క'న్నీటి' ఊట.. కష్టాల బాట

కొండమార్గంలో తాగునీటిని గ్రామానికి మోస్తున్న మహిళలు

ఊట నీటిని సేకరిస్తున్న మహిళలు

అనంతగిరి మండలం రొంపల్లి పంచాయతీ దబ్బలపాడులో తాగునీటికి గిరిజనులు అల్లాడుతున్నారు. కొండల్లో ఊటనీరే గ్రామస్థులకు దిక్కవుతోంది. మూడు కిలోమీటర్ల దూరంలోని కొండల వద్దకు వెళ్లి ఊటలో నీటిని సేకరించి గ్రామానికి తీసుకొస్తున్నారు. కనీసం వసతులకు దూరంగా ఈ గ్రామం ఉండడంతో.. ఎవరైనా అనారోగ్యం పాలైతే సుమారు ఆరు కిలోమీటర్ల దూరం కాలినడకన వెళ్లాల్సి వస్తోంది. గతంలో ఈ గ్రామంలో 28 కుటుంబాలు ఉండేవి. కనీస సౌకర్యాలు లేకపోవడంతో.. పొట్ట చేతపట్టుకుని కొందరు కొండ దిగువ ప్రాంతానికి వెళ్లిపోయారు. అధికారులు స్పందించి రహదారి, తాగునీరు, విద్యుత్తు సౌకర్యాలు కల్పించాలని గ్రామస్థులు కోటపర్తి సింహాచలం, అప్పలరాజు, అప్పన్న, గంగమ్మ, గిరిజన సంఘం నాయకులు గోవిందరావు తదితరులు కోరారు. – అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే

ఆన్‌లైన్‌లో డ్రోన్ బుకింగ్!

చింతపల్లి, న్యూస్‌టుడే

మారుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వల్ల ఇప్పుడంతా డ్రోన్‌ల శకం నడుస్తోంది. వ్యవసాయ రంగంలోనూ ఇవి రైతులకు సహాయకారిగా నిలుస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగంలో రైతులు వృద్ధి సాధించడం కోసం అనేక పథకాలు, రాయితీలు కల్పిస్తున్నాయి. రైతులకు అవసరమైన విత్తనాలు, జీవన ఎరువులు, కీటకనాశినులు, వ్యవసాయ పరికరాలతో పాటు రాయితీపై డ్రోన్లు అందిస్తున్నాయి. పూర్తిగా వ్యవసాయాధారిత ప్రాంతంగా ఉన్న అల్లూరి జిల్లాలో గిరిజన రైతులు ఇప్పుడిప్పుడే ఆధునిక వ్యవసాయ విధానాలను యంత్ర పరికరాలను వినియోగిస్తున్నారు.

✦ సినిమా టికెట్ల దగ్గర నుంచి విమానం టికెట్ల వరకూ అంతా ఆన్‌లైన్లోనే దొరుకుతున్నాయి. వీటి మాదిరిగానే రైతులు వారి వ్యవసాయ అవసరాల కోసం డ్రోన్‌లను కావాలనుకుంటే ఆన్‌లైన్లో బుక్ చేసుకునే వెసులుబాటు ఉంది.

✦ ప్లేస్టోర్‌లోకి వెళ్లి ఉబరైజేషన్ ఆఫ్ కిసాన్ డ్రోన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని బుక్ చేసుకోవచ్చు. గ్రామాల్లో రైతు సేవాకేంద్రాల్లో వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన డ్రోన్ దీదీ సేవల వాల్‌పోస్టర్‌లోని క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా డ్రోన్‌సేవలను ఉపయోగించుకోవచ్చు.

పొలాలపై డ్రోన్‌తో మందుల పిచికారీ

✦ జిల్లాలో ఎక్కడైనా రైతులు పొలాలకు సేంద్రియ ఎరువులు, కీటక నాశినులు, విత్తనాలు చల్లడానికి డ్రోన్లను అద్దెకు తీసుకోవచ్చు. ఎక్కువ విస్తీర్ణం ఉన్నా వీటితో సులభంగా పని ముగించవచ్చు. డ్రోన్ ద్వారా కేవలం 15 నిమిషాల్లో ఎకరా విస్తీర్ణంలో ఎరువులను పిచికారీ చేసే అవకాశం ఉంది. దూరాన్ని బట్టి డ్రోన్ నిర్వాహకులు అద్దె వసూలు చేస్తారు.

వండిందే మెనూ.. పెట్టిందే తిను!

నచ్చినట్లు వ్యవహరిస్తున్న పాఠశాలల నిర్వాహకులు

ఈనాడు డిజిటల్, పాడేరు – న్యూస్‌టుడే, జి.మాడుగుల, డుంబ్రిగుడ, అనంతగిరి గ్రామీణం

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో భోజన మెనూ అటకెక్కుతోంది. వసతితో కూడిన నాణ్యమైన విద్య అందించాలని కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నా.. క్షేత్రస్థాయిలో నిర్వాహకుల నిర్లక్ష్యం పిల్లల పాలిట శాపంగా మారుతోంది. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాల్సిన కొంతమంది పాఠశాలల సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఫలితంగా విద్యార్థులు చాలీచాలని కూరగాయలు, ఉడికీఉడకని అన్నం.. నీరులాంటి సాంబారుతో సర్దుకోవాల్సి వస్తోంది. మరో వైపు సౌకర్యాలలేమి కూడా వారిని తీవ్రంగా వేధిస్తోంది.

పరిశీలన

డుంబ్రిగుడ బాలికల ఆశ్రమ పాఠశాలలో వంకాయ, రసంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

ఇదీ పరిస్థితి...

■ జి.మాడుగుల ఆశ్రమ పాఠశాలలో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనంలో బెండకాయ, ఆకుకూరపప్పు, సాంబారు, మజ్జిగ, పెట్టాల్సి ఉంది. కానీ విద్యార్థులకు [illegible] కూర, రసం మాత్రమే వడ్డించారు.

■ డుంబ్రిగుడ బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలో 643 మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి వంకాయ, రసంతో సరి పెట్టేశారు. ఆకుకూర పప్పు పెట్టలేదు.

■ అనంతగిరి మండలం శివలింగపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో 288 మంది విద్యార్థులున్నారు. ఐటీడీఏ మెనూ చార్టు అమలు లేదని, కొన్ని రకాలే పెడుతున్నారని విద్యార్థులు తెలిపారు. పెరుగుకు బదులుగా మజ్జిగ మాత్రమే ఇస్తున్నారు.

కొద్దిగానే చికెన్.. ఆశ్రమ పాఠశాలల్లో పిల్లలకు ఒక్క శనివారం తప్పించి మిగిలిన రోజుల్లో ఉదయం ఉడకబెట్టిన గుడ్డు ఇవ్వాలి. ఆదివారం మధ్యాహ్నం, మంగళవారం రాత్రి చికెన్, కిచిడీ, పెరుగు, గోంగూర చట్నీ ఇవ్వాలి. ప్రతి గిరిజన విద్యార్థికి 100 గ్రాములు తగ్గకుండా చికెన్ పెట్టాలి. కానీ.. చాలాచోట్ల విద్యార్థులకు రెండు లేదా మూడు ముక్కల చికెన్ వేసి సరిపెడుతున్నారు. పెరుగు పెట్టాల్సిన చోట మజ్జిగతో సరిపెడుతున్నారు.

● మెనూ అమలులో పాఠశాలల నిర్వాహకుల ఇష్టారాజ్యంగా మారినా సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. గిరిజన విద్యార్థులు తమ బాధ ఎవరికి చెప్పుకోలేక తెలియక అల్లాడుతున్నారు. కొందరు పౌష్టికాహార లోపంతో బాధ పడుతుంటే, మరికొందరు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు.

బొయితిలి ఆశ్రమ పాఠశాలలో ఓ విద్యార్థి కంచంలో అన్నం, కొద్దిపాటి దుంపకూర

మెనూ అమలు చేయకుంటే సహించం: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాలు, గురుకులాల్లో మెనూ పక్కాగా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశాం. మెనూ అమలు చేయని పాఠశాలలపై చర్యలు తీసుకుంటాం. డైనింగ్‌హాళ్ల నిర్మాణాలకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. – పరిమళ, గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకులు

ఒడిశా అదనంగా నీటి వాడకం

సీలేరు, న్యూస్‌టుడే: బలిమెల జలాశయం నిర్వహణ, నీటి వాడకంపై ఆంధ్రా, ఒడిశా అధికారులు బుధవారం సీలేరు జెన్‌కో అతిథిగృహంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం జలాశయంలో 65.65 టీఎంసీల నీరుండగా.. జోలాపుట్ జలాశయంలో 20.19 టీఎంసీలు ఉండని, మొత్తం 85.84 టీఎంసీలు నిరువ ఉన్నట్లు పేర్కొన్నారు. రాబోయే నెలల్లో సుమారు 1 టీఎంసీ నీరు రెండు జలాశయాల్లోకి చేరే అవకాశముందని లెక్కగట్టారు. మొత్తం సుమారు 86.84 టీఎంసీల్లో ఒడిశా 28.48, ఏపీ జెన్‌కో 58.36 టీఎంసీలు వాడుకోవడానికి నిర్ణయించారు. జనవరి నెలలో ఏపీ 5.31 టీఎంసీలు, ఒడిశా 6.18 టీఎంసీలు వాడుకున్నట్లు లెక్కలు తేల్చారు. దీనిప్రకారం ఒడిశా అదనంగా 0.87 టీఎంసీలు నీటిని వాడుకున్నట్లు పేర్కొన్నారు. ఈ నీటి సంవత్సరంలో ఇప్పటివరకూ ఏపీ 28.39 టీఎంసీలు నీటిని వినియోగించుకోగా, ఒడిశా 58.28 టీఎంసీలు వినియోగించుకున్నట్లు తేల్చారు. ఒడిశా అదనంగా 29.88 టీఎంసీలను వాడుకుందని తెలిపారు. ప్రస్తుతానికి గ్రిడ్ డిమాండ్, విద్యుత్తు అవసరాల నిమిత్తం ఒడిశా 3000, ఏపీ 6500 క్యూసెక్కుల నీటిని బలిమెల జలాశయం నుంచి వాడుకోవాలని నిర్ణయించారు. ఒడిశా జలవనరులశాఖ నుంచి ముఖ్యనిర్వాహక ఇంజినీరు తృప్తిపాడు మార్ పాత్రో, పర్యవేక్షక ఇంజినీరు సరోజ్ సాహూ, ఏఈఈ దిలీప్ కుమార్ దలాబెహరా, ఏఈ గదాధర్ ప్రధాన్, కృష్ణ చంద్రపాణి, ఒడిశా హైడ్రో పవర్ కార్పొరేషన్ తరఫున డిప్యూటీ జనరల్ మేనేజర్ ఓం ప్రకాష్ నాయక్, డిప్యూటీ మేనేజర్ బెహరా, అసిస్టెంట్ మేనేజర్ సుబదీప్ పండా పాల్గొన్నారు. ఏపీ జెన్‌కో తరపున ఎస్‌ఈలు జాకీర్‌హుస్సేన్, సీహెచ్ హనుమా, డీఈఈ జయపాల్, ఏఈఈ చింతాటి సురేష్ తదితరులు హాజరయ్యారు.

సమీక్షా సమావేశంలో ఇరు రాష్ట్రాల అధికారులు

చెమట చుక్కతో.. నిలిపి ఉంచుతాం నీటిచుక్క

నూతిబంద గ్రామంలో చెక్‌డ్యాం నిర్మిస్తున్న గిరిజనులు

కొండలపై పారే నీటికి అడ్డుకట్ట వేసి.. గ్రామంలో సాగు అవసరాలు తీర్చుకునేందుకు ప్రజలంతా ఒక్కటయ్యారు. చెమట చిందించి శ్రమదానంతో చెక్‌డ్యాం నిర్మాణానికి నడుంకట్టారు. చింతపల్లి మండలం నూతిబంద పంటపొలాలకు సాగునీటి సదుపాయం లేదు. దీంతో ఆదివాసీలు చెక్‌డ్యాం నిర్మాణంతో ఈ సమస్య పరిష్కారానికి ముందడుగు వేశారు. ఈ పనులను సిఫా ట్రస్ట్ సీఈవో డాక్టర్ శశిప్రభ పరిశీలించి జలవనరుల కోసం శ్రమిస్తున్న గిరిజనులను అభినందించారు. పొలాల్లో ఐదుశాతం భూమిలో గొయ్యి తవ్వి.. నీరు నిల్వ ఉంచి భూగర్భజలాలను పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. అలా చేసిన వారికి చేపపిల్లలు అందజేస్తామన్నారు. గ్రీన్ క్లైమెట్ టీం ఎన్జీవో రత్నం, ట్రస్ట్ ప్రతినిధులు త్రిమూర్తులు, జాన్‌బాబు పాల్గొన్నారు. – చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే

ప్రధానితో మాట్లాడతారా..?

కేంద్ర బడ్జెట్‌పై క్విజ్‌పోటీలు

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్ర బడ్జెట్‌పై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో నేరుగా మాట్లాడే సదవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పిస్తోంది. కేంద్ర బడ్జెట్-2026పై ప్రాథమిక అవగాహన, కేటాయింపులపై ప్రజల అభిప్రాయాన్ని క్విజ్ ద్వారా తెలుసుకునే ప్రయత్నం చేస్తోంది. వికసిత్ భారత్-2047 విజన్‌ను అర్థవంతంగా ముందుకు తీసుకెళ్లి.. ప్రజల భాగస్వామ్యం పెంపొందించడం, బడ్జెట్‌పై ప్రాథమిక అవగాహన కల్పించే ఉద్దేశంతో మేరా యువ భారత్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందులో పాల్గొనేందుకు ఎలాంటి ప్రవేశ రుసుం లేదు. 15 నుంచి 29 సంవత్సరాల లోపు ఉన్న వారెవరైనా పాల్గొనవచ్చు. 30 ప్రశ్నలకు 30 మార్కులుంటాయి. 15 నిమిషాల్లోపు సమాధానాలు చెప్పాల్సి ఉంటుంది. 10 మార్కులొస్తే ఉత్తీర్ణులైనట్లు పరిగణిస్తారు. ఈనెల 17 లోపు ఎప్పుడైనా ఆన్‌లైన్‌లో క్విజ్‌లో పాల్గొనవచ్చు. పాల్గొన్న వారందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందజేస్తారు. ఉత్తమ ప్రతిభ కనబర్చినవారితో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో వర్చువల్‌గా మాట్లాడే అవకాశం కల్పిస్తారు. మై భారత్ వెబ్‌సైట్‌లో క్విజ్ వివరాలున్నాయి. నేరుగా పాల్గొనేందుకు https://mybharat.gov.in వెబ్‌సైట్‌లో లాగిన్ అవ్వాల్సి ఉంటుంది.

సామాజిక మాధ్యమాల్లో తస్మాత్ జాగ్రత్త

అనంతగిరి, న్యూస్‌టుడే

■ అనంతగిరి ప్రాంతానికి చెందిన కొందరు యువకులు గతంలో ఉడుమును పట్టి దాన్ని చంపి మాంసం వండి తిని.. ఆ దృశ్యాలను చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. ఈ వీడియోను చూసిన అటవీశాఖ ఉద్యోగులు వారిని పట్టుకుని కేసులు నమోదు చేసి.. ఊచలు లెక్కపెట్టించారు.

■ అనంతగిరి మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన వాట్సప్ గ్రూప్‌లో రెండు వర్గాల ప్రజలు ఒకరిని ఒకరు దూషించుకుంటూ పోస్టులు పెట్టగా.. ఈ విషయం పోలీసుల వరకు వెళ్లింది. వారిని స్టేషన్‌కు పిలిచి.. మొదటి తప్పుగా మందలించి వదిలివేశారు.

ఇలా కొందరు సామాజిక మధ్యమాల్లో పోస్టులు పెట్టి జైలుపాలవుతున్నారు. నేటి ఆధునిక జీవితంలో సోషల్‌మీడియా ప్రతిఒక్కరి జీవితంలో అంతర్భాగమై పోయింది. పిల్లల నుంచి పండు ముసలి వరకు ప్రతిఒక్కరూ అందులో లీనమైపోతున్నారు. కొందరు నిత్యం ఇన్‌స్టాగ్రామ్ లేదా వాట్సప్‌లో ఏదో ఒక పోస్టు పెట్టనిదే రోజు గడవని పరిస్థితి. కొందరు కంటెంట్ క్రియేటర్‌లుగా ఎదిగేందుకు కొన్ని వీడియోలను చిత్రీకరించి అప్‌లోడ్ చేస్తున్నారు. ఇవి అభ్యంతరకరంగా ఉంటే కచ్చితంగా కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుంది.

ఇవి మంచివి..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చే పథకాలను ప్రజలకు తెలియజేయవచ్చు. ఆరోగ్యం, విద్య, ఆధ్యాత్మికం, పర్యావరణంపై అవగాహన కల్పించే విషయాలు, ప్రకృతి వైపరీత్యాలు, రక్తదానం తదితర అంశాలపై పోస్టులు పెట్టొచ్చు. ప్రజలకు ఉపయోగపడే ఏ విషయమైనా అది నిజమైతే తెలియజేయవచ్చు.

ఇవి వద్దు..

అడల్ట్ కంటెంట్ పెట్టడం, షేర్ చేయడం, వ్యక్తిగత దూషణలు, అభ్యంతరకర పదజాలం, మహనీయుల మాటలను వక్రీకరించడం, కులానికి, మతానికి సంబంధించిన విషయాలపై జాగ్రత్తగా ఉండాలి. అదేవిధంగా మహిళలను కించపరచటం, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, ఫొటోలు, వీడియోల మార్ఫింగ్, జంతు బలులు వంటివి పోస్టు చేయకపోవడం మంచిది.

కేసులు, శిక్షలు..

✦ ఎవరైనా అభ్యంతరకర పోస్టు పెడితే 1930ను సంప్రదించవచ్చు. ✦ నిబంధనలు పాటించనివారిపై ఐటీ చట్టం కింద కేసులు నమోదు చేస్తారు. ✦ తీవ్రమైన నేరమైతే జైలు, జరిమానా ఒక్కోసారి రెండూ ఉంటాయి. * అసత్య ప్రచారం చేస్తే అయిదేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. ✦ మార్ఫింగ్ చేసినా జైలు శిక్ష ఉంటుంది.

దశాబ్దాల కల.. నెరవేరిన వేళ

రూ.5.5 కోట్లతో బర్రంగిబంద రహదారి నిర్మాణం

పాడేరు, న్యూస్‌టుడే

రహదారి లేక బాహ్య ప్రపంచం తెలియని ఓ మారుమూల పీవీటీజీ గ్రామంలోని గిరిజనుల దశాబ్దాల కళ నెరవేరింది. హుకుంపేట మండలం తడిగిరి పంచాయతీ పరిధిలోని పీవీటీజీ గ్రామం బర్రంగిబందలో సుమారు 50 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. తడిగిరి నుంచి సుమారు నాలుగు కిలోమీటర్ల దూరంలోని అటవీ ప్రాంతంలో ఉన్న ఈ గ్రామానికి ఐదు నెలల క్రితం కలెక్టర్ దినేష్‌కుమార్ జెండాకొండ పర్యటన నిమిత్తం వెళ్లారు. ఈ సందర్భంలో గ్రామస్థులు, స్థానిక సర్పంచి రంజిత్‌కుమార్ కలిసి.. జెండాకొండ అభివృద్ధి చెందాలంటే ముందుగా బర్రంగిబంద వరకు రహదారి నిర్మించాలని విన్నవించారు.

ఆయన వెంటనే స్పందించి.. తడిగిరి నుంచి రహదారి నిర్మాణానికి ఎంత నిధులు అవసరమో అంచనా వేయాలని పంచాయతీరాజ్ ఈఈని ఆదేశించారు. ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించారు. ఇటీవల కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. అందులో ఈ గ్రామం వరకు రహదారి నిర్మాణానికి రూ.5.5 కోట్లు నిధులు మంజూరయ్యాయి. తడిగిరి నుంచి చీడిపుట్టు మీదుగా బీటీ రోడ్డు నిర్మిస్తున్నారు. గతేడాది డిసెంబర్ 13వ తేదీన ఈ రహదారి నిర్మాణానికి శాసనసభ్యుడు మత్స్యలింగం శంకుస్థాపన చేశారు. మే నెలఖారులోగా పనులు పూర్తి చేస్తామని గుత్తేదారు తెలిపారు. డోలీమోతలకు అడ్డుకట్ట పడిందని బర్రంగిబంద గ్రామస్థులు సన్యాసిరావు, భాస్కరరావు తదితరులు పేర్కొన్నారు.

చీడిపుట్టు మీదుగా నిర్మిస్తున్న రోడ్డు

రహదారుల నిర్మాణాలు వేగవంతం

జి.మాడుగుల, న్యూస్‌టుడే: రహదారుల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. జి.మాడుగుల మండలంలోని కుంబిడిసింగి, బొయితిలి, కిల్లంకోటలో బుధవారం ఆయన పర్యటించారు. కుంబిడిసింగిలో నిర్మాణంలో ఉన్న వంతెన పనులను పరిశీలించారు. మార్చి నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పంచాయతీ భవనం, బొడ్డపుట్టు రహదారి పనులు తనిఖీ చేశారు. పలు సమస్యలపై గ్రామస్థుల నుంచి వినతులు స్వీకరించారు. బొయితిలి నుంచి కిల్లంకోట వరకు జరుగుతున్న బీటీ రహదారి పనులను పరిశీలించారు. కిల్లంకోట సమీపంలో ఉన్న గెడ్డలో వంతెన నిర్మాణానికి మూడు నెలలో టెండర్లు పిలుస్తామన్నారు. రహదారి సదుపాయాలు లేని గ్రామాలను గుర్తిస్తే వెంటనే నిధులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. పలు గ్రామాలకు రహదారి సదుపాయం కల్పించాలని ఎంపీపీ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు కలెక్టర్‌ను కోరారు. ఎంపీపీ ఎల్.అప్పలరాజు, కుంబిడిసింగి ఎంపీటీసీ సభ్యురాలు సుభద్ర, సర్పంచులు కృష్ణమూర్తి, మాలన్న, తెదేపా నాయకులు రామారావు, రామన్న, అప్పన్నదొర, పిన్నయ్య పాల్గొన్నారు.

కుంబిడిసింగిలో వంతెన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

మావోయిజం, గంజాయి నిర్మూలనే లక్ష్యం

పాడేరు, న్యూస్‌టుడే: జిల్లాకు మావోయిజం, గంజాయి నుంచి పూర్తిగా విముక్తి కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని ఎస్పీ అమిత్ బర్దార్ అన్నారు. పాడేరులోని ఎస్పీ కార్యాలయంలో బుధవారం సబ్ డివిజన్ స్థాయి అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. సమాజంలో నమ్మకాన్ని నిర్మించడానికి, క్షేత్రస్థాయి సమాచారం సేకరించడానికి గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శించాలని పోలీసు అధికారులకు సూచించారు. సైబర్ నేరాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. కేసుల విచారణలను వెంటనే పూర్తి చేయాలని పేర్కొన్నారు. కోర్టు ఛార్జిషీట్లను త్వరగా దాఖలు చేయాలని చెప్పారు. మండల కేంద్రాల్లో పోలీస్‌స్టేషన్లకు వచ్చే ఫిర్యాదులు, పిటీషన్లను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా నిబద్ధతతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఏఎస్పీలు పంకజ్‌కుమార్‌మీనా, నవజ్యోత్ మిశ్రా, డీఎస్పీలు సాయి ప్రశాంత్, ఆర్.వి.వి.ఎస్. అభిషేక్, బొడ్డు హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అమిత్ బర్దార్

ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులకు కొలువులు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: కంచరపాలెంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఏడాదికి రూ.5 లక్షల వేతనంతో కొలువులు సాధించారు. ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ మారుతి సుజుకి ఇండియా లిమిటెడ్ బుధవారం రాష్ట్రంలోని వివిధ కళాశాలల్లో రాష్ట్ర స్థాయి సెంట్రల్ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించింది. ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా 50 మంది విద్యార్థులు ఎంపికవ్వగా అందులో 24 మంది కంచరపాలెంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ బ్రాంచ్‌ల విద్యార్థులు కావడం గమనార్హం. అధ్యాపకుల మార్గదర్శకత్వం, సంస్థ అందిస్తున్న శిక్షణ ఫలితమే ఉద్యోగాల సాధనకు కారణమని ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.రమణ తెలిపారు.

కాస్త దృష్టిపెడితే కాసుల రాశులే

చింతపల్లి, న్యూస్‌టుడే

మన్యం కాఫీకి ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు లభించింది. గిరిజనుల జీవనశైలిని పూర్తిగా మార్చేసిన పంట ఇది. ఇంతటి గుర్తింపు ఉన్న కాఫీ వెనుక కనిపించని నిర్లక్ష్యం కూడా ఉంది. ఇటు రైతులు, అటు అధికారులు మన్యంలో కాఫీ తోటల విస్తరణపై దృష్టి సారిస్తున్నారేగానీ దిగుబడుల పెంపును విస్మరిస్తున్నారు. ఇది రైతులను ఆర్థికంగా తీవ్రంగానే నష్టపరుస్తోంది. కేజీ పార్చిమెంటు కాఫీ ధర స్థానికంగానే రూ. 450 వరకు ఉంది. అదే అంతర్జాతీయ మార్కెట్‌లో దీని ధర కేజీ రూ. 600 పైమాటే. ఇక చెర్రీ కాఫీ ధర మన్యంలో ప్రస్తుతం రూ. 280 వరకూ ఉంది. సగానికిపైగా రెట్టింపు ధర పార్చిమెంటు కాఫీకి ఉన్నా రైతులంతా చాలావరకు చెర్రీ కాఫీ తయారీకే మొగ్గుచూపుతున్నారు. దీనివల్ల ఆర్థికంగా నష్టపోతున్నారు.

కాఫీ పండ్ల సేకరణలో గిరిజన మహిళ

కేరళ, కర్ణాటక, తమిళనాడు వంటి రాష్ట్రాలతో పోల్చి చూస్తే మన్యంలో కాఫీ దిగుబడులు చాలా తక్కువగా ఉంటున్నాయి. అక్కడ హెక్టారుకు సగటున 450 కేజీల వరకూ దిగుబడులు వస్తుండగా మన్యంలో హెక్టారుకు కేవలం 150 కేజీలకు మించి దిగుబడులు సాధించడం లేదు. ఒకవైపు దిగుబడులు రాకపోగా కాఫీ సాగులో సరైన శాస్త్రీయ విధానాలను పాటించకపోవడంతో నాణ్యత కొరవడుతోంది. ఫలితంగా గిరిజన రైతులు పండించిన కాఫీకి మార్కెట్‌లో తగిన ధరలు రాక నష్టపోతున్నారు.

జిల్లాలో కాఫీ సాగు ఇలా

విస్తీర్ణం : 2.25 లక్షల ఎకరాలు
దిగుబడులు ఇస్తున్న తోటలు : 1.7 లక్షల ఎకరాలు
ఆధారపడిన కుటుంబాలు: 1.5 లక్షలు
ఏటా ఉత్పత్తి : 18 వేల మెట్రిక్ టన్నులు
ఏటా వ్యాపారం: రూ. 150 కోట్ల నుంచి రూ. 200 కోట్లు

మరింత ఖ్యాతి: కాఫీ సాగులో గిరిజన రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తే అన్ని విధాలుగా లాభం చేకూరుతుంది. రైతులు సేకరించిన కాఫీ పండ్లను ఎండబెట్టి వాటిని చెర్రీగా విక్రయిస్తున్నారు. దీనికి బదులు పార్చిమెంటుగా తయారుచేసేలా ప్రోత్సాహకాలను కేంద్ర కాఫీబోర్డు కల్పిస్తోంది. పంటల సాగులో నాణ్యత పాటించేలా రైతులకు అవసరమైన శిక్షణ ఇస్తున్నాం. – డాక్టర్ సునీల్‌బాబు ప్రాంతీయ కాఫీ పరిశోధనా స్థానం అధిపతి

అభిరామ్‌కు ఆపన్నహస్తం

'ఈనాడు' కథనంతో సాయం అందించేందుకు ముందుకొస్తున్న దాతలు

చింతపల్లి, న్యూస్‌టుడే: అయిన వారు దూరమై.. గుండెబరువై సాయం కోసం ఆర్తిగా ఎదురు చూస్తున్న అభిరామ్‌కు మేమున్నామంటూ పలువురు ఆపన్నహస్తం అందించేందుకు ముందుకు వస్తున్నారు. జి.మాడుగుల మండలం గెమ్మెలి గ్రామానికి చెందిన పన్నెండేళ్ల వన్ను అభిరామ్ దయనీయ పరిస్థితిపై బుధవారం 'ఈనాడు'లో 'కన్నీళ్లకే కన్నీరొచ్చే కష్టం నీది చిన్నా' శీర్షికన కథనం ప్రచురితం అయ్యింది. అమ్మానాన్నా దూరమై, ఆలనాపాలనా చూసే నానమ్మ కన్నుమూయడంతో కొండంత కష్టంలో ఉన్న అభిరామ్‌ను పాము కాటేయడంతో ఆసుపత్రి పాలయ్యాడు.

✦ అభిరామ్ పరిస్థితిని పత్రికలో చూసిన సన్‌ఛారిటీ వ్యవస్థాపకులు సూరెడ్డి అప్పలనాయుడు బుధవారం నర్సీపట్నం ఆసుపత్రికి వెళ్లి బాధిత చిన్నారిని పరామర్శించారు. చిన్నారి చదువుకు సాయం అందించేందుకు ముందుకు వచ్చారు. కొయ్యూరుకు చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ప్రతినిధులు మల్లేష్, సభ్యులు కిరణ్ ఆసుపత్రికి వెళ్లి అభిరామ్‌ను పరామర్శించి రూ. 5 వేల ఆర్థికసాయం అందించి.. వసతిగృహంలో చేర్చుతామన్నారు. హైదరాబాద్‌కు చెందిన విశ్రాంత ఇంజినీరు రామకృష్ణ ఉప్పల్‌లోని అబిసాయిదత్త ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథాశ్రమంలో అభిరామ్‌ను చేర్పించేందుకు సిద్ధంగా ఉన్నానని భరోసా ఇచ్చారు.

అభిరామ్‌కు సాయం అందిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు

(c) eenadu

'మెట్రో'.. మరింత ముందుకు

తొలిదశలోనే 'భోగాపురం' వరకూ!

రూ.2,618 కోట్ల సమీకరణకు కసరత్తు

ఈనాడు, విశాఖపట్నం : విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టును మొదటి దశలోనే భోగాపురం వరకు విస్తరించే అంశంపై కసరత్తు సాగుతోంది. తొలుత అనుకున్న కొమ్మాది నుంచి ఆనందపురం మీదుగా భోగాపురం విమానాశ్రయానికి అనుసంధానించేలా ప్రతిపాదన కేంద్ర ప్రభుత్వానికి పంపినట్లు తెలిసింది. దీనికి ఆమోదం దక్కితే... తొలి దశ ప్రాజెక్టు 46.4 కి.మీ. నుంచి 71.7 కిలోమీటర్లకు పెరగనుంది.

నిధుల సమీకరణకు: మెట్రో రైలు ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం వాటా భరించాల్సి ఉంది. 71.7 కి.మీ.లకు రూ.17,232 కోట్లు ఖర్చవుతుందని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది. భూ సమీకరణ, విక్రయం ద్వారా నిధుల సమీకరణ బాధ్యత వీఎంఆర్‌డీఏకు అప్పగించింది. ఇందుకోసం వీఎంఆర్‌డీఏ దాదాపు రెండు వేల ఎకరాలు సమీకరించనుంది. ఆ పనులు వేగంగా సాగుతున్నాయి. సుమారు వెయ్యి ఎకరాలకుపైగా ఇప్పటికే రెవెన్యూ యంత్రాంగం సమీకరించింది. ఆ భూములు అభివృద్ధి చేసి విక్రయించి, నిధులను మెట్రో కోసం వెచ్చించనున్నారు. అలాగే మరికొన్ని వాణిజ్య తరహా విధానాలు అవలంబించనున్నారు.

రుణాలకు: మెట్రో రైలు ప్రాజెక్టు కోసం వీఎంఆర్‌డీఏ దాదాపు రూ.2,618 కోట్లు సమీకరించనుంది. భూములను తాకట్టు పెట్టి రుణాలు తీసుకునే ప్రతిపాదనపై ఆలోచన చేస్తున్నారు. తక్కువ వడ్డీకి రుణాలు ఇచ్చే జాతీయ బ్యాంకులు, ఆర్థిక సంస్థలను అధికారులు సంప్రదిస్తున్నారు. ఏ బ్యాంకులు ఎంత కాలానికి ఎంత వడ్డీతో రుణాలు మంజూరు చేస్తాయన్న విషయాలను పరిశీలిస్తున్నారు.

ఆ గాలి వలన.. అంతా ఆందోళన!

★ నగరంలో పడిపోతున్న వాయు నాణ్యత
★ కాలుష్యం పెరుగుదలకు కారణాలెన్నో

ఈనాడు-విశాఖపట్నం: గత కొన్ని రోజులుగా విశాఖలో గాలి నాణ్యత ఆందోళన కలిగించే స్థాయిలో దారుణంగా ఉంటోంది. కాలుష్యంలో దిల్లీని మించి ఏక్యూఐ (గాలి నాణ్యత-ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్) గణాంకాలు నమోదవ్వడం కలవరపెడుతోంది. ఇందుకు కొన్ని కారణాలు అధికారులు గుర్తించారు.

1 విశాఖ పోర్టు అథార్టీ (వీపీఏ), గంగవరం పోర్టుల్లో కవర్డ్ షెడ్లను ఉపయోగించకుండా బహిరంగంగా బొగ్గు, ఇతర నిల్వలు ఉంచారు. టార్పాలిన్ పట్టాలు కప్పడం, స్ప్రింక్లర్లతో నీటిని చల్లే చర్యలు పూర్తిస్థాయిలో లేవు. కన్వేయర్ బెల్టులపై ముడిఖనిజం వెళ్లేటప్పుడు దుమ్ము బయటకు రాకుండా ఏర్పాట్లు లేవు. విశాఖ పోర్టులో ఓ కంపెనీ కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అనుమతుల్లేకుండా క్రషింగ్ యూనిట్ ఏర్పాటు చేసింది. బహిరంగంగా మాంగనీస్ ఓర్, బొగ్గు గ్రేడింగ్ చేస్తుండటం ఇక్కడ కాలుష్యానికి కారణమవుతోంది. పోర్టులకు వచ్చి, వెళ్లే లారీల్లో అధిక లోడు ఉండటం, టార్పాలిన్ కప్పకపోవడం వంటి కారణాలతో రోడ్లపైకి దుమ్ము భారీగా చేరుతోంది.

2 ఇటీవల శీలానగర్-సబ్బవరం గ్రీన్‌ఫీల్డ్ రహదారి పనులు ఆరంభమయ్యాయి. రూ.964 కోట్లతో చేపట్టిన 12.66 కి.మీ. ఆరు వరుసల రహదారి పనుల్లో ఫ్లైయాష్ (బూడిద) కూడా వాడుతున్నారు. ఎన్టీపీసీ, హిందూజా నుంచి నిత్యం వందల సంఖ్యలో లారీలు బూడిద రవాణా చేస్తున్నాయి.

★ ఆ సమయంలో ఓవర్‌లోడుతో, టార్పాలిన్ పట్టాలు కప్పకుండా తీసుకురావడంతో రహదారులన్నీ బూడిద మయంగా మారుతున్నాయి. ఫలితంగా గాల్లోకి బూడిద రేణువులు లేచి కాలుష్యానికి కారణమవుతున్నాయి.

★ పారిశ్రామిక ప్రాంతంలో బహిరంగంగా జిప్సం నిల్వలు పేరుకుపోవడంతో ఆ రేణువులు గాలిలో కలిసి ప్రమాదకరంగా మారుతున్నాయి.

3 జీవీఎంసీ పరిధిలో శిథిలావస్థ భవనాలను నిబంధనలు పాటించకుండా కూల్చేస్తుండటంతో దుమ్ము విపరీతంగా గాల్లోకి కలుస్తోంది. వ్యర్థాలను ఎలాంటి పైకప్పు లేకుండా జీవీఎంసీ వాహనాల్లో తరలిస్తున్నారు. నగరంలోని రోడ్లపై చేరిన దుమ్ము వాహనాల వేగానికి గాల్లో కలుస్తోంది. బహిరంగంగా చెత్తను కాల్చడం కూడా కాలుష్యానికి ఓ కారణంగా గుర్తించారు.

సైబర్ మోసాల నివారణపై అవగాహన

గోడప్రతుల ఆవిష్కరణలో కలెక్టర్ విజయకృష్ణన్, అధికారులు

కలెక్టరేట్, న్యూస్‌టుడే: సైబర్ మోసాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం టీవీ కమర్షియల్ ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల గోడప్రతులను అధికారులతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 13 వరకు జరిగే వారోత్సవాల్లో భాగంగా వీటిపై ప్రజలకు అవగాహన కల్పించి మోసాల బారి నుంచి రక్షించాలన్నారు.

పనులు తక్షణమే పూర్తి చేయాలి: జిల్లాకు మంజూరు చేసిన అన్ని అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎంపీడీఓలు, ఇంజినీరింగ్, వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ నిధులు మురిగిపోతే సంబంధిత అధికారులపై తక్షణమే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీధి కుక్కల సంతతి పెరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వయోజన విద్యా కేంద్రాలకు వస్తున్న 91 వేల మందిని మార్చిలో జరిగే పరీక్షలకు హాజరై ఉత్తీర్ణులయ్యేలా చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు ఉచిత సౌరవిద్యుత్తు వినియోగించుకునేలా చేయాలన్నారు.

భూములు కబ్జా కాకుండా చర్యలు: రెవెన్యూశాఖకు సంబంధించిన అంశాలను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. తహసీల్దార్లతో వివిధ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడుతూ ప్రతి సోమవారం పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ ద్వారా వచ్చే అర్జీలపై మరుసటి రోజు క్షేత్రస్థాయిలో సందర్శించి పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకుండా చర్యలు చేపట్టాలన్నారు. రెండో విడత రీసర్వే జరిగిన గ్రామాల్లో మళ్లీ క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎలాంటి తప్పులు రాకుండా పాసుపుస్తకాలు ముద్రణకు పంపించాలన్నారు. పౌరసరఫరాలకు సంబంధించి ఇంటి వద్దనే నిర్ణీత గడువులోగా నూరుశాతం పంపిణీ చేపట్టాలన్నారు. డీఆర్వో సత్యనారాయణ, లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ, సర్వే ఏడీ గోపాల్‌రాజు, డీఎస్ఓ మూర్తి, ఏఓ విజయకుమార్ పాల్గొన్నారు.

సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలపై నిఘా



అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేసే వారిపై నిఘా ఉంచాలని ఎస్పీ తుహిన్‌సిన్హా ఆదేశాలు జారీచేశారు. జిల్లాలోని పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలతో బుధవారం రాత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సైబర్ నేరాల బాధితులకు తక్షణ న్యాయం జరిగేలా చూడాలన్నారు. శివరాత్రి నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించారు. పుణ్యక్షేత్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. 2025 ఏడాదికి సంబంధించి కొత్తగా అమలులోకి వచ్చిన చట్టాలపై అధికారుల పనితీరును సమీక్షించారు. పెండింగ్ కేసులు పరిష్కరించి పోలీస్ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలన్నారు.

నాచు సాగు.. ఉపాధి బాగు

తీరం నుంచి సీవీడ్‌ను బయటకు తెస్తున్న మహిళలు

గ్రామీణభీమిలి, తగరపువలస, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి మత్స్య సమృద్ధి యోజనలో భాగంగా భీమిలి మండలం పెదమంగమారిపేట తీరంలో ఇటీవల ప్రారంభించిన సీవీడ్ (సముద్ర నాచు పెంపకం) సాగు సత్ఫలితాలను ఇస్తోంది. ★ మంగమారిపేట గ్రామానికి చెందిన కొందరు మత్స్యకార మహిళలు సంఘంగా ఏర్పడి గత ఏడాది నవంబరు 21న అంతర్జాతీయ మత్స్యకార దినోత్సవం నాడు సముద్రపు నాచు పెంపకానికి శ్రీకారం చుట్టారు. మత్స్యకార మహిళలకు సుస్థిర జీవనోపాధిని అందించేందుకు ప్రభుత్వం తెచ్చిన ఈ ప్రాజెక్టుతో కొద్దిరోజుల వ్యవధిలోనే మంచి లాభాలు రావడంతో వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రెండు టన్నుల దిగుబడి..: మంగమారిపేట తీరంలో దాదాపు రెండు టన్నుల దిగుబడి తొలిసారి వచ్చింది. తడిచిన సీవీడ్‌ను కిలో రూ.40 చొప్పున, ఎండబెట్టిన నాచును రూ.120 చొప్పున అమ్మారు. తద్వారా చక్కటి ఆదాయాన్ని పొందారు. ఈ స్ఫూర్తితో రెండోసారి కూడా 30 రాఫ్ట్‌ల సీవీడ్‌ను వేశారు. ఏడాదికి అయిదు సార్లు సాగు చేయనున్నారు. వీరిని ప్రోత్సహిస్తూ చిప్పాడ దివీస్ ఫార్మా కంపెనీ రూ.6 లక్షలను సీఎస్ఆర్ కింద అందించింది. ఈ మొత్తంతో సీవీడ్, రాఫ్ట్‌లను సమకూర్చుకున్నారు. మత్స్యకార మహిళలను స్ఫూర్తిగా తీసుకుని ఓ స్వచ్ఛంద సంస్థ, ఓ విశ్వవిద్యాలయం ఈ తీరంలో పదేసి రాఫ్ట్‌లతో సీవీడ్‌ను సాగు చేస్తున్నాయి.

సీ వీడ్ అంటే..: సీవీడ్ సముద్రపు వాతావరణంలో పెరిగే ఓ రకమైన నాచు మొక్క. ప్రధానంగా ఎరుపు, ఆకుపచ్చ, గోధుమ రంగుల్లో ఉంటాయి.

మరింత మందికి అవకాశం: మంగమారిపేట తీరంలో మహిళలు సాగు చేస్తున్న సీవీడ్ మంచి ఫలితాన్నిచ్చింది. ఈ స్ఫూర్తితో మరింత మందికి అవగాహన కల్పించి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకుంటాం. మార్కెటింగ్ సదుపాయాలను కల్పిస్తున్నాం. - డా.కృష్ణ, పీఎం మత్స్య సమృద్ధి యోజన విశాఖ జిల్లా అధికారి

సీవీడ్‌తో అతివలకు ఆదాయం

సీవీడ్ హబ్‌గా తీరం..: సీవీడ్‌ను ఎరువులు, ఔషధాలు, తినుబండారాలు, సౌందర్య ఉత్పత్తుల్లోనూ ఉపయోగిస్తున్నారు. వీటికి జపాన్, తైవాన్, ఇండోనేషియాలో డిమాండు ఎక్కువ. మంగమారిపేట, పరిసర తీర ప్రాంతాలను సీవీడ్ హబ్‌గా తీర్చిదిద్దుతాం. - డా.లక్ష్మణరావు, మత్స్యశాఖ విశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం

మాట్లాడుతున్న టిస్ ప్రతినిధి తేజ

కొయ్యూరు, న్యూస్‌టుడే: మర్రి పాలెం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వినియోగదారుల హక్కులు, రక్షణ చట్టాలపై విద్యార్థినులకు బుధవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టీఐఎస్ఎస్) చెందిన తేజ మాట్లాడుతూ.. వినియోగదారులకు హక్కులపై అవగాహన అవసరమన్నారు. నాణ్యత లేని వస్తువులపై ఎలా ఫిర్యాదు చేయాలి, వినియోగదారుల కోర్టులో కేసు ఎలా వేయాలన్న విషయాలను వివరించారు. ప్రిన్సిపల్ కె.సుధ, అధ్యాపకులు మేరీపుష్ప, భువనేశ్వరీదేవి, విద్యార్థినులు పాల్గొన్నారు.

కలకృత్యాలకు వెళ్లి కానరాని లోకాలకు..



పెదబయలు (గ్రామీణం), న్యూస్‌టుడే: కలకృత్యాలకు వెళ్లి గెడ్డలో పడి యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. అరడకోట గ్రామానికి చెందిన తమర్ల వెంకటరమణ (35) బుధవారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు గ్రామ సమీపంలోని మత్స్య గెడ్డకు వెళ్లాడు. గెడ్డలో దిగే క్రమంలో ప్రమాదవశాత్తు జారిపడి ఊపిరాడక మృతి చెందాడు. ఇతను గతంలో జీపు డ్రైవర్‌గా పనిచేసున్న సమయంలో ప్రమాదంలో తలకు గాయమైంది. అప్పటి నుంచి అప్పుడప్పుడు మతిస్థిమితం లేనట్లుగా ప్రవర్తిస్తున్నాడని గ్రామస్థులు చెబుతున్నారు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబసభ్యులు బోరున విలపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కాఫీ ప్రాసెసింగ్‌పై ఆరా

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: అరమ పంచాయతీ బడిమెల గ్రామంలో కేంద్ర కాఫీ బోర్డు సహకారంతో ఏర్పాటు చేసిన కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఉత్తరాఖండ్ జర్మనీ స్వేల బృందం బుధవారం పరిశీలించింది. ప్రాసెసింగ్, పల్పింగ్ యూనిట్లను పరిశీలించారు. కాఫీ సాగులో ఆదాయ మార్గాలను అడిగి తెలుసుకున్నారు. సీనియర్ లైజన్ అధికారి రమేష్, జూనియర్ లైజన్ అధికారి లక్ష్మీ, హెచ్‌వో మత్స్యరాజు తదితరులు పాల్గొన్నారు.

బడిమెలలో ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న ప్రతినిధులు

డోలీమోతల నివారణకు చర్యలు

శంకుస్థాపన చేస్తున్న తెదేపా నేతలు

పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే: మన్యంలో డోలీమోతల నివారణకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెదేపా మండల అధ్యక్షులు వెచ్చింగి కొండయ్య అన్నారు. పెదబయలు మండలం ఇంజిరి గ్రామం నుంచి అంబిరిపాడు వరకు రూ.2.15 కోట్లతో మంజూరైన రోడ్డు పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. తెదేపా మండల ప్రధాన కార్యదర్శి కొర్రా రాజారావు, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బి వినోద్, గ్రామస్థులు పాల్గొన్నారు.

జీవితాన్ని మార్చేది విద్యే!

భోజనం రుచి చూస్తున్న డీఈఓ అప్పారావునాయుడు

ఎలమంచిలి, రాంబిల్లి, న్యూస్‌టుడే: జీవితాన్ని మార్చేది విద్య మాత్రమేనని డీఈఓ గిడ్డి అప్పారావు నాయుడు అన్నారు. బుధవారం ఆయన ఎలమంచిలి క్లస్టర్‌లోని సోమలింగపాలెం, రాంబిల్లి మండలం దిమిలి పాఠశాలలను బుధవారం సందర్శించారు. పదిలో మంచి మార్కులు సాధనకు చక్కని ప్రణాళిక రూపొందించుకోవాలని కోరారు. ప్రతిరోజు కనీసం 6 నుంచి 8 గంటలపాటు చదవాలన్నారు. సమయపాలన పాటించాలన్నారు. క్రమశిక్షణతో చదివితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఉపాధ్యాయులతో సమావేశమై పది విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా దృష్టి పెట్టాలని ఆదేశించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. జిల్లా ఉప విద్యాశాఖ అధికారి పి.అప్పారావు, ఎంఈఓ సూర్యప్రకాశరావు, వై.వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం శాస్త్రి పాల్గొన్నారు.

విజయవంతంగా కంటి శస్త్రచికిత్సలు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: బ్రాండిక్స్ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత కంటి శస్త్రచికిత్సలు విజయవంతమయ్యాయి. 45 మంది రోగులకు శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రిలో ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించి వీరిని బుధవారం బ్రాండిక్స్ తీసుకొచ్చారు. అనంతరం ఉచితంగా మందులు అందించి వీరిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. బ్రాండిక్స్ భారతీయ భాగస్వామి దొరస్వామి చొరవతో కంటిచూపు పొందామని రోగులు సంతోషం వ్యక్తం చేశారు.

శస్త్రచికిత్సలు చేయించుకున్న రోగులు

ఘంటసాల పాటల పోటీల విజేతలు వీరే

పాటల పోటీల్లో విజేతలతో నిర్వాహకులు

అనకాపల్లి, న్యూస్‌టుడే: అనకాపల్లి వేల్పులవీధిలోని జీవీఎంసీ పాఠశాలలో బుధవారం ఘంటసాల వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన పాటల పోటీ విజేతలకు ఎస్ఏ పి.రామలక్ష్మ బహుమతులు అందజేశారు. సిద్ధార్థ సోషల్ సర్వీస్, కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్ల నాగభూషణం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో ఎస్.చార్విక్ మొదటి బహుమతి అందుకున్నారు. బి.శ్యామ్, ఎం.కుషిత ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. జి.మృదుల, డి.జయశ్రీ ప్రోత్సాహక బహుమతులు పొందారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జి.రామాంజనేయులు, నిర్వాహకులు వినకోట నీలేష్ గుప్తా, రొబ్బి మల్లేశ్వరరావు, వెంకటరమణమూర్తి, సోమరాజు, అప్పారావు పాల్గొన్నారు.

అందరూ చూసేలా.. అమలు చేసేలా!

● కాంక్రీట్ నగరిలో పచ్చనికాలనీ..!
● ఇంటింటా ఇంకుడుగుంతలు
● ఆదర్శంగా నిలుస్తున్న దయాల్‌నగర్

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ఇండోర్, డెహ్రాడూన్ నగరాల అధికారులు ఇటీవల విశాఖ పర్యటనకు వచ్చారు. విశాలాక్షినగర్‌లోని దయాల్‌నగర్ కాలనీని సందర్శించి ఇక్కడ పచ్చదనం, పారిశుద్ధ్యం, తడిపొడి చెత్త సేకరణ, సేంద్రియ ఎరువుల తయారీ, వృత్తివిద్యా కోర్సుల నిర్వహణ తదితర అంశాలను అధ్యయనం చేశారు. నగరంలో చాలా ప్రాంతాలు ఉండగా ఆ అధికారులు దయాల్‌నగర్‌ను సందర్శించడానికి ఆ కాలనీ ప్రత్యేకతే కారణం.

పచ్చదనం నిండిన ప్రవేశ మార్గం

ప్రతి నీటి చుక్క భూమిలోకే..: ఈ కాలనీ 1981లో ఏర్పాటైంది. ఇక్కడ 250 నివాసాలు ఉన్నాయి. తొలినాళ్లలో నీటి కోసం ప్రతి ఇంటి ఆవరణలో నూతులను తవ్వించుకున్నారు. పదేళ్ల క్రితం భూగర్భజలాలు పడిపోవటంతో బోర్లు ఏర్పాటు చేసుకున్నారు. ఎండిపోయిన బావులను వదిలేయలేదు. డాబాలపై పడిన వర్షపు నీటిని, ఇళ్లల్లోని వాడుక నీటిని వాటిల్లోకి పంపించి మళ్లీ జలకళ తెచ్చారు. నూతనంగా నిర్మించిన ప్రతి భవనానికి ఇంకుడు గుంతను తప్పనిసరిచేశారు. ఇటీవల భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ రావడంతో సెప్టిక్ ట్యాంకులను శుభ్రపరిచి అందులోకి కూడా వాడుకనీరు పంపిస్తున్నారు. దీంతో మండు వేసవిలో కూడా నీటి ఎద్దడి ఉండదిక్కడ.

ఎటుచూసినా పచ్చదనమే

హుద్‌హుద్ తుపాను భీకరగాలులకు కాలనీలోని చెట్లన్నీ నామరూపాల్లేకుండా పోయాయి. కాలనీ వాసులంతా ఐకమత్యంతో రహదారులకు ఇరువైపులా, సామాజిక ప్రదేశాలలో, ఇళ్ల ఆవరణల్లో యుద్ధ ప్రాతిపదికన మొక్కలు నాటి వాటి సంరక్షణను బాధ్యతగా స్వీకరించారు. దీంతో కాలనీలో ఎటుచూసినా పచ్చదనం కనిపిస్తుంటుంది. ఏప్రిల్, మే నెలలో కూడా ఇక్కడ చల్లటి వాతావరణం ఉంటుంది.

శ్రమైక జీవనం: కాలనీలో సామాజిక అవసరాల కోసం వదిలిన స్థలంలో నాలుగుచోట్ల వ్యవసాయ క్షేత్రాలను ఏర్పాటు చేసుకున్నారు. వాటిల్లో పండ్ల తోటలు, ఆకుకూరలు, కూరగాయలు పండిస్తుంటారు. పండిన పంటలను ప్రతి ఆదివారం కాలనీవాసులు తక్కువ ధరకు విక్రయిస్తారు. ఆ డబ్బును వ్యవసాయ క్షేత్రాల నిర్వహణకు వినియోగిస్తారు. 'కాలనీకి స్వచ్ఛ పురస్కారాలు వచ్చాయి. కాలనీవాసులు మద్యం, మాంసం, ధూమపానం లాంటి అలవాట్లకు దూరంగా ఉంటారు. దీపావళి నాడు బాణసంచా కాల్చకుండా మొక్కలు నాటి సహపంక్తి భోజనాలు చేస్తాం'ని కాలనీ సంఘం కార్యదర్శి ఎంబీఆర్ మూర్తి తెలిపారు.

సార్వత్రిక సమ్మెకు బ్యాంకు ఉద్యోగుల మద్దతు

అనకాపల్లి (గ్రామీణం), న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు అనుగుణంగా గురువారం చేపడుతున్న దేశవ్యాప్త సమ్మెకు బ్యాంకు ఉద్యోగులు మద్దతు తెలుపుతున్నారని యూనియన్ బ్యాంకు జాయింట్ కార్యదర్శి కాండ్రేగుల హరికృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బ్యాంకు ఉద్యోగులు అందరూ సమ్మెలో పాల్గొంటారన్నారు. విధులకు దూరంగా ఉండి సమ్మె చేస్తారని ఖాతాదారులు, ప్రజలు సహకరించాలన్నారు.

పండిట్ దీన్‌దయాళ్ ఆశయసాధనకు కృషి

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చింతపల్లిలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని భాజపా మండల అధ్యక్షుడు సాగిన బాలకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర కాఫీబోర్డు సభ్యుడు జైతి ప్రభాకరరావు మాట్లాడుతూ.. పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ సమాజ అభ్యున్నతికి పాటుపడ్డారన్నారు. ఆయన ఆశయసాధనకు కృషి చేయాలన్నారు. భాజపా జిల్లా ఐటీ కన్వీనర్ పండా ఈశ్వరరావు, నరేంద్రప్రసాద్, వసుపరి భారతి, మాతే లక్ష్మణరావు, ఇండుగ శివ, సోమలింగం తదితరులు పాల్గొన్నారు.

పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భాజపా నాయకులు

ఇగ్నో బీఈడీ, బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాలు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) బీఈడీ, పోస్టు బేసిక్ బీఎస్సీ నర్సింగ్ కోర్సులలో ప్రవేశాలకు మార్చి నెలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు సీనియర్ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ జి.ధర్మారావు ఒక ప్రకటనలో తెలిపారు. మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామన్నారు. బీఈడీ ప్రవేశ పరీక్షకు ఈనెల 27వ తేదీలోపు, బీఎస్సీ నర్సింగ్ కోసం మార్చి 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 08912511200 నంబరులో సంప్రదించాలని కోరారు.

రూ.57 కోట్ల పనులపై సామాజిక తనిఖీ

పనుల వివరాలను పరిశీలిస్తున్న అధికారులు

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకంలో భాగంగా 2024-25లో అరకులోయ మండలంలో రూ.57 కోట్లతో చేపట్టిన వివిధ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదికను బుధవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో నిర్వహించారు. వేతనాల రూపంలో చెల్లించిన రూ.29 కోట్లు, మెటీరియల్ రూపంలో వెచ్చించిన రూ.28 కోట్ల నిధులకు సంబంధించి పంచాయతీల వారీగా వివరాలను అధికారులు పరిశీలించారు. రూ.36 లక్షలకు సంబంధించి పనుల రెక్టిఫికేషన్‌కు అధికారులు ఆదేశించారు. ప్రొసీడింగ్ అధికారి డి.విద్యాసాగర్, ఎంపీడీవో లవరాజు, ఏపీఓ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలోకి అదనపు డీజీపీ

స్వచ్ఛంద పదవీ విరమణ చేస్తున్న కిల్లాడ సత్యనారాయణ



నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: ఉత్తరప్రదేశ్ అదనపు డీజీపీగా ఉన్న కిల్లాడ సత్యనారాయణ ఈనెల 15న స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) తీసుకుంటున్నారు. పదవీ విరమణ తరువాత ఆంధ్రప్రదేశ్‌లో విద్యార్థుల్లో మాతృభాష పట్ల ఆసక్తి, సృజనాత్మకత పెంచడం, ఆన్‌లైన్ ద్వారా పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వడం తదితర కార్యక్రమాలను నిర్వహించాలన్నది తన అభిమతమని పేర్కొన్నారు. కోటవురట్ల మండలం పాములవాక గ్రామానికి చెందిన సత్యనారాయణ 1998బ్యాచ్ ఐపీఎస్ అధికారి. ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లో అదనపు డీజీపీ హోదాలో ఉన్నారు. ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 28 ఏళ్లపాటు సేవలు అందించారు. 2025లో రాష్ట్రపతి నుంచి విశిష్ట సేవా పురస్కారంతో పాటు మూడుసార్లు రాష్ట్రపతి చేతులమీదుగా పోలీసు మెడల్స్ అందుకున్నారు. కవిగా, సామాజిక సేవకుడుగా, ఉపన్యాసకుడిగా సామాజిక చైతన్యం కలిగించారు. ఎనిమిది పుస్తకాలను రచించారు.

సరుగుడు, కొబ్బరి తోటలు దగ్ధం

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: బంగారుమెట్ట గ్రామంలో బుధవారం సరుగుడు, కొబ్బరి తోటలో అగ్నిప్రమాదం సంభవించింది. జక్కా చిన్నారావు, వేచలపు చినతల్లికి చెందిన తోటల్లో మంటలు వ్యాపించాయి. గుర్తుతెలియని వ్యక్తులు కాల్చిపారేసిన సిగరెట్ పీకతోనే ప్రమాదం సంభవించి ఉంటుందని భావిస్తున్నారు. ఘటనలో రూ.50వేలు పంట నష్టం వాటిల్లింది. రావికమతం నుంచి అగ్నిమాపక సిబ్బంది గంగరాజు, శివయ్యరాయుడు వచ్చి మంటలను అదుపు చేశారు.

జాతీయ కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: నిజి షోటోకాన్ జాతీయ కరాటే పోటీల్లో అచ్యుతాపురం శ్రీభవానీ విద్యానికేతన్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపించారు. ఈనెల 9, 10 తేదీల్లో విశాఖలో జరిగిన ఈ పోటీల్లో వివిధ విభాగాల్లో 28 మంది విద్యార్థులు బహుమతులు సొంతం చేసుకున్నారు. వీరిలో ఎనిమిది మంది బంగారు పతకాలు, 12 మంది రజత, మరో ఎనిమిది మంది కాంస్య పతకాలు పొందారు. ఈ విద్యార్థులను పాఠశాల వ్యవస్థాపకులు కూండ్రపు మూర్తి ప్రసాద్, కరస్పాండెంట్ సంతోష్, డైరెక్టర్ శ్రీలత అభినందించారు.

పతకాలు పొందిన విద్యార్థులతో మూర్తి ప్రసాద్

తోడుగా వచ్చి.. ప్రాణాలు తీసే..!

ఆనందపురం, న్యూస్‌టుడే: కొన్నాళ్ల నుంచి సహజీవనం సాగిస్తున్న ఇద్దరి మధ్య గొడవలు రావడంతో, పురుషుడిని మహిళ దారుణంగా హత్య చేసిన ఘటన ఆనందపురం శివారు పందుల ఫారంలో చోటు చేసుకుంది. బుధవారం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలివి. మధురవాడ ప్రాంతానికి చెందిన పైడిరాజు ఆనందపురం శివారులో రెండేళ్ల నుంచి పందుల ఫారం నిర్వహిస్తున్నాడు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన ఎస్.నాగశివ(38), షేక్ ముబీనా(శ్రావణి)(41) భార్యాభర్తలుగా పరిచయం చేసుకుని, ఫారం నిర్వహణ పనులు చూసుకుంటున్నారు. మంగళవారం అర్ధరాత్రి ఇద్దరూ మద్యం తాగి, ఆ మత్తులో గొడవ పడ్డారు. అయితే బుధవారం ఉదయం నాగశివ మృతి చెందినట్లు శ్రావణి 112 నెంబర్‌కు సమాచారం ఇచ్చింది. ఆనందపురం పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతి చెందిన తీరు, పరిసరాలు అనుమానాస్పదంగా ఉండడంతో ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. మధురవాడ ఏసీపీ అప్పలరాజు ఆధ్వర్యంలో డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీం సభ్యులు ఆధారాలు సేకరించారు. మృతుడి శరీరంపై గట్టి దెబ్బలు ఉండడంతో శ్రావణిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించి, ఆమె హత్య చేసినట్టు నిర్ధారించారు. నిందితురాలికి గతంలోనే వివాహం అయినట్టు పోలీసులు తెలిపారు. మద్యం మత్తులో గొడవ పడడంతో హత్య జరిగిందా..? పథకం ప్రకారమే జరిగిందా...? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, మృతుడి బంధువులకు సమాచారం ఇచ్చినట్లు సీఐ వాసునాయుడు తెలిపారు.

విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఐటీఐ, డిప్లమా అభ్యర్థులకు సౌదీ అరేబియాలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు సంస్థ జిల్లా అధికారి ఎన్.గోవిందరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు http:///naipunyam.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 99888 53335, 87126 55686, 87901 18349 నంబర్లను సంప్రదించాలన్నారు.

విద్యార్థుల సురక్షిత ఆరోగ్యమే కీలకం

కశింకోట, న్యూస్‌టుడే: విద్యార్థుల సురక్షిత ఆరోగ్యంతో భవిష్యత్తులో దృఢమైన సమాజం ఏర్పడుతుందని కేంద్రబృందం ప్రతినిధి డాక్టర్ రమణ సూచించారు. తాళ్లపాలెం గురుకుల బాలికల ఆశ్రమ పాఠశాలను బుధవారం రాత్రి కేంద్రబృందం ప్రతినిధులు డా.పడాల్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల మానసిక ఆరోగ్యం, భవిష్యత్‌లో కాబోయే యువత ఎలా ఉండాలి, సమాజంలో సమస్యలను ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, ఆహార నియమాలు, పోషకాహారంపై వివరించారు. జిల్లా ఆర్‌బీఎస్‌కే అధికారిణి డా.ఎస్తేరు రాణి, పీహెచ్‌సీ వైద్యాధికారిణి సుమ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రమణ

స్పందనకు వందనం

వీధిదీపాల పునరుద్ధరణ

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లిలోని పూడిమడక రోడ్డులో వీధిదీపాలకు బుధవారం మరమ్మతులు చేపట్టారు. 'ఈనాడు'లో ప్రచురితమైన 'వెలగని దీపాలు.. కమ్మేస్తున్న చీకట్లు' కథనానికి స్పందించిన జీవీఎంసీ ఏఈ గణేష్ సిబ్బందితో రామాలయం వెనక వీధిలోని వీధి లైట్లకు మరమ్మతులు చేపట్టారు. దీంతో సమస్య తీరింది.

గంజాయి నిందితుడికి పదేళ్ల జైలు

చోడవరం, న్యూస్‌టుడే: గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన సీరా అప్పలనాయుడుకు పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ స్థానిక తొమ్మిదో అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ బుధవారం తీర్పు చెప్పారు. జైలు శిక్ష, రూ.లక్ష జరిమానాను విధించారు. 2016లో సీరా అప్పలనాయుడు 60 కిలోల గంజాయితో చీడికాడ పోలీసులకు చిక్కాడు. కేసు విచారణలో అప్పలనాయుడిపై నేరారోపణ రుజువుకావడంతో కోర్టు శిక్ష విధించింది. అప్పటి చీడికాడ పోలీస్ ఎస్సై ఎ.కోటేశ్వరరావు దర్యాప్తు జరిపారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా చీపురుపల్లి సూర్యనారాయణ కేసు వాదించారు. పోలీస్ సిబ్బందిని ఎస్పీ తుహిన్ సిన్హా అభినందించారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	115	110
లైవ్	142	130
డ్రెస్డ్	206	230
స్కిన్‌లెస్	234	240

(c) eenadu

ప్రతి గ్రామానికి ఎల్‌జీ కోడ్

పాడేరు, న్యూస్‌టుడే: ప్రతి రెవెన్యూ గ్రామానికి లోకల్ గవర్నమెంట్ కోడ్(ఎల్‌జీ) కేటాయించడం ద్వారా ప్రభుత్వ పథకాలు, నిధులు ఆన్‌లైన్ సేవలు నేరుగా చేరుతాయని, పరిపాలనా సౌలభ్యానికి ఇది చాలా ముఖ్యమని కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా స్థాయి అధికారులతో భూ సమస్యలు, రెవెన్యూ పరిపాలనకు సంబంధించి సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న మ్యుటేషన్ల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఇన్‌ఛార్జి జేసీ శ్రీపూజ, ఇన్‌ఛార్జి ఆర్డీఓ లోకేశ్వరరావు, డీఆర్‌ఓ అంబేద్కర్, సీపీఓ ప్రసాదరావు పాల్గొన్నారు.

అంబులెన్సును జెండా ఊపి ప్రారంభించిన కలెక్టర్ దినేష్‌కుమార్ తదితరులు

నూతన అంబులెన్సు ప్రారంభం

యూనివర్సల్ సోంపో జనరల్ ఇన్సూరెన్స్ సౌజన్యంతో సమకూర్చిన నూతన అంబులెన్సును కలెక్టరేట్ వద్ద కలెక్టర్ దినేష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి ప్రారంభించారు. ఈ వాహనం డుంబ్రిగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అందించనున్నట్లు జిల్లా వైద్యాధికారి కృష్ణమూర్తినాయక్ తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతంలో వైద్య సదుపాయాలను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి, డీఎంహెచ్ఓ కృష్ణమూర్తి నాయక్, అదనపు జిల్లా వైద్యాధికారి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం.. అల్లంత దూరం!

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: మండలంలో వైద్యసేవలు విస్తరించేందుకు.. గిరిజనులకు ప్రాథమిక వైద్యం అందుబాటులో ఉంచేందుకు రూ.లక్షల ఖర్చుతో చేపట్టిన ఆయుష్మాన్ భారత్ హెల్త్, వెల్‌నెస్ కేంద్రాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. గత ప్రభుత్వం చేపట్టిన ఈ భవనాల నిర్మాణాలు పూర్తికాక ప్రజలకు ప్రాథమిక వైద్యం దూరమవుతోంది. ముంచంగిపుట్టు మండలంలోని 18 గ్రామాల్లో ఈ ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలు చేపట్టారు. ఒక్కో భవన నిర్మాణానికి రూ.22 లక్షలు ఖర్చుగా వెచ్చించారు. నిధులు ఖర్చయినా భవన నిర్మాణాలు పూర్తి కాలేదు. కొన్ని గ్రామాల్లో నిర్మాణాలు పూర్తయినా వినియోగంలోనికి రాలేదు. బూసిపుట్టు, ఏనుగురాయి, బొంద్రుగుడ, కించాయిపుట్టు గ్రామాల్లో భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి.

ఏనుగురాయిలో నిరుపయోగంగా హెల్త్‌క్లినిక్

★ ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు వినియోగంలోకి తెస్తే గిరిజన పల్లెల్లో వైద్యసేవలు చేరువవుతాయి. బూసిపుట్టు గ్రామంలో ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేస్తే.. బూసిపుట్టు, కుమడ, జామిగుడ, ఇంజరి, గిన్నెలకోట పంచాయతీల్లోని గ్రామాల గిరిజనులకు వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేస్తే 80 గ్రామాలకు వైద్యం అందుతుందని ప్రజలు పేర్కొంటున్నారు.

★ ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు వినియోగంలోకి తీసుకురాకపోవడంతో నిధులు వృథా అయ్యాయే తప్ప ప్రజలకు వినియోగపడలేదు. ఏనుగురాయి గ్రామంలో నిర్మాణం తుది దశలో ఉంది. భవనం ప్రారంభానికి ముందే శిథిలావస్థకు చేరుతోంది. వరండాలో చీమలు పుట్టలు ఏర్పడ్డాయి. ఈ కేంద్రం ప్రారంభిస్తే.. ఏనుగురాయి, సుజనకోట, పెదగురు పంచాయతీలోని 20 గ్రామాల ప్రజలకు వైద్యసేవలు చేరువవుతాయి. బూసిపుట్టు గ్రామంలో ఆరోగ్య కేంద్ర నిర్మాణం పూర్తి చేయకపోవడంతో 18 గ్రామాల ప్రజలకు వైద్యం దూరమవుతోంది. ఇక్కడి కి.మీ.ల దూరంలో ఉన్న కుమడ కేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చేందుకు గిరిజనులు అవస్థలు పడుతున్నారు. కుమడ గ్రామంలో భవన నిర్మాణం పూర్తిచేసి మూడేళ్లు గడుస్తున్నా వినియోగంలోకి రాలేదు.

వరండాలో వెలసిన పుట్టలు

పరుగు పందెంలో యువకుడికి రజతం

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: జాతీయస్థాయి పరుగు పందెంలో గిరి యువకుడు ప్రతిభ చాటాడు. దిల్లీలోని రాజీవ్ గాంధీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈనెల 8న జరిగిన స్కూల్ గేమ్స్ యాక్టివిటీ ఆల్ ఇండియా నేషనల్ ఛాంపియన్‌షిప్ 200 మీటర్ల పరుగు పందెంలో కించుమండ పంచాయతీ కంబవలస గ్రామానికి చెందిన కోసేపు సింహాద్రి రజత పతకం కైవసం చేసుకున్నాడు. యువకుడిని పలువురు అభినందించారు.

పతకం, ప్రశంసాపత్రం అందుకుంటున్న సింహాద్రి

చినుకు పడితే సెలవే!

అనంతగిరి, న్యూస్‌టుడే: మన్యంలోని పలు పాఠశాలలకు నేటికీ సరైన భవనాలు లేకపోవడంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. ఎన్.ఆర్.పురం పంచాయతీ సిమిడివలస గ్రామంలో పాఠశాలకు భవనం లేకపోవడంతో విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతం. ఈ పాఠశాలలో సిమిడివలస, రాయిపాడు, బొంగిజ గ్రామాలకు చెందిన సుమారు 40 మంది వరకు విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల భవనానికి గతంలో ఎప్పుడో నిధులు మంజూరు కాగా.. నగరు వరకు గోడలు కట్టి భవనాన్ని నిర్మించకుండా వదిలివేశారు. దీంతో విద్యార్థులో కొందరికి అసంపూర్తిగా ఉన్న వంట షెడ్డులో, మరికొందరికి చెట్టుకింద పాఠాలు బోధిస్తున్నారు. చిన్నపాటి చినుకులు పడినా పాఠశాలకు సెలవు ప్రకటించే పరిస్థితి. కూటమి ప్రభుత్వం, అధికారులు స్పందించి పాఠశాల భవనానికి నిధులు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అసంపూర్తిగా ఉన్న వంటషెడ్డులో నేలన కూర్చున్న విద్యార్థులు..

చెట్టు కింద మరికొందరు..

కల్వర్టు.. పట్టించుకుంటే ఒట్టు!

చినలబుడు పంచాయతీ పకనకుడి సమీపం ప్రధాన రహదారిలో కల్వర్టు శిథిలావస్థకు చేరడంతో వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కల్వర్టు పూర్తిగా కూలిపోతే పంచాయతీ పరిధిలోని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – అరకులోయ, న్యూస్‌టుడే

పకనకుడి సమీపంలో..

ఊటనీటితో సాగు భళా!

మన్యంలో ఎక్కువ మంది రైతులు వర్షాధారంగా వ్యవసాయం చేస్తుంటారు. ఏడాదిలో నాలుగు నెలలు సాగు చేసి.. మిగతా కాలం పనులు లేక నిరాశకు గురవుతున్నారు. ముంచంగిపుట్టు మండలంలోని దోడిపుట్టు, గూడమాలిపుట్టు, వనబసింగి, గర్భగుండ గ్రామాల్లోని మాలి గిరిజనులు స్వల్ప నీటి వసతులతో వివిధ పంటలు పండిస్తున్నారు. పేటమాలిపుట్టు గ్రామంలో ప్రధాన గ్రామ సమీపంలో ఉన్న ఊటనీటి సాగు భూములకు మళ్లించి టమాట, బంగాళదుంపలు, వంకాయలు, ఆనపకాయ, బెండకాయ పండిస్తున్నారు. వీటిని వారపుసంతలకు తరలించి ఆదాయం పొందుతున్నారు. – ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే


పేటమాలిపుట్టులో కూరగాయల సాగు

వృథా.. తప్పని వ్యథ!

హుకుంపేట నుంచి కామయ్యపేట వెళ్లే మార్గంలోని దిగుడుపుట్టు ఏకలవ్య సమీపంలో ప్రధాన రహదారి పక్కన పైపులైన్లు పగిలిపోవడంతో తాగునీరు వృథాగా పోతోంది. నిర్వాహకులు ప్రతిరోజూ ఆ మార్గంలోనే రాకపోకలు సాగిస్తున్నప్పటికీ.. మరమ్మతులు చేయడం లేదని చింతలవీధి, హుకుంపేటవాసులు ఆరోపించారు. ఈ పైపులైన్ ద్వారా సుమారు తొమ్మిది గ్రామాలకు నీరు సరఫరా అవుతోంది. నీటి వృథాతో శివారు ప్రాంతాలకు సక్రమంగా అందడం లేదు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. ఇసుక లారీలు వేసే వాహనాలు పైపులను తొక్కేయడంతో పగిలిపోతున్నాయి. దిగుడుపుట్టు గెడ్డ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలను అడ్డుకోవాలని పేర్కొన్నారు. – పాడేరు, న్యూస్‌టుడే

దిగుడుపుట్టు ప్రధాన రహదారిలో..

అ వీ ఇ వీ

వీఆర్వోపై ఫిర్యాదు

అనంతగిరి, న్యూస్‌టుడే: పెదకోట వీఆర్వోపై ప్రజా సమస్యల పరిష్కార వేదిక(మీకోసం)లో ఫిర్యాదు చేసినట్లు ఎంపీటీసీ సభ్యురాలు శిరగం శ్రావణి తెలిపారు. ప్రతి చిన్న పనికి వీఆర్వో డబ్బులు ఇవ్వాలని ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు.

బాధ్యులను కఠినంగా శిక్షించాలి

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: మాకవరం సమీపంలో గిరిజన బాలిక మృతికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని తుడిపా డివిజన్ నాయకులు, దారెల సర్పంచి పాండురంగస్వామి డిమాండు చేశారు. బరడ పంచాయతీ అడర్లడి ముకిపుట్టు గ్రామానికి చెందిన బాలిక మాకవరం సమీపంలో తీవ్రగాయాలతో అపస్మారక స్థితిలో పడి మరణించడం విచారకరమన్నారు.

చేపలు, మాంసం దుకాణాలపై కొరడా

చింతపల్లి, న్యూస్‌టుడే: చింతపల్లిలో చేపలు, మాంసం దుకాణదారులపై ఎట్టకేలకు అధికారులు కొరడా ఝుళిపించారు. పోలీసుల సాయంతో రహదారికి ఇరువైపులా అమ్మకాలను అడ్డుకున్నారు. గ్రామం చివరన పంచాయతీ, నాబార్డు నిధులతో నిర్మించిన షెడ్లలో చేపలు, మాంసం దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని ఎంపీడీఓ సీతామహలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి వెంకటరావు స్పష్టం చేశారు. ఈ దుకాణాలు రహదారి పక్కన ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. కుక్కల బెడద అధికం అవుతోంది. అధికారులకు తరచూ ఫిర్యాదులు వెళ్లడంతో ఇప్పటికే నోటీసులు ఇచ్చారు.

బాధితులను ఆదుకోవాలి

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: సాగర పంచాయతీ టికిలిబెడ్డలో అగ్ని ప్రమాదంలో నష్టపోయిన గిరిజనుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. బాధిత పాలకి ఆనందరావు కుటుంబాన్ని సంఘ నాయకులు బుధవారం పరామర్శించారు. శ్రీను, నర్సింగరావు, వెంకటరావు పాల్గొన్నారు.

శివరాత్రి వేడుకలకు సర్వంసిద్ధం

పాడేరు ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: పాడేరు పట్టణంలోని అతి పురాతన ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ధర్మకర్తలు కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, చీపురు రమాదేవి ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీ నుంచి మూడు రోజులపాటు వేడుకలు జరగనున్నాయి. ఈ ఏర్పాట్లను తహసీల్దార్ అరుణ్ చంద్ర, పాడేరు ఎస్సై నాయుడు, వీఆర్‌వో రామునాయుడు బుధవారం పరిశీలించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. మొదటి రోజు శివ పార్వతుల కల్యాణం, 14వ తేదీన శివ పార్వతుల ఊరేగింపు, 15న మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం జరుగుతుంది. ఈ రోజుల అన్ని సమూహాల ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

మత్స్యగుండంలో పటిష్ఠ ఏర్పాట్లు

పాడేరు, న్యూస్‌టుడే: మత్స్యగుండంలో ఈనెల 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు జరిగే మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఇన్‌ఛార్జి ఆర్డీఓ లోకేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జిల్లాస్థాయి, హుకుంపేట మండల స్థాయి అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ.. వాగుల్లోకి భక్తులు వెళ్లకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యేక ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ డీఎంకు సూచించారు. పోలీస్ భద్రత కట్టుదిట్టం చేయాలని డీఎస్పీ అభిషేక్‌ను ఆదేశించారు.

గంగమ్మ జాతరకు డ్రోన్‌తో నిఘా

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: సుజనకోట గ్రామంలో ఈనెల 16, 17 తేదీల్లో నిర్వహించే గంగమ్మతల్లి జాతరలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా డ్రోన్‌తో నిఘా ఏర్పాటు చేయాలని తహసీల్దార్ భాస్కరప్పారావు సూచించారు. జాతర ఏర్పాట్లపై బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్సైని సూచించారు. వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని, విద్యుత్తు సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని చెప్పారు. నీటి ఎద్దడి ఏర్పడకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఎంపీడీఓ ధర్మారావు, ఎస్సై నాని, వెలుగు ఏపీఎం, గ్రామ సచివాలయ, రెవెన్యూ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

పాడేరు 89853 66570 | అరకులోయ: 63034 86346 | చింతపల్లి: 94404 07658

?: పద్మాపురం రింగ్‌రోడ్డు ఛిద్రంగా మారి రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. – సహదేవ్, పద్మాపురం, ✔: మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. నిధులు విడుదల చేయగానే పనులు చేపడతాం. – రాము, పీఆర్ డీఈఈ, అరకులోయ

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: గుమ్మకోట నుంచి శంకుపర్తి వరకు రహదారి పనులు పూర్తి చేయాలి. – నాగేశ్వరరావు, అప్పారావు, గ్రామస్థులు, ✔: త్వరలోనే పనులు పూర్తిచేస్తాం. – రవికుమార్, ప్రాజెక్టు డీఈ

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: కొల్లోరిని ఆదంపరగెడ్డ కాలనీలో డ్రైనేజీలను శుభ్రం చేయకపోవడంతో మురుగునీరు రోడ్డుపైకి వస్తోంది. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. – నర్సింగరావు, స్థానికుడు. ✔: డ్రైనేజ్ వ్యవస్థను మెరుగుపరిచేందుకు ప్రతిపాదనలు పంపాం. మురుగు కాలువలను మూడు రోజుల్లో శుభ్రం చేయిస్తాం. – సులక్ష్మి, పంచాయతీ కార్యదర్శి

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: ఏనుగురాయి పాఠశాల ఆవరణలో బోరు మూలకు చేరింది. మరమ్మతులు చేపట్టాలి. – రాజు, స్థానికుడు, ✔: మరమ్మతులు చేయిస్తాం. – రాజేష్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ముంచంగిపుట్టు

వ్యవసాయానుబంధ పరిశ్రమగా చేపల పెంపకం

గూడెంకొత్తవీధి, చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: అల్లూరి జిల్లాలో చేపల పెంపకానికి అనువైన వాతావరణం ఉందని, వ్యవసాయానుబంధ పరిశ్రమగా చెరువుల్లో చేపల పెంపకాన్ని చేపట్టాలని వాసన్ సంస్థ ప్రోగ్రాం మేనేజరు జి.దామోదర్ అన్నారు. సంస్థ ప్రతినిధులు చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల్లో చెరువుల్లో చేపల పెంపకంపై గిరిజన రైతులకు క్షేత్రస్థాయి ప్రదర్శన ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. తమ సంస్థ ద్వారా మూడేళ్ల నుంచి గిరిరైతులకు చేపపిల్లలు పంపిణీ చేస్తున్నామన్నారు. బంగారుపాప, సిల్వర్‌కార్ప్, మృగాల్, రోహు, కట్ల గడ్డిచేపలు మన్యం వాతావరణంలో బాగా పెరుగుతాయని పేర్కొన్నారు. చెరువు గట్లపై అరటి, కొబ్బరి, కూరగాయలు, పైనాపిల్, సపోటా, జామ వంటి పలు రకాల ఉద్యాన పంటలు సాగు చేయడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం వస్తుందని వివరించారు. వాసన్ సంస్థ ప్రతినిధులు కోరాబు గాంధీ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

వసతిగృహాల నిర్మాణానికి చర్యలు

సీలేరు, న్యూస్‌టుడే: విద్యార్థుల వసతి ఇబ్బందులు తొలగేలా వసతి గృహాలు మంజూరైనట్లు గిరిజన సంక్షేమశాఖ ఏఈ గోపాలకృష్ణ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. సప్పర్ల, సీలేరు బాలికల ఆశ్రమ పాఠశాల, జిల్లా పరిషత్ హైస్కూల్‌కు పీఎం జన్‌మన్ ద్వారా వసతిగృహాలు మంజూరయ్యాయని చెప్పారు. సీలేరులో రెండు వసతిగృహాలకు రూ. 2.75 కోట్లు నిధులు విడుదల చేశారని తెలిపారు. వసతిగృహాల నిర్మాణానికి స్థల పరిశీలన చేసి.. కొలతలు వేశామని పేర్కొన్నారు. రాజేంద్రపాలెం, రావణాపల్లి, కొమ్మంగి, చింతపల్లి మండలంలోని లంబసింగి, వంగసార పాఠశాలలకు భవనాలు మంజూరయ్యాయని వివరించారు.

కష్టపడి చదివితే మంచి భవిష్యత్తు

కొయ్యూరు, న్యూస్‌టుడే: కొయ్యూరు బాలురు-1, పెద మాకవరం బాలికలు, శరభన్నపాలెం బాలుర ఆశ్రమ పాఠశాలలను అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్ బుధవారం సందర్శించారు. బాలల విద్యా ప్రమాణాలపై ఆరా తీశారు. పదోతరగతి విద్యార్థులతో మాట్లాడారు. కష్టపడి చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. పాఠ్యాంశాలపై విద్యార్థులకు ప్రశ్నలు వేశారు. కొయ్యూరు బాలురు-1 ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాలల్లోని సదుపాయాలను పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్ పాల్గొన్నారు.

బాలురు-I పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్

పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఈశ్వరి, గంగులయ్య, నాయకులు

పల్లెల్లో ప్రగతి బాటలు

పాడేరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిననాటి నుంచి గిరి పల్లెల్లో ప్రగతి పరుగులు పెడుతోందని మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి పేర్కొన్నారు. కాడేలి పంచాయతీ భవన నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. రూ. 34 లక్షలతో ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ భవనానికి స్థలం దానం చేసిన ఉపాధ్యాయుడు కొండలరావును అభినందించారు. గిరిజన ప్రాంత అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవణ్‌కల్యాణ్ కృషి చేస్తున్నారన్నారు. జానపద కళలు, సృజనాత్మక అకాడమీ ఛైర్మన్ వంపూరు గంగులయ్య, సర్పంచి బసవన్నదొర, తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బొర్రా విజయరాణి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం తగదు

పాడేరు, న్యూస్‌టుడే: వీబీజీ రాంజీ పథకంపై కాంగ్రెస్, సీపీఐ, సీపీఎంల తప్పుడు ప్రచారం మానుకోవాలని భాజపా జిల్లా అధ్యక్షురాలు మఠం శాంతకుమారి అన్నారు. పాడేరులో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఉపాధి హామీ పనితీరులో సమూల మార్పుల కోసమే ఈ నూతన చట్టాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. గతంలో కొన్ని రాష్ట్రాల్లో క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ లేక.. అనేక అవకతవకలు జరిగాయన్నారు. ప్రస్తుత చట్టంలో పని దినాలు 125కు పెంచినట్లు పేర్కొన్నారు. శ్రామికులకు సకాలంలో వేతనం అందించని పక్షంలో.. జరిగిన ఆలస్యానికి సైతం అదనంగా వేతనం అందజేసేలా చట్టం చేశారని పేర్కొన్నారు. భాజపా నాయకులు కొండబాబు, స్వరూప, విమల తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న భాజపా జిల్లా అధ్యక్షురాలు శాంతకుమారి, భాజపా నాయకులు

వైద్యసేవల్లో నిర్లక్ష్యం వద్దు

పాడేరు, న్యూస్‌టుడే: పాడేరు జిల్లా ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే ప్రతి రోగితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని పర్యవేక్షకులు డాక్టర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లా ఆసుపత్రిలోని చిన్నపిల్లల వార్డులో బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నారులకు వైద్య సేవలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. వార్డుల్లో పరిశుభ్రత, భోజన సదుపాయాలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. వార్డుల్లో తాగునీరు లేదని, మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ లేదని పలువురు ఫిర్యాదు చేశారు. లోపాలను వెంటనే సరిదిద్దాలని సిబ్బందిని ఆదేశించారు. చిన్నపిల్లలకు వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యం చేయొద్దని పేర్కొన్నారు. నర్సింగ్ పర్యవేక్షకురాలు అన్నపూర్ణ, సహాయ పర్యవేక్షకులు ఎర్రయ్య, బి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నపిల్లల వార్డును పరిశీలిస్తున్న పర్యవేక్షకులు శ్రీనివాసరావు

వస్తుమార్పిడి ప్రారంభం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో చెత్త సేకరణ నిమిత్తం ప్రభుత్వం స్వచ్ఛరథాలను ప్రవేశపెట్టింది. చింతపల్లిలో స్వచ్ఛరథం వద్ద వస్తుమార్పిడి విధానం మొదలైంది. రథం వద్ద ప్లాస్టిక్ వస్తువులు, అట్టలు, పుస్తకాలు, ప్లాస్టిక్ సీసాలు తదితర వస్తువులు అందజేసి.. నగదు, కావాల్సిన వస్తువులు తీసుకుంటున్నారు. చింతపల్లి వారపుసంతలో, పలు వీధుల్లో బుధవారం ఈ వాహనం తిరిగి వస్తువులు సేకరించింది. వ్యర్థాలు అందజేసి కావాల్సిన వస్తువులు తీసుకోవచ్చని, దీంతో పల్లెల్లో పారిశుధ్యం మెరుగుపడటంతోపాటు జలవనరులు కలుషితమవకుండా అడ్డుకట్ట వేసే అవకాశముందని ఎంపీడీవో సీతామహలక్ష్మి పేర్కొన్నారు.

స్వచ్ఛరథం వద్ద వస్తువులు మార్పిడి చేసుకుంటున్న గ్రామస్థులు

రూ.13 లక్షలతో జల్‌జీవన్ పనులు

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: పినకోట పంచాయతీ రాచకీలం గ్రామంలో రూ. 13 లక్షలతో జల్‌జీవన్ మిషన్ పనులు మంజూరయ్యాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఏఈ గౌతమ్ పేర్కొన్నారు. సర్పంచి శిరగం గణేష్ నేతృత్వంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఏఈ మాట్లాడుతూ.. త్వరలో ఈ పనులు ప్రారంభిస్తామన్నారు. అందరికీ ఇళ్లు మంజూరయ్యాయని, అందరూ ఒకేచోట ఇళ్ల నిర్మాణాలు చేపడితే బాగుంటుందని చెప్పారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హుకుంపేట, న్యూస్‌టుడే: మత్స్యగుండం జాతరకు వచ్చే భక్తుల దాహార్తిని తీర్చేందుకు తాగునీటి బోరు ఏర్పాటు చేస్తున్నామని మఠం పంచాయతీ సర్పంచి, ఉత్సవ కమిటీ ఛైర్మన్ శాంతికుమారి పేర్కొన్నారు. ఆలయం వద్ద బోరు ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఆర్‌డబ్ల్యూవో ఏఈ జగదీష్, భాజపా మహిళ మోర్చా అధ్యక్షురాలు రాణి, మత్స్య కొండబాబు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచి గణేష్

బాల్యవివాహాలతో అనర్థాలు

హుకుంపేట, న్యూస్‌టుడే: బాల్య వివాహాలతో అనర్థాలపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణకుమారి పేర్కొన్నారు. మారుమూల ఓలుబెడ్డలో అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం సందర్శించి.. పిల్లల వివరాలు, బాలింతలకు అందుతున్న పోషకాహారంపై ఆరా తీశారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. అనారోగ్య సమస్యలు వస్తే ఆసుపత్రికి వెళ్లాలని, నాటుమందులు తీసుకోవద్దని కోరారు. ఐసీడీఎస్ సిబ్బంది జ్ఞానేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రానికి సుదూరంలోని మఠంభీమవరం పంచాయతీ పోతవరం, చీడికోట, వాలుగూడెం, చిలకలపాలెం అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సీడీపీవో దేవమణి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోతవరం గ్రామంలో బాల్య వివాహ్ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీడీపీవో మాట్లాడుతూ.. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, సత్యవతి, కనకమహాలక్ష్మి, బీపీసీ సోమశేఖర్ పాల్గొన్నారు.

ఓలుబెడ్డలో గిరి మహిళలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కార్పొరేట్ల లాభాలకే లేబర్‌కోడ్లు

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: లేబర్ కోడ్లు.. దేశంలో కార్పొరేట్ శక్తుల లాభాలకేనని సీఐటీయూ పూర్వ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ అజశర్మ అన్నారు. అరకులోయ గిరిజన సంఘం భవన్‌లో వివిధ రంగాల కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. నూతన లేబర్‌కోడ్లతో సంఘం పెట్టుకునే, సమ్మె చేసే హక్కులు కార్మికులు పూర్తిగా కోల్పోతారన్నారు. గురువారం జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఉపాధ్యాయ, ఉద్యోగ కార్మిక వేదిక కన్వీనర్ రఘునాథ్, భగత్‌రాం, ఉమామహేశ్వరరావు, సురేంద్ర, పోతురాజు పాల్గొన్నారు.

చింతపల్లి గ్రామీణం, నూస్‌టుడే: లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ ఈనెల 12న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి కోరారు. చింతపల్లిలో కార్మికులతో కలసి బుధవారం ప్రచారం నిర్వహించారు. విశాఖ ఉక్కుతో సహా ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలన్నారు. గిరిజన సంఘం నాయకులు రాంబాబు, ఆనంద్, శంకరరావు పాల్గొన్నారు.

అనంతగిరి, న్యూస్‌టుడే: బొర్రా వద్ద పర్యాటకశాఖ కార్మికులు, మోటారు యూనియన్ సభ్యులతో జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు సమావేశమయ్యారు. సమ్మెను జయప్రదం చేసేందుకు సహకరించాలని కోరారు. దుకాణదారులు, కార్మిక సంఘాల నాయకులు సహకరించాలని పేర్కొన్నారు. లేబర్ కోడ్‌లు రద్దు చేసే వరకు తమ ఆందోళనలు కొనసాగుతుంటాయని చెప్పారు. మోస్య తదితరులు పాల్గొన్నారు.

అరకులోయలో మాట్లాడుతున్న అజశర్మ

బొర్రాలో మోటారు యూనియన్ నాయకులతో మాట్లాడుతున్న గంగరాజు

అరకులోయలో 7.8 డిగ్రీల ఉష్ణోగ్రత

చింతపల్లి, న్యూస్‌టుడే: అరకులోయలో బుధవారం 7.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ అప్పలస్వామి తెలిపారు. చింతపల్లిలో 10.8, ముంచంగిపుట్టులో 11 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

(c) eenadu

ఈనాడు - ఈటీవీ ఆధ్వర్యంలో.. జిల్లా స్థాయి ప్రతిభాపాటవ పోటీలు రేపు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: ‘ఈనాడు-ఈటీవీ’ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి పాఠశాల-కళాశాలల ప్రతిభా పాటవ పోటీలు శుక్రవారం జరగనున్నాయి. గుంటూరు జడ్పీ ఆవరణలోని శ్రీసత్యసాయి విద్యా విహార్‌లో ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని వివిధ కేంద్రాల్లో నాలుగు నెలలుగా 120 పాఠశాలలు, 23 కళాశాలల్లో వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాసం, క్విజ్ విభాగాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో పోటీలు జరిగాయి. ప్రాంతీయ స్థాయిలో 1,003 మంది విద్యార్థులు హాజరుకాగా.. 120 మంది బహుమతులు అందుకుని జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గుంటూరు నగరంలోని పలు కేంద్రాలతో పాటు తెనాలి, బాపట్ల, చీరాల, మాచర్ల, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, నరసరావుపేట, చిలకలూరిపేట తదితర ప్రాంతాల్లో పాఠశాలల స్థాయిలో 120 మంది, కళాశాలల నుంచి నాలుగు విభాగాల్లో ముగ్గురు వంతున 276 మంది విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఎంపికైన విద్యార్థులందరూ శుక్రవారం ఉదయం 9 గంటలకు శ్రీసత్యసాయి విద్యా విహార్‌కు చేరుకోవాలని నిర్వాహకులు సూచించారు.

ఎన్టీఆర్ విగ్రహానికి సీఎం ఘన నివాళి

తుళ్లూరు, న్యూస్‌టుడే: అసెంబ్లీ సమావేశాలకు వెళుతూ బుధవారం ఉదయం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంకటపాలెంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్థానికులు, ప్రజాప్రతినిధులు, రాజధాని రైతులు, మహిళలకు అభివాదం చేశారు. ఆయన వెంట మంత్రులు పి.నారాయణ, అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్, సవిత, ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, బి.రామాంజనేయులు, భాష్యం ప్రవీణ్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, చింతమనేని ప్రభాకర్, నరేంద్రవర్మ, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా తెదేపా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు తదితరులు ఉన్నారు. పెద్ద సంఖ్యలో తాడికొండ నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

రుణం.. ఎగనామం

నిద్ర మత్తులో డీసీసీబీ

రూ.20 కోట్లకుపైగా పేరుకున్న బకాయిలు

ఈనాడు – అమరావతి

శీతల గోదాముల్లో మిర్చి నిల్వ చేసి.. కేంద్ర సహకార బ్యాంకు పరిధిలోని గురజాల, నల్లపాడు శాఖల్లో తీసుకున్న రుణ బకాయిల వసూళ్లలో ముందడుగు కానరావడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా రుణాలిచ్చిన బ్యాంకు అధికారులపై చర్యలు తీసుకున్న యంత్రాంగం బాధ్యులైన రుణగ్రహీతలపై చర్యలకు వెనకడుగు వేస్తోంది. దాదాపు రూ.20 కోట్లకుపైగా బకాయి పేరుకుపోయింది.

గురజాల శాఖలో...

ఇక్కడి శీతల గోదాము యజమాని రైతులు మిర్చి నిల్వ చేసినట్టు చూపించి వారి పేరుతో రుణం తీసుకున్నారు. వైకాపా హయాంలో బ్యాంకు పాలకవర్గంలో కీలకంగా వ్యవహరించిన నేత అప్పటి ఉద్యోగులపై ఒత్తిడి తెచ్చి ఈ రుణం మంజూరు చేయించారు. ఏడాదిలోగా రికవరీ కాకపోవడంతో బ్యాంకు అధికారులు తనిఖీ చేసినప్పుడు అసలు గుట్టు బయటపడింది. గోదాము యజమాని మిర్చిని సైతం అమ్మేసుకున్నట్టు తేలింది. రైతులను విచారించగా.. రుణం తీసుకున్న విషయమే తెలియదని స్టేట్‌మెంట్లు ఇచ్చారు. బ్యాంకు అధికారులు ఇప్పటికీ ఒక్క రూపాయి కూడా వసూలు చేయలేకపోయారు.

నల్లపాడు శాఖలో...

శీతల గోదాముల్లో మిర్చి నిల్వ చేసినవారి పేరిట వైకాపా నేతల ఒత్తిడితో నిబంధనలకు విరుద్ధంగా రూ.70 కోట్లకుపైగా ప్లెడ్జ్ రుణాలిచ్చారు. ప్రారంభంలో రికవరీ బాగానే ఉన్నా.. కొన్నాళ్లకు చెల్లింపులు ఆగిపోయాయి. శీతల గోదాముల్లో మిర్చిని పరిశీలించకుండానే పరిమితికి మించి రుణాలిచ్చినట్టు తరువాత వెలుగులోకొచ్చింది.

అయినా.. బ్యాంకు అధికారులు నిర్మాణాత్మక చర్యలు తీసుకోలేదు. 51విచారణలో.. రాఘవేంద్ర, విశ్వసాయి గోదాముల్లో మిర్చి తనఖా పెట్టి తీసుకున్న రూ.13.15 కోట్ల బకాయి తీర్చలేదని గుర్తించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో అడుగు ముందుకు పడడం లేదు. రైతుల పేరుతో రుణాలు కొల్లగొట్టినవారు మాత్రం బయట దర్జాగా తిరుగుతున్నారు. సాంకేతికంగా రైతుల పేరుతో రుణం మంజూరైనందున ఇటీవల ఒక శీతల గోదాము యజమాని కొంత సొమ్ము చెల్లించారు. ఇంకా రూ.9 కోట్లకుపైగానే వసూలు కావాల్సి ఉంది.

* ఇప్పటికే క్రిమినల్ కేసులు నమోదైనందున పోలీసులు విచారణ చేస్తే బాధ్యులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

జనం వదిలేసిన సొమ్ము రూ.126 కోట్లు

క్లెయిమ్ చేయకపోవడంతో ఆర్‌బీఐకి బదిలీ

ఈనాడు – అమరావతి

జిల్లాలో అన్‌క్లెయిమ్డ్ ప్రైవేటు ఖాతాలు 7,18,043

బ్యాంకుల్లో అన్‌క్లెయిమ్డ్ ఖాతాల్లోని మొత్తాలను తీసుకునేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో ఆ నిల్వలను అధికారులు ఆర్‌బీఐకి బదిలీ చేశారు. ఇలా ప్రైవేటు ఖాతాల్లోని మొత్తం రూ.120.43 కోట్లు తరలిపోయాయి. బ్యాంకుల్లో ఖాతాలు తెరిచి.. కొన్నాళ్లపాటు లావాదేవీలు నిర్వహించి గత పదేళ్లుగా స్తబ్దుగా ఉన్న ఖాతాలను అన్‌క్లెయిమ్డ్ ఖాతాలుగా గుర్తించిన విషయం విదితమే. ప్రైవేటు వ్యక్తులకు అవగాహన లేకపోవడం, ఖాతా విషయం మరిచిపోవడంతో ముందుకు రాని పరిస్థితి. గత సోమవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో సమీక్షించిన సీఎం చంద్రబాబు.. ప్రభుత్వ ఖాతాల్లో అన్‌క్లెయిమ్డ్‌గా ఉన్న సొమ్మును వెంటనే తిరిగి తీసుకోవాలని ఆదేశించడంతో ప్రభుత్వ ఖాతాల్లో ఉన్న రూ.6.34 కోట్లను వెనక్కి తీసుకునేందుకు అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు.

“ప్రతి ఒక్కరికి బ్యాంకు ఖాతా ఉండాలన్న ఉద్దేశంతో 2015-16లో కేంద్రప్రభుత్వం పెద్దఎత్తున జన్‌ధన్ ఖాతాలను తెరిపించింది. చాలామంది వీటి ద్వారా లావాదేవీలు నిర్వహించకపోవడంతో పదేళ్లు దాటినందున అవన్నీ అన్‌క్లెయిమ్డ్ ఖాతాల జాబితాలోకి చేరాయి.”

సొమ్ము తిరిగి తీసుకోవాలంటే...

■ అన్‌క్లెయిమ్డ్ ఖాతాల్లో ఉన్న సొమ్ము తీసుకోవడానికి ఆర్‌బీఐ వెసులుబాటు కల్పించింది. ■ ఖాతాదారులు వారికి సంబంధించిన అన్‌క్లెయిమ్డ్ ఖాతాల వివరాలు తెలుసుకోవడానికి ‘ఉద్గమ్’ ఎపీ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని ఆధార్‌కార్డు, పాన్‌కార్డు ద్వారా వివరాలు తెలుసుకోవచ్చు. ■ సంబంధిత పత్రాలు అప్‌లోడ్ చేయాలి. ■ బ్యాంకులో కొత్తగా కేవైసీ చేసుకుని ఆ సొమ్ము తిరిగి పొందొచ్చు. ■ బ్యాంకు ఖాతా తెరిచిన తర్వాత అప్పట్లో ఇచ్చిన ఆధార్‌కార్డులోని పేరు, చిరునామా, నంబరు, చిరునామా మార్పునట్లయితే బ్యాంకులో రికేవైసీ చేయాలి. అలా చేసుకున్న తర్వాత ఆర్‌బీఐ నుంచి సొమ్ము తిరిగి తీసుకునే అవకాశం లభిస్తుంది. ■ అన్‌క్లెయిమ్డ్ ఖాతాలకు సంబంధించి ఏమైనా సందేహాలున్నా, సొమ్ము తిరిగి తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురైనా జీటీ రోడ్డులోని లీడ్ బ్యాంక్ కార్యాలయాన్ని సంప్రదించాలని లీడ్ బ్యాంకు మేనేజర్ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

పరాధీనంలో భూమి... దేవుడి సొంతమయ్యేనా?

చేతులు మారిన 381.63 ఎకరాలు ● సర్వేలో తేల్చిన దేవాదాయశాఖ

ఈనాడు – అమరావతి
న్యూస్‌టుడే – పొన్నూరు

దేవుడి భూములనే హారతి కర్పూరం చేసేశారు. ఒకటీ రెండూ కాదు.. ఏకంగా 381.63 ఎకరాలు. మార్కెట్ విలువ ఎంత తక్కువగా చూసినా.. రూ.350 కోట్లు. చివరకు ఆ దేవుడి కార్యక్రమాలు చేపట్టడానికి సొమ్ముల్లేని పరిస్థితి. ఆలయంలో కొంత భాగం శిథిలమవడంతో బాగు చేయడానికి నిధుల కొరత పీడిస్తోంది. ఏటా కౌలు ద్వారా వచ్చే రూ.62.50 లక్షలతో స్వామి కైంకర్యాలు, సిబ్బంది వేతనాలు చెల్లించి నెట్టుకొస్తున్నారు.

పొన్నూరు పట్టణంలోని సుందరవల్లి రాజ్యలక్ష్మీ సమేత సాక్షి భావనారాయణ స్వామి ఆలయానికి 710.63 ఎకరాల భూమి ఉంది. ఇందులో 311.81 ఎకరాలను ఆలయ అధికారులు కౌలుకిచ్చారు. 5.54 ఎకరాల్లో ఆలయం ఉంది. వివిధ సేవలందించిన 13 మందికి అప్పట్లో 381.63 ఎకరాలను ఇనాంగా కేటాయించారు. దశాబ్దాల క్రితమే వారు ఆ భూములను అమ్ముకుని వెళ్లిపోయారు. ప్రస్తుతం ఆలయంలో ఇనాందారులెవరూ పని చేయడం లేదు. అప్పట్లో వారికిచ్చిన భూములన్నీ పొన్నూరు పట్టణంతో పాటు పరిసరాల్లో ఉన్నాయి.

రిజిస్ట్రేషన్ల నిలిపివేత

2016 వరకు క్రయవిక్రయాలు జరగడంతో ఆ భూములు పలువురి చేతులు మారాయి. అన్యాక్రాంతమైన భూముల వివరాలు దేవాదాయశాఖ అధికారులు సేకరించి... ఆలయ రికార్డుల్లో నమోదు చేశారు. క్రయవిక్రయాలు జరపకుండా నిషేధిత జాబితాలో చేర్చారు

తాజాగా సర్వే

దేవాదాయశాఖ ఉన్నతాధికారుల సూచన మేరకు అన్యాక్రాంతమైన భూములను ఇటీవల సర్వే చేశారు. ఆ భూముల తాజా స్థితి. . ఎంతమంది స్వాధీనంలో ఉన్నాయి వంటి వివరాలు సేకరించి నివేదికను ఉన్నతాధికారులకు పంపించారు. దీని ప్రకారం 381.63 ఎకరాలు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉన్నట్టు గుర్తించారు. పొన్నూరు పట్టణంలో ఉన్న భూముల్లో వాణిజ్య సముదాయాలు, గృహాలు ఉండడంతో విలువ ఎక్కువగా ఉంది. అన్యాక్రాంతమైన ఆలయాల భూములపై ప్రభుత్వం నియమించిన మంత్రుల కమిటీ తీసుకునే నిర్ణయం ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని దేవాదాయశాఖ ఉపకమిషనర్ శ్రీనివాసరావు చెప్పారు. ప్రస్తుతం పరాధీనంలో ఉన్న భూముల రిజిస్ట్రేషన్ జరగకుండా చూస్తామన్నారు.

చేనేత పరిశ్రమ పరిరక్షణకు మంత్రి లోకేశ్ కృషి

తాడేపల్లి, మంగళగిరి, మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: చేనేత పరిశ్రమ పరిరక్షణకు మంత్రి నారా లోకేశ్ విశేష కృషి చేస్తున్నారని పద్మశాలీ వెల్ఫేర్ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్ధయ్య చెప్పారు. వస్త్రాలకు వినియోగించే నూలుకు రంగులు అద్దే కార్మికులకు నూతన పద్ధతులపై

శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నందం అబద్ధయ్య, చిత్రంలో అనీల్‌సాహుల్ తదితరులు

నైపుణ్య శిక్షణను కేంద్ర ప్రభుత్వ జౌళి మంత్రిత్వ శాఖ, చేనేత అభివృద్ధి సంస్థ చేపట్టింది. మంగళగిరి రాజీవ్‌గృహకల్ప వద్ద ఉన్న రజక సామాజిక భవనంలో ఈ శిక్షణ తరగతులను బుధవారం అబద్ధయ్య ప్రారంభించారు. 20 మంది కార్మికులను ఎంపిక చేసి వారికి 15 రోజుల పాటు శిక్షణ ఇస్తారు. శిక్షణ పొందే కార్మికులకు రోజుకు రూ.300 చొప్పున ఇవ్వనున్నారు. కార్యక్రమంలో విజయవాడ వీవర్‌సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ అనీల్‌సాహుల్, తితిదే పాలకమండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, కూటమి నాయకులు గుత్తికొండ ధనుంజయరావు, కారంపూడి అంకమరావు, పడవల మహేష్, మునగాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పసుపు రంగు మిర్చి.. లాభాలు తెచ్చి..

సాగుకు రైతుల ఆసక్తి

న్యూస్‌టుడే – మేడికొండూరు

మందపాడులో పసుపు రంగు మిర్చి తోట

ఉమ్మడి జిల్లాలో సాధారణంగా ఎర్ర మిరప సాగు ఎక్కువ. గత కొన్నేళ్లుగా నల్లతామర, బొబ్బర తెగులు, చీడపీడల సమస్యల కారణంగా పంటలు దెబ్బతింటున్నాయి. ఫలితంగా ఏటా నష్టపోవాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రయోగాత్మకంగా ఈ ఏడాది మేడికొండూరు, పెదకాకాని, పల్నాడు జిల్లా గురజాల, మాచవరం మండలాల్లో పసుపు రంగు మిర్చి సాగు చేస్తున్నారు. ఒక్క మేడికొండూరు మండల పరిధిలోనే సుమారు 400 ఎకరాల్లో ఈ రకం మిరప సాగవుతోంది.

కారణాలివీ..

* ఈ రకం మిర్చి తామర పురుగుతో పాటు, బొబ్బర తెగులు వివిధ రకాల వైరస్‌లు తట్టుకునే గుణం ఎక్కువగా కలిగి ఉంటుంది. * మందపాడులో కొంతమంది రైతులు మూడేళ్ల కిందట ప్రయోగాత్మకంగా సాగు చేశారు. దిగుబడి ఆశాజనకంగా ఉండటం, అప్పట్లో ఒక్కో క్వింటా ధర రూ.50 వేల నుంచి రూ.60 వేలదాకా పలకడంతో లాభాలు తెచ్చింది. * గత రెండేళ్లుగా ఎర్ర మిర్చి సాగు చేసిన రైతులు వివిధ కారణాలతో నష్టపోయారు. దీంతో మరోసారి పసుపు రంగు మిర్చి సాగుకు మొగ్గు చూపారు. * ఒక్క మందపాడులో గ్రామంలోనే 200 ఎకరాల్లో సాగులో ఉంది. * ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా. ప్రస్తుతం క్వింటా రూ.35 వేల నుంచి రూ.40 వేల దాకా ధర పలుకుతోంది.

● బొబ్బర తెగులు రాలేదు..

మూడెకరాల్లో పసుపు రంగు మిర్చి సాగు చేశాం. ఇప్పటి వరకు బొబ్బర తెగులు రాలేదు. ఒక్కో ఎకరాకు సుమారు రూ.2 లక్షలు ఖర్చయింది. వాతావరణం అనుకూలిస్తే సుమారు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల దాకా లాభం వచ్చే అవకాశం ఉంది.
- సూర్యదేవర వెంకటేశ్వరరావు, మందపాడు

● ఔషధ గుణాలు పుష్కలం..

పసుపు రంగు మిర్చిలో ఔషధ గుణాలు ఎక్కువ.. తెగుళ్ల బెడద తక్కువ. అంతర్జాతీయ మార్కెట్లోనూ మంచి డిమాండ్ ఉంది. అన్ని జాగ్రత్తలు పాటిస్తే ఎకరాకు సగటున 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. **- లక్ష్మి, ఏవో, మేడికొండూరు మండలం**

ప్రశాంతంగా త్రికోటేశ్వరుడిని దర్శించుకునేలా..

పకడ్బందీగా మహాశివరాత్రి తిరునాళ్ల ఏర్పాట్లు ● కోటప్పకొండ ఆలయ ఈవో దాసరి చంద్రశేఖర్‌రావు

ఈనాడు, నరసరావుపేట

చంద్రశేఖర్‌రావు

శివరాత్రికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా, త్వరగా దర్శనాలు అయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి ఆలయ ఈవో దాసరి చంద్రశేఖర్‌రావు తెలిపారు. తిరునాళ్ల సమీపిస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లపై ఆయన ‘ఈనాడు’ ముఖాముఖిలో మాట్లాడారు. ఆ వివరాలు..

దర్శనాలు ప్రశాంతంగా అయ్యేలా..

రద్దీ వల్ల తోపులాటలు చోటుచేసుకోకుండా ఈసారి ముందస్తుగానే దర్శనాలు ప్రారంభిస్తున్నాం. శివరాత్రి పురస్కరించుకుని ముందురోజు రాత్రి ఒంటిగంట నుంచే త్రికోటేశ్వర స్వామి దర్శనాలు మొదలవుతాయి. భక్తులు వచ్చిన వారిని వచ్చినట్లు పంపుతాం. అదనంగా క్యూలైన్లు కూడా ఏర్పాటు చేశాం. వీఐపీ దర్శన టికెట్లు టైమ్ స్లాట్‌ల ప్రకారం ఇస్తున్నాం. ఆ సమయంలోనే వారు రావాలి. ముందుగా వస్తే దర్శనం ఉండదు. ప్రోటోకాల్ దర్శనాలు ఉదయం 8:30 గంటల నుంచి 10 వరకు మళ్లీ మధ్యాహ్నం 2:30 గంటల నుంచి 4 వరకు ఉంటాయి.

భక్తులకు సేవల్లో లోపం లేకుండా..

2 లక్షల తాగునీటి సీసాలు పంపిణీకి సిద్ధం చేశాం. గతంలో ప్యాకెట్లు ఇచ్చేవారు. ఈసారి అరలీటరు సీసాలు పంపిణీ చేయనున్నాం. 75 వేల మజ్జిగ ప్యాకెట్లు, 75 వేల బిస్కట్ ప్యాకెట్లు, చిన్న పిల్లలకు వేడిపాలు సరఫరా చేస్తాం. 600 మంది వాలంటీర్లు సేవలు అందించడానికి ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకున్నారు. వీరితో పాటు ఎన్‌సీసీ, స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులు కూడా భక్తులకు సేవలందిస్తారు.

క్యూల్లో రద్దీ నియంత్రణకు..

ఇదివరకు ఎప్పుడూ రాత్రిపూట పట్టువస్త్రాల సమర్పణ ఉండేది. ఈసారి సాయంత్రం 3 నుంచి 4 గంటల మధ్యలోనే స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించేలా ఏర్పాట్లు ఉంటాయి. భక్తులకు అసౌకర్యం లేకుండా క్యూలు ఆగకుండా త్వరగా స్వామి దర్శనం పూర్తయ్యేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ ఆగకుండా ఆయా విభాగాలను అప్రమత్తం చేస్తున్నాం.

సరిపడా ప్రసాదాలు

దర్శనం చేసుకునే ప్రతి భక్తుడికి ఉచిత ప్రసాదం 20 గ్రాముల లడ్డూ అందజేస్తాం. ఇవి లక్షన్నర సిద్ధం చేస్తున్నాం. స్వామివారి ప్రసాదమైన నేతి అరిసెలు లక్ష, లడ్డూలు సుమారు రెండు లక్షలు అందుబాటులో ఉంచుతున్నాం. వీటి కోసం పది కౌంటర్లు ఏర్పాటు చేశాం.

పార్కింగ్‌లో నిలిపేలా..

కార్లు, ద్విచక్ర వాహనాలకు కొండపైకి అనుమతి లేదు. కొండ కింది వాహనాలు నిలుపుకోవడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. ఆ ప్రాంతంలోనే నిలపాలి. కొండపైకి భక్తులు బస్సుల్లోనే రావాలి. సొంత వాహనాలను అనుమతించం. 80 వరకు బయో టాయిలెట్స్ సిద్ధం చేశాం.

52.11 టీఎంసీలు లెక్కల్లోంచి మినహాయించండి

● సముద్రంలోకి వృథాగా వెళ్తున్న నీటినే వాడుకున్నాం ● కృష్ణా బోర్డుకు జలవనరులశాఖ లేఖ

ఈనాడు – అమరావతి

కృష్ణా నదికి వరదలు వచ్చినప్పుడు కాలువలకు విడుదల చేసిన నీటి పరిమాణంపై మినహాయింపు ఇవ్వాలని జలవనరులశాఖ.. కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)కు లేఖ రాసింది. గతేడాది జూరాల నుంచి ప్రకాశం బ్యారేజి వరకు ప్రాజెక్టులన్నీ నిండిపోయి గేట్లు ఎత్తి నీటిని వదిలినప్పుడు సముద్రంలోకి వదిలేశారు. ఆ సమయంలో పంటలకు అవసరం లేకపోయినా కాలువల ద్వారా చెరువులు, పంటకుంటలు, వాగుల్లోకి మళ్లించారు. ఇలా చేయకపోయి ఉంటే విలువైన జలం వృథాగా సముద్రంలో కలిసిపోయేది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఆ నీటి పరిమాణాన్ని లెక్కల నుంచి మినహాయించాలని జలవనరులశాఖ కోరుతోంది. ఇప్పటివరకు నాగార్జునసాగర్ నుంచి కాలువల కింద ఏపీ వాడుకున్న నీటి పరిమాణంలో తగ్గించి చూపాలని విన్నవిస్తోంది.

అన్ని ప్రాజెక్టుల్లో వరద కొనసాగుతుంటేనే...

కృష్ణా నదిపై రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ప్రాజెక్టులు, జలాశయాలు, బ్యారేజీలు అన్నీ నిండి నీరు వృథాగా సముద్రంలోకి వెళ్తున్న సమయంలో కాలువలకు తీసుకున్న నీటిని లెక్కలోకి తీసుకుంటారు. గతేడాది భారీగా వరద నీరు రావడంతో జులైలోనే ప్రాజెక్టులన్నీ నిండిపోయాయి. జులై నుంచి అక్టోబరు వరకు ఆరు విడతల్లో అన్ని ప్రాజెక్టుల గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ఈ సమయంలో నాగార్జునసాగర్ కుడికాలువ కింద 42.701 టీఎంసీలు, సాగర్ ఎడమ కాలువ కింద ఏపీ పరిధిలో 9.41 టీఎంసీలు వాడుకున్నట్టు జలవనరులశాఖ లెక్క తేల్చింది. ఇలా వాడుకున్న 52.111 టీఎంసీలను మినహాయించాలని కోరింది.

175.48 టీఎంసీల వినియోగం

ఫిబ్రవరి 10 వరకు నాగార్జునసాగర్ కుడి, ఎడమ కాలువల పరిధిలో ఏపీ 175.486 టీఎంసీల నీటిని (కుడి కాలువ ద్వారా 148.739 టీఎంసీలు, ఎడమ కాలువ ద్వారా ఏపీ పరిధిలో 26.747 టీఎంసీలు) వాడుకుంది. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో నీటి లభ్యత ఉండడంతో రబీలోనూ మెట్ట పంటలకు సాగు నీరందిస్తున్నారు. గతేడాది కృష్ణా పరివాహక ప్రాంతంలో భారీ వర్షాలు కురవడంతో సకాలంలో ప్రాజెక్టుల్లోకి నీరొచ్చింది. ఫలితంగా గతేడాది జులైలోనే కాలువలకు సాగునీటిని విడుదల చేశారు. కుడికాలువ కింద తొలిపంట వరి సాగు చేసిన రైతుల్లో కొందరు రబీలో రెండో పంట కూడా వేశారు. ఖరీఫ్‌లో వరి సాగు చేయని రైతులు రబీలో మొక్కజొన్న వేశారు. ఫలితంగా సాగు విస్తీర్ణం అనూహ్యంగా పెరిగింది. మరోవైపు ఎడమకాలువ కింద తెలంగాణ నుంచి ఏపీలోకి సాగు నీరు రావాల్సి ఉండడంతో ఆయకట్టు చివరి భూములకు నీరందని పరిస్థితి నెలకొంది. జలవనరులశాఖ యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుని వారాబందీ అమలు చేయడంతో పంటలకు నీరందుతోంది.

ముగిసిన ఉత్సవాలు.. పోటెత్తిన విశ్వాసులు

గుణదల మేరీ మాత ఉత్సవాలు బుధవారం ముగిశాయి. చివరి రోజు భారీగా విశ్వాసులు తరలివచ్చారు. కార్యక్రమంలో భాగంగా దివ్య పూజాబలి ప్రసాదాన్ని చూపుతున్న బిషప్‌లు రాజారావు, షమీంద్ర జయవర్ధన. -గుణదల, న్యూస్‌టుడే



విద్యుత్తు దీపాల వెలుగుల్లో గుణదల కొండ

బినామీ గ్రూపులతో దోచేశారు..!

8వ వార్డు ఆర్పీపై పొదుపు సంఘ సభ్యుల ఫిర్యాదు

పొన్నూరు, న్యూస్‌టుడే

వైకాపా పాలనలో మెప్మా విభాగం అవినీతికి కేంద్ర బిందువుగా మారింది. ఆర్పీ, వైకాపాలోని మహిళా నేత కలిసి బినామీ గ్రూపులను ఏర్పాటు చేసి లక్షలాది రూపాయలు దోచుకున్నారు. పొన్నూరు 8వ వార్డుకు చెందిన అప్పటి ఆర్పీ నిమ్మకాయల నాగసంధ్య.. శ్రీలక్ష్మీ కనకదుర్గా, దుర్గమ్మ, శాంతి, షిర్డిసాయి, మీనాక్షి అనే బినామీ మహిళ పొదుపు సంఘాలను ఏర్పాటు చేశారు. ఈ సంఘాల ద్వారా సుమారు రూ.46 లక్షల రుణాలు పొందారు.

నోటీసుతో అసలు విషయం బయటకు..

పొదుపు సంఘ సభ్యులకు నోటీసులు రావడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో ఐదు గ్రూపుల్లోని సభ్యులు అర్బన్ పోలీసుస్టేషన్, మెప్మా అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. సీఎంఎం సజ్జా వెంకటశివ నాగేశ్వరమ్మ సభ్యుల వద్దకు వెళ్లి వారిని విచారించి వాంగ్మూలాన్ని నమోదు చేసుకుని ఆ పత్రాలను పోలీసులకు అప్పగించినట్లు మెప్మా అధికారులు వెల్లడించారు. పోలీసులు ఆర్పీ నిమ్మకాయల నాగసంధ్యను పిలిచి విచారించి వాంగ్మూలాన్ని నమోదు చేసినట్లు సమాచారం. విచారణ సమయంలో ఆర్పీ బ్యాంకులో తీసుకున్న రుణాన్ని పూర్వ సీఎంఎం, వైకాపాలోని మహిళ నేతకు అప్పగించినట్లు చెప్పినట్లు తెలిసింది.

మహిళలను విచారిస్తున్న సీఎంఎం శివనాగేశ్వరమ్మ

మళ్లీ విధుల్లోకి..

గతంలోనే 8వ వార్డులో బినామీ గ్రూపులను ఏర్పాటు చేసి లక్షలాది రూపాయలు వైకాపా మహిళా నేత, పూర్వ సీఎంఎం స్వాహా చేశారని ఆర్పీ నాగ సంధ్య ఇచ్చిన ఫిర్యాదుతో అప్పటి మెప్మా ఉన్నతాధికారులు విచారణ చేశారు. వాస్తవం అని తేలడంతో అప్పటి సీఎంఎం మానుకొండ మేరి జోత్స్న, సీవోలు ఉషారాణి, జ్యోతిలను అప్పటి మెప్మా ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఆర్పీ నాగసంధ్యను విధుల నుంచి తప్పించారు. అక్రమాల్లో కీలక పాత్ర పోషించిన అధికారులను కొంత కాలం తర్వాత విధుల్లోకి తీసుకున్నారు. బ్యాంకుకు చెల్లించాల్సిన రుణాలను చెల్లించకపోవడంతో వారు కోర్టును ఆశ్రయించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రుణాలను తీసుకున్న వారి నుంచి తిరిగి చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని పొదుపు సంఘ సభ్యులు కోరుతున్నారు.

☛ దీనిపై పొన్నూరు అర్బన్ సీఐ వీరనాయక్‌ను న్యూస్‌టుడే వివరణ కోరగా.. పొదుపు సంఘ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేస్తున్నామన్నారు.

పరిశీలించారు సరే.. నివేదికేది..?

తూతూమంత్రంగా తనిఖీలు చేసిన సీడీఈ స్క్వాడ్

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే

ఏఎన్‌యూలోని దూరవిద్యా కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పరీక్షల్లో చూచిరాతను, ఇతర అక్రమాలను అరికట్టేందుకు ఉన్నతాధికారులు నియమించిన ప్రత్యేక స్క్వాడ్ కొండను తవ్వి ఎలుకను పట్టుకున్న సామెతను గుర్తుచేస్తోంది. ఈ నెల 2 నుంచి నిర్వహించిన రెండో విడత పరీక్షలలో అక్రమాలను అరికట్టేందుకు ఉన్నతాధికారులు ముగ్గురు అధ్యాపకులతో కమిటీ నియమించారు. అధికారిక ఉత్తర్వులు లేకుండానే రాయలసీమ, తర్వాత కోస్తాంధ్ర, ఉభయగోదావరి జిల్లాల్లో పర్యటించింది. అత్యధికంగా చూచిరాతలు జరిగే కర్నూలు జిల్లాలో పర్యటించలేదు. గుంటూరు, పల్నాడు ప్రాంతాల్లో తూతూ మంత్రంగా తనిఖీలు చేసింది. ఏఎన్‌యూలోని ఓ అధ్యాపకుడి బినామీ సెంటర్‌గా ప్రచారంలో ఉన్న గుంటూరులోని పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేయలేదు. ఈ కేంద్రంలో భారీగా చూచిరాతకు పాల్పడుతూ విద్యార్థులు మీడియాకు చిక్కారు. విజయవాడ వైపు కన్నెత్తి చూడలేదు. ఎక్కువ చూచిరాతలు జరిగే విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో అసలు పర్యటించలేదు. ఏఎన్‌యూలోని ఓ అధికారి సన్నిహితుడికి చెందిన నాలుగు పరీక్షా కేంద్రాల్లో భారీగా చూచిరాతలు జరిగినా వారికి కనబడలేదు. రాజమహేంద్రవరం సమీపంలోని ఓ పరీక్షా కేంద్రంలో పరిశీలకుడున్నా అతను అక్కడ లేడంటూ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. దీనిపై పరిశీలకుడు గట్టిగా ప్రశ్నించడంతో తేలుకుట్టిన దొంగల్లా మిన్నకుండిపోయారు.

ఎలాంటి మార్పు చేయలేదు..

ఎక్కడైనా ప్రత్యేక స్క్వాడ్ పర్యటిస్తే వెంటనే విశ్వవిద్యాలయానికి నివేదిక ఇవ్వాలి. తప్పులు జరిగిన సెంటర్లపై అధికారులు చర్యలు తీసుకుంటారు. తర్వాతి పరీక్షల్లో ఆ పరీక్షా కేంద్రాన్ని రద్దు చేస్తారు. పరిశీలకుల విషయంలోనూ ఇదే నిబంధనను పాటించాలి. ఈ నెల 9 నుంచి మూడో స్పెల్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. రెండో స్పెల్‌లో పర్యటించిన స్క్వాడ్ ఎలాంటి నివేదిక ఇవ్వకపోవడంతో ఎప్పటిలాగే ఆయా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. ఈ వ్యవహారంపై పరీక్షల సమన్వయకర్త ఆచార్య రామచంద్రన్‌ను న్యూస్‌టుడే వివరణ కోరగా.. పాత స్క్వాడ్ నివేదిక ఇవ్వకపోవడంతో పరీక్షల నిర్వహణలో ఎలాంటి మార్పులు చేయలేదన్నారు.

బాలల సంరక్షణాలయాల నమోదు గడువు 13

జిల్లాపరిషత్తు, న్యూస్‌టుడే: బాలల సంరక్షణాలయాల నిర్వాహకులు ఈనెల 13వ తేదీ లోపు సంస్థల పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి విజయ్‌కుమార్ బుధవారం తెలిపారు. డైరెక్టర్, బాలల సంక్షేమం, సంస్కరణ సేవలు-వీధి బాలల సంక్షేమ శాఖ విజయవాడ పేరుతో రూ.750 డీడీ తీసి గుంటూరులోని కార్యాలయంలో అందజేయాలన్నారు. గడువు ముగిశాక రిజిస్ట్రేషన్ లేకుండా ఏ సంస్థ కూడా బాలల సంరక్షణాలయంగా కొనసాగేందుకు అనుమతి లేదని, అటువంటి సంస్థలపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. వివరాలకు నగరంపాలెం మూడు బొమ్మల కూడలిలోని జిల్లా బాలల పరిరక్షణ అధికారి కార్యాలయంలో, 89191 62918 నంబర్‌లోనూ సంప్రదించవచ్చని సూచించారు.

(c) eenadu

ఇన్‌ఛార్జుల పాలన.. బిల్లులకు యాతన

శిథిలమైన భవనం ● జిల్లా యువజన సేవల శాఖ పరిస్థితి ఇదీ

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే

యువతకు మార్గదర్శకం చేయాల్సిన జిల్లా యువజన సేవల శాఖకు నెలలుగా ఇన్‌ఛార్జి పాలనతోనే సాగుతోంది. ఆ శాఖకు చెందిన జిల్లా స్టెప్ సీఈవోగా డిప్యుటేషన్‌పై పని చేసిన రెవెన్యూ శాఖకు చెందిన డిప్యూటీ కలెక్టర్ ఆర్. చంద్రముని 2025, ఆగస్టు 28న దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో రాష్ట్ర యువజన సేవల శాఖ సంచాలకుడు.. ఆయన్ను మాతృ శాఖకు సరెండర్ చేశారు. ఆయన స్థానంలో డీఆర్‌డీఏ పీడీ టి.వి.విజయలక్ష్మిని పూర్తి అదనపు బాధ్యతలతో నియమించారు. ఆమె గత డిసెంబరులో మాతృ విభాగం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖకు వెళ్లడంతో.. ఆ స్థానంలో డీఆర్‌డీఏ పీడీగా వచ్చిన వి.విజయలక్ష్మి స్టెప్ సీఈవోగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈమె జిల్లా మెప్మా పీడీగానూ కొనసాగుతున్నారు. దాంతో పని భారంతో ఆమె జిల్లా యువజన సేవలు, స్టెప్ కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా పాల్గొనే అవకాశాలు తక్కువయ్యాయి. స్టెప్ సీఈవో పోస్టు ఖాళీ ఏర్పడి ఆరు నెలలవుతున్నా ప్రభుత్వం రెగ్యులర్ అధికారిని నియమించకపోవడంతో ఆ శాఖ కార్యక్రమాలపై పర్యవేక్షించే అధికారి లేకపోవడంతో పాటు పరిపాలనా పరంగానూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

జిల్లా యువజన సేవలు, స్టెప్ కార్యాలయం లోపల పరిస్థితి ఇదీ..

దస్త్రాలపై సంతకాలకు ఇబ్బందులు

పండగలు, జాతీయ నాయకుల జయంతి, వర్ధంతులు వంటి కార్యక్రమాలు ప్రతి నెలా చేస్తున్నారు. వీటి నిర్వహణ ఖర్చులకు బిల్లులను సీఎఫ్‌ఎంఎస్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాతే ప్రభుత్వం విడుదల చేస్తుంది. సీఎఫ్‌ఎంఎస్‌లో బిల్లులు పెట్టినపుడు జిల్లా అధికారి రెండు, మూడు సార్లు బయోమెట్రిక్ వేయాలి. క్షేత్ర పర్యటనలు, అధికారిక సమావేశాల వల్ల ఇన్‌ఛార్జి అధికారులు అందుబాటులో ఉండని పరిస్థితి. దీంతో కార్యాలయ సిబ్బంది సొంతంగా డబ్బులు ఖర్చు పెట్టి.. తర్వాత బిల్లులు పెట్టి ప్రభుత్వం విడుదల చేశాక తీసుకోవాల్సి వస్తోంది. ☛ పొరుగు సేవల సిబ్బందికి డిసెంబరు, జనవరి వేతనాల దస్త్రంపై సంతకాలు చేయకపోవడంతో జీతాలు అందలేదు. ☛ రెగ్యులర్ అధికారి లేక యువతలో జాతీయ సమైక్యత సాధనకు మొక్కుబడి కార్యక్రమాలకే పరిమితమవుతున్నారనే విమర్శలున్నాయి.

బిక్కుబిక్కుమంటూ సిబ్బంది విధులు..

గుంటూరులోని స్టెప్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరింది. శ్లాబ్ పెచ్చులూడి పడడంతో లోపలి భాగంలో సీలింగ్ విరిగి కింద పడుతోంది. దీంతో ఉద్యోగులు బాగున్న చోట కూర్చుని విధులు నిర్వహిస్తున్నారు. భవనం మరమ్మతులకు రాష్ట్ర కార్యాలయానికి దస్త్రం పంపి నెలలవుతున్నా నిధులు విడుదల చేయని పరిస్థితి. ఫలితంగా సిబ్బంది బిక్కుబిక్కుమంటూ కూర్చుని పని చేస్తున్నారు.

శివాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

కలెక్టరేట్(గుంటూరు): శివరాత్రి పర్వదినం రోజున భక్తులు ప్రశాంత వాతావరణంలో స్వామిని దర్శించుకునేలా దేవాదాయ శాఖ, రెవెన్యూ, పోలీస్ శాఖలు సమన్వయంతో ముందస్తుగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మహాశివరాత్రి ఏర్పాట్లపై బుధవారం సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ చేబ్రోలులోని శ్రీబాల కోటేశ్వరస్వామి దేవస్థానం, పెదకాకానిలోని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంతో పాటు అన్ని శివాలయాల వద్ద భక్తుల రక్షణే ప్రాధాన్యంగా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. పోలీస్ శాఖ సూచన మేరకు భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూలైన్లు, బారికేడ్లు, సీసీ కెమెరాలను దేవాదాయ శాఖ అధికారులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రసాదాలను పరీక్షించిన తర్వాతే పంపిణీ చేయాలని, సూచిక బోర్డులతో పాటు, నిరంతరం భక్తులకు సూచనలు అందించేలా మైకులు, సీసీ టీవీ కెమెరాలు మానిటరింగ్‌కు కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. విద్యుత్తు, అగ్నిమాపక శాఖ మార్గదర్శకాల ప్రకారం అన్ని భద్రతా చర్యలు తీసుకోవాలని, సంబంధిత శాఖల అధికారులతో తనిఖీలు చేయించి ధ్రువీకరణ చేయించాలన్నారు. సామాన్య భక్తులకు ఇబ్బంది లేకుండా వీవీఐపీ దర్శనాలకు ఏర్పాట్లు చేయాలన్నారు. పర్వదినం రోజు తహసీల్దార్లు, పోలీస్ అధికారులు ఆలయాల వద్ద అందుబాటులో ఉండాలని చెప్పారు. తోపులాటలు, తొక్కిసలాటలు, భక్తులను భయాందోళనలకు గురిచేసే సంఘటనలు జరగకుండా చూసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఎన్.ఎస్.కె.ఖాజావలి, తెనాలి ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ లక్ష్మీకుమారి, దేవాదాయ శాఖ ఏసీ మాధవి తదితరులు పాల్గొన్నారు.

పనుల నిర్వహణకు ఒత్తిడి చేయొద్దు

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాలో స్వర్ణ గ్రామ, వార్డు ఉద్యోగుల సేవలను సక్రమంగా వినియోగించుకోవాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అధికారులకు సూచించారు. కలెక్టరేట్ నుంచి జేసీ అశుతోష్ శ్రీవాస్తవతో కలిసి అక్షర ఆంధ్ర, ఏకీకృత కుటుంబ సర్వేపై ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ సచివాలయాల ఉద్యోగులపై ఒత్తిడి లేకుండా పని వేళల్లోనే సర్వేలు నిర్వహించేలా పర్యవేక్షణ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అత్యవసరమైతే మినహా సెలవు దినాలు, హార్డ్ అవర్స్‌లోనూ పనుల నిర్వహణకు ఒత్తిడి చేయొద్దని స్పష్టం చేశారు. సర్వేలు ప్రారంభం నుంచే నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేలా ఉద్యోగులకు అవగాహన కల్పించడం ద్వారా చివరి సమయంలో ఒత్తిడి తగ్గుతుందన్నారు. ఒత్తిడి లేకుంటే ప్రశాంత వాతావరణంలో నాణ్యమైన పనులు చేయగలరని తెలిపారు. స్వర్ణ గ్రామ, వార్డు ఉద్యోగులు ఉన్నత విద్యావంతులని.. వారికి సరైన మార్గనిర్దేశం చేయడం ద్వారా మంచి ఫలితాలు పొందవచ్చని వివరించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి, అధికారులు పాల్గొన్నారు.

సీఎంఏ ఫైనల్, ఇంటర్ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న శ్రీమేధ ఛైర్మన్ నందకిషోర్

నగరపాలక సంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఎంఏఐ) బుధవారం ప్రకటించిన సీఎంఏ ఫైనల్, ఇంటర్ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థులు ఆలిండియా ట్యాప్ ర్యాంకులతో పాటు అత్యధిక పాస్ పర్సంటేజ్ సాధించారని విద్యాసంస్థ ఛైర్మన్ అన్నా నందకిషోర్ తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నందకిషోర్ మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా సీఏ, సీఎంఏ కోర్సుల్లో 450 ఆలిండియా ర్యాంకులు సాధించామని చెప్పారు. సీఎంఏ ఫైనల్ విభాగంలో ఎస్.శివారెడ్డి 800 మార్కులకు 537 మార్కులతో ఆలిండియా 21వ ర్యాంకు సాధించారని తెలిపారు. శ్రీమేధలో జూనియర్ ఇంటర్ ఎంఈసీలో డబుల్ బెనిఫిట్ ప్రోగ్రాంలో చేరి ఏకకాలంలో సీఏ, సీఎంఏ అర్హత పొందాడని, గతంలో సీఎంఏ ఇంటర్ విభాగంలో ఆలిండియా మూడో ర్యాంకు సాధించాడని తెలిపారు. సీఎంఏ ఇంటర్‌లో... ఎస్.కిషోర్ 800 మార్కులకు 506, జి.చంద్రశేఖర్ 457, సూఫీయస్ 456, షేక్ సలాం 449 మార్కులు సాధించారని వివరించారు. ఇంటర్మీడియట్ నుంచి సీఏ, సీఎంఏ కోర్సులను అనుభవజ్ఞులైన అధ్యాపకులతో శిక్షణ అందించడం వల్లనే ఆలిండియా ర్యాంకులు సాధ్యమవుతున్నాయని తెలిపారు. సీఎంఏ ఇంటర్ పూర్తయిన విద్యార్థులకు ఐసీఎంఏఐ సంస్థ నెలకు రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు ఇంటర్న్‌షిప్‌తో మంచి అవకాశాలు కల్పిస్తోందన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను శ్రీమేధ ఛైర్మన్ అన్నా నందకిషోర్, డైరెక్టర్ శ్రీలక్ష్మి, అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు.

మనమిత్రతో నేరుగా ప్రజలకు కీలక సేవలు

మాట్లాడుతున్న మోహనకృష్ణ

గుంటూరు రూరల్: ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రోత్సాహంతో దేశంలోనే తొలిసారిగా వాట్సాప్ గవర్నెన్స్ మనమిత్ర అందుబాటులోకి వచ్చిందని, దీనిద్వారా ప్రజలకు కీలక సేవలు అందిస్తున్నామని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ అన్నారు. ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో వాట్సాప్ గవర్నెన్స్, సైబర్ సెక్యూరిటీపై బుధవారం అవగాహన సదస్సు జరిగింది. సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన మన్నవ మోహనకృష్ణ మాట్లాడుతూ మంత్రి లోకేశ్ వినూత్న ఆలోచనలతో దేశంలోనే తొలిసారిగా ప్రజలకు వాట్సాప్‌లో 920కి పైగా ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ప్రజలు తమ చరవాణిలో 95523 00009 నంబర్‌ను సేవ్ చేసుకుని వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ పంపితే వెంటనే వచ్చే రిప్లైలో నచ్చిన భాషను ఎంచుకోవడం ద్వారా సేవలు నిమిషాల వ్యవధిలో సేవలు పొందవచ్చన్నారు. ముఖ్యమంత్రి విజన్‌తో దేశంలోనే బెస్ట్ సైబర్ సెక్యూరిటీ మానిటరింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. సైబర్ సెక్యూరిటీలో ఇంటర్న్‌షిప్స్ ఇస్తూ ప్రపంచంలో సైబర్ సెక్యూరిటీ నిపుణులను తయారు చేయడంలో ఏపీటీఎస్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ప్రజల వ్యక్తిగత రక్షణలో ఏపీటీఎస్ నిరంతరం నిఘా ఉంచుతూ హ్యాకర్ల ఆట కట్టిస్తున్నదన్నారు. ఏపీటీఎస్ ప్రతినిధులు శ్రీనివాస్, దినేష్, మదన్ రాజ్, కళాశాల ప్రిన్సిపల్ కొల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్వగ్రామానికి చేయూత అభినందనీయం

దాత రంగనాయకిని సత్కరిస్తున్న అతిథులు, సర్పంచి

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: స్వగ్రామానికి అండగా నిలుస్తున్న ప్రవాస భారతీయురాలు డాక్టర్ యలవర్తి రంగనాయకి సేవలు ఆదర్శనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. తెనాలి మండలం గుడివాడలో తల్లిదండ్రులు మేడూరు బసవపున్నయ్య, సత్యవతమ్మ పేరిట రూ.25 లక్షలతో సామాజిక భవనాన్ని నిర్మించిన డాక్టర్ యలవర్తి రంగనాయకిని అతిథులు, గ్రామస్థులు ఘనంగా సత్కరించారు. తొలుత బుధవారం సాయంత్రం గ్రామస్థులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. అనంతరం సామాజిక భవనాన్ని ప్రారంభించారు. సర్పంచి యడ్లపాటి రాకేష్, కాపూరు చంద్రమోహన్, మాతంగి రత్నం, బొద్దులూరి శివరామకృష్ణయ్య, సునీల్ పాల్గొన్నారు. యార్లగడ్డ శైలజ, రావెల బసవపున్నమ్మ, దొండపాటి అన్నపూర్ణ, సీతామహాలక్ష్మి, విజయలక్ష్మి, మోహనరావు, నవీన్ తదితరులు అతిథులుగా హాజరయ్యారు.

విద్యుత్తు విజిలెన్స్ దాడుల్లో రూ. 3.39 లక్షల జరిమానా

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: విద్యుత్తు అక్రమ వినియోగంపై ఆకస్మిక తనిఖీలు చేసి రూ.3.39 లక్షల జరిమానా విధించినట్లు విజిలెన్స్ విభాగం అధికారులు సుందరబాబు, సింగయ్య తెలిపారు. పల్నాడు జిల్లా పర్యవేక్షక ఇంజినీరు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో రాయవరం, కొత్తూరు, కొత్తపల్లి, హస్నాబాద్, గన్నవరం, గోపాలపురం, ఏజే మడక, మాచర్ల రూరల్ ప్రాంతాల్లో తనిఖీలు చేశామని వివరించారు. మీటర్ లేకుండా నేరుగా విద్యుత్తు చౌర్యానికి పాల్పడుతున్న నలుగురు, మీటర్ ఉన్నా.. అక్రమంగా చౌర్యానికి పాల్పడుతున్న ఇద్దరు, అనుమతించిన కేటగిరీకి బదులు వేరే కేటగిరీలో వినియోగిస్తున్న ఒకరు, అనుమతించిన లోడుకంటే అధికంగా వాడుతున్న 82 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. విద్యుత్తు చౌర్యం సామాజిక నేరమని ఎక్కడైనా అక్రమంగా వినియోగిస్తుంటే 94408 12262, 86397 41050 నంబర్లకు నేరుగా సమాచారం ఇవ్వొచ్చని లేదా వాట్సప్ ద్వారా తెలియజేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. డీఈఈలు రామయ్య, మల్లికార్జున ప్రసాదు, శ్రీనివాసరావు, రవికుమార్, ఏఈఈలు వెంకటేశ్వర నాయక్, శివశంకర్, సతీష్‌కుమార్, దుర్గారావు తనిఖీల్లో పాల్గొన్నారని తెలిపారు.

జీవన్మృతుడి అవయవాలు దానం

విజయకుమార్ (పాతచిత్రం)

తాడేపల్లి: ఇంజినీరింగ్ విద్యార్థి జీవన్మృతుడు కావడంతో అతని అవయవాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. తాడేపల్లి మణిపాల్ వైద్యశాల ప్రతినిధులు తెలిపిన వివరాల ప్రకారం కృష్ణా జిల్లా మచిలీపట్నం చెందిన కంచర్ల విజయ్‌కుమార్(20) కేఎల్‌యూలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్నారు. ఈనెల 6న కంచనపల్లి క్రాస్‌రోడ్డు వద్ద ప్రమాదానికి గురయ్యారు. అతన్ని మణిపాల్ వైద్యశాలకు తీసుకొచ్చారు. అతని ఆరోగ్య పరిస్థితిని పరిశీలించిన వైద్యులు మెదడులో రక్తస్రావం అవుతుండటం గమనించి చికిత్స అందించారు. అయినప్పటికీ ఆరోగ్య పరిస్థితిలో మార్పు కనిపించలేదు. వైద్య పరీక్షల అనంతరం ఈనెల 11న జీవన్మృతుడిగా నిర్ధారించారు. తండ్రి సైదేశ్వరరావు, కుటుంబ సభ్యుల అంగీకారంతో ఏపీ జీవన్‌దాన్ ఛైర్మన్ డాక్టర్ రాంబాబు, వైద్యశాల డైరెక్టర్ రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో అవయవదానం జరిగింది. ఇందులో గుండె, కాలేయాన్ని మణిపాల్ వైద్యశాల నుంచి విజయవాడలోని ఆసుపత్రులకు తరలించారు. ఊపిరితిత్తులను హైదరాబాద్ కిమ్స్‌కి, కిడ్నీలను గుంటూరు విధాత వైద్యశాలకు, కార్నియాలను విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి వైద్యశాలకు తరలించారు. అవయవదానానికి ముందుకొచ్చిన విజయ్‌కుమార్ కుటుంబానికి మణిపాల్ వైద్యశాల కృతజ్ఞతలు తెలిపింది.

కారులో చెలరేగిన మంటలు

కాలిపోతున్న కారు

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి వద్ద 16వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం రాత్రి ఓ కారులో నుంచి మంటలు చెలరేగాయి. అకస్మాత్తుగా ఇంజిన్ నుంచి మంటలు రావడంతో దానిలోని వారంతా బయటకు వచ్చేశారు. ఎగసిపడుతున్న మంటలను స్థానికులు గమనించి అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. జాతీయ రహదారిపై పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరి ఆరాతీశారు. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని తెలిపారు.

రేపటి నుంచి క్వారీ బాలకోటేశ్వరస్వామి తిరునాళ్ల

చేబ్రోలు, న్యూస్‌టుడే: వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వర స్వామి తిరునాళ్ల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు నిర్వహించేందుకు ఆలయ, పంచాయతీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మహాశివరాత్రి సందర్భంగా జరిగే ఈ తిరునాళ్లకు ఏటా రెండు లక్షల మంది భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. ఈ ఏడాది భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున చలువ పందిళ్లతో పాటు టెంట్లు ఏర్పాటు చేస్తున్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అన్ని విధాలా కృషి చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆ బంగారం ఏమైనట్లు..?

కొనసాగుతున్న విచారణ

పొన్నూరు, న్యూస్‌టుడే: పొన్నూరు అర్బన్ పోలీసుస్టేషన్‌లో బంగారం మాయమైన ఘటనలో పోలీసు అధికారులు పురోగతి సాధించలేకపోయారు. అసలు కారకులను గుర్తించి చర్యలు చేపట్టకపోవడంపై పోలీసు ఉన్నతాధికారులపై విమర్శలు వెలువడుతున్నాయి. * బర్నబాసు హత్య కేసులో ఆయన శరీరంపై ఉన్న బంగారు వస్తువులను బట్టి మృతదేహాన్ని గుర్తించారు. దీంతో ఆయన హత్య కేసులో బంగారం కీలక ఆధారంగా మారింది. ఈ నేపథ్యంలో అర్బన్ పోలీసుస్టేషన్‌లో బంగారం మాయం కావడంపై అనేక అనుమానాలకు తావిస్తోంది. తెనాలి డీఎస్పీ జనార్దనరావు పొన్నూరు అర్బన్ పోలీసు స్టేషన్‌లో రహస్యంగా విచారణ చేసినట్లు సమాచారం. అయితే ఎలాంటి వివరాలు బయటకు వెల్లడించలేదు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి లోతుగా విచారణ చేసి బంగారాన్ని స్వాధీనం చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాల్సి ఉంది. ★ దీనిపై పొన్నూరు అర్బన్ సీఐ వీరనాయక్‌ను న్యూస్‌టుడే వివరణ కోరగా.. బంగారం మాయం చేసిన ఘటనపై ఇంకా విచారణ కొనసాగుతుందన్నారు.

'దాడులన్నింటికీ ప్రతిఫలం అనుభవించక తప్పదు'

అంబటి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి, నాయకులు

కలెక్టరేట్(గుంటూరు): మాజీ మంత్రుల ఇళ్లపై దాడులు చేయడం ఎన్నడూ చూడలేదని, దాడులన్నింటికీ ప్రతిఫలం అనుభవించక తప్పదని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. గుంటూరు సిద్ధార్థనగర్‌లోని అంబటి రాంబాబు కుటుంబ సభ్యులను బుధవారం పలువురు మాజీ మంత్రులు, వైకాపా నేతలు పరామర్శించారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ కాపులకు అండగా ఉంటానన్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చెప్పిన మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. మంత్రి లోకేశ్ వల్లే దాడులు జరుగుతున్నాయన్నారు. జగన్ తిరిగి అధికారంలోకి వస్తారని పేర్కొన్నారు. ★ మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా మాట్లాడుతూ కూటమి వైఫల్యాలను ప్రశ్నించే గొంతులను నొక్కేందుకే అంబటిపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపారన్నారు. చట్టాన్ని అతిక్రమించిన ప్రతి ఒక్కరూ రానున్న రోజుల్లో డిజిటల్ బుక్ ద్వారా దోషులుగా నిలబడతారని హెచ్చరించారు. ★ మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ ఇంట్లో మహిళలు ఉన్నారన్న ఆలోచన లేకుండా దాడులకు పాల్పడ్డారని మండిపడ్డారు. తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి ఆరోపణల్లో నిజం లేదు కాబట్టే భాజపా నేతలు మాట్లాడడం లేదన్నారు. ★ ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటిఅమర్నాథ్‌రెడ్డి, వైకాపా గుంటూరు నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా, జైభీమ్ రావ్ భారత్ పార్టీ అధ్యక్షుడు జడ శ్రావణ్‌కుమార్, ఉభయగోదావరి జిల్లాల కాపు సంఘం అధ్యక్షుడు చిన్నిమిల్లి వెంకటరాయుడు తదితర నేతలు అంబటి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ముస్లిం ఉద్యోగులకు సడలింపు అభినందనీయం

దుగ్గిరాల, మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: ఎంతో పవిత్రమైన రంజాన్ మాసంలో ముస్లిం ఉద్యోగులు ఒక గంట ముందుగానే ప్రార్థనలకు వెళ్లేందుకు అనుమతిస్తూ పనివేళల్లో ప్రభుత్వం సడలింపు ఇవ్వడం ఎంతైనా అభినందనీయమని రాష్ట్ర హజ్‌కమిటీ సభ్యురాలు, దుగ్గిరాల ఎంపీపీ షేక్ జబీన్ అన్నారు. బుధవారం దుగ్గిరాలలో మాట్లాడుతూ ఈ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

మిర్చి యార్డు సమాచారం (నిన్నటి ధరలు)

వచ్చిన బస్తాలు: 1,09,852
అమ్మకాలు: 1,05,937
నిల్వలు: 25,636

నాన్ ఏసీ కామన్ వెరైటీ (క్వింటా రూ.ల్లో)	
334	13,500-23,000
నంబర్ 5	13,500-22,500
273	14,000-23,000
341	14,000-26,000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ	
తేజ	13,000-20,000
బాడిగ	14,000-25,500
దేవనూరు డీలక్స్	15,500-27,500
ఆర్మూర్	13,000-18,000
ఏసీ కామన్ వెరైటీ	
334	14,000-21,000
నెంబర్5	13,000-21,000
341	14,000-23,500
సూపర్ 10	13,500-22,500
ఏసీ స్పెషల్ వెరైటీ	
తేజ	13,000-19,000
బాడిగ	14,000-24,000
తాలు	7,600-12,500

- న్యూస్‌టుడే, మిర్చియార్డు

'వైకాపావి చిల్లర రాజకీయాలు'

తుళ్లూరు, న్యూస్‌టుడే: కులమతాల మధ్య విభేదాలు సృష్టిస్తూ, ప్రజలను రెచ్చగొడుతూ వైకాపా నాయకులు చిల్లర రాజకీయాలు చేస్తున్నారంటూ తెదేపా నాయకులు విమర్శించారు. బుధవారం వెంకటపాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ ప్రతి ఎమ్మెల్యే అసెంబ్లీ సమావేశాలకు హాజరై ప్రజా సమస్యలపై మాట్లాడాలన్నారు. కేవలం జీతాల కోసం అసెంబ్లీకి వచ్చి సంతకాలు పెట్టి వెళ్లడం సరికాదు. ఏ అంశంపై అయినా జబాబు చెప్పడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

జగన్ ప్రతిపక్ష హోదా అడగడం విడ్డూరం: బుచ్చయ్యచౌదరి

ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్ కేవలం ఒక్కరోజు అసెంబ్లీ సమావేశాలకు హాజరై గవర్నర్ ప్రసంగం విని వెళ్లిపోవడం మన దౌర్భాగ్యమన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 11 సీట్లతో జగన్ ప్రతిపక్ష హోదా కావాలని అడగడం విడ్డూరంగా ఉందన్నారు.

వైకాపా నాయకులది బుకాయింపు: శ్రీధర్‌రెడ్డి

ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ జగన్‌తో సహా వైకాపా నాయకులంతా ఒక పక్క తిరుమల లడ్డూ నెయ్యిలో కల్తీ జరిగిందని చెబుతూ..మరో పక్క బుకాయిస్తున్నారని చెప్పారు. చేసిన తప్పునకు చెంప దెబ్బలు వేసుకొని చేసిన నేరానికి శిక్ష అనుభవించేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని సూచించారు. ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ రాజధాని అమరావతి గురించి మాట్లాడడానికి జగన్ అనర్హుడన్నారు.

కారుతో వెంబడించి ఢీకొట్టారు

తుళ్లూరు, న్యూస్‌టుడే: విద్యార్థుల మధ్య ఏర్పడిన మనస్పర్థలు చిలికి చిలికి గాలివానలా మారుతున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజధాని ప్రాంతంలోని ఒక యూనివర్సిటీలో బీటెక్ చదువుతున్న కౌశిక్, నాగేంద్ర, చంద్రమౌళి మధ్య గతంలో గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం చంద్రమౌళి స్కూటీపై విజయవాడ వెళుతుండగా కౌశిక్, నాగేంద్రలు కారులో వెంబడించి స్కూటీని అడ్డగించి కొట్టారు. విషయం తెలుసుకొని పోలీసులు అక్కడికి వచ్చి విద్యార్థులను అక్కడి నుంచి పంపించారు. ఆ తరువాత సాయంత్రం సీడ్‌యాక్సెస్ రోడ్డు నుంచి చంద్రమౌళి తన సహచరుడు స్వరూప్‌తో కలిసి స్కూటీపై మందడం గ్రామం వచ్చే క్రమంలో మరోసారి కౌశిక్, నాగేంద్రలు కారులో వచ్చి స్కూటీని ఢీకొట్టడంతో స్వరూప్, చంద్రమౌళి కిందపడిపోయారు. స్వరూప్ కాళ్లకు గాయాలు కావడంతో గుంటూరులోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేయించుకొని తుళ్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సినీపరిశ్రమ అభివృద్ధిపై బిల్లు పెట్టాలి

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: ప్రస్తుత శాసనసభ సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్‌లో సినీపరిశ్రమ అభివృద్ధిపై బిల్లు పెట్టాలని, దీనికి నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మా-ఏపీ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్ రాజా విజ్ఞప్తి చేశారు. గుంటూరు అరండల్‌పేటలోని ఓ హోటల్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాజధాని అమరావతిలోనే వంద ఎకరాల్లో ఎన్టీఆర్ ఫిల్మ్ సిటీని ఏర్పాటు చేస్తే రాష్ట్రంలో సినిమా చిత్రీకరణలు బాగా జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. దీనివల్ల రాష్ట్రానికి ఆదాయం కూడా వస్తుందన్నారు. తిరుపతి, విశాఖల్లో మినీ స్టూడియోలు నిర్మించాలనుకునే ఔత్సాహికులకు అవకాశాలు కల్పించాలని సూచించారు. ఆంధ్రాలో సినిమాలు తీసే నిర్మాణ సంస్థలకు రాయితీ పెంచాలని కోరారు. సెన్సార్ పూర్తిచేసుకున్న ప్రతి చిన్న సినిమా విడుదలకు విధి, విధానాలను సినిమాటోగ్రఫీ మంత్రిత్వ శాఖ రూపొందించాలన్నారు. ఆంధ్రలో సినిమా చిత్రీకరణలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన కల్పించాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ డైరెక్టర్లు నరేష్ దోనె, గాజులపల్లి రాముడు, నటుడు మిలటరీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో |కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 120, రిటైల్ ధర - 147, చికెన్ విత్‌స్కిన్ - 213, చికెన్ స్కిన్‌లెస్ - 243.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213 చికెన్ స్కిన్‌లెస్ - 243.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 248 చికెన్ స్కిన్‌లెస్ - 258.

రైలుపట్టాలపై రెండు మృతదేహాలు

గుంటూరు నేరవార్తలు: రైలుపట్టాలపై రెండు మృతదేహాలు స్థానికంగా కలకలం రేపాయి. బుధవారం కేసు నమోదు చేసిన గుంటూరు జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాలు... నంబూరు-మంగళగిరి మార్గంలో కల్వరి ఆలయం సమీపంలో బుధవారం ఉదయం రెండు మృతదేహాలు ఉన్నాయని స్థానికులు సమాచారం ఇవ్వడంతో జీఆర్పీ సీఐ అంజిబాబు, ఎస్సై దీపిక సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. మృతుల్లో మహిళ వయసు 70 సంవత్సరాలు, పురుషుడికి 40 సంవత్సరాలు ఉండొచ్చని భావిస్తున్నారు. స్థానికంగా విచారించినా వారి వివరాలు తెలియలేదు. మృతుడి రెండు చేతులపై రాములు, రాముడు అని పచ్చబొట్టు ఉంది. ఆత్మహత్య చేసుకున్నారా? ఇతర కారణాలేమైనా ఉన్నాయా? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. వివరాలు తెలిసినవారు గుంటూరులోని జీఆర్పీ పోలీసులను సంప్రదించాలని కోరారు.

EENADU e Classifieds

AUTO

VEHICLES FOR SALE

AP-39-TH-0626 Maruti Swift Dzire Car Model 2019 is for Sale in as is Where is Condition. Sundaram Finance Ltd. Guntur. ✆ 0863-2241386, 94409 09736.

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్‌క్యాష్). ✆ 81422 92071.

REAL ESTATE

FLAT FOR SALE

GENERAL

గుంటూరు పట్టణంలో సంగడిగుంటలోని లాంచెస్టర్ రోడ్డులో ఉన్న లక్ష్మీ రాఘవేంద్ర టవర్స్ లోని 3వ అంతస్తులో తూర్పు ఫేసింగ్ 3BHK అపార్ట్మెంట్ (1654చ.అ.) అమ్మకమునకు కలదు. సంప్రదించవలసిన ఫోన్: 94414 11874.

PLOT FOR SALE

GENERAL

గుంటూరు సిటీ 1500 చ||గ|| E/F ప్లాట్ సేల్. గోరంట్ల, ఆదిత్రి యెల్లోరా ప్రక్కన, శిల్పారామం, అమరావతి రోడ్డుకు 1km, గ. Rs.16000. ✆87908 94569.

JOBS

TECHNICAL Skills Nerchukoni Job lo set avvali anukone vallaku sada avakasam. Training period 1 month. if you are ready to join Job after Course. No Interview. More detailes Contact: 8712625322 in between 8 am to 9 am. Limited Seats only.

బస్సుడ్రైవర్స్ కావలెను. హెవీ లైసెన్స్‌తో పాటు కనీసం 5సం||ల అనుభవం కలిగిన డ్రైవర్స్ కావలెను. రూట్లు: మంగళగిరి, కేసరపల్లి, భవానీపురం, కంచికచర్ల, గంగినేనిపాలెం, వత్సవాయి, గట్టు భీమవరం, నందిగామ. జీతం నెలకు 18000/-. అమృతసాయి ఇంజినీరింగ్ కళాశాల, పరిటాల. ✆ 94907 97533, 99482 30222

గుంటూరు పరిధిలోని ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీలో పని చేయుటకు 10th / Inter చదివిన ఫుల్ టైం లేడీ వార్డెన్ కావలెను. & Degree చదివిన DTP cum Cleark (Male) కావలెను. ✆ 93944 47117, 92477 45046.

గుంటూరులోని రియల్ బూమ్ రియల్ ఎస్టేట్ సర్వీసెస్ నందు పని చేయుటకు కంప్యూటర్ ఆపరేటర్స్ (50), టెలీకాలర్స్ (10), DDOలు (10) కావలెను. ✆ 78010 32689.

ప్రముఖ L.G. సర్వీస్ సెంటర్, ఏ.టి.అగ్రహారం నందు పని చేయుటకు కంప్యూటర్ ఆపరేటర్ & టెలికాలర్స్ కావలెను. ✆ 97013 63586, 93812 32909.

గుంటూరులో ప్రముఖ హాస్పిటల్ నందు పనిచేయుటకు మేల్ రిసెప్షనిస్ట్, ఫార్మాసిస్ట్ మరియు స్టాఫ్ కావలెను. సంప్ర|| 88855 90905.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు వార్డెన్స్ మరియు హాస్టల్ ఇన్‌ఛార్జిగా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము 12000/-నుండి 15000/- వరకు ఇవ్వబడును (నాన్‌లోకల్ వారికి ఉచిత భోజనము, వసతి కల్పించబడును). విద్యార్హతలు: ఇంటర్ నుండి డిగ్రీ వరకు, వయస్సు:22 సం||రాలు నుండి 40 సం||రాలు ఉండవలెను. వివరాలకు సంప్ర| 92487 33371.

అశోక్ లేలాండ్ వెహికల్స్ కోసం 3 డ్రైవర్లు కావలెను. 3 సం|| అనుభవం ఉండాలి. వివరాలకు సంప్ర: 74166 89935.

ప్రముఖ కలెక్షన్ ఏజెన్సీలో పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్ మరియు టెలికాలర్స్ అనుభవంగలవారు కావలెను. జీతం: 15k to 20k, కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. DRA సర్టిఫికెట్ ఉన్నవారికి ప్రాధాన్యత కలదు. జీతం:20k సంప్రదించగలరు ఫోన్ నెంబర్స్: 89190 80894, 83091 32382.

ప్రముఖ కంపెనీకి తెనాలి, బాపట్ల, చీరాల, ప్రత్తిపాడు, తాడికొండ, మంగళగిరి, సత్తెనపల్లి, పెదకూరపాడు, మాచర్ల, చిలకలూరిపేట, గురజాల మార్కెటింగ్ చేయుటకు ఎగ్జిక్యూటివ్స్ కావలెను. మంచి జీతం, ఇన్సెంటీవ్‌లు మరియు ప్రయాణ భత్యాలు. సంప్రదించగలరు. ✆ 79970 18666.

ప్రముఖ సోలార్ కంపెనీ ఆఫీసు నందు పనిచేయుటకు టెలికాలర్, కంప్యూటర్ ఆపరేటర్ (లేడీస్) కావలెను. సంప్ర|| 79970 18666.

ప్రముఖ విద్యా సంస్థలో పనిచేయుటకు ఆఫీస్ అడ్మిన్‌స్ట్రేటివ్/ MKTG Exe. కావలెను. సంప్ర|| శ్రీవర్ధనీ విద్యాసంస్థలు, 2/6 బ్రాడీపేట, Gnt. ✆ 94402 14612.

గుంటూరు లక్ష్మీపురంలోని ప్రముఖ దంత వైద్యశాలలో పనిచేయుటకు రిసెప్షనిస్ట్, క్లీనింగ్‌స్టాఫ్. జీతం: 12 నుంచి 15000, వయస్సు: 30 సం||లోపు. గుంటూరు టూ టౌన్‌వారు కావలెను. ✆ 85008 08778.

SECURITY GUARDS

సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. లక్ష్మీపురం మెయిన్ రోడ్‌లో పనిచేయుటకు, 12 గం||లు డ్యూటీ, జీతం: 13000/-, వివరాలు: 72880 04466.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఎటువంటి సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు. ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బులు వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/-

5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/-

ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

91.9 FM Vijayawada ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

ఈనాడు దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి Cell: 80085 14589

గుంటూరు తూర్పు

1న ఎన్టీఆర్ స్టేడియం పాలకవర్గం ఎన్నిక

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: జీఎంసీ పరిధిలోని ఎన్టీఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణం, స్విమ్మింగ్ పూల్ సొసైటీ పాలకవర్గం ఎన్నికను మార్చి 1న నిర్వహించనున్నట్లు డీసీ, ఎన్టీఆర్ స్టేడియం ఎన్నికల నిర్వహణ అధికారి సీహెచ్ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12న అర్హులైన ఓటర్ల జాబితాను స్టేడియంలో ప్రదర్శిస్తామని, 13న నోటిఫికేషన్ జారీ ఉంటుందని తెలిపారు.

82 బస్తాల చౌకబియ్యం జప్తు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: చౌకబియ్యం అక్రమంగా నిల్వ చేశారన్న సమాచారంతో విజిలెన్స్ ఎస్పీ సూర్యశ్రావణ్‌కుమార్ ఆదేశాలతో బుధవారం విజిలెన్స్ అధికారుల బృందం పల్నాడు జిల్లా అచ్చంపేట మండలంలో తనిఖీలు చేసింది. సీతారాంపురం వాగు వద్ద లెల్ల అప్పిరెడ్డి ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 82 బస్తాల్లోని 3,725 కిలోల చౌక బియ్యం జప్తు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

94406 38515, 80085 73097

స్పందన: ★ వినోభానగర్ రెండోలైన్‌లో చెత్త కుప్పలు రెండు రోజులుగా వదిలేయడంతో వీధులు అపరిశుభ్రంగా ఉన్నాయని స్థానికుడు మీరావలి 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. సమస్యను శానిటరీ సూపర్‌వైజర్ అయూబ్‌ఖాన్ దృష్టికి తీసుకెళ్లడంతో ట్రాక్టర్ సిబ్బందిని పంపి చెత్తకుప్పలు తరలించారు. ★ పద్మావతినగర్ 3వ లైన్‌లో సైడుకాలువల్లో పూడికలు చేరి మురుగునీరు నిలిచిపోవడంతో దోమల వ్యాప్తి అధికంగా ఉంటోందని స్థానికుడు మధు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. సమస్యను ప్రజారోగ్య విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో సిల్ట్ తీయించారు. ★ షాప్‌ఎంప్లాయిస్‌కాలనీ 2వ లైన్‌లో సైడుకాలువల్లో పూడికలు చేరడంతో మురుగునీటి పారుదలకు ఆటంకం కలుగుతోందని స్థానికుడు హనీఫ్‌మహమ్మద్ 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. సమస్యను శానిటరీ సూపర్‌వైజర్ అయూబ్‌ఖాన్ దృష్టికి తీసుకెళ్లడంతో సిబ్బందిని పంపి కాలువల్లో పూడికలు తీయించారు. ★ గాంధీనగర్ ప్రధానరోడ్డులో చెత్త కుప్పలు రెండు రోజులుగా ఉండటం వల్ల వీధులు అపరిశుభ్రంగా మారుతున్నాయని స్థానికుడు వేణుబాబు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు ఫిర్యాదు చేశారు. సమస్యను ప్రజారోగ్య విభాగం అధికారులకు తెలియజేయడంతో ట్రాక్టర్ పంపి చెత్త కుప్పలు తొలగించి తరలించారు. **- న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ**

సార్వత్రిక సమ్మెకు బ్యాంకు ఉద్యోగుల మద్దతు

కలెక్టరేట్, న్యూస్‌టుడే: కేంద్ర కార్మిక సంఘాల పిలుపుతో గురువారం సార్వత్రిక సమ్మెకు బ్యాంకు ఉద్యోగులు మద్దతిచ్చారు. జీటీరోడ్డులోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం వద్ద బుధవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సమ్మెకు సంఘీభావం ప్రకటించారు. జిల్లాలోని బ్యాంకులు గురువారం సమ్మెలో పాల్గొంటున్నాయని ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కార్మిక వ్యతిరేక నిర్ణయాలు వెనక్కు తీసుకోవాలని నినదించారు. 29 కార్మిక చట్టాలను, 4 లేబర్ కోడ్‌లను.. కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా మార్చడాన్ని వ్యతిరేకించారు.

సగం పనులు.. నిత్యం అవస్థలు

న్యూస్‌టుడే – గుంటూరు నగరం

అధికారుల పర్యవేక్షణ లోపం, గుత్తేదారుల స్వార్థంతో నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సకాలంలో పూర్తి చేయకపోవడంతో ఆరు నెలలుగా కాలనీవాసులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమస్యను పట్టించుకోవడం లేదు. లాంచెస్టర్ కాలనీ ఒకటో లైన్‌లో గతేడాది ఆగస్టులో కాలువలు, రోడ్లు పగలగొట్టారు. సీసీ రోడ్డు, మురుగు కాలువలు నిర్మిస్తున్నారని కాలనీవాసులు సంబరపడ్డారు. తొలుత మురుగు కాలువలు నిర్మించినా గుత్తేదారుడు రోడ్డు వేయకుండా వదిలేశారు. దీంతో స్థానికులు, వాహనచోదకులకు అవస్థలు తప్పలేదు. కాలనీవాసులు తమ కష్టాలను గత కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చినప్పటికీ అమలుకు నోచుకోలేదు. గుత్తేదారుడు మురుగు కాలువలు కట్టినప్పటికీ రోడ్డు నిర్మాణంలో భాగంగా కంకర పరిచి వదిలేశారు. ఇళ్ల ఎదుట కాలువలు ఎత్తుగా నిర్మించడంతో

కాల్వలు కట్టి వదిలేసిన రోడ్డు

అంతర్గత రోడ్డులో కంకరపోసి వదిలేశారు ఇలా

వృద్ధులు, చిన్నారులు బయటకు వచ్చే సమయంలో ప్రమాదాలకు గురవుతున్నారు. కంకర రోడ్డుపై ఉండడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

◆ ఎల్ఆర్ కాలనీలోని పలు వీధుల్లో మురుగు కాలువల నిర్మాణం నాసిరకంగా ఉండడంతో మురుగు నీరు ముందుకు ప్రవహించడం లేదు. ఎత్తుగా ఉండడమే కారణం.

విద్యుత్తు బస్సుల నిర్వహణకు అధికారుల కసరత్తు

విద్యుత్తు బస్సుల ఏర్పాటుపై ఆర్టీసీ అధికారులు ప్రణాళికలు ప్రారంభించారు. ఇప్పటికే గుంటూరు-2 డిపోలోని నాలుగు ఎకరాల స్థలంలో ఛార్జింగ్‌కు అవసరమైన సబ్ స్టేషన్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. బుధవారం గుంటూరు-2 డిపోలోని 101 బస్సుల్ని వివిధ డిపోలకు పంపేందుకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. గుంటూరు-1 డిపోకు 19, మంగళగిరికి 23, తెనాలికి 9, పొన్నూరుకు 4 బస్సులు పంపనున్నారు.. మిగిలిన 46 బస్సులు గుంటూరు-2 డిపో నుంచి రాకపోకలు కొనసాగిస్తాయని ఆర్టీసీ అధికారులు పేర్కొన్నారు. శివరాత్రి అనంతరం నూతన విధానం అమల్లోకి రానుంది. గుంటూరు బస్టాండు నుంచి 100, మంగళగిరి బస్టాండు నుంచి 50 విద్యుత్తు బస్సులు నడిపేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఛార్జింగ్ నిమిత్తం గుంటూరు-2 డిపోతో పాటు మంగళగిరి డిపోలో నూతనంగా విద్యుత్తు సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. **- న్యూస్‌టుడే, పట్నంబజారు**

ఆర్టీసీ బస్టాండ్‌లో కలెక్టర్ తనిఖీ

ఎంఆర్‌పీకి మించి విక్రయించకూడదని ఆదేశం

పట్నంబజారు, న్యూస్‌టుడే: ప్రయాణికులకు కనీస అవసరాలను మెరుగుపరచాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె గుంటూరు ఆర్టీసీ బస్టాండును తనిఖీ చేశారు. తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లను పరిశీలించారు. స్టాల్స్‌లో ధరల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. గరిష్ఠ చిల్లర ధరకు మించి విక్రయించకూడదని చెప్పారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. బస్టాండు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి సామ్రాజ్యం, డిపో మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మంచినీటి సీసా ధరలను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్లాన్ అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలో జీఎంసీ అనుమతి పొందిన ప్లాన్ ప్రకారమే నిర్మాణాలు జరగాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ మయూర్ అశోక్ స్పష్టం చేశారు. బుధవారం ఇన్నర్‌రింగ్ రోడ్డు, అమరావతిరోడ్డు, ప్రశాంతినగర్, నెహ్రూనగర్ ప్రాంతాల్లో భవన నిర్మాణాలు పరిశీలించారు. ఇన్నర్ రింగురోడ్డులో ప్లానుకు అనుగుణంగా భవన నిర్మాణం లేకపోవడంపై టీపీబీవో రామకృష్ణకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని సీపీని ఆదేశించారు. కమిషనర్ మాట్లాడుతూ వార్డు సచివాలయాల వారీగా ప్లానింగ్ కార్యదర్శులు, అధికారులు నిర్దేశిత ప్లాన్ ప్రకారం నిర్మాణాలు జరిగేలా పర్యవేక్షణ చేయాలన్నారు. బహుళ అంతస్తుల భవనాల సెట్‌బ్యాక్‌లు, ర్యాంప్‌లు, గ్రీనరీకి కేటాయింపు, డ్రైనేజీ కనెక్షన్ వంటి నిబంధనలు కచ్చితంగా పాటిస్తేనే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేస్తామన్నారు. ప్లానింగ్ కార్యదర్శులు ఎల్ఆర్ఎస్, బీపీఎస్‌ల దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలన్నారు. నెహ్రూనగర్ రైల్వేగేటు వద్ద డ్రెయినేజీ నిర్మాణానికి మార్కింగ్ చేసిన ప్రాంతాల్లో నిరాశ్రయులయ్యే వారిలో అర్హులకు ప్రభుత్వ లేఔట్లలో స్థలాలు కేటాయించాలని సీపీని ఆదేశించారు. పర్యటనలో సీపీ రాంబాబు, డీసీపీ సూరజ్‌కుమార్, ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు పాల్గొన్నారు.

★ కమిషనర్ మయూర్ అశోక్ అమరావతిరోడ్డులోని అన్నక్యాంటీన్ పరిశీలించారు.

భవనం కొలతలు పరిశీలిస్తున్న కమిషనర్ మయూర్ అశోక్

రంజాన్ ఉపవాస ప్రార్థనలకు పకడ్బందీగా ఏర్పాట్లు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: రంజాన్ వస్తున్నందున ముస్లిం సోదరుల ఉపవాస ప్రార్థనలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని మేయర్ కోవెలమూడి రవీంద్ర అధికారులను ఆదేశించారు. బుధవారం తన ఛాంబర్‌లో అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మసీదుల వద్ద ప్రత్యేక పారిశుద్ధ్య పనులు, రహదారుల మరమ్మతులు, వీధి దీపాల ఏర్పాటు త్వరితగతిన చేపట్టాలన్నారు. మసీదుల వద్ద విద్యుత్తు సరఫరాకు అంతరాయం రాకుండా, తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు.

మేయర్ కోవెలమూడి రవీంద్ర

హజ్ యాత్రికులకు సదుపాయాలు కల్పిస్తున్నాం

ఎన్టీఆర్ సర్కిల్, న్యూస్‌టుడే: హజ్ యాత్రికులకు ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తుందని తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ చెప్పారు. ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో హజ్ యాత్రికుల కోసం బుధవారం వ్యాక్సినేషన్ నిర్వహించారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ యాత్రికులకు ఒక్కొక్కరికీ రూ. లక్ష అందించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. గురువారం కూడా వ్యాక్సినేషన్ నిర్వహిస్తున్నామన్నారు. రాబోయే సంవత్సరం నుంచి గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రయాణ సౌకర్యాలు కల్పించబోతున్నామన్నారు. కార్యక్రమంలో హజ్ కమిటీ ఛైర్మన్ హసన్ బాషా, జీజీహెచ్ సూపరింటెండెంట్ యశస్వి రమణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

ఓటరు జాబితా నవీకరణకు సహకరించండి

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు జాబితా నవీకరణ, మ్యాపింగ్‌కు రాజకీయపక్షాలు సహకరించాలని అదనపు కమిషనర్, పశ్చిమ ఈఆర్‌వో చల్లా ఓబులేసు కోరారు. బుధవారం ఏసీ ఛాంబర్‌లో రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో ఓటర్ల మ్యాపింగ్ 52 శాతం పూర్తయిందన్నారు. రాజకీయపార్టీలు పోలింగ్ కేంద్రాల వారీగా బూత్ ఏజెంట్లను నియమించుకుని ఆ వివరాలు ఇవ్వాలని సూచించారు. త్వరలో బీఎల్‌వోలు, రాజకీయ పక్షాల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తామన్నారు. ఏఈఆర్‌వో బి.శ్రీనివాసరావు, ఎన్. ఓంకార్(తెదేపా), త్రినాథ్(జనసేన) హెచ్.రామకృష్ణ(భాజపా), డి.జాన్‌బాబు(వైకాపా), సీహెచ్‌వాసు, జి.మణికుమారి(బీఎస్పీ), తాతా సేవాకుమార్(ఆమ్ ఆద్మీ పార్టీ) పాల్గొన్నారు.

రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశమైన ఏసీ ఓబులేసు

దీన్ దయాళ్‌కు భాజపా నేతల నివాళి

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: నిరాడంబరమైన జీవితం కొనసాగించిన గొప్ప వ్యక్తి దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అని భాజపా సీనియర్ నాయకుడు, ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి అన్నారు. జిల్లా భాజపా ఆధ్వర్యంలో చలమయ్య కళాశాలలో భారతీయ జనసంఘ్ నిర్మాత దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దీన్ దయాళ్ ఆశయసాధనకు కృషి చేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, జాతీయ స్పైసెస్ బోర్డు డైరెక్టర్ సుబ్బారావు, పార్టీ నేతలు రామకృష్ణ, లక్ష్మణ్, కుమార్‌గౌడ్, రవికుమార్, నాగమల్లేశ్వరి, శ్రీనివాసరెడ్డి, డాక్టర్ రాధా మాధవి తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో వైద్య సేవలు అందించండి

వేడుకల్లో వైస్ ఛాన్సలర్ డాక్టర్ చంద్రశేఖర్, ఎమ్మెల్యే నసీర్, కళాశాల ఛైర్మన్ రసూల్ తదితరులు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: వైద్య పట్టా పొందిన విద్యార్థులు అంకిత భావంతో సేవలందించి ప్రజల మన్నన అందుకోవాలని డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రాంగణలోని జింకానా ఆడిటోరియంలో కేర్ డెంటల్ కళాశాల నాలుగో స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన చంద్రశేఖర్ మాట్లాడుతూ రోగుల పట్ల సేవాభావంతో వ్యవహరించాలని సూచించారు. కేర్ సంస్థల ఛైర్మన్ ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ఉచితంగా సేవలందించారని కొనియాడారు. తూర్పు ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ కేర్ విద్యాసంస్థలతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. కళాశాల ఛైర్మన్ డాక్టర్ రసూల్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్యాంపులు ఏర్పాటు చేసి సేవలు అందజేస్తున్నామని భవిష్యత్‌లోనూ కొనసాగిస్తామన్నారు. ముఖ్య అతిథులు తొలుత విద్యార్థులకు పట్టాలు అందజేశారు. అనంతరం దంత వైద్య కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, కందుకూరుకు చెందిన సీనియర్ వైద్యులు అజ్మల్ హుస్సేన్‌లను ఘనంగా సత్కరించారు. మొహియుద్దీన్, జాకీర్ హుస్సేన్ డాక్టర్ మహబూబ్, హిదాయత్, సుహేల్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురు ఆటో డ్రైవర్లపై కేసు

పట్నంబజారు, న్యూస్‌టుడే: మద్యం సేవించి ఆటోలు నడుపుతున్న నలుగురిపై ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. బుధవారం రాత్రి మూడు వంతెనల సెంటర్లో తూర్పు విభాగపు ట్రాఫిక్ సి.ఐ.అశోక్‌కుమార్ నేతృత్వంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.

కల్వర్టులు ఇలా ఉంటే ఎలా?

గుత్తేదారుడు నిబంధనలు పాటించకుండా కల్వర్టులు ఎత్తుగా నిర్మించడంతో పాదచారులు, వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. వృద్ధులు నడిచి వెళ్లాలంటే వీలుపడని దుస్థితి. ఐపీడీ కాలనీలో పలు వీధుల్లో కల్వర్టులు ప్రమాదకరంగా ఉన్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, గుంటూరు నగరం**

ఇబ్బంది పడుతున్న వాహనదారుడు

రోడ్డుపై వాహనాలు.. ఇబ్బందుల్లో ప్రజలు

లాలాపేట పోలీసులు చేపట్టిన విధానాల వల్ల వాహనదారులకు ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను స్టేషన్ ఎదుట రోడ్డును ఆక్రమించి నిలుపుతున్నారు. దీంతో స్టేషన్‌కు వచ్చే వారు రోడ్లపై నిలబడటంతో ఈ ప్రాంతంలో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. **- న్యూస్‌టుడే, పట్నంబజారు**

రహదారి దుస్థితి ఇలా...

చౌత్రాసెంటర్‌లోని రోడ్డు అధ్వానంగా మారింది. ఇటీవల ఈ ప్రాంతంలో పైపులైన్లు ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి నడవటానికి మారింది. అధికారులు స్పందించి రోడ్డును అభివృద్ధి చేయాలని ప్రాంతవాసులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పట్నంబజారు**

పనిచేయని బోరు

డీఎస్ నగర్‌లోని ప్రధాన రహదారిలో చేతి పంపు పనిచేయడం లేదు. దశాబ్దాల కిందట ఏర్పాటు చేసిన బోరు మరమ్మతులకు గురవడంతో కొద్ది రోజులుగా నీరు రావట్లేదని స్థానికులు తెలిపారు. అధికారులు మరమ్మతులు చేయించి బోరింగ్ బాగు చేయిస్తే వేసవికాలంలో ఉపయోగకరంగా ఉంటుందని ప్రాంతవాసులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, నెహ్రూనగర్**

హోంగార్డుల పెద్ద మనసు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డులు జంగం చిట్టిబాబు, మంచాల మేరీకి ఆర్థికంగా తోడ్పాటు ఇచ్చేందుకు సహచర సహచర హోంగార్డులందరూ తమ ఒక రోజు వేతనం రూ. 5.02 లక్షలను విరాళంగా ప్రకటించారు. బుధవారం ఎస్పీ వకుల్ జిందాల్ చేతుల మీదుగా వారికి అందజేశారు. హోంగార్డుల సేవాభావాన్ని ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో ఆర్ఐ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

చెక్కులు అందిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: హజ్‌కు వెళ్లనున్న యాత్రికులకు జీజీహెచ్‌లో బుధవారం మెడికల్ స్క్రీనింగ్ చేసి వ్యాక్సినేషన్ వేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ రమణ ఆధ్వర్యంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ శ్రావణబాబు పర్యవేక్షణలో పరీక్షలు చేశారు. తొలిరోజు 145 మందికి వ్యాక్సినేషన్ వేశారు. తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్, రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ హసన్ బాషా తదితరులు పాల్గొన్నారు. గురువారం కూడా వ్యాక్సినేషన్ వేస్తామని డాక్టర్ శ్రావణబాబు తెలిపారు.

హాజరైన ఎమ్మెల్యే నసీర్, డాక్టర్ శ్రావణబాబు తదితరులు

నేటి సమ్మెకు మద్దతు

నెహ్రూనగర్: కేంద్రం నాలుగు లేబర్ కోడ్‌ల పేరుతో కార్మికుల హక్కులను హరించటానికి యత్నిస్తోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు విమర్శించారు. బుధవారం కొత్తపేటలోని కార్యాలయంలో జిల్లా నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 12న జరగనున్న సార్వత్రిక సమ్మెకు సీపీఐ జాతీయస్థాయిలో సంపూర్ణ మద్దతు తెలుపుతోందన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి మాల్యాద్రి, అరుణ్‌కుమార్, హనుమంతరావు పాల్గొన్నారు. రాష్ట్రంలో మెడికల్ మాఫియా విజృంభిస్తున్నా అడ్డుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయంటూ ఈనెల 14న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి చెప్పారు.

మాట్లాడుతున్న నాగేశ్వరరావు. పక్కన మాల్యాద్రి, అరుణ్‌కుమార్, హనుమంతరావు

కారులో నగదు సంచి.. గంటల్లో పట్టుకున్న పోలీసులు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: తండ్రి చికిత్స కోసం ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు తెచ్చిన నగదును కారులో మరచిపోవడంతో కొత్తపేట పోలీసులు గంటల వ్యవధిలో గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాలు... పల్నాడు జిల్లా కారంపూడి మండలం సన్నిగండ్లకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పొట్ల లక్ష్మీనారాయణ తండ్రికి అనారోగ్యంగా ఉండడంతో ఈ నెల 10న నరసరావుపేట నుంచి కారులో గుంటూరులోని గుంటూరువారితోటలో ఓ ఆసుపత్రికి తీసుకొచ్చారు. చికిత్స కోసం తీసుకొచ్చిన రూ.2 లక్షల నగదు ఉన్న బ్యాగ్‌ను కారులో మరచిపోయారు. ఆసుపత్రిలోకి వెళ్లాక గుర్తుకు రావడంతో బయటకొచ్చి చూశారు. అప్పటికే కారు వెళ్లిపోవడంతో వెంటనే కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కారు నంబరు, డ్రైవర్ వివరాలు తెలియదని చెప్పడంతో సీఐ వీరయ్యచౌదరి సిబ్బందితో కలిసి సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. కారును గుర్తించి అందులోని రూ.2 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై హనుమంతరావు చేతులమీదుగా లక్ష్మీనారాయణకు ఆ నగదు అందజేశారు.

లక్ష్మీనారాయణకు రూ. 2 లక్షలు అందజేస్తున్న ఎస్సై హనుమంతురావు, సిబ్బంది

సచివాలయం వద్ద కట్టుదిట్టంగా భద్రత

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో బుధవారం నుంచి ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీలు వకుల్ జిందాల్ బందోబస్తు పర్యవేక్షించారు. ఏఎస్పీలు రవికుమార్, హనుమంతు, తుళ్లూరు డీఎస్పీలు మురళీకృష్ణ, శ్రీనివాసులు, సీఐలు, ఎస్సైలు బందోబస్తులో పాల్గొన్నారు.

బందోబస్తు పర్యవేక్షిస్తున్న ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తదితరులు

ముఠా కార్మికుల ప్రదర్శన

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ముఠా కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టం అమలు చేయాలని ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు సురేష్‌బాబు డిమాండ్ చేశారు. ఈ నెల 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం ముఠా కార్మిక సంఘం ఆధ్వర్యంలో నగరంలో ప్రదర్శన నిర్వహించారు. అంజిబాబు, శ్రీకాంత్, రాఘవ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

డీవీసీ ఆసుపత్రికి డయాలసిస్ యంత్రం వితరణ

పొన్నూరు, న్యూస్‌టుడే: బెంగళూరుకు చెందిన జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు సీనియర్ ప్రెసిడెంట్ ప్రేమానంద్ కృష్ణన్, రీజినల్ హెడ్ అమర్నాథ్ చల్లగుండ్ల తదితరులు వడ్లమూడి డీవీసీ వైద్యశాలకు డయాలసిస్ యంత్రాన్ని బుధవారం అందచేశారు. సమావేశంలో ప్రేమానంద్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందిస్తున్న డీవీసీ ఆసుపత్రికి రూ.20 లక్షలు విలువ చేసే డయాలసిస్ యంత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. వైద్య రంగంలో భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

యంత్రాన్ని అందిస్తున్న జన స్మాల్ ఫైనాన్స్ అధికారులు

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం జరిగిందని రాష్ట్ర విభజన హామీ చట్టాన్ని పట్టించుకోలేదని మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు అన్నారు. బుధవారం బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయంలో కేంద్ర బడ్జెట్, విశ్లేషణపై సెమినార్ నిర్వహించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టుకు అత్యంత స్వల్పంగా నిధులు కేటాయించారన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారని చెప్పారు. ఎల్ఐసీ ఎంప్లాయిస్ యూనియన్ సౌత్ సెంట్రల్ జోన్ కార్యదర్శి కిషోర్‌కుమార్ మాట్లాడుతూ మౌలిక సమస్యలను అధిగమించడానికి నిర్దిష్టమైన పరిష్కారాలను ప్రకటించలేదన్నారు. సమావేశంలో సీహెచ్ కుమార్, సురేష్, హరి, భావన్నారాయణ, లక్ష్మణరావు, శ్రీనివాస్, శేఖర్‌రెడ్డి, వెంకయ్య, ఫణీంద్ర పాల్గొన్నారు.

మాట్లాడుతున్న లక్ష్మణరావు. పక్కన కిషోర్‌కుమార్, సురేష్, హరి

విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

పట్నంబజారు, న్యూస్‌టుడే: విద్యారంగాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఏపీ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం అన్నారు. పాతగుంటూరులోని నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాశాఖ మంత్రి లోకేశ్ రూ.1,200 కోట్ల ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయటం హర్షణీయమన్నారు. ఏపీ నాయీ బ్రాహ్మణ పొలిటికల్ జేఏసీ అధ్యక్షుడు కందుకూరి వెంకట్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. కార్యక్రమంలో మున్నంగి శివ శేషగిరిరావు, కె.పూర్ణచంద్రరావు, అద్దంకి రవి, ఎం.నాగరాజు, టి.కిరణ్, ఎం.శివ, కె.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సదాశివం

వేలం ప్రకటన

In the Court of the Hon'ble IV Addl. Senior Civil Judge: Guntur
E.P.No.40/2023 in Dispute No.05/2021

Between:-
M/s Margadarsi Chitfund Pvt. Ltd. Rep. by its Senior Manager, Market Center, Guntur ... **D.Hr**
And
Mr. Gangineni Ashok Kumar .. **JDr.4**

పై నెంబరు ఇ.పి.లో డిక్రీ హోల్డర్‌కు రావలిసిన బాకీ నిమిత్తం Mr. Gangineni Ashok Kumar, S/o G.Pulla Rao, Jdr-4కి చెందిన ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తి ది. 03-03-2026వ తేదీన పై కోర్టు ఉత్తర్వుల మేరకు వేలం జరిపించుటకు ఉత్తర్వులు పొందియున్నారు. ది.03-03-2026న శ్రీ కోర్టువారి ఎదుట హాజరై వేలపు షరతులకు లోబడి పాల్గొనవచ్చునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

Doc. No.4278/2017, Dated 15-06-2017, SRO:Guntur

Schedule-B for Attachment: In the total extent of 800 sq.yds, undivided, unspecified an extent of 40 sq.yds in which Tejaswi Towers in which Flat No.101, in Ground Floor with Double BedRoom, Flat at 2nd Line Sakuntala Nagar, Inner Ring Road, Guntur. Bounded by: South: Open to Sky, East: common Corridor, West: Open to Sky, North: Open Space in between the above Flat and 102, with in the above Boundaries an extent of 40 sq.yds or 1100 sq.fts Double Bed Room Flat Doors, Door Ways, Furniture and Fixtures, Bath Room, Letrin, Electricity Deposit , Wiring, Common Corridor, Car Parking, Common Borewell, Common Water Connection, Common Stair Cases, common Lift, Common Terrace and all easementary rights.

DHR Value: Rs.25,00,000/-
Ameen Value: Rs.35,00,000/-
Market Value: Rs.25,30,000/-

వేలం తేది: 03–03–2026
ఫర్దర్ హియరింగ్: 10-03-2026
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

Smt. D.S.K.Kumari, Mr. K.Sreenivas, Mr. K.Seetharamaiah, Advocates for D.Hr
1/5 Brodipet, Guntur.
Cell No's: 9603911172, 9985462688

(c) eenadu

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

కైలాసనాథుడి గ్రామోత్సవం

మంగళగిరి, మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మంగళగిరి శ్రీగంగా భ్రమరాంబ సమేత శ్రీమల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆయిదోరోజు బుధవారం రాత్రి భృంగి వాహనంపై కైలాసనాథుడి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ పాలకవర్గ అధ్యక్షుడు భోగి కోటేశ్వరరావు, సభ్యులు బాపనపల్లి వాసు, సుకుమంచి గిరిబాబు, తిరుమలశెట్టి మురళీకృష్ణ, జంజనం వెంకట సుబ్బారావు, ప్రధాన అర్చకులు మహేష్ కుమార్‌శర్మ తదితరులు ఉత్సవాన్ని పర్యవేక్షించారు.

ఈనాడు మీతోడు: విద్యుత్తు సమస్యలు.. తెలియజేయండి

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యుత్తు సమస్యలను పరిష్కరించుకునే అవకాశాన్ని ఈనాడు కల్పిస్తోంది. అందుకు 'డయల్ యువర్ ఏడీఈ' నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజలు ప్రస్తావించే సమస్యలపై స్పందించడానికి ఏడీఈ సురేష్‌బాబు అంగీకరించారు. మీరు చేయాల్సిందల్లా ఈ కింది నంబర్లకు ఫోన్ చేసి విద్యుత్తు సరఫరాలో హెచ్చుతగ్గులు...బిల్లుల్లో తేడాలు...తీగలు కిందకు వేలాడడం...మీటర్లలో సమస్యలు...స్తంభాలు ఒరిగిపోవడం...నూతన సర్వీసుల మంజూరులో జాప్యం...ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ ఏర్పాట్లు తదితర సమస్యలను సూటిగా చెప్పవచ్చు.

రేపు డయల్ యువర్ ఏడీఈ

08645–235990, 232614

తేదీ: శుక్రవారం (13.2.2026)

సమయం: ఉదయం 10.30 నుంచి 11.30 వరకు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

★ నాగులపాడు సచివాలయం పక్క రహదారిలో మురుగుకాలువ పూడిక చేరి నీరు నిలుస్తోందని స్థానికులు 'మేమున్నాం... మీకు తోడుగా' ద్వారా కార్యదర్శి శ్వేత దృష్టికి తీసుకువెళ్లారు. ఆమె స్పందించి సిబ్బంది చేత కాలువలో పూడిక తీయించి శుభ్రం చేయించారు. ★ పెదనందిపాడు ఎస్సీ కాలనీ సాయిమందిర్ వీధిలో మురుగుకాలువలు పూడికతో నిండి నీరు నిలుస్తోందని స్థానికులు 'మేమున్నాం... మీకు తోడుగా' ద్వారా పంచాయతీ కార్యదర్శి శ్వేత దృష్టికి తీసుకెళ్లారు. ఆమె స్పందించి కార్మికుల చేత పూడిక తీయించారు. – న్యూస్‌టుడే, పెదనందిపాడు

ఇలా.. మట్టిలో కలిసిపోవాల్సిందేనా..!

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే

మంగళగిరి, తాడేపల్లి పోలీసుస్టేషన్ల వద్ద వందల సంఖ్యలో ద్విచక్ర, వివిధ రకాల వాహనాలు మట్టిలో కలిసిపోతున్నాయి. వివిధ కేసుల్లో ఉన్న ఈవాహనాలను పలి రక్షించాల్సి ఉన్నా...వీటిని భద్రపరిచేందుకు తగిన స్థలం కొరత కారణంగా పోలీసుస్టేషన్ల వద్ద ఇలా వదిలేశారు. రోడ్డు ప్రమాదాలతోపాటు పలురకాల కేసుల్లో స్వాధీనం చేసుకున్న ఈవాహనాలను కేసులు తేలేవరకు భద్రపరచి వాటిని సంబంధిత వ్యక్తులకు అప్పగించాల్సి ఉంటుంది. రోజురోజుకు ఇలాంటి వాహనాల సంఖ్య పెరిగిపోతుండటంతో ఆయా స్టేషన్ల వద్ద గుట్టలుగా చేరుతున్నాయి.

మంగళగిరి పోలీసుస్టేషన్ ఎదుట పాడైపోతున్న వాహనాలు

తుప్పుపడుతూ... మంగళగిరి పట్టణ, గ్రామీణ, తాడేపల్లి, కనకదుర్గమ్మ వారధి వద్ద బైపాస్ రోడ్డులో ట్రాఫిక్ పోలీసుస్టేషన్ల వద్ద వాహనాలు తుప్పుపట్టి పోతున్నాయి. ఇంకా కొన్ని వాహనాలను దేవస్థానం రోడ్డులోని శిథిల పోలీసు భవనాల ప్రాంగణంలో ఉంచారు. వీటి కేసులను పరిశీలించి సంబంధిత వ్యక్తులకు అప్పగించడంతో లేక వేలం ద్వారా విక్రయించడం వంటి అంశాలపై పోలీసులు దృష్టి పెట్టాలి. ఇటీవల వారధి వద్ద ఉన్న ట్రాఫిక్ పోలీసుస్టేషన్ ఆవరణలో తుప్పుపట్టిన వాహనాలను నిప్పంటుకుని మంటలు ఎగిసిపడ్డాయి. అప్రమత్తమైన అధికారులు మంటలను అదుపుచేశారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వీటిని సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బాధితులకు మంత్రి లోకేశ్ భరోసా



సీఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న తెదేపా నాయకులు కొమ్మారెడ్డి కిరణ్

తాడేపల్లి, మంగళగిరి గ్రామీణం, దుగ్గిరాల, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతూ ప్రయివేటు వైద్యశాలల్లో చికిత్స పొందుతున్న బాధితులకు మంత్రి నారా లోకేశ్ అండగా నిలుస్తున్నారని మండల తెదేపా ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు అన్నారు. మంత్రి లోకేశ్ సహకారంతో మంజూరైన సీఎం సహాయనిధి నగదు చెక్కులను పెనుమాకలో తెదేపా నాయకులు బాధితులకు పంపిణీ చేశారు. కొమ్మినేని లక్ష్మీ తేజకు రూ.80వేలు, కల్లం రామ్మోహన్‌రెడ్డికి రూ.3,24,677, తరిగొప్పుల లక్ష్మీప్రసన్నకు రూ.2,08,488, మేకా సీతామహాలక్ష్మికి రూ.1.65 లక్షలు, షేక్ మీరావలీకి రూ.41,870, మేకా వెంకటరెడ్డికి రూ.1,13,436, వెంకట నరసమ్మకు రూ.32,586, బాబు రావుకు రూ.31,365, కేసుబోయిన కృష్ణకు రూ.18 వేల చెక్కులు పంపిణీ చేశారు. నవులూరులో ఇటీవల కొత్తపేటకు చెందిన నాగరాజుకు రూ.2,50,403 చెక్కును మంగళగిరి మార్కెట్ యార్డు ఛైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్ అందజేశారు. దుగ్గిరాలలో షేక్ రఫ్హీక్ రూ.1,01,642లు, సయ్యద్ రహమున్నీసాకు రూ.55,700, గొడవర్రులో ప్రసంగి వెంకట శివనాగమణికి రూ.40,460, పెదపాలెంలో కొండూరు పద్మజకు రూ.1,00,911, పెదకొండూరులో కత్తిమళ్ల వందనకు రూ.26,098 విలువగల చెక్కులను వీర్లపాలెంలో బెజ్జం శేషిదకు రూ.59,406 ఎలివోనిని తెదేపా నాయకులు అందజేశారు. ★ నియోజకవర్గంలో ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా మంత్రి నారా లోకేశ్ అండగా ఉన్నారని మండల తెదేపా నాయకులు కొమ్మారెడ్డి కిరణ్ అన్నారు. మంత్రి లోకేశ్ సహకారంతో మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను గుండిమెడలో బాధితులకు అందజేశారు. కందర్ల వరలక్ష్మికి రూ.1,45,208, భొమ్మారెడ్డి చంద్రారెడ్డికి రూ.91,238, రావెల కృపాకరరావుకి రూ.40,918 చెక్కులు పంపిణీ చేశారు.

రుణ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మహిళలకు చెక్కు అందిస్తున్న మణిపాల్‌రెడ్డి, సీతారామ్, లాజర్ తదితరులు

ప్రత్తిపాడు: బ్యాంకుల ద్వారా ప్రభుత్వాలు అందిస్తున్న రుణ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజరు మహిపాల్ రెడ్డి చెప్పారు. ప్రత్తిపాడు యూనియన్ బ్యాంకు బ్రాంచిలో ఆర్థిక అక్షరాస్యతపై బుధవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రుణాలను అందించే పథకాలు, అర్హతలు వివరించారు. అనంతరం వివిధ రుణాలకు సంబంధించి రూ.కోటి విలువైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన పథకం రూ.2 లక్షల చెక్కును నామినీకి అందించారు. బ్యాంకు మేనేజరు సీతారామ్, ఏపీఎం వి.లాజర్ పాల్గొన్నారు.

మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ

కార్యక్రమంలో జానకీదేవి, భూలక్ష్మి తదితరులు

మంగళగిరి, మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మంత్రి నారాలోకేశ్ సహకారంతో 30 మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లను తెలుగుమహిళా నాయకులు బుధవారం అందజేశారు. స్త్రీశక్తి సంక్షేమం పేరుతో మహిళలకు ఉచితంగా కుట్టుశిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి కోసం ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. దుగ్గిరాల మండలానికి చెందిన 30 మందికి వీటిని అందజేసి శిక్షణ పొందిన ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఇప్పటివరకు 77 బృందాలకు మంగళగిరిలోని డాక్టర్ ఎంఎస్ఎస్ భవన్‌లో కుట్టుమిషన్లను అందజేశారు. శిక్షణ పొంది మిషన్లు అందుకున్న మహిళలు మంత్రి నారాలోకేశ్‌కి కృతజ్ఞతలు తెలిపారు. తితిదే పాలకమండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, స్వర్ణాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మి, దుగ్గిరాల మండల తెదేపా అధ్యక్షురాలు కేశంనేని శ్రీఅనిత, తెలుగుమహిళా రాష్ట్ర కార్యదర్శి విజయమూరి ఆషాభాల తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంపై బహిరంగ చర్చకు సిద్ధం

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ప్రత్తిపాడు నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం ఎలా చేశామో చెప్పేందుకు బహిరంగ చర్చకు సిద్ధం అని తెదేపా రైతు విభాగం రాష్ట్ర మీడియా సమన్వయకర్త గింజుపల్లి వెంకటేశ్వరావు చెప్పారు. తెదేపా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, సీఆర్‌ఐఎఫ్ శాఖ ద్వారా కొట్లాది రూపాయల నిధులను తీసుకొచ్చి రోడ్ల నిర్మాణం, కల్వల నిర్మాణం, సాగునీటి కాల్వల పూడికతీత చేపట్టామన్నారు. గతంలో ప్రత్తిపాడులో సీసీ రోడ్ల కోసం హోంలో జగన్ ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు శివరాం ప్రసాద్, కుర్రి సుబ్బారెడ్డి, బసవబాబు, కాసు వెంకటరెడ్డి, ఏమిడి శ్రీనివాసరావు మాట్లాడారు. మిర్చియార్డు డైరెక్టరు డి.భాగ్యారావు తదితరులు పాల్గొన్నారు.

కాకుమాను: రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ నక్కల అగస్టిన్‌బాబు, తెదేపా మండల అధ్యక్షుడు మామిళ్లపల్లి రాంగోపాల్ అన్నారు. కాకుమానులో వారు విలేకరులతో మాట్లాడారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో 17 కిలోమీటర్లకు రూ.10.94 కోట్ల నిధులను ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మంజూరు చేసేలా కృషి చేశారన్నారు. ఆయనకు ప్రజల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. నాయకులు వీరయ్య చౌదరి, పూర్ణచంద్రరావు, సునీల్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో మంచి భవిష్యత్తు

మేడికొండూరు: మండలంలోని ఎస్ఆర్ఐటీ కళాశాలలో బుధవారం సీఎస్‌ఈ రెండో ఏడాది విద్యార్థులకు భవిష్యత్తు ప్రణాళిక అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఆపిల్ కంపెనీ ఏఐ, ఓపెన్ విభాగం సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ దుండి పసుపులేటి ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ సంజయ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాల విడుదలపై హర్షం

మంత్రి సవితకు కృతజ్ఞతలు తెలుపుతున్న శంకరరావు, నాగమల్లేశ్వరరావు

తాడేపల్లి, మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో వెనకబడిన తరగతులకు చెందిన బీసీ విద్యార్థులకు 2024-25 విద్యాసంవత్సరానికి పోస్టు మెట్రిక్ ఉపకారవేతనాల కింద రూ.258.23 కోట్ల నిధులను ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు హర్షం వ్యక్తంచేశారు. ఈమేరకు ఆయన బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను కలిసి బుధవారం కృతజ్ఞతలు తెలిపారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ధాన్యం కొన్నరోజే నగదు

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఎన్నడూ లేనివిధంగా రైతుల నుంచి ప్రభుత్వం ధాన్యం కొన్న రోజునే నగదు చెల్లింపులు జరుగుతున్నాయని ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ నార్నె బాబు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల తెలుగుదేశం అధ్యక్షుడు మద్దినేనివీ వరప్రసాద్ మాట్లాడుతూ గత 18 నెలల్లో వట్టిచెరుకూరు మండలంలో మొత్తం రూ.3 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు పూర్తిచేశామని తెలిపారు. నాయకులు వీసినేని జగన్‌మోహన్‌రావు, వీరయ్య, నాగరాజు, శివయ్య, సత్య నారాయణ, మురళీ పాల్గొన్నారు.

దూరవిద్య పరీక్షల్లో చూచిరాతలపై ఆరోపణలు

తాడికొండ, న్యూస్‌టుడే: తాడికొండ గ్రామంలోని భగవాన్ శ్రీ సత్యసాయిబాబా కళాశాలలో దూరవిద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. డిగ్రీ, పీజీ పరీక్షలు జరుగుతున్నాయి. అయితే పరీక్షలకు హాజరైన అభ్యర్థులు బుకిలెటులను చూసిరాతలకు రాయిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. చూచిరాతలు జరుగుతున్నాయని తెలుస్తోంది. పరీక్షలను నిమా ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. దీనిపై సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్ వేణుబాబును 'న్యూస్‌టుడే' సంప్రదించగా.. కళాశాలలో పరీక్షలను పరిశీలకుడి పర్యవేక్షణలో నిర్వహిస్తున్నామని తెలిపారు. చూచిరాతలు జరుగుతున్నాయనేది అవాస్తవమన్నారు.

స్టూడెంట్స్ క్లబ్ ఏర్పాటు

తాడికొండ,న్యూస్‌టుడే: స్థానిక లాం చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో స్టూడెంట్ క్లబ్ ఏర్పాటు చేశామని కళాశాల కరెస్పాండెంట్ వై.సుజిత్‌కుమార్ బుధవారం తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించేందుకే ఈ క్లబ్ ప్రారంభించామని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్ మాట్లాడారు. వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

శివాలయ పాలకవర్గ అధ్యక్షుడిగా నాగేశ్వరరావు

తాడేపల్లి: తాడేపల్లి మండలం ఇప్పటంలోని శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయ పాలకవర్గ అధ్యక్షుడిగా కాటూరి నాగేశ్వరరావు బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. ఆలయ ఈవో ఉమామహేశ్వరరావు ఆయనతో ప్రమాణం చేయించారు. శ్రీశైలం ఆలయ పాలకవర్గ సభ్యులు శంకరశెట్టి పిచ్చియ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

మంగళగిరి గ్రామీణం: లైన్ల మరమ్మతుల నిమిత్తం గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ సురేష్‌బాబు తెలిపారు. ఈ ప్రభావంతో మంగళగిరి పట్టణంలోని కేకే టవర్, ఎస్ఎల్‌వీ అపార్టుమెంట్ ఏరియా, ఎన్ఎస్ఆర్ విల్లాస్ రోడ్, కొండపనేని టౌన్‌షిప్, పెద్ద పెట్రోలు బంక్ రోడ్డు, రత్నాలచెరువు, బైపాస్ రోడ్డు ప్రాంతాల్లో కరెంటు ఉండదని వెల్లడించారు.

ఆరోగ్య మందిరం.. నిరుపయోగం..!

ఫిరంగిపురం మండలంలోని బేతపూడి గ్రామంలో నిర్మించిన ఆయుష్ ఆరోగ్య మందిర్ ప్రస్తుతం నిరుపయోగంగా ఉంది. ప్రజల వైద్య అవసరాల కోసం నిర్మించిన ఈ భవనం వద్దకు వెళ్లడానికి దారి కూడా వేయలేదు. మెట్లు నిర్మించలేదు. కరెంటు పనులు, నీటి కనెక్షన్ పూర్తి చేయకుండానే వదిలేశారు. ఈ భవనం త్వరగా పూర్తి చూసి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులకు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. - ఫిరంగిపురం న్యూస్‌టుడే

'దారి' కష్టాలకు చెల్లు

ప్రారంభమైన వల్లూరు-చినలింగాయపాలెం రహదారి పనులు

కాకుమాను, న్యూస్‌టుడే: పాండ్రపాడు-వల్లూరు ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి భారీ గుంతలతో అధ్వానంగా మారింది. ఈ దుస్థితిపై 'ఈనాడు'లో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. చినలింగాయపాలెం గ్రామస్థులు కూడా నిరసన తెలిపారు. దీంతో అధికారులు, ప్రజాప్రతినిధుల కృషితో వట్టిచెరుకూరు నుంచి వల్లూరు మీదుగా పాండ్రపాడు రహదారికి రూ.2 కోట్ల నిధులు మంజూరు చేశారు. ప్రస్తుతం పనులు మొదలయ్యాయి. త్వరలో పూర్తి చేస్తామని ఏఈ రాంబాబు తెలిపారు. మరోవైపు వల్లూరు నుంచి వంగిపురం మీదుగా జీజీపాలెం రహదారికి రూ.4 కోట్ల నిధులతో త్వరలో మరమ్మతులు చేపట్టనున్నారు.

వాడుకలోకి వడపోత బావి

ప్రత్తిపాడులోని వడపోత బావులు పాచి, ఇతర వ్యర్థాలతో అత్యంత దారుణంగా ఉన్నాయని 'అధ్వానంగా వడపోత బావి' శీర్షికతో ఈనెల 6న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీ అధికారులు వడపోత బావిని పరిశీలించి పంచాయతీ కార్మికులతో పాచి, వ్యర్థాలను తొలగింపజేశారు. వడపోత బావిని వాడుకలోకి తీసుకురావడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. - ప్రత్తిపాడు, న్యూస్‌టుడే

ఒరిజినల్ డాక్యుమెంట్స్ పోయినవి

వల్లూరు గురవయ్య S/o శివయ్య, D.No: 4-133, చిలుపూరు గ్రామం, దుగ్గిరాల మండలం వారికి చెందిన చిలుపూరు గ్రామంలో 5.3/4 సెంట్లు స్థలంలోని డాబా యింటి తాలుకు డాక్యుమెంట్స్ నెం: 1728/1971 (ముసునూరు శీతారామయ్య గారి పేరున కలదు) చిలుపూరు సెంటర్‌లో జిరాక్స్ కొరకు వెళ్ళగా పోయినది. ఎవరికైనా దొరికినచో దయచేసి తెలుపగలరు.

✆ :95423 71181

రెజ్లింగ్‌లో విద్యార్థుల ప్రతిభ

విజేతలైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

వడ్డేశ్వరం (తాడేపల్లి): రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో వడ్డేశ్వరంలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పతకాలు సాధించారు. చిత్తూరులో ఈనెల 6, 7, 8 తేదీల్లో అండర్-17, 15 విభాగాల్లో పోటీలు జరిగాయి. 73 కేజీల విభాగంలో శృంగారపాటి గోపీచంద్ బంగారు పతకం గెలుచుకున్నాడు. 57 కేజీల విభాగంలో పవన్‌నాయక్, బాలికల విభాగంలో 58 కేజీల విభాగంలో లిఖిత, 48 కేజీల విభాగంలో ప్రియదుర్గ రజత పతకాలను గెలుపొందారు. 45 కేజీల విభాగంలో భువనేశ్వరిబాయ్, 66 కేజీల విభాగంలో శశిచరణ్ కాంస్య పతకాలు గెలుపొందారు. పతకాలు సాధించిన విద్యార్థులు, శిక్షణ ఇచ్చిన వ్యాయామోపాధ్యాయులను ప్రధానోపాధ్యాయులు కాకుమాను జోజప్ప తదితరులు అభినందించారు.

24 గంటల హ్యాకథాన్‌లో ద్వితీయ స్థానం

వట్టిచెరుకూరు: విజయవాడ పీబీ సిద్ధార్థ కళాశాలలో జరిగిన 24 గంటల హ్యాకథాన్‌లో వింజనంపాడు కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల సీఎస్ఈ విద్యార్థినులు జాస్వితాలక్ష్మి, ప్రవల్లిక, యమునల బృందానికి ద్వితీయ స్థానం లభించింది. నిర్వాహకులు వీరికి రూ.5 వేల నగదు బహుమతి అందించారు. విజయం సాధించిన విద్యార్థులను కళాశాల ఛైర్మన్ కోయిసుబ్బారావు, కార్యదర్శి కోయిశేఖర్ అభినందించారు. ✦ మూడో సంవత్సరం బీటెక్ విద్యార్థి షేక్ సమీర్ జనవరిలో దిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల ఎన్‌సీసీ పరేడ్ గ్రూప్ నుంచి పాల్గొనడంపై ఛైర్మన్ కోయిసుబ్బారావు, కార్యదర్శి కోయిశేఖర్, ప్రిన్సిపల్ పి.బాబు, సంచాలకులు హరిబాబు అభినందించారు.

అవార్డు గ్రహీతలకు అభినందన

పెదనందిపాడు: పాలపర్రు శ్రీనారసింహ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు కె.ప్రేమరాజు, సీహెచ్ కల్యాణ్, ఉపాధ్యాయుడు ఆదంషఫీ పర్యవేక్షణలో సీడ్ ప్రొటెక్టర్ రూపొందించి పీఆర్‌టీయూ వారి నుంచి యంగ్ సైంటిస్టు అవార్డు సాధించిన నేపథ్యంలో బుధవారం వారిని పాఠశాలలో సన్మానించారు. పూర్వవిద్యార్థుల సంఘ అధ్యక్షుడు, కోశాధికారి రామారావు, రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ కరణం శ్రీనివాసరావు సహకారంతో విద్యార్థులు, ఉపాధ్యాయులకు రూ.3 వేల వంతున నగదు అందజేశారు. గత ఏడాది పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు పూర్వ విద్యార్థి డి.మల్లయ్య రూ.35 వేలు అందించారని వెల్లడించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలి

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ గురువారం తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను ప్రత్తిపాడు నియోజకవర్గంలోని కార్మికులు, రైతులు జయప్రదం చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఆర్.ఆదేశ్వరరావు కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

దీనదయాళ్‌కు నివాళి



న్యూస్‌టుడే బృందం: మంగళగిరి, ప్రత్తిపాడు, తాడికొండ నియోజకవర్గాల్లో బుధవారం దీనదయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన చేసిన కృషిని భాజపా నాయకులు వివరించారు.

ప్రముఖ వైద్యుడు సూర్యాజీరావు మృతి

మంగళగిరి గ్రామీణం: మంగళగిరి పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ అన్నే సూర్యాజీరావు(79) బుధవారం గుండెపోటుతో మృతిచెందారు. ఆయన మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి, రాజ్యసభ మాజీ సభ్యుడు కేవీపీ రామచంద్రరావులతో కలిసి వైద్య విద్య అభ్యసించారు. పలువురు ప్రముఖులు ఆయన భౌతికకాయానికి నివాళులు అర్పించారు.

రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి

దుగ్గిరాల, న్యూస్‌టుడే: రైతులందరూ విశిష్టగుర్తింపు సంఖ్య(భూఆధార్) కోసం తమ వివరాలు నమోదు చేసుకోవడం తప్పనిసరి అని తెనాలి ఏడీఏ అజయ్‌బాబు చెప్పారు. బుధవారం మండలంలోని రైతులతో మాట్లాడుతూ గుర్తింపు సంఖ్య నమోదు కోసం సమీప రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. దుగ్గిరాల మండలంలో 2215 మంది రైతులు పీఎం కిసాన్ నిధి పథకం కోసం గుర్తింపు సంఖ్య పొందాల్సి ఉందన్నారు.

కాకుమాను, న్యూస్‌టుడే : సాగు చేసే ప్రతి రైతు 11 అంకెలతో కూడిన విశిష్ట సంఖ్యను తప్పనిసరిగా తీసుకోవాలని ఏడీఏ రామకోటేశ్వరి అన్నారు. కాకుమాను మండలంలోని బీకేపాలెం, గరికపాడు గ్రామాలలో ఈ క్రాప్ నమోదును ఆమె బుధవారం పరిశీలించారు. ఆమె వెంట ఏఓ సుధాకర్, ఏఈఓ శివప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

నియామకపత్రాలు అందజేత

మంగళగిరి, న్యూస్‌టుడే: అభ్యాసం, నైపుణ్యంతో ఉన్నత స్థాయికి చేరవచ్చని ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. మంగళగిరి ఆటోనగర్‌లో ఫైకేర్ సర్వీసెస్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్ సంస్థలోని మెడికల్ కోడింగ్ విభాగంలో 11 మందికి ఉద్యోగ నియామక పత్రాలను ఆయన బుధవారం అందజేశారు. జూనియర్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలు కోసం ఇటీవల నిర్వహించిన ఇంటర్వ్యూ ప్రక్రియలో అభ్యర్థులు ఎంపికయ్యారు. సంస్థ హెచ్ఆర్ మేనేజర్ అశ్వనిదాసరి, ఛైర్మన్ పెంట్యాల శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

మంగళగిరిలో అన్నదానం

మంగళగిరి: డొక్కా సీతమ్మ స్ఫూర్తితో ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు పుట్టినరోజు పురస్కరించుకుని మంగళగిరి బస్టాండ్ కూడలిలో బుధవారం పేదలకు జనసేన కార్యకర్తలు అన్నదానం నిర్వహించారు. చిల్లపల్లి యూత్ ఆధ్వర్యాన కార్యక్రమం జరిగింది.

సైబర్ నేరాల బారిన పడొద్దు

పెదనందిపాడు: అత్యంత జాగ్రత్తగా ఉండి సైబర్ నేరాల బారిన పడవద్దని కళాకారులు సూచించారు. ఏపీ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో బుధవారం గోగులమూడిలో కళాకారులు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. తొలుత స్థానిక ఎల్ఎం పాఠశాల విద్యార్థులకు పొదుపు, బ్యాంకు సేవలు, వివిధ పథకాల గురించి వివరించారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్సు 1) నూర్ బాష జానీ గారి కుమారుడు నూర్ బాష ఇమామ్ వలి, నెం.7-455, ఫ్లాట్ నెం.413, కె.ఎ.ఎం రెసిడెన్సీ, రాజీవ్ గృహకల్ప ఎదురుగా, మార్కండేయ కాలనీ, మంగళగిరి, గుంటూరు జిల్లా – 522503, 2) రుద్రు శ్రీనివాసరావు గారి కుమారుడు బాలాజీ, డోరు నెం.2-33, నవులూరు, మంగళగిరి, గుంటూరు జిల్లా-522503 గార్ల సంజాయిషీ పొంది యావన్మందికి ఈ బహిరంగ ప్రకటన ద్వారా తెలియ జేయునది ఏమనగా:

నా క్లయింట్సు దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని లేటు లంకా నాగేశ్వరరావుగారి భార్య భారతిగారి నుండి విక్రయ ద.నెం. 18710/2024, తేది.26-12-2024, యస్.ఆర్.ఓ. మంగళగిరి ద్వారా రిజిష్టరు పొందియున్నారు. సదరు ఆస్తికి లింకు దస్తావేజులు విక్రయ ద.నెంలు (1) 2268/2000, (2) 5673/1999, (3) 499/1971 అన్ని యస్.ఆర్.ఓ మంగళగిరి అయివున్నవి. ఒరిజినల్ లింకు విక్రయ ద.నెం.499/1971 ఆస్తి పూర్వుల వద్ద లోగడనే పోయినది, పోలీసు వారికి రిపోర్టు ఇచ్చి యుండలేదు, కావున సదరు ఒరిజినల్ దస్తావేజు నాక్లయింట్సుకు యిచ్చియుండలేదు. ఆవిధంగా దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి నా క్లయింట్సు సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములలో ఉన్నది, సదరు ఆస్తి నిర్వివాద ఆస్తి అని సదరు విషయములు వాస్తవములని, సదరు దస్తావేజు ఏవిధంగాను దుర్వినియోగంచేయలేదని నాక్లయింట్సు తెలియజేయుచున్నారు.

నాక్లయింట్సు సదరు ఆస్తి విక్రయించుట, లేదా ఏదైనా నేషనలైజ్డ్ బ్యాంకు, ప్రైవేటుబ్యాంకు, ఇతర ఋణసంస్థల నుండి గానీ, వ్యక్తుల నుండి గానీ ఋణమును పొందగోరుచున్నారు. సదరు ఆస్తుల విక్రయం, తనఖాపై ఎవరికైనా ఎటువంటి అభ్యంతరములు ఉన్ననూ ఈ బహిరంగ ప్రకటన తేది నుంచి వారం రోజులలోగా నాకు లిఖిత పూర్వకంగా తెలియజేయవలెను. తదుపరి క్లెయిములు నా క్లయింట్సును గానీ, సదరు ఋణదాతలైన నేషనలైజ్డ్ బ్యాంకు, కార్పోరేట్/ప్రైవేటు బ్యాంకు, ఇతర ఋణసంస్థలనుగానీ వ్యక్తులనుగానీ బైండు చేయజాలవు.

షెడ్యూలు: గుంటూరు డి. మంగళగిరి సబ్.డి. యిలాకా, మంగళగిరి మండలం, నవులూరు గ్రామ పంచాయితీ ఏరియాలో యేరియాలో చేరిన నవులూరు గ్రామం తాలూకు డి.నెం:125రు దాఖలా డోర్ నెం:4-277/1రుకు సమీపమునగల ప్లాట్ నెం.12రు తాలూకు చ.గ.310.5లు ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు. తూర్పు: అ.15రు వెడల్పుగల రోడ్డు హద్దు, అ.50.0లు, దక్షిణము: ప్లాట్ నెం.13 తాలూకు స్థలంహద్దు, అ.55.9లు, పడమర: ప్లాట్ నెం.25 తాలూకు స్థలం హద్దు, అ.50.0లు, ఉత్తరము: ప్లాట్ నెం.11 తాలూకు స్థలం హద్దు, అ.55.9లు

మంగళగిరి, ది.12-02-2026

వాకా రామగోపాల్ గౌడ్, న్యాయవాది, డోర్ నెం.1-443, కొత్తపేట, మంగళగిరి, సెల్ నెం: 9848116475

యువతి బలవన్మరణంపై కేసు నమోదు

పేరేచర్లలో ఘటనా ప్రదేశం వద్ద బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు

మేడికొండూరు, న్యూస్‌టుడే: యువతి బలవన్మరణానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సత్తెనపల్లి మండలం గర్నెపూడికి చెందిన కాశిమాల కిరణ్, ఏసు మరియమ్మ దంపతులు అయిదు నెలల కిందట పేరేచర్ల వలస వచ్చారు. వీరికి ముగ్గురు కుమార్తెలు. కుటుంబం గ్రామంలోని ఒక ప్రయివేట్ వసతిగృహంలో పనిచేస్తూ అక్కడే ఒక గదిలో నివాసం ఉంటున్నారు. రెండో కుమార్తె మెర్సిలత(18) అదే గ్రామంలోని ఒక దుకాణంలో పని చేస్తుంది. బుధవారం మధ్యాహ్నం దుకాణం బాత్‌రూమ్‌లో చున్నీతో ఉరి వేసుకుంది. మెర్సిలత తల్లి ఏసుమరియమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న సీఐ మధుసూదనరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మెర్సిలత కుటుంబ సభ్యులు, బంధువులు అక్కడకు వచ్చారు. దీనితో అక్కడ కాసేపు ఉద్రిక్తత ఏర్పడింది. తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేస్తూ ప్రయివేటు వాహనంలో మృతదేహాన్ని మేడికొండూరు పోలీస్‌స్టేషన్ వద్దకు తీసుకువెళ్లారు. పోలీసులు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో విషయం సద్దుమణిగింది.

లారీ ఢీకొని వ్యాపారికి తీవ్ర గాయాలు

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో వ్యాపారికి తీవ్ర గాయాలయ్యాయి. నల్లపాడు పోలీసులు తెలిపిన వివరాల మేరకు తాడికొండకు చెందిన అక్కేశ్వరరావు గ్రామంలో కిరాణా దుకాణం నడుపుతుంటారు. సరకులు తీసుకునేందుకు గుంటూరు వచ్చి వాహనంపై తిరిగి వెళుతుండగా గోరంట్లలో లారీ ఢీకొట్టింది. దీంతో అక్కేశ్వరరావు రోడ్డుపై పడడంతో లారీ టైర్లు ఎడమ కాలు పైకి ఎక్కగా నుజ్జునుజ్జయ్యింది. స్థానికులు గుర్తించి 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రుడిని జీజీహెచ్‌కి తరలించారు. వైద్యులు అక్కేశ్వరరావు కాలును మోకాలి వరకు తొలగించారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం జరిగిందని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

పైరు తొక్కించిన కొడుకుపై ఫిర్యాదు

వట్టిచెరుకూరు: తన పొలంలో పంటను తన కొడుకు ట్రాక్టర్‌తో తొక్కించి నాశనం చేశాడని తల్లి వట్టిచెరుకూరు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. సీఐ రామానాయక్ తెలిపిన వివరాల ప్రకారం పొన్నూరు మండలం వల్లభరాయపాలెంలో నివాసం ఉంటున్న తిరుపతమ్మకు చింతపల్లిపాడులో 67 సెంట్ల భూమి ఉంది. ఇందులో ఆమె రబీలో శనగ పంట సాగు చేశారు. ఈ పైరు ఎదుగుతున్న సమయంలో ఆమె కొడుకు తిరుపతిరావు ట్రాక్టర్‌తో తొక్కించేశాడు. దీనిపై తిరుపతమ్మ ఫిర్యాదుపై స్పందించిన పోలీసులు తిరుపతిరావుపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్
ప్రభుత్వ రంగ సంస్థ - ప్రాయోజిత బ్యాంక్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
అత్మకూరు బ్రాంచి (7082), గ్రౌండ్ ఫ్లోర్, డి.నెం.5-20, అత్మకూరు, మంగళగిరి మండలం, గుంటూరు జిల్లా-522503. ఫోన్: 9100910482.

బంగారు నగల వేలము నోటీసు

ఇందుమూలముగా తెలియజేయుట ఏమనగా మా బ్యాంకు ద్వారా బంగారు నగలు తాకట్టు పెట్టి తీసుకున్న ఋణములు ఎన్ని నోటీసులు పంపినను దిగువ తెలిపినవారు తమ బాకీలను చెల్లించియుండలేదు. ఋణము చెల్లించవలసిన కాలము గతించినందున సదరు బంగారు నగలను ది.20-02-2026, శుక్రవారం మధ్యాహ్నం 2-30 గం॥లకు మా బ్రాంచి ఆవరణములో బహిరంగ వేలము వేసి వారి పేరునయున్న బకాయిలకు జమ కట్టుకొనబడును. వేలములో పాల్గొనదలచినవారు ది.20-02-2026 ఉదయం 11-00 గం॥ల లోపు రూ.5,000/- ధరావత్తుగా చెల్లించవలయును. ఏట్టికారణం చూపకనే వేలమును రద్దుచేయుటకు గానీ, వాయిదా వేయుటకు గానీ బ్యాంకు వారికి పూర్తి అధికారము కలదు. వేలము తదితర ఖర్చులు వారి ఖాతాలకు వ్రాయబడును. వేలము వేసినా బకాయిలు రద్దుకాని యెడల వారిపై చట్టరీత్యా తగుచర్య తీసుకొని మిగిలిన బకాయిలను వసూలు చేయబడును. ఈ దిగువ పేర్కొనబడిన ఖాతాదారులలో ఎవరైనా మరణించియెడల వారి వారసులకు ఈ వేలము నోటీసు వర్తిస్తుంది.

క్ర.సం.	అకౌంట్ నెంబరు	ఋణగ్రహీత పేరు మరియు చిరునామా	స్థూల బరువు
1	708230100076125	శ్రీ జాలాది సురేష్ బాబు, తండ్రి: సంగీతరావు, డి.నెం.5-178/ఎ, అత్మకూరు, మంగళగిరి-522503.	11.900

1) పైన తెలిపిన ఋణగ్రహీతలకు గతంలో జారీ చేసిన నోటీసులు (అవి ఏ కారణము చేతనైనను) తిరిగి వచ్చిన దీనినే ఆఖరి నోటీసుగా భావించవలసినది, 2) విజయవంతమైన పాటదారుడు వేలం తేది సాయంత్రం 4:00 గం॥లోగా ధరావత్తు మినహా మిగిలిన పాట మొత్తమును చెల్లించి నగలను స్వంత భాధ్యత వహించి పొందవలెను, 3) నగల నాణ్యతను పాటకు ముందుగానే పాటదారుడు సరిచూసుకొనవలెను. అందుకు బ్యాంక్ బాధ్యత వహించజాలదు, 4) పాటదారుడు సరైన ఫోటో మరియు చిరునామా ఋజువులను ప్రాథమికంగా దాఖలు చేయుట తప్పనిసరి.
గమనిక: పైన ప్రచురించిన ప్రకటనతో పత్రికవారి అచ్చుతప్పులకు బ్యాంకువారు బాధ్యులు కాదు.
తేది : 11-02-2026, ప్రదేశం: అత్మకూరు — ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, అత్మకూరు బ్రాంచి గుంటూరు జిల్లా.

తెనాలి

•తెనాలి •పొన్నూరు

తెనాలి మార్కెట్ యార్డులో..

నిమ్మకాయల ధరలు రూ.. (క్వింటా)

అత్యధికం: 6500
అత్యల్పం: 5000
సగటు: 6000

– న్యూస్‌టుడే, తెనాలి టౌన్

లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే చర్యలు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: మైనర్లు వాహనాన్ని నడపకూడదని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ఎవరైనా వాహనాలు నడిపితే చట్ట పరంగా కేసులు నమోదు చేస్తామని మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రాఘవరావు తెలిపారు. తెనాలి శ్రీచైతన్య జూనియర్ కళాశాల్లో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో విద్యార్థులకు రవాణా శాఖ నిబంధనలను వివరించారు. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు.

రథయాత్ర రహదారి పరిశీలన

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: మహాశివరాత్రి రోజున పట్టణంలోని రామేశ్వరస్వామి రథయాత్ర సజావుగా సాగడానికి, భక్తులు దర్శించుకోవడానికి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అధికారులు సమావేశమయ్యారు. తహసీల్దార్ గోపాలకృష్ణ, కమిషనర్ రామ అప్పలనాయుడు, ఈవో రమణ కుమారి బుధవారం రూట్ మ్యాప్ ప్రకారం రథయాత్ర రహదారిని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో ఏసుబాబు, టూటౌన్ సీఐ రాములు నాయక్, మున్సిపల్ ఇంజినీర్లు, శానిటేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది

కాలూరి రమేష్‌బాబు S/o సాంబశివరావు, డి.నెం.1-6-6, నాజరుపేట, పురుషోత్తమవారివీధి, తెనాలి, గుంటూరు జిల్లా. నాకు సంబంధించిన తెనాలి యస్.ఆర్.ఓ.లో రిజిష్టర్ కాబడిన డాక్యుమెంట్ నెం.282/1993 ది.08.02.2026న టి.బి. రోడ్డునకు జిరాక్స్ కొరకు తీసుకొని వెళ్ళుచుండగా మార్గ మధ్యములో పోయినది. దొరికినచో తెలుపగలరు.

9849818388
9444249116

ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది

జూపూడి శ్రీనివాసరావు S/o (లేటు) జూపూడి కృష్ణమూర్తి, డి.నెం.4-8-5, విద్యానగర్, పొన్నూరు, గుంటూరు జిల్లా. నాకు సంబంధించిన గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ యస్.ఆర్.ఓలో రిజిష్టరు కాబడిన గోరంట్ల ఏరియాకు సంబంధించిన డాక్యుమెంట్ నెం.819/2014 మరియు 6118/2014 ది.2-2-2026న పొన్నూరు ఐలాండ్ సెంటరు నందు జిరాక్స్ కొరకు బైక్‌పై వెళ్ళుచుండగా మార్గమధ్యములో పోయినవి. దొరికినచో తెలుపగలరు.

9840840193

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? తెనాలి-రేపల్లె రైల్వే మార్గంలో వైకుంఠపురం వంతెన ట్రాక్ వద్ద సిగ్నల్స్ సమయంలో రైలు ఆగినప్పుడు వాటిలోని మరుగుదొడ్ల వ్యర్థాలు వంతెన కింద నుంచి రాకపోకలు సాగించే వారిపై పడుతున్నాయి. - కొప్పరపు నారాయణమూర్తి, తెనాలి

✔ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం.- వెంకటరమణ, తెనాలి రైల్వే స్టేషన్ మేనేజర్.

? పట్టణంలోని షరాఫ్ బజార్ జైన మందిరం వీధిలో రాకపోకలకు అడ్డుగా వాహనాలు, ఇతర వస్తువులను పెడుతున్నారు. - సుధాకర్, తెనాలి

✔ తొలగింపు చేస్తాం. - జనార్దనరావు, డీఎస్పీ

స్పందన: నందులపేటలో వీధి దీపాలను మున్సిపల్ అధికారులు మరమ్మతులు చేయించారు. * పట్టణంలోని ఆర్ఆర్ నగర్‌లో పైపులు పగిలి తాగునీరు వృథా పోతుండడంతో వాటిని అధికారులు సరి చేయించారు. - న్యూస్‌టుడే, తెనాలి టౌన్

ఏడు బృందాలతో నిఘా

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: ఏఎన్‌యూలోని దూరవిద్యా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి ప్రారంభమైన మూడో విడత పరీక్షల్లో చూచిరాతలు, ఇతర అక్రమాలను నివారించేందుకు సమన్వయకర్త డాక్టర్ రామచంద్రన్ ఏడు ప్రత్యేక బృందాలను నియమించారు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు ఈ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. తూర్పుగోదావరి జిల్లాలోని ఓ కేంద్రంలో చూచిరాతకు పాల్పడుతున్న 9 మంది విద్యార్థులను ప్రత్యేక స్క్వాడ్ పట్టుకుంది.

'పది'కి ప్రత్యేక కార్యాచరణ.. ఉత్తీర్ణతే లక్ష్యం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే

పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించాలని, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులందరూ నూరు శాతం ఉత్తీర్ణులు కావాలన్న లక్ష్యంతో విద్యాశాఖ ఈ ఏడాది మొదటిసారి విభిన్న కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. పదో తరగతిలో ఇప్పటి వరకు నిర్వహించిన పరీక్షలు, వాటి ఫలితాల ఆధారంగా ప్రత్యేక దృష్టి పెడితే ఉత్తీర్ణులవుతారని నిర్ధారించిన విద్యార్థులతో జాబితాలు రూపొందించారు. తల్లిదండ్రుల నుంచి అనుమతి పొందిన విద్యార్థులను ఎంపిక చేశారు. వారికి 30 రోజుల పాటు వసతి, భోజన సదుపాయాలతో కూడిన రెసిడెన్షియల్ విధానాన్ని అమలు చేస్తున్నారు. తెనాలి విద్యాశాఖ డివిజన్ పరిధిలో ఉన్న తెనాలి, కొల్లిపర, పొన్నూరు, మంగళగిరి, చేబ్రోలు, దుగ్గిరాల, కాకుమాను, తాడేపల్లి (మొత్తం 8 మండలాలు) ప్రాంతాల్లోని బాలుర కోసం తెనాలి పట్టణ చెంచుపేటలోని కొగంటి శివయ్య పురపాలక ఉన్నత పాఠశాల, బాలికల కోసం తెనాలి పట్టణ కొత్తపేటలోని దొడ్డపనేని ఇందిర పురపాలక బాలికోన్నత పాఠశాలలను వసతి కేంద్రాలుగా ఎంపిక చేశారు. ఈ నెల 9వ తేదీన మొదలైన కార్యాచరణ మార్చి నెల 10వ తేదీ వరకు కొనసాగనుంది. 52 మంది విద్యార్థులు, 14 మంది విద్యార్థినులు ఈ ప్రత్యేక తరగతుల్లో శిక్షణ పొందుతున్నారు.

వసతి, భోజనంతో తరగతులు

కొగంటి శివయ్య పురపాలక ఉన్నత పాఠశాల కేంద్రంలో రాత్రి సమయంలో చదువుకుంటున్న విద్యార్థులు

రోజు వారీ ప్రణాళిక

విద్యార్థులను ఉదయం 5:30 గంటలకు నిద్ర లేపడం.. కాలకృత్యాలకు అర గంట సమయం కేటాయింపు.. అనంతరం యోగ సాధన చేయిస్తారు. పాఠ్యాంశాల్లోని సందేహాలకు సమాధానాలు ఇస్తూ చదివిస్తారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందిస్తారు. అక్కడే ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు తర్వాత రాత్రి 9 గంటల వరకు చదివిస్తారు. ఈ ప్రక్రియకు ప్రత్యేకంగా ఉపాధ్యాయులు, రాత్రి సమయంలో సంరక్షకులను నియమించారు. బాలికలకు మహిళా ఉపాధ్యాయులే ఉండేలా ఏర్పాటు చేశారు. పదో తరగతిలో ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణులు కావాలన్న లక్ష్యంతో ఈ ప్రయత్నం చేస్తున్నామని, సత్ ఫలితాలు వస్తాయని భావిస్తున్నామని తెనాలి డివిజన్ ఉప విద్యాశాఖాధికారిణి (డీవైఈవో) జి.శాంతకుమారి తెలిపారు. ఆమె ప్రతి రోజూ ఈ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడుతున్నారు.

ఏఎన్‌యూ అభివృద్ధికి ఐకమత్యంతో పనిచేయాలి

వికాస భవనం వద్ద ఎమ్మెల్యే నరేంద్రకుమార్

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: ఏఎన్‌యూ అభివృద్ధికి అధ్యాపకులు, ఉద్యోగులు ఐకమత్యంతో పనిచేయాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ సూచించారు. ఏఎన్‌యూలో ఆధునికీకరించిన వికాస భవనాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ వికాస సభ్యులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. అకడమిక్ సెనెట్, ఈసీలో బోధనేతర సిబ్బంది అసోసియేషన్‌లో వాళ్లకు స్థానం కల్పించాలని, సకాలంలో బ్లాక్ గ్రాంట్ వచ్చేలా చూడాలని, పనిభారం తగ్గించాలని, ఖాళీగా ఉన్న పోస్టుల్లో అర్హతలున్న ఒప్పంద, దినసరి ఉద్యోగులను భర్తీ చేయాలని, 20 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న దినసరి ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, దినసరి ఉద్యోగులకు ఈపీఎఫ్, ఈఎస్ఐ వర్తింపజేయాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలను మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్ మాట్లాడుతూ.. సీడీఈ వల్లే సకాలంలో జీతాలు, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నామని.. అలాంటి దూరవిద్యా కేంద్రానికి చెడ్డపేరు తీసుకొచ్చేలా చేయవద్దని బోధన, బోధనేతర సిబ్బందికి సూచించారు. రెక్టార్ ఆచార్య శివరామప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, వికాస అధ్యక్షులు నీలం ప్రసాద్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వీనుల విందు... సంగీత గాత్ర కచేరి

గాత్ర కచేరీ చేస్తున్న శివానంద యశస్వి

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: శ్రీ సీతారామ గాన సభ ఆధ్వర్యంలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ప్రారంభమైన మూడు రోజుల శాస్త్రీయ సంగీత ఉత్సవాలు బుధవారం రెండో రోజుకు చేరుకున్నాయి. విజయవాడకు చెందిన మాస్టర్ మల్లాది శివానంద యశస్వి గాత్ర కచేరి వీనుల విందుగా సాగింది. కుమారి మల్లాది సింధు రాగేశ్వరి వయోలిన్, మాస్టర్ కార్తికేయ ఆదినారాయణశర్మ మృదంగం వాయిద్య సహకారం అందించారు. సంగీత అభిమానులు అధిక సంఖ్యలో హాజరై తిలకించారు. సభ అధ్యక్ష, కార్యదర్శులు పిరాట్ల రమణి, హరిబాబుశాస్త్రి పర్యవేక్షించారు.

భవిత కేంద్రం ప్రారంభం

చేబ్రోలు: దివ్యాంగ విద్యార్థుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాలను వినియోగించుకోవాలని ఎంఈవో సుబ్బారావు అన్నారు. స్థానిక గాలిగోపురం వద్ద ఉన్న ఎంపీపీ పాఠశాలలో బుధవారం ఆధునికీకరించిన భవిత కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల కోసం ప్రభుత్వం ఆటిజం కేంద్రాలు ఏర్పాట్లు చేస్తున్నట్టు వెల్లడించారు. చిన్నారులకు పరికరాలను అందజేశారు.

పీజీ మూడో సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో గతేడాది నవంబరులో నిర్వహించిన పీజీ మూడో సెమిస్టర్ ఫలితాలను సీఈ ఆలపాటి శివప్రసాద్ బుధవారం విడుదల చేశారు. ఎంకామ్ మూడో సెమిస్టర్‌లో 58 మంది పరీక్ష రాయగా 45, బోటనీ మూడో సెమిస్టర్‌లో 83 మంది పరీక్ష రాయగా 41, కెమిస్ట్రీలో 402 మంది పరీక్ష రాయగా 226, ఫుడ్ ప్రాసెసింగ్, క్వాలిటీ మేనేజ్‌మెంట్‌లో 17 మంది పరీక్ష రాయగా 16, నానోటెక్నాలజీ రెండో ఏడాది మొదటి సెమిస్టర్‌లో 13 మంది పరీక్ష రాయగా నలుగురు, మూడో ఏడాది మొదటి సెమిస్టర్‌లో 23 మంది పరీక్ష రాయగా 15, ఐదో ఏడాది మొదటి సెమిస్టర్‌లో 26 మంది పరీక్ష రాయగా 23, డిప్లొమో ఇన్ మ్యూజిక్‌లో 13 మంది పరీక్ష రాయగా 12, హార్టికల్చర్, ల్యాండ్ స్కేప్‌లో పరీక్ష రాసిన 16 మంది, ఎంబీఏ మూడో సెమిస్టర్‌లో 721 మంది పరీక్ష రాయగా 601 మంది ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. జవాబు పత్రాల పునఃమూల్యాంకన కోసం ఈ నెల 20లోపు ఒక్కో పేపర్‌కు రూ.1860 చెల్లించాలని సీఈ తెలిపారు.

GENERAL PUBLIC AWARE NOTICE

Hyderabad 10-2-2026

All the public are hereby informed that Late Dr. Vemuri Poornanadam, S/o. Late Lakshmi Narayana, R/o. H.No.10-53/1, Plot No. 48, Vasantha Puri Colony, Malkajgiri, Medchal Malkajgiri District, Telangana, had executed a will deed on 19-05-2019 by bequeathing in all his property to a Trust called as "Vemuri Lakshmi Narayana and Poornanadam Sanathana Sadhaka Samasti Trust". Late Dr. Poornanadam is having properties in Kunchavaram Village, Kollipara Mandal and Guntur District. After demise of Late Dr. Poornanadam the followers of Dr. Poornanadam formed a trust. Now all the properties of Dr. Vemuri Poornanadam will belong to the Trust only. In this regard trust board made an application to the Tahsildar Kollipara Mandal to enter name in revenue records. If anybody got objection with regard to trust may kindly submit their objections to undersigned within 10 days from the date of this Publication. Thereafter no objections shall be entertained

Sd/- S. KRISHNA MOHAN, Advocate, Cell: 7989895566, 9704224493 Plot No: 45, Road No: 4, Besides Ele. Sub Station, Hanuman Nagar, Mansurabad, Hyderabad-500 068.

నేటి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు

విద్యుద్దీపాల అలంకరణలో మల్లేశ్వరస్వామి దేవస్థానం

పెదకాకాని, న్యూస్‌టుడే: పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఆర్డీవో శ్రీనివాసులు, ఈవో గోగినేని లీలాకుమార్ తెలిపారు. ఆలయంలో వివిధ శాఖల అధికారులతో బుధవారం వారు సమావేశం నిర్వహించారు. మహాశివరాత్రి రోజున రెవెన్యూ, పోలీసు, ఆరోగ్య, విద్యుత్తు, అగ్నిమాపక శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భక్తులు ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ➡ ఆలయం బయట భక్తులు వాహనాలు నిలిపేందుకు ఏర్పాటు చేసిన ఖాళీ స్థలాలు, చెరువు కట్ట వెంబడి ఎలాంటి పార్కింగ్ ఫీజు వసూలు చేయొద్దని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అధికారులను ఆదేశించారు.

దీన్‌దయాళ్ సేవలు చిరస్మరణీయం

నివాళులర్పిస్తున్న భాజపా నాయకులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: పండిత్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని భాజపా నాయకులు పేర్కొన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా తెనాలి పట్టణం, మండలంలోని అంగలకుదురు గ్రామంలో బుధవారం చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమాల్లో సందీప్‌రాజు, కడియాల నందకిషోర్, కతారి వాసుదేవనాయుడు, శఖమూరి శంకర్రావు, కనకదుర్గ, యోగా నందకిషోర్, వీరయ్య, విజయభాస్కరరెడ్డి, హనుమంతరావు, శ్రీనివాస్, ప్రసాద్, కోటేశ్వరరావు, రాఘవయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు మద్దతు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ఈ నెల 12న జాతీయ సమ్మెకు యూటీఎఫ్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. తెనాలి ప్రాంతీయ శాఖల ఆధ్వర్యంలో బుధవారం ప్రదర్శన నిర్వహించారు.

WALK-IN -INTERVIEW

TENALI NRI SPRINGS IN CHERUKUPALLI

HERE WALK IN INTERVIEWS ARE CONDUCTED FOR SCHOOL FACULTY
WE INVITE YOU TO ATTEND A WALK-IN INTERVIEW FOR THE POSITIONS OF

REQUIREMENT FACULTY:

1. PRINCIPAL 2. OFFICE FACULTY
3. NURSARY TO 10th CLASS TEACHING FACULTY

INTERVIEW CONDUCTED BY DEMO

DATE: 14-02-2026 (2nd SATURDAY) 10:00 AM ONWARDS

SPOKEN ENGLISH IS MUST AND SHOULD

VENUE: **NRI JUNIOR KALASALA**
GULLAPALLI, SRINIVASARAO HOSPITAL (OPPOSITE),
PHONE NO: 7780492081; 7075821396

PLEASE BRING YOUR UPDATED RESUME AND RELEVANT DOCUMENTS

ప్రధాన పైపులైను లీకు

తెనాలి పట్టణ రజకచెరువు కూడలి నుంచి ఐతానగర్‌కు వెళ్లే మార్గంలో డాంగే వారి వీధి మలుపు వద్ద ఉన్న తాగునీటి ప్రధాన పైపులైనుకు చిల్లులు పడ్డాయి. దీంతో వాటి నుంచి నీరు వృథాగా పోతుంది. ఇలానే. . వదిలేస్తే జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉంది. మున్సిపల్ అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తెనాలి టౌన్

అడ్డదిడ్డంగా వాహనాల నిలిపివేత

తెనాలి పట్టణ వహాబ్ రోడ్డు నుంచి పాత సత్యనారాయణ థియేటర్ రోడ్డుకు అనుసంధాన చేసే మార్గం మలుపులో ద్విచక్ర వాహనాలను నిలుపుతున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన వారు ఇక్కడ వాహనాలు పార్క్ చేయడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. దీని వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని.. పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. - న్యూస్‌టుడే, తెనాలి టౌన్

పూడిక తీయక.. మురుగు పారక..

పినపాడు చెరువు సమీపాన గల ఆవాసాల్లోని కాలువల్లో మురుగునీరు స్తంభించింది. పూడిక తీయని ఈ కాలువలో దోమ లార్వా నిర్మూలన చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దోమలు విపరీతంగా పెరుగుతున్నాయి. కంటిమీద కునుకు ఉండడం లేదని జనం ఆందోళన చెందుతున్నారు. క్రమం తప్పకుండా పూడిక తీసి మురుగు పారుదలకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, తెనాలి(కొత్తపేట)

పాఠశాలల అభ్యున్నతికి 'విద్యాంజలి'

వివరాలు తెలుపుతున్న విద్యాశాఖ అధికారులు

కొల్లిపర, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల అభ్యున్నతికి జ్ఞానంతో కూడిన దాతృత్వం, వస్తు రూపంలో సాయం మాత్రమే అందిపుచ్చుకోవాలని మండల విద్యాశాఖాధికారి యూన్నీలత అన్నారు. విద్యాంజలి 2.0 కార్యక్రమంలో భాగంగా మున్నంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యాశాఖ రూపొందించిన యాప్‌లో స్వచ్ఛంద సేవకుల (వాలంటీర్ల) వివరాలున్నాయని పేర్కొన్నారు. సాయం కోరిన పాఠశాల అభివృద్ధికి సాయమందించేందుకు ముందుకొచ్చిన దాతల వివరాల నమోదులో యాప్ సమన్వయం చేస్తుందని తెలిపారు. క్లస్టర్ హెచ్ఎం పి.అప్పారావు, రిసోర్సు పర్సన్స్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: విద్యాంజలి 2.0 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల విద్యాశాఖాధికారులు జయంతిబాబు, లక్ష్మీనారాయణ, సమన్వయకర్తలు పఠాన్ కరిముల్లా, షేక్ షరీఫ్ కోరారు. పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు.

రైలుపై రాళ్లు విసరడం నేరం

తెనాలి టౌన్: రైళ్లపై రాళ్లు విసరడం బెయిల్ కూడా లభించని తీవ్రమైన నేరమని, రైల్వే ట్రాక్‌లపై ప్రమాదకర విన్యాసాలు, దాటడం వంటి పనులు చేయకూడదని ఆర్‌పీఎఫ్ ఏఎస్సై శివరామకృష్ణయ్య తెలిపారు. తెనాలి మారీసుపేటలోని నల్లమోతు చెంచు రామానాయుడు పురపాలక ఉన్నత పాఠశాల్లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు ఆయా అంశాలపై అవగాహన కలిగించారు.

డీవీసీ ఆసుపత్రికి డయాలసిస్ యంత్రం వితరణ

యంత్రాన్ని అందిస్తున్న జన స్మాల్ ఫైనాన్స్ అధికారులు

పొన్నూరు, న్యూస్‌టుడే: బెంగళూరుకు చెందిన జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు సీనియర్ ప్రెసిడెంట్ ప్రేమానంద్ కృష్ణన్, రీజినల్ హెడ్ అమర్నాథ్ చల్లగుండ్ల తదితరులు వడ్లమూడి డీవీసీ వైద్యశాలకు డయాలసిస్ యంత్రాన్ని బుధవారం అందచేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ప్రేమానంద్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందిస్తున్న డీవీసీ ఆసుపత్రికి రూ.20 లక్షలు విలువ చేసే డయాలసిస్ యంత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. వైద్య రంగంలో భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

వృద్ధురాలిని ఏమార్చి.. బంగారు నగ మాయం చేసి..

కృష్ణలంక, న్యూస్‌టుడే: ఓ మహిళ వృద్ధురాలిని ఏమార్చి బంగారు గొలుసుతో పరారైన ఘటన బస్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. తెనాలికి చెందిన వృద్ధురాలు శేషకుమారి మంగళవారం ఉదయం విజయవాడ పీఎన్‌బీఎస్‌లో బస్సు దిగారు. బంధువుల ఇంటికి వెళ్లేందుకు 50వ నంబరు ప్లాట్‌ఫాం వద్ద ఒంటరిగా కూర్చున్నారు. వృద్ధురాలిని గమనించిన అపరిచిత మహిళ ఆమె వద్దకు వచ్చింది. మాటలు కలిపింది. నగరంలో తిరునాళ్ల జరుగుతోంది.. దొంగలు సంచారం ఎక్కువగా ఉంది.. ఆభరణాలు తదితర విలువైన వస్తువులు జాగ్రత్త అని చెప్పింది. ఆందోళన చెందిన వృద్ధురాలు తన మెడలో ఉన్న సుమారు ఎనిమిది గ్రాముల బంగారు గొలుసు తీసి సంచిలో వేసుకున్నారు. కొద్దిసేపటికి అపరిచిత మహిళ అక్కడ నుంచి వెళ్లిపోయింది. తరువాత వృద్ధురాలు తన సంచిలో చూసుకోగా... బంగారు గొలుసు కనిపించలేదు. అపరిచిత మహిళ తనను ఏమార్చి నగతో పరారైనట్లుగా నిర్ధారించుకున్న ఆమె కృష్ణలంక పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

స్పర్శ లేని మచ్చలను అశ్రద్ధ చేయొద్దు

తెనాలి(కొత్తపేట): శరీరంపై స్పర్శ లేని మచ్చలను అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించాలని డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ జంగం శ్యామ్ తెలిపారు. లెప్రా సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో నిర్వహించిన కుష్ఠు నిర్మూలనా అవగాహన పక్షోత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉద్యోగులు, సిబ్బందితో అవగాహన ప్రదర్శన నిర్వహించారు. విశ్రాంత హెల్త్ పర్యవేక్షకుడు వీరయ్య వ్యాధిగ్రస్థులకు దుప్పట్లు, టవళ్లు, సబ్ యూనిట్ మలేరియా అధికారి శ్రీ కంఠ ఉమాకాంత్ ఉచిత భోజనం అందించారు.

తృప్తి క్యాంటీన్ పైకప్పు ఏర్పాటుపై వాగ్వాదం

అధికారులతో వాగ్వాదం చేస్తున్న నిర్వాహకురాలు నాగలక్ష్మి

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: మున్సిపల్ అధికారుల అనుమతి మేరకు నిర్వాహకురాలు నాగలక్ష్మి బుర్రిపాలెం మార్గంలో తృప్తి క్యాంటీన్ ఏర్పాటు చేశారు. అల్పాహారం తినటానికి క్యాంటీన్‌కు వచ్చే వారి కోసమని ఇనుప గొట్టాలతో పైకప్పు వేయించారు. బుధవారం అక్కడికి వచ్చిన మున్సిపల్ అధికారులు పైకప్పునకు వాడిన గొట్టాలు తొలగించాలని సూచించారు. ఆమె ఒప్పుకోకపోవడంతో వారి మధ్య వాగ్వాదం జరిగింది. జేసీబీతో తొలగిస్తామని అధికారులు హెచ్చరించడంతో ఆమె ఇంధనం నింపిన డబ్బాతో వివాదం సృష్టించారు. ఈ విషయాన్ని అధికారులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన.. నాగలక్ష్మితో మాట్లాడడంతో ఆమె వాటిని తొలగించేందుకు ఒప్పుకొన్నారు.

విద్యార్థులకు పరీక్షల సామగ్రి బహూకరణ

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో ఐతానగర్‌లోని నన్నపనేని సీతారామయ్య సరస్వతమ్మ పురపాలక ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని బుధవారం అందించారు. వెంకటపూర్ణచంద్, వెంకటేశ్వరరావు, వెంకటనారాయణ, శ్రీనివాసరావు, సరోజ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుపడాలి

తెనాలి (కొత్తపేట): పట్టణంలోని సుందరయ్య కాలనీలో పారిశుద్ధ్యం మెరుగు పడాలని కమిషనర్ రామ అప్పలనాయుడు అధికారులకు ఆదేశించారు. ఆయన బుధవారం కాలనీలో పర్యటించారు. కాలువల్లో పూడిక తీయకపోవడం వల్ల మురుగు పారుదల స్తంభించిందని పూడిక తీయాలని చెప్పారు. తాగునీటి పంపులకు మరమ్మతులు చేయాలని, దోమల నిర్మూలన చర్యలు చేపట్టాలని సూచించారు. ఏఈ కల్యాణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి అభినందన

తెనాలి టౌన్: షూటింగ్ బాల్ వరల్డ్ కప్ పోటీల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాల్లో ఇంటర్ 2వ సంవత్సరం చదువుతున్న అనురాధరెడ్డి జట్టు విజయానికి కీలక పాత్ర పోషించినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు చిన్నం పద్మాకర్ తెలిపారు. కళాశాల్లో బుధవారం అనురాధరెడ్డిని కరస్పాండెంట్ మేరి గ్రేస్, ప్రిన్సిపల్ సిరిల్ పాల్, డైరెక్టర్ సుధీర్, ఉపాధ్యాయులు సత్కరించారు.

ఉపాధ్యాయ బృందానికి సత్కారం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: క్రికెట్ పోటీల్లో గుంటూరు టైగర్స్ జట్టు తరపున పాల్గొని రాష్ట్ర స్థాయిలో సత్తా చాటిన ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాసరావు, ఎస్.శ్రీనివాసరావు, రాయన్న, నవీన్, సత్యనారాయణ, కరిముల్లా, మిధున్ చక్రవర్తి, జయ ప్రకాష్, రామరాజు, కొండలు, హనుమాన్ నాయక్, ఆంజనేయశర్మ తదితరులను గంగానమ్మపేటలోని తోటకూర సుబ్బారావు పురపాలక ఉన్నత పాఠశాల్లో బుధవారం సత్కరించారు. ప్రధానోపాధ్యాయిని మల్లేశ్వరి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఎన్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'ప్రతిపక్ష హోదా ప్రజలు ఇవ్వాలి'

తెనాలి టౌన్: మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు ప్రతిపక్ష హోదాను ప్రజలే ఇవ్వలేదని తెదేపా నాయకులు పేర్కొన్నారు. తెనాలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ ఖుద్దూస్, జొన్నాదుల మహేష్, కేసన కోటేశ్వరరావు, అశోక్, నాగేశ్వరరావు, శేషగిరిరావు, విజయ్, వెంకట్, కన్నయ్య, సురేష్, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ మేనేజ్‌మెంట్ కార్యశాల

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని వాణిజ్య విభాగంలోని విద్యార్థులకు రెవెన్యూ మేనేజ్‌మెంట్ (ఆర్ఎం) స్థితిగతులపై నిర్వహించిన కార్యశాల బుధవారంతో ముగిసింది. కనెక్టెక్ నాలెడ్జ్ సెంటర్ సీఈవో డాక్టర్ సత్యకుమార్ ఆర్ఎంపై అవగాహన కల్పించారు.

(c) eenadu

గుంటూరు పశ్చిమ

డీవీసీ ఆసుపత్రికి డయాలసిస్ యంత్రం వితరణ



యంత్రాన్ని అందిస్తున్న జన స్మాల్ ఫైనాన్స్ అధికారులు

పొన్నూరు: బెంగళూరుకు చెందిన జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు సీనియర్ ప్రెసిడెంట్ ప్రేమానంద్ కృష్ణన్, రీజనల్ హెడ్ అమర్నాథ్ చల్ల గుండ తదితరుల వద్ద మూడి డీవీసీ వైద్యశాలకు దయాలసిస్ యంత్రాన్ని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ప్రేమానంద్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందిస్తున్న డీవీసీ ఆసుపత్రికి రూ.20 లక్షలు విలువ చేసే దయాలసిస్ యంత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. వైద్య రంగంలో భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
80086 22566, 97042 53525, 80085 74897

? యేసుభక్తనగర్‌లో రహదారి పక్కనున్న కాలువలో మురుగు ముందుకు కదలడంలేదు. దీంతో దుర్వాసన, దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. - **స్థానికులు** ✓ పారిశుద్ధ్య సిబ్బందితో కాలువలో పూడిక తీయించి మురుగు ముందుకు కదిలేలా చర్యలు తీసుకుంటాం. - **నాగేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్,**

చెత్త తొలగింపు: కలెక్టర్ బంగ్లా రోడ్డులోని బాలికల విద్యా భవన్ పాఠశాల పక్కన రహదారి వెంబడి వ్యర్థాలు పేరుకుపోవడంతో దోమల బెడద ఎక్కువైంది. సమస్యను 'మేమున్నాం..' ద్వారా జీఎంసీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంగడి వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన స్పందించి పారిశుద్ధ్య సిబ్బందితో రహదారి వెంబడి చెత్త, వ్యర్థాలను తొలగించేలా చర్యలు తీసుకున్నారు. - **న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం**

హోంగార్డుల పెద్ద మనసు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డులు జంగం చిట్టిబాబు, మంచాల మేరీకి ఆర్థికంగా తోడ్పాటు ఇచ్చేందుకు సహచర హోంగార్డులందరూ తమ ఒక రోజు వేతనం రూ. 5.02 లక్షలను విరాళంగా ప్రకటించారు. బుధవారం ఎస్పీ వకుల్ జిందాల్ చేతుల మీదుగా వారికి అందజేశారు. హోంగార్డుల సేవాతత్పరతను ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో ఆర్ఐ రామకృష్ణ రెడ్డి పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించాలి

మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర 2047లో భాగంగా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించే దిశగా అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అన్నారు. కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాలులో బుధవారం కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్‌పై వివిధ శాఖల అధికారులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ కీలక పనితీరు సూచికలు, సాంకేతికత ఆధారిత పనితీరుపై పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. ఈ వ్యవస్థ సేవా బట్వాడాను మెరుగుపర్చడానికి, జవాబుదారీతనాన్ని నిర్ధారించడానికి, ఆర్థిక వృద్ధిని పెంచడానికి, నెలవారీ, త్రైమాసిక, వార్షిక సమీక్షలకు కీలకంగా మారనుందన్నారు. ప్రతీ శాఖ ఉత్తమ పనితీరుతో లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. జిల్లా, నియోజకవర్గం, గ్రామ స్థాయిలో ప్రణాళిక యూనిట్లను ఏర్పాటు చేసి, వాటిని సమర్థంగా వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో సీపీఓ శేషశ్రీ, శిక్షణ సమన్వయ అధికారులు పాల్గొన్నారు.

ధర వరలు

కృష్ణనగర్ రైతుబజారులో నిన్నటి ధరలు(కిలో రూ.ల్లో). టమాట 14, వంగ 25, బెండ 30, పచ్చిమిర్చి 38, కాకర 47, బీర 40, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజి 18, క్యారెట్ 26, దొండ 45, బంగాళదుంప 20, ఉల్లిపాయలు 24, గోరుచిక్కుళ్లు 35, దోస 34, సొర 14, పొట్ల కాయ 27, అరటికాయ 10, పెద్ద చిక్కుళ్లు 50, బీట్‌రూట్ 25, ముల్లంగి 16, కీరదోసకాయ 45, బీన్స్ 65, క్యాప్సికం 65, కొత్తిమీర 20, ఆకుకూరలు 15, నిమ్మకాయలు 45, అల్లం 75, వెల్లుల్లి 155, పుదీనా 70. - న్యూస్‌టుడే, పట్టాభిపురం

గుంతలు పూడ్చరు.. కుప్పలు తీయరు..

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: తాగునీటి సరఫరా పైపులైన్లకు లీకులు ఏర్పడిన సందర్భంలో నగరపాలక సంస్థ సిబ్బంది మరమ్మతులు చేస్తున్నారు. ఈ క్రమంలో పనులు పూర్తయిన తర్వాత సిబ్బంది గుంతలు పూడ్చకుండా వదిలేయడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. కొన్నిచోట్ల గుంతలు.. మరికొన్నిచోట్ల మట్టి కుప్పలు ప్రమాదకరంగా పరిణమిస్తున్నాయి. నగరంలో ప్రస్తుతం చాలాచోట్ల ఇదే పరిస్థితి కనిపిస్తుంది.

❖ కేవీపీ కాలనీలో వారం రోజుల క్రితం మంచినీటి సరఫరా పైపులైన్లకు మరమ్మతులు చేశారు. కొన్ని వీధుల్లో కొత్తగా లైన్లు ఏర్పాటు చేశారు. కొత్తగా లైన్ వేసిన చోట కుళాయి కనెక్షన్ కోసం గుంతలు తవ్వి వదిలేశారు.

❖ వీవీపీ రోడ్డు నుంచి శ్రీనివాసరావుపేట వచ్చే రోడ్డులో వారం రోజుల క్రితం గుంతలు తవ్వి మట్టి కుప్పలు రోడ్డుపైన ఉంచేశారు. ఈ మార్గంలో ద్విచక్రవాహనాలు, ఆటోలు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డుపైన మట్టి కుప్పలు అడ్డుగా ఉండడంతో వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు.



మురుగు కాల్వలో తాగునీటి సరఫరా పైపులు

రక్షణ చర్యలు శూన్యం..

❖ మరమ్మతుల కోసం తవ్విన గుంతల వద్ద ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోలేదు. చిన్నపిల్లలు ఆడుకుంటూ అటుగా వస్తే గోతుల్లో పడే ప్రమాదముంది. కాలనీలోని పలుచోట్ల కుళాయి కనెక్షన్ ఇచ్చేందుకు గుంతలు తీసి పూడ్చకుండా వదిలేశారు.

❖ ఈ ప్రాంతంలో రోడ్డు చిన్నదిగా ఉండడంతో కుళాయి కనెక్షన్ పైపులు మురుగు కాలువ మీదుగా ఏర్పాటు చేశారు. ఎక్కువ శాతం పైపులు మురుగు కాలువల్లోనే కనిపిస్తున్నాయి. పైపులకు లీకులు ఏర్పడి మురుగునీరు కుళాయిల్లోకి వచ్చే ప్రమాదం ఉన్నప్పటికీ నగరపాలక సంస్థ సిబ్బంది ఎక్కువ శాతం కాలువల్లోనే వేస్తున్నారు.

❖ తాగునీరు కలుషితమై అనారోగ్యం బారిన పడితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

❖ ఇంజినీరింగ్ విభాగం అధికారులు స్పందించి కాలనీలో తవ్విన గుంతలు పూడ్చించాలని, కాలువల్లో ఉన్న పైపులు మార్పించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రధాన వీధిలో పైపులైన్ పనులు చేసి రోడ్డుపై వదిలేసిన మట్టి కుప్పలు

విద్యారంగానికి ప్రాధాన్యం రాష్ట్రాభివృద్ధికి దోహదం

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యమిస్తూ తీసుకుంటున్న నిర్ణయాలు రాష్ట్రాభివృద్ధికి దోహదపడతాయని జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ఛైర్మన్ వడ్లమూడి హరిబాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.1,200 కోట్లు విడుదల చేయడం విద్యార్థుల భవిష్యత్తుకు గొప్ప ఊరట కలిగిస్తుందన్నారు. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న వేలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఎంతో ఉపశమనం కలిగించిందన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం కట్టుబడి పని చేస్తున్న మంత్రి లోకేశ్‌కు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

సచివాలయం వద్ద కట్టుదిట్టంగా భద్రత

గుంటూరు నేరవార్తలు: వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో బుధవారం నుంచి ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ వకుల్ జిందాల్ బందోబస్తు పర్యవేక్షించారు. ఏఎస్పీలు రవికుమార్, హనుమంతు, ఈశ్వరరావు, డీఎస్పీలు మురళీకృష్ణ, శ్రీనివాసులు, సీఐలు బందోబస్తులో పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్

పేర్లు నమోదు చేసుకుంటున్న హజ్ యాత్రికులు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: హజ్‌కు వెళ్లనున్న యాత్రికులకు జీజీహెచ్‌లో బుధవారం మెడికల్ స్క్రీనింగ్ చేసి వ్యాక్సినేషన్ వేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ రమణ ఆధ్వర్యంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ శ్రావణబాబు పర్యవేక్షణలో పరీక్షలు చేశారు. తొలిరోజు 145 మందికి వ్యాక్సినేషన్ వేశారు. తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్, రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ హసన్ బాషా తదితరులు పాల్గొన్నారు. గురువారం కూడా వ్యాక్సినేషన్ వేస్తామని డాక్టర్ శ్రావణబాబు తెలిపారు.

17, 24 తేదీల్లో చెస్, సైక్లింగ్ పోటీలు

గుంటూరు క్రీడలు: జిల్లాలో 31 క్రీడాంశాల్లో శాప్ లీగ్ పోటీలు నిర్వహించనున్నామని, తొలుత ఈనెల 17, 24 తేదీల్లో జిల్లా స్థాయి చెస్, సైక్లింగ్ పోటీలు జరుగుతాయని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి అఫ్రోజ్‌ఖాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు బీఆర్ స్టేడియంలో 17న జిల్లా స్థాయి చెస్ పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీలు అండర్-13, 15, 17, 19 కేటగిరీల్లో బాలబాలికల విభాగాల్లో నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 24న జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలు అండర్-18 కేటగిరీలో పురుషులు, మహిళలకు వేర్వేరుగా నిర్వహిస్తామని తెలిపారు. పేర్లు నమోదు చేసుకున్న క్రీడాకారులు మాత్రమే అర్హులన్నారు. వివరాలకు 94934 47566, 63011 77119 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఓబీసీ మోర్చా పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జిగా శేషగిరిరావు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా భాజపాలో క్రియాశీలకంగా పనిచేసిన మోతే వెంకటశేషగిరిరావు ఓబీసీ మోర్చా పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జిగా నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ అధిష్ఠానం నుంచి ఉత్తర్వులు అందాయని బుధవారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. 13 సంవత్సరాలు పార్టీలో వివిధ కీలక బాధ్యతలు నిర్వహించానని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్, గుంటూరు జిల్లా భాజపా అధ్యక్షుడు తిరుపతిరావు, పార్టీ నేతలకు ధన్యవాదాలు తెలిపారు.

హెచ్‌డీడీ ట్రస్ట్ రాష్ట్ర సమన్వయకర్తగా కృష్ణంరాజు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ రాష్ట్ర సమన్వయకర్త(సోషల్ ప్రాజెక్ట్ విభాగం)గా డాక్టర్ కాకుల కృష్ణంరాజు నియమితులయ్యారు. ఈమేరకు హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ ఛైర్మన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి దాసరి శ్రీనివాస్ నుంచి ఆయన నియామక పత్రం అందుకున్నారు. రాష్ట్రంలో దేవాలయాల పరిరక్షణకు చేపట్టిన పలు కార్యక్రమాల్లో కృష్ణంరాజు చురుగ్గా పాల్గొంటున్నారు.

వంతెన చెంత.. ప్రమాదాల చింత..

వీవీపీ రోడ్డులోని వంతెన వద్ద తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రహదారిని విస్తరించిన సమయంలో వంతెనను పూర్తి స్థాయిలో నిర్మించలేదు. ఈ రోడ్డు గుంతలమయం కావడంతో ఇటీవల మరమ్మతులు చేపట్టారు. రహదారిని డ్రెయిన్ టు డ్రెయిన్ విస్తరించి కొత్తగా తారు రోడ్డు వేశారు. రహదారి వెడల్పుగా ఉన్నా.. బ్రిడ్జి వద్ద కుచించుకుపోయింది. రెండు అడుగుల మేర బ్రిడ్జికి, రోడ్డుకు ఖాళీ ఉంది. ఇక్కడ ఎలాంటి ప్రమాద సూచికలు ఏర్పాటు చేయలేదు. రాత్రి వేళల్లో వాహనచోదకులు రహదారి వెడల్పు ఉందని భావించి వేగంగా వస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. పెను ప్రమాదాలు సంభవించకముందే వంతెన వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, గుంటూరు నగరం**

పీకలవాగులో వ్యర్థాల మేటలు

కంకరగుంట మసీదు లైన్ నుంచి ఏటీ అగ్రహారం మెయిన్ రోడ్డుకు వెళ్లే దారిలో పీకల వాగు ప్లాస్టిక్ డబ్బాలు, చెత్త, వ్యర్థాలతో నిండిపోయింది. వాగులో రోజులుగా పూడిక సక్రమంగా తీయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని, దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పీకలవాగులో చెత్తను వెంటనే తొలగించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం**

భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలి

ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ఫాదర్ జ్యోతి రాజు

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని స్టెమ్ స్కూల్ కరస్పాండెంట్, ప్రిన్సిపల్ ఫాదర్ జ్యోతి రాజు పేర్కొన్నారు. సరూర్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 5వ ఇంటర్నేషనల్ ఓపెన్ టు ఆల్ స్టైల్స్ తైక్వాండో ఛాంపియన్ షిప్-2026లో స్టెమ్ స్కూల్ విద్యార్థులు పలు పతకాలు సాధించారు. ఈ పోటీలను న్యూ డ్రాగన్ ఫైటర్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విజేతలను ఫాదర్ జ్యోతిరాజు, వైస్ ప్రిన్సిపల్ అనుపమ, కోచ్‌లు కాశి, సాయి బుధవారం అభినందించారు.

వ్యభిచారం నిర్వహిస్తున్న రెసిడెన్సీపై పోలీసుల దాడి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: వ్యభిచారం నిర్వహిస్తున్న ఓ రెసిడెన్సీపై పోలీసులు దాడి చేశారు. బ్రాడీపేట రెండో లైను పదో అడ్డరోడ్డులోని ఓ రెసిడెన్సీలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో పాటు ఎస్సై నరసింహారావు లాడ్జిపై దాడి చేశారు. ఎనిమిది మంది పురుషులు, ఏడుగురు మహిళలు పట్టుబడ్డారు. 17 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

జల్సాలకు అలవాటు పడి.. దొంగలుగా మారి..

రూ.4 లక్షల విలువైన ద్విచక్ర వాహనాలు స్వాధీనం

మాట్లాడుతున్న సీఐ సుబ్బారావు

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం, గుంటూరు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న ముఠాను మార్కాపురం జిల్లా, మార్కాపురం పట్టణ పోలీసులు అడ్డుకట్ట వేశారు. బుధవారం స్థానిక సీఐ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మార్కాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బారావు తెలిపిన వివరాల మేరకు మార్కాపురం పట్టణంలోని విజయ సినిమా థియేటర్ ప్రాంతానికి చెందిన సయ్యద్ మజీద్ అలియాస్ ఆషిక్, దూదేకుల మొహిద్దీన్‌షా, గుంటూరు నగరంలోని నల్లచెరువు వీధికి చెందిన పులి ఆంజిరెడ్డిలు పాత నిందితులు. వీరు గతంలో ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో ద్విచక్ర వాహనాలు చోరీ చేసి అమ్మగా వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తున్నారు.

జైల్లో పరిచయం స్నేహంగా మారింది..

ఒకే జైల్లో గడుపుతున్న సమయంలో ముగ్గురి మధ్య పరిచయం ఏర్పడింది. జైలు నుంచి బెయిల్‌పై వచ్చిన తర్వాత కూడా వాహనాలు చోరీ చేయసాగారు. బుధవారం ఉదయం మండలంలోని కోమటికుంట వై- జంక్షన్ వద్ద మార్కాపురం గ్రామీణ ఎస్సై వి.వేమన వాహనాలు తనిఖీలు చేస్తున్న సమయంలో ఉదయం 9:30 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై ఈ ముగ్గురు కుంటవైపు రాసాగారు. పోలీసులను చూసి పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. విచారించగా గుంటూరులో రెండు ద్విచక్ర వాహనాలు, పల్నాడు జిల్లా వినుకొండలో ఒక ద్విచక్ర వాహనం, మార్కాపురం మండలంలోని రాయవరం గ్రామంలో ఒక ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసినట్లు అంగీకరించినట్లు తెలిపారు. కోమటికుంట వద్ద ఉన్న ముళ్ల పొదల్లో వాహనాలను ఉంచి ఒక్కొక్కటిగా విక్రయిస్తున్నట్లు చెప్పారు. నిందితుల నుంచి మూడు బులెట్‌లు, మరొక పల్సర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసును ఛేదించినందుకు జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీ హర్షవర్ధన్ రాజు, డీఎస్పీ నాగరాజు, సీఐ, ఎస్సైలను ప్రత్యేకంగా అభినందించినట్లు చెప్పారు. అంతే కాకుండా కేసులో క్రియాశీలకంగా వ్యవహరించిన కానిస్టేబుళ్లు గిరి, వెంకటేశ్వర్లును అధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

ప్లాన్ అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు

భవనం కొలతలు పరిశీలిస్తున్న కమిషనర్ మయూర్ అశోక్

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలో జీఎంసీ అనుమతి పొందిన ప్లాన్ ప్రకారమే నిర్మాణాలు జరగాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ మయూర్ అశోక్ స్పష్టం చేశారు. బుధవారం ఇన్నర్ రింగ్ రోడ్డు, అమరావతిరోడ్డు, ప్రశాంతినగర్, నెహ్రూనగర్ ప్రాంతాల్లో భవన నిర్మాణాలు పరిశీలించారు. ఇన్నర్ రింగురోడ్డులో ప్లానుకు అనుగుణంగా భవన నిర్మాణం లేకపోవడంపై టీపీబీవో రామకృష్ణకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని సీపీని ఆదేశించారు. కమిషనర్ మాట్లాడుతూ వార్డు సచివాలయాల వారీగా ప్లానింగ్ కార్యదర్శులు, అధికారులు నిర్దేశిత ప్లాన్ ప్రకారం నిర్మాణాలు జరిగేలా పర్యవేక్షణ చేయాలన్నారు. బహుళ అంతస్తుల భవనాల సెట్‌బ్యాక్‌లు, ర్యాంప్‌లు, గ్రీనరీకి కేటాయింపు, డ్రైనేజీ కనెక్షన్ వంటి నిబంధనలు కచ్చితంగా పాటిస్తేనే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేస్తామన్నారు. ప్లానింగ్ కార్యదర్శులు ఎల్ఆర్ఎస్, బీపీఎస్‌ల దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలన్నారు. నెహ్రూనగర్ రైల్వేగేటు వద్ద డ్రెయినేజీ నిర్మాణానికి మార్కింగ్ చేసిన ప్రాంతాల్లో నిరాశ్రయులయ్యేవారిలో అర్హులకు ప్రభుత్వ లేఔట్లలో స్థలాలు కేటాయించాలని సీపీని ఆదేశించారు. పర్యటనలో సీపీ రాంబాబు, డీసీపీ సూరజ్‌కుమార్, ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు పాల్గొన్నారు.

☛ కమిషనర్ మయూర్ అశోక్ అమరావతిరోడ్డులోని అన్నక్యాంటీన్ పరిశీలించారు.

సార్వత్రిక సమ్మెకు బ్యాంకు ఉద్యోగుల మద్దతు

జీటీ రోడ్డులోని బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం వద్ద ఉద్యోగుల నిరసన

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: కేంద్ర కార్మిక సంఘాల పిలుపుతో గురువారం చేపట్టనున్న సార్వత్రిక సమ్మెకు బ్యాంకు ఉద్యోగులు మద్దతిచ్చారు. జీటీరోడ్డులోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం వద్ద బుధవారం సాయంత్రం నిరసన ప్రదర్శన చేపట్టారు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సమ్మెకు సంఘీభావం ప్రకటించారు. జిల్లాలోని బ్యాంకులు గురువారం సమ్మెలో పాల్గొంటున్నాయని ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కార్మిక వ్యతిరేక నిర్ణయాలు వెనక్కు తీసుకోవాలని నినదించారు. 29 కార్మిక చట్టాలను, 4 లేబర్ కోడ్‌లను.. కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా, కార్మికులకు వ్యతిరేకంగా మార్చడాన్ని తీవ్రస్థాయిలో విమర్శించారు. నిరసనలో నాయకులు రవిచంద్రారెడ్డి, సాంబశివరావు, జయకుమార్, రంగసాయి, పావని, మురళీ, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

జేకేసీ విద్యార్థులకు ఉద్యోగాలు

ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్ తదితరులు

ఎస్వీఎన్‌కాలనీ, న్యూస్‌టుడే: ఐక్యూబీసీ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో జేకేసీ కళాశాలకు చెందిన 37 మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందారని ప్రిన్సిపల్ పి.గోపీచంద్ తెలిపారు. రాత పరీక్ష, బృంద చర్చ, మౌఖిక పరీక్ష పద్ధతిలో జరిగిన ఎంపికల్లో విజయాలు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల పాలకమండలి అధ్యక్షుడు రాయపాటి శ్రీనివాస్, కార్యదర్శి జాగర్లమూడి మురళీమోహన్, వైస్ ప్రిన్సిపల్ కె.సాంబశివరావు, ప్రాంగణ ఎంపికల అధికారి డాక్టర్ వై.సురేష్‌బాబు అభినందించారు.

విశ్రాంత ఉద్యోగిని బెదిరించి.. రూ.66 లక్షలు దోచేసి

విశాఖపట్నం(ఎండాడ), న్యూస్‌టుడే: డిజిటల్ అరెస్టు పేరుతో ఓ విశ్రాంత ఉద్యోగిని భయపెట్టి రూ.66 లక్షలు కాజేసిన ఘటనపై విశాఖ సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని బుధవారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. విశాఖ నగరానికి చెందిన విశ్రాంత ఉద్యోగికి కొద్ది రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి డిపాజిట్ ప్రొటెక్షన్ బోర్డు ముంబయి అధ్యక్షుడిగా పరిచయం చేసుకున్నాడు. ముంబయి కొలాబా పోలీస్ స్టేషన్‌లో నీపై మనీ లాండరింగ్ కేసు నమోదైందని చెప్పి ఫోన్ కాల్‌ను మహారాష్ట్ర పోలీస్ డీఐజీ వికాస్ శర్మ మాట్లాడతారని మరో వ్యక్తికి బదిలీ చేశాడు. కెనరా బ్యాంకులో ఖాతా తెరిచి, ఆ ఖాతా ద్వారా కోట్లాది రూపాయలు మనీ లాండరింగ్ జరిగిందని, దీనిపై సుప్రీంకోర్టు అరెస్టు వారెంట్ జారీ చేసిందని వికాస్ శర్మ బాధితుడిని బెదిరించాడు. దర్యాప్తులో భాగంగా ఎవరితో మాట్లాడొద్దని, ఒంటరిగా ఉంటూ నిరంతరం వీడియో కాల్‌లో అందుబాటులో ఉండాలని భయపెట్టారు. ఐదు రోజుల పాటు మానసిక ఒత్తిడికి గురిచేసిన అనంతరం వారి ఖాతాకు రూ.66 లక్షలు బదిలీ చేయించుకున్నారు. తాను మోసపోయినట్లు తెలుసుకున్న విశ్రాంత ఉద్యోగి విశాఖ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేసిన పోలీసులు గుంటూరుకు చెందిన చాగంటి గౌతమ్ (40)ను నిందితుడిగా గుర్తించారు. అనంతరం అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

సేవకు ప్రతిరూపం మేరీ గ్లోరీ

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: సెయింట్ జోసఫ్ హాస్పిటల్‌లో 36 ఏళ్ల వేలాది మంది రోగులకు చికిత్స అందించి.. సేవకు ప్రతిరూపంగా డాక్టర్ మేరీ గ్లోరీ నిలిచారని వక్తలు కొనియాడారు. దివంగత డాక్టర్ మేరీ గ్లోరీని సెయింట్‌గా గుర్తించే క్రమంలో రెండో దశ అయిన పూజ్యనీయ స్థానాన్ని పొందిన సందర్భంగా సెయింట్ జోసఫ్ పాఠశాలలో బుధవారం రాత్రి ఉత్సవం నిర్వహించారు. డాక్టర్ మేరీ గ్లోరీ ఆస్ట్రేలియా నుంచి గుంటూరు వచ్చి 1920లో సెయింట్ జోసఫ్ హాస్పిటల్‌లో చేరి సేవలు అందించారన్నారు. అత్యున్నత ప్రమాణాలతో కూడిన వైద్య సేవలతో పాటు భగవంతుడిని నిత్యం ఆరాధించే మేరీ గ్లోరీ విజ్ఞాపన, ప్రార్థనల ద్వారా స్వస్థత పొందిన పలువురు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం గ్లోరి జీవిత చరిత్రకు సంబంధించిన డాక్యుమెంటరీని ప్రదర్శించారు. సిస్టర్ ఉడుమల విజయమేరీ తదితరులు పాల్గొన్నారు.

నమ్మించి దగా.. రూ.లక్షల్లో వసూళ్లు

మహిళపై చర్యలు తీసుకోవాలని బాధితుల వేడుకోలు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: మాయమాటలు చెప్పి నమ్మించి రూ.లక్షలు దోచేసిన మహిళపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని బాధితులు కనుమూరి కృష్ణవేణి, రాయిడి శ్రీలక్ష్మి కోరారు. గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లో బుధవారం వారు మీడియాతో మాట్లాడారు. కృష్ణవేణి మాట్లాడుతూ వాసిరెడ్డి ప్రసన్న రాధిక.. తనకు ప్రభుత్వంలో పెద్దలు బాగా తెలుసని నమ్మించిందన్నారు. ఈ విధంగా 750 గ్రాముల బంగారం, రూ.23 లక్షల నగదు, నాలుగు కేజీల వెండి తీసుకుందన్నారు. ఉండవల్లిలో 80 సెంట్ల స్థలం ఉందని, బిల్డర్‌కు డెవలప్‌మెంట్‌కు ఇచ్చానని, అందుకు కొంత సొమ్ము అవసరమని చెప్పి నమ్మబలికించి దగా చేసిందన్నారు. ఈవిధంగా మొత్తం 15 మంది వరకు బాధితులున్నారని వివరించారు. పోలీసులు న్యాయం చేయాలని కోరారు. రాయిడి శ్రీలక్ష్మి మాట్లాడుతూ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ పదవి వస్తుందని ప్రసన్న రాధిక నమ్మబలికారన్నారు. రూ.50 లక్షల వరకు తీసుకున్నారన్నారు. పలువురి వద్ద అందినంత వసూళ్లు చేశారన్నారు. ఆమెపై పలు చెక్ బౌన్స్ కేసులు నమోదయ్యాయన్నారు. పోలీసులు జోక్యం చేసుకుని విచారిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని, న్యాయం చేయాలని కోరారు.

మధుర గాయకుడు ఘంటసాల

భారత్‌పేట సేవాసదన్ కార్యాలయంలో..

నాజ్ కూడలిలో విగ్రహం దగ్గర నివాళులర్పిస్తూ..

గోరంట్ల, న్యూస్‌టుడే: అమరావతిరోడ్డు భారత్‌పేటలోని సేవాసదన్ కార్యాలయంలో గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి సభ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సేవాసదన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మిరియాల గోపీకుమార్ ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సినీరంగ సంగీతానికి వన్నె తెచ్చిన మధుర గాయకుడు ఘంటసాల అని కొనియాడారు. మిరియాల ప్రసాదరావు, మద్దు వెంకటస్వామి, బి.రాజశేఖర్, డి.బి.బాలస్వామి, కొల్లూరు శివప్రసాద్ పాల్గొన్నారు.

గుంటూరు సాంస్కృతికం: ఘంటసాల పాటలు ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. నగరంలోని నాజ్ కూడలిలో ఘంటసాల వర్ధంతిని కళాదర్బార్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు పొత్తూరి రంగారావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. అమర గాయకుడి కాంస్య విగ్రహానికి సర్వజనాసుపత్రి సూపరింటెండెంట్ ఎస్ఎస్వీ రమణ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాదర్బార్ సభ్యులు బిజినేపల్లి మోహనరావు, జమదగ్ని, అబ్దుల్ ఖాదర్, బాబూరావు, హనుమాన్ సింగ్, సత్తార్, వీరశంకరరెడ్డి, వేణు భాను, ఎస్ఎం సుభాని, నరసింహమూర్తి పాల్గొన్నారు.

1న ఎన్టీఆర్ స్టేడియం పాలకవర్గం ఎన్నిక

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: జీఎంసీ పరిధిలోని ఎన్టీఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణం, స్విమ్మింగ్ పూల్ సొసైటీ పాలకవర్గం ఎన్నికను మార్చి 1న నిర్వహించనున్నట్లు డీసీ, ఎన్టీఆర్ స్టేడియం ఎన్నికల నిర్వహణ అధికారి సీహెచ్ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12న అర్హులైన ఓటర్ల జాబితాను స్టేడియంలో ప్రదర్శిస్తామని, 13న నోటిఫికేషన్ జారీ ఉంటుందని తెలిపారు.

82 బస్తాల చౌకబియ్యం జప్తు

గుంటూరు నేరవార్తలు: చౌకబియ్యం అక్రమంగా నిల్వ చేశారన్న సమాచారంతో విజిలెన్స్ ఎస్పీ సూర్యశ్రావణ్‌కుమార్ ఆదేశాలతో బుధవారం విజిలెన్స్ అధికారుల బృందం పల్నాడు జిల్లా అచ్చంపేట మండలంలో తనిఖీలు చేసింది. సీతారాంపురం వాగు వద్ద లెల్ల అప్పిరెడ్డి ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 82 బస్తాల్లోని 3,725 కిలోల చౌక బియ్యం జప్తు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు.

వేలం ప్రకటన

In the Court of the Hon'ble IV Addl. Senior Civil Judge: Guntur
E.P.No.40/2023 in Dispute No.05/2021

Between:-
M/s Margadarsi Chitfund Pvt. Ltd. Rep. by its Senior Manager, Market Center, Guntur ... **D.Hr**
And
Mr. Gangineni Ashok Kumar .. **JDr.4**

పై నెంబరు ఇ.పి.లో డిక్రీ హోల్డర్‌కు రావలిసిన బాకీ నిమిత్తం Mr. Gangineni Ashok Kumar, S/o G.Pulla Rao, Jdr-4కి చెందిన ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తి ది. 03-03-2026వ తేదీన పై కోర్టు ఉత్తర్వుల మేరకు వేలం జరిపించుటకు ఉత్తర్వులు పొందియున్నారు. ది.03-03-2026న శ్రీ కోర్టువారి ఎదుట హాజరై వేలపు షరతులకు లోబడి పాల్గొనవచ్చునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

Doc. No.4278/2017, Dated 15-06-2017, SRO:Guntur

Schedule-B for Attachment: In the total extent of 800 sq.yds, undivided, unspecified an extent of 40 sq.yds in which Tejaswi Towers in which Flat No.101, in Ground Floor with Double BedRoom, Flat at 2nd Line Sakuntala Nagar, Inner Ring Road, Guntur. Bounded by: South: Open to Sky, East: common Corridor, West: Open to Sky, North: Open Space in between the above Flat and 102, with in the above Boundaries an extent of 40 sq.yds or 1100 sq.fts Double Bed Room Flat Doors, Door Ways, Furniture and Fixtures, Bath Room, Letrin, Electricity Deposit , Wiring, Common Corridor, Car Parking, Common Borewell, Common Water Connection, Common Stair Cases, common Lift, Common Terrace and all easementary rights.

DHR Value: Rs.25,00,000/-
Ameen Value: Rs.35,00,000/-
Market Value: Rs.25,30,000/-

వేలం తేదీ: 03-03-2026
ఫర్‌దర్ హియరింగ్: 10-03-2026
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

Smt. D.S.K.Kumari, Mr. K.Sreenivas, Mr. K.Seetharamaiah, Advocates for D.Hr
1/5 Brodipet, Guntur.
Cell No's: 9603911172, 9985462688

విద్యుత్తు దీపాల వెలుగుల్లో గుణదల కొండ

ముగిసిన ఉత్సవాలు.. పోటెత్తిన విశ్వాసులు

గుణదల మేరీ మాత ఉత్సవాలు బుధవారం ముగిశాయి. చివరి రోజు భారీగా విశ్వాసులు తరలివచ్చారు. కార్యక్రమంలో భాగంగా దివ్య పూజాబలి ప్రసాదాన్ని చూపుతున్న బిషప్‌లు రాజారావు, షమీంద్ర జయవర్ధన. -గుణదల, న్యూస్‌టుడే

ఈనాడు అమరావతి
కృష్ణా

ఎన్‌హెచ్‌-65కి.. ఒక్కటే డీపీఆర్‌!

❖ హైదరాబాద్‌-విజయవాడ హైవే బెంజ్‌సర్కిల్‌ వరకు విస్తరణ

❖ 18న ఉమ్మడి జిల్లా స్టేక్‌హోల్డర్స్‌ సమావేశంలో స్పష్టతకు అవకాశం

ఈనాడు, అమరావతి

ఎన్‌హెచ్‌-65కి ఏకరూపకత తీసుకొచ్చేందుకు అడుగులు పడుతున్నాయి. హైదరాబాద్‌-విజయవాడ హైవే ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్రంలోని భువనగిరి జిల్లా మల్కాపురం నుంచి విజయవాడ పున్నమిఘాట్‌ వరకు విస్తరణకే డీపీఆర్‌ రూపొందించారు. తాజాగా బెంజ్‌సర్కిల్‌ వరకు విస్తరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటి వరకు పున్నమిఘాట్‌ వరకు ఒక భాగం.. బెంజ్‌సర్కిల్‌ నుంచి మచిలీపట్నం వరకు మరో భాగంగా ఉన్న ఎన్‌హెచ్‌-65 ఇప్పుడు ఒకే రహదారిగా విస్తరించనున్నారు. వేరువేరుగా తయారు చేసిన డీపీఆర్‌లను అనుసంధానం చేసి ఒక్కటిగా రూపొందించనున్నారు. ఫిబ్రవరి 18న విజయవాడలో జరగనున్న భాగస్వాముల (స్టేక్‌ హోల్డర్స్‌) సదస్సులో దీనిపై స్పష్టత రానుంది.

రెండు పైవంతెనల నిర్మాణం..

✪ విజయవాడ నగరంలోని ట్రాఫిక్‌ రద్దీ నేపథ్యంలో రెండు పైవంతెనల నిర్మాణం చేపట్టాలని ప్రజాప్రతినిధులు పట్టుబడుతున్నారు. కనకదుర్గ పై వంతెన నుంచి బెంజ్‌సర్కిల్‌ పైవంతెనకు అనుసంధానం చేస్తూ దాదాపు 5 కి.మీ మేర భారీ పైవంతెన నిర్మించాలని ప్రజాప్రతినిధులు అడుగుతున్నారు. బెంజ్‌సర్కిల్‌ నుంచి గోసాల వరకు ఎన్టీఆర్‌ సర్కిల్‌, ఆటోనగర్‌, కానూరు, తాడిగడప, పెనమలూరు కూడళ్లలో ట్రాఫిక్‌ రద్దీ ఎక్కువగా ఉండడంతో ఆ మధ్యలో ఓ భారీ పై వంతెన నిర్మాణం చేపట్టాలని గతంలో విజయవాడ, మచిలీపట్నంలో జరిగిన భాగస్వాముల సదస్సులో ప్రజాప్రతినిధులు డిమాండ్‌ చేశారు. ఈ రెండు అంశాలపై ప్రతిపాదనలు ఎన్‌హెచ్‌ఏఐ దృష్టికి తీసుకువెళ్లారు.

గతంలో కన్సల్టెన్సీ అభ్యంతరం

✪ బెంజ్‌సర్కిల్‌- గోసాల పరిధిలో వంతెన నిర్మాణానికి మెట్రో ప్రతిపాదనలు అడ్డంకిగా ఉన్నాయని గతంలో కన్సల్టెన్సీ అభ్యంతరం తెలిపింది. ఎన్‌హెచ్‌-65కి మెట్రోకి ముడిపెట్టవద్దని అది పట్టాలెక్కేలోగా ప్రజలకు ఇబ్బందులు పెరుగుతాయని.. డీపీఆర్‌ రివైజ్‌ చేయాలని ప్రజాప్రతినిధులు గట్టిగా చెప్పారు. ఈసారి ఆ ప్రతిపాదనలకు పరిగణనలోకి తీసుకుంటారని తెలుస్తోంది.

తెలంగాణ అధికారుల రాక

✪ హైదరాబాద్‌- విజయవాడ హైవేను తెలంగాణ ఎన్‌హెచ్‌ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. విజయవాడ-మచిలీపట్నం హైవే డీపీఆర్‌ విజయవాడ ఎన్‌హెచ్‌ అధికారుల ఆధ్వర్యంలో జరుగుతోంది. రెండు భాగాలను ఒకే డీపీఆర్‌ ద్వారా చేపట్టాలని అధికారులు, ప్రజాప్రతినిధులు భావిస్తున్నారు. దీంతో స్టేక్‌హోల్డర్ల సమావేశానికి తెలంగాణలో ఆ మార్గం పర్యవేక్షిస్తున్న ఎన్‌హెచ్‌ పీడీ, ఆర్వో కూడా సమావేశానికి హాజరుకానున్నారు. వీరితో పాటు జిల్లా ఎన్‌హెచ్‌ అధికారులు, ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, అధికారులు పాల్గొంటారు.

తవ్వింది లెక్కేసి.. కాసులు పోగేసి..

☛ కేవలం ఎన్‌వోసీలు తీసుకుని మట్టి దందా

☛ పరిశీలనలకే పరిమితమవుతున్న అధికారులు

ఈనాడు, అమరావతి

గత వైకాపా ప్రభుత్వంలో కొత్తూరు తాడేపల్లి పరిధిలో లక్షల క్యూబిక్‌ మీటర్ల మట్టిని అక్రమంగా తవ్వేశారు. వీరందరినీ గుర్తించి రూ.వందల కోట్ల డిమాండ్‌ నోటీసులను కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే అధికారులు ఇచ్చారు. కానీ ఒక్క రూపాయి వెనక్కి కట్టించింది లేదు. కేవలం నోటీసులు ఇచ్చి అక్రమార్కులతో కొందరు అధికారులు తెరవెనుక వ్యవహారం నడిపించారనే ఆరోపణలున్నాయి. ప్రస్తుతం మరో అడుగు ముందుకేసి గతంలో ఎక్కడైతే అక్రమాలు జరిగాయో.. మళ్లీ అక్కడే విచ్చలవిడిగా తవ్వేసి తరలించుకుపోతున్నారు. దీనిపై జిల్లా యంత్రాంగానికి గ్రామస్థులు ఫిర్యాదు చేస్తుంటే.. రావడం పరిశీలించి వెళ్లడం.. తప్ప చర్యలు శూన్యం. కొత్తూరు రెవెన్యూ పరిధిలోని ఆర్‌ఎస్‌ నంబరు.39లో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా.. కేవలం నిరభ్యంతర పత్రాలు(ఎన్‌వోసీ)లను చూపిస్తూ.. వాటినే మైనింగ్‌ అనుమతులుగా నమ్మిస్తూ.. విచ్చలవిడిగా మట్టి తవ్వకాలు చేస్తున్నారు. జిల్లా అధికార యంత్రాంగానికి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. రెండు రోజుల కిందట కూడా స్పందనలో తెదేపా నేత, సామాజిక కార్యకర్త మెండెం జమలయ్య.. ఈ తవ్వకాలపై ఫిర్యాదు చేశారు. రోజుకు కనీసం 500 లారీలకు పైగానే తవ్వి తీసుకెళ్లిపోతున్నారంటూ ఆధారాలతో సహా సమర్పించారు.

ఆర్‌ఎస్‌ 39లో భారీగా తవ్వి లారీల్లో తరలింపు..

తాజాగా మైనింగ్‌ అధికారులొచ్చి..

మైనింగ్‌ ఆర్‌ఐ శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో సిబ్బంది వచ్చి తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాన్ని బుధవారం పరిశీలించారు. ఎంత లోతుగా తవ్వకాలు జరిపారు, ఎన్ని క్యూబిక్‌ మీటర్ల మట్టిని తరలించుకుపోయారనే కొలతలు వేశారు. గతంలోనూ ఫిర్యాదులు వెల్లువెత్తిన సమయంలో మైనింగ్‌ సిబ్బంది వచ్చి ఇలాగే లెక్కలు వేసి వెళ్లిపోయారు. కానీ తవ్వకాలను అడ్డుకున్నది లేదు.

నెల కిందట ఇలాగే హడావుడి..

జనవరి 19న ఇలాగే తాడేపల్లి రెవెన్యూ పరిధిలోని ఆర్‌ఎస్‌ నంబరు 261/1ఎ ప్రవీణ్‌ అనే వ్యక్తి పేరుతో 1.32 ఎకరాల భూమికి రెవెన్యూ, అటవీశాఖల నుంచి ఎన్‌వోసీ తీసుకున్నారు. ఎన్‌వోసీలను మైనింగ్‌కు అనుమతుల కోసం పెట్టాలి. అనుమతి వస్తేనే తవ్వాలి. కానీ ఇవేవీ చేయకుండా కేవలం ఎన్‌వోసీలను చూపిస్తూ తవ్వేయడం ఆరంభించారు. దీనిపైనా స్థానికులు ఫిర్యాదు చేయడంతో అధికారులు వచ్చి హడావుడి చేసి ఆరు లారీలు, రెండు జేసీబీలను సీజ్‌ చేశారు. ఆ తర్వాత ఒక్కో వాహనానికి రూ.8వేలు కట్టించుకుని వదిలేశారు. ఒక లారీ లోడ్‌ రూ.10వేలకు అమ్ముతుంటే ఈ జరిమానాలు ఏమాత్రం? అందుకే అక్రమ తవ్వకాలు ఆగడం లేదు.

వదిలేస్తే ఇలా.. వదిలిస్తే మురిసేలా..

ఈ చిత్రంలో పచ్చగా కనిపిస్తున్నది పచ్చని మైదానం కాదు. కొండపల్లిలో పూర్తిగా నిర్వహణ కరవై పిచ్చిమొక్కలు, నాచు, గుర్రపుడెక్క పెరిగిపోయిన గజరాజు చెరువు. ఇబ్రహీంపట్నం నుంచి కొండపల్లికి వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న ఈ చెరువును బాగు చేస్తే ఆహ్లాదాన్ని పంచుతుంది. కొండపల్లి బొమ్మలు చూసేందుకు, కొనేందుకు దేశవిదేశాల నుంచి పర్యాటకులు వచ్చే ఈ ప్రాంతంలో చెరువును అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. -ఈనాడు, అమరావతి

నిజాయతీ కలిగిన పార్టీ తెలుగుదేశం

క్రమశిక్షణకు మారు పేరు గద్దె కుటుంబం ✪ ఎన్టీఆర్‌ జిల్లా అధ్యక్షురాలిగా అనురాధ ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రులు

అధ్యక్షురాలు, కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న నెట్టెం రఘురామ్‌

పటమట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఎవరిని అడిగినా క్రమశిక్షణకు మారుపేరు గద్దె కుటుంబం అని చెబుతారని, తెదేపా బలోపేతానికి కృషి చేసిన వారికి సరైన గుర్తింపు లభిస్తుందనడానికి గద్దె అనురాధను తెదేపా ఎన్టీఆర్‌ జిల్లా అధ్యక్షురాలిగా నియమించడమే నిదర్శనమని మంత్రులు కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి, ఎంపీ శివనాథ్‌ అన్నారు. నగరంలోని ఎన్‌ఏసీ కల్యాణ మండపంలో బుధవారం తెదేపా ఎన్టీఆర్‌ జిల్లా అధ్యక్షురాలిగా గద్దె అనురాధ, కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం వైభవంగా నిర్వహించారు. తొలుత ఆటోనగర్‌లోని తన నివాసం నుంచి అనురాధ.. నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్టీఆర్‌ సర్కిల్‌కు ప్రదర్శనగా వచ్చారు. అక్కడ ఎన్టీఆర్‌ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి ఎన్‌ఏసీ కల్యాణ మండపానికి ప్రదర్శనగా చేరుకున్నారు. అనంతరం తెదేపా ఎన్టీఆర్‌ జిల్లా మాజీ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్‌ నుంచి అనురాధ అధ్యక్షురాలిగా, ప్రధాన కార్యదర్శిగా చెన్నుబోయిన చిట్టిబాబు, కార్యవర్గ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. మంత్రి రవీంద్ర మాట్లాడుతూ.. నిజాయతీ, క్రమశిక్షణ ఉన్న పార్టీ తెదేపా అని, గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కమిటీలున్న ఏకైక పార్టీ కూడా తెదేపానేనని పేర్కొన్నారు. మంత్రి పార్థసారథి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి నాయకులు, కార్యకర్తలు తీసుకెళ్లాలని సూచించారు. ఎంపీ శివనాథ్‌ మాట్లాడుతూ.. తెదేపా పట్ల గద్దె రామ్మోహన్‌ కుటుంబానికి అంతులేని అభిమానం ఉందని అన్నారు. 11 సీట్లను నిలబెట్టుకోవడానికి వైకాపా ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వస్తారని అన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌ మాట్లాడుతూ.. జిల్లా అధ్యక్ష పదవి నిర్వహణ చాలా కష్టమని, గతంలో తాను అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఇబ్బందులు పడ్డానని గుర్తు చేశారు. అనురాధకు సహనం ఎక్కువని, ఆమె పార్టీని ముందుకు తీసుకెళ్తుందని అన్నారు. తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, వసంత కృష్ణప్రసాద్‌, శ్రీరాంతాతయ్య, కొలికపూడి శ్రీనివాసరావు, తెదేపా కృష్ణా జిల్లా అధ్యక్షుడు వీరంకి గురుమూర్తి, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌ ఛైర్మన్‌ కొమ్మారెడ్డి పట్టాభిరామ్‌, నాయకులు నన్నపనేని రాజకుమారి, నాగుల్‌మీరా, పరుచూరి అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారథి

రైతుబజారుల్లో.. దళారుల పెత్తనం

★ ఓ వ్యక్తికి అనుకూలంగా లేఖ ఇచ్చిన ప్రజాప్రతినిధి

★ పలుచోట్ల మధ్యవర్తులకు అధికారుల వత్తాసు

రైతులు పండించిన కూరగాయలను నేరుగా అమ్ముకునేందుకు వీలుగా ప్రభుత్వం తెచ్చిన రైతుబజార్ల వ్యవస్థలో దళారుల పెత్తనం పెరిగిపోయింది. కొందరు ప్రజాప్రతినిధుల జోక్యంతో రైతుబజార్లు అక్రమార్కులకు అడ్డాగా మారుతున్నాయి. తాము చెప్పిన వారి నుంచే కూరగాయలు దించుకోవాలని పలువురు నేతలు, అధికారులు చెబుతుండడంతో దళారులు రెచ్చిపోతున్నారు.

పేదవాడని సిఫారసు లేఖ.. తనకు తెలిసిన వ్యక్తికి పేదరికంతో ఇల్లు గడవడమే కష్టంగా ఉందని, అతనికి వాహనం ఉందని, గన్నవరం రైతుబజారులో కూరగాయల సరఫరాకు అవకాశమివ్వాలని జిల్లా మార్కెటింగ్‌ శాఖాధికారికి గతేడాది డిసెంబరు 4న స్థానిక ప్రజాప్రతినిధి సిఫారసు లేఖ పంపారు. కూరగాయల సరఫరా పేరుతో ఆ వ్యక్తి దళారి అవతారమెత్తి తన వద్దే కొనాలని దుకాణాదారులను ఒత్తిడి చేశారు. ఇతను ఓ దుకాణదారుడికి ఫోన్‌ చేసి.. తన నుంచి మాత్రమే కూరగాయలు తీసుకోవాలని ఒత్తిడి చేస్తున్న ఆడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది.

దళారి: మేము రైతుబజారు నుంచి ఫోన్‌ చేస్తున్నాం. మీరు టమాటా దుకాణం కోసం సరకు చెప్పలేదేంటి. రేపు దుకాణం పెడుతున్నారా..? టమాటా ఎన్నికావాలి.

దుకాణాదారుడు: మాకు తోట ఉంది. అందులోవే అమ్ముతాం.

దళారి: తోటలోవి తేకూడదు. నాగబాబు వాళ్లు వేస్తారు. ఎస్టేట్‌ అధికారిని కనుక్కోలేదా..? కాదని తెచ్చుకున్నా మురావాళ్లు దించరు.

దుకాణాదారుడు: మేము ఎప్పటి నుంచో తోటలోవే అమ్ముతున్నాం. అమ్మకూడదని అంటారేంటి. ఈవోతో మాట్లాడతాం.

దళారి: వినకుంటే రేపు సరకు దిగదు.

తార్కాణాలివిగో.. ఇటీవల గుడివాడ రైతుబజారులో టమాటా, క్యారెట్‌, బీట్‌రూట్‌, క్యాప్సికం లాంటి కూరగాయలు విజయవాడ వ్యక్తి నుంచే కొనుగోలు చేయాలని అధికారులు ఒత్తిడి చేయడం దళారుల వర్గాల మధ్య తన్నులాటకు దారితీసింది. వివాదం రాణాకు చేరడంతో సర్దిచెప్పారు. విజయవాడ వ్యక్తితో కూరగాయల సరఫరాకు ఒప్పందం కుదిర్చినందుకు రూ.7లక్షలు మామూళ్లు తీసుకున్నారని సమాచారం. ఇక్కడే ఓ వైకాపా సానుభూతిపరుడు రూ.లక్షలు వడ్డీలకు తిప్పుతూ పెత్తనం చేస్తున్నాడు.

● చల్లపల్లిలో టమాటాలు తాము చెప్పిన వారి వద్దే దించుకోవాలని కొందరు అధికారులు దుకాణదారులను ఒత్తిడి చేయడం విమర్శలకు తావిచ్చింది.

● దీనిపై కృష్ణా జిల్లా మార్కెటింగ్‌ ఏడీ నిత్యానందంను వివరణ కోరగా.. దుకాణదారులు వారి ఇష్టం వచ్చిన చోట కొనుగోలు చేయవచ్చని, ఫలానా చోటే కొనమని అధికారులు ఒత్తిడి చేస్తే చర్యలు తప్పవన్నారు.

- ఈనాడు డిజిటల్, మచిలీపట్నం

పేద విద్యార్థులకు ఉచిత కార్పొరేట్‌ విద్య

ఒకటో తరగతిలో ప్రవేశాలకు అవకాశం

విజయవాడ సిటీ, ఉయ్యూరు గ్రామీణం న్యూస్‌టుడే

విద్యా హక్కు చట్టం - 2009 ప్రకారం పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులు ఉచితంగా కార్పొరేట్‌ విద్య పొందవచ్చు. విద్యాసంస్థల్లో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు కేటాయిస్తారు. 2026-27 విద్యా సంవత్సరానికిగాను ఒకటో తరగతిలో ప్రవేశాలకు ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

అర్హులు ఎవరు?.. దరఖాస్తు ఎలా?

★ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.44 లక్షలు ఉన్న తల్లిదండ్రుల పిల్లలు అర్హులు. ★ స్టేట్‌ సిలబస్‌ పాఠశాలలో చేరే విద్యార్థి 2 జూన్‌ 2020 నుంచి 31 మే 2021 మధ్య, సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ సిలబస్‌ పాఠశాలలో చేరే విద్యార్థి 2 ఏప్రిల్‌ 2020 నుంచి 31 మార్చి 2021 మధ్య జన్మించాలి. ఐదేళ్లు నిండాలి. ★ www.cse.ap.gov.in వెబ్‌సైట్‌లో లేదా స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయాలు, ఎంఈవో కార్యాలయం, మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. ★ ఓటరు గుర్తింపు కార్డు, తెల్ల రేషన్‌ కార్డు, పాస్‌పోర్టు, ఉపాధి హామీ జాబ్‌కార్డ్‌, డ్రైవింగ్‌ లైసెన్సు, విద్యుత్తు బిల్లు, గ్యాస్‌ కనెక్షన్‌ పత్రాన్ని చిరునామా ధ్రువీకరణకు పరిగణనలోకి తీసుకుంటారు. ★ ఈ నెల 20 నుంచి మార్చి 10 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. మార్చి 25న లాటరీ తీసి విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఏప్రిల్‌ 13 నుంచి 23 వరకు ప్రవేశాల నిర్ధారణ ఉంటుంది.

జత చేయాల్సిన పత్రాలు

★ విద్యార్థి జనన, కుల, వార్షిక ఆదాయం ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి. ★ వివరాల కోసం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు 1800-4258-599 టోల్‌ఫ్రీ నంబరులో సంప్రదించవచ్చు ★ ఎన్టీఆర్‌ జిల్లాలో 512, కృష్ణా జిల్లాలో 282 కార్పొరేట్‌, ప్రైవేట్‌, అన్‌ ఎయిడెడ్‌ పాఠశాలలున్నాయి. గతేడాది ఎన్టీఆర్‌ జిల్లాలో వెయ్యి, కృష్ణా జిల్లాలో 505 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. ★ అర్హులు ఉచిత కార్పొరేట్‌ విద్య పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సమగ్ర శిక్షా ఎన్టీఆర్‌, కృష్ణా జిల్లాల అదనపు కోఆర్డినేటర్లు ఎం.రజని, ఆర్‌.కుమిదిని సింగ్‌ తెలిపారు.

ఇగ్నో దరఖాస్తుల ఆహ్వానం

విజయవాడ వన్‌టౌన్‌: ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో) నిర్వహించే బీఎడ్‌, బీఎస్సీ నర్సింగ్‌ కోర్సులకు జనవరి 2026కు, రిహాబిలిటేషన్‌ కౌన్సెల్‌ ఆఫ్‌ ఇండియా గుర్తింపు పొందిన పి.జి. డిప్లొమా ఇన్‌ రిహాబిలిటేషన్‌ సైకాలజీ కోర్సు జులై 2026కు నిర్వహించే ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇగ్నో ప్రాంతీయ కేంద్రం రీజినల్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ కె.సుమలత బుధవారం తెలిపారు. విజయవాడలో మాత్రమే ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు వివరించారు. బీఎడ్‌ ప్రవేశ పరీక్షకు ఫిబ్రవరి 27 ఆఖరు తేదీ.. బీఎస్సీ నర్సింగ్‌, పి.జి.డిప్లొమా ఇన్‌ రిహాబిలిటేషన్‌ సైకాలజీ కోర్సుల ప్రవేశ పరీక్షకు మార్చి 05 ఆఖరు తేదీ అని చెప్పారు. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని కోరారు. వివరాలకు దగ్గరలోని ఇగ్నో అధ్యయన కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు. 0866-2565253 ఫోన్‌ నంబరు ద్వారా కూడా తెలుసుకోవచ్చని తెలిపారు.

శివరాత్రి ప్రత్యేక బస్సులకు సాధారణ ఛార్జీలే

మచిలీపట్నం (కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: మహా శివరాత్రి సందర్భంగా ఈ నెల 15న భక్తుల సౌకర్యార్థం సాధారణ ఛార్జీలతోనే ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు ఏర్పాటు చేస్తున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లాలోని వివిధ డిపోల నుంచి ప్రసిద్ధ శైవక్షేత్రాలైన పెదకళ్లేపల్లి, సంగమేశ్వరం, ఐలూరు తదితర ప్రాంతాలకు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు. ఉయ్యూరు నుంచి వివిధ రూట్లలో ఐలూరుకు 45, అవనిగడ్డ, మచిలీపట్నం డిపోల నుంచి పెదకళ్లేపల్లికి 43, అవనిగడ్డ- సంగమేశ్వరానికి 2 ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉంటాయన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మూస సేద్యం వీడండి

- చినజీయర్‌ స్వామి

అయోధ్యలో ప్రకృతి వ్యవసాయ రైతులకు సత్కారం..

మోపిదేవి, న్యూస్‌టుడే: మూస సేద్యాన్ని వీడి, ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు దృష్టి సారించాలని శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి పిలుపునిచ్చారు. బుధవారం సుఫల రైతు పాదయాత్రను మోపిదేవిలో ప్రారంభించారు. జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి మోపిదేవిలంక, కోసూరుపాలెం, నడిమిలంక, మేళ్లమర్తిలంక, ఉత్తర చిరువోల్లంక మీదుగా సాగి అయోధ్య గ్రామంలో ముగింపు సభ జరిగింది. తొలుత గోమాతకు పూజలు చేశారు. సభలో చినజీయర్‌ మాట్లాడుతూ విషపూరిత రసాయనిక మందుల వాడకాన్ని పూర్తిగా విడనాడాలి. అందుకు మార్గం గోఆధారిత పంచగవ్యం, వేపనూనెతో తయారు చేసే మందులు, చెత్తనుంచి సంపద కేంద్రాలలో లభ్యమయ్యే వర్మీకంపోస్టును వాడాలన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రకృతి వ్యవసాయ ప్రేమికుడు పాలేకర్‌ కోవలో విజయరామ్‌, విజయ డైరీ ఛైర్మన్‌ చలసాని ఆంజనేయులు, కోనేరు కరుణాకర్‌, చినముత్తేవి ముముక్షు పీఠం నిర్వాహకులు ఆదర్శంగా నిలవాలన్నారు. పాదయాత్రలో భాగంగా వ్యవసాయ క్షేత్రాలలో పనిచేస్తున్న వారితో ముచ్చటించారు. సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగం మానేసి ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గుచూపిన విశాఖపట్నం మహిళా రైతు పయనాన్ని తెలిపారు. అయోధ్యలో 15 ఎకరాల్లో గోఆధారిత వ్యవసాయం చేస్తున్న కోనేరు కరుణాకర్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తహసీల్దార్‌ హరనాథ్‌, ఎస్‌.ఐ గౌతమ్‌కుమార్‌, భవానీ ప్రసాద్‌, లంక శ్యాంసుందర్‌శాస్త్రి, నేపాల్‌ కృష్ణమాచార్య స్వామి, అహోబిల స్వామి, వేములపల్లి శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవకులకు సేవా యాప్‌ ప్రారంభం

ఇంద్రకీలాద్రి: కనకదుర్గమ్మ ఆలయ సేవకుల కోసం సేవా యాప్‌ ప్రారంభిస్తున్నట్లు ఈవో శీనానాయక్‌ తెలిపారు. తిరుమల తరహాలో స్వచ్ఛంద సేవ పట్ల ఆసక్తి ఉన్న వారి పేర్లు నమోదు చేసేందుకు సేవా యాప్‌ వినియోగించుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్‌, హాజరు, పర్యవేక్షణ కోసం యాప్‌ను తీసుకు వచ్చినట్లు తెలిపారు. క్యూలైన్లు, అన్నదానం, ఉచిత ప్రసాదం పంపిణీ, తాగునీరు, పాలు అందజేయడానికి దేవస్థానం సిబ్బందితో పాటు స్వచ్ఛంద సేవకులను వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు.

స్పీడ్‌ బ్రేకర్లుంటే.. హర్షవర్ధన్‌ బతికేవాడు..!

☛ అత్యంత ప్రమాదకరంగా మారిన కానూరు రోడ్డు

☛ మలుపులు, అనేక అంతర్గత దారులతో అనుసంధానం

ఈనాడు, అమరావతి, - కానూరు, తాడిగడప న్యూస్‌టుడే

తాడిగడప మున్సిపాలిటీలోని ప్రధాన రహదారుల్లో ఒకటైన కామయ్యతోపు నుంచి కానూరు వెళ్లే రోడ్డు అత్యంత ప్రమాదకరంగా మారింది. విజయవాడ నగరాన్ని ఆనుకుని ఉన్న కిలోమీటరున్నర పొడవైన ఈ రోడ్డులో కేవలం స్పీడ్‌ బ్రేకర్లు లేకపోవడం వల్లే శ్రీహర్షవర్ధన్‌ అనే పదో తరగతి విద్యార్థి సోమవారం బలైపోయాడు. చదువులో రాణిస్తున్న హర్ష భవిష్యత్తుపై తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ అర్ధంతరంగా మృత్యువు కబళిస్తుందని ఊహించలేకపోయారు. అత్యంత వేగంగా బైక్‌పై దూసుకొచ్చిన పదో తరగతి చదివే ముగ్గురు విద్యార్థులు రోడ్డుపై వెళ్తున్న హర్షవర్ధన్‌ను ఢీకొట్టి అతని మరణానికి కారణమయ్యారు. ఈ రోడ్డుపై ఒక్క స్పీడ్‌ బ్రేకరు కూడా లేకపోవడంతో విచ్చలవిడిగా ద్విచక్ర వాహనాలు, కార్లతో దూసుకుపోతూ అమాయకుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు.

రహదారిపై ప్రమాదకర మలుపు

అధికారులు కళ్లు తెరవాలి..

ఈ రోడ్డుపై ఉన్న చర్చి ఎదురుగా ఆరేడు నెలల కిందట జరిగిన ప్రమాదంలో ఓ యువ ఉద్యోగి మృతి చెందాడు. ప్రస్తుతం ఓ విద్యార్థి బలైపోయాడు. నిత్యం ప్రమాదాలు ఏదో ఒక చోట జరుగుతూనే ఉన్నాయి. ఈ రోడ్డు పంట కాలువ జంక్షన్‌ నుంచి ఆరంభమై.. ప్రమాదకరమైన మలుపులు, కాలనీల్లోకి వెళ్లే అంతర్గత దారులతో అనుసంధానమై ఉంటుంది. ఎటునుంచి ఎవరు దూసుకొస్తారో కూడా ఊహించడం కష్టం. కనీసం ఓ ఐదారు ప్రాంతాల్లో స్పీడ్‌ బ్రేకర్లు ఉండాలి. కొత్తగా ఈ రహదారిని ఆరు నెలల కిందట వేసినప్పుడే స్పీడ్‌ బ్రేకర్లను వేయాలంటూ అన్ని వర్గాల నుంచి విజ్ఞప్తులు వచ్చినా అధికారులు ఒకరిపై ఒకరు నెపం నెట్టుకుంటూ.. పెడచెవిన పెట్టారు. ఇంత జరిగినా ఇప్పటికీ యంత్రాంగంలో చలనం లేకపోవడం బాధాకరం.

వందల విద్యా కేంద్రాలున్న ప్రాంతం..

కానూరు రోడ్డుకు ఆనుకుని చుట్టుపక్కల కనీసం 150కుపైగా విద్యాసంస్థలు, అకాడమీలు, కళాశాలలు ఉన్నాయి. నిత్యం 50వేల మంది విద్యార్థులు, లక్షల మంది ప్రజలు.. వేల సంఖ్యలో వాహనాల్లో తిరుగుతుంటారు. విజయవాడను ఆనుకుని ఉన్న ప్రాంతం కావడంతో.. నగరంలో కొలువులు చేసేవాళ్లంతా ఇక్కడే ఉంటారు. ఇంత కీలకమైన రహదారిపై స్పీడ్‌ బ్రేకర్లు అత్యవసరం. అప్పుడే వాహనాల వేగానికి.. పగ్గాలు పడి ప్రమాదాలను అరికట్టేందుకు వీలుంటుంది.

పంచమ వర్ధంతి

నీవు మమ్ములను వీడి నేటికి 5 సంవత్సరాల కాలము గడిచిననూ సదా నీ స్మృతులతో..

భర్త: గుర్రం నాగేశ్వరరావు మరియు కుటుంబ సభ్యులు

సంస్మరణ

ది. 12-02-2026 గురువారం నాడు ఎన్‌.టి.ఆర్‌ జిల్లా గంపలగూడెం మండలం అనుమల్లంక గ్రామము గట్టు చెరువు తోటలోని స్మారక చిహ్నం దగ్గర జరుపబడును.

శ్రీమతి గుర్రం అరుణకుమారి
W/o. గుర్రం నాగేశ్వరరావు
జననం: 07-10-1947 మరణం: 12-2-2021

(c) eenadu

హమాలీ ఛార్జీలేవి సారూ...

ధాన్యం అమ్మిన రైతుల ఎదురుచూపులు

గుడివాడ, న్యూస్‌టుడే: ధాన్యం మిల్లుకు చేర్చడానికి అయ్యే హమాలీల ఖర్చును అందిస్తామని చెప్పిన ప్రభుత్వం యంత్రాంగం.. ధాన్యం సేకరణ పూర్తై నెలలు గడుస్తున్నా నేటికీ విడుదల చేయలేదని కృష్ణా జిల్లా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ప్రతి రైతు వారి పరిధిలోని రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం ప్రభుత్వానికి కనీస మద్దతు ధరకు విక్రయించారు. నాణ్యతను బట్టి నిర్ణయించిన ధర వెంటనే వారి ఖాతాలలో జమ అయ్యింది. ధాన్యం నగదు జమ త్వరితగతిన జరిగినా.. మిల్లుకు చేర్చడానికి అయిన హమాలీల ఖర్చు గురించి మాత్రం దృష్టి పెట్టలేదు. ప్రతీ క్వింటాకు.. అంటే 100 కేజీలకు ప్రభుత్వం రూ.22 రైతుకు అందిస్తుంది. గోనె సంచుల నిమిత్తం 40 కేజీలకు రూ.4.74 చెల్లిస్తుంది. ఈనెలవ్యవధిలో ఈ నెల 10వ తేదీ వరకూ గుడివాడ మండలంలో 29,874 మెట్రిక్ టన్నులు, జిల్లాలో 700161 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు.

జిల్లాలో రూ.15.40 కోట్ల బకాయిలు

నేటికీ పైసా కూడా హమాలీ ఛార్జీలకు సంబంధించిన నగదు రైతుల ఖాతాల్లో జమ కాకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పనులు లేని సమయంలో.. పైగా పైరుకు పురుగు మందులు చల్లడానికి దిక్కులేక చిల్లిగవ్వ కూడా లేని సమయంలో రైతులు ఆ నిధులు అందక ఇబ్బంది పడుతున్నారు. తక్షణం అధికారులు స్పందించి ఛార్జీలను వెంటనే ఇవ్వాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. జిల్లా మొత్తం మీద 700161 మెట్రిక్ టన్నులకు రైతులకు రూ.15.40 కోట్లను ఇవ్వాల్సి ఉంది. ఒక్క గుడివాడ మండలంలో 29,874 మెట్రిక్ టన్నులకు రూ.657,228 రైతులకు హమాలీ ఛార్జీలు ఇవ్వాల్సి ఉంది.

డిసెంబరులో ధాన్యం మిల్లుకు తోలాను. కానీ నేటికీ నా 400 బస్తాల ధాన్యానికి కూడా పైసా హమాలీ ఛార్జీలు జమ కాలేదు. కారణాలు ఎవరూ చెప్పడం లేదు. అధికారులు వెంటనే స్పందించాలి. **- కందుల నాంచారయ్య, పర్నాస**

ఏడాది పాటు చేసిన సాగులో పురుగు మందులు, ఎరువుల కొనుగోలుకు చాలా ఖర్చు అయ్యింది. అప్పుల్లో ఉన్న తమకు ధాన్యం నగదు వెంటనే పడినా, హమాలీ ఛార్జీలు ఇంకా రాలేదు. అవి వస్తే ఉన్న పైరుకు పురుగు మందులు పిచికారి చేసుకొంటాం. అధికారులు స్పందించాలి. **- నురుగుల మురళీకృష్ణ, గుంటాకోడూరు.**

తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటి చెప్పాలి: ఎస్పీ

శ్రీకాకుళం(ఘంటసాల), న్యూస్‌టుడే: తెలుగు భాష ఔన్నత్యాన్ని భావి తరాలకు చాటి చెప్పాలని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు అన్నారు. శ్రీకాకుళంలో ఆంధ్రమహావిష్ణువు సన్నిధిలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధ్యక్షతన శ్రీకృష్ణదేవరాయలు మహోత్సవాలు బుధవారం రాత్రి ముగిశాయి. ఎస్పీ మాట్లాడుతూ రాయలు మహోత్సవాలతో పోలీస్ శాఖ చేపట్టే సమాజహిత కార్యక్రమాలలో భాగంగా తెలుగు భాష పట్ల నేటి తరానికి ఆసక్తి పెంచే చర్యలు తీసుకుంటామన్నారు. సృజనాత్మక, సాంస్కృతిక మండలి ఛైర్మన్ పొడపాటి తేజస్వి మాట్లాడుతూ సంస్కృత భాష ప్రాముఖ్యం ఉన్న కాలంలోనే తెలుగును రాజభాషగా చేసిన మనుమడు శ్రీకృష్ణదేవరాయలు అని పేర్కొన్నారు. రాయలు వారు ఆముక్తమాల్యద గ్రంథ రచనను ప్రారంభించిన చారిత్రక స్థలాన్ని దర్శించడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ గత కృష్ణా పుష్కరాల్లో విజయవాడ తరువాత అత్యధిక భక్తులు స్నానాలు చేసిన ప్రాంతం శ్రీకాకుళం నిలవడం గొప్ప విశేషమన్నారు. కవులు, సంగీత విద్వాంసులు, ఎందరో చరిత్ర ప్రసిద్ధి చెందిన మహనీయులు శ్రీకాకుళం వాసులు కావడం గర్వకారణమన్నారు. అతిథులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, సాహితీవేత్త ఆద్దంకి శ్రీనివాసరావు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి పి.సాయిబాబు, ఆలయ ఏసీ దాసరి శ్రీరామవరప్రసాద్, ఈవో చెన్నకేశవరావు, ఎంపీడీవో డి.సుబ్బారావు, నాయకులు మండలి రాజా, తుమ్మల చౌదరి బాబు, తాడికొండ వెంకటేశ్వరరావు, రవిప్రసాద్, నాగళ్లనివాసరావు, చిట్టిబాబు, సీతారామరాజు, తదితరులు పాల్గొన్నారు. ◆ పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. 'భువనవిజయం' సాహితీ నృత్యరూపకం, కేవీ సత్యనారాయణ బృందం 'మోహినీ భస్మాసుర' నృత్య నాటకం అలరించాయి. కళాకారులను ఎమ్మెల్యే సత్కరించారు.

మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, వేదికపై ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తదితరులు

'మోహినీ భస్మాసుర' నృత్య నాటకంలో ఓ సన్నివేశం

2030 నాటికి పేదరిక నిర్మూలన సాధ్యమేనా?

లోక్‌సభలో ప్రశ్నించిన ఎంపీ బాలశౌరి

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం: దేశంలో సామాజిక రక్షణ పథకాల లబ్ధి.. పేదరిక నిర్మూలనపై లోక్‌సభలో ఎంపీ బాలశౌరి బుధవారం కేంద్ర ప్రణాళిక మంత్రిని ప్రశ్నించారు. 'ప్రభుత్వ నివేదిక ప్రకారం ప్రస్తుత జనాభాలో 64.3 శాతం మంది సామాజిక రక్షణ పథకాలు పొందుతున్నారు. 2016లో ఇది కేవలం 24శాతంగా ఉండటం నిజమేనా? అన్ని వయసుల పురుషులు, మహిళలు, పిల్లలు కలిసి పేదరికంలో జీవిస్తున్న వారి నిష్పత్తి 24.8 శాతం నుంచి 14.9శాతానికి తగ్గిందా? 2030 నాటికి ఎస్‌డీజీ లక్ష్యాల ప్రకారం పేదరికాన్ని నిర్మూలించగలమా' అని ఎంపీ బాలశౌరి వివరాలు అడిగారు. దీనిపై కేంద్ర ప్రణాళిక మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి రావు ఇంద్రజిత్‌సింగ్ స్పందించారు. 'అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) తాజా సమాచారం ప్రకారం.. 2015లో దేశంలో సామాజిక భద్రతా లబ్ధి 19శాతం కాగా 2025 నాటికి అది 64.3శాతానికి పెరిగింది. జన్‌ధన్ ఖాతాలు, ఆధార్ ఆధారిత గుర్తింపు వ్యవస్థ, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా లబ్ధిదారులకు ప్రయోజనాలు వేగంగా, పారదర్శకంగా అందుతున్నాయి. పీఎం గరీబ్ కల్యాణ్ అన్న యోజన, యోగి మన్ ధన్, పీఎం పోషణ్, జననీ సురక్ష యోజన, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, పీఎం మాతృ వందన యోజన, పీఎం వయ వందన యోజన వంటి పథకాలు సామాజిక రక్షణను విస్తరించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ఆధారంగా ఆరోగ్య సంరక్షణ సేవలను మరింత విస్తరించాం. నీతి ఆయోగ్ విడుదల చేసిన 2023 జాతీయ బహుముఖ పేదరిక సూచిక (ఎంపీఐ) ప్రకారం.. 2015-16లో 24.85శాతంగా ఉన్న పేదరికం 2019-21లో 14.96 శాతానికి తగ్గింది. ఈ కాలంలో 13.5 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. 2013-14లో 29.17శాతం ఉన్న పేదరికం 2022-23లో 11.28 శాతానికి తగ్గడంతో 24.82కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. 2030 నాటికి ఎస్‌డీజీ లక్ష్యం 1.2 ప్రకారం పేదరికాన్ని సగానికి తగ్గించే దిశగా భారత్ సరైన మార్గంలో ఉంది.

రెవెన్యూ రికార్డులను పటిష్ఠం చేయాలి

కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే: రెవెన్యూ రికార్డులను పటిష్ఠ పరచాలని కలెక్టర్ డీకే బాలాజీ రెవెన్యూ అధికారులను సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన జేసీ నవీన్‌తో కలిసి వివిధ అంశాలపై సమీక్షిస్తూ అధికారులకు పలు సూచనలు చేశారు. రీసర్వేలో తప్పులు చేస్తే చారిత్రక తప్పిదాలుగా నిలుస్తాయన్నారు. సర్వే గ్రామ సభల్లో తప్పనిసరిగా సంబంధిత తహసీల్దార్లు హాజరుకావాలన్నారు. రీసర్వేలో విస్తీర్ణం 5 శాతానికి మించి తేడా ఉంటే సంబంధిత భూహక్కుదారులతో మాట్లాడి పరిష్కారం చేయాలన్నారు. రెవెన్యూ క్లినిక్‌లకు వచ్చే అర్జీలకు సంతృప్తికర పరిష్కారం చూపకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేస్తూ, ప్రతి అర్జీని పూర్తిగా అవగాహన చేసుకుని తగు చర్యలు తీసుకోవాలన్నారు. క్లినిక్‌లకు వచ్చిన 73 అర్జీల్లో 43 సేవా పోర్టల్‌లో పెట్టకపోవడాన్ని ప్రశ్నించారు. ఆర్‌ఓఆర్‌లో ఏవైనా అనుమానాలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనుభవదారుల భూమిపై హక్కు రాదని, రికార్డుల పరంగానే ఉండాలన్నారు. జేసీ మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌లో వచ్చే అర్జీలను మండల స్థాయిలో పరిష్కరించాలన్నారు. ప్రతిరోజూ అర్జీలను తప్పనిసరిగా పరిశీలించాలని చెప్పారు. పీజీఆర్‌ఎస్‌లో వచ్చే అర్జీల్లో 3 శాతం గడువు దాటి పరిష్కరిస్తున్నారని, 10 శాతం అర్జీలు మళ్లీ తిరిగివస్తున్నాయన్నారు. ముఖ్యంగా ఉయ్యూరు డివిజన్‌లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉందన్నారు. పలువురు తహసీల్దార్లు లేవనెత్తిన అనుమానాలను కలెక్టర్, జేసీలు నివృత్తి చేశారు.

రెవెన్యూ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

మహాశివరాత్రికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా, ఆలాంఛనీయ సంఘటనలు, తొక్కిసలాట వంటి అంశాలకు ఆస్కారం లేకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను దిశానిర్దేశం చేశారు. భక్తుల తాకిడి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సౌకర్యానికి మించి ఒకేసారి ఎక్కువ మంది అనుమతించకూడదన్నారు. వైద్యశిబిరాలు, అంబులెన్సులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని, పుణ్యస్నానాల సందర్భంగా అందరూ అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

మచిలీపట్నంలో స్పెసిఫిక్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ రేపు

కలెక్టరేట్(మచిలీపట్నం): ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 13న మచిలీపట్నంలో స్పెసిఫిక్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. ఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలలో ఉదయం 9 గంటలకు నిర్వహించే డ్రైవ్‌లో ప్రముఖ ఆటోమోటివ్ సంస్థ సెల్స్ ఎగ్జిక్యూటివ్‌లను ఎంపిక చేసుకోనుందన్నారు. ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ అర్హత కలిగి ఉండి 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయసు ఉన్న వారు డ్రైవ్‌లో పాల్గొనేందుకు అర్హులన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 200 ఖాళీలను భర్తీ చేసుకుంటున్నారు. మరిన్ని వివరాల కోసం 99664 89796 నంబరులో సంప్రదించవచ్చని తెలిపారు.

ఇంద్రకీలాద్రిపై ఏర్పాట్లు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై మహాశివరాత్రి వేడుకలు పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నట్లు దుర్గగుడి ఈవో శీనానాయక్ తెలిపారు. మల్లికార్జున మహామండపం నాలుగో అంతస్తులో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఈవో మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వేలాది భక్తులు దుర్గాఘాట్‌లో స్నానాలు చేసే అవకాశం ఉంటుందని.. మౌలిక వసతులపై ఇంజినీరింగ్, పారిశుద్ధ్యం విభాగ అధికారులు దృష్టి పెట్టాలని ఆదేశించారు. భక్తులు దుర్గమ్మ దర్శనం అనంతరం మల్లేశ్వరస్వామిని దర్శించుకుంటారని. . వారికి భక్తులకు ఇబ్బందులు లేకుండా ఫ్యాబ్రికేటెడ్ ఫ్రేమ్స్‌తో క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

వీరమ్మను దర్శించుకున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

గండిగుంటలో కోర్టు నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గోపి

ఉయ్యూరు, న్యూస్‌టుడే: కృష్ణాజిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గోపి బుధవారం మధ్యాహ్నం వీరమ్మతల్లిని దర్శించుకున్నారు. అమ్మవారికి సారె సమర్పించి ప్రత్యేక పూజాది కార్యక్రమంలో పాల్గొన్నారు. అమ్మవారి దర్శనం అనంతరం ఉయ్యూరు మండలం గండిగుంటలో కోర్టు భవన నిర్మాణం కోసం దాత సజ్జా వెంకటేశ్వరరావు అందించిన స్థలాన్ని పరిశీలించారు. న్యాయమూర్తికి ఉయ్యూరు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి శ్రీహరి స్వాగతం పలికారు. ఉయ్యూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపిచంద్, పలువురు న్యాయవాదులున్నారు. తొలుత ఉయ్యూరు జూనియర్ సివిల్ కోర్టును సందర్శించారు.

అక్కరకు రాని సంపద సృష్టి కేంద్రాలు

మంటాడ (పమిడిముక్కల), పామర్రు, న్యూస్‌టుడే

గ్రామాల్లో పేరుకుంటున్న చెత్తను ఎరువుగా మార్చి అమ్మటంతో పంచాయతీలకు ఆదాయం పెరుగుతుందనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన చెత్త నుంచి సంపద సృష్టి పథకం ఆదాయం ఇవ్వకపోగా అదే గుదిబండగా మారింది. ఐదేళ్ల నుంచి వీటి ద్వారా ఖర్చే గాని ఆదాయం పొందని పంచాయతీలు 90 శాతం పైగా ఉంటాయనేది యథార్థం. ప్రభుత్వ స్థలాల్లో ఈ షెడ్లను నిర్మించాలనే ఒత్తిడితో పలుచోట్ల గ్రామాలకు సుదూరంగా పొలిమేరల్లో వీటిని నిర్మించారు. గ్రామాల్లో చెత్త ఊడ్చేందుకే ఎవరూ ముందుకు రాని పరిస్థితి. ఇచ్చే భత్యం స్వల్పమంటున్నారు. మేజర్ పంచాయితీల్లో ట్రాక్టర్‌తో షెడ్లకు తరలించిన చెత్తను అక్కడ విడిగా చేసేవారు లేక కాల్చి వేస్తున్నారు. మైనర్ పంచాయతీలకు చెత్తను తీసుకువెళ్లేవారే లేరని అందువల్ల ఇచ్చిన మూడు చక్రాల సైకిళ్లు కొద్ది నెలల్లోనే మూలనపడ్డాయి.

పామర్రు నియోజకవర్గంలో చెత్త నుంచి సంపద కేంద్రాలు:

మండలం	పంచాయతీలు	సంపదకేంద్రాలు
పామర్రు	25	23
మొవ్వ	21	21
తోట్లవల్లూరు	16	16
పమిడిముక్కల	25	24
పెదపారుపూడి	19	17

మైనరు పంచాయతీల్లో వీటి నిర్వహణకు తగిన ఆర్థిక స్థోమత లేక, మేజరు వాటిల్లో సిబ్బందికి పని ఒత్తిడిలో వీటిపై దృష్టి సారించక పథకం నీరుగారి పైసా ఆదాయం లేకుండా పోయింది.

◆ **తప్పని ఖర్చు:** ఈ షెడ్ల నిర్మాణంతో పాటు విద్యుత్ ఛార్జీలు, కాపలాదారునికి జీతభత్యాలు పంచాయతీలకు భారంగా మారాయి. షెడ్లలోని తొట్లలోకి వానపాముల కొనుగోలు, పేడ, చెడిపోయిన కూరగాయలు, ఇతర ఖర్చుల కింద లెక్కలు చూపుతూ.. పంచాయతీ ఆదాయానికి గండికొడుతున్నారనే ఆరోపణలున్నాయి. వీటి పరిశీలనకు వచ్చే అధికారులకు కూలీల, వనరుల సమస్యలు చెబితే మీరే చూసుకోవాలంటున్నారే గాని వాటి పరిష్కారం చెప్పేవారు కరవయ్యారనేది కార్యదర్శుల ఆవేదన.

◆ **తీరు మారాలి:** గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్ల భత్యం పెంచి పంచాయతీ ఉద్యోగిగా పరిగణించాలి. మండలంలోని గ్రామాలను యూనిట్లుగా విభజించి ఒక్కో యూనిట్‌లోని గ్రామాల్లోని చెత్త అంతా ఒక చోటకు చేర్చటం, అక్కడి షెడ్లలో ప్రత్యేక జాగ్రత్తలతో వానపాముల పెంపకం, ఎరువు తయారీ విధానం అనుసరించాలి. ప్రతి యూనిట్‌కు ఒక వాహనం ఏర్పాటు చేసి ఆ పరిధిలోని చెత్తను షెడ్ల వద్దకు చేర్చే విధానం ఉండాలనేది కార్యదర్శుల అభిప్రాయం.

సంపద సృష్టి కేంద్రం షెడ్డు

పరిస్థితి మెరుగుపడుతోంది

గతంలో కంటే ఇప్పుడు షెడ్ల నిర్వహణ మెరుగుపడుతోంది. వాటి ఫలితాలు కొద్ది నెలల్లో కనపడతాయి. గ్రామాల్లో కూలీల సమస్య ప్రతిబంధకంగా ఉంది. వీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాం. **- డిప్యూటీ ఎంపీడీవో ధారావత్ తావీర్య, పమిడిముక్కల**

ఆరోగ్య కేంద్ర భవనానికి రూ.20లక్షల భూమి విరాళం

వీరంకి(పమిడిముక్కల): వీరంకిలో గ్రామీణ ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణానికి ఆ గ్రామానికి చెందిన మహ్మద్ వాహెదుల్లా కుమారుడు అబ్దుల్‌కరీమ్ పర్వేజ్ రూ.20 లక్షల విలువైన 6 సెంట్ల భూమిని ప్రభుత్వానికి విరాళంగా ఇచ్చారు. బుధవారం దానపత్రాలను సర్పంచి కాసాని నాగేశ్వరమ్మ, కార్యదర్శి కనుమూరి సౌజన్యలకు అందజేశారు. వీరంకి, అమీనపురం, ఫతేలంక, పైడికొండలపాలెం గ్రామాల్లో వైద్యం అందుబాటులో లేక స్థానికులు సమీపంలోని వీరంకిలాకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లేవారు. దీంతో తండ్రి జ్ఞాపకార్థం తన భూమిని వీరంకిలో ఆరోగ్యకేంద్రం నిర్మాణానికి ఇస్తున్నట్టు అబ్దుల్‌కరీమ్ పర్వేజ్ తెలిపారు. దాత ఔదార్యాన్ని సర్పంచి నాగేశ్వరమ్మ, ఎంపీడీఓ వీర్ల సీతారామరాజు, గ్రామస్థులు అభినందించారు.

సర్పంచి, కార్యదర్శికి దానపత్రం అందిస్తున్న అబ్దుల్‌కరీమ్ పర్వేజ్

అధికారుల హామీతో ఆందోళన విరమణ

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: నాటుబాంబులతో క్వారీ అక్రమ తవ్వకాలు చేపడుతుండడంతో భయభ్రాంతులకు గురవుతున్నామని నిరసన చేపట్టిన గన్నవరం మండలం సావరగూడెం గ్రామస్థులు అధికారుల హామీతో ఆందోళనను విరమించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఏపీఎస్పీ అధికారులతో కలిసి రెవెన్యూ అధికారులు బుధవారం గ్రామంలో పర్యటించారు. నివాసితుల ఇళ్లు కదలడం, సామగ్రి, విద్యుత్తు తీగల ధ్వంసం, దుమ్ము, ధూళితో రోడ్డు ధ్వంసం చేస్తున్నారన్న గ్రామస్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ వెంకట శివయ్య ఆందోళనకారులకు హామీ ఇచ్చారు. ప్రభుత్వ నిబంధనల మేరకే క్వారీ నిర్వహణ ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే పలుమార్లు తహసీల్దార్, ప్రజాప్రతినిధి, కలెక్టర్‌కు అర్జీలు పెట్టినా పట్టించుకోకపోవడం వల్లే తాము ఆందోళనకు దిగినట్లు నిరసనకారులు తెలిపారు. గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చని పక్షంలో మళ్లీ ఆందోళన చేపట్టాల్సి ఉంటుందని ప్రజలు వెల్లడించారు.

గ్రామస్థులతో చర్చిస్తున్న తహసీల్దార్ వెంకట శివయ్య తదితరులు

జీవన్మృతుడి అవయవాల దానం

తాడేపల్లి: ఇంజినీరింగ్ విద్యార్థి జీవన్మృతుడు కావడంతో అతని అవయవాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. తాడేపల్లి మణిపాల్ వైద్యశాల ప్రతినిధులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం జిల్లా మధిరకు చెందిన కందిమళ్ల విజయ్‌కుమార్(20) కేఎల్ యూలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 6న కుంచనపల్లి క్రాస్‌రోడ్డు వద్ద ప్రమాదానికి గురయ్యాడు. దీంతో అతన్ని చికిత్స నిమిత్తం మణిపాల్ వైద్యశాలకు తీసుకొచ్చారు. అతని ఆరోగ్య పరిస్థితిని పరిశీలించిన వైద్యులు మెదడులో రక్తస్రావం అవుతుందని గమనించి చికిత్స అందించారు. పరిస్థితిలో మార్పు కనిపించ లేదు. ఈనెల 11న జీవన్మృతుడిగా నిర్ధారించారు. తండ్రి సైదేశ్వరరావు, కుటుంబ సభ్యుల అంగీకారంతో ఏపీ జీవన్‌దాన్ ఛైర్మన్ డాక్టర్ రాంబాబు, వైద్యశాల డైరెక్టర్ రామాంజనేయరెడ్డి ఆధ్వర్యాన అవయవదానం జరిగింది.

విజయ్‌కుమార్ (పాతచిత్రం)

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213 చికెన్ స్కిన్‌లెస్ - 243.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 137, 146, 157 చికెన్ విత్ స్కిన్ - 260 చికెన్ స్కిన్‌లెస్ - 270.

ఈలచెట్లదిబ్బ గ్రామంలో అధికారుల పర్యటన

సొంతూళ్లకు కొందరు యానాదుల తరలింపు

ఈలచెట్లదిబ్బ(నాగాయలంక), న్యూస్‌టుడే: ఈలచెట్లదిబ్బ గ్రామంలోని యానాదుల కుటుంబాల్ని మచిలీపట్నం ఆర్డీఓ పోతురాజు ఆధ్వర్యంలో ఎనిమిది మంది జిల్లా అధికారుల కమిటీ బృందం పరామర్శించింది. కొందరు వ్యాపారులు మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారంటూ వెట్టి చాకిరి నుంచి విముక్తి చేయాలని సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో యానాదులు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం ఈలచెట్లదిబ్బ ప్రాథమిక పాఠశాలలో బాధిత యానాదుల నుంచి అభిప్రాయాల్ని సేకరించారు. అనంతరం దీనదయాళపురంలోని యానాదులతో అధికార బృందం మాట్లాడారు.

యానాదుల కుటుంబాలను విచారించేందుకు ఈలచెట్లదిబ్బ గ్రామానికి వచ్చిన ఆర్డీఓ బృందం

27 యానాదుల కుటుంబాలను విచారించాం..

గ్రామస్థులపై యానాదులు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని ఆర్డీవో తెలిపారు. విచారించిన 27 కుటుంబాలలో 11 కుటుంబాలకు చెందిన 43 మందిని మచిలీపట్నం, కోడూరు, అవనిగడ్డ, బాపట్లలోని వారి సొంత ప్రాంతాలకు పోలీసుల రక్షణలో పంపామన్నారు. మిగతా 16 కుటుంబాలలో 52 మంది సభ్యులు ఇక్కడే ఉంటామని చెప్పారన్నారు. వ్యాపారులపై ప్రత్యేక నిఘా పెడుతున్నట్లు అవనిగడ్డ డీఎస్పీ టి. విద్యాశ్రీ తెలిపారు. మత్స్యశాఖ జేడీ నాగరాజు, ఐసీడీఎస్ పీడీ ఎం.ఎన్. రాణి, జిల్లా ఎస్టీ సాంఘిక సంక్షేమ అధికారి షాయుద్, మార్కెటింగ్ శాఖ ఏడీ నిత్యానందం, లేబర్ అసిస్టెంట్ అధికారి పి.విష్ణు, ట్రైబల్ సంక్షేమం జిల్లా అధికారి ఫణి ధూర్జటి, తహసీల్దారు వీరాంజనేయప్రసాద్ పాల్గొన్నారు.

◆ ఈలచెట్ల గ్రామంలో యానాదులు స్వతంత్రంగా పీతలు వేటాడి జీవనం చేస్తే ఇబ్బంది ఏమీ లేదని, ఊరిలోని ఐదుగురు వ్యాపారులకు ఇస్తే మాత్రం మా ఊరిలో ఉండటానికి వీలు లేదని స్థానికులు కొందరు అధికారులకు తెలిపారు. వారి వల్ల తమ గ్రామానికి చెడ్డ పేరు వస్తుందని వాపోయారు. గ్రామస్థులు ఎదుర్కొంటున్న సమస్యలను రేవు సువర్ణరాజు అధికారుల దృష్టికి తెచ్చారు. ఎస్టీ నేత నక్కా విజయబాబు, సీఐ జి.యువకుమార్, ఎస్సై కె.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



యానాదులను వారి సొంత గ్రామాలకు ప్రత్యేక పడవలలో తరలిస్తున్న పోలీసులు

తెదేపాతోనే వడ్డెరల అభివృద్ధి సాధ్యం

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: తెదేపాతోనే వడ్డెర అభివృద్ధి సాధ్యమని వడ్డెర కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ దేవళ్ల మురళీ పేర్కొన్నారు. గురువారం గవర్నర్‌పేటలోని ఓ హోటల్‌లో రాష్ట్ర వడ్డెర సంఘం ఆత్మీయ సమావేశం జరిగింది. అన్ని జిల్లాల నుంచి వడ్డెర కుల పెద్దలు విచ్చేశారు. వారి సమస్యలపై చర్చించారు. దేవళ్ల మురళీ మాట్లాడుతూ గత ప్రభుత్వ అరాచకాలకు ఎదురు తిరిగి అనేకమంది వడ్డెర నాయకులు పోలీస్ కేసులు పెట్టించుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొన్ని జిల్లాల్లో వడ్డెరలకు పదవుల కేటాయింపులో న్యాయం జరగడం లేదన్న భావన ఉందని ఈ నిరాశను తొలగించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నామినేటెడ్ పదవులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. దీనిపై చంద్రబాబు సానుకూలంగా స్పందిస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలో తెదేపా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందిస్తామని మురళీ వివరించారు. అంజనప్ప, దేవుళ్ల వెంకట్, రెడ్డిశేఖర్, కుంచపు వెంకటేష్, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంఘీభావం తెలుపుతున్న కుల పెద్దలు

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానము, ఇంద్రకీలాద్రి, విజయవాడ-1

సీల్డు కొటేషన్లు స్వీకరించుటకు ప్రకటన NIT NO.16/EE-1/2025-26, Dt: 11-02-2026

శ్రీ అమ్మవారి దేవస్థానము నందు సాంకేతిక విభాగమునకు సంబంధించిన ఆర్థిక సంవత్సరం 2026-27 సందర్భముగా వివిధ షామియానా, ఫ్లెక్స్ బోర్డ్స్, సివిల్, ఎలక్ట్రికల్, వాటర్, గార్డెన్, ట్రాన్స్‌పోర్ట్ మెటీరియల్ మరియు పనులు చేయుటకుగాను కొటేషన్లు స్వీకరించబడును. పూర్తి వివరములకు కార్యాలయము పనిచేయు వేళలో లేదా ఫోన్:0866-2423800 ద్వారా సంప్రదించగలరు.

ఆర్జిత సేవ, పరోక్ష సేవా మరియు విరాళముల కొరకు https:// kanakadurgamma.org నందు చూడగలరు.

శ్రీ బొర్రా రాధాకృష్ణ, చైర్మన్ మరియు ధర్మకర్తల మండలి సభ్యులు — సం/- వి.కె. శీనా నాయక్, యమ్.ఎ, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టరు & కార్యనిర్వహణాధికారి

ఆక్వాకల్చర్ స్టీవార్డ్‌షిప్ కౌన్సిల్-రొయ్యల ప్రమాణాల ప్రకారం భాగస్వామ్య-సామాజిక ప్రభావ అంచనాల కోసం ప్రజా సంప్రదింపు

ఫార్మ్ పేరు	చిరునామా	GPS	సంప్రదింపు తేది మరియు సమయం
నాహల శ్రీనివాస రావు	శేరి దింతకుర్రు గ్రామం, గుడివాడ మండలం, కృష్ణా జిల్లా	16.408940, 81.062032	13/02/2026., ఉ 09.00 గం॥ లకు
పి.శివాజీ రాజు	ముంజులూరు గ్రామం, బంటుమిల్లి మండలం, కృష్ణా జిల్లా	16.303171, 81.201126,	13/02/2026., మ 1.30 గం॥ లకు

పైన తెలిపిన ఆక్వాకల్చర్ చెరువులపై ఏ విధమైన అభిప్రాయాలు లేదా సలహాలు/ సూచనలను తెలుపుటకు గాను క్రింద తెలిపిన ఇమెయిల్‌కు తెలియపరచగలరు. sarabpreet@deviseafoods.com., స్పాన్సర్-దేవి సీఫుడ్స్ లిమిటెడ్ NH-16, పెరవలి రోడ్, తణుకు-534 211, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్, భారతదేశం.

91.9FM Vijayawada ఈ FM 91.9 Mee FM

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతరప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్‌క్యాష్ ✆81422 92071

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై AP అంతటా మార్టిగేజ్ లోన్స్, స్థిరాస్తి ఎక్కడ ఉన్నా ఏసంస్థలో ఉన్నా Xerox పేపర్స్‌పై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. 50లక్షలు లోపు, అయోధ్య కోఆపరేటివ్ బ్యాంక్. ✆ 93969 99669.

PERSONAL CLASSIFIEDS

LOST

I, Madduri Satya Srinivas S/o. M.Someshwar Rao R/o. flat no 101, Metro residency, plot no: 26, 27 Matrusree nagar Miyapur Hyderabad 500049 lost my original document of sale deed no: 3583/2019 registered at sub register office Ibrahimpatnam krishna district while travelling from Ibrahimpatnam to Rajamundry. If found M: 90598 65548

REAL ESTATE

FLAT FOR SALE

గాయత్రినగర్ లలితా జ్యూయలర్స్ వెనుక రిలయన్స్ స్పెండర్ అపార్ట్‌మెంట్‌లో 3BHK, 2500 S.Ft., 2 కార్ పార్కింగ్స్‌తో అమ్మకం. 98482 07437/ 93981 14214

PLOT FOR SALE

ఫ్లాష్! ఫ్లాష్! వినుకొండలో అవకాడో ప్లాంటేషన్‌లో 11 సెంట్లు (532 గజాలు) కేవలం 5.5 లక్షలు మాత్రమే. 2) 133 గజాలు 99,000/-. ✆ 7989476799.

LAND REQUIRED

వేర్ హౌస్ కావలెను

15000 నుండి 20000 Sq ft విజయవాడ దగ్గర మరియు గన్నవరం. సంప్రదించండి

CONTACT: 948 0834 451 895 1379 154

JOBS

శ్రీశ్రీ హోటల్, బైపాస్ రోడ్, ఖమ్మం నందు పనిచేయుటకు జనరల్ మేనేజర్ కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత. సంప్ర: 9949911636.

బస్సుడ్రైవర్స్ కావలెను. హెవీ లైసెన్స్‌తో పాటు కనీసం 5సం||ల అనుభవం కలిగిన డ్రైవర్స్ కావలెను. రూట్లు: మంగళగిరి, కేసరపల్లి, భవానీపురం, కంచికచర్ల, గంగినేనిపాలెం, వత్సవాయి, గట్టు భీమవరం, నందిగామ. జీతం నెలకు 18000/-. అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాల, పరిటాల. ✆ 94907 97533, 99482 30222

మ్యారేజి సంస్థలో పనిచేయుటకు కంప్యూటర్‌నాలెడ్జ్ గల ఇన్‌ఛార్జ్ (F). జీ: 20K. రిసెప్షనిస్ట్ (F) జీ: 15K. ఏదైనా డిగ్రీ VJA-7. ✆ 87905 99799.

VJA, గాంధీనగర్‌లోని ఇంటీరియర్ ఆఫీస్‌కు హిందీ, ఇంగ్లీష్ వచ్చిన లేడీ రిసెప్షనిస్ట్, బైక్ ఉన్న Exp. మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్. ✆ 98486 10708

విజయవాడ మొగల్‌రాజపురంలోని ప్రముఖ స్వీట్ షాపు నందు పనిచేయుటకు సేల్స్ బాయ్స్ & సేల్స్ గరల్స్ కావలెను. ✆ 91778 17557

విజయవాడ హోం అప్లయన్సెస్ షోరూంలో Female/ Male సేల్స్ ప్రమోటర్స్ జీతం: 15000/-+ ఇన్సెంటివ్ & హెల్పర్స్, ఆఫీస్‌బాయ్స్ కావలెను. ✆ 73311 73685.

తెలుగు/ ఇంగ్లీష్/ హిందీ డి.టి.పి (F) ఆపరేటర్లు కావలెను. పేజ్‌మేకర్‌లో బుక్‌వర్క్ చేయటంలో అనుభవం ఉన్నవాళ్ళకి ప్రాధాన్యత. 77028 02426, 98484 07654

ఫీమేల్ నర్స్ కావలెను. విజయవాడ సీతారామపురం, ఏలూరు రోడ్డులో డైలీ ఇంటికి వచ్చి (2Legs) డ్రెస్సింగ్ చేయుటకు ఫీమేల్ నర్స్ కావలెను. ✆ 92472 88381.

BR INFRACON నందు పనిచేయుటకు సైట్ ఇంజనీర్లు కావలెను. Q: డిప్లొమా, B.Tech/ M.Tech అర్హత కలిగి బిల్డింగ్స్, ఇరిగేషన్ వర్క్స్ నందు 3to4 సంవత్సరములు అనుభవం కలిగి విజయవాడ, రాజమండ్రి, ఏలూరు జిల్లాల నందు పనిచేయుటకు కావలెను. పూర్తి బయోడేటాను info@brinfracon.comకి పంపగలరు ✆ 79955 57831.

Gujarat నిస్సానగర్‌లో ఉన్న హాస్టల్‌లో పనిచేయుటకు చెఫ్, మాస్టర్ చెఫ్, హెల్పర్స్ కావలెను. మెస్ కాంట్రాక్టుకి ఇవ్వబడును. సం|| 95057 01977.

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న రెడ్ శాండిల్ ఫామ్ ల్యాండ్స్ (ISO 9001 కంపెనీ)లో ఇన్వెస్ట్/ మార్కెటింగ్ చేయుటకు సంప్రదించగలరు. ✆ 98482 74262

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

మచిలీపట్నం
•మచిలీపట్నం •పెడన

ముక్తేశ్వరుడికి వెండి నగల బహూకరణ

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: పెరికీడులో కొలువై ఉన్న శ్రీముక్తికాంత సమేత ముక్తేశ్వరస్వామి వారికి మచిలీపట్నానికి చెందిన భక్తులు వెండి వస్తువులు కానుకగా సమర్పించారు. శివలెంక విద్యాసాగర్, అమృతవల్లి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు, కుమార్తెలు 1,250 గ్రాముల వెండితో రూపొందించిన 1008 మారేడు దళాల మాల, 108 మారేడు దళాల మాలలు బహూకరించారు. బుధవారం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులకు వీటిని అందజేశారు.

ధర వరలు

టమాట 14, వంగ 20, బెండ 30, పచ్చిమిర్చి 36, కాకర 38, క్యాబేజీ 16, క్యారట్ 26, దొండ 44, బంగాళ దుంప 22, ఉల్లిపాయలు 22, గోరుచిక్కుడు 32, దోస 30, సొర 10, అరటికాయ 7,6, చిక్కుళ్లు 28, బీర 30, చామదుంప 24, మునగ 08/10, కంద 38, బీట్‌రూట్ 24, కీరదోస 44, బీన్స్ 55, క్యాప్సికం 65, అలసందలు 30, చిలకడదుంప 30, కొత్తిమీర 12/06, పుదీనా 15/05 గురువారం ఉదయం 7 గంటలవరకు ఈ ధరల వర్తిస్తాయి. సమస్యలుంటే ఎస్టేట్ అధికారి చక్రవర్తిని ఫోన్ నంబరు 91823 61295లో సంప్రదించొచ్చు. - న్యూస్‌టుడే, మచిలీపట్నం(గొడుగుపేట)

సినిమాలు

రేవతి: ఓం శాంతి శాంతి శాంతిః **మినీ రేవతి:** అనగనగా ఒక రాజు **సిరికృష్ణ:** మన శంకరవరప్రసాద్‌గారు **సిరివెంకట్:** బరాబర్ ప్రేమిస్తా

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

స్పందన: నగరంలోని ఇంగ్లీషుపాలెం- సుకర్లాబాద్ రహదారిలో ఉన్న చెత్తను తొలగించకపోవడంతో స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన కమిషనర్ బాపిరాజు సిబ్బందిని పంపి చెత్తను తొలగించి సమస్యను పరిష్కరించారు.
- న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: విద్యా హక్కు చట్ట ప్రకారం.. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యా శాఖాధికారి యూవీ సుబ్బారావు, సమగ్రశిక్ష ఏపీసీ కుముదినీ సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరానికి 1వ తరగతి ప్రవేశానికి అర్హులైన వారు ఈ నెల 20 నుంచి మార్చి 10 లోపు సంబంధిత వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2020 జూన్ 2 నుంచి 2021 మే 31 మధ్య జన్మించినవారు ఈ సీట్లు పొందడానికి అర్హులని తెలిపారు. మార్చి 25న లాటరీ విధానంలో మొదటి విడత సీట్లు కేటాయిస్తారన్నారు.

బంటుమిల్లి ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా శివప్రసాద్

పెడన, న్యూస్‌టుడే: బంటుమిల్లి ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా కేవీఎన్‌డీ శివప్రసాద్ నియమితులయ్యారు. పెడన మండల పరిషత్తు ఏవోగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆయనకు ఎంపీడీవో పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జడ్పీ సీఈవో ఉత్తర్వులు జారీచేశారు. పెడన ఏవో పోస్టులో కొనసాగుతూనే బంటుమిల్లి ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వర్తిస్తారు.

గృహయోగం

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

అర్హులైన పేదలందరికీ ఇళ్లు కేటాయించేందుకు తెదేపా ప్రభుత్వం వివిధ ప్రాంతాల్లో జీ ప్లస్ త్రి గృహసముదాయాల నిర్మాణం చేపట్టింది. ఆ తరువాత వచ్చిన వైకాపా ప్రభుత్వం ఇళ్లను లబ్ధిదారులకు కేటాయిస్తామని చెప్పడమే కానీ ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో ఇళ్లు పొందిన వారు కూడా చేరలేని దుస్థితి దాపురించింది. క్షేత్ర స్థాయిలో ఉన్న సమస్యలు పరిష్కరించి ఉగాది నాటికి గృహప్రవేశాలు చేయించాలని ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆదేశించడంతో ఆ దిశగా అధికారులు కార్యాచరణ చేపట్టారు.

రుద్రవరంలోని టిడ్కో గృహాల సముదాయం

సమస్యలు సకాలంలో పరిష్కరించేనా?

పంపిణీ చేయాల్సిన ఇళ్లకు చిన్నచిన్న పనులు చేయాల్సి ఉందని, అవి పూర్తిచేసి అందిస్తామని అధికారులు చెబుతున్నారు. రుద్రవరం వద్ద ఇప్పటికే కేటాయించిన గృహాల్లో చాలా తక్కువ మంది మాత్రమే గృహప్రవేశాలు చేశారు. పూర్తిస్థాయిలో వసతులు లేకపోవడంతో వెనుకంజ వేస్తున్నారు. అక్కడ తిష్ఠ వేసిన సమస్యలపై ఇటీవల ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అర్జీ కూడా అందించారు. గృహనిర్మాణ సముదాయ ప్రాంతంలో పొదలు వ్యాపించడంతోపాటు విద్యుత్తు సౌకర్యం కల్పించలేదు. అక్కడ ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర పరికరాలు తుప్పుపట్టి పాడైపోతున్నాయి. అక్కడ నిర్మించిన మురుగు నీటి శుద్ధి కేంద్రం, రిజర్వాయర్ ఇలా అన్నీ అలంకారంగా మారాయి. వీటన్నింటినీ సకాలంలో పరిష్కరించగలిగితేనే లబ్ధిదారులు నివాసం ఉండే అవకాశం ఉంటుంది. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి గృహప్రవేశం వేళకు అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉగాదికి 1008 మందికి ఇళ్లు

నగరంలోని దేశాయిపేట గోసంఘం ప్రాంతంతో పాటు బందరు మండలం రుద్రవరం గ్రామంలో రెండు చోట్ల టిడ్కో గృహసముదాయ నిర్మాణాలు చేపట్టారు. గో సంఘం వద్ద భవన నిర్మాణాలు పూర్తి కావడంతో మొత్తం 864 మందికి అక్కడ ఇళ్లు కేటాయించారు. ప్రస్తుతం ఇళ్లు పొందిన వారు అక్కడ ఉంటున్నారు. రుద్రవరంలో కొన్ని ఇళ్లు పూర్తవగా, మరికొన్ని చివరి దశలో ఉన్నాయి. ఇంకా వేలాది పునాది దశలోనే ఆగిపోయాయి. 1440 ఇళ్లు నిర్మాణం పూర్తవగా వాటిలో 432 ఇళ్లు కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత లబ్ధిదారులకు కేటాయించారు. ఇంకా 1008 చివరిదశలో ఉన్నాయి. ప్రభుత్వం అలాంటి ఇళ్లను పూర్తి చేసి ఉగాది నాటికి లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించేలా చూడాలని ఆదేశించడంతో అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టారు.

మొత్తం కేటాయించిన ఇళ్లు:	6,400
నిర్మాణం పూర్తయినవి:	2,304
పునాది దశలో ఆగినవి:	4,096
ఇప్పటివరకు లబ్ధిదారులకు కేటాయించినవి:	1,296

చెడు ఆహార అలవాట్లతోనే క్యాన్సర్

రుద్రవరం (మచిలీపట్నం రూరల్), న్యూస్‌టుడే: చెడు ఆహార అలవాట్లతోనే క్యాన్సర్ వస్తుందని కృష్ణా యూనివర్సిటీ ఉపకులపతి కె.రాంజీ పేర్కొన్నారు. మణిపాల్ ఆసుపత్రి సౌజన్యంతో కృష్ణా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. జంక్, ఫాస్ట్ ఫుడ్స్‌లో క్యాన్సర్ కారక పదార్థాలు ఎక్కువగా ఉంటాయని వాటికి దూరంగా ఉండాలని సూచించారు. రెక్టర్ ఆచార్య ఎం.వి.బసవేశ్వరరావు మాట్లాడుతూ.. తొలి దశలో క్యాన్సర్‌ను గుర్తిస్తే నివారణ సులభమన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ విభాగం సమన్వయకర్త డా.ఎం.శ్రావణి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వైద్యులు భవాని, శ్రీదివ్యలు, సల్మా, శేషారెడ్డి పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న ఉపకులపతి రాంజీ

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే: సైబర్ నేరాలపై అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలని యూనియన్ బ్యాంకు విజయవాడ జోనల్ హెడ్ సీహెచ్ వీఎన్ భాస్కర్‌రావు తెలిపారు. ఆర్‌బీఐ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఆర్థిక సాక్షరత వారోత్సవాల్లో భాగంగా నగరంలోని పట్టాభి గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డిజిటల్ లావాదేవీలు పెరగడంతో సైబర్ నేరాలు పెరుగుతున్నందున తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మచిలీపట్నం రీజినల్ హెడ్ కె.వెంకట్రావు, డిప్యూటీ రీజినల్ హెడ్‌లు రామలింగారెడ్డి, హెచ్‌పీ దాస్, పట్టాభి గ్రామీణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ స్వర్ణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న భాస్కర్‌రావు, వేదికపై అధికారులు

మహా శివరాత్రికి విశేష పూజలు

మచిలీపట్నం (గొడుగుపేట): నగరంలోని ఖొజ్జిల్లిపేట నాగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ లంకిశెట్టి నీరజ తెలిపారు. బుధవారం ఆమెతో పాటు మున్సిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పీవీ ఫణికుమార్, కార్పొరేటర్ దింటకుర్తి సుధాకర్ తదితరులు ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. శివరాత్రి సందర్భంగా దేవాలయంలో మహాశివార్చన, కుంకుమ పూజ, రుద్రాభిషేకం, లింగోద్భవ వేళ ప్రత్యేక అభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఆప్కాస్ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు సహకారంతో ఉత్సవాల్లో భక్తులకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈవో మాధవీలత, కమిటీ సభ్యులు కొల్లూరి త్రివేణి, పి.మౌనిక, గద్దం చిన్న శివయ్య, సూదాబత్తుల రంగారావు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అతిథులు, ధర్మకర్తల మండలి సభ్యులు

సకాలంలో పన్నులు చెల్లించాలి

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: సకాలంలో పన్నులు చెల్లించాలని నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు అన్నారు. బుధవారం ఆయన నగరంలోని 45వ డివిజన్‌లో సచివాలయ ఉద్యోగులతో కలిసి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి పన్ను బకాయిల గురించి వివరించారు. ప్రజలు చెల్లించే పన్నులపై నగర అభివృద్ధి ఆధారపడి ఉంటుందన్న విషయాన్ని అందరూ గుర్తించాలన్నారు. పలువురు డ్రైనేజీ, కల్వర్టులు, అంతర్గత రోడ్ల సమస్యలను కమిషనర్‌కు వివరించి పరిష్కరించాలని కోరారు. డివిజన్ ఇన్‌ఛార్జి పీవీ ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న కమిషనర్

చిత్రలేఖనంలో విద్యార్థిని సత్తా

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: స్థానిక సెయింట్ ఫ్రాన్సిస్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న ఎం.వజ్రశ్రేష్ఠ చిత్రలేఖన పోటీల్లో ప్రతిభ చాటింది. విశాఖపట్నం జిల్లా చోడవరంలో.. చోడవరం చిత్ర కళా నిలయం నిర్వహించిన 8వ ఆల్ ఇండియా ఆర్ట్ కాంపిటిషన్ పోటీల్లో బంగారు పతకం సాధించింది. మచిలీపట్నం ఆర్ట్ అకాడమీ వ్యవస్థాపకులు బీవీఎస్ రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు బాలికను అభినందించారు.

బహుమతి అందుకుంటున్న వజ్రశ్రేష్ఠ

ఆసక్తిగా భగవద్గీత శ్లోకాల పోటీలు

పామర్రు(గ్రామీణం): మండలంలోని అడ్డాడ శ్రీఅరవింద విజ్ఞాన విహార ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో బుధవారం నిర్వహించిన భగవద్గీత శ్లోకాల పోటీలు ఆసక్తికరంగా సాగాయి. కళాపీఠం అధ్యక్షుడు కాటూరు వెంకట మురళీకృష్ణ అధ్యక్షత వహించారు. ఘంటసాల వర్ధంతిని పురస్కరించుకుని పామర్రు, ఘంటసాల, ఎన్టీఆర్ కళాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు అనర్గళంగా శ్లోకాలు చెప్పి ఆకట్టుకున్నారు. మోహనశ్రీ, హంసిని(8వ తరగతి), నరసింహాచార్యులు, కారుణ్య(7వ తరగతి), హేమశ్రీ, సాయిఉషశ్రీ(ఐదో తరగతి) విద్యార్థులు విజేతలుగా నిలిచారు.

దీన్‌దయాళ్ సేవలు చిరస్మరణీయం

మచిలీపట్నం(గొడుగుపేట): దీన్‌దయాళ్ సేవలు చిరస్మరణీయమని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి యామినీశర్మ పేర్కొన్నారు. పండిట్ దీన్‌దయాళ్ వర్ధంతిని నగరంలోని భాజపా కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఆరెస్సెస్ సిద్ధాంతాలకు ఆకర్షితులై దేశసేవకు అంకితమయ్యారని చెప్పారు. భాజపా జిల్లా అధ్యక్షుడు తాతినేని శ్రీరామ్, నాయకులు గజేంద్రరావు, శ్రీనివాస్, శ్రీరామచంద్రమూర్తి, రాము, ఎస్.సుబ్బారావునాయుడు, హరికృష్ణ, పాండురంగారావు నివాళులు అర్పించారు.

నివాళులర్పిస్తున్న యామినీశర్మ, శ్రీరామ్, నాయకులు

ఘంటసాలకు నివాళి

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే: ప్రముఖ నేపథ్య గాయకుడు, సంగీత దర్శకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతిని స్థానిక జిల్లా గ్రంథాలయంలో బుధవారం నిర్వహించారు. ఉప గ్రంథాలయ అధికారి బీరం వెంకటరమణ మాట్లాడుతూ చరిత్రలో నిలిచిపోయే పాటలు ఘంటసాల ఆలపించారన్నారు. గ్రంథాలయ ఉద్యోగులు, పాఠకులతో కలిసి ఘంటసాల చిత్రపటానికి నివాళులర్పించారు.

ఘంటసాల చిత్రపటం వద్ద ఉద్యోగులు, పాఠకులు

రహదారి అధ్వానం.. ప్రయాణం నరకం

మండలంలోని అర్తమూరు నుంచి సాతులూరు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. సకాలంలో మరమ్మతులు చేయించకపోవడంతో బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసమై నేడు మట్టి రోడ్డుగా దర్శనమిస్తోంది. సుమారు 3 కిలోమీటర్లు ఉన్న ఈ దారి గుంతలమయంగా, అస్తవ్యస్తంగా ఉండటంతో రాకపోకలు సాగించడానికి వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితులలో ఎవరినైనా ఆసుపత్రికి తీసుకెళ్లాలంటే వాహనాలు రాని పరిస్థితి. రోడ్డు పటిష్ఠంగా నిర్మించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, బంటుమిల్లి

మొక్కలకు రక్షణ ఏదీ ?

నగరంలోని మూడు స్తంభాల కూడలి నుంచి బైపాస్ రోడ్డు డివైడర్‌పై మొక్కలు నాటి వదిలేశారు. సంబంధిత అధికారులు రక్షణ కంచె ఏర్పాటు చేయకపోవడం, నీళ్లు పట్టకపోవడంతో అవి ఎండిపోతున్నాయి. ప్రధానంగా హౌసింగ్ బోర్డు సర్కిల్ నుంచి మాచవరం వరకు పూర్తిగా ఎండిపోయాయి. వేసవి సమీపిస్తున్నందున అధికారులు ఇప్పటికైనా స్పందించి మొక్కలకు సక్రమంగా నీళ్లు పోయడంతో పాటు రక్షణ కంచె ఏర్పాటు చేసి కాపాడాలని నగరవాసులు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

రక్షణగోడ నిర్మించరూ..

చిట్టిగూడూరు గ్రామ చెరువు చుట్టూ ఉన్న ప్రధాన రహదారి కోతకు గురవడంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారి నిర్మించినా రిటైనింగ్ వాల్ లేకపోవడంతో రోడ్డు క్రమేపీ కోతకు గురవుతోంది. గత వైకాపా ప్రభుత్వ హయాంలోనే ఈ సమస్యను గ్రామస్థులు పాలకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. పశువుల రాకపోకల కారణంగా రోడ్డు అంచులన్నీ దెబ్బతింటున్నాయి. ఈ సమస్యను గ్రామస్థులు ఇటీవల ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్య తీవ్రతను గుర్తించి త్వరితగతిన రిటైనింగ్ వాల్ నిర్మించేలా చూడాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గూడూరు

కబేళాను అభివృద్ధి చేయరూ..

నగరంలో కబేళా అధ్వానంగా మారడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్లతరబడి ఈ సమస్యలతో అవస్థలు పడుతున్నా.. ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో కబేళాను అక్కడ నుంచి తరలిస్తామని చెప్పినా ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. పూర్తిస్థాయిలో వినియోగంలో లేక, ఇతర జంతు కళేబరాలు, వ్యర్థాలను తీసుకొచ్చి ఇక్కడ వేసి వెళ్లిపోతుండటంతో కుళ్లిపోయి దుర్వాసన వ్యాపిస్తోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

కలవరపెడుతున్న కల్వర్టులు

నగరంలోని వివిధ ప్రాంతాల్లో కల్వర్టులు ప్రమాదకరంగా తయారయ్యాయి. బైపాస్ రోడ్డు నుంచి పంచాయతీరాజ్ కాలనీకి వెళ్లే మలుపులో ఉన్న కల్వర్టు గోడలు పగిలిపోయాయి. ఈడేపల్లి, ఉల్లింగిపాలెం తదితర ప్రాంతాల్లో రహదారుల మధ్యలో డ్రెయిన్లపై కల్వర్టులు నిర్మించి రక్షణ గోడల నిర్మాణాన్ని విస్మరించారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున అధికారులు స్పందించి త్వరితగతిన రక్షణ గోడలు నిర్మించేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

పశువుల ఐడీ ట్యాగ్‌లతో బహుళ ప్రయోజనాలు

పెడన, న్యూస్‌టుడే: ఐడీ ట్యాగ్‌లతో పశువులకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయని జిల్లా పశువైద్యాధికారి డా.ఎన్‌సీహెచ్ నరసింహులు అన్నారు. పశుసంవర్ధక శాఖ ఐడీ ట్యాగ్‌ల విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిన నేపథ్యంలో పురోగతిని పరిశీలించేందుకు చేవేంద్ర, చెన్నూరు గ్రామాల్లో ఆయన బుధవారం పర్యటించారు. ఈ ట్యాగ్‌లు సాంకేతిక పరిజ్ఞానంతో రూపుదిద్దుకున్నాయని. . పశువుల వ్యక్తిగత ఆరోగ్య రికార్డు, వ్యాధి నిరోధక టీకాలు, జన్యు రికార్డు, సంతానోత్పత్తి చరిత్ర నమోదవుతాయని పేర్కొన్నారు. బీమా, దాణా రాయితీలు కూడా ఇందులో పొందుపర్చవచ్చన్నారు. పెడన వెటర్నరీ ఏడీ డా.కె.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

చేవేంద్రలో పశువు ట్యాగ్ పరిశీలిస్తున్న జిల్లా అధికారి

నేటి నుంచి పెదకళ్లేపల్లిలో బ్రహ్మోత్సవాలు

మోపిదేవి, న్యూస్‌టుడే: పెదకళ్లేపల్లిలో స్వయంభుగా వెలసిన శ్రీదుర్గాపార్వతి సమేత నాగేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమవుతాయని ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో తొలిరోజు స్వామిని పెండ్లికుమారునిగా అలంకరిస్తారు. 15న మహాశివరాత్రి పూజలు, లింగోద్భవ అభిషేకాలు జరుగుతాయి.

కోడి పందేల శిబిరంపై దాడి

పెడన, న్యూస్‌టుడే: స్థానిక పల్లోటి కాలనీలో కోడిపందేల శిబిరంపై బుధవారం ఎస్సై-2 షేక్ బషీర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు జరిపారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని రూ.3 వేల నగదు, కోడిపుంజును స్వాధీనం చేసుకున్నారు.

అసంపూర్తి భవనాలతో అవస్థలు

న్యూస్‌టుడే, పెడన గ్రామీణం

మండలంలో పలు భవనాలు అసంపూర్తిగా మిగిలిపోయాయి. 17 సచివాలయాలకు గానూ 8 మాత్రమే పూర్తయ్యాయి. మూడు భవనాలు అసలు మొదలు కాలేదు. ఉరివి, కొంకేపూడి, చేవెంద్ర గ్రామాల్లో నిర్మాణాలు చేపట్టలేదు. బల్లిపర్రులో పునాది స్థాయిలోనే నిలిచి పోయింది. చెన్నూరు సచివాలయం తుది దశకు చేరుకున్నప్పటికీ పూర్తి కావడం లేదు. జింజేరుపై కప్పు వరకు వచ్చింది. నందమూరు, మడకలలో రెండో స్లాబ్ పూర్తి చేశారు. రైతు సేవా కేంద్రాలు 17లో 8 మాత్రమే పూర్తయ్యాయి. నాలుగు నిర్మాణాలే ప్రారంభం కాలేదు. నాలుగు భవనాలు పైకప్పు వరకు వచ్చాయి. ఒకటి పూర్తయినా వినియోగంలోనికి రాలేదు. 15 ఆరోగ్య కేంద్రాల్లో నాలుగు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలినవి వేర్వేరు దశల్లో అసంపూర్తిగా ఉన్నాయి. నిర్మాణాలు పూర్తి కాని చోట్ల అరకొర సౌకర్యాలతో అద్దె భవనాల్లో నడుస్తున్నాయి.

పెడన గ్రామీణం: నందమూరులో అసంపూర్తిగా వదిలేసిన సచివాలయం, ఆర్‌ఎస్‌కే భవనాలు

❖ ఈ విషయమై పీఆర్ ఏఈ వై.ధర్మయ్య న్యూస్‌టుడేతో మాట్లాడుతూ సచివాలయాలకు, రైతు సేవా కేంద్రాలకు వేరే బడ్జెట్ నుంచి నిధులు కోసం ప్రతిపాదనలు పంపుతామని పేర్కొన్నారు. ఆరోగ్య కేంద్రాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

రుద్రవరం (మచిలీపట్నం రూరల్), న్యూస్‌టుడే: రుద్రవరం అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 18 మంది విద్యార్థులు అస్వస్థతకు లోనైనట్లు గుర్తించి చిన్నాపురం పీహెచ్‌సీ వైద్యులు డా.గౌతమ్ పరీక్షలు చేశారు. జ్వరంగా ఉన్న ఐదుగురి నుంచి రక్తనమూనాలు సేకరించారు. భోజనశాలను, మంచి నీటిని పరీక్షించారు. గురుకుల ప్రిన్సిపల్ ఎం.సూర్యచంద్రరావు, పీడీ కె.రత్నకిశోర్ వైద్య శిబిరాన్ని పర్యవేక్షించారు. పి.వి.పరమేశ్వరరావు, ఎస్.రాంబాబు, పి.అమ్మాజీ, ఎం.నాగలక్ష్మి తదితరులు వైద్యసేవలందించారు.

పరీక్షలు చేస్తున్న వైద్యుడు గౌతమ్

కిటికీలు, తలుపులు ఏర్పాటు చేయండి

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: నందమూరు జడ్పీ ఉన్నత పాఠశాల వంటశాల పనులను అసంపూర్తిగా వదిలేశారు. 2022-23లో నాడు- నేడు రెండో దశలో వంటశాలకు రూ.6 లక్షలు మంజూరయ్యాయి. అప్పుడు కిటికీలు, తలుపులు ఏర్పాటు చేయకపోవడంతో వంట చేసే వారు ఇబ్బందులు పడుతున్నారు. కోతులు, ఇతర జంతువులు వంటశాలలోకి యథేచ్ఛగా వస్తున్నాయి. సరకులు భద్రపర్చుకోవడానికి ఇబ్బందిగా ఉందని తలుపులు కిటికీలు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

వంటశాల ఇలా..

మానవతా స్వచ్ఛంద సంస్థ వితరణ

మచిలీపట్నం (కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారికి మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన నిత్యావసర వస్తువులు, దుస్తులు, రూ.10 వేల నగదు అందచేశారు. మచిలీపట్నంలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కిశోర్ కుమార్, కన్వీనర్ ముదిగొండ శాస్త్రి, కార్యదర్శి, మైనార్టీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ హసీమ్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు చేయూత అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

మద్యం దుకాణంలో దొంగతనం

పెడన, న్యూస్‌టుడే: పెడన మండలం బల్లిపర్రులోని దేవీ వైన్స్‌లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం అర్ధరాత్రి షాపు తలుపులు ధ్వంసం చేసి దుండగులు రూ.9వేల నగదు, కొన్ని మద్యం బాటిళ్లను దొంగిలించారు. వారి కదలికలు సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. పెడన రూరల్ సీఐ నాగేంద్రప్రసాద్, ఎస్సై-2 షేక్ బషీర్‌ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. మచిలీపట్నం నుంచి వచ్చిన క్లూస్ టీం ఆధారాలను సేకరించింది. మూడేళ్ల క్రితం ఇదే షాపులో రూ.1.50 లక్షలు అపహరించారు.

ఆధారాలను సేకరిస్తున్న క్లూస్ టీం

మున్సిపల్ కాంప్లెక్స్‌లు.. నిర్లక్ష్యానికి ప్రతీకలు

న్యూస్‌టుడే, పెడన

మున్సిపాలిటీకి ఆస్తిపన్నుల తర్వాత ప్రధాన ఆదాయ వనరుగా ఉండే షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో నిర్మించిన వీటిని నిర్వహించే వారు లేక శిథిలస్థితికి చేరుకుంటున్నాయి. ఈనేపథ్యంలో వ్యాపారులు ఈ కాంప్లెక్స్‌ల్లో దుకాణాలు లీజుకు తీసుకునేందుకు ఆసక్తి చూపించటంలేదు. ఫలితంగా ఆదాయంలోనూ వెనుకంజ కనిపిస్తోంది. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఐదు కాంప్లెక్స్‌లను నిర్మించారు. స్థానిక బస్టాండు సెంటరులోని మహాత్మాగాంధీ కాంప్లెక్స్‌లో అత్యధికంగా 20 దుకాణాలు, పాత కూరగాయల మార్కెట్ కాంప్లెక్స్‌లో 14, బంటుమిల్లి రోడ్డులో 9, కొత్తపేటలో 5, రైల్వేస్టేషన్ రోడ్డులోని మహిళా వాణిజ్య సముదాయంలో 10 అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇంజినీరింగ్ విభాగం నిర్లక్ష్యంతో ఇవి శిథిల స్థితికి చేరుకోవడంతోమొత్తం 59 దుకాణాలకు 20కు పైగా ఖాళీగా ఉన్నాయి. నెలకు రూ.8 లక్షలకు పైగా రావాల్సిన ఆదాయంలో సగం కూడా సమకూరటం లేదు.

శిథిల స్థితిలో బంటుమిల్లి రోడ్డు కాంప్లెక్స్

భవనాల్లో వర్షం: భవనాల పైకప్పులు దుస్థితికి చేరటంతో ఇబ్బందులు పడుతున్నామని లీజుదారులు ఆవేదన చెందుతున్నారు. బంటుమిల్లి రోడ్డు కాంప్లెక్స్‌లో మెట్లు పెచ్చులూడి పై అంతస్తుకు వెళ్లాలంటే భయపడుతున్నారు. మార్కెట్ కాంప్లెక్స్‌లోనూ ఇదే పరిస్థితి. ప్రైవేటు వ్యక్తులు వ్యర్థ మట్టిని డంప్ చేసినా అధికారులు తొలగింపు చర్యలు చేపట్టడం లేదు. కొన్ని చోట్ల భవనాల నుంచి మొక్కలు మొలుస్తున్నాయి.

పేరుకుంటున్న అద్దె బకాయిలు

ఈ మొత్తం కాంప్లెక్స్‌ల్లో దీర్ఘకాలంగా రూ.41.13లక్షల అద్దె బకాయిలు పేరుకోగా ఇటీవల రూ.20.12 లక్షలు వసూలు చేశారు. ఖాళీగా ఉన్న షాపులకు షెడ్యూల్ ప్రకారం వేలం నిర్వహిస్తున్నా లీజుదారులు ముందుకు రాని పరిస్థితి. ప్రస్తుత లీజుదారులు కొంతమంది ఖాళీ చేయకుండానే సంస్థలను మూసేసి వెళ్లిపోయారు. కాంప్లెక్స్‌లను ఆధునికీకరిస్తే పురపాలికకు ఆదాయం పెరుగుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. కాంప్లెక్స్‌ల నిర్వహణ ద్వారా నెలకు కనీసం రూ.10 లక్షల ఆదాయం వచ్చేలా తీర్చిదిద్దుతామని కమిషనర్ కొండయ్య చెప్పారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

(c) eenadu

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

కాటూరు(ఉయ్యూరు గ్రామీణం), న్యూస్‌టుడే : కాటూరు టౌన్ ఫీడర్‌లో తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించనున్న నేపథ్యంలో గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గృహాలకు సరఫరా అయ్యే విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నామని ఈఈ బి.వి.సుధాకర్ తెలిపారు.

పోరంకి, న్యూస్‌టుడే: పోరంకి సర్కిల్ పరిధిలోని బీజేఆర్‌నగర్, నిడమానూరు రోడ్డు, మహాలక్ష్మీనగర్, వసంత్‌నగర్, ఆర్టీసీ కాలనీ, లక్ష్మీపురం కాలనీ, రంగాబొమ్మ ఏరియా, సీతాపురంకాలనీ, శ్రీనివాసనగర్, బీఎస్‌ఎన్‌ఎల్ ఆఫీసు రోడ్డు, కృష్ణవేణి స్కూల్‌రోడ్డు, బందరురోడ్డు ప్రాంతాల్లో గురువారం ఉదయం 8 గంటల నుంచి ఒంటి గంట వరకు విద్యుత్తు మరమ్మతుల నిమిత్తం సరఫరా నిలిపేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యుత్తు తీగల మరమ్మతుల నేపథ్యంలో ఉంగుటూరు మండలం మానికొండ రెవెన్యూ పరిధిలోని వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లకు గురువారం సరఫరా నిలిపివేయనున్నామని నందమూరు సబ్‌స్టేషన్ అధికారులు ఓ ప్రకటనలో బుధవారం కోరారు.

కేసరపల్లిలో ఆర్‌జేడీ పర్యటన

గన్నవరం మండలం కేసరపల్లి మండల పరిషత్తు పాఠశాలను కాకినాడ విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు(ఆర్‌జేడీ) జి.నాగమణి బుధవారం సందర్శించారు. గ్యారెంటీ ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ(జీఎఫ్‌ఎల్‌ఎన్) కార్యక్రమంలో భాగంగా ఆమె పాఠశాలను పరిశీలించారు. పాఠశాల నిర్వహణ తీరును హెచ్ఎం ఎమ్.జ్యోతిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు, రికార్డులను పరిశీలించిన ఆర్‌జేడీ.. నాణ్యత ప్రమాణాలను తనిఖీ చేసి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో డీవైఈవో రవికుమార్ పాల్గొన్నారు. - గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే

అసంపూర్తి నిర్మాణం.. అవస్థలతో ప్రయాణం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: గన్నవరం నియోజకవర్గంలో పలు కీలక కార్యాలయాలకు ఏళ్లు గడుస్తున్నా వసతులు సమకూరడంలేదు. సరైన భవనాలు లేని పలు ప్రజోపయోగ సంస్థలకు రూ.కోట్లు కేటాయించి, భవనాల నిర్మాణం చేపట్టినా, వివిధ కారణాలతో పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. దీంతో అధికారులు, సిబ్బంది, ప్రజలు నానా అవస్థలు పడాల్సి వస్తోంది.

సగంలో ఆగిపోయిన బాపులపాడు పీహెచ్‌సీ భవనం

అరకొర వసతులతోనే: శిథిలావస్థకు చేరిన బాపులపాడు పీహెచ్‌సీ భవనం స్థానే కొత్తది నిర్మించేందుకు కార్యాచరణ ప్రారంభమైంది. శస్త్రచికిత్సలు చేసే గది పై కప్పు పాడైపోయింది. దీంతో ఆరేళ్లుగా ఇక్కడ చికిత్సలు నిలిపివేయాల్సి వచ్చింది. 2022లో రూ.1.82 కోట్ల వ్యయంతో ఎట్టకేలకు కొత్త భవనం నిర్మాణం చేపట్టినా, ఇప్పటికీ పూర్తి కాలేదు. దీంతో అరకొర వసతుల మధ్యే వైద్య సేవలందించాల్సి వస్తుంది.

నిధులు చాలక : ఆత్కూరు కేంద్రంగా గత తెదేపా ప్రభుత్వ హయాంలో నూతన పీహెచ్‌సీ ఏర్పాటు చేశారు. గన్నవరం, ఉంగుటూరు మండలాల్లోని తొమ్మిది గ్రామాలను దీని పరిధిలోకి చేర్చారు. ఏడేళ్ల కిందటే శాశ్వత భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. మూడేళ్ల కిందటే ఇవి ఓ కొలిక్కి వచ్చినా, మిగతా పనులకు వీలుగా నిధులు చాలకపోవడంతో భవనం పూర్తయినా వినియోగానికి వీల్లేకుండాపోయింది. దీంతో సచివాలయంలో ఓ గదిని ఆసరాగా చేసుకుని వైద్యులు, సిబ్బంది సేవలందించాల్సి వస్తుంది.

వైకాపా అధికారంలోకి వచ్చాక: ఎంతో కీలకమైన గన్నవరం తహసీల్దార్ కార్యాలయం అత్యంత పురాతన భవనంలోనే ఇప్పటికీ కొనసాగుతోంది. గత తెదేపా ప్రభుత్వ హయాంలో రూ.90 లక్షల వ్యయంతో నూతన భవనం నిర్మాణం చేపట్టారు. శ్లాబ్ దశకు చేరిన నిర్మాణం వైకాపా అధికారంలోకి రావడంతో ఆగిపోయింది. ఇప్పటికీ ఎలాంటి పురోగతి లేదు.

జంక్షన్ సీఐ కార్యాలయం: దశాబ్దాలుగా అద్దె భవనంలో కొనసాగుతున్న హనుమాన్‌జంక్షన్ పోలీస్ సర్కిల్ కార్యాలయానికి గత ప్రభుత్వ హయాంలో శాశ్వత భవనం నిర్మించారు. కాకుంటే పూర్తిగా ప్రజా విరాళాలతో నిర్మించడంతో ఆరోపణలు వచ్చాయి. కూటమి ప్రభుత్వంలో దీనిపై విచారణ జరపాలనే డిమాండ్లు రావడంతో పూర్తిగా భవనం సిద్ధమైనా రెండేళ్లుగా నిరుపయోగంగానే ఉంచేశారు.

ముక్తేశ్వరుడికి వెండి నగల బహూకరణ

ఆలయ కమిటీ సభ్యులకు అందిస్తున్న దాతలు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: పెరికీడులో కొలువై ఉన్న శ్రీముక్తికాంత సమేత ముక్తేశ్వరస్వామి వారికి మచిలీపట్నానికి చెందిన భక్తులు వెండి వస్తువులు కానుకగా సమర్పించారు. శివలెంక విద్యాసాగర్, అమృతవల్లి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు, కుమార్తెలు 1,250 గ్రాముల వెండితో రూపొందించిన 1008 మారేడు దళాల మాల, 108 మారేడు దళాల మాలలు బహూకరించారు. బుధవారం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులకు వీటిని అందజేశారు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

కానూరు : 80085 74647 హనుమాన్‌జంక్షన్, 98486 27585

స్పందన: ★ కానూరు ఉమాశంకర్‌నగర్ మొదటి రోడ్డులో కొన్ని రోజులుగా మురుగు రోడ్డుపైకి వచ్చి, పూడిక తీత చేయక ఇబ్బంది పడుతున్నామని స్థానికులు మేమున్నాం మీకు తోడుగా ద్వారా తెలిపిన సమస్యను కమిషనర్ షేక్ నజీర్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. - న్యూస్‌టుడే, కానూరు

★ పెనమలూరులోని ప్రధాన డ్రెయిన్లలో పూడిక పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోందని గ్రామస్థులు మేమున్నాం మీకు తోడుగా ద్వారా గ్రామకార్యదర్శి అహ్మద్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన సిబ్బందితో బుధవారం ఆయా ప్రాంతాల్లోని డ్రెయిన్లలో పూడిక తీయించారు.

★ గంగూరు ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్ వెనుక కాల్వకట్ట నివాసితులకు తాగునీటి సరఫరా పూర్తిస్థాయిలో లేదని మేమున్నాం మీకు తోడుగా ద్వారా గ్రామ కార్యదర్శి ప్రకాష్‌నాథ్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. బుధవారం ఆ ప్రాంతంలోని తాగునీటి బోరుకు అధిక సామర్థ్యం ఉన్న మోటారు ఏర్పాటు చేయించి సమస్య పరిష్కరించారు.

★ గంగూరు మహిళా మండలి కట్ట, ఈఎస్ఐ కాల్వకట్టలపై వీధి లైట్లు కొన్ని పనిచేయడం లేదని స్థానికులు చేస్తున్న ఫిర్యాదును గ్రామ కార్యదర్శికి వివరించగా స్పందించిన ఆయన బుధవారం ఈ ప్రాంతంలోని 12 వీధి దీపాలకు మరమ్మతులు చేయించి లైట్లు వెలిగేలా చేయించారు.

★ వణుకూరులో పలుచోట్ల తాగునీటి పైపులైన్లు పగిలిపోవడం, మరమ్మతులకు గురికావడంతో తాగునీరు పూర్తిస్థాయిలో సరఫరా కాకపోవడం, నలకలు వస్తున్నాయని స్థానికులు ఫిర్యాదులు చేశారు. ఈ సమస్యను గ్రామకార్యదర్శి దుర్గాప్రసాద్‌కు తెలుపగా స్పందించారు. బుధవారం నుంచి నూతన పైపులైన్ల ఏర్పాటును మొదలుపెట్టారు. - న్యూస్‌టుడే, పెనమలూరు,

14 నుంచి ఉచిత యోగా శిబిరం

పెనమలూరు, న్యూస్‌టుడే: శ్రీ వెంకటేశ్వర యోగా సేవా కేంద్రం ఆధ్వర్యాన ఈనెల 14వ తేదీ ఉదయం 6 గంటల నుంచి పెనమలూరు కూడలిలోని అనిల్ ఎస్టేట్స్ కల్యాణ మండపంలో ఉచిత యోగా శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 28 రోజుల పాటు నిర్వహించనున్న ఈ శిబిరానికి ఆసక్తి ఉన్న వారు ఎవరైనా హాజరు కావచ్చని పేర్కొన్నారు. వివరాలకు 91333 06804 సంప్రదించాల్సిందిగా కోరారు.

రైతులకు చేరువగా డ్రోన్ సేవలు

అవగాహన కల్పిస్తున్న జేడీ పద్మావతి, పక్కన ఏడీ సునీల్, ఏవో రంగనాథ్

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: వ్యవసాయంలో డ్రోన్ల వినియోగాన్ని పెంచి, రైతులకు ఖర్చు, ప్రయాసలు తగ్గించడం కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని జిల్లా వ్యవసాయాధికారిణి పద్మావతి పేర్కొన్నారు. రానున్న ఖరీఫ్ నుంచి కర్షకులకు డ్రోన్ సేవలు విస్తృతంగా అందుబాటులోకి తెచ్చేలా డ్రోన్ ఉబరైజేషన్ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. బుధవారం రంగన్నగూడెంలో పర్యటించిన ఆమె డ్రోన్ సేవలపై అవగాహన కల్పించారు. స్మార్ట్ ఫోన్‌లోని ప్లేస్టోర్ నుంచి డ్రోన్ మార్ట్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, తమ వివరాలు నమోదు చేసుకుంటే, వారి అవసరాలను బట్టి డ్రోన్ సేవల్ని పొందవచ్చునన్నారు. ఈ-పంట నమోదు, రైతులే స్వయంగా ఈ-పంట నమోదు చేసుకునే ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఏడీఏ సునీల్, ఏవో రంగనాథ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించండి

ఉయ్యూరు, తాడిగడప, న్యూస్‌టుడే: అనధికార భవనాలు, నాన్ లేఅవుట్లలోని స్థలాలను, ప్లాన్లకు విరుద్ధంగా నిర్మించిన భవనాలను క్రమబద్ధీకరించుకోవాలని అందుకు బీపీఎస్, ఎల్‌ఆర్‌ఎస్ వంటి పథకాలను యజమానులు సద్వినియోగించుకోవాలని మున్సిపల్ శాఖ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ జి.సుబ్బారావు కోరారు. ఉయ్యూరు పురపాలక సంఘం కార్యాలయంలో బుధవారం ఆయన పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ప్రభుత్వం నిర్దేశించిన నియమావళి ప్రకారం వాటిని క్రమబద్ధీకరించుకోవాలని లేని పక్షంలో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఆయా అంశాలపై పట్టణంలోని అనధికార స్థలాలు, భవనాలపై ఆయన మాట్లాడారు. వారికి నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఇదే విషయమై పోరంకిలోని కమిషనర్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. కమిషనర్ జి.రామారావు, పట్టణ ప్రణాళికాధికారిణి ఆషా, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జి.సుబ్బారావు

చదువుతోపాటు క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వాలి

ఓవరాల్ ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకున్న గోసాల క్యాంపస్ ప్రతినిధికి జ్ఞాపిక అందజేస్తున్న ఈడీవో, పక్కన సీఐ

పునాదిపాడు (కంకిపాడు), న్యూస్‌టుడే: క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనే విద్యార్థులు చదువుల్లో మరింత రాణిస్తారని జిల్లా వ్యాయామవిద్యాధికారి యు.వి.సుబ్బారావు, కంకిపాడు సీఐ మురళీకృష్ణ అన్నారు. డాక్టర్ బి.ఎస్.రావు స్మారక విజయవాడ జోన్ స్థాయి క్రీడా పోటీలు బుధవారం పునాదిపాడు పరిధిలోని శ్రీచైతన్య హైస్కూల్ (గోసాల క్యాంపస్) ప్రాంగణంలో ఉత్సాహంగా సాగింది. వివిధ క్యాంపస్‌లకు చెందిన సుమారు రెండు వేల మంది విద్యార్థినీ, విద్యార్థులతో ఆవరణలో ఆటల సందడి నెలకొంది. ఓవరాల్ విన్నర్స్ ఛాంపియన్‌షిప్‌ను గోసాల క్యాంపస్, రన్నరప్‌షిప్‌ను గన్నవరం క్యాంపస్ సాధించాయి. విజేతలకు పతకాలు, ట్రోఫీలు, బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమాల్లో చైతన్య విద్యా సంస్థల ఈజీఎం ఎం.మురళీకృష్ణ, ప్రాంతీయ ఇన్‌ఛార్జి ధీరేంద్ర, ప్రధానోపాధ్యాయులు పి.శివ, రాజు తదితరులు పాల్గొన్నారు.

దీన్‌దయాళ్ కృషి మరువలేనిది

కంకిపాడు, న్యూస్‌టుడే : రాష్ట్రీయ స్వయం సంఘ్ ప్రచారక్, భారతీయ జనసంఘ్ అధ్యక్షుడిగా దేశ సమగ్రత, ఐక్యమత్యానికి ఎనలేని కృషి చేసిన పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ సేవలు చిరస్మరణీయమని భాజపా నాయకులు పేర్కొన్నారు. బుధవారం ఆయన వర్ధంతిని పురస్కరించుకుని కంకిపాడులో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ ప్రతినిధులు శ్రీనివాసరావు, సురేష్, హరికృష్ణ, కరుణకుమార్, స్వప్న, శివపార్వతి తదితరులు పాల్గొన్నారు.

నిర్మిస్తే వంతెన.. తప్పేను యాతన

బాపులపాడు మండలం సింగన్నగూడెం-మల్లవల్లి మార్గంలో ఏటివాగుపై దశాబ్దాల కిందట నిర్మించిన లోలెవల్ కల్వర్టు కొన్నేళ్ల కిందట ధ్వంసమైపోయింది. 2024 సెప్టెంబరులో వచ్చిన వరదలకు వాగు పొంగి కొన్ని రోజులు రాకపోకలు సైతం నిలిచిపోయాయి. అంతంతమాత్రంగా ఉన్న ఈ కల్వర్టుపై భారీ వాహనాలు ప్రయాణించడం ప్రయాసగా మారింది. ఇక్కడ హైలెవల్ వంతెన నిర్మించాలని రెండు గ్రామాల ప్రజలు ఎప్పట్నుంచో విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రస్తుతం ఈ రహదారి పునర్నిర్మాణం చేపట్టిన నేపథ్యంలో వంతెన కూడా నిర్మిస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెబుతున్నారు. - న్యూస్‌టుడే, హనుమాన్‌జంక్షన్

రాళ్లు తేలాయ్ సారు.. !

విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి పక్కన ఉన్న సర్వీస్‌రోడ్డులో గండిగుంట శివారు ఆనందపురం వద్ద కొంత మేర అభివృద్ధి చేయకుండా అసంపూర్తిగా వదిలేశారు. దీంతో రాళ్లు తేలి నిత్యం రాకపోకలు కొనసాగించే ఆనందపురం, వెంకటాపురం, చిన ఓగిరాల గ్రామాల ప్రజలు, ద్విచక్రవాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పొరపాటున పడితే తీవ్రగాయాలు అవుతున్నాయని వాపోతున్నారు. ఈ సమస్యను పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గండిగుంట (ఉయ్యూరు గ్రామీణం)

మీ స్ఫూర్తికి వందనం..

వృక్షో రక్షతి రక్షితః..పూర్వ కాలం నుంచి పెద్దలు చెబుతూ వస్తున్న మాట ఇది. కానీ నేటి ఆధునిక కాలంలో అభివృద్ధి పేరుతో ఎంతటి చెట్టునైనా ఇట్టే కొట్టేస్తున్నారు. కానీ గన్నవరం ఆర్టీసీ అధికారులు మాత్రం ఇందుకు భిన్నంగా పచ్చదనం పరిరక్షణకు పట్టం కట్టారు. బస్టాండ్ ప్రాంగణం చుట్టూ ప్రహరీ నిర్మించే క్రమంలో ఏళ్ల నాటి రావి చెట్టు ఒకటి అడ్డు వచ్చినా తొలగించకుండా, చెట్టు ఉన్న ప్రాంతం వరకు గోడను మలుపు తిప్పి నిర్మించడం స్ఫూర్తిదాయకంగా నిలిచింది. - న్యూస్‌టుడే, హనుమాన్‌జంక్షన్

కొత్తది కట్టాలి.. కష్టాలు తీర్చాలి

శిథిలస్థితికి ఉప్పులూరు వంతెన

ఉప్పులూరు, కంకిపాడు, న్యూస్‌టుడే : అనుకున్నదే అయింది. రైవస్ కాల్వపై 1939లో నిర్మించిన ఉప్పులూరు వంతెనపై మంగళవారం పెద్ద గుంత ఏర్పడింది. వాహనాలు రాకపోకలు సాగించే సమయంలో కట్టడం ఊగిసలాడుతోంది. దీన్ని పూడ్చడానికి పంచాయతీ సిబ్బంది నానా తంటాలు పడుతున్నారు. బాధ్యత వహించాల్సిన రోడ్లు-భవనాలశాఖ అధికారులు మాత్రం 'నిధుల కొరత' పేరుతో కన్నెత్తి చూడడంలేదు. వంతెనపై భారీ వాహనాలను నిషేధించాలని డిమాండ్ చేస్తూ ఇటీవల ధర్నా చేయడం తెలిసిందే. నాలుగు రోజుల పాటు ఇసుక, రబ్బీష్ టిప్పర్లను నియంత్రించినా ఆ తర్వాత షరామామూలైంది.

పొంచి ఉన్న ప్రమాదం : వంతెన పిల్లర్లు, శ్లాబ్‌లు, గోడలు, రెయిలింగ్‌లు చాలావరకు ధ్వంసమయ్యాయి. కాల్వ కట్ట కోతకు గురై నాలుగు వైపులా లోయలు.. పైభాగంలో పగుళ్లు రోజురోజుకీ విస్తరిస్తూ చివరకు పెద్ద గుంత ఏర్పడింది. ఈ సమస్యపై 'ఈనాడు' దినపత్రికలో గత నెల 17న 'వంతెనపై గుంతనుపూడ్చరూ..' శీర్షికన వార్త ప్రచురితం కాగా గ్రామ పంచాయతీ సిబ్బంది కంకర మిశ్రమంతో పూడ్చారేగాని సంబంధితశాఖ అధికారులు స్పందించలేదు. భారీ వాహనాల నియంత్రణ, పైభాగం పటిష్ఠం చేసే విధంగా అత్యవసర పనులు వెంటనే చేపట్టాలి. లేకుంటే వేలాది వాహనదారులకు తీవ్ర అవస్థలు తప్పవు

బ్రిడ్జిపై వెళ్తున్న భారీ లారీ, అంతర్ చిత్రంలో వంతెనపై గొయ్యి

20 ఏళ్లుగా ప్రతిపాదనలకే సరి: ఉప్పులూరు, బుడమేరు కొత్త వంతెనల నిర్మాణానికి రూ.10కోట్లు మంజూరు చేసినట్లు అప్పటి ఎమ్మెల్యే యలమంచిలి నాగేశ్వరరావు సమక్షంలో ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజినీర్ గ్రామస్థులకు స్వయంగా చెప్పారు. పనులు మాత్రం జరగలేదు. అప్పటి నుంచి ఈ తంతు ఇలానే కొనసాగి చివరకు కూలే స్థితి చేరుకుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కొత్త వంతెన నిర్మాణం పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు

యనమలకుదురు, న్యూస్‌టుడే : యనమలకుదురు శ్రీరామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో శివరాత్రికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని దేవాదాయ ధర్మాదాయశాఖ ప్రాంతీయ కమిషనర్ వి.త్రినాథరావు సూచించారు. బుధవారం ఆలయంలో జరుగుతున్న ఏర్పాట్లను ఈవో భవానీని అడిగి తెలుసుకున్నారు. లక్షలాది మంది భక్తులకు తగిన విధంగా సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో కృష్ణా జిల్లా సహాయ కమిషనర్ ఎన్‌వీ సాంబశివరావు, ఆలయ అర్చకులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు

దళితులపై దాడులు తగదు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులు, హత్యల నివారణకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం ఉమ్మడి కృష్ణా జిల్లా ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశం హనుమాన్ జంక్షన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ శాతాన్ని మరింత పెంచాల్సి ఉందన్నారు. అమరావతిలో బాబూజగ్జీవన్‌రామ్ స్మృతీవనం, స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలన్నారు. చర్మకారులు, డప్పు కళాకారులకు రూ.6 వేల చొప్పున పింఛను ఇవ్వాలన్నారు. ఈనెల 18న మార్కాపురంలో జరిగే రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి అందరూ హాజరు కావాలని కోరారు. నాయకులు నాగేశ్వరరావు, బొకినాల సాంబశివరావు, వరప్రసాద్, కలపాల కార్తీక్, కుంపటి వెంకటేశ్వరరావు, కొడాలి సుధాకర్, గంగాధర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దండు వీరయ్య

శివరాత్రి సన్నద్ధత సమావేశం నేడు

కంకిపాడు: శివరాత్రిని పురస్కరించుకుని సన్నద్ధత సమావేశం గురువారం ఉదయం 10 గంటలకు మద్దూరులో జరుగుతుందని తహసీల్దార్ భవనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ, పంచాయతీ, పోలీస్, వైద్యఆరోగ్య, మత్స్య, అగ్నిమాపకశాఖలు, ట్రాన్స్‌కో అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. మద్దూరు, కాసరనేనివారిపాలెంలోని పుష్కర ఘాట్ల సమీప కృష్ణా నది పాయల్లో నీరు పుష్కలంగా అందుబాటులో ఉండడంతో శివరాత్రి పుణ్యస్నానాలు, పితృదేవతల పిండ ప్రదానాలకు ప్రతి ఏటా 30 వేలకుపైగా భక్తులు తరలి వస్తుంటారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని అవాంఛనీయ ఘటనలు, భక్తులకు ఇబ్బందులు ఎదురవకుండా ముందస్తు కార్యాచరణ నిమిత్తం సమావేశం నిర్వహిస్తున్నామన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూత

హనుమాన్‌జంక్షన్: కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద క్రిబ్‌కో సంస్థ రేమల్లె గ్రామ పంచాయతీలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించింది. చొదిమెళ్ల జ్యోతి, కలపాల జయంతి అనే ఇద్దరు మహిళల స్వయం ఉపాధికి రెండు కుట్టు యంత్రాలు ఉచితంగా అందజేసింది. దీంతో పాటు గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య నిర్వహణకు ఉపయోగపడేలా కొంత సామగ్రి సమకూర్చింది. బుధవారం సంస్థ ప్రతినిధులు అక్రమ్, రోహన్, ఉపసర్పంచి యనమదల సుదర్శనరావు, కార్యదర్శి ఆంజనేయులుకు వీటిని అందించారు. నాయకులు కలపాల రాధాకృష్ణ, కుమార్ పాల్గొన్నారు.

రైతు గుర్తింపు కార్డు తప్పనిసరి

దావులూరు (కంకిపాడు), న్యూస్‌టుడే : ప్రధానమంత్రి కిసాన్ యోజన కింద కేంద్ర ప్రభుత్వ సాయం పొందడానికి రైతు గుర్తింపు (ఐడీ) తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారిణి ఉషారాణి సూచించారు. నమోదు చేయడానికి సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో వీఏఏలు సిద్ధంగా ఉన్నారన్నారు. మినుము పైరుపై తెల్లదోమ, లద్దె, తామర పురుగుల నివారణ చర్యలను తెలియజేశారు. వ్యవసాయ సలహా లేకుండా రసాయన మందులు వాడవద్దని సూచించారు. వీఏఏ యామిని, రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతులకు సూచనలిస్తున్న ఏవో, వీఏఏ

రంగులేశారు.. శుభ్రపరిచారు..

నున్న(పి.నైనవరం), న్యూస్‌టుడే: కొద్దిరోజులు కిందట విజయవాడ రూరల్‌మండలంలోని పి.నైనవరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరిగింది. దీనికి స్థానిక ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు హాజరయ్యారు. ఆ సమయంలో పాఠశాల ఆవరణలోని పారిశుద్ధ్య అస్తవ్యస్తంగా ఉండడంతో అసహనం వ్యక్తం చేశారు. దీంతో పాఠశాల టీచర్లు, గ్రామస్థులు కొంత మంది కలిసి పాఠశాలకు రంగులేసి సుందరంగా తీర్చిదిద్దారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకున్నామని ప్రధానోపాధ్యాయుడు బి.దామోదరం తెలిపారు.

కృష్ణా రివర్ క్రాస్‌లో ప్రతిభ

దేవన్ శ్రీకర్‌ను అభినందిస్తున్న గాయత్రి

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఎనికేపాడులోని హ్యాపీ చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ రిహాబిలేషన్ కేంద్రానికి చెందిన ఆటిస్టిక్ విద్యార్థి తేళ్ల దేవన్ శ్రీకర్(9) కృష్ణా రివర్‌ను ఈదాడని కేంద్రం డైరెక్టర్ గాయత్రి తిపిరినేని బుధవారం వెల్లడించారు. ఈ నెల 8న ఆక్వా డెవిల్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కృష్ణా రివర్ క్రాస్ (1.5 కి.మీ.)ను శ్రీకర్ 45 నిమిషాల వ్యవధిలో ఈదాడని పేర్కొన్నారు. కేంద్రంలోని ఈత కొలనులో స్విమ్మింగ్ శిక్షకుడు రాజేష్ పర్యవేక్షణలో రోజూ 3 గంటల సాధన చేశాడని వివరించారు. ప్రత్యేక కేటగిరీ కింద నిర్వాహకుల అనుమతితో శ్రీకర్ కృష్ణా రివర్ క్రాస్ చేసి ప్రశంసలందుకున్నాడని పేర్కొన్నారు. బుధవారం కేంద్రంలో అతనిని అభినందించారు.

ట్రావెల్ బస్సు ఢీ..వృద్ధుడి మృతి

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ప్రొద్దుటూరు పరిధిలో ఈనెల 10వ తేదీన జరిగిన రహదారి ప్రమాదంలో ఓ వృద్ధుడు అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఉయ్యూరు మండలం కడవకొల్లు గ్రామానికి చెందిన వీర్ల రంగారావు (65) మండలంలోని ప్రొద్దుటూరులో జాతీయ రహదారిని దాటుతుండగా ఉయ్యూరు నుంచి విజయవాడ వెళ్తున్న ట్రావెల్ బస్సు ఢీ కొట్టగా అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న కంకిపాడు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించి పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ ఆర్టీసీ డ్రైవర్ ..

పెనమలూరు, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన ఆర్టీసీ డ్రైవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పోరంకికి చెందిన భూక్యా బాలు (53) గవర్నర్‌పేట బస్ డీపోలో డ్రైవర్‌గా పనిచేస్తుంటారు. ఈనెల 10వ తేదీన విధులకు వెళ్లి తిరిగి రాత్రి 8 గంటల సమయంలో ద్విచక్రవాహనంపై ఇంటికి బయల్దేరారు. కామయ్యతోపు వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి ద్విచక్రవాహనంపై నుంచి కిందపడిపోయారు. సమాచారం తెలుసుకున్న కుటుంబసభ్యులు అతడిని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం వేకువజామున మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

15వ వర్ధంతి

మంచికి, మానవత్వానికి మారుపేరుగా నిలిచి ఉన్నతమైన వ్యక్తిత్వంతో జీవించిన మహనీయుడు, మా పురోభివృద్ధి కోసం బంగారుబాటను పరచిన ఆరాధ్యదైవం భౌతికంగా దూరమైనా నేటికి 15 సం॥లు గడిచినా సదా మీ స్మృతులతో..
జననం 20-10-1943 మరణం 12-02-2011
కీ॥శే॥ బొబ్బా విజయ్‌కుమార్ బెనర్జీ గారు
Rtd. The Nalgonda Dist. Co-Operative Bank Manager
భార్య: బొబ్బా అనురాధ కుమార్తె: శిరీష (మున్ని) మూల్పూరి

శ్రద్ధాంజలి

జననం: 1939 మరణం: 31-01-2026
కీ॥శే॥ లంక రామకోటయ్య గారు (రిటైర్డ్ టీచర్)
నా భర్తగారైన కీ॥శే॥ లంక రామకోటయ్య గారు ది. 31-01-2026 శనివారం ఉదయం స్వర్గస్తులైనారని తెలుపుటకు చింతిస్తున్నాము.
వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ... శోకతప్త హృదయాలతో...
భార్య: లంక లక్ష్మీకాంతమ్మ
కుమారుడు: లంక శ్రీనివాసరావు
కుమార్తె-అల్లుడు: బొండలపాటి సుమలత-శ్రీనివాసు (వాసు)
మనుమరాళ్ళు: బొండలపాటి శ్రీవిద్య, శ్రీదివ్య
సెల్: 8008083035, 8978902345, 98488 22999
పెద్దకర్మ ది. 12-2-26 గురువారం ఉ॥ 10 గంటలకు

(c) eenadu

గుడివాడ
● గుడివాడ ● పామర్రు ● అవనిగడ్డ

రహదారి నిర్మాణ పనుల పరిశీలన

మోదుమూడి(అవనిగడ్డ గ్రామీణం): వైకాపా ప్రభుత్వ హయాంలో మోదుమూడి ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతల్లో ఒక్కటీ పూడ్చలేదని సర్పంచి బచ్చు బేబీ అన్నారు. బుధవారం రహదారి నిర్మాణ పనులను గ్రామస్థులతో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే రహదారి అభివృద్ధికి రూ.90లక్షలు మంజూరు చేయించారన్నారు. బచ్చు నారాయణరావు, బచ్చు వెంకటనాథ్, గ్రామస్థులు రఘునాథ్, శ్రీహరి, యుగంధరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు చెల్లించండి

నాగాయలంక: గ్రామ పంచాయతీ పరిధిలోని గృహస్థుల ఇంటి పన్నులను ఈ నెల 15లోపుగా చెల్లించాలని డిప్యూటీ మండల పరిషత్తు అభివృద్ధి అధికారి బి.విజయకుమారి కోరారు. పంచాయతీ కార్యదర్శి జె.పవన్ కుమార్, సిబ్బందితో కలసి బుధవారం నాగాయలంకలోని పలు వ్యాపార దుకాణాలకు పన్నుల డిమాండ్ నోటీసులు ఇచ్చారు. ఇంటి పన్నులను త్వరితగతిన చెల్లించాలని ఆమె యజమానులను కోరారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

మొవ్వ(కూచిపూడి), న్యూస్‌టుడే: మొవ్వ వీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులకు సిద్ధార్థ అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం ఉపకార వేతనాలు అందజేసినట్టు ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.మాధవి తెలిపారు. పది మంది విద్యార్థులు రూ.7,500 చొప్పున అందుకున్నారు. వైస్ ప్రిన్సిపల్ కెఆర్.మంజుల, స్టాఫ్ సెక్రటరీ డాక్టర్ శ్రీకాంత్ విద్యార్థులను అభినందించారు.

ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులు

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

గుడివాడ: 89775 35999 పామర్రు : 80085 74684 అవనిగడ్డ: 80085 74679

పామర్రు, న్యూస్‌టుడే: చల్లపల్లి రోడ్డులో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోందని స్థానికులు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన సిబ్బందిని పంపి చెత్తను తొలగించారు.

★ అవనిగడ్డలోని పేటలో మురుగునీరు రోడ్డుపైకి వచ్చి పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని ఆ ప్రాంత వాసులు మేమున్నాం మీకు తోడుగా ద్వారా పంచాయతీ కార్యదర్శి సలీమ్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన కార్యదర్శి సిబ్బందిని పంపి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

★ స్థానిక విజయవాడ రోడ్డులోని చర్చి ఆఫ్ గాడ్ సమీపంలో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోందని ఆ ప్రాంత ప్రజలు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌కు తెలియజేశారు. స్పందించిన ఆయన చెత్తను పారిశుద్ధ్య సిబ్బందిని పంపి సమస్యను పరిష్కరించారు.

రూ.8 లక్షలతో సీసీ రోడ్డు పనులు

పామర్రు (గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పసుమర్రులో రూ.8 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టామని ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. బుధవారం రోడ్డు పనులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘ నిధులతో నిర్మాణం జరుగుతుందన్నారు. పనులు పూర్తయితే స్థానికుల రోడ్డు సౌకర్యం ఏర్పడుతుందని తెలిపారు. సర్పంచి కాకి నాగేంద్రం, ఇంజినీరింగ్ అసిస్టెంటు నాగమల్లేశ్వరరావు, భవానీ, స్థానికులు సుధీర్, నాగమల్లి, కిషోర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ అశోక్ కుమార్

శరవేగంగా అన్న క్యాంటీన్ నిర్మాణం

పామర్రులో ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా భూమి పూజ చేసి ప్రారంభించిన అన్న క్యాంటీన్ భవన నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. రూ.61 లక్షలతో నిర్మాణం చేపట్టారు. రోజూ 500 మంది భోజనం చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. 'పేదలకు రూ.5కే భోజనం అందేలా కూటమి ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఎమ్మెల్యే కుమార్‌రాజా ఎన్నికల ప్రచారంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తానని హామీ ఇవ్వడంతో ఆ దిశగా అడుగులు వేస్తున్నానని ఆయన అన్నారు. - న్యూస్‌టుడే, పామర్రు

నిర్మాణ దశలో ఇలా..

ఘంటసాలకు ఘన నివాళి

గుడివాడ, న్యూస్‌టుడే: మధుర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావుకు మరణం లేదని, ఆయన తన గాత్రం ద్వారా శాశ్వతంగా తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని మానవతా స్వచ్ఛంద సేవ సంస్థ గుడివాడ అధ్యక్షుడు దండమూడి సీతారామస్వామి పేర్కొన్నారు. మండలంలోని చౌటపల్లి ప్రభుత్వ శాఖ గ్రంథాలయంలో బుధవారం ఘంటసాల వర్ధంతి జరిగింది. గుడివాడ రత్నచంద్ర, అవిర్నేని వెంకటేశ్వరరావు, ఆటూరి తిరుమలరావు, డి.సోమేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు. గుడివాడ పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఘంటసాల విగ్రహం వద్ద పట్టణ కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. పేద కళాకారులకు పింఛను అందజేశారు. సమాఖ్య అధ్యక్షుడు విస్సాకోట సత్యనారాయణ(బుజ్జి), సభ్యులు బి.వి.సత్యం, అమ్మల కృష్ణ, యాదాల అంజనేయులు, బందారు రాధాకృష్ణ, వసంత ఐసేశ్వరరావు తదితరులు పాల్గొని ఘంటసాలకు నివాళులు అర్పించారు.

చౌటపల్లి గ్రంథాలయంలో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

రూ.2.17 కోట్లతో అభివృద్ధి పనులు

అవనిగడ్డ (గ్రామీణం, న్యూస్‌టుడే: అవనిగడ్డ మండల పరిధిలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ.2.17కోట్లతో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పీఆర్ ఏఈ బి.బ్రహ్మానందరావు తెలిపారు. అవనిగడ్డలోని ఆర్టీసీ బస్ డిపో నుంచి మంగలిపాలెం వంతెన వరకు రూ.76 లక్షలతో బీటీ రహదారి నిర్మాణం జరుతోందన్నారు. మోదుమూడి వంతెన నుంచి గ్రామంలోని ఎస్టీకాలనీ చర్చి వరకు 2 కిలోమీటర్ల బీటీ రహదారి నిర్మిస్తున్నామన్నారు.

నేటి నుంచి పెదకళ్లేపల్లిలో బ్రహ్మోత్సవాలు

మోపిదేవి, న్యూస్‌టుడే: పెదకళ్లేపల్లిలో స్వయంభూగా వెలసిన శ్రీదుర్గా పార్వతి సమేత నాగేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమవుతాయని ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో తొలిరోజు స్వామిని పెండ్లికుమారునిగా అలంకరిస్తారు. 15న మహాశివరాత్రి పూజలు, లింగోద్భవ అభిషేకాలు జరుగుతాయి.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పూజలు

మోపిదేవి, న్యూస్‌టుడే: మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్‌స్వామి బుధవారం దర్శించారు. ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు పూర్ణకుంభస్వాగతం పలికారు. ఈవో స్వామికి పట్టువస్త్రాలను, చిత్రపటం బహూకరించారు.

రేపు దుర్గాదేవి జాతర

కూచిపూడి, న్యూస్‌టుడే: స్థానిక దుర్గానగర్‌లో వెలసిన శ్రీదుర్గాదేవి అమ్మవారి జాతర మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీవారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వినాయకుడి పూజ, పంచామృతాభిషేకం, అష్టోత్తర సహస్ర నామపూజలు జరుగుతాయని అన్నారు. జాతర అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

శివరాత్రికి పార్కింగ్ స్థలాల పరిశీలన

ఐలూరు (తోట్లవల్లూరు), న్యూస్‌టుడే: మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా మండలంలోని ఐలూరులో శివరాత్రికి లక్ష మందికి పైగా భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో దేవాలయ ప్రాంగణంలో వాహనాల పార్కింగ్ కోసం పమిడిముక్కల సీఐ చిట్టిబాబు, ఎస్సై కిషోర్ బుధవారం పరిశీలించారు. మూడు చోట్ల పరిశీలించి పార్కింగ్ స్థలాలను ఎంపిక చేశారు. వాటిని చదును చేయాలని అధికారులకు సూచించారు.

పార్కింగ్ ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీఐ చిట్టిబాబు, ఎస్సై కిషోర్

బాల్య వివాహాల విముక్తికి ప్రచారం

అవనిగడ్డ, న్యూస్‌టుడే: వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో బాల్య వివాహాల విముక్త ప్రచార రథం బుధవారం అవనిగడ్డ చేరుకుంది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9,10 తరగతులు చదువుతున్న బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయిని కె.సుజాత మాట్లాడుతూ బాల్యవివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరి మీద ఉందన్నారు. ఈమేరకు ప్రతిజ్ఞ చేయించారు. ఏఎంసీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, మహిళా మండలి సీఎస్‌డబ్ల్యూ సిహెచ్. శాంతకుమారి పాల్గొన్నారు.

విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రధానోపాధ్యాయిని సుజాత

అవనిగడ్డ గ్రామీణం: సమాజంలో బాల్యవివాహాలు అనర్థదాయకమని ఎంపీడీవో ఎం.మరియాదేవి అన్నారు. మండల పరిషత్తు కార్యాలయం ఆవరణలో విముక్తి రథం ప్రచారాన్ని ప్రారంభించారు. డిప్యూటీ ఎంపీడీవోలు పద్మావతి, చంద్రశేఖర్, పంచాయతీ ఈవో తోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మండువా ఇల్లు.. మమతల పొదరిల్లు

పురాతన సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టేలా..

న్యూస్‌టుడే, కూచిపూడి

ఎండ, వాన, చలి.. ఇలా ఏ కాలమాన పరిస్థితులనైనా ఆ ఇంట్లో ఉండే ఆస్వాదించొచ్చు. అదే మొవ్వ మండలం పెదసనగల్లులో 160 ఏళ్ల కిందట నిర్మించిన మండువా లోగిలి. అన్ని వసతులతో పాత తరం సంస్కృతి సంప్రదాయాలకు నిలువుటద్దంలా నిలుస్తోంది. దీన్ని సూరపనేని సీతారాముడు, రంగమ్మ దంపతులు నిర్మించారు. ఆ ఇంట్లో వందేళ్ల నాటి అందమైన పందిరి మంచం, వడ్లు దంచుకునే రోకళ్లు, కుందులు, బీరువాలు, దుస్తులు తగిలించుకునే స్టాండ్లు.. ఇలా ఎన్నో ఉన్నాయి. ఇనుప లాకర్, స్తంభాలకు ఉన్న డిజైన్లు ఎంతగానో ఆకర్షిస్తుంటాయి. ఎంత వర్షం కురిసినా పెంకు పైకప్పునకు వేసిన దూలాల నుంచి చుక్కనీరు కూడా పడదు. వేసవిలో చల్లగా, శీతాకాలంలో వెచ్చగా ఉంటుందని ఆ ఇంటి గురించి తెలిసిన గ్రామస్థులు చెబుతున్నారు. ఈ ఇంటిని ఆరు తరాల వారు చూడగా సూరపనేని, లింగం వారసులు అమెరికాలో ఉంటున్నారు. ఏడాదికి ఒకసారి ఈ ఇంటికి వచ్చి వెళుతుంటారు.

మండవా ఇల్లు (160 సంవత్సరాల కిందటిది)

పైకప్పు చెక్కు చెదరకుండా ఇలా


వందేళ్ల కిందటి మంచం

160ఏళ్ల కిందటి ఇల్లు మాది

మా ఇల్లు నిర్మించి 160 ఏళ్లకు పైగా అయ్యింది. మా నాయనమ్మ అమ్మ(తాతమ్మ) రంగమ్మ కోసం కట్టించారు. మా కుటుంబాల మనవళ్లతో లెక్కిస్తే ఆరో తరం ఇంట్లో ఉన్నట్లు. పెంకుటిల్లు కావటంతో నాలుగేళ్లకు ఒకసారి చిన్న చిన్న మరమ్మతులు చేయిస్తాం. మా పూర్వీకుల ఇల్లు కావటంతో పాడవకుండా రక్షించేందుకు స్థానికంగా ఉన్న గుప్తాకు అప్పగించాం. నిలువు స్తంభాలపై ఎంతో అందమైన ఆకర్షణీయమైన కళాత్మక రూపాలతో మా మండువా ఇల్లు ప్రత్యేక ఆకర్షణగా ఉంది.

- లింగం శివకుమార్

ఆసక్తిగా భగవద్గీత శ్లోకాల పోటీలు

పామర్రుగ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని అడ్డాడ శ్రీఅరవింద విజ్ఞాన విహార ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో బుధవారం నిర్వహించిన భగవద్గీత శ్లోకాల పోటీలు ఆసక్తికరంగా సాగాయి. కళాపీఠం అధ్యక్షుడు కాటూరు వెంకట మురళీకృష్ణ అధ్యక్షత వహించారు. ఘంటసాల వర్ధంతిని పురస్కరించుకుని పామర్రు, ఘంటసాల, ఎన్టీఆర్ కళాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు అనర్గళంగా శ్లోకాలు చెప్పి ఆకట్టుకున్నారు. మోహనశ్రీ, హంసిని(8వ తరగతి), నరసింహాచార్యులు, కారుణ్య(7వ తరగతి), హేమశ్రీ, సాయిఉపశ్రీ(ఐదో తరగతి) విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ప్రిన్సిపల్ రమణమూర్తి, ముకేశ్వర్, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలతో పాఠశాల సిబ్బంది, కళాపీఠం సభ్యులు

పదోతరగతి గణిత అధ్యయన సామగ్రి పంపిణీ

ఐనపూరు(పమిడిముక్కల), న్యూస్‌టుడే: ఐనపూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో చదువుతున్న 32 మంది పదో తరగతి విద్యార్థులకు గణిత అధ్యయన సామగ్రిని తాడిగడప జడ్పీ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు ఉండి రమేష్ ఉచితంగా అందజేశారు. విద్యార్థులు మెటీరియల్‌ను చదివి నూరు శాతం మార్కులు సాధించాలని ఆయన కోరారు. ప్రధానోపాధ్యాయుడు తమ్మన వేణుగోపాలరావు, స్థానిక గణిత ఉపాధ్యాయుడు ఆకుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అంతర్గత రోడ్డు నిర్మాణం ప్రారంభం

వీరంకి(పమిడిముక్కల), న్యూస్‌టుడే: మండల పరిషత్తు నిధుల కింద రూ.6 లక్షలతో అంతర్గత సీసీ రోడ్డును వీరంకిలో నిర్మిస్తున్నారు. బుధవారం సర్పంచి కాసాని నాగేశ్వరమ్మ, ఎంపీపీ కాసాని వేద సుప్రజ ప్రారంభించారు.

నాసా పోటీలలో ప్రతిభ

గుడివాడ, న్యూస్‌టుడే: చిన్నారులు విద్యార్థి దశ నుంచే పరిశోధనా రంగంపై ఆసక్తి పెంచుకొని దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్తలుగా ఎదగాలని గుడివాడ వన్ టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక నారాయణ ఈ టెక్నో పాఠశాల విద్యార్థులు ఇటీవల నాసా అంతరిక్ష పరిశోధనలపై నిర్వహించిన పోటీ పరీక్షలలో ప్రథమ స్థానం కైవశం చేసుకోగా వారిని బుధవారం అభినందించారు. పాఠశాల ప్రిన్సిపల్ బి.కె.వి. సుమంత్ మాట్లాడుతూ విద్యార్థులు నెబ్యులా న్యూట్రాన్ అనే అంశంపై ఉత్తమ స్థానం పొందారన్నారు. విజేతలు ధనరాజ్, ఈశ్వర్ తేజ, నిక్షిత, పూర్ణశ్రీ, రోషన్, తేజ్, తేజశ్వి వర్ధన్, సాయి జాహ్నవిలను అభినందించారు. ఏవో జయకుమార్, డీన్ దేవేంద్ర పవన్, ఏజీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలను అభినందిస్తున్న సీఐ కొండపల్లి శ్రీనివాస్

కేంద్ర బడ్జెట్‌పై విశ్లేషణ

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం వికసిత్ భారత్ సాధనలో కేంద్ర బడ్జెట్ (2026) పాత్రపై జరిగిన చర్చాగోష్టిలో కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన అర్థశాస్త్రం అధ్యాపకులు విశ్లేషణ చేశారు. ప్రిన్సిపల్ ఉమారాణి అధ్యక్షతన జరిగిన చర్చలో మైలవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు షేక్ కరీముల్లా మాట్లాడుతూ 2026 బడ్జెట్ వికసిత్ భారత్‌కు దోహదం చేస్తుందని, అవసరమైన రంగాలకు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. అధ్యాపకులు కె.భాస్కర్‌రావు, పి.మురళీకృష్ణ, ఎం.పిచ్చయ్య, జి.సురేష్‌బాబు, జె.చలంప్రసాద్ విశ్లేషించారు.

ప్రసంగిస్తున్న అధ్యాపకుడు షేక్ కరీముల్లా

ఎస్ఆర్‌జీఈసీ కళాశాలకు అవార్డు

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: విజయవాడ మలినేని లక్ష్మయ్య ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన 'ఐఈటీఈ స్టూడెంట్స్ డే'లో గుడ్లవల్లేరు ఎస్ఆర్‌జీఈసీ కళాశాల ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ) విభాగం విద్యార్థి ఉత్తమ అవార్డు అందుకున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ బి.కరుణకుమార్ తెలిపారు. ఐఓటీ విభాగాధిపతి డాక్టర్ వై.శ్యామలకు ఐఈటీఈ విజయవాడ కేంద్రం ఛైర్మన్ డాక్టర్ బి.సూర్యప్రసాదరావు అవార్డు అందజేశారు. ఐఓటి కార్యదర్శి ఎన్.గౌతమి, విద్యార్థులు కె.మోక్షజ్ఞశ్రీరాం, కె.హరిరామసాయి తదితరులు పాల్గొన్నారు.

అవార్డు అందుకుంటున్న ఐఓటీ విభాగాధిపతి శ్యామల

IN THE COURT OF HONOURABLE CIVIL COURTS (SENIOR DIVISION) AT AVANIGADDA
Dr. I.P No. 1/2026

Between:
Sabbineni Srihari ..Petitioner
And
Talasila Venkateswara Rao & 13 others ..Respondents

To
R1: Talasila Venkateswara Rao, S/o. Raghavaiah, Hindu, aged about 60 years, Properties, resident of Peda Kammavaripalem village of Nagayalanka Mandal, Krishna District. R.2: Katragadda Rangaiah, S/o. Chinna Abbai, Hindu, aged about 60 years, Properties, resident of Peda Kammavaripalem Village of Nagayalanka Mandal, Krishna District. R.3: Uppala Koteswara Rao, S/o. Nagendraiah, Hindu, aged about 60 years, Properties, resident of China Kammavaripalem Village of Nagayalanka Mandal, Krishna District. R.4: Kolusu Sridhar, S/o. Madhusudana Rao, Hindu, aged about 40 years, Properties, resident of Nagayalanka village, Nagayalanka Mandal, krishna District. R.5: Lebaka Ankalu, S/o. Venkateswarlu, Hindu, aged about 60 years, Properties, resident of Nagayalanka village, Nagayalanka Mandal, Krishna District. R.6: Pulugujju Sivarama Prasad, S/o. Nancharaiah, Hindu, aged about 45 years, Properties, resident of Nagayalanka village, Nagayalanka Mandal, Krishna District. R.7: Peddiboyina Tathaiah, S/o. Veera Raghavaiah, Hindu, aged about 30 years, Properties, resident of Peda Kammavaripalem village of Nagayalanka Mandal, Krishna District. R.8: Bommidi Satyanarayana, S/o. Gopala Rao, Hindu, aged about 50 years, Properties, resident of Gullalamoda village, Nagayalanka Mandal, Krishna District. R.9: Akuthota Sitharamaiah, S/o. Subbarao, Hindu, aged about 50 years, Properties, resident of Nagayalanka village, Nagayalanka mandal, krishna District. R.10: Kanagala Sastrullu, S/o. Kotaiah, Hindu, aged about 50 years, Properties, resident of Peda Kammavaripalem village, Nagayalanka Mandal, Krishna District. R.11: Aluri Pitchaiah, S/o. Subbaiah, Hindu, aged about 70 years, Properties, resident of Peda Kammavaripalem village, Nagayalanka Mandal, Krishna District. R.12: Talasila Madhava Rao, S/o. Purnaiah, Hindu, aged about 85 years, Properties, resident of Peda Kammavaripalem village of Nagayalanka Mandal, Krishna District. R.13: Aluru Sesha Rao, S/o. Srinivasa Rao, Hindu, aged about 50 years, Properties, resident of Peda Kammavaripalem village of Nagayalanka Mandal, Krishna District. R.14: Aluri Ravi, S/o. Srinivasa Rao, Hindu, aged about 45 years, Properties, resident of Peda Kammavaripalem village of Nagayalanka Mandal, Krishna District.

పిటిషనరు పై నెంబరు I.P ను దాఖలు చేయగా శ్రీ కోర్టు వారు సదరు I.Pని రిజిస్టరు చేస్తూ జనరల్ నోటీసు నిమిత్తం ది.27-02-2026 తేదీన వాయిదా అయి వున్నది. సదరు వాయిదా రోజున పై కోర్టు వారి ఎదుట ఉదయం 10.30 ని॥లకు ఎవ్వరికైనా ఎట్టి అభ్యంతరములు ఉన్న యెడల వారు స్వయంగా గాని లేదా న్యాయవాది ద్వారా గాని హాజరై ఆక్షేపణలను తెలుపుకొనవలెను అని ఇందు మూలముగా యావన్మందికీ తెలియజేయడమైనది.

వాయిదా తేది: 27-02-2026

ఇట్లు: సనకా రఘురామ్ ప్రసాద్, న్యాయవాది
అవనిగడ్డ - 521121 Cell: 99499 88835

పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు ఘన నివాళి

పండిట్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న భాజపా నేతలు

గుడివాడ, న్యూస్‌టుడే: ఏకాత్మతా మానవతా వాదం సిద్ధాంత కర్త పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ హైందవ ధర్మ పరిరక్షణకు ఎనలేని సేవలందించారని భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు వలపర్ల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఏకేటీపీ పురపాలక బాలికల ఉన్నత పాఠశాలలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి సందర్భంగా బుధవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో పట్టణ మాజీ అధ్యక్షుడు కావేటి దుర్గా ప్రసాద్, ముక్కపాటి సాయి, స్వాతి, జి.సతీష్, తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో విజేతలు

వల్లూరుపాలెం(తోట్లవల్లూరు), న్యూస్‌టుడే: మండలంలోని వల్లూరుపాలెంలో లంక ప్రకాశరావు మెమోరియల్ ఉమ్మడి కృష్ణా జిల్లా ఓపెన్ కబడ్డీ పోటీలు మూడు రోజులు నిర్వహించారు. ప్రథమ విజేత సాయి సెంటర్ టీమ్- ఎ(విజయవాడ) రూ.25,000, ద్వితీయ విజేత సాయి సెంటర్ టీమ్- బి(విజయవాడ) రూ.20,000 నగదును మండల తెదేపా అధ్యక్షుడు వీరపనేని శివరామప్రసాద్, తెలుగు యువత మాజీ అధ్యక్షుడు రామినేని కుటుంబయ్య అందజేశారు. ఆరు టీమ్‌లు ప్రత్యేక బహుమతులు అందుకున్నారు. చింతపల్లి వెంకటేశ్వరరావు, ఆచంట కోటిబాబు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న శివరామప్రసాద్, రామినేని కుటుంబయ్య

వసతిగృహానికి పేద విద్యార్థులు

కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: మండలంలోని కౌతవరం సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహాన్ని ఎంపీడీవో ఇమ్రాన్ బుధవారం పరిశీలించారు. హాస్టల్‌లో సంఖ్య తక్కువగా ఉండటాన్ని గుర్తించి సమీపంలోని జడ్పీ హైస్కూల్‌కు వెళ్లి 10వ తరగతి చదువుతున్న 9 మంది పేద విద్యార్థులను వసతిగృహంలో చేర్పించారు.

విద్యుత్ కేసుల్లో అపరాధ రుసుముల విధింపు

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: మండలంలో బుధవారం విద్యుత్‌శాఖ అధికార సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. డీఈఈ సీహెచ్.వాసు, ఈఈ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మొత్తం 40 బృందాలుగా డివిజన్‌లోని అధికార సిబ్బంది 3030 సర్వీసుల్ని తనిఖీ చేశారు. ఇందులో 399 సర్వీసులపై కేసులు నమోదు చేసి రూ.12.02 లక్షల అపరాధ రుసుం విధించారు. కార్యక్రమంలో డీఈఈ పి.కిరణ్‌బాబు, ఏఈఈ శ్యామలకుమారి తదితరులు పాల్గొన్నారు.

'హామీలు గాలికి వదిలి రాజకీయాలా?'

అవనిగడ్డ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు గాలికి వదిలి, లడ్డూ ప్రసాదాన్ని రాజకీయం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ విమర్శించారు. హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టే ధోరణిలో కూటమి నాయకులున్నారని, అదే జరిగితే ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ పూర్తి బాధ్యత వహించాలన్నారు.

మినీ డంపింగ్ యార్డులా..

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక లంకమ్మ మాన్యం శివారు రాజశేఖరపురం సమీపంలో ఆర్‌అండ్‌బీ రహదారిపై చెత్త కుప్పలు పేరుకుపోయి, మినీ డంపింగ్ యార్డును తలపిస్తోంది. ఆ రహదారిలో ప్రయాణించే వారు దుర్వాసన భరించలేక పోతున్నామంటున్నారు. రహదారిపైకి చెత్త కుప్పలు వస్తున్నా పట్టించుకునే వారు కానరావడం లేదంటున్నారు.

సరఫరాలో అంతరాయం నేడు

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక 6, 9 వార్డులలో విద్యుత్ సరఫరాకు సంబంధించిన అభివృద్ధి పనులు చేపడుతున్నందున గురువారం ఉదయం 9 నుంచి 1 గంట వరకు 6, 9 వార్డులలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏడీఈ సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బురదకయ్యగా మందపాడు రోడ్డు

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ పట్టణంలోని మందపాడుకు వెళ్లడానికి రైల్వే పైవంతెన పక్కగా ఉన్న రహదారి పూర్తిగా అధ్వానంగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి చాలా కాలంగా బురదకయ్యగా మారి ప్రయాణించడానికి కష్టసాధ్యంగా ఉంది. ఈ రహదారిలోకి చుట్టుపక్కల నుంచి మురుగు నీరు వచ్చి చేరి జారుడు బల్లమాదిరిగా ఉంది. వాహన చోదకులు నిత్యం జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రహదారిలో ప్రయాణించడానికి భయాందోళనలకు గురవుతున్నారు. పురపాలక సంఘ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు వేడుకొంటున్నారు.

నేత్ర దానం



నాగాయలంక, న్యూస్‌టుడే: స్థానిక 1వ వార్డుకు చెందిన పరుచూరి సామ్రాజ్యం (75) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. మృతురాలి కళ్లు మరో ఇద్దరికి చూపునిస్తాయని కుమార్తె రత్నకుమారి, అల్లుడు హరిప్రసాద్, కుటుంబ సభ్యులు ముందుకు వచ్చి సుదర్శి మానవత సేవ సంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్, కనగంటి నారాయణల ఆధ్వర్యంలో విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి నేత్రాలను దానం చేశారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా రేపు

గుడివాడ, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల సమస్యలను అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామని చెప్పిన కూటమి పార్టీలు వెంటనే మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఈనెల 13న మచిలీపట్నంలోని కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి డి.చంద్రశేఖర్ తెలిపారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని, 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు.

విద్యార్థులకు కళ్లజోళ్ల పంపిణీ

కోడూరు, న్యూస్‌టుడే: కోడూరు శివారు స్వతంత్రపురంలోని శ్రీచామర్తి ప్రకాశరాయ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, కోడూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో దృష్టిలోపం ఉన్న 63 మంది విద్యార్థులకు జాతీయ అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం కళ్లజోళ్లను పంపిణీ చేశారు. ఆప్తాల్మిక్ అధికారి మస్కే శ్రీలక్ష్మి, ఎంఈవో టీవీఎం. రామదాసు, ఎంఈవో-2 నాంచారయ్య, ప్రధానోపాధ్యాయులు ఉమామహేశ్వరరావు, సీహెచ్ఓ ఎం.లీల, తదితరులు పాల్గొన్నారు.

కళ్లజోళ్లను చూపుతున్న విద్యార్థులు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

శ్రద్ధాంజలి



జననం: 1939
మరణం: 31-01-2026

కీ॥శే॥ లంక రామకోటయ్య గారు
(రిటైర్డ్ టీచర్)

నా భర్త గారైన కీ॥శే॥ లంక రామకోటయ్య గారు ది. 31-01-2026 శనివారం ఉదయం స్వర్గస్తులైనారని తెలుపుటకు చింతిస్తూ...
వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ... శోకతప్త హృదయాలతో...

భార్య: లంక లక్ష్మీకాంతమ్మ
కుమారుడు: లంక శ్రీనివాసరావు
కుమార్తె-అల్లుడు: బొందలపాటి సుమలత-శ్రీనివాసు (వాసు)
మనుమరాళ్ళు: బొందలపాటి శ్రీదివ్య, శ్రీదీప్య మరియు బంధుమిత్రులు
సెల్: 8008083035, 8978902345, 98488 22999

పెద్దకర్మ: ది. 12-2-26 గురువారం ఉ॥10 గంటలకు ప్లాట్ నెం.776 (S), సాయిబాబా గుడి దగ్గర, ప్రశాంత్‌నగర్, వనస్థలిపురం, హైదరాబాద్ లోని మా స్వగృహం నందు జరుగును.

ఛత్తీస్‌గఢ్‌లో ఒకేరోజు 6,414 జంటలకు పెళ్లిళ్లు

ఛత్తీస్‌గఢ్‌లో ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి సమక్షంలో కన్యా వివాహ యోజన కింద ఒకేరోజు అన్ని మతాలకు చెందిన 6,414 జంటలకు పెళ్లిళ్లు జరిగాయి. ఈ కార్యక్రమం 'గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌'లో చోటు సాధించింది. మూడుముళ్ల బంధంతో ఒక్కటైన జంటల్లో ఆదివాసీ వీడి జనజీవన స్రవంతిలో చేరిన మాజీ నక్సలైట్లు కూడా ఉన్నారు. రాయ్‌పుర్ సైన్స్ కాలేజ్ మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ పథకం కింద ప్రతి కొత్త జంటకు రూ.35,000 ఆర్థికసహాయం అందించారు. నారాయణ్‌పుర్ జిల్లాలో ఏడు మాజీ నక్సలైట్ జంటలు వివాహ బంధంతో ఒక్కటయ్యాయి.

వధూవరులకు సీఎం ఆశీర్వాదం

వాహనం ఈ రోడ్డెక్కితే.. జయహో

ముంబయి: భారత్‌లో తొలి మ్యూజికల్ రోడ్డును ప్రారంభించి ముంబయి తీరప్రాంత రహదారి అధికారులు రికార్డు సృష్టించారు. హంగేరియన్ టెక్నాలజీ సాయంతో నారిమన్ ప్రాంతం నుంచి వర్లి వైపు వెళ్లే రహదారిపై పలు సంగీత స్ట్రిప్‌లను ఏర్పాటు చేశారు. దీంతో ఈ రోడ్డుపై దాదాపు 500 మీటర్ల మేర వాహనదారులకు స్లమ్‌డాగ్ మిలియనీర్ సినిమాలోని 'జయ హో' పాట వినిపించనుంది. వాహనాలు 70 - 80 కి.మీ.ల వేగంతో ప్రయాణించినప్పుడు రోడ్డుపై ఉన్న ప్రత్యేక పట్టీల రాపిడికి 'జయహో' అని ధ్వని తరంగాలు ఉత్పత్తి అవుతాయి. ప్రజల్లో దేశభక్తి భావాన్ని మరింత పెంచేందుకు ఈ విధంగా డిజైన్ చేసినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) చేపట్టిన ఈ ప్రాజెక్టుకు రూ.6.21 కోట్ల వ్యయం అయిందన్నారు. ముంబయి కోస్టల్ రోడ్ కారిడార్ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన ఈ రహదారి దేశంలోనే మొదటి మ్యూజికల్ రోడ్డుగా నిలవనుంది. ఇటువంటి రహదారులు హంగరీ, జపాన్, దక్షిణ కొరియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో ఉన్నాయి. ముంబయిలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ దీనిని ప్రారంభించారు.

నేడు దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల సమ్మె

దిల్లీ: ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆరోపిస్తున్న కేంద్ర కార్మిక సంఘాల సంయుక్త ఫోరం.. గురువారం దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చింది. దీనివల్ల బ్యాంకులు, ఇన్సూరెన్స్, రవాణా రంగాలపై పాక్షిక ప్రభావం పడే అవకాశం ఉంది. 30 కోట్ల మంది కార్మికులు ఈ సమ్మెలో పాల్గొననున్నారని ఫోరం వెల్లడించింది. కార్మిక, రైతు, జాతీయ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ సమ్మె చేయనున్నట్లు ఈ నెల 9న తేదీన కార్మిక సంఘాలు ప్రకటించాయి. 'విద్యుత్తు, బ్యాంకింగ్, ఇన్సూరెన్సు, రవాణా, ఆరోగ్య, విద్య, గ్యాస్, నీటి సరఫరా సేవలకు అంతరాయం కలగనుంది' అని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్జీత్ కౌర్ తెలిపారు. సమ్మెలో పాల్గొంటామని బ్యాంకు ఉద్యోగుల సంఘాలు హామీ ఇచ్చాయని వెల్లడించారు. సమ్మెకు కాంగ్రెస్ కూడా మద్దతు తెలిపింది. సంయుక్త ఫోరంలో ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, హెచ్‌ఎంఎస్, సీఐటీయూ, ఏఐయూటీయూసీ, ఎస్‌ఈడబ్ల్యూఏ, ఏఐసీసీటీయూ ఎల్‌పీఎఫ్, యూటీయూటీ తదితర సంఘాలున్నాయి. టీయూసీసీ ఈ సమ్మెలో పాల్గొనడం లేదు.

దోషాలున్న నోటీసును తిరస్కరించొద్దన్న స్పీకర్

- సరిచేయించి పరిశీలించాలని సిబ్బందికి ఆదేశం
- సాధ్యమైనంత త్వరగా సభ ముందుంచాలన్న ఓం బిర్లా

దిల్లీ: తనపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదిస్తూ విపక్షాలు ఇచ్చిన నోటీసులో దోషాలు స్పందుపరిచినా దానిని సరిదిద్దుచేలా చూడాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తమ సిబ్బందిని ఆదేశించినట్లు సమాచారం. నిజానికి నోటీసులో లోపాలుంటే దానిని తిరస్కరించవచ్చని, స్పీకర్ మాత్రం అప్పుడు విషయాన్ని విపక్షానికి తెలిపి సరిచేయించి, సాధ్యమైనంత త్వరగా అది సభ ముందుకు వచ్చేలా చూడాలని చెప్పారని పార్లమెంటరీ వర్గాలు వెల్లడించాయి. కాంగ్రెస్ సహా విపక్షాలకు చెందిన 118 మంది సభ్యులు మంగళవారం లోక్‌సభ సెక్రటరీ జనరల్‌ను కలిసి ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చిన విషయం తెలిసిందే. "ఫిబ్రవరి 2025"లో జరిగిన పరిణామాలను దానిలో నాలుగుచోట్ల కొన్ని మాటల్లో ప్రస్తావించారు. నిబంధనల ప్రకారం ఆ ఒక్క తప్పుతో నోటీసు చెల్లదని ప్రకటించే అవకాశం ఉంది. తిరస్కరించకుండా నోటీసుపై చర్చల్ని వేగవంతం చేయాలని, నిబంధనల ప్రకారం స్పందించాలని స్పీకర్ ఆదేశించారు.

కాంగ్రెస్ ఎంపీలు స్పీకర్‌ను ఛాంబర్లోనే దూషించారు: రిజిజు

లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాను 20-25 మంది కాంగ్రెస్ ఎంపీలు ఆయన ఛాంబర్లోనే దూషించారని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు. వారు దూషణలకు దిగినప్పుడు అక్కడే ఉన్న సీనియర్ నేతలు కె.సి.వేణుగోపాల్, ప్రియాంకాగాంధీ వంటివారు నిలువరించలేదని విమర్శించారు. దాంతో స్పీకర్ ఎంతో మనస్తాపానికి గురయ్యారని, ఆయన ఎంతో సౌమ్యుడు కాబట్టి ఎలాంటి కఠిన చర్యలు తీసుకోలేదని బుధవారం విలేకరులకు తెలిపారు.

భారత పప్పుధాన్యాలకు రక్షణ
సవరించిన ఫ్యాక్ట్‌షీట్‌ను విడుదల చేసిన అమెరికా

వాషింగ్టన్: పప్పు ధాన్యాలపై సుంకాలను భారత్.. సున్నాకు చేర్చిందంటూ, తగ్గించిందంటూ తొలుత ప్రకటించిన అమెరికా.. వెనక్కి తగ్గింది. భారత ఉత్పత్తులకు రక్షణ కల్పిస్తూ వాటిని సుంకాల తగ్గింపు జాబితా నుంచి తొలగించింది. సోమవారం విడుదల చేసిన ఫ్యాక్ట్‌షీట్‌కు సవరణలు చేసింది. సవరించిన ఫ్యాక్ట్‌షీట్‌ను మంగళవారం విడుదల చేసింది. 'అన్ని పారిశ్రామిక ఉత్పత్తులు, ఆహార, వ్యవసాయ ఉత్పత్తులు (ఎండు ధాన్యాలు, ఎర్ర జొన్నలు, ట్రీ నట్స్, తాజా, ప్రాసెస్డ్ పండ్లు, సోయాబీన్ ఆయిల్), వైన్, ఆల్కహాల్, ఇతర ఉత్పత్తులపై సుంకాలు సున్నా స్థాయికిగానీ, అతి స్వల్ప స్థాయికిగానీ చేరతాయి' అని సవరించిన ఫ్యాక్ట్‌షీట్ వెల్లడించింది. తొలుత ఇచ్చిన ఫ్యాక్ట్‌షీట్‌లో 'కొన్ని పప్పు ధాన్యాలు' అని ఉంది. సవరించిన దానిలో దానిని అమెరికా తొలగించింది.

ఎప్‌స్టీన్‌ను కలిశా..కానీ!
కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురీ

ఇంటర్నెట్ డెస్క్: తాను ఎప్‌స్టీన్‌ను కలిసింది నిజమేగానీ.. అతడిపై వచ్చిన ఆరోపణలకు, తనకు సంబంధం లేదని కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురీ స్పష్టం చేశారు. ఇంటర్నేషనల్ పీస్ ఇనిస్టిట్యూట్ (ఐపీఐ) బృందంతోపాటు తాను అతడిని కలిశానని పేర్కొన్నారు. ఎప్‌స్టీన్‌ను మంత్రి కలిశారని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఆరోపించిన నేపథ్యంలో ఆయన ఈ వివరణ ఇచ్చారు. 'ఐపీఐలో మా బాస్‌కు ఎప్‌స్టీన్ తెలుసు. కొన్ని సందర్భాల్లో అతడితో సమావేశమయ్యా. కచ్చితంగా చెప్పాలంటే మూడు నాలుగు సార్లు కలిశా. ఒక్కసారి ఈమెయిల్ చేసుకున్నాం. అతడిపై వచ్చిన ఆరోపణలకు, మా మధ్య జరిగిన సంభాషణలకు ఎలాంటి సంబంధం లేదు' అని మంత్రి వెల్లడించారు.

వందేమాతరం తర్వాతే జనగణమన

- ఆలాపనపై కేంద్ర హోంశాఖ ఆదేశం

దిల్లీ: అధికారిక కార్యక్రమాల్లో జాతీయ గీతం జనగణమన ఆలపించడానికి ముందే జాతీయ గేయం వందేమాతరంలోని 6 చరణాలను పాడాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్రపతి పాల్గొనే, త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసే, గవర్నర్లు మాట్లాడే కార్యక్రమాల్లో తొలుత 3 నిమిషాల 10 సెకన్లు ఉండే వందేమాతరంలోని 6 చరణాలను ఆలపించాలని సూచిస్తూ గత నెల 28వ తేదీన కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 'రెండింటినీ ఆలపించాల్సిన సమయంలో వందేమాతరాన్నే ముందుగా పూర్తి చేయాలి' అని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. వందేమాతరం ఆలపించేటప్పుడు అందరూ లేచి నిల్చోవాలని సూచించింది. అయితే న్యూస్‌రీల్స్, డాక్యుమెంటరీలు, సినిమాల్లో భాగంగా వందేమాతరం ఆలాపన వచ్చినప్పుడు నిల్చోవాల్సిన అవసరం లేదని పేర్కొంది.

■ పాఠశాలల్లో వందేమాతరంతోనే కార్యకలాపాలను ప్రారంభించాలని కేంద్ర హోంశాఖ సూచించింది.

■ దేశభక్తితో, మాతృభూమిపై ప్రేమతో, మర్యాదపూర్వకంగా.. సముచిత పద్ధతిలో ఏ కార్యక్రమంలోనైనా వందేమాతరాన్ని ఆలపించొచ్చని, దానిపై అభ్యంతరం ఉండదని స్పష్టం చేసింది.

■ దేశ గౌరవానికి చిహ్నాలైన జాతీయ గీతం, గేయం ఆలాపన జరుగుతున్నప్పుడు ఎవరైనా ఉద్దేశపూర్వకంగా అంతరాయం కలిగించినా, అగౌరవపరిచినా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించనుంది. కొత్త నిబంధనల ప్రకారం, ఇటువంటి చర్యలకు పాల్పడే వారికి గరిష్ఠంగా మూడేళ్ల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉంది.

నేడు బంగ్లాదేశ్ ఎన్నికలు

బీఎన్‌పీ, జమాతే పార్టీల మధ్యే ప్రధాన పోరు

తారిఖ్ రెహమాన్

షఫీకుర్ రెహమాన్

ఢాకా: ఏడాదిన్నర క్రితం షేక్ హసీనా ప్రభుత్వం కుప్పకూలినప్పటి నుంచి తీవ్ర అస్థిరతను ఎదుర్కొంటున్న బంగ్లాదేశ్‌లో గురువారం సార్వత్రిక ఎన్నికలకు జరగన్నాయి. ప్రజలు కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకోనున్నారు. 2024ఆగస్టులో విద్యార్థుల ఉద్యమంతో అవామీ లీగ్ నేతృత్వంలో హసీనా ప్రభుత్వం పడిపోయిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి బంగ్లా పాలనను మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం పర్యవేక్షిస్తూ వచ్చింది. ఇప్పుడు ఈ ఎన్నికలతో ఢాకాలో కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. 299 పార్లమెంటు స్థానాలకు జరిగే ఈ పోరులో వివిధ పార్టీలకు చెందిన 1,981 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. దాదాపు 12.7 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్‌పై ప్రభుత్వం నిషేధం విధించడంతో ఈసారి ప్రధాన పోటీ.. బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ (బీఎన్‌పీ), షఫీకుర్ రెహమాన్ నేతృత్వంలోని జమాత్-ఎ-ఇస్లామీ కూటమి మధ్యే జరగనుంది. విద్యార్థుల ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నేషనల్ సిటిజన్ పార్టీ కూడా జమాతే కూటమిలో ఉంది. ఎన్నికలతో పాటు కీలక రాజ్యాంగ సంస్కరణలపైనా రిఫరెండం జరగనుంది.

■ హసీనా నాయకత్వంలోని అవామీ లీగ్ పార్టీ లేకుండా ఎన్నికలు జరగనుండడం ఇదే తొలిసారి. హసీనా భారత్‌లో ఆశ్రయం పొందుతున్న సంగతి తెలిసిందే.

■ హసీనా ప్రభుత్వం కుప్పకూలిన తర్వాత బంగ్లాలోని మైనారిటీలు ముఖ్యంగా హిందువులను లక్ష్యంగా చేసుకుంటూ దాడులు జరిగాయి. ఈ ఎన్నికల్లో మతతత్వ పార్టీ జమాత్-ఎ-ఇస్లామీ అధికారంలోకి వస్తే ఈ దాడులు మరింతగా పెరిగే అవకాశం ఉందని మైనారిటీలు భావిస్తున్నారు.

పిల్లల పెంపకం అంటే ఆదర్శంగా ఉండటమే

మీరు ఏ అలవాట్లను పాటిస్తే మీ పిల్లలు వాటినే అనుసరిస్తారు. మీరు ఎల్లప్పుడూ ఒత్తిడితో ఉంటే వారు దానినే నేర్చుకుంటారు. మీరు అనారోగ్యకర ఆహారాలను భుజిస్తుంటే వారూ అదే అలవరచుకుంటారు. మీరు ఆరోగ్యంపై శ్రద్ధ చూపితే దానిని నేర్చుకుంటారు. ఉత్తమ పిల్లలపెంపకం అంటే ఆదర్శంగా నిలవడమే.

– బాబీ ఫ్రైలెర్, ఇన్‌ఫ్లుయెన్సర్

కెనడా స్కూల్లో కాల్పులు.. 10 మంది మృతి

ఒట్టావా: కెనడాలో కాల్పులు కలకలం సృష్టించాయి. బ్రిటీష్ కొలంబియా ప్రాంతంలోని టంబ్లర్ రిడ్జ్ సెకండరీ పాఠశాలలో జరిగిన కాల్పుల్లో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 25 మంది గాయపడగా.. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. మృతుల్లో కాల్పులకు తెగబడినట్లు అనుమానిస్తున్న మహిళ కూడా ఉన్నట్లు అధికారులు తెలిపారు. కాల్పుల జరిపిన అనంతరం తనను తాను కాల్చుకుని మహిళ ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. షూటర్‌ను గుర్తుపట్టినప్పటికీ ఆమె వివరాలను మాత్రం వెల్లడించలేదు. స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 12:30 గంటలకు కాల్పులు జరిగాయి. పాఠశాలలో ఏడుగురి మృతదేహాలను గుర్తించగా... స్కూల్ సమీపంలోని ఓ ఇంట్లో మరో రెండు మృతదేహాలను గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. మరొకరు ఆసుపత్రికి తరలిస్తుండగా మరణించారన్నారు. ఇక్కడి సెకండరీ స్కూల్‌లో దాదాపు 175 మంది విద్యార్థులు చదువుతున్నారు.

పాఠశాల నుంచి వెలుపలకు వస్తున్న విద్యార్థులు

కమీషన్ల ఎరచూపి అద్దె ఖాతాలు

విజయవాడలో వెలుగు చూసిన మరో మ్యూల్ ఎకౌంట్స్ వ్యవహారం

ఈనాడు, అమరావతి: విజయవాడ నగరంలో మరో అద్దె ఖాతాల వ్యవహారం వెలుగుచూసింది. ఇందులో ముగ్గురు సభ్యుల ముఠాను సైబర్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలను ఏసీపీలు రాజశేఖర్, పావన్‌కుమార్, ఇన్‌స్పెక్టర్‌లు మీడియా సమావేశంలో వెల్లడించారు. నిందితులను బుధవారం సాయంత్రం మూడో ఏసీజేఎం కోర్టులో హాజరుపర్చగా.. న్యాయాధికారి నిందితులకు ఈనెల 25వ తేదీ వరకు రిమాండ్ విధించారు.

డిజిటల్ మార్కెటింగ్ పేరుతో కార్యాలయం తెరిచిన సోదరులు : విజయవాడ సమీపంలోని యనమలకుదురు ప్రాంతానికి చెందిన సోదరులు రాయపాటి రవికుమార్ (ఏ1), అతని సోదరుడు స్టీవెన్ (ఏ2)లు.. బంధువుల వివాహం నిమిత్తం గతేడాది చెన్నై వెళ్లారు. బ్యాంకు ఖాతాలు తెరిపించి, వాటిని తనకు ఇస్తే ఒక్కో దానికి రూ.4వేలు చొప్పున ఇస్తానని అక్కడ వారి సమీప బంధువు చెప్పాడు. దీనికి వారు అంగీకరించారు. విజయవాడ వచ్చిన తర్వాత డిజిటల్ మార్కెటింగ్ పేరుతో గదిని అద్దెకు తీసుకుని కార్యాలయాన్ని నడిపిస్తున్నారు. పలువురు అమాయకులు, కుటుంబ అవసరాలకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నవారిని గుర్తించి వారితో పొదుపు, కరెంటు ఖాతాలు తెరిపించి.. వాటి చెక్, పాస్‌పుస్తకాలు, డెబిట్ కార్డులు తీసుకుని తమ వద్ద ఉంచుకునేవారు. ఖాతాలను మాత్రం చెన్నైలోని బంధువుకు పంపించేవారు. ఖాతాలు తెరిపించిన తర్వాత వారి నుంచి సిమ్‌లు తీసుకునేవారు. ఇలా 9 నెలల కాలంలో 36 ఖాతాలను తెరిపించారు. లావాదేవీలు జరిగినప్పుడు ఓటీపీలను చెన్నైలోని వ్యక్తికి ఫోన్‌లో వీరు చెబుతుండేవారు.

★ అద్దెకు తీసుకున్న గదిలోనే 21 ఫోన్లు పెట్టుకుని నిందితులు.. చెన్నై నుంచి వచ్చిన సూచనల మేరకు వీరి ఆధీనంలోని ఖాతాలకు వచ్చిన మొత్తాన్ని.. పైనుంచి ఆదేశాల మేరకు ఆయా ఖాతాలకు తిరిగి బదిలీ చేసేవారు. యూపీఐ లావాదేవీలు కూడా నిర్వహించారు. వీరి వద్ద ఉన్న ఖాతాలకు నగదు వస్తే.. పలుసార్లు డెబిట్ కార్డుల ద్వారా డ్రా చేసి, ఇతర ఖాతాలకు జమ చేసేవారు. ఈ వ్యవహారాల కోసం అవసరమైన ఫోన్లు, ల్యాప్‌టాప్‌ను చెన్నైకు చెందిన వ్యక్తి నుంచి వచ్చిన డబ్బులతో కొనుగోలు చేశారు. వీరి ఇంటికి సమీపంలో ఉండే స్నేహితుడు బాజి (ఏ3) కూడా జతకలిశాడు. ఇతను ఇతరులతో ఖాతాలు తెరిపించడంతో పాటు.. తను, తన భార్య పేరుతో కూడా పొదుపు, కరెంటు ఖాతాలు తెరిచి రవికుమార్, స్టీవెన్‌లకు ఇచ్చారు

వివరాలు వెల్లడిస్తున్న సైబర్ ఏసీపీ రాజశేఖర్. చిత్రంలో సౌత్ ఏసీపీ పావన్‌కుమార్, సైబర్ ఇన్‌స్పెక్టర్ శ్రీను

ఫిర్యాదుతో వెలుగులోకి.. : పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న రాజవంశీ.. తన స్నేహితుడైన రవికుమార్ (ఏ1) సూచనతో మూడు బ్యాంకు ఖాతాలు తెరిచారు. తనకు తెలిసిన వారికి సంబంధించి కంపెనీకి ఐటీ, జీఎస్టీ సమస్యలు ఉన్నాయని.. దీనికి బ్యాంకు ఖాతాలు కావాలని నమ్మించాడు. దీంతో రాజవంశీ ఖాతాలు తెరిచారు. ఇటీవల ఈ ఖాతాను పరిశీలించగా రూ.కోట్లలో లావాదేవీలు జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ల్యాప్‌టాప్‌లో లావాదేవీల చిట్టా..

పోలీసులు నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ల్యాప్‌టాప్‌లో నిందితులు తెరిచిన ఖాతాలు, చెన్నై నుంచి వచ్చిన ఆదేశాల మేరకు నిర్వహించిన లావాదేవీల తాలూకు ఖాతాల వివరాలు లభించాయి. వీటిలో ఇప్పటివరకు వీరు నిర్వహించిన లావాదేవీలను నమోదు చేశారు. ఆయా ఖాతాలకు జమ అయిన, బదిలీ అయిన నగదు వివరాలను నిక్షిప్తం చేశారు. వీరి నుంచి ల్యాప్‌టాప్‌తో పాటు రూ.3.40 లక్షలు, 21 మొబైళ్లు, 46 ఏటీఎం కార్డులు, 21 చెక్ పుస్తకాలు, 16 పాస్‌పుస్తకాలు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

బోగస్ పత్రాలతో మోసం...

వ్యాపారంతో ఏమాత్రం సంబంధం లేని వారితో కూడా బోగస్ పత్రాలతో నిందితులు కరెంట్ ఖాతాలు తెరిపించారు. ఇలా నాలుగు కరెంటు ఖాతాలను తెరిపించారు. యనమలకుదురులోని ఓ పండ్ల దుకాణం వద్ద బ్యానర్ కట్టి.. బాజీ (ఏ3)ని అక్కడ నిలబెట్టి ఫొటో తీశారు. దీని ఆధారంగా పండ్ల వ్యాపారం చేస్తున్నట్లుగా మీసేవా కేంద్రంలో ట్రేడ్ లైసెన్స్‌కు దరఖాస్తు చేయించి.. అది వచ్చిన తర్వాత, దాని ఆధారంగా బ్యాంకుల్లో కరెంట్ ఖాతా తెరిచారు. ఇలా మరో స్నేహితుడితో ఏబీ వెజిటబుల్స్ పేరుతోనూ ఇలాగే చేసి కరెంట్ ఖాతా తెరిపించారు.

ఘనంగా ముగిసిన వీరమ్మతల్లి తిరునాళ్లు

ఉయ్యూరు, న్యూస్‌టుడే: ఉయ్యూరు వీరమ్మతల్లి తిరునాళ్లు బుధవారం రాత్రితో ముగిశాయి. పదిహేను రోజుల పాటు అత్యంత వైభవంగా జరిగిన తిరునాళ్లకు జిల్లాలోని నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చి వీరమ్మతల్లిని ఉత్సవ ఆలయంలో దర్శించుకున్నారు. గత నెల 28వ తేదీన ప్రారంభమైన తిరునాళ్లు పదిహేను రోజుల పాటు జరిగాయి. బుధవారం అర్ధరాత్రి వీరమ్మతల్లిని స్థానిక రావిచెట్టు సమీపంలోని మెట్టినింటికి తీసుకెళ్లారు. అక్కడ మహాశివరాత్రి రోజు వరకు ఉంచి..ఆ రోజు నడకదారిన తోట్లవల్లూరు మండలం ఐలూరు వద్ద కృష్ణానదిలో అమ్మవారిని స్నానమాచరింపజేసి తిరిగి మెట్టినింటికి తీసుకొస్తారు. వచ్చే ఏడాది తిరునాళ్ల ప్రారంభం వరకు అమ్మవారు అక్కడే భక్తులకు దర్శనమిస్తారు. చివరి రోజున వేలాది మంది జనంతో ఉయ్యూరు రహదారులన్నీ నిండిపోయాయి. కాటూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటైంది. శ్రీనివాసరావు వైద్యసేవలందించారు. గన్నవరం డీఎస్పీ శ్రీనివాస్ నేతృత్వంలో ఉయ్యూరు పట్టణ సీఐ టీవీవీ రామారావు ఆధ్వర్యంలో వందలాది మంది పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు.


ఊరేగింపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్ర ప్రసాద్ తదితరులు

ముఠా కార్మికుల ఆధ్వర్యంలో: బుధవారం ఉయ్యూరులో ముఠా కార్మికుల ఆధ్వర్యంలో పెద్దఎత్తున వీరమ్మతల్లి సంబరం జరిగింది. అమ్మవారి సారె తీసుకెళ్లే పోతుల ప్రభ ఊరేగింపును ఎమ్మెల్యే బోడే ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ వై.వి.బి.రాజేంద్రప్రసాద్‌లు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ పూర్ణచంద్రరావు, తెదేపా బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రాజులపాటి ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ రంగాన్ని అగ్ర స్థానానికి తీసుకెళ్లడమే లక్ష్యం

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు బ్యాంకుల నుంచి ఆర్థిక సహాయం మంజూరు పరంగా దేశంలోనే మొదటి ఐదు స్థానాల్లో రాష్ట్రాన్ని నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఆ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ప్రస్తుతం పదో స్థానంలో ఉందని, గతంతో పోలిస్తే రుణాల మంజూరు రెట్టింపు అయ్యిందని తెలిపారు. 'ఎంఎస్ఎంఈ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు... పరిష్కారానికి సూచనలు' అనే అంశంపై కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ఆధ్వర్యంలో విజయవాడ ఎంజీ రోడ్డులోని ఓ హోటల్లో బుధవారం రాత్రి నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి, ఉప సభాపతి రఘురామకృష్ణరాజు హాజరయ్యారు. వివిధ రంగాల పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ.. ఎంఎస్ఎంఈ రంగాన్ని అగ్ర స్థానంలోకి తీసుకెళ్లాలనే కృతనిశ్చయంతో ప్రభుత్వం ఉందని అన్నారు. అందులో భాగంగానే అనుమతులను సరళీకృతం చేశామని, ఆటో అప్రూవల్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని వివరించారు. పరిశ్రమల స్థాపనలో జాప్యాన్ని నివారించేందుకు వైట్, గ్రీన్ కేటగిరీ పరిశ్రమలకు ఆటోమెటిక్ అప్రూవల్ విధానాన్ని వర్తింపజేస్తున్నామని చెప్పారు. పారిశ్రామికవేత్తలు అనుమతుల కోసం చూడకుండా వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించవచ్చని, రెండేళ్ల లోపు అవసరమైన పత్రాలను సమర్పించే వెసులుబాటు కల్పిస్తున్నామని అన్నారు. గత రెండేళ్లలో ఎంఎస్ఎంఈలకు బ్యాంక్‌ల ఆర్థిక సహాయం రూ.4 వేల కోట్ల నుంచి రూ.8 వేల కోట్లకు పెరిగిందన్నారు. ఇంకా ఆ సహాయాన్ని పెంచాలనేది ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రతి ఇంటికి ఓ పారిశ్రామికవేత్త రావాలన్నదే ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 175 ఎంఎస్ఎంఈ పార్కులను ఆయా రంగాల అవసరాలకు అనుగుణంగా మార్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. ఉప సభాపతి రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వంతో ఘర్షణ ధోరణిలో కాకుండా... సంప్రదింపుల ద్వారా పారిశ్రామికవేత్తలు తమకు అవసరమైన రాయితీలు, సౌకర్యాలు పొందే వీలుంటుందని, ఈ విషయం తన వ్యక్తిగత అనుభవంతో చెబుతున్నానని అన్నారు. సీఐఐ విజయవాడ జోన్ ఛైర్‌పర్సన్ నాగలక్ష్మి, సభ్యులు కోటగిరి అభినవ్, ఈబీ రాజేశ్, వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు కీర్తి తదితరులు పాల్గొన్నారు. అనంతరం రుణాల మంజూరు పరంగా బ్యాంకుల నుంచి ఎదురవుతున్న ఇబ్బందులను పారిశ్రామికవేత్తలు మంత్రి, ఉప సభాపతి దృష్టికి తీసుకెళ్లారు. పూచీకత్తు లేని రుణాల పరిమితి పెంచాలని సీసీఐ ప్రతినిధులు కోరారు. గత ప్రభుత్వ కాలం నుంచి నిలిచిపోయిన పారిశ్రామిక రాయితీలను విడుదల చేయాలని అన్నారు.

మాట్లాడుతున్న ఉప సభాపతి రఘురామకృష్ణరాజు, వేదికపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తదితరులు

15న వీణావాద్య కచేరీలు

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీసుబ్రహ్మణ్య మహతీ సంగీత సంస్థ 10వ వార్షికోత్సవం సందర్భంగా గాంధీనగర్‌లోని వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో దశమ వార్షిక అఖండ ఖచ్చపీ (వీణావాద్య కచేరీలు) మహోత్సవం నిర్వహించనున్నట్లు కార్యదర్శి సి.విశ్వేశ్వర రావు, ఉపాధ్యక్షురాలు చిట్టా రామలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15వ తేదీ ఉదయం 8 నుంచి 16వ తేదీ ఉదయం 8 వరకు(24 గంటలు) నిర్విరామంగా సాగుతుందన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 200 మందికిపైగా విద్వాంసులు, వాద్యకళాకారులు పాల్గొని వీణపై సంప్రదాయ కీర్తనలతో అలరిస్తారని ఆ ప్రకటనలో తెలిపారు.

14న హెచ్‌సీఎల్ క్రీడా జట్ల ఎంపిక పోటీలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: హెచ్‌సీఎల్, హీల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 14న పటమటలోని కేబీసీ జడ్పీహెచ్ స్కూల్ మైదానంలో ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి క్రీడా జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని హెచ్‌సీఎల్ స్పోర్ట్స్ ఫర్ ఛేంజ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్.శ్యామ్ సుందరరావు తెలిపారు. బాలబాలికలకు ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బాలికలకు మాత్రమే రగ్బీ పోటీలు ఉంటాయని చెప్పారు. జనవరి ఒకటి, 2011 తర్వాత జన్మించి.. ప్రభుత్వ, నగర పాలక సంస్థ, గురుకుల పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న వారు మాత్రమే పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఈ పోటీల నుంచి ప్రతిభ గల క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఆ జట్లు త్వరలో బెంగళూరులో జరిగే దక్షిణ భారత్ అంతర్ రాష్ట్ర పోటీల్లో తలపడతాయని వివరించారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు హెచ్‌సీఎల్ ఉచిత ప్రయాణ, దినసరి భత్యం చెల్లిస్తుందని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు, జట్లు ఈ నెల 14వ తేదీ ఉదయం 8 గంటలకు జడ్పీహెచ్ స్కూల్ మైదానంలో హాజరు కావాలని సూచించారు. హెచ్‌సీఎల్ ఏరియా మేనేజర్ బి.శ్రీనివాసరావు, హీల్ సీఈవో కె.అజయ్‌కుమార్ పోటీలను పర్యవేక్షిస్తారని ఎస్.శ్యామ్ సుందరరావు తెలిపారు. కార్యక్రమానికి ఎస్పీడీ బి.శ్రీనివాసరావు, ఎన్టీఆర్ డీఈవో చంద్రకళ ముఖ్యఅతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు.

అందరూ సహోదర ప్రేమతో జీవిస్తే మేలు

ముగిసిన గుణదల మేరీమాత ఉత్సవాలు

గుణదల, న్యూస్‌టుడే: మూడు రోజులుగా నిర్వహించిన గుణదల మేరీమాత మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ముగింపు వేడుకలకు విజయవాడ కథోలిక పీఠం బిషప్ తెలగతోటి రాజారావు ముఖ్యఅతిథిగా హాజరై సందేశమిచ్చారు. అసమానతలు తొలగినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. మదర్ థెరెసా, జోసఫ్ తంబి లాంటి వ్యక్తులు సమాజానికి ఎంతో అవసరమని అన్నారు. అందరూ సహోదర ప్రేమతో జీవించాలని పిలుపునిచ్చారు. మేరీమాతను దర్శించిన భక్తులకు అనుగ్రహం లభించడం వల్లే ఏటా వేడుకలకు వచ్చే విశ్వాసుల సంఖ్య పెరుగుతోందని పేర్కొన్నారు. అనంతరం బిషప్‌లు రాజారావు, షమీంద్ర జయవర్ధన (అమెరికా)లతో కలిసి మోన్సిన్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, వికార్ జనరల్ ఫాదర్ మేశపాం గాబ్రియేలు, గుణదల పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు తదితర 500 మంది గురువులు ముగింపు మహోత్సవాల సమిష్టి దివ్యపూజాబలి సమర్పించారు. భక్తులకు దివ్యసత్ప్రసాదం అందజేశారు. ఉత్సవాల చివరి రోజు పుణ్యక్షేత్రం విశ్వాసులతో కిటకిటలాడింది. ప్రార్థనలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. దివ్యసత్ప్రసాదం స్వీకరించారు. ఫాదర్ పసల థామస్, మధిర బెర్నాడ్ బృందం ఆలపించిన ఆధ్యాత్మిక గీతాలు, కోలాటం, భక్తి గీతాలు, లూర్దు మాత సంక్షిప్త చరిత్ర ప్రదర్శన, బుర్రకథ ఆకట్టుకున్నాయి. పీఠాధిపతిగా బిషప్ రాజారావు 10 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన్ని మోన్సిన్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్ తదితరులు సన్మానించారు. ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, వైకాపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ తదితరులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ.. తమిళనాడు వేళాంగిణి మాత ఉత్సవాల తరహాలో వచ్చే ఏడాది మరింత వైభవంగా.. మేరీమాత ఉత్సవాలు నిర్వహించేందుకు ఎమ్మెల్యే రామ్మోహన్‌తో కలిసి కృషి చేస్తానని తెలిపారు. పుణ్యక్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఉత్సవాలకు జిల్లా యంత్రాంగం చక్కటి ఏర్పాట్లు చేసిందని అభినందించారు. ఫాదర్లు పసల థామస్, కొలకాని మరియన్న, తోట సునీల్ రాజు, జి.కిరణ్‌బాబు, మెరుగుమాల చిన్నప్ప, తెలగతోటి పౌలు, గుజ్జల మైఖేల్, డేవిడ్ రాజు, వినయ్ కుమార్ తదితర 500 మంది గురువులు, సిస్టర్లు పాల్గొన్నారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్, వేదికపై ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, బిషప్ తెలగతోటి రాజారావు తదితరులు

వేడుకలకు హాజరైన విశ్వాసులు

(c) eenadu

ముగిసిన ఉత్సవాలు.. పోటెత్తిన విశ్వాసులు

గుణదల మేరీ మాత ఉత్సవాలు బుధవారం ముగిశాయి. చివరి రోజు భారీగా విశ్వాసులు తరలివచ్చారు. కార్యక్రమంలో భాగంగా దివ్య పూజాబలి ప్రసాదాన్ని చూపుతున్న బిషప్‌లు రాజారావు, షమీంద్ర జయవర్ధన. -గుణదల, న్యూస్‌టుడే

విద్యుత్తు దీపాల వెలుగుల్లో గుణదల కొండ

ఎన్‌హెచ్‌-65కి.. ఒక్కటే డీపీఆర్‌!

❖ హైదరాబాద్‌-విజయవాడ హైవే బెంజ్‌సర్కిల్‌ వరకు విస్తరణ
❖ 18న ఉమ్మడి జిల్లా స్టేక్‌హోల్డర్స్‌ సమావేశంలో స్పష్టతకు అవకాశం

ఈనాడు, అమరావతి

ఎన్‌హెచ్‌-65కి ఏకరూపకత తీసుకొచ్చేందుకు అడుగులు పడుతున్నాయి. హైదరాబాద్‌-విజయవాడ హైవే ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్రంలోని భువనగిరి జిల్లా మల్కాపురం నుంచి విజయవాడ పున్నమిఘాట్‌ వరకు విస్తరణకే డీపీఆర్‌ రూపొందించారు. తాజాగా బెంజ్‌సర్కిల్‌ వరకు విస్తరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటి వరకు పున్నమిఘాట్‌ వరకు ఒక భాగం.. బెంజ్‌సర్కిల్‌ నుంచి మచిలీపట్నం వరకు మరో భాగంగా ఉన్న ఎన్‌హెచ్‌-65 ఇప్పుడు ఒకే రహదారిగా విస్తరించనున్నారు. వేరువేరుగా తయారు చేసిన డీపీఆర్‌లను అనుసంధానం చేసి ఒక్కటిగా రూపొందించనున్నారు. ఫిబ్రవరి 18న విజయవాడలో జరగనున్న భాగస్వాముల (స్టేక్‌ హోల్డర్స్‌) సదస్సులో దీనిపై స్పష్టత రానుంది.

రెండు పైవంతెనల నిర్మాణం..

✪ విజయవాడ నగరంలోని ట్రాఫిక్‌ రద్దీ నేపథ్యంలో రెండు పైవంతెనల నిర్మాణం చేపట్టాలని ప్రజాప్రతినిధులు పట్టుబడుతున్నారు. కనకదుర్గ పై వంతెన నుంచి బెంజ్‌సర్కిల్‌ పైవంతెనకు అనుసంధానం చేస్తూ దాదాపు 5 కి.మీ మేర భారీ పైవంతెన నిర్మించాలని ప్రజాప్రతినిధులు అడుగుతున్నారు. బెంజ్‌సర్కిల్‌ నుంచి గోసాల వరకు ఎన్టీఆర్‌ సర్కిల్‌, ఆటోనగర్‌, కానూరు, తాడిగడప, పెనమలూరు కూడళ్లలో ట్రాఫిక్‌ రద్దీ ఎక్కువగా ఉండడంతో ఆ మధ్యలో ఓ భారీ పై వంతెన నిర్మాణం చేపట్టాలని గతంలో విజయవాడ, మచిలీపట్నంలో జరిగిన భాగస్వాముల సదస్సులో ప్రజాప్రతినిధులు డిమాండ్‌ చేశారు. ఈ రెండు అంశాలపై ప్రతిపాదనలు ఎన్‌హెచ్‌ఏఐ దృష్టికి తీసుకువెళ్లారు.

గతంలో కన్సల్టెన్సీ అభ్యంతరం

✪ బెంజ్‌సర్కిల్‌- గోసాల పరిధిలో వంతెన నిర్మాణానికి మెట్రో ప్రతిపాదనలు అడ్డంకిగా ఉన్నాయని గతంలో కన్సల్టెన్సీ అభ్యంతరం తెలిపింది. ఎన్‌హెచ్‌-65కి మెట్రోకి ముడిపెట్టవద్దని అది పట్టాలెక్కేలోగా ప్రజలకు ఇబ్బందులు పెరుగుతాయని.. డీపీఆర్‌ రివైజ్‌ చేయాలని ప్రజాప్రతినిధులు గట్టిగా చెప్పారు. ఈసారి ఆ ప్రతిపాదనలకు పరిగణనలోకి తీసుకుంటారని తెలుస్తోంది.

తెలంగాణ అధికారుల రాక

✪ హైదరాబాద్‌- విజయవాడ హైవేను తెలంగాణ ఎన్‌హెచ్‌ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. విజయవాడ-మచిలీపట్నం హైవే డీపీఆర్‌ విజయవాడ ఎన్‌హెచ్‌ అధికారుల ఆధ్వర్యంలో జరుగుతోంది. రెండు భాగాలను ఒకే డీపీఆర్‌ ద్వారా చేపట్టాలని అధికారులు, ప్రజాప్రతినిధులు భావిస్తున్నారు. దీంతో స్టేక్‌హోల్డర్ల సమావేశానికి తెలంగాణలో ఆ మార్గం పర్యవేక్షిస్తున్న ఎన్‌హెచ్‌ పీడీ, ఆర్వో కూడా సమావేశానికి హాజరుకానున్నారు. వీరితో పాటు జిల్లా ఎన్‌హెచ్‌ అధికారులు, ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, అధికారులు పాల్గొంటారు.

తవ్వింది లెక్కేసి.. కాసులు పోగేసి..

☛ కేవలం ఎన్‌వోసీలు తీసుకుని మట్టి దందా
☛ పరిశీలనలకే పరిమితమవుతున్న అధికారులు

ఈనాడు, అమరావతి

గత వైకాపా ప్రభుత్వంలో కొత్తూరు తాడేపల్లి పరిధిలో లక్షల క్యూబిక్‌ మీటర్ల మట్టిని అక్రమంగా తవ్వేశారు. వీరందరినీ గుర్తించి రూ.వందల కోట్ల డిమాండ్‌ నోటీసులను కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే అధికారులు ఇచ్చారు. కానీ ఒక్క రూపాయి వెనక్కి కట్టించింది లేదు. కేవలం నోటీసులు ఇచ్చి అక్రమార్కులతో కొందరు అధికారులు తెరవెనుక వ్యవహారం నడిపించారనే ఆరోపణలున్నాయి. ప్రస్తుతం మరో అడుగు ముందుకేసి గతంలో ఎక్కడైతే అక్రమాలు జరిగాయో.. మళ్లీ అక్కడే విచ్చలవిడిగా తవ్వేసి తరలించుకుపోతున్నారు. దీనిపై జిల్లా యంత్రాంగానికి గ్రామస్థులు ఫిర్యాదు చేస్తుంటే.. రావడం పరిశీలించి వెళ్లడం.. తప్ప చర్యలు శూన్యం. కొత్తూరు రెవెన్యూ పరిధిలోని ఆర్‌ఎస్‌ నంబరు.39లో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా.. కేవలం నిరభ్యంతర పత్రాలు(ఎన్‌వోసీ)లను చూపిస్తూ.. వాటినే మైనింగ్‌ అనుమతులుగా నమ్మిస్తూ.. విచ్చలవిడిగా మట్టి తవ్వకాలు చేస్తున్నారు. జిల్లా అధికార యంత్రాంగానికి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. రెండు రోజుల కిందట కూడా స్పందనలో తెదేపా నేత, సామాజిక కార్యకర్త మెండెం జమలయ్య.. ఈ తవ్వకాలపై ఫిర్యాదు చేశారు. రోజుకు కనీసం 500 లారీలకు పైగానే తవ్వి తీసుకెళ్లిపోతున్నారంటూ ఆధారాలతో సహా సమర్పించారు.

ఆర్‌ఎస్‌ 39లో భారీగా తవ్వి లారీల్లో తరలింపు..

తాజాగా మైనింగ్‌ అధికారులొచ్చి..

మైనింగ్‌ ఆర్‌ఐ శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో సిబ్బంది వచ్చి తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాన్ని బుధవారం పరిశీలించారు. ఎంత లోతుగా తవ్వకాలు జరిపారు, ఎన్ని క్యూబిక్‌ మీటర్ల మట్టిని తరలించుకుపోయారనే కొలతలు వేశారు. గతంలోనూ ఫిర్యాదులు వెల్లువెత్తిన సమయంలో మైనింగ్‌ సిబ్బంది వచ్చి ఇలాగే లెక్కలు వేసి వెళ్లిపోయారు. కానీ తవ్వకాలను అడ్డుకున్నది లేదు.

నెల కిందట ఇలాగే హడావుడి..

జనవరి 19న ఇలాగే తాడేపల్లి రెవెన్యూ పరిధిలోని ఆర్‌ఎస్‌ నంబరు 261/1ఎ ప్రవీణ్‌ అనే వ్యక్తి పేరుతో 1.32 ఎకరాల భూమికి రెవెన్యూ, అటవీశాఖల నుంచి ఎన్‌వోసీ తీసుకున్నారు. ఎన్‌వోసీలను మైనింగ్‌కు అనుమతుల కోసం పెట్టాలి. అనుమతి వస్తేనే తవ్వాలి. కానీ ఇవేవీ చేయకుండా కేవలం ఎన్‌వోసీలను చూపిస్తూ తవ్వేయడం ఆరంభించారు. దీనిపైనా స్థానికులు ఫిర్యాదు చేయడంతో అధికారులు వచ్చి హడావుడి చేసి ఆరు లారీలు, రెండు జేసీబీలను సీజ్‌ చేశారు. ఆ తర్వాత ఒక్కో వాహనానికి రూ.8వేలు కట్టించుకుని వదిలేశారు. ఒక లారీ లోడ్‌ రూ.10వేలకు అమ్ముతుంటే ఈ జరిమానాలు ఏమాత్రం? అందుకే అక్రమ తవ్వకాలు ఆగడం లేదు.

నిజాయతీ కలిగిన పార్టీ తెలుగుదేశం

క్రమశిక్షణకు మారు పేరు గద్దె కుటుంబం ✪ ఎన్టీఆర్‌ జిల్లా అధ్యక్షురాలిగా అనురాధ ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రులు

అధ్యక్షురాలు, కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న నెట్టెం రఘురామ్‌

పటమట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఎవరిని అడిగినా క్రమశిక్షణకు మారుపేరు గద్దె కుటుంబమని చెబుతారని, తెదేపా బలోపేతానికి కృషి చేసిన వారికి సరైన గుర్తింపు లభిస్తుందనడానికి గద్దె అనురాధను తెదేపా ఎన్టీఆర్‌ జిల్లా అధ్యక్షురాలిగా నియమించడమే నిదర్శనమని మంత్రులు కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి, ఎంపీ శివనాథ్‌ అన్నారు. నగరంలోని ఎస్‌ఏసీ కల్యాణ మండపంలో బుధవారం తెదేపా ఎన్టీఆర్‌ జిల్లా అధ్యక్షురాలిగా గద్దె అనురాధ, కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం వైభవంగా నిర్వహించారు. తొలుత అశోక్‌నగర్‌లోని తన నివాసం నుంచి అనురాధ.. నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్టీఆర్‌ సర్కిల్‌కు ప్రదర్శనగా వచ్చారు. అక్కడ ఎన్టీఆర్‌ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి ఎస్‌ఏసీ కల్యాణ మండపానికి ప్రదర్శనగా చేరుకున్నారు. అనంతరం తెదేపా ఎన్టీఆర్‌ జిల్లా మాజీ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్‌ నుంచి అనురాధ అధ్యక్షురాలిగా, ప్రధాన కార్యదర్శిగా చెన్నుబోయిన చిట్టిబాబు, కార్యవర్గ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. మంత్రి రవీంద్ర మాట్లాడుతూ... నిజాయతీ, క్రమశిక్షణతో కూడిన పార్టీ తెదేపా ఒక్కటేనని అన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కమిటీలున్న ఏకైక పార్టీ కూడా తెదేపా నేనని పేర్కొన్నారు. మంత్రి పార్థసారథి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి నాయకులు, కార్యకర్తలు తీసుకెళ్లాలని సూచించారు. ఎంపీ శివనాథ్‌ మాట్లాడుతూ.. తెదేపా పట్ల గద్దె రామ్మోహన్‌ కుటుంబానికి అంతులేని అభిమానం ఉందని అన్నారు. 11 సీట్లను నిలబెట్టుకోవడానికి వైకాపా ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వచ్చారని అన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌ మాట్లాడుతూ.. జిల్లా అధ్యక్ష పదవి నిర్వహణ చాలా కష్టమని, గతంలో తాను అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఇబ్బందులు పడ్డానని గుర్తు చేశారు. అనురాధకు సహనం ఎక్కువని, ఆమె పార్టీని ముందుకు తీసుకెళ్తుందని అన్నారు. తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, వసంత కృష్ణప్రసాద్‌, శ్రీరాంతాతయ్య, కొలికపూడి శ్రీనివాస్‌, తెదేపా కృష్ణా జిల్లా అధ్యక్షుడు వీరంకి గురుమూర్తి, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌ ఛైర్మన్‌ కొమ్మారెడ్డి పట్టాభిరామ్‌, నాయకులు నన్నపనేని రాజకుమారి, నాగుల్‌మీరా, పరుచూరి అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారథి

ఇగ్నో దరఖాస్తుల ఆహ్వానం

విజయవాడ వన్‌టౌన్‌, న్యూస్‌టుడే: ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో) నిర్వహించే బీఎడ్‌, బీఎస్సీ నర్సింగ్‌ కోర్సులకు జనవరి 2026కు, రిహాబిలిటేషన్‌ కౌన్సెల్‌ ఆఫ్‌ ఇండియా గుర్తింపు పొందిన పి.జి.డిప్లొమా ఇన్‌ రిహాబిలిటేషన్‌ సైకాలజీ కోర్సు జులై 2026కు నిర్వహించే ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇగ్నో ప్రాంతీయ కేంద్రం రీజినల్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ కె.సుమలత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడ ప్రాంతీయ కేంద్రం పరిధిలో విజయవాడలో మాత్రమే ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు వివరించారు. ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి బీఎడ్‌ ప్రవేశ పరీక్షకు ఫిబ్రవరి 27 ఆఖరు తేదీ.. బీఎస్సీ నర్సింగ్‌, పి.జి.డిప్లొమా ఇన్‌ రిహాబిలిటేషన్‌ సైకాలజీ కోర్సుల ప్రవేశ పరీక్షకు మార్చి 05 ఆఖరు తేదీ అని చెప్పారు. అర్హులైన అభ్యర్థులు ఇగ్నో వెబ్‌సైట్‌ను సందర్శించి ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని కోరారు. మరిన్ని వివరాలకు కొత్తపేట హిందూ హైస్కూల్‌ ప్రాంగణంలోని ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని, దగ్గరలోని ఇగ్నో అధ్యయన కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు. 0866-2565253 ఫోన్‌ నంబరు ద్వారా వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు.

పేద విద్యార్థులకు ఉచిత కార్పొరేట్‌ విద్య

ఒకటో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయవాడ సిటీ, ఉయ్యూరు గ్రామీణం న్యూస్‌టుడే

విద్యా హక్కు చట్టం - 2009 ప్రకారం పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులు ఉచితంగా కార్పొరేట్‌ విద్య పొందవచ్చు. విద్యాసంస్థల్లో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు కేటాయిస్తారు. 2026-27 విద్యా సంవత్సరానికిగాను ఒకటో తరగతిలో ప్రవేశాలకు ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

అర్హులు ఎవరు?.. దరఖాస్తు ఎలా?

★ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.44 లక్షలు ఉన్న తల్లిదండ్రుల పిల్లలు అర్హులు. ★ స్టేట్‌ సిలబస్‌ పాఠశాలలో చేరే విద్యార్థి 2 జూన్‌ 2020 నుంచి 31 మే 2021 మధ్య, సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ సిలబస్‌ పాఠశాలలో చేరే విద్యార్థి 2 ఏప్రిల్‌ 2020 నుంచి 31 మార్చి 2021 మధ్య జన్మించాలి. ఐదేళ్లు నిండాలి. ★ www.cse.ap.gov.in వెబ్‌సైట్‌లో లేదా స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయాలు, ఎంఈవో కార్యాలయం, మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. ★ ఓటరు గుర్తింపు కార్డు, తెల్ల రేషన్‌ కార్డు, పాస్‌పోర్టు, ఉపాధి హామీ జాబ్‌కార్డ్‌, డ్రైవింగ్‌ లైసెన్సు, విద్యుత్తు బిల్లు, గ్యాస్‌ కనెక్షన్‌ పత్రాన్ని చిరునామా ధ్రువీకరణకు పరిగణనలోకి తీసుకుంటారు. ★ ఈ నెల 20 నుంచి మార్చి 10 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. మార్చి 25న లాటరీ తీసి విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఏప్రిల్‌ 13 నుంచి 23 వరకు ప్రవేశాల నిర్ధారణ ఉంటుంది.

జత చేయాల్సిన పత్రాలు

★ విద్యార్థి జనన, కుల, వార్షిక ఆదాయం ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి. ★ వివరాల కోసం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు 1800-4258-599 టోల్‌ఫ్రీ నంబరులో సంప్రదించవచ్చు ★ ఎన్టీఆర్‌ జిల్లాలో 512, కృష్ణా జిల్లాలో 282 కార్పొరేట్‌, ప్రైవేట్‌, అన్‌ఎయిడెడ్‌ పాఠశాలలున్నాయి. గతేడాది ఎన్టీఆర్‌ జిల్లాలో వెయ్యి, కృష్ణా జిల్లాలో 505 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. ★ అర్హులు ఉచిత కార్పొరేట్‌ విద్య పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సమగ్ర శిక్షా ఎన్టీఆర్‌, కృష్ణా జిల్లాల అదనపు కోఆర్డినేటర్లు ఎం.రజని, ఆర్‌.కుమిదిని సింగ్‌ తెలిపారు.

వదిలేస్తే ఇలా.. వదిలిస్తే మురిసేలా..

ఈ చిత్రంలో పచ్చగా కనిపిస్తున్నది పచ్చని మైదానం కాదు. కొండపల్లిలో పూర్తిగా నిర్వహణ కరవై పిచ్చిమొక్కలు, నాచు, గుర్రపుడెక్క పెరిగిపోయిన గజరాజు చెరువు. ఇబ్రహీంపట్నం నుంచి కొండపల్లికి వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న ఈ చెరువును బాగు చేస్తే ఆహ్లాదాన్ని పంచుతుంది. కొండపల్లి బొమ్మలు చూసేందుకు, కొనేందుకు దేశవిదేశాల నుంచి పర్యాటకులు వచ్చే ఈ ప్రాంతంలో చెరువును అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. -ఈనాడు, అమరావతి

పవిత్ర సంగమం.. అవుతోంది శుభ్రం

ఇబ్రహీంపట్నంలోని పవిత్ర సంగమం వద్ద కృష్ణానది తీరాన్ని మహాశివరాత్రి భక్తుల పుణ్యస్నానాల కోసం శుభ్రం చేస్తున్నారు. నదీతీరంలో ఉన్న చెత్తను అంతా తొలగించి, ఘాట్లలో పేరుకుపోయిన మట్టిని తొలగిస్తున్నారు. భక్తులకు ఎటువంటి ఆటంకం లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. -ఈనాడు అమరావతి

స్పీడ్‌ బ్రేకర్లుంటే.. హర్షవర్ధన్‌ బతికేవాడు..!

☛ అత్యంత ప్రమాదకరంగా మారిన కానూరు రోడ్డు
☛ మలుపులు, అనేక అంతర్గత దారులతో అనుసంధానం

ఈనాడు, అమరావతి, - కానూరు, తాడిగడప న్యూస్‌టుడే

తాడిగడప మున్సిపాలిటీలోని ప్రధాన రహదారుల్లో ఒకటైన కామయ్యతోపు నుంచి కానూరు వెళ్లే రోడ్డు అత్యంత ప్రమాదకరంగా మారింది. విజయవాడ నగరాన్ని ఆనుకుని ఉన్న కిలోమీటరున్నర పొడవైన ఈ రోడ్డులో కేవలం స్పీడ్‌ బ్రేకర్లు లేకపోవడం వల్లే శ్రీహర్షవర్ధన్‌ అనే పదో తరగతి విద్యార్థి సోమవారం బలైపోయాడు. చదువులో రాణిస్తున్న హర్ష భవిష్యత్తుపై తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ అర్ధాంతరంగా మృత్యువు కబళిస్తుందని ఊహించలేకపోయారు. అత్యంత వేగంగా బైక్‌పై దూసుకొచ్చిన పదో తరగతి చదివే ముగ్గురు విద్యార్థులు రోడ్డుపై వెళ్తున్న హర్షవర్ధన్‌ను ఢీకొట్టి అతని మరణానికి కారణమయ్యారు. ఈ రోడ్డుపై ఒక్క స్పీడ్‌ బ్రేకరు కూడా లేకపోవడంతో విచ్చలవిడిగా ద్విచక్ర వాహనాలు, కార్లతో దూసుకుపోతూ అమాయకుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు.

రహదారిపై ప్రమాదకర మలుపు

అధికారులు కళ్లు తెరవాలి..

ఈ రోడ్డుపై ఉన్న చర్చి ఎదురుగా ఆరేడు నెలల కిందట జరిగిన ప్రమాదంలో ఓ యువ ఉద్యోగి మృతి చెందాడు. ప్రస్తుతం ఓ విద్యార్థి బలైపోయాడు. నిత్యం ప్రమాదాలు ఏదో ఒక చోట జరుగుతూనే ఉన్నాయి. ఈ రోడ్డు పంట కాలువ జంక్షన్‌ నుంచి ఆరంభమై.. ప్రమాదకరమైన మలుపులు, కాలనీల్లోకి వెళ్లే అంతర్గత దారులతో అనుసంధానమై ఉంటుంది. ఎటునుంచి ఎవరు దూసుకొస్తారో కూడా ఊహించడం కష్టం. కనీసం ఓ ఐదారు ప్రాంతాల్లో స్పీడ్‌ బ్రేకర్లు ఉండాలి. కొత్తగా ఈ రహదారిని ఆరు నెలల కిందట వేసినప్పుడే స్పీడ్‌ బ్రేకర్లను వేయాలంటూ అన్ని వర్గాల నుంచి విజ్ఞప్తులు వచ్చినా అధికారులు ఒకరిపై ఒకరు నెపం నెట్టుకుంటూ.. పెడచెవిన పెట్టారు. ఇంత జరిగినా ఇప్పటికీ యంత్రాంగంలో చలనం లేకపోవడం బాధాకరం.

వందల విద్యా కేంద్రాలున్న ప్రాంతం..

కానూరు రోడ్డుకు ఆనుకుని చుట్టుపక్కల కనీసం 150కుపైగా విద్యాసంస్థలు, అకాడమీలు, కళాశాలలు ఉన్నాయి. నిత్యం 50వేల మంది విద్యార్థులు, లక్షల మంది ప్రజలు.. వేల సంఖ్యలో వాహనాల్లో తిరుగుతుంటారు. విజయవాడను ఆనుకుని ఉన్న ప్రాంతం కావడంతో.. నగరంలో కొలువులు చేసేవాళ్లంతా ఇక్కడే ఉంటారు. ఇంత కీలకమైన రహదారిపై స్పీడ్‌ బ్రేకర్లు అత్యవసరం. అప్పుడే వాహనాల వేగానికి.. పగ్గాలు పడి ప్రమాదాలను అరికట్టేందుకు వీలుంటుంది.

దుర్గమ్మ సేవకులకు సేవా యాప్‌ ప్రారంభం

ఇంద్రకీలాద్రి: కనకదుర్గమ్మ ఆలయ సేవకుల కోసం సేవా యాప్‌ ప్రారంభిస్తున్నట్లు ఈవో శీనానాయక్‌ తెలిపారు. తిరుమల తరహాలో స్వచ్ఛంద సేవ పట్ల ఆసక్తి ఉన్న వారి పేర్లు నమోదు చేసేందుకు సేవా యాప్‌ వినియోగించుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్‌, హాజరు, పర్యవేక్షణ కోసం యాప్‌ను తీసుకు వచ్చినట్లు తెలిపారు. సాధారణ రోజుల్లో 30వేల నుంచి 40 వేలమంది, వారాంతాల్లో 50వేల నుంచి 70 వేలమంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటున్నారని చెప్పారు. క్యూలైన్లు, అన్నదానం, ఉచిత ప్రసాద పంపిణీ, తాగునీరు, పాలు అందజేయడానికి దేవస్థానం సిబ్బందితో పాటు స్వచ్ఛంద సేవకులను వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. తిరుమల తరహాలో సేవకులను పారదర్శకంగా వినియోగించుకునేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు అమరావతి సాఫ్ట్‌వేర్‌ ఇన్నోవేషన్స్‌ ఈ యాప్‌ రూపొందించిందని పేర్కొన్నారు.

చేనేత పరిశ్రమ పరిరక్షణకు మంత్రి కృషి

మంగళగిరి: చేనేత పరిశ్రమ పరిరక్షణకు మంత్రి నారా లోకేశ్‌ విశేష కృషి చేస్తున్నారని పద్మశాలీ వెల్ఫేర్‌ కార్పొరేషన్‌ ఛైర్మన్‌ నందం అబద్ధయ్య చెప్పారు. వస్త్రాలకు వినియోగించే నూలుకు రంగులు అద్దే కార్మికులకు నూతన పద్ధతులపై నైపుణ్య శిక్షణను కేంద్ర ప్రభుత్వ జౌళి మంత్రిత్వ శాఖ, చేనేత అభివృద్ధి సంస్థ చేపట్టింది. మంగళగిరి రాజీవ్‌గృహకల్ప వద్ద ఉన్న రజక సామాజిక భవనంలో ఈ శిక్షణ తరగతులను బుధవారం అబద్ధయ్య ప్రారంభించారు. 20 మంది కార్మికులకు 15 రోజుల పాటు శిక్షణ ఇస్తారు. శిక్షణ పొందే కార్మికులకు రోజుకు రూ.300 చొప్పున ఇవ్వనున్నారు.

సెల్‌ఫోన్ల మధ్యలో.. స్వర్ణం తరలింపు

పట్టుకున్న పన్నుల అధికారులు ✪ 275గ్రా. బంగారం, 308 గ్రా. వెండి స్వాధీనం

ఈనాడు, అమరావతి: సెల్‌ఫోన్ల మధ్యలో బంగారం పెట్టి తరలిస్తుండగా రాష్ట్ర పన్నులశాఖ అధికారులు పట్టుకున్నారు. రూ.50లక్షల విలువైన 275గ్రాముల బంగారం, మరో 308గ్రాముల వెండి దొరికాయి. విజయవాడ వాణిజ్య పన్నుల మూడో డివిజన్‌ అధికారులకు పక్కా సమాచారం అందడంతో బుధవారం తెల్లవారుజామున గాంధీనగర్‌లో పహారా కాశారు. ఓ ద్విచక్ర వాహనదారుడిని తనిఖీ చేయగా.. అతని వద్ద ఉన్న బ్యాగులో సెల్‌ఫోన్ల పెట్టెలు కనిపించాయి. వాటి మధ్యలో రెండు ప్రత్యేక బాక్సులను గుర్తించారు. వాటిలో మందులు ఉన్నాయంటూ అతను చెప్పాడు. అనుమానం వచ్చి పరిశీలించగా పెట్టెల్లో బంగారం ఉన్నట్టు గుర్తించారు. వెంటనే సత్యనారాయణపురం పోలీస్‌స్టేషన్‌కు బంగారం బాక్సులను తరలించారు. నగరంలోని నాలుగు బంగారు దుకాణాలకు వాటిని తరలిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే వాటి యజమానులకు సమాచారం అందించి రప్పించారు. పోలీసులు, సదరు బంగారం యజమానుల సమక్షంలో వీడియో తీస్తూ బాక్సులను తెరిచారు. బంగారం, వెండి బయటపడ్డాయి. వాటికి ఎలాంటి బిల్లులు లేవు. హైదరాబాద్‌ నుంచి వీటిని తీసుకొచ్చినట్టు గుర్తించారు. డీసీటీవో కిరణ్‌ ఆధ్వర్యంలోని పన్నుల అధికారులు ఈ బిల్లులు లేని సరకును పట్టుకున్నారు. ప్రస్తుతం మూడు శాతం పన్ను, మరో మూడు శాతం జరిమానాతో కలిపి వాణిజ్య పన్నులశాఖకు వీటిపై ఆదాయం సమకూరుతుంది.

అందుబాటులో 2,908 టన్నుల యూరియా

ఎన్టీఆర్‌ కలెక్టరేట్‌, న్యూస్‌టుడే: రబీ పంటల సాగు నేపథ్యంలో ఈనెల 11వ తేదీ నుంచి రాబోవు 8 రోజులకు 1,576 మెట్రిక్‌ టన్నుల యూరియా అవసరం కాగా ప్రస్తుతం 2,908 మెట్రిక్‌ టన్నులు అందుబాటులో ఉన్నట్టు జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి డి.ఎం.ఎఫ్‌.విజయకుమారి బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎరువుల కొరత లేదని ఆమె వివరించారు.

(c) eenadu

రెవెన్యూ క్లినిక్‌లకు 259 అర్జీలు

❑ 26 పరిష్కారం ❑ 183 విచారణకు ఆదేశం

జేసీ ఇళక్కియా

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆదేశాల మేరకు గత ఏడాది డిసెంబరు 29 నుంచి కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం రెవెన్యూ క్లినిక్‌లు నిర్వహిస్తున్నారు. ఈ నెల 9వ తేదీ వరకు వీటి ద్వారా మొత్తం 259 అర్జీలు స్వీకరించినట్లు జాయింట్ కలెక్టర్ ఎస్.ఇళక్కియా బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. నిర్ణీత వ్యవధిలో పరిష్కారం చూపిన 50 అర్జీలను ఆమోదించి ఏపీ సేవా సర్వీసుల్లో నమోదు చేసినట్లు వెల్లడించారు. ఆర్వోఆర్ అప్పీలు, భూ సర్వేకు సంబంధించిన మరో 183 అర్జీల విచారణకు ఆదేశాలిచ్చినట్లు పేర్కొన్నారు.

అర్జీదారుల్లో సంతృప్తి.. సంతోషం

రీ సర్వేలో జరిగిన పొరపాటుపై తిరువూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని గంపలగూడెం మండలం కనుమూరుకు చెందిన జంగా మనీషా రెడ్డి అర్జీ దాఖలు చేశారు. ఈక్రమంలో రెవెన్యూ రికార్డులు, ఎఫ్ఎంబీ, రిజిస్టరు దస్తావేజులు, సరిహద్దులు, భూ స్థితిని పరిశీలించారు. తప్పుగా నమోదైన సర్వే నంబరు, అనుభవ స్వభావం, భూమి స్వభావం, పట్టాదారు పేరు, అనుభవదారుని పేరును వెబ్ ల్యాండ్‌లో సరిచేసి, అడంగల్ నకలును అర్జీదారునికి అందజేశారు. వినతిపత్రం దాఖలు చేసిన రోజునే సమస్యను పరిష్కరించడంతో అర్జీదారు ఊరట చెందారు.

◆ నందిగామ డివిజన్ పరిధి వత్సవాయి మండలం మంగొల్లుకు చెందిన అన్నేపాక మహేష్‌కుమార్‌రెడ్డికి ఆర్ఎస్ నంబరు 158/1లో 90 సెంట్ల భూమి ఉంది. వెబ్ ల్యాండ్‌లో 40 సెంట్లను తప్పుగా చూపుతోంది. దీనిపై ఈనెల రెండో తేదీన అర్జీ దాఖలు చేశారు. అధికారులు రెవెన్యూ రికార్డులు పరిశీలించి, సుమోటో సవరణ ద్వారా 90 సెంట్లకు సాంకేతిక సమస్యను సరిచేసి అప్‌డేషన్ పరిష్కారం చూపారు. మ్యుటేషన్ నమోదు చేయించారు. వచ్చిన రోజునే సమస్య పరిష్కరించడంతో అర్జీ దారుడు సంతృప్తి వ్యక్తం చేశారు.

◆ విజయవాడ రెవెన్యూ డివిజన్ పరిధిలోని విజయవాడ గ్రామీణ మండలం కొత్తూరు తాడేపల్లికి చెందిన తోటకూర శివకుమారి భర్త పుల్లయ్య ఈనెల 9వ తేదీన ఒక అర్జీ దాఖలు చేశారు. ఆర్ఎస్ నంబరు 33/4, 33/5లో 55 సెంట్ల భూమికి రీ సర్వే తర్వాత ఎల్పీఎం నంబరు 149గా వారి కుతురు, కుమారుల పేర్లు నమోదై ఉన్నాయి. సరిచేయాలని కోరారు. రెవెన్యూ రికార్డులను, రిజిస్టరు పార్టిషన్ దస్తావేజులను పరిశీలించారు. వెబ్ ల్యాండ్‌లో తప్పుగా నమోదైన పేర్లను తొలగించి, శివకుమారి పేరిట అడంగల్ నకలు మంజూరు చేశారు. సమస్య తక్షణమే పరిష్కారం కావడంతో అర్జీ దారుడు ఆనందం వ్యక్తం చేశారు.

తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటి చెప్పాలి: ఎస్పీ

మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, వేదికపై ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తదితరులు

శ్రీకాకుళం(ఘంటసాల), న్యూస్‌టుడే: తెలుగు భాష ఔన్నత్యాన్ని భవితరాలకు చాటి చెప్పాలని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు అన్నారు. శ్రీకాకుళంలో ఆంధ్రమహావిష్ణు సన్నిధిలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయలు మహోత్సవాలు బుధవారం రాత్రి ముగిశాయి. ఎస్పీ మాట్లాడుతూ రాయలు మహోత్సవాలతో పోలీస్ శాఖ చేపట్టే సమాజహిత కార్యక్రమాలలో భాగంగా తెలుగు భాష పట్ల నేటి తరానికి అవగాహన పెంచే చర్యలు తీసుకుంటామన్నారు. ... అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ గత కృష్ణా పుష్కరాల్లో విజయవాడ తరువాత అత్యధిక భక్తులు స్నానాలు చేసిన ప్రాంతంగా శ్రీకాకుళం నిలవడం గొప్ప విశేషమన్నారు. కవులు, సంగీత విద్వాంసులు, ఎందరో చరిత్ర ప్రసిద్ధి చెందిన మహనీయులు శ్రీకాకుళం వాసులు కావడం గర్వకారణమన్నారు. అతిథులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, సాహితీవేత్త శ్రీనివాసరావు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి పి.సాయిబాబు, ఆలయ ఏసీ దాసరి శ్రీరామవరప్రసాద్, ఈవో చెన్నకేశవరావు, ఎంపీపీ డి.సుబ్బారావు, నాయకులు మండవ రాజా, తుమ్మల చౌదరిబాబు, తాడికొండ వెంకటేశ్వరరావు, రవిప్రసాద్, నాగశ్రీనివాసరావు, చిట్టిబాబు, సీతారామరాజు, తదితరులు పాల్గొన్నారు. ◆ పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. 'భువన విజయం' సాహితీ నృత్యరూపకం, కేవీ సత్యనారాయణ బృందం 'మోహినీ భస్మాసుర' నృత్య నాటకం అలరించాయి. కళాకారులను ఎమ్మెల్యే సత్కరించారు.

'మోహినీ భస్మాసుర' నృత్య నాటకంలో ఓ సన్నివేశం

మట్టిలో మాణిక్యాలను వెలికి తీయడమే శాప్ లీగ్స్ లక్ష్యం

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: మట్టిలో మాణిక్యాలను వెలికితీయడమే శాప్ లీగ్స్ లక్ష్యమని ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. విజయవాడలోని తన కార్యాలయంలో శాప్ లీగ్స్ అమలుపై బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎండీ ఎస్.భరణితో కలిసి రవినాయుడు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించి శిక్షణ, వనరులు అందించి ఒలింపిక్స్ స్థాయికి వెళ్లేలా తీర్చిదిద్దడమే లక్ష్యమని స్పష్టం చేశారు. శాప్ లీగ్ కేవలం పోటీలే కాదని క్రీడా సంస్కృతిని బలోపేతం చేసే మహత్తర కార్యక్రమమని పేర్కొన్నారు. ప్రతిభ గల క్రీడాకారులను ఫిట్‌నెస్, పోషకాహారం, శారీరక సామర్థ్యాల ఆధారంగా ఎంపిక చేసి, వారికి స్పోర్ట్స్ కిట్స్, పరికరాలు, ఆర్థిక సహాయం అందించడమే కాకుండా ప్రముఖ క్రీడా అకాడమీలతో అనుసంధానం చేసి నిపుణుల పర్యవేక్షణలో శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. పీ4 మోడల్ ద్వారా ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, క్రీడా సంఘాలు, విద్యాసంస్థలు భాగస్వాములయ్యేలా సమన్వయం చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సంవత్సరం 32 క్రీడాంశాల్లో శాప్ లీగ్స్‌ను జిల్లాల వారీగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. శాప్ పరిపాలనాధికారి రమావత్ వెంకట రమణనాయక్, రాష్ట్రంలోని అన్ని జిల్లాల క్రీడాభివృద్ధి అధికారులు, స్కూల్ గేమ్స్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

జీవన్మృతుడి అవయవాల దానం

విజయ్‌కుమార్ (పాతచిత్రం)

తాడేపల్లి: ఇంజినీరింగ్ విద్యార్థి జీవన్మృతుడు కావడంతో అతని అవయవాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. తాడేపల్లి మణిపాల్ వైద్యశాల ప్రతినిధులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం జిల్లా మధిరకు చెందిన కందిమళ్ల విజయ్‌కుమార్(20) కేఎల్‌యూలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 6న కుంచనపల్లి క్రాస్‌రోడ్డు వద్ద ప్రమాదానికి గురయ్యాడు. దీంతో అతన్ని చికిత్స నిమిత్తం మణిపాల్ వైద్యశాలకు తీసుకొచ్చారు. అతని ఆరోగ్య పరిస్థితిని పరిశీలించిన వైద్యులు మెదడులో రక్తస్రావం అవుతుందని గమనించి చికిత్స అందించారు. అయినప్పటికీ ఆరోగ్య పరిస్థితిలో మార్పు కనిపించ లేదు. వైద్య పరీక్షల అనంతరం ఈనెల 11న జీవన్మృతుడిగా నిర్ధారించారు. తండ్రి సైదేశ్వరరావు, కుటుంబ సభ్యుల అంగీకారంతో ఏపీ జీవన్‌దాన్ ఛైర్మన్ డాక్టర్ రాంబాబు, వైద్యశాల డైరెక్టర్ రామాంజనేయ రెడ్డి ఆధ్వర్యాన అవయవదానం జరిగింది. ఇందులో గుండె, కాలేయాలను మణిపాల్ వైద్యశాల నుంచి విజయవాడలోని అవసరమైన వారికి అమర్చారు. ఊపిరితిత్తులను హైదరాబాద్ కిమ్స్‌కి, కిడ్నీలను గుంటూరు విధాత వైద్యశాలకు, కార్నియాలను విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి వైద్యశాలకు తరలించారు. అవయవదానానికి ముందుకొచ్చిన విజయ్‌కుమార్ కుటుంబానికి మణిపాల్ వైద్యశాల కృతజ్ఞతలు తెలిపింది.

తెదేపాతోనే వడ్డెరల అభివృద్ధి సాధ్యం

సంఘీభావం తెలుపుతున్న కుల పెద్దలు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: తెదేపాతోనే వడ్డెర అభివృద్ధి సాధ్యమని వడ్డెర కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ దేవళ్ల మురళీ పేర్కొన్నారు. గురువారం గవర్నర్‌పేటలోని ఓ హోటల్‌లో రాష్ట్ర వడ్డెర సంఘం ఆత్మీయ సమావేశం జరిగింది. అన్ని జిల్లాల నుంచి వడ్డెర కుల పెద్దలు విచ్చేశారు. వారి సమస్యలపై చర్చించారు. దేవళ్ల మురళీ మాట్లాడుతూ గత ప్రభుత్వ అరాచకాలకు ఎదురు తిరిగి అనేకమంది వడ్డెర నాయకులు పోలీస్ కేసులు పెట్టించుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొన్ని జిల్లాల్లో వడ్డెరలకు పదవుల కేటాయింపులో న్యాయం జరగడం లేదన్న భావన ఉందని ఈ నిరాశను తొలగించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వడ్డెర కులస్థులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని వివరించారు. వడ్డెరలను ఎస్టీల్లో చేర్చాలన్న నిర్ణయం ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. వారికి నామినేటెడ్ పదవులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. దీనిపై చంద్రబాబు సానుకూలంగా స్పందిస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలో తెదేపా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందిస్తామని మురళీ వివరించారు. అంజనప్ప, దేవుళ్ల వెంకట్, రెడ్డిశేఖర్, కుంచపు వెంకటేష్, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి వేడుకలకు పటిష్ఠ ఏర్పాట్లు

అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై మహాశివరాత్రి వేడుకలకు పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నట్లు దుర్గగుడి ఈవో శీనానాయక్ తెలిపారు. మల్లికార్జున మహామండపం నాలుగో అంతస్తులో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఈవో మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వేలాది భక్తులు దుర్గాఘాట్‌లో స్నానాలు చేసే అవకాశం ఉంటుందని.. మౌలిక వసతులపై ఇంజినీరింగ్, పారిశుద్ధ్యం విభాగ అధికారులు దృష్టి పెట్టాలని ఆదేశించారు. భక్తులు దుర్గమ్మ దర్శనం అనంతరం మల్లేశ్వరస్వామిని దర్శించుకుంటారని.. వారికి భక్తులకు ఇబ్బందులు లేకుండా ఫ్యాబ్రికేటెడ్ ఫ్రేమ్స్‌తో క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆన్‌లైన్లో దర్శనం, ఆర్జిత సేవలు, ఇతర సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. డిజిటల్ చెల్లింపులు క్యూలైన్లలో కౌంటర్ల వద్ద వచ్చే ఉండే సమయాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఏసీ రంగారావు, ఈఈ కోటేశ్వరరావు, డీఈ రవీంద్ర, ఏఈవోలు చంద్రశేఖర్, సుధారాణి పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో విద్యార్థులకు భరోసా

లోకేశ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రవినాయుడు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే: యువగళం కార్యక్రమంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలుచేస్తూ ముందుకు సాగుతున్న విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌పై యువత, విద్యార్థుల్లో విశ్వాసం మరింత బలపడిందని శాప్ ఛైర్మన్ రవినాయుడు పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.1,198 కోట్లు విడుదల చేయడంతో ఈట్ స్ట్రీట్ వద్ద విద్యార్థులతో కలిసి లోకేశ్ చిత్రపటానికి బుధవారం పాలాభిషేకం చేశారు. రవినాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ సక్రమంగా అమలుకాకపోవడంతో అనేకమంది విద్యార్థులు చదువుకు దూరమైన పరిస్థితులు చూశామని తెలిపారు. పేద విద్యార్థులను ఇబ్బందులకు గురిచేసేలా జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చిన జీవోలను సరిదిద్దుతూ కూటమి ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయడం ఒక కీలకమైన పరిణామమని కొనియాడారు. ఈ నిర్ణయం ద్వారా ఎంతోమంది పేద, బడుగు, బలహీనవర్గాల విద్యార్థులకు భరోసా ఏర్పడిందన్నారు. శాప్ బోర్డు సభ్యులు సంతోష్ విద్యార్థి సంఘాల నాయకులు పి.చరణ్‌సాయి యాదవ్, ఎస్కే నాగూర్, సోహెల్‌ఖాన్, శ్రీధర్, బాబి తదితరులు పాల్గొన్నారు.

ధర్నా విజయవంతానికి పిలుపు

ఎన్టీఆర్ కలెక్టరేట్: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కూటమి ప్రభుత్వాన్ని కోరుతూ.. రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నేతృత్వంలో ఈనెల 13వ తేదీన విజయవాడలోని అలంకార్ కూడలిలో చేపట్టిన ధర్నా విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేముల బిక్షమయ్య, జి.అనుగ్రహప్రసాదులు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి అంతర్జాతీయ సదస్సు

మాచవరం: స్థానిక ఎస్సారార్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 12, 13వ తేదీల్లో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపల్ భాగ్యలక్ష్మి తెలిపారు. దీర్ఘకాలిక పర్యావరణ ప్రభావాలను పరిగణనలోకి తీసుకోకుండా జరిగే పరిశోధనకు బదులుగా సుస్థిరత విలువలను అనుసరించే 'ఈకో-అడాప్టివ్' పరిశోధన అవసరంపై ప్రసంగాలు సాగుతాయని వివరించారు. ఈ సదస్సుకు మొత్తం 200 మంది అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొనేందుకు నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. ఈ సదస్సుకు భారత ప్రభుత్వానికి చెందిన ఏఎన్ఆర్ఎఫ్/డీఎస్‌టీ-ఎస్ఈఆర్‌బీ, ఆరీస్ ఆగ్రో లిమిటెడ్ సంస్థలు ప్రాయోజకులుగా తమ సహకారం అందిస్తున్నాయన్నారు. రాష్ట్ర కళాశాల విద్య కమిషనర్ నారాయణ భరత్‌గుప్తా ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు.

జినేష్, శిబుకు బెయిల్ మంజూరు

నకిలీ మద్యం కేసులో ఉత్తర్వులిచ్చిన ఎక్సైజ్ కోర్టు

ఈనాడు, అమరావతి: నకిలీ మద్యం కేసులో ఇద్దరు నిందితులకు కోర్టు బెయిల్ ఇచ్చింది. తమకు బెయిల్ మంజూరు చేయాలని జినేష్ (ఏ24), శిబు (ఏ25) విజయవాడలోని ఎక్సైజ్ కోర్టులో గత నెలలో పిటిషన్లు దాఖలు చేసుకున్నారు. వీటిపై గత వారం ఇరుపక్షాల వాదనలు పూర్తి అయ్యాయి. బుధవారం ఎక్సైజ్ కోర్టు న్యాయాధికారి లెనిన్ బాబు తీర్పు వెలువరించారు. నిందితులు ఇద్దరికి బెయిల్ మంజూరు చేశారు. ఒక్కొక్కటి రూ.25వేలు చొప్పున రెండు పూచీకత్తులను సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బాలాజీకి గోవాలో వీరిద్దరు స్పిరిట్ సరఫరా చేశారు. కేరళలోని త్రిసూర్ జిల్లా కైపమంగళం ప్రాంతానికి చెందిన జినేష్.. ఎనిమిదేళ్లుగా గోవాలో లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. కేరళకే చెందిన శిబు ద్వారా బాలాజీకి పలు సార్లు అందజేశాడు. గత ఏడాది డిసెంబరు 27న వీరిని పీటీ వారెంట్‌పై మదనపల్లి నుంచి తీసుకొచ్చి విజయవాడ కోర్టులో హాజరుపర్చారు. అప్పటి నుంచి విజయవాడ కారాగాంలో రిమాండ్‌లో ఉన్నారు.

వంకాయలు-20/22, టమాటా-13, బెండ-30, పచ్చిమిర్చి-38, కాకర-38, బీర-30/32, క్యాలీఫ్లవర్-15/20, క్యాబేజి-14, క్యారెట్-28, దొండ-42, బంగాళదుంప-21, ఉల్లిపాయలు-22, గోరుచిక్కుళ్లు-32, దోస-20/30, సొర-12/14, పొట్ల-30, అరటికాయ-7/6, చామదుంప-22, అల్లం-72, మునగ-10/8, ఆకు కూరలు(కట్ట)-2.50, కంద-38, బీట్‌రూట్-24, కీరదోస-46, బీన్స్-60/55, క్యాప్సికమ్-65, చింతకాయలు-65, నిమ్మ (డజను)-30/24, కొత్తిమీర-5/10, పుదీనా-5/15, ముల్లంగి-8, పచ్చిమామిడి-20/22 (నిన్నటివి). నగరంలోని రైతుబజార్లలో ఈ ధరలు (కిలో రూ.ల్లో) వర్తిస్తాయి. - న్యూస్‌టుడే, విజయవాడ రైతుబజారు

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213 చికెన్ స్కిన్‌లెస్ - 243.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 137, 146, 157 చికెన్ విత్ స్కిన్ - 260 చికెన్ స్కిన్‌లెస్ - 270.

తిరుపతమ్మ అమ్మవారి హుండీల ఆదాయం రూ.78.12 లక్షలు

కానుకలు లెక్కిస్తున్న భక్తులు, ఈవో మహేశ్వరరెడ్డి, సభ్యుడు రమేష్‌బాబు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలులోని తిరుపతమ్మ అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. జిల్లా దేవాదాయ శాఖ అధికారి నియమించిన సురేష్, ఆలయ ఈవో మహేశ్వరరెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యుడు చుంచు రమేష్‌బాబు సమక్షంలో హుండీలను తెరిచారు. అనంతరం స్థానిక యూనియన్ బ్యాంకు, ఆలయ ఉద్యోగులు, సేవా సమితి సేవకులు కలిసి కానుకలను లెక్కించారు. నగదు రూ.78,12,667 సమకూరిందని ఈవో తెలిపారు. విదేశీ నగదు యూఎస్‌ఏ డాలర్లు 12, సౌదీ రియాల్స్-10, మలేషియా రింగిట్స్-1, ఆస్ట్రేలియా డాలర్లు-20 వచ్చాయని చెప్పారు. బంగారం 50, వెండి 220 గ్రాములు వచ్చిందని.. ఇది డిసెంబరు మూడు నుంచి ఫిబ్రవరి 11 వరకు 71 రోజుల పాటు భక్తుల సమర్పించిన కానుకల ఆదాయమని చెప్పారు.

దోమల నివారణ చర్యలపై శిక్షణ

● 15 ఏళ్ల తర్వాత అధికారులు, సిబ్బందికి తరగతులు

విజయవాడ(భవానీపురం), న్యూస్‌టుడే: గ్రామాలు, పట్టణాల్లో దోమలు, కీటకాల ఉద్ధృతి ఎక్కువగా ఉంటుంది. వాటి కారణంగా ప్రజలు అనేక రోగాల బారిన పడుతున్నారు. దోమల నివారణ, అందుకు అనుసరించాల్సిన పద్ధతులపై వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమాన్ని విజయవాడ సమీపంలోని జక్కంపూడి కాలనీలో బుధవారం నిర్వహించారు. వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్, అదనపు సంచాలకులు సుబ్రహ్మణ్యేశ్వరి ఆదేశాల మేరకు దాదాపు 15 ఏళ్ల తర్వాత ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దోమల సంతతిని ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు అనుసరించాల్సిన పద్ధతులను వివరించారు. మలేరియా వచ్చేందుకు కారణమైన ఎనాఫిలిస్ దోమ, డెంగీ, చికెన్ గున్యాకు కారణమయ్యే ఎడిస్ దోమ, ఫైలేరియా, మెదడు వాపు వ్యాధి రావడానికి కారణమైన క్యూలెక్స్ దోమల నివారణకు అనుసరించాల్సిన పద్ధతులను వివరించారు. సీజనల్ వ్యాధుల నివారణలో భాగంగా 2011 సంవత్సరంలో శిక్షణ కార్యక్రమాలు జరిగాయి. వివిధ కారణాలతో తర్వాత వదిలేశారు. ప్రస్తుతం దోమలు పట్టుకోవడంపై కూడా శిక్షణ ఇచ్చారు. 'మస్కిటో కలెక్షన్ ట్యూబ్' ద్వారా దోమలను పట్టుకునే విధానాన్ని తెలియజేశారు. ఆ దోమలను పరీక్షించి ఏ రకానికి చెందినవి, వాటి వల్ల ఎలాంటి జ్వరాలు వస్తాయనే విషయాన్ని గుర్తించి నిరోధానికి చర్యలు చేపడతారు. మలేరియా అధికారులతో కలిసి యాంటీ లార్వా ఆపరేషన్లు, ఫాగింగ్, తదితర చర్యలు చేపడతారు. గడిచిన రెండు, మూడేళ్లలో ఎక్కువగా కేసులు వచ్చిన ప్రాంతాలను గుర్తించి అక్కడ చేపట్టాల్సిన చర్యలను వివరించారు.

మెడికల్ మాఫియాపై 14న నిరసనలు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్, ఫార్మా రంగాల్లో నెలకొన్న మాఫియా ధోరణులను అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 14న సీపీఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపట్టనున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య తెలిపారు. బుధవారం దాసరి భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మెడికల్ రంగం ఒక మాఫియాగా రూపాంతరం చెందిందని నకిలీ మందుల వినియోగం ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయన్నారు. ఇతర దేశాల్లో దశాబ్దాల క్రితమే నిషేధించిన ఔషధాలను కొనుగోలు చేసి తెలుగు రాష్ట్రాలకు తీసుకొచ్చి నిల్వల పేరుతో డ్రగ్స్ కంట్రోల్ విభాగం నుంచి అనుమతులు పొంది ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో నకిలీ ఫార్మసీ మెడికల్ సర్టిఫికెట్లను గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నెల 12న తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు అక్కినేని వనజ, పి.హరినాథ్‌రెడ్డి, పి.దుర్గాభవానీ, రావులపల్లి రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బుసలు కొట్టదు.. నేరుగా కాటేస్తుంది

చంద్రనాగును పట్టుకున్న సుధాకర్

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: జగ్గయ్యపేట పట్టణంలోని కోదాడ రోడ్డు పుట్టబజార్‌లో తిరుగుతూ రెండు రోజులుగా ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్న విష సర్పం ఎట్టకేలకు చిక్కింది. స్థానికంగా ఓ ఇంటివద్ద ఉన్న పామును బుధవారం స్నేక్ క్యాచర్ సుధాకర్ చాకచక్యంగా పట్టుకున్నారు. ఇది అత్యంత ప్రమాదకరమైన చంద్రనాగు అని.. శబ్దం చేయకుండా కాటు వేయడం దీని ప్రత్యేకత అని ఆయన తెలిపారు. అనంతరం పామును సురక్షితంగా అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

అన్ని రంగాల్లో మహిళల ప్రతిభ

పోటీలను ప్రారంభిస్తున్న వీసీ చంద్రశేఖర్, చిత్రంలో రిజిస్ట్రార్ సాయి సుధీర్, త్రిమూర్తి తదితరులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభ చాటుతున్నారని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ పి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. వర్సిటీ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన ఎన్టీఆర్ వర్సిటీ మహిళా చెస్ జట్టు ఎంపిక పోటీలను రిజిస్ట్రార్ డాక్టర్ టి.సాయిసుధీర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ.. విశాఖలోని ఓ పేద కుటుంబానికి చెందిన అథ్లెట్ యర్రాజి జ్యోతి అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటి రాష్ట్ర, దేశ ఖ్యాతిని ఇనుమడింపజేసిందని కొనియాడారు. క్రీడల్లో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తే.. రాష్ట్ర ప్రభుత్వం గ్రూపు-1, 2 పోస్టులు ఇచ్చి ప్రోత్సహిస్తుందని తెలిపారు. తమిళనాడు రాష్ట్రం దిండిగల్‌లోని అన్నా విశ్వవిద్యాలయంలో జరుగుతున్న ఆలిండియా అంతర్ వర్సిటీ మహిళా బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఎన్టీఆర్ వర్సిటీ జట్టు బుధవారం కర్ణాటక రాష్ట్రంలోని చామరాజనగర వర్సిటీ జట్టుపై గెలవడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ నెల 21 నుంచి విశాఖలోని గీతం డీమ్డ్ వర్సిటీ ఆధ్వర్యంలో జరిగే ఆలిండియా అంతర్ వర్సిటీ మహిళా చెస్ టోర్నీలో వర్సిటీ జట్టు ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. టి.సాయి సుధీర్ మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడం వల్ల మానసిక వికాసం కలుగుతుందని అన్నారు. వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఇ.త్రిమూర్తి, ఎంపిక కమిటీ సభ్యులు ఎస్.రామకృష్ణ, జె.రాము, గున్నాజీ, కె.సుధాకరరావు పాల్గొన్నారు.

ప్రకటన

మా క్లయింట్ అయిన గూడ బలదేవ్ కుమార్, తండ్రి: లేటు గూడ లక్ష్మీనారాయణ సోమయాజి, నివాసం: ఫ్లాట్ నెం. ఎస్-2, 2వ ఫ్లోర్, నెం.549, 12 క్రాస్, ఐడియల్ హోమ్స్, రాజరాజేశ్వరినగర్, బెంగళూరు - 560098. ప్రస్తుతం విజయవాడ వారి వలన సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా!
మా క్లయింటు ఈ క్రింది నోటీసు షెడ్యూల్లో ఉదహరించిన స్థిరాస్తి అనగా హరిమాణిక్యం రమేష్ గారి కుమారుడు హరిమాణిక్యం మోహన్ గారు నివాసం: 4-20-14/6, గురుస్వామి వీధి, లంబాడీపేట, చిట్టినగర్, విజయవాడ వారికి వారి తండ్రిగారైన హరిమాణిక్యం రమేష్ గారు వారి స్వార్జితపు సొమ్ముతో మవులూరి వెంకటేశ్వరరావు గారి నుండి ది.10-12-1981 తేదీన దస్తావేజు నెం.12510/1981రుగా రిజిస్టర్ కాబడిన విక్రయ దస్తావేజు రీత్యా సంక్రమించి, స్వాధీన హక్కుభుక్తములతో అనుభవించుచూ దరిమిలా వారి కుమారుడు అయిన హరిమాణిక్యం మోహన్ గారికి ది.23-3-2021 ప్రేమయే ప్రతిఫలంగా యెంచి, ఒక దఖలు దస్తావేజును వ్రాయించి 2799/2021 గా రిజిస్టరు కాబడిన రీత్యా అట్టి దఖలు దస్తావేజు అమలు కాబడి అనుభవించుచూ, మా క్లయింటుకు విక్రయించుటకుగాను అగ్రిమెంటు వ్రాయించుకొని క్రమమైన క్రయ దస్తావేజును వ్రాయించుకొని, రిజిస్టర్ చేయించుకొని ఆస్తిని స్వాధీనం చేసుకొనుటకుగాను ఏర్పాటు చేసుకొనివున్నారు. యిట్టి క్రయ విషయమై ఎవరికైననూ ఏ అభ్యంతరములుగానీ చెల్లదగిన క్లయిములు, కోర్టు జప్తులు, తనఖా హామీలు, ఇతరత్రా ఏ విధమైన లావాదేవీలు ఉన్న యెడల ఈ ప్రకటన విడుదల అయిన 10 దినములలోపల మాకు గానీ, మా క్లయింటుకు గానీ లిఖితపూర్వకముగా పోస్టు ద్వారా తెలియపరచవలసినదిగా కోరడమైనది. లేని యెడల మా క్లయింటు చేసుకొనబోవు క్రయమును బైండు చేయజాలదు.
నోటీసు షెడ్యూలు: నున్న, యన్.టి.ఆర్ జిల్లా, నున్న సబ్ రిజిస్ట్రార్ వారి విజయవాడ రూరల్ మండలం, నున్న గ్రామ పంచాయతి, ఆర్.ఎస్. నెం.348/1, 351, 352లో ప్లాటు నెం. II-ఎ 25 దాఖలా చ.గ.290.4లో చ.గ. 50.0లు రోడ్డు నిమిత్తం మినహాయించగా, చ.గ.240.4 స్థిరాస్తి ఖాళీ నివేశన స్థలమునకు **హద్దులు: తూర్పు:** ప్లాటు నెం.4రు దాఖలా ఆస్తి, **దక్షిణము:** ప్లాటు నెం.26రు దాఖలా ఆస్తి, **పడమర:** రోడ్డు, **ఉత్తరము:** ప్లాటు నెం.24రు దాఖలా ఆస్తి.

న్యాయవాదులు
మా క్లయింటు: బలదేవ్ కుమార్ గూడ, సెల్: 99664 06195
టి.వి. నవకుమార్, సెల్ : 94401 09153
కె. రాఘువేంద్ర, సెల్: 94907 77576

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానము, ఇంద్రకీలాద్రి, విజయవాడ-1
సీల్డు కొటేషన్లు స్వీకరించుటకు ప్రకటన NIT NO.16/EE-1/2025-26, Dt: 11-02-2026
శ్రీ అమ్మవారి దేవస్థానము నందు సాంకేతిక విభాగమునకు సంబంధించిన ఆర్థిక సంవత్సరం 2026-27 సందర్భముగా వివిధ షామియానా, ఫ్లెక్స్ బోర్డ్స్, సివిల్, ఎలక్ట్రికల్, వాటర్, గార్డెన్, ట్రాన్స్‌పోర్ట్ మెటీరియల్ మరియు పనులు చేయుటకుగాను కొటేషన్లు స్వీకరించబడును. పూర్తి వివరములకు కార్యాలయము పనిచేయు వేళలో లేదా ఫోన్: 0866-2423800 ద్వారా సంప్రదించగలరు.
ఆర్జిత సేవ, పరోక్ష సేవా మరియు విరాళముల కొరకు https:// kanakadurgamma.org నందు చూడగలరు.
శ్రీ బొర్రా రాధాకృష్ణ, ఛైర్మన్ మరియు ధర్మకర్తల మండలి సభ్యులు
సం/- వి.కె. శీనా నాయక్, యమ్.ఎ, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టరు & కార్యనిర్వహణాధికారి

VIJAYAWADA MUNICIPAL CORPORATION (VMC)

The following individual sites are submited for the forthcoming TDR Committee meeting, which will be headed by the Commissioner of Vijayawada Municipal Corporation. The meeting will cover the areas mentioned below. Any Suggestion or objections regarding the issuance of the TDR bonds for the applications listed below should be submitted to this office (Circle-II, VMC main office) within 7 days. if no objections are received with in this period. Further action will be taken for the issuance of TDR bonds vide RDP No: 01/2026/CIRCLE-2VIJ, RDP No: 04/2022/CIRCLE-2/VIJ, RDP No: 03/2022/CIRCLE-2/VIJ and RDP No: 01/2022/CIRCLE-2/VIJ

S. No	Name of the property Holder	Road affected area	Name of the Street	R.S.No/ Village Name	Near D.No:	Document No
1	Kamma Vidyardhi Sahayaka Sangam	172.22	Proposed 60' Prakasam Road	Ward No:09 Block No: 04 N.T.S. No: 107	27-12-75	-
2	Kelam Narasimha Rao	322.57	60' Gunadala Railway Track Road	34/1 Gunadala	49-4-22	362/2022 522/2022 5810/2022 106/2022
3	Paladugu Bala Shekara Rao	309.76	60' Gunadala Donka Road	85/4P Gunadala	49-5-7/1	3783/1961
4	Mutyala Suresh Bunti	134.06	Gunadala 120' Road	161/6, 7, 8, 9, 10	49-4-19/2	1679/2003

Sd/- Municipal Commissioner

91.9FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతరప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్‌క్యాష్ ✆81422 92071

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై AP అంతటా మార్టిగేజ్ లోన్స్, స్థిరాస్తి ఎక్కడ ఉన్నా ఏసంస్థలో ఉన్నా Xerox పేపర్స్‌పై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. 50లక్షలు లోపు, అయోధ్య కోఆపరేటివ్ బ్యాంక్. ✆ 93969 99669.

PERSONAL CLASSIFIEDS

LOST

I, Madduri Satya Srinivas S/o. M.Someshwar Rao R/o. flat no 101, Metro residency, plot no: 26, 27 Matrusree nagar Miyapur Hyderabad 500049 lost my original document of sale deed no: 3583/2019 registered at sub register office Ibrahimpatnam krishna district while travelling from Ibrahimpatnam to Rajamundry. If found M: 90598 65548

REAL ESTATE

FLAT FOR SALE

గాయత్రినగర్ లలితా జ్యూయలర్స్ వెనుక రిలయన్స్ స్పెండర్ అపార్ట్‌మెంట్‌లో 3BHK, 2500 S.Ft., 2 కార్ పార్కింగ్స్‌తో అమ్మకం. 98482 07437/ 93981 14214

PLOT FOR SALE

ఫ్లాష్! ఫ్లాష్! వినుకొండలో అవకాడో ప్లాంటేషన్‌లో 11 సెంట్లు (532 గజాలు) కేవలం 5.5 లక్షలు మాత్రమే. 2) 133 గజాలు 99,000/-. ✆ 7989476799.

LAND REQUIRED

వేర్ హౌస్ కావలెను
15000 నుండి 20000 Sq ft
విజయవాడ దగ్గర మరియు గన్నవరం.
సంప్రదించండి
CONTACT:
948 0834 451
895 1379 154

JOBS

శ్రీశ్రీశ్రీ హోటల్, బైపాస్ రోడ్, ఖమ్మం నందు పనిచేయుటకు జనరల్ మేనేజర్ కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత. సంప్ర: 9949911636.

బస్సుడ్రైవర్స్ కావలెను. హెవీ లైసెన్స్‌తో పాటు కనీసం 5సం॥ల అనుభవం కలిగిన డ్రైవర్స్ కావలెను. రూట్లు: మంగళగిరి, కేసరపల్లి, భవానీపురం, కంచికచర్ల, గంగినేనిపాలెం, వత్సవాయి, గట్టు భీమవరం, నందిగామ. జీతం నెలకు 18000/-. అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాల, పరిటాల. ✆ 94907 97533, 99482 30222

మ్యారేజి సంస్థలో పనిచేయుటకు కంప్యూటర్‌నాలెడ్జ్ గల ఇన్‌ఛార్జ్ (F). జీ: 20K. రిసెప్షనిస్ట్ (F) జీ: 15K. ఏడైనా డిగ్రీ VJA-7. ✆ 87905 99799.

VJA, గాంధీనగర్‌లోని ఇంటీరియర్ ఆఫీస్‌కు హిందీ, ఇంగ్లీష్ వచ్చిన లేడీ రిస్సెప్షనిస్ట్, బైక్ ఉన్న Exp. మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్. ✆ 98486 10708

విజయవాడ మొగల్‌రాజ్‌పురంలోని ప్రముఖ స్వీట్ షాపు నందు పనిచేయుటకు సేల్స్ బాయ్స్ & సేల్స్ గరల్స్ కావలెను. ✆ 91778 17557

విజయవాడ హోం అప్లయన్సెస్ షోరూంలో Female/ Male సేల్స్ ప్రమోటర్స్ జీతం: 15000/-+ ఇన్సెంటివ్ & హెల్పర్స్, ఆఫీస్‌బాయ్స్ కావలెను. ✆ 73311 73685.

తెలుగు/ ఇంగ్లీష్/ హిందీ డి.టి.పి (F) ఆపరేటర్లు కావలెను. పేజ్‌మేకర్‌లో బుక్‌వర్క్ చేయటంలో అనుభవం ఉన్నవాళ్ళకి ప్రాధాన్యత. 77028 02426, 98484 07654

ఫిమేల్ నర్స్ కావలెను. విజయవాడ సీతారామపురం, ఏలూరు రోడ్డులో డైలీ ఇంటికి వచ్చి (2Legs) డ్రెస్సింగ్ చేయుటకు ఫిమేల్ నర్స్ కావలెను. ✆ 92472 88381.

BR INFRACON నందు పనిచేయుటకు సైట్ ఇంజనీర్లు కావలెను. Q: డిప్లొమా, B.Tech/ M.Tech అర్హత కలిగి బిల్డింగ్స్, ఇరిగేషన్ వర్క్స్ నందు 3to4 సంవత్సరములు అనుభవం కలిగి విజయవాడ, రాజమండ్రి, ఏలూరు జిల్లాల నందు పనిచేయుటకు కావలెను. పూర్తి బయోడేటాను info@brinfracon.comకి పంపగలరు ✆ 79955 57831.

Gujarat నిస్సానగర్‌లో ఉన్న హాస్టల్‌లో పనిచేయుటకు చెఫ్, మాస్టర్ చెఫ్, హెల్పర్స్ కావలెను. మెస్ కాంట్రాక్ట్‌కి ఇవ్వబడును. సం॥ 95057 01977.

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న రెడ్ శాండిల్ ఫామ్ ల్యాండ్స్ (ISO 9001 కంపెనీ)లో ఇన్వెస్ట్/ మార్కెటింగ్ చేయుటకు సంప్రదించగలరు. ✆ 98482 74262

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

పాఠశాలలో శుద్ధజల యూనిట్ ప్రారంభం

విద్యార్థికి శుద్ధజలం అందిస్తున్న సర్పంచి నాగమల్లేశ్వరి, కోటేశ్వరరావు దంపతులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : విస్సన్నపేట పరిధి తిరుపతమ్మ టెంపుల్ పాఠశాలలో శుద్ధజల యూనిట్‌ను స్థానిక సర్పంచి సాదుపాటి నాగమల్లేశ్వరి కోటేశ్వరరావు దంపతులు ప్రారంభించారు. కార్యక్రమంలో తెదేపా జిల్లా నాయకుడు ఆకుల రాధాకృష్ణ, ప్రధానోపాధ్యాయురాలు యు.శ్రీవల్లి, ఉపాధ్యాయులు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గొల్లమందలలో జల సేవా అధ్యయనం

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని గొల్లమందల, తండా గ్రామాల్లో బుధవారం హైదరాబాద్‌కు చెందిన వర్ధమాన్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ విద్యార్థుల బృందం జల సేవా అధ్యయనం నిర్వహించారు. ప్రభుత్వం జల జీవన్ మిషన్ ద్వారా ఏర్పాటు చేసిన పైపులైన్ ద్వారా ప్రజలకు సరఫరా చేస్తున్న శుద్ధ జలాలను సదరు విద్యార్థులు పరీక్ష చేశారు. ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీటి భద్రతకు పరీక్షలు చేస్తున్నట్లు విద్యార్థులు తెలిపారు. కళాశాల సహాయ ఆచార్యులు దుర్గాశ్రీలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సీహెచ్.సాయివెంకటలక్ష్మి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గొల్లమందలలో నీటి పరీక్షలు చేస్తున్న విద్యార్థులు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

తిరువూరు, న్యూస్‌టుడే

స్పందన: తిరువూరు ఎనిమిది, పదకొండు వార్డుల్లో మురుగు, చెత్త కారణంగా దోమలు విజృంభిస్తున్నాయని స్థానికులు రాజేందర్, సిరాజుద్దీన్ మేమున్నాం..మీకుతోడుగా ద్వారా సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మున్సిపల్ శానిటరీ అధికారి విజయ్ సిబ్బందిని పంపి దోమల మందు ఫాగింగ్ చేయించారు.

పరీక్షల తరుణం.. ఆరోగ్యం భద్రం

న్యూస్‌టుడే, గంపలగూడెం

పరీక్షలను పండగలా భావించాలి.. వేడుకగా జరుపుకోవాలి..'పరీక్ష పే' చర్చలో ప్రధాని నరేంద్రమోదీ విద్యార్థులకు ఇచ్చిన సందేశమిది. నిజమే విద్యార్థులు చదువును భారంగా భావించకూడదు. అదే సమయంలో ఆరోగ్యంపై శ్రద్ధ తప్పనిసరని వైద్యులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. ఈ నెల 23 నుంచి ఇంటర్, మార్చి 16 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పది విద్యార్థులకు 100 రోజుల ప్రణాళిక, ఇంటర్ విద్యార్థులకు సంకల్ప కార్యక్రమాలు అమలు చేస్తూ తుది పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అలసట, ఆందోళన, నిస్సత్తువ, ఒత్తిడికి దూరంగా ఉంటూ ఉత్సాహంగా, ఉల్లాసంగా పరీక్షలు రాయాలంటే కచ్చితంగా వ్యాయామం, పౌష్టికాహారం ప్రతి రోజూ ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

★ తిరువూరు నియోజకవర్గంలో ఈ ఏడాది 36 ప్రభుత్వ పాఠశాలల నుంచి 1598 మంది పది పరీక్షలకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలు, గురుకులాల, కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలల నుంచి ఇంటర్ విద్యార్థులు మరో వెయ్యి వరకు ఉంటారు. పరీక్షలు దగ్గరపడే కొద్దీ విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనయ్యే అవకాశం ఉంది. రాత్రి వేళ ఎక్కువ సేపు చదవటం వల్ల నీరసానికి గురై, చదువుపై దృష్టి సారించలేని పరిస్థితి వస్తోంది. రాత్రి 9 గంటలకు నిద్రకు ఉపక్రమించి తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి చదువుకుంటే మంచిది. రాత్రిపూట నిద్ర లేకుండా చదివే పిల్లలకు మూడు, నాలుగు గంటలకోసారి ఆహారం అందించాలి. తద్వారా మెదడుకు సరైన పోషకాలు అందుతాయి. ఉదయం నిద్రలేవగానే కొంత సమయం వ్యాయామం, ధ్యానం చేస్తే చలాకీగా ఉంటారు. రోజుకు 8 గంటల పాటు నిద్రపోయేలా చూడాలి.

నెమలి పాఠశాలలో ప్రత్యేక తరగతిలో చదువుతున్న పది విద్యార్థులు

తేలికగా జీర్ణమయ్యే ఆహారం అందించాలి: డాక్టర్ వి.శ్రుతి, పీహెచ్‌సీ వైద్యాధికారి

తల్లిదండ్రులు తమ పిల్లలను ఖాళీ కడుపుతో పాఠశాలలకు పంపవద్దు. అలా పంపితే నీరసించి చదువుపై దృష్టి సారించలేరు. ఉదయం అల్పాహారంగా తేలికపాటి ఇడ్లీ, దోశ, పాలు, కోడిగుడ్లు ఇవ్వాలి. నీరు ఎక్కువగా తాగేలా చూడాలి. పరీక్షలు ముగిసే వరకు మాంసాహారంతో పాటు మసాలాలు, నూనె పదార్థాలకు దూరంగా ఉండటం మేలు. పీచు పదార్థాలు, వాల్‌నట్స్, కార్బోహైడ్రేట్స్‌తో కూడిన పదార్థాలను రోజుకు రెండు నుంచి మూడు సార్లు అందించాలి.

టీవీలు, చరవాణులకు దూరంగా ఉంచాలి: సీహెచ్.సతీష్, ప్రధానోపాధ్యాయుడు, సత్యాలపాడు ఉన్నత పాఠశాల

పరీక్షల సమయంలో టీవీలు, సామాజిక మాధ్యమాలు, సినిమాలు, ఫోన్లకు దూరంగా ఉండాలి. తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై ఉపాధ్యాయులతో తరచూ మాట్లాడాలి. బడిలో ప్రత్యేక తరగతుల్లో విద్యార్థుల సందేహాలు నివృత్తి చేస్తున్నాం. ఇంటి వద్ద తల్లిదండ్రులు కూడా వారితో మాట్లాడి ధైర్యాన్ని నింపితే ఉత్తమ ఫలితాలు సాధించొచ్చు.

సోలార్ సాంకేతికతపై శిక్షణ

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: గుంటుపల్లి రైజ్ కేంద్రంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు బుధవారం సోలార్‌తో పనిచేసే పరికరాల సాంకేతికతపై శిక్షణ ఇచ్చారు. ఇబ్రహీంపట్నం, విజయవాడ రూరల్ మండలాలకు చెందిన ఎస్‌హెచ్‌జీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై బృంద చర్చ

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూటుడే: జూపూడి నిమ్రా ఇంజినీరింగు కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులతో కేంద్ర బడ్జెట్‌పై చర్చ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి పథకాలపై వ్యయాలు, రాబడులను వివరించారు. వివిధ రంగాలకు చెందిన సీహెచ్.నరేష్, లక్ష్మి. కృష్ణమోహన్, శ్రీకుమార్, కళాశాల ప్రిన్సిపల్ అక్బర్‌ఖాన్, ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరావు తమతమ అభిప్రాయాలను వెల్లడించారు.

మత్స్యకారుల జీవనోపాధికి కృషి

నదిలో చేప పిల్లలను వదులుతున్న ప్రజాప్రతినిధులు అధికారులు

ఇబ్రహీం పట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: మత్స్యకారుల సంక్షేమం, జీవనోపాధికి ప్రభుత్వం కృష్ణా నదిలో చేప పిల్లలను వదులుతోందని ఇబ్రహీంపట్నం మండల పరిషత్తు అధ్యక్షురాలు పాలడుగు జ్యోత్స్న పేర్కొన్నారు. తుమ్మలపాలెం వద్ద కృష్ణా నదిలో బుధవారం ఆమె, సర్పంచి వెంకట రమణ, జనసేన అధికార ప్రతినిధి అక్కల గాంధీ మత్స్యశాఖ అధికారులతో కలిసి 4.8 లక్షల చేప పిల్లలను వదిలారు. జిల్లా మత్స్యశాఖ అధికారిణి షర్మిళ మాట్లాడుతూ జిల్లాలో చేపల ఉత్పత్తితోపాటు మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపరచడం లక్ష్యంగా ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన అమలు చేస్తున్నట్లు వివరించారు. విజయవాడ ఎఫ్‌డీవో తేజస్వి మాట్లాడుతూ చేప పిల్లలను నదిలో వదలడం వల్ల మత్స్య ఉత్పత్తిలో 15 శాతం వృద్ధి రేటు సాధించే అవకాశముందన్నారు.

మత్తులో తేలితే.. జీవితం మునిగినట్లే

మైలవరం, న్యూస్‌టుడే: మత్తు పదార్థాలకు అలవాటైతే జీవితం మునిగినట్లేనని స్థానిక శాసనసభ్యుడు వసంత కృష్ణప్రసాద్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ శాఖ నిర్వహిస్తున్న డ్రగ్స్‌పై దండయాత్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం మైలవరంలో సైకిళ్లపై, పలు పాఠశాలలు, కళాశాల విద్యార్థులతో కలిసి ప్రదర్శన చేశారు. స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి క్రీడా ప్రాంగణంలో సభ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పిల్లలు డ్రగ్స్‌కు అలవాటుపడకుండా ఉండాలంటే, వారి ప్రవర్తనను పెద్దలు గమనిస్తుండాలని, వారి స్నేహాలపై నిఘా ఉంచాలన్నారు. గత వైకాపా ప్రభుత్వం అనాలోచితంగా మద్యం ధరలను విపరీతంగా పెంచటం తోనే గంజాయి వాడకం పెరిగిందని ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గంజాయి నియంత్రణకు పటిష్ఠంగా చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. సీపీ ఎస్వీ రాజశేఖరబాబు మాట్లాడుతూ గతంలో రాష్ట్రంలో విచ్చలవిడిగా దొరికేదని, గంజాయితో పట్టుబడుతున్న వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు పెడుతుండటంతో తగ్గుముఖం పట్టిందని చెప్పారు. ప్రభుత్వం, పోలీస్ చర్యలతో గంజాయి విక్రేతలు వణికిపోతూ భయపడుతున్నారని చెప్పారు. అనంతరం సైకిల్ ప్రదర్శన చేస్తున్న మహిళా పోలీసులను సన్మానించి, సర్వమత ప్రార్థనలతో స్థానికులు దీవెనలు ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచి మంజుభార్గవి, డీసీపీ లక్ష్మీనారాయణ, స్థానిక ఏసీపీ ప్రసాదరావు, సీఐ చంద్రశేఖర్, ఏఎంసీ ఛైర్మన్ నర్సిరెడ్డి గాంధీ, నివృత్‌రావు, శ్రీనివాసరెడ్డి, సర్కిల్ లోని ఎస్సైలు సుధాకర్, సతీష్, శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, సీపీ ఎస్వీ రాజశేఖర బాబు, పోలీసులు, అతిథులు

హనుమాన్ చాలీసా పారాయణం

తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరు పట్టణంలోని శ్రీరంగనాయకమ్మ ఆలయంలో మంగళవారం రాత్రి భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం సామూహికంగా 11 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేపట్టారు. దేశం సుభిక్షంగా, ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ పారాయణం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

శ్రీ రంగనాయకమ్మ ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించిన భక్తులు

పవర్ లిఫ్టింగ్‌లో విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ అప్పారావు

మైలవరం, న్యూస్‌టుడే: అమరావతి పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి కృష్ణా జిల్లా పవర్ లిఫ్టింగ్ పోటీల్లో లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభతో పతకాలు సాధించినట్లు ప్రిన్సిపల్ కె. అప్పారావు తెలిపారు. వెంకట పూర్ణచంద్ర (ఈసీఈ) బంగారు, సాయితేజ్‌రెడ్డి(ఏఐడీఎస్) కాంస్య, బి.సాయిప్రసాద్ రజిత పతకం సాధించినట్లు పేర్కొన్నారు. వెంకట పూర్ణచంద్ర రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

దారికి అడ్డుగా ఇసుక దిబ్బలు..

తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరు పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహం, పలు పాఠశాలలు, అసుపత్రులకు వెళ్లే మార్గంలో అడ్డుగా ఇసుక దిబ్బలు ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు సైకిళ్లపై నుంచి జారిపడి గాయాలపాలవుతున్నారని పాఠశాల యాజమాన్యం తెలిపింది. రాత్రివేళ ఇసుక దిబ్బలు కనిపించక తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, అధికారులు వీటిని తొలగించే ఏర్పాటు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

నెమలి కృష్ణుని ఆదాయం రూ.17.52 లక్షలు

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: నెమలి వేణుగోపాల స్వామి గుడిలో భక్తులు సమర్పించిన కానుకలు బుధవారం లెక్కించారు. 2025 డిసెంబరు 6 నుంచి బుధవారం వరకు వచ్చిన కానుకలు లెక్కించగా స్వామివారి ఆదాయానికి రూ. 17,52,279 నగదు, 5 గ్రాముల బంగారం, 92 గ్రాముల వెండి, 175 యూఎస్ఏ డాలర్లు, 10 సింగపూర్ డాలర్లు అందాయి. పాలకవర్గ అధ్యక్షురాలు కె.శశికళ, ఏసీ ఎన్.సంధ్య, పలువురు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కానుకల లెక్కింపును పర్యవేక్షిస్తున్న అధికారులు, పాలకవర్గం

క్రమశిక్షణతో ఉన్నతులుగా ఎదగాలి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత లక్ష్యాలను ఎదగాలని లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ అన్నపురెడ్డి కోటిరెడ్డి తెలిపారు. బుధవారం లయన్స్ క్లబ్ ఆఫ్ బెజవాడ ఆధ్వర్యంలో రెడ్డిగూడెం నారాయణ పాఠశాలలో మోటివేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఉన్నతమైన లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఎంత శ్రమించైనా లక్ష్యం సాధించే దిశగా ఆచరణ అంతే ముఖ్యమని సూచించారు. పాఠశాల డైరెక్టర్లు వి.రాధాకృష్ణారెడ్డి, కోటిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులకు శిరస్త్రాణం తప్పనిసరి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు శిరస్త్రాణం తప్పనిసరిగా వాడాలని ఏసీపీ దుర్గారావు అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో పలుచోట్ల శిరస్త్రాణంపై వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. నిబంధనలను పాటించని వారిపై చర్యలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో సీఐ చంద్రశేఖర్, ట్రాఫిక్ ఆర్ఐ కృష్ణ, ఎస్సై లక్ష్మణరావు పాల్గొన్నారు.

పేరు మార్పు

ఆధార్‌లో ప్రస్తుతం ఎడ్డి రవళి, W/o. శివకృష్ణగా నమోదు కాబడింది. 10th మార్కులిస్ట్ ప్రకారం కాటమనేని రవళి D/o. నాగేశ్వరరావు, **H.No. 1-72,** రాయనపాడు, విజయవాడ రూరల్ (మం), ఎన్.టి.ఆర్. జిల్లాగా మార్పుచేయుట జరుగుతుంది. నేటినుండి కాటమనేని రవళి **(Katamaneni Ravali)**గా పిలవబడును. (ఆధార్ మార్పు కొరకు)

విద్యుత్తు నియంత్రికను మార్చరూ..

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: కేతనకొండ రైస్ మిల్లు సమీపంలోని విద్యుత్తు నియంత్రిక ప్రమాదభరితంగా ఉంది. గతంలో దీని సమీపంలో గడ్డి మేస్తున్న రెండు పాడి గేదెలు విద్యుదాఘాతానికి గురై మృతిచెందాయి. అత్యంత తక్కువ ఎత్తులో ఉండే నియంత్రిక వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం రానుందోనని సమీప నివాసాల పిల్లల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. కనీసం నియంత్రిక చుట్టూ అధికారులు రక్షణ వలయం కూడా ఏర్పాటు చేయకపోవడం పట్ల గ్రామస్థులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. నియంత్రికను అక్కడి నుంచి మరో ప్రదేశానికి తరలించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఇబ్రహీంపట్నం విద్యుత్తు సహాయక ఇంజినీరు వెంకన్న దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా నియంత్రిక ప్రదేశాన్ని పరిశీలించి మరో చోటుకు మార్పు చేయడం, లేదా రక్షణ కంచె ఏర్పాటుచేసి సమస్యను పరిష్కరిస్తానన్నారు.

ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్తు నియంత్రిక

ప్రకటన

మా క్లయింటు గుంటూరు జిల్లా, తెనాలి కాపురస్తులు కందుకూరి మలాద్రి గారి కుమారుడు కందుకూరి నాగరాజు గారి సంజాయిషీ పొంది తెలియచేయునది ఏమనగా.. ఎన్.టి.ఆర్. జిల్లా, జి.కొండూరు గ్రామ కాపురస్తులు పజ్జూరు ఫణింద్ర కుమార్ గారి భార్య పజ్జూరు లక్ష్మీప్రియ మాధురి గారు ది. 25.11.2019వ తేదీన పజ్జూరు నాగమల్లేశ్వరరావు గారి వలన సెటిల్‌మెంట్ పొంది శ్రీ మైలవరం సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో 1వ పుస్తకం, నెం. 6822/2019 రుగా రిజిష్టరు కాబడిన సెటిల్‌మెంట్ దస్తావేజు రీత్యా వారికి సంక్రమించి తదాది నేటి వరకు వారికి మాత్రమే సర్వ సంపూర్ణ స్వాధీన యాజమాన్య హక్కు భుక్తములతో అనుభవించుచున్నారు. సదరు షెడ్యూలు దాఖలా ఆస్తులను మా క్లయింటు క్రయమును పొందుటకు విక్రయ ఒప్పందము కుదుర్చుకుని కొంత సొమ్ము బయానాగా చెల్లించి త్వరలో మా క్లయింటు పేరగాని, వారు కోరిన వారి పేరున గాని రిజిష్టరు దస్తావేజును వ్రాసుకొనబోవుచున్నారు. కావున యీ దిగువ షెడ్యూలు దాఖలాస్తిపై ఎవ్వరికి ఎట్టి ఆక్షేపణలు, తనఖాలు, కోర్టు దావాలు, డబల్ రిజిస్ట్రేషన్లు, క్లయిములు, మైనరు హక్కులు, వారసత్వపు హక్కులు వగైరాలు వున్న యెడల ఈ ప్రకటన వెలువడిన తేదీ లగాయతు 10 రోజుల లోపల చేరునట్లుగా ఎక్నాలెడ్జిమెంట్ గల రిజిష్టరు పోస్టు ద్వారా మా చిరునామాకు తెలియపరచ వలసినది. అట్లు గడువు తేదీ లోపు ఎట్టి అభ్యంతరములు, ఆక్షేపణలు వగైరాలు రానియెడల దిగువ షెడ్యూలు దాఖలాస్తి నిర్వివాదమైన ఆస్తిగా పరిగణించి మా క్లయింటు క్రయమును పొందుదురు. గడువు తేదీ దాటి వచ్చు ఎట్టి క్లయిములు, ఛార్జీలు, అభ్యంతరములు, ఆక్షేపణలు వగైరాలు మా క్లయింటును బద్ధులను చేయజాలవని ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూలు: ఎన్.టి.ఆర్. జిల్లా, మైలవరం సబ్-రిజిస్ట్రారు వారి యిలాకా జి. కొండూరు మండలం, గడ్డమణుగు గ్రామ పంచాయితీ ఏరియాలో చేరినటువంటిన్నీ, గడ్డమణుగు గ్రామ రీ. సర్వే నెం.175 రు దాఖలా య.2.01 ట్లలో రోడ్డు నిమిత్తం పోను యింకనూ మిగిలియున్న య.1.29 సెంట్ల స్థిరాస్థి శేరీ మెరక భూమికి **హద్దులు: తూర్పు:** నాగ్‌పూర్ నేషనల్ హైవే రోడ్డు; **దక్షిణం:** బోజడ్ల ప్రభాకరరావు గారి భూమి; **పడమర:** అప్పసాని లక్ష్మాయమ్మ గారి భూమి; **ఉత్తరం:** వేములకొండ శ్రీనివాసరావు గారి భూమి.

ఇట్లు: **యలమంచిలి రామకృష్ణ,**
యలమంచిలి యశస్వని పద్మావతి, న్యాయవాదులు
షాపు నెం. 10, రాధాకృష్ణ రెసిడెన్సీ,
న్యూ ఆర్.టి.సి. కాలనీ, పటమట, విజయవాడ-7
ఫోన్ నెం: 94946 23679, 99594 54322
విజయవాడ: 11.02.2026

'పది' ఫలితాల్లో రికార్డు సాధించాలి

కొండపల్లి,న్యూస్‌టుడే: పదో తరగతి ఫలితాల్లో కొండపల్లి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల గత రికార్డును అధిగమించి మరో ఉత్తమ ఫలితం సాధించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హేమలత అన్నారు. ఏపీటీఎఫ్ యూనియన్ సభ్యులు, జాహ్నవి అకాడమి సంయుక్తంగా 170 మంది విద్యార్థులకు విద్యావసర వస్తువులను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా జనరల్ సెక్రటరీ ఖాసిం, మండల సెక్రటరీ శ్రీనివాసరావు, జాహ్నవి సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రానికి ఆధునిక వైద్య పరికరాలు

కొండపల్లి,న్యూస్‌టుడే: సామాజిక బాధ్యతతో దాతలు చేస్తున్న కార్యక్రమాలు హర్షణీయమని కొండపల్లి ప్రాథమిక వైద్యశాల వైద్యులు రాథోడ్ అన్నారు. ఎస్‌బీఐ అమరావతి సర్కిల్, అవేరా గ్రూప్‌లు సంయుక్తంగా కొండపల్లి ఆరోగ్య కేంద్రానికి బుధవారం వైద్య పరికరాలను అందజేశాయి. సంస్థలు, కంపెనీలు సామాజిక బాధ్యతగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తే ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు ఆధునిక వైద్య సదుపాయాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో వైద్యులు శిరీష, బ్యాంకు, అవేరా గ్రూప్ సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పరికరాలను అందిస్తున్న ఎస్‌బీఐ, అవేరా గ్రూప్‌సభ్యులు

పండిట్ దీన్‌దయాళ్ వర్ధంతి

జి.కొండూరు, న్యూస్‌టుడే: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని స్థానిక ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో బుధవారం నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పలువురు నాయకులు దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భాజపా మండల నాయకులు సుబ్బారావు, వెంకటేశ్వరరావు, జీ శ్రీనివాసరావు, వెంకటరెడ్డి, టీ.శ్రీనివాసరావు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

కొండపల్లి: కొండపల్లి, ఇబ్రహీంపట్నం భాజపా కార్యాలయాల్లో బుధవారం దీనదయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో భాజపా నియోజకవర్గ నాయకులు బాలకోటేశ్వరరావు, రఘునాధరెడ్డి, భవాని, సేనాపతి, నాగమణి, కృష్ణకుమారి, కనకదుర్గ పాల్గొన్నారు.

జి.కొండూరులో దీన్‌దయాళ్ చిత్రపటానికి నివాళులర్పించిన కొల్లి నాగేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

విస్సన్నపేట, న్యూస్‌టుడే: రైతులందరూ తమ స్మార్ట్ ఫోన్లో తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ , ఏపీఎయిమ్స్ అనే యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు కె శశికళ, మండల వ్యవసాయ అధికారి షేక్ టిప్పు సుల్తాన్ కోరారు. విస్సన్నపేట మండలం కొర్లమండ, కలగర, చంద్రుపట్ల గ్రామాల్లో బుధవారం రైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ నెల 20 లోపు ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలన్నారు. ముందు వ్యవసాయ శాఖ నుంచి అందే సౌలభ్యాలు ఈ యాప్ వినియోగించే రైతులకు మాత్రమే అందుతాయన్నారు. ఏఈవో ఉషారాణి, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి కపులూరి రాజా, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

చంద్రుపట్లలో అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయాధికారులు శశికళ, టిప్పుసుల్తాన్, ఉషారాణి, స్థానిక రైతులు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: రైతులకు వ్యవసాయ రంగంలో సకల సౌకర్యాలు అందించేందుకు దిక్సూచి వంటి ఏపీ ఎయిమ్స్ 2.0 యాప్‌ను ప్రభుత్వం విడుదల చేసిందని ప్రతి ఒక్క రైతు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని విస్సన్నపేట వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు కె.శశికళ తెలిపారు. బుధవారం మద్దులపర్వ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఈ పక్రియ వల్ల రైతులకు ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలందుతాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

'రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది'

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: దేశంలోని అన్ని రాష్ట్రాల్లో అంబేడ్కర్ రాజ్యాంగం నడుస్తుంటే ఆంధ్రాలో లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని మాజీ ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా అన్నారు. మాజీ మంత్రి జోగి రమేష్‌ను బుధవారం ఆయన ఇబ్రహీంపట్నంలో పరామర్శించారు. రెడ్‌బుక్ అంటూ లోకేష్, ఆయన బృందం ప్రతిపక్షాన్ని భయపెట్టి పాలన సాగించాలనుకోవడం అవివేకమన్నారు.

క్రీడా పరికరాల పంపిణీ

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజాప్రగతి ట్రస్టు ఇండియా లిటరసీ ప్రాజెక్టు ద్వారా చిలుకూరు, త్రిలోచనాపురం గ్రామాలలోని మండల పరిషత్తు పాఠశాలలకు ఒక్కొక్కదానికి రూ.3వేలు విలువగల క్రీడా పరికరాలను ఆయా పాఠశాలల హెచ్ఎంలకు అందజేశారు.

ఘంటసాలకు నివాళి

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని పెనుగొలనులో బుధవారం ప్రముఖ నేపథ్య గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద చిన్నారులు, గ్రామస్థులు నివాళులర్పించారు. ఆయన ఆలపించిన భగవద్గీత తెలుగునాట అత్యంత ప్రజాదరణ పొందిందని, వేలాదిగా భక్తి, సినిమా పాటలు పాడారని వక్తలు అన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రెడ్డిగూడెం,న్యూస్‌టుడే: పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని తెదేపా నాయకులు పలువురు పేర్కొన్నారు. బుధవారం రాత్రి తెదేపా రెడ్డిగూడెం గ్రామ పార్టీ కార్యకర్తల సమావేశం రాఘవాపురం బీసీ కాలనీలో నిర్వహించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు సీహెచ్.చందా అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు జె.వేణుగోపాలరెడ్డి, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరెడ్డి, తెదేపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

(c) eenadu

విజయవాడ తూర్పు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
80085 74652

స్పందన: ✦ 3వ డివిజన్ గుణదల ఎస్సీ కాలనీలో తాగునీటి పైపు లీకేజీ అవుతోందని స్థానిక నివాసి రవికుమార్ మేమున్నాం...మీకు తోడుగా ద్వారా డీఈ రామారావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందిని పంపించి మరమ్మతులు చేయించారు. ✦ మూడో డివిజన్ శ్రీరామచంద్రనగర్ హైటెన్షన్ రోడ్డులో 3-14/127 వీధి స్తంభానికి ఉన్న దీపం వెలగడం లేదని స్థానిక నివాసి భగవాన్ మేమున్నాం...మీకు తోడుగా ద్వారా ఏఈ ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కొత్త దీపాన్ని ఏర్పాటు చేయించారు. ✦ రెండో డివిజన్ గుణదల కుమ్మరి పాలెం ప్రాంతంలో దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానిక నివాసి లక్ష్మీనారాయణ మేమున్నాం... మీకు తోడుగా ద్వారా మలేరియా అధికారి హెచ్.శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందితో దోమల మందులు పిచికారీ చేయించారు. – న్యూస్‌టుడే, కరెన్సీనగర్

కార్మికుల సమ్మె.. అధికారులు అప్రమత్తం

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: దేశ వ్యాప్తంగా కార్మికులు గురువారం సమ్మె చేస్తున్న నేపథ్యంలో విజయవాడ నగర పాలక సంస్థ అధికారులు అప్రమత్తమయ్యారు. బుధవారం డంపర్‌బిన్లలో వ్యర్థాలు తొలగించేలా చర్యలు చేపట్టారు. రహదారులను శుభ్రం చేయించారు. నగర పాలక సంస్థలోని అన్ని విభాగాల కార్మికులు సమ్మెలో పాల్గొనే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో నగర ప్రజలు వ్యర్థాలను గురువారం బహిరంగ ప్రదేశాల్లో వేయవద్దని కమిషనర్ ధ్యానచంద్ర సూచించారు. 13న క్లాప్ వాహనాల ద్వారా వ్యర్థాలు సేకరిస్తామని తెలిపారు.

నేడు తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జాబ్‌మేళా

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: విజయవాడ నగర పాలక సంస్థ మెప్మా ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్టు అధికారి లక్ష్మి ఓ ప్రకటనలో బుధవారం తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 20 కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. పదో తరగతి, డిగ్రీ, ఇంజినీరింగ్ చదివిన అభ్యర్థులు తగిన ధ్రువపత్రాలతో పాల్గొనాలని కోరారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చౌకగా కొట్టేసి.. గుట్టుగా అమ్మేసి..

అక్రమంగా తరలిపోతున్న రేషన్ బియ్యం

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

☛ ఇటీవల వ్యాన్‌లో రేషన్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారం మేరకు పౌర సరఫరాలు, విజిలెన్స్ అధికారులు, పోలీసులు కృష్ణలంక వద్ద తనిఖీలు చేసి 20 క్వింటాళ్ల సరకు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.

☛ తాజాగా ఓ వాహనంలో బియ్యం తరలిస్తున్నారని అధికారులకు సమాచారం వచ్చింది. పటమట వద్ద 37.50 క్వింటాళ్లు పట్టుకున్నారు.

☛ రేషన్ బియ్యం అక్రమ రవాణా నిరంతరం కొనసాగుతోంది. కొంతమంది మాఫియాలా ఏర్పడి లబ్ధిదారుల వద్ద తక్కువ ధరకు బియ్యం కొని ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు.

☛ వైకాపా ప్రభుత్వంలో వాహనాల్లో బియ్యం తీసుకెళ్లి కార్డుదారులకు ఇచ్చేవారు. కొందరు వాహనాల డ్రైవర్లే బియ్యం పంపిణీ చేయకుండా లబ్ధిదారుల వద్ద కొని అధిక ధరలకు బయట అమ్ముకుంటున్నారని అధికారులు గుర్తించారు.

☛ కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ విధానాన్ని రద్దు చేశారు. చౌక ధరల దుకాణాల నుంచి పంపిణీ చేస్తున్నారు. సులభంగా డబ్బు సంపాదనకు అలవాటు పడిన మాఫియా వేరే మార్గంలో బియ్యం కొని అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

ఇంటింటికీ వెళ్లి సేకరణ..

☛ తూర్పు నియోజకవర్గం లోని 21 డివిజన్ల పరిధిలో 89 చౌక ధరల దుకాణాలు ఉన్నాయి. 69,600 మంది కార్డుదారులు ఉన్నారు. వారికి ప్రతి నెల 1056 టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నారు.

☛ ప్రతి నెల బియ్యం పంపిణీ చేశాక లబ్ధిదారుల ఇళ్లకు ద్విచక్రవాహనాలపై కొందరు వెళ్లి కిలో రూ.12 చొప్పున కొంటున్నారు. కృష్ణలంక, రాణిగారితోట, పటమట, రామలింగేశ్వరనగర్, మొగల్రాజపురం, లబ్బీపేట ప్రాంతాల్లో ఎక్కువగా కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

☛ ప్రభుత్వం కేజీ బియ్యాన్ని సుమారు రూ.34 వరకు వెచ్చించి కొనుగోలు చేసి లబ్ధిదారులకు అందజేస్తోంది. ఎక్కువ మంది లబ్ధిదారులు వాటిని వినియోగించకుండా కేజీ రూ.12 వంతున అమ్మేస్తున్నారు. వాటిని అక్రమార్కులు చౌకగా కొని రైస్ మిల్లులు, పిండి మరలు, కోళ్ల ఫారాలు, హోటళ్ల నిర్వాహకులకు ఎక్కువ మొత్తానికి విక్రయిస్తున్నారు. రూ.లక్షల్లో వ్యాపారం చేస్తున్నారు.

☛ రైస్ మిల్లులకు వెళ్లిన బియ్యం పాలిష్ చేసి మళ్లీ మనకే అధిక ధరకు అమ్ముతున్నారు. రేషన్ మాఫియాపై కఠిన చర్యలు తప్పవని ఇటీవల ఎమ్మెల్యే కూడా హెచ్చరికలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో అధికారులు స్పందించి అక్రమ రవాణా అడ్డుకోవాల్సిన అవసరం ఉంది.

ప్రత్యేక దృష్టి పెట్టాం

రేషన్ బియ్యం అక్రమంగా తరలించకుండా చర్యలు చేపట్టాం. వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాం. అక్రమార్కులపై కేసులు నమోదు చేస్తున్నాం.
- శ్రీనివాస్, ఏఎస్ఓ

నిత్యాన్నదాన పథకానికి విరాళాలు

ఇంద్రకీలాద్రి: శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి ఇద్దరు దాతలు రూ.2,01,116 విరాళాన్ని బుధవారం అందజేశారు. పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలు నివాసి మెట్టపల్లి రమాదేవి రూ.1,01,116, విశాఖపట్నంలోని ఎం.వి.పి కాలనీ చెందిన ఎం.వెంకటేశ్వర్లు రూ.లక్ష విరాళాలను వేర్వేరుగా అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో దర్శనం చేయించారు. దేవస్థానం సూపరింటెండెంట్ సత్యనారాయణ, ట్రస్టుబోర్డు సభ్యులు శ్రీనివాసరావు వారికి విరాళం రసీదుతోపాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

విద్యాధరపురం: ట్రాఫిక్ అంబాసిడార్లు క్షేత్ర స్థాయి పరిస్థితిని అధికారుల దృష్టికి తీసుకు వచ్చినప్పుడు సమస్య పరిష్కారం అవుతుందని వన్‌ట్రాఫిక్ సీఐ ఉమామహేశ్వరరావు అన్నారు. వన్‌ట్రాఫిక్ పోలీసుస్టేషను ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన ట్రాఫిక్ అంబాసిడార్ల సమావేశం (దుకాణదారులు, ఆటో డ్రైవర్లు, వ్యాపారులు) లో సీఐ మాట్లాడుతూ.. ముఖ్య కూడళ్లలో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించే పరిస్థితులకు సంబంధించిన ఫొటోలను అధికారులకు పంపాలని సూచించారు.

'ఫన్‌టైమ్స్ క్లబ్‌లో సభ్యత్వం తీసుకుంటాం'

నూతన నిర్మాణాల శిలాఫలకం ఆవిష్కరణలో ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తదితరులు

పటమట, న్యూస్‌టుడే: ఫన్‌టైమ్స్ క్లబ్‌లో తాము కూడా సభ్యత్వం తీసుకుని సభ్యులుగా చేరుతామని ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. టీచర్స్ కాలనీలో ఫన్ టైమ్స్ క్లబ్ ఆవరణలో కొత్తగా నిర్మించిన ఫంక్షన్ హాలు, లగ్జరీ రూమ్స్, సోలార్ సిస్టమ్‌ను బుధవారం ఎంపీ, ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. నిర్వాహకులు ఎప్పటి నుంచో ఫన్‌టైమ్స్ క్లబ్ నిర్వహిస్తూ వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కుటుంబ సభ్యులంతా కలిసి పండుగలు నిర్వహించుకునేందుకు క్లబ్ అనువుగా ఉంటుందని అన్నారు. తక్కువ ధరల్లో చక్కటి కార్యక్రమాలు నిర్వహించుకునే అవకాశం క్లబ్ నిర్వాహకులు కల్పిస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి ఫ్యామిలీ రిక్రియేషన్ క్లబ్‌లు నగరంలో మరిన్ని రావాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్పొరేటర్ దేవినేని అపర్ణ, దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ఛైర్మన్ బొర్రా గాంధీ, తెదేపా రాష్ట్ర కార్యదర్శి బొప్పన భవకుమార్, సభ్యులు కిలారు శివాజీ, సతీష్, సురేష్, విజయ్ బాబు, వెంకటరత్నం, సుమ, బిందు, దర్శిత తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న కాశీనాథ్ తదితరులు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థలోని ఇంజినీరింగ్, ఆరోగ్య విభాగం, మెకానికల్ డిపో తదితర విభాగాల్లో పని చేసే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ యూనియన్ నగర గౌరవ అధ్యక్షుడు దోనేపూడి కాశీనాథ్ పేర్కొన్నారు. కార్మికుల సమస్యలపై కమిషనర్ ధ్యానచంద్రను నగరపాలక సంస్థ కార్యాలయంలో సంఘం నాయకులు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా కాశీనాథ్ మాట్లాడుతూ.. నగర పాలక సంస్థలో నూతనంగా విధుల్లో చేరిన 75 మంది జీతాల విషయంలో తేడా వచ్చిందని తెలిపారు. నీటి సరఫరా విభాగం సిబ్బందికి బకాయిలు రాలేదని వెల్లడించారు. కార్మికుల సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. సంఘం నాయకులు ఎం.బుజ్జమ్మ, టి.తిరుపతమ్మ, జె.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సైన్షియా-2కే26 పోటీలు

విజేతలతో ప్రిన్సిపల్ ఫాదర్ మిల్కియోర్ తదితరులు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ఆంధ్రా లయోల కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో 'సైన్షియా-2కే26' పేరుతో బుధవారం ఫాదర్ దేవయ్య ఆడిటోరియంలో వివిధ పోటీలు నిర్వహించారు. పోటీలను ఐన్సూర్ ఏఐ ల్యాబ్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో కిరణ్ కంభంపాటి ప్రారంభించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక అంశాలపై ఆయన మాట్లాడారు. కృత్రిమ మేధ అద్భుత వృద్ధి సాధిస్తుందని, ఎన్నో మానవ సమస్యలకు పరిష్కారం లభించబోతోందని అన్నారు. ప్రిన్సిపల్ ఫాదర్ మిల్కియోర్, రెక్టార్ జో ఏస్ క్రిస్టియన్ పాల్గొన్నారు. కంప్యూటర్ సైన్స్ విభాగ అధిపతి ఎస్.ఎ.బి.నెహ్రూ, సమన్వయకర్త కె.అపర్ణ పర్యవేక్షించారు. పోటీల్లో ఎన్నారై కళాశాల ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. శ్రీధర్ రామలేశ్వరం, పీబీ సిద్ధార్థ, ఆర్‌వీఆర్ బాలిరెడ్డి, కేబీఎన్, లయోల ఇంజినీరింగ్ కళాశాలలు వివిధ అంశాల్లో బహుమతులు సాధించాయి. మిస్టర్ సైన్షియాగా షఫీ ఉల్లా (ఎన్నారై కళాశాల), మిస్ సైన్షియాగా సయ్యద్ అంజుమ్ (శ్రీదుర్గా మల్లేశ్వర కళాశాల) నిలిచారు.

పవర్ లిఫ్టింగ్ పోటీలో పతకాలు

సాయిశ్రీని అభినందిస్తున్న వీసీ చంద్రశేఖర్ తదితరులు

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: గుడివాడలో ఈ నెల 8న జరిగిన ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఆరు బంగారు పతకాలు సాధించిన విజయవాడ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం సీనియర్ ఆఫీస్ అసిస్టెంట్ సూరపనేని సాయిశ్రీని బుధవారం ఉప కులపతి డాక్టర్ పి.చంద్రశేఖర్ అభినందించారు. ఆమె 63 కిలోల మహిళల కేటగిరీలో వివిధ విభాగాల్లో మొత్తం 6 బంగారు పతకాలు సాధించారు. భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో పాల్గొని పతకాలు కైవసం చేసుకోవాలని వీసీ ఆకాంక్షించారు. ప్రవీణ్ కుమార్, రవి కిరణ్, జయశ్రీ తదితరులు ఆమెను అభినందించారు.

వృద్ధురాలిని ఏమార్చి.. బంగారు నగ మాయం చేసి..

కృష్ణలంక, న్యూస్‌టుడే: ఓ మహిళ వృద్ధురాలిని ఏమార్చి బంగారు గొలుసుతో పరారైన ఘటన బస్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. తెనాలికి చెందిన వృద్ధురాలు శేషకుమారి మంగళవారం ఉదయం విజయవాడ పీఎన్‌బీఎస్‌లో బస్సు దిగారు. బంధువుల ఇంటికి వెళ్లేందుకు 50వ నంబరు ప్లాట్‌ఫాం వద్ద ఒంటరిగా కూర్చున్నారు. వృద్ధురాలిని గమనించిన అపరిచిత మహిళ ఆమె వద్దకు వచ్చింది. మాటలు కలిపింది. నగరంలో తిరునాళ్ల జరుగుతోంది.. దొంగలు సంచారం ఎక్కువగా ఉంది.. ఆభరణాలు తదితర విలువైన వస్తువులు జాగ్రత్త అని చెప్పింది. ఆందోళన చెందిన వృద్ధురాలు తన మెడలో ఉన్న సుమారు ఎనిమిది గ్రాముల బంగారు గొలుసు తీసి సంచిలో వేసుకున్నారు. కొద్దిసేపటికి అపరిచిత మహిళ అక్కడ నుంచి వెళ్లిపోయింది. తర్వాత వృద్ధురాలు తన సంచిలో చూసుకోగా... బంగారు గొలుసు కనిపించలేదు. అపరిచిత మహిళ తనను ఏమార్చి నగతో పరారైనట్లుగా నిర్ధారించుకున్న ఆమె కృష్ణలంక పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మూడు కుటుంబాలకు నిత్యావసర సరకుల అందజేత

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : పీ4 కార్యక్రమంలో భాగంగా మూడు పేద కుటుంబాలను ఆదుకునేందుకు తెదేపా యువనేత గద్దె క్రాంతికుమార్ ముందుకు వచ్చారు. 19, 7, 22వ డివిజన్లకు చెందిన ఆ మూడు కుటుంబాలకు బుధవారం ఆయన నెల కుటుంబ పోషణకు అవసరమయ్యే నిత్యావసరాలు, వెయ్యి రూపాయల నగదు అందజేశారు. ప్రతి నెల తన వంతు సాయం చేస్తానని క్రాంతికుమార్ తెలిపారు. తెదేపా 19వ డివిజన్ అధ్యక్షుడు భాగం సాయిప్రసాద్, ప్రధాన కార్యదర్శి కంచర్ల శ్రీను, పరిశపోగు విజయ్, కోటి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గొయ్యి.. వెంటనే పూడ్చండి

కరెన్సీనగర్ బాయన బాబూజీ రహదారి నుంచి ఎనికేపాడు శక్తి కల్యాణ మండపానికి వెళ్లే రహదారి మలుపు వద్ద భారీ గొయ్యి పడింది. వాహనాలు మరమ్మతులు గురవుతున్నాయి. నిత్యం వేలాది వాహనాలు ఆ దారిలో రాకపోకలు సాగిస్తున్నా.. అధికారులు మరమ్మతులు చేయించడం లేదు. రాత్రి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు వెంటనే స్పందించాలి. - కరెన్సీనగర్, న్యూస్‌టుడే

విరిగిన చిరునామా సూచిక బోర్డు

శ్రీనివాసనగర్ బ్యాంకు కాలనీ 11వ రోడ్డులో సూచిక బోర్డులు ధ్వంసమయ్యాయి. చాలా కాలనీల్లో కొత్త బోర్డులు ఏర్పాటు చేయగా.. ఇక్కడ మాత్రం బోర్డులను గాలికి వదిలేశారు. తెలియని వ్యక్తులు వచ్చినప్పుడు చిరునామా తెలియక ఇబ్బంది పడుతున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి కొత్త బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.
- కరెన్సీనగర్, న్యూస్‌టుడే

మ్యాన్‌హోల్ పొంగుతోంది.. పట్టించుకోండి

స్థానిక 20వ డివిజన్ గౌతమీ నగర్ మూడో లైనులో మ్యాన్‌హోల్ పొంగి పొర్లుతోంది. మురుగు రోడ్డుపై నిలుస్తోంది. ప్రజలు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారు. దీర్ఘకాలంగా మ్యాన్‌హోల్ పొర్లుతున్నా.. నగర పాలక సంస్థ పారిశుద్ధ్య సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. - కృష్ణలంక, న్యూస్‌టుడే

రహదారి పక్కనే వ్యర్థాల గుట్టలు

సిద్ధార్థ మహిళా కళాశాల పక్క రోడ్డులో వ్యర్థాల గుట్టలు, విద్యుత్తు స్తంభాలు ఉన్నాయి. చెంతనే చెత్త బుట్ట ఉంది. అందులో వ్యర్థాలనే పారిశుద్ధ్య సిబ్బంది తరలిస్తున్నారు. సమీపంలో ఉన్న వాటి గురించి పట్టించుకోవడం లేదు. రోడ్డు పక్కనే ఉన్నందున వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది. వాటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.
- లబ్బీపేట (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే

అసంపూర్తిగా వదిలేశారు... అభివృద్ధి చేయండి

పటమట లంక వైపు బెంజి సర్కిల్ మొదటి పైవంతెన అప్రోచ్ గోడను అభివృద్ధి చేయకుండా కొంత వదిలేశారు. అక్కడున్న రాళ్లపైకి పిల్లలు ఎక్కి ఆడుతున్నారు. అవి జారి పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు పొదలు అల్లుకున్నాయి. అధికారులు స్పందించి ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.
- బెంజిసర్కిల్ (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే

ఆకతాయిల ఆగడాలు.. జనం బెంబేలు!

న్యూస్‌టుడే, కృష్ణలంక

కృష్ణలంక, రాణిగారితోటల పరిధిలోని పలుచోట్ల ఆకతాయిల సంచారంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రిళ్లు తిరుగుతూ.. మద్యం తాగి గొడవలు పడుతూ ఆందోళనకు గురిచేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. పోలీసులు నిఘా పెట్టి వారి ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు. ✦ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఆకతాయిలు స్వర్గపురి సమీపంలోని ఘాట్ మెట్ల వద్దకు రాత్రిళ్లు చేరి వారిలో వారే గొడవలకు దిగుతున్నారు. ✦ గౌతమీనగర్, నెహ్రూనగర్ ప్రాంతాల్లో రాత్రిళ్లు పార్కింగ్ చేసిన ఆటోల్లో కూర్చొని మద్యం తాగుతున్నారు. ✦ 22వ డివిజన్ దోబీఘాట్, పట్టణ ఆరోగ్య కేంద్రాల సమీపంలో అధికంగా సంచరిస్తున్నారు. సమీపంలోని మెట్లపై కూర్చుని మద్యం తాగుతున్నారు. స్థానికులు అటువైపు వెళ్లాలంటే భయపడుతున్నారు. ✦ తారకరామానగర్ కరకట్ట దిగువ మెట్ల మార్గాలపై చేరుతున్న ఆకతాయిలు మద్యం, గంజాయి తాగి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆ ప్రాంత వాసులు చెబుతున్నారు. పోలీసులు స్పందించాలని కోరుతున్నారు.

అటు వెళ్లాలంటే భయపడుతున్నాం

పాత పోస్టాఫీసు రోడ్డు చివర పుష్కర ఘాట్ వద్దకు ఆహ్లాదం కోసం సాయంత్రం వేళ కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాలంటే భయపడుతున్నాం. అక్కడ పార్కింగ్ చేసిన ఆటోలు, కార్లలో ఆకతాయిలు కూర్చుని మద్యం తాగుతున్నారు. ప్రజలు ఇక్కడకు రావాలంటే బెంబేలెత్తుతున్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో కొంతమేర తీవ్రత తగ్గినా పూర్తి స్థాయిలో అరికట్టేందుకు పోలీసులు చర్యలు చేపట్టాలి.
- సురేష్, కృష్ణలంక

ఫక్రుద్దీన్ అలీ అహ్మద్‌కు నివాళి

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: మాజీ రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆంధ్రరత్న భవన్‌లో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఏపీ మహిళా కాంగ్రెస్ పరిశీలకులు ఆదిత స్వప్న, ఏపీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అమర్జహ బేగ్, ఖుర్షీదాబేగం, ప్రమీలాగాంధీ, పూర్ణిమ, సునీత, మీసాల రాజేశ్వరరావు, అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

చేతి వృత్తుల్లో శిక్షణ... ఆర్థిక స్వావలంబన

స్వయం ఉపాధి పొందుతున్న మహిళలు

న్యూస్‌టుడే, విజయవాడ సిటీ

ప్రస్తుతం ఖర్చులు పెరిగిపోయాయి. భర్త ఆదాయం కుటుంబ పోషణకు సరి పోవడం లేదు. అదనపు ఖర్చు వస్తే.. అప్పు చేయాల్సి వస్తోంది. ఆర్థిక ఇబ్బందులు అధిగమించేందుకు పేద, మధ్య తరగతి మహిళలు చేతి వృత్తులు నేర్చుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. మొగల్రాజపురంలోని జనశిక్షణ సంస్థాన్‌లో ఫ్యాబ్రిక్ పెయింటింగ్, మగ్గం, అల్లికలు, కుట్టు తదితర చేతి వృత్తులు నేర్పుతున్నారు. మహిళలు ఆసక్తిగా వచ్చి శిక్షణ తీసుకుంటున్నారు. ఆయా వృత్తులపై పట్టు సాధిస్తున్నారు. ఇంట్లోనే ఉంటూ స్వయం ఉపాధి పొందుతూ ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తున్నారు.

కుటుంబ పోషణకు అండగా..

మాది మధ్య తరగతి కుటుంబం. కొత్త వంతెన సెంటర్‌లో నివసిస్తున్నాం. బీకాం చదువుకున్నా. నా భర్త వ్యాపారం చేస్తారు. ఇంటి వద్ద ఖాళీగా ఉంటున్నా. సమయం వృథా చేయడం కంటే ఏదైనా ఉద్యోగం చేయాలనుకున్నా. కానీ ప్రస్తుతం మార్కెట్‌లో డిమాండ్ ఉన్న మిషన్ ఎంబ్రాయిడరీ నేర్చుకోవాలని అనుకున్నా. జన శిక్షణ సంస్థాన్‌లో చేరి నేర్చుకున్నా. ఏడాది నుంచి ఇంటి వద్దే ఉంటూ చీరలు, జాకెట్లపై వివిధ ఆకృతులతో మిషన్ ఎంబ్రాయిడరీ చేస్తున్నా. మెటీరియల్ ఖర్చు పోను నెలకు రూ.20 వేల వరకు ఆదాయం వస్తోంది. కుటుంబానికి ఆర్థికంగా తోడ్పాటు అందిస్తున్నాను. ఆనందంగా ఉంది. - స్వాతి

ఇంటి వద్దే ఉంటూ సంపాదన

మేము కృష్ణలంకలో నివసిస్తున్నాం. నా భర్త మీ సేవా కేంద్రం నిర్వహిస్తున్నారు. నేను ఎంఎస్సీ, బీఈడీ చదివాను. కొన్నాళ్ల పాటు ఓ ప్రైవేట్ పాఠశాలలో విధులు నిర్వహించాను. సమయం కుదరక మానేశాను. ఇంటి వద్దే ఉంటూ సొంతంగా ఏదో ఒకటి చేయాలని అనుకున్నా. గతంలో ఫ్యాబ్రిక్ పెయింటింగ్ నేర్చుకున్నాను. ఏడాది కిందట జనశిక్షణ సంస్థాన్‌లో మెషిన్ ఎంబ్రాయిడరీలో శిక్షణ తీసుకున్నా. ఆ రెండింటిపై పట్టు సాధించా. ఆరు నెలలుగా ఇంటి వద్దే ఉంటూ నెలకు రూ.10 వేలకుపైగా సంపాదిస్తున్నా. కొంత సమయం మీ సేవ కేంద్రంలో పని చేస్తాను. పూర్తిగా సమయం కేటాయిస్తే నెలకు రూ.30 వేలు వరకు ఆదాయం వస్తుంది. - లక్ష్మి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

భవానీపురం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడినట్లు భవానీపురం పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి... చిట్టినగర్ టైలర్‌పేటలో గుర్రం వెంకట రామాంజనేయులు కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. భవానీపురం ఐరన్‌యార్డులో ఇనుము వ్యాపారం చేస్తున్నారు. ఈనెల 10వ తేదీ మధ్యాహ్నం రామాంజనేయులు, మరో వ్యక్తి సీహెచ్.వి.పూర్ణచంద్రరావు టీ తాగేందుకు ద్విచక్రవాహనంపై బయలుదేరారు. ఐరన్‌యార్డు నుంచి బయటకు వస్తుండగా వారు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని పొక్లెయినర్ ఢీకొట్టింది. దీంతో వారిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని నగరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

అలరించిన మధుర గీతాలు

పాటలు పాడుతున్న మల్లీశ్వరి, వేదికపై డేవిడ్‌రాజు తదితరులు

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే: తెలుగు సుస్వరాల రాగాలను మధురంగా ఆలపించడంలో ఘంటసాల దిట్టని బీఆర్ అంబేడ్కర్ సాంస్కృతిక సంస్థ ప్రతినిధి కె.డేవిడ్‌రాజు అన్నారు. బుధవారం గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానంద కళావేదికపై ఘంటసాల వర్ధంతి సందర్భంగా డీజే మెలోడీస్ ఆధ్వర్యంలో 'ఘంటసాల గానామృతం' నిర్వహించారు. గాయకులు కె.డేవిడ్ రాజు, మారేపల్లి జోహష నిర్వహణలో ఈ కార్యక్రమం జరిగింది. గాయకులు హేమమాలిని(గుంటూరు), బొబ్బిలి మల్లేశ్వరి తదితరులు ఘంటసాల పాటలను చక్కగా ఆలపించారు. అతిథులుగా అశోక్ ఆనంద్, పరుచూరి విజయలక్ష్మి, ప్రసూనారామన్, చిట్టిబాబు, వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల గానం అజరామరం

విద్యాధరపురం, న్యూస్‌టుడే: అమరజీవి ఘంటసాల గానం అజరామరం అని శ్రీకళా భారతి అధ్యక్షుడు సింగంశెట్టి చంద్రశేఖర్ అన్నారు. ప్రముఖ గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి పురస్కరించుకొని తుమ్మలపల్లి కళాక్షేత్రంలోని ఘంటసాల విగ్రహానికి పలు స్వచ్ఛంద కళా సంస్థల సభ్యులు పూలమాలలు వేసి బుధవారం నివాళులర్పించారు. ఈసందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఘంటసాల గీతాలు ఐదు దశాబ్దాలుగా వింటూ ప్రజలు ఆనందిస్తున్నారని చెప్పారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చిట్టిబాబు మాట్లాడుతూ నేటికి ఘంటసాల నోటి నుంచి జాలువారిన భగవద్గీత శ్లోకాలు ప్రతి నిత్యం వినడం మన అదృష్టమన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద కళా సంస్థల సభ్యులు బి.ఆంజనేయ రాజు, డేవిడ్ రాజు, సంగీత విద్వాంసులు బ్రహ్మానందం, గాయకులు శ్యామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న చంద్రశేఖర్ ఆంజనేయరాజు తదితరులు



నందిగామ

• నందిగామ • జగ్గయ్యపేట

అసెంబ్లీ సమావేశాలు వీక్షించేందుకు అవకాశం

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను ప్రత్యక్షంగా వీక్షించేందుకు పెనుగంచిప్రోలులోని స్వామి పుల్లయ్య మెమోరియల్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు అవకాశం దక్కింది. అసెంబ్లీ సమావేశాలు చూసేందుకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అసెంబ్లీ స్పీకర్ అనుమతి ఇవ్వగా.. వెంటనే స్పందించిన మాజీ సర్పంచి జిల్లేపల్లి సుధీర్‌బాబు సమాచారం ఇవ్వడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నక్కా బాబురావు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారు. ఈ మేరకు ఈ నెల 14న శనివారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి అసెంబ్లీ సమావేశాలను గ్యాలరీ నుంచి వీక్షించేందుకు రావాల్సిందిగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి అసెంబ్లీ కార్యదర్శి నుంచి ఉత్తర్వులు వచ్చాయి.

నేడు డయల్ యువర్ మున్సిపల్ కమిషనర్

ఈనాడు మీతోడు

జగ్గయ్యపేట పట్టణంలో పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు, చెత్త తరలింపు, వీధి దీపాలు, ఇంటి పన్నుల విషయంలో ఏమైనా సమస్యలు ఎదురవుతున్నాయా? అయితే వీటి పరిష్కారానికి 'ఈనాడు' ఆధ్వర్యంలో ఈ నెల 12న నిర్వహించే 'ఫోన్ ఇన్' కార్యక్రమంలో కమిషనర్ డీటీ వెంకటకృష్ణారావు పాల్గొంటారు. మీ ప్రాంత సమస్యలను ఫోన్‌లో ఆయన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తారు. **- న్యూస్‌టుడే, జగ్గయ్యపేట గ్రామీణం**

వెంకటకృష్ణారావు

98499 05823 | గురువారం (12-02-2026) | సమయం: ఉదయం 10.30 నుంచి 11.30 వరకు

దీన్‌దయాళ్ సేవలు ఎనలేనివి

ఉపాధ్యాయ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న భాజపా నాయకులు

నందిగామ, న్యూస్‌టుడే: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు, సిద్ధాంతకర్త పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ 108వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. నందిగామలోని భాజపా కార్యాలయంలో బుధవారం పార్టీ నాయకులు ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన జన్‌సంఘ్ ఏర్పాటుకు చేసిన కృషిని నాయకులు కొనియాడారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మునగంటి కామేశ్వరరావు, జిల్లా ఓబీసీ ప్రధానకార్యదర్శి తొర్లికొండ సీతారామయ్య, కార్యదర్శి పోరుగంటి నరసింహారావు, అధికార ప్రతినిధి కేదారేశ్వర శర్మా, నాయకులు పులిపాటి లక్ష్మణరావు, శ్రీనివాసరావు, రజియాబేగం తదితరులు పాల్గొన్నారు.

రోగుల జీవితాల్లో వెలుగులు..!

ఉచిత వైద్య సేవలతో స్ఫూర్తిగా నిలుస్తున్న జయప్రద ఫౌండేషన్

న్యూస్‌టుడే- పెనుగంచిప్రోలు, నందిగామ

తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ తొండెపు దశరథ జనార్దన్ ఆధ్వర్యంలో జయప్రద ఫౌండేషన్ ఉచిత వైద్య సేవలందిస్తూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. తన ఎదుగుదలకు కారణమైన జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకునేందుకు దశరథ జనార్దన్ జయప్రద ఫౌండేషన్ ఏర్పాటు చేశారు. సీఎం చంద్రబాబునాయుడు తలపెట్టిన జన్మభూమి స్ఫూర్తితో సొంత నియోజకవర్గానికి ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారు. జగ్గయ్యపేటలో గతేడాది ఏప్రిల్ 25న వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చేతుల మీదుగా ఫౌండేషన్‌ను ప్రారంభించారు. నిరంతరం గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటుచేసి పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ నెట్టెం రఘురాం తదితరులు ఫౌండేషన్ సేవలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నారు. ఇప్పటివరకు నాలుగు మండలాల్లో 64 వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి 31 వేల మందికి పైగా వైద్య సేవలందించారు. కంటి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి శంకర్ నేత్రాలయంలో ఉచితంగా శస్త్రచికిత్సలు చేయిస్తున్నారు. కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్నారు. విజయవాడలోని అను ఒమెగా హాస్పిటల్ వారితో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసేందుకు ఫౌండేషన్ తరఫున అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. వత్సవాయిలో ఉచితంగా 80 మంది మహిళలకు పరీక్షలు చేయగా 22 మందికి వ్యాధి ఉన్నట్లు గుర్తించి వారికి వైద్య సేవలు అందించారు.

కంటి రోగులతో టీడీ జనార్దన్, మంత్రి సత్యకుమార్ యాదవ్, రఘురాం, రాజగోపాల్

1313 మందికి నేత్ర చికిత్సలు...

జయప్రద ఫౌండేషన్ ద్వారా జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో కో ఆర్డినేటర్ కట్టా వెంకట నరసింహారావు నిర్వహణలో ఇప్పటివరకు 18,413 మంది కంటి రోగులను పరీక్షించారు. వీరిలో 4315 మందికి చికిత్సలు చేయాలని గుర్తించగా 1313 మందికి చేయించారు. దృష్టి లోపం ఉన్న 10,458 మందికి నాణ్యమైన కళ్లజోళ్లు ఉచితంగా అందించారు. సాధారణ వైద్య పరీక్షలు 11,766 మందికి, దంత వైద్యం 1706 మందికి అందించారు. ఇదేవిధంగా నిరంతరం సేవలు కొనసాగిస్తామని ఛైర్మన్ జనార్దన్ తెలిపారు. వైద్యం కోసం ఎవరూ ఇబ్బంది పడకూడదనే లక్ష్యంతో ప్రతి గ్రామంలో ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోండి

అధికారులతో మాట్లాడుతున్న ఆర్‌జేసీ త్రినాథరావు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి తిరునాళ్లకు వచ్చే భక్తులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేయాలని దేవాదాయశాఖ ఆర్‌జేసీ (రాజమహేంద్రవరం) వి.త్రినాథరావు ఆదేశించారు. బుధవారం మండలంలోని దాములూరు శివారు కూడలి సంగమేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి తిరునాళ్ల ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆలయ ఉద్యోగులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. వైరా, కట్టలేరులో భక్తులు పుణ్యస్నానాలు, పిండ ప్రదానాలు చేసే ప్రదేశాల్లో ఏర్పాట్లు చేయాలన్నారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. దీనిపై ఆలయ ఈవో ఎన్.నరసింహమూర్తి మాట్లాడుతూ.. జల్లు స్నానాలకు ఏర్పాట్లు చేస్తున్నామని, ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతామన్నారు. అన్నప్రసాదంతో పాటు భక్తులకు పులిహోర ప్రసాదం, మజ్జిగ, తాగునీరు పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దేవాదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ ఎన్.షణ్ముఖం, డివిజన్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కల్యాణ్, దేవాలయ కమిటీ ఛైర్మన్ గింజుపల్లి శ్రీనివాసరావు, అర్చకులు పాల్గొన్నారు.

భూసేకరణపై పునరాలోచన చేయాలి

తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

కంచికచర్ల, న్యూస్‌టుడే: రాష్ట్ర అభివృద్ధి కోసం తమ జీవనాధారమైన సాగు భూములను ఇవ్వడానికి సిద్ధమేనని, కానీ ప్రభుత్వం ఔటర్ రింగు రోడ్డు కోసం మొదట ప్రకటించిన విధంగా 70 మీటర్లకే భూసేకరణను పరిమితం చేయాలని భూములు కోల్పోతున్న రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కంచికచర్ల తహసీల్దారు కార్యాలయం ఎదుట న్యాయం చేయాలని కోరుతూ రైతులు బుధవారం ఆందోళన నిర్వహించారు. విలువైన తమ భూములకు ప్రభుత్వ రిజిస్ట్రేషన్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లిస్తామని ప్రకటించడం సరి కాదని, బహిరంగ మార్కెట్ ధరకు అనుగుణంగా నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. భూసేకరణ 250 మీటర్లు కాకుండా 70 మీటర్లకే పరిమితం చేయాలని అన్నారు. అనంతరం ఉప తహసీల్దారు మానసకు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

ద్విచక్రవాహన ర్యాలీలో మున్సిపల్ కార్మికులు

నందిగామ, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా గురువారం తలపెట్టిన సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ నందిగామలో సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు ద్విచక్రవాహన ర్యాలీ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభించారు. ప్రధాన వీధుల్లో నినాదాలు చేస్తూ ప్రదర్శన చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి కటారపు గోపాల్ మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు. 26 వేలు వ్యాపారాలు, వారందరికీ పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని తెలిపారు. ఉద్యోగ విరమణ ప్రయోజనాలు ఇవ్వాలన్నారు. మున్సిపల్ కార్మికులు సంఘం నాయకులు సైదా, మాణిక్యం, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కంచికచర్ల, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 12న దేశవ్యాప్తంగా సమ్మె నిర్వహిస్తున్నామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కల్యాణ్, సీఐటీయూ నాయకుడు గోపీనాయక్ అన్నారు. సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ కంచికచర్లలో గ్యాస్ సరఫరా కార్మికులతో కలిసి బుధవారం ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, సీఐటీయూ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

నిరంతర శ్రమతో విజయం

పరిటాల(కంచికచర్ల), న్యూస్‌టుడే: మన భారతీయులు పలు అంతర్జాతీయ కంపెనీలకు సీఈవోలుగా ఉన్నారని, వారి జీవితం ప్రతి విద్యార్థికి ఆదర్శం కావాలని జేఎన్‌టీయూ(కాకినాడ) ప్రొఫెసర్ డా. కె.వి.ఎస్.జి.మురళీ కృష్ణ సూచించారు. 'ఉద్యోగ నైపుణ్యాలు - జీవిత నైపుణ్యాలు' అనే అంశంపై అమ్రిత సాయి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సానుకూల దృక్పథం, నిరంతర శ్రమతో విద్యార్థులు జీవితంలో విజయాలు సాధించవచ్చని అన్నారు. ప్రోగ్రామింగ్, కోడింగ్‌లపై నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె.రామమోహనరావు, ప్రిన్సిపల్ డా.ఎం.శశిధర్, వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డా.మురళీకృష్ణ

ఆకతాయిలపై చర్యలు

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని సీతారామపురం కొత్త వెంకటేశ్వరస్వామి గుడి వీధిలో బుధవారం సాయంత్రం ద్విచక్రవాహనాలపై హల్‌చల్ చేసి ఆ ప్రాంత ప్రజలను భయాందోళనలకు గురి చేసిన ఆకతాయిలపై పోలీసులు చర్యలు తీసుకున్నారు. సీఐ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు జగ్గయ్యపేట ఎస్ఐ రాజు ఆధ్వర్యంలో వారిపై శాఖపరమైన చర్యలు చేపట్టారు. జగ్గయ్యపేట పోలీస్ యంత్రాంగం తక్షణమే స్పందించడంపై సీతారామపురం వాసులు హర్షం వ్యక్తం చేశారు.

అంతర విశ్వవిద్యాలయాల బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: అంతర విశ్వవిద్యాలయాల మహిళా బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు నందిగామ కేవీఆర్ కళాశాల క్రీడాకారిణి ఎన్.హారిక ఎంపికైంది. బీకాం చివరి ఏడాది చదువుతున్న విద్యార్థిని ఈ నెల 12 నుంచి చెన్నై దిండుగల్ అన్నా విశ్వవిద్యాలయంలో నిర్వహించే పోటీల్లో పాల్గొననుంది. ఈ సందర్భంగా కళాశాల ఫిజికల్ డైరెక్టర్ వాసిరెడ్డి నాగేశ్వరరావు బుధవారం అభినందించారు.

క్రమశిక్షణతో ఉన్నతులుగా ఎదగాలి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నతులుగా ఎదగాలని లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ అన్నపరెడ్డి కోటిరెడ్డి తెలిపారు. బుధవారం లయన్స్ క్లబ్ ఆఫ్ బెజవాడ ఆధ్వర్యంలో రెడ్డిగూడెం నారాయణ పాఠశాలలో మోటివేషన్ కార్యక్రమం నిర్వహించారు.

సచివాలయాలకు ప్రింటర్లు.. స్కానర్ల అందజేత

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో వార్డు సచివాలయాలకు బుధవారం ప్రింటర్లు, స్కానర్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కమిషనర్ వెంకటకృష్ణారావు పాల్గొని సచివాలయ సిబ్బందికి ప్రింటర్లు, స్కానర్లు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ధ్రువపత్రాలు, దరఖాస్తులు, ఇతర సేవలు పొందడంలో ఇకపై ఆలస్యం లేకుండా సౌకర్యవంతంగా పొందుతారని చెప్పారు. వార్డు కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ప్రింటర్ అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

బార్ కౌన్సిల్ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా సుందరరావు

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: బార్ కౌన్సిల్ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు నియమితులయ్యారు. ఈ నెల 13న జగ్గయ్యపేట కోర్టులో బార్ కౌన్సిల్ ఎన్నికలు జరగనున్నాయని.. 23 కౌన్సిల్ స్థానాలకు 143 మంది బరిలో నిలిచారన్నారు. ఇప్పటికే బ్యాలెట్ బాక్సులు, పేపర్లు కోర్టుకి చేరుకున్నాయని తెలిపారు.

వేలంపాటకు ఆసక్తి చూపని వ్యాపారులు

హాజరైన ఎంపీడీవో ప్రసాదరావు, డిప్యూటీ ఎంపీడీవోలు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: దాములూరు శివారు కూడలి సంగమేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో మహాశివరాత్రి తిరునాళ్ల సందర్భంగా దుకాణాల ఏర్పాటుకు బహిరంగ వేలంపాట ఏర్పాటు చేయగా పాటదారులు ఆసక్తి చూపలేదు. గతేడాది రూ.3.40 లక్షలకు వ్యాపారాలు వేలంపాట దక్కించుకున్నారు. ఈ ఏడాది రూ.3.30 లక్షలు ప్రారంభ పాట ఏర్పాటు చేయగా వ్యాపారాలు డిపాజిట్ చెల్లించలేదు. దీంతో ఎంపీడీవో అర్జున ప్రసాదరావు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వ్యాపారాల నుంచి సొమ్ములు వసూలు చేయాలని చెప్పారు. వ్యాపారాల నుంచి వసూలుచేసిన సొమ్ముతో పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీరు సరఫరా చేయాలని నిర్ణయించారు. డిప్యూటీ ఎంపీడీవో నాయక్యరావు, ప్రసాద్, పంచాయతీ సర్పంచి గాదెల వెంకటలక్ష్మమ్మ, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్ రగడ..

సంగమేశ్వరస్వామి ఆలయం వద్ద పంచాయతీ స్థలంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ వల్ల వ్యాపారులు వేలంపాటకు ఆసక్తి చూపలేదని తెలిసింది. వేలంపాటకు ముందే ఎగ్జిబిషన్ నిర్వాహకుడు అధికార పార్టీకి చెందిన ఓ వ్యక్తికి గోశాల కోసం రూ.70 వేలు చెల్లించాడని తెలిసింది. ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసిన వ్యక్తి వేలంపాట పాడిన వారికి తాను సొమ్ములు చెల్లించనని చెప్పడంతో పాటదారులు డిపాజిట్ చెల్లించకుండా వెనుదిరిగారు. తిరునాళ్లలో ప్రధాన ఆదాయం ఎగ్జిబిషన్ ద్వారా వస్తుంది. ఎగ్జిబిషన్ నిర్వాహకుడికి అనుమతులు, అగ్నిమాపకశాఖ, ఫిట్‌నెస్ ధ్రువపత్రాలను పరిశీలించాల్సి ఉంది.

నూరు శాతం ఫలితాల సాధనకు కృషి

చందర్లపాడు, న్యూస్‌టుడే: కోనాయపాలెం ఉన్నత పాఠశాలను నందిగామ ఇన్‌ఛార్జి డీవైఈవో యు.గురునాథం బుధవారం సందర్శించారు. 10వ తరగతి విద్యార్థులకు 100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. స్లిప్ టెస్టుల్లో వచ్చిన మార్కులను పరిశీలించి వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని సూచించారు. పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు. పాఠశాల సిబ్బంది డీవైఈవోను సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు డీవీఎల్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

డీవైఈవోను సన్మానించిన ఉపాధ్యాయులు

ఘనంగా మహిళా.. బాలికల విజ్ఞాన దినోత్సవం

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: స్థానిక స్వామి పుల్లయ్య మెమోరియల్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ మహిళా, బాలికల విజ్ఞాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాల మేరకు సంపూర్ణత అభియాన్-2.0 కింద ఏబీపీ కో ఆర్డినేటర్ మోహన్‌సందీప్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలికల విజ్ఞానం, సాంకేతికత, ఇంజినీరింగ్, గణితం తదితర రంగాల్లో విద్య, వృత్తి అవకాశాల వైపు ప్రోత్సహించేలా అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ రజనీ, ప్రధానోపాధ్యాయుడు నక్కా బాబురావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మోహన్‌సందీప్

శిరస్త్రాణం తప్పనిసరి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు శిరస్త్రాణం తప్పనిసరిగా వాడాలని ఏసీపీ దుర్గారావు అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో పలుచోట్ల శిరస్త్రాణంపై వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. నిబంధనలను పాటించని వారిపై చర్యలు ఉంటాయని తెలిపారు. సీఐ చంద్రశేఖర్, ట్రాఫిక్ ఆర్ఐ కృష్ణ, ఎస్సై లక్ష్మణరావు పాల్గొన్నారు.

సంగమేశ్వరా.. తిరునాళ్లకు చేరుకునేదెలా..?

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: దక్షిణకాశీగా ప్రసిద్ధి పొందిన దాములూరు శివారు కూడలి సంగమేశ్వరస్వామి (జంగమయ్య) దేవాలయంలో మహాశివరాత్రి తిరునాళ్లకు వెళ్లే రహదారులు అధ్వానంగా మారాయి. ఈ నెల 14 నుంచి తిరునాళ్లు మొదలవుతున్నా అధికారులు మరమ్మతులు చేయించడం లేదు. దేవాలయం ఎదురుగా వైరా ఏటిపై ఉన్న చప్టాకు గతేడాది వరదలకు భారీ గండిపడడంతో గ్రావెల్‌తో పూడ్చారు. చప్టా కోతకు గురవ్వడంతో మరమ్మతులకు నిధులు మంజూరు చేసినా గుత్తేదారు పూర్తిస్థాయిలో పనులు చేయలేదు. మరమ్మతుల కోసం తెచ్చిన కంకర రహదారికి అడ్డంగా ఉంది. గ్రావెల్ పోసిన ప్రదేశంలో తారుతో అభివృద్ధి చేయకుండా వదిలేశారు. వీరులపాడు, కంచికచర్ల, మధిర నుంచి వచ్చే భక్తులకు అసౌకర్యంగా మారింది. తొర్రగుడిపాడు-దాములూరు గ్రామాల మధ్య కంకర తేలి నడిచేందుకు వీలుపడటం లేదు. ఈ రహదారి అభివృద్ధికి ఇటీవల రూ.55 లక్షలు మంజూరైనా టెండర్లు పిలవలేదు. సోమవరం చెరువుకట్ట రహదారిపై ఉన్న గుంతలకు తారుతో ప్యాచ్‌వర్క్‌లు చేశారు. కొండూరు-తొర్రగుడిపాడు ఆర్‌అండ్‌బీ రహదారి వెంట కంపచెట్ల తొలగింపు పనులు బుధవారం ప్రారంభించారు. సర్పంచి హైమారావు ఆధ్వర్యంలో జేసీబీ యంత్రంతో చెట్లను తొలగిస్తున్నారు.

దాములూరు-తొర్రగుడిపాడు రహదారి ఇలా..

జోరుగా ఇసుక రవాణా

అంబారుపేట నుంచి ట్రాక్టరులో రవాణా చేస్తూ..

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మునేరు నుంచి ఇసుకను తవ్వి ట్రాక్టర్లతో రవాణా చేస్తున్నారు. ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాలకు అనుకూలంగా ఉండటంతో సమీప గ్రామాలకు తరలిస్తున్నారు. పాతకంచల ప్రభుత్వ రీచ్ నుంచి ఇసుక రవాణా నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానంతో ఇక్కడ ట్రాక్టర్లతో గ్రామాలకు ఇసుకను రవాణా చేస్తున్నారు. అంబారుపేట, నందిగామ, పల్లగిరికొండ వెనుక మునేటిలో నిత్యం వందలాది ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టరు ఇసుక రూ.500కు లభిస్తుండటంతో గృహ నిర్మాణదారులు కొనుగోలు చేస్తున్నారు. వైకాపా ప్రభుత్వంలో ట్రాక్టరు ఇసుక కావాలంటే రోజుల తరబడి నిరీక్షించాల్సి వచ్చేది. ఒక్కో ట్రాక్టరు ఇసుక రూ.3 వేలు పెట్టినా లభించేది కాదు. ప్రస్తుతం ఉచిత ఇసుక విధానంతో ట్రాకర్లతో ఇసుకను జోరుగా రవాణా చేస్తున్నారు. జగ్గయ్యపేట, వత్సవాయి తదితర మండలాల నుంచి తెలంగాణకు అక్రమంగా లారీల్లో ఇసుకను తరలిస్తుండగా ఇటీవల పోలీసులు పట్టుకున్నారు. స్థానిక అవసరాలకు మాత్రమే ఇసుకను తరలించేలా రెవెన్యూ, మైనింగ్, పోలీసుశాఖ అధికారులు పర్యవేక్షించాల్సి ఉంది.

క్రీడా పరికరాల పంపిణీ

ఇబ్రహీంపట్నం గ్రామీణం: ప్రజా ప్రగతి ట్రస్టు ఇండియా లిటరసీ ప్రాజెక్టు ద్వారా చిలుకూరు, త్రిలోచనాపురం గ్రామాలలోని మండల పరిషత్తు పాఠశాలలకు క్రీడా పరికరాలను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేశారు.

రెయిలింగ్‌లు లేక.. ప్రమాదకరంగా

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని పాలేరుపై ఉన్న వంతెనలపై రెయిలింగ్‌లు దెబ్బతిన్నాయి. దీంతో అటుగా ప్రయాణించాలంటే వాహనదారులు భయపడుతున్నారు. అన్నవరం, బూదవాడ గ్రామాల వద్ద వంతెనలపై రెయిలింగ్‌లు గతేడాది వచ్చిన వరదల కారణంగా పూర్తిగా దెబ్బతిన్నాయి. వరదలు వచ్చి ఏడాదిన్నర దాటినా.. రెయిలింగ్‌లు మాత్రం నిర్మించడం లేదు. వంతెనలు కోతకు గురై రెండు వైపులా అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోయింది. ఇనుప చువ్వలు బయటకి రావడంతో వాహనదారులు వాటికి తగిలి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా స్పందించి మండల పరిధిలోని వంతెనలపై రెయిలింగ్‌లు నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

అన్నవరం వంతెనపై ఇలా..

ఘంటసాల గానం అజరామరం

నందిగామ, న్యూస్‌టుడే: ప్రముఖ గాయకుడు, పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు 52వ వర్ధంతిని నందిగామలో ఘనంగా నిర్వహించారు. స్థానిక గ్రంథాలయంలో బుధవారం ఆయన చిత్రపటానికి గ్రంథాలయ అధికారి అల్లూరు రామచంద్రుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు ప్రసాదరావు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్య పోరాటంలో 1942లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారని కొనియాడారు. ఎన్నో మధుర పాటలు పాడిన ఘంటసాల ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని చెప్పారు.

ఘంటసాల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయ అధికారి, విద్యార్థులు

లక్ష్మీనర్సయ్యకు నివాళి

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని చెర్వుకొమ్ముపాలెం గ్రామానికి చెందిన తెదేపా సీనియర్ నాయకుడు దివంగత లక్ష్మీనర్సయ్య చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. బుధవారం గ్రామంలో ఆయన దశదినకర్మ నిర్వహించారు. మాజీ హోంమంత్రి వసంత నాగేశ్వరరావు, ఏఎంసీ ఉపాధ్యక్షుడు అమ్మినేని జ్వాలాప్రసాద్, సొసైటీ అధ్యక్షులు వాసిరెడ్డి ప్రసాద్, జమల్లమూడి విష్ణు, తెదేపా నాయకులు తదితరులు పాల్గొని పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నెమలి కృష్ణుని ఆదాయం రూ.17.52 లక్షలు

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: నెమలి వేణుగోపాలస్వామి గుడిలో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. 2025 డిసెంబరు 6 నుంచి బుధవారం వరకు వచ్చిన కానుకలు లెక్కించగా స్వామివారి ఆలయానికి రూ.17,52,279 నగదు, 5 గ్రాముల బంగారం, 92 గ్రాముల వెండి, 175 యూఎస్ఏ డాలర్లు, 10 సింగపూర్ డాలర్లు అందాయి. పాలకవర్గ అధ్యక్షురాలు కె.శశిరేఖ, ఏసీ ఎన్.సంధ్య, పలువురు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రానికి ఆధునిక వైద్య పరికరాలు

కొండపల్లి, న్యూస్‌టుడే: సామాజిక బాధ్యతతో దాతలు చేస్తున్న కార్యక్రమాలు హర్షణీయమని కొండపల్లి ప్రాథమిక వైద్యశాల వైద్యులు రాథోడ్ అన్నారు. ఎస్‌బీఐ అమరావతి సర్కిల్, అవేరా గ్రూప్‌లు సంయుక్తంగా కొండపల్లి ఆరోగ్య కేంద్రానికి బుధవారం వైద్య పరికరాలను అందజేశాయి. సంస్థలు, కంపెనీలు సామాజిక బాధ్యతగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తే ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు ఆధునిక వైద్య సదుపాయాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో వైద్యులు శిరీష, బ్యాంకు, అవేరా గ్రూప్ సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 98496 97616

మాక్సిమస్ ఎఆర్‌సి లిమిటెడ్

కార్పొరేట్ ఆఫీసు: # నం.302 బి, జైన్ సద్గురు ఇమేజెస్ క్యాపిటల్ పార్క్, ఇమేజ్ గార్డెన్స్ రోడ్, విఐపి హిల్స్, మాధాపూర్, హైదరాబాదు, తెలంగాణ - 500081. ఫోన్ 040-49951666, ఇమెయిల్: co@maximusarc.com

స్థిరాస్తుల విక్రయానికి అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 6 (2) మరియు 8(6) యొక్క నిబంధనలతో చదువుకోవల్సిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.

[illegible]

స్థిరాస్తి సంక్షిప్త వివరణ

క్ర.సం	ఆస్తి వివరం
లాట్ - 1	శ్రీమతి బొలిశెట్టి శ్రీ లక్ష్మీ సుజాతకు చెందిన, ... [illegible]
	రిజర్వు ధర రూ.25 లక్షలు, ధరావతు రూ.2.50 లక్షలు
లాట్ - 2	శ్రీమతి బొలిశెట్టి శ్రీ లక్ష్మీ సుజాతకు చెందిన, ... [illegible]
	రిజర్వు ధర రూ.25 లక్షలు, ధరావతు రూ.2.50 లక్షలు
లాట్ - 3	శ్రీమతి బొలిశెట్టి శ్రీ లక్ష్మీ సుజాతకు చెందిన, ... [illegible]
	రిజర్వు ధర రూ.25 లక్షలు, ధరావతు రూ.2.50 లక్షలు

తెలిసినంతవరకు ఏవైనా ఎన్‌కంబ్రెన్సులు (ఏదైనా): లేవు.

వేలం వెబ్‌సైట్: https://auctionbazaar.com ద్వారా ఆన్‌లైన్ ఇ-వేలం.

16.03.2026న సా.5.00ల లోగా అన్ని లాట్లకు బిడ్లను ధరావతుతో పాటుగా దాఖలు చేయాలి.

ఇ-వేలం తేదీ లాట్ 1కి 17.03.2026 ఉ.11.00ల నుండి మ.12.00ల వరకు

లాట్ 2కు 17.03.2026 మ.12.00ల నుండి మ.01.00ల వరకు

లాట్ 3కు 17.03.2026 మ.02.00ల నుండి మ.03.00ల వరకు

బిడ్ పెంపుదల లాట్ 1కి రూ.50,000/- లాట్ 2కు రూ.50,000/- లాట్ 3కు రూ.50,000/-

[illegible] www.maximusarc.com/tenders [illegible]

తేది: 10.02.2026, స్థలం: హైదరాబాద్

సం/- (ఆర్ వెంకట రాజు), అధీకృత అధికారి, మాక్సిమస్ ఎఆర్‌సి లిమిటెడ్ +91 98481 70245.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
విజయవాడ వన్‌టౌన్ : 90320 99986

? కేఎల్‌రావునగర్‌లో పలు చోట్ల మురుగు కాలువలో పూడిక పేరుకుపోయింది. - **సుజాత, స్థానికురాలు.** ✔ పూడిక తీయించేందుకు చర్యలు తీసుకుంటాం. - **ఆనంద్ కృపాల్, స్థానిక శానిటరీ అధికారి.** - న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

స్పందన: ★ చిట్టినగర్ బస్‌స్టాప్ ఆవరణలో చెత్త పేరుకుపోయిందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. దీనికి స్పందించిన పారిశుద్ధ్య అధికారులు కార్మికులతో చెత్త తీయించారు. - **న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్**

శిరస్త్రాణం తప్పనిసరి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు శిరస్త్రాణం తప్పనిసరిగా వాడాలని ఏసీపీ దుర్గారావు అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో పలుచోట్ల శిరస్త్రాణంపై వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. నిబంధనలను పాటించని వారిపై చర్యలు ఉంటాయని తెలిపారు.

విజయవాడ పశ్చిమ

కల్తీ నెయ్యి బాధ్యులను శిక్షించాలి

విజయవాడ(గాంధీనగర్): శ్రీవారి లడ్డూకు కల్తీ నెయ్యి సరఫరా చేసి హిందువుల మనోభావాలు దెబ్బతీసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ సెంట్రల్ నియోజకవర్గ నాయకులు కోరారు. బుధవారం ఇక్కడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో పార్టీ నాయకులు యాంపాటి ప్రభూజీ, కె.భవానీ మాట్లాడారు. కల్తీ నెయ్యి వ్యవహారాన్ని పక్కదోవ పట్టించడానికే వైకాపా నాయకులు అంబటి రాంబాబు వ్యవహారాన్ని తెరపైకి తెచ్చి రాష్ట్రంలో అలజడులు సృష్టిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ఈ వ్యవహారంలో వైకాపా ప్రభుత్వం రూ.250 కోట్ల కుంభకోణానికి పాల్పడిందని ఆరోపించారు. దీనిపై హిందువులంతా కలిసి కట్టుగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు తాడి దుర్గారావు, పైలా ప్రకాష్, కె.నరేంద్ర, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మెల్యే సుజనాచౌదరికి వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

భవానీపురం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే సుజనాచౌదరి దృష్టికి యూటీఎఫ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి సుందరయ్య పేర్కొన్నారు. బుధవారం యూటీఎఫ్ నాయకులు ఎమ్మెల్యే సుజనాచౌదరిని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగుల పీఆర్సీ, పెండింగ్ బకాయిలు, సీపీఎస్ రద్దు, పెండింగ్ డీఏ, తదితర అంశాలను శాసనసభలో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. 12 పీఆర్సీ కమిషన్ ఛైర్మన్‌ను నియమించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 4 డీఏలు విడుదల చేయాలని, 29 శాతం ఐఆర్ ప్రకటించాలన్నారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో ఈ నెల 17న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. యూటీఎఫ్ నాయకులు ముత్తయ్య ఎం.లలిత, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడిలో మౌలిక వసతుల కల్పనకు ఎదురుచూపులు

ముందుకు సాగని శాశ్వత సెంట్రల్ రిసెప్షన్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

రాష్ట్రంలో రెండో అతిపెద్ద దేవాలయమైన దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో మౌలిక వసతుల కల్పన విషయంలో దశాబ్దాల కల నేరవేరలేదు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత దుర్గమ్మ దర్శనానికి వచ్చిన సందర్భంలో తూర్పుముఖం నుంచి దుర్గమ్మ దర్శనం చేసుకోవాలన్న తలంపుతో రాజగోపురం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 2015లో సాకారమైంది. రాజగోపురం నిర్మాణం పూర్తయ్యింది. పలువురు గవర్నర్లు, న్యాయమూర్తులు, ప్రజాప్రతినిధులు వచ్చి లిఫ్టు మార్గంలో తూర్పు ముఖంగా అమ్మవారిని దర్శించుకున్నారు.

★ రాష్ట్ర విభజన తర్వాత కూటమి ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి ఆలయానికి చుట్టూ ఉన్న ఆవాసాలను తొలగించింది. కనకదుర్గానగర్ ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈవో శీనానాయక్ భక్తులకు ఎదురవుతున్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకొని గత ఏడాది ఆక్రమణలను తొలగించి తాత్కాలికంగా సెంట్రల్ రిసెప్షన్ సెల్ ఏర్పాటు చేశారు. దానికి పక్కన రూ.60 లక్షలు వెచ్చించి నిర్మాణం చేసిన రేకుల షెడ్డు, శృంగేరి పీఠానికి సంబంధించిన సత్రం దుర్గగుడి పరిధిలో ఉన్నాయి.

అసంపూర్తిగా ఎలివేటెడ్ క్యూలైను నిర్మాణ పనులు

తిరుపతి విష్ణు నివాసం తరహాలో..

తిరుపతి విష్ణు నివాసం తరహాలో ఇంద్రకీలాద్రి దిగువన బహుళ ప్రయోజన భవన నిర్మాణం చేస్తే అందులో సెంట్రల్ రిసెప్షన్‌తో పాటు సెల్లార్ పార్కింగ్, ఆన్‌లైన్‌లో విరాళాలు, ఆర్జిత సేవల కేంద్రం ఏర్పాటు చేసేందుకు వీలుంటుంది. దసరా, భవానీ దీక్షల విరమణ సమయంలో భక్తులు రోడ్లపై విశ్రాంతి తీసుకునే పరిస్థితుల నుంచి ఉపశమనం లభిస్తుంది. ప్రస్తుతం రూ.13 కోట్లతో నిర్మిస్తున్న ఎలివేటెడ్ క్యూలైన్లు, లిఫ్టు మార్గంలో భక్తులు తూర్పు రాజగోపురం నుంచి అమ్మవారి దర్శనానికి అవకాశం లభిస్తుంది.

★ దీనిపై దుర్గగుడి పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణను సంప్రదించగా భక్తుల మౌలిక వసతుల కల్పనకు పాలకమండలి ప్రథమ ప్రాధాన్యం ఇస్తుందన్నారు. అర్జున వీధిలో ఆక్రమణలు తొలగించి ఆ ప్రాంతంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన సెంట్రల్ రిసెప్షన్ షెడ్ భక్తులు ఉపయోగపడుతుందన్నారు. ఎలివేటెడ్ క్యూలైన్ల నిర్మాణం పూర్తయితే భక్తులు అధిక శాతం తూర్పు రాజగోపురం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. సెంట్రల్ రిసెప్షన్ స్థానంలో బహుళ ప్రయోజన భవనం నిర్మాణం విషయం పాలకమండలి సమావేశంలో చర్చించిన తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

మాట్లాడుతున్న వన్‌ట్రాఫిక్ సీఐ ఉమామహేశ్వరరావు, ఎస్సై శ్రీధర్

విద్యాధరపురం, న్యూస్‌టుడే: ట్రాఫిక్ అంబాసిడార్లు క్షేత్రస్థాయి పరిస్థితిని అధికారుల దృష్టికి తీసుకు వచ్చినప్పుడు సమస్య పరిష్కారం అవుతుందని వన్‌ట్రాఫిక్ సీఐ ఉమామహేశ్వరరావు అన్నారు. వన్‌ట్రాఫిక్ పోలీసుస్టేషను ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన ట్రాఫిక్ అంబాసిడార్ల సమావేశం (దుకాణదారులు, ఆటో డ్రైవర్లు, వ్యాపారులు) లో సీఐ మాట్లాడుతూ.. ముఖ్య కూడళ్లలో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించే పరిస్థితులకు సంబంధించిన ఫొటోలను అధికారులకు పంపాలని సూచించారు. ఎవరి వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయో..? పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. మెరుగైన ట్రాఫిక్ నియంత్రణకు సూచనలు, సలహాలు కూడా అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సైలు శ్రీధర్, ఓంకార్ పాల్గొన్నారు.

రండి. పని చేయించుకోండి..

విజయ సూచికతో కూటమి కార్పొరేటర్లు

చిట్టినగర్, న్యూస్‌టుడే: 'రండి మీకు కావాల్సిన పనులు చేయించుకోండి' అంటూ ఎమ్మెల్యే సుజనా చౌదరి నూతన నినాదం అమలు చేస్తున్నారని పశ్చిమ నియోజకవర్గం కూటమి కార్పొరేటర్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ర్యాంకింగ్‌లో రాష్ట్రంలో వెస్ట్.. బెస్ట్‌గా నిలిచిన సందర్భంగా 48వ డివిజన్ కార్పొరేటర్ ఆదిలక్ష్మి కార్యాలయంలో కూటమి కార్పొరేటర్లు మీడియా ప్రతినిధుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో గుడ్ గవర్నెన్స్‌లో పశ్చిమ నియోజకవర్గం ప్రథమ స్థానంలో నిలవడం ఎమ్మెల్యే పని తీరుకు అద్దం పడుతుందన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన, విద్య, వైద్య అభివృద్ధి, నియోజకవర్గంలో కొండ ప్రాంతాల అభివృద్ధి, ప్రజారోగ్య పరిరక్షణకు ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. ఎన్నికల సమయంలో తనను గెలిపిస్తే అభివృద్ధిలో రాష్ట్రంలోనే వెస్ట్ బెస్ట్‌గా నిలబెడతానని చెప్పిన మాట ప్రకారం చేసి చూపించారని అన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు మహదేవు అప్పాజీ, ఉమ్మడి చంటి, బుల్లా విజయ్‌కుమార్, మరుపిళ్ల రాజేష్, హర్షద్, అత్తలూరి ఆదిలక్ష్మి, మైలవరపు రత్నకుమారి, మాధురి లావణ్య, నాయకులు పెదబాబు, మైలవరపు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళాలు

దాతలు వెంకటేశ్వర్లు, రమాదేవి కుటుంబ సభ్యులకు విరాళం రసీదు, అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ట్రస్ట్ బోర్డు సభ్యుడు శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ సత్యనారాయణ తదితరులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి ఇద్దరు దాతలు రూ.2,01,116 విరాళాన్ని బుధవారం అందజేశారు. పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలు నివాసి మెట్లపల్లి రమాదేవి రూ.1,01,116, విశాఖపట్నంలోని ఎం.వి.పి కాలనీ చెందిన ఎం.వెంకటేశ్వర్లు రూ.లక్ష విరాళాలను వేర్వేరుగా అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో దర్శనం చేయించారు. దేవస్థానం సూపరింటెండెంట్ సత్యనారాయణ, ట్రస్టుబోర్డు సభ్యుడు శ్రీనివాసరావు వారికి విరాళం రసీదుతోపాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

డ్రెయినేజీ వ్యవస్థ మెరుగు పరచాలి

ఊర్మిళానగర్ వద్ద డ్రెయిన్‌ను డ్రోన్ ద్వారా పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర, అధికారులు

భవానీపురం, న్యూస్‌టుడే: పశ్చిమ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగు పరచాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో కమిషనర్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలువల్లో పూడికతీసి వ్యర్థాలను తొలగించాలని పేర్కొన్నారు. వైజాగ్‌కాలనీ వద్ద అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లో పేరుకున్న వ్యర్థాలను చూసి వెంటనే తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. వ్యర్థాలు తొలగించే వాహనం మరమ్మతులకు గురవడంతో వేయలేకపోతున్నామని సిబ్బంది పేర్కొన్నారు. దీంతో వెంటనే మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకురావాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. అలాగే పారిశుద్ధ్య నిర్వహణకు ఉపయోగించే వాహనాలు మరమ్మతులకు గురైతే వెంటనే చేయించాలని సూచించారు. ఊర్మిళా సుబ్బారావు నగర్ వద్ద అవుట్‌ఫాల్ డ్రెయిన్‌ను పరిశీలించి పూడికలు తీయించాలని ఆదేశించారు. డ్రోన్ ద్వారా పరిశీలించి ప్రజారోగ్య విభాగం, ఇంజినీరింగ్ విభాగం అధికారులు సమన్వయంతో పని చేయాలని చెప్పారు. కేఎల్‌రావునగర్‌లోని అవుట్‌ఫాల్ డ్రెయిన్‌ను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. హెచ్‌బీకాలనీలోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. తాగునీరు, వాడుక నీటి సరఫరాకు ఆటంకం లేకుండా చూడాలని, అధికారులు పర్యవేక్షించాలని పేర్కొన్నారు. పర్యటనలో జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, ఈఈ జె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల గానం అజరామరం

నివాళులర్పిస్తున్న చంద్రశేఖర్ ఆంజనేయరాజు తదితరులు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: అమరజీవి ఘంటసాల గానం అజరామరం అని శ్రీకళాభారతి అధ్యక్షుడు సింగంశెట్టి చంద్రశేఖర్ అన్నారు. ప్రముఖ గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి పురస్కరించుకొని తుమ్మలపల్లి కళాక్షేత్రంలోని ఘంటసాల విగ్రహానికి పలు స్వచ్ఛంద కళా సంస్థల సభ్యులు పూలమాలలు వేసి బుధవారం నివాళులర్పించారు. ఈసందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఘంటసాల గీతాలు ఐదు దశాబ్దాలుగా మించా ప్రజలు ఆనందిస్తున్నారని చెప్పారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చిట్టిబాబు మాట్లాడుతూ నేటికీ ఘంటసాల నోటి నుంచి జాలువారిన భగవద్గీత శ్లోకాలు ప్రతి నిత్యం వినడం మన అదృష్టమన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద కళా సంస్థల సభ్యులు బి.ఆంజనేయ రాజు, డేవిడ్ రాజు, సంగీత విద్వాంసులు బ్రహ్మానందం, గాయకులు శ్యామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమ్మె.. అధికారులు అప్రమత్తం

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: దేశ వ్యాప్తంగా కార్మికులు గురువారం సమ్మె చేస్తున్న నేపథ్యంలో విజయవాడ నగర పాలక సంస్థ అధికారులు అప్రమత్తమయ్యారు. బుధవారం డంపర్‌బిన్లలో వ్యర్థాలు తొలగించేలా చర్యలు చేపట్టారు. రహదారులను శుభ్రం చేయించారు. నగర పాలక సంస్థలోని అన్ని విభాగాల కార్మికులు సమ్మెలో పాల్గొనే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో నగర ప్రజలు వ్యర్థాలను గురువారం బహిరంగ ప్రదేశాల్లో వేయవద్దని కమిషనర్ ధ్యానచంద్ర సూచించారు. 13న క్లాప్ వాహనాల ద్వారా వ్యర్థాలు సేకరిస్తామని తెలిపారు.

అలరించిన మధుర గీతాలు

పాటలు పాడుతున్న మల్లీశ్వరి, వేదికపై డేవిడ్‌రాజు తదితరులు

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే: తెలుగు సుస్వరాల రాగాలను మధురంగా ఆలపించడంలో ఘంటసాల దిట్టని బీఆర్ అంబేడ్కర్ సాంస్కృతిక సంస్థ ప్రతినిధి కె.డేవిడ్‌రాజు అన్నారు. బుధవారం గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానంద కళావేదికపై ఘంటసాల వర్ధంతి సందర్భంగా డీజే మెలోడీస్ ఆధ్వర్యంలో 'ఘంటసాల గానామృతం' నిర్వహించారు. గాయకులు కె.డేవిడ్ రాజు, మారేపల్లి జోహష నిర్వహణలో ఈ కార్యక్రమం జరిగింది. గాయకులు హేమమాలిని(గుంటూరు), బొబ్బిలి మల్లేశ్వరి తదితరులు ఘంటసాల పాటలను చక్కగా ఆలపించారు. అతిథులుగా అశోక్ ఆనంద్, పరుచూరి విజయలక్ష్మి, ప్రసూనారామన్, చిట్టిబాబు, వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

హలీమ్ స్టాళ్లు నిలిపేయాలి

నిరసన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: హలీమ్ స్టాల్స్ వల్ల ఏర్పడే ట్రాఫిక్ ఇబ్బందులను పరిష్కరించాలని, స్టాళ్ల ఏర్పాటు నిలపాలని చేయాలని ఎంసీపీఐ (యూ)పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్‌కె ఖాదర్ బాషా డిమాండ్ చేశారు. బుధవారం పంజా సెంటర్ వద్ద రంజాన్ మాసంలో హలీమ్ స్టాల్స్ వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందని నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హలీమ్ తినడానికి బయట నుంచి వచ్చే వాహనాలు పంజాసెంటర్ చుట్టూ పరిసర ప్రాంతంలో ద్విచక్ర వాహనాలు, కార్లు, పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని చెప్పారు. మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సలీం, జిల్లా కమిటీ సభ్యులు ఎన్.చంద్రశేఖర్, ఖాలీద్, ఎండీ గాలిబ్, మలంగ్ తదితరులు పాల్గొన్నారు.

ఇలాగైతే ఎలా..!

వాహనచోదకులు, పాదచారులకు అవగాహన కల్పించేలా ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు అలంకార ప్రాయంగా మారుతున్నాయి. భవానీపురం ఆర్టీసీవర్క్ షాపు రోడ్డులో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు ఒంగిపోయి ఉన్నాయి. దీంతో వాటిని ఏర్పాటు చేసిన లక్ష్యం నెరవేరని పరిస్థితి. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు. - **భవానీపురం, న్యూస్‌టుడే**

అధ్వానంగా రహదారి

భవానీపురం 41వ డివిజన్ పరిధిలోని ఆశ్రమం రోడ్డులో రహదారి గతుకులుగా తయారైంది. దారంతా గోతులు పడడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. - **భవానీపురం, న్యూస్‌టుడే**

కరాటే పోటీల్లో సత్తా

విజేతలతో ప్రిన్సిపల్ కృష్ణవేణి తదితరులు

చిట్టినగర్, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి కరాటే పోటీల్లో తమ కళాశాలలో ఉచిత శిక్షణ పొందుతున్న విద్యార్థులు సత్తా చాటి పతకాలు సొంతం చేసుకున్నారని కేబీఎన్ కళాశాల ప్రిన్సిపల్ కృష్ణవేణి తెలిపారు. కొత్తపేటలోని కళాశాల కార్యాలయంలో అభినందన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. ఈనెల 8న ఎన్టీఆర్ మెమోరియల్ నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలు మంగళగిరిలోని ఓ కన్వెన్షన్‌లో జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జాతీయ స్థాయి పోటీల్లో బాలికల కటా విభాగంలో కృతజ్ఞ ప్రథమ, ఆయేషా కౌసర్, జి.దర్భిక తృతీయ స్థానాల్లో నిలిచినట్లు వివరించారు. బాలికల కుమితే విభాగంలో బి.కృతజ్ఞ, జి.దర్భిక వరసగా తృతీయ స్థానాలు సాధించారని వివరించారు. బాలుర కటా విభాగంలో సీహెచ్ సాయిస్మరణ్ ప్రథమ, బి.రక్షణ్, ఎన్.ఉమేష్‌చంద్ర ద్వితీయ, కె.తనీష్ సాయితేజ, డి.కష్వంత్ తృతీయ స్థానాలను సాధించారని చెప్పారు. బాలుర కుమితే విభాగంలో సీహెచ్ సాయిస్మరణ్ ద్వితీయ, బి.రక్షణ్, ఉమేష్‌చంద్ర, కె.తనీష్‌సాయితేజ, డి.కష్వంత్ వరుసగా తృతీయ స్థానాలను సాధించారని వివరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్స్ ఎం.వెంకటేశ్వరరావు. పి.ఎల్.రమేష్ విజేతలను, కరాటే శిక్షకురాలు వరలక్ష్మీదేవిని అభినందించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న కాశీనాథ్ తదితరులు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థలోని ఇంజినీరింగ్, ఆరోగ్య విభాగం, వెహికల్ డిపో తదితర విభాగాల్లో పని చేసే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ యూనియన్ నగర గౌరవ అధ్యక్షుడు దోనేపూడి కాశీనాథ్ పేర్కొన్నారు. కార్మికుల సమస్యలపై కమిషనర్ ధ్యానచంద్రను నగరపాలక సంస్థ కార్యాలయంలో సంఘం నాయకులు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా కాశీనాథ్ మాట్లాడుతూ.. నగర పాలక సంస్థలో నూతనంగా విధుల్లో చేరిన 75 మంది జీతాల విషయంలో తేడా వచ్చిందని తెలిపారు. నీటి సరఫరా విభాగం సిబ్బందికి బకాయిలు రాలేదని వెల్లడించారు. కార్మికుల సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. సంఘం నాయకులు ఎం.బుజ్జమ్మ, టి.తిరుపతమ్మ, జె.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి దీన్‌దయాళ్

దీనదయాళ్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న భాజపా నాయకులు

చిట్టినగర్, న్యూస్‌టుడే: ఆదర్శ కర్మయోగి, దూరదృష్టి కలిగిన రాజనీతిజ్ఞుడు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ నేటి తరం నాయకులకు మార్గదర్శకులని ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.శివకుమార్ పట్నాయక్ తెలిపారు. భాజపా చిట్టినగర్ మండల అధ్యక్షుడు దేవిన హరిప్రసాద్ ఆధ్వర్యంలో కేఎల్‌రావునగర్, దీన్‌దయాళ్‌నగర్‌లోని దీన్‌దయాళ్ విగ్రహం వద్ద వర్ధంతి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విలక్షణ ఆలోచనతో సమాజ హితానికి ఆయన పడిన తపన జాతీయ వాదానికి మారేందుకు దోహదం చేసిందని అన్నారు. ఏకాత్మ మానవతా వాదాన్ని జనసంఘ్ సిద్ధాంతంగా ప్రకటించారని వివరించారు. అనంతరం ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో భాజపా నాయకులు పోతిన భేసుకంఠేశ్వరుడు, ఎర్ర సునీత, ప్రవీణ్‌ఉమార్, ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

భాజపా రాష్ట్ర కార్యాలయంలో అధికార ప్రతినిధి జయప్రకాష్, నాయకులు

భవానీపురం, న్యూస్‌టుడే: భాజపా నిర్మాణంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ కీలకపాత్ర పోషించారని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ పేర్కొన్నారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి కార్యక్రమాన్ని విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ ఆయన ప్రతిపాదించిన ఏకాత్మ మనవతా వాదం భారతదేశ నిర్మాణానికి దిక్సూచి అని, నేటి యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాజపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాం, నాయకులు బి.నాగలక్ష్మి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఉద్యోగ మేళా నేడు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: విజయవాడ నగర పాలక సంస్థ మెప్మా ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్టు అధికారి లక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 20 కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. పదో తరగతి, డిగ్రీ, ఇంజినీరింగ్ చదివిన అభ్యర్థులు పాల్గొనాలని కోరారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

భవానీపురం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడినట్లు భవానీపురం పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి... చిట్టినగర్ టైలర్‌పేటలో గుర్రం వెంకట రామాంజనేయులు కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. భవానీపురం ఐరన్ యార్డులో ఇనుము వ్యాపారం చేస్తున్నారు. ఈనెల 10వ తేదీ మధ్యాహ్నం రామాంజనేయులు, మరో వ్యక్తి సీహెచ్.వి.పూర్ణచంద్రరావు టీ తాగేందుకు ద్విచక్రవాహనంపై బయలుదేరారు. ఐరన్‌యార్డు నుంచి బయటకు వస్తుండగా వారు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని పొక్లెనర్ ఢీకొట్టింది. దీంతో వారిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని నగరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కృష్ణా వర్సిటీ బాడీ బిల్డింగ్ పోటీల్లో ప్రతిభ

శోభనాచారిని అభినందిస్తున్న రామనారాయణ, ప్రసాద్, నాగేశ్వరశాస్త్రి, దుర్గాప్రసాద్ తదితరులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: గాంధీనగర్‌లోని శారద డిగ్రీ కళాశాలకు చెందిన ఎ.శోభనాచారి కృష్ణా వర్సిటీ అంతర్ కళాశాలల బాడీ బిల్డింగ్ పోటీలో ప్రతిభ ప్రదర్శించి రజత పతకం కైవసం చేసుకున్నాడని కళాశాల ప్రిన్సిపల్ పి.నాగేశ్వరశాస్త్రి తెలిపారు. ఈ నెల 9న మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో అతడు ద్వితీయ స్థానంలో నిలిచాడన్నారు. బుధవారం కళాశాలలో కరస్పాండెంట్ ఎస్ఎస్‌వీ ప్రసాద్, కార్యదర్శి రామనారాయణ, ప్రిన్సిపల్ ప్రిన్సిపల్ దుర్గాప్రసాద్ పలువురు అధ్యాపకులు విద్యార్థిని అభినందించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: హనుమాన్‌పేటలో గుర్తుతెలియని వ్యక్తి(55) రోడ్డుపై అనుమానాస్పద స్థితిలో చనిపోయినట్లు గవర్నర్‌పేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. అనారోగ్యం కారణంగా చనిపోయి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రిలో మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు గవర్నర్‌పేట పోలీస్ స్టేషన్‌లో (0866-2576023) లేదా 94406 27079) సంప్రదించాలని పోలీసులు కోరారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

సినిమాలు

యుఫోరియా, హనీ, నారీ నారీ నడుమ మురారి, సుమతీ-శతకం, విత్ లవ్, శ్రీచిదంబరం గారు : ఊర్వశి ఐనాక్స్ (గాంధీనగర్), స్వర్ణా కాంప్లెక్స్ (గవర్నర్‌పేట), రామ్ సినిమాస్(గుణదల), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటెల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్ (కానూరు), ఏబీఆర్ సినిమాస్(కానూరు). **విత్ లవ్:** జయరామ్

బరాబర్ ప్రేమిస్తా: అప్సర, ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), పీవీఆర్ మాల్ (బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటెల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట). **లగ్గం, ఎర్రచీర:** నవరంగ్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), రామ్ సినిమాస్(గుణదల)ఆపరేషన్ పద్మ: స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), రామ్ సినిమాస్ (గుణదల), పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్). **ఓంశాంతి శాంతి శాంతి శాంతి:** జీ-3 (రాజ్-యువరాజ్), త్రిముఖ: ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), పీవీఆర్ మాల్ (బందరు రోడ్డు), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట). **ఓం శాంతి శాంతి శాంతి శాంతి:** ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్ (గవర్నర్‌పేట), తారా స్క్రీన్స్, రవీంద్ర సినిమాస్(పాయకాపురం), రామ్ సినిమాస్ (గుణదల), సాయిరామ్, సౌమ్య(వన్‌టౌన్), స్వాతి(భవానీపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్ (బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు), ఏబీఆర్ సినిమాస్(కానూరు). దేవగుడి: ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్ (గవర్నర్‌పేట), రామ్ సినిమాస్(గుణదల), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటెల్ సినిమాస్). **అనగనగా ఒకరాజు:** అలంకార్, జీ-3(రాజ్-యువరాజ్), ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), తారా స్క్రీన్స్, రవీంద్ర సినిమాస్(పాయకాపురం), రామ్ సినిమాస్(గుణదల), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు). **అనగనగా ఒకరాజు:** అలంకార్, జీ-3(రాజ్-యువరాజ్). **భర్త మహాశయులకు విజ్ఞప్తి, మన శంకరవరప్రసాద్ గారు:** జీ-3(రాజ్-యువరాజ్), ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), రవీంద్ర సినిమాస్(పాయకాపురం), రామ్ సినిమాస్ (గుణదల), స్వాతి(భవానీపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల(కానూరు). **మన శంకరవరప్రసాద్ గారు:** అలంకార్. - **న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్**

(c) eenadu

విజయవాడ మధ్య

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: స్థానిక 36వ డివిజన్‌కు చెందిన ఇద్దరికి సుమారు రూ.లక్ష సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం ఎమ్మెల్యే బొండా ఉమా బీఆర్‌టీఎస్ రోడ్డులో పార్టీ కార్యాలయంలో అందజేశారు. ఘంటా కృష్ణ మోహన్, మద్దినేని సుబ్రహ్మణ్యం, లక్ష్మణ్‌సింగ్, నాభాని దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల స్వరం.. తెలుగు ప్రజలకు వరం

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే: గాన గంధర్వుడు ఘంటసాల గళం తెలుగు వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిందని శ్రీకళాభారతి అధ్యక్షుడు శింగంశెట్టి చంద్రశేఖర్ అన్నారు. బుధవారం తుమ్మలపల్లి క్షేత్రియ కళాక్షేత్రంలోని ఘంటసాల విగ్రహం వద్ద కళా సంస్థల నిర్వాహకుల ఆధ్వర్యంలో ఆయన 52వ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ ఘంటసాల స్వరం తెలుగు ప్రజలకు వరమని కొనియాడారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, ప్రముఖ సంగీత విద్వాంసులు కె.వి.బ్రహ్మానందం, అంబేడ్కర్ సాంస్కృతిక సంస్థ ప్రతినిధి కె.డేవిడ్ రాజు, ఎక్స్‌రే ప్రధాన కార్యదర్శి బోడి ఆంజనేయరాజు, గాయకులు శ్యాంప్రసాద్, దండు చంద్రశేఖర్ తదితరులు ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విగ్రహానికి నివాళులర్పిస్తున్న చంద్రశేఖర్, చిట్టిబాబు, డేవిడ్‌రాజు, ఆంజనేయరాజు తదితరులు

11సీఈఎస్06: పాటలు పాడుతున్న మల్లీశ్వరి, వేదికపై డేవిడ్‌రాజు తదితరులు

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే: తెలుగు సుస్వరాల రాగాలను మధురంగా ఆలపించడంలో ఘంటసాల దిట్టని బీఆర్ అంబేడ్కర్ సాంస్కృతిక సంస్థ ప్రతినిధి కె.డేవిడ్‌రాజు అన్నారు. బుధవారం గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానంద కళావేదికపై ఘంటసాల వర్ధంతి సందర్భంగా డీజే మెలోడీస్ ఆధ్వర్యంలో 'ఘంటసాల గానామృతం' నిర్వహించారు. గాయకులు కె.డేవిడ్‌రాజు, మారేపల్లి జోషప నిర్వహణలో ఈ కార్యక్రమం జరిగింది. గాయకులు హేమమాలిని(గుంటూరు), బొబ్బిలి మల్లేశ్వరి తదితరులు ఘంటసాల పాటలను చక్కగా ఆలపించారు. అతిథులుగా అశోక్ ఆనంద్, పరుచూరి విజయలక్ష్మి, ప్రసూనారామన్, చిట్టిబాబు, వీరభద్రరావు పాల్గొన్నారు.

ఫక్రుద్దీన్ అలీ అహ్మద్‌కు నివాళి

చిత్రపటం వద్ద స్వప్న, అమర్జహబేగ్, ఖుర్షీదా, ప్రమీలాగాంధీ, పూర్ణిమ తదితరులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: మాజీ రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆంధ్రరత్న భవన్‌లో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఏపీ మహిళా కాంగ్రెస్ పరిశీలకులు అదిత స్వప్న, ఏపీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అమర్జహ బేగ్, ఖుర్షీదా బేగం, ప్రమీలాగాంధీ, పూర్ణిమ, సునీత, మీసాల రాజేశ్వరరావు, అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

జనంపై దోమల దండయాత్ర!

నివారణ చర్యలు శూన్యం ★ రాత్రి వేళ కంటికి నిద్ర కరవు

మధురానగర్, న్యూస్‌టుడే: మధ్య నియోజకవర్గంలో దోమలు విజృంభిస్తున్నాయి. వీటి నివారణకు ప్రజలు తీసుకుంటున్న చర్యలు వారి ప్రాణాలనే బలిగొంటున్నాయి. మూడు రోజుల క్రితం ఈ ప్రాంతంలో ఓ మహిళ దోమల బాధను తట్టుకోలేక ఇంట్లో అగరబత్తి వెలిగించుకుని పడుకోగా మంటలు చెలరేగి నిద్రలోనే ప్రాణాలు కోల్పోయింది. ఈ నేపథ్యంలో ఇటు అధికారులు, అటు ప్రజలు అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది. ఈ నియోజకవర్గంలో ఉన్న 21 డివిజన్లలోనూ దోమల బెడద తీవ్రంగా ఉండడంతో ప్రజలకు కంటిమీద కునుకు కరవయ్యింది.

ఏలూరు కాలువ, బుడమేరు ప్రాంతాల్లో..

నగరంలోని పలు ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు చెరువుల్లా మారి దోమల ఉత్పత్తికి ప్రధాన బిందువుగా మారాయి. ఇక సరైన పారుదల లేని ఓపెన్ డ్రెయిన్లు దోమలకు ఆవాసాలుగా మారాయి. ఏలూరు కాలువ, బుడమేరు పరివాహక ప్రాంతాల్లో ప్రజలకు వేసవిలోనూ దోమల బాధ తప్పడం లేదు. వీటిలో నీటి పారుదల లేకపోవడంతో దోమలు పెరుగుతున్నాయి.

దావుబుచ్చయ్య కాలనీలో చెరువులా మారిన ఖాళీ స్థలాలు

బుడమేరు కాలువ

1.50లక్షల జనాభాకు తప్పని అవస్థలు

మధ్య నియోజకవర్గంలో 1, 28, 29, 30, 31, 36, 57 నుంచి 64 డివిజన్లలో దోమల ప్రభావం ఎక్కువగా ఉంది. 23, నుంచి 27 డివిజన్లలో వీటి జోరు అంతగా లేదు. నియోజకవర్గం మొత్తం మీద దాదాపు 1.50లక్షల మంది ప్రజలు దోమలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

డ్రోన్లతో రసాయనాల పిచికారీ ఏదీ?

దోమల నివారణకు రాత్రి వేళ చేపడుతున్న ఫాగింగ్ స్థానికులకు శ్వాసకోశ ఇబ్బందులు తప్ప ఉపయోగం ఉండడం లేదు. దోమలు ఏ మాత్రం తగ్గడం లేదు. ఒకప్పుడు ఖాళీ స్థలాలు, బుడమేరు, ఏలూరు కాలువల్లో దోమల లార్వాల నివారణకు డ్రోన్లతో రసాయనాలు పిచికారీ చేసేవారు. వానాకాలంలో చేపట్టిన ఈ పనులు సత్ఫలితాలు ఇచ్చాయి. కానీ కొత్త సంవత్సరంలో ఈ పనులు చేయకపోవడంతో పరిస్థితులు చేజారి దోమల బాధతో ప్రజలు నానా అవస్థలుపడుతున్నారు. ఇప్పటికైనా ఓపెన్ డ్రెయిన్లు, ఖాళీ స్థలాల్లో యాంటీ లార్వా చర్యలు తీసుకోవడం, నీటి ప్రవాహం నిలిచిన తాగునీటి కాలువలు, బుడమేరులో డ్రోన్ల ద్వారా రసాయనాలు పిచికారీ చేయడం వంటి చర్యలు తక్షణమే చేపడితే కొంతవరకు ఫలితం ఉంటుందని ప్రజలు సూచిస్తున్నారు.

ఆర్థిక సంక్షోభంలోనూ సుపరిపాలన: ఎమ్మెల్యే

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే: రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం 20 నెలల పాలనలో సూపర్-6 హామీలను 90 శాతం అమలు చేసి ప్రజల్లో పూర్తి సంతృప్తి నింపిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తెలిపారు. బుధవారం అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి, సామాజిక న్యాయం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. 'స్వర్ణాంధ్ర విజన్ 2047' దిశగా తలసరి ఆదాయం పెంపునకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. తల్లికి వందనం, శ్రీశక్తి, దీపం-2, అన్నదాత సుఖీభవ, ఎన్టీఆర్ భరోసా వంటి పథకాల ద్వారా కోట్లాది మందికి లబ్ధి చేకూర్చినట్లు వివరించారు. పింఛన్ పంపిణీలో రాష్ట్రం రికార్డు సృష్టించిందని, వివిధ వర్గాలకు గౌరవ వేతనాలు అందజేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. 21 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చి 25 లక్షల ఉద్యోగావకాశాలు కల్పించామని అన్నారు.

కార్మికుల సమ్మె.. అధికారులు అప్రమత్తం

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా కార్మికులు గురువారం సమ్మె చేస్తున్న నేపథ్యంలో విజయవాడ నగర పాలక సంస్థ అధికారులు అప్రమత్తమయ్యారు. బుధవారం డంపర్‌బిన్లలో వ్యర్థాలు తొలగించేలా చర్యలు చేపట్టారు. రహదారులను శుభ్రం చేయించారు. నగర పాలక సంస్థలోని అన్ని విభాగాల కార్మికులు సమ్మెలో పాల్గొనే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో నగర ప్రజలు వ్యర్థాలను గురువారం బహిరంగ ప్రదేశాల్లో వేయవద్దని కమిషనర్ ధ్యానచంద్ర సూచించారు.

పవర్ లిఫ్టింగ్ పోటీలో పతకాలు

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం: గుడివాడలో ఈ నెల 8న జరిగిన ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఆరు బంగారు పతకాలు సాధించిన విజయవాడ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం సీనియర్ ఆఫీస్ అసిస్టెంట్ సూరపనేని సాయిశ్రీని బుధవారం ఉపకులపతి డాక్టర్ పి.చంద్రశేఖర్ అభినందించారు. ఆమె 63 కిలోల మహిళల కేటగిరీలోని వివిధ విభాగాల్లో మొత్తం 6 బంగారు పతకాలు సాధించారు.

ప్రకటన

నా క్లయింట్ అయిన State Bank of India R.A.C.P.C. ... [illegible]

పడమర: యమ్.మంగమ్మ గారి ఆస్తి మరియు ఎండోమెంట్ వారి గోడ, **ఉత్తరం:** ఈ రోజున మాలో 1వ వారు కోట లక్ష్మీకల్పన గారికి విక్రయ ఖరారు చేసిన ఆస్తి. ఈ నాలుగు హద్దుల మధ్య చ.గ. 226-7 లేక చ.మీ. 189.55లు స్థిరాస్తి ఖాళీ నివేశన స్థలమున్ను, సదరు స్థలముపై మాకు గల యావత్ ఈజ్‌మెంట్ హక్కులతో సహా.

యల్.ఎస్. పవన్‌కుమార్, అడ్వకేట్,
ఆఫీస్: 59-12-9, ఫస్ట్ లేన్, గాయత్రినగర్
విజయవాడ-8. సెల్ నెం.: 92469 88678

నిత్యాన్నదాన పథకానికి విరాళాలు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి ఇద్దరు దాతలు రూ.2,01,116 విరాళాన్ని బుధవారం అందజేశారు. పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలు నివాసి మెట్టపల్లి రమాదేవి రూ.1,01,116, విశాఖపట్నంలోని ఎం.వి.పి కాలనీ చెందిన ఎం.వెంకటేశ్వర్లు రూ.లక్ష విరాళాలను వేర్వేరుగా అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో దర్శనం చేయించారు. దేవస్థానం సూపరింటెండెంట్ సత్యనారాయణ, ట్రస్టుబోర్డు సభ్యులు శ్రీనివాసరావు వారికి విరాళం రసీదుతో పాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

నేడు తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జాబ్‌మేళా

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: విజయవాడ నగర పాలక సంస్థ మెప్మా ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జాబ్‌మేళా ప్రాజెక్టు అధికారి లక్ష్మీ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 20 కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. పదో తరగతి, డిగ్రీ, ఇంజినీరింగ్ చదివిన అభ్యర్థులు పాల్గొనాలని కోరారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థలోని ఇంజినీరింగ్, ఆరోగ్య విభాగం, వెహికల్ డిపో తదితర విభాగాల్లో పని చేసే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ యూనియన్ నగర గౌరవ అధ్యక్షుడు దోనేపూడి కాశీనాథ్ పేర్కొన్నారు. కార్మికుల సమస్యలపై కమిషనర్ ధ్యానచంద్రను నగర పాలక సంస్థ కార్యాలయంలో సంఘం నాయకులు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా కాశీనాథ్ మాట్లాడుతూ.. నగర పాలక సంస్థలో నూతనంగా విధుల్లో చేరిన 75 మంది జీతాల విషయంలో తేడా వచ్చిందని తెలిపారు. నీటి సరఫరా విభాగం సిబ్బందికి బకాయిలు రాలేదని వెల్లడించారు. కార్మికుల సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. సంఘం నాయకులు ఎం.బుజ్జమ్మ, టి.తిరుపతమ్మ, జె.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న కాశీనాథ్ తదితరులు

వ్యర్థాల గుట్టలతో ఇబ్బందులు

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే: నందమూరినగర్, తోటవారి వీధి 6వ లైను, కృష్ణా హోటల్ సెంటర్ సమీప రహదారిలో వ్యర్థాలను గుట్టలుగా పోశారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. చెత్త నిల్వలు పేరుకుపోయి గుట్టలుగా తయారవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఫలితంగా ఆ ప్రాంతాలు అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. అధికారులు స్పందించి వ్యర్థాలను తొలగించడంతో పాటు ఇకపై అక్కడ పోయకుండా దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

చెత్తకు నిప్పు.. ఆరోగ్యానికి ముప్పు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: గవర్నర్‌పేట ఆలీబేగ్‌వీధి, గూడవల్లి వారివీధి కూడలిలో బుధవారం స్థానికులు చెత్తకు నిప్పు పెట్టారు. కొద్ది రోజులుగా ఇక్కడి ఖాళీ స్థలంలో చెత్తకుప్పలు పేరుకుపోతున్నా పారిశుద్ధ్య సిబ్బంది తొలగించడం లేదు. గాలి వీచినప్పుడల్లా చెత్త దుకాణాల్లోకి వస్తుండడంతో స్థానికులు విసిగిపోయి నిప్పు పెట్టారు. దీంతో పొగలు చుట్టిముట్టి వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. పారిశుద్ధ్య సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించి ఉంటే ఈ పరిస్థితి దాపురించేది కాదని స్థానికులు అంటున్నారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో ప్రతిభ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: గాంధీనగర్‌లోని శారద డిగ్రీ కళాశాలకు చెందిన ఎ.శోభనాచారి కృష్ణా వర్సిటీ అంతర్ కళాశాలల బాడీ బిల్డింగ్ పోటీలో ప్రతిభ ప్రదర్శించి రజత పతకం కైవసం చేసుకున్నాడని కళాశాల ప్రిన్సిపల్ పి.నాగేశ్వర శాస్త్రి తెలిపారు. ఈ నెల 9న మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో అతడు ద్వితీయ స్థానంలో నిలిచాడన్నారు. బుధవారం కళాశాలలో కరస్పాండెంట్ ఎస్ఎస్‌వీ ప్రసాద్, కార్యదర్శి రామనారాయణ, ప్రిన్సిపల్ ప్రిన్సిపల్ దుర్గాప్రసాద్ పలువురు అధ్యాపకులు విద్యార్థిని అభినందించారు.

శోభనాచారిని అభినందిస్తున్న రామనారాయణ, ప్రసాద్, నాగేశ్వరశాస్త్రి, దుర్గాప్రసాద్ తదితరులు

గుర్తుతెలియని వ్యక్తి మృతి

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: హనుమాన్‌పేటలో గుర్తుతెలియని వ్యక్తి(55) రోడ్డుపై అనుమానాస్పద స్థితిలో చనిపోయినట్లు గవర్నర్‌పేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. అనారోగ్యం కారణంగా చనిపోయి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రిలో మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు గవర్నర్‌పేట పోలీస్ స్టేషన్‌లో(0866-2576023) లేదా 9440627079) సంప్రదించాలని పోలీసులు కోరారు.

హలీమ్ స్టాళ్లు నిలిపేయాలి

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: హలీమ్ స్టాల్స్ వల్ల ఏర్పడే ట్రాఫిక్ ఇబ్బందులను పరిష్కరించాలని, స్టాళ్ల ఏర్పాటు నిలపాలని చేయాలని ఎంసీపీఐ (యూ) పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్కే ఖాదర్ బాషా డిమాండ్ చేశారు. బుధవారం పంజా సెంటర్ వద్ద రంజాన్ మాసంలో హలీమ్ స్టాల్స్ వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందని నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. హలీమ్ తినడానికి బయట నుంచి వచ్చే వాహనాలు పంజాసెంటర్ చుట్టూ పరిసర ప్రాంతంలో ద్విచక్ర వాహనాలు, కార్లు, పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని చెప్పారు. మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

విద్యాధరపురం: ట్రాఫిక్ అంబాసిడార్లు క్షేత్రస్థాయి పరిస్థితిని అధికారుల దృష్టికి తీసుకు వచ్చినప్పుడు సమస్య పరిష్కారం అవుతుందని వన్‌ట్రాఫిక్ సీఐ ఉమామహేశ్వరరావు అన్నారు. వన్‌ట్రాఫిక్ పోలీసు స్టేషను ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన ట్రాఫిక్ అంబాసిడార్ల సమావేశం (దుకాణదారులు, ఆటో డ్రైవర్లు, వ్యాపారులు) లో సీఐ మాట్లాడుతూ.. ముఖ్య కూడళ్లలో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించే పరిస్థితులకు సంబంధించిన ఫొటోలను అధికారులకు పంపాలని సూచించారు. ఎవరి వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయో..? పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

కీలక రహదారిపై నిర్లక్ష్యం

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే: సెంట్రల్ నియోజకవర్గంలో 58, 59, 60 డివిజన్ల పరిధిలో సుమారు 30 వేల మంది జనాభాకు ఉపయోగపడే వాంబే కాలనీ రైలు కట్ట పక్కన ఉన్న రహదారి ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైంది. వాంబే కాలనీ, లూనా సెంటర్ తదితర రైలు కట్ట పక్కన నివసిస్తున్న ప్రజలు నగరంలోకి వెళ్లాలంటే అజిత్‌సింగ్‌నగర్ ఫ్లైఓవర్ లేదా పాయకాపురం కూడలి రోడ్డు నుంచి తిరిగి వెళుతుంటారు. వాంబే కాలనీ నుంచి రామవరప్పాడు రైలు కట్ట పక్కన రహదారి ఉన్నా అది వాహనాలు తిరగడానికి అనుకూలంగా లేదు. వాంబే కాలనీ జీ, ఎఫ్ బ్లాకుల నుంచి అజిత్‌సింగ్‌నగర్ ఫ్లైఓవర్ వరకు రైలు కట్ట మార్గం కూడా అదే పరిస్థితిలో ఉంది. వాంబే కాలనీ నుంచి అజిత్‌సింగ్‌నగర్ ఫ్లైఓవర్ వరకు 600 మీటర్ల రోడ్డు అభివృద్ధికి సుమారు 95 లక్షలు అవసరం. అలాగే ఇదే కాలనీ నుంచి రామవరప్పాడు వైపు రెండు కి.మీ రోడ్డుకు సుమారు రూ.4 కోట్లు కావాలి.

వాంబే కాలనీ నుంచి అజిత్‌సింగ్‌నగర్ ఫ్లైఓవర్ వైపు వెళ్లే మార్గం

చుట్టూ తిరిగి వెళ్లాల్సిందే..

వాంబే కాలనీ ఈ బ్లాక్‌లో ఉంటూ ఎలక్ట్రికల్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నా. నగరంలో ఏ చిన్న పని ఉన్నా చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. ఉదయం, సాయంత్రం వేళ అజిత్‌సింగ్‌నగర్ ఫ్లైఓవర్ వద్ద అధిక రద్దీ ఏర్పడి ఎక్కువ సమయం పడుతుంది. ఇటు రామవరప్పాడు వెళ్లాలన్నా అదే పరిస్థితి ఉంది. అధికారులు రైలుకట్ట మార్గాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. - బుర్ర డేవిడ్ రాజు, స్థానికుడు

కట్ట దాటడం కష్టమే..

వాంబే కాలనీ జీ బ్లాక్‌లో నివసిస్తున్నా. నగరంలో వివిధ ప్రాంతాల్లో తాపీ పనులకు సైకిల్‌పై వెళుతుంటా. జీ బ్లాక్ సమీపంలో రైలు కట్ట దాటితే నగరంలోకి సులభంగా చేరుకుంటా. కట్ట దాటుతున్నపుడు ప్రమాదాల బారిన పడుతుంటాం. తప్పని పరిస్థితిలో చుట్టూ తిరగలేనప్పుడు ఆ మార్గాన్ని విని యోగిస్తుంటాం. రైలుకట్ట పక్కన రోడ్లను బాగుస్తే ప్రజలకు మేలు జరుగుతుంది. - గట్టిపోయిన శ్రీను, స్థానికుడు

త్వరలో పనులు చేపడతాం

వాంబే కాలనీ జీ బ్లాక్ నుంచి అజిత్‌సింగ్ నగర్ ఫ్లైఓవర్ వరకు 600 మీటర్ల రహదారి పనులకు అనుమతులు వచ్చాయి. పనులు రెండు రోజుల్లో చేపడతాం. వాంబే కాలనీ ఎఫ్ బ్లాక్ నుంచి రామవరప్పాడు వైపు వెళ్లే రహదారి ఒకటో డివిజన్ పరిధికి వస్తుంది. పనుల గురించి అధికారుల దృష్టికి తీసుకెళతాం. - శ్రావణశ్రీ, వీఎంసీ, సర్కిల్-2 ఏఈ

'కల్తీ నెయ్యి బాధ్యులను శిక్షించాలి'

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: శ్రీవారి లడ్డూకు కల్తీ నెయ్యి సరఫరా చేసి హిందువుల మనోభావాలు దెబ్బతీసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ సెంట్రల్ నియోజకవర్గ నాయకులు కోరారు. బుధవారం ఇక్కడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో పార్టీ నాయకులు యాంపాటి ప్రభూజీ, కె.భవానీ మాట్లాడారు. కల్తీ నెయ్యి వ్యవహారాన్ని పక్కదోవ పట్టించడానికే వైకాపా నాయకులు అంబటి రాంబాబు వ్యవహారాన్ని తెరపైకి తెచ్చి రాష్ట్రంలో అలజడులు సృష్టిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ఈ వ్యవహారంలో వైకాపా ప్రభుత్వం రూ.250 కోట్ల కుంభకోణానికి పాల్పడిందని ఆరోపించారు. దీనిపై హిందువులంతా కలిసికట్టుగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు తాడి దుర్గారావు, పైలా ప్రకాష్, కె.నరేంద్ర, నాగమణి పాల్గొన్నారు.

సినిమాలు

యుఫోరియా, హనీ, నారీ నారీ నడుమ మురారి, సుమతీ-శతకం, విత్ లవ్, శ్రీచిదంబరం గారు : ఊర్వశి ఐనాక్స్ (గాంధీనగర్), స్వర్ణా కాంప్లెక్స్ (గవర్నర్‌పేట), రామ్ సినిమాస్(గుణదల), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్ (కానూరు), ఏబీఆర్ సినిమాస్(కానూరు). **విత్ లవ్:** జయరామ్

బరాబర్ ప్రేమిస్తా: అప్సర, ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), పీవీఆర్ మాల్ (బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటెల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట). **లగ్గం, ఎర్రచీర:** నవరంగ్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), రామ్ సినిమాస్(గుణదల)**ఆపరేషన్ పద్మ:** స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), రామ్ సినిమాస్ (గుణదల), పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్). **ఓంశాంతి శాంతి శాంతి:** జీ-3 (రాజ్-యువరాజ్), **త్రిముఖ:** ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), పీవీఆర్ మాల్ (బందరు రోడ్డు), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట). **ఓం శాంతి శాంతి శాంతి శాంతి:** ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్ (గవర్నర్‌పేట), తారా స్క్రీన్స్, రవీంద్ర సినిమాస్(పాయకాపురం), రామ్ సినిమాస్ (గుణదల), సాయిరామ్, సౌమ్య(వన్‌టౌన్), స్వాతి(భవానీపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్ (బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు), ఏబీఆర్ సినిమాస్(కానూరు). దేవగుడి: ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్ (గవర్నర్‌పేట), రామ్ సినిమాస్(గుణదల), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్). **అనగనగా ఒకరాజు:** అలంకార్, జీ-3(రాజ్-యువరాజ్), ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), తారా స్క్రీన్స్, రవీంద్ర సినిమాస్(పాయకాపురం), రామ్ సినిమాస్(గుణదల), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు). **అనగనగా ఒకరాజు:** అలంకార్, జీ-3(రాజ్-యువరాజ్). **భర్త మహాశయులకు విజ్ఞప్తి, మన శంకరవరప్రసాద్ గారు:** జీ-3(రాజ్-యువరాజ్), ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), రవీంద్ర సినిమాస్(పాయకాపురం), రామ్ సినిమాస్ (గుణదల), స్వాతి(భవానీపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు). **మన శంకరవరప్రసాద్ గారు:** అలంకార్. - **న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్**

మత్తులో తేలితే.. జీవితం మునిగినట్లే



డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, సీపీ రాజశేఖరబాబు, అతిథులు

మైలవరం, న్యూస్‌టుడే: మత్తు పదార్థాలకు అలవాటైతే జీవితం మునిగినట్లేనని స్థానిక శాసనసభ్యుడు వసంత కృష్ణప్రసాద్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ శాఖ నిర్వహిస్తున్న డ్రగ్స్‌పై దండయాత్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం మైలవరంలో సైకిళ్లపై, పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో కలిసి ప్రదర్శన చేశారు. స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి క్రీడా ప్రాంగణంలో సభ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పిల్లలు డ్రగ్స్‌కు అలవాటుకాకుండా ఉండాలంటే, వారి ప్రవర్తనను పెద్దలు గమనిస్తుండాలని, వారి స్నేహాల పట్ల నిఘా ఉంచాలన్నారు. గత వైకాపా ప్రభుత్వం అనాలోచితంగా మద్యం ధరలను విపరీతంగా పెంచటంతోనే గంజాయి వాడకం పెరిగిందని ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గంజాయి తగ్గుముఖం పట్టిందన్నారు. సీపీ ఎస్వీ.రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ గంజాయితో పట్టుబడుతున్న వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు పెడుతుండటంతో తగ్గుముఖం పట్టిందని చెప్పారు. ప్రభుత్వం, పోలీస్ చర్యలతో గంజాయి విక్రేతలు వచ్చేందుకు భయపడుతున్నారని చెప్పారు. అనంతరం సైకిల్ ప్రదర్శన చేస్తున్న మహిళా పోలీసులను సన్మానించి, సర్వమత ప్రార్థనలతో స్థానికులు దీవెనలు ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచి మంజుభార్గవి, డీసీపీ లక్ష్మీనారాయణ, స్థానిక ఏసీపీ ప్రసాదరావు, సీఐ చంద్రశేఖర్, ఏఎంసీ ఛైర్మన్ నవ్యశ్రీ, గాంధీ, నివృత్‌రావు, శ్రీనివాసరెడ్డి, సర్కిల్‌లోని ఎస్సైలు సుధాకర్, సతీష్, శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

SBI భారతీయ స్టేట్ బ్యాంక్
హోమ్ లోన్ సెంటర్-2 (ఆర్ఎసిపిసి-2), డి.నెం.54-15-1/బి, యలమంచిలి కాంప్లెక్స్, వెంకటేశ్వర నగర్, విజయవాడ-520 008.

స్వాధీనత ప్రకటన

APPENDIX IV (రూలు-8(1) (స్థిరాస్తి కొరకు)

ఇందుమూలముగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం-2002 ప్రకారం భారతీయ స్టేట్ బ్యాంక్, హోమ్ లోన్ సెంటర్-2 (ఆర్ఎసిపిసి-2), విజయవాడ, యన్‌టీఆర్ జిల్లా యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారు, సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 (నెం.54 ఆఫ్ 2002) యొక్క సెక్షన్ 13(12) 3వ నిబంధన క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ, సదరు నోటీసు స్వీకరించిన తేది నుండి 60 రోజులలోపు నోటీసులో తెలిపిన ఋణము మొత్తము **ది.14-11-2025**వ తేదీ నాటికి మొత్తము బకాయి **రూ.37,43,146/-** (అక్షరాల ముప్పైఏడులక్షల నలభైమూడువేల నూటనలభైఆరు రూపాయలు మాత్రమే) మరియు **ది.15-11-2025** నుండి తదుపరి వడ్డీ, ఖర్చులతో సహా చెల్లించమని కోరుతూ ఋణగ్రహీత: **1) శ్రీమతి షేక్ షబీన భర్త: యస్‌కె బాషు 2) శ్రీ షేక్ బాషు తండ్రి: యస్‌కె అబ్దుల్ రహమాన్** డోర్ నెం.43-18-15, బ్లాక్ నెం.88, అబ్దుల్లాహ్ వీధి, అజిత్‌సింగ్ నగర్, విజయవాడ-520015. సమీప డోర్ నెం.43-106/1-58, ఫ్లాట్ నెం: యఫ్‌యఫ్-1, శ్రీ లక్ష్మీ నరసింహ ఎమ్రాల్డ్, తోటవారి వీధి, 10వ లైను, నందమూరి నగర్, అజిత్‌సింగ్ నగర్, విజయవాడ-520015. **హెచ్‌యల్ నెం: 39024072708, 39024091073** వీరిని కోరుతూ **ది:14-11-2025** వ తేదీన డిమాండు నోటీసును మరియు **ది.25-11-2025** న పత్రికా ప్రకటన ప్రచురించడమైనది.

సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో ఋణగ్రహీత విఫలమైనందున సదరు రూల్ "8"తో చదువుకొనవలసిన సదరు చట్టం ద్వారా సెక్షన్ 13(4) క్రింద దిగువ వివరించిన స్థిరాస్తిని సెక్యూరిటీ ఇంట్రెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 ప్రకారం ఈ దిగువ సంతకందారు స్వాధీనం చేసుకొన్నారని ఋణగ్రహీతకు మరియు సాధారణ ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలుపడమైనది.

ఈ స్థిరాస్తితో ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని, ఏవేని లావాదేవీలు జరిపిన పక్షంలో అవి భారతీయ స్టేట్ బ్యాంక్ యొక్క ఛార్జీకి **ది.14-11-2025** నాటికి మొత్తం బకాయి **రూ.37,43,146/-** మరియు తదుపరి వడ్డీ + ఖర్చులు మొదలగువాటికి లోబడి ఉంటాయని ఋణగ్రహీతకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియపరచటమైనది.

ఋణగ్రహీతలు సదరు చట్టంలో సబ్ సెక్షన్(8) ఆఫ్ సెక్షన్ 13 ప్రకారం తనఖా ఆస్తిని గడువులోపల విడిపించుకొనుటకు గాను దృష్టి సారించవలసి ఉన్నది.

స్థిరాస్తి వివరము

యన్‌టీఆర్ జిల్లా, విజయవాడ, విజయవాడ విలేజ్ పోర్షన్, నందమూరి నగర్, తోటవారి వీధి, ఆర్‌యస్ నెం.18/1, ఆర్‌డియస్ నెం.సి2-4252/2012, శ్రీ లక్ష్మీనరసింహ ఎమ్‌రాల్డ్, ఫ్లాట్ నెం.యఫ్‌యఫ్-1, మొదటి అంతస్థు, ప్లింత్ ఏరియా 1160 చ॥అడుగులు (కామన్ ఏరియా, బాల్కానితో కలుపుకొని), కారు పార్కింగ్ 80 చ॥అడుగులు, సమీప డోర్ నెం.43-106/1-58, ప్లాట్ నెం.11, మొత్తం విస్తీర్ణం 237.22 చ॥గ॥లోని అవిభాజ్యపు మరియు అనిర్థిష్టపు భాగము 39.5 చ॥గ॥లు కలిగిన ఆర్‌సిసి భవనము 1) శ్రీమతి షేక్ షబీన భర్త: యస్‌కె బాషు 2) శ్రీ షేక్ బాషు తండ్రి: యస్‌కె అబ్దుల్ రహమాన్ గార్లకు చెందిన రిజిస్టర్డ్ సేల్‌డీడ్ నెం.14467/2019, తేది:31-12-2019 విజయవాడ జెయస్ఆర్ఒ, యన్‌టీఆర్ జిల్లా.

అపార్ట్‌మెంట్ హద్దులు: తూర్పు: 30 అడుగుల వెడల్పుగల రోడ్డు, దక్షిణం: ఎక్స్‌టెన్షన్ ప్రోపర్టీ, పడమర: నబానుపూడి గిరిజ నిర్మల గారికి చెందిన ఆస్థి, ఉత్తరం: అకుల నాగవెంకట పవన్ కుమార్ యొక్క ఆస్థి. **ఫ్లాట్ హద్దులు:** తూర్పు: ఉమ్మడి వరండా మరియు మెట్లు, దక్షిణం: ఓపెన్ టు స్కై, పడమర: ఓపెన్ టు స్కై, ఉత్తరం: ఓపెన్ టు స్కై.

తేది : 06-02-2026
ప్రదేశం: విజయవాడ

అధీకృత అధికారి
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

(c) eenadu

ఛత్తీస్‌గఢ్‌లో ఒకేరోజు 6,414 జంటలకు పెళ్లిళ్లు

ఛత్తీస్‌గఢ్‌లో ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి సమక్షంలో కన్యా వివాహ యోజన కింద ఒకేరోజు అన్ని మతాలకు చెందిన 6,414 జంటలకు పెళ్లిళ్లు జరిగాయి. ఈ కార్యక్రమం 'గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో చోటు సాధించింది. మూడుముళ్ల బంధంతో ఒక్కటైన జంటల్లో ఆదివాసీ వీడి జనజీవన స్రవంతిలో చేరిన మాజీ నక్సలైట్లు కూడా ఉన్నారు. రాయ్‌పుర్ సైన్స్ కాలేజ్ మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ పథకం కింద ప్రతి కొత్త జంటకు రూ.35,000 ఆర్థికసహాయం అందిస్తారు. నారాయణ్‌పుర్ జిల్లాలో ఏడు మాజీ నక్సలైట్ జంటలు వివాహ బంధంతో ఒక్కటయ్యాయి.

వధూవరులకు సీఎం ఆశీర్వాదం

వాహనం ఈ రోడ్డెక్కితే.. జయహో

ముంబయి: భారత్‌లో తొలి మ్యూజికల్ రోడ్డును ప్రారంభించి ముంబయి తీరప్రాంత రహదారుల అధికారులు రికార్డు సృష్టించారు. హంగేరియన్ టెక్నాలజీ సాయంతో నారీమన్ పాయింట్ నుంచి వర్లి వైపు వెళ్లే రహదారిపై పలు సంగీత స్ట్రిప్‌లను ఏర్పాటు చేశారు. దీంతో ఈ రోడ్డుపై దాదాపు 500 మీటర్ల మేర వాహనదారులకు స్లమ్‌డాగ్ మిలియనీర్ సినిమాలోని 'జయ హో' పాట వినిపించనుంది. వాహనాలు 70 - 80 కి.మీ.ల వేగంతో ప్రయాణించినప్పుడు రోడ్డుపై ఉన్న ప్రత్యేక పట్టీల రాపిడికి 'జయహో' అని ధ్వని తరంగాలు ఉత్పత్తి అవుతాయి. ప్రజల్లో దేశభక్తి భావాన్ని మరింత పెంచే దిశ ఈ విధంగా డిజైన్ చేసినట్లు ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు. బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) చేపట్టిన ఈ ప్రాజెక్టుకు రూ.6.21 కోట్ల వ్యయం అయిందన్నారు. ముంబయి కోస్టల్ రోడ్ కారిడార్ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన ఈ రహదారి దేశంలోనే మొదటి మ్యూజికల్ రోడ్డుగా నిలవనుంది. ఇటువంటి రహదారులు హంగరీ, జపాన్, దక్షిణ కొరియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో ఉన్నాయి. ముంబయిలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ దీనిని ప్రారంభించారు.

నేడు దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల సమ్మె

దిల్లీ: ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆరోపిస్తున్న కేంద్ర కార్మిక సంఘాల సంయుక్త వేదిక.. గురువారం దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చింది. దీనివల్ల బ్యాంకులు, ఇన్సూరెన్సు, రవాణా రంగాలపై పాక్షిక ప్రభావం పడే అవకాశముంది. 30 కోట్ల మంది కార్మికులు ఈ సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చింది. కార్మిక, రైతు, జాతీయ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ సమ్మె చేయనున్నట్లు ఈ నెల 9వ తేదీనే కార్మిక సంఘాలు ప్రకటించాయి. 'విద్యుత్తు, బ్యాంకింగ్, ఇన్సూరెన్సు, రవాణా, ఆరోగ్య, విద్య, గ్యాస్, నీటి సరఫరా సేవలకు అంతరాయం కలగనుంది' అని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్జీత్ కౌర్ తెలిపారు. సమ్మెలో పాల్గొంటామని బ్యాంకు ఉద్యోగుల సంఘాలు హామీ ఇచ్చాయని వెల్లడించారు. సమ్మెకు కాంగ్రెస్ మద్దతు తెలిపింది. సంయుక్త ఫోరంలో ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, హెచ్‌ఎంఎస్, సీఐటీయూ, ఏఐయూటీయూసీ, ఎస్ఈడబ్ల్యూఏ, ఏఐసీసీటీయూ ఎల్‌పీఎఫ్, యూటీయూసీ తదితర సంఘాలున్నాయి. టీయూసీసీ ఈ సమ్మెలో పాల్గొనడం లేదు.

దోషాలున్న నోటీసును తిరస్కరించొద్దన్న స్పీకర్

- సరిచేయించి పరిశీలించాలని సిబ్బందికి ఆదేశం
- సాధ్యమైనంత త్వరగా సభ ముందుంచాలన్న ఓం బిర్లా



దిల్లీ: తనపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదిస్తూ విపక్షాలు ఇచ్చిన నోటీసులో దోషాలు ఉన్నందువల్ల దానిని సరిదిద్దేలా చూడాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తమ సిబ్బందిని ఆదేశించినట్లు సమాచారం. నిజానికి నోటీసులో లోపాలుంటే దానిని తిరస్కరించవచ్చని, స్పీకర్ మాత్రం తప్పుల విషయాన్ని విపక్షానికి తెలిపి సరిచేయించి, సాధ్యమైనంత త్వరగా అది సభ ముందుకు వచ్చేలా చూడాలని చెప్పారని పార్లమెంటరీ వర్గాలు వెల్లడించాయి. కాంగ్రెస్ సహా విపక్షాలకు చెందిన 118 మంది సభ్యులు మంగళవారం లోక్‌సభ సెక్రటరీ జనరల్‌ను కలిసి ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చిన విషయం తెలిసిందే. "ఫిబ్రవరి 2025"లో జరిగిన పరిణామాలుగా దానిలో నాలుగుచోట్ల కొన్ని ఘటనల్ని ప్రస్తావించారు. నిబంధనల ప్రకారం ఆ ఒక్క తప్పుతో నోటీసు చెల్లదని ప్రకటించే అవకాశం ఉంది. తిరస్కరించకుండా నోటీసుపై చర్చల్ని వేగవంతం చేయాలని, నిబంధనల ప్రకారం స్పందించాలని స్పీకర్ ఆదేశించారు.

కాంగ్రెస్ ఎంపీలు స్పీకర్‌ను ఛాంబర్లోనే దూషించారు: రిజిజు

లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాను 20-25 మంది కాంగ్రెస్ ఎంపీలు ఆయన ఛాంబర్లోనే దూషించారని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు. వారు దూషణలకు దిగినప్పుడు అక్కడే ఉన్న సీనియర్ నేతలు కె.సి.వేణుగోపాల్, ప్రియాంకాగాంధీ వంటివారు నిలువరించలేదని విమర్శించారు. దాంతో స్పీకర్ ఎంతో మనస్తాపానికి గురయ్యారని, ఆయన ఎంతో సౌమ్యుడు కాబట్టి ఎలాంటి కఠిన చర్యలు తీసుకోలేదని బుధవారం విలేకరులకు తెలిపారు.

భారత పప్పుధాన్యాలకు రక్షణ

సవరించిన ఫ్యాక్ట్‌షీట్‌ను విడుదల చేసిన అమెరికా

వాషింగ్టన్: పప్పు ధాన్యాలపై సుంకాలను భారత్.. సున్నాకు చేర్చడంగానీ, తగ్గించడంగానీ చేస్తుందని తొలుత ప్రకటించిన అమెరికా.. వెనక్కి తగ్గింది. భారత ఉత్పత్తులకు రక్షణ కల్పిస్తూ వాటిని సుంకాల తగ్గింపు జాబితా నుంచి తొలగించింది. సోమవారం విడుదల చేసిన ఫ్యాక్ట్‌షీట్‌కు సవరణలు చేసింది. సవరించిన ఫ్యాక్ట్‌షీట్‌ను మంగళవారం విడుదల చేసింది. 'అన్ని పారిశ్రామిక ఉత్పత్తులు, ఆహార, వ్యవసాయ ఉత్పత్తులు (ఎండు ధాన్యాలు, ఎర్ర జొన్నలు, ట్రీ నట్స్, తాజా, ప్రాసెస్డ్ పండ్లు, సోయాబీన్ ఆయిల్), వైన్, ఆల్కహాల్, ఇతర ఉత్పత్తులపై సుంకాలు సున్నా స్థాయికిగానీ, అతి స్వల్ప స్థాయికిగానీ చేరతాయి' అని సవరించిన ఫ్యాక్ట్‌షీట్ వెల్లడించింది. తొలుత ఇచ్చిన ఫ్యాక్ట్‌షీట్‌లో 'కొన్ని పప్పు ధాన్యాలు' అని ఉంది. సవరించిన దానిలో దానిని అమెరికా తొలగించింది.

ఎప్‌స్టీన్‌ను కలిశా..కానీ!

కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురీ

ఇంటర్నెట్ డెస్క్: తాను ఎప్‌స్టీన్‌ను కలిసింది నిజమేగానీ.. అతడిపై వచ్చిన ఆరోపణలకు, తనకు సంబంధం లేదని కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురీ స్పష్టం చేశారు. ఇంటర్నేషనల్ పీస్ ఇన్‌స్టిట్యూట్ (ఐపీఐ) బృందంతోపాటు తాను అతడిని కలిశానని పేర్కొన్నారు. ఎప్‌స్టీన్‌ను మంత్రి కలిశారని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఆరోపించిన నేపథ్యంలో ఆయన ఈ వివరణ ఇచ్చారు. 'ఐపీఐలో మా బాస్‌కు ఎప్‌స్టీన్ తెలుసు. కొన్ని సందర్భాల్లో అతడితో సమావేశమయ్యా. కచ్చితంగా చెప్పాలంటే మూడు నాలుగు సార్లు కలిశా. ఒక్కసారి ఈమెయిల్ చేసుకున్నాం. అతడిపై వచ్చిన ఆరోపణలకు, మా మధ్య జరిగిన సంభాషణలకు ఎలాంటి సంబంధం లేదు' అని మంత్రి వెల్లడించారు.

వందేమాతరం తర్వాతే జనగణమన

- ఆలాపనపై కేంద్ర హోంశాఖ ఆదేశం

దిల్లీ: అధికారిక కార్యక్రమాల్లో జాతీయ గీతం జనగణమన ఆలపించడానికి ముందే జాతీయ గేయం వందేమాతరంలోని 6 చరణాలను పాడాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్రపతి పాల్గొనే, త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసే, గవర్నర్లు మాట్లాడే కార్యక్రమాల్లో తొలుత 3 నిమిషాల 10 సెకన్లు ఉండే వందేమాతరంలోని 6 చరణాలను ఆలపించాలని సూచిస్తూ గత నెల 28వ తేదీన కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 'రెండింటినీ ఆలపించాల్సిన సమయంలో వందేమాతరాన్నే ముందుగా పూర్తి చేయాలి' అని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. వందేమాతరం ఆలపించేటప్పుడు అందరూ లేచి నిల్చోవాలని సూచించింది. అయితే న్యూస్‌రీల్స్, డాక్యుమెంటరీలు, సినిమాల్లో భాగంగా వందేమాతరం ఆలాపన వచ్చినప్పుడు నిల్చోవాల్సిన అవసరం లేదని పేర్కొంది.

- పాఠశాలల్లో వందేమాతరంతోనే కార్యకలాపాలను ప్రారంభించాలని కేంద్ర హోంశాఖ సూచించింది.
- దేశభక్తితో, మాతృభూమిపై ప్రేమతో, మర్యాదపూర్వకంగా.. సముచిత పద్ధతిలో ఏ కార్యక్రమంలోనైనా వందేమాతరాన్ని ఆలపించొచ్చని, దానిపై అభ్యంతరం ఉండదని స్పష్టం చేసింది.
- దేశ గౌరవానికి చిహ్నాలైన జాతీయ గీతం, గేయం ఆలాపన జరుగుతున్నప్పుడు ఎవరైనా ఉద్దేశపూర్వకంగా అంతరాయం కలిగించినా, అగౌరవపరిచినా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించనుంది. కొత్త నిబంధనల ప్రకారం, ఇటువంటి చర్యలకు పాల్పడే వారికి గరిష్ఠంగా మూడేళ్ల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉంది.

నేడు బంగ్లాదేశ్ ఎన్నికలు

బీఎన్‌పీ, జమాతే పార్టీల మధ్యే ప్రధాన పోరు

తారిఖ్ రెహమాన్

షఫీకుర్ రెహమాన్

ఢాకా: ఏడాదిన్నర క్రితం షేక్ హసీనా ప్రభుత్వం కుప్పకూలిన పుటి నుంచి తీవ్ర అస్థిరతను ఎదుర్కొంటున్న బంగ్లాదేశ్‌లో గురువారం సార్వత్రిక ఎన్నికలకు జరగన్నాయి. ప్రజలు కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకోనున్నారు. 2024ఆగస్టులో విద్యార్థుల ఉద్యమంతో అవామీ లీగ్ నేతృత్వంలో హసీనా ప్రభుత్వం పడిపోయిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి బంగ్లా పాలనను మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం పర్యవేక్షిస్తూ వచ్చింది. ఇప్పుడు ఈ ఎన్నికలతో ఢాకాలో కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. 299 పార్లమెంటు స్థానాలకు జరిగే ఈ పోరులో వివిధ పార్టీలకు చెందిన 1,981 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. దాదాపు 12.7 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్‌పై ప్రభుత్వం నిషేధం విధించడంతో ఈసారి ప్రధాన పోటీ.. బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ (బీఎన్‌పీ), షఫీకుర్ రెహమాన్ నేతృత్వంలోని జమాత్-ఎ-ఇస్లామీ కూటమి మధ్యే జరగనుంది. విద్యార్థుల ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నేషనల్ సిటిజన్ పార్టీ కూడా జమాతే కూటమిలో ఉంది. ఎన్నికలతో పాటు కీలక రాజ్యాంగ సంస్కరణలపైనా రిఫరెండం జరగనుంది.

- హసీనా నాయకత్వంలోని అవామీ లీగ్ పార్టీ లేకుండా ఎన్నికలు జరగనుండడం ఇదే తొలిసారి. హసీనా భారత్‌లో ఆశ్రయం పొందుతున్న సంగతి తెలిసిందే.
- హసీనా ప్రభుత్వం కుప్పకూలిన తర్వాత బంగ్లాలోని మైనారిటీలు ముఖ్యంగా హిందువులను లక్ష్యంగా చేసుకుంటూ దాడులు జరిగాయి. ఈ ఎన్నికల్లో మతతత్వ పార్టీ జమాత్-ఎ-ఇస్లామీ అధికారంలోకి వస్తే ఈ దాడులు మరింతగా పెరిగే అవకాశం ఉందని మైనారిటీలు భావిస్తున్నారు.

పిల్లల పెంపకం అంటే ఆదర్శంగా ఉండటమే

మీరు ఏ అలవాట్లను పాటిస్తే మీ పిల్లలు వాటినే అనుసరిస్తారు. మీరు ఎల్లప్పుడూ ఒత్తిడితో ఉంటే వారు దానినే నేర్చుకుంటారు. మీరు అనారోగ్యకర ఆహారాలను భుజిస్తుంటే వారూ అదే అలవరచుకుంటారు. మీరు ఆరోగ్యంపై శ్రద్ధ చూపితే దానిని నేర్చుకుంటారు. ఉత్తమ పిల్లల పెంపకం అంటే ఆదర్శంగా నిలవడమే.

– బాబీ ఫ్రైలెర్, ఇన్‌ఫ్లుయెన్సర్

కెనడా స్కూల్లో కాల్పులు.. 10 మంది మృతి

ఒట్టావా: కెనడాలో కాల్పులు కలకలం సృష్టించాయి. బ్రిటిష్ కొలంబియా ప్రాంతంలోని టంబ్లర్ రిడ్జ్ సెకండరీ పాఠశాలలో జరిగిన కాల్పుల్లో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 25 మంది గాయపడగా.. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. మృతుల్లో కాల్పులకు తెగబడినట్లు అనుమానిస్తున్న మహిళ కూడా ఉన్నట్లు అధికారులు తెలిపారు. కాల్పుల జరిపిన అనంతరం తనను తాను కాల్చుకుని మహిళ ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. షూటర్‌ను గుర్తుపట్టినప్పటికీ ఆమె వివరాలను మాత్రం వెల్లడించలేదు. స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 12:30 గంటలకు కాల్పులు జరిగాయి. పాఠశాలలో ఏడుగురి మృతదేహాలను గుర్తించగా... స్కూల్ సమీపంలోని ఓ ఇంట్లో మరో రెండు మృతదేహాలను గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. మరొకరు ఆసుపత్రికి తరలిస్తుండగా మరణించారన్నారు. ఇక్కడి సెకండరీ స్కూల్‌లో దాదాపు 175 మంది విద్యార్థులు చదువుతున్నారు.

పాఠశాల నుంచి వెలుపలకు వస్తున్న విద్యార్థులు

కమీషన్ల ఎరచూపి అద్దె ఖాతాలు

విజయవాడలో వెలుగు చూసిన మరో మ్యూల్ ఎకౌంట్స్ వ్యవహారం

ఈనాడు, అమరావతి: విజయవాడ నగరంలో మరో అద్దె ఖాతాల వ్యవహారం వెలుగుచూసింది. ఇందులో ముగ్గురు సభ్యుల ముఠాను సైబర్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలను ఏసీపీలు రాజశేఖర్, పావన్‌కుమార్, ఇన్‌స్పెక్టర్‌లు మీడియా సమావేశంలో వెల్లడించారు. నిందితులను బుధవారం సాయంత్రం మూడో ఏసీజేఎం కోర్టులో హాజరుపర్చగా.. న్యాయాధికారి నిందితులకు ఈనెల 25వ తేదీ వరకు రిమాండ్ విధించారు.

డిజిటల్ మార్కెటింగ్ పేరుతో కార్యాలయం తెరిచిన సోదరులు : విజయవాడ సమీపంలోని యనమలకుదురు ప్రాంతానికి చెందిన సోదరులు రాయపాటి రవికుమార్ (ఏ1), అతని సోదరుడు స్టీవెన్ (ఏ2)లు.. బంధువుల వివాహం నిమిత్తం గతేడాది చెన్నై వెళ్లారు. బ్యాంకు ఖాతాలు తెరిపించి, వాటిని తనకు ఇస్తే ఒక్కో దానికి రూ. 4వేలు చొప్పున ఇస్తానని అక్కడ వారి సమీప బంధువు చెప్పాడు. దీనికి వారు అంగీకరించారు. విజయవాడ వచ్చిన తర్వాత డిజిటల్ మార్కెటింగ్ పేరుతో గదిని అద్దెకు తీసుకుని కార్యాలయాన్ని నడిపిస్తున్నారు. పలువురు అమాయకులు, కుటుంబ అవసరాలకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నవారిని గుర్తించి వారితో పొదుపు, కరెంటు ఖాతాలు తెరిపించి.. వాటి చెక్, పాస్‌పుస్తకాలు, డెబిట్ కార్డులు తీసుకుని తమ వద్ద ఉంచుకునేవారు. ఖాతాలను మాత్రం చెన్నైలోని బంధువుకు పంపించేవారు. ఖాతాలు తెరిపించిన తర్వాత వారి నుంచి సిమ్‌లు తీసుకునేవారు. ఇలా 9 నెలల కాలంలో 36 ఖాతాలను తెరిపించారు. లావాదేవీలు జరిగినప్పుడు ఓటీపీలను చెన్నైలోని వ్యక్తికి ఫోన్‌లో వీరు చెబుతుండేవారు.

★ అద్దెకు తీసుకున్న గదిలోనే 21 ఫోన్లు పెట్టుకుని నిందితులు.. చెన్నై నుంచి వచ్చిన సూచనల మేరకు వీరి ఆధీనంలోని ఖాతాలకు వచ్చిన మొత్తాన్ని.. పైనుంచి ఆదేశాల మేరకు ఆయా ఖాతాలకు తిరిగి బదిలీ చేసేవారు. యూపీఐ లావాదేవీలు కూడా నిర్వహించారు. వీరి వద్ద ఉన్న ఖాతాలకు నగదు వస్తే.. పలుసార్లు డెబిట్ కార్డుల ద్వారా డ్రా చేసి, ఇతర ఖాతాలకు జమ చేసేవారు. ఈ వ్యవహారాల కోసం అవసరమైన ఫోన్లు, ల్యాప్‌టాప్‌ను చెన్నైకు చెందిన వ్యక్తి నుంచి వచ్చిన డబ్బులతో కొనుగోలు చేశారు. వీరి ఇంటికి సమీపంలో ఉండే స్నేహితుడు బాజి (ఏ3) కూడా జతకలిశాడు. ఇతను ఇతరులతో ఖాతాలు తెరిపించడంతో పాటు.. తను, తన భార్య పేరుతో కూడా పొదుపు, కరెంటు ఖాతాలు తెరిచి రవికుమార్, స్టీవెన్‌లకు ఇచ్చారు

ఫిర్యాదుతో వెలుగులోకి.. : పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న రాజవంశీ.. తన స్నేహితుడైన రవికుమార్ (ఏ1) సూచనతో మూడు బ్యాంకు ఖాతాలు తెరిచారు. తనకు తెలిసిన వారికి సంబంధించి కంపెనీకి ఐటీ, జీఎస్టీ సమస్యలు ఉన్నాయని.. దీనికి బ్యాంకు ఖాతాలు కావాలని నమ్మించాడు. దీంతో రాజవంశీ ఖాతాలు తెరిచారు. ఇటీవల ఈ ఖాతాను పరిశీలించగా రూ. కోట్లలో లావాదేవీలు జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వివరాలు వెల్లడిస్తున్న సైబర్ ఏసీపీ రాజశేఖర్. చిత్రంలో సౌత్ ఏసీపీ పావన్‌కుమార్, సైబర్ ఇన్‌స్పెక్టర్ శ్రీను

ల్యాప్‌టాప్‌లో లావాదేవీల చిట్టా..

పోలీసులు నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ల్యాప్‌టాప్‌లో నిందితులు తెరిచిన ఖాతాలు, చెన్నై నుంచి వచ్చిన ఆదేశాల మేరకు నిర్వహించిన లావాదేవీల తాలూకు ఖాతాల వివరాలు లభించాయి. వీటిలో ఇప్పటివరకు వీరు నిర్వహించిన లావాదేవీలను నమోదు చేశారు. ఆయా ఖాతాలకు జమ అయిన, బదిలీ అయిన నగదు వివరాలను నిక్షిప్తం చేశారు. వీరి నుంచి ల్యాప్‌టాప్‌తో పాటు రూ.3.40 లక్షలు, 21 మొబైళ్లు, 46 ఏటీఎం కార్డులు, 21 చెక్ పుస్తకాలు, 16 పాస్‌పుస్తకాలు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

బోగస్ పత్రాలతో మోసం...

వ్యాపారంతో ఏమాత్రం సంబంధం లేని వారితో కూడా బోగస్ పత్రాలతో నిందితులు కరెంట్ ఖాతాలు తెరిపించారు. ఇలా నాలుగు కరెంటు ఖాతాలను తెరిపించారు. యనమలకుదురులోని ఓ పండ్ల దుకాణం వద్ద బ్యానర్ కట్టి.. బాజీ (ఏ3)ని అక్కడ నిలబెట్టి ఫొటో తీశారు. దీని ఆధారంగా పండ్ల వ్యాపారం చేస్తున్నట్లుగా మీసేవా కేంద్రంలో ట్రేడ్ లైసెన్స్‌కు దరఖాస్తు చేయించి.. అది వచ్చిన తర్వాత, దాని ఆధారంగా బ్యాంకుల్లో కరెంట్ ఖాతా తెరిచారు. ఇలా మరో స్నేహితుడితో ఏబీ వెజిటబుల్స్ పేరుతోనూ ఇలాగే చేసి కరెంట్ ఖాతా తెరిపించారు.

ఘనంగా ముగిసిన వీరమ్మతల్లి తిరునాళ్లు

ఉయ్యూరు, న్యూస్‌టుడే: ఉయ్యూరు వీరమ్మతల్లి తిరునాళ్లు బుధవారం రాత్రితో ముగిశాయి. పదిహేను రోజుల పాటు అత్యంత వైభవంగా జరిగిన తిరునాళ్లకు జిల్లాలోని నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలి వచ్చి వీరమ్మతల్లిని ఉత్సవ ఆలయంలో దర్శించుకున్నారు. గత నెల 28వ తేదీన ప్రారంభమైన తిరునాళ్లు పదిహేను రోజుల పాటు జరిగాయి. బుధవారం అర్ధరాత్రి వీరమ్మతల్లిని స్థానిక రావిచెట్టు సమీపంలోని మెట్టినింటికి తీసుకెళ్లారు. అక్కడ మహాశివరాత్రి రోజు వరకు ఉంచి..ఆ రోజు నడకదారిన తోట్లవల్లూరు మండలం ఐలూరు వద్ద కృష్ణానదిలో అమ్మవారిని స్నానమాచరింపజేసి తిరిగి మెట్టినింటికి తీసుకొస్తారు. వచ్చే ఏడాది తిరునాళ్ల ప్రారంభం వరకు అమ్మవారు అక్కడే భక్తులకు దర్శనమిస్తారు. చివరి రోజున వేలాది మంది జనంతో ఉయ్యూరు రహదారులన్నీ నిండిపోయాయి. కాటూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటైంది. శ్రీనివాసరావు వైద్యసేవలందించారు. గన్నవరం డీఎస్పీ శ్రీనివాస్ నేతృత్వంలో ఉయ్యూరు పట్టణ సీఐ టీవీవీ రామారావు ఆధ్వర్యంలో వందలాది మంది పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు.

ముఠా కార్మికుల ఆధ్వర్యంలో: బుధవారం ఉయ్యూరులో ముఠా కార్మికుల ఆధ్వర్యంలో పెద్దఎత్తున వీరమ్మతల్లి సంబరం జరిగింది. అమ్మవారి సారె తీసుకెళ్లే పోతుల ప్రభ ఊరేగింపును ఎమ్మెల్యే బోడే ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ వై.వి.బి.రాజేంద్రప్రసాద్‌లు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ పూర్ణచంద్రరావు, తెదేపా బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రాజులపాటి ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఊరేగింపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్ర ప్రసాద్ తదితరులు

ఎంఎస్ఎంఈ రంగాన్ని అగ్ర స్థానానికి తీసుకెళ్లడమే లక్ష్యం

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు బ్యాంకుల నుంచి ఆర్థిక సహాయం మంజూరు పరంగా దేశంలోనే మొదటి ఐదు స్థానాల్లో రాష్ట్రాన్ని నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఆ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ప్రస్తుతం పదో స్థానంలో ఉందని, గతంతో పోలిస్తే రుణాల మంజూరు రెట్టింపు అయ్యిందని తెలిపారు. 'ఎంఎస్ఎంఈ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు... పరిష్కారానికి సూచనలు' అనే అంశంపై కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ఆధ్వర్యంలో విజయవాడ ఎంజీ రోడ్డులోని ఓ హోటల్లో బుధవారం రాత్రి నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి, ఉప సభాపతి రఘురామకృష్ణరాజు హాజరయ్యారు. వివిధ రంగాల పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ.. ఎంఎస్ఎంఈ రంగాన్ని అగ్ర స్థానంలోకి తీసుకెళ్లాలనే కృతనిశ్చయంతో ప్రభుత్వం ఉందని అన్నారు. అందులో భాగంగానే అనుమతులను సరళీకృతం చేశామని, ఆటో అప్రూవల్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని వివరించారు. పరిశ్రమల స్థాపనలో జాప్యాన్ని నివారించేందుకు వైట్, గ్రీన్ కేటగిరీ పరిశ్రమలకు ఆటోమేటిక్ అప్రూవల్ విధానాన్ని వర్తింపజేస్తున్నామని చెప్పారు. పారిశ్రామికవేత్తలు అనుమతుల కోసం చూడకుండా వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించవచ్చని, రెండేళ్ల లోపు అవసరమైన పత్రాలను సమర్పించే వెసులుబాటు కల్పిస్తున్నామని అన్నారు. గత రెండేళ్లలో ఎంఎస్ఎంఈలకు బ్యాంక్‌ల ఆర్థిక సహాయం రూ.4 వేల కోట్ల నుంచి రూ.8 వేల కోట్లకు పెరిగిందన్నారు. ఇంకా ఆ సహాయాన్ని పెంచాలనేది ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రతి ఇంటికి ఓ పారిశ్రామికవేత్త రావాలన్నదే ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 175 ఎంఎస్ఎంఈ పార్కులను ఆయా రంగాల అవసరాలకు అనుగుణంగా మార్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. ఉప సభాపతి రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వంతో ఘర్షణ ధోరణిలో కాకుండా... సంప్రదింపుల ద్వారా పారిశ్రామికవేత్తలు తమకు అవసరమైన రాయితీలు, సౌకర్యాలు పొందే వీలుంటుందని, ఈ విషయం తన వ్యక్తిగత అనుభవంతో చెబుతున్నానని అన్నారు. సీఐఐ విజయవాడ జోన్ ఛైర్‌పర్సన్ నాగలక్ష్మి, సభ్యులు కోటగిరి అభినవ్, ఈబీ రాజేశ్, వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు కీర్తి తదితరులు పాల్గొన్నారు. అనంతరం రుణాల మంజూరు పరంగా బ్యాంకుల నుంచి ఎదురవుతున్న ఇబ్బందులను పారిశ్రామికవేత్తలు మంత్రి, ఉప సభాపతి దృష్టికి తీసుకెళ్లారు. పూచీకత్తు లేని రుణాల పరిమితి పెంచాలని సీసీఐ ప్రతినిధులు కోరారు. గత ప్రభుత్వ కాలం నుంచి నిలిచిపోయిన పారిశ్రామిక రాయితీలను విడుదల చేయాలని అన్నారు.

మాట్లాడుతున్న ఉప సభాపతి రఘురామకృష్ణరాజు, వేదికపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తదితరులు

14న హెచ్‌సీఎల్ క్రీడా జట్ల ఎంపిక పోటీలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: హెచ్‌సీఎల్, హీల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 14న పటమటలోని కేబీసీ జడ్పీహెచ్ స్కూల్ మైదానంలో ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి క్రీడా జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని హెచ్‌సీఎల్ స్పోర్ట్స్ ఫర్ ఛేంజ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్. శ్యామ్ సుందరరావు తెలిపారు. బాలబాలికలకు ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బాలికలకు మాత్రమే రగ్బీ పోటీలు ఉంటాయని చెప్పారు. జనవరి ఒకటి, 2011 తర్వాత జన్మించి.. ప్రభుత్వ, నగర పాలక సంస్థ, గురుకుల పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న వారు మాత్రమే పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఈ పోటీల నుంచి ప్రతిభ గల క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఆ జట్లు త్వరలో బెంగళూరులో జరిగే దక్షిణ భారత్ అంతర్ రాష్ట్ర పోటీల్లో తలపడతాయని వివరించారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు హెచ్‌సీఎల్ ఉచిత ప్రయాణ, దినసరి భత్యం చెల్లిస్తుందని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు, జట్లు ఈ నెల 14వ తేదీ ఉదయం 8 గంటలకు జడ్పీహెచ్ స్కూల్ మైదానంలో హాజరు కావాలని సూచించారు. హెచ్‌సీఎల్ ఏరియా మేనేజర్ బి. శ్రీనివాసరావు, హీల్ సీఈవో కె.అజయ్‌కుమార్ పోటీలను పర్యవేక్షిస్తారని ఎస్.శ్యామ్ సుందరరావు తెలిపారు. కార్యక్రమానికి ఎస్‌పీడీ బి.శ్రీనివాసరావు, ఎన్టీఆర్ డీఈవో చంద్రకళ ముఖ్యఅతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు.

అందరూ సహోదర ప్రేమతో జీవిస్తే మేలు

ముగిసిన గుణదల మేరీమాత ఉత్సవాలు

గుణదల, న్యూస్‌టుడే: మూడు రోజులుగా నిర్వహించిన గుణదల మేరీమాత మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ముగింపు వేడుకలకు విజయవాడ కథోలిక పీఠం బిషప్ తెలగతోటి రాజారావు ముఖ్యఅతిథిగా హాజరై సందేశమిచ్చారు. అసమానతలు తొలగినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. మదర్ థెరెసా, జోసఫ్ తంబి లాంటి వ్యక్తులు సమాజానికి ఎంతో అవసరమని అన్నారు. అందరూ సహోదర ప్రేమతో జీవించాలని పిలుపునిచ్చారు. మేరీమాతను దర్శించిన భక్తులకు అనుగ్రహం లభించడం వల్లే ఏటా వేడుకలకు వచ్చే విశ్వాసుల సంఖ్య పెరుగుతోందని పేర్కొన్నారు. అనంతరం బిషప్‌లు రాజారావు, షమీంద్ర జయవర్ధన (అమెరికా)లతో కలిసి మోన్సిన్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, వికార్ జనరల్ ఫాదర్ మేశపాం గాబ్రియేలు, గుణదల పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు తదితర 500 మంది గురువులు ముగింపు మహోత్సవాల సమిష్టి దివ్యపూజాబలి సమర్పించారు. భక్తులకు దివ్యసత్ప్రసాదం అందజేశారు. ఉత్సవాల చివరి రోజు పుణ్యక్షేత్రం విశ్వాసులతో కిటకిటలాడింది. ప్రార్థనలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. దివ్యసత్ప్రసాదం స్వీకరించారు. ఫాదర్ పసల థామస్, మధిర బెర్నార్డ్ బృందం ఆలపించిన ఆధ్యాత్మిక గీతాలు, కోలాటం, భక్తి గీతాలు, లూర్దు మాత సంక్షిప్త చరిత్ర ప్రదర్శన, బుర్రకథ ఆకట్టుకున్నాయి. పీఠాధిపతిగా బిషప్ రాజారావు 10 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన్ని మోన్సిన్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్ తదితరులు సన్మానించారు. ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, వైకాపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ తదితరులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ.. తమిళనాడు వేళాంగిణి మాత ఉత్సవాల తరహాలో వచ్చే ఏడాది మరింత వైభవంగా.. మేరీమాత ఉత్సవాలు నిర్వహించేందుకు ఎమ్మెల్యే రామ్మోహన్‌తో కలిసి కృషి చేస్తానని తెలిపారు. పుణ్యక్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఉత్సవాలకు జిల్లా యంత్రాంగం చక్కటి ఏర్పాట్లు చేసిందని అభినందించారు. పాదర్లు పసల థామస్, కొలకాని మరియన్న, తోట సునీల్ రాజు, జి.కిరణ్‌బాబు, మెరుగుమాల చిన్నప్ప, తెలగతోటి పౌలు, గుజ్జుల మైఖేల్, డేవిడ్ రాజు, వినయ్ కుమార్ తదితర 500 మంది గురువులు, సిస్టర్లు పాల్గొన్నారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్, వేదికపై ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, బిషప్ తెలగతోటి రాజారావు తదితరులు

వేడుకలకు హాజరైన విశ్వాసులు

15న వీణావాద్య కచేరీలు

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీసుబ్రహ్మణ్య మహతీ సంగీత సంస్థ 10వ వార్షికోత్సవం సందర్భంగా గాంధీనగర్‌లోని వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో దశమ వార్షిక అఖండ ఖచ్ఛపీ (వీణావాద్య కచేరీలు) మహోత్సవం నిర్వహించనున్నట్లు కార్యదర్శి సి.విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షురాలు చిట్టా రామలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15వ తేదీ ఉదయం 8 నుంచి 16వ తేదీ ఉదయం 8 వరకు(24 గంటలు) నిర్విరామంగా సాగుతుందన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 200 మందికిపైగా విద్వాంసులు, వాద్యకళాకారులు పాల్గొని వీణపై సంప్రదాయ కీర్తనలతో అలరిస్తారని ఆ ప్రకటనలో తెలిపారు.

విశాఖపట్నం ఆశీలుమెట్టలో బుధవారం రాత్రి నిర్వహించిన ఫ్యాషన్‌షోలో సంప్రదాయ వస్త్రధారణలో యువతులు, మహిళలు అలరించారు. - న్యూస్‌టుడే, విశాఖపట్నం

ఆదాయపు పన్నుశాఖ ఏడీపైనా కేసు

ఈనాడు డిజిటల్, అనకాపల్లి: ఆర్థిక నేరం కప్పిపుచ్చే యత్నంలో నర్సీపట్నంలో ఓ విద్యాసంస్థల నిర్వాహకుడు, ఛార్టెడ్ అకౌంటెంట్‌తోపాటు విశాఖపట్నంలోని ఆదాయపన్ను ఉన్నతాధికారిని సీబీఐ అధికారులు అరెస్టు చేశారు. ఈ మేరకు విశాఖపట్నం సీబీఐ అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు. అందులోని వివరాల ప్రకారం.. నర్సీపట్నంలోని ప్రముఖ విద్యాసంస్థలకు చెందిన నేరెళ్ల వెంకటరాజేష్ కొన్ని రోజుల క్రితం విద్యాసంస్థలకు చెందిన ట్రస్ట్ నుంచి రూ. 2 కోట్లు వ్యక్తిగత బ్యాంక్ ఖాతాకు మళ్లించుకున్నారు. ఐటీ రిటర్నుల సమర్పించినప్పుడు ఈ లావాదేవీలకు సంబంధించిన లోపాలు గుర్తించిన ఆదాయ పన్ను ఉన్నతాధికారులు ఆయన ఛార్టెడ్ అకౌంటెంట్ గ్రంధి శరత్‌కుమార్‌కు తమ అభ్యంతరాలను తెలిపారు. దీని నుంచి బయటపడేందుకు విశాఖలోని ఆదాయపన్ను శాఖ యూనిట్-3 అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న అమృత్‌కుమార్‌కు రూ. 14 లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ వ్యవహారాలపై కాల్ రికార్డ్ ద్వారా నిఘా వేసిన సీబీఐ అధికారులు ఈనెల ఐదున ఆకస్మికంగా దాడి చేసి పట్టుకున్నారు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

పాదచారి ప్రాణం.. గాల్లో దీపం!

★ ప్రమాదాలకు గురవుతున్న నడకదారులు

★ ఫుట్‌పాత్‌లు లేక రోడ్లపైనే రాకపోకలు

ఈనాడు డిజిటల్ - అనకాపల్లి

▸▸ మునగపాకకు చెందిన బీరా లక్ష్మణరావు ఈనెల 5న అనకాపల్లి వచ్చారు. నాలుగు రోడ్ల కూడలి నుంచి రహదారిపై నడుకుచుంటూ వెళ్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొంది. లక్ష్మణరావు నడుంపైనుంచి బస్సు వెళ్లడంతో గాయపడి మృతి చెందారు.

▸▸ ఈనెల 4నన నెహ్రూచౌక్ వద్ద రాయవరపు నూకాలమ్మ నడుచుకుంటూ వెళ్తోంది. వెనక నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన వృద్ధురాలిని ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందింది.

జిల్లాలో పట్టణాలు క్రమేపీ విస్తరిస్తున్నాయి. కానీ.. ఎక్కడా ట్రాఫిక్ నియమాలు సక్రమంగా అమలు కావడం లేదు. కూడళ్ల వద్ద దారి దాటాలంటే.. ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందే. ఎటు నుంచి ఏ వాహనం వచ్చి ఢీకొంటుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. దీంతోపాటు.. రోడ్లపై జీబ్రా లైన్లు లేవు.

ప్రధాన కూడళ్లవద్ద కాలిబాటలు లేకపోవడం, కొన్నిచోట్ల ఉన్నా వాటిని ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేయడం పాదచారుల ప్రాణంమీదకు తీసుకొస్తోంది.

ఫుట్ పాత్‌లు లేక జరిగిన ప్రమాదాలు..

	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
అనకాపల్లి	94	9	85
ఎలమంచిలి	54	0	52
నర్సీపట్నం	80	1	82

అనకాపల్లిలో ఫుట్‌పాత్‌పై ఆక్రమణల కారణంగా రోడ్డుపై నడుచుకెళ్తున్న పాదచారులు

అంతటా ఆక్రమణలు...

అనకాపల్లి పట్టణంలో విజయరామరాజు పేట కూడలి నుంచి రైల్వేస్టేషన్ వైపు కాలిబాటలు నిర్మించలేదు. పోలీస్ స్టేషన్ నుంచి డీమార్ట్ కూడలి వరకు ఉన్నా.. దాదాపు అన్ని చోట్లా దుకాణదారులు ఆక్రమించారు.

» కొన్నాళ్ల క్రితం అనకాపల్లి పట్టణంలో మున్సిపల్ అధికారులు ప్రధాన రహదారి వెంట ఉన్న ఫుట్‌పాత్‌లపై అక్రమ వ్యాపార సముదాయాలను డ్రైవ్‌గా తొలగించారు. నెల రోజులపాటు రోడ్లు విశాలంగా కనిపించినా.. తర్వాత పరిస్థితి మామూలే.

» నర్సీపట్నం పురపాలక పరిధిలో అబీద్ కూడలి నుంచి పెల్బాట్ కూడలి వరకు గత ప్రభుత్వంలో రోడ్డు విస్తరించి మూడు అడుగులు కాలిబాట కోసం వదిలారు. కానీ.. నడవడానికి వీలుగా చేయలేదు. దీంతో వ్యాపార దుకాణాలు వెలిశాయి.

▸▸ **ట్రాఫిక్ సిబ్బంది లేక..:** జిల్లాలోని మూడు మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిబ్బంది ఉండటం లేదు. అనకాపల్లి టౌన్‌లోని పెరుగు బజార్, రింగ్‌రోడ్డు, ఎన్టీఆర్ సర్కిల్, ఆర్టీసీ కాంప్లెక్స్ సమీప కూడలి రోజూ ఉదయం, సాయంత్రం రద్దీగా ఉంటాయి. వాహనదారులు కూడా ఇష్టం వచ్చినట్లు నడుపుతున్నారు. వీరిని క్రమబద్ధీకరించేందుకు ఆయా కూడళ్లలో ట్రాఫిక్ సిబ్బంది లేక అంతరాయాలు, వాహనాలు ఎదురెదురుగా ఢీకొంటున్నాయి.

రక్షణ కవచం

రైల్వే లైను వెంబడి ప్రహరీ నిర్మాణం

నర్సీపట్నం, న్యూస్‌టుడే: పట్టాలపై పరుగులు తీసే రైళ్లు.. ఆకతాయిలు పట్టాలు దాటి మూగ జీవులు, మనుషులు ప్రమాదాల బారిన పడకుండా రైల్వేశాఖ పటిష్ఠ రక్షణ వ్యవస్థ ఏర్పాటు చేస్తోంది. దీని ద్వారా అటు ప్రాణ, ఇటు రైళ్ల రక్షణ కల్పించేలా కేంద్రం చర్యలు చేపట్టింది.

రైళ్లలో గతం కంటే వేగం పెరిగింది. గతంలో గరిష్ఠ వేగం 110 కిలోమీటర్లు ఉండగా, ప్రస్తుతం 130 కిలోమీటర్ల వరకు పెంచారు. దీన్ని త్వరలో 160 కిలోమీటర్ల వరకు పెంచడానికి ముమ్మర కసరత్తు జరుగుతోంది. అతి వేగంతో రైలు వెళ్తున్నప్పుడు పట్టాలపై ఆవులు, గేదెలు వంటి భారీ మూగజీవాలు ట్రాక్‌పైన ఉంటే తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఈ తరహా ప్రమాదాలను అడ్డుకట్ట వేయడానికి వీలుగా ట్రాక్ రెండువైపులా భారీ సిమెంటు పలకలతో రక్షణ ప్రహరీ, కంచె ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి.

★ జిల్లాలో అనకాపల్లి మొదలుకుని అటు తూర్పుగోదావరి సరిహద్దు పక్కనే ఉన్న తుని వరకు దాదాపు 65 కిలోమీటర్ల పరిధిలో రైల్వే ట్రాక్‌కు ఇరువైపులా రక్షణ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే జిల్లాలో 30 శాతం వరకు ప్రహరీ పనులు పూర్తయినట్లు రైల్వేశాఖకు చెందిన ఓ సీనియర్ ఇంజినీరింగ్ అధికారి తెలిపారు. మరో రెండు, మూడు నెలల్లో ఈ ఏర్పాట్లు పూర్తికానున్నాయి. ఇవి అందుబాటులోకి వస్తే నిర్దేశించిన రైల్వే లెవెల్ క్రాసింగ్, గేట్ల వద్ద తప్పితే అడ్డదారిలో మరెక్కడా పట్టాలను దాటే అవకాశం ఉండదు.

పెదబొడ్డేపల్లి వద్ద ట్రాక్‌కు సమీపంగా నిర్మించిన భారీ సిమెంటు పలకల ప్రహరీ

ప్లాస్మాకు పరుగు పెట్టక్కర్లేదు

అనకాపల్లి ఆసుపత్రికి ఆధునిక పరికరాలు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

అనకాపల్లి జిల్లా ఆసుపత్రిలో రక్తనిధి కేంద్రానికి రూ. కోటి విలువైన పరికరాలు సమకూరడంతో చిరకాలంగా వెంటాడుతున్న సమస్యలకు పరిష్కారం లభించింది. ఎంతోమంది రోగులు అనకాపల్లి జిల్లా నుంచి విశాఖపట్నం కేజీహెచ్‌కు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా ఆసుపత్రిలో ఇప్పటివరకు రక్తనిధి కేంద్రంలో దాతలు ఇచ్చే రక్తాన్ని ప్యాకెట్ల రూపంలో నిల్వ చేసి అవసరమైన వారికి అందించేవారు. దాతల రక్తం నుంచి ప్లాస్మా, ప్లేట్‌లెట్లు, తెల్ల, ఎర్ర రక్తకణాలు వేరుచేయడం అయ్యేది కాదు. దీనికోసం ఆధునిక పరికరాలు అవసరం. వీటిని సమకూర్చాలని గతంలోనే ప్రతిపాదించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ సమస్యను పరిష్కరించేలా కలెక్టర్ విజయకృష్ణన్‌తోపాటు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రత్యేక చొరవ చూపారు. ప్రస్తుతం వీటిని అమరుస్తున్నారు. ఈ నెలాఖరుకల్లా సేవలు అందించేలా చర్యలు చేపడుతున్నారు.

రక్తపరీక్షలకు వచ్చిన ఆధునిక పరికరాలు



జిల్లా ఆసుపత్రిలో నెలకు 120 నుంచి 150 వరకు రోగులకు రక్తం అందిస్తున్నారు. అత్యవసర సమయంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు ఈ చర్యలు సాంత్వన కలిగిస్తున్నాయి. ప్లాస్మా, ప్లేట్‌లెట్లు, తెల్లరక్తకణాలు అవసరమయ్యే వారికి వీటిని అందించడం కుదరడం లేదు. ప్రస్తుతం వీరంతా విశాఖకే వెళ్తున్నారు. దాతలు అందించే రక్తం నుంచి వీటిని వేరుచేసి నిల్వ ఉంచేలా ఆధునిక పరికరాలు అనకాపల్లి ఆసుపత్రికి సమకూరడంతో రోగుల వెతలు తప్పనున్నాయి. దీనికితోడు ఈ ఆసుపత్రిలో రక్త దాతల సంఖ్య పెరుగుతోంది. ప్రజల్లో అవగాహన పెరగడంతో రక్తనిల్వలు పెరిగాయి. ఆధునిక పరికరాలు సమకూరడంతో ఇకనుంచి ప్లాస్మా, ప్లేట్‌లెట్లు అందుబాటులోకి రానున్నాయి.

ఆపద సమయంలో అవసరాలు తీర్చేలా

జిల్లా ఆసుపత్రిని సంపూర్ణ వైద్యసేవలు అందించేలా తీర్చిదిద్దుతున్నాం. సీటీ స్కాన్, డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేశాం. రక్తనిధి కేంద్రానికి ఆధునిక పరికరాలు సమకూర్చాం. ప్లాస్మా, ప్లేట్‌లెట్లు ఎక్కించే సదుపాయం లేక చాలామంది ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్య మా దృష్టికి రావడంతో ప్రభుత్వం నుంచి పరికరాలను సమకూర్చారు. వీటితో త్వరలోనే ప్రజలకు సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నాం.
- కొణతాల రామకృష్ణ, ఎమ్మెల్యే

పొలం పిలుస్తోంది.. కొందరికే తెలుస్తోంది!

అనకాపల్లి, న్యూస్‌టుడే

పంటల సాగులో ఆధునిక పద్ధతులు అందిపుచ్చుకునేలా సూచనలు, సలహాలు ఇవ్వడంతోపాటు క్షేత్రస్థాయిలో రైతులకు ఉన్న సమస్యలను పరిష్కరిస్తూ రైతులకు వెన్నుదన్నుగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం చేపట్టిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం అందరికీ చేరడం లేదు. జిల్లాలో పంటలతోపాటు పాడి, కోళ్లు, చేపల పెంపకాలు చేపడుతున్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమానికి వ్యవసాయశాఖ అధికారులు మినహా అనుబంధ శాఖల అధికారులు హాజరు కావడం లేదు.

ఖరీఫ్‌లో అన్ని రకాల వ్యవసాయ పంటలు కలిపి 85,857 హెక్టార్లలో సాగు చేస్తుండగా.. రబీలో 15,662 హెక్టార్లలో పంటలు వేస్తున్నారు. వరి, చెరకు, మొక్కజొన్న, చోడి, కంది, మినుము, పెసర వంటి పంటలు సాగు చేస్తున్నారు. ఆయా పంటల్లో మంచి దిగుబడులు వచ్చేలా, అధిక ధరలు దక్కే విధంగా అన్ని శాఖల అధికారులు రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాల్సి ఉంది. ఆ దిశగా ఎక్కడా జరగడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఒక్క వ్యవసాయాధికారితో మెట్టపాలెంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమం

★ ప్రతి మంగళ, బుధవారాలు 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించాలి. ప్రతి మండలంలో రోజుకు రెండు గ్రామాల్లో చేపడతారు. వీటిలో వ్యవసాయ శాఖతో పాటు ఉద్యాన, పశుసంవర్ధక, మార్కెటింగ్, మత్స్య శాఖ, ప్రకృతి వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొనాలి. కానీ వ్యవసాయ శాఖ నుంచి ఒకరిద్దరు తప్ప మిగతా శాఖల అధికారుల జాడే కనిపించడం లేదు. రైతులు మిగతా విభాగాలకు సంబంధించి ఏదన్నా సందేహం అడిగినా అది తమ పరిధిలోని అంశం కాదంటూ వ్యవసాయ అధికారులు మాట దాటేస్తున్నారు.

» జిల్లాలో ఉద్యాన పంటల సాగు ఏటా పెరుగుతోంది. ప్రస్తుతం 57,238 హెక్టార్లలో వీటిని సాగు చేస్తున్నారు. జీడి 27,900, మామిడి 10,880, కొబ్బరి 9,330, కూరగాయలు 3,150 హెక్టార్లలో సాగు చేస్తున్నారు.

అందరూ హాజరుకావాలి

ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ, అనుబంధశాఖల అధికారులంతా పాల్గొనాలని జిల్లా వ్యవసాయశాఖాధికారిణి ఎం.ఆశాజ్యోతి తెలిపారు. అన్నిశాఖలు పాల్గొనే విధంగా చూస్తామన్నారు.

మనసంతా మంచుకొండలే!

ఎవరెస్ట్ అధిరోహణకు దివ్యాంగ విద్యార్థుల కసరత్తు

అనకాపల్లి పట్టణం, నర్సీపట్నం, న్యూస్‌టుడే

ప్రపంచంలో అతి ఎత్తయిన ఎవరెస్ట్ శిఖరం అధిరోహించడం ఒక ఛాలెంజ్. అవయవాలు అన్ని సరిగా ఉన్నవారే ఎనిమిది వేలకు పైగా అడుగులున్న శిఖరాగ్రాన్ని ఎక్కడానికి చాలా కష్టపడతారు. తమలో ఉన్న వైకల్యాన్ని అధిగమించి ఎవరెస్ట్ అధిరోహించడానికి జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు సై అంటున్నారు.

దివ్యాంగ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం తొలిసారిగా ఎవరెస్ట్ శిఖరం అధిరోహించే అవకాశం కల్పించాలని నిర్ణయించింది. సమగ్రశిక్షా పీడీ బి.శ్రీనివాసరావు చొరవతో రాష్ట్రంలోని ప్రత్యేక అవసరాల పిల్లలకు 'అడ్వంచర్ స్పోర్ట్స్' కింద ఈ అవకాశం దక్కింది. పర్వతారోహణపై ఆసక్తి ఉన్న దివ్యాంగ విద్యార్థులకు అనకాపల్లిలో డిసెంబరు 6న ఎంపిక పోటీలు నిర్వహించారు. దీనికి అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం. కాకినాడ జిల్లాల నుంచి 100 మందికి పైగా ఉత్సాహంగా పాల్గొన్నారు. వీరిలో అనకాపల్లి జిల్లా నుంచి ఆరుగురు, కాకినాడ జిల్లా నుంచి నలుగురు ఎంపికయ్యారు. అల్లూరి, విశాఖ జిల్లాల నుంచి ఎవరూ ఎంపిక కాలేదు. అనకాపల్లి నుంచి ఎంపికైన వారిలో ఇద్దరు విద్యార్థుల తల్లిదండ్రులు అంగీకారం తెలపకపోవడంతో నలుగురినే ఖరారు చేశారు. ప్రస్తుతం వీరిని నెలరోజుల శిక్షణ నిమిత్తం కడప జిల్లా గండికోట పంపారు. ఇక్కడి నుంచి లడఖ్ తీసుకెళ్తారు. ఇక్కడ శిక్షణ అందించి ఎవరెస్ట్ శిఖర అధిరోహణకు పంపుతారు. విజయంతంగా పూర్తిచేసిన దివ్యాంగ విద్యార్థులకు రాష్ట్రపతి చేతుల మీదగా బహుమతులు అందజేస్తారు.

గండికోటలో తర్ఫీదు

నమ్మకం ఏర్పడుతోంది: అనకాపల్లి మండలం గవరపాలెం మాది. పదో తరగతి చదువుతున్నాను. గతంలో పరుగు పందాల పోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంతో జాతీయ పోటీలకు ఎంపికయ్యాను. పర్వతారోహణకు బాగా ఎత్తయిన కొండలతో కూడిన గండికోట ఎంతో అనువైన ప్రదేశం. ఇక్కడ సాహస క్రీడలకు శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఎక్కువగా కాలినడక అలవాటవుతోంది. అలాగే ఎత్తయిన చోట తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిశాయి. యాత్రలో విజయం సాధిస్తాన్న నమ్మకం కలుగుతోంది. **- దోని భాస్కర్**

▸▸ **వైకల్యం గుర్తుకు రావడంలేదు:** గొలుగొండ మండలంలోని జోగుంపేట ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాను. పరుగు పందాల పోటీల్లో ప్రతిభ చూపడంతో ఈ యాత్రకు ఎంపిక చేశారు. ఈనెల 22 వరకు ఇక్కడ తర్ఫీదు కొనసాగుతుంది. రాష్ట్రవ్యాప్తంగా 44 మంది కొండలెక్కడంతోపాటు యోగా సైతం నేర్చుకుంటున్నారు. వీటిల్లో నిమగ్నమవుతున్న మాకు వైకల్యం గుర్తుకు రావడం లేదు. అన్నింటిని భరించి నిలదొక్కుకునేలా తయారుచేస్తున్నారు.
- లెక్కల హరిశ్రీ దుర్గా ప్రసాద్

▸▸ **ఆత్మస్థైర్యం మెండుగా:** రావికమతం మండలం మేడివాడ నా స్వగ్రామం. కొత్తకోట జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాను. కాళ్లు, చేతులు సరిగ్గా పనిచేయవు. ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మినాయుడు ప్రోత్సాహంతో అడ్వెంచర్ స్పోర్ట్స్‌లో పాల్గొని ఎవరెస్టు యాత్రకు ఎంపికయ్యాను. గతంలో పారా క్రీడా పోటీల్లో రాష్ట్రస్థాయిలో పతకం సాధించాను. ప్రస్తుత తర్ఫీదులో ఇబ్బందులు అన్నీ అధిగమిస్తూ కొండలు సులువుగా ఎక్కడం నేర్చుకుంటున్నాను. గండికోటలో శిక్షణ మాలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తోంది. **- కొంట్యాడ రాము**

అన్ని రకాల శిక్షణ

అనకాపల్లి మండలంలోని కూండ్రం మా స్వగ్రామం. పదో తరగతి చదువుతున్నాను. ఒక చెయ్యి పనిచేయకపోయినా మొదటిసారిగా పరుగు పందాల పోటీల్లో విజేతగా నిలిచాను. ఈ ఆటే ఇప్పుడు పర్వతారోహణకు అర్హతనిచ్చింది. కొండల మధ్య దూరాన్ని చేరుకోవడం, జిప్‌లైన్ శిక్షణ తదితర అన్నీ నేర్చుకుంటున్నాం. ఈ తర్ఫీదులోనూ బాగా రాణించే వారిని లడఖ్‌లో చలికి తట్టుకునేలా సిద్ధం చేయనున్నారు. చివరిగా ఎంపికైన వారు యాత్రకు అర్హత దక్కించుకుంటారు.
- సీహెచ్ పవన్‌కుమార్

19న బీచ్‌రోడ్డులో 'అంతర్జాతీయ సిటీ పరేడ్'

హాజరుకానున్న సీఎం చంద్రబాబు

విశాఖపట్నం, న్యూస్‌టుడే : అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ(ఐఎఫ్‌ఆర్)లో భాగంగా 19న ఆర్కేబీచ్‌లో 'అంతర్జాతీయ సిటీ పరేడ్'ను నిర్వహించనున్నట్టు కలెక్టర్ హరేంధిరప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో మాట్లాడారు. "కార్యక్రమానికి సీఎం చంద్రబాబు ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. పార్క్ హోటల్ నుంచి కోస్టల్ బ్యాటరీ వరకు నిర్వహించే కార్యక్రమాలు సాయంత్రం 5 గంటలకు ప్రారంభమవుతాయి. 19న నిర్వహించే అన్ని కార్యక్రమాలు 18న సన్నాహకంగా జరుగుతాయి. ఈ రెండు రోజులు ప్రజలు హాజరై విన్యాసాలు తిలకించొచ్చు..." అని కలెక్టర్ పేర్కొన్నారు.

వసూళ్లలోటు.. పన్నుపోటు

చోడవరం, అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో పంచాయతీ కార్యదర్శుల్లో గాభరా మొదలైంది. ఈ నెల 14 నాటికి ఇంటి పన్నులు శతశాతం వసూలు చేయాలన్నది పంచాయతీ రాజ్ కమిషనర్ నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. వసూళ్లలో అలసత్వం వహించే కార్యదర్శులు, సిబ్బందిపైన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారుల నుంచి హెచ్చరికలు జారీ అయ్యాయి. అనకాపల్లి డివిజన్‌లో రూ. 27 కోట్ల ఇంటి పన్నులు రావాల్సి ఉండగా అందులో రూ. 11.57 కోట్లు మాత్రమే వసూలు చేశారు. ముఖ్యంగా నివాసేతర భవనాల నుంచి పన్ను విషయంలో చాలా వెనుకబాటు ఉంది. వీటి వసూలులో పంచాయతీలు అసలు శ్రద్ధ చూపడం లేదనే తేలడంతో ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

● అనకాపల్లి డివిజన్‌లో నివాసేతర భవనాల పన్ను డిమాండ్ రూ. 1.06 కోట్లు ఉండగా రూ. 80,000 మాత్రమే వసూలైంది.

● ఇంటి పన్ను వసూళ్లలో 62.5 శాతంతో పరవాడ ముందు వరుసలో ఉంది. 30 శాతంతో చోడవరం, అచ్యుతాపురం చివరి స్థానంలో ఉన్నాయి.

● వసూళ్ల లక్ష్యం పూర్తయ్యేలా అనకాపల్లి, నర్సీపట్నం డివిజన్లలోని డెవలప్‌మెంట్ అధికారులు మండలాల వారీగా అధికారులు సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈనెల 14 నాటికి పూర్తి స్థాయిలో వసూలు చేస్తామంటూ కార్యదర్శి, సిబ్బంది చేత లేఖలు రాయిస్తున్నారు. దీంతో సిబ్బంది ఏమి చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.

274 మంది పంచాయతీ కార్యదర్శులకు తాఖీదులు

పల్లెల్లో పన్నుల వసూళ్లలో వెనుకబడిన 274 మంది పంచాయతీ కార్యదర్శులకు తాఖీదులు జారీ చేశామని జిల్లా పంచాయతీ అధికారి సందీప్ పేర్కొన్నారు. జిల్లాలో 24 మండలాల పరిధిలో 646 పంచాయతీల్లో ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 44.54 కోట్లు పన్నుల వసూలు లక్ష్యం కాగా ఇంతవరకు రూ. 20 కోట్లు మాత్రమే వసూలైంది. 50 శాతం కంటే తక్కువ వసూలు చేసిన 274 మందికి తాఖీదులు ఇచ్చామని, వీరందరూ 2, 3 రోజుల్లో సరైన వివరణ ఇవ్వాలన్నారు. ఈనెల 17న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ పన్నుల వసూళ్లపై సమీక్షిస్తారని.. వెనుకబడిన ఉద్యోగులపై ఆయన ఆదేశాల మేరకు శాఖాపరమైన చర్యలు సైతం ఉంటాయన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు

రాంబిల్లి, న్యూస్‌టుడే: శివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా భద్రతపై దృష్టి పెట్టాలని పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ సూచించారు. పంచదార్ల పుణ్యక్షేత్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఆలయ ఈఓ తేజతో శివరాత్రి ఏర్పాట్లపై చర్చించారు. భక్తుల రాకపోకలు, దర్శన ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, తాగునీరు, క్యూలైన్ల గురించి మాట్లాడారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా శివాలయాల వద్ద భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని డీఎస్పీ చెప్పారు. పంచదార్ల ఆలయం వద్ద అత్యవసర సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. అనంతరం వెంకటాపురం కూడలిలో వాహనాలను తనిఖీ చేసి శిరస్త్రాణం ధరించడంపై అవగాహన కల్పించారు. చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. సీఐ నరసింగరావు, ఎస్ఐ బి.నాగేంద్ర పాల్గొన్నారు.

పంచదార్ల ఆలయంలో ఏర్పాట్లపై ఈఓతో మాట్లాడుతున్న డీఎస్పీ విష్ణుస్వరూప్

గోపాలపట్నంలో ఎన్టీపీసీ టౌన్‌షిప్

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పాయకరావుపేట పరిశ్రమలకు నిలయంగా మారుతోంది. నక్కపల్లి మండలంలో బల్క్‌డ్రగ్ పరిశ్రమ, ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయనున్న విషయం తెలిసిందే. సమీపంలోనే ఉన్న పాయకరావుపేట మండలం కుమారపురంలో దక్కన్ పరిశ్రమ రెండో యూనిట్ నిర్మాణానికి 100 ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. తాజాగా నేషనల్ థర్మల్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు సర్వే చేపట్టారు. దీనికోసం నీటి నాణ్యత, భూముల వివరాలపై సమగ్ర వివరాలు తీసుకున్నారు. వాస్తవానికి దీనిని సుమారు 2 వేల ఎకరాల్లో నిర్మించాలని తొలుత భావించారు. కుమారపురం, రాజగోపాలపురం గ్రామాలు తరలించాల్సి ఉండటంతో ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు. కేవలం 1200 ఎకరాల్లో కర్మాగారం, మరో 300 ఎకరాల్లో గ్రీన్‌ఫీల్డ్ (మొక్కల పెంపకం) కోసం సేకరించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. దీనిలో సుమారు 200 ఎకరాల వరకు డీ పట్టా ఉండే అవకాశముంది. భూములు చాలా వరకు చేతుల మారిపోయాయి. కొంతమంది జీడితోటల పెంపకం చేపట్టారు. మరికొంతమంది వీటిలో హేచరీలు నిర్వహిస్తున్నారు. ఇటీవల చేపట్టిన భూముల రీ సర్వేలో అసలు లబ్ధిదారుల పేర్లు ఉన్నాయి. దీంతో కొనుగోలుదారులు తమకు న్యాయం చేయాలంటూ అధికారులను ఆశ్రయిస్తున్నారు.

★ ఎన్టీపీసీ పరిశ్రమకు సంబంధించిన టౌన్‌షిప్‌ను గోపాలపట్నం సీతమ్మవారి కొండ పరిధిలో ఏర్పాటు చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. ఇక్కడ సుమారు 100 ఎకరాల్లో దీనికి రూపకల్పన చేయాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. రానున్న రోజుల్లో భూసేకరణ ఆరంభం కానుంది.

టౌన్‌షిప్ కోసం సేకరించనున్న భూములు

(c) eenadu

'మెట్రో'.. మరింత ముందుకు

తొలిదశలోనే 'భోగాపురం' వరకూ!

రూ.2,618 కోట్ల సమీకరణకు కసరత్తు

ఈనాడు, విశాఖపట్నం : విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టును మొదటి దశలోనే భోగాపురం వరకు విస్తరించే అంశంపై కసరత్తు సాగుతోంది. తొలుత అనుకున్న కొమ్మాది నుంచి ఆనందపురం మీదుగా భోగాపురం విమానాశ్రయానికి అనుసంధానించేలా ప్రతిపాదన కేంద్ర ప్రభుత్వానికి పంపినట్లు తెలిసింది. దీనికి ఆమోదం దక్కితే... తొలి దశ ప్రాజెక్టు 46.4 కి.మీ. నుంచి 71.7 కిలోమీటర్లకు పెరగనుంది.

నిధుల సమీకరణకు: మెట్రో రైలు ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం వాటా భరించాల్సి ఉంది. 71.7 కి.మీ.లకు రూ.17,232 కోట్లు ఖర్చవుతుందని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది. భూ సమీకరణ, విక్రయం ద్వారా నిధుల సమీకరణ బాధ్యత వీఎంఆర్‌డీఏకు అప్పగించింది. ఇందుకోసం వీఎంఆర్‌డీఏ దాదాపు రెండు వేల ఎకరాలు సమీకరించనుంది. ఆ పనులు వేగంగా సాగుతున్నాయి. సుమారు వెయ్యి ఎకరాలకుపైగా ఇప్పటికే రెవెన్యూ యంత్రాంగం సమీకరించింది. ఆ భూములను అభివృద్ధి చేసి విక్రయించి, నిధులను మెట్రో కోసం వెచ్చించనున్నారు. అలాగే మరికొన్ని వాణిజ్య తరహా విధానాలు అవలంబించనున్నారు.

రుణాలకు: మెట్రో రైలు ప్రాజెక్టు కోసం వీఎంఆర్‌డీఏ దాదాపు రూ.2,618 కోట్లు సమీకరించనుంది. భూములను తాకట్టు పెట్టి రుణాలు తీసుకునే ప్రతిపాదనపై ఆలోచన చేస్తున్నారు. తక్కువ వడ్డీకి రుణాలు ఇచ్చే జాతీయ బ్యాంకులు, ఆర్థిక సంస్థలను అధికారులు సంప్రదిస్తున్నారు. ఏ బ్యాంకులు ఎంత కాలానికి ఎంత వడ్డీతో రుణాలు మంజూరు చేస్తాయన్న విషయాలను పరిశీలిస్తున్నారు.

ఆ గాలి వలన.. అంతా ఆందోళన!

★ నగరంలో పడిపోతున్న వాయు నాణ్యత

★ కాలుష్యం పెరుగుదలకు కారణాలెన్నో

ఈనాడు-విశాఖపట్నం: గత కొన్ని రోజులుగా విశాఖలో గాలి నాణ్యత ఆందోళన కలిగించే స్థాయిలో దారుణంగా ఉంటోంది. కాలుష్యంలో దిల్లీని మించి ఏక్యూఐ (గాలి నాణ్యత-ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్) గణాంకాలు నమోదవ్వడం కలవరపెడుతోంది. ఇందుకు కొన్ని కారణాలు అధికారులు గుర్తించారు.

1 విశాఖ పోర్టు అథార్టీ (వీపీఏ), గంగవరం పోర్టుల్లో కవర్డ్ షెడ్లను ఉపయోగించకుండా బహిరంగంగా బొగ్గు, ఇతర నిల్వలు ఉంచారు. టార్పాలిన్ పట్టాలు కప్పడం, స్ప్రింక్లర్లతో నీటిని చల్లే చర్యలు పూర్తిస్థాయిలో లేవు. కన్వేయర్ బెల్టులపై ముడిఖనిజం వెళ్లేటప్పుడు దుమ్ము బయటకు రాకుండా ఏర్పాట్లు లేవు. విశాఖ పోర్టులో ఓ కంపెనీ కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అనుమతుల్లేకుండా క్రషింగ్ యూనిట్ ఏర్పాటు చేసింది. బహిరంగంగా మాంగనీస్ ఓర్, బొగ్గు గ్రేడింగ్ చేస్తుండటం ఇక్కడ కాలుష్యానికి కారణమవుతోంది. పోర్టులకు వచ్చి, వెళ్లే లారీల్లో అధిక లోడు ఉండటం, టార్పాలిన్ కప్పకపోవడం వంటి కారణాలతో రోడ్లపైకి దుమ్ము భారీగా చేరుతోంది.

2 ఇటీవల షీలానగర్-సబ్బవరం గ్రీన్‌ఫీల్డ్ రహదారి పనులు ఆరంభమయ్యాయి. రూ.964 కోట్లతో చేపట్టిన 12.66 కి.మీ. ఆరు వరుసల రహదారి పనుల్లో ఫ్లైయాష్ (బూడిద) కూడా వాడుతున్నారు. ఎన్టీపీసీ, హిందూజా నుంచి నిత్యం వందల సంఖ్యలో లారీలు బూడిద రవాణా చేస్తున్నాయి.

★ ఆ సమయంలో ఓవర్‌లోడుతో, టార్పాలిన్ పట్టాలు కప్పకుండా తీసుకురావడంతో రహదారులన్నీ బూడిద మయంగా మారుతున్నాయి. ఫలితంగా గాల్లోకి బూడిద రేణువులు లేచి కాలుష్యానికి కారణమవుతున్నాయి.

★ పారిశ్రామిక ప్రాంతంలో బహిరంగంగా జిప్సం నిల్వలు పేరుకుపోవడంతో ఆ రేణువులు గాలిలో కలిసి ప్రమాదకరంగా మారుతున్నాయి.

3 జీవీఎంసీ పరిధిలో శిథిలావస్థ భవనాలను నిబంధనలు పాటించకుండా కూల్చేస్తుండటంతో దుమ్ము విపరీతంగా గాల్లోకి కలుస్తోంది. వ్యర్థాలను ఎలాంటి పైకప్పు లేకుండా జీవీఎంసీ వాహనాల్లో తరలిస్తున్నారు. నగరంలోని రోడ్లపై చేరిన దుమ్ము వాహనాల వేగానికి గాల్లో కలుస్తోంది. బహిరంగంగా చెత్తను కాల్చడం కూడా కాలుష్యానికి ఓ కారణంగా గుర్తించారు.

సైబర్ మోసాల నివారణపై అవగాహన

గోడప్రతుల ఆవిష్కరణలో కలెక్టర్ విజయకృష్ణన్, అధికారులు

కలెక్టరేట్, న్యూస్‌టుడే: సైబర్ మోసాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం టీవీ కమర్షియల్ ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల గోడప్రతులను అధికారులతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 13 వరకు జరిగే వారోత్సవాల్లో భాగంగా వీటిపై ప్రజలకు అవగాహన కల్పించి మోసాల బారి నుంచి రక్షించాలన్నారు.

పనులు తక్షణమే పూర్తి చేయాలి: జిల్లాకు మంజూరు చేసిన అన్ని అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎంపీడీఓలు, ఇంజినీరింగ్, వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ నిధులు మురిగిపోతే సంబంధిత అధికారులపై తక్షణమే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీధి కుక్కల సంతతి పెరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వయోజన విద్యా కేంద్రాలకు వస్తున్న 91 వేల మందిని మార్చిలో జరిగే పరీక్షలకు హాజరై ఉత్తీర్ణులయ్యేలా చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు ఉచిత సౌరవిద్యుత్తు వినియోగించుకునేలా చేయాలన్నారు.

భూములు కబ్జా కాకుండా చర్యలు: రెవెన్యూశాఖకు సంబంధించిన అంశాలను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. తహసీల్దార్లతో వివిధ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడుతూ ప్రతి సోమవారం పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ ద్వారా వచ్చే అర్జీలపై మరుసటి రోజు క్షేత్రస్థాయిలో సందర్శించి పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకుండా చర్యలు చేపట్టాలన్నారు. రెండో విడత రీసర్వే జరిగిన గ్రామాల్లో మళ్లీ క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎలాంటి తప్పులు రాకుండా పాసుపుస్తకాలు ముద్రణకు పంపించాలన్నారు. పౌరసరఫరాలకు సంబంధించి ఇంటి వద్దనే నిర్ణీత గడువులోగా నూరుశాతం పంపిణీ చేపట్టాలన్నారు. డీఆర్వో సత్యనారాయణ, లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ, సర్వే ఏడీ గోపాల్‌రాజు, డీఎస్‌ఓ మూర్తి, ఏఓ విజయకుమార్ పాల్గొన్నారు.

సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలపై నిఘా



అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేసే వారిపై నిఘా ఉంచాలని ఎస్పీ **తుహిన్‌సిన్హా** ఆదేశాలు జారీచేశారు. జిల్లాలోని పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలతో బుధవారం రాత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సైబర్ నేరాల బాధితులకు తక్షణ న్యాయం జరిగేలా చూడాలన్నారు. శివరాత్రి నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించారు. పుణ్యక్షేత్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. 2025 ఏడాదికి సంబంధించి కొత్తగా అమలులోకి వచ్చిన చట్టాలపై అధికారుల పనితీరును సమీక్షించారు. పెండింగ్ కేసులు పరిష్కరించి పోలీస్ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలన్నారు.

నాచు సాగు.. ఉపాధి బాగు

సీవీడ్‌తో అతివలకు ఆదాయం

గ్రామీణభీమిలి, తగరపువలస, న్యూస్‌టుడే: 'ప్రధానమంత్రి మత్స్య సమృద్ధి యోజన'లో భాగంగా భీమిలి మండలం పెదమంగమారిపేట తీరంలో ఇటీవల ప్రారంభించిన సీవీడ్ (సముద్ర నాచు పెంపకం) సాగు సత్ఫలితాలను ఇస్తోంది. ★ మంగమారిపేట గ్రామానికి చెందిన కొందరు మత్స్యకార మహిళలు సంఘంగా ఏర్పడి గత ఏడాది నవంబరు 21న అంతర్జాతీయ మత్స్యకార దినోత్సవం నాడు సముద్రపు నాచు పెంపకానికి శ్రీకారం చుట్టారు. మత్స్యకార మహిళలకు సుస్థిర జీవనోపాధిని అందించేందుకు ప్రభుత్వం తెచ్చిన ఈ ప్రాజెక్టుతో కొద్దిరోజుల వ్యవధిలోనే మంచి లాభాలు రావడంతో వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తీరం నుంచి సీవీడ్‌ను బయటకు తెస్తున్న మహిళలు

సీ వీడ్ అంటే..: సీవీడ్ సముద్రపు వాతావరణంలో పెరిగే ఓ రకమైన నాచు మొక్క. ప్రధానంగా ఎరుపు, ఆకుపచ్చ, గోధుమ రంగుల్లో ఉంటాయి.

మరింత మందికి అవకాశం: మంగమారిపేట తీరంలో మహిళలు సాగు చేస్తున్న సీవీడ్ మంచి ఫలితాన్ని ఇచ్చింది. ఈ స్ఫూర్తితో మరింత మందికి అవగాహన కల్పించి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకుంటాం. మార్కెటింగ్ సదుపాయాలను కల్పిస్తున్నాం. – డా.కృష్ణ, పీఎం మత్స్య సమృద్ధి యోజన విశాఖ జిల్లా అధికారి

సీవీడ్ హబ్‌గా తీరం..: సీవీడ్‌ను ఎరువులు, ఔషధాలు, తినుబండారాలు, సౌందర్య ఉత్పత్తుల్లోనూ ఉపయోగిస్తున్నారు. వీటికి జపాన్, తైవాన్, ఇండోనేషియాలో డిమాండు ఎక్కువ. మంగమారిపేట, పరిసర తీర ప్రాంతాలను సీవీడ్ హబ్‌గా తీర్చిదిద్దుతాం. – డా.లక్ష్మణరావు, మత్స్యశాఖ విశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్

రెండు టన్నుల దిగుబడి..: మంగమారిపేట తీరంలో దాదాపు రెండు టన్నుల దిగుబడి తొలిసారి వచ్చింది. తడిచిన సీవీడ్‌ను కిలో రూ.40 చొప్పున, ఎండబెట్టిన నాచును రూ.120 చొప్పున అమ్మారు. తద్వారా చక్కటి ఆదాయాన్ని పొందారు. ఈ స్ఫూర్తితో రెండోసారి కూడా 30 రాఫ్టుల సీవీడ్‌ను వేశారు. ఏడాదికి అయిదు సార్లు సాగు చేయనున్నారు. వీరిని ప్రోత్సహిస్తూ చిప్పాడ దివీస్ ఫార్మా కంపెనీ రూ.6 లక్షలను సీఎస్సార్ కింద అందించింది. ఈ మొత్తంతో సీవీడ్, రాఫ్టులను సమకూర్చుకున్నారు. మత్స్యకార మహిళలను స్ఫూర్తిగా తీసుకుని ఓ స్వచ్ఛంద సంస్థ, ఓ విశ్వవిద్యాలయం ఈ తీరంలో పదేసి రాఫ్టులతో సీవీడ్‌ను సాగు చేస్తున్నాయి.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్ట్రెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, పరిపాలన కార్యాలయ ప్రాంగణం, బాలాజీ నగర్, సిరిపురం, విశాఖపట్నం

అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ వై. శ్రీకాంత్ (చీఫ్ మేనేజర్) మొబైల్ నెం. 80994 44378, ఇ-మెయిల్ ఐడి: sbi.10077@sbi.co.in, ఆస్తి తనిఖీ కొరకు : 9666909050

ఇ-వేలం అమ్మకం ప్రకటన

[illegible]

రిజర్వు ధర: రూ.1,10,04,000/-	ధరావత్తు: రూ.11,00,400/-	బిడ్ పెంపుదల: రూ.25,000/-

గమనిక : ఋణగ్రహీత ఎస్.ఎ. నెం.251/2025 డిఆర్‌టి, విశాఖపట్నంలో దాఖలు చేసినారు. కాని, స్టే లేదు.

ఇ-వేలం తేదీ : 16-03-2026 సమయం : ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఆస్తి తనిఖీ తేది మరియు సమయం: తేది:12-02-2026 నుండి 15-03-2026 వరకు ఉ॥10.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు

[illegible] బిడ్ ఇ.ఎమ్.డి మొత్తం PSB Alliance బ్యాంక్ అకౌంట్‌లో జమ అయిన సమాచారం వెబ్‌సైట్‌లో పొందుపరిచిన తరువాత మాత్రమే బిడ్డరు యొక్క "వాలెట్"లో చూపించబడుతుంది. బ్యాంకింగ్ ప్రక్రియలో ఇది జరుగుటకు సమయం పట్టవచ్చు, కావున బిడ్డర్లు చివరి నిముషంలో ఇబ్బందులు ఎదుర్కొనకుండా తమ ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డిను సాధ్యమైనంత త్వరగా జమ చేసుకోవాలనీ సూచించటమైనది.

గమనిక -2 : ఆదాయపు పన్ను చట్టం 1961లోని సెక్షన్ 194-1A ప్రకారం అమ్మకంలో భాగంగా అమ్మకం విలువ రూ.50,00,000/- (యాభై లక్షల రూపాయలు) మరియు అంతకంటే ఎక్కువ ఉన్నచో సదరు మొత్తముపై TDS @ 1% వర్తిస్తుంది. కావున సఫలీకృత బిడ్డరు/కొనుగోలుదారు గవర్నమెంట్ గైడ్‌లైన్స్ ధర లేదా అమ్మకం ధరలో ఏది ఎక్కువైతే దానిలో 1% TDS ను తగ్గించుకొని సదరు మొత్తమును ఆదాయపు పన్ను డిపార్ట్‌మెంట్ యొక్క ఫారం నెం.16-బి నందు జమచేయవలెను మరియు సదరు ఒరిజినల్ TDS సర్టిఫికెట్‌ను బ్యాంకు వారికి సమర్పించవలెను. (వ్యవసాయ భూమి కాకుండా కేవలం స్థిరాస్తికి మాత్రమే వర్తించును).

తేది:07-02-2026, ప్రదేశం: విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

జీవితాన్ని మార్చేది విద్యే!

ఎలమంచిలి, రాంబిల్లి, న్యూస్‌టుడే: జీవితాన్ని మార్చేది విద్య మాత్రమేనని డీఈఓ గిడ్డి అప్పారావు నాయుడు అన్నారు. బుధవారం ఆయన ఎలమంచిలి స్టేషన్‌రోడ్డు సోమలింగపాలెం, రాంబిల్లి మండలం దిమిలి పాఠశాలలను బుధవారం సందర్శించారు. పదిలో మంచి మార్కులు సాధనకు చక్కని ప్రణాళిక రూపొందించుకోవాలని కోరారు. ప్రతిరోజు కనీసం 6 నుంచి 8 గంటలపాటు చదవాలన్నారు. సమయపాలన పాటించాలన్నారు. క్రమశిక్షణతో చదివితే మంచి ఫలితాలు వస్తాయన్నారు.

భోజనం రుచి చూస్తున్న డీఈఓ అప్పారావునాయుడు

ఉపాధ్యాయులతో సమావేశమై పది విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా దృష్టి పెట్టాలని ఆదేశించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. జిల్లా ఉప విద్యాశాఖ అధికారి పి.అప్పారావు, ఎంఈఓ సూర్యప్రకాశరావు, వై.వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం శాస్త్రి పాల్గొన్నారు.

విజయవంతంగా కంటి శస్త్రచికిత్సలు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: బ్రాండిక్స్ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత కంటి శస్త్రచికిత్సలు విజయవంతమయ్యాయి. 45 మంది రోగులకు శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రిలో ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించి వీరిని బుధవారం బ్రాండిక్స్‌ తీసుకొచ్చారు. అనంతరం ఉచితంగా మందులు అందించి వీరిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. బ్రాండిక్స్ భారతీయ భాగస్వామి దొరస్వామి చొరవతో కంటిచూపు పొందామని రోగులు సంతోషం వ్యక్తం చేశారు.

శస్త్రచికిత్సలు చేయించుకున్న రోగులు

ఘంటసాల పాటల పోటీల విజేతలు వీరే

పాటల పోటీల్లో విజేతలతో నిర్వాహకులు

అనకాపల్లి, న్యూస్‌టుడే: అనకాపల్లి వేల్పులవీధిలోని జీవీఎంసీ పాఠశాలలో ఘంటసాల మండపం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాటల పోటీల విజేతలకు ఎస్‌వి. రాములమ్మ బహుమతులు అందజేశారు. సిద్ధార్థ సోషల్ సర్వీస్, కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్ల నాగభూషణం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో ఎస్. చార్విక్ మొదటి బహుమతి అందుకున్నారు. బి.శ్యామ్, ఎం.కుషిత ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. జి.మృదుల, డి.జయశ్రీ ప్రోత్సాహక బహుమతులు పొందారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జి.రామాంజనేయులు, నిర్వాహకులు వినకోట నీలేష్ గుప్తా, రొబ్బి మల్లేశ్వరరావు, వెంకటరమణమూర్తి, సోమరాజు, అప్పారావు పాల్గొన్నారు.

సామాజిక సేవలోకి అదనపు డీజీపీ

స్వచ్ఛంద పదవీ విరమణ చేస్తున్న కిల్లాడ సత్యనారాయణ

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: ఉత్తరప్రదేశ్ అదనపు డీజీపీగా ఉన్న కిల్లాడ సత్యనారాయణ ఈనెల 15న స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) తీసుకుంటున్నారు. పదవీ విరమణ తరువాత ఆంధ్రప్రదేశ్‌లో విద్యార్థుల్లో మాతృభాష పట్ల ఆసక్తి, సృజనాత్మకత పెంచడం, ఆన్‌లైన్ ద్వారా పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వడం తదితర కార్యక్రమాలను నిర్వహించాలన్నది తన అభిమతమని పేర్కొన్నారు. కోటవురట్ల మండలం పాములవాక గ్రామానికి చెందిన సత్యనారాయణ 1998బ్యాచ్ ఐపీఎస్ అధికారి. ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లో అదనపు డీజీపీ హోదాలో ఉన్నారు. ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 28 ఏళ్లపాటు సేవలు అందించారు. 2025లో రాష్ట్రపతి నుంచి విశిష్ట సేవా పురస్కారంతో పాటు మూడుసార్లు రాష్ట్రపతి చేతులమీదుగా పోలీసు మెడల్స్ అందుకున్నారు. కవిగా, సామాజిక సేవకుడుగా, ఉపన్యాసకుడిగా సామాజిక చైతన్యం కలిగించారు. ఎనిమిది పుస్తకాలను రచించారు.

అభిరామ్‌కు ఆపన్నహస్తం

'ఈనాడు' కథనంతో సాయం అందించేందుకు ముందుకొస్తున్న దాతలు

చింతపల్లి, న్యూస్‌టుడే: అయిన వారు దూరమై.. గుండెబరువై సాయం కోసం ఆర్తిగా ఎదురు చూస్తున్న అభిరామ్‌కు తామున్నామంటూ పలువురు ఆపన్నహస్తం అందించేందుకు ముందుకు వస్తున్నారు. జి.మాడుగుల మండలం గెమ్మెలి గ్రామానికి చెందిన పన్నెండేళ్ల వన్ను అభిరామ్ దయనీయ పరిస్థితిపై బుధవారం 'ఈనాడు'లో 'కన్నీళ్లకే కన్నీరొచ్చే కష్టం నీది చిన్నా' శీర్షికన కథనం ప్రచురితం అయ్యింది. అమ్మానాన్నా దూరమై, ఆలనాపాలనా చూసే నానమ్మ కన్ను మూయడంతో కొండంత కష్టంలో ఉన్న అభిరామ్‌ను పాము కాటేయడంతో ఆసుపత్రి పాలయ్యాడు. ✦ అభిరామ్ పరిస్థితిని పత్రికలో చూసిన సన్‌ఛారిటీ వ్యవస్థాపకులు సూరెడ్డి అప్పలనాయుడు బుధవారం నర్సీపట్నం ఆసుపత్రికి వెళ్లి బాధిత చిన్నారిని పరామర్శించారు. చిన్నారి చదువుకు తన వంతు సాయం అందించేందుకు ముందుకు వచ్చారు. కొయ్యూరుకు చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ప్రతినిధులు మల్లేష్, సభ్యులు కిరణ్ ఆసుపత్రికి వెళ్లి అభిరామ్‌ను పరామర్శించి తాత్కాలికంగా రూ.5 వేల ఆర్థికసాయం అందించారు. హైదరాబాద్‌కు చెందిన విశ్రాంత ఇంజినీరు రామకృష్ణ ఉప్పల్‌లోని అభిసాయిదత్త ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథాశ్రమంలో అభిరామ్‌ను చేర్పించేందుకు సిద్ధంగా ఉన్నానని భరోసా ఇచ్చారు.

అభిరామ్‌కు సాయం అందిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధి టి.మల్లేష్

సార్వత్రిక సమ్మెకు బ్యాంకు ఉద్యోగుల మద్దతు

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు అనుగుణంగా గురువారం చేపడుతున్న దేశవ్యాప్త సమ్మెకు బ్యాంకు ఉద్యోగులు మద్దతు తెలుపుతున్నారని యూనియన్ బ్యాంకు జాయింట్ కార్యదర్శి కాండ్రేగుల హరికృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బ్యాంకు ఉద్యోగులు అందరూ సమ్మెలో పాల్గొంటారన్నారు. విధులకు దూరంగా ఉండి సమ్మె చేస్తారని ఖాతాదారులు, ప్రజలు సహకరించాలన్నారు.

AUTO

VEHICLES FOR SALE

Maruti Car for sale 2008 Model Alto LXI (4 in all) submit sealed quotation on or before 16-02-2026 in the name of head master DAV Public School. Cont: 08924-224132, 9494289271.

BUSINESS SERVICES

శ్రీవల్లి గోల్డ్ లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ ధరకు కొనబడును, అధిక రుణం ఇప్పించబడును. ✆ 9908545224.

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై AP అంతటా మార్టిగేజ్ లోన్స్, స్థిరాస్తి ఎక్కడ ఉన్నా ఏసంస్థలో ఉన్నా Xerox పేపర్స్‌పై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. 50లక్షలులోపు, అయోధ్య కోఆపరేటివ్ బ్యాంక్. ✆ 93969 99669.

ప్రభుత్వ ఉద్యోగులకు పర్సనల్ లోన్స్ ఇళ్ల స్థలాలు, పొలాలు, ఫ్యాక్టరీలు, స్థిరాస్తులు, కాలేజీలపై తక్కువ వడ్డీతో ఫైనాన్స్ చేయబడును. బ్యాంకు లోన్స్‌లో ఉన్నా ఇవ్వబడును. *నో సిబిల్/ నో బ్రోకర్స్ *MSR గ్రూప్, వైజాగ్. Ph.:9121314141.

REAL ESTATE

LAND FOR SALE

GENERAL

పూసపాటిరేగ 'మం' గోవిందాపురం రోడ్డు హైవేకి 1/2KM తారురోడ్డు ఫేసింగ్ 9&4 ఎకరాలు కొబ్బరితోట అమ్మకం & హోటల్ లీజుకు కలదు. ✆ 9440255187.

JOBS

Wanted Part / Full Time Sales Promoters for well reputed Real Estate Co. MVP Vizag. Ph: 9493244471, 9396972239.

Job Opportunity. A fast growing org. shortly opening new branches in Vizag & reqd... (1) Sr. Manager (2) Field Officers (3) PRO. M/F. Age: 30+. Yrly Pkag: 5-15 Lakhs (Nego). For Intrw. ✆ 9347268543.

WALK - IN - INTERVIEW
An A1 GRADE COMPANY in Vizag/ Telangana Required the Following Positions.
★ Asst. GENERAL MANAGERS: 10 Posts M/F
Qlf: Degree to P.G. VRS/Retd., in any Sectors. Age: 35 to 65 Good Package, Flexible Timing, Attractive Remuneration.
★ MARKETING MANAGERS: 10 Posts
Qlf: Degree & Above, Need min., 1 Year Exp. in any Marketing Field Like Real Estate/ LIC/ Chit fund Companies Good Package + Perks.
Note: Interviews on 12th & 13th
Morning 10 to 7 PM. attend with Resume.
Con: Y.K.Rao - DGM Doctors Colony, VSP. Ph: 8121100599

EENADU eClassifieds

ఉద్యోగ అవకాశం
20 సం॥ల సుదీర్ఘ అనుభవం కలిగిన కార్పొరేట్ కంపెనీలో వైజాగ్ బ్రాంచ్‌లో పనిచేయుటకు క్రింద పేర్కొన్న స్టాఫ్ కావలెను.
❖BRANCH MANAGERS (M/F): 2 No's
❖DEVELOPMENT OFFICERS (M/F): 3 No's
అర్హత: ఏదైనా డిగ్రీ, అనుభవం: Minimum 3 to 5 years experience in Govt. / Retd. / Pvt. / Ex. Servicemen.
Package: Rs. 80,000 to 1.6 Lakhs PM
Interviews on: 12th & 13th Feb. 2026
Con: VADREVU SRINIVAS - DGM B.S. LAYOUT, VSP Ph: 7207744599 8555968393

Gujarat నిస్సానగర్‌లో ఉన్న హాస్టల్‌లో పనిచేయుటకు చెఫ్, మాస్టర్ చెఫ్, హెల్పర్స్ కావలెను. మెస్ కాంట్రాక్ట్‌కి ఇవ్వబడును. సం॥ 9505701977.

లేడీ ఆఫీస్ ఇంచార్జ్ -1, Qlf : డిగ్రీ, శాలరీ-15వేలు, ఆఫీస్ బాయ్ -1, ఆయా -1 అర్జెంటుగా కావలెను, MSR కన్‌స్ట్రక్షన్స్, శ్రీకన్య థియేటర్ దగ్గర, న్యూ కాలనీ, వైజాగ్. Ph: 9121232326

కావలెను
Electrical D.C — వాల్తేరు RTC డిపో నందు పనిచేయుటకు ITI పాస్ అయిన వారికి ప్రాధ్యానత ఉంటుంది.
SD Oil TopUp — విశాఖపట్నం RTC డిపో మద్దిలపాలెం దగ్గర RTC బస్సులకు డీజిలు వేయుటకు 7వ తరగతి చదివినవారు కావలెను.
శ్రీ లక్ష్మీ ప్రసన్న సర్వీసెస్ ఆరిలోవ, విశాఖపట్నం 80080 58734

DRIVERS

ప్రముఖ రియల్‌ఎస్టేట్ కంపెనీలో పనిచేయుటకు అనుభవంగల కార్ డ్రైవర్స్ (2) కావలెను. జీతం: 15,000/- - 18,000/- ✆ 7093563940, 9603167030

SECURITY GUARDS

వైజాగ్‌సిటీలో అన్ని ప్రాంతాల్లో పనికొరకు సెక్యూరిటి సూపర్‌వైజర్స్, గార్డ్స్, హౌస్‌కీపింగ్స్, ఆఫీస్ స్టాఫ్ లేడీస్ & జెంట్స్ కావలెను. రూమ్, భోజనం ఫ్రీ. జీతం: 18 వేలు, 36 వేలు. ✆ 6300071128.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

జాతీయ కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: నిజి షోటోకాన్ జాతీయ కరాటే పోటీల్లో అచ్యుతాపురం శ్రీభవానీ విద్యానికేతన్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపించారు. ఈనెల 9, 10 తేదీల్లో విశాఖలో జరిగిన ఈ పోటీల్లో వివిధ విభాగాల్లో 28 మంది విద్యార్థులు బహుమతులు సొంతం చేసుకున్నారు. వీరిలో ఎనిమిది మంది బంగారు పతకాలు, 12 మంది రజత, మరో ఎనిమిది మంది కాంస్య పతకాలు పొందారు. ఈ విద్యార్థులను పాఠశాల వ్యవస్థాపకులు కూండ్రపు మూర్తి ప్రసాద్, కరస్పాండెంట్ సంతోష్, డైరెక్టర్ శ్రీలత అభినందించారు.

పతకాలు పొందిన విద్యార్థులతో మూర్తి ప్రసాద్

తోడుగా వచ్చి.. ప్రాణాలు తీసే..!

ఆనందపురం, న్యూస్‌టుడే: కొన్నాళ్ల నుంచి సహజీవనం సాగిస్తున్న ఇద్దరి మధ్య గొడవలు రావడంతో, పురుషుడిని మహిళ దారుణంగా హత్య చేసిన ఘటన ఆనందపురం శివారు పందుల ఫారంలో చోటు చేసుకుంది. బుధవారం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలివి. మధురవాడ ప్రాంతానికి చెందిన పైడిరాజు ఆనందపురం శివారులో రెండేళ్ల నుంచి పందుల ఫారం నిర్వహిస్తున్నాడు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన ఎస్.నాగశివ(38), షేక్ ముబీనా(శ్రావణి)(41) భార్యాభర్తలుగా పరిచయం చేసుకుని, ఫారం నిర్వహణ పనులు చూసుకుంటున్నారు. మంగళవారం అర్ధరాత్రి ఇద్దరూ మద్యం తాగి, ఆ మత్తులో గొడవ పడ్డారు. అయితే బుధవారం ఉదయం నాగశివ మృతి చెందినట్లు శ్రావణి 112 నెంబర్‌కు సమాచారం ఇచ్చింది. ఆనందపురం పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతి చెందిన తీరు, పరిసరాలు అనుమానాస్పదంగా ఉండడంతో ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. మధురవాడ ఏసీపీ అప్పలరాజు ఆధ్వర్యంలో డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీం సభ్యులు ఆధారాలు సేకరించారు. మృతుడి శరీరంపై గట్టి దెబ్బలు ఉండడంతో శ్రావణిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించి, ఆమె హత్య చేసినట్టు నిర్ధారించారు. నిందితురాలికి గతంలోనే వివాహం అయినట్టు పోలీసులు తెలిపారు. మద్యం మత్తులో గొడవ పడడంతో హత్య జరిగిందా..? పథకం ప్రకారమే జరిగిందా...? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, మృతుడి బంధువులకు సమాచారం ఇచ్చినట్లు సీఐ వాసునాయుడు తెలిపారు.

విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఐటీఐ, డిప్లమా అభ్యర్థులకు సౌదీ అరేబియాలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు సంస్థ జిల్లా అధికారి ఎన్.గోవిందరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు http://naipunyam.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 99888 53335, 87126 55686, 87901 18349 నంబర్లను సంప్రదించాలన్నారు.

విద్యార్థుల సురక్షిత ఆరోగ్యమే కీలకం

కశింకోట, న్యూస్‌టుడే: విద్యార్థుల సురక్షిత ఆరోగ్యంతో భవిష్యత్తులో దృఢమైన సమాజం ఏర్పడుతుందని కేంద్రబృందం ప్రతినిధి డాక్టర్ రమణ సూచించారు. తాళ్లపాలెం గురుకుల బాలికల ఆశ్రమ పాఠశాలను బుధవారం రాత్రి కేంద్రబృందం ప్రతినిధులు డా. పడాల్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల మానసిక ఆరోగ్యం, భవిష్యత్‌లో కాబోయే యువత ఎలా ఉండాలి, సమాజంలో సమస్యలను ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, ఆహార నియమాలు, పోషకాహారంపై వివరించారు. జిల్లా ఆర్‌బీఎస్‌కే అధికారిణి డా. ఎస్తేరు రాణి, పీహెచ్‌సీ వైద్యాధికారిణి సుమ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రమణ

స్పందనకు వందనం

వీధిదీపాల పునరుద్ధరణ

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లిలోని పూడిమడక రోడ్డులో వీధిదీపాలకు బుధవారం మరమ్మతులు చేపట్టారు. 'ఈనాడు'లో ప్రచురితమైన 'వెలగని దీపాలు.. కమ్మేస్తున్న చీకట్లు' కథనానికి స్పందించిన జీవీఎంసీ ఏఈ గణేష్ సిబ్బందితో రామాలయం వెనక వీధిలోని వీధి లైట్లకు మరమ్మతులు చేపట్టారు. దీంతో సమస్య తీరింది.

గంజాయి నిందితుడికి పదేళ్ల జైలు

చోడవరం, న్యూస్‌టుడే: గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన సీరా అప్పలనాయుడుకు పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ స్థానిక తొమ్మిదో అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ బుధవారం తీర్పు చెప్పారు. జైలు శిక్ష, రూ.లక్ష జరిమానాను విధించారు. 2016లో సీరా అప్పలనాయుడు 60 కిలోల గంజాయితో చీడికాడ పోలీసులకు చిక్కాడు. కేసు విచారణలో అప్పలనాయుడిపై నేరారోపణ రుజువుకావడంతో కోర్టు శిక్ష విధించింది. అప్పటి చీడికాడ పోలీస్ ఎస్సై ఎ.కోటేశ్వరరావు దర్యాప్తు జరిపారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా చీపురుపల్లి సూర్యనారాయణ కేసు వాదించారు. పోలీస్ సిబ్బందిని ఎస్పీ తుహిన్ సిన్హా అభినందించారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	115	110
లైవ్	142	130
డ్రెస్డ్	206	230
స్కిన్‌లెస్	234	240

(c) eenadu

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న పీలా గోవింద సత్యనారాయణ

14న గౌరీపరమేశ్వరుల ఉత్సవం

కశింకోట, న్యూస్‌టుడే: కశింకోటలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి భీమరశెట్టి రామకృష్ణ, తెదేపా జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ కోరారు. ఈనెల 14న నిర్వహించే ఉత్సవానికి సంబంధించిన కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. కమిటీ సభ్యులు వేగి గోవిందు, కాండ్రేగుల సతీష్, పెంటకోట రాము, వేగి దొరబాబు పాల్గొన్నారు.

బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ర్యాలీ

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: బాల్య వివాహాలకు వ్యతిరేకంగా కొనెంపాలెం, పూడిమడకలో గ్రామాల్లో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుహాసిని ఆధ్వర్యంలో విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్లకార్డులతో ర్యాలీ చేశారు. ఆరోగ్యవంతమైన సమాజం సృష్టించడానికి అందరూ బాల్య వివాహాలను అడ్డుకోవాలన్నారు. హెచ్‌ఎం రూపాదేవి, కార్యకర్తలు సరోజని, పైడిరత్నం పాల్గొన్నారు.

ఐసీడీఎస్ అధికారుల ర్యాలీ

అవీ ఇవీ

రేపు విద్యుత్తు సరఫరా నిలిపివేత

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: ఆర్‌డీఎస్ఎస్ పనుల నిమిత్తం శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ గోపి తెలిపారు. తిమ్మాపురం అడ్డురోడ్డు, గుడివాడ, కొరుప్రోలు, లక్ష్మీపతిరాజుపేట, బంగారమ్మపేట, కొత్త పోలవరం, వాతాడ, పెదఉప్పలం, రేవుపోలవరం, గుర్రాజుపేట, కొనవానిపాలెం గ్రామాలకు పాటు, కొరుప్రోలు పేము పరిశ్రమలు, చినఉప్పలం రొయ్యల చెరువులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరా ఉండదన్నారు.

నక్కపల్లి: వేంపాడు, నెల్లిపూడి, డీఎల్‌పురం, గునుపూడి, చీడిక, ఉపమాక, రేబాక, చినదొడ్డిగల్లు, దొండాడ, దోసలపాడు, జి.జగన్నాథపురం, గుల్లిపాడు గ్రామాల్లో ఉదయం 5 గంటల నుంచి 7, తిరిగి 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా ఉండదని ఈఈ రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు.

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పేట సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా పాయకరావుపేట, పి.ఎల్.పురం, సీతారాంపురం, నామవరం, గుంటపల్లి గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి 11 వరకు విద్యుత్తు సరఫరా ఉండదని ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. వ్యవసాయానికి ఉదయం 5 నుంచి 7 వరకు, 11 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా చేస్తామని చెప్పారు.

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ఎం.జగన్నాథపురం, యర్రవరం, ఉప్పవరం, మల్లవరం, పెదపాడు, హరిపాలెం, ఆంధ్రలాపల్లి, కొండకర్ల, నరేంద్రపురం, ఖాజీపాలెం, జగన్నపేట గ్రామాలకు ఈనెల 13న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3వరకు విద్యుత్తు సరఫరా ఉండదని ఈఈ రాజశేఖర్ తెలిపారు.

మునగపాక, న్యూస్‌టుడే: చూచుకొండ, గణపర్తి, కుమారపురం, పల్లపు ఆనందపురం మడకపాలెం, చెర్లోపాలెం, నరేంద్రపురం గ్రామాలకు శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం మూడుగంటల వరకు విద్యుత్తు నిలుపుదల చేస్తామని డీఈఈ మురళీకృష్ణ తెలిపారు.

యాదవ సంఘం ఉపాధ్యక్షుడిగా వియ్యపు

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా తుమ్మపాలకు చెందిన వియ్యపు సింహాచలం ఎన్నికైనట్లు అధ్యక్షుడు భరణికాన సాయినాథ్‌బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంఘం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన తెలిపారు.

భాజపా కిసాన్ మోర్చాకు రాజుబాబు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: భాజపా కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడుగా ఉప్పవరానికి చెందిన పల్లి రాజుబాబు నియమితులయ్యారు. ఈమేరకు కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు ఎస్‌వీవీ శంకరరావు నియామక పత్రాన్ని బుధవారం అచ్యుతాపురంలో అందించారు. ఆయనను నాయకులు రాజాన సన్యాసినాయుడు, తురాయి శ్రీరాములు అభినందించారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లిలోని 82వార్డు తెదేపా ఇన్‌ఛార్జి పోలవరపు త్రినాథ్ జన్మదిన వేడుకల సందర్భంగా బుధవారం పేదలకు దుప్పట్లు, రగ్గులు పంపిణీ చేశారు. అన్న సంతర్పణ చేపట్టారు.

లేగదూడల ప్రదర్శన

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: దోసూరులో బుధవారం లేగదూడల ప్రదర్శన జరిగింది. వివిధ గ్రామాల పాడిరైతులు లేగదూడలను తీసుకొచ్చారు. ప్రత్యేక పర్యవేక్షణ అధికారి పీవీ సుధాకర్, పశుసంవర్ధకశాఖ జేడీ రామ్మోహనరావు, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈఓ సజ్జ శ్రీనివాసరావు హాజరయ్యారు. వీటిలో గొర్రెల తాతయ్య, కర్రి అప్పారావు, బంటుమిల్లి అప్పారావు పెంచుతున్న దూడలకు బహుమతులు అందించారు. ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసి పశువులకు చికిత్స అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఏడీ గణేష్, వైద్యులు జగదీశ్, సౌజన్య, సుమతీరాణి, ఉమామహేశ్వరీ పాల్గొన్నారు.

పాఠశాలపై చర్యలు తీసుకోండి

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఏటికొప్పాక లోని ప్రైవేటు పాఠశాలలో తరగతి గదులు చాలక విద్యార్థులను ఆరుబయట నేలపై కూర్చోబెడుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.బాలాజీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరోపించారు. ఇటువంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సాంకేతిక విద్యతో కొలువులు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలు సాధించారు. వివిధ ఏడాదిలో 57 మంది ఉద్యోగాలు సాధించారు. ఈ కళాశాలలో ఈసీఈ, కంప్యూటర్ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఐటీఐల కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలు సాధించారు. శిక్షణ సమయంలో ఏడాదికి రూ.3.05 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలు పొందారు. అనంతరం వీరికి జీతాలు పెంచేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. కొలువులు సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేయడం వీరి కుటుంబాల్లో వెలుగులు నింపుతోంది.

ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపల్, సిబ్బంది

ఆనందంగా ఉంది: సాంకేతిక విద్యను అభ్యసించడం వల్ల త్వరగా ఉద్యోగం వచ్చింది. పాలిటెక్నిక్‌లో సీటు పొందాలన్న లక్ష్యంతో చదివాను. మంచి ర్యాంకు రావడంతో సీటు సాధించాను. కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ నియామకంలో ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది. – సీహెచ్ భావన

కుటుంబానికి చేదోడుగా..: అమ్మానాన్న ఎంతో కష్టపడి చదివిస్తున్నారు. ఈసీఈ మూడో ఏడాది చదువుతుండగా క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగం వచ్చింది. శిక్షణ సమయం అనంతరం జీతం పెరుగుతుందని చెప్పారు. మంచి కంపెనీల్లో ఉద్యోగం సాధించేలా ఇక్కడ శిక్షణ అందిస్తున్నారు. – దేవీ వరప్రసాద్

ఉద్యోగాలు లభించేలా శిక్షణ: సాంకేతిక విద్యతో చిన్న వయసులోనే ఉద్యోగాలు పొందే అవకాశం ఉంది. మంచి ర్యాంకులు సాధించి ఇక్కడ ప్రవేశం పొందిన వీరికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా శిక్షణ ఇస్తున్నాం. ప్రముఖ కంపెనీలో మంచి ప్యాకేజీతో ఉద్యోగాలు పొందుతున్నారు. – ఐవీఎస్ఎస్ శ్రీనివాసరావు, ప్రిన్సిపల్, రేబాక పాలిటెక్నిక్ కళాశాల

దడ పుట్టిస్తున్న కల్వర్టులు

పేటలో కల్వర్టులు దడ పుట్టిస్తున్నాయి. దశాబ్దాల కిందట కాలువలపై రాకపోకలకు వీలుగా వీటిని నిర్మించారు. క్రమేణా శిథిలావస్థకు చేరడంతో రాకపోకలకు ఆందోళన చెందుతున్నారు. తాజాగా పట్టణంలోని రాజుగారిబీడులోని నేరెళ్ల కాలువపై ఉన్న కల్వర్టు కుప్పకూలిన విషయం తెలిసిందే. రాత్రిపూట సంఘటన జరగడంతో పెద్దప్రమాదమే తప్పింది. పట్టణంలోని భూమి కాలువపై బృందావనం నుంచి మేకల రేవుపుంత, రాజీవ్‌నగర్ కాలనీకి వెళ్లే దారిలోనూ, ధనిశెట్టినగర్, ప్రశాంతినగర్ వెళ్లేందుకు నిర్మించిన కల్వర్టులపై భారీ వాహనాలు కూడా తిరుగుతున్నాయి. అధిక లోడుతో తిరిగే వాహనాలతో కల్వర్టులకు బీటలు వస్తున్నాయి. దీంతో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కల్వర్టులను పటిష్ఠం చేయాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పాయకరావుపేట

ఫార్మరీ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

నక్కపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాల లబ్ధికి రైతులంతా తప్పనిసరిగా ఫార్మరీ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయాధికారి ఉమాప్రసాద్ కోరారు. మండలంలోని జానకయ్యపేట, గొడిచెర్లలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను బుధవారం పరిశీలించిన ఆయన రైతులతో మాట్లాడారు. మండలంలో 8200 మంది రైతులకు గాను 2 వేల మంది వరకు ఇందులో నమోదు చేయించుకోలేదన్నారు. రిజిస్ట్రేషన్ జరగకుంటే పంటల బీమా, పెట్టుబడి సాయం, అన్నదాత సుఖీభవ, కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.

నగదు అందిస్తున్న శేఖర్

శివాలయం అభివృద్ధికి రూ.లక్ష విరాళం

అచ్యుతాపురం: దోసూరు సోమలింగేశ్వరస్వామి ఆలయం అభివృద్ధికి రావిపాలేనికి చెందిన కర్రి శేఖర్ రూ.లక్ష విరాళాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధి నర్మాల రామకృష్ణకు బుధవారం అందించారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డ్రీమ్స్ నాయుడు, వెదురువాడ సర్పంచి కొయ్యా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులివ్వండి

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: గ్రామాల్లో అభివృద్ధి పనులకు సీఎస్ఆర్ నిధులు అందించాలని తెదేపా మండల అధ్యక్షులు కర్రి సన్యాసినాయుడు ఎంపీ సీఎం రమేష్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. హైమాస్ట్ దీపాలు, ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు సహకరించాలని కోరారు.

కాలువ నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు

నక్కపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని ముకుందరాజుపేట వద్ద జరుగుతున్న పోలవరం ఎడమ కాలువ నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు దార్ల కృష్ణ ఆరోపించారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ గుత్తేదారు గెడ్డపై వంతెన నిర్మాణ పనులు మొదలు పెట్టారని ఈ క్రమంలో ఇక్కడ కాంక్రీటులో మట్టి కలిసిపోతున్నా పట్టించుకోవడంలేదన్నారు. ఫలితంగా నాణ్యత దెబ్బతింటుందన్నారు. దీనిపై మంత్రి అనితకు ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు.

గెడ్డలో నిర్మాణ పనులు

మట్టి రహదారితో అవస్థలు

విద్యుత్తునగర్‌లో మట్టి రహదారి

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: తుమ్మపాల విద్యుత్తు నగర్ వాసులు ఏళ్ల తరబడి మట్టి రహదారితో అవస్థలు పడుతున్నారు. ఈ రహదారిని ఆనుకొని చినబాబుకాలనీ, వాటర్‌వర్క్స్ ఏరియా, మధురానగర్, గాంధీనగర్, అంజయ్యకాలనీ ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి వేళల్లో పాములతో ఆందోళన చెందుతున్నారు. సిమెంట్ రహదారి నిర్మించాలని పలుమార్లు పంచాయతీ అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాగునీరు పారేదెలా?

మునగపాక, న్యూస్‌టుడే: ఉపాధి హామీలో సాగునీటి కాలువల్లో తొలగించిన పిచ్చిమొక్కలను తిరిగి కాలువలోనే వేస్తున్నారు. నీటి ప్రవాహానికి ఇవి కొట్టుకొచ్చి రెగ్యులేటర్ల వద్ద పేరుకుపోతున్నాయి. ఈ కారణంగా భూములకు నీరు ప్రవహించే సమయంలో దిగువ ఆయకట్టుకు చుక్క నీరు కూడా చేరని పరిస్థితి నెలకొంటోంది. అనకాపల్లి ఆవకాలువపై తోటాడ, మూలపేట, మునగపాక వద్ద, కృష్ణంరాజు ఛానల్‌పై పేటకట్టు వద్ద చెత్త కుప్పలుగా పేరుకుపోయింది. జలవనరులశాఖ అధికారులు స్పందించి ఈ చెత్తను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

తోటాడ రెగ్యులేటర్ ముందు చెత్త

అభివృద్ధే ధ్యేయం

రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న నాయకులు

మునగపాక, న్యూస్‌టుడే: అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మండల జనసేన అధ్యక్షుడు టెక్కలి పరశురామ్ అన్నారు. మూలపేటలో రూ. 19 లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో సిమెంట్‌రోడ్డు నిర్మాణానికి బుధవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు పెంటకోట విజయ్, సర్పంచి భీశెట్టి గంగప్పలనాయుడు, నాయకులు ఆడారి ఆనంద సన్యాసినాయుడు, ఏవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

అనకాపల్లి గ్రామీణం, నక్కపల్లి, న్యూస్‌టుడే: కోడూరులో రూ. 8 లక్షలతో సిమెంట్ రహదారి పనులను ప్రారంభించారు. బోయపాడు ప్రధాన రహదారిలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ రోడ్డు కొంత మేర దెబ్బతినడంతో సమీపంలో బల్క్‌డ్రగ్ నిర్మాణ పనులు చేస్తున్న ఎస్ఆర్ఆర్ ప్రతినిధులకు ఈ సమస్యను స్థానిక నాయకులు తీసుకెళ్లగా కాంక్రీటు రోడ్డు వేశారు. దీర్ఘకాల సమస్యకు పరిష్కారం లభించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రతినిధులకు మాజీ ఉప సర్పంచి, తెదేపా నేత సిరిపల్లి అప్పలరాజు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

రామలింగేశ్వరస్వామి ఆలయంలో తహసీల్దార్ సత్యనారాయణ, ఎస్సై ప్రసాదరావు

మునగపాక, న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా ప్రధాన ఆలయాల్లో ముందస్తుగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ సత్యనారాయణ, ఎస్సై ప్రసాదరావు దేవదాయశాఖ ఈఓ మూర్తి సూచించారు. నాగులాపల్లి రామలింగేశ్వరస్వామి, వాడ్రాపల్లి దక్షిణేశ్వరస్వామి, మూలపేట గంగాలమ్మ, టి.సిరసపల్లి వీరభద్రస్వామి ఆలయాలను బుధవారం సందర్శించి పలు సూచనలు చేశారు.

నక్కపల్లి, న్యూస్‌టుడే: గ్రామాల్లో దేవాలయాల భద్రతకు ప్రజలంతా సహకరించాలని సీఐ జె.మురళి కోరారు. రేబాక, గుల్లిపాడు తదితర గ్రామాల్లో బుధవారం పర్యటించిన ఆయన స్థానికులతో సమావేశమయ్యారు. రాజయ్యపేటలో ఎస్సై సాహిబా అంజుమ్ సమావేశం నిర్వహించారు.

కశింకోట, న్యూస్‌టుడే: కశింకోటలో దేవాలయాలను సీఐ అల్లు స్వామినాయుడు, ఎస్సై కె.లక్ష్మణరావుతో కలిసి సందర్శించి సూచనలు చేశారు.

ఎన్నికల్లో తెదేపా విజయమే లక్ష్యం

రాంబిల్లి, న్యూస్‌టుడే: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెదేపా విజయమే లక్ష్యంగా పనిచేయాలని మాజీ ఎంపీ పప్పల చలపతిరావు కోరారు. లాలంకోడూరులో బుధవారం పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు లాలం భరత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు అధిష్ఠానం గుర్తించి నామినేటెడ్ పదవులు కట్టబెట్టిందని గుర్తు చేశారు. నాయకులు దూళి రంగనాయకులు, వి.దిన్నుబాబు, ఎరిపల్లి చిట్టిబాబు, కరెడ్ల ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఎలమంచిలి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని మాజీ ఎంపీ పప్పల చలపతిరావు అన్నారు. బుధవారం ఎలమంచిలి పార్టీ కార్యాలయంలో ఆయన తెదేపా నాయకులతో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నాయకులు గొర్లె నానాజీ, ఇత్తంశెట్టి రాజు, దాడి రమేష్, గొర్లె బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆరోగ్యమే రక్ష

కశింకోట, న్యూస్‌టుడే: కంటి ఆరోగ్యమే విద్యార్థులకు రక్షగా ఉంటుందని వైద్యాధికారి తిరుపతిరావు సూచించారు. తేగాడ కస్తూర్బా విద్యాలయం, ఆదర్శ పాఠశాల విద్యార్థులకు బుధవారం కళ్లద్దాలు పంపిణీ చేశారు. కంటి వైద్యాధికారి మురళీకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి కళ్ల అద్దాలను ఎంపీటీసీ సభ్యులు అద్దేపల్లి బాబురావు చేతుల మీదుగా అందజేశారు. అనంతరం విద్యార్థులకు కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. వైద్య సహాయకులు ఈశ్వరరావు, ప్రిన్సిపల్ వి.రత్నవల్లి, ప్రత్యేకాధికారిణి చంద్రకళ, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

విద్యార్థులకు కళ్లద్దాలు అందజేస్తున్న వైద్యాధికారి తిరుపతిరావు

క్రీడలతో మానసిక ఉల్లాసం

కోటవురట్ల, న్యూస్‌టుడే : క్రీడలు ఆడటం వలన మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యంగా ఉంటామని తెదేపా మండల అధ్యక్షులు పెట్ల లింగన్ననాయుడు అన్నారు. బుధవారం బాపిరాజు కొత్తపల్లిలో షటిల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. అడవి రాజులబాబు పండగను పురస్కరించుకొని ఈ టోర్నమెంట్‌ను జరుపుతున్నామన్నారు. క్రీడల్లో యువకులు రాణించాలని కోరారు. ఎంపీటీసీ సభ్యులు రాంబాబు, నరేష్, యువకులు పాల్గొన్నారు.

మరిడిమాంబకు పూజలు

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: తుమ్మపాలలో మరిడిమాంబ అమ్మవారిని తెదేపా జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ బుధవారం దర్శించుకున్నారు. అనంతరం సారె ఊరేగింపులో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు కొణతాల శ్రీనివాసరావు, ఆడారి గోవిందరావు, మాదేటి రామునాయుడు, కొణతాల శివాజీ పాల్గొన్నారు.

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ఎలమంచిలి ద్వారకానగర్‌లో శ్రీకృష్ణుని ఆలయ వార్షికోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అన్న సమారాధన ఏర్పాటు చేశారు. మహిళల కోలాటాలు, భజనలు ఆకట్టుకున్నాయి. యాదవ సంఘం పెద్దలు దూళి దేముళ్లు, నాగు తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి, న్యూస్‌టుడే: ఉపమాక కనకదుర్గ ఆలయ వార్షిక వేడుక భక్తిశ్రద్ధలతో జరిగింది. ఉదయం ధర్మకర్త కొప్పిశెట్టి రమణ ఆధ్వర్యంలో పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

గురుకులానికి సొంత భవనం కేటాయించాలి

డీటీకి ఫిర్యాదు చేస్తున్న దేవవరం గ్రామస్థులు

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: లింగరాజుపాలెం బాలికల గురుకుల పాఠశాలకు సొంత భవనం కేటాయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బాలాజీ ఆర్డీవో రమణకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ఉన్న తుపాను రక్షిత భవనంలో అయిదు గదులు మాత్రమే ఉన్నాయని తెలిపారు.

శ్మశాన స్థలానికి రక్షణ కల్పించాలి

నక్కపల్లి, న్యూస్‌టుడే: దేవవరంలో శ్మశానస్థలం ఆక్రమణలకు గురికాకుండా రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు గొర్ల నరసింహమూర్తి, దండు బలరాం రాజు డీటీ నారాయణరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో పద్మశాలీలకు కేటాయించిన స్థలం ఆక్రమణలకు గురవుతుందన్నారు. ఈ స్థలానికి రక్షణగా కంచె ఏర్పాటు చేయాలన్నారు.

పాఠశాలను మార్పు చేయాలి

తమ్మయ్యపేట పాఠశాలను పునరావాస కాలనీకి మార్పు చేయించాలని స్థానికులు దేవి, రాణి, దుర్గ, వరలక్ష్మి తదితరులు డీటీ నారాయణరావుకు వినతి పత్రం అందించారు. విద్యార్థుల చదువుకు ఆటంకం లేకుండా బడిని పెదబోదుగల్లం పునరావాస కాలనీలో పెట్టాలన్నారు.

దీన్‌దయాల్ సేవలు ప్రశంసనీయం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: దేశానికి సేవ చేయడం ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ సుహాసిని ఆనంద్ అన్నారు. అనకాపల్లి భాజపా కార్యాలయంలో బుధవారం దీన్‌దయాల్ వర్ధంతి సందర్భంగా సమర్పణ దివస్‌ను నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బొడ్డేడ నాగేశ్వరరావు, రామునాయుడు, భరత్, వర్మ, నర్సింగ్‌యాదవ్ పాల్గొన్నారు.

రాంబిల్లి, మునగపాక, అచ్యుతాపురం, నక్కపల్లి, ఎలమంచిలి, న్యూస్‌టుడే: రాంబిల్లిలో భాజపా మండల కమిటీ అధ్యక్షుడు కారె రాముడు ఆధ్వర్యంలో, నాగులాపల్లిలో మండల భాజపా అధ్యక్షుడు మళ్ల కాళేశ్వరరావు ఆధ్వర్యంలో, అచ్యుతాపురంలో భాజపా నియోజకవర్గ కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు ఆధ్వర్యంలో నక్కపల్లిలో మండలశాఖ అధ్యక్షుడు పోలినాటి నానాజీ ఆధ్వర్యంలో, ఎలమంచిలి భాజపా కార్యాలయంలో జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఆడారి శ్రీధర్, పట్టణపార్టీ అధ్యక్షులు బొద్దపు శివ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు.



నక్కపల్లిలో నివాళులు అర్పిస్తున్న భాజపా నాయకులు

వైద్యసేవల్లో లోపాలు ఉంటే ఫిర్యాదు చేయండి

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని, లోపాలు ఉంటే నేరుగా తనకు ఫిర్యాదు చేయవచ్చని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్ తెలిపారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయనను ప్రజాసంఘాల సభ్యులు బుధవారం కలిసి సత్కరించారు. రోగులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రానికి వితరణ

మునగపాక, న్యూస్‌టుడే: నాగులాపల్లి అంగన్‌వాడీ కేంద్రానికి బుధవారం క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ లిమిటెడ్ సంస్థ సీఎస్ఆర్ నిధులతో కుర్చీలను సమకూర్చింది. బేబీ కుర్చీలతోపాటు ఫైబర్ కుర్చీలు, కార్పెట్‌ను సంస్థ ఏరియా మేనేజరు రామచంద్రరావు అందజేశారు. మరిన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి మేనేజరు అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి- 80085 74722	పాయకరావుపేట- 80085 74750
ఎలమంచిలి- 80085 74726	

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ?: కశింకోట అగ్రహారం వీధిలో కాలువ బాగోలేదు. వీధి లైట్లు వెలగడం లేదు. కుక్కలు, పందుల సంచారం ఎక్కువగా ఉంది. – కొయిలాడ శ్రీరాం ✓: సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.– ఎం.జగన్ మోహన్‌రావు, పంచాయతీ కార్యదర్శి.

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని బృందావనం ప్రాథమిక పాఠశాల సమీపంలో మురుగు నిలిచిపోయింది. విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.– కె.రవి, స్థానికుడు ✓: కాలువలో మురుగు తొలగిస్తాం. – వై.సత్యనారాయణ, ఈవో

పాయకరావుపేట, న్యూస్‌టుడే ?: పట్టణంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న పార్కులో ఆట వస్తువులు ఏర్పాటు చేయాలి. పూర్తిస్థాయిలో విద్యుత్తు దీపాలు నెలకొల్పాలి. – జి.వెంకటేశ్వరరావు, స్థానికుడు ✓: పార్కులో వసతులు మెరుగు పరుస్తాం.– వై.సత్యనారాయణ, పంచాయతీ ఈవో

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ?: సీతారాంపురం కూడలి వద్ద ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. – రామారావు, గ్రామస్థుడు ✓: ప్రమాదాలు నివారణకు చర్యలు తీసుకుంటాం. – అప్పన్న, సీఐ

?: వెంకటనగరం పంపానది వంతెన అప్రోచ్ రహదారికి ఇరువైపులా రెయిలింగ్ లేదు. – గ్రామస్థులు ✓: ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి రెయిలింగ్ ఏర్పాటు చేస్తాం. – సత్యనారాయణ, కార్యదర్శి

అచ్యుతాపురం, న్యూస్‌టుడే ?: కొండకర్ల-చోడపల్లి మధ్య నాటేందుకు తీసుకొచ్చిన చెట్లను రోడ్డు మధ్యలో వదిలేశారు. వీటివల్ల తరుచూ ట్రాఫిక్ ఇబ్బందులు వస్తున్నాయి.– చిన్న, ఆటోడ్రైవర్, తిమ్మరాజుపేట. ✓: రసాయన ప్రక్రియ అనంతరం వాటిని తిరిగి నాటడానికి సిద్ధంగా ఉంచాం. – పద్మిని, ఏఈ

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ?: ఖాజీపాలెంలో డంపింగ్‌యార్డుకు స్థలంలేక చెత్తను ఎక్కడపడితే అక్కడ వేస్తున్నారు. – అప్పారావు, ఖాజీపాలెం ✓: స్థలం కేటాయించడానికి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తాం. – శ్యామ్, ఉపతహసీల్దార్

అనకాపల్లి, న్యూస్‌టుడే: ?: గవరపాలెం కర్రివారివీధిలో కుక్కలు ఎక్కువగా ఉన్నాయి.– కాండ్రేగుల చిన్న భాస్కరరావు, అనకాపల్లి ✓: కుక్కలకు కు.ని. ఆపరేషన్లు చేయిస్తాం. – రవికుమార్, శానిటరీ సూపర్‌వైజర్

తెరుచుకున్న శుద్ధజల కేంద్రం

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: వెంకటనగరంలో సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన శుద్ధ జలాల కేంద్రం తెరుచుకుంది. గత కొన్ని రోజులుగా మూసివేయడంతో 'శుద్ధ జల కేంద్రం ఉన్నా.. లేనట్లే' శీర్షికతో 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన హోంమంత్రి కార్యాలయం అధికారులు...తక్షణమే దీనిని తెరిపించి గ్రామస్థులకు అందుబాటులోకి తెవాలని ఆదేశాలిచ్చింది. దీంతో గ్రామ కార్యదర్శి వై.సత్యనారాయణ, సర్పంచి వంకా రమణ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకొచ్చారు.

రహదారి పరిశుభ్రం

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: రహదారి పక్కన చెత్త వేయకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు డిప్యూటీ ఎంపీడీఓ సత్యనారాయణ ఆదేశించారు. 'ఈనాడు'లో ప్రచురితమైన 'చెత్త తొలగించరూ' వార్తపై ఆయన స్పందించారు. రేవుపోలవరం-బంగారమ్మపాలెం ఆర్‌అండ్‌బీ రహదారి పక్కన ఉన్న చెత్త నిల్వలను జేసీబీతో తొలగింపు చర్యలు చేపట్టారు.

స్పందనకు వందనం

శ్రమదానంతో తుప్పల తొలగింపు

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: పులపర్తి అంగన్‌వాడీ కేంద్రం వద్ద సిబ్బంది తుప్పలను తొలగించి శుభ్రం చేశారు. ఈనెల 9న 'ఈనాడు'లో 'అంగన్‌వాడీ స్వచ్ఛత కొరవడి' శీర్షికన ప్రచురితమైన వార్తకు ఐసీడీఎస్ అధికారులు స్పందించారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి కె.ఇందిరాదేవి ఆధ్వర్యంలో తుప్పలు, చెత్త తొలగించే పనులు చేయించారు.

(c) eenadu

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకన్య ఆడి1: అనగనగా ఒకరాజు, ఆపరేషన్ పద్మ, సుమతీ శతకం, అనీ, ఆడి2: యుఫోరియా, ఆడి3: మన శంకర వరప్రసాద్ గారు, ఆడి4: ఎర్ర చీర, మిస్టర్ చిదంబరం గారు
చోడవరం: సాయిలక్ష్మి: బరాబర్ ప్రేమిస్తా, శ్రీసాయిలక్ష్మి: యుఫోరియా, పూర్ణా: మన శంకర వరప్రసాద్ గారు

ప్రభుత్వ పాఠశాలకు గేట్ల వితరణ

మాకవరపాలెం, న్యూస్‌టుడే : జి.గంగవరం శివారు సీతన్న అగ్రహారం ప్రాథమిక ఉన్నత పాఠశాలకు జనసేన పార్టీ మండల అధ్యక్షుడు నమ్మి కొండలరావు గేట్లు ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రహరీ గోడ ముఖ ద్వారం వద్ద గేట్లు లేకపోవడంతో ఉపాధ్యాయులు విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు బుధవారం ఉపాధ్యాయులకు ఇనుప గేట్లు అందజేశామన్నారు.

అల్లూరి విగ్రహంతో.. అలుముకున్న వెలుగు

విద్యుత్తుకాంతుల మధ్య అల్లూరి విగ్రహం, జాతీయ జెండా

క్షత్రియ పరిషత్తు ఆధ్వర్యంలో పురపాలకలోని పెదబొడ్డేపల్లి పెద్దమదుం వద్ద ఏర్పాటు చేసిన అల్లూరి సీతారామ రాజు విగ్రహం పట్టణానికి కొత్త అందం తీసుకువచ్చింది. విగ్రహం ఏర్పాటుకు, జాతీయ జెండా ఏర్పాటుకు దాదాపు రూ. 32లక్షలు వెచ్చించారు. కొద్దిరోజుల క్రితం రూ. 30 వేల ఖర్చుతో గార్డెన్ లైట్లు, ఫోకస్ లైట్లు ఏర్పాటు చేశారు. – న్యూస్‌టుడే, నర్సీపట్నం అర్బన్

ఎమ్మెల్యే రాజు కృషితోనే అభివృద్ధి పనులు

రావికమతం, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే రాజు బి.ఎన్ రోడ్డు అభివృద్ధి కోసం రూ. 68 కోట్లు నిధులు మంజూరు చేయించడంతో రోలుగుంట నుంచి కొత్తకోట, రావికమతం మీదుగా వడ్డాది వరకు తారురోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్టు మండల తెదేపా నాయకులు చెప్పారు. ఈ మేరకు బుధవారం కొత్తకోటలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ బుచ్చెయ్యపేట నుంచి మట్టవానిపాలెం మీదుగా ఆర్ఈసీ రోడ్డుకు రూ. 2.75 కోట్లు, రావికమతం నుంచి గుడ్డిప వరకు రూ. 3 కోట్లు నిధులు మంజూరు చేయించారని చెప్పారు. కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రాజాన కొండనాయుడు, మండల తెదేపా అధ్యక్షుడు కోమటి శంకరరావు, కార్యదర్శి ఉగ్గిన శ్రీనివాసరావు, నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కోట నీలవేణి, కోట గోవిందరావు, కోట సత్యనారాయణ పాల్గొన్నారు.

మంజూరైన నిధుల వివరాలు తెలియజేస్తున్న తెదేపా నాయకులు

రారండోయ్... గౌరీశ్వరుడి కల్యాణానికి

కైలాసంలో గౌరీశ్వరులు, అర్ధనారీశ్వరుడి విగ్రహాల వద్ద జరుగుతున్న పనులు

చోడవరం, న్యూస్‌టుడే

చోడవరం పట్టణంలో వెలసిన స్వయంభూ గౌరీశ్వరుడి కల్యాణ మహాశివరాత్రి మహోత్సవాలకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. పురాతనమైన గౌరీశ్వర ఆలయంలో కల్యాణం, మహాశివరాత్రికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవాదాయశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. మహాశివరాత్రి రోజున స్వయంభువు దర్శనార్థం ఉత్తరాంధ్ర వ్యాప్తంగా భక్తులు ఇక్కడికి వస్తుంటారని దేవాదాయశాఖ కార్యనిర్వహణాధికారి ఎస్.వి.వి. సత్యనారాయణ మూర్తి తెలిపారు.

వంశపారంపర్య ధర్మకర్త గోవా గవర్నరు పూసపాటి ఆనంద గజపతి రాజు సారథ్యంలో ఇక్కడ ఉత్సవాలు జరుగుతాయి. ఆలయంలోపలి భాగంలో అంతటా తాటాకులతో చలువ పందిళ్లు వేశారు. ధ్వజస్తంభానికి వేసిన ఇత్తడి తాపడానికి నగిషీలు అద్దారు. ఆలయ ముఖ ద్వారం వద్ద కైలాసగిరిలో శివపార్వతుల విగ్రహాలకు రంగులు వేసే పనిని చేపట్టారు. చేపట్టారు ఎన్టీఆర్ కళా మందిరంలో ఈ నెల 13 నుంచి 18 వరకు జరిగే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రత్యే ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణమంతా పరిశుభ్రం చేస్తున్నారు. స్వామివారి కల్యాణం కనులపండువగా చేసేందుకు అర్చకుడు కొడమంచిలి చలపతి సారథ్యంలో అర్చక బృందం గర్భగుడిని ముస్తాబు చేసే పనిలో నిమగ్నమయ్యారు.

స్వయంభువు దర్శనార్థం..

చోడవరం గౌరీశ్వరుల ఆలయంలో జరిగే కల్యాణ ఘట్టాన్ని తిలకించడం మహాభాగ్యంగా భక్తులు భావిస్తున్నారు. అందులోనూ మహాశివరాత్రి రోజున స్వయంభువు దర్శనం గొప్ప అదృష్టంగా భావిస్తారు. దీంతో వచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకుని దేవాదాయ శాఖ, భక్తులు సహకారంతో ఏర్పాట్లు చేశాం. ఎమ్మెల్యే రాజు సహకారంతో పుష్కరిణిని అభివృద్ధి చేస్తాం.
– గూనూరు సురేష్, ఛైర్మన్ ట్రస్టు బోర్డు, గౌరీశ్వర ఆలయం, చోడవరం

దమ్ము చక్రాలతో రహదారులు ఛిద్రం

మాకవరపాలెం, న్యూస్‌టుడే

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక రహదారుల అభివృద్ధే లక్ష్యంగా రూ. కోట్లు ఖర్చు చేస్తోంది. నియోజకవర్గంలో అన్ని మండలాల్లో ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులను అధ్వానంగా ఉన్న దారులను బాగు చేసేందుకు చర్యలు తీసుకుంది. గ్రామాల్లోని వివిధ సభలకు, ప్రారంభోత్సవాలకు వెళ్లే సమయంలోనే రహదారుల పరిస్థితిని పరిశీలించిన సభాపతి వాటిని మెరుగుపరచడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.

★ రహదారుల అభివృద్ధే ధ్యేయంగా ప్రతి మండలానికి నిధులు కేటాయించడంతో పాటు పనుల నాణ్యత, పురోగతిని అయ్యన్న ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. మండలంలోని కొండల అగ్రహారం నుంచి రోలుగుంట మండలం కుసర్లపూడి వరకు 8కి.మీ. రహదారికి రూ. 2.6కోట్ల నిధులు కేటాయించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

★ పాయకరావుపేట నియోజకవర్గం కోటవురట్ల, అడ్డురోడ్డు వెళ్లేందుకు రాచపల్లి కూడలి నుంచి అడ్డ రోడ్డుకు, మాకవరపాలెం నుంచి కైలాసపట్నం, ఎండపల్లి నుంచి గిడుతూరు మీదుగా కైలాసపట్నం ప్రధాన రహదారులతో గ్రామాల్లో అంతర్గత రహదారుల నిర్మాణానికి రూ. 4.3కోట్లు నిధులు సభాపతి కేటాయించారు. కూటమి ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోంది. పొలాలు దమ్ములు పట్టే సమయంలో రైతుల నిబంధనలకు విరుద్ధంగా ట్రాక్టర్లకు దమ్ము చక్రాలు అమర్చుకుని రహదారులపై వెళుతుండటంతో కొంతకాలానికే గోతులు ఏర్పడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.



ఛిద్రమైన కొండల అగ్రహారం గిడుతూరు రహదారి

అ వీ ఇ వీ

15న జిల్లాస్థాయి చదరంగం పోటీలు

మాకవరపాలెం, న్యూస్‌టుడే : ప్రగతి చెస్ వెల్ఫేర్ అసోసియేషన్, గౌతమి లలిత కళా శిక్షణ కేంద్రం సంయుక్తంగా ఆదివారం జిల్లాస్థాయి చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక శ్రీ గ్రంథాలయంలో నిర్వహించే పోటీలకు క్రీడాకారులు ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు. 18 సంవత్సరాలలోపు బాలబాలికలు రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఐదు రౌండ్లలో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామని చెప్పారు. పోటీలో పాల్గొనేవారు ఆట సామగ్రి తెచ్చుకోవాలన్నారు. 96765 14520, 79815 59599 నంబర్లకు ఫోను చేసి వివరాలు తెలుసుకోవచ్చు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

మాకవరపాలెం, న్యూస్‌టుడే: మాకవరపాలెం ఉపకేంద్రం పరిధిలో ఉన్న విద్యుత్తు తీగల కింద ఉన్న చెట్టు కొమ్మలు తొలగించేందుకు శుక్రవారం మాకవరపాలెం, జి.కోడూరు ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ బాలకృష్ణ తెలిపారు. చోడవరం: వెంకన్నపాలెం విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో ముద్దుర్తి, నర్సాపురం, వెంకన్నపాలెం, ఎం.కొత్తపల్లి, గంధవరం, రాయపురాజుపేట, సీమునాపల్లి పంచాయతీలకు శుక్రవారం విద్యుత్తు సరఫరా ఉండదన్నారు. ఏపీఈపీడీసీఎల్ నర్సీపట్నం డీఈఈ ఎస్.రామకృష్ణ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

తప్పులుంటే సరి చేసుకోండి

మాకవరపాలెం, న్యూస్‌టుడే: పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలలో పేర్లు, వివరాలు తప్పులుంటే సరి చేసుకునేందుకు గురువారం చివరి రోజని ఎంఈఓ మూర్తి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో పదో తరగతి మార్కుల లిస్టు అన్నింటికీ కీలకమన్నారు. ప్రధానోపాధ్యాయులను సంప్రదించి తప్పులుంటే సరిచేసుకోవాలని కోరారు.

16న జేడీ శీలం రాక

చీడికాడ, న్యూస్‌టుడే: ఏఐసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేడీ శీలం ఈనెల 16న అనకాపల్లి రానున్నారని ఏఐసీసీ అధ్యక్షుడు జొడ్డు శ్రీనివాసరావు చెప్పారు. బుధవారం చీడికాడలో మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకానికి సంబంధించి సమావేశం ఉంటుందన్నారు. అనకాపల్లి జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పార్టీ ఇన్‌ఛార్జులు, జిల్లా కమిటీ సభ్యులు, మండలాధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

రాజులబాబు పండగకు సన్నాహాలు

రోలుగుంట, న్యూస్‌టుడే: మండలంలోని శరభవరం, జానకిరాంపురం తదితర గ్రామాల్లో ఈనెల 12న రాజులబాబు పండగను వైభవంగా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా పలు గ్రామాల్లో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు సర్పంచులు లగుడు కృష్ణంనాయుడు, మండల తెదేపా అధ్యక్షుడు పంచాడ చంద్రరావులు తెలిపారు.

గునుపూడిలో నిఘా కెమెరాల ఏర్పాటు

నాతవరం, న్యూస్‌టుడే: గునుపూడి గ్రామంలోని పలు ప్రదేశాల్లో నిఘా కెమెరాలు ఏర్పాటు చేశామని ఎస్సై తారకేశ్వరరావు తెలిపారు. గ్రామంలో అవాంఛనీయ ఘటనలు పరిశీలించేందుకు ఇవి దోహద పడతాయన్నారు. వీటిని స్థానికులు పసగడుగుల నాగేశ్వరావు, కొరుప్రోలు ప్రసాద్ అందించారన్నారు.

సరుగుడు, కొబ్బరి తోటలు దగ్ధం

బుచ్చెయ్యపేట: బంగారుమెట్ట గ్రామంలో బుధవారం సరుగుడు, కొబ్బరి తోటల్లో అగ్నిప్రమాదం సంభవించింది. గుర్తుతెలియని వ్యక్తులు కాల్చిపారేసిన సిగరెట్ పీకతోనే ప్రమాదం సంభవించి ఉంటుందని భావిస్తున్నారు. ఘటనలో రూ. 50వేలు పంటనష్టం వాటిల్లింది. రావికమతం నుంచి అగ్నిమాపక సిబ్బంది గంగరాజు, శివయ్యరాయుడు వచ్చి మంటలను అదుపు చేశారు.

కొబ్బరితోటలో మంటలు

పదోన్నతి పొందిన వీఆర్వోలకు సత్కారం

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1 వీఆర్వోలుగా పదోన్నతి పొందిన శివ భాస్కర్, సతీష్, దుర్గలను బుధవారం వీఆర్వోల సంఘం కార్యాలయంలో ఏర్పాటైన కార్యక్రమంలో తహసీల్దార్ రామారావు సత్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు శేఖర్ మాట్లాడుతూ వీఆర్వోల మీద ఒత్తిడి అధికంగా ఉందన్నారు. ప్రభుత్వ ప్రకటన ప్రకారం పనులు చేయాలని సూచించారు. జిల్లా సహ అధ్యక్షుడు చిన్నంనాయుడు, నర్సీపట్నం అధ్యక్షులు డి.వి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వో దుర్గని సత్కరిస్తున్న తహసీల్దార్ రామారావు తదితరులు

ఉపాధిపనుల తనిఖీ

దేవరాపల్లి, న్యూస్‌టుడే: వీబీజీ రామ్ జీ పనుల్ని కేంద్ర బృందం తనిఖీలు చేస్తోంది. ఇందులో భాగంగా బుధవారం దేవరాపల్లి, కె.కోటపాడు మండలాల్లో ఈ బృందం పర్యటించింది. గతఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులకు సంబంధించిన ఫైళ్లను మండలాల వారీగా ఆన్‌లైన్ కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ బృందంలోని సభ్యులు పరిశీలించారు. జల సంచయ్-భాగీదారీ పథక కేంద్ర నోడల్ అధికారి సుగుణాకరరావు, కేంద్ర జల కమిషన్ సబ్ డివిజన్ ఇంజినీర్ బాలు ఇందులో సభ్యులుగా ఉన్నారు. మండలంలోని వాలాబు, చింతలపూడి, తామరబ్బ, దిసనందపల్లి, తారువ, బోయిలకింతాడ, కొత్తపెంట తదితర గ్రామాల్లోని చెరువులు, నీటికుంటలు తదితర పనుల్ని తనిఖీ చేశారు. ఏపీఓ లక్ష్మీదేవి, ఈసీ వెంకటేష్, సత్యనారాయణ తదితరులున్నారు.

దేవరాపల్లి మండలంలో జరిగిన ఉపాధి పనులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

కొత్తకోటలో బి.ఎన్ రోడ్డు పనులు

రావికమతం, న్యూస్‌టుడే: బి.ఎన్ రోడ్డును తారువేసి మెరుగు పరచడంతో ఈమార్గంలో ప్రయాణికుల కష్టాలు తొలగుతాయని నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి పి.వి.ఎస్.ఎన్. రాజు పేర్కొన్నారు. కొత్తకోటలో బి.ఎన్ రోడ్డు పనులకు కొబ్బరికాయ కొట్టి బుధవారం ప్రారంభించారు. మహాశివరాత్రికి కల్యాణలోవ పోతురాజులబాబు జాతరకు తరలివచ్చే భక్తులు ఇబ్బంది పడకుండా కొత్తకోట గ్రామ పరిధిలో అధ్వానంగా ఉన్న రోడ్డును తారువేసి మెరుగు పరుస్తున్నట్లు వివరించారు. జనసేన నాయకులు పాల్గొన్నారు.

★ కొత్తకోటలో హాట్‌మిక్స్ ప్లాంటును తొలగించాలని నిరసనలు వెల్లువెత్తుతుండటంతో ప్లాంటు యాజమాన్యం కూటమి నాయకులతో చర్చలు జరిపింది. రోలుగుంట నుంచి వడ్డాది వరకు బి.ఎన్ రోడ్డును మార్చి నెలాఖరుకు పూర్తి చేసి ఏప్రిల్‌లో హాట్‌మిక్స్ ప్లాంట్‌ను తొలగిస్తామని హామీ ఇచ్చింది.

రూ. 10 లక్షలతో శ్మశానవాటికకు రోడ్డు

గొలుగొండ, న్యూస్‌టుడే: ఏళ్ల తరబడి అంతిమ యాత్రకు అవస్థలు పడుతున్న మైదాన గిరిజన గ్రామాలు ఎన్.గరువుపాలెం, చిన హమాంపేట ప్రజల చిరకాల కష్టాలు తీరనున్నాయి. చనిపోయిన వారిని శ్మశానానికి తీసుకెళ్లేందుకు బంధువులు నరకం చూసేవారు. ఈ సమస్యను శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు దృష్టికి తీసుకెళ్లడంతో రూ. 10లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. బుధవారం సర్పంచి ఆదిలక్ష్మి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. తెదేపా సీనియర్ నేతలు నానాజీ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలకు అదనపు భవనాలు

నిర్మాణదశలో ఉన్న భవనం

రోలుగుంట, న్యూస్‌టుడే: జిల్లాలోని కేజీబీవీలకు చెందిన ప్రాంగణాలు విశాలం కానున్నాయి. వీటికి అదనపు భవన సదుపాయాలు సమకూరుతున్నాయి. ఇందుకు సంబంధించి జిల్లాలోని పలు ప్రాంతాల్లో వీటి నిర్మాణాలు ఇప్పటికే చివరిదశకు చేరుకున్నాయి. రోలుగుంట కేజీబీవీతోపాటు కోటవురట్ల, రావికమతం, బుచ్చెయ్యపేట, కె.కోటపాడు, నర్సీపట్నం, మాడుగుల, రాంబిల్లి, దేవరాపల్లి నాతవరం, మాకవరపాలెం తదితర ప్రాంతాల్లో విద్యాలయాల్లోని అదనపు వసతుల కోసం వీటిని గతేడాది మంజూరు చేశారు. ఒక్కో భవనానికి రూ. 1.60కోట్లు చొప్పున కేటాయించారు. రోలుగుంట మినహా మిగతా ప్రాంతాల్లో నిర్మాణపనులు దాదాపు పూర్తయ్యే దశలో ఉన్నాయి.

★ రోలుగుంటకు సంబంధించి నిర్మాణ పనులు ప్రారంభంలో పునాదుల్లోని గోతుల్లో నీరు చేరడం, వివిధ కారణాలతో ప్రారంభంలో పనులు కాస్త మందగించాయి. ★ తరువాత పరిస్థితులు అనుకూలించడంతో నిర్మాణంలో వేగం పుంజుకుందని ఏఈ ప్రసాద్ తెలిపారు. ఈ పనులు పూర్తిగా అధికారుల పర్యవేక్షణలో కొనసాగుతున్నాయని ఎలాంటి లోపాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయాలి

చోడవరంలో బైక్‌ర్యాలీ

రోలుగుంట, న్యూస్‌టుడే: ఈనెల 12న జరిగే జాతీయ సమ్మెలో ఉపాధి హామీ కార్మికులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా నాయకులు ఈరెల్లి చిరంజీవి పిలుపునిచ్చారు.

చోడవరం పట్టణం: లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ చోడవరంలో బుధవారం బైక్ ర్యాలీ జరిగింది. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎల్ఐసీ కార్యాలయం నుంచి కోఆపరేటివ్‌కాలనీ, పాతబస్సుస్టాండ్ మీదుగా కొత్తూరు వరకు ర్యాలీ నిర్వహించారు.

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోనమోహనరావు కోరారు. రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో రాజాంలో ఉపాధి కూలీలతో బుధవారం ప్రచారం నిర్వహించారు.

రాజాంలో ఉపాధి కూలీలతో ప్రచారం

వ్యర్థాలు సేకరిస్తూ.. సరకుల అందజేత

చోడవరం, న్యూస్‌టుడే: గ్రామాలకు పదిహేను రోజులకొక మారు స్వచ్ఛ రథం వస్తే వ్యర్థాలు ఇక బయట కనిపించవని గ్రామస్థులు మండల అధికారులకు విన్నవించారు. వాహనం గ్రామాలలో తిప్పుతూ చెత్తకు బదులు సరకులు ఇచ్చే కార్యక్రమం మండలంలో చేపట్టారు. బుధవారం జన్నవరం గ్రామంలో స్వచ్ఛరథంతో తిప్పి ప్లాస్టిక్, వ్యర్థాలను సేకరించారు. రథం గ్రామాలకొస్తే బాగుంటుందని పలువురు ఎంపీడీఓ స్వామికి చెప్పారు.

జన్నవరంలో వ్యర్థాలు ఇచ్చి సరకులు తీసుకుంటున్న ప్రజలు

తితిదే నిధులతో ఆలయాల నిర్మాణం

దేవరాపల్లి, న్యూస్‌టుడే: తితిదే ట్రస్టు నిధులతో ఆలయాల నిర్మాణం చేపట్టనున్నట్లు దేవాదాయశాఖ ఏఈ అనిత పేర్కొన్నారు. వీటి నిర్మాణానికి అవసరమైన స్థలాలను గుర్తిస్తున్నామన్నారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సిఫార్సుతో నియోజకవర్గంలోని 4 మండలాల నుంచి 31 దరఖాస్తులు అందాయన్నారు. దేవరాపల్లిలో అయ్యప్పస్వామి ఆలయం వద్ద భజన మందిర నిర్మాణానికి స్థల పరిశీలన సందర్భంగా బుధవారం దేవరాపల్లి వచ్చిన ఆమె ఈ మేరకు మాట్లాడారు.

జూద శిబిరంపై పోలీసుల దాడులు

చోడవరం గ్రామీణం, న్యూస్‌టుడే: దుడ్డుపాలెం గ్రామ శివారులో జూద శిబిరంపై పోలీసులు బుధవారం దాడులు చేసినట్లు సీఐ అప్పలరాజు తెలిపారు. స్పెషల్ బ్రాంచ్ అధికారులకు అందించిన సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దాడులు చేయగా 18మంది పట్టుబడినట్లు పేర్కొన్నారు. వారి నుంచి రూ. 98,880 నగదు, 17సెల్‌ఫోన్లు, 15 గేమ్‌కాయిన్లను స్వాధీనం చేసుకొని సీజ్ చేశామన్నారు. జూదరులపై కేసు నమోదుచేసి కోర్టుకు తరలించామని సీఐ పేర్కొన్నారు.

మంచి వ్యక్తిత్వం, క్రమశిక్షణ అలవర్చుకోవాలి

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: కష్టపడి చదువుకోవడం వల్లే మంచి భవిష్యత్తు ఉంటుందని అమెరికాలో శాస్త్రవేత్తగా పనిచేస్తున్న సీతా బాలసుబ్రహ్మణ్యం చెప్పారు. దిబ్బిడి జడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. తానూ ఇదే పాఠశాలలో చదువుకున్నట్లు గుర్తుచేశారు. విద్యార్థులందరూ మంచి వ్యక్తిత్వం, క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు.

చోడవరంలో పన్నుల వసూళ్లు పెరగాలి..

చోడవరం, న్యూస్‌టుడే: చోడవరం పంచాయతీలో రూ. కోటి మేర బకాయిలున్న ఇంటి పన్నుల వసూలుకు కార్యదర్శి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీఓ సీతారామస్వామి తెలిపారు. పన్నుల విషయంలో వెనుకబడిన చోడవరం పంచాయతీలో సిబ్బందిని సమాయత్తం చేసేందుకు ఎంపీడీఓ సమావేశమయ్యారు. ఈనెల 14 నాటికి సగానికి పైగా పన్నులు వసూలు చేయాలని సూచించారు. కార్యదర్శి కె.శ్రీనివాసరావు, సాహు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్య సేవలపై ఆరా

నర్సీపట్నం అర్బన్: పిల్లలు, బాలింతల మానసిక ఆరోగ్య సేవలపై జనాభా పరిశోధన కేంద్ర బృందం బుధవారం నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రి, పెదబొడ్డేపల్లిలోని పట్టణ ఆరోగ్యకేంద్రం, ప్రాథమిక పాఠశాలను సందర్శించింది. బృందం ప్రతినిధి డా. యడ్ల రమణ ప్రాంతీయ ఆసుపత్రి పర్యవేక్షకురాలు సుధాశారద, డిప్యూటీ డీఎంహెచ్‌వో వీరజ్యోతి తదితరులతో మాట్లాడుతూ బాలింతలు ఎవరైనా మానసిక సమస్యలతో ఉంటున్నారా తెలుసుకున్నారు. అనంతర వైద్యం అందుతుందో లేదో ఆరా తీశారు.

వృద్ధాశ్రమానికి రేషన్ వితరణ

రోలుగుంట, న్యూస్‌టుడే: మండలంలోని కొవ్వూరుకి చెందిన వేంకటేశ్వర యువజన సంఘం నిర్వహిస్తున్న వృద్ధాశ్రమానికి విశాఖపోర్టు ఉద్యోగులు ఆరునెలకు సరిపడ రేషన్‌తోపాటు నిత్యావసర సరకులకు బుధవారం వితరణగా అందజేశారు. ఈ మేరకు శరణాలయం నిర్వాహకులు యర్రంశెట్టి రాజారావుకి వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాసరావుతోపాటు కొవ్వూరు సర్పంచి కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమానికి సరకులను అందిస్తున్న పోర్టు ఉద్యోగులు

సర్పానదిలో ఇసుక తవ్వకాలు

మాకవరపాలెం, న్యూస్‌టుడే: కొత్త తూటిపాల సమీపంలోని సర్పానదిలో అక్రమ ఇసుక తవ్వకాలతో వ్యవసాయ భూములు దెబ్బ తింటున్నాయని స్థానిక రైతులు ఆవేదన చెందుతున్నారు. పగలూరాత్రి తేడా లేకుండా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని ఈ విషయమై రెవెన్యూ అధికారులు హెచ్చరించినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోయారు. బుధవారం ఉదయం నుంచి చీకటి పడేవరకు ఇసుకను తరలించారని అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రాత్రి సమయంలో సర్పానదిలో ఇసుక తవ్వుతున్న దృశ్యం

బాల్యవివాహాలతో అనర్థాలెన్నో..

నాతవరం, న్యూస్‌టుడే: బాల్య వివాహాలతో జీవన విధానం అస్తవ్యస్తం అవుతుందని శిశుసంక్షేమ శాఖ ప్రాజెక్టు అధికారి గౌరి తెలిపారు. మల్లుబూపాలపట్నంలో ఐసీడీఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో జడ్పీ పాఠశాల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. ముక్త భారత్ 100 రోజుల కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కలిగిస్తున్నామన్నారు. మండల విద్యాశాఖ అధికారి వరహాలబాబు, హెచ్.ఎం. పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

కొత్తఎల్లవరంలో ప్రచార రథం వద్ద కార్యకర్తలు

గొలుగొండ, న్యూస్‌టుడే: బాల్య వివాహాలకు ఎవరూ సహకరించొద్దని జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ సంస్థ సమన్వయకర్తలు చిన్నారావు, మహాలక్ష్మి సూచించారు. కొత్తఎల్లవరం, కసిమి తదితర గ్రామాల్లో బుధవారం ప్రచార రథంలో తిరిగి నష్టాలను వివరించారు.

కాలనీ వినియోగంలోకి తెచ్చేలా చర్యలు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: మున్సిపాలిటీలోని సుబ్బారాయుడుపాలెంలో పీఎంఏవై-వైఎస్ఆర్ (అర్బన్) కింద 2022లో మంజూరైన 56 ఇళ్ల కాలనీ వినియోగంలోకి వచ్చేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈనాడులో మంగళవారం 'దారిలేక... గోడు వినేదిక్కు లేక' శీర్షికన వచ్చిన కథనానికి హౌసింగ్ కార్పొరేషన్ కార్యనిర్వాహక ఇంజినీరు స్పందించారు. సిబ్బందితో కలిసి ఆయన కాలనీకి వెళ్లే రోడ్డును, నిర్మాణం పూర్తయిన ఇళ్లను పరిశీలించారు. కొంతమంది లబ్ధిదారులతోనూ మాట్లాడారు. అనంతరం ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ హౌసింగ్ కార్పొరేషన్ ఆదేశం మేరకు ఈ పరిశీలన చేశామన్నారు. దాదాపు కిలోమీటరు రోడ్డు నడవడానికి వీల్లేని విధంగా తయారైందని గుర్తించామన్నారు. రోడ్డు పునరుద్ధరణకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని తెలిపారు. 56 ఇళ్లకు గాను 26 పూర్తయ్యాయని, మూడు స్లాబ్‌ల వరకు, పది పునాదుల వరకు నిర్మించుకున్నారని వివరించారు. వీరందరితో కాలనీలోనే మేళా నిర్వహించి అందరు ఇళ్లని పూర్తి చేసుకునే చుస్తామన్నారు. విద్యుత్తు, నీరు అందుబాటులో ఉన్నందున పనులకు ఇబ్బంది ఉండదని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి ప్రధాన రహదారి, అంతర్గత రహదారిలో పెరిగిపోయిన తుప్పలన్నీ తొలగించి పరిసరాలను శుభ్రం చేయిస్తామని పేర్కొన్నారు. మొదలు పెట్టని ఇళ్లు రద్దయినట్టేనని వివరించారు. ఆయన వెంట ఏఈఈ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పాడైన రోడ్డుని పరిశీలిస్తున్న హౌసింగ్ కార్పొరేషన్ ఈఈ శ్రీనివాస్

స్పందనకు వందనం

తాగునీటి వృథాకు అడ్డుకట్ట

గొలుగొండ, న్యూస్‌టుడే: లింగంపేట వద్ద ప్రధాన రహదారి దగ్గర భారీ నీటి సరఫరా పైపులైన్ దెబ్బతిని శుద్ధిజలం ఏరులా పారేది. దీంతో 17 గ్రామాల ప్రజలకు తాగునీరు అందక అవస్థ పడేవారు. దీనిపై ఈ నెల 9న 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన 'ఈనాడు'లో చిత్రకథనం ప్రచురితమైంది. వెంటనే స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి నీటి వృథాకు అడ్డుకట్ట వేశారు.

మాకవరపాలెం, న్యూస్‌టుడే : తామరం కనకదుర్గమ్మ ఆలయం ఎదుట మురుగు కాలువలపై దుకాణదారులు కాంక్రీట్ పలకలు వేయడంతో వ్యర్థాలు తొలగించడం కుదరట్లేదు. మురుగువాసన, దోమల బెడద పెరిగిపోతున్నాయి. – కర్రినాయుడు, తామరం

✔: మురుగు కాలువలు ఆక్రమించి వేసిన కాంక్రీట్ పలకలు తొలగిస్తాం. పారిశుద్ధ్య పనులు చేపడతాం.
– సంతోష్, పంచాయతీ కార్యదర్శి, తామరం

మేమున్నాం.. మీకు తోడుగా

నర్సీపట్నం - 80085 74743	చోడవరం - 80085 74732
మాడుగుల - 80085 74740	చీడికాడ - 80085 74742

చోడవరం గ్రామీణం, న్యూస్‌టుడే: చోడవరం నుంచి గవరవరం గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా ఉంది. వాహన చోదకుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. – రమేష్, ఉపాధ్యాయుడు ✔: గవరవరం రోడ్డుకు నిధులు మంజూరయ్యాయి. త్వరతోనే మరమ్మతులు చేపడతాం. – సాయిశ్రీనివాస్, ఇన్‌ఛార్జి జేఈ, ఆర్అండ్‌బీ

చీడికాడ, న్యూస్‌టుడే: చీడికాడ మండలం కోనాం పంచాయతీ జాజులపాలెం, చెరకుపల్లి గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. రహదారి సౌకర్యం కల్పిస్తే ఇబ్బందులు తీరతాయి. – వాసు, ఆర్ఎంపీ డాక్టర్
✔: జాజులపాలెం, చెరకుపల్లి గ్రామాలకు రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం.
– శ్రీనివాసరావు, పీఆర్ మండల ఇంజినీర్, చీడికాడ

(c) eenadu

పెందుర్తి

తెరపై ఈనాడు
లక్ష్మీకాంత్ స్క్రీన్-1: **శ్రీ చిదంబరం గారు**
స్క్రీన్-2: **మన శంకర వరప్రసాద్ గారు**

నూతన నియామకం

దేశపాత్రునిపాలెం(పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వవార్డు భాజపా ఇన్‌ఛార్జిగా దేశపాత్రునిపాలెం గ్రామానికి చెందిన పండూరి రమేశ్ నియమితులయ్యారు. ఈమేరకు అనకాపల్లి జిల్లా భాజపా అధ్యక్షుడు డి.పరమేశ్వరరావు నుంచి బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ భాజపా బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి ఈ పదవి అప్పగించిన పార్టీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

వేపగుంట, న్యూస్‌టుడే: ?: 98వవార్డు షిప్‌యార్డ్ లేఅవుట్ కాలనీలోని కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధం వెంటాడుతోంది. -నాగేశ్వరరావు, అప్పారావు, స్థానికులు ✓: వెంటనే పరిశీలించి శుభ్రత చర్యలు చేపడతాం. -వెంకటస్వామి, శానిటరీ ఇన్‌స్పెక్టర్

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ మండలం సమ్మెంగిపాలెం-జాలారిపేట రహదారిని ఆనుకుని ఉన్న కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నాం. -స్థానికులు ✓: మీప్రాంత కాలువలను శుభ్రం చేయించడానికి చర్యలు తీసుకుంటాం. -మల్లికార్జునరావు, డిప్యూటీ ఎంపీడీవో, పరవాడ

పెందుర్తి, న్యూస్‌టుడే: ?: పులగవానిపాలెం సమీప అయ్యప్పనగర్ రోడ్డులోని వీధిదీపాలు రాత్రి, పగలు వెలుగుతున్నాయి. -బోని అప్పలరాజు, అయ్యప్పనగర్ ✓: వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. -ప్రసాద్, వీధిదీపాల నిర్వహణ ఏఈ, 97వ వార్డు

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: సబ్బవరం గణేశ్ వీధిలో వ్యర్థాలు పేరుకుపోయాయి. -పి.సత్యనారాయణ, సబ్బవరం ✓: వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. -పి.ఆనందరావు, గ్రామ కార్యదర్శి

?: సాయినగర్ కాలనీ నుంచి వచ్చే వాడుక నీరు సబ్బవరం వ్యాపార దుకాణాల ముందు తిష్ట వేస్తోంది. -బి.శంకరరావు, సబ్బవరం ✓: వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. -డి.ప్రసాదరావు, సర్పంచి, సబ్బవరం

స్పందనకు వందనం

ఎట్టకేలకు వ్యర్థాల తరలింపు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం సాయినగర్ కాలనీలో వ్యర్థాలు పేరుకుపోయి కొద్ది రోజులుగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను స్థానికులు 'ఈనాడు-మేమున్నాం మీకు తోడుగా' దృష్టికి తీసుకురావడంతో పంచాయతీ అధికారులు స్పందించారు. బుధవారం సిబ్బందితో శుభ్రత చర్యలు చేపట్టారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 'సుస్తీ'..!

■ ఇంకా అద్దె భవనంలో లక్ష్మీనరసింహనగర్ యూపీహెచ్‌సీ ■ రోగులకు, సిబ్బందికి తప్పని ఇక్కట్లు

వేపగుంట, న్యూస్‌టుడే: 98వవార్డు శివారు ప్రాంతాల ప్రజలకు ప్రాథమిక వైద్యం అందించేందుకు గత ప్రభుత్వం కేటాయించిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) ఇంకా అద్దె భవనంలోనే కొనసాగుతోంది. అరకొర వసతుల కారణంగా రోగులు, సిబ్బంది నిత్యం అవస్థలు పడుతున్నారు. కొంత మంది అక్కడ వైద్య సేవలు పొందడానికి ఇష్టపడకపోవడంతో సంబంధిత ఆరోగ్య కేంద్రం ఉన్నా లేనట్లేనని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.

■ గత వైకాపా ప్రభుత్వంలో అప్పటి పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ పదవీకాలం పూర్తి కానున్న సమయంలో హడావుడిగా సింహపురికాలనీ రామాలయం సమీపంలో ఈ ఆరోగ్య కేంద్రానికి అప్పటి మంత్రి విడదల రజిని చేతులమీదుగా శంకుస్థాపన చేయించారు. తరువాత సంబంధిత ఆసుపత్రికి స్థలం కేటాయించకపోవడం, ఓ చోట గుర్తించిన స్థలం తమకు చెందినదని జీవీఎంసీ అభ్యంతరం చెప్పడంతో శాశ్వత భవన నిర్మాణం అంతటితో ఆగిపోయింది. తర్వాత అధికారులెవ్వరూ ఆ విషయంపై దృష్టి సారించలేదు.

■ **సుమారు 20 కాలనీల ప్రజలకు ప్రయోజనం..** : ఈ ఆరోగ్య కేంద్రానికి అన్ని వసతులు సమకూర్చి అందుబాటులోకి తీసుకువస్తే సుమారు 20 కాలనీల ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. సింహపురి కాలనీ, షిప్‌యార్డ్‌కాలనీ, అప్పన్నపాలెం, శ్రీనివాసనగర్, ఈస్ట్‌పాయింట్‌కాలనీ, లక్ష్మీనరసింహనగర్, శ్రీసాయిమాధవనగర్, పరిసర ప్రాంతాల ప్రజలు అత్యవసర సమయంలో ఇదే కేంద్రంలో వైద్య సహాయం పొందుతున్నారు. రక్త పరీక్షలు చేసేందుకు తగిన వసతి లేకపోవడంతో సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు. కూటమి పాలకులు, సంబంధిత అధికారులు వెంటనే దృష్టి సారించి తగిన చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

> ■ ఈ ఆరోగ్యకేంద్రం విషయమై ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటాం. గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇలాంటివెన్నో నిదర్శనం. అభివృద్ధి పనుల పేరిట గత వైకాపా ప్రభుత్వం ఎంతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసింది. రాజకీయాలకు అతీతంగా ఈ ఆరోగ్య కేంద్రాన్ని పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తాం.
> -పంచకర్ల రమేశ్‌బాబు, ఎమ్మెల్యే

మహాశివరాత్రికి పటిష్ఠ ఏర్పాట్లు

దేవాదాయశాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

వన్‌టౌన్, న్యూస్‌టుడే : అప్పికొండ సోమేశ్వర స్వామి ఆలయంలో 15న మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఆదేశించారు. బుధవారం ఆయన ఉత్సవాల నిర్వహణపై దేవాదాయశాఖతో పాటు ఇతర శాఖలకు చెందిన అధికారులతో సమీక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున భద్రత, పారిశుద్ధ్యం, తాగునీటి వసతి, వైద్య సదుపాయాలపై దృష్టి సారించాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని పోలీసులకు సూచించారు. ఆర్డీఓ సుధాసాగర్, ఏసీ అన్నపూర్ణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు, ఆలయ ఈఓ పద్మావతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సోమలింగేశ్వరుడు

15వ తేదీన ప్రత్యేక పూజలు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం బంగారమ్మపాలెం (లింగాల తిరుగుడు)లో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని అర్చకులు డి.శేఖర్, కమిటీ సభ్యులు తెలిపారు. ఈనెల 15వ తేదీన తెల్లవారుజాము నుంచి రుద్రాభిషేకాలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాలు జరుగుతాయన్నారు. రాత్రి 7గంటల నుంచి కోటి దీపార్చన, బాణసంచా కాల్పులు, నాటక ప్రదర్శనలు ఉంటాయన్నారు.

దుర్గమాంబ పండగకు ఏర్పాట్లు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం కలపాక పంచాయతీ పెద్ద స్వయంభూవరంలో గురువారం శ్రీదుర్గమాంబ అమ్మవారి పండగ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద, గ్రామపురవీధుల్లో ప్రత్యేక విద్యుత్తు దీపాలంకరణ చేస్తున్నారు. ఉదయం 5గంటల నుంచి అమ్మవారి దర్శనాలు, ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయని గ్రామపెద్దలు తెలిపారు. భక్తులకు ప్రసాద వితరణ, మజ్జిగ పంపిణీ ఉంటుందన్నారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించాక అనుపోత్సవం చేస్తామన్నారు. రాత్రి సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని, ప్రజలు విజయవంతం చేయాలని కోరారు.

నేడు పారిశుద్ధ్య కార్మికుల సమ్మె

కార్పొరేషన్, న్యూస్‌టుడే: అఖిల భారత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం జరిగే సమ్మెలో జీవీఎంసీ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొంటున్నారని కమిషనర్ కేతన్‌గార్గ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా ఒక్కరోజు చెత్త సేకరణకు క్లాప్ వాహనాలు రావని, నివాసితులంతా తమ ఇళ్లలోనే చెత్తను నిల్వ ఉంచుకోవాలని ఆయన సూచించారు. రహదారులపై, బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేయకూడదన్నారు. శుక్రవారం ఇంటింటికీ వచ్చే క్లాప్ వాహనాలకు చెత్తను అందించాలన్నారు. దాదాపు 5 వేల మంది కార్మికులు సమ్మెలో పాల్గొంటారని కమిషనర్ పేర్కొన్నారు.

యువతకు నైపుణ్యాభివృద్ధిపై ఉచిత శిక్షణ

నరవ(వేపగుంట), న్యూస్‌టుడే: నరవలోని విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగు కళాశాలలో నైపుణ్యాభివృద్ధిపై ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ప్రదీప్‌వర్మ తెలిపారు. ఈనెల 16వ తేదీ నుంచి 20 రోజులపాటు శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. సొంతంగా పరిశ్రమలు, వ్యాపారాలు ప్రారంభించాలని భావించేవారికి, ఉపాధి అవకాశాల్లో నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తారన్నారు. విద్యార్థులు నేరుగా కళాశాలకు వచ్చి పేర్లు నమోదు చేసుకుని ఈ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ సూచించారు.

ఉత్తమ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు

వేపగుంట, న్యూస్‌టుడే: ప్రజలకు అందించిన ఉత్తమ సేవలతోనే ప్రభుత్వ ఉద్యోగులకు తగిన గుర్తింపు లభిస్తుందని జీవీఎంసీ ఎస్‌ఈ శ్యామ్‌బాబు అన్నారు. వేపగుంట సచివాలయం పరిధిలో 34ఏళ్లు పనిచేసి రిటైర్ అయిన ఉద్యోగి సూర్యనారాయణకు బుధవారం నాయుడుతోటలోని ఓ కల్యాణమండపంలో ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమానికి శ్యామ్‌బాబుతోపాటు డీఈలు, ఏఈలు, ఇతర ఉద్యోగులు హాజరై సూర్యనారాయణ దంపతులను సత్కరించారు. ఆయన అందించిన సేవలను కొనియాడారు.

20న ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం మల్లునాయుడుపాలెంలో మర్లమాంబ అమ్మవారికి కొన్నేళ్లుగా పూజలు చేస్తున్నప్పటికీ గ్రామంలో ఆలయం లేదు. దీంతో అమ్మవారికి ఆలయం నిర్మించాలని గ్రామస్థులు ముందుకొచ్చారు. ఈనెల 20న ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు సంబంధిత గోడపత్రికను బుధవారం ఆవిష్కరించారు.

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

బీఈడీ కళాశాలలపై విచారణకు వెనకడుగు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: నగర శివారులో స్పెషల్ బీఈడీ కోర్సు నిర్వహిస్తున్న 6 కళాశాలలపై గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు ఫిర్యాదు వెళ్లింది. ఈ మేరకు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఏయూ అధికారులను ఆదేశిస్తూ గత నెల 22న గవర్నర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. 20రోజులైనా ఏయూ అధికారులు విచారణ చేపట్టకపోవడం గమనార్హం. స్థానిక విద్యార్థులకు కాకుండా ఒడిశా, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు ఒక్కో సీటును రూ.1.20లక్షల నుంచి రూ.1.60లక్షలకు విక్రయించినట్టు ఆరోపణలు ఉన్నాయి. తరగతులకు హాజరుకాకుండానే ఆయా రాష్ట్రాల విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఏయూ సీడీసీ డీన్ ఆచార్య టి.వెంకటకృష్ణను సంప్రదించగా గవర్నర్ కార్యాలయం నుంచి ఆదేశాలు అందిన విషయం వాస్తవమేనని, త్వరలో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

హుండీ ఆదాయం రూ.30.10 లక్షలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : పాతనగరం బురుజుపేటలో కొలువైన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి హుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. నగదు రూ.30,10,993, బంగారం 40.240 గ్రాములు, వెండి 144.800 గ్రాములు, వివిధ దేశాల కరెన్సీ లభించిందని ఆలయ ఈఓ శోభారాణి తెలిపారు. దేవాదాయశాఖ తనిఖీ అధికారి ఎం.శ్రీధర్, ఆలయ సహాయ కార్యనిర్వహణ అధికారులు కె.రాజేంద్రకుమార్, ఎన్.ఆనంద్‌కుమార్, హెచ్‌ఎస్‌ఎవీఆర్.మూర్తి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

లెక్కింపులో పాల్గొన్న ఆలయ ఉద్యోగులు

'అక్రమాలు బయటపడినా వైకాపా వైఖరి మారలేదు'

పెందుర్తి, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ తయారీలో వినియోగించే నెయ్యి కల్తీ చేయడం జగన్ ప్రభుత్వ రాక్షస పాలనకు నిదర్శనమని రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ వేగి పరమేశ్వరరావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటనలో ఆయన విమర్శించారు. 2022లోనే నెయ్యి కల్తీ జరిగిందని నివేదిక వచ్చినా జగన్ సర్కార్ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. అక్రమాలు బయటపడ్డాక కూడా తప్పు ఒప్పుకోకుండా రాజకీయాలు చేయడం వైకాపా వైఖరికి నిదర్శనమని వ్యాఖ్యానించారు.

విద్యార్థులకు అవగాహన

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: విద్యార్థులు లక్ష్యాలు నిర్దేశించుకుని వాటి సాధనకు నిత్యం కృషి చేయడం ద్వారా ఉన్నత స్థాయికి ఎదుగుతారని రవీంద్రభారతి పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్వరూప చంద్రకళ, సాయిబిందు పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులకు బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాల సాధన, పదో తరగతి తర్వాత అందుబాటులో ఉన్న వివిధ కోర్సులపై అవగాహన కల్పించారు.

దేవీపురం-బల్జిపాలెం రహదారికి మోక్షమెప్పుడో..

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలంలోని దేవీపురం-బల్జిపాలెం రహదారి గత కొన్నేళ్లుగా నిర్లక్ష్యానికి గురైంది. సుమారు రెండు కి.మీ. పొడవు గల ఈ రోడ్డు సమస్య పరిష్కరిస్తామని గత ప్రభుత్వ హయాంలో నేతలు హామీలిచ్చినా కార్యరూపం దాల్చలేదు. ఈ రోడ్డు శిథిలావస్థకు చేరడం వల్ల అమ్మలపాలెం, బల్జిపాలెం, నారపాడు, నల్లరేగులపాలెం గ్రామాల ప్రజలు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. రైతులు పండించే వ్యవసాయోత్పత్తులను మార్కెట్‌కు తరలించడానికి అష్ట కష్టాలు పడుతున్నారు. కూటమి పాలకులు, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మావుళ్ల గెడ్డ వంతెనకు రక్షణేది..!

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం మల్లునాయుడుపాలెం మావుళ్లగెడ్డపై నిర్మించిన కల్వర్టుకు రక్షణ గోడ లేకుండా పోయింది. గతంలో 'ఈనాడు'లో వెలువడిన కథనాలకు స్పందించి గ్రిల్స్ ఏర్పాటు చేశారు. రెండేళ్ల గడవక ముందే అవి తుప్పు పట్టి ఓ పక్క విరిగిపోగా మరో వైపున కూడా దెబ్బతినే స్థితిలో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ఆ దారిన వెళ్లే వారంతా కల్వర్టు వద్దకు వచ్చినపుడు భయాందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రక్షణ గోడ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

దర్పణం

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కార్యక్రమంలో పాల్గొన్న 97వ వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత, కాలనీవాసులు

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ సమీప శ్రమశక్తినగర్ ఆరవ లేఅవుట్‌లో రూ.40లక్షలతో సీసీ రహదారుల నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన జరిగింది. వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత ముఖ్య అతిథిగా పాల్గొని పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు వసంత, శంకరరావు దంపతులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కాలనీవాసులు శంకర్ ప్రసాద్, చిన్నాజీ, రమణమూర్తి, సాంబమూర్తి, శంకర్రావు, తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విజయవంతం చేయాలంటూ ర్యాలీ

పరవాడ, న్యూస్‌టుడే: కార్మికుల సమస్యలపై ఈనెల 12వ తేదీన చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం పరవాడ ఫార్మాసిటీలో ద్విచక్ర వాహన ర్యాలీ చేపట్టారు. తొలుత ఈ ర్యాలీని సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ ప్రారంభించి మాట్లాడారు. కార్మికులకు తీవ్రనష్టం కలిగిస్తున్న నాలుగు లేబర్‌కోడ్‌లను కేంద్రం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం చేపట్టిన ర్యాలీ విజయశ్రీ ఫార్మా నుంచి తానాం చెక్‌పోస్టు వరకు సాగింది. ఈకార్యక్రమంలో ధారబాబు, చిన్నారావు, రాజా తదితరులు పాల్గొన్నారు.

దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు నివాళి

చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న భాజపా నాయకులు

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: భాజపా ఆధ్వర్యంలో బుధవారం భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి జరిగింది. చినముషిడివాడలోని 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు కార్యాలయంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో 95, 97 వార్డుల భాజపా అధ్యక్షుడు చిక్కాల సతీశ్, ఉపాధ్యక్షురాలు మాధవి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం వాడచీపురుపల్లి రామచంద్రమ్మ జాతర సందర్భంగా సింహాద్రి లోకల్ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు బుధవారం తెల్లవారుజామున ముగిశాయి. ఈ పోటీల్లో విశాఖ, ముత్యాలమ్మపాలెం, వాడచీపురుపల్లి-1, వాడచీపురుపల్లి జూనియర్స్ జట్టు వరుస స్థానాల్లో విజేతలుగా నిలిచాయి. వీరికి రూ.12వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలు నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలను మాజీ ఎంపీపీ, ఉత్సవకమిటీ ఛైర్మన్ మాసవరపు అప్పలనాయుడు చేతులమీదుగా అందజేశారు. ఈ పోటీల్లో 32 బృందాలు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రొంగలి రమణమూర్తి, కూండ్రపు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విజేతకు బహుమతులు అందజేస్తున్న మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ కిరణ్, తదితరులు

పినగాడి (పెందుర్తి), న్యూస్‌టుడే: ఇటీవల తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీలో పెందుర్తి మండలం పినగాడిలోని విస్టం పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపల్ కేవీ కిరణ్ తెలిపారు. ఈ పోటీలో విజేతలుగా నిలిచి బంగారు పతకం సాధించడంతో పాటు కేరళలో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు వివరించారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రతిభ చాటిన విద్యార్థులు నాగు, దుర్గాప్రసాద్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏవో సాయిరాం, పీడీ బి.రమణారావు, శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి అబాకస్‌లో..

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: ఇటీవల ఉక్కు నగరంలో జరిగిన జిల్లాస్థాయి అబాకస్ పోటీల్లో చినముషిడివాడ ఎన్ఆర్ఐ ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాల విద్యార్థి ఎం.చరణ్ ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు చైతన్య తెలిపారు. ఈ సందర్భంగా సంబంధిత విద్యార్థిని ఆమె అభినందించారు.

జోనల్ స్థాయిలో..

పెందుర్తి, న్యూస్‌టుడే: భీమిలి నియోజకవర్గ పరిధిలోని కొమ్మాదిలో జరిగిన డాక్టర్ బీఎస్ రావు మెమోరియల్ జోనల్ క్రీడా పోటీల్లో పెందుర్తి శ్రీచైతన్య విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన చేపట్టినట్లు ప్రిన్సిపల్ తారకేశ్వరరావు తెలిపారు. వాలీబాల్ పోటీల్లో పాఠశాల బాలురు విజేతలుగా నిలిచారన్నారు. ఖోఖో, పరుగు పందెంలో పతకాలు సాధించినట్లు వివరించారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సంబంధిత విద్యార్థులను అభినందించారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులతో ప్రిన్సిపల్ తారకేశ్వరరావు, ఉపాధ్యాయులు

వార్షిక క్రీడా సంబరాలు

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: సుజాతనగర్ 80అడుగుల రహదారిలోని భాష్యం పాఠశాలలో బుధవారం వార్షిక క్రీడా సంబరాలు ఘనంగా జరిగాయి. ప్రిన్సిపల్ మహాలక్ష్మీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు అంతర్జాతీయ టెన్నికాయిట్ క్రీడాకారిణి, పద్మనాభం జెడ్పీ ఉన్నత పాఠశాల వ్యాయామోపాధ్యాయిని కె.నారాయణమ్మ ముఖ్య అతిథిగా విచ్చేసి వేడుకలను ప్రారంభించారు. విద్యార్థులు వివిధ క్రీడాపోటీల్లో పాల్గొని ప్రతిభ చాటారు. సాంస్కృతిక కార్యక్రమాలు, విన్యాసాలతో అలరించారు. విజేతలకు పాఠశాల జోనల్ అధికారి ఆంజనేయులు బహుమతులు అందజేశారు.

ఆకట్టుకున్న బాలల విన్యాసాలు

సాంస్కృతిక ప్రదర్శన

సైన్స్ ల్యాబ్ ప్రారంభం

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం తానాం బీసీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలోని రాంకీ ఫౌండేషన్, ఫౌండేషన్ ఫర్ రీజెలయన్స్ సీఎస్ఆర్ నిధులు రూ.19.50 లక్షలు వెచ్చించి ఫిజిక్స్ ల్యాబ్‌ను ఆధునికీరించడంతో పాటు కొత్తగా బయాలజీ ల్యాబ్ నిర్మించారు. విశాఖ ఫార్మాసిటీ సంస్థ ఎండీ డాక్టర్ లాల్‌కృష్ణ, ఫౌండేషన్ ఫర్ రీజెలయన్స్ డైరెక్టర్ సామ్రాట్‌కుమార్ బసక్ వీటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికలంతా సైన్స్‌ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో మంచి శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. సైన్స్‌ల్యాబ్ నిర్మించిన రాంకీ ఫౌండేషన్, ఎఫ్ఎఫ్ఆర్ సంస్థల యాజమాన్యాలకు ప్రిన్సిపల్ రమామోహిని కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో స్థానిక నాయకులు పైలా జగన్నాథరావు, రొంగలి నగేశ్, రాంకీ ఫౌండేషన్ అధికారులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న విశాఖ ఫార్మాసిటీ ఎండీ లాల్‌కృష్ణ

గొలుసు దొంగకు దేహశుద్ధి

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే: మహిళ మెడలోని బంగారు గొలుసును తెంచుకుని పారిపోతున్న దొంగను స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఉక్కు నిర్వాసితకాలనీ లక్ష్మీపురం ప్రాంతానికి చెందిన అద్దాల లక్ష్మి బుధవారం రాత్రి కూర్మన్నపాలెం ప్రధాన రహదారిలోని ఏప్లస్ ఆసుపత్రి సమీపంలో నడుచుకుంటూ వెళ్తున్నారు. ఇంతలో వెనుక నుంచి వచ్చిన దుండగుడు మహిళ మెడలోని మూడు తులాల పుస్తెల తాడును తెంచుకుని పారిపోయేందుకు ప్రయత్నించాడు. లక్ష్మి బిగ్గరగా కేకలు వేయడంతో స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. నిందితుడు మాటూరి శ్యామ్‌సుందర్‌ను ఉక్కునగరం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గతంలో ఎక్కడైనా దొంగతనాలకు పాల్పడ్డాడా అన్న కోణంలో విచారిస్తున్నారు.

ఉక్కు ఎస్ఎంఎస్‌లో కాపర్ ట్యూబ్‌ల చోరీ

ఉక్కునగరం (స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు కర్మాగారం స్టీల్ మెల్టింగ్ షాపు(ఎస్ఎంఎస్)లో చోరీ జరిగి వారం రోజులైనా ఫిర్యాదు చేసే నాథుడు కరవయ్యాడు. ఎస్ఎంఎస్-2లోని సీసీడీ మౌల్డ్ ప్రిపరేషన్ ప్రాంతంలోని 20 కాపర్ ట్యూబ్‌లు ఈ నెల 5వ తేదీ రాత్రి నుంచి కనిపించలేదు. ఒక్కో ట్యూబ్ సుమారు 91కేజీల బరువు ఉంటుంది. వాటిని ఎవరు దొంగిలించారో అధికారులకు అంతు చిక్కడంలేదు. ఏ అధికారి కూడా దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావడం లేదని సమాచారం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

సేవలు మరువలేనివి

వన్‌టౌన్, న్యూస్‌టుడే : తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమ్మినేని మోహన్‌రావు పార్టీకి అందించిన సేవలు మరువలేనివని నాయకులు కొనియాడారు. బుధవారం నగర పార్టీ కార్యాలయంలో మోహన్‌రావు సంతాప సభ నిర్వహించి, ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం పార్టీ విశాఖ లోక్‌సభ నియోజకవర్గ అధ్యక్షులు చోడె వెంకటపట్టాభిరామ్ మాట్లాడుతూ... మోహన్‌రావు మృతి పార్టీకి తీరనిలోటు అన్నారు. ప్రయాణ సమయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని, విధిగా శిరస్త్రాణం ధరించడంతో పాటు, బీమా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, నాయకులు లొడగల కృష్ణ, బైరెడ్డి పోతనరెడ్డి, తాతాజీ, కోట నరేష్, సుజాత, చక్రవర్తి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మోహన్‌రావు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న జిల్లా తెదేపా నాయకులు

(c) eenadu

చంద్రన్న చల్లని చూపు..

అనంతపురం (అశోక్‌నగర్), న్యూస్‌టుడే: నగర, పురపాలికల్లోని ఇంజినీరింగ్, పారిశుద్ధ్య కార్మికులు గత సంవత్సరం జులై 13, 16 నుంచి 22 వరకు సమ్మెలోకి వెళ్లారు. కార్మికులు ఆయా ప్రాంతాల్లోని కమిషనర్లకు రాతపూర్వకంగా తాము సమ్మెలోకి వెళుతున్నామని అందజేశారు. ఎన్ని రోజులు సమ్మెలో ఉంటే అన్ని రోజులు వేతనం రాదు. అప్పట్లో సమ్మె కాలానికి వేతనాల్లో కోత విధించి వేతనాలు ఇచ్చారు. అసలే చాలీ చాలని వేతనం తీసుకొనే చిరుద్యోగులు ఉన్న కొంత సొమ్ములోనే కోత విధించడంతో ఇబ్బంది పడ్డారు. సమ్మె కాలానికి ఒక్కొక్కరి నుంచి రూ.5 వేల వరకు వేతనం కట్ చేశారు. సమ్మె కాలానికి వేతనం ఇవ్వనున్నామని ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడంతో కరుణ చూపారని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అనంతలో అత్యధికం

ఉమ్మడి జిల్లాలో అనంతపురంలోనే అత్యధికంగా 680 మంది కార్మికులకు ప్రయోజనం ఒనకూరనుంది. అనంతపురం జిల్లాలోని అనంతపురం, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, కళ్యాణదుర్గం, రాయదుర్గం పురపాలికల్లో సుమారుగా 1182 మంది సమ్మెలోకి వెళ్లారు. శ్రీసత్యసాయి జిల్లాలోని ధర్మవరం, హిందూపురం, కదిరి, పెనుకొండ, పుట్టపర్తి, మడకశిర పురపాలికల్లో 529 మంది సమ్మెలోకి వెళ్లారు. రెండు జిల్లాల్లో రూ.85 లక్షల వరకు కార్మికులకు సప్లిమెంటరీ బిల్లులో వేతనాలు ఇవ్వనుండటంతో వారిలో ఆనందం వ్యక్తం అవుతోంది.

డిమాండ్ల పరిష్కారం కోసం ఉద్యమ బాట పట్టాం. చిరుద్యోగుల వేతనాల్లో కోత విధించడం భావ్యం కాదని అనేకసార్లు విన్నవించుకున్నాం. ఆలస్యంగా అయినా కూటమి ప్రభుత్వం వేతనం ఇవ్వడం అభినందనీయం.. ధన్యవాదాలు.

సాకే తిరుమలేశ్, సీఐటీయూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి

15,800 శివలింగాలకు.. అభిషేకం

ఏర్పాట్లు పరిశీలిస్తున్న లక్ష్మీప్రసాద్, పోలీసులు

రాంనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: ఈ నెల 15న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా అనంతపురం నగరంలో మహా శివోత్సవం కార్యక్రమం భారీ ఎత్తున నిర్వహించనున్నారు. అనంతపురం నగరం శ్రీనగర్ కాలనీ అందుకు వేదిక కానుంది. ఇప్పటికే కార్యక్రమానికి సంబంధించి పాసుల పంపిణీ పూర్తయింది. “ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. అరుణాచలేశ్వరుడి కల్యాణాన్ని ఏపీలో మొట్టమొదటి సారిగా అనంతపురంలో నిర్వహిస్తున్నాం. 21 ఎకరాల్లో 20 వేల మంది భక్తులు పాలుపంచుకునేలా ఏర్పాట్లు చేస్తున్నాం. మౌలిక సదుపాయాల కల్పనలో అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. మొత్తంగా 15,800 శివలింగాలను తెప్పించి అభిషేక కార్యక్రమం ఘనంగా నిర్వహించనున్నాం. అభిషేకానికి అయ్యే పూజా సామగ్రి ఉచితంగా అందిస్తాం. అల్పాహారం, తాగునీరు సౌకర్యాలు కల్పిస్తాం. అరుణాచలం దేవస్థాన ఆచారం ప్రకారం ఏకహారతి, నక్షత్రహారతి, నంది హారతి అనంతరం మంగళహారతి కూడా ఉంటుంది. జిల్లా సుభిక్షంగా ఉండేందుకు చేపట్టే ఈ కార్యక్రమానికి భక్తులంతా సహకరించాలి.

- చల్లా లక్ష్మీప్రసాద్, ఏపీఐఐసీ డైరెక్టర్, తెదేపా నాయకులు

త్వరలో రైళ్లలో.. అరటి ఎగుమతి

- ఉమ్మడి జిల్లాలో అరటి సాగు రమారమి : 50 వేల హెక్టార్లు
- అరటిపై ఆధారపడిన రైతులు : 30 వేల మంది
- ఎకరాకు దిగుబడి : గరిష్ఠంగా 15 టన్నులు
- టన్ను సరాసరి ధర : నాణ్యత బాగుంటే రూ. 20 వేలు
- ఎగుమతికి అనుకూలమైన రకాలు : 8

అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ఆనంద్

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: రైలు మార్గం ద్వారా అరటి ఎగుమతి చేసే ప్రక్రియ అతి త్వరలో ప్రారంభిస్తామని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. ఎగుమతిదారులకు ప్రోత్సాహకం కింద ప్రభుత్వం రూ.కోటి నిధులు ఇవ్వడానికి ఆమోదం తెలిపిందని ఆయన అన్నారు. బుధవారం తన కార్యాలయంలో అరటి ఎగుమతిదారులు, అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు.

సీఎం ఆదేశం

“తాడిపత్రి రైల్వేస్టేషన్ నుంచి ప్రత్యేక రైలు ద్వారా అరటి ఎగుమతి చేసేందుకు నిర్దేశిత వ్యాపారులు త్వరగా చర్యలు తీసుకోవాలి. రీఫర్ కంటెయినర్‌కు రూ.10 వేలు ప్రోత్సాహకాన్ని అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. తాడిపత్రి నుంచి జేఎన్‌పీటీ పోర్టు దాకా అరటి ఎగుమతి చేసే ప్రక్రియను సత్వరం మొదలు పెట్టాలని స్వయంగా సీఎం చంద్రబాబు మొన్నటి సమీక్షలో ఆదేశించారు. ప్రోత్సాహక నిధులపై ఉద్యాన శాఖ ఉన్నతాధికారులతోనూ మాట్లాడాం. అరటి నాణ్యత పెంచడానికి యంత్రాంగం సాయంతో తగిన చర్యలు తీసుకుంటాం” **- కలెక్టర్**

త్రినేత్రుడు సరస్వతీ రూపుడై

అనంతపురం మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరుడు.. సరస్వతీ మాత రూపంగా శాకంబరీ అలంకరణలో దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి హంస వాహనంపై పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి మహాన్యాసపూర్వక ఏకవార రుద్రాభిషేకం, సాయంత్రం దీక్షా హోమం జరిగింది. వాసవీ నృత్యశిక్షణాలయం నాట్యగురువు పద్మరాజ్ ఆధ్వర్యంలో 19 మంది చిన్నారుల భరతనాట్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

- న్యూస్‌టుడే, అనంత సాంస్కృతికం

కుంగింది.. కలవరపెడుతోంది!

హెచ్చెల్సీ వెళుతున్న ప్రాంతంలో వంతెనల దారులు అధ్వానంగా మారాయి. కొన్నేళ్లుగా వాటి నిర్వహణ లేకపోవడంతో రాకపోకలకు నరకప్రాయంగా మారాయి. కణేకల్లు మండలం మాల్యం వద్ద హెచ్చెల్సీపై రోడ్డు మొత్తం కుంగిపోయింది. కంకర తేలి గోతులు ఏర్పడ్డాయి. ఐదేళ్లుగా ఇదే దుస్థితి నెలకొనడంతో వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో గుంతలను గుర్తించక ప్రమాదాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. అధికారులు స్పందించి రహదారులను బాగు చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు. **-ఈనాడు, అనంతపురం**

చిన్నారి తల్లులు!

- పెరుగుతున్న టీనేజీ గర్భిణుల శాతం
- తీవ్ర సమస్యాత్మక జిల్లాగా అనంత

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: అనంత జిల్లాలో వందలాది బాలికలు గర్భం దాలుస్తుండటం కలకలం రేపుతోంది. ఏటా ఈ సంఖ్య పెరుగుతోంది. తీవ్ర సమస్యాత్మక జిల్లాల్లో అనంత నాలుగో స్థానంలో ఉండటం విస్మయాన్ని కలిగిస్తోంది. రాష్ట్ర సగటున 8.8 శాతం మంది టీనేజీ గర్భిణులు ఉండగా.. అనంత జిల్లాలో 13 ఉండటం గమనార్హం. ఈనెల 9న జరిగిన మంత్రులు, కార్యదర్శులు, కలెక్టర్ల సమీక్షలో స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు బాల్య వివాహాలు, టీనేజీ గర్భిణుల సంఖ్యపై ఆందోళన వ్యక్త పరిచారు. ఒక వైపు బాల్య వివాహాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే బాలికలు గర్భం దాల్చి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

ఏటా 44వేల పెళ్లిళ్లు

జిల్లాలో ఏటా 44వేల వివాహాలు జరుగుతాయని అంచనా. ఇందులో సుమారు 16వేలు దాకా బాల్య వివాహాలు ఉంటాయని భావిస్తున్నారు. వారిలోనే దాదాపు 2వేల(13%) మంది దాకా బాలికలు గర్భిణులు అవుతున్నారు. నిర్దేశిత ప్రభుత్వ శాఖల యంత్రాంగం మాత్రం 300 దాకా బాల్య వివాహాలను నియంత్రిస్తున్నట్లు ‘లెక్క’ నమోదు చేస్తున్నారు.

★ ఉరవకొండ, రాయదుర్గం ప్రాజెక్టు పరిధిలోనే 200పైగా టీనేజీ గర్భిణులు ఉన్నట్లు తెలుస్తోంది. గుత్తి, కంబదూరు, కణేకల్లు, కళ్యాణదుర్గం, అనంత గ్రామీణ ప్రాజెక్టుల్లోనూ వందకుపైగా ఉన్నాయి. నార్పల, శింగనమల, అనంత పట్టణం, తాడిపత్రిలో వందలోపే ఉన్నాయి.

అవగాహన లోపం.. పేదరికం

ప్రధానంగా బాల్య వివాహాలు జరగడానికి పేదరికం, అవగాహన లోపమే మూలం. ప్రేమ, వలసలు, మంచి సంబంధం.. వంటి అంశాలు పరిగణలోకి వస్తున్నాయి. ఇటీవల పలువురు ప్రేమ, ఆకర్షణతో దగా పడుతున్నారు. గడిచిన పది రోజుల్లోనే మూడు కేసులు తెరపైకి వచ్చాయి. పోక్సో చట్టం కింద కేసులూ నమోదు అయ్యాయి. ★ బాల్య వివాహాల నిర్మూలనపై ఆశించిన స్థాయిలో ప్రచారం సాగలేదు. జిల్లా కేంద్రానికి సమీపంలోని విద్యా సంస్థల్లో తూతూ మంత్రంగా ప్రచారం చేసి చేతులు దులుపుకొంటున్నారు. ఆయా శాఖల అధికారులు, సిబ్బంది ఏమాత్రం పట్టించుకోవడం లేదు. బాల్య వివాహాలంటే కేవలం ఐసీడీఎస్‌కు సంబంధించినదే అన్నట్లుగా భావిస్తున్నారు. అన్ని శాఖలు సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తేనే బాల్యవివాహాలకు అడ్డుకట్ట వేయడానికి అవకాశం ఉంటుంది.

కె.కె.అగ్రహారం.. అధికారి అక్రమార్గం

బంధువు పేరుతో భూమి పత్రాల బదలాయింపు

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: బుక్కరాయసముద్రం మండల పరిధి కె.కె.అగ్రహారంలో 55ఏళ్ల కిందట దళితులకు ఇచ్చిన ప్రభుత్వ భూమిని డిప్యూటీ తహసీల్దార్ హోదాలో ఉన్న ఓ అధికారి బంధువుల పేరుతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. పైగా ఆ భూమి తనకే చెందేలా ఉత్తర్వులు ఇవ్వాలని హైకోర్టును ఆశ్రయించడం గమనార్హం.

భూమి పత్రాలు చూపుతున్న లక్ష్మమ్మ కుటుంబం

ఏం జరిగింది

కె.కె.అగ్రహారానికి చెందిన పెద్దన్నకు సర్వేనంబరు 612-1లో 2.05 ఎకరాల భూమిని 1972లో అసైన్‌మెంట్ పట్టా కింద ప్రభుత్వం పంపిణీ చేసింది. 55 ఏళ్లుగా భూమిలో పెద్దన్న కుటుంబం సాగులో ఉంది. పెద్దన్న మరణానంతరం ఆ భూమిని భార్య లక్ష్మమ్మ పేరుతో బదలాయించారు. 8 ఏళ్లక్రితం మండలంలో రెవెన్యూ అధికారిగా పనిచేసిన ఓవ్యక్తి కన్ను ఈ భూమిపై పడింది. తప్పుడు పత్రాలను సృష్టించి భూమిని తన బంధువు పేరుతో ఆన్‌లైన్‌లో రికార్డులు మార్చేశాడని, లక్ష్మమ్మ భూమి రికార్డులు కార్యాలయంలో లేకుండా చేశాడని ఇందుకు ఓ ఉద్యోగి సహకారం అందించారని బాధితులు ఆరోపిస్తున్నారు.

తనకే ఇవ్వాలని కోర్టుకు..

భూమిని బంధువుల పేరుతో కాజేయడానికి యత్నిస్తున్న అధికారి ప్రస్తుతం డిప్యూటీ తహసీల్దారు స్థాయిలో జిల్లాలోనే పనిచేస్తున్నాడు. భూమి తనకే ఇవ్వాలని హైకోర్టును ఆశ్రయించడం విశేషం. భూమి పోతుందన్న బాధతో లక్ష్మమ్మ మంచం పట్టారు. ఆర్థిక స్థోమత లేక ఐదేళ్లుగా తహసీల్దారు కార్యాలయాం చుట్టూ తిరుగుతున్నా మని వాపోతున్నారు.

“లక్ష్మమ్మ పేరుతో పాసుపుస్తకాలు ఉన్నమాట వాస్తమేనని, ప్రస్తుతం వారే సాగులో ఉన్నారన్నారు. భూమికి సంబంధించిన రికార్డులన్నీ కోర్టుకు సమర్పించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటా.”

- తహసీల్దారు శ్రీధరమూర్తి

పది తర్ఫీదుపై నిర్లక్ష్యం

చదువులో వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించని వైనం

‘బడిబయట ఉంటున్న, అభ్యసన పరంగా వెనుకబడిన పదో తరగతి విద్యార్థులకు రెసిడెన్షియల్ తర్ఫీదు ఇవ్వడానికి వసతిగృహాల్లో చేర్పించాలని చెబుతున్నా.. కొందరు ఎంఈవోలు నిర్లక్ష్యం చేస్తున్నారు. కనీసం 50 శాతం మంది విద్యార్థులను చేర్పించండి. తల్లిదండ్రులతో సంతకాలు చేయించండి. ఇతర శాఖాధికారులతో మళ్లీ సర్వే చేయిస్తా. నివేదిక తప్పుగా ఉంటే సంబంధిత ఎంఈవోలు, హెచ్ఎంలను ఇంటికి పంపిస్తా’

- అధికారులతో మంగళవారం నిర్వహించిన వెబ్‌కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఆనంద్

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: పదో తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంచడానికి వంద రోజుల కార్యాచరణ అమలు చేస్తోంది. జిల్లాలో 365 మంది ప్రత్యేక తరగతులకు హాజరుకావడంలేదు. అభ్యసనలో వెనుకబడిన సి, డి. గ్రేడ్ విద్యార్థులు ఉత్తీర్ణులు కావడానికి చర్యలు చేపడుతున్నారు. బాలికలను సమీపంలోని కేజీబీవీ, విద్యార్థులను సంక్షేమ వసతి గృహాల్లో చేర్పించి శిక్షణ ఇప్పించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈక్రమంలో గైర్హాజరవుతున్న 365 మందిలో ఇప్పటి వరకు 50 మందిని.. అభ్యసనపరంగా వెనుకబడిన సుమారు 5 వేల మంది విద్యార్థుల్లో కేవలం 500 మందిని చేర్పించారు. కొందరు ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులు సక్రమంగా పట్టించుకోకపోవడంతో ఈ కార్యక్రమం నీరుగారుతోంది. మార్చి 10వ తేదీ వరకూ ప్రత్యేక తర్ఫీదు ఇవ్వనున్నారు.

జిల్లాలో ఇలా..

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు: 354
- పదో తరగతి విద్యార్థులు : 19,338
- సి గ్రేడ్‌లో ఉన్న వారు : 2,584
- డి గ్రేడ్‌లో.. : 3,494

మిగిలింది 31 రోజులే

పరీక్షలు ఆరంభం కావడానికి 31 రోజులే ఉన్నాయి. మార్చి 16 నుంచి పరీక్షలు ఆరంభం కానున్నాయి. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులు ఉత్తీర్ణత పరంగా ప్రతి సంవత్సరం వెనుకబడుతున్నారు.

క్వాంటం సైబర్ సెక్యూరిటీతో ఉద్యోగావకాశాలు

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: భవిష్యత్తులో క్వాంటం సైబర్ సెక్యూరిటీతో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయని జేఎన్‌టీయూ వీసీ ఆచార్య సుదర్శనరావు పేర్కొన్నారు. జేఎన్‌టీయూ కంప్యూటర్‌సైన్స్ ఇంజినీరింగ్ విభాగంలో బుధవారం ‘సైబర్ సెక్యూరిటీ-ఏఐ ఎకానమి’ అనే అంశంపై విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. మైక్రోసాఫ్ట్ సంస్థ కార్పొరేటర్ సోసియల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా రోమన్ టెక్నాలజీ, ఐఐఐటీ లఖ్‌నవూ, ఈవై గ్లోబల్ లిమిటెడ్ భాగస్వామ్యంతో 3 నెలల పాటు ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రిన్సిపల్ చెన్నారెడ్డి, శిక్షకులు సోహల్ సిద్ధిఖీ, ఆచార్యులు శోభాబిందు, రాజశేఖర్, దిలీప్‌కుమార్, రోమన్ టెక్నాలజీ ప్రతినిధి రక్షిత్ పాల్గొన్నారు.

అదరహో.. అద్దాల అంగళ్లు

హైదరాబాద్‌లో చౌటుప్పల్ వద్ద ఓ సంస్థ కంటెయినర్లతో నిర్మించే అందమైన కార్యాలయాలకు భలే గిరాకీ ఉంది. కొన్ని కార్పొరేటు కంపెనీలు తాత్కాలికంగా ఇటువంటి కంటెయినర్ల కార్యాలయాలను కావాలని ఆర్డర్లు పెడుతున్నాయి. రెండు వైపులా రూంలు లేదా దుకాణాలు నిర్వహించుకునే వీలుండటం, మధ్యలో అద్దాలతో తలుపులు.. ఇవన్నీ కార్పొరేటు శైలిని తలపిస్తున్నాయి. ఇలాంటి కార్యాలయాలు కావాలని మైసూర్‌కు చెందిన ఓ కంపెనీ ఆర్డర్ ఇవ్వడంతో హైదరాబాద్ నుంచి వీటిని ఏడు లారీల్లో తరలిస్తున్నారు. బుధవారం ఇవి అనంతపురం చేరుకున్నాయి. **- ఈనాడు, అనంతపురం**

కరివేపాకు.. కాసుల పంట

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: వాణిజ్య పంటగా పేరొందిన పంటల్లో కరివేపాకు ఒకటి. డిమాండుకు తగట్టుగా ధర అమాంతంగా పెరిగిపోయింది. అరటి, చీనీ, కర్బూజాకు కూడా ఈ ధర దక్కదు. పంటను ఒకసారి సాగు చేస్తే 15-20 ఏళ్ల పాటు నిరంతరాయంగా దిగుబడి పొందవచ్చు. గతంలో ఎన్నడూ లేనివిధంగా టన్ను ఏకంగా రూ.50 వేలకు పైగా పలుకుతోంది.

ఏడాదికి మూడు కోతలు

కరివేపాకు తొలి ఏడాది కోత కొంత ఆలస్యమవుతోంది. రెండో ఏడాది నుంచి నాలుగు నెలలకొకసారి చొప్పున ఏడాదికి మూడు కోతలు వస్తాయి. ఎకరాకు మొదటి కోతకు దిగుబడి 8 టన్నులు వస్తోంది. ఆ లెక్కన ఏడాదికి 24 టన్నుల వరకు దిగుబడి వస్తోందని ఉద్యానశాఖ అంచనా వేసింది. రెండో కోత పంట నుంచి పెట్టుబడి ఖర్చులు తగ్గడం, దిగుబడి పెరగడంతో మంచి ఆదాయం పొందుతున్నారు.

2,300 ఎకరాల్లో సాగు

జిల్లాలోని గుంతకల్లు, తాడిపత్రి, నార్పల, పుట్లూరు, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు, శింగనమల, గార్లదిన్నె, పామిడి, యాడికి, యల్లనూరు, బుక్కరాయసముద్రం మండలాల్లో కరివేపాకు ఎక్కువ సాగు చేస్తున్నారు. సుమారు 2,300 ఎకరాల్లో పంట ఉంది. ఏడాదికి 55,200 టన్నులు దిగుబడి వస్తుంది అధికారులు అంచనా వేశారు.

నార్పలలో సాగు చేసిన కరివేపాకు పంట

వివిధ ప్రాంతాలకు ఎగుమతి

ఆంధ్రప్రదేశ్‌తో పాటు ముంబయి, బెంగళూరు, చిత్రదుర్గం, బళ్లారి, హైదరాబాద్, చెన్నై తదితర నగరాలకు ఎగుమతి చేస్తున్నారు. పంటకు డిమాండు పెరగడంతో తోటల వద్దనే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు.

17 నుంచి జిల్లా స్థాయి శాప్ లీగ్ పోటీలు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్ల ఎంపిక తేదీలను డీఎస్‌డీఓ ఎస్ఎం మంజుల ప్రకటించారు. జిల్లా స్థాయి అండర్-13, 15, 17, 19 విభాగాల బాలబాలికల చెస్ పోటీలు ఈనెల 17న డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తామని ఆమె తెలిపారు.

★ జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన వారు ఈనెల 21, 22 తేదీల్లో తిరుపతిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు.

★ సైక్లింగ్ అండర్-18 బాలబాలికల జిల్లా స్థాయి పోటీలు ఈనెల 24న నీలం సంజీవ రెడ్డి స్టేడియంలో నిర్వహిస్తారు.

★ రాష్ట్రస్థాయి పోటీలు ఎన్టీఆర్ జిల్లాలో ఈనెల 28వ తేదీన, మార్చి ఒకటిన నిర్వహించనున్నారు.

రిజిస్ట్రేషన్ ఇలా..

ఈ పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు శాప్ వెబ్‌సైట్‌లో ఉన్న క్రీడాయాప్ ద్వారా వ్యక్తిగత వివరాలు, క్రీడాంశం, విభాగాల వారీగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఏడాది పొడవునా నెలకు మూడు క్రీడల చొప్పున 31 క్రీడాంశాల్లో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలు శాప్ నిర్వహిస్తుంది. రిజిస్ట్రేషన్ చేసుకున్న క్రీడాకారులు మాత్రమే పోటీల్లో పాల్గొనడానికి అర్హులన్నారు. విజేతలకు ప్రదానం చేసే మెరిట్ పత్రాలు యాప్ ద్వారా జారీ చేస్తారని వివరించారు.

★ ఇతర వివరాలకు 79890-90758 చరవాణి నంబరును సంప్రదించవచ్చు.

స్వామివారి భూమి.. ఆదాయం అందదేమీ?

గుత్తి, గుంతకల్లు, తాడిపత్రి, ఉరవకొండ, న్యూస్‌టుడే: ఆలయాలకు రూ.కోట్లలో భూములున్నా తగినంత ఆదాయం రావడం లేదు. బహిరంగ వేలాలు నిర్వహించకుండా సాగుదారులకే వంతపాడుతూ అప్పగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వేల ఎకరాల భూములున్న చోట కూడా అరకొర భూములకు గుట్టుగా వేలాలు వేస్తున్నారు. బహిరంగ వేలాలు వేస్తే దేవాదాయశాఖకు రూ.కోట్లలో ఆదాయం సమకూరుతుంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా గుంతకల్లు, ఉరవకొండ, తాడిపత్రి నియోజవర్గాల్లో ఆలయ భూములకు నామమాత్రంగా వేలాలు జరుపుతున్నారు.

ఇదీ పరిస్థితి...

గుంతకల్లు నియోజకవర్గం బేతాపల్లిలో శివాలయానికి చెందిన 18 ఎకరాల్లో కొందరు 50 ఏళ్ల నుంచి ఆధీనంలో ఉంచుకొని సాగు చేసుకుంటున్నారు. దేవాదాయశాఖకు ఏ మాత్రం గుత్తలు రావడంలేదు. చెట్నేపల్లిలోని శివాలయానికి చెందిన 20 ఎకరాల భూమిలో కొందరు సాగు చేసుకుంటున్నా.. వారు ఓ సామాజిక వర్గం వారికే గుత్త చెల్లిస్తున్నారు.

❖ జక్కలచెరువు పంచాయతీ పరిధి గొందిపల్లిలో బొలికొండ రంగనాథస్వామి ఆలయానికున్న 42 ఎకరాల భూమి పూర్తిగా ఆక్రమణలకు గురైంది. ❖ రజాపురంలో బురుడాల విఘ్నేశ్వర ఆలయానికున్న భూమి ఆక్రమణకు గురైంది. అదేగ్రామంలో మఠం ఆస్తులు 20 ఎకరాలు అన్యాక్రాంతమైంది.

❖ తాడిపత్రి నియోజకవర్గం యాడికిలో చెన్నకేశవస్వామికి చెందిన 200 ఎకరాలను కొందరు ఆక్రమించుకున్నారు.

❖ తాడిపత్రి పట్టణంలో రూ.కోట్ల విలువైన మఠం భూమిలో 150 మంది పాగావేశారు. ఆక్రమణదారులకే రెవెన్యూ అధికారులు కొన్నేళ్ల కిందట పొజిషన్ పత్రాలు ఇచ్చారు. ఆలూరుకోన, బుగ్గలోని ఆలయ భూమి, కనకాద్రిపల్లిలలోని భూముల నుంచి అరకొర ఆదాయమే సమకూరుతోంది.

❖ ఉరవకొండలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహాస్వామి ఆలయానికి 2,134 ఎకరాల భూమి ఉండగా 1,556 ఎకరాలకు మాత్రమే వేలం నిర్వహిస్తున్నారు. దేవుడికి ఏటా రూ.కోటి దాకా ఆదాయం రావాల్సి ఉంది. రూ.16 లక్షలు మాత్రమే వస్తోంది.

మూడేళ్లకోసారి వేలం..

గుత్తి, గుంతకల్లు, పెద్దవడుగూరు మండలాల్లోని ఆలయ భూములకు ప్రతి మూడేళ్లకోసారి బహిరంగ వేలాలు వేస్తున్నాం. అనేక చోట్ల ఆలయ భూములను పూజార్లు, పెద్దలు వేలాలు వేస్తున్నారు. కొన్ని చోట్ల మాత్రమే ఆలయాల దీప, ధూప నైవేద్యానికి సొమ్మును వెచ్చిస్తున్నారు. సాగులో ఉంటున్న భూములకు పక్కాగా వేలాలు వేస్తున్నాం.

- నాగేంద్రుడు, ఈవో, గ్రూపు టెంపుల్, గుత్తి

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

పూర్తి వివరములకు: 8008709784

అనురాగస్మృతులతో...


కీ॥శే॥ శ్రీ మాదాల పుల్లమనాయుడు గారు
రిటైర్డ్ మేనేజర్, ఆంధ్రాబ్యాంక్, అనంతపురము
భార్య: శ్రీమతి మాదాల ఉమాదేవి
సెల్: 7892621421, 9008123474
వైకుంఠ సమారాధన: 12-02-2026వ తేదీ గురువారం ఉదయం 10 గంటల నుండి అనంతపురము, మారుతి నగర్, 2వ క్రాస్, డి.నెం. 6/4/36/12, మా స్వగృహము నందు జరుగును.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్/ఫైనాన్స్ లో తాకట్టు ఉన్నవి మా ద్వారా విడిపించి కొంటాము. సెల్ల్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డ్ ట్రేడింగ్ కం. ✆ 7382114647.

COMPUTER EDUCATION

Lasyakrish టెక్నాలజీస్, ATP వారి తరఫున కంప్యూటర్ కోర్స్, మొబైల్ రిపేర్ నందు 3 నెలలు ఉచిత శిక్షణ + వసతి. ✆ 9642273066,7674937927.

REAL ESTATE

FLAT FOR SALE

East Facing 2BHK Flat, 1300 SFT, with Good Interiors, Geyser, Fans, Chimney Free, 9 years old, Suvida Sadan Apartment, 3rd Cross, Maruthi Nagar. Contact: 8328453431

LEASE/ RENT

స్కూలు లీజుకు కావలెను. అనంతపురం నగర పరిసరాల్లో మంచి బిల్డింగ్ విశాలమైన గ్రౌండ్ ఉన్న స్కూల్ లీజుకు ఇవ్వదలచుకున్నవారు సంప్రదించండి: 9133399861.

LAND REQUIRED

ల్యాండ్ పార్ట్నర్స్ Land Partners కావలెను. ✆ 9133399861.

JOBS

అనంతపూర్ షీప్ ఫార్మ్స్ (Sheep farm) లో పనిచేయుటకు వర్కర్స్ కావలెను. మంచి శాలరీ ఇవ్వబడును. కాంటాక్ట్: 9989304684

Rajahamsa Grand ఇన్ Hotel నందు రూమ్‌బాయ్స్‌గా పనిచేయుటకు కావలెను. ✆ 9948266888.

ప్రముఖ కంపెనీలో బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ గా పని చేయుటకు కావలెను. అర్హత: MBA/B.Com /B.Sc వయస్సు: 30-45. ✆ 8885423099

ATP ట్యూటర్ లైట్ ప్రాజెక్ట్ సెంటర్ నందు పనిచేయుటకు కావలెను. # 2-224, 4వ క్రాస్, 2వ రోడ్, ATP. Cell: 7780544424

సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. కదిరిలో పని చేయుటకు 10 గంటలు డ్యూటీ, జీతం: 12000/- వివరాలకు: 72880 04466

గమనిక

క్లాసిఫైడ్స్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవాలని పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారులు వెలువరించే వివరాలకు ఈనాడు బాధ్యత వహించదు.

5 లైన్ల ప్రకటన రూ.395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి... అధిక స్పందనలు పొందండి.

వివరాలకు: 8008709784

ప్రకటనలపై జీఎస్టీ 5% వర్తించును

సర్కారుపై ఆశ.. భూగర్భ జలాలపైనే ధ్యాస!

● కలగా రాగులపాడు తూము ఏర్పాటు
● రైతులకు తప్పని ఎదురుచూపులు

గుంతకల్లు, ఉరవకొండ, న్యూస్‌టుడే : గుంతకల్లు సమీపంలో నుంచి వెళ్లే హంద్రీనీవా కాలువకు ఉరవకొండ నియోజకవర్గం వజ్రకరూరు మండలంలోని రాగులపాడు వద్ద తూము ఏర్పాటు విషయంలో అంతులేని జాప్యం జరుగుతోంది. ఆ పనులు జరిగితే గుంతకల్లు మండలంలోని చెరువులు, కుంటలకు, పలు చెక్‌డ్యాంలకు నీటిని అందించడానికి ఉపయుక్తంగా ఉంటుంది. దీంతోపాటు ఉరవకొండ నియోజకవర్గంలోనూ కొన్ని కుంటలు, చెక్‌డ్యాంలకు నీరు అందివ్వడానికి వీలుంటుంది.

2018లోనే అనుమతులు

గత తెదేపా ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ కాలువ ఏర్పాటు కోసం ప్రభుత్వం నుంచి 2018లో ఉత్తర్వులు తీసుకొచ్చారు. అప్పటి ప్రభుత్వం రూ.40 కోట్లు మంజూరు చేసింది. తరువాత వైకాపా ప్రభుత్వం 2021లో టెండర్లు నిర్వహించారు. అప్పటి ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి భూమి పూజ చేసి పట్టించుకోలేదు. భూసేకరణ ప్రక్రియ ముందుకు సాగలేదు. ఇప్పుడా కాలువ అంచనా వ్యయం రూ.55 కోట్లకు చేరింది. ● కాలువ ఏర్పాటు చేస్తామని గతంలోనే ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా గత మేలో ఉరవకొండ నియోజకవర్గానికి వచ్చిన సమయంలోనూ రైతులకు అభయమిచ్చారు.

ప్రయోజనం బోలెడు

కాలువ ఏర్పాటైతే వజ్రకరూరు మండలంలోనే కాకుండా గుంతకల్లు మండలంలోని దాదాపు 4 వేల సేద్యపు బోర్లలో నీటి మట్టం పెరిగి పంటలు పండించుకోవడానికి వీలుంటుంది. కుంటల్లో, చెరువులు, చెక్ డ్యాంలో నీరు నిల్వఉంటే భూగర్భజలమట్టం పెరుగుతుంది. తాగునీటి సమస్యకు పరిష్కారం లభించే అవకాశముంది. దీనిపై హంద్రీనీవా కాలువ గుంతకల్లు డివిజన్ ఈఈ శ్రీనివాస్‌నాయక్ స్పందిస్తూ ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందగానే సమగ్రమైన నివేదికను అందించి పనులను ప్రారంభిస్తామన్నారు.

నీరు లేక ఒట్టిపోయిన పులగుట్టపల్లి చెరువు

పొడవు	20 కి.మీ.లు	తూము నిర్మాణ వ్యయం (అంచనాల్లో)	రూ.55 కోట్లు
లబ్ధిపొందే మండలాలు	గుంతకల్లు, వజ్రకరూరు, ఉరవకొండ	భూసేకరణ	230 ఎకరాలు
హంద్రీనీవా నీటితో నింపే చెరువులు, కుంటలు	14	కాలువ సామర్థ్యం	100 క్యూసెక్కులు

ఈఏడాదిలో పూర్తి చేయిస్తాం

హంద్రీనీవా కాలువకు రాగులపాడు వద్ద తూమును ఏర్పాటు చేయిస్తాం. ఈ ఏడాది చివరికంతా పనులు పూర్తయ్యేలా ప్రణాళికతో ముందుకెళ్తాం. నిధులను మంజూరు చేయించుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. - జయరాం, ఎమ్మెల్యే, గుంతకల్లు

మహాత్మ జ్యోతిబా ఫులె గురుకులాల్లో ప్రవేశాలు

అనంతపురం (అశోక్‌నగర్), న్యూస్‌టుడే: మహాత్మా జ్యోతిబా ఫులె ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు ప్రకటన విడుదల అయింది. 2026-2027 విద్యాసంవత్సరంలో ప్రవేశాలు కల్పిస్తారు.

ఎక్కడెక్కడ..ఎన్ని సీట్లు

బాలుర గురుకులంలో ఐదో తరగతిలో ప్రవేశాలకు ఉరవకొండ మండలం పెన్నహోబిళం 80సీట్లు, కళ్యాణదుర్గం మండలం కుందుర్పిలో 40సీట్లు, బాలికల విభాగంలో డి.హిరేహాళ్‌లో 40, గోనబావిలో 40, నార్పలలో 80సీట్లు ఉన్నాయి. అనంతపురం జిల్లాలో ఇంటర్ కళాశాలలు లేవు. శ్రీసత్యసాయిలో మొత్తం 13 ఉండగా ఇందులో ఇంటర్ కళాశాలలు ఉన్నాయి. ●6, 7, 8వ తరగతుల్లో ఆయా గురుకులాల్లో ఖాళీలను బట్టి ప్రవేశాలు ఉంటాయి. ఇంటర్‌లో ఆంగ్లమాధ్యమంలో చదివేందుకు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుకు చివరి తేది: **4-3-2026,** 5వ తరగతిలో ప్రవేశాలకు ప్రవేశ పరీక్ష: **12-4-2026,** 6,7,8 తరగతుల్లో మిగిలిన సీట్లకు: **19-4-2026** మధ్యాహ్నం, ఇంటర్‌లో ప్రవేశాలకు: అదేరోజు ఉదయం. దరఖాస్తుకు వెబ్‌సైట్: https:///mipaphcwreis.apcfss.in సంప్రదించాల్సిన నంబరు: 8125840147

ఉద్యోగుల క్రెడిట్ సొసైటీ అవకతవకలపై విచారణ

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఉద్యోగుల క్రెడిట్ సొసైటీలో చోటుచేసుకున్న అవకతవకలపై విచారణకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా సహకార శాఖ అధికారిణి అరుణకుమారి ఆదేశాల మేరకు విచారణ చేయడానికి రంగం సిద్ధమైంది. గత ఆర్థిక సంవత్సరంలో సొసైటీలో నిబంధనలకు విరుద్ధంగా నిధులు ఖర్చు చేశారని సభ్యులు అభ్యంతరాలు లేవనెత్తారు. ఈ విషయాన్ని డివిజనల్ సహకార శాఖ అధికారి వెంకటరామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన డీసీసీబీ విషయాన్ని చేరవేశారు. సహకార చట్టం సెక్షన్ 52 కింద విచారణ చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. విచారణ అధికారిగా మల్లరాయుడిని నియమించారు. బుధవారం ఆయన క్రెడిట్ సొసైటీ పాలకవర్గ సభ్యులకు తాఖీదులు జారీ చేశారు. తక్షణమే రికార్డులన్నీ అప్పగించాలని సూచించారు. రికార్డులు అప్పగించిన తర్వాత విచారణ ప్రారంభిస్తానని అధికారి మల్లరాయుడు తెలిపారు.

సేవాఘడ్‌కు నిరంతర విద్యుత్తు

గుంతకల్లు పట్టణం: పాతకొత్త చెరువు గ్రామంలో 33కేవీ విద్యుత్తు ఉపకేంద్రంలో బుధవారం సేవాఘడ్‌కు 24గంటల పాటు విద్యుత్తు సరఫరా చేసేందుకు కన్‌స్ట్రక్షన్ ఏడీ రంగస్వామి కొత్త బ్రేకరును ప్రారంభించారు. సేవాఘడ్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్తు సరఫరా చేసేందుకు బ్రేకరును ప్రారంభించామన్నారు. ఈకార్యక్రమంలో ఏఈ మన్నన్, సిబ్బంది పాల్గొన్నారు.

కాలమానిని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్, గెజిటెడ్ అధికారులు

స్టడీ సర్కిల్ పునః ప్రారంభానికి రూ.22 లక్షలతో ప్రతిపాదనలు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువత బాగు కోసం స్టడీ సర్కిల్ భవన మరమ్మతుకు రూ.22 లక్షలతో ప్రతిపాదనలు పంపడం సంతోషకరమని అఖిల భారత ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంఘం హర్షం వ్యక్తం చేసింది. బుధవారం కలెక్టర్ ఆనంద్‌ను కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆ సంఘం డైరీని ఆవిష్కరించారు. జిల్లాలోని ప్రభుత్వ శాఖల్లో ఫోకల్ పాయింట్ల వద్ద దళిత, గిరిజన ఉద్యోగ, అధికారులను నియమించేలా చొరవ తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ప్రధాన కార్యదర్శి రవిశంకర్, కేంద్ర కమిటీ సభ్యుడు సోమశేఖర్, విశ్రాంత డీసీటీఓ సుబ్బన్న, కలెక్టర్ కార్యాలయ సమన్వయాధికారి యుగేశ్వరిదేవి, డిగ్రీ అధ్యాపకుడు సుగప్ప, జేఎన్‌టీయూ ఇంజినీరు శ్యామ్‌బాబు, ఏబీసీడబ్ల్యూఓ సుభాషిణి, డీఈఈ లలిత, ఏఈఈ జైప్రకాశ్ పాల్గొన్నారు.

యాడికి.. అవుట్‌పోస్టుకు దిక్కేది?

యాడికి, న్యూస్‌టుడే : యాడికి మండలంలో అవుట్‌పోస్టుల నిర్వహణను పోలీసులు గాలికి వదిలేశారు. తాడిపత్రి సబ్‌డివిజన్ పరిధిలోని యాడికి మండలంలో నేరాల సంఖ్య అధికంగానే ఉంటుంది. దీంతో ఉన్నతాధికారులు యాడికిలో అవుట్‌పోస్టు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అవుట్‌పోస్టు చిరు వ్యాపారులకు నిలయంగా మారింది. ఇక్కడి పాత పోలీస్‌స్టేషన్ భవనం అవసరాలకు సరిపోకపోవడం, గదులు శిథిలావస్థకు చేరడం, వర్షాలు వస్తే కారడం జరుగుతుండేది. దీంతో గత తెదేపా ప్రభుత్వ హయాంలో గ్రామానికి దూరంగా నూతన భవనాలు నిర్మించి పోలీస్‌స్టేషన్‌ను అక్కడికి మార్చారు.

చిరు వ్యాపారులకు నిలయంగా అవుట్ పోస్టు

తక్షణ సేవల నిమిత్తం కేంద్రం

వివిధ సమస్యలు, ఫిర్యాదులను ఇవ్వడానికి బాధితులు, ప్రజలు రావాలంటే ఇబ్బందులు తలెత్తేవి. సమస్యను గుర్తించి తక్షణ చర్యల నిమిత్తం పాత భవనంలో అవుట్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఒక ఏఎస్సైతో పాటు ఇద్దరు సిబ్బందిని నియమించి ప్రారంభించారు. కొంతకాలం తర్వాత పట్టించుకోలేదు. అప్పటి నుంచి భవనం చుట్టూ చిరువ్యాపారులు ఆక్రమించారు. ● రాయలచెరువులో రైల్వేస్టేషన్, జాతీయ రహదారి, జనాభా దృష్ట్యా ఇక్కడా అవుట్‌పోస్టును ఏర్పాటు చేయాలనుకున్నారు. రైల్వేగేటు సమీపంలో వ్యవసాయ చెక్‌పోస్టు పక్కనే గది నిర్మాణం చేపట్టారు. ఎందుకనో అదికాస్త సగంలోనే ఆగిపోయింది. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని సీఐ ఆర్.శ్రీనివాసులు తెలిపారు.

ఓవరాల్ ఛాంపియన్ కప్‌ను అందజేస్తున్న ఐజీ షిమోషీ, ఎస్పీ జగదీశ్

ముగిసిన పోలీసు క్రీడలు

ఆజాద్‌నగర్ (అనంతపురం),న్యూస్‌టుడే: జిల్లా పోలీసు స్పోర్ట్స్ అండ్ గేమ్స్-2025 బహుమతుల ప్రదానం పండగ వాతావరణంలో బుధవారం నగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో సాగింది. ముఖ్య అతిథులుగా ఐజీ షిమోషీ, ఎస్పీ జగదీశ్‌లు పాల్గొని పోలీసు అధికారులు, సిబ్బందిని ఉత్సాహ పరిచారు. క్రీడల్లో గెలుపొందిన జట్లు, వ్యక్తిగత విజేతలకు కప్‌లు, పతకాలు అందజేశారు. అనంతరం పోలీసు కుటుంబాలతో కలిసి 'బడాఖానా' కార్యక్రమంలో ఐజీ, ఎస్పీలు పాల్గొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో చేరిన తొలినాళ్లలో నేర్చుకున్న శిక్షణ మరచిపోకుండా ఉండేలా ఈ కార్యక్రమాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. ముగింపు కార్యక్రమంలో ఐజీ, ఎస్పీ జట్లుగా విడిపోయి టగ్ ఆఫ్ వార్ నిర్వహించారు. పోటీలో ఎస్పీ జట్టు గెలుపొందింది. తాడిపత్రి ఏఎస్పీ రోహిత్‌కుమార్, శిక్షణ ఐపీఎస్ అశ్విని మణిదీప్, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఓవరాల్ ఛాంపియన్‌గా ఏఆర్ జట్టు

మూడు రోజులుగా జరిగిన పోలీసు క్రీడల్లో అన్ని విభాగాల్లో ప్రతిభ చూపిన జిల్లా ఏఆర్ విభాగం ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. క్రికెట్, పరుగు పందెం, రిలే, వాలీబాల్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రోలో గ్రూపు, వ్యక్తిగత విజయాలను నమోదు చేసింది. అలాగే అనంతపురం, తాడిపత్రి, కళ్యాణదుర్గం, గుంతకల్లు సబ్ డివిజన్‌ల జట్లకు మెమెంటోలను ఐజీ, ఎస్పీలు అందజేశారు.

జడ్పీ పాఠశాలలో తాగునీటి సమస్య పరిష్కారం

బ్రహ్మసముద్రం: మండలంలోని నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నెలకొన్న తాగునీటి సమస్యపై మంగళవారం విద్యార్థులు ఆ గ్రామ సర్పంచి సందీప్ ఇంటి వద్దకు వెళ్లి ఖాళీ ప్లేట్లు, గ్లాసులతో ధర్నా చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం సర్పంచితోపాటు పాఠశాల కమిటీ ఛైర్మన్ మల్లికార్జున స్పందించి.. పైపులైన్‌కు మరమ్మతులు చేయించారు. సంపులోకి నీరు సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టారు. ఎంఈవోలు ఓబుళపతి, కృష్ణానాయక్ పైపులైన్ మరమ్మతు పనులను పర్యవేక్షించారు.

తెదేపా గూటికి వైకాపా మైనార్టీ నాయకుడు

తాడిపత్రి, న్యూస్‌టుడే: వైకాపా సీనియర్ నాయకుడు, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు గయాజ్‌బాషా జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో తెదేపాలోకి చేరారు. ఈ సందర్భంగా ఆయన్ను తెదేపా కండువాతో పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా సమాజసేవ చేస్తున్న వ్యక్తి గయాజ్‌బాషా అన్నారు. తాడిపత్రిని అభివృద్ధి చేసేందుకు తోడ్పాటు అందించాలని, ఇదివరకే గయాజ్‌బాషాను అడిగామని, అప్పట్లో కొంత సమయం కావాలని చెప్పారని తెలిపారు. ప్రస్తుతం ఆయన పార్టీలోకి రావడం సమాజాభివృద్ధి చేసేందుకు తనకు మరింత బలం చేకూరిందన్నారు.

తెదేపా కండువాతో పార్టీలోకి ఆహ్వానిస్తున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

ఆధ్యాత్మిక సమాచారం

కదిరి, న్యూస్‌టుడే: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి దర్శనం నేటి (గురువారం) ఉదయం 6 గంటల నుంచి 6.45 వరకు ఉంటుంది. 7నుంచి 9గంటల మధ్య అభిషేక, స్వర్ణ కవచ సేవలు. అనంతరం 9 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు తిరిగి సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు భక్తులకు స్వామివారి సర్వదర్శనం ఉంటుంది.

నెట్టికంటయ్య ఆలయంలో వేలం

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే : కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో 2026-27 సంవత్సరానికి బహిరంగ వేలం, సీల్డ్ టెండర్, ఆన్‌లైన్ టెండర్ వేలం పాటలు ఈవో విజయరాజు ఆధ్వర్యంలో జరిగాయి. గతంలో కంటే ఈసారి వేలం పాటలతో కసాపురం దేవస్థానానికి ఆదాయం పెరిగింది. తలనీలాలు పోగుచేసుకొనే హక్కును అనంతపురానికి చెందిన నవీన్ రూ.1,36,50,000లకు పాట పాడి దక్కించుకున్నారు. టోల్‌గేట్/పార్కింగ్ రుసుం వసూలుకు ఈసారి రూ. 19,07,069 ఆన్‌లైన్‌లో ఒకరు దక్కించుకున్నారు. మొబైల్ ఫోన్ల భద్రతకు రూ.8,15,000లతో దక్కించుకున్నారు. ఇంకా పలు వేలం పాటలను పలువురు దక్కించుకున్నారు. జిల్లా సహాయ కమిషనర్ మల్లికార్జున, ఏఈవో వెంకటేశ్వరుడు, ఆలయాధికారులు రామ్మోహన్, వేమన్న, పోలీస్ సిబ్బంది టెండర్ పాటదారులు పాల్గొన్నారు.

అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వీరాంజనేయులు

అనంతపురం(లీగల్), న్యూస్‌టుడే: నాలుగో అదనపు జిల్లా కోర్టు(మహిళా కోర్టు) పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఆర్.వీరాంజనేయులును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కళ్యాణదుర్గం మండలం ఈస్టు కోడిపల్లికి చెందిన వీరాంజనేయులు 2007లో న్యాయశాస్త్రంలో పట్టభద్రులయ్యారు. అప్పటి నుంచి జిల్లా కోర్టులో న్యాయవాదిగా సేవలు అందిస్తున్నారు. అదనపు పీపీగా ఆయన మూడేళ్ల పాటు కొనసాగనున్నారు.

అత్యాధునిక వసతులతో గ్రంథాలయం ఏర్పాటు చేస్తాం

రత్నాకర్‌ను సన్మానిస్తున్న గ్రంథాలయ ఛైర్మన్ వెంకట్

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో విద్యార్థులు, నిరుద్యోగుల సౌకర్యార్థం అత్యాధునిక వసతులతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసేందుకు తగు చర్యలు చేపడుతున్నామని ఉమ్మడి జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ వడ్డె వెంకట్ తెలిపారు. బుధవారం పుట్టపర్తిలో ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, జేసీ మౌర్యభరద్వాజ్‌లను ఆయన వేర్వేరుగా కలిసి సన్మానించారు. పుట్టపర్తిలో గ్రంథాలయం ఏర్పాటుకు స్థలం కేటాయించి, పక్కా భవనాన్ని ట్రస్టు తరఫున నిర్మించాలని కోరారు.

పెన్నా.. జలపరవళ్లు!

పెద్దపప్పూరు, న్యూస్‌టుడే :పెద్దపప్పూరు మండలంలో సాగు, తాగునీటి వర ప్రదాయనిగా మారిన పెన్నానది ప్రస్తుతం జల ప్రవాహంతో పరవళ్లు తొక్కుతోంది. పదిహేనుళ్లగా ఈ సమయంలో మొదటి సారి నదిలో నీరు ప్రవహిస్తోంది. కూటమి ప్రభుత్వం చేపట్టిన చర్యలతోనే జలకళ సంతరించుకుంది. దీంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తాగు, సాగు నీటి కష్టాలు లేకుండా జీవిస్తున్నామని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదం జరిగితే ఎలా?

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండ ప్రాంతంలో వ్యవసాయ కూలీలు దూర గ్రామాలకు వెళ్తున్నారు. వారు ఉపాధి నిమిత్తం నిత్యం ఆటోలు, బొలెరోలో రాకపోకలు సాగిస్తుంటారు. ఈ వాహనాల్లో తరచుగా స్థాయికి మించి ప్రయాణికులను తీసుకెళ్తుంటారు. వాహనాలు కుదుపునకు గురైతే వారు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. మంగళవారం పట్టణంలోని ప్రధాన రహదారిపై ఓ బొలెరోలో ప్రయాణికులు ప్రమాదం అంచున ప్రయాణిస్తూ కనిపించారు. గతంలో కూలీలను తరలించే వాహనాలు ప్రమాదానికి గురైన సందర్భాలు ఉన్నాయి.

రంగనాథస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.14.97 లక్షలు

గుత్తి గ్రామీణం, న్యూస్‌టుడే: గుత్తి మండలంలోని తొండపాడు గ్రామంలో వెలసిన ప్రసిద్ధ బొలికొండ రంగనాథ స్వామి ఆలయ లెక్కింపును బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రాణి, ఆలయ కార్యనిర్వహణాధికారి శోభ ఆధ్వర్యంలో ఆలయ హుండీ లెక్కింపు చేశారు. గతేడాది అక్టోబర్ 10 నుంచి ఇప్పటి వరకు భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. రూ.14.97,832 లక్షల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ రంగస్వామిరెడ్డి యాదవ్, సిబ్బంది రామకృష్ణ, బాలు మోహన్ పాల్గొన్నారు.

కానుకలు లెక్కిస్తున్న ఆలయ అధికారులు, నిర్వాహకులు

గుత్తి.. నిత్యం ట్రాఫిక్ కష్టాలతో హడలెత్తి

గుత్తి గ్రామీణం, న్యూస్‌టుడే : గుత్తిలో ట్రాఫిక్ కష్టాలు అన్నీ ఇన్నీ కావు. నిత్యం గుత్తి మీదుగా వేల వాహనాల రాకపోకలు ఉండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. గుంతకల్లు, మంత్రాలయం వెళ్లే వాహనాలకు బైపాస్ రోడ్డు లేకపోవడంతో పట్టణంలోనే వెళ్లాల్సి వస్తోంది. దీంతో గాంధీచౌక్, ఆర్టీసీ ప్రాంగణం వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు రద్దీ ఎక్కువగా ఉంటోంది. అలాగే గుంతకల్లు రోడ్డును నూతనంగా నిర్మించడంతో ఒకవైపే వాహనాలు వెళ్లాల్సిన పరిస్థితి కొనసాగుతోంది. పట్టణంలో రోడ్డుకు ఇరువైపులా తోపుడు బండ్లు, వాహనాలు నిలపకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని వాహనాదారులు కోరుతున్నారు.

అనారోగ్య సమస్యలపై ప్రశ్నించిన భార్యకు వేధింపులు

అనంత నేరవార్తలు: అనారోగ్య సమస్యలపై ప్రశ్నించిన భార్యను వేధింపులకు గురిచేసిన ఘటన నగరంలో వెలుగుచూసింది. వివరాల మేరకు కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన ఓ యువకుడికి గతేడాది డిసెంబరులో నగరానికి చెందిన ఓ యువతితో వివాహమైంది. వివాహం అనంతరం భర్తకు అనారోగ్య సమస్యలు చుట్టుముట్టాయి. యువతి ఆమె తల్లిదండ్రుల సలహా మేరకు భర్తను నగరంలోని ఓ వైద్యుడి వద్దకు తీసుకెళ్లి పరీక్షలు చేయించింది. పరీక్షల్లో భర్తకు అధిక స్థాయిలో చక్కెర, కొలెస్ట్రాల్, రక్తంలో గ్లైకోట్స్ ఉన్నట్లు తేలింది. అనారోగ్య సమస్యలు దాచిపెట్టి తనను పెళ్లెందుకు చేసుకున్నావని ఆమె భర్తను ప్రశ్నించింది. అప్పటి నుంచి ఆమెపై వేధింపులకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు మద్దతు తెలపడంతో మరింత రెచ్చిపోయాడు. అదనంగా కట్నం తీసుకురావాలని వేధించేవాడు. బాధితురాలు రెండు రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

చెరువును ఆక్రమించినా పట్టదా?

చెరువు భూమిలో పంట సాగు

గుత్తి గ్రామీణం, న్యూస్‌టుడే : చెరువులు ఆక్రమణకు గురవుతున్నా ఎవరికీ పట్టడం లేదు. పూర్వం ప్రజలకు తాగునీరు, సాగునీరు అందించాలనే లక్ష్యంతో గ్రామాల్లో చెరువులను తవ్వించారు. ప్రస్తుతం కొందరు ఆక్రమించి దర్జాగా పంటలు సాగు చేసుకుంటున్నారు. జలవనరులశాఖ అధికారులు సైతం నోరుమెదపడం లేదు. గుత్తి మండలంలోని తొండపాడు గ్రామ సమీపంలోని 67వ జాతీయ రహదారి పక్కనే ఉన్న చెరువును దాదాపు రెండు ఎకరాలకు పైగా ఆక్రమించారు. సంబంధిత అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యాపారంలో నష్టం..చోరీలకు బీజం

● అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు
● 270 గ్రాముల బంగారం స్వాధీనం

పెనుకొండ, న్యూస్‌టుడే: వ్యాపారంలో నష్టాలు రావడంతో చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా కుటుంబాన్ని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ముఠా పెనుకొండ సబ్-డివిజన్‌లోని పది పోలీస్‌స్టేషన్ల పరిధిలో గత నాలుగేళ్లలో 25 చోరీలకు పాల్పడింది. జిల్లా ఎస్పీ సతీశ్ కుమార్ బుధవారం పెనుకొండలోని డీఎస్పీ కార్యాలయంలో విలేకరులకు వివరించారు. కర్ణాటక రాష్ట్రం తుమకూరు జిల్లా పావగడ తాలుకా జాజురాయునిహళ్లికి చెందిన బొమ్మలాట అరుణ్‌కుమార్, అతడి కుటుంబ సభ్యులు, బంధువులు నరేశ్, ఆంజనేయులు, లక్ష్మీ, గంగమ్మ, యశోదమ్మ, వెంకటరమణ, నిర్మలమ్మ, లక్ష్మీదేవమ్మ పందుల వ్యాపారం చేస్తూ నష్టాల పాలయ్యారు. ఆర్థిక ఇబ్బందులతో సులభంగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకొని దొంగతనాలను ఎంచుకున్నారు. 2022 నుంచి వీరందరూ కలిసి తాళం వేసిన ఇళ్లలో చోరీలకు పాల్పడ్డారు. అమరాపురం, రొళ్ల, అగళి, మడకశిర, గుడిబండ, పెనుకొండ, రొద్దం, సోమందేపల్లి, కియా పోలీస్‌స్టేషన్ల పరిధిలోని దాదాపు 27 ఇళ్లలో బంగారు నగలు దొంగలించారు. చోరీ సమయంలో చరవాణులు వాడితే పోలీసులకు పట్టుబడతామని ముందుగానే వాటిని తమ ఇళ్లలో ఉంచేవారు. దొంగలించిన ఆభరణాలను భాగాలుగా పంచుకొని అందులో కొన్ని అమ్మి వచ్చిన నగదు పంచుకునేవారు. మిగిలిన నగలను ప్రధాన నిందితులు అరుణ్ కుమార్, నరేశ్ తమ బంధువులు వెంకటరమణ, నిర్మలమ్మ పేరుపైన తాకట్టుపెట్టి తప్పించుకు తిరిగేవారు. ఈ నేపథ్యంలో 2026 జనవరి 22న గుడిబండ మండలం తాల్లకెరెకు చెందిన గొల్ల పాండురంగప్ప ఇంటిలో చోరీకి పాల్పడి 60గ్రాముల బంగారం, రూ.10వేలు నగదు దొంగలించారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. వరుస చోరీలను అరికట్టేందుకు ఎస్పీ సతీశ్ కుమార్, పెనుకొండ డీఎస్పీ నరసింగప్ప ప్రత్యేక బృందాలను రంగంలో దింపారు. ఈక్రమంలో బుధవారం జంబులబండ గ్రామం కోటకొత్తూరు క్రాస్ వద్ద పోలీసులు అరుణ్‌కుమార్, నరేశ్‌ను అరెస్టు చేశారు. వారి నుంచి ద్విచక్రవాహనం, ఇనుపరాడ్లు స్వాధీనం చేసుకుని విచారించారు. వారిచ్చిన వివరాలతో కర్ణాటకలోని జాజురాయునిహళ్లిలో ఉంటున్న లక్ష్మీ, లక్ష్మీదేవమ్మ, గంగమ్మ, యశోదమ్మ, పావగడలోని ముత్తూట్ ఫైనాన్స్ కార్యాలయ సమీపంలో ఉంటున్న వెంకటరమణ, పావగడ తాలూకా కోటగుడ్డంలో నివసిస్తున్న నిర్మలమ్మను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.32.40లక్షల విలువచేసే 270 గ్రాముల నగలను స్వాధీనం చేసుకున్నారు. ఆంజనేయులు అనే నిందితుడు పరారీలో ఉన్నట్లు ఎస్పీ వివరించారు.

నిందితులు, నగలను చూపుతున్న ఎస్పీ సతీశ్‌కుమార్, సిబ్బంది

గోరంట్లలో చోరీ కేసుల్లో నిందితుడి..

గోరంట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో 2024 నుంచి 2026 మధ్య ఇళ్లలో జరిగిన వరుస చోరీల్లో హిందూపురం పట్టణానికి చెందిన నిందితుడు నూర్‌ముజామిల్‌ను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.18లక్షలు విలువజేసే 130 గ్రాముల బంగారు నగలు, ఒక ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. గోరంట్ల మండలం పాలసముద్రం వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా, నిందితుడు వారిని చూసి పారిపోవడానికి యత్నించగా అదుపులో తీసుకొని విచారించగా నిజాలు బయటపడ్డాయి. రెండు కేసుల్లో నిందితులను కోర్టులో హాజరుపరుస్తామని ఎస్పీ వివరించారు. సమావేశంలో పెనుకొండ, గోరంట్ల, మడకశిర సీఐలు రాఘవన్, శేఖర్, రాజ్‌కుమార్, పలువురు ఎస్సైలు పాల్గొన్నారు.

(c) eenadu

రాయదుర్గం

•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

ప్రత్యేక ప్రణాళికతో ఉత్తమ ఫలితాలు

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధన కోసమే వంద రోజుల ప్రత్యేక ప్రణాళిక కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎంఈవో మల్లికార్జున, ప్రధానోపాధ్యాయులు అనిల్ తెలిపారు. బుధవారం మండలంలోని నేమకల్లు గ్రామంలోని ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి అవగాహన కల్పించారు. పరీక్షలకు ఇంకో 30 రోజులు మాత్రమే ఉన్నందున వెనుకబడిన సీ, డీ గ్రేడ్ విద్యార్థులకు మండల కేంద్రంలోని బీసీ బాలుర సంక్షేమ వసతిగృహం, కేజీబీవీ పాఠశాలల్లో ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పదో తరగతి విద్యార్థుల ఇళ్ల వద్ద అవగాహన కల్పిస్తున్న ఎంఈవో, ప్రధానోపాధ్యాయుడు

కుందుర్పి, న్యూస్‌టుడే: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న సీ, డీ గ్రేడు విద్యార్థిని, విద్యార్థులు కూడా ఉత్తమ మార్కులు సాధించేందుకు వీలుగా విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేసినట్లు మండల విద్యాశాఖ అధికారులు లక్ష్మీదేవి, తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని పలు ఉన్నత పాఠశాలలోని విద్యార్థులను బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీలో 12 మంది బాలికలు, బీసీ బాలుర వసతిగృహంలో 78 మంది బాలురకు ప్రత్యేక ప్రవేశాలు కల్పించి, అందులో చేర్పారు.

చాట్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

కళ్యాణదుర్గం గ్రామీణం: ప్రస్తుతం శాసనసభ సమావేశాలు జరుగుతున్నాయని అనుమతి తీసుకొని అమ్మవారి విగ్రహ ప్రారంభోత్సవానికి వచ్చానని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. బుధవారం మండలంలోని మోరేపల్లిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో చాట్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన జరిగింది. కుంభాభిషేకం, ధ్వజస్తంభం, కలశ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే అమ్మవారికి పూజలు చేశారు.

అమ్మవారికి హారతి ఇస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

గ్రామాలన్నీ రోడ్డు నిర్మించేలా కృషి.. : నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సీసీరోడ్లు, తారురోడ్లు వేయించేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. బుధవారం మండలంలోని కొత్తూరు గ్రామంలో రూ.31.20 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీరోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహాశివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు

వజ్రకరూరు, న్యూస్‌టుడే: వజ్రకరూరు మండలం జె.రాంపురం గ్రామంలోని శ్రీ జరుట్ల రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను జిల్లా సహాయ కమిషనర్ మల్లికార్జునప్రసాద్ బుధవారం పరిశీలించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ఈఓ ప్రేమ్‌కుమార్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రాజేంద్రస్వామి, సర్పంచ్, తిరుపాల్‌యాదవ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా సహాయ కమిషనర్ మల్లికార్జునప్రసాద్

అరకొర వసతులు అందని వైద్యసేవలు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం పాత భవనంలో కొనసాగుతోంది. గతంలో ఉన్న క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రస్తుతం రోజూ 650-820 మంది వరకు రోగులు ఆస్పత్రికి వస్తుంటారు. రోగులకు సరిపడా గదులు, సిబ్బంది లేరు. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. వైద్యులు అందుబాటులో ఉండేలా అప్పట్లో వారి కోసం రెండు, సిబ్బంది ఉండేందుకు 10 క్వార్టర్లు నిర్మించగా కొన్నాళ్లకే అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. వైద్యులు, సిబ్బంది బయట అద్దె భవనాల్లో ఉంటున్న పరిస్థితి నెలకొంది.

శిథిలావస్థలో క్వార్టర్స్

- పాతభవనంలో 12 గదులు ఉండగా ల్యాబ్, స్కానింగ్, ఆపరేషన్ థియేటర్, రక్తనిధి, ఎక్స్‌రే, దంత, ఫిజియోథెరపి, టీబీ యూనిట్, ఐసీటీసీ, వైద్యుల ప్రత్యేక గది, మిగిలిన వాటిలో ఔషధాల నిల్వలు చేస్తున్నారు.
- కొత్త భవనంలో ఆరు ఓపీ గదులు, ఎమర్జెన్సీ, మహిళలు, పురుషులు, ఐడీ వార్డులు ఉన్నాయి. ప్రస్తుతం 50 పడకలు కొనసాగిస్తున్నారు. ఇటీవలే వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తామని ఉన్నతాధికారులు తెలిపారు. కానీ అందుకు అనుగుణంగా భవనాలు అందుబాటులో లేవు. ప్రస్తుతం ఉన్న కొత్త భవనంపై అదనపు భవన నిర్మాణానికి రూ.5.75 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి.
- సామాజిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరత కూడా ఉంది. వైద్యాధికారిణితో పాటు 8 మంది ఉండగా, ఫిజీషియన్, సర్జన్ డాక్టర్లు, స్టాఫ్‌నర్సులు భర్తీ కావాల్సి ఉంది. రోజురోజుకు రోగుల సంఖ్య పెరుగుతుండటంతో సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతోంది. ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేసి, భవనాలు, క్వార్టర్స్ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

- ప్రసన్నభారతి, వైద్యాధికారిణి

పాతభవనం, క్వార్టర్స్ సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రస్తుతం కొత్తభవనంలో రోగులకు సేవలందిస్తున్నాం. వైద్యులు, సిబ్బంది, భవనాల సమస్యతో అవస్థలు పడుతున్నాం.

టెండర్లు పూర్తయ్యాయి

- రామ్మోహన్, ఈఈ, ఏపీఎంఐడీసీ

సామాజిక ఆరోగ్య కేంద్రంలోని కొత్త భవనం ఉండగా దానిపై అంతస్తు నిర్మాణానికి రూ.5.75 కోట్లు మంజూరయ్యాయి. ఇటీవలే టెండర్లు పూర్తి అయ్యాయి. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయి. ఇవి పూర్తయితే ఇబ్బందులు తొలగనున్నాయి.

మేమున్నాం.. మీకు తోడుగా

రాయదుర్గం పట్టణం: 9666888046
కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661
ఉరవకొండ: 8008573071

సమస్య: బెళుగుప్పలోని పలు వీధుల్లో చెత్త పేరుకుపోయి అపరిశుభ్రత నెలకొంది. వెంటనే శుభ్రం చేయించాలి. - గోవిందు, గ్రామస్థుడు

సమస్య: ఎర్రాపల్లి గ్రామం ప్రధాన వీధిలో పైపులైను ద్వారా ఇళ్లకు తీసుకున్న కనెక్షన్లతో నిత్యం నీరు వృథాగా పోతోంది. - బొమ్మయ్య, స్థానికుడు

సమాధానం: పై రెండు గ్రామాల్లో ఉన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన పరిష్కారిస్తాం. - సురేష్, పంచాయతీ కార్యదర్శి, పాల్తూరు పంచాయతీ

- న్యూస్‌టుడే, కంబదూరు

వైభవంగా మలెమ్మ గ్రామోత్సవం

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: మండలంలోని ఉంతకల్లు గ్రామంలో వెలసిన మలెమ్మ అమ్మవారి గ్రామోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి కుంభాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలవ భరత్, తెదేపా నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు. గ్రామంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటుచేశారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

తీటకల్లు(బ్రహ్మసముద్రం), న్యూస్‌టుడే: మామిడి తోటల సాగులో పూత, పిందె దశలో తగు సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యాన శాఖ అధికారి కృష్ణతేజ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని తీటకల్లులో ఉద్యానశాఖ అధికారి క్షేత్రస్థాయిలో పర్యటించి మామిడి రైతులకు సలహాలు, సూచనలిస్తూ అవగాహన కల్పించారు. మామిడి పంటను రక్షించుకోవడానికి ప్రభుత్వం 50శాతం రాయితీతో పండ్ల సంచులు(ఫ్రూట్ కవర్స్) అందిస్తోందన్నారు. సంచులు వాడకం ద్వారా మంగు మచ్చలు, తేనె మంచు పురుగు తదితర వాటిని నియంత్రించి నాణ్యమైన అధిక దిగుబడికి తోడ్పడుతుందన్నారు. ఉద్యాన శాఖ ద్వారా వచ్చే పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పాడి రైతులు అవకాశం సద్వినియోగం చేసుకోండి

రాయదుర్గం గ్రామీణం: అనంతపురం జిల్లాలో పాల ఉత్పత్తి పెంచడానికి ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న లింగ నిర్ధారిత వీర్యం (కేవలం పెయ్య దూడలు జన్మించే వీర్యం) పాడి రైతులు ఉపయోగించుకోవాలని అనంతపురం పశు సంవర్ధకశాఖ జేడీ డాక్టర్ ప్రేమ్‌చంద్ పిలుపునిచ్చారు. రాయదుర్గం ప్రాంతీయ వైద్యశాలలో బుధవారం ఆశాఖ డీడీ ఉమామహేశ్వర్ రెడ్డి, రాయదుర్గం ఇన్‌ఛార్జ్ ఏడీహెచ్ నాగలింగేశ్వర రెడ్డితో కలిసి 'భారత్ పశుధన్' యాప్, లింగ నిర్ధారిత వీర్యంపై పశు వైద్యాధికారులు, గ్రామ సచివాలయాల ఏహెచ్‌ఏ, గోపాలమిత్రలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఉచితంగా లింగ నిర్ధారిత వీర్యం అందిస్తామన్నారు. రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిన రాప్తాడు మండలంలోని కొండాపురం గ్రామంలో 24.38 లీటర్ల పాల ఉత్పత్తి చేస్తున్న మేలు జాతి ఆవు ప్రథమ స్థానం పొందినట్లు వివరించారు. సమావేశంలో రాయదుర్గం నియోజకవర్గంలోని పశు వైద్యాధికారులు సిబ్బంది, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

ఉత్సవాల్లో ఉత్తమ సేవకులకు గుర్తింపు

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: శ్రీ పట్టాభిరామస్వామి బ్రహ్మోత్సవాల్లో సేవలు అందించిన అన్ని వర్గాల ప్రజలకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చి సత్కరిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు కార్తీక్, బుట్నా తిమ్మరాజు, రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ వై.పి.రమేష్ తదితరులు తెలిపారు. బుధవారం పట్టాభిరామస్వామి దేవాలయంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులను శాలువాలతో సత్కరించారు. ఉత్సవాల సమయంలో సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న శ్రీవివేకానంద విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఆలయ కమిటీ సభ్యులు అందజేసిన బహుమతులతో విద్యార్థులు

పురపాలికలో రాత్రిపూట చెత్త సేకరణ

రాయదుర్గం, న్యూస్‌టుడే: పట్టణంలోని అనంతపురం, బళ్లారి, బీటీపీ రోడ్లలో ఇప్పటి నుంచి రాత్రివేళల్లో కూడా చెత్త సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.దివాకర్ రెడ్డి వెల్లడించారు. ప్రధాన రోడ్లు, కూడళ్ల తదితర ప్రాంతాల్లో రాత్రిళ్లు చెత్తను రోడ్లపై పడేస్తుండటంతో అది రోడ్లపై విస్తరించి అపరిశుభ్రంగా మారుతోందని ఆయన తెలిపారు. సాయంత్రం నుంచి రాత్రి దాకా ఒక ట్రాక్టర్‌లో కొందరు పారిశుద్ధ్య కార్మికులను ఏర్పాటు చేసి వ్యాపార దుకాణాల ముందే చెత్త ట్రాక్టర్‌ను నిలుపుతామని వ్యాపారులు దుకాణాలకు చెందిన వ్యర్థాలను చెత్త బండిలోని కార్మికులకు అందజేయాలన్నారు. ఇందుకు పట్టణంలోని వ్యాపారులు సహకరించాలని సూచించారు. ప్రధాన రోడ్లను ఊడ్చేందుకు రూ.24 లక్షలతో స్వీపింగ్ యంత్రాన్ని కొనుగోలు చేస్తున్నట్లుగా కమిషనర్ తెలిపారు.

పొలం పిలుస్తోంది

విడపనకల్లు, న్యూస్‌టుడే: విడపనకల్లు మండలం పాల్తూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పాల్తూరు రైతు సేవ కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి పెన్నయ్య రైతులతో సమావేశం అయ్యారు. రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య చాలా ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు ముత్యాలు, రైతులు రామాంజినేయులు, ఎర్రిస్వామి, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు అనేకం

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల చిన్న వయస్సులోనే అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని సీడీపీవో లక్ష్మీప్రసన్న పేర్కొన్నారు. బుధవారం వన్నూరస్వామి కొండ అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీవో లక్ష్మీప్రసన్న, ఆరోగ్య శాఖ సూపర్‌వైజర్ కళావతి హాజరై మాట్లాడారు.

విడపనకల్లు, న్యూస్‌టుడే: విడపనకల్లు మండలం చీకలగురికి గ్రామంలో సీడీపీఓ శ్రీదేవి ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనకు విద్యార్థినులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. రచ్చబండపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పద్మావతి, సూపర్‌వైజర్లు పుష్ప, విజయకుమారి, పద్మా, అరుణ తదితరులు పాల్గొన్నారు.

చీకలగురికిలో విద్యార్థినులతో కలసి ప్రతిజ్ఞ చేస్తున్న సీడీపీఓ శ్రీదేవి

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేద్దామని అంగన్‌వాడీ సూపర్‌వైజరు లక్ష్మీదేవి అన్నారు. బుధవారం మండలంలోని గోళ్ల అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య వివాహాల నిర్మూలన పై అవగాహన కల్పించారు. బాలికలను చదివించాలని, వారి ఉన్నతికి తల్లిదండ్రులు కృషియాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మాధవి, వసంత, భారతి, మహిళా పోలీసు రిహానా, మహిళలు పాల్గొన్నారు.

ఆదమరిస్తే ప్రమాదమే!

ఉరవకొండ మండలం మూలగిరిపల్లి క్రాస్ వద్ద జాతీయ రహదారిపై మట్టి పేరుకు పోయింది. అక్కడ కూడలిలో వాహనదారులు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా వాహనాలు అదుపు తప్పి, బోల్తా పడే అవకాశం ఉంది. చీకట్లో ద్విచక్ర వాహనదారులు ఆ మట్టిలో ప్రమాదాలకు గురవుతున్నాయి. జాతీయ రహదారి అధికారులు ఇప్పటికైనా మట్టి తొలగించాలని చోదకులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఉరవకొండ

గుంతను పూడ్చరూ..

రాయదుర్గం పట్టణంలోని చెన్నవీరస్వామి దేవాలయానికి వెళ్లే దారిలో వారం రోజుల క్రితం తాగునీటి పైపు మరమ్మతు చేసేందుకు అధికారులు గుంత తవ్వి వదిలేశారు. రాత్రి పూట ప్రజలు గమనించకుండా వేగంగా వస్తే అందులోకి పడే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఫిట్టర్ జగన్నాథ్‌ను వివరణ కోరగా లీకేజీ అరికట్టే పనులు పూర్తయిన వెంటనే పూడ్చుతామన్నారు. - న్యూస్‌టుడే, రాయదుర్గం పట్టణం

చెత్త తొలగించరా!

ఉరవకొండ మండలం ఆమిద్యాలలో ఏటీఎం పరిసరాల్లో చెత్త పేరుకుపోయింది. దానిని ఎప్పటికప్పుడు తరలించే దిశగా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోలేదు. దీంతో ఆ ప్రాంతంలో అపరిశుభ్రత, దుర్వాసనతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దీనిని అధికారులు గుర్తించి, ఎప్పటికప్పుడు చెత్త తరలించేలా కృషి చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఉరవకొండ

వీధి దీపాలులేక ఇక్కట్లు

ఉరవకొండ పట్టణంలో నాలుగు వరుసల ప్రధాన రహదారిలో అగ్నిమాపక కార్యాలయం ఎదురుగా వీధి దీపాలు వెలగక పోవడంతో అంధకారం నెలకొంది. చీకట్లో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పైగా అక్కడ మలుపు ఉండడంతో రాత్రిపూట ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిపై ఎంపీడీవో రవిప్రసాద్‌ను వివరణ కోరగా.. వీధి దీపాలను అందుబాటులోకి తెచ్చేలా పంచాయతీ అధికారులకు సూచిస్తామని తెలిపారు. - న్యూస్‌టుడే, ఉరవకొండ

నీటి వృథా అరికట్టండి

బెళుగుప్ప మండలంలోని హనిమిరెడ్డిపల్లి గ్రామంలో గత కొన్నిరోజులుగా పైపులైను లీకేజీతో నీరు వృథాగా పోతోంది. గ్రామంలో బీసీ కాలనీకి వెళ్లే దారిలో విద్యుత్తు స్తంభాలు నాటేందుకు గుంతలు తవ్వడంతో పైపులైను దెబ్బతింది. దీంతో దారి పొడవునా నీరు పారుతూ అపరిశుభ్రంగా మారిందని కాలనీ వాసులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నీటి వృథా అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, బెళుగుప్ప

హత్యాయత్నం నిందితుడి అరెస్టు

కుందుర్పి, న్యూస్‌టుడే: మండలంలోని వడ్డేపాళ్యం గ్రామంలో రెండు రోజుల క్రితం భూవివాదంతో పాలక్కగారి చిన్న ఈరన్న అనే రైతుపై, సమీప బంధువు ఈరన్న అనే వ్యక్తి మచ్చుకత్తితో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడగా అతడిని అరెస్టు చేసి, రిమాండుకు తరలించినట్లు కుందుర్పి ఎస్సై మహేష్ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసి, నిందితుడిని బుధవారం అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరచి, రిమాండుకు తరలించినట్లు ఎస్సై తెలిపాడు.

బిందు సేద్య పరికరాల దగ్ధం

బెళుగుప్ప, న్యూస్‌టుడే: మండలంలోని నరసాపురం పంచాయతీలో ఉన్న గొల్లలదొడ్డిలో బిందు సేద్య పరికరాలు కాలిపోయాయి. బాధిత రైతు రాధాకృష్ణ తెలిపిన వివరాలు మేరకు.. పక్క పొలం రైతు అతని పొలం మేరలో నిప్పు పెట్టడంతో అవి వ్యాపించి సుమారు నాలుగు ఎకరాలకు సంబంధించిన రూ.70 వేలు విలువైన బిందు పరికరాలు పూర్తిగా కాలిపోయాయి. అలాగే సాగులో ఉన్న అనప, మొక్కజొన్న పైరు పాక్షికంగా కాలిపోయినట్లు బాధిత రైతు వాపోయాడు. ఘటనపై బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

కడుపు నొప్పి భరించలేక వృద్ధురాలి ఆత్మహత్య

ఉరవకొండ, న్యూస్‌టుడే: కడుపు నొప్పిని భరించ లేక వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉరవకొండ మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. మండలంలోని రేణుమాకులపల్లికి చెందిన లక్ష్మీదేవి(65) కొంత కాలంగా కడుపు నొప్పితో బాధ పడుతోంది. నొప్పి అధికం కావడంతో పాటు జీవితంపై విరక్తి చెంది బుధవారం ఉదయం ఇంటికి సమీపంలో క్రిమిసంహారక మందు తాగింది. గుర్తించిన కుటుంబ సభ్యులు పట్టణంలోని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి కొడుకు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు.

ఉద్యానశాఖ అధికారుల నిర్లక్ష్యం

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండలో ప్రధాన రహదారి పక్కన ఉన్న ఉద్యానశాఖ డివిజన్ కార్యాలయం నిర్వహణలో ఆశాఖ అధికారుల్లో నిర్లక్ష్యం నెలకొంది. కనీసం తాళం కూడా సరిగా వేయక పోవడంతో బుధవారం అవి తెరుచుకున్నాయి. ఉదయాన్నే వాటిని చూసిన స్థానికులు దొంగలు ధ్వంసం చేసి, చోరీ చేశారేమోనని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, ఎంపీడీవో రవిప్రసాద్ వెళ్లి పరిశీలించగా అక్కడ ఎలాంటి చోరీ జరగలేదని, కార్యాలయ నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా తలుపులు తెరుచుకున్నట్లు నిర్ధారించారు. ఆ తరువాత అక్కడికి చేరుకున్న ఉద్యానశాఖ డివిజన్ అధికారిణి యామినితో ఎంపీడీవో చర్చించారు. అలసత్వానికి అవకాశం లేకుండా చూసుకోవాలని సూచించారు.

ఉద్యానశాఖ డివిజన్ అధికారిణితో మాట్లాడుతున్న ఎంపీడీవో రవిప్రసాద్

సంక్షిప్త సమాచారం

పైపులైను పనులకు శ్రీకారం

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లు గ్రామంలోని 4, 5వార్డుల్లో తాగునీటి పైపులైను ఏర్పాటు చేయడానికి బుధవారం మున్సిపల్ అధికారులు భూమి పూజ చేశారు. గ్రామంలో తాగునీటి సమస్య ఉండటంతో వేసవికి ముందే చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణభార్గవ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి, రామాంజనేయులు, మంజు, తెదేపా నాయకులు సోమశేఖర్, రమేష్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వద్దు

కణేకల్లు, న్యూస్‌టుడే: విద్యుత్తు మరమ్మతు పనులలో అలసత్వం వహించి ప్రమాదాలు జరిగితే చర్యలు తప్పవని ఉరవకొండ ఏడీఈ భాస్కర్, విజిలెన్స్ ఎస్సై సుధాకర్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రైవేటు వేడుకల ప్రాంగణంలో ఏఈ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో కణేకల్లు క్రాస్, బ్రహ్మసముద్రం, కణేకల్లు, మాల్యం విద్యుత్తు ఉపకేంద్రాల పరిధిలోని విద్యుత్తు సిబ్బందితో ఇటీవల జరిగిన విద్యుత్తు ప్రమాదాల ఘటనలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇటీవల మండలంలో విద్యుత్తు ప్రమాదాలు చోటు చేసుకొని పలువురు తీవ్రంగా గాయపడిన ఘటనలపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదాలు జరగకుండా సిబ్బంది జాగ్రత్తలు పాటించాలని సూచనలు చేశారు.

ఏంఈవోగా బాధ్యతల స్వీకరణ

బెళుగుప్ప, న్యూస్‌టుడే: మండల నూతన ఎంఈవో-1గా గోవిందరాజులు పదవి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎంఈవో మల్లారెడ్డి ఇటీవలే పదవీ విరమణ చేశారు. దీంతో కళ్యాణదుర్గం కరణం చిక్కప్ప ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న గోవిందరాజులను మండల ఏంఈవో-1గా జిల్లా ఉన్నత అధికారులు నియమించడంతో బుధవారం బాధ్యతలు తీసుకున్నారు.

ఉచిత వైద్య శిబిరం

డి.హీరేహాళ్, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో యునాని వైద్యాధికారి డా.సాజిదున్నిసా ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. బుధవారం జాతీయ యునాని దినోత్సవం సందర్భంగా ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బీపీ, షుగర్, దీర్ఘకాలిక సమస్యలతో బాధపడే మహిళలు, పురుషులకు వైద్య చికిత్సలు అందించి, తగిన మందులను పంపిణీ చేశారు.

నీటి ట్యాంకుకు భూమిపూజ

వజ్రకరూరు, న్యూస్‌టుడే: జల జీవన్ మిషన్ ద్వారా గ్రామీణ ప్రాంతాలలోని ప్రతి ఇంటికి సురక్షితమైన కుళాయి నీటిని అందించేందుకు పయ్యావుల శ్రీనివాసులు సోదరుల సహకారంతో వజ్రకరూరు మండలం రాగులపాడు గ్రామంలో బుధవారం నీటి ట్యాంకుకు తెదేపా మండల నాయకులు నాగేంద్ర, ధనుంజయ, ప్రశాంత్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రూ.30 లక్షల వ్యయంతో 40 వేలు లీటర్ల సామర్థ్యం కలిగిన నీటి ట్యాంకును నిర్మిస్తున్నట్లు తెలిపారు. లక్ష్మీనారాయణ, బొజ్జన్న, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కలతో జాగ్రత్త

రాయదుర్గం, న్యూస్‌టుడే: ఆహారపదార్థాల వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పారవేయటంతో వీధి కుక్కలు వాటిని తినటానికి వచ్చి పిల్లలపై దాడి చేస్తున్నాయని, వీటిపై పాఠశాల, కళాశాలల, సంక్షేమ వసతి గృహాలకు చెందిన విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ వి. దివాకర్‌రెడ్డి సూచించారు. బుధవారం ఉదయం మున్సిపల్ కమిషనర్ ఛాంబర్‌లో సమావేశాన్ని నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలలు ఇతర చోట్ల తప్పని సరిగా డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేసుకొని మున్సిపల్ సిబ్బందికి అప్పగించాలన్నారు. పట్టణంలో 8 ఫీడింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 వెంకటరమేష్, కళాశాలల అధ్యాపకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సమీక్షలో మున్సిపల్ కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి

రాయదుర్గం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీ యుఐఎఫ్‌ఐడీసీ) కింద ప్రభుత్వం రూ.3 కోట్లను మంజూరు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి తెలిపారు. ఈ ప్రతిపాదనలకు సాంకేతిక అనుమతులు మంజూరైన తర్వాత పట్టణంలో అభివృద్ధి పనులను చేపడుతామన్నారు. ఇటీవల పట్టణంలో మౌలిక వసతుల కల్పన కోసం నిధుల మంజూరుకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పురపాలకశాఖ మంత్రి నారాయణకు విజ్ఞప్తి చేశారు.

సైన్స్‌లో విద్యార్థి ప్రతిభ

ఉరవకొండ, న్యూస్‌టుడే: పట్టణంలోని వివేకనంద పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న దేవాన్ష్ సర్ సీవీ రామన్ పోటీ పరీక్షల్లో సైన్స్ సంబంధ అంశాల్లో ప్రతిభ చాటినట్లు కరస్పాండెంట్ నాగరత్న, హెచ్‌ఎం రవీంద్రారెడ్డి బుధవారం పేర్కొన్నారు. ఫలితాల్లో ఉత్తమ స్థానంలో నిలువడంతో నిర్వాహకులు తాజాగా హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సినీ కథనాయకుడు శ్రీకాంత్, విశాఖ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చేతుల మీదుగా సర్ సీవీ రామన్ యంగ్‌జీనియస్ అవార్డును అందుకున్నట్లు తెలిపారు.

సినీహీరో శ్రీకాంత్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చేతులు మీదుగా అవార్డు అందుకుంటున్న దేవాన్ష్

మార్కెట్‌లో తగ్గిన చింతపండు ధర

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్ యార్డుకు బుధవారం 284.4 క్వింటాళ్ల చింతపండు వచ్చినట్లు రాయదుర్గం ఆర్ఎంసీ కార్యదర్శి ఎం.శ్రీనివాసులు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈనాం ద్వారా వ్యాపారులు చింతపండు టెండర్లు వేయాల్సి ఉన్నా, బహిరంగ వేలాల ద్వార చింతపండు కొనుగోళ్లు జరిపారు.

● రాయదుర్గం బహిరంగ మార్కెట్‌లో గతవారం కంటే చింతపండు ధరలు భారీగా పడిపోయాయి. ఫ్లవర్ రకం క్వింటాలుకి రూ.6 వేలు నుంచి రూ.11 వేలు, కరిపులి మేలు రకం చింతపండు క్వింటాలుకి రూ.14 వేలు నుంచి రూ.17,500 ధరలు పలికాయి. వ్యాపారులు కొనుగోలు చేసిన చింతపండును లారీల ద్వారా కడప, ప్రొద్దుటూరు, తాడేపల్లి గూడెం, గుంటూరు, చెన్నై నగరాలకు ఎగుమతులు చేశారు.

నీరు అందక పైరు దక్కక

శెట్టూరు, న్యూస్‌టుడే: ఎన్నో ఆశలతో వ్యయప్రయాసలు పడి అప్పు చేసి పంటసాగు చేస్తే బోరులో నీరు ఎండి పంటను గొర్రెలకు వదిలేసిన బాధిత రైతు ఆవేదన వర్ణనాతీతం. కుందుర్పి మండలం యర్రగుంటకు చెందిన కాపు రామచంద్రకు శెట్టూరు మండలం చితర్లపల్లి రెవెన్యూగ్రామంలో 5 ఎకరాలు పొలం ఉంది. నాలుగు మాసాల క్రితం బోరువేయించగా రెండు అంగుళాలు నీరు పడగా సంబరపడి పోయాడు. కొత్త ఆశలతో మోటారు, విద్యుత్తు ఏర్పాటు, వేరుసెనగ విత్తనం సేకరణకు మొత్తం రు.3.50 లక్షలు అప్పు చేసి రెండు నెలల క్రితం వేరుసెనగ విత్తనం వేశాడు. ప్రస్తుతం పంట కాయలు కాసే దశలో ఉంది. ఈ పరిస్థితిలో బోరులో నీరు తగ్గిపోవడంతో పంటను కాపాడుకోవడానికి ఇరుగు పొరుగు రైతుల అందుబాటులో లేకపోవడంతో పంటను గొర్రెలకు వదిలేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.



(c) eenadu

గుంతకల్లు

•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి

భక్తిశ్రద్ధలతో ధ్వజారోహణ

పూజల్లో పాల్గొన్న అర్చకులు, భక్తులు

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలోని ప్రాచీన దేవాలయంలో బుగ్గరామలింగేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో బుగ్గరామలింగేశ్వరుడు, రాజరాజేశ్వరి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సంబరంగా ధ్వజారోహణం, చిత్రగోపురం కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

అమర గాయకుడు ఘంటసాల

ఘంటసాల చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అభిమానులు తదితరులు

గుంతకల్లు, న్యూస్‌టుడే : చలనచిత్ర గాయకుడు, దివంగత పద్మశ్రీ ఘంటసాల పాడిన పాటలు తెలుగు ప్రజల హృదయాల్లో ప్రతిధ్వనిస్తూనే ఉంటాయని వక్తలు అన్నారు. ఆయన వర్ధంతి కార్యక్రమం బుధవారం రాత్రి పట్టణంలోని విజయనగర్ కాలనీలో ఘంటసాల అభిమాన సంఘం ఆధ్వర్యంలో జరిగింది. అభిమాన సంఘం నాయకుడు నారాయణబాబు, గాయకులు భీమలింగయ్య, చలపతి, సత్యబాబు, శ్రీనివాసరెడ్డి, సంగీత విద్వాంసుడు దివాకర్ శాస్త్రి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 8008612342

సమస్య : చిన్నవడియార్ చెరువులో అనంతపురానికి చెందిన వ్యాపారులు వివిధ రకాల వ్యర్థాలనుచెరువులో పడేస్తున్నారు. **-కొండన్న**

సమాధానం: చెరువు కట్టపై నిఘా ఉంచి చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటాం. **-సదాశివ, డిప్యూటీ ఎంపీడీవో, బుక్కరాయసముద్రం**

– న్యూస్‌టుడే, బుక్కరాయసముద్రం

సమస్య : గుంతకల్లులో మున్సిపల్ కూరగాయల మార్కెట్‌లో ఎగువన మరుగుదొడ్ల వద్ద అపరిశుభ్రంగా ఉంది. **- ప్రకాశ్**

సమాధానం: బ్లీచింగ్ పొడి చల్లించి సమస్యను పరిష్కరిస్తాం. **- వేణుగోపాల్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్, గుంతకల్లు పురపాలక సంఘం**

సమస్య: మున్సిపల్ కూరగాయల మార్కెట్ వెనకాల కసాపురం రోడ్డు క్రాస్ వద్ద రాళ్లకుప్పలు ఉన్నాయి. **- చంద్ర**

సమాధానం: పరిశీలించి రాళ్ల కుప్పలను తొలగిస్తాం. **- వేణుగోపాల్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్, గుంతకల్లు**

– న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

ఇంటి పట్టునే ఉపాధి మంత్రం

పొదుపు మహిళల విజయగాథ

శింగనమల, న్యూస్‌టుడే : స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. శింగనమల మండలవ్యాప్తంగా విజయలక్ష్మి స్వయం సహాయక మండలిలో దాదాపు 850 సంఘాలు ఉండగా, సుమారు 10 వేల మంది సభ్యులు ఉన్నారు. వీరంతా సక్రమంగా పొదుపు చేసుకుంటూ జీవితాల్లో రాణిస్తున్నారు. ఆయా సంఘాల సభ్యులకు ఏపీఎం ఈశ్వరయ్య స్వయం ఉపాధి విషయాలపై అవగాహన కల్పిస్తూ ప్రోత్సహిస్తున్నారు.

తరిమెలకు చెందిన సుజాత 2020లో గంగమ్మ స్వయం సహాయక సంఘంలో చేరారు. స్త్రీనిధి, బ్యాంకుల ద్వారా రూ.6 లక్షల వరకు రుణం తీసుకున్నారు. మిఠాయి దుకాణం ఏర్పాటు చేశారు. నెలకు రూ.30 వేల వరకు సంపాదిస్తున్నారు. గతంతో పోల్చుకుంటే కుటుంబ జీవనానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉందని చెబుతున్నారు. భవిష్యత్తులో వ్యాపారాన్ని మరింత విస్తరిస్తానని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

శింగనమలకు చెందిన సుకన్య 2018లో సీతారామ స్వయం సహాయక సంఘంలో చేరి పొదుపు బాట పట్టారు. స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ ద్వారా దాదాపు రూ.10 లక్షల వరకు రుణం తీసుకున్నారు. కుట్టు మిషన్, ఎంబ్రాయిడింగ్ వంటి వాటితో జీవనం పొందుతున్నారు. ఒక్కో జాకెట్‌ను కుట్టడానికి రూ.300 నుంచి రూ.500 వరకు తీసుకుంటున్నారు. నెలకు రూ.20 వేలకు పైగా సంపాదిస్తున్నారు. తన ఆదాయంతో పిల్లల్ని చక్కగా చదివిస్తున్నారు.

గురుగుంట్లకు చెందిన సాలమ్మ 2008లో స్వయం సహాయక సంఘంలో చేరారు. ప్రభుత్వం అందిస్తున్న స్త్రీనిధి, బ్యాంకుల ద్వారా రూ.5 లక్షల రుణం తీసుకున్నారు. తద్వారా బుట్టలు అల్లడం ద్వారా నెలకు రూ.15 వేల వరకు సంపాదిస్తున్నారు. దీంతో కుటుంబపోషణకు ఇబ్బంది లేకుండా పోయింది. పాడి పశువులతో పాల ఉత్పత్తి ద్వారా మరింత రాబడి గడిస్తున్నారు.

నార్పల మార్గంలో ప్రయాణ కష్టాలు

అధ్వానంగా ఉన్న రహదారి

నార్పల, న్యూస్‌టుడే : నార్పల మండలంలో పలు గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నార్పల మండలం ఉద్యాన పంటల సాగులో జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉన్నా గ్రామీణ రహదారులు దారుణ స్థితిలో ఉండటం రైతులు, వ్యాపారులకు పెద్ద సమస్యగా మారింది. ఉద్యాన పంటలను మార్కెట్లకు తరలించే క్రమంలో పలు మార్లు వాహనాలు బోల్తా పడుతున్న ఘటనలు లేకపోలేదు. గ్రామీణ అభివృద్ధికి కోసం తక్షణమే రోడ్ల మరమ్మతులు చేపట్టి, శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు, రైతులు, అధికారులను కోరుతున్నారు.

స్తంభాలు పాతారు... తీగలు మరిచారు

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తి పురపాలికలోని చెట్నేపల్లి, గుత్తిశివారు కాలనీలకు విద్యుత్తు సౌకర్యం లేక ప్రజలు అనేక పాట్లుపడుతున్నారు. చెట్నేపల్లిలోని దళిత వాడలో అధికారులు 8 నెలల కిందట విద్యుత్తు స్తంభాలను పాతారు. ఇప్పటికీ తీగలు ఏర్పాటు చేయలేదు. పట్టణంలోని వీరారెడ్డికాలనీలోనూ అధికారులు స్తంభాలను ఏర్పాటు చేసి తీగలను మరిచారు. దీంతో పురపాలిక అధికారులు వీధిదీపాలను ఏర్పాటు చేయించలేకపోతున్నారు. దీపాలు లేక రాత్రిసమయాల్లో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వీరారెడ్డి కాలనీ ప్రజలు ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తున్నా అధికారులు స్పందించడం లేదు. ఇప్పటికైనా చెట్నేపల్లి, గుత్తిలలో వీధిదీపాలు ఏర్పాటు చేసేందుకు స్తంభాలకు తీగలను అమర్చాలని ప్రజలు కోరుతున్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

బుక్కరాయసముద్రం : కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ గురువారం నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం నాయకులు బాలరంగయ్య పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వడంతో పాటు, బ్యాంకులు పంట రుణాలు ఇవ్వాలన్నారు. యజమానితో సంబంధం లేకుండా అన్నదాత సుఖీభవ డబ్బులు ఇవ్వాలన్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలన్న డిమాండ్‌తో దేశవ్యాప్త సమ్మెకు రైతులు, కౌలు రైతులు మద్దతు తెలిపి పాల్గొనాలన్నారు. నాయకులు కుళ్లాయప్ప, శ్రీనివాసులు, నెట్టికంటయ్య, పుల్లన్న పాల్గొన్నారు.

గుంతకల్లు పట్టణం: సార్వత్రిక సమ్మెకు సంపూర్ణ మద్దతు ఉంటుందని సీపీఐ నాయకులు పేర్కొన్నారు. బుధవారం గుంతకల్లులో కార్యాలయంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గోవిందు, జిల్లా కార్యవర్గ సభ్యులు వీరభద్రస్వామి, జిల్లా సమితి సభ్యులు మహేశ్ మాట్లాడుతూ కేంద్రం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి, నాలుగు లేబర్‌కోడ్లను తీసుకొచ్చిందన్నారు. కార్మికులు, ఉద్యోగులు సమ్మెలో పాల్గొనాలని కోరారు. ఈకార్యక్రమంలో సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి గౌస్, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యల్లనూరు వ్యవసాయాధికారిగా సురేశ్‌రెడ్డి

యల్లనూరు, : యల్లనూరు మండల ఏఓగా సురేశ్ రెడ్డి బుధవారం వ్యవసాయ శాఖ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. నాలుగు నెలలుగా మండలానికి వ్యవసాయ శాఖ అధికారి లేరు. దీంతో జిల్లా వ్యవసాయ అధికారులు తెలంగాణాకు చెందిన సురేశ్‌ను మండలానికి కేటాయించారు. ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో రైతుల సేవలో తరిస్తామన్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఇన్‌ఛార్జి ఏఓ కిరణ్ కుమార్ తాడిపత్రి టెక్నికల్ ఏఓగా వెళ్లారు.

తవ్వారు.. వదిలేశారు!

శింగనమల నుంచి గార్లదిన్నె వెళ్లే రహదారిలో నాగులగుడ్డం తండా క్రాస్ వద్ద నాలుగు నెలల కిందట పైపులైను కోసం రహదారిని గుంత తవ్వారు. తరువాత పూడ్చడం మరిచారు. ద్విచక్రవాహనదారులు వేగం వెళ్లే క్రమంలో గమనించకుండా ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది. **-న్యూస్‌టుడే, శింగనమల**

ట్యాంకులు నిరుపయోగం

గుంతకల్లులోని ఇందిరా నగర్లో పవర్ బోర్ ట్యాంకు నిరుపయోగంగా ఉంది. వేసవిలో నీటి ఎద్దడిని నివారించాలని అన్ని వార్డుల్లో ప్రజల అవసరాల కోసం ట్యాంకులకు నీటి సరఫరా చేయడానికి పవర్‌బోర్లను ఏర్పాటు చేశారు. కొన్ని వార్డుల్లో ట్యాంకులు వృథాగా ఉన్నాయి. వేసవి వస్తుండటంతో ముందస్తుగా మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం**

కార్యాలయాల ఎదుటే అపరిశుభ్రత

కల్లూరు గ్రామంలోని అగ్రహారం ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న రైతు సేవా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ కార్యాలయాల వద్ద పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. పిచ్చిమొక్కల మధ్య విషపురుగులు ఉండే అవకాశం ఉంది. అపరిశుభ్రత వాతావరణంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్యాలయాల వద్ద అపరిశుభ్రతను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, గార్లదిన్నె గ్రామీణం**

శిథిలావస్థలో నీటి ట్యాంకు

గుత్తి మండలంలోని అబ్బేదొడ్డిలో తాగునీటి ట్యాంకు శిథిలావస్థకు చేరుకుంది. 30ఏళ్ల కిందట నిర్మించిన ట్యాంకు పైభాగం లీకేజీ అవుతోంది. లీకేజీతో విలువైన తాగునీరు వృథా అవుతోంది. గ్రామీణ అధికారులు మరమ్మతులు చేయించలేకపోతున్నారు. మరో వైపు గ్రామంలోని దళిత వాడలో రూ.20లక్షలతో చేపట్టిన నీటి పథకం అసంపూర్తిగా ఉంది. అధికారులు తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. **-న్యూస్‌టుడే, గుత్తి**

గుంత.. ఎవరికీ పట్టదంట

తాడిపత్రిలోని యల్లనూరు రోడ్డు నుంచి టైలర్స్ కాలనీ వెళ్లే మలుపులో భారీగా గుంత పడింది. తాగునీటి పైపులైన్ కోసం మూడేళ్ల కిందట భారీగా సీసీరోడ్డు తవ్వారు. అప్పటి నుంచి రోడ్డు వేయడం మరిచి పోవడంతో ప్రమాదకరంగా గుంత ఏర్పడింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది. **-న్యూస్‌టుడే, తాడిపత్రి**

13న ఉపాధ్యాయుల సమస్యలపై ధర్నా

కరపత్రాలను విడుదల చేస్తున్న ఎస్టీయూ నాయకులు

పామిడి, న్యూస్‌టుడే : ఉపాధ్యాయ సమస్యలే పరిష్కారమే లక్ష్యంగా ఎస్టీయూ ఆధ్వర్యంలో దశలవారీగా చేపడుతున్న పోరాట కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ వద్ద ఈనెల 13న జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఎస్టీయూ మండల ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు పేర్కొన్నారు. బుధవారం ఎంఆర్సీ కార్యాలయ ఆవరణలో కరపత్రాలు విడుదల చేశారు. రాష్ట్ర సంఘం పిలుపుతో పీఆర్సీ కమిటీ, డీఏ బకాయిలు తదిత సమస్యల పరిష్కారానికి చేపడుతున్న కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎస్టీయూ నాయకులు చంద్రశేఖర్, ఆనంద్, వీరాంజనేయులు, వాసు, నరసింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పంచాయతీకి 'ఉపాధి' కల్పించండి

మాట్లాడుతున్న ఉపాధి హామీ జిల్లా అధికారి శ్రీనివాసులు

యల్లనూరు, న్యూస్‌టుడే : పని అడిగిన ప్రతి గ్రామంలోనూ ఉపాధి కల్పించాలని , పనుల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఉపాధి హామీ జిల్లా అధికారి శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లడుతూ ప్రతి పంచాయతీలో పనులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీవీఓ అసిస్టెంట్ పర్వేజ్, ఏపీఓ ఓబిరెడ్డి, ఈసీ సత్యమూర్తి, ఉపాధి హామీ సిబ్బందిపాల్గొన్నారు.

కాలుష్యకోరల్లో.. పట్టణం

చెత్తకుప్పలు అంటుకోవడంతో దట్టంగా వస్తున్న పొగ

గుంతకల్లు, న్యూస్‌టుడే : నెలల తరబడి పోగైన చెత్తను మున్సిపల్ అధికారులు తొలగించకపోతుండటంతో వాటికి జనం నిప్పు పెడుతున్నారు. ప్రధానంగా అంబమ్మగుడి కాలనీగుండా వన్‌వే ట్రాఫిక్ రోడ్డుతో పాటు గుత్తిరోడ్డు, తిలక్‌నగర్‌రోడ్డు, గుంతకల్లురోడ్లు కలుస్తాయి. రోడ్డు పక్కన పెద్దఎత్తున చెత్త నిల్వ ఉంటోంది. ఇక్కడ చెత్త కాలుతుంటే వెలువడుతున్న పొగ కారణంగా పట్టణ ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయి. ఇక్కడ నిల్వఉన్న చెత్త దిబ్బలను ఎప్పటికప్పుడు అధికారులు తొలగించాలని వాహన చోదకులు కోరుతున్నారు

కుష్ఠువ్యాధిపై అపోహలు వీడాలి

నిత్యావసర సరకులు అందజేస్తున్న నిర్వాహకులు

తాడిపత్రి, న్యూస్‌టుడే: కుష్ఠువ్యాధితో బాధపడుతున్న వారు ఎలాంటి అపోహలు పెట్టుకోకుండా ఉండాలని పలువురు అధికారులు పేర్కొన్నారు. స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం కుష్ఠువ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కుష్ఠువ్యాధి బాధితులకు ఎంసీఆర్ ఆధ్వర్యంలో పోషక పదార్థాలు అందజేశారు. కుష్ఠు బారిన పడిన వారు ఎలాంటి ఇబ్బంది పడకుండా పోషకాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు జయలక్ష్మి, గంగాధర్, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వండి

గుంతకల్లు, న్యూస్‌టుడే : ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి మొదటి ప్రాధాన్యమివ్వాలని తెదేపా పట్టణ ఇన్‌ఛార్జి నారాయణస్వామి, పట్టణ అధ్యక్షుడు గుణశేఖర్ అన్నారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బుధవారం సత్యనారాయణపేటలో కంటి ఉచిత పరీక్ష శిబిరం జరిగింది. శిబిరంలో వారు మాట్లాడారు. బళ్లారికి చెందిన ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి నిపుణులు ఉచితంగా పరీక్షలు చేయడమే కాకుండా శస్త్ర చికిత్సలు కూడా చేస్తున్నారన్నారు. కంటిచూపు సరిగాలేని నిరుపేదలు శిబిరాలను వినియోగించుకోవాలన్నారు. తెదేపా నాయకులు మస్తానప్ప, అంజలిదేవి, సాయిప్రసాద్, అంజి, కౌన్సిలర్ బ్రహ్మ తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్యశిబిరం

గుంతకల్లు, న్యూస్‌టుడే : గుంతకల్లులోని మిల్లు పాఠశాలలో బుధవారం సాయికృష్ణ నర్సింగ్ హోం, తెదేపా జిల్లా వైద్యుల విభాగం అధ్యక్షురాలు హిమబిందు ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం జరిగింది.

అ వీ.. ఇ వీ.. అ న్నీ..

ఆమెతో పాటు డాక్టర్ వెంకటేశ్ రోగులను పరీక్షించారు. రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. ప్రతి వార్డులో ఉచిత శిబిరాలను నిర్వహిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో తెదేపా నాయకుడు లాయర్ ప్రతాప్, లోకేశ్ అభిమాన సంఘం జాతీయ అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి. కోదండరామస్వామి ఆలయం అధ్యక్షుడు లోకేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

గార్లదిన్నె, న్యూస్‌టుడే : కనంపల్లి గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గని అనే యువకుడు గాయపడినట్లు స్థానికులు తెలిపారు. శింగనమల మండలం కల్లుమడి గ్రామానికి చెందిన యువకుడు ద్విచక్రవాహనంపై అనంతపురం నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా వాహనం అదుపు తప్పి డివైడర్లను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు.

బాధిత కుటుంబానికి జేసీ పరామర్శ

శింగనమల, న్యూస్‌టుడే : తరిమెల గ్రామంలో కొన్ని రోజుల కిందట వైకాపా నాయకుడు, ఏడీసీసీ బ్యాంకు మాజీ అధ్యక్షుల తరిమెల రంగారెడ్డి అనారోగ్యంతో మృతిచెందాడు. ఈనేపథ్యంలో ఆయన కుటుంబాన్ని మాజీ జేసీ దివాకర్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం ఆయన పలువురు నాయకులతో ఆప్యాయంగా పలకరించారు.

జీరామ్‌జీ పథకంపై సమీక్ష

యాడికి, న్యూస్‌టుడే: జీరామ్‌జీ పథకంపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఎంపీడీవో బీ.వీరరాజు మాట్లాడుతూ. .కూలీలకు తప్పక పనులు కల్పించాలన్నారు. చేసిన పనులకు సంబంధించి పక్కాగా కొలతలు తీసి నమోదు చేసి, పనిచేసే చోటు నుంచే కూలీల ముఖచిత్రం అప్‌లోడ్ చేయాలని క్షేత్రసహాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో మద్దిలేటి, క్షేత్రసహాయకులు తదితరులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లిస్తున్నా.. ప్రగతి చూపరేం!

చేనేత కాలనీలో అధ్వానంగా మట్టిరోడ్డు

గుంతకల్లు, న్యూస్‌టుడే : గుంతకల్లులోని పలు కాలనీల వాసులు సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రధానంగా మస్తాన్ పేట, కొత్తకొట్టాల,

• కాలనీల్లో మౌలిక వసతులు కరవు

చేనేత కాలనీ, రాఘవరెడ్డి కాలనీల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. మస్తాన్‌పేట కాలనీ, కొత్తకొట్టాలలో వర్షం వస్తే చాలు ఇళ్లలోకి నీరు చేరుతోంది. కొన్ని ప్రాంతాల్లో మురుగు కాలువలు లేవు. ఉన్నా అవి చిన్నగా ఉన్నాయి. కొన్ని చోట్ల నిర్మించిన కాల్వర్టులు ధ్వంసమయ్యాయి. మస్తాన్‌పేటలోని చిన్ననీటి పథకాన్ని తీసేశారు. ఏటా పన్నులు చెల్లిస్తున్నా మాకేంటి ఈదుర్గతి అని, ప్రగతి పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పురపాలిక	: గుంతకల్లు
కాలనీలు	: మస్తాన్‌పేట, కొత్త కొట్టాల, రాఘవరెడ్డి కాలనీ, చేనేత కాలనీ
నివాసగృహాలు	: 2400
జనాభా	: 19,600

ఏ కాలనీకెళ్లినా.. సమస్యలే!

• చేనేత కాలనీలో అధికారులు రోడ్లు, మురుగు కాలువలను నిర్మించలేదు. ఉన్న మట్టి రోడ్లు పాడైపోవడంతో గుంతలు పడ్డాయి. ఇక్కడ 200 మంది దాకా విద్యార్థులున్నారు. వీరికి ప్రభుత్వం పాఠశాలను ఏర్పాటు చేయలేదు. కాలనీవాసుల ఆహ్లాదం కోసం ఉద్యానం లేదు. కసాపురం రహదారి నుంచి కాలనీకి రోడ్డును నిర్మించలేదు • రాఘవరెడ్డి కాలనీలోనూ పరిస్థితి దారుణంగా ఉంది. ఇక్కడ గతంలో నీటి పథకం ఉండేది. దాన్ని అధికారులు తొలగించారు. తరువాత కొత్తపథకాన్ని ఏర్పాటు చేయలేదు. ఇక్కడ విద్యుత్తు తీగల కిందనే ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. దీంతో ఎవరూ వినియోగించడానికి ముందుకు రావడంలేదు.

సౌకర్యాల కల్పనకు కృషి చేస్తాం

కాలనీల్లో సౌకర్యాలు లేని విషయం వాస్తవమే. రోడ్లు, మురుగు కాలువలను నిర్మించాల్సి ఉంది. దీనికి సంబంధించి ప్రణాళికలను రూపొందించాం. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే పనులకు టెండర్లను నిర్వహించి సౌకర్యాలు కల్పించడానికి అన్ని విధాలా కృషి చేస్తాం.

- హరికృష్ణ, ఏఈ

ప్రమాదమని హెచ్చరించరా?

మండలంలోని మంరాయలచెరువు-కూర్మాజీపేట మధ్య మలుపు ప్రమాదకరంగా మారింది. నగరూరు రోడ్డు ప్రధాన దారి కావడంతో ఇటు వైపు ప్రతిరోజు వందల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. మలుపులో ఎదురుగా వచ్చే వాహనాలకు కానరాకపోతుండటంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. వేగ నిరోధకాలు, లేకపోతే హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే,యాడికి,**

యాడికి వీధులు.. దుర్గంధభరితం

యాడికి, న్యూస్‌టుడే: యాడికిలోని లాలెప్పతోట కాలనీ, కెనరా బ్యాంకు వీధిలో మురుగు కదలడం లేదు. కాలువలు చిన్నవిగా ఉండటంతో వ్యర్థాలు అడ్డుపడి మురుగు నీరు ముందుకు కదలక రోడ్డుపైనే నిల్వ ఉంటోంది. దీంతో విద్యార్థులు, పాదచారులు మురుగులోనే నడవాల్సి వస్తోంది. ఇలా ప్రతిరోజూ ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు వాపోతున్నారు. మురుగు వెళ్లడానికి శాశ్వత చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

ముఖ్య బహిరంగ ప్రకటన

మా కక్షికర్త యగు కడప జిల్లా, బద్వేలు మండలం, అశోక్ నగర్ వీధిలో కాపురముండు బచ్చల రామయ్య మరియు సుబ్బమ్మ గార్ల జ్యేష్ఠ కుమారుడైన బచ్చల రమణయ్య (74 సం॥ల వయస్సు) తరపున యావన్మందికి బహిరంగ పరచడమేమనగా..

మా కక్షికర్త బి.రమణయ్య మరియు అతని ధర్మపత్ని వెంకట సుబ్బమ్మ గార్లు కలిసి పై తెలిపిన టౌన్ నందు కాపురమున్నారు. వారివురికి శ్రీధర్ అనే జ్యేష్ఠ కుమారుడున్నూ మరియు స్వర్ణలత (శ్రీ వై.వెంకట సుబ్బయ్య గారి భార్య-బద్వేలు టౌన్) అను ఏకైక పుత్రిక మరియు డాక్టర్ సునీల్ కుమార్ (ప్రస్తుతం మదనపల్లి టౌన్ వాస్తవ్యులు) అను ముగ్గురు సంతానము కలిగియున్నారు. మా కక్షికర్త మరియు అతని భార్య, వారికి గల ఆస్తుల గురించి మరియు పరిస్థితులననుసరించి వారి సంతతి వారిని పెంచి, పెద్ద చేసి వివాహాది శుభకార్యములు వగైరాలు జరిపి జీవితములో స్థిరపరచియున్నారు. పై ముగ్గురు సంతానము పైకి జ్యేష్ఠ కుమారుడైన శ్రీధర్‌ను శ్రీమతి నాగలక్ష్మి (నార్పాల-అనంతపురం జిల్లా) అను ఆమెతో 31-10-1999 లేక ఆ సుమారున వివాహాది శుభకార్యములు జరిపించియున్నారు. సదరు బి.శ్రీధర్ మరియు బి.నాగలక్ష్మి వీరికి కౌశిక్ (ఉద్యోగ రీత్యా హైదరాబాద్ నివాసి) అను జ్యేష్ఠ కుమారుడున్నూ మరియు వెంకట పార్థివ్ (ప్రస్తుతం ఇంజనీరింగ్ విద్యార్థి) అను కనిష్ఠ కుమారుడున్నూ కలిగియున్నారు. స్వర్ణలతకు 2003లో వివాహము జరిగినది. వీరిపురికి నవ్యశ్రీ మరియు యశశ్రీ అను ఇరువురు కుమార్తెలు (ప్రస్తుతం మైనర్లు) కలిగియున్నారు. సదరు బచ్చల రమణయ్య మరియు వెంకట సుబ్బమ్మ గార్లకు డాక్టర్ సునీల్ కుమార్ (గుండె వైద్య నిపుణులు-(ప్రస్తుతం మదనపల్లి టౌన్ వాస్తవ్యులు) గారికి డాక్టర్ లహరి అను ఆమెతో వివాహము జరిగి వీరికి శ్యామ్‌శౌర్య (9 సం॥ల వయస్సు) మరియు కామాక్షి (ఒకటిన్నర సం॥ల వయస్సు)అను సంతానము కలిగియున్నారు.

మా కక్షికర్త బద్వేలు టౌన్ నందు స్థిరపడి యున్నందున జీవనోపాధి నిమిత్తము అన్నపూర్ణ కట్ పీస్ సెంటర్ అను జౌళి వ్యాపారము 1985 నుండి బద్వేలు టౌన్‌లో జరుపుకొనుచున్నారు. మా కక్షికర్త జ్యేష్ఠ కుమారుడు శ్రీధర్, మరియు కనిష్ఠ కుమారుడు డాక్టర్ సునీల్ కుమార్ కలిసి వారి జాయింట్ కుటుంబ నిమిత్తము వ్యాపారము వగైరాలు ఈరోజు సరికి జరుపుకొనుచున్నారు. అదృష్ట వశాత్తు మా కక్షికర్త అతని భార్య ప్రారంభించిన వ్యాపారములు గాని మరియు కుటుంబమునకు కావలసిన ఏ కార్యమైనను ఫలించి, యే విధమైన లోటు లేకుండా వారి సంతతిని గౌరవ మర్యాదల, ఉన్నత స్థితిలో స్థిరపరచియున్నారు.

ఇట్లు ఉండగా మా కక్షికర్త జ్యేష్ఠ కుమారుడు శ్రీధర్ 20-12-2025వ తేదీన బద్వేలు టౌన్‌లో అకస్మాత్తుగా చనిపోయిఉన్నారు. సదరు శ్రీధర్ భార్య, పిల్లలు, ప్రస్తుతము నాగలక్ష్మి పుట్టినిల్లయిన అనంతపురం జిల్లా నార్పాల మండలం మరియు గ్రామంలో కాపురముంటూ ఉన్నారు. బి.శ్రీధర్ మరణానంతరము అతని భార్య పిల్లలలో లేని అసహనము, దురాశ వగైరాలు పెరిగి మా కక్షికర్త జాయింట్ కుటుంబములో ఊహించని మరియు ఇదివరకు జరగని పరిణామములు పై తెలిపిన నాగలక్ష్మి మరియు ఆమె ఇరువురి కుమారులు కలిసి మనశ్శాంతి లేక నడుచుకొనుచున్నారు. మా కక్షికర్త మరియు అతని భార్య చాలా ఓపిక ప్రదర్శించి, పరిస్థితులను చక్కబెట్టడం కోసం చేసిన చర్యలు ఎంతమాత్రము పెద్ద కోడలు అయిన నాగలక్ష్మి మరియు ఆమె సంతానమునకు బోధపడలేదు. ఈ రోజు సరికి వారి నడవడికలో ఏ విధమైన మార్పు సహా ఎంతమాత్రము కనబడుటలేదు.

మా కక్షికర్త మరియు పై తెలిపిన ఇరువురు కుమారులు వారి జాయింట్ కుటుంబమునకు గాను సంపాదించిన జాయింట్ ఆస్తులు, వ్యాపారములు వగైరాలు సామరస్య పూర్వకముగా పరిష్కరించుకొనుటకు గాను చేసిన గట్టి ప్రయత్నములు విఫలము అయినవి. బి.శ్రీధర్ జీవిత కాలములో తన తండ్రి రమణయ్యతో జాయింట్ కుటుంబమునకు గాను జరిపిన ఆస్తులు వగైరాలు అతి నమ్మకము మీద శ్రీధర్ పేరున సహా సంపాదించియున్నారు. కానీ జాయింట్ కుటుంబ సభ్యులు అయిన మా కక్షికర్త [illegible]

మదనపల్లి టౌన్
తేది: 11/02/2026

సం/- శ్రీ నరస సుబ్రహ్మణ్యం, శ్రీ వి.యస్. హర్షవర్ధన్, న్యాయవాదులు, సొసైటీ కాలనీ, మదనపల్లి.

అనంతపురం
• అనంతపురం • రాప్తాడు

సృజనాత్మకతతోనే ఆవిష్కరణలు

రాప్తాడు, న్యూస్‌టుడే: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీస్తేనే అద్భుతమైన ఆవిష్కరణలు రూపొందించవచ్చని రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్ తెలిపారు. జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న యురేకా సైన్స్ ఎక్స్ పో-2026 కార్యక్రమ పోస్టర్లను బుధవారం మండలంలో విద్యాధికారి మల్లికార్జున ఆవిష్కరించారు.

ఆర్ట్స్ కళాశాలలో వైద్యశిబిరం

అనంతపురం విద్య: ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో బుధవారం ఉచిత గుండె వైద్యశిబిరం నిర్వహించారు. కిమ్స్ సవేరా ఆసుపత్రి సహకారంతో కళాశాలలోని రెడ్‌రిబ్బన్‌క్లబ్, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. హృదయానికి సంబంధించిన వివిధ పరీక్షలు నిర్వహించారు. ప్రిన్సిపల్ పద్మశ్రీ, సమన్వయకర్త, గిరిధర్ పాల్గొన్నారు.

ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేసే సంక్షేమ పథకాల ఫలాలు అందుకోవాలంటే ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య ఉండాలని వ్యవసాయ శాఖ సహాయ డైరెక్టర్ అల్తాఫ్ అలీ సూచించారు. ఫార్మర్ ఐడీ యాప్స్ ప్రతి రైతు డౌన్‌లోడ్ చేసుకుంటే అనేక ప్రయోజనాలు ఉంటాయని ఆయన వెల్లడించారు. బుధవారం అనంతపురం గ్రామీణ పరిధిలోని నరసనాయనికుంట కొడిమి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ విస్తరణాధికారి బి.మురళీకృష్ణ, ఉద్యాన సహాయకులు సాయి ప్రమోద్, రాప్తాడు మార్కెట్‌యార్డు సభ్యుడు అనిల్‌చౌదరి, రైతులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఆత్మకూరు: 9701452321,
ఎస్కే, జేఎన్‌టీయూ: 8008573005
శారదానగర్: 8008573049

సమస్య: గుల్జార్‌పేటలో పందుల బెడద ఎక్కువగా ఉంది. **- ఫక్రుద్దీన్**
సమాధానం: పెంపకందారులకు తాఖీదులు ఇచ్చి తరలించే ఏర్పాట్లు చేస్తాం.
సమస్య: అశోక్‌నగర్ నుంచి ఈద్గా మైదానంలోకి వెళ్లే రోడ్డులో చెత్తను పడేస్తున్నారు. **- ఆదిమూర్తి**
సమాధానం: చెత్తను వెంటనే తరలిస్తాం.
- నరసింహ, నగరపాలక ఇన్‌ఛార్జి ప్రజారోగ్య అధికారి. – న్యూస్‌టుడే, అశోక్‌నగర్

తెరపై ఈనాడు

అనంతపురం(కమలానగర్), న్యూస్‌టుడే : గౌరి : **విత్ లవ్,** గాయత్రి : **శ్రీచిదంబరం,** గౌతమి : **బరాబర్ ప్రేమిస్తా,** నీలిమ : **3,** త్రివేణి : **సుమతీ శతకం,** తరంగిణి : **అనగనగా ఒక రాజు,** తేజస్విని : **భర్త మహాశయులకు విజ్ఞప్తి,** శాంతి : **మన శంకర వరప్రసాద్.** ఎస్వీ సినిమా, సుధా : **అరెంజ్.**

ఆలయ పునరుద్ధరణకు వితరణ

అనంత సాంస్కృతికం: నగరంలోని ఒకటో రోడ్డు కాశీ విశ్వేశ్వర, కోదండ రామాలయ పునర్నిర్మాణానికి నందినేని మల్లికార్జున, సరస్వతి దంపతులు ఆలయ కమిటీ ఛైర్మన్ అమిలినేని నరేంద్రచౌదరి, ఈవో నాగేంద్రుడులకు రూ.50,116ల చెక్కు రూపంలో విరాళం అందించారు. దంపతులు బ్రహ్మోత్సవాల సమయంలో స్వామివారి గ్రామోత్సవానికి గజవాహనాన్ని సమకూర్చాలని ఛైర్మన్, ఈవో గుర్తు చేశారు. ఛైర్మన్, ఈవో, కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది పరమేశ్వర్, నవీన్ పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెకు సంఘీభావం

రుద్రంపేట, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా కార్మిక, ఉద్యోగ సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు గురువారం తలపెట్టిన జాతీయ సార్వత్రిక సమ్మెకు ఏపీఎన్జీఓ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జక్కల మాదవ్, రవికుమార్ సంఘీభావం తెలిపారు. అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య సమ్మెకు మద్దతు ప్రకటించి, అనుబంధ సంఘాలు మద్దతు తెలిపాలని పిలుపునిచ్చారు.

నిగనిగ.. ధరదగా

మొక్కపైనే మాగిపోతున్న టమాటాలు

రూ.100 దాటని 15 కిలోల బాక్సు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటకు గిట్టుబాటు ధరలు లేక అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లావ్యాప్తంగా రైతులు ఎక్కువగా ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. అందులో టమాటాకు ప్రాధాన్యత ఇస్తున్నారు. జిల్లావ్యాప్తంగా సాగు చేసిన పంటను అనంతపురంలోని మార్కెట్‌కు తరలించి, బెంగళూరు, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. టమాటాను ఎక్కువగా ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఏడాదిలో కేవలం రెండు లేదా మూడు నెలలు 15 కిలోల బాక్స్ ధర దాదాపు రూ.300 నుంచి రూ.600 వరకూ ఉంటోంది. మిగిలిన రోజుల్లో నేల చూపులు చూస్తోంది. ప్రస్తుతం 15 కిలోల బాక్స్ ధర రూ.40 నుంచి రూ.100 వరకు పలుకుతోంది. ఎకరాకు 15 నుంచి 18 టన్నుల వరకు పంట దిగుబడి వస్తోంది.

● జిల్లావ్యాప్తంగా గతంలో తక్కువ విస్తీర్ణంలో పంట సాగుచేసేవారు. ప్రభుత్వం రాయితీపై పెద్దఎత్తున బిందు సేద్య పరికరాలు అందించడంతో కర్షకులు ఎక్కువగా స్వల్పకాలిక పంటలు సాగుచేస్తున్నారు. సాధారణంగా ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 10 వేల ఎకరాల్లో టమాటా సాగు చేస్తారు. రబీలో నేడు దాదాపు 4 వేల ఎకరాల్లోనే పంట సాగుచేశారు. రాప్తాడు నియోజకవర్గం వ్యాప్తంగా కేవలం 718 ఎకరాల్లో టమాటా సాగవుతోంది. అనంతపురం మార్కెట్‌కు ఖరీఫ్‌లో వచ్చే బాక్సుల కంటే 60 శాతం తక్కువగా వస్తోంది. ఉత్తరాది నుంచి వ్యాపారులు కొనుగోలుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో కొనుగోళ్లు మందగించాయి.

కోయకుండా వదిలేశా



నాకున్న 3 ఎకరాల్లో రూ.2 లక్షలు పెట్టుబడి పెట్టి టమాటా సాగు చేశా. గ్రామం నుంచి అనంతపురం మార్కెట్‌కు తరలించేందుకు బాక్సుకు రూ.30 బాడుగ, రూ.10 కమీషన్, కూలీల ఖర్చు పోనూ ఏమి మిగలడం లేదు. గత 20 రోజులుగా ధరలేక పంటను కోయకుండా వదిలేశా. **- రంగారెడ్డి, తలుపూరు**

రూ.3 లక్షలు పెట్టుబడి పెట్టా



నాలుగు ఎకరాల్లో 4 నెలల క్రితం టమాటా సాగు చేశా. ప్రస్తుతం పంట కోత దశలో ఉంది. రూ.3 లక్షలు పెట్టుబడి పెట్టి సాగు చేసినప్పటికీ ఒక్క కోత కూడా కోయలేక వదిలేయాల్సి వచ్చింది. పంటను కోసి మార్కెట్‌కు తరలిస్తే బాడుగలు, కూలి చెల్లించాల్సి రావడం భారంగా ఉంది. **- అక్కులప్ప, రైతు, తలుపూరు**

ముగిసిన ఈ-ఉద్భవ్ జాతీయ సాంకేతిక సదస్సు

తపోవనం, న్యూస్‌టుడే: అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలో రెండురోజులుగా జరిగిన జాతీయ సాంకేతిక సదస్సు విజయవంతంగా ముగిసింది. కార్యక్రమానికి జేఎన్‌టీయూ పులివెందుల ఈసీఈ విభాగాధిపతి ఆచార్య చంద్రమోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సెమీ కండక్టర్ పరిశ్రమ, 5జీ, 6జీ కమ్యూనికేషన్, క్వాంటమ్ కంప్యూటింగ్, ఎడ్జ్ ఏఐ వంటి ఆధునిక సాంకేతిక రంగాలు ఉద్యోగ కల్పనలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన తెలిపారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపల్ కె.శ్రీనివాసులు, నైపుణ్యాభివృద్ధి సంస్థ డైరెక్టర్ సురేంద్రనాయుడు, కమిటీ కన్వీనర్ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

‘తెదేపాతోనే విద్యాభివృద్ధి’

రాంనగర్(అనంతపురం), న్యూస్‌టుడే: వైకాపా హయాంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.1200 కోట్లను కూటమి ప్రభుత్వం విడుదల చేయడంపై టీఎన్ఎస్ఎఫ్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం నగరంలో మంత్రి లోకేశ్ చిత్రపటానికి నాయకులు క్షీరాభిషేకం చేశారు. టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అమర్‌యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాభివృద్ధి చెందాలంటే తెదేపా ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందన్నారు. సరిపూటి శ్రీకాంత్, వరుణ్, లోకేశ్, మురళి, తేజ, యోగి పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

మూడేళ్లు దాటిన లే అవుట్లలో పురోగతి పెరగాలి

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: అధికారికంగా ఏర్పాటు చేసిన లే అవుట్లలో మూడేళ్లు దాటినా ఇంకా పురోగతి లేకుంటే మరింత అభివృద్ధి పనులు చేపట్టాలని అహుడా వైస్ ఛైర్మన్, జేసీ విష్ణు చరణ్ పేర్కొన్నారు. బుధవారం అనంతపురం-హిందూపురం పట్టణ అభివృద్ధి సంస్థ(అహుడా) కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. బిల్డింగ్ పీనలైజేషన్, లే అవుట్ రెగ్యులరేషన్ పథకం ద్వారా అందరూ అనుమతులు పొందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కందుకూరు, కునుతూరులో పనులు వేగంగా చేపట్టాలన్నారు. లైసెన్స్ టెక్నికల్ పర్సన్ పనితీరును అంచనా వేసేందుకు సమావేశం నిర్వహించాలని అధికారులకు సూచించారు. అహుడా సెక్రటరీ రామకృష్ణారెడ్డి, పీఓ ఇషాక్ పాల్గొన్నారు.

జిల్లా సచివాలయం: రెవెన్యూ సమస్యలపై నిర్లక్ష్యం చూపొద్దని. జేసీ విష్ణు చరణ్ హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలు నుంచి రెవెన్యూ, పౌర సరఫరాలు, భూరీసర్వే, వ్యవసాయం శాఖల సమస్యలపై ఆర్డీఓ, తహసీల్దార్లు, వ్యవసాయ అధికారులతో వీక్షణ సమీక్ష జరిపారు. సహాయ కలెక్టర్ సచిన్, డీఆర్ఓ మాలోల, సర్వే ఏడీ రూప్లానాయక్, కలెక్టరేట్ సమన్వయాధికారి యుగేశ్వరిదేవి, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, పీజీఆర్ఎస్ ఇన్‌ఛార్జి తహసీల్దారు జయశ్రీ పాల్గొన్నారు.

సమీక్షలో అహుడా వైస్ ఛైర్మన్ విష్ణు చరణ్

స్వామి సన్నిధిలో..

చెరువుకట్ట శిర్డీ సాయినాథాలయం

గురువారం • ఉ: 6.00 గంటలకు కాగడా హారతి • 7.00కు పంచామృతాభిషేకం • 8.30కు హారతి • తీర్థప్రసాద వితరణ • మధ్యాహ్నం 12కు హారతి • 12.20కు అన్నప్రసాద వితరణ • సాయంకాలం 6.00కు ధూప హారతి • 6.20కు తీర్థ ప్రసాద వితరణ • రాత్రి 7.00కు పల్లకి సేవ • 8.00కు ఊంజల్ సేవ • 8.45కు సేజ్ హారతి

ఒకటో రోడ్డు శివాలయంలో..

గురువారం ఉదయం 10 గంటలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం • సాయంత్రం 5.00కు దీక్షాహోమం • 6 గంటలకు రావణ బ్రహ్మ వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం • రాత్రి 8గంటలకు దశ హారతులు

- అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే

ప్రజలకు మెరుగైన సేవలు అందివ్వడమే ధ్యేయం

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: నగర ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందివ్వడమే ధ్యేయం అని నూతన కమిషనర్ ఎం.జశ్వంత్ రావు పేర్కొన్నారు. నగర కమిషనర్‌గా బుధవారం ఆయన బాధ్యతలు తీసుకున్నారు. నగర పరిశుభ్రత, తాగునీటి సరఫరా, వీధిదీపాల నిర్వహణ, రహదారులు తదితర వాటిని మెరుగు పరుస్తామని చెప్పారు. సిబ్బంది కొరత ఉంటే పరిశీలించి ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. కలెక్టర్ ఆనంద్, జేసీ విష్ణు చరణ్, నగర మేయర్ వసీంలను మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన కమిషనర్‌కు నగరపాలక ఉద్యోగులు స్వాగతం పలికి అభినందించారు.

శివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీఅనంత శివారాధన సమితి ఆధ్వర్యంలో నగరంలోని మూడోరోడ్డు గొంగడి రామప్ప కల్యాణమండపంలో 15న మహా శివరాత్రి వేడుకలు సంప్రదాయబద్ధంగా జరుపుతున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు గొంగడి రామప్ప, ఉడిపి అనంత పద్మనాభ తెలిపారు. బుధవారం కల్యాణ వేదిక ఆవరణలో ఆహ్వాన పత్రికలు విడుదల చేశారు. స్వామి వారి అభిషేకాలు, శివపార్వతుల కల్యాణంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. బుగ్గేశ్, శ్రీనివాసులు, సునీల్, మురళి, కేదార్నాథ్, చెన్నారెడ్డి, చలపతి, చంద్రశేఖర్‌లు పాల్గొన్నారు.

ధర్నా విజయవంతం చేయండి

అనంతపురం విద్య: ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్ల డిమాండ్లు పరిష్కరించాలని 13న కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న ధర్నా విజయవంతం చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఎస్టీయూ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన 20 నెలలైనా ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. మెరుగైన పీఆర్సీ, మధ్యంతర భృతి, ఆర్థిక బకాయిలు, పాతపెన్షన్ విధానం అమలు చేయాలనే డిమాండ్లతో ధర్నా చేస్తున్నట్లు వివరించారు. ఎస్టీయూ నాయకులు సూర్యుడు, రాజశేఖర్, శివయ్యాచారి, మల్లికార్జున, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి

ఆకుపచ్చ వర్ణం.. చోదకులకు శాపం

రుద్రంపేట పంచాయతీ పరిధి జాతీయ రహదారి-44లో మురుగు ప్రవహించేందుకు నిర్మించిన వంతెన వద్ద నిల్వ ఉన్న మురుగు ఆకుపచ్చ వర్ణంలో దర్శనమిస్తోంది. వంతెన నుంచి మురుగు వెళ్లేందుకు కాలువ సదుపాయం లేకపోవడంతో నెలలు తరబడి నిల్ల ఉండి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో అటు వైపు వెళ్తున్న ప్రయాణికులు, చోదకులు ఇబ్బందులు పడుతున్నారు.
- న్యూస్‌టుడే, రుద్రంపేట

పోలీసు డైరీ ఆవిష్కరణ

అనంత నేరవార్తలు: రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం రూపకల్పన చేసిన ‘పోలీసు డైరీ-2026’ను ఎస్పీ జగదీశ్ బుధవారం స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఆవిష్కరించారు. డైరీలో పోలీసు అధికారులకు, సిబ్బందికి అవసరమయ్యే అన్ని రకాల కీలక సమాచారాన్ని పొందుపరచడంపై ఎస్పీ ప్రశంసించారు. తాడిపత్రి ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి, ట్రైనీ ఐపీఎస్ అశ్విని మణిదీప్, పోలీసు సంఘ కమిటీ సభ్యులు త్రిలోక్‌నాథ్, జాఫర్, హరినాథ్, ఆనంద్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

● కేసుల నమోదు, దర్యాప్తులో ఎలాంటి అలసత్వానికి తావివ్వకూడదని ఎస్పీ అధికారులకు సూచించారు. పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసులు, హత్య, పోక్సో, అత్యాచారం, దోపిడీపై సర్కిళ్ల వారీగా సమీక్షించారు.

చువ్వలు తేలాయి.. గుచ్చుకోవడమే తరువాయి

నగరంలోని పాతూరు గాంధీ బజార్ ఇరుకైన ప్రదేశం. రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు ఉండటంతో నిత్యం రద్దీగా ఉంటుంది. మాంసపు మార్కెట్ మీదుగా వచ్చే పెద్దకాలువ గాంధీ బజారు రోడ్డు మధ్యలో ఉన్న మ్యాన్ హోల్‌కు కంకర, సిమెంటు ఊడిపోవడంతో చువ్వలు తేలి రంధ్రం పడింది. వాహనాలు వెళ్లకుండా సిమెంటు పెళ్లలు అడ్డంగా ఉంచారు. రద్దీగా ఉండే మార్గం కావడంతో వాహనదారులు ఎటువైపు వెళ్లాలో తెలియక, ట్రాఫిక్‌లో ఇబ్బందులు పడుతున్నారు. **- న్యూస్‌టుడే, అశోక్‌నగర్**

మాట్లాడుతున్న నగరాధ్యక్షుడు సుధాకర్‌యాదవ్, సరిపూటి రమణ తదితరులు

‘వైకాపాలో అభద్రతా భావం’

రాంనగర్(అనంతపురం), న్యూస్‌టుడే: వైకాపా ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లి పట్టుమని 11 నిమిషాల్లో వెళ్లిపోయారని, దీన్ని బట్టి ఎవరిది అభద్రతా భావమో ప్రజలందరికి అర్థమవుతోందని అనంతపురం పట్టణ తెదేపా నాయకులు పేర్కొన్నారు. ఇటీవల సీఎం చంద్రబాబుపై వైకాపా జిల్లా అధ్యక్షుడు అనంతవెంట్రామిరెడ్డి చేసిన వ్యాఖ్యలపై వారు స్పందించారు. బుధవారం నగరంలోని తెదేపా కార్యాలయంలో నగరాధ్యక్షుడు సుధాకర్‌యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ మాట్లాడారు. సాకే లక్ష్మీనరసింహ, బాలప్ప, పరమేశ్వర్, గోపాల్‌గౌడ్, కేశవనాయుడు, భక్తవత్సలనాయుడు, నాగభూషణం పాల్గొన్నారు.

ముంచెత్తక ముందే స్పందించండి

నగర పరిధిలోని సోమనాథనగర్‌లో వంతెన వద్ద డ్రైనేజీ కాలువలో చెత్త, ప్లాస్టిక్ కవర్లతో నిండిపోయింది. దీంతో మురుగు ముందుకు కదలడం లేదు. రోజుల తరబడి కాలువలో మురుగు స్తంభించడంతో స్థానికులు దుర్వాసనతో అవస్థలు పడుతున్నారు. నగర కార్పొరేషన్ అధికారులు సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రుద్రంపేట**

ఘంటసాలకు స్వరనీరాజనం

అవార్డు అందుకుంటున్న ఘంటసాల ధూళిపాళ్ల మిత్ర

అనంత సాంస్కృతికం: నగరంలోని హౌసింగ్‌బోర్డు రాజీవ్ చిల్డ్రన్స్ పార్క్‌లో ఘంటసాల స్వరనీరాజనం బుధవారం ఘనంగా నిర్వహించారు. పాత పాటల ప్రేమికులు (పీపీపీ) ఆధ్వర్యంలో ఘంటసాల 52వ వర్ధంతిని హౌసింగ్‌బోర్డు రాజీవ్ చిల్డ్రన్స్ పార్క్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి హైదరాబాద్ ఘంటసాల గాయకుడు డీపీ మిత్ర, డీఆర్వో మాలోల ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సహచర గాయనీ గాయకులతో కలసి ఘంటసాల విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మాయకుంట్ల ఓబులదాసు, రామయ్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పురస్కారం పంపిణీ : స్థానిక ఆఫీసర్స్ క్లబ్ ఆవరణలో సంగీత కళాభారతి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి రాష్ట్రస్థాయి ఘంటసాల అవార్డు పురస్కార ప్రదానోత్సవం, సంగీత విభావరి సందడిగా జరిగింది. హైదరాబాద్‌కు చెందిన అభినవ ఘంటసాల ధూళిపాళ్ల మిత్ర రాష్ట్రస్థాయి అవార్డు పురస్కారం అందుకున్నారు.

యునాని వైద్య శిబిరం

తపోవనం (అనంత గ్రామీణం): ప్రపంచ యునాని దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ఐదో రోడ్డులో ఉచితంగా యునాని చికిత్స శిబిరం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆయూష్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 80 మందికి పైగా చికిత్స చేసి యునాని మందులు పంపిణీ చేశారు. వైద్యుడు రఫీక్‌ఖాన్, భాజపా మైనార్టీ మోర్చ రాష్ట్ర కార్యదర్శి జి.మహమ్మద్ రఫీ శిబిరాన్ని ప్రారంభించారు.

గుంతలమయం.. ప్రయాణం గగనం

రాప్తాడు, న్యూస్‌టుడే : గ్రామీణ రోడ్లు అధ్వానంగా మారడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వైకాపా ప్రభుత్వంలో ఈనాడు ఆఫీస్ మీదుగా కందుకూరు నుంచి ధర్మవరం వెళ్లే రహదారిని నాసిరకంగా నిర్మించడంతో కంకర తేలి గుంతలు ఏర్పడ్డాయి. దాదాపు 6 కిలోమీటర్ల రహదారి కంకర తేలి, రోడ్డుకు ఇరువైపులా కోతకు గురై రాకపోకలకు కష్టంగా మారింది. సింగిల్ రోడ్డు కావడంతో ఎదురుగా వాహనాలు రావడంతో కిందకు దిగే ప్రయత్నంలో గుంతలు తప్పించబోయి కిందపడి గాయాలపాలైన ఘటనలు ఉన్నాయి. ఆటోల్లో వెళ్లేవారు కుదుపులకు గురై అవస్థలు పడుతున్నారు. మొన్న కురిసిన వర్షాలకు గంగులకుంట వెళ్లే దారి వద్ద కల్వర్టు దెబ్బతిని సగం రోడ్డు వరకు కుంగిపోయింది. ఎదురుగా వాహనాలు వస్తే ఆగి ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. రాత్రి వేళల్లో గుంతను గమనించక వేగంగా వస్తే ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

గంగులకుంట క్రాస్ వద్ద ప్రమాదకరంగా గుంత

అంచులు కోతకు గురై..

కందుకూరు నుంచి ధర్మవరం వెళ్లే రహదారి అడుగడుగునా గుంతలు ఏర్పడి ప్రయాణం చేయాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఎదురుగా వాహనాలు వస్తే రోడ్డు అంచుల్లో కోతకు గురికావడంతో ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి కిందపడి గాయాలపాలవుతున్నారు. **- చంద్రశేఖర్,కందుకూరు**

ఆర్థిక అక్షరాస్యతతో సైబర్ నేరాలకు అడ్డుకట్ట

తపోవనం : సైబర్ నేరాలు కట్టడి చేయాలంటే ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవాలని ఎల్‌డీఎం నరేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం రూడ్‌సెట్ సంస్థలో ఆర్థిక అక్షరాస్యతపై బ్యాంకు మిత్రలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ చరవాణిలో అపరిచిత లింకుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. నాబార్డు డీడీఎం అనురాధ, రూడ్‌సెట్ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి, ఇతర బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఆర్థిక అక్షరాస్యత గోడ పత్రికలను ఆవిష్కరించారు.

కాయగూరల ధరలు

అరవిందనగర్: (అనంతపురం పాతూరు మార్కెట్లో ధరలు కిలో రూ.లలో) టమాటాలు 20, రెండోరకం 10, ఉల్లిగడ్డలు 35, రెండోరకం 25, బంగాళాదుంపలు 35 మిరపకాయలు 35, బెండకాయలు 20, వంకాయలు 20

నిర్ణీత ధరలకే ఎరువుల విక్రయం

తపోవనం: రైతులకు మెరుగైన సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నామని రాచానపల్లి సొసైటీ ఛైర్మన్ పాములరాయి రఘు తెలిపారు. ఎరువులు, పురుగు మందుల కొనుగోలులో మోసపోతున్న రైతుల కోసమే ఎరువుల వ్యాపారం ప్రారంభించామని ఆయన వెల్లడించారు. బుధవారం అనంతపురం గ్రామీణ మండలం రాచానపల్లి సొసైటీలో ఎరువుల వ్యాపారాన్ని ఆయన ప్రారంభించారు. సొసైటీ డైరెక్టర్లు ఎం.శ్రీనివాసులు, బి.నారాయణప్ప, మోనిటరింగ్ అధికారి ఎం.నాగమణి, సీఈఓ శ్రీనివాసులు, వ్యవసాయశాఖ సహాయ డైరెక్టర్ అల్తాఫ్, మండల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

20 మంది ఉద్యోగాలకు ఎంపిక

జేఎన్‌టీయూ: జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 20 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. బెంగళూరుకు చెందిన 10000-కోడెర్స్ అనే సంస్థ ప్రాంగణ నియామకాలు నిర్వహించగా 128 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీసీ సుదర్శనరావు, ప్రిన్సిపల్ చెన్నారెడ్డి, వైస్‌ప్రిన్సిపల్ దిలీప్‌కుమార్, వి.బి.చిత్ర, డాక్టర్ జె.శ్రీనివాసులు, సాంబయ్య పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ
కేవలం అమ్మాయిలకు మాత్రమే
Lasyakrish టెక్నాలజీస్, అనంతపురము వారి తరపున కంప్యూటర్ కోర్సునకు 3 నెలలు ఉచిత శిక్షణ + వసతి కల్పించబడును.
BATCH STARTS : 18-02-2026
9642273066, 7674937927

పీపీపీ విధానంతో శిల్పారామం రూపురేఖలు మారుస్తాం

శిల్పారామాన్ని పరిశీలిస్తున్న ఛైర్‌పర్సన్ మంజులారెడ్డి

తపోవనం (అనంత గ్రామీణం): శిల్పారామం రూపురేఖలు మార్చడానికి అన్ని చర్యలు తీసుకున్నట్లు రాష్ట్ర శిల్పారామం ఛైర్‌పర్సన్ మంజులారెడ్డి వెల్లడించారు. పీపీపీ పద్ధతిలో ఔత్సాహికులకు కొత్త ప్రాజెక్టులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆమె స్పష్టం చేశారు. రెండు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం శిల్పారామాన్ని సందర్శించారు. కలెక్టర్‌తో చర్చలు నిర్వహించిన అనంతరం శిల్పారామాన్ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఈత కొలను, వాటర్ గేమ్స్, కాటేజీలు, గుర్రపు స్వారీ లాంటి వాటిని నిర్వహించడానికి పీపీపీ పద్ధతిలో అనుమతులు ఇస్తామన్నారు.

ప్రచార పోస్టర్ల విడుదల

కమలానగర్, న్యూస్‌టుడే: వెట్టి చాకిరీ నిర్మూలన చట్టం వచ్చి 50 ఏళ్లు అవుతున్నా ఇంకా కొన్ని ప్రాంతాల్లో పేదలు, యువత ఇబ్బందులు పడుతున్నారని రెడ్స్ స్వచ్ఛంద సంస్థ ఛైర్ పర్సన్ భానుజ పేర్కొన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె ప్రజా, కుల సంఘాలతో కలిసి పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. సంస్థ ఆధ్వర్యంలో 9 నుంచి వారం రోజుల పాటు అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. డాక్టర్ ప్రసూన, సాకే హరి, గోవిందరాజులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఎలక్ట్రీషియన్ మృతి

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: విద్యుదాఘాతానికి గురై చికిత్స పొందుతున్న ఎలక్ట్రీషియన్ బుధవారం మృతి చెందాడు. వివరాల మేరకు ఆత్మకూరు మండలం బి.యాలేరు గ్రామానికి చెందిన జయచంద్రారెడ్డి (60) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల సొంతూరు నుంచి నగరంలోని రామ్‌నగర్‌కు వలస వచ్చాడు. సజ్జలకాల్వ గ్రామంలో కాశీవిశ్వేశ్వర ఆలయం వద్ద ఎలక్ట్రీషియన్ పనులు చేయడానికి మంగళవారం సాయంత్రం వెళ్లాడు. అక్కడ విద్యుత్తు స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కింద పడ్డాడు. చికిత్స నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు.



(c) eenadu

కల్పవృక్ష వాహనంపై కలియుగ దైవం

చంద్రగిరి, న్యూస్‌టుడే: కల్యాణ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారు శ్రీరాజమన్నార్ రూపంలో కల్పవృక్ష వాహనంపై భక్తులను అనుగ్రహించారు. సాయంత్రం శ్రీవారి ఉత్సవమూర్తుల ఊంజల్ సేవ అనంతరం శ్రీహరి దేవేరులతో సర్వభూపాల వాహనంపై తిరువీధుల్లో విహరించారు. వాహన సేవ ముందు కోలాటాలు, పండరి భజనలు, వాయిద్య బృందాలు లయబద్ధంగా నృత్య ప్రదర్శనలతో ప్రత్యేకత చాటుకున్నాయి. డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్ రమేష్‌బాబు, రాజ్‌కుమార్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

వాహన సేవలో మహిళల నృత్య ప్రదర్శన

ఇగ్నో ప్రవేశాలకు 28 వరకు గడువు

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: తిరుపతి శ్రీ వెంకటేశ్వర ఆర్ట్స్ కళాశాలలోని ఇగ్నో స్టడీ కేంద్రంలో పీజీ, డిగ్రీ, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ మల్లికార్జునరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, దరఖాస్తులకు వెబ్‌సైట్ www.ignou.ac.inను సందర్శించాలని, ఈనెల 28వ తేదీ వరకు గడువు ఉన్నట్లు అందులో పేర్కొన్నారు.

క్విజ్‌లో గెలువు... ప్రధానితో మాట కలుపు

కలకడ, న్యూస్‌టుడే: కేంద్ర బడ్జెట్ అంటే దేశ పరిపాలనకు సంబంధించినది. ఉద్యోగులకు జీతాలు, సంక్షేమం, అభివృద్ధికి కేటాయింపులు, చెల్లించాల్సిన అప్పులు... ఇలా అన్నీ బడ్జెట్ పరిధిలో ఉంటాయి. భావిభారత పౌరులైన యువతకు బడ్జెట్‌పై అవగాహన కల్పించేందుకు కేంద్ర యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వశాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. బడ్జెట్ క్వెస్ట్-2026 పేరిట యువత నుంచి ఆలోచనలు ఆహ్వానిస్తోంది. విజేతలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో వర్చువల్‌గా మాట్లాడే అవకాశాన్ని కల్పిస్తోంది.

వివరాలు ఇలా..

http://my bharat.gov. in వెబ్‌సైట్‌లో 15 నుంచి 29 ఏళ్లలోపు యువత ఈ నెల 17వ తేదీ వరకు పేర్లు నమోదు చేసుకోవాలి. బడ్జెట్ నిబంధనలపై అవగాహన అంచనా వేసేందుకు ఆన్‌లైన్‌లో క్విజ్ పోటీలు ఉంటాయి. 15 నిమిషాల్లో 30 ప్రశ్నలకు సమాధానాలివ్వాలి. క్విజ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి రాష్ట్ర స్థాయిలో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారు. విజేతలకు ప్రధానితో వర్చువల్‌గా మాట్లాడే అవకాశం కల్పిస్తారు.

ఎస్సీ, ఎస్టీ గృహాలకు ఉచిత సౌరభాలు

మాట్లాడుతున్న డైరెక్టర్ అయూబ్‌ఖాన్, పక్కన సీజీఎం ఉమాపతి, జీఎం విజయం

పీలేరు, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ గృహాలకు విధిగా పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా సోలార్ యూనిట్లు ఏర్పాటు చేయాలనేది లక్ష్యమని ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ అయూబ్‌ఖాన్ పేర్కొన్నారు. స్థానిక ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో ఆ శాఖ సీజీఎం ఉమాపతి, జనరల్ మేనేజరు విజయంతో కలిసి బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం ఎస్పీడీసీఎల్ పరిధిలో 2.07 లక్షల ఎస్సీ, ఎస్టీ గృహాలు ఉన్నాయని, వీటికి 415 మెగావాట్ల విద్యుత్తు అవసరం ఉంటుందని చెప్పారు. ప్రతి ఇంటికీ రూఫ్ టాప్‌లు ఏర్పాటు చేస్తే రోజుకు 4.5 యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుందన్నారు. వీటికి సూర్యఘర్ పథకంలో ఉచితంగా సౌర యూనిట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎస్పీడీసీఎల్ పరిధిలో ఎస్సీ, ఎస్టీలకు 415, వ్యవసాయానికి 410 మెగా యూనిట్ల విద్యుత్తు అవసరమన్నారు. సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు స్థల సేకరణ చేస్తున్నట్లు వివరించారు. సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుతో హరిత ఇంధనం సాధ్యమని, 3 కేవీ సౌర పలకల ఏర్పాటుకు రూ.2.21 లక్షలు ఖర్చవుతుందన్నారు. ఇందులో కేంద్రం రాయితీ రూ.78 వేలు ఉంటుందని చెప్పారు. ఈఈ వై.చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెరువుల చెర.. నిబంధనల వధ

- యథేచ్ఛగా ఆక్రమించి మట్టి తరలింపు
- వాగులు, వంకలు, కుంటలకూ ఎసరు

జల వనరులు బాగుంటేనే అందరి భవిత బాగుంటుంది.. లేదంటే భావితరాల సంగతేమోగానీ ప్రస్తుతం ఉన్న వారికే తాగు, సాగునీటి సమస్యలు తప్పవు. వీటిని కాపాడాల్సిన ప్రభుత్వ శాఖలు ఎవరికి వారు తమకు సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తుండటంతో నానాటికీ ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. జిల్లాలో మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో జరుగుతున్న అక్రమాలపై 'న్యూస్‌టుడే' పరిశీలన కథనం.

- న్యూస్‌టుడే, కురబలకోట, పీలేరు, ములకలచెరువు, పెద్దమండ్యం, పీటీఎం

పెద్దమండ్యం మండలం కలిచెర్ల చెరువులో ట్రాక్టర్లలో మట్టి తరలింపు

ఉత్తారెడ్డికుంట ఆక్రమణ!

పీలేరు మండలం తలుపుల పంచాయతీ మల్లేశ్వరపురం సమీపంలోని ఉత్తారెడ్డి కుంటను ఓ నాయకుడు ఆక్రమించుకున్నాడు. గత రెండు రోజులుగా జేసీబీతో చెట్లను తొలగిస్తుండగా చుట్టుపక్కల రైతులు గుర్తించి పీలేరు తహసీల్దారు శివకుమార్‌కు ఫిర్యాదు చేశారు. కుంట విస్తీర్ణం సుమారు 5.10 సెంట్లు ఉండగా ఈ నీటి ద్వారా సాగునీరు, మూగజీవాల దాహార్తి తీర్చడానికి అనువుగా ఉండేది. కుంట చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ భూములు అటవీ ప్రాంతంలో ఉన్నందున ఇప్పటికే ఆక్రమణలకు గురైంది. రూ.20 లక్షలతో ప్రభుత్వం వాటర్‌షెడ్ పథకంలో భాగంగా నిర్మించిన మట్టికట్ట కూడా ఆక్రమణలకు గురైంది. రైతులు అభ్యంతరం చెప్పినా పనులు కొనసాగిస్తున్నారని వాపోతున్నారు. అధికారులు చర్య తీసుకుని అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. దీనిపై తహసీల్దార్ శివకుమార్ మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బందిని పంపి ఆక్రమణలు జరగకుండా చూస్తామన్నారు. కుంట ఆక్రణకు యత్నిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కర్ణాటకకు మన మట్టి.. ఇసుక

■ కురబలకోట మండలంలోని అంగళ్లు సమీపంలో ఉన్న కొండలు, గుట్టలను జాతీయ రహదారి పక్కనే తవ్వేసి, చదును చేసి జాతీ ప్లాట్లుగా తరలిస్తున్నారు. అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడడం లేదు. పీటీఎం మండలంలోని టి.సదుం నుంచి కూడా మట్టి తవ్వకాలు చేపట్టి కర్ణాటకకు తరలిస్తున్నారు.

■ పెద్దమండ్యం మండలంలోని కలిచెర్ల, ఎన్‌పోతువల్లి, పాపులపల్లి, లింగంవారిపల్లి, కోటకందపల్లి జేసీబీ యంత్రాలతో యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్నారు. చెరువులను ఆనుకుని ఉన్న గుట్టలను చదును చేసి ఆక్రమించేస్తున్నారు. మండలంలో చాలా చెరువులది ఇదే పరిస్థితి.

■ కర్ణాటక రాష్ట్రంలోని చేలూరులో ఎర్రమట్టికి మంచి డిమాండ్ ఉండటంతో పెద్దతిప్పసముద్రం మండలం నుంచి యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్నారు. ములకలచెరువు, తంబళ్లపల్లె, బి.కొత్తకోట మండలాల్లో కూడా మట్టి మాఫియా రెచ్చిపోతోంది.

చేతి పంపుల మరమ్మతులకు క్రాష్

కంభంవారిపల్లెలో చేతిపంపు మరమ్మతు చేస్తున్న మెకానిక్

కంభంవారిపల్లి, న్యూస్‌టుడే: వేసవిని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా గ్రామీణ నీటి పారుదలశాఖ 'క్రాష్' కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఈ నెల 1వ తేదీ నుంచి మార్చి 15వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా ఈ కార్యక్రమం అమలుకు శ్రీకారం చుట్టారు. గ్రామాల్లో తాగునీటి పథకాలున్నా, అవి మరమ్మతుకు గురైన సమయంలో, విద్యుత్ లేని సమయంలో చేతి పంపులే ఆధారం. ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా మరమ్మతులు చేపట్టారు.

మండల పరిషత్ నిధుల సాయం

క్రాష్ కార్యక్రమం కింద బోర్ల మరమ్మతులకు అవసరమైన సామగ్రిని కొనుగోలు చేసేందుకు 15వ ఆర్థిక సంఘ నిధుల్లో 15 శాతం తాగునీటి అవసరాలకు కేటాయించనున్నారు. గ్రామ పంచాయతీ నిధుల నుంచి కొంత మేరకు ఖర్చు చేయనున్నారు.

■ జిల్లాలో సుమారు 7,658 చేతి పంపులు ఉన్నాయి. ఒక్కో మండలానికి 50 నుంచి 60 బోర్లు మరమ్మతుకు గురయ్యాయి. వీటికి మరమ్మతులు చేసి, వినియోగంలోకి తీసుకు రానున్నారు. అందుకుగాను మండల స్థాయి అధికారులు కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకున్నారు. ప్రణాళిక ప్రకారం వెళ్లి, చేతి బోర్లు మరమ్మతులు చేస్తున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రణాళికతో చర్యలు

వేసవిని దృష్టిలో పెట్టుకొని తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి చేతి బోరు వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ప్రణాళికను సిద్ధం చేసుకున్నాం. మండలంలో ప్రతి బోరును క్షుణ్ణంగా పరిశీలించి, మరమ్మతు చేస్తున్నాం. **- శైలేంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, పీలేరు**

కొట్టుకుపోయారు.. కొట్టుకు చేర్చారు

- డంపింగ్ యార్డులో హిటాచీతో ధ్వంసం
- 104 వాహనాలు ముక్కలు చేసి విక్రయం

రాయచోటి, న్యూస్‌టుడే: 104 వాహనాల అపహరణ వ్యవహారం బట్టబయలైంది. ఎన్టీఆర్ వైద్య సేవ సంస్థ, వైద్య ఆరోగ్యశాఖ పర్యవేక్షణలో నడుస్తున్న నాలుగు వాహనాల కండీషన్ బాగోలేదని ఆరు నెలల క్రితం నిలిపేసి ఆసుపత్రిలో ఆవరణలో ఉంచారు. సదరు వాహనాలను ఇటీవల కొందరు గుట్టుచప్పుడు కాకుండా తరలించారు. ఆలస్యంగా మేల్కొన్న అధికారులు ఈ నెల నాలుగో తేదీన పోలీసులకు ఫిర్యాదు చేయడంతో చోరీ విషయం వెలుగు చూసింది. రూ.50 లక్షల విలువైన ఈ నాలుగు వాహనాల మాయం వ్యవహారం నిగ్గు తేల్చాల్సి ఉన్నా విచారణలో జాప్యం జరుగుతోంది. వాహనాలను ధ్వంసం చేసిన తుక్కు దుకాణంలో అమ్మేశారు. ఈ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో తాజాగా వైరల్ అయ్యాయి.

డంపింగ్ యార్డులో ధ్వంసమైన శకటాలు

ఇంత సాహసం చేసిందెవరు?

104 వాహనాలు ఆసుపత్రి ఆవరణలోనే ఉంచాల్సి ఉన్నా.. అక్కడి సిబ్బంది అధికారుల అనుమతి లేకుండానే ట్రామా కేర్ నిర్మాణ పనుల ముసుగులో చోటా నేతల అండదండలతో డంపింగ్ యార్డుకు తరలించడం చర్చనీయాంశంగా మారింది. ఇందులో యార్డు నిర్వహణ బాధ్యతలు చూసే ఉద్యోగి సహకారం ఉన్నట్లు ప్రచారంలో ఉంది. పోలీసులు సైతం యార్డు కాపలాదారులను విచారించి వదిలేశారు. వాహనాలు ఎప్పుడు అక్కడకు చేరాయి.. వాటిని ఎవరు తెచ్చారు.. ఎవరి అనుమతితో లోనికి పంపారనే విషయాలపై లోతుగా విచారించాల్సి ఉన్నా ఆ దిశగా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు లేవు. రాజకీయ ప్రమేయంతోనే పోలీసులు ముందుకు వెళ్లలేకపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కేసును ఎస్సై విష్ణువర్ధన్ దర్యాప్తు చేస్తున్నారని సీఐ చలపతి తెలిపారు. త్వరలో అన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని, దర్యాప్తులో జాప్యం జరగకుండా చూస్తామన్నారు.

కార్మికా.. అందుకో పింఛను కానుక!

- నెలవారీ ప్రీమియం రూ.55-200
- 60 ఏళ్ల తర్వాత నెలకు రూ.3 వేలు

కేంద్ర ప్రభుత్వం అసంఘటిత రంగ కార్మికుల సాంఘిక భద్రతా చట్టం కింద 'శ్రమ యోగి మాన్‌ధన్ యోజన' పింఛను పథకాన్ని అమలు చేస్తోంది.. ఈ పథకంలో తోపుడు బండ్లపై విక్రయించే వారు, రిక్షా కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, వ్యవసాయ కూలీలు, మధ్యాహ్న భోజనం పనివారు, బీడీలు చుట్టేవారు.. ఇటుక బట్టీల్లో పనివారు, చేనేతలు, చర్మకారులు, ఇళ్లలో పని వారు అర్హులు. 18 నుంచి 40 సంవత్సరాలలోపు వారు అర్హులు. **- న్యూస్‌టుడే, పీలేరు**

- ఈ పథకం ఎల్ఐసీ ద్వారా అమలవుతుంది. లబ్ధిదారుడి బ్యాంకు ఖాతా నుంచి ప్రతి నెలా ప్రీమియం చెల్లించే సదుపాయం ఉంది.
- లబ్ధిదారులు ప్రతి నెలా చెల్లించే ప్రీమియం వివరాలు, ఖాతాలో జమ చేసిన వివరాలు ఎప్పటికప్పుడు చరవాణి యాప్ ద్వారా తెలుసుకునే సౌకర్యం ఉంది.

పింఛను పథక కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఏఎంసీ ఛైర్మన్ రమణ, కార్మికశాఖ అధికారి జగదీష్‌బాబు

పథకంలో చేరేది ఇలా..

- దగ్గరలో ఉన్న కామన్ సర్వీస్ సెంటరు(మీ-సేవ) ద్వారా ఈ పథకంలో చేరవచ్చు.
- ఈ పథకంలో నమోదయ్యే అభ్యర్థులు ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా కాపీ (ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌తో) ప్రస్తుతం వాడుతున్న చరవాణి నంబరు ఇవ్వాలి.
- లబ్ధిదారుల ప్రీమియం నెలకు రూ.55 నుంచి రూ.200 వరకు వారి వయసును బట్టి చెల్లించాలి.

ఇవీ ప్రయోజనాలు

- 60 సంవత్సరాలు దాటిన తరవాత నెలవారీ పింఛను రూ.3 వేలు లభిస్తుంది.
- మరణానంతరం జీవిత భాగస్వామికి 50 శాతం చెల్లిస్తారు.
- పదేళ్ల లోపు వైదొలగాలనుకుంటే మీరు చెల్లించిన మొత్తాన్ని సేవింగ్స్ ఖాతాకు వడ్డీ రేటుతో తిరిగి చెల్లిస్తారు. తరవాత వైదొలగితే పింఛను నిధిలో పొందిన వడ్డీతో సహా చెల్లిస్తారు.
- జీవిత భాగస్వామి సభ్యులుగా కొనసాగించవచ్చు. వారు కూడా పింఛను పొందొచ్చు.
- జీవిత భాగస్వామి మృతి చెందాక చందా మొత్తాన్ని వడ్డీతో సహా చెల్లిస్తారు.

కొత్త విధానం.. పర్యవేక్షణే ప్రధానం!

- పది పరీక్షలకు ఇన్విజిలేటర్ల నియామకం

- న్యూస్‌టుడే, చిన్నమండెం, కంభంవారిపల్లె

- వచ్చే నెల 16 నుంచి నిర్వహించే పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు ఇన్విజిలేటర్ల నియామకంలో నూతన విధానం అమలు చేయనున్నారు. ఇప్పటి వరకు జిల్లాస్థాయిలోనే వీరిని నియమించేవారు. ఈ విద్యా సంవత్సరం నుంచి రాష్ట్ర విద్యాశాఖ అధికారులే ఇన్విజిలేటర్లను నియమించనున్నారు. పరీక్షలను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు ఈ నిర్ణయం తీసుకొన్నట్లు అధికారులు చెబుతున్నారు.

జిల్లా సమాచారం

పదో తరగతి విద్యార్థులు: **22,165**

పరీక్షా కేంద్రాలు: **124** ఇన్విజిలేటర్లు: **1,100**

ఇతరులు: ప్రతి పరీక్ష కేంద్రానికి డిపార్ట్‌మెంటల్ అధికారి, చీఫ్, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్స్ కూడా ఉంటారు.

చిన్నమండెం ఆదర్శ పాఠశాలలో స్టడీ అవర్స్‌ను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి, ఉపాధ్యాయులు

■ 60 ఏళ్లు పైబడిన ఉపాధ్యాయులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారిని ఇందులో నుంచి మినహాయించనున్నారు. గణితం, సైన్సు, సాంఘిక శాస్త్రం పరీక్షలకు భాషోపాధ్యాయులను, తెలుగు, ఆంగ్లం, హిందీ (ల్యాంగేజ్‌లు) పరీక్షలకు గణితం, సాంఘిక శాస్త్రం, సైన్సు ఉపాధ్యాయులను కేటాయిస్తారు.

ప్రణాళిక అమలిలా..

పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు వంద రోజుల ప్రణాళికను అమలు చేస్తున్నారు. కలెక్టరు నిశాంత్‌కుమార్ ప్రత్యేకంగా జిల్లాలో మై స్కూల్ మై ప్రైడ్ పేరుతో ప్రతి పాఠశాలకు ఒక గెజిటెడ్ అధికారిని నియమించి పర్యవేక్షించాలని ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులను గ్రేడ్లుగా విభజించి వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి సారించారు. తాజాగా ఇళ్ల దగ్గర ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు రెసిడెన్షియల్ తరహాలో వసతి కల్పించి చదివించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. బాలికలకు సమీప కస్తూర్బా పాఠశాలల్లో, బాలురకు కేటాయించిన వసతి గృహాల్లో ఉండి చదువుకొనేందుకు అవకాశం కల్పించారు.

తటాకానికి జలకళ.. అలుగు గలగల

పుంగనూరు పట్టణానికి జలహారంలా ఉన్న పుంగమ్మ చెరువు అలుగు పారుతూ జల పరవళ్లతో అందరినీ ఆకర్షిస్తోంది. వర్షం కురవలేదు.. వాగులు, వంకలు పారలేదు.. ఈ జల పరవళ్లేమిటబ్బా అనుకుంటున్నారా.. ఈ చెరువు పైభాగంలోని హంద్రీ-నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలతో చెరువును నింపడంతో మూడు రోజులుగా అలుగు పారుతోంది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- న్యూస్‌టుడే, పుంగనూరు

మూడు పల్లెల్లోనే బర్డ్‌ఫ్లూ గుర్తింపు: కలెక్టర్

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: బర్డ్‌ఫ్లూ విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ నిశాంత్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సదుం మండలం పుత్తవారిపల్లె, అమ్మగారిపల్లె, కుంభంవారిపల్లెలోని కోళ్లఫారాల్లో మినహా 24 మండలాల్లో ఎక్కడ బర్డ్‌ఫ్లూను గుర్తించలేదన్నారు. బర్డ్‌ఫ్లూ సోకిన కోళ్లను ఖననం చేశామని, బాధిత రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. పశుసంవర్ధక, పంచాయతీరాజ్, రెవెన్యూ, పోలీసు, వైద్య ఆరోగ్య శాఖల సమన్వయంలో సదుం మండలం నుంచి బయట ప్రాంతాలకు కోళ్ల సరఫరా జరగలేదన్నారు. వంద డిగ్రీల ఉష్ణోగ్రతతో ఉడికించిన చికెన్, గుడ్లను నిరభ్యంతరంగా తినవచ్చని పశుసంవర్ధక శాఖ జేడీ గుణశేఖర్ పేర్కొన్నారు. బయట ప్రాంతాల వారు కోళ్లఫారాలను సందర్శించకుండా యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలాంటి అనుమానాలున్నా పశు వైద్యులను సంప్రదించాలని సూచించారు.

బాతులా భలేగుండు

రాయచోటి నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో మదనపల్లెకు వెళ్లే ప్రధాన రహదారి పక్కనున్న కొండలపై గుండ్లు విభిన్న ఆకారాలతో దారిన పోయే వారిని ఆకట్టుకుంటున్నాయి. ఇక్కడ అనేక ఆకారాల్లో ఇవి కనిపిస్తూ కనువిందు చేస్తున్నాయి. పెద్దగుండుపై చిన్నగుండు (భారీ రాయి) బాతు ఆకారంలో కన్పిస్తోంది. ఆ చిత్రమే ఇది.

- న్యూస్‌టుడే, రాయచోటి

పీలేరులో భూకంపం

- లోకాయుక్త ఆదేశాలతో చర్యలు
- ఆక్రమిత భూముల స్వాధీనం

పీలేరు గ్రామీణ న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, చోటా మోటా కార్యకర్తలు, అధికారాన్ని అడ్డుపెట్టుకుని పీలేరు చుట్టూ ఐదు కి.మీ పరిధిలో విచ్చలవిడిగా భూ ఆక్రమణలకు తెరలేపారు. వీరికి అధికారులు వంతపాడటంతో ఆక్రమణలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. ఈ రకంగా పక్కదారి పట్టిన ప్రభుత్వ, డీకేటీ భూములను ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకోవాలని లోకాయుక్త ఆదేశించింది. ఈ మేరకు జిల్లా ఉన్నతాధికారులు కసరత్తు ప్రారంభించారు.

పీలేరులో ఆక్రమిక భూముల వివరాలివీ..

పంచాయతీలు	అధీకృత లేఅవుట్లు	చుక్కల భూములు	అక్రమ లేఅవుట్లు	డీకేటీ భూములు
పీలేరు	42.71	17.54	13.77	26.72
గూడరేవుపల్లె	2.19	44.76	71.98	46.67
దొడ్డిపల్లె	109.40	70.69	9.34	14.49
బోడుమల్లువారిపల్లె	55.49	23.20	14.76	7.54
ఎర్రగుంటపల్లె	-	-	1.19	0.02
ముడుముల వేముల	-	-	18.36	8.55
మొత్తం (ఎకరాల్లో)	209.79	158.19	129.40	103.99



బోడుమల్లువారి పల్లె పంచాయతీ పరిధిలోని సర్వే నంబరు 652లో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

పట్టువదలని ఎమ్మెల్యే నల్లారి

ప్రభుత్వ, ప్రజావసరాలు దృష్టిలో పెట్టుకుని ఆక్రమణలకు గురైన భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పట్టువదలని విక్రమార్కుడిలా పోరాటం సాగించారు. అసెంబ్లీలో పీలేరు భూఆక్రమణలపై పట్టుబట్టి విచారణ చేయించారు. అంతటితో ఆగక లోకాయుక్తను ఆశ్రయించగా అక్కడ నుంచి విచారణ జరిపించి ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలు అందాయి.

- ఆరు పంచాయతీల పరిధిలో సెటిల్‌మెంట్ పట్టా భూముల్లో అధీకృత లేఅవుట్లు చుక్కల భూముల్లో అనుమతి లేకుండా లేఅవుట్లు, ప్రభుత్వ భూముల్లో అక్రమ లేఅవుట్లు, డీకేటీ భూముల ఆక్రమణల్లో రూ.400 కోట్ల విలువైన 601.37 ఎకరాల్లో అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారించారు. ఇవన్నీ తిరిగి ప్రభుత్వ పరం కాబోతుండటంతో వైకాపా నాయకుల నోట్లో పచ్చి వెలక్కాయ పడినట్లైంది.

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల, తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: నేరుగా వచ్చే భక్తులకు 8 గంటల్లో, రూ.300 టికెట్లు కలిగిన భక్తులకు మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. మంగళవారం శ్రీవారిని 73,983 మంది దర్శించుకోగా రూ.4.23 కోట్ల హుండీ కానుకలు లభించాయి. శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద బుధవారం భక్తులకు పదివేల సర్వదర్శన టోకెన్లు జారీ చేశారు. వీరికి గురువారం వేకువజాము నుంచి రాత్రి పది గంటల వరకు దర్శనం కానుంది. శ్రీవారి మెట్టు నడక దారి భక్తులకు మరో రెండువేల టోకెన్లు జారీ చేశారు.

వేసవికి ఏర్పాట్లు : రానున్న వేసవి నేపథ్యంలో శ్రీవారి ఆలయ మాడవీధులు, భక్తులు నడిచే మార్గంలో కూల్ పెయింట్ వేస్తున్నారు. కొంతకాలంగా మధ్యాహ్నం సమయంలో ఎండవేడిమి పెరిగింది. ఈ నేపథ్యంలో ఆలయ మాడవీధుల్లో భక్తులు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపడుతున్నారు.

(c) eenadu

అగస్త్య పూజితం.. అరుదైన ఆలయం

నలభై అడుగుల్లో పాతాళ గణపతి వైభవం

స్వామిని దర్శించుకునేందుకు వెళ్తున్న భక్తులు

ప్రాశస్త్యం ఇలా..: స్థల పురాణం అంతర్గతంగా సప్తరుషుల్లో ఒక్కరైన అగస్త్య మహర్షి దక్షిణ కైలాసంగా ప్రసిద్ధి పొందిన శ్రీకాళహస్తి క్షేత్రానికి నది ఆవశ్యకత తెలుసుకుని తపోబలంతో సువర్ణముఖి పేరుతో నదిని ఆవిర్భవించేలా చేశారు. పాకాలకు సమీపంలోని అగస్త్యాచలంలో పుట్టి శ్రీకాళహస్తీశ్వరాలయానికి సమీపంలో సాగుతూ బంగాళాఖాతంలో కలుస్తోంది. నది ఆవిర్భావం జరిగాక అందులో నీళ్లు లేకపోవడంతో ఆలోచనలో పడతాడు. తపస్సుకు ముందు విఘ్నాధిపతి అయిన వినాయకస్వామిని పూజించని కారణంగా ఇలా జరిగిందని గ్రహించి ఆయన్ను మన్నించమని వేడుకుంటాడు. అగస్త్యముని సంకల్పానికి మెచ్చిన వినాయకస్వామి పాతాళ మార్గంలో 40 అడుగుల లోతులో అగస్త్యునికి దర్శనమిచ్చినట్లు స్థల పురాణంలో విశదమవుతోంది. అందుకే ఇప్పటికీ ఇక్కడి వినాయక దర్శనం చేసుకోవాలంటే భక్తులు నలభై అడుగుల కిందకు దిగి చూడాల్సిందే.

దక్షిణ కైలాసంగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తి క్షేత్రంలో పురాణ ప్రాభవం కల్గిన ఆలయాలు ఎన్నో ఉన్నాయి. క్షేత్ర మహత్యానికి, అందులో సువర్ణముఖి నదీ వృత్తాంతానికి సంబంధించి ఏర్పాటైన పాతాళ గణపతి ఆలయం అగస్త్య మహర్షి పూజితంగా, దాదాపు 40 అడుగుల పాతాళంలో పూజలందుకుంటున్నారు.

ఇక్కడి ఆలయం ఎంతో అరుదైనదిగా గుర్తింపు పొందడం విశేషం. ఈ గణనాథుడిని దర్శించుకునేందుకు సినీనటులు, రెండు తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అత్యధికంగా భక్తులు తరలివస్తుండటం విశేషం.

వినాయక స్వామి

సాహసోపేతమైన దర్శనం..: పాతాళ వినాయక స్వామి దర్శనం ఓ రకంగా సాహసోపేతమైనదనే చెప్పాలి. ఎందుకంటే ఎవరైనా మోకాళ్ల మీద పాక్కుంటూ లోనికి వెళ్లాల్సిందే. ఇరుకైన, ఎత్తయిన మెట్లపై అత్యంత జాగ్రత్తగా లోనికి వెళ్లి వినాయక స్వామిని దర్శించుకోవాల్సి ఉంటుంది. స్థూలకాయులు, చంటిబిడ్డలు, వృద్ధులు, దివ్యాంగులు, హృద్రోగులకు ప్రవేశం లేదు. ఎందుకంటే లోనికి వెళ్లి రావడం కాస్తంత కష్టం. భక్తుల శ్రేయస్సు దృష్ట్యా ఆలయ అధికారులు ఈ తరహా నియమ, నిబంధనలు అనుసరిస్తూ భక్తులను ఆలయంలోనికి అనుమతిస్తుంటారు. ఒకదఫా ఏడుగురు లేదా ఎనిమిది మందికి మాత్రమే లోపలికి వెళ్లే అవకాశం ఉంటుంది. వాళ్లు వెళ్లి వచ్చాక మరి కొంత మందిని అనుమతిస్తుంటారు. ఇలా పర్వదినాల్లో రోజంతా వినాయకుడి దర్శనాలు సాగుతాయి.

- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

సుప్రభాతం.. ఆధ్యాత్మిక ఆనందం..

పవళింపు సేవలోని దేవతామూర్తులకు ఉదయత్పూర్వం మేలుకొలుపుగా నిర్వహించే విశేష సేవ సుప్రభాతం. ఒక్కో ఆలయంలో ఒక్కో రీతిలో ఈ సేవ నిర్వహిస్తుంటారు. శ్రీకాళహస్తీశ్వరాలయ విషయానికి వస్తే జ్ఞానప్రసూనాంబిక అమ్మవారి ఆలయానికి ఎడమ వైపున ఉన్న శయన మందిరంలో ఈ విశేష సేవ నిర్వహిస్తుంటారు. ప్రతి రోజూ వేకువజామున ఇక్కడ ప్రభాతసేవ, రాత్రి ఏకాంతసేవ ఈ మండపంలోనే జరుపుతుంటారు.

❖ **రుసుం:** రూ.200 ❖ **అనుమతి:** ఒకరికి

❖ **ఎలా పొందాలి:** ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఆలయ కౌంటర్లలో పొందచ్చు

❖ **ప్రత్యేకతలు:** ప్రధానమైన గర్భాలయాల్లో కొలువుదీరిన శ్రీకాళహస్తీశ్వరునితో పాటు జ్ఞానాంబిక అమ్మవార్ల తొలి దర్శనాన్ని వీక్షించే అవకాశం.

❖ **ఫలితం:** మానసిక శాంతి, ఆరోగ్యసిద్ధి, సర్వపాపాలు హరిస్తాయి.

ముక్కంటి ఆలయంలోని శయనోత్సవ మండపం

శిశువు తల్లిదండ్రులు సంప్రదించాలి

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని బాలాజీ కాలనీ చర్చి వద్ద దొరికిన శిశువుకు సంబంధించిన తల్లిదండ్రులు స్త్రీ, శిశు సంక్షేమశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖాధికారిణి హేమావతి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులు గుర్తించేందుకు ఆధారాలతో 12 రోజుల్లోగా జిల్లా కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. లేని పక్షంలో పాపను అనాథగా ప్రకటించి, ప్రభుత్వ షరతులతో నిబంధనల మేరకు మరొకరికి దత్తత ఇస్తామని పీడీ తెలిపారు.

22న లేఖా రచన పోటీలు

మదనపల్లె విద్య: కడప డివిజన్ తపాలా శాఖ ఆధ్వర్యంలో లేఖా రచన పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈవో సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ నెల 22న ఉదయం 10-11 గంటలకు కడపలోని ప్రధాన తపాలా కార్యాలయం మొదటి అంతస్తులో పోటీలు జరుగుతాయన్నారు. 'డిజిటల్ ప్రపంచంలో మానవ సంబంధాల ప్రాధాన్యత గురించి మీ స్నేహితుడికి లేఖ రాయండి' అనే అంశంపై 9 - 15 ఏళ్లలోపు విద్యార్థులకు పోటీ ఉంటుందన్నారు.

సూపరింటెండెంట్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ తమతో వెట్టిచాకిరి చేయిస్తున్నారని పలువురు వైద్యులు బుధవారం రాత్రి కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు కలిసి వినతిపత్రం అందజేశారు. వైద్యులు సయ్యద్ హదీద్, లక్ష్మీకళ తదితరులు మాట్లాడుతూ అత్యవసర విభాగంలో గతంలో పది మంది వైద్యులుండగా నలుగురితో పనిచేయిస్తున్నారని, తాము ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్నం తర్వాత ఆర్థో విభాగ వైద్యులు అందుబాటులో ఉండటం లేదని, ప్రమాదాలు జరిగి ఎవరైనా వస్తే తిరుపతికి పంపుతున్నారని, దీనిపై సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. తమ సమస్యలపై మాట్లాడాలన్నా ఛాంబరులోకి రానివ్వకుండా, బయటకు వెళ్లండని మందలిస్తున్నారని, తమకు న్యాయం చేయాలని కోరారు.

మాదిరి పత్రాలపై ప్రత్యేక దృష్టి

☛ నిత్య సాధనతో మంచి మార్కులు ☛ ఇంటర్ విద్యార్థులకు అధ్యాపకుల సూచన

కంభంవారిపల్లి(న్యూస్‌టుడే): త్వరలో జరగబోయే ఇంటర్మీడియట్ పరీక్షల్లో మాదిరి పేపర్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పలువురు అధ్యాపకులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. పరీక్షలంటే భయం లేకుండా మానసిక ప్రశాంతతతో హాజరు కావాలని సూచించారు. చిన్న మార్పులు ప్రశ్నలు రాయడం వల్ల ఇంటర్‌లో మంచి మార్కులు సాధించవచ్చని తెలిపారు. కొద్ది రోజుల్లో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో వారు విద్యార్థులకు విలువైన సూచనలిచ్చారు. వాటిని విద్యార్థులు ఆచరించడం వల్ల మంచి భవిత సొంతమవుతుంది.

ఇవి సాధన చేస్తే మెరుగైన ఫలితాలు



బోర్డు వారి మాదిరి ప్రశ్నాపత్రాలు సాధన చేయాలి. భౌతిక శాస్త్రంలో అధిక మార్కులు సాధించవచ్చు. ఈ పరీక్షలో ఒక మార్కు, ప్రశ్నలు అధిక మార్కులు పొందడంలో కీలకమవుతాయి. పార్టు ప్రశ్నలపై అవగాహన ఉంటే 85కు.. 85 మార్కులు తెచ్చుకోవడానికి అవకాశాలు ఉన్నాయి. **- మల్లికార్జున, భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు ఆదర్శ పాఠశాల, కంభంవారిపల్లె**

ఒక మార్కు ప్రశ్నలపై శ్రద్ధ

ఇంటర్మీడియట్ పరీక్షల్లో గణితంలో ఎక్కువ మార్కులు సాధించడానికి ఒకమార్కు ప్రశ్నలపై శ్రద్ధ పెట్టాలి. బోర్డు జారీ చేసిన మాదిరి ప్రశ్నపత్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, ప్రాక్టీస్ చేసి, జవాబులు గుర్తించి, సరిచేసుకోవాలి. రెండో సంవత్సరం గణితంలో ఎనిమిది మార్కులు ప్రశ్నలలో ముఖ్యమైన ప్రశ్నలు, గతంలో జరిగిన ప్రశ్నాపత్రాలపై దృష్టి పెట్టాలి. నాలుగు మార్కుల ప్రశ్నలు సాధన చేయడం వల్ల పాసు మార్కులతో పాటు, ఎక్కువ మార్కులు సాధించే అవకాశం ఉంది. **- బాలాజీ, గణిత అధ్యాపకులు, ఆదర్శ పాఠశాల, కంభంవారిపల్లె**

వ్యాకరణంపై దృష్టి

మొదటి సంవత్సరం ఆంగ్ల పరీక్షలో వ్యాకరణంపై దృష్టి పెడితే సులువుగా 30 మార్కులు వస్తాయి. గత సంవత్సరం ప్రశ్నపత్రాలను రివైజ్ చేసుకోవాలి. ద్వితీయ సంవత్సరం ఆంగ్లంలో ఆన్నోటేషన్స్‌లో రెఫరెన్స్, రైటర్, పాఠం పేర్లు గుర్తు పడితే 8 మార్కులు స్కోర్ చేయవచ్చు. పాసెజస్, అడ్వర్టైజ్‌మెంటు స్టడీ స్కిల్స్ రెండు, మూడుసార్లు చదివి రాయగలిగితే 16 మార్కులు వస్తాయి. లెటర్, సీవీ ఫార్మట్ కరెక్ట్‌గా రాస్తే 6 మార్కులు గ్యారెంటీగా వస్తాయి. **- రవినాయక్ ఆంగ్ల అధ్యాపకులు, ఆదర్శ పాఠశాల, కంభంవారిపల్లె**

మాట్లాడుతున్న ఎంపీడీవో మనోహర్‌రాజు, నిరంజన్‌రెడ్డి

రూ.19 కోట్లతో బాహుదా నదిపై వంతెన

వాల్మీకిపురం, న్యూస్‌టుడే: వాల్మీకిపురం కొత్త బైపాస్ రోడ్డు (జాతీయ రహదారి) నుంచి గాంధీ సర్కిల్ వరకు ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డును విస్తరించడంతో పాటు బాహుదా నదిపై వంతెన నిర్మాణానికి రూ.19 కోట్లు మంజూరయ్యాయని పీలేరు నియోజకవర్గ తెదేపా సీనియర్ నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కె.నిరంజన్‌రెడ్డి తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వాల్మీకిపురంలో రూ.10 లక్షలతో హైమాస్ట్ దీపాల ఏర్పాటుకు సైతం నిధులు మంజూరయ్యాయని, పనులు ప్రారంభమయ్యాయన్నారు. వాల్మీకిపురాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి కృషిచేస్తున్నారన్నారు. ఇక్కడి గురుకులాల్లో రూ.6 లక్షలు, ఎస్సీ వసతిగృహంలో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరయ్యాయని, అగ్నిమాపక, విద్యుత్తు కార్యాలయాల నిర్మాణాలు పూర్తయ్యాయని, త్వరలోనే వీటిని ప్రారంభిస్తామన్నారు. ఎంపీడీవో మనోహర్‌రాజు మాట్లాడుతూ గండికోట రిజర్వాయర్ నుంచి రూ.2 వేల కోట్లతో మంజూరైన తాగునీటి పథక పైప్‌లైన్ల ద్వారా తాగునీరు అందిస్తామని, పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ చంద్రమౌళి, మండల పార్టీ అధ్యక్షుడు దామురెడ్డి, తెదేపా నాయకులు పీవీనారాయణ, రాజేంద్రాచారి, కోసూరి రమేష్, సయ్యద్‌బాషా, బొక్కసం ఆనంద్, డిష్ బ్రదర్స్ పాల్గొన్నారు.

పల్లె ప్రగతికి రహదారులే కీలకం

కలెక్టర్ నిశాంత్‌కుమార్

ములకలచెరువు, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రహదారుల నిర్మాణమే కీలకమని కలెక్టర్ నిశాంత్ కుమార్ సూచించారు. బుధవారం సాయంత్రం ములకలచెరువు సమీపంలోని కనుగొండ రాయస్వామి దేవాలయం వద్ద నరేగా నిధులు రూ.90 లక్షలతో నిర్మిస్తున్న రహదారిని కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మార్చిలోగా రూ.51 కోట్ల నరేగా నిధులతో రహదారుల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. 2025-26 సంవత్సరానికి రూ.75 కోట్ల నరేగా నిధులతో రహదారుల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజనలో 17 పనులను వ్యవధిలోగా పూర్తి చేయాలన్నారు. జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారి దయాకర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

కనుగొండరాయస్వామి ఆలయానికి వెళ్లే రోడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

శివరాత్రి ఉత్సవాలకు పటిష్ఠ బందోబస్తు: ఎస్పీ

ములకలచెరువు, కురబలకోట, తంబళ్లపల్లె, న్యూస్‌టుడే: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా తంబళ్లపల్లె మల్లయ్యకొండ భక్తుల రక్షణ కోసం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ ధీరజ్ కునుబిల్లి అన్నారు. బుధవారం ఎస్పీ, మదనపల్లె డీఎస్పీ మహేంద్రతో కలిసి జిల్లాలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండను సందర్శించి మహాశివరాత్రి ఏర్పాట్లపై ఆరా తీశారు. కొండకింద, కొండపై ఆర్టీసీ బస్సులు, వాహనాల పార్కింగ్ కోసం కేటాయించిన స్థలాలను పరిశీలించి సూచనలు చేశారు. భక్తులు స్వామివారిని సౌకర్యవంతంగా దర్శించుకునేందుకు వీలుగా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొండ కింద నిర్మిస్తున్న అన్నదాన షెడ్డును సందర్శించారు. ఎస్పీ వెంట సీఐ వెంకటేశులు, ఎస్సై అనిల్‌కుమార్, తెదేపా నాయకులు తులసీధర్‌నాయుడు, డేరంగుల చంద్ర, మణి, శివకుమార్, అన్నదాన ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

మల్లయ్యకొండ కింద మహాశివరాత్రి ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు ఘన నివాళి

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: అంత్యోదయ సిద్ధాంతం కోసం జీవితాన్ని పార్టీ కోసం అంకితం చేసిన వ్యక్తిగా పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చరిత్రలో నిలిచిపోతారని ఏపీ మార్కెట్‌యార్డు డైరెక్టర్, భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి వి.శశిభూషణ్ అన్నారు. దీన్‌దయాళ్ బలి దివస్ సందర్భంగా బుధవారం మదనపల్లె సొసైటీ కాలనీలోని పార్టీ కార్యాలయంలో రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ భాజపా అధ్యక్షుడు సాయిలోకేశ్ అధ్యక్షతన జరిగిన సమర్పణ్ దివస్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ముందుగా దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. భాజపా సీనియర్ నాయకుడు చల్లపల్లె నరసింహారెడ్డి, విజయభారతి విద్యాసంస్థల ఛైర్మన్ ఎస్.సేతు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి యలంపల్లె ప్రశాంత్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి ఆనంద్, పులి నరేంద్రకుమార్ రెడ్డి, ఓసూరి కిరణ్‌కుమార్, రామదాసు, ఎం.కిరణ్, బర్నేపల్లె రవికుమార్, రామస్వామిరెడ్డి, భగవాన్, అంజలి, పూలనాగరాజు, టి.వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శశిభూషణ్

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

శ్రీ విఘ్నేశ్వర్ స్వామి ఇంటీరియర్ డిజైనర్స్ కబోర్డ్స్, డబుల్‌కాట్ విండోస్ ద్వారాలు అల్యూమినియం వర్క్ మరియు అపార్ట్‌మెంట్ వర్క్ ప్లానింగ్ మిషన్‌తో పాటు వర్క్స్ చేయబడును. ✆ 95812 56014.

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై ఆంధ్రప్రదేశ్ అంతటా మార్టిగేజ్ లోన్స్ మరియు స్థిరాస్తి ఎక్కడ ఉన్నా ఏసంస్థలో ఉన్నా Xerox పేపర్స్‌పై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. 50లక్షలులోపు, అయోధ్య కోఆపరేటివ్ బ్యాంక్. ✆ 93969 99669.

HEALTH & CARE

PAEDIATRIC

శ్రీవిష్ణు చిన్నపిల్లల హాస్పిటల్: డా॥ కె.శ్రీధర్ (M.D., Pediatrics, SVMC & Ex. Senior Resident RUIA, Fellow in Neonatology) ... 24X7 ... తిరుపతి ✆ 63035 53359.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

JOBS

WANTED MALE Process Associates Qual: Degree/ Diploma with Typing Skills of 25 NWPM, Sal: 14K to 18K. Mob: 80967 30137.

Universal Educational Services Wanted Female Telecallers. Qualification: Any Degree, Tirupati ✆ 9676968115, 8179915301.

తిరుపతిలోని ప్రముఖ కంపెనీకి బిజినెస్‌పర్సన్స్, రిటైర్డ్ పర్సన్స్, వివాహితులు కావలెను. Age:30to65, Qua: Inter- PG పాన్‌కార్డు తప్పనిసరి ✆ 7675095860.

లక్ష్మీస్ డిజైనర్ ఎంపోరియం తిరుపతిలో బొటిక్‌లో అనుభవం కల్గిన లేడీ మరియు సేల్స్‌గర్ల్స్-2 కావలెను. ఆకర్షణీయమైన జీతం ✆9966129199.

బాతులను పెంచుటకు అనుభవం గల వర్కర్స్ & ఆంధ్ర టిఫిన్స్, Veg & Nonveg, స్నాక్స్ చేసే వంట మనిషి కావలెను. ✆ 9849311524, 8688262581.

గమనిక

B/W 5 లైన్ల ప్రకటన రూ. 500/- Colour 5 లైన్ల ప్రకటన రూ. 600/- మాత్రమే

80085 13290

B/W: రూ. 600 Colour: రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

కార్వేటినగరంలో బర్డ్‌ఫ్లూ నిర్ధారణ

ఆందోళన చెందొద్దు: పశు సంవర్ధకశాఖ జేడీ

కార్వేటినగరం, న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లా కార్వేటినగరం మండలం ఆర్‌కేవీబీపేట పంచాయతీ పరిధిలోని ఇందిరా కాలనీ రైతు గోపినాథ్‌కు చెందిన కోళ్ల ఫారంలో బర్డ్ ఫ్లూతో వేల సంఖ్యలో కోళ్లు మరణించాయి. కోళ్ల ఫారంలో నాలుగు రోజులుగా రెండు వేల కోళ్లకు పైగా మృతి చెందాయి. జిల్లా అధికార యంత్రాంగం ఫారంలో మరణించిన కోళ్ల నమూనాలను సేకరించి భోపాల్‌లో పరీక్షలకు పంపారు. నివేదికలో బర్డ్ ఫ్లూగా నిర్ధారణ కావడంతో జిల్లా అధికార యంత్రాంగం ఆరు ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలతో బుధవారం సంఘటనా స్థలానికి చేరుకొని బయో సెక్యూరిటీ చర్యలు చేపట్టింది. కోళ్ల ఫారంలోని 5125 కోళ్లను శాస్త్రీయ పద్ధతిలో ఖననం చేశారు. గ్రామానికి సమీపంలోని కిలోమీటరు పరిధిలో 6100 కోళ్లను నిర్మూలించి వ్యాధి వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకున్నారు. పశు సంవర్ధకశాఖ జేడీ ఉమామహేశ్వరి మాట్లాడుతూ.. బర్డ్స్ ఫ్లూపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వ్యాధి ప్రబలకుండా అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. బర్డ్స్ ఫ్లూ వల్ల నష్టపోయిన పౌల్ట్రీ రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుందన్నారు. ఆమె వెంట డీడీ గోవిందయ్య ఏడీ వాసు, డీడీ ఆర్‌ఏడీడీఎల్ శ్రీలక్ష్మీ, పశువైద్యాధికారులు హేమకుమార్, కృష్ణ, సుబ్రహ్మణ్యం, నరేష్ ఉన్నారు.

ఇందిరాకాలనీలో బయో సెక్యూరిటీ చర్యలు చేపడుతున్న జిల్లా అధికార యంత్రాంగం

కుప్పం బొంగరానికి జీఐ ట్యాగ్ కోసం దరఖాస్తు

కుప్పంలో తయారవుతున్న బొంగరాలు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: కుప్పం ఉడెన్ టాప్స్ (బొంగరం)కు జీఐ ట్యాగ్ కోసం దరఖాస్తు చేసినట్లు మిట్స్ డీమ్డ్ టుబీ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పం మండలం కంగుంది, పరిసర ప్రాంతాల్లో తరతరాలుగా బొంగరాలు తయారు చేస్తున్నారని వివరించారు. వీటి ఉత్పత్తికి ప్రత్యేక గుర్తింపు తెచ్చేందుకు జీఐ ట్యాగ్ కోసం దరఖాస్తు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అడ్వైజర్ తులసీరాం నాయుడు, డాక్టర్ రవీంద్రనాథ్ చెరుకూరి, అసోసియేట్ డీన్ డాక్టర్ శివయ్యలను విశ్వవిద్యాలయ ఛాన్సలర్ డాక్టర్ ఎన్.విజయభాస్కర్‌చౌదరి, ప్రో ఛాన్సలర్ ద్వారకానాథ్‌లు అభినందించారు.

దరఖాస్తు పత్రాన్ని చూపుతున్న మిట్స్ డీమ్డ్ టుబీ విశ్వవిద్యాలయం ప్రో ఛాన్సలర్ ద్వారకానాథ్, వీసీ యువరాజ్ తదితరులు

హార్సిలీహిల్స్ టెండర్లకు పోటాపోటీ

రూ.13 లక్షలకుపైగా అదనపు ఆదాయం

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: బి.కొత్తకోట మండలంలో పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో అటవీశాఖ ప్రాంగణం వద్ద ప్రవేశ రుసుము వసూలు, క్యాంటీన్ నిర్వహణ హక్కులు దక్కించుకోవడానికి గుత్తేదారులు పోటీపడ్డారు. గతేడాదితో పోల్చితే ఈ సారి రూ.13 లక్షలకుపైగా అదనపు ఆదాయం అటవీశాఖకు సమకూరనుంది. రాజంపేటలోని అటవీశాఖ జిల్లా కార్యాలయంలో డీఎఫ్‌వో జగన్నాథసింగ్ ఆధ్వర్యంలో టెండర్ల ప్రక్రియను బుధవారం నిర్వహించారు. ప్రవేశ రుసుంతో పాటు క్యాంటీన్ నిర్వహణకు ఏడుగురు టెండరు దాఖలు చేశారు. ఇందులో రూ.31,00,005 ధరను కోట్ చేసిన ఇ.రమేష్‌కు, క్యాంటీన్‌ను రూ.3,25,000కు టెండరు వేసిన శివన్నకు దక్కినట్లు అధికారులు ప్రకటించారు. ఈసారి పోటీ తీవ్రంగా ఉండటంతో రూ.13,65,005 అదనంగా రాబడి పెరిగింది. ఒక్కో పర్యాటకుడి ప్రవేశానికి రూ.25, పిల్లలకు రూ.15 చొప్పున రుసుము వసూలు చేయాల్సి ఉంటుందని హార్సిలీహిల్స్ అటవీశాఖ సెక్షన్ అధికారి శివకుమార్ తెలిపారు.

17న నులిపురుగుల నిర్మూలన

లక్ష్మీనరసయ్య

మదనపల్లె వైద్యం, న్యూస్‌టుడే: జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మీనరసయ్య అన్నారు. బుధవారం ఆయన వైద్యాధికారులతో మాట్లాడుతూ.. ఈ నెల 17న జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. 1 - 19 ఏళ్లలోపు వారే లక్ష్యంగా మాత్రలు అందజేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, వసతిగృహాల్లో ఉన్న 3,96,796 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు ఉచితంగా అందజేస్తామన్నారు. 17న మాత్రలు తీసుకోని విద్యార్థులకు 24వ తేదీ మరోసారి అందజేస్తామన్నారు.

పంటల సాగులో సాంకేతిక సేవల వినియోగం

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: పంటల సాగులో సాంకేతిక సేవలను వినియోగంలోకి తేవాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ వ్యవసాయాధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, పశుసంవర్ధక, మార్కెటింగ్‌శాఖల అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో యూరియా కొరత లేదని, పదిరోజుల్లో మరో వెయ్యి టన్నుల యూరియా జిల్లాకు కేటాయిస్తారన్నారు. 20వ తేదీలోగా పంట నమోదు పూర్తిచేయాలని, పీఎం కిసాన్ పథకం అమలుపై రైతు విశిష్ఠ గుర్తింపు సంఖ్యలను కేటాయించాలని, లేకుంటే నిధులు జమకావన్నారు. డ్రోన్ ఉబరైజేషన్ సేవలను రైతులు వినియోగించుకునేలా చూడాలన్నారు. బయట నుంచి వచ్చే కోళ్లను ఎవరూ కొనుగోలుచేయకుండా చెక్‌పోస్టుల వద్ద తనిఖీ చేయాలన్నారు. క్యాబ్ బుకింగ్ తరహా వ్యవసాయ యంత్రాల సేవల గోడపత్రాలు ఆవిష్కరించారు.

పంట.. రైతుల్లో బెంగ

తోటల్లో వదిలేసిన టమాట

పశ్చిమ మండలాల్లో రైతులు విస్తారంగా టమాట, వంగ సాగు చేశారు. గిట్టుబాటు ధరల్లేక, కనీసం పంట కోతకు అయ్యే కూలి ఖర్చులు కూడా గిట్టుబాటు కాని పరిస్థితి. దీంతో పొలాల్లోనే అవన్నీ మగ్గిపోతున్నాయి. టమాట, వంకాయలు కలికిరిలో కోయకుండా తోట చిత్రమిది.

- న్యూస్‌టుడే, కలికిరి

రెవెన్యూలో 19 మందికి రివర్షన్

చిత్తూరు కలెక్టరేట్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రెవెన్యూ శాఖలో 19 మంది సీనియర్ అసిస్టెంట్లకు గ్రేడ్-1 వీఆర్వోలుగా రివర్షన్ ఇచ్చారు. ఈ మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి. 2022, 2023లో ఉమ్మడి జిల్లాలో పలువురు గ్రేడ్-1 వీఆర్వోలకు తాత్కాలికంగా ఉద్యోగోన్నతిపై షరతులు విధించి సీనియర్ అసిస్టెంట్లుగా పోస్టింగులు ఇచ్చారు. 19 మంది సీనియర్ అసిస్టెంట్లు.. సంతృప్త స్థాయిలో ఉత్తీర్ణత సాధించకపోవడంతో రివర్షన్ పొందారు. చిత్తూరు జిల్లాలో ఐదుగురు, తిరుపతి జిల్లాలో ఐదుగురు, అన్నమయ్య జిల్లాలో 9 మంది రివర్షన్ ఉత్తర్వులు అందుకున్నారు.

ఫర్నిచర్ తరలింపుపై విమర్శలు

లారీలోకి సామగ్రి ఎక్కిస్తున్న విద్యార్థులు

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక ఉర్దూ పాఠశాలలో బల్లలు, కుర్చీల తరలింపుపై విమర్శలు వెల్లువెత్తాయి. మూడ్రోజుల క్రితం ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి.. పట్టణంలోని ఉర్దూ జడ్పీ పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ క్రమంలో పాత భవనంలో నుంచి కొత్త భవనానికి సామగ్రి తరలింపులో విద్యార్థులతో పనులు చేయిస్తున్న వీడియోలు.. సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేశాయి. ఈ వీడియోలో విద్యార్థులే బల్లలు, సామగ్రి తరలిస్తున్నారు.

చింతచెట్టుపై నుంచి పడి వ్యక్తి దుర్మరణం

శివకుమార్ (పాతచిత్రం)

వాల్మీకిపురం, న్యూస్‌టుడే: చింతకాయలు కోసేందుకు చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు కింద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన వాల్మీకిపురంలోని ఎన్టీఆర్ కాలనీలో బుధవారం చోటుచేసుకుంది. ఎన్టీఆర్ కాలనీకి చెందిన పూల శివకుమార్ (33).. వాల్మీకిపురం - గుర్రంకొండ రోడ్డులో చింతకాయలు కోసేందుకు చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు కొమ్మ విరగడంతో కిందపడ్డాడు. గమనించిన స్థానికులు గాయపడిన అతడిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే శివకుమార్ మృతి చెందినట్లు నిర్ధారించారు. పంచనామా నిమిత్తం మృతదేహాన్ని శవాగారానికి తరలించారు. ఎస్సై తిప్పేస్వామి కేసు నమోదు చేశారు.

రాయచోటిలో పేట్రేగిన రౌడీమూకలు

వరుస దాడుల్లో ఒకరికి తీవ్ర గాయాలు

రాయచోటి, న్యూస్‌టుడే: పట్టణంలో రౌడీ మూకల అల్లరి చేష్టలు పెరిగిపోయాయి. గుంపులుగా చేరి రహదారులపై దందాలు సాగిస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి పట్టణంలోని జగదాంబ సెంటర్ ప్రాంతంలో యువకుల మధ్య రాడ్లు, కట్టెలతో దాడులు, ప్రతిదాడులు జరిగాయి. ఈ దాడుల్లో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఇరువర్గాల వారిని స్టేషన్‌కు తరలించారు. బుధవారం మధ్యాహ్నం పట్టపగలే సుద్దలోళ్లపల్లె రోడ్డులో యువకులు బాహాబాహీకి దిగారు. కేకలు, ఈలలతో ఆ ప్రాంతం భీతావహంగా మారింది. స్థానిక వ్యాపారులు పరుగులు తీయాల్సిన పరిస్థితి. పోలీసులు అక్కడికి చేరుకున్నప్పటికీ అల్లరి మూకలు లెక్కచేయని పరిస్థితి కనిపించిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం రాత్రి జరిగిన దాడిలో ఓ యువకుడికి బలమైన గాయాలు కావడంతో అతడిని.. అనుచరులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు అల్లరి మూకలను అదుపులోకి తీసుకుని గట్టిగా మందలించారు. రాత్రి పొద్దుపోయే వరకు ఈ ఘటనలపై కేసు నమోదు కాలేదు. త్వరలోనే మున్సిపల్ ఎన్నికలు రానున్న నేపథ్యంలో అల్లర్లపై పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

(c) eenadu

రాయచోటి
• రాయచోటి • పీలేరు

ఆపస్ మండల కమిటీ ఎన్నిక

సులోచన

వెంకటేశ్వర్లు

కంభంవారిపల్లె, న్యూస్‌టుడే: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఆపస్ ఉపాధ్యాయ సంఘ ఎన్నికలు బుధవారం నిర్వహించారు. మహిళా విభాగం మండల అధ్యక్షురాలిగా సులోచన, గౌరవాధ్యక్షులుగా వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. ఎన్నికల పరిశీలకులుగా సంఘ జిల్లా సహాధ్యక్షులు పి.సుధాకర్, అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, మండల సహాధ్యక్షులు రామాంజుల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టించాలి

కలికిరి, న్యూస్‌టుడే: చెత్త నుంచి సంపద సృష్టించి పంచాయతీకి ఆదాయం సమకూర్చాలని డీఎల్‌డీవో లక్ష్మీపతి ఆదేశించారు. బుధవారం మండలంలోని గుట్టపాలెం సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో ఉన్న చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించి చెత్త నుంచి సంపద సృష్టించేందుకు చేపట్టాల్సిన పలు సూచనలు, సలహాలను సచివాలయ సిబ్బందికి ఇచ్చారు. అంతకుముందు సచివాలయ సిబ్బందితో సమావేశమై యూనిఫామ్ సర్వే సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీడీవో భానుమూర్తిరావు, డిప్యూటీ ఎంపీడీవో నవీన్, ఏపీవో మంజుల, కార్యదర్శి తిమ్మారెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సల్మా, సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌డీవో లక్ష్మీపతి

ప్రశాంత వాతావరణంలో శివరాత్రి ఉత్సవాలు

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రశాంత వాతావరణంలో మహా శివరాత్రి ఉత్సవాలు నిర్వహించాలని పీలేరు తహసీల్దార్ శివకుమార్ కోరారు. మండల పరిధిలో శివరాత్రి ఉత్సవాలు జరిగే ఆలయాల నిర్వాహకులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా జాగారం, పగటివేళ ఊరేగింపులు, ప్రత్యేక పూజలు నిర్వహించే సమయంలో అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో శివకుమార్, ఎస్సై లోకేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్ వ్యవస్థను నిర్వీర్యం చేయొద్దు

చిన్నమండెం, న్యూస్‌టుడే: ఉద్యోగుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ఆప్కాస్ వ్యవస్థను నిర్వీర్యం చేయొద్దని ప్రభుత్వ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.చంద్రశేఖర్ కోరారు. చిన్నమండెం ఆదర్శ పాఠశాలలో బుధవారం జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్ష, కోశాధికారులు నాగరాజు, పద్మనాభం, రామ్మూర్తినాయక్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ఆప్కాస్ వ్యవస్థను తొలగించి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఏజెన్సీలకు అప్పగించే యోచనలో ప్రభుత్వం ఉందన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో వస్తున్న కథనాలతో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. ఇప్పటికైనా ఆప్కాస్‌ను బలోపేతం చేయాలని కోరారు. నూతన ఉద్యోగులను కూడా ఆప్కాస్ ద్వారానే తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రతకు హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం తమకు మేలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

17లోగా ఆస్తి పన్ను చెల్లించాలి

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: ఈ నెల 17వ తేదీ లోగా ఆస్తి, నీటి పన్ను చెల్లించాలని లక్కిరెడ్డిపల్లె పంచాయతీ కార్యదర్శి నరసింహులు కోరారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 17వ తేదీ తర్వాత ఆస్తి, నీటి పన్ను చెల్లించాలంటే అపరాధ రుసుము తప్పక విధిస్తామన్నారు. ప్రతిఒక్కరూ దీన్ని గమనించి సకాలంలో పన్ను చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలన్నారు.

రహదారులకు మహర్దశ

- రూ.4 కోట్లతో సీసీరోడ్ల నిర్మాణం
- అందివచ్చిన 15వ ఆర్థిక సంఘం నిధులు
- రూపుమారనున్న పట్టణం

న్యూస్‌టుడే, రాయచోటి

పూర్వ జిల్లా కేంద్రమైన రాయచోటి పురపాలక సంఘం పరిధిలో అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయి. ఏళ్ల తరబడి మట్టిరోడ్లతో పట్టణ ప్రజలు అవస్థలు పడేవారు. తాజాగా సిమెంట్ రోడ్ల నిర్మాణానికి పెట్టిన ప్రతిపాదనలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. 15వ ఆర్థిక సంఘం ద్వారా రూ.5 కోట్లు మంజూరవడంతో అధికారులు పట్టణంలో సీసీరోడ్ల నిర్మాణం చేపట్టారు. వీధుల్లో సిమెంట్ రోడ్లతో పాటు కాలువలు, తాగునీటి పైపులైన్లు ఒకేసారి నిర్మిస్తే మళ్లీ రోడ్లు ధ్వంసం చేయాల్సిన అవసరం ఉండదు. ఈ దిశగా అధికారులు ఆలోచించి చర్యలు తీసుకోవాలని పురప్రజలు కోరుతున్నారు.

సిమెంట్ రోడ్డుగా మారిన మదనపల్లె రోడ్డు నుంచి సుద్దులోళ్లపల్లె వెళ్లే రోడ్డు

పనుల్లో అప్రమత్తమైతేనే..

సీసీరోడ్లు వేసే ప్రాంతాల్లో ముందుగా విద్యుత్తు స్తంభాలను పక్కకు మార్చాల్సి ఉన్నా.. చాలాచోట్ల అలా జరగడం లేదు. కొన్నింటిని అలానే రహదారిపైనే వదిలేస్తున్నారు. పలుచోట్ల వేగంగా వచ్చే వాహనాలు ఆయా స్తంభాలను ఢీకొని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. మరికొన్నిచోట్ల కాలువలు నిర్మించకపోవడంతో రోడ్డుపై వచ్చే నీటితో పాటు ఇళ్ల నుంచి వెలువడే మురుగుతో దుర్వాసన వెదజల్లుతోంది. శివారు ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు వేసే వీధుల్లో తాగునీటి పైపులైన్లు ఉన్నాయి. పాత రహదారులపైనే నూతన రోడ్లు వేయడం వల్ల మళ్లీ పైపులైన్లు వేసేటప్పుడు ధ్వంసం చేయాల్సిన పరిస్థితి. ఇక తాగునీటి సరఫరా విభాగం అధికారులు వీటిపై దృష్టి సారించి శివారు ప్రాంతాల్లో తాగునీటి పైపులైన్ల పనులు పూర్తిచేయాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

పురపాలక	రాయచోటి
జనాభా	1.30 లక్షలు
వార్డులు	34
మంజూరైన నిధులు	రూ.5 కోట్లు
చేసిన పనుల విలువ	రూ.4 కోట్లు
సిమెంట్ రోడ్లు వేస్తున్న ప్రదేశాలు	కొత్తపేట, కొత్తపల్లె, మదనపల్లె రోడ్డు, బోస్‌నగర్, మాసాపేట, పాత రాయచోటి, ఎస్ఎన్‌కాలనీ

పర్యవేక్షణ తప్పనిసరి..

ఆర్థిక సంవత్సరం మార్చి నెలతో పూర్తి కానుంది. ఉన్న నిధులు సకాలంలో వ్యయం చేయకపోతే వృథా అవుతాయి. వచ్చిన నిధులు సద్వినియోగం చేసుకుని పట్టణంలో మౌలిక సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంగా పనుల్లో వేగం పెంచారు. సీసీరోడ్ల నిర్మాణంపై ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ ఏమాత్రం కొరవడినా నాణ్యత లోపించే ప్రమాదం ఉంది. పట్టణ పరిధిలో ప్రతి వార్డు సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సహా పురపాలకలో డీఈఈ, ఏఈలు ఉన్నారు. వీరందరూ తరచూ పనులు జరుగుతున్న తీరును పర్యవేక్షించడం లేదని బహిరంగ విమర్శలు లేకపోలేదు. ఇప్పటికే నాణ్యత విషయంలో ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. ఇదివరలో కొనసాగితే రూ. కోట్లు వెచ్చించి చేపట్టిన పనులు ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉంది.

గోడప్రతుల ఆవిష్కరణ

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: నులిపురుగుల నివారణ వారోత్సవాల గోడప్రతులను తహసీల్దార్ శివకుమార్ బుధవారం ఆవిష్కరించారు. తలుపుల పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ నెల 17 నుంచి జరిగే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వైద్యులు గిరీష్, హెచ్ఈ కొండయ్య, పర్యవేక్షకురాలు కుసుమ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
రాయచోటి: 9703622242
పీలేరు: 8008574958
చిన్నమండెం: 9440170752

న్యూస్‌టుడే, రాయచోటి గ్రామీణ

సమస్య: పట్టణంలోని బస్టాండు, అన్న క్యాంటీన్ ప్రాంతంలో తోపుడుబండ్ల వ్యాపారులు నడకదారి ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తుండటంతో పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. **-ద్వారక, స్థానికుడు**

సమాధానం: తోపుడుబండ్లను నడకదారి నుంచి తొలగించి పాదచారులకు ఇబ్బంది లేకుండా చూస్తాం. నడకదారులను ఆక్రమించి వ్యాపారాలు చేస్తే జరిమానా విధిస్తాం. **-రవి, కమిషనర్**

న్యూస్‌టుడే, రాయచోటి గ్రామీణ

సమస్య: గాలివీడు రోడ్డులోని శ్రీచైతన్య పాఠశాలకు వెళ్లే మార్గంలో సీసీరోడ్డు దెబ్బతిని గుంతలమయమైంది. **-మహేశ్వరి, స్థానికురాలు**

సమాధానం: రహదారికి మరమ్మతులు చేయిస్తాం. **-విశ్వకిరీటి, ఏఈ, పురపాలక సంఘం**

న్యూస్‌టుడే, రాయచోటి గ్రామీణ

సమస్య: సరస్వతి వీధిలో చాలాకాలం క్రితం చేతి పంపు చెడిపోయింది. **-రెడ్డిలక్ష్మి, స్థానికురాలు**

సమాధానం: చేతి పంపునకు మరమ్మతులు చేపడతాం. **-రవి, కమిషనర్**

న్యూస్‌టుడే, కలకడ

సమస్య: దిగువవీధిలోని కాలువలో చెత్తాచెదారం చేరి దుర్వాసన వస్తోంది. **-జాఫర్, కలకడ**

సమాధానం: కాలువలో చెత్త తొలగించి, వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటాం. **-శైలజ, కార్యదర్శి, కలకడ**

న్యూస్‌టుడే, గుర్రంకొండ

సమస్య: మర్రిపాడు ఇందిరమ్మ కాలనీలో మద్యం బహిరంగంగా విక్రయిస్తున్నారు. గొలుసు దుకాణాలు లేకుండా చేయండి. **-స్థానికులు**

సమాధానం: ఈ సమస్య మా దృష్టికి వచ్చింది. పిలిచి హెచ్చరించాం. త్వరలో నిర్వాహకులను పట్టుకుని కేసులు నమోదు చేస్తాం. **-రవీంద్రబాబు, ఎస్సై**

న్యూస్‌టుడే, కంభంవారిపల్లె

సమస్య: గంగువారిపల్లెలో తాగునీటి పథకం ట్యాంకుకు నీరు సరఫరా చేయాలి. నీరు సరిపోక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. **-వెంకటరమణ, స్థానికుడు**

సమాధానం: ట్యాంకులోకి నీరు పంపింగ్ చేయిస్తాం. **-మధుసూదన్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్**

తొలగిన పూడిక

గాలివీడు ప్రధాన రోడ్డు బస్టాండు సమీపంలో పారిశుద్ధ్య కార్మికులు పూడిక తొలగించారు. 'పెద్దదారి.. అడుసు తొక్కాలి' శీర్షికన ప్రచురితమైన చిత్రకథనంపై సర్పంచి లక్ష్మీదేవి, కార్యదర్శి ఆంజనేయులు నాయక్ స్పందించారు. మురుగు మళ్లించి చెత్తాచెదారం కాలువలో వేయకుండా సహకరించాలని కోరారు. **-న్యూస్‌టుడే, గాలివీడు**

కాలువ శుభ్రం

స్థానిక మహబూబ్‌నగర్ వీధిలోని మురుగునీటి కాలువలో చెత్తాచెదారం చేరి అధ్వానంగా మారిన సమస్యపై పంచాయతీ కార్యదర్శి శైలజ స్పందించారు. సిబ్బందిచే కాలువలో చెత్త తొలగించి, బ్లీచింగ్ చల్లించారు. **-న్యూస్‌టుడే, కలకడ**

తెలుసా.. ఇది మరుగుదొడ్డే..!

సి.పొలిమేరపల్లె గ్రామం కాయలవాండ్లపల్లె ప్రాథమిక పాఠశాలకు మరుగుదొడ్డి సౌకర్యం లేదు. దీంతో విద్యార్థులు మలమూత్రాలకు ఆరుబయటకు వెళ్లాల్సి వస్తోంది. పాఠశాలలో 37 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. పాఠశాలకు ఆనుకుని ఉన్న మరుగుదొడ్డి కూలిపోయే దశలో ఉండటంతో ఇటీవల దీన్ని పడేశారు. హెచ్ఎం కృష్ణయ్య కొత్తగా మరుగుదొడ్డి నిర్మిస్తామని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.
-న్యూస్‌టుడే, చిన్నమండెం

నేటి నుంచి చిన్నమండెంలో ఉరుసు

చిన్నమండెం, న్యూస్‌టుడే: స్థానిక హజరత్ షా అలీ గంజే షహీద్ బాబా రహమతుల్లా అలైహి వారి ఉరుసు గురువారం నుంచి మూడ్రోజుల పాటు నిర్వహించనున్నామని దర్గా కమిటీ నిర్వాహకులు బుధవారం తెలిపారు. గురువారం రాత్రి తొమ్మిది గంటలకు నాయబ్‌సాబ్ ఇంటి నుంచి గంధం ఊరేగింపుగా దర్గాకు చేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కడప పెద్ద దర్గా గురువు హజరత్ సయ్యద్ షా ఆరిఫుల్లా మహ్మద్ హుసేనీ పాల్గొని ప్రత్యేక చదివింపులు కార్యక్రమం నిర్వహిస్తారని వివరించారు. అదేరోజు రాత్రి ఝార్ఖండ్, గుజరాత్ నుంచి వచ్చే గాయకులతో ఖవ్వాలీ పోటీ ఉంటుందన్నారు. 13న రాత్రి ఉరుసు ఉంటుందని, దిల్లీ, ముంబై నుంచి వచ్చే గాయకుల ఆధ్వర్యంలో ఖవ్వాలీ నిర్వహిస్తామని చెప్పారు. ఉరుసుకు అన్ని ఏర్పాట్లు చేశామని, పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు.

ముస్తాబైన దర్గా

నమ్మండి.. ఇది బస్‌షెల్టరే

చిత్తూరు-కడప జాతీయ రహదారి, కలికిరి-సోమల ప్రధాన రహదారికి అనుకూలంగా మహల్‌క్రాస్‌లో రాజుల కాలంలో ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన బస్‌షెల్టర్ శిథిలమై ఆనవాళ్లు కోల్పోయింది. దీంతో వివిధ దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికులు బస్సుల కోసం వేచిఉండేందుకు చోటులేక ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు లేదా ఎవరైనా దాతలు స్పందించి బస్‌షెల్టర్‌ను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, కలికిరి**

రైతులకు సేవలందేనా..?

చిన్నర్సుపల్లెలో మూడేళ్ల కిందట రూ.21.8 లక్షలతో ప్రారంభించిన రైతు సేవా(నాటి భరోసా) కేంద్రం పనులు నేటికీ పూర్తికాలేదు. గుత్తేదారు శ్లాబ్ వేసి వదిలేశారు. ఇది పూర్తయితే సంబంధిత అధికారి, విత్తనాలు, ఎరువులు రైతులకు అందుబాటులో ఉంటాయి. ఆయా పనులు పూర్తిచేసి తమకు ఇబ్బంది లేకుండా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. దీనిపై జేఈఈ హర్షవర్ధన్‌రెడ్డిని అడగ్గా.. పనులు నిలిచినమాట వాస్తవమేనని, ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. **-న్యూస్‌టుడే, చిన్నమండెం**

పీహెచ్‌సీ దారి.. శ్మశానాల అడ్డా

గాలివీడు పీహెచ్‌సీలో 24 గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. ఆసుపత్రి ఎదురుగా శ్మశానం ఉంది. పక్కనే రాకపోకలు సాగిస్తుండటంతో పిల్లలు, మహిళలు వైద్యం కోసం వెళ్లడానికి భయపడుతున్నారు. ప్రమాదాలు జరిగినపుడు రాత్రివేళ చికిత్స కోసం వెళ్లడానికి జంకుతున్నారు. సమీపంలో వెలుగు కార్యాలయ భవనాలు నిర్మించారు. వీటికి ప్రహరీ నిర్మించాలని వేడుకున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. **-న్యూస్‌టుడే, గాలివీడు**

అదుపు తప్పితే అంతే..!

పట్టణంలోని ఎన్జీవో కాలనీ నుంచి చౌడేశ్వరీ దేవి ఆలయానికి వెళ్లే మార్గంలో రహదారిపై నెల రోజుల క్రితం తాగునీటి పైపులైను మరమ్మతుల నిమిత్తం పెద్ద గుంత తవ్వారు. మరమ్మతుల అనంతరం దాన్ని పూడ్చకుండా అలానే వదిలేశారు. పైగా దానిపై ముళ్లకంప వేశారు. రాత్రి వేళ ఇది కనపడక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు నిర్లక్ష్యం వీడి వెంటనే గుంత పూడ్చివేయాలని స్థానికులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, రాయచోటి గ్రామీణ**

కాలువ పూడి.. మురుగు పారి

కొత్తపేట సరస్వతి వీధిలోని కాలువను శుభ్రం చేయడం లేదు. వీధిలో పడేసే చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు కాలువలోకి చేరుతున్నాయి. ప్రధాన రోడ్డును దాటే తూము వద్ద ప్లాస్టిక్, చెత్త పేరుకుపోయి మురుగు దిగువకు వెళ్లే పరిస్థితి లేక రోడ్డుపైకి తరచూ వచ్చేస్తోంది. నిత్యం కాలువలు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నామని ఆ ప్రాంతానికి చెందిన మునెయ్య వాపోయారు. పురపాలక అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పారిశుద్ధ్య కార్మికులు బుట్టల్లో ఉన్న చెత్త తీసుకెళ్తున్నారే తప్ప కాలువల్లో పూడిక తీయడం లేదన్నారు. **-న్యూస్‌టుడే, కొత్తపేట(రాయచోటి)**

పొరపాట్లు లేకుండా చూసుకోవాలి

వాల్మీకిపురం, న్యూస్‌టుడే: మండలంలోని ఎర్రగుండ్లబావి అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఐసీడీఎస్ సీడీపీవో భారతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల ఎర్రగుండ్లబావి అంగన్‌వాడీ కేంద్రంలో సిబ్బంది పనితీరు సరిగా లేదని గ్రామానికి చెందిన కొందరు ఫిర్యాదు చేయడంతో ఆమె.. సిబ్బందితో కలిసి అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి బుధవారం విచారణ చేపట్టారు. ఈ కేంద్రంపై తమకు అందిన ఫిర్యాదులో వాస్తవాలు లేవని, ఈ కేంద్రంలో టీచర్, ఆయాలు విధులు చక్కగానే నిర్వర్తిస్తున్నారని తెలిపారు. చిన్నచిన్న పొరపాట్లు లేకుండా చూసుకోవాలని సిబ్బందికి.. సీడీపీవో సూచించారు. సూపర్‌వైజర్లు భాను, లక్ష్మీదేవి, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీడీపీవో భారతి

కుండీలు పెట్టరు.. చెత్త ఎత్తరు..!

రాయచోటి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో పలుచోట్ల చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాల దుర్గంధం వెదజల్లుతోంది. రోడ్లపై చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోతోంది. ప్రధాన దారులు మినహా మిగిలినచోట్ల చెత్త ఎత్తేందుకు రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవట్లేదు. కొన్ని ప్రాంతాల్లో కంప పెరిగి ప్లాస్టిక్ వ్యర్థాలు నిండి డంపింగ్‌యార్డులా కనిపిస్తోంది. ఎన్జీవో కాలనీలో చెత్త కుండీలు లేక ఖాళీ స్థలాల్లో వేస్తున్నారు. ఫలితంగా ఇళ్లలోకి దుర్వాసన వచ్చి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

ఝురి తిరుణాలకు ఏర్పాట్లు

కలకడ, న్యూస్‌టుడే: సత్యవతి నదీతీరాన వెలసిన శ్రీ కామాక్షీ సమేత సిద్ధేశ్వరాలయంలో ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ప్రముఖ శైవ క్షేత్రాల్లో ఒకటైన కలకడ శ్రీ సిద్ధేశ్వరాలయం ఈ ప్రాంత ప్రజలకు కల్పతరువు. కోరిన కోర్కెలు తీర్చే దేవుడిగా కొలుస్తారు. 800 ఏళ్ల ప్రాశస్త్యం కలిగిన ఈ ఆలయాన్ని వైధుంబరాజులు నిర్మించారని చరిత్ర చెబుతోంది. బ్రహ్మోత్సవాల నిర్వహణకు.. కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఆలయం చుట్టూ షామియానాలు, ప్రధాన రహదారి నుంచి ఆలయం వరకు విద్యుద్దీపాల అలంకరణ, తలనీలాల సమర్పణకు వచ్చే భక్తులకు పుష్కరిణిలో నీటి వసతి కల్పిస్తున్నారు. 12న హంస వాహనం, 13న మయూర, 14న కల్యాణం, గజవాహన సేవ, 15న మహాశివరాత్రి రోజున అభిషేకం, అలంకరణ, శిఖర దీప దర్శనం, రుద్రాభిషేకం, వృషభవాహన సేవ, లక్ష బిల్వార్చన ఉంటాయి. 16న ఝురి ఉత్సవం, యాళివాహనం, 17న త్రినేత్రధారణ, మహా నివేదన, రథోత్సవం, 18న వసంతోత్సవం, త్రిశూల స్నానం, 19న పార్వేట, అశ్వవాహన సేవలు, 20న ధ్వజావరోహణం, ఊంజల్ సేవతో సదరు ఉత్సవాలు ముగియనున్నాయి.

లింగాకృతిలో శ్రీ సిద్ధేశ్వరస్వామి...

ముస్తాబైన ఆలయం

మరమ్మతులు చేస్తేనే షాదీఖానా తెరచుకునేది

రాయచోటి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో అధిక సంఖ్యలో ఉన్న మైనార్టీల సౌకర్యార్థం రెండు దశాబ్దాల క్రితం ప్రభుత్వం షాదీఖానా నిర్మించింది.. తక్కువ ఖర్చు, ఎక్కువ సౌకర్యాలతో పేద ముస్లిం మైనార్టీల వివాహాలు, ఇతర కార్యక్రమాలకు ఇది ఉపయోగపడింది.. అధికారుల నిర్లక్ష్యంతో ఏడేళ్లుగా మూతబడింది.


మూసివేసిన షాదీఖానా

20 ఏళ్ల క్రితం స్థానిక పెట్రోల్‌బంక్ సమీపంలో ప్రభుత్వం షాదీఖానా నిర్మించింది. కొన్నేళ్లు వినియోగించాక పైభాగంలో పగుళ్లు వచ్చి వర్షాలకు ఉరుస్తోంది. గోడలు నెర్రెలివడంతో అధికారులు మరమ్మతులకు రూ.15 లక్షలు ఖర్చు చేశారు. రంగులేయడం, మరుగుదొడ్ల మరమ్మతులు, నేలపై టైల్స్ పరచడం తదితర పనులు చేయక అదికాస్తా మూతపడింది. దీని ముందు ప్రాంతాన్ని పార్కింగ్‌గా వినియోగిస్తున్నారు. ఇక్కడి చెత్తకుండీ మలిన వ్యర్థాలతో నిండి దుర్వాసన వెదజల్లుతోంది. ఏడేళ్లు గడుస్తున్నా తనకు.. మున్సిపల్ అధికారులు బిల్లు చెల్లించలేదని గుత్తేదారు అంటున్నారు. మరోవైపు మున్సిపల్, రెవెన్యూ అధికారులు షాదీఖానా తమ అధీనంలో లేదని చెబుతున్నారు.

2024లో పెమ్మాడపల్లిలో సర్వే నంబరు 380-1లో 7 సెంట్లు, 380-2లో 35 సెంట్ల స్థలాన్ని నూతన షాదీఖానాకు కేటాయిస్తూ నాటి కలెక్టర్ గిరీష.. జిల్లా మైనార్టీ అధికారికి ఉత్తర్వులు ఇచ్చారు. దీనికి కంచె వేయడం మినహా నిర్మాణాలు చేపట్టలేదు. కోట్ల విలువైన స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే ప్రచారం ఉంది. మున్సిపల్, రెవెన్యూ, మైనార్టీ శాఖల సమన్వయంతో నూతన షాదీఖానా భూమి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

చెరువుల్లో వ్యర్థాలు.. లోపించిన పారిశుద్ధ్యం

- ప్రబలుతున్న వ్యాధులు
- అవస్థల్లో గ్రామీణులు

న్యూస్‌టుడే, కంభంవారిపల్లి

గ్రామానికి సమీపంలో ఉన్న చెరువుల్లో ప్లాస్టిక్, కోళ్ల వ్యర్థాలు, చెత్తాచెదారం వేయడం వల్ల నీరు కలుషితమై పారిశుద్ధ్యం లోపిస్తోంది.. ఫలితంగా దోమలు వృద్ధి చెంది, జ్వరాలు, అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉంది.. కొన్ని గ్రామాల్లో చెరువులు ఊరికి దగ్గరగా ఉండటంతో గ్రామంలో ఉన్న చెత్తాచెదారాన్ని వాటిలో వేస్తున్నారు.. ప్రస్తుతం చెరువుల్లో నీరు ఉండటం వల్ల అవన్నీ కుళ్లి దుర్వాసన వస్తోంది.. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.. ప్రతిరోజు గ్రామాల్లో చెత్త సేకరణ జరుగుతున్నా కొందరు అనవసరంగా చెరువుల్లో వేస్తున్నారు.. ప్లాస్టిక్ వ్యర్థాలు సైతం వేయడం వల్ల పర్యావరణానికి ముప్పు ఏర్పడనుంది.. పారిశుద్ధ్యంపై వైద్య సిబ్బంది అవగాహన కల్పిస్తున్నా ఆచరణలో సాధ్యం కావడం లేదు.

సంబేపల్లి మండలం బుచ్చమ్మ చెరువులో ప్లాస్టిక్ వ్యర్థాలు

✶ పీలేరు మండలం బోడుమల్లువారిపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న చెరువులో స్థానికులు చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు వేస్తున్నారు.

✶ కంభంవారిపల్లె మండలం గర్నిమిట్ట చెరువు ఊరికి దగ్గరగా ఉండటంతో చెత్త, కోళ్ల వ్యర్థాలు చెరువులో వేస్తున్నారు. దీంతో నీరు కలుషితమవుతోంది. పలుమార్లు అధికారులు వారికి చెప్పినా స్పందించడం లేదు.

✶ రాయచోటి నియోజకవర్గం సంబేపల్లె మండలం బుచ్చెమ్మ చెరువులో చెత్త వేయడంతో అవన్నీ కుప్పలుగా ఉంది.

✶ గుర్రంకొండ మండలంలోని ఏనుగుల చెరువులో కోళ్ల వ్యర్థాలు వేస్తున్నారు. దీనివల్ల నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉంది.

చర్యలు తీసుకుంటాం..

చెరువుల్లో చెత్తాచెదారం వేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదు. సంబంధీకులకు నోటీసులు జారీచేస్తాం. చెత్త కోసమే సంపద కేంద్రాలు ఏర్పాటు చేశాం. ప్రతిరోజు గ్రీన్ అంబాసిడర్లు గ్రామాల్లో చెత్త సేకరిస్తున్నారు.
-రాధమ్మ, జిల్లా పంచాయతీ అధికారిణి

Passport పోయినది

Passport No: S6255296 వేంపల్లి, మహమ్మద్ గౌస్, తండ్రి వేంపల్లి చాన్‌బాషా, D.No:1/121, మంగళవీధి, చిన్నమండెం గ్రామం & మండలం, అన్నమయ్య జిల్లా, AP. INDIA. అను నేను 01-02-2026 వ తేదీన చిన్నమండెం నుండి రాయచోటికి వెళ్ళుటకు చిన్నమండెం బస్టాండ్ నందు బస్సు కోసం వేచిఉండగా నా Passport (No: S6255296) పోయినది. కావున ఎవ్వరికైనను దొరికి ఉన్నచో క్రింద తెలిపిన సెల్ నంబర్‌కు తెలియజేసి తగిన పారితోషికం పొందగలరని మనవి. ఇట్లు
వేంపల్లి మహమ్మద్ గౌస్, Cell: 7569164464

ప్రకటన

అన్నమయ్య జిల్లా, చిన్నమండెం మండలం చిన్నర్సుపల్లి గ్రామం, వడ్డెపల్లెలో ఉన్న శ్రీ గుర్రప్ప స్వామి దేవాలయంను దేవాదాయ చట్టం 30/87 ప్రకారం రిజిస్ట్రేషన్ మరియు పబ్లికేషన్ చేయుటకు అభ్యంతరం ఉన్నయెడల ఈ ప్రకటన వెలువడిన పది రోజుల్లోగా అన్నమయ్య జిల్లా దేవాదాయ అధికారి వారికి తెలియజేయగలరు. ఇట్లు
ఇన్‌స్పెక్టర్, సి.శివయ్య

(c) eenadu

మదనపల్లె

• మదనపల్లె • తంబళ్లపల్లె • పుంగనూరు

గోడ పత్రిక విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

'ఊరు బడి'ని కాపాడుదాం

పెద్దమండ్యం: విద్యా వ్యవస్థ ఉన్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'ఊరు బడి'ని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని ఎంఈవో మనోహర్ అన్నారు. మండలంలోని ఎల్లంపల్లె పాఠశాల ఆవరణలో 'ఊరు బడిని కాపాడుదాం..' పేరుతో యూటీఎఫ్ ఆధ్వర్యంలో గోడ ప్రతులు బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు భాస్కర్‌రెడ్డి, ఫయాజ్ అహ్మద్, బాబు, శివకుమార్ పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణాలు కాపాడండి

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి అన్నారు. బుధవారం కళాశాలలో జాతీయ సేవా పథకం విద్యార్థుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం సమన్వయకర్త అరుణ్‌కుమార్‌రెడ్డి, విభాగాధిపతి డాక్టర్ అమర్‌నాథ్‌రెడ్డి, అధ్యాపకులు ఈశ్వర్‌రెడ్డి, దర్షన్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న విద్యార్థులు

మేమున్నాం.. మీకు తోడుగా..

మదనపల్లె పట్టణం: 80085 74611
తంబళ్లపల్లె: 94416 29636
పుంగనూరు: 80085 74622
(10 AM TO 1 PM)

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: ? పట్టణంలోని సిద్ధార్థ థియేటర్ ప్రాంతంలో మురుగు కాలువలు శుభ్రం చేయడం లేదు. నీరు పారక దుర్వాసన వస్తోంది. - శ్రీనివాసులు, మదనపల్లె ✓ పనులు చేపడతాం. - వెంకటసుబ్బయ్య, పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్ ? కోమటివానిచెరువులో గుర్రపుడెక్క పెరిగి దుర్వాసన వస్తోంది. - వి.వి.రమణ, మదనపల్లె ✓ గుర్రపుడెక్క తొలగిస్తాం. - ప్రమీల, కమిషనర్ ? బయ్యారెడ్డికాలనీలో రహదారులపై మురుగు పారుతోంది. - బాషా, బయ్యారెడ్డికాలనీ ✓ పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. - భారతి, డిప్యూటీ ఎంపీడీవో

పుంగనూరు, న్యూస్‌టుడే: ? పుంగమ్మ చెరువు మొరవ పారుతున్నందున పట్టణ పరిధిలోని ఏటిగడ్డపాళ్యంలో సాగే కౌండిన్య నదిలో పిచ్చిమొక్కలు, వ్యర్థాలు తొలగించాలి. - రెడ్డప్ప, ఏటిగడ్డపాళ్యం ✓ అడ్డంకులు తొలగిస్తాం. - మధుసూదనరెడ్డి, కమిషనర్

పెద్దమండ్యం, న్యూస్‌టుడే: ? పెద్దమండ్యం రోడ్డులోని ప్రేమనగర్ నుంచి జడ్పీహెచ్ఎస్ వరకు కాలువలు మట్టితో పేరుకుపోయాయి. - **రమణ, పెద్దమండ్యం** ✓ చెత్త తొలగిస్తాం. - సుబ్రహ్మణ్యం, పంచాయతీకార్యదర్శి ? జండామాను వీధి నుంచి బస్టాండు వరకు రోడ్డుపై మురుగు ప్రవహిస్తోంది. - **రాజు, పెద్దమండ్యం** ✓ మురుగు కాలువల విస్తరణకు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపాం. - శ్రీధర్‌రావు, ఎంపీడీవో

తొలగిన కష్టాలు

స్పందనకు వందనం

మదనపల్లె గ్రామీణం: చీకలబైలు గ్రామ కాలువల్లో వ్యర్థాలు పేరుకున్నాయని ఈనెల 5న 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. సర్పంచి ప్రభాకర్, కార్యదర్శి బాలాజీ స్పందించి శుభ్రత పనులు చేయించారు. ● కొత్తిండ్లు పంచాయతీలో వీధి దీపాలు వెలగడం లేదని వార్త రాగా కార్యదర్శి షర్ఫ్వాద్దీన్ మరమ్మతుల పనులు చేయించారు. ● బెంగళూరు రహదారిలోని చెత్తకుప్పలను ఎంపీడీవో తాజ్‌మస్రూర్ తొలగింపజేశారు. ● ఇసుకనూతిపల్లెలో రోడ్డుపై మురుగు పారకుండా చర్యలు చేపట్టారు. ● **మదనపల్లె విద్య, న్యూస్‌టుడే:** మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లె పంచాయతీ గాంధీపురంలో మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడంపై బుధవారం **ఈనాడు**లో 'మురుగులో దిగితేనే వీధి దాటేది' శీర్షికన చిత్రవార్త ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య కార్మికులతో మురుగునీటిని శుభ్రం చేయించారు.

● **పుంగనూరు, న్యూస్‌టుడే:** కౌండిన్య కాలువలో ఏపుగా పెరిగిన జమ్మును పురపాలిక కార్మికులు తొలగించారు. బుధవారం 'ఈనాడు'లో 'ఇక్కడో కాలువ ఉండాలే' శీర్షికన చిత్రవార్త ప్రచురితమైంది. కమిషనరు మధుసూదనరెడ్డి స్పందించి పనులు చేపట్టారు.

బాలలు.. ఆటల్లో దిట్టలు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతో పాటు ఆటలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటున్నారు. చదువుతో పాటు ఆటల్లో ప్రావీణ్యం సాధిస్తూ మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై పాఠశాలకు, తమ గ్రామానికి పేరు తెస్తున్నారు పలువురు విద్యార్థులు. ఇటీవల ములకలచెరువు మండలంలో జరిగిన జిల్లా స్థాయి సబ్ జూనియర్ షూటింగ్‌బాల్ పోటీల్లో మదనపల్లె విద్యార్థులు ప్రతిభ చూపి ఈ నెల 14, 15 తేదీల్లో పల్నాడు జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరి స్ఫూర్తిపథంపై 'న్యూస్‌టుడే' కథనం.

షూటింగ్ బాల్ ఆడుతున్న క్రీడాకారులు

రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక

అమ్మానాన్నల ప్రోత్సాహంతో శిక్షణ

అమ్మానాన్న ఇచ్చిన స్ఫూర్తి, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో చదువుతో పాటు ఆటల్లో శిక్షణ తీసుకొని రాణిస్తున్నా. పాఠశాలలో షూటింగ్‌బాల్, వాలీబాల్ నేర్చుకుంటున్నా. త్వరలో పల్నాడు జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో బాగా రాణిస్తా. భవిష్యత్తులో ఆర్మీలో ఉద్యోగం చేస్తా. - **గౌస్ అజామ్, 9వ తరగతి, జడ్పీ హెచ్ఎస్, బసినికొండ, మదనపల్లె**

పోలీసునై ప్రజలకు సేవ చేస్తా..

నాకు ఆటలంటే ఇష్టం. పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయురాలు భారతి సూచనతో వాలీబాల్, కబడ్డీ, షూటింగ్‌బాల్ ఆటలో శిక్షణ తీసుకుంటున్నా. పల్నాడులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటేందుకు శిక్షణ తీసుకుంటున్నా. చదువుతో పాటు ఆటల్లో రాణించి అమ్మానాన్నలు కృష్ణవేణి, దొరస్వామినాయక్ కోరిక మేరకు పోలీసునై ప్రజలకు సేవ చేస్తా. - **విశ్వతేజనాయక్, 8వ తరగతి, జడ్పీహెచ్ఎస్, పెంచుపాడు, మదనపల్లె**

వాలీబాల్‌పై మక్కువతో రాణింపు

చిన్నప్పటి నుంచి వాలీబాల్ అంటే ఇష్టం. అమ్మానాన్న మల్లేశ్వరి, గణేష్ ప్రోత్సాహంతో పాఠశాలలో కూడా వాలీబాల్ జట్టులో ఆడుతున్నా. ఇటీవల జరిగిన జోనల్స్‌లో ఆడినా నైపుణ్యం సాధించలేకపోయా. దీంతో వ్యాయామోపాధ్యాయుడు శివశంకర్ వద్ద షూటింగ్‌బాల్‌లో శిక్షణ తీసుకున్నా. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యా. అక్కడ కూడా బాగా ఆడి జాతీయ స్థాయిలో రాణించేందుకు కృషి చేస్తున్నా. బాగా చదివి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కావాలన్నదే లక్ష్యం. - **మోక్షిత్‌సాయి, 9వ తరగతి, జడ్పీహెచ్ఎస్, బసినికొండ, మదనపల్లె**

నేడు పీటీఎం మండల సమావేశం

పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే: ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు పెద్దతిప్పసముద్రం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 10 గంటలకు మండల కార్యాలయంలో జరుగుతుందని ఇన్‌ఛార్జి ఎంపీడీవో ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఎంపీటీసీ సభ్యులతో పాటు పలు శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

సమష్టి కృషితో ప్లాస్టిక్ నియంత్రణ

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: ప్రమాదకరమైన ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని అరికట్టడానికి సమష్టి కృషి అవసరమని నగర పంచాయతీ కమిషనరు రమాదేవి తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంపై సచివాలయ ఉద్యోగులు, మెప్మా సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనరు మాట్లాడుతూ ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను వేరు చేసి సంపదగా తయారు చేయడంపై దృష్టి సారించినట్లు తెలిపారు. నగర పంచాయతీ మేనేజరు రాము, ఏఈ లోకేష్ రెడ్డి, రిసోర్స్‌పర్సన్‌లు పాల్గొన్నారు.

మొరాయించి రెండేళ్లు.. మరమ్మతుకు ఇంకెన్నాళ్లో?

పుంగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని మేలుపట్ల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 202 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన నీటిశుద్ధి యంత్రం రెండేళ్ల కిందట మొరాయించింది. అప్పటి నుంచి మరమ్మతుకు నోచుకోలేదు. ఏడాది నుంచి దాతలు ఇచ్చిన వాటర్ ఫిల్టర్‌ను ఉపయోగిస్తున్నారు. అధికారులు నీటిశుద్ధి యంత్రాన్ని వినియోగంలోకి తేవాలని విద్యార్థులు కోరుతున్నారు. దీని మరమ్మతుకు ప్రతిపాదనలు పంపామని ప్రధానోపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం తెలిపారు.

మరమ్మతుకు గురైన నీటిశుద్ధి యంత్రం

ఉపాధ్యాయుల చొరవతో సమస్య పరిష్కారం

చౌడేపల్లె, న్యూస్‌టుడే: చౌడేపల్లె మండలం దుర్గసముద్రం పంచాయతీ డి.రాజులూరు ఎంపీఎస్ పాఠశాల ఉపాధ్యాయుల చొరవతో తరగతి గదుల కొరత సమస్య పరిష్కారమైంది. ఈ పాఠశాలలో 54 మంది విద్యార్థులు ఉండగా.. తరగతి గదుల కొరత వేధిస్తోంది. ఈ నేపథ్యంలో శిథిలావస్థకు చేరిన పాత భవనాన్ని తక్కువ ఖర్చుతో వినియోగంలోకి తేవాలని ఉపాధ్యాయులు భావించారు. ఐదుగురు ఉపాధ్యాయులు సొంత ఖర్చులతో బాగు చేయడానికి ఉపక్రమించడంతో కొందరు గ్రామస్థులు చేయూతనివ్వడంతో సమస్య పరిష్కారమైంది. తరగతి గదుల కొరత తీరింది.

బాగుపడిన భవనం

ప్రజాబండి.. ఆగితే ఇంతేనండి

రామసముద్రం, న్యూస్‌టుడే: మదనపల్లె నుంచి రామసముద్రంకు బుధవారం సాయంత్రం వస్తున్న ఆర్టీసీ బస్సు బొమ్మనచెరువు వద్ద మరమ్మతులకు గురై ఆగిపోయింది. దీంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. అరగంట తర్వాత మరో బస్సులో ప్రయాణికులను తరలించారు. ఈ రోడ్డులో సామర్థ్యం సరిగా లేని బస్సులు నడపడంతో తరచూ ఈ పరిస్థితి ఎదుర్కొంటున్నామని ప్రయాణికులు వాపోయారు.

బస్సు ఆగిపోవడంతో ప్రత్యామ్నాయంగా పంపిన మరో బస్సు

ఉత్సవ విగ్రహాల స్వాధీనం.. కొండపైకి తరలింపు

రామసముద్రం, న్యూస్‌టుడే: రామసముద్రం మండలం ఆర్.నడింపల్లె పంచాయతీ బల్లసముద్రం వాలీశ్వరస్వామి ఆలయంలోని ఉత్సవ విగ్రహాలను బుధవారం దేవాదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథ్, ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు రమణారెడ్డి స్వాధీనం చేసుకున్నారు. గత శివరాత్రి ఉత్సవాల్లో ఆలయ అర్చకులు లోకనాథ దీక్షిత్, గ్రామస్థుల మధ్య నెలకున్న వివాదం తారస్థాయికి చేరింది. దీంతో గ్రామస్థులు ఉత్సవ విగ్రహాలను తమ స్వాధీనంలోకి తీసుకొని పూజలు సాగించారు. ఈ విషయం కోర్టు వరకు వెళ్లింది. ఈ ఏడాది శివరాత్రి ఉత్సవాలు జిల్లా దేవాదాయశాఖ ఆధ్వర్యంలో జరగనుండటంతో దేవాదాయ శాఖ జిల్లా అధికారి విశ్వనాథ్‌కు బాధ్యతలు అప్పగించారు. ఎస్సై ఉమామహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు విగ్రహాలను స్వాధీనం చేసుకుని కొండపైకి తరలించారు. బుధవారం సాయంత్రం శివరాత్రి ఉత్సవాన్ని అంకురార్పణతో ప్రారంభించారు. ఈ నెల 20 వరకు శివరాత్రి ఉత్సవాలు కొండపై సాగనున్నట్లు అధికారులు తెలిపారు. 16న స్వామివారి కల్యాణం, 17న బ్రహ్మరథోత్సవం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహాలను కొండపైకి తరలిస్తున్న అధికారులు

మహిళల రక్షణకు డ్రోన్ పెట్రోలింగ్: కలెక్టర్

మదనపల్లె గ్రామీణ: మహిళల రక్షణకు డ్రోన్ పెట్రోలింగ్, మాదక ద్రవ్యాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ ధీరజ్ కునుబిల్లితో కలిసి పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఐవీఆర్ఎస్ ద్వారా మహిళలపై జరుగుతున్న నేరాలు, ప్రజాప్రాయాలు, నమోదైన కేసులకు సంబంధించి, అవగాహన కార్యక్రమాలపై సమీక్షించారు. ఐవీఆర్ఎస్ వివరాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీలు మాట్లాడుతూ మహిళ రక్షణకోసం రెవెన్యూశాఖ, పోలీసుశాఖల అధికారులు సమన్వయంతో సమగ్ర కార్యాచరణ రూపొందించి అమలు చేసేయాలని ఆదేశించారు. జిల్లాలో నేరాలు తగ్గించేందుకు త్వరలో ఈగల్ క్లబ్ సభ్యులతో మెగా సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు.

పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: ఫీజు బకాయిలు రూ.1,200 కోట్లు విడుదల చేసిన విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు ప్రసాదించారని తెదేపా పట్టణ అధ్యక్షుడు నాదెళ్ల అరుణ్‌కుమార్, రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పఠాన్ ఖాదర్‌ఖాన్ అన్నారు. బుధవారం సాయంత్రం మంత్రి నారా లోకేశ్‌కు పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో తెలుగు యువత ఆధ్వర్యంలో కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం విద్యార్థులకు సకాలంలో ఫీజులు చెల్లించకపోవడంతో పేద విద్యార్థులు అర్ధాంతరంగా చదువు ఆపేశారన్నారు. మంత్రి తీసుకున్న నిర్ణయంతో రాష్ట్రంలోని లక్షలాది విద్యార్థులకు న్యాయం జరుగుతుందన్నారు. నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు ముద్దకృష్ణమనాయుడు, పట్టణ అధ్యక్షుడు ప్రణయ్‌రాయల్, ధనయాదవ్, నాగూర్‌వలి పాల్గొన్నారు.

పంటలపై ఒంటరి ఏనుగు దాడి

కల్లూరు, న్యూస్‌టుడే: మండలంలో ఏనుగుల బెడద తప్పిందనుకున్న రైతులకు మంగళవారం మళ్లీ ఒంటరి ఏనుగు పాళెం పంచాయతీలోని పంట పొలాలపై దాడి చేసింది. కోటపల్లె గ్రామానికి చెందిన దామోదర్‌నాయుడు, దామోదర, వెంకటరమణ, జూపల్లెవారిపల్లెకు చెందిన రైతు కళావతి పొలాల్లోని మామిడి చెట్ల కొమ్మలను విరిచేసి నానా బీభత్సం సృష్టించింది.

భక్తిశ్రద్ధలతో ధ్వజారోహణం

పుంగనూరు, న్యూస్‌టుడే: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని నెక్కుంది సమీపంలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో బుధవారం భక్తిశ్రద్ధలతో ధ్వజారోహణం నిర్వహించారు. ముందుగా ప్రసన్న పార్వతీదేవి, అగస్త్యేశ్వరస్వామి వారి మూలవిరాట్, ఉత్సవ విగ్రహాలను అలంకరించి పూజించారు. అర్చకులు మంజునాథదీక్షితులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రత్యేకాలంకారంలో అగస్త్యేశ్వరుడు

పూలరథంలో బాట గంగమ్మ వైభవం

ఊరేగుతున్న బాట గంగమ్మ

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే: తిరునాళ్లను పురస్కరించుకొని పట్టణంలోని నాదెళ్ల నారాయణస్వామి కాలనీలో వెలసిన బాట గంగమ్మ ప్రత్యేకంగా అలంకరించిన పూల రథంలో పురవీధుల్లో బుధవారం రాత్రి ఘనంగా ఊరేగారు. భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి ఆలయ వ్యవస్థాపకులు బి.అలివేలమ్మ, పూజారి శ్రీనివాసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

ముగిసిన సల్లాపురమ్మ గంగోడమ్మ జాతర

సోమల, న్యూస్‌టుడే: మండలంలోని పెద్దఉప్పరపల్లె సమీపంలోని సొల్లాపురం వడ్డిపల్లె, చీకలగుట్టపై వెలసిన సల్లాపురమ్మ, గంగోడమ్మ జాతర ఘనంగా ముగిసింది. బుధవారం అమ్మవార్లను ప్రత్యేక అలంకరించి అభిషేకాలు చేశారు. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రాత్రి అమ్మవార్లు పల్లకీలో ఊరేగారు. పుంగనూరు నియోజకవర్గ నాయకుడు మధుసూదన్‌నాయుడు, ఏఎంసీ ఛైర్మన్ శ్రీనివాసులునాయుడు, తెదేపా రైతు అధికార ప్రతినిధి సీఎం సురేష్, జిల్లా మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు యదుశేఖర్ నాయుడు, మండల తెదేపా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు పీఏసీసీ ఛైర్మన్ శివశంకర్, మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు తదితరులు అమ్మవార్లను దర్శించుకున్నారు.

అమ్మవారిని దర్శించుకుంటున్న మధుసూదన్‌నాయుడు తదితరులు

ఫీజు బకాయిల విడుదల హర్షణీయం

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థుల భవితను దృష్టిలో ఉంచుకుని బీసీ, ఓబీసీ, మైనార్టీ విద్యార్థులకు 2024-25 సంవత్సరానికి ఫీజు బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడం హర్షణీయమని ఎస్వీయూ పాలక మండలి మాజీ సభ్యుడు రాటకొండ గురుప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందిస్తూ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నారని కొనియాడారు.

ధర్నా విజయవంతం చేయండి

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 13న కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి పోకల మధుసూదన్ బుధవారం తెలిపారు. పీఆర్సీ ఏర్పాటు, 30 శాతం ఐఆర్ మంజూరు, సీపీఎస్ రద్దు, ఓపీఎస్ అమలు తదితర అంశాలపై ధర్నా చేస్తున్నామన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలు మెరుగుపరచడమే లక్ష్యం

కల్లూరు, న్యూస్‌టుడే: విద్యార్థుల సామర్థ్యాలు మెరుగుపరచడమే లక్ష్యంగా జీఎఫ్ఎల్ఎన్ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ఎంఈవోలు సిద్ధరామయ్య, పోకల తాతయ్య పేర్కొన్నారు. బుధవారం నన్నూరివారి పల్లె ప్రాథమిక, పుచ్చలవారిపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించి 75 రోజుల యాక్షన్ ప్లాన్‌లో పిల్లల సామర్థ్యాలను పరిశీలించి ఫలితాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీఎంసీ ఛైర్మన్ రవి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

భాజపా నాయకుల నివాళి

పుంగనూరు, న్యూస్‌టుడే: భారతీయ జనసంఘ్ పార్టీ పూర్వ అధ్యక్షుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి సందర్భంగా బుధవారం భాజపా నాయకులు ఆయన చిత్రపటానికి నివాళులు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ భాజపా అధ్యక్షుడు జగదీష్‌రాజు, నాయకులు బాబు, వెంకటరెడ్డి, ప్రసాద్, మల్లికారాణి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టించాలి

కలికిరి, న్యూస్‌టుడే: చెత్త నుంచి సంపద సృష్టించి పంచాయతీకి ఆదాయం సమకూర్చాలని డీఎల్‌డీవో లక్ష్మీపతి ఆదేశించారు. బుధవారం మండలంలోని గుట్టపాలెం సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో ఉన్న చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించి చెత్త నుంచి సంపద సృష్టించేందుకు చేపట్టాల్సిన పలు సూచనలు, సలహాలను సచివాలయ సిబ్బందికి ఇచ్చారు. అంతకుముందు సచివాలయ సిబ్బందితో సమావేశమై యూఎఫ్ఎస్ సర్వే సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. ఎంపీడీవో భానుమూర్తిరావు, డిప్యూటీ ఎంపీడీవో నవీన్, ఏపీవో మంజుల, కార్యదర్శి తిమ్మారెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సల్మా, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి వృథా.. నిత్యం వ్యథ

సోమల, న్యూస్‌టుడే: సోమల మండలం పొదలకుంటపల్లె పంచాయతీ తుగడంవారిపల్లె ప్రాథమిక పాఠశాల సమీపంలో పైప్‌లైన్ మరమ్మతుకు గురైంది. లీకైన నీరు రహదారిపై వృథాగా పోతోంది. అధికారులు చొరవ తీసుకొని పైప్‌లైన్ మరమ్మతులకు చొరవ తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

SEAFARER IDENTITY DOCUMENT
దారిపోయినది

కుర్ర వెంకటరమణ నాయక్, తండ్రి చిన్నప్ప నాయక్ డోర్ నెం. 3-60-B, టీచర్స్ కాలనీ, పప్పిరెడ్డిపల్లి గ్రామం, మదనపల్లి టౌన్ & మండలం, అన్నమయ్య జిల్లా, ఆంధ్రప్రదేశ్. నాకు సంబంధించి Sea Farer Idendity Document (SID) No: C33228330, Dt. 04-02-2026 వ తేదీన CTM రైల్వేస్టేషన్ నుండి మదనపల్లికి బస్సులో వెళ్ళుతున్న సమయంలో దారిపోయినది. ఎవ్వరికైనా దొరికినచో ఈ క్రింది నెంబర్‌కు తెలియజేయగలరు.

Cell: 8686860958

మహాశివరాత్రికి చకచకా ఏర్పాట్లు

సీటీఎం (మదనపల్లె అర్బన్), న్యూస్‌టుడే: సీటీఎం అల్లక్కతోపులోని కాశీవిశ్వేశ్వరాలయ ఆవరణలో మరమ్మతు పనులు చేపట్టామని మండల తెదేపా జడ్పీటీసీ మాజీ సభ్యుడు డి.రెడ్డిరామప్రసాద్ తెలిపారు. ఆలయ ఆవరణలో గ్రామస్థులతో కలసి బుధవారం పనులను పరిశీలించారు. ఆలయ ఆవరణతో పాటు కోనేరు, నాగదేవతల స్థలంలో చేపట్టిన మరమ్మతు పనులు మహాశివరాత్రికి పూర్తవుతాయని తెలిపారు. తెదేపా ఎంపీటీసీ మాజీ సభ్యుడు కోసూరి చిన్న వేమన్న, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చల్లా నరసింహులు, జనసేన నాయకులు దిలీప్, రాసోరి చలపతి, దేశి చలపతి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

కోనేరు వద్ద పనులు

కొండపైకీ ఉచిత ప్రయాణం

తంబళ్లపల్లె: మహాశివరాత్రి సందర్భంగా అంగళ్లు, తంబళ్లపల్లెలోని మల్లయ్యకొండ పైకి మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చని 1వ డిపో మేనేజరు ఎం.వి.రమణారెడ్డి బుధవారం తెలిపారు. సప్తగిరి ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మాత్రం కొండపైకి రాకపోకల కోసం ఛార్జి చెల్లించాల్సి ఉంటుందని డీఎం పేర్కొన్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా కొండపైకి కూడా రాకపోకల కోసం మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని యాజమాన్యం ఆదేశించిందన్నారు.

వాహనాల దారి మళ్లింపు

తంబళ్లపల్లె: మల్లయ్య కొండ ఉత్సవాల్లో భాగంగా తంబళ్లపల్లెలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా శివరాత్రి రోజున వాహనాల దారి మళ్లిస్తున్నట్లు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. మదనపల్లె బస్సులు తంబళ్లపల్లె ఆర్టీసీ బస్టాండు మీదుగా; పెద్దమండ్యం, ములకలచెరువు వాహనాలు పెట్రోల్ బంకు, పోలీస్‌స్టేషన్ మీదుగా ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చి వెళ్లేలా, మల్లయ్యకొండ కిందకు వెళ్లే వాహనాలు, బస్సులు రాగిమాను కూడలి నుంచి అక్కమ్మ చెరువు కట్ట మీదుగా బస్టాండుకు చేరుకునేలా మార్గాలను సిద్ధం చేశారు.

భక్తులకు మెరుగైన సేవలు

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రం స్వయంభు శ్రీయోగ నేలమల్లేశ్వర స్వామి ఆలయం వద్ద భక్తులకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీడీవో ఫక్రుద్దీన్ సాహెబ్, ఏవో రమేశ్‌బాబు, డిప్యూటీ ఎంపీడీవోలు బాలరాజు, లక్ష్మీపతి యాదవ్ అన్నారు. మహాశివరాత్రి ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో బుధవారం ఆలయం వద్ద అధికారులు ఏర్పాట్లు పరిశీలించారు. వాహన పార్కింగ్, ఆలయానికి వచ్చే చాందినీ బండ్లు, దుకాణాలు, క్యూలైన్ల వంటి సౌకర్యాలను కల్పించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచి రెడ్డెప్ప, నాయకులు చిన్న రెడ్డెప్పరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

ఆలయం వద్ద పరిసరాలు పరిశీలిస్తున్న ఎంపీడీవో ఫక్రుద్దీన్ సాహెబ్, అధికారులు

క్రైం కార్నర్

కర్ణాటక పోలీసుల అదుపులో మదనపల్లె మహిళ

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆంధ్రా - కర్ణాటక సరిహద్దుల్లో చోటుచేసుకున్న పుంగనూరుకు చెందిన రౌడీషీటర్ డీజే భాస్కర్ హత్య కేసుకు సంబంధించి మదనపల్లెకు చెందిన ఓ మహిళను బుధవారం కర్ణాటక రాష్ట్రం నంగిళి పోలీసులు తీసుకెళ్లినట్లు సమాచారం. హత్య కేసు దర్యాప్తులో భాగంగా టవర్ లొకేషన్లు తీసిన నంగిళి పోలీసులు చరవాణి నంబరు ఆధారంగా మదనపల్లెకు చెందిన మహిళను తీసుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు.

కత్తితో దాడి చేసిన వ్యక్తి అరెస్టు

చౌడేపల్లె, న్యూస్‌టుడే: మహిళపై కత్తితో దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై నాగేశ్వరరావు తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని దిగువపల్లె పంచాయతీ యానాదిపాళ్యానికి చెందిన గంగులమ్మపై అదే గ్రామానికి చెందిన నాగరాజు ఈ నెల 4న కత్తితో దాడి చేశాడు. బాధితురాలి తండ్రి వీరప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని బుధవారం కొలింపల్లె క్రాస్ వద్ద అరెస్టు చేసి పుంగనూరు కోర్టులో హాజరుపరిచామన్నారు.

హత్యాయత్నం కేసులో ఒకరికి రిమాండ్

ములకలచెరువు, న్యూస్‌టుడే: హత్యయత్నం కేసులో ఒకరిని రిమాండ్‌కు తరలించినట్లు ములకలచెరువు ఎస్సై ప్రతాప్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. ములకలచెరువు మండలం పాతములకలచెరువుకు చెందిన చిన్నరెడ్డెప్ప, అతని కుమారుడు సతీష్‌లపై అదే గ్రామానికి చెందిన విజయలక్ష్మి, సునీల్, విజయ్‌లు ఆస్తి విషయమై గొడవ పడ్డారు. ఈ నేపథ్యంలో రెడ్డెప్ప, అతని కుమారుడిపై విజయలక్ష్మి, సునీల్, విజయ్‌కుమార్‌లు రాళ్లతో దాడికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు ములకలచెరువు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో విజయలక్ష్మిని అరెస్ట్ చేసి తంబళ్లపల్లె కోర్టుకు తరలించారు. ఆపై రిమాండ్ నిమిత్తం మదనపల్లె సబ్‌జైలుకు తీసుకెళ్లారు.

ద్విచక్ర వాహనాల ఢీ.. వృద్ధుడికి తీవ్ర గాయాలు

పుంగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పుంగనూరు-మదనపల్లె జాతీయ రహదారిలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న శాంతినగర్‌కు చెందిన టైలర్ బాషాను బుధవారం నేతిగుట్లపల్లె వెళ్తున్న ద్విచక్ర వాహన చోదకుడు ఢీకొన్నాడు. ప్రమాదంలో బాషాకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

IN THE COURT OF THE Prl. JUNIOR CIVIL JUDGE OF MADANAPALLE

O.S.No.: 421/2025

Plaintiff : Pottigani Nagarani & Others
Defendants: Marpuri Prabhakar Naidu & Others

NOTICE TO D1 To D8

D1) M. Prabhakar Naidu, S/o M. Rangaswamy Naidu, Residing at A.V. Naidu Colony, Madanapalle Town, Annamayya District. **D2)** S.Ramalakshmi, W/o S.Sathayanarayana, Residing at Teachers Colony, Chinnathippasamudram Village and Post, Madanapalle Mandal, Annammayya Dist. **D3)** Nallapareddy Ramalinga Reddy, S/o late Maddi Reddy, Residing at RRN Colony Madanapalle Town and Mandal, Annammayya Dist. **D4)** D. Hari Prakash, S/o D. Markond Naidu, Residing at D.No:15-5, RRN Colony, Madanapalle Town and Mandal, Annammayya Dist. **D5)** G. Kavyasree, W/o Para Sudhakar, Residing at Ambachinnabba Street, Punganur Town, Annammayya Dist. **D6)** G. Someswar, S/o G. Reddeppa, Residing at D.No:9-70, Isukaneetthi Palle, H/o Basinikonda, Madanapalle, Annammayya Dist. **D7)** S. Sathyanarayana, S/o late Gangulappa Residing at Teachers Colony Chinnathippasamudram (V) & (P), Madanapalle (M),Annammayya Dist. **D8)** B. Vijayalakshmi, W/o G. Someswar, Residing D.No: 9-70, Basinikonda Village, Madanapalle (M), Annammayya Dist.

పై తెలిపిన దావా సంధు ప్రతివాదులు అయిన D1 to D8 అయిన మీరు తేది: 20-02-2026న పై తెలిపిన కోర్టు వారి ఎదుట ఉదయం 10 గం॥ 30ని॥లకు మీరు D1 to D8 ప్రతివాదులు మీరు నేరుగా కాని మీ తరఫున వకీలు ద్వారా కాని హాజరు కావలెను అని ఈ నోటీసు ద్వారా తెలియజేయుచున్నాము. అట్లు హాజరుకాని పక్షములో మిమ్ములని D1 to D8లను Exparteeగా తీర్మానించబడును అని తెలియజేయుచున్నాము.

ఇట్లు: **N.S.N. PRASAD**, B.Com. LL.B., ADVOCATE, MADANAPALLE

ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో..

జిల్లా స్థాయి ప్రతిభాపాటవ పోటీలు రేపు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి పాఠశాల-కళాశాలల ప్రతిభా పాటవ పోటీలు శుక్రవారం జరగనున్నాయి. గుంటూరు జడ్పీ ఆవరణలోని శ్రీసత్యసాయి విద్యా విహార్‌లో ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని వివిధ కేంద్రాల్లో నాలుగు నెలలుగా 120 పాఠశాలలు, 23 కళాశాలల్లో వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాసం, క్విజ్ విభాగాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో పోటీలు జరిగాయి. ప్రాంతీయ స్థాయిలో 1,003 మంది విద్యార్థులు హాజరుకాగా.. 120 మంది బహుమతులు అందుకుని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక య్యారు. గుంటూరు నగరంలోని పలు కేంద్రాలతో పాటు తెనాలి, బాపట్ల, చీరాల, మాచర్ల, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, నరసరావుపేట, చిలకలూరిపేట తదితర ప్రాంతాల్లో పాఠశాల స్థాయిలో 120 మంది, 23 కళాశాలల నుంచి నాలుగు విభాగాల్లో ముగ్గురు వంతున 276 మంది విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఎంపికైన విద్యార్థులందరూ శుక్రవారం ఉదయం 9 గంటలకు శ్రీసత్యసాయి విద్యా విహార్‌కు చేరుకోవాలని నిర్వాహకులు సూచించారు.

కోటప్పకొండకు 115 ప్రత్యేక బస్సులు

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : త్రికోటేశ్వరస్వామి తిరునాళ్లకు వెళ్లే భక్తుల కోసం చిలకలూరిపేట డిపో నుంచి బస్సులను సిద్ధం చేస్తున్నట్లు డిపో మేనేజర్ వై.వేణు బుధవారం తెలిపారు. బస్సుల పరిస్థితిని పరిశీలించి మాట్లాడారు. డిపోలో ఉన్న 40 బస్సులతో పాటు ఇతర డిపోల నుంచి 75 తెప్పించి మొత్తం 115 బస్సులు నడపనున్నట్లు తెలిపారు. తిరునాళ్ల కోసం 650 సిబ్బంది పనిచేయనున్నారని, చిలకలూరిపేట నుంచి పురుషోత్తమపట్నం, మద్దిరాల, యడవల్లి, యూటీ మీదుగా కోటప్పకొండకు వెళ్లేలా రూట్‌మ్యాప్ సిద్ధం చేశామన్నారు. తిరుగు ప్రయాణంలో కోటప్పకొండ, యూటీ మీదుగా కట్టుబడివారిపాలెం, కమ్మవారిపాలెం జంక్షన్, జాతీయ రహదారి మీదుగా ఎన్నార్టీ సెంటర్‌కు చేరుకుంటాయన్నారు. బస్సు టిక్కెట్ పెద్దలు రూ.30, చిన్నారులకు రూ.15, మహిళలు స్త్రీశక్తి పథకం ద్వారా ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపారు. ఈనెల 13నుంచి 15 వరకు ప్రత్యేక బస్సులు తిరుగుతాయని చెప్పారు. తిరునాళ్ల సందర్భంగా గతేడాది ఆర్టీసీకి రూ.17.24లక్షల ఆదాయం వచ్చిందని, ఈ ఏడాది పెరిగే అవకాశం ఉందన్నారు.

నష్టం నమోదైనా.. పరిహారం జాప్యమేనా!

- మొంథా తుపానుకు 12,700 హెక్టార్లలో దెబ్బతిన్న పంటలు
- ప్రభుత్వం నుంచి ఇంకా విడుదల కాని పెట్టుబడి రాయితీ

న్యూస్‌టుడే, బాపట్ల

మొంథా తుపాను వచ్చి వంద రోజులు గడిచినా పంట నష్టపోయిన రైతులకు నేటికీ పరిహారం అందలేదు. పెట్టుబడి రాయితీ కోసం సాగుదారులు ఎదురు చూస్తున్నారు. మరో నెలన్నరలో రబీ సీజన్ ముగియనుంది. ప్రభుత్వం వెంటనే సాయాన్ని అందజేయాలని కోరుతున్నారు.

గత అక్టోబరు 28న మొంథా తుపాను ప్రభావంతో జిల్లాలో రెండ్రోజులు భారీవర్షాలు కురిశాయి. బాపట్ల, చీరాల, కారంచేడు, పర్చూరు ప్రాంతంలో కుంభ వృష్టి సంభవించింది. 24 గంటల వ్యవధిలో 23 సెం.మీ. పైగా వర్షపాతం నమోదైంది. పర్చూరు వాగు, నల్లమడ వాగు, సాకి, ఆలేరు వాగు, కొమ్మమూరు కాలువ కట్టలు తెగి

పంట నష్టపోయిన చిన్న, సన్నకారు రైతులు (ఐదెకరాల్లోపు)	17,308
పంట నష్టపోయిన ఇతర రైతులు (ఐదెకరాల పైన)	1118
మొత్తం దెబ్బతిన్న పంటల విస్తీర్ణం (హెక్టార్లలో)	12,700
పంట నష్టం (రూ.కోట్లు)	84.16
ప్రభుత్వం ఇవ్వాల్సిన ఇన్‌పుట్ రాయితీ (రూ.కోట్లు)	29.35

గండ్లు పడి వేల ఎకరాల్లో వరి, మొక్కజొన్న, అపరాలు, పత్తి పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు. వరి పొలాలు చెరువుగా మారాయి. వారం రోజులు పైగా వరి పైరు నీటిలోనే మునిగి కొన్నిచోట్ల కుళ్లిపోయింది. సాగుదారులు ఎకరాకు రూ.15 నుంచి 18 వేల వరకు పెట్టుబడి నష్టపోయారు. లంక గ్రామాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి.

తుపానుకు నీట మునిగి కుళ్లిన పైరు

ప్రత్యేక బృందాలు వివరాలు సేకరించినా..

పంట నష్ట వివరాల సేకరణకు ప్రత్యేక బృందాలను నియమించారు. మొత్తం 12,700 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు సర్వేలో తేలింది. అత్యధికంగా వరి పంట 7882 హెక్టార్లలో దెబ్బతింది. మినుములు 1175 హెక్టార్లు, మొక్కజొన్న 870 హెక్టార్లు, పత్తి 626 హెక్టార్లలో నష్టపోయినట్లు వ్యవసాయ, రెవెన్యూ అధికారుల బృందాలు నమోదు చేశాయి. నవంబరు రెండో వారంలో గ్రామసభలు నిర్వహించి పంట నష్టపోయిన రైతుల తుది జాబితా రూపొందించి పరిహారం మంజూరు కోసం ప్రభుత్వానికి పంపించారు. కేంద్ర బృందం జిల్లాలో పర్యటించి తుపాను వల్ల కలిగిన పంట నష్టాన్ని పరిశీలించి వెళ్లింది. రైతులతో మాట్లాడి జరిగిన నష్టం వివరాలు సేకరించారు.

రైతుల ఎదురుచూపు

2024 సెప్టెంబరులో వచ్చిన కృష్ణా వరదలకు వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్న రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంట నష్ట వివరాలు వేగంగా సేకరించి 20 రోజుల్లో రైతుల బ్యాంకు ఖాతాలో పరిహారాన్ని ప్రభుత్వం జమ చేసింది. మొంథా తుపానుకు నెలరోజుల్లో పరిహారం అందుతుందని సాగుదారులు ఆశించారు. నెలలు గడుస్తున్నా ఊసే లేదు. ఇన్‌పుట్ రాయితీ సాయాన్ని విడుదల చేస్తే రబీ పంటల నూర్పిడి ఖర్చులకు ఉపయోగపడతాయని అన్నదాతలు అంటున్నారు. దీనిపై జేడీఏ విజయనిర్మల మాట్లాడుతూ తుపానుకు పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతుల వివరాలు ప్రభుత్వానికి పంపించామన్నారు. త్వరలో పరిహారం అందుతుందని చెప్పారు.

బస్సులు ఆగవు.. వెతలు తీరవు!

- స్త్రీశక్తి పథకానికి ఆదరణ ఉన్నా వెంటాడుతున్న సమస్యలు
- రద్దీతో కొన్నిచోట్ల ఆపకుండా వెళుతున్న డ్రైవర్లు

న్యూస్‌టుడే, రేపల్లె అర్బన్, చీరాల అర్బన్

రేపల్లె నియోజకవర్గం నడింపల్లికి చెందిన వెంకటేశ్వరమ్మ గుంటూరు వెళ్లేందుకు బస్టాప్ వద్ద నిలుచున్నారు. ఆర్డినరీ బస్సులో ప్రయాణికులు రద్దీగా ఉన్నారన్న నెపంతో ఆపలేదు. అరగంట సేపు వేచిఉంటే మరో బస్సు వచ్చినా ఆపకపోవడంతో చెరుకుపల్లి వరకు ఆటోలో వెళ్లి, గమ్యం చేరుకోవాల్సి వచ్చింది.

ఈపూరుపాలేనికి చెందిన నలుగురు వృద్ధులు అత్యవసరంగా గుంటూరు వైద్యశాలకు వెళ్లేందుకు బస్టాప్‌లో నిల్చున్నారు. 15 నిమిషాల్లో బస్సు వచ్చింది. ప్రయాణికులు కిక్కిరిసి ఉన్నారు. ఎక్కేనా నిల్చొనే పరిస్థితి కూడా లేదు. అరగంట తరువాత మరో బస్సు వచ్చింది. అందులోనూ అదే పరిస్థితి ఉండటంతో ఆటోలో బాపట్ల వెళ్లి, అక్కడ నుంచి గుంటూరు వెళ్లాల్సిన పరిస్థితి.

బస్సు వద్ద రద్దీ ఇలా..

స్త్రీశక్తి పథకానికి ఆదరణ లభిస్తున్నా సమస్యలు వెంటాడుతున్నాయి. జిల్లాలో రద్దీ మార్గాల్లో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా తగినన్ని బస్సులు, ట్రిప్పులు నడపడం లేదన్న విమర్శలున్నాయి. ఒక బస్సు ఆగకుంటా వెళ్లినా మరొకటి ఆగుతుందన్న నమ్మకం లేదని, ఒకవేళ ఆపినా రద్దీతో ఎక్కే పరిస్థితి ఉండటం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. బస్సుల్లో ఎక్కినా కూర్చునేందుకు సీటు దొరకడం లేదని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలని కోరుతున్నారు. అదిక బస్సులు స్త్రీశక్తి పథకానికి కేటాయించారు. వీటిలో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు నడుపుతున్నారు. పథకం ప్రారంభంలో 60 నుంచి 70 శాతం ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్)తో నడిచిన బస్సులు ప్రస్తుతం 100 శాతం దాటడంతో ప్రయాణికులు కిక్కిరిసి వేలాడుతూ ప్రయాణించాల్సి వస్తోంది.

అన్ని మార్గాల్లో..

రేపల్లె-బాపట్ల, రేపల్లె-గుంటూరు, రేపల్లె-విజయవాడ మార్గాల్లో బస్సులు ప్రయాణికులతో కిటకిటలాడుతుండటంతో అవస్థలు తప్పడం లేదు. చీరాల-ఒంగోలు, చీరాల-రేపల్లె, చీరాల-గుంటూరు, తెనాలి-చెరుకుపల్లి, తెనాలి-భట్టిప్రోలు మార్గాల్లోనూ ఇదే పరిస్థితి. ముఖ్యంగా డిగ్రీ, ఇంటర్, ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్న మార్గాల్లో బస్సుల్లో 30 నుంచి 40 వరకు నిల్చుని ప్రయాణించాల్సి వస్తోంది. రద్దీతో విసిగిపోతున్న కొందరు డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికులతో దురుసుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. బస్సుల సమస్యపై బాపట్ల ఆర్‌ఎం విమల మాట్లాడుతూ జిల్లాలో ప్రయాణికులకు ఇబ్బంది ఉంటే పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. 80 శాతం మహిళా ప్రయాణికులు ఉండే మార్గాల్లో అదనంగా బస్సులు ప్రవేశపెట్టే విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు.

ఏపీఆర్‌జేసీలో విద్యార్థుల గొడవపై విచారణ

విజయపురిసౌత్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్‌లోని ఏపీఆర్‌జే కళాశాలలో సోమవారం రాత్రి విద్యార్థుల గొడవపై కలెక్టర్ కృతికా శుక్లా ఆరా తీశారు. కలెక్టర్ ఆదేశాలతో బుధవారం గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, మాచర్ల తహసీల్దారు కిరణ్‌కుమార్ తదితరులు కళాశాలను సందర్శించారు. గొడవ గురించి విద్యార్థులు, అధ్యాపకుల నుంచి వివరాలు సేకరించారు. ఏపీ ఆర్‌ఈఐఎస్ సొసైటీ ఆర్సీఓ రమునాథ్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించి విచారణ చేపట్టారు. ప్రిన్సిపల్ సరోజిని, అధ్యాపకులు, సిబ్బందితో పలు విషయాలపై చర్చించారు. విద్యార్థుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హెచ్చరించారు. అనంతరం గాయాలపాలైన విద్యార్థులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆర్సీఓ మీడియాతో మాట్లాడుతూ వీడ్కోలు వేడుకలో జరిగిన చిన్న వివాదం విద్యార్థుల మధ్య ఘర్షణకు దారితీసిందన్నారు. ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమన్నారు. భవిష్యత్తులో పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

తర్ఫీదు నిత్యం... పతకాలే లక్ష్యం

ఇండోర్ స్టేడియంలో ఫెన్సింగ్‌లో శిక్షణ

న్యూస్‌టుడే, బాపట్ల

జిల్లా కేంద్రంలోని మినీ ఇండోర్ స్టేడియంలో ఖేలో ఇండియా కింద కేంద్ర నిధులతో శిక్షణ కేంద్రం(కోచ్)ని ఏర్పాటు చేసి పాఠశాల, కళాశాల విద్యార్థులు, యువ క్రీడాకారులకు ఫెన్సింగ్‌లో శిక్షణ ఇస్తున్నారు. వారు జాతీయ పోటీలకు ఎంపికై పతకాలు సాధించటమే లక్ష్యంగా శ్రమిస్తున్నారు.

సాధన చేస్తున్న క్రీడాకారులు

ఆంధ్రప్రదేశ్ క్రీడా సమాఖ్య(శాప్) కేటాయించిన రూ.70 లక్షల నిధులతో మినీ ఇండోర్ స్టేడియంలో మౌలిక వసతులు కల్పించారు. కేంద్రం ఖేలో ఇండియా పథకం కింద శాప్ ఆధ్వర్యంలో ఇండోర్ స్టేడియంలో ఫెన్సింగ్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. శిక్షణ ఇవ్వటానికి కోచ్ చిరంజీవిని నియమించారు. రోజూ పాఠశాలలు, కళాశాలల నుంచి 35 మంది యువ క్రీడాకారులు సాధన చేస్తున్నారు. స్టేడియంలో ఉదయం ఏడు నుంచి తొమ్మిది, రాత్రి ఏడు నుంచి తొమ్మిది గంటల వరకు రెండు విడతల్లో సాధన చేయిస్తున్నారు. బ్యాడ్మింటన్ కోర్టుల్లో క్రీడాకారులు సాధన చేస్తున్నారు. షటిల్‌లో జూనియర్స్, సబ్ జూనియర్స్ విభాగంలో బాపట్ల క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి పతకాలు గెలుస్తున్నారు. శాప్ చొరవ తీసుకుని టీటీ కోర్టులు ఏర్పాటు చేసి కోచ్‌లను నియమించి టేబుల్ టెన్నిస్ క్రీడాకారులకు శిక్షణ ఇవ్వాలని బాలల తల్లిదండ్రులు కోరుతున్నారు.

క్రీడాకారులకు శిక్షణ ఇచ్చి ప్రోత్సాహిస్తున్నాం: శ్రీనివాసరావు, జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ అధికారి

ఇండోర్ స్టేడియాన్ని క్రీడాకారులకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెచ్చాం. యువ క్రీడాకారులను కోచ్‌ల ద్వారా శిక్షణ ఇప్పిస్తున్నాం. స్టేడియాన్ని క్రీడాకారులకు మరింత అనువైనదిగా చేసేలా క్రీడా మౌలిక వసతుల కల్పనకు శాఖకు ప్రతిపాదనలు పంపాం. జాతీయ, రాష్ట్ర పోటీల్లో ప్రతిభ చూపే క్రీడాకారులను నిలిచేలా క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నాం.

జాతీయ పోటీల్లో పతకమే లక్ష్యం: గగన్‌దీర్, తొమ్మిదో తరగతి విద్యార్థి, బాపట్ల

పట్టణంలోని శ్రీపై తన్య పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నా. ఫెన్సింగ్(కత్తిసాము) అంటే చాలా ఇష్టం. సంధ్యాలలో నిర్వహించిన అండర్-19 స్కూల్ గేమ్స్ రాష్ట్ర పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం గెలిచా. ఔరంగాబాద్‌లో జాతీయ స్థాయిలో నిర్వహించిన జాతీయ పోటీల్లో పాల్గొన్నా. ఈ సారి తప్పనిసరిగా జాతీయ పోటీల్లో పతకం సాధించాలన్న లక్ష్యంతో కఠోర సాధన చేస్తున్నా.

ఆత్మరక్షణపై భరోసా: సలోమి, తొమ్మిదో తరగతి విద్యార్థిని, కర్లపాలెం

చింతాయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నా. శిక్షణ కోసం కర్లపాలెం నుంచి బాపట్లలో స్టేడియానికి వచ్చి కోచ్ వద్ద రోజూ రెండు గంటలు సాధన చేస్తున్నా. స్కూల్ గేమ్స్ అండర్-14లో రాష్ట్రస్థాయి పోటీల్లో కాంస్య పతకం సాధించా. జాతీయ పోటీల్లో పతకం గెలవడమే ధ్యేయం. ఫెన్సింగ్ నేర్చుకోవటం వల్ల ఆత్మరక్షణపై భరోసా వచ్చింది.

ప్రశాంతంగా కోటయ్యను దర్శించుకునేలా..

- పకడ్బందీగా మహాశివరాత్రి ఏర్పాట్లు
- కోటప్పకొండ ఆలయ ఈవో దాసరి చంద్రశేఖర్‌రావు

ఈనాడు, నరసరావుపేట

శివరాత్రికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా, త్వరగా దర్శనాలు అయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి ఆలయ ఈవో దాసరి చంద్రశేఖర్ రావు తెలిపారు. తిరునాళ్లు సమీపిస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లపై ఆయన 'ఈనాడు' ముఖాముఖిలో మాట్లాడారు. ఆ వివరాలు..



దర్శనాలు సులువుగా అయ్యేలా..

శివాలయాల్లో రద్దీ వల్ల తోపులాటలు చోటుచేసుకోకుండా ఈసారి ముందస్తుగానే దర్శనాలు ప్రారంభిస్తున్నాం. శివరాత్రి పురస్కరించుకుని ముందు రోజు రాత్రి ఒంటిగంట నుంచే త్రికోటేశ్వర స్వామి దర్శనాలు మొదలవుతాయి. భక్తులు వచ్చిన వారిని వచ్చినట్లు పంపుతాం. ఎక్కడా రద్దీ లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. అదనంగా క్యూలైన్లు కూడా ఏర్పాటు చేశాం. వీఐపీ దర్శన టికెట్లు టైమ్ స్లాట్‌ల ప్రకారం ఇస్తున్నాం. ఆ సమయంలోనే వారు రావాలి. ముందుగా వస్తే దర్శనం ఉండదు. ప్రోటోకాల్ దర్శనాలు ఉదయం 8:30 గంటల నుంచి 10 వరకు మళ్లీ మధ్యాహ్నం 2:30 గంటల నుంచి 4 వరకు ఉంటాయి.

భక్తులకు సేవల్లో లోపం లేకుండా..

2 లక్షల తాగునీటి సీసాలు పంపిణీకి సిద్ధం చేశాం. గతంలో ప్యాకెట్లు ఇచ్చేవారు. ఈసారి అరలీటరు సీసాలు పంపిణీ చేయనున్నాం. 75 వేల మజ్జిగ ప్యాకెట్లు, 75 వేల బిస్కట్ ప్యాకెట్లు, చిన్నపిల్లలకు వేడిపాలు సరఫరా చేస్తాం. 600 మంది వాలంటీర్లు సేవలు అందించడానికి ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకున్నారు. వీరితో పాటు ఎన్‌సీసీ, స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులు కూడా భక్తులకు ఉచితంగా సేవలందిస్తారు. కొండపైన 64 సీసీ కెమెరాలున్నాయి. ఇవి కాకుండా, అదనంగా 100 సీసీ కెమెరాలతో పర్యవేక్షణ చేపడుతున్నాం.

క్యూల రద్దీ నియంత్రణకు..

ఇదివరకు ఎప్పుడూ రాత్రిపూట పట్టువస్త్రాల సమర్పణ ఉండేది. ఈసారి సాయంత్రం 3 నుంచి 4 గంటల మధ్యలోనే స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించేలా ఏర్పాట్లు ఉంటాయి. భక్తులకు అసౌకర్యం లేకుండా క్యూలు ఆగకుండా త్వరగా స్వామి దర్శనం పూర్తయ్యేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. క్యూల వద్ద రద్దీ లేకుండా ఎక్కడికక్కడ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నాం. ఘాట్ రోడ్డులోనూ ట్రాఫిక్ ఆగకుండా ఆయా విభాగాలను అప్రమత్తం చేస్తున్నాం.

సరిపడా ప్రసాదాలు

దర్శనం చేసుకునే ప్రతి భక్తుడికి ఉచిత ప్రసాదం 20 గ్రాముల లడ్డూ అందజేస్తాం. ఇవి లక్షన్నర సిద్ధం చేస్తున్నాం. స్వామివారి ప్రసాదమైన నేతి అరిసెలు లక్ష, లడ్డూలు సుమారు రెండు లక్షలు అందుబాటులో ఉంచుతున్నాం. వీటికోసం పది కౌంటర్లు ఏర్పాటు చేశాం. నిరుడు 1.25 లక్షల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఈ సారి 1.50 లక్షల మంది వచ్చే అవకాశం ఉంది. అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నాం.

పార్కింగ్‌లో నిలిపేలా..

కార్లు, ద్విచక్ర వాహనాలకు కొండపైకి అనుమతి లేదు. కొండ కింది బాగాన వాహనాలు నిలుపుకోవడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. ఆ ప్రాంతంలోనే వాహనాలు నిలిపి ఉంచాలి. కొండపైకి భక్తులు బస్సుల్లోనే రావాలి. సొంత వాహనాలను అనుమతించం. పారిశుద్ధ్యం వంటి సమస్య తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. 80 వరకు బయో టాయిలెట్స్ సిద్ధం చేశాం. కేవలం కొండపైనే శానిటేషన్‌కు 200 మందిని నియమించాం. మున్సిపాల్టీల నుంచి కూడా కొందరు షిఫ్టుల వారీగా విధులు నిర్వహిస్తారు.

ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు సహకరించండి: ఎస్పీ

గోవాడ, (అమృతలూరు), న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా గోవాడ శైవక్షేత్రం వద్ద జరగనున్న అయిదు రోజుల ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ ఉమామహేశ్వర్ పేర్కొన్నారు. ఆయన బుధవారం ఆలయం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. దేవాదాయశాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, విద్యుత్తు సరఫరా, ఫైర్ సర్వీసులు, ఆర్టీసీ ప్రత్యేక బస్సులు, వైద్యబృందం, పశుసంవర్ధకశాఖ, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. తిరునాళ్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పూర్తి భద్రత, బందోబస్తు, పోలీస్ చెక్‌పోస్టులు, కట్ ఆఫ్ పాయింట్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. భద్రత, నిఘా కోసం 2 నుంచి 5కి.మీ పరిధిని కవర్ చేసే అధునాతన డ్రోన్లు వినియోగించి దేవాలయ పరిసర ప్రాంతాలపై నిఘా పెంచి, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పర్యవేక్షించాలని ఆయన పేర్కొన్నారు. భక్తులు సైతం జాగ్రత్తగా ఆలయానికి చేరుకుని స్వామి దర్శనం చేసుకుని సురక్షితంగా ఇంటికి తిరిగి వెళ్లాలని ఆయన సూచించారు. ఆర్డీవో రామలక్ష్మి, డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ ఆనందరావు, ఎస్సై సుమన్, కమిటీ ఛైర్మన్ పావులూరి రమేష్, సర్పంచి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్పీ ఉమామహేశ్వర్

పసుపు మిర్చి... లాభాలు తెచ్చి...

సాగుకు రైతుల ఆసక్తి

ఈనాడు, అమరావతి

ఉమ్మడి జిల్లాలో సాధారణంగా ఎర్ర మిరప సాగు ఎక్కువ. గత కొన్నేళ్లుగా నల్లతామర, బొబ్బర తెగులు, చీడపీడల సమస్యల కారణంగా పంటలు దెబ్బతింటున్నాయి. ఫలితంగా ఏటా నష్టపోవాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రయోగాత్మకంగా ఈ ఏడాది మేడికొండూరు, పెదకాకాని, పల్నాడు జిల్లా గురజాల, మాచవరం మండలాల్లో పసుపు రంగు మిర్చి సాగు చేస్తున్నారు. ఒక్క మేడికొండూరు మండల పరిధిలోనే సుమారు 400 ఎకరాల్లో ఈ రకం మిరప సాగవుతోంది.

ఆకర్షణీయంగా పసుపు రంగు మిర్చి

కారణాలివీ..

- ఈ రకం మిర్చి తామర పురుగుతో పాటు, బొబ్బర తెగులు వివిధ రకాల వైరస్‌లు తట్టుకునే గుణం ఎక్కువగా కలిగి ఉంటుంది.
- మందపాడులో కొంతమంది రైతులు మూడేళ్ల కిందట ప్రయోగాత్మకంగా సాగు చేశారు. దిగుబడి ఆశాజనకంగా ఉండటం, అప్పట్లో ఒక్కో క్వింటా ధర రూ.50 వేల నుంచి రూ.60 వేల దాకా పలకడంతో లాభదాయకంగా మారింది.
- గత రెండేళ్లుగా ఎర్ర మిర్చి సాగు చేసిన రైతులు వివిధ కారణాలతో నష్టపోయారు. దీంతో మరోసారి పసుపు రంగు మిర్చి సాగుకు మొగ్గు చూపారు.
- ఒక్క మందపాడులో గ్రామంలోనే 200 ఎకరాల్లో సాగులో ఉంది.
- ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా. ప్రస్తుతం క్వింటా రూ.35 వేల నుంచి రూ.40 వేల దాకా ధర పలుకుతోంది.

బొబ్బర తెగులు రాలేదు..

మూడెకరాల్లో పసుపు రంగు మిర్చి సాగు చేశాం. ఇప్పటి వరకు బొబ్బర తెగులు రాలేదు. ఒక్కో ఎకరాకు సుమారు రూ.2 లక్షలు ఖర్చయింది. వాతావరణం అనుకూలిస్తే సుమారు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల దాకా లాభం వచ్చే అవకాశం ఉంది.

– సూర్యదేవర వెంకటేశ్వరావు, మందపాడు

ఔషధ గుణాలు పుష్కలం..

పసుపు రంగు మిర్చిలో ఔషధ గుణాలు ఎక్కువ.. తెగుళ్ల బెడద తక్కువ. అంతర్జాతీయ మార్కెట్లోనూ మంచి డిమాండ్ ఉంది. అన్ని జాగ్రత్తలు పాటిస్తే ఎకరాకు సగటున 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

– లక్ష్మీ, ఏవో, మేడికొండూరు మండలం

ద్విచక్రవాహనంపై మృతదేహం తరలింపు ఘటనపై మంత్రి ఆరా

బాపట్ల, న్యూస్‌టుడే: బాపట్ల ఏరియా ఆసుపత్రి నుంచి ద్విచక్రవాహనంపై మృతదేహం తరలింపు ఘటనపై జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్థసారథి కలెక్టర్ వినోద్‌కుమార్‌కు, బాపట్ల ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ సిద్ధార్థకు ఫోన్ చేసి ఆరా తీశారు. జిల్లాలో అందుబాటులో ఉన్న అంబులెన్సులు, వాటి కొరత, మహాప్రస్థానాలు తదితర అంశాలపై కలెక్టర్‌తో చర్చించారు. మృతదేహాన్ని బైకుపై తీసుకెళ్లేంత పరిస్థితి ఎందుకొచ్చిందని కలెక్టర్‌ను మంత్రి ప్రశ్నించారు. ఆసుపత్రి సిబ్బందికి చెప్పకుండా మృతుడి కుటుంబ సభ్యులు ద్విచక్రవాహనంపై తీసుకెళ్లారని కలెక్టర్ బదులిచ్చారు. అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, పేదవారికి ఏ ఇబ్బంది రాకుండా చూసుకోవాలని ఆదేశించారు.

ఫోన్‌లో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

రుణం.. ఎగనామం

- నిద్ర మత్తులో డీసీసీబీ
- రూ. 20కోట్లకుపైగా పేరుకున్న బకాయిలు

ఈనాడు, అమరావతి

శీతల గోదాముల్లో మిర్చి నిల్వ చేసి.. కేంద్ర సహకార బ్యాంకు పరిధిలోని గురజాల, నల్లపాడు శాఖల్లో తీసుకున్న రుణ బకాయిల వసూళ్లలో ముందడుగు కానరావడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా రుణాలిచ్చిన బ్యాంకు అధికారులపై చర్యలు తీసుకున్న యంత్రాంగం బాధ్యులైన రుణగ్రహీతలపై చర్యలకు వెనకడుగు వేస్తోంది. దాదాపు రూ.20 కోట్లకుపైగా బకాయి పేరుకుపోయింది.

గురజాల శాఖలో... ఇక్కడి శీతల గోదాము యజమాని రైతులు మిర్చి నిల్వ చేసినట్టు చూపించి వారి పేరుతో రుణం తీసుకున్నారు. వైకాపా హయాంలో బ్యాంకు పాలకవర్గంలో కీలకంగా వ్యవహరించిన నేత అప్పటి ఉద్యోగులపై ఒత్తిడి తెచ్చి ఈ రుణం మంజూరు చేయించారు. ఏడాదిలోగా రికవరీ కాకపోవడంతో బ్యాంకు అధికారులు తనిఖీ చేసినప్పుడు అసలు గుట్టు బయటపడింది. గోదాము యజమాని మిర్చిని సైతం అమ్మేసుకున్నట్టు తేలింది. రైతులను విచారించగా.. రుణం తీసుకున్న విషయమే తెలియదని స్టేట్‌మెంట్లు ఇచ్చారు. బ్యాంకు అధికారులు ఇప్పటికీ ఒక్క రూపాయి కూడా వసూలు చేయలేకపోయారు.

✤ ఇప్పటికే క్రిమినల్ కేసులు నమోదైనందున పోలీసులు విచారణ చేస్తే బాధ్యులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

నల్లపాడు శాఖలో.... శీతల గోదాముల్లో మిర్చి నిల్వ చేసినవారి పేరిట వైకాపా నేతల ఒత్తిడితో నిబంధనలకు విరుద్ధంగా రూ.70 కోట్లకుపైగా ప్లెడ్జ్ రుణాలిచ్చారు. ప్రారంభంలో రికవరీ బాగానే ఉన్నా.. కొన్నాళ్లకు చెల్లింపులు ఆగిపోయాయి. శీతల గోదాముల్లో మిర్చిని పరిశీలించకుండానే పరిమితికి మించి రుణాలిచ్చినట్టు తరువాత వెలుగులోకొచ్చింది.

అయినా.. బ్యాంకు అధికారులు నిర్మాణాత్మక చర్యలు తీసుకోలేదు. 51విచారణలో.. రాఘవేంద్ర, విశ్వసాయి గోదాముల్లో మిర్చి తనఖా పెట్టి తీసుకున్న రూ.13.15 కోట్ల బాకాయి తీర్చలేదని గుర్తించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో అడుగు ముందుకు పడడం లేదు. రైతుల పేరుతో రుణాలు కొల్లగొట్టిన వారు మాత్రం బయట దర్జాగా తిరుగుతున్నారు. సాంకేతికంగా రైతుల పేరుతో రుణం మంజూరైనందున ఇటీవల ఒక శీతల గోదాము యజమాని కొంత సొమ్ము చెల్లించారు. ఇంకా రూ.9 కోట్లకుపైగానే వసూలు కావాల్సి ఉంది.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించండి

బాపట్ల, న్యూస్‌టుడే : రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ వి.వినోద్ కుమార్ అన్నారు. బాపట్ల ఏరియా వైద్యశాలలో ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే ప్రతి సంతోషంగా ఇంటికి వెళ్లాలన్నారు. వైద్యం కోసం వచ్చే వారితో మర్యాదగా నడుచుకోవాలన్నారు. రోగులకు అవసరమైన ఔషధాలు ముందస్తుగా నిల్వ చేసుకోవాలని చెప్పారు. మందులు అందుబాటులో లేకుంటే అత్యవసరంగా కొనుగోలు చేయాలని సూచించారు. వైద్యం పొందుతున్న రోగులతో ఆయన మాట్లాడి సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు 350 నుంచి 450 మంది వైద్య పరీక్షలకు ప్రజలు వస్తుంటారని స్థానిక అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఓపీ విభాగం దస్త్రాలను పరిశీలించారు. ఆసుపత్రిలో నెలకు 60 కాన్పులు జరుగుతుండగా బ్లడ్‌బ్యాంకు లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. ఎముకలు కీళ్ల పరీక్షల గది, ఇంజెక్షన్ల గదుల్లో ఒక బెడ్ కూడా లేకుండా వైద్యం ఎలా చేస్తారని వైద్యులను నిలదీశారు. డీఎంహెచ్‌వో విజయమ్మ, వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దార్థ, డాక్టర్ పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

బాలింతల వార్డులో పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

నేటి నుంచి స్వచ్ఛ భారత్ మిషన్‌పై శిక్షణ

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: ఉమ్మడి గుంటూరు జిల్లాలో స్వచ్ఛ భారత్ మిషన్‌లో ప్రభుత్వం నిర్ణయించిన స్వచ్ఛత కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించేలా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగులకు శిక్షణ తరగతులు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించారు. గుంటూరులోని జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో గురువారం నుంచి రెండు రోజుల శిక్షణ తరగతులు ప్రారంభించనున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన 57 మండలాల ఎంపీడీవోలు, డీఎల్‌పీవోలు, డీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు హాజరు కావాలని జిల్లాపరిషత్తు సీఈవో వి.జ్యోతిబసు ఉత్తర్వులు జారీ చేశారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో నిర్మించిన వ్యక్తిగత కుటుంబ మరుగుదొడ్ల (ఐహెచ్‌హెచ్‌ఎల్)ను వినియోగించడం ద్వారా 100 శాతం బహిరంగ మల విసర్జన రహితంగా చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో జిల్లా స్థాయిలో డీపీఆర్‌సీ ద్వారా శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 12 నుంచి 17వ తేదీ వరకు కిచెన్ గార్డెన్ల ఏర్పాటు, ప్లాస్టిక్, ఘన, ద్రవ వ్యర్థ పదార్థాల నిర్వహణపై విడతల వారీగా ఉద్యోగులకు శిక్షణ ఇస్తారు. ఆయా తేదీల్లో నిర్ణయించిన శిక్షణ కార్యక్రమాలకు మండలాల సిబ్బందిని విధిగా పంపాలని ఎంపీడీవోలను సీఈవో ఆదేశించారు.

(c) eenadu

ఇంటర్ విద్యార్థులకు 'సంకల్ప్' ఈనెల 20 వరకు ప్రత్యేక శిక్షణ

శిక్షణ తరగతులకు హాజరైన విద్యార్థులు

బెస్తపాలెం, పావరాజుతోట, కారంచేడు గేటు(చీరాల అర్బన్), న్యూస్‌టుడే: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించి ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణత సాధించేలా ఇంటర్ విద్యార్థులు 'సంకల్ప్' అనే పేరుతో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని విద్యాశాఖ అమలు చేస్తోంది. దీన్ని ఈనెల 20వ తేదీ వరకు కొనసాగించనున్నారు. బాపట్ల జిల్లాలో 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. వీటిల్లో 2381 మంది విద్యార్థులు చదువుతున్నారు. గత ఏడాది నవంబరులో దీన్ని ప్రవేశపెట్టి విద్యాసామగ్రి సైతం అందజేశారు. ఆయా పాఠ్యాంశాల్లో నిపుణులతో తరగతులు నిర్వహించడమే కాకుండా వారికి వచ్చే అనుమానాలను సైతం నివృత్తి చేస్తున్నారు. ప్రతిరోజు పరీక్షలు పెట్టి వారి సామర్థ్యాలను గుర్తించి, తక్కువ మార్కులు వచ్చే వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.

ఆన్‌లైన్‌లో మార్కులు

సబ్జెక్టుల వారీగా వచ్చిన మార్కులను ఎప్పటికప్పుడు ఇంటర్ బోర్డుకు ఆన్‌లైన్‌లో నివేదిస్తున్నారు. వీటి ఆధారంగా విద్యార్థి సామర్థ్యాన్ని గుర్తించి మరుసటి పరీక్షల్లో మరింత రాణించేలా తీర్చిదిద్దుతున్నారు. ఇటీవల ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించారు. వీటిల్లో ప్రథమ సంవత్సరంలో 1240 మంది విద్యార్థులు ఉండగా పరీక్షకు 982 మంది హాజరుకాగా 587 మంది ఉత్తీర్ణత సాధించడంతో 60 శాతంగా నమోదైంది. ఇక ద్వితీయ సంవత్సరంలో 1141 మందికి 864 మంది పరీక్షలు రాయగా 579 మంది ఉత్తీర్ణత పొందగా 67 శాతంగా ఉంది. ఈ ఫలితాల ఆధారంగా పబ్లిక్ పరీక్షల్లో జిల్లాకు వచ్చే ర్యాంకును అధికారులు గుర్తించి, దానికన్నా మెరుగైన ఫలితాలు సాధించేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు ఇంటర్ అధికారులు పేర్కొంటున్నారు.

మార్టూరు బాలికలకు అరుదైన అవకాశం

అమరావతిలో సచివాలయం వద్ద విద్యార్థినులు

మార్టూరు, న్యూస్‌టుడే: మార్టూరు విద్యార్థినులకు అరుదైన అవకాశం దక్కింది. రాష్ట్రంలో తొలిసారి ప్రత్యక్షంగా అసెంబ్లీ సమావేశాలను వీక్షించే అవకాశం ఈ పాఠశాల బాలికలకు లభించింది. మార్టూరులోని మద్ది సత్యనారాయణ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు అమరావతిలోని అసెంబ్లీలో బుధవారం నుంచి ప్రారంభమైన బడ్జెట్ సమావేశాల్లో పాల్గొన్నారు. అసెంబ్లీలోని గ్యాలరీ నుంచి ప్రజాప్రతినిధులు పాల్గొనే సమావేశాలను ప్రత్యక్షంగా వీక్షించారు. విద్యాలయానికి చెందిన 30 మంది గ్రామీణ కూర్పుని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో పాటు పలువురు ఎమ్మెల్యేల ప్రసంగాలను ఆసక్తిగా తిలకించి, ఆనందం వ్యక్తం చేశారు. గతంలోనూ ఈ బడికి చెందిన విద్యార్థులు మాక్ అసెంబ్లీలోనూ పాల్గొన్నారు. ఎస్‌సీసీ ఉపాధ్యాయుడు అన్నం శ్రీనివాసరావు, పీఈటీ పోలినేని కోటేశ్వరరావు వీరి వెంట ఉన్నారు. తమకు ఈ అవకాశం కల్పించిన స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, సీఎం చంద్రబాబునాయుడు, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌కు విద్యార్థినులు కృతజ్ఞతలు తెలిపారు.

స్వచ్ఛమైన నీటిని ప్రజలకు అందించాలి

కారంచేడు మండలం జరుబులవారిపాలెంలో ఫిల్టర్‌బెడ్ల పనులు పరిశీలిస్తున్న ఎస్ఈ అనంతరాజు, డీఈ సతీష్ చంద్ర

కారంచేడు, పర్చూరు, యద్దనపూడి, మార్టూరు, న్యూస్‌టుడే: రానున్న వేసవి దృష్ట్యా గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీటిని ప్రజలకు అందించేందుకు ప్రణాళికతో ముందుకెళ్లాలని ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎం.అనంతరాజు సూచించారు. బుధవారం కారంచేడు, పర్చూరు, యద్దనపూడి, మార్టూరు మండలాల్లో వివిధ దశల్లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను, మంచినీటి చెరువులను, ఓవర్‌హెడ్ ట్యాంకులను డీఈ ఎస్.సతీష్‌చంద్రతో కలిసి పరిశీలించారు. పనుల పురోగతిని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కారంచేడు మండలంలోని కారంచేడు, స్వర్ణ, నాయుడువారిపాలెం, దగ్గుబాడు, పీహెచ్‌సీలోని మరుగుదొడ్ల నిర్మాణాలు, జరుబులవారిపాలెంలోని మంచినీటి ఫిల్టర్‌బెడ్ల పనులు, దగ్గుబాడులో వాటర్ ట్యాంకు, పర్చూరులోని మంచినీటి చెరువు, యద్దనపూడి మండలం పూనూరులో రూ.92 లక్షలతో పూర్తి చేసిన జల జీవన్ మిషన్ పనులను పరిశీలించారు. తనుబొద్దివారిపాలెంలో సీపీడబ్ల్యూఎస్ పథకానికి డీఎంఎఫ్ నిధులు రూ.27 లక్షలతో జరిగిన ఫిల్టర్‌బెడ్ల పనులు, మార్టూరు మండలంలోని కోనంకి జడ్పీ ఉన్నత పాఠశాల, కోలలపూడిలోని ప్రాథమిక పాఠశాలలో చేపట్టాల్సిన మరమ్మతులకు సంబంధించి సూచనలు చేశారు. గ్రామాల్లోని మంచినీటి చెరువులను నూరుశాతం నింపాలని సూచించారు. ఎప్పటికప్పుడు వాటర్ ట్యాంకులను పరిశీలిస్తూ క్లోరినేషన్ పనులు చేపట్టాలన్నారు. వెంట ఏఈలు ఎ.కార్తీక్, ఎన్.చైతన్య, ఎ.బ్రహ్మయ్య, జి.నాగరాజు, ఎంఈవో వస్రామ్‌నాయక్ ఉన్నారు.

చేనేత కుటుంబాల్లో వెలుగులు

న్యూస్‌టుడే, భట్టిప్రోలు, రేపల్లె అర్బన్

ఆర్థిక ఇబ్బందులతో ఉన్న చేనేత కార్మికులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చటానికి రంగం సిద్ధం చేసింది. మగ్గం నేసే ప్రతి చేనేత కార్మికుడుకి 200 యూనిట్ల వరకు ఉచితంగా కరెంట్‌ను అందించనుంది. ఏప్రిల్ నెల నుంచి అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత ప్రకటించడంతో కార్మికులు ఆనందోత్సాహాలతో ఉన్నారు. రాత్రి సమయంలో మగ్గం నేతకు ఎంతో ఉపయోగం. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న కార్మికులకు కొంతమేర వెసులుబాటు ఉంటుంది. ముఖ్యంగా జిల్లా పరిధిలో బాపట్ల, చీరాల, వేటపాలెం, ఈపూరుపాలెం, చెరుకుపల్లి, భట్టిప్రోలు, రేపల్లె మండలాల్లో కార్మికులు అధికంగా ఉన్నారు.

పూర్తి చేసిన సర్వే.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ సచివాలయాలు ద్వారా డ్వాక్రా గ్రూపుల యానిమేటర్లు ద్వారా సర్వే చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపారు. జిల్లా పరిధిలో 8900 మంది కార్మికులు ఉండగా, వీరిలో 6500 మంది వరకు ఈ పథకానికి అర్హులని సర్వేలో తేల్చారు. విద్యుత్తు శాఖ అధికారులు మరోసారి సర్వే చేసి పథకాన్ని అమలు చేస్తారని ఆ శాఖ జిల్లా ఏడీ రఘునాథన్ తెలిపారు. పూర్తిస్థాయిలో సర్వే చేస్తే మరికొన్ని మగ్గాలు పెరిగే అవకాశం ఉందన్నారు.

చేనేత కార్మికులకు ఊరట.. పరిశ్రమను నమ్ముకొని జీవిస్తున్న కార్మికులకు ఈ పథకం అమలైతే కొంత ఊరట లభిస్తుంది. పగలు వేరే వృత్తుల్లో పని చేస్తూ చాలామంది రాత్రి సమయాల్లో మగ్గం నేస్తున్నారు. ఇటువంటి కార్మికులకు మేలు. పెరిగిన ధరలు దృష్ట్యా చాలీచాలని వేతనాలతో అవస్థలు పడుతున్నారు. ఉచిత విద్యుత్తు అమలు ద్వారా తమకు లబ్ధి చేకూరుతుందని కార్మికులు చెబుతున్నారు.

విద్యుత్తు విజిలెన్స్ అధికారుల దాడులు

రూ.11.64 లక్షల జరిమానా విధింపు

కర్లపాలెం, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖ విజిలెన్స్, ఆపరేషన్ విభాగం ఆధ్వర్యంలో కర్లపాలెం సెక్షన్‌లో బుధవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. 25 మంది అధికారులు 150 మంది సిబ్బంది 72 బృందాలుగా ఏర్పడి 4,890 సర్వీసులను తనిఖీ చేశారు. అదనపు లోడు వాడుతున్న 361 మందిని గుర్తించి రూ.9.89 లక్షలు, ఇతర కేటగిరిలో అదనపు విద్యుత్తు వాడుతున్న 8 మందికి రూ.62,000, విద్యుత్తు చౌర్యానికి పాల్పడుతున్న 21 మందికి రూ.1.07 లక్షలు అపరాధ రుసుం విధించినట్లు విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.భాస్కరరావు తెలిపారు. ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.భాస్కరరావు, బాపట్ల, చెరుకుపల్లి, రేపల్లె, చుండూరు డీఈలు శ్రీనివాసరావు, సురేష్, శ్యామ్ సుందర్, రాజశేఖర్‌బాబు, విజిలెన్స్ డీఈ విజయ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అమరావతిలో శాసనసభ సమావేశాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ఎస్‌కే అబ్దుల్ నజీర్ ప్రసంగించారు. తొలి రోజు సమావేశానికి పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ హాజరయ్యారు. - బాపట్ల, మార్టూరు, న్యూస్‌టుడే

ప్రత్యేక అవసరాల పిల్లల అభ్యున్నతే ధ్యేయం

విద్యార్థినికి జ్ఞాపిక, ధ్రువపత్రం అందజేస్తున్న జినోఆరుషి, జోత్స్న

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: ప్రత్యేక అవరాలున్న పిల్లల అభ్యున్నతే ధ్యేయమని ఎక్సెప్షనల్ లెర్నింగ్ ఫౌండర్, డైరెక్టర్ జినోఆరుషి అన్నారు. రేపల్లె భవిత కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ భవిత, ఆటిజం కేంద్రాల్లో విద్యాబుద్ధులు నేర్చుకునే విద్యార్థుల కోసం దృష్టి యాప్ రూపొందించామన్నారు. యాప్‌లో పిల్లల వివరాలు, వారికి అందిస్తున్న విద్య, వైద్య సేవలతోపాటు ఉపాధ్యాయులు నేర్పించే అభ్యసనాలు ఉంటాయని తెలిపారు. ఈ యాప్ పనితీరు దాని వల్ల కలిగే ప్రయోజనాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఎప్పటికప్పుడు భవిత, ఆటిజం కేంద్రాలను మోనిటరింగ్ చేస్తూ పిల్లల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించవచ్చని చెప్పారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపిక, ధ్రువపత్రం అందజేశారు. సహిత విద్య జిల్లా సమన్వయకురాలు మట్టా జోత్స్న, ఉపాధ్యాయినులు అనురాధ, సుకన్య, సిబ్బంది సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

కొండవీటి రెడ్డిరాజుల శాసనాల పరిశీలన

యడ్లపాడు: కొండవీడు కోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కల్లి శివారెడ్డి బుధవారం సింహాచలంలోని నరసింహస్వామి ఆలయాన్ని సందర్శించి కొండవీటి రెడ్డిరాజుల శాసనాలను పరిశీలించారు. కొండవీటి రెడ్డిరాజులలో సుప్రసిద్ధుడు అనవేమారెడ్డితో పాటు కాటయ వేమారెడ్డి, కుమార గిరిరెడ్డి, వీరభద్రారెడ్డి, పేద కోమటి వేమారెడ్డి తూర్పుదేశ దండయాత్రలో భాగంగా ఆంధ్రప్రదేశ్ నుంచి ఒడిశా వరకు పలు రాజ్యాలు, దుర్గాలు జయించారన్నారు. ఇందులో భాగంగా సింహాచలంలోని నరసింహస్వామి దేవాలయంలో 'అనవేమనగర' అనే మండపాన్ని నిర్మించి స్వామివారి ధూపదీప నైవేద్యాలకు, కల్యాణానికి దానాలు చేశారన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

కర్లపాలెం, న్యూస్‌టుడే: గుండెపోటుతో మృతి చెందిన చింతాయపాలెం పంచాయతీ రాళ్లచెరువుకు చెందిన నక్కా నాగేశ్వరరావు కుటుంబాన్ని కలెక్టర్ వినోద్‌కుమార్ బుధవారం పరామర్శించారు. వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. నిరుపేద కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. మృతుడి మరణ ధ్రువీకరణ పత్రాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతుని భార్యకు వితంతు పింఛను మంజూరు చేస్తామని చెప్పారు. రాళ్లచెరువు వద్ద నివాసం ఉంటున్న కుటుంబాలకు నివాస స్థలాలతో పాటు గృహాలు మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా నేరుగా తమ దృష్టికి తీసుకురావచ్చని సూచించారు. అనంతరం రెడ్‌క్రాస్ సంస్థ వారు ఏర్పాటు చేసిన నిత్యావసర సరకులు, దుస్తులను బాధిత కుటుంబానికి కలెక్టర్ అందించారు. ఆర్డీవో గ్లోరియా, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి అబ్బులు, తహసీల్దారు శ్రీదేవి, ఎంపీడీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నూరు శాతం బడ్జెట్ ఖర్చు చేయాలి

బాపట్ల, న్యూస్‌టుడే: వ్యవసాయం దాని అనుబంధ శాఖలకు కేటాయించిన బడ్జెట్ వంద శాతం ఖర్చు చేయాలని కలెక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని న్యూ వీడియో సమావేశం హాలులో వ్యవసాయం, అనుబంధ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షల్లో మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ఏపీఎఫ్ఆర్ సర్వే పూర్తి చేయాలన్నారు. గత ఏడాది నుంచి జరుగుతున్నా ఇప్పటి వరకు 79 శాతం పూర్తి చేయడంపై జేడీని ప్రశ్నించారు. రబీ, ఖరీఫ్ సీజన్‌లో విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల సరఫరా పరిస్థితిని క్షేత్రస్థాయి సిబ్బందితో ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. సీపీవో ఎస్ రాజు, జేడీ విజయనిర్మల, ఏడీఏ అన్నపూర్ణ, మార్క్‌ఫెడ్ మేనేజరు కరుణశ్రీ, మార్కెటింగ్ ఏడీ రమేష్ ఉన్నారు.

అధిక ఛార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు

బాపట్ల: ప్రైవేటు అంబులెన్సు యజమానులు ప్రభుత్వం నిర్ణయించిన రవాణా ఛార్జీల మేరకే ఫీజులు వసూలు చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని న్యూ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఎస్పీ ఉమామహేశ్వర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అనివార్య పరిస్థితుల్లో రోగులు మృతి చెందిన సందర్భాల్లో మృతదేహాన్ని తరలించే బాధ్యత సంబంధిత ఆసుపత్రి సూపరింటెండెంట్, మెడికల్ ఆఫీసర్లదేనని స్పష్టం చేశారు. అంబులెన్స్ సేవల పేరుతో అదనపు రుసుములు వసూలు చేయడం, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే సహించబోమని హెచ్చరించారు. డీఎంహెచ్‌వో విజయమ్మ, డీసీహెచ్ డాక్టర్ పద్మావతి పాల్గొన్నారు.

అసత్య ప్రచారం చేస్తే..

సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ ఉమామహేశ్వర్ హెచ్చరించారు. కచ్చితత్వం లేకుండా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం చట్టపరమైన నేరమని స్పష్టం చేశారు. ప్రజల్లో అపోహలు, గందరగోళం కలిగించే విధంగా పోస్టులు, సందేశాలు పంపితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

బియ్యం నిల్వలపై అధ్యయనం

గోదాములో వివరాలు నమోదు చేసుకుంటున్న విద్యార్థులు

బాపట్ల వెస్ట్, న్యూస్‌టుడే: బాపట్ల వ్యవసాయ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు బియ్యం నిల్వలపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేపట్టారు. బుధవారం రాష్ట్ర గిడ్డంగుల సంస్థలోని బియ్యం నిల్వలు, వాటి నాణ్యతపై పరిశోధనలు చేశారు. బియ్యం ఎలా నిల్వ చేయాలి, వాటి నాణ్యత గుర్తింపు, పురుగులు పడితే ఎటువంటి మందులు వినియోగించాలి, ఎన్ని రోజులు నిల్వ చేయాలనే విషయాలపై వీరికి గిడ్డంగుల సంస్థ ఇన్‌ఛార్జి ఎల్.సి. శ్రీనివాసరెడ్డి వివరించారు. అసిస్టెంట్ టీచింగ్ స్టాఫ్ కావ్య, టెక్నికల్ సహాయకుడు సుగంధరావు పాల్గొన్నారు.

సొసైటీ ఎన్నికలకు నామినేషన్లు దాఖలు

ఎన్నికల అధికారికి నామినేషన్ అందజేస్తున్న అభ్యర్థి అశోక్

కొత్తపేట(వేటపాలెం), న్యూస్‌టుడే: ఐఎల్‌టీడీ స్టాఫ్ కో-ఆపరేటివ్ ఇండస్ట్రియల్ హౌస్ కన్‌స్ట్రక్షన్ లిమిటెడ్ పాలకవర్గం ఎన్నికలకు సంబంధించి బుధవారం స్థానిక సొసైటీ కార్యాలయంలో న్యాయవాది, ఎన్నికల అధికారి, మాగంటి సాయికృష్ణ పోటీలో ఉన్న వారి నుంచి నామినేషన్లు స్వీకరించారు. పోటీల్లో డేటా అశోక్, పీజే ప్రసాద్, టీసీహెచ్ వెంకటేశ్వర్లు ప్యానల్స్ నుంచి 15 మంది, స్వతంత్రులుగా మరో నలుగురు నామినేషన్లు దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఈనెల 3న ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేయగా బుధవారంతో నామినేషన్ల ప్రక్రియ ముగిసిందన్నారు. 12న పరిశీలన, 13న ఉపసంహరణతో పాటు పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తామన్నారు. 22వ తేదీ ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. అదే రోజు లెక్కించి, విజేతలను ప్రకటిస్తామని చెప్పారు. నామినేషన్లను పురస్కరించుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

EENADU Classifieds

AUTO

VEHICLES FOR SALE

AP-39-TH-0626 Maruti Swift Dzire Car Model 2019 is for Sale in as is Where is Condition. Sundaram Finance Ltd. Guntur. ✆ 0863-2241386, 94409 09736.

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్‌క్యాష్). ✆ 81422 92071.

REAL ESTATE

FLAT FOR SALE

GENERAL

గుంటూరు పట్టణంలో సంగడిగుంటలోని లాంచెస్టర్ రోడ్డులో ఉన్న లక్ష్మీ రాఘవేంద్ర టవర్స్ లోని 3వ అంతస్తులో తూర్పు ఫేసింగ్ 3BHK అపార్ట్మెంట్ (1654చ.అ.) అమ్మకమునకు కలదు. సంప్రదించవలసిన ఫోన్: 94414 11874.

PLOT FOR SALE

GENERAL

గుంటూరు సిటీ 1500 చ||గ|| E/F ప్లాట్ సేల్. గోరంట్ల, ఆదిత్రి యెల్లోరా ప్రక్కన, శిల్పారామం, అమరావతి రోడ్డుకు 1km, గ. Rs.16000. ✆87908 94569.

JOBS

TECHNICAL Skills Nerchukoni Job lo set avvali anukone vallaku sada avakasam. Training period 1 month. if you are ready to join Job after Course. No Interview. More detailes Contact: 8712625322 in between 8 am to 9 am. Limited Seats only.

బస్సుడ్రైవర్స్ కావలెను. హెవీ లైసెన్స్‌తో పాటు కనీసం 5సం||ల అనుభవం కలిగిన డ్రైవర్స్ కావలెను. రూట్లు: మంగళగిరి, కేసరపల్లి, భవానీపురం, కంచికచర్ల, గంగినేనిపాలెం, వత్సవాయి, గట్టు భీమవరం, నందిగామ. జీతం నెలకు 18000/-. అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాల, పరిటాల. ✆ 94907 97533, 99482 30222

గుంటూరు పరిధిలోని ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీలో పని చేయుటకు 10th / Inter చదివిన ఫుల్ టైం లేడీ వార్డెన్ కావలెను. & Degree చదివిన DTP cum Cleark (Male) కావలెను. ✆ 93944 47117, 92477 45046.

గుంటూరులోని రియల్ బూమ్ రియల్ ఎస్టేట్ సర్వీసెస్ నందు పని చేయుటకు కంప్యూటర్ ఆపరేటర్స్ (50), టెలీకాలర్స్ (10), DDOలు (10) కావలెను. ✆ 78010 32689.

ప్రముఖ L.G. సర్వీస్ సెంటర్, ఏ.టి.అగ్రహారం నందు పని చేయుటకు కంప్యూటర్ ఆపరేటర్ & టెలికాలర్స్ కావలెను. ✆ 97013 63586, 93812 32909.

గుంటూరులో ప్రముఖ హాస్పిటల్ నందు పనిచేయుటకు మేల్ రిసెప్షనిస్ట్, ఫార్మాసిస్ట్ మరియు స్టాఫ్ కావలెను. సంప్ర|| 88855 90905.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు వార్డెన్స్ మరియు హాస్టల్ ఇన్‌ఛార్జ్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము 12000/-నుండి 15000/- వరకు ఇవ్వబడును (నాన్‌లోకల్ వారికి ఉచిత భోజనము, వసతి కల్పించబడును). విద్యార్హతలు: ఇంటర్ నుండి డిగ్రీ వరకు, వయస్సు:22 సం||రాలు నుండి 40 సం||రాలు ఉండవలెను. వివరాలకు సంప్ర| 92487 33371.

అశోక్ లేలాండ్ వెహికల్స్ కోసం 3 డ్రైవర్లు కావలెను. 3 సం|| అనుభవం ఉండాలి. వివరాలకు సంప్ర: 74166 89935.

ప్రముఖ కలెక్షన్ ఏజెన్సీలో పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్ మరియు టెలికాలర్స్ అనుభవంగలవారు కావలెను. జీతం: 15k to 20k, కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. DRA సర్టిఫికెట్ ఉన్నవారికి ప్రాధాన్యత కలదు. జీతం:20k సంప్రదించగలరు ఫోన్ నెంబర్స్: 89190 80894, 83091 32382.

ప్రముఖ కంపెనీకి తెనాలి, బాపట్ల, చీరాల, ప్రత్తిపాడు, తాడికొండ, మంగళగిరి, సత్తెనపల్లి, పెదకూరపాడు, మాచర్ల, చిలకలూరిపేట, గురజాల మార్కెటింగ్ చేయుటకు ఎగ్జిక్యూటివ్స్ కావలెను. మంచి జీతం, ఇన్సెంటివ్‌లు మరియు ప్రయాణ భత్యాలు. సంప్రదించగలరు. ✆ 79970 18666.

ప్రముఖ సోలార్ కంపెనీ ఆఫీసు నందు పనిచేయుటకు టెలికాలర్, కంప్యూటర్ ఆపరేటర్ (లేడీస్) కావలెను. సంప్ర|| 79970 18666.

ప్రముఖ విద్యా సంస్థలో పనిచేయుటకు ఆఫీస్ అడ్మినిస్ట్రేటివ్/ MKTG Exe. కావలెను. సంప్ర|| శ్రీవర్ధినీ విద్యాసంస్థలు, 2/6 బ్రాడీపేట, Gnt. ✆ 94402 14612.

గుంటూరు లక్ష్మీపురంలోని ప్రముఖ దంత వైద్యశాలలో పనిచేయుటకు రిసెప్షనిస్ట్, క్లీనింగ్‌స్టాఫ్. జీతం: 12 నుండి 15000, వయస్సు: 30 సం||లోపు. గుంటూరు టూ టౌన్‌వారు కావలెను. ✆ 85008 08778.

SECURITY GUARDS

సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. లక్ష్మీపురం మెయిన్ రోడ్‌లో పనిచేయుటకు, 12 గం||లు డ్యూటీ, జీతం: 13000/-, వివరాలు: 72880 04466.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారులు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించు సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మరియు/లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

Book your 5 lines Classified Colour Rs.770/-
3Ads Package Rs.1945/-

5 lines Classified B/W Rs.650/-
3Ads Package Rs.1625/-

ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి:
8008510541

విద్యాశాఖ అధికారులకు ఒకరోజు శిక్షణ

విద్యాంజలి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అధికారులు

బాపట్ల టౌన్: బాపట్ల పట్టణంలోని సరస్వతి స్మారక ప్రభుత్వ బాలికల పాఠశాలలో జిల్లా స్థాయిలో విద్యాంజలి 2.0పై బుధవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణలో మండల ఎంఈవో-2, కాంప్లెక్స్ ఛైర్మన్, రిసోర్స్ పర్సన్లు, ఎస్.ఎస్.సి. ఛైర్మన్‌లు పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన జిల్లా ఇన్‌ఛార్జి విద్యాశాఖాధికారి శివబాబు మాట్లాడుతూ ఈ- పోర్టల్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక, శిక్షణ సేవారంగాల్లో వాలంటీర్లు, ఎన్‌జీవోలు ద్వారా సదుపాయాలు కల్పిస్తామన్నారు. పాఠశాల ఈ- పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని దాతల సహకారం పాఠశాలలకు అందేటట్లు ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం విద్యాంజలి పుస్తకాన్ని ఆవిష్కరించారు. చీరాల డిప్యూటీ డీఈవో గంగాధరరావు, సమగ్రశిక్ష ఏఎంవో బి.మోజెస్, ఆర్పీలు జయకుమార్, ఉమామహేశ్వరరావు, నవీన్ పాల్గొన్నారు.

త్రికోటేశ్వరస్వామి ఆదాయం రూ.59,97,462

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: కోటప్పకొండలోని త్రికోటేశ్వరస్వామి ఆలయం హుండీ లెక్కింపు బుధవారం చేపట్టారు. 82 రోజులకు నగదు 58,77,452, అన్నదానానికి రూ.1,20,010 చొప్పున మొత్తం రూ.59,97,462 ఆదాయం వచ్చింది. అలానే వెండి 106గ్రాములు, బంగారం 2గ్రాములు 900 మిల్లీగ్రాములు, విదేశీ కరెన్సీ 40 అమెరికా డాలర్లు, 100 కెనడా డాలర్లు, 5 యూరోలు, 20 నేపాల్ కరెన్సీ నోట్లు ఉన్నట్లు ఈవో చంద్రశేఖరరావు తెలిపారు.

22న మంగళగిరిలో చేనేత గర్జన

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: మంగళగిరిలో ఈనెల 22న జరిగే చేనేత గర్జనకు చేనేత కార్మికులు, ఉపవృత్తులు వారు భారీగా తరలివచ్చి పరిశ్రమ ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. పట్టణంలోని గోలి సదాశివరావు కల్యాణ మండపంలో గర్జన సన్నాహక సమావేశానికి బుధవారం ఉమ్మడి ప్రకాశం జిల్లా చేనేత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ కన్వీనరు దామర్ల శ్రీకృష్ణ అధ్యక్షత వహించారు. చేనేత పరిశ్రమకు ప్రభుత్వం ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు అమలు, చేనేత వస్త్రాలపై జీఎస్టీని సర్కారు భరించాలని, నేతన్న నేస్తం పథకాన్ని అమలు చేయాలని పలువురు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గర్జన గోడపత్రికను ఆవిష్కరించారు. ఆల్ ఇండియా వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బండారు ఆనందప్రసాద్, ఏపీ చేనేత కార్మిక సంఘ అధ్యక్షుడు పిల్లలమర్రి నాగేశ్వరరావు, చేనేత జన సమాఖ్య వ్యవస్థాపకుడు మాచర్ల మోహనరావు, రాష్ట్ర అధ్యక్షుడు దేవన వీరనాగేశ్వరరావు, పూర్ణచంద్రరావు, అండగుండ నారాయణ, మునగాల గిరిధర్, గద్దె బాబు, మేడ వెంకట్రావు, పి.కొండయ్య, శీలం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఉద్యానశాఖ ఉద్యోగి దుర్మరణం

జీలుగుమిల్లి (బుట్టాయగూడెం), న్యూస్‌టుడే: లారీ ఢీకొని ఉద్యాన శాఖ ఉద్యోగి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం తాటియాకులగూడెం సమీపాన జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. బాపట్ల జిల్లా నరాలశెట్టివారిగూడేనికి చెందిన నరాలశెట్టి నాగేశ్వరరావు(53) తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేటలో ఉద్యాన శాఖలో ఉద్యోగం చేస్తూ అక్కడే కుటుంబంతో కలిసి ఉంటున్నారు. బుధవారం వ్యక్తిగత పనిపై జీలుగుమిల్లి వచ్చి.. తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో తాటియాకులగూడెం సమీపంలో అశ్వారావుపేట వైపు వేగంగా వెళుతున్న లారీ వెనుక నుంచి ఆయన్ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగేశ్వరరావు తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందారు. మృతుని భార్య నాగమల్లేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై క్రాంతికుమార్ తెలిపారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

రేపల్లె అర్బన్: రేపల్లె 18వ వార్డు శివారు ఎన్టీఆర్ నగర్‌లో బుధవారం సోమమ్మ (38) ఇంట్లో సీలింగ్ ఫ్యానుకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. నగరం మండలం వెనిగళ్లవారిపాలేనికి చెందిన దంపతులు వెంకటస్వామి, సోమమ్మ ప్రస్తుతం ఎన్టీఆర్‌నగర్‌లో నివశిస్తున్నారు. కుటుంబ కలతలే ఆమె ఆత్మహత్యకు కారణమని పోలీసులు చెబుతున్నారు. మృతురాలి తల్లి నాంచారమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 120, రిటైల్ ధర - 147, చికెన్ విత్‌స్కిన్ - 213, చికెన్ స్కిన్‌లెస్ - 243.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213 చికెన్ స్కిన్‌లెస్ - 243.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 248 చికెన్ స్కిన్‌లెస్ - 258.

91.9FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

ఉద్యోగం మానేసి.. చోరీలు మొదలెట్టి

అమరావతి, న్యూస్‌టుడే: పోస్టల్ శాఖలో ఉద్యోగం చేస్తున్న అతడు వ్యసనాలకు అలవాటు పడ్డాడు. బెట్టింగ్‌లకు పాల్పడి అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చేదారిలేక ఉద్యోగం మానేసి చోరీల బాటపట్టి చివరికి కటకటాల పాలయ్యాడు. పోలీసుల వివరాల ప్రకారం.. గుంటూరు గ్రామీణ మండలం జొన్నలగడ్డకు చెందిన నాగార్జున ఈ నెల 7న 14వ మైలు సెంటర్‌లో ఓ ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసి, దానిపై వైకుంఠపురం చేరుకున్నాడు. అక్కడ వేదవ్యాస ధర్మక్షేత్రం సమీపంలో వెంకాయమ్మ అనే మహిళ మెడలోని బంగారు గొలుసు లాక్కొని పారిపోయాడు. మహిళ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన ఎస్సై శ్రీనివాసరావు దర్యాప్తు చేస్తుండగా బుధవారం ముత్తాయపాలెం వద్ద నాగార్జునను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా గత జనవరిలో పెదకూరపాడు మండలం పరస వద్ద ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును అపహరించినట్లు చెప్పాడు. ఈ రెండు ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

(c) eenadu

బాపట్ల

•బాపట్ల • రేపల్లె • వేమూరు

దీన్ దయాళ్ ఉపాధ్యాయకు నివాళి

బాపట్ల: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపక ముఖ్యులు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ సమర్పణ దివస్ సందర్భంగా స్థానిక భాజపా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. భాజపా జిల్లా అధ్యక్షుడు బంగారుబాబు, ప్రధాన కార్యదర్శి కాకర్ల వెంకటేశ్వరరావు, నేతలు పులి వెంకట కృష్ణారెడ్డి, రమేష్‌కుమార్, వెంకటరామకృష్ణ, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

పండగ ప్రత్యేక అధికారిణిగా అనుపమ

అమృతలూరు, న్యూస్‌టుడే: గోవాడ బాలకోటేశ్వరస్వామి ఆలయం వద్ద మహాశివరాత్రి సందర్భంగా జరిగే ఉత్సవాల పర్యవేక్షణకు పండగ ప్రత్యేక అధికారిణిగా వైకుంఠపురం ఈవో అనుపమను ఉన్నతాధికారులు నియమించినట్లు ఆలయ ఈవో విఠల్ శ్రీనివాస్‌వర్మ చెప్పారు. ఉత్సవాలు ముగిసిన అనంతరం హుండీ లెక్కింపు వరకు ఆమె పర్యవేక్షణ కొనసాగుతుందని ఆయన చెప్పారు.

భూ సమస్యలపై ఆర్డీవోతో 'ఫోన్ ఇన్' నేడు

ఈనాడు మీతోడు

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె డివిజన్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలు, అడంగల్, భూమి ఆన్‌లైన్‌లో నమోదు, భూ ఆక్రమణలు, శ్మశాన వాటికలు లేకపోవడం తదితర సమస్యలను రేపల్లె ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లే అవకాశాన్ని ఫోన్ ఇన్ కార్యక్రమం ద్వారా ఈనాడు కల్పిస్తోంది. ప్రజల సమస్యలకు ఆర్డీవో రామలక్ష్మి సమాధానాలిచ్చి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు. మీరు చేయాల్సిందల్లా కింది నంబర్లకు ఫోన్ చేయడమే.

87026 55890
80085 73136
తేదీ: గురువారం (12-02-2026)
సమయం: ఉదయం 9 నుంచి 10 గంటల వరకు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73136, వేమూరు: 91107 83738

చేతిపంపులకు మరమ్మతులు

స్పందన: రేపల్లె అర్బన్: రేపల్లె మండలం బేతపూడి మసీదు ఏరియాలో రెండు చేతిపంపులు పనిచేయడం లేదు. సమస్యను ఈనెల 11న మేమున్నాం.. మీకు తోడుగా శీర్షికన ఈనాడు అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి ఉయ్యూరు నాగేశ్వరరావు బుధవారం కార్మికులను పంపి చేతిపంపులకు మరమ్మతులు చేయించారు.

ఆహ్లాదం అందించేలా.. స్వచ్ఛంగా జీవించేలా

జిల్లా కేంద్రంలో మొక్కల ఏర్పాటు

న్యూస్‌టుడే, బాపట్ల టౌన్, ఆర్ట్స్‌కాలేజీ, రైలుపేట (బాపట్ల)

పర్యావరణం పరిశుభ్రంగా ఉండాలని పాలకులు, అధికారులు ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. కూటమి ప్రభుత్వం పట్టణాలు, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచి వాటిని అభివృద్ధి చేయాలనే కృతనిశ్చయంతో పనిచేస్తోంది. ప్రజలకు ఆహ్లాదం పంచాలని అధికారులు పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.

60 వేల బోగనవిల చెట్లతో అందంగా..

గత ఏడాది నుంచి బాపట్ల పట్టణాన్ని అందంగా తీర్చిదిద్దాలని మున్సిపాలిటీ అధికారులు ప్రణాళికలు రచించారు. బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల నుంచి నందిరాజుతోట సమీపంలోని మార్కెట్ యార్డు వరకు సుమారు మూడున్నర కిలో మీటర్ల దూరంలో 60 వేలకు పైగా బోగనవిల (కాగితాల పూల) మొక్కలు నాటారు. ఈ చెట్లు పూలు అందంగా ఉండటంతో పాటు వీటికి రెండు రోజులకు ఒకసారి నీళ్లు పోస్తే పువ్వులు పుష్కలంగా పూస్తాయి. రోడ్డు మధ్యలో డివైడర్ సుందరీకరణకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.25 లక్షలు వెచ్చించి డివైడర్ మధ్యలో పూల మొక్కలు పెంచుతున్నారు. డివైడర్‌లో ఉన్న రాళ్లు ఇతర వ్యర్థాలు తొలగించి తాజాగా ఎర్ర మట్టితో పాటు అందులో బలమైన ఎరువులను వేస్తున్నారు. పూల మొక్కల మధ్యలో చెడు గాలిని పీల్చుకుని ఆక్సిజన్‌ను పుష్కలంగా అందించేందుకు టర్మినలియా గ్రీన్ అనే చెట్లు 3 మీటర్లకు ఒకటి చొప్పున సుమారు 700 మొక్కల వరకు నాటారు.

పాత బస్టాండ్ కూడలిలో డివైడర్‌పై పూల మొక్కలు

ఆర్వోబీపై 300 కుండీలు

గుంటూరు వైపు వెళ్లే ఆర్వోబీపై రెండు వైపులా 300 సిమెంట్ కుండీల్లో బోగనవిల చెట్లు ఏర్పాటు చేసి సంరక్షిస్తున్నారు. దీనికి జనరల్ ఫండ్ నుంచి రూ.8 లక్షలు వెచ్చించారు. ప్రతిరోజు ట్యాంకర్ల ద్వారా వీటికి నీటిని అందిస్తూ కాపాడుతున్నారు. పట్టణంలో విశాలమైన రోడ్ల మధ్య పూల మొక్కలు ఎంతో ఆహ్లాదాన్ని అందిస్తున్నట్లు పురవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పరిశుభ్రత బాధ్యత పౌరులపైనా ఉంది

బాపట్ల పట్టణాన్ని అందంగా ఆహ్లాదంగా ఉంచాలని స్థానిక ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, కలెక్టర్ వినోద్‌కుమార్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఆ దిశగా మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది పనిచేస్తున్నారు. పట్టణంలో ఉన్న 4 పార్కులను అభివృద్ధి చేశాం. ఆర్వోబీల గోడల మీద ప్రకృతితో ఉండే అందమైన బొమ్మలు వేయించే దిశగా ప్రణాళిక వేస్తున్నాం. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత పౌరుల మీద కూడా ఉంది.

పల్లెల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న అనగాని శివప్రసాద్

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెదేపా నేత అనగాని శివప్రసాద్ అన్నారు. రేపల్లె మండలం రావిఅనంతవరం, కారుమూరు, గుడ్డికాయలంకలో బుధవారం జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.1.81 కోట్లతో ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మూడు గ్రామాల్లో వాటర్ ట్యాంకులు, పైపులైను పనులు చేయిస్తామని గ్రామీణ తాగునీటి సరఫరాశాఖ డీఈ పంతాని రామ్‌కుమార్ తెలిపారు. కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పంతాని మురళీధరరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రూ.36 లక్షలతో ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణం

నగరం: పల్లె పల్లెకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని అనగాని శివప్రసాద్ అన్నారు. కారంకివారిపాలెం గ్రామంలో రూ.36 లక్షలతో నిర్మించే ప్రజా ఆరోగ్య కేంద్ర నూతన భవనానికి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు.

యూరియా వాడకంతో అనర్థం

వేమూరు, న్యూస్‌టుడే: తెల్లజొన్నలో ఇబ్బడి ముబ్బడిగా యూరియా వాడడం వల్ల పైరును తెగుళ్లు ఆశించే అవకాశం ఉందని రేపల్లె వ్యవసాయ శాఖ ఏడీఏ లక్ష్మి తెలిపారు. మండలంలోని వెల్లబాడు, కుచ్చెళ్లపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్త అచ్యుతరామారావు జీవన ఎరువుల వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు.

సీఎం సహాయనిధి మంజూరు పత్రాల అందజేత

భట్టిప్రోలు, కొల్లూరు, న్యూస్‌టుడే: భట్టిప్రోలు మండలం రాచూరు గ్రామానికి చెందిన ఆలూరి మరియమ్మ, కొల్లూరు మండలం పెదలంక గ్రామానికి చెందిన తోడేటి నాంచారమ్మ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. నాంచారమ్మకు రూ.2,04,908, మరియమ్మకు రూ.1,55,429 చొప్పున మంజూరయ్యాయి. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు బుధవారం క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు మంజూరు పత్రాలు పంపిణీ చేశారు.

విశ్రాంత ఉద్యోగుల నూతన కమిటీ ఏర్పాటు

ప్రతిజ్ఞ చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

బాపట్ల టౌన్, బాపట్ల వెస్ట్, న్యూస్‌టుడే: బాపట్ల విశ్రాంతి ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు బుధవారం ఎన్జీవో హోమ్‌లో నిర్వహించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా విశ్రాంత తహసీల్దారు ఎం.సిద్దయ్య, కార్యదర్శిగా కె.రామకృష్ణారావు ఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన కమిటీ ప్రతిజ్ఞ చేసింది. ఎన్నికల అధికారిగా బి.బ్రహ్మారెడ్డి వ్యవహరించారు. రజినీకాంత్, ఓంకార్, ఆర్.నరసింహరావు వర్మ పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమలుకు ఎస్టీయూ పోరాటం

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎస్టీయూ నేతలు

బాపట్ల, న్యూస్‌టుడే: ఎన్నికల హామీల అమలు, ఆర్థిక అంశాల సాధన కోసం ఎస్టీయూ దశలవారీ పోరాటానికి పిలుపునిచ్చిందని ఆ శాఖ జిల్లా అధ్యక్షుడు బడుగు శ్రీనివాస్ తెలిపారు. ఎస్టీయూ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. 13న కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. సీపీఎస్ రద్దుతో పాటు పెండింగ్‌లో ఉన్న డీఏలను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బొంత వెంకటేశ్వర్లు, నేతలు పాల్గొన్నారు.

పామాయిల్ సాగుపై దృష్టి పెట్టండి

మొక్కకు నీరుపోస్తున్న తహసీల్దారు

పెదపులివర్రు (భట్టిప్రోలు), న్యూస్‌టుడే: రైతులు ప్రత్యామ్నాయ పంటల్లో భాగంగా పామాయిల్ పంట సాగుపై దృష్టి పెట్టాలని తహసీల్దారు మేకా శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పెదపులివర్రులో అజంతా సోయా లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో రాయితీపై నాదెళ్ల రామకోటేశ్వరరావు రెండు ఎకరాల పొలంలో బుధవారం పామాయిల్ మొక్కలను నాటారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ఆయిల్‌కు మంచి ధర ఉండటంతో పామాయిల్ సాగు లాభదాయకంగా ఉంటుందని అన్నారు. కంపెనీ మేనేజరు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ నూరు శాతం రాయితీతో రైతులకు మొక్కలను కంపెనీ ద్వారా అందజేస్తున్నామన్నారు. సర్పంచి ఉషారాణి, డిప్యూటీ తహసీల్దారు లక్ష్మి, ఉద్యాన శాఖ అధికారి కల్యాణ చక్రవర్తి, యూనియన్ బ్యాంకు మేనేజర్ ఉదయ్‌కుమార్, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలు సద్వినియోగం చేసుకోండి

రేపల్లె అర్బన్: పోస్టల్‌శాఖ అందిస్తున్న సేవలను మరింత విస్తృతం చేసేందుకు అందరూ కృషి చేయాలని తెనాలి సూపరింటెండెంట్ విద్యావతి అన్నారు. ఇటీవల కొత్తగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన ఆమె బుధవారం రేపల్లె హెడ్ పోస్టాఫీసును సందర్శించారు. పోస్టల్‌శాఖ అమలు చేస్తున్న పథకాలను ఎక్కువ మంది ప్రజలు సద్వినియోగం చేసుకునేలా దృష్టి సారించాలన్నారు. ఈనెల 11 నుంచి 14 వరకు పోస్టల్ పొదుపు ఖాతాల మేళా, 18 నుంచి 20 వరకు నిర్వహించే బీమా మేళాను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రేపల్లె సహాయ సూపరింటెండెంట్ ఏడుకొండలు, పాంచజన్యరెడ్డి, సత్యనారాయణ, నరేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి బీమా చెక్కు అందజేత

చందోలు(పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే: చందోలు ఎస్బీఐ బ్యాంకులో సెక్యూరిటీగార్డుగా పనిచేస్తున్న మాజీ సైనికుడు జీవీ సుబ్బారెడ్డి మూడు నెలల క్రితం నందిరాజు తోట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మృతుడి తాలుకు పెన్షన్ అకౌంటు ఇన్సూరెన్స్ క్లెయిమ్ రూ.50 లక్షల చెక్కును బుధవారం కుటుంబ సభ్యులకు అందజేసినట్లు రీజనల్ మేనేజర్ జగదీష్ తెలిపారు. మేనేజర్ అనిల్‌కుమార్, హెచ్‌ఆర్ మేనేజర్ తిరుమల ఈశ్వరరావు, జోనల్ సెక్రటరీ ప్రేమకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ఏర్పాట్లు పూర్తి

చుండూరు, గుళ్లపల్లి (చెరుకుపల్లి గ్రామీణ): మహాశివరాత్రి సందర్భంగా రేపల్లె, వేమూరు నియోజవర్గాల్లోని ఆలయాలు ముస్తాబవుతున్నాయి. చుండూరులోని బాలకోటేశ్వరస్వామి, గుళ్లపల్లిలోని ఆనందీశ్వరస్వామి, ఉత్సవాల నిమిత్తం ఆలయ కమిటీ తగిన ఏర్పాట్లు చేశారు. బాలకోటేశ్వర ఆలయానికి మండల పరిధిలోని గ్రామాలతో పాటు తెనాలి, అమృతలూరు ప్రాంతాల నుంచి భక్తులు వస్తారు. ఈ నేపథ్యంలో ఆలయానికి రంగులు, విద్యుత్తు దీపాలతో అలంకరణ చేశారు. క్యూలైన్‌లు, తాగునీటి వసతులు కల్పించారు. ఆనందీశ్వరస్వామి ఆలయంలో 15న ఉదయం నుంచే స్వామికి విశేష అభిషేకాలు నిర్వహించనున్నారు.

పాఠశాలకు రూ.5 లక్షల వస్తువులు వితరణ

ఆర్వో ప్లాంట్ వద్ద బ్యాంకు అధికారులు

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని ఇస్లాంపేటలో ఉన్న ఆజాద్ మున్సిపల్ మోడల్ ప్రాథమిక పాఠశాలకు ఎస్బీఐ తెనాలి శాఖ వారు రూ.5 లక్షల విలువ చేసే ఆర్వో వాటర్ ప్లాంట్, కంప్యూటర్లు, ఇంటిగ్రేటెడ్ ఫ్లాట్ ప్యానల్స్, విద్యా సంబంధ వస్తువులను బుధవారం పాఠశాలకు అందించారు. ఎస్బీఐ తెనాలి బ్రాంచి రీజనల్ మేనేజర్ వీవీ జగదీశ్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత ఉద్యోగాలు చేస్తూ ఇతరులకు సహాయపడాలన్నారు. ఎస్బీఐ బాపట్ల మెయిన్ బ్రాంచ్ మేనేజర్ పి.ఆనందబాబు, ఎం.తిరుమలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాపట్లటౌన్: పాండురంగాపురం ఉన్నత పాఠశాలలో తెనాలి ఎస్బీఐ రీజనల్ మేనేజర్ జగదీశ్ ఆధ్వర్యంలో బ్యాంకు సహకారంతో 15 మంది బాలికలకు సైకిళ్లు అందజేశారు.

విద్యార్థులు సేవా దృక్పథం అలవర్చుకోవాలి

బాపట్ల, న్యూస్‌టుడే: విద్యార్థులు తప్పనిసరిగా దృక్పథం అలవర్చుకోవాలని డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల అధిపతి డాక్టర్ డీడీ స్మిత్ తెలిపారు. కళాశాల ఆధ్వర్యంలో కొత్తపాలెం, చెరుకూరు గ్రామాల్లో ఈ నెల 17 వరకు నిర్వహించనున్న ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని కొత్తపాలెం సర్పంచి పాలపర్తి సంపూర్ణమ్మ, చెరుకూరు ఎంపీటీసీ సభ్యుడు పాలేటి వీరయ్య ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ అశోక్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పంట కోత సరైన సమయంలో చేయాలి

కనగాల (చెరుకుపల్లి (గ్రామీణ), న్యూస్‌టుడే: రైతులు సరైన సమయంలో పంట కోతను నిర్వహించాలని మండల వ్యవసాయాధికారి ఎండీ ఫరూక్ అన్నారు. బుధవారం మండలంలోని కనగాలలో ఆయన రైతులు, డ్వాక్రా మహిళలతో సమావేశం నిర్వహించారు. 'పంటకోత తర్వాత నిర్వహణ, విలువల జోడింపు'పై అవగాహన కల్పించారు. అపరాల సాగులో మినుము, పెసర పంట కాయలు 80 నుంచి 85శాతం నల్లగా మారిన తరువాతే పంట కోత నిర్వహించాలన్నారు. మొక్కజొన్నలో గింజ గట్టిపడే వరకు ఆగాలని సూచించారు. తద్వారా పంట ఉత్పత్తుల్లో నాణ్యత పెరుగుతుందన్నారు.

దస్తావేజులు పోయినవి

బాపట్ల జిల్లా, భట్టిప్రోలు మండలం, పెదపులివర్రు గ్రామ పంచాయతీ పరిధిలోని గుత్తావారిపాలెంకు చెందిన గుత్తా బాలకృష్ణ కుమార్తె మరియు పరుచూరి భవానిశంకర్ భార్య అయిన గుత్తా నాగగాయత్రి అను నాకు గల భట్టిప్రోలు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో 01.05.1947వ తేదీన పులివర్తి రాఘవయ్య వద్ద విక్రయం పొంది సబ్ రిజిస్టర్ కార్యాలయంలో 1వ పుస్తకం, 152వ వాల్యూం, పుట 144 నుండి 146, దస్తావేజు నంబర్ 759/1947, మరియు 1వ పుస్తకం వాల్యూమ్ 18, పుట 454 నుండి456, దస్తావేజు నంబర్ 1804/1953, 1వ పుస్తకం, వాల్యూం 23, పుట 341, 342, దస్తావేజు నంబర్ 1295/1927, 1 పుస్తకం, వాల్యూం 573, పుట 452 నుండి 440, దస్తావేజు నంబర్ 873/1995లకు సంబంధించి డి.నం.48-1రు య 0.52 సెంట్లు, డి.నం.48-2రు య 0.42 సెంట్లు, డి. నం.48-3రు. య 0.92 సెంట్లు వెరసి ఏకా ఖండంగా ఉన్న య 1.86 భూమికి సంబంధించిన లింకు డాక్యుమెంట్లు ది.30.01.2026వ తేదీన పెద్దపులివర్రు నుండి భట్టిప్రోలుకు వచ్చుచుండగా మార్గమధ్యంలో జారిపోయినవి. వెతికినా దొరకలేదు. దొరికిన వారు ఈ క్రింది సెల్ నంబరు తెలియపర్చగలరు.

9703323999

విద్యుత్తు స్తంభం.. కూలేందుకు సిద్ధం

మండల పరిధిలోని నరసాయపాలెం తాగునీటి చెరువు సమీపంలో చెరుకూరు వెళ్లే రోడ్డు పక్కన విద్యుత్తు స్తంభం కూలేందుకు సిద్ధంగా ఉంది. స్తంభాన్ని సరిజేయమని విద్యుత్తు శాఖ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. సమస్యపై బాపట్ల రూరల్ విద్యుత్తు ఏఈ కోటేశ్వరరావు మాట్లాడుతూ సిబ్బందిని పంపించి ఒరిగిన స్తంభానికి మరమ్మతులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. **-న్యూస్‌టుడే, నరసాయపాలెం (బాపట్ల టౌన్)**

రుద్రభూమి రహదారిలో చెత్త పారబోత

పిట్టలవానిపాలెం రుద్రభూమికి వెళ్లే సీసీ రహదారి దుర్గంధ భరితంగా తయారైంది. గ్రామంలో సేకరించిన చెత్త, వ్యర్థాలను రహదారి వెంబడి వేస్తుండటంతో అటుగా రాకపోకలు సాగించలేని పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామంలో ఎవరైనా మరణిస్తే రుద్రభూమికి వెళ్లే వారికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి ప్రసాదరావు మాట్లాడుతూ పరిశీలించి చెత్త, వ్యర్థాలు తొలగించి మరల అక్కడ వేయకుండా చర్యలు తీసుకుంటామన్నారు. **-న్యూస్‌టుడే, పిట్టలవానిపాలెం**

మురుగు పారదు.. దుర్గంధం వదలదు

నగరం ప్రధాన రహదారుల పక్కన మురుగు కాలువల్లో మురుగు ప్రవాహం నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన కూడలి నుంచి కళాశాల వరకు, బాపట్ల, చెరుకుపల్లి రహదారుల్లో డ్రైనేజీల్లో మురుగు నెలల తరబడి నిల్వ ఉండటంతో భరించలేని దుర్వాసన వస్తోందని వ్యాపారులు వాపోతున్నారు. దోమలకు నిలయాలుగా మారాయంటున్నారు. డ్రైనేజీలు శుభ్రం చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, నగరం**

అవీ ఇవీ

రేషన్ డీలర్లు సమయపాలన పాటించండి

చెరుకుపల్లి, న్యూస్‌టుడే: రేషన్ డీలర్లు సమయపాలన పాటిస్తూ వినియోగదారులకు అసౌకర్యం కలిగించకుండా సరకులు అందించాలని తహసీల్దారు సీహెచ్ పద్మావతి కోరారు. బుధవారం మండల రెవెన్యూ కార్యాలయంలో ఆమె రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దారు టి.అబ్రహాం, జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు రవిచంద్రారెడ్డి, మండల సంఘ అధ్యక్షుడు నాగుల పున్నారావు, పలువురు డీలర్లు పాల్గొన్నారు.

సెల్‌టవర్ నిర్మించకూడదని వినతిపత్రం అందజేత

చెరుకుపల్లి, న్యూస్‌టుడే: చెరుకుపల్లి సంతబజారుకు దక్షిణ వైపు ఉన్న గొల్లపూడి వీరప్రసాద్ స్థలంలో జియో కంపెనీ సెల్‌టవర్ నిర్మాణానికి ప్రయత్నాలు చేస్తోందని, నివాస ప్రాంతాల మధ్య దీని నిర్మాణం జరగకుండా చర్యలు తీసుకోవాలని బుధవారం స్థానికులు తహసీల్దారు పద్మావతికి వినతిపత్రం అందజేశారు.

సార్వత్రిక సమ్మె విజయవంతం చేయండి

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగే సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని బుధవారం పార్టీ నాయకులు మండల పరిధిలో విస్తృత ప్రచారం చేసి కరపత్రాలు పంపిణీ చేశారు. జిల్లా కార్యదర్శి పి.మనోజ్ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో సభ్యుల సహకారం అవసరం

చెరుకుపల్లి, న్యూస్‌టుడే: గోవాడ శైవక్షేత్రంలోని బ్రాహ్మణ అన్నదాన సత్రంలో మహాశివరాత్రి పురస్కరించుకొని 15, 16 తేదీల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు బాలకోటేశ్వరస్వామి అన్నదాన సేవాసమితి నాయకులు రావూరి ఆంజనేయులు, ఆర్వీఎస్ శర్మ తెలిపారు. సేవా కార్యక్రమం నిర్వహణలో భాగంగా బుధవారం చెరుకుపల్లిలో సమావేశమైన నాయకులు మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో పాల్గొనే సంఘ సభ్యులు ముందుగా పేర్లు నమోదు చేయించుకొని తమకు సహకారం అందించాలన్నారు.

చేనేత గర్జనకు తరలిరండి

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి 22న మంగళగిరిలో నిర్వహించే చేనేత గర్జనకు తరలిరావాలని చేనేత కార్మిక సంఘం ఐక్య కార్యాచరణ కమిటీ నాయకుడు గొట్టుముక్కల బాలాజీ అన్నారు. భట్టిప్రోలులో చేనేత గర్జనకు సంబంధించిన గోడ పత్రికలు ఆవిష్కరించారు.

బాపట్ల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అంకమ్మ చౌదరి

బాపట్ల, న్యూస్‌టుడే: బాపట్ల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అంకమ్మ చౌదరిని కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని అసోసియేషన్ సీనియర్ సలహాదారుడు గంట అంజిబాబు తెలిపారు. స్థానిక క్రికెట్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా జయరామ్‌రెడ్డి, కార్యదర్శిగా బిల్లా స్టాండ్లీ విమల్ కుమార్‌ను ఎన్నుకున్నారు.

పౌష్టికాహారం పంపిణీ

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సహకారంతో బుధవారం చీరాల రామానంద ట్రస్టు ఆధ్వర్యంలో 50 మంది క్షయ బాధితులకు పౌష్టికాహార కిట్లు అందజేశారు. కూటమి నాయకులు అనగాని శివప్రసాద్, పంతాని మురళీధరరావు వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైద్యశాలలో ఆర్వో ప్లాంట్ ప్రారంభం

రేపల్లె అర్బన్: రేపల్లె ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో దాత చేయూతతో సమకూరిన ఆర్వో ప్లాంట్‌ను బుధవారం తెదేపా నేత అనగాని శివప్రసాద్ ప్రారంభించారు. ప్లాంట్ బహూకరించిన మురళి, వాషింగ్ మిషన్ అందజేసిన కెనరా బ్యాంకు మేనేజరు భార్గవ్‌ను సత్కరించారు. నాయకులు, అభివృద్ధి కమిటీ సభ్యులు వైద్యులు పృథ్వీ గణేష్ పాల్గొన్నారు.

ఆకలిబాధ తీరుస్తున్న సత్రాలు

దాతల సహకారంతో ఏళ్లుగా అన్నదానం

గోవాడ, (అమృతలూరు), న్యూస్‌టుడే

గోవాడ శైవక్షేత్రంలో ఉన్న పలు సత్రాలు ఏళ్ల తరబడి అన్నసంతర్పణ చేస్తూ భక్తుల మన్ననలు పొందుతున్నాయి. మహాశివరాత్రికి స్వామి దర్శనానికి తరలివచ్చే భక్తులకు అన్నప్రసాదం అందించి సేద తీరేందుకు సత్రాల నిర్వాహకులు తమవంతు సహకారం అందిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఊరట లభిస్తోంది. శివరాత్రికి సమీప జిల్లాల నుంచి భక్తులు వేల సంఖ్యలో గోవాడ తరలివస్తారు. వీరు స్వామి దర్శనం చేసుకుని మొక్కుబడి తీర్చుకుని అన్నదాన సత్రాలను ఆశ్రయిస్తారు. వీరికి నిర్వాహకులు స్వాగతం పలుకుతూ సేవలందిస్తారు. ఈ సత్రాల్లో మరుగుదొడ్ల సౌకర్యం ఉండడంతో మహిళలకు మరింత వెసులుబాటుగా ఉంటుంది. దాతలు, భక్తుల సహకారంతో అందిస్తున్న పలు సత్రాల సేవలు ఇలా ..

1940 నుంచి..: పద్మశాలీయ అన్నదాన సత్రంలో 1940 నుంచి భక్తులకు అన్నదానం కొనసాగుతోంది. 15వ తేదీన మధ్యాహ్నం, రాత్రి వేళ, 16వ తేదీ మధ్యాహ్నం అన్నదానం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

19 ఏళ్లుగా సేవలు: కాకతీయ సేవాసమితి సత్రంలో 19 ఏళ్ల నుంచి భక్తులకు సేవలందిస్తున్నారు. పండగ రోజున 25 వేల మందికి తాగు నీరు, మజ్జిగ, పులిహోర, 5 వేల మందికి ఉదయం అన్నదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

61 ఏళ్లుగా.. ఆర్యవైశ్య అన్నదాన సత్రం 1965లో ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు అన్నసంతర్పణ కొనసాగుతూనే ఉంది. పండగ రోజున ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రికి అన్నదానం చేస్తారు. మరుసటి రోజున ఉదయం భోజనం అందుబాటులో ఉంటుందని సత్ర కమిటీ అధ్యక్షుడు కొత్తమాసు సాంబశివరావు తెలిపారు.

అల్పాహారం, భోజనం: బ్రాహ్మణ అన్నదాన సత్రంలో 2007 నుంచి భక్తులకు సేవలు అందిస్తున్నారు. 15, 16వ తేదీల్లో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నదానం చేస్తామని అధ్యక్షుడు రావూరి ఆంజనేయులు తెలిపారు.

గ్రామ సభలు నిర్వహించండి

చెరుకుపల్లి, న్యూస్‌టుడే: మండలంలో ఉపాధి హామీ సోషల్ ఆడిట్ జరుగుతున్న నేపథ్యంలో బుధవారం మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభానీ, ఎస్సార్పీ నాగరాజు వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. నాగరాజు మాట్లాడుతూ రికార్డులు సరిగా నిర్వహించాలని, షెడ్యూలు ప్రకటించి గ్రామ సభలు సకాలంలో ఏర్పాటు చేయాలని కోరారు. పంచాయతీ రాజ్ ఏఈ సేవా నాయక్, హౌసింగ్ ఏఈ సుబ్రహ్మణ్యేశ్వరరావు, డీఆర్పీ యోగానంద్, ఏపీవో మాలతి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

అద్దేపల్లి సచివాలయంలో ఆధార్ సేవలు

భట్టిప్రోలు: పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి సచివాలయంలో నూతనంగా ఆధార్ సెంటర్ ప్రారంభించారని తెదేపా రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ భట్టిప్రోలు, పరిసర ప్రాంతాల్లో ఉన్న గ్రామప్రజలు ఆధార్ సెంటరును వినియోగించుకోవచ్చని చెప్పారు.

సామాజిక తనిఖీపై అవగాహన సదస్సు

వేమూరు, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులపై సామాజిక తనిఖీ బృందం సర్వే చేయనున్నట్లు ఎంపీడీవో రవికుమార్ తెలిపారు. దీనిపై వేమూరు ఎంపీడీవో కార్యాలయంలో తనిఖీ బృందం, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ శాఖ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మొత్తం 829 పనులకు సంబంధించి, రూ.6.01 కోట్ల నిధులు ఖర్చు చేసినట్లు ఆయన వివరించారు.

ఘంటసాలకు నివాళి

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె రామకృష్ణ విద్యా నిలయంలో బుధవారం రసాలయ కళాసమితి ఆధ్వర్యంలో ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి నిర్వహించారు.

WALK-IN -INTERVIEW
TENALI NRI SPRINGS IN CHERUKUPALLI
HERE WALK IN INTERVIEW'S ARE CONDUCTED FOR SCHOOL FACULTY :
WE INVITE YOU TO ATTEND A WALK-IN INTERVIEW FOR THE POSITIONS OF
REQUIREMENT FACULTY:
1. PRINCIPAL 2. OFFICE FACULTY
3. NURSARY TO 10th CLASS TEACHING FACULTY
INTERVIEW CONDUCTED BY DEMO
DATE: 14-02-2026 (2nd SATURDAY) 10:00 AM ONWARDS
SPOKEN ENGLISH IS MUST AND SHOULD
VENUE: NRI JUNIOR KALASALA
GULLAPALLI, SRINIVASARAO HOSPITAL (OPPOSITE),
PHONE NO: 7780492081; 7075821396
PLEASE BRING YOUR UPDATED RESUME AND RELEVANT DOCUMENTS

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda
బాపట్ల బ్రాంచి
12-4-11, చడాల వీధి (ఆంజనేయ గుడి వీధి), బాపట్ల-522101, ఫోన్: 08643-220409, మెయిల్: BAPATL@bankofbaroda.com

స్వాధీనతా ప్రకటన (Appendix IV సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని 8(1)వ నిబంధన క్రింద స్థిరాస్తిపై)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం **బ్యాంక్ ఆఫ్ బరోడా, బాపట్ల బ్రాంచి,** అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002, సెక్షన్ 13(12) లోని రూలు 3 ప్రకారం తనకు సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ **ఋణగ్రహీత: 1. శ్రీ మట్లపూడి విష్ణు కుమార్, తండ్రి: కోటయ్య,** డోర్ నెం.15-96, హరిజనవాడ, నిజాంపట్నం, బాపట్ల జిల్లా-522314, **2. శ్రీమతి మట్లపూడి నాగమణి, భర్త: మట్లపూడి కోటయ్య,** డోర్ నెం.15-96, [illegible]

స్థిరాస్తి వివరాలు

[illegible]

స్థలం: బాపట్ల
తేదీ: 10-02-2026

సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా, బాపట్ల బ్రాంచి, బాపట్ల.

(c) eenadu

చురుగ్గా రహదారి నిర్మాణ పనులు

అడుసుమల్లి(పర్చూరు), న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంత రహదారుల మహర్దశ పట్టింది. మండల పరిధిలోని అడుసుమల్లిలో మురుగునీరు పారుదల సక్రమంగా జరిగేలా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సహకారంతో రూ.70 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో గ్రామంలోని ప్రధాన రహదారి నుంచి బీసీ కాలనీ వరకు 200 మీటర్ల మేర రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. ఈ రహదారికి ఇరువైపులా సైడ్ డ్రైయిన్ల నిర్మాణం చేపట్టారు. దీంతో వర్షాల సమయంలో మురుగునీరు నిలవకుండా పరిశుభ్రతకు పెద్దపీట వేసినట్లవుతుందని గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చీరాల

• చీరాల • పర్చూరు

కోరం లేక మండల సమావేశం వాయిదా

మార్టూరు, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారం చాల్సిన సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడిన పరిస్థితి మార్టూరులో చోటుచేసుకుంది. బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యులు 21 మందికి కేవలం ముగ్గురు మాత్రమే హాజరుకావడంతో ఎంపీడీవో వై.శ్రీనివాసరావు సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

15న కల్యాణ మహోత్సవం

మార్టూరు, న్యూస్‌టుడే: ఈనెల 15న శివరాత్రిని పురస్కరించుకుని మార్టూరు-యద్దనపూడి గ్రామాల సరిహద్దు దండుదారిలోని శ్రీ మద్దిరాల పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పెట్రోలు బంకుల్లో వసతులు ఎక్కడ?

న్యూస్‌టుడే, పర్చూరు

పెట్రోలు బంకుల్లో వినియోగదారులకు కల్పించాల్సిన కనీస మౌలిక సదుపాయాలు కానరావడం లేదు. వీటిపై వాహనదారులకు సరైన అవగాహన లేకపోవడంతో యజమానులు ఉదాసీనంగా ఉంటున్నారు. నిబంధనల ప్రకారం ఎనిమిది రకాల సౌకర్యాలను బంకులకు వచ్చే వారికి యజమానులు ఉచితంగా అందించాలని నిబంధనలు ఉన్నాయి. బంకుల్లో ప్రజలకు అందాల్సిన సేవలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన పౌరసరఫరాలు, రెవెన్యూ శాఖల అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో ఈ సేవలు అందడంలేదు. పర్చూరు మండలంలో మొత్తం ఐదు పెట్రోలు బంకులు ఉన్నాయి. పర్చూరులో-3, నూతలపాడు, చెరుకూరులో ఒక్కొక్కటి చొప్పున పనిచేస్తున్నాయి. ఒకచోట శౌచాలయాలు మరమ్మతు పనులు, మరోచోట వాటికి తాళాలు, ఇంకొక చోట ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి ఉందని వాహనదారులు వాపోతున్నారు. ఈ బంకుల్లో గాలినింపే పంపులు ఎక్కడా పనిచేయడం లేదు. వీటిల్లో మంచినీరు అంతంతమాత్రంగానే ఉన్నాయి. బంకుల్లో గాలినింపే యంత్రం, చరవాణి, ప్రథమ చికిత్స కిట్లు, మంచి నీరు, ఉచిత మరుగుదొడ్లు, పెట్రోల్ సంస్థల ఫోన్ల నంబర్లు, ఫిర్యాదుల పెట్టె వంటి సదుపాయాలు కనిపించడం లేదు. వచ్చామా... పెట్రోలు కొట్టించుకున్నామా అనే రీతిలో వినియోగదారులు ఉండటంతో బంకు నిర్వాహకులు మౌలిక సదుపాయాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావట్లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని బంకుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని వాహనదారులు కోరుతున్నారు.

పర్చూరు-చీరాల రహదారిలో శౌచాలయాలకు వేసిన తాళాలు

తనిఖీలు చేపడతాం

ఆయిల్ కంపెనీల సేల్స్ అధికారుల దృష్టికి తీసుకువెళ్తాం. పెట్రోలు బంకుల్లో మౌలిక సదుపాయాలు కల్పించకపోతే చర్యలు తీసుకుంటాం. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే శాఖాపరంగా చర్యలు తీసుకుని వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

- ఎస్.కె జమీర్‌బాషా, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, బాపట్ల

గోమాతలను కాస్త పట్టించుకోండయ్యా!

న్యూస్‌టుడే, చీరాల అర్బన్

పట్టణంలో గోమాతలు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. వీటికి పడేవి మరింత ఎక్కువగా రహదారులపైకి చేరుతున్నాయి. దీనివల్ల వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటి యజమానులు కావాలని రోడ్లపై వీటిని వదిలేస్తున్నారు. ప్రధానంగా ఐవి మార్కెట్ సెంటరు, ముంతావారి కూడలి, బస్ స్టాండ్, పేరాల, మసీదు సెంటరు, ముక్కోణపు పార్కు, పాత ప్రసాద్ థియేటరు, పేరాల తదితర ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటున్నాయి. వీటి యజమానులకు మున్సిపల్ అధికారులు నోటీసులు ఇస్తున్నా వారిలో మార్పు రావడంలేదు. కొన్ని రాత్రి పది గంటల వరకు బయట తిరిగి తరువాత వాటి యజమానుల ఇళ్లకు చేరుతున్నాయి. ఉదయాన్నే మళ్లీ రోడ్లపైకి వస్తున్నాయి. ఇక అనాథ గోవులైతే పడక, తిండి రోడ్డుపైనే.

వందల సంఖ్యలో మృతి.. చీరాల పట్టణంలో దాదాపు 300 పైనే ఆవులు ఉంటాయి. రోడ్లపైనే ఇవి తిరుగుతూ ప్లాస్టిక్ వ్యర్థాలు తింటున్నాయి. ఫలితంగా అనారోగ్యానికి గురై మృత్యువాత పడుతున్నాయి. కొన్ని ఆకుకోకుండా జరిగే రహదారి ప్రమాదాల్లో కన్నుమూస్తున్నాయి. అనారోగ్యంతో ఉన్న వాటిని అధికారులు స్థానిక మున్సిపల్ ఓపెన్ థియేటర్‌కి తరలించి, గో సంరక్షకుల చేత వాటికి చికిత్స చేయిస్తున్నా ఫలితం ఉండటంలేదు. గడిచిన నాలుగేళ్లలో దాదాపు 200 ఆవులుపైనే చనిపోయాయి.

పట్టణంలో రహదారిపై సేదతీరుతున్న గోవులు

వీటిని సంరక్షించాలని, వాటి యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి బయటకు పంపకుండా చర్యలు చేపట్టాలని రెండు రోజుల క్రితం గోపరిరక్షణ సమితి తరఫున పురపాలక కమిషనర్‌తో పాటు ఆర్డీవోకు, పోలీసులకు వినతిపత్రాలు అందజేశారు. అనాథ గోవులను ప్రత్యేకంగా ఒక చోట ఉంచి, వాటి ఆలనాపాలన చూడాలని కోరారు. ఇకనైనా అధికారులు స్పందించి వీటి సంరక్షణకు చర్యలు చేపట్టాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. దీనిపై కమిషనర్ డానియల్ జోసఫ్ వివరణ కోరగా రోడ్లపై తిరిగే ఆవులన్నింటినీ ప్రత్యేక స్థలంలోకి తరలించి, వాటి చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. యజమానులు ఎవరైనా కావాలని రహదారులపైకి ఆవులను వదిలేస్తే వారిని గుర్తించి, పోలీసు కేసు పెడతామని హెచ్చరించారు. గోవుల సంరక్షణలో పట్టణ ప్రజలందరూ పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

చీరాల: 9154846713 వేటపాలెం: 8008574099
చీరాల గ్రామీణ: 6309994673 పర్చూరు: 9063144743
మార్టూరు: 8008574106 ఇంకొల్లు: 8008574102
చినగంజాం: 8008574103

? మండల పరిధి నూతలపాడు-యద్దనపూడి మండలం పూనూరు గ్రామాలకు వెళ్లే రహదారిలో ఇరువైపులా చెత్తాచెదారంపడేస్తుండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. **- స్థానికుడు**

✔ రెండ్రోజుల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి, బ్లీచింగ్ చల్లిస్తాం. **- కొల్లా రామబ్రహ్మాం, పంచాయతీ కార్యదర్శి, నూతలపాడు** – న్యూస్‌టుడే, పర్చూరు

స్పందన: చెత్తాచెదారం తొలగింపు.. **పర్చూరు:** పర్చూరు బస్టాండ్ లోపలికి వెళ్లే మార్గంలో చెత్తకుండీలో చెత్త తొలగించకపోవడంతో దుర్వాసన వెదజల్లుతుందని సమస్యను స్థానికులు 'మేమున్నాం..మీకుతోడుగా' దృష్టికి తీసుకురాగా బుధవారం వార్త ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి ఎ.మస్తానరావు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు చెత్తాచెదారం తొలగించి, బ్లీచింగ్ చల్లించారు.

పండగ ప్రత్యేక అధికారిణిగా అనుపమ

అమృతలూరు, న్యూస్‌టుడే: గోవాడ బాలకోటేశ్వర స్వామి ఆలయం వద్ద మహాశివరాత్రి సందర్భంగా జరిగే ఉత్సవాల పర్యవేక్షణకు పండగ ప్రత్యేక అధికారిణిగా వైకుంఠపురం ఈవో అనుపమను ఉన్నతాధికారులు నియమించినట్లు ఆలయ ఈవో విఠల్ శ్రీనివాస్‌వర్మ చెప్పారు. ఉత్సవాలు ముగిసిన అనంతరం హుండీ లెక్కింపు వరకు ఆమె పర్యవేక్షణ కొనసాగుతుందని ఆయన చెప్పారు.

విద్యుత్తు దీపాలంకరణలో శైవక్షేత్రాలు

న్యూస్‌టుడే, చినగంజాం

చినగంజాం మండలంలోని సోపిరాల, కొత్తపాలెం శివాలయాల వద్ద ఈ నెల 15న జరిగే మహాశివరాత్రి తిరునాళ్లను పురస్కరించుకొని నిర్వాహకులు, పంచాయతీల వారు ఏర్పాట్లు చేస్తున్నారు. తిరునాళ్ల నాలుగు రోజుల ముందే సోపిరాల శివాలయాన్ని భారీ విద్యుత్తు దీపాలంకరణలతో ముస్తాబు చేశారు. రాత్రులు విద్యుత్తు దీపాలంకరణ ఆకట్టుకుంటోంది. కొత్తపాలెం, చినగంజాం పంచాయతీ అధికారులు తిరునాళ్లకు వచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకొని రోడ్ల వెంట చెత్తాచెదారం తొలగించే పనులు చేస్తున్నారు. ఇబ్బందిగా ఉండే చెట్ల కొమ్మలు తొలగిస్తున్నారు. ఇంకొల్లు సీఐ రమణయ్య, చినగంజాం ఎస్సై రమేష్‌లు ఆయా ఆలయాల ప్రాంతాలను పరిశీలించి, అభివృద్ధి కమిటీలకు క్యూలైన్లు తదితర వాటిపై సూచనలు, సలహాలను ఎప్పటికప్పుడు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం పరిశీలించారు. తిరునాళ్ల నిర్వహణ విషయమై జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్, చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, చీరాల డీఎస్పీ మెయిన్‌లు ఆలయాల్ని గురువారం సందర్శించనున్నట్లు సోపిరాల ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ డాక్టర్ టీఎస్‌ఆర్ ఆంజనేయులు తెలిపారు. అనంతరం రెండు ఆలయాల అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, ఆయా గ్రామాల పరిధిలోని పెద్దలు, యువకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారని ఆయా శాఖలకు చెందిన స్థానిక అధికారులు చెప్పారు.

సోపిరాల శివాలయం

నేటి నుంచి కబడ్డీ పోటీలు

కొత్తపేట(వేటపాలెం), న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు గురువారం నుంచి హరిప్రసాద్‌నగర్‌లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే పోటీల్లో విజేతలకు వరుసగా రూ.20,000 రూ.15,000, రూ.10,000, రూ.5000 నగదు బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. ప్రతిరోజు సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు పోటీలు జరుగుతాయని వివరించారు.

నేడు విద్యుత్తు అదాలత్

చీరాల: విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం గురువారం ప్రత్యేక విద్యుత్తు వినియోగదారుల అదాలత్, అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఈఈ జాన్‌థామస్ తెలిపారు. పాపరాజుతోటలోని బాపనమ్మ కల్యాణ మండపంలో ఉదయం 10.30 నుంచి జరిగే అదాలత్‌లో వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక ఛైర్మన్ ఎన్.విక్టర్ ఇమ్మానియేల్, ఇతర సభ్యులు పాల్గొంటారని చెప్పారు. అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పోటీలకు వెళ్లేందుకు ఆర్థిక సాయం

వేటపాలెం, న్యూస్‌టుడే: ఆల్ ఇండియా మాస్టర్ అథ్లెటిక్స్‌లో 45ప్లస్‌లో విజేతగా నిలిచి, ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ మీట్ (థాయిలాండ్)కి ఎంపికైన గాత్రం ఉమామహేశ్వరరావు పోటీలకు వెళ్లేందుకు పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం రూ.12 వేల చెక్కును అందజేశారు. సంఘ అధ్యక్షుడు ప్రత్తి వెంకటసుబ్బారావు, కార్యదర్శి నాగాంజనేయులు, నున్నా శివప్రసాదరావు, ప్రత్తి శరత్‌బాబు, శేఖర్‌బాబు, నాగరాజు, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

240 మందికి ఉచిత వైద్య పరీక్షలు

చినగంజాం: చింతగుంపలలో బుధవారం ఒంగోలు కిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు వివిధ రకాల వ్యాధులకు సంబంధించి 240 మందికి పరీక్షలు చేసినట్లు ఆ వైద్యశాల ప్రతినిధి షేక్ రఫీ తెలిపారు. గ్రామ సర్పంచి వై.సత్యనారాయణ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించి, రోగులకు పరీక్షలు చేసినట్లు చెప్పారు. డాక్టర్ రామాంజనేయులు, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎత్తుపల్లాల మార్గంతో ఇబ్బందులు

జాండ్రపేట నుంచి వేటపాలెం వచ్చే రహదారిలో స్టేజీ వద్ద ఉన్న మలుపులో రోడ్డు దెబ్బతింది. దీంతో అక్కడ ఎత్తు పల్లాలుగా ఉండటంతో వాహనదారులు అప్రమత్తంగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక్కడ ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా ద్విచక్రవాహనాలు అదుపు తప్పుతున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి అక్కడ రోడ్డును బాగుచేయాలని వాహనదారులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, జాండ్రపేట (చీరాల అర్బన్)

డివైడర్‌కు మరమ్మతులు చేపట్టరూ

చీరాల పట్టణంలోని బోస్‌నగర్ సమీపంలో ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన డివైడర్ ఓ పక్క పూర్తిగా దెబ్బతింది. చీరాల - వేటపాలెం ప్రధాన రహదారి కావడంతో వాహనాల రాకపోకల ధాటికి డివైడర్ నుంచి ఒక్కొక్క రాయి నేలకొరిగింది. ఈ సమస్య పెద్దదిగా మారే అవకాశం లేకపోలేదు. అధికారులు స్పందించి వెంటనే డివైడర్‌కు మరమ్మతులు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పేరాల

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

వేతన సవరణ సంఘం ఏర్పాటు చేయాలి

చీరాల: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటుచేసి 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ఎస్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో జరిగిన ఎస్టీయూ సమావేశంలో నేతలు ప్రభాకరరావు, ఏసురత్నం, వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 13న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈసందర్భంగా కరపత్రాన్ని ఆవిష్కరించారు.

ఆక్రమణలు అడ్డుకునేదెవరు

పర్చూరు, న్యూస్‌టుడే: పర్చూరులో జాగా కనపడితే పాగా వేసేయ్ అన్న చందంగా పరిస్థితి మారింది. ప్రభుత్వ స్థలాలు కనపడితే చిన్నగా పాకలు వేసి, ఆపై రాత్రికి రాత్రే గోడలు కట్టి దుకాణాలు ఏర్పాటు చేస్తుండటం పరిపాటైంది. న్యాయస్థానాల్లో ఉన్న స్థలాల్లో ఎటువంటి కట్టడాలు కట్టకూడదని ఆదేశాలు ఉన్నా, ఆర్‌అండ్‌బీ రహదారుల వెంబడి, పోరంబోకు స్థలాలను ఆక్రమించుకుని దుకాణాలు నెలకొల్పి అద్దెలకు ఇస్తున్నారు. అయినా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆర్‌అండ్‌బీ, జాతీయ రహదారుల నిర్మాణ సంస్థ, పంచాయతీ అధికారులు ఒకరిపై ఒకరు నెపం నెట్టుకుంటూ అక్రమార్కులకు ఊతం ఇస్తున్నట్లుగా ఉంది. ఈ ఆక్రమణలతో పర్చూరు-ఇంకొల్లు, పర్చూరు-చీరాల మార్గంలో రహదారులు పూర్తిగా వెడల్పు తగ్గి, ఎదురెదురుగా వచ్చే వాహనాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని పలువురు ప్రజలు వాపోతున్నారు. ఈ విషయంపై ఎన్‌హెచ్ అధికారి ఖాదర్‌నవాజ్‌ను వివరణ కోరగా పరిశీలిస్తామని తెలిపారు.

పర్చూరు-చీరాల రహదారిలో నిర్మిస్తున్న షాపు

ఎన్నికల హామీల అమలుకు పోరాటం

బాపట్ల, న్యూస్‌టుడే: ఎన్నికల హామీల అమలు, ఆర్థిక అంశాల సాధన కోసం ఎస్టీయూ దశలవారీ పోరాటానికి పిలుపునిచ్చిందని ఆ శాఖ జిల్లా అధ్యక్షుడు బడుగు శ్రీనివాస్ తెలిపారు. ఎస్టీయూ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. 13న కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. సీపీఎస్ రద్దుతో పాటు పెండింగ్‌లో ఉన్న డీఏలను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బొంత వెంకటేశ్వర్లు, నేతలు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో సభ్యుల సహకారం అవసరం

చెరుకుపల్లి, న్యూస్‌టుడే: గోవాడ శైవక్షేత్రంలోని బ్రాహ్మణ అన్నదాన సత్రంలో మహాశివరాత్రి పురస్కరించుకొని 15, 16 తేదీల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు బాలకోటేశ్వరస్వామి అన్నదాన సేవాసమితి నాయకులు రావూరి ఆంజనేయులు, ఆర్వీఎస్ శర్మ తెలిపారు. సేవా కార్యక్రమ నిర్వహణలో భాగంగా బుధవారం చెరుకుపల్లిలో సమావేశమైన నాయకులు మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో పాల్గొనే సంఘ సభ్యులు ముందుగా పేర్లు నమోదు చేయించుకోని తమకు సహకారం అందించాలన్నారు.

ప్రధాన రహదారుల్లో సూచికలేవీ?

ప్రధాన రహదారుల్లో ప్రమాద సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రాణ, ఆస్తినష్టం జరుగుతోంది. ఇంకొల్లు కేంద్రంగా పాతచెన్నై రహదారిలో దగ్గుబాడు సమీపంలోని కోనరాజు కుంట, గ్రామానికి ఉత్తరం వైపు మలుపుల్లో పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఇంకొల్లు సమీపంలో సాగర్ కాలువ ప్రధాన రహదారి క్రాస్‌లో గత ఏడాది జరిగిన ప్రమాదాల్లో రెండు గేదెలు, ఒక మహిళ మృతిచెందారు. ఇంకొల్లు-సంతరావూరు ఆర్‌అండ్‌బీ రోడ్డులో ఎమిలేరు ఎత్తిపోతల పథకం దగ్గర వాగుపై వంతెన రక్షణ గోడలు కూలిపోయి ప్రమాదాలు జరుగుతున్నాయి. ముప్పవరం ఆర్‌అండ్‌బీ రోడ్డులో గంగవరం సమీపంలో చప్టాపై వంతెన గోడలు కూలిపోయాయి. కొన్నిచోట్ల రహదారి అంచులు దెబ్బతిన్నాయి. కడవకుదురు రహదారిలో పలుచోట్ల అంచులు దెబ్బతిని, ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని ప్రమాద సూచికల ఏర్పాటుతో పాటు రక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఇంకొల్లు

సాగర్ కాలువ వంతెనను ఢీకొన్న కారు

దీన్‌దయాళ్ సేవలు చిరస్మరణీయం

చీరాల, పర్చూరు, చినగంజాం, న్యూస్‌టుడే: ఏకాత్మతా మానవతా వాదం సిద్ధాంతంతో జనసంఘ్‌కు సిద్ధాంతకర్తగా కీలకపాత్ర పోషించిన పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ సేవలు చిరస్మరణీయమని భాజపా జాతీయ కౌన్సిల్ సభ్యుడు ఎంవీ రమణారావు పేర్కొన్నారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం భాజపా కార్యాలయంలో నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా రమణారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్ల వెంకటేశ్వరరావు, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు కృష్ణఅర్జున్, రాష్ట్ర కార్యదర్శి ఎన్.మణికుమార్ తదితరులు మాట్లాడుతూ ఉపాధ్యాయ సిద్ధాంతం ఆధారంగానే జనసంఘ్ నుంచి భాజపా ఆవిర్భవించిందన్నారు. ఎం.భరణీరావు, రఘునాథ్, లక్ష్మయ్య, బి.భరణారావు పాల్గొన్నారు. ✦ పర్చూరు భాజపా కార్యాలయంలో నేతలు దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భాజపా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అడపాల కృష్ణ మాట్లాడారు. పార్టీ మండల అధ్యక్షుడు పి.గోపికృష్ణ, జిల్లా కార్యదర్శి ఎ.లక్ష్మీరాజ్యం, స్టేట్ మైనార్టీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ అమీన్‌బాషా పాల్గొన్నారు. ✦ చినగంజాం మండల భాజపా కార్యాలయంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి నివాళులర్పించారు. భాజపా మండల అధ్యక్షుడు ఉల్చి రాజేష్‌కుమార్, సీనియర్ నేత యు.ఏసుబాబు, నాయకులు కోలా సుబ్బారావు, అనుమాలశెట్టి శ్రీనివాసరావు, మెట్టు వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

చీరాల: దీన్‌దయాళ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

దాడిపై కేసు నమోదు

పర్చూరు, న్యూస్‌టుడే: అప్పుగా తీసుకున్న నగదు తిరిగి చెల్లించే క్రమంలో బుధవారం రాత్రి తనపై చదలవాడ వెంకటరమణ, అతని కుమారుడు హరికృష్ణ కర్రలతో దాడి చేసి గాయపరిచారని ఉప్పుటూరు గ్రామానికి చెందిన కాల్వ సత్యనారాయణ ఫిర్యాదు చేసినట్లు ఎస్సై పులి గోపి తెలిపారు. బాధితుడు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

అప్పుగా ఇచ్చిన నగదు అడిగినందుకు బెదిరింపులు

మార్టూరు, న్యూస్‌టుడే: అప్పుగా ఇచ్చిన నగదు తిరిగి ఇవ్వమని అడిగితే బెదిరిస్తూ అసభ్యకరంగా మాట్లాడుతున్నాడంటూ ఎం.ఎస్.కాలనీకి చెందిన దాసరి యువన బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు మార్టూరు పోలీసులు కేసు నమోదు చేశారు. 2022-24 మధ్యకాలంలో ఒంగోలుకు చెందిన కె.లక్ష్మీనారాయణ మార్టూరులో ఓ ట్రాన్స్‌పోర్టు సంస్థ నిర్వహించగా తాను రూ.33 లక్షలు, తన తల్లి రూ.17 లక్షల నగదు అప్పు ఇచ్చామని, నగదు తిరిగి ఇవ్వమని అడిగితే ఫోన్‌లో అసభ్యకరంగా మాట్లాడుతూ, బెదిరిస్తున్నాడంటూ ఆ యువతి ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై శ్రీనివాసరావు వివరించారు.

కారు బోల్తా.. ఏడుగురికి గాయాలు

తోటవారిపాలెం (చీరాల గ్రామీణం), న్యూస్‌టుడే: వేగంగా వెళుతున్న కారు బోల్తా పడి ఏడుగురు గాయపడిన ఘటన చీరాల మండలం తోటవారిపాలెం-పిట్టువారిపాలెం ఎన్‌హెచ్ కూడలి వద్ద బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కొందరు యువకులు హైదరాబాద్ నుంచి చీరాల వైపు వస్తుండగా.. చోదకుడి నిద్రమత్తు వల్ల కారు అదుపు తప్పింది. దీంతో పక్కనున్న పొలంలోకి దూసుకెళ్లి, విద్యుత్తు స్తంభాన్ని ఢీకొని బోల్తా పడింది. డ్రైవర్‌తో పాటు అందులో ప్రయాణిస్తున్న ఆరుగురు వ్యక్తులు గాయపడ్డారు. వీరిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై తమకు ఎటువంటి సమాచారం అందలేదని ఈపూరుపాలెం పోలీసులు తెలిపారు.

ఆర్వో ప్లాంట్ వద్ద బ్యాంకు అధికారులు

పాఠశాలకు రూ.5 లక్షల వస్తువులు వితరణ

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని ఇస్లాంపేటలో ఉన్న ఆజాద్ మున్సిపల్ మోడల్ ప్రాథమిక పాఠశాలకు ఎస్బీఐ తెనాలి శాఖ వారు రూ.5 లక్షల విలువ చేసే ఆర్వో వాటర్ ప్లాంట్, కంప్యూటర్లు, ఇంటిగ్రేటెడ్ ఫ్లాట్ ప్యానల్స్, విద్యా సంబంధ వస్తువులను బుధవారం పాఠశాలకు అందించారు. ఎస్బీఐ తెనాలి బ్రాంచి రీజనల్ మేనేజర్ వీవీ జగదీశ్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత ఉద్యోగాలు చేస్తూ ఇతరులకు సహాయపడాలన్నారు. ఎస్బీఐ బాపట్ల మెయిన్ బ్రాంచ్ మేనేజర్ పి.ఆనందబాబు, ఎం.తిరుమలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తపాలా సేవలు సద్వినియోగం చేసుకోండి

రేపల్లె అర్బన్: పోస్టల్‌శాఖ అందిస్తున్న సేవలను మరింత విస్తృతం చేసేందుకు అందరూ కృషి చేయాలని తెనాలి సూపరింటెండెంట్ విద్యావతి అన్నారు. ఇటీవల కొత్తగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన ఆమె బుధవారం రేపల్లె హెడ్ పోస్టాఫీసును సందర్శించారు. పోస్టల్‌శాఖ అమలు చేస్తున్న పథకాలను ఎక్కువ మంది ప్రజలు సద్వినియోగం చేసుకునేలా దృష్టి సారించాలన్నారు. ఈనెల 11 నుంచి 14 వరకు పోస్టల్ పొదుపు ఖాతాల మేళా, 18 నుంచి 20 వరకు నిర్వహించే బీమా మేళాను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రేపల్లె సహాయ సూపరింటెండెంట్ ఏడుకొండలు, పాంచజన్యరెడ్డి, సత్యనారాయణ, నరేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

గోడలు బీటలు వారి.. ప్రమాదకరంగా మారి

కారంచేడు - పర్చూరు మార్గంలోని కారంచేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో రైతుల సౌకర్యార్థం ఎగువ నుంచి వచ్చే మురుగు నీరు పర్చూరు వాగులో కలిసేలా రహదారి కింద నుంచి కల్వర్టు నిర్మించారు. దీనికి కొన్నేళ్లుగా సరైన మరమ్మతులు చేయకపోవడంతో ఒక వైపు గోడలు బీటలు వారి, రక్షణ గోడలు రెండువైపులా కూలిపోయాయి. పిచ్చిమొక్కలు పెరిగి నీటి ప్రవాహానికి ఆటంకంగా మారాయి. దీంతో వరద సమయంలో పర్చూరు వాగులో నుంచి నీరు వెనక్కు మరలి, సమీప పొలాలను ముంచెత్తుతోందని కర్షకులు వాపోతున్నారు. అధికారులు రక్షణ గోడలు నిర్మించడంతో పాటు వరదనీరు వెనక్కు రాకుండా షట్టర్లు ఏర్పాటు చేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కారంచేడు

ఘంటసాలకు భారతరత్న ప్రకటించాలి

చీరాల, న్యూస్‌టుడే: మధురమైన తన గానంతో తెలుగువారిని అలరించిన గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావుకు భారతరత్న అవార్డు ప్రకటించాలని ఘంటసాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి కోరారు. ఘంటసాల వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం వేదిక ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గాదె హరిహరరావు, సీతారామశర్మ, నాగమనోహరలోహియా, బాలకృష్ణ, సుభాని తదితరులు పాల్గొన్నారు.

నివాళి అర్పిస్తున్న ప్రతినిధులు

ఆంధ్రప్రదేశ్ – దేవాదాయ – ధర్మదాయశాఖ

శ్రీ త్రివిక్రమ మరియు అగస్తేశ్వర స్వామి వారి దేవస్థానం

చెరుకూరు గ్రామం, పర్చూరు మండలం, బాపట్ల జిల్లా - 523169

టెండర్ నోటీసు నెం.నిల్/2026–27, తేది: 12.02.2026

శ్రీ త్రివిక్రమ మరియు అగస్తేశ్వర స్వామి వారి దేవస్థానముకి ఈ క్రింది తెలిపిన వివిధ ఐటములకు సీల్డ్ టెండర్లను కోరటమైనది. ఈ దిగువ తెలిపిన విధములుగా టెండర్ వివరములు కలవు.

వ.నెం	ఐటమ్ పేరు	టెండర్ కాలము	టెండర్ ధరావత్తు	టెండర్ విధానము
1	అవసరమైన కిరాణా మరియు పూజ సరుకులు సప్లయి చేయుటకు	తేది:01.06.2026 నుండి 31.05.2027	10000/-	సీల్డ్ టెండర్
2	అవసరమైన మాలలు, పుష్పములు సప్లయి చేయుటకు	తేది:01.06.2026 నుండి 31.05.2027	10000/-	సీల్డ్ టెండర్
3	2026-27 సం॥లో నిర్ణయకాల పండగలుకి, శ్రీ స్వామి వారి వార్షిక కళ్యాణమహోత్సవంకి ఎలక్ట్రికల్ డెకరేషన్	తేది:01.05.2026 నుండి 31.03.2027	10000/-	సీల్డ్ టెండర్

సీల్డ్ టెండర్ ఫామ్స్‌ను తేది.12.02.2026 నుండి తేది.27.02.2026న ఉదయం 10.00 గంటల వరకు స్వీకరించి, అదేరోజు మధ్యాహ్నం 12.00 గంటలకు దేవాదాయ ధర్మదాయశాఖ అధికారులు, టెండర్‌దారుల సమక్షములో కార్య నిర్వహణాధికారి వారిచే సీల్డ్ టెండర్లను తెరవబడును. దేవస్థానము కార్యాలయము పని చేయు వేళల్లో ఐటెం నెంబరు 1 నుండి 3 వరకు రూ 500/-లు టెండర్ షెడ్యూల్‌కి చెల్లించి సీల్డ్ టెండర్ షెడ్యూల్ ఫామ్స్‌ను పొందగలరు. మరిన్ని వివరములు కొరకు దేవస్థానము కార్యాలయములో సంప్రదించి తెలుసుకొనగలరు.

శ్రీ స్వామి వారి సేవలో కార్యనిర్వహణాధికారి

(c) eenadu

ధ్వజారోహణం.. ఆనందించే భక్తగణం

ధ్వజారోహణం సందర్భంగా పూలవర్షం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలకు సమారంభంగా వాయులింగేశ్వరుని ధ్వజారోహణ ఘట్టం ఆద్యంతం వైభవంగా జరిగింది. తొలి పూజ కన్నప్పదైతే.. బ్రహ్మోత్సవ బాధ్యత నందీశ్వరునిది. అందుకే వృషభధ్వజ సంకేతం కల్గిన దవళవస్త్రాన్ని అధిరోహించి వేదోక్తంగా ధ్వజారోహణ ఘట్టాన్ని పూర్తిచేశారు. ఉత్సవ మూర్తులకు శ్రీకృష్ణదేవరాయల కాలం నాటి దివ్యాభరణాలు అలంకరించారు. స్వామినాథన్ నేతృత్వంలో సంకల్ప పూజలు అనంతరం ధ్రువమూర్తులకు కంకణధారణ చేపట్టి సకల దేవతలను ఆహ్వానించారు. ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, ఈవో బాపిరెడ్డి, బొజ్జల బృందమ్మ, భాజపా నేత ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సంకల్ప పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, ఉభయదారులు

నేడు భూతరాత్రి వైభవం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం భూతరాత్రి వైభవం జరగనుంది. సమస్త భూత గణాలకు అధిపతి అయిన సర్వాంతర్యామి ఉదయం సూర్య ప్రభ, చప్పరంపై దర్శనమిచ్చే సోమస్కందమూర్తి, జ్ఞానాంబికలు రాత్రి భూత, శుక వాహనాలపై ఊరేగుతూ భక్తకోటికి దర్శన భాగ్యం కల్పించనున్నారు.

ఉ.4.30: మంగళవాయిద్యాలు
5.00: గోమాతపూజ, సర్వదర్శనం
9.00: స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తుల ఊరేగింపు
రాత్రి 8.00 స్వామి, అమ్మవార్ల పురవీధుల ఉత్సవం
9.00: దర్శనం ముగింపు

కల్పవృక్షంపై రాజమన్నార్ రాజసం

చంద్రగిరి, న్యూస్‌టుడే: శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో నాలుగోరోజు బుధవారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారు శ్రీరాజమన్నార్ (శ్రీరాజగోపాలస్వామి) స్వరూపంతో కల్పవృక్ష వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వాహనసేవ అనంతరం కల్యాణమండపంలో శ్రీవారి ఉత్సవమూర్తులకు తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం శ్రీవారి ఉత్సవమూర్తులు ఊంజల సేవలో భక్తులను తన్మయపరిచారు. రాత్రి శ్రీహరి దేవేరులతో సర్వభూపాల వాహనంపై తిరువీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

నేడు గరుడోత్సవం : వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం పల్లకీసేవ, స్నపనతిరుమంజనం, సాయంత్రం ఊంజలసేవ అనంతరం స్వామివారు గరుడవాహనం అధిరోహించి తిరువీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు.

చౌక.. చక్కదిద్దక

- రేషన్ దోచేస్తున్న వైకాపా అనుయాయులు
- పునర్విభజన, ఖాళీల భర్తీ ఎప్పుడో?

చౌక ధరల దుకాణం

చిత్తూరు (మిట్టూరు), న్యూస్‌టుడే: చౌకదుకాణాల పునర్విభజన ప్రక్రియ మూలనపడింది. ఏళ్లుగా తాత్కాలిక పద్ధతిలోనే కొనసాగుతుండగా.. శాశ్వత డీలర్ల భర్తీ ప్రక్రియను మధ్యలోనే ఆపేశారు. తద్వారా అవినీతి రాజ్యమేలుతోంది.

జిల్లాలో చౌక దుకాణాల పునర్విభజన ప్రక్రియ ప్రతిపాదనల్లోనే ఉంది. కూటమి ప్రభుత్వం 800 బియ్యం కార్డులున్న చౌక దుకాణాలను పునర్విభజించి...లబ్ధిదారులకు సౌకర్యంగా దుకాణాల ఏర్పాటుకు దృష్టి సారించగా అదనంగా 48 దుకాణాలు అందుబాటులోకి వస్తాయి. ఈ ప్రక్రియ నిలిచిపోవడంతో లబ్ధిదారులు సరకులు పొందేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరకుల పంపిణీలో అక్రమాలకు పాల్పడిన కొన్ని దుకాణాలపై 6ఏ కేసులు.. మరికొన్ని దుకాణాల డీలర్లను సస్పెన్షన్ చేశారు. 6ఏ కేసులు, సస్పెన్షన్‌కు గురైన డీలర్ల స్థానంలో ఆ ప్రాంతంలోని మహిళా స్వయంసహాయక సంఘం సభ్యులకు తాత్కాలిక పద్ధతిలో అప్పగించారు. పౌరసరఫరాల శాఖలో అధికారుల కొరతతో పర్యవేక్షణే లేకపోవడంతో కొందరు బియ్యాన్ని దోచేస్తున్నారు.

జిల్లాలో బియ్యం కార్డులు : 5.47 లక్షలు
దుకాణాలు : 1,379
తాత్కాలిక డీలర్లు: 430
కొత్తగా ఏర్పాటయ్యేవి : 48

అనుమతులు రాగానే భర్తీ

ప్రభుత్వ అనుమతులు రాగానే దుకాణాల పునర్విభజన, డీలర్ల ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటాం. డీలర్ల అక్రమాలు ఉపేక్షించం. కేసులు నమోదు చేస్తాం. **-శంకరన్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి**

పసివయసుకు ప్రసవ గండం

- ఉమ్మడి జిల్లాలో ప్రమాదకర స్థాయిలో కేసులు
- కుప్పం ప్రాంతంలో అత్యధికంగా 14.9 శాతం

ఈనాడు- చిత్తూరు, న్యూస్‌టుడే, తిరుపతి (వైద్యవిభాగం): బాలికలకు కనీస వివాహ వయసు 18 ఏళ్లుగా చట్టం చేసినా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. ఆలోపు వారు గర్భం దాలిస్తే శారీరక, మానసిక సమస్యలు ఎదురయ్యే అవకాశమున్నా తల్లిదండ్రులు విస్మరిస్తున్నారు. అవగాహన కల్పించడంలో అధికారులూ విఫలమవుతున్నారు. దీంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో టీనేజర్ల ప్రసవాలు అధికంగా జరుగుతున్నాయి.

తిరుపతి జిల్లాలో 2025 ఏప్రిల్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు ముప్పైవేల వరకు ప్రసవాలు జరిగాయి. అందులో 13-19 ఏళ్లలోపు బాలికలు 3,364 మంది ఉన్నారు. చిత్తూరు జిల్లాలో మొత్తం ప్రసవాలు పోల్చితే ఆరువేల వరకు తక్కువగా ఉండగా గర్భం దాల్చిన టీనేజర్ల సంఖ్య 2,565 నమోదైంది. శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లో పరిశ్రమలు ఉండటం, ఉపాధి కోసం ఉత్తరాది రాష్ట్రాల నుంచి తల్లిదండ్రులు వలస వస్తుండగా వారితో వచ్చే బాలికలు త్వరగా గర్భం దాల్చుతున్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో సహజంగానే శివరాత్రి సమయంలో బాల్య వివాహాలు అధికం. చిత్తూరు జిల్లాలో కుప్పం, పలమనేరులో ఇలాంటి ప్రసవాలు జరుగుతున్నాయి. కుప్పం ప్రాంతంలో తల్లిదండ్రులు చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేస్తుండటంతో ఇక్కడ అత్యధికంగా 14.9 శాతం టీనేజర్ల ప్రసవాలు నమోదవుతున్నాయి.

తల్లీబిడ్డలకు ప్రతిబంధాలు ఇలా..

బాలికల్లో శారీరకంగా ఎదుగుదల లేకపోవడంతో అనివార్య పరిస్థితుల్లో సిజేరియన్లు చేస్తున్నారు. 65 శాతం మంది వరకు రక్తహీనతతో బాధపడుతున్నారు. ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో వీరికి ప్రసవాలు చేయడం క్లిష్టతరమవుతుండటంతో జిల్లా, ప్రాంతీయ ఆసుపత్రులకు తరలిస్తున్నారు. ప్రసవం సమయంలో ఇబ్బందులు ఎదురై మాతాశిశు మరణాలు పెరుగుతున్నాయి. ఇలాంటి కేసుల్లో శిశువులూ బలహీనంగా ఉంటున్నారు.

కమిటీలు ఉండి లాభమేంటి?

బాల్య వివాహాలు నేరం. ఉల్లంఘిస్తే రెండేళ్ల జైలుశిక్ష రూ.లక్ష జరిమానా విధించే అవకాశముంది. ఇలాంటి వాటిని అడ్డుకోవడానికి గ్రామ, మండల స్థాయిలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, మహిళా పోలీసులు, ఏఎన్ఎంలతో కమిటీలు వేసినా ప్రయోజనం లేకుండాపోయింది. గ్రామ పెద్దలు పంచాయితీలు చేయడం, పిల్లలకు రహస్యంగా పెళ్లిళ్లు చేయడంతో సమస్యలు ఎదురవుతున్నాయి.

ఇలా చేస్తే మేలు

పాఠశాలల్లో తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, పారిశ్రామిక ప్రాంతాల్లో తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పరిస్థితుల్లో మార్పువచ్చే అవకాశం ఉంటుంది. వివాహాలు అరికట్టడానికి పొదుపు మహిళల సాయం తీసుకోవడం, 1098 టోల్‌ఫ్రీ నంబరు, అధికారుల ఫోన్ నెంబర్లు ప్రదర్శించడం వంటి చర్యలు చేపట్టాల్సి ఉంటుంది.

2015 ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు ప్రసవాలు మొత్తం **23,492** టీనేజర్లు **2,565** శాతం **10.91**

జైకా.. కదలక

- కూటమి బడ్జెట్‌పైనే ఆశలు

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జపాన్ అంతర్జాతీయ సహకార సంస్థ (జైకా) సహకారంతో పనుల్లో స్తబ్ధత నెలకొంది. వైకాపా హయాంలో బిల్లులు రాకపోవడంతో గుత్తేదారులు పనులు ఆపేశారు. కూటమి ప్రభుత్వం కదలిక తెచ్చినా అంచనాలు పెరగడంతో గుత్తేదారులు ముందుకురాలేదు.

పనుల వివరాలు చెరువులు : **41**, అంచనా విలువ : రూ.**38.18** కోట్లు

కృష్ణాపురం జలాశయం

గతంలో తెదేపా పాలనలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 33 ప్యాకేజీల కింద 65 చెరువులు, ప్రాజెక్టుల మరమ్మతులు, అభివృద్ధి, ఆధునికీకరణ పనులు చేయాలని నిర్ణయించింది. కార్వేటినగరం మండలంలో కృష్ణాపురం ప్రాజెక్టుకు రూ.28 కోట్లు, పిచ్చాటూరులోని అరణియార్ ప్రాజెక్టుకు రూ.35 కోట్లతోపాటు చిత్తూరు జిల్లాలో 41, తిరుపతి జిల్లాలో 24 చెరువుల అభివృద్ధికి నిధులు కేటాయించింది. వైకాపా ప్రభుత్వం తొక్కిపెట్టడంతో పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి.

17 పనుల రద్దు : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 17 పనులు, మరో ఐదు చెరువుల పనులు రద్దుచేసింది. మిగిలిన 48 పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించింది. 2019-20 నాటి అంచనాలు కావడంతో పనులు కదలడం లేదు. రూ.10-12 కోట్లు అవసరం.

నోటీసులిచ్చాం : పెరిగిన ధరల ప్రకారం ప్రభుత్వానికి నివేదించాం. అదనపు నిధులిస్తేనే పనులు చేపట్టగలం. **- వెంకటేశ్వరరాజు, ఎస్ఈ**

క్రీడాకారుల వివరాలకు యాప్

నకిలీల కట్టడికి శాప్ చర్యలు

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: క్రీడల్లో నకిలీ ధ్రువపత్రాల్ని అడ్డుకోవడానికి కూటమి ప్రభుత్వం పారదర్శక చర్యలు చేపట్టింది. 'క్రీడా యాప్'లో వాటిని ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయిస్తోంది. క్రీడాకారుని చిరునామా, ఆధార్ సహా అన్ని వివరాలు ఉంటాయి. పోటీల వివరాలు వాటి పత్రాల్ని డిజీ లాకర్‌లో భద్రపరుస్తారు. వాటిని అభ్యర్థి తన ఫోన్ నుంచే ఎప్పుడు కావాలంటే అప్పుడు ఆధార్ నంబరు సాయంతో పొందొచ్చు.

క్రీడలు, వేదికల సమాచారం

శాప్ ఆదేశాల మేరకు 1999 నుంచి క్రీడా ధ్రువపత్రాల్ని యాప్‌లో భద్రపరచుకోవచ్చు. జిల్లాలో నైపుణ్యం కలిగిన క్రీడాకారులు ఎందరో ఉన్నారు. అవగాహన లేక అవకాశాల్ని అందిపుచ్చుకోలేకపోతున్నారు. యాప్ ద్వారా ఏడాదిలో జరిగే క్రీడల వివరాలు, ప్రాంతాలు, అవకాశాలను తెలుసుకోవచ్చు. క్రీడల్లో సాధించే పతకాలతో లభించే ప్రోత్సాహకాలు ఇతర వివరాలపై సమాచారం పొందొచ్చు.

జిల్లాలో ఇలా జిల్లాలో గతేడాది స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, వివిధ క్రీడా సంఘాల అసోసియేషన్లు వివిధ రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో తలపడ్డాయి. వేల సంఖ్యలో ఆటగాళ్లు పోటీల్లో పాల్గొన్నారు. అన్ని క్రీడాంశాల్లో కలిపి రాష్ట్రస్థాయిలో వందమందికిపైగా పతకాలు సాధించారు. జాతీయ స్థాయిలో 50 మంది వరకూ ప్రాతినిధ్యం వహించారు.

పెరుగుతున్న గజరాజుల సంఖ్య

పలమనేరు, న్యూస్‌టుడే: ఉనికి కోసం ఏనుగులు తమ పోరాటాన్ని సాగిస్తున్నాయి. ఇక్కడ పంటలు నష్టపోతున్నామని రైతుల ఆందోళన ఓ వైపు ఉంటే సంతతిని వృద్ధి చేసుకోవడానికి ఏనుగులు మరోవైపు ఆరాటపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఏనుగుల సంఖ్య పెరుగుతున్నట్లు అధికారులు స్పష్టం చేస్తున్నారు. 1984 సంవత్సరం ఏనుగులు మధుమలై నుంచి ఈ ప్రాంతానికి వలస వచ్చాయి. అప్పట్లో 7 నుంచి 14 ఏనుగులు సంఖ్య మాత్రమే ఉండేది. ఇప్పుడా సంఖ్య 80 నుంచి 100 వరకు పెరిగింది. అయితే చనిపోయిన వాటిని కలిపితే సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. జిల్లాలో 2021 నుంచి ఇప్పటివరకు 24 ఏనుగులు వివిధ కారణాలతో మృత్యువాతపడ్డాయి.

పలమనేరు అడవిలో ఏనుగులు

2024 సర్వే ప్రకారం జిల్లాలో ఏనుగుల వివరాలు

	ఆడ	మగ
పెద్దవి	6	16
మధ్యస్తం	16	8
గున్నలు	12	8

గుర్తు తెలియనివి: 20 నుంచి 30

మూడు రాష్ట్రాల్లో

ఏనుగులు ప్రస్తుతం ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో సంచరిస్తున్నాయి. వీటికి ఎక్కువ ఇబ్బందులు పక్కనున్న తమిళనాడు నుంచే ఉన్నట్లు సమాచారం. అక్కడ రైతులు వీటిని పంటల మీదికి రాకుండా చేయడానికి ఎంతో కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఇక కర్ణాటకలో కూడా ఇదే పరిస్థితి. వాటికి అన్ని అనుకూలంగా ఉండేది మన జిల్లాలో మాత్రమే. అందుకే అవి ఇక్కడ ఎక్కువగా సంచరిస్తున్నాయి. గతంతో కంటే వీటి సంఖ్య బాగా పెరిగిందని చిత్తూరు డీఎఫ్‌వో సుబ్బరాజు తెలిపారు.

టన్నుల్లో చెత్త.. ఎరువుగా తరలి

చిత్తూరు డంపింగ్ యార్డులో ఏర్పాటు చేసిన ప్రాసెసింగ్ యంత్రాలు

టిప్పర్లలో తరలిస్తూ..

ఈనాడు, చిత్తూరు: అబ్బా కంపు.. అటుగా వెళ్లాలంటేనే ముక్కుపుటాలదిరే దుర్వాసన. వందల అడుగుల దూరం నుంచే ఇక్కడెక్కడో డంపింగ్ యార్డు ఉందని ఇట్టే చెప్పేయొచ్చు. అది మొన్నటి వరకులో ఉన్న డంపింగ్ యార్డు దుస్థితి. ప్రస్తుతం రాష్ట్రంలో డంపింగ్ యార్డులు లేకుండా చూడాలన్న లక్ష్యానికి వేగంగా అడుగులు పడుతున్నాయి. అందులో భాగంగా చిత్తూరులో టన్నులకొద్దీ చెత్తను ప్రాసెసింగ్ చేసేందుకు పెద్దఎత్తున యంత్రాలు ఏర్పాటు చేశారు.

16 ఎకరాల్లో ఉన్న ఈ యార్డులో చెత్తను ప్రాసెసింగ్ చేసి ఎరువును ఉచితంగా ఇస్తుండటంతో రైతులు తమ పొలాల్లో వేసుకోవడంతో పాటు రోడ్డు పనుల్లోనూ వినియోగిస్తున్నారు. ఇలా ఇప్పటికే దాదాపు 2 లక్షల టన్నుల చెత్తను ప్రాసెసింగ్ చేసినట్లు అక్కడి ప్లాంట్ మేనేజర్ గోకుల్ తెలిపారు. మరో 70 వేల టన్నుల చెత్త ప్రాసెసింగ్ చేయాల్సి ఉందని, దీనిని త్వరగా పూర్తిచేస్తే ఏరోజు చెత్త ఆరోజు ప్రాసెస్ చేసేలా పనులు వేగవంతం చేస్తున్నామన్నారు.

రెవెన్యూలో 19 మందికి రివర్షన్

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రెవెన్యూ శాఖలో 19 మంది సీనియర్ అసిస్టెంట్లకు గ్రేడ్-1 వీఆర్‌వోలుగా రివర్షన్ ఇచ్చారు. ఈ మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి. 2022, 2023లో ఉమ్మడి జిల్లాలో పలువురు గ్రేడ్-1 వీఆర్‌వోలకు తాత్కాలికంగా ఉద్యోగోన్నతిపై సీనియర్ అసిస్టెంట్లుగా పోస్టింగులు ఇచ్చారు. ఉద్యోగోన్నతి పొందినవారు తహసీల్దార్/ఆర్డీవో/కలెక్టరేట్‌లో రెండేళ్లపాటు పనిచేయాలని, డిపార్ట్‌మెంట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలని, ఏపీపీఎస్సీ నిర్వహించే కంప్యూటర్ సామర్థ్య పరీక్షల్లో ఉత్తీర్ణులు కావాలంటూ షరతులు విధించారు. 19 మంది సీనియర్ అసిస్టెంట్లు.. సంతృప్త స్థాయిలో ఉత్తీర్ణత సాధించకపోవడంతో రివర్షన్ పొందారు. చిత్తూరు జిల్లాలో ఐదుగురు, తిరుపతి జిల్లాలో ఐదుగురు, అన్నమయ్య జిల్లాలో 9 మంది రివర్షన్ ఉత్తర్వులు అందుకున్నారు.

వేలాడే.. ప్రాణాలు.. ప్రయాణాలు

చిత్తూరు-పుత్తూరు మార్గంలో వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు చిత్తూరుకు చదువుకునేందుకు వస్తారు. వీరితో పాటు వివిధ పనులపై నగరానికి వచ్చే ప్రజలు, చిరుద్యోగులు ఒక్కసారిగా సాయంత్రం ఇళ్లకు పయనం అవుతుండటంతో బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. కొందరు విద్యార్థులు బుధవారం ఇలా పుట్‌బోర్డుపై నిల్చొని ప్రయాణించారు.

-ఈనాడు, చిత్తూరు

17 నుంచి చదరంగం పోటీలు

తిరుపతి (క్రీడలు), న్యూస్‌టుడే: క్రీడా క్యాలెండర్- 2026లో భాగంగా తిరుపతిలో జిల్లా, రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు నిర్వహించనున్నట్లు శాప్ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శశిధర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 17న జిల్లాస్థాయి, ఈనెల 21న రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయని, పోటీలకు అండర్- 13, 15, 17, 19 బాలబాలికలు అర్హులని అందులో వివరించారు. ఆసక్తిగల క్రీడాకారులు క్రీడా యాప్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఇక్కడికి వచ్చే క్రీడాకారులు, కోచ్‌లకు అవసరమైన వసతులు కల్పిస్తున్నామని, వివరాలకు 90596 06346, 99668 82029, 91772 34298 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

104FM Tirupati Mee FM

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9154991499

ఇక చాలనే వయసులో చిరుతలా..!

తిరుపతి (క్రీడలు), న్యూస్‌టుడే: ఏడుపదుల వయసు.. అయితేనేం అదే వేగం.. జింకలా చెంగు చెంగుమంటూ దూకేస్తున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సొంత చేసుకుంటున్నారు. ఆయనే తిరుపతికి చెందిన కూరపాటి ధనంజయ (72). తిరుపతి గ్రామీణ మండలం ఓటేరు గ్రామానికి చెందిన ఆయన ఐదో తరగతి వరకు చదువుకున్నారు. తిరుపతి భేరివీధిలో 45 ఏళ్లుగా చౌకదుకాణం నిర్వహిస్తున్నారు. మానసికోల్లాసం కోసం రోజూ ఉదయం, సాయంత్రం మైదానానికి వెళ్లేవారు. ఈక్రమంలో పలువురు వ్యాయామం, అథ్లెటిక్స్‌లో సాధన చేయడం చూసి స్ఫూర్తి పొందారు. అందరూ ఇక విరమిద్దామనే వయసులో తాను మొదలుపెట్టారు. అలా 2014 నుంచి మాస్టర్ అథ్లెటిక్స్‌లో సాధన మొదలుపెట్టారు. సలహాలు, సూచనలు ఇవ్వడానికి ఎవరూ లేనప్పటికీ సొంతంగా రాటుదేలారు. ప్రస్తుతం 100 మీ. పరుగు, 80, 300మీ హర్డిల్స్, 100×4 రిలేలో రాణిస్తున్నారు. ఇప్పటివరకు 15కుపైగా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. ఇటీవల తిరువనంతపురం వేదికగా జరిగిన 46వ జాతీయస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం, రెండు రజతాలతో సత్తాచాటారు. కుమారుడు ఓ ప్రైవేటు బ్యాంకులో ఉద్యోగం చేస్తుండగా, కుమార్తెను చార్టెడ్ అకౌంటెంట్‌కి ఇచ్చి వివాహం చేశారు. ఆర్థిక ఇబ్బందులు సైతం తట్టుకుని ప్రతిపోటీలోనూ ప్రాతినిధ్యం వహిస్తూ వస్తున్నారు.



హర్డిల్స్ సాధనలో ధనంజయ

అంత్యక్రియలు

మంచి మనసుకు ప్రతిరూపం...
మమతానురాగాల మణిదీపం...
మరువలేము నీ రూపం...
ఆత్మీయతను పంచిన అమృతమూర్తి...
మా ఉన్నతికి అహర్నిశలు శ్రమించిన మా ఇంటిదీపం
శ్రీమతి అవినేని వనజాక్షి గారు
10.02.2026 మంగళవారం స్వర్గస్తులైనారు.

దహనక్రియలు
12.02.2026వ తేది గురువారం ఉ.11.00గం॥లకు మా స్వగృహం నెం.20 టెంపుల్ టౌన్ విల్లాస్, రామతులసి కళ్యాణ మండపం రోడ్డు నుండి అంతిమయాత్రగా బయలుదేరి గోవిందధామం నందు జరుగునని తెలియజేయడమైనది.

కీ॥శే॥ అవినేని వనజాక్షి గారు
W/o.కీ॥శే॥ అవినేని జయరామా నాయుడు,
మరణం: 10.02.2026

శోకతప్త హృదయాలతో...
కుమారులు: అవినేని ప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్, చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్
అవినేని జయప్రకాష్, USA
కుమార్తె: డా॥ఎ.స్వర్ణలత మరియు కుటుంబసభ్యులు

(c) eenadu

అగస్త్య పూజితం.. అరుదైన ఆలయం

నలభై అడుగుల్లో పాతాళ గణపతి వైభవం

స్వామిని దర్శించుకునేందుకు వెళ్తున్న భక్తులు

ప్రాశస్త్యం ఇలా..: స్థల పురాణం అంతర్గతంగా సప్త రుషుల్లో ఒక్కరైన అగస్త్య మహర్షి దక్షిణ కైలాసంగా ప్రసిద్ధి పొందిన శ్రీకాళహస్తి క్షేత్రానికి నది ఆవశ్యకత తెలుసుకుని తపోబలంతో సువర్ణముఖి పేరుతో నదిని ఆవిర్భవింపచేశారు. పాతాళం సమీపంలోని అగస్త్య వనంలో పుట్టి శ్రీకాళహస్తీశ్వరాలయానికి సమీపంలో సాగుతూ బంగాళాఖాతంలో కలుస్తోంది. నది ఆవిర్భావం జరిగాక అందులో నీళ్లు లేకపోవడంతో ఆలోచనలో పడ్డారు. తపస్సుకు ముందు విఘ్నాధిపతి అయిన వినాయకస్వామిని పూజించని కారణంగా ఇలా జరిగిందని గ్రహించి ఆయన్ను మన్నించమని వేడుకుంటారు. అగస్త్యముని సంకల్పానికి మెచ్చిన వినాయకస్వామి పాతాళ మార్గంలో 40 అడుగుల లోతులో అగస్త్యునికి దర్శనమిచ్చినట్లు స్థల పురాణంలో విశదమవుతోంది. అందుకే ఇప్పటికీ ఇక్కడి వినాయక దర్శనం చేసుకోవాలంటే భక్తులు నలభై అడుగుల్లోనికి వెళ్లి చూడాల్సిందే.

దక్షిణ కైలాసంగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తి క్షేత్రంలో పురాణ ప్రాభవం కలిగిన ఆలయాలు ఎన్నో ఉన్నాయి. క్షేత్ర మహత్యానికి, అందులో సువర్ణముఖి నదీ పుట్టుకతానికి సంబంధించి ఏర్పాటైన పాతాళ గణపతి ఆలయం అగస్త్య మహర్షి పూజితంగా, దాదాపు 40 అడుగుల పాతాళంలో పూజలందుకుంటున్నారు. ఇక్కడి ఆలయం ఎంతో అరుదైనదిగా గుర్తింపు పొందడం విశేషం. ఈ గణనాథుని దర్శించుకునేందుకు సినీనటులు, రెండు తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అత్యధికంగా భక్తులు తరలివస్తుండటం విశేషం.

వినాయక స్వామి

సాహసోపేతమైన దర్శనం..: పాతాళ వినాయక స్వామి దర్శనం ఓ రకంగా సాహసోపేతమైనదనే చెప్పాలి. ఎందుకంటే ఎవరైనా మోకాళ్ల మీద పాక్కుంటూ లోనికి వెళ్లాల్సిందే. ఇరుకైన, ఎత్తయిన మెట్లపై అత్యంత జాగ్రత్తగా లోనికి వెళ్లి వినాయక స్వామిని దర్శించుకోవాల్సి ఉంటుంది. స్థూలకాయులు, చంటిబిడ్డలు, వృద్ధులు, దివ్యాంగులు, హృద్రోగులకు ప్రవేశం లేదు. ఎందుకంటే లోనికి వెళ్లి రావడం కాస్తంత కష్టం. భక్తుల శ్రేయస్సు దృష్ట్యా ఆలయ అధికారులు ఈ తరహా నియమ, నిబంధనలు అనుసరిస్తూ భక్తులను ఆలయంలోనికి అనుమతిస్తుంటారు. ఇరుకుగా ఉండటం వల్ల ఏడు లేదా ఎనిమిది మందికి మాత్రమే లోపలికి వెళ్లే అవకాశం ఉంటుంది. వాళ్లు వెళ్లి వచ్చాక మరి కొంత మందిని అనుమతిస్తుంటారు. ఇలా పర్వదినాల్లో రోజంతా వినాయకుడి దర్శనాలు సాగుతాయి.

- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

సుప్రభాతం.. ఆధ్యాత్మిక ఆనందం..

పవళింపు సేవలోని దేవతామూర్తులకు మేలుకొలుపును నిర్వహించే విశిష్ట సేవ సుప్రభాతం. ఒక్కో ఆలయంలో ఒక్కో రీతిలో ఈ సేవ నిర్వహిస్తుంటారు. శ్రీకాళహస్తీశ్వరాలయ విషయానికి వస్తే జ్ఞానప్రసూనాంబిక అమ్మవారి ఆలయానికి ఎడమ వైపున ఉన్న శయన మందిరంలో ఈ విశేష సేవ నిర్వహిస్తుంటారు. ప్రతి రోజూ వేకువజాము ఇక్కడ ప్రభాతసేవ, రాత్రి ఏకాంతసేవ ఈ మండపం లోనే జరుపుతుంటారు.

❖ **రుసుం:** రూ. 200 ❖ **అనుమతి:** ఒకరికి

❖ **ఎలా పొందాలి:** ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఆలయ కౌంటర్లలో పొందవచ్చు

❖ **ప్రత్యేకతలు:** ప్రధానమైన గర్భాలయాల్లో కొలువుదీరిన శ్రీకాళహస్తీశ్వరునితో పాటు జ్ఞానాంబిక అమ్మవార్ల తొలి దర్శనాన్ని వీక్షించే అవకాశం.

❖ **ఫలితం:** మానసిక శాంతి, ఆరోగ్యసిద్ధి, సర్వపాపాలు హరించిపోతాయి.

ముక్కంటి ఆలయంలోని శయనోత్సవ మండపం

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance

రిజిష్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై- 600032, ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్రాలకు పరిపాలనా కార్యాలయం: డి.నెం.3-6-478, 4వ అంతస్తు, ఆనంద్ ఎస్టేట్ లిబర్టీ రోడ్డు, హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500029, వెబ్‌సైట్: www.shriramfinance.in. బ్రాంచ్ కార్యాలయము : ప్యాలెస్ రోడ్డు, కుప్పం, చిత్తూరు జిల్లా

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క 8(6) క్రింద 30 రోజులు అయిన తర్వాత అమ్మకాన్ని తెలుపుతూ ఋణగ్రహీతకు ఇవ్వబడిన ఉద్దేశిత అమ్మకం ప్రకటన

రుణగ్రహీతలు / గ్యారంటార్ల వివరాలు:-

1) శ్రీ సాయి శ్రీనివాస ట్రేడర్స్, ప్రొప్రయిటర్ టి.జయకుమార్, తండ్రి చిన్నప్ప, డి.నెం.1-125, క్రిష్ణ దాసనపల్లి, కుప్పం, చిత్తూరు జిల్లా - 517425

2) టి.జయకుమార్ తండ్రి చిన్నప్ప, డి.నెం.1-125, క్రిష్ణ దాసనపల్లి, కుప్పం, చిత్తూరు జిల్లా - 517425

3) టి.కుపేంద్రన్, తండ్రి తిమ్మరాయశెట్టి, డి.నెం.30, సమృద్ధి నగర్, 3వ క్రాస్, భాచన లేఔట్, బెంగుళూరు- 560043

4) 1) టి.మహేంద్రబాబు తండ్రి చిన్నప్ప, డి.నెం.1-67, క్రిష్ణదాసనపల్లి, కుప్పం,చిత్తూరు జిల్లా - 517425

5) 2)టి.పార్వతమ్మ, భర్త చిన్నప్ప, డి.నెం.1-67, క్రిష్ణదాసనపల్లి, కుప్పం,చిత్తూరు జిల్లా - 517425

సర్/ మేడమ్,

విషయం:2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలతో చదువుకొనేలా 2002 సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం ద్వారా ఋణదాతకు బకాయిపడిన మొత్తాలను వసూలు చేయుటకు ఋణగ్రస్తులగు : **సాయిశ్రీనివాస ట్రేడర్స్ ప్రొప్రయిటర్ టి.జయకుమార్ తండ్రి చిన్నప్ప** కు చెందిన ఆస్తుల అమ్మకం గురించి నిర్దేశించిన అమ్మకం ప్రకటన

సూచిక : ఋణ ఒప్పందం నెం. KUPPMTF2101300007

1.ఇందుమూలముగా తెలియజేయడమేమనగా "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్" తేదీ 09.11.2022న సి.పి.నెం.69-76 ఆఫ్ 2022 లోని ఎన్‌సిఎల్‌టి చెన్నై వారి ఉత్తర్వు ప్రకారం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్"తో విలీనం కాబడింది. ఇటీవల "శ్రీరామ్ ఫైనాన్స్ ట్రాన్స్‌పోర్ట్ లిమిటెడ్" గా మార్పు చెందింది. ఇది తేదీ: 30.11.2022 నుంచి పేరు మార్పుకు సంబంధించిన సర్టిఫికెట్ ఇన్ కార్పొరేషన్ తేదీ: 30.11.2022 ద్వారా మార్పు చెందింది. దీని రిజిష్టర్ కార్యాలయం: శ్రీ టవర్స్ ఫ్లాట్ నెం.14ఎ, దక్షిణ దిశ, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై -600032 మరియు **పరిపాలనా కార్యాలయం 6వ అంతస్తు (లెవల్2) బిల్డింగ్‌నెం. క్యూ2 ఔరమ్ క్యూ పార్క్, జెన్4/1, టిటిసి, థానే, బేలాపూర్ రోడ్డు, ఘన్‌సోలి, నవి ముంబయి- 400710 మరియు వారి జోనల్/ బ్రాంచ్ కార్యాలయం: ప్యాలెస్ రోడ్డు, కుప్పం, చిత్తూరుజిల్లా వారు దిగువ విధంగా నోటీసు జారీ చేసినారు.**

2.సెక్యూర్డ్ ఋణదాత- శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13(2) క్రింద **తేది:16.03.2023** న జారీ చేసిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న తేదీ: **17.03.2023 నాటికి బకాయి రూ.34,92,378/-(ముప్పై నాలుగు లక్షల తొంభై రెండు వేల మూడు వందల డెబ్బై ఎనిమిది రూపాయలు మాత్రమే) తో** పాటు ఇటీవల వడ్డీ/ ఖర్చులు మొత్తాన్ని నిర్దేశించిన కాలపరిమితిలోగా మీరు చెల్లించవలెను. మీరు సదరు నోటీసులో నిర్దేశించిన కాలపరిమితి లోగా బకాయి మొత్తాన్ని చెల్లించనందున అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం (ఎన్‌ఫోర్‌మెంట్) నిబంధనలలోని నిబంధన 8తో చదువుకొనేటి సెక్షన్ 13(4) క్రింద సెక్యూర్డ్ స్థిరాస్తులను **తేది: 08.07.2024** న లాంఛనంగా స్వాధీనం చేసుకొనిరి మరియు చట్టంలోని సెక్షన్ 14 క్రింద ఎగ్జిక్యూటివ్ సహకారంతో **తేది: 12.01.2026** న భౌతికంగా స్వాధీనం చేసుకొనిరి.

కావున శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి చెల్లించాల్సిన బకాయి మొత్తం, తదుపరి వడ్డీ, ఖర్చులు, వ్యయాలలతో సహా విక్రయ ప్రకటన ప్రచురితమయ్యే లోపు చెల్లించిన యెడల విక్రయానికి సంబంధించిన ఎటువంటి చర్యలు తీసుకోకుండా రుణగ్రహీత చట్టంలోని సెక్షన్ 13(8) క్రింద తమ యొక్క ఆస్తులను తిరిగి పొందేందుకు సమయం కేటాయించవమైనదని గమనించగలరు. మీరు ఈ నోటీసు ప్రచురించిన తేది నుండి 30 రోజులలోపు బకాయి మొత్తం చెల్లించడంతో విఫలమైనా లేక విస్మరించినా దిగువ సంతకం దారు బకాయిలను తిరిగి రాబట్టుకునేందుకు పైన తెలిపిన సెక్యూర్డ్ ఆస్తులను విక్రయించడం మినహా ఎటువంటి ప్రత్యామ్నాయ చర్యలు ఉండవని గమనించగలరు. అది కూడా మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారి బకాయిలను రాబట్టుకునేందుకు పైన తెలిపిన రుణసౌకర్యానికి సంబంధించి మాత్రమే చెల్లించాలి.

ఈ ఉద్దేశిత అమ్మకం ప్రకటన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్),2002 లోని రూల్ 8(6) విరుద్ధంగా జారీ చేయబడినది.

ఈ ఆర్థిక సంస్థకు అందుబాటులో ఉన్న హక్కులు మరియు నివారణలకు ఎటువంటి పక్షపాతం లేకుండా ఈ నోటీసు జారీ చేయబడినది.

స్థిరాస్తి వివరములు:-

చిత్తూరు జిల్లా, కుప్పం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సాయి శ్రీనివాసా ట్రేడర్స్ ప్రొప్రయిటర్ టి.జయకుమార్ తండ్రి చినప్ప పేరున ఫైలు కాబడిన పత్రం నెం.913/ 2021లోని ఆస్తి వివరములు:- చిత్తూరు జిల్లా, కుప్పం సబ్‌జిల్లా, కుప్పం మండలం, దాసనపల్లి గ్రామ పంచాయతీ & గ్రామలెక్కదాఖలా సర్కారు మెట్ట సర్వేనెం.39/1లో ఎ.1.10 సెంట్లు లేదా 5320.94 చ.గ. మరియు ఇందున నిర్మించిన డి.నెం.2/157 గల ఎసిసి షీట్ రూఫ్ గ్రౌండు ఫ్లోర్ బిల్డింగ్‌కు కొలతలు: తూర్పు నుండి పడమర: 21.6 చ.అ. మరియు ఉత్తరం నుండి దక్షిణం:41.6 చ.అ. వెరశి 892.5 చ.అ. లేదా 99.14 చ.గ. లలో శ్రీ సాయి శ్రీనివాస ఇండస్ట్రీస్ వున్నది. హద్దులు: తూర్పు:చిన్న అప్పోని ఆస్తి, పడమరకం చిన్నగుట్ట, ఉత్తరం: దండ రోడ్డు, దక్షిణం: మునస్వామి భూమి.

ప్రదేశం: కుప్పం సం/- అధీకృత అధికారి,

తేది: 20.01.2026 శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న కాణిపాకం ఆలయ ఛైర్మన్ మణినాయుడు, ఈవో పెంచల కిశోర్ దంపతులు, అర్చకులు

శ్రీశైలం మల్లన్నకు పట్టువస్త్రాల సమర్పణ

కాణిపాకం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీశైలం భ్రమరాంబిక మల్లికార్జునస్వామికి.. కాణిపాకం స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయం నుంచి బుధవారం పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ ఛైర్మన్ మణినాయుడు, ఈవో పెంచల కిశోర్ దంపతులు, అర్చకులు, వేదపండితులు పట్టు వస్త్రాలు తీసుకెళ్లి అక్కడి పాలకమండి సభ్యులు, అర్చకులకు అందజేశారు. శ్రీశైలం ఆలయ ఛైర్మన్ రమేష్‌నాయుడు, ఈవో శ్రీనివాసరావు, కాణిపాకం ఆలయ పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

అదనపు కట్నం వేధింపులతోనే
పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య

భర్త, అత్త అరెస్టు.. రిమాండ్

పుత్తూరు, న్యూస్‌టుడే: భర్త వేధింపులతో ఓ వివాహిత తన ఇద్దరు పిల్లలను చంపి తానూ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న కేసులో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం రాత్రి విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పుత్తూరు మండలం నేసనూరు గ్రామానికి చెందిన పద్మ(28), పైడిపల్లి గ్రామానికి చెందిన శివశంకర్‌రావు(29) 8 సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. పుత్తూరు పట్టణంలో కాపురం ఉంటున్నారు. వీరికి తేజ, లాస్య ఇద్దరు కుమార్తెలున్నారు. శివశంకర్‌రావు కుటుంబాన్ని పోషించకుండా అప్పులు చేసి జులాయిగా తిరుగుతున్నాడు. భర్త, అత్త పద్మావతి బాయి కొంతకాలంగా పద్మను పుట్టింటికి వెళ్లి అదనపు కట్నం తీసుకురావాలని చిత్రహింసలకు గురిచేస్తున్నారు. కట్నం తీసుకురాకపోతే నువ్వు, నీ బిడ్డలు ఎక్కడికైనా వెళ్లి ఉరేసుకుని చావమని తిట్టడంతో మృతురాలు ఈనెల 7వ తేదీన తీవ్ర మనస్తాపానికి గురై ఇద్దరు బిడ్డలకు ఉరేసి చంపి తానూ ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి అన్న తులసీకార్తీక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతురాలి భర్త శివశంకర్‌రావు, అతని తల్లి పద్మావతిబాయిని బుధవారం సాయంత్రం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

డీఈవో పరిశీలన

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: పదో తరగతి వందరోజుల ప్రణాళికలో భాగంగా డీఈవో రాజేంద్రప్రసాద్ నగరంలోని ప్రశాంత్‌నగర్ కాలనీలో బుధవారం రాత్రి నైట్ విజన్‌లో విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల ఇంటికి వెళ్లి పిల్లలు ఏ విధంగా చదువుతున్నారని తల్లి దండ్రులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల రాత పుస్తకాలను పరిశీలించి సబ్జెక్టుపరంగా ప్రశ్నించి సమాధానాలు రాబట్టారు. ఉత్తమ మార్కులు సాధించేందుకు తీసుకోవాల్సిన మెలకువలు వివరించారు. చిత్తూరు, గుడిపాల ఎంఈవోలు మోహన్, హసన్‌బాషా, ప్రధానోపాధ్యాయుడు మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థి ఇంటికి వెళ్లి మాట్లాడుతున్న డీఈవో రాజేంద్రప్రసాద్ తదితరులు

'తెదేపా వారితో చేరితే సహించేది లేదు'

పలమనేరు, న్యూస్‌టుడే: వైకాపాకు చెందిన నాయకులు ఎవరూ తెదేపా వారితో చేరకూడదని మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆరోపించారు. బుధవారం పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో వైకాపా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గంగవరం మండలంలో తెదేపా, వైకాపా నాయకులు చెట్టాపట్టాలు వేసుకుని తిరుగుతున్నారు. అలాంటి వారిపై రాబోయే రోజుల్లో వైకాపా అధికారంలోకి రాగానే కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. అనంతరం వైకాపా నాయకులు పట్టణంలో మోటారు సైకిళ్ల ర్యాలీ చేపట్టారు. తిరుపతి మాజీ ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి, చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెంకటేగౌడ

రైతులకు విశిష్ట సంఖ్య తప్పనిసరి

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: ప్రతి రైతుకు 11 అంకెల ప్రత్యేక విశిష్ట సంఖ్య జారీ చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళి తెలిపారు. బుధవారం వ్యవసాయాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అన్నదాతలకు ప్రభుత్వ పథకాలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 'ఫార్మర్ రిజిస్ట్రీ' నమోదు ప్రక్రియ చేపట్టిందన్నారు. పీఎం కిసాన్ లబ్ధిదారులు 1,74,716 మంది ఉండగా..వీరిలో 1,30,900 మందికి ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు పూర్తయిందన్నారు. మిగిలిన 43,663 మందికి విశిష్ట గుర్తింపు సంఖ్య జారీకి దృష్టి సారించాలన్నారు.

నులిపురుగుల నిర్మూలనకు కృషి

చిత్తూరు (వైద్యవిభాగం), న్యూస్‌టుడే: జిల్లాలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంలో భాగంగా పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలను అందించి నులిపురుగుల నిర్మూలనకు కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి సుధారాణి తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం ఆమె జూమ్ కాన్ఫరెన్సు ద్వారా వైద్యాధికారులతో మాట్లాడారు.

తండ్రికి తలకొరివి పెట్టిన తనయ

వడమాలపేట, న్యూస్‌టుడే: తండ్రికి కుమార్తె తలకొరివి పెట్టిన ఘటన వడమాలపేట మండలం వడమాల గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సానంబట్ల మునిశేఖర్ ఉపాధ్యాయుడు. ఆయనకు భార్య సంధ్యాలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు సౌమ్య, హిమజ ఉన్నారు. మునిశేఖర్ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. భార్య, కుమార్తెలు తమకు దిక్కెవరంటూ గుండెలవిసేలా రోదించారు. కొడుకులు లేరు.. తలకొరివి ఎవరు పెడతారనే చర్చ బంధువుల్లో వచ్చింది. తన తండ్రి అంత్యక్రియలు తానే చేస్తానని, తలకొరివి తానే పెడతానని పెద్ద కుమార్తె సౌమ్య పెద్దలకు చెప్పింది. సంప్రదాయాలు పాటిస్తూ అంత్యక్రియలు పూర్తి చేసింది. తండ్రి లేని లోటు తీరనిదైనా చివరి తంతు అంతా తానే చేశానని ఆ చిన్నారి కంటతడి పెట్టడం చూపరుల హృదయాలను కలచివేసింది.

తండ్రి అంత్యక్రియల్లో సౌమ్య

గంగమ్మ ఆలయ నిర్మాణానికి తితిదే నిధులు

వడమాలపేట, న్యూస్‌టుడే: మండలంలోని తట్నేరి గ్రామం గంగమ్మ ఆలయ నిర్మాణం కోసం తితిదే శ్రీవాణి ట్రస్టు ద్వారా రూ. 20 లక్షల నిధులు మంజూరయ్యాయి. గతంలో ఎన్నో ఏళ్లుగా గుడి నిర్మాణం కోసం పలువురు ప్రజాప్రతినిధులను కలిసి విజ్ఞప్తి చేసినా గ్రామస్థుల కోరిక నెరవేరలేదు. ఇటీవల గ్రామస్థులు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన స్పందించి తితిదే ద్వారా నిధులు మంజూరు చేయించారు. ఈ మేరకు గ్రామస్థులు గాలి భానుప్రకాష్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

కార్వేటినగరంలో బర్డ్‌ఫ్లూ నిర్ధారణ

ఆందోళన చెందొద్దు: పశు సంవర్ధకశాఖ జేడీ

కార్వేటినగరం, న్యూస్‌టుడే: కార్వేటినగరం మండలం ఆర్‌కేవీబీపేట పంచాయతీ పరిధిలోని ఇందిరా కాలనీ రైతు గోపినాథ్‌కు చెందిన కోళ్ల ఫారంలో బర్డ్ ఫ్లూతో వేల సంఖ్యలో కోళ్ల మరణించాయి. కోళ్ల ఫారంలో నాలుగు రోజులుగా రెండు వేల కోళ్లకు పైగా మృతి చెందాయి. జిల్లా అధికార యంత్రాంగం కోళ్ల ఫారంలో మరణించిన కోళ్ల నమూనాలను సేకరించి భోపాల్‌లో పరీక్షలకు పంపారు. నివేదికలో బర్డ్ ఫ్లూగా నిర్ధారణ కావడంతో జిల్లా అధికార యంత్రాంగం ఆరు ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలతో బుధవారం సంఘటనా స్థలానికి చేరుకొని బయో సెక్యూరిటీ చర్యలు చేపట్టింది. కోళ్ల ఫారంలోని 5125 కోళ్లను శాస్త్రీయ పద్ధతిలో ఖననం చేశారు. గ్రామానికి సమీపంలోని కిలోమీటరు పరిధిలో 6100 కోళ్లను నిర్మూలించి వ్యాధి వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకున్నారు. పశు సంవర్ధకశాఖ జేడీ ఉమామహేశ్వరి మాట్లాడుతూ.. బర్డ్ ఫ్లూపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వ్యాధి ప్రబలకుండా అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. బర్డ్ ఫ్లూ వల్ల నష్టపోయిన పౌల్ట్రీ రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుందన్నారు. ఆమె వెంట డీడీ గోవిందయ్య ఏడీ వాసు, డీడీ ఆర్‌ఏడీడీఎల్ శ్రీలక్ష్మీ, పశువైద్యాధికారులు హేమకుమార్, కృష్ణ, సుబ్రహ్మణ్యం, నరేష్ ఉన్నారు.

బయో సెక్యూరిటీ చర్యలు చేపడుతున్న అధికారులు

అనుచిత పోస్టులపై కేసు

పెద్దపంజాణి, న్యూస్‌టుడే: తెదేపా నాయకులపై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో రెడ్డి వెంకటేష్ తెలిపారు. తెదేపా నాయకులు మురహరిరెడ్డి, సుధాకర్‌రెడ్డిలపై గుర్తుతెలియని వ్యక్తి ఫేక్ ఐడీలతో నాయకులు అవినీతికి పాల్పడినట్లు, పార్టీకి నష్టం కలిగే విధంగా పోస్టులు పెడుతున్నట్లు తెదేపా సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌ఛార్జి అంబరీష్ బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

నియోజకవర్గ కేంద్రాల్లో పశు ఔషధి కేంద్రాలు

చిత్తూరు(వ్యవసాయం): కేంద్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జాతీయ పశువ్యాధుల నియంత్రణ పథకం కింద జిల్లాలో పశు ఔషధి కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ ఉమామహేశ్వరి తెలిపారు. నాణ్యమైన జనరిక్ పశు ఔషధాలు చౌక ధరలకే రానున్నాయన్నారు. వీటిని ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాలు(పీఎం-కేఎస్‌కేలు) అంటారన్నారు. తొలుతగా నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటుకు దృష్టి సారించనున్నామన్నారు. విజయవంతమైతే మండల కేంద్రాలు, సహకార సంఘాల ద్వారా ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నామని ఆమె తెలిపారు.

క్రమశిక్షణ చర్యలు నిలిపివేత

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: సర్వే ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చెందిన గిరిపై క్రమశిక్షణా చర్యలను నిలిపివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వు జారీచేసింది. ఆయన జిల్లాలో సర్వే ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న సమయంలో.. ఆరోగ్య సమస్యలతో రీసర్వే లక్ష్యాలను అధిగమించలేకపోతున్నానని, రెగ్యులర్ విధులను సక్రమంగా నిర్వహించలేకపోతున్నావనే కారణాలు చూపి 27.4.2022 నుంచి 28.6.2022 మెడికల్ సెలవుపై వెళ్లారు. అప్పటి ప్రభుత్వం ఆయనపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలంటూ ఉత్తర్వు జారీచేసింది. అప్పట్లో దీనిపై విచారణ అధికారి దర్యాప్తు జరిపి.. ఛార్జెస్ నిరూపణ కాలేదని నివేదిక ఇచ్చారు. గతేడాది మార్చి 31న ఆయన ఉద్యోగ విరమణ చెందారు. విచారణ నివేదిక, ఛార్జెస్ నమోదైన అధికారి వివరణను పరిశీలించిన ప్రభుత్వం.. క్రమశిక్షణ చర్యలపై తదుపరి చర్యల్ని నిలిపివేస్తూ ఉత్తర్వు జారీ చేసింది.

8,189 మట్టి నమూనాల సేకరణ

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రకృతి సేద్యం సాగు పొలాల్లో వేగంగా మట్టి నమూనాల సేకరణ కొనసాగుతోంది. జిల్లా వ్యాప్తంగా 16,401 మట్టి నమూనాల సేకరణ లక్ష్యం కాగా ఇప్పటి వరకు 8,189 నమూనాలను సేకరించామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళి తెలిపారు. మార్చి 20లోపు సేకరణ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు.

ఇగ్నో ప్రవేశాలకు 28న ఆఖరు

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: శ్రీవెంకటేశ్వర ఆర్ట్ కళాశాలలోని ఇగ్నో అధ్యయన కేంద్రంలో పీజీ, డిగ్రీ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేంద్రం సమన్వయకర్త మల్లికార్జునరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఈనెల 28వ తేదీ వరకు గడువు ఉంది, దరఖాస్తుల కోసం వెబ్‌సైట్ www.ignou.ac.in ను సందర్శించాలని పేర్కొన్నారు.

అమరరాజ ఎనర్జీ & మొబిలిటీ లిమిటెడ్

(గతంలో అమరరాజ బ్యాటరీస్ లిమిటెడ్‌గా పిలువబడేది)

CIN: L31402AP1985PLC005305

నమోదిత కార్యాలయం: రేణిగుంట – కడప రోడ్, కరకంబాడి, తిరుపతి- 517520, ఆంధ్రప్రదేశ్

ఫోన్: 91 (877) 2265000, ఫ్యాక్స్: 91 (877) 2285600.

ఇమెయిల్ ఐడి: investorservices@amararaja.com వెబ్‌సైట్: www.amararajaeandm.com

AMARA RAJA Gotta be a better way

31 డిసెంబర్ 2025తో ముగిసిన త్రైమాసిక మరియు తొమ్మిది నెలల కాలానికి స్వతంత్ర మరియు ఏకీకృత ఫలితాల సంగ్రహ నివేదిక రూ.కోట్లలో

వివరాలు	స్వతంత్ర ఫలితాలు						ఏకీకృత ఫలితాలు					
	ముగిసిన త్రైమాసిక కాలం			ముగిసిన తొమ్మిది నెలల కాలం		ముగిసిన వార్షిక కాలం	ముగిసిన త్రైమాసిక కాలం			ముగిసిన తొమ్మిది నెలల కాలం		ముగిసిన వార్షిక కాలం
	31.12.2025	30.09.2025	31.12.2024	31.12.2025	31.12.2024	31.03.2025	31.12.2025	30.09.2025	31.12.2024	31.12.2025	31.12.2024	31.03.2025
	ఆడిట్ కానివి	ఆడిట్ కానివి	ఆడిట్ కానివి	ఆడిట్ కానివి	ఆడిట్ కానివి	ఆడిట్ అయినవి	ఆడిట్ కానివి	ఆడిట్ కానివి	ఆడిట్ కానివి	ఆడిట్ కానివి	ఆడిట్ కానివి	ఆడిట్ అయినవి
కార్యకలాపాల ద్వారా వచ్చిన మొత్తం ఆదాయం	3,350.84	3,388.18	3,164.02	10,088.94	9,431.04	12,404.89	3,410.15	3,467.02	3,272.47	10,278.25	9,786.25	12,846.32
సదరు వ్యవధికి నికర లాభం (పన్ను, అసాధారణ ఐటంలకు ముందు)	251.28	283.76	311.09	796.05	963.72	1,188.08	239.87	243.03	297.70	711.82	949.48	1,162.10
పన్నుకు ముందు వ్యవధికి నికర లాభం (అసాధారణ ఐటంల తర్వాత)	207.48	405.55	422.16	874.04	1,074.79	1,299.15	192.24	364.82	408.77	785.98	1,060.55	1,273.17
పన్ను మరియు అసాధారణ ఐటంల తర్వాత వ్యవధికి నికర లాభం	151.69	302.40	311.83	648.10	797.09	963.90	140.15	276.49	298.37	581.44	783.10	944.67
సదరు వ్యవధికి మొత్తము సమగ్ర ఆదాయం (పన్ను తర్వాత సమగ్ర లాభంతోపాటు మరియు పన్ను తర్వాత ఇతర సమగ్ర ఆదాయం)	151.48	305.14	180.00	649.99	741.37	799.97	139.95	279.10	166.64	583.21	727.08	780.75
చెల్లించిన ఈక్విటీ వాటామూలధనం (ముఖ విలువ రూ. 1/- ఒక్కింటికి)	18.30	18.30	18.30	18.30	18.30	18.30	18.30	18.30	18.30	18.30	18.30	18.30
గత సంవత్సరపు ఆడిట్ చేసిన ఆస్తి అప్పులపట్టీలో చూపిన విధంగా రిజర్వులు (రీవాల్యుయేషన్ రిజర్వు మినహా)	-	-	-	-	-	7,359.97	-	-	-	-	-	7,370.83
ప్రతి వాటాకు వచ్చిన ఆర్జనలు (రూ. 1/- ఒక్కింటికి) (సదరు కాలానికి - వార్షీకరించబడలేదు) - బేసిక్ /డైల్యూటెడ్ (రూ.)	8.29	16.52	17.04	35.41	43.55	52.66	7.66	15.11	16.30	31.77	42.79	51.62

గమనిక:1) SEBI (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్ 2015 యొక్క రెగ్యులేషన్- 33 ప్రకారం స్టాక్ ఎక్స్ఛేంజిలకు దాఖలు చేసిన స్వతంత్ర మరియు ఏకీకృత ఆర్థిక ఫలితాల సంగ్రహమే పైనపేర్కొన బడినది. త్రైమాసిక/తొమ్మిది నెలల కాల వ్యవధి యొక్క ఆర్థిక ఫలితాల మరియు వాటి నోట్స్ యొక్క పూర్తి నమూనా స్టాక్ ఎక్స్ఛేంజి వెబ్‌సైట్స్ (www.nseindia.com మరియు www.bseindia.com) నందు మరియు కంపెనీ వెబ్‌సైట్ అనగా www.amararajaeandm.com నందు లభ్యమగును.

2) కంపెనీ వాటాదారులు, ఎవరైతే తమ యొక్క ఇ-మెయిల్ చిరునామాను ఇంతవరకు నమోదు చేసుకోని/నవీకరించనివారు తమ యొక్క ఇ-మెయిల్ చిరునామాను వారి యొక్క డిపాజిటరీ పార్టిసిపెంట్స్‌తో నమోదు చేసుకోవలసినదిగా/నవీకరించవలసిందిగా లేదా వారి సమ్మతిని నమోదు/నవీకరణ నిమిత్తం తమయొక్క ఫోలియో సంఖ్య/DPID CL ID మరియు చెల్లుబాటు అయ్యే ఈమెయిల్ చిరునామాతో పాటుగా investor@cameoindia.com లేదా investorservices@amararaja.com కు పంపవలసిందిగా కోరడమైనది.

అమరరాజ ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ తరఫున
(గతంలో అమరరాజ బ్యాటరీస్ లిమిటెడ్‌గా పిలువబడేది)

సం/- జయదేవ్ గల్లా
DIN: 00143610
ఛైర్మెన్ & మేనేజింగ్ డైరెక్టర్ మరియు సిఇఒ

హైదరాబాద్
తేది: 11, ఫిబ్రవరి, 2026

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

శ్రీ విఘ్నేశ్వర్ స్వామి ఇంటీరియర్ డిజైనర్స్ కబోర్డ్స్, డబుల్‌కాట్ విండోస్ ద్వారాలు అల్యూమినియం వర్క్ మరియు అపార్ట్‌మెంట్ వర్క్ ప్లానింగ్ మిషన్‌తో పాటు వర్క్స్ చేయబడును. ✆ 95812 56014.

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై ఆంధ్రప్రదేశ్ అంతటా మార్టిగేజ్ లోన్స్ మరియు స్థిరాస్తి ఎక్కడ ఉన్నా ఏసంస్థలో ఉన్నా Xerox పేపర్స్‌పై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. 50లక్షలులోపు, అయోధ్య కోఆపరేటివ్ బ్యాంక్. ✆ 93969 99669.

HEALTH & CARE

PAEDIATRIC

శ్రీవిష్ణు చిన్నపిల్లల హాస్పిటల్: డా॥ కె.కీర్తన (M.D., Pediatrics, SVMC & Ex. Senior Resident RUIA, Fellow in Neonatology) పుట్టిన బిడ్డలు & చిన్నపిల్లల వైద్యనిపుణులు, 24X7 ఎమర్జెన్సీ కేసులు చూడబడును. మనోహరి హాస్పిటల్ ప్రక్కన, రెడ్డి & రెడ్డి కాలనీ, తిరుపతి ✆ 63035 53359.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

నేషనల్ హైవేలకు అనుకొని తిరుపతిలో ఫైనల్ అప్రూవ్డ్ ప్లాట్స్ అన్ని సదుపాయాలతో తక్కువధరకే,డైరెక్ట్ ఓనర్,స్పాట్ రిజిస్ట్రేషన్ ఫోన్ : 9966262221/9502774175

1.తిరుపతి - సి.రామాపురం జైన్‌మందిరం వద్ద 2.రేణిగుంట యోగానంద కాలేజీకి ప్రక్కన 3.చంద్రగిరిటౌన్‌లో ఉగ్రప్రత్యంగిరా అమ్మవారి గుడి దగ్గర 100 feet రోడ్డు అనుకొనిఉన్న వెంచర్స్‌లో తుడా అప్రూవల్స్‌తో హౌస్/విల్లా కట్టుకునే ప్లాట్లు అమ్మబడును. 9505502346.

JOBS

WANTED MALE Process Associates Qual: Degree/ Diploma with Typing Skills of 25 NWPM, Sal: 14K to 18K. Mob: 80967 30137.

Universal Educational Services Wanted Female Telecallers. Qualification: Any Degree, Tirupati ✆ 9676968115, 8179915301.

తిరుపతిలోని ప్రముఖ కంపెనీకి బిజినెస్‌పర్సన్స్, రిటైర్డ్ పర్సన్స్, వివాహితులు కావలెను. Age:30to65, Qua: Inter- PG పాన్‌కార్డు తప్పనిసరి ✆ 7675095860.

లక్ష్మీన్ డిజైనర్ ఎంపోరియం తిరుపతిలో బొటిక్‌లో అనుభవం కల్గిన లేడీ మరియు సేల్స్‌గర్ల్స్-2 కావలెను. ఆకర్షణీయమైన జీతం ✆ 9966129199.

బాతులను పెంచుటకు అనుభవం గల వర్కర్స్ & ఆంధ్ర టిఫిన్స్, Veg & Nonveg, స్నాక్స్ చేసే వంట మనిషి కావలెను. ✆ 9849311524, 8688262581.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

B/W 5 లైన్ల ప్రకటన రూ. 500/-
Colour 5 లైన్ల ప్రకటన రూ. 600/- మాత్రమే
తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు...
80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600
Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

చిత్తూరు

• చిత్తూరు • పూతలపట్టు • గంగాధరనెల్లూరు • నగరి

ఆలయ అధికారులకు చెక్కు అందిస్తున్న నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు

కాణిపాకం ఆలయానికి రూ.లక్ష విరాళం

కాణిపాకం, న్యూస్‌టుడే: స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో నిత్య అన్నదానం ట్రస్టుకు రూ.1,00,001 చెక్కును విరాళంగా ప్రకాశం జిల్లా మద్దిపాడుకు చెందిన సాతులూరి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు అందించారు. దాత కుటుంబ సభ్యులకు స్వామివారి దర్శనం చేయించి శేష వస్త్రాలు, స్వామివారి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ సూపరింటెండెంట్ శ్రీధర్‌బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి ఆర్థికసాయం

పాలసముద్రం: ప్రభుత్వం కల్పించే అవకాశాలతో విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని సర్పంచి భానుప్రియ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బలిజకండ్రిగ మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, కుమార్, రమేష్‌బాబు, నరేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వినతులు సత్వరం పరిష్కరించండి

పెనుమూరు, న్యూస్‌టుడే: ప్రజా ఫిర్యాదుల దినం సందర్భంగా ప్రజల నుంచి వచ్చే వినతులను సత్వరం పరిష్కరించాలని చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఆయన తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రజల వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపరాదని చెప్పారు. తహసీల్దారు శ్రావణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

యుగవర్ధన్

జాతీయ సదస్సుకు ఆహ్వానం

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సు దేశ సాంకేతిక అభివృద్ధిపై ఎటువంటి ప్రభావం చూపబోతుందన్న అంశంపై ఈ నెల 16 నుంచి 20 వరకు దిల్లీలో జరిగే జాతీయ సదస్సులో పాల్గొనేందుకు చిత్తూరుకు చెందిన యుగవర్ధన్‌కు ఆహ్వానం అందింది. ఈ సదస్సు ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో జరగనుంది. ఈ సదస్సుకు ఏపీ విద్యార్థి విభాగం నుంచి నగరంలోని అపోలో ఇంజినీరింగ్ కళాశాల తృతీయ సంవత్సరం సీఎస్‌ఈ విభాగం యుగవర్ధన్ ప్రాతినిధ్యం వహించడంపై ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అభినందించారు. సదస్సులో 200కు పైగా జాతీయ, అంతర్జాతీయ స్థాయి పరిశ్రమల సీఈవోలు, కేంద్ర మంత్రులు, సాంకేతిక పరిజ్ఞాన నిపుణులు పాల్గొననున్నారు.

అపురూప గాయకుడు ఘంటసాల

ఘంటసాల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: మధురగానంతో ప్రజా హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన అపురూప గాయకుడు ఘంటసాల అని చిత్తూరు ఘంటసాల అభిమానుల సంఘం అధ్యక్షుడు రవినాయుడు, జిల్లా సైనిక సంక్షేమ అధికారి రాఘవులు అన్నారు. ఘంటసాల వర్ధంతిని బుధవారం చిత్తూరులోని గాంధీ విగ్రహ కూడలి వద్ద నిర్వహించారు. కార్యక్రమంలో మురుగేష్, కిషోర్, శివశంకర్, మధుసూదన్, త్యాగరాజులు, సుందరమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గస్తీ.. నాస్తి

- చిత్తూరులో వరుస దొంగతనాలు
- నగరవాసుల భయాందోళన

కట్టమంచిలో చోరీ జరిగిన ఇల్లు

✦ చిత్తూరు నగరంలో గత వారం దుండగులు ఒకటో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో వరుసగా మూడు ఇళ్లల్లో చోరీకి పాల్పడ్డారు. బంగారు, వెండి ఆభరణాలను చోరీ చేశారు.

✦ నగరంలోని రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో ఇటీవల కర్ణాటకకు చెందిన వాహనంలో వచ్చిన ముగ్గురు దుండగులు ఇంటి తాళాలను పగులగొట్టి బంగారు, వెండి వస్తువులను అపహరించారు.

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: చిత్తూరు నగరంలో పోలీసుల గస్తీ కొరవడటంతో దొంగలు స్వైర విహారం చేస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా చోరీలకు పాల్పడుతూ.. అందినకాడికి దోచుకుని వెళుతున్నారు. ఈ నెలలో 11 రోజుల వ్యవధిలోనే ఐదు ఘటనలు చోటుచేసుకోవడం గమనార్హం. జిల్లాలో ఎక్కడ ముఖ్యులు వచ్చినా.. నగరంలోని పోలీసు సిబ్బంది బందోబస్తుకు వెళ్తుంటారు. ఆ సమయంలో పోలీసు స్టేషన్లలో సిబ్బంది కొరత ఉండడం సహజమే. ఆ ఒకట్రెండు రోజులు పగలు, రాత్రి వేళల్లో పోలీసుల గస్తీ అంతంత మాత్రంగానే ఉంటుంది. ఉన్న కొంత మందితోనే బీట్స్, గస్తీ విధులను నిర్వహిస్తుంటారు. ఆ సమయం కోసం ఎదురుచూస్తున్న దుండగులు ఎంచుకున్న ఇళ్లల్లో చోరీకి పాల్పడి జారుకుంటున్నారు.

నెల	చోరీలు	ఛేదించినవి
నవంబరు-2025	33	13
డిసెంబరు-2025	30	11
జనవరి-2026	32	10
ఫిబ్రవరి(10-02-26)	10	00

సరిహద్దులు దాటుతున్న వాహనాలు

నగరంలో ద్విచక్రవాహనాల చోరీలు కూడా అధికంగా చోటుచేసుకుంటున్నాయి. దుండగులు వాహనాలను చోరీ చేసి జిల్లా సరిహద్దులు దాటుతున్నారు. పోలీసుల తనిఖీలు ఉత్తుత్తిగా ఉండడంతో దొంగలు నిర్భయంగా చోరీ చేసి సొత్తుతో పాటు వెళుతున్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు పగలు, రాత్రి వేళల్లో గస్తీలను పెంచడమే కాకుండా.. నిరంతరం వాహనాల తనిఖీలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

అప్రమత్తంగా ఉన్నాం

చోరీలు జరగకుండా అప్రమత్తంగా ఉన్నాం. గస్తీ కూడా పెంచుతాం. ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించి.. ఊరు వెళ్లే సమయంలో స్థానిక పోలీసులకు సమాచారం ఇస్తే ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను అమర్చడమే కాకుండా.. స్థానికంగా బీట్స్‌ను ఏర్పాటు చేస్తాం. కుటుంబ సభ్యులు వారి ఇళ్ల వద్ద నైట్ విజన్ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే చోరీలకు అవకాశాలు కూడా ఉండవు. -సాయినాథ్, చిత్తూరు డీఎస్పీ

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 80085 74568
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 80085 74601

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: సమస్య: స్థానిక ప్రశాంత్ నగర్‌లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. -స్థానికులు
సమాధానం: వ్యర్థాలను తక్షణమే తొలగిస్తాం.
-లోకేష్, నగరపాలక ఆరోగ్యాధికారి

వీధుల్లో మురుగు తొలగింపు

స్పందనకు వందనం

పాలసముద్రం, న్యూస్‌టుడే: నరసింహాపురం పంచాయతీ టీవీఎన్‌ఆర్‌పురం ఆదిఆంధ్రవాడ గ్రామంలోని మురుగునీటి కాలువలో అధ్వానంగా నిలిచిపోయిన మురుగునీటిపై మేమున్నాం..మీకుతోడుగా శీర్షికన సమస్య ప్రచురితమైంది. స్పందించిన ఎంపీడీవో సతీష్ సిబ్బంది సహాయంతో తొలగింపజేశారు.

✦ **వీధి దీపాల ఏర్పాటు:** సింహరాజపురం పంచాయతీ మఠవలం పరిసర ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శి రాజు వీధి దీపాలు ఏర్పాటు చేయించారు.

ఏపీటీఎఫ్ నగర అధ్యక్షుడిగా ఎన్నిక

కృష్ణమూర్తి

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: ఏపీటీఎఫ్ నగర అధ్యక్షుడిగా కృష్ణమూర్తి ఎన్నికయ్యారని ఆ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు జగదీష్ తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా షఫీఉన్నిసా, గౌరవాధ్యక్షుడిగా చిరంజీవి, ఆర్థిక కార్యదర్శిగా రాజశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని చెప్పారు.

నియామకం

సురేష్

పుత్తూరు, న్యూస్‌టుడే: భారత చైతన్య యువజన పార్టీ నియోజకవర్గ యూత్ కన్వీనర్‌గా రాయందుల సురేష్‌ను పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ ఆదేశాల మేరకు నియమించినట్లు పార్టీ కార్యాలయం నుంచి బుధవారం ప్రకటన విడుదలైంది. రాష్ట్ర వ్యాప్తంగా పదవులు ప్రకటించామని, అందులో సురేష్ పార్టీ కోసం చేస్తున్న కార్యక్రమాలను గుర్తించి యూత్ కన్వీనర్‌గా ప్రకటించామని అందులో పేర్కొన్నారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు.. చిత్తూరు (మిట్టూరు): నగరంలోని పలమనేరు రహదారిలో రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో గురువారం రామనగర్‌కాలనీ, దర్గా సర్కిల్, న్యూట్రిన్ ఫ్యాక్టరీ పరిసర ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఈఈ మునిచంద్ర, గిరింపేట ఏఈ వివేకానందరెడ్డి తెలిపారు.

దెబ్బతిన్న రెయిలింగ్.. పొంచి ఉన్న ముప్పు

చిత్తూరు-పలమనేరు జాతీయ రహదారి మొగిలి ఘాట్‌రోడ్డులో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఘాట్ రోడ్డు దిగే సమయంలో వాహనాలు అదుపు తప్పి పక్కకు వెళితే రహదారి అంచున ఉన్న కొండ, గుట్టలను ఢీకొంటే పెనుప్రమాదమని సుమారు 2 కి.మీ పైగా రైయిలింగ్ ఏర్పాటు చేశారు. వాహనాలు అదుపు తప్పి పలుచోట్ల రెయిలింగ్‌ను ఢీకొనడంతో దెబ్బతింది. నెలలు గడిచినా అధికారులు పట్టించుకోలేదు. ఈ విషయమై సీఐ శ్రీనివాసులను సంప్రదించగా పాడైన రెయిలింగ్ సరిచేయాలని, జాతీయ రహదారుల సంస్థ నిర్వహణ అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని తెలిపారు. -న్యూస్‌టుడే, బంగారుపాళ్యం

సస్యరక్షణతోనే మామిడి దిగుబడి

సదస్సులో ప్రసంగిస్తున్న శాస్త్రవేత్త సుధాకర్

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: సస్యరక్షణతోనే మామిడి పంట దిగుబడి సాధ్యమవుతుందని శాస్త్రవేత్త సుధాకర్ తెలిపారు. స్థానిక మార్కెట్‌యార్డులో బుధవారం రాస్ కోకోకోలా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో మామిడి రైతులకు పంట సాగుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సదస్సు నిర్వహించారు. శాస్త్రవేత్త అనిల్‌కుమార్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ భాస్కర్‌నాయుడు, తెదేపా మండల కార్యదర్శి జనార్దన్, చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ మాజీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, మండల ఉద్యానవన శాఖ అధికారిణి సాగరిక, మండల వ్యవసాయాధికారిణి భారతి పాల్గొన్నారు.

శేషాచలంను సన్మానిస్తున్న తెదేపా నాయకులు

ఏజీపీ శేషాచలంకు సన్మానం

పుత్తూరు, న్యూస్‌టుడే: పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టుకు ఏజీపీగా నియమితులైన డి.శేషాచలంను పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య బుధవారం సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చొరవతో, శేషాచలం సేవలను గుర్తించి ఏజీపీగా నియమించినట్లు తెలిపారు. తెదేపా మండల అధ్యక్షుడు బాలాజీ, కార్యదర్శి హేమంత్, తడుకు సర్పంచి వెంకటేష్, తెదేపా నాయకులు అమరనాథ్, గజపతి, కవిత తదితరులు పాల్గొన్నారు.

నగరంలో పగలే వెలుగు

చిత్తూరు నగరంలోని కట్టమంచి చెరువు చుట్టూ ఉన్న విద్యుత్ దీపాలు పగలే ధగధగలాడుతున్నాయి.

పాదచారుల కోసం ప్రత్యేకంగా వేసిన వీధి దీపాలను పగలే వెలిగిస్తుండటంతో నగర పాలికకూ విద్యుత్ బిల్లుల మోత మోగనుంది. - ఈనాడు, చిత్తూరు

ట్యాంకు కూలితే ప్రమాదం తప్పదు

కీళ్లపట్టు ప్రభుత్వ పాఠశాల ఆవరణలో తాగునీటి సరఫరా ట్యాంకు నిరుపయోగంగా శిథిలావస్థకు చేరింది. 5 సంవత్సరాలుగా ఈ ట్యాంకుని వినియోగించడం లేదు. పాఠశాల ఆవరణలో ఉన్న ఈ ట్యాంకును తొలగించాలని స్థానిక ప్రజలు పలుమార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించినా ఫలితం లేదు. పొరబాటున ఈ ట్యాంకు కూలితే విద్యార్థులకు ప్రమాదం వాటిల్లే పరిస్థితి ఉంది. - న్యూస్‌టుడే, నగరి

సీసీ రోడ్డు నిర్మించరూ!

పుత్తూరు పట్టణంలోని కార్వేటినగరం రోడ్డులో ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని ఈశ్వరాలయం కోనేరు స్థలానికి ఆనుకుని ఎన్నికలకు ముందు మట్టి రోడ్డు నిర్మించారు. ఇటీవల వర్షాలకు రోడ్డు దెబ్బతింది. దీంతో నిత్యం రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రోడ్డును సీసీ రోడ్డుగా వేసి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. ఆ దిశగా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. -న్యూస్‌టుడే, పుత్తూరు

శుద్ధజలం అందేదెన్నడో?

శుద్ధజలం కోసం మండలంలోని చుక్కావారిపల్లె గ్రామస్థులు ఏడాదిగా ఎదురు చూస్తున్నారు. 8 ఏళ్ల క్రితం రూ.12 లక్షలతో గదిని నిర్మించి అందులో యంత్రాలను అమర్చారు. మొదట్లో బాగా పనిచేసినా నిర్వహణ లోపం వల్ల ఏడాదిగా పనిచేయడం లేదు. దీంతో స్థానికులు సమీప గ్రామానికి వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారు. చిన్నపాటి మరమ్మతులు చేస్తే కేంద్రం పనిచేస్తుందని, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, గుడిపాల

కల్వర్టు కోసం తవ్వారు.. వదిలేశారు

పుత్తూరు మండలం కేబీఆర్‌పురం పంచాయతీలోని దేవసేనాపురం వెళ్లే రోడ్డులో కల్వర్టు కోసం 10 రోజుల క్రితం తవ్వేశారు. ఈ పనులను జడ్పీ నిధులతో చేపడుతున్నారు. ఆలస్యం చేస్తుండడంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కల్వర్టు కోసం ఓ వీధి వద్ద గుంత తీయడంతో మురుగంతా నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు పెరిగి వాసులు వాపోతున్నారు. ఇబ్బందిగా ఉందని అక్కడి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నారు. -న్యూస్‌టుడే, పుత్తూరు

పేరుకే 24 గంటలు

సాయంత్రమైతే సీహెచ్‌సీలో వైద్యులు ఉండరు

పెనుమూరు, న్యూస్‌టుడే: పెనుమూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో సాయంత్రం అయితే వైద్య సేవలు అందుబాటులో ఉండవు. 24 గంటల ఆసుపత్రి అయినా సాయంత్రమైతే వైద్యులు అందుబాటులో ఉండడం లేదు. దీంతో అత్యవసర సమయాల్లో రోగులకు అవస్థలు తప్పడంలేదు. ఆ సమయంలో నర్సులు, సిబ్బంది ప్రథమ చికిత్స అందించడం తప్ప మెరుగైన సేవలు దూరం అవుతున్నాయి.

✦ పెనుమూరు-నేంద్రగుంట మార్గంలో గుట్టకిందపల్లె సమీపంలో బుధవారం సాయంత్రం ఓ ద్విచక్ర వాహనదారుడు వేగంగా వచ్చి గొబ్బిళ్లమిట్టకు చెందిన పవన్‌ను ఢీకొని మరో రెండు ద్విచక్ర వాహనదారులను ఢీకొన్నాడు. గాయపడిన పవన్‌ను స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు లేకపోవడంతో సిబ్బంది ప్రథమ చికిత్స అందించారు. తనకు చాలా నొప్పిగా ఉందని బాధితుడు చెప్పగా ప్రస్తుతం డాక్టర్ అందుబాటులో లేరని రేపు(గురువారం) వస్తే పరీక్షిస్తారని చెప్పినట్లు తెలిసింది. ఆసుపత్రిలో 24 గంటలు అందుబాటులో ఉండాల్సిన వైద్యులు లేకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉందాం

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: మత్తు పదార్థాలకు నో చెప్పండి.. ఆరోగ్యకర జీవితానికి ఎస్ చెబుదామని ట్రాఫిక్ సీఐ నిత్యబాబు తెలిపారు. నగరంలోని వరదప్పనాయుడు నగరపాలకోన్నత పాఠశాలలో బుధవారం సోషియల్ మీడియా ప్రభావం, మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టం, చట్టాలపై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ లింకులు, ఓటీపీ మోసాలు, సోషియల్ మీడియా అకౌంట్ హ్యాకింగ్ తదితర వాటిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భాజపా నాయకులు

దీన్‌దయాళ్ త్యాగం చిరస్మరణీయం

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: ఏకాత్మ మానవతావాదాన్ని ప్రవచించిన పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ త్యాగం చిరస్మరణీయమని భాజపా జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు అన్నారు. చిత్తూరులోని భాజపా జిల్లా కార్యాలయంలో బుధవారం బలిదాన దివస్-సంస్మరణ దివస్‌ను నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, శ్రీనివాసులు, చిట్టిబాబు, రవి, కవిత, షణ్ముగం, రెడ్డిమస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో వరుస చోరీలు

గుడిపాల, న్యూస్‌టుడే: మండలంలోని గ్రామ సచివాలయాల్లో వరుస చోరీలు జరుగుతున్నాయి. ఇటీవల పేయనపల్లె, కుప్పిగానిపల్లె గ్రామ సచివాలయాల్లో ప్రింటర్లు, ల్యాబ్‌టాప్‌లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. మంగళవారం రాత్రి వసంతాపురం సచివాలయ భవనం తాళాలు పగులగొట్టి అందులో ప్రింటర్‌ను మాత్రమే తీసుకెళ్లారు. మిగిలిన వస్తువులను ముట్టుకోకపోవడంతో ఎవరో కావాలనే వరుసగా దొంగతనాలకు పాల్పడుతున్నారని అనుమానం వ్యక్తమౌతోంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు.

మరమగ్గ కార్మికులకు గుర్తింపు కార్డులివ్వాలి

నగరి, న్యూస్‌టుడే: మరమగ్గ కార్మికులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని సీఐటీయూ కార్యదర్శి పెరుమాల్ డిమాండ్ చేశారు. మరమగ్గ, చేనేత కార్మికులకు గుర్తింపుకార్డులు ఇస్తే, వారి పిల్లలకు విద్యారంగంలో ఫీజు రాయితీ వర్తించే అవకాశం ఉందన్నారు. తిరుపతిలో చేనేత టెక్స్‌టైల్ శాఖ కార్యాలయంలో అడిషనల్ డైరెక్టర్‌కి బుధవారం వినతి పత్రం అందించినట్లు తెలిపారు.

కుష్ఠు రహిత సమాజమే లక్ష్యం

నింద్ర, న్యూస్‌టుడే: కుష్ఠు రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని అడిషనల్ డీఎమ్‌హెచ్‌వో వెంకటప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని కుష్ఠు బాధితులకు పీహెచ్‌సీ ఆవరణలో దుస్తులు, పాదరక్షలు, క్లీనింగ్ కిట్లు పంపిణీ చేశారు. వైద్యాధికారులు సుమలత, వినీషా, డీపీఎమ్‌వో కానిక్‌రాజ్, హెచ్‌ఈవో గోపి, సీహెచ్‌వో శ్రీదేవి పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలో గ్రంథాలయం ప్రారంభం

కాణిపాకం, న్యూస్‌టుడే: కాణిపాకం ప్రాథమిక పాఠశాలలో ఎస్సై నరసింహ యాదవ్ బుధవారం మినీ గ్రంథాలయాన్ని ప్రారంభించారు. హైదరాబాదుకు చెందిన బ్లూమ్ విత్ బుక్స్ లైబ్రరీ రీడ్ అండ్ హెల్ప్ ట్రస్టు ఆధ్వర్యంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. ఎంఈవో-2 భానుప్రకాష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహన్ పాల్గొన్నారు.

నాయకులు సమష్టిగా పనిచేయాలి

శ్రీరంగరాజపురం, న్యూస్‌టుడే: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో, ఆ తరువాత వచ్చే సార్వత్రిక ఎన్నికల్లోనూ నాయకులు సమష్టిగా పనిచేసి విజయం సాధించాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా వైకాపా అధ్యక్షుడు కరుణాకరరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధి కొత్తపల్లిమిట్ట దీపికా కల్యాణ మండపంలో నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను క్షేత్రస్థాయిలో ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మి, మాజీ ఎంపీ రెడ్డప్ప, చిత్తూరు పార్లమెంటు పరిశీలకుడు రాజశేఖర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కరుణాకర్‌రెడ్డి, చిత్రంలో కృపాలక్ష్మి, నాయకులు

గురుకులం పిలుస్తోంది

5వ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు ఆహ్వానం

పుత్తూరు, న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాలు పేద విద్యార్థుల పాలిట ఆశా కిరణాలుగా నిలుస్తున్నాయి. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉన్నత ప్రమాణాలతో బోధన అందిస్తున్నారు. ఉచితంగా పుస్తకాలు, ఏకరూప దుస్తులు, వసతి, పౌష్టికాహారం తదితర సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోంది. మెరుగైన విద్యతో పాటు పూర్తిస్థాయిలో వసతులు ఉండడంతో ఏటా వీటిలో ప్రవేశాలకు పోటీ నెలకొంటోంది.

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

పుత్తూరు మండలంలోని గోపాలకృష్ణాపురంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో 5వ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు తాజాగా దరఖాస్తులు కోరుతున్నారు. అర్హులైన విద్యార్థులు(బాలికలు మాత్రమే) ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి. రూ.100 రుసుంగా చెల్లించాలి. ఆధార్, పాస్‌పోర్టు సైజు ఫొటో, విద్యార్థుధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డుకు అనుసంధానమైన ఫోన్ నంబరుతో వెబ్‌సైట్ ద్వారా ఈనెల 19లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ శైలజ పేర్కొన్నారు.

ఇవే అర్హతలు..

✦ 5వ తరగతిలో ప్రవేశాలకు విద్యార్థులకు 11 ఏళ్లలోపు వయసు ఉండాలి. ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో 4వ తరగతి పూర్తి చేసి ఉండాలి. ✦ ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు విద్యార్థి వయసు 17 సంవత్సరాలు మించకూడదు. 2025-26 విద్యా సంవత్సరంలో 10వ తరగతి ఉత్తీర్ణత సాధించాలి. తల్లిదండ్రులకు వార్షికాదాయం రూ.2.50 లక్షలకు మించకూడదు.

నూతనంగా నిర్మించిన స్వామివారి ఆలయం

నాటి వైభవం.. నేడు ఏదీ?

కలిగిరి శ్రీనివాసునికి కరవైన ప్రత్యేక ఉత్సవాలు

పెనుమూరు: కలిగిరి కొండ అంటే జిల్లాలో ప్రాధాన్యత ఉంది. ఇక్కడ స్వామివారు సాలిగ్రామం రూపంలో వెలిశారని ప్రతీతి. ప్రజలను పట్టి పీడిస్తున్న కలిపురుషున్ని సైతం ఈ కొండపైనే అతని తలపై బండరాయి ఉంచి తన ఎడమ కాలితో పాతాళానికి తొక్కాడని స్థల పురాణం ద్వారా తెలుస్తోంది. ఇక్కడి ఆలయంలో స్వామివారు శ్రీదేవి, భూదేవి సమేతుడై భక్తులకు దర్శనం ఇస్తారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన కొండపై ఉన్న స్వామివారికి ప్రస్తుతం ప్రత్యేక పూజలు కరవయ్యాయి.

గతంలో తిరుమల తరహాలో పూజలు

గతంలో ఈ ఆలయం దేవాదాయశాఖ ఆధీనంలో ఉండేది. ఆ సమయంలో ఏటా స్వామివారికి విశేష పూజలు జరిగేవి. తిరుమల శ్రీవారికి ఏయే ఉత్సవాలు జరుగుతాయో అవన్నీ కలిగిరి వేంకటేశ్వరునికి నిర్వహించేవారు. బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి, రథ సప్తమి వంటి అన్ని ఉత్సవాలు జరిగేవి. ఇందుకోసం చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వారు ఉభయదారులుగా వ్యవహరించి విశేషంగా పూజలు, ఉత్సవాలు చేసేవారు. భక్తులు కూడా ఎక్కువగా వచ్చి స్వామివారి సేవలో పాల్గొనేవారు.

తితిదే ఆధ్వర్యంలో బంద్

రాష్ట్రంలో వైకాపా అధికారంలోకి వచ్చిన తరువాత ఆలయాన్ని తితిదే ఆధీనంలోకి తీసుకువచ్చి పాత ఆలయాన్ని తొలగించి నూతన ఆలయాన్ని నిర్మించారు. గత ఏడాది మే నెలలో కుంభాభిషేకం నిర్వహించారు. తితిదే ఆధీనంలో చేరాక ఉభయదారుల వ్యవస్థను తొలగించి తితిదేనే పూజలు, ఉత్సవాలు నిర్వహించేలా నిర్ణయించారు. అనంతరం జరిగిన బ్రహ్మోత్సవాలను మాత్రం తితిదే నిర్వహించింది. ఆ తరువాత వైకుంఠ ఏకాదశి, రథసప్తమి వేడుకలను తితిదే విస్మరించింది. దీంతో భక్తుల్లో నిరాశ వ్యక్తం అవుతోంది. పూజలు చేసేందుకు తమకు కల్పిస్తే చేసుకుంటామని, ఇందుకు అయ్యే భారాన్ని భరిస్తామనే భావన వారిలో ఉంది. ఇకపై తితిదే అన్ని ఉత్సవాలను నిర్వహించాలని లేకుంటే తమకు అవకాశం కల్పిస్తే చేసుకుంటామని గత ఉభయదారులు అంటున్నారు. మరి తితిదే ఏ విధంగా వ్యవహరిస్తుందో వేచి చూడాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ముడిపల్లికి రహదారి నిర్మాణం

నగరి, న్యూస్‌టుడే: నగరి మండలం ముడిపల్లి మార్గంలో రోడ్డు గుంతలమయంగా ఉండేది. విషయాన్ని గ్రామస్థులు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన చొరవ చూపి ఈ మార్గంలో నూతన తారురోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. పనులు పూర్తి కావడంతో ప్రస్తుతం ముడిపల్లి మార్గంలో చక్కటి రోడ్డు ఏర్పడింది.

విద్యార్థినికి ధ్రువపత్రం అందిస్తున్న ప్రిన్సిపల్ వేణుగోపాల్, అధ్యాపకులు

అవగాహనతో చదివితే ఉద్యోగం, ఉపాధి సాధ్యం

నగరి, న్యూస్‌టుడే: ముందస్తు అవగాహనతో చదివితే ఉద్యోగాలు, ఉపాధి కల్పన సాధ్యమని నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. వేణుగోపాల్ పేర్కొన్నారు. కళాశాలలో ఉద్యోగ సోపాన యాత్ర అనే అంశంపై ప్రత్యేక కౌన్సిలింగ్ తరగతులు బుధవారం నిర్వహించారు. శిబిరంలో వే ఫౌండేషన్ ప్రతినిధి అంకయ్య, వ్యక్తి వికాసం స్పీకర్ రత్నశేఖర్, వైస్ ప్రిన్సిపల్ డా.భాస్కరరాజు, అధ్యాపకులు రామాంజులు, స్వాతి, గుణశేఖర్, అరుణకుమారి, రేవతి, విద్యార్థులు పాల్గొన్నారు.

(c) eenadu

పలమనేరు

•పలమనేరు • కుప్పం

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

రామకుప్పం, న్యూస్‌టుడే: రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని తెదేపా మండల అధ్యక్షుడు వెంకటరమణ, మాజీ అధ్యక్షుడు ఆనందరెడ్డి అన్నారు. బుధవారం వ్యవసాయ కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి అమృత ఆధ్వర్యంలో 300 రాయితీ టార్పాలిన్ పట్టలు పంపిణీ చేశారు. పంటలు చేతికందే సమయంలో వర్షాలతో కష్టాలు ఎదురవుతున్నాయని వాటిని గుర్తించి కూటమి ప్రభుత్వం రాయితీ పట్టలు పంపిణీ చేశారు. రైతులు వ్యవసాయ కార్యాలయంలోని సిబ్బందిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ శాఖ డైరెక్టర్ మునస్వామి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పట్టనారాయణ, ఎస్సీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహులు, సింగిల్ విండో వైస్ ప్రెసిడెంట్ మహ్మద్ రఫీ, ప్రధాన కార్యదర్శి రామరాజనాయక్, రెస్కో డైరెక్టర్ మనోహర్, క్లస్టర్, మాజీ ఏఎంసీ వైస్ ఛైర్మన్ సీతాపతి తదితరులు పాల్గొన్నారు.

గది చిన్నది.. సమస్యలు పెద్దవి

పలమనేరు, న్యూస్‌టుడే: ఓ చిన్నపాటి గదిలో చిన్నారులు.. కూర్చోవాలి, తినాలి, ఆడుకోవాలి. దీంతో చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ గదిలోనే సతమతం అవుతున్నారు. ఇది మున్సిపల్ పరిధిలోని నీళ్ల కుంటలో అంగన్‌వాడీ కేంద్రం పరిస్థితి. దాదాపు 20 మంది పిల్లలు ఇందులోనే కూర్చోవాలి. పాఠశాలల విలీనం కోసం ఆ పక్కనే రెండు ప్రభుత్వ పాఠశాల భవనాలు విద్యార్థులు లేక ఖాళీ అయ్యింది. దాదాపు నాలుగేళ్లుగా అవి నిరుపయోగంగా ఉన్నాయి. ఆ రెండు విశాలమైన భవనాలను ఇవ్వడానికి అధికారులు చొరవ చూపాలి. అధికారులు అనుమతి ఇస్తే భవనాలను అంగన్‌వాడీ కేంద్రానికి కేటాయించవచ్చని ఎంఈవో తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

పలమనేరు, న్యూస్‌టుడే: ? పట్టణంలోని పట్టువీధిలో పారిశుద్ధ్య పనులు అధ్వానంగా ఉన్నాయి. వీధిలో మురుగు తొలగించకపోవడంతో దుర్వాసన వస్తోంది. దోమల బెడద అధికంగా ఉంది. **- రాము, స్థానికుడు**

సమాధానం: సిబ్బందిని పంపి పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. **- ఎన్నీరమణారెడ్డి, మున్సిపల్ కమిషనర్, పలమనేరు**

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: ? ఇటీవల కుప్పం ప్రాంతంలో కొందరు ఆకతాయిలు బుల్లెట్ వాహనాలపై భారీ శబ్దాలు చేస్తూ, ప్రజలను భయపెడుతున్నారు. **- వెంకటేష్, కుప్పం**

సమాధానం: ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. **- పార్థసారథి, డీఎస్పీ, కుప్పం**

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: ? పుంగనూరు ప్రధాన రహదారి నుంచి కామినాయునిపల్లె గ్రామానికి వెళ్లే రోడ్డులో గుంతలు ఏర్పడ్డాయి. ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి. **- స్థానికులు, కామినాయునిపల్లె**

సమాధానం: రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. **- విద్యాసాగర్, పంచాయతీరాజ్ ఏఈ, బైరెడ్డిపల్లె**

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని రెక్కమాను సర్కిల్ వద్ద మున్సిపల్ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కాలువల్లో పేరుకుపోయిన మురుగును తొలగించి పారిగుం చేశారు. సర్కిల్ వద్ద పారిశుద్ధ్య పనులు అధ్వానంగా ఉన్నాయని 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికలో ఈనాడులో బుధవారం ప్రచురించిన సమస్యకు అధికారులు స్పందించారు.

అతిథి గృహాలు.. మరిచిన ఆతిథ్యం

శిథిలావస్థకు చేరుతున్న భవనాలు

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణానికి వచ్చే ప్రముఖులకు, ప్రభుత్వ అతిథులకు విశ్రాంతి తీసుకోవడానికి భవనాలు లేవు. ఉన్నవి రెండు కూడా నిరుపయోగంగానే దర్శనమిస్తున్నాయి. అటవీశాఖ, ఆర్‌అండ్‌బీ అతిథి భవనాలు ఒకప్పుడు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఉపయోగంలో ఉండేవి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ప్రజా ప్రతినిధులకు, అధికారులకు కూడా ఈ భవనాలు ఎంతో అనుకూలంగా ఉపయోగపడేవి. సమీపంలోని కర్ణాటక రాష్ట్ర ముఖ్యమంత్రులు, ప్రధాన న్యాయమూర్తులు సేద తీరేవారు. పోలీసు శాఖ అధికారులు ఇక్కడే విశ్రాంతి తీసుకునేవారు. అలాంటిది నేడు విశ్రాంతికి నోచుకోవడం లేదు. అధికారులు ఎవరూ వచ్చిన ప్రైవేటు హోటళ్లలో బస చేయాల్సిన పరిస్థితి. ఇక ప్రభుత్వ అతిథి భవనాల కోసం వి.కోట, కుప్పం, లేదంటే పుంగనూరు వెళ్లాలి. అటు నుంచి వచ్చే వారు చిత్తూరు, తిరుపతిలో సేదతీరే పరిస్థితి ఏర్పడుతుంది.

మరమ్మతులకు నోచుకోక

పట్టణంలో మొత్తం 3 ప్రభుత్వ అతిథి భవనాలు ఉండేవి. జడ్పీ అతిథి భవనంతో పాటు ఆర్ అండ్‌బీ, అటవీశాఖ విభాగాలకు చెందినవి. అయితే ఇవన్నీ కూడా పురాతనమైనవి కావడంతో ఉపయోగపడటం లేదు. ఇక జడ్పీ భవనం అయితే పట్టణంలో ఉన్నందున పడగొట్టి దుకాణ సముదాయాన్ని నిర్మించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పాత అతిథి భవనాన్ని పూర్తిగా పట్టించుకోవడం మరిచారు. ఇక అటవీశాఖ భవనం అయితే మరమ్మతులు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. ఆర్ అండ్‌బీ అతిథి భవనాన్ని ఏడాదిగా మూతపెట్టేశారు. మరమ్మతులకు టెండర్లు పిలిచినా ఎవరూ రావడం లేదు. దాంతో భవనం శిథిలావస్థకు చేరుకుంటోంది.

నిరుపయోగంగా ఉన్న ఆర్‌అండ్‌బీ భవనం

ప్రతిపాదనలు పంపాం..

పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి భవనానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. మరమ్మతులు చేయడానికి టెండర్లు పిలుస్తున్నాం.

- ధనలక్ష్మి, డీఈ, ఆర్‌అండ్‌బీ, పలమనేరు

మండలస్థాయి ఆస్తుల పరిరక్షణ కమిటీ ఏర్పాటు

పెద్దపంజాణి, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు మండలస్థాయి ఆస్తుల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో బాలాజీ, డిప్యూటీ ఎంపీడీవో శారదాదేవి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కమిటీని ఎంపిక చేశారు. మండలస్థాయి కమిటీలో ఎంపీడీవో కన్వీనర్‌గా.. డిప్యూటీ ఎంపీడీవో, తహసీల్దార్, ఎస్సై, మండల సర్వేయర్, ఏపీవోలు సభ్యులుగా ఉంటారన్నారు. అలాగే గ్రామ పంచాయతీ స్థాయిలో పంచాయతీ కార్యదర్శి కన్వీనర్‌గా.. సచివాలయ సర్వేయర్, వీఆర్వో, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సభ్యులుగా నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ రమేష్‌బాబు, ఎస్సై మారెప్ప, ఎంపీవో తదితరులు పాల్గొన్నారు.

దీన్‌దయాళ్‌కు నివాళులు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: దేశానికి అంకితభావంతో సేవలందించిన మహానుభావుడు, అంత్యోదయ సిద్ధాంతంతో సమాజంలోని చివరి వ్యక్తి అభ్యున్నతికి కృషి చేసిన మహోన్నత నాయకుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అని భాజపా ఇన్‌ఛార్జి తులసినాథ్ అన్నారు. దీన్‌దయాళ్ వర్ధంతి సందర్భంగా బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఇంద్ర కుమార్, అంజి, కుమార్, జగదీష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌కు డ్రోన్ వితరణ

వి.కోట, న్యూస్‌టుడే: స్థానిక పోలీసు స్టేషన్‌కు సమాయా ట్రస్ట్ సంస్థ అధినేత ఉదయ్‌సాగర్‌రెడ్డి రూ.లక్ష విలువ చేసే డ్రోన్ కెమెరా వితరణగా అందజేశారు. పోలీసులు వెళ్లడానికి వీలుకాని చోట్లకు వెళ్లడానికి, నేరస్థులపై నిఘా ఉంచడానికి ఈ కెమెరాను ఉపయోగించుకున్నట్లు సీఐ సోమశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై అంజద్ బాష, షేక్ షావలీ, ఏఎస్సై జైలక్ష్మి సిబ్బంది ఉన్నారు.

వైభవంగా శ్రీసల్లాపురమ్మ జాతర

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తయిండ్లు గ్రామంలో బుధవారం శ్రీసల్లాపురమ్మ జాతర వైభవంగా జరిగింది. గ్రామ పొలిమేరల్లో మంగళవారం రాత్రి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని సుగంధ పరిమళ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి కానుకలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తెదేపా మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడ, పీఏసీఎస్ ఛైర్మన్ నాగరాజునాయుడు, ఎంపీపీ రెడ్డెప్ప, వైకాపా రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి అమ్మవారి పూజలో పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో శ్రీసల్లాపురమ్మ ఉత్సవ విగ్రహం

వీరాంజనేయుడికి పల్లకీ సేవ

వి.కోట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీ వీరాంజనేయస్వామి వారి పుష్పపల్లకీ సేవ కార్యక్రమాన్ని నిర్వాహకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారి మూల విరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి భక్తుల దర్శనార్థం ఉంచారు. రాత్రికి స్వామివారి ఉత్సవ మూర్తిని అలంకరించిన పూల పల్లకిలో ఊరేగించారు. దారిపొడువునా భక్తులు పూలు, పండ్లు సమర్పించి మొక్కులు తీర్చుకొన్నారు. కూచిపుడి, ఆర్కెస్ట్రా, బాణాసంచా వేడుక ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకొన్నాయి. ఎమ్మెల్యే సతీమణి రేణుకారెడ్డి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి మొక్కులు తీర్చుకొన్నారు.

ఆర్‌అండ్‌బీ రోడ్లకు మహర్దశ

పలమనేరు, న్యూస్‌టుడే: నియోజకవర్గ పరిధిలోని ఆర్‌అండ్‌బీ రోడ్ల పనులకు మహర్దశ పట్టనుంది. గత ప్రభుత్వం రోడ్ల మరమ్మతుల గురించి పట్టించుకోలేదు. రోడ్లన్నీ అధ్వానంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అంతకుముందు తెదేపా ప్రభుత్వం రోడ్లను అభివృద్ధి చేయడానికి మొత్తం 13 రోడ్లపై కంకర చల్లి పనులను ప్రారంభించింది. అయితే అప్పట్లో ఎన్నికల్లో ప్రభుత్వం మారడం వైకాపా అధికారంలోకి రావడంతో రోడ్ల పనులన్నీ ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్లుగా పనులు నిలిచిపోయాయి. ఇన్ని రోజులు కంకర మీద అవస్థలు పడ్డారు. నేడు కూటమి ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసింది. ఈ నిధులతో రోడ్లను అభివృద్ధి చేస్తామని పలమనేరు ఆర్‌అండ్‌బీ డీఈ ధనలక్ష్మి తెలిపారు.

కొలమాసనపల్లె రోడ్డు

వివరాలు ఇలా..

పలమనేరు- గుడియాత్తం రూ.1.80 కోట్లు, పుంగనూరు- శంకర్రాయలపేట రూ.3.35 కోట్లు, కొలమాసనపల్లె- నెల్లిపట్ల 3.9 కోట్లు, అప్పినపల్లె- పలమనేరులోని గంగాజుపల్లె రూ.4 కోట్లు, కుప్పం ఆర్‌అండ్‌బీ రోడ్డుకు రూ.4.4 కోట్ల నిధులు మంజూరయ్యాయి.

మురుగుతో బేజారు

మండలంలోని లింగాపురం పంచాయతీ మట్టిగానిపల్లె గ్రామంలోని ప్రధాన వీధి తులసమ్మగుడి-పెద్దారికుంట మార్గం మురుగునీటి పేరుకుపోయింది. దీంతో గ్రామస్థులే కాకుండా ఈ మార్గంలో వెళ్లే వారు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన వీధికి ఇరువైపులా మురుగునీటి కాలువలు నిర్మించి ఇబ్బందులను తొలగించాలని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి మురుగునీటి కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, పెద్దపంజాణి**

ఈ భవనానికి మోక్షం కలిగేనా...!

పెద్దారికుంట గ్రామంలో గ్రామ పంచాయతీ భవనం 2017-18లో తెదేపా ప్రభుత్వం రూ.15లక్షల అంచనా వ్యయంతో పంచాయతీ భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. తరువాత బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారు పనులు నిలిపేశారు. సుమారుగా రూ.10లక్షల నిధులు మంజూరు చేస్తే పనులు పూర్తవుతాయి. పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి నిధులు మంజూరు చేసి అసంపూర్తిగా ఉన్న పంచాయతీ భవన నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. **-న్యూస్‌టుడే, పెద్దపంజాణి**

విద్యా ప్రాంగణం.. దుకాణాల రాజ్యం

దుకాణాలు ఏర్పాటు చేసుకోవడానికి పాఠశాలను కూడా వదలడం లేదు. మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాల ప్రహరీని ఆనుకుని దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. ఆ పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ఉందనే భయం కూడా లేకుండా రేకులతో కప్పేశారు. ఇక రోజు విద్యార్థులు లోపలికి వెళ్లడానికి కూడా దారి లేకుండా తోపుడు బళ్లను అడ్డం పెట్టేస్తున్నారు. ఆక్రమణలను అధికారులు తొలగించాల్సిన అవసరం ఉంది. **-న్యూస్‌టుడే, పలమనేరు**

అందని పశు వైద్యం.. సామగ్రి నిరుపయోగం

మండలంలోని అనికెర పంచాయతీ కేంద్రంలో పశు వైద్య పరికరాల దుస్థితి ఇది. మండలంలోని 23 పంచాయతీల పరిధిలో పశువైద్యం కోసం రూ.లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన నిర్మాణాలు నిరుపయోగంగా ఉన్నాయి. ఇనుప పైపులు తుప్పు పడుతున్నాయి. పలు చోట్ల చోరుల పాలయ్యాయి. క్షేత్ర స్థాయిలో పశు వైద్య సేవలు అందని కారణంగా నిర్మాణాలు అలంకార ప్రాయమైనట్లు పాడి రైతులు అంటున్నారు. అధికారులు స్పందించి వైద్య సేవలను మెరుగు పరచాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, శాంతిపురం

ద్రవిడలో ఎన్‌సీసీ క్యాంప్ ఫైర్

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: ద్రవిడ విశ్వవిద్యాలయంలోని ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో బుధవారం క్యాంప్ ఫైర్ నిర్వహించారు. కార్యక్రమంలో వీసీ ఆచార్య దొరస్వామి, రిజిస్ట్రార్ కిరణ్‌కుమార్, అకడమిక్ డీన్ శ్యామల, ఎన్‌సీసీ అధికారి ప్రసాద్ నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

'పది'లో వందశాతం

ఉత్తీర్ణత లక్ష్యంగా..

శాంతిపురం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణతను సాధించే విధంగా శాంతిపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన మహిళా ఉపాధ్యాయులు గ్రామ పర్యటనలతో విద్యార్థుల చదువులను పర్యవేక్షిస్తున్నారు. పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో విద్యార్థులకు ఇతరత్రా పనులను అప్పగించరాదని తల్లిదండ్రులకు సూచిస్తున్నారు.

సస్యరక్షణతోనే మామిడి దిగుబడి

సదస్సులో ప్రసంగిస్తున్న శాస్త్రవేత్త సుధాకర్

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: సస్యరక్షణతోనే మామిడి పంట దిగుబడి సాధ్యమవుతుందని శాస్త్రవేత్త సుధాకర్ తెలిపారు. స్థానిక మార్కెట్‌యార్డులో బుధవారం రాస్ కోకోకోలా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో మామిడి రైతులకు పంట సాగుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సదస్సు నిర్వహించారు. శాస్త్రవేత్త అనిల్‌కుమార్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ భాస్కర్‌నాయుడు, తెదేపా మండల కార్యదర్శి జనార్దన్, చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ మాజీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, మండల ఉద్యానవన శాఖ అధికారిణి సాగరిక, మండల వ్యవసాయాధికారిణి భారతి పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నగర అధ్యక్షుడిగా ఎన్నిక

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: ఏపీటీఎఫ్ నగర అధ్యక్షుడిగా కృష్ణమూర్తి ఎన్నికయ్యారని ఆ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు జగదీష్ తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా షఫీఉన్నిసా, గౌరవాధ్యక్షుడిగా చిరంజీవి, ఆర్థిక కార్యదర్శిగా రాజశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని చెప్పారు.

పొట్టేళ్ల చోరీ

పెద్దపంజాణి, న్యూస్‌టుడే: మండలంలో రెండుచోట్ల జరిగిన పొట్టేళ్ల చోరీపై వేర్వేరు కేసులు నమోదు చేసినట్లు పెద్దపంజాణి ఎస్సై మారెప్ప తెలిపారు. కూరగాయల కొత్తపల్లెకు చెందిన వీరప్పకు చెందిన రెండు పొట్టేళ్లు జనవరి 21న, గౌరీనగర్ నివాసి మధుసూదన్‌రెడ్డికి చెందిన రెండు పొట్టేళ్లు జనవరి 22న గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకెళ్లినట్లు బాధితులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తెదేపాతోనే అభివృద్ధి సాధ్యం

రామకుప్పం, న్యూస్‌టుడే: తెదేపాతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీయస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీయస్ మునిరత్నం పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని ఉన్సిగానిపల్లి పంచాయతీ నుంచి వార్డు సభ్యురాలు పవిత్ర, మాజీ వాలంటీర్లతో సహా 20కుటుంబాలు వైకాపా నుంచి తెదేపాలో చేరారు. కార్యక్రమంలో గ్రంథాలయ శాఖ డైరెక్టర్ మునస్వామి, ఎంపీపీ సులోచనా గుర్రప్ప, తెదేపా మండలాధ్యక్షుడు వెంకటరమణ, రెస్కో వైస్ ఛైర్మన్ విశ్వనాథ్, వైస్ ఎంపీపీ వెంకట్రామేగౌడు, సీనియర్ నేతలు రామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

తెదేపాలో చేరిన వైకాపా వార్డు సభ్యురాలు, మాజీ వాలంటీర్లు

బిందు సేద్యం విస్తరణకు కృషి

శాంతిపురం, న్యూస్‌టుడే: సాగునీటి పొదుపు లక్ష్యంగా బిందు సేద్యం విస్తరణకు వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది కృషి చేయాలని కుప్పం ఏఎంసీ ఛైర్మన్ జి.ఎం.రాజు, తెదేపా మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండల సచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశం నిర్వహించారు. బిందు సేద్యంతో పాటు ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలపై రైతుల్లో అవగాహన పెంచాలన్నారు. ఆరుతడి పంటల సాగులో లాభాలను తెలియజేయాలన్నారు. రైతుల అవసరాలకు అనుగుణంగా ఆర్ఎస్‌కేల ద్వారా రాయితీ ధరకు యూరియాను ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. ఏఎంసీ డైరెక్టర్లు హరినాథరెడ్డి, శ్యామల, ఏఓ రాజ్యలక్ష్మి, ఏఈఓ శివశంకర్, వ్యవసాయ, ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉదయ్‌కుమార్

భక్తిశ్రద్ధలతో ధ్వజారోహణం

పుంగనూరు, న్యూస్‌టుడే: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని నెక్కుంది సమీపంలోని అగస్తీశ్వర స్వామి ఆలయంలో బుధవారం భక్తిశ్రద్ధలతో ధ్వజారోహణం నిర్వహించారు. ముందుగా ప్రసన్న పార్వతీదేవి, అగస్తీశ్వర స్వామి వారి మూలవిరాట్, ఉత్సవ విగ్రహాలను అలంకరించి పూజించారు. అర్చకులు మంజునాథదీక్షితులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రత్యేకాలంకారంలో అగస్తీశ్వరుడు

కాణిపాకం ఆలయానికి రూ.లక్ష విరాళం

ఆలయ అధికారులకు చెక్కు అందిస్తున్న నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు

కాణిపాకం, న్యూస్‌టుడే: స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో నిత్య అన్నదానం ట్రస్టుకు రూ.1,00,001 చెక్కును విరాళంగా ప్రకాశం జిల్లా మద్దిపాడుకు చెందిన సాతులూరి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు అందించారు. దాత కుటుంబ సభ్యులకు స్వామివారి దర్శనం చేయించి శేష వస్త్రాలు, స్వామివారి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ సూపరింటెండెంట్ శ్రీధర్‌బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణ దూరమై.. విద్యుత్తు ఛార్జీలు భారమై..

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: అసలే కుప్పం పురపాలిక.. కోట్ల రూపాయల విద్యుత్తు బిల్లులు పేరుకుపోయాయి. నిర్వహణ లోపం కారణంగా విద్యుత్తు బకాయిలు మరింత పెరిగే అవకాశాలు లేక పోలేదు. కుప్పం పురపాలిక పరిధిలోని లక్ష్మీపురంలో రాత్రి, పగలు తేడా లేకుండా వీధి దీపాలు వెలుగుతుండటం పురపాలికకు మరింత భారం కానుందని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. ఈ విషయమై ఏఈ ఆంజనేయులును వివరణ కోరగా.. వీధి దీపాల నిర్వహణ సక్రమంగా చేపట్టేలా సిబ్బందిని ఆదేశిస్తామన్నారు.

ఉద్యాన పంటల సాగుకు రైతులు ఆసక్తి చూపాలి

రామకుప్పం, న్యూస్‌టుడే: ఉద్యాన పంటల సాగుకు రైతులు ఆసక్తి చూపాలని కుప్పం ఏయంసీ ఛైర్మన్ రాజు, పీకేయం ఉడా ఛైర్మన్ డా.సురేశ్ బాబు, జనసేన కుప్పం నియోజకవర్గ ఇన్‌ఛార్జి నరేశ్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని రాజుపేట వద్ద ఉద్యాన రైతులకు జిల్లా ఉద్యాన అధికారి రామానుజులు, మాజీ జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్‌రెడ్డిలు శిక్షణ తరగతులు నిర్వహించారు. వాణిజ్య పంటల సాగు చేస్తున్న వారు, పంట మార్పిడి చేసే అధిక ఆదాయం ఇచ్చే ప్రత్యామ్నాయ పంటల కోసం పూలు, పండ్లతోటల విస్తరణ చేపట్టాలన్నారు. బంతి సాగులో కొత్త రకం వంగడం కల్ప ఆరెంజ్ టాల్, కల్ప ఎల్లో టాల్ రకాన్ని ఆవిష్కరించి రైతులకు కొత్త రకానికి పాత రకం వంగడానికి మధ్య గల నాణ్యతలను, తేడాలను తెలిపారు. ప్రభుత్వం ఉద్యాన శాఖ తరపున సాగుకు సబ్సిడీలను అందిస్తున్నట్లు తెలిపారు. రైతులందరూ సబ్సిడీలను పొందాలని కోరారు. అనంతరం రాజుపేట రోడ్డులో బంతి పూల సాగును పరిశీంచారు. కార్యక్రమంలో తెదేపా, జనసేన మండలాధ్యక్షులు వెంకటరమణ, హరీశ్, మాజీ అధ్యక్షుడు ఆనందరెడ్డి, నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షుడు చలపతి, ఉద్యాన అధికారి డింపుప్రియశ్రీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బంతి పూల సాగును పరిశీలిస్తున్న ఉద్యాన అధికారులు, కూటమి నేతలు

మూలన చేరి.. నిరుపయోగంగా మారి..

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని వివిధ ప్రాంతాలకు రూ.2లకు 20 లీటర్ల శుద్ధ జలం అందించాలన్న ముఖ్య ఉద్దేశంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 2015లో పైలట్ ప్రాజెక్టుగా కుప్పంలో ప్రారంభించారు. అప్పట్లో రూ.22 కోట్లతో 16 ప్లాంట్లు నిర్మాణం చేపట్టారు. వాటి ద్వారా నీటిని గ్రామాల్లో ఏర్పాటు చేసిన 202 శుద్ధ జల పంపిణీ కేంద్రాలకు తరలించేవారు. ఈ నీటిని తరలించేందుకు కొత్త ట్రాక్టర్లు, ట్రాలీలను ప్రభుత్వం మంజూరు చేసింది. దాని ద్వారా శుద్ధ జలాన్ని అందించేవారు.

ఎన్టీఆర్ సుజల ప్లాంటు వెనుక ఉన్న ట్రాక్టర్లు

వైకాపా హయాంలో..

రాష్ట్రంలో 2019 ఎన్నికల్లో వైకాపా అధికారం చేపట్టడంతో ఎన్టీఆర్ శుద్ధ జల పథకానికి రంగులు, పేరు మార్చి 20 లీటర్ల శుద్ధజలం రేటును రూ.2 నుండి రూ.5కు పెంచారు. ప్రాజెక్టుపై పూర్తి స్థాయిలో పర్యవేక్షణ లేకపోవడంతో పంపిణీ కేంద్రాలతో పాటు ప్లాంట్లు మరమ్మతులకు గురయ్యారు. దీంతో పంపిణీ చేసేందుకు వచ్చిన ట్రాక్టర్లు, ట్రాలీలు ఉపయోగంలో లేక నిరుపయోగంగా మారి.. కుప్పం పురపాలిక పరిధిలోని దళవాయి కొత్తపల్లె చెరువు సమీపంలోని ఎన్టీఆర్ సుజల ప్లాంటు వద్ద ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ ఏళ్లుగా అలానే పడింది. ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సుజల పథకానికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్లాంట్లతో పాటు పంపిణీ కేంద్రాలకు మరమ్మతులు చేయిస్తూ, ఉపయోగంలోకి తీసుకున్నారు. నీటి సరఫరాకు కొన్ని ట్రాక్టర్లు, ట్రాలీలను మాత్రమే ఉపయోగిస్తున్నారు. మిగిలినవి నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పురుషోత్తంను వివరణ కోరగా.. ఉపయోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

(c) eenadu

వైభవంగా చక్రస్నానం

కల్పవృక్ష వాహనంపై శ్రీనివాసుడు

ఆలమూరు: చింతలూరులోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి పాంచాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆఖరి రోజైన బుధవారం శ్రద్ధోత్సవం, పూర్ణాహుతి కార్యక్రమాలు జరిగాయి. అనంతరం స్వామివారి చక్రస్నానం నిర్వహించారు. సాయంత్రం కల్యాణవేంకటేశ్వరునిగా కల్పవృక్ష వాహనంపై పురవీధుల్లో ఊరేగారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పన్నుల వసూలుపై దృష్టిపెట్టండి

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో వాణిజ్య పన్నులు, జీఎస్టీ వసూలుపై సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో వాణిజ్య పన్నులు, బ్యాంకులు, రెవెన్యూ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇకపై ప్రతి నెలా పన్నుల వసూలుపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. బ్యాంకు రుణాల రికవరీల్లో అవసరమైతే పోలీసుల సహకారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కె.మాధవి, ఆర్డీవోలు శ్రీకర్, అఖిల, వాణిజ్య పన్నుల అధికారి ముత్యాలరావు, ఎల్డీఎం వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలు వేగుళ్ల జోగేశ్వరరావు, అయితాబత్తుల ఆనందరావు, దాట్ల సుబ్బరాజు, బండారు సత్యానందరావు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం తదితరులు బుధవారం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను అసెంబ్లీలో కలిశారు. తమ పరిధిలోని గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. -న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

స్థల సేకరణే కీలకం..!

ఈనాడు, అమలాపురం: ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్న సంకల్పంతో కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నా క్షేత్రస్థాయిలో భిన్నమైన పరిస్థితులు ఎదురవుతున్నాయి. ప్రతి నియోజకవర్గంలో పారిశ్రామిక క్లస్టర్ ఏర్పాటు చేయడం ద్వారా అక్కడ సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహమివ్వాలని భావించారు. అయితే ఉమ్మడి జిల్లాలో ఆశించిన మేర పురోగతి కనిపించడం లేదు. ప్రధానంగా భూముల గుర్తింపు, ఏపీఐఐసీకి బదలాయింపు ప్రక్రియలో జాప్యం నెలకొంటోంది.

పారిశ్రామిక అడుగులకు అడ్డంకులు

ఇదీ పరిస్థితి: ✦ జిల్లాలో రెండు విడతల్లో రామచంద్రపురం, అమలాపురంలో శంకుస్థాపనలు చేశారు. మిగిలిన ప్రాంతాల్లో స్థల సేకరణ చేయాల్సి ఉంది. ఇప్పటికి ఒక నియోజకవర్గంలో మాత్రమే భూమి గుర్తించారు. ✦ రాజమహేంద్రవరం గ్రామీణం, గోపాలపురం, రాజానగరం నియోజకవర్గాల పరిధిలో గుర్తించిన భూముల్లో ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యేలు శంకుస్థాపనలు చేశారు. మరో మూడు చోట్ల స్థలాలు గుర్తించాలి. ✦ కాకినాడ గ్రామీణం, పెద్దాపురం, పిఠాపురం, తుని, జగ్గంపేట నియోజకవర్గాల పరిధిలో ఇప్పటికే స్థలాల గుర్తింపుతో పాటు రెండో విడతలోనే శంకుస్థాపనలు చేశారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. కాకినాడ నియోజకవర్గానికి స్థలాన్ని గుర్తించే పనిలో యంత్రాంగం ఉంది.

✦ పోలవరం జిల్లా గంగవరం మండలంలో స్థలం గుర్తించడంతో అక్కడ మౌలిక వసతుల కల్పన పనులు చేయాల్సి ఉంది.

కాసులు దక్కేనా..? కదలిక వచ్చేనా..?

కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్‌కు నిధుల సాధనపై ఆశలు

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

కోనసీమ చిరకాల స్వప్నం కోటిపల్లి- నరసాపురం రైల్వే లైన్ నిర్మాణం 25 ఏళ్లుగా అందని ద్రాక్షలా మిగులుతోంది. ప్రస్తుతం రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేలు ఈ రైల్వేలైన్ నిర్మాణానికి నిధులు విడుదలయ్యేలా కృషి చేయాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

2000లో భూమి పూజ

2000, నవంబరు 16న అమలాపురం మండలం భట్నవిల్లి వద్ద అప్పటి కేంద్ర రైల్వే మంత్రి మమతా బెనర్జీ, సీఎం చంద్రబాబునాయుడు, నాటి లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి కాకినాడ- నరసాపురం రైల్వే లైన్‌కు శంకుస్థాపన చేశారు. తర్వాత కాకినాడ నుంచి కోటిపల్లి వరకు నిర్మాణం పూర్తి చేశారు. కోటిపల్లి-నరసాపురం మధ్య 57 కి.మీ. మేర పనులు నిలిచాయి. ప్రారంభంలో రాష్ట్ర ప్రభుత్వం రూ. 2.69 కోట్లు ఇచ్చింది. కేంద్రం 2016 ముందు వరకు రూ. 70 కోట్లు విడుదల చేయగా తెదేపా ప్రభుత్వం పట్టుబట్టడంతో మరో రూ. 1130 కోట్లు కేటాయించింది. కేంద్రం ఇచ్చిన నిధులను నదులపై వంతెనలకు వినియోగిస్తున్నారు.

ఖరారుకాని ఎలైన్‌మెంట్..

భట్నవిల్లి నుంచి చించినాడ వంతెన వరకు రైల్వేలైన్‌కు ఎలైన్‌మెంట్ ఇప్పటికీ ఖరారు కాలేదు. బోడసకుర్రు, పేరూరు, గుడిమెల్లంక తదితర ప్రాంతాలకు చెందిన రైతుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

భూ బదలాయింపు జరగక

కోటిపల్లి-భట్నవిల్లి వరకు 13 కి.మీ. మేర 288 ఎకరాల భూసేకరణ పూర్తయింది. ఇంకా 44 కి.మీ. ట్రాక్ నిర్మాణానికి 510 ఎకరాలు కావాలి. ఇప్పటికే సేకరించిన భూమి ప్రభుత్వానికి చెందినట్లు రెవెన్యూశాఖ అధికారులు మ్యుటేషన్ పూర్తి చేయలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఈ భూమిని రైల్వేశాఖకు బదలాయించలేదు. ఈ ప్రక్రియ పూర్తయితే కోటిపల్లి-భట్నవిల్లి ట్రాక్ పనులు ప్రారంభించేందుకు వీలు కలుగుతుంది.

బోడసకుర్రు వైనతేయ గోదావరిలో నిర్మాణంలో ఉన్న రైల్వేలైన్ నిర్మాణ పనులు

రాష్ట్ర ప్రభుత్వం స్పందిస్తేనే..



కోటిపల్లి- నరసాపురం రైల్వేలైన్‌పై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారిస్తేనే పూర్తవుతుంది. భూసేకరణకు అవసరమైన నిధులు కేటాయించి, పనులను ఎప్పటికప్పుడు రాష్ట్ర కమిటీ పర్యవేక్షిస్తే తప్ప పూర్తికావు. ఎమ్మెల్యేలు ప్రత్యేక శ్రద్ధ చూపాలి. -ఆర్.సుబ్రహ్మణ్యం, కోనసీమ రైల్వే సాధన సమితి కన్వీనర్

ఎలైన్‌మెంట్ పూర్తిచేస్తే భూసేకరణ

భట్నవిల్లి నుంచి చించినాడ వరకు ఎలైన్‌మెంట్ పూర్తయితే భూసేకరణ ప్రక్రియ చేపడతాం. ఇప్పటికే సేకరించిన భూముల మ్యుటేషన్ ప్రక్రియ ప్రారంభిస్తాం. -కె.మాధవి, డీఆర్వో

రూ.2వేల ఫోన్ కొంటే.. రూ.లక్ష కొట్టేశారు..!

డబ్బులు రిఫండ్ ఇస్తామని ఆన్‌లైన్‌లో మోసం

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త మోసంతో జనాలను నిండా ముంచుతున్నారు. వీరి మోసాలపై అవగాహన ఉన్నవాళ్లు సైతం ఉచ్చులో పడుతున్నారు. అమలాపురంలో ఇలాంటి ఘటనే చోటు చేసుకుంది. స్థానికంగా ఉంటున్న ఓ ఆర్ఎంపీ వైద్యుడు చవకగా ఫోన్లు విక్రయించే ఓ వెబ్‌సైట్‌లో రూ. 2వేలు చెల్లించి సెల్ ఆర్డర్ పెట్టారు. నేరగాళ్లు అతడికి పనిచేయని ఫోన్ పంపించారు. ఈ విషయాన్ని ఆయన బుధవారం సంబంధిత వెబ్‌సైట్‌లోని నంబరుకు ఫోన్‌చేసి ఫిర్యాదు చేశారు. రూ. 2వేలు రిఫండ్ ఇస్తామని నమ్మించి అతని బ్యాంకు వివరాలు తీసుకున్నారు. వెంటనే అతని సెల్‌కు వెంటవెంటనే రెండు ఓటీపీలు పంపించారు. వాటిని చెబుతూ డబ్బులు మీ ఖాతాలో పడతాయని నమ్మించారు. అతను ఆ నంబర్లు చెప్పిన తర్వాత రూ. 49,500 చొప్పున రెండుసార్లు ఖాతాల్లోని డబ్బులు లాగేశారు. దీనిపై ఎస్పీ కార్యలయంలోని సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దోమల దండుపై స్మార్ట్ యుద్ధం

ఈనాడు, కాకినాడ: అపరిశుభ్ర పరిసరాలు.. నిల్వ నీటికుంటలు.. పిచ్చిమొక్కలు... ఏదైతేనేం ఇంటా బయట దోమలు విజృంభిస్తున్నాయి. డెంగీ, మలేరియా వంటి వ్యాధులకు కారణమవుతున్నాయి. ఆధునిక సాంకేతికతతో సమస్యకు చెక్ పెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. డ్రోన్లు, ఐవోటీ సెన్సార్లు, మొబైల్ యాప్‌లు, కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని కాకినాడ నగరపాలక సంస్థలో ఏర్పాటు చేయబోతున్నారు. స్మార్ట్ మస్కిటో సర్వైలెన్స్ సిస్టమ్ (ఎస్ఎంఎస్ఎస్) పేరుతో కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత దోమల నియంత్రణ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు.

ఇలాంటి డ్రోన్లతోనే దోమల నియంత్రణ చేపట్టనున్నారు

కమాండ్ కంట్రోల్ కేంద్రం..

దోమలపై చేపట్టే స్మార్ట్ యుద్ధం కోసం ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ వ్యవస్థను ఏర్పాటు చేస్తారు. డ్రోన్ల సంచారం, ఐవోటీ సెన్సార్ల సమాచారం, ఆసుపత్రుల్లో వ్యాధులు, ప్రజల ఫిర్యాదులన్నీ ఒకే కమాండ్ కేంద్రం ద్వారా సమీకరించి పర్యవేక్షిస్తారు. దోమల వృద్ధి చెందే ప్రాంతాల సమీపంలో సీసీ టీవీ కెమెరాలతో రియల్ టైమ్ సర్వైలెన్స్ ఏర్పాటు చేస్తారు.

డ్రోన్లతో సర్వే.. జీఐఎస్ మ్యాపింగ్..

డ్రోన్లతో దోమల సంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాలను సర్వే చేస్తారు. నిల్వ నీరు, తెరిచి ఉన్న కాలువలు, చెత్తకుప్పలు ఉన్న ప్రాంతాలను జీఐఎస్ మ్యాపింగ్ ద్వారా గుర్తిస్తారు. డ్రోన్లతో లార్వా నాశన పిచికారీ చేసి మట్టుబెడతారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ) సెన్సార్ల ద్వారా దోమల రకం, సంఖ్య, ప్రాబల్యం సమాచారాన్ని రియల్ టైమ్‌లో సేకరించి కేంద్ర క్లౌడ్ సిస్టమ్‌కు పంపిస్తారు. ఫాగింగ్ యంత్రాలకు కూడా జీపీఎస్ పరికరాలు అమర్చి ఎక్కడ ఫాగ్ పిచికారీ చేయాలో మ్యాప్‌లో సూచిస్తారు.

ఇవీ ప్రయోజనాలు..

❖ ఫాగింగ్ కోసం కాకి లెక్కలు చూపడం. వాటితో కాసులు వెనకేసుకోవడం తగ్గుతుంది. ❖ డ్రోన్లతో మారుమూల ప్రాంతాల్లోనూ మందు పిచికారీ చేయొచ్చు. ❖ లార్వా దశలోనే నాశనం చేయడానికి అవకాశం ఉంటుంది. ❖ కార్మికులకు ఆరోగ్య సమస్యలు రాకుండా ఉంటాయి. ❖ సాధారణ దోమల నివారణకు ఒక రోజు సమయం పడితే ఏఐ టెక్నాలజీ, డ్రోన్లతో గంటలోనే మొత్తం పూర్తిచేయొచ్చు.

అల్లవరం మండలం గోపాయిలంక పుష్కర ఘాట్ మెట్లపై పేరుకు పోయిన బురద

ముమ్మిడివరం: పల్లవారిపాలెంలో ఇలా..

శివయ్యా..! శివరాత్రికి స్నానం ఎలా..?

ఒకవైపు మహాశివరాత్రి ఉత్సవాలు సమీపిస్తున్నాయి. మరోవైపు చాలా ఆలయాల వద్ద సరైన సౌకర్యాలు లేవు. స్నానాలు చేసేందుకు రేవులు, ఘాట్‌లలో సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి, కాట్రేనికోన మండలం కుండలేశ్వరంలోని ఆలయాలు రాష్ట్ర వ్యాప్తంగా ప్రసిద్ధి చెందినవి. మహాశివరాత్రి పర్వదినాన ఇక్కడకు వేల సంఖ్యలో భక్తులు తరలివస్తారు. మండలేశ్వరాలయానికి సుమారుగా లక్ష మంది భక్తులు వస్తారని అంచనా. ఇక్కడా స్నానాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. -న్యూస్‌టుడే, ముమ్మిడివరం, కాట్రేనికోన

నిధులు లేక... పనులు పూర్తికాక

న్యూస్‌టుడే, పి.గన్నవరం: దాదాపుగా 19 సంవత్సరాల క్రితం ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల్లో వశిష్ఠ, గౌతమి, వైనతేయ గోదావరి నదిపాయలకు సంబంధించిన కుడి, ఎడమ ఏటిగట్లను సుమారు రూ. 400 కోట్లతో పటిష్ఠ పరిచారు. వీటిలో కొన్ని చోట్ల ఆక్రమణలు తొలగించకపోవడం వంటి కారణాలతో కొన్నిచోట్ల ఆధునికీకరణ నోచుకోలేదు. ఇలా లంకలగన్నవరం నుంచి అంతర్వేది వరకు 42 కిలోమీటర్ల నిడివిలో సుమారు 20 కిలోమీటర్ల మేర వశిష్ఠ ఎడమ ఏటిగట్టు మిగిలిపోయింది. దీని అభివృద్ధికి రూ. 52కోట్లు అవసరం ఉంటుందని హెడ్‌వర్క్స్ ఇంజినీరింగ్ అధికారులు ఈ ఏడాది జనవరిలో ప్రతిపాదనలు పంపారు.

రూ.52 కోట్ల నిధుల కోసం ప్రతిపాదనలు

నిధులు విడుదలైతే తదుపరి చర్యలు మొదలు పెడతామని డ్రైన్స్ సెక్షన్ హెడ్‌వర్క్స్ ఏఈ వీవీఎస్ మూర్తి తెలిపారు.

పెరిగిపోతున్న అంచనా వ్యయం

నిధులు విడుదల కాకపోవడంతో నేడు అంచనా వ్యయం రూ. 52 కోట్లకు పెరిగిపోయింది. 20 కిలోమీటర్ల వశిష్ఠ ఎడమ ఏటిగట్టును అభి... 1986 ఆగస్టులో ఉద్ధృత వరదల సమయంలో సుమారుగా ఒ.ఎం.ఎఫ్.ఎల్. (ఆర్డినరీ మేగ్జిమమ్ ఫ్లడ్‌లెవెల్) మించి రెండు మీటర్లు (ఫ్రీ బు) ఎత్తు పెరిగింది.

ఇదీ కార్యాచరణ

ఉదాహరణకు 1986లో ఈ ఏటిగట్టు వద్ద ఓ.ఎం.ఎఫ్.ఎల్. 10 మీటర్లు నమోదైతే దానికి రెండు మీటర్లు కలిపి మొత్తం 12 మీటర్లు ఎత్తు, పైభాగంలో 6.50 మీటర్ల వెడల్పుతో గట్టు పూర్తిచేసి దానిపై డబ్ల్యూ.బి.ఎం.రోడ్డు ఏర్పాటు చేస్తారు. వృద్ధి చేసేందుకు 5.50లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి అవసరం ఉంటుంది.

ఎక్కడెక్కడంటే...

లంకలగన్నవరం, మొండెపులంక, నాగుల్లంక, తాటిపాక, పొదలాడ, రాజోలు, దిండి, రామరాజులంక, టేకిశెట్టిపాలెం, సఖినేటిపల్లి, రామేశ్వరం, గుడిమూడ, అంతర్వేది.

లంకలగన్నవరం వద్ద వశిష్ఠ ఎడమ ఏటిగట్టు

ఉరుకులు.. పరుగులు

మార్చిలోగా ఉపాధి పెండింగ్ పనుల పూర్తికి చర్యలు

న్యూస్‌టుడే, అల్లవరం, ముమ్మిడివరం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27) నుంచి 'వీబీ జీ రామ్ జీ'గా మారనుంది. కొత్త చట్టంలో చాలా మార్పులు, చేర్పులు చేశారు. అందులో కీలకమైంది. ప్రతి పంచాయతీ పరిధిలో 20 గరిష్ఠంగా పనులు మాత్రమే మంజూరులో ఉండాలని నిబంధన. దీని ప్రకారం ఇప్పటికే ఉన్న 20లో ఎన్ని పూర్తి చేస్తే కొత్తగా అన్ని మంజూరు చేస్తారు. లేకుంటే కొత్త పనులు చేపట్టే అవకాశం ఉండదు. దీని ప్రకారం ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి ప్రతి పంచాయతీలో 20 పనులు మాత్రమే ఉండేలా అధికారులు చర్యలు చేపట్టారు. వీలైతే పూర్తి చేయడం, లేదంటే తొలగించడం చేస్తున్నారు. జిల్లాలో 385 పంచాయతీలు ఉండగా(మండపేట నియోజకవర్గంలో కలిపి) 35,193 పనులు వివిధ స్థాయిల్లో ఉన్నాయి. సోమవారం నాటికి సుమారు 21,663 పనులను ముగించారు. ఈ సంఖ్యను 7700కు తగ్గించాల్సి ఉంది.

ఆ పనులపై ఆందోళన

ఉపాధి హామీ పథకంలో గత ఏడాది పల్లెపండగ కార్యక్రమంలో పెద్ద ఎత్తున సీసీ, నల్ల కంకర, తారు రోడ్ల నిర్మాణాలు చేపట్టారు. ఈ పనులకు బిల్లులు పెండింగ్ ఉండడంతో కొంత నత్తనడకన సాగాయి. గోకులం పథకంలో పశువుల షెడ్ల నిర్మాణం పరిస్థితి ఇలాగే ఉంది. ఈ పనులన్నీ ప్రస్తుతం మార్చి నెలాఖరులోగా పూర్తి చేసి బిల్లులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. వైకాపా పాలనలో రైతు సేవా కేంద్రాలు, గ్రామ/వార్డు సచివాలయాలు, గ్రామ ఆరోగ్య కేంద్రాలను అర్ధంతరంగా వదిలేశారు.

మొత్తం పనులు	35,193
ఇటీవల పూర్తిచేసినవి	21,663
వివిధ స్థాయిల్లో ఉన్నవి	
మొక్కలు నాటడం	1422
గృహ నిర్మాణం (90 రోజుల పనిదినాలు)	4307
సీసీ, గోకులాలు, ఆర్ఎస్‌కే, సచివాలయాలు	7801

వేగవంతం చేశాం..

సీసీ రోడ్లు, గోకులాలు వంటివి మార్చి నెలాఖరులోగా పూర్తి చేసి బిల్లులు అప్‌లోడ్ చేస్తే.. చెల్లింపులు జరుగుతాయి. పనులు పూర్తి చేయడంలో జిల్లా ముందుంది. ఇక్కడ తొలగించే పనులు తక్కువగానే ఉన్నాయి. -మధుసూదన్, డ్వామా, పీడీ

సేవా లోపాలకు తక్షణ పరిష్కారం

ద్రాక్షారామ: విద్యుత్తు పంపిణీ వ్యవస్థలో ఎదురయ్యే సేవా లోపాలను సత్వరం పరిష్కరించి వినియోగదారులకు న్యాయం చేయడానికి విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కార ఫోరం (సీజీఆర్ఎఫ్)ను ఏర్పాటుచేసినట్లు ఆ సంస్థ ఛైర్మన్ డా. బి. సత్యనారాయణ చెప్పారు. విశ్రాంత న్యాయమూర్తితో పాటు ముగ్గురు సభ్యులు ఇందులో ఉంటారని వివరించారు. కోనసీమ జిల్లా పరిధిలోని సమస్యల పరిష్కారానికి బుధవారం ద్రాక్షారామ వేదికగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో ఎదురయ్యే సమస్యలను ఫోరంలో సత్వరమే పరిష్కరిస్తున్నట్లు వివరించారు. సమావేశంలో 8 ఫిర్యాదులు అందగా వాటిని పరిశీలిస్తున్నట్లు వివరించారు. అనంతరం ద్రాక్షారామ మహిళా కళాశాలలో విద్యుత్తు సమస్యలు, పరిష్కారానికి సంబంధించిన అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు ఎస్. సుబ్బారావు, బి. సులేఖారాణి, ఎన్. మురళీకృష్ణ, కోనసీమ జిల్లా ఈఈ (టెక్నికల్) వై. విజయానంద్, ఈఈ రత్నాలరావు, ఏడీఈ ఎస్. శ్రీనివాసరావు, ఏఈ ఎం. వెంకటరమణ పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌లో ఫిర్యాదు స్వీకరిస్తున్న ఛైర్మన్ సత్యనారాయణ తదితరులు

ఆపద సమయంలో ఆసరా

గుర్తుతెలియని వాహనాలు ఢీకొన్న సందర్భాల్లో పరిహారం

న్యూస్‌టుడే, అల్లవరం

రహదారులపై గుర్తు తెలియని వాహనాలు ఢీకొని(హిట్ అండ్ రన్) ప్రమాదాలు జరిగే సందర్భాల్లో బాధితులు తీవ్రంగా నష్టపోతున్నారు. సంబంధిత వాహనాన్ని గుర్తిస్తేనే బాధితులకు థర్డ్‌పార్టీ బీమా వర్తిస్తుంది. లేకుంటే ఆ కుటుంబాలు పరిహారం దక్కక రోడ్డున పడుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వారికి అండగా నిలవాలని నిర్ణయించింది. హిట్ అండ్ రన్ కేసుల్లో మృతి చెందిన వ్యక్తుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, క్షతగాత్రులకు రూ. 50 వేలు అందిస్తోంది. ఈ తరహా కేసుల పరిష్కారం కోసం రెవెన్యూ, సాధారణ బీమా, న్యాయ, పోలీసు, రవాణా శాఖ అధికారులతో ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు.

జిల్లా పరిధిలో 2025లో హిట్ అండ్ రన్ కేసుల వివరాలు

ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
28	12	22

2022లో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని 2022 ఏప్రిల్ 1న అమల్లోకి తీసుకువచ్చింది. దీనిపై సరైన అవగాహన లేక బాధితుల్లో చాలామంది వినియోగించుకోవడం లేదు. ప్రమాదం జరిగిన 90 రోజుల్లోగా ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంది.

15 రోజుల్లోగా పరిహారం..

ఈ కేసుల్లో పరిహారం అందించేందుకు కలెక్టర్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. గుర్తుతెలియన వాహనం ఢీకొట్టిన ప్రాంతాన్ని తహసీల్దార్ క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదిక ఆర్డీవోకు పంపిస్తారు. ఆర్డీవో ఫారం-2ను జత చేసి కలెక్టర్‌కు పంపుతారు. కలెక్టర్, ట్రాఫిక్, రవాణా, రెవెన్యూ, పోలీసు అధికారులతో కూడిన కమిటీ దీనిని ఆమోదిస్తుంది. అక్కడి నుంచి సాధారణ బీమా కౌన్సిల్‌కు పంపి బాధితులకు 15 రోజుల్లోగా పరిహారం జమ చేస్తారు.

దరఖాస్తు ఇలా..

బాధితులు రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల్లో పరిహారానికి దరఖాస్తు చేసుకోవాలి. ఈ ఫారం కలెక్టరేట్, రవాణాశాఖ కార్యాలయాల్లో లభిస్తుంది. ఇందులో ఫారం- 1, 4ను పూర్తి చేయాలి. క్షతగాత్రులు ఫారం-1లో వ్యక్తి గత వివరాలు, ప్రమాదం జరిగిన ప్రదేశం, సమయం, గాయాలకు సంబంధించిన వివరాలు నమోదు చేయాలి. ఎఫ్ఐఆర్, బ్యాంకు ఖాతా వివరాలు, ఆధార్‌కార్డు అందజేయాలి. మృతి చెందినవారి మరణ ధ్రువీకరణ పత్రం అందించాలి. ప్రమాదంలో గాయపడి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందితే ఫారం-4తో పాటు ఆసుపత్రి నుంచి తీసుకున్న బిల్ జత చేయాలి.

అవగాహన కల్పిస్తున్నాం..

రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఈ పథకాలపై అవగాహన కల్పిస్తున్నాం. బాధితులు పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకుంటే జిల్లా కమిటీలో ఆమోదించి పరిహారం అందిస్తారు. -డి.శ్రీనివాస్, జిల్లా రవాణా శాఖ అధికారి

సమన్వయంతో ఉత్సవాలు విజయవంతం

అమలాపురం కలెక్టరేట్: అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవాల్లో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించారని కలెక్టర్ మహేష్‌కుమార్ అన్నారు. ఉత్సవాల నిర్వహణలో పాల్గొన్న అధికారులను బుధవారం కలెక్టరేట్‌లో ఆయన అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్తు అవసరాల దృష్ట్యా శాశ్వత కల్యాణ మండపం, బస్‌స్టాండ్, మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కల్యాణోత్సవం, రథోత్సవం సమయాల్లో మొబైల్ నెట్ వర్క్ సామర్థ్యాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ రాహుల్ మీనా, డీఆర్వో కె.మాధవి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ రాహుల్ మీనా

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

పోటెత్తిన నదులు.. ముంపుతో అవస్థలు

దేవీపట్నం, వరరామచంద్రాపురం: పోలవరం కాపర్‌డ్యాం గేట్లు మూసివేయడంతో రెండో రోజు బుధవారం గోదావరి, శబరి నదుల్లో నీటి మట్టం పెరిగింది. దేవీపట్నం మండలం గండిపోశమ్మ ఆలయ పరిసరాలు, ఒడ్డును ఆనుకుని ఉన్న దుకాణాల్లోకి నీరు చేరింది. దండంగి, డి.రావిలంక మధ్య వరద మరింత పెరగడంతో మన్యం నుంచి సీతానగరం, పురుషోత్తపట్నం వైపు రాకపోకలు నిలిచిపోయాయి. పోలవరం ముంపు గ్రామాల్లో దండంగి, చినరమణయ్యపేట, కె.వీరవరం, సీతారంలో మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది గోదావరి వరదల నేపథ్యంలో నాలుగు నెలలుగా అమ్మవారి దర్శనాలు నిలిచిపోయాయి. మరో మూడు రోజుల్లో దర్శనాలకు ఏర్పాట్లు చేస్తున్న నేపథ్యంలో గోదావరి పెరగడంతో ఆలయం వైపు భక్తులు రాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

పొగాకు తోటల్లో ముంపు: వరరామచంద్రాపురం మండలంలో శబరి నది ఒడ్డు పక్కన పొలాల్లోకి ముంపు నీరు చేరింది. ఏటా వరదలు తగ్గిన తరువాత కొందరు పేద రైతులు ఒడ్డు పక్కన లంక భూముల్లో అపరాలు, పొగాకు సాగు చేస్తుంటారు. ఇంజిన్లకు పెట్టుబడి పెట్టే ఆర్థిక పరిస్థితి లేక కావిళ్లతో నది నుంచి నీరు తెచ్చుకుని మొక్కలను సంరక్షించుకుంటున్నారు.

గండిపోశమ్మ ఆలయ పరిసరాల్లో వరద నీరు

థైరాయిడ్ సమస్యతో బాధ పడుతున్నారా?

అధునాతన రోబోటిక్ సర్జరీతో మీ థైరాయిడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం
ప్రయోజనాలు: తక్కువ నొప్పి | తక్కువ రక్తస్రావం | త్వరితగతిన కోలుకోవడం
APEX HOSPITALS
ప్రకాష్ నగర్, రాజమండ్రి
Dr. Nitin Rimmalapudi, M.S. Robotic Surgeon
అపాయింట్‌మెంట్ కొరకు సంప్రదించండి
93 922 922 00
సోమవారం నుండి శనివారం

(c) eenadu

మహా గణపతికి పంచలోహ కవచం

రాష్ట్రంలో ప్రసిద్ధిచెందిన మందపల్లి శనీశ్వరాలయంలోని మహాగణపతి విగ్రహానికి పంచలోహ కవచాన్ని అలంకరించనున్నారు. మండపేటకు చెందిన శిల్పి వాసా శ్రీనివాస్‌తో విజయవాడకు చెందిన భక్తులు పల్లపురాజు దంపతులు కవచాన్ని తయారు చేయించారు. మహాగణపతి విగ్రహానికి అలంకరించేలా 18 అంగుళాల ఎత్తు, 14 అంగుళాల వెడల్పున్న కవచం రెండు కిలోల బరువున్న పంచలోహాలతో తయారు చేసినట్లు శిల్పి తెలిపారు. శనీశ్వరాలయంలో స్వామివారి కల్యాణం నేపథ్యంలో గురువారం అందిస్తామని వివరించారు. - న్యూస్‌టుడే, మండపేట

సుద్దముక్కలతో సూక్ష్మ కళాఖండాలు

పెద్దాపురం పట్టణానికి చెందిన గృహిణి కొరుకొండ మహాలక్ష్మి సుద్దముక్కలతో సూక్ష్మ కళాఖండాలు తయారుచేసి అబ్బుర పరుస్తున్నారు. ఈమె తండ్రి బిక్కవోలు మండలం పందలపాక గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు అప్పల బత్తుల ప్రకాశరావు. తండ్రి తయారుచేసిన వస్తువులను చూసి ఈవిద్యను నేర్చుకున్నారు. సుద్దముక్కలతో సూక్ష్మ కళాఖండాలే కాదు చిత్రలేఖనం, బంగారపు వస్తువుల డిజైనింగ్, కాస్ట్యూమ్స్ డిజైనింగ్, ఇంటీరియల్ డిజైనింగ్‌లోనూ ప్రావీణ్యం సాధించారు. మదర్‌థెరిసా, ప్రధాని నరేంద్రమోదీ, బుద్ధుడు, స్వాతంత్ర్య సమరయోధులు మహాత్మాగాంధీ, అల్లూరి సీతారామరాజు, వినాయకుడు, వేంకటేశ్వరస్వామి, లక్ష్మీదేవి వంటి దేవుళ్ల చిత్రాలు గీశారు. - న్యూస్‌టుడే, పెద్దాపురం

ప్రధాని నరేంద్ర మోదీ చిత్రానికి రంగులు అద్దుతున్న కొరుకొండ మహాలక్ష్మి

కొంగల ఆకృతి

ఆలోచన అదిరింది..

రాజులపాలెం గ్రామానికి చెందిన రైతు కుసుమ సత్యనారాయణ పది సెంట్ల విస్తీర్ణంలో ఆకుకూరలు సాగు చేస్తున్నారు. పంటకు నీటితడులు ఇచ్చేందుకు ఆయన చేసిన ప్రయత్నం బాగుంది. చేతిపంపు నీటిని బకెట్‌లో పోసి తీసుకెళ్లే అవసరం లేకుండా అడుగున రంధ్రం చేసి దానికి ప్లాస్టిక్ పైపు అమర్చారు. బకెట్‌లోంచి నీరు నేరుగా పైపు ద్వారా పంటకు చేరుతోంది. దీనికి ఖర్చు, శ్రమ లేకుండా ఉందని ఆయన చెబుతున్నారు. - న్యూస్‌టుడే, పి.గన్నవరం

నేడు మహిళల హాకీ తుది పోరు

సెమీ ఫైనల్స్‌కు చేరిన పురుషుల జట్లు

పురుషుల జట్ల మధ్య జరుగుతున్న హాకీ మ్యాచ్

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ డీఎస్ఏలో జరుగుతున్న కోకనాడ గోల్డ్ కప్ హాకీ టోర్నమెంట్ తుది దశకు చేరింది. గురువారం మహిళల విభాగంలో హాకీ హరియాణా, ఎన్‌సీవోఈ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరగనుంది. పురుషుల క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు బుధవారం ఉత్సాహంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా మాజీ రైల్వే ఉద్యోగి రత్నాకర్, మాజీ ఇన్‌కంటాక్స్ అధికారి వెంకటేశ్వర్లు తదితరులు హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని, మ్యాచ్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డులు అందజేశారు. కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్ ఫౌండర్ కె.రవిచంద్రప్రసాద్, క్లబ్ అధ్యక్షుడు ఎ.బాబ్జి, రాష్ట్ర హాకీ సంఘ జాయింట్ సెక్రటరీ రవిరాజు, హాకీ కోచ్ నాగేంద్రకుమార్, పీడీలు సూరిబాబు, క్లబ్ సభ్యులు పర్యవేక్షించారు.

క్వార్టర్ ఫైనల్ విజేతలు వీరే..

సెంట్రల్ బోర్డు ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్‌పై 2-1తో పంజాబ్ నేషనల్ బ్యాంక్, సెంట్రల్ సెక్రటరియేట్ జట్టుపై 4-1తో ఒడిశా నేవల్ టాటా హాకీ జట్టు విజయం సాధించాయి. ఇండియన్ ఆర్మీపై 1-0తో సౌత్ సెంట్రల్ రైల్వేస్, ఇండియన్ నేవీపై 4-1తో ఐవోసీ జట్టు గెలుపొందాయి.

గొల్లవిల్లిలో వాలీబాల్ సంరంభం

గ్రామంలో పోటీలకు ఏర్పాటుచేస్తున్న మైదానం

న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

పట్టణాలే కాదు పల్లెలుకూడా జాతీయ స్థాయి క్రీడాసంబరాలకు వేదికగా నిలుస్తున్నాయి. ఇందుకు నిదర్శనం ఉప్పలగుప్తం మండలంలోని గొల్లవిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వాలీబాల్ క్రీడా ప్రాంగణం. ఈ పాఠశాలలో చదివే విద్యార్థులు సైతం జాతీయస్థాయి పోటీల్లో మెరుస్తూ గ్రామానికి కీర్తిప్రతిష్ఠలు తెస్తున్నారు. ఇక్కడ చదివే విద్యార్థులు అన్నిరంగాల్లో ప్రావీణ్యం సాధించడం గమనార్హం.

క్రీడా గ్రామంగా ప్రస్థానం ఇలా..

1989లో తూర్పుగోదావరి జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు పాఠశాల మైదానంలో ప్రారంభించడంతో స్థానిక క్రీడాకారులకు, గ్రామస్థులకు ఆసక్తిరేగింది. దీంతో తిరిగి 2000 సం॥లో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించి విజయపథంలో నడిపించడంతో ఇక్కడ ప్రాంగణానికి మంచిపేరు వచ్చింది. 2017లో జాతీయస్థాయి పోటీలకు గొల్లవిల్లి గ్రామం ఆతిథ్యమిచ్చింది. అప్పటి నుంచి ఈ గ్రామం వాలీబాల్ గ్రామంగా మారిపోయింది. 2018లో ఇదే ప్రాంగణంలో నిమ్మకాయల రంగయ్య మెమోరియల్ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించి జాతీయస్థాయి గుర్తింపు తెచ్చారు. 2025లో తిరిగి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అరిగెల శ్రీరంగయ్య (ఏఎస్ఆర్) వాలీబాల్ టోర్నమెంట్ పేరుతో గ్రామస్థులు జాతీయస్థాయి మహిళా, పురుషుల వాలీబాల్ పోటీలు నిర్వహించి గ్రామానికి పూర్వవైభవం తెచ్చారు. అదే పేరుతో ఈ నెల 15 నుంచి శివరాత్రిని పురస్కరించుకుని 5రోజుల పాటు ఏఎస్ఆర్ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. అందుకు తగ్గ ఏర్పాట్లు గొల్లవిల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో చురుగ్గా సాగుతున్నాయి. మహిళా, పురుష క్రీడాకారులకు వేరు వేరుచోట్ల విశ్రాంతి గదులు సిద్ధం చేశారు. ప్రాంగణం చుట్టూ ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేస్తున్నారు.

అన్ని సిద్ధం చేస్తున్నాం..

గత ఏడాది కంటే మెరుగ్గా క్రీడాకారులకు వసతి సౌకర్యం ఏర్పాటు చేశాం. సుమారు 6 వేల మంది మహిళలు, పురుషులకు వేర్వేరుగా మ్యాచ్‌లను వీక్షించేలా గ్యాలరీలు సిద్ధం అవుతున్నాయి. ప్రతీరోజు సాయంత్రం ఆరు నుంచి రాత్రి 12వరకూ మ్యాచ్‌లు జరిగే అవకాశం ఉంది.

- దేశంశెట్టి లక్ష్మీనారాయణ, ఏఎస్ఆర్ టోర్నమెంట్ అధ్యక్షుడు

శివయ్యా.. సౌకర్యలేవయ్యా..

అంబాజీపేట, న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని అంబాజీపేట, అయినవిల్లి, అమలాపురం గ్రామీణ మండలాల్లో ఉన్న ఏకాదశ రుద్రుల ఆలయాల్లో భక్తులకు వివిధ సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. ఈ నెల 15న (ఆదివారం) మహాశివరాత్రి. దీనికి తగ్గట్టుగా ఆయా మండలాల్లోని పరమశివుడి ఆలయాలను భక్తుల కోసం సిద్ధం చేస్తున్నారు. తాగునీరు సౌకర్యం ఏర్పాటు చేయాలి. భక్తులకు క్యూలైన్‌లు సిద్ధం చేయాలి. ప్రధానంగా ఆలయాలకు వేకువజాము నుంచే భక్తులు వస్తారు కాబట్టి ముఖ్యకూడళ్లు, రహదారుల చెంతన విద్యుత్తు దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలి. ఆలయాలకు వచ్చే రహదారులు అధ్వానంగా ఉన్నాయి. అంబాజీపేట మండలంలోని కె.పెదపూడి, వ్యాఘ్రేశ్వరం, గంగలకుర్రుఅగ్రహారం గ్రామాల్లోని మంజునాథుడి ఆలయాలకు వెళ్లే రహదారులు గుంతలుపడి దారుణంగా ఉన్నాయి. వీటికి కనీస మరమ్మతులైనా చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

వ్యాఘ్రేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఇలా..

భారీ వాహనాలు వెళ్లకుండా పహారా..

రాత్రి సమయంలో పహారా కాస్తున్న లస్కర్లు

పి.గన్నవరం: పి.గన్నవరం డొక్కా సీతమ్మ అక్విడక్టు రోడ్డు వంతెనకు మంగళవారం నుంచి మరమ్మతు పనులు మొదలు పెట్టారు. దీనికి చేరువలో ఉన్న కాటన్ అక్విడక్టు రోడ్డు వంతెనపై ఆర్టీసీ బస్సులు, ఇతర భారీ వాహనాలు వెళ్లకుండా ట్రాఫిక్‌ను మళ్లించారు. ముందుజాగ్రత్త చర్యగా ఇక్కడ రేయింబవళ్లు కాపలా ఉండేవిధంగా జలవనరులశాఖ లస్కర్లను నియమించారు. 12 గంటల పాటు డ్యూటీ వేసేవిధంగా రోజుకు రెండు షిఫ్ట్‌లతో వీరిని నియమించారు. కాటన్ అక్విడక్టుకు అవతల, ఇవతల మొత్తం నలుగురిని ఉంచారు. 42 రోజుల పాటు లస్కర్లను నియమించనున్నట్లు జలవనరులశాఖ డీఈఈ భూపతిరాజు రవిప్రసాద్‌రాజు వెల్లడించారు.

నూతన పెన్షన్ విధానంపై స్పష్టత ఇవ్వాలి

మాట్లాడుతున్న పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్

మలికిపురం, న్యూస్‌టుడే: గరిష్ఠ సర్వీసు తర్వాత ఉద్యోగ విరమణ చేయించే అసంబద్ధ నిబంధనలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంకటాల చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. స్థానిక మండల వనరుల కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు దీపాటి సురేశ్‌బాబు అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసే లోగా 12వ పీఆర్సీ ఛైర్మన్‌ను నియమించాలని, పాత పెన్షన్ విధానం అమలు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని, ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్య పరిష్కారానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని, ఎంటీఎస్ ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని, బకాయిల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు అప్పారి రామకృష్ణ, పంగం నీలారావు, రాష్ట్ర కార్యదర్శులు పంగం బ్రహ్మాజీరావు, యెరుబండి సత్యనారాయణ, పల్లంరాజు, యేపుగంటి పద్మనాభం, హేమసుందరరావు, సుబ్రహ్మణ్యం, మట్టా శ్రీను, కోరుకొండ సువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిలో తొలగిన ఆక్రమణలు

కైకాలపేట వద్ద తొలగించిన ఇళ్లు

మామిడికుదురు, న్యూస్‌టుడే: జాతీయ రహదారి 216లో బైపాస్ అనుసంధానమయ్యే చోట పాశర్లపూడి పరిధి కైకాలపేట వద్ద ఉన్న ఆక్రమణలను రెవెన్యూ, ఎన్.హెచ్. అధికారులు తొలగించారు. ఇక్కడ వై.జంక్షన్‌ను విస్తరించి విభాగినులను ఏర్పాటు చేయడం, సిమెంటు డ్రెయిన్ పనులు చేపట్టినా అప్పటికీ తొలగని ఆక్రమణల కారణంగా వాహనచోదకులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ పరిస్థితులపై ఈ నెల 8న 'అసంపూర్తి పనులు.. ప్రమాద ఘంటికలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. నాలుగు పూరిళ్లను తొలగించి వారికి పాశర్లపూడిలంకలో రెండేసి సెంట్ల చొప్పున స్థలాలు ఇచ్చేందుకు సమ్మతించారు. దీంతోపాటు కొంత ఆర్థిక సాయం చేసి ఇళ్లలోని సామగ్రి తరలించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ పి.సునీల్‌కుమార్ తెలిపారు.

ఈనాడు కథనానికి స్పందన

రుమటాలజిస్ట్ చెన్నై నుండి రాక

డా॥ కవిత M.D, DNB, D.M., SCE (Rheumatology)

కీళ్ళ వాతం, గౌట్, SLE, APLA మొ॥ వ్యాధుల చికిత్సా నిపుణులు

డాక్టరు గారు తేది: 14-2-2026 (శనివారం) విచ్చేయుచున్నారు

అపాయింట్‌మెంట్ కొరకు: 98854 22345, 96662 61803, 08816-223728

A+ అభిరామ్ హాస్పిటల్స్ వాటర్ ట్యాంక్ దగ్గర, జె.పి.రోడ్, భీమవరం

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

రీజనల్ బిజినెస్ ఆఫీస్, అమలాపురం

ఆవరణ లీజుకు కావలెను

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రీజనల్ బిజినెస్ ఆఫీస్, అమలాపురం [illegible] https://bank.sbi/web/sbi-in-the-news/procurement-news [illegible] 28-02-2026 [illegible]

తేది: 11-02-2026. రీజనల్ మేనేజర్

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

రీజనల్ బిజినెస్ ఆఫీస్, అమలాపురం

ఆవరణ లీజుకు కావలెను

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రీజనల్ బిజినెస్ ఆఫీస్, అమలాపురం [illegible] https://bank.sbi/web/sbi-in-the-news/procurement-news [illegible] 28-02-2026 [illegible]

తేది: 11-02-2026. రీజనల్ మేనేజర్

శ్రీ బాలబాలాజీ దేవస్థానం, అప్పనపల్లి.

మామిడికుదురు మండలం, డా. బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా.

'ఇ' ప్రొక్యూర్మెంట్ / సీల్డు టెండర్ కమ్-బహిరంగ వేలం ప్రకటన

ఆర్.సి.నెం.బి5/19/2025 తేది: 11-02-2026

[illegible]

క్ర.సం.	వేలంపు వివరము	కాలపరిమితి	ధరావత్తు
1.	[illegible]	23-03-2026 నుండి 22-03-2028	2,00,000/-
2.	[illegible]	అప్పగించిన తేది నుండి రెండు సంవత్సరాలు	50,000/-
3.	[illegible] ('ఇ'ప్రొక్యూర్మెంట్)	1-04-2026 నుండి 31-03-2027	2,00,000/-
4.	[illegible]	1-04-2026 నుండి 31-03-2027	20,000/-
5.	[illegible]	1-04-2026 నుండి 31-03-2027	50,000/-
6.	[illegible] (సీల్డ్ టెండరు)	1-04-2026 నుండి 31-03-2027	50.000/-
7.	[illegible]	1-04-2026 నుండి 31-03-2027	5,000/-
8.	[illegible] (సీల్డ్ టెండరు)	1-04-2026 నుండి 31-03-2027	20,000/-
9.	[illegible]	1-04-2026 నుండి 31-03-2027	25.000/-
10.	[illegible] (సీల్డ్ టెండరు)	1-04-2026 నుండి 31-03-2027	20.000/-
11.	[illegible] (సీల్డ్ టెండరు)	1-04-2026 నుండి 31-03-2027	20,000/-
12.	[illegible]	1-04-2026 నుండి 31-03-2027	20,000/-

[illegible] http://tender.apeprocurement.gov.in [illegible] apendowments marketing [illegible]

11-02-2026 సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి

ప్రసాదం కౌంటర్ వద్ద వీరంగం సృష్టించిన యువకులపై చర్యలు

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం కొండ దిగువన తొలి పావంచాల వద్ద ప్రసాదం విక్రయ కౌంటర్ వద్ద వీరంగం సృష్టించిన యువకులపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. ఈనెల 8న మధ్యాహ్నం కొందరు యువకులు క్యూలైన్లో ఉన్న ఓ వ్యక్తిపై దాడికి దిగి అక్కడి వారిని భయభ్రాంతులకు గురి చేసిన విషయం విదితమే. ప్రసాదం టికెట్లు ఇచ్చే కౌంటర్ వద్ద క్యూలైన్లలో వెళ్లే సమయంలో యువకులు హడావుడి చేసి లైన్లో ఉన్న మరో వ్యక్తితో వాగ్వాదానికి దిగారు. రెచ్చిపోయిన యువకులు లైన్లో నుంచి బారికేడ్లపై నుంచి ప్రమాదకరంగా దూకి వెళ్లి దాడి చేశారు. దీంతో భక్తులు ఆందోళనకు గురయ్యారు. అక్కడివారు వీడియో తీయగా సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేసింది. ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. జిల్లా ఎస్పీ ఆదేశాలతో సీసీ కెమెరాల ద్వారా పోలీసులు పరిశీలించారు. వీరిది పెదపూడి మండలం గండ్రేడు గ్రామంగా గుర్తించారు. వీరంతా తలుపులమ్మ లోవ ఆలయానికి వెళ్లి వస్తూ వీరంగం సృష్టించారని తెలుసుకున్నారు. దాడికి పాల్పడిన 10 మంది యువకులను అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. వీరిని బైండోవర్ చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నామని ఎస్సై శ్రీహరిబాబు తెలిపారు.

రేపటి నుంచి గోలింగేశ్వరస్వామి కల్యాణ వేడుకలు

నిడదవోలు: నిడదవోలులోని రాజరాజేశ్వరి సహిత గోలింగేశ్వస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. పట్టణ నడిబొడ్డున ఉన్న చారిత్రాత్మకమైన గోలింగేశరస్వామిని ఈ ప్రాంత ప్రజలు తమ ఇలవేల్పుగా భావిస్తారు. ఈనెల 13 నుంచి 17వ తేదీ వరకు ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ నామా సూర్యప్రకాశరావు తెలిపారు. 13న స్వామికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమపూజలు, రాత్రి స్వామివారి కల్యాణం జరుగుతుందన్నారు. 14న స్వామివారికి రుద్రాభిషేకాలు, 15న మహాశివరాత్రి సందర్భంగా తెల్లారుజామున మూడు గంటల నుంచి స్వామివారి మహాదర్శనం, రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహిస్తారు. మహాశివరాత్రి రోజున రుద్రాభిషేకాలు నిర్వహించుకునే భక్తులకు తెల్లారుజామున 3 నుంచి 5 గంటల వరకు, ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమయం కేటాయించారు. 16న స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమపూజలు, 17న స్వామివారికి శ్రీపుష్పయాగోత్సవం నిర్వహించనున్నారు.

14న చదరంగం పోటీలు

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్-7, 9, 11, 13, 15 బాల, బాలికల చదరంగం పోటీలు ఈనెల 14న రాజమహేంద్రవరంలోని కాల్ ఫ్యూషన్ చెస్ అకాడమీలో నిర్వహిస్తున్నట్లు అకాడమీ డైరక్టర్ కుమార్ విత్తనాల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు 95051 42888ను సంప్రదించవచ్చును.

ఘనంగా లూర్దుమాత యాత్ర

ప్రత్తిపాడులో మరియగిరి మహోత్సవం

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ప్రత్తిపాడులో లూర్దుమాత యాత్రా మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. మరియగిరికి జిల్లా నలుమూలల నుంచి జనం పోటెత్తారు. మరియగిరిపై ఒమ్మి మోహన్ ప్రసాద్, ప్రభాకర్, రాజశేఖర్‌లు తొలి దివ్యపూజాబలి నిర్వహించారు. అనంతరం లూర్దుమాత, వ్యాకుల మాత, నిత్యసహాయ మాత విగ్రహాలను పూలతో అలంకరించిన తేరుపై ఊరేగింపుగా మరియగిరిపై ఉన్న మందిరానికి తీసుకెళ్లారు. క్రీస్తును, మేరీని కీర్తిస్తూ ప్రార్థనలు చేస్తూ కొండపై ఉన్న మేరీమాత మందిరానికి యాత్ర చేరుకుంది. మరియగిరిపై ఉన్న ప్రార్థనా మందిరంలో ఫాదర్ కె.చిన్నప్ప దివ్యసత్ప్రసాద ఆరాధన చేయగా, విశాఖ అతిమేత్రాసన వికార్ జనరల్ దుక్కింపూడి బాలశౌరి, మేత్రాసన కోశాధికారి కె.జయరాజుల 50 మంది క్రైస్తవ గురువులతో కలిసి దివ్య పూజాబలి నిర్వహించారు. మేరీమాత వాత్సల్యం, క్రీస్తు త్యాగాలు స్ఫూర్తిగా తీసుకోవాలని ఉపదేశించారు. పునీత జోజప్ప మఠకన్యలు, చర్చికమిటీ సభ్యులు, ఆర్‌సీఎం యూత్ తదితరులు ఈ ఉత్సవంలో సేవలందించారు. ఖాదీ గ్రామీణ పరిశ్రమల బోర్డు వైస్‌ఛైర్మన్ కొమ్ముల కన్నబాబు తదితరులు ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఎస్సై లక్ష్మీకాంతం నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మరియగిరిపై దివ్య పూజాబలి నిర్వహిస్తున్న క్రైస్తవ గురువులు

వృద్ధురాలి మెడలో పుస్తెలతాడు చోరీ

- ఆమె ప్రతిఘటించడంతో ఈడ్చుకెళ్లిన దొంగ

చోరీ జరిగిన ప్రదేశంలో బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్సై సురేశ్‌బాబు

రాయవరం, న్యూస్‌టుడే: ఒంటరిగా వెళ్లే మహిళల మెడలో గొలుసులు, పుస్తెలతాళ్లను చోరీ చేయడమే లక్ష్యంగా కొందరు రెచ్చిపోతున్నారు. రాత్రి సమయాల్లో దొంగలు బరితెగిస్తున్నారు. మంగళవారం రాత్రి రాయవరంలో జరిగిన ఘటనే దీనికి ఉదాహరణ. ఎస్సై డి.సురేశ్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. రెడ్ల రామాలయం వద్ద కిరాణ సరకులు కొనుగోలుచేసిన వృద్ధ దంపతులు పులగం భామిరెడ్డి, లక్ష్మి ఇంటికి వెళుతుండగా చీకట్లో చరవాణి చూస్తూ ఓ యువకుడు ఆకస్మికంగా ఆమె మెడలోని 11 కాసుల బంగారు పుస్తెలతాడును లాక్కొనే ప్రయత్నం చేశాడు. బిత్తరపోయిన ఆమె తాడును చేతితో పట్టుకుని కేకలు వేస్తూ తీవ్రంగా ప్రతిఘటించింది. దీంతో ఆమెను ఈడ్చుకుంటూ చేతికి అందినంత తాడును పట్టుకుని ఆ యువకుడు పరారయ్యాడు. భార్య లక్ష్మి కేకలు విని ముందు నడుస్తున్న భామిరెడ్డి దొంగ వెళ్లిన వైపు కొంతదూరం వెళ్లినా చీకట్లో పట్టుకోలేకపోయారు. బాధితురాలి మెడ, మోచేయిపై స్వల్ప గాయాలయ్యాయి. సుమారు 25 గ్రాములపైనే బంగారుతాడు చోరీకి గురైందని ఆమె ఫిర్యాదుచేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

సీసీ కెమెరాలు లేని ప్రాంతంలో..

చోరీ ఘటనకు ముందు రావిచెట్టు సమీపంలో ఆ యువకుడు సిమెంట్ బల్లపై కూర్చొని ఉన్నాడని బాధితులు చెబుతున్నారు. ఆ వీధిలో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ కెమెరా పరిధిలోకి రాని ప్రాంతంలో ఆమెపై దాడికి పాల్పడి.. పుస్తెలతాడును తెంచేందుకు ప్రయత్నించాడని పోలీసులు గుర్తించారు. ముందుగా ఆ ప్రాంతంలో కలియ తిరుగుతూ చోరీకి పాల్పడ్డాడని స్థానికులు చెబుతున్నారు. ఘటన జరిగిన ప్రాంతంతో పాటు పరిసరాలు, గ్రామంలోని ప్రధాన కూడళ్ల సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నామని ఎస్సై చెప్పారు.

కొబ్బరి చెట్టును ఢీకొని యువకుడి దుర్మరణం



మెట్టి దుర్గాప్రసాద్ (పాత చిత్రం)

రాజోలు, న్యూస్‌టుడే: రాజోలు మండలం కడలిలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామంలోని వాసంశెట్టివారిపాలేనికి చెందిన మెట్టి దుర్గాప్రసాద్(33) దుర్మరణం పాలయ్యాడు. ఇటీవల గల్ఫ్ నుంచి వచ్చిన బావను గెద్దాడలో కలుసుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వస్తుండగా కొబ్బరి చెట్టును బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింటాడని బావిస్తున్నారు. ఈ ఘటన జరిగిన విషయం బుధవారం ఉదయం వరకూ ఎవరికీ తెలియరాలేదు. రాజోలు ఎస్సై బి.రాజేష్‌కుమార్ చేరుకుని మృతదేహాన్ని రాజోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. దుర్గాప్రసాద్ తండ్రి గతంలోనే మరణించాడు. ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొడుకు మృతితో తల్లి రోదనలు మిన్నంటాయి. తనకు దిక్కెవరంటూ విలపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)		ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):		18,500
పాతకాయ:	గండేరా	30,500
	గటగట	29,000
కొత్తకాయ:	గండేరా	30,000
	గటగట	29,000
నీటి కాయ (వెయ్యింటికి):	పాత (ముక్కుడు) కాయ	20,000-21,000
	కొత్త (పచ్చి) కాయ	16,000-17,000
కొబ్బరినూనె మార్కెట్:	15 కిలోలు	5,000
	కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	120-00
రిటైల్ లైవ్	147-00
డ్రెస్డ్	213-00
స్కిన్‌లెస్	243-00

92.7 FM Rajamahendravaram ఈ FM 92.7 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్‌క్యాష్). ✆ 81422 92071.

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై ఆంధ్రప్రదేశ్ అంతటా మార్టిగేజ్ లోన్స్ మరియు స్థిరాస్తి ఎక్కడ ఉన్నా ఏసంస్థలో ఉన్నా Xerox పేపర్స్‌పై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. 50లక్షలులోపు, అయోధ్య కోఆపరేటివ్ బ్యాంక్. ✆ 93969 99669.

MARRIAGE SERVICES

మంచి ప్రొపర్టీస్. టీసీ పద్మశాలి కన్వర్ట్ క్రిస్టియన్ బిజినెస్ అబ్బాయి 45 ఇయర్స్ సెకండ్‌కి OC or BCలో కన్వెర్ట్‌గాని హిందూలో గాని లేట్ or సెకండ్‌లో అమ్మాయి మ్యారేజ్ కావాలి (ఎవరులేని అమ్మాయి అయినా పరవాలేదు). డైరక్ట్: ✆ 9493835167.

PERSONAL CLASSIFIEDS

GREETINGS

మునగ వారి వారసుడు వస్తున్నాడు

చి॥ మునగ వెంకట శ్రీ కార్తికేయ గుప్త రాజమండ్రి

తాతయ్య: గంగాధర రామారావు నానమ్మ: సౌభాగ్యం పెదనాన్న: శివప్రశాంత్ పెద్దమ్మ: నిహిత లక్ష్మి అక్క: జాహ్నవి గుప్త తండ్రి: సాయికృష్ణ తల్లి: భవిష్య తాతమ్మ: లక్ష్మి

REAL ESTATE

PLOT FOR SALE

KAKINADA CITY

308 Sq.yards West facing Commercial site for Sale/Lease at Karanamgari Junction, Kakinada. Cont: 94458 00581, 73933 40994.

JOBS

రాజమండ్రి ప్రముఖ ఎలక్ట్రానిక్స్ షోరూం నందు పనిచేయుటకు బాయ్స్ (హెల్పర్లు) కావలెను. ESI + PF సదుపాయం కలదు. Cell: 94947 11544, 97017 30347.

రాజమండ్రిలో మహాలక్ష్మి మార్కెట్ నందు పనిచేయుటకు అనుభవంగల ఎలక్ట్రీషియన్ కావలెను. మంచి జీతం, రెజ్యూమ్ వాట్సాప్: 99005 39944, 99124 01164

BR INFRACON నందు పనిచేయుటకు సైట్ ఇంజనీర్లు కావలెను. Q: డిప్లొమా, B.Tech/M.Tech అర్హత కలిగి బిల్డింగ్స్, ఇరిగేషన్ వర్క్స్ నందు 3to4 సంవత్సరములు అనుభవం కలిగి విజయవాడ, రాజమండ్రి, ఏలూరు జిల్లాల నందు పనిచేయుటకు కావలెను. పూర్తి బయోడేటాను info@brinfracon.comకి పంపగలరు ✆ 79955 57831.

కాకినాడ టూవీలర్ ఎలక్ట్రికల్ (ఏథర్)షోరూంలో చేయుటకు Service Advisors, Technicians, Sales Executives కావలెను. 8008884256

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 4-85 పై॥

అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

భూముల రీసర్వేపై సందేహాలా?

ఫోన్ చేయాల్సిన తేదీ : ఫిబ్రవరి 13 (శుక్రవారం)
సమయం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు

'ఈనాడు' ఆధ్వర్యంలో 'ఫోన్ ఇన్'

'ఈనాడు' ఆధ్వర్యంలో మామిడికుదురు తహసీల్దార్ పి.సునీల్‌కుమార్‌తో 'ఫోన్ ఇన్' కార్యక్రమం జరగనుంది. భూముల రీసర్వేలో సందేహాలు, కొత్తగా ఇళ్ల స్థలాలకు దరఖాస్తులు, రేషన్ సరకుల పంపిణీ పరంగా ఇబ్బందులు, రెవెన్యూ శాఖకు సంబంధించి ఇతరత్రా అంశాలకు సంబంధించిన సమస్యలు తదితరాలను వివరించాలి. – న్యూస్‌టుడే, మామిడికుదురు

రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

గ్రామ గ్రామాన 'మై టీడీపీ'కి శ్రీకారం

కొత్తపేట, న్యూస్‌టుడే: 'మై టీడీపీ' యాప్ ద్వారా పార్టీ, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సుపరిపాలన, సంక్షేమ పథకాలను నిత్యం ప్రజలకు చేరవేయడమే లక్ష్యంగా చర్యలు చేపట్టినట్లు తెదేపా కొత్తపేట మండల శాఖ అధ్యక్షుడు గనిశెట్టి వీరేష్ తెలిపారు. బుధవారం ఇందుకు సంబంధించిన ప్రచార గోడపత్రికను ఆవిష్కరించారు. ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలపై స్పష్టమైన సమాచారం అందించేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాసరావు, బూసి భాస్కరరావు, ముత్యాల బాబ్జి, మిద్దె ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174
ఉ. 10 - మ. 1 పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట: 90323 93884

పూడిక తొలగింపు (స్పందనకు వందనం)

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: మెర్లపాలెం పంచాయతీ డ్రెయిన్‌లో పూడికలు పెరిగిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. విషయాన్ని సర్పంచి మెర్ల శ్రీరామచంద్రమూర్తి వద్ద ప్రస్తావించగా పూడిక తీయించారు.

గోపాలపురంలో దోమల నివారణకు చర్యలు

రావులపాలెం గ్రామీణం, న్యూస్‌టుడే: గోపాలపురంలో దోమలు విపరీతంగా పెరిగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ కార్యదర్శి సాయిపట్టాభిరామయ్య దృష్టికి తీసుకుని వెళ్లగా దోమల నివారణ మందు చల్లించారు.

ఉచ్చిలిలో వీధి దీపాల ఏర్పాటు

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: ఉచ్చిలి గ్రామంలో పలుచోట్ల వీధి దీపాలు వెలగక ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి వద్ద ప్రస్తావించగా లైట్లకు మరమ్మతులు చేయించారు.

స్నాన ఘట్టాలు.. రక్షణ అవశ్యం

పరిశీలన

మహా శివరాత్రి సమీపిస్తోంది. ఈ సందర్భంగా భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించే రేవులు మాత్రం అస్తవ్యస్తంగా ఉన్నాయి. అవసరమైన రక్షణ, పరిశుభ్రత చర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఉంది. బుధవారం రాజోలు, కొత్తపేట, పి.గన్నవరం నియోజకవర్గాల పరిధిలోని ఘాట్లను పరిశీలించగా పలు లోపాలు వెలుగుచూశాయి.
– న్యూస్‌టుడే, మామిడికుదురు, మలికిపురం, ఆత్రేయపురం, రాజోలు, అయినవిల్లి

ఒడ్డున అపరిశుభ్రత

మామిడికుదురు మండలం పాశర్లపూడిబాడవలో వైనతేయ నది ఒడ్డున ఉన్న ఘాట్ అపరిశుభ్రంగా ఉంది. మెట్లు మట్టిలో కూరుకుపోవడం, ఊబి ఉండటంతో ఇబ్బందికరంగా ఉంది. మహిళలకు దుస్తులు మార్చుకునే వసతితో పాటు విద్యుద్దీపాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. అప్పనపల్లి బాలబాలాజీస్వామి ఆలయ సమీపంలోని ఘాట్ వద్ద రక్షణ కవచాన్ని పటిష్ఠం చేయడం, మెట్లపై విరిగిన టైల్స్ గుంతలను చక్కదిద్దే పనులు చేపట్టాల్సి ఉంది. ఆదుర్రులో స్నానాలు చేసే ప్రదేశంలోనూ అవసరమైన రక్షణ ఏర్పాట్లు చేయాల్సి ఉంది. చర్యలు చేపడతామని ఉప ఎంపీడీవో అడబాల శ్రీనివాస్ తెలిపారు.

కేశనపల్లి రక్తతుల్య నది వద్ద చెత్తాచెదారం

రేవుల్లో మద్యం సీసాలు

మలికిపురం మండలంలోని దిండి వద్ద వశిష్ఠ గోదావరి పుష్కర రేవు వద్ద మద్యం సీసాలు పగులకొట్టి వేస్తున్నారు. రామరాజులంక రేవు కూడా ఇదే మాదిరిగా ఉంది. కేశనపల్లి వంతెన వద్ద రక్తతుల్య నది(శంకరగుప్తం మేజరు డ్రెయిను)లో రేవు చెత్తాచెదారంతో అస్తవ్యస్తంగా ఉంది. మునివంపు వద్ద స్నానాల రేవులో సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఎంపీడీవో సీహెచ్ లక్ష్మీకల్యాణిని వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

సోంపల్లిలో మెట్ల వరకు ఊబిచేరి..

రాజోలు మండలం సోంపల్లి ఘాట్ వ్యర్థాలు, పిచ్చిమొక్కలతో నిండిపోయింది. మెట్ల వరకు ఊబి చేరడంతో ప్రమాదం పొంచి ఉంది. రాత్రి సమయంలో యువకులు మద్యం సేవించి సీసాలను అక్కడే వదిలేస్తుండటంతో గాజు పెంకులతో ప్రమాదకరంగా ఉంది.

తొగరపాయ వద్ద నీరు లేక..

తొగరపాయ వద్ద అయినవిల్లి, తొత్తరమూడి గ్రామాల వైపు రెండు స్నానఘట్టాలు ఉన్నాయి. తొగరపాయ ఎగువన మెరక కారణంగా నీటి ప్రవాహం ఉండదు. ఇంజన్లతో నీరు తోడించినప్పటికి ప్రవాహం తక్కువగా ఉండటంతో భక్తులు స్నానాలు ఆచరించేదుకు ఇక్కట్లు పడాల్సి వస్తోంది. అయినవిల్లి వైపు స్నానఘట్టం వద్ద బురదగా ఉంది. జల్లు స్నానఘట్టాలు ఏర్పాటు చేపడతామని తొత్తరమూడి ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి అన్వర్ తెలిపారు.

వెళ్లేందుకు మార్గం కూడా లేదు

ఆత్రేయపురం అత్రి మహాముని పుష్కరాల రేవులో చెత్తాచెదారం పేరుకుపోవడంతో పాటు గోదావరి నది ఒడ్డుకు వెళ్లేందుకు మార్గం లేకుండా తుప్పలతో మూసుకుపోయింది. ఈ విషయాన్ని ఎంపీడీవో బీకేఎస్ఎస్ వెంకటరామన్ వద్ద ప్రస్తావించగా సంబంధిత అధికారులతో చర్చించి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పుష్కర ఘాట్ చెంత పరిశుభ్రంగా..

– న్యూస్‌టుడే, పి.గన్నవరం

రానున్న గోదావరి పుష్కరాల నేపథ్యంలో ఇప్పటినుంచే నదీ పరిసరాలు, ఘాట్ల వద్ద అపరిశుభ్ర వాతావరణం లేకుండా పి.గన్నవరం గ్రామానికి చెందిన పేరిచర్ల సత్యవాణి కృషి చేస్తున్నారు. పి.గన్నవరంలోని పుష్కర ఘాట్, వైనతేయ తీరం అపరిశుభ్రంగా ఉండేది. కార్తిక మాసం, మాఘ మాసం, శివరాత్రి పర్వదినాల్లో భక్తులు ఇక్కడ ఎక్కువగా పుణ్యస్నానాలు చేస్తుంటారు. ఘాట్ వద్ద అపరిశుభ్ర వాతావరణంతో వారంతా ఇబ్బంది పడేవారు. ఇక్కడ చిన్నపాటి పాయలో రాళ్లు ఉండటంతో అనేక ఇక్కట్లు పడుతున్నారు. ఈ పాయలో ఆమె ఇసుక బస్తాలతో చక్కటి మార్గం ఏర్పాటు చేశారు. దీంతో చాలావరకు ఇబ్బందులు తీరాయి.

పి.గన్నవరంలో నది వద్ద ఇలా..

వసతి సౌకర్యాల కల్పన

గోదావరిలో పుణ్యస్నానాలు చేసిన మహిళలు దుస్తులు మార్చుకునేందుకు వీలుగా పుష్కర ఘాట్ వద్ద టెంట్ ఏర్పాటు చేసి వసతి కల్పిస్తున్నారు. సత్యవాణి సేవా కార్యక్రమాలకు భర్త భీమరాజు ప్రోత్సహిస్తున్నారు. స్థానిక మహిళలు సైతం ముందుకొచ్చి సహకరిస్తున్నారు.

స్థానికుల సహకారంతో..

పుష్కర ఘాట్ పరిసరాలు పచ్చదనంతో కనువిందు చేసేలా మొక్కలు నాటి చిన్నపాటి పార్కులా తీర్చిదిద్దాలని ఉంది. స్థానికుల సహకారంతో ఇక్కడ తరచూ పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తాం.
– పేరిచర్ల సత్యవాణి, గృహిణి, పి.గన్నవరం

ఉచిత వైద్యశిబిరం నేడు

రావులపాలెం పట్టణం: రావులపాలెం శ్రీసత్యసాయి సేవా కేంద్రంలో గురువారం ఉచిత చర్మ వ్యాధుల వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. డా అమృతబిందు(ఎండీ) హాజరవుతారని, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సేవలు అందిస్తారన్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన

ఆలమూరు, న్యూస్‌టుడే: ఇటుకబట్టీ, ఇతర పరిశ్రమల యజమానులు లేబర్ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని మండపేట అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కాశీ శివనాగమల్లేశ్వరరావు అన్నారు. ఆలమూరు శ్రీవిష్ణుదేవరాయ కాపు కల్యాణ మండపంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ-శ్రమ్, పీఎంఎస్ వైఎం పెన్షన్ సమోద గురించి అవగాహన కల్పించారు. లైసెన్స్ పొంది ఏటా నవీకరణ చేసుకోవాలని సూచించారు. కార్మికులకు గుర్తింపు కార్డులను అందజేసి ఆ వివరాలు కార్యాలయంలో తెలియజేయాలన్నారు. వారాంతపు సెలవులను కచ్చితంగా ఇవ్వాలన్నారు. తహసీల్దార్ కేజే ప్రకాష్‌బాబు పాల్గొన్నారు.

విద్యార్థులు, నటులపై సన్నివేశం

'ఆత్రేయపురం బ్రదర్స్' సందడి

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: ఆత్రేయపురం కోటేరు పుంత రోడ్డులో ఉన్న మహర్షి విద్యానికేతన్‌లో రాజీవ్ జగన్నాథ దర్శకత్వంలో బుధవారం నటుడు రాజీవ్ కనకాల, శ్రీనివాస్ గవిరెడ్డి, సన్నీ పాత్ర, గిట్ సైనీ, నిహ పవన్ తదితరులు నటిస్తున్న 'ఆత్రేయపురం బ్రదర్స్' సినిమా చిత్రీకరణ జరిగింది. పలు కీలక సన్నివేశాలు తెరకెక్కించారు. దీంతో ఆయా ప్రాంతాల్లో సందడి నెలకొంది. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ వారం రోజుల పాటు ఈ ప్రాంతంలోనే చిత్రీకరిస్తామన్నారు.

కాలువ గట్ల ఆక్రమణలపై సర్వే

ఆలమూరు: చింతలూరులో జొన్నాడ-వెదురుమూడి కాలువ గట్ల ఆక్రమణలు తొలగించి రైతులకు న్యాయం చేస్తామని చింతలూరు నీటిసంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాస్‌చౌదరి తెలిపారు. సర్వేయర్ అనూష, సిబ్బందితో కలిసి బుధవారం సర్వే నిర్వహించారు. ఆక్రమణలను గుర్తించామని, వివరాలను అధికారులకు తెలియజేస్తామని చౌదరి తెలిపారు. నీటిపారుదల ఆస్తుల ఆక్రమించుకున్నవారికి నోటీసులు పంపిస్తామన్నారు.

జనసేన కార్యకర్తపై దాడి ఘటనలో విచారణ

మలికిపురం, న్యూస్‌టుడే: విశ్వేశ్వరాయపురంలో జనసేన కార్యకర్తపై అదే పార్టీకి చెందిన నాయకులు చేసిన దాడి ఘటనపై అధిష్ఠానం నియమించిన ద్విసభ్య కమిటీ బుధవారం విచారణ చేపట్టింది. కమిటీ సభ్యులు బండారు శ్రీనివాసరావు, కొటికలపూడి గోవిందరావు వివరాలు సేకరించారు. మలికిపురంలోని ఎల్ఎస్ ల్యాండ్ మార్కులో ముత్యాల కన్నా, దాడి జరిగిన సమయంలో అక్కడున్న వారు విచారణకు హాజరయ్యారు. తమపైన, అంతకుముందు నియోజకవర్గంలో జరిగిన దాడుల గురించి వివరించారు. దాడికి పాల్పడిన వారితో కూడా మాట్లాడినట్లు తెలిసింది.

కైలాస భూమిలో శివుడి విగ్రహావిష్కరణ

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: అంతర్వేదిపాలెం మినీ హార్బర్ చెంతనున్న కైలాస భూమిలో యువ పల్లపసేన అగ్నికులక్షత్రియ కువైట్ సంఘం వారు రూ.8 లక్షలతో ఏర్పాటు చేసిన శివుడి విగ్రహాన్ని బుధవారం గ్రామపెద్దలు ఆవిష్కరించారు. ఇక్కడే నిర్మించిన విశ్రాంతి షెడ్‌ను ప్రారంభించారు. కైలాస భూమిలో సౌకర్యాలు ఏర్పాటు చేసిన సంఘ సభ్యులను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో పల్లిపాలెం, అంతర్వేదిదేవస్థానం, గొంది సర్పంచులు శ్రీను, జాన్ బాబు, రవికుమార్, ఎంపీటీసీ నాగరాజు పాల్గొన్నారు.

ఆత్రేయపురానికి ముగిసిన సాగునీటి వంతు

ఆత్రేయపురం: ఆత్రేయపురం మండలంలోని ద్వారాపూడి పొలాలకు 24 గంటల పాటు ఇచ్చిన సాగునీటి వంతు ముగిసింది. ప్రస్తుతం పలివెల, గోపాలపురం, వాడపాలెం లాకుల పరిధి వంతు కట్టుకు బుధవారం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమైంది. ఈ వంతు 48 గంటల పాటు కొనసాగనుందని సంబంధిత జలవనరులశాఖ అధికారులు వెల్లడించారు. రైతులు సాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు.

తెదేపా పటిష్ఠతకు ప్రత్యేక కార్యాచరణ

రాజోలు, న్యూస్‌టుడే: గ్రామ స్థాయిలో తెదేపా పటిష్ఠతకు ప్రత్యేక క్యాలెండర్‌ను రూపొందించినట్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొల్లపల్లి అమూల్య పేర్కొన్నారు. తాటిపాకలో బుధవారం కొత్తగా నియమితులైన మండల పార్టీ అధ్యక్షుల సన్మాన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు ప్రజలతో ఎక్కువగా మమేకమయ్యేలా పనిచేయాలన్నారు. మలికిపురం, సఖినేటిపల్లి, మామిడికుదురు మండలాల నూతన అధ్యక్షులు అడబాల సాయిబాబు, తాడి సత్యనారాయణ, జోణం బాబును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ భూపతిరాజు ఈశ్వరరాజువర్మ, రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ ముదునూరి చినబాబు, అనుచూరి పురుషోత్తం, సర్పంచులు కోటిపల్లి రత్నమాల, చెల్లుబోయిన హెలీన, నగరం సొసైటీ అధ్యక్షుడు ఈలి శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ అధ్యక్షుడు కాకి లక్ష్మణ్, జగడం సత్యనారాయణ, కాండ్రేగుల సత్యనారాయణ, మొల్లేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మండల శాఖ అధ్యక్షులతో ఇన్‌ఛార్జి అమూల్య

శిథిల రహదారిపై అవస్థలు

కూనవరం-గూడపల్లి ర.భ. శాఖ రహదారి ఎక్కడికక్కడ గుంతలు పడి, రాళ్లు తేలింది. ఇటువైపు రాకపోకలకు గూడపల్లి, గుబ్బలపాలెం, జి.పల్లిపాలెం, కేశనపల్లి గ్రామాల ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఈ దుస్థితిపై ఏఈ కె.రవీంద్రను వివరణ కోరగా 3 కి.మీ.ల రహదారి అభివృద్ధికి రూ.1.40 కోట్లతో ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. – న్యూస్‌టుడే, మలికిపురం

చెరువుకు మోక్షం కల్పించరూ!

ఆదుర్రు పరిధిలోని మంచినీటి చెరువు గుర్రపుడెక్కతో నిండి అధ్వానంగా మారింది. అందులోకి మురుగునీరు వెళ్లడంతో దుర్వాసన వ్యాపిస్తోంది. చుట్టూ గట్టు బలహీనంగా మారి చెట్లు విరిగిపడిపోతున్నాయి. ఉపాధిహామీ పథకం పనుల్లో భాగంగా వేసవిలో పూడికతీత చేపట్టి పూర్తిగా శుభ్రం చేసేందుకు కార్యాచరణ చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఏపీవో రమేష్ దృష్టికి తీసుకువెళ్లగా పరిశీలించి శుభ్రం చేసే దిశగా చర్యలు చేపడతామన్నారు.
– న్యూస్‌టుడే, మామిడికుదురు

రూ.లక్షల వ్యయం.. నిరుపయోగం

పుల్లేటికుర్రు సంత మార్కెట్‌లో రూ.లక్షల వ్యయంతో నిర్మించిన ప్రభుత్వ వెనకబడిన తరగతుల బాలుర వసతిగృహ భవనం నిరుపయోగంగా మారింది. గతంలో ఇక్కడి వసతిగృహాన్ని ఎత్తివేసి గంగలకుర్రులోని సమీకృత సంక్షేమ వసతిగృహంలో విలీనం చేశారు. అప్పటి నుంచి భవనం ఖాళీగా వదిలేయడంతో పాడైపోతోందని స్థానికులు అంటున్నారు. దీనిపై సర్పంచి జల్లి బాలరాజును వివరణ కోరగా ప్రస్తుతం ఇందులో పారిశుద్ధ్య కార్మికుల కుటుంబాలు ఉంటున్నాయని, భవిష్యత్తులో కలెక్టర్ అనుమతితో వారికే అప్పగిస్తామన్నారు.
– న్యూస్‌టుడే, అంబాజీపేట

దుమ్ము, ధూళితో అగచాట్లు

పి.గన్నవరం వద్ద డొక్కా సీతమ్మ అక్విడక్టు రోడ్డు వంతెన మరమ్మతుల కారణంగా దీనిపై ట్రాఫిక్‌ను పూర్తిగా నిలుపుదల చేసి చెంతనే ఉన్న కాటన్ అక్విడక్టు రోడ్డు వంతెనపై నుంచి మళ్లించారు. మంగళవారం నుంచి 42 రోజుల పాటు రాకపోకలు సాగించాల్సిన పరిస్థితులు అనివార్యమయ్యాయి. దీనికి 2000 సంవత్సరం నుంచి ఎలాంటి నిర్వహణ లేకపోవడంతో దుమ్ము, ధూళి పేరుకుపోయింది. బుధవారం కాలినడకన వెళ్లే ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. అధికారులు, పాలకులు చొరవ తీసుకుని దీనిని శుభ్రం చేయించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. – న్యూస్‌టుడే, పి.గన్నవరం

స్లాబు దశలో నిలిచిన భవనం

చింతలమోరి పల్లిపాలెంలో ఆర్‌డబ్ల్యూఎస్ ట్యాంకు సమీపంలో నిర్మిస్తున్న సామాజిక భవనం అసంపూర్తిగా నిలిచిపోయింది. 2023లో రూ.25 లక్షల అంచనా వ్యయంతో దీనికి శంకుస్థాపన జరిగింది. అప్పట్లో నిర్మాణం ప్రారంభం కాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక పనులు ప్రారంభించి స్లాబు వరకు వచ్చాక నిలిచిపోయింది. దీనిపై పంచాయతీరాజ్ ఏఈ ఎంవీఎన్ రవికుమార్‌ను వివరణ కోరగా నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభించి పూర్తి చేస్తామన్నారు. – న్యూస్‌టుడే, మలికిపురం

యూటీఎఫ్ పోస్టుకార్డు ఉద్యమం

పోస్టుకార్డులు ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

పి.గన్నవరం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ పి.గన్నవరం మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. 12వ పీఆర్సీ కమిషన్ తక్షణం ఏర్పాటు చేయాలని, ఆర్థిక బకాయిలకు రూట్‌మ్యాపు ప్రకటించాలని, 2004 కంటే ముందు నియమితులైన వారికి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని పోస్టు కార్డులను ముఖ్యమంత్రికి పంపామని రాష్ట్ర కౌన్సిలర్ కె.సురేష్‌కుమార్ తెలిపారు.

కుమ్మరిపాలెంలో గురువులకు పాదపూజ

మాతాజీ చిత్రపటం వద్ద పూజలు

అంబాజీపేట, న్యూస్‌టుడే: గురుసేవా విశిష్ఠ విమలాంబ వీరవరపు సుబ్బాయమ్మ గురుమాతాజీ మూడో వార్షికారాధన సందర్భంగా మాచవరం శివారు కుమ్మరిపాలెంలో ఆదుర్తి నారాయణమూర్తి, సుజాత దంపతుల ఆధ్వర్యంలో 35 మంది గురువులకు బుధవారం పాదపూజ చేశారు. విశాఖ జిల్లా పైడికొండలో ఉన్న శివరామ దీక్షితుల పీఠంలో చిన్నతనం నుంచి ఆధ్యాత్మిక చింతనలో ఉంటూ రాష్ట్రం నలుమూలల పర్యటించిన సుబ్బాయమ్మ గురుమాతాజీ ఎంతోమంది శిష్యులను సంపాదించుకున్నారు. ఈ సందర్భంగా ఎ.భూమానంద, బల్ల మల్లేశ్వర, బొంతు సత్యనారాయణ, కాకి గోపాలకృష్ణ, కొప్పిశెట్టి మంగతాయారు, కొలిశెట్టి శ్రీదేవి తదితరులను ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. తొలుత మాతాజీ చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దీన్‌దయాళ్ సేవలు ఆదర్శనీయం

మామిడికుదురు, కొత్తపేట, రావులపాలెం పట్టణం, ఆలమూరు, అంతర్వేది, న్యూస్‌టుడే: జన్‌సంఘ్ వ్యవస్థాపకుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ సేవలు అందరికీ ఆదర్శంగా నిలిచాయని భాజపా మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నేషా హుస్సేన్ అన్నారు. మండల శాఖ అధ్యక్షుడు భైరిశెట్టి దుర్గారామకృష్ణ అధ్యక్షతన మామిడికుదురులో బుధవారం జరిగిన దీన్‌దయాళ్ వర్ధంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కంకిపాటి సుబ్బారావు, మెండా ఆదినారాయణ, గాడి సత్తిబాబు, నక్కా త్రిలోచనరావు, కోటిపల్లి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు. ● కొత్తపేటలో భాజపా రాష్ట్ర యువమోర్చా నాయకులు పాలూరి జయప్రకాష్‌నారాయణ దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పాలూరి సత్యానందం, వి.కిరణ్, ఆర్.సందీప్ తదితరులు పాల్గొన్నారు. ● రావులపాలెం సెంటర్‌లో ఆత్మ కమిటీ డైరెక్టర్ మద్దెంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. పాలూరి సత్యానందం, పొనుగుపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ● జొన్నాడలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యదర్శి, కొత్తపేట భాజపా నియోజకవర్గ పరిశీలకుడు అయినవిల్లి సత్తిబాబుగౌడ్ పాల్గొన్నారు. ● అంతర్వేదిలో దీన్‌దయాళ్ చిత్రపటానికి భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు మాలే శ్రీనివాసనగేష్, మండల పార్టీ అధ్యక్షుడు పోతురాజు సురేష్, చంపాటి శివరామకృష్ణంరాజు, సూరిబాబు తదితరులు నివాళి అర్పించారు.

రావులపాలెంలో..

మామిడికుదురులో నివాళి అర్పిస్తున్న నాయకులు

ఉద్యోగ మేళాకు స్పందన

అయినవిల్లి, న్యూస్‌టుడే: నేదునూరులో రావి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉద్యోగ మేళాకు 302 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 162 మంది వివిధ సంస్థల్లో ఉద్యోగావకాశాలు పొందారు. వీరికి నియామక పత్రాలు అందజేశారు. వికాస జిల్లా మేనేజర్ రమేష్ మాట్లాడుతూ నిరుద్యోగ యువత జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రావి ఫౌండేషన్ సెక్రటరీ వెంకటకృష్ణ, ఉద్యోగ నియామక అధికారి రాజేంద్రప్రసాద్, సర్పంచి గుమ్మడి ప్రసాద్, అంగర శివసాయిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ దృష్టికి నియోజకవర్గ సమస్యలు

పి.గన్నవరం, న్యూస్‌టుడే: పి.గన్నవరం నియోజకవర్గంలోని వివిధ సమస్యలను ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఆయనను కలుసుకుని ఇంతవరకు పూర్తిచేసిన అభివృద్ధి పనులు, ఇతర సమస్యలు, వాటి పరిష్కారానికి కావాల్సిన నిధులు తదితర అంశాలను వివరించానని పేర్కొన్నారు.

స.హ.చట్టం కమిషనర్‌కు అభినందన

పి.గన్నవరం, న్యూస్‌టుడే: రాష్ట్ర సమాచార హక్కు చట్టం నూతన కమిషనర్‌గా నియమితులైన వట్టికూటి శరత్‌చంద్ర కల్యాణచక్రవర్తిని బుధవారం మంగళగిరిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కలుసుకుని అభినందించారు. కమిషనర్‌గా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.

హాజరు ఉంటే సరే.. లేకుంటే బేజారే..

సచివాలయ సిబ్బందికి తప్పని నిబంధనలు

న్యూస్‌టుడే, అయినవిల్లి

గత ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ నేటికీ గాడిన పడలేదు. ఈ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఎక్కడ పనిచేస్తున్నారు.. సమయానికి విధులకు హాజరవుతున్నారా.. అనేది ప్రశ్నార్థకం గానే మారింది. కొంతమంది వ్యవహార శైలితో ప్రజలు ఇక్కట్లు పడుతున్నట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందున్నాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణలో 20 శాతం పైగా సిబ్బంది పనితీరు పట్ల ప్రజల్లో వ్యతిరేకత వెలుగు చూసింది.

బయోమెట్రిక్ వేయకుంటే మెమోలు

పి.గన్నవరం నియోజకవర్గ పరిధిలో 83 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో 632 మంది సిబ్బంది ఉన్నారు. అయినవిల్లి మండలంలో విలస, కె.జగన్నాథపురం సచివాలయాల్లో గత డిసెంబరులో ఇద్దరు సిబ్బంది 20 రోజుల పైబడి బయోమెట్రిక్ హాజరు వేయలేదని అధికారులు గుర్తించారు. వారికి సంబంధిత ఉన్నతాధికారులు మెమోలు జారీ చేశారు.

వివిధ పనుల్లో నిమగ్నం..

స్వర్ణ గ్రామ సచివాలయల్లో పనిచేసే సిబ్బంది ఉదయం 11 గంటల లోపు, సాయంత్రం 5 తరువాత బయోమెట్రిక్ హాజరు వారి ఫోన్‌లో తప్పనిసరిగా వేయాలి. లేకపోతే ఆ రోజు విధులకు హాజరుకానట్లు లెక్క. గత డిసెంబరులో 20 రోజులకు పైబడి ప్రభుత్వ పని దినాల్లో బయోమెట్రిక్ హాజరు వేయని సిబ్బందికి అధికారులు మొదటసారి మెమోలు జారీ చేస్తున్నారు. ఇదేతప్పు రెండోసారి జరిగితే చర్యలు తప్పవని చెబుతున్నారు. కొందరు సిబ్బంది జిల్లాస్థాయి పీజీఆర్ఎస్, మండలస్థాయి స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల్లో పనిచేస్తున్నారు. మరికొందరు ఏకీకృత సర్వే, ఈ-క్రాప్ పనుల్లో నిమగ్నమయ్యారు స్వర్ణగ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది పోస్టింగ్ ఎక్కడైతే అక్కడే బయోమెట్రిక్ వేయాల్సి ఉంది.

సమయానికి వస్తున్నారు

ప్రభుత్వం ప్రవేశపెట్టిన బయోమెట్రిక్ హాజరుతో సచివాలయ సిబ్బంది పనితీరు మెరుగుపడింది. సమయానికి కార్యాలయానికి వచ్చి ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. దీంతో ప్రభుత్వ కార్యక్రమాలు పూర్తిస్థాయిలో ప్రజలకు చేరువ అవుతాయి.
– రాజమోహన్, డిప్యూటీ ఎంపీడీవో, జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి, అయినవిల్లి

ఆలయ పునర్నిర్మాణానికి విరాళాలు

పి.గన్నవరం, న్యూస్‌టుడే: లంకలగన్నవరం గ్రామదేవత మహాలక్ష్మి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణం కోసం బుధవారం పలువురు దాతలు విరాళాలు అందజేశారు. యర్రంశెట్టి రాజారావు రూ.3,01,415, యర్రంశెట్టి నాగేశ్వరరావు రూ.2,25,500, యర్రంశెట్టి రాజు రూ.2,06,789, యర్రంశెట్టి సత్యనారాయణ రూ.1,60,348, యర్రంశెట్టి చిన్నలోనవారిసేవ రూ.1,01,116, అంబటి దుర్గారావు రూ.50 వేలు, గన్నవరపు సావిత్రి రూ.21,116, యర్రంశెట్టి సత్యనారాయణ కుటుంబ సభ్యులు రూ.20,116, రామేశ్వరపు లక్ష్మీరత్నం రూ.20,115, లంకె ఫాల్గుణ రూ.15,116, చిట్టాల విష్ణుమూర్తి రూ.10,116, తాటికాయలవారిపాలెం వాసులు రూ.10,116 సమర్పించారు. వీరికి ఆలయ కమిటీ ప్రతినిధులు అమ్మవారి చిత్రపటాలు అందించి అభినందించారు.

దాతలకు అమ్మవారి చిత్రపటాలు అందజేసిన ప్రతినిధులు

CHANGE OF NAME

I, REVATHI PRASANNA DOMMETI (New Name), D/o Sanaboina Uma Mahesh (W/o Dommeti Rambabu) previously called my name/surname as Sanaboina Revathi – as per my SSC Marks List bearing Roll No. 1209127284 (Old Name), resident of Door No. 9-88, Gollagunta, Ambajipeta Mandalam, Dr. B.R. Ambedkar Konaseema – 533239, A.P. Now changed my name from SANABOINA REVATHI – Parental surname/name (Old Name) to REVATHI PRASANNA DOMMETI – In-law's surname/name (new name).

(c) eenadu

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం • రామచంద్రపురం

ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మాదక ద్రవ్యాలతో తీవ్ర నష్టం

అమలాపురం పట్టణం : గంజాయి, మాదకద్రవ్యాల వల్ల తీవ్ర దుష్పరిణామాలు ఎదురవుతాయని అందరికీ తెలియజేయాలని విద్యార్థులకు జిల్లా ఈగల్ టీం సీఐ వెంకటేశ్వరరావు సూచించారు. అమలాపురం శ్రీచైతన్య పాఠశాలలో సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈగల్ టీం సభ్యులు విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గంజాయి సంబంధిత ఎటువంటి సమాచారం ఉన్నా టోల్ ఫ్రీ నంబరు 1972కు సమాచారమివ్వాలన్నారు.

శివరాత్రి ఉత్సవాల కరపత్రాల ఆవిష్కరణ

ఐ.పోలవరం : ఈ నెల 15 నుంచి నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలకు సంబంధించి కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, ఛైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించి ఉత్సవ ఏర్పాట్లను వివరించారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు కఠారి శ్రీనివాసరాజు, స్వస్తి వాచక్ నాగాభట్ల రవిప్రసాద్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

అమలాపురం కలెక్టరేట్ : భారతీయ రిజర్వ్ బ్యాంకు ఆధ్వర్యంలో ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. బుధవారం దీనికి సంబంధించిన ప్రచార గోడపత్రికను ఆవిష్కరించారు.

నిబంధనలు పాటించని బస్సుల సీజ్

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: నిబంధనలు పాటించని పాఠశాల బస్సులను సీజ్ చేసినట్లు జిల్లా రవాణాధికారి డి.శ్రీనివాసరావు తెలిపారు. ఐ.పోలవరం మండలం మురమళ్లలోని ప్రైవేటు పాఠశాలలకు చెందిన రెండు బస్సులను సీజ్ చేసి కేసి నమోదు చేసినట్లు తెలిపారు. రూ.33,200 అపరాధ రుసుం విధించామన్నారు. జిల్లా వ్యాప్తంగా బస్సుల తనిఖీలు జరుగుతున్నాయన్నారు. అతివేగం, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ఓవర్‌లోడ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఆయన చెప్పారు. ఈ తనిఖీలో మోటార్ వేహికల్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్ కౌశిక్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులపై అలసత్వం వద్దు

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: పంచాయతీ సిబ్బంది గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఎల్‌పీవో బొజ్జిరాజు సూచించారు. ఉప్పలగుప్తం మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం పంచాయతీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో డి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రికి శుభ్రం చేసేనా..?

● స్నాన ఘాట్‌ల వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు

పరిశీలన

న్యూస్‌టుడే, ముమ్మిడివరం, కాట్రేనికోన, అల్లవరం

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు గోదావరి స్నానాలు ఆచరించి శివాలయాను దర్శించుకుంటారు. ఈ సందర్భంగా రేవులు, స్నానాల ఘాట్‌ల వద్ద రద్దీ వాతావరణం ఉంటుంది. మరో వైపు స్నానాలు చేసేందుకు సరైన సదుపాయాలు లేవు. అపరిశుభ్ర పరిస్థితులు కనిపిస్తున్నాయి. సమయం దగ్గర పడుతున్నా.. ఇక్కడి పరిస్థితులు మాత్రం చక్కదిద్దలేదు.

ఎక్కడ చూసినా..

ముమ్మిడివరం: నియోజకవర్గంలో గత పుష్కరాల సమయంలో 24 ఘాట్‌లను నిర్మించారు. వీటిలో 13 పాతవి కాగా.. 11 నూతనంగా నిర్మించారు. పుష్కరాల అనంతరం ప్రతి కార్తిక మాసం, మహా శివరాత్రి వంటి పర్వదినాల సమయంలో భక్తులు గోదావరి పుణ్య స్నానాలకు వీటిని వినియోగించుకుంటున్నారు. ముమ్మిడివరం మండలంలో లంక ఆఫ్ ఠాణేలంక, పల్లవారిపాలెం, గేదెల్లంక, చింతపల్లిలంక, కొత్తలంక, అయినాపురం, కాట్రేనికోన మండలంలో కుండలేశ్వరం, నడవపల్లి, పల్లంకుర్రు, ఐ.పోలవరం మండలంలో మురమళ్ల వీరేశ్వరస్వామి సన్నిధి ప్రాంతం, మురమళ్ల మెయిన్, కేశనకుర్రు, కేశనకుర్రుపాలెం, తిళ్లకుప్పు, టి.కొత్తపల్లి, జి.మూలపాలెం, గుత్తెనదీవి, గుత్తెనదీవి రేవు, ఎదుర్లంక, కొమరగిరి, పాత ఇంజరంలలో పుష్కరఘాట్‌లు ఉన్నాయి. ఇక్కడ అరకొర ఏర్పాట్లు మాత్రమే ఉన్నాయి. ఘాట్‌లన్నీ మట్టితో పూడిపోయాయి.

అయినాపురంలోని స్నానఘట్టం

రద్దీకి తగ్గ ఏర్పాట్లు ఏవీ..?

కాట్రేనికోన: కుండలేశ్వరాలయం వద్ద వృద్ధగౌతమి గోదావరి గట్టున ఉన్న పుష్కరఘాట్ వద్ద మాత్రం భక్తులు ఇబ్బంది పడే పరిస్థితి ఉంది. ఇక్కడ ఘాట్ ఏడెనిమిదేళ్లకాలం నుంచి వరదలకు సుమారు పదిమీటర్ల ముందు వరకు మేటవేసింది. అప్పటి నుంచి గోదావరి గట్టు కోతకు గురవ్వకుండా ఏర్పాటు చేసిన ఒక గ్రోయిన్‌ను ఘాట్‌గా వినియోగిస్తున్నారు. దీని చుట్టూ ఇనుక కంచెను ఏర్పాటు చేశారు. జల్లుస్నానానికి ఏర్పాటు చేశారు. వచ్చే భక్తులకు ఇవి చాలని పరిస్థితి ఉంది. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు చిన్న షెడ్డుతోపాటు బరకాలతో మరొకటి ఏర్పాటు చేశారు. ఘాట్ వద్ద ఒక్క మరుగుదొడ్డి మాత్రమే ఉంది. ఘాట్ చుట్టూ అపరిశుభ్ర వాతావరణం ఉంది. స్నానాలు చేసి భక్తులు వదిలేసిన దుస్తులు ఎక్కడికక్కడ ఉన్నాయి.

కుండలేశ్వరాలయం వద్ద ఈ గ్రోయిన్ వద్దనే స్నానాలు చేసేది

అపరిశుభ్ర వాతావరణం..

రక్షణ గోడలు ధ్వంసమై ప్రమాదకరంగా గోడి పుష్కరఘాట్

అల్లవరం: మండలంలో ఏ ఘాట్‌లో చూసినా చెత్త కుప్పలు, మద్యం సీసాలు, ఇతర వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. బెండమూర్లంక, గోడి, గోపాయిలంక, బోడసకుర్రు గ్రామాల్లో వైనతేయ గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించేందుకు వీలుగా పుష్కర ఘాట్లు నిర్మించారు. వీటిల్లో ఎక్కడికక్కడ చెత్త, బురద, ఇతర వ్యర్థాలు పేరుకు పోయి భక్తులు గోదావరి నీళ్లలో కాళ్లు పెట్టలేకుండా ఉన్నాయి. గోపాయిలంకలోని పుష్కరఘాట్‌లో మోకాళ్ల లోతు బురద మేట వేసింది. దీంతో ఇక్కడ భక్తులు స్నానాలు ఆచరించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంత కాలంగా ఇక్కడ సరైన వసతులు లేక పుష్కర ఘాటలో పెద్దమొత్తంలో బురద పేరుకుపోయింది.

ప్రమాదకరంగా రేవు: గోడిలోని పుష్కరఘాట్ రక్షణ గోడలు ధ్వంసమై ప్రమాదకరంగా ఉంది. ఇక్కడ గోదావరి నది ఒడ్డునే లోతుగా ఉంటుంది. దీంతో రక్షణ గోడలు లేకపోవడంతో భక్తులు ఆదమరిచి లోతుగా వెళితే పెను ప్రమాదమే. గతంలో ఈ స్నానాల రేవులో ఏర్పాటు చేసిన రక్షణ ఏర్పాటు పాడైంది.

పింఛనుదారుల సమస్యలు పరిష్కరించాలి

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: ఈపీఎస్ 95 ఫించనుదార్లకు కనీస పింఛను రూ.9వేలు డీఏతో కలిపి చెల్లించాలని, ప్రభుత్వ విరమణ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గడియార స్తంభం కూడలిలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కడలి సత్యనారాయణ, జి.గోపాలకృష్ణ, వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నానో ఎరువులతో విప్లవాత్మక మార్పులు

కాజులూరు, న్యూస్‌టుడే: నానో ఎరువులతో వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. ఆత్మ పథకంలో భాగంగా నానో ఎరువుల వినియోగంపై బుధవారం కాజులూరులో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ పరిమాణంలో ఎక్కువ ప్రయోజనం అందించే ఎరువులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఈ ఎరువులు అధిక లాభాలు అందించే సామర్థ్యం కలిగి ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ధనధాన్యలక్ష్మి ప్రత్యేక పూజలు

పామర్రు, న్యూస్‌టుడే: కె.గంగవరం మండలం కోటిపల్లి సమీపంలోని కోట వద్ద ధనధాన్యలక్ష్మి అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం కోటిపల్లి తీరం గోదావరి నది నుంచి 108 మంది మహిళలు బిందెలతో పవిత్ర జలాలు తీసుకుని బాజాభజంత్రీల నడుమ రెండు కిలోమీటర్ల దూరం మోసుకొచ్చి అమ్మవారిని అభిషేకించారు. అనంతరం పంచామృతాభిషేకం, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.

ప్రత్యేక పూజలందుకుంటున్నఅమ్మవారు

కుచ్చాలమ్మ ఆలయ వార్షికోత్సవం

పామర్రు, న్యూస్‌టుడే: కె.గంగవరం మండలం కూళ్ల శివారు నీలగిరిపేట గ్రామదేవత కుచ్చాలమ్మ ఆలయ అయిదో వార్షికోత్సవం సందర్భంగా బుధవారం అమ్మవారిని భక్తుల కనులపండువగా అలంకరించారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరలో జానపద, గరగ నృత్యాలు అలరించాయి. గ్రామ కమిటీ అధ్యర్యంలో జరిగిన వేడుకలో చిట్టూరి రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అలంకరణలో కుచ్చాలమ్మ

మహాసౌరయాగంలో వేదస్వస్తి

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: విలసవిల్లి శ్రీరామమందిరంలో జరుగుతున్న మహాసౌరయాగంలో బుధవారం రుత్వికులు వేదస్వస్తి చేశారు. యాగకర్త మున్నంగి రామకృష్ణ శర్మ దంపతులను గ్రామస్థులు సత్కరించారు. మంగిపూడి చైతన్య, అనిపిండి మూర్తి, నూకల సూరిబాబు, యర్రమిల్లి శ్రీనివాస్, శ్రీనివాస్ శర్మ, నిట్టల సుబ్రహ్మణ్య శర్మ, తనికెళ్ల హయగ్రీవశర్మ, చరణ్, రాము, శేఖర్ తదితర రుత్వికులు పాల్గొన్నారు.

ఆర్థిక సమస్యలతో చికిత్సకు దూరం కావొద్దు

పామర్రు, న్యూస్‌టుడే: ఆర్థిక సమస్యల కారణంగా అనారోగ్యాలకు చికిత్స చేయించుకోవడానికి ఎక్కువ మంది వెనుకంజ వేస్తున్నారని, ఇకపై ఎవరూ అలా చేయవద్దని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సూచించారు. కె.గంగవరం మండలం కుడుపూరు గ్రామానికి చెందిన పిల్లి శ్రీను కుమారుడు వెంకట మోహన్‌కుమార్ మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారని, వైద్య ఖర్చులకు ఇబ్బందిపడుతున్నట్లు స్థానిక నాయకులు మంత్రి దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన మంత్రి రూ.10 వేలు తక్షణ సాయంగా అందించారని కూటమి నాయకులు బుధవారం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రవ్వా భూషణం, కొత్తపల్లి మురార్జీ, చిల్లే నాగేశ్వరరావు తదితరులు పాలొన్నారు.

బాధితుడికి ఆర్థికసాయం అందిస్తున్న మంత్రి సుభాష్

సీఎం దృష్టికి యానాం సమస్యలు

యానాం, న్యూస్‌టుడే: యానాం ప్రజాపనులశాఖ ఎన్ఎంఆర్‌ల సర్వీసు క్రమబద్ధీకరణ, ఇసుక కార్మికుల జీవనోపాధి తదితర సమస్యల గురించి సీఎం ఎన్.రంగసామి మంగళవారం రాత్రి పుదుచ్చేరి వాణిజ్యపన్నులశాఖ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించినట్లు ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. ఎన్ఎంఆర్‌ల సర్వీసు రెగ్యులరైజేషన్, ఓచర్ పెయిడ్ ఉద్యోగుల వేతనం పెంపుపై బడ్జెట్‌లో నిర్ణయం, వెంకన్న ఆలయం నిర్మాణం కోసం రూ.49 లక్షలు తిరుమల తిరుపతి దేవస్థానానికి ఇచ్చేందుకు చర్యలు, పద్మబాలాజీ వ్యాపార సముదాయం వంటి అంశాలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారని మల్లాడి తెలిపారు.

సమస్యలపై చర్చిస్తున్న మల్లాడి

అందరినీ అక్షరాస్యులుగా మార్చాలి

పామర్రు : అందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో నిర్వహిస్తున్న అక్షరాంధ్ర కార్యక్రమాన్ని సమన్వయంతో విజయవంతం చేద్దామని ఎంపీపీ పంపన నాగమణి పిలుపునిచ్చారు. బుధవారం కె.గంగవరం మండలం దంగేరులో నిర్వహించిన అవగాహన, చైతన్య సదస్సులో ఆమె మాట్లాడారు. ఎంఈవో అలజంగి నాగరాజు మాట్లాడుతూ వయోజన విద్య కింద సాయంత్రం లేదా రాత్రి వేళల్లో నిరక్షరాస్యులకు రోజూ గంట పాటు అక్షరజ్ఞానం కలిగించాలన్నారు. సొసైటీ అధ్యక్షుడు జగతా వెంకటరమణ, కూటమి నాయకులు పళ్ల చినబాబు, వనచర్ల శ్రీను, ఉపాధ్యాయులు, మహిళలు పాల్గొన్నారు.

శతశాతం అక్షరాస్యతే లక్ష్యం

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: శతశాతం అక్షరాస్యత సాధించేలా కూటమిప్రభుత్వం కృషి చేస్తోందని డీఆర్‌డీఏ ఏపీడీ ఎల్.రాంబాబు అన్నారు. ఉప్పలగుప్తంలో అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఉల్లాస్- అక్షర ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. దేశంశెట్టి లక్ష్మీనారాయణ, గొల్లవిల్లి సర్పంచి జొన్నాడ శ్రీదుర్గ, అరిగెల నానాజీ ఎంపీడీవో డి.కృష్ణ, ఏపీవో సురేంద్ర పాల్గొన్నారు.

సొసైటీ అధ్యక్షుడిగా చిట్టూరి

పామర్రు, న్యూస్‌టుడే: పామర్రు విశాల సహకార పరపతి సంఘం నూతన అధ్యక్షుడిగా చిట్టూరి లక్ష్మీనారాయణ చౌదరి బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. సభ్యులుగా పెంకే రామకృష్ణ, సుందరపల్లి వీరబ్రహ్మాజీ ఎన్నికయ్యారు. రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి సహకారం అందిస్తామని కొత్త పాలకవర్గం తెలిపింది. కూటమి నాయకులు మరివాడ సూరిబాబు, దేవరపల్లి లక్ష్మీప్రసాద్ (బుల్లి), ఈదర శ్రీధర్, గంటి నాగేశ్వరరావు, రైతులు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

పామర్రు సొసైటీ అధ్యక్షునిగా ప్రమాణ పత్రం స్వీకరిస్తున్న లక్ష్మీనారాయణ చౌదరి

యూటీఎఫ్ పోస్టుకార్డు ఉద్యమం

పి.గన్నవరం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ పి.గన్నవరం మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. 12వ పీఆర్సీ కమిషన్ తక్షణం ఏర్పాటు చేయాలని, ఆర్థిక బకాయిలకు రూట్‌మ్యాప్ ప్రకటించాలని, 2004 కంటే ముందు నియమితులైన వారికి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని పోస్టు కార్డులను ముఖ్యమంత్రికి పంపామని రాష్ట్ర కౌన్సిలర్ కె.సురేష్‌కుమార్ తెలిపారు.

కుంగిన రహదారిని సరిచేశారు

ద్వారపూడి-యానాం రహదారిలోని కె.గంగవరం మండలం ఎర్రపోతవరంలో రోడ్డు కుంగిపోయింది. యానాం రాకపోకలకు ఇదే ప్రధాన రహదారి కావడం, రాత్రి సమయాల్లో అటు నుంచి వచ్చే వాహనాలు పలుమార్లు ఇక్కడే ప్రమాదాలకు గురయ్యాయి. వల రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఈ రహదారిలో ప్రయాణిస్తుండగా స్థానికులు ప్రమాదాల తీవ్రతను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై వెంటనే ఆయన స్పందించి ర.భ.శాఖ డీఈ టి.వి.సూర్యనారాయణతో చర్చించారు. బుధవారం గ్రావెల్ వేయించి మెరక చేసే పనులు ప్రారంభించారు. వాహనదారులకు ఇబ్బందులు తప్పుతాయని డీఈ వివరించారు.

- న్యూస్‌టుడే, పామర్రు

చెత్తవేసే చోటు లేక..!

ముమ్మిడివరం మండలంలో కొమానపల్లి నుంచి చింతపల్లిలంకకు వెళ్లే రహదారి చెంతన పరిస్థితి ఇదీ. గ్రామంలో సేకరించిన చెత్తను ఇలా రోడ్డు చెంతన వేస్తున్నారు. గతంలో ఏర్పాటు చేసిన ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలు మూలకు చేరాయి. దీంతో ఈ పరిస్థితి నెలకొంది. –న్యూస్‌టుడే, ముమ్మిడివరం

ఇరుకు వంతెనతో యాతన

అమలాపురం మండలం ఇందుపల్లి వెళ్లేందుకు ప్రధాన పంటకాలువపై ఉండే వంతెన శిథిలావస్థకు చేరింది. ఈ వంతెనకు ఇరువైపులా ఉండే రక్షణ గోడలు ప్రమాదకరంగా మారాయి. రాకపోకలు సాగించేందుకు యాతన పడాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇప్పటికైనా ఈ వంతెనకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

రైతులంతా ప్రత్యేక గుర్తింపు పొందాలి

పామర్రు, న్యూస్‌టుడే: పౌరులకు ఆధార్‌కార్డు ఎంత ముఖ్యమో రైతులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య అంతే ముఖ్యమని వ్యవసాయ శాఖ రామచంద్రపురం ఏడీ బి.నాగకుమార్ అన్నారు. బుధవారం కె.గంగవరం మండలం యండగండిలో ఆయన రైతులతో మాట్లాడి వారి వివరాలు నమోదు చేశారు. గుర్తింపు సంఖ్య పొందడానికి రైతులు తప్పనిసరిగా దగ్గరలోని రైతు సేవా కేంద్రంలో వివరాలు సమర్పించి నమోదు చేయించుకోవాలని సూచించారు. రాష్ట్రంలో అమలవుతున్న సుఖీభవ, రాయితీలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా, ఎరువులు, కనీస మద్దతు ధర ఈ గుర్తింపు సంఖ్య ద్వారా పొందవచ్చని చెప్పారు. ఏవో సద్గురుమూర్తి, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

యూనిక్ ఐడీ నమోదుచేస్తున్న ఏడీ నాగకుమార్, సిబ్బంది

విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక ప్రోత్సాహం

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రత్యేక అవసరాల పిల్లలు విభిన్న రంగాల్లో ప్రతిభ కలిగి ఉంటారని, వారిని ప్రోత్సహిస్తే అద్భుత విజయాలు నమోదు చేస్తారని కలెక్టర్ మహేష్‌కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ వద్ద ఉన్న అంబేడ్కర్ భవన్‌లో సమగ్ర శిక్ష, సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాల విద్యార్థులకు సాంస్కృతిక, ఇతర రంగాల్లో పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పోటీలు వారిలో ఉన్న ఆత్మ విశ్వాసాన్ని మరింతగా పెంపొందిస్తాయన్నారు. డీఆర్వో మాధవి మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల్లో అపారమైన నైపుణ్యం దాగి ఉంటుందన్నారు. అనంతరం అధికారులు విజేతలకు బహుమతులు అందించారు. సమగ్ర శిక్ష అధికారి జి.మమ్మి, సూర్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ఉద్యోగుల ఆందోళనలో యానాం వాసికి గాయాలు

యానాం, న్యూస్‌టుడే: పుదుచ్చేరిలో నిరసన తెలిపేందుకు వెళ్లిన యానాం ఫరంపేటకు చెందిన ప్రజాపనులశాఖ ఓచర్ పెయిడ్ ఉద్యోగి బడుగు సుబ్బరాజు బుధవారం గాయపడ్డారు. పుదుచ్చేరి ఉద్యోగుల సంఘం నాయకుడు సాయిశరవణన్ పిలుపుమేరకు యానాం నుంచి ఓచర్ పెయిడ్ ఉద్యోగులు పలువురు పుదుచ్చేరి వెళ్లారు. పోలీసుల అత్యుత్సాహం వల్లే ఈ ఘటన జరిగిందని యానాం ఓచర్ పెయిడ్ ఉద్యోగుల సంఘం కార్యదర్శి కె.నాగబాబు ఆరోపించారు. తోపులాట సమయంలో గెంటడంతో సుబ్బరాజు ముందుకు పడి గాయపడ్డాడన్నారు.

గాయపడిన బడుగు సుబ్బరాజు

ఆత్రేయపురానికి ముగిసిన సాగునీటి వంతు

ఆత్రేయపురం: ఆత్రేయపురం మండలంలోని దాళ్వాపంట పొలాలకు 24 గంటల పాటు ఇచ్చిన సాగునీటి వంతు ముగిసింది. ప్రస్తుతం పలివెల, గోపాలపురం, వాడపాలెం లాకుల పరిధి ఆయకట్టుకు బుధవారం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమైంది. ఈ వంతు 48 గంటల పాటు కొనసాగనుందని సంబంధిత జలవనరులశాఖ అధికారులు వెల్లడించారు. సాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు.

దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు నివాళి

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: దీన్‌దయాళ్ ఉపాధ్యాయ భారతీయ జనసంఘ్‌కు జీవం పోశారని భాజపా జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి మోకా సుబ్బారావు అన్నారు. అమలాపురం భాజపా కార్యాలయంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఆర్వీ నాయుడు, అడపా శ్రీనివాసరావు, చిట్టూరి రాజేశ్వరి, కె.ఈశ్వర్‌గౌడ్, అరిగెల తేజ, దేగల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురంలో నివాళి అర్పిస్తున్న భాజపా నాయకులు

పామర్రు: సమాజంలో ఆర్థికంగా అట్టడుగున ఉన్న వర్గాల సంక్షేమానికి అంత్యోదయ అన్న యోజన పథకానికి రూపకల్పన చేసిన పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పేదల పాలిట పెన్నిధిగా నిలిచారని వక్తలు కొనియాడారు. దీన్‌దయాళ్ వర్ధంతిని పురస్కరించుకుని కె.గంగవరం మండలం అముజూరులో బుధవారం భాజపా నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ద్రాక్షారామ: ద్రాక్షారామలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటం వద్ద బుధవారం సంప్రదాయ దుస్తులు ధరించి నివాళి అర్పించారు. కార్యక్రమంలో హసనబాద సర్పంచి నాగిరెడ్డి సతీష్‌రావు మాట్లాడుతూ పండిట్ ఉపాధ్యాయ సేవలు చిరస్మరణీయమని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో మండల భాజపా అధ్యక్షుడు ఆకెటి శ్రీకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు గానాల కల్యాణ్, నాయకులు తోటేటి సూర్యనారాయణ, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందిలేకుండా చర్యలు

కాట్రేనికోన, న్యూస్‌టుడే : మహాశివరాత్రిని పురస్కరించుకుని కుండలేశ్వరంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలని అమలాపురం ఆర్డీవో మాధవి సూచించారు. కుండలేశ్వరంలో ఏర్పాట్లపై ఈవో దుర్గ ఆధ్వర్యంలో ఆర్డీవో అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. గతేడాది సుమారు 70 వేల మంది వరకు భక్తులు దర్శించుకోగా ఈ ఏడాది లక్ష మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామన్నారు. దీనికి అనుగుణంగా భక్తులకు పుష్కరఘాట్, ఆలయం వద్ద క్యూలైన్లు, ఇతరచోట్ల ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అన్ని వైపులా సీసీ కెమెరాలు ఉండాలన్నారు. ఘాట్ వద్ద రెండు బోట్లు, 12 మంది గజ ఈతగాళ్లను వంతులవారీగా అందుబాటులో ఉంచాలన్నారు. పుష్కరఘాట్‌ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నాగిడి నాగేశ్వరరావు, భద్రరావు, రవికిరణ్, రాజేశ్వరరావు, మోహన్‌కుమార్, పీఎస్ఎన్ రాజు, నాగు, రవికుమార్, అవినాష్, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



పుష్కరఘాట్ వద్ద వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో

జీఎస్టీ తొలగింపు హామీపై హర్షం

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: నీటిసంఘాలు చేపట్టే పనులపై జీఎస్టీ తొలగిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇవ్వడంపై గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు ఛైర్మన్ గుబ్బల శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. రంగాపురంలోని కార్యాలయంలో బుధవారం నీటిసంఘాల కమిటీలతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 10 నుంచి సాగునీటిని అధికారులు వంతులవారీగా వదలడం ప్రారంభించారని ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా సంఘాలు కృషి చేయాలని కోరారు. ఈఈ వెంకటేశ్వరరావు, డీఈఈ ప్రసాద్‌రాజు, జగన్నాథం, నీటి సంఘం అధ్యక్షులు దాట్ల గోపిరాజు, రాజులపూడి వెంకటేశ్వరరావు, చావాల జగన్నాథం, దంగేటి చిట్టిబాబు, ఆకాశం శ్రీనివాస్, చిలువూరి సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో వివిధ అంశాలపై చర్చిస్తున్న నీటిసంఘాల అధ్యక్షులు

బ్యాంక్ ఆఫ్ బరోడా
చెయ్యేరు బ్రాంచ్
డి.నెం.1-171, గ్రామ పంచాయితీ బిల్డింగ్ వద్ద, కాట్రేనికోన మండలం, తూ.గో.జిల్లా.
ఫోన్ : 08856-271100, మొబైల్ : 79955 65194, ఇ-మెయిల్ : cheyyu@bankofbaroda.co.in

ఋణగ్రహీత కొరకు నోటీసు
(SARFAESI ACT, 2002లోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (2) క్రింద)
తేది.10.02.2026

దిగువ వారికి
శ్రీ దొంగ నాగరాజు, డోర్ నెం.7-34, మెయిన్ రోడ్, వెంకటేశ్వర స్వామి గుడి, చెయ్యేరు అగ్రహారం, చెయ్యేరు, కాట్రేనికోన మండలం, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా., పిన్ కోడ్- 533222
శ్రీమతి దొంగ విజయలక్ష్మి, భర్త : దొంగ నాగరాజు, డోర్ నెం.7-34, మెయిన్ రోడ్, వెంకటేశ్వర స్వామి గుడి, చెయ్యేరు అగ్రహారం, చెయ్యేరు, కాట్రేనికోన మండలం, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా., పిన్ కోడ్-533222
అయ్యా,

విషయము: మా చెయ్యేరు బ్రాంచ్ నుండి శ్రీ దొంగ నాగరాజు & శ్రీమతి దొంగ విజయలక్ష్మి గార్ల పేరున గల (టెర్మ్ లోన్ (ఖాతా నెం.55260600003041) క్రెడిట్ సౌకర్యాలు గురించి.

1. తేది.15-07-2020 నాటి మా లెటర్ ను మేము ప్రస్తావిస్తున్నాము, అది వివిధ క్రెడిట్ సౌకర్యాల మంజూరు మరియు మంజూరు నిబంధనలను తెలియజేస్తుంది. పైన పేర్కొన్న మంజూరు ప్రకారం, మీరు క్రెడిట్ సౌకర్యాలను పొంది, వాటికి భద్రతను అందించిన తర్వాత వాటిని ఉపయోగించడం ప్రారంభించారు, దిగువ పేర్కొన్న విధంగా. వివిధ రుణం/క్రెడిట్ సౌకర్య ఖాతాలలో ప్రస్తుత బకాయిలు మరియు అటువంటి బాధ్యత కోసం సృష్టించబడిన భద్రతా ప్రయోజనాలు క్రింది విధంగా ఉన్నాయి:
ఋణ స్వభావం మరియు రకం: హోమ్ లోన్ & టెర్మ్ లోన్
పరిమితి : 12.50 లక్షలు వడ్డీ రేటు: సాలీనా 8.45%
తేది.05.09.2025 నాటికి బకాయి (తేది.08-08-2025 వరకు వడ్డీతో కలిపి) : రూ.10,63,802/- (వర్తించని వడ్డీ & ఇతర చట్టపరమైన ఛార్జీలు)
సెక్యూరిటీల సంక్షిప్త వివరణతో భద్రతా ఒప్పందం:
1) సమాన నిష్పత్తిలో తనఖా చేయబడిన ముమ్మిడివరం యస్ఆర్ఓ నందలి డాక్యుమెంట్ నెం.2170/2020, తేది.20-07-2020 ప్రకారం.
2) లోన్ అగ్రిమెంట్ ఇండివిడ్యువల్/లు (హౌసింగ్ లోన్స్), తేది.20-07-2020 ప్రకారం
సెక్యూరిటీ వివరములు : రిజిష్టర్డు ఈక్విటబుల్‌మోర్ట్‌గేజ్ 1వ ఐటమ్ :
ముమ్మిడివరం యస్ఆర్ఓ, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా (మునుపటి తూర్పు గోదావరి జిల్లా), కాట్రేనికోన మండలం, చెయ్యేరు గ్రామం, ఆర్.యస్.నెం.417/17 లోని 119.79 చ.గ.లు విస్తీర్ణం గల స్థలము అందలి డి.నెం.7-34తో గల ఇల్లు. హద్దులు: తూర్పు : మంగిపూడి లక్ష్మీనారాయణ గారి భూమి, దక్షిణం : గొవ్వల సత్యనారాయణ గారి స్థలము మరియు భవనము, పడమర : పంచాయితీ సి.సి.రోడ్డు, ఉత్తరం : ఈ సర్వే నెం.లోని గొవ్వల రామారావు గారి స్థలము.
ఈ పై హద్దుల మధ్య అన్ని ఫలములతో గల చెట్లు, యాజమెంట్ హక్కులతో మొదలగునవి అందలి మరియు ఉపయోగ హక్కులు మరియు నీటి వనరులు మొదలగు వాటితో సహా కలదు.
2. వర్తించని తేదీతో ఉన్న ఋణ రోజు లేఖలో మీరు బ్యాంకుకు రూ.......... వరకు మీ బాధ్యతను అంగీకరించారు. .... నాటికి .... పైన పేర్కొన్న బకాయిలో మరిన్ని డ్రాయింగ్‌లు మరియు వడ్డీ ఉన్నాయి. .... ఖాతాకు డెబిట్ చేయబడిన ఇతర ఛార్జీలు రూ............ (టర్మ్ లోన్ ఖాతా కాబట్టి రుణ రోజు లేఖ వర్తించదు)
3. మీకు తెలిసినట్లుగానే, మీరు మే 2025తో ముగిసిన నెలకు సంబంధించిన పై రుణాల/బకాయిల వాయిదాల చెల్లింపులో డిఫాల్ట్ అయ్యారు. అలాగే, 08-06-2025న మరియు ఆ తర్వాత చెల్లించవలసి ఉన్న టర్మ్ లోన్/డిమాండ్ లోన్‌ల వాయిదాల చెల్లింపులో కూడా మీరు డిఫాల్ట్ అయ్యారు.
4. మీరు చేసిన డిఫాల్ట్‌ల పర్యవసానంగా, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాలు మరియు మార్గదర్శకాల ప్రకారం మీ రుణ ఖాతా 06.09.2025న నిరర్థక ఆస్తిగా వర్గీకరించబడింది. మా పదేపదే అభ్యర్థనలు మరియు డిమాండ్లు ఉన్నప్పటికీ మీరు దానిపై వడ్డీతో సహా గడువు మీరిన రుణాలను తిరిగి చెల్లించలేదు.
5. పైన పేరా 1లో పేర్కొన్న వివిధ సెక్యూరిటీల ద్వారా తగిన విధంగా సురక్షితం చేయబడిన క్రెడిట్ సదుపాయాలకు సంబంధించి మీ బాధ్యతలను నెరవేర్చడంలో మీ అసమర్థతను, మరియు మీ ఖాతాను నిరర్థక ఆస్తిగా వర్గీకరించడాన్ని దృష్టిలో ఉంచుకొని, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002లోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్ (2) కింద మేము దీని ద్వారా మీకు నోటీసు ఇస్తున్నాము, మరియు ఈ నోటీసు తేదీ నుండి 60 రోజులలోపు, బ్యాంకుకు మీ ఋణ బాధ్యతలను పూర్తిస్థాయిలో (తేది.08-08-2025 వరకు వడ్డీ కలిపి) రూ.10,63,802/- (అక్షరాల పది లక్షల అరవై మూడు వేల ఎనిమిది వందల రెండు రూపాయలు మాత్రమే) + ప్లస్ వర్తించని వడ్డీతో పాటు ఇతర లీగల్ ఛార్జీలు + పైన పేరా 1లో పేర్కొన్న ఇతర ఛార్జీలను చెల్లించవలసిందిగా మిమ్మల్ని కోరుతున్నాము. పైన పేర్కొన్న మొత్తాన్ని వడ్డీతో సహా చెల్లింపు తేదీ వరకు చెల్లించడంలో విఫలమైతే, సదరు చట్టంలోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్ (4) కింద ఉన్న అన్ని లేదా ఏవైనా హక్కులను వినియోగించుకోవడానికి మేము స్వేచ్ఛగా ఉంటామని మీకు తెలియజేస్తున్నాము, దయచేసి దీనిని గమనించగలరు.
6. దయచేసి గమనించండి, పూర్తి చెల్లింపు జరిగే వరకు ప్రతి క్రెడిట్ సదుపాయం కోసం పైన పేరా 1 లో పేర్కొన్న రేట్ల ప్రకారం వడ్డీ వసూలు చేయబడుతుంది.
7. మా ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేకుండా, పైన పేరా 1లో పేర్కొన్న ఏవైనా సురక్షిత ఆస్తులను అమ్మకం, లీజు లేదా ఇతరత్రా (సాధారణ వ్యాపార క్రమంలో తప్ప) బదిలీ చేయడానికి మీకు అనుమతి లేదని, సదరు చట్టంలోని ఉప-సెక్షన్ 13 ప్రకారం మేము మీ దృష్టికి తీసుకువస్తున్నాము. సదరు చట్టంలోని సెక్షన్ 13(13)లో ఉన్న పై నిబంధనను పాటించకపోవడం చట్టంలోని సెక్షన్ 29 ప్రకారం శిక్షార్హమైన నేరం అని మేము జోడించవచ్చు.
8. పబ్లిక్ వేలం/కొటేషన్లు/టెండర్/ప్రైవేట్ ఒప్పందం కోసం నోటీసు ప్రచురించడానికి ముందు ఏ సమయంలోనైనా బ్యాంక్ చేసిన అన్ని ఖర్చులు, ఛార్జీలు మరియు వ్యయాలతో కలిపి బాకీ ఉన్న మొత్తాన్ని మీరు సమర్పిస్తే, మీరు సెక్యూరిటీ ఆస్తులను విమోచించుకోవచ్చు అనే నిబంధన ప్రకారం, సదరు చట్టంలోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8)కి మేము మీ దృష్టిని మరింతగా ఆహ్వానిస్తున్నాము. పైన పేర్కొన్న విధంగా నోటీసు ప్రచురించబడిన తర్వాత, సెక్యూరిటీ ఆస్తులను విమోచించుకోవడానికి మీకు ఉన్న హక్కు అందుబాటులో ఉండదని దయచేసి గమనించండి.
9. ఈ డిమాండ్ నోటీసు మాకు ఉన్న ఇతర హక్కులు లేదా నివారణలకు ఎటువంటి భంగం కలిగించదని [illegible]

తేది : 10.02.2026
ప్రదేశం : చెయ్యేరు
సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి
బ్యాంక్ ఆఫ్ బరోడా

(c) eenadu

పుష్కరాలకు ప్రత్యేక రవాణా వ్యవస్థ

● 'రూట్ మ్యాప్' తయారీకి కలెక్టర్ ఆదేశం

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : గోదావరి పుష్కరాల నేపథ్యంలో నగరానికి వివిధ ప్రాంతాల నుంచి వాహనాల రాకపోకలు, ట్రాఫిక్ మళ్లింపు, పార్కింగ్ సౌకర్యాలపై యంత్రాంగం కసరత్తు చేస్తోంది. కలెక్టర్ కీర్తి చేకూరి, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, ఎస్పీ నరసింహ కిషోర్ బుధవారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు ట్రావెల్స్, కార్లు, ఆటో రిక్షాలు, ద్విచక్ర వాహనాలకు సంబంధించి సమగ్ర రూటు మ్యాప్ రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రధాన కూడళ్ల సమీపంలో విస్తృత పార్కింగ్ స్థలాల ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. అక్కడ నుంచి యాత్రికులకు ప్రత్యేక షటిల్ బస్సుల ద్వారా తరలించాల్సి ఉందన్నారు. దీని కోసం ప్రత్యేక రవాణా వ్యవస్థ సిద్ధం చేయాలన్నారు.

శివరాత్రికి ట్రయిల్ రన్

శివరాత్రి నేపథ్యంలో పుష్కర ట్రయిల్ రన్‌కు కార్యాచరణ సిద్ధం చేశామని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. బుధవారం సాయంత్రం గోదావరి ఘాట్‌లు పరిశీలించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, భద్రతా ఏర్పాట్లు సమగ్రంగా ఉండేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఎస్పీ మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ప్రధాన కూడళ్ల వద్ద అదనపు పోలీసు బలగాలు, ట్రాఫిక్ సిబ్బందిని నియమిస్తున్నట్లు తెలిపారు.

కోటిలింగాల రేవును పరిశీలిస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి, కమిషనర్ రాహుల్ మీనా, ఎస్పీ నరసింహకిషోర్

అన్నవరం నెయ్యి సరైనదేనా..?

2019-24 మధ్య కొనుగోళ్ల వివరాల సేకరణ

అన్నవరం : వైకాపా ప్రభుత్వ హయాంలో అన్నవరం దేవస్థానానికి కొనుగోలు చేసిన నెయ్యిపై అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. అన్నవరం ఆలయానికి 2019- 24 మధ్య సరఫరా అయిన నెయ్యిపై వివరాలు అందించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. సేకరించిన వివరాల ప్రకారం 2019 ఏప్రిల్ నుంచి 2022 సెప్టెంబరు వరకు సంగం, విజయ డెయిరీల నుంచి కొనుగోలు చేశారు. 2022 అక్టోబరు 1 నుంచి 2024 సెప్టెంబరు వరకు (రెండేళ్లు) లక్కవరం రైతు డెయిరీ ప్రొడక్ట్స్ ప్రైవేటు లిమిటెడ్ నుంచి కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ప్రతి ఆర్నెల్లకోసారి టెండర్లు పిలవగా వరుసగా నాలుగుసార్లు ఈ సంస్థ నుంచే నెయ్యి సరఫరా అయ్యింది. ఆ తర్వాత విజయ, సంగం డెయిరీల నుంచి కొటేషన్ పద్ధతిలో కొనుగోలు చేశారు. ప్రస్తుతం సంగం డెయిరీ సరఫరా చేస్తోంది.

లోగుట్టు సత్యదేవుడికే ఎరుక

2023 ఏప్రిల్ నుంచి 2024 సెప్టెంబరు వరకు (ప్రతి ఆర్నెళ్లకు) రైతు డెయిరీ కేజీ రూ. 564, రూ. 540, రూ. 538.60కు అన్నవరం ఆలయానికి నెయ్యి సరఫరా చేశారు. అదే సంస్థ సింహాచలం దేవస్థానానికి (2024 - 25) కేజీ కేవలం రూ. 344కు సరఫరా చేసింది. అక్కడి ఆలయానికి సరఫరా చేసింది 3 వేల డబ్బాలే. అయితే ఒకే సంస్థ రెండు ప్రధానాలయాలకు సరఫరా చేసిన నెయ్యిలో కేజీ రూ.194 భారీ తేడాపై చర్చ జరిగింది.

ఘాట్‌లు.. పాట్లు..!

పుణ్యస్నానం.. జర భద్రం..

పరిశీలన

● గతేడాది శివరాత్రి రోజు ఉదయం తాళ్లపూడి మండలం తాడిపూడికి చెందిన ఎనిమిది మంది యువకులు అక్కడి ఎత్తిపోతల పథకం సమీపంలో గోదావరిలో స్నానాలకు దిగారు. లోతు అంచనా వేయలేక ఐదుగురు గల్లంతై మృతి చెందారు.

● ఈ ఏడాది కనుమ రోజున పెనకనమెట్టకు చెందిన దినేష్ కొవ్వూరు పట్టణ పరిధిలోని దండకుంట రేవు సమీపంలో స్నానానికి దిగి ఉత్సాహంగా లోపలికి వెళ్లి గల్లంతై మృత్యువాతపడ్డాడు.

కొవ్వూరు పట్టణం, తాళ్లపూడి, నిడదవోలు, రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ, న్యూస్‌టుడే: శివరాత్రికి స్నానాల కోసం వచ్చే భక్తులకు ఘాట్‌ల వద్ద పాట్లు తప్పని పరిస్థితి ఏర్పడింది. శివరాత్రి నేపథ్యంలో అటు ధవళేశ్వరం నుంచి కాతేరు వరకూ 11 ఘాట్‌లు సిద్ధం చేశారు. అయితే వివిధ కారణాలతో కీలక స్నానరేవులు స్నానాలకు అనుకూలంగా లేకపోవడం గమనార్హం.

ఇదీ పరిస్థితి

● పుష్కరఘాట్ వద్ద టూరిజం శాఖ ఆధ్వర్యంలో పనులు జరుగుతున్న నేపథ్యంలో కొంత మేర మాత్రమే స్నానాలకు అనుమతి ఇస్తున్నారు. దీంతో ఇక్కడ రద్దీ ఏర్పడే అవకాశం ఉంది. ఆధునికీకరణ పేరుతో గత పుష్కరాలకు వేసిన టైల్స్ తొలగించి, కొత్తగా రాజస్థాన్ పింక్ రాక్ టైల్ వేశారు. ఇది నీరు తగిలితే జారే అవకాశం ఉంది. చాలా వరకూ పింక్ టైల్స్ వేయడంతో భక్తులు ఇబ్బంది పడే అవకాశం ఉందన్న విమర్శలు ఉన్నాయి. ● పద్మావతి, తితిదే ఘాట్‌ల వద్ద రివర్ ఫ్రంటు పనులు జరుగుతుండటంతో వీటిని మూసివేశారు. ● కోటిలింగాల రేవు వద్ద కొంత మేర ఊబలు ఉండటంతో పాత ఘాట్ వరకూ మాత్రమే స్నానాలకు అనుమతిస్తున్నారు. ● గోదావరి పొడవునా ఇష్టానుసారం చేపడుతున్న ఇసుక తవ్వకాలు ప్రమాదాలకు ప్రధాన కారణమవుతున్నాయి. ● నిడదవోలు మండలంలోని విజ్జేశ్వరం, పురుషోత్తపల్లి, పందలపర్రు, జీడిగుంట, పెండ్యాలలో గోదావరి పొడవునా ఇసుక తవ్వకాలు చేపడుతుండడంతో గుంతలు పడ్డాయి. స్నానాలకు దిగిన వారు వాటిలో పడి మునిగిపోతున్నారు. ● కొవ్వూరు గోష్పద క్షేత్రం, చిగురులంక, సీతంపేట, విజ్జేశ్వరం, ఆరికిరేవుల సమీపంలో అక్కడకక్కడ, తాడిపూడి ఎత్తిపోతల పథకం సమీపం, గూటాల సమీపం, ప్రక్కిలంక- వేగేశ్వరపురం మధ్య గోదావరిలో చేసే స్నానాలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ● కొవ్వూరు గోష్పద క్షేత్రం, పరిసర రేవులు, తాళ్లపూడి, నిడదవోలు మండల పరిధిలోని గుర్తించిన రేవులతోపాటు భద్రత లేని, అనువు కానిచోట ఇటువంటి ఘటనలు చోటుచేసుకున్నాయి.

ప్రమాదకరంగా కోటిలింగాల ఘాట్

నాలుగేళ్లలో 147 మంది..

కొవ్వూరు డివిజన్ పరిధిలో గోదావరి తీరం వెంబడి 2023లో 63, 2024లో 51, 2025లో 32, ఈ ఏడాది (40 రోజులు)లో ఒకరు గల్లంతయ్యారు. ఒక్క గోష్పద క్షేత్రంలోనే ఏటా 20 మంది వరకు గల్లంతై మృత్యువాత పడుతున్నారు.

రూ.2వేల ఫోన్ కొంటే.. రూ.లక్ష కొట్టేశారు..!

డబ్బులు రిఫండ్ ఇస్తామని ఆన్‌లైన్‌లో మోసం

అమలాపురం పట్టణం : సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త మోసంతో జనాలను నిండా ముంచుతున్నారు. అమలాపురంలో ఇలాంటి ఘటనే చోటు చేసుకుంది. స్థానికంగా ఉంటున్న ఓ ఆర్ఎంపీ వైద్యుడు చవకగా ఫోన్లు విక్రయించే ఓ వెబ్‌సైట్‌లో రూ.2వేలు చెల్లించి సెల్ ఆర్డర్ పెట్టారు. నేరగాళ్లు అతడికి పనిచేయని ఫోన్ పంపించారు. ఈ విషయాన్ని ఆయన బుధవారం సంబంధిత వెబ్‌సైట్‌లోని నంబరుకు ఫోన్‌చేసి ఫిర్యాదు చేశారు. రూ. 2వేలు రిఫండ్ ఇస్తామని నమ్మించి అతని బ్యాంకు వివరాలు తీసుకున్నారు. వెంటనే అతని సెల్‌కు వెంటవెంటనే రెండు ఓటీపీలు పంపించారు. వాటిని చెబుతూ డబ్బులు మీ ఖాతాలో పడతాయని నమ్మించారు. అతను ఆ నంబర్లు చెప్పిన తర్వాత రూ. 49,500 చొప్పున రెండుసార్లు ఖాతాల్లోని డబ్బులు లాగేశారు. దీనిపై ఎస్పీ కార్యాలయంలోని సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఒడిసిపట్టారు.. ప్రత్యేకత చాటారు

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : నీటి సంరక్షణ పై నగర పాలక సంస్థ ప్రత్యేక దృష్టి సారించి, పదివేలకు పైగా ఇంకుడు గుంతలు తవ్వించారు. దీనిని గుర్తించిన కేంద్రం జల సంరక్షణలో భాగంగా నగరాన్ని ఎంపిక చేసి, అవార్డు ఇచ్చింది. ఇంకుడు గుంతలు తవ్వడం, వర్షపు నీటిని ఒడిసిపట్టడం, బోరు నీటిని తిరిగి వినియోగించడం ఇవన్నీ ప్రామాణికంగా తీసుకొన్నారు. గత ఏడాది దేశవ్యాప్తంగా సర్వే నిర్వహించగా.. రాజమహేంద్రవరం నాలుగు, రాష్ట్రంలో ప్రథమ స్థానాలు సాధించింది. ఈ మేరకు గత ఏడాది అవార్డు అందుకున్నారు.

మున్సిపల్ కార్యాలయంలో ఇంకుడు గుంత

ఏం చేశారంటే..

● బహుళ అంతస్తులు, భారీ భవంతులు, వాణిజ్య భవనాల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలంటే ముందుగా ఇంకుడు గుంత ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

● పట్టణ ప్రణాళికా విభాగం ఆధ్వర్యంలో పక్కాగా పరిశీలించి, అనుమతులు మంజూరు చేస్తారు.

రూ. 2 కోట్లు నజరానా

జల సంరక్షణలో భాగంగా అవార్డు ఎంపికైన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నగర పాలక సంస్థకు రూ 2 కోట్ల నజరానా ప్రకటించింది. తాజాగా ఆ నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. నీటి అవసరాలకు, తాగునీటి ఇబ్బందులను అధిగమించడానికి వీటిని వినియోగించేందుకు యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది.

పది ఫలితాల్లో మెరిసేలా

● డ్రాపౌట్స్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

న్యూస్‌టుడే, శ్యామలా సెంటర్(రాజమహేంద్రవరం)

పదో తరగతి ఉత్తీర్ణత శాతం మెరుగుపైనే కాదు.. చదువుతూ మధ్యలో బడి మానేసిన (డ్రాపౌట్స్) విద్యార్థులపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. వీరు జిల్లాలో 186 మంది వరకు ఉన్నట్లు తాజాగా విద్యాశాఖ అధికారులు గుర్తించారు. దగ్గర్లోని రెసిడెన్షియల్ లేదా వసతి గృహాల్లో ఉంచి వారికి ఉపాధ్యాయులతో పది పాఠాలు బోధిస్తున్నారు. జిల్లాలో పదో తరగతి పరీక్షలకు ఈ ఏడాది 24,537 మంది హాజరుకానున్నారు. గత ఏడాది 87.99 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో మెరుగైన స్థానంలో నిలవగా.. ఈసారి మొదటి స్థానంలో నిలిపేందుకు విద్యాశాఖ అధికారులు కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యాశాఖ కమిషనర్ సూచనలు మేరకు పది చదువుతూ మధ్యలో మానేసిన వారిని గుర్తించి.. వారు కనీస మార్కులతో ఉత్తీర్ణత సాధించే విధంగా తర్ఫీదు ఇస్తున్నారు. ఇందులో భాగంగా ముఖ్యమైన ప్రశ్నలు ఇచ్చి చదివించటం, తిరిగి వాటిపై పరీక్షలు నిర్వహించటం చేస్తున్నారు. లెక్కలు, సైన్సు పాఠ్యాంశాపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతీసుకొని వారికి పదేపదే మాదిరి ప్రశ్నలు ఇవ్వటం, బొమ్మలు వేయించడం ద్వారా కనీసం వారు పది పాసయ్యేలా సూచనలు చేస్తున్నారు.

నూరుశాతం ఉత్తీర్ణత లక్ష్యం

ఈ ఏడాది పదోతరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నాం. కుటుంబ పరిస్థితులు, తదితర కారణాల రీత్యా బడి మధ్యలో మానేసిన వారిని కూడా గుర్తించి వారు కనీసం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. సాధ్యమైనంత వరకు 186మందిలో కొంతమందిని వారు తిరిగి స్కూలుకు వచ్చేలా తల్లిదండ్రులతో మాట్లాడుతున్నాం. **- కె.వాసుదేవరావు, డీఎస్ఈఓ**

స్థల సేకరణే కీలకం..!

● పారిశ్రామిక అడుగులకు అడ్డంకులు

ఈనాడు, రాజమహేంద్రవరం : ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్న సంకల్పంతో కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నా క్షేత్రస్థాయిలో భిన్నమైన పరిస్థితులు ఎదురవుతున్నాయి. ప్రతి నియోజకవర్గంలో పారిశ్రామిక క్లస్టర్ ఏర్పాటు చేయడం ద్వారా అక్కడ సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహమివ్వాలని భావించారు. అయితే ఉమ్మడి జిల్లాలో ఆశించిన మేర పురోగతి కనిపించడం లేదు. ప్రధానంగా భూముల గుర్తింపు, ఏపీఐఐసీకి బదలాయింపు ప్రక్రియలో జాప్యం నెలకొంటోంది.

ఇదీ పరిస్థితి

● డా. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రెండు విడతల్లో రామచంద్రపురం, అమలాపురంలో శంకుస్థాపనలు చేశారు. మిగిలిన ప్రాంతాల్లో స్థల సేకరణ చేయాల్సి ఉంది. ఇప్పటికి ఒక నియోజకవర్గంలో మాత్రమే భూమి గుర్తించారు. ● తూర్పుగోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం గ్రామీణం, గోపాలపురం, రాజానగరం నియోజకవర్గాల పరిధిలో గుర్తించిన భూముల్లో ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యేలు శంకుస్థాపనలు చేశారు. మరో మూడు చోట్ల స్థలాలు గుర్తించాల్సి ఉంది. ● కాకినాడ జిల్లాలో కాకినాడ గ్రామీణం, పెద్దాపురం, పిఠాపురం, తుని, జగ్గంపేట నియోజకవర్గాల పరిధిలో ఇప్పటికే స్థలాల గుర్తింపుతో పాటు రెండో విడతలోనే శంకుస్థాపనలు చేశారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. కాకినాడ నియోజకవర్గానికి సంబంధించి స్థలాన్ని గుర్తించే పనిలో యంత్రాంగం ఉంది. ● పోలవరం జిల్లాలో గంగవరం మండలంలో స్థలం గుర్తించడంతో అక్కడ మౌలిక వసతుల కల్పన పనులు చేయాల్సి ఉంది.

'పీఎం అజయ్'తో ఆర్థిక అభయం

● ఎస్‌హెచ్‌జీలోని ఎస్సీ మహిళల జీవనోపాధికి తోడ్పాటు

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే

స్వయం ఉపాధి యూనిట్ల స్థాపన ద్వారా గ్రామీణ ప్రాంతంలోని స్వయం సహాయక సంఘాలు(ఎస్ హెచ్‌జీ)ల్లోని షెడ్యూల్డ్ కులాల(ఎస్సీ) మహిళలు ఆర్థికంగా బలోపేతమయ్యేలా కూటమి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోంది. చిన్న వ్యాపారాల నిర్వహణ, కుటీర పరిశ్రమలు, వ్యవసాయ అనుబంధ యూనిట్లు ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందేందుకు ప్రధాన మంత్రి అనుసుచిత్ జాతి అభ్యుదయ్ యోజన(పీఎం అజయ్) పథకం కింద రాయితీ రుణాలు మంజూరు చేస్తుంది. ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఎస్సీ కార్పొరేషన్), గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) సమన్వయంతో యూనిట్ల మంజూరుకు అర్హుల గుర్తింపు ప్రక్రియ చేపడుతున్నారు.

నెలాఖరులోగా యూనిట్ల ఏర్పాటుకు చర్యలు..

జిల్లాలో గత ఆర్థిక సంవత్సరం(2024-2025)లో ఎస్‌హెచ్‌జీల్లోని ఎస్సీ మహిళలకు పీఎం అజయ్ పథకం కింద 74 యూనిట్ల స్థాపనకు రాయితీ రుణాలు అందించగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-2026)కు సంబంధించి జిల్లాకు 191 యూనిట్లు మంజూరు చేసింది. ఇందుకుగాను రూ. 2.75 కోట్లు విడుదల చేసింది. ఒక్కొక్క యూనిట్‌కు లబ్ధిదారుడి వాటా 10 శాతం కాగా రూ.50 వేలు ప్రభుత్వ రాయితీ, మిగిలిన మొత్తం సెర్ప్ ఆధ్వర్యంలోని ఉన్నతి పథకం ద్వారా వడ్డీలేని రుణం కల్పించనున్నారు. జిల్లాలోని ఆయా మండలాల్లో ఎస్‌హెచ్‌జీల్లోని ఎస్సీ మహిళల సంఖ్య ఆధారంగా మండలానికి 10 నుంచి 14 యూనిట్లు మంజూరు చేశారు. ఈ నెలాఖరులోగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి యూనిట్లను గ్రౌండింగ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. మార్చి నెలాఖరులోగా ఈ నిధులు ఖర్చు చేయకపోతే వెనక్కి పోయే అవకాశం ఉన్నందున ఈ ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్, సెర్ప్ అధికారులు చెబుతున్నారు.



రాయితీ రుణాల చెక్కు అందిస్తున్న అధికారులు

ఏయే యూనిట్లంటే.. ?

● పీఎం అజయ్ పథకం కింద స్వయం సహాయక సంఘాల్లోని ఎస్సీ మహిళలకు కనిష్టంగా రూ. లక్ష, గరిష్టంగా రూ. 3 లక్షలు రుణ సహాయం కల్పిస్తున్నారు. ● ఎంత రుణం తీసుకున్నా రూ. 50 వేలు రాయితీ మాత్రమే వర్తిస్తుంది. ● జిల్లాలో 191 మందికి రూ. 2.75 కోట్లు రుణం ఇస్తారు. దీనిలో రూ. 95.50 లక్షలు రాయితీగా ఇవ్వనున్నారు. ● రూ. 17.10 లక్షలు మాత్రం లబ్ధిదారుల వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. ● మిగిలిన మొత్తం సెర్ప్ ద్వారా ఉన్నతి పథకంలో వడ్డీలేని రుణాలుగా అందిస్తారు. ● లబ్ధిదారులు 60 రకాల యూనిట్లలో తమకు నచ్చినవి ఏర్పాటు చేసుకోవచ్చు. వ్యవసాయ పరికరాల దుకాణాలు, పచ్చళ్ల వ్యాపారాలు, ఫ్యాన్సీ, హోటళ్లు, కాయగూరలు, మొబైల్, వస్త్ర దుకాణాలు, ఫొటోస్టూడియోలు వంటివి, సేవా రంగానికి సంబంధించిన జీవనోపాధి యూనిట్లు స్థాపించుకుని ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చుని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యవతి, సెర్ప్ ఏపీఎం త్రిమూర్తులు తెలిపారు.

బడ్జెట్‌పై ప్రధానితో మాట్లాడదామా..!

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: కేంద్ర బడ్జెట్‌పై ప్రధాని మంత్రి నరేంద్ర మోదితో నేరుగా మాట్లాడే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పిస్తోంది. కేంద్ర బడ్జెట్-2026పై ప్రాథమిక అవగాహన, కేటాయింపులపై ప్రజల అభిప్రాయాన్ని క్విజ్ ద్వారా తెలుసుకునేందుకు ప్రయత్నం చేస్తోంది. మేరా యువ భారత్ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహిస్తోంది. ● మై భారత్ బడ్జెట్ క్వెస్ట్ (క్విజ్)-2026 పోటీల్లో పాల్గొనేందుకు 15 నుంచి 29 ఏళ్ల వయసులోపు వారెవరైనా పాల్గొనవచ్చు. ఇందుకు ఎటువంటి రుసుము చెల్లించనవసరం లేదు. ● క్విజ్‌లో బహుళ ఎంపిక ప్రశ్నలుంటాయి. 30 ప్రశ్నలకు 30 మార్కులుంటాయి. 15 నిమిషాల్లోపు ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సి ఉంటుంది. 10 మార్కులొస్తే ఉత్తీర్ణులైనట్లు పరిగణిస్తారు. ఈ నెల 17లోపు ఎప్పుడైనా ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనవచ్చు. ఒక విద్యార్థి ఒకసారి మాత్రమే పాల్గొనాలి. క్విజ్‌లో పాల్గొన్న అందరికీ ధ్రువపత్రం అందజేస్తారు. ● క్విజ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరచిన వారితో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో వర్చువల్‌గా మాట్లాడే అవకాశం కల్పిస్తారు. ● మై భారత్ వెబ్‌సైట్‌లో క్విజ్ వివరాలుంటాయి.

బడ్జెట్‌పై క్విజ్ చిత్రం

సమన్వయంతో ఉత్సవాలు విజయవంతం

అమలాపురం కలెక్టరేట్: అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవాల్లో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించారని కలెక్టర్ మహేష్‌కుమార్ అన్నారు. ఉత్సవాల నిర్వహణలో పాల్గొన్న అధికారులను బుధవారం కలెక్టరేట్‌లో ఆయన అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్తు అవసరాల దృష్ట్యా శాశ్వత కల్యాణ మండపం, బస్‌స్టాండ్, మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కల్యాణోత్సవం, రథోత్సవం సమయాల్లో మొబైల్ నెట్ వర్క్ సామర్థ్యాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ రాహుల్ మీనా, డీఆర్వో కె.మాధవి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు శుద్ధి జలాలు

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం ఆర్టీసీ ప్రధాన బస్టాండ్‌లో ప్రయాణికులకు శుద్ధి చేసిన తాగునీటిని అందించేందుకు ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేస్తున్నారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రతి రోజూ 25 వేల మందికిపైగా ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. గతంలో చల్లటి తాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన ఫ్రిజ్ మరమ్మతుకు గురైంది. ఇప్పటికే పల్లెవెలుగు సర్వీసుల ప్రాంగణంలో 1,500 లీటర్ల సామర్థ్యం(కెపాసిటీ) ఉన్న ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశారు. ప్రధాన బస్టాండ్‌లో మంచినీటి సౌకర్యం పూర్తిస్థాయిలో లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో నాన్‌స్టాప్ టికెట్ బుకింగ్ కౌంటర్ వద్ద 1,500 లీటర్ల సామర్థ్యం ఉన్న ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నారు. అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సహకారంతో భవాని ట్రస్టు ద్వారా రూ. 2.50 లక్షల వ్యయంతో దీనిని నిర్మిస్తున్నామని డిపో అధికారులు చెబుతున్నారు.

నాన్‌స్టాప్ టికెట్ కౌంటర్ వద్ద ఆర్వో ప్లాంట్ నిర్మాణ పనులు

సేవా లోపాలకు తక్షణ పరిష్కారం

ద్రాక్షారామ: విద్యుత్తు పంపిణీ వ్యవస్థలో ఎదురయ్యే సేవా లోపాలను సత్వరం పరిష్కరించి వినియోగదారులకు న్యాయం చేయడానికి విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కార ఫోరం (సీజీఆర్ఎఫ్)ను ఏర్పాటుచేసినట్లు ఆ సంస్థ ఛైర్మన్ డా. బి. సత్యనారాయణ చెప్పారు. విశ్రాంత న్యాయమూర్తితో పాటు ముగ్గురు సభ్యులు ఇందులో ఉంటారని వివరించారు. కోనసీమ జిల్లా పరిధిలోని సమస్యల పరిష్కారానికి బుధవారం ద్రాక్షారామ వేదికగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉభయగోదావరి జిల్లాల పరిధిలో ఎదురయ్యే సమస్యలను ఫోరంలో సత్వరమే పరిష్కరిస్తున్నట్లు వివరించారు. సమావేశంలో 8 ఫిర్యాదులు అందగా వాటిని పరిశీలిస్తున్నట్లు వివరించారు. అనంతరం ద్రాక్షారామ మహిళా కళాశాలలో విద్యుత్తు సమస్యలు, పరిష్కారానికి సంబంధించిన అవగాహన సదస్సు నిర్వహించారు. సభ్యులు ఎస్.సుబ్బారావు, బి.సులేఖారాణి, ఎన్.మురళీకృష్ణ, కోనసీమ జిల్లా ఈఈ (టెక్నికల్) వై.విజయానంద్, ఈఈ రత్నాలరావు, ఏడీఈ ఎస్.శ్రీనివాసరావు, ఏఈ ఎం.వెంకటరమణ పాల్గొన్నారు.

ఫిర్యాదు స్వీకరిస్తున్న ఛైర్మన్ సత్యనారాయణ తదితరులు

వైభవంగా చక్రస్నానం

కల్పవృక్ష వాహనంపై శ్రీనివాసుడు

ఆలమూరు: చింతలూరులోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి పాంచాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆఖరి రోజైన బుధవారం శ్రద్ధోత్సవం, పూర్ణాహుతి కార్యక్రమాలు జరిగాయి. అనంతరం స్వామివారి చక్రస్నానం నిర్వహించారు. సాయంత్రం కల్యాణవెంకటేశ్వరునిగా కల్పవృక్ష వాహనంపై పురవీధుల్లో ఊరేగారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

17న శాప్ లీగ్ పోటీలు

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 31 క్రీడాంశాల్లో శాప్ లీగ్ పోటీలు నిర్వహించనున్నట్లు డీఎస్‌డీవో డి.శేషగిరి ఒక ప్రకటనలో తెలిపారు. 17న రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ, ఆర్ట్స్ కళాశాలలో అండర్-13, 15, 17, 19 విభాగాల్లో పురుషులు, మహిళలకు జిల్లాస్థాయి చదరంగం, సైక్లింగ్ పోటీలు ఉంటాయన్నారు. గెలుపొందిన క్రీడాకారులు 21, 22 తేదీల్లో విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. మరిన్ని వివరాలకు చరవాణి నంబరు 903 293 4038 ను సంప్రదించవచ్చును.

ఆటిజం బాధితులకు సాంత్వన

● జిల్లాకు మూడు కేంద్రాలు మంజూరు

న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం

వయస్సుకు తగ్గ మానసిక ఎదుగుదల.. ప్రతిస్పందన లేక ఏం చెప్పినా ఆలస్యంగా అర్థమై వాళ్లలో వాళ్లు మాట్లాడుకునే నాడీ సంబంధిత రుగ్మత (న్యూరోలాజికల్ డిజార్డర్) ఆటిజం. దీంతో బాధపడే చిన్నారులకు సరైన చికిత్స అవసరం. జన్యు, నాడీ, రోగ నిరోధక వ్యవస్థ కారకాలు, అంటువ్యాధులు, అనారోగ్యం వంటి కారణాలు కూడా ఆటిజం స్థితికి కారణమవుతుంటాయి. కొంతమంది పిల్లలకు వంశపారంపర్యంగానూ సంక్రమించే అవకాశం ఉంది. అమ్మాయిల కంటే అబ్బాయిల్లోనే ఆటిజం నిర్ధరణ అవుతున్నట్లు తెలుస్తోంది. వీరికి సాంత్వన చేకూర్చేందుకు కూటమి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. సహిత విద్యా విభాగం, సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో తూర్పు గోదావరి జిల్లాకు కొత్తగా మూడు కేంద్రాలను మంజూరు చేసింది. ఫిజియోథెరపిస్టు, స్పెషల్ ఎడ్యుకేటర్, సూపర్‌వైజర్, సహాయకుడు ఈ కేంద్రాల్లో సేవలందించేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఎక్కడెక్కడంటే..

రాజమహేంద్రవరం నగరంలో బాలుర ఉన్నత పాఠశాల, నిడదవోలు పరిధి సమిశ్రగూడెం, దేవరపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఈ కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయి. రాజమహేంద్రవరానికి రూ. 20 లక్షలు, సమిశ్రగూడెం, దేవరపల్లి కేంద్రాలకు రూ. 30 లక్షలు చొప్పున నిధులు మంజూరు కానున్నాయి. ప్రస్తుతం ఆయా పాఠశాలల్లో తరగతి గదులనే వినియోగించినా భవిష్యత్తులో ప్రత్యేక భవనాలు నిర్మించే అవకాశం ఉండవచ్చు. రాజమహేంద్రవరం నగరంతోపాటు ఏడు నియోజకవర్గాల పరిధిలో ఆటిజం బారిన పడి ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన వారు ఏడుగురు ఉన్నారు. అయితే సుమారు 150 మందికి పైగా ఆటిజం లక్షణాలతో ఉన్నారని, అలాంటి వారికి ఈ కేంద్రాలు తోడ్పడనున్నాయని తెలుస్తోంది. జిల్లాకు మూడు ఆటిజం కేంద్రాలు మంజూరయ్యాని, ఆయా పాఠశాలల్లో గదుల కేటాయింపు ప్రక్రియ జరుగుతోందని జిల్లా సహిత విద్య సమన్వయకర్త కనకబాబు తెలిపారు.

దేవరపల్లి ఉన్నత పాఠశాలలో ఆటిజం కేంద్రం ఏర్పాటుకు ఎంపిక చేసిన భవనం

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

థైరాయిడ్ సమస్యతో బాధ పడుతున్నారా?
అధునాతన రోబోటిక్ సర్జరీతో మీ థైరాయిడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం
ప్రయోజనాలు: తక్కువ నొప్పి | తక్కువ రక్తస్రావం | త్వరితంగా కోలుకోవడం

APEX HOSPITALS
Dr. Nitin Rimmalapudi, M.S.
Robotic Surgeon
అపాయింట్‌మెంట్ కొరకు సంప్రదించండి
93 922 922 00
ప్రకాశ్ నగర్, రాజమండ్రి

(c) eenadu

మహా గణపతికి పంచలోహ కవచం

రాష్ట్రంలో ప్రసిద్ధిచెందిన మందపల్లి శనీశ్వరాలయంలోని మహాగణపతి విగ్రహానికి పంచలోహ కవచాన్ని అలంకరించనున్నారు. మండపేటకు చెందిన శిల్పి వాసా శ్రీనివాస్‌తో విజయవాడకు చెందిన భక్తులు పల్లపురాజు దంపతులు కవచాన్ని తయారు చేయించారు. మహాగణపతి విగ్రహానికి అలంకరించేలా 18 అంగుళాల ఎత్తు, 14 అంగుళాల వెడల్పున్న కవచం రెండు కిలోల బరువున్న పంచలోహాలతో తయారు చేసినట్లు శిల్పి తెలిపారు. శనీశ్వరాలయంలో స్వామివారి కల్యాణం నేపథ్యంలో గురువారం అందిస్తామని వివరించారు. **- న్యూస్‌టుడే, మండపేట**

సుద్దముక్కలతో సూక్ష్మ కళాఖండాలు

పెద్దాపురం పట్టణానికి చెందిన గృహిణి కోరుకొండ మహాలక్ష్మి సుద్దముక్కలతో సూక్ష్మ కళాఖండాలు తయారుచేసి అబ్బుర పరుస్తున్నారు. ఈమె తండ్రి బిక్కవోలు మండలం పందలపాక గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు అప్పల బత్తుల ప్రకాశరావు. తండ్రి తయారుచేసిన వస్తువులను చూసి ఈవిద్యను నేర్చుకున్నారు. సుద్దముక్కలతో సూక్ష్మ కళాఖండాలే కాదు చిత్రలేఖనం, బంగారపు వస్తువుల డిజైనింగ్, కాస్ట్యూమ్స్ డిజైనింగ్, ఇంటీరియల్ డిజైనింగ్‌లోనూ ప్రావీణ్యం సాధించారు. మదర్‌థెరిసా, ప్రధాని నరేంద్రమోదీ, బుద్ధుడు, స్వాతంత్ర్య సమరయోధులు మహాత్మాగాంధీ, అల్లూరి సీతారామరాజు, వినాయకుడు, వేంకటేశ్వరస్వామి, లక్ష్మీదేవి వంటి దేవుళ్ల చిత్రాలు గీశారు. **- న్యూస్‌టుడే, పెద్దాపురం**

ప్రధాని నరేంద్ర మోదీ చిత్రానికి రంగులు అద్దుతున్న కోరుకొండ మహాలక్ష్మి

కొంగల ఆకృతి

ఆలోచన అదిరింది..

రాజులపాలెం గ్రామానికి చెందిన రైతు కుసుమ సత్యనారాయణ పది సెంట్ల విస్తీర్ణంలో ఆకుకూరలు సాగు చేస్తున్నారు. పంటకు నీటితడులు ఇచ్చేందుకు ఆయన చేసిన ప్రయత్నం బాగుంది. చేతిపంపు నీటిని బకెట్‌లో పోసి తీసుకెళ్లే అవసరం లేకుండా అడుగున రంధ్రం చేసి దానికి ప్లాస్టిక్ పైపు అమర్చారు. బకెట్‌లోంచి నీరు నేరుగా పైపు ద్వారా పంటకు చేరుతోంది. దీనికి ఖర్చు, శ్రమ లేకుండా ఉందని ఆయన చెబుతున్నారు. **- న్యూస్‌టుడే, పి.గన్నవరం**

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్‌క్యాష్). ✆ 81422 92071.

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై ఆంధ్రప్రదేశ్ అంతటా మార్టిగేజ్ లోన్స్ మరియు స్థిరాస్తి ఎక్కడ ఉన్నా ఏసంస్థలో ఉన్నా Xerox పేపర్స్‌పై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. 50లక్షలులోపు. అయోధ్య కోఆపరేటివ్ బ్యాంక్. ✆ 93969 99669.

MARRIAGE SERVICES

మంచి ప్రాపర్టీస్. బీసీ పద్మశాలి కన్వెర్ట్ క్రిస్టియన్ బిజినెస్ అబ్బాయి 45 ఇయర్స్ సెకండ్‌కి OC or BCలో కన్వెర్ట్‌గాని హిందూలో గాని లేట్ or సెకండ్‌లో అమ్మాయి మ్యారేజ్ కావాలి (ఎవరులేని అమ్మాయి అయినా పరవాలేదు). డైరెక్ట్: ✆ 9493835167.

PERSONAL CLASSIFIEDS

GREETINGS

REAL ESTATE

PLOT FOR SALE

KAKINADA CITY

308 Sq.yards West facing Commercial site for Sale/Lease at Karanamgari Junction, Kakinada. Cont: 94458 00581, 73933 40994.

JOBS

రాజమండ్రి ప్రముఖ ఎలక్ట్రానిక్స్ షోరూం నందు పనిచేయుటకు బాయ్స్ (హెల్పర్లు) కావలెను. ESI + PF సదుపాయం కలదు. Cell: 94947 11544, 97017 30347.

రాజమండ్రిలో మహాలక్ష్మి మార్కెట్ నందు పనిచేయుటకు అనుభవంగల ఎలక్ట్రీషియన్ కావలెను. మంచి జీతం, రెజ్యూమ్ వాట్సాప్: 99005 39944, 99124 01164

BR INFRACON నందు పనిచేయుటకు సైట్ ఇంజనీర్లు కావలెను. Q: డిప్లొమా, B.Tech/M.Tech అర్హత కలిగి బిల్డింగ్స్, ఇరిగేషన్ వర్క్స్ నందు 3to4 సంవత్సరములు అనుభవం కలిగి విజయవాడ, రాజమండ్రి, ఏలూరు జిల్లాల నందు పనిచేయుటకు కావలెను. పూర్తి బయోడేటాను info@brinfracon.comకి పంపగలరు ✆ 79955 57831.

కాకినాడ టూవీలర్ ఎలక్ట్రికల్ (ఏథర్)షోరూంలో చేయుటకు Service Advisors, Technicians, Sales Executives కావలెను. 8008884256

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. **4-85** పై॥

అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో ధ్రువీకరించుకోవలసిందిగా పాఠకులకు మనవి...

న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

గొల్లవిల్లిలో వాలీబాల్ సంరంభం

గ్రామంలో పోటీలకు ఏర్పాటుచేస్తున్న మైదానం

పట్టణాలే కాదు పల్లెలుకూడా జాతీయ స్థాయి క్రీడాకారులను అందించే వేదికగా నిలుస్తున్నాయి. ఇందుకు నిదర్శనం ఉప్పలగుప్తం మండలంలోని గొల్లవిల్లి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివే విద్యార్థులు వాలీబాల్ క్రీడలో ప్రావీణ్యం కనబరుస్తున్నారు. ఈ పాఠశాలలో చదివే విద్యార్థులు సైతం జాతీయస్థాయి పోటీల్లో మెరుస్తూ గ్రామానికి కీర్తిప్రతిష్ఠలు తెస్తున్నారు. ఇక్కడ చదివే విద్యార్థులు అన్నిరంగాల్లో ప్రావీణ్యం సాధించడం గమనార్హం.

క్రీడా గ్రామంగా ప్రస్థానం ఇలా..

1989లో తూర్పుగోదావరి జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు పాఠశాల మైదానంలో ప్రారంభించడంతో స్థానిక క్రీడాకారులకు, గ్రామస్థులకు ఆసక్తి పెరిగింది. దీంతో తిరిగి 2000 సంవత్సరంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించి విజయవంతంగా నడిపించడంతో ఇక్కడి ప్రాంగణానికి మంచి పేరు వచ్చింది. 2017లో జాతీయస్థాయి పోటీలకు గొల్లవిల్లి గ్రామం ఆతిథ్యమిచ్చింది. అప్పటినుంచి ఈ గ్రామం వాలీబాల్ గ్రామంగా మారిపోయింది. 2018లో ఇదే ప్రాంగణంలో నిమ్మకాయల రంగయ్య మెమోరియల్ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించి జాతీయస్థాయి గుర్తింపు తెచ్చారు. 2025లో తిరిగి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అరిగెల శ్రీరంగయ్య (ఎస్ఆర్) వాలీబాల్ టోర్నమెంట్ పేరుతో గ్రామస్థులు జాతీయస్థాయి మహిళా, పురుషుల వాలీబాల్ పోటీలు నిర్వహించి గ్రామానికి పూర్వవైభవం తెచ్చారు. అదే పేరుతో ఈ నెల 15 నుంచి శివరాత్రి పురస్కరించుకుని 5 రోజుల పాటు ఎస్ఆర్ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. అందుకు తగ్గ ఏర్పాట్లు గొల్లవిల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో చురుగ్గా సాగుతున్నాయి. మహిళా, పురుష క్రీడాకారులకు వేరు వేరుచోట్ల విశ్రాంతి గదులు సిద్ధం చేశారు. ప్రాంగణం చుట్టూ ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేస్తున్నారు.

అన్ని సిద్ధం చేస్తున్నాం..

గత ఏడాది కంటే మెరుగ్గా క్రీడాకారులకు వసతి సౌకర్యం ఏర్పాటు చేశాం. సుమారు 6 వేల మంది మహిళలు, పురుషులు వేర్వేరుగా మ్యాచ్‌లను వీక్షించేలా గ్యాలరీలు సిద్ధం అవుతున్నాయి. ప్రతీరోజు సాయంత్రం ఆరు నుంచి రాత్రి 12వ రకూ మ్యాచ్‌లు జరిగే అవకాశం ఉంది.

- దేశంశెట్టి లక్ష్మీనారాయణ, ఏఎస్ఆర్ టోర్నమెంట్ అధ్యక్షుడు

రేపటి నుంచి గోలింగేశ్వరస్వామి కల్యాణ వేడుకలు

నిడదవోలు: నిడదవోలులోని రాజరాజేశ్వరి సహిత గోలింగేశ్వస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. పట్టణ నడిబొడ్డున ఉన్న చారిత్రాత్మకమైన గోలింగేశ్వర స్వామిని ఈ ప్రాంత ప్రజలు తమ ఇలవేల్పుగా భావిస్తారు. ఈనెల 13 నుంచి 17వ తేదీ వరకు ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ నామా సూర్యప్రకాశరావు తెలిపారు. 13న స్వామికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమపూజలు, రాత్రి స్వామివారి కల్యాణం జరుగుతుందన్నారు. 14న స్వామికి రుద్రాభిషేకాలు, 15న మహాశివరాత్రి సందర్భంగా తెల్లారుజామున మూడు గంటల నుంచి స్వామివారి మహాదర్శనం, రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహిస్తారు. మహాశివరాత్రి రోజున రుద్రాభిషేకాలు నిర్వహించుకునే భక్తులకు తెల్లారు జామున 3 నుంచి 5 గంటల వరకు, ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమయం కేటాయించారు. 16న స్వామికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమపూజలు, 17న స్వామివారికి శ్రీపుష్పయాగోత్సవం నిర్వహించనున్నారు.

బహిరంగ వేలం

తేది: 13-02-2026 (శుక్రవారం)

Veh. No.	Vehicle Description	Year
AP39TX6333	MARUTHI DZIRE TOUR DIESEL-P	2019
AP35AB8220	SWIFT VDI DIESEL 5 SEATER	2014
AP39TK2403	MARUTHI DZIRE DIESEL-P	2013

వేలం జరుగు ప్రదేశం

శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా Ltd., NH-16, భారత్ పెట్రోల్ బంక్ ఎదురుగా, రాజానగరం, రాజమండ్రి, E.G.Dt.

శ్రీరామ్ ఫైనాన్స్ Ltd., D.No. 54-9-8, A.V.అప్పారావు రోడ్, రాజమండ్రి. 0883-2465088, 98499 81384

రుమటాలజిస్ట్ చెన్నై నుండి రాక

డా॥ కవిత M.D, DNB, D.M., SCE (Rheumatology)

కీళ్ళ వాతం, గౌట్, SLE, APLA మొ॥ వ్యాధుల చికిత్సా నిపుణులు

డాక్టరు గారు తేది: 14-2-2026 (శనివారం) విచ్చేయుచున్నారు

అపాయింట్‌మెంట్ కొరకు: 98854 22345, 96662 61803, 08816-223728

A+ అభిరామ్ హాస్పిటల్స్ వాటర్ ట్యాంక్ దగ్గర, జె.పి.రోడ్, భీమవరం

14న చదరంగం పోటీలు

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్-7, 9, 11, 13, 15 బాల, బాలికల చదరంగం పోటీలు ఈనెల 14న రాజమహేంద్రవరంలోని కాల్ఫ్యూషన్ చెస్ అకాడమీలో నిర్వహిస్తున్నట్లు అకాడమీ డైరక్టర్ కుమార్ విత్తనాల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు 95051 42888ను సంప్రదించవచ్చును.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్ళలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	18,500
పాతకాయ: గండేరా	30,500
గటగట	29,000
కొత్తకాయ: గండేరా	30,000
గటగట	29,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	20,000-21,000
కొత్త (పచ్చి) కాయ	16,000-17,000
కొబ్బరినూనె మార్కెట్: 15 కిలోలు	5,000
కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	120-00
రిటైల్ లైవ్	147-00
డ్రెస్డ్	213-00
స్కిన్‌లెస్	243-00

వేతన ఒప్పందంపై రెండోసారి చర్చలు విఫలం

దేవరపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని గౌరీపట్నంలో క్రషర్ కార్మికుల నూతన వేతన ఒప్పందంపై బుధవారం జరిగిన చర్చలు విఫలమయ్యాయి. గతంలో జరిగిన వేతన ఒప్పందం జనవరి 8న ముగియడంతో నూతన ఒప్పందం కోసం రెండుసార్లు క్రషర్, క్వారీ యజమానుల సంఘంతో చర్చలు జరిపారు. కార్మిక యూనియన్ నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం కార్మికులకు రోజుకు (24 గంటలకు) రూ.1300 వేతనం ఇస్తున్నారని, అదనంగా రూ.700 పెంచి రూ.2000 ఇవ్వాలన్నారు. సంక్రాంతి పండగ సందర్భంగా నెల రోజుల వేతనం బోనస్‌గా ఇవ్వాలని, ప్రతి కార్మికుడికి రూ. 10 లక్షలు ప్రమాద బీమా చేయించాలని, క్రషర్ ఆడే సమయంలో కార్మికులకు 150 గ్రాముల బెల్లం, రెండు అరటి పండ్లు, మాస్కు, మంచినీటి సదుపాయం, కార్మికులను పని నుంచి తొలగించిన తరువాత చేసిన కాలానికి సర్వీస్ (గ్రాట్యూటీ) చెల్లించాలని డిమాండ్ చేశారు. యజమానుల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో వేతనాలు పెంచలేమని అందరితో సమీక్షించిన తర్వాత మంగళవారం చర్చలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ చర్చల్లో యజమానుల సంఘం అధ్యక్షుడు ఆంద్రు అనిల్, సూర్యనారాయణరాజు, సత్యనారాయణ, దోనెల్లి మధుబాబు, కార్మిక సంఘం నాయకులు ఎస్కే మస్తాన్, కన్నే సత్యనారాయణ, కృష్ణ, రాము, రాజు, తదితరులు పాల్గొన్నారు.

చర్చల్లో పాల్గొన్న యజమానులు, కార్మికులు

నేడు మహిళల హాకీ తుది పోరు

మసీదు సెంటర్ (కాకినాడ): కాకినాడ డీఎస్ఏలో జరుగుతున్న కోకనాడ గోల్డ్ కప్ హాకీ టోర్నమెంట్ తుది దశకు చేరింది. గురువారం మహిళల విభాగంలో హాకీ హరియాణా, ఎన్‌సీవోఈ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరగనుంది. పురుషుల క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు బుధవారం ఉత్సాహంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా మాజీ రైల్వే ఉద్యోగి రత్నాకర్, మాజీ ఇన్‌కంటాక్స్ అధికారి వెంకటేశ్వర్లు తదితరులు హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని, మ్యాచ్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డులు అందజేశారు. కె.రవిచంద్రప్రసాద్, ఎ.బాబ్జి, క్లబ్ సభ్యులు పర్యవేక్షించారు.

తోడుగా వచ్చి.. ప్రాణాలు తీసి!

సహజీవనం చేస్తున్న వ్యక్తిని హతమార్చిన మహిళ

విశాఖపట్నం(ఆనందపురం): సహజీవనం సాగిస్తున్న ఇద్దరి మధ్య గొడవలు రావడంతో పురుషుడిని మహిళ దారుణంగా హత్య చేసిన ఘటన విశాఖపట్నం జిల్లా ఆనందపురం శివారు పందుల ఫారంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. మధురవాడ ప్రాంతానికి చెందిన పైడిరాజు ఆనందపురం శివారులో రెండేళ్ల నుంచి పందుల ఫారం నిర్వహిస్తున్నాడు. రాజమహేంద్రవరానికి చెందిన ఎస్.నాగశివ(38), షేక్ ముబీనా(శ్రావణి)(41) భార్యాభర్తలుగా పైడిరాజుకు పరిచయం చేసుకుని, ఫారం నిర్వహణ పనులు చూసుకుంటున్నారు. మంగళవారం అర్ధరాత్రి ఇద్దరూ మద్యం తాగి గొడవపడ్డారు. నాగశివ అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు శ్రావణి బుధవారం ఉదయం పోలీసులకు సమాచారం ఇచ్చింది. మృతుడి శరీరంపై గట్టి దెబ్బలు ఉండడంతో శ్రావణిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించి, ఆమె హత్య చేసినట్లు నిర్ధారించారు.

వృద్ధురాలి మెడలో పుస్తెలతాడు చోరీ

● ఆమె ప్రతిఘటించడంతో ఈడ్చుకెళ్లిన దొంగ

రాయవరం, న్యూస్‌టుడే: ఒంటరిగా వెళ్లే మహిళల మెడలో గొలుసులు, పుస్తెలతాళ్లను చోరీ చేయడమే లక్ష్యంగా కొందరు రెచ్చిపోతున్నారు. రాత్రి సమయాల్లో దొంగలు బరితెగిస్తున్నారు. మంగళవారం రాత్రి రాయవరంలో జరిగిన ఘటనే దీనికి ఉదాహరణ. ఎస్సై డి.సురేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. రెడ్ల రామాలయం వద్ద కిరాణ సరకులు కొనుగోలుచేసిన వృద్ధ దంపతులు పులగం భామిరెడ్డి, లక్ష్మి ఇంటికి వెళుతుండగా చీకట్లో చరవాణి చూస్తూ ఓ యువకుడు ఆకస్మికంగా ఆమె మెడలోని 11 కాసుల బంగారు పుస్తెలతాడును లాక్కొనే ప్రయత్నం చేశాడు. బిత్తరపోయిన ఆమె తాడును చేతితో పట్టుకుని కేకలు వేస్తూ తీవ్రంగా ప్రతిఘటించింది. దీంతో ఆమెను ఈడ్చుకుంటూ చేతికి అందినంత తాడును పట్టుకుని ఆ యువకుడు పరారయ్యాడు. భార్య లక్ష్మి కేకలు విని ముందు నడుస్తున్న భామిరెడ్డి దొంగ వెళ్లిన వైపు కొంతదూరం వెళ్లినా చీకట్లో పట్టుకోలేకపోయారు. బాధితురాలి మెడ, మోచేయిపై స్వల్ప గాయాలయ్యాయి. సుమారు 25 గ్రాములపైనే బంగారుతాడు చోరీకి గురైందని ఆమె ఫిర్యాదుచేయగా కేసు నమోదుచేసినట్లు ఎస్సై చెప్పారు.

చోరీ జరిగిన ప్రదేశంలో బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్సై సురేష్‌బాబు

సీసీ కెమెరాలు లేని ప్రాంతంలో..

చోరీ ఘటనకు ముందు రావిచెట్టు సమీపంలో ఆ యువకుడు సిమెంట్‌బల్లపై కూర్చొని ఉన్నాడని బాధితులు చెబుతున్నారు. ఆ వీధిలో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ కెమెరా పరిధిలోకి రాని ప్రాంతంలో ఆమెపై దాడికి పాల్పడి.. పుస్తెలతాడును తెంచేందుకు ప్రయత్నించాడని పోలీసులు గుర్తించారు. ముందుగా ఆ ప్రాంతంలో కలియతిరుగుతూ చోరీకి పాల్పడ్డాడని స్థానికులు చెబుతున్నారు. ఘటన జరిగిన ప్రాంతంతో పాటు పరిసరాలు, గ్రామంలోని ప్రధాన కూడళ్ల సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నామని ఎస్సై చెప్పారు.

ప్రసాదం కౌంటర్ వద్ద వీరంగం.. యువకులపై చర్యలు

అన్నవరం: అన్నవరం కొండ దిగువున తొలి పావంచాల వద్ద ప్రసాదం విక్రయ కౌంటర్ వద్ద వీరంగం సృష్టించిన యువకులపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. ఈనెల 8న మధ్యాహ్నం కొందరు యువకులు క్యూలైన్లో ఉన్న ఓ వ్యక్తిపై దాడికి దిగి అక్కడి వారిని భయభ్రాంతులకు గురి చేసిన విషయం విదితమే. ప్రసాదం టికెట్లు ఇచ్చే కౌంటర్ వద్ద క్యూలైన్లలో వెళ్లే సమయంలో యవకులు హడావుడి చేసి లైన్లో ఉన్న మరో వ్యక్తితో వాగ్వాదానికి దిగారు. రెచ్చిపోయిన యువకులు లైన్లో నుంచి బారికేడ్లపై నుంచి ప్రమాదకరంగా దూకి వెళ్లి దాడి చేశారు. దీంతో భక్తులు ఆందోళనకు గురయ్యారు. అక్కడి వారు వీడియో తీయగా సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేసింది. ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. జిల్లా ఎస్పీ ఆదేశాలతో సీసీ కెమెరాల ద్వారా పోలీసులు పరిశీలించారు. వీరిది పెదపూడి మండలం గండ్రేడు గ్రామంగా గుర్తించారు. వీరంతా తలుపులమ్మ లోవ ఆలయానికి వెళ్లి వస్తూ వీరంగం సృష్టించారని తెలుసుకున్నారు. దాడికి పాల్పడిన 10 మంది యువకులను అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. వీరిని బైండోవర్ చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నామని ఎస్సై శ్రీహరిబాబు తెలిపారు.

92.7 FM Rajamahendravaram 92.7 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

చోరీ చేసిన వాహనాలపై గంజాయి రవాణా

పోలీసుల అదుపులో నిందితులు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: జల్సాలకు అలవాటు పడి ద్విచక్రవాహన చోరీలు, గంజాయి రవాణా వంటి నేరాలకు పాల్పడుతున్న ఇద్దరికి రాజమహేంద్రవరంలోని రెండో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా ఇరగవరం మండలం రేలంగి గ్రామానికి చెందిన తానేటి జయేంద్రవర్మ, అదే ప్రాంతానికి చెందిన మరో బాలుడు గంజాయి వ్యాపారం చేస్తే ఎక్కువ డబ్బు వస్తుందని భావించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో అయిదు ద్విచక్రవాహనాలను చోరీ చేశారు. విశాఖ, సీలేరు మన్యం ప్రాంతాల్లో వాహనాల ద్వారా 1.8 కిలోల గంజాయిని నగరానికి తరలించారు. ఆల్కాట్‌తోట రైతుబజార్ దగ్గర్లో రెండో పట్టణ పోలీసులు గంజాయితో ఉన్న వీరిని పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా Bank of Baroda

ROSARB - రాజమండ్రి. 5వ అంతస్తు, 36-7-14, కొండూరి స్క్వేర్, ఇన్నీస్‌పేట, రాజమండ్రి-533102.

ఈ వేలం ద్వారా వాహనముల అమ్మకం https://baanknet.com

క్ర. నెం.	ఋణగ్రహీత / హామీదారు పేరు & చిరునామా	హైపోథికేటెడ్ వాహనము / మెషినరీ తయారీ - మోడల్ మొదలగు పూర్తి వివరములు	బకాయి మొత్తం
1	శ్రీ సుంకర సత్యనారాయణ, #1-33, రామాలయం స్ట్రీట్ దగ్గర, సీతానగరం, తూర్పు గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్-533287.	వాహనం నెం: AP 39 UQ 3434; తయారీ సం: 05-2023; తయారీ: Eicher (VE Commercial Vehicles Ltd.); మోడల్: EICHER PRO 2110 H HSD BS VI; కలర్: New Golden Brown	రూ.23,82,227/-
	రిజర్వు ధర: రూ.11,70,000/- ; ధరావత్తు: రూ.1,17,000/-		
2	శ్రీ సంపత్కొర్ శ్రీనివాసరావు, 4-5-26, అంబేడ్కర్ స్ట్రీట్, రామచంద్రపురం, సీతానగరం, తూర్పు గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్-533287.	వాహనం నెం: AP 39 UQ 3969; తయారీ సం: 03-2023; తయారీ: Ashok Leyland Ltd; మోడల్: CA1615/47 FBL; కలర్: NP Brown	రూ.24,28,417.55
	రిజర్వు ధర: రూ.11,70,000/- ; ధరావత్తు: రూ.1,17,000/-		
3		వాహనం నెం: AP 39 UM 0959; తయారీ సం: 2022; తయారీ: ASHOK LEYLAND; మోడల్: ASHOK LEYLAND TIPPER (NE2825N/39T TIP); కలర్: WHITE	రూ.45,66,183.52
	రిజర్వు ధర: రూ.17,82,000/- ; ధరావత్తు: రూ.1,79,000/-		
4		వాహనం నెం: AP39VA2339; తయారీ సం: 2023; తయారీ: Mahindra & Mahindra Ltd; మోడల్: BLAZO35HLBS6P61CB; కలర్: ARTIC WHITE	రూ.43,17,204/-
	రిజర్వు ధర: రూ.21,60,000/- ; ధరావత్తు: రూ.2,16,000/-		
5		వాహనం నెం: AP39UP9889; తయారీ సం: 2023; తయారీ: EICHER (VE COMMERCIAL VEHICLES LTD); మోడల్: EICHER PRO 3015XP J HSD BS6; కలర్: NEW GOLDEN BROWN	రూ.22,07,926.50
	రిజర్వు ధర: రూ.14,85,000/- ; ధరావత్తు: రూ.1,49,000/-		

వేలం యొక్క తేది: 04.03.2026, సమయం: మ॥ 02.00 గం.ల నుండి సా॥ 6.00 గం.ల వరకు. బిడ్ పెంపుదల మొత్తం: రూ.10,000/-

తేది: 11-02-2026, ప్రదేశము: రాజమండ్రి — సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా

బ్యాంక్ ఆఫ్ ఇండియా Bank of India **BOI** — నిడదవోలు బ్రాంచ్, డోర్ నెం.3-10-8, డా॥ శ్రీరామ్ మూర్తి హాస్పిటల్ రోడ్, రామ్‌నగర్, నిడదవోలు, తూర్పు గోదావరి జిల్లా, ఆం.ప్ర-534301. ఫోన్: 08813-221414. ఇ-మెయిల్: Nidadavolu.visakhapatnam@bankofindia.co.in

స్వాధీనత ప్రకటన అపెండిక్స్-IV రూల్ నెం.8(1) (స్థిరాస్తి కొరకు)

... తేది: 07.02.2026, ప్రదేశం: నిడదవోలు — సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ ఇండియా

కెనరా బ్యాంక్ Canara Bank — ప్రాంతీయ కార్యాలయం : భీమవరం, రెండవ అంతస్తు, జె.పి. రోడ్, భీమవరం-534204. ఫోన్: 0883-2555609

స్థిరాస్తుల అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

ఇ-వేలం తేది & సమయం: 17-03-2026, మ॥ 02.00 గం.ల నుండి సా॥ 04.00 గం.ల వరకు

రిజర్వు ధర: రూ. 23,00,000/- ; ధరావత్తు సొమ్ము: రూ. 2,30,000/-

తేది: 04-02-2026, ప్రదేశం: భీమవరం — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

(c) eenadu

రాజమహేంద్రవరం

నియామకపత్రాల అందజేత

దేవీచౌక్: భాజపా ఎస్సీ మోర్చా నూతన కమిటీ సభ్యులకు బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు తగరం సురేష్ బాబు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా భాజపా జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దళితుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రవేశపెట్టిన అనేక పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరికీ అందించేలా నూతన కమిటీ కార్యాచరణ ఉండాలని పిలుపునిచ్చారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. పార్టీలో అందరికి గుర్తింపు ఉంటుందన్నారు.

పాండురంగ స్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం

కోరుకొండ : స్థానిక రుక్మిణీ సమేత పాండురంగస్వామి కల్యాణ మహోత్సవాలు ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు జరుగనున్నాయని ఆలయ కమిటీ సభ్యులు, అర్చక స్వామి అనిపెద్ది శ్రీనివాసరావు శర్మ తెలిపారు. 12న పంచామృతాభిషేకం, 13న కల్యాణోత్సవం, 14న అన్న సమారాధన, 15న పుష్పాలంకరణ, పవళింపు సేవ ఉంటుందన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 83282 39927, 80089 02897

సమస్య: స్థానిక గాంధీపురంలోని వైశ్య హాస్టల్ వీధిలో రాత్రివేళ అంధకారంగా ఉంటుంది. దీంతో రాకపోకలకు ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఇక్కడ వీధిదీపం ఏర్పాటు చేయాలి.
– సాయినాథ్, స్థానికుడు

సమస్య: నగరంలో పలు చోట్ల వీధిదీపాలు సక్రమంగా వెలగడంలేదు. కొన్నిచోట్ల పట్టపగలే వెలుగుతూ కన్పిస్తున్నాయి.
– గోవింద్, నగరవాసి

సమాధానం: సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.
– విమల, ఎలక్ట్రికల్ ఏఈ – న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

స్పందనకు వందనం

నగరంలోని వివిధ సమస్యలపై 'మేమున్నాం.. మీకుతోడుగా'కు ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను నగరపాలక సంస్థ ఆయా విభాగాల అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వాటి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారు. ● స్థానిక ఆర్డీవో కార్యాలయం నుంచి గోకవరం బస్టాండ్ వైపు వెళ్లే మార్గంలో దామెర్ల ఆర్ట్ గ్యాలరీ సమీపంలో పేరుకుపోయిన చెత్తను పారిశుద్ధ్య సిబ్బంది తరలించినట్లు ఫిర్యాదుదారుడు శాంతారావు తెలిపారు. ● స్థానిక తుమ్మలావ సాంబశివరావుపేటలోని నాలుగో అడ్డవీధిలో పేరుకుపోయిన చెత్త పారిశుద్ధ్య సిబ్బంది తొలగించినట్లు ఫిర్యాదుదారుడు కుమారస్వామి తెలిపారు. – న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

పకడ్బందీగా పారిశుద్ధ్య నిర్వహణ

● 'డయల్ యువర్ ఎంహెచ్‌వో'కు విశేష స్పందన

ఫోన్ ఇన్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఎంహెచ్‌వో వినూత్న

ఈనాడు మీతోడు

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలో పారిశుద్ధ్యం మెరుగుపర్చేందుకు కృషి చేస్తున్నామని నగరపాలక సంస్థ ఆరోగ్య విభాగం అధికారిణి వినూత్న తెలిపారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 'డయల్ యువర్ ఎంహెచ్‌వో'కు పాఠకుల నుంచి విశేష స్పందన వచ్చింది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పారిశుద్ధ్య సమస్యలను ఆమె దృష్టికి తెచ్చారు. ఎంహెచ్‌వో మాట్లాడుతూ.. రానున్న పుష్కరాల నేపథ్యంలో కార్మికుల సంఖ్య పెంచుతామన్నారు. ప్రధాన కాలువల్లో పూడిక తీత పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు కాలువల్లో పూడికలు తీసేందుకు సిబ్బందిని నియమించామన్నారు. ఇంటింటా చెత్త సేకరణ పూర్తి స్థాయిలో జరుగుతుందన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే నేరుగా ఫిర్యాదు చేయాలన్నారు. పుష్కరాలకు 14వేల మంది కార్మికులను ఘాట్‌ల వద్ద ఏర్పాటు చేస్తామన్నారు. దోమల నిర్మూలనకు నిరంతం ఫాగింగ్, స్ప్రేయింగ్ క్రమం తప్పకుండా జరుగుతుందన్నారు. ఇంటింటికీ చెత్త సేకరణ వాహనాలు తిరుగుతున్నాయన్నారు. పారిశుద్ధ్య సిబ్బందికి తడి,పొడి చెత్త అందించి, సహకరించాలన్నారు.

? రాజేంద్రనగర్, రామాలయం వీధుల్లో కాలువల్లో పూడిక పేరుకు పోయింది. సకాలంలో పూడిక తొలగించడం లేదు. - రాజు

? దానవాయిపేట యేరుకొండ వారి వీధిలో కాలువల్లో పూడికలు తొలగించడం లేదు. - లక్ష్మీతులసి

? పీఅండ్‌టీ కాలనీలో కాలువల్లో పూడిక తొలగించడం లేదు. - సూర్యచంద్రరావు

✓ కాలువల్లో పూడిక ఎప్పటికప్పుడు తొలగించే విధంగా చర్యలు తీసుకొంటాం.

? జాంపేట వీధుల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేదు. వీధుల్లో చెత్త తొలగించడం లేదు - లక్ష్మణమూర్తి, జాంపేట

? లలితానగర్‌లో ఇంటింటా చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదు. - లక్ష్మి, లలితానగర్

✓ తక్షణం సిబ్బంది పంపించి, జాంపేట, లలితానగర్‌లో సమస్య పరిష్కరిస్తాం.

? దేవీచౌక్ నుంచి ఆర్యాపురం వెళ్లే రోడ్డులో కాలువలు శుభ్రం చేయడం లేదు. - సుబ్బారావు, దేవీచౌక్

? కంబాలచెరువు వెంకటేశ్వర అపార్ట్‌మెంట్ ఆవరణ చుట్టూ ఉన్న కాలువల్లో పూడికలు తొలగించడం లేదు. - సురేష్, కంబాలచెరువు

? స్వతంత్ర ఆసుపత్రి రోడ్డులో ఆక్రమణలు పెరిగిపోవడం వల్ల కాలువలు అధ్వానంగా మారాయి. - రమ్య

? మురుగు కాలువల్లో ప్రణాళికా బద్ధంగా పూడిక తొలగించడం లేదు. దోమలతో ఇబ్బందిగా ఉంది. - సుప్రియ

✓ పెద్ద కాలువల్లో యంత్రాలతో పూడికను తొలగించాల్సి ఉంది. ఈ మేరకు త్వరలో పూడిక తీసే ప్రక్రియను చేపడతాం.

? సమస్య: దానవాయిపేటలో పలు భవనాలు శిథిలావస్థకు చేరాయి. కొందరు ఆయా భవనాల్లో రాత్రి పూట అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. తుప్పలు పేరుకుపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. - లక్ష్మీనారాయణ, దానవాయిపేట

✓ సమాధానం: ఆ మధ్య ఖాళీ స్థలాలు, భవనాలు ఉంటే సంబంధిత యజమానులను గుర్తించి నోటీసులు జారీ చేస్తున్నాం. - ఎంహెచ్‌వో, వినూత్న

వీధి కుక్కల నియంత్రణపై దృష్టి

? ఆర్యాపురం మధ్య వీధిలో వీధి కుక్కల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. - తేజస్వి, ఆర్యాపురం

? మల్లికార్జునగర్‌లో వీధి కుక్కల సమస్య తీవ్రంగా ఉంది. - శ్రీకాంత్, మల్లికార్జున నగర్

? త్యాగరాజనగర్‌లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. రాత్రయితే బయటకు రావాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. - ప్రకాష్, త్యాగరాజనగర్

✓ వీధి కుక్కల నియంత్రణకు శస్త్ర చికిత్సలు చేస్తున్నాం. వీటిని తరలించి దానికి ప్రత్యేకంగా వ్యాన్ తిరుగుతోంది.

త్యాగశీలి దీన్ దయాళ్ ఉపాధ్యాయ

దేవీచౌక్, న్యూస్‌టుడే: దేశంకోసం, పార్టీకోసం జీవితాన్ని త్యాగం చేసిన జనసంఘ్ మాజీ అధ్యక్షుడు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ త్యాగశీలి అని భాజపా జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర కొనియాడారు. బుధవారం రాజమహేంద్రవరం ప్రధానంలోని పార్టీ కార్యాలయంలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని కార్యకర్తల సమక్షంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దీన్ దయాళ్ ఉపాధ్యాయ తన ఏకాత్మ మానవవాద సిద్ధాంతంతో భారతీయ సంస్కృతి ఆధారంగా దేశాభివృద్ధి జరగాలని కోరుకున్నారన్నారు. అంతకుముందు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీప్రసన్న, కార్యదర్శి బొమ్ముల దత్తు, కోమలి లక్ష్మీనారాయణ, అడబాల రామకృష్ణారావు, అన్నె కృష్ణన్, పొట్టూరి రామ్మోహనరావు, యానాపు ఏసు, కురగంటి సతీష్, మద్దిపాటి రజని, రాజేష్‌కుమార్ జైన్, తదపర్తి వల్లి పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న భాజపా జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర

జీతాలకనుగుణంగా పింఛన్ పెంచాలి

మాట్లాడుతున్న రాజేష్ కుమార్ పాటిల్

టి.నగర్, న్యూస్‌టుడే: పెరుగుతున్న జీతాలకు అనుగుణంగా పెన్షన్ రివిజన్ జరగాల్సి ఉందని ఎస్‌బీఐ పింఛనుదారుల సంఘం ప్రతినిధులు అన్నారు. బుధవారం టీఎస్‌కే గార్డెన్స్‌లో నిర్వహించిన ఎస్‌బీఐ పింఛనుదారుల సంఘం అమరావతి సర్కిల్ సర్వసభ్య సమావేశంలో చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్ పాటిల్, డిప్యూటీ జనరల్ మేనేజర్ పంకజ్ కుమార్, జనరల్ సెక్రటరీ బీకే నరసింహ మాట్లాడారు. చాలీచాలని పింఛన్‌తో విశ్రాంత ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధ్యక్షుడు రాధాకృష్ణ, రాష్ట్ర ప్రతినిధులు చంద్రశేఖర్, కాశీ విశ్వనాథ్, సునీల్, కృష్ణ కుమార్, రామచంద్రరావు, జార్జి ఆంటోని తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో రాణించాలి

రాజానగరం: నన్నయ విశ్వవిద్యాలయంలో సెపక్ తక్రా మెన్ అండ్ ఉమెన్ పోటీలకు అంతర్ కళాశాల, యూనివర్సిటీ టీం ఎంపికను వీసీ ఎస్.ప్రసన్నశ్రీ బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కష్టపడి సెపక్‌తక్రాలో విద్యార్థులు ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. వర్సిటీ నైపుణ్యం కలిగిన క్రీడాకారులను తయారు చేసే వేదికగా మారుతుందన్నారు. ఎంపికలో యూనివర్సిటీ, అనుబంధ కళాశాలలకు చెందిన విద్యార్థులు 30, విద్యార్థినులు 12 మంది పాల్గొనగా.. ప్రతిభ కనబరిచిన 8 మంది విద్యార్థులు, ముగ్గురు విద్యార్థినులను కోచింగ్ క్యాంపునకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ క్యాంపులో ప్రతిభ కనబరిచిన వారు మార్చి 11 నుంచి 14 వరకు అస్సాం యూనివర్సిటీలో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. నిర్వాహణా కమిటీ ఛైర్మన్ పి.వెంకటేశ్వరావు, కార్యదర్శి కె.బాలసత్యనారాయణ, అబ్జర్వర్ ఎంవీఎస్ఎన్ మూర్తి, ఎంపిక కమిటీ సభ్యులు కె.కనకరాజు, కె.సతీష్ పాల్గొన్నారు

శివరాత్రి ఉత్సవాలకు కోటిలింగేశ్వరాలయం ముస్తాబు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : పవిత్ర గోదావరి చెంతన కోటిలింగాలపేటలో కొలువైన శ్రీఉమా కోటిలింగేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. దేవాదాయ ధర్మదాయశాఖ ఆధీనంలోని దేవస్థానంలో ఈనెల 12 నుంచి 16 వరకు స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ అధికారులు తెలిపారు. శివరాత్రి పర్వదినం రోజున భారీఎత్తున భక్తులు తరలి వచ్చే ఆలయం కావడంతో ఈ ఆలయానికి ప్రత్యేకత ఉంటుంది.

కోటిలింగేశ్వరస్వామి ఆలయం

దివ్య కల్యాణ మహోత్సవాలు..

● ఈనెల 12న ఉదయం 8.45 గంటలకు స్వామి, అమ్మవారికి మంగళస్నానాలు, పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెగా అలంకరణ, గణపతి పూజ, ధ్వజారోహణ, అంకురార్పణ, బలిహరణ, మధ్యాహ్నం 3గంటలకు గ్రామోత్సవం, సాయంత్రం స్వామివారికి అగ్నిప్రతిష్ఠాపన, రాత్రి 8.45గంటలకు కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. ● 13, 14 తేదీల్లో స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు. ● 15న మహాశివరాత్రి సందర్భంగా రాత్రి 1.05గంటల నుంచి స్వామివారికి విశేష అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజ అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పిస్తారు. మధ్యాహ్నం 2.10గంటలకు రథోత్సవం, రాత్రి 10.15గంటల నుంచి లింగోద్భవ అభిషేకాలు నిర్వహిస్తారు. ● 16న ఉదయం స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజలు, వసంతోత్సవం, త్రిశూల స్నానం, రాత్రి 7.15 గంటలకు పుష్పోత్సవం నిర్వహిస్తారు.

ఆక్రమణలపై చర్యలు

రాజానగరం, న్యూస్‌టుడే: చాగల్నాడు ఎత్తిపోతల పథకం పిల్లకాలువపై ఆక్రమణలను బుధవారం అధికారులు తొలగించారు. జాతీయ రహదారి పక్కన కాలువపై ఆక్రమణలు చేపట్టడంతో దిగువ పొలాలకు నీరు అందడం లేదని స్థానిక రైతులు పోలీసులు, ఎత్తిపోతల పథకం ఏఈ సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ జి.ఎ.ఎల్.ఎస్.దేవి, సీఐ ప్రసన్న వీరయ్యగౌడ్ సమక్షంలో సిబ్బంది ప్రొక్లెయిన్ సాయంతో ఆక్రమణలను తొలగించారు. కాలువ నీరు వెళ్లకుండా ఇబ్బంది లేకుండా ఆక్రమణలను తొలగించినట్లు ఏఈ సత్యనారాయణ తెలిపారు. త్వరలో సర్వే చేపట్టి చర్యలు ఆక్రమణలకు పాల్పడిన వారిపై తీసుకుంటామని తెలిపారు.

పొక్లెయిన్‌తో మట్టి తొలగిస్తున్న అధికారులు

ప్రకటన

నా క్లయింటు అయిన తూర్పుగోదావరి జిల్లా, రాజమండ్రి, దానవాయిపేట, డో.నెం. 78-15-21/2 [illegible] పాటంశెట్టి సూర్యకాంతం [illegible] Ac. 0.24 Cents [illegible] సెటిల్‌మెంట్ డాక్యుమెంట్ నెం. 8507/2017, Dt. 18-3-2017, SRO, రాజమండ్రి [illegible] తనఖాలు గాని, కోర్టు కేసులు గాని, వారసత్వపు హక్కులు గాని, బ్యాంకు లోనులు గాని మరియు ఏవిధమైన అభ్యంతరములు ఉన్న యెడల 10 రోజులలో వారి అభ్యంతరములను వ్రాతపూర్వకంగా తగిన ఆధారముల కాపీలతో ఈక్రింది అడ్రస్‌కి తెలియజేయవలెను. గడువు తేది తదుపరి వచ్చు అభ్యంతరములు నా క్లయింటును మరియు ఆస్తిని బైండు చేయవని, గడువు తేదీలోపు ఏవిధమైన అభ్యంతరములు రాని ఎడల నా క్లయింటు పైన తెలిపిన ఆస్తిని నిర్వివాద నిష్పేచీ ఆస్తి అని నా క్లయింటు గిఫ్ట్ పొందుదురని తెలియజేయడమైనది.

షెడ్యూలు

తూర్పుగోదావరి జిల్లా, శ్రీ రాజమండ్రి రిజిస్ట్రారు వారి ఆఫీసు పరిధిలో చేరిన రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలో చేరినటువంటి రాజమండ్రి ఏరియా తాలూకు జిరాయితీ మెరక రి.స. నెం. 416 రు దర్మిలా సబ్ డివిజన్ కాబడిన ప్రకారం రి.స. నెం. 416/2బి2 రు దాఖలా య. 15-53 ట్లు భూమికి దర్మిలా సబ్-డివిజన్ కాబడిన ప్రకారం రి.స. నెం. 416/2బి2బి రు పూరా య. 3-88 ట్లులో దక్షిణం వైపు నా తాలూకు య.0-70 ట్లులో తూర్పు వైపు య.0-24 ట్లు లేక హె. 0.097 ర్లు భూమికి హద్దులు:

తూర్పు: మిగిలిన భూమి. **దక్షిణం:** రోడ్డు. **పడమర:** శివ చైతన్య ఇండస్ట్రీస్ వారి భూమి. **ఉత్తరం:** మిగిలిన భూమి.

సదరు హద్దుల మధ్య Ac. 0.24 Cents దానిలో పాటంశెట్టి సూర్యకాంతం గారి య. *0-12* ట్లు భూమిన్ని, యిందుకు సంబంధించిన నీటివసరులు, యీజిమెంటు హక్కులు, మాములు రివాజు మార్గపు హక్కులతో సహా.

డి.వి.కృష్ణారావు, అడ్వకేట్
డో.నెం.25-1-4/5. కంటిపూడివారి వీధి
రాజమండ్రి కంబాల చెరువు, రాజమండ్రి
11-2-26 సెల్: 9490178358

కార్మికులకు చేయూత

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : ఇళ్లల్లో పనిచేస్తున్న కార్మికులను గౌరవంగా చూడాలని స్వర్ణాంధ్రా సేవా సంస్థ నిర్వాహకుడు గుబ్బల రాంబాబు కోరారు. బుధవారం మధ్యాహ్నం లాలాచెరువులోని సంస్థ ప్రాంగణంలో జరిగిన ఇంటి పనివారి సమావేశంలో రాంబాబు మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో అనేక మంది మహిళలు ఇంటి పనివారుగా మారుతున్నారన్నారు. వారికి కనీస హక్కులు, చట్టాలు లేక ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఆరేళ్లుగా పనివారి సంక్షేమం కోసం స్వర్ణాంధ్రా కృషి చేస్తోందన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కార్మికులకు చీరలు, నగదు, భోజనం అందించారు. సంస్థ మేనేజర్ హరికృష్ణ, మీరాకుమారి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు చీరలు, నగదు పంపిణీ చేస్తున్న గుబ్బల రాంబాబు

వీధుల్లో అంధకారం

నగరంలో ముఖ్య ప్రాంతాల్లో ఒకటైన టి.నగర్‌లోని కంకటాల వారి వీధిలో వీధి దీపాలు సరిగా వెలగడం లేదు. ఈ ప్రాంతం రోడ్డు కం రైలు వంతెనకు ఆనుకుని ఉంది. రాత్రి సమయంలో ప్రయాణించాలంటే స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

కాలువ ఇలా.. భద్రత ఎలా..?

తుమ్మలావ ప్రాంతంలో పెద్ద కాలువ రూపంలో ప్రమాదం పొంచి ఉంది. తుమ్మలావ, కృష్ణనగర్ కొత్త రోడ్డు, ఆదెమ్మ దిబ్బ వంటి ప్రాంతాలకు సంబంధించి ఇదే ప్రధాన కాలువ. ముఖ్య జనావాస ప్రాంతంలో పెద్ద కాలువకు ప్రహరీ లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతోందనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కాలువ గట్లు కొన్ని చోట్ల పూర్తిగా కుంగిపోయింది. అధికారుల స్పందించి కాలువకు ప్రహరీ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

కదలని చెత్త మేట

నగరంలోని సి.వి.జి మార్కెట్ తదితర ప్రాంతాల్లో కాలువల్లో చెత్త, పూడిక పేరుకుపోయాయి. దీంతో మురుగునీరు సాఫీగా పారే పరిస్థితి లేకుండా పోయింది. ఇంటింటికి చెత్త సేకరణ వాహనాలు తిరుగుతున్నా, 'ఇచ్చట చెత్త వేయరాదు' అంటూ సూచికలు ఏర్పాటు చేస్తున్నా... ఏ మాత్రం ప్రయోజనం ఉండటం లేదు. ప్రజా చైతన్యంతోనే స్వచ్ఛ నగరం సాధ్యమని అధికారులు చెబుతున్నారు. –న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

శ్రీవారి ప్రసాదాల విశిష్టతపై అవగాహన

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : శ్రీవారి ప్రసాదాలకు ఎంతో విశిష్టత ఉందని తితిదే పూర్వపు ప్రధానార్చకులు ఎ.వి. రమణ దీక్షితులు అన్నారు. ఆయన రచించిన 'తిరుమల శ్రీవారి దివ్య ప్రసాదాలు' పుస్తకాన్ని రాజమహేంద్రవరం నగరానికి చెందిన 'నాగేంద్రాస్ న్యూ గొల్లపూడి వీరాస్వామి అండ్ సన్' పక్షాన గొల్లపూడి నాగేంద్ర ప్రచురించగా గత డిసెంబరులో తితిదే ఛైర్మన్ బి.ఆర్.నాయుడు ఆవిష్కరించారు. రమణ దీక్షితులు నగరానికి రావడంతో పుస్తక పరిచయ కార్యక్రమం బుధవారం ఆత్మీయుల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశ్రామికవేత్త మధు ఫోమ్రా తొలి పుస్తకం అందుకున్నారు. రమణ దీక్షితులు మాట్లాడుతూ శ్రీవారి అన్నప్రసాదాలు చాలా రకాలు ఉంటాయని, నిత్యోత్సవాలు, పక్షోత్సవాలు, మాసోత్సవాలు, బ్రహ్మోత్సవాలు, పర్వదినాల్లో విశేష ప్రసాదాలతో నివేదన చేస్తారన్నారు. పుస్తకాన్ని 9కిలోల బరువుతో పెద్దసైజు పుస్తకంగా గొల్లపూడి నాగేంద్ర రూపొందించి మోడల్‌గా ప్రదర్శించారు.

మధు ఫోమ్రాకు పుస్తకం అందిస్తున్న రమణ దీక్షితులు

నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు దూరం

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నబీ అన్నారు. బుధవారం రాజమహేంద్రవరం ఆదిత్య డిగ్రీ కళాశాలలో ట్రాఫిక్ నియమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వాహనం నడిపేవారు శిరస్త్రాణం ధరించాలన్నారు. ఇటీవల నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు కళాశాల డైరెక్టర్ ఎస్.పి.గంగిరెడ్డి కోరికపై నబీ చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఉత్సవాలు, జాతీయ పండగలు వంటి కార్యక్రమాల్లో వాలంటీర్లు అందిస్తున్న సేవలు అమూల్యమని ప్రశంసించారు. జి.వి.ఎస్.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

విజేతకు ఉద్యోగ నియామక పత్రాలు అందిస్తున్న ఇన్‌స్పెక్టర్ నబీ

26 నుంచి పాత సోమాలమ్మ జాతర

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : రాజమహేంద్రవరం నగర దేవత పాత సోమాలమ్మ జాతర ఈ నెల 26 నుంచి మార్చి 2 వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. రాజమహేంద్రవరం శ్యామలానగర్‌లో కొలువైన ఆలయంలో 26న దశమి గురువారం తెల్లవారుజామున 4గంటలకు అమ్మవారికి పంచామృతాభిషేకం, విశేష అలంకారం, ఉదయం 10.10గంటలకు కలశస్థాపన, 10.30గంటలకు లక్ష్మీగణపతి హోమం నిర్వహిస్తారు. సాయంత్రం 7 గంటల నుంచి శ్రీ ఉమా నృత్యనికేతన్ శిష్యబృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన. 27న ఉదయం 8 గంటలకు చండీ హోమం, సాయంత్రం 6గంటలకు కూచిపూడి నృత్యం, 7గంటలకు సహస్ర జ్యోతిర్లింగార్చన నిర్వహిస్తారు. 28న ఉదయం 8.30 గంటలకు లక్ష పుష్పార్చన, సాయంత్రం 6గంటలకు వేంకటేశ్వరస్వామి గానామృతం ఉంటుంది. మార్చి 1న ఉదయం 9గంటలకు సౌభాగ్య వ్రతం, సాయంత్రం 6గంటలకు శ్రీమహా గురుస్థాన్ క్షేత్రం వారిచే అమ్మవారి పల్లకీసేవ, ఊయల సేవ, సాయిబాబా భజన ఉంటాయి. 2న తెల్లవారుజాము 4గంటలకు పంచామృతాభిషేకం, జాతర మహోత్సవం సందర్భంగా విశేష అలంకారం ఉంటుంది. మధ్యాహ్నం 3గంటల నుంచి గరగల నృత్యాలు, కాళీ నృత్యం, అమ్మవారి వేషధారణలు, మేళతాళాలతో సోమాలమ్మ జాతర మహోత్సవం నగర వీధుల్లో ఊరేగింపు వైభవంగా నిర్వహిస్తారు. 26 నుంచి మార్చి 2 వరకు ఆలయ ఆవరణలోని వేదికపై అమ్మవారికి ఉదయం 8గంటల నుంచి 12గంటల వరకు, సాయంత్రం 5గంటల నుంచి 8గంటల వరకు కుంకుమ పూజలు జరుగుతాయని ఉత్సవ కమిటీ సభ్యులు వివరించారు.

यूनियन बैंक Union Bank of India

రీజనల్ కార్యాలయం-రాజమండ్రి
డి.నెం.36-11-2/3/4, 3వ అంతస్తు, జెట్టి టవర్స్ మెయిన్ రోడ్డు, ఇన్నీస్‌పేట, రాజమండ్రి-533101, తూర్పు గోదావరి జిల్లా.
ఫోన్: 6281254383, ఇ మెయిల్: services.rorajahmundry@unionbankofindia.bank.in

లీజుకు ఆవరణ కావలెను

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రీజనల్ ఆఫీస్, రాజమండ్రి పరిధిలోని **మోరంపూడి రోడ్డు** బ్రాంచ్ ని ఏర్పాటు చేయుటకు గానూ **పాత సోమాలమ్మగుడి రోడ్డు, మోరంపూడి రోడ్డు, వి.ఎల్ పురం మరియు తిలక్ రోడ్డు** పరిసర ప్రాంతాల యందు స్వాధీనము చేయుటకు సిద్ధంగా వున్న/నిర్మాణములో ఉన్న/ఖాళీ ప్రదేశము నందు బ్యాంకువారి అవసరాలకు అనుగుణంగా నిర్మించి ఇవ్వగల ఆవరణ యజమానులు సంప్రదించగలరు.
మోరంపూడి రోడ్డు బ్రాంచ్ కొరకు 1700 - 1870 చ॥అ॥ల మేర కార్పెట్ ఏరియా గల వాణిజ్య ఆవరణము.
ఇతర వివరముల కొరకు బ్యాంక్ యొక్క వెబ్‌సైట్: www.unionbankofindia.bank.in; https://tenders.gov.inను సంప్రదించగలరు. నిర్ణీత విధానంలో బిడ్లు సమర్పించుటకు చివరి తేది: 04-03-2026 సాయంత్రం గం॥ 4.00 ల వరకు. ఏవిధమైన కారణము చూపకనే బిడ్స్‌ను అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు బ్యాంక్‌కు అధికారము కలదు.
స్థలం: రాజమండ్రి సం/- రీజనల్ హెడ్
తేది: 12-02-2026 రీజనల్ ఆఫీస్, రాజమండ్రి.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: నగరంలోని చిరంజీవి బస్టాండు వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందడంపై మూడోపట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. సుబ్బారావునగర్‌కు చెందిన మామిడి దుర్గారావు(46) రెండేళ్ల కిందట భార్యతో విడిపోయారు. అప్పటి నుంచి ఆయన అనారోగ్యానికి గురయ్యారు. మంగళవారం అనుమానాస్పదంగా మృతి చెంది ఉండటంపై పోలీసులు కేసు నమోదు చేశారు.

కోర్టులో నిందితుడికి బదులు మరొకరు హాజరు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం జిల్లా కోర్టులో ఓ కేసుకు సంబంధించి నిందితుడికి బదులు మరో వ్యక్తి హాజరవడంపై మూడోపట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజానగరం పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ కేసులో నరేంద్రపురానికి చెందిన ఓ వ్యక్తి కోర్టులో హాజరవ్వాల్సి ఉండగా ఆయన స్థానంలో ఆర్.చిన్నబ్బులు అనే వ్యక్తి హాజరవడాన్ని అధికారులు గుర్తించారు. కోర్టు కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న జిత్‌మోహన్‌మిత్రా తదితరులు

ఘంటసాల వర్ధంతి

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి కార్యక్రమం జిత్‌మోహన్‌మిత్రా కళా వేదికపై నిర్వహించారు. బుధవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఘంటసాల చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. నటుడు, గాయకుడు శ్రీపాద జిత్‌మోహన్‌మిత్రా మాట్లాడుతూ తెలుగు సినిమా పరిశ్రమలో తన గానామృతంతో ఎన్నో మధురమైన గీతాలు పాడి అమర గాయకుడిగా సంగీత ప్రియుల గుండెల్లో చెరగని ముద్ర వేశారన్నారు. ఆర్కెస్ట్రా గాయనీ గాయకులు డాక్టర్ వంక బాలకృష్ణ, మంగళంపల్లి సూర్యకుమారి, డాక్టర్ గిరజాల సోమరాజు నాయుడు, జి.లక్ష్మీతులసి తదితరులు ఘంటసాల గీతాలు ఆలపించారు.

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda **బ్యాంక్ ఆఫ్ బరోడా**
ROSARB - రాజమండ్రి 5వ అంతస్తు, 36-7-14, కొండూరి స్క్వేర్, ఇన్నీస్‌పేట, రాజమండ్రి-533102.

స్థిరాస్తుల విక్రయం కొరకు అమ్మకం నోటీసు అనుబంధం-IV-A (రూల్ 6(2) & 8(6) చూడవలెను)
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 యొక్క రూల్ 6(2) & 8(6)లోని నిబంధనలతో చదువుతూ సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఈ-వేలం అమ్మకం ప్రకటన)

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకానికి మరియు ప్రత్యేకంగా రుణగ్రహీత(లు), తనఖాదారు(లు) మరియు హామీదారు(లు) కు తెలియజేయునది ఏమనగా ఈ దిగువ వివరించబడిన స్థిరాస్తి సెక్యూర్డ్ క్రెడిటర్‌కి తనఖా [illegible] "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ", "ఏది ఎలా ఉన్నది అదే", "అక్కడ ఏది ఉన్నదో అదే" ప్రాతిపదికన [illegible]

రుణగ్రహీత / తనఖాదారు / హామీదారుల పేర్లు మరియు చిరునామా	స్థిరాస్తి వివరములు	బకాయిమొత్తం	రిజర్వు ధర, ధరావతు & బిడ్ పెంపుదల	స్వాధీనం యొక్క స్థితి / ఈ-వేలం తేదీ & సమయం
1) శ్రీ దంగేటి రమణమూర్తి, తండ్రి: శ్రీరాములు, ఫ్లాట్ నెం.303, లేపాక్షి రెసిడెన్సీ, విశాఖ, విద్యానగర్, రాజమండ్రి-533105. 2) శ్రీమతి దంగేటి వరలక్ష్మి, భర్త: శ్రీ దంగేటి రమణమూర్తి, ఫ్లాట్ నెం.303, లేపాక్షి రెసిడెన్సీ, విశాఖ, విద్యానగర్, రాజమండ్రి-533105.	తూర్పు గోదావరి జిల్లా, రాజమండ్రి, విద్యానగర్ [illegible] డో.నెం. 57-6-22, [illegible] ఫ్లాట్ నెం.1 [illegible] LEHI [illegible] (3 BHK) [illegible] 1600 చ.అ. [illegible]	రూ.26,21,721/- తేది. 09-12-2024 [illegible]	రిజర్వు ధర: రూ.60,00,000/- ధరావతు: రూ.6,00,000/- బిడ్ పెంపుదల మొత్తం: రూ.15,000/-	భౌతికంగా; ఆస్తి తనిఖీ యొక్క తేదీ & సమయం: 17-02-2026, సమయం: ఉ. 11:00 నుండి మ. 05.00 గం. వరకు; ఈ-వేలం తేదీ & సమయం: [illegible]

ఈ-వేలం తేది & సమయం: 05-03-2026 గం. 02:00 గం.ల నుండి సా. 06.00 గం. వరకు (విక్రయం పూర్తయ్యే వరకు ప్రతి సారి 10 నిమిషాల పొడిగింపు సమయం పొడిగించు)

అమ్మకం యొక్క పూర్తి నియమములు మరియు షరతుల కొరకు దయచేసి https://bankofbaroda.bank.in/e-auction [illegible] https://baanknet.com [illegible] 7569961199, email ID: support.BAANKNET@psballiance.com [illegible]
తేది: 11-02-2026, ప్రదేశము: రాజమండ్రి సం/-అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం

రథానికి ప్రత్యేక పూజలు

కోరుకొండ, న్యూస్‌టుడే: కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం ఈ నెల 27న జరగనున్న నేపథ్యంలో బుధవారం రథశాల నుంచి రథాన్ని భక్తులు ప్రధాన రహదారిపై బయటకు తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరంగం స్థానాచార్యులు లక్ష్మీనరసింహభట్టర్ స్వామి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకస్వామి గిరిధరాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఈఓ గుర్రాజు, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచార్యులు, స్థానిక ఇన్‌ఛార్జి కె.శ్రీనివాస్, ఈశ్వరరావు, దుర్గాచార్యులు, కటకం చలం, తెలగంశెట్టి శ్రీను, వీరాస్వామి, దొరబాబు తదితర రథం నిర్వాహకులు, అన్నవరం దేవస్థానం అధికారులు, సిబ్బంది, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

పాండురంగస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం

కోరుకొండ, న్యూస్‌టుడే: స్థానిక రుక్మిణీ సమేత పాండురంగస్వామి కల్యాణ మహోత్సవాలు ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు జరగనున్నాయని ఆలయ కమిటీ సభ్యులు, అర్చక స్వామి అనిపెద్ది శ్రీనివాసరావు శర్మ తెలిపారు. 12న పంచామృతాభిషేకాలు, 13న కల్యాణోత్సవం, 14న అన్నసమారాధన, 15న పుష్పాలంకరణ, పవళింపు సేవ ఉంటుందన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ. 10 - మ. 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

ధవళేశ్వరం: 91212 29057 కడియం: 91212 29062
బొమ్మూరు: 91549 78039 మోరంపూడి: 94935 92696
రాజానగరం: 98492 36167 కోరుకొండ: 80085 74213

సమస్య: హుకుంపేట రామకృష్ణ నగర్ 14వ వీధిలో ఉన్న కాలువలో పూడిక పేరుకుపోయి మురుగు కదలడం లేదు. – సత్యనారాయణ

సమాధానం: చర్యలు తీసుకుంటాం. – శ్రీదేవి, గ్రామకార్యదర్శి, హుకుంపేట – న్యూస్‌టుడే, బొమ్మూరు

మట్టి తొలగింపు

పిడింగొయ్యి పంచాయతీ కలిగొయ్యి నుంచి బుచ్చియ్యనగర్ వైపునకు వెళ్లే ప్రధాన రహదారిపై మట్టిని వదిలివేయడంతో స్థానికులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారని 'ఈనాడు'లో చిత్ర వార్త ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించి మట్టి గుట్టలను తొలగించారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. – న్యూస్‌టుడే, మోరంపూడి

మరమ్మతులు చేపట్టారు

బొమ్మూరు సమీపంలో సీసీ డ్రైను పై ఉన్న సిమెంటు దిమ్మ వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. సమస్యపై బుధవారం 'గంట మోగింది.. సమస్య వీడింది' శీర్షికతో 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన ఆర్‌అండ్‌బీ, పంచాయతీ అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు. సిమెంటు దిమ్మ ఏర్పాటు చేసి పని పూర్తి చేశారు. – న్యూస్‌టుడే, బొమ్మూరు

విద్యుత్తు హెచ్చుతగ్గులకు... అడ్డుకట్ట

అందుబాటులోకి రానున్న ఉపవిద్యుత్తు కేంద్రం

న్యూస్‌టుడే, కడియం

నియోజకవర్గంలోని కడియం మండలం నర్సరీలతో విరాజిల్లుతోంది. కాని ఇక్కడి రైతులకు మాత్రం ఏటా వేసవిలో విద్యుత్తు హెచ్చుతగ్గులతో అవస్థలు తప్పడం లేదు. ప్రత్యామ్నాయంగా కొందరు రైతులు డీజిల్ మోటారు బోర్లను ఆశ్రయించడం పరిపాటిగా మారింది. కూటమి ప్రభుత్వం రాకతో కడియం మండల కేంద్రంలో రూ.2.45కోట్లతో విద్యుత్తు ఉప కేంద్ర నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. దాదాపు 70శాతం పనులు పూర్తయ్యాయి. ఇప్పటికే జేగురుపాడు పరిధిలోని పాములమెట్ట కాలనీ, కడియపులంక పరిధి బుర్రిలంకలో, మురమండ, వేమగిరి గ్రామాల్లో విద్యుత్తు ఉపకేంద్రాలు ఉన్నాయి. కడియంలో నిర్మిస్తున్న ఉపకేంద్రం అందుబాటులోకి వస్తే అధిక శాతంలో విద్యుత్తు సమస్యలు నివారించగలుగుతామని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు.

నిర్మాణంలో ఉన్న కడియం ఉపకేంద్రం

రెండు సెక్షన్లుగా పదకొండు పంచాయతీలు

కడియం మండలంలోని పదకొండు పంచాయతీలను రెండు సెక్షన్లుగా విభజించారు. మురమండ పరిధిలో మురమండ, మాధవరాయుడుపాలెం, దుళ్ల, వీరవరం, పొట్టిలంక, దామిరెడ్డిపల్లి ఉండగా కడియం సెక్షన్‌లో కడియం, వేమగిరి, జేగురుపాడు, కడియపులంక, కడియపుసావరం గ్రామాలున్నాయి. అత్యధికంగా వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్‌లతో పాటు గృహావసరాలు ఉన్నాయి. తెదేపా అధికారంలో ఉన్నప్పుడు నర్సరీ, వ్యవసాయ రైతులకు ఉచిత విద్యుత్తును అందించింది. ఈ ప్రాంతాన్ని నర్సరీ హబ్‌గా గుర్తించి వాల్టా చట్టానికి కొన్ని సవరణలు చేసి సోలార్ విద్యుత్తు కనెక్షన్లను రాయితీపై అందించింది. రైతుల అభ్యున్నతికి పెద్దపీట వేసింది.

ఇదీ పరిస్థితి..

వేసవి సమీపిస్తున్న తరుణంలో విద్యుత్తు లోడ్ పెరిగి దాని ప్రభావం వ్యవసాయ ఫీడర్‌పై పడేది. దాంతో తొమ్మిది గంటల విద్యుత్తు సరఫరాకు అవరోధం ఏర్పడేది. మండల కేంద్రమైన కడియంలో ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, ధాన్యం మిల్లులు, చిన్న మధ్య తరహా పరిశ్రమలు అధికంగా ఉన్నాయి. సుమారు 20,332 గృహ కనెక్షన్లు, 3,065 వాణిజ్య వినియోగదారులు, 57 పరిశ్రమలు, 112 విద్యాలయాలు ఇతర సంస్థలు, దాదాపు 1,615 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. కడియంలో నిర్మించనున్న ఉప విద్యుత్తు కేంద్రంతో లైన్‌లాస్ తగ్గి హెచ్చుతగ్గుల సమస్య ఉండదని అధికారులు చెబుతున్నారు. దీంతో కోతలు లేని, నాణ్యమైన విద్యుత్తు సరఫరా అందించేందుకు మార్గం సుగమం కానుంది. నర్సరీలతో వ్యవసాయ బోర్లు నిరాటంకంగా పనిచేస్తాయి.

మరో నెలలో ప్రారంభం..

కడియంలో ఉప విద్యుత్తు కేంద్రం నిర్మాణానికి చాలా ఏళ్ల క్రితమే అనుమతులు వచ్చాయి. స్థలాభావం కారణంగా కార్యాచరణకు నోచుకోలేదు. స్థానిక నేతలతో కలిసి వివిధ ప్రాంతాల్లో స్థల పరిశీలన చేశాం. ఎట్టకేలకు మార్కెట్‌కు ఎదురుగా ఎంపీపీ సత్యప్రసాద్ చొరవతో స్థల కేటాయింపులు జరిగి అనుమతులు లభించడంతో నిర్మాణ పనులు ప్రారంభించాం. అందుబాటులోకి వస్తే విద్యుత్తు లోడ్‌లో హెచ్చుతగ్గులు పూర్తిగా తగ్గుముఖం పడతాయి. లైన్‌లాస్ లేక నాణ్యమైన సరఫరా అందించేందుకు వెసులుబాటు ఉంటుంది. మరో నెలలో ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నాం. – జేపీటీ నటరాజన్, ఈఈ, రాజమహేంద్రవరం గ్రామీణ డివిజన్

సాంకేతిక సేవలు చేరువ చేయడమే లక్ష్యం

కడియం, న్యూస్‌టుడే: జాతీయ విద్యుత్తు మంత్రిత్వశాఖ రాష్ట్రంలోని ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ పరిధిలో ఈ నెల 23 వరకు 'స్మార్ట్‌మీటర్ల పక్వాడా' కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు రాజమహేంద్రవరం గ్రామీణ డివిజన్ విద్యుత్తు శాఖ ఈఈ నటరాజన్ ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులకు ఆధునాతన సాంకేతిక సేవలు చేరువచేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో అవగాహన సదస్సులు, మొబైల్ యాప్ ఇన్‌స్టలేషన్స్‌పై సహాయ కేంద్రాలు, స్మార్ట్‌మీటర్ల పనితీరుపై ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ముందస్తు చెల్లింపులతో పాటు యాప్‌తో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ సదుపాయం, మానవ తప్పిదాలు లేని పారదర్శక బిల్లింగ్, తక్కువ బ్యాలెన్స్ అలర్ట్స్, ఆదా చేసే విద్యుత్తు వినియోగాన్ని తక్షణ సమాచారం ఈ స్మార్ట్‌మీటర్ల ప్రత్యేకతలన్నారు. మీటర్ల అమరిక సమయంలో సిబ్బందికి సహకారం అందించాలని వినియోగదారులను కోరారు.

స్నానాలకు కష్టమేనా..?

మహాశివరాత్రికి భక్తులు ప్రధానంగా గోదావరి స్నానాలకు ప్రాధాన్యమిస్తారు. పవిత్రంగా భావించే గోదావరి రాజమహేంద్రవరం స్నానాల ఘాట్లతో పాటు సీతానగరం మండలంలోని ప్రధానంగా మునికూడలి, ముగ్గళ్ల, వంగలపూడి ప్రాంతాల్లోని ఘాట్ల వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో స్నానాలు ఆచరిస్తారు. మునికూడలి, ముగ్గళ్ల ప్రాంతాల్లో గోదావరికి ఇసుకను మెట్ల మార్గం ఉంది. స్నానాలు చేసేందుకు తగిన సౌకర్యాలు, రక్షణ చర్యలు లేవని భక్తులు ఆరోపిస్తున్నారు. వంగలపూడి ఘాట వద్ద గోదావరిలోకి దిగేందుకు మెట్లు లేకపోవడంతో భక్తులు స్నానాలు చేసే సమయంలో ఇబ్బంది పడుతున్నారు. శివరాత్రి పర్వదినం నాటికి ఆయా ఘాట్ల వద్ద తగిన చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, సీతానగరం(కోరుకొండ)

రహదారి నిర్మించరూ..?

కడియపులంకలో నర్సరీల మధ్య ఉన్న సుమారు అర కిలోమీటరు రహదారి పూర్తిగా ధ్వంసమై పోయింది. మొక్కల రవాణా సమయంలో వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల క్రితం నిర్మించిన ఈ రహదారి ప్రస్తుతం భారీ గుంతలతో దర్శనమిస్తోందన్నారు. దీనిపై స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకొని రహదారి అభివృద్ధికి కృషి చేయాలని కోరుతున్నారు. దీనిపై ర.భ అధికారులను వివరణ కోరగా బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని.. అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, కడియం

మంటలు అదుపు చేస్తున్న సిబ్బంది

బొమ్మూరులో అగ్ని ప్రమాదం

బొమ్మూరు, న్యూస్‌టుడే: గడ్డివాము తగలబడిన ఘటన బుధవారం మధ్యాహ్నం బొమ్మూరు జేఎల్‌బీనగర్‌కు సమీపంలో జాతీయ రహదారి పక్కన ఖాళీ స్థలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గడ్డివాము పక్కన ఉన్న విద్యుత్తు స్తంభం తీగల నుంచి నిప్పులు చెలరేగి ఎండుగడ్డిపై పడడంతో మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరి మంటలు అదుపు చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు చేరి కొంత గడ్డిని బయటకు తీయడంతో మంటలు అదుపులోకి వచ్చాయి. ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదని తెలిపారు.

బకాయిలపై పోస్టుకార్డు ఉద్యమం

కడియం, న్యూస్‌టుడే: ప్రభుత్వం నుంచి ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో పోస్టు కార్డు ఉద్యమానికి నాంది పలికారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయుల సమస్యలపై లక్ష పోస్టు కార్డులు సీఎం కార్యాలయానికి పంపిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు వివరించారు. బుధవారం ఉపాధ్యాయులు యూటీఎఫ్ కార్యదర్శి సభ్యులు పోస్టు కార్డులను పోస్టు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ అనిత, మండల ప్రధాన కార్యదర్శి అప్పారావు, సహాయ అధ్యక్షురాలు బుజ్జాల, అరుణకుమారి, రమణకుమారి, శశి, ఇందిర ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

పోస్టుబాక్సుల్లో కార్డులు వేస్తున్న ఉపాధ్యాయులు

మాట్లాడుతున్న పీడీ మల్లేశ్వరావు

ఉపాధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

బొమ్మూరు(హుకుంపేట), న్యూస్‌టుడే: ఉపాధిహామీ పథకంలో పనులు సకాలంలో పూర్తి చేయాలని ఉపాధి హామీ ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.నాగ మల్లేశ్వరావు అన్నారు. హుకుంపేట మండల కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ 2024-25 ఏడాదికి గాను చేపట్టిన పనులపై సమీక్ష నిర్వహించారు. డీవీవో రత్నకుమారి మాట్లాడుతూ 17వ రౌండ్‌లో మిగిలిపోయిన పనులను పూర్తి చేయాలన్నారు. గ్రామాల వారీగా ఉపాధి హామీలో చేసిన పనులు, కూలీల వివరాలను తెలియజేశారు. సమావేశంలో ఏపీడీ పి.రామప్రసాద్, ఎంపీడీవో ఆర్మ్‌స్ట్రాంగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై చర్యలు

పొక్లెయిన్‌తో పూడ్చిన మట్టి తొలగిస్తున్న దృశ్యం

రాజానగరం, న్యూస్‌టుడే: చాగల్నాడు ఎత్తిపోతల పథకం పిల్లకాలువపై ఆక్రమణలను బుధవారం అధికారులు తొలగించారు. జాతీయ రహదారి పక్కన కలవచర్ల కూడలి సమీపంలోని చాగల్నాడు ఎత్తిపోతల పథకం కాలువ నుంచి తూర్పుగోనగూడెం గ్రామానికి తాగు నీరు, సాగునీరు అందించే పిల్లకాలువను ఆయకట్ట పరిధిలోని రియల్‌ఎస్టేట్ వ్యాపారులు పూడ్చివేశారు. సిమ్మెంట్ స్తంభాలు వేసి ఇనుప తీగలతో ఫెన్సింగ్ చేసి ఆక్రమించారు. దీనిపై స్థానిక రైతులు పోలీసులకు, ఎత్తిపోతల పథకం ఏఈ సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ జి.ఎ.ఎల్.ఎస్.దేవి, సీఐ ప్రసన్న వీరయ్యగౌడ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి పొక్లెయిన్ సహాయంతో సదరు స్తంభాలను, తీగలను తొలగించారు. కాలువ నీరు వెళ్లేందుకు ఇబ్బంది లేకుండా ఆక్రమణలను తొలగించినట్లు ఏఈ సత్యనారాయణ తెలిపారు. త్వరలో సర్వే చేపట్టి చర్యలు ఆక్రమణకు పాల్పడిన వారిపై తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ కె.రంభ, వీఆర్వో సి.హెచ్.పాపారావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగుపాట ఆర్తి ఘంటసాల

ధవళేశ్వరంలో నివాళులర్పిస్తున్న ప్రముఖులు

ధవళేశ్వరం, మోరంపూడి, న్యూస్‌టుడే: గాన గంధర్వుడు పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతిని గోదావరి కల్చరల్ అసోసియేషన్ రాకా ఆధ్వర్యంలో ధవళేశ్వరంలో బుధవారం నిర్వహించారు. ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాకా కార్యదర్శి జి.వి.రమణ మాట్లాడుతూ తెలుగు పాటకు ఆర్తి ఘంటసాల అని కొనియాడారు. అద్వితీయమైన గాత్రంతో కఠినతరమైన గీతాలను కూడా సులువుగా ఆలపించి చరిత్ర సృష్టించారన్నారు. అధ్యక్షుడు యర్రమోతు ధర్మరాజు మాట్లాడుతూ ఎన్ని శతాబ్దాలైనా తెలుగు వారు మరువలేని మహోన్నతుడు ఘంటసాల అని అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ ఇంజినీర్ మదర్షాఅలీ మాట్లాడుతూ ఘంటసాల గానంతో తెలుగు సినిమాలు విజయోత్సవాలు చేసుకున్నాయన్నారు. కార్యక్రమంలో భమిడిపాటి రామక్రిష్ణ, ఎలక్ట్రికల్ ఇంజినీర్ సబ్బెళ్ల సూరిబాబు, సూరపురెడ్డి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

కడియం, న్యూస్‌టుడే: ఆబాల గోపాలాన్ని సుమధుర కంఠస్వరంతో మెప్పించిన గానగంధర్వుడు ఘంటసాల అని వేమగిరికి చెందిన ప్రత్తిపాటి నల్లరాజు అన్నారు. వేమగిరి కూడలిలో ఘంటసాల వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక ఆటో యూనియన్ కార్యవర్గ సభ్యులు, ఘంటసాల అభిమానులు పాల్గొన్నారు.

వేమగిరిలో...

బడ్జెట్ అవగాహనకు క్విజ్

రాజానగరం, న్యూస్‌టుడే: కేంద్ర బడ్జెట్‌పై నిర్వహిస్తున్న 'మై భారత్ క్విజ్' పోటీల ప్రచారాన్ని జీజీయూలోని ఫార్మసీ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, మై భారత్ తూర్పుగోదావరి జిల్లా సంయుక్తంగా బుధవారం గైట్ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి సబంధించిన గోడ పత్రికను విద్యార్థులు ఆవిష్కరించారు. ఫార్మసీ కళాశాల డీన్ డా.ఎం.డి.ధనరాజు మాట్లాడుతూ.. 2026-27 బడ్జెట్ కేటాయింపులను యువత ద్వారా ప్రజలకు అవగాహన కల్పించేందుకు మై భారత్ ద్వారా క్విజ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డా.ధనరాజు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా మొదలై క్షేత్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన యువత రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతారన్నారు. కార్యక్రమంలో షేక్‌మీరా, ఎన్‌ఎస్ఎస్ పీఓ జె.సింధు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న విద్యార్థులు

మొదటి స్థానం హర్షణీయం

కోరుకొండ, న్యూస్‌టుడే: ప్రాథమిక, పారిశ్రామిక, సేవల రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ర్యాంకింగ్‌లో విజయవాడ పశ్చిమ నియోజకవర్గం మొదటి స్థానం సాధించడం హర్షణీయమని రాజానగరం నియోజకవర్గం భాజపా కన్వీనరు నీరుకొండ వీరన్నచౌదరి అన్నారు. బుధవారం కోరుకొండలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే భాజపా నేత సుజనా చౌదరి ఇదే స్ఫూర్తితో కొనసాగాలని ఆకాంక్షించారు.

నియామకపత్రాల అందజేత

దేవీచౌక్, న్యూస్‌టుడే: భాజపా ఎస్సీ మోర్చా నూతన కమిటీ సభ్యులకు బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు తగరం సురేష్ బాబు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా భాజపా జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దళితుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రవేశపెట్టిన అనేక పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరికీ అందించేలా నూతన కమిటీ కార్యాచరణ ఉండాలని పిలుపునిచ్చారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

పండిట్ దీన్‌దయాళ్‌కు నివాళి

గోకవరం, న్యూస్‌టుడే: పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని బుధవారం గోకవరంలో భాజపా నాయకులు నిర్వహించారు. స్థానిక గబ్బాలమ్మ ఆలయం వద్ద మండల పార్టీ అధ్యక్షుడు ఇనకోటి బాపన్నదొర అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టా మంగరాజు హాజరై దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీ నాయకులు కోన వెంకట సురేష్, సత్తి వెంకటరెడ్డి, ఉంగరాల ఆదివిష్ణు, బత్తుల వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న భాజపా నాయకులు

జాతీయ స్థాయిలో రాణించాలి

రాజానగరం, న్యూస్‌టుడే: నన్నయ విశ్వవిద్యాలయంలో సెపక్‌తక్రా మెన్ అండ్ ఉమెన్ పోటీలకు అంతర్ కళాశాలల, యూనివర్సిటీ టీం ఎంపికను వీసీ ఎస్.ప్రసన్నశ్రీ బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కష్టమైన సెపక్‌తక్రాలో విద్యార్థులు ప్రతిభ కనబరచి జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. వర్సిటీ నైపుణ్యం కలిగిన క్రీడాకారులకు చక్కని వేదికగా మారనుందన్నారు. ఎంపికలో యూనివర్సిటీ, అనుబంధ కళాశాలలకు చెందిన విద్యార్థులు 30, విద్యార్థినిలు 12 మంది పాల్గొనగా.. ప్రతిభ కనబరచిన 8 మంది విద్యార్థులు, ముగ్గురు విద్యార్థినులను కోచింగ్ క్యాంపునకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ క్యాంపులో ప్రతిభ కనబరచిన వారు మార్చి 11 నుంచి 14 వరకు అస్సాం యూనివర్సిటీలో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహణా కమిటీ ఛైర్మన్ పి.వెంకటేశ్వరావు, కార్యదర్శి కె.బాలసత్యనారాయణ, అబ్జర్వర్ ఎంవీఎస్ఎన్ మూర్తి, ఎంపిక కమిటీ సభ్యులు కె.కనకరాజు, కె.సతీష్ పీడీలు, ఎంపీఈడీ విద్యార్థులు పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

శివరాత్రికి కోటిలింగేశ్వరాలయం ముస్తాబు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : పవిత్ర గోదావరి చెంతన కోటిలింగాలపేటలో కొలువైన శ్రీఉమా కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ అధీనంలోని దేవస్థానంలో ఈనెల 12నుంచి 16వ వరకు స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ అధికారులు తెలిపారు. శివరాత్రి పర్వదినం రోజున భారీ ఎత్తున భక్తులు తరలి వచ్చే ఆలయం కావడంతో దీనికి ప్రత్యేకత ఉంటుంది.

దివ్య కల్యాణ మహోత్సవాలు..

● ఈనెల 12న ఉదయం 8.45 గంటలకు స్వామి, అమ్మవారికి మంగళస్నానాలు, పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెగా అలంకారం, గణపతి పూజ, ధ్వజారోహణ, అంకురార్పణ, బలిహరణ, మధ్యాహ్నం 3గంటలకు గ్రామోత్సవం, సాయంత్రం స్వామివారికి అగ్నిప్రతిష్ఠాపన, రాత్రి 8.45గంటలకు కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. ● 13, 14 తేదీల్లో స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు. ● 15న మహాశివరాత్రి సందర్భంగా రాత్రి 1.05గంటల నుంచి స్వామివారికి విశేష అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజ అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పిస్తారు. మధ్యాహ్నం 2.10గంటలకు రథోత్సవం, రాత్రి 10.15గంటల నుంచి లింగోద్భవ అభిషేకాలు నిర్వహిస్తారు. ● 16న ఉదయం స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజలు, వసంతోత్సవం, త్రిశూల స్నానం, రాత్రి 7.15 గంటలకు పుష్పోత్సవం నిర్వహిస్తారు.

ఉత్తమ ఫలితాలకు.. ప్రణాళిక పక్కా

రాజానగరం, న్యూస్‌టుడే : పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యాశాఖ రూపొందించిన వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక పక్కాగా అమలవుతోంది. ఇందుకు విద్యార్థులకు సాధారణ తరగతులతో పాటు ఉదయం, సాయంత్రం వేళల్లో అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు.

రోజుకో పాఠ్యాంశంపై తరగతులు.

ఈ ఏడాది మార్చి 16 నుంచి 31వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. డివిజన్‌లో మొత్తం సుమారు 26,600 మంది 140 కేంద్రాలలో పరీక్ష రాయనున్నారు. ఈ నేపథ్యంలో మార్చి 15 వరకు కార్యాచరణ ప్రణాళిక అమలుకు సంబంధించి ఉదయం 8 నుంచి 9 గంటల వరకు రోజుకో పాఠ్యాంశంపై రెమిడియల్ తరగతులు నిర్వహిస్తున్నారు. 9 నుంచి 4 గంటల వరకు ఆయా సబ్జెక్ట్‌లపై ఉపాధ్యాయ పర్యవేక్షిత అధ్యయన తరగతులు చేపడుతున్నారు. అనంతరం రోజుకో పాఠ్యాంశంపై 20 మార్కులకు స్లిప్‌టెస్ట్ నిర్వహించి, మూల్యాంకనం చేసి వచ్చిన మార్కులను లీప్‌యాప్‌లో వెంటనే నమోదు చేస్తున్నారు. ఆ మార్కులు ఉపాధ్యాయులు, విద్యార్థులే కాకుండా వారి తల్లిదండ్రులు, జిల్లా అధికారులు కూడా చూసే అవకాశం ఉంటుంది. సెలవు రోజుల్లో ఆదివారం, రెండో శనివారం సైతం పాఠశాల నిర్వహించి ఈ కార్యక్రమం యథావిధిగా అమలు చేస్తున్నారు.

దివాన్‌చెరువు జడ్పీ ఉన్నత పాఠశాలలో..

ప్రత్యేక శ్రద్ధ..

బాగా చదివి స్లిప్ టెస్టుల్లో మంచి మార్కులు తెచ్చుకునే వారిని షైనింగ్ స్టార్స్‌గా గుర్తించి అన్ని సబ్జెక్టుల్లో ఇంకా అదనపు మార్కులు తెచ్చుకునే విధంగా వారిని ప్రోత్సహిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులను రైజింగ్ స్టార్స్‌గా గుర్తించి వారి వెనుకబాటుతనానికి కారణాలను తెలుసుకొని అదనపు సహాయం అందిస్తున్నారు. సందేహాలు నివృత్తి చేసి మెరుగుపడేలా కృషి చేస్తున్నారు.

పరీక్షల వాతావరణానికి అలవాటుపడేలా

రాబోయే పరీక్షల వాతావరణానికి విద్యార్థులు అలవాటుపడే విధంగా చేస్తున్నాం. కఠినమైన సబ్జెక్టులపై ఎక్కువ శ్రద్ధ కేటాయిస్తున్నాం. ఐఎఫ్‌పీ ప్యానల్ ఉపయోగించి సరళమైన, ప్రభావవంతమైన బోధనతో కాన్సెప్ట్‌లను విద్యార్థులు అందిపుచ్చుకునేలా కృషి చేస్తున్నాం. కాన్సెప్ట్ వీడియోల ద్వారా విద్యార్థులు ఎక్కువ మార్కులు సాధించేందుకు ప్రయత్నిస్తున్నాం. – కోరాడ శ్రీనివాస్, హెచ్‌ఎం, ఎస్‌డీఎస్‌ఎం జడ్పీ ఉన్నత పాఠశాల, దివాన్‌చెరువు

కార్మికులకు చేయూత

చీరలు, నగదు పంపిణీ చేస్తున్న గుబ్బల రాంబాబు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : ఇళ్లల్లో పనిచేస్తున్న కార్మికులను గౌరవంగా చూడాలని స్వర్ణాంధ్రా సేవా సంస్థ నిర్వాహకుడు గుబ్బల రాంబాబు కోరారు. బుధవారం మధ్యాహ్నం లాలాచెరువులోని సంస్థ ప్రాంగణంలో జరిగిన ఇంటి పనివారి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో అనేకమంది మహిళలు ఇంటి పనివారుగా మారుతున్నారన్నారు. వారికి కనీస హక్కులు, చట్టాలు లేక ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఆరేళ్లుగా వారి సంక్షేమం కోసం స్వర్ణాంధ్రా కృషి చేస్తోందన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కార్మికులకు చీరలు, నగదు, భోజనం అందించారు. సంస్థ మేనేజర్ హరికృష్ణ, మీరాకుమారి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా Union Bank of India

రీజనల్ కార్యాలయం-రాజమండ్రి
డి.నెం. 36-11-2/3/4, 3వ అంతస్తు, జెట్టి టవర్స్ మెయిన్ రోడ్డు, ఇన్నీస్‌పేట, రాజమండ్రి-533101, తూర్పు గోదావరి జిల్లా.
ఫోన్: 6281254383, ఇ మెయిల్: services.rorajahmundry@unionbankofindia.bank.in

లీజుకు ఆవరణ కావలెను

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రీజనల్ ఆఫీస్, రాజమండ్రి పరిధిలోని మోరంపూడి రోడ్డు బ్రాంచ్ ని ఏర్పాటు చేయుటకు గాను పాత సోమాలమ్మగుడి రోడ్డు, మోరంపూడి రోడ్డు, వి.ఎల్ పురం మరియు తిలక్ రోడ్డు పరిసర ప్రాంతాల యందు స్వాధీనము చేయుటకు సిద్ధంగా పున్న/నిర్మాణములో ఉన్న/ఖాళీ ప్రదేశము నందు బ్యాంకువారి అవసరాలకు అనుగుణంగా నిర్మించి ఇవ్వగల ఆవరణ యజమానులు సంప్రదించగలరు.
మోరంపూడి రోడ్డు బ్రాంచ్ కొరకు 1700 - 1870 చ॥అ॥ల మేర కార్పెట్ ఏరియా గల వాణిజ్య ఆవరణము.
ఇతర వివరముల కొరకు బ్యాంక్ యొక్క వెబ్‌సైట్: www.unionbankofindia.bank.in; https://tenders.gov.inను సంప్రదించగలరు. నిర్ణీత విధానంలో బిడ్లు సమర్పించుటకు చివరి తేదీ: 04-03-2026 సాయంత్రం గం॥ 4.00 ల వరకు. ఏవిధమైన కారణము చూపకనే బిడ్స్‌ను అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు బ్యాంక్‌కు అధికారము కలదు.
స్థలం: రాజమండ్రి తేది: 12-02-2026
సం/- రీజనల్ హెడ్ రీజనల్ ఆఫీస్, రాజమండ్రి.

(c) eenadu

కొవ్వూరు

•కొవ్వూరు •నిడదవోలు •గోపాలపురం

లోక్‌అదాలత్‌తో ధనం, సమయం ఆదా

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే : రాజీ మార్గంలో కేసుల పరిష్కారంతో సమయం, ధనం ఆదా చేయవచ్చని కొవ్వూరు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.సాయికృష్ణ అన్నారు. వచ్చేనెల 14న జాతీయ లోక్‌అదాలత్ నేపథ్యంలో పోలీసు అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయా స్టేషన్ల పరిధిలో పెండింగులో ఉన్న కేసులు, రాజీ చేయదగ్గవి ఎన్ని అనే అంశాలపై సమీక్షించి సూచనలు చేశారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జరిగే లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించే విధంగా సహకరించాలని కోరారు.

పోక్సో చట్టంపై అవగాహన

చాగల్లు : అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పోక్సో చట్టంపై బాలికలకు అవగాహన కల్పించాలని ఎస్సై కె.నరేంద్ర సూచించారు. చాగల్లు పీహెచ్‌సీలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైద్యులు, సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేలటూరులో నూరు శాతం పన్ను వసూలు

చాగల్లు : మండలంలోని నేలటూరులో 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఇంటి పన్నులు నూరు శాతం వసూలు చేసినట్లు ఎంపీడీవో ఆర్.శ్రీదేవి తెలిపారు. లక్ష్యం మేరకు రూ.5.37 లక్షలు బుధవారానికి వసూలు చేయడంతో పంచాయతీ అధికారి వి.కరుణ, సిబ్బందిని అభినందించారు.

బార్ కౌన్సిల్ ఎన్నికల ప్రచారం

నిడదవోలు : బార్ కౌన్సిల్ ఎన్నికల్లో నేషనల్ లిస్ట్ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించాలని భాజపా జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర కోరారు. నిడదవోలులో బుధవారం పలువురు న్యాయవాదులను కలిసి నేషనల్ లిస్ట్ తరపున పోటీ చేస్తున్న వి.శ్రీనివాసరాజు, జె.పృథ్వీరాజ్, ఎస్.బ్రహ్మానందరెడ్డి, వి.చంద్రశేఖర్, పి.పద్మావతికి ప్రాధాన్య క్రమంలో ఓటు వేసి గెలిపించాలన్నారు. పలువురు భాజపా నాయకులున్నారు.

శివయ్యా.. కాస్త ఇటు చూడయ్యా..!

● రేవుల్లో కానరాని స్వచ్ఛత, భద్రత
● శివరాత్రి స్నానం ప్రహసనం..

పరిశీలన

న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం, తాళ్లపూడి

గౌతమ మహర్షి తపో బలంతో గోదావరి ఆవిర్భవించిన పవిత్ర సలమైన కొవ్వూరు గోష్పద క్షేత్రంలో పుణ్య స్నానాలు ఆచరించే భక్తులకు ఇక్కట్లు తప్పడం లేదు. పురాణ ప్రాశస్త్యంతో ఆధ్యాత్మిక వైభవ ప్రతీకగా భావించి ఉభయ తెలుగు రాష్ట్రాలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఏంటి ఈ దుస్థితి అని ఆవేదన చెందుతున్నారు. పర్వదినాలు, విశేష కార్యక్రమాల సమయాల్లో పురపాలక, జలవనరులు, రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, మత్స్యశాఖలు ఏర్పాట్లు చేసినా.. తర్వాత రోజు నుంచే ఇక్కడి వెతలు యథాతథంగా దర్శనమిస్తున్నాయి. గత పుష్కరాల సమయంలో క్షేత్రంలోని మూడు రేవులను కలిపి 197 మీటర్ల పొడవున ప్రధాన ఘాట్‌ను నిర్మించి ఆధునికంగా తీర్చిదిద్దారు. రేవు పొడవునా రక్షణ వలయం ఏర్పాటు చేశారు. అది ఏడాది కాకుండానే కనుమరుగైంది. ఈనెల **15న మహాశివరాత్రి** పర్వదినం సందర్భంగా కొవ్వూరు, తాళ్లపూడి మండలాల పరిధిలో గోదావరి తీరాన ఉన్న ఆలయాలు, ఆ పరిసరాల స్థితిగతులపై కథనం.

భక్తి కంటే భయమే ఎక్కువ..

అధ్వానస్థితిలో గోష్పద క్షేత్రంలోని రేవు

క్షేత్రం ప్రధాన రేవులో మెట్లు నాచు పట్టి అడుగేస్తే అంతే సంగతులు అన్నట్లు కనిపిస్తోంది. పూజా ద్రవ్యాల వ్యర్థాలు, చెత్తాచెదారం, అపర కర్మలకు వచ్చిన వారు విడిచిన దుస్తులు రేవు, పరిసరాల్లోనే కనిపిస్తున్నాయి. పుణ్యస్నానాలు చేసే భక్తులు దుస్తులు మార్చుకోవడం పరీక్షగా మారుతోంది. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన గదులు సౌకర్యవంతంగా లేవు. పూజలు, ఇతర క్రతువుల కోసం వచ్చే వారు ఎక్కడపడితే అక్కడ మల, మూత్ర విసర్జన చేస్తున్నారు. స్వచ్ఛభారత్ నిధులతో క్షేత్రం ప్రారంభంలో మరుగుదొడ్లు నిర్మించినా ఒక్కటే వినియోగంలో ఉంది.

తాళ్లపూడి పరిధిలో ఇక్కట్లు..

ప్రక్కిలంకలో ప్రమాదకరంగా..

తాళ్లపూడి మండల పరిధిలో ఏ రేవులో చూసినా మద్యం ఖాళీ సీసాలు దర్శనమిస్తున్నాయి. వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. పుష్కరఘాట్, వేగేశ్వపురంలోని బ్రాహ్మణ, ఆంజనేయస్వామి, ప్రక్కిలంక, తాడిపూడి రేవులు ప్రమాదకరంగా మారాయి. ఆంజనేయస్వామి రేవు ఏటవాలుగా ఉండి ప్రమాదాలకు కారణమవుతోంది. పుష్కర ఘాట్ వద్ద పెద్దపెద్ద రాళ్లు ఉన్నాయి. ప్రక్కిలంక రేవులో మెట్ల నిండా ఒండ్రుమట్టి చేరింది. రేవుల వద్ద విద్యుద్దీపాలు సక్రమంగా వెలగడం లేదు. దారి పొడవునా చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా ఉంది.

రక్షణ కార్యాచరణ అంతంతే...

ప్రతిష్ఠాత్మకమైన గోష్పద క్షేత్రం, తాళ్లపూడి పరిధిలోని రేవుల్లో స్నానాలు చేసే వారి భద్రత ప్రశ్నార్థకంగా మారింది. లోతును తెలియజేసే విధంగా బోర్డులు, రక్షణ వలయాల ఏర్పాటుకు ఏవిధమైన ప్రయత్నాలు చేయడం లేదు.

ప్రత్యేక ప్రణాళిక సిద్ధం..

శివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. భక్తుల భద్రతకు పడవలతో గజ ఈతగాళ్లు అందుబాటులో ఉంటారు. మహిళా భక్తులకు అవసరమైన ఏర్పాట్లు, పారిశుద్ధ్య నిర్వహణ, దర్శనాలకు చర్యలు తీసుకుంటాం.

– రాణి సుస్మిత, ఆర్డీవో, కొవ్వూరు

మేమున్నాం.. మీకు తోడుగా

చెత్తచెదారం తొలగింపు..

దేవరపల్లి : మండలంలోని యాదవోలు సొసైటీ సమీపంలో రహదారి పక్క చెత్త చెదారం పేరుకుపోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమీపంలోని పాఠశాలకు రాకపోకలు సాగించే విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా చెత్త చెదారం తొలగింపునకు చర్యలు తీసుకున్నారు.

కొత్త లైట్లు వేశారు..

తాళ్లపూడి : మండలంలోని మలకపల్లి ఎస్సీ ప్రాంతం 6వ వార్డులో వీధి దీపాలు వెలగక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం సర్పంచి రాపాక శ్రీహరి, కార్యదర్శి కామేశ్వర దృష్టికి తీసుకెళ్లగా స్పందించి వెలగని దీపాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయించారు.

అంధకారంతో అవస్థలు..

సమస్య : గౌతమినగర్ గ్రంథాలయం సమీపంలో మూడు వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రయితే ఈ ప్రదేశం అంధకారంగా మారుతోంది. ఓ పక్క కుక్కల సంచారం, పైపులైను మరమ్మతుల కోసం తీసిన గోతులతో భయమేస్తోంది. - పి.సుబ్బారెడ్డి, కొవ్వూరు

సమాధానం : వీధి దీపాలకు మరమ్మతులు చేయించడంతో పాటు పైపులైన్ పనులను పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటాం.

- జి.సందీప్, పురపాలక సహాయ ఇంజినీరు

– న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కొవ్వూరు: 80085 74497
నిడదవోలు: 80085 74501, గోపాలపురం: 91212 29084

పుణ్య స్నానాలకొచ్చే భక్తులకు సౌకర్యాలు

అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే : మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా పుణ్యస్నానాలకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తామని ఆర్డీవో రాణి సుస్మిత అన్నారు. శివరాత్రి నేపథ్యంలో ప్రభుత్వ శాఖల అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. స్నానఘట్టాలు, ఆలయ ప్రాంగణాలను శుభ్రం చేయించాలని, తాగునీటి సౌకర్యం, విద్యుద్దీపాలు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఆర్డీవో పురపాలక అధికారులను ఆదేశించారు. భక్తుల రక్షణకు 24 గంటలపాటు మూడు షిఫ్టుల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, సీసీ కెమెరాలు, ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్తు సరఫరా నిరాటంకంగా ఉండాలని, రేవుల్లో గజ ఈతగాళ్లు, పడవలు సిద్ధంగా ఉంచుతామన్నారు. భక్తుల సౌకర్యార్థం జల్లు స్నానాల ఏర్పాట్లు, భక్తుల క్యూలైన్లు, బారికేడ్లు తదితర అంశాలపై చర్చించారు. ఈనెల 12న గోష్పద క్షేత్రంలో మరో సమావేశం నిర్వహిస్తామన్నారు. మున్సిపల్ వైస్‌ఛైర్మన్ రత్నకుమారి, కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, పట్టణ, గ్రామీణ సీఐలు పి.విశ్వం, విజయ్ బాబు, డీఎల్‌పీవో పి.సావాలి, వివిధ శాఖల అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

విద్యుత్తు దీపాల ఏర్పాటుకు విరాళం

బాబ్జీకి నగదు అందిస్తున్న కొరా కన్నయ్య, రాజేశ్వరి దంపతులు

నల్లజర్ల, న్యూస్‌టుడే : మండలంలోని దూబచర్ల శివారులోని ఆంజనేయస్వామి ఆలయం పక్క రోడ్డు నుంచి కొత్తగూడెం, అయ్యవరం, రాళ్లకుంట గ్రామాల మీదుగా ద్వారకా తిరుమల వెంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం తెదేపా సీనియర్ నాయకుడు మంతెన బాబ్జీ ఆధ్వర్యంలో 9 కి.మీ. మేర విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు నల్లజర్లకు చెందిన కొరా కన్నయ్య, రాజేశ్వరి దంపతులు తమ వంతుగా రూ.లక్ష బుధవారం బాబ్జీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు పుసులూరి శ్రీను, సవలం రామకృష్ణ, కొరాడ సద్గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సంపద కేంద్రాల పరిశీలన

పెరవలి : మండలంలోని సంపద కేంద్రాలను డీడీవో సుదర్శనరెడ్డి బుధవారం పరిశీలించారు. పెరవలి కేంద్రం ఆవరణలో కొబ్బరి మొక్క నాటారు. ఆయన వెంట ఎంపీడీవో పద్మజ, డిప్యూటీ ఎంపీడీవో చంద్ర వెంకటరమణ, వెంకటరెడ్డి, కార్యదర్శులు ఉన్నారు.

గోడ పత్రాలు ఆవిష్కరిస్తున్న జేసీ మేఘాస్వరూప్, వికాస అధికారులు తదితరులు

'ఉపాధి' అవకాశాలు సద్వినియోగం చేసుకోండి : జేసీ

కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఉద్యోగ మేళాల ద్వారా కల్పించే ఉపాధి అవకాశాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ మేఘాస్వరూప్ సూచించారు. వికాస సహకారంతో ఈ నెల 13న మానవతా సంస్థ ఆధ్వర్యంలో గోపాలపురంలో నిర్వహించనున్న మెగా ఉద్యోగ మేళాకు సంబంధించి ప్రచార గోడ పత్రాలను బుధవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ గోపాలపురంలోని శర్వాణి ఆంగ్లమాధ్యమ ఉన్నత పాఠశాల వద్ద ఆరోజు ఉదయం 9 గంటల నుంచి జరిగే ఈ మెగా జాబ్‌మేళా ద్వారా టెక్నికల్, నాన్‌టెక్నికల్, ఐటీ, ఫార్మా, హెల్త్‌కేర్, బ్యాంకింగ్ వంటి రంగాల్లో 1,200 ఉద్యోగాలు కల్పించేందుకు 20 కంపెనీలు ముందుకొచ్చాయన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. వికాస ప్రాజెక్టు డైరెక్టర్ లచ్చారావు, జిల్లా మేనేజర్ బాబు, మానవతా సంస్థ అధ్యక్షుడు రాపాక ఫణి పాల్గొన్నారు.

పుష్కర ప్రణాళికపై చర్చిస్తా : ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు పట్టణం : రానున్న పుష్కరాలకు విచ్చేసే యాత్రికులు, భక్తులకు సకల సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు **కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు** తెలిపారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో సభలో ప్రస్తావించనున్న అంశాలను 'న్యూస్‌టుడే'కు వివరించారు. పుష్కరాల క్రతువు నిర్వహణకు రాజమహేంద్రవరంతో సమానంగా కొవ్వూరు నియోజకవర్గానికి ప్రాధాన్యమివ్వాలని ముఖ్యమంత్రి, ఆయా శాఖల మంత్రులు, అధికారుల దృష్టికి తీసుకెళతానన్నారు. ఇప్పటికే శాఖల వారీగా పంపిన ప్రతిపాదనలకు అనుగుణంగా నిధులివ్వాలని కోరతానన్నారు. పుష్కరాల లోపుగా కొవ్వూరు సీహెచ్‌సీని 100 పడకల ఆసుపత్రిగా మార్చాలని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలకు 10 ఎకరాల స్థల సేకరణ, భవనాల నిర్మాణాలకు నిధులు అడుగుతానన్నారు. నియోజకవర్గంలోని ఎత్తిపోతల పథకాలకు పూర్వవైభవం తేవాలని, ఏఎంసీ భవనం, గోదాముల నిర్మాణ పనులకు నిధుల కోసం ప్రయత్నిస్తానని తెలిపారు.

అసెంబ్లీ సమావేశాల వేళ..

సాగు నీటి కాలువల ఆధునికీకరణపై ప్రస్తావిస్తా

గోపాలపురం : నియోజకవర్గం పరిధిలో సాగునీటి కాలువల ఆధునికీకరణ, కొన్ని చోట్ల పిల్ల కాలువల అభివృద్ధి ఆవశ్యకతపై అసెంబ్లీలో ప్రస్తావిస్తానని **గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు** తెలిపారు. రానున్న పుష్కరాల నేపథ్యంలో రహదారులు, ఆలయాలు, పర్యటక ప్రాంతాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరతానన్నారు. ప్రధాన రహదారులకు గ్రామీణ ప్రాంత రోడ్ల అనుసంధానానికి నిధులు విడుదల, నిరుద్యోగ యువతి యువకులకు ఉద్యోగ, ఉపాధి కలనకు మినీ పరిశ్రమల ఏర్పాటుపై అసెంబ్లీలో ప్రస్తావిస్తానన్నారు.

సాయినాథ్ ఆలయ వార్షిక వేడుకలు

చాగల్లు : శ్రీ సాయినాథ్ ఆలయం 24వ వార్షిక వేడుకలు బుధవారం ప్రారంభమయ్యాయి. కలశ స్థాపన, పుణ్యాహవచనం, మండపారాధన, మహా గణపతి హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

డ్రోన్ వినియోగంతో ఖర్చు ఆదా

చాగల్లు : మండలంలోని నందిగంపాడులో ఆర్.కామేశ్వరరావు అనే రైతు వరి చేలో నానో యూరియా, ఆరి పోటాష్ బుధవారం ప్రయోగాత్మకంగా డ్రోన్‌తో పిచికారీ చేసి ఖర్చు లెక్కించారు. ఎకరానికి సుమారు రూ.680 వరకు ఆదా అయినట్లు మండల వ్యవసాయాధికారి వేణుగోపాల్ తెలిపారు.

పనులు సకాలంలో పూర్తి చేయాలి

బొమ్మూరు(హుకుంపేట): ఉపాధిహామీ పథకంలో పనులు సకాలంలో పూర్తి చేయాలని ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.నాగ మల్లేశ్వరావు సూచించారు. హుకుంపేట మండల కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ 20224-25 ఏడాదికి గాను చేపట్టిన పనులపై సమీక్ష నిర్వహించారు. డీవీవో రత్నకుమారి మాట్లాడుతూ 17వ రౌండ్‌లో మిగిలిపోయిన పనులను పూర్తి చేయాలన్నారు. ఏపీడీ పి.రామప్రసాద్, ఎంపీడీవో ఆర్మ్‌స్ట్రాంగ్ పాల్గొన్నారు.

రక్షణ కొరవడి.. పెచ్చులూడుతూ

ఉండ్రాజవరంలో సుబ్బారాయుడి కాలువపైనున్న పాత వంతెన శిథిలావస్థకు చేరింది. రక్షణ గోడలు పడిపోయాయి. అగుడు భాగంలో స్లాబ్ పెచ్చులు ఊడిపడుతున్నాయి. భారీ వాహనాలు తిరుగుతుండడంతో ఏ క్షణంలోనైనా కూలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వంతెన దుస్థితిని ఏఈ మురళి దృష్టికి తీసుకు వెళ్లగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, ఉండ్రాజవరం

వంతెన లేక.. రాకపోకలకు అవస్థ

కొవ్వూరుపాడు నుంచి నరసన్నపాలెం అడ్డ రోడ్డులోని అల్లి కాలువపై వంతెన లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ రోడ్డుకు ఇరువైపులా ఉన్న పంట భూముకు నిత్యం రైతులు, కూలీలు రాకపోకలు సాగిస్తుంటారు. కాలువ వేసవిలో మినహా పారుతూనే ఉంటుంది. ఆ నీటిలో నుంచే రాకపోకలు సాగించాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం సమయంలో ప్రవాహం ఎక్కువగా ఉండడంతో కాలువ దాటలేక సుమారు 10 కిలోమీటర్లు చుట్టూ తిరిగి వెళాల్సి వస్తోందంటున్నారు. వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గోపాలపురం

పక్కనే గుంత.. ప్రమాదాల చింత

దేవరపల్లి మండలం యర్నగూడెం-యాదవోలు రహదారిలో పోలవరం కుడి కాలువ దాటిన తర్వాత రోడ్డును ఆనుకుని మూడు అడుగుల లోతున గుంతపడింది. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో వాహనచోదకులు ఆదమరపున పక్కకు వెళితే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. రాత్రి వేళలో గుంతను గుర్తించలేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులు అందులో కర్ర ఏర్పాటు చేసి ఎర్రటి వస్త్రం కట్టారు. ఈ విషయం ర.భ. శాఖ ఏఈ శ్రీనివాస్ విజయ్ దృష్టికి తీసుకు వెళ్లగా గుంత పూడ్చివేతకు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, దేవరపల్లి

దుర్భరస్థితిలో దొరయ్య కాలువ

పెరవలి మండలం నడుపల్లిలోని దొరయ్య డ్రెయిన్ అధ్వాన స్థితికి చేరింది. గ్రామం మధ్యలోనున్న దీని ద్వారా పొలాల్లోని మురుగు నీరు కాలువలో చేరాల్సి ఉంది. తూడు పెరిగిపోవడంతో మురుగు నీరు లాగడం లేదు. దోమలు పెరిగి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు వాపోతున్నారు. ఈ సమస్యను పంచాయతీ కార్యదర్శి మర్రి రవిరాజ్ దృష్టికి తీసుకు వెళ్లగా ప్రస్తుతం ఇక్కడ కల్వర్టు నిర్మిస్తున్నామని, ఆపనులు పూర్తయిన తర్వాత డ్రెయిన్‌ను శుభ్రం చేయిస్తామన్నారు. – న్యూస్‌టుడే, పెరవలి

త్యాగశీలి దీన్ దయాళ్ ఉపాధ్యాయ

మాట్లాడుతున్న భాజపా జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర

దేవీచౌక్, న్యూస్‌టుడే: దేశంకోసం, పార్టీకోసం జీవితాన్నే త్యాగం చేసిన జనసంఘ్ మాజీ అధ్యక్షుడు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ త్యాగశీలి అని భాజపా జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర కొనియాడారు. బుధవారం రాజమహేంద్రవరంలోని పార్టీ కార్యాలయంలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని కార్యకర్తల సమక్షంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దీన్ దయాళ్ ఉపాధ్యాయ తన ఏకాత్మ మానవవాదం సిద్ధాంతంతో భారతీయ సంస్కృతి ఆధారంగా దేశాభివృద్ధి జరగాలని కోరుకున్నారన్నారు. . అంతకుముందు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాలగ్రామ లక్ష్మీప్రసన్న, కార్యదర్శి బొమ్ముల దత్తు, కోడూరి లక్ష్మీనారాయణ, అడబాల రామకృష్ణారావు, ఉన్ని కృష్ణన్, పొట్లూరి రామ్మోహనరావు, యానాపు ఏసు, కురగంటి సతీష్, మద్దిపాటి రజని, రాజేష్‌కుమార్ జైన్, తడవర్తి ఫణీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ తాతారావు మృతి తీరని లోటు

నిడదవోలు సీహెచ్‌సీ వద్ద పట్టణ ప్రజల సంక్షేమ సంఘ నాయకులు, వైద్యుల నివాళి

నిడదవోలు, న్యూస్‌టుడే: తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ ఏవీఆర్ఎస్ తాతారావు మృతికి పట్టణ ప్రజల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిడదవోలు సీహెచ్‌సీ వద్ద సంతాప సభ నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు జువ్వల రాంబాబు మాట్లాడుతూ పేదలకు వైద్యం అందించడంలో తాతారావు ఎప్పుడు ముందుండేవారని కొనియాడారు. ఆయన మృతి పేదలకు తీరని లోటన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఫయాజ్, వైద్యులు రుబీనా, సుష్మారాణి, ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు దిద్దే దయామణి, డాక్టర్ జానకి ప్రియ, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భాజపా ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా మాధవ్

నల్లజర్ల : భాజపా ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా సుభద్రపాలేనికి చెందిన పోలుకొండ సేతు మాధవ్ నియమితులయ్యారు. జిల్లా అధ్యక్షుడు తగరం సురేష్ నుంచి బుధవారం నియామక పత్రం అందుకున్నట్లు ఆయన తెలిపారు.

జింకు లోపాన్ని అధిగమించాలి

ఉండ్రాజవరం : ఉద్యాన, వరి పంటల్లో జింకు ధాతు లోపం నివారణకు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.రాజారావు రైతులకు సూచించారు. ఉండ్రాజవరంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు జింకు సల్ఫేట్ పంపిణీ చేశారు.

వరకట్నం వేధింపులపై కేసు

కొవ్వూరు పట్టణం : అధిక కట్నం తేవాలని భర్త వేధింపులకు గురి చేస్తున్నాడని ఓ వివాహిత పట్టణ పోలీసులను ఆశ్రయించారు. వివరాల ప్రకారం వాడపల్లికి చెందిన జ్యోతికి అదే గ్రామానికి చెందిన ఆరుగొలను చైతన్యతో 2018లో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. ఈ మధ్య కాలంలో అధికంగా కట్నం కావాలని చైతన్య భార్యను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీ అలెగ్జాండర్ తెలిపారు.

రథానికి ప్రత్యేక పూజలు

కోరుకొండ, న్యూస్‌టుడే: కోరుకొండ లక్ష్మీనరసింహ స్వామి రథోత్సవం ఈ నెల 27న జరగనున్న నేపథ్యంలో బుధవారం రథశాల నుంచి రథాన్ని భక్తులు ప్రధాన రహదారిపై బయటకు తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరంగం స్థానాచార్యులు లక్ష్మీనృసింహభట్టర్ స్వామి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకస్వామి గిరిధరాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. డీఈ గుర్రాజు, ఇన్‌స్పెక్టరు శ్రీనివాసాచార్యులు, స్థానిక ఇన్‌ఛార్జి కె.శ్రీనివాస్, ఈశ్వరరావు, దుర్గాచార్యులు, కటకం చలం, తెలగంశెట్టి శ్రీను, వీరాస్వామి, దొరబాబు తదితర రథం నిర్వాహకులు, అన్నవరం దేవస్థానం అధికారులు, సిబ్బంది, విశ్వ బ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

'అధ్యక్షుడి ఎంపికలో అభిప్రాయాలు తీసుకోవాలి'

తాళ్లపూడి : వేగేశ్వరపురం ఎత్తిపోతల పథకం రైతుల సమావేశం అక్కడి వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పథకం గత అధ్యక్షుడు కైగాల రాంబాబు మాట్లాడుతూ కాంగ్రెస్, తెదేపా, వైకాపా హయంలో తాను అధ్యక్షుడిగా పని చేసి, రైతులకు ఇబ్బంది లేకుండా సమర్థంగా పథకం నిర్వహించానన్నారు. ఎత్తిపోతల దస్త్రాలన్నీ అక్కడి గదిలోనే ఉన్నాయని, అధికారులతోపాటు కొంత మంది కావాలనే ఆరోపణలు చేస్తున్నారన్నారు. పలువురు రైతులు మాట్లాడుతూ పథకం అధ్యక్షుడి నియామకం విషయంలో తమ అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. సమావేశంలో మాజీ సర్పంచి ఎ.రాంబాబు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

గోపాలపురం : అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న దొండపూడికి చెందిన జుత్తిక శ్రీనుకు గ్రామానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్ సభ్యులు బుధవారం రూ.15 వేలు ఆర్థిక సాయం అందించారు.

మృతుల కుటుంబాలకు..

దేవరపల్లి : ఇటీవల గామన్ వంతెనపై జరిగిన ప్రమాదంలో మృతి చెందిన దుద్దుకూరుకు చెందిన తాతపూడి చిన్న సుబ్బారావు, వెలగన కోట సత్యనారాయణ కుటుంబాలను బుధవారం లోడింగ్ ట్రాక్టర్ కార్మికుల యూనియన్ నాయకులు పరామర్శించి రూ.27,400 చొప్పున నగదు, ఒక్కో బియ్యం బస్తా అందించారు. కార్యక్రమంలో ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కే.మస్తాన్, కార్తిక్, రాజశేఖర్, పాపారావు, రాంబాబు తదితరులు, పాల్గొన్నారు.

డాక్యుమెంట్ పోయినది

దాపర్తి కాశీవిశ్వనాథం, S/o సోమరాజు, డోర్ నెం.7-131, దేవరపల్లి గ్రామం, దేవరపల్లి మండలం, తూ॥గో॥జిల్లా, AP అను నాయొక్క ఒరిజినల్ డాక్యుమెంట్ నెం. 2465/2001 ది.9-02-2026న మా ఇంటి నుండి దేవరపల్లి సెంటర్‌లో జిరాక్స్ కోసం వెళ్లుచుండగా మార్గమధ్యలో పడిపోయినవి. ఎవ్వరికైనా దొరికిన వారు పై అడ్రస్‌కు గాని, క్రింది ఫోన్ నెంబర్‌కు గాని తెలియపర్చగలరు.

సెల్: 85238 10822

తాళాలు పగలగొట్టి చోరీ

తెరిచి ఉన్న బీరువా, చిందర వందరగా దుస్తులు

నల్లజర్ల, న్యూస్‌టుడే : మండలంలోని దూబచర్లలో ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలోని ఏడు కాసుల బంగారు ఆభరణాలు, 200 గ్రాముల వెండి వస్తువులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై శివగణేష్ వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పూరెళ్ల పవన్ భార్య ప్రకాశరావుపాలెంలోని అమ్మగారింట ప్రసవించడంతో ఆదివారం చూడ్డానికి వెళ్లారు. ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నట్లు పరిసరాల్లోని వారు గుర్తించి బుధవారం ఉదయం ఆయనకు సమాచారం ఇవ్వడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని సీఐ రాంబాబు, ఎస్సై పరిశీలించారు. కేసు నమోదు చేశారు.

ఓటర్ల జాబితాపై కసరత్తు

● రాజకీయ పార్టీలు, ఆశావహుల్లో కదలిక

న్యూస్‌టుడే, నిడదవోలు

పట్టణ పరిధిలోని ఓటర్ల జాబితా వచ్చే నెల 9న ఫోటోలతో సహా ప్రచురించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం సూచించడంతో అధికారులు కసరత్తుకు సిద్ధమవుతున్నారు. ఈ ఏడాది జనవరి ఒకటి నాటికి 18 ఏళ్లు నిండిన వారికి జాబితాలో చోటు కల్పించనున్నారు. ప్రస్తుతం నిడదవోలులో 28 వార్డుల్లో 35 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. 3, 4, 9, 23, 24, 27 వార్డుల పరిధిలో రెండేసి చొప్పున ఉన్నాయి. వీటి పరిధిలో 33,614 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 15,972, మహిళలు 17,642 మంది. ఈసారి కొద్దిగా పెరిగే అవకాశం ఉంది. ఎన్నికల సంఘ తాజా ప్రకటనతో ప్రధాన పార్టీలు, పోటీకి సిద్ధమవుతున్న ఆశావహుల హడావుడి మొదలైంది. గత ఎన్నికల రిజర్వేషన్లు, ప్రస్తుతం ఏ వార్డు ఏ కేటగిరికి కేటాయిస్తారో అంచనా వేస్తూ ఏ వార్డులో ఏ పార్టీకి మొగ్గు ఉంటుందనే దిశగా అంచనాలు వేసుకుంటూ రంగం సిద్ధం చేసుకుంటున్నారు. గత ఎన్నికలకు ముందు నిడదవోలులో 24 వార్డులు ఉండేవి. తర్వాత 28కి పెరిగాయి. ఈసారి అటువంటి అవకాశం కనిపించడం లేదు. గత ఐదేళ్ల నుంచి పట్టణ శివారు ప్రాంతాలు కొంత వరకు పెరిగినా.. జన సంఖ్యపై ఆ ప్రభావం కనిపించలేదు. పోలింగ్ కేంద్రాల సంఖ్య మాత్రం ఒకటి రెండు పెరిగే అవకాశం కనిపిస్తోంది.


నిడదవోలు పురపాలక సంఘ కార్యాలయం

గడిచిన అరవై ఏళ్లలో..

నిడదవోలు పురపాలక సంఘం ఆవిర్భవించి 60 ఏళ్లయ్యాయి. ఇప్పటి వరకు 10 మంది ఛైర్మన్లు, ఇద్దరు ఇన్‌ఛార్జి ఛైర్మన్లు పని చేశారు. తొలి ఛైర్మన్‌గా డాక్టర్ బీవీఎల్ఎన్ రాజు ఎన్నిక కాగా, చిన్నం వెంకన్న, బొబ్బా కృష్ణమూర్తి రెండుసార్లు ఛైర్మన్‌గా పని చేశారు. 8 మంది ప్రత్యేకాధికారుల పాలన సాగింది. వచ్చే నెల 17తో ప్రస్తుత పాలకవర్గం పదవీ కాలం పూర్తి కానుండడంతో మళ్లీ ప్రత్యేకాధికారి పాలన వచ్చే అవకాశం కనిపిస్తోంది. పాలక వర్గాలు ఉంటే ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలను కౌన్సిలర్లు అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించే అవకాశం ఉంటుంది. అదే ప్రత్యేకాధికారుల పాలనలో అయితే సమస్యలు అంతగా పరిష్కారం కావనే అపోహ ప్రజల్లో ఉంది. అటువంటి పరిసితుల్లో ప్రస్తుతం ఎన్నికలు జరుగుతాయా.. లేక ప్రత్యేకాధికారుల పాలనే వస్తుందా? అనే చర్చ ప్రజల్లో సాగుతోంది.

భూముల మరియు షాప్స్ కౌలు హక్కునకు టెండరు-కం-బహిరంగ వేలం పాట ప్రకటన

ఈ దిగువ స్టేట్‌మెంట్‌నందు చూపిన దేవస్థానముల భూముల మరియు షాప్స్ చేసుకొను కౌలు హక్కు 2026-2027 సం॥రం నుండి 2028-2029 సం॥రం వరకు అనగా 3 సంవత్సరముల కాలపరిమితికి దేవాదాయశాఖ అధికారుల సమక్షములో వ్యవసాయ భూముల మరియు షాప్స్ బహిరంగ వేలం పాటలు టెండరు-కం-బహిరంగ వేలం పాట పెట్టబడును. వేలం పాటలో పాల్గొనువారు ఈ క్రింది స్టేట్‌మెంట్‌నందు చూపిన ధరావతు చెల్లించి పాటలో పాల్గొనవలసినదిగా తెలియజేయడమైనది.

వ. నెం.	దేవస్థానం పేరు	ఆర్.ఎస్.నెం. (డోర్ నెం.)	విస్తీర్ణం ఎ.సెం.	ధరావతు రూ.	కౌలు కాల పరిమితి	సీల్డు టెండరు స్వీకరించు తేదీ, సమయం	వేలం పాట జరుగు ప్రదేశం, తేదీ, సమయం
1.	శ్రీ విశ్వేశ్వరస్వామి వారి దేవస్థానం, ప్రక్కిలంక గ్రామం తాళ్లపూడి మండలం	12/1	0.20	5000/-	2026-27 నుండి 2028-29 వరకు సం॥లు	ది. 18-02-2026 మధ్యాహ్నం గం. 12.00లకు	శ్రీ స్వామివారి దేవస్థానం, ది. 18-02-2026 మధ్యాహ్నం గం. 12.00 లకు
2.	శ్రీమదనగోపాల స్వామివారి దేవస్థానం, తాళ్లపూడి గ్రామం తాళ్లపూడి మండలం	116-1 Shop-1 Shop-2	(19x14) (12x8)	20000/- 10000/-	2026-27 నుండి 2028-29 వరకు 3 సం॥లు	ది. 18-02-2026 ఉదయం గం. 11.00లకు	శ్రీ స్వామి వారి దేవస్థానం, ది. 18-02-2026 ఉదయం గం. 11.00

షరతులు: వేలం పాట షరతులు, ఇతర వివరములకు పెట్టేవంనందు గల దేవస్థానం కార్యాలయం పనిచేయు వేళలలో కార్యనిర్వహణాధికారి వారిని అడిగి తెలుసుకొనవచ్చును.

గ్రామం: తాళ్లపూడి, తేది: 11-02-2026. ఎస్.సూర్యప్రకాశరావు, కార్యనిర్వహణాధికారి, సెల్ నెం. 9441265809

మండపేట

• మండపేట • అనపర్తి

పంచముఖ ఆంజనేయస్వామిగా అలంకరణ

పంచముఖ ఆంజనేయ స్వామిగా అలంకరణ

బిక్కవోలు, న్యూస్‌టుడే: మెర్లపాలెంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవంలో 8వ రోజు పంచముఖ ఆంజనేయస్వామిగా స్వామిని అలంకరించారు. తొమ్మిది రోజుల పాటు జరిగే వార్షికోత్సవాల్లో నిత్య పూజలు అభిషేకాలు నిర్వహిస్తున్నారు. బుధవారం ప్రత్యేక పూజల్లో స్వామివారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. స్వామివారికి వెండి ఆభరణాలతో అలంకరించారు. శ్రీరామ సప్తాహం ఆరో రోజుకు చేరింది. నిత్య భజనలు కొనసాగుతున్నాయి.

రథానికి ప్రత్యేక పూజలు

కోరుకొండ: కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం ఈ నెల 27న జరగనున్న నేపథ్యంలో బుధవారం రథశాల నుంచి రథాన్ని బయటకు తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరంగం స్వానాచార్యులు లక్ష్మీనృసింహభట్టర్ స్వామి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకస్వామి గిరిధరాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు.

రేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ఏడిద సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని రామచంద్రపురం ఈఈ కె.రత్నాలరావు తెలిపారు. ఏడిద గ్రామంలో రథోత్సవం సందర్భంగా గ్రామంతో పాటు ఏడిద కొత్తూరు, ఏడిద శివారు, ఏడిద సీతానగరం గ్రామాల్లో సరఫరా నిలిపివేస్తామని వివరించారు.

ఉపముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యేలు

మండపేట, న్యూస్‌టుడే: శాసనసభ సమావేశాల్లో భాగంగా గురువారం ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను ఎస్‌సీసీ ఛైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. మండపేట నియోజకవర్గంలోని గ్రామాల్లో అభివృద్ధి పనులకు రూ.22.75 కోట్ల సాస్కీ నిధులు కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రహదారుల అభివృద్ధి, డ్రెయిన్లు, తాగునీటి సరఫరా పనులు పెద్దఎత్తున చేపట్టినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే వేగుళ్లతో పాటు కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం తదితరులు ఉపముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

పవన్‌కల్యాణ్‌తో ఎమ్మెల్యేలు వేగుళ్ల, అయితాబత్తుల, దాట్ల, బండారు, ఎమ్మెల్సీ పేరాబత్తుల

స్నానఘట్టాలు అధ్వానం.. పుణ్యస్నానాలు ఎలా సాధ్యం..?

పరిశీలన

మండపేట, న్యూస్‌టుడే: మహాశివరాత్రి వేడుకల నిర్వహణకు శివాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు కనీస వసతుల కల్పనతో పాటు మహాశివరాత్రి దర్శనం సాఫీగా జరిగేలా చర్యలు చేపడుతున్నారు. అయితే గోదావరి పరివాహక ప్రాంతాల్లోని పంటకాలువల వద్ద ప్రధాన స్నానఘట్టాల పరిసరాలు మాత్రం అస్తవ్యస్తంగా మారాయి. వీటిని బాగుచేయాలనే ఆలోచన ఇంకా అధికారులకు రాలేదు. మహాశివరాత్రి పురస్కరించుకుని ఈనెల 15వ తేదీన తెల్లవారుజాము 3 గంటల నుంచే భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారు. అనంతరం శివాలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ప్రస్తుతం రబీ పంట నేపథ్యంలో పంటకాలువల్లో నీటి ప్రవాహం ఎక్కువగా ఉంది. దీనివల్ల స్నానఘట్టాల వద్ద రక్షణ చర్యలతో పాటు విద్యుత్తు దీపాలు ఏర్పాటుచేయాల్సి ఉంది. భక్తుల రద్దీ అధికంగా ఉండే చోట్ల రెవెన్యూ, పోలీసు శాఖల పర్యవేక్షణ ఉండాలి. దీనికి భిన్నంగా కాలువ గట్లు, స్నానఘట్టాల వద్ద రక్షణ కొరవడింది. పరిసరాలు అస్తవ్యస్తంగా మారాయి. మండపేట నియోజకవర్గం పరిధిలోని పలు స్నానఘట్టాల వద్ద కనీస ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు.

పెదకాలువ వద్ద స్నానఘాట్ పరిస్థితి ఇది

మండపేట పట్టణ పరిధిలోని పెద కాలువ వద్ద స్నానఘట్టం వద్ద వ్యర్థాలు పేరుకుపోయాయి. మెట్లు పాకుడుగా మారాయి. వీరభద్రపురం, మారేడుబాక వంతెన వద్ద కూడా ఇదే పరిస్థితి. ఈ రెండు చోట్ల స్నానాలు ఆచరించిన తరవాత మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక గదులు సిద్ధం చేయాలి.

ఇవీ సమస్యలు

తెల్లవారుజామున స్నానాలు ఆచరించే వారి సౌలభ్యం విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయాలి. పేకేరుపాకలు గోదావరి కాలువ స్నాన ఘట్టం వద్ద రక్షణ చర్యలు చేపట్టాలి. రాయవరం మండలం సోమేశ్వరం శివాలయం, మాచవరం వంతెన వద్ద రేవులు శుభ్రం చేసి సౌకర్యాలు కల్పించాలి. కపిలేశ్వరపురం మండలం తాతపూడి, కోరుమిల్లి, కపిలేశ్వరపురం స్నానఘట్టాలు అధ్వానంగా మారాయి. వచ్చే సంవత్సరంలో పుష్కరాల నేపథ్యంలో వాటిని పటిష్ఠంగా తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టాలి.

కాలువలన్నీ అపరిశుభ్రం..

మండపేట మండల పరిధిలోని అర్తమూరు వినాయకుడి ఆలయం వద్ద ఘాట్‌ని శుభ్రం చేయాలి. జడ్.మేడపాడు వంతెన వద్ద, ద్వారపూడి అయ్యప్ప ఆలయం వద్ద పంటకాలువ ఘాట్లు అపరిశుభ్రంగా ఉన్నాయి. ఏడిద స్వయంవర పార్వతి సమేత సంఘమేశ్వరాలయం వద్ద స్నానాల రేవు మెట్లు తక్షణం శుభ్రం చేయాలి.

వెంటనే పనులు చేయిస్తాం..

● శివరాత్రి భక్తుల రద్దీ అధికంగా ఉండే పెదకాలువ స్నానఘట్టం వద్ద పరిసరాలను వెంటనే శుభ్రం చేయించే పనులు చేపడతాం. అన్ని ఘాట్లలో రెవెన్యూ, పోలీసు యంత్రాంగం పర్యవేక్షణ ఉంటుంది.

- టి.వి.రంగారావు, మున్సిపల్ కమిషనర్, మండపేట

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

మండపేట: 80085 74183 ద్వారపూడి: 98490 93850
అనపర్తి: 95333 66637 అంగర: 97044 16418
రాయవరం: 80085 74185

వ్యర్థాలు తొలగించారు..

సమస్య: మండపేట మండలం ఎస్సీకాలనీ రక్షితనీటి ట్యాంకువీధిలో రహదారి పక్కన వ్యర్థాలు పోస్తున్నారు. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. - మేడిశెట్టి త్రిమూర్తులు, జడ్.మేడపాడు

సమాధానం: సమస్యను పంచాయతీ కార్యదర్శి శ్రీరామచంద్రమూర్తి దృష్టికి తీసుకువెళ్లగా సిబ్బందిని పంపించి వ్యర్థాలు తొలగించే పనులు చేయించారు.

- న్యూస్‌టుడే, ద్వారపూడి

దోమల మందు పిచికారీ

సమస్య: కపిలేశ్వరపురం మండలం అంగరలో దోమల బెడద తీవ్రంగా ఉంది. రోజూ వీటి కాట్లతో జ్వరాల బారిన పడుతున్నాం. - జి.శ్రీనివాస్, స్థానికుడు, అంగర

పరిష్కారం: సమస్యను పంచాయతీ కార్యదర్శి రాయుడు మోహన్ వద్ద ప్రస్తావించగా వెంటనే స్పందించారు. కాలువల వెంబడి దోమల మందు పిచికారీ చేయించారు.

- న్యూస్‌టుడే, అంగర

సమ్మెను విజయవంతం చేయండి

రంగంపేట, న్యూస్‌టుడే: ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 12న చేపట్టే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు అన్నారు. బుధవారం రంగంపేట మండలం సింగంపల్లిలో సమ్మెపై రైతు కూలీ సంఘం ప్రచారం చేపట్టింది. రైతులు, కూలీలకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. ప్రచారంలో సంఘం ప్రతినిధులు రెడ్డి దుర్గాదేవి, మహాలక్ష్మి, రత్నం, సత్తిబాబు పాల్గొన్నారు.

సింగంపల్లిలో ప్రచారంలో రైతు కూలీ సంఘం ప్రతినిధులు

రాయవరం: కార్మిక చట్టాలను సవరించి లేబర్ కోడ్‌లుగా మార్చడాన్ని వ్యతిరేకిస్తూ గురువారం దేశవ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెను కార్మిక సంఘాలు విజయవంతం చేయాలని సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి డి.ఆదిలక్ష్మి పిలుపునిచ్చారు. బుధవారం ఆమె మాట్లాడుతూ స్కీమ్ వర్కర్లకు కనీస వేతనంగా రూ.30 వేలు చెల్లించాలని, అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సేవలు క్రమబద్ధీకరించడం, కౌలు రైతులకు రుణాలు, పంటలకు గిట్టుబాటు ధర చట్టం తదితర డిమాండ్లతో సమ్మె నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మండల కేంద్రమైన రాయవరంలో ఉదయం 10.30 గంటలకు ర్యాలీలో కార్మికులు, సంఘాల నేతలు అధిక సంఖ్యలో పాల్గొవాలని విజ్ఞప్తి చేశారు.

రేపు ఎస్టీయూ ధర్నా

మండపేట, న్యూస్‌టుడే: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీన అమలాపురం కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని ఆ సంఘం మండపేట మండల అధ్యక్షుడు చల్లా వీరవెంకట సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కూసు వీరరాఘవులు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛన్‌దారుల సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేస్తామని వివరించారు.

దీన్‌దయాళ్‌కు నివాళి

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని మండపేట మండలం ద్వారపూడిలో బుధవారం భాజపా ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు పాలిక రమణ, రాయి వీర్రాజు, కంకటాల మురళి, నీల సత్యనారాయణ, గుత్తుల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ద్వారపూడిలో చిత్రపటం వద్ద భాజపా నాయకుల నివాళి

ఆర్టీఐ కమిషనర్‌కు సత్కారం

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన వీఎస్‌కే చక్రవర్తిని మంగళగిరిలోని ఆర్టీఐ కార్యాలయంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని అంశాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట జనసేన నేత రావాడ నాగు పాల్గొన్నారు.


చక్రవర్తిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

శివరాత్రికి కోటిలింగేశ్వరాలయం ముస్తాబు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: పవిత్ర గోదావరి చెంతన కోటిలింగాలపేటలో కొలువైన శ్రీఉమా కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. దేవాదాయ ధర్మాదాయశాఖ అధీనంలోని దేవస్థానంలో ఈనెల 12 నుంచి 16వ వరకు స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ అధికారులు తెలిపారు. శివరాత్రి పర్వదినం రోజున భారీ ఎత్తున భక్తులు తరలి వచ్చే ఆలయం కావడంతో దీనికి ప్రత్యేకత ఉంటుంది.

దివ్య కల్యాణ మహోత్సవాలు..

● ఈనెల 12న ఉదయం 8.45 గంటలకు స్వామి, అమ్మవారికి మంగళ స్నానాలు, పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెగా అలంకారం, గణపతి పూజ, ధ్వజారోహణ, అంకురార్పణ, బలిహరణ, మధ్యాహ్నం 3గంటలకు గ్రామోత్సవం, సాయంత్రం స్వామివారికి అగ్నిప్రతిష్ఠాపన, రాత్రి 8.45గంటలకు కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. ● 13, 14 తేదీల్లో స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు. ● 15న మహాశివరాత్రి సందర్భంగా రాత్రి 1.05గంటల నుంచి స్వామివారికి విశేష అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజ అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పిస్తారు. మధ్యాహ్నం 2.10గంటలకు రథోత్సవం, రాత్రి 10.15గంటల నుంచి లింగోద్భవ అభిషేకాలు నిర్వహిస్తారు. ● 16న ఉదయం స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజలు, వసంతోత్సవం, త్రిశూల స్నానం, రాత్రి 7.15 గంటలకు పుష్పోత్సవం నిర్వహిస్తారు.

హోటళ్లలో నాణ్యత పాటించాలి

మండపేట, న్యూస్‌టుడే: ఆహార పదార్థాల తయారీ, వడ్డనలో హోటళ్ల నిర్వాహకులు నాణ్యత ప్రమాణాలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ టి.వి.రంగారావు సూచించారు. అపరిశుభ్రంగా ఉన్నా, నిల్వ పదార్థాలు విక్రయించినా కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ నిర్వాహకులతో మున్సిపల్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గ్లాసులు, ప్లేట్లను ఎప్పటికప్పుడు వేడినీటితో శుభ్రం చేయాలన్నారు. వంటశాల, భోజనశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని చెప్పారు. తెలుపురంగు వేయించాలని, సర్వర్లు సైతం శుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. టీ, సాంబారు, కూరలు, అన్నం, బిర్యానీ వంటి పదార్థాలు వేడిగా ఉన్నప్పుడు పార్శిల్ చేసే సమయంలో ప్లాస్టిక్ కవర్లు వాడొద్దని సూచించారు. ప్రత్యామ్నాయంగా ప్లాస్కులు, స్టీలు, లేదా గాజుగ్లాసులు వాడాలన్నారు. సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.సత్తిరాజు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

హోటల్ నిర్వాహకులతో మాట్లాడుతున్న కమిషనర్

ప్రత్యేక తరగతులు.. సత్ఫలితాలే లక్ష్యం

నూరు శాతం ఉత్తీర్ణతకు ప్రణాళిక అమలు

మండపేట గ్రామీణం, అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షలు మార్చి 16 నుంచి ప్రారంభంకానున్న నేపథ్యంలో ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యసాధనకు ఉపాధ్యాయులు తీవ్రంగా కృషి చేస్తున్నారు. శత శాతం ఫలితాలు సాధించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలుకు దిశానిర్దేశం చేసింది. ఈ నేపథ్యంలో విద్యార్థులను ఉపాధ్యాయులు అన్ని విధాలా సన్నద్ధం చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులతో విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ చూపుతున్నారు. మండపేట, అనపర్తి నియోజకవర్గాల్లో మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాల్లో మొత్తం జడ్పీ ఉన్నత పాఠశాలలు 54 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు 3,222 మంది ఉన్నారు. వీరిని షైనింగ్ స్టార్స్, రైజింగ్ స్టార్స్‌గా విభజించి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విభజించారు.

గ్రేడ్‌ల వారీగా విభజన..

విద్యార్థులను ఏ, బీ, సీ, డీ గ్రేడ్‌ల వారీగా విభజించి వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. రోజూ సబ్జెక్టుల వారీగా పరీక్షలు నిర్వహించి ఫలితాలను యాప్‌లో నమోదుచేస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహిస్తున్నారు. వీరిలో సీ, డీ గ్రేడ్‌ల విద్యార్థులకు పరీక్షలపై భయం పోగొట్టి ఉత్సాహంగా చదివేలా శిక్షణ ఇస్తున్నారు.

మండపేటలో రోజువారీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

మండలం	ప్రభుత్వ పాఠశాలలు	విద్యార్థులు
మండపేట	12	844
రాయవరం	8	365
కపిలేశ్వరపురం	8	373
అనపర్తి	8	572
బిక్కవోలు	8	510
రంగంపేట	10	558

జిల్లాలో ప్రథమస్థానానికి కృషి..

ఈ ఏడాది వంద శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ప్రణాళిక అమలు చేస్తున్నాం. గత సంవత్సరం ఫలితాల్లో జిల్లాలో ద్వితీయస్థానంలో ఉండగా ఈసారి ప్రథమ స్థానం సాధించడానికి ప్రయత్నం చేస్తున్నాం. అందుకు అనుగుణంగా బోధన జరుగుతోంది. వెనుకబడిన విద్యార్థుల కోసం నిపుణులైన ఉపాధ్యాయులతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. అలాగే విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పిస్తున్నాం.

- పి.రామలక్ష్మణమూర్తి, డీవైఈవో, రామచంద్రాపురం

సమయ సద్వినియోగంతో ప్రయోజనాలు

రంగంపేట, న్యూస్‌టుడే: సమయాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకుంటే లక్ష్యాన్ని సులభంగా చేరుకోవచ్చని రంగంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బి.హేమ అన్నారు. బుధవారం కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఏర్పాటుచేసిన వీడ్కోలు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చరవాణులతో గడుపుతూ విద్యార్థులు విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. ఈ సందర్భంగా రెండేళ్లుగా కళాశాలలో స్నేహితులు, అధ్యాపకులతో గడిపిన సాన్నిహిత్యాన్ని విద్యార్థులు గుర్తుచేసుకున్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ భూషణం తదితరులు మాట్లాడారు.

బాలలు, మహిళల సంరక్షణ అందరి బాధ్యత

రంగంపేట, న్యూస్‌టుడే: బాలలు, మహిళల సంరక్షణ అందరి బాధ్యతని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి కృష్ణవేణి తెలిపారు. బుధవారం రంగంపేట మండల పరిషత్తు కార్యాలయంలో చైల్డ్ వెల్ఫేర్, ప్రొటెక్షన్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. క్షేత్రస్థాయిలో కమిటీలు తీసుకోవాల్సిన జాగ్రత్తల చర్యలను తహసీల్దారు కె.అనసూయ, ఎంపీడీవో వి.సాయిబాబు వివరించారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్తు నియంత్రిక ఏర్పాటుకు చర్యలు

మండపేట, న్యూస్‌టుడే: మండపేట పట్టణంలో మెరుగైన విద్యుత్తు సరఫరా చేసేందుకు అదనంగా నియంత్రికలు ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్తు శాఖ ఏఈ ముని తెలిపారు. బుధవారం 20వ వార్డులో నియంత్రిక ఏర్పాటు పనులను మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్; విద్యుత్తు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ మోర్చా కమిటీకి సింహాచలం ఎంపిక

బిక్కవోలు,న్యూస్‌టుడే: భాజపా ఎస్సీ మోర్చా కమిటీలో బలభద్రపురానికి చెందిన కాటే సింహాచలాన్ని సభ్యునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దళితవర్గాల సంక్షేమం, పార్టీ కార్యక్రమాల విస్తరణలో ఆయన చురుగ్గా పనిచేస్తున్నారని జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు తరగం సురేష్‌బాబు తెలిపారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో ఆయన సేవలు అవసరమని పేర్కొన్నారు. ఈ మేరకు నియామకపత్రాన్ని బుధవారం భాజపా జిల్లా అధ్యక్షులు పి.నాగేంద్ర చేతుల మీదుగా అందించారు.

భాజపా అధ్యక్షుడు, ఎస్సీ మోర్చా అధ్యక్షులతో సింహాచలం

ఆలయ వార్షికోత్సవ పూజలు

అంగర, న్యూస్‌టుడే: కపిలేశ్వరపురం మండలం అంగరలో కొలువైన శ్రీభక్తాంజనేయ స్వామివారి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆధ్యాత్మిక, భజన కార్యక్రమాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయం వద్ద భారీ అన్న సమారాధన ఏర్పాటుచేశారు. అంగర, పడమర ఖండ్రిక, టేకి, కపిలేశ్వరపురం గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తెలుగుపాట ఆర్తి ఘంటసాల

ధవళేశ్వరంలో నివాళులర్పిస్తున్న ప్రముఖులు

ధవళేశ్వరం, మోరంపూడి, న్యూస్‌టుడే: గానగంధర్వుడు పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతిని గోదావరి కల్చరల్ అసోసియేషన్ రాకా ఆధ్వర్యంలో ధవళేశ్వరంలో బుధవారం నిర్వహించారు. ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాకా కార్యదర్శి జి.వి.రమణ మాట్లాడుతూ తెలుగు పాటకు ఆర్తి ఘంటసాల అని కొనియాడారు. అద్వితీయమైన గాత్రంతో కఠినతరమైన గీతాలను కూడా సులువుగా ఆలపించి చరిత్ర సృష్టించారన్నారు. అధ్యక్షుడు యర్రమోతు ధర్మరాజు మాట్లాడుతూ ఎన్ని శతాబ్దాలైనా తెలుగు వారు మరువలేని మహోన్నతుడు ఘంటసాల అని అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ ఇంజినీర్ మదర్షాలీ మాట్లాడుతూ ఘంటసాల గానంతో తెలుగు సినిమాలు విజయోత్సవాలు చేసుకున్నాయన్నారు. కార్యక్రమంలో భమిడిపాటి రామక్రిష్ణ, ఎలక్ట్రికల్ ఇంజినీర్ సబ్బెళ్ల సూరిబాబు, సూరపురెడ్డి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

కడియం: ఆబాల గోపాలాన్ని సుమధుర కంఠస్వరంతో మెప్పించిన గానగంధర్వుడు ఘంటసాల అని వేమగిరికి చెందిన ప్రత్తిపాటి నల్లరాజు అన్నారు. వేమగిరి కూడలిలో ఘంటసాల వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక ఆటో యూనియన్ కార్యవర్గ సభ్యులు, ఘంటసాల అభిమానులు పాల్గొన్నారు.

వేమగిరిలో...

శిథిల వంతెనతో భయం.. భయం

కపిలేశ్వరపురం మండలం కేదార్లంక బోడిపాలెం వంతెన శిథిలావస్థకు చేరడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ వంతెన బ్రిటిషు కాలంలో నిర్మించినదని స్థానికులు చెబుతున్నారు. కేదార్లంక, వీధివారిలంక గ్రామస్థులతో పాటు ప్రముఖ పర్యాటక కేంద్రం ధనమ్మమర్రికి వెళ్లే భక్తుల రాకపోకలకు ఈ వారధే కీలకం. ఆయా గ్రామాల్లో అధికసంఖ్యలో ఇటుక బట్టీలు ఉండడంతో పాటు వందల ఎకరాల్లో ఉద్యానపంటలు సాగుచేస్తున్నారు. కూరగాయల లోడుతో వాహనాలు, ఇటుక ఎగుమతి లారీలకు వంతెన మార్గమే ఆధారం. ఆయా వాహనాల రాకపోకలతో వంతెన కుంగిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, అంగర

శివరాత్రి ఏర్పాట్ల పరిశీలన

బిక్కవోలు, న్యూస్‌టుడే: కొంకుదురు బుడతల మామిడి వద్ద జరగనున్న శివరాత్రి ఉత్సవ ఏర్పాట్లను అనపర్తి సీఐ సుమంత్, బిక్కవోలు ఎస్సై రవిచంద్రకుమార్ బుధవారం పరిశీలించారు. శివరాత్రి ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. తుల్యభాగ ఉత్తర దిక్కుగా ప్రవహించి అంతర్లీనంగా గోదావరి కాలువలో కలిసి తూర్పు దిక్కులో చేరుతుందని భక్తుల విశ్వాసం. ఈ కారణంగా శివరాత్రి ఉత్సవాలకు కాలువలో పవిత్రస్నానాలు చేసి బాలత్రిపురసుందరీ సమేత త్రిముఖలింగేశ్వరుని దర్శించుకోవడానికి భక్తులు ఆసక్తి చూపుతారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు ఘాట్ల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఊలపల్లి అగస్త్యేశ్వరస్వామి దేవాలయం వద్ద కూడా ఏర్పాట్లు పరిశీలించారు.

ఘాట్లు పరిశీలిస్తున్న సీఐ సుమంత్, ఎస్సై రవిచంద్రకుమార్

రక్షణగోడకు తూట్లు.. ఎదుగుతున్న వేళ్లు



బిక్కవోలు పరిసర ప్రాంతాల్లోని తొమ్మిది వేల ఎకరాలకు సాగునీరందించే మూలా డ్యామ్ రక్షణగోడకు తూట్లు పడుతున్నాయి. జల వనరుల శాఖ అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోవటం, పర్యవేక్షణ లేకపోవటంతో ఈ పరిస్థితి ఏర్పడిందని రైతులు విమర్శిస్తున్నారు. పెద్దాడ, పెదపూడి తదితర ప్రాంతాల్లో సాగునీరందించేందుకు కొంకుదురు వద్ద టీఎన్ఎస్ కాలువకు మూలా డ్యామ్ నిర్మించారు. దీనికి పశ్చిమంలో తుల్యభాగ డ్రెయిన్ ఉండడంతో కాలువకు రక్షణగోడ నిర్మించారు. దీనిపై మొక్కలు కాస్త మానులవుతున్నాయి. మొక్కలుగా ఉన్నప్పుడే జల వనరుల శాఖ అధికారులు స్పందించి వాటిని తొలగించే పనులు చేయిస్తే ఇంతవరకు వచ్చేది కాదని చెబుతున్నారు. మరికొన్ని రోజుల్లో చెట్లు వృక్షాలై గట్టును చీల్చేస్తాయని, సాగునీరు లీకై చివరి భూములకు నీరందే పరిస్థితి ఉండదని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. - న్యూస్‌టుడే, బిక్కవోలు

(c) eenadu

పుర సేవల్లో లోపాలా?

ఈనాడు ఫోన్ ఇన్

రేపు మున్సిపల్ ఆర్డీతో ఫోన్‌ఇన్

నరసాపురం, న్యూస్‌టుడే: ఏలూరు నగరపాలక సంస్థ, ఉభయ జిల్లాలోని పురపాలక సంఘాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, మురుగు సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా? భవన నిర్మాణ అనుమతులు, పన్నులకు సంబంధించిన సేవల్లో జాప్యం జరుగుతోందా? ఇలాంటి సమస్యలను పురపాలక ఆర్డీ (రాజమహేంద్రవరం) సీహెచ్ నాగనరసింహారావు దృష్టికి తీసుకువెళ్లే అవకాశం 'ఈనాడు' కల్పిస్తోంది. మీరు చేయాల్సిందల్లా నిర్ణీత సమయంలో ఇక్కడ పేర్కొన్న చరవాణి నంబరుకు ఫోన్‌చేసి పేరు, మీ ప్రాంతం వివరాలతో పాటు సమస్యను క్లుప్తంగా తెలియజేయడమే.

తేదీ: 13.02.2026 (శుక్రవారం)	సమయం: ఉదయం 12.30 నుంచి 1.30 గంటల వరకు	ఫోన్ నంబరు 98499 05801

హాయిగా రావొచ్చు.. సంతోషంగా దాటొచ్చు

కైకలూరు, న్యూస్‌టుడే: కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతరకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. 13 రోజులు జరిగే ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు అమ్మవారి దర్శనానికి వస్తుంటారు. పందిరిపల్లెగూడెం సర్కారు కాలువపై నిర్మించిన పెద్దింట్లమ్మ వారధిపై ఎదురెదురుగా భక్తుల వాహనాలు వస్తే తప్పుకొనే వీల్లేదు. ఈ నేపథ్యంలో సీఐ రవి కుమార్ గతేడాది దాతల సహకారంతో వంతెనపై ట్రాఫిక్ సిగ్నళ్లు ఏర్పాటు చేయించారు. ఇటీవల అవి మరమ్మతులకు గురయ్యాయి. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ సూచనలతో సాంకేతికతను జోడించి సిగ్నళ్లకు 150 సెకన్ల నిడివితో టైమర్‌ను అమర్చారు. దీంతో ఒక వైపు వాహనాలు వంతెన దాటిన అనంతరం రెండో వైపు వచ్చేలా ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అమ్మబాబోయ్

- తొమ్మిది నెలలు.. 281 గర్భస్రావాలు
- మన్యం ఆసుపత్రుల్లో పరిస్థితి ఇదీ..

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: మన్యం ప్రాంతంలోని పీహెచ్‌సీల పరిధిలో తొమ్మిది నెలల్లో ఏకంగా 281 మందికి గర్భస్రావాలు జరిగాయి. సాక్షాత్తు వైద్య శాఖ సిబ్బందే తమ నివేదికల్లో ఈ వివరాలను పేర్కొన్నారు. ఐటీడీఏ ద్వారా అమలవుతున్న గిరిజన సంక్షేమ కార్యక్రమాలపై ఏలూరులో ఇటీవల కలెక్టర్ వెట్రిసెల్వి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ అంశాన్ని గుర్తించారు. పరిస్థితిపై అధికారులను ప్రశ్నించి మండిపడ్డారు. గర్భస్రావాలు జరగకుండా అరికట్టేందుకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పొంతన లేని వివరాలు చెప్పడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసుల వారీగా వివరాలు అందజేయాలని ఆదేశించారు. దీంతో ఉన్నతాధికారులు తలలు పట్టుకుంటున్నారు. నివేదికలను పరిశీలించి క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.

★ సహజంగా గిరిజన గ్రామాల్లో పోషకాహార లోపాలు, రక్తహీనత సమస్యలతో బాధపడుతూ ఉంటారు. గర్భస్రావాలకు ఇవి కారణాలా, లేక ఇంకేమైనా ఉన్నాయా అన్న కోణంలో పరిశీలిస్తున్నారు.

పీహెచ్‌సీల వారీగా నివేదికలో చూపిన గర్భస్రావాలు

కొండ్రుకోట-15
దొరమామిడి-30
కేఆర్‌పురం-28
నందాపురం-30
ఎల్ఎన్‌డీపేట-29
జీలుగుమిల్లి-23
వింజరం-33
వేలేరుపాడు-24
అంతర్వేదిగూడెం-14
కామయ్యపాలెం-15
అమరవరం-14
కుక్కునూరు-17
పులిరామడుగూడెం-3
కొయిదా-4
రాచన్నగూడెం-2

రిజిస్ట్రేషన్ లక్ష్యాలే కారణం అంట.. ఇదిలా ఉండగా పీహెచ్‌సీల పరిధిలో గర్భిణుల వివరాలు రిజిస్ట్రేషన్ చేసేందుకు ఉన్నతాధికారులు లక్ష్యాలు ఇవ్వడమే పరిస్థితికి కారణంగా వైద్య సిబ్బంది వాదిస్తున్నారు. గర్భిణులు లేకుండానే ఉన్నట్లు చూపి, వారు ప్రసవించినట్లు చూపే అవకాశం లేనందున గర్భస్రావం అయినట్లు తప్పుడు సమాచారాన్ని నివేదికల్లో పేర్కొన్నట్లు చెబుతున్నారు.

మన్యంలో మండలాలు: బుట్టాయగూడెం, పోలవరం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు: 15

17న మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాక.. 281 గర్భస్రావాలు నమోదైన పరిస్థితిని రాష్ట్ర మహిళా కమిషన్ తీవ్రంగా పరిగణించింది. ఇందుకు సంబంధించిన వాస్తవ పరిస్థితులు, కారణాలను నిర్ధారించడానికి మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ ఈ నెల 17న జిల్లాకు రానున్నారు. ఈ మేరకు సమాచారం అందినట్లు ఐటీడీఏ అధికారులు తెలిపారు. క్షేత్రస్థాయిలో పర్యటించి, ఉన్నతాధికారులతో సమావేశమవుతారని చెబుతున్నారు.

మన నేత.. మట్టి మేత

ఈనాడు-ఏలూరు: జిల్లా కేంద్రం ఏలూరులో కీలక వంతెన అది. దాని మీదుగానే నిత్యం పరిమితికి మించి బరువు గల మట్టి లారీలు రయ్‌రయ్‌మని దూసుకెళ్తున్నాయి. వాటి ధాటికి ఏక్షణాన అయినా కుప్పకూలి వాహన రాకపోకలు స్తంభించే అవకాశం ఉంది. అయినా ఆ మట్టి లారీలకు ఎవరూ అడ్డు చెప్పడం లేదు. కారణం అవి జిల్లాకు చెందిన ముఖ్య నాయకుడివి కావటమే. మట్టి అక్రమ తవ్వకాలు, తరలింపు అన్నీ ఆయనే చూస్తున్నారని తెలుసుకుని బాధ్యులైన శాఖలు కళ్లు మూసుకున్నాయి.

ఏలూరు నగరంలోకి మట్టి లారీలు సమయపాలన లేకుండా ప్రవేశిస్తున్నాయి. వాటి వేగం, శబ్దానికి శనివారపుపేట, శ్రీరాంనగర్ ప్రాంతాల్లో రోడ్డు పక్కన ఇళ్లల్లో ఉండే వారు కునుకు లేకుండా పోతోందని ఆవేదన చెందుతున్నారు. ఆ ముఖ్యనేతకు సంబంధం లేకపోతే ఇప్పటికే యంత్రాంగానికి ఆయనే చెప్పి ఆ లారీలను పట్టించేవారు. ఆపై జనాలను రోడ్డుపైకి పంపి వంతెన దెబ్బతింటుందని ఆందోళన చేయించే వారన్న అభిప్రాయం లేకపోలేదు.

తమ్మిలేరులో తవ్వకాలు

రవాణాతో వంతెనకు ముప్పు

విజిలెన్స్ విభాగానికి ఏమైంది?.. ఈ నెల 7న జరిగిన డీఆర్సీ అంతకు ముందు జడ్పీ స్థాయీ సంఘం సమావేశాల్లో మట్టి అక్రమ తవ్వకాలపై చర్చ జరిగింది. ఎందుకు కట్టడి చేయడం లేదని ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ గనుల శాఖ యంత్రాంగాన్ని ప్రశ్నించారు. ఆ తర్వాత కూడా మట్టి అక్రమ తవ్వకాలపై కొరడా ఝుళిపించాల్సిన గనుల శాఖ విజిలెన్స్ విభాగం మౌనం వహిస్తోంది. ఇటీవల ప్రభుత్వం ఆ విభాగం ఏడీ పోస్టును భర్తీ చేసింది. అయినా అక్రమాలకు అడ్డుకట్ట పడటం లేదు.

కొన్ని వేల మందికి అదే మార్గం.. దుగ్గిరాల, శనివారపుపేట, శ్రీరాంనగర్, దత్తాశ్రమం రోడ్ తదితర ప్రాంతాల నుంచి ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి, ఫైర్ స్టేషన్ సెంటర్‌కు శనివారపుపేట కాజ్‌వే మీదుగానే వెళ్లాలి. నూజివీడు నుంచి వచ్చే వారు ఇటు మీదుగా నగరానికి చేరుకుంటారు. నిత్యం కొన్ని వేల మంది జనం, వాహన రాకపోకలు సాగించే వంతెన మట్టి లారీల ధాటికి రోజురోజుకూ కుంగుతోంది. అయినా.. ఎవరికీ పట్టడం లేదు.

తిరిగి మొదలెట్టారు.. ఏలూరుకు సమీపాన తమ్మిలేరులో అక్రమ మట్టి తవ్వకాలపై మొన్నీ మధ్య 'ఈనాడు'లో కథనాలు రాగా కొన్ని రోజులు తవ్వకాలు నిలిపేశారు. తిరిగి ఇప్పుడు మొదలు పెట్టారు. నిత్యం అక్కడ జేసీబీ తదితర యంత్రాలతో మట్టి తవ్వి నగరానికి తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. గతంలో లారీ మట్టి రూ.3-4 వేలకు దొరికేది. ఇప్పుడు ఆ నేత తాను మినహా ఇతరులెవరూ తోలకూడదని అల్టిమేటం ఇచ్చి రూ.5-6 వేలకు విక్రయిస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోంది.

కందిపప్పు ఊసేలేదు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: చౌక దుకాణాల ద్వారా ఏ నెలకు.. ఆ నెల కందిపప్పు కోసం పేదలకు ఎదురు చూపులే మిగులుతున్నాయి. జిల్లాలో 6,20,146 కార్డులుండగా, 1105 రేషన్ డిపోల ద్వారా నిత్యావసరాలు పంపిణీ చేస్తున్నారు.

బహిరంగ మార్కెట్లో కిలో రూ.140.. బహిరంగ మార్కెట్లో కిలో కందిపప్పు రూ.140 పలుకుతుండగా.. చౌక దుకాణాల్లో రూ.67కే ఇచ్చే అవకాశం ఉంది. దాంతో కార్డు దారులు ఎప్పుడిస్తారా అని ఆరా తీస్తున్నారు. వారి ప్రశ్నలకు డీలర్లు సమాధానం ఇవ్వలేక సతమతమవుతున్నారు. ప్రభుత్వం స్పందించి.. బియ్యం, పంచదారతో పాటు కందిపప్పు, గోధుమ పిండి ఇవ్వాలని కార్డుదారులు కోరుతున్నారు. దీనిపై డీఎస్‌వో విలియమ్స్ మాట్లాడుతూ.. నిల్వలు రాగానే పంపిణీ చేస్తామన్నారు.

డ్రాప్ ఎట్ హోంతో.. మహిళలకు అభయం

ఈనాడు-ఏలూరు: వివిధ కారణాలతో మహిళలు ఎవరైనా అర్ధరాత్రి వేళ ప్రయాణాల్లో ఒంటరిగా ఉండిపోతే ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వారు ఒక్క ఫోన్ చేస్తే క్షణాల్లో పోలీసులు వారి ముంగిట వాలిపోతారు. సురక్షితంగా వారిని గమ్యస్థానాలకు చేరుస్తారు. దీనికి ఏలూరు పోలీసులు 'డ్రాప్‌ఎట్ హోం' అని పేరు పెట్టారు. ఈ సేవలను బాధిత మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారు.

అర్ధరాత్రి ఒంటరిగా ఉంటే ఫోన్ చేయండి
నంబరు: 83329 59174

ఇలా చేయాలి.. ఒంటరిగా ఉన్న వారు పోలీసు కంట్రోల్ రూంకు ఫోన్ చేసి వారు ఎక్కడ ఉన్నారో చెప్పాలి. వెంటనే అక్కడ ఉండే డ్రాప్ ఎట్ హోం సర్వీసెస్‌కు చెందిన ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు మరో పురుష కానిస్టేబుల్‌తో కలిసి వాహనంలో ఆ మహిళ ఉన్న ప్రదేశానికి చేరుకుంటారు. ఆమె ఎక్కడికి వెళ్లాలో తెలుసుకుంటారు. ఏలూరు నగరంలో అయితే ఇంటికే తీసుకెళ్తారు. ఇతర ప్రాంతాల వారైతే బస్టాండ్, రైల్వేస్టేషన్‌కు తీసుకెళ్లి బస్సు, రైలు ఎక్కించి జాగ్రత్తలు చెప్పి పంపుతారు.

మచ్చుకు కొన్ని..

➤ రెండు రోజుల క్రితం ఆశ్రం బస్టాప్ వద్ద ఓ మహిళ అర్ధరాత్రి 1.30 గంటలకు బస్సులు రాక ఒంటరిగా ఉన్నారు. భయంతో పోలీసు కంట్రోల్ రూంకు ఫోన్ చేశారు. వెంటనే డ్రాప్ ఎట్ హోం సర్వీసెస్ విభాగానికి ఫోన్ చేయగా ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు మరో కానిస్టేబుల్ వెళ్లి ఆమెను పోలీసు జీపులో కొత్త బస్టాండ్‌కు తీసుకొచ్చి బస్సు ఎక్కించారు.

➤ మరో మహిళ తంగెళ్లమూడి జాతర తిలకించేందుకు పలువురు మహిళలతో కలిసొచ్చి చివరకు ఒంటరిగా మిగిలిపోయారు. అయితే ఆమె ఇంటికి వెళ్లడానికి ఆ అర్ధరాత్రి బస్సులు, ఆటోలు లేక ఇబ్బంది పడుతూ కంట్రోల్ రూమ్‌కు కాల్ చేయగా వెంటనే మహిళా పోలీసులు సురక్షితంగా ఇంటికి చేర్చారు.

తెల్లవారుజామున 4 గంటల వరకు.. వారానికి ఇద్దరు, ముగ్గురు మహిళలు పోలీసుల సహాయంతో గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. కొందరు చరవాణి పోగొట్టుకుని.. మరికొందరు చేతిలో డబ్బులు అయిపోయి ఫోన్ చేసి రక్షణ కోరుతున్నారు. వారిని కూడా మా సిబ్బంది ఇంట్లో దింపి వస్తున్నారు. డ్రాప్ ఎట్ హోం సేవలు రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు అందుబాటులో ఉంటాయి. తెలియని వ్యక్తులు తీసుకెళ్తామని చెబితే నమ్మవద్దు. పోలీసులతో సురక్షితంగా చేరుకోవాలి. **- కేపీఎస్ కిశోర్, ఎస్పీ**

కుర్రకారు దూసుకెళ్తోంది

చినఅమిరం (భీమవరం పట్టణం), న్యూస్‌టుడే

వాహన తయారీలో విద్యార్థులు

ఆ కుర్రోళ్లు చదివేది ఇంజినీరింగ్. అభిరుచి రకరకాల మోడళ్ల కార్ల తయారీ.. నిత్యం ధ్యాసంతా వాటిపైనే. వీరి ఆసక్తి చూసి వాహన విడిభాగాలను కళాశాల యాజమాన్యం సమకూరుస్తోంది. ఇక అంతే.. రోజుల వ్యవధిలో వాటికి ప్రాణం పోస్తున్నారు. దాని పనితీరును తొలుత కళాశాల ప్రాంగణంలో.. తర్వాత ప్రధాన రహదారులపై చూస్తున్నారు. అంతటితో ఆగకుండా గుంతలు, రాళ్ల రహదారులపై ఎంత వేగంగా వెళ్తుందో చూసి జాతీయ పోటీలకు తీసుకెళ్లి బహుమతులు పట్టేస్తున్నారు.

భీమవరంలో విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మెకానికల్ ఇంజినీరింగ్ చదువుతున్న మొదటి నుంచి ఆఖరి ఏడాది విద్యార్థులు 30 మంది ఎమిగోస్ (స్పానిష్‌లో ఫ్రెండ్స్) పేరుతో బృందంగా ఏర్పడ్డారు. వాళ్ల ఆలోచనంతా కొత్త రకం వాహనాల సృష్టిపైనే. బాహా, గోకార్ట్, ఈ బైక్, బైస్కిల్ ఇలా వినూత్నంగా, తక్కువ ఖర్చుతో తయారీ వాళ్ల ప్రత్యేకత.

బురదలో పరీక్షలు

ఆల్ టెరైన్ వెహికల్.. ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల గోదావరి బృందం పలు పోటీల్లో ఛాంపియన్‌గా నిలిచింది. భోపాల్‌లో గతేడాది సెప్టెంబరులో జరిగిన ఫార్ములా ఆఫ్ రోడ్ బాజా ఇండియా పోటీల్లో 'ఆల్ టెరైన్ వెహికల్' ప్రథమ స్థానంలో నిలిచి రూ.1.50 లక్షలు అందుకున్నారు. హైదరాబాద్, కాకినాడలో ఇటీవల జరిగిన పోటీల్లో బహుమతులు గెలుచుకున్నారు.

బహుమతులు అనేకం.. జాతీయ స్థాయి హైడ్రోజన్ వాహన బాహా పోటీలు గతేడాది జనవరిలో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ పితంపూర్‌లో జరగ్గా ప్రథమస్థానంలో నిలిచి రూ.1.10 లక్షల నగదుతో పాటు ప్రముఖ కంపెనీల దృష్టిలో వాహన డిజైన్ పడింది. అలా ఏడాది పొడవునా చెన్నై, పుణె, హిమాచల్‌ప్రదేశ్ తదితర చోట్ల జరిగిన వివిధ వాహన తయారీ, పోటీల్లో 5 ప్రథమ బహుమతులు సొంతం చేసుకున్నారు. తాజాగా జనవరిలో 7 నుంచి 11 వరకు మధ్యప్రదేశ్‌లోని పితంపూర్‌లో జరిగిన హైడ్రోజన్ బాహా-2026లో ఓవరాల్ రన్నరప్‌గా నిలిచి రూ.1.20 లక్షలు బహుమతి గెలుచుకున్నారు. పలు విభాగాల్లో ప్రత్యేకతలు చాటారు.

పట్టిసీమలో పకడ్బందీగా ఏర్పాట్లు: కలెక్టర్

పోలవరం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. పట్టిసీమ వద్ద గోదావరి మధ్యలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 14 నుంచి 16 వరకు జరిగే ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. తొలుత ఆలయానికి వెళ్లిన కలెక్టర్‌కు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయంలో చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పట్టిసీమలో శివరాత్రితో పాటు రానున్న గోదావరి పుష్కర ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు.

మాట్లాడుతున్న వెట్రిసెల్వి, పాల్గొన్న అధికారులు

వృద్ధులు, గర్భిణులు, విభిన్న ప్రతిభావంతులకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఫెర్రీ వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు, ఆలయ క్యూలైన్లలో తొక్కిసలాటలు జరగకుండా బందోబస్తు నిర్వహించాలన్నారు. తాగునీరు, పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఇసుక తిన్నెలపై రద్దీని డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షించాలన్నారు. స్నాన ఘట్టాల వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మహిళలు దుస్తులు మార్చుకునే చోట బరకాలు వేయించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జేసీ అభిషేక్‌గౌడ, అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి భ్రమరాంబ మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ద్వారకాతిరుమల క్షేత్రపాలకుడైన భ్రమరాంబమల్లేశ్వరస్వామి ముస్తాబయ్యాడు. ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు వైభవంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఆలయం, ప్రాకారాలు విద్యుద్దీపాలంకరణలతో వెలుగొందుతున్నాయి. చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. తాత్కాలిక క్యూలు సిద్ధం చేశారు. గురువారం ఉదయం స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, కుమార్తెలను చేయడంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి.

ఆనందబడి

దాతల సేవలకు 'విద్యాంజలి 2.0'

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థులకు ఎంతో మంది దాతలు వివిధ రూపాల్లో సహాయం చేస్తున్నారు. అదనపు గదుల నిర్మాణం, ఫర్నిచర్, రాత పుస్తకాలు, పరీక్ష సామగ్రి వంటివి అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. మరి కొందరు సామాజిక అంశాలపై అవగాహన, వృత్తి నైపుణ్య శిక్షణ తదితర అంశాలపై సదస్సులు నిర్వహిస్తున్నారు. ఇకపై ఇలాంటి దాతలు, సంస్థలను ఒక వేదికపై తీసుకొచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'విద్యాంజలి 2.0' పేరుతో వినూత్న కార్యక్రమాన్ని తెచ్చింది. ఇందులో దాతలు నగదు కాకుండా వస్తువులు, సేవల రూపంలో పాఠశాలలు, విద్యార్థులకు సహకారం అందించవచ్చు. ఇందుకోసం దాతలు http://vidyanjali.education.gov.in వెబ్‌సైట్‌లో వాలంటీరుగా రిజిస్టరు చేసుకుని తమకు నచ్చిన పాఠశాలను ఎంపిక చేసుకోవచ్చు.

ఉమ్మడి జిల్లాలో 3094 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో సుమారు 1.30 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. చాలా బడుల్లో అసౌకర్యాలు పలకరిస్తున్నాయి. వైకాపా ప్రభుత్వం నాడు-నేడు పేరుతో ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తామంటూ గొప్పలు చెప్పింది. అప్పట్లో చేపట్టిన పాఠశాలల అదనపు తరగతి గదుల నిర్మాణం చాలాచోట్ల నేటికీ పూర్తికాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'విద్యాంజలి' కార్యక్రమాన్ని వైకాపా పాలకులు పక్కన పెట్టారు. కూటమి ప్రభుత్వం 'విద్యాంజలి 2.0' ద్వారా దాతలను ఆహ్వానిస్తోంది.

ఏమేం చేయొచ్చంటే.. దాతలు, ప్రవాస భారతీయులు, స్వచ్ఛంద సంస్థలు, గ్రామస్థులు, కార్పొరేట్ సంస్థలు, పూర్వవిద్యార్థులు 'విద్యాంజలి 2.0' ద్వారా పిల్లలకు ఉపయోగపడే ఏ సహకారం అయినా అందించవచ్చు. వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకుంటే అందులో కనిపించే వివిధ రకాల సేవల్లో ఏదో ఒకటి ఎంచుకోవచ్చు.

సేవలు ఇలా.. విద్యా సహాయం, క్రీడలు, కళలు, నైపుణ్యాలు, ఆరోగ్యం, యోగా, మార్గనిర్దేశం, కెరీర్ గైడెన్స్ కౌన్సెలింగ్, ఎంట్రన్స్ ఎగ్జామ్ ప్రిపరేషన్స్, ఫర్నిచర్, విద్యా సామగ్రి, వైద్య శిబిరాలు, స్టోరీ రైటింగ్ స్కిల్స్, వృత్తి విద్యాశిక్షణ, సామాజిక బాధ్యతను గుర్తు చేసే అవగాహన సదస్సులు.

దాతలు రిజిస్టరు చేసుకోవాలి.. విద్యాంజలి 2.0 వెబ్‌సైట్‌లో దాతలు రిజిస్టరు చేసుకుని పాఠశాలను ఎంపిక చేసుకోవాలి. అక్కడ ఏ సేవలను వారు సమకూర్చగలరో తెలియజేయాలి. ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలలకు కావాల్సిన సేవలను వెబ్‌సైట్‌లో పొందుపరచాలి. **- ఈ.నారాయణ, డీఈవో**

బోర్డు పెట్టరు.. తిప్పి పంపుతారు!

ఫోన్ పే, గూగుల్ పే ద్వారా డబ్బులు చెల్లించే కౌంటర్ వద్ద టికెట్లు ఇవ్వకపోవడంతో వెనుతిరిగి వెళ్తున్న భక్తులు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకా తిరుమల శ్రీవారి కేశఖండనశాల టికెట్లు తీసుకునేందుకు భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దేవస్థానం భక్తుల సౌకర్యార్థం కేశఖండశాల ప్రారంభంలో ఫోన్ పే, గూగుల్ పే ద్వారా డబ్బులు చెల్లించి టికెట్లు తీసుకునేందుకు ఒక కౌంటర్, డబ్బులు చెల్లించి టికెట్లు తీసుకునేలా మరో కౌంటర్ ఏర్పాటు చేశారు. ఆయా కౌంటర్ల వద్ద భక్తులు గుర్తించేలా ఎటువంటి బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో తెలియక తికమక పడుతున్నారు. ఫోన్ పే, గూగుల్ పే ద్వారా టికెట్లు తీసుకునే కౌంటర్ వద్దకు డబ్బులు తీసుకెళ్లి టికెట్లు ఇవ్వమంటే మరో చోటుకు పంపిస్తున్నారు. ఇలా భక్తులను ఒక దగ్గర నుంచి నుంచి మరో దగ్గరకు పంపించడంతో ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై దేవస్థానం ఈఈ భాస్కర్ మాట్లాడుతూ.. భక్తులు గుర్తించేలా ఆయా కౌంటర్ల వద్ద బోర్డులు ఏర్పాటు చేయిస్తామని చెప్పారు.

13న ఉద్యోగ మేళా

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా ఉపాధి కార్యాలయం, నేషనల్ కెరీర్ సర్వీస్ ఆధ్వర్యంలో ఈ నెల 13న ఉదయం 10 గంటలకు ఏలూరులోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి రమేశ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ నుంచి డిగ్రీ వరకు చదువుకున్న అభ్యర్థులు హాజరు కావచ్చన్నారు. మరిన్ని వివరాలకు 88868 82032 నంబరులో సంప్రదించవచ్చని చెప్పారు.

చీకట్లు.. ఇక్కట్లు!

హనుమాన్ జంక్షన్ నుంచి నూజివీడు వెళ్లే మార్గంలోనూ, ఆర్వోబీ వంతెనపైనా చీకట్లు అలముకున్నాయి. హనుమాన్ జంక్షన్ నుంచి ఏలూరు వెళ్లే రోడ్డులోనూ ఇదే పరిస్థితి నెలకొంది. హనుమాన్ జంక్షన్ నుంచి నూజివీడు వెళ్లే మార్గం 216 హెచ్ జాతీయ రహదారి కావడంతో నిత్యం వేలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటోంది. ఏళ్ల తరబడి విద్యుద్దీపాలు వెలగడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళల్లో అంధకారం అలముకోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

హనుమాన్ జంక్షన్ నుంచి ఏలూరు వెళ్లే మార్గంలో వెలగని విద్యుద్దీపాలు

దీనిపై ఎన్‌హెచ్‌ఏఐ పీడీ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యుద్దీపాలు వేసేందుకు ప్రతిపాదనలు చేస్తున్నామన్నారు. అవసరమైన చోట సౌర విద్యుద్దీపాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. **- ఈనాడు, ఏలూరు.**

సమీక్షకు ఆలస్యంగా వచ్చారని కలెక్టర్ ఆగ్రహం

బాధ్యులైన అధికారులకు షోకాజ్ నోటీసులు

ఈనాడు-ఏలూరు: జిల్లాలో పలు శాఖలకు చెందిన జిల్లా అధికారులు కలెక్టర్ అధ్యక్షతన జరిగే సమావేశాలకు సైతం గైర్హాజరవుతున్నారు. కొందరు ఆలస్యంగా వస్తున్నారు. కొందరు విభాగాధిపతులకు బదులు కిందిస్థాయి అధికారులను పంపుతున్నారు. సోమవారం సచివాలయం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లాల ప్రగతిపై మంత్రులు, కార్యదర్శులు, కలెక్టర్, ఎస్పీలతో సమీక్షించారు. ఆ సమీక్ష ప్రారంభానికి ముందు కలెక్టర్ వెట్రిసెల్వి జిల్లా అధికారులతో కలెక్టరేట్లో సమీక్ష ఉంటుందని, దీనికి అందరూ హాజరుకావాలని జిల్లా విభాగాధిపతుల వాట్సాప్ గ్రూప్‌లో ఆమె పోస్టు చేశారు. దీనికి సుమారు 20 మంది అధికారులు ఆలస్యంగా వచ్చినట్లు తెలిసింది. దీన్ని తీవ్రంగా పరిగణించి బాధ్యులైన అధికారులకు షోకాజ్‌లు జారీ చేశారు. ఇది అధికారుల్లో చర్చనీయాంశమవుతోంది. సీఎం సమావేశంలో చర్చకు వచ్చే అంశాలపై ముందస్తుగా చర్చించుకునే కీలక సమావేశానికి అధికారులు ఆలస్యంగా రావడంపై కలెక్టర్ ఆగ్రహించి షోకాజ్ నోటీసులు ఇచ్చి వివరణ కోరారని అధికారవర్గాలు తెలిపాయి.

ట్రిపుల్ ఐటీ.. పురపాలిక లేఖల యుద్ధం

ఆస్తి పన్ను నుంచి మినహాయించాలని విజ్ఞప్తి

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నిరుపేద పిల్లలు చదివే ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ ట్రిపుల్ ఐటీకి ఆస్తి పన్ను నుంచి మినహాయించాలని యాజమాన్యం నూజివీడు పురపాలక సంఘాన్ని కోరింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పన్ను తప్పనిసరి అంటూ పుర అధికారులు స్పష్టం చేయడంతో లేఖల యుద్ధం సాగుతోంది.

నూజివీడు ట్రిపుల్ ఐటీని 2008లో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పురపాలక సంఘానికి రూ.కోట్లలో పన్నులు చెల్లించారు. ఇంత చేసినా విద్యాసంస్థకు రూపాయి ఖర్చు చేసిన దాఖలాలు లేవు. ఏ అవసరం వచ్చినా యాజమాన్యమే సమకూర్చుకుంటోంది. ఇప్పుడేమో పన్నులు కట్టండి అంటూ లేఖలు సంధిస్తున్నారని అంటున్నారు.

☛ 2011-12 నుంచి 2022 వరకు ప్రతి ఏడాది రూ.48,08,824 చొప్పున చెల్లించారు. 2023లో రూ.71,19,342, 2024లో రూ.62,10,956, 2025లో రూ.71,07,140, ఈ ఏడాది రూ.92,16,569 బకాయిలు చెల్లించాలని పురపాలిక తాఖీదులు అందించింది. ఆలస్యం అయితే మున్సిపల్ చట్టాల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఆ లేఖలో పేర్కొన్నారు. జి.ఒ.ఎం.ఎస్.నం.198 ప్రకారం మినహాయింపుల పరిధిలోకి రాదని స్పష్టం చేస్తూ లేఖను పంపించారు. ఇవి కాకుండా నీటి పన్ను రూ.2.44 కోట్లు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు.

☛ దీనికి ప్రతిగా ట్రిపుల్ ఐటీ అధికారులు పంపిన లేఖలో ఆస్తి పన్నులో మినహాయింపు ఇవ్వాలని కోరారు. క్యాంపస్‌లో మూడు నెలలకు ఒకసారి కూడా పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. చెత్త డబ్బాలు ఏర్పాటు చేయాలని కోరినా ఏర్పాటు చేయలేదన్నారు. దోమల మందు పిచికారీ చేయడం లేదన్నారు. వీధి కుక్కలు, కోతుల బెడదతో విద్యార్థులు, ఉద్యోగులు బెంబేలెత్తుతున్నారని వివరించారు.

నిధుల కొరత.. దీనిపై ట్రిపుల్‌ఐటీ ఏవో లక్ష్మణరావును కోరగా సంస్థ వద్ద నిధుల కొరత ఉందన్నారు. విద్యాసంస్థకు పన్ను మినహాయింపు ఇవ్వాలని లేఖ రాశామన్నారు. ఈ విషయం ఆర్జీయూకేటీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్తామన్నారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారమే చర్యలు

పుర కమిషనర్ కొత్రపాటి పీరయ్య మాట్లాడుతూ ట్రిపుల్ ఐటీ యాజమాన్యం పురపాలక సంఘానికి పన్ను చెల్లించాల్సి ఉందన్నారు. అందరికి నోటీసులు జారీ చేసిన విధంగానే వారికీ ఇచ్చి చెల్లించాలని కోరామన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే చర్యలు ఉంటాయన్నారు. ఎవరికీ పన్ను మినహాయింపులు లేవని ఆయన స్పష్టం చేశారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

లీగల్ ప్రకటనలు

ఈనాడు క్లాసిఫైడ్స్

వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక

పదవీ విరమణ శుభాకాంక్షలు

జన్మదిన శుభాకాంక్షలు

అంత్యక్రియలు, వర్ధంతి, జయంతి

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి

జి.ఎస్.టి. 5% అదనం

ప్రకటనల కొరకు సంప్రదించండి: 80080 12494

(c) eenadu

శివాలయంలో వేంకన్న ప్రసాదాలు

స్వామివారి ప్రసాదాల విక్రయాలు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీభ్రమరాంబమల్లేశ్వరస్వామి ఆలయంలో వేంకటేశ్వర స్వామి ప్రసాదాలు విక్రయించే కౌంటర్‌ను బుధవారం ఏర్పాటు చేశారు. ఈ కౌంటర్ ద్వారా భక్తులకు ప్రసాదాల విక్రయాలను ప్రారంభించారు. చిన్న వెంకన్నను దర్శించుకున్న భక్తులు శివాలయాన్ని సందర్శిస్తారు. ఇక్కడ భక్తుల సౌకర్యార్థం స్వామివారి ప్రసాదాలను అందుబాటులో ఉంచినట్లు ఆలయాధికారులు తెలిపారు.

శ్మశానవాటికల అభివృద్ధికి రూ.9.34 కోట్లు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: జిల్లాలో శ్మశానవాటికల అభివృద్ధికి ఉపాధిహామీ పథకం కింద పంచాయతీ రాజ్ శాఖ ద్వారా రూ.9.34 కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు కలెక్టర్, జిల్లా పథక కో-ఆర్డినేటర్ వెట్రిసెల్వి ఉత్తర్వులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ నిధులతో 20 మండలాల్లో 51 గ్రామాల్లో శ్మశానవాటికల్లో అవసరమైన నిర్మాణాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

13న అభ్యర్థుల ఎంపిక కౌన్సెలింగ్

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి పరిధిలో డిస్ట్రిక్ట్ కన్సల్టెంట్, క్లినికల్ సైకాలజిస్ట్, ఆడియోలజిస్ట్ పోస్టులు సింగిల్ సోలటరీ పోస్టు (ఒకే పోస్టు) కావడంతో వీటికి రోస్టర్ వర్తించదని ఏలూరు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి అమృతం తెలిపారు. తుది జాబితా www.eluru.ap.gov.in, www.westgodavari.ap.gov.in పొందుపరచడమైందని తెలిపారు. స్టాఫ్ నర్స్ పోస్టుకు రోస్టర్ ప్రకారం ఓసీ అభ్యర్థులు లేనందున ఈ పోస్టు నిలుపుదల చేయడం జరిగిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆలపాటి ఆచూకీ కోసం గాలింపు చర్యలు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఏలూరులో అదృశ్యమైన ఆలపాటి నాగేశ్వరరావు ఆచూకీ కోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ.. నాలుగు ప్రత్యేక పోలీసు బృందాల ఏర్పాటు చేయడం జరిగిందని టూటౌన్ సీఐ అశోక్ కుమార్ తెలిపారు. డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న సీసీ టీవీ ఫుటేజీలు, డ్రోన్ కెమెరాల ద్వారా పరిశీలించడంతోపాటు మొబైల్ సిగ్నల్స్, ఇతర సాంకేతిక ఆధారాల ద్వారా విచారణ జరుపుతున్నామని చెప్పారు. నాగేశ్వరరావు ఆచూకీ తెలిస్తే సీఐ 94407 96606, 112కు డయల్ చేసి సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

పీఎంశ్రీ పాఠశాలలకు గ్రంథాలయ సామగ్రి

నిడమర్రు, న్యూస్‌టుడే: పీఎంశ్రీ పాఠశాలలకు కొత్తగా గ్రంథాలయ సామగ్రి వచ్చింది. ఈ సామగ్రిలో ఒక టేబుల్, 2 అల్మారాలు, దిన పత్రికల పెట్టె, 10 కుర్చీలు ఉన్నాయి. కొత్తగా వచ్చిన సామగ్రితో గ్రంథాలయాలకు నూతన శోభ వచ్చింది. జిల్లాలోని 37 పీఎంశ్రీ పాఠశాలలకు సామగ్రి వచ్చింది. సమగ్ర శిక్షా ఏఎంవో రెడ్డి రామారావు మాట్లాడుతూ గ్రంథాలయాలకు ఈ సామగ్రి ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు.

రాతపరీక్ష వాయిదా

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుకు సీఆర్ఆర్ కళాశాల ఇంటర్మీడియట్ బ్లాకులో ఈ నెల 12న నిర్వహించాల్సిన రాత పరీక్ష అనివార్య కారణాలతో వాయిదా వేయడం జరిగిందని జిల్లా జడ్జి ఎస్.శ్రీదేవి పేర్కొన్నారు.

ప్రకటన

మా క్లయింట్లు అయిన కొమ్మారెడ్డి జ్యోతిప్రసాద్ మరియు కొమ్మారెడ్డి ఉషా ప్రసాద్, తండ్రి (లేటు) కొమ్మారెడ్డి ప్రసాద్, శనగల వీరాస్వామి నాయుడు, దక్షిణ వీధి, మంజువాణి స్ట్రైస్ వద్ద, ఏలూరు-1 అను వారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా..

మా క్లయింట్లు ఇరువురు వారి స్వంత సోదరి అయిన కొమ్మారెడ్డి ఉషా ప్రసాద్, భర్త ఇజ్జాడ సురేష్ కుమార్ మరియు ఆమె భర్త ఇజ్జాడ సురేష్ కుమార్‌పై మరియు బసిబసి బ్యాంక్ మేనేజర్, తంగెళ్ళమూడి బ్రాంచ్, ...

[illegible]

రుమటాలజిస్ట్ చెన్నై నుండి రాక

డా॥ కవిత M.D, DNB, D.M., SCE (Rheumatology)

కీళ్ళ వాతం, గౌట్, SLE, APLA మొ॥ వ్యాధుల చికిత్సా నిపుణులు

తేదీ: 14-2-2026 (శనివారం) అపాయింట్‌మెంట్ కొరకు: 98854 22345, 96662 61803, 08816-223728

A+ అభిరామ్ హాస్పిటల్స్ వాటర్ ట్యాంక్ దగ్గర, జె.పి.రోడ్, భీమవరం

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

Union Bank of India మెయిన్ బజార్ బ్రాంచ్ (12421), ఏలూరు, ఏలూరు జిల్లా, ఫోన్: 9985091506

బ్యాంకుకు తనఖా దస్తావేజు కింద సెక్యూరిటీగా తనఖా పెట్టిన వాహనం అమ్మకానికి వేలం నోటీసు

	వాహనం యొక్క సంక్షిప్త వివరములు	రిజర్వు ధర / ధరావత్తు
	i. Registration No : AP39MC3838 ii. Year of Registration: 2022 iii. Year of Manufacturing: 2022 iv. Make: MARUTHI S-PRESSO VXI+ v. Model: 4 seater car vi. Colour: FIRE RED vii. Chassis No.: MA3RFL41SMM319025 viii. Engine No.: K10BN2472733 ix. Fuel Used: Petrol x. Meter reading (Odometer): 34756 KM at the time of seizure	రూ. 2,65,000/- ; రిజర్వు ధరలో 10%

తేది: 10.02.2026, ప్రదేశం: ఏలూరు సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

లోపం అధిగమించి.. ప్రతిభతో రాణించి..

విభిన్న కళల్లో మెరుస్తున్న ప్రత్యేక అవసరాల బాలలు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: విధి తమను చిన్నచూపు చూసిందని ఏ మాత్రం భావించకుండా చిన్న వయసులోనే ఇతరులతో సమానంగా ప్రతిభ కనబరుస్తున్నారు. దివ్యాంగుల కోసం సమగ్ర శిక్షా జిల్లా ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఇటీవల ఏలూరులో నిర్వహించిన జిల్లా స్థాయి సాంస్కృతిక, కళా ఉత్సవాల్లో భాగంగా జరిగిన వివిధ రకాల పోటీల్లో వీరు పాల్గొని ప్రథమ స్థానాల్లో నిలిచారు.

నాట్యంలో దిట్ట



జి.లహరికి వినికిడి లోపం ఉంది. ఆమెకు శస్త్ర చికిత్స చేసినా లోపం తొలగలేదు. జంగారెడ్డిగూడెం ఇందిరానగర్ కాలనీ ఎంపీపీ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతోంది. అదే ప్రాంతంలోని భవిత కేంద్రంలో ఐఈఆర్‌పీ చైతన్య వద్ద జానపద నృత్యంలో శిక్షణ తీసుకొంది. ఏలూరులో నిర్వహించిన జానపద నృత్య పోటీలో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచింది. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లోనూ బహుమతులు సాధించాలనేది ఈ బాలిక ఆశయం.

చిత్రలేఖనంలో సత్తా..

బుట్టాయగూడెం మండలం దొరమామిడి జడ్పీ ఉన్నత పాఠశాలలో కె.భార్గవి పదో తరగతి చదువుతోంది. న్యూరాలజీ సమస్యతో చేతులు సరిగా పనిచేయని ఆమెకు చిన్నతనం నుంచి బొమ్మలు వేయడంపై ఆసక్తి. అది గమనించిన తల్లిదండ్రులు ఒక ప్రైవేటు డ్రాయింగ్ టీచరు వద్ద చిత్రలేఖనంలో ప్రత్యేకంగా తర్ఫీదు ఇప్పిస్తున్నారు. ఏలూరులో నిర్వహించిన జిల్లా స్థాయి చిత్రలేఖనం పోటీలో ప్రథమ స్థానంలో నిలిచింది. చదువులో ఉత్తమ ప్రతిభ కనబరుస్తోన్న ఆమె చిత్రకళాకారిణిగా ఎదగాలని లక్ష్యంగా నిర్ణయించుకుంది.

ఇంజినీర్ కావడమే లక్ష్యం..

ఎన్.యశ్వంత్ సాయి సెరిబ్రల్ పాల్సీతో బాధపడుతూ.. ఏలూరు శ్రీరామ్‌నగర్ ఎంపీపీ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. స్థానిక అశోకవర్ధన భవిత కేంద్రంలో చికిత్స చేయించుకుంటున్నాడు. ఇతనికున్న వ్యాధి వల్ల అవయవాలు సరిగా పనిచేయవు. అయితేనేం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అందిస్తున్న ప్రోత్సాహంతో ఏలూరులో నిర్వహించిన జిల్లా స్థాయి ఆధునిక వస్త్రధారణ పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచాడు. భవిష్యత్తులో ఇంజినీరు కావాలనేది ఈ బాలుడి ఆశయం.

మనోవైకల్యంతో ఉన్నా..

ఏలూరు కేపీడీటీ ఉన్నత పాఠశాలలో ఎం.షణ్ముఖ సాయి 7వ తరగతి చదువుతున్నాడు. స్థానిక అశోకవర్ధన భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ చికిత్స పొందుతున్నాడు. ఆ కేంద్రంలో ఐఈఆర్‌టీ చెప్పిన విషయాలను అర్థం చేసుకుంటూ తనలోనూ ప్రతిభ దాగుందని నిరూపిస్తున్నాడు. ఏలూరులో నిర్వహించిన జిల్లా స్థాయి స్కిట్ పోటీల్లో కాంతారా వేషధారణ వేసి ప్రథమ బహుమతి అందుకున్నాడు.

ముందస్తు ప్రణాళికతో ఉత్తమ ఫలితాలు

పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

నూజివీడు, న్యూస్‌టుడే: విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ విద్య కీలకం. ఇక్కడే చాలా మంది భవితవ్యం తేలిపోతుంది. ఫిబ్రవరి 23 నుంచి మార్చి 24 వరకు ఇంటర్ వార్షిక పరీక్షలు జరగనున్నాయి. ఇప్పటికే సిలబస్ పూర్తయి రివిజన్ నడుస్తోంది. ఇష్టంగా చదివితే ఉత్తీర్ణత సాధించడం సులువు అని నిపుణులు చెబుతున్నారు.

ఇలా చేయాలి.. ☛ ప్రతి నిమిషం విలువైంది. ప్రణాళిక ప్రకారం చదవాలి. ☛ క్లిష్ట, సులభ జవాబులు చదివేందుకు ఏ సబ్జెక్టుకు ఎంత సమయం కేటాయించాలో అవగాహన ఉండాలి. విజయంలో సగం పాత్ర దీనిదే. ☛ సిలబస్, పరీక్ష విధానం పూర్తిగా ఆకళింపు చేసుకోవాలి. అన్ని సబ్జెక్టులపై అవగాహన అవసరం. ప్రతి సబ్జెక్టుకు ఓ బ్లూ ప్రింట్ ఏర్పాటు చేసుకుని, ప్రధాన అంశాలపై శ్రద్ధ వహించాలి. ☛ పూర్వ, మాదిరి ప్రశ్న పత్రాలు పరిశీలించాలి. సమాధానాలు రాసి సరిచూసుకోవాలి. ☛ సమయం తక్కువున్నందున ముఖ్యమైన అంశాలపై దృష్టి పెట్టాలి. ☛ ఇప్పటికే చదివిన అంశాల్ని మళ్లీ చూసుకోవాలి. ముఖ్యాంశాలను అండర్‌లైన్ చేసుకుని, పేపర్‌పై రాసుకోవడం ఉత్తమం. ☛ ఇతరులతో చర్చిస్తే మరింత ఉపయోగం. విద్యార్థులు వారిలో వారే ప్రశ్నలు వేసుకోవాలి. ☛ పరీక్షా కేంద్రంలో ప్రశ్న పత్రం బాగా చదివి అర్థం చేసుకోవాలి.

జిల్లా సమాచారం...	
ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు:	17,531
రెండో సంవత్సరం విద్యార్థులు:	16,975
కళాశాలలు:	135
పరీక్ష కేంద్రాలు:	56

సరైన వాతావరణం అవసరం..

చదివేందుకు ప్రశాంత వాతావరణం అవసరం. దీంతో ఏకాగ్రత పెరుగుతుంది. విద్యార్థులను ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు గమనిస్తుండాలి. వారి అవసరాలను గుర్తించి కావాల్సినవి సమకూర్చాలి. ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి. వారికి తోడుగా ఉండాలి. చరవాణి, టీవీలకూ దూరంగా ఉండేలా చూడాలి. ఇతరులతో పోల్చకూడదు. ఒత్తిడికి గురైనట్లు కనిపిస్తే ధైర్యం చెప్పాలి. అవసరమైతే అధ్యాపకుల సహకారం తీసుకోవాలి. **- కె.యోహాను, ఆర్ఐవో, ఏలూరు**

మెనూ పాటించని ఏజెన్సీలపై కఠిన చర్యలు: కలెక్టర్

పిల్లలతో మాట్లాడుతున్న వెట్రిసెల్వి

పోలవరం, న్యూస్‌టుడే: ఇటుకలకోట ప్రభుత్వ గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలను బుధవారం కలెక్టర్ వెట్రిసెల్వి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ వండిన భోజనం రుచి చూసి మెనూ ప్రకారం భోజనం అందించని ఏజెన్సీ వారిపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు షోకాజ్ నోటీసు జారీ చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. మెనూ ప్రకారం పిల్లలకు ఆహారం అందించాలని, మెనూ పాటించని ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. రోజూ మెనూ ప్రకారం భోజనం పెడుతుందీ లేనిదీ ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించాలన్నారు. అక్కడి నుంచి తరగతి గదులకు వెళ్లి పాఠాల గురించి అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులతో మమేకమయ్యారు. హాజరు పట్టీ పరిశీలించి పాఠశాలకు రాని విద్యార్థుల తల్లిదండ్రులతో కలెక్టర్ ఫోన్‌లో మాట్లాడారు. ఐటీడీఏ పీవో రాములునాయక్, డీడీ జగన్నాధరావు, ఏటీడబ్ల్యూ జనార్దనరావు తహసీల్దార్ సాయిరాజు, ఎంపీడీవో శ్రీనివాసబాబు తదితరులున్నారు.

భూసేకరణపై కలెక్టర్ సమీక్ష.. మహాశివరాత్రి, పుష్కరాల ఏర్పాట్లపై సమీక్ష అనంతరం కలెక్టర్ వెట్రిసెల్వి పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ అభిషేక్, జేసీ అభిషేక్‌గౌడతో కలిసి భూసేకరణ అధికారులతో పట్టిసీమలో సమీక్షించారు. జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలాల్లో భూసేకరణకు సంబంధించిన పనులు ఎంత వరకు వచ్చింది అని ప్రశ్నించారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల నుంచి వచ్చిన నిర్వాసితులతో కలెక్టర్ మాట్లాడారు.

జ్ఞాపకాలు పదిలం!

ఆర్యసమాజం 150 వసంతాల నాణెం
మహర్షి దయానంద సరస్వతి 200వ జయంతి నాణెం

ఆర్యసమాజం స్థాపించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రూ.150 విలువైన స్మారకనాణెం, ఆర్యసమాజ వ్యవస్థాపకులు మహర్షి దయానంద సరస్వతి 200వ జయంతి సందర్భంగా విడుదలైన రూ.200 విలువైన స్మారక నాణేలను ఏలూరుకు చెందిన ఆలీఖాన్ మహమ్మద్ సేకరించి ప్రదర్శించారు. **- ఈనాడు, ఏలూరు**

సమ్మెకు సంఘీభావం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: కేంద్ర కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 12న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెకు సంఘీభావం తెలియజేస్తున్నట్లు ఏపీఎన్‌జీజీవోల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, రామారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్‌జీజీవోలు సమ్మెలో ప్రత్యక్షంగా పాల్గొనరని, సమ్మెకు సంఘీభావం తెలియజేస్తారని స్పష్టం చేశారు. ఈ మేరకు 12న మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ప్రదర్శన నిర్వహించనున్నట్లు చెప్పారు.

ప్రైవేటు ఉపాధ్యాయులను నియమించే ఆలోచన వద్దు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షల ఇన్విజిలేషన్‌లో ప్రైవేటు ఉపాధ్యాయులను నియమించాలనే ఆలోచన విరమించుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.రెడ్డిదొర ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇటువంటి విధానాలు ప్రైవేటు విద్యారంగాన్ని ప్రోత్సహించడమే అవుతుందని వెల్లడించారు.

బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లి మండలం తోటపల్లిలో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంటు ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. నితిన్ సాయి కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారు 20 టీపీడీ కంప్రెస్‌డ్ బయోగ్యాస్ ప్లాంటు ఏర్పాటుకు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. దాంతో తాజాగా నిర్వహించిన రాష్ట్ర మంత్రి మండలి సమావేశంలో తోటపల్లిలో ఆర్.ఎస్.నెంబర్ 2-1లో 45.60 ఎకరాల ప్రభుత్వ భూమిని నూతన, పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ(ఎన్ఆర్ఈడీసీఏపీ) తరఫున కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ స్థాపన కోసం కేటాయించే ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. ఎకరా రూ.16.94 లక్షల చొప్పున కేటాయింపులు చేయనున్నారు. దాంతో ఈ ప్రాజెక్టు ద్వారా అనేక మందికి ఉపాధి లభించనుంది.

మహాశివరాత్రి పర్వదినం.. అప్రమత్తతే ప్రధానం

‘న్యూస్‌టుడే’తో దేవాదాయశాఖ సహాయ కమిషనర్ శ్రీనివాసరావు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాలు పట్టిసీమ, బలివే, భోగేశ్వర స్వామి ఆలయాలతో పాటు శివాలయాల్లో ఈనెల 15న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. దీనికోసం అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు సహకరించి దర్శనానికి కొంత సమయం ముందుగానే ప్రణాళిక చేసుకుని ప్రశాంతంగా శివారాధన చేసుకోవాలని దేవాదాయశాఖ సహాయ కమిషనర్ కూచిపూడి శ్రీనివాసరావు కోరారు. శివరాత్రి వేడుకల ఏర్పాట్లు, భక్తులు పాటించాల్సిన జాగ్రత్తలపై ఆయన ‘న్యూస్‌టుడే’కు ఇలా వివరించారు.

విస్తృత ఏర్పాట్లు.. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా పూర్తి స్థాయి ఏర్పాట్లు చేస్తున్నామని ఏసీ శ్రీనివాసరావు తెలిపారు. మూడు ప్రధాన ఆలయాలకు ముగ్గురిని సీఎఫ్‌వో(చీఫ్ ఫెస్టివల్ అధికారులు)లుగా నియమించినట్లు చెప్పారు. అంతేకాకుండా భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక అదనపు సిబ్బందిని కేటాయించామన్నారు. ఎండల వల్ల ఇబ్బంది కలగకుండా చలువ పందిళ్లు, మ్యాట్‌లు, ఫ్యాన్లు, దాతల సహకారంతో మంచినీళ్లు, మజ్జిగ పంపిణీ చేయనున్నట్లు ఆయన చెప్పారు. లింగోద్భవ కాలంలో అభిషేకాలకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. అలాగే జిల్లాలో ఎక్కడా లేనివిధంగా భోగేశ్వరంలో జరిగే స్వామి వారి తెప్పోత్సవంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామన్నారు. ఆలయం నుంచి లేదా దాతల సహకారంతో ప్రసాదాలు పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేశామని వివరించారు. వీఐపీ దర్శనాల వల్ల ఉచిత దర్శనాలకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశామన్నారు.

భక్తులు సహకరించాలి

ఎటువంటి తోపులాటలు, అపశృతులకు తావు లేకుండా భక్తులు సహకరించాలని శ్రీనివాసరావు కోరారు. క్యూ లైన్లలో మాత్రమే వెళ్లాలని, వ్యతిరేక దిశలో వస్తే ఎదుట వారికి ఇబ్బంది కలుగుతుందని, దర్శన సమయాలను పాటించాలని సూచించారు. వృద్ధులు, మహిళలు, పిల్లలు ముందుగా వెళ్లేందుకు మిగిలిన వారు సహకరించాలన్నారు. తోసుకోవడం, ముందు ఉన్నవారిని నెట్టడం ప్రమాదాలకు దారితీస్తాయని హెచ్చరించారు. బారికేడ్లపై బరువు ఆన్చి నిల్చోవద్దని, అధికారుల సూచనలు పాటించాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

జీలుగుమిల్లి (బుట్టాయగూడెం), న్యూస్‌టుడే: రాష్ట్రేతర ప్రాంతం నుంచి ఉపాధి నిమిత్తం వచ్చిన యువతి ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం పి.అంకంపాలెంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ఒడిశా రాష్ట్రం రాయగడ జిల్లా బీఎల్ వడి మండలానికి చెందిన పతిక రష్మిక(19) నాలుగు రోజుల కిందట గ్రామంలోని కోళ్ల ఫారంలో పని చేసేందుకు వచ్చారు. బుధవారం ఆమె అనుమానాస్పద స్థితిలో ఉరి వేసుకుని మృతి చెంది ఉండడాన్ని గుర్తించారు. అక్కడే పనిచేస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన వివాహితుడు ప్రశాంత్‌తో ఆమెకు పరిచయం ఉన్నట్లు చెబుతున్నారు. ప్రశాంత్, అతడి భార్య పని నిమిత్తం కోళ్ల ఫారానికి వెళ్లగా, ఇంటి వద్ద రష్మిక షెడ్డులో ఉరి వేసుకున్నట్లు పేర్కొన్నారు. జీలుగుమిల్లి పోలీసులు సంఘటనాస్థలిని పరిశీలించారు.

లారీ ఢీకొని ఉద్యానశాఖ ఒప్పంద ఉద్యోగి దుర్మరణం

నాగేశ్వరరావు (పాత చిత్రం)

జీలుగుమిల్లి (బుట్టాయగూడెం), అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: లారీ ఢీకొని ఉద్యాన శాఖ ఉద్యోగి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన జీలుగుమిల్లి మండలం తాటియాకులగూడెం సమీపాన జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. బాపట్ల జిల్లా నరాలశెట్టివారిగూడేనికి చెందిన నరాలశెట్టి నాగేశ్వరరావు(53) తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేటలో ఉద్యానశాఖ కార్యాలయంలో ఒప్పంద పద్ధతిన ఉద్యోగం చేస్తూ అక్కడే కుటుంబంతో కలిసి ఉంటున్నారు. బుధవారం వ్యక్తిగత పనిపై జీలుగుమిల్లి వచ్చి.. తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో తాటియాకులగూడెం సమీపంలో అశ్వారావుపేట వైపు వేగంగా వెళుతున్న లారీ వెనుక నుంచి ఆయన్ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగేశ్వరరావు తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందారు. మృతుని భార్య నాగమల్లేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై క్రాంతికుమార్ తెలిపారు.

ఉప్పుటేరులో దూకి యువకుడు ఆత్మహత్య

ఆకివీడు, న్యూస్‌టుడే: ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల సరిహద్దు ప్రాంతంలో ఉన్న ఉప్పుటేరులో దూకి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఇది. సుమారు 22 సంవత్సరాల వయస్సు కలిగిన యువకుడు వారం రోజుల క్రితం నుంచి కనిపించపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకుతున్నారు. అయితే యువకుడి మృత దేహం బుధవారం ఉప్పుటేరులో లభ్యమైనట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మార్చి 16 నుంచి దూరవిద్య పరీక్షలు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: ఏపీ సార్వత్రిక విద్యాపీఠం దూరవిద్య వార్షిక పరీక్షలను మార్చి 16 నుంచి 28 వరకు నిర్వహించనున్నట్లు డీఈవో వెంకటలక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 20న జరగాల్సిన గణిత, భారతీయ సంస్కృతి, వారసత్వం పరీక్షను 21వ తేదీకి వాయిదా వేసినట్లు చెప్పారు. పరీక్షల కాల నిర్ణయ పట్టికను www.apopen-school.ap.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలియజేశారు.

14న పీఏటీ పరీక్ష.. ఈ నెల 14న ‘ప్రొఫెషనల్ అడ్వాన్స్‌మెంట్ టెస్ట్’ (పీఏటీ) పరీక్ష నిర్వహించనున్నట్లు డీఈవో వెంకటలక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు హాజరు కావాల్సిన అభ్యర్థులు హాల్ టికెట్లను www.bse.ap.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

18 నుంచి టీసీసీ పరీక్షలు.. ఈ నెల 18 నుంచి 21 వరకు టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. అభ్యర్థులు హాల్ టికెట్లను www.bse.ap.gov.in వెబ్‌సైట్ నుంచి పొందవచ్చని అన్నారు.

14, 15 తేదీల్లో హెచ్ఎం అకౌంట్.. ఈ నెల 14, 15 తేదీల్లో హెచ్ఎం అకౌంట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ఆయా తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్షలు జరుగుతాయని చెప్పారు.

దిగబడిపోతున్న రాష్ట్రీయ రహదారి

కోలమూరు(ఉండి), న్యూస్‌టుడే: ఉండి నుంచి చేబ్రోలు వెళ్లే రాష్ట్రీయ రహదారి కొన్నిచోట్ల దెబ్బతింటోంది. ప్రధానంగా కోలమూరు, ఆరేడు ప్రాంతాల్లో రహదారి రెండు, మూడుచోట్ల దిగబడిపోతోంది. కోలమూరు నుంచి పులుగుమ్మ మార్గం వరకూ పంట కాలువ ప్రక్షాళన పనులు ఇటీవల పూర్తిచేశారు. ఆ దశలో కోలమూరు చిన్న రైసుమిల్లునకు సమీపంలో రహదారి కొంతమేర కోతకు గురైంది. దాని పునరుద్ధరణ పనులు అప్పట్లో చేశారు. గట్టు బలహీనపడినచోట రహదారి ముక్కలైపోతోందని వాహనచోదకులు వాపోతున్నారు. ఈఅంశంపై ఆర్అండ్‌బీ ఏఈ కె.శ్రీహరిరాజు స్పందిస్తూ పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రయాణికుడిగా పరిచయమై.. ఐపీఎస్‌గా నమ్మబలికి

ఉద్యోగం ఇప్పిస్తానని రూ.1.50 లక్షల కాజేత

నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సీఐ రామ్‌కిషోర్

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: దిల్లీ ఎన్ఐఏలో ఐపీఎస్ అధికారిగా పని చేస్తున్నా.. ఆదాయపు పన్ను శాఖలో డివిజనల్ అడ్వైజర్ ఉద్యోగాన్ని రీప్లేస్‌మెంట్ కోటాలో ఇప్పిస్తానని ఓ యువకుడిని నమ్మించి రూ.1.50 లక్షలు కాజేసిన నకిలీ ఐపీఎస్ అధికారి ఉదంతమిది. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన తిరుపతి జిల్లా అలిపిరి పోలీసులకు ఇదే తరహాలో మరో రెండు చోట్ల మోసాలకు పాల్పడినట్లు తెలిసింది. తెలంగాణ రాష్ట్రం సిద్దిపేటలో ఒకరి నుంచి రూ.2.50 లక్షలు, మాదాపూర్‌లో మరో యువకుడి నుంచి రూ.7 లక్షలు కాజేసినట్లు గుర్తించారు. నిందితుడిని అరెస్టు చేసి కేసు వివరాలను సీఐ రామ్‌కిషోర్ ఎస్ఐ నరసింహారావుతో కలిసి బుధవారం వెల్లడించారు. ‘ఏలూరుకు చెందిన వెంకటేశ్వరరావు ఐదేళ్ల కిందట గరుడ వారధి నిర్మాణ పనుల నిమిత్తం తిరుపతికి వచ్చారు. స్థానిక ఆటోనగర్‌లో ఉంటూ ప్రస్తుతం స్విమ్స్‌లో ఫార్మసిస్ట్‌గా పనిచేస్తున్నారు. సెలవు రోజుల్లో ర్యాపిడో డ్రైవర్‌గా పనిచేస్తారు. రెండు నెలల కిందట ర్యాపిడో రైడ్‌లో కె.సురేష్‌కుమార్ అలియాస్ సూర్య పరిచయమయ్యారు. దిల్లీ ఎన్ఐఏలో ఐపీఎస్ అధికారిగా తనను తాను పరిచయం చేసుకున్నారు. ఇటీవల పదోన్నతిపై హైదరాబాద్‌కు బదిలీ అయినట్లు చెప్పారు. ప్రస్తుతం సెలవులో శెట్టిపల్లిలోని పిన్నమ్మ ఇంటికి వచ్చానని తెలిపారు. హైదరాబాద్ ఆదాయపన్ను శాఖలోని ఉన్నతాధికారులు తనకు పరిచయం ఉన్నారని.. రీప్లేస్‌మెంట్ కోటాలో ఉద్యోగం ఇప్పిస్తానని ర్యాపిడో డ్రైవర్‌ను నమ్మించారు. అతని నుంచి విడతల వారీగా పేటీఎం ద్వారా రూ.1.50 లక్షల నగదు బదిలీ చేయించుకున్నారు. అతని అనుమానాస్పద ప్రవర్తనను గుర్తించిన బాధితుడు నగదు తిరిగి ఇమ్మని కోరగా.. నువ్వు చేయగలిగింది చేసుకోమని బెదిరించడంతో అలిపిరి పోలీసులను ఆశ్రయించారు. దర్యాప్తులో ఒడిశాకు చెందిన సురేష్‌కుమార్ ఇదే తరహా మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్స్‌కు అలవాటు పడి అవసరమైన డబ్బు కోసం మోసాలకు పాల్పడుతున్నట్లు తెలుసుకున్నారు. బుధవారం అరెస్టు చేసి అతని నుంచి రూ.1.25 లక్షల విలువైన వాషింగ్ మిషన్, టీవీ, మ్యూజిక్ పరికరాలు స్వాధీనం చేసుకున్న’ట్లు సీఐ వివరించారు.

మురుగు కాలువలో పసికందు మృతదేహం

పెదపాడు, న్యూస్‌టుడే : ఏ తల్లి కన్నదో... పుట్టిన వెంటనే కనీసం బొడ్డు పేగు కోయకుండానే ఓ పసికందు మురుగు కాలువలో తేలింది. పెదపాడులోని పెద్దమాల కాలనీలో మురుగుకాలువ నుంచి స్థానికులకు దుర్వాసన వస్తుండటంతోపాటు పసికందు మృతదేహం ఉబ్బి కనిపిస్తుండటంతో పోలీసులకు సమాచారం అందించారు. పెదపాడు ఎస్సై ఆర్.శ్రీను ఘటన స్థలానికి చేరుకొని మురుగు కాలువలో ఉన్న మగశిశువును బయటకు తీయించారు. చుట్టుపక్కల వారిని విచారించినా ఎటువంటి ఆచూకీ లభించలేదు. ఐసీడీఎస్, ఆరోగ్యశాఖ అధికారులతో మాట్లాడినా ఫలితం లేకపోయింది. మృతదేహం ఉబ్బి ఉండటంతో పాటు దుర్వాసన వస్తుండటంతో రెండు రోజుల కిందట తీసుకొచ్చి ఇక్కడ పడేసి ఉంటారని ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని ఏలూరు సర్వజన ఆసుపత్రి శవాగారానికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)

(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213 చికెన్ స్కిన్‌లెస్ - 243. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 137, 146, 157 చికెన్ విత్ స్కిన్ - 260 చికెన్ స్కిన్‌లెస్ - 270.

కోనేరు గోడ కూలింది..!

నూజివీడు మండలం సీతారాంపురంలోని గౌరీ సమేత కేదారేశ్వర విజయగణపతి ఆలయం ఎదురుగా ఉన్న కోనేరు ప్రహరీ కూలింది. ఇటీవల నిర్మించిన ఈ గోడ కూలడంపై స్థానికులు పెదవి విరుస్తున్నారు. అధికారులు పరిశీలించి గోడను పునర్నిర్మించాలని కోరుతున్నారు. **- ఈనాడు, నూజివీడు**

92.7 FM Rajamahendravaram ఈ FM 92.7 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్‌క్యాష్). ✆ 81422 92071.

భీమవరంలో బేకరీ స్వీట్ షాపులో జ్యూస్, ఫ్రైడ్ చికెన్, చైనీస్ చేయుటకు మాస్టర్స్ కావలెను. వెంటనే సంప్రదించండి. సెల్: 89853 11167.

మీ ఇంటి వద్ద నుండి పార్ట్/ఫుల్ టైం చేస్తూ అధిక ఆదాయం. అందరూ అర్హులే. వీక్లీ: 5000 to10,000 సంపాదించుకునే అవకాశం. ✆ 99897 99736.

JOBS

Senior Marketing Executive for Bhimavaram. Attractive Salary Will be Paid. Help Hospitals, Vijayawada. ✆ 92462 76008

BR INFRACON నందు పనిచేయుటకు సైట్ ఇంజనీర్లు కావలెను. Q: డిప్లొమా, B.Tech/M.Tech అర్హత కలిగి బిల్డింగ్స్, ఇరిగేషన్ వర్క్స్ నందు 3to4 సంవత్సరముల అనుభవం కలిగి విజయవాడ, రాజమండ్రి, ఏలూరు జిల్లాల నందు పనిచేయుటకు కావలెను. పూర్తి బయోడేటాను info@brinfra-con.com కి పంపగలరు ✆ 79955 57831.

జంగారెడ్డిగూడెం, అశ్వారావుపేట రోడ్‌లోగల ప్రముఖ ఎలక్ట్రానిక్స్ షోరూంనందు పనిచేయుటకు బాయ్స్ (హెల్పర్స్), సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. ESI+PF కలదు. ✆ 94947 11544, 99123 51117.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

★ For the Information of Trade & Industry ★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 4.85 పైII తణుకు ఆఫీసు: 08819-224254

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం

ఏలూరు

●ఏలూరు ●దెందులూరు ●ఉంగుటూరు

నిమ్మకాయల వర్తక సంఘం సమావేశం

గార్లమడుగు(పెదవేగి),న్యూస్‌టుడే : పెదవేగి మండలం గార్లమడుగులోని ఉప్పలపాటి చక్రపాణి గార్డెన్స్‌లో బుధవారం సౌత్ ఇండియన్ లెమన్ మర్చంట్ అసోషియేషన్ సమావేశం నిర్వహించారు. దక్షిణ భారతదేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన నిమ్మకాయల వర్తక సంఘం నాయకులు హాజరై సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ దక్షిణ భారతదేశం నుంచి ఉత్తర భారతానికి నిమ్మకాయల ఎగుమతి ఎక్కువగా ఉంటుందని, ఈ సమయంలో దిగుమతి చేసుకొనే ఉత్తర భారత వ్యాపారులు మోసాలకు పాల్పడుతున్నారని చెప్పారు. అటువంటి సమయంలో సంఘం అండగా నిలిచి రావాల్సిన సొమ్ము ఇప్పించడంలో కృషి చేస్తుందని ఆయన తెలిపారు. నిమ్మకాయల వర్తక సంఘం నాయకులు తూతా బాలాజీకుమార్, అలపాటి రంగారావు, పి.ఉమామహేశ్వరరావు, ఎ.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి చెరువు శుభ్రం

వసంతవాడ (పెదపాడు), న్యూస్‌టుడే : పెదపాడు మండలం వసంతవాడలో మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న తీరుపై గత నెల 23న 'ఆదాయం జాస్తి...ప్రగతి నాస్తి' శీర్షికతో 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన వసంతవాడ పంచాయతీ కార్యదర్శి వినోద్‌కుమార్ గ్రామంలోని మంచినీటి చెరువును బాగు చేయించారు. చెరువులో పేరుకుపోయిన తూడు, నాచు, గుర్రపుడెక్క తొలగించారు. దీంతోపాటు సురక్షిత మంచినీటిని సరఫరా చేసే ట్యాంక్ నిచ్చెనలు శిథిలమయ్యాయి. దీంతో ట్యాంక్ క్లోరినేషన్ చేసేందుకు అవకాశం లేకుండా పోయింది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి ట్యాంక్ ఎక్కేందుకు వీలుగా నిచ్చెనలు ఏర్పాటు చేయించడంతో పాటు క్లోరినేషన్ చేయించి గ్రామస్థులకు మంచి నీటిని సరఫరా చేయిస్తున్నారు.

బాగు చేసిన తర్వాత ఇలా..

కలాం ఫౌండేషన్ సేవలు ప్రారంభం

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: కలాం ఫౌండేషన్ (కొత్త దిల్లీ) సేవలు ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైనట్లు 'డెమోక్రటిక్ పీఆర్‌టీయూ' (డీపీఆర్‌టీయూ) నాయకులు తెలిపారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన సంఘ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంలో ఫౌండేషన్ ప్రతినిధుల నుంచి ఒప్పంద పత్రాలను అందుకున్నట్లు ఏలూరుకు చెందిన సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కలాం రీసెర్చి ఫోరం ఏపీ విభాగానికి కన్వీనరుగా డీపీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీనును ఎంపిక చేశారన్నారు. ఈ ఒప్పందం వల్ల గైడు ఉపాధ్యాయులు, విద్యార్థులు జాతీయ స్థాయి సదస్సుల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని వెల్లడించారు.

పత్రాలు అందుకుంటున్న శ్రీనివాస్, వెంకటేశ్వరరావు తదితరులు

వసతులు లేవు.. ఇబ్బందులు తీరవు..!

నగరంలో తీరని సమస్యలు

తంగెళ్లమూడి (ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే): ఏలూరు నగరం తంగెళ్లమూడి పరిధి ద్వారకానగర్‌లో సమస్యలు తాండవిస్తున్నాయి. ఈ కాలనీలో సుమారు 3,500 మంది జనాభా ఉన్నారు. స్థానికంగా మౌలిక సదుపాయాలు లేకపోవడంతో నివాసితులు ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా రహదారులు లేకపోవడం, మురుగు కాల్వల్లో పూడిక తీయకపోవడం, వీధి దీపాలు అరకొరగా ఉండటం, ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్త, వీటిలో పందులు, కుక్కల సంచారం ఎక్కువగా ఉండటం వంటి అనేక సమస్యల నడుమ జనం జీవనం సాగించాల్సి వస్తోంది. చిన్నపాటి వానకే రహదారులు జలమయం అవుతున్నాయి. ఖాళీ స్థలాల్లో రోజుల తరబడి నీరు నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెందుతూ ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. రాత్రివేళ వీధి దీపాలు వెలగకపోవడంతో చీకట్లో విష పురుగులు సంచరిస్తూ స్థానికులను ఇళ్ల నుంచి బయటకు రాకుండా చేస్తున్నాయి. ఈ కాలనీలో నెలకొన్న సమస్యలను పాలకులు, అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినప్పటికీ పట్టించుకున్న పాపాన పోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

ద్వారకానగర్‌లో పూడిపోయిన డ్రెయిన్

చీకటి పడిందంటే భయం

ద్వారకానగర్ నివాసితులు చీకటి పడిందంటే భయాందోళనలకు గురవుతున్నారు. వీధుల్లో అక్కడక్కడా మాత్రమే దీపాలు వెలుగుతున్నాయి. పాఠశాలలకు వెళ్లిన పిల్లలు సాయంత్రం ఇళ్లకు చేరుకోవడానికి చాలా ఇబ్బంది పడుతున్నారు. రోజుల తరబడి మురుగు కాల్వల్లో పూడిక తీయకపోవడంతో మురుగు కదలడం లేదు. ఎండా కాలంలో తాగునీటి సరఫరా సరిగా ఉండదు.
- సురేంద్ర, స్థానికుడు

సీఆర్‌ఆర్‌లో ప్రాంగణ ఎంపికలు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: స్థానిక సీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. బజాజ్ క్యాపిటల్ ఇన్సూరెన్స్ సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. హాజరైన అభ్యర్థులకు రాత, మౌఖిక పరీక్షలు నిర్వహించారు. ఉద్యోగాలకు ఎంపికైన వారి వివరాలను తదుపరి ప్రకటిస్తారని ప్రధానాచార్యుడు రామరాజు తెలిపారు.

ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పిద్దాం..

పెదవేగి, భీమడోలు, న్యూస్‌టుడే: పెదవేగి మండలం రామశింగవరంలో మంగళవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పిద్దాం.. మన ఊరి బడిని కాపాడుదాం.. అనే నినాదంతో జెడ్పీహెచ్, ఎంపీపీఎస్ పాఠశాలల్లో ఎన్రోల్మెంట్ నిర్వహించారు. గుండుగొలనులో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రచారం చేశారు.

పోస్టర్లు చూపుతున్న నాయకులు

దేశవ్యాప్త సమ్మెకు మద్దతు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: కార్మిక చట్టాల రద్దును నిరసిస్తూ ఈ నెల 12న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెకు మద్దతు ఇస్తున్నట్లు ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు తెలిపారు. ఆ సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గ్యారేజీ ఎదుట గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా కార్యదర్శి ఎన్.సురేశ్ మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేయాలని కేంద్రం నిర్ణయించడం వల్ల కార్మికులు నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. గురువారం నిర్వహించనున్న సమ్మెలో భాగంగా ఉదయం 10 గంటలకు స్థానిక జూట్ మిల్లు కూడలి నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆర్టీసీ గ్యారేజీ ఎదుట గేట్ మీటింగ్ నిర్వహిస్తున్న నాయకులు

ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి

పెదవేగి (పెదపాడు), న్యూస్‌టుడే: ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు కూటమి ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. పెదవేగి మండలంలోని పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన ఎల్‌వోసీ పత్రాలను బుధవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన అమ్మపాలెంలో మాట్లాడుతూ ప్రాధాన్య క్రమంలో అందరి సమస్యలు పరిష్కరిస్తామని, నియోజకవర్గ ప్రజలకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు.

అమ్మపాలెంలో సీఎం సహాయనిధి పత్రాన్ని లబ్ధిదారునికి అందజేస్తున్న చింతమనేని

విద్యతోనే సామాజిక అభ్యున్నతి.. దెందులూరు, న్యూస్‌టుడే: విద్యతోనే సామాజిక అభ్యున్నతి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. సీతంపేటలో ట్రినిటీ అకాడమీ విద్యాసంస్థ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. దెందులూరు నియోజకవర్గం పరిధిలో అంతర్జాతీయస్థాయిలో అకాడమీ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ట్రినిటీ అధినేత ఆర్.జయప్రకాష్, సీతంపేట సొసైటీ బ్యాంకు అధ్యక్షుడు యలమర్తి శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

మహా అన్నసమారాధన

ఏలూరు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: ఏలూరు ఆదివారపుపేట గంగానమ్మ జాతర కొలుపుల కమిటీ ఆధ్వర్యంలో జాతర ముగింపు సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం ఆలయ సమీపంలో మహా అన్నసమారాధన ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలో కొలువైన అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి.. నైవేద్యాలు సమర్పించారు.

కోళ్ల వ్యర్థాలను రవాణా చేస్తే కఠిన చర్యలు: సీఐ

పెదపాడు, న్యూస్‌టుడే: ఎక్కడైనా కోళ్ల వ్యర్థాలు రవాణా చేస్తే బాధ్యులను పట్టుకొని కఠిన చర్యలు తీసుకుంటామని పెదవేగి సీఐ సీహెచ్.రాజశేఖర్ హెచ్చరించారు. పెదపాడు తహసీల్దారు కార్యాలయంలో బుధవారం తహసీల్దారు కృష్ణజ్యోతి, ఎస్సై శ్రీనుతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బైండోవర్ కేసులో నిబంధనలను అతిక్రమించి మళ్లీ కోళ్ల వ్యర్థాలను తరలిస్తూ పోలీసులకు పట్టుబడిన గుడిపాడుకు చెందిన ముంగర మధుబాబుకు రూ.3 లక్షలు జరిమానాగా విధించి ప్రభుత్వానికి జమ చేసినట్లు ఆయన తెలిపారు. ఇతనిపై ఇప్పటి వరకు పెదపాడు, ముసునూరు, చాట్రాయి, హనుమాన్‌జంక్షన్, గన్నవరం పోలీసు స్టేషన్లలో 27 కేసులు నమోదయ్యాయని తెలిపారు. ప్రతి కేసులో జామీపై విడుదలై మళ్లీ అదే తప్పు చేసేవారని వివరించారు. అటువంటి వ్యక్తిని తహసీల్దారు ఎదుట హాజరుపరిచి బైండోవర్ చేయగా మళ్లీ అదే కోళ్ల వ్యర్థాలను తరలిస్తూ పర్యావరణానికి హాని చేయడంతోపాటు ప్రజారోగ్యానికి ముప్పుగా మారారని వెల్లడించారు.

మాట్లాడుతున్న సీఐ రాజశేఖర్, తహసీల్దారు కృష్ణజ్యోతి, ఎస్సై శ్రీను

మొక్కలను సంరక్షించే బాధ్యత తీసుకోండి

గణపవరం, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి దాన్ని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాధ్యాపకురాలు పి.నిర్మలాకుమారి తెలిపారు. కళాశాలలో ప్రపంచ పప్పు ధాన్యాల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎకో- క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు.

పీఎంపీలకు క్యాన్సర్‌పై అవగాహన

ఉంగుటూరు, న్యూస్‌టుడే: స్థానిక సామాజిక భవనంలో పీఎంపీ అసోసియేషన్ ఉంగుటూరు మండల శాఖ సర్వసభ్య సమావేశం అధ్యక్షుడు కొచ్చెర్లకోట శ్రీనివాస్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య విజ్ఞాన సదస్సులో గైనకాలజిస్ట్ శ్వేత వివిధ రకాల క్యాన్సర్లపై అవగాహన కల్పించారు.

రహదారి పనులకు నిధులు

నిడమర్రు, న్యూస్‌టుడే: పెదనింద్రకొలను-నిడమర్రు మధ్య అధ్వానంగా ఉన్న 1.6 కి.మీ రహదారి నిర్మాణానికి రూ.80 లక్షలు మంజూరయ్యాయి. టెండర్లు కూడా పూర్తయ్యాయి. అందులో భాగంగా రహదారి ఎత్తు పల్లాలు సరి చేశారు. త్వరలోనే రహదారి నిర్మాణం చేపడతామని ర.భ.శాఖ ఏఈ భాస్కరరావు తెలిపారు. దీంతో రహదారి నిర్మాణంలో కదలిక వచ్చింది.

అవి ఇవి అన్నీ

సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి.. భీమడోలు, న్యూస్‌టుడే: లాభసాటి వ్యవసాయం చేసేందుకు రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని వ్యవసాయశాఖ భీమడోలు ఏడీఏ సీహెచ్.ఉషారాజకుమారి అన్నారు. భీమడోలు మండలం పోలసానిపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.

12 నుంచి విద్యుత్తు సరఫరాకు అంతరాయం.. పెదవేగి (పెదపాడు), న్యూస్‌టుడే: పెదవేగి విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ అంబేడ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.

శిరస్త్రాణం భారం కాదు.. బాధ్యత.. భీమడోలు, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనచోదకులు శిరస్త్రాణం విధిగా ధరించాలని, దాన్ని భారంగా భావించవద్దని భీమడోలు సీఐ యు.జె.విల్సన్ అన్నారు. 16వ నంబరు జాతీయ రహదారిపై భీమడోలు, ద్వారకాతిరుమల మండలాల సరిహద్దు ప్రాంతం అంబరుపేట వద్ద రహదారి భద్రత, వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని పోలీసులు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన.. గణపవరం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని మానసిక ఆరోగ్య నిపుణుడు శ్రీనివాసరావు తెలిపారు. పిప్పర పీహెచ్‌సీలో మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైద్యాధికారిణి శ్రీదివ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకమైన బిల్లింగుకు స్మార్ట్ మీటర్లు.. భీమడోలు, న్యూస్‌టుడే: భీమడోలులో విద్యుత్తు స్మార్ట్ మీటర్ల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఆ శాఖ అధికారులు కళాజాత బృందంతో అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. విద్యుత్తు శాఖ ఏడీఈ మల్లేశ్వరరావు, ఏఈ శివాజీ స్మార్ట్ మీటర్ల వినియోగంపై అవగాహన కల్పించారు.

CHANGE OF NAME

I, Mohammad Madhaar S/o. Mohammad Abdul Ajij D.No. 16A-11-82/1, Tangellamudi, Eluru, Eluru Dist. Here by State that my parents name in my Passport No: S9278257 we recorded as Old Names: **Abdul Azeez Mohammed, Jubeda Begum Mohammed** & Correct Names **Mohammad Abdul Ajij, Mohammad Jubeda Begum** for all Purposes.

ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం Civil Judge (Senior Division) వారి కోర్టులో
డెటార్ ఐ.పి.నెం. 3/2026
పిటిషనరు : బోనం వెంకట్ సుదర్శన్
రెస్పాండెంట్లు : యిండుగుల మురళి వగైరా
ఈ నోటీసు ద్వారా యావన్మందికి తెలియజేయునది ఏమనగా పై నంబరు గ్రంథంలో పిటీషనర్ పిటీషను దాఖలు చేసియున్నారు. రెస్పాండెంట్లుపై ఇన్సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని డెటార్ ఐ.పి. పై శ్రీ కోర్టువారి ఎదుట పై నంబర్ వ్యాజ్యము దాఖలు చేసియున్నారు. అందుపై యెవ్వరికైనా ఎట్టి అభ్యంతరాలు, ఆక్షేపణలు గాని ఉన్న యెడల ది. 27-02-2026వ సం॥రం తేదీ ఉదయం గం. 10.30 ని॥లకు పై శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని హాజరై తెలియపర్చవలెను. లేని యెడల మీ పరోక్షమందు పై నంబరు గ్రంథం తీర్మానించబడునని యిందుమూలముగా తెలియజేయడమైనది.
పై కోర్టు వారి ఉత్తర్వులతో
సం/- కాళ్ళకూరి కుసుమ హరనాథ్
తాడేపల్లిగూడెం పిటిషనరు తరపు అడ్వకేట్
తేది: 11-2-2026 సెల్ నెం. 99639 54564

పెద్దింట్లమ్మ... చల్లగా చూడమ్మా

చేబ్రోలు (ఉంగుటూరు), న్యూస్‌టుడే: చేబ్రోలు నుంచి తల్లాపురం వెళ్లే రహదారి పక్కనున్న పెద్దింట్లమ్మ జాతర బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆలయం వద్ద భారీ అన్న సమారాధన చేశారు.

ఏలూరులో సమర్పణ దివాస్ కార్యక్రమంలో భాజపా నాయకులు

దీన్ దయాళ్ ఉపాధ్యాయ జీవితం ఆదర్శప్రాయం

ఏలూరు అర్బన్, ఉంగుటూరు, భీమడోలు,న్యూస్‌టుడే: పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జీవితం ఆదర్శప్రాయమని భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ప్రసాద్ తెలిపారు. దీన్ దయాళ్ ఉపాధ్యాయ సమర్పణ దివాస్ కార్యక్రమాన్ని బుధవారం ఏలూరు భాజపా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడారు. భీమడోలు, చేబ్రోలులో దీన్‌దయాల్ ఉపాధ్యాయ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భీమడోలు మండలం వడ్లపట్ల గ్రామంలో పేద కుటుంబాలకు నగదు సహాయం, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు.

విద్యుత్తు నియంత్రికలో రాగితీగ చోరీ

పెదపాడు, న్యూస్‌టుడే : పెదపాడు మండలం కొక్కిరపాడులోని పంట పొలాల్లో ఉన్న విద్యుత్తు నియంత్రికను పగలగొట్టి అందులో ఉన్న రాగి తీగను ఈ నెల 1న గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. ఈ ఘటనపై ట్రాన్స్‌కో పెదపాడు ఏఈ కె.శివశంకరం ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదపాడు ఎస్సై ఆర్.శ్రీను తెలిపారు.

రెండు లారీలు స్వాధీనం

పెదపాడు, న్యూస్‌టుడే : కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న రెండు లారీలను బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు పెదపాడు ఎస్సై ఆర్.శ్రీను తెలిపారు. విజయవాడ పరిసర ప్రాంతాల్లో సేకరించి మండలంలోని చెరువులకు తరలిస్తుండగా రామచంద్రపురం వద్ద వాటిని పట్టుకున్నామన్నారు. పలువురిపై కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

విద్యుత్తు మోటార్ల చోరీలపై కేసులు

పెదపాడు, న్యూస్‌టుడే : పెదపాడు మండలం వడ్డిగూడెం, గుడిపాడు గ్రామాల్లోని చేపల చెరువుల వద్ద పలువురు ఆక్వా రైతులకు చెందిన ఆరు విద్యుత్తు మోటార్ల చోరీపై రైతుల ఫిర్యాదుల మేరకు బుధవారం కేసులు నమోదు చేసినట్లు పెదపాడు ఎస్సై ఆర్.శ్రీను తెలిపారు.





చింతలపూడి
•చింతలపూడి •పోలవరం

కొనసాగిన లక్ష మోదక గణపతి హోమం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ఐఎస్ జగన్నాథపురం సుందరగిరిపై లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అతిరుద్ర సహిత శ్రీసుదర్శన నృసింహ ధన్వంతరి మహాయజ్ఞంలో భాగంగా లక్ష మోదక గణపతి హోమం బుధవారం కొనసాగింది. పండితులు, రుత్వికులు హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మేళతాళాలు, వాయిద్యాల నడుమ వేద మంత్రాలు చదువుతూ ఘనంగా జరిపించారు. మహాయజ్ఞంలో భాగంగా కలశాలను సిద్ధం చేస్తున్నారు.

వీధి దీపాల అందజేత

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: ఎంపీ నిధులతో వచ్చిన 200 వీధి దీపాలను మేడేపల్లి పంచాయతీ కార్యదర్శి పద్మజ, సర్పంచి రాంబాబుకు తెదేపా మండలాధ్యక్షుడు అమరవరపు అశోక్ బుధవారం అందించారు. కార్యక్రమంలో నాయకులు చాపర్ల శ్రీను, పద్దం రమేశ్ పాల్గొన్నారు.

కనకాద్రిపురంలో తాగునీటికి ఇక్కట్లు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: కనకాద్రిపురంలో తాగునీటి సరఫరా సక్రమంగా లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికంగా తాగునీటి బోరు పడకపోవడంతో సుమారు మూడు కిలోమీటర్ల దూరంలోని పంచాయతీ కేంద్రం కుంతలగూడెం సమీపం నుంచి పైపులైను ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. కొన్ని వారాలుగా నీటి సరఫరాలో అవాంతరాలు ఎదురవుతున్నాయి. తరచూ బురద నీరు రావడం, నీరు సరఫరా కాకపోవడంతో తాగునీటికి మరోచోటకు పరుగులు తీయాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి పవన్ మాట్లాడుతూ.. నీటి సమస్యపై ఉన్నతాధికారులకు నివేదించామని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

కంటి పరీక్షలు చేస్తున్న సిబ్బంది

పేదలకు చేయూత అందించడం అభినందనీయం

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: పేదలకు చేయూత అందించేందుకు యువత ముందుకు రావడం అభినందనీయమని కూటమి నాయకులు కొండ్రెడ్డి కిశోర్, చిట్టిబోయిన రామలింగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని 19వ వార్డులో కంపా వినయ్, అతడి మిత్రబృందం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాగృతి కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో పేదలకు కంటి పరీక్షలు నిర్వహించారు. నాయకులు కంపా రాజేంద్ర, షేక్ రషీద్, సత్యనారాయణ, కర్రా శ్రీధర్, ప్రియాంక, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇలా ఉంటే రారా.. ఆసక్తిగా వినరా..

• బొమ్మలతో అర్థమయ్యేలా విద్యాబోధన • అంగన్‌వాడీలకు ప్రత్యేక కిట్ల పంపిణీ

చింతలపూడి, జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. చిన్నారులకు సులభంగా విద్యాబోధన అందిస్తూ.. వారిలో సృజనాత్మకతను వెలికితీసేందుకు ప్రీస్కూల్ కిట్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటితో పిల్లలకు బొమ్మలను చూపిస్తూ పాఠాలు చెప్పడంతో వాటిని వినేందుకు బాలలు ఆసక్తి చూపుతున్నారు.

జంగారెడ్డిగూడెం ఐసీడీఎస్ పరిధిలో..	
అంగన్‌వాడీ కేంద్రాలు	: 219
మండలాలు	3
బాలింతలు	969
గర్భవతులు	1119
చిన్నారులు(0–6నెలలు)	969
చిన్నారులు(6 నెలలు–3 ఏళ్లు)	5397
చిన్నారులు(3 ఏళ్ల నుంచి 6ఏళ్లు)	4398

219 కేంద్రాల్లో.. జంగారెడ్డిగూడెం ఐసీడీఎస్ పరిధిలో జంగారెడ్డిగూడెం, ద్వారకాతిరుమల, కామవరపుకోట మండలాల్లో 219 అంగన్‌వాడీ కేంద్రాలుండగా.. వాటిల్లో మూడు నుంచి ఆరేళ్ల లోపు 4,398 మంది చిన్నారులున్నారు. ఆయా కేంద్రాల్లో బాలలకు పూర్వ ప్రాథమిక విద్యలో భాగంగా శారీరక, మేధ, భాషా, సామాజిక, గణితాభివృద్ధికి సంబంధించి అయిదు రకాల అభివృద్ధి అంశాలపై రోజూ బోధిస్తున్నారు.

రోజుకొక అంశంపై..

కేంద్రాలకు వచ్చే 3, 4, 5 సంవత్సరాల చిన్నారులను ఆటలు ఆడించడం, బొమ్మలు గీయించడం, రంగులు వేయడం, ఆంగ్ల, తెలుగు భాషలకు సంబంధించి అక్షరాలను రాయించడం వంటి పనులు చేస్తున్నారు. ప్రీస్కూల్ కిట్లలో అక్షరాల నమూనాలు చిత్రాలుగా ముద్రించిన పుస్తకాలు, జంతువుల బొమ్మలు, బంతులు, పజిల్స్, రంగు పెన్సిల్స్, కథల పుస్తకాలు వంటివి ఉండటంతో వీటి ద్వారా అభ్యాసం చేయడం బాలలకు సులభతరంగా మారింది. పిల్లలకు బోధించే అంశాలు రోజూవారీ అంశంపై ప్రత్యేక ప్రణాళిక ద్వారా చెప్పడంతో పాటు వాటిలో మెలకువలను సైతం నేర్పిస్తున్నారు.

జంగారెడ్డిగూడెం: బొమ్మలతో బోధిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

చిన్నారులకు ఎంతో ఉపయుక్తం

'అంగన్‌వాడీ కేంద్రాలకు ఇచ్చిన ప్రీస్కూల్ కిట్లలో సామగ్రి చిన్నారులకు ఎంతో ఉపయుక్తంగా ఉంది. వీటి ద్వారా చదివిన అంశాలను సులభంగా గుర్తు పెట్టుకునే వీలుంటుంది.' సీడీపీవో బ్యూలా తెలిపారు.

10 AM to 1 PM మేమున్నాం.. మీకు తోడుగా..
జంగారెడ్డిగూడెం: 80085 74478
కొయ్యలగూడెం: 80085 74947
చింతలపూడి: 76759 19086

టి.నరసాపురం, న్యూస్‌టుడే: ? గ్రామంలో మురుగు నీటి పారుదల సౌకర్యం సరిగా లేదు. మురుగు నిలిచి, దుర్వాసనతోపాటు దోమల బెడద పెరిగింది. - **కె.నాగేశ్వరరావు, బొర్రంపాలెం**

✔ గ్రామంలో మురుగునీటి పారుదలకు చర్యలు చేపట్టాం. డ్రెయినేజీ నిర్మాణాలు వరుస క్రమంలో పూర్తి చేయిస్తాం. - **హరికృష్ణ, పంచాయతీ కార్యదర్శి, బొర్రంపాలెం**

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: ? చింతలపూడి పట్టణం ఆశ్రం వీధి, కొప్పులవారి వీధిలో దోమలు విజృంభిస్తున్నాయి. ఇబ్బంది పడుతున్నాం. - **శ్రావణ్‌కుమార్, కొప్పులవారి వీధి**

✔ దోమల నివారణకు చర్యలు తీసుకుంటాం. - **రాంబాబు, కమిషనర్**

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: ? జంగారెడ్డిగూడెం పట్టణంలోని 2వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కంకర పరిచి అలానే వదిలేయడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. - **వెంకటేశ్వరరావు, జంగారెడ్డిగూడెం**

✔ రూ.14 లక్షల నిధులు మంజూరయ్యాయి. పనులు త్వరితగతిన ప్రారంభిస్తాం. - **కేవీ రమణ, కమిషనర్**

పోలవరం, న్యూస్‌టుడే: ? గత వారం రోజులుగా పోలవరం నుంచి రాజమహేంద్రవరం మధ్యాహ్నం 11.40 గంటలకు వెళ్లాల్సిన ఆర్టీసీ బస్సు 11.20కే వెళ్లిపోతుంది. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలి. - **పి.త్రిమూర్తులు**

✔ తప్పకుండా సమయపాలన పాటించేలా చర్యలు తీసుకుంటాం. - **మాధవ్, ఆర్టీసీ డీపో మేనేజర్, రాజమహేంద్రవరం**

మందులు అందజేస్తున్న సాయిబుచ్చారావు

ఆధునిక పద్ధతులతో మేలు

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: పాడి పశువులతో అధిక ఆదాయాన్ని పొందేందుకు ఆధునిక యాజమాన్య పద్ధతులు పాటించాలని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు ఎం.సాయిబుచ్చారావు అన్నారు. బుధవారం కోయ మాదారంలో నిర్వహించిన పశు వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. పశువులకు గర్భకోశ, సాధారణ చికిత్స చేసి నట్టల నివారణ మందులను రైతులకు అందించారు.

సకాలంలో ఇంటి పన్నులు చెల్లించాలి

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: గ్రామాల్లో ఇంటి పన్నులను సకాలంలో చెల్లించాలని డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి ఎం.రాజు కోరారు. కేఆర్‌పురం పంచాయతీ పరిధిలో బుధవారం ఆయన పర్యటించారు. పలువురు గృహ యజమానులతో మాట్లాడి, పన్ను బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. పంచాయతీల సిబ్బంది ఇంటి పన్నుల వసూలు చేయడంలో నిర్దేశిత లక్ష్యాలను సాధించాలన్నారు.

విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలి: డీఏవో

కుక్కునూరు, న్యూస్‌టుడే: సాగుభూమి ఉన్న ప్రతి రైతు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి షేక్ హబీబ్ బాషా తెలిపారు. బుధవారం కుక్కునూరు మండలంలో ఆయన పర్యటించారు. రైతులను కలిసి ఏపీ ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఐడీ ఆవశ్యకత గురించి తెలియజేశారు. దాచారంలో రైతులతో సమావేశమయ్యారు. అనంతరం మొక్కజొన్న, మిరప తదితర పంటలను పరిశీలించారు. స్థానిక వ్యవసాయాధికారి బాలాజీ, గ్రామ వ్యవసాయ సహాయకులు కుమారి, సుదారాణి, భాగ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

రైతులతో మాట్లాడుతున్న హబీబ్‌బాషా

బుట్టాయగూడెం: ప్రతి రైతు తప్పనిసరిగా ప్రత్యేక యాప్‌లో తమ విశిష్ట సంఖ్యను నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి షేక్ హబీబ్ బాషా సూచించారు. దర్భగూడెంలో బుధవారం ఆయన రైతులతో సమావేశమై ఏపీ ఏఐఎంఎస్ యాప్, ఈ-పంట నమోదు ఆవశ్యకత, ఉపయోగాలను వివరించారు.

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా స్థానిక అధికారులకు సూచించారు. బుధవారం రామవరం రైతు సేవా కేంద్రం వద్ద రైతులతో ఆయన మాట్లాడారు.

ఉన్నత చదువులతో ఉత్తమ భవిత

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: విద్యార్థులు ఉన్నత చదువులు చదివి పట్టుదలతో ఉత్తమ భవితను సాధించాలని బుట్టాయగూడెం ఏకలవ్య విద్యాలయం ప్రిన్సిపల్ ప్రవీణ్ కుమార్ మిశ్రా అన్నారు. విద్యాలయంలో 10వ, 12వ తరగతుల విద్యార్థులకు మంగళవారం రాత్రి వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు ఆకాశ దీపాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు తమ జీవితాలను కాంతివంతంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

పాత స్థలంలోనే వసతిగృహ భవనం నిర్మించాలని ధర్నా

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: బుట్టాయగూడెంలోని గిరిజన కళాశాల బాలుర వసతిగృహానికి చెందిన స్థలంలోనే కొత్త భవనాన్ని నిర్మించాలని కోరుతూ పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద విద్యార్థులు బుధవారం ధర్నా చేశారు. కేఆర్‌పురంలోని గురుకుల కళాశాల నుంచి ఐటీడీఏకు ప్రదర్శనగా చేరుకుని, కార్యాలయం ముందు బైఠాయించి నినాదాలు చేశారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని మాట్లాడుతూ.. శిథిలస్థితిలోని వసతిగృహం భవనాన్ని తొలగించి ఆ స్థలంలో దుకాణ సముదాయాన్ని నిర్మించడం తగదన్నారు. ఇటువంటి చర్యలు గిరిజన విద్యార్థులను విద్యకు దూరం చేయడమేనన్నారు. వసతిగృహాన్ని నాలుగు కిలోమీటర్ల దూరాన ఉన్న బూసరాజుపల్లిలో ఏర్పాటు చేయడం తగదన్నారు. పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బన్నే వినోద్, పీవైఎల్ జిల్లా నాయకులు భూషణం, తగరం బాబూరావు తదితరులు నాయకత్వం వహించారు. అనంతరం ఐటీడీఏ మేనేజర్ ప్రకాశరావుకు వినతిపత్రం అందజేశారు.

ఆందోళన చేస్తున్న నాయకులు, విద్యార్థులు

మహాశివరాత్రి ఉత్సవ కరపత్రాల ఆవిష్కరణ

జంగారెడ్డిగూడెం గ్రామీణ న్యూస్‌టుడే: తాడువాయిలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు మహాశివరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ ఛైర్మన్ ఉప్పునూతల పుల్లారావు తెలిపారు. బుధవారం ఆలయ ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహోత్సవాలు 5 రోజుల పాటు జరుగుతాయన్నారు. 15వ తేదీ మహాశివరాత్రి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, 16న భద్రకాళీ సమేత వీరేశ్వరుని గ్రామోత్సవం, 17న స్వామి కల్యాణం, అఖండ అన్నసమారాధన, 18న అపర్ణా సమేత అనంతేశ్వరస్వామి కల్యాణం, 19న స్వామి, అమ్మవారికి పుష్పయాగం వంటి పూజాదికాలు ఉంటాయన్నారు. అనంతరం ఉత్సవాలకు సంబంధించి కరపత్రాలను కమిటీ సభ్యులు, గ్రామ ప్రముఖులు ఆవిష్కరించారు. ఆలయ ఈవో ఎం.నాగరాజు, కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రదర్శిస్తున్న కమిటీ సభ్యులు, గ్రామ ప్రముఖులు

పల్లె రహదారులకు కూటమి హయాంలోనే మహర్దశ

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: పల్లె రహదారులకు కూటమి ప్రభుత్వ హయాంలో మహర్దశ పట్టిందని జంగారెడ్డిగూడెం పట్టణ కూటమి నాయకులు అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం నుంచి కాకర్ల జంక్షన్ వరకు ఇటీవల నిర్మించిన నూతన రహదారిని వారు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఒకపక్క అభివృద్ధి, మరో పక్క సంక్షేమంతో కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. కూటమి నాయకులు కొండ్రెడ్డి కిశోర్, మేకా ఈశ్వరయ్య, కొప్పాక శ్రీనివాస్, చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, పరిమి సత్తిపండు, పీవీ రామలక్ష్మి, బొబ్బర రాజ్‌పాల్‌కుమార్, దాకారపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రీ-సర్వేకు సహకరించాలి

టి.నరసాపురం, న్యూస్‌టుడే: బంధంచర్లలో ఈనెల 12 నుంచి నిర్వహించే రీ-సర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ సత్యసాయిబాబా కోరారు. ఆ గ్రామంలో రీ-సర్వేకు సంబంధించి బుధవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. . బంధంచర్ల రెవెన్యూ పరిధిలో సుమారు అయిదు వందల మంది రైతులకు సంబంధించిన 2,100 ఎకరాల భూమికి రీ-సర్వే చేయాల్సి ఉందన్నారు. రీ-సర్వే సమయంలో రైతులు దగ్గర ఉండి సర్వేకు సహకరించాలన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, కొవ్వూరు కోర్టులో
డెటార్ ఐ.పి.నెం. 28/2025
Between:
Padaga Ramu ... Petitioner
and
Sai Sri Jewellary Prop. KAK Rajkumar and 18 Others ... Respondents
Respondents:
1. Sai Sri Jewellary Prop. KAK Rajkumar, S/o K.Narayana, R/o Jangareddygudem, Jangareddygudem Mandal, KSCJC
2. Nukavarapu Chandu, W/o N.Venkata Ratnam, R/o Jangareddygudem Post & Mandal, KSCJCJ
3. Punnam Satyanarayana, (AE, Electrical) R/o Jangareddygudem Post & Mandal, KSCJCJ
4. Mahankali Sai S/o Chandrarao, R/o Jangareddygudem Post & Mandal, KSCJCJ
5. V.Govarthan, Gold Work R/o Jangareddygudem Post & Mandal, KSCJCJ
6. Ranga VBN Sobhana Chari, RTC Conductor, R/o Jangareddygudem Post & Mandal, KSCJCJ
7. Vydarsi Satya Ashok Kumar S/o Bennaya Chari, R/o Jangareddygudem Post & Mandal, KSCJCJ
8. Lakkoju Satyanarayana S/o Nageswara Rao, R/o Jangareddygudem Post & Mandal, KSCJCJ
9. Lakkoju Nageswara Rao, S/o Raja Gopalam, R/o Jangareddygudem Post & Mandal, KSCJCJ
10. S.L. Electronics Prop. Ebicherla Siva, R/o Jangareddygudem Post & Mandal, KSCJCJ
11. Vasamsetty Bala Subramanyam, Gold Business, R/o Jangareddygudem Post & Mandal, KSCJCJ
12. Muramalla Kumar, Gold Work R/o Jangareddygudem Post & Mandal, KSCJCJ
13. Kolla Balaji, Vengamamba Cool Drinks, R/o Jangareddygudem Post & Mandal, KSCJCJ
14. Pakirom Abilash, R/o Gangavaram, Koyyalagudem Mandal, KSCJCJ
15. Manuparthi Babji, S/o Chendrayya, R/o Jangareddygudem Post & Mandal, KSCJCJ
16. K.Suri Reddy, Business, R/o Jangareddygudem Post & Mandal, KSCJCJ
17. Jakkoju Surya Prakash, S/o Veerachari, R/o Kamayyapalem (V), Jeelugumilli Mandal, Eluru Dist. KSCJCJ
18. Oleti Krishna, Bank Agent, R/o Yerraguntapalli Post, Chintalapudi Mandal, Eluru Dist., KSCJCJ
19. The Official Receiver, District Court Complex, Eluru, Eluru Dist.
పిటిషనర్ 1 నుండి 18 వద్ద చేసిన బాకీలు చెల్లించలేని స్థితిలో ఉన్నందున తనని Insolvent గా డిక్లేర్ చేయమని వగైరా రిలీఫ్‌లు కోరుతూ రెస్పాండెంట్లపై 28 నెంబరు IP ఫైల్ చేసియున్నారు. కావున IP లో ఎవరికైనను ఆక్షేపణలు ఉన్న యెడల సదరు IP వాయిదా తేదీన 16-2-2026న 10-30 నిమిషములకు పై కోర్టు వారి సమక్షమున హాజరై తెలియజేసుకొనవలెను. లేని యెడల పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.
వాయిదా తేదీ: 16–2–2026
Station: కొవ్వూరు
Date: 10-2-2026
Sd/- P.V.Ratnam
Advocate for Petitioner
Cell: 80088 34609

విద్యార్థులను ప్రోత్సహించేందుకు రూ.3లక్షల విరాళం

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: దిప్పకాయలపాడు ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఏటా ప్రోత్సాహక బహుమతులు ఇచ్చేందుకు గ్రామానికి చెందిన దివంగత గెడా రాజబాబు భార్య వెంకటనారాయణ రూ.3లక్షలు విరాళంగా బుధవారం ఇచ్చారు. ఆ నగదును స్థానిక సహకార సంఘంలో డిపాజిట్ వేసి రసీదును ఆమె పాఠశాల ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా వెంకటనారాయణ మాట్లాడుతూ.. మరణించిన తమ కుమార్తె వల్లీసాహిత పేరున బహుమతులు ఇచ్చేందుకు విరాళం ఇచ్చినట్లు తెలిపారు.

డిపాజిట్ రసీదును అందిస్తున్న వెంకటనారాయణ

రూ.29.93 కోట్ల అంచనా బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం

సమావేశంలో పాల్గొన్న సభ్యులు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: రాబోయే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.29.93 కోట్ల అంచనా బడ్జెట్‌ను కౌన్సిల్ ఆమోదించింది. జంగారెడ్డిగూడెం పురపాలక సంఘం కార్యాలయంలో ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి అధ్యక్షతన బడ్జెట్ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో 2026-27 సంవత్సరానికి గానూ ప్రారంభ నిల్వ రూ.3.22 కోట్లు ఉండగా.. పన్నులు, స్టాంప్ డ్యూటీ, వేతనాలు, అద్దెలు, యూజర్ ఛార్జీలు, ఇతర ఆదాయాలతో పాటు మూలధన ఆదాయాలు, ప్రభుత్వ గ్రాంట్లు రూ.26,71,53,350గా బడ్జెట్‌లో చూపారు. అలాగే సిబ్బంది జీతాలు, ఇతర ఖర్చులు, మూలధన వ్యయం రూ.29,27,09,500 కాగా రూ.66,13,115 మిగులు బడ్జెట్‌ను రూపొందించారు. వీటిలో ముఖ్యంగా వీధి దీపాలు నిర్వహణ, మురుగు నీటి పారుదల, మంచినీటి సరఫరా, రహదారులు, ప్రజారోగ్యం ఇతరత్రా వాటికి రూ.4,11,19,279 కేటాయించగా.. పురపాలక సంఘం పరిధిలో మురికివాడల్లో ప్రత్యేకించి మౌలిక వసతుల కల్పన, ఎస్సీ, ఎస్టీ, మహిళా శిశు సంక్షేమం, విభిన్న ప్రతిభావంతులకు రూ.1,87,98,920 బడ్జెట్‌లో కేటాయింపులు జరిపారు. సమావేశంలో పురపాలక కమిషనర్ కేవీ రమణ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రజలకు ఏమీ చేయలేకపోయాం

కన్నీరు పెట్టుకున్న కౌన్సిలర్

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: పాలకవర్గం పదవీకాలం పూర్తయినా.. ప్రజలకు ఏమీ చేయలేకపోయామని 5వ వార్డు కౌన్సిలర్ కరుటూరి రమాదేవి కన్నీటి పర్యంతమయ్యారు. జంగారెడ్డిగూడెం పట్టణం పురపాలక సంఘం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన బడ్జెట్ సమావేశంలో పట్టణ అభివృద్ధి విషయంలో చర్చలు సాగిన సమయంలో రమాదేవి ఈ విధంగా స్పందించారు. 'ఇలా అంటున్నానని కాదు సార్. అవకాశం లేకుంటే బాధ పడేదాన్ని కాదు సార్. అవకాశాలు ఉండీ కావాలని చేయలేదు. పట్టణంలోని డంపింగ్ యార్డును మార్చలేకపోయాం. పట్టణంలో గ్రీనరీ అభివృద్ధి చేయలేకపోయాం. పలు ప్రాంతాల్లో నాటిన మొక్కలకు నీళ్లు సైతం పోయలేదు. మనం వేసిన చెట్లు ఎక్కడున్నాయో చూపించండి. వైకాపా హయాంలో గ్రీన్ వెహికల్స్ ఇచ్చారు. వాటిని వాడకపోవడంతో మరమ్మతులకు గురయ్యాయి. ఇంకా చెత్త సేకరణ తోపుడు బండ్లతోనే జరుగుతోంది. పదవీ కాలం పూర్తి కావస్తున్నా.. పాలకవర్గం ద్వారా చాలా పనులు చేయలేకపోయాం.' అంటూ రమాదేవి ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై డంపింగ్ యార్డు మార్చేందుకు కృషి చేస్తామని, గ్రీన్ వెహికల్స్‌కు సంబంధించి మరమ్మతుల నిమిత్తం టెక్నీషియన్ రావాల్సి ఉందని కమిషనర్ కేవీ రమణ వివరించారు.

ఏడుస్తూ మాట్లాడుతున్న రమాదేవి

17, 18 తేదీల్లో ఏజెన్సీ గిరిజన సంఘ మహాసభలు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: అభివృద్ధి పేరుతో ప్రభుత్వాలు రూపొందించే విధానాలు, కొత్త చట్టాలు గిరిజనుల మనుగడకు ప్రశ్నార్థకంగా మారుతున్నాయని ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుంజం రామారావు ఆరోపించారు. పోలవరం మండలం మనుగోపులలో ఈ నెల 17, 18 తేదీల్లో జరగనున్న సంఘం మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. మహాసభల ప్రచారంలో భాగంగా సంఘం సభ్యులు కొయ్యలగూడెం, కన్నాపురం సంతల్లో కళా ప్రదర్శన నిర్వహించారు.

కొయ్యలగూడెంలో నాయకుల ప్రదర్శన

తప్పుల్లేని పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీకి చర్యలు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: పరింపూడి, పొంగుటూరు రెవెన్యూ గ్రామాల పరిధిలో రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీకి రెవెన్యూ అధికారులు కసరత్తు చేస్తున్నారు. దీనిలో భాగంగా రైతుల నుంచి ఆధార్, పొలం 1బీ నకళ్లతో పాటు ఫొటోలను సేకరిస్తున్నారు. పాస్ పుస్తకాల నమూనా డ్రాఫ్టులను దగ్గర పెట్టుకుని వాటిలో పేర్కొన్న వివరాలలో తప్పులు దొర్లితే గుర్తించి సరి చేస్తున్నారు. పరింపూడి పరిధిలో 4247, పొంగుటూరులో 968 పుస్తకాలను వచ్చే నెలలో పంపిణీ చేయనున్నట్లు తహసీల్దారు ఎన్.నాగరాజు తెలిపారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి

చింతలపూడి, న్యూస్‌టుడే: కోకో రైతులు కాయ కోత అనంతరం పాటించాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులు, గింజల నాణ్యతా ప్రమాణాల ప్రాముఖ్యంపై ఉద్యానశాఖ ఆధ్వర్యంలో అల్లిపల్లిలో కోకో రైతులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యానశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సంతోష్ రైతులకు సూచనలు చేశారు. కోకోలో మొక్క వేసిన దగ్గర నుంచి గింజ వచ్చే వరకు చేపట్టాల్సిన సాగు మెలకువలను వివరించారు. సమావేశంలో మండల ఉద్యానశాఖ అధికారిణి షాఫియా తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో వైద్యసేవలు

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: కొయ్యలగూడెంలోని రోటరీ కల్పవృక్ష వృద్ధాశ్రమంలో బుధవారం 104 వైద్య సిబ్బంది వృద్ధులకు పరీక్షలు చేశారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి తస్లీమా వృద్ధులను పరీక్షించి పలు ఆరోగ్య జాగ్రత్తలు వివరించారు. అనంతరం మందులను పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు మాదేటి సత్యనారాయణ, సభ్యులు దారం సత్తిరాజు, యాతం సత్తిబాబు, మాదేటి అప్పలరాజు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి: ఏఎస్పీ

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి అధికారులకు సహకరించాలని ఏఎస్పీ సుస్మిత అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పలు ప్రధాన రహదారులు, రద్దీ కూడళ్లలో వాహన తనిఖీలు బుధవారం నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాహనాలను జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌కు తరలించి వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారించి నిరంతరం వాహన తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. పోలీసుల సమక్షంలో నంబర్ ప్లేట్లు లేని వాహనాలకు నూతన నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు శిరస్త్రాణాలను కొనుగోలు చేయించారు.

వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సుస్మిత

ఇంటి పన్ను కట్టమని అడిగినందుకు దాడి

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: ఇంటి పన్ను కట్టమని అడిగినందుకు పవన్ అనే వ్యక్తి తనను కింద పడేసి కొట్టాడని దొరమామిడి పంచాయతీ అభివృద్ధి అధికారి జి.సోమరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి దగ్గర కాకుండా బయట ఎందుకు అడిగావంటూ తనపై దాడికి పాల్పడ్డాడని, ఆ సమయంలో స్థానికులు అతన్ని ఆపారని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శుల సంక్షేమ సంఘం మండల కమిటీ ప్రతినిధులు కిరణ్‌కుమార్, రామకృష్ణ, పలువురు పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయాల సిబ్బంది బాధితునికి సంఘీభావంగా నిలిచారు. ఈ మేరకు బాధితునికి న్యాయం చేయాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కిరణ్‌కుమార్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ ఫిర్యాదుపై కేసు

చింతలపూడి, న్యూస్‌టుడే: వేములపల్లికి చెందిన మాదాసు రామకృష్ణ అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకన్న తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సదరు మహిళ రెండు రోజుల కిందట ఇంటి వద్ద స్నానం చేస్తుండగా.. గ్రామానికి చెందిన రామకృష్ణ అనే వ్యక్తి కిటికీలోంచి చూశాడు. దీనిపై రామకృష్ణను నిలదీయగా.. దుర్భాషలాడాడు. సదరు మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

పర్యావరణ సమతుల్యత కాపాడేందుకు కృషి

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: పర్యావరణ సమతుల్యత కాపాడేందుకు విద్యార్థులు తమ వంతు కృషి చేయాలని హెచ్‌పీసీఎల్ ఏరియా రూట్ ఆఫీసర్ పి.గణేశ్ అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో హిందుస్థాన్ పెట్రోలియమ్ కార్పొరేషన్ లిమిటెడ్ సౌజన్యంతో 'సహజ వాయువుల నిల్వాలు-పరిరక్షణ' అనే అంశంపై బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. 'పర్యావరణ సమతుల్యతను కాపాడటం' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.ఎన్.ప్రసాద్‌బాబు, అధ్యాపకులు బి.శ్రీనివాసరావు, ఎం.మధు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న గణేశ్

రహదారి ప్రమాదాల నివారణే లక్ష్యం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: మీ తల మీ కుటుంబానికి ఆస్తి అని, దానిని జాగ్రత్తగా చూసుకోవాలని భీమడోలు సీఐ విల్సన్ అన్నారు. ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లిలో రహదారి భద్రతా అవగాహన కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సీఐ, ద్వారకాతిరుమల ఎస్సై సుధీర్‌తో కలిసి రహదారి ప్రమాదాల నివారణే లక్ష్యంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. హెల్మెట్లు ధరించని వారికి జరిమానాలు విధించకుండా వారితో 30 హెల్మెట్లను కొనుగోలు చేయించారు.

సమ్మె విజయవంతానికి పిలుపు

టి.నరసాపురం, న్యూస్‌టుడే: దేశ వ్యాప్తంగా ఈనెల 12న నిర్వహిస్తున్న సమ్మెను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు గుడెల్లి వెంకట్రావు కోరారు. టి.నరసాపురంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. భాజపా అధికారంలోకి వచ్చాక సామాన్య ప్రజలపై పెనుభారం మోపుతోందన్నారు. ఈ విధానాన్ని నిరసిస్తూ.. నిర్వహించే సమ్మెలో ఉద్యోగులు, కార్మికులు, కర్షకులు, శ్రామికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం పట్టణంలో ఈ నెల 12న తలపెట్టిన భారీ ప్రదర్శనను విజయవంతం చేయాలని పలు కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో బుధవారం సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు సమావేశాన్ని నిర్వహించారు. నాయకులు పసల సూర్యారావు, కేవీ రమణ, జంపన వెంకటరమణరాజు, చల్లారి మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

నూజివీడు
• నూజివీడు • కైకలూరు

రూ.6 కోట్లతో త్వరలో స్మార్ట్ సిటీ పనులు: మంత్రి

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడు పట్టణంలో రూ. 6 కోట్లతో స్మార్ట్ సిటీ పనులను త్వరలోనే ప్రారంభిస్తున్నట్లు మంత్రి కొలుసు పార్థసారథి ప్రకటించారు. ఇందుకు అవసరమైన నిధులను కూటమి ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇప్పటికే బీటీ, సీసీ రహదార్ల నిర్మాణం చురుగ్గా సాగుతుందని తెలిపారు. ఆర్టీసీ బస్‌స్టాండ్ నుంచి రాజీవ్ సర్కిల్ వరకు రూ.61 లక్షలతో సెంటర్ డివైడర్‌తో బీటీ రోడ్డు, చిన్న గాంధీ బొమ్మ సెంటర్ నుంచి ఆర్టీసీ పేటలో ఎన్టీఆర్ విగ్రహం వరకు రూ. 1.32 కోట్లతో రహదారి వెడల్పు, సెంట్రల్ లైటింగ్ నిమిత్తం రూ.63లక్షలు, సీసీ రహదార్ల అభివృద్ధికి రూ. కోటి, మురుగు కాలువల నిర్మాణానికి రూ.1.64 కోట్లు, పార్కుల అభివృద్ధికి రూ.40 లక్షలు, శ్మశానవాటిక అభివృద్ధికి రూ.40 లక్షలతో వివిధ పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు.

వరిలో తెగుళ్లపై అప్రమత్తత అవసరం

రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో భవాని

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: వరి సాగులో పురుగులు, తెగుళ్లతో అన్నదాత అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి జె.భవాని తెలిపారు. ఆగిరిపల్లి మండలం సింగరాయపాలెం, చొప్పరమెట్ల గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వరి పొలాలను క్షేత్రస్థాయి పరిశీలన చేసి రైతులకు పలు సూచనలు చేశారు. వరి పంటను ఆకు ముడత పురుగు ఆశిస్తోందని తెలిపారు. దాని నివారణకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నూజివీడు:	80085 74698	ఆగిరిపల్లి:	9121229090
ముసునూరు:	93983 81268	చాట్రాయి:	8008574700
కైకలూరు:	73060 88555	మండవల్లి:	8106099008
కలిదిండి:	90594 84862	ముదినేపల్లి:	8008574693

కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరు 6వ వార్డు సిమెంటు రోడ్డుపై మురుగు నీరు నిలిచి స్థానికులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. దీనిపై స్థానిక శ్యామ్ 'ఈనాడు' 'మేమున్నాం... మీకు తోడుగా' ద్వారా సమస్యను పంచాయతీ ఈవో ఫణి రాజకుమారి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె సమస్యను పరిష్కరించారు.

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ? పెదలిలో బంటుమిల్లి ప్రధాన రహదారి మలుపు వద్ద చెత్తను తగలబెడుతున్నారు. దట్టమైన పొగతో వాహనదారులకు దారి కనిపించక ప్రమాదాల బారినపడుతున్నారు. అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. **- ఫణి, సింగరాయపాలెం**

✔ వెంటనే విచారణ చేపట్టి, మళ్లీ చెత్త తగలబెట్టకుండా చర్యలు తీసుకుంటాను. **- అశోక్, డిప్యూటీ ఎంపీడీవో**

కలిదిండి, న్యూస్‌టుడే : ? గ్రామంలోని ప్రధాన మార్గంలో వీధి దీపాలు వెలగడం లేదు. ఇబ్బందిగా ఉంది. **- సూర్య, తాడినాడ**

✔ పని చేయని దీపాలు తొలగించి కొత్తవి ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. **- రమేశ్‌బాబు, పంచాయతీ కార్యదర్శి**

సర్వర్ పనిచేయక.. సర్వే ముందుకు సాగక..

నూజివీడు, న్యూస్‌టుడే: ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు అందాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం చేపట్టిన ఏకీకృత కుటుంబ నమోదు సర్వే నత్తనడకన సాగుతోంది.

వివరాలు సేకరిస్తున్న సచివాలయ సిబ్బంది

గత వైకాపా ప్రభుత్వం గ్రామ వాలంటీర్ల ద్వారా నిర్వహించిన ఇంటింటా సర్వే మ్యాపింగ్‌లో పలు రకాల తప్పులు రావడంతో అర్హులైన వారు సంక్షేమ పథకాలను అందుకోలేక పోయారు. ఈ సమస్యను తొలగించేందుకు కూటమి ప్రభుత్వం డిసెంబరులో సచివాలయ సిబ్బందితో సర్వే ప్రారంభించింది. సాంకేతిక లోపాలతో సర్వే ముందుకు సాగడం లేదు.

నూజివీడు నియోజకవర్గంలో 93 సచివాలయాల పరిధిలో 1,01,428 కుటుంబాలకు సంబంధించి సర్వే చేపట్టాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 54,141 కుటుంబాల్లో,

క్షేత్ర స్థాయిలో పలు సమస్యలు

కైకలూరు నియోజకవర్గంలో 79 సచివాలయాల పరిధిలో 86,616 కుటుంబాలకు 45,045 కుటుంబాల్లో మాత్రమే సర్వే ప్రక్రియ పూర్తయింది. ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్ విధానం ఇస్తే వివరాలు పూర్తి చేసుకుని సర్వర్ పనిచేసే సమయంలో వాటిని సబ్మిట్ చేసే అవకాశం ఉంటుందని అధికారులు కోరుతున్నారు.

ఆలస్యానికి కారణాలు ఇవీ..

ప్రతి ఇంటికి వెళ్లి సమాచారం సేకరించాల్సి రావడంతో ఒక్కో ఇంటికి గంట దాకా సమయం పడుతోంది. దీంతో పాటు ఇంట్లో నిరక్షరాస్యులు ఉండటంతో వివరాలు పూర్తిగా తెలియకపోవడం, చెప్పలేక పోవడం వంటి సమస్యలు సిబ్బందికి ఎదురవుతున్నాయి. దీంతో పాటు సర్వర్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ ప్రక్రియ ఫిబ్రవరి నెలాఖరులోగా పూర్తి చేయాల్సి ఉంది.

ఉన్నతాధికారులకు నివేదించాం...

సర్వర్ సమస్యలను, సిబ్బంది చెప్పే సూచనలను ఉన్నతాధికారులకు నివేదించాం. సచివాలయ సిబ్బంది యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేను గడువులోగా పూర్తి చేయాలి. రోజూ సర్వే పనితీరుపై పర్యవేక్షిస్తున్నాం. సర్వేను పూర్తి చేసి అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటాం.
- వెంకటరత్నం, డీఎల్‌డీవో, నూజివీడు.

రెండు నియోజకవర్గాల సమాచారం..

మండలం	సచివాలయాలు	కుటుంబాలు	సర్వే పూర్తయినవి
నూజివీడు అర్బన్	16	17,399	11,128
నూజివీడు రూరల్	26	24,645	17,486
ఆగిరిపల్లి	19	21,322	12,091
ముసునూరు	16	19,028	8,712
చాట్రాయి	16	18,034	4,724
కైకలూరు	22	25,460	15,092
మండవల్లి	16	16,668	7,857
ముదినేపల్లి	21	21,071	10,056
కలిదిండి	20	23,417	12,040

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కైకలూరు, న్యూస్‌టుడే: జాతీయ రహదారి-165 విస్తరణ పనుల నేపథ్యంలో పల్లెవాడ విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలో గోనెపాడు 11 కేవీ విద్యుత్తు ఫీడర్‌కు గురువారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ జీబీ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపేస్తున్నట్లు చెప్పారు. గృహ, వాణిజ్య పరిశ్రమల వినియోగదారులు, ఆక్వా రైతులు సహకరించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

మార్చి 14న జాతీయ లోక్ అదాలత్

కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరు సివిల్ కోర్టుల్లో మార్చి 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు సివిల్ కోర్టు సీనియర్ న్యాయమూర్తి వీవీఎన్‌వీ లక్ష్మి అన్నారు. బుధవారం పోలీసు అధికారులు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. పరిష్కరించదగ్గ కేసుల్లోని కక్షిదారులకు రాజీ మార్గంపై అవగాహన కల్పించాలని సూచించారు. రాజీతో సత్వరం సమస్యకు పరిష్కారం దొరుకుతుందని, ఇటువంటి అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు

కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరు గ్రామ పంచాయతీ పరిధిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నామని ఈవో ఫణి రాజకుమారి అన్నారు. శ్యామ్ డ్రెయిన్ సమీపంలో పైపులైను పగిలి నీరు వృథాగా పోవడంతో ఏలూరు రోడ్డు ప్రజలకు తాగునీరు సక్రమంగా వెళ్లడం లేదు. దీంతో బుధవారం సిబ్బందితో మరమ్మతులు నిర్వహించి సమస్యను పరిష్కరించారు. 20 వార్డుల్లోనూ పైపులైను సమస్యలను గుర్తించి అవసరమైన చోట కొత్తవి ఏర్పాటు చేస్తామని తెలిపారు. పంచాయతీ జూనియర్ అసిస్టెంటు శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

నూజివీడు పట్టణం

సత్యనారాయణ	యుఫోరియా
సత్యనారాయణ మినీ	ఆరెంజ్
ద్వారక సినిమాస్ స్క్రీన్ 1	భర్త మహాశయులకు విజ్ఞప్తి
ద్వారక సినిమాస్ స్క్రీన్ 2	మన శివశంకరవరప్రసాద్ గారు
ద్వారక సినిమాస్ స్క్రీన్ 3	....
ఆగిరిపల్లి: శ్రీఅను డీలక్స్	మన శివశంకరవరప్రసాద్ గారు
కైకలూరు: శ్రీవిజయలక్ష్మి జీ3	నారీ నారీ నడుమ మురారి
మాగంటి సినిమాస్	ఓం శాంతి శాంతి శాంతి
శ్రీవెంకటరమణ సినిమాస్	మన శివశంకరవరప్రసాద్ గారు
ముదినేపల్లి: పూర్ణిమ	నారీ నారీ నడుమ మురారి

రహదారికి తాత్కాలిక మరమ్మతులు

ముసునూరు, న్యూస్‌టుడే: నూజివీడు, పోతురెడ్డిపల్లి, సింహాద్రిపురం, ముసునూరు, గోపవరం, బలివే ఆర్అండ్‌బీ రోడ్డుకు అధికారులు బుధవారం తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఈ నెల 14 నుంచి బలివే మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. రాష్ట్ర నలుమూలల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకోనున్నారు. ఈ నెల 2న 'ఈనాడు'లో శివయ్యా.. నీ చెంతకు చేరేదెట్టయ్యా..!, శీర్షికతో, ఈ నెల 10న 'కంకర పోసి.. వదిలేసి' శీర్షికతో కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై ఆర్అండ్‌బీ అధికారులు స్పందించారు. మంత్రి పార్థసారథి చొరవతో రహదారికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టామని ఆర్అండ్‌బీ డీఈ బాబూరావు తెలిపారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పత్రాల్లేకుంటే వాహనాలు సీజ్

కైకలూరు, న్యూస్‌టుడే: వాహన పత్రాలు సక్రమంగా లేకుండా వాహనాలు రోడ్లపై నడిపితే సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని కైకలూరు పట్టణ సీఐ ఏవీఎస్ రామకృష్ణ అన్నారు. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా బుధవారం పట్టణ పరిధిలో ట్రాక్టర్ల తనిఖీలు నిర్వహించారు. వాహనాలకు సంబంధించి ధ్రువపత్రాలు, వాహన స్థితిని పరిశీలించారు. డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా ట్రాక్టర్లు నడిపినా గ్రామాల్లో వేగ నియంత్రణ పాటించక పోయినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వెనుక వచ్చే వాహనాలకు అప్రమత్తం చేసేలా ప్రతి ట్రాక్టరు ట్రక్కు వెనుక భాగంలో రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎస్సై వెంకట్ కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్లకు సంబంధించిన ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న సీఐ రామకృష్ణ

● స్థానిక పోలీస్ కార్యాలయం సమీపంలో శిరస్త్రాణ ధారణపై సీఐ రామకృష్ణ, ఎస్సై వెంకట్‌కుమార్ ద్విచక్ర వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భద్రత లేకుండా ప్రయాణాలు చేస్తున్న పలువురు చోదకులకు అపరాధ రుసుం విధించకుండా హెల్మెట్‌లు కొనుగోలు చేయించారు.

భక్తులకు సౌకర్యాల కల్పన అందరి బాధ్యత: సబ్‌కలెక్టర్

బలివేలో అధికారులతో సమీక్షిస్తున్న వినూత్న

ముసునూరు, న్యూస్‌టుడే: స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించడం, సంతృప్తికరంగా సేవలందించడం ఉద్యోగులందరి బాధ్యత అని నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న అన్నారు. బుధవారం ముసునూరు మండలం బలివే రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో మహా శివరాత్రి ఉత్సవాలపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. శివరాత్రి రోజున పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారని, సామాన్యులకు కూడా సకాలంలో స్వామివారి దర్శనం కలిగేలా ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా జనరేటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. వాహనాల పార్కింగ్‌కు స్థలాన్ని కేటాయించి.. ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ఉత్సవాలు విజయవంతం చేయాలని ఆదేశించారు. డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్, ఈవో సీతారామయ్య, ఛైర్మన్ బొమ్మకంటి శ్యామలరావు పాల్గొన్నారు.

శ్మశాన స్థలాన్ని ఆక్రమణల నుంచి కాపాడాలి

చాట్రాయి, న్యూస్‌టుడే: శ్మశాన స్థలాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించేశారని.. ఏళ్ల తరబడి కోరుతున్నా రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోవడం లేదని, సమాచార హక్కు చట్టంలో కోరినా పట్టకుండా వ్యవహరిస్తున్నారని సీపీఐఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు వేముల బక్కయ్య తెలిపారు. చిత్తపూరులో బుధవారం ఆయన మాట్లాడుతూ 6.30 ఎకరాల భూమి శ్మశానంగా రెవెన్యూ దస్త్రాల్లో ఉన్నా, భూమిని విడదీయడం లేదన్నారు. ఈ సమస్యకు ఇకనైనా పరిష్కారం చేయకపోతే శ్మశానం స్థలాన్ని చూపే వరకూ ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు చాట్ల బాబూరావు, కలపాల వెంకటేశ్వరరావు, పల్లెపోం భవాని, కోపూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మో పెయ్యేరా.. మేము రాం..

ముదినేపల్లి, న్యూస్‌టుడే: పెయ్యేరులో ఉద్యోగమా.. మేము రాలేమంటూ ఉద్యోగులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ గ్రామం నుంచి తరచూ పీజీఆర్ఎస్‌కు అధిక సంఖ్యలో ఫిర్యాదులు వెళ్తుండటంతో ఉద్యోగులు ఇక్కడకు రావడానికి వెనుకడుగు వేస్తున్నారు. గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శిగా పదోన్నతిపై కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలం అంగలూరుకు బదిలీపై వెళ్లిన యార్లగడ్డ శ్యామ్‌ను పెయ్యేరులో చోటుచేసుకున్న అవకతవకలపై జరిగిన విచారణలో గత నెల 8న సస్పెండ్ చేశారు. దీంతో ఈ గ్రామానికి రావడానికి ఎవరూ సుముఖత చూపడం లేదు. ఇప్పటికే

ఇక్కడ వీఆర్వో బదిలీపై వెళ్లగా ఆ స్థానం భర్తీ కాలేదు. దీంతో ముదినేపల్లి వీఆర్ఏను ఇన్‌ఛార్జిగా నియమించారు. ఇక్కడ పంచాయతీ కార్యదర్శిగా చిగురుకోట కార్యదర్శి చంద్రశేఖరరావుకు ఇన్‌ఛార్జిగా నియమించారు. దాదాపు పది రోజులు కావస్తున్నా ఆయన బాధ్యతలు చేపట్టలేదు. ఇద్దరు ఉద్యోగులు పెయ్యేరుకు ఇన్‌ఛార్జి బాధ్యతలపై వెళ్లలేమని, అవసరమైతే వేరే మండలానికి బదిలీపై అయినా వెళ్తామని చెబుతున్నారు. పూర్తి స్థాయి పంచాయతీ కార్యదర్శి లేకపోవడంతో సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదని, అందుబాటులో ఉండటం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎవరూ రావడంలేదు.. ఫిర్యాదులు ఎక్కువగా ఉండటంతో ఎవరూ పెయ్యేరుకు రావడానికి సుముఖత చూపడం లేదన్నారు. ఎవరికి ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇస్తున్నా.. సెలవు పెట్టేస్తామంటున్నారు. ప్రస్తుతం చిగురుకోట కార్యదర్శిని ఇన్‌ఛార్జిగా నియమించాం.. ఆయన కూడా చేయనంటున్నారు. కార్యదర్శులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తాం. **- బి.అశోక్, డిప్యూటీ ఎంపీడీవో**

మల్లేశ్వరస్వామి ఆలయ ఛైర్మన్ నియామకం

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్‌గా గుడివాడ గణేశ్‌ను నియమిస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆలయ అభివృద్ధి, భక్తుల మెరుగైన వసతుల కల్పన, ఉత్సవాలు నిర్వహణ, పరిపాలన వ్యవహారాల పర్యవేక్షణ అంశాలలో కమిటీ పని చేస్తుంది. ఛైర్మన్‌తో పాటు మరో 8 సభ్యులను నియమించారు.

శిరస్త్రాణం ప్రాణాధారం

చాట్రాయి, న్యూస్‌టుడే: ప్రాణ రక్షణే కీలకమని, శిరస్త్రాణం లేకుండా ప్రయాణించినప్పుడు ఏదైనా ప్రమాదం జరిగితే కుటుంబానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఎస్సై డి.రామకృష్ణ అన్నారు. తాను ఎవరికీ జరిమానా వేయబోనని, హెల్మెట్ కొనుగోలు చేయిస్తానని తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మండవల్లి, న్యూస్‌టుడే: అగ్ని ప్రమాదంలో తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటనపై మండవల్లి పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్సై రామచంద్రరావు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని లింగాల గ్రామానికి చెందిన ఎస్.లక్ష్మి జనవరి 10న ఆమె నివాసంలో దేవుడికి దీపారాధన చేస్తున్నారు. ప్రమాదవశాత్తు చీరకు నిప్పు అంటుకుని మంటలు వ్యాపించడంతో బిగ్గరగా కేకలు వేశారు. ఆ సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో చుట్టుపక్కల వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అనంతరం కుటుంబ సభ్యులు కైకలూరు, అక్కడ నుంచి గన్నవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీనిపై మృతురాలి కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అత్తపై కోడలి దాడి

ముదినేపల్లి, న్యూస్‌టుడే: అప్పులు చెల్లించడానికి ఉన్న పొలం అమ్ముదామని తల్లి కుమారుడికి చెబుతుండగా కోడలు కర్రతో దాడి చేసి గాయపరిచిన సంఘటన ఇది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. పెదగొన్నూరుకు చెందిన నల్లగచ్చు ధనలక్ష్మి అప్పులు పెరగడంతో ఉన్న పొలం అమ్ముదామని కుమారుడు రంగారావుకు బుధవారం తెలిపింది. ఆ సమయంలో అక్కడే ఉన్న కోడలు మీనాక్షి పొలం అమ్మడానికి నువ్వు ఎవరివి అంటూ కర్రతో ధనలక్ష్మి తలపై, కుడి చెయ్యి, ఎడమ భుజంపై కొట్టడంతో గాయాలయ్యాయి. స్థానికులు 108లో గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఏఎస్సై వై.పద్మజ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువతిని కత్తితో పొడిచిన నిందితుడికి రిమాండ్

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: పట్టణంలోని కొప్పుల వెలమపేటలో యువతిపై కత్తితో దాడి చేసిన సంఘటనలో బండారు సురేశ్‌కుమార్‌ను పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. బుధవారం ఆయనను న్యాయస్థానంలో హాజరు పరచగా 15 రోజుల పాటు న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు పట్టణ ఎస్.ఐ. నాగేశ్వరరావు తెలిపారు.

జంతువుల కొవ్వుతో నూనె తీస్తున్న వ్యక్తిపై కేసు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: పట్టణంలో పశువుల కొవ్వును కరగబెట్టి నూనె తీసి మార్కెట్‌లో విక్రయిస్తున్న వ్యక్తిపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్.ఐ. నాగేశ్వరరావు తెలిపారు. అజరయ్యపేటకు చెందిన కంచిపోగు అజయ్ అలియాస్ మస్తాన్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు.

ట్రిపుల్ ఐటీలో చెత్త తొలగింపు ఓ ప్రహసనమే

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ప్రతిష్ఠాత్మక ట్రిపుల్ ఐటీలో చెత్త తొలగింపు ఓ ప్రహసనంగా తయారైంది. 8,500 మంది విద్యార్థులు, మరో వెయ్యి మందికి పైగా ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఉండే ప్రదేశం ఇది. విద్యార్థులకు దిశా నిర్దేశం చేసేందుకు ఉన్నత స్థాయి అతిథులు వచ్చి వెళ్తుంటారు. లక్షల్లో పన్నుల వసూలు చేస్తున్న పురపాలక సంఘం క్యాంపస్‌లో చెత్త తొలగింపు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. క్యాంపస్‌లో పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు కార్మికులను నియమించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ విద్యా సంస్థలో ఇటువంటి పరిస్థితి నెలకొనడం ఆందోళన రేకెత్తిస్తోంది.

క్యాంపస్‌లోని ఖాళీ స్థలంలో పడేస్తున్న వ్యర్థాలు

లోపలికి రాని పురపాలక సిబ్బంది

గత కొంతకాలంగా ట్రిపుల్ ఐటీలో చెత్తను మున్సిపల్ సిబ్బంది తొలగించడం లేదు. దీంతో క్యాంపస్ అధికారులే చెత్తను తమ కార్మికులతో పోగేయించి ట్రిపుల్ ఐటీ వెనుక వైపు ఉన్న ఖాళీ స్థలంలో పడేస్తున్నారు. అక్కడే చెత్తకు నిప్పంటించి మిన్నకుంటున్నారు. దీని కారణంగా దుర్వాసన, దోమల సమస్య పెరగడం వంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ఈ సమస్యను పరిష్కరించాలని ట్రిపుల్ ఐటీ అధికారులు పురపాలక సంఘం అధికారులను కోరినప్పటికీ వారు చెత్త తొలగించే సిబ్బందిని, ట్రాక్టర్లను సక్రమంగా పంపకపోవడం గమనార్హం. దీంతో యాజమాన్యం తమకు ఉన్న కొద్ది పాటి నిధులతోనే కార్మికులను నియమించుకుని చెత్త తొలగింపు చేపట్టారు. పురపాలక సంఘం పరిధిలో ఉండే ప్రభుత్వ విద్యా సంస్థ విషయంలో పురపాలికలు ఇటు వంటి చర్యలు చేపట్టడం విమర్శలకు తావిస్తోంది.

పన్నుల వసూళ్లకే పరిమితం..

పురపాలక సంఘానికి పన్నుల వసూళ్లపై ఉన్న శ్రద్ధ.. చెత్త తొలగింపులో ఉండటం లేదు. దీంతో మేమే కార్మికులను ఏర్పాటు చేసుకుని ఆవరణలో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. అనేకసార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లినా ప్రతిసారి ఏదో ఒక కారణం చెప్పి సమస్యను పరిష్కరించడం లేదు. ఆర్జీయూకేటీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలుంటాయి.
- లక్ష్మణరావు, పరిపాలన అధికారి, ట్రిపుల్‌ఐటీ, నూజివీడు.

గోడప్రతులను ఆవిష్కరిస్తున్న నాయకులు

'నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేసేవరకు పోరు'

అడవినెక్కలం(ఆగిరిపల్లి), న్యూస్‌టుడే: నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేసే వరకు తమ పోరాటం ఆగదని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.బలరామ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 12న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆ మేరకు ఆగిరిపల్లి మండలం నెక్కలం గొల్లగూడెం కుశలవ పారిశ్రామిక కేంద్రం దగ్గర బుధవారం సమావేశం నిర్వహించారు. నాయకులు సత్తు కోటేశ్వరరావు, బాషా, ఆర్.చంటి, నరేశ్, శ్రీను, సుందరం తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి, న్యూస్‌టుడే: కార్మికుల హక్కులు, చట్టాలు అమలు కోసం ఈనెల 12న జరిగే దేశ వ్యాప్త సమ్మెను కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని వ్యకాస మండల కార్యదర్శి చిన్నం మాధవ్ కోరారు. దేవపూడి, వణుదుర్రు, కొత్తపల్లిలో బుధవారం దేశవ్యాప్త సమ్మెపై ఉపాధిహామీ కూలీలు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలతో కలిసి ప్రదర్శన నిర్వహించారు. రైతులు, మధ్యతరగతి ప్రజలు అందరూ సమ్మెలో పాల్గొనాలని ఆయన కోరారు.

విద్యతోనే దేశాభివృద్ధి

మండవల్లి, న్యూస్‌టుడే: విద్యార్థులకు అందించే నాణ్యమైన విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యపడుతుందని విశ్రాంత ఉపాధ్యాయులు ప్రతాప్‌కుమార్ పేర్కొన్నారు. మండవల్లిలోని 6వ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పండ్లు, మిఠాయిలు, కేంద్రానికి అవసరమైన ఆట వస్తువులను అందించారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం ఎన్నో అవకాశాలను కల్పిస్తుందని తల్లిదండ్రులు విద్యార్థులను సక్రమంగా పాఠశాలలకు పంపి దేశం గర్వించే విజ్ఞానవంతులుగా తయారు చేయాలని కోరారు.

సీపీఎం నాయకుడికి నివాళులు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: సింగరాయపాలేనికి చెందిన సీపీఎం నాయకులు దాకరపు నాగేశ్వరరావు(70) గుండెపోటుతో బుధవారం మృతిచెందారు. సీపీఎం, దాని విభాగాలైన వ్యవసాయ కార్మిక సంఘం, కులవివక్ష పోరాట సమితి(కేవీపీఎస్)లో మండల, జిల్లా స్థాయిలో వివిధ పదవులను ఆయన నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహంకాళిరావు, మండల కార్యదర్శి చిన్నం మాధవ, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జక్కుల మహేశ్ తదితరులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యం

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా రాజకీయాలు ఉండాలని ఆకాంక్షించిన గొప్ప జాతీయవాది, జనసంఘ్ వ్యవస్థాపకుడు పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అని భాజపా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జి.ఆర్.కె.రంగారావు, భాజపా మండల అధ్యక్షుడు సంగా రంగారావులు తెలిపారు. దీన్ దయాళ్ వర్ధంతిని బుధవారం ఆగిరిపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు పొన్నం వెంకట రామచంద్రరావు, జె.శేషగిరిరావు, ఎం.వెంకటేశ్వరరావు, ఆర్.రామారావు, కె.రాంబాబు, ఎస్.దీన రాజు తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ప్రజల సమస్యల పరిష్కారం ద్వారా పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడమే గ్రామాల పర్యటన లక్ష్యమని భాజపా జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణ అన్నారు. ఊటుకూరు, ప్రొద్దుటూరులోని పోలింగ్‌బూత్‌ల ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. బూత్, శక్తి కేంద్రాలను పునరుద్ధరించి మరింతగా బలోపేతం చేస్తామన్నారు. శక్తి కేంద్రం ఇన్‌ఛార్జిగా తాతా వెంకటేశ్వరరావును నియమించారు. పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సత్యవోలు నాగలక్ష్మి, కొల్లిపర నాగరాజు, వత్తుమిల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న భాజపా నాయకులు

ప్రపంచానికి వెలుగులు అందించిన శాస్త్రవేత్త

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ప్రపంచానికి వెలుగులు అందించిన శాస్త్రవేత్త థామస్ ఆల్వా ఎడిసన్ అని నూజివీడు మండలం మద్దాయికుంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు దారపురెడ్డి భాస్కరరావు తెలిపారు. బుధవారం థామస్ ఆల్వా ఎడిసన్ జయంతిని పాఠశాలలో నిర్వహించారు. విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

థామస్ ఆల్వా ఎడిసన్‌కు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

అవి ఇవి అన్నీ

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ఖరీఫ్ ప్రణాళికలో భాగంగా బుధవారం చిగురుకోటలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల ఇన్‌ఛార్జి గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నాయన్నారు. భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పీఏసీఎస్ అధ్యక్షుడు చలసాని జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ అందరి భవిష్యత్తు తరాల కోసం ఆరోగ్యకరమైన, నాణ్యమైన ఆహార ఉత్పత్తుల కోసం ప్రకృతి వ్యవసాయం అవసరమన్నారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులతో సామూహికంగా గ్రోత్ ప్రమోటర్ కోడిగుడ్డు నిమ్మరసం ద్రావణం తయారు చేయించారు. పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌రావు, ఐసీఆర్పీ పరసా వీరాంజనేయులు, రైతులు నరసింహస్వామి, కొడాలి కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణతోనే దిగుబడులు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: రైతులు సరైన యాజమాన్య, సస్యరక్షణ చర్యలు చేపడితేనే అధిక మొత్తంలో దిగుబడులు సాధించవచ్చని మండల ఏవో బి.వేణుమాధవ్ సూచించారు. దాకరంలో బుధవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది'లో ఆయన పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. మినుములో చీడ పీడలను, తెగుళ్లను ఎప్పటికప్పుడు పరిశీలించుకుని, తగు సస్యరక్షణ చేపట్టాలని సూచించారు. వీఏఏ, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుందాం

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుందామంటూ బుధవారం నూజివీడు మండలంలోని పోతురెడ్డిపల్లి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. పోస్టర్లు చేత పట్టి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. యూటీఎఫ్ అధ్యక్షుడు బొద్దుకోళ్ల బాబూరావు, ప్రధాన కార్యదర్శి మల్లెల చెన్నకేశవరావు, కార్యదర్శి వెలివెల శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండవల్లి, న్యూస్‌టుడే: మన ప్రభుత్వ బడిని కాపాడుకుందాం.. అంటూ కానుకొల్లు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం అట్లూరి వెంకట సత్యప్రసాద్, యూటీఎఫ్ నాయకుడు సీహెచ్ పిచ్చోడు, మేడా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు విద్యార్థులు ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతుల, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని వివరించారు. రానున్న విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో పెద్దఎత్తున విద్యార్థులను చేర్పించేలా నాయకులు తీసుకోవాలని కోరారు. కార్పొరేట్ పాఠశాలల మోజులో పడి చిన్నారుల జీవితాలను నాశనం చేయవద్దని కోరారు. ఇందులో సర్పంచి నాగదాసి థామస్, వై.రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: జాతీయరహదారి 216హెచ్‌పై రూరల్ పోలీసులు బుధవారం అన్నవరం వద్ద తనిఖీలు నిర్వహించారు. పలువురు ద్విచక్ర వాహనదారులను నిలిపి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్.ఐ.లు లక్ష్మణబాబు, జ్యోతిబాసులు హెల్మెట్‌లు లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారులతో హెల్మెట్‌లు కొనుగోలు చేయించారు. జరిమానా రూ. వెయ్యిపైనే విధించాలని, హెల్మెట్ కొనుగోలు చేస్తే మీకు మీ కుటుంబానికి మీరు అండగా ఉంటారని ఉద్బోధ చేసి హెల్మెట్లు కొనిపించి, తలకు పెట్టి పంపించారు.

స్నేహితుల ఆర్థిక సాయం.. ముదినేపల్లి, న్యూస్‌టుడే: పెదపాలపర్రుకు చెందిన బొడ్డపాటి భుజంగరావు తండ్రి దశదిన కార్యక్రమాలకు ఆయన స్నేహితులు రూ. 75 వేలు ఆర్థికసాయం అందించారు. ఈదర శోభనాద్రి మెమోరియల్ జడ్పీ పాఠశాలలో చదివిన 1988 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు సాయాన్ని అందించారు.

రాజకీయమా.. ఉద్యోగమా.. తేల్చుకోండి

క్షేత్ర సహాయకులకు సూచనలిస్తున్న రాఘవేంద్రనాథ్

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: క్షేత్ర స్థాయిలో పని చేయాల్సిన సిబ్బంది.. రాజకీయాలు చేస్తూ విధి నిర్వహణను అలక్ష్యం చేస్తే సహించేది లేదని నూజివీడు ఎంపీడీవో చెన్నా రాఘవేంద్రనాథ్ తెలిపారు. బుధవారం నూజివీడులోని స్త్రీశక్తి భవనంలో ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న క్షేత్ర సహాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈ సమావేశానికి గైర్హాజరైన పలువురు క్షేత్ర సహాయకులకు, ఇతర సిబ్బందికి మెమోలు జారీ చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో పనులు ప్రారంభించకుండా మీరంతా ఉండి ఏమి ప్రయోజనమని నిలదీశారు. ఈ పద్ధతిని మార్చుకుని ప్రభుత్వ సూచనల ప్రకారం ముందుకు వెళ్లాలని స్పష్టం చేశారు. పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఐకేపీ ఏపీఎం పచ్చిగళ్ల ప్రసాద్ పాల్గొని పలు అంశాలను క్షేత్ర సహాయకులకు వివరించారు

(c) eenadu

భక్తిశ్రద్ధలతో లూర్దుమాత యాత్ర

ప్రత్తిపాడులో లూర్దుమాత యాత్రా మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. మరియగిరికి జిల్లా నలుమూలల నుంచి జనం పెద్దసంఖ్యలో తరలివచ్చారు. మరియగిరిపై దివ్యపూజాబలి నిర్వహించారు. అనంతరం లూర్దుమాత, వ్యాకుల మాత, నిత్యసహాయ మాత విగ్రహాలను పూలతో అలంకరించిన తేరుపై ఊరేగింపుగా మరియగిరిపై ఉన్న మందిరానికి తీసుకెళ్లారు. - న్యూస్‌టుడే, ప్రత్తిపాడు

బడ్జెట్‌పై ప్రధానితో మాట్లాడదామా..!

శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే: కేంద్ర బడ్జెట్‌పై ప్రధాని మంత్రి నరేంద్ర మోదితో నేరుగా మాట్లాడే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పిస్తోంది. కేంద్ర బడ్జెట్-2026పై ప్రాథమిక అవగాహన, కేటాయింపులపై ప్రజల అభిప్రాయాన్ని క్విజ్ ద్వారా తెలుసుకునేందుకు ప్రయత్నం చేస్తోంది. మేరా యువ భారత్ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహిస్తోంది. ● మై భారత్ బడ్జెట్ క్వెస్ట్ (క్విజ్)-2026 పోటీల్లో పాల్గొనేందుకు 15 నుంచి 29 ఏళ్ల వయసులోపు వారెవరైనా పాల్గొనవచ్చు. ఇందుకు ఎటువంటి రుసుము చెల్లించనవసరం లేదు. ● క్విజ్‌లో బహుళ ఎంపిక ప్రశ్నలుంటాయి. 30 ప్రశ్నలకు 30 మార్కులుంటాయి. 15 నిమిషాల్లోపు ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సి ఉంటుంది. 10 మార్కులొస్తే ఉత్తీర్ణులైనట్లు పరిగణిస్తారు. ఈ నెల 17లోపు ఎప్పుడైనా ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనవచ్చు. ఒక విద్యార్థి ఒకసారి మాత్రమే పాల్గొనాలి. క్విజ్‌లో పాల్గొన్న అందరికీ ధ్రువపత్రం అందజేస్తారు. ● క్విజ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరచిన వారితో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో వర్చువల్‌గా మాట్లాడే అవకాశం కల్పిస్తారు. ● మై భారత్ వెబ్‌సైట్‌లో క్విజ్ వివరాలుంటాయి.

శివయ్యా.. భారం నీదేనయ్యా..!

మహాశివరాత్రి పర్వదినాన ఏలేశ్వరం పట్టణం సమీపంలో ఏలేరు కాలువ వెంట అప్పనపాలెం వద్ద ఘాట్లలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు జగ్గంపేట, ప్రత్తిపాడు నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివస్తారు. ఇక్కడ వంతెన సగం కూలి ప్రమాదకర స్థితిలో ఉంది. దానిపై నుంచే రాకపోకలు సాగించాలి. ఈ స్థితిలో వంతెన వద్ద పటిష్ఠ చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది. శిథిలమై ఏళ్లు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. వచ్చే శివరాత్రి వరకైనా నిర్మాణం పూర్తి చేయాలని శివుడిని భక్తులు వేడుకుంటున్నారు. - న్యూస్‌టుడే, ప్రత్తిపాడు

బోగస్‌పై బెత్తం.. నకిలీలకు కళ్లెం!

ప్రత్యేక యాప్‌తో డ్వాక్రా రుణాల మంజూరులో పారదర్శకత

న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

గ్రామీణ ప్రాంతంలో బ్యాంకు లింకేజీ రుణాల్లో అక్రమాల అడ్డుకట్టకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 2025-26 ఆర్థిక సంవత్సరం నుంచి సూక్ష్మ రుణ ప్రణాళిక పేరుతో సభ్యులకు ఎంత మేర, ఏ అవసరాలకు రుణం అవసరమో ముందుగా డీఆర్‌డీఏ-సెర్ప్ సిబ్బంది ద్వారా గుర్తించారు. ఇందుకు ప్రత్యేక యాప్ రూపొందించారు. యానిమేటర్ల ప్రమేయాన్ని తగ్గించి, వేలిముద్రలు నమోదు ద్వారా ఈ ఏడాది రుణాలు జారీ చేశారు. తీసుకున్న రుణం, చెల్లించే అప్పుల వివరాలు సభ్యులకు తెలిసే విధంగా ఏర్పాట్లు చేశారు.

డ్వాక్రా సభ్యులకు యాప్‌పై అవగాహన కల్పిస్తున్న సెర్ప్ సిబ్బంది

వారే నేరుగా ఆన్‌లైన్‌లో కిస్తీలు చెల్లించే విధంగా చర్యలు చేపట్టడంతో డ్వాక్రా రుణాల్లో అక్రమాలకు అడ్డుకట్ట పడింది. ఇలా ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికి 1,01,860 మంది సభ్యులకు రూ.1,298.71 కోట్లు రుణాలు పంపిణీ చేశారు.

● గత ప్రభుత్వంలో కాకినాడ గ్రామీణం మండలంలో ఒకే సభ్యురాలు రెండు, మూడు చోట్ల బ్యాంకుల్లో డ్వాక్రా రుణాలు పొందారు. కొందరు యానిమేటర్లు సూత్రధారులుగా డూప్లికేట్ సభ్యులతో అక్రమంగా రుణాలు తీసుకున్నారు. ఒక మండలం నుంచి మరో మండలంలో ఖాతాలు తెరిచిన వైనంపై ఫిర్యాదులు వచ్చినా, ఆలస్యంగా డీఆర్‌డీఏ అధికారులు స్పందించారు. పది మంది యానిమేటర్లపై వేటు వేశారు.

● పిఠాపురం మండలంలో బోగస్ డ్వాక్రా సంఘాలను సృష్టించి రూ.కోట్లలో బ్యాంకు రుణాలు కొట్టేశారు. కొందరు యానిమేటర్లు దీనిలో ప్రధాన పాత్రధారులుగా ఉన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక.. ఈ అక్రమాలపై పోలీసు కేసులు నమోదు చేసి, ఇటీవల ఒక యానిమేటర్‌ను జైలుకు పంపారు.

మంచి ఫలితాలు

ప్రత్యేక యాప్ ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో 1,05,250 మంది మహిళలకు రూ.1,457 కోట్ల రుణ పంపిణీ లక్ష్యం విధించారు. జిల్లాలో 12 బ్యాంకులకు చెందిన 149 శాఖల నుంచి రూ.1,298 కోట్లు ఇప్పటివరకు పంపిణీ చేశారు. ఈ నెలాఖరులోగా మిగతా లక్ష్యాలు పూర్తి చేస్తాం. - జె.శ్రీనివాసరావు, పీడీ, డీఆర్‌డీఏ

ఇప్పటి వరకు ఇచ్చిన రుణాలు

నియోజకవర్గం	డ్వాక్రా సభ్యులు	రుణాలు (రూ.కోట్లలో)
జగ్గంపేట	16,800	170.77
కాకినాడ గ్రామీణం	12,550	176.57
తుని	15,660	197.83
పిఠాపురం	14,860	205.63
ప్రత్తిపాడు	18,540	246.64
పెద్దాపురం	11,300	151.29

రూ.2వేల ఫోన్ కొంటే.. రూ.లక్ష కొట్టేశారు..!

డబ్బులు రిఫండ్ ఇస్తామని ఆన్‌లైన్‌లో మోసం

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త మోసంతో జనాలను నిండా ముంచుతున్నారు. వీరి మోసాల్లో అవగాహన ఉన్నవాళ్లు సైతం ఉచ్చులో పడుతున్నారు. అమలాపురంలో ఇలాంటి ఘటనే చోటు చేసుకుంది. స్థానికంగా ఉంటున్న ఓ ఆర్‌ఎంపీ వైద్యుడు చవకగా ఫోన్లు విక్రయించే ఓ వెబ్‌సైట్‌లో రూ.2వేలు చెల్లించి సెల్ ఆర్డర్ పెట్టారు. నేరగాళ్లు అతడికి పనిచేయని ఫోన్ పంపించారు. ఈ విషయాన్ని ఆయన బుధవారం సంబంధిత వెబ్‌సైట్‌లోని నంబరుకు ఫోన్‌చేసి ఫిర్యాదు చేశారు. రూ.2వేలు రిఫండ్ ఇస్తామని నమ్మించి అతని బ్యాంకు వివరాలు తీసుకున్నారు. వెంటనే అతని సెల్‌కు వెంటవెంటనే రెండు ఓటీపీలు పంపించారు. వాటిని చెబుతూ డబ్బులు మీ ఖాతాలో పడతాయని నమ్మించారు. అతను ఆ నంబర్లు చెప్పిన తర్వాత రూ.49,500 చొప్పున రెండుసార్లు ఖాతాల్లోని డబ్బులు లాగేశారు. దీనిపై ఎస్పీ కార్యాలయంలోని సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భూసమస్యల పైనే ప్రత్యేక దృష్టి

అర్జీదారుల్లో సంతృప్తిస్థాయిని పెంచడమే లక్ష్యం

ముఖాముఖి

న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం భూములు, రీసర్వే సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టింది. రెవెన్యూశాఖకు చెందిన అనేక అంశాలపై దృష్టి సారించింది. దీనికి గ్రామ సభలు, రెవెన్యూ క్లినిక్‌లు నిర్వహిస్తోంది. రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేస్తోంది. పేదలకు చౌక దుకాణాల ద్వారా రాయితీతో సరకులు అందిస్తోంది. బియ్యం అక్రమరవాణా చేస్తూ పలువురు పట్టుబడుతున్నారు. వీటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, భూసమస్యలు పరిష్కరిస్తామని జేసీ అపూర్వభరత్ పేర్కొన్నారు. అర్జీదారులు సంతృప్తిచెందేలా చూస్తామని పేర్కొన్నారు. ఆయా అంశాలపై జేసీ 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు.

పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా వస్తున్న అర్జీలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. అర్జీదారుడు సంతృప్తిస్థాయిని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. భూములు, రీసర్వేకు సంబంధించిన సమస్యలపై ప్రత్యేక చొరవ తీసుకుని, నాలుగు విభాగాలుగా విభజించి, రెవెన్యూ, సర్వేశాఖ అధికారులతో క్షేత్రస్థాయి పరిశీలన చేయిస్తున్నాం. కిందిస్థాయిలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే నేరుగా నాకు ఫిర్యాదు చేయొచ్చు.

సంయుక్త కలెక్టర్ అపూర్వభరత్

చౌక దుకాణాలపై నిరంతర నిఘా

చౌక దుకాణాలో సరకుల పంపిణీపై నిరంతరం నిఘా పెడుతున్నాం. రెవెన్యూ, పౌరసరఫరాల శాఖల అధికారులు ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకు అన్ని దుకాణాలను తనిఖీ చేయాలని ఆదేశించాం. తరుగు లేకుండా సరకులు పంపిణీ జరిగేలా చర్యలు తీసుకుంటాం. డీలర్లు సమయపాలన పాటించకపోతే కార్డుదారులు ఫిర్యాదు చేయాలి.

ఉజ్వల్‌లో జిల్లాకు ప్రథమ స్థానం

కేంద్ర ప్రభుత్వ ఉజ్వల్ పథకం ద్వారా నిరుపేదలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు జారీ చేస్తున్నాం. దీని అమల్లో కాకినాడ జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. సిలిండర్లు ఇళ్లకు సరఫరా చేసే క్రమంలో అదనపు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం.

పూర్తిస్థాయిలో ధాన్యం సేకరణ

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 3 లక్షల టన్నుల మేర ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు సేకరించాం. 24 గంటల వ్యవధిలో చెల్లింపులు చేశాం. రానున్న రబీలో పండిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో సేకరణకు ఇప్పటి నుంచే ప్రణాళికలు తయారు చేస్తున్నాం.

దోమల దండుపై స్మార్ట్ యుద్ధం

ఈనాడు, కాకినాడ: అపరిశుభ్ర పరిసరాలు.. నిల్వ నీటికుంటలు.. పిచ్చిమొక్కలు... ఏదైతేనేం ఇంటా బయట దోమలు విజృంభిస్తున్నాయి. డెంగీ, మలేరియా వంటి వ్యాధులకు కారణమవుతున్నాయి. దీంతో ఆధునిక సాంకేతికతతో సమస్యకు చెక్ పెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. కాకినాడ నగర పాలక సంస్థలో స్మార్ట్ మస్కిటో సర్వైలెన్స్ సిస్టమ్ (ఎస్ఎంఎస్ఎస్) పేరుతో కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత దోమల నియంత్రణ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు.

డ్రోన్లతో సర్వే.. జీఐఎస్ మ్యాపింగ్..

డ్రోన్లతో దోమల సంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాలను సర్వే చేస్తారు. నిల్వ నీరు, తెరిచి ఉన్న కాలువలు, చెత్తకుప్పలు వంటి ఆవాస ప్రాంతాలను జీఐఎస్ మ్యాపింగ్ ద్వారా గుర్తించి డ్రోన్లతో లార్విసైడ్‌ను పిచికారీ చేస్తారు. ఐవోటీ సెన్సార్ల ద్వారా దోమల రకం, సంఖ్య, వాటి ప్రాబల్యం సమాచారాన్ని సేకరించి కేంద్ర క్లౌడ్ సిస్టమ్‌కు పంపిస్తారు. ఫాగింగ్ యంత్రాలకు ఐవోటీ పరికరాలు అమర్చి ఎక్కడక్కడ పిచికారీ చేయాలో మ్యాప్‌లో నమోదు చేస్తారు.

సర్పవరం కాలువలో డ్రోన్‌తో పిచికారీ

కమాండ్ కంట్రోల్ కేంద్రం..

దోమలపై చేపట్టే స్మార్ట్ యుద్ధం కోసం ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ వ్యవస్థను ఏర్పాటు చేస్తారు. డ్రోన్ల సంచారం, ఐవోటీ సెన్సార్ల సమాచారం, వ్యాధులు, ఫిర్యాదులన్నీ కమాండ్ కేంద్రం ద్వారా పర్యవేక్షిస్తారు. దోమలు వృద్ధి చెందే ప్రాంతాల సమీపంలో సీసీ కెమేరాలతో రియల్ టైమ్ సర్వైలెన్స్ ఏర్పాటు చేస్తారు.

ఇవీ ప్రయోజనాలు..

● ఫాగింగ్ కోసం కాకిలెక్కలు చూపడం. వాటితో కాసులు వెనకేసుకోవడం తగ్గుతుంది.

● డ్రోన్లతో మారుమూల, చిట్టచివరి ప్రాంతాల్లోనూ మందు పిచికారీ చేయొచ్చు.

● లార్వా దశలోనే నాశనం చేయడానికి అవకాశం ఉంటుంది.

● కార్మికులకు ఆరోగ్య సమస్యలు రాకుండా ఉంటాయి.

● సాధారణ దోమల నివారణకు ఒక రోజు సమయం పడితే ఏఐ టెక్నాలజీ, డ్రోన్లతో గంటలోనే మొత్తం పూర్తిచేయొచ్చు.

పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో మరిన్ని అవుట్‌లెట్లు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: పౌరసరఫరాల సంస్థ జిల్లాలో పెట్రోలు బంకులు, వంట గ్యాస్ ఏజెన్సీలు మరిన్ని నెలకొల్పేందుకు కసరత్తు చేస్తోంది. ఈ మేరకు అవసరమైన ప్రభుత్వ భూములను సమకూర్చాలని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ దిల్లీరావు జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. జిల్లా కేంద్రంలో ఈ సంస్థకు రెండు పెంట్రోలు బంకులు ఉన్నాయి. ఒక గ్యాస్ ఏజెన్సీని నిర్వహిస్తోంది. ఇక జిల్లా వ్యాప్తంగా వీటిని విస్తరించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. రెవెన్యూశాఖ ద్వారా స్థలాల గుర్తింపునకు చర్యలు తీసుకుంటున్నారు. అనువైన స్థలాలను గుర్తించి నివేదిక ఇవ్వాలని సూచించారు. త్వరలో దీనికి సంబంధిచిన వివరాలను పంపించనున్నట్లు పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు ఎం.దేవులనాయక్ తెలిపారు.

వయసు 54.. పతకాలు 97

పవర్ లిఫ్టింగ్‌లో ఆర్టీసీ డ్రైవర్ ఘనత

న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్(కాకినాడ)

ఆయన బరిలో దిగితే పతకం సొంతం కావాల్సిందే.. ఒకటి.. రెండు కాదు.. ఏకంగా 97 పతకాలు సాధించి సెంచరీకి చేరువలో ఉన్నారు. తిరుగులేని విజయాలను తన ఖాతాలో వేసుకుంటూ పవర్ లిఫ్టింగ్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. ఆయనే కాకినాడ ఆర్టీసీ డిపోకి చెందిన డ్రైవర్ మందపల్లి శ్రీనివాసరావు. 54 ఏళ్ల వయసులోనూ యువతకు దీటుగా సత్తా చాటుతున్నారు.

కష్టాలకు ఎదురీది

కాకినాడ జగన్నాథపురానికి చెందిన శ్రీనివాసరావు ఓ వైపు డ్రైవర్‌గా పనిచేస్తూనే మరోవైపు తనకు ఇష్టమైన బాడీ బిల్డింగ్, పవర్ లిఫ్టింగ్‌లో 2004 నుంచి శిక్షణ పొందారు. పలు పోటీల్లో పతకాలు సాధించారు. ఇటీవల హరియాణాలో జరిగిన పోటీల్లో మూడు స్వర్ణ పతకాలు కైవసం చేసుకుని అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. గతంలో పోటీల్లో పాల్గొనే సమయంలో జీతం రాక ఇబ్బందులు పడ్డానని, నాలుగైదునెలలుగా చెల్లిస్తున్నారని శ్రీనివాసరావు పేర్కొన్నారు. ప్రయాణ ఖర్చులు, ఇతర వాటికి అప్పులు చేయాల్సి వస్తోందని ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరిన్ని పతకాలు సాధిస్తానని చెప్పారు.

సాధనచేస్తున్న శ్రీనివాసరావు

సాధించిన విజయాలు కొన్ని..

● 2024లో నేపాల్‌లో జరిగిన ఎస్‌బీఏకేఏఫ్ ఇంటర్నేషనల్ గేమ్స్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించారు. ● సెప్టెంబరులో సింగపూర్, మలేసియాలో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో మూడు బంగారు పతకాలు కైవసం. ● పంజాబ్‌లో జరిగిన పోటీల్లో స్వర్ణపతకం

అన్నవరం నెయ్యి సరైనదేనా..?

2019-24 మధ్య కొనుగోళ్ల వివరాల సేకరణ

అన్నవరం, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో అన్నవరం దేవస్థానానికి కొనుగోలు చేసిన నెయ్యిపై అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. తితిదేకి రసాయనాలతో కూడిన కల్తీ నెయ్యిని సరఫరా చేసినట్లు బయటపడిన విషయం విదితమే. ఈ క్రమంలో దేవాదాయశాఖ పరిధిలోని ప్రధానాలయాలకు అదే నెయ్యిని అందించినట్లు తేలింది. దీంతో అన్నవరం ఆలయానికి 2019- 24 మధ్య సరఫరా అయిన నెయ్యిపై వివరాలు అందించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. 2019 ఏప్రిల్-2022 సెప్టెంబరు వరకు సంగం, విజయ డెయిరీల నుంచి కొనుగోలు చేశారు. 2022 అక్టోబరు - 2024 సెప్టెంబరు వరకు లక్కవరం రైతు డెయిరీ ప్రొడక్ట్స్ ప్రైవేటు లిమిటెడ్ నుంచి కొనుగోలు చేశారు. ప్రతి ఆర్నెళ్లకోసారి టెండర్లు పిలవగా వరుసగా నాలుగుసార్లు ఈ సంస్థే దక్కించుకుంది.

లోగుట్టు సత్యదేవుడికే ఎరుక

రైతు డెయిరీ కేజీ రూ.564, రూ.540, రూ. 538.60 ధరకు అన్నవరం ఆలయానికి నెయ్యి సరఫరా చేసింది. ఆ 18 నెలల వ్యవధిలో సుమారు 20 వేల డబ్బాలు సరఫరా చేశారు. అదే సంస్థ సింహాచలం దేవస్థానానికి (2024 - 25) కేజీ కేవలం రూ. 344కు సరఫరా చేసింది. ఒకే సంస్థ రెండు ప్రధానాలయాలకు సరఫరా చేసిన నెయ్యిలో కిలోకు రూ.194 భారీ తేడాపై అప్పట్లో చర్చ జరిగింది. నెయ్యికొనుగోళ్లపై నివేదిక పంపించామని ఈవో త్రినాథరావు తెలిపారు.

హర్షించేలా బోధన.. ఆనందించేలా లాలన

ఉపాధ్యాయురాలికి మంత్రి లోకేశ్ ప్రశంసలు

న్యూస్‌టుడే, కాకినాడ నగరం

సాధారణంగా చిన్న పిల్లలు బడికి వెళ్లేందుకు మారాం చేస్తుంటారు. ఆ పాఠశాలకు మాత్రం ఆనందంగా అడుగులు వేస్తారు. బడికి ఎప్పుడు వెళ్దామా అంటూ ఎదురు చూస్తారు. అందుకు ఆ పాఠశాల ఉపాధ్యాయినే కారణం. ఆమె పిల్లల్ని ఒక తల్లిలా ఆటపాటలతో లాలిస్తూ, బొమ్మలు, చిత్ర పటాలు, ఇతర కృత్యాలతో పాఠాలు బోధిస్తూ ఆకట్టుకుంటున్నారు. కాకినాడలోని శంతనపురి కాలనీ ముళ్లపూడి వెంకట్రావు నగర పాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తోన్న అడబాల హర్షిత తేజశ్రీ తన పనితీరుతో విద్యా మంత్రి లోకేశ్ ప్రశంసలు అందుకున్నారు. ఎక్స్ వేదికగా ఆమెను అభినందించారు.

పిల్లలకు పాఠాలు బోధిస్తున్న హర్షిత

ఎంతో ఆత్మసంతృప్తి

మంత్రి లోకేశ్ నన్ను అభినందిస్తూ ట్వీట్ చేయడం ఆనందంగా ఉంది. సమాజంలో ఎవరికీ లేని గౌరవం గురువుకే ఉంటుంది. బడి దేవాలయం వంటిది. పిల్లలను సొంత బిడ్డలుగా భావిస్తూ వారికి పాఠాలు బోధించడంలో ఉన్న ఆత్మసంతృప్తి మరోచోట దొరకదు.

- హర్షిత తేజశ్రీ, ఉపాధ్యాయిని

హర్షిత తేజశ్రీ 2020లో ఈ పాఠశాలలో ఎస్జీటీగా చేరారు. అప్పట్లో విద్యార్థుల సంఖ్య కేవలం 64 మంది మాత్రమే. తన పనితీరుతో, సహచర ఉపాధ్యాయుల సహకారంతో ఇప్పుడా సంఖ్య 183కు పెంచారు. ఆమె పిల్లలతో మమేకమై ఆడిస్తూ.. పాడిస్తూ పాఠాలు చెబుతారు. వస్త్రధారణ, అలంకరణ, పరిశుభ్రత విషయంలోనూ శ్రద్ధ తీసుకుంటారు. మధ్యాహ్న భోజనం చేసేటప్పుడు దగ్గరుండి పర్యవేక్షిస్తారు. తల్లిదండ్రులతో సమావేశాలు జరుపుతూ పిల్లల స్థితిగతులను వివరిస్తుంటారు. ప్రత్యేక వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసి రోజువారీ విషయాలను, పిల్లలకు యోగక్షేమాలనుతెలియజేస్తుంటారు. దీంతో పలువురు పిల్లలను ఈ బడికి పంపేందుకు ఉత్సాహం చూపుతున్నారు.

అన్ని విషయాల్లో ప్రత్యేక శ్రద్ధ

స్థల సేకరణే కీలకం..!

పారిశ్రామిక అడుగులకు అడ్డంకులు

ఈనాడు, రాజమహేంద్రవరం: ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్న సంకల్పంతో కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నా క్షేత్ర స్థాయిలో భిన్నమైన పరిస్థితులు ఎదురవుతున్నాయి. ప్రతి నియోజకవర్గంలో పారిశ్రామిక క్లస్టర్ ఏర్పాటు చేయడం ద్వారా పరిశ్రమలకు ప్రోత్సహమివ్వాలని భావించారు. ఉమ్మడి జిల్లాలో భూముల గుర్తింపు, ఏపీఐఐసీకి బదలాయింపులో జాప్యం నెలకొంటోంది.

ఇదీ పరిస్థితి

● డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రెండు విడతల్లో రామచంద్రపురం, అమలాపురంలో శంకుస్థాపనలు చేశారు. మిగిలిన ప్రాంతాల్లో స్థల సేకరణ చేయాల్సి ఉంది. ఇప్పటికి ఒక నియోజకవర్గంలో మాత్రమే భూమి గుర్తించారు. ● తూర్పుగోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం గ్రామీణం, గోపాలపురం, రాజానగరం నియోజకర్గాల పరిధిలోని భూముల్లో ఇప్పటికే శంకుస్థాపనలు చేశారు. మరో మూడు చోట్లగుర్తించాల్సి ఉంది. ● కాకినాడ జిల్లాలో కాకినాడ గ్రామీణం, పెద్దాపురం, పిఠాపురం, తుని, జగ్గంపేట నియోజకవర్గాల పరిధిలో స్థలాల గుర్తింపుతో పాటు రెండో విడతలోనే శంకుస్థాపనలు చేశారు. కాకినాడ నియోజకవర్గానికి సంబంధించి స్థలాన్ని గుర్తించే పనిలో యంత్రాంగం ఉంది.

తూరలు వేసి.. కాలువ పూడ్చేసి

రొయ్యల చెరువులు, పంట పొలాల్లోని నీరు గోదావరిలోకి చేరే ప్రధాన మురుగు కాలువను పూడ్చేస్తున్నారు. కోరింగ పంచాయతీ చినబొడ్డువెంకటాయపాలెంలో కాలువలో 4 తూరలు వేసి రహదారి ఏర్పాటు చేస్తున్నారు. కొంతమంది వ్యక్తులు తమ భూములను మెరక చేసుకునేందుకు వాహనాలు వెళ్లేలా ఈ ఏర్పాటు చేశారు. దీంతో ఆ ప్రాంతంలో నీరు నిలిచి పోతుందని, వెంటనే తూరలను తొలగించాలని రైతులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తాళ్లరేవు

పుష్కరాలకు ప్రత్యేక రవాణా వ్యవస్థ

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: గోదావరి పుష్కరాల నేపథ్యంలో నగరానికి వివిధ ప్రాంతాల నుంచి వాహనాల రాకపోకలు, ట్రాఫిక్ మళ్లింపు, పార్కింగ్ సౌకర్యాలపై యంత్రాంగం కసరత్తు చేస్తోంది. తూర్పు కలెక్టర్ కీర్తి చేకూరి, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, ఎస్పీ నరసింహ కిశోర్ బుధవారం క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు ట్రావెల్స్, కార్లు, ఆటో రిక్షాలు, ద్విచక్ర వాహనాలకు సంబంధించి సమగ్ర రూటు మ్యాప్ రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రధాన కూడళ్ల సమీపంలో విస్తృత పార్కింగ్ స్థలాల ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. అక్కడ నుంచి యాత్రికులకు ప్రత్యేక షటిల్ బస్సుల ద్వారా తరలించాల్సి ఉందన్నారు. దీని కోసం ప్రత్యేక రవాణా వ్యవస్థ సిద్ధం చేయాలన్నారు. ● రావులపాలెం, కాకినాడ వయా అనపర్తి కెనాల్ రోడ్డు ద్వారా వచ్చే వేమగిరి సెంటర్ నుంచి ధవళేశ్వరం కాటన్‌పేట, బొమ్మూరు సెంటర్, వేమగిరి, ఆర్టీసీ కాంప్లెక్స్ వరకూ రూట్లు పరిశీలించారు. మోరంపూడి , ఆర్టీసీ కాంప్లెక్స్, తూర్పు రైల్వే స్టేషన్ మార్గం, లాలాచెరువు, కాతేరు మీదుగా కోటిలింగాల రేవు వరకూ ట్రాఫిక్ నియంత్రణ , పార్కింగ్ మళ్లింపుపై సమీక్షించారు.

శివరాత్రికి ట్రయల్ రన్

శివరాత్రి నేపథ్యంలో పుష్కర ట్రయల్ రన్‌కు కార్యాచరణ సిద్ధం చేశామని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. బుధవారం సాయంత్రం గోదావరి ఘాట్‌లు పరిశీలించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

భీమేశ్వరాలయంలో శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబు

సామర్లకోట, న్యూస్‌టుడే: పంచారామ క్షేత్రమైన సామర్లకోట చాళుక్య కుమారారామా భీమేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 12 నుంచి 18వ తేదీ వరకు మహాశివరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. పంచారామాల్లో నాలుగు భోగలింగాలు, సామర్లకోటలో యోగలింగం కావడంతో ఎంతో ప్రసిద్ధి చెందింది. ఇక్కడ ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా దేవాదాయశాఖ, ట్రస్టుబోర్డు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

ఆలయంలో కార్యక్రమాలివీ..

● మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 12న గురువారం ఉదయం 9.05 గంటలకు స్వామి, అమ్మవార్లను పెండ్లికొడుకు, పెండ్లి కుమార్తెగా అలంకరిస్తారు. ● 13న రాత్రి 9.05 గంటలకు స్వామి, అమ్మవార్ల దివ్య కల్యాణం.● 14న స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, ● 15న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా తెల్లవారు జాము ఒంటి గంట నుంచి స్వామివారి మూలవిరాట్ వద్ద అభిషేకాలు, 4.05 పండిత సదస్యం, రాత్రి 10 గంటల నుంచి 12.15 గంటల వరకు స్వామివారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, పిఠాపురం మహారాజావారి గోత్రనామాలతో అభిషేకాలు, 12.30 గంటలకు మహానివేదన.

అలంకరణలో స్వామివారు

● 16న ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేకం, కుంకుమార్చన, మధ్యాహ్నం 2.20 గంటలకు రథోత్సవం. ● 18న ఆలయ కోనేరులో రాత్రి 6.15 గంటలకు తెప్పోత్సవం, రాత్రికి పుష్పయాగం

సాంస్కృతిక కార్యక్రమాలు

13న కూచిపూడి, కోలాటం, 14న గాత్రకచేరి, కూచిపూడి, 15న సీతారామ కల్యాణ గానామృతం, కూచిపూడి, 16న అన్నమయ్య త్యాగరాజు కీర్తన, కర్ణాటక సంగీతం, 17న కోలాటం, కూచిపూడి నాట్యం, 18న కూచిపూడి నాట్యప్రదర్శన కార్యక్రమాలు ఆలయ పరిసరాల్లో నిర్వహిస్తారు.

థైరాయిడ్ సమస్యతో బాధ పడుతున్నారా?

అధునాతన రోబోటిక్ సర్జరీతో మీ థైరాయిడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం
ప్రయోజనాలు: తక్కువ నొప్పి | తక్కువ రక్తస్రావం | త్వరితంగా కోలుకోవడం
APEX HOSPITALS
Dr. Nitin Rimmalapudi, M.S.
Robotic Surgeon
అపాయింట్‌మెంట్ కొరకు సంప్రదించండి
93 922 922 00
సోమవారం నుండి శనివారం
ప్రకాష్ నగర్, రాజమండ్రి

(c) eenadu

మహా గణపతికి పంచలోహ కవచం

రాష్ట్రంలో ప్రసిద్ధిచెందిన మందపల్లి శనీశ్వరాలయంలోని మహాగణపతి విగ్రహానికి పంచలోహ కవచాన్ని అలంకరించనున్నారు. మండపేటకు చెందిన శిల్పి వాసా శ్రీనివాస్‌తో విజయవాడకు చెందిన భక్తులు పల్లపురాజు దంపతులు కవచాన్ని తయారు చేయించారు. మహాగణపతి విగ్రహానికి అలంకరించేలా 18 అంగుళాల ఎత్తు, 14 అంగుళాల వెడల్పున్న కవచం రెండు కిలోల బరువున్న పంచలోహాలతో తయారు చేసినట్లు శిల్పి తెలిపారు. శనీశ్వరాలయంలో స్వామివారి కల్యాణం నేపథ్యంలో గురువారం అందిస్తామని వివరించారు. **- న్యూస్‌టుడే, మండపేట**

సుద్దముక్కలతో సూక్ష్మ కళాఖండాలు

పెద్దాపురం పట్టణానికి చెందిన గృహిణి కోరుకొండ మహాలక్ష్మి సుద్దముక్కలతో సూక్ష్మ కళాఖండాలు తయారుచేసి అబ్బుర పరుస్తున్నారు. ఈమె తండ్రి బిక్కవోలు మండలం పందలపాక గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు అప్పల బత్తుల ప్రకాశరావు. తండ్రి తయారుచేసిన వస్తువులను చూసి ఈవిద్యను నేర్చుకున్నారు. సుద్దముక్కలతో సూక్ష్మ కళాఖండాలే కాదు చిత్రలేఖనం, బంగారపు వస్తువుల డిజైనింగ్, కాస్ట్యూమ్స్ డిజైనింగ్, ఇంటీరియల్ డిజైనింగ్‌లోనూ ప్రావీణ్యం సాధించారు. మదర్‌థెరిసా, ప్రధాని నరేంద్రమోదీ, బుద్ధుడు, స్వాతంత్ర్య సమరమోధులు మహాత్మాగాంధీ, అల్లూరి సీతారామరాజు, వినాయకుడు, వేంకటేశ్వరస్వామి, లక్ష్మీదేవి వంటి దేవుళ్ల చిత్రాలు గీశారు. **- న్యూస్‌టుడే, పెద్దాపురం**

ప్రధాని నరేంద్ర మోదీ చిత్రానికి రంగులు అద్దుతున్న మహాలక్ష్మి

కొంగల ఆకృతి

ఆలోచన అదిరింది..

రాజులపాలెం గ్రామానికి చెందిన రైతు కుసుమ సత్యనారాయణ పది సెంట్ల విస్తీర్ణంలో ఆకుకూరలు సాగు చేస్తున్నారు. పంటకు నీటితడులు ఇచ్చేందుకు ఆయన చేసిన ప్రయత్నం బాగుంది. చేతిపంపు నీటిని బకెట్‌లో పోసి తీసుకెళ్లే అవసరం లేకుండా అడుగున రంధ్రం చేసి దానికి ప్లాస్టిక్ పైపు అమర్చారు. బకెట్‌లోంచి నీరు నేరుగా పైపు ద్వారా పంటకు చేరుతోంది. దీనికి ఖర్చు, శ్రమ లేకుండా ఉందని ఆయన చెబుతున్నారు. **- న్యూస్‌టుడే, పి.గన్నవరం**

నేడు మహిళల హాకీ తుది పోరు
సెమీ ఫైనల్స్‌కు చేరిన పురుషుల జట్లు

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ డీఎస్ఏలో జరుగుతున్న కోకనాడ గోల్డ్ కప్ హాకీ టోర్నమెంట్ తుది దశకు చేరింది. గురువారం మహిళల విభాగంలో హాకీ హరియాణా, ఎన్‌సీవోఈ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరగనుంది. పురుషుల క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు బుధవారం ఉత్సాహంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా మాజీ రైల్వే ఉద్యోగి రత్నాకర్, మాజీ ఇన్‌కంటాక్స్ అధికారి వెంకటేశ్వర్లు తదితరులు హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని, మ్యాచ్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డులు అందజేశారు. కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్ ఫౌండర్ కె.రవిచంద్రప్రసాద్, క్లబ్ అధ్యక్షుడు ఎ.బాబ్జి, రాష్ట్ర హాకీ సంఘ జాయింట్ సెక్రటరీ రవిరాజు, హాకీ కోచ్ నాగేంద్రకుమార్, పీడీలు సూరిబాబు, క్లబ్ సభ్యులు పర్యవేక్షించారు.

పురుషుల జట్ల మధ్య జరుగుతున్న హాకీ మ్యాచ్

క్వార్టర్ ఫైనల్ విజేతలు వీరే..

సెంట్రల్ బోర్డు ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్‌పై 2-1తో పంజాబ్ నేషనల్ బ్యాంక్, సెంట్రల్ సెక్రటరియేట్ జట్టుపై 4-1తో ఒడిశా నేవల్ టాటా హాకీ జట్టు విజయం సాధించాయి. ఇండియన్ ఆర్మీపై 1-0తో సౌత్ సెంట్రల్ రైల్వేస్, ఇండియన్ నేవీపై 4-1తో ఐవోసీ జట్టు గెలుపొందాయి.

పంచాయతీరాజ్‌లో వేధిస్తున్న ఇంజినీర్ల కొరత
ఇన్‌ఛార్జ్ ఏఈల పాలనలో ఇబ్బందులు

వి.కె.రాయపురంలో డ్రెయినేజీ నిర్మాణ పనులు

సామర్లకోట గ్రామీణం, న్యూస్‌టుడే: పంచాయతీ రాజ్ శాఖలో ఇంజినీర్ల కొరత వెంటాడుతుంది. మండల ఇంజినీర్లు లేకపోవటంతో జిల్లాలో పలు చోట్ల ఇన్‌ఛార్జ్ ఏఈల పాలన కొనసాగుతుంది. పూర్తిస్థాయిలో అధికారులు లేకపోవటంతో క్షేత్రస్థాయిలో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో పాటుగా కొన్ని చోట్ల ఇన్‌ఛార్జ్ ఏఈలు సైతం అందుబాటులో ఉండటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జిల్లావ్యాప్తంగా పరిశీలిస్తే..

కాకినాడ జిల్లా వ్యాప్తంగా 20 మండలాలకు గాను పిఠాపురం మినహా పలుచోట్ల ఇన్‌ఛార్జ్‌ల పాలన సాగుతుంది. ● పెద్దాపురం నియోజకవర్గంలోని సామర్లకోట, పెద్దాపురం మండలాలకు చెందిన ఏఈలు గతేడాది బదిలీపై వెళ్లిపోవటంతో రాజమహేంద్రవరానికి చెందిన ఏఈని డిప్యూటేషన్‌పై పెద్దాపురం రాగా సామర్లకోట మండల అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో పనుల పర్యవేక్షణ కరవైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ● కోటనందూరు జేఈ తుని ఇన్‌ఛార్జ్ డీఈఈగా రెండు మండలాలు చూస్తుండగా ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో కాలం నెట్టుతున్నారు. ● జగ్గంపేట నియోజకవర్గంలో మూడు మండలాలకు కలిపి ఒక డీఈఈ, ఒక జేఈ మాత్రమే ఉన్నారు. ● ప్రత్తిపాడు నియోజకవర్గంలో 4 మండలాలకు గాను డీఈఈతో పాటుగా ఇద్దరు ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు, మరో ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్లకు ఇన్‌ఛార్జిలను అప్పగించారు. ఏఈలు అందుబాటులో లేకపోవటంతో క్షేత్రస్థాయిలో టెక్నికల్ అసిస్టెంట్లు చక్రం తిప్పుతున్నారు.

ముంచుకొస్తున్న సమయం

2025-26 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి పల్లెపండగ కింద విడుదల అయిన నిధులకు చెంది 18 రోజుల వ్యవధిలో సుమారు రూ 120 కోట్ల విలువైన 1028 పనులను పూర్తి చేయకుంటే నిధులు వెనక్కిపోయే ప్రమాదం ఉన్న నేపథ్యంలో సమయం ముంచుకురావటంతో హడావిడిగా పనులు చేస్తున్నారు. ఎన్ఆర్ఈజీఎస్ శాఖ ద్వారా నిర్వహించే ఈ పనుల పర్యవేక్షణను పంచాయతీ రాజ్ శాఖకు అప్పగించడం.. అధికారుల కొరతతో పనులు చేసేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇంజినీరింగ్ అధికారుల కొరత సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈవిషయమై డీఈఈ శ్రీనివాస్‌ని వివరణ కోరగా ఏఈల కొరత సమస్య జిల్లా అధికారుల దృష్టిలో ఉందని తెలిపారు.

వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి

సాంబమూర్తినగర్, గాంధీనగర్, న్యూస్‌టుడే: వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాకినాడ సుందరయ్య భవన్‌లో బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈసందర్భంగా రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోనేటి రాజు మాట్లాడుతూ రజకులకు సామాజిక రక్షణ చట్టం వెంటనే ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయాలని, కేజీ నుంచి పీజీ వరకు పిల్లలకు ఉచిత విద్యను అందించాలని డిమాండ్ చేశారు. వృత్తి చెరువులు, ధోబీ ఘాట్ స్థలాలపై రజకులకే పూర్తి హక్కు కల్పించాలని, రజక యువతీ యువకులకు ప్రతి జిల్లాలో స్కిల్ ట్రైనింగ్ సెంటర్లో శిక్షణ ఇచ్చి ఆదరణ పథకం అమలు చర్యలు చేపట్టాలన్నారు. మత్స్యకారుల సంఘం జిల్లా నాయకులు సిహెచ్.రమణి, యు.సత్యనారాయణ, తోలు బొమ్మలాట కళాకారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు అనపర్తి ఏడుకొండలు, కె.నాగేశ్వరరావు, కె.అప్పన్న, సిహెచ్.శ్రీను, ఓ.ఏసు, ఎన్.అప్పారావు, ఎం.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కోనేటి రాజు

సీఎంను దూషిస్తే చర్యలు తీసుకోవద్దా?
మాజీ ఎమ్మెల్యే వర్మ

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబును పరుష పదజాలంతో దూషించినందునే అంబటి రాంబాబును అరెస్టు చేశారని తెదేపా అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ అన్నారు. ఈ విషయంలో చట్టం తన పని తాను చేసిందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ మేరకు బుధవారం కాకినాడలోని వర్మ ఒక వీడియోను విడుదల చేశారు. తప్పుచేసిన అంబటిని మాజీ సీఎం జగన్ పరామర్శించడం బాధాకరమని, ఆ వ్యక్తిని ఆయన సమర్థిస్తున్నట్లు భావించాల్సి వస్తోందన్నారు. తిరుమల లడ్డూకు వినియోగించిన నెయ్యిలో కల్తీ జరిగినట్లు నివేదిక ఇచ్చినా జగన్‌రెడ్డి మాట్లాడడం ఏంటని ప్రశ్నించారు. వైకాపా పాలనలో లడ్డూ తయారీలో కల్తీ జరిగిన మాట నూటికి నూరు శాతం వాస్తవమన్నారు.

పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం

పెద్దాపురం, జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్టుకు పెద్దాపురం పట్టణానికి చెందిన లలిత ఎంటర్‌ప్రైజెస్ యాజమాన్యం రూ.10 లక్షల విరాళాన్ని బుధవారం అందజేశారు. పెద్దాపురంలో విస్తరించిన ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ రాజేష్, డైరెక్టర్ కర్ర వెంకటేశ్వరరావు(కొండబాబు)లకు మట్టే సత్యప్రసాద్, శ్రీనివాస్, ఆదినారాయణ చెక్కును అందించారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు త్యాగానికి గుర్తుగా అమరావతిలో 6.08 ఎకరాల స్థలంలో 58 అడుగుల కాంస్య విగ్రహాన్ని నిర్మిస్తున్నారు. శ్రీరాములు స్మృతి వనం, ఆడిటోరియం, మినీ థియేటర్, మ్యూజియం నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఆర్యవైశ్యులకు గుర్తింపు ఇచ్చి అన్నివిధాల సహాయసహకారాలు అందిస్తున్న కూటమి నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, పురందేశ్వరి, నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. మట్టే సోదరులను కార్పొరేషన్ తరఫున సత్కరించారు. ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

లలిత ఎంటర్‌ప్రైజెస్ సత్యప్రసాద్, శ్రీనివాసులను సత్కరిస్తున్న రాజేష్, కొండబాబు తదితరులు

ఆధ్యాత్మిక వైభవం..
తితిదే ఆధ్వర్యంలో భజన మందిరాల నిర్మాణం

తుని, తుని పట్టణం, న్యూస్‌టుడే: తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ నిధులతో జిల్లాలో భజన మందిరాల నిర్మాణం జరగనుంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఎక్కువగా నివసించే ప్రాంతాల్లో వీటి నిర్మాణానికి ప్రాధాన్యమిస్తున్నారు. భక్తి సంస్కృతిని పెంపొందించడం, భజనల నిర్వహణకు వీలుగా వీటిని నిర్మించనున్నారు. ఆయా ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న స్థలాలకు అనుగుణంగా నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నారు. 5 సెంట్ల స్థలం ఉంటే రూ.10 లక్షలు, 8 సెంట్లకు రూ.15 లక్షలు, 10 సెంట్లు, ఆపైన ఉంటే రూ.20 లక్షలు కేటాయిస్తారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు

భజన మందిరాల నిర్మాణానికి జిల్లాలో 272 దరఖాస్తులు (ఈనెల 2 వరకు) అందాయి. ఆయా గ్రామాల్లో కాలనీల్లో అందుబాటులో ఉన్న స్థలానికి అనుగుణంగా నిధులు మంజూరు చేస్తున్నారు. ప్రైవేటు వ్యక్తులు దానంగా ఇవ్వొచ్చు. తీర్మానం ద్వారా పంచాయతీ స్థలాన్ని కేటాయించవచ్చు. రెవెన్యూ స్థలమైతే ఆ శాఖ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) ఇవ్వాలి. గ్రామ కమిటీల ఆధ్వర్యంలో ఒకే నమూనాలో నిర్మాణాలు ఉంటాయి. దేవాదాయశాఖ ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షిస్తారు. తుని నియోజకవర్గం నుంచి 69, ప్రత్తిపాడు 45, కాకినాడ గ్రామీణం 5, పెద్దాపురం 48, కాకినాడ పట్టణం 105 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 106 మంజూరయ్యాయి. ముందుగా ఆయా ప్రాంతాల్లో ఆలయ పరిధిలో స్థలాలు ఉన్న 56 చోట్ల మందిరాల నిర్మాణానికి (డిసెంబరు 20న ఆదేశాల ప్రకారం) పరిపాలన అనుమతులు దేవాదాయశాఖ కమిషనర్ ఇచ్చారు. ఇందులో తుని నియోజకవర్గంలో 48 (రూ.6.70 కోట్లు), ప్రత్తిపాడు 4 (రూ.65 లక్షలు), పెద్దాపురం 4 (రూ.70 లక్షలు) ఉన్నాయి. పరిపాలన అనుమతులు వచ్చిన భజన మందిరాల నిర్మాణానికి త్వరితగతిన చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు తెలిపారు.

భీమేశ్వరస్వామి రథానికి ప్రత్యేక పూజలు

రథం వద్ద పూజలు చేస్తున్న ఆలయ ఈవో నీలకంఠం, ఛైర్మన్ జగదీష్‌మోహన్

సామర్లకోట, న్యూస్‌టుడే: భీమేశ్వరాలయంలో ఈనెల 13 నుంచి 18వ తేదీ వరకు జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా రథయాత్రకు సంబంధించి బుధవారం రథం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో నీలకంఠం, ఛైర్మన్ జగదీష్‌మోహన్ ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈనెల 16న స్వామివారి రథోత్సవం సందర్భంగా రథం సెంటర్ వద్ద షెడ్డులో ఉన్న రథానికి పూజలు చేసి గాంధీ బొమ్మవద్దకు తీసుకువచ్చారు.

ప్రసాదం కౌంటర్ వద్ద వీరంగం.. యువకులపై చర్యలు

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం కొండ దిగువన తొలి పావంచాల వద్ద ప్రసాదం విక్రయ కౌంటర్ వద్ద వీరంగం సృష్టించిన యువకులపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. ఈనెల 8న మధ్యాహ్నం కొందరు యువకులు క్యూలైన్లో ఉన్న ఓ వ్యక్తిపై దాడికి దిగి అక్కడి వారిని భయభ్రాంతులకు గురి చేసిన విషయం విదితమే. ప్రసాదం టికెట్లు ఇచ్చే కౌంటర్ వద్ద క్యూలైన్లలో వెళ్లే సమయంలో యువకులు హడావుడి చేసి లైన్లో ఉన్న మరో వ్యక్తితో వాగ్వాదానికి దిగారు. రెచ్చిపోయిన యువకులు లైన్లో నుంచి బారికేడ్లపై నుంచి ప్రమాదకరంగా దూకి వెళ్లి దాడి చేశారు. దీంతో భక్తులు ఆందోళనకు గురయ్యారు. అక్కడివారు వీడియో తీయగా సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేసింది. ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. జిల్లా ఎస్పీ ఆదేశాలతో సీసీ కెమెరాల ద్వారా పోలీసులు పరిశీలించారు. వీరిది పెదపూడి మండలం గండ్రేడు గ్రామంగా గుర్తించారు. వీరంతా తలుపులమ్మ లోవ ఆలయానికి వెళ్లి వస్తూ వీరంగం సృష్టించారని తెలుసుకున్నారు. దాడికి పాల్పడిన 10 మంది యువకులను అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. వీరిని బైండోవర్ చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నామని ఎస్సై శ్రీహరిబాబు తెలిపారు.

సమ్మెకు ఏపీఎన్జీవోల మద్దతు

కాకినాడ కలెక్టరేట్: దేశ వ్యాప్తంగా కేంద్ర కార్మిక, ఉద్యోగ సంఘాలు గురువారం తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు మద్దతు ఇస్తున్నట్లు ఏపీఎన్‌జీజీవో అసోసియేషన్ కాకినాడ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుద్దటి రామ్మోహనరావు, పాలపర్తి మూర్తిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకు కాకినాడ కలెక్టరేట్ వద్ద తలపెట్టిన నిరసనకు జిల్లాలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్స్, కార్మికులు హాజరుకావాలని కోరారు.

ఈ-పంట నమోదు త్వరగా పూర్తిచేయాలి: జేసీ

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో రబీ పంటకాలానికి సంబంధించి ఈ-పంట నమోదు త్వరగా పూర్తి చేయాలని సంయుక్త కలెక్టర్ అపూర్వభరత్ ఆదేశించారు. ఆయన బుధవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, పౌరసరఫరాల సంస్థ అధికారులతో సమీక్షించారు. రబీలో 70వేల హెక్టార్లలో వరిసాగు లక్ష్యం కాగా, ఇప్పటికి 69వేల హెక్టార్లలో నాట్లు వేశారని, ఈ-పంట నమోదులో 73 శాతంతో జిల్లా ప్రథమ స్థానంలో ఉన్నా మరింత వేగంగా ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఈనెలాఖరుకు రబీ ధాన్యం సేకరణకు సంబంధించి ముందస్తు కార్యాచరణ ప్రణాళిక తయారు చేస్తామని చెప్పారు. ఈ-పంట నమోదు తర్వాత ఖరీఫ్ ధాన్యం సేకరణ నిలిచిపోతుందన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయ్‌కుమార్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు ఎం.దేవులనాయక్, జిల్లా పౌరసరఫరాల అధికారి ఆర్ఎస్ఎస్ సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

14న చదరంగం పోటీలు

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్-7, 9, 11, 13, 15 బాల, బాలికల చదరంగం పోటీలు ఈనెల 14న రాజమహేంద్రవరంలోని కాల్ ఫ్యూషన్ చెస్ అకాడమీలో నిర్వహిస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ కుమార్ విశ్వనాథ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు 95051 42888ను సంప్రదించవచ్చును.

చిన్నారుల్లో నులిపురుగుల నివారణకు చర్యలు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో 1-19 ఏళ్ల వయసు గల వారిలో నులిపురుగుల నివారణకు చర్యలు చేపట్టాలని డీఆర్వో టి.తిప్పేనాయక్ సూచించారు. ఈ నెల 17న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని ఆయన అధ్యక్షతన నిర్వహించారు. ఈ నెల 17న జిల్లా వ్యాప్తంగా నులిపురుగుల నివారణ మాత్రలను విద్యార్థులకు అందించాలని ఆయన సూచించారు. సమావేశంలో జడ్పీ సీఈవో లక్ష్మణరావు, డీఎంహెచ్‌వో నరసింహనాయక్, వైద్యాధికారిణి అరుణ తదితరులు పాల్గొన్నారు.

కేఎస్‌పీఎల్ సేవా కార్యక్రమాలు అభినందనీయం

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ సీపోర్ట్స్ లిమిటెడ్ సంస్థ సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్ శాఖకు రూ.12 లక్షల విలువైన మహీంద్ర బొలేరో నియో ఎన్10 వాహనాన్ని సమకూర్చారు. తాళాలను ఎస్పీ బిందుమాధవ్‌కి కేఎస్‌పీఎల్ ప్రతినిధులు బుధవారం అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ కేఎస్‌పీఎల్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. కేఎస్‌పీఎల్ సీఎండీ కేవీ రావు, సీవోవో మురళీధర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఏఎస్పీలు శ్రీనివాసరావు, మనీష్ దేవరాజ్ పాటిల్, డీఎస్పీలు కేవీవీ సత్యనారాయణ, శ్రీహరిరావు, సీఐలు సునీల్‌కుమార్, ఎం.అప్పలనాయుడు, పెద్దిరెడ్డి రామచంద్రరావు, ఎస్సైలు సతీష్‌బాబు, కనకదుర్గ, కేఎస్‌పీఎల్ వైస్ ప్రెసిడెంట్ జాకబ్ సత్యరాజ్, సీఎఫ్‌వో డి.సత్యరాజేష్, మేనేజ్‌మెంట్ ప్రతినిధి శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ బిందుమాధవ్‌కు కారు తాళం అందిస్తున్న కేఎస్‌పీఎల్ ప్రతినిధులు

ప్రత్తిపాడులో మరియగిరి మహోత్సవం

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ప్రత్తిపాడులో లూర్దుమాత యాత్రా మహోత్సవం సందర్భంగా బుధవారం మరియగిరిపై ఒమ్మి మోహన్ ప్రసాద్, ప్రభాకర్, రాజశేఖర్‌లు తొలి దివ్యపూజాబలి నిర్వహించారు. అనంతరం క్రీస్తును, మేరీని కీర్తిస్తూ ప్రార్థనలు చేస్తూ కొండపై ఉన్న మేరీమాత మందిరానికి యాత్ర చేరుకుంది. మరియగిరిపై ఉన్న ప్రార్థనా మందిరంలో పాదర్ కె.చిన్నప్ప దివ్యసత్ప్రసాద ఆరాధన చేయగా, విశాఖ అతిమేత్రాసన వికార్ జనరల్ దుక్కింపూడి బాలశౌరి, మేత్రాసన కోశాధికారి కె.జయరాజుల 50 మంది క్రైస్తవ గురువులతో కలిసి దివ్య పూజాబలి నిర్వహించారు. మేరీమాత వాత్సల్యం, క్రీస్తు త్యాగాలు స్ఫూర్తిగా తీసుకోవాలని ఉపదేశించారు. పునీత జోజప్ప మఠకన్యలు, చర్చికమిటీ సభ్యులు, ఆర్‌సీఎం యూత్ తదితరులు ఈ ఉత్సవంలో సేవలందించారు. ఖాదీ గ్రామీణ పరిశ్రమల బోర్డు వైస్‌ఛైర్మన్ కొమ్ముల కన్నబాబు తదితరులు ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఎస్సై లక్ష్మీకాంతం నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మరియగిరిపై దివ్యపూజాబలి నిర్వహిస్తున్న గురువులు

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

తుని పట్టణం, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా తుని రైల్వేస్టేషన్ సెంటర్లో ఉన్న ఓ లాడ్జిలో వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్సై పాపారావు తెలిపారు. మృతుడి వద్ద ఉన్న ఆధారాల ప్రకారం తమిళనాడు తిరుచురాపల్లి ప్రాంతానికి చెందిన ఎం.మోహన్(45)గా గుర్తించామన్నారు. ఈనెల 6న లాడ్జీలో గది తీసుకునే సమయంలో, తాను వస్త్ర వ్యాపారం నిమిత్తం వచ్చినట్లు సిబ్బందికి తెలిపాడన్నారు. రోజూ లాడ్జీ బాయ్‌తో మద్యం తెప్పించుకుని, గదిలో తాగేవాడన్నారు. ఈక్రమంలో బుధవారం బాయ్ వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో కుర్చీలో పడి ఉన్నాడన్నారు. లాడ్జి యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు, కుటుంబసభ్యులకు తెలియజేసి, మృతదేహాన్ని మార్చురీకి పంపామన్నారు.

మత్స్యరంగ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తోడ్పాటు: ఎంపీ సతీష్

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మత్స్యరంగ అభివృద్ధికి కేంద్రం తగిన ప్రోత్సాహాన్నిస్తోందని రాజ్యసభ సభ్యుడు (ఎంపీ) సానా సతీష్‌బాబు తెలిపారు. ఈ మేరకు బుధవారం పార్లమెంట్‌లో తాను అడిగిన ప్రశ్నలకు కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ స్పందిస్తూ లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారని ఎంపీ వివరించారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎస్‌వై) కింద రూ.2,416.92కోట్ల ప్రతిపాదనలను కేంద్రం ఆమోదించిందన్నారు. ఈ నిధులతో ఫిషింగ్ హార్బర్లు, ఐస్ ప్లాంట్లు, హేచరీలు వంటి మౌలిక సదుపాయాల ఏర్పాటుకు వినియోగిస్తారని ఆయన వెల్లడించారు. దివ్యాంగులకు నిరామయ పథకం కింద రూ.లక్ష వరకు బీమా సదుపాయం ఉందని మరో ప్రశ్నకు సమాధానంగా కేంద్ర సామాజిక న్యాయ మంత్రి వీరేంద్రకుమార్ తెలిపారన్నారు.

వికసిత్ భారత్ దిశగా కేంద్ర బడ్జెట్
ఎంపీ ఉదయ్ శ్రీనివాస్

సర్పవరం, న్యూస్‌టుడే: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్.. వికసిత్ భారత్ లక్ష్యాలను సాధించడానికి మార్గదర్శకంగా ఉందని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ తెలిపారు. బుధవారం పార్లమెంట్ సమావేశాల్లో లోక్‌సభలో కేంద్ర బడ్జెట్‌పై జరిగిన చర్చ కార్యక్రమంలో కాకినాడ ఎంపీ పాల్గొని మాట్లాడారు. బడ్జెట్‌లో పోర్టులు, షిప్పింగ్‌శాఖకు రూ.3470 కోట్ల నుంచి రూ.5164 కోట్లకు పెంచారన్నారు. రూ.వేయి కోట్లతో ఏర్పాటు చేసిన మారిటైం డెవలప్‌మెంట్ ఫండ్ ద్వారా తీరప్రాంతాల్లో షిప్‌బిల్డింగ్, పోర్టులు ఆధునికీకరణకు దోహదం చేస్తుందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్, వీధివ్యాపారుల జీవనోపాధికి నిధులు పెంచడం హర్షణీయమన్నారు. ఏపీలో పీఎంజీఎస్‌వై -3 ద్వారా రికార్డుస్థాయిలో 3200 కిలోమీటర్ల రహదారులు, 77 వంతెనలు నిర్మాణానికి అనుమతి లభించిందన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లల్లో)	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి	18,500
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	30,500
గటగట	29,000
కొత్తకాయ: గండేరా	30,000
గటగట	29,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	20,000-21,000
కొత్త (పచ్చి) కాయ	16,000-17,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	5,000
కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ.ల్లో

ఫారం రేటు	120-00
రిటైల్ లైవ్	147-00
డ్రెస్డ్	213-00
స్కిన్‌లెస్	243-00

గుంతలు.. ప్రయాణానికి ఆటంకాలు

పెద్దాపురం, న్యూస్‌టుడే: గుంతలు చిన్నగా ఉన్నప్పుడే పూడ్చడం వల్ల తక్కువ వ్యయంతో పనులు జరిగిపోతాయి. అధికారులు అవి పెద్దగా అయ్యే వరకు పట్టించుకోకపోవడంతో పెద్దగా తయారై ద్విచక్రవాహనదారులు ప్రమాదాలు జరగడానికి కారణమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పురపాలిక సంఘాల్లో ఎక్కడెక్కడైతే గుంతలు ఉన్నాయో గుర్తించి పురపాలిక సాధారణ నిధులు వెచ్చించి పూడ్చేచర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు పురపాలిక అధికారులు రంగంలోకి దిగి పట్టణ, నగర పంచాయతీల్లో గుంతలను గుర్తించారు. కాకినాడ జిల్లాలోని పెద్దాపురం, సామర్లకోట, తుని, పిఠాపురం పురపాలిక, గొల్లప్రోలు నగర పంచాయతీల్లో ఇప్పటివరకు సుమారు 184 గుంతలు గుర్తించి రూ.11.70 లక్షలు కేటాయించారు. ఈ నిధులతో గుంతలు పూడ్చడానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు.

పెద్దాపురం పత్తేవారి సందులో ప్రమాదకర గుంత

పురపాలిక	గుర్తించిన గుంతలు	కేటాయించిన నిధులు (రూ.లక్షల్లో)
పెద్దాపురం	40	1.20
తుని	60	5.00
పిఠాపురం	30	2.00
సామర్లకోట	35	1.50
గొల్లప్రోలు	19	2.00

చర్యలు చేపడతాం..

పెద్దాపురం, సామర్లకోట పట్టణంలో రహదారులకు పడిన గుంతలను పూడ్చడానికి 75 గుంతలను గుర్తించడం జరిగింది. వాటికి సుమారు రూ. 2.70 లక్షలు నిధులు కేటాయించాం. వెంటనే గుంతలు పూడ్చే పనులు చేపడతాం. **- కె.శ్రీకాంత్‌రెడ్డి, శ్రీవిద్య, కమిషనర్లు, పెద్దాపురం, సామర్లకోట**

రుమటాలజిస్ట్ చెన్నై నుండి రాక
డా॥ కవిత M.D, DNB, D.M., SCE (Rheumatology)
కీళ్ళ వాతం, గౌట్, SLE, APLA మొ॥ వ్యాధుల చికిత్సా నిపుణులు
డాక్టరు గారు తేది: 14-2-2026 (శనివారం) విచ్చేయుచున్నారు
అపాయింట్‌మెంట్ కొరకు: 98854 22345, 96662 61803, 08816-223728
అభిరామ్ హాస్పిటల్స్ వాటర్ ట్యాంక్ దగ్గర, జె.పి.రోడ్, భీమవరం

92.7 FM Rajamahendravaram
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

EENADU Classifieds

BUSINESS SERVICES
బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్‌క్యాష్). ✆ 81422 92071.

FINANCIAL SERVICES
స్థిరాస్తులపై ఆంధ్రప్రదేశ్ అంతటా మార్టిగేజ్ లోన్స్ మరియు స్థిరాస్తి ఎక్కడ ఉన్నా ఏసంస్థలో ఉన్నా Xerox పేపర్స్‌పై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. 50లక్షలులోపు, అయోధ్య కోఆపరేటివ్ బ్యాంక్. ✆ 93969 99669.

MARRIAGE SERVICES
మంచి ప్రాపర్టీస్. బీసీ పద్మశాలి కన్వెర్ట్ క్రిస్టియన్ బిజినెస్ అబ్బాయి 45 ఇయర్స్ సెకండ్‌కి OC or BCలో కన్వెర్టగాని హిందూలో గాని లేట్ or సెకండ్‌లో అమ్మాయి మ్యారేజ్ కావాలి (ఎవరులేని అమ్మాయి అయినా పరవాలేదు). డైరెక్ట్: ✆ 9493835167.

JOBS
రాజమండ్రి ప్రముఖ ఎలక్ట్రానిక్స్ షోరూం నందు పనిచేయుటకు బాయ్స్ (హెల్పర్స్) కావలెను. ESI + PF సదుపాయం కలదు. Cell: 94947 11544, 97017 30347.
రాజమండ్రిలో మహాలక్ష్మి మార్కెట్ నందు పనిచేయుటకు అనుభవంగల ఎలక్ట్రీషియన్ కావలెను. మంచి జీతం, రెజ్యూమ్ వాట్సాప్: 99005 39944, 99124 01164
BR INFRACON నందు పనిచేయుటకు సైట్ ఇంజనీర్లు కావలెను. Q: డిప్లొమా, B.Tech/M.Tech అర్హత కలిగి బిల్డింగ్స్, ఇరిగేషన్ వర్క్స్ నందు 3to4 సంవత్సరములు అనుభవం కలిగి విజయవాడ, రాజమండ్రి, ఏలూరు జిల్లాల నందు పనిచేయుటకు కావలెను. పూర్తి బయోడేటాను info@brinfracon.comకి పంపగలరు ✆ 79955 57831.
కాకినాడ టూవీలర్ ఎలక్ట్రికల్ (ఏథర్)షోరూంలో చేయుటకు Service Advisors, Technicians, Sales Executives కావలెను. 8008884256

PERSONAL CLASSIFIEDS
GREETINGS

REAL ESTATE
PLOT FOR SALE
KAKINADA CITY
308 Sq.yards West facing Commercial site for Sale/Lease at Karanamgari Junction, Kakinada. Cont: 94458 00581, 73933 40994.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 4-85 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

కాకినాడ

మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం

సాంబమూర్తినగర్, గాంధీనగర్, న్యూస్‌టుడే: కాకినాడ మార్కెట్ వీధిలో పాత పోస్టాఫీస్ వద్ద మహాశివ నవరాత్రి ఉత్సవాలను బుధవారం విశేష పూజలతో ప్రారంభించారు. స్వయంభూ భోగి గణపతి పీఠం వ్యవస్థాపక ఉపాసకులు దూసర్లపూడి రమణరాజు లక్ష్మీకలశాన్ని ప్రతిష్ఠ చేసి ప్రారంభించారు. ప్రతిరోజు ఉదయం రాత్రి పంచామృతాలతో శివాభిషేకం ప్రత్యేక పూజలు జరుగుతాయని నిర్వాహకులు అప్పికొండ వెంకటేశ్వరరావు, పెంకే నూకరాజు తెలిపారు. శివరాత్రి రోజున ఉదయం 108 మంది కన్యలతో రాతి శివలింగానికి కుంభాభిషేకం, భారీ జ్యోతిర్లింగార్చన, జాగరణ భజన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.

దోమల నివారణకు చర్యలు

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: కాకినాడ నగరంలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్ సత్యనారాయణ తెలిపారు. 43వ డివిజన్ శారదమ్మగుడి వద్ద కాలువల్లో మందు ద్రావణాన్ని పిచికారీ చేసే కార్యక్రమాన్ని బుధవారం ఇన్‌ఛార్జి కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని డివిజన్లలో కాలువలు, మురుగు గుంతల వద్ద పిచికారీ చేసేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. పారిశుద్ధ్యం మెరుగుకు ప్రజలు సహకరించాలని సూచించారు. ఎంహెచ్‌వో డా. పృథ్వీచరణ్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
కాకినాడ నగరం: 80085 74157
సాంబమూర్తినగర్: 91548 46719, మసీదుసెంటర్: 91541 18210
గాంధీనగర్: 80085 74159, బాలాజీచెరువు: 80085 74154

దీపాలు వెలిగించారు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: స్థానిక గాంధీనగర్ రైతు బజారు ప్రాంతంలో వీధి దీపాలు వెలగడం లేదని 'ఈనాడు'లో ప్రచురితమైన కథనంపై నగపాలక అధికారులు స్పందించారు. మరమ్మతులు చేయడంతో బుధవారం రాత్రి నుంచి వీధి దీపాలు యథావిధిగా వెలుగుతున్నాయి.

స్పందనకు వందనం

కాలువ శుభ్రం చేశారు..

సాంబమూర్తినగర్: కాకినాడ జగన్నాథపురం చిన్న మసీదు వద్ద కాలువలు సరిగా శుభ్రం చేయడం లేదు. దుర్వాసన, దోమలతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలియజేశారు. దీనిపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురాగా స్పందించి సిబ్బందితో కాలువలు శుభ్రం చేయించారు.

మూత ఏర్పాటు చేయండి..

మూడో డివిజన్ పరిధిలోని సురేష్‌నగర్ నగరపాలక ఉద్యానం రహదారిలో మ్యాన్‌హోల్‌పై మూత లేక ప్రమాదకరంగా ఉంది. చిన్న పిల్లలు ఏ మాత్రం అజాగ్రత్తగా వెళ్లినా ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. అధికారులు స్పందించి మ్యాన్‌హోల్‌పై మూత ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

విరిగిన స్తంభాన్ని తొలగించండి..

కాకినాడ శ్రీనగర్‌లోని నయన ఆసుపత్రి ఎదురుగా ఓ టెలిఫోన్ స్తంభం కింద భాగాన విరిగి ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే ఆ ప్రాంతంలో ప్రమాదం జరగకముందే స్తంభాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

పార్కులను పట్టించుకోరూ..

వెంకట్‌నగర్ పార్కులో ప్రహరీకి ఇనుపచట్రం లేకుండా ఇలా..

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: నగరంలోని పలు ప్రాంతాల్లో ఆహ్లాదాన్ని పంచాల్సిన నగరపాలక సంస్థ ఉద్యానాలు నిర్లక్ష్యానికి గురై కళావిహీనంగా దర్శనమిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లోని పార్కులను పట్టించుకోవట్లేదని ఆయా ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాకినాడ వెంకట్‌నగర్ నగరపాలకసంస్థ ఉద్యానంలో సైతం కనీస వసతులు కరవయ్యాయి. ప్రహరీకి ఏర్పాటుచేసిన ఇనుపచట్రం ఊడిపోవడంతో ఆకతాయిలు దాని గుండా లోపలకి ప్రవేశించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. బాస్కెట్‌బాల్ కోర్టు సైతం అభివృద్ధికి నోచుకోకుండా నిరుపయోగంగా ఉంది. వాకింగ్‌ట్రాక్‌పై చెత్తాచెదారం పేరుకుపోయాయి. క్రీడా పరికరాలు లేక చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు.

శాంతినగర్‌లోని సంజీవిరావు పార్కులో మైదానంలా ఉద్యానం

✦ శాంతినగర్‌లోని సంజీవిరావు ఉద్యానం మైదానంలా ఉంది. వాయామ పరికరాలు, ఆట వస్తువులు, మొక్కలు తదితర కనీస వసతులు కూడా లేకపోవడంతో ఆ ప్రాంత వాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ✦ పల్లంరాజునగర్‌లోని నగరపాలకసంస్థ ఉద్యానం సైతం సమస్యలతో సతమతమవుతోంది. ✦ లక్ష్మీనారాయణ నగర్‌లోని పార్కులో క్రీడా పరికరాలు లేకపోవడంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. పార్కులో అశుభ్ర వాతావరణం చోటుచేసుకుంది. ✦ పలు పార్కుల్లో చీకటి పడితే పలు ఆకతాయిలు చేరుతున్నారు. దీపాలు వెలగకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. మద్యం సీసాలు, వాటర్ ప్యాకెట్లు, ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు అక్కడే పడేస్తున్నారు.

నిరుపయోగంగా ఉద్యానం..

సంజీవరావు ఉద్యానంలో సమస్యలు తిష్ఠ వేశాయి. ఇక్కడ ఎటువంటి కనీస సదుపాయాలు లేకపోవడంతో దూర ప్రాంతాలో ఉన్న పార్కులకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. వ్యాయమ పరికరాలు, క్రీడా పరికరాలు ఏర్పాటు చేయాలి. –శ్రీనివాస్, స్థానికుడు

అసెంబ్లీలో వైకాపా తీరు సరికాదు: ఆర్పీఐ

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో వైకాపా తీరు సరికాదని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్పీఐ) రాష్ట్ర అధ్యక్షుడు పిట్టా వరప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గవర్నర్ ప్రసంగానికి అడ్డుతగిలి రాద్ధాంతం చేయడం వల్ల ఏం ప్రయోజనమని ప్రశ్నించారు. బాధ్యతయుతమైన ప్రతిపక్ష పాత్ర పోషించి సమస్యలపై చర్చలో పాల్గొంటే బాగుండేదన్నారు. ప్రజల కోసం కాకుండా కేవలం గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకునేందుకే వారు సభకొచ్చినట్లుందన్నారు.

లైసెన్సు ఫీజుల పెంపుపై సమావేశం

కాకినాడ నగరం: ట్రేడ్ లైసెన్సు ఫీజుల పెంపుపై బుధవారం నగరానికి చెందిన వ్యాపార సంస్థల ప్రతినిధులతో కమిషనర్ సత్యనారాయణ సమావేశాన్ని నిర్వహించారు. 15 ఏళ్ల తరువాత ఫీజులు పెంచుతున్నామని, వ్యాపారులు సహకరించాలని కోరారు. గోదావరి ఛాంబరు ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు గ్రంధి బాబ్జి మాట్లాడుతూ ఒకేసారి ఫీజులను పెంచడంతో చిరు వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారని వివరించారు. ఈ విషయంలో పునరాలోచన చేయాలని కోరారు. అదనపు కమిషనర్ సుధాకర్, ఉప కమిషనర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేట్రాక్ మరమ్మతులు పూర్తి

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: నగరంలోని ఎస్.అచ్యుతాపురం రైల్వేగేటు వద్ద ట్రాక్ మరమ్మతులు పూర్తయ్యాయని రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీరు శాస్త్రి తెలిపారు. ఆయన బుధవారం ఈ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఇక్కడ ట్రాక్, రహదారి మధ్య ఎత్తుపల్లాల వ్యత్యాసం ఉండటంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందిపడుతున్న పరిస్థితిని గత నెల 22న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించినట్లు చెప్పారు. ఈనెల 4 నుంచి గేటు మూసివేసి ట్రాక్ మరమ్మతు పనులు ప్రారంభించామని, బుధవారంతో ఇవి పూర్తయ్యాని తెలిపారు. మరో రెండు రోజుల్లో రాకపోకలు పునరుద్ధరిస్తామని చెప్పారు.

మున్సిపల్ పెన్షనర్స్ సమస్యలు పరిష్కరించాలి

పద్మనాభరావును సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఆనందభారతి మైదానంలో మున్సిపల్ సుపీరియర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ భవన్‌లో కాకినాడ డివిజన్ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. గోగురాజు మాట్లాడుతూ 12వ వేతన సవరణ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. పెండింగ్ డీఏలను విడుదల చేయాలని, నగదు రహిత వైద్య చికిత్స అందించాలని, బకాయి రాయితీలు విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం ఉద్యోగ విరమణ చేసిన మున్సిపల్ మేనేజరు కొప్పుల రంగనాయకులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.పద్మనాభరావులను సత్కరించారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధులు దామెర మురళి, కర్రి సత్యనారాయణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.జితేంద్ర, వి.సత్యనారాయణ, కేవీఎల్ రెడ్డి, ఎస్‌కే నవాబ్‌జీ, ఎంవీ రెడ్డి, గోపాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గాటీలమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పేదలకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఫౌండేషన్ సభ్యుడు డా.కృష్ణమోహన్ దంపతులు పూజకార్యక్రమాలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. శేషు, మట్టా రాజు, శేషాద్రి, సతీష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రసాయన పరిశ్రమల్లో సెన్సార్లు తప్పనిసరి

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: రసాయన పరిశ్రమల్లో అనుకోని ప్రమాదాలు సంభవించినప్పుడు అప్రమత్తం చేసేందుకు సెన్సార్లను తప్పనిసరిగా వినియోగించాలని ఆర్డీవో ఎస్.మల్లిబాబు ఆదేశించారు. బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో కాకినాడ డివిజన్‌స్థాయి సమావేశాన్ని ఆయన అధ్యక్షతన నిర్వహించారు. పరిశ్రమల యాజమాన్యాలు, కార్మాగారాలు, అగ్నిమాపక, ప్రజారోగ్య, వైద్యఆరోగ్యశాఖ ప్రతినిధులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు సంభవించకుండా, జరిగిన తర్వాత తీసుకోవాల్సిన చర్యలపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ప్రతి పరిశ్రమలో అలారం సిస్టమ్స్ ఏర్పాటు చేయాలని, మాక్ డ్రిల్ నిర్వహించాలని, చుట్టుపక్కల ప్రజలను ప్రమాదాలపై చైతన్యం చేయాలని సూచించారు. డివిజన్ పరిధిలోని రసాయన పరిశ్రమల వివరాలను పుస్తక రూపంలో తీసుకురావాలని ఆదేశించారు. డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జీవీవీఎస్ నారాయణ, ఇన్‌స్పెక్టర్ కె.రాంబాబు, అదనపు జిల్లా అగ్నిమాపక అధికారి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



సూచనలిస్తున్న ఆర్డీవో మల్లిబాబు, చిత్రంలో జీవీవీఎస్ నారాయణ

పోలీసుల తీరుపై నిరసన

సర్పవరం: తిమ్మాపురం గ్రామంలోని విశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామి ఆలయం శివరాత్రి ఉత్సవాల నిర్వహణపై ఎన్నడూ లేనివిధంగా పోలీసులు జోక్యం చేసుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆ ఊరి శివాలయం వద్ద బుధవారం సర్పంచి, ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు బెజవాడ సత్యనారాయణ, భక్తులు నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ శివరాత్రి ఉత్సవాలు ప్రచారం చేస్తున్న ఆటో, మైక్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారన్నారు. ఉత్సవాల కోసం ముహూర్తపు రాట వేయకూడదని చెబుతున్నారన్నారు. దీనిపై ఎస్సై గణేష్‌కుమార్ మాట్లాడుతూ నాయకుల మధ్య ఉత్సవాల నిర్వహణలో విభేదాలు తలెత్తే అవకాశముందని ఫిర్యాదు రావడంతో ఆలయ కమిటీతో మాట్లాడామని, శాంతియుతంగా ఉత్సవాలు చేసుకోవాలని సూచించామన్నారు.

దోషరహిత ఓటరు జాబితాలు రూపొందిద్దాం

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: నగర నియోజకవర్గ పరిధిలో దోష రహిత ఓటర్ల జాబితాలను రూపొందించేందుకు సమష్టిగా కృషిచేద్దామని నగర నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అదనపు కమిషనర్ కేటీ సుధాకర్ కోరారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం ఆయన బీఎల్‌వోలు, ఇతర అధికారులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. పోలింగు కేంద్రాల వారీగా ఓటర్ల జాబితాలను సరిపోల్చి తప్పులను సరిదిద్దాలన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గడువులోపు జాబితాలను సిద్ధం చేయాలని చెప్పారు. ఆ దిశగా వేగంగా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఉప తహసీల్దారు గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

'నిర్వాణ షట్కము' గ్రంథావిష్కరణ

సాంబమూర్తినగర్, గాంధీనగర్, న్యూస్‌టుడే: స్వామి తత్వవిద్యానంద రచించిన 'నిర్వాణ షట్కము' గ్రంథావిష్కరణ బుధవారం శాంతినగర్‌లోని శ్రీరామకృష్ణ సేవాసమితి ప్రాంగణంలో జరిగింది. సమితి అధ్యక్షుడు వీఎల్ గాంధీ, పెండ్యాల సుబ్బారావు, వక్కలంక రామకృష్ణ, కొప్పర్తి సుబ్రహ్మణ్యేశ్వరరావు, కొండలరావు, కందుకూరి వాణి, వీవీఎల్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE: KAKINADA
Succession O.P.No. 18 of 2025
(For the estate of the deceased Smt.Palakurthi Nagaratnamma, W/o.Buli Veerraju)
Between :
1.Palakurthi Leela Satyaprasad
2.Palakurthi Dorabbai ..Petitioners
and
1.M/s.Coromandel International Limited, (Formerly Coromondel Fertilisers Limited) (Incorporated under The Companies Act, 1956) Regd. Office: Coromandel House", 1-2-10, Sardaar Patel Road, Secunderabad - 500 003.
2.M/s.KFIN Technologies LTD, Selenium Towers B, Plot No. 31-32, Gachibowlli, Financial District, Nanakramguda, Hyderabad - 500 032 ...Respondents
పై నెంబరు S.O.P లో పిటీషనర్స్ తమకు Succession Certificate ఇప్పించమని కోరుచూ పై కోర్టు లో పిటీషన్ దాఖలు చేసియున్నారు. కావున ఈ విషయమై ఎవరికైనా ఏమైనా అభ్యంతరములు ఉన్నచో ది. 27-02-2026వ తేదీన ఉదయం గం.10-30 నిులకు పైన ఉదహరించిన శ్రీకోర్టువారి ఎదుట మీరు స్వయంగా గానీ, మీ ప్లీడరు గారి ద్వారా గానీ హాజరు అయ్యి మీకు ఎటువంటి ఆక్షేపణలు ఉన్న యెడల శ్రీ కోర్టువారికి తెలియపరుచుకోవలెను. లేని యెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.
V.S.M. RAJU, Advocate
M.G.K. Towers (F5), Womens College Road, Jagannaickpur, KAKINADA.
Cell: 9440128075, 9676754446

తవ్వారు.. వదిలేశారు

కాకినాడ మూడో డివిజన్ పరిధిలోని గొడారిగుంట సచివాలయానికి వెళ్లే రహదారిలో నాలుగు రోడ్ల కూడలి వద్ద పనుల నిమిత్తం తవ్వకాలు చేపట్టారు. రోజులు గడుస్తున్నా రాళ్లను సరిచేయకపోవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో ఇటువైపు తిరిగే క్రమంలో ప్రమాదాలు గురవుతున్నామని, సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. –న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

వీధి దీపాలు వెలగక అంధకారం..

కాకినాడ 8వ డివిజన్ పరిధిలోని బాలవెంకటనగర్ వాటర్ ట్యాంకుల వెనుక వైపు రహదారిలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రిపూట చీకట్లో ప్రమాదాలకు గురవుతున్నామని పలువురు వాపోతున్నారు. రాత్రి సమయంలో కుక్కల బెడద అధికంగా ఉంటోందని స్థానికులు పేర్కొన్నారు. అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేస్తున్నారు.

– న్యూస్‌టుడే, భానుగుడి సెంటర్

చూడకుంటే ప్రమాదమే..!

కాకినాడ నగరంలో అనేక ప్రదేశాల్లో మురుగు కాలువలపై ఉండాల్సిన మ్యాన్‌హోల్ మూతలు పాడయ్యాయి. దీంతో పాదచారులు, వాహనదారులు ప్రమాదవశాత్తు పడుతూ ఆసుపత్రి పాలవుతున్నారు. దుమ్ములపేట రాజీవ్ గృహకల్ప సముదాయానికి వెనుక రహదారిలో ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్ వద్ద స్థానికులు అక్కడ ఓ చెట్టుకొమ్మను ఉంచారు. అధికారులు సత్వరం స్పందించి చర్యలు తీసుకోవల్సిన అవసరం ఉంది.

– ఈనాడు, కాకినాడ

Union Bank of India
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ప్రాంతీయకార్యాలయం,.డి.నెం.13-1-61/61/1, కాత్యాయని కాంప్లెక్స్, 2వ అంతస్థు, మెయిన్‌రోడ్,కాకినాడ
కాకినాడ శ్రీనగర్ కాలనీ శాఖకు అవరణ కావలెను
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ప్రాంతీయ కార్యాలయం వారు తమ శ్రీనగర్ కాలనీ శాఖను భానుగుడి జంక్షన్ ఏరియాలో తరలించుటకు దగ్గరలో గ్రౌండ్ ఫ్లోర్ సందు 2200(+/-10%) [illegible] (www.unionbankofindia.co.in) & https://tender.gov.in). [illegible]
ఎలాంటి కారణములు చూపకుండా ఏదైన ఆఫరును అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు బ్యాంకు హక్కు కలిగి ఉన్నది.
ఆఫర్లు/ బిడ్లు సమర్పించుటకు ఆఖరు తేది.05.03.2026
తేది : 11.02.2026 సం/- రీజనల్ హెడ్, ప్రాంతీయ కార్యాలయం, కాకినాడ.

మైనర్ డ్రైవింగ్ కట్టడికి ప్రత్యేక తనిఖీలు

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: మైనర్లు వాహనాలు నడపకుండా కట్టడి చేయడానికి ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, తల్లిదండ్రులు, వాహన యజమానులకు చట్టపరమైన నిబంధనలు, శిక్షలపై అవగాహన కల్పిస్తున్నట్లు కాకినాడ ట్రాఫిక్-2 సీఐ డి.రామారావు తెలిపారు. ట్రాఫిక్-2 సీఐ డి.రామారావు ఆధ్వర్యంలో నగరంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. గత మూడు రోజులుగా మైనర్ డ్రైవింగ్‌కు పాల్పడిన ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని, వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. చలానాలు విధించి మరోసారి వారి పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని, ఇస్తే బైక్‌లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ రామారావు

మద్యం తాగి వాహనాలు నడిపినవారికి జైలు, జరిమానా

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: ఒకటో పట్టణ పీఎస్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 13 మందిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ ఎం.నాగదుర్గారావు బుధవారం తెలిపారు. వారిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా ముగ్గురికి 2 రోజుల జైలు, ఒకరికి 3 రోజుల శిక్ష, 9 మందికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారని చెప్పారు.

చోరీ కేసులో బాలుడి అరెస్టు

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: చరవాణి చోరీ చేసి పారిపోతున్న బాలుడిని బాధితుడు పట్టుకుని పోలీసులకు అప్పగించిన ఘటన మంగళవారం సాయంత్రం రామారావుపేట జయంతి ఐ కేర్ ఆసుపత్రి వద్ద చోటుచేసుకుంది. దీనిపై కాకినాడ రెండో పట్టణ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. కాకినాడ, మాదిరెడ్డివారివీధికి చెందిన ఎం.రాజు రామారావుపేటలో ఫాస్ట్‌ఫుడ్ దుకాణం వద్ద ఉండగా, పిఠాపురం మండలం దొంతమూరుకి చెందిన 17 ఏళ్ల బాలుడు వచ్చి రోడ్డుపై రెండు రూ.10 నోట్లు పడేశాడు. తర్వాత ఏమీ తెలియనట్లు ఆ వ్యక్తిని పిలిచి ఈ నోట్లు మీవేనా అని అడిగాడు. ఈలోగా ఆ వ్యక్తి వాటిని తీస్తుండగా, అతని చొక్కా జేబులో ఉన్న చరవాణిని చోరీ చేసి పారిపోబోయాడు. అతడిని రాజు చాకచక్యంగా పట్టుకుని పోలీసులకు అప్పగించారు. దీనిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘంటసాల పాటలే.. వర్ధమాన గాయకులకు పాఠ్యాంశాలు

సాంబమూర్తినగర్, గాంధీనగర్, న్యూస్‌టుడే: ఘంటసాల పాడిన పాటలనే వర్ధమాన గాయకులు పాఠ్యాంశాలుగా చేసుకుని రాణించాలని సత్యాస్కాన్ అధినేత డా.కాద వెంకటరమణ అన్నారు. ఘంటసాల వర్ధంతిని బుధవారం కర్రి అచ్యుత రామారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. తెదేపా నాయకులు నురుకుర్తి వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు ఆకుల వెంకటరమణ, జీకే విశ్వనాథ్ తదితరులు విగ్రహానికి నివాళులర్పించారు. కర్రి భామిరెడ్డి, ఎస్‌వీవీఎస్ఎన్ మూర్తి, టీవీవీఎస్ ఎన్ రెడ్డి, టి.నూకరాజు, పీపీ శాస్త్రి, కె.రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కాద వెంకటరమణ

దీన్‌దయాళ్‌కు నివాళి

సాంబమూర్తినగర్, గాంధీనగర్, న్యూస్‌టుడే: దేశం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన నాయకుడు పండిత్ దీన్‌దయాళ్ అని భాజపా జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అన్నారు. భారతీయ జన్‌సంఘ్ నాయకుడు పండిత్ దీన్‌దయాళ్ వర్ధంతి సందర్భంగా సమర్పణ దివస్‌ను బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. భాజపా ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగళ్ల గోపి శ్రీనివాస్, ఎనిమిరెడ్డి మాలకొండయ్య, సాహితీవర్మ, చోడిశెట్టి రమేష్‌బాబు, సాయికుమార్ యాదవ్, పైడా రవీంద్ర, డీవీఎస్ రాజు, గండి కొండలరావు, మారే బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న భాజపా నాయకులు

మహాశివరాత్రికి పటిష్ఠ ఏర్పాట్లు

కాకినాడ నగరం: మహాశివరాత్రికి శివాలయాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్‌వీవీ సత్యనారాయణ ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. బుధవారం తన ఛాంబరులో బాలాత్రిపుర సుందరి ఆలయం, భానుగుడి, రామారావుపేట, జగన్నాథపురం, దేవాలయం వీధి శివాలయాలకు చెందిన అధికారులు, పోలీసు అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. మరుగుదొడ్లు, తాగునీరు, వంటి అన్ని సదుపాయాలను కల్పించాలన్నారు. తొక్కిసలాటలు, ట్రాఫిక్ సమస్యలు లేకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా దేవాదాయశాఖ అధికారి నాగేశ్వరరావు, ఈవోలు వీర్రాజు చౌదరి, వి.శ్రీనివాసరావు, ఆర్.రాజేశ్వరరావు, లక్ష్మణరావు, ఫణీంద్ర, సీఐలు రమేష్, దుర్గారావు పాల్గొన్నారు.

దేవాదాయశాఖ అధికారులతో సమీక్షిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ సత్యనారాయణ

నైపుణ్యాల ఆవశ్యకతపై అవగాహన

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వాణిజ్య శాఖ, ఐఐసీ కమిటీ, మేనేజ్‌మెంట్ స్టడీస్, జేఎన్‌యూటీకే సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం 'వ్యవస్థాపక అవగాహన కార్యక్రమం'పై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రిన్సిపల్ డా.వి.అనంతలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన కార్యశాలలో రిసోర్స్ పర్సన్లు ప్రొఫెసర్ డా.పీవీవీ సత్యనారాయణ విద్యార్థులకు ప్రస్తుత వ్యవస్థాపక నైపుణ్యాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ప్రొఫెసర్ జి.అబ్బాయి, ఆర్ఆర్‌డీ శిరీష, ఎన్‌పీవీ లక్ష్మి, డా.జి.సౌజన్య, కేఎన్‌బీ కుమారి, ఎ.సంధ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డా.వి.అనంతలక్ష్మి

ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన

పెద్దాపురం, సర్పవరం, న్యూస్‌టుడే: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు కోసం బుధవారం స్థానిక రాజుగారివీధిలోని మట్టే ఆదినారాయణ, నాగమణి ఆర్యవైశ్య సేవా సంఘం కల్యాణ మండపంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది అవగాహన కల్పించారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ సుశాంత్ కుమార్ బెహరా, తహసీల్దార్ వెంకటలక్ష్మి, అగ్నిమాపక అధికారి ప్రసాద్, ఎస్సై వి.మౌనిక పాల్గొన్నారు. ● రమణయ్యపేట ఏపీఎస్పీ జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు తుపానులు, ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు తీసుకునే జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం 3వ బెటాలియన్ ఎస్‌డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ చాంద్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగింది.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

అపోలో హాస్పిటల్స్ హైదరాబాద్
ప్రఖ్యాత ఆర్థోపెడిక్ వైద్య నిపుణులచే ఇప్పుడు కాకినాడ లో
Apollo HOSPITALS HYDERABAD
ఆర్థోపెడిక్ క్లినిక్

డా సోమశేఖర్ రెడ్డి
MBBS, MS (Orthopaedic), MCh (Liverpool, UK)
కన్సల్టెంట్ - ఆర్థోపెడిక్ సర్జన్
14 ఫిబ్రవరి 2026 | 9 am - 12 pm
డా ఎం.వి. రమణరావు హాస్పిటల్, రామారావు పేట.
14 ఫిబ్రవరి 2026 | 3 pm - 5 pm
సన్ రైజ్ హాస్పిటల్, గోకుల్ స్ట్రీట్, భానుగుడి జంక్షన్.
ఈ సమస్యలు ఏమైనా ఉన్నట్లైతే డాక్టర్ గారిని సంప్రదించండి.
• తుంటి, మోకాలు, భుజం మొదలైన కీళ్ల మార్పిడి • మోకాళ్ళ సమస్యలు
• మోకాలు, భుజం యొక్క ఆర్థోస్కోపీ ఆపరేషన్లు అవసరమైనవారు.
• అత్యాధునిక రోబోటిక్ సర్జరీ ద్వారా మోకాళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స చేయబడును.
• ప్రత్యేకమైన కీళ్ల సమస్యలు ఉన్నవారి ఆపరేషన్ల కోసం అధునాతన రోబోలు, A.I. మరియు A. R. సాంకేతికత పరికరాలు అందుబాటులో ఉన్నాయి.
అపాయింట్మెంట్ కొరకు: +91 8074 936 811

అమృతమూర్తికి అశ్రునివాళి

మంచికి, మానవత్వానికి మారుపేరుగా నిలిచి, మా అందరికీ ప్రేమానురాగాలు పంచి, మమ్మల్ని కంటి పాపలా కాపాడి, మా ఉన్నతి కొరకై అహర్నిశలూ పాటుపడి, మాకు మార్గదర్శకులుగా నిలిచిన అమృతమూర్తి శ్రీ రావు రాయన్నారావు గారు మమ్మల్ని విడిచి దైవసన్నిధికి చేరినారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...
కీ॥శే॥శ్రీ రావు రాయన్నారావు గారు
Ex. ఛైర్మన్, సూపర్‌బజార్, కాకినాడ
జననం: 01-01-1949, మరణం: 03-02-2026
భార్య: శ్రీమతి రావు నీరజ
కుమారుడు: రావు శ్రీనివాసరావు - కోడలు: దీప్తి, మనుమడు: అభినవ్
శ్రేయోభిలాషి: K.V.P.రామచంద్రరావు, Ex.పార్లమెంటుసభ్యులు
మరియు బంధుమిత్రులు
పెద్దకార్యం: ది.14-02-2026న శనివారం, కాకినాడ, వాకలపూడిలో వేదిక ఫంక్షన్ హాలు నందు జరుపబడును.

(c) eenadu

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

నానో ఎరువులతో ప్రయోజనం

కాజులూరు, న్యూస్‌టుడే: నానో ఎరువులతో వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. ఆత్మ పథకంలో భాగంగా నానో ఎరువుల వినియోగంపై బుధవారం కాజులూరులో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ పరిమాణంలో ఎక్కువ ప్రయోజనం అందించే ఎరువులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఈ ఎరువులు అధిక లాభాలు అందించే సామర్థ్యం కలిగి ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం రేపు

పిఠాపురం: ఈనెల 13న విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. జగ్గయ్యచెరువు, వైఎస్ సెంటర్, క్రిష్, విశ్వం లేఅవుట్లు, ప్రభుత్వాసుపత్రి, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, అంబేడ్కర్ సెంటర్, రథాలపేట, వస్తాద్ వీధి, కోటవారి వీధి, జెజ్జూరి వారి పత్రి, గోపాలబాబా ఆశ్రమం, బ్రహ్మణ లేఅవుట్, ఎంపీడీవో కార్యాలయం ప్రాంతాలవారు గమనించాలన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉంటుందన్నారు.

తాళ్లరేవు: తాళ్లరేవు విద్యుత్తు సబ్ స్టేషన్ పరిధిలో ఈ నెల 13న విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని కాకినాడ విద్యుత్తు శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.ఉదయ భాస్కర్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్తు సరఫరా ఉండదన్నారు.

త్వరితగతిన పనులు పూర్తిచేసేలా చర్యలు

రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న అధికారులు

గొల్లప్రోలు: గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద మంజూరైన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు చేపడుతున్నట్లు పంచాయతీరాజ్ డీఈఈ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో సలాట్ రాజు తెలిపారు. ఎ.కె.మల్లవరంలో సిమెంటురోడ్డు నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. మండలంలో 96 అభివృద్ధి పనులు చేసేందుకు రూ.6.88 కోట్లు మంజూరుకాగా ఇప్పటివరకు 30 పనులు ప్రారంభించినట్లు చెప్పారు.

ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన

పెద్దాపురంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది

పెద్దాపురం, సర్పవరం, న్యూస్‌టుడే: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల కోసం బుధవారం స్థానిక రాజారావువీధిలోని మట్టే ఆదినారాయణ, నాగమణి ఆర్యవైశ్య సేవా సంఘం కల్యాణ మండపంలో ఎన్డీఆర్ఎఫ్ బృందం అవగాహన కల్పించింది. ఎన్డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ సుశాంత్ కుమార్ బెహరా, తహసీల్దార్ వెంకటలక్ష్మి, అగ్నిమాపక అధికారి ప్రసాద్, ఎస్సై వి.మౌనిక పాల్గొన్నారు. ● రమణయ్యపేట ఏపీఎస్పీ మూడో బెటాలియన్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు తుపానులు, ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు తీసుకునే జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 3వ బెటాలియన్ ఎన్డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ చాంద్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగింది.

పుష్కరిణి వద్ద ప్రమాదాలు అరికట్టాలి

పిఠాపురం: పిఠాపురం పాదగయ క్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఈనెల 13 నుంచి 18 వరకు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో పుష్కరిణిలో కలుషిత నీటిని తొలగించి మోటార్లతో నీటిని నింపుతున్నారు. పైకిరు నీటిని మళ్లించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 15న మహాశివరాత్రి సందర్భంగా పుణ్యస్నానాలకు లక్ష మంది వరకు భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. వీరికోసం ఇప్పటి నుంచే ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవీ.. ● పుష్కరిణిలోని కొన్ని మెట్లు నాచుపట్టి ఉన్నాయి పుణ్యస్నానాలు ఆచరించే భక్తులు ప్రమాదాల బారిన పడే అవకాశముంది. కోనేరు లోపల ఆక్రమణలు ప్రస్తుతం నెట్ కట్టినప్పటికి దాని పటిష్టమైన ఏర్పాట్లు చేయాల్సి ఉంది. పటా భక్తులు ఆరబోసిన, పూజా సామగ్రి పుష్కరిణిలో వదిలేస్తున్నారు దీంతో నీరు కలుషితమవుతున్నాయి. దీన్ని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలి. క్యూలైన్లలో పటా తోపులాట జరుగుతుండడంతో దీనిపై ఇప్పటి నుంచే దృష్టి సారించాల్సి ఉందని స్థానికులు చెబుతున్నారు.

తూరంగేశ్వరస్వామి ఆలయ కోనేరు శుభ్రం

సర్పవరం: శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని తూరంగి గ్రామంలోని తూరంగేశ్వరస్వామి ఆలయం కోనేరును శుభ్రం చేశారు. ఎమ్మెల్యే పంతం నానాజీ, స్వచ్ఛంద సంస్థలు ఆధ్వర్యంలో సొంత నిధులతో కోనేరులో పేరుకుపోయిన వ్యర్థాలు తొలగించారు. పనులను ఆలయ ఈవో శివబాబు పర్యవేక్షించారు.

పన్ను కట్టకపోతే నీటి కనెక్షన్ కట్

పెద్దాపురం, న్యూస్‌టుడే: పెద్దాపురం పట్టణంలో ఇళ్లు, దుకాణాలకు సంబంధించిన పన్నులు చెల్లించకపోతే వాటి కొళాయిలకు కట్ చేయడం జరుగుతుందని, బకాయి పన్నులు రూ.54 లక్షలు వసూలుకావాల్సి ఉండగా ఇంకా రూ.86 లక్షల వరకు బకాయిలున్నాయి. వాటిని వసూలు చేయడానికి తమ సిబ్బంది క్షేత్రస్థాయిలో తిరుగుతున్నారని.. కట్టని పక్షంలో పురపాలిక చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని పెద్దాపురం పురపాలిక కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో తెలిపారు.

ముఖాముఖి

కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి

దుకాణాలకు తాళాలు వేస్తాం..

పెద్దాపురంలోని వాణిజ్య సముదాయాల నుంచి రూ.97 లక్షలకుగాను రూ.75 లక్షలు వసూలు చేయగా ఇంకా రూ.22 లక్షలు వసూలు చేయాలి. వాణిజ్య పన్నులు చెల్లించని పక్షంలో దుకాణాలకు తాళాలు వేస్తున్నాం. పన్నులు చెల్లించే దుక ప్రజలు ముందుకు రావాలి.

భవనాల క్రమబద్ధీకరణకు..

అనధికార, ప్రణాళికలకు విరుద్ధంగా పట్టణంలో నిర్మించిన భవన నిర్మాణాల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం బీపీఎస్ పథకాన్ని ప్రవేశపెట్టింది. పట్టణంలో 305కి ఇప్పటివరకు 180 వరకు భవనాల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు చేసుకున్నారు. ఎల్ఆర్ఎస్ కింద 56 ప్లాట్లు క్రమబద్ధీకరించాం.

ఆస్తిపన్ను బకాయిల వసూలుపై దృష్టి

పట్టణంలో ఆస్తిపన్నులు రూ.3.83 కోట్లు వసూలుకాగా ఇంకా 2.67 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఇందులో వివిధ ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.61 లక్షల వరకు బకాయిలున్నాయి. ఖాళీ స్థలాల పన్నులు రూ.38 లక్షలు వసూలు చేశామని, ఇంకా రూ.1.33 కోట్లు వసూలు చేయాలి. ఖాళీ స్థలాలు, లేఅవుట్లలో ఖాళీ స్థలాలు కలిగిన యజమానులు ఖాళీ స్థలాలు విధించుకోవడానికి ముందుకు రావాలి.

రహదారులపై చెత్త వేస్తే చర్యలు

చెత్త సేకరణకు తమ సిబ్బంది ఇంటింటికి వస్తున్నారు. ఎవరూ కూడా రహదారులపై, కాలువల్లో చెత్త వేయకూడదు. వాటిని అతిక్రమిస్తే అపరాధ రుసుం విధిస్తాం. ముఖ్యంగా ఏడీబీ రహదారి, జగ్గంపేట, పాత ఆర్టీసీ బస్టాండ్(వారపు సంత), టిట్కో కాలనీ వెళ్లే ప్రధాన రహదారులపై చెత్త వేస్తున్నారు. ఇకపై వేస్తే వారిపై చర్యలు తీసుకుంటాం.

గుడ్డ సంచులు వాడాలి..

పట్టణంలో ప్లాస్టిక్ కవర్లు సుమారు 80 శాతం నియంత్రించాం. పెద్ద పెద్ద మాల్స్‌కు ఎలాగైతే ఇంటి నుంచి సంచులు తీసుకు వెళ్తున్నారో కూరగాయాల కొనుగోలుకు గుడ్డ సంచులు తీసుకువెళ్లాలి.

పరిశుభ్రతకు ప్రాధాన్యం

కరప: తడి, పొడి చెత్తను వేర్వేరుగా పారిశుద్ధ్య సిబ్బందికి అందించి పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా అందరూ కృషి చేయాలని ఎంపీడీవో జె.శ్రీనివాస్ సూచించారు. కరపమండలం జి.భావవరంలో బుధవారం ఆయన డిప్యూటీ ఎంపీడీవో ఎస్వీ శ్రీనివాసరావుతో కలిసి ఇంటింటా చేపడుతున్న తడి, పొడి చెత్త సేకరణను పరిశీలించి మహిళలకు అవగాహన కల్పించారు.

సమస్యలు పరిష్కరించాలి

పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: గొల్లప్రోలోని ఒకటో వార్డు ఎస్సీపేట శివారు వీధిలో పలు సమస్యలు పరిష్కరించాలని మహిళలు డిమాండ్ చేశారు. గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయం ఎదుట బుధవారం ఆందోళన చేపట్టారు. అనంతరం కమిషనర్ శ్రీనివాసులను కలిసి సమస్యలు విన్నవించారు. ఎస్సీపేట శివారునున్న ప్రధాన డ్రెయిన్‌లో చెత్తను వేయడంతో మురుగునీరు ప్రవహించక దుర్వాసన వస్తోందని, రోగాలబారిన పడుతున్నామని వివరించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ముగిసిన వార్షిక ఆధ్యాత్మిక సభలు

కుట్టు మిషన్ అందిస్తున్న పీఠాధిపతి ఉమర్ ఆలీషా

పిఠాపురం, న్యూస్‌టుడే: కాలానికి అతీతంగా ప్రయాణించే ఏ జీవీ సృష్టిలో మనుగడ సాగించలేదని పీఠాధిపతి డా.ఉమర్ ఆలీషా అన్నారు. పిఠాపురంలోని శ్రీ విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠంలో మూడు రోజులుగా జరుగుతున్న 98వ వార్షిక మహాసభలు బుధవారంతో ముగిశాయి. పీఠాధిపతి మాట్లాడుతూ సృష్టిలో ప్రతి ఒక్కరూ కాల పరీక్షకు అతీతులు కాదన్నారు. నామొక్క-నాశ్వాస కార్యక్రమంలో భాగంగా ప్రజలంతా ఒక్కో మొక్కను నాటి, పర్యవరణాన్ని పరిరక్షించాలని సూచించారు. ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ద్వారా కుట్టు మిషన్లు, రెడ్ క్రాస్ గ్రీన్ ఫీల్డ్ బ్లైండ్ పాఠశాలకు విద్యార్థులకు ఉపకార వేతనాలు, పక్షుల కొరంగా ధాన్యపు కుచ్చులు అందించారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, సినీ దర్శకుడు వంశీకృష్ణ, సినీ మ్యూజిక్ డైరెక్టర్ విజయ్ దంపతులు, పెద్దాపురం ఆర్డీవో కె.రమణి తదితరులు హాజరయ్యారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు

సర్పవరం, న్యూస్‌టుడే: పి.వెంకటాపురం (పండూరు) గ్రామంలోని డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల మహిళ పాఠశాల ప్లస్‌లో 5వ తరగతి, ఇంటర్మీడియట్‌లలో ప్రవేశాలు కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు కోరుతున్నామని ప్రిన్సిపల్ సీహెచ్ ఎంజీ పరిమళ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19వ తేదీ లోపు 6,7,8,9 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్లు కోసం కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 9440116298కు సంప్రదించాలని తెలిపారు.

దీన్‌దయాళ్‌కు నివాళి

వాకలపూడిలో నివాళులర్పిస్తున్న భాజపా నాయకులు

సర్పవరం, గొల్లప్రోలు, న్యూస్‌టుడే: వాకలపూడిలోని భాజపా కార్యాలయంలో బుధవారం పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని మాజీ భాజపా జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ● పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని గొల్లప్రోలు పట్టణ భాజపా కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు చిట్టా మధు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయాలి

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: ఈనెల 12న దేశవ్యాప్తంగా జరగనున్న సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని కోరుతూ ఎ.కె.మల్లవరంలో అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఏఐఎఫ్‌టియు) ఆధ్వర్యంలో ఉపాధి కూలీలు బుధవారం ప్రదర్శన నిర్వహించారు. ప్రధాన రహదారి, వివిధ వీధుల్లో నినాదాలు చేస్తూ ప్రదర్శన చేశారు. ముఖ్య అతిథిగా ఏఐఎఫ్‌టీయూ ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా ప్రధాన కార్యదర్శి కుంచే అంజిబాబు హాజరై మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా ప్రధాన కార్యదర్శి డి.నారాయణమూర్తి, కుంచే లక్ష్మి, అన్నపూర్ణ, పాప, వెంకటలక్ష్మి, నాగమణి, సత్యవేణి, అధికసంఖ్యలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

గృహోపకరణాలు దగ్ధం

సామర్లకోట, న్యూస్‌టుడే: విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. బుధవారం పట్టణంలోని గణపతి నగరంలో వాకపల్లి ఇమ్మానుయేల్ ఇంటిలో విద్యుత్తు హైవోల్టేజీతో షార్ట్‌సర్క్యూట్ సంభవించి గృహోపకరణాలు రిఫ్రిజిరేటర్, ఇన్వర్టర్, మిక్సీ, ఇతర సామగ్రి కాలిపోయాయి. అగ్నిమాపక అధికారులు, గౌడ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ శ్రీకాంత్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

సచివాలయాలకు ప్రింటర్ల పంపిణీ

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: గొల్లప్రోలు మండలంలోని సచివాలయాలకు వచ్చిన ప్రింటర్లను ఎంపీడీవో సలాట్ రాజు సిబ్బందికి అందజేశారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో వీటిని అందించారు. డిప్యూటీ ఎంపీడీవోలు కుమార్, వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం గ్రామీణ పోలీసు స్టేషన్ పరిధిలో రెండు రోజుల క్రితం విరవా నుంచి దివిలి వెళ్లే రోడ్డులో ఎస్సై జాన్‌బాషా తన సిబ్బందితో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. మద్యం తాగి వాహనం నడుపుతున్న ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసి, బుధవారం కోర్టులో హాజరుపరిచారు. సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ బొమ్మిడి భారతి ఏడు రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారని ఎస్సై తెలిపారు.

శివరాత్రి ఉత్సవాలకు ఇబ్బంది పెడుతున్నారంటూ నిరసన

సర్పవరం, న్యూస్‌టుడే: తిమ్మాపురం గ్రామంలోని విశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామి ఆలయం శివరాత్రి ఉత్సవాల నిర్వహణపై ఎన్నడూ లేనివిధంగా పోలీసులు జోక్యం చేసుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆ ఊరి శివాలయం వద్ద బుధవారం సర్పంచి, ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు బెజవాడ సత్యనారాయణ, భక్తులు నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ శివరాత్రి ఉత్సవాలు ప్రచారం చేస్తున్న ఆటో, మైక్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారన్నారు. ఉత్సవాల కోసం ముహూర్తపు రాట వేయకూడదని చెబుతున్నారన్నారు. దీనిపై ఎస్సై గణేష్‌కుమార్ మాట్లాడుతూ జనసేన, వైకాపా నాయకుల మధ్య ఉత్సవాల నిర్వహణలో విభేదాలు తలెత్తే అవకాశముందని ఈమేరకు 112కు ముగ్గురు ఫిర్యాదు చేయడంతో ఆలయ కమిటీతో మాట్లాడడం జరిగిందని తెలిపారు. గ్రామస్థులు అందరూ కలిసి శాంతియుతంగా ఉత్సవాలు జరుపుకోవాలని సూచించామని తెలిపారు.

ఆలయం వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

పారిశుద్ధ్య నిర్వహణపై ఆగ్రహం

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణపై ఆర్డీ నాగ నరసింహారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక ఇందిరానగర్, సీతారాంపురం, మాధవపురం రోడ్డు, మూడో వార్డుల్లో ఆయన, కమిషనర్ కనకారావు, పారిశుద్ధ్య అధికారి ప్రభాకర్ ఇతర సిబ్బంది పరిశీలించారు. చెత్త సరిగ్గా తొలగించపోవడం, కాలువలు శుభ్రంగా లేకపోవడం గుర్తించారు. సంబంధిత పారిశుద్ధ్య కార్యదర్శులకు ఛార్జిమెమోలు ఇస్తామన్నారు. పారిశుద్ధ్య సమస్యను మెరుగుపరచాలని పిఠాపురం అఖిలపక్ష కమిటీ నాయకులు కొవండేపూడి శంకరరావు, బగారు రామకృష్ణ, శ్రీకాంత్, శ్రీనివాస్ తదితరులు ఆయనకు వినతిపత్రాన్ని అందించారు.

కాలువను పరిశీలిస్తున్న ఆర్డీ నాగ నరసింహారావు

ఆర్థిక పరిపుష్టితోనే అభివృద్ధి

నూరుశాతం పన్నులు చెల్లింపునకు ప్రజలు సహకరించాలని ఆర్థిక పరిపుష్టి సాధిస్తేనే పురపాలికల అభివృద్ధి సాధ్యమవుతుందని మున్సిపల్ రిజీనల్ డైరెక్టర్ (ఆర్డీ) నాగ నరసింహారావు తెలిపారు. బుధవారం పిఠాపురం మున్సిపల్ కౌన్సిల్ హాలులో నాలుగు పురపాలికలు, రెండు నగర పంచాయతీల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇంటి పన్నుల వసూళ్లలో తుని 63 శాతం, పెద్దాపురం 60, పిఠాపురం 50, సామర్లకోట 55, ఏలేశ్వరం 52, గొల్లప్రోలు 52 పన్నులు వసూలైందన్నారు. ఏప్రిల్ నెలాఖరుకు నూరుశాతం వసూలు చేయాలని ఆదేశించినట్లు చెప్పారు.

రహదారి నిర్మాణానికి భూమి పూజ

తాళ్లరేవు: గ్రామాలకు అనుసంధాన రహదారుల నిర్మాణంతోనే రాకపోకలు సక్రమంగా సాగుతాయని తాళ్లరేవు జడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి సామ్యూల్ సాగర్ అన్నారు. జి.వేమవరం నుంచి అడివిపూడి వరకు ఉపాధి హామీ నిధులు రూ.1.50 కోట్లతో మూడున్నర కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణ పనులకు జడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి సామ్యూల్ సాగర్, సర్పంచి పుణ్యమంతుల సూరిబాబు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, ధూళిపూడి వెంకటరమణ, కట్టా త్రిమూర్తులు బుధవారం భూమి పూజ చేశారు.

పేరుకుపోయిన వ్యర్థాలు

కోరింగ పంచాయతీ చిననబొడ్డు వెంకటాయపాలెం ప్రధాన రహదారి చెంతనే ఉన్న విద్యుత్తు నియంత్రిక చుట్టూ ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. ఆ ప్రాంతంలోని ప్లాస్టిక్ సంచులు గాలికి ఎగిరి రహదారిపైకి వస్తున్నాయి. ఈ సమస్యను పంచాయతీ కార్యదర్శి సురేష్ దృష్టికి తీసుకు వెళ్లగా తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. -న్యూస్‌టుడే, తాళ్లరేవు

సామాన్య భక్తులకు మెరుగైన సౌకర్యాలు

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం పాదగయ క్షేత్రంలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలు విజయవంతం చేద్దామని ఆర్డీవో మల్లిబాబు పిలుపునిచ్చారు. బుధవారం కుక్కుటేశ్వరస్వామి ఆలయంలో వివిధ శాఖలతో సమీక్ష నిర్వహించారు. జనసేన పార్టీ ఫైవ్ మెన్ కమిటీ సభ్యులు డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ఓదూరి కిషోర్‌తోపాటు, పాదగయ మాజీ ఛైర్మన్లు కొండేపూడి ప్రకాష్, ఆగంటి ప్రభాకర్, ఈవో జగన్మోహన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. పుష్కరిణీ వద్ద ప్రత్యేక ఏర్పాట్లు, దివ్యాంగుల దర్శనానికి, వీఐపీ దర్శనాలకు అవసరమైన చర్యలు చేపడతామన్నారు. పాడా పీడీ శ్రీనివాసరావు, సీఐ శ్రీనివాస్, ఎంపీడీవో స్వప్న, కార్పొరేషన్ల రాష్ట్ర డెరెక్టర్లు చల్లా లక్ష్మీ, కంచర్ల భవానీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సూచనలిస్తున్న మాజీ పాదగయ ఛైర్మన్ ప్రకాష్

పురపాలిక ఎన్నికల్లో జనసేన సత్తా చాటాలి

పెద్దాపురం, న్యూస్‌టుడే: రానున్న పురపాలిక ఎన్నికల్లో జనసేన సత్తా చాటాలని డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి అన్నారు. బుధవారం సాయంత్రం పెద్దాపురం మండలం పులిమేరు గ్రామంలో పెద్దాపురం పట్టణ జనసేన నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అధిక సీట్లు గెలిచి కూటమి ప్రభుత్వానికి దిక్సూచి అవ్వాలన్నారు. నాయకులు పి.సత్తిబాబు, లక్ష్మణ్ దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.64 లక్షలతో అభివృద్ధి పనులు

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం మండలం కందరాడ గ్రామ అభివృద్ధికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎంతో కృషి చేస్తున్నారని కూటమి నాయకులు అన్నారు. బుధవారం ఎన్ఆర్ఈజీఎస్ నుంచి రూ.64 లక్షలతో చేపట్టే అభివృద్ధి రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ చొరవతో మౌలిక సదుపాయాలు మెరుగుపడుతున్నాయన్నారు.

పాదయాత్రగా కాకినాడ భక్తులు

పాదయాత్రగా భద్రాచలం చేరుకున్న భక్తులు

భద్రాచలం: కాకినాడ జిల్లా అచ్చంపేట సమీపంలోని గొంచాల గ్రామం నుంచి 3న ప్రారంభమైన శ్రీభద్రాద్రి దివ్య రథోత్సవ పాదయాత్ర బుధవారం భద్రాచలం చేరుకుంది. దాదాపు 300 మంది భక్తులు 270 కి.మీ. నడిచి ఈ పుణ్యక్షేత్రానికి చేరుకున్నారు. ఊరూరా కీర్తనలు ఆలపిస్తు భజనలు చేస్తూ భక్తిశ్రద్ధలతో ఇక్కడకు వచ్చి రామయ్యను దర్శించుకున్నారు. 2012 నుంచి ప్రతీ సంవత్సరం శ్రీరామ నవమికి ముందు పాదయాత్ర చేస్తున్నామని ఇది 15వ యాత్ర అని వాసుదేవ గురుస్వామి వివరించారు.

కట్టడి చేయక కాట్లు.. ఎన్నాళ్లీ అగచాట్లు

నెలలో 286 కేసుల నమోదు

సామర్లకోటలో గుంపులుగా తిరుగుతున్న శునకాలు

సామర్లకోట, న్యూస్‌టుడే: సామర్లకోట పట్టణంలో రోజురోజుకూ కుక్కకాటు కేసులు పెరుగుతున్నాయి. ఏ వీధిలో చూసినా శునకాలు గుంపులుగా సంచరిస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గతంలో కుక్కలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టేవారు. కుక్కల సంతానోత్పత్తిని అరికట్టేందుకు ప్రభుత్వం తీసుకున్న కు.ని కార్యక్రమం పూర్తిస్థాయిలో జరగకపోవడంతో వీధుల్లో గ్రామసింహాలు విచ్చలవిడిగా పెరిగిపోతున్నాయి.

రోజుకు సగటున 10 కేసుల నమోదు

సామర్లకోట సీహెచ్‌సీలో రోజుకు సుమారు 10 కేసులు నమోదవుతున్నాయి. ప్రధానంగా పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులు, వృద్ధులు, మోటారు సైకిళ్లపై వెళ్తున్నవారు అధిక సంఖ్యలో కుక్కకాటుకు గురవుతున్నారు. జనవరి 1 తేదీ నుంచి ఫిబ్రవరి 10 వరకు సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రిలో 286 కుక్కకాటు కేసులు నమోదయ్యాయి.

నియంత్రణకు కానరాని చర్యలు..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం కుక్కల సంతానోత్పత్తి జరగకుండా పట్టణాల్లో కుక్కలను గుర్తించి వాటికి కుటుంబ నియంత్రణ నిమిత్తం వ్యాక్సిన్లు, ఆపరేషన్లు చేయించాల్సి ఉంది. వాటికోసం ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు. సామర్లకోట పట్టణంలో 31 వార్డులు ఉన్నాయి. వార్డుకు సుమారుగా 100కు పైగా కుక్కలు సంచరిస్తున్నాయి. కేవలం కొన్నింటికి మాత్రమే కు.ని ఆపరేషన్లు చేయించారు. మిగిలిన వాటికి కార్యచరణ జరగకపోవడంతో రోజురోజుకూ పెరుగుతున్నాయి.

ఆపరేషన్లు చేయిస్తున్నాం

పట్టణంలో వీధికుక్కలను గుర్తించి సంతానోత్పత్తి జరగకుండా వాటికి ఆపరేషన్లు, వ్యాక్సిన్లు వేయిస్తున్నాం. సామర్లకోట పట్టణ పరిధిలో సుమారు 600 వీధి కుక్కలను గుర్తించాం. ఇప్పటివరకు సుమారు 220 కుక్కలకు ఆపరేషన్లు, వ్యాక్సిన్ వేయించాం. తిరిగి పట్టణంలో విడిచిపెట్టాం. మిగిలిన వాటికి దశలవారీగా కాకినాడకు తరలించి ఆపరేషన్లు చేయిస్తాం. - శ్రీవిద్య, పురపాలిక కమిషనర్ సామర్లకోట

వేలం ప్రకటన

మహారాజశ్రీ 3వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో :: కాకినాడ

E.P.No.30/2024 in O.S.No.91/2018

Between:
1) పాకలపాటి వెంకట సీతారామ చంద్ర సుబ్బరాజు
2) మంతెన శాంతి ...DHrs

and

1) కాకర్లపూడి చక్రధర రాజు
2) కాకర్లపూడి మీనాక్షి ...JDrs

పై నెంబరు అమలు గ్రంథములో JDrs వద్ద నుండి DHrsకు రావలసిన డిక్రీ బాకీకి గాను JDrs తాలూకు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని వేలపు యిస్తేహార్లు షరతులకు లోబడి ది.02-03-2026 తేదీన ఉదయం గం॥ 10.30 ని॥ల లగాయితూ పై శ్రీ కోర్టువారి ఎదుట బహిరంగ వేలం వేయుదురు. పాడదలచినవారు పచ్చి సదరు వేలం పాటనందు పాల్గొని పాడుకోవలెను. వివరముల కొరకు పై శ్రీకోర్టు నజారత్ నందు గాని, DHrs అడ్వకేటు గారి ఆఫీసు నందు గాని తెలుసుకొనవలెను.

SCHEDULE: East Godavari District, Tallarevu Sub-Registry, Tallarevu Mandal, Korangi Village, Zerioti, Dry Land situated in R.S.No.401, in an extent of Ac.5.60 cents, which was devided into Plots as Layout Plan No.19/6/R, Plot No.32, an extent of 244.44 square yards, is bounded by:
East: Road, South: Plot No.31, West: Plot No.22, North: Plot No.33, with all fruit, bearing trees and easementary rights etc., thereon

DHr Value: Rs. 6,84,432/-
Amin's Value: Rs.19,55,520/-, JDr Value: Not given

K.తాతంరాజు, G.అర్జున బాబు
G.శ్రీనివాసరావు అడ్వకేట్స్
డో.నెం.68-8-15/5బి, అశోక్‌నగర్
కాకినాడ-3, సెల్: 9246692669

మహారాజశ్రీ పిఠాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P.4/2024 in O.S.125/2018

Between:
బొడిరెడ్డి రాముడు ...DHR
And
కోట సత్యవతి ...JDR

పై నెంబరు E.P.లో DHR గారి డిక్రీ బాకీని JDR గారు తీర్చనందున JDR గార్కి చెందిన ఈ క్రింది షెడ్యూల్ ఆస్తి వేలం వేసి తన బాకీని తీర్చుకొనేటందుకు పై కోర్టు వారు అనుమతి ఇచ్చినందున శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం ఆసక్తి గల పాటదారులు ది.21-02-2026వ తేదీన పై కోర్టు ఆవరణలో జరిగే వేలంపాటలో కోర్టువారి షరతులకు లోబడి ఉదయం 10.30 నిమిషములకు హాజరు అయి పాట పాడుకొనవచ్చును.

షెడ్యూల్

పూర్వము తూర్పుగోదావరి జిల్లా, ప్రస్తుతం కాకినాడ జిల్లా, పిఠాపురం సబ్-రిజిస్ట్రీ, పిఠాపురం మునిసిపాలిటీ, S.No.154/5, D.No.9-4-110 కి దగ్గర R.CC. డాబా బిల్డింగ్, ఖాళీ స్థలం D.No.9-4-109/ఎ 196 Sq. Yds or 162.68 Sq. Mts. మధ్య గల దానికి హద్దులు. తూర్పు: సూర్యారావు వగైరాల ఖాళీ స్థలం (33 అడుగులు); దక్షిణం: ఐసరప్పు సుబ్బాయి వగైరాల ఖాళీ స్థలం (D.No.9-4-110) 53 అడుగుల 4 అంగుళాలు; పడమర: 9 అడుగుల 4 అంగుళాలు - దారితో (33 అడుగులు); ఉత్తరం: గోపి గారి ఖాళీ స్థలం (53 అడుగుల 4 అంగుళాలు)
పై హద్దుల మధ్య గల బిల్డింగ్ ఖాళీ స్థలం 196 Sq. Yds or 162.68 Sq. Mts.

DHR విలువ = Rs. 6,00,000/-
JDR విలువ = చూపించియుండలేదు
అమీనా విలువ = Rs. 45,00,000/-

(పూర్తి వివరములకు కోర్టువారి అమీనాగార్ని గానీ, ఈ క్రింది తెలిపిన న్యాయవాదిని గాని కలుసుకొని తెలుసుకొనవచ్చును.)

కొత్త కోట సత్య సూర్యనారాయణ (కొత్త సురేష్)
న్యాయవాది, పిఠాపురం

అమృతమూర్తికి అశ్రునివాళి

మంచికి, మానవత్వానికి మారుపేరుగా నిలిచి, మా అందరికీ ప్రేమానురాగాలు పంచి, మమ్మల్ని కంటి పాపలా కాపాడి, మా ఉన్నతి కొరకై అహర్నిశలూ పాటుపడి, మాకు మార్గదర్శకులుగా నిలిచిన అమృతమూర్తి శ్రీ రావు రాయన్నారావు గారు మమ్మల్ని విడిచి దైవసన్నిధికి చేరినారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కీ॥శే॥శ్రీ రావు రాయన్నారావు గారు
Ex. ఛైర్మన్, సూపర్‌బజార్, కాకినాడ
జననం: 01-01-1949, మరణం: 03-02-2026

భార్య: శ్రీమతి రావు నీరజ

కుమారుడు: రావు శ్రీనివాసరావు - కోడలు: దీప్తి, మనుమడు: అభినవ్
శ్రేయోభిలాషి: K.V.P.రామచంద్రరావు, Ex.పార్లమెంటుసభ్యులు
మరియు బంధుమిత్రులు

పెద్దకార్యం: ది.14-02-2026న స్థిరవారం, కాకినాడ, వాకలపూడిలో వేదిక ఫంక్షన్ హాలు నందు జరుపబడును.

यूनियन बैंक ऑफ़ इंडिया Union Bank of India

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
రమణయ్యపేట బ్రాంచి, గంగరాజు నగర్, కాకినాడ.

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(1))

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 ప్రకారము యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క అధీకృత అధికారి అయిన ఈ సంతకందారుడు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 నందలి సెక్షన్ 13(12)కు అనుబంధమైన నిబంధన 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో ఋణగ్రహీత/హామీదారు/సహఋణగ్రహీత: 1. మెస్సర్స్ శ్రీ వీరభద్ర ఏజెన్సీస్ ప్రాతినిధ్యం వహిస్తున్నవారు శ్రీ బస్వా కొండలరావు, 2) శ్రీ బస్వా కొండలరావు, తండ్రి: రాజయ్య, 3. శ్రీ మోటూరి లోకేశ్వరరావు, తండ్రి: రాజారావు వారు చెల్లించవలసిన బకాయిమొత్తం రూ.52,55,589.00 (అక్షరాల యాభై రెండు లక్షల యాభై ఐదు వేల ఐదు వందల ఎనభై తొమ్మిది రూపాయలు మాత్రమే) మరియు పునరుద్ధరించబడని వడ్డీ సదరు నోటీసు తేదీ నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా తేది.03.10.2025 న డిమాండ్ నోటీసు జారీచేయడమైనది.

ఋణగ్రహీత మరియు హామీదారులు సదరు బకాయిసొమ్మును తిరిగి చెల్లించడంలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారుడు సదరు చట్టములోని సెక్షన్ 13(4)కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి రూలు 8 ప్రకారము తేది.07 ఫిబ్రవరి 2026 న దిగువ పేర్కొన్న ఆస్తిని స్వాధీనత తీసుకోవడమైనదని ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ముఖ్యంగా ఋణగ్రహీత/హామీదారును మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తులతో ఎవరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదనియు మరియు సదరు ఆస్తులతో జరిపే ఏ లావాదేవీలైనా బకాయిమొత్తం రూ.52,55,589.00 (అక్షరాల యాభై రెండు లక్షల యాభై ఐదు వేల ఐదు వందల ఎనభై తొమ్మిది రూపాయలు మాత్రమే) వడ్డీ మొ॥ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి ఛార్జీకి లోబడి ఉంటాయి.

సెక్షన్ 13(8) చట్టం ప్రకారము ఋణగ్రహీత మరియు హామీదారు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరు.

తనఖాపుంచిన ఆస్తి వివరములు

పూర్వము తూర్పు గోదావరి జిల్లా, ప్రస్తుతము కాకినాడ జిల్లా, పూర్వము కాకినాడ సబ్-రిజిస్ట్రీ, ప్రస్తుతం సర్పవరం సబ్-రిజిస్ట్రీ, సర్పవరం గ్రామము మరియు గ్రామపంచాయతీ, బ్లాకు నెం. 5, సర్వే నెం.14/4 నందు మొత్తం ఎ॥1.52 సెంట్లలలో మధ్యస్థముగా ఎ॥ 0.52 సెంట్లు లేదా 1210.00 చ॥గ॥ స్థలము ఈ దిగువ హద్దులలో: తూర్పు: బస్వా సత్తిబాబు గారికి చెందిన ఆస్తి, పడమర: బస్వా దేవి ప్రసాద్ గారికి చెందిన ఆస్తి, ఉత్తరం: కె.పరలక్ష్మి గారికి చెందిన ఆస్తి, దక్షిణం: పుంత.

తేది: 07.02.2026
ప్రదేశం: కాకినాడ
సం/- ఛీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి

పన్ను బకాయిలు వసూలు చేయాలి

ఇంటి పన్ను వివరాలు అడుగుతున్న డివిజన్ అభివృద్ధి అధికారి శ్యామల

తొండంగి, న్యూస్‌టుడే: ఈ నెలాఖరుకు మండలవ్యాప్తంగా ఉన్న ఇంటి పన్ను బకాయిలు వసూలు చేయాలని పెద్దాపురం డివిజన్ అభివృద్ధి అధికారి ఎం.శ్యామల అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో డిప్యూటీ ఎంపీడీవో ఆర్ఎస్ మూర్తి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆమె బకాయిలు, వసూలైన వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యదర్శులు రాము, అప్పారావు, సూరిబాబు, విశ్వాస్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తుని

• తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

అన్నవరం: అన్నవరం దేవస్థానంలో కోటి తులసి పత్రి పూజ మహోత్సవం జరుగుతోంది. బుధవారం ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తుని పట్టణానికి చెందిన శ్రీ గౌరీ పాండురంగ భక్త బృందం సభ్యులు భక్తి సంకీర్తనలకు కోలాటం నృత్యం చేసి స్వామిని సేవించారు. భక్తబృందాలకు డిప్యూటీ కమిషనర్ బాబూరావు, పీఆర్వో అనకాపల్లి ప్రసాద్, సీనియర్ అసిస్టెంటు గణపతిల చేతుల మీదుగా సత్కరించి చిత్రపటం అందించి అభినందించారు. ఈ నెల 15 వరకు పూజ జరగనుంది. చివరి రోజు రుద్రహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలకు ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

బృంద సభ్యులను అభినందిస్తున్న అధికారులు

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946, ప్రత్తిపాడు: 9866962946 జగ్గంపేట: 8008622066

ఉ॥ 10 - మ॥ 1

కొళాయి నీరు అందించాలి

సమస్య: జి.కొత్తపల్లి గ్రామంలో కాలనీలో కొళాయిల ద్వారా తాగునీరు అందడం లేదు. – శ్రీనివాస్, స్థానికుడు.

సమాధానం: గ్రామంలో వాటర్ ట్యాంకు నిర్మాణం పూర్తి అయ్యింది. విద్యుత్తు కనెక్షన్ ఏర్పాటు చేయాల్సి ఉంది. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తాం. – వీరబాబు, పంచాయతీ కార్యదర్శి, జి.కొత్తపల్లి. న్యూస్‌టుడే, శంఖవరం

వయోజనులు విద్యావంతులు కావాలి

జగ్గంపేట గ్రామీణం: వయోజనులు అందరూ విద్యావంతులు అయ్యేందుకు 'అక్షర ఆంధ్ర' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం ఉమామహేశ్వరరావు అన్నారు. మండల సమాఖ్య కార్యాలయంలో గ్రామ సంఘాల వారీగా స్వచ్ఛందంగా పనిచేస్తున్న వాలంటీర్లకు పుస్తకాలు, పెన్సిళ్లు, ఇతర సామగ్రిని అందజేశారు. ప్రభుత్వం సమకూర్చిన పుస్తకాలతో పెద్ద వయస్సు ఉన్న నిరక్షరాస్యులు అక్షరాలు నేర్చుకోవడం, రాయడం సులభతరం అవుతుందన్నారు.

ఎవరి భద్రత వారిదే..!

• ఏలేరు కాలువ చెంత చింతే..

• శివరాత్రి తీర్థస్నానాలకు ఏర్పాట్లు కరవు

పరిశీలన

న్యూస్‌టుడే– ప్రత్తిపాడు, ఏలేశ్వరం, జగ్గంపేట గ్రామీణం, తుని, రౌతులపూడి, శంఖవరం

శివరాత్రి రోజున తీర్థస్నానాలను పరమపవిత్రంగా భక్తులు భావిస్తారు. మెట్టలోని ఏలేరు జలాశయం, కాలువలు, కొండల్లోని జలధారలు. ఏటా వేలాది మందిని స్వాగతిస్తున్నాయి. ఎవరి భద్రత వారు చూసుకోవడం తప్ప భక్తులకు తగ్గట్టుగా పక్కా ఏర్పాట్లు లేవు. ప్రత్తిపాడు, జగ్గంపేట, తుని నియోజకవర్గాల్లోని తీర్థస్నానాలు చేసే ప్రదేశాల్లో ఏర్పాట్లు వెక్కిరిస్తూనే ఉన్నాయి. 'న్యూస్‌టుడే' ప్రతినిధుల పరిశీలనలో ప్రస్తుత స్థితిగతులు..

అప్పనపాలెం వద్ద ఏలేరు కాలువకు ఓవైపు రేవు తీరిది..

రెండే రేవులు..ఎన్నో వెతలు..

గోదావరి, సముద్ర స్నానాల తర్వాత జిల్లాలో ఏలేశ్వరంలోని ఏలేరు జలాల్లో భక్తులు మూడు మునకలు వేయడానికే ప్రాధాన్యమిస్తారు. పట్టణం సమీపంలో ఏలేరు కాలువ వెంబడి అప్పనపాలెం వద్ద 50 వేల మందికి పైగా స్నానాలకు వస్తారు. శివరాత్రి ముందు 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తారు. ఈప్రదేశంలో కాలువకు అటూ ఇటూ రెండు రేవులు ఇప్పటికీ పక్కాగా లేవు. మరోపక్క కాలువలో అపరిశుభ్రతను ప్రవాహమే తొలగించాలి. రేవులు దెబ్బతినగా కనీస మరమ్మతులు చేయలేదు. నగర పంచాయతీ పాలకవర్గం చర్చించడం తప్ప శాశ్వత సౌకర్యాలు సమకూర్చలేదు.

అపరిశుభ్రంగాఏలేరు: ఇక్కడే పుణ్యస్నానాలు చేయాలి..

జర జాగ్రత్త..

ఇక్కడ స్నానాలకు వచ్చే ప్రతి ఒక్కరు ప్రమాదకరంగా ఉన్న అప్పనపాలెం వంతెనను దాటాలి. మెట్టప్రాంతంలో పాటు ఏజెన్సీ నుంచి ఇక్కడికే స్నానానికి వస్తారు. కాలువలో పలు చోట్ల ఇసుక తవ్వకాలకు గోతులు పెట్టి వదిలేశారు. ప్రవాహంలో వీటిని గుర్తించడం కష్టమే.

ఇర్రిపాకలో ఇలా..

జగ్గంపేట మండలంలో ఏలేరు కాలువ వెంబడి ఇర్రిపాకలో 10 వేల మంది పైనే శివరాత్రికి తీర్థస్నానాలు చేస్తారు. శివకేశవుల ఆలయం వద్ద జల్లు స్నానఘట్టం భక్తులకు సౌకర్యంగానే ఉన్నా కాలువ చెంత పక్కా రేవు నిర్మించాల్సి ఉంది. కాలువను ఆనుకుని ప్రతిష్ఠించిన ద్వాదశ జ్యోతిర్లింగాలు ఇక్కడ ప్రత్యేకత.

ఇర్రిపాకలో ఏలేరు కాలువ చెంత ద్వాదశ లింగాలు..

ధార క్షేత్రాలకు వెళ్లే బాట బాగులేదు..

ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి మండలాల్లోని కొండల్లో జలధారలు తీర్థస్థలాలై ఉన్నాయి. ఎరకంపాలెం, దారపల్లికి వెళ్లే దారి అభివృద్ధికి నోచలేదు. ఈ ప్రదేశాలకు నిత్యం సందర్శకులు వస్తుండడంతో ప్లాస్టిక్ వ్యర్థాలు ఇతర చెత్తతో ఇబ్బందిగా ఉన్నాయి. వేళంగి, [illegible] తదితర ధార క్షేత్రాల వద్ద ఏర్పాట్లు పర్యవేక్షించాలి.

నిరంతర నిఘా..

ఏలేరు స్నానాలకు వచ్చేవారి కోసం సర్కిల్ పరిధిలోని పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తాం. ట్రాఫిక్ నియంత్రణ నుంచి స్నానాలు చేసే ప్రతి ప్రదేశంలోనూ పహరా కాస్తాం. తోపులాటలకు తావివ్వకుండా బాధ్యతాయుతంగా, భక్తితో వచ్చి వెళ్లాలి. బి.సూర్యఅప్పారావు, ప్రత్తిపాడు సీఐ

ఘాట్లు.. ప్రమాద ఘంటికలు

తాండవ నదిలో పట్టణంలోని కట్రాళ్లమాల వద్ద ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. కొండపై ఉన్న శివాలయం, అయ్యప్ప, వినాయక ఆలయాలకు పెద్ద సంఖ్యలో భక్తులు వస్తున్నారు. అనేక మంది స్నానాలు ఆచరించడానికి, దీపాలు వదిలేందుకు నదిలోకి దిగుతున్నారు. అయితే ఇక్కడ పూర్తిస్థాయిలో బారికేడ్లు, విద్యుత్తు దీపాలు ఇతర సౌకర్యాలు లేవు. తుని - కుమ్మరిలోవ రోడ్డులో ఈ ప్రాంతం ఇరుకుగా ఉండటంతో భారీ వాహనాల రద్దీ వేళల్లో భక్తులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. గవరపేట శివాలయం ప్రాంగణం ఇరుకుగా ఉంది. ఆలయ కమిటీలు, పోలీసు, పురపాలక అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలి.

తుని కట్రాళ్ల వద్ద తాండవ నదిలో ఘాట్

ముస్తాబవుతున్న శివాలయాలు

తొండంగి, న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా ఆయా గ్రామాల ఆలయ కమిటీల ఆధ్వర్యంలో శివాలయాలు ముస్తాబవుతున్నాయి. ఒంటిమామిడి, తొండంగి, ఎ.కొత్తపల్లి, బెండపూడి, పీఈచిన్నాయిపాలెం, శృంగవృక్షం శివాలయాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాటు చేస్తున్నారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా దానవాయిపేట, పెరుమాళ్లపురం సముద్ర తీరాల వద్దకు భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు పెద్ద ఎత్తున తరలివస్తారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఈ తీరాల వద్ద అధికారులు ఏర్పాట్లు చేయాల్సిన అవసరముంది. మహిళలు స్నానమాచరించి దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి.

దీన్‌దయాళ్ సేవలు ఎనలేనివి

దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్న భాజపా నాయకులు.

కిర్లంపూడి, న్యూస్‌టుడే: దేశ రాజకీయాల్లో ఏకాత్మ మానవతావాదం అనే సిద్ధాంతాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన గొప్పదార్శనికుడు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అని మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు అల్లు శివరామకృష్ణ పేర్కొన్నారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి కార్యక్రమాన్ని కిర్లంపూడిలోని మండల భాజపా కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. నాయకులు శరకణం రాజబాబు, కంతా కాశీవిశ్వనాధం, తామరాడ ఎంపీటీసీ సభ్యుడు గోకాడ రాజా తదితరులు పాల్గొన్నారు.

దారులన్నీ మరియగిరికి..

• ఘనంగా యాత్రా మహోత్సవం

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే:

మరియగిరి..లూర్దుమాత యాత్రా ఉత్సవాలతో ప్రత్తిపాడు నియోజకవర్గం కేంద్రం జనసంద్రం అయింది. దారులన్నీ మరియగిరికి వచ్చే జనంతో కిటకిటలాడాయి. ప్రార్థనలు, బాణసంచా కాల్పులు, సాంస్కృతిక అంశాలతో లూర్దుమాత నిలువ రూపాల విగ్రహాలతో పూల తేరుపై పురప్రదక్షిణ అందరినీ ఆకట్టుకుంది. దారి పొడవునా సందర్శకుల కోసం ఏర్పాట్లు చేశారు. కాంగ్రెస్ నాయకుడు దాసరి సత్తిబాబు, దరజాలకోట శ్రీను తదితరులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్‌సీఎం చర్చి కమిటీ డి.వసంత, రామవ, రమేష్, జేగంట, పద్దరాజు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పురప్రదక్షిణలో ఖాదీబోర్డు వైస్‌ఛైర్మన్ కన్నబాబు, చర్చి ఫాదర్ తదితరులు

నేటి సమ్మెను విజయవంతం చేయాలి

జడ్.రాగంపేటలో నిర్వహించిన సమావేశంలో కార్మికులు

జగ్గంపేట గ్రామీణం, గండేపల్లి, రౌతులపూడి: కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్‌కోడ్లను వ్యతిరేకిస్తూ గురువారం దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. సమ్మె గోడపత్రికలను దుకాణాల యజమానులకు అందజేశారు. రౌతులపూడిలో ప్రదర్శన చేశారు. యూనియన్ కార్యదర్శి సుజాత, కృపాబాయి, జ్యోతిశ్రీ, రైతుకూలి సంఘం జిల్లా నాయకుడు కర్నాకుల రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

'ఎస్సై వేధిస్తున్నారు..'

తుని, న్యూస్‌టుడే: తొండంగి ఎస్సై జగన్‌మోహన్ అకారణంగా వేధిస్తున్నారని తెదేపా నాయకుడు, మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు కోడా వెంకట రమణ ఆరోపించారు. పట్టణంలోని మార్కెట్‌యార్డు ఆవరణలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఇటుక తయారీ పరిశ్రమకు డబ్బులు చెల్లించి, రశీదులు పొంది గోదావరి ఇసుకను తీసుకువచ్చానన్నారు. అయినా వాటిని పట్టించుకోకుండా ఎస్సై ఇబ్బందికి గురిచేస్తున్నారన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానన్నారు.

చిన్నారులకు ప్రత్యేక వ్యాయామాలు

చిన్నారులకు వ్యాయామం చేస్తున్న సోమేశ్వరరావు

కోటనందూరు, న్యూస్‌టుడే: కోటనందూరులోని నాన్ భవిత కేంద్రంలో చిన్నారులకు ప్రత్యేక ఫిజియోథెరపీ శిబిరం బుధవారం నిర్వహించారు. వైద్యుడు సోమేశ్వరరావు ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులతో వ్యాయామాలు చేయించారు. ఐఈఆర్‌పీలు గోవింద్, నారాయణరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఇసుక నిల్వలు సీజ్

తొండంగి: యల్లయ్యపేటలో అనధికారికంగా ఉన్న ఇసుక నిల్వలను సీజ్ చేసినట్లు తొండంగి ఎస్సై జగన్మోహనరావు తెలిపారు. ఎస్సై బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన కోడ వెంకట రమణ గోదావరి ఇసుకను గ్రామ శివారులో నిల్వ చేసి అందులో బొండు ఇసుకను కలిపి అమ్ముతున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ కాంతారావుతో కలిసి ఆ నిల్వలను స్వాధీనం చేసుకుని మైనింగ్ శాఖకు అప్పగించామన్నారు.

దొంగలుంటారు..జాగ్రత్త!

తనిఖీలు, దర్యాప్తు కాదు.. ప్రయాణికుల భద్రత కోసం పోలీసుల ప్రయత్నం ఇది. ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్తిపాడు సీఐ సూర్యఅప్పారావు, ఎస్సై లక్ష్మీకాంతం, సిబ్బంది బస్‌స్టేషన్లు, బస్సుల్లోనూ ప్రచారం చేశారు. బస్సుల్లో జరుగుతున్న దొంగతనాలను దృష్టిలో ఉంచుకుని ప్రయాణికులను నేరుగా కలిసి అప్రమత్తం చేశారు. ప్రయాణాల్లో జరిగే దొంగతనాల తీరును వివరిస్తూ విలువైన వస్తువులు, ఇతర సామగ్రిని జాగ్రత్తగా ఉంచుకోవాలని ప్రయాణికులను కోరారు. తెలియని వారి ఏ చర్యనైనా అనుమానించాలని సూచించారు. బస్‌స్టేషన్లలో పోలీసులు మైకుల ద్వారా భద్రత ప్రకటనలు ఇస్తున్నారు. దొంగల వివరాలను ప్రదర్శించారు.

– న్యూస్‌టుడే, ప్రత్తిపాడు

వసతులు కల్పించరూ..!

కేఈ చిన్నాయిపాలెంలో సంత నిర్వహణకు షెడ్లు లేకపోవటంతో వ్యాపారస్తులు, కొనుగోలుదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేక స్థలం కేటాయించి షెడ్లు ఏర్పాటు చేయవలసిందిగా వ్యాపారస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కోటనందూరు

సీసీ రోడ్డు వేశారు... కల్వర్టు మరిచారు

ఉపాధి నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు సాగుతున్నాయి. కొన్ని గ్రామాల్లో చేపట్టిన ఈ పనులు వల్ల ప్రజలకు అంతరాయం కలుగుతోంది. ఈ పరిస్థితుల్లో అటికివానిపాలెం గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డు ప్రధాన రహదారికి అనుసంధానం చేసేందుకు చేపట్టాల్సిన కల్వర్టు నిర్మాణం చేపట్టకపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని స్థానికులు వాపోతున్నారు. – న్యూస్‌టుడే, తుని గ్రామీణం

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా భవనాలు

తుని పట్టణంలోని పురాతన, అసంపూర్తి భవనాలు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయి. ఆర్ ఎస్ పేటలో కొన్నేళ్లుగా తహసీల్దారు కార్యాలయం కొత్త భవనం పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. సీతారాంపురంలో టెలికామ్ క్వార్టర్స్ శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా ఉన్నాయి. పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, తుని

శెభాష్ కెవిన్...

రోలర్ స్కేటింగ్ జాతీయ స్థాయిలో ప్రతిభచూపిన విద్యార్థి కెవిన్‌ను శాప్, ఆర్ఎస్ఎఫ్ఐ అధికారులు అభినందించారు. విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో కెవిన్‌కు పతకం అందించారు. పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఈ విద్యార్థి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఐదు బంగారు, రజత పతకాలు సాధించాడు. ఏప్రిల్‌లో జరిగే అంతర్జాతీయ ఎంపికల కోసం శిక్షణ పొందుతున్నాడు. – న్యూస్‌టుడే, తుని పట్టణం

తునిలో ఫుడ్‌ట్రాక్ ప్రారంభం

ప్రారంభిస్తున్న స్టేషన్ సూపరింటెండెంట్ బెహ్రా

తుని, న్యూస్‌టుడే: రైల్వేస్టేషన్ ఆవరణలో ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో ఫుడ్‌ట్రాక్ బుధవారం ప్రారంభమైంది. ప్రయాణికులకు 24 గంటలు రుచికరమైన ఆహార పదార్థాలు పరిశుభ్రమైన వాతావరణంలో అందించేలా దీనిని సిద్ధం చేశారు. స్టేషన్ సూపరింటెండెంట్ బెహ్రా, ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్ ఎం.రాజా, కొల్లాబత్తుల దిలీప్, పెంటకోట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సార్లంక మహిళల ఆర్థిక పరిస్థితిపై ఆరా

మహిళలతో సమావేశమైన వెలుగు సిబ్బంది

రౌతులపూడి, న్యూస్‌టుడే: ఘోర అగ్నిప్రమాదానికి గురైన సార్లంక గ్రామంలో బుధవారం డీఆర్‌డీఏ - వెలుగు సిబ్బంది పర్యటించి ఆప్రాంత మహిళల ఆర్థిక స్థితిపై ఆరా తీశారు. ఏపీఎం త్రినాధమ్మ, సీసీలు నాగమణి, అప్పలకొండ, రత్నరాజుల బృందం ప్రమాదానికి గురైన ఇళ్లను పరిశీలించారు. గ్రామంలో 59 కుటుంబాలకు సంబంధించి నాలుగు మహిళా సంఘాలున్నాయని త్రినాధమ్మ తెలిపారు. సంఘంలో లేని పది మందిని గుర్తించామని, వారికి కొత్త సంఘం ఏర్పాటుచేస్తున్నామన్నారు. సంఘాల సభ్యులకు బ్యాంకు లింకేజి రుణాలు మంజూరుకు సహకరిస్తామన్నారు. ఉన్నతి నిధుల ద్వారా మూడు సంఘాలకు వడ్డీ లేకుండా రూ.15 లక్షలు రుణ మంజూరుకు అవకాశం ఉందన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న నాయకులు

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: సమాజంలో పురుషులతో పాటు మహిళలు అన్నిరంగాల్లో పోటీపడుతున్నారని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ అన్నారు. అంతర్జాతీయ మహిళా సైన్సు దినోత్సవం బుధవారం జగ్గంపేట ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. సైన్స్ ఉపాధ్యాయురాలు హుస్నార్‌బేగంను ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు సత్యనారాయణమూర్తి, వందన యూత్‌వాలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షులు పులి ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చేర్పండి..

చిన్నారుల వివరాలు సేకరిస్తున్న ఉపాధ్యాయులు

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: సి.రాయవరం జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ప్రవేశాల కోసం బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఐదేళ్లు నిండిన చిన్నారుల వివరాలు నమోదు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించే సౌకర్యాలను వివరించారు. సర్కారు బడుల్లో చదివించాలని తల్లిదండ్రులను కోరారు. హెచ్ఎం లాజరస్, టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నరేగాను యథావిధిగా ఉంచండి

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ఎన్డీయే ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని (నరేగా) నిర్వీర్యం చేస్తుందని రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. రామవరం శివారు రంగవల్లినగర్‌లో కర్నాకుల మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొత్త చట్టాన్ని రద్దు చేసి యథావిధిగా అమలు చేయాలని ఏడాదికి 200 పనిదినాలు కల్పించి రోజు కూలీ రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అవీ ఇవీ అన్నీ

పోలీసులకు ఏకరూప దుస్తులు అందజేత

కిర్లంపూడి: కిర్లంపూడి పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బందికి జగ్గంపేట మార్కెట్‌కమిటీ డైరెక్టరు, కృష్ణవరం తెదేపా నాయకులు బొదిరెడ్ల సుబ్బారావు సొంతఖర్చులతో సమకూర్చిన ఏకరూప దుస్తులను సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ సిబ్బందికి బుధవారం అందజేశారు. స్టేషన్‌లో పనిచేస్తున్న మొత్తం సిబ్బందికి నూతన వాస్త్రాలు సమకూర్చిన సుబ్బారావును సీఐ, ఎస్సై అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు భూపాలపట్నం ప్రసాద్, చదరం చంటిబాబు, సొసైటీ అధ్యక్షులు తోట గాంధీ, కుర్ల చిన్నబాబు, తూము కుమార్, చదరం చంటిబాబు తదితర నాయకులు పాల్గొన్నారు.

ఏకీకృత సర్వేను వేగవంతం చేయాలి

గండేపల్లి: ఏకీకృత సర్వేను వేగవంతం చేయ్యాలని ఎంపీడీవో హరికృష్ణసత్యరెడ్డి అన్నారు. ఉప్పలపాడులో ఏకీకృత (కుటుంబ) సర్వేను ఎంపీడీవో పరిశీలించారు. డిప్యూటీ ఎంపీడీవో, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలతో ఉన్నతంగా ఎదగాలి

గండేపల్లి: ప్రభుత్వం అందించే పూర్తి రాయితీతో వ్యాపారంలో ఉన్నతంగా ఎదగాలని గండేపల్లి గ్రామపార్టీ అధ్యక్షుడు బొల్లంరెడ్డి రామకృష్ణ అన్నారు. గండేపల్లి ఎస్ఈఆర్పీ వారి సౌజన్యంతో రూ.50వేల రాయితీతో ప్రభుత్వం కటకం ధనలక్ష్మికి అందజేశారన్నారు. ఈ ఎగ్‌మార్ట్‌ను ప్రజలు ఉపయోగించుకుంటూ ప్రతి ఒక్కరూ రోజుకి రెండు గుడ్డులు తినాలని అన్నారు. నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

లేగ దూడల ప్రదర్శన

రౌతులపూడి: లచ్చిరెడ్డిపాలెం గ్రామంలో బుధవారం లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. 55 దూడలను ప్రదర్శనలో ఉంచగా వాటిలో ఆరగ్యోవంతమైన దూడలను గుర్తించి మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. వైద్యులు కల్యాణి, రామ్మోహన్, సాత్విక 48 పశువులకు గర్భకోశ వ్యాధి, చూడి నిర్ధారణ పరీక్షలు చేశారు. ఏడీఏ మనోజ్‌కుమార్, కాంతారావు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

సేవా సంస్థకు పురస్కారం

తుని: సేవా కార్యక్రమాలు విస్తృతం చేపట్టినందుకు సూర్యోదయ సేవా సంస్థకు అల్లూరి సీతారామరాజు జాతీయ సేవా పురస్కారం దక్కింది. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో మదర్ సర్వీస్ సొసైటీ ద్వారా ఈ అవార్డును సేవా సంస్థ ప్రతినిధులకు అందించారు.

ఆశ్రమానికి చేయూత

ఆశ్రమంలో నిత్యావసరాలు అందిస్తున్న దుర్గారావు తదితరులు

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: మార్స్ కంప్యూటర్స్ అధినేత అడపా దుర్గారావు ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం సేవా కార్యక్రమాలు జరిగాయి. స్వామి దయానంద ఆశ్రమానికి బియ్యం, నిత్యావసరాలను అందజేశారు. శివాలయం వద్ద పేదలకు అన్నదానం చేశారు. తన తల్లిపేరిట ఏటా దుర్గారావు ఈ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

నాయకుల విభేదాలతో ఉపాధి పనికి గండి

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: గజ్జనపూడిలో ఉపాధి పనులు చేపట్టడానికి ఇద్దరు గ్రామ నాయకుల విభేదాలు అడ్డంకిగా మారాయి. ఫలితంగా గత ఐదు నెలలుగా పని కల్పించలేని పరిస్థితి. గ్రామంలో 300 మంది కూలీలు ఉండగా 100 మంది కూలీలు చెరువు పనిచేసేందుకు బుధవారం వెళ్లారు. ఓ నాయకుడి అభ్యంతరం వల్ల పనుల్లోకి వెళ్లిన వారు వెనుదిరగాల్సివచ్చింది. దీనికి అధికారులు వివరణ ఇస్తూ గ్రామంలో మస్తరు సిద్ధం కాలేదని చెపుతున్నారు. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామంలోని ఇద్దరు తెదేపా నాయకుల మధ్య సఖ్యత లోపించడం వల్ల ఈ పరిస్థితి వచ్చిందని అంటున్నారు. గతంలోనూ ఉపాధి పనుల పెత్తనం కోసం ఇద్దరు నాయకుల విభేదాలను చక్కదిద్దేందుకు క్షేత్రసహాయకుడితో పాటు మేస్త్రీకి కూలీలు, పనుల వివరాలు నమోదు చేసే సిమ్ ఇవ్వాల్సి వచ్చింది. గ్రామంలోని ఈ వ్యవహారం ఎమ్మెల్యే దృష్టికి వెళ్లింది. తాము వలస పోకుండా పనులు కల్పించమని కూలీలు కోరుతున్నారు.

అంగన్‌వాడీలో అవకతవకలపై ఫిర్యాదు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: పోతులూరులో అంగన్‌వాడీ 2లో అవకతవకలు జరుగుతున్నాయని గ్రామానికి చెందిన కొందరు పీజీఆర్ఎస్‌కు ఫిర్యాదు చేశారు. కేంద్రం నిర్వహణ సక్రమంగా లేదని, గుడ్లు తదితర వస్తువులను నిర్వాహకురాలు తన ఇంటివద్ద దింపిస్తున్నారని పేర్కొన్నారు. అంగన్‌వాడీ సెంటరు ప్రభుత్వ లక్ష్యం మేరకు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన కుంచే కృష్ణ కలెక్టర్‌కు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు అందజేశారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ప్రత్తిపాడు: ధర్మవరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన బి.రాఘవ(63) హైవే పక్కన నిలవగా బైకు ఢీకొట్టి వెళ్లిందన్నారు. గాయపడ్డ వ్యక్తి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. ఎస్సై లక్ష్మీకాంతం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైతుసేవలకు భవనాలేవీ..!

కోటనందూరు, రౌతులపూడి, శంఖవరం, న్యూస్‌టుడే:

గ్రామస్థాయిలో రైతులకు సేవలందించేందుకు ఏర్పాటైన రైతు సేవా కేంద్రాలకు పూర్తిస్థాయిలో భవనాలు లేని పరిస్థితి. రైతు వద్దకే సేవలు అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటైన ఈవ్యవస్థకు నిధులున్నా...గత ప్రభుత్వం సకాలంలో పనులు పూర్తిచేయకపోవడంతో సమస్యలే మిగిలాయి. సిబ్బంది నియామకం, కేటాయింపు, నిర్మాణాలకు నిధులు వెచ్చించినా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురాకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

రౌతులపూడిలో అసంపూర్తిగా ఉన్న రైతు సేవా కేంద్ర భవనం

అందుబాటులోకి రావాలి..

కోటనందూరు, రౌతులపూడి, శంఖవరం మండలాల్లో భవన నిర్మాణాలను పూర్తిచేసి అందుబాటులోకి తేవాలి. రైతులకు సలహాలు, సూచనలు అందించడం, సమావేశాలు నిర్వహణ, పథకాల అమలుకు ఈభవనాలే గ్రామాల్లో ముఖ్య కేంద్రాలు. పూర్తిస్థాయి భవనాలు లేని చోట ఎరువుల అమ్మకం, పంటల కొనుగోళ్లకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సామాజిక, ఇతర ప్రభుత్వ భవనాల్లోనే సిబ్బంది విధులు నిర్వహిస్తున్న పరిస్థితి ఉంది. కోటనందూరు మండలంలో అల్లిపూడి-1, అల్లిపూడి-2, భీమవరపుకోట, బొద్దవరం, ఇందుగపల్లి, కేపీమల్లవరం, కేఈచిన్నాయిపాలెం, కాకరాపల్లి, కోటనందూరులో నిర్మాణాలను పూర్తిచేయాలి. రౌతులపూడి మండలంలో గుమ్మరేగుల, ఎస్.అగ్రహారం, గంగవరం, శృంగవరం, లచ్చిరెడ్డిపాలెం, ఎ.మల్లవరం, రాజవరం, ఎన్.ఎన్.పట్నం, రౌతులపూడి-2, శంఖవరం మండలంలో అన్నవరం, వేళంగి, పెదమల్లాపురం, జి.కొత్తపల్లి గ్రామాల్లో పూర్తయిన ఆర్ఎస్‌కేలు వినియోగంలోకి రాలేదు. నిర్మాణ పనులు నిలిచిన భవనాల వివరాలను ఇంజినీరింగు, మండల పరిషత్ అధికారులు ఉన్నతాధికారులకు నివేదించారు.

ప్రస్తుత ఆర్ఎస్‌కేల స్థితి ఇదీ...:

మండలం	మంజూరు	పూర్తి	అసంపూర్తి
కోటనందూరు	14	05	09
రౌతులపూడి	17	08	09
శంఖవరం	16	12	04

(c) eenadu

హంపీ కీర్తి.. తుంగా హారతి!

తుంగభద్రమ్మకు సామూహిక హారతులు

హొసపేటె, న్యూస్‌టుడే : రాయలు ఏలిన గడ్డ హంపీ పురం సింగారాలతో తులతూగుతోంది. విజయనగర రాజుల కీర్తి వైభవాలను చాటేలా శుక్రవారం ఉత్సవ ఢంకా మోగ నున్న నేపథ్యంలో ముందస్తు వేడుకలు మురిపిస్తున్నాయి. అందులో భాగంగానే పంపాపురిగా వినుతికెక్కిన తుంగభద్ర ఒడ్డున.. విరూపాక్ష సన్నిధానానికి చేరువలో బుధవారం రాత్రి నదీమతల్లికి మహా హారతులిచ్చి గంగమ్మను ప్రసన్నం చేసు కున్నారు. నిండుగా.. గలగలమంటూ పారుతున్న జలవేణిలో ఉత్సవ కాగడా కాంతులీనింది. 'తుంగా హారతి' కార్యక్రమం భక్తిపూర్వకంగా సాగింది. ఒడ్డున గంగమ్మ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. విరూపాక్ష ఆలయ అర్చకులు ఈ పూజా కైంకర్యాల్లో పాల్గొన్నారు. పూలతో అలంకరించిన మండపంలో అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్, జిల్లా పాలనాధికారి కవితా మన్నికేరి తదితరులు పాల్గొన్నారు. కమలాపుర, హంపీ, హొసపేటె, కడ్డి రాంపుర నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమ వీక్ష ణకు కదలివచ్చారు.

నదీతీరంలో మండపానికి విద్యుద్దీపాల అలంకరణ

అడ్డంకులు అధిగమించి.. గగనయానం

అంతరిక్ష వ్యోమగామి శుభాంశు శుక్లా

ఈనాడు, బెంగళూరు : భారతీయ తొలి మానవ అంతరిక్ష ప్రాజెక్ట్ గగన్‌యాన్‌లో అడ్డం కులు సహజమేనని గ్రూప్ కెప్టెన్, అంతరిక్ష వ్యోమగామి శుభాంశు శుక్లా అభిప్రాయపడ్డారు. ఆయన బుధవారం బెంగళూరులో నిర్వహిస్తున్న ఇండో- యూఎస్ బిజినెస్ ఫోరమ్ సదస్సులో భారత అంతరిక్ష ప్రాజెక్టులు, ఒప్పందాలపై మాట్లాడారు. 'గగన్‌యాన్ ప్రాజెక్టు భారత్ తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయం. ఇలాంటి ప్రాజెక్టుల రూపకల్పనలో అడ్డంకులతో పాటు సమయాన్ని అంచనా వేయడం కష్టం. భారత్ తొలి రోజు నుంచి అదే ఉత్సాహంతో గగన్‌యాన్‌ను తయారు చేస్తోంది. ఈ ప్రాజెక్టు పూర్తయిన రోజున అంతరిక్షానికి మనిషిని పంపిన నాలుగో దేశంగా భారత్ నిలువనుంది. ఇతర దేశాలతో పోటీ అనివార్యమే అయినా సాంకేతికత, ప్రాజెక్టు పనితీరు, వ్యయాల్లో మన దేశం భిన్నంగా ఉండగలదు. ప్రపంచ దేశాలతో అంతరిక్ష ఒప్పందాలు ఎంత ప్రయోజనాన్ని చేకూరుస్తాయో ఇటీవలి యాగ్జియం ప్రాజెక్టే సరైన ఉదాహరణ' అని శుభాంశు శుక్లా వివరించారు. ప్రపంచ అవసరాలు తీర్చేందుకు దేశాల మధ్య ఒప్పందాలు ఎంతో కీలకమన్నారు. ఇదే సందర్భంగా గగన్‌యాన్ వ్యోమగామి.. గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ నాయర్ మాట్లాడుతూ మనం సహనంతో ఎదురుచూడటం మాత్రమే చేయగ లగాలని గగన్‌యాన్ ఆలస్యంపై అడిగిన ఓ ప్రశ్నకు బదులిచ్చారు. ఈ ప్రాజెక్టు భారతీయ అంతరిక్ష రంగంలో కీలక మలుపుగా వివరిం చారు. భారతీయ సాంకేతికతతో తయారైన వాహకనౌకలో భారతీయుడు వెళ్లి సురక్షితంగా తిరిగి రావటం కేవలం మనమే కాదు ప్రపంచ దేశాల పౌరులు కూడా గర్వపడే క్షణమన్నారు. కరోనా టీకాను భారత్ టీకా తయారు చేసినా అది ప్రపంచ మానవాళికి ఉపయోగపడినట్లే గగన్‌యాన్ ప్రపంచం కోసం తయారైన ప్రాజె క్టుగా ఆయన అభివర్ణించారు. ఈ సదస్సులో యూఎస్ కాన్సులేట్ జనరల్ పబ్లిక్ డిప్లమసీ ఆఫీసర్ ఎరిక్ ఆట్కిన్స్, ప్రిన్సిపల్ కమర్షియల్ ఆఫీసర్ క్యారీ అరున్ తదితరులు పాల్గొన్నారు.

ఇండో-యూఎస్ బిజినెస్ ఫోరమ్ వేదికపై ఎరిక్ ఆట్కిన్స్, శుభాంశు శుక్లా, ప్రశాంత్ నాయర్

పాఠశాల వాహనం కింద చితికిపోయిన చిన్నారులు

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే : ద్విచ క్రవాహనాన్ని పాఠశాల వాహనం ఢీకొనటంతో ఇద్దరు బాలలు దుర్మరణం చెందారు. ఈ సంఘ టన బుధవారం హెణ్ణూరు సంచార పోలీసుఠాణా పరిధిలో విషాదం నింపింది. థణిసంద్ర పోలీసు వసతి గృహం వద్ద ఉదయం 8.16 గంటలకు ప్రమాదం సంభవించింది. ఓ ప్రైవేట్ పాఠశాల వాహనం డ్రైవర్ మారప్పను స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. సాయుధ బలగాల (సీఏఆర్) కానిస్టేబుల్ నాగనగౌడ ఉదయం పాలు తీసుకు వచ్చేందుకు ద్విచక్రవాహనంపై బయలుదేరారు. ఆ సమయంలో తన రెండేళ్ల కుమార్తె, నాలుగేళ్ల అన్న కుమారుడిని బండిలో తీసుకెళ్లారు. అదే సమయానికి ఎదురొచ్చిన పాఠశాల వాహనం ఢీకొంది. కిందపడిన ఇద్దరు బాలలపై బస్సు చక్రం దూసుకెళ్లడంతో రక్తపుమడుగులో విలవిల లాడి మరణించారు. యలహంక ప్రభుత్వ ఆసుప త్రికి ఇద్దరు పిల్లల మృతదేహాలను తరలించారు. రాయచూరుకు చెందిన నాగనగౌడ రక్షకభటుడిగా పని చేస్తున్నారు. ఆయనకు ఇద్దరు పిల్లలు. రెండేళ్ల కిందట కుమారుడు మృతిచెందారు. ఇప్పుడు కుమార్తె మరణించడంతో కుటుంబం దు:ఖసాగరంలో మునిగిపోయింది. కొన్ని రోజుల కిందట రాయచూరు నుంచి వచ్చిన అన్న కుమార్తె కూడా కడతేరడంతో ఆ కుటుంబాన్ని ఓదార్చడం ఎవరి వల్ల సాధ్యం కాలేదు.

పాత పాట.. కొత్త రాగం

● దిల్లీలో డీకే ఎత్తుగడలు
● ముదురుతున్న రాజకీయం

కన్నడనాట సిద్దరామయ్య సర్కారు కొత్త బడ్జెట్ మాట అటుంచితే.. రాజకీయ ఊబిలో కూరుకుపోతోంది. నిత్యం ఏదో మూల నుంచి అసమ్మతి రాగాలు, డీకే శివకుమార్ రూపంలో సొంతింట్లో కుంపట్ల తరహా వ్యవహారాలు సర్కారును ముప్పతిప్పలు పెడుతున్నాయి. అధికారం వదులుకోవడానికి ససేమిరా అనేలా సిద్దు.. గద్దె దక్కేదాకా వదిలేది లేదన్న రీతిలో డీకే ఆడుతున్న చదరంగం పాలనను అటకెక్కిస్తోంది. ఇప్పటికిప్పుడు రాష్ట్రాన్ని కుదిపేస్తున్న ఆర్థిక ఇక్కట్లను అధిగమించడానికి ప్రణాళికాబద్ధంగా సాగాల్సిన సర్కారు పడుతూ లేస్తూ అడుగులు వేస్తోంది.

ఈనాడు, బెంగళూరు : రేపో మాపో బడ్జెట్.. ఆపై కేరళ, అసోం ఎన్నికలు.. తర్వాత కర్ణాటకలో స్థానిక ఎన్నికలు.. ఈ పరిణామాల మధ్య రాష్ట్ర నాయకత్వాన్ని మార్చేందుకు అధిష్ఠానం ఏమాత్రం ఇష్టపడదు. అదిగో ఇదిగో అనేలోగా ఏది ముగిసి 2028 ఎన్నికలకు కూడా సమయం ముంచుకొస్తుంది. ఎన్నికల తర్వాత కాంగ్రెస్ గెలుస్తుందో లేదో కూడా చెప్పలేని పరిస్థితి. ఇది డీకే సోదరులు, వారి అనుయాయులను నిత్యం వెంటాడుతున్న భయం. ఈ రెండేళ్ల సమయంలోనే అనుకున్న కార్యాన్ని నెరవేర్చు కోవాలన్న లక్ష్యంతో డీకే సోదరులు రాజకీయాలను వేడెక్కిస్తు న్నారు. అన్న డీకే శివకుమార్ దిల్లీలో, తమ్ముడు డీకే సురేశ్ బెంగ ళూరులో రెండు రోజులుగా ప్రదర్శిస్తున్న తీరు రాష్ట్ర రాజకీయాలను రాజేస్తోంది. మరోవైపు సిద్ధరామయ్య శిబిరం కూడా వారికి గట్టిపోటీ ఇచ్చేందుకు ఏకంగా విదేశీ ప్రయాణానికి ప్రణా ళిక సిద్ధం చేసుకోవటం మరో కీలక పరిణామం.

సోదరుల దూకుడు

రెండ్రోజులుగా దిల్లీలోనే ఉన్న డీకే శివకు మార్ బుధవారం మరింత వ్యూహాత్మక వ్యాఖ్యలు చేశారు. తాను అసోం ఎన్నికల అంశా లపై మాట్లాడేందుకే దిల్లీకి వచ్చినట్లు చెప్పిన ఆయన బుధవారం తనకు, ముఖ్యమంత్రికి మధ్య కొన్ని రహస్య ఒప్పందాలు కుదిరాయని వివరించారు. దిల్లీ నాయకులు కూడా ఆ సమ యంలో ఉన్నారు. అవన్నీ మాకు సంబంధించిన విషయాలు. అవసరమనుకుంటే బయటపెడతామని డీకే శివకుమార్ సూటిగా చెప్పారు. ఇక బెంగళూరులో డీకే సురేశ్ మరింత దూకుడుగా మాట్లాడుతూ సిద్ధరామయ్య ఇచ్చిన మాట నెరవేర్చా లన్నారు. అలసత్వమైనా ఆయన మాట నిలబెట్టుకుంటారని పాత పాటనే మరోసారి గట్టిగా పాడారు. ఈ సమయంలోనే యతీంద్ర తన తండ్రికి మద్దతుగా చేసిన వ్యాఖ్యలపై మాట్లాడుతూ ఆయనే మా అధిష్ఠానం. ఆయన ముందు మేమెంత అన్న ధోరణిలో వ్యంగ్యంగా మాట్లాడారు. ఆపై నేరుగా దిల్లీకి వెళ్లిన సురేశ్ సోద రుడితో కలిసి పెద్దలతో భేటీ అవటం మరో పరిణామం. బుధ వారం సాయంత్రం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ సంఘటనా కార్యదర్శి కె.సి. వేణుగోపా ల్‌తో భేటీ అయ్యారు. సాధారణంగా ఎన్నికల వ్యవ హారాలను ఏఐసీసీ కార్యవర్గ సమావేశాలు, సభ్యుల సమక్షంలోనే చర్చిస్తారు. ఇందులో డీకే సురేశ్ చర్చలకు అవకాశం లేదు. కానీ వీరి ద్దరూ ఏఐసీసీ నేతలతో భేటీ కావడం రాజ కీయ వర్గాల్లో ఆసక్తి రెట్టింపు చేస్తోంది.

సోదరుడి తరఫున డీకే సురేశ్ మాటలదాడి

సీఎం మండిపాటు..

నాయకత్వ మార్పుపై ముఖ్యమంత్రి సిద్దరా మయ్య బుధవారం మరింత అసహనాన్ని వ్యక్తం చేశారు. మంగళవారం మరో ప్రశ్న అడగారా అంటూ గద్దించిన ఆయన బుధవారం కూడా ఇదేలా స్పందించారు. అధిష్ఠానం చెప్పినట్లు నేను, డీకే ఇద్దరూ వినాల్సిందే. ఇచ్చిన మాట నెరవేర్చాలని డీకే సురేశ్ చేసిన వ్యాఖ్యపై స్పందించేందుకు నిరాకరించిన సిద్ధరామయ్య వెళ్లి ఆయ ననే ఆ ప్రశ్న అడగాలని సూచించారు. పదేపదే ఇదే ప్రశ్నలు వేయొద్దని ఆయన హెచ్చరించారు. ఇదే సమయంలో ఎమ్మెల్యేల విదేశీ ప్రయాణం గురించి మాట్లాడుతూ వారంతా వ్యక్తిగత పనుల కోసమే విదేశీ ప్రయాణం చేస్తున్నారని బదులిచ్చారు.

పర్యటన రాజకీయం..

సిద్ధరామయ్య, డీకే శివకుమార్ నాయకత్వ పోరు ఉదంతం విదేశాలకు విస్తరించే అవకాశం ఉంది. ఈనెల 16 నుంచి మార్చి 3 వరకు సిద్ధరామయ్య మద్దతుదారులుగా భావించే 25 మంది ఎమ్మెల్యేలు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లో పర్యటిస్తారని సమాచారం. వీరంతా ఇప్పటికే టికెట్లు బుక్ చేసుకున్నారు. పుట్టరంగ శెట్టి, శివలింగేగౌడ, శరత్ బచ్చేగౌడ తదితరులతో కూడిన బృందం విదేశీ పర్యటనకు సిద్ధమైంది. మేమంతా రాజ కీయ శక్తి ప్రదర్శన కోసం కాకుండా పశు సంవర్ధకశాఖ పనుల నిమిత్తం వెళ్తున్నట్లు పుట్టరంగశెట్టి అన్నారు. వారంతా వ్యక్తిగత పనుల కోసం విదేశాలకు వెళ్తున్నారని ముఖ్యమంత్రి చెప్పటం ఆసక్తికరం. ఈ బృందానికి దీటుగా డీకే శివకుమార్ మద్దతుదా రులు బెంగళూరు, మైసూరు శివార్లలోని రిసార్టుల్లో ప్రత్యేకంగా సమావేశమవుతారని కూడా తెలుస్తోంది. వీరంతా ఇక్బాల్ హుస్సేన్, బాలకృష్ణల నేతృత్వంలో ఎమ్మెల్యేల శక్తిప్రదర్శనకు సిద్ధంగా ఉన్నారని సమాచారం.

నా టైమ్ ఇంకా రాలేదనుకుంటా! (డీకేతో సిద్దు.. పాతచిత్రం)

ఇది.. కమీషన్ల సర్కారు
గుత్తేదారుల ఆగ్రహం

మండ్య, న్యూస్‌టుడే : ప్రభుత్వం తక్షణమే తమకు రూ.37 వేల కోట్ల బకాయిలను విడుదల చేయాలని గుత్తేదారుల సంఘం అధ్యక్షుడు ఆర్.మంజునాథ్ డిమాండ్ చేశారు. బాజపా హయాం కన్నా, ఇప్పటి ప్రభుత్వ హయాంలోనే ఎక్కువ కమీషన్ ఇస్తున్నామని ఆరోపించారు. మండ్యలోని ప్రజాపనుల శాఖ కార్యా లయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పనుల కోసం తీసుకువచ్చిన రుణాలకు వడ్డీలు కట్టలేకపోతున్నామని చెప్పారు. చిన్న పనులకూ కమీషన్ ఇవ్వవలసి వస్తోందని విమర్శిం చారు. బాజపా హయాంలో చేసిన పనులకు సంబంధించిన బకాయిలు అంటూ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. మార్చి 5లోగా తమ బకాయిలను విడుదల చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పనులను నిలిపి ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

విలాసాల వక్రరేఖ

ఓ సబ్బు ప్రకటనలో.. యువతి అందంగా.. ఉల్లాసంగా సందడి చేస్తుంటే మిల్కీబాయ్ మహేష్‌బాబు విస్మయానందాలకు గురవుతాడు! అంతలోనే ఓ పాపాయి పరుగున వచ్చి 'మమ్మీ..' అంటూ ఒడిలో చేరితే.. 'మమ్మీనా..' అంటూ ఆశ్చర్యపోవడం అందరికీ పరిచయమైన ప్రకటనే. నిజజీవితంలో అంతకు వెయ్యిరెట్ల స్థాయిలో కుదేలై పోయాడు రవిచంద్ర. ఈయన కథలోకి ఓసారి తొంగి చూస్తే..

హావేరి జిల్లా రాణిబెన్నూరు తాలూకా తుమ్మినకట్టి గ్రామానికి చెందిన రవికి మూడు పదుల వయస్సు ముంచుకొస్తున్న తరుణంలో ఓ పెళ్లిళ్ల పేరయ్యను సంప్రదించాడు. ఎలాంటి ఆస్తిపాస్తులూ అవసరం లేదు.. అమ్మాయి అందంగా ఉంటే చాలంటూ తన అవసరాలు వివరించాడు. ఆ పేరయ్య ఒక డుగు ముందుకేసి 'సల్లక్షణమైన పిల్ల ఉంది బాబూ.. కాకపోతే ఆమెకు ఎవరూ ముందు-వెనుక లేరు..'అంటూ నీళ్లు నమిలాడు. 'దానిదేముంది.. నేను అన్నీ చూసుకుంటా. పువ్వుల్లో పెట్టుకుని కొత్త జీవితాన్నిస్తా..' నంటూ రవి భరోసా ఇవ్వడంతో రేఖ (32) తెరపైకి వచ్చింది. చక్కని అమ్మాయి.. అంటూ రవి మురిసిపోయి తొలి చూపులోనే పెళ్లికి సరే నన్నాడు. అలా.. ఆమె పంట పండింది. పెళ్లికి నాకు కొద్దిగా ఖర్చులుంటాయి.. కొంత సొమ్ము కావాలంటూ ఆదిలోనే ఆమె రూ.2.5 లక్షలు సులువుగా తీసుకుంది. ఎలాంటి ఆటంకాలూ లేకుండా రవి- రేఖ పెళ్లి వారం కిందట ఓ ఆల యంలో నిరాడంబరంగా చేసేశారు.

● మరో తెర తీసి చూస్తే.. వారిద్దరి దాంప త్యజీవనం ఉల్లాసంగా మొదలైంది. రవి ఆనం దానికి అవధులు లేవు. ఒంటరితనాన్ని దూరం చేసిన అందమైన భార్య గురించి గొప్పలు చెప్పు కొన్నాడు. ఆమె తరపున ఎవరూ లేకపోవ డంతో ఇక అంతా తానై చూసుకోవడం మొద లుపెట్టాడు. కోరిన ఆహారం.. ఇష్టమైన విహా రాలు కొనసాగుతున్న తరుణంలోనే.. మంగళ వారం రాత్రి ఆయన పడకగదిలో ఉన్న సమ యంలో- ఆమె పనిమీద మరో గదిలోకి వెళ్లింది. అప్పుడే.. రేఖ ఫోన్ మోగింది. ఈమెకు ఎవరూ లేరుకదా.. స్నేహితులేమో చూద్దామని ఫోన్ తీశాడు. అటు వైపు నుంచి ఎంతో ఉత్సాహంగా.. 'మమ్మీ..' అంటూ కేకలు! 'మమ్మీ..నా..' అంటూ రవి ఆశ్చర్యపో యాడు. 'ఎవరు మీరు..?' అంటూ ప్రశ్నిం చాడు. దిమ్మతిరిగే సమాధానం వచ్చింది. 'రేఖ మా అమ్మనే.. ఓసారి ఫోన్ ఇవ్వండి' అంటూ అటు వైపు నుంచి ఇద్దరు పిల్లలు గొంతులు అరవడంతో కుదేలైపోయాడు. ఆమె ఒంటరికాదట. తుమకూరు జిల్లా పావగడ పట్టణంలో మేమంతా ఆమె కోసం ఎదురుచూస్తున్నామని చెప్పడంతో నిర్ఘాంతపోయాడు. అంతలోనే అక్కడికి వచ్చిన రేఖ.. గుట్టురట్టయిందని భావించి పరారయ్యేందుకు ప్రయత్నించింది. స్థానికుల సాయంతో రవి వెంటాడి పట్టుకుని హలగేరి ఠాణా పోలీసులకు అప్పగించారు. ఆమె నుంచి మరిన్ని వివరాలు రాబట్టేందుకు పోలీసులు బుధవారం విచారణ చేపట్టారు. విలాసాల కోసమే ఆమె ఈపని చేసిందని.. ఇలానే ఇంకెవరినైనా మోసం చేసిందేమోననే కోణంలో వివరాలు సేకరిస్తున్నారు.

-న్యూస్‌టుడే, హావేరి

పొద్దుగూకే దాకా పద్దుల సమీక్ష

బెంగళూరు (హలసూరు), న్యూస్‌టుడే : శాసనసభలో తన 17వ పద్దును ప్రవేశపెట్టేందుకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆయా శాఖల మంత్రులు, అధికారులతో సమీక్ష సమావేశాలను బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగించారు. వ్యవసాయ, ప్రజాపనుల శాఖ చక్కెర, వ్యవసాయ మార్కెటింగ్, జౌళి, రవాణా, తదితర శాఖల మంత్రులు, అధికారులు సమీక్ష సమావేశాల్లో పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్, అదనపు ముఖ్యకార్యదర్శి అంజుం పర్వేజ్, ముఖ్యమంత్రికి రాజకీయ కార్యదర్శి బసవరాజ రాయరెడ్డి తదితరులు సమీక్ష సమావేశాల్లో పాల్గొన్నారు. శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెట్టే తేదీని త్వరలో ప్రకటిస్తామని సిద్ధరామయ్య తెలిపారు. విదేశీ పర్యటనకు వెళుతున్న ఎమ్మెల్యేలు తమ సొంత ఖర్చుతో వెళుతున్నారని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి పీఠం మార్పు అనేది పార్టీ అధిష్ఠానం చేతిలో ఉన్న అంశమన్నారు. విలేకరులు పదేపదే అదే ప్రశ్నను అడిగి ఇబ్బంది పెట్టవద్దంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు.

మంత్రి శివానంద పాటిల్ తదితరులతో సిద్దు సమీక్ష

గడువు మీరినా విదేశీయుల తిష్ఠ

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే : వీసా గడువు ముగిసినా అక్రమంగా బెంగళూరులోనే ఉంటున్న ఓ మహిళతో పాటు ఎనిమిది మంది విదేశీయులను సంజయనగర పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. క్యామరూన్ దేశానికి చెందిన ఐదుగురు, సుడాన్‌కు చెందిన ముగ్గురు నాలుగేళ్ల కిందట విద్యార్థి వీసాపై బెంగళూరుకు వచ్చారు. గడువు ముగిసినా వారి దేశాలకు వెళ్లలేదు. వారంతా సంజయనగర ప్రాంతంలోని భూపసంద్రలో ఉండేవారు. నగర పోలీసులు దాడులు నిర్వహించి, వారిని అదుపులోకి తీసుకుని నెలమంగల సమీప విదేశీ పరిహార క్యాంపునకు తరలించారు.

మతితప్పి.. కన్నవారినే కడతేర్చాడు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : మానసిక వ్యాధిపీడితుడైన ఆ కుమారుడు కన్న తల్లిదండ్రులను దారుణంగా కడతేర్చాడు. బెంగళూరు వాసులను దిగ్భ్రాంతికి గురిచేసిన ఈ సంఘటన బుధవారం హెచ్ఏఎల్ ఠాణా పరిధి దొడ్డనక్కుంది విజ్ఞాననగరలో చోటుచేసుకుంది. విజ్ఞాననగరకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నవీన్‌చంద్ర (45), ఆయన భార్య శ్యామల (44) హత్యకు గురైనట్లు పోలీసులు గుర్తించారు. దారుణానికి తెగబడిన వారి కుమారుడు రోహన్ చంద్ర(21)ను అరెస్టు చేసినట్లు వైట్‌ఫీల్డ్ విభాగం డీసీపీ సైదులు అడావత్ తెలిపారు. పోలీసు కంట్రోల్ రూం నెం:112కు వచ్చిన సమాచారం ఆధారంగా సంఘటన ప్రదేశానికి పోలీసులు చేరుకుని పరిశీలించారు. నవీన్ చంద్ర, శ్యామల రక్తమడుగులో పడి చనిపోయారు. ఆ ఇద్దరి తలలపై బలమైన గాయాలున్నట్లు గుర్తించారు. ఆ పక్కనే పెద్ద ఇనుప రాడ్డు ఉండటంతో దానితోనే తీవ్రంగా కొట్టి హత్య చేసి ఉంటాడని అనుమానిస్తున్నారు. ఆ రోహన్‌చంద్ర డిగ్రీ పూర్తి చేసి ఇంట్లో ఉంటున్నాడు. మానసిక వ్యాధితో బాధ పడుతున్నాడని గుర్తించారు. ఇప్పటికే వైద్యుడి చేత చికిత్స చేయిస్తున్నా ఫలితం లేదు. ప్రతి చిన్నవిషయానికీ పెద్దలతో గొడవ పడేవాడని పోలీసులు వివరించారు. ఇలానే.. బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు తల్లిదండ్రులతో గొడవపడి రాడ్డుతో కొట్టి హత్య చేశాడని తేలింది. నిందితుడిని అదుపులోకి తీసుకుని పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు.

అమ్మా..నాన్నా.. నవ్వుతూ ఉండండి..

బీదర్, న్యూస్‌టుడే : బసవకల్యాణ తాలూకా నారాయణపుర నవోదయ విద్యాలయం వసతిగృహంలో శరత్ (15) అనే విద్యార్థి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 'సారీ మమ్మీ, డాడీ.. కీప్ స్మైలింగ్ ఫర్ ఎవర్' అని రాసిన డెత్‌నోట్‌ను బసవకల్యాణ నగర ఠాణా పోలీసులు స్వాధీనపరుచుకున్నారు. ఆత్మహత్యకు కారణాలు గుర్తించవలసి ఉందని పోలీసులు తెలిపారు. శరత్ వినియోగిస్తున్న చరవాణి జప్తు చేసుకుని వాట్సప్ చాట్‌లను పోలీసులు పరిశీలిస్తున్నారు.

దర్గాలో శివలింగానికి పూజ చేయాలని అర్జీ

కలబురగి, న్యూస్‌టుడే : ఆళందలోని లాడ్లే మశాక్ దర్గాలోని శ్రీరాఘవ చైతన్య శివలింగానికి మహాశివరాత్రి రోజు పూజ చేసుకోవడానికి అనుమతించాలని కోరుతూ ఆందోళ మఠాధిపతి సిద్ధలింగస్వామి ఉన్నత న్యాయస్థానంలో అర్జీ వేసుకున్నారు. ఆయన బుధవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ దర్గాలోని శివలింగాన్ని కొందరు ఉద్దేశపూర్వకంగా అపచారం చేశారని ఆరోపించారు. శివలింగానికి రక్షణగా చాదర్‌ను కప్పారని, ప్రతి ఏడాది తరహాలో ఈ ఏడాది కూడా శివరాత్రికి పూజకు అనుమతించాలని కోరుతూ అర్జీ వేసుకున్నామని చెప్పారు.

బెంగళూరు స్వాతంత్య్ర ఉద్యానవనంలో నిరుద్యోగుల ధర్నా ఘట్టం

ఉద్యమించిన నిరుద్యోగులు

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే : సర్కారు ఊక దంపుడు ఉపన్యాసాలతో కాలం వెళ్లదీస్తోందని, ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయకుండా మొండికేస్తోందని తప్పుబడుతూ నిరుద్యోగులు ఉద్యమించారు. బెంగళూరులోని స్వాతంత్య్ర ఉద్యానవనంలో అఖిల కర్ణాటక రాజ్య విద్యార్థి సంఘం నేతృత్వంలో నిరుద్యోగులు, విద్యార్థులు బుధవారం ధర్నాకు దిగారు. రెండు లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ పాలకులు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని సంఘం నేతలు ఆరోపించారు. ఇప్పటి వరకు ఉద్యోగ భర్తీ విషయాన్ని తాత్సారం చేసినట్లు విమర్శించారు. ప్రస్తుతం ఉన్నత న్యాయస్థానం ఆదేశాలతో ఉద్యోగ ఖాళీల నియామకాలను చేపట్టాలని కోరారు. నిరుద్యోగ సమస్య తీవ్రమవుతోందని, దాన్ని పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అన్ని శాఖల్లో ఉన్న ఖాళీ ఉద్యోగాల నియామకాల ఉత్తర్వులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నేడే కార్మికుల ప్రదర్శన

బెంగళూరు (యశ్వంతపుర) : కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన నాలుగు కార్మిక చట్టాలను వెంటనే రద్దు చేయాలని దేశవ్యాప్తంగా పలు సంఘాలు గురువారం సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో కర్ణాటకలోనూ ఉద్యమ ఢంకా మోగింది. ఈ ఉద్యమానికి పలు సంఘాలు మద్దతు ప్రకటించాయి. రవాణా, విద్య, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులపై ఈ ప్రభావం ఉంటుందని అంచనా వేస్తున్నారు. కె.ఎస్.ఆర్టీసీ కార్మిక సంఘం సమ్మెకు మద్దతు ప్రకటించడంతో ఉదయ వేళ తక్కువ సంఖ్యలో బస్సులు అందుబాటులో ఉంటాయి. బ్యాంకుల్లోనూ సిబ్బంది హాజరీ తక్కువ కానుందని అంచనా వేస్తున్నారు. ఆటో, ట్యాక్సీ డ్రైవర్ల యూనియన్లు సమ్మెకు మద్దతు ప్రకటించాయి. బెంగళూరులోని స్వాతంత్య్ర ఉద్యానవనంలో భారీ ప్రదర్శన, సమావేశానికి సన్నాహాలు చేస్తున్నారు.

నవ మన్మథుడు!

అవివాహితలే ఇతని లక్ష్యం

మంగళూరు, న్యూస్‌టుడే : అవివాహితలను లక్ష్యంగా చేసుకుని వివాహం చేసుకుని, అనంతరం నగదు తీసుకుని తప్పించుకు పరారవుతున్న సుశాంత్ పూజారి అనే వంచకుడిని మంగళూరు నగరఠాణా పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. అతను తన మేనల్లుడు అని వంచనలకు సహకారాన్ని అందిస్తున్న భాస్కర్ అనే వ్యక్తికీ పోలీసులు అరెస్టు చేసి విచారిస్తున్నారు. ఇప్పటి వరకు తొమ్మిది మందిని వివాహం చేసుకుని, వారి నగలు, నగదు తీసుకుని మరో చోటుకు సుశాంత్ పూజారి మకాం మార్చుతూ వచ్చాడు. ముంబయికి చెందిన ఒక యువతి, ఉడుపి జిల్లాలో ఇద్దరు, దక్షిణ కన్నడ జిల్లాలో ఆరుగురిని వంచించాడని ఇప్పటి వరకు నిర్వహించిన విచారణలో గుర్తించారు. ఆన్‌లైన్ మ్యాట్రిమోనీలో యువతులను గుర్తించి, ఇతను వల విసిరేవాడని పోలీసులు తెలిపారు.

తమన్నాకన్నా.. మనమే మిన్న

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే : మైసూరు సబ్బులకు బహుభాషా నటి తమన్నా భాటియాను ప్రచారకర్తగా నియమించడంపై కన్నడ పోరాట నాయకుడు వాటాళ్ నాగరాజ్ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఆమెకు రూ.కోట్ల నగదు ఇచ్చి ప్రజా ధనాన్ని వృథా చేస్తున్నారంటూ ప్రభుత్వంపై బుధవారం నిప్పులు చెరిగారు. కన్నడ రాని వారిని ప్రచారకర్తగా ఎందుకు నియమించారని ప్రశ్నించారు. ప్రచారకర్తగా వ్యవహరిస్తున్నందుకు ఆమెకు రెండేళ్లకు రూ.6.2 కోట్లు ఇవ్వడం సరైన నిర్ణయమేనా అని ప్రశ్నించారు. ఆయన రామనగరలో విలేకరులతో మాట్లాడుతూ, కన్నడిగులందరూ తమన్నా ఎంపికను వ్యతిరేకిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఆమెకన్నా మన నటులే మేలన్నారు.

● మైసూరు సబ్బులు, కేఎస్‌డీఎల్ ఉత్పత్తులను జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళుతున్నామని పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్ తెలిపారు. దేశం మొత్తం తెలిసిన నటిగా తమన్నా భాటియాను ప్రచారకర్తగా ఎంపిక చేసుకున్నామని చెప్పారు.

కార్యాలయంలోనే ఉద్యోగులు బందీ

ఉడుపి, న్యూస్‌టుడే : సిబ్బంది విధుల్లో ఉన్న సమయంలో కాపు పురసభ భవంతి ప్రధాన ద్వారానికి జవాను తాళం వేసి వెళ్లిపోయాడు. నిత్యం తాళం వేసి వెళ్లే ఉద్యోగి అనారోగ్యంతో సెలవు తీసుకున్నాడు. అతని బాధ్యతలు తీసుకున్న మరో ఉద్యోగి మంగళవారం సాయంత్రం నిర్ణీత 5.30 గంటలకు తాళం వేసి ఇంటికి వెళ్లిపోయాడు. ఆరు గంటలకు విధులు ముగిసిన అనంతరం బయటకు వచ్చేందుకు సిబ్బంది, అధికారులు, పనుల నిమిత్తం వచ్చిన స్థానికులు భవంతిలోనే చిక్కుకు పోయారు. లోపల సిబ్బంది పని చేస్తున్నారని కూడా చూడకుండా ఆ ఉద్యోగి వెళ్లడంతో మళ్లీ అతనికే ఫోన్ చేసి పిలిపించుకుని వారు బయటకు రావలసి వచ్చింది.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 9121167525
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 9945050116

(c) eenadu

సకల దేవతలు కొలువైన ఈశ్వర కోవెల

● జిల్లాకు తలమానికం..పంచాయతన క్షేత్రం ● గాంధీనగర్ క్యాంపులో సువిశాల శివాలయం

ప్రధాన గర్భగుడిలో ఆరడుగుల శివలింగం

కంచిశిలలు ఎదురుగా..ద్వాదశ జ్యోతిర్లింగాలు

సింధనూరు, న్యూస్‌టుడే: రాయచూరు జిల్లా సింధనూరుకి సరిగ్గా 17 కి.మీ దూరంలో గాంధీనగర్‌లో ద్వాదశ జ్యోతిర్లింగాల ఈశ్వర పంచాయతన క్షేత్రం కొలువైంది. ఈ ఆలయం ప్రసిద్ధి చెందడంతో ఈ ప్రాంతం విహారయాత్రా స్థలంగా మారింది. గాంధీనగర్ క్యాంపులో ఎక్కువమంది తెలుగువారు ఉంటారు. సంకల్పానికి దైవబలం తోడవ్వడంతో 2007లో తొమ్మిది ఎకరాల విస్తీర్ణంలో ఈ బృహత్ ఆలయక్షేత్ర నిర్మాణం ఆరంభించిన రెండేళ్లలో పూర్తయింది.

ఆహ్లాదం..ఆధ్యాత్మికతల కలబోత

శివాలయం..తలంపు

క్యాంపు పెద్దలు మద్దిపాటి గంగాధరరావు, బలుసు కొండయ్య, మద్దిపాటి హరిశ్చంద్రరావు, పసల భీమరాజు తదితరులు క్యాంపులో ధ్వజస్తంభం గల శివాలయం నిర్మించాలనే తలంపు రాగానే అందరితో చర్చించి అంకురార్పణ చేశారు. ఆంధ్రాలోని వీరంపాలెం శ్రీబాలత్రిపురసుందరి పీఠం గరిమెళ్ల వెంకటరమణ శాస్త్రి వద్దకు వెళ్లి వాస్తుపరమైన సలహాలు తీసుకున్నారు. ఏడాదిపొడవునా తుంగభద్ర కాలువ పారుతుండగా ఊరికి ముందుగానే ఈ శివాలయ క్షేత్రం మంచిదని చెప్పడంతో కార్యోన్ముఖులై నిర్మాణం పూర్తి చేశారు.

ఏమేం ఉన్నాయంటే..

ఆలయం మధ్యన గర్భగుడిలో ప్రధానమైన ఆరు అడుగుల నర్మదా నది నుంచి తెప్పించిన శివలింగం ఉంది. గణపతి ఆలయం, జగన్నాథ బాలాత్రిపురసుందరిదేవి ఆలయం, శ్రీలక్ష్మీనారాయణుల కోవెల, నవగ్రహ మంటపం యాగశాల చుట్టూ కొలువై ఉన్నాయి. హంపీ విరూపాక్ష ఆలయాన్ని పోలే 72 అడుగుల రాజగోపురం, 68 అడుగుల శ్రీఅభయాంజనేయస్వామి నిలువెత్తు విగ్రహం ఉన్నాయి. గర్భగుడి వెనుకనే ద్వాదశ జ్యోతిర్లింగాలు ఏర్పాటయ్యాయి.

చూడచక్కని లక్షలింగాల ఆలయం..

శివాలయం పక్కనే 2022లో రూ.కోట్లు వెచ్చించి అత్యంత ఆకర్షణీయంగా స్ఫటిక లింగ సమేత లక్ష లింగాల మహాగిరి ఆలయాన్ని నిర్మించారు. లోపల రెండున్నర అడుగుల ఆత్మలింగాన్ని ప్రతిష్ఠించారు. మొత్తం లక్ష లింగాలను నర్మదా నది నుంచే తెచ్చారు. ఇక్కడ ఒక్కసారి ప్రదక్షిణ చేస్తే లక్ష శివ లింగాలకు ప్రదక్షిణ చేసినంత పుణ్యం దక్కుతుందని భక్తులు నమ్ముతారు.

నిత్యం పూజలే..

ఈ క్షేత్రంలో అన్ని ఆలయాల్లో అర్చకులు నిత్య కైంకర్యాలు చేస్తూ ఉంటారు. ప్రతి రోజూ ప్రధాన ఆలయంలో ఏకవార రుద్రాభిషేకం జరుగుతుంటుంది. ఆలయం 18వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం మహాశివరాత్రి నాడు పెద్దఎత్తున కుంభాభిషేకం తలపెట్టారు. ఈ పుణ్యకార్యానికి అవసరమైన పనులు చకచకా కొనసాగుతున్నాయి.

68 అడుగుల శ్రీఅభయాంజనేయస్వామి

పంచాయతన క్షేత్రం పక్కనే లక్ష లింగాల మహాగిరి

కార్మికుల ద్విచక్రవాహన ర్యాలీ

సింధనూరు, న్యూస్‌టుడే: ఈ నెల 12న జరగబోతున్న అఖిల భారత కార్మికుల సమ్మెకు బాసటగా సింధనూరులో సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మిక సంఘాల ప్రతినిధులు బుధవారం సాయంత్రం బైక్ ర్యాలీ చేసి ప్రజలను జాగృతపర్చారు. కార్మిక సంఘాల నాయకులు బసవంతరాయగౌడ, బాషుమియా మాట్లాడుతూ ప్రభుత్వాలు కార్మికులను నానా విధాలుగా ఉపయోగించుకుంటున్నాయే తప్ప వాళ్ల కనీస కోర్కెలు నెరవేర్చడంలేదని ఆరోపించారు. ఉత్పాదనకు కార్మికులు కావాలి..వాళ్లకు హక్కులు మాత్రం ఇవ్వరు, ఇష్టారాజ్యంగా చట్టాలు సవరిస్తారు..వాటికి మా అభిప్రాయంతో పనిలేదని విమర్శించారు. అందుకే ఈ సమ్మె నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 12న దేశవ్యాప్తంగా ఉత్పాదన ఉండదు, స్వయం ప్రేరితంగా సమ్మె జరుపుతూ సేవలన్నీ నిలిపేస్తున్నట్లు తెలిపారు. కాగా బైక్ ర్యాలీ పట్టణ ప్రధాన రహదారుల గుండా సాగింది. 12న సమ్మెలో భాగంగా సింధనూరు తంతి తపాల శాఖను ముట్టడిస్తున్నట్లు కార్మిక సంఘం నాయకులు వెల్లడించారు.

సింధనూరులో ప్రదర్శన నిర్వహిస్తున్న వివిధ సంఘాలు

వ్యర్థాల పారబోత ప్రాంతం పరిశీలన

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగర వ్యర్థాలు నిల్వ చేసిన డంపింగ్ యార్డ్‌ను పాలికె కమిషనర్ పి.మంజునాథ అధికారులతో కలిసి పరిశీలించారు. వ్యర్థాలను బళ్లారి తాలూకా హగరిదోణి గ్రామం సమీపంలోని విశాల ప్రదేశంలో పారబోస్తున్నారు. గత కొన్నేళ్లుగా వ్యర్థాలు వేయడం వల్ల ఆ స్థలం మొత్తం నిండిపోయింది. విష పదార్థాలు, రసాయనాలు భూమిలోకి ఇంకిపోవడం వల్ల భూగర్భ జలాలు విషంగా మారుతున్నాయి. నిల్వ చేసిన వ్యర్థాలను నగర పాలికె కార్మికులు ప్రాసెసింగ్ చేస్తున్నారు. ఈ పనులను కమిషనర్ మంజునాథ, ఉప కమిషనర్ మల్లనగౌడ, ఇంజినీర్లు కిరణ్, వీరేశ్, శ్రీనాథ్ పరిశీలించి వివరాలు సేకరించారు.

స్థలంలో పరిశీలిస్తున్న కమిషనర్

పుస్తక సంస్కృతి నేటితరానికి కానుక

బళ్లారి (గ్రామీణ), న్యూస్‌టుడే: యాంత్రికయుగంలో పుస్తక సంస్కృతిని నేటితరానికి కానుకగా అందించేందుకు ప్రయత్నించాలని శిశు సంక్షేమ సమితి జిల్లా అధ్యక్షురాలు త్రివేణి పత్తార్ పిలుపునిచ్చారు. కన్నడ సాహిత్య పరిషత్తు ఆధ్వర్యంలో ప్రభుత్వ మహిళా పదవీ కళాశాలలో ఏర్పాటు చేసిన దత్తి కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పుస్తక సంస్కృతిని కాపాడుకొనేందుకు క.సా.ప చేస్తున్న సేవలు అనన్యమన్నారు. ఆధునిక మహిళా సాహిత్యంపై కన్నడ అధ్యాపకురాలు సువర్ణమ్మ వివరించారు. కార్యక్రమంలో ప్రధానాచారిణి ప్రజ్ఞా, నవకర్ణాటక యువశక్తి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంజునాథ్, చంద్రశేఖర్ ఆచార్, అధ్యాపకులు కొట్రేష్, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న క.సా.ప అధ్యక్షుడు నిష్ఠిరుద్రప్ప, త్రివేణి తదితరులు

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

బళ్లారి, న్యూస్‌టుడే: అల్లీపురం విద్యుత్తు సరఫరా కేంద్రంలో మరమ్మతులు జరుగుతుండటం వల్ల గురువారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఎదురౌతుందని అధికారులు తెలిపారు. కె.హెచ్.బి.కాలనీ, నేతాజీనగర, ఇన్నారెడ్డి, కౌళగల్లు రహదారి, విద్యానగర, కల్యాణ కాలనీ, భత్రి, గురు కాలనీ, తిలక్‌నగర, వినాయకనగర, ఐశ్వర్య కాలనీ, రేడియోపార్క్ చుట్టుపక్కల కాలనీల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం కల్గనుంది.

మరమ్మతుల కారణంగా..

అత్యవసర మరమ్మతు పనులు జరుగుతుండటం వల్ల బండిమోట, బాపూజీనగర, కురికమేల, కమేల రహదారి, బెంగళూరు రహదారి, తేరువీధి, బ్రూస్‌పేటె, తదితర చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ విద్యుత్తు కోతలు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6.30 వరకు అమలుకానున్నాయి.

గ్రామీణ పరిధిలో..

బళ్లారి గ్రామీణ: రామేశ్వరనగర, బైపాస్, జానెకుంటె, బెళగల్లు తాండ, పారిశ్రామిక ప్రాంతం బెళగల్లు, హరగినడోణి, తదితర చుట్టుపక్కల గ్రామాల్లోనూ విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలిగిస్తున్నట్లు విద్యుత్తు శాఖాధికారులు తెలిపారు.

అవిశ్వాసానికీ నిబంధనల వర్తింపు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీ సభ్యులు ప్రమాణ స్వీకారాన్ని చేపట్టిన 15 నెలల అనంతరం ఎప్పుడైనా అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టవచ్చని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. కోలారు జిల్లా శ్రీనివాసపుర తాలూకా చల్దిగానహళ్లి గ్రామ పంచాయతీ అధ్యక్షునికి వ్యతిరేకంగా సభ్యులు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఓటింగ్ కోసం కోలారు జిల్లాధికారి తేదీని ఖరారు చేయడాన్ని ప్రశ్నిస్తూ అధ్యక్షుడు సీఎన్ శ్రీనివాస్ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

బళ్లారి విభిన్నమైన జిల్లా

ఇక్కడి ప్రజలు మంచి వాళ్లు

బళ్లారి, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో రెండు వర్గాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు...శాంతిభద్రతలు చేయిదాటిపోయాయి. ఇలాంటి కఠిన పరిస్థితుల్లో జిల్లా పోలీస్ అధికారిగా సుమన్ పెన్నేకర్ జనవరి 8న బాధ్యతలు స్వీకరించారు. విధులకు హాజరై నెల పూర్తయిన సందర్భంగా 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. మాది బెళగావి జిల్లా ఖానాపుర తాలూకాలోని ఒక చిన్న గ్రామం.. మా తండ్రి ప్రభుత్వ పాఠశాల ముఖ్య ఉపాధ్యాయుడు విధులు నిర్వహించి విశ్రాంతి పొందారు. నేను మైసూరులో ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల నుంచి డాక్టర్ పట్టా పొందాను..తర్వాత ప్రాక్టీస్ చేయలేదు. వివాహమైంది. ఆ తర్వాత యూపీఎస్సీపై మా రెండు కుటుంబాల్లో అవగాహన ఉండటంతో పాటు నేను ప్రాథమిక విద్యాభ్యాసం చేస్తున్న సమయంలో జిల్లా పాలనాధికారి, జిల్లా పోలీస్ అధికారికి మంచి గుర్తింపు, ప్రజలకు సేవ చేసే అవకాశం వస్తోందని రెండు సార్లు శిక్షణ లేకుండా రాశాను. ప్రయోజనం కనిపించలేదు. మూడోసారి శిక్షణ తీసుకోవడంతో 126వ ర్యాంకు సాధించాను. కలెక్టర్ పోస్టు 125వ ర్యాంకు వద్ద నిలిచిపోయింది. 126వ ర్యాంకు ఎస్పీగా కర్ణాటకలో సేవ చేసే అవకాశం లభించింది.

● నేను కొడుగు, కార్వార్ జిల్లాల ఎస్పీగా విధులు నిర్వహించాను. ఈ మూడు జిల్లాలు భిన్నమైనవి. బళ్లారి జిల్లా వాసులు శాంతి స్వభావులు, అమాయకులు అని చెప్పొచ్చు. ఎక్కువ మందికి చట్టంలో ఏముందో కూడా తెలియదు.

● ప్రభుత్వం కోరి మిమ్మల్ని ఉద్రిక్త పరిస్థితుల్లో ఇక్కడికి పంపారా అని అడగ్గా ...మొదటి నుంచి పని చేయడం నా స్వభావం..నేటి వరకు నాకు అప్పగించిన పనులను ఏనాడు తిరస్కరించలేదు. సవాలుగా తీసుకుని విధులు నిర్వహించడం అలవాటుగా మారింది.

● నేను బాధ్యతలు స్వీకరించిన మొదటి రోజే సంఘటన ప్రదేశానికి వెళ్లి పరిశీలించాను. వీడియోలను సేకరించి దర్యాప్తు ప్రారంభించాల్సి ఉంది. నేను వచ్చిన రెండు రోజులకే ఈ కేసును సీఐడీకీ అప్పగించారు.

● మీపై జిల్లా ప్రజలు అంచనాలు పెట్టుకున్నారు కదా అని ప్రశ్నించగా నేను 13 ఏళ్లగా పోలీసు సేవలో ఉన్నాను. నా రూట్ వేరు..దీంతో మంచి ఫలితాలు వస్తున్నాయి. ప్రజలు అంచనాలను నేరవేర్చడానికి నా వంతు ప్రయత్నం చేస్తాను.

● బళ్లారిలో ట్రాఫిక్ నియంత్రణకు ముఖ్యమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడానికి మేము సిద్ధంగా ఉన్నాం. సీసీ కెమెరాల స్థాపన పూర్తయితే కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షిస్తాం. నగరంలో రహదారులు బాగా లేవు. ప్రజాప్రతినిధులు సహకరించే అనుకూలంగా ఉంటుందన్నారు.

● బళ్లారి జిల్లా ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో ఉండటం వల్ల పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా గంజాయి నివారణ, అక్రమ మద్యం రవాణా, మట్కా, పేకాట, రేషన్ బియ్యం అక్రమ తరలింపు తదితర వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాం.

జిల్లా పోలీస్ అధికారి డా.డి.సుమన్ పెన్నేకర్

రాజ్యాంగంపై శిక్షణ శిబిరం

బళ్లారి, న్యూస్‌టుడే: ప్రభుత్వ సరళాదేవి సతీశ్చంద్ర అగర్వాల్ డిగ్రీ కళాశాల్లో గురువారం ఉదయం 10లకు కళాశాల్లో రాజనీతి శాస్త్రం, రాజ్యాంగంపై శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రధాన ఆచార్యులు ప్రహ్లాద చౌదరి తెలిపారు. ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, విద్యాశాఖ డైరెక్టర్ శోభా, కులబురిగా ప్రాదేశిక విభాగం విద్యాశాఖ డైరెక్టర్ గోళ్లి శివశరణ, బళ్లారి వీఎస్కేయూ ఉపకులపతి మునిరాజు తదితరులు పాల్గొని ప్రారంభిస్తారన్నారు.

భాజపా నేతకు మంత్రి హోదా!

బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే: ప్రభుత్వం ఇటీవలే 54 మందికి మండలి, కార్పొరేషన్ల అధ్యక్షులుగా బాధ్యతలతో పాటు వారికి మంత్రివర్గ హోదాను కట్టబెట్టింది. వారిలో భాజపా నాయకుడు బీడీ భూకాంత్‌కు రాష్ట్ర సహకార ఉద్యాన మార్కెటింగ్ మహామండలి అధ్యక్షునిగా బాధ్యతలను అప్పగించారు. ఆయన భార్య కూడా భాజపా నుంచి జిల్లా పంచాయతి సభ్యురాలిగా ఉన్నారు. పార్టీలో నేతలను విస్మరించి, వారికి బాధ్యతలు ఎలా అప్పగిస్తారని కాంగ్రెస్ కార్యకర్తలు తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

విజయపురలో భూప్రకంపనలు

విజయపుర, న్యూస్‌టుడే: జిల్లాలోని సింధగి, చుట్టుపక్కల ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 11.43 నుంచి మధ్యాహ్నం 12.30 మధ్యలో భూమి కంపించింది. గుర్తించిన స్థానికులు ఇళ్ల నుంచి భయంతో బయటకు పరుగున వచ్చారు. మొదటిసారి పెద్ద చప్పుడు వచ్చిందని స్థల పరిశీలనకు వచ్చిన భూవిజ్ఞాన శాఖ అధికారులకు తెలిపారు.

'వీర కంబళ'లో వీరేంద్రుడు!

మంగళూరు, న్యూస్‌టుడే: సీనియరు దర్శకుడు రాజేంద్రసింగ్ బాబు దర్శకత్వం వహిస్తున్న 'వీరకంబళ' చిత్రంలో ధర్మస్థల ధర్మాధికారి వీరేంద్ర హెగ్గడే ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. సుమారు ఏడు వందల ఏళ్ల చరిత్ర ఉన్న 'కంబళ' క్రీడకు సంబంధించిన అంశాలతో తెరకెక్కిస్తున్న ఈ చిత్రం ఈ నెల 27న వెండితెరపైకి రానుంది. ధర్మస్థల ధర్మాధికారికి, కంబళ చరిత్రకు ఉన్న అవినాభావ సంబంధం తెరపై చూడవచ్చని రాజేంద్రసింగ్ బాబు తెలిపారు. తుళునాడు సీమలో మనోరంజన, సాహస క్రీడగా కంబళను ఏడో దశకంలో భారీ స్థాయిలో వీరేంద్ర హెగ్గడే నిర్వహిస్తూ వచ్చారు. అనంతరం కంబళ పలు మార్పులు చేసుకుని ఆధునికతను సంతరించుకుంది. బాబాస్ బ్లెస్సింగ్స్ ఫిలింస్ బ్యానర్‌పై కన్నడ, తుళుభాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది. డాక్టర్ వినిత విజయ్‌కుమార్ రెడ్డి, అరుణ్ రై తొడార్ ఈ చిత్రాన్ని నిర్మించగా, ప్రకాశ్ రాజ్, రవిశంకర్, రాధికా చేతన్, నవీన్ పడీల్, గోపీనాథ్ భట్, భోజరాజ్ వామంజూరు తదితరులు ప్రధాన పాత్రల్లో నటించారు.



ధర్మాధికారి వీరేంద్ర హెగ్గడేకు సూచనలు ఇస్తున్న రాజేంద్రసింగ్ బాబు

గాల్లోకి తూటాలు పేల్చిన నాయకుడు

కలబురగి, న్యూస్‌టుడే: అఫ్జలపుర కాంగ్రెస్ నాయకుడు ఎంవై పాటిల్‌కు ఆప్తుడు మతీన్ పటేల్ గాల్లోకి కాల్పులు జరిపి, హిందీ చిత్రం 'దురంధర్' చిత్రంలోని పాటకు నృత్యం చేశాడు. ఒక వివాహ వేడుకలో ఆయన పలువురు అతిథుల ముందే గాల్లోకి కాల్పులు జరిపిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. మతీన్ పాటిల్‌పై చర్యలు తీసుకోవాలని భాజపా నాయకులు డిమాండ్ చేశారు. ఆయనపై స్వయం ప్రేరితంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కలకలం రేపిన విమానం

చిక్కమగళూరు, న్యూస్‌టుడే: కళస, ఎన్ఆర్‌పుర తాలూకా పరిధిలోని భద్రా నదీ తీరంలో అడవిపై ఒక లఘు విమానం మంగళవారం తక్కువ ఎత్తులో ఎగురుతూ వెళ్లింది. తమ గ్రామాలపై తక్కువ ఎత్తులో విమానం పెద్ద చప్పుడు చేస్తూ ఎగరడం స్థానికులను విస్మయానికి గురి చేసింది. స్థానికులు తమ చరవాణుల్లో ఆ విమానం ఎగరడాన్ని రికార్డు చేసుకున్నారు.

హిందూ ధర్మరక్షణకు కంకణం

సిరుగుప్ప, న్యూస్‌టుడే: హిందూధర్మం, దేశ రక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములైనప్పుడే మనదేశం, మన సంస్కృతి, సంప్రదాయలు బలోపేతమౌతాయని బెంగళూరుకు చెందిన కుమారి హారికా మంజునాథ పేర్కొన్నారు. హిందూ సమ్మేళన సంచాలన సమితి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి పట్టణంలోని నిట్టూరు నరసింహమూర్తి బయలు ప్రాంగణంలో విరాట హిందూ సమ్మేళనాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని స్వామీజీలు, ప్రతినిధులతో కలిసి ప్రారంభించిన ఆమె ప్రసంగించారు. అంతకు ముందు పట్టణంలో ప్రధాన రహదారులు, కూడళ్ల మీదుగా వేదిక వరకు ఊరేగింపు నిర్వహించారు. వేదికపై వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, దేశభక్తి, దైవభక్తి గీతాలకు నృత్యాలు చేసి అలరించారు. హాల్వి మఠాధిపతి అభినవ మహంత స్వామి సాన్నిధ్యం వహించగా, బసవభూషణ స్వామి, హిందూ సమ్మేళన వేదిక అధ్యక్షుడు కిరణ్‌కుమార్ జైన్, ఉపాధ్యక్షుడు ఆర్.సదాశివ, గురురాజ్, ఇతర ప్రతినిధులు, సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

భక్తి గేయానికి నృత్యం చేస్తున్న విద్యార్థులు

నాజూకు సంజీవని సిద్ధం

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే: కర్ణాటకలో మొట్టమొదటి 5జీ- సేవలను వినియోగించుకునే 'స్మార్ట్ అంబులెన్సు'ను పోలీసు డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎంఏ సలీం బుధవారం ప్రారంభించారు. రోగిని ఇంటి నుంచి ఆసుపత్రి వరకు తీసువచ్చే సమయంలో అంబులెన్సులోని నిపుణులకు ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తూ, ప్రథమ చికిత్స చేసేందుకు అనువైన సదుపాయాలు, ఎక్కువ నాణ్యతతో వీడియో తీసే కెమెరాలు, టెలిమెడిసిన్ పరికరాలు, ఈసీజీ, రక్తపోటు, ఆక్సిజన్ సరఫరా తదితర వివరాలు ఎప్పటికప్పుడు ఆసుపత్రికి చేర్చే సదుపాయం ఈ అంబులెన్సులో ఉన్నాయని ట్రస్ట్‌వెల్ ఆసుపత్రి అధ్యక్షుడు డాక్టర్ హెచ్‌వీ మధుసూదన్ తెలిపారు. గుండెపోటు, పక్షవాతం, వెను ప్రమాదాల బారిన పడిన రోగిని చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకువచ్చేలోగా ఆపరేషన్ థియేటర్, సీటీ స్కానింగ్‌కు సిద్ధతల్ని చేసేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. ఉద్యాననగరిలోని వాహన రద్దీలో బాధితుడ్ని ఆసుపత్రికి తీసుకువచ్చేలోగా 'హాస్పిటల్ ఎట్ హోమ్' అనే నినాదంతో ఈ అంబులెన్సును నిపుణులతో కలిసి సిద్ధం చేయించామని ఆయన వివరించారు. రానున్న రోజుల్లో ఇదే తరహాలో సేవలు అందించే మరికొన్ని అంబులెన్సులను సమకూర్చుకుంటామని చెప్పారు.

స్మార్ట్ అంబులెన్సు వద్ద వైద్యులతో ఎంఏ సలీం

నాటకానికి చక్కని స్పందన

'విగడ విక్రమరాయ' నాటకంలోని సన్నివేశం

మండ్య, న్యూస్‌టుడే: మేలుకోటె పుతిన కళామందిరంలో కర్ణాటక నాటక అకాడమి నిర్వహించిన పోటీల్లో 'విగడ విక్రమరాయ' నాటకానికి చక్కని స్పందన లభించింది. దృశ్య ట్రస్టు సహకారంతో నిర్వహించిన నాటకానికి ముందస్తుగా 30 రోజులు అభ్యాసం చేశారు. మైసూరు సంస్థానానికి చెందిన చరిత్రాత్మక కథనానికి నాటక రూపాన్ని కేవీ నారాయణ మూర్తి ఇచ్చారు. మైసూరు రాజవంశస్థుల ఆస్థానంలో ఆలపించే 'కాయే శ్రీగౌరి' పాటకు బాలలు చేసిన నృత్యం అందరినీ ఆకట్టుకుంది. నాటకంలో విగడ విక్రమరాయ, రధీర, సేనాధిపతి, రాజవైద్యుడు, రాజమాత, సేవకులు, మంత్రులు, చెలికత్తెల పాత్రను పాతిక మంది విద్యార్థులు అభినయించారు. ఒక గంట పాటు నాటకం కొనసాగింది. ప్రధానోపాధ్యాయుడు స్థానీకం సంతానరామన్, ఉపాధ్యాయురాలు బి.జయంతి విద్యార్థులకు ప్రశంస పత్రాలను వితరణ చేశారు.

దివ్యాంగులకు ఉచిత శిక్షణ

బళ్లారి, న్యూస్‌టుడే: సిరిగేరి క్రాస్‌లోని శ్రేష్ఠ ఇంటర్నేషనల్ స్కూల్ మొదటి వార్షికోత్సవం ఈ నెల 14న సాయంత్రం 5 గంటలకు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు బ్రహ్మయ్య నాయుడు తెలిపారు. బుధవారం నగరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు చదువుతో పాటు అంతర్జాతీయ స్థాయిలో క్రీడలపై ప్రత్యేక శిక్షణ ఉంటుందన్నారు. దివ్యాంగులకు ఉచితంగా విద్యాబోధన చేస్తున్నట్లు తెలిపారు.

జీవనశైలి, ఆహారపు అలవాట్లతో క్యాన్సర్ దూరం

బళ్లారి, న్యూస్‌టుడే: ఆరోగ్యకరమైన జీవనశైలి, సమతుల్య ఆహారం, క్రమ తప్పకుండా వ్యాయామం చేయడం, పొగాకు వస్తువులు, మద్యపానం వంటి వాటికి దూరంగా ఉండటం వల్ల క్యాన్సర్‌ను నివారించవచ్చని జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖాధికారి డాక్టర్ యల్లా రమేశ్‌బాబు తెలిపారు. బుధవారం స్థానిక గాంధీనగరలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్యాన్సర్ గురించి అవగాహన పెంచడానికి భారతదేశంలో నవంబరు 7న జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్యాన్సర్ రోగులకు మద్దతు ఇవ్వడం, వ్యాధి గురించి అపోహలను తొలగించడం, ముందస్తుగా గుర్తించడం ప్రధానమని చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న వారికి ఉచిత ఆరోగ్య పరీక్షలు, రక్తపోటు, మధుమేహం వంటి పరీక్షలు నిర్వహించారు. క్యాన్సర్ సంబంధిత వ్యాధులపై సమాచారం అందించారు. కార్యక్రమంలో వైద్యులు విశాలాక్షి, ప్రశాంత్ కుమార్, చేతన్, చందన, సాత్విక్, జబిన్ తాజ్, సిబ్బంది, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో డాక్టర్ యల్లా రమేశ్‌బాబు, చిత్రంలో డాక్టర్ వీరేంద్రకుమార్

హంపీ ఉత్సవాలకు 10 లక్షల మంది

మంత్రి జమీర్ వెల్లడి

ఉత్సవాల ప్రధాన వేదికను పరిశీలిస్తున్న మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్, జిల్లా పాలనాధికారి కవితా మన్నికేరి

హొసపేటె, న్యూస్‌టుడే: హంపీ ఉత్సవాల్ని అంగరంగ వైభవంగా నిర్వహిద్దామని విజయనగర జిల్లా బాధ్యమంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన హంపీ ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. నిరుడు మూడు రోజుల్లో ఏడు లక్షల మంది హంపీ ఉత్సవాలను తిలకించారు, ఇప్పుడు కనీసం 10 లక్షమంది వచ్చే అవకాశం ఉందని ప్రధాన వేదిక వద్ద 50 వేల ఆసనాలను ఏర్పాటు చేశాం, అవసరమైతే మరో 15వేల ఆసనాలను వేయిస్తామని తెలిపారు. ఐదు వేదికల్లో సమానంగా కళాకారుల్ని కళాప్రదర్శనకు అవకాశం కల్పించామని తెలిపారు. నిరుడు ఉత్సవాలకు రూ.16కోట్ల ఖర్చయ్యాయి. ఈసారి కూడా అంతే ఖర్చుతో ఉత్సవాల్ని ఆచరిస్తున్నామన్నారు. ఉత్సవాలకు వచ్చిన వారికి జిల్లా యంత్రాంగం నుంచి మూడు రోజులూ ఉచితంగా భోజనం, తాగునీటి వసతి ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. 13న ఉత్సవాలను ముఖ్యమంత్రి సిద్ధూ ప్రారంభిస్తారన్నారు. అనంతరం ఆయన చిత్రకళ, శిల్పకళా శిబిరాలను సందర్శించారు. జిల్లా పాలనాధికారి కవితా మన్నికేరి, ఎస్పీ జాహ్నవి తదితరులు పాల్గొన్నారు.

గవియప్పతో విభేదాల్లేవ్

స్థానిక ఎమ్మెల్యే గవియప్పతో తనకెలాంటి విభేదాల్లేవని మంత్రి జమీర్ స్పష్టం చేశారు. ఉత్సవాల నుంచి ఆయన దూరంగా ఉన్నారని విలేకరులు ప్రస్తావించగా, వ్యక్తిగత పనుల్లో ఆయన తీరిక లేకుండా ఉన్నారు. ఆయన అధ్యక్షతన ఉత్సవాలు జరుగుతాయని వివరణ ఇచ్చారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులందరూ ఉత్సవాల్లో పాలు పంచుకుంటారని తెలిపారు.

హంపీ ఉత్సవాల నేపథ్యంలో ఏర్పాటు చేసిన శిల్పకళా శిబిరాన్ని సందర్శించిన మంత్రి జమీర్

(c) eenadu

బళ్ళారి
● బళ్ళారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

గనినాడులో వెన్న గణపయ్య

మోకాకోడ్లులోని గణపతికి వెన్నతో అలంకరణ

బళ్లారి (గ్రామీణ, న్యూస్‌టుడే: మోకాకోడ్లులోని గణపతి ఆలయంలో స్వామివారికి నవనీతం(వెన్న)తో అలంకరించి పూజించారు. గణపయ్యను గంగాజలంతో అభిషేకించి పుష్పాలు, వెన్నతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. గొల్లనరసప్ప కాలనీ వరసిద్ధి వినాయక ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పుష్పాలతో అలంకరించారు. హోమాలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. భక్తిగీతాలు, భజనలు భక్తులను రంజింపజేశాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఉడసలమ్మకు 101 కిలోల కుంభం సమర్పణ

ఉత్సవంలో పాల్గొన్న అశేష భక్తులు

కురుగోడు (బళ్లారి), న్యూస్‌టుడే: తాలూకా కేంద్రం సమీపంలోని బాదనహట్టి ప్రజల ఆరాధ్య దైవంగా కొలుస్తున్న ఉడసలమ్మ దేవి మేటి కుంభోత్సవం, ఊరు జాతర బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మేటి కుంభోత్సవం గ్రామంలోని దేవర ఇంటి నుంచి ప్రారంభమై ఊరేగింపు ప్రధాన రహదారి, కూడ్లు మీదుగా ఆలయస్థానానికి చేరుకుంది. బాదనహట్టితో పాటు, నాలుగు గ్రామాల నుంచి మలెనాడ దేవి కుంభోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మేటి హిరే కుంభం విశేషంగా ఆకట్టుకుంది. అన్నంతో పాటు హోళి ఓలిగె 101కిలోల ఉండటం విశేషం. మధ్యరాత్రి 1.30 లకు కుంభోత్సవం ఊరేగింపు ప్రారంభమై తెల్లవారుజామున 5.30లకు దేవస్థానానికి చేరుకుంది. అనంతరం మడివాళ సమూదాయం ప్రజలు ఉదయం 6 గంటలకు కుంభం సమర్పించారు. కుంభోత్సవంలో డోళ్ల కుణిత, కళస, మంగళవాద్యాలతో బాదనహట్టిలో పండగ వాతావరణం నెలకొంది. కురుగోడు తాలూకా నుంచే కాకుండా చుట్టుపక్కల తాలూకాల నుంచి కుంభోత్సవం చూడటానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఎస్.ఐ.సుప్రీత్ విరూపాక్ష నేతృత్వంలో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పది ఫలితాల సాధనకు కృషి

మాట్లాడుతున్న విద్యా శాఖాధికారిణి ఉమాదేవి

కంప్లి, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తున్నామని జిల్లా విద్యాశాఖ అధికారిణి ఉమాదేవి తెలిపారు. కంప్లిలో బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. మొదటి విడత సన్నాహక పరీక్షల్లో 49.24 శాతం, రెండో విడత పరీక్షల్లో 64.05 శాతం ఫలితాలు వచ్చాయి. మూడో విడత తుది పరీక్షల్లో 90 శాతం ఫలితాలు సాధిస్తున్నారు. జిల్లాలో 275 మంది విద్యార్థులు మధ్యలో బడి మానేయగా 125 మందిని తిరిగి పాఠశాలకు రప్పించామన్నారు. సమావేశంలో అధికారులు వేదావతి, షకీల్ అహ్మద్, టి.ఎం.బసవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ద్వితీయ పీయూసీ పరీక్షలకు సర్వం సిద్ధం

◆ విద్యార్థులు 25,645 ◆ మొత్తం 43 కేంద్రాలు, బళ్లారి-20, విజయనగర-23

బళ్లారి, న్యూస్‌టుడే: విద్యార్థుల జీవిత భవిష్యత్తును నిర్ధారించే ద్వితీయ పీయూసీ వార్షిక పరీక్షలు ఈనెల 28న ప్రారంభమవుతున్నాయి. పరీక్షలకు విద్యా శాఖ గనినాడు బళ్లారి, విజయనగర జిల్లాల్లో సర్వం సిద్ధం చేశారు. ఈ రెండు జిల్లాల్లో మొత్తం విద్యార్థులు 25,645 మంది పరీక్షలు రాస్తుండగా, వారిలో బాలికలు 15,155 మంది, బాలురు 10,490 మంది ఉన్నారు. బాలుర కంటే అత్యధికంగా బాలికలు 4665 మంది పరీక్షలు రాస్తున్నారు. ఎక్కువ మంది బాలికలు చదువుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. ప్రైవేట్‌గా పరీక్షలు రాసే విద్యార్థులు(కళాశాల రహితం) 967 మంది, రిపీటర్స్ 3806 మంది విద్యార్థులు ఉన్నారు.

ఫిబ్రవరి 28 నుంచి పరీక్షలు షురూ

ద్వితీయ పీయూసీ పరీక్షలు ఈనెల 28 (శనివారం) నుంచి ప్రారంభమవుతున్నాయి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట (3గంటలు)వరకు పరీక్షలు జరుగుతాయి. ఉదయం 9.30 వరకే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతి ఇస్తారు. 9.45కు జవాబు పత్రం అందజేస్తారు. మార్చి 17న హిందూస్తానీ మ్యూజిక్ ఇతర పరీక్షలతో ద్వితీయ పీయూసీ పరీక్షలు ముగుస్తాయి. ఈ పరీక్ష మాత్రం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12.15 వరకు జరుగుతుంది.

● పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తారు. ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉంటారు. తాగునీటిని డి.గ్రూపు సిబ్బంది అందజేస్తారు. సిట్టింగ్ స్క్వాడ్‌తో పాటు తాలూకా, జిల్లా, రాష్ట్ర స్థాయి స్క్వాడ్‌లు రంగంలో ఉంటాయి. విస్తృత పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

తాలూకాల వారీగా కేంద్రాలు

ఉమ్మడి బళ్లారి జిల్లాలో మొత్తం 43 పరీక్ష కేంద్రాలను సర్వం సిద్ధం చేయగా, వాటిలో బళ్లారి-20, విజయనగర-23 పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేశారు. బళ్లారి-12, సండూరు-2, సిరుగుప్ప-3, కంప్లి-2, కురుగోడు-1 కేంద్రాలను సిద్ధం చేశారు. విజయనగర జిల్లాలో హోసపేటె-7, హరపనహళ్లి-5, కూడ్లిగి-2, హగరిబొమ్మనహళ్లి-3, కొట్టూరు-3, హూవినహడగలి-3 కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఉత్తీర్ణత శాతం పెంచడానికి కసరత్తు

ఈ ఏడాది నూటికి నూరుశాతం ద్వితీయ పీయూసీ ఉత్తీర్ణత శాతం పెంచడానికి తీవ్ర కసరత్తు చేశాం. ప్రభుత్వ పీయూసీ కళాశాల ముగిసిన తర్వాత కూడా గంటపాటు ప్రత్యేక తరగతులు నిర్వహించాం. మొదటి సారి పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులను గుర్తించి వారిపై మరింత దృష్టి పెట్టాం. ఈ ఏడాది రెండుసార్లు ప్రిఫైనల్ పరీక్షలు నిర్వహించాం. ఉత్తీర్ణత శాతం పెరిగే అవకాశాలు ఉన్నాయి.

-లక్ష్మణ హళ్లదమని, ఉప నిర్దేశకులు, పీయూసీ శాఖ

ఊరేగింపులో పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులు

ఘనంగా అయ్యప్ప కుంభోత్సవం

గంగావతి,న్యూస్‌టుడే: అయ్యప్పస్వామి ఆలయం 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గంగావతిలో బుధవారం కుంభోత్సవం ఆచరించారు. 251 మంది ముత్తయిదులు పూర్ణకుంభాలతో గంగాజలాన్ని ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి అభిషేకం చేశారు. పట్టణంలోని దుర్గమ్మ ఆలయం నుంచి ఈ ఉత్సవం ప్రారంభమైంది. ఊరేగింపులో మహిళల కోలాటం ఆకట్టుకుంది. బ్రహ్మశ్రీ చంద్రమౌళి గురుస్వామి, ఆలయం అధ్యక్షుడు జట్టి వీరప్రసాద్, టి రామకృష్ణ, తాయిబాబు, చెన్నుపాటి ప్రభాకర్, నారాయణప్ప నాయక్, భీమసేనాచర్ పాల్గొన్నారు.

నగర పాలికె సాధారణ సమావేశం వాయిదాకు వినతి

నగర పాలికె కమిషనర్ మంజునాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ముందూరు ప్రభంజన్ కుమార్ తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: తొమ్మిది నెలల తర్వాత జరుగుతున్న బళ్లారి నగర పాలికె సాధారణ సమావేశం, బడ్జెట్ సమావేశాన్ని వాయిదా వేయాలని 3వ వార్డు కార్పొరేటర్ ముందూరు ప్రభంజన్‌కుమార్ నేతృత్వంలో 18 మంది కార్పొరేటర్లు సంతకాలు చేసిన వినతిపత్రాన్ని నగర పాలికె కమిషనర్ పి.మంజునాథ్‌కు అందజేశారు. బళ్లారి నగర పాలికె 2026-27 బడ్జెట్ సమావేశం ముందు నగర పాలికకు వచ్చే ఆదాయం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే ఆదాయం, ఖర్చులు, వార్డుల వారీగా నిధుల కేటాయింపు తదితర వాటిపై కార్పొరేటర్లతో చర్చించకుండా, ముందస్తు సమావేశం నిర్వహించకుండా ఏకపక్షంగా బడ్జెట్‌ను సిద్ధం చేశారు. దీన్ని పలువురు కార్పొరేటర్లు వ్యతిరేకిస్తున్నారు. వచ్చేది వేసవి కాలం ఇప్పటికే నగర పాలికెలో వారం రోజులకు ఒకసారి తాగునీటిని అందజేస్తున్నారు. నగర పాలికెలో పలు రహదారులు గుంతలు పడ్డాయి. ఇతర సమస్యలు ఉన్నాయి. ఈనెల 16న నిర్వహించే సాధారణ సమావేశం గురించి కూడా కార్పొరేటర్లతో మేయర్, కమిషనర్ చర్చించలేదన్నారు. కార్పొరేటర్ ముందూరు ప్రభంజన్‌కుమార్ మాట్లాడుతూ రాబోయే సమావేశాల్ని పలువురు కార్పొరేటర్లు వ్యతిరేకిస్తున్నారన్నారు.

ఎస్ఐఆర్ మ్యాపింగ్ నిలిపివేయాలని ధర్నా

తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న స్లం జనాందోళన కార్యకర్తలు

హొసపేటె, న్యూస్‌టుడే: ఓటరు జాబితాలో సవరణ సాకుతో కేంద్ర ప్రభుత్వం 12 రాష్ట్రాల్లో చేపడుతున్న ప్రత్యేక సునిశిత సంస్కరణ(ఎస్ఐఆర్) మ్యాపింగ్‌ను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ గురువారం స్లం జనాందోళన కర్ణాటక కార్యకర్తలు జిల్లా పాలనాధికారి కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఆందోళనకారులు నేతృత్వం వహించిన వెంకమ్మ, రామచంద్ర తదితరులు మాట్లాడుతూ మొన్న జరిగిన బిహార్ ఎన్నికలకు ముందు ఎస్ఐఆర్ మ్యాపింగ్ చేసి సుమారు 65 లక్షల మంది ఓటర్లను తొలగించారని ఆరోపించారు. స్వతంత్రంగా పనిచేయాల్సిన కేంద్ర ఎన్నికల సంఘం కేంద్ర ప్రభుత్వం పరంగా పనిచేస్తోందని దుయ్యబట్టారు. ఎస్ఐఆర్ మ్యాపింగ్ చేపడితే దళిత, నిరుపేదల ఓట్లే గల్లంతయ్యే ప్రమాదం ఉందని విచారం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కూడా ఈ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసుకుంటోంది, రాష్ట్ర ప్రభుత్వం కూడా వ్యతిరేకించాలని కోరారు. తహసీల్దార్ శివరాజ్‌కు వినతిపత్రం సమర్పించారు.

విద్యార్థులకు వినయం అవసరం

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న స్వామీజీలు

మాన్వి, న్యూస్‌టుడే: మానవీయ విలువలు నశించిపోతున్న ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులకు విద్యతో పాటు సంస్కారం, వినయం చాలా అవసరమని చిక్కల్‌పర్వ రుద్రమునీశ్వర మఠం సదానంద స్వామీజీ పేర్కొన్నారు. గారిగె జాతరలో భాగంగా బుధవారం ధ్యాన మందిరం వద్ద ప్రభులింగలీల ప్రవచన కార్యక్రమాన్ని స్వామీజీ ప్రారంభించి మాట్లాడారు. 12వ శతమానంలో విశ్వ గురు బసవణ్ణ అనుభవ మంటపాన్ని నిర్మించారని, ప్రథమ శూన్యపీఠాధ్యుడిగా అల్లమ ప్రభుదేవరు వ్యవహరించారని, కాయక తత్వాలను వచనరూపంలో ప్రజలకు చాటిన ఘనత శరణులకు దక్కుతుందన్నారు. కల్మఠ విరూపాక్షపండితారాధ్య స్వామీజీ, అభినవ శాంతమల్లశివాచార్య స్వామీజీ, శంకరయ్యస్వామి సువర్ణగిరిమఠ మాట్లాడారు. ఎల్ఎంజీఎస్ కాన్వెంట్ విద్యార్థుల ఆధ్వర్యంలో నృత్య కార్యక్రమాలు జరిగాయి. రుద్రయ్యస్వామి మద్లాపూర్, జగదీశ్, సిద్ధయ్యస్వామి, తాలూకా వీరశైవలింగాయత్ సంఘం అధ్యక్షుడు హరిహరపాటిల్ తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయుల మృతికి సంతాపం

మాన్వి, న్యూస్‌టుడే: ఇటీవల మృతి చెందిన సీనియర్ పాత్రికేయుడు, విధానపరిషత్ మాజీ సభ్యుడు రామయ్య, మాన్వి పత్రిక సంపాదకుడు గిరికోటేశ్ మృతికి మాన్వి తాలూకా వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ సంతాపం వ్యక్తం చేసింది. సంఘం అధ్యక్షుడు అశోక్ తదితర అధ్యక్షతన స్థానిక పత్రిక భవనంలో వారి చిత్రపటాలకు శ్రద్ధాంజలి ఘటించారు. సంఘం అధ్యక్షుడు ఆశోక్, సీనియర్ పాత్రికేయులు పి.వి మేక్, బసవరాజ్ బోగావతి, తాయప్ప హోసూరు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి అజయ్‌కుమార్, మాజీ అధ్యక్షుడు మారెప్ప, జిల్లా ప్రతినిధి హనుమంతప్ప వివిధ పత్రికల విలేకర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దద్దల్ రెండు రోజుల పర్యటన

మాన్వి, న్యూస్‌టుడే : రాయచూరు గ్రామీణ ఎమ్మెల్యే, కర్ణాటక వాల్మీకి అభివృద్ధి మండలి అధ్యక్షుడు బసనగౌడ దద్దల్ నియోజకవర్గం లోని మాన్వి తాలూకా పరిధిలో గురువారం పర్యటించనున్నారు. గోర్కల్ గ్రామంలోని ద్యావమ్మదేవి జాతరలో పాల్గొంటారు. బిచ్చాలి గ్రామ దేవత పూజా కార్యక్రమానికి హారవుతారు. మధ్యాహ్నం వేసవి తాగునీటి విషయమై రాయచూరు తాలూకా పంచాయతీ సభాప్రాంగణంలో అధికారుల సమీక్ష సమావేశంలో పాల్గొంటారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు రాజలబండలో మాన్వి తాలూకా కేడీపీ సమావేశంలో పాల్గొంటారు.

కంప్లి ఉత్సవాలు ప్రారంభం

కొట్టాలు మార్గంలో మహిళలు వేసిన రంగోలీ

విజేతలకు బహుమతులు అందిస్తున్న శ్రీదేవి గణేశ్

కంప్లి, న్యూస్‌టుడే: కంప్లి ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. స్థానిక బీఎస్‌వీ పాఠశాల్లో ఉదయం మహిళలకు మెహందీ పోటీలు, కొట్టాలు మార్గంలోని ప్రధాన రహదారిపై ఓవైపు రంగోలీ పోటీలు నిర్వహించారు. 57 మంది మెహందీ పోటీలో పాల్గొనగా బి.కె.సల్మా నాజ్ ప్రథమ, ఆఫ్రినా ద్వితీయ, కౌసర్ తృతీయ స్థానాల్లో నిలిచి బహుమతులు అందుకున్నారు. పోటీదారులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. రంగోలీ పోటీలో 132 మంది పాల్గొనగా శిల్పా, మీనాక్షి, భాగ్యలక్ష్మి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ఎమ్మెల్యే గణేశ్ భార్య శ్రీదేవి బహుమతులు అందించారు. పోటీలో పాల్గొన్న అందరికీ ప్రోత్సాహక బహుమతులు అందించారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ నిర్వహించిన ఈ పోటీలో అధికారి జి.ప్రదీప్, గౌసియా బేగం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విచిత్ర వేషధారణతో పాల్గొన్న కళా బృందాలు

కళా బృందాల ఊరేగింపు

కంప్లి, న్యూస్‌టుడే: తుంగభద్ర నదీ తీరంలోని కోటె పంపాపతి ఆలయం నుంచి సోమేశ్వర పార్వతీ దేవి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఎమ్మెల్యే గణేశ్ ఈ ఊరేగింపును ప్రారంభించారు. వివిధ వేషధారణలతో ఉన్న కళాకారులు వెంట రాగా ఊరేగింపు పట్టణ ప్రధాన వీధుల మీదుగా సోమప్ప ఆలయం వరకు కొనసాగింది. హుబ్బళ్లి, ధార్వాడ, శివమొగ్గ, హొసపేటె, కంప్లి, 10.ముద్దాపుర, హళె దరోజి, రామసాగర, సోమలాపుర, హొన్నావర, సాగర తదితర కళా బృందాలు పాల్గొన్నాయి.

భారత్ బంద్‌కు పిలుపునిస్తూ ప్రదర్శన

కొప్పళలో కాగడాల ప్రదర్శన నిర్వహిస్తున్న జేసీటీయూ కార్యకర్తలు

గంగావతి, న్యూస్‌టుడే: అఖిల భారత సార్వత్రిక సమ్మెకు మద్దతు కోరుతూ కార్మిక సంఘాల సంయుక్త సమితి మంగళవారం రాత్రి కొప్పళలో కాగడాల ప్రదర్శన నిర్వహించింది. కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలని ఈ నెల 12న సమ్మె చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ చట్టాల వల్ల కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందన్నారు. ధరలు పెరిగి సామాన్యులు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రదర్శనలో అల్లమప్రభు బెట్టదూరు, డీహెచ్ పూజార్, శరణుగడ్డి, బసవరాజ్ శీలవంతర్, సుంకప్ప గదగ పాల్గొన్నారు.

నులి పురుగుల నియంత్రణ మాత్రల వితరణ

విద్యార్థులకు మాత్రలు ఇస్తున్న వైద్య సిబ్బంది

శ్రీరామనగర్, న్యూస్‌టుడే: కారటగి తాలూకా ముష్టూరు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం వైద్య సిబ్బంది నులి పురుగుల నియంత్రణ మాత్రలు పంపిణీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారిణి కరి బసమ్మ మాట్లాడుతూ 10న జాతీయ నులి పురుగుల నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వారం రోజుల పాటు గ్రామాల్లోని 19 ఏళ్ల లోపు పిల్లలకు మాత్రలు పంపిణీ చేయనున్నారు. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి మాత్రలు పంపిణీ చేస్తారన్నారు. ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

లింగప్పకు కాయక శరణ శ్రీ ప్రశస్తి ప్రదానం

లింగప్పను సత్కరిస్తున్న మంత్రులు

చెళ్లకెర(చిత్రదుర్గ),న్యూస్‌టుడే: కాయక శరణుల జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా ఏర్పాటు చేసిన కాయక శరణ శ్రీ ప్రశస్తికి చిత్రదుర్గానికి చెందిన విశ్రాంత ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, రచయిత ప్రొ. హెచ్ లింగప్పను ఎంపిక చేసి సత్కరించింది. మంగళవారం రాత్రి బెంగళూరులోని రవీంద్ర కళాక్షేత్రంలో నిర్వహించిన ప్రశస్తి బహూకరణ కార్యక్రమంలో కన్నడ సాంస్కృతిక శాఖ మంత్రి శివరాజ్ తంగడగి, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి ఆర్‌బీ తిమ్మాపూర్, మాజీ ఎంపీ ఎల్.హనుమంతయ్య తదితరులు ఆయనకు అవార్డుతో పాటు రూ.5 లక్షల నగదు, జ్ఞాపికను అందజేసి సత్కరించారు. శరణ సాహిత్య తత్వ సిద్ధాంతాలను తమ జీవనంలో అలవర్చుకొని వాటిని తమ రచనల ద్వారా ప్రచారం చేస్తున్నందుకు ఆయనకు ఈ ప్రశస్తిని ప్రదానం చేసినట్లు మంత్రి శివరాజ్ తంగడగి పేర్కొన్నారు.

ఒంటరి మహిళల్ని సంరక్షించాలి

రెవెన్యూ అధికారి మంజునాథ గౌడకు వినతిపత్రం అందిస్తున్న సంఘం సభ్యులు

సిరుగుప్ప, న్యూస్‌టుడే: సమాజంలో ఒంటరిగా ఉన్న మహిళలను గుర్తించి వారికి సంరక్షణ, పునరావాసం, ఉపాధి కల్పించాలని ఒంటరి మహిళల సంఘం ప్రభుత్వాన్ని కోరింది. సంఘం ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని ఈ మేరకు విన్నవించుకున్నారు. తాలూకా సంచాలకురాలు ఈరమ్మ మాట్లాడుతూ భర్తలు చనిపోయి, ఇతరత్రా కారణాలతో అనేక మంది మహిళలు ఒంటరిగా జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వం సర్వే చేసి వారిని గుర్తించి వారికి జీవనాధారం కల్పించాలి. పింఛన్లు, ఆశ్రయ గృహాలు, జీవనోపాధికి ఆర్థిక తోడ్పాటు, తదితర సౌకర్యాలు కల్పించి ఆదుకోవాలని కోరుతూ వినతిపత్రాన్ని ఉప తహసీల్దార్ మంజునాథ గౌడకు అందించారు. సంఘం సభ్యులు హనుమంతి, మాళమ్మ, దుర్గమ్మ, లక్ష్మి, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

11-02-2026 (ఉ. 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1602.35	1613.87
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	000	000
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	1,465	6,813
నీటి నిల్వ (టి.ఎం.సి)	24.714	45.788

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

మాన్ ధన్ సద్వినియోగానికి పిలుపు

పీఎం ఎస్.వై.ఎం పథకం కింద నమోదు చేసుకున్న పత్రాలు చూపుతున్న సభ్యులు

సిరుగుప్ప, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి శ్రమ యోగి మాన్ ధన్ (పీఎం ఎస్.వై.ఎం) పథకాన్ని ప్రజలు సద్వినియోగ పరుచుకోవాలని నగరసభ కమ్యూనిటీ విభాగాధికారి అమరేశ్ పేర్కొన్నారు. కార్మికశాఖ, నగరసభ సంయుక్తంగ బుధవారం నగరసభ కార్యాలయ సభాభవనంలో పథకం సభ్యుల నమోదు కార్యక్రమాన్ని ఇతర అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అసంఘటిత రంగంలో జీవనం సాగిస్తున్న వీధి వ్యాపారులు, మధ్యాహ్న భోజనం పథకం కార్మికులు, హమాలీలు, ఇటుక బట్టీలు, బియ్యం మిల్లులు, ఇతరత్రా కర్మాగారాల్లో పని చేసే కార్మికులు, సొంత వ్యాపారం చేసుకునే 18-40 ఏళ్ల వారు ఈ పథకానికి అర్హులు. వయసును బట్టి ప్రీమియం చెల్లింపు ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం తన వంతుగా కొంత జమ చేసి 60 ఏళ్ల తర్వాత నెలకు రూ.3 వేలు చొప్పున పింఛను అందిస్తుంది. అర్హులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కామన్ సర్వీస్ కేంద్రాల్లో (సి.ఎస్.సి) దాఖలాలు అందించి పథకాన్ని నమోదు చేసుకుని సద్వినియోగ పరుచుకోవాలని పిలుపునిచ్చారు. కార్మిక శాఖ అధికారి తిరుమలేశ్, నగరసభ మేనేజర్ ఖాజామొయినుద్దీన్, నగరసభ, కార్మిక ఉద్యోగులు, అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్యకర్తలు, వీధి వ్యాపారులు పాల్గొన్నారు.

'మచ్చలేని చంద్రునిపై నిందలా?'

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సింధనూరు మాదిగ సమాజం ప్రతినిధులు

సింధనూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర అబ్కారీ శాఖ మంత్రి ఆర్.బి.తిమ్మాపూరు సీనియర్ నాయకుడు, తనకు కేటాయించిన శాఖను నిబద్ధతతో నిర్వహిస్తారు, ప్రస్తుతం అబ్కారిశాఖలో కూడా మచ్చలేని చంద్రునిలా సేవలు అందిస్తున్నారని సింధనూరు మాదిగ సమాజం ప్రముఖులు ప్రశంసించారు. మాదిగ సమాజం పెద్దలు బుధవారం విలేకరులతో మాట్లాడారు. తిమ్మావూరు వంటి నాయకునిపై ప్రతిపక్ష భాజపా నేతలు పనిగట్టుకుని అవినీతి బురద పూయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని సింధనూరు మాదిగ సమాజం ప్రముఖులు హెచ్చరించారు. మంత్రి తిమ్మాపూరు సౌమ్యుడు, పాలనాపరంగా జనం మెచ్చే పనులు చేపడతారని మాదిగ సమాజ నాయకుడు వీరేశ్ పేర్కొన్నారు. సమావేశంలో హనుమేశ్ కర్ని, గురురాజ్, దుర్గేశ్ బాలి, గాదిలింగ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రగా వెళ్తూ.. మహిళ దుర్మరణం

హొసపేటె, న్యూస్‌టుడే: కొట్టూరు జాతరకు పాదయాత్రగా వెళుతున్న పుష్పా(55) అనే భక్తురాలిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందారు. ఈ దుర్ఘటన బుధవారం రాత్రి హరపనహళ్లి తాలూకా కె.కల్లహళ్లిలో చోటుచేసుకొంది. హావేరి జిల్లా రాణిబెన్నూరుకు చెందిన ఆమె గ్రామస్థులతో కలిసి విజయనగర జిల్లా కొట్టూరు జాతరకు పాదయాత్రగా బయలుదేరారు. అలసటగా ఉండటంతో కొంత వెనుకపడ్డారు. ఆ సమయంలో చీకట్లో వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొంది. డీఎస్పీ సంతోష్ చవాన్, ఇన్‌స్పెక్టర్ మహాంతేశ్ సజ్జన్, ఎస్సై శంభులింగ హిరేమఠ్‌లు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.

ప్రతిభా పోటీల నిర్వహణ భేష్

మంత్రి శివరాజ్ తంగడగిని సన్మానిస్తున్న అధికారులు

కారటగి, న్యూస్‌టుడే: స్థానిక సిద్ధేశ్వర రంగ మందిరం ఆవరణలో రెండ్రోజులు నిర్వహించిన రాష్ట్ర స్థాయి ప్రతిభా కారంజి-కళోత్సవ పోటీల నిర్వహణ బాగుందని స్థానిక ఎమ్మెల్యే, జిల్లా బాధ్య మంత్రి శివరాజ్ తంగడగి ప్రశంసించారు. పోటీల నిర్వహణ ముగింపు విషయమై బుధవారం ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన అధికారుల సన్మానం స్వీకరించి మాట్లాడారు. వేదికల ఏర్పాటు, పోటీల నిర్వహణ, రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు వసతి, భోజన తదితర సదుపాయాల తీరును ప్రశంసించారు. బడ్జెట్ సమావేశాల సన్నాహక సమావేశం, రాయచూరు ఉత్సవాల వల్ల సొంత నియోజకవర్గంలో జరిగిన రాష్ట్ర స్థాయి కార్యక్రమానికి రాలేకపోయానని విచారం వ్యక్తం చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర గౌడ, క్షేత్ర శిక్షణాధికారి బి.నటేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్యశాలలో ప్రసంగిస్తున్న పాలనాధికారి సురేశ్ ఇట్నాళ

బాధ్యతగా పశు సంరక్షణ

గంగావతి,న్యూస్‌టుడే: పశుసంవర్ధక, జంతుసంక్షేమానికి సమగ్ర పథకం అవసరమని కొప్పళ పాలనాధికారి సురేశ్ ఇట్నాళ అన్నారు. కొప్పళలో బుధవారం జరిగిన విభాగస్థాయి సాంకేతిక కార్యశాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. జంతువుల సంక్షేమం వాటి సంరక్షణకే పరిమితం కాదంటూ ప్రజల ఆరోగ్యం, పర్యావరణం, గ్రామీణ ఆర్థికతతో ముడిపడి ఉందన్నారు. వాటిని సంరక్షించడం, ఆశ్రయం కల్పించడం సమాజం బాధ్యత అన్నారు. వీధికుక్కల నియంత్రణ, రేబిస్ టీకాలు, పశు వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు వీధికుక్కల నియంత్రణకు వందశాతం ప్రగతి సాధించిన యలబుర్గా, కుకునూరు, కారటగి పురసభల ముఖ్యాధికారులను సత్కరించారు. రాయచూరు పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు రమేశ్ దొడ్డమని, కొప్పళ డీఎఫ్ఓ నిర్మలా పాల్గొన్నారు.

మళ్లీ మనరేగా అమలు చేయాలని పాదయాత్ర

పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే గోపాలకృష్ణ, పార్టీ నాయకులు

చెళ్లకెర(చిత్రదుర్గ),న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని (మనరేగా)..వీబీ జీ రామ్ జీ పేరిట మార్పు చేయడాన్ని ఖండిస్తూ జిల్లా కాంగ్రెస్ నేతృత్వంలో కార్యకర్తలు మొలకాల్మూరు తాలూకాలో జన జాగృతి పాదయాత్రను నిర్వహించారు. బుధవారం ఉదయం తాలూకాలోని రాంపుర గ్రామం నుంచి ప్రారంభమైన పాదయాత్ర కొండాపురం మీదుగా దేవసముద్రం వరకు సుమారు 10 కి.మీ కొనసాగింది. పాదయాత్రకు స్థానిక ఎమ్మెల్యే ఎన్.వై గోపాలకృష్ణ నేతృత్వం వహించారు. దేవసముద్రంలో పాదయాత్ర ముగింపు కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ఎమ్మెల్యే గోపాలకృష్ణ మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల కూలీలకు మరణ శాసనమైన వీబీ జీ రామ్ జీ పథకాన్ని వెంటనే కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి, దాని స్థానంలో పాత గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాదయాత్రలో జిల్లా కాంగ్రెస్ సమితి అధ్యక్షుడు తాజ్‌పీర్, రాష్ట్ర ద్రాక్షారస మండలి అధ్యక్షుడు డాక్టర్ యోగీశ్ బాబు తదితరులు పాల్గొన్నారు. జిల్లా నలమూలల నుంచి విచ్చేసిన వందల మంది కార్యకర్తలు పాదయాత్రలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు.

(c) eenadu

ఆ వ్యాఖ్యలకు సిగ్గుపడుతున్నా

క్షమాపణలు కోరిన చంద్రచూడ్

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే : నిర్మాతలు, కథానాయకుల విషయంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సీనియరు విలేకరి, నటుడు చక్రవర్తి చంద్రచూడ్ ఎట్టకేలకు తన వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నారు. నిర్మాతల సంఘం అధ్యక్షురాలు జయమాలను క్షమాపణ కోరారు. జయమాల తనకు తల్లితో సమానమని, చేసిన వ్యాఖ్యలకు సిగ్గుపడుతున్నానని ఆయన పేర్కొన్నారు. చంద్రచూడ్ చేసిన వ్యాఖ్యలపై నిర్మాతలు కొందరు ఫిర్యాదు చేయడంతో ఆయనపై కేసు నమోదైన విషయం తెలిసిందే.

'సుప్రీం' మెట్లెక్కిన 'భైరతి'

బెంగళూరు (కృష్ణరాజపురం), న్యూస్‌టుడే : తనకు ముందస్తు బెయిలు అర్జీని కర్ణాటక ఉన్నత న్యాయస్థానం రద్దు చేయడాన్ని ప్రశ్నిస్తూ ఎమ్మెల్యే భైరతి బసవరాజ్ సర్వోన్నత న్యాయస్థానంలో అర్జీ వేసుకున్నారు. రౌడీషీటరు బిక్లు శివ హత్య కేసులో తనకు ముందస్తు బెయిలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. శివ హత్య కేసులో మొత్తం 20 మందిని భారతీనగర ఠాణా పోలీసులు నిందితులుగా పేర్కొన్నారు. మీ అంతట మీరే పోలీసుల ముందు లొంగిపోయి విచారణకు సిద్ధం కావాలని హోం మంత్రి డాక్టర్ పరమేశ్వర్ ఎమ్మెల్యేకు హితవు పలికారు.

సకల దేవతల సుమమాల..

గాంధీనగర్ క్యాంపులో సువిశాల శివాలయం

ఈశ్వర కోవెల

ఆహ్లాదం.. ఆధ్యాత్మికతల కలబోత

ప్రధాన గర్భగుడిలో ఆరడుగుల శివలింగం

68 అడుగుల శ్రీఅభయాంజనేయస్వామి

పంచాయతన క్షేత్రం పక్కనే చూడచక్కగా లక్ష లింగాల మహాగిరి

సింధనూరు, న్యూస్‌టుడే: రాయచూరు జిల్లా సింధనూరుకి సరిగ్గా 17 కి.మీ దూరంలోని గాంధీనగర్ లో ద్వాదశ జ్యోతిర్లింగాల ఈశ్వర పంచాయతన క్షేత్రం కొలువైంది. ఈ ఆలయం ప్రసిద్ధి చెందడంతో ఈ ప్రాంతం విహారయాత్రా స్థలంగాను మారింది. గాంధీనగర్ క్యాంపులో ఎక్కువమంది తెలుగువారుంటారు. సంకల్పానికి దైవబలం తోడవ్వడంతో 2007లో తొమ్మిది ఎకరాల విస్తీర్ణంలో ఈ బృహత్ ఆలయ క్షేత్ర నిర్మాణం ఆరంభించిన రెండేళ్లలో పూర్తయింది.

శివాలయం.. తలంపు: క్యాంపు పెద్దలు మద్దిపాటి గంగాధరరావు, బలసు కొండయ్య, మద్దిపాటి హరిశ్చంద్ర రావు, పసల భీమరాజు తదితరులకు క్యాంపులో ధ్వజస్తంభం గల శివాలయం నిర్మించాలనే తలంపుతో అందరితో చర్చించి అంకురార్పణ చేశారు. ఆంధ్రాలోని వీరంపాలెం శ్రీబాలత్రిపురసుందరి పీఠం గరిమెళ్ల వెంకటరమణ శాస్త్రి వద్దకు వెళ్లి వాస్తుపరమైన సలహాలు తీసుకున్నారు. ఎడమపక్కన తుంగభద్ర కాలువ పారుతోంది. ఆలయం మధ్యన గర్భగుడిలో ప్రధానమైన ఆరు అడుగుల నర్మదా నది నుంచి తెచ్చిన శివలింగం ఉంది. గణపతి ఆలయం, జగన్మాత బాలాత్రిపురసుందరిదేవి ఆలయం, శ్రీలక్ష్మీనారాయణుల కోవెల, నవగ్రహ మంటపం యాగశాల చుట్టూ కొలువై ఉన్నాయి.

నిత్యం పూజలే..: ఈ క్షేత్రంలో అన్ని ఆలయాల్లో అర్చకులు నిత్య కైంకర్యాలు చేస్తూ ఉంటారు. ప్రతిరోజూ ప్రధాన ఆలయంలో ఏకవార రుద్రాభిషేకం జరుగుతుంటుంది. ఆలయం 18వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం మహాశివరాత్రి నాడు పెద్దఎత్తున కుంభాభిషేకం తలపెట్టారు. ఈ పుణ్యకార్యానికి అవసరమైన పనులు చకచకా కొనసాగుతున్నాయి.

శివోహం.. ధర్మపథం

శివరాత్రికి కుద్రోళిలో ఏర్పాట్లు

కుద్రోళి గోకర్ణనాథ ఆలయం

గర్భగుడిలోని గోకర్ణనాథుడు

మంగళూరు, న్యూస్‌టుడే: ఒకప్పుడు ఆలయాల్లోకి అన్ని వర్గాల వారికి ప్రవేశం ఉండేది కాదు. బ్రహ్మశ్రీ నారాయణ గురు కర్ణాటకలో నెలకొల్పిన ఏకైక శివాలయం కుద్రోళి గోకర్ణనాథ క్షేత్రం. బిల్లవ సముదాయంతో పాటు అన్ని వర్గాల ప్రజలు అప్పటి నుంచి ఆ ఆలయానికి వచ్చి వెళ్లేవారు. ఒకే కులం.. ఒకే మతం.. ఒకే దేవుడు.. అనే నినాదం విశ్వవ్యాప్తమైంది. మహాశివరాత్రికి ఆలయంలో జాగారానికి ఏర్పాట్లు చేస్తున్నారు. నారాయణగురు 1912లో నిర్మించిన ఆలయాన్ని 1989లో కేంద్ర మాజీ మంత్రి జనార్దన పూజారి నేతృత్వంలో జీర్ణోద్ధరణ పనులు ప్రారంభమయ్యాయి. బ్రహ్మకలశ ఉత్సవాలను 1991లో నిర్వహించగా, అప్పటి ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. శివగిరిలో కుద్రోళి తీర్థాటన పేరిట మూడు రోజులు నిర్వహించే కార్యక్రమాలలో కనీసం పాతిక లక్షల మంది భక్తులు పాల్గొంటారని ఆలయ సమితి కోశాధికారి పద్మరాజ్ పూజారి తెలిపారు. ఫిబ్రవరి 15న మహారుద్రాభిషేకం, 16న మహా అన్నసంతర్పణ, 18న జాతర ముగింపు వేడుకలు ఉంటాయని ఆయన తెలిపారు. మొక్కులు ఉన్న భక్తులు పసుపు వర్ణం దుస్తులు ధరించి వస్తారని చెప్పారు.

'వీర కంబళ'లో వీరేంద్రుడు!



ధర్మాధికారి వీరేంద్ర హెగ్గడెకు సూచనలు ఇస్తున్న రాజేంద్రసింగ్ బాబు

మంగళూరు, న్యూస్‌టుడే: సీనియరు దర్శకుడు రాజేంద్రసింగ్ బాబు దర్శకత్వం వహిస్తున్న 'వీరకంబళ' చిత్రంలో ధర్మస్థల ధర్మాధికారి వీరేంద్ర హెగ్గడె ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. సుమారు ఏడు వందల ఏళ్ల చరిత్ర ఉన్న 'కంబళ' క్రీడకు సంబంధించిన అంశాలతో తెరకెక్కుతున్న ఈ చిత్రం ఈ నెల 27న వెండితెరపైకి రానుంది. ధర్మస్థల ధర్మాధికారికి, కంబళ చరిత్రకు ఉన్న అవినాభావ సంబంధం తెరపై చూడవచ్చని రాజేంద్రసింగ్ బాబు తెలిపారు. తుళునాడు సీమలో [illegible] సాహస క్రీడగా కంబళను ఏడు దశకాలుగా భారీ స్థాయిలో వీరేంద్ర హెగ్గడె నిర్వహిస్తూ వచ్చారు. అనంతరం కంబళ పలు మార్పులు చేసుకుని ఆధునికతను సంతరించుకుంది. బాబాస్ ఫ్లెక్సింగ్ ఫిలిమ్స్ బ్యానర్‌పై కన్నడ, తుళుభాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది. డాక్టర్ వినీత్ విజయకుమార్ రెడ్డి, అరుణ్ రై తోడార్ ఈ చిత్రాన్ని నిర్మించగా, ప్రకాశ్ రాజ్, రవిశంకర్, రాధికా చేతన్, నవీన్ పడీల్, గోపీనాథ్ భట్, భోజరాజ్ వామంజూరు తదితరులు ప్రధాన పాత్రల్లో నటించారు.

హంపీ ఉత్సవాలకు 10 లక్షల మంది

అంచనా వేశామని మంత్రి జమీర్ వెల్లడి

ఉత్సవాల ప్రధాన వేదికను పరిశీలిస్తున్న మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్, జిల్లా పాలనాధికారి కవితా మన్నికేరి

హొసపేటె, న్యూస్‌టుడే: హంపీ ఉత్సవాల్ని అంగరంగ వైభవంగా నిర్వహిద్దామని విజయనగర జిల్లా బాధ్యమంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన హంపీ ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. నిరుడు మూడు రోజుల్లో ఏడు లక్షల మంది హంపీ ఉత్సవాలను తిలకించారు, ఇప్పుడు కనీసం 10 లక్షలమంది వచ్చే అవకాశం ఉందని ప్రధాన వేదిక వద్ద 50 వేల ఆసనాలను ఏర్పాటు చేశాం, అవసరమైతే మరో 15వేల ఆసనాలను వేయిస్తామని తెలిపారు. ఐదు వేదికల్లో సమానంగా కళాకారులకు కార్యక్రమాలు ప్రదర్శించే అవకాశం కల్పించామని తెలిపారు. నిరుడు ఉత్సవాలకు రూ.16కోట్ల ఖర్చయ్యాయి. ఈసారి కూడా అంతే ఖర్చుతో ఉత్సవాల్ని ఆదరిస్తున్నామన్నారు. ఉత్సవాలకు వచ్చిన వారికి జిల్లా యంత్రాంగం నుంచి మూడు రోజులూ ఉచితంగా భోజనం, తాగునీటి వసతి ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. 13న ఉత్సవాలను ముఖ్యమంత్రి సిద్ధు ప్రారంభిస్తారన్నారు. అనంతరం ఆయన చిత్రకళ, శిల్పకళ శిబిరాలను సందర్శించారు. జిల్లా పాలనాధికారి కవితా మన్నికేరి, ఎస్పీ జాహ్నవి తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే గవియప్పతో తనకెలాంటి విభేదాల్లేవని మంత్రి జమీర్ స్పష్టం చేశారు. ఉత్సవాల నుంచి ఆయన దూరంగా ఉన్నారని విలేకరులు ప్రస్తావించగా, వ్యక్తిగత పనులపై ఆయన బీదర్ వెళ్లారని తెలిపారు. ఆయన అధ్యక్షతన ఉత్సవాలు జరుగుతాయని వివరణ ఇచ్చారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులందరూ ఉత్సవాల్లో పాలు పంచుకుంటారని తెలిపారు.

ఆమె ఇంట్లో.. రహస్య కెమెరాలు

బెళగావి, న్యూస్‌టుడే: తనతో కలిసి పని చేస్తున్న అధికారిణి పరువు తీయాలని ఆమె నివాసంలో రహస్య కెమెరా ఏర్పాటు చేసిన ఆరోపణలపై టి.వినోద్ అనే ప్రభుత్వ ఉద్యోగిని అరెస్టు చేసినట్లు మాళమారుతి ఠాణా పోలీసులు బుధవారం తెలిపారు. ఆమె నివాసంలో బల్బు హోల్డర్లలో మొత్తం 8 రహస్య కెమెరాలను ఏర్పాటు చేయించాడు. ఆ కెమెరాల్లో రికార్డయిన చిత్రాలు వినోద్ చరవాణికి వచ్చేవి. తనకు పరిచయం ఉన్న వారిని విలేకరులుగా చెప్పించి, వాటితో ఆ అధికారిణిని నగదు కోసం బెదిరిస్తూ వచ్చాడు. తనకు ఇష్టం లేకుండానే బదిలీ చేయించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించి, నిందితుడు ఈ అక్రమానికి పాల్పడ్డాడని ప్రాథమిక విచారణలో గుర్తించారు. పరారీలో ఉన్న ఇతర నిందితుల కోసం పోలీసులు గాలింపు తీవ్రం చేశారు.

విజయపురలో భూప్రకంపనలు

విజయపుర, న్యూస్‌టుడే: జిల్లాలోని సింధగి, చుట్టుపక్కల ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 11.43 నుంచి మధ్యాహ్నం 12.30 మధ్యలో భూమి కంపించింది. భూమి కంపిస్తున్నట్లు గుర్తించిన స్థానికులు ఇళ్ల నుంచి భయంతో బయటకు పరుగున వచ్చారు. మొదటిసారి కంపించిన సమయంలో పెద్ద చప్పుడు వచ్చిందని స్థల పరిశీలనకు వచ్చిన భూవిజ్ఞాన శాఖ అధికారులకు తెలిపారు.

చల్లచల్లగా.. వేసవి ప్రారంభం కాకముందే బెంగళూరులో పుచ్చకాయల వ్యాపారం ప్రారంభమైంది. తమిళనాడు, బెంగళూరు గ్రామీణ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి కూరగాయలు, పండ్ల మార్కెట్‌కు వస్తున్న కాయల్ని యశ్వంతపుర, కేఆర్ పురం, మల్లేశ్వరం తదితర చోట్ల చిరు వ్యాపారులు టోకున కొనుగోలు చేసుకుని విక్రయిస్తున్నారు. కిలో రూ.18 ప్రారంభ ధర పలుకుతోంది. వేసవి నాటికి కిలో రూ.40 వరకు చేరుకునే అవకాశం ఉందని వ్యాపారులు తెలిపారు. (న్యూస్‌టుడే, రాజాజీనగర)

పుస్తకాల సంచిలో నాగు!

మైసూరు, న్యూస్‌టుడే: [illegible] సమీపంలోని మధురానగరలోని ఓ పాఠశాలలో వచ్చిన ఒక నాగుపాము అక్కడి వారిని బుధవారం పరుగులు తీయించింది. అది చివరికి.. ఓ విద్యార్థి పుస్తకాల సంచిలోకి దూరింది. పాఠశాల యాజమాన్యం ఫిర్యాదుతో 'స్నేక్ శ్యామ్' అక్కడకు చేరుకుని, పామును పట్టుకుని పాలికె సిబ్బంది సహకారంతో దాన్ని స్థానిక అడవిలో విడిచి పెట్టారు.

ఉద్యోగాల పేరిట యువతులకు ఎర

చిక్కబళ్లాపుర: ఉద్యోగాలు ఇప్పిస్తామని యువతులను నమ్మించి, వారిని బెదిరించి పడుపు వృత్తి చేయిస్తున్న ముగ్గురు మహిళలకు తలా ఏడేళ్ల కారాగార శిక్ష, పదేసి వేల రూపాయల జరిమానా విధిస్తూ చిక్కబళ్లాపుర ఒకటో అదనపు జిల్లా, పోక్సో ప్రత్యేక న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. [illegible] వెంకట రమణమ్మకు రూ.7 వేలు, లక్ష్మీ నరసమ్మకు రూ.10వేలు, శారదకు రూ.15 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఎస్‌పీ కాంతరాజు ఆదేశించారు. బ్యూటీ పార్లర్లలో ఉద్యోగాల పేరిట వీరు పలువురు యువతులతో పడుపు వృత్తి చేయించారని పోలీసులు తమ అభియోగపత్రంలో పేర్కొన్నారు. ఓ యువతిని రూ.3 లక్షలకు విక్రయించిన కేసులో ఆ ముగ్గురూ చిక్కుల్లోపడి, కారాగారం పాలయ్యారు.

తిరిగొచ్చిన 'బహుమతి'

'పెద్దాయన'ను పట్టించుకోని ఫలితం

బెంగళూరు (జేపీనగర), న్యూస్‌టుడే: వృద్ధాప్యంలో తనను చూసుకుంటారని వెంకటయ్య అనే వ్యక్తి తన పేరిట ఉన్న 2.4 ఎకరాల వ్యవసాయ భూమిని కుమార్తెలు శివమ్మ, పుట్టమ్మ పేరిట బహుమతి (గిఫ్ట్‌డీడ్)గా అందించారు. ఆస్తి చేజిక్కిన అనంతరం వారు తనను నిర్లక్ష్యం చేయడంతో ఆవేదనకు గురైన ఆయన ఆ బహుమతిని రద్దు చేయాలని ఉన్నత న్యాయస్థానంలో అర్జీ వేసుకున్నారు. పూర్వాపరాలను విచారణ చేసిన అనంతరం, సీనియరు సిటిజన్ల చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా ఆ గిఫ్ట్‌డీడ్‌ను ఉన్నత న్యాయస్థానం రద్దు చేసింది. కుమార్తెలకు రాసిచ్చిన 2.4 ఎకరాల వ్యవసాయ భూమిని వెంకటయ్యకు అప్పగించాలని న్యాయస్థానం ఆదేశించింది.

ఇంటి బయట దగ్గాడని దాడి

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రామనగర, న్యూస్‌టుడే : బిడదిలోని తమ ఇంటి ముందు నుంచి దగ్గుతూ వెళ్లాడని రాజస్థాన్‌కు చెందిన వినోద్ కుమార్ శైని (34) అనే వ్యక్తిపై కొందరు దాడి చేశారు. బాధితుడ్ని చికిత్స కోసం బిడదిలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి ఆయన మరణించాడు. ఇంటి యజమాని సంజయ్, అతని స్నేహితులు హొంబయ్య, విజయ్ తదితరులు వినోద్ కుమార్ శైనిపై దాడి చేశారని పోలీసులు తెలిపారు. పదకొండేళ్లుగా బిడదిలో ఉంటూ, వినోద్ కుమార్ ఒక ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు.

ఇక భారం : బెంగళూరులోని ఓ వీధిలో నిలిపిన వాహనాల వరుస

వాహనం నిలిపితే.. వాతలు!

వీధుల్లోనూ జేబు ఖాళీ

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: నీటి పన్ను.. మెట్రో వాత.. విద్యుత్తు షాక్‌లతో హడలెత్తిస్తున్న సర్కారు మరో బాదుడుకు సిద్ధమైంది. బెంగళూరు నగరంలోని ప్రధాన రహదారులతో పాటు కొత్తగా నివాస ప్రాంతాల్లోని చిరు వీధుల్లో వాహనాలు నిలిపినా బృహత్ బెంగళూరు పాలికె (జీబీఏ)కు రుసుం చెల్లించాల్సిందే. అలాంటి ఓ నిబంధనను అమలు చేయాలని జీబీఏ యోచిస్తోంది. వాహనాల పార్కింగ్ సమస్య పరిష్కరించాలని గ్రేటర్ బెంగళూరు ప్రాధికార (జీబీఏ) సిద్ధమైంది. ఇప్పటికే కొన్ని రహదారులపై పార్కింగ్ రుసుం వసూలు చేస్తున్నారు. ఇళ్ల ముంగిట, పాదచారి మార్గాలపై నిలిపే వాటికీ సొమ్ము వసూలు చేయాలనేది కొత్త ఆలోచన. రహదారుల పక్కన నిలిపిన వాహనాలకు సంచార పోలీసులు జరిమానా వడ్డిస్తున్నా సమస్య అదుపులోకి రావడం లేదు. జనావాసాల్లోని ఇరుకైన దారులనూ వాహనాలు ముంచెత్తుతున్నాయి. సాధారణ జన సంచారానికి, కనీసం ద్విచక్ర వాహనాల సంచారానికీ ఇబ్బందికరంగా మారుతోంది. నిజానికి ఇదొక పెద్ద సమస్య. కొత్తగా నిర్మించే ఇళ్ల వద్ద వాహనాల పార్కింగ్ వ్యవస్థ కల్పించుకోవాలనే నిబంధన ఇటీవలే అమలులోకి తెచ్చారు. కొత్త విధానాల ప్రకారం ఇంటి ప్రహరీ లోపల వాహనాలు నిలపాలి. ముంగిట పార్కింగ్ నిషేధం. అలా ఎవరైనా సొంత వాహనాలు నిలిపినా రుసుం కక్కాల్సిందే. ఇందులో.. నెలకోసారి చెల్లించే వీలూ కల్పిస్తారు. ఇలా చేస్తే పార్కింగ్ సమస్య అదుపులోకి వస్తుందని అంచనా వేస్తున్నారు.

రహదారి పక్కన వాహనాలు నిలిపినా మోత తప్పదు..

బెయిలు కోసం పవిత్ర అర్జీ

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే: చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి హత్య కేసులో ఏ1 నిందితురాలు, వెండితెర కథానాయిక పవిత్రా గౌడ తనకు బెయిలు ఇవ్వాలని కోరుతూ న్యాయస్థానంలో అర్జీ వేసుకుంది. తన కుమార్తెకు పదో తరగతి బోర్డ్ పరీక్షలు ఉన్నాయని, ఆమెకు మద్దతుగా ఉండేందుకు బెయిలు ఇవ్వాలని కోరుతూ, తన న్యాయవాది సహకారంతో అర్జీ వేసుకున్నారు. ఇదేవారం అర్జీ విచారణకు వస్తోందని పవిత్ర తరఫు న్యాయవాది సునీల్ తెలిపారు.

బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు	
(హాప్‌కామ్స్-కిలో..రూ.లలో)	
బీన్స్-	50
క్యారెట్-	55
బీరకాయలు-	50
క్యాబేజి-	35
క్యాలీఫ్లవర్(ఒక్కోటి)-	30
సొరకాయ-	55
దొండకాయలు-	45
పొట్లకాయ-	45
పచ్చి మిరపకాయలు-	85
కాకర కాయలు-	55
టమాటా(నాటు)-	35
టమాటా(సాధారణ)-	25
గుమ్మడి-	30
ఆలుగడ్డ-	35
ఉల్లి(మేలురకం)-	35
ఉల్లి(సాధారణ)-	25
వెల్లుల్లి-	160
సాంబారు ఉల్లి-	165
బీట్‌రూట్-	55
వంకాయలు-	55
బెండకాయలు-	55
ముల్లంగి-	55
నిమ్మకాయ-	120
పండ్లు, ఫలాలు ధరలు	
వాషింగ్టన్ ఆపిల్-	395
సిమ్లా ఆపిల్-	285
గ్రీన్ ఆపిల్-	345
అరటి కాయలు-	35
సపోటా-	65
పైనాపిల్-	65
బొప్పాయి-	35
ఆరంజి-	95
బత్తాయి-	55

(న్యూస్‌టుడే, యశ్వంతపుర)

గాల్లోకి తూటాలు పేల్చిన నాయకుడు

కలబురగి, న్యూస్‌టుడే: అఫ్జలపుర కాంగ్రెస్ నాయకుడు ఎంవై పాటిల్‌కు ఆప్తుడు మతీన్ పటేల్ గాల్లోకి కాల్పులు జరిపి, హిందీ చిత్రం 'దురంధర్' చిత్రంలోని పాటకు నృత్యం చేశాడు. ఒక వివాహ వేడుకలో ఆయన పలువురు అతిథుల ముందే గాల్లోకి కాల్పులు జరిపిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. మతీన్ పాటిల్‌పై చర్యలు తీసుకోవాలని భాజపా నాయకులు డిమాండ్ చేశారు. రీల్స్ కోసమే ఆయన గాల్లోకి కాల్పులు జరిపారని గుర్తించారు. ఆయనపై స్వయం ప్రేరితంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అవిశ్వాసానికీ నిబంధనల వర్తింపు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీ సభ్యులు ప్రమాణ స్వీకారాన్ని చేపట్టిన 15 నెలల అనంతరం ఎప్పుడైనా అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టవచ్చని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. కోలారు జిల్లా శ్రీనివాసపుర తాలూకా చల్దిగానహళ్లి గ్రామ పంచాయతీ అధ్యక్షుడికి వ్యతిరేకంగా సభ్యులు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఓటింగ్ కోసం కోలారు జిల్లాధికారి తేదీని ఖరారు చేయడాన్ని ప్రశ్నిస్తూ అధ్యక్షుడు సీఎన్ శ్రీనివాస్ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. సభ్యులు, అధ్యక్షుడు బాధ్యతలు చేపట్టిన 15 నెలల అనంతరం ఎప్పుడైనా అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టవచ్చని జస్టిస్ సూరజ్ గోవిందరాజ్ ప్రకటించి, శ్రీనివాస్ వేసుకున్న అర్జీని తోసిపుచ్చారు.

భాజపా నేతకు మంత్రి హోదా!

బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే: ప్రభుత్వం ఇటీవలే 54 మందికి మండలి, కార్పొరేషన్ల అధ్యక్షులుగా బాధ్యతలతో పాటు వారికి మంత్రివర్గ హోదాను కట్టబెట్టింది. వారిలో భాజపా నాయకుడు బీడీ భూకాంత్‌కు రాష్ట్ర సహకార ఉద్యాన మార్కెటింగ్ మహామండలి అధ్యక్షుడిగా బాధ్యతలను అప్పగించారు. ఆయన భార్య కూడా భాజపా నుంచి జిల్లా పంచాయతీ సభ్యురాలిగా ఉన్నారు. పార్టీలో నేతలను విస్మరించి, భాజపా సభ్యునిగా గుర్తింపు ఉన్న వ్యక్తికి ఆ బాధ్యతలు ఎలా అప్పగిస్తారని కాంగ్రెస్ కార్యకర్తలు తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

కలకలం రేపిన విమానం

చిక్కమగళూరు, న్యూస్‌టుడే: కళస, ఎన్ఆర్‌పుర తాలూకా పరిధిలోని భద్రా నదీ తీరంలో అడవిపై ఒక లఘు విమానం మంగళవారం తక్కువ ఎత్తులో ఎగురుతూ వెళ్లింది. తమ గ్రామాలపై తక్కువ ఎత్తులో విమానం పెద్ద చప్పుడు చేస్తూ ఎగరడం స్థానికులను విస్మయానికి గురి చేసింది. స్థానికులు తమ చరవాణుల్లో ఆ విమానం ఎగరడాన్ని రికార్డు చేసుకున్నారు. భూ సమీక్షకు ఆ విమానం వచ్చి ఉంటుందని అధికారులు అంచనాకు వచ్చారు.

అదుపు తప్పిన ఆర్టీసీ

ప్రయాణికులకు గాయాలు

మండ్య, న్యూస్‌టుడే: మద్దూరు తాలూకా కోడిహళ్లి సమీపంలోని అండర్‌పాస్ వద్ద బుధవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో 19 మంది ప్రయాణికులు గాయపడ్డారు. బెంగళూరు నుంచి విరాజపేటకు సర్వీసు రోడ్డులో వెళుతున్న బస్సు అదుపుతప్పి అండర్‌పాస్ గోడను ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. బాధితులను మద్దూరు తాలూకా ఆసుపత్రిలో చేర్పించారు. తీవ్రంగా గాయపడిన కొందరికి ప్రథమ చికిత్స అనంతరం మండ్య మిమ్స్‌కు తరలించారు.

హాకర్ల విన్నపాలు వినవలె..

బెంగళూరు (రామమూర్తినగర), న్యూస్‌టుడే: శాసనసభలో మార్చిలో ప్రవేశపెట్టే పద్దులో ఇంటింటికీ దినపత్రికలను చేర్చే హాకర్ల సంక్షేమానికి నిధులు కేటాయించాలని కర్ణాటక రాష్ట్ర దినపత్రికల హాకర్ల సమాఖ్య డిమాండ్ చేసింది. సమాఖ్య అధ్యక్షుడు కె శంభులింగ, ప్రధాన కార్యదర్శి సంగం సురేశ్, ప్రతినిధులు శివశాంత్ కుమార్, నాదోరు వాసుదేవ, చెలువరాజు, గంగ ముత్తయ్య, హనుమంతరాజు, హోమదేవ, నాగేశ్ శ్రీకాంత్ గోవిందు, హరిరావు, కృష్ణమూర్తి తదితరులు ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను, ముఖ్యమంత్రికి మాధ్యమ సలహాదారుడు కేవీ ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రాలను అందజేశారు. హాకర్ల క్షేమాభివృద్ధికి ప్రత్యేక నిధిని కేటాయిస్తానని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వారికి భరోసా ఇచ్చారు.

ముఖ్యమంత్రికి వినతిపత్రాన్ని అందిస్తున్న సమాఖ్య ప్రతినిధులు

'విగడ విక్రమరాయ' నాటకంలోని సన్నివేశం

నాటకానికి చక్కని స్పందన

మండ్య, న్యూస్‌టుడే: మేలుకోటె పుతిన కళామందిరంలో కర్ణాటక నాటక అకాడమీ నిర్వహించిన పోటీల్లో 'విగడ విక్రమరాయ' నాటకానికి చక్కని స్పందన లభించింది. దృశ్య ట్రస్టు సహకారంతో నిర్వహించిన నాటకానికి ముందస్తుగా 30 రోజులు అభ్యాసం చేశారు. మైసూరు సంస్థానానికి చెందిన చరిత్రాత్మక కథనానికి నాటక రూపాన్ని కేవీ నారాయణమూర్తి ఇచ్చారు. మైసూరు రాజవంశస్థుల ఆస్థానంలో ఆలపించే 'కాయే శ్రీగౌరి' పాటకు బాలలు చేసిన నృత్యం అందరినీ ఆకట్టుకుంది. నాటకంలో విగడ విక్రమరాయ, రధీర, సేనాధిపతి, రాజవైద్యుడు, రాజమాత, సేవకులు, మంత్రులు, చెలికత్తెల పాత్రను పాతిక మంది విద్యార్థులు అభినయించారు. గంట పాటు నాటకం కొనసాగింది. ప్రధానోపాధ్యాయుడు స్థానీకం సంతానరామన్, ఉపాధ్యాయురాలు బి.జయంతి విద్యార్థులకు ప్రశంస పత్రాలను వితరణ చేశారు.

రైలులోంచి దూకేసి యువకుడు ఆత్మహత్య

హాసన, న్యూస్‌టుడే: మంగళూరు నుంచి బెంగళూరుకు వస్తున్న రైలు నుంచి నిశిత్ నాయక్ (25) అనే యువకుడు కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పుత్తూరు సమీపంలోని పుణచ గ్రామంలోని దేవీనగరకు చెందిన అతను బెంగళూరులోని ఒక నగల దుకాణంలో ఉద్యోగి. సెలవుపై ఊరికి వెళ్లి, మళ్లీ బెంగళూరుకు తిరిగి వస్తూ చెన్నరాయపట్టణ వద్ద రైలు నుంచి కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు కారణాలు గుర్తించవలసి ఉందని రైల్వే పోలీసులు తెలిపారు.

నాజూకు సంజీవని సిద్ధం

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే: కర్ణాటకలో మొట్టమొదటి 5జీ- సేవలను వినియోగించుకునే 'స్మార్ట్ అంబులెన్స్'ను పోలీసు డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎంఏ సలీం బుధవారం ప్రారంభించారు. రోగిని ఇంటి నుంచి ఆసుపత్రి వరకు తీసుకువచ్చే సమయంలో అంబులెన్సులోని నిపుణులకు ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తూ, ప్రథమ చికిత్స చేసేందుకు అనువైన సదుపాయాలు, ఎక్కువ నాణ్యతతో వీడియో తీసే కెమెరాలు, టెలిమెడిసిన్ పరికరాలు, ఈసీజీ, రక్తపోటు, ఆక్సిజన్ సరఫరా తదితర వివరాలు ఎప్పటికప్పుడు ఆసుపత్రికి చేర్చే సదుపాయం ఈ అంబులెన్సులో ఉన్నాయని ట్రస్ట్‌వెల్ ఆసుపత్రి అధ్యక్షుడు డాక్టర్ హెచ్‌వీ మధుసూదన్ తెలిపారు. గుండెపోటు, పక్షవాతం, పెను ప్రమాదాల బారిన పడిన రోగిని చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకువచ్చేలోగా ఆపరేషన్ థియేటర్, సీటీ స్కానింగ్‌కు సిద్ధతల్ని చేసేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. ఉద్యాననగరిలోని వాహన రద్దీలో బాధితుడ్ని ఆసుపత్రికి తీసుకువచ్చేలోగా 'హాస్పిటల్ ఎట్ హోమ్' అనే నినాదంతో ఈ అంబులెన్సును నిపుణులతో కలిసి సిద్ధం చేయించామని ఆయన వివరించారు. రానున్న రోజుల్లో ఇదే తరహాలో సేవలు అందించే మరికొన్ని అంబులెన్సులను సమకూర్చుకుంటామని చెప్పారు.

స్మార్ట్ అంబులెన్సు వద్ద వైద్యులతో ఎంఏ సలీం

పశువుల అక్రమ తరలింపు

మైసూరు, న్యూస్‌టుడే: కంటెయినర్‌లో అక్రమంగా తరలిస్తున్న 38 ఆవులు, లేగదూడలను కవలందె ఠాణా పోలీసులు రక్షించారు. నంజనగూడు మార్గంగా వీటిని కబేళాకు తరలిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో గుర్తించారు. డ్రైవరును అరెస్టు చేసి కంటెయినర్‌ను పోలీసులు జప్తు చేసుకున్నారు. పింజరాపోల్ సమీపంలోని గోశాలకు పశువులను తరలించారు.

బెంగళూరు

● బెంగళూరు ● కోలారు ● మైసూరు ● హోసూరు ● చిక్కబళ్లాపుర ● తుమకూరు

శెట్టిహళ్లిలో వేడుకగా హిందూ సమాజోత్సవం

చిన్నారులతో సురేశ్, సోమశేఖర్, తదితరులు

బెంగళూరు (పీణ్యాదాసరహళ్లి), న్యూస్‌టుడే : హిందూమతాన్ని కాపాడుకోవాడానికి ప్రతి హిందువు పోరాటస్ఫూర్తిని పెంపొందించుకోవాలని భాజపా శెట్టిహళ్లి అధ్యక్షుడు బి.సురేశ్ పిలుపునిచ్చారు. శెట్టిహళ్లిలో సురేశ్ నేతృత్వంలో సమాజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళాలు ప్రత్యేకంగా శోభాయాత్ర నిర్వహించారు. వివిధ కళాకారుల నృత్యాలు, వేషధారణలో చిన్నారులు కన్పించారు. శ్రీసాయి పాఠశాల ఛైర్మన్ బి.సురేశ్, శిల్పాసురేశ్, శ్రీపతీజీ, ఆర్ఎస్ఎస్ నాయకులు, దాసరహళ్లి భాజపా అధ్యక్షుడు సోమశేఖర్, సమాజోత్సవ సమితి నాయకులు పాల్గొన్నారు.

కొల్లాపురమ్మ ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠ

పూజలు చేస్తున్న అర్చకుడు రాజు, దాత ఓబళేసు, మంజునాథ్ తదితరులు

పావగడ : పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని కొల్లాపురమ్మ దేవాలయంలో నాగలింగేశ్వర, నంది, కాలభైరవేశ్వర, ఆంజినేయ, అమ్మవారి పాదాలు, నాగుల ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రాజు, విగ్రహాల దాతలు బ్యాంకు ఓబళేసు, రామాంజి, హోటల్ మంజునాథ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణ, గ్రామాల భక్తులు భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు.

హోసూరు ఖబర్లు

పౌరకార్మికులకు ఘన సత్కారం

పౌర కార్మికులతో ఎమ్మెల్యే ప్రకాశ్, తదితరులు

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు కార్పొరేషన్ పరిధి పారిశ్రామికవాడలోని టైటాన్ పరిశ్రమ యాజమాన్యం సామాజిక బాధ్యత కింద హోసూరు కార్పొరేషన్‌లో పనిచేస్తున్న పౌర కార్మికులను బుధవారం మీరా మహల్‌లో సత్కరించారు. 900 మందికి చీరలు, దోవతులు ఇతర సాయాన్ని అందించారు. హోసూరు ఎమ్మెల్యే వై.ప్రకాశ్, ఉప మేయర్ సి.ఆనందయ్య, ఆరోగ్య విభాగం ఛైర్మన్ ఎన్.ఎస్.మాదేశ్వరన్, కమిషనర్ షబ్బీరు మహమ్మద్ ఆలం, డి.ఎం.కె. కార్మిక విబాగం కార్యదర్శి గోపాలకృష్ణన్ ముఖ్య అథితులుగా హాజరయ్యారు. పౌరకార్మికులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌టాప్‌ల పంపిణీ

ల్యాప్‌టాప్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్, చెన్నీరప్ప తదితరులు

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు కార్పొరేషన్ పరిధి మిడిగిరిపల్లిలోని ప్రభుత్వ కళాశాలలో ముఖ్యమంత్రి ఆదేశం మేరకు విద్యార్థులకు బుధవారం ఉచితంగా ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. హోసూరు ఎమ్మెల్యే వై.ప్రకాశ్, ట్యాక్స్ కమిటీ ఛైర్మన్ చెన్నీరప్ప, యువ విభాగం నాయకులు సుమన్ తదితరులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులకు ప్రిన్సిపల్ డాక్టర్ జె.భాగ్యమణి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్టాలిన్ విద్యారంగానికి అధిక నిధులు విడుదల చేశారని, ముఖ్యమంత్రి ఆదేశం మేరకు 13 కళాశాలలకు చెందిన విద్యార్థులకు 2,817 ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేస్తున్నామన్నారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తును మెరుగు పరచుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కళాశాల ప్రగతిని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ శివబాలా, కంప్యూటర్ విభాగం ప్రతినిధి శరవణన్ ల్యాప్‌టాప్‌ల గురించి వివరించారు. కళాశాల ఉపన్యాసకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

డీఎంకే కూటమిని గెలిపించాలి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్ తదితరులు

డెంకణీకోట, న్యూస్‌టుడే : త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమిని గెలిపించాలని, తమిళనాడు మహిళలదే అని హోసూరు ఎమ్మెల్యే ప్రకాశ్ పేర్కొన్నారు. బుధవారం డెంకణీకోటలో జరిగిన 'మహిళలదే విజయం' పథకం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. రాష్ట్రంలో ద్రావిడ మోడల్ ప్రభుత్వం మహిళల కోసం కలైనార్ హక్కు, రుణం నెలకు రూ.1000 సాయం, ఉచిత బస్సు ప్రయాణం, విద్యార్థినులకు నూతన మహిళా పథకంలో కళాశాల విద్యార్థినులకు రూ.1000 వంటి పథకాలను ఇంటింటి ప్రచారం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉప కార్యదర్శి చిన్నస్వామి, కోశాధికారి సుకుమారన్, యూనియన్ కార్యదర్శులు నీలకంఠరెడ్డి, దివాకర్, రాజు, శ్రీధర్, నగర కార్యదర్శులు దస్తగిరి, విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వ్యాను ఢీకొని వృద్ధుడి మృతి

డెంకణీకోట న్యూస్‌టుడే : డెంకణీకోట శివారు మారేగొండనపల్లి గ్రామానికి చెందిన రైతు కల్లప్ప (70) ఇంటి ముందర నీళ్ల పడుతుండగా నీలగిరికి చెందిన మూర్తి వ్యానును అజాగ్రత్తగా నడపడంతో కల్లప్ప మీద దూసుకెళ్లింది. తీవ్రంగా గాయపడిన కల్లప్పను డెంకణీకోట ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన చికిత్స కోసం కృష్ణగిరికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు. తమ్ముడి కొడుకు రంగప్ప ఫిర్యాదు మేరకు డెంకణీకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి సమస్యపై ముందస్తు చర్యలు

ట్యాంకర్ల వద్ద నీటి కష్టాలు (పాతచిత్రం)

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : రానున్న వేసవిలో తలెత్తనున్న తాగునీటి ఎద్దడి నియంత్రించేందుకు బెంగళూరు జలమండలి ముందస్తు చర్యలు చేపట్టింది. మార్చి నుంచి వేసవి ప్రారంభం కావడంతో జలమండలి అధికారులు తాగునీటిపై అప్రమత్తమయ్యారు. ముందస్తు చర్యలు చేపట్టాలని మండలి అధ్యక్షుడు డాక్టర్ రామ్‌ప్రసాత్ మనోహర్ కింద స్థాయి అధికారులకు సూచించారు. గత ఏడాది పలు ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉండేది. ఆయా ప్రాంతాల ప్రజలు వీధిపోరాటాలు చేశారు. మహదేవపుర, ఆర్ఆర్‌నగర, బొమ్మనహళ్లి, దాసరహళ్లి, కె.ఆర్.పుర తదితర ప్రాంతాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంటుంది. ప్రస్తుతం అలాంటి పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. కావేరి ఐదో స్టేజీ నీటి సరఫరా పథకం అమలులోకి రావడంతో రానున్న వేసవిలో సమస్య రాబోదని అంచనా వేస్తున్నారు. అవసరమైన ప్రదేశాలకు మినీ ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేసేందుకు కార్యాచరణ పథకాన్ని సిద్ధం చేస్తున్నారు. ప్రైవేట్ ట్యాంకర్ల అద్దెకు తీసుకుని తాగునీరు సరఫరా చేస్తామన్నారు. తాగునీటి సమస్య ఏర్పడితే అందుకు ఆయా ప్రాంతాల ఇంజినీర్లను బాధ్యులను చేస్తామని అధ్యక్షుడు డాక్టర్ రామ్‌ప్రసాత్ మనోహర్ హెచ్చరించారు.

చెరువుల అభివృద్ధికి శ్రీకారం

బేగూరు చెరువును పరిశీలిస్తున్న జీబీఏ అధికారులు

బెంగళూరు (యలహంక): నగరంలోని చెరువుల అభివృద్ధికి గ్రేటర్ బెంగళూరు ప్రాధికార (జీబీఏ) శ్రీకారం చుట్టింది. వేసవి ప్రారంభం కావడంతో చెరువుల్లో నీరు తగ్గుముఖం పట్టడంతో పూడిక పనులు చేపట్టనున్నారు. వానాకాలంలో చెరువుల్లో ఎక్కువ నీరు నిలబడే విధంగా చర్యలు చేపడుతున్నారు. నీరు నిల్వలు ఎక్కువగా ఉంటే భూగర్భ జలాల మట్టం పెరుగుతోంది. వేసవిలో బోరు బావుల్లో నీటి మట్టం పెరిగి ప్రజల దాహం తీర్చుతోంది. అందులో భాగంగా బేగూరు చెరువు, వర్తూరు చెరువులపై జీబీఏ అధికారులు దృష్టిసారించారు. ఇవి రెండూ పెద్ద చెరువులు కావడంతో అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం ప్రారంభించారు. రెండు చెరువులను జీబీఏ అధికారులు పరిశీలించారు. నీటి మట్టం తగ్గిన ప్రదేశంలో పూడిక తొలగించాలని నిర్ణయించారు. మిగతా నీటిలో ఉన్న గుర్రపు డెక్కలు తొలగించనున్నారు. మురుగునీటిని శుద్ధీకరించేందుకు ప్రత్యేకంగా శుద్ధీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. తద్వారా మురుగు నీరు చెరువుల్లోకి ప్రవహించదు.

రామయ్యకు నివాళులర్పించిన సిద్ధు

కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ముఖ్యమంత్రి, తదితరులు

బెంగళూరు (సదాశివనగర) : ప్రముఖ ఆంగ్ల దినపత్రిక ది హిందూలో దాదాపు ఐదు దశాబ్దాల పాటు వివిధ హోదాల్లో పని చేసిన సీనియర్ విలేకరి, మాజీ ఎమ్మెల్సీ పి.రామయ్య (93) వయో సహజ ఆరోగ్య సమస్యలతో మంగళవారం రాత్రి కన్నుమూశారు. స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించిన ఆయన భౌతికకాయాన్ని సదాశివనగరలోని నివాసంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ అశ్వత్థనారాయణ తదితరులు బుధవారం నివాళులర్పించారు. జర్నలిస్టు కోటా కింద ఆయన ఎమ్మెల్సీగా ఎన్నికై ఉత్తమ సేవలు అందించారు. బుధవారం సాయంత్రం జరిగిన అంత్యక్రియల్లో పెద్ద సంఖ్యలో పాత్రికేయులు హాజరయ్యారు. బెంగళూరు రిపోర్టర్స్ గిల్డ్, బెంగళూరు ప్రెస్‌క్లబ్, సీనియర్ పాత్రికేయుల వేదిక, కర్ణాటక మీడియా అకాడమీ, కర్ణాటక వర్కింగ్ జర్నలిస్టుల సంఘం, జర్నలిస్టుల సహకార సంఘం ప్రతినిధులు, మాజీ ప్రధాని దేవేగౌడ, కేంద్ర మంత్రి కుమారస్వామి, మాజీ ముఖ్యమంత్రులు యడియూరప్ప, బసవరాజ బొమ్మై, జగదీశ్ శెట్టర్, సదానంద గౌడ, వీరప్ప మొయిలీ, భాజపా అధ్యక్షుడు విజయేంద్ర తదితరులు రామయ్య మృతికి సంతాపం ప్రకటించారు.

వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు

కార్డులు పంపిణీ చేస్తున్న అదనపు కమిషనర్ లత, తదితరులు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : యలహంక, యలహంక ఉప నగర, అట్టూరు, కామాక్షమ్మలేఅవుట్, వెంకటాల తదితర ప్రాంతాల్లో వీధి వ్యాపారులకు బుధవారం బృహత్ బెంగళూరు ఉత్తర నగరపాలికె కార్యాలయంలో అదనపు కమిషనర్ ఆర్.లత గుర్తింపు కార్డులను అందజేశారు. ఆ ప్రాంతంలో వ్యాపారం చేస్తున్న 4445 మందికి ఛాయాచిత్రంతో కూడిన గుర్తింపు కార్డులు రూపొందించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుర్తింపు పొందిన వీధివ్యాపారులు స్వేచ్ఛగా వ్యాపారం చేసుకోవచ్చని, పాలికె, పోలీసులు, అధికారులు వేధింపులు గురి చేయబోరని వెల్లడించారు. గుర్తింపు కార్డులకు రుసుం చెల్లించాల్సిన అవసరంలేదని, స్వేచ్ఛగా వ్యాపారం చేసుకోవాలని లత సూచించారు.

ఏషియన్ షూటింగ్‌లో సత్తాచాటిన మేఘనా సజ్జనర్

మేఘనా సజ్జనర్

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : ఏషియన్ షూటింగ్ పోటీలో కర్ణాటకకు చెందిన అంతర్జాతీయ షూటింగ్ క్రీడాకారిణి నగరవాసి మేఘనా సజ్జనర్ కాంస్య పతకాన్ని సాధించింది. గర్భవతి అయిన ఆమె దిల్లీలో జరిగిన పోటీలో కాంస్య పతకాన్ని సాధించడం ఆశ్చర్యం కల్గిస్తోంది. ఈ సమయంలో కూడా పతకాన్ని సాధించాలనే సంకల్పంతో షూటింగ్‌లో పతకాన్ని దక్కించుకొంది. మేఘన మిత్రురాలు బ్యాడ్మింటన్ స్టార్ పి.వి.సింధు ఆమె సాధనకు, పట్టుదల, ఆసక్తికి మెచ్చుకొంది. పది మీటర్ల ఎయిర్ రైఫిల్ పోటీ టీం ఈవెంట్‌లో ఒలింపియన్ ఇలవెనీల్ వలరివన్, ఆర్యాబోస్‌తో కలిసి బంగారు పతకాన్ని సాధించిన 32 ఏళ్ల మేఘన వ్యక్తిగత విభాగంలో కాంస్యపతకాన్ని సాధించడం విశేషం. గత ఏడాది మోహన్‌కుమార్‌తో వివాహం జరిగింది. ఇంకో నెలలో తల్లి కానున్న మేఘన ఇలాంటి సమయంలో షూటింగ్‌లో పాల్గొనడం విశేషం. గతంలో కామన్వెల్త్ గేమ్స్‌లో మహిళా షూటర్ గర్భిణిగా పోటీలో పాల్గొన్నట్టు తెలుసుకొని, ఆమెకు తర్ఫీదు నిచ్చిన లాజ్లో సూచక్ మేఘనాకు కూడా గతంలో శిక్షణ నిచ్చాడు. అతని సలహాలు, సూచనలతో పతకం సాధించిందని మేఘన ప్రస్తుత కోచ్ రాకేశ్ మన్‌పత్ తెలిపారు. జైన్ విశ్వవిద్యాలయంలో బీబీఏ చేసిన మేఘన 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ షూటింగ్‌లో దిట్ట. 2017లో మ్యూనిచ్‌లో జరిగిన ప్రపంచకప్, 2018లో కొలంబొలో జరిగిన ప్రపంచ విశ్వవిద్యాలయం పోటీలో విశ్వవిద్యాలయం జట్టు తరఫున, వ్యక్తిగత విభాగాల్లో పాల్గొన్న ఆమె 2022, 2025 ప్రపంచ పోటీల్లో భారత జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించింది. గత ఏడాది నింగోబాలో జరిగిన ప్రపంచకప్ షూటింగ్ పోటీల్లో కాంస్య పతకాన్ని సాధించింది.

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహనం కల్పించాలి

సదస్సును ప్రారంభిస్తున్న శ్రీలవంతర్, బిరాదర్, భాలె తదితరులు

బెంగళూరు (యశ్వంత పుర), న్యూస్‌టుడే : వ్యవసాయ ఉత్పాదన పెంపుదలలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం వల్ల దీర్ఘకాలిక ఉపయోగాలున్నాయని బెంగళూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి డాక్టర్ ఎం.ఎన్.శ్రీలవంతర్ తెలిపారు. బుధవారం ఇక్కడ జీకేవీకే ఆవరణలో లాభదాయకం, మొక్కలు ఆరోగ్యం అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. వాతావరణంలో మార్పులు, మట్టి ఆరోగ్యం, నీటినిర్వహణ, నవీన వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు అవగాహన కలిగించాలని సూచించారు. ఉపకులపతి డాక్టర్ ఎస్.వి.సురేశ్ మాట్లాడుతూ రైతులకు ఆర్థిక భద్రతతో పాటు ప్రకృతితో సమన్వయం సాధించేందుకు దీర్ఘకాల వ్యవసాయ విధానాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపకులపతులు డాక్టర్ డీపీ బిరాదర్, డాక్టర్ వీఎం భాలె, శాస్త్రవేత్తలు డాక్టర్ అరకేరి, డాక్టర్ ఎస్‌వీ పాటిల్, డాక్టర్ కె.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అఖిలభారత బాస్కెట్‌బాల్ పోటీలు

బంతిని తన నియంత్రణలోకి తీసుకున్న జైన్ క్రీడాకారిణి

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : అఖిలభారత అంతర విశ్వవిద్యాలయం మహిళల లీగ్ బాస్కెట్‌బాల్ పోటీలో జైన్ విశ్వవిద్యాలయం జట్టు 65-25 పాయింట్లతో కోల్‌కతా విశ్వవిద్యాలయం జట్టుపై గెలుపొంది తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. బుధవారం జైన్ గ్లోబల్ క్యాంపస్‌లో జరిగిన ఈ పోటీలో విజేత జట్టుకు హర్ష 13, ఆద్యాగౌడ పది పాయింట్లు, ఓటమి జట్టుకు సుష్మితత పది పాయింట్లను సాధించారు. ఇతర పోటీల్లో చండీగర్ జట్టు 70-29 పాయింట్ల తేడాతో ఇండోర్ డీఏవీ జట్టుపై, చెన్నైకు చెందిన ఎస్ఆర్ఎం జట్టు 58-15 పాయింట్లతో పాటియాలకు చెందిన ఎంపీఎస్‌పీఎస్‌యు జట్టుపై, లవ్లీ విశ్వవిద్యాలయం జట్టు 63-58 పాయింట్ల తేడాతో క్రైస్ట్ జట్టుపై, ఐటీఎం జట్టు 65-30 స్కోర్‌తో ఎస్‌జీబీవీఏ జట్టుపై గెలుపొందాయి. చివరిగా ఎస్ఎన్ఏవీఈ జట్టు 68-28 పాయింట్ల తేడాతో పి.టి.రవిశంకర్ విశ్వవిద్యాలయం జట్టుపై గెలుపొందింది. గురువారం పోటీలు కొనసాగనున్నాయి.

జేడీఎస్ జిల్లా అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే నింగప్ప

తుమకూరు, న్యూస్‌టుడే : జేడీఎస్ జిల్లా అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే హెచ్.నింగప్పను నియమించారు. బుధవారం జేడీఎస్ పార్టీ కార్యాలయంలో ప్రతినిధులు, పదాధికారులు నింగప్పను సత్కరించారు. మహానగర పాలికె మాజీ ఉపమేయర్ టి.ఆర్.నాగరాజు, మాజీ సభ్యులు మంజునాథ్, శ్రీనివాస్, బాలకృష్ణ, నరసింహరాజు, కృష్ణమూర్తి కెంపరాజు దిబ్బూరు విజయ్‌కుమార్ తదితరులు నూతన అధ్యక్షుడిని అభినందించి సత్కరించారు. త్వరలో జరగబోయే స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని జిల్లాలో పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని నాయకులు ఆకాంక్షించారు.

14న భీమణ్ణ ఖండ్రే పుణ్యస్మరణ

చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రులు రామలింగారెడ్డి, ఈశ్వరఖండ్రే తదితరులు

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : ఈనెల 14న ప్యాలెస్ మైదానం గాయత్రి విహారలో డాక్టర్ భీమణ్ణ ఖండ్రే స్మరణార్థం నిర్వహించనున్న కార్యక్రమంపై బుధవారం ముందస్తు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రవాణా శాఖ మంత్రి రామలింగారెడ్డి, అటవీశాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రే, ఎం.ఇ.ఐ అధ్యక్షుడు, కేపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.మనోహర్, స్పోక్స్‌మెన్ లక్ష్మణ్, మాజీ మేయర్లు హుచ్చప్ప, బి.ఎస్.పుట్టరాజు, ఎంటీసీ మండలి అధ్యక్షుడు జి.కృష్ణప్ప, మాజీ పాలికె సభ్యుడు బి.టి.శ్రీనివాస్, సాహితీవేత్త చిక్కరంగేగౌడ తదితరులుభీమణ్ణ ఖండ్రే చిత్రపటానికి పూలు సమర్పించారు. మంత్రి రామలింగారెడ్డి మాట్లాడుతూ భీమణ్ణఖండ్రేకు కర్ణాటక రత్న బిరుదు ఇవ్వాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు విజ్ఞప్తి చేస్తామని మంత్రి పేర్కొన్నారు.

ఘనంగా సూఫీ సాధువుల వర్ధంతి

ఉరుసులో పాల్గొన్న ప్రముఖులు

ముళబాగిలు, న్యూస్‌టుడే : సూఫీ సాధువుల వర్ధంతి సందర్భంగా దర్గాల్లో నిర్వహించే వార్షిక పండగ ఉరుసు. ఇది ముస్లిం సమాజానికి పవిత్ర పండగ అని కాంగ్రెస్ నాయకుడు వి.ఆదినారాయణ అన్నారు. తాలూకాలోని కొండెనహళ్లి గ్రామంలో బుధవారం జరిగిన హజరత్ సత్యద్ మలగంగాషా వలీ ఉరుసులో ఆయన మాట్లాడారు. హిందూ, ముస్లిం సంబంధాలు ఐక్యత, మత సామరస్యానికి చిహ్నంగా ఈ పండగ చేసుకుంటారని ఆయన వివరించారు.

మహిళా కళాశాలను మరోచోట ఏర్పాటు చేయాలి

నిరసన ప్రదర్శనలో ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

చిత్రదుర్గ, న్యూస్‌టుడే : అర్ధ శతాబ్దానికి పైగా వేలాది మంది విద్యార్థులకు సేవలందిస్తున్న ప్రభుత్వ విజ్ఞాన కళాశాల ఆవరణలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయడం వల్ల విద్యా వాతావరణం పాడవుతుందని ఏబీవీపీ కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం వందలాది మంది విజ్ఞాన కళాశాల విద్యార్థులు తరగతులను బహిష్కరించి జిల్లా పాలనాధికారి కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. జిల్లా పాలనాధికారికి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ మహిళా కళాశాలకు మరో చోట స్థలాన్ని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఏబీవీపీ నాయకులు కుబేర, కనకరాజ్, సుదర్శన్, జీవన్ కుమార్ తదితరులు నేతృత్వం వహించారు.

బైకుల దొంగకు కటకటాలు

బెంగళూరు (యలహంక) : రాత్రిళ్లు ఇంటి ముందు నిలిపిన వాహనాలను దొంగిలిస్తున్న నిందితుడు సయ్యద్ (28)ను మహాలక్ష్మీలేఅవుట్ పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.3.50 లక్షల విలువైన పది ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మహాలక్ష్మీలేఅవుట్, బసవేశ్వరనగర, బ్యాడరహళ్లి, బ్యాటరాయనపుర కామాక్షిపాళ్య తదితర ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

మామపై కోడలు ఫిర్యాదు

బెంగళూరు (యశ్వంతపుర) : మామ తనపై లైంగిక దౌర్జన్యానికి పాల్పడ్డారని కోడలు నగరంలోని ఆర్‌టీనగర పోలీసుఠాణాలో ఫిర్యాదు చేశారు. మామ కావల్ భైరసంద్ర నివాసి అబ్దుల్ హఫీజ్ ఓ విద్యాసంస్థను నిర్వహిస్తున్నారు. మామ తనతో ఇంట్లో వికృతంగా ప్రవరిస్తున్నారని కోడలు ఆరోపించారు. వేధింపులు భరించలేక పోలీసులను ఆశ్రయించారు.

రూ.పదివేలు ఇవ్వాలంటూ గొడవ

చిక్కమగళూరు, న్యూస్‌టుడే : చిక్కమగళూరులో హిజ్రాల వేధింపులు తీవ్రమయ్యాయి. గృహప్రవేశం, వివాహం, శుభ కార్యక్రమాలు జరుగుతున్న చోటుకు వచ్చి భారీ మొత్తంలో నగదు డిమాండ్ చేస్తున్నారు. ఒక కల్యాణ మండపానికి వచ్చిన కొందరు హిజ్రాలు తమకు రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంత మొత్తం ఇవ్వలేమని రూ.500 తీసుకుని వెళ్లాలని చెప్పగా, వేదికపై ఉన్న పీఠోపకరణాలను ధ్వంసం చేసి వెళ్లారు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు స్థానికంగా వైరల్‌గా మారింది.

లవ్ జిహాద్ కేసు

మంగళూరు, న్యూస్‌టుడే : సూరత్కల్ సమీపంలోని ముల్కిలో చదువుతున్న వైశాలి అనే యువతి మిద్లాజ్ అనే యువకుడిని ప్రేమించి వివాహం చేసుకుంది. వారిద్దరూ కేరళలోని వయనాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జనవరి 31న వివాహం చేసుకున్నారని తల్లిదండ్రుల ఫిర్యాదుతో లవ్ జిహాద్ పేరిట మిద్లాజ్ వివాహం చేసుకున్నాడని పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

పురస్కారానికి ఎంపికైన సంగీత దర్శకుడు

గురుకిరణ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సమితి ప్రతినిధులు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : తెలుగు విజ్ఞాన సమితి మార్చిలో నిర్వహించే ఉగాది ఉత్సవాల్లో శ్రీకృష్ణదేవరాయ పురస్కారాన్ని ప్రసిద్ధ సంగీత దర్శకుడు గురుకిరణ్‌కు ప్రదానం చేయనుంది. సమితి ఉపాధ్యక్షుడు ఆర్.ఆదికేశవులునాయుడు, ప్రతినిధులు జి.రమణబాబు, బాలాజీనాయుడు, హెచ్ఎం ప్రకాశ్ తదితరులు గురుకిరణ్‌ను బుధవారం భేటీ అయ్యారు. పురస్కారానికికి ఎంపిక చేసిన సమితి అధ్యక్షుడు ఎ.రాధాకృష్ణరాజు, సభ్యులకు గురుకిరణ్ కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ విద్యావిధానంపై పుస్తకం విడుదల


పుస్తకావిష్కరణలో దలైలామా, త్రిష్ట రామమూర్తి, రామమూర్తి

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : విద్యార్థుల్లో పెరుగుతున్న ఒత్తిడి, మానసిక ఆరోగ్య సమస్యలపై రచించిన పుస్తకాన్ని బుధవారం దలైలామా, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.సి.రామమూర్తితో కలిసి ఆవిష్కరించారు. ఏక్యా బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ ఛైర్మన్ డాక్టర్ త్రిష్ట రామమూర్తి పాల్గొన్నారు. జాతీయ విద్యావిధానం-ఎన్ఈపీ-2020 తత్వాలకు అనువుగా ఈ పుస్తకం రచించనట్లు త్రిష్ట రామమూర్తి తెలిపారు.

బస్టాండ్ పనులను త్వరగా పూర్తి చేయాలి

ఎమ్మెల్యే మునిరాజును సత్కరిస్తున్న నాయకులు

బెంగళూరు (జాలహళ్లి), న్యూస్‌టుడే : ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మిస్తున్న నూతన బస్టాండ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని దాసరహళ్లి ఎమ్మెల్యే ఎస్.మునిరాజు తెలిపారు. బుధవారం ఆయన భూమిపూజ చేసి పనులను ప్రారంభించి మాట్లాడారు. చాలా ఏళ్లుగా బస్టాండ్ లేక ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారని, అందరి సౌకర్యం కోసం బస్టాండ్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. భవన నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించకుండా చక్కటి ఆకృతిలో నిర్మించాలని అధికారులకు ఆయన సూచించారు. ఈ సందర్భంగా నాయకులు ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖులు కె.విశ్వనాత్, అబ్బిగిరి లండన్ మంజునాథ్‌గౌడ, లారీ మంజన్న, రాఘవేంద్ర ప్రతాప్‌సింగ్, ప్రసాద్, గొళ్లపల్లె సాల్మాన్, నెల్లూరు లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

'సామాజిక బాధ్యతలు పాటించాలి'

మొక్కకు నీరు పోసి ప్రారంభిస్తున్న రమేశ్, రాజేశ్, రాజు తదితరులు

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : విద్యార్థులు జ్ఞానం, కౌశల్యంతో పాటు సామాజిక బాధ్యతలు, మానవీయతను పెంచుకోవాలని మన్‌మోహన్‌సింగ్ బెంగళూరు నగర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య బి.రమేశ్ పిలుపునిచ్చారు. బుధవారం సెంట్రల్ కళాశాల ఆవరణలో యువ రెడ్‌క్రాస్, అధికారుల సమావేశం, తర్ఫీదు శిబిరాన్ని రమేశ్ తదితర ప్రముఖులు మొక్కకు నీరు పోసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, బాలలు రక్తహీనత, తదితర ఆరోగ్య సమస్యలతో తల్లడిల్లుతున్నారన్నారు. రోడ్డు ప్రమాదాల సమయంలో మానవీయతతో రక్తదానం చేసి సేవాభావాన్ని పెంచేందుకు ప్రత్యేకమైన జాగృతి అభియానా నిర్వహిస్తామని ఆయన ప్రకటించారు. రెడ్‌క్రాస్ సంస్థ బెంగళూరు నగర జిల్లా కార్యదర్శి డాక్టర్ రాజేశ్, సంచాలకుడు ఆనంద్, సీనియర్ సలహాదారుడు డాక్టర్ సి.ఎన్.ఎన్.రాజు ఉపన్యసించారు.

మోసెస్ సేవలు అనుసరణీయం

మోసెస్‌ను సత్కరిస్తున్న బెంజమెన్, ఆనందరావు, తదితరులు

బెంగళూరు (మత్తికెరె), న్యూస్‌టుడే : సమాజంలో అన్ని వర్గాల సంక్షేమం, సమాజసేవకు కృషి చేస్తున్న డాక్టర్ రెవరెండ్ జె.డి.మోసెస్ సేవలు అభినందనీయమని, ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కర్ణాటక తెలుగు క్రిస్టియన్ మినిస్ట్రీ ఫెలోషిప్ (కేటీసీఎంఎఫ్) అధ్యక్షుడు బిషప్ డాక్టర్ ఎం.బెంజమెన్ పేర్కొన్నారు. బుధవారం జాలహళ్లిలోని హెచ్ఎంటీ కదంబ హోటల్‌లో ఏర్పాటు చేసిన అభినందన సమావేశంలో మోసెస్‌ను ఘనంగా సత్కరించారు. భద్రవతిలో 44 ఏళ్లుగా ఆయన ఉత్తమ సేవలందిస్తున్నారని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో ప్రముఖులు డాక్టర్ ఎన్.ఎ.ఆనందరావు, యు.డేవిడ్, ఎన్.పి.డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

బళ్ళారి

● బళ్ళారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

అధికారులకు నిర్దేశిస్తున్న కమిషనర్ నసీమ్

రాయచూరు, న్యూస్‌టుడే : ఈ-పౌతి (మృత రైతుల వారసుల పేరిట భూముల రిజిస్ట్రేషన్) ప్రక్రియలో దరఖాస్తులను వేగంగా పరిష్కరించి, అన్నదాతలకు ఇక్కడే పట్టా పాస్ పుస్తకాలను పంపించాలని కలబురగి విభాగం కమిషనర్ జహీరా నసీమ్ అధికారులకు నిర్దేశించారు. ఆమె బుధవారం జిల్లా పాలనాధికారి సభాభవనంలో రెవెన్యూశాఖ ప్రగతిని సమీక్షిస్తూ మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను కార్యాలయాల నామఫలకాల్లో ప్రదర్శించాలని సూచించారు. ముఖ్య ద్వారాలను డిజిటీకరణ చేసిన విషయంపై రైతులు, ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. దీని వల్ల కార్యాలయాల నుంచి మ్యూటేషన్, పట్టాకు సంబంధించిన వివరాలు తెలుసుకోవడం సాధ్యపడుతుందన్నారు. జిల్లాలో లక్షకు పైగా దాఖలాలను స్కాన్ చేసి అందుబాటులో ఉంచారని చెబుతూ మిగిలిన వాటిని వేగంగా అప్‌డేట్ చేయాలన్నారు. ఫైళ్ల భద్రతా ఉండేందుకు తహసీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. గ్యారంటీ రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రజలతో స్నేహ పూర్వకంగా మెలగుతూ వారి సమస్యలను త్వరగా తీర్చేందుకు కృషి చేయాలని నిర్దేశించారు. జిల్లా పాలనాధికారి నితీశ్, సహాయ కమిషనర్లు గజానన్ సజ్జన్, బసవణ్ణప్ప కలశెట్టి, జిల్లా పాలనాధికారి కార్యాలయం తహసీల్దార్ జగదీశ్, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

హాజరైన అధికారులు

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం

ప్రతిజ్ఞ చేయిస్తున్న న్యాయమూర్తి, అధికారులు

రాయచూరు, న్యూస్‌టుడే : సామాజిక దుర్వ్యసనంగా మారిన బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వామం కావాలని జిల్లా న్యాయస్థానం న్యాయమూర్తి, న్యాయ సేవల ప్రాధికార సభ్య కార్యదర్శి హెచ్.ఎ.సాత్విక్ పిలుపునిచ్చారు. రాయచూరు తాలూకా చంద్రబండ కడగందొడ్డి రహదారికి దగ్గర్లోని ఇటుకుల బట్టీ వద్ద బాలకార్మిక నిర్మూలన దినోత్సవాన్ని ఆచరించారు. సాత్విక్ మొక్కకు నీళ్లు పోసి కార్యక్రమాన్ని ప్రారంభించి ఉపన్యసించారు. జీతభత్యాలకు పేదరికం కారణమని కార్మికులను చేరవద్దని సూచించారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే సహాయవాణికి ఫోన్ చేసి న్యాయ సలహాలు పొందాలని కోరారు. జిల్లా కార్మికశాఖ అధికారి ఆరతి మాట్లాడుతూ బట్టీల్లో, కట్టడ నిర్మాణాలు, పత్తి, రైస్ మిల్లుల్లో ఒడిశా, బీహార్, ఆంధ్ర, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి వస్తున్న వలస కార్మికులకు చట్టపరమైన సౌలభ్యాలు కల్పించాలని యజమానులకు సూచించారు. వారి పిల్లలు చదువుకునేందుకు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా.. బాలలతో పని చేయించుకోమని ప్రతిజ్ఞ చేయించారు. కార్మికశాఖ ఇన్‌స్పెక్టర్ ప్రియాంక, జిల్లా బాలకార్మిక యోజనా నిర్దేశకుడు రియాజ్ పాల్గొన్నారు.

నేడే కార్మికుల ప్రదర్శన

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన నాలుగు కార్మిక చట్టాలను వెంటనే రద్దు చేయాలని దేశవ్యాప్తంగా పలు సంఘాలు గురువారం సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో కర్ణాటకలోనూ ఉద్యమ ఢంకా మోగింది. ఈ ఉద్యమానికి పలు సంఘాలు మద్దతు ప్రకటించాయి. రవాణా, విద్య, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులపై ఈ ప్రభావం ఉంటుందని అంచనా వేస్తున్నారు. కె.ఎస్.ఆర్టీసీ కార్మిక సంఘం సమ్మెకు మద్దతు ప్రకటించడంతో ఉదయ వేళ తక్కువ సంఖ్యలో బస్సులు అందుబాటులో ఉంటాయి. బ్యాంకుల్లోనూ సిబ్బంది హాజరీ తక్కువ కానుందని అంచనా వేస్తున్నారు. ఆటో, ట్యాక్సీ డ్రైవర్ల యూనియన్లు సమ్మెకు మద్దతు ప్రకటించాయి. బెంగళూరులోని స్వాతంత్ర్య ఉద్యానవనంలో భారీ ప్రదర్శన, సమావేశానికి సన్నాహాలు చేస్తున్నారు.

శివోహం.. ధర్మపథం

శివరాత్రికి కుద్రోళిలో ఏర్పాట్లు

కుద్రోళి గోకర్ణనాథ ఆలయం

మంగళూరు, న్యూస్‌టుడే: ఒకప్పుడు ఆలయాల్లోకి అన్ని వర్గాల వారికి ప్రవేశం ఉండేది కాదు. బ్రహ్మశ్రీ నారాయణ గురు కర్ణాటకలో నెలకొల్పిన ఏకైక శివాలయం కుద్రోళి గోకర్ణనాథ క్షేత్రం. బిల్లవ సముదాయంతో పాటు అన్ని వర్గాల ప్రజలు అప్పటి నుంచి ఈ ఆలయానికి వచ్చి వెళ్తారు. ఒకే కులం.. ఒకే మతం.. ఒకే దేవుడు.. అనే నినాదం విశ్వవ్యాప్తమైంది. మహా శివరాత్రికి ఆలయంలో జాగారానికి ఏర్పాట్లు చేస్తున్నారు. నారాయణగురు 1912లో నిర్మించిన ఆలయాన్ని 1989లో కేంద్ర మాజీ మంత్రి జనార్దన పూజారి నేతృత్వంలో జీర్ణోద్ధరణ పనులు ప్రారంభమయ్యాయి. బ్రహ్మకలశ ఉత్సవాలను 1991లో నిర్వహించగా, అప్పటి ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. శివగిరిలో కుద్రోళి తీర్థదాన పేరిట మూడు రోజులు నిర్వహించే కార్యక్రమాల్లో కనీసం పాతిక లక్షల మంది భక్తులు పాల్గొంటారని ఆలయ సమితి కోశాధికారి పద్మరాజ్ పూజారి తెలిపారు. ఫిబ్రవరి 15న మహారుద్రాభిషేకం, 16న మహా అన్నసంతర్పణ, 18న జాతర ముగింపు వేడుకలు ఉంటాయని ఆయన తెలిపారు. మొక్కులు ఉన్న భక్తులు పసుపు వర్ణం దుస్తులు ధరించి వస్తారని చెప్పారు.

వినియోగం అధికం..పుంజుకోని ఉత్పాదన

ఉడుపిలోని శాఖోత్పన్న కేంద్రం

రాయచూరు, న్యూస్‌టుడే : చలి తగ్గుముఖం పడుతూ, పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో విద్యుత్తు వినియోగం అధికమవుతోంది. మార్చి నుంచి వాడకం ఊపందుకోనుంది. వేసవి అవసరాలను జల, పవన విద్యుత్తు కొంత మేరకే తీరుస్తాయి. బాగా ఆదుకునేవి థర్మల్ కేంద్రాలే. ఎండకాలం సమీపిస్తున్నా అన్ని తాప కేంద్రాల్లో ఉత్పాదన పెంపుపై కర్ణాటక విద్యుతు నిగమ పూర్తిగా దృష్టి సారించకపోవడం ఆందోళన కల్గిస్తోంది. బుధవారం రాత్రి 7.20 గంటల సమయంలో ఐదు కేంద్రాల్లో నమోదైన ఉత్పాదన వివరాలు. రాయచూరులో 907 మెగావాట్లు (మొత్తం 1720), బళ్లారిలో 1507 మెగవాట్లు (సామర్థ్యం 1700), యరమారస్‌లో 637 మెగావాట్లు (కెపాసిటీ 1600), ఉడుపిలో 1105 మెగావాట్లు (మొత్తం సామర్థ్యం 1200) తయారీ జరుగుతోంది. జిందాల్‌లో 1260 మెగావాట్లకు గానూ 83 మెగావాట్లను తయారు చేయడం గమనార్హం. రాయచూరులోని ఎనిమిది యూనిట్లలో ఒకటి, ఎనిమిది స్తంభించాయి. బళ్లారిలోని మూడు యూనిట్లు, ఉడుపిలోని రెండు యూనిట్లలో ఉత్పాదన మెరుగ్గానే ఉంది. రాయచూరులో ఒకటో యూనిట్ పాతదైనందున ఉత్పాదన చేయడం కష్టమే. ఇందులోని ఎనిమిది, యరమారస్‌లోని రెండో యూనిట్‌లో ఉత్పాదన ఆరంభించి, జిందాల్‌లో పెంచుకుంటేనే విద్యుత్తు కొనుగోలు తగ్గించుకోవచ్చు. ఐదు కేంద్రాల ద్వారా ప్రతి రోజూ 7680 మెగావాట్లు ఉత్పత్తి చేయాలి. ప్రస్తుతం 4239 మెగావాట్ల ఉత్పాదన సాధ్యపడుతోంది. విద్యుత్తు నిగమ 3441 మెగావాట్లను కోల్పోయింది.

హైడ్రాలిక్ ప్రాజెక్టుల్లో

జలాశయాలకు సంబంధించి శరావతి 736, నాగజహరి 634, గేరుసొప్పా 204, సూపా 102, ఆలమట్టి 88, జోగ్ 76, వారాహి 74, ,ఎల్‌పీహెచ్ 24, ఘటక ప్రభ 23, బాద్రా 5, మణిడ్యామ్ 4, శివసముద్రంలో 2 మెగావాట్లు తయారీ జరుగుతోంది. కొడసల్లి, కాద్రా, షింషా, మునీరాబాద్‌లో శూన్య ఉత్పాదన నమోదైంది. 16 ప్రాజెక్టుల ద్వారా 3666.6 మెగావాట్లను తీయాల్సి ఉండగా.. ప్రస్తుతం 1972 మెగావాట్లను ఉత్పత్తి చేస్తున్నారు.

విద్యార్థులకు విద్య, వినయం అవసరం

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న స్వామీజీలు

మాన్వి, న్యూస్‌టుడే : మానవీయ విలువలు నశించిపోతున్న ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులకు విద్యతో పాటు సంస్కారం, వినయం చాలా అవసరమని చికల్‌పర్వి రుద్రమునీశ్వర మఠం సదాశివ స్వామీజీ పేర్కొన్నారు. గారిగె జాతరలో భాగంగా బుధవారం ధ్యానమందిరం వద్ద ప్రభులింగలీల ప్రవచన కార్యక్రమాన్ని స్వామీజీ ప్రారంభించి మాట్లాడారు. 12వ శతమానంలో విశ్వ గురు బసవణ్ణ అనుభవ మంటపాన్ని నిర్మించారని, ప్రథమ పీఠాధ్యుడిగా అల్లమ ప్రభుదేవరు వ్యవహరించారని, కాయక తత్వాలను వచనరూపంలో ప్రజలకు చాటిన ఘనత శరణులకు దక్కుతుందన్నారు. కల్మఠ విరూపాక్షపండితారాధ్య స్వామీజీ, అభినవ శాంతమల్లశివాచార్య స్వామీజీ, శంకరయ్యస్వామి సువర్ణగిరి మఠ మాట్లాడారు. ఎల్ఎంజీఎస్ కాన్వెంట్ విద్యార్థుల ఆధ్వర్యంలో నృత్య కార్యక్రమాలు జరిగాయి. రుద్రయ్య స్వామి మద్లాపూర్, జగదీశ్, సిద్ధయ్య స్వామి, తాలూకా వీరశైవలింగాయత్ సంఘం అధ్యక్షుడు హరిహరపాటిల్ తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో శివలింగానికి పూజ చేయాలని అర్జీ

కలబురగి : ఆళందలోని లాడ్లే మశాక్ దర్గాలోని శ్రీరాఘవ చైతన్య శివలింగానికి మహాశివ రాత్రి రోజు పూజ చేసుకోవడానికి అనుమతించాలని కోరుతూ ఆందోళ మఠాధిపతి సిద్ధలింగ స్వామి ఉన్నత న్యాయస్థానంలో అర్జీ వేసుకున్నారు. దర్గాలోని శివలింగాన్ని కొందరు అపచారం చేశారని ఆరోపించారు. శివలింగానికి రక్షణగా చాదర్‌ను కప్పారని, ప్రతి ఏడాది తరహాలో పూజకు అనుమతించాలని కోరుతూ అర్జీ వేసుకున్నామని చెప్పారు.

‘వీర కంబళ’లో వీరేంద్రుడు!

మంగళూరు, న్యూస్‌టుడే : సీనియరు దర్శకుడు రాజేంద్రసింగ్ బాబు దర్శకత్వం వహిస్తున్న ‘వీరకంబళ’ చిత్రంలో ధర్మస్థల ధర్మాధికారి వీరేంద్ర హెగ్గడే ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. సుమారు ఏడు వందల ఏళ్ల చరిత్ర ఉన్న ‘కంబళ’ క్రీడకు సంబంధించిన అంశాలతో తెరకెక్కిస్తున్న ఈ చిత్రం ఈ నెల 27న వెండితెరపైకి రానుంది. ధర్మస్థల ధర్మాధికారికి, కంబళ చరిత్రకు ఉన్న అవినాభావ సంబంధం తెరపై చూడవచ్చని రాజేంద్రసింగ్ బాబు తెలిపారు. తుళునాడు సీమలో మనోరంజన, సాహస క్రీడగా కంబళను ఏడో దశకంలో భారీ స్థాయిలో వీరేంద్ర హెగ్గడే నిర్వహిస్తూ వచ్చారు. అనంతరం కంబళ పలు మార్పులు చేసుకుని ఆధునికతను సంతరించుకుంది. బాబాస్ బ్లెస్సింగ్స్ ఫిలింస్ బ్యానర్‌పై కన్నడ, తుళుభాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది. డాక్టర్ వినిత విజయ్‌కుమార్ రెడ్డి, అరుణ్ రై తొడార్ ఈ చిత్రాన్ని నిర్మించగా, ప్రకాశ్ రాజ్, రవిశంకర్, రాధికా చేతన్, నవీన్ పడీల్, గోపీనాథ్ భట్, భోజ రాజ్ వామంజూరు తదితరులు ప్రధాన పాత్రల్లో నటించారు.

ధర్మాధికారి వీరేంద్ర హెగ్గడేకు సూచనలిస్తున్న రాజేంద్రసింగ్ బాబు

అన్నదాతల సమస్యలపై వినతి

అధికారికి వినతిపత్రం ఇస్తున్న ప్రతినిధులు

రాయచూరు, న్యూస్‌టుడే : ‘వ్యవసాయ పంపుసెట్లకు త్రీఫేజ్ విద్యుత్తును 12 గంటలు సరఫరా చేయాలని, విద్యుత్తు నియంత్రిక (ట్రాన్స్‌ఫార్మర్లు) చెడిపోతే 48 గంటల్లో కొత్తది అమర్చేలా చర్యలు తీసుకోవాలని, పొలాల మధ్యలో పడిపోయిన విద్యుత్తు స్తంభాలను వెంటనే తొలగించాలని రైతు సంఘం, హసిరు సేన జెస్కాం అధికారులకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు బుధవారం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ మజీద్, గౌరవాధ్యక్షుడు లక్ష్మణగౌడ, తాలూకా అధ్యక్షుడు రమేశ్, రాష్ట్ర సమితి సభ్యులు నరసింగరావు కులకర్ణి, నరసప్ప నేతృత్వంలో బుధవారం సంబంధిత అధికారికి వినతిపత్రాన్ని అందజేశారు. వేసవికాలంలో గ్రామాల్లో విద్యుత్తు కోతలు విధించవద్దని, మండలగేరా గ్రామంలో భాగ్యమ్మ పేరిట విద్యుత్తు మీటరు లేకపోయినా బిల్లు చెల్లించాలని ఇచ్చిన రూ.10 వేల బిల్లును రద్దు చేయాలని, మీటర్లకు సీల్ వేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

సర్ ప్రక్రియను వ్యతిరేకించండి

నిరసన ప్రదర్శనలో ప్రతినిధులు

రాయచూరు, న్యూస్‌టుడే : రాష్ట్రంలో ప్రత్యేక సునిశిత సంస్కరణల (సర్) ప్రక్రియ చేపట్టకుండా నిర్ణయం తీసుకోవాలని ‘స్లమ్ నివాసుల క్రియా వేదిక’ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చింది. అధ్యక్షుడు జనార్దన్, కార్యదర్శి నూరజాన్, సంఘటనా కార్యదర్శి బసవరాజ్ నాయకత్వంలో బుధవారం జిల్లా పాలనాధికారి కార్యాలయం వద్ద ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సంబంధిత అధికారికి వినతిపత్రం అందజేశారు. ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్నా.. కేంద్రం ఎన్నికల కమిషన్ ద్వారా రాజ్యాంగ బద్ధంగా కల్పించిన ఓటును తొలగించేందుకు కుట్ర పన్నిందని ఫిర్యాదు చేశారు. 7.89 కోట్ల ఓట్లను రద్దు చేయటానికి ప్రణాళిక రూపొందించారని, ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో లక్షల ఓట్లను తొలగించారని ఆరోపించారు. కొన్ని వర్గాల ప్రజలకు ఓటు హక్కు లేకుండా చేయాలన్న దురుద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. అశాస్త్రీయమైన సర్ సర్వేను పశ్చిమబెంగాల్, కేరళ, తమిళనాడు వ్యతిరేకిస్తున్నట్లే ఇక్కడి ప్రభుత్వం వ్యతిరేకించాలని కోరారు.

ఇంటి వద్దకే వైద్యశాల!

● నాజూకు ‘సంజీవని’ సిద్ధం

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే : కర్ణాటకలో మొట్టమొదటి 5జీ-సేవలను వినియోగించుకునే ‘స్మార్ట్ అంబులెన్స్’ను పోలీసు డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎంఏ సలీం బుధవారం ప్రారంభించారు. రోగిని ఇంటి నుంచి ఆసుపత్రి వరకు తీసుకువచ్చే సమయంలో అంబులెన్సులోని నిపుణులకు ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తూ, ప్రథమ చికిత్స చేసేందుకు అనువైన సదుపాయాలు, ఎక్కువ నాణ్యతతో వీడియో తీసే కెమెరాలు, టెలిమెడిసిన్ పరికరాలు, ఈసీజీ, రక్తపోటు, ఆక్సిజన్ సరఫరా తదితర వివరాలు ఎప్పటికప్పుడు ఆసుపత్రికి చేర్చే సదుపాయం ఈ అంబులెన్సులో ఉన్నాయని ట్రస్ట్‌వెల్ ఆసుపత్రి అధ్యక్షుడు డాక్టర్ హెచ్‌వీ మధుసూదన్ తెలిపారు. గుండెపోటు, పక్షవాతం, పెను ప్రమాదాల బారిన పడిన రోగిని చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకువచ్చేలోగా ఆపరేషన్ థియేటర్, సీటీ స్కానింగ్‌కు సిద్ధతల్ని చేసేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. ఉద్యాననగరిలోని వాహన రద్దీలో బాధితుడ్ని ఆసుపత్రికి తీసుకువచ్చేలోగా ‘హాస్పిటల్ ఎట్ హోమ్’ అనే నినాదంతో ఈ అంబులెన్సును నిపుణులతో కలిసి సిద్ధం చేయించామని ఆయన వివరించారు. రానున్న రోజుల్లో ఇదే తరహాలో సేవలు అందించే మరికొన్ని అంబులెన్సులను సమకూర్చుకుంటామని చెప్పారు.

స్మార్ట్ అంబులెన్సు వద్ద వైద్యులతో ఎంఏ సలీం

కరాటే పోటీల్లో సత్తా

ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలతో విజేతలు

రాయచూరు, న్యూస్‌టుడే : రాయచూరు తాలూకా శక్తినగర్‌లోని సూగూరేశ్వర సంస్థ కరాటే ఆటగాళ్లు జాతీయ పోటీల్లో సత్తా చాటారు. నారాయణపేట (తెలంగాణ) జిల్లా మక్తల్‌లోని ఒక ఫంక్షన్ హాల్లో డ్రాగన్ శోటోకాన్ కరాటే డూ స్పోర్ట్స్ సహకారంతో జాతీయ స్థాయి ఒపెన్ కరాటే చాంపియన్ షిప్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. వివిధ రాష్ట్రాల క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. కటా విభాగంలో సూగూరేశ్వర సంస్థ తరఫున ఆడిన వారిలో 18 మంది విజేతలుగా నిలిచారు. ఐదు గ్రాండ్ ఛాంపియన్‌షిప్ పతకాలు సాధించారు. విజేతలను సంస్థాపకుడు, కోచ్ సూగప్ప, సహ కోచ్‌లు ప్రకాశ్, మల్లేష్, మహేంద్ర, సాయికుమార్, నాగరాజ్ అభినందించారు. ఆత్మరక్షణ, శారీరక, మానసిక సామర్థ్యాన్ని మెరుగుపరిచే కరాటే నేర్చుకోవాలని కోచ్ విద్యార్థులకు సూచించారు.

నేటి సార్వత్రిక సమ్మెకు మద్దతు

రాయచూరు, న్యూస్‌టుడే : దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు ఏఐడీవైవో జిల్లా అధ్యక్షుడు చెన్నబసవ మద్దతు ప్రకటించారు. గురువారం రైతులు, కూలీలు, కార్మికులు, యువకులు స్వచ్ఛందంగా పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఖాళీగా ఉన్న లక్షలాది ఉద్యోగాలను భర్తీ చేయాలని, పొరుగు సేవలు, ఒప్పంద పద్ధతిలో భర్తీ ప్రక్రియకు స్వస్తి పలకాలని, ఇంతవరకూ నియమించుకున్న వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని సమ్మె ద్వారా ఒత్తిడి తెస్తామని వివరించారు. గ్రామీణ ఉపాధి పథకంలో తీసుకొచ్చిన మార్పులను ఉపసంహరించాలని, ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకీకరణ చేయవద్దని డిమాండ్ చేస్తామని తెలిపారు.

నాటకానికి చక్కని స్పందన

‘విగడ విక్రమరాయ’ నాటకంలోని సన్నివేశం

మండ్య, న్యూస్‌టుడే: మేలుకోటె పుతిన కళామందిరంలో కర్ణాటక నాటక అకాడమి నిర్వహించిన పోటీల్లో ‘విగడ విక్రమరాయ’ నాటకానికి చక్కని స్పందన లభించింది. దృశ్య ట్రస్టు సహకారంతో నిర్వహించిన నాటకానికి ముందస్తుగా 30 రోజులు అభ్యాసం చేశారు. మైసూరు సంస్థానానికి చెందిన చరిత్రాత్మక కథనానికి నాటక రూపాన్ని కేవీ నారాయణ మూర్తి ఇచ్చారు. మైసూరు రాజవంశస్థుల ఆస్థానంలో ఆలపించే ‘కాయే శ్రీగౌరి’ పాటకు బాలలు చేసిన నృత్యం అందరినీ ఆకట్టుకుంది. నాటకంలో విగడ విక్రమరాయ, రధీర, సేనాధిపతి, రాజవైద్యుడు, రాజమాత, సేవకులు, మంత్రులు, చెలికత్తల పాత్రను పాతిక మంది విద్యార్థులు అభినయించారు. ఒక గంట పాటు నాటకం కొనసాగింది. ప్రధానోపాధ్యాయుడు స్థానీకం సంతానరామన్, ఉపాధ్యాయురాలు బి.జయంతి విద్యార్థులకు ప్రశంస పత్రాలను వితరణ చేశారు.

చల్లచల్లగా..

వేసవి ప్రారంభం కాకమునుపే బెంగళూరులో పుచ్చకాయల వ్యాపారం ప్రారంభమైంది. తమిళనాడు, బెంగళూరు గ్రామీణ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి కూరగాయలు, పండ్ల మార్కెట్‌కు వస్తున్న కాయల్ని యశ్వంతపుర, కేఆర్ పురం, మల్లేశ్వరం తదితర చోట్ల చిరు వ్యాపారులు టోకున కొనుగోలు చేసుకుని విక్రయిస్తున్నారు. కిలో రూ.18 ప్రారంభ ధర పలుకుతోంది. వేసవి నాటికి కిలో రూ.40 వరకు చేరుకునే అవకాశం ఉందని వ్యాపారులు తెలిపారు. (న్యూస్‌టుడే, రాజాజీనగర)

‘టాక్సిక్’ చిత్రంపై ఫిర్యాదులు

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే : నటుడు యశ్ నటించిన టాక్సిక్ చిత్రాన్ని మరో సారి వివాదాలు చుట్టుముట్టాయి. చిత్ర టీజర్‌పై మహిళా సంఘాలు ఇప్పటికే అభ్యంతరాన్ని వ్యక్తం చేసి, మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశాయి. ఇప్పుడు జాతీయ క్రైస్తవుల సమాఖ్య స్పందించి.. చిత్ర నిర్మాతలు, దర్శకులపై ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. దేవదూత సెయింట్ మికయేల్ ప్రతిమ వద్ద కొన్ని అసభ్య దృశ్యాలను చిత్రీకరించారని సమాఖ్య ప్రతినిధులు ఆరోపించారు.

ఎమ్మెల్యే దద్దల్ రెండు రోజుల పర్యటన

మాన్వి, న్యూస్‌టుడే : రాయచూరు గ్రామీణ ఎమ్మెల్యే, కర్ణాటక వాల్మీకి అభివృద్ధి మండలి అధ్యక్షుడు బసనగౌడ దద్దల్ నియోజకవర్గంలోని మాన్వి తాలూకా పరిధిలో గురువారం పర్యటించనున్నారు. గోర్కల్ గ్రామంలోని ద్యావమ్మదేవి జాతరలో పాల్గొంటారు. బిచ్చాలి గ్రామ దేవత పూజా కార్యక్రమానికి హాజరవుతారు. మధ్యాహ్నం వేసవి తాగునీటి విషయమై రాయచూరు తాలూకా పంచాయతీ సభాప్రాంగణంలో అధికారుల సమీక్ష సమావేశంలో పాల్గొంటారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు రాజలబండలో మాన్వి తాలూకా కేడీపీ సమావేశంలో పాల్గొంటారు.

పాత్రికేయుల మృతికి సంతాపం

మాన్వి, న్యూస్‌టుడే : ఇటీవల మృతి చెందిన పాత్రికేయుడు, విధానపరిషత్ మాజీ సభ్యుడు రామయ్య, మాన్వి పత్రిక సంపాదకుడు గిరీశ్‌జోషీల మృతికి మాన్వి తాలూకా వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ సంతాపం వ్యక్తం చేసింది. సంఘం అధ్యక్షుడు అశోక్ తడకల్ అధ్యక్షతన స్థానిక పత్రికా భవనంలో వారి చిత్రపటాలకు శ్రద్ధాంజలి ఘటించారు. సంఘం అధ్యక్షుడు అశోక్, సీనియర్ పాత్రికేయులు పి.పరమేశ్, బసవరాజ్ భోగావతి, తాయప్ప హొసూరు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి అజయ్‌కుమార్, మాజీ అధ్యక్షుడు మారెప్ప, జిల్లా ప్రతినిధి హనుమంతప్ప వివిధ పత్రికల విలేకర్లు, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శస్త్రచికిత్సలపై సమావేశాలు

రాయచూరు, న్యూస్‌టుడే : రాష్ట్ర స్థాయి శస్త్ర చికిత్సా సమావేలను ఈ నెల 13 నుంచి 15 వరకు స్థానిక రిమ్స్ ప్రేక్షక సభా భవనంలో నిర్వహిస్తారని రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.డి.మండోల్కర్, ఒపెక్ (రాజీవ్‌గాంధీ ఆసుపత్రి) ప్రత్యేక అధికారి డాక్టర్ రమేశ్‌సాగర్ ఒక ప్రకటనలో వెల్లడించారు. రాయచూరు శస్త్ర చికిత్సకుల సంఘం, శస్త్ర చికిత్సా విభాగం సంయుక్తంగా జరుపుతున్న సమావేశాన్ని వైద్య విద్యాశాఖ, జిల్లా బాధ్య మంత్రి డాక్టర్ శరణప్రకాశ్ పాటిల్ ప్రారంభిస్తారని తెలిపారు. ముఖ్య అతిథులుగా శస్త్ర చికిత్సా సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మరుథు పాండ్యన్, రాష్ట్రాధ్యక్షుడు డాక్టర్ రాజగోపాల్ విచ్చేస్తారని, వివిధ ప్రాంతాల నుంచి వెయ్యిమందికి పైగా శస్త్రచికిత్సల నిపుణులు హాజరవుతారని వివరించారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

11-02-2026 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1602.35	1613.87
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	000	000
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	1,465	6,813
నీటి నిల్వ (టి.ఎం.సి)	24.714	45.788

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

హంపీ ఉత్సవాలకు 10 లక్షల మంది

అంచనా వేశామని మంత్రి జమీర్ వెల్లడి

ఉత్సవాల ప్రధాన వేదికను పరిశీలిస్తున్న మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్, జిల్లా పాలనాధికారి కవితా మన్నికేరి

హొసపేటె, న్యూస్‌టుడే: హంపీ ఉత్సవాల్ని అంగరంగ వైభవంగా నిర్వహిద్దామని విజయనగర జిల్లా బాధ్యమంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన హంపీ ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. నిరుడు మూడు రోజుల్లో ఏడు లక్షల మంది హంపీ ఉత్సవాలను తిలకించారు, ఇప్పుడు కనీసం 10 లక్షమంది వచ్చే అవకాశం ఉందని ప్రధాన వేదిక వద్ద 50 వేల ఆసనాలను ఏర్పాటు చేశాం, అవసరమైతే మరో 15వేల ఆసనాలను వేయిస్తామని తెలిపారు. ఐదు వేదికల్లో సమానంగా కళాకారుల్ని కళాప్రదర్శనకు అవకాశం కల్పించామని తెలిపారు. నిరుడు ఉత్సవాలకు రూ.16కోట్లు ఖర్చయ్యాయి. ఈసారి కూడా అంతే ఖర్చుతో ఉత్సవాల్ని ఆచరిస్తున్నామన్నారు. ఉత్సవాలకు వచ్చిన వారికి జిల్లా యంత్రాంగం నుంచి మూడు రోజులూ ఉచితంగా భోజనం, తాగునీటి వసతి ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. 13న ఉత్సవాలను ముఖ్యమంత్రి సిద్ధూ ప్రారంభిస్తారన్నారు. అనంతరం ఆయన చిత్రకళ, శిల్పకళా శిబిరాలను సందర్శించారు. జిల్లా పాలనాధికారి కవితా మన్నికేరి, ఎస్పీ జాహ్నవి తదితరులు పాల్గొన్నారు.

గవియప్పతో విభేదాల్లేవ్: స్థానిక ఎమ్మెల్యే గవియప్పతో తనకెలాంటి విభేదాల్లేవని మంత్రి జమీర్ స్పష్టం చేశారు. ఉత్సవాల నుంచి ఆయన దూరంగా ఉన్నారని విలేకరులు ప్రస్తావించగా, వ్యక్తిగత పనుల్లో ఆయన తీరిక లేకుండా ఉన్నారు. ఆయన అధ్యక్షతన ఉత్సవాలు జరుగుతాయని వివరణ ఇచ్చారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులందరూ ఉత్సవాల్లో పాలు పంచుకుంటారని తెలిపారు.

హంపీ ఉత్సవాల నేపథ్యంలో ఏర్పాటు చేసిన శిల్పకళా శిబిరాన్ని సందర్శించిన మంత్రి జమీర్

అదుపు తప్పిన ఆర్టీసీ

మండ్య, న్యూస్‌టుడే: మద్దూరు తాలూకా కోడిహళ్లి సమీపంలోని అండర్‌పాస్ వద్ద బుధవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో 19 మంది ప్రయాణికులు గాయపడ్డారు. బెంగళూరు నుంచి విరాజపేటకు సర్వీసు రోడ్డులో వెళుతున్న బస్సు అదుపుతప్పి అండర్‌పాస్ గోడను ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. బాధితులను మద్దూరు తాలూకా ఆసుపత్రిలో చేర్పించారు. తీవ్రంగా గాయపడిన కొందరికి ప్రథమ చికిత్స అనంతరం మండ్య మిమ్స్‌కు తరలించారు.

హాకర్ల విన్నపాలు వినవలె..

బెంగళూరు (రామమూర్తినగర), న్యూస్‌టుడే: శాసనసభలో మార్చిలో ప్రవేశపెట్టే పద్దులో ఇంటింటికీ దినపత్రికలను చేర్చే హాకర్ల సంక్షేమానికి నిధులు కేటాయించాలని కర్ణాటక రాష్ట్ర దినపత్రికల హాకర్ల సమాఖ్య డిమాండ్ చేసింది. సమాఖ్య అధ్యక్షుడు కె శంభులింగ, ప్రధాన కార్యదర్శి సంగం సురేశ్, ప్రతినిధులు శివశాంత్ కుమార్, నాదోరు వాసుదేవ, చెలువ రాజు, గంగముత్తయ్య, హనుమంతరాజు, హోమదేవ, నాగేశ్ శ్రీకాంత్ గోవిందు, హరిరావు, కృష్ణమూర్తి తదితరులు ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను, ముఖ్యమంత్రికి మాధ్యమ సలహాదారుడు కేవీ ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రాలను అందజేశారు. హాకర్ల క్షేమాభివృద్ధికి ప్రత్యేక నిధిని కేటాయిస్తానని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వారికి భరోసా ఇచ్చారు.

ముఖ్యమంత్రికి వినతిపత్రాన్ని అందిస్తున్న సమాఖ్య ప్రతినిధులు

(c) eenadu

14న ఈనాడు 50, ఈటీవీ 30 వసంతాల వేడుకలు

కర్నూలు, సాంస్కృతికం, న్యూస్‌టుడే : తెలుగువారి ప్రియ పత్రిక 'ఈనాడు' దినపత్రిక 50 వసంతాలు పూర్తి చేసుకుంది. తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచింది. 'ఈనాడు..మీటీవీ' అంటూ మూడు దశాబ్దాలుగా ఈటీవీని తెలుగు ప్రజలు అక్కున చేర్చుకున్నారు. ఈ సందర్భంగా ఈనాడు@50, ఈటీవీ@30 వసంతాల వేడుకలకు కర్నూలు వేదిక కాబోతోంది. ఈ నెల 14న కర్నూలులో ఏపీఎస్పీ బెటాలియన్ గ్రౌండ్‌లో ఈ వేడుకలు సాయంత్రం 6 నుంచి జరగనున్నాయి. సినీ గీతాలు, డ్యాన్స్ పర్ఫార్మెన్స్‌లతో ఉర్రూతలూగించేలా పలు కార్యక్రమాలు దీనిలో ఉంటాయి. ప్రముఖ గాయనీగాయకులు యాజిన్ నిజార్, శ్రీకృష్ణ, ధనుంజయ్, ఆదిత్య, మాళవిక, ఉష, కౌశల్య, కల్పనలు పాటలతో అలరించనున్నారు. వీరితోపాటు వందేమాతరం శ్రీనివాస్ తమ గానంతో ఉర్రూతలూగించనున్నారు. జబర్దస్త్ ఫేమ్ హైపర్ ఆది పంచ్ డైలాగులతో కడుపుబ్బ నవ్వించనున్నారు. బుల్లితెర ప్రయోక్త, సినీనటుడు నందు యాంకర్‌గా వ్యవహరిస్తారు. ఆద్యంతం వినోదభరితంగా సాగే ఈ కార్యక్రమంలో పాల్గొనాలంటే పాసులు తప్పనిసరి.

13న పాసుల పంపిణీ

ఫిబ్రవరి 13న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఏపీఎస్పీ బెటాలియన్ గ్రౌండ్ వద్ద పరిమిత సంఖ్యలో పాసులు పంపిణీ చేస్తారు. అంతే కాదు పాసుతో పాటు ప్రత్యేక ఆకర్షణగా ఇచ్చే రిస్ట్ బ్యాండులను ధరించిన వారికి మాత్రమే ప్రవేశం ఉంటుంది.

విదేశాల్లో ఉద్యోగాలు

విదేశాల్లో వెల్డింగ్, నిర్మాణ రంగంలో ఉద్యోగ అవకాశాలపై గురువారం పులివెందులలోని న్యాక్ కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు డోన్ న్యాక్ కేంద్రం ఇన్‌ఛార్జి శివాజీ తెలిపారు. ఈ సదస్సుకు పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ చదివి 19 నుంచి 45 ఏళ్ల లోపు వయస్సు గల అభ్యర్థులు హాజరు కావచ్చన్నారు. సదస్సును యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9000517637, 9701271158 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

– న్యూస్‌టుడే, డోన్ పట్టణం

ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ప్రతిభా పాటవ పోటీలు రేపే

కళాశాల విద్యార్థులకు 'ఈనాడు - ఈటీవీ' ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా స్థాయి ప్రతిభా పాటవ పోటీలు జరగనున్నాయి. కర్నూలు నగరంలోని క్లస్టర్ విశ్వవిద్యాలయంలో ఉదయం 10.00 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయి. గత నాలుగు నెలలుగా ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 25 కళాశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాసం, క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతి కళాశాల నుంచి నాలుగు విభాగాల్లో ముగ్గురి చొప్పున 12 మందిని జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. వారంతా ఉదయం 9 గంటలకు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

– న్యూస్‌టుడే, కర్నూలు విద్య

వేలాలకు వేళ కాలేదా

పురపాలికలకు తగ్గుతున్న ఆదాయం ● దృష్టిసారించని అధికారులు

ఉమ్మడి జిల్లాలోని పురపాలక సంఘాల్లో గేట్ వసూళ్లకు నిర్వహించాల్సిన వేలాలపై అధికార యంత్రాంగం దృష్టిసారించడం లేదు. కీలకమైన పుర ఆదాయాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనేది స్పష్టమవుతోంది. రాజకీయ అండదండలతో చోటా మోటా నాయకులు మార్కెట్లు దక్కించుకొని గేట్ వసూళ్లతో రూ. లక్షలు ఆర్జిస్తున్నారు. పురపాలికలకు మాత్రం ఎగనామం పెడుతున్నారు. 2025-26 ఆర్థిక ఏడాది ముగింపు దశకు చేరుతున్నా.. నేటికీ ఎక్కడా వేలాల నిర్వహణపై దృష్టి సారించలేదు.

– న్యూస్‌టుడే, ఆదోని, నంద్యాల, ఎమ్మిగనూరు పురపాలికలు

రింగ్ అవుతున్న గుత్తేదారులు

ఏటా పురపాలికల్లో ఆదాయం పెరుగుతున్న పరిస్థితి కనిపించడం లేదు. మూడేళ్లలో వేలం ధరలు కూడి.. వచ్చిన మొత్తాన్ని మూడుగా విభజిస్తారు. సరాసరి 10 నుంచి 15 శాతం మేర పెంచి వేలం నిర్వహించాలి. ఈ విధానం ఎక్కడా అమలు కావడం లేదు. చివరి క్షణంలో వేలాలు నిర్వహించడం, సమయం తక్కువగా ఉందనే నెపంతో గుత్తేదారులు రింగ్ అయ్యేందుకు అవకాశమివ్వడం, లేదంటే.. యంత్రాంగమే వసూలు చేసేలా చేయడం వంటి వాటి వల్ల పుర ఆదాయం తగ్గుతోంది. నంద్యాలలో గడిచిన రెండేళ్లలో గేట్ వసూళ్లు పరిశీలిస్తే.. రూ.1.20 కోట్ల ఆదాయం తగ్గింది. ఎమ్మిగనూరులో రూ.20 లక్షల బకాయిలు చెల్లించాల్సి ఉంది.

ఎప్పుడు నిర్వహిస్తారో

● ఎమ్మిగనూరులో కూరగాయల మార్కెట్‌తో పాటు పశువులు, గొర్రెల సంత, మాంసం దుకాణాలు, కబేలా.. ఇలా ఆరు మార్కెట్లున్నాయి. 2025-26 ఏడాదికి ఈ మార్కెట్లన్నీ కలిపి రూ.74 లక్షలకు వేలం వేశారు. ఈ ఏడాది ఇంకా వేలాల నిర్వహణ చేపట్టలేదు.

బకాయిలు బారెడు

● ఆదోని పురపాలక సంఘం పరిధిలోని రూప్నీ లక్ష్మీబాయి (జేఎల్‌బీ) కూరగాయల మార్కెట్, పశువులు, గొర్రెల సంతలున్నాయి. మూడు మార్కెట్లకు 2025-26 ఏడాదికి రూ.90.41 లక్షలకు వేలం పాడారు. జేఎల్‌బీ మార్కెట్ రూ.61.80 లక్షలకు పలికింది. ఆర్థిక ఏడాది ముగుస్తున్నా.. రూ.34.60 లక్షలు బకాయిలు రావాల్సి ఉంది. గతేడాది ఆలస్యంగా వేలాలు నిర్వహించారు. పెంచిన ధరలు తగ్గించాలని గుత్తేదారులు పట్టుబట్టారు. దీంతో మొదటి రెండు నెలలు పాత గుత్తేదారే వసూలు చేయించారు. ఈ లోపు గుత్తేదారులు రింగ్ అయ్యేందుకు అవకాశం ఇచ్చినట్లయింది.

రెండేళ్లుగా మానేశారు

● నంద్యాలలో రెండేళ్లుగా వేలాలు జరగడం లేదు. గత వైకాపా ప్రభుత్వంలో వేలంలో పోటీ లేదన్న కారణంతో వాయిదా వేస్తూ వస్తున్నారు. 2024 ఆర్థిక ఏడాది నుంచి ఇప్పటి వరకు నిర్వహించకపోవడం వెనుక చేతివాటం కారణమనే వాదనలు వినిపిస్తున్నాయి. గతేడాది ఆరు నెలల కాలానికి వేలాలు నిర్వహిస్తే.. కౌన్సిల్ సభ్యులు ఆమోదించలేదు. దీంతో అధికారులే గేట్ వసూళ్లు చేస్తున్నారు. 2025-26 ఆర్థిక ఏడాదికి ఏప్రిల్ నుంచి జనవరి 18వ తేదీ వరకు రూ. 26.18 లక్షలు వసూలు చేసినట్లు చెబుతున్నారు.

మాట నిలబెట్టుకున్న మంత్రి లోకేశ్

విద్యార్థులకు మిఠాయిలు తినిపిస్తున్న గుడిసె కృష్ణమ్మ, తెదేపా నేతలు

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : వైకాపా ప్రభుత్వం బకాయిపడిన ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చెల్లిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నిలబెట్టుకున్నారని కర్నూలు పార్లమెంట్ తెదేపా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ తెలిపారు. మంగళవారం రూ.1,200 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తం చెల్లించడం తెలిసిందే. కూటమి ప్రభుత్వం హామీలను నెరవేర్చిన సందర్భంగా కర్నూలు పార్లమెంటు తెలుగు యువత అధ్యక్షుడు ఎస్.అబ్బాస్ ఆధ్వర్యంలో నగరంలోని తెదేపా జిల్లా కార్యాలయం ఎదుట బుధవారం తెదేపా నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. గుడిసె కృష్ణమ్మ, పార్టీ ప్రధాన కార్యదర్శి పూల నాగరాజుయాదవ్ తదితరులు ప్రజలకు, విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్పొరేటర్ జకియా అన్సారి, తెదేపా నాయకులు నాగేంద్ర, పి.రాజు, రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మనబడికెళ్దాం.. ప్రగతి బాటలేద్దాం

"కర్నూలు నగరంలోని ట్రిపుల్ ఐటీ(డీఎం) విద్యార్థులు రుద్రవరం, ఓర్వకల్లు, నూతనపల్లె, కన్నమడకల, కేతవరం గ్రామాల్లో పాఠశాలలను దత్తత తీసుకొన్నారు.. ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి వివిధ అంశాలపై విద్యార్థుల్లో చైతన్యం నింపుతున్నారు."

● మీరూ ఇలా విద్యార్థులకు సేవ చేయాలని అనుకుంటున్నారా ? మీలాంటి వారి కోసమే రాష్ట్ర ప్రభుత్వం విద్యాంజలి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మీరు చదువుకున్న బడిని అభివృద్ధి చేయడానికి చక్కని వేదిక ఇది. –న్యూస్‌టుడే, కర్నూలు విద్య

ఇలా నమోదు

● వెబ్‌సైట్ vidyanjali.education.gov.in లోకి వెళ్లి వాలంటీరుగా నమోదు చేసుకోవాలి. సమీపంలోని పాఠశాల, ఆసక్తి ఉన్న సేవా రంగాన్ని ఎంచుకోవచ్చు. ఇది పూర్తిగా స్వచ్ఛంద సేవ కిందకు వస్తుంది.

సేవలందించొచ్చు

● విద్యాసాయం, కళలు, నైపుణ్యాలు, ఆరోగ్యం, క్రీడలు, మార్గనిర్దేశం, సామాజిక బాధ్యత, తరగతి గదికి అవసరమైన బల్లలు, కుర్చీలు, బోర్డులు, సైన్సు, మ్యాథ్స్ కిట్లు, పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు, సాంకేతిక విద్యకు అవసరమయ్యే స్మార్ట్ టీవీలు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు ఇవ్వవచ్చు.

● నర్సరీ నుంచి ఇంటర్ వరకు బోధించొచ్చు. కథలు చెప్పడంతోపాటు పిల్లల్లో సృజనాత్మకత, చదవడం, రాయడంలో సాయం చేయొచ్చు.

● సామాజిక బాధ్యత కింద దివ్యాంగులకు సేవలు, వయోజన విద్య, పాఠశాలల్లో పరిశుభ్రతకు సహకారం. పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్వహణ, ప్రయోగశాలలు, భోజన వసతి, మరుగుదొడ్ల శుభ్రత, విద్యుత్తు సదుపాయం వంటి సేవలు అందించొచ్చు.

● కళలు, వత్తి నైపుణ్యాలు నేర్పడంతో సృజనాత్మకతను వెలికితీసి, జీవనోపాధికి మార్గం చూపడం. క్రీడల్లో శిక్షణ, పొగాకు, మాదకద్రవ్యాలతో అనర్థాలపై అవగాహన కల్పించే అవకాశం ఉంటుంది.

ఇది పూర్తిగా స్వచ్ఛందం

విద్యాంజలి ద్వారా నియమితులమయ్యామని వచ్చిన వ్యక్తుల నుంచి జిల్లా విద్యాశాఖ అనుమతి పత్రాన్ని పరిశీలించాలి. ఈ పేరుతో గతంలో పలువురు నిరుద్యోగులు అపరిచితుల చేతుల్లో మోసపోయారు. విద్యాంజలి కింద వచ్చే వ్యక్తులు అందించే సేవలు పూర్తిగా స్వచ్ఛందం. దీనికి ఎటువంటి పారితోషికం ఉండదు. ఇలాంటి అంశాలపై హెచ్‌ఎంలు జాగ్రత్తలు పాటించాలి.

మయూర వాహనసేవ.. మమ్మేలు మహాశివా

■ నల్లమల గిరుల్లో శివనామస్మరణ

■ జనసంద్రంగా శ్రీశైల మల్లన్న కొండ

భక్తజనం మధ్య స్వామిఅమ్మవార్ల గ్రామోత్సవం

శ్రీశైల మహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. నాలుగో రోజైన బుధవారం శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి మయూర వాహనంపై కొలువుదీరారు. కృష్ణదేవరాయగోపురం వద్ద నుంచి గంగాధరమండపం, బయలు వీరభద్రస్వామి ఆలయం వరకు గ్రామోత్సవం కనుల పండువగా జరిగింది. చెక్క భజనలు, కోలాటాలు, అగ్నికీల విన్యాసాలు, శంఖు, ఢమరుక నాదాలతో కళాకారులు అలరించారు. గ్రామోత్సవంలో దేవస్థానం ఈవో ఎం.శ్రీనివాసరావు, ధర్మకర్తలమండలి అధ్యక్షులు రమేష్‌నాయుడు, సభ్యులు అనిల్‌కుమార్, రమణ, భరద్వాజ శర్మ, దేవకి వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

★ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఐదో రోజు గురువారం రావణ వాహనసేవ జరుగనుంది. రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

– న్యూస్‌టుడే, శ్రీశైలం ఆలయం

సంకల్పం సిద్ధించేనా

● ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

● ఆందోళన కలిగిస్తున్న 'ప్రీఫైనల్' ఫలితాలు

ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణత పెంచేందుకు కూటమి ప్రభుత్వం గతేడాది సంకల్ప్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఫలితాలు కొంతమేర మెరుగుపడటంతో ఈ ఏడాది మరింత పకడ్బందీగా అమలు చేస్తున్నారు. ఈనెల 23 నుంచి మార్చి 24వ తేదీ వరకు ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో వారికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈనెల 20వ తేదీ వరకు వీటిని కొనసాగించనున్నారు. గత నెలలో జరిగిన ప్రీఫైనల్ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించారు. సీ, డీ గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించారు. వారికి నిత్యం హోమ్‌వర్క్ ఇస్తున్నారు. ప్రతిరోజు స్లిప్‌టెస్టులు నిర్వహిస్తూ ప్రతిఒక్కరు ఉత్తీర్ణులయ్యేలా సన్నద్ధం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, కర్నూలు విద్య

సగం మందికిపైగా బోల్తా

● ఉమ్మడి కర్నూలు జిల్లాలో 43 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటితో పాటు కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లలో కూడా జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ప్రీఫైనల్ పరీక్షల్లో అంతంత మాత్రమే ఉత్తీర్ణత వచ్చినట్లు తెలుస్తోంది. నంద్యాల జిల్లాలో మొదటి ఏడాది 2,918 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 1,039 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 2,681కు గాను 1,073 మందే పాసయ్యారు.

● కర్నూలు జిల్లాలో 4,179 మంది ప్రథమ సంవత్సరం విద్యార్థులు ప్రీఫైనల్ పరీక్షలు రాయగా 2,411 మందే పాసయ్యారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థుల్లో 2,629కు గాను 2,004 మంది ఉత్తీర్ణత సాధించారు.

వీటి పర్యవేక్షణ బాధ్యత ఎవరిది?

కేజీబీవీలు, ఆదర్శ, రెసిడెన్షియల్ పాఠశాలల్లో కూడా ఇంటర్మీడియట్ విద్య బోధిస్తున్నారు. వీటిలో సుమారు 4 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. జిల్లా విద్యాశాఖ పదో తరగతి విద్యార్థులపై దృష్టి సారించింది. ఇంటర్ బోర్డు ప్రభుత్వ జూనియర్ కళాశాలలనే పర్యవేక్షిస్తోంది. కేజీబీవీలు, ఆదర్శ, రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఇంటర్ చదువుతున్న విద్యార్థులను గురించి పట్టించుకునే వారు కరవయ్యారు. ఈ పాఠశాలల్లో ఇంటర్ విద్యార్థుల పర్యవేక్షణ ఎవరి బాధ్యతన్నది ప్రశ్నగా మారింది. ఎవరికి సమాచారం ఇవ్వాలో తెలియని స్థితిలో ప్రిన్సిపాళ్లు ఉన్నారు. అధికారులు వీటిపై దృష్టిసారిస్తే ఉత్తీర్ణత పెరిగే అవకాశం ఉంది.

ప్రధానితో మాట్లాడే అవకాశం

దేశ భవిష్యత్తు గురించి ప్రభుత్వానికి సూచనలు చేయడానికి కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ యువతకు అవకాశం కల్పిస్తోంది. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఉండే అంశాల గురించి ప్రజలకు, ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించడానికి 'మై భారత్ బడ్జెట్ క్వెస్ట్-2026'ను నిర్వహిస్తోంది. ఇందులో రైతులు, యువత, మహిళలు, ఉద్యోగులు, వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు పాల్గొనవచ్చు. విజేతలకు మార్చి నెలలో దేశ ప్రధాని మోదీతో వర్చువల్‌గా మాట్లాడే అవకాశం కల్పిస్తోంది. వీరు వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, ఉద్యోగ సదుపాయాలపై సలహాలు, సూచనలు ఇవ్వొచ్చు.

– న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

ఎంపిక ఇలా..

ఆసక్తి ఉన్న యువత www.mybharath.gov.in అనే వెబ్‌సైట్‌లో చరవాణి లేదా ఈమెయిల్ ద్వారా రిజిస్టర్ అవ్వాలి. వయస్సు 15-29 ఏళ్లలోపు ఉన్న వారు అర్హులు. ఈనెల 17లోగా నమోదు చేసుకోవాలి.

పోటీల్లో రాణిస్తే ...

బడ్జెట్‌పై అవగాహన అంచనా వేసేందుకు ఆన్‌లైన్‌లో జాతీయ స్థాయి క్విజ్ పోటీ నిర్వహిస్తారు. ఇందులో 30 ప్రశ్నలు ఉంటాయి. క్విజ్‌లో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన వారికి వ్యాస రచన పోటీలు నిర్వహిస్తారు. పోటీల్లో పాల్గొన్న వారికి ధ్రువీకరణ పత్రం ఇస్తారు. రాష్ట్రస్థాయి విజేతలతో దేశ ప్రధాని వర్చువల్‌గా మాట్లాడతారు. యువత తమ ఆలోచనలు ప్రధానితో పంచుకోవచ్చు.

అంచనా తప్పిన ఆర్టీసీ

శ్రీశైలంలో ప్రయాణికుల అవస్థ ● కానరాని ప్రత్యేక బస్సులు

"బుధవారం ఉదయం ఆరు గంటలకు శ్రీశైలం బస్టాండుకొచ్చాం. చాలా సేపటికి ఒకటిరెండు బస్సులు వచ్చాయి. గేటు బయటే ఎక్కేస్తున్నారు. లోపలికి వచ్చాక సీట్లు ఉండటం లేదు. బస్సులు చాలా తక్కువగా ఉన్నాయి. మధ్యాహ్నం నుంచి కొన్ని బస్సు రావడంతో వృద్ధులు, పిల్లలు పరిగెత్తి కిందపడుతున్నారని" ఆదోనికి చెందిన అరుణ వాపోయారు.

ఈమె ఒక్కరే కాదు.. శ్రీశైలం వెళ్లిన ప్రతి ఒక్కరికీ ఇదే పరిస్థితి ఎదురవుతోంది. శ్రీశైల మల్లన్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు వెళ్లిన భక్తుల సంఖ్యను అంచనా వేయడంలో ప్రజారవాణా అధికారులు విఫలమయ్యారు.

– న్యూస్‌టుడే, ఆత్మకూరు, కర్నూలు, నంద్యాల ఆర్టీసీ

శ్రీశైలంలో బస్సు ఎక్కేందుకు తోపులాట

ఎందుకీ పరిస్థితి వచ్చిందంటే

● ఈ నెల 8వ తేదీన బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకు 1,95,555 మంది స్వామిఅమ్మవార్లను దర్శనం చేసుకొన్నట్లు అధికారులు చెబుతున్నారు.

● వెంకటాపురం నుంచి శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్లే భక్తులకు ఈ నెల 8వ తేదీ నుంచీ అనుమతి ఇవ్వనున్నట్లు మొదట అటవీ శాఖ అధికారులు ప్రకటించారు. భక్తుల విన్నపం మేరకు ఒక్కరోజు ముందు నుంచే అనుమతి ఇచ్చారు.

● ఆదివారం(8వ తేదీ) సెలవుదినం కావడంతో ఎక్కువ మంది నడకమార్గంలో వెళ్లారు. వీరంతా 45 కి.మీ. రెండురోజుల పాటు నడిచి శ్రీగిరికి చేరుకొన్నారు. అక్కడ స్వామిఅమ్మవారిని దర్శనం చేసుకొని తిరుగు ప్రయాణం అయ్యే సరికి సరైన బస్సుల్లేవు.

సీటు దొరకాలంటే యుద్ధమే చేయాలి

● శ్రీశైలానికి రాత్రి వేళ వచ్చిన బస్సులు బస్టాండుకు సమీపంలో నిలుపుతున్నారు. అవన్నీ తెల్లారి ఉదయం 5-6 గంటల మధ్య తిరుగు ప్రయాణం అవుతున్నాయి. సీట్లు దొరకవన్న ఉద్దేశంతో రాత్రి వేళనే ప్రయాణికులు ఆయా బస్సుల్లోని సీట్లలో నిద్రిస్తున్నారు. అవి బస్టాండుకు వచ్చే సరికి సీట్లన్నీ నిండిపోతున్నాయి.

● పాదయాత్రగా 40 కి.మీలు నడిచి స్వామిని దర్శించుకున్న భక్తులు బస్సు ఎక్కేందుకు పరుగులు తీయాల్సి వస్తోంది. కాళ్ల నొప్పులతో నడవడమే కష్టంగా ఉంటే ప్రతి బస్సు వద్ద వందల మంది గుమికూడటంతో బస్సు ఎక్కడమే కష్టమైంది.

● కర్నూలు నుంచి బయల్దేరిన బస్సులు శ్రీశైలం చేరుకోవడానికి ఆరుగంటలు పడుతుంది. అంటే ఉదయం 11 గంటల తర్వాతే ఒక్కోటి వస్తున్నాయి.

కనిపించని ప్రత్యేకం

● ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఫిబ్రవరి 8 నుంచి ప్రత్యేక బస్సులు నడపాల్సి ఉంది. వివిధ జిల్లాల నుంచి కర్నూలు రావాల్సిన 140, నంద్యాల జిల్లాలకు రావాల్సిన 90 బస్సులు సకాలంలో రాలేదు. దీంతో 9వ తేదీన బస్సులు లేకపోవడంతో ఏమి చేయలేని పరిస్థితిలో ప్రజారవాణా సిబ్బంది ఉండిపోయారు.

● రెండు గంటలకు ఒకసారి మాత్రమే శ్రీశైలానికి వెళ్లే బస్సు అందుబాటులో ఉంది. దీంతో సీట్ల కోసం మహిళలు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫిబ్రవరి 13 నుంచి 17వ తేదీ వరకు ఉమ్మడి కర్నూలు జిల్లాల నుంచి పూర్తిస్థాయిలో బస్సులు అందుబాటులో ఉంటాయని అధికారులు చెబుతున్నారు.

● ఫిబ్రవరి 8 నుంచి 10వ తేదీ వరకు ఉమ్మడి జిల్లాలో 200 బస్సులు నడిపినట్లు కాగితాల్లో చూపుతున్నారు. వాస్తవానికి 10వ తేదీన శ్రీశైలానికి 55, వెంకటాపురానికి 42 మాత్రమే నడిపారు. 11వ తేదీన సాయంత్రం వరకు శ్రీశైలానికి 100, వెంకటాపురానికి 30 బస్సులు నడిపారు.

కోర్టు ఉద్యోగాలకు 18న రాతపరీక్ష

కర్నూలు గాయత్రీ ఎస్టేట్, న్యూస్‌టుడే : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయానికి సంబంధించి రికార్డు అసిస్టెంట్, ఫ్రంట్ ఆఫీసు కోఆర్డినేటర్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 18న రాత పరీక్ష ఉంటుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్థి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటలకు స్థానిక ప్రసూన లా కళాశాలలో పరీక్ష ప్రారంభమవుతుందన్నారు. దరఖాస్తు చేసుకుని రాత పరీక్షకు అర్హత సాధించిన అభ్యర్థుల జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. హాల్‌టికెట్లు ఇంటికి రాని అభ్యర్థులు స్థానిక జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలని సూచించారు.

నకిలీ యాప్, వెబ్‌సైట్లను నమ్మొద్దు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : మహాశివరాత్రి సందర్భంగా సైబర్ నేరగాళ్లు ఆలయాల పేరిట నకిలీ వెబ్‌సైట్‌లు, యాప్‌లు సృష్టించి మోసాలకు పాల్పడతారని, ఇలాంటి నేరాల పట్ల భక్తులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. దర్శనం టికెట్లు, ప్రత్యేక పూజలు, సత్రాల్లో బస చేసేందుకు గదుల బుకింగ్ పేరుతో నమ్మించి డబ్బులు స్వాహా చేస్తారన్నారు. త్వరపడి వారు పంపే లింకులను క్లిక్ చేయడం గాని, బ్యాంకు ఖాతా ఓటీపీ ఇతర వ్యక్తిగత వివరాలు పంపవద్దన్నారు. భక్తులు అధికారిక వెబ్‌సైట్, యాప్‌లను మాత్రమే సంప్రదించాలన్నారు. సైబర్‌నేరగాళ్ల చేతిలో నష్టపోయిన బాధితులు టోల్‌ఫ్రీ నంబరు 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఈ-నారీ.. వెలుగు దారి

డ్వాక్రా సంఘాల కార్యకలాపాల్లో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా.. పూర్తి పారదర్శకంగా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సంఘాలను పకడ్బందీగా నిర్వహించేందుకు డీఆర్డీఏ- వెలుగు కార్యాలయాల్లో ఈ-నారీ, సీఆర్పీలను నియమిస్తోంది. క్రమం తప్పకుండా సంఘాల సమావేశాలు నిర్వహించడం, పొదుపు, రుణాలపై సభ్యులకు అవగాహన కల్పించడం.. జీవనోపాధులపై శిక్షణ ఇవ్వడం, వ్యవసాయం, పశుపోషణ, వ్యాపారాల అభివృద్ధికి దిశానిర్దేశం చేయడం.. ప్రభుత్వ పథకాలతో మహిళలను అనుసంధానం చేయడం వంటి బాధ్యతలను వీరు నిర్వర్తించాల్సి ఉంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రెండు నెలలుగా ఈ-నారీమణులు, సీఆర్పీలను ఎంపిక చేసి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు.

– న్యూస్‌టుడే, కర్నూలు కలెక్టరేట్

పది సంఘాలకు ఒకరు

పొదుపు సంఘాల కార్యకలాపాలు, రుణాలు, వాయిదాలు, పొదుపు మొత్తాలకు సంబంధించిన సమస్త సమాచారాన్ని పుస్తకాలతో పాటు ఆన్‌లైన్‌లో పొందుపరిచేలా వెలుగు ఆధ్వర్యంలో సంస్కరణలు చేపట్టారు. ఇందుకోసం పది సంఘాలకు ఒక ఈ-నారీని నియమిస్తున్నారు. ప్రతినెలా ఎనిమిది రోజులపాటు వీరు తమకు కేటాయించిన సంఘాల పుస్తకాలు రాయడం, గ్రామైక్య సంఘాలు (వీవోఏ) పర్యవేక్షణలో వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. సభ్యులకు రుణాలు తీసుకోవడం, సకాలంలో చెల్లించడంపై అవగాహన కల్పించడం, మన డబ్బులు- మన లెక్కలు యాప్ నిర్వహణ వంటి విధులు నిర్వహించాలి. ఈ పనులు చేసినందుకు వీరికి రోజుకు రూ.300 చొప్పున పారితోషికం చెల్లిస్తారు.

ఎంపికకు ప్రామాణికాలు

18- 45 సంవత్సరాల మధ్య వయసుండి అదే గ్రామంలో స్వయం సహాయ సంఘం సభ్యురాలై ఉండాలి. ఆ ఊరి కోడలై ఉండాలి. పదో తరగతి విద్యార్హత ఉన్నవారిని ఈ-నారీగా, పది ఆపై డిగ్రీ వరకు చదువుకున్న వారిని సీఆర్పీలుగా ఎంపిక చేశారు. వ్యక్తిగత ఆండ్రాయిడ్ ఫోన్ కలిగుండి.. దాన్ని ఉపయోగించడంపై అవగాహన ఉండాలి. డ్వాక్రా సంఘం పుస్తకాల నిర్వహణ తెలిసుండాలి.

సంఘాలు/ సభ్యులు	కర్నూలు	నంద్యాల
జిల్లా గ్రామైక్య సంఘాలు	964	1,098
స్వయం సహాయ సంఘాలు	32,103	30,739
మొత్తం సభ్యులు	3,25,824	3,13,656
ఈ-నారీమణులు	3,180	3,040
సీఆర్పీలు	1,402	1,345

మన డబ్బులు- మన లెక్కలు

మొన్నటి వరకు డ్వాక్రా సంఘాల కార్యకలాపాలన్నీ వీవోఏల కనుసన్నల్లోనే జరిగాయి. బ్యాంకు నుంచి రుణాలు తీసుకునేటప్పుడు, తప్పనిసరి సమావేశాలప్పుడు మాత్రమే సంఘ సభ్యులు హాజరయ్యేవారు. పొదుపు మొత్తాలు, రుణ వాయిదాల లెక్కలను సభ్యులు పట్టించుకునేవారు కాదు. దీంతో చాలా మండలాల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయి. వీటికి అడ్డుకట్ట వేస్తూ, తమ సంఘానికి సంబంధించిన లెక్కలన్నీ సభ్యులు తెలుసుకునేందుకు వీలుగా 'మన డబ్బులు- మన లెక్కలు' పేరుతో ఓ యాప్‌ని రూపొందించారు. దీని ద్వారా సంఘానికి సంబంధించిన ఆర్థిక వ్యవహారాలన్నీ ఇంట్లో ఉండే తెలుసుకునే వెసులుబాటు లభిస్తుంది.

(c) eenadu

నైపుణ్యం పొందేలా.. ఉన్నతంగా ఎదిగేలా..

● పీఎంశ్రీ పాఠశాలల్లో వృత్తినైపుణ్య శిక్షణ

టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ నిచ్చి.. పాఠశాల స్థాయిలోనే భవితకు బాటలు పడేలా కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ(ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇప్పటికే పలు పాఠశాలలను ఎంపిక చేసి.. అధునాతన ప్రయోగశాలలతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించింది. ఆయా బడుల్లో వృత్తి విద్యా కోర్సులు ప్రత్యేక శిక్షకులు బోధిస్తున్నారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో భౌతిక, రసాయన, జీవశాస్త్ర విభాగాల్లో ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, గ్రంథాలయాలు వంటి పలు రకాల సౌకర్యాలను కల్పిస్తోంది. ఈ నేపథ్యంలో విద్యార్థులు స్వయం ఉపాధి పొందేలా వివిధ అంశాల్లో తర్ఫీదు పొందుతున్నారు.

కోర్సుల వివరాలు: అగ్రికల్చర్, కుట్టు, ఆటోమేటివ్, బ్యూటీ అండ్ వెల్‌నెస్, బీఎఫ్ఎస్ఐ, ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్‌వేర్, ఫుడ్ ప్రాసెసింగ్, హెల్త్‌కేర్, ఐటీ, రిటైల్ మార్కెటింగ్.

తరగతుల వారీగా శిక్షణ

○ పీఎంశ్రీ కింద ఎంపికైన ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల్లో పలు కోర్సుల్లో ఒకేషనల్ టీచర్లతో నైపుణ్యాలు పెంపొందిస్తున్నారు. 6 నుంచి 8వ తరగతి వరకు కౌశల్ బోధ్ పథకం కింద పుస్తకాలను అందించి ప్రీ ఒకేషనల్ తరగతులను నిర్వహిస్తున్నారు. 9వ తరగతికి లెవల్-1, పదోతరగతి లెవల్-2 కింద, ఇంటర్మీడియట్‌లో ప్రథమ సంవత్సర విద్యార్థులకు లెవల్-3, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు లెవల్-4లో నైపుణ్యాలు కల్పిస్తున్నారు.

○ విద్యార్థులకు నచ్చిన కోర్సులకు సంబంధించి వృత్తి విద్యా కోర్సుల్లో ఒకేషనల్ ఉపాధ్యాయులతో ప్రత్యేక శిక్షకులను నియమించి.. బోధనతో పాటు పాఠశాలలకు సమీప ప్రాంతాల్లోని పరిశ్రమలు, ఆటోమేటివ్ షాపులు, ఎలక్ట్రానిక్స్ హార్డ్‌వేర్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి వాటిని క్షేత్రస్థాయిలో పలు అంశాలపై ప్రత్యక్షంగా చూపిస్తూ అవగాహన నైపుణ్యాలను పెంపొందిస్తున్నారు. బాలికల సంఖ్య ఎక్కువగా ఉన్న పీఎంశ్రీ పాఠశాలల్లో 9, 10 తరగతుల వారికి కుట్టు, బాలురు ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, అగ్రికల్చర్, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్, ఆటోమేటివ్ కోర్సుల్లో శిక్షణ కల్పిస్తున్నారు.

○ పదో తరగతి, ఇంటర్ పూర్తైన విద్యార్థులకు శిక్షణలో నేర్చుకున్న అంశాలపై పరీక్ష నిర్వహించి ధ్రువపత్రం అందజేయనున్నారు.

కర్నూలు జిల్లాలో శిక్షణ ఇచ్చే విద్యా సంస్థలు:	36
9వ తరగతి విద్యార్థులు:	10,400
10వ తరగతి విద్యార్థులు:	9,700
ఇంటర్ విద్యార్థులు:	4,200
శిక్షకుల సంఖ్య:	187

కాణిపాకం దేవస్థానం పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఛైర్మన్, ఈవో

స్వామి, అమ్మవార్లకు తితిదే నుంచి పట్టువస్త్రాలు తీసుకువచ్చిన అధికారులు

ఆలయానికి చేరుకుంటున్న భక్తులు

శ్రీగిరి మార్గం.. భక్తజన పరవశం

◆ శివనామ స్మరణతో మార్మోగుతున్న నల్లమల

నల్లమల అటవీ ప్రాంతంలో భక్తజన బృందాలు జలప్రవాహంలా శ్రీశైలం చేరుకుంటున్నాయి. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీగిరి శివస్వాములతో నిండిపోయింది. నల్లమల అటవీప్రాంతంతో పాటు శ్రీశైల రహదారులు శివనామస్మరణంతో మారుమోగుతున్నాయి. దాతలు, ఆశ్రమాలు, సత్రాలు, పలు సేవా సంస్థల వారు భక్తుల సేవలో భాగస్వాములవుతున్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని బుధవారం కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం తరపున శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. కాణిపాకం దేవస్థానం ధర్మకర్తలమండలి అధ్యక్షులు మణినాయుడు, ఈవో కె.పెంచల కిశోర్ పట్టువస్త్రాలు తీసుకువచ్చారు. శ్రీశైలం దేవస్థానం ఈవో శ్రీనివాసరావు, ఛైర్మన్ రమేష్‌నాయుడు వారికి మంగళవాయిద్యాల మధ్య ఆలయ ప్రాంగణంలోకి తీసుకువచ్చారు..

– న్యూస్‌టుడే, శ్రీశైలం ఆలయం, నంది సర్కిల్

హటకేశ్వరం వద్ద కాలినడకన వచ్చే భక్తులకు మజ్జిగ, పండ్లు అందజేస్తున్న విద్యుత్తు శాఖ ఉద్యోగులు

ఆలయానికి చేరుకుంటున్న శివస్వాములు

రాత్రివేళ నడక కొనసాగిస్తూ..
ఆలయం వద్ద నిద్రిస్తున్న భక్తులు

దేవస్థానం ఏర్పాటు చేసిన షెడ్లలో సేదతీరుతున్న భక్తులు

స్నానం చేస్తున్న మాలధారులు

భక్తి బాటలో అటవీశాఖ సేవలు

భక్తులతో సూచనలు చేస్తున్న విజయ్‌కుమార్

ఆత్మకూరు, నంద్యాల గ్రామీణం న్యూస్‌టుడే: శ్రీశైలానికి పాదయాత్రగా నడిచి వెళ్లే భక్తులకు సహజ వనరులు, అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు సహకరించాలని ఎన్‌ఎస్‌టీఆర్ డీడీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అండ్ జిల్లా అటవీ శాఖ ఫీల్డ్ డైరెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. నల్లమలలో భక్తుల సౌకర్యాలు ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధానికి సహకరిస్తున్న అధికారులను, సిబ్బందిని అభినందించారు. యాత్రికులతో చర్చించారు. సిబ్బంది కొరత ఉన్నా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పకడ్బందీగా పర్యవేక్షణ

● భక్తులకు తాగునీటి ఇబ్బందుల్లేకుండా ప్రవేశ ద్వారం నుంచి భీమునికొలను వరకు నీటి సౌకర్యం కల్పించారు. యాత్రికులకు ప్రథమ చికిత్స సేవలందించేందుకు ప్రైవేట్ ఆసుపత్రుల సహాయంతో ఐదు ప్రాంతాల్లో శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మజ్జిగ పంపిణీకి అనుమతించారు.

● జీవ వైవిధ్యం పరిరక్షణ, భక్తుల కోసం ఏడు ప్రదేశాల్లో మూడు షిఫ్టుల్లో 400 మంది అటవీ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనారోగ్యంతో బాధపడేవారు, అత్యవసర సహాయం కోసం యాత్రికులను రక్షించడానికి ప్రత్యేక అటవీ సిబ్బంది సిద్ధంగా ఉన్నారు.

● ప్లాస్టిక్ నిషేధం అమలు చేస్తూ అన్నదాన శిబిరాల వద్ద స్టీల్ ప్లేట్లు, గ్లాసులు ఉపయోగించాలని సూచించారు. పాదయాత్ర పరిస్థితిని పర్యవేక్షిస్తూ ఆత్మకూరులో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.

● భక్తులు నడిచే బాట వైపు టైగర్ కోర్ ప్రాంతాల్లో పులుల కదలికలపై నిఘా ఉంచి అటువైపు వచ్చే పులులను అడవిలోకి తరిమివేసేలా చర్యలు తీసుకున్నారు.

సంతృప్త స్థాయి అంతంత మాత్రమే

● ప్రభుత్వ శాఖల సేవలపై ప్రజల పెదవి విరుపు

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రభుత్వ శాఖలు ప్రజలు సంతృప్తి చెందేలా సేవలు అందించాలని కూటమి ప్రభుత్వం ఆదేశిస్తోంది. ఆయా శాఖల పనితీరుపై ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ సేకరిస్తోంది. దానిని పరిశీలిస్తే సంతృప్త స్థాయి కంటే అసంతృప్తే ఎక్కువగా కనిపిస్తోంది. విద్యుత్తు సేవల్లో కర్నూలు జిల్లా రాష్ట్రంలో చివరి నుంచి ఆరో స్థానంలో నిలవగా.. నంద్యాల జిల్లా పదో స్థానంలో నిలిచింది. పాఠశాల విద్యపై కూడా తల్లిదండ్రుల నుంచి పెద్దఎత్తున ఫిర్యాదులు అందాయి. ఉపాధ్యాయులు పాఠశాలలకు సకాలంలో హాజరయ్యేలా చూడాలని, పిల్లలకు అర్థమయ్యేలా విద్య బోధన సాగాలని, మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం వడ్డించాలని, రుచి, నాణ్యత బాగుండేలా చూడాలని పలువురు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

☛ ఆయా ప్రభుత్వ శాఖల్లో అందుతున్న సేవలపై ప్రజల సంతృప్త స్థాయికి సంబంధించి రాష్ట్రస్థాయిలో కర్నూలు, నంద్యాల జిల్లాల ర్యాంకులు ఇలా ఉన్నాయి.

ప్రభుత్వ సేవలు	కర్నూలు	నంద్యాల
విద్యుత్తు సేవలు	23	10
పాఠశాల విద్యాశాఖ పనితీరు	24	18
మధ్యాహ్న భోజన పథకం అమలు	28	13
ఉచిత ఇసుక సరఫరా	09	11
గృహ నిర్మాణ బిల్లుల చెల్లింపు	03	19
ఇంటర్మీడియట్ కాలేజియేట్ సేవలు	19	10

ఉచిత ఇసుకపై అలక

గృహ నిర్మాణ శాఖ సేవల్లో కర్నూలుకు 3వ ర్యాంక్ రాగా.. ఉచిత ఇసుక విధానంలో 9వ ర్యాంక్ వచ్చింది. విద్యుత్తు, పాఠశాల స్థాయి, ఇంటర్మీడియట్ విద్య, మధ్యాహ్న భోజన పథకం అమలు తదితర నాలుగు అంశాల్లో కర్నూలు చివరి స్థానాల్లో నిలిచింది.

● నంద్యాల జిల్లా ఇంటర్మీడియట్ కాలేజియేట్, విద్యుత్తు సేవల్లో పదో స్థానంలో నిలిచింది. మిగిలిన సేవల్లో వెనుకబడింది.

ర్యాంకులు మెరుగుపడాలి

పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ అంశంపై కలెక్టర్ డా. ఎ.సిరి బుధవారం కర్నూలు కలెక్టరేట్‌లో ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. రేషన్ సరకులు అందరికీ అందేలా చూడాలని, వాటి నాణ్యత బాగుండేలా చూడాలని డీఎస్‌వోను ఆదేశించారు. దీపం పథకం లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్ల డెలివరీ చేసే బాయ్స్ ప్రవర్తన మర్యాదగా ఉండాలని, బిల్లు మొత్తం కంటే ఎక్కువ డబ్బు వసూలు చేయకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్తు సరఫరాలో లోపాలు లేకుండా చూడాలని ఆ శాఖ ఎస్ఈని ఆదేశించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం వడ్డించాలని, వేరుసెనగ చిక్కీలు నాణ్యంగా ఉండేలా చూడాలని డీఈవోకు సూచించారు. జీఎస్టీ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో జడ్పీ సీఈవో నాసరరెడ్డి, డీఎస్‌వో రాజా రఘువీర్, విద్యుత్తు శాఖ ఎస్ఈ ప్రదీప్‌కుమార్, డీఈవో సుధాకర్, సమగ్ర శిక్ష ఏపీసీ లోకరాజు, జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి ఓంకారంలో శివరాత్రి ఉత్సవాలు

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన ఓంకార పుణ్యక్షేత్రంలో ఈనెల 14వ తేదీ నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభంకానున్నట్లు బుధవారం ఈవో నాగప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఈనెల 14న తేదీన బండిఆత్మకూరులోని శివాలయం నుంచి శివపార్వతులను వైభవంగా గ్రామోత్సవం నిర్వహిస్తారని తెలిపారు. 15న బండిఆత్మకూరు నుంచి సింగవరం, సోమయాజులపల్లె గ్రామాల మీదుగా ఓంకార క్షేత్రానికి చేరుతారని చెప్పారు. అదే రోజు తెల్లవారుజామున శివపార్వతులకు వైభవంగా కల్యాణం జరుగుతుందన్నారు. 16న నందివాహన సేవ, 17న అర్చనలు, సాయంత్రం రథోత్సవం ఉంటుందన్నారు. 18న ఆదివేళ్లకు ఓంకార క్షేత్రం నుంచి బండిఆత్మకూరు బయలు దేరనున్నట్లు చెప్పారు.

నందులకోటకెళ్లిన మహానందీశ్వరుడు

మహానంది, నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: మహానంది పుణ్యక్షేత్రంలో ఈనెల 13వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో కల్యాణ పెద్దలుగా నంద్యాలలోని బ్రహ్మానందీశ్వరాలయంలోని స్వామి, అమ్మవార్లను ఆహ్వానించేందుకు గంగాకామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వారు నంద్యాలకు వెళ్లారు. బుధవారం సాయంత్రం విశేష పూజలు చేసి పంపించారు. స్వామివార్లు మార్గ మధ్యలో అయ్యన్ననగర్, శ్రీనగరం, బుక్కాపురం, తమ్మడపల్లె, నంద్యాల మండలం సుగాలిమెట్ట గ్రామాల వద్ద భక్తులతో పూజలందుకున్నారు. నంద్యాలలోని ఆత్మకూరు బస్టాండులోని లక్ష్మీగణపతి ఆలయం చేరుకున్నారు. అక్కడి నుంచి బ్రహ్మానందీశ్వరస్వామి దేవస్థానం అధికారులు, సిబ్బంది ఘనస్వాగతం పలికి ఆలయ మర్యాదలతో తీసుకెళ్లారు. 12వ తేదీన తిరిగి ఇరు దేవేరుల పల్లకీలు మహానందికి చేరుకుంటాయని పండితులు తెలిపారు.

మహానంది నుంచి నంద్యాలకు పల్లకిని పంపుతున్న అధికారులు, పండితులు

మహానందీశునికి కాణిపాకం పట్టువస్త్రాల సమర్పణ

మహానంది, న్యూస్‌టుడే: మహానందిలో వెలసిన మహానందీశ్వర స్వామి, కామేశ్వరీదేవి అమ్మవార్లకు కాణిపాకం దేవస్థానం అధికారులు పట్టువస్త్రాలు సమర్పించారు. బుధవారం రాత్రి మహానందికి చేరుకున్న ఈవో పెంచల కిశోర్, ధర్మకర్తల మండలి ఛైర్మన్ సురేంద్రబాబు, ప్రధానార్చకులు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల గౌరవార్థం తీసుకువచ్చారు. వీటిని మహానందిలోని ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, వేదపండితులు రవి శంకర అవధానికి అందజేశారు.

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగొద్దు

మహానంది, న్యూస్‌టుడే: సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని నంద్యాల ఆర్డీవో చల్లా విశ్వనాథ్ పేర్కొన్నారు. దేవస్థానం ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈనెల 13 నుంచి 18వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు, ఇబ్బందులు కలుగకుండా చూడాలని తెలిపారు. భక్తులకు సరిపడా బస్సులు నడపాలన్నారు.

పచ్చదనం పెంపొందేలా..

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని బనవాసి ఫారం వద్ద ఉన్న సెంట్రల్ నర్సరీలో 3.50 లక్షల మొక్కలు పెంచేందుకు మట్టి బెడ్లు, ఇతర పనులు చేపట్టారు. నర్సరీలో టేకు, వేప, చింత, కానుగ, సుంకేశుల వంటి మొక్కలు పెంపకం చేపట్టనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. నర్సరీలో రెండేళ్ల పాటు మొక్కలను పెంచి తర్వాత అవెన్యూ ప్లాంటేషన్, ప్రభుత్వ పాఠశాలలు, ఇతర ఖాళీ స్థలాల్లో మొక్కలు పెంపకం చేపట్టనున్నారు. ప్రభుత్వం పచ్చదనాన్ని పెంచేందుకు రూ.45.50 లక్షలు మంజూరు చేసింది. త్వరలో నర్సరీకి అవసరమైన విత్తనాలు కొనుగోలు చేస్తామని సాంకేతిక సహాయకుడు భాస్కర్ తెలిపారు.

మొక్కల పెంపకానికి సిద్ధం చేసిన బెడ్లు

పుట్టగూడు

హాలహర్వి మండలం చింతకుంట, బాపురం గ్రామాల్లో దిగువ కాల్వ ప్రవహిస్తోంది. కాల్వ దాటేందుకు అక్విడక్ట్ వంతెనలు నిర్మించారు. వాటి కింద పక్షులు మట్టిగూళ్లను ఏర్పాటు చేసుకున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆహార అన్వేషణలో ఉన్న పక్షులు గూళ్లకు చేరుతాయి. వీటిని ఎవరైనా చూస్తే.. పాము పుట్టల్లా కనిపిస్తున్నాయి.

– న్యూస్‌టుడే, హాలహర్వి

మహిళ ఆత్మహత్య

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని నందమూరినగర్‌కు చెందిన హసీనా(37) మంగళవారం అర్ధరాత్రి అందరూ నిద్రిస్తుండగా ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ ఈశ్వరయ్య తెలిపారు. భర్త మహబూబ్ బాషా మద్యానికి బానిసకావడంతో ఆమె తరచూ గొడవ పడేదన్నారు. ఇంట్లో భర్త నిద్రిస్తున్న సమయంలో ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఆమెకు ఒక కూతురు ఉంది.

పన్ను బకాయిలు వసూలుపై దృష్టి పెట్టండి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డా.సిరి

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : పన్ను బకాయిల వసూళ్లపై దృష్టి పెట్టాలని కలెక్టర్ డా.ఎ.సిరి వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్‌ను ఆదేశించారు. జీఎస్టీ అమలుపై బుధవారం ఆమె కలెక్టరేట్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెక్షన్-51 ప్రకారం అన్ని ప్రభుత్వ విభాగాలు, స్థానిక సంస్థలు జీఎస్టీ రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలన్నారు. ప్రతి నెలా 20వ తేదీలోపు రిటర్న్స్ ఫైల్ చేయాలన్నారు. నకిలీ బిల్లులతో వ్యాపారం చేస్తూ పన్ను ఎగవేస్తున్న బోగస్ డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పోలీసు అధికారులను ఆదేశించారు. జీఎస్టీ రేట్ల తగ్గింపు ప్రయోజనం వినియోగదారులకు అందేలా తూనికలు కొలతల శాఖ అధికారులు నిరంతరం తనిఖీలు చేయాలని ఆదేశించారు. వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ నీరజ మాట్లాడుతూ పన్నుల వసూళ్లు, బకాయిలు తదితర అంశాల గురించి వివరించారు. సమావేశంలో జడ్పీ సీఈవో నాసరరెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయాలి

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : నులి పురుగుల నివారణ కోసం 19 ఏళ్లలోపు విద్యార్థులందరికీ తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డా.ఎ.సిరి అధికారులను ఆదేశించారు. కర్నూలు కలెక్టరేట్‌లో బుధవారం ఆమె జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 17న జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ఐటీఐలలో చదువుతున్న విద్యార్థులందరితో ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డా.భాస్కర్‌రాజు, ఐసీడీఎస్ పీడీ విజయ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నియంత్రికల వైఫల్యాలు తగ్గించండి

సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ గురువయ్య

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : జిల్లా వ్యాప్తంగా నియంత్రికల వైఫల్యాలను తగ్గించి వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (టెక్నికల్ అండ్ హెచ్ఆర్డీ) కె.గురువయ్య ఆదేశించారు. నగరంలోని విద్యుత్తు భవన్‌లో బుధవారం ఆయన జిల్లా ఎస్ఈ ఆర్.ప్రదీప్‌కుమార్‌తో కలిసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ.. విద్యుత్తు అధికారులు, సిబ్బంది వినియోగదారులకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రజల్లో సంతృప్త స్థాయి పెంచేలా సేవలు అందించాలని సూచించారు. పీఎం సూర్యఘర్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అధిక లోడు తగ్గించేలా 11 కేవీ అదనపు ఫీడర్లను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈటీ వై.వి.మహేశ్వరరెడ్డి, ఎస్ఏవో చిన్నరాఘవులు, కర్నూలు డివిజన్ ఈఈ శేషాద్రి, ఈఈ భాస్కరరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. సాయి క్యాష్ ఫర్ గోల్డ్ ట్రేడింగ్ కం|| ✆ 73821 14647.

JOBS

కర్నూలు కొరియర్ లాజిస్టిక్ లో పని చేయుటకు 1 సంవత్సరం అనుభవం ఉన్న కొరియర్ డెలివరీ బాయ్స్ కావలెను. సంప్ర: 85558 37909.

కర్నూలు - నంద్యాల జిల్లాలో వినాయక సోలార్ నందు పని చేయుటకు మార్కెటింగ్ Executives & Manager కావలెను. జీతం 15,000/- మరియు Spl ఇన్సెంటివ్ ఇవ్వబడును. సంప్ర: 95025 92654.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.

కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.

ప్రకటనలపై 5% GST వర్తించును.

వివరాలకు: 99899 97628

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

బడి దగ్గర ఇంత అపరిశుభ్రతా?

దేవనకొండ, న్యూస్‌టుడే: పాఠశాల పరిసరాలు ఇంత అపరిశుభ్రంగా ఉంటే ఎలా..? పిల్లలు ఇబ్బంది పడరా? వ్యాధులు వ్యాపించవా? అని జేసీ నూరుల్ ఖమర్ అసహనం వ్యక్తం చేశారు. మండల కేంద్రమైన దేవనకొండ జడ్పీ ఉన్నత పాఠశాలను పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్‌తో కలిసి పరిశీలించారు. పాఠశాల ముందున్న మురుగు కాల్వలో చెత్తాచెదారం పేరుకుపోయిందని, మురుగు ముందుకు కదలటం లేదని, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని ఉపాధ్యాయులు జేసీ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే కాల్వలో చెత్తాచెదారం తొలగించాలని పంచాయతీ కార్యదర్శి రాముడును ఆదేశించారు.

ఉన్నత పాఠశాల ముందున్న కాల్వను పరిశీలిస్తున్న జేసీ నూరుల్ ఖమర్, ఆర్డీవో భరత్ నాయక్

చోరీ కేసులో నిందితుల అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న డోన్ డీఎస్పీ శ్రీనివాసులు

బనగానపల్లి, న్యూస్‌టుడే: బనగానపల్లి పట్టణంలో ఈ నెల 7న శ్రీనివాస జ్యువెలరీ దుకాణంలో జరిగిన చోరీ కేసులో ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు డోన్ డీఎస్పీ శ్రీనివాసులు బుధవారం వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం మైలాన్‌దేవరపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ ఇమ్రాన్, షేక్ మహబూబ్ ఇబ్రహీం, సయ్యద్ షాదుల్లా, మహమ్మద్ షేక్‌షా, బాలకృష్ణ, తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా బాలాపూర్‌కు చెందిన మహమ్మద్ నజీర్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు. దుకాణం షట్టర్‌ను కోసి లోనికి ప్రవేశించి 18 తులాల బంగారు నగలు, 8 కేజీల వెండిని దోచుకెళ్లారు. వీరు అవుకు మండలంలో కునుకుంట్ల వద్ద జరిగే అపాంషావలి ఉరుసుకు వాహనంలో వచ్చారు. అనంతరం తెలంగాణకు వెళ్లే సమయంలో చోరీకి పాల్పడ్డారు. నిందితుల గుర్తింపులో బనగానపల్లి సీఐ ప్రవీణ్‌కుమార్, నంద్యాల సీసీఎస్ సీఐ సురేశ్‌కుమార్, ఎస్సైలు కల్పన, దుగ్గిరెడ్డి పాల్గొన్నారని తెలిపారు.

రేషన్ బియ్యం లావాదేవీల విషయంలో ఘర్షణ

ఆదోని సాయిబాబా థియేటర్ వద్ద హనుమంతు తదితరులపై దాడులకు పాల్పడుతూ..

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలో రేషన్ బియ్యం అక్రమ రవాణా లావాదేవీల విషయంలో ఇరువర్గాల మధ్య బుధవారం రాత్రి ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో ఓ వర్గానికి చెందిన వ్యక్తులు దాడులకు పాల్పడటంతో ఐదుగురు వ్యక్తులు గాయాలకు గురయ్యారు. ఆదోని పట్టణానికి చెందిన ఎరుకుల హనుమంతు, మహేశ్, నరేశ్, రంగస్వామి, ఇందప్పపై స్థానిక సాయిబాబా థియేటర్ వద్ద ఇందిరానగర్‌కు చెందిన ఉరుకుందప్ప, విజయ్, రాజశేఖర్, రామకృష్ణ, జావీద్ దాడి చేశారని బాధితుడు హనుమంతు వాపోయారు. గాయపడిన బాధితులు ఆదోని రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

17న శాప్ లీగ్ చదరంగం పోటీలు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈనెల 17వ తేదీన కర్నూలు డీఎస్ఏ స్టేడియంలో జిల్లాస్థాయి శాప్ లీగ్ చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు బుధవారం తెలిపారు. అండర్-13, 15, 17, 18 బాల బాలికల విభాగాల్లో పోటీలు ఉంటాయని వెల్లడించారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన వారు ఈనెల 21 నుంచి 22వ తేదీ వరకు తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు /https:/sports.gov.in/#homeindex వెబ్‌సైట్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

YEMMIGANUR MUNICIPALITY

E-Procurement Tender Notice No. 15/15th FCG& General Fund- 2025-2026/E1, dt. 11.02.2026

మునిసిపల్ సాధారణ నిధులు మరియు 15వ ఆర్థిక సంఘ నిధులతో 20 పనులు గాను రూ. 75.07 లక్షలతో అర్హులైన కాంట్రాక్టర్ల నుండి టెండర్లు స్వీకరించబడును, వివరములకు apeprocurement.gov.in నుండి పొందగలరు.

సం/- కమిషనరు, ఎమ్మిగనూరు పురపాలక సంఘం.

బాలల సంరక్షణ కేంద్రాలు సక్రమంగా నిర్వహించాలి

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలోని బాలల సంరక్షణ కేంద్రాలను ప్రభుత్వ నిబంధనలు, జువైనల్ జస్టిస్ చట్టం-2015 ప్రకారం సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ డా.ఎ.సిరి ఆదేశించారు. ఎలాంటి లోపాలు కనిపించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆమె బాలల సంరక్షణ కేంద్రాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన జిల్లాస్థాయి సిఫార్సుల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ నాలుగు బాలల సంరక్షణ కేంద్రాలను ఆమోదించింది. ప్రైవేటు బాలల సంరక్షణ కేంద్రాల పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో స్త్రీ, శిశు సంక్షేమశాఖ పీడీ విజయ, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ రయీస్ ఫాతిమా, సీపీవో భారతి, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి శారద, జిల్లా చైల్డ్ ప్రొహిబిషన్ అధికారి దివాకర్, పోలీసు శాఖ ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

(c) eenadu

ఆదోని

● ఆదోని ● ఆలూరు ● పత్తికొండ

భక్తులపై పోలీసుల దాడులు దారుణం

వెల్దుర్తిలో నిరసన వ్యక్తం చేస్తున్న శివ భక్తులు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: శ్రీశైలంలో శివ భక్తులపై పోలీసులు దాడులకు పాల్పడటం దారుణమని ఎస్సీ సాధన కమిటీ జిల్లా అధ్యక్షుడు వెంకటయ్యాదవ్, తదితరులు అన్నారు. వెల్దుర్తిలో బుధవారం ఆయన శివ స్వాములతో కలిసి నిరసన వ్యక్తం చేశారు.

మిగులు భూములు పేదలకు పంచాలి

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ఆదోని మండలం-2 పరిధిలోని ప్రభుత్వ మిగులు భూములు పేదలకు పంచాలని డిమాండు చేస్తూ.. ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో నాయకులు ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. నాయకులు బసాపురం గోపాల్, తిమ్మయ్య, యల్లప్ప, సత్యనారాయణ తదితరులు మాట్లాడారు. అధికారికి వినతి పత్రం అందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఆదోని: 77996 66004 ఆలూరు: 80085 62277 పత్తికొండ: 80085 73822

చిప్పగిరి, న్యూస్‌టుడే: ?: నంచర్లలో తాగునీటి కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారు. - రామాంజనేయులు, నంచర్ల

✓: ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, బోరువేయించేందుకు చర్యలు తీసుకుంటాం. - వెంకట రమణ, ఏఈ, చిప్పగిరి

తుగ్గలి, న్యూస్‌టుడే: ?: చెన్నంపల్లి నుంచి రామలింగాయపల్లికి వెళ్లే దారిలో కల్వర్టు వద్ద కోతకు గురై ప్రమాదకరంగా ఉంది. - మల్లికార్జున, రామలింగాయపల్లి

✓: చెన్నంపల్లి రామలింగాయపల్లి మార్గంలో అధిక వర్షాలకు కోతకు గురైన రహదారిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. - వెంకటేశ్వర్లు, పీఆర్ ఏఈ

తాపలకొత్తూరు(కృష్ణగిరి), న్యూస్‌టుడే: ?: గ్రామంలో కోయిలకొండకు వెళ్లే ప్రధాన రహదారిలో కల్వర్టులు లేక గ్రామ మురుగంతా రహదారిపైకి చేరుతోంది. - వెంకటేశ్వర్లు, తాపలకొత్తూరు ✓: అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. - లెనిన్ బాబు, గ్రామ సర్పంచి

పెదవలి (మద్దికెర), న్యూస్‌టుడే: ?: పెరవలి ప్రధాన రహదారిలో చెరువు కట్టపై విద్యుత్తు స్తంభాలు ఒరిగిపోయాయి. - అల్తాఫ్, పెరవలి ✓: సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటాం. - రఫీక్, విద్యుత్తు ఏఈ, మద్దికెర

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ?: ఆదోని పట్టణంలో పాత గౌరీగోపాల్ ఆస్పత్రి నుంచి హన్మాన్‌పేటకు వెళ్లే రహదారిలో మురుగు కాల్వపై సగం కల్వర్టు లేదు. ప్రమాదాలు జరుగుతున్నాయి. - నాగరాజు, ఆదోని

✓: పరిశీలించి.. పరిష్కార చర్యలు చేపడతాం. - నాసీర్‌హుసేన్, సహాయ కమిషనర్, ఆదోని పురపాలక సంఘం

ఆలూరు గ్రామీణం, న్యూస్‌టుడే : ?: కోయనగర్ కాలనీ వెళ్లేదారిలో మురుగు కాలువలో పూడ్చలు పేరుకు పోయాయి. శుభ్రం చేయాలి. - రామచంద్రయ్య, కాలనీ వాసి

✓: సిబ్బందిని పంపి శుభ్రం చేయిస్తాం. - జిలానీ, పంచాయతీ కార్యదర్శి, ఆలూరు

కొనసాగుతున్న పోలీస్ పికెట్

బొంపిమదుగుల (తుగ్గలి), న్యూస్‌టుడే: బొంపిమదుగుల రమేష్ హత్యతో గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ ఉన్నతాధికారుల ఈ చర్యలు చేపట్టారు. పోలీసులు 13 రోజులుగా గ్రామంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.

జొన్నగిరిలో రీ-సర్వే పరిశీలన

జొన్నగిరి(తుగ్గలి), న్యూస్‌టుడే: గ్రామంలో భూముల రీ-సర్వే సమయంలో ఇద్దరు రైతుల మధ్య సర్వే వేషయంలో తహసీల్దారు రవి, మండల సర్వేయర్ సుధాకర్ బుధవారం తనిఖీ చేశారు. గ్రామంలో జరుగుతున్న భూముల రీసర్వే కార్యక్రమాన్ని వారు పరిశీలించారు. రైతులు ఆమోదం మేరకే సర్వే చేపట్టాలని ఆయన సిబ్బందికి సూచించారు. కొలతలు సమయంలో వివాదాలు వస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో కాశిరంగస్వామి పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెకు మద్దతివ్వాలి

వెల్దుర్తి, న్యూస్‌టుడే: కేంద్రం అమలు చేస్తున్న లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఈ నెల 12న జరగనున్న దేశవ్యాప్త సమ్మెకు మద్దతివ్వాలని జయప్రదం చేయాలని కోరుతూ ఏఐటీయూసీ నాయకులు వెల్దుర్తిలో బుధవారం ప్రతి కార్యాలయానికి తిరిగి అధికారులు, సిబ్బందికి కరపత్రాలు అందజేశారు. నాయకులు మాధవస్వామి, రిగి, అనిత్, బషీర్, వెంకటేష్, మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి ఈఈగా విజయరాజ్

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: ఆదోని సబ్ డివిజన్ విద్యుత్ శాఖ ఇన్‌ఛార్జి ఈఈగా విజయరాజ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈయన ఎమ్మిగనూరు సబ్ డివిజన్ ఈఈగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆదోని ఈఈ ఇటీవల మృతిచెందిన విషయం తెలిసిందే.

సకాలంలో చెల్లించకుంటే ఖాళీ చేయిస్తాం

మద్దికెర, న్యూస్‌టుడే: పంచాయతీ గదులు అద్దెకు తీసుకొని వ్యాపారాలు చేసుకుంటున్న వారు సకాలంలో చెల్లించకుంటే వెంటనే ఖాళీ చేయిస్తామని పత్తికొండ డీఎల్‌డీవో రామసంద్రారెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ పేర్కొన్నారు. మద్దికెర పంచాయతీకి సంబంధించి 78 వ్యాపార గదులు దగా పలువురు నెలల తరబడి బకాయిలు చెల్లించకుండా ఉన్నారని, రూ.1.50 కోటికి పైగా అద్దెలు, పన్నులు వసూలు కావాల్సి ఉందన్నారు. ఉన్నతాధికారుల నుంచి పన్నుల వసూళ్లకు ఒత్తిడి ఉండటంతో బుధవారం వారు ప్రతి దుకాణానికి తిరిగి పన్నుల వసూళ్లు చేపట్టారు.

బారికేడ్లు తొలగించాలని ఆందోళన

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: పట్టణంలోని జిహెచ్ రహదారి మధ్యలో ఏర్పాటు చేసిన బారికేడ్లను తొలగించాలని డిమాండు చేస్తూ స్థానిక వ్యాపారులు, హమాలీలు, కాలనీ వాసులు ఆందోళన చేపట్టారు. నాయకులు దేవరాజ్‌దోశా, వెంకన్న, కల్లుబావి రాజు, వలీద్‌ఖాన్, డీసీ తదితరులు మాట్లాడుతూ కొన్ని నెలల కిందట ట్రాఫిక్ నియంత్రణ కోసం అధికారులు రహదారి మధ్యలో బారికేడ్లు ఏర్పాటు చేశారని, దీంతో వ్యాపారులు, స్థానిక కాలనీ వాసులు, ఆటోడ్రైవర్లు, హమాలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో పర్యటించి వారి సమస్యలు తెలుసుకొని బారికేడ్లు తొలగించి సహకరించాలని కోరారు.

న్యాయవాది మృతి

మైరాముడు (పాత చిత్రం)

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పత్తికొండ న్యాయవాదుల సంఘం మాజీ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది ఎ.మైరాముడు(58) అనారోగ్యంతో బుధవారం చెకువ జామున మృతిచెందారు. న్యాయవాదులు, ఆయా పార్టీల నాయకులు, పట్టణ ప్రముఖులు ఆయన ఇంటికి వెళ్లి సంతాపం తెలిపారు. పత్తికొండ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు.

తుగ్గలి, న్యూస్‌టుడే: రాతన గ్రామానికి చెందిన సీనియర్ న్యాయవాది మైరాముడు మృతికి వైకాపా నాయకులు సంతాపం తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, తుగ్గలి ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెంకటేష్, భాజపా మండల అధ్యక్షుడు లక్ష్మన్న, వాల్మీకి సంఘం నాయకులు రాముడు, శ్రీనివాసులు, రాంప్రసాద్ తదితరులు బాధిత కుటుంబానికి సానుభూతి ప్రకటించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోని గ్రామీణ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన ఇద్దరు నిందితులకు కోర్టు జైలు శిక్ష విధించినట్లు ఆదోని తాలూకా సీఐ నల్లప్ప బుధవారం తెలిపారు. కర్ణాటకలోని కోప్పల్ జిల్లా హసకెర గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్‌కు 20 రోజులు, ఆదోని పట్టణానికి చెందిన శివకుమార్‌కు ఏడు రోజుల జైలు శిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

కొత్తపేటలో చోరీ

హొళగుంద, న్యూస్‌టుడే: కొత్తపేట గ్రామంలో బుధవారం తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు గ్రామానికి చెందిన హంపయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉదయాన్నే దంపతులిద్దరూ పని నిమిత్తం వెళ్లారు. భార్య దేవమ్మ ఉదయం 10 గంటల సమయంలో ఇంటికి వచ్చేసరికి, తలుపులు తెరిచి ఉండటం గమనించారు. భర్తకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకొని విచారణ చేపట్టారు. బీరువాలోని నగదు రూ.67 వేలు, ఐదు తులాల బంగారం ఎత్తుకెళ్లినట్లు తెలిపారు.

చివరి మజిలీ.. చిక్కులతో గజిబిజి

● కనిపించని శ్మశాన వాటికలు
● వెళ్లేందుకు దారి సైతం కనిపించదు

పరిశీలన

గ్రామం:	గణేకల్
మండలం:	ఆదోని
జనాభా:	2,800
నివాసాలు:	600

ఆదోని గ్రామీణం, నేరవార్తలు, న్యూస్‌టుడే: శ్మశాన వాటికకు వెళ్లాలంటే ఆ గ్రామస్థులు రైల్వే పట్టాలు దాటాల్సిందే. దశాబ్దాలుగా గ్రామస్థులను ఈ సమస్య వేధిస్తోంది. రైలు ప్రాణాలు పోతున్నా.. పాలకులు, అధికారులు స్పందించడం లేదు. ఆదోని మండలం గణేకల్ గ్రామస్థులు శ్మశాన వాటిక సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే పట్టాలకు అవతలి వైపు శ్మశాన వాటిక ఉంది. ఎవరైనా చనిపోతే పట్టాలు దాటుకొని వెళ్లాలి. పట్టాల పక్కనే కూర్చొని అంత్యక్రియలు చూస్తుంటారు. శవాలను తీసుకెళ్లే సమయంలో గతంలో ప్రమాదాలు జరిగి చనిపోయిన సందర్భాలు లేకపోలేదు. ఇప్పటి వరకు ముగ్గురు చనిపోయినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. ఏళ్ల తరబడి తమ పరిష్కరించడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం శ్మశాన వాటిక నిండా ముళ్లపొదలు పెరిగిపోయాయి.

గణేకల్ గ్రామంలో అంత్యక్రియలకు వెళ్లి.. రైల్వేపట్టాలపై కూర్చున్న గ్రామస్థులు

రైలొస్తే.. ప్రమాదమే

- జీపీ బంగారయ్య, గణేకల్ (ఆదోని)

రైల్వే పట్టాలు దాటి శవాలను తీసుకెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. పట్టాలు దాటే సమయంలో రైళ్లొస్తే ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో ముగ్గురు చనిపోయారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు పలుసార్లు విన్నవించాం. సమస్య అలాగే ఉంది. రైలు పట్టాల సమీపంలో కాకుండా వేరే దగ్గర శ్మశాన వాటిక ఏర్పాటు చేస్తే సమస్య తీరుతుంది.

నివాస గృహాల మధ్యే..!

గ్రామం:	పెద్దహుల్తి
మండలం:	పత్తికొండ
జనాభా:	3,200
నివాసాలు:	610

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పెద్దహుల్తి గ్రామంలో నివాసాల మధ్యనే శ్మశాన వాటిక ఉంది. సమీపంలోనే గ్రామానికంతటికీ నీటి సరఫరా చేసే తాగునీటి పథకంతో పాటు పాఠశాలు ఉన్నాయి. సమీపంలోనే అంగన్‌వాడీ కేంద్రం ఉంది. అంత్యక్రియలు నిర్వహించేందుకు మరో చోట స్థలం లేకపోవడంతో అక్కడే నిర్వహించాల్సి వస్తోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల సమీపంలోని ఇళ్లలోకి దుర్వాసన వస్తోందని, పిల్లలు, మహిళలు చీకటి పడితే బయటకు రావాలంటే హడలిపోతున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. గ్రామానికి దూరంగా మరో శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని గ్రామస్థులు కోరుతున్నారు. మండలంలోని పందికోన, పత్తికొండ, చిన్నహుల్తి, జూటూరు గ్రామాల్లోనూ శ్మశాన వాటికలు సరిగా లేకపోవటంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పెద్దహుల్తిలో శ్మశానం చుట్టూ ఉన్న నివాస గృహాలు

కూలితేగాని.. కదలరా..!

ఆలూరు ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల లోపలికి వెళ్లే ముఖద్వారం ప్రమాదకరంగా మారింది. ఆరు నెలల కిందట పెచ్చులూడి పడింది. గతంలో ఇదే దారిలో విద్యార్థుల రాకపోకలు సాగించే వారు. పెచ్చులూడి పడటంతో జాలువైపు రాకుండా గేటు వద్ద ముళ్ల కంప అడ్డుగా ఉంచారు. పాఠశాలలోని కొన్ని తరగతి గదుల్లో కూడా పైకప్పు పెచ్చులూడి కడ్డీలు తేలాయి. ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని భయం భయంగా గడుపుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టి, ఇబ్బందులు తొలగించాలని విద్యార్థులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఆలూరు

బ్యాడిగి.. ధర పెరిగి

బ్యాడిగి మార్కెట్‌లో మిరప ధర పెరుగుతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో వివిధ రకాల మిరప ధరలు పెరిగాయి. కడ్డీ కాయలు రూ.47 వేల నుంచి రూ.70 వేలు పలికింది. డబ్బీ రకం రూ.50 వేలు నుంచి రూ.80 వేల ధరకు పలికింది. గుంటూరు రకం రూ.15 వేలు నుంచి రూ.19 వేలు పలికింది. ఈ సారి పంట సాగు తగ్గడంతో పాటు దిగుబడి అంతంత మాత్రంగానే ఉండటంతో ధరలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం మిరప కోత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. - న్యూస్‌టుడే, హాలహర్వి

‘ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి’

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ఆదోని జిల్లాగా ప్రకటించాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అసెంబ్లీ సమావేశంలో డిమాండు చేయాలని.. అవసరమైతే జిల్లా సాధన కోసం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని జిల్లా సాధన నాయకులు, పెద్దహరివాణం మండల సాధన కన్వీనర్ ఆదినారాయణరెడ్డి అన్నారు. ఆదోని జిల్లా సాధన కోసం జిల్లా అధ్యర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు బుధవారం 88వ రోజుకు చేరుకుంది. ఈ దీక్షకు పెద్దహరివాణం మండల సాధన సమితి నాయకులు తమ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రఘురామయ్య, కృష్ణమూర్తిగౌడ్, తిప్పగిరి నాయుడు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

దీక్షలో జిల్లా, పెద్దహరివాణం మండల సాధన సమితి నాయకులు

ఆలూరు కుర్రాడు.. శ్రీలంకలో సత్తా చాటాడు

ఆలూరు, న్యూస్‌టుడే: ఆలూరు పట్టణానికి చెందిన క్రీడాకారుడు మధు శ్రీలంకలో జరిగిన సెపక్‌తక్రా పోటీల్లో సత్తా చాటాడు. ఈ నెల 7, 8వ తేదీల్లో శ్రీలంకలో జరిగిన సౌత్ ఏషియన్ సెపక్‌తక్రా పోటీల్లో భారత జట్టు తరఫున పాల్గొన్నారు. మధు భారత జట్టుకు కెప్టెన్‌గా సైతం వ్యవహరించారు. పాకిస్థాన్, నేపాల్, ఆఫ్గనిస్థాన్ జట్టును ఓడించి భారత జట్టు ఫైనల్‌కు చేరుకుంది. తుది సమరంలో భారత జట్టు శ్రీలంకపై తలపడి విజయం సాధించింది. ఆటగాళ్లు మధు తెలిపారు. బంగారు పతకంతో పాటు కప్పు అందుకున్నట్లు పేర్కొన్నారు. సౌత్ ఏషియన్ సెపక్‌తక్రా పోటీల్లో మొత్తం 11 జట్లు పాల్గొన్నాయని వివరించారు. ఆలూరుకు చెందిన క్రీడాకారుడు భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించి శ్రీలంకలో జట్టును ముందుండి నడిపించి విజయం సాధించేలా చేయడం హర్షణీయమని స్థానికులు పేర్కొన్నారు.

కప్పు, బంగారు పతకంతో మధు

పేదలకు వరం సీఎం సహాయ నిధి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్సలు చేయించుకోలేని వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి వరం లాంటిదని తెదేపా సీనియర్ నాయకుడు ఉమాపతినాయుడు అన్నారు. ఆదోనిలో బుధవారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. 58 మంది లబ్ధిదారులకు రూ.27,63,678 అందించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు రామస్వామి, రంగస్వామి, కాంప్ప, చంద్రశేఖర్, వెంకటేష్, రామకృష్ణ, శంకర్, కృష్ణారెడ్డి, తిమ్మప్ప, అఫ్జల్‌బాష, వీరేష్, అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తెదేపా సీనియర్ నేత ఉమాపతినాయుడు

కరివేములలో ఉరుసు

కరివేముల (దేవనకొండ), న్యూస్‌టుడే: గ్రామంలో హజరత్ హొన్నూరుపలి స్వామి ఉరుసు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదపఠానుమన స్వామి వారి అశ్వాన్ని అలంకరించి, ఊరేగించారు. రైతులు, భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. సకాలంలో వానలు కురవాలని, పంటలు పండాలని కోరుకున్నారు. ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

స్వామివారి అశ్వాన్ని ఊరేగిస్తున్న నిర్వాహకులు

భక్తులకు సౌకర్యాలు కల్పిద్దాం

వెల్దుర్తి, న్యూస్‌టుడే: బ్రహ్మగుండంలో ఈ నెల 15 నుంచి జరిగే మహాశివరాత్రి ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించి వేడుకలు ఘనంగా నిర్వహిద్దామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆంజనేయులు, కమిటీ నిర్వాహకులు బొమ్మన రాజశేఖరరెడ్డి, ఇన్‌ఛార్జి తహసీల్దారు గురుస్వామి రెడ్డి, ఏఎస్సై బాలకృష్ణ, మండల పరిషత్ ఏవో లలిత తదితరులు పేర్కొన్నారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆలయ పరిసర ప్రాంతాల్లో శుభ్రత, రవాణా, రక్షణ, తదితర వాటి విషయాల్లో అవసరమైన చర్యలు తీసుకునేలా కమిటీలో నిర్ణయించారు.

సమావేశంలో పాల్గొన్న అధికారులు, శివరాత్రి ఉత్సవ కమిటీ నిర్వాహకులు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఆదోని విద్య, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 13న కర్నూలు కలెక్టరేట్ వద్ద ఎస్టీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టనున్నట్లు ఎస్టీయూ పట్టణ అధ్యక్షుడు భీమరాజు పిలుపునిచ్చారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పీఆర్‌సీ కమిటీ ఏర్పాటు చేయాలని, ఐఆర్ మంజూరు చేయాలని, బకాయిలు చెల్లించాలని, సీపీఎస్ రద్దు చేయాలని డిమాండు చేశారు. సమావేశంలో నాయకులు లోకన్‌నాయక్, నాగరాజు, వీరచంద్ర యాదవ్, గంగానాయక్, మహబూబ్ సుభాని, రాజాసతీశ్, నిరంజన్‌కుమార్, ప్రహ్లద, ప్రసాద్, మారయ్య, నాగేశ, అహ్మద్, రాముడు, ముర్తుజా పాల్గొన్నారు.

‘భూమి ఆక్రమించి.. దాడికి పాల్పడ్డారు’

బసినేపల్లి (మద్దికెర), న్యూస్‌టుడే: తమ భూమిని దర్జాలో ఆక్రమంగా మార్చుకొని ఆక్రమించడమే కాకుండా, అడ్డుకున్న తమపై దాడి చేశారని బాధితులు పోలీసులను, తహసీల్దారును ఆశ్రయించారు. మండలంలోని బసినేపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 978లో ఉన్న తమ భూమిని గ్రామానికి చెందిన తెదేపా నాయకుడు మునీంద్ర, అతని కుటుంబ సభ్యులు ఆక్రమించి, దర్జాలో తన పేరుతో మార్చుకున్నారని ఆరోపించారు. ఆక్రమణను అడ్డుకునేందుకు వెళ్లిన తమపై దాడికి, తీవ్రంగా గాయపరిచారని అనంతమ్మ, వరలక్ష్మి, సాలమ్మ, మహాలక్ష్మి తదితరులు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. అనంతరం వారు తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం వారు తహసీల్దారు గుండాల నాయక్‌కి వినతి పత్రం అందజేశారు. తమకు న్యాయం చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో నాగరాజు, కోదండరాముడు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు

సిలిండర్‌కు అదనంగా వసూలు చేస్తే చర్యలు

ఆలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గ్యాస్ సిలిండర్ సరఫరాలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలు కాకుండా అదనంగా డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవని జేసీ నూరుల్ ఖమర్ అన్నారు. ఆలూరులోని భారత్ గ్యాస్ గోడౌమును ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆలూరు సీఎస్‌డీటీ పాయింట్ పరిధిలోని మూడు గ్యాస్ ఏజెన్సీలను ప్రతి నెలా తనిఖీ చేయాలని సీఎస్‌డీటీ దీపను ఆదేశారు. ఆయనతో పాటు పత్తికొండ ఆర్డీవో భరత్‌నాయక్, డీటీ విజయ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రీసర్వే వేగవంతం చేయాలి

వెలమకూరు(దేవనకొండ), న్యూస్‌టుడే: రీ-సర్వే పనులు వేగవంతం చేయాలని జేసీ నూరుల్ ఖమర్ పేర్కొన్నారు. వెలమకూరులో రీ-సర్వే పనులను బుధవారం ఉదయం ఆయన పరిశీలించారు. సంవత్సరాల తరబడి భూ సమస్యలతో సతమతమవుతున్న రైతులకు న్యాయం చేస్తామన్నారు. తహసీల్దారు సుదర్శనం, ఆర్‌ఐ బాస్కర్, వీఆర్వో రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

దేవనకొండ, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షాల వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ చూపాలని జేసీ అన్నారు. దేవనకొండ జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. వంద రోజుల ప్రణాళిక అమలుపై ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా సమీక్షించారు. ఆయన వెంట ఆర్డీవో భరత్‌నాయక్, ఎంఈవో-2 విజయనిర్మల, తహసీల్దారు సుదర్శన, ప్రధానోపాధ్యాయుడు నజీర్ పాల్గొన్నారు.

ఆలూరులో సిలిండర్ గోదామును పరిశీలిస్తున్న జేసీ నూరుల్ ఖమర్

ముందు జాగ్రత్తతో క్యాన్సర్ దూరం

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: క్యాన్సర్ పరీక్షలు, వ్యాక్సిన్ వేయించుకోవడం వల్ల భవిష్యత్తులో స్త్రీలకు వచ్చే ప్రమాదకర క్యాన్సర్ ముప్పును తప్పించవచ్చని మండల వైద్యాధికారిణి సుజాత అన్నారు. పత్తికొండ కస్తూర్బా పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పాఠశాల ప్రిన్సిపల్ షబానా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ప్రకాశ్, వరలక్ష్మి, వెంకటేశ్వర్లు, గంగరత్న, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారిణి సుజాత

విద్యుత్తు శాఖ ఈఈ మృతికి సంతాపం

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: ఆదోని సబ్ డివిజన్ విద్యుత్తు శాఖ ఈఈ రామ్మోహన్ మృతి పట్ల స్థానిక కార్యాలయంలో ఆ శాఖ ఉద్యోగులు బుధవారం నివాళి అర్పించారు. ఈ నెల 8వ తేదీన ఈఈ తిరుమలనగర్‌లోని ఆయన నివాసంలో గుండెపోటుకు గురయ్యారు. కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఈఈ విజయరాజ్, ఆదోని సబ్ డివిజన్ డీఈలు పురుషోత్తం, మదన్, పరూక్, ఏఈలు లోకేష్, ఉల్లిగప్ప, చెన్నయ్య, బాబున్న, శాస్త్రి, ప్రసాద్, ఏవోలు బాలభాగ్యమ్మ, హుసేన్, గుత్తేదారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నివాళి అర్పిస్తున్న విద్యుత్ శాఖాధికారులు, సిబ్బంది

స్పందించారు.. పరిష్కరించారు

స్పందనకు వందనం

సమస్య: ? ప్రచురితమైన కథనం: ■ పరిష్కారం: ■

అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టిసారిస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ‘ఈనాడు’లో ప్రచురితమైన కథనాలకు ఆయా శాఖల అధికారులు స్పందించారు. ఆయా చోట్ల పనులు చేపట్టారు.

? ఆస్పరి- ఆదోని ప్రధాన రహదారి గుంతలు పడి అధ్వానంగా మారింది. రహదారిపై కంకర తేలి వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ■ బిణిగేరిలో వంకర కంకర పనులు (జనవరి 21న) ■ ఆర్అండ్‌బీ అధికారులు, గుత్తేదారు స్పందించి గుంతలు పూడ్చి, కంకరపై తారు రోడ్డు వేశారు. బిణిగేరి గ్రామంలో మూడు చోట్ల పనులు చేసేందుకు రూ.11లక్షలు ఖర్చు చేశారు. నిత్యం 14 వేల వాహనాల రాకపోకలు సాగిస్తాయి. - న్యూస్‌టుడే, ఆస్పరి

? ఆదోని మండలం కడితోట గ్రామంలోని సర్వే నెం.70లోని 7.51 ఎకరాల పోతురాజు దేవాలయం ఇనాం భూమిని కొందరు కబ్జా చేశారు. ■ ఇనాం భూమి కబ్జా (ఈ నెల 10న) ■ క్షేత్రస్థాయిలో పరిశీలించి, దస్త్రాలు సేకరించి.. విచారణ చేపట్టారు. పోతురాజు ఆలయ ఇనాం భూమిగా గుర్తించి రికార్డులో పొందుపరుస్తామని రీసర్వే డిప్యూటీ తహసీల్దారు వెంకయ్య తెలిపారు. - న్యూస్‌టుడే, ఆదోని నేరవార్తలు, గ్రామీణం

? తంగరడోణ గ్రామంలో చింతలాముని స్వామి గుడి సమీపంలో ఇళ్ల మధ్యన ఉన్న విద్యుత్తు నియంత్రికకు కంచె లేక ప్రమాదకరంగా మారింది. ■ నియంత్రిక.. పట్టించుకోవాలిక (ఈ నెల 9న) ■ విద్యుత్తు ఏఈ ఆంజనేయ శాస్త్రి స్పందించి.. విద్యుత్తు నియంత్రికకు చుట్టూ కంచె ఏర్పాటు చేయించారు. దీనికోసం రూ.40వేలు వెచ్చించారు. గ్రామంలో నివాసం ఉంటున్న 400 మంది ప్రజలకు ప్రయోజనం చేకూరింది. - న్యూస్‌టుడే, ఆస్పరి

? ఆదోని పట్టణంలోని ఎస్కేడీ కాలనీలోని సాయిబాబానగర్‌లో రహదారులు ఊడ్చి, చెత్తాచెదారం ఎత్తివేయకుండా అక్కడే నిప్పు పెడుతున్నారు. పొగతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ■ ప్రచురితమైన కథనం: ‘మేమున్నాం.. మీకు తోడుగా’ శీర్షికన కాలనీవాసి శ్రీనాథ్ తెలిపారు. (ఈ నెల 11వ తేదీన) ■ పరిష్కారం: పురపాలక సంఘం సహాయ కమిషనర్ నాసీర్‌హుసేన్ బుధవారం ఆయా కాలనీల్లో పర్యటించారు. చెత్తకు నిప్పు పెట్టకుండా.. ఎప్పటికప్పుడు తరలించాలని ప్రజారోగ్య సిబ్బందిని ఆదేశించారు. - న్యూస్‌టుడే, ఆదోని పురపాలకం

? హొళగుంద జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధాన గేట్ ఎదుట మురుగు కాల్వకు రక్షణ గోడలు లేవు. విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉంది. ■ తడబడితే ముప్పే (ఈ నెల 5న) ■ మురుగు కాల్వపై ఉన్న కల్వర్టుకు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించారు. పీఎంశ్రీ నిధులు రూ.70వేలతో నిర్మాణం చేపట్టారు. ఈ పనుల వల్ల 1835 మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరింది. - న్యూస్‌టుడే, హొళగుంద

ఎమ్మిగనూరు

• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

వాల్మీకి విగ్రహానికి రూ.లక్ష సాయం

గ్రామస్థులకు నగదు అందజేస్తున్న తెలుగుయువత జిల్లా కార్యదర్శి దివాకర్‌రెడ్డి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: మహర్షి వాల్మీకి విగ్రహానికి అన్ని విధాలా చేయూత అందిస్తామని తెలుగుయువత జిల్లా కార్యదర్శి వి.దివాకర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని తన స్వగృహంలో బుధవారం గ్రామస్థులకు వాల్మీకి విగ్రహం కోసం రూ.లక్ష విరాళం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. సేవ కార్యక్రమాలకు మరింత చేయూత అందిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు నల్లన్న, కోసిగి తిమ్మప్ప, ఈరన్న, నరసన్న, పెద్దయ్య, తిరుమల, మహేంద్రనాయుడు, నరసింహులు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బకాయిలను తక్షణమే విడుదల చేయాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయిలను చెల్లించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు జనార్దన్ డిమాండ్ చేశారు. ఎస్టీయూ కార్యాలయంలో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తక్షణం బకాయిలు విడుదల చేసి పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు బసవరాజు, ప్రసన్నరాజు, ఎల్లిస్వామి, రామచంద్ర, ఎల్లప్ప, చంద్రశేఖర్, భాస్కర్, చిన్న తిమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు జనార్దన్

ఉచిత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

మంత్రాలయం గ్రామీణం: మండలంలో అన్ని ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలల్లో ఒకటో తరగతి ప్రవేశాల కోసం చిన్నారుల తల్లిదండ్రులు అంతర్జాలంలో నమోదు చేసుకోవాలని ఎంఈఓ రాగన్న తెలిపారు. అన్ని ప్రైవేటు పాఠశాలల్లో 2026-27 అకడమిక్ విద్యా సంవత్సరానికి దరఖాస్తుకు అవకాశముందన్నారు. యాజమాన్యాలు 25 శాతం సీట్లను ఉచితంగా కేటాయించాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఎమ్మిగనూరు 8008573824, కోడుమూరు 9885988357, కౌతాళం 8008574913

సి.బెళగల్, న్యూస్‌టుడే: ?: కృష్ణదొడ్డి గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న బోరుకు ఫ్లషింగ్ చేసి వినియోగంలోకి తీసుకురావాలి. - **గోకారి, కృష్ణదొడ్డి గ్రామం** ?: మారందొడ్డి పాఠశాలల్లో ఉన్నత పాఠశాలలకు ప్రహరీ లేదు. పశువులు పాఠశాల ఆవరణలోకి వస్తున్నాయి. - **విక్రమ్, స్థానికుడు** ✓: మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దృష్టికి తీసుకెళ్లి తక్షణమే బోరుకు ఫ్లషింగ్ చేపడతాం. పాఠశాలకు ప్రహరీ నిర్మాణంపై సర్వశిక్ష అభియాన్ ఏఈ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం. - **రాణెమ్మ, ఎంపీడీవో.** ?: జిల్లాలో సి.బెళగల్ నుంచి అలువాలకు బీటీ రహదారి నిర్మించారు. సి.బెళగల్ నుంచి గోనెగండ్ల వరకు అలువాల మీదుగా మూడు మార్లు బస్సు సర్వీసు తిరిగేలా చర్యలు చేపట్టాలి. - **పాండురంగన్న గౌడ్, సి.బెళగల్** ✓: ఆర్టీసీ డిపోమేనేజరు దృష్టికి తీసుకెళ్లి బస్సు సర్వీసు నడిపేలా చర్యలు తీసుకుంటాం. - **రాణెమ్మ, ఎంపీడీవో, సి.బెళగల్**

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: ?: తారాపురం గ్రామంలో రోజుల తరబడి మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదు. రాత్రి పూట దోమల వల్ల నిద్ర పోలేకున్నాం. - **హనుమంతు, గ్రామస్థుడు** ✓: గ్రామంలో అపరిశుభ్రత సమస్య గురించి గ్రామ కార్యదర్శి, సర్పంచికి వివరిస్తాం. పారిశుద్ధ్య పనులు చేయించేలా చర్యలు తీసుకుంటాం. - **ప్రభావతిదేవి, ఎంపీడీవో, పెద్దకడబూరు.**

నిర్మాణం.. బిల్లులకు గ్రహణం

★ అగమ్యగోచరంగా గోకులం షెడ్ల రైతుల పరిస్థితి

పాడి పరిశ్రమ బలోపేతానికి ప్రభుత్వాలు మినీ గోకులాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టాయి. పాడి పశువులు, కోళ్లు, గొర్రెలు, మేకల పెంపకందారులకు చేయూతనిస్తూ షెడ్ల నిర్మాణానికి రాయితీ కల్పించాయి. దీంతో రైతులు అప్పు చేసి నిర్మాణాలు చేపట్టారు. అయితే ఇప్పుడు బిల్లులు మంజూరు కాకపోవడంతో లబోదిబోమంటున్నారు.

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో ప్రభుత్వం మంజూరు చేసిన గోకులం షెడ్లను నిర్మించుకున్న రైతులకు బిల్లులు రాక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. 15 రోజుల వ్యవధిలో రైతుల వెంటపడి త్వరగా నిర్మించుకునేలా చేశారు. కాగా వాటికి ఇప్పటివరకు బిల్లులు రాక రైతులు అప్పులపాలయ్యారు. వాటిని తీర్చలేక పశువులను అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది. సకాలంలో నిర్మించినా ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.

కౌతాళం: నిర్మాణంలో ఉన్న గోకులం షెడ్డు

కౌతాళం మండలంలో మొత్తం 44 గోకులం షెడ్లు మంజూరు కాగా అందులో 33 పూర్తయ్యాయి. మిగిలిన 11 వివిధ దశల్లో ఉన్నాయి. మండల మొత్తం మీద ఇప్పటివరకు రూ.47 లక్షలు మంజూరు కాగా అందులో ఇప్పటి వరకు రూ.24 లక్షలు బిల్లులు వచ్చాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే బిల్లులు అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

మంజూరైనా.. మొదలే కాలేదు

గోనెగండ్ల, న్యూస్‌టుడే: ఈ చిత్రంలో నిర్మాణ దశలో ఉన్న గోకులం షెడ్డు మండలంలోని కులుమాల గ్రామంలోనిది. పాడి రైతు ఈరన్న దీన్ని నిర్మిస్తున్నారు. గ్రామంలో నలుగురు రైతులకు గోకులం షెడ్లు మంజూరు చేశారు. ఇందులో ఒకటి పనులే ప్రారంభించలేదు. బిల్లులు మంజూరు కాకపోతుండటంతో లబ్ధిదారులు వెనకడుగు వేశారు. అలాగే మండలానికి 51 గోకులం షెడ్లు మంజూరయ్యాయి. ఇందులో 11 పూర్తయ్యాయి. 30 చోట్ల నిర్మాణ దశలో ఉన్నట్లు ఏపీవో మహ్మబూబ్‌బాషా చెప్పారు. కానీ ఒంటెడుదిన్నె, నెరుడుప్పల, గోనెగండ్ల తదితర గ్రామాల్లో మంజూరు చేసినా వాటిలో సగానికి పైగా పనులే ప్రారంభించకపోవడం గమనార్హం.

పరిశీలన

అప్పు చేసి కట్టుకున్నా..

మండలం: కోసిగి	మంజూరైనవి: 41
పూర్తయినవి: 18	రావాల్సిన బిల్లులు: రూ.94.30 లక్షలు

కోసిగి, న్యూస్‌టుడే: మండలంలో 2025 జనవరిలో బిల్లులు పడతాయని ఉపాధి హామీ అధికారులు చెప్పడంతో కొంత మంది రైతులు అప్పు తెచ్చి మరీ నిర్మాణం పూర్తి చేసుకున్నారు. ప్రస్తుతం బిల్లుల కోసం ఎదురుచూపులు చూస్తున్నారు.. కోసిగి గ్రామానికి చెందిన అయ్యప్ప అనే రైతు 2.50 లక్షలు అప్పు తెచ్చి షెడ్డు నిర్మాణం పూర్తిచేశారు. నిర్మాణం పూర్తయి రెండేళ్లు దాటినా ఒక్క బిల్లు పడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి బిల్లులు చెల్లించాలని కోరుతున్నారు.

గొట్టం మార్గానికి మరమ్మతులు

స్పందనకు వందనం

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: మండలంలోని నౌలేకల్‌లో అంగన్‌వాడీ కార్యాలయం ముందు గొట్టపు ద్వారం లీకేజీతో అంతర్గత రహదారి బురదమయంగా ఉండేది. సమస్యపై ఈ నెల 2న 'రహదారి ఇలా... నడిచేదెలా' శీర్షికతో 'ఈనాడు'లో ప్రచురించిన చిత్రవార్తకు పంచాయతీ అధికారులు స్పందించారు. పైపు లీకేజీకి మరమ్మతులు చేసి సమస్య పరిష్కరించారు.

నిర్లక్ష్యం ఏరైంది

వేసవి ముంచుకొస్తోంది. చుక్క నీరు వృథా అయినా వేసవిలో తాగునీటి ఎద్దడి తప్పదు. ఇప్పటి నుంచి నీటిని పొదుపుగా వాడుకోవాలి. కానీ మండలంలోని చిన్నకడబూరులో ఓహెచ్‌ఆర్ ట్యాంకు ద్వారా శుద్ధి చేసిన తాగనీరు గంటల తరబడి వృథాగా పోతున్నా పట్టించుకునే నాథుడే లేరని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. నీటి వృథాపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పెద్దకడబూరు

మురుగు.. రహదారిపై పరుగు

కృష్ణదొడ్డి గ్రామంలో ప్రధాన బీటీ రహదారికి ఎడమ వైపు కాలువ లేదు. గ్రామంలో ప్రముఖ వైష్ణవ క్షేత్రం కోన వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించే నిమిత్తం కిలో మీటరు మేరకు 20 ఏళ్ల క్రితం బీటీ రహదారి నిర్మించారు. కానీ కాలువ మరిచారు. దీంతో రహదారి ఎడమ వైపు ఇళ్ల నుంచి మురుగునీరు పారి రహదారిపై చేరుతోంది. ఇప్పటికైనా కాలువ నిర్మించి సమస్య పరిష్కరించాల్సిన అవసరముంది. - న్యూస్‌టుడే, కృష్ణదొడ్డి (సి.బెళగల్)

పట్టు జారితే ఆసుపత్రికే..

ఆటో వెనుక ప్రమాదకరంగా వేలాడుతూ ప్రయాణిస్తున్న వీరు మండల కేంద్రం లోని గూడూరు నుంచి జూలకల్లు లోని ఆదర్శ పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు. నిత్యం ఇలా ఆటోల్లో ప్రమాదకర ప్రయాణం చేయాల్సిందే. ఆదర్శ పాఠశాలకు ఒకటే విద్యార్థి బస్సు నడుపుతున్నారు. అది సరిపోక ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి మరో బస్సును ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గూడూరు గ్రామీణం

వేగానికి అడ్డుకట్ట

మండలంలోని కోటేకల్ సమీపంలో జాతీయ రహదారి మలుపు వద్ద ఇటీవల వేగ నియంత్రిక వేశారు. ఈ ప్రాంతంలో దాదాపు రెండున్నర నెలల క్రితం జరిగిన రహదారి ప్రమాదంలో ఆరుగురు కర్ణాటకవాసులు మృతి చెందిన సంగతి తెలిసిందే. జాతీయ రహదారి కావడంతో కార్లు వంటి వాహనాలు అతి వేగంగా వెళ్తూ మలుపు వద్ద ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో మలుపు వద్ద రెండు చోట్ల వేగ నియంత్రికలు ఏర్పాటు చేయడంతో వాహనాలు నిర్ణీత వేగంతో వెళ్తున్నాయి. ప్రమాదాల కట్టడికి చర్యలు చేపట్టినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. - న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు గ్రామీణం

ఆగని వలస బండి

మండలంలో వ్యవసాయ పనులు తగ్గుముఖం పట్టడంతో కూలీలు వలస బాట పట్టారు. ఉన్న ఊళ్లో పనుల లేక ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నారు. మండలంలోని చిన్నకడబూరు, పెద్దకడబూరు, కల్లుకుంట, ముచ్చిగేరి, నౌలేకల్, రంగాపురం తదితర గ్రామాల నుంచి నిత్యం బొలెరో వాహనాల్లో గుంటూరు, తెలంగాణలోని నాగర్ కర్నూలు ప్రాంతాలకు మిర్చి కోతలకు వెళ్తున్నారు. అక్కడ వ్యక్తికి రూ.400 వేతనం చెల్లిస్తున్నట్లు తెలిపారు. - న్యూస్‌టుడే, పెద్దకడబూరు

శ్రీమన్యాయసుధా పరీక్షలు

జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పీఠాధిపతులు సుబుధేంద్ర తీర్థులు, విద్యాశ్రీషతీర్థ స్వాములు

మంత్రాలయం గ్రామీణం(కౌతాళం), న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో గురు సార్వభౌమ సంస్కృత విద్యాపీఠంలో 7వ బ్యాచ్ న్యాయ సుధ విద్యార్థుల కోసం శ్రీమన్యాయసుధ పరీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు, వ్యాసరాజ మఠం పీఠాధిపతులు విద్యాశ్రీషతీర్థ స్వామీజీ జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులను మూల్యాంకనం చేసేందుకు పెద్ద సంఖ్యలో ప్రముఖ పండితులు పాల్గొన్నారు. పాండిత్యం సుసంపన్నం చేసే విధంగా పరీక్షలు నిర్వహించారు.

అంకురార్పణ పూజలకు శ్రీకారం

సి.బెళగల్, న్యూస్‌టుడే: సి.బెళగల్‌లోని అన్నప్ప ఆలయంలో దేవతామూర్తులు, ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం అంకురార్పణ పూజలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. 12 హోమం, విశేష పూజలు ఉంటాయి. 13న విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా గ్రామదేవతోత్సవం

కుంభాలతో ఆలయానికి ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్థులు

మంత్రాలయం గ్రామీణం (కౌతాళం), న్యూస్‌టుడే: మండలంలోని దొమ్మలదిన్నెలో వెలసియున్న గ్రామదేవత మారెమ్మ అమ్మవారి ఉత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. మంగళవారం రాత్రి నుంచి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మహిళలు, గ్రామస్థులు కుంభాలతో ఆలయానికి ఊరేగింపుగా వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. తెదేపా, వైకాపా నాయకులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

శివస్వాములకు పూలమాలలు వేసి శ్రీగిరికి సాగనంపుతున్న రాఘవేంద్ర రెడ్డి తదితరులు

శ్రీగిరికి బయలుదేరిన శివస్వాములు

మంత్రాలయం గ్రామీణం(కౌతాళం), న్యూస్‌టుడే: మండలంలోని మాధవరం గ్రామంలో శివస్వాములు బుధవారం శ్రీగిరికి పయనమయ్యారు. ఉదయం నుంచి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇరుముళ్లకు ప్రత్యేక పూజలు చేశారు. మేళతాళాలతో గ్రామస్థులు స్వాములను ఊరేగించారు. కార్యక్రమంలో తెదేపా నియోజకవర్గ బాధ్యుడు రాఘవేంద్ర రెడ్డి, ఆయన సోదరుడు రామకృష్ణా రెడ్డి, కుమారులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: శివరాత్రి ఉత్సవాలను ఎమ్మిగనూరు పట్టణం, మండలాల నుంచి శివస్వాములు భారీ ఎత్తున తరలివెళ్లారు. పట్టణంలో అయ్యప్ప స్వామి దేవాలయం, శివాశ్రమం, వెంకటాపురం, దేవిబెట్ట, దైవందిన్నె ఇతర గ్రామాల నుంచి స్వాములు బుధవారం భారీ ఎత్తున తరలివెళ్లారు. కొందరు పాదయాత్ర ద్వారా, కొందరు ప్రత్యేక బస్సుల ద్వారా బయలుదేరారు.

సమ్మె జయప్రదానికి వినతి

కోసిగి, న్యూస్‌టుడే: లేబర్ కోడ్లను వ్యతిరేకిస్తూ గురువారం జరిగే దేశవ్యాప్త సమ్మెకు ఉద్యోగ, కార్మిక, రైతు, వ్యవసాయ కూలీలు సహకరించి జయప్రదం చేయాలని మండల ప్రజా సంఘాల నాయకులు సుదర్శన్, రాముడు, వీరేష్, గోపాల్, తాయన్నలు కోరారు. బుధవారం కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో సబ్ రిజిస్ట్రార్, తహసీల్దార్, బ్యాంకుల్లో వినతిపత్రాలు అందజేశారు. కేంద్రం తీసుకోస్తున్న లేబర్ కోడ్లతో ఉపాధి కూలీలకు పనులు తగ్గి వలసలు పెరుగుతాయన్నారు.

తహసీల్దార్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్లు ప్రవేశపెట్టి కార్మికులను పూర్తిగా విస్మరించిందని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి గోవర్ధనమ్మ మండిపడ్డారు. పట్టణంలో బుధవారం యూనియన్ సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ సిబ్బందికి కనీస వేతనం కింద రూ.26 వేలు పంపిణీ చేయాలన్నారు. తక్షణమే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు.

చంద్రబాబుపై అసత్య ఆరోపణలు సహించం

కోసిగి, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వ్యవహారంలో వైకాపా నాయకుల హస్తం ఉందని విచారణలో తేలినా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఇంకా గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని మంత్రాలయం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చింతలగేని నర్సారెడ్డి విమర్శించారు. కోసిగిలో బుధవారం ఆయన తెదేపా మండల అధ్యక్షుడు పల్లెపాడు రామిరెడ్డి, మాజీ సర్పంచి ముత్తురెడ్డి, ఆర్లబండ సొసైటీ ఛైర్మన్ అయ్యన్నల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 10న వైకాపా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి విలేకరుల సమావేశంలో సీఎం చంద్రబాబుపై చేసిన ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు.

మాట్లాడుతున్న ఏఎంసీ ఛైర్మన్ నర్సారెడ్డి

వైకాపా నాయకులు ఇప్పటికైనా లడ్డూ, శవాలపై చేసే రాజకీయాలు తగ్గిస్తే మంచిదని హితవు పలికారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్‌ల అసభ్య ఆరోపణలు చేస్తే మెరుపు దాడి చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యేను హెచ్చరించారు. అనంతరం మంత్రాలయం సొసైటీ ఛైర్మన్ రామకృష్ణారెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు నరసింహులు, కోసిగయ్య, వజ్రాణి వెంకటేష్, అరివిలి వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

శిశువు మృతి ఘటనపై విచారణ

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రిలో గతంలో సూపరింటెండెంట్‌గా పని చేసిన వైద్యురాలు మైత్రేయిని బుధవారం కృష్ణా జిల్లా డీసీహెచ్‌ఎస్ ఏవీ శేషుకుమార్ విచారణ చేసినట్లు తెలిసింది. మైత్రేయి సూపరింటెండెంట్‌గా ఉన్న సమయంలో రెండేళ్ల క్రితం శిశువు మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యం వల్లే శిశువు మృతి చెందినట్లు అప్పట్లో తల్లిదండ్రులు రాష్ట్రస్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులు విచారణ చేశారు. ప్రస్తుతం ఆమె గుంతకల్లు ఏరియా ఆసుపత్రిలో పని చేస్తున్నారు.

13న జిల్లాలో మందకృష్ణ మాదిగ పర్యటన

గోనెగండ్ల, న్యూస్‌టుడే: జిల్లాలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ పర్యటిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా నాయకులు చిన్న వెంకటేశ్వర్లు, మహదేవ మాదిగ, ఎంఎస్పీ జిల్లా నాయకుడు ఆనంద్‌చైతన్య తెలిపారు. గోనెగండ్లలో బుధవారం ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలతో కలిసి పర్యటనకు సంబంధించిన గోడపత్రాలను విడుదల చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో హనుమంతు, నరసింహులు, రంగస్వామి, తాయన్న, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రాలు విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పాసుపుస్తకాల్లో తప్పులు పకడ్బందీగా సరిచేయాలి

గోనెగండ్ల, న్యూస్‌టుడే: మండలంలో రెండో విడత కింద రైతులకు మంజూరయ్యే నూతన పట్టాదారు పాసుపుస్తకాల్లో పకడ్బందీగా తప్పులను సరి చేయాలని ఆదోని సబ్‌కలెక్టరు అజయ్‌కుమార్ స్పష్టం చేశారు. బుధవారం సాయంత్రం గోనెగండ్ల తహసీల్దారు కార్యాలయాన్ని పరిశీలించారు. అనంతరం వీఆర్వో, సర్వేర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. పీజీఆర్ఎస్, ఎఫ్‌లైన్ అర్జీల పరిష్కారంపై విచారించారు. త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని సూచించారు. తిప్పనూరుకు పంపిణీ చేసే పట్టాదారు పాసుపుస్తకాల్లో ఎలాంటి తప్పులు ఉండకూడదన్నారు. కార్యక్రమంలో ఉపతహసీల్దారు రఘువీర, ఆర్.రామయ్య తదితరులు పాల్గొన్నారు.

వేరుసెనగ క్వింటా గరిష్ఠ ధర రూ.8,710

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం వేరుసెనగ క్వింటా గరిష్ఠ ధర రూ.8,710, మధ్యస్థ ధర రూ.8,470, కనిష్ఠ ధర రూ.3,231కు వ్యాపారులు కొన్నారు. ఆముదాలు గరిష్ఠ ధర రూ.6,004, మధ్యస్థ ధర రూ.5,977, కనిష్ఠ ధర రూ.5,950 పలికింది. కందులు క్వింటా గరిష్ఠ ధర రూ.7,412, మధ్యస్థ ధర రూ.6,890, కనిష్ఠ ధర రూ.5,790కు కొన్నారు. శనగలు క్వింటా గరిష్ఠ ధర రూ.5,069, మధ్యస్థ ధర రూ.4,989, కనిష్ఠ ధర రూ.4,910 పలికింది.

కోర్టుల ఏర్పాటుకు ఆమోదమివ్వండి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలో సబ్ కోర్టు (సీనియర్ సివిల్ జడ్జి కోర్టు), అదనపు కోర్టుల ఏర్పాటుకు ఆర్థిక ఆమోదం ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రషీద్ వినతిపత్రాన్ని సమర్పించారు. ఇటీవల మండలంలోని కలుగొట్లలో సీఎం పర్యటించిన సందర్భంగా ఆయనకు వినతిపత్రాన్ని సమర్పించామని బుధవారం వెల్లడించారు. ఈ సందర్భంగా రషీద్ మాట్లాడుతూ.. కోర్టులు వస్తే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. అంతేకాక గోనెగండ్ల కోర్టు ప్రాంతాన్ని ఎమ్మిగనూరు కోర్టులో కలపాలని కోరామన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఏకీకృత కుటుంబ సర్వేపై ఆరా

సి.బెళగల్, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన సి.బెళగల్‌లో జరుగుతున్న ఏకీకృత కుటుంబ సర్వేను బుధవారం ఎంపీడీవో రాణెమ్మ పరిశీలించారు. సచివాలయం సిబ్బందితో కలిసి ఇంటింటికి తిరిగి సర్వే తీరుపై ఆరా తీశారు. సర్వే తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

సి.బెళగల్‌లో సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది

నేడు వ్యవసాయ మార్కెట్ బంద్

కర్నూలు మార్కెట్, న్యూస్‌టుడే : కార్మిక సంఘాలు సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో గురువారం కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో వ్యవసాయ ఉత్పత్తుల క్రయ విక్రయాలు జరగవని మార్కెట్ కమిటీ సెక్రెటరీ ఆర్.జయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13న శుక్రవారం యథావిధిగా వ్యవసాయ ఉత్పత్తుల క్రయ విక్రయాలు జరుగుతాయన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

క్రీడల్లో మెరుస్తున్న బాలికలు

● రాష్ట్ర స్థాయిలో పేదింటి బిడ్డల సత్తా

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: బాలికలకు ఆటలెందుకు అనే వారిని నివ్వెరబోయేలా ఆటల్లో ప్రతిభ చాటారు. పేదింటి బిడ్డలు చదువులోనే కాక క్రీడల్లోనూ అదుర్స్ అనిపిస్తున్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ పురస్కారాలు అందుకున్నారు. ఎమ్మిగనూరు పట్టణంలోని శ్రీనీలకంఠేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలపై కథనం.

షర్మిల.. బాస్కెట్ బాల్‌లో భళా

హెచ్.మురవణికి చెందిన షర్మిల పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు మోహన్, చిట్టెమ్మ కూలీ పనులు చేస్తున్నారు. అండర్-14 విభాగంలో బాస్కెట్ బాల్ సాధన చేస్తోంది. స్ట్రాకర్‌గా రాణిస్తోంది. గతేడాది డిసెంబర్‌లో కర్నూలులో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో సత్తా చాటి రాష్ట్ర జట్టుకు ఎంపికైంది. నూజివీడులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో శ్రీకాకుళం, కృష్ణా జిల్లాల జట్లతో తలపడింది. అక్కడ ప్రతిభ కనబరిచి పురస్కారం అందుకుంది. జాతీయ స్థాయి పోటీలే లక్ష్యంగా రోజూ మూడు గంటల సాధన చేస్తోంది.

పట్టు వదలని తులసి

ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటుతోంది ఎమ్మిగనూరు సున్నంబట్టి వీధికి చెందిన తులసి. పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు చంద్ర, ఉరుకుందమ్మ కూలీలు. తులసి మూడేళ్లుగా ఫుట్‌బాల్ సాధన చేస్తోంది. మొదట్లో జట్టుకు ఎంపిక కాలేదు. పట్టుదలతో ఆడి డివిజన్ స్థాయి పోటీల విభాగంలో ఆదోనికి ఎంపికైంది. తరువాత జరిగిన పోటీల్లో జిల్లా జట్టుకు ఎంపికైంది. గతేడాది డిసెంబర్‌లో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో బాగా ఆడి మదనపల్లిలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ క్రీడాకారిణిగా పురస్కారం అందుకుంది. జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యమంటోంది.

ప్రభుత్వ బడులను కాపాడుకుందాం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చేర్చి వాటిని కాపాడుకుందామని యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు దావీదు కోరారు. ఆ సంఘం కార్యాలయంలో బుధవారం ఇందుకు సంబంధించిన గోడపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఉపాధ్యాయుడు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్చాలన్నారు. బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్చేందుకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ నెల 17న తలపెట్టిన చలో విజయవాడ సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు తిమ్మన్న, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రాలను విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

పదోన్నతి పొందిన ఆర్టీసీ ఉద్యోగికి సన్మానం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపోలో సూపరిండెంటెంట్‌గా పని చేస్తున్న పంపాపతి అసిస్టెంట్ మేనేజర్‌గా పదోన్నతి పొందడంతో బుధవారం డిపోలో ఆమెను సన్మానించారు. మరిన్ని సేవలు అందించాలని డిపో మేనేజర్ మద్దిలేటి నాయుడు ఆకాంక్షించారు. ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ మంచి గుర్తింపు పొందారని కొనియాడారు. మున్ముందు మరింత ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో మజ్దూర్ యూనిటీ రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ వలి, డిపో కార్యదర్శి సాహెబ్, ముస్తాక్ అహ్మద్, నాగరాజు, మూర్తి, చంద్రయ్య, బాబు, లక్ష్మీరెడ్డి, రాజు, శ్రీరాములు, గంగప్ప, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

కర్నూలు

•కర్నూలు •పాణ్యం

14న దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు

మాట్లాడుతున్న డీఆర్వో వెంకటనారాయణమ్మ. చిత్రంలో సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిణి బి.రాధిక

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఈనెల 14న దివంగత మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి ఉత్సవాలను నిర్వహించేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల నాయకులు సహకరించాలని డీఆర్వో వెంకటనారాయణమ్మ పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం దామోదరం సంజీవయ్య జయంతి ఉత్సవాలపై నిర్వహణపై డీఆర్వో, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి బి.రాధిక అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈనెల 14న కలెక్టరేట్ నుంచి నంద్యాల చెక్‌పోస్టు వరకు భారీ ర్యాలీ నిర్వహించాలని కోరారు.

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరం

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : వెంకటరమణకాలనీలోని కేశవరెడ్డి పాఠశాలలో ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు ఆధార్ నమోదు, అప్డేషన్ కోసం ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు కర్నూలు తపాలా డివిజన్ ప్రధాన పర్యవేక్షకులు జి.జనార్దన్‌రెడ్డి తెలిపారు. గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరం ఉంటుందన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
కర్నూలు : 80085 52632,
కర్నూలు గ్రామీణం : 85010 05408
ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలక సంస్థ : ?: ఎ.క్యాంపు, లక్ష్మీనగర్‌లలో మురుగు కాలువలు పూడిపోయాయి. శుభ్రం చేయాలి. **- రమేష్** ?: ఎన్‌ఆర్ పేట, కొత్తపేట ప్రాంతాల్లో కుక్కల బెడద అధికంగా ఉంది. **- స్థానికులు**
✔: నగరంలో కాలువలు పూడిక తొలగిస్తాం. త్వరలోనే కుక్కల్ని పట్టిస్తాం. **- నగరపాలక అధికారులు**

శివరాత్రి ఉత్సవాలు విజయవంతం చేద్దాం

ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్డీవో సందీప్‌కుమార్, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ సుధాకర్‌రెడ్డి, కమిటీ ప్రతినిధులు

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించి మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని కర్నూలు ఆర్డీవో సందీప్‌కుమార్ పిలుపునిచ్చారు. నగర శివారులోని జగన్నాథగట్టు రూపాల సంగమేశ్వర ఆలయాన్ని దేవాదాయశాఖ, పంచాయతీ, పోలీసు అధికారులతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. తక్కువ సమయంలోనే భక్తులు స్వామివారిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేయాలని దేవాదాయశాఖ అధికారులను సూచించారు. బారికేడ్లు, మంచినీరు, నీడ వసతి ఏర్పాటు చేయాలన్నారు. దేవాదాయశాఖ సహాయ కమిషనర్ సుధాకర్‌రెడ్డి, ఈవో గుర్రెడ్డి, చిన్నటేకూరు సర్పంచి మాదన్నపాటి, పంచాయతీ కార్యదర్శి జాకీర్, జగన్నాథగట్టు అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, కార్యదర్శి ఈ.మల్లికార్జునరెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

శివయ్యా.. శ్రీశైలం చేరేదెలాగయ్యా

● శివరాత్రి బ్రహ్మోత్సవాలకు బస్సుల కొరత
● ఇబ్బందులు ఎదుర్కొంటున్న భక్తులు

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : శ్రీశైలంలో జరుగుతున్న భ్రమరాంబ, మల్లికార్జున స్వామివార్ల మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు వెళ్లే భక్తులకు కష్టాలు తప్పడం లేదు. కర్నూలు బస్టాండు నుంచి నిత్యం వేలాదిమంది శ్రీగిరికి తరలుతున్నారు. చాలామంది నేరుగా శ్రీశైలం వెళ్తున్నారు. పాదయాత్ర చేయాలని మొక్కుకున్న వారు మాత్రం కర్నూలు నుంచి వెంకటాపురం వరకు బస్సుల్లో వెళ్లి.. అక్కడి నుంచి కాలి నడకన మల్లన్న సన్నిధికి చేరుకుంటున్నారు. కర్నూలు బస్టాండులో సరిపడా బస్సులు రాక పోవడం.. అలస్యంగా వచ్చినవి కూడా క్షణాల్లో భర్తీ అవుతుండటంతో గంటల తరబడి ఎదురు చూడాల్సి వస్తోంది.

★ ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ తదితర ప్రాంతాల నుంచి శ్రీశైలానికి వెళ్లే శివస్వాములు, వారి కుటుంబ సభ్యులంతా కలిసి కర్నూలుకు చేరుకుంటున్నారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా కర్నూలు-1, కర్నూలు-2, ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ డిపోల నుంచి వందకు పైగా బస్సులను వెంకటాపురం, శ్రీశైలానికి నడుపుతున్నారు. ఉచిత బస్సుల కోసం చూసే మహిళా భక్తులకు నిరీక్షణ తప్పడం లేదు. మల్లన్న దర్శనానంతరం శ్రీశైలం నుంచి కర్నూలుకు చేరుకునేందుకు.. ఇక్కడి నుంచి స్వగ్రామాలకు వెళ్లేందుకు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

శ్రీశైలం ప్లాట్‌ఫాం వద్ద ఎదురుచూస్తున్న శివస్వాములు, వారి కుటుంబ సభ్యులు

కర్ణాటక ఆర్టీసీకే కాసుల పంట

ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు ఆర్టీసీ వారు ఉమ్మడి జిల్లాలోని వివిధ డిపోల నుంచి 200 బస్సులు నడిపినట్లు చెబుతున్నారు. 10వ తేదీన శ్రీశైలానికి 55, వెంకటాపురానికి 42, 11వ తేదీన సాయంత్రం వరకు శ్రీశైలానికి 100, వెంకటాపురానికి 30 బస్సులు మాత్రమే నడిపారు. భక్తులకు రద్దీకి ఇవి ఏమాత్రం సరిపోలేదు. ఈ పరిస్థితిని కర్ణాటక ఆర్టీసీ సొమ్ము చేసుకుంటోంది. రెండు రోజులుగా 20 నుంచి 30 బస్సులు నడుపుతూ ఆదాయం పొందుతోంది. చాలా మంది భక్తులు కర్ణాటక బస్సులనే ఆశ్రయిస్తున్నారు.

ఇక్కడికొచ్చినా నిరాశే..

- నగేష్, ఆదోని

శ్రీశైలానికి నడిచి వెళ్లాలని నిర్ణయించుకున్నాం. ఆదోని నుంచి వెంకటాపురం వెళ్లేందుకు బస్సులు దొరకకపోవడంతో కర్నూలుకు వచ్చాం. ఇక్కడ కూడా బస్సులు రావడం ఆలస్యమవుతోంది. గంట నుంచి ఎదురు చూస్తున్నా ఒక్కటీ రాలేదు. వెంకటాపురానికి త్వరగా చేరుకుంటే నడక సాగించడానికి సులభం అవుతుంది. ఆలస్యం కావడంతో కష్టాలు తప్పేలాలేవు.

శ్రీశైలంలోనూ ఇదే పరిస్థితి

- రాజు, కోడుమూరు

రెండు రోజుల కిందట కర్నూలు నుంచి వెంకటాపురానికి వెళ్లాను. అక్కడి నుంచి నడక మార్గంలో శ్రీశైలం చేరుకున్నా. స్వామి వారి దర్శనం తరువాత శ్రీశైలం నుంచి కర్నూలుకు వచ్చేందుకు బస్సు ఎక్కడానికి వెళ్తే అక్కడా బస్సులు దొరకడం లేదు. అష్టకష్టాలుపడి కర్నూలుకు చేరుకున్నా. బంధువులను శ్రీశైలం పంపేందుకు కర్నూలు బస్టాండుకు వస్తే ఇక్కడా అదే పరిస్థితి ఉంది.

దారంతా గుంతలు.. ఇటు రావాలంటే గుబులు

నగరంలోని కల్లూరు చెన్నమ్మ కూడలి నుంచి సుంకులమ్మ ఆలయం వైపు వెళ్లే మార్గంలో నాలుగైదు నెలల కిందట ప్రమాదకర గుంతలు ఏర్పడ్డాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఏర్పడిన ఈ గుంతల కారణంగా వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరమ్మతులు చేయించడంలో నగరపాలక అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు.
- న్యూస్‌టుడే, కర్నూలు మార్కెట్

నేడు వ్యవసాయ మార్కెట్ బంద్

కర్నూలు మార్కెట్, న్యూస్‌టుడే : కార్మిక సంఘాలు సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో గురువారం కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో వ్యవసాయ ఉత్పత్తుల క్రయ విక్రయాలు జరగవని మార్కెట్ కమిటీ కార్యదర్శి ఆర్.జయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13న శుక్రవారం యథావిధిగా వ్యవసాయ ఉత్పత్తుల క్రయ విక్రయాలు జరుగుతాయన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

తెలుగుజాతికి గర్వకారణం ఘంటసాల

ఘంటసాల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కళాక్షేత్రం సభ్యులు

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : మధురమైన పాటలతో ప్రపంచ ఖ్యాతి పొందిన ఘంటసాల తెలుగుజాతికి గర్వకారణమని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య పేర్కొన్నారు. ఘంటసాల వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక టీజీవీ కళాక్షేత్రంలో ఆయనచిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఘంటసాల గానసుధ అద్భుతం అని ప్రముఖ కవి మాట్లాడుతూ ఘంటసాలను తెలుగుజాతి ఎప్పటికీ మరిచిపోదన్నారు. అనంతరం నాట్యగురువు కేకేమూర్తి నిర్వహించిన నృత్య ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో నాయకులు, గాంధీ లక్ష్మన్న, రమణారెడ్డి, బాలవెంకటేశ్వర్లు, శివయ్య, రాజారత్నం, యాగంటీశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : మద్దూరు నగర్‌లోని తెలుగుతోటలో రంగస్థల కళాకారుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘంటసాల వర్ధంతి కార్యక్రమం జరిగింది. సంఘం ఉపాధ్యక్షుడు దస్తగిరి, కార్యదర్శి హనుమంతరావుచౌదరి, షఫీఉల్లా, సుబ్బయ్య, భాస్కర్‌రెడ్డి తదితరులు ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వాము గరిష్ఠ ధర రూ.29,448

కర్నూలు మార్కెట్, న్యూస్‌టుడే : కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు బుధవారం 2,098 క్వింటాళ్ల వాము దిగుబడులు అమ్మకానికి వచ్చాయి. క్వింటా వాము కనిష్ఠ ధర రూ.2,022, మధ్యస్థం రూ.20,899, గరిష్ఠ ధర రూ.29,448 పలికింది. ఉల్లిగడ్డ బ్యాగిన్ రకాలు గరిష్ఠ ధర రూ.28,500, మిర్చి-5 రకాలు రూ.25,290, సూపర్-10 రూ.24,221, దేవనూరు డీలక్స్ రూ.22,299, అర్మూర్ రకాలు రూ.22,100, వాము పొట్టు రూ.7,140, వేరుశనగకాయలు రూ.9,399, పొద్దు తిరుగుడు విత్తనాలు రూ.6,319, ఆముదాలు రూ.6,030, మొక్కజొన్నలు రూ.1,635, కందులు రూ.7,943, కందుల వడకలు రూ.4,690, శనగలు రూ.5,271, ఉల్లి రూ.1,480, కొర్రలు రూ.2,329, మినుములు రూ.8,629, సోయాబీన్స్ రూ.4,350, సజ్జలు రూ.2,326తో వ్యాపారం కొనసాగింది.

యార్డు సహాయకులపై బహిష్కరణ వేటు

కర్నూలు మార్కెట్, న్యూస్‌టుడే : కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని కూరగాయల మార్కెట్‌లో జంతువులను బయటకు తరలించడం, పెట్రోలింగ్, గేటు విధులు, పర్యవేక్షణలో విఫలమైన యార్డు అసిస్టెంట్లు సి.డి.రాఘవేంద్ర, ఆర్.విజయ్‌కుమార్, సి.మద్దిలేటి, డి.మధుసూదన్‌రెడ్డిలను ఏడు రోజుల పాటు విధుల నుంచి బహిష్కరించినట్లు మార్కెట్ కమిటీ సెక్రెటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. వారు నిర్దేశిత గడువులోగా వివరణ ఇవ్వకుంటే విధుల నుంచి తొలగించనున్నట్లు ఆమె బుధవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

తూకాల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు

కర్నూలు మార్కెట్, న్యూస్‌టుడే : పంట ఉత్పత్తుల తూకాల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మార్కెట్ కమిటీ సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు కాటాదారులు, వ్యాపారులను హెచ్చరించారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం ఆయన కాటాలను తనిఖీలు చేశారు. మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమసమాజ స్థాపనలో భాగస్వాములవ్వాలి

ప్రార్థనలకు హాజరైన క్రైస్తవ భక్తులు

కర్నూలు బి.క్యాంపు, కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : సమసమాజ స్థాపనలో అందరూ భాగస్వాములవ్వాలని కర్నూలు డయాసిస్ బిషప్ గోరంట్ల జ్వాన్నెస్ పిలుపునిచ్చారు. నంద్యాల చెక్‌పోస్ట్ సమీపంలోని పరిశుద్ధ లూర్ధుమాత కెథడ్రల్ (బిషప్ చర్చి)లో బుధవారం లూర్ధుమాత మహోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ.. సి.క్యాంపు సెంటర్ నుంచి నంద్యాల చెక్‌పోస్ట్ మీదుగా బిషప్ చర్చి వరకు లూర్ధుమాత ప్రతిమ ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్ కె.ప్రతాప్‌రెడ్డి, అసిస్టెంట్ పాస్టర్ రాజశేఖర్, పాదర్లు, సిస్టర్లు, భక్తులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితులకు పరిహారం అందజేత

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : కల్లూరు మండలం ఉలిందకొండ గ్రామ సమీపంలోని రిలయన్స్ బయో సోలార్ కంపెనీలో గత నెలలో జరిగిన ప్రమాదంలో గాయపడిన ముగ్గురు యువకులకు ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి చొరవతో కంపెనీ ప్రతినిధులు నష్ట పరిహారం అందజేశారు. స్థానిక మాధవనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెదేపా నేత గౌరు వెంకటరెడ్డి చేతులమీదుగా బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు చెక్కులు ఇచ్చారు. బాధితులు పడ్డ చంద్రమోహన్‌కు రూ.10 లక్షలు, సురేంద్రకు రూ.2 లక్షలు, బోయ మహేశ్‌కు రూ.50 వేలు చొప్పున అందించారు. కార్యక్రమంలో బీటీఈడీ, సింగిల్‌విండో అధ్యక్షుడు శివరామిరెడ్డి, నాయకులు శేఖర్, మహేష్, వినోద్, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలులోని ఇందిరాగాంధీనగర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇక్బాల్‌బాషా (44) మృతి చెందారు. ఆదోనిలోని బర్మాబజార్‌కు చెందిన ఇతడు కొంతకాలం నుంచి కర్నూలులో ఉంటూ సుందరయ్య సర్కిల్ వద్ద గన్నీ బ్యాగుల దుకాణంలో పనిచేస్తున్నారు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. బుధవారం ఉదయం ఇందిరాగాంధీనగర్‌లో గోదాము వద్ద నడుచుకుంటూ వెళ్తుండగా ట్రాక్టర్ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆయన్ను స్థానికులు 108 వాహనం ద్వారా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందారు. ట్రాక్టర్ డ్రైవర్ అతివేగం, నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కర్నూలు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్ఐఆర్ ప్రక్రియకు ఓటర్లు సహకరించాలి

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)కు ఓటర్లు సహకరించాలని కర్నూలు నియోజకవర్గ ఆర్వో, నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ కోరారు. నియోజకవర్గ పరిధిలోని బీఎల్వోలతో బుధవారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై సమీక్షించారు. బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను ధ్రువీకరిస్తూ పారదర్శకంగా సర్వే పూర్తి చేయాలన్నారు.

రేపు జరుగు న్యాయశాఖ స్టెనోగ్రాఫర్లు & టైపిస్ట్ స్కిల్ టెస్ట్‌లో అత్యుత్తమ శిక్షణ పొందిన మా విద్యార్థులందరూ ఉత్తీర్ణులై ఉద్యోగాలకు ఎంపిక కావాలని హృదయపూర్వకంగా కోరుకుంటున్నాము.
★N.Md.Isaq, B.Com, Rtd. Gazetted Officer & Principal, Jaagruti Computer, Shorthand & Typewriting Institution, Kurnool.
Bommarillu Ladies Delux Hostel.
★ M.A.Rahman, B.E., Rtd. Engineer
★ Dr. N.R.Fathima, Ph.D., (Owners)
Cell: 94402 92537, 98490 02214.

బ్యాడ్మింటన్‌లో బాద్‌షా

● రాష్ట్రస్థాయిలో రాణిస్తున్న ఉస్మానియా విద్యార్థి

ఆరిఫ్‌బాషా

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : నగరంలోని ఉస్మానియా కళాశాలలో బీకాం కంప్యూటర్స్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఆరిఫ్ బాషా క్రీడల్లో ప్రతిభ చూపుతున్నాడు. క్రీడల పట్ల మక్కువతో పాఠశాల స్థాయిలో నుంచే కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్‌లో శిక్షణ తీసుకున్నాడు. సాధనతో ప్రావీణ్యం సాధించి జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో రాణిస్తున్నాడు.

★ 2022 డిసెంబరులో ఓర్వకల్లులో జరిగిన అసోసియేషన్ సబ్‌జూనియర్ కబడ్డీ పోటీల్లో జిల్లాకు రన్నర్స్ ట్రోఫీ అందించి రజత పతకం అందుకున్నాడు. ★ 2023 అక్టోబరులో చిత్తూరు జిల్లా నగరిలో జరిగిన రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో రాణించి జిల్లాను నాలుగో స్థానంలో నిలిపాడు. ★ 2024 అక్టోబరులో విశాఖపట్నంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో కర్నూలు జిల్లాకు ప్రాతినిధ్యం వహించాడు. ★ 2026 జనవరి 7వ తేదీన ఉస్మానియా కళాశాలలో జరిగిన ఆర్‌యూ అనుబంధ కళాశాలల బ్యాడ్మింటన్ పోటీల్లో సెంటర్ పొజిషన్‌లో ఆడి కళాశాలకు ట్రోఫీ అందించాడు. బంగారు పతకం గెలుపొందాడు. ★ 2026 జనవరి 14 నుంచి 17వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రంలోని భారత్‌దాస్ విశ్వవిద్యాలయ మైదానంలో జరిగిన జాతీయస్థాయి అంతర్ విశ్వవిద్యాలయాల బ్యాడ్మింటన్ పోటీల్లో ఆర్‌యూ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు.

కాల్వబుగ్గలో వసతులను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

బ్రహ్మోత్సవాలకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

ఓర్వకల్లు, న్యూస్‌టుడే : మండలంలోని కాల్వబుగ్గ బుగ్గ రామేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్, గ్రామీణ సీఐ చంద్రబాబునాయుడు చెప్పారు. కాల్వబుగ్గ ఆలయంలో చేపట్టిన ఏర్పాట్లను బుధవారం వారు పరిశీలించారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా చర్యలు తీసుకోవాలని ఈవో మద్దిలేటికి సూచించారు. తాగునీరు, విద్యుత్తు, మహిళలకు స్నాన ఘట్టాలు తదితర వసతులు కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ కాటినేని నారాయణ, ఓర్వకల్లు, ఉలిందకొండ ఎస్సైలు సునీల్‌కుమార్, ధనుంజయ, సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్‌లో కర్నూలు-డి జట్టు విజయం

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : నగరంలోని డీఎస్ఏ స్టేడియంలో జరుగుతున్న ఎం.ఎ.ఇస్మాన్ మెమోరియల్ అండర్-14 క్రికెట్ లీగ్ మ్యాచ్‌లో కర్నూలు- డి జట్టు కోడుమూరుపై విజయం సాధించింది. కర్నూలు-డి జట్టు మొదటి ఇన్నింగ్‌లో 261 పరుగులు చేసింది. కోడుమూరు జట్టు మొదటి ఇన్నింగ్‌లో 71 పరుగులకే కుప్పకూలింది. బుధవారం రెండో ఇన్నింగ్ ప్రారంభించిన కోడుమూరు జట్టు 92 పరుగులకే ఆలౌటైంది. కర్నూలు- డి బౌలర్ కార్తీక తన స్పిన్‌తో కోడుమూరు బ్యాటర్లను ముప్పతిప్పలు పెట్టింది. ఆమె మొదటి ఇన్నింగ్‌లో 5, రెండో ఇన్నింగ్‌లో 7 వికెట్లు తీసింది. అద్భుత ప్రదర్శన చేసిన టి.కార్తీక, 74 పరుగులతో రాణించిన భావనకు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి దేవేంద్రగౌడ్, అసోసియేషన్ ప్రతినిధులు రమేష్, శేఖర్, మహబూబ్, స్కోరర్ ప్రకాశ్ బహుమతులను అందజేశారు.

అద్భుత ప్రదర్శన చేసిన బౌలర్ కార్తీకకు పతకం అందిస్తున్న క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కేవీ సుబ్బారెడ్డి

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కేవీ సుబ్బారెడ్డి విద్యా సంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. శ్రీలక్ష్మి బీపీఈడీ, ఎంపీఈడీ కళాశాలలో మంగళవారం ఆర్‌యూ అనుబంధ కళాశాలల సెపక్‌తక్రా, హ్యాండ్‌బాల్, ఖోఖో (పురుషుల) క్రీడా పోటీలను ఆర్‌యూ క్రీడల సమన్వయకర్త శివకిషోర్, ఐఏఎస్‌ఈ కళాశాల వ్యాయామ అధ్యాపకుడు డా.వై.కల్యాణ్‌కుమార్‌లతో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో బీపీఈడీ, ఎంపీఈడీ కళాశాల కరస్పాండెంట్ శ్రీకాంత్, ప్రిన్సిపల్ రాజు, వ్యాయామ అధ్యాపకులు నరసింహ, శివ, మురళి పాల్గొన్నారు.

స్థలం కాపాడాలంటూ నిరసన

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : తమ స్థలానికి కొందరు నకిలీ హక్కు పత్రాలు సృష్టించి ఆక్రమించాలని చూస్తున్నారని.. తమకు న్యాయం చేయాలని కల్లూరు టైలర్స్ కాలనీకి చెందిన చిన్న ఈరమ్మ, శేషయ్య, సత్యనారాయణలు అధికారులను కోరారు. ఈమేరకు కలెక్టరేట్ ఎదుట ఉన్న గాంధీ విగ్రహం వద్ద బుధవారం వారు వీహెచ్‌పీ నాయకులతో కలిసి నిరసన తెలిపారు. వీహెచ్‌పీ నాయకులు తూముకుంట ప్రతాప్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘం నాయకులు రవి, నాగేశ్వరరావు, యుగంధర్‌శెట్టి, క్యాటరర్స్ అసోసియేషన్ నాయకులు ప్రసాదరావు, బుచ్చు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రద్ధాంజలి

జననం: 1-7-1934 మరణం: 28-1-2026
కీ॥శే॥ శ్రీ కె.రంగారెడ్డి గారు, D.V.E.O, Retd.
అకుంఠిత దీక్షతో 1992వ సం॥ వరకు A.P State Education Dept. లో సేవలందించి మీరు వృత్తి పట్ల మీ అంకితభావం, జీవితం పట్ల మీ నిబద్ధత ఎందరికో ఆదర్శనీయం.. ఎంత ఎదిగినా ఒదిగిఉండాలనే మీ నిరాడంబరత గల వ్యక్తిత్వం ఆచరనీయం.. మీరు మా నుండి దూరమైననూ మీ మధురస్మృతులు మా మదిలో సదా పదిలం. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ..
భార్య : కె.రామచంద్రమ్మ
కుమారులు: - కోడలు: కె.వెంకటశివారెడ్డి - కె.సుమతి, కె.శ్రీధరరెడ్డి, కె.మురళీధరరెడ్డి
మనుమరాళ్లు: సుమధురి, స్నేహసుమ
మనుమల్లు: సమంత్, భార్గవ్
మునిమనవడు: సుజయ్
పెద్దకర్మ: తేది: 12-02-2026 గురువారం మధ్యాహ్నం 12.00 గం॥లకు పెద్దకర్మ కార్యక్రమము మా స్వగృహం H.No: 79/10-156B1, క్రిష్ణానగర్, కర్నూలు నందు జరుగును.

చెత్తపని.. ప్రజారోగ్యానికి హాని

● జనావాసాల మధ్యలో అనధికార డంపింగ్‌యార్డు
● గుట్టలుగా వ్యర్థాలు పడేస్తున్న నగరపాలక సిబ్బంది

నగరంలో చెత్త సేకరణ.. నిర్వహణలో నగరపాలక పారిశుద్ధ్య విభాగం అధికారులు, సిబ్బంది ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. ఖర్చులు మిగుల్చుకునేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. నగరంలో సేకరించిన వ్యర్థాలను గార్గేయపురం వద్ద ఉన్న డంపింగ్ యార్డుకు తరలించాల్సి ఉంది. అక్కడికి తీసుకెళ్లకుండా నగరం నడిబొడ్డున జనావాసాల మధ్యనే అనధికారిక డంపింగ్ యార్డును ఏర్పాటు చేశారు. కొంతకాలం నుంచి ఇక్కడ గుట్టుచప్పుడు కాకుండా వందల ట్రాక్టర్ల వ్యర్థాలు నిల్వ చేస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు.
- న్యూస్‌టుడే, కర్నూలు కలెక్టరేట్

బుధవారం రివర్‌వ్యూ కాలనీలోని ఖాళీ స్థలంలో చెత్తను అన్‌లోడ్ చేస్తున్న నగరపాలక టిప్పర్, ట్రాక్టర్

నగరంలో రోజుకు 225 టన్నుల చెత్త ఉత్పత్తవుతోంది. ఇందులో పారిశుద్ధ్య సిబ్బంది 180 టన్నుల వరకు సేకరించి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. మిగతా వ్యర్థాలను రోడ్ల పక్కన, ఖాళీ స్థలాల్లో పడేస్తున్నారు. నగరపాలక సంస్థలో వాహనాలు, సిబ్బంది కొరత

వాహనాల కొరత సాకుగా చూపి..

కారణంగా చెత్త సేకరణ, తరలింపు సక్రమంగా సాగడం లేదు. ఏడాది పాటు అద్దె ట్రాక్టర్లతో చెత్త సేకరణ ప్రక్రియ సాగింది. మొదటి ఆరు నెలలకు బిల్లులు రాకపోవడంతో అవస్థలు మొదలయ్యాయి. ట్రాక్టర్లు రోజూ వస్తేనే అద్దె చెల్లిస్తున్నారు. రాని రోజులకు సంబంధించి డబ్బు మినహాయించుకుని బిల్లులు చెల్లిస్తుండటంతో ట్రాక్టర్ల యజమానులు మొండికేస్తున్నారు. అద్దె వాహనాలు రాకపోవడంతో ఎక్కడ ఖాళీ ప్రదేశం కనిపిస్తే అక్కడ చెత్త పడేస్తున్నారు.

ఖర్చులు.. సమయం కలిసొస్తాయని

నగరంలో ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను నగరపాలక వాహనాల్లో గార్గేయపురం సమీపంలోని డంపింగ్ యార్డుకు తరలించాల్సి ఉంది. అక్కడికి తరలించేందుకు ఎక్కువ డీజిల్ ఖర్చవుతుంది. గంటకు పైగా సమయం పడుతుంది. దీంతో డీజిల్‌ను మిగిల్చుకోవడంతో పాటు సమయం ఆదా అవుతుందని కొందరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, పారిశుద్ధ్య సిబ్బంది, చెత్త సేకరణ వాహనాల డ్రైవర్లు కుమ్మక్కై వ్యర్థాలను గార్గేయపురం దాకా తీసుకెళ్లడం లేదు. స్థానిక మౌర్యఇన్ సమీపంలోని రివర్‌వ్యూ కాలనీలో ఉన్న ఓ ఖాళీ ప్రదేశంలో అనధికారికంగా మినీ డంపింగ్‌యార్డు ఏర్పాటు చేసుకున్నారు. వివిధ కాలనీల నుంచి సేకరించిన వ్యర్థాలను టిప్పర్లు, ట్రాక్టర్లలో తీసుకొచ్చి ఇక్కడ వదులుతున్నారు. పొక్లెయిన్లు, డోజర్లతో చెత్తను గుంతలోకి తోసేసి చదును చేస్తున్నారు. కొంతకాలం నుంచి వందలాది ట్రిప్పుల వ్యర్థాలను ఇక్కడికి తెచ్చి పోగేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. తీవ్ర దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. నగరపాలక అధికారులు స్పందించి ఇక్కడ చెత్త నిల్వ చేయకుండా చూడాలని కోరుతున్నారు.

కార్మికుల హక్కులు కాలరాస్తే సహించం

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : ప్రభుత్వాలు లేబర్ కోడ్‌ల పేరుతో కార్మికుల హక్కులను కాలరాస్తే సహించేది లేదని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప పేర్కొన్నారు. స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నూతన విత్తన బిల్లు, విద్యుత్తు చట్టం సవరణను రద్దు చేయాలని, మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని కోరుతూ ఈనెల 12న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, డి.శ్రీనివాసరావు, చంద్రశేఖర్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అప్రమత్తం

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : లేబర్ కోడ్‌ల రద్దు కోసం కార్మిక, కర్షక, ఉద్యోగ సంఘాలు గురువారం దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు తమ పరిధిలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ఒక భారత ప్రభుత్వ రంగ సంస్థ
నరసింగరావు పేట శాఖ, 43/161, ఎన్.ఆర్.పేట, కర్నూలు.
ఇమెయిల్ ఐడి: ubin0808849@unionbankofindia.bank.in
ఫోన్ నెం: 93249 88363

స్వాధీన ప్రకటన
(2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలులో నిబంధన 8(1) ప్రకారం) (స్థిరాస్తి కొరకు)

క్రింది సంతకదారుడు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నరసింగరావుపేట శాఖకు అధీకృత అధికారిగా సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 (2002 నాటి చట్టం 54) మరియు 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలులోని నిబంధన 3తో చదువుకొనేలా చట్టంలోని సెక్షన్ 13(12)క్రింద లభించిన అధికారాలను వినియోగించుకొని రుణగ్రస్తులు: శ్రీ జగన్‌మోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి మరియు శ్రీమతి అంకిరెడ్డిపల్లి ప్రేమలత, చిరునామా: డో.నెం. 40/814-బి, 40/814-బి1, మరియు 40/814-బి2, టెలీకమ్యూనికేషన్ లైను, శ్రీనివాసనగర్, చర్చి దగ్గర, వార్డు నెం. 40, కర్నూలు వార్లకు నోటీసులో వివరించిన బకాయి మొత్తం రూ. 45,88,222.86 (రూపాయలు నలభై ఐదు లక్షల ఎనభై ఎనిమిది వేల రెండు వందల ఇరవై రెండు మరియు ఎనభై ఆరు పైసలు మాత్రమే)లను సదరు నోటీసు చేరిన తేదీ నుంచి గల 60 రోజులలోగా చెల్లించమని కోరుతూ తేది: 01-12-2025తో డిమాండ్ నోటీసు ఇవ్వబడింది.

రుణగ్రస్తుడు సదరు బకాయి మొత్తం చెల్లించనందున క్రింది సంతకదారుడు 2002 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలులోని నిబంధన 8తో చదువుకొనేలా సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద లభించిన అధికారాలను వినియోగించుకొని దిగువ వివరించిన ఆస్తిని ఈ రోజు తేదీ 07-02-2026న స్వాధీన పర్చుకొన్నట్లుగా తెలుపుతూ రుణగ్రస్తుడు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది.

సదరు ఆస్తితో ఎవ్వరూ ఎలాంటి వ్యవహారం చేయరాదని, ఒకవేళ ఎవ్వరైనా చేసినచో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు తమకు రావలసిన బకాయి మొత్తం అగు రూ. 45,88,222.86 (రూపాయలు నలభై ఐదు లక్షల ఎనభై ఎనిమిది వేల రెండు వందల ఇరవై రెండు మరియు ఎనభై ఆరు పైసలు మాత్రమే) మరియు దానిపై అయిన వడ్డీ మొత్తంలపై తీసుకోనున్న చర్యలకు బాధ్యులగుదురని ముఖ్యంగా రుణగ్రస్తుడు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా హెచ్చరించడమైనది.

సెక్యూర్డ్ ఆస్తులు విడిపించుటకు లభించే సమయంపై చట్టంలోని సెక్షను 13లోని ఉప-సెక్షన్ (8)లో గల అంశాలుపై రుణగ్రస్తులు శ్రద్ధవహించాల్సినదిగా కోరడమైనది.

స్థిరాస్తులు వివరాలు
నివాస భూమి మరియు భవనం మొత్తం శ్రీ ఎ.జగన్‌మోహన్ రెడ్డికి చెంది, ఉన్నచోటు: ఇ.నెం. 40/814-బి, 40/814-బి1, 40/814-బి2, స.నెం. 122, వార్డు నెం. 40, శ్రీనివాసనగర్ (టెలికమ్యూనికేషన్ ఆఫీసు లైను), కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ హద్దులకు లోబడి, కర్నూలు జిల్లా, కర్నూలు ఉప-రిజిస్ట్రేషన్ మరియు రిజిస్ట్రేషన్ జిల్లా. **తూర్పు:** బహిరంగ రోడ్, **పడమర:** పి.విజయకుమార్ రెడ్డి గృహం, **ఉత్తరం:** సుబ్బమ్మ గృహం, **దక్షిణం:** అడ్వకేట్ భీమేశ్వర రెడ్డి గృహం.
తేది: 07-02-2026
స్థలం: కర్నూలు.
అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా



అశ్వ వాహనంపై నారాయణుడు

ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో శివరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. బుధవారం... స్వామి వారి అశ్వవాహన సేవ కనుల పండువగా సాగింది. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. – న్యూస్‌టుడే, సి.ఎస్.పురం

మల్లన్న భక్తులకు ఇబ్బంది లేకుండా వసతులు

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైల మల్లన్న దర్శనానికి వెళ్లే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని జేసీ పి.శ్రీనివాసులు ఆదేశించారు. పెద్దదోర్నాల, పెద్దారవీడు మండలాల అధికారులతో దోర్నాల మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఘాట్ రోడ్లలో ట్రాఫిక్ ఇబ్బందులు, ప్రమాదాలకు తావులేకుండా చేపట్టిన చర్యలను సీఐ అజయ్ కుమార్ తెలియజేశారు. శివరాత్రి రోజున క్షేత్రంలో 1.40 లక్షల మంది కంటే ఎక్కువ మంది భక్తులుంటే... ఆపై వచ్చే వాహనాలను పెద్దదోర్నాలలో నిలిపివేస్తామన్నారు. ఆ మేరకు మల్లికార్జుననగర్ సమీపంలో పార్కింగ్ ఏర్పాట్లు చేశామన్నారు. వాహనదారులకు ఇబ్బంది లేకుండా ఆ ప్రాంతంలో విద్యుత్తు, తాగు నీరుతో పాటు అవసరమైన వసతులు కల్పిస్తున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో శివకోటేశ్వరరావు వివరించారు. పార్కింగ్ ప్రాంతాలు, పెద్ద దోర్నాల ఘాట్‌ను జేసీ పరిశీలించారు. ఆత్మకూరు మార్గంలో మట్టి చెదరకుండా నీరు చల్లాలని హైవే అధికారులను ఆదేశించారు. సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి, డీఎస్పీ నాగరాజు, డీడీవో బాలునాయక్, ఎంపీడీవో ప్రసూనాదేవి, తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డి, ఇరిగేషన్ ఏఈ భ్రమరాంబికా దేవి పాల్గొన్నారు.

పెద్దదోర్నాలలో వాహనాల పార్కింగ్ స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాసులు

ఉత్పాదకత పెంచుతాం..
జిల్లాను అగ్రగామిగా నిలుపుతాం

- జూన్ నాటికి లక్ష్యం చేరేలా ప్రణాళిక
- 'ఈనాడు'తో కలెక్టర్ రాజాబాబు

వ్యవసాయం, అనుబంధ, సేవా, పారిశ్రామిక రంగాలతో పాటు ఇతర అన్ని అంశాల్లోనూ మెరుగైన పనితీరు కనబరిచి వచ్చే జూన్ నాటికి జిల్లాను అగ్రపథాన నిలబెట్టేందుకు కృషి చేస్తున్నట్లు కలెక్టర్ రాజాబాబు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వ్యవసాయం, అనుబంధ రంగాల ప్రగతి ర్యాంకుల్లో జిల్లా వెనుకబాటుపై 'ఈనాడు' ఆయనను సంప్రదించగా పలు అంశాలు వెల్లడించారు. కొండపి నియోజకవర్గం ఖరీఫ్ వివరాలు నమోదుకాకపోవడం వెనుకబాటుకు ఓ కారణమన్నారు. సానుకూలతలను సద్వినియోగం చేసుకుంటూ రానున్న మూడు నెలల్లో 'ఏ ప్లస్' స్థానానికి చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. వివరాలు ఆయన మాటల్లోనే...

– ఈనాడు, ఒంగోలు



ముఖాముఖి

పరిశ్రమల రాకతో...

జిల్లాలోనే రామాయపట్నం పోర్టు, బీపీసీఎల్, ఇండోసోల్ ప్రాజెక్టులు ఏర్పాటవుతున్నాయి. భూసేకరణ పరంగా ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నాం. నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటవుతున్నాయి. దొనకొండకూ కంపెనీలు రానున్నాయి. పారిశ్రామికంగా వడివడిగా అడుగులు పడుతున్నందున... అనుబంధంగా రవాణా, ఇతర రంగాలు విస్తరించనున్నాయి. తద్వారా విస్తృత అవకాశాలతో పాటు ఉత్పాదకతా పెరుగుతుంది. పర్యాటకం అభివృద్ధికి బీచ్ ఫెస్ట్ నిర్వహిస్తున్నాం.

జల సురక్ష... రాష్ట్రమంతటా: జల సురక్ష పేరిట జిల్లాలో నెల రోజుల పాటు రక్షిత నీటి పథకాల మరమ్మతులు, ట్యాంకులు శుభ్రత వంటి పనులు చేపట్టి మంచి ఫలితాలు సాధించాం. దీన్ని గుర్తించిన ప్రభుత్వం రాష్ట్రమంతటా ఈ విధానం అమలుకు 'క్రాస్' పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం ఆనందంగా ఉంది.

ఉద్యానం మరింత పెరిగేలా...: ఇప్పటికే జిల్లాలో మూడు వేల హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. ఈ దిశగా రైతులను మరింత ప్రోత్సహిస్తాం. ఇటీవల వెలువరించిన జాబితాలో వ్యవసాయ ఉత్పత్తుల వివరాలు నమోదు కాలేదు. వచ్చే నివేదికలో ఇవి నమోదైతే ర్యాంకుల పరంగానూ మెరుగవుతాం.

'పది'లో పైచేయి కోసం...: పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ఉత్తమంగా నిలిచేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం. వసతి గృహానికి ఒక అధికారిని నియమించి పర్యవేక్షణ చేపట్టడంతో మార్పు కనిపిస్తోంది. పాఠశాలలను దత్తత ఇచ్చి మంచి మార్కులు సాధించేలా చూస్తున్నాం. ఈ ప్రయత్నాలన్నీ మంచి ఫలితాలనిస్తున్నాయి.

రారండోయ్... ప్రభుత్వ బడుల బాగుకు!

జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు లేక విద్యార్థులు ఆరు బయట విద్యాభ్యాసం చేయాల్సి వస్తోంది. తగినన్ని బల్లలు లేక కింద కూర్చోవాల్సి వస్తోంది. కొన్నిచోట్ల క్రీడా సామగ్రి లేక ఆటలకు దూరమవుతున్నారు. ఇతరత్రా సమస్యలూ వెన్నాడుతున్నాయి. ఈ నేపథ్యంలో దాతల సహకారంతో ఆయా సౌకర్యాలు కల్పించాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా విద్యాంజలి 2.0 కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి.

సైట్‌లో అవసరాల గుర్తింపు

ఇందులో భాగంగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యాలయానికి ఏమేం అవసరమన్నది ముందుగా గుర్తించాలి. ఆ వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన సైట్‌లో నమోదు చేయాలి. ఈ విషయమై జిల్లా విద్యాశాఖ అధికారులు ఇప్పటికే వారికి శిక్షణ ఇచ్చారు. విద్యాంజలి 2.0 ద్వారా

వివరాలు నమోదు చేసుకోవాలి...: వసతుల కల్పన, సేవలకు ముందుకు వచ్చే ఔత్సాహికులు, ఎన్‌జీవోలు, ఎన్నారైలు, సంస్థలు ముందుగా... విద్యాంజలి.ఎడ్యుకేషన్.జీవోవి.ఇన్ సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. ఆసక్తి ఉన్న రంగాన్ని ఎంచుకొని తోడ్పాటు అందించవచ్చు.

ఔత్సాహికుల కోసం విద్యాంజలి 2.0 అమలు

ఎవరైనా... రాష్ట్రంలోని ఏ ప్రాంతంలో ఉన్న పాఠశాలకైనా వసతులు కల్పించేందుకు ముందుకు రావచ్చు.

ఇలా సాయపడొచ్చు...

విద్యార్థులకు బోధన చేయవచ్చు. కళలు, యోగా, క్రీడలు, వృత్తి నైపుణ్యాలు, పోటీ పరీక్షలు వంటి అంశాల్లో శిక్షణ ఇవ్వవచ్చు. దివ్యాంగులకు అవసరమైన పరికరాలు, పిల్లలకు ఉపయోగపడే కథల పుస్తకాలు, పోషకాహారం అందించవచ్చు. విద్యావేత్తలు కౌన్సెలింగ్ తరగతులు... వైద్యులు శిబిరాలు నిర్వహించవచ్చు. బాలికలకు ఆత్మరక్షణ విద్య అందజేయవచ్చు.

– న్యూస్‌టుడే, గిద్దలూరు పట్టణం, నాగులుప్పలపాడు

అంతదూరంలో బస్టాండా...?

- మార్పు ప్రతిపాదనపై అంతటా చర్చ

ఈనాడు, ఒంగోలు

బస్సుల రద్దీ, ట్రాఫిక్ సమస్యల నేపథ్యంలో ఒంగోలు నడిబొడ్డున ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌ను మరో చోటకు తరలించాలన్న ప్రతిపాదనపై నగర వాసుల్లో ఇప్పుడు చర్చ నడుస్తోంది. అందరికీ అందుబాటులో ఉన్న దానిని ఊరి చివరకు తరలించడం సరికాదని కొందరు అభిప్రాయపడుతుంటే... ప్రత్యామ్నాయం ఆలోచించాలని మరి కొందరు సూచిస్తున్నారు.

ఆక్రమణలు.. ట్రాఫిక్ చిక్కులు

దశాబ్దాల క్రితం అప్పటి అవసరాలకు అనుగుణంగా 11 ఎకరాల విస్తీర్ణంలో బస్టాండ్, గ్యారేజీ ఏర్పాటు చేశారు. అప్పటితో పోలిస్తే ఇప్పుడు బస్సుల రాకపోకలు, ప్రయాణికుల రద్దీ అయిదారింతలు పెరిగింది. ప్రస్తుతం 28 ప్లాట్‌ఫాంలు ఉండగా... రోజుకు 1,500 బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. మరోవైపు చుట్టూ ఆక్రమణలు పెరిగాయి. బస్సులు లోపలకు వెళ్లి వచ్చే క్రమంలో కర్నూలు రోడ్డులో ట్రాఫిక్ నిలిచిపోతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో మరిన్ని చిక్కులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో బస్టాండ్‌ను మరోచోటకు తరలించాలని ఎమ్మెల్యే జనార్దన్ ఆర్టీసీ ఉన్నతాధికారులకు లేఖ రాశారు.

ప్రజాభీష్టం మేరకే నిర్ణయం...

నగర శివారులోని మార్కెట్ యార్డులో పదెకరాలకు పైగా ఖాళీ స్థలం ఉన్నందున బస్టాండ్‌ను అక్కడకు తరలించాలని ప్రతిపాదించారు. ఈ విషయాన్ని మంగళవారం నాటి నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే ప్రస్తావించారు. తద్వారా ఆ స్థలాన్ని వినియోగంలోకి తేవడంతో పాటు... పీపీపీ విధానంలో ఇక్కడ వాణిజ్య సముదాయాలు నిర్మిస్తే ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందన్నది తన ఆలోచనగా చెప్పారు. కాగా... అంతదూరమైతే కష్టమన్న అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది. బస్టాండ్‌పై ఒత్తిడి తగ్గించేలా నగరంలోనే మినీ బస్టాండ్ నిర్మిస్తే ప్రయోజనం ఉంటుందని పలువురు సూచిస్తున్నారు. ఏ నిర్ణయమైనా ప్రజల అభిప్రాయం మేరకే ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

☛ ఈ నెల 9న... కనిగిరి పట్టణంలోని బీసీ-2 బాలుర వసతి గృహాన్ని జేసీ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులో 75 మంది ఉన్నట్లు నమోదు చేసినా... అక్కడ వాస్తవంగా ఉన్నది 21 మందే. బోగస్ రోల్‌తో పాటు ఇతరత్రా అవకతవకలు వెలుగు చూడడంతో వార్డెన్‌ను విధుల నుంచి సస్పెండ్ చేశారు.

☛ ఈ నెల 10న... ఉలవపాడులోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తనిఖీ చేశారు. మెనూ పాటించకపోవడం, అల్పాహారం తక్కువగా ఉండడం, తాగునీరు లేక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

బోగస్ రోల్‌తో బొక్కుడు

- తనిఖీలు పట్టని అధికారులు
- సంక్షేమ వసతి గృహాల్లో పరిస్థితి ఇది

న్యూస్‌టుడే – కనిగిరి

ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో ఇటీవల కాలంలో వెలుగు చూస్తున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. బోగస్ రోల్‌తో పాటు కొన్ని చోట్ల కనీస స్థాయిలోనూ మెనూ పాటించడం లేదు. గత వైకాపా ప్రభుత్వ హయాంలోనే పర్యవేక్షణ లేక వసతి గృహాల నిర్వహణ గాడి తప్పింది. కూటమి ప్రభుత్వం వచ్చాక తరచూ చేపడుతున్న తనిఖీల్లో ఆ తప్పిదాలు వెలుగు చూస్తున్నాయి.

అంతా ఇష్టారాజ్యం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 74 ఎస్సీ, 64 బీసీ వసతి గృహాలున్నాయి. వీటిలో దాదాపు 12 వేల మంది విద్యార్థులున్నారు. ఇవి కాకుండా అన్ని రకాల గిరిజన వసతి గృహాలు 19 వరకు ఉన్నాయి. కళాశాల వసతి గృహాలు అదనం. ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యాలయాల్లో చదివే పిల్లలను మాత్రమే వీటిలో చేర్చుకోవాలి. విద్యార్థుల సంఖ్య తక్కువ ఉన్న చోట... సంక్షేమాధికారులు సమీప ప్రైవేటు పాఠశాలల పిల్లల పేర్లు నమోదు చేస్తున్నారు. ఈ బోగస్ రోల్ చూపి మెనూ ఛార్జీల కింద ప్రతి నెలా రూ.లక్షల్లో కాజేస్తున్నారు. ఈ మొత్తంలో కొంత పై అధికారులకూ వెళ్తుండడంతో చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

కనిగిరి వసతిగృహంలో మెనూ అమలుపై ఆరా తీస్తున్న జేసీ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యే ఉగ్ర

పరీక్షల సమయంలోనూ అదేతీరు...

త్వరలో పది, ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. ప్రభుత్వం సైతం ప్రభుత్వ విద్యాలయాల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తోంది. ఇటువంటి సమయంలోనూ వసతి గృహాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడం కలవరపరుస్తున్న అంశం. చాలా చోట్ల మెనూ అమలును పూర్తిగా విస్మరించారు. విద్యార్థులే ఈ విషయం చెబుతున్నారు. కొందరు సంక్షేమాధికారులు వేరే ప్రాంతాల్లో ఉంటూ వసతి గృహం ముఖమే చూడడం లేదన్న విమర్శలూ ఉన్నాయి. కొద్ది రోజుల క్రితం... కొనకనమిట్ల వసతి గృహంలో అటు సంక్షేమాధికారి, ఇటు సిబ్బంది రాక రోజంతా విద్యార్థులు ఆకలితో నకనకలాడాల్సి వచ్చింది. తరచూ వసతి గృహాలను తనిఖీ చేయాల్సిన ఏబీసీడబ్ల్యూవోలు, ఏఎస్‌డబ్ల్యూవోలు ఆ బాధ్యతలు విస్మరించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులైనా స్పందించి వసతిగృహాల నిర్వహణను గాడిన పెట్టాల్సిన అవసరం ఉంది.

డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగ పరీక్ష వాయిదా

ఒంగోలు న్యాయవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో రెగ్యులర్ డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగ నియామకానికి ఈ నెల 15న నిర్వహించాల్సిన పరీక్షను వాయిదా వేసినట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్‌ఛార్జి ఛైర్ పర్సన్, ఒకటో అదనపు జిల్లా జడ్జి టి.రాజ్యలక్ష్మి తెలిపారు. మళ్లీ ఎప్పుడు నిర్ణయించేదీ తరువాత తెలియజేస్తామని చెప్పారు. రికార్డు అసిస్టెంట్, ఫ్రంట్ ఆఫీసు కో ఆర్డినేటర్ ఉద్యోగాలకు మాత్రం యథావిధిగా అదే రోజున... ఒంగోలు ఇందిరా ప్రియదర్శిని న్యాయ కళాశాలలో పరీక్ష జరుగుతుందని వివరించారు.

తప్పుల సవరణకు పది విద్యార్థులకు అవకాశం

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: త్వరలో పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులు... ఇప్పటివరకు సమర్పించిన వ్యక్తిగత వివరాల్లో ఏవైనా తప్పులుంటే సరిచేసుకునేందుకు విద్యాశాఖ ఉన్నతాధికారులు అవకాశం కల్పించారు. ఈ నెల 12 (గురువారం)తో ఆ గడువు ముగియనుంది. పాఠశాల దస్త్రాలు, యూడైస్‌లో నమోదైన వివరాలను పరిశీలించి తప్పులుంటే ప్రధానోపాధ్యాయుడి ద్వారా సరి చేయించుకోవాలని తెలిపారు. విద్యార్థి, తల్లిదండ్రుల పేర్లు, శరీరంపై గుర్తులు (పుట్టు మచ్చలు), కులం, ఉప కులం, విద్యార్థి చిత్రం, సంతకంలో మార్పులు చేసుకునే వెసులుబాటు కల్పించారు. మార్చిన వివరాలను ప్రధానోపాధ్యాయులు పాఠశాల దస్త్రాల్లో సరిదిద్ది ఉప విద్యాశాఖాధికారి దృష్టికి తీసుకెళ్లి అధికారికంగా నిర్ధారణ చేయిస్తారు.

చిన్న పరీక్ష... రేపటికి రక్షణ

- మహిళలకు ప్రత్యేకంగా క్యాన్సర్ స్క్రీనింగ్

న్యూస్‌టుడే, మార్కాపురం

తగిన అవగాహన లేక మహిళలు క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవడం లేదు. దీంతో ఎవరైనా మహమ్మారి బారిన పడితే వ్యాధి ముదిరిన వరకు తెలియడం లేదు. ఆ తరువాత వైద్యం చేయించినా ప్రయోజనం లేకపోతోంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం సమస్యపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇందులో భాగంగా ముప్పై ఏళ్లు దాటిన మహిళకు ముందుగానే పరీక్షలు నిర్వహించి... క్యాన్సర్ లక్షణాలు ఉంటే గుర్తించేలా వైద్య ఆరోగ్యశాఖ ద్వారా కార్యాచరణ రూపొందించింది. ఇప్పటికే స్క్రీనింగ్ పరీక్షలు కొనసాగుతున్నాయి. వివిధ రకాల అపోహలతో కొందరు ఈ ప్రక్రియకు దూరంగా ఉన్నట్లు తేలడంతో... వారిని సైతం భాగస్వాములు చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా ప్రత్యేకంగా ఆహ్వాన పత్రికలు ముద్రించి... ఇంటింటికీ వెళ్లి అందజేసేందుకు నిర్ణయించారు.

మార్కాపురం జిల్లా పరిధిలో.

- గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ పరీక్షలు చేయించుకున్న వారు: 35,638 మంది
- అనుమానితులు: 542 మంది
- నోటి క్యాన్సర్ పరీక్షలు: 38,141 మందికి
- అనుమానితులు: 630 మంది

కార్డులిచ్చి ఆహ్వానం..

ప్రాథమిక, సామాజిక ఆసుపత్రులు; పట్టణ, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో... ఇంకా పరీక్షలు చేయించుకోని మహిళలను గుర్తిస్తారు. వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు వారి ఇళ్లకు వెళ్లి అపోహలు తొలగించి... పరీక్షలకు రావాలని ఆహ్వాన పత్రిక అందజేస్తారు. ఏరోజు, ఏఆరోగ్య కేంద్రంలో పరీక్షలు నిర్వహిస్తారు... ఎన్ని గంటలకు రావాలన్నది అప్పుడే చెబుతారు. 'సులువైన చిన్న పరీక్ష - బలమైన రేపటికి రక్షణ' అన్న నినాదంతో ముద్రించిన ఈ ఆహ్వాన పత్రికలు ఇప్పటికే జిల్లా కేంద్రానికి చేరాయి. త్వరలోనే ఆరోగ్య కేంద్రాలకు పంపిణీ చేయనున్నారు.

మార్కాపురం మండలం రాయవరంలో సర్వే చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో మనిష్షే, వైద్యులు

సిబ్బంది కొరత... పశువైద్యానికి కలత!

- భవనాలూ బాగుకు నోచక అవస్థలు

న్యూస్‌టుడే – కంభం

ఉమ్మడి జిల్లాలో వ్యవసాయంతో సమానంగా పాడికి ప్రాధాన్యం ఉంది. పశుపోషణపైనే ఆధారపడి వేల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఇంతవరకు బాగానే ఉన్నా... తగినంత సిబ్బంది లేక ఆస్థాయిలో పశు వైద్య సేవలు అందడం లేదు.

లింగోజిపల్లిలో పూర్తిగా దెబ్బతిన్న గ్రామీణ పశు వైద్యశాల భవనం

ప్రకాశం, మార్కాపురం జిల్లాల పరిధిలో ఇప్పటికే 15 పశు వైద్య పోస్టులు ఖాళీగా ఉన్నాయి. త్వరలో మరికొందరు ఉద్యోగ విరమణ చేయనున్నారు. 2019కి ముందు పోస్టుల భర్తీ తప్ప... గత వైకాపా పాలనలో ఒక్కరినీ నియమించలేదు. ఒక్క గిద్దలూరు నియోజకవర్గంలోనే సోమవారపేట, పాపినేనిపల్లి, కొమరోలు, సంజీవరాయునిపేట, తర్లుపాడు తదితర ప్రాంతాల్లో వైద్యులు లేరు. ఆఫీసు సబార్డినేట్ పోస్టుల కొరతా ఎక్కువగానే ఉంది. సచివాలయాల్లో వెటర్నరీ సహాయకులను నియమించినా వారి సేవలు అంతంతమాత్రంగానే ఉన్నాయన్న విమర్శలున్నాయి.

జిల్లాలో పశు సంపద వివరాలు	ఆవులు:	గేదెలు, దున్నలు:	గొర్రెలు, మేకలు:
	56 వేలు	6.35 లక్షలు	19.75 లక్షలు

మార్కాపురం డివిజన్‌లో 21, ఒంగోలు పరిధిలో 16 పశు వైద్య శాల భవనాలు శిథిలావస్థకు చేరాయి. ఒక్కో దాని మరమ్మతులకు రూ.44 లక్షలు అవసరమని గత ఏడాది జనవరిలో ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాలేదు.

శిథిలావస్థలో పశువైద్యశాలలు

ఉమ్మడి జిల్లాలో మొత్తం 37 పశు వైద్యశాలలు శిథిలావస్థకు చేరాయి. చిన్నపాటి వర్షం పడినా కారుతూ మందులు, దస్త్రాలు తడిచిపోతున్నాయి. కొన్నిచోట్ల విధుల నిర్వహణకు అవకాశం లేక ఇతర శాఖల భవనాలను వినియోగిస్తున్నారు. తురిమెళ్ల వైద్యశాల భవనాన్ని పదిహేనేళ్ల క్రితమే నిర్మించినా... పనుల్లో నాణ్యత లేక గోడలు బీటలు వారాయి. రావిపాడు పశువైద్యశాలకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి అసెంబ్లీలోనూ ప్రస్తావించారు. లింగోజిపల్లి, యర్రబాలెం, లింగాపురంలోనూ భవనాలు దెబ్బతిన్నాయి. సమస్యలపై పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటేశ్వరరావు స్పందిస్తూ... వైద్యుల కొరత తీర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. దెబ్బతిన్న భవనాల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

అమృతమూర్తికి అశ్రునివాళి

మంచితనానికి మారుపేరుగా
మా అందరి హృదయాలలో
సుస్థిరస్థానాన్ని సంపాదించి
మాకుటుంబ ఉన్నతికి
అహర్నిశలు శ్రమించి
మా భవితకు బంగారు
బాటలు వేసి మరెందరో
జీవితాలలో వెలుగులు నింపిన
మాకు దైవసమానులైన
శ్రీ మేదరమెట్ల
శంకరారెడ్డి గారి
అకాల మరణం
మాకు తీరనిలోటు..
వారి మరణానికి చింతిస్తూ...
వారి పవిత్ర ఆత్మకు శాంతి
చేకూరాలని
భగవంతుని ప్రార్థిస్తూ..

స్వర్గీయ మేదరమెట్ల శంకరారెడ్డి గారు
Ex. PDCC బ్యాంక్ ఛైర్మన్, ఒంగోలు
(2005 -2013)
జననం: 25-10-1944 మరణం: 29-01-2026

భార్య
(లేట్) మేదరమెట్ల అరుణ
మాజీ సర్పంచ్, బద్దిపూడి

కుమారులు - కోడళ్లు
మేదరమెట్ల రాజశేఖరరెడ్డి - శాలిని
డా॥ మేదరమెట్ల చంద్రశేఖరరెడ్డి - హేమలత

మనుమలు - మనుమరాండ్రు
అనీత్‌రెడ్డి, అద్వితీ- అశిష్‌రెడ్డి
ప్రణవ్‌రెడ్డి, కౌముది

పెద్దకర్మ : తేది 12-2-2026 గురువారం ఒంగోలు రైల్వేస్టేషన్‌రోడ్ బచ్చలబాలయ్య & సంజీవమ్మ ఫంక్షన్‌హాల్ నందు జరుగును.
సంస్మరణసభ: ఉదయం 11-30ని॥లకు జరుగును కావున తెలియజేయడమైనది.

(c) eenadu

మెట్ల మార్గం వద్ద అధికారులకు సూచనలిస్తున్న జేసీ శ్రీనివాసులు

త్రిపురాంతకం ఉత్సవాలను విజయవంతం చేయండి

త్రిపురాంతకం గ్రామీణం, త్రిపురాంతకం, న్యూస్‌టుడే: మార్కాపురం జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన త్రిపురాంతకం ఆలయంలో జరగనున్న మహా శివరాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేలా అధికారులు ప్రణాళికలతో పనిచేయాలి. భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న శివరాత్రి ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించేందుకు ఆయన బుధవారం త్రిపురాంతకం వచ్చారు. ఈ సందర్భంగా సాగర్ కాలువ వద్ద స్నాన ఘట్టాలు, పార్కింగ్ స్థలం, క్యూలైన్లు, మెట్ల మార్గాల వద్ద భక్తుల కోసం జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు.

❖ అనంతరం స్థానిక బాలా త్రిపురసుందరీ దేవి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలపై మార్కాపురం ఇన్‌ఛార్జి సబ్‌-కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి అధ్యక్షతన అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాట్ల పురోగతిని సంబంధిత అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. సాగర్ కాలువలో ఏర్పాటు చేసిన స్నాన ఘట్టాల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా నిరంతరం గస్తీ ఏర్పాటు చేయాలన్నారు. వినుకొండ, మార్కాపురం, పొదిలి, గిద్దలూరు ప్రాంతాల నుంచి 20 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. సమావేశంలో స్థానిక తహసీల్దార్ విజయభాస్కర్, ఆలయాల ఈవో అనిల్ కుమార్, డీఎంహెచ్‌వో డా. వాణిశ్రీ, డీఎస్పీ నాగరాజు, ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీనివాసరెడ్డి, సాంబశివరావు, సునీల్, ఇతర శాఖ అధికారులు పాల్గొన్నారు.

సాగర మిత్రలను కొనసాగించాలి

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: జిల్లాలో మత్స్య శాఖ ఆధ్వర్యంలో పని చేస్తున్న సాగర మిత్రలను కొనసాగించాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్ర మత్స్య శాఖ మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్‌ను విజ్ఞప్తి చేశారు. బుధవారం దిల్లీలోని ఆయన కార్యాలయంలో కలిసి రాష్ట్ర సాగర మిత్ర ఎంప్లాయీస్ యూనియన్ తరఫున వినతిపత్రం అందించారు. వీరి సేవలు మార్చి 31వ తేదీతో ముగియనున్నాయని, రెండు నెలల ముందే నోటీసు కూడా జారీ చేశారన్నారు. వారిని అకస్మాత్తుగా నిలిపివేయడంతో పీఎంఎంఎస్‌వైలో సాధించిన ప్రగతిపై ప్రతికూల ప్రభావం పడే వీలుందన్నారు. వారిని కొనసాగించేలా చూస్తామని మంత్రి తెలిపారు. కందుకూరులోని టీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో రద్దయిన ఎన్‌సీసీ యూనిట్‌ను పునరుద్ధరించాలని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కోరారు.

హాకీ.. వారి హాబీ!

❖ జాతీయ స్థాయి పోటీల్లో మద్దిపాడు బాలికల ప్రతిభ

న్యూస్‌టుడే, మద్దిపాడు

వారు పేదింటి బిడ్డలు. తమ గ్రామంలో ఉన్న ప్రభుత్వ బడిలోనే చదువుతున్నారు. అయినా నిత్యం కఠోర సాధనతో రాష్ట్ర హాకీ జట్టులో స్థానం సంపాదించి జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటుతున్నారు. జట్టు విజయంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. తమ ఊరికి, చదువుతున్న పాఠశాలకు మంచి పేరు తెస్తున్నారు. వారే మద్దిపాడులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ప్రత్యేక తర్ఫీదు పొందుతూ నైపుణ్యాలు పెంచుకుని అండర్ -14, అండర్-17 మహిళల విభాగాల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున ఝార్ఖండ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో జరిగిన జాతీయ స్థాయి హాకీ పోటీల్లో పాల్గొన్నారు. ఉత్తమ ఆటతీరుతో పలువురి ప్రశంసలు అందుకున్నారు. అంతర్జాతీయ స్థాయిలో దేశం తరఫున ఆడాలనేదే తమ లక్ష్యమని చెబుతున్నారు.

ఉత్తరప్రదేశ్ జట్టుతో పోటీ పడుతున్న ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణులు

తల్లిదండ్రుల కోరిక నెరవేరుస్తా..

నా పేరు కావూరి సిరివల్లి. మద్దిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నా. వ్యాయామ ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో హాకీపై ఆసక్తిని పెంచుకున్నా. నాన్న జాన్‌సన్ దర్జీ, అమ్మ దయమ్మ రోజువారీ కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. మా వ్యాయామ ఉపాధ్యాయులు సౌజన్య, వనజలు చాలా రోజుల నుంచి రైట్ ఆఫ్ ఫ్లేయర్‌గా నన్ను తీర్చిదిద్దారు. బాల్ గోల్ చేయడంలో మెలకువలు నేర్పించారు. జిల్లాల మధ్యప్రదేశ్‌లో జరిగిన అండర్ -14 జాతీయ స్థాయి హాకీ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున పాల్గొన్నా. రాష్ట్రం గెలుపు కోసం నా వంతు సహకారం అందించాను. దేశం తరఫున ఆడాలన్నదే మా తల్లిదండ్రుల కోరిక. దానిని తీర్చడమే నా లక్ష్యం.

జట్టు విజయంలో కీలకపాత్ర పోషించా..

నా పేరు మందా అను. 9వ తరగతి చదువుతున్నా. చిన్నప్పటి నుంచే క్రీడలంటే ఆసక్తి. మద్దిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 7వ తరగతిలో ఉన్నప్పుడే హాకీ బ్యాట్ చేతపట్టాను. కూలి పనులు చేసుకుని జీవనోపాధి పొందే మా తల్లిదండ్రులు సురేష్, కోటేశ్వరమ్మలు ఇచ్చిన ప్రోత్సాహంతో పాటు, పాఠశాల ఉపాధ్యాయుల సహకారం మరువలేను. మా వ్యాయామ ఉపాధ్యాయులు హాకీలో సెంటర్ ఫార్వర్డ్ క్రీడాకారిణిగా నన్ను తీర్చిదిద్దారు. ఝార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో జరిగిన అండర్-17 విభాగంలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో త్రిపుర, బిహార్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలపై విజయం సాధించి తొలిసారి మన రాష్ట్ర జట్టు క్వార్టర్ ఫైనల్ వరకు వెళ్లడానికి నా వంతు ప్రతిభ చాటాను. అంతర్జాతీయ స్థాయిలో ఆడాలన్నదే నా ధ్యేయం.

సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

బీచ్ ఫెస్టివల్‌కు పటిష్ఠ బందోబస్తు

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పాకల బీచ్ ఫెస్టివల్‌కు పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ఆ మేరకు సింగరాయకొండ మండలం పాకల తీరం వద్ద చేస్తున్న ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. పర్యాటకులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించడంతో పాటు పూర్తి స్థాయి భద్రత కల్పించేలా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. నిర్దేశిత ప్రదేశాల్లో మాత్రమే సందర్శకులు స్నానాలు చేసేలా చూడాలన్నారు. ఆయా ప్రాంతాల్లో ఎలాంటి అప్రమత్తతకు తావులేకుండా 50 మంది గజ ఈతగాళ్లు, మెరైన్ పోలీసులను సిద్ధం చేయాలని ఆదేశించారు. వాహనాల రాకపోకల సమయంలో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చూడటంతో పాటు రహదారి మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఇబ్బందికర పరిస్థితులు ఎదురైతే ప్రజలు సమీపంలోని పోలీసులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు శివన్నారాయణ, హజరత్తయ్య, ఎస్సైలు మహేంద్ర, నాగమల్లేశ్వరరావు, బి. మహేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

శైవక్షేత్రాల వద్ద పోలీసు పహారా

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: మహా శివరాత్రి నేపథ్యంలో ఈ నెల 15వ తేదీన జిల్లాలోని అన్ని ప్రముఖ శైవక్షేత్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ట్రాఫిక్ మళ్లింపు, పార్కింగ్ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని క్షేత్రస్థాయి అధికారులను సూచించారు. సాంకేతికతను పూర్తిగా వినియోగించుకుంటూ ఆయా ప్రాంతాల్లో నిఘా పెట్టాలని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా, ఏదైనా అనూహ్య సంఘటన జరిగితే తక్షణం స్పందించి చర్యలు చేపట్టేందుకు కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తుల కదలికలు ఉంటే స్థానిక పోలీసులతో పాటు డయల్-112/ 100 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ ఓ ప్రకటనలో కోరారు.

బస్సులు లేక ఇలా వెళ్తున్నారు

కాలినడకన శ్రీశైలం చేరుకుని భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించుకున్న భక్తులు తిరుగు ప్రయాణంలో సాహసంగా మారింది. తమ గమ్య స్థానం చేరేందుకు అవసరమైన ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో వారికి ప్రైవేటు వాహనాలే దిక్కయ్యాయి. ఆటోలు, బొలెరో ఆటోల్లో టాప్‌పై తమతో వచ్చిన చిన్నారులను ఎక్కించుకుని ప్రయాణం సాగిస్తున్నారు. నల్లమల ఘాట్ రహదారుల్లో ప్రమాదమని తెలిసినా తప్పని సరి పరిస్థితుల్లో ప్రయాణం చేస్తున్నామని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
– న్యూస్‌టుడే, పెద్దదోర్నాల

శ్రీశైలానికి 80 ప్రత్యేక బస్సులు

❖ మార్కాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ లావణ్య

న్యూస్‌టుడే, మార్కాపురం:

మహాశివరాత్రి వస్తోందంటే మార్కాపురం జిల్లా, దీనిని ఆనుకుని, శ్రీశైల ముఖద్వారంగా పేరొందిన పెద్దదోర్నాలలో ఒకటే సందడి. స్వామిని దర్శించుకునేందుకు, మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు కాలినడకన, ఆర్టీసీ బస్సుల్లో, ప్రైవేటు వాహనాల్లో వెళ్తుంటారు. ప్రస్తుతం ఆర్టీసీ తగినన్ని బస్సులు వేయకపోవడంతో భక్తులు ప్రైవేటు వాహనాల్లో కిక్కిరిసి ప్రమాదకరంగా వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో మార్కాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ లావణ్యను 'న్యూస్‌టుడే' బుధవారం పలకరించింది. బస్సులు, ఇతర ఏర్పాట్ల గురించి 'ముఖాముఖి' నిర్వహించగా ప్రత్యేక బస్సులు తిప్పనున్నట్లు తెలిపారు. ఆ వివరాలు.. ఆమె మాటల్లోనే...

ముఖాముఖి

24 గంటలూ బస్సులు తిరుగుతాయి

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 14, 15 తేదీల్లో 24 గంటలూ మార్కాపురం నుంచి 80 బస్సులు తిరుగుతాయి. ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటే అదనంగా బస్సులు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటాం. తిరుగు ప్రయాణాల్లో ఇక్కడి నుంచి ఒంగోలుకు అవసరమైతే అదనంగా బస్సులు నడుపుతాం.

ఇతర డిపోలనుంచీ నడిపేలా చూస్తాం

కేవలం మార్కాపురం నుంచే కాకుండా పొదిలి, గిద్దలూరు, కనిగిరి డిపోల నుంచి కూడా శ్రీశైలానికి అదనంగా బస్సులను ఏర్పాటు చేసేలా చూస్తాం. ప్రస్తుతం మార్కాపురం నుంచి భక్తుల రద్దీ కారణంగా 15 బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. 14వ తేదీ ఉదయం నుంచి 80 బస్సులు అందుబాటులోకి వస్తాయి.

త్రిపురాంతకేశ్వరాలయానికీ ..

శివరాత్రి వేడుకల్లో మరో కీలకమైన త్రిపురాంతకేశ్వరస్వామి దేవాలయానికి ప్రస్తుతం రోజుకు ఆరు బస్సు సర్వీసులు తిరుగుతున్నాయి. ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటే అదనంగా ఎన్ని బస్సులు అయినా ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నాం. ప్రయాణికులు, భక్తులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ప్రాంగణంలో తాగు నీటి వసతి కల్పిస్తున్నాం. ప్రజలు ఆర్టీసీ బస్సు సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి.

కొనుగోలు కేంద్రాల ఏర్పాటు పట్టదా ?

❖ మొక్కజొన్న రైతు విలవిల

న్యూస్‌టుడే, తాళ్లూరు, దర్శి :

ఆపసోపాలు పడి వరి సాగు చేసినా.. నష్టాలే పలకరించడంతో పలువురు రైతులు ఈ దఫా మొక్కజొన్న వైపు దృష్టి సారించారు. దీంతో ప్రస్తుత రబీ సీజన్‌లో జిల్లావ్యాప్తంగా సాగు గణనీయంగా పెరిగింది. దిగుబడులు కూడా ఆశాజనకంగా ఉన్నా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు విలవిల్లాడుతున్నారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో అత్యధికంగా గిద్దలూరు, అర్థవీడు, బేస్తవారపేట, కొమరోలు, పుల్లలచెరువు, రాచర్ల, తాళ్లూరు, త్రిపురాంతకం, అద్దంకి ప్రాంతాల్లో విస్తారంగా మొక్కజొన్న సాగైంది. సాధారణ విస్తీర్ణం 5,626 హెక్టార్లకుగాను 19,283 హెక్టార్లలో పంట వేయడం విశేషం. ఎకరా సొంత పొలం కలిగిన రైతులు రూ.35 వేలు, కౌలు రైతులు మరో రూ. పదివేలు అదనంగా ఖర్చు చేశారు. తెగుళ్ల ప్రభావం తక్కువగా ఉండడంతో రైతులకు ఇబ్బందులు కొంతమేర తగ్గాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈపాటికే కోతలు ప్రారంభించారు. దిగుబడులు ఆశాజనకంగా 30 నుంచి 40 క్వింటాళ్ల వరకూ వస్తున్నాయి. మార్కెట్‌లో ధరలు లేకపోవడం నిరాశకు గురిచేస్తోంది.

కొత్తపాలెంలో ట్రాక్టరుకు లోడ్ చేస్తున్న మొక్కజొన్న బస్తాలు

మధ్యవర్తులు ధరలు తగ్గించేసి..

ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.2400 ఉంది. అయితే మధ్యవర్తులు రూ.1900కే కొనుగోలు చేస్తున్నారు. దీంతో క్వింటాకు రూ.500 వరకూ నష్టపోతున్నారు. ఎకరాకు రూ.20 వేల కంటే తక్కువ రాబడులు వస్తున్నాయని ఇలా ఉంటే పెట్టుబడి డబ్బులు కూడా రావని వారంటున్నారు. ప్రభుత్వం తరపున తక్షణం కొనుగోలు కేంద్రాలు తెరిస్తే తాము గట్టెక్కుతామని వారంటున్నారు. ఈ విషయమై జిల్లా మార్కెటింగ్ విభాగం డీఎం హరికృష్ణను సంప్రదించగా జిల్లా రైతులు రబీ సీజనులో సాగు చేసి ఉత్పత్తి చేసిన మొక్కజొన్నను కొనుగోలు చేస్తామని, త్వరలోనే ఉన్నతాధికారుల నుంచి అనుమతులు తీసుకొని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేస్తామన్నారు.

అదనపు భూసేకరణకు వినతి

కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ కార్యదర్శి ఉమాశంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ మాగుంట

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: అత్యవసర పరిస్థితుల్లో విమానాలు దిగేందుకు సింగరాయకొండ వద్ద జాతీయ రహదారిపై అదనపు భూ సేకరణ చేయాలని కోరుతూ కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారులశాఖ కార్యదర్శి ఉమాశంకర్‌కు దిల్లీలో బుధవారం ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి వినతి పత్రం అందజేశారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన అత్యవసర లాండింగ్ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. త్రోవగుంట-చదలవాడ గ్రామాల మధ్యలో 7.5 కి.మీ మేర విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలని విన్నవించారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ ఓ ప్రకటనలో తెలిపారు.

త్రిశూలేశ్వర అలంకారంలో నిర్మమహేశ్వరుడు



పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి శ్రీపార్వతీదేవి సమేత నిర్మ మహేశ్వర స్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం అశ్వవాహనంపై త్రిశూలేశ్వర అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవాలయంలో స్వామివారికి ప్రత్యేకపూజలు, మహిళల భజనలు, సహస్ర నామార్చనలు, పుష్పార్చన కార్యక్రమాలు గావించారు. కమిటీ సభ్యులు ఉభయదాతలు శింగంశెట్టి వెంకట సుబ్బారావు, చంద్రశేఖర్, బ్రహ్మేంద్రరావు, ధనలక్ష్మమ్మ, కె. వెంకటేశ్వర్లు, బి.వెంకట సుబ్బారావు కుటుంబ సభ్యులను మేళతాళాలతో దేవాలయానికి ఆహ్వానించారు. ఉభయదాతలు, బంధువులతో ఆగమ నిర్వాహకులు కె.బాలకృష్ణ, ఎం.సుబ్బనరసయ్య, సుధాకర్, మంత్రపుష్పార్చన, పూజలు జరిపించారు. అనంతరం స్వామివారిని భక్తుల దర్శనం కోసం గ్రామంలో ఊరేగించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఛైర్మన్ ఒగ్గు వెంకటరామయ్య, ధర్మకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గృహ నిర్మాణ శాఖ ఇన్‌ఛార్జి పీడీ శ్రీనివాస ప్రసాద్

ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఉగాది నాటికి పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేయాలని గృహ నిర్మాణ శాఖ మార్కాపురం జిల్లా ఇన్‌ఛార్జి పీడీ పెరుగు శ్రీనివాసప్రసాద్ ఆదేశించారు. మార్కాపురం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశపు హాలులో బుధవారం ఆ శాఖ అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలో అసంపూర్తిగా ఉన్న 5,169 గృహాలను వెంటనే పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను పీఎంఏవై గ్రామీణ్ పథకం కింద 24,177 నూతన గృహాలకు అర్హత వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం ఈఈ పవన్‌కుమార్, కనిగిరి ఈఈ కోటిరెడ్డి, వైపాలెం, గిద్దలూరు డిఈలు సురేష్ బాబు, ఖదీర్‌బాష, జిల్లాలోని ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాల్సిందే

బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఫుడ్ కమిషన్ సభ్యుడు లక్ష్మీరెడ్డి

అద్దంకి, న్యూస్‌టుడే : ప్రభుత్వం నిర్దేశించిన విధంగా పాఠశాల విద్యార్థులకు తప్పనిసరిగా మెనూ ప్రకారం ఆహారం అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు ఎందేటి లక్ష్మీరెడ్డి అన్నారు. బుధవారం అద్దంకి బాలుర, బాలికల, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. సరఫరా అవుతున్న కోడిగుడ్లు, బియ్యం నిల్వలను సరి చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం వండే సమయంలో సంబంధిత ఉపాధ్యాయులు రుచి చూడాలన్నారు. నాణ్యమైన బియ్యం, సరకులు సరఫరా చేస్తున్న నేపథ్యంలో మంచి ఆహారం అందించాలన్నారు. బాలికల ఉన్నత పాఠశాలలో ఎక్కువ సైకిళ్లు ఉండటాన్ని గమనించి వివరాలు అడిగారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో ఏడువేల మంది విద్యార్థులకు సైకిళ్లు సరఫరా చేసినట్లు ఉపాధ్యాయులు వివరించారు. మరో మూడు వేల మందికి సైకిళ్లు ఇవ్వనున్నట్లు తెలుసుకుని అభినందించారు. ఆయన వెంట జిల్లా పౌర సరఫరా అధికారిణి పద్మశ్రీ, డిపో మేనేజరు వరలక్ష్మి, జీసీటీవో హేమలత, సాంఘిక సంక్షేమ గురుకుల సమన్వయకర్త డీ జయ, తూనికలు కొలతల అధికారి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కూలి పనికోసం వచ్చి..

❒ బంగారం, నగదు ఎత్తుకెళ్లాడు

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: దారిన వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తిని కూలి పనికోసం పిలిచిందామె. పనిచేస్తున్నట్లు నటించి అదును చూసి అదే ఇంటికి కన్నమేశాడు అతడు. రూ.లక్ష నగదు, అయిదు సవర్ల బంగారు ఆభరణాలు అపహరించుకుని వెళ్లిపోయాడు. ఒంగోలు రైలుపేట ఒకటో లైనులో బుధవారం జరిగింది ఈ సంఘటన. రెండో పట్టణ పోలీసులు కథనం మేరకు.. స్థానిక రైలుపేటలో విశ్రాంత తహసీల్దార్ కల్లూరి ఇందిరాదేవి నివసిస్తుంటారు. ఆమె ఇంటి నిర్మాణం చేపట్టారు. ఈ క్రమంలో అక్కడ కొన్ని కర్రల తొలగింపు కోసం ఆ దారిని వెళ్తున్న ఒక అపరిచిత వ్యక్తిని పిలిచి కూలిపని అప్పగించారు. ఆమె ఆదమరిచి ఉన్న సమయంలో వేరొక గదిలోకి వెళ్లిన ఆ వ్యక్తి బీరువా పగలకొట్టి అందులో ఉన్న బంగారం, నగదు అపహరించుకొని వెళ్లాడు. కర్రలు తీసేందుకు వెళ్లిన వ్యక్తి ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో అనుమానించిన ఇందిరాదేవి అక్కడికి వెళ్లి చూడగా సదరు వ్యక్తి కనిపించలేదు. బీరువా పగలగొట్టి ఉంది. అందులోని నగదు, నగలు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ మేడా శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు

ఒంగోలు గ్రామీణం: పాడి రైతులకు సేవల ద్వారా మంచి గుర్తింపు వస్తోందని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఎన్.వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక రంగారాయుడు చెరువు సమీపంలోని డీఎల్‌డీఏ కార్యాలయంలో బుధవారం ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన ఆరుగురు వీఎల్వోలకు సన్మానసభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ రీత్యా సర్వీసులో 30 నుంచి 40 సంవత్సరాల పాటు పశు వైద్యశాలలో మూగ జీవాల సంక్షేమానికి చేసిన సేవలు అభినందనీయమన్నారు. వైద్య సిబ్బంది అందరూ స్థానికంగా అందుబాటులో ఉంటూ సకాలంలో సత్వర సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎన్‌జీవీఎఫ్ జిల్లా అధ్యక్షుడు టీవీ. రమేష్, మార్కాపురం జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి రాఘవయ్య, డీడీలు జయచంద్ర, మురళీకృష్ణ, శ్రీధర్, జగత్ శ్రీనివాసరావు, లావణ్య, పారా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 120, రిటైల్ లైవ్ - 142, చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్- 234

వివాహిత ఆత్మహత్య

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కుటుంబ వివాదాల నేపథ్యంలో వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఒంగోలులో గురువారం జరిగింది. రెండో పట్టణ పోలీసుల కథనం మేరకు.. నల్లగర్ల పద్మజ(38), ఎంఎస్సీ బీఈడీ చేశారు. పదేళ్ల ఏళ్ల క్రితం మొనపాటి చంద్రశేఖర్ అనే వ్యక్తితో వివాహమైంది. పద్మజ గృహిణిగా ఉండగా చంద్రశేఖర్ ఒక ప్రైవేటు హాస్పిటల్‌లో పనిచేస్తున్నాడు. అతను వ్యసనాలకు బానిస కావడంతో భార్యాభర్తల మధ్య తరచుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం తాము నివాసం ఉంటున్న ఇంటిలో పద్మజ చీరతో ఫ్యానుకు ఉరివేసుకుంది. ఆమె కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండో పట్టణ సీఐ మేడా శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనదారుడి మృతి

పెదనెమలిపురి(రాజుపాలెం), న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరు మృతి చెందిన ఘటన అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారిపై పెదనెమలిపురి వద్ద బుధవారం జరిగింది. ప్రకాశం జిల్లా పొదిలి మండలం ఏలూరుకు చెందిన ధర్మవరపు శివకుమార్‌రెడ్డి(24) ద్విచక్ర వాహనంపై పిడుగురాళ్లకు బయలుదేరాడు. మార్గమధ్యలో పెదనెమలిపురి గ్రామంలోని తిరుపతమ్మ ఆలయ సమీపానికి చేరుకోగానే వాహనం అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ఘటనలో అతడి తల డివైడర్‌ను తగడంతో బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై మణికృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జల్సాలకు అలవాటు పడి.. దొంగలుగా మారి..

❖ రూ.4 లక్షల విలువైన ద్విచక్ర వాహనాలు స్వాధీనం

మాట్లాడుతున్న సీఐ సుబ్బారావు

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం, గుంటూరు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న ముఠాకు మార్కాపురం పోలీసులు అడ్డుకట్ట వేశారు. బుధవారం స్థానిక సీఐ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మార్కాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బారావు తెలిపిన వివరాల మేరకు మార్కాపురం పట్టణంలోని విజయ సినిమా థియేటర్ ప్రాంతానికి చెందిన సయ్యద్ మజీద్ అలియాస్ ఆషిక్, దూదేకుల మొహిద్దీన్‌షా, గుంటూరు నగరంలోని నల్లచెరువు వీధికి చెందిన పులి ఆంజిరెడ్డిలు పాత నిందితులు. వీరు గతంలో ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో ద్విచక్ర వాహనాలు చోరీ చేసి అమ్మగా వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తున్నారు.

జైల్లో పరిచయం స్నేహంగా మారింది..

ఒకే జైల్లో గడుపుతున్న సమయంలో ముగ్గురి మధ్య పరిచయం ఏర్పడింది. జైలు నుంచి బెయిల్‌పై వచ్చిన తర్వాత కూడా వాహనాలు చోరీ చేయసాగారు. బుధవారం ఉదయం మండలంలోని కోమటికుంట వై- జంక్షన్ వద్ద మార్కాపురం గ్రామీణ ఎస్సై వి.వేమన వాహనాలు తనిఖీలు చేస్తున్న సమయంలో ఉదయం 9:30 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై ఈ ముగ్గురు కుంటవైపు రాసాగారు. పోలీసులను చూసి పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. విచారించగా గుంటూరులో రెండు ద్విచక్ర వాహనాలు, పల్నాడు జిల్లా వినుకొండలో ఒక ద్విచక్ర వాహనం, మార్కాపురం మండలంలోని రాయవరం గ్రామంలో ఒక ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసినట్లు అంగీకరించినట్లు తెలిపారు. కోమటికుంట వద్ద ఉన్న ముళ్ల పొదల్లో వాహనాలను ఉంచి ఒక్కొక్కటిగా విక్రయిస్తున్నట్లు చెప్పారు. నిందితుల నుంచి మూడు బులెట్‌లు, మరొక పల్సర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసును ఛేదించినందుకు జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీ హర్షవర్ధన్ రాజు, డీఎస్పీ నాగరాజు, సీఐ, ఎస్సైలను ప్రత్యేకంగా అభినందించినట్లు చెప్పారు. అంతేకాకుండా కేసులో క్రియాశీలకంగా వ్యవహరించిన కానిస్టేబుళ్లు గిరి, వెంకటేశ్వర్లును అధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

EENADU e Classifieds

AGRI BUSINESS

సాయి ప్రాపర్టీస్ & ప్రాజెక్ట్స్ ఎర్రచందనం 25 సెంట్స్, 9 లక్షలు. ప్రకాశం, నెల్లూరు, కడప, కర్నూలు, అనంతపురంలో కలదు. సంప్ర|| J. సతీష్‌బాబు. 9703753121.

సరిపూడి సుజుకి ఒంగోలులో పనిచేయుటకు స్పేర్స్‌మేనేజర్ (స్పేర్స్ నందు అనుభవం) స్పేర్స్ అసిస్టెంట్స్ కావలెను. ✆77999 60149, 77999 60199, 77999 60279.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజ నందు వార్డెన్స్ మరియు హాస్టల్ ఇన్‌ఛార్జ్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము 12000/-నుండి 15000/- వరకు ఇవ్వబడును (నాన్‌లోకల్ వారికి ఉచిత భోజనము, వసతి కల్పించబడును). విద్యార్హతలు: ఇంటర్ నుండి డిగ్రీ వరకు, వయస్సు:22 సం||రాలు నుండి 40 సం||రాలు ఉండవలెను. వివరాలకు సంప్ర| 92487 33371.

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్‌క్యాష్). ✆ 81422 92071.

నలంద CBSE స్కూల్ గాయత్రినగర్ కావలి నందు పనిచేయుటకు ప్రైమరి తెలుగు, మ్యాథ్స్, హయ్యర్ మాథ్స్, సోషల్, సైన్స్, అకాడమిక్ కో-ఆర్డినేటర్ టీచర్స్ కావలెను. మంచి జీతం + నాన్ లోకల్స్‌కి ఉచిత భోజనం + వసతి కల్పించబడును. ✆ 62653 97498, 91210 24992

EDUCATION

DISTANCE EDUCATION

ఆచార్యనాగార్జున యూనివర్సిటీ దూరవిద్యాకేంద్రం నిర్వహిస్తున్న M.Sc (అన్నికోర్సులు), M.A (అన్నికోర్సులు) MBA, MCA, M.Com, MLiSc కోర్సులకు అడ్మిషన్లు జరుగుచున్నవి. గీతం డిగ్రీకాలేజి, ఒంగోలు. సెల్: 9849124970, 9030568558.

SECURITY GUARDS

నెల్లూరుజిల్లా గూడూరు పరిసర ప్రాంతాలలోకి అనుభవం ఉన్న ASO & సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 12hrs డ్యూటీ, జీ.+PF, ESI, ఫ్రీ రూమ్, సబ్సిడి ఫుడ్. 96189 71229, 9550214234

JOBS

MSK సెక్యూరిటీలో పని చేయుటకు సెక్యూరిటీగార్డ్స్, హౌస్ కీపింగ్, ఫీల్డ్ ఆఫీసర్స్, కెప్టెన్స్, స్టీవర్డ్స్, రిసెప్షనిస్ట్ కావలెను. రూం+భోజనం ఫ్రీ ✆ 83283 64242.

విజయశ్రీ సూపర్ స్పెషాలిటి హాస్పిటల్ ఒంగోలులో పనిచేయుటకు అనుభవం ఉన్న స్త్రీ GNM-2, రిసెప్షనిస్ట్-2, ల్యాబ్‌టెక్నీషియన్-1, నైట్‌డ్యూటి GNM Boys-2, కావలెను. ✆ 98498 78129, 63057 88609.

గుంటూరులోని రియల్‌బూమ్ రియల్‌ఎస్టేట్ సర్వీసెస్ నందు పని చేయుటకు కంప్యూటర్ ఆపరేటర్స్ (50), టెలీకాలర్స్(10), DDOలు (10) కావలెను. ✆ 78010 32689.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయం లో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

కనిగిరి

• కనిగిరి • గిద్దలూరు

రెసిడెన్షియల్ పాఠశాల సక్రమంగా ఉపయోగించుకోండి

విద్యార్థితో మాట్లాడుతున్న డీఈవో శ్రీనివాసరెడ్డి

కనిగిరి, న్యూస్‌టుడే: కనిగిరి మండలంలోని కంచర్లవారిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి ప్రత్యేక శిక్షణా కేంద్రాన్ని బుధవారం రాత్రి కనిగిరి డిడివో కె.శ్రీనివాసులరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని తనిఖీ చేశారు. వసతి గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కనిగిరి, పొదిలి, వెలిగండ్ల మండలాలకు చెందిన 62 మంది పదో తరగతి విద్యార్థులు పాఠశాలకు సక్రమంగా పోని వారిని గుర్తించి తల్లిదండ్రుల అంగీకారం మేరకు ఈ ప్రత్యేక శిక్షణా కేంద్రానికి తరలించి రెసిడెన్షియల్ విధానంలో విద్యాబోధన చేస్తున్నట్లు తెలిపారు. అంత్యంత ముఖ్యమైన అంశాలతో ప్రశ్నలతో విద్యార్థులకు తర్ఫీదునిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కనిగిరి, సీఎస్‌పురం ఎంఈవోలు ఉడుమల నారాయణరెడ్డి, రాజాల కొండారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు సిహెచ్ విజయభాస్కర్‌రెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

బేస్తవారపేట, న్యూస్‌టుడే: విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని అందించాలని ఎంఈవో-1 మధుసూదన్‌రెడ్డి, ఎంఈవో-2 సీ.వి రమణారెడ్డి నిర్వాహకులను ఆదేశించారు. బుధవారం బేస్తవారపేటలోని మెయిన్ ప్రాథమిక పాఠశాల, మండలంలోని పందిళ్లపల్లి జడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలోని పలు దస్త్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

గురుకుల పాఠశాల పరిశీలన

రాచర్ల, న్యూస్‌టుడే: స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలను సమగ్ర శిక్ష అభియాన్ డీఈ పి.వి.రమణయ్య, ఏఈ రామాంజనేయరెడ్డి, గుత్తేదారు కృష్ణమోహన్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. విద్యార్థులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మేరీ మంజుల తదితరులు పాల్గొన్నారు.

● కంభం: పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డిప్యూటీ ఎంపీడీవో దేవరశెట్టి బ్రహ్మయ్య పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థుల స్టడీ అవర్, వంద రోజుల ప్రణాళికను బుధవారం పరిశీలించారు. విద్యార్థులకు అల్పాహారం అందించడంపై హర్షం వ్యక్తం చేశారు. నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో అబ్దుల్‌సత్తార్, సీఆర్పీ మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అతిథి గృహం నిరుపయోగం

వాడుకలోకిరాని గెస్ట్‌హౌస్

అర్థవీడు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని పోలీసు గెస్ట్‌హౌస్ పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. నెలల తరబడి గెస్ట్‌హౌస్ వాడుకలో లేకపోవటంతో ఆవరణమంతా వ్యర్థాలతో నిండిపోయింది. దీన్ని వాడులోకి తీసుకొచ్చి వినియోగించాలని ప్రజలు కోరుతున్నారు.

వేసవి వస్తున్నా క్రాష్ ఊసేదీ ?

❖ వెంటాడుతున్న నీటి కష్టాలు

న్యూస్‌టుడే, కనిగిరి : పరిశీలన

వేసవి ముంచుకొస్తున్నా.. అధికారులు బోర్ల మరమ్మతుల ఊసెత్తకపోవడంపై కనిగిరివాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు ప్రతి ఏడాది ఫిబ్రవరి 1 నుంచి మార్చి 15 వరకు క్రాష్ కార్యక్రమం చేపడతారు. ప్రధానంగా చేతి పంపులతో పాటు రక్షిత మంచినీటి పథకాలు వినియోగంలోకి తీసుకురావాలన్నది దీని ఉద్దేశం. అయితే ఇప్పటికీ కనిగిరి ప్రాంతంలో దీనికి శ్రీకారం చుట్టకపోవడం ఆవేదన కలిగిస్తోంది.

కనిగిరి నియోజకవర్గంలోని కనిగిరి, పామూరు, వెలిగండ్ల, హనుమంతునిపాడు, సీఎస్ పురం, పీసీ పల్లి మండలాల్లో మూడు వేలకు పైగా బోర్లున్నాయి. ఇందులో మూడొందల వరకూ బోర్లు మూలకు చేరాయి. మరికొన్ని మరమ్మతులకు గురయ్యాయి. క్రాష్ కార్యక్రమంలో భాగంగా ప్రతి మండలానికి సుమారు రూ.5 లక్షల వరకు మంజూరు చేసి వాటితో గొట్టాలు ఇతర పరికరాలు కొనుగోలు చేస్తారు. అయితే కొనుగోలు చేశారే గానీ ఇంతవరకు మరమ్మతులకు గురైన చోట వాటిని వినియోగించ లేదు. దీంతో నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. వెంటనే అధికారులు స్పందించి ప్రత్యేకంగా ఒక వాహనాన్ని ఏర్పాటు చేసి మెకానిక్‌లను పంపి వెంటనే మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ వరికూటి విశ్వనాథరెడ్డిని వివరణ కోరగా, క్రాష్ కార్యక్రమం ఇంకా మొదలుకాలేదన్నారు. త్వరలోనే కార్యాచరణ సిద్ధం చేస్తామన్నారు.

కనిగిరి పట్టణంలో నీళ్లు రాని చేతి పంపు

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

కనిగిరి : 8008574114

గిద్దలూరు పట్టణం : 8008574135

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

అర్థవీడు, న్యూస్‌టుడే:

?: అయ్యవారిపల్లి చిలకనగర్ కాలనీలో సీసీ రోడ్డుకు అనుసంధానంగా కల్వర్టు లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. – పుల్లయ్య.

✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. కాశీంపీరా, ఎంపీడీవో.

అర్థవీడు, న్యూస్‌టుడే:

?: బొమ్మిలింగం ప్రభుత్వ పాఠశాల గేటు ఎదురు రహదారిపై మురుగు నిలిచి విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోంది. సమస్య పరిష్కరించాలి. - శ్రీను.

✓: పారిశుద్ధ్య కార్మికులతో మురుగు తొలగిస్తాం. –నరేష్, పంచాయతీ కార్యదర్శి.

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే:

?: మండలంలోని తిమ్మారెడ్డిపల్లి వద్ద పైప్‌లైన్ లీకవటంతో గ్రామంలోకి సాగర్‌నీరు రావడం లేదు. సమస్య పరిష్కరించాలి. – ఎం.శ్రీనివాసరెడ్డి, గ్రామస్థులు

✓: మరమ్మతులు చేయిస్తాం – శ్రీకాంత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే: మండలంలోని తిమ్మారెడ్డిపల్లి ఉపకేంద్రం పరిధిలోని హెచ్‌ఎంపాడు, కొండారెడ్డిపల్లి, దాసరిపల్లి గ్రామాలకు విద్యుత్తు సరఫరాను గురువారం ఉదయం గం.8ల నుంచి మధ్యాహ్నం గం.12ల వరకు నిలిపివేస్తున్న మండల విద్యుత్‌శాఖ ఏఈ మణికంఠ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రం హెచ్‌ఎంపాడు టవర్‌లకు కొత్త స్తంభాలు వేస్తున్నందున విద్యుత్తు సరఫరా నిలిపి వేస్తున్నామని తెలిపారు. ఈ అసౌకర్యాన్ని గుర్తించి ప్రజలు సహకరించాలని కోరారు.

మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీధర్

సేంద్రియ ఎరువు తయారు చేయండి

కనిగిరి, న్యూస్‌టుడే: తడి, పొడి చెత్త, సేంద్రియ ఎరువుల తయారీపై బుధవారం కనిగిరి మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులకు, పొదుపు గ్రూపు సభ్యులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ మాట్లాడుతూ.. ఘనవ్యర్థాల నిర్వహణ ఎంతో కీలకమన్నారు. శిక్షణ పొందిన వారు తమ పరిధిలోని వార్డుల్లో తడి, పొడి చెత్త ఇతర ప్రమాదకర చెత్తను విభజించడంలో ఇంటిలో ఉత్పత్తి అయ్యే తడి చెత్తతో సేంద్రియ ఎరువుల తయారు చేయు పద్ధతులపై అవగాహన కల్పించాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలన్నారు. సచివాలయ మహిళా సంఘాల సభ్యులు, ఆర్పీలు ప్రతి ఇంటిని సందర్శించి స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రజలను భాగస్వాములను చేసి కనిగిరి మున్సిపాలిటీని ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ నాయబ్ రసూల్, మెప్మా సీవో రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

అశ్వవాహనంపై నారాయణుడు

స్వామివారి పల్లకీ మోస్తున్న భక్తులు

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: ప్రసిద్ధి గాంచిన పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అశ్వవాహన సేవ కనుల పండువగా జరిగింది. మహాగణపతి కూష్మాండ, అరుణ మహా సౌర హోమములు, లఘుపూర్ణాహుతి, దీక్షా హోమములు పూజా కార్యక్రమాలు జరిగాయి. అర్చకులు ఎం.శివప్రసాద్‌శర్మ హోమాలు, ఇతర పూజలు నిర్వహించారు. ఈవో ఎస్.నరసింహా బాబు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కె.చిన్నఆది నారాయణలు సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు. సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

● కనిగిరి: భక్తి శ్రద్ధలతో శివరాత్రి పర్వదినాన్ని జరుపుకోవాలని సీఐ ఉప్పు శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం కనిగిరి పట్టణంలోని విజయమార్తాండేశ్వర దేవస్థానం, మండలంలోని పునుగోడు సిద్ధేశ్వరాలయాన్ని సందర్శించి కమిటీ సభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి ఘర్షణలు, శాంతి భద్రతలకు విఘాతం కల్గించే కార్యక్రమాలు నిర్వహించకూడదన్నారు. కేవలం భక్తి సంబంధ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం ఏపీ ఏర్పాట్లు చేస్తున్నారని కమిటీ సభ్యుల ద్వారా తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హనుమంతునిపాడు ఎస్సై మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

● బేస్తవారపేట: మండలంలోని మోక్షగుండం సమీపాన వెలసిన ముక్తీశ్వర ఆలయంలో 15న మహా శివరాత్రి సందర్భంగా ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఉత్సవ ఏర్పాట్లను బుధవారం తహసీల్దార్ జితేంద్రకుమార్ అధికారులతో కలిసి పరిశీలించారు. శివరాత్రి నాడు ఆలయాన్ని దర్శించుకుని రాత్రికి అక్కడ జాగారం చేసేందుకు గానూ పలు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రానున్న నేపథ్యంలో ఆలయంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్‌కి సైతం అంతరాయం కలగకుండా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై రవీంద్రారెడ్డి, గిద్దలూరు ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరీ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : వెట్టిచాకిరి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని గిద్దలూరు తహసీల్దారు ఎం.ఆంజనేయరెడ్డి కోరారు. ఆయన బుధవారం గిద్దలూరు తహసీల్దారు కార్యాలయం ఆవరణలో వెట్టిచాకిరి విమోచన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. వెట్టిచాకిరి బాధితులు ఉన్నట్లయితే అధికారులకు తెలియజేస్తే వారికి విముక్తి కలిగించేందుకు చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. విముక్తి పొందిన వారికి పునరావాసం కల్పిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో వెట్టిచాకిరి విమోచన కమిటీ గిద్దలూరు కన్వీనర్ చిట్లూరి ఏలియా, స్పీడ్ ఎన్‌జీవో డి.యోబు, రీడ్ సంస్థ ప్రతినిధి బ్లెస్సింగ్ టన్, బాబ్జీ, ప్రభుదాస్, న్యాయవాది యాసిన్ బాషా పాల్గొన్నారు.

పేద వర్గాలకు మెరుగైన వైద్యం

దేవాంగ్‌నగర్‌లో నిర్మాణం పూర్తి చేసుకున్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

కనిగిరి, న్యూస్‌టుడే: కనిగిరి మున్సిపాలిటీలోని దేవాంగ్ నగర్‌లో రూ.1.22 కోట్లతో నిర్మించిన అర్బన్ ప్రైమరీ హెల్త్‌సెంటర్ ఎట్టకేలకు నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధమైంది. గత వైకాపా అయిదేళ్ల పాలనలో గుత్తేదార్లకు బిల్లులు చెల్లించక పోవడంతో సగంలోని నిర్మాణం వదిలేసి వెళ్లిపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుత్తేదార్లకు నిధులు మంజూరు చేసి వారికి భరోసా కల్పించడంతో ఎట్టకలకు మోక్షం లభించి పూర్తయింది. మరో వారం రోజుల్లో ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానుంది. హెల్త్ సెంటర్ వల్ల పేద వర్గాలకు మెరుగైన వైద్యం అందుతుంది. ప్రతి చిన్న విషయాన్ని పట్టణంలోని కమ్యూనిటీ వైద్యశాలకు ఇతర వైద్యశాలలకు వెళ్ల కుండా అందుబాటులోనే వైద్యం అందుతుండటంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చెట్టు.. కూలితే ముప్పు

బేస్తవారపేటలోని స్థానిక త్రిలోక పుణ్యక్షేత్రానికి వెళ్లే దారిలో ద్వారస్తంభంని ఆనుకుని రహదారి పక్కనే ఎండిపోయిన భారీ వేప చెట్టు ప్రమాదకరంగా తయారైంది. అక్కడి చెట్టు గత కొన్నేళ్ల కాలంగా ఎండిపోయి ప్రస్తుతం చిన్నపాటి గాలి వచ్చిన విరిగి పడే పరిస్థితిలో ఉంది. ఈ దారి నుంచే త్రిలోక పుణ్యక్షేత్రం, అటు దరగా గ్రామానికి వెళ్లేందుకు భక్తులు, స్థానికులు అధిక మొత్తంలో రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం చోటుచేసుకుంటుందోనని వారంతా భయాందోళనలకు గురవుతున్నారు. ప్రమాదం చోటుచేసుకోక ముందే సంబంధిత అధికారులు స్పందించి చెట్టును తొలగించాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, బేస్తవారపేట

అధ్వానంగా రహదారి

మండలంలోని తురిమెళ్ల నుంచి అక్కపల్లి గ్రామం వెళ్లే రహదారిపై కంకర కుప్పలుగా పోశారు. దీంతో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ దారిపై అక్కపల్లి, చోళ్లవీడు, ఆకవీడు, ఆరవీటికోట గ్రామాలకు నెమలిగుండ్ల రంగనాయకస్వామి, సురభేశ్వర కోన ఆలయాలకు వెళ్లే నిత్యం వందలాది వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. 15న మహాశివరాత్రి పండుగ వస్తోంది. ఈ దారికి మరమ్మతులు చేయకపోవటంతో భక్తులు, ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డును బాగు చేయించేందుకు వెంటనే చర్యలు తీసుకుంటామని రహదారులు భవనాల శాఖ డీఈ రాంబాబు తెలిపారు.

–న్యూస్‌టుడే, కంభం

కష్టపడి చదివితే మంచి ఫలితాలు

పామూరు, న్యూస్‌టుడే: పామూరులోని రత్నం విద్యా సంస్థల విద్యార్థుల వీడ్కోలు వేడుకలు బుధవారం అనిల్ గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నృత్య ప్రదర్శనతో ప్రేక్షకులను అలరించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సీఐ యమ్. శ్రీనివాసరావు, ఎంఈవో అరుణకుమారి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి కష్టపడి చదివితే మంచి భవిష్యత్ సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో హజరత్ అలీ, కరస్పాండెంట్ మద్దుల శ్రీనివాసులు, గుత్తి రమణయ్య, గుర్రం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఫీజు చెల్లింపు

విద్యార్థికి నగదు అందజేస్తున్న ఫారెస్టు రేంజి అధికారిణి మధుప్రియాంక

కంభం, న్యూస్‌టుడే : మండలంలోని తురిమెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వారు చెల్లించిన ల్యాబ్, లైబ్రరీ ఫీజును బుధవారం ప్రిన్సిపల్ జి.సోని వెనక్కు ఇచ్చారు. సైన్సు, ఒకేషనల్ విద్యార్థులు ఒకొక్కరికీ రూ. 600, ఆర్ట్స్ వారికి రూ. 150 చొప్పున మొత్తం 118 మందికి రూ.50,500 ప్రిన్సిపల్, ఫారెస్టు రేంజ్ అధికారిణి మధు ప్రియాంక, డిప్యూటీ ఫారెస్టు రేంజ్ అధికారి రంగారెడ్డి నగదు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మొయిన్‌ద్దీన్, కెనరా బ్యాంకు మేనేజర్ శ్రీను నాయక్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న కారు.. ముగ్గురికి గాయాలు

రాచర్ల, న్యూస్‌టుడే: ముందు వెళ్తున్న ఆటో ఒక్కసారిగా మలుపు తిరగడంతో వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొనడంతో ముగ్గురికి గాయాలైన సంఘటన మండలంలోని రంగారెడ్డిపల్లి సమీపంలో అనంతపురం - అమరావతి జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై కోటేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు ఆటోలో ఒద్దులవాగుపల్లి వెళ్లే క్రమంగా రంగారెడ్డిపల్లి వద్ద ఒక్కసారిగా మలుపు తిప్పాడు. అదే సమయంలో అర్ధవీడు మండలం గన్నెపల్లి నుంచి గిద్దలూరు వెళ్తున్న కారు వెనక నుంచి ఆటోను ఢీకొంది. దాంతో కారులో ఉన్న శ్రీను, షేక్ నాగూర్‌కు ఆటో డ్రైవర్ వెంకటేశ్వర్లుకు గాయాలయ్యాయి.

తీరిన ప్రయాణ కష్టాలు

అద్దంలా మారిన బేస్తవారపేట-చిన్నకంభం రోడ్డు

బేస్తవారపేట, న్యూస్‌టుడే: బేస్తవారపేట-చిన్న కంభం రహదారి నూతన రూపు సంతరించుకుంది. ఈ రహదారి మీదుగా చిన్న కంభం, జేబీకే పురం, తురిమెళ్ల వైపుగా నిత్యం వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. రైతులు సైతం పొలాలకు వెళ్లేందుకు ఈ రహదారిలో ప్రయాణిస్తుంటారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాజాగా నూతన రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి చొరవ తీసుకున్నారు. సుమారు రెండు కిలో మీటర్ల మేర ఉన్న రహదారికి నాబార్డ్ (ఆర్ఐడీఎఫ్ ట్రెంచ్-30) నిధుల కింద రూ.90 లక్షలు కేటాయించడంతో అధికారులు చిన్నకంభం బస్టాండ్ నుంచి ఉప్పువాగు వంతెన వరకు తారు రహదారి నిర్మాణ పనులు పూర్తి చేశారు. అక్కడి నుంచి తేరు వరకు సీసీ రహదారి నిర్మించాల్సి ఉందని రెండు రోజుల్లో పనులు మొదలు పెట్టనున్నట్లు పంచాయతీరాజ్ శాఖ జేఈ సుబ్బారావు తెలిపారు.

దీన్‌దయాళ్ బాటలో నడుద్దాం

నివాళులర్పిస్తున్న భాజపా నాయకులు

పామూరు, న్యూస్‌టుడే: పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ వర్ధంతి సందర్భంగా పామూరులోని భాజపా కార్యాలయంలో నాయకులు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా భాజపా సీనియర్ నాయకులు కొండిశెట్టి వెంకట రమణయ్య మాట్లాడుతూ. దేశసేవే ధ్యేయంగా జీవించిన మహానేత దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ అని తెలిపారు. కార్యక్రమంలో భాజపా జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్న సుబ్బయ్య, వెంకట సుబ్బారావు, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

వేములపాడులో...

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే: వేములపాడులో భారతీయ జనతాపార్టీ వ్యవస్థాపకుడు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి వేములపాడులో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల బీజేపీ అధ్యక్షుడు గుంటకల నరేష్ మాట్లాడుతూ దీన్‌దయాళ్ నిరాడంబతను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ నాయకులు టంగుటూరి త్రిమూర్తులు, జిల్లా ఆర్టీఐ కన్వీనర్ గొట్టిముక్కల నరసింహులు, నాగయ్య, పొదిలి పవన్‌బాబు కార్యకర్తలు పాల్గొన్నారు.

రుణాలతో ఆర్థికాభివృద్ధి

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: స్వయం సహాయక పొదుపు సంఘాల మహిళలు రుణాలతో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఏపీఎం ఎం.లక్ష్మీనారాయణ అన్నారు. ఆహార పదార్థాలు తయారు చేసి ప్యాకెట్ చేసి విక్రయించే పొదుపు మహిళలకు స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆహార పదార్థాలు తయారుచేసి అమ్ముకునే సభ్యులకు ఒక్కో సభ్యురాలికి రూ.40 వేలు రుణాన్ని బ్యాంకుల ద్వారా ఇప్పించడం జరిగిందని పేర్కొన్నారు. తీసుకున్న రుణాలతో వ్యాపారాలు చేసుకుని ఆదాయం గడించాలని తెలిపారు. కార్యక్రమంలో సీసీలు టి.కాశయ్య, ఐ.మస్తాన్‌రెడ్డి, ఎంవీ నారాయణమ్మ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

కనిగిరి, న్యూస్‌టుడే: కనిగిరి పట్టణంలోని కొత్తూరు పొలాల్లో బుధవారం జూదం ఆడుతున్న వారిపై కనిగిరి పోలీసులు దాడి చేసి రూ.30 వేలు నగదు స్వాధీనం చేసుకుని ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు సీఐ యు.శ్రీనివాసరావు తెలిపారు.

అసాంఘిక చర్యలకు పాల్పడితే సహించం

కనిగిరి ఆర్టీసీ డిపోలో యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న బ్లూకోల్ట్స్ బృందం

కనిగిరి, న్యూస్‌టుడే: కనిగిరి పట్టణంలోని ఈవ్ టీజింగ్ నివారణకు బ్లూకోల్ట్స్ బృందంతో పెట్రోలింగ్ ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ పి.సాయి ఈశ్వర్ యశ్వంత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఇటీవల జరిగిన సంఘటనలు దృష్టిలో ఉంచుకుని ఈ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. అసాంఘిక చర్యలకు పాల్పడే వారిని ఏమాత్రం ఉపేక్షించేది లేదన్నారు. పట్టణంలోని పాఠశాలలు, కళాశాలల సమీపంలో ఆరు బృందాలు పెట్రోలింగ్ నిర్వహిస్తాయన్నారు. విద్యార్థినులు, బాలికలు, మహిళలు భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. వేధింపు ఘటనలు గమనించినా, ఏదురైన భయ పడకుండా వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. మహిళల రక్షణ కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటుందన్నారు.

కాపు భవన నిర్మాణం పూర్తయ్యేదెప్పుడో..!

పిల్లర్ల స్థాయిలోనే నిలిచిపోయిన నిర్మాణం

కంభం, న్యూస్‌టుడే: తెదేపా హయాంలో మంజూరైన కాపు భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. వైకాపా పాలనలో వాటిని పట్టించుకోలేదు. పట్టణంలోని సచివాలయ -2 సమీపంలో ప్రారంభమైన నిర్మాణం బేస్‌మెంట్, పిల్లర్ల స్థాయిలోనే నిలిచిపోయింది. కూటమి ప్రభుత్వం భవన నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. కానీ ఇప్పటి వరకూ వాటిపై పురోగతి కనిపించలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను పూర్తి చేయాలని ఆ సామాజిక వర్గం ప్రజలు కోరుతున్నారు.

నిలిచిన రోడ్డు పనులు.. నిత్యం ఇబ్బందులు

కనిగిరి - వేములపాడు రోడ్డు దుస్థితి

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే: మండలంలోని కనిగిరి - వేములపాడు డబుల్ రోడ్డు పనులు అర్థాంతరంగా నిలిచిపోవడంతో రోడ్డంతా పగలగొట్టి వదిలి వేయడంతో వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందికరంగా మారింది. మార్జిన్‌లల్లో ద్విచక్రవాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇటుకలు, కర్రలోడు ట్రాక్టర్‌లు పడిపోతున్నాయి. గత మూడేళ్ల క్రితం మొదలైన వందకోట్ల పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇటీవల ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి చొరవతో కనిగిరి నుంచి ఎత్తురోడ్డు వరకు పనులు జరగగా నెలరోజుల నుంచి పనులు నిలిచిపోయాయి. గుత్తేదారు బిల్లులు రాలేదని పనులు నిలిపివేశారు. త్వరలో ప్రారంభిస్తామని ఆర్అండ్‌బీ అధికారులు అంటున్నారు. అక్కడ ఉన్న మిషనరీలు రాత్రికి రాత్రి తీసుకెళ్లడంతో పనులు ఎప్పటికయ్యేనో అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కాగా నిత్యం ప్రమాదాలకు నిలయంగా ఈ రహదారి నిలుస్తోంది. పనులు వెంటనే ప్రారంభించి వేములపాడు వరకు రహదారి పనులు పూర్తి చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల ఫుడ్ ఫెస్టివల్

కూరగాయలు, పండ్లు ప్రదర్శిస్తున్న దృశ్యం

కనిగిరి, న్యూస్‌టుడే: కనిగిరి పట్టణంలోని ఐకిడ్స్ పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన చిన్నారుల ఫుడ్ ఫెస్టివల్ విశేషంగా ఆకట్టుకుంది. తల్లి దండ్రుల చేత తయారు చేయించి తీసుకొచ్చిన వివిధ రకాల ఆహార పదార్థాలను ప్రదర్శనగా ఏర్పాటు చేశారు. మన రాష్ట్రంలోని వివిధ రకాల వంటకాలతోపాటు, ఇతర రాష్ట్రాలకు చెందిన వంటకాలను ప్రదర్శించారు. స్నాక్స్, పలావు, ఖీర్, లడ్డు, జిలేబీలు, అరిసెలు, కజ్జికాయలు, చక్రాలు, పరమాన్నం, జంతికలు, కూరగాయలు, పండ్లు ఇలా రకరకాలు తీసుకొచ్చి ప్రదర్శనగా పెట్టారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ షేక్ రజియా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

పరీక్ష సామగ్రితో విద్యార్థులు, దాత ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు

రాచర్ల, న్యూస్‌టుడే : మండలంలోని అనుమలవీడు ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు వైకాపా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు పిడతల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి 40 మంది విద్యార్థులకు అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు తదితర సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో రవీంద్రనాథ్‌రెడ్డి, జప్రుల్లాఖాన్, వెంకట్రామిరెడ్డి, శివారెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, రామరాజు తదితరులు పాల్గొన్నారు. రాచర్ల, న్యూస్‌టుడే: చిన్ని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థినులకు బుధవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. పదో తరగతి చదువుతున్న 71 మందికి ప్రిన్సిపల్ మేరీ మంజులా చేతుల మీదుగా వాటిని అందజేశారు. సొసైటీ అధ్యక్షుడు మాగులూరి శ్రీకాంత్ మాట్లాడుతూ.. విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆయన సేవలను ప్రిన్సిపల్ కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రీదేవి, ఉపాధ్యాయినులు, సిబ్బంది పాల్గొన్నారు.

(c) eenadu

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

అర్జీలు పరిశీలిస్తున్న నియోజకవర్గ తెదేపా బాధ్యుడు ఎరిక్షన్‌బాబు

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని నియోజకవర్గ తెదేపా బాధ్యుడు గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. ఆయన బుధవారం నల్లగుంట్లలో రూ.2కోట్లతో 3.4 కి.మీల తారు రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పీఎం ఉజ్వల యోజన పథకం లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ కనెక్షన్, సిలిండర్లు పంపిణీ చేశారు. పెద్దదోర్నాలలో రూ.10 లక్షలతో నిర్మించనున్న సిమెంటు రహదారికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసూనాదేవి, మండల తెదేపా అధ్యక్షుడు షేక్ మాబు, సొసైటీ అధ్యక్షుడు బట్టు సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రహదారిపై మురుగు.. పెట్టిస్తోంది పరుగు

పాశంవారి వీధిలో రహదారిపై పారుతున్న మురుగు

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం పట్టణం 32 వార్డులోని నాగులవరం రోడ్డు, పాశం వారి వీధిలోని ప్రధాన రహదారిపై మురుగు నీరు పారుతోంది. భరించలేని దుర్గంధం వెలువడుతుండటంతో ప్రజలు రాకపోకల సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్య కొన్ని నెలలుగా ఉందని, అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

◗ మసీదులోని ప్రార్థనలకు ఈ రహదారి మీదుగానే వెళ్లాల్సి వస్తోంది. రహదారిపై మురుగు ఉండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందని, కొందరు జారి పడుతున్నారని స్థానికులు తెలిపారు. రహదారి మొత్తం అధ్వానంగా ఉన్నా అధికారులు పారిశుద్ధ్య చర్యలు చేపట్టడంలేదన్నారు. తక్షణమే సమస్యకు పరిష్కారం చూపించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ నారాయణరావును సంప్రదించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే మురుగు తొలగించేందుకు సిబ్బందిని పంపుతామన్నారు.

రుణాలతో ఆర్థికంగా అభివృద్ధి చెందండి

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: స్వయం సహాయక పొదుపు సంఘాల మహిళలు రుణాలతో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఏపీఎం ఎం.లక్ష్మీనారాయణ అన్నారు. ఆహార పదార్థాలు తయారు చేసి ప్యాకెట్ చేసి విక్రయించే పొదుపు మహిళలకు స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆహార పదార్థాలు తయారుచేసి అమ్ముకునే సభ్యులకు ఒక్కో సభ్యురాలికి రూ.40 వేలు రుణాన్ని బ్యాంకుల ద్వారా ఇప్పించడం జరిగిందని పేర్కొన్నారు. తీసుకున్న రుణాలతో వ్యాపారాలు చేసుకుని ఆదాయం గడించాలని తెలిపారు.

విశిష్ట గుర్తింపు సంఖ్యను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దారవీడు, న్యూస్‌టుడే: రైతులకు చరవాణిలోనే వ్యవసాయ అవసరాలకు కావలసిన పరికరాలను బుక్ చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం విశిష్ట గుర్తింపు సంఖ్య పేరిట ప్రవేశపెట్టిందని ఏవో లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని బోయదగుంపుల, మద్దలకట్టలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డ్రోన్‌తో మందుల పిచికారీ కోసం, ట్రాక్టర్‌లు, వరి, కందికోత మిషన్లను చరవాణిలో బుక్ చేసుకుంటే నేరుగా పొలం వద్దకు వస్తారని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పీఎం కిసాన్ పథకంలో భాగంగా మొత్తం 8,634 మంది రైతులు ఏడాదికి రూ.6వేలను లబ్ధిపొందుతున్నారని వివరించారు. రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించి యాప్‌ని డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది విశ్వనాథ్, రవి, వి.సౌజన్య, రైతులు పాల్గొన్నారు.

రబీ పంటలు నమోదు చేయించుకోండి

పొదిలి, న్యూస్‌టుడే: రబీలో సాగుచేసిన పంటలను వ్యవసాయ సహాయకుల వద్ద నమోదు చేయించుకోవాలని ఏవో డి.శ్రీనివాసులు చెప్పారు. బుధవారం కుంచేపల్లి, దాసల్లపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో రైతులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. పంట నమోదు వల్ల కలిగే ఉపయోగాలను తెలియజేశారు. రైతులు రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులు, అధికారులు

మార్కాపురం
•మార్కాపురం • యర్రగొండపాలెం

యాజమాన్య పద్ధతులతో నాణ్యమైన పొగాకు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: యాజమాన్య పద్ధతుల ద్వారా సుస్థిరమైన పొగాకు పంట దిగుబడులు సాధించాలని జీపీఐ సీనియర్ ఉపాధ్యక్షుడు డీఎస్.జితేంద్రకుమార్ సూచించారు. జీపీఐ ఆధ్వర్యంలో స్థానిక ఉత్తర బైపాస్‌లోని శ్రీ కన్వెన్షన్ హాలులో పొగాకు బోర్డు అధికారులు, ఉద్యోగులకు కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట సాగు సమయంలో పర్యావరణ, సామాజిక, పరిపాలన విధానాలు పాటించాలన్నారు.

అమాత్యా.. ఇటు చూడండి

☛ సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలంటున్న మార్కాపురం వాసులు

న్యూస్‌టుడే, మార్కాపురం:

మార్కాపురం జిల్లా ఏర్పడిన తరువాత జరుగుతున్న తొలి అసెంబ్లీ సమావేశాలివి. వీటిని సద్వినియోగం చేసుకుని స్థానికంగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రతినిధులు అసెంబ్లీలో తమ గళం వినిపించాలని ప్రజలు కోరుతున్నారు.

సౌకర్యాలు సమకూర్చాల్సిన మార్కాపురం జిల్లా కేంద్రం

వెలిగొండకు నిధుల వరద పారాలి

జిల్లాలో కీలకమైనది వెలిగొండ ప్రాజెక్టు. పూర్తి అయితే సాగు, తాగునీటికి ఇబ్బందులు ఉండవు. ఇందుకోసం కనీసం రూ.2,000 కోట్లు కావాలి. అంతేకాకుండా ప్రాజెక్టులోని మరో కీలకమైన సమస్య నిర్వాసితులకు పరిహారం. వీటిపై ఎమ్మెల్యే అసెంబ్లీ దృష్టికి తేవాలి.

వేధిస్తున్న తాగునీటి సమస్య

మార్కాపురం పట్టణంలో 35 వార్డుల్లో లక్ష మంది జనాభా ఉన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నీటి సమస్య తీవ్రమవుతోంది. పరిష్కరించడానికి ప్రత్యేక నిధులు కేటాయించాలి. అలాగే మున్సిపల్ కేంద్రంలో పారిశుద్ధ్యం పెద్ద సమస్యగా మారింది.

పరిశ్రమలు ఏర్పాటుతోనే యువతకు ఉపాధి

మార్కాపురం జిల్లా నూతనంగా ఏర్పడిన నేపథ్యంలో పరిశ్రమలు ఏర్పాటుతోనే నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుంది.

◗ సర్వజన వైద్యశాలలో సిబ్బంది కొరత లేకుండా చూడాలి.

గిట్టుబాటు ధర కల్పన అవసరం

జిల్లా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి. ఆ దిశగా అసెంబ్లీలో చర్చించాలి. అలాగే రైతులకు ప్రోత్సాహకాలు అందించే విధంగా చూడాలి.
– జి.అనంత కోటిరెడ్డి, రైతు, భూపతిపల్లె

నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలి

వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలి. గతంలో ప్రకటించిన పరిహారం రూ.12.50 లక్షలు అప్పటి లెక్కల ప్రకారం సరిపోతుంది. ప్రస్తుతం పెరిగిన లెక్కల ప్రకారం పరిహారం పెంపుదల చేయాలి. – డి.సోమయ్య, మార్కాపురం

ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లపై మాట్లాడాలి

అసెంబ్లీ సమావేశాల్లో ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలపై చర్చ జరగాలి. మార్కాపురం జిల్లా ప్రజా ప్రతినిధులు సమస్యలను లేవనెత్తాలి. స్థానిక ప్రజల డిమాండ్‌లను నెరవేర్చాలి.
– బి.శ్రీరాములు, ఉపాధ్యాయుడు, మార్కాపురం

ట్యాంకు అధ్వానం..మరమ్మతులు అవసరం

తర్లుపాడులోని ముస్లిం బజారులో ప్రజావసరాలకు ఏర్పాటు చేసిన తాగునీటి ట్యాంక్ గురించి పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో పిచ్చిమొక్కలు అల్లుకుని శిథిలావస్థకు చేరింది. చుట్టూ ఉన్న ప్రజలకు నీటి కోసం బస్టాండ్ వద్ద ఉన్న పెద్ద ట్యాంక్ వద్దకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోంది. ఇంటి ముందు ఉన్న ట్యాంకును శుభ్రం చేయించి నీటితో నింపాలని స్థానికులు పలుమార్లు పంచాయతీ దృష్టికి తీసుకు వెళ్లినా స్పందించలేదని స్థానికులు తెలిపారు. పక్కనే ఉన్న ట్యాంక్‌లో నీరు లేకపోవడంతో 500 మీటర్ల దూరం నుంచి తెచ్చుకోవాలంటే ఇబ్బందిగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ట్యాంకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, తర్లుపాడు**

కార్మికుల సమ్మెకు ఎన్జీవోల సంఘీభావం

పొదిలి, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల పిలుపు మేరకు గురువారం సార్వత్రిక సమ్మె జరగనుంది. దీనికి అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య మద్దతు ప్రకటించినందున ఏపీ ఎన్జీవో సంఘం సంఘీభావం తెలుపుతున్నట్లు పొదిలి ఎన్జీవో సంఘం అధ్యక్షులు ఎల్.శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఎన్జీవో సమావేశ మందిరంలో ఎన్జీవో కార్యవర్గ సభ్యులు సమావేశమై ఈ విషయమై చర్చించారు. కార్మిక సంఘాల నాయకులు, జేఏసీ నాయకులు పాల్గొని సమ్మెను జయప్రదం చేయనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఎన్జీవో సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్కే. సంధానిబాషా తదితరులు పాల్గొన్నారు.

సమావేశమైన ఎన్జీవో నాయకులు

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

మార్కాపురం : 8008631313
యర్రగొండపాలెం : 8008552658

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే:

?: నల్లగుంట్ల ఎస్సీ కాలనీలో వీధి దీపాలు వెలగడంలేదు. దీంతో రాత్రి వేళ వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ఏర్పాటు చేయండి.
– వెంకటేశ్వర్లు, నల్లగుంట్ల

✓: వెలగని వీధి దీపాలు తీసి వాటి స్థానంలో కొత్తవి అమర్చి సమస్య పరిష్కరిస్తాం.
– రంగయ్య, పంచాయతీ కార్యదర్శి, నల్లగుంట్ల

పొదిలి, న్యూస్‌టుడే:

?: పొదిలి విశ్వనాథపురం మొదటిలైనులో ఆర్టీసీ గ్యారేజీ వెనుక భాగంలో కాలువల్లో మురుగు తీయడం లేదు. దీంతో దుర్గంధం పెరిగిపోతోంది. వెంటనే మురుగు తొలగించాలి. – స్థానిక ప్రజలు.

✓: రెండు రోజుల్లో సిబ్బందిని పంపి మురుగు కాలువను శుభ్రం చేయిస్తాం. పారిశుద్ధ్య చర్యలు చేపడతాం. – ఎ.మారుతీరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, పొదిలి.

యర్రగొండపాలెం, న్యూస్‌టుడే:

?: పట్టణంలోని ఇందిరానగర్‌లో పలుచోట్ల వీధిదీపాలు వెలగడంలేదు. దీంతో రాత్రిపూట రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోంది. వెంటనే సమస్య తీర్చాలి. – ఇస్మాయిల్, స్థానికుడు

✓: సిబ్బందిని పంపించి మరమ్మతులు చేయించి ఇబ్బందిలేకుండా చేస్తాం.
– రామసుబ్బయ్య, పీఎస్

తర్లుపాడు, న్యూస్‌టుడే:

?: తర్లుపాడులోని పార్కులో ఉన్న శుద్ధజల కేంద్రంలోని వృథా నీరు బస్టాండ్ రోడ్డు వైపు వదలడంతో పాచిపట్టి ప్రమాదాలు జరుగుతున్నాయి. వెంటనే చర్యలు తీసుకోగలరు.
– వెంకటేశ్వర్లు, తర్లుపాడు.

✓: శుద్ధజల కేంద్రం వద్ద గుంట తీయించి వృథా నీటిని రోడ్డుపైకి రాకుండా చర్యలు తీసుకుంటాం. – శుభాకర్, పంచాయతీ అధికారి, తర్లుపాడు.

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే:

?: మురారిపల్లెలో మురికి గుంతలలో పారిశుద్ధ్య చర్యలు లోపించాయి. దీంతో ఈగలు, దోమలకు నిలయంగా మారి ఇబ్బంది పడుతున్నాం. వ్యాధులు ప్రబలుతున్నాయి. బ్లీచింగ్ చల్లించాలి. – వెంకటయ్య, స్థానికుడు

✓: పంచాయతీ సిబ్బందిని పంపించి బ్లీచింగ్ చల్లిస్తాం. పారిశుద్ధ్య చర్యలు చేపడతాం.
– యలకా శ్రీను, పంచాయతీ కార్యదర్శి

ఎస్సై వేమనను అభినందిస్తున్న డైరెక్టర్ శ్రీనివాసులు, పీఏసీఎస్ ఛైర్మన్ రామాంజులురెడ్డి, తెదేపా నాయకులు

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం మండలంలో శాంతిభద్రతల విషయంలో పటిష్ఠ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి కార్పొరేషన్ డైరెక్టర్ కాకర్ల శ్రీనివాసులు, మార్కాపురం పీఏసీఎస్ ఛైర్మన్ జవ్వాజి రామాంజులురెడ్డిలు ఎస్సై వేమనకు సూచించారు. బుధవారం స్థానిక గ్రామీణ పోలీసు స్టేషన్‌లో నూతనంగా విధుల్లో చేరిన ఎస్సై వి.వేమనను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కాపురం మండలంలో నేర నియంత్రణకు కృషి చేయాలన్నారు. రాబోతున్న సర్పంచి, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను సమర్థంగా నిర్వహించడానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు జంకె రమణారెడ్డి, మాకం అబ్రహం, గుంజె రాముడు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవ ఆహ్వాన ప్రతులను ప్రదర్శిస్తున్న కమిటీ సభ్యులు

20 నుంచి లక్ష్మీనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ఆమలక లక్ష్మీనారాయణ స్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 20వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీ త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ వారి మంగళా శాసనాలతో, త్రిదండి అహోబిల రామానుజ జీయర్, త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామివార్ల ప్రత్యక్ష పర్యవేక్షణలో 8 రోజుల పాటు ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. 20న అంకురార్పణ, సామూహిక లక్ష్మీపూజ, 21న అగ్ని ప్రతిష్ఠ, 24 మంగళవారం స్వామివారి కల్యాణం, రథోత్సవం నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆలయ ప్రాంగణంలో ఆహ్వాన ప్రతులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ అధ్యక్ష కార్యదర్శులు గోళ్ల వరలక్ష్మి, జి.సి.వెంకటరెడ్డి, గౌరవాధ్యక్షుడు వై.సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణసేవకు రూ.5 లక్షలు అందజేత

నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి వసంతలక్ష్మి

మార్కాపురం గ్రామీణం: శ్రీ ఆలమక లక్ష్మీనారాయణ స్వామి వారి శాశ్వత కల్యాణ కైంకర్యం నిమిత్తం స్థానిక ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి వసంతలక్ష్మి రూ.5 లక్షలు నగదు ఎమ్మెల్యే స్వగృహంలో దేవస్థాన కమిటీ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ గౌరవాధ్యక్షుడు వై.సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్న పనులే.. పూర్తిచేస్తే ప్రయోజనం

☛ అభివృద్ధికి ఎదురుచూస్తున్న మున్సిపల్ పాఠశాల
☛ పర్యవేక్షణ లేక ఆకతాయిలకు నిలయం

అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనం

న్యూస్‌టుడే, మార్కాపురం అర్బన్:

మార్కాపురం జిల్లా కేంద్రంలో విద్యార్థుల చదువుల కోసం ప్రారంభించిన మున్సిపల్ పాఠశాల అసంపూర్తిగా నిలిచిపోయింది. పట్టించుకునే వారు లేక అసాంఘిక శక్తులకు నిలయంగా మారుతోంది. దీనిపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సత్వరం పనులు పూర్తిచేసి వచ్చే విద్యా సంవత్సరానికి అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

2022లో రూ.1.80 కోట్లతో పనులకు శ్రీకారం

స్థానిక పూలసుబ్బయ్య కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు 6నుంచి 10వ తరగతి వరకు గదులు నిర్మించేందుకు 2.20 ఎకరాల్లో 2022లో వైకాపా ప్రభుత్వం 'నాడు నేడు' కింద రూ.1.80 కోట్లతో పనులు ప్రారంభించారు. గుత్తేదారుడు గదులు, తలుపులు, కిటికీలు తదితర పనులు పూర్తి చేశాడు. చివరి దశలో ఉన్న ప్లాస్టరింగ్, విద్యుత్ వంటి చిన్న చిన్న పనులను పూర్తి చేయకుండా వదిలేశారు. పట్టించుకునే వారు లేక ప్రస్తుతం ఆ పాఠశాల ఆవరణంతా పిచ్చి చెట్లు మొలిచి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. రాత్రి పగలు తేడా లేకుండా అక్కడ మద్యం తాగుతుంటారని మహిళలు వాపోయారు. పిచ్చి చెట్లలోంచి పాములు, విష పురుగులు సైతం ఇళ్లల్లోకి వస్తున్నాయన్నారు.

చిన్నారిని ఎత్తుకెళ్లేందుకు యత్నించారు

పాఠశాల ఆవరణ పూర్తికాక పోవడంతో ఆకతాయిలకు అడ్డాగా మారింది. నిత్యం యువకులు ఇక్కడే ఉండడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇటీవల ఓ చిన్నారిని ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించారు. కొందరు గేదెలను ఇక్కడే కట్టేస్తున్నారు. – నరసింహ, స్థానికుడు

ఇళ్ల ముందు కూర్చోలేకపోతున్నాం..

రాత్రీ పగలు తేడా లేకుండా యువకులు ఈ గదుల్లో తిష్ట వేస్తున్నారు. మద్యం మత్తులో కొట్లాటలకు దిగుతున్నారు. దీంతో భయబ్రాంతులకు గురవుతున్నాం. ప్రదేశం ఖాళీగా ఉండడంతో వీధుల్లోని చెత్తంతా ఇక్కడే వేస్తున్నారు. పాఠశాల పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. – శివమ్మ, స్థానికురాలు

అసాంఘిక చర్యలకు పాల్పడితే సహించం

కనిగిరి ఆర్టీసీ డిపోలో యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న బ్లూకోల్ట్స్ బృందం

కనిగిరి, న్యూస్‌టుడే: కనిగిరి పట్టణంలోని ఈవ్ టీజింగ్ నివారణకు బ్లూకోల్ట్స్ బృందంతో పెట్రోలింగ్ ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ పి.సాయి ఈశ్వర్ యశ్వంత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఇటీవల జరిగిన సంఘటనలు దృష్టిలో ఉంచుకుని ఈ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. అసాంఘిక చర్యలకు పాల్పడే వారిని ఏమాత్రం ఉపేక్షించేది లేదన్నారు. పట్టణంలోని పాఠశాలలు, కళాశాలల సమీపంలో ఆరు బృందాలు పెట్రోలింగ్ నిర్వహిస్తాయన్నారు. విద్యార్థినులు, బాలికలు, మహిళలు భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. వేధింపు ఘటనలు గమనించినా, ఏదురైన భయ పడకుండా వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. మహిళల రక్షణ కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటుందన్నారు.

ప్రధాన కుర్చీలన్నీ ఖాళీ!

☛ పుల్లలచెరువు కార్యాలయాల్లో విచిత్ర పరిస్థితి
☛ వచ్చేందుకు అధికారుల అనాసక్తి

పుల్లల చెరువు తహసీల్దార్ కార్యాలయం

న్యూస్‌టుడే పుల్లలచెరువ (యర్రగొండపాలెం):

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోనూ.. తాజాగా ఏర్పడిన మార్కాపురం జిల్లాలోనూ పుల్లలచెరువు మండలం చివర్లో ఉంటుంది. ఎక్కడో విసిరేసినట్లు ఉండే ఈ మండలానికి అధికారులు బదిలీపై వచ్చేందుకు ఆసక్తి చూపించడం లేదు. దీంతో కీలకమైన శాఖల్లోని అధికార కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఆయా శాఖల్లోని ఎవరో ఒక సీనియర్ అధికారిని ఇన్‌ఛార్జిగా నియమించి నెట్టుకొస్తున్నారు. ఇక్కడ ఏళ్ల తరబడి ఇదే తంతు నడుస్తోంది.

కింది స్థాయి ఉద్యోగులతో నెట్టుకొస్తున్నారు

పరిపాలనలో ప్రధానమైన అధికారులందరూ ఎఫ్ఏసీ బాధ్యతలే నిర్వహిస్తున్నారు. మండల తహసీల్దార్, మండలపరిషత్ అభివృద్ధి అధికారి, వ్యవసాయాధికారి, విద్యుత్తు సహాయ ఇంజినీరు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పంచాయతీరాజ్ ఏఈ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. పక్క మండలాలు, అదేశాఖలోని కింది స్థాయి ఉద్యోగులతో కాలం వెళ్లదీస్తున్నారు. ఇటీవల అనారోగ్యంతో తహసీల్దార్ సెలవుపై వెళ్లడంతో పెద్దదోర్నాల తహసీల్దార్‌కు ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించారు. భూ సమస్యలు ఎక్కువగా ఉండే ఇలాంటి ప్రాంతంలో రైతులు, భూ బాధితుల సమస్యలు పరిష్కారాలకు నోచుకోవడంలేదు. ఎంపీడీవో కుర్చీ చాలా కాలంగా ఖాళీగానే ఉండగా.. కార్యాలయ ఏవోలనే ఇన్‌ఛార్జిగా నియమిస్తూ వస్తున్నారు.

అభివృద్ధి పనులపై ప్రభావం

కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామాభివృద్ధికి విస్తారంగా నిధులు మంజూరు చేస్తోంది. దీంతో అంచనాల తయారీ, పనుల పురోగతి నిత్యం పర్యవేక్షించాల్సి ఉంది. ఒకే అధికారి రెండు మండలాల బాధ్యతలు చూడాల్సిరావడంతో ఈ ప్రభావం అభివృద్ధి పనులపై పడుతోంది. అధికారులూ ఒత్తిడికి లోనవుతున్నారు. ప్రభుత్వం ఈ మండలంపై ప్రత్యేక దృష్టి సారించి ఇక్కడే ఉండే విధంగా ఉద్యోగులను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా శేషమ్మదేవి తిరునాళ్ల

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: మండలంలోని అమానిగుడిపాడు గ్రామంలో మంగళవారం రాత్రి శేషమ్మదేవి తిరునాళ్లను ప్రజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పూజలు చేశారు. ఈ సందర్భంగా తెదేపా ఆధ్వర్యంలో పాటకచేరి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ డాక్టర్ మన్నె రవీంద్ర గ్రామస్థులతో ప్రదర్శనగా వెళ్లి స్టేజీపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ చేకూరి ఆంజనేయులు, మండల మాజీ అధ్యక్షుడు వడ్లమూడి లింగయ్య, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఘంటసాల పాటలు అజరామరం

ఘంటసాల చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న చైతన్య కళా స్రవంతి ప్రతినిధులు, విద్యార్థులు

పొదిలి, న్యూస్‌టుడే: గాన గంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరరావు పాటలు అజరామరమని పలువురు వక్తలు అన్నారు. పొదిలిలోని త్యాగరాజస్వామి కళాక్షేత్రంలో బుధవారం ఘంటసాల వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. ఘంటసాలతో తెలుగు ప్రజలకు ఉన్న అనుబంధాన్ని, ఆయన పాడిన పాటలను నెమరువేసుకున్నారు. కళాకారులు ఘంటసాల పాడిన పాటలను ఆలపించారు. పాటల పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చైతన్య కళా స్రవంతి వ్యవస్థాపకులు నాగశ్రీ, హబీబుల్లా సేవాసంస్థ ఛైర్మన్ కరీముల్లాబేగ్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు గురుస్వామి, బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, సన్‌షైన్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు తిరుపతమ్మ, నాగమణి, విద్యార్థులు పాల్గొన్నారు.

◗ యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: తెలుగు జాతి గర్వించ దగ్గ గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు అని ఎస్సై చౌడయ్య అన్నారు. బుధవారం స్థానిక ఘంటసాల కళా పరిషత్ అధ్యక్షుడు చీదెళ్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఘంటసాల 52వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా డివైడర్‌పై ఉన్న ఘంటసాల విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎస్సై మాట్లాడారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని వడ్డించారు. ఈ కార్యక్రమంలో కళాపరిషత్ సభ్యులు మెడబలిమి అచ్యుతరావు, షేక్ ఇస్మాయిల్, దొంతా బాదరయ్యాగౌడ్, నాయకులు సేవా నాయక్, కేవీ.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

హాకీలో జాతీయ స్థాయిలో ప్రతిభ

విద్యార్థి జాన్సన్‌తో ప్రిన్సిపల్ పెద్దిరాజు ఉపాధ్యాయులు

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: గిరిజన పాఠశాల్లో చదివే విద్యార్థులకు కాకినాడ జెడ్పీ పాఠశాల్లో రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు గత నెల 28న నిర్వహించారు. ఈ పోటీల్లో యర్రగొండపాలెం ఏపీ గిరిజన గురుకుల బాలుర పాఠశాల్లో చదివే విద్యార్థి మండ్లి జాన్సన్ ప్రథమ స్థానంలో రాణించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ విద్యార్థి 9వ తరగతి చదువుతున్నాడు. జాన్సన్ ఈ నెల 21న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాయగఢ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాడు. ఈ విద్యార్థికి స్థానిక పాఠశాల్లో హాకీ కోచ్ అంజన్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్ బ్రహ్మనాయక్‌లు కోచింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా బుధవారం ఈ విద్యార్థిని పాఠశాల్లో ప్రిన్సిపల్ పెద్దిరాజు, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

(c) eenadu

14న ఈనాడు 50, ఈటీవీ 30 వసంతాల వేడుకలు

కర్నూలు, సాంస్కృతికం, న్యూస్‌టుడే: తెలుగువారి ప్రియ పత్రిక 'ఈనాడు' దినపత్రిక 50 వసంతాలు పూర్తి చేసుకుంది. తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచింది. 'ఈనాడు..ఈటీవీ' అంటూ మూడు దశాబ్దాలుగా ఈటీవీని తెలుగు ప్రజలు అక్కున చేర్చుకున్నారు. ఈ సందర్భంగా ఈనాడు@50, ఈటీవీ@30 వసంతాల వేడుకలకు కర్నూలు వేదిక కానుంది. ఈ నెల 14న కర్నూలులో ఏపీఎస్పీ బెటాలియన్ గ్రౌండ్‌లో ఈ వేడుకలు సాయంత్రం 6 నుంచి జరగనున్నాయి. సినీ గీతాలు, డ్యాన్స్ పెర్ఫార్మెన్స్‌లతో ఉర్రూతలూగించేలా పలు కార్యక్రమాలు దీనిలో ఉంటాయి. ప్రముఖ గాయనీగాయకులు యాజిన్ నిజార్, శ్రీకృష్ణ, ధనుంజయ్, ఆదిత్య, మాళవిక, ఉష, కౌశల్య, కల్పనలు పాటలతో అలరించనున్నారు. వీటితోపాటు వందేమాతరం శ్రీనివాస్ తమ గానంతో ఉర్రూతలూగించనున్నారు. జబర్దస్త్ ఫేమ్ హైపర్ ఆది పంచ్ డైలాగులతో కడుపుబ్బ నవ్వించనున్నారు. బుల్లితెర ప్రముఖ, సినీ నటి సుమ యాంకర్‌గా వ్యవహరిస్తారు. ఆద్యంతం వినోదభరితంగా సాగే ఈ కార్యక్రమంలో పాల్గొనాలంటే పాసులు తప్పనిసరి.

13న పాసుల పంపిణీ

ఫిబ్రవరి 13న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఏపీఎస్పీ బెటాలియన్ గ్రౌండ్ వద్ద పరిమిత సంఖ్యలో పాసులు పంపిణీ చేస్తారు. అంతే కాదు పాసుతో పాటు ప్రత్యేక ఆకర్షణగా ఇచ్చే రిస్ట్ బ్యాండులను ధరించిన వారికి మాత్రమే ప్రవేశం ఉంటుంది.

విదేశాల్లో ఉద్యోగాలు

విదేశాల్లో వెల్డింగ్, నిర్మాణ రంగంలో ఉద్యోగ అవకాశాలపై గురువారం పులివెందులలోని న్యాక్ కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు డోన్ న్యాక్ కేంద్రం ఇన్‌ఛార్జి తిమోతి తెలిపారు. ఈ సదస్సుకు పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ చదివి 19 నుంచి 45 ఏళ్ల లోపు వయస్సు గల అభ్యర్థులు హాజరు కావచ్చన్నారు. సదస్సును యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9000517637, 9701271158 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. - న్యూస్‌టుడే, డోన్ పట్టణం

ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో
జిల్లా స్థాయి ప్రతిభా పాటవ పోటీలు రేపే

కళాశాల విద్యార్థులకు 'ఈనాడు - ఈటీవీ' ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా స్థాయి ప్రతిభా పాటవ పోటీలు జరగనున్నాయి. కర్నూలు నగరంలోని క్లస్టర్ విశ్వవిద్యాలయంలో ఉదయం 10.00 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయి. గత నాలుగు నెలలుగా ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 25 కళాశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, ఉపన్యాసం, క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతి కళాశాల నుంచి నాలుగు విభాగాల్లో ముగ్గురు చొప్పున 12 మంది జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. వారంతా ఉదయం 9 గంటలకు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని నిర్వాహకులు తెలిపారు. - న్యూస్‌టుడే, కర్నూలు విద్య

అంచనా తప్పిన ఆర్టీసీ

■ శ్రీశైలంలో ప్రయాణికులకు అవస్థలు

“మూడు రోజుల కిందట పాదయాత్రగా శ్రీశైలం వచ్చాం. బుధవారం ఉదయం 5 గంటలకు బస్టాండుకు వెళ్లాం. రద్దీ ఎక్కువగా ఉంది. వచ్చిన బస్సులో ఎక్కేందుకు తోసుకున్నారు. మాకు చిన్న పిల్లలు ఉన్నారు. ఇబ్బంది పడ్డాం. ప్రైవేట్ వాహనదారులు ఒక్కొక్కరికి కర్నూలుకు రూ.వెయ్యి, ఆత్మకూరుకు రూ.500 తీసుకుంటున్నారు. మేము పది మంది ఉంటే వెయ్యి చొప్పున రూ.పది వేలు అడుగుతున్నారు. ఏం చేయాలో తోచడం లేదని” కర్నూలు జిల్లాకు చెందిన సురేశ్ ఆందోళన వ్యక్తం చేశారు.

▶▶ ఈమె ఒక్కరే కాదు.. శ్రీశైలం వెళ్లిన ప్రతి ఒక్కరికి ఇదే పరిస్థితి ఎదురవుతోంది. శ్రీశైల మల్లన్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు వెళ్లిన భక్తుల సంఖ్యను అంచనా వేయడంలో ప్రజారవాణా అధికారులు విఫలమయ్యారు. కర్నూలు నుంచి వెంకటాపురం వెళ్లేందుకు, తిరుగు ప్రయాణంలో శ్రీశైలం నుంచి సరిపడా బస్సులు లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
– న్యూస్‌టుడే, ఆత్మకూరు, కర్నూలు, నంద్యాల ఆర్టీసీ

సీటు దొరకాలంటే యుద్ధమే చేయాలి

▶▶ శ్రీశైలానికి రాత్రి వేళ వచ్చిన బస్సులు బస్టాండుకు సమీపంలో నిలుపుతున్నారు. అవన్నీ తెల్లారి ఉదయం 5-6 గంటల మధ్య తిరుగు ప్రయాణం అవుతున్నాయి. సీటు దొరకాలనే ఉద్దేశంతో రాత్రి వేళనే ప్రయాణికులు ఆయా బస్సుల్లోని సీట్లలో నిద్రిస్తున్నారు. అవి బస్టాండుకు వచ్చే సరికి సీట్లన్నీ నిండిపోతున్నాయి.

▶▶ పాదయాత్రగా 45 కి.మీలు నడిచి స్వామిని దర్శించుకున్న భక్తులు బస్సు ఎక్కేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. కాళ్ల నొప్పులతో నడవడమే కష్టంగా ఉంటే ప్రతి బస్సు వద్ద వందల మంది గుమికూడటంతో బస్సు ఎక్కడమే కష్టమవుతోంది.

▶▶ కర్నూలు నుంచి బయల్దేరిన బస్సులు శ్రీశైలం చేరుకోవడానికి ఆరు గంటలు పడుతుంది. అంటే ఉదయం 11 గంటల తర్వాతే ఒక్కటి వస్తున్నాయి. అప్పటి వరకు ప్రయాణికులకు నిరీక్షణ తప్పడం లేదు. వచ్చిన బస్సుల్లో సీటు మాట దేవుడెరుగు తోపులాట, తొక్కిసలాటల మధ్య అసలు బస్సు ఎక్కడమే యుద్ధంలా మారింది.

▶▶ ఏ బస్సు ఎప్పుడొస్తుంది.. ఎన్ని గంటలకు బయలుదేరుతోంది.. అన్న వివరాలు శ్రీశైలం ప్రయాణ ప్రాంగణంలోని అధికారులు చెప్పలేకపోతున్నారు.

శ్రీశైలం బస్టాండులో కర్నూలు బస్సు ఎక్కేందుకు తోపులాట

▶▶ ఈ నెల 8వ తేదీన బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకు 1,95,555 మంది స్వామిఅమ్మవార్లను దర్శనం చేసుకున్నట్లు ఆలయ అధికారులు చెబుతున్నారు.

▶▶ వెంకటాపురం నుంచి శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్లే భక్తులకు ఈ నెల 8వ తేదీ నుంచీ అనుమతి ఇవ్వనున్నట్లు మొదట అటవీ శాఖ అధికారులు ప్రకటించారు. ఆ మేరకు అన్ని శాఖలు సన్నద్ధమయ్యాయి. భక్తుల విశ్వసం మేరకు ఒక్క రోజు ముందు నుంచే అనుమతి ఇచ్చారు.

ఎందుకీ పరిస్థితి వచ్చిందంటే

▶▶ ఆదివారం(8వ తేదీ) సెలవు దినం కావడంతో ఎక్కువ మంది నడకదారిలో వెళ్లారు. వీరంతా 45 కి.మీ. రెండురోజుల పాటు నడిచి శ్రీగిరి చేరుకున్నారు. అక్కడ స్వామి అమ్మవారిని దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణం అయ్యే సరికి బస్సులు సరిపోక ఇబ్బందులు పడుతున్నారు.

పరుగులు పెట్టని ప్రత్యేకం

▶▶ ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఫిబ్రవరి 8 నుంచి ప్రత్యేక బస్సులు నడపాల్సి ఉంది. వివిధ జిల్లాల నుంచి కర్నూలు రావాల్సిన 140, నంద్యాల జిల్లాలకు రావాల్సిన 90 బస్సులు సకాలంలో రాలేదు. దీంతో 9వ తేదీన బస్సులు లేకపోవడంతో ఏమి చేయలేని పరిస్థితిలో ప్రజారవాణా సిబ్బంది ఉండిపోయారు.

▶▶ రెండు గంటలకు ఒకసారి మాత్రమే శ్రీశైలానికి వెళ్లే బస్సు అందుబాటులో ఉంది. దీంతో సీట్ల కోసం మహిళలు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫిబ్రవరి 13 నుంచి 17వ తేదీ వరకు ఉమ్మడి కర్నూలు జిల్లాల నుంచి పూర్తిస్థాయిలో బస్సులు అందుబాటులో ఉంటాయని అధికారులు చెబుతున్నారు.

▶▶ ఫిబ్రవరి 8 నుంచి 10వ తేదీ వరకు ఉమ్మడి జిల్లాలో 200 బస్సులు నడిపినట్లు కాగితాల్లో చూపుతున్నారు. వాస్తవానికి 11వ తేదీన సాయంత్రం వరకు శ్రీశైలానికి 100, వెంకటాపురానికి 30 బస్సులు నడిపారు.

మనబడికెళ్దాం.. ప్రగతి బాటలేద్దాం

“కర్నూలు నగరంలోని ట్రిపుల్ ఐటీ(డీఎం) విద్యార్థులు రుద్రవరం, ఓర్వకల్లు, నూతనపల్లె, కన్నమడకల, కేతవరం గ్రామాల్లో పాఠశాలలను దత్తత తీసుకొన్నారు.. ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి వివిధ అంశాలపై విద్యార్థుల్లో చైతన్యం నింపుతున్నారు.”

- మీరూ ఇలా విద్యార్థులకు సేవ చేయాలని అనుకుంటున్నారా ? మీలాంటి వారి కోసమే రాష్ట్ర ప్రభుత్వం విద్యాంజలి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మీరు చదువుకున్న బడిని అభివృద్ధి చేయడానికి చక్కని వేదిక ఇది. –న్యూస్‌టుడే, కర్నూలు విద్య

ఇలా నమోదు

● వెబ్‌సైట్ vidya-jali.education.gov.in లోకి వెళ్లి వాలంటీరుగా నమోదు చేసుకోవాలి. సమీపంలోని పాఠశాల, ఆసక్తి ఉన్న సేవా రంగాన్ని ఎంచుకోవచ్చు. ఇది పూర్తిగా స్వచ్ఛంద సేవ కిందకు వస్తుంది.

సేవలందించొచ్చు

- విద్యాసాయం, కళలు, నైపుణ్యాలు, ఆరోగ్యం, క్రీడలు, మార్గనిర్దేశం, సామాజిక బాధ్యత, తరగతి గదికి అవసరమైన బల్లలు, కుర్చీలు, బోర్డులు, సైన్సు, మ్యాథ్స్ కిట్లు, పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు, సాంకేతిక విద్యకు అవసరమయ్యే స్మార్ట్ టీవీలు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు ఇవ్వవచ్చు.
- నర్సరీ నుంచి ఇంటర్ వరకు బోధించొచ్చు. కథలు చెప్పడంతోపాటు పిల్లల్లో సృజనాత్మకత, చదవడం, రాయడంలో సాయం చేయొచ్చు.
- సామాజిక బాధ్యత కింద దివ్యాంగులకు సేవలు, వయోజన విద్య, పాఠశాలల్లో పరిశుభ్రతకు సహకారం. పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్వహణ, ప్రయోగశాలలు, భోజన వసతి, మరుగుదొడ్ల శుభ్రత, విద్యుత్తు సదుపాయం వంటి సేవలు అందించొచ్చు.
- కళలు, వృత్తి నైపుణ్యాలు నేర్పడంతో సృజనాత్మకతను వెలికితీసి, జీవనోపాధికి మార్గం చూపడం. క్రీడల్లో శిక్షణ, పొగాకు, మాదకద్రవ్యాలతో అనర్థాలపై అవగాహన కల్పించే అవకాశం ఉంటుంది.

ఇది పూర్తిగా స్వచ్ఛందం

విద్యాంజలి ద్వారా నియమితులమయ్యామని వచ్చిన వ్యక్తుల నుంచి జిల్లా విద్యాశాఖ అనుమతి పత్రాన్ని పరిశీలించాలి. ఈ పేరుతో గతంలో పలువురు నిరుద్యోగులు అపరిచితుల చేతుల్లో మోసపోయారు. విద్యాంజలి కింద వచ్చే వ్యక్తులు అందించే సేవలు పూర్తిగా స్వచ్ఛందం. దీనికి ఎటువంటి పారితోషికం ఉండదు. ఇలాంటి అంశాలపై హెచ్ఎంలు జాగ్రత్తలు పాటించాలి.

శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి

భక్తజనం మధ్య స్వామిఅమ్మవార్ల గ్రామోత్సవం

మయూర వాహనసేవ.. మమ్మేలు మహాశివా

■ జనసంద్రంగా శ్రీశైల మల్లన్న కొండ
■ నల్లమల గిరుల్లో శివనామస్మరణ

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. నాలుగో రోజైన బుధవారం శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి మయూర వాహనంపై కొలువుదీరారు. కృష్ణదేవరాయగోపురం వద్ద నుంచి గంగాధరమండపం, బయలు వీరభద్రస్వామి ఆలయం వరకు గ్రామోత్సవం కనుల పండువగా జరిగింది. చెక్క భజనలు, కోలాటాలు, అగ్నికీల విన్యాసాలు, శంఖు, ఢమరుక నాదాలతో కళాకారులు అలరించారు. గ్రామోత్సవంలో దేవస్థానం ఈవో ఎం. శ్రీనివాసరావు, ధర్మకర్తలమండలి అధ్యక్షులు రమేష్‌నాయుడు, సభ్యులు అనిల్‌కుమార్, రమణ, భరద్వాజ శర్మ, దేవకి వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

★ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఐదో రోజు గురువారం రావణ వాహనసేవ జరుగనుంది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవాదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

కళాకారుల సందడి

చెంచు మహిళల నృత్యం

13వ తేదీ వరకే నీటి విడుదల

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: కేసీ కాల్వ ఆయకట్టును సీఈ కబీర్ బాషా, ఎస్ఈ బాలచంద్రారెడ్డిలు పరిశీలించారు. లాక్ ఇన్‌స్లా నుంచి నంద్యాల వరకు కేసీ కెనాల్ ఆయకట్టును పరిశీలించారు. తూడిచెర్ల కెనాల్ పరివాహక ప్రాంతాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. మల్యాల, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం ద్వారా ఆయకట్టుకు నీటి విడుదల జరుగుతున్న క్రమంలో అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చారు. ఆయకట్టు పరిధిలో 80 శాతం రైతులు మెట్ట పంటలను సాగు చేస్తున్నారు. పంట పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈనెల 13వ తేదీ వరకు నీటి విడుదల ఉంటుందని రైతులకు తెలిపారు. పంటలకు నీటి విడుదల చేసినందుకు అధికారులను రైతులు సన్మానించారు. డీఈ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

13న ఉద్యోగ మేళా

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలోని నేషనల్ ఐటీఐ కళాశాలలో ఈనెల 13న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి కళ్యాణి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18-35 ఏళ్లలోపు వయస్సు ఉండి పదో తరగతి, బి/ఎం/డి ఫార్మసితో పాటు పీసీఐ చేసిన వారు, బీఎస్సీ, బీజడ్‌సీ ఫార్మసీ, ఎంఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ కెమిస్ట్రీ, ఇంటర్, డిగ్రీ చేసిన అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలు, ఫొటోలతో హాజరుకావాలన్నారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగులు ఎన్‌సీఎస్. జీవోవీ. ఇన్ అనే వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

17 నుంచి బాలోత్సవం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాలలో ఈనెల 17, 18వ తేదీల్లో నిర్వహించే బాలోత్సవాలను విజయవంతం చేయాలని నంది విజ్ఞాన కేంద్రం కన్వీనర్ డి.మౌలాలి, ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు డా.రాకేశ్‌రెడ్డి, అధ్యక్షులు డా.క్రాంతి చైతన్య, ప్రధాన కార్యదర్శి గురుస్వాములు పేర్కొన్నారు. స్థానిక టౌన్‌హాల్‌లో నిర్వహించే పిల్లల సంబరాల్లో పాల్గొనే పాఠశాలలకు సంబంధించిన విద్యార్థుల వివరాలను 13వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు.

ప్రధానితో మాట్లాడే అవకాశం

దేశ భవిష్యత్తు గురించి ప్రభుత్వానికి సూచనలు చేయడానికి కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ యువతకు అవకాశం కల్పిస్తోంది. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఉండే అంశాల గురించి ప్రజలకు, ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించడానికి 'మై భారత్ బడ్జెట్ క్వెస్ట్-2026'ను నిర్వహిస్తోంది. ఇందులో రైతులు, యువత, మహిళలు, ఉద్యోగులు, వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు పాల్గొనవచ్చు. విజేతలకు మార్చి నెలలో దేశ ప్రధాని మోదీతో వర్చువల్‌గా మాట్లాడే అవకాశం కల్పిస్తోంది. వీరు వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, ఉద్యోగ సదుపాయాలపై సలహాలు, సూచనలు ఇవ్వొచ్చు.
– న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

ఎంపిక ఇలా..

ఆసక్తి ఉన్న యువత www.mybharath.gov.in అనే వెబ్‌సైట్‌లో చరవాణి లేదా ఈమెయిల్ ద్వారా రిజిస్టర్ అవ్వాలి. వయస్సు 15-29 ఏళ్లలోపు ఉన్న వారు అర్హులు. ఈనెల 17లోగా నమోదు చేసుకోవాలి.

పోటీల్లో రాణిస్తే అవకాశం

బడ్జెట్‌పై అవగాహన అంచనా వేసేందుకు ఆన్‌లైన్‌లో జాతీయ స్థాయి క్విజ్ పోటీ నిర్వహిస్తారు. ఇందులో 30 ప్రశ్నలు ఉంటాయి. క్విజ్‌లో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన వారికి వ్యాస రచన పోటీలు నిర్వహిస్తారు. పోటీల్లో పాల్గొన్న వారికి ధ్రువీకరణ పత్రం ఇస్తారు. రాష్ట్రస్థాయి విజేతలతో దేశ ప్రధాని వర్చువల్‌గా మాట్లాడతారు. యువత తమ ఆలోచనలు ప్రధానితో పంచుకోవచ్చు.

ముఖ్యుల సేవే ముఖ్యం

■ వీఐపీల సేవలో తరిస్తున్నారు
■ నిబంధనలకు విరుద్ధంగా స్పర్శ దర్శనాలు
■ సాధారణ భక్తులకు తీవ్ర ఇబ్బందులు

ఈనాడు, నంద్యాల: శ్రీశైలం ఆలయ అధికారులు స్థానిక నేతల ఒత్తిడితో ఇష్టారాజ్యంగా వారికి నచ్చిన వారిని ఆలయంలోకి పంపిస్తుండటం, స్పర్శ దర్శనాలు చేయిస్తుండటంతో సాధారణ భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బ్రహ్మోత్సవాలు మొదలైన నేపథ్యంలో మాలధారులు మినహా ఎవరినీ స్పర్శ దర్శనానికి అనుమతించకూడదని పాలకవర్గం నిర్ణయించింది. అందుకు భిన్నంగా ఈ నెల 8, 9వ తేదీల్లో నిబంధనలకు విరుద్ధంగా పలువురు వీఐపీలకు, నేతల సిఫార్సులున్నవారిని స్పర్శ దర్శనానికి అనుమతించారు. వారికోసం దీక్షాపరులకు స్పర్శ దర్శనం ఆపివేయడం వివాదానికి దారితీసింది. శివస్వాములకు ఐదు రోజులు మాత్రమే స్పర్శ దర్శనానికి అనుమతించారు. దీంతో క్షేత్రానికి వేలాదిగా మాలధారులు పోటెత్తారు. క్షేత్రస్థాయిలో వారికి అవసరమైన సేవలు అందడంలో ఆలస్యం జరుగుతుండటంతో ఆందోళనకు దిగారు.

సమయానికి మించి..

ప్రొటోకాల్ దర్శనాలకు వచ్చే ప్రముఖులు ఉదయం 6.30 నుంచి 7.30 గంటలు, మధ్యాహ్నం 12.30 నుంచి ఒంటి గంట వరకు, రాత్రి ఏడు నుంచి 7.30 గంటల వరకు మాత్రమే అనుమతిస్తామని ప్రకటించారు. ఆయా సమయాలను మించిన సమయాన్ని వారికి కేటాయిస్తుండడంతో సాధారణ భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.

'నేల'బారు ఏర్పాట్లు

శ్రీశైలానికి వచ్చే సాధారణ భక్తులు విశ్రాంతి తీసుకోవడానికి, పడుకోవడానికి వీలుగా 6.27 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో జర్మన్ హ్యాంగర్లు, షామియానాలు వేశారు. వాటిలో చాలా చోట్ల నేలపై పట్ట వేయకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మట్టినేలపై ఎలా నిద్రపోవాలని భక్తులు ప్రశ్నిస్తున్నారు.

మంచినీళ్లకూ అవస్థలే..

మంచినీళ్ల బాటిళ్లను(ప్లాస్టిక్‌వి) శ్రీశైలంలో నిషేధించడంతో స్వచ్ఛమైన మంచినీళ్ల కోసం భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక లీటర్ మంచినీళ్ల సీసాను బ్రాండ్‌ను బట్టి రూ.60 నుంచి రూ.70కి విక్రయిస్తున్నారు. ఆ సీసా తిరిగి ఇచ్చేస్తే మంచినీటికి రూ.30లు తీసుకుని మిగిలిన మొత్తాన్ని ఇస్తామని వ్యాపారులు పేర్కొంటున్నారు. సీసా వెనక్కి ఇచ్చినా ఒక్క లీటరు నీటి ధర రూ.30 ఉండడంతో వాటిని కొనుగోలు చేయడానికి భక్తులు ఆసక్తి చూపడంలేదు. క్యూలైన్లలో ఉన్నవారికి మంచినీళ్లు ఇచ్చేవారు కూడా కరవవుతున్నారు.

ధరలదడ

◀◀ శ్రీశైలంలోని పలు దుకాణాల వారు అన్ని రకాల వస్తువులను అధిక ధరలకు విక్రయిస్తూ భక్తులను అందినకాడికి దోచుకుంటున్నారు. సబ్బులు, పేస్టులు, పౌడర్ డబ్బాలు తదితరాలు ఎంఆర్పీకి మించి విక్రయిస్తున్నా పట్టించుకునేవారే కానరావడం లేదు.

◀◀ శ్రీశైలం వచ్చే భక్తులు కాలకృత్యాలు తీర్చుకోవడానికి, స్నానాలు చేయడానికి మొబైల్ మరుగుదొడ్లు, స్నానపు గదులను దేవస్థానం ఉచితంగా ఏర్పాటుచేసింది. వాటి నిర్వహణను పర్యవేక్షించడానికి అందుబాటులో ఉంచిన వ్యక్తులు భక్తుల నుంచి మనిషికి రూ.20 నుంచి రూ.30వరకు వసూలు చేస్తున్నారు.

కిటికీలు లేవు... పడితే ప్రమాదమే

నంద్యాల పట్టణం ఎంఎస్ నగర్ పురపాలక ఉన్నత పాఠశాలలో పై అంతస్తులో తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ గదుల్లో కిటికీలకు తలుపులు లేవు. కిటికీల పక్కనే విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారు. పొరపాటున విద్యార్థులు కిటికీలో నుంచి కింద పడితే ప్రాణాలకే ప్రమాదం. అపాయం జరగక ముందే అధికారులు చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

ఈ-నారీ.. వెలుగు దారి

డ్వాక్రా సంఘాల కార్యకలాపాల్లో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా.. పూర్తి పారదర్శకంగా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సంఘాలను పకడ్బందీగా నిర్వహించేందుకు డీఆర్డీఏ- వెలుగు కార్యాలయాల్లో ఈ-నారీ, సీఆర్పీలను నియమిస్తోంది. క్రమం తప్పకుండా సంఘాల సమావేశాలు నిర్వహించడం, పొదుపు, రుణాలపై సభ్యులకు అవగాహన కల్పించడం.. జీవనోపాధులపై శిక్షణ ఇవ్వడం, వ్యవసాయం, పశుపోషణ, వ్యాపారాల అభివృద్ధికి దిశానిర్దేశం చేయడం.. ప్రభుత్వ పథకాలతో మహిళలను అనుసంధానం చేయడం వంటి బాధ్యతలను వీరు నిర్వర్తించాల్సి ఉంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రెండు నెలలుగా ఈ-నారీమణులు, సీఆర్పీలను ఎంపిక చేసి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు.
– న్యూస్‌టుడే, కర్నూలు కలెక్టరేట్

పది సంఘాలకు ఒకరు

పొదుపు సంఘాల కార్యకలాపాలు, రుణాలు, వాయిదాలు, పొదుపు మొత్తాలకు సంబంధించిన సమస్త సమాచారాన్ని పుస్తకాలతో పాటు ఆన్‌లైన్‌లో పొందుపరిచేలా వెలుగు ఆధ్వర్యంలో సంస్కరణలు చేపట్టారు. ఇందుకోసం పది సంఘాలకు ఒక ఈ-నారీని నియమిస్తున్నారు. ప్రతినెలా ఎనిమిది రోజులపాటు వీరు తమకు కేటాయించిన సంఘాల పుస్తకాలు రాయడం, గ్రామైక్య సంఘాలు (వీవోఏ) పర్యవేక్షణలో వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. సభ్యులకు రుణాలు తీసుకోవడం, సకాలంలో చెల్లించడంపై అవగాహన కల్పించడం, మన డబ్బులు- మన లెక్కలు యాప్ నిర్వహణ వంటి విధులు నిర్వహించాలి. ఈ పనులు చేసినందుకు వీరికి రోజుకు రూ.300 చొప్పున పారితోషికం చెల్లిస్తారు.

ఎంపికకు ప్రామాణికాలు

18- 45 సంవత్సరాల మధ్య వయసుండి అదే గ్రామంలో స్వయం సహాయ సంఘం సభ్యురాలై ఉండాలి. ఆ ఊరి కోడలై ఉండాలి. పదో తరగతి విద్యార్హత ఉన్నవారిని ఈ-నారీగా, పది ఆపై డిగ్రీ వరకు చదువుకున్న వారిని సీఆర్పీలుగా ఎంపిక చేశారు. వ్యక్తిగత ఆండ్రాయిడ్ ఫోన్ కలిగుండి.. దాన్ని ఉపయోగించడంపై అవగాహన ఉండాలి. డ్వాక్రా సంఘం పుస్తకాల నిర్వహణ తెలిసుండాలి.

సంఘాలు/ సభ్యులు	కర్నూలు	నంద్యాల
జిల్లా గ్రామైక్య సంఘాలు	964	1,098
స్వయం సహాయ సంఘాలు	32,103	30,739
మొత్తం సభ్యులు	3,25,824	3,13,656
ఈ-నారీమణులు	3,180	3,040
సీఆర్పీలు	1,402	1,345

మన డబ్బులు- మన లెక్కలు

మొన్నటి వరకు డ్వాక్రా సంఘాల కార్యకలాపాలన్నీ వీవోఏల కనుసన్నల్లోనే జరిగాయి. బ్యాంకు నుంచి రుణాలు తీసుకునేటప్పుడు, తప్పనిసరి సమావేశాలప్పుడు మాత్రమే సంఘ సభ్యులు హాజరయ్యేవారు. పొదుపు మొత్తాలు, రుణ వాయిదాల లెక్కలను సభ్యులు పట్టించుకునేవారు కాదు. దీంతో చాలా మండలాల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయి. వీటికి అడ్డుకట్ట వేస్తూ, తమ సంఘానికి సంబంధించిన లెక్కలన్నీ సభ్యులు తెలుసుకునేందుకు వీలుగా 'మన డబ్బులు- మన లెక్కలు' పేరుతో ఓ యాప్‌ని రూపొందించారు. దీని ద్వారా సంఘానికి సంబంధించిన ఆర్థిక వ్యవహారాలన్నీ ఇంట్లో ఉండే తెలుసుకునే వెసులుబాటు లభిస్తుంది.

(c) eenadu

నైపుణ్యం పొందేలా.. ఉన్నతంగా ఎదిగేలా..

◆ పీఎంశ్రీ పాఠశాలల్లో వృత్తినైపుణ్య శిక్షణ

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ నిచ్చి.. పాఠశాల స్థాయిలోనే భవితకు బాటలు పడేలా కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ(ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇప్పటికే పలు పాఠశాలలను ఎంపిక చేసి.. అధునాతన ప్రయోగశాలలతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించింది. ఆయా బడుల్లో వృత్తి విద్యా కోర్సులు ప్రత్యేక శిక్షకులు బోధిస్తున్నారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో భౌతిక, రసాయన, జీవశాస్త్ర విభాగాల్లో ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, గ్రంథాలయాలు వంటి పలు రకాల సౌకర్యాలను కల్పిస్తోంది. ఈ నేపథ్యంలో విద్యార్థులు స్వయం ఉపాధి పొందేలా వివిధ అంశాల్లో తర్ఫీదు పొందుతున్నారు.

టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

శిక్షణ ఇచ్చే విద్యా సంస్థలు	:26
9వ తరగతి విద్యార్థులు	:10,350
10వ తరగతి విద్యార్థులు	:9,800
ఇంటర్ విద్యార్థులు	:4,640
శిక్షకుల సంఖ్య	:151

కోర్సుల వివరాలు: అగ్రికల్చర్, కుట్టు, ఆటోమేటివ్, బ్యూటీ అండ్ వెల్‌నెస్, బీఎఫ్ఎస్ఐ, ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్‌వేర్, ఫుడ్ ప్రాసెసింగ్, హెల్త్ కేర్, ఐటీ, రిటైల్ మార్కెటింగ్.

తరగతుల వారీగా తర్ఫీదు

◆ పీఎంశ్రీ కింద ఎంపికైన ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల్లో పలు కోర్సుల్లో ఒకేషనల్ టీచర్లతో నైపుణ్యాలు పెంపొందిస్తున్నారు. 6 నుంచి 8వ తరగతి వరకు కౌశల్ బోధ్ పథకం కింద పుస్తకాలను అందించి ప్రీ ఒకేషనల్ తరగతులను నిర్వహిస్తున్నారు. 9వ తరగతికి లెవల్-1, పదోతరగతి లెవల్-2 కింద, ఇంటర్మీడియట్‌లో ప్రథమ సంవత్సర విద్యార్థులకు లెవల్-3, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు లెవల్-4లో నైపుణ్యాలు కల్పిస్తున్నారు.

◆ విద్యార్థులకు నచ్చిన కోర్సులకు సంబంధించి వృత్తి విద్యా కోర్సుల్లో ఒకేషనల్ ఉపాధ్యాయులతో ప్రత్యేక శిక్షకులను నియమించి.. బోధనతో పాటు పాఠశాలలకు సమీప ప్రాంతాల్లోని పరిశ్రమలు, ఆటోమేటివ్ షాపులు, ఎలక్ట్రానిక్స్ హార్డ్‌వేర్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి వాటిని క్షేత్రస్థాయిలో పలు అంశాలపై ప్రత్యక్షంగా చూపిస్తూ అవగాహన నైపుణ్యాలను పెంపొందిస్తున్నారు. బాలికల సంఖ్య ఎక్కువగా ఉన్న పీఎంశ్రీ పాఠశాలల్లో 9, 10 తరగతుల వారికి కుట్టు, బాలురు ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, అగ్రికల్చర్, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్, ఆటోమేటివ్ కోర్సుల్లో శిక్షణ కల్పిస్తున్నారు.

◆ పదో తరగతి, ఇంటర్ పూర్తైన విద్యార్థులకు శిక్షణలో నేర్చుకున్న అంశాలపై పరీక్ష నిర్వహించి ధ్రువపత్రం అందజేయనున్నారు.

కాణిపాకం దేవస్థానం పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఛైర్మన్, ఈవో

స్వామి, అమ్మవార్లకు తితిదే నుంచి పట్టువస్త్రాలు తీసుకువచ్చిన అధికారులు

నడక మార్గంలో వస్తున్న భక్తులు

శ్రీగిరి మార్గం.. భక్తజన పరవశం

◆ శివనామ స్మరణతో మార్మోగుతున్న నల్లమల

నల్లమల అటవీ ప్రాంతంలో భక్తజన బృందాలు జలప్రవాహంలా శ్రీశైలం చేరుకుంటున్నాయి. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీగిరి శివస్వాములతో నిండిపోయింది. నల్లమల అటవీప్రాంతంతో పాటు శ్రీశైల రహదారులు శివనామస్మరణంతో మారుమోగుతున్నాయి. దాతలు, ఆశ్రమాలు, సత్రాలు, పలు సేవా సంస్థల వారు భక్తుల సేవలో భాగస్వాములవుతున్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని బుధవారం కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం తరపున శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. కాణిపాకం దేవస్థానం ధర్మకర్తలమండలి అధ్యక్షులు మణినాయుడు, ఈవో కె.పెంచల కిశోర్ పట్టువస్త్రాలు తీసుకువచ్చారు. శ్రీశైలం దేవస్థానం ఈవో శ్రీనివాసరావు, ఛైర్మన్ రమేష్‌నాయుడు వారికి మంగళవాయిద్యాల మధ్య ఆలయ ప్రాంగణంలోకి తీసుకువచ్చారు..

– న్యూస్‌టుడే, శ్రీశైలం ఆలయం, నంది సర్కిల్

హఠకేశ్వరం వద్ద కాలినడకన వచ్చే భక్తులకు మజ్జిగ, పండ్లు అందజేస్తున్న విద్యుత్తు శాఖ ఉద్యోగులు

ఆలయానికి చేరుకుంటున్న శివస్వాములు

రాత్రివేళ నడక కొనసాగిస్తూ..

ఆలయం వద్ద నిద్రిస్తున్న భక్తులు

దేవస్థానం ఏర్పాటు చేసిన షెడ్లలో సేదతీరుతున్న భక్తులు

స్నానం చేస్తున్న మాలధారులు

భక్తి బాటలో అటవీ శాఖ సేవలు

భక్తులకు సూచనలు చేస్తున్న విజయ్‌కుమార్

ఆత్మకూరు, నంద్యాల గ్రామీణం న్యూస్‌టుడే: శ్రీశైలానికి పాదయాత్రగా నడిచి వెళ్లే భక్తులు సహజ వనరులు, అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు సహకరించాలని ఎన్ఎస్‌టీఆర్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అండ్ జిల్లా అటవీ శాఖ ఫీల్డ్ డైరెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. నల్లమలలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధానికి తనిఖీలు చేస్తున్న అధికారులు, సిబ్బందిని అభినందించారు. యాత్రికులతో చర్చించారు. సిబ్బంది కొరత ఉన్నా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పకడ్బందీగా పర్యవేక్షణ

● భక్తులకు తాగునీటి ఇబ్బందుల్లేకుండా ప్రవేశ ద్వారం నుంచి భీమునికొలను వరకు నీటి సౌకర్యం కల్పించారు. యాత్రికులకు ప్రథమ చికిత్స సేవలందించేందుకు ప్రైవేట్ ఆసుపత్రుల సహాయంతో ఐదు ప్రాంతాల్లో శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మజ్జిగ పంపిణీకి అనుమతించారు.

● జీవ వైవిధ్యం పరిరక్షణ, భక్తుల సంక్షేమం కోసం ఏడు ప్రదేశాల్లో మూడు షిఫ్టుల్లో 400 మంది అటవీ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనారోగ్యంతో బాధపడేవారు, అత్యవసర సహాయం కోసం యాత్రికులను రక్షించడానికి ప్రత్యేక అటవీ సిబ్బంది సిద్ధంగా ఉన్నారు.

● ప్లాస్టిక్ నిషేధం అమలు చేస్తూ అన్నదాన శిబిరాల వద్ద స్టీల్ ప్లేట్లు, గ్లాసులు ఉపయోగించాలని సూచించారు. పాదబాటలో పరిస్థితిని పర్యవేక్షిస్తూ ఆత్మకూరులో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.

● భక్తులు నడిచే బాట వైపు టైగర్ కోర్ ప్రాంతాల్లో పులుల కదలికలపై నిఘా ఉంచి అటువైపు వచ్చే పులులను అడవిలోకి తరిమివేసేలా చర్యలు తీసుకున్నారు.

14 నుంచి ఓంకారంలో శివరాత్రి ఉత్సవాలు

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన ఓంకార పుణ్యక్షేత్రంలో ఈనెల 14వ తేదీ నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభంకానున్నట్లు బుధవారం ఈవో నాగప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఈనెల 14వ తేదీన బండిఆత్మకూరులోని శివాలయం నుంచి శివపార్వతులను వైభవంగా గ్రామోత్సవం నిర్వహిస్తారని తెలిపారు. 15న బండిఆత్మకూరు నుంచి శింగవరం, సోమయాజులపల్లె గ్రామాల మీదుగా ఓంకార క్షేత్రానికి చేరుకుంటారని చెప్పారు. అదే రోజు తెల్లవారుజామున శివపార్వతులకు వైభవంగా కల్యాణం జరుగుతుందన్నారు. 16న నందివాహన సేవ, 17న అర్చనలు, సాయంత్రం రథోత్సవం ఉంటుందన్నారు. 18న ఆదిదేవుళ్ల ఓంకార క్షేత్రం నుంచి బండిఆత్మకూరు బయలు దేరనున్నట్లు చెప్పారు.

వేలాలకు వేళ కాలేదా

❑ పురపాలికలకు తగ్గుతున్న ఆదాయం
❑ దృష్టిసారించని అధికారులు, పాలకులు

ఆదోని, నంద్యాల, ఎమ్మిగనూరు పురపాలికలు, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలోని పురపాలక సంఘాల్లో గేట్ వసూళ్లకు నిర్వహించాల్సిన వేలాలపై అధికార యంత్రాంగం దృష్టిసారించడం లేదు. కీలకమైన పుర ఆదాయాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనేది స్పష్టమవుతోంది. రాజకీయ అండదండలతో చోటా మోటా నాయకులు మార్కెట్లు దక్కించుకొని గేట్ వసూళ్లతో రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. పురపాలికలకు మాత్రం ఎగనామం పెడుతున్నారు. 2025-26 ఆర్థిక ఏడాది ముగింపు దశకు చేరుతున్నా.. నేటికీ ఎక్కడా వేలాల నిర్వహణపై దృష్టి సారించలేదు.

ఝాన్సీలక్ష్మీబాయి కూరగాయల మార్కెట్

బకాయిలు బారెడు

■ ఆదోని పురపాలక సంఘం పరిధిలోని ఝాన్సీలక్ష్మీబాయి (జేఎల్‌బీ) కూరగాయల మార్కెట్, పశువులు, గొర్రెల సంతలున్నాయి. మూడు మార్కెట్లు 2025-26 ఏడాదికి రూ.90.41 లక్షలకు వేలం పాడారు. జేఎల్‌బీ మార్కెట్ రూ.61.80 లక్షలకు పలికింది. ఆర్థిక ఏడాది ముగుస్తున్నా.. రూ.34.60 లక్షలు బకాయిలు రావాల్సి ఉంది. గతేడాది ఆలస్యంగా వేలాలు నిర్వహించారు. పెంచిన ధరలు తగ్గించాలని గుత్తేదారులు పట్టుబట్టారు. దీంతో మొదటి రెండు నెలలు పాత గుత్తేదారే వసూలు చేయించారు. ఈ లోపు గుత్తేదారులు రింగ్ అయ్యేందుకు అవకాశం ఇచ్చినట్లవుతోంది.

రెండేళ్లుగా మానేశారు

■ నంద్యాలలో రెండేళ్లుగా వేలాలు జరగడం లేదు. గత వైకాపా ప్రభుత్వంలో వేలాలకు పోటీ లేదన్న కారణంతో వాయిదా వేస్తూ వస్తున్నారు. 2024 ఆర్థిక ఏడాది నుంచి ఇప్పటి వరకు నిర్వహించకపోవడం వెనుక చేతివాటమే కారణమనే వాదనలు వినిపిస్తున్నాయి. గతేడాది ఆరు నెలల కాలానికి వేలాలు నిర్వహిస్తే.. కౌన్సిల్ సభ్యులు ఆమోదించలేదు. దీంతో అధికారులే గేట్ వసూళ్లు చేస్తున్నారు. 2025-26 ఆర్థిక ఏడాదికి ఏప్రిల్ నుంచి జనవరి 18వ తేదీ వరకు రూ.26.18 లక్షలు వసూలు చేసినట్లు యంత్రాంగం చెబుతోంది.

ఎప్పుడు నిర్వహిస్తారో

■ ఎమ్మిగనూరులో కూరగాయల మార్కెట్‌తో పాటు పశువులు, గొర్రెల సంత, మాంసం దుకాణాలు, కబేలా.. ఇలా ఆరు మార్కెట్లున్నాయి. 2025-26 ఏడాదికి ఈ మార్కెట్లన్నీ కలిపి రూ.74 లక్షలకు వేలం వేశారు. ఈ ఏడాది ఇంకా వేలాల నిర్వహణ చేపట్టలేదు. దీంతో ఎప్పుడు నిర్వహిస్తారో, ఇంతవరకు ప్రణాళిక సైతం జరగలేదని సమాచారం.

‘రింగ్’ అవుతున్న గుత్తేదారులు

ఏటా పురపాలికల్లో ఆదాయం పెరుగుతున్న పరిస్థితి కనిపించడం లేదు. మూడేళ్లలో వేలం ధరలు కూడి.. వచ్చిన మొత్తాన్ని మూడుగా విభజిస్తారు. సరాసరి 10 నుంచి 15 శాతం మేర పెంచి వేలం నిర్వహించాలి. ఈ విధానం ఎక్కడా అమలు కావడం లేదు. చివరి క్షణంలో వేలాలు నిర్వహించడం, సమయం తక్కువగా ఉందనే నెపంతో గుత్తేదారులు రింగ్ అయ్యేందుకు అవకాశమివ్వడం, లేదంటే.. యంత్రాంగమే వసూలు చేసేలా చేయడం వంటి వాటి వల్ల పుర ఆదాయం తగ్గుతోంది. నంద్యాలలో గడిచిన రెండేళ్లలో గేట్ వసూళ్ల పరిశీలిస్తే.. రూ.1.20 కోట్ల ఆదాయం తగ్గింది. ఎమ్మిగనూరులో 2025-26 ఏడాదికి పాడిన మొత్తంలో ఇంకా రూ.20 లక్షల బకాయిలు చెల్లించాల్సి ఉంది.

నందులకోటకెళ్లిన మహానందీశ్వరుడు

మహానంది, నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: మహానంది పుణ్యక్షేత్రంలో ఈనెల 13వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో కల్యాణ పెద్దలుగా నంద్యాలలోని బ్రహ్మనందీశ్వరాల

మహానంది నుంచి నంద్యాలకు పల్లకిని పంపుతున్న అధికారులు, పండితులు

యంలోని స్వామి, అమ్మవార్లను ఆహ్వానించేందుకు గంగాకామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వారు నంద్యాలకు వెళ్లారు. బుధవారం సాయంత్రం విశేష పూజలు చేసి పంపించారు. స్వామివార్ల మార్గ మధ్యలో అయ్యన్నగర్, శ్రీనగరం, బుక్కాపురం, తమ్మడపల్లె, నంద్యాల మండలం సూగాలిమెట్ట గ్రామాల వద్ద భక్తులతో పూజలందుకున్నారు. నంద్యాలలోని ఆత్మకూరు బస్టాండు సమీపంలోని ఆలయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి బ్రహ్మనందీశ్వరస్వామి దేవస్థానం అధికారులు, సిబ్బంది మహానంది స్వామివారికి స్వాగతం పలికి ఆలయానికి తీసుకెళ్లారు. 12వ తేదీన తిరిగి ఇరు దేవేరుల పల్లకీలు మహానందికి చేరుకుంటాయని పండితులు తెలిపారు.

మహానందీశునికి కాణిపాకం పట్టువస్త్రాల సమర్పణ

మహానంది, న్యూస్‌టుడే: మహానందిలో వెలసిన మహానందీశ్వరస్వామి, కామేశ్వరీదేవి అమ్మవార్లకు కాణిపాకం దేవస్థానం అధికారులు పట్టువస్త్రాలు సమర్పించారు. బుధవారం రాత్రి మహానందికి చేరుకున్న ఈవో పెంచల కిశోర్, ధర్మకర్తల మండలి ఛైర్మన్ మణినాయుడు(బాబు), ప్రధాన అర్చకులు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల గౌరవార్థం పట్టువస్త్రాలు తీసుకువచ్చారు. వీటిని మహానందిలోని ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, వేదపండితులు రవిశంకర అవధాని అందజేశారు.

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగొద్దు

మహానంది, న్యూస్‌టుడే: సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని నంద్యాల ఆర్డీవో చల్లా విశ్వనాథ్ పేర్కొన్నారు. దేవస్థానం ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈనెల 13 నుంచి 18వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు, ఇబ్బందులు కలుగకుండా చూడాలని తెలిపారు. భక్తులకు సరిపడా బస్సులు నడపాలన్నారు.

స్వామి వచ్చె.. పండగ తెచ్చె

రుద్రవరం, న్యూస్‌టుడే: అహోబిలం పార్వేట ఉత్సవాల్లో భాగంగా బుధవారం చిలకలూరు గ్రామంలో స్వామి పల్లకి రాకతో పండగ వాతావరణం నెలకొంది. స్వయంగా స్వామి తమ దగ్గరకు రావడంతో గ్రామస్థులు సంబరాలు చేసుకున్నారు. స్వామి వార్లకు భక్తులు పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. గ్రామంలో పార్వేటోత్సవం సందర్భంగా సందడి నెలకొంది.

మల్లన్నసేవలో తెలంగాణ మంత్రి కొండా సురేఖ

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జునస్వామివార్లను బుధవారం తెలంగాణ మంత్రి కొండా సురేఖ దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆమె ఆలయ మహాద్వారం వద్దకు రాగా దేవస్థానం ఈవో ఎం.శ్రీనివాసరావు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆమె శ్రీస్వామిఅమ్మవార్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పండితులు వేదాశీర్వచనాలు పలుకగా, ఈవో స్వామివార్ల శేషవస్త్రాలు, ప్రసాదాలు, జ్ఞాపిక బహూకరించారు.

వివరాలు వెల్లడిస్తున్న డోన్ డీఎస్పీ శ్రీనివాసులు

చోరీ కేసులో నిందితుల అరెస్టు

బనగానపల్లి, న్యూస్‌టుడే: బనగానపల్లి పట్టణంలో ఈ నెల 7న శ్రీనివాస జ్యువెలరీ దుకాణంలో జరిగిన చోరీ కేసులో ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు డోన్ డీఎస్పీ శ్రీనివాసులు బుధవారం వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం మైలాన్‌దేవరపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ ఇమ్రాన్, షేక్ మహబూబ్ ఇబ్రహీం, సయ్యద్ షాదుల్లా, మహమ్మద్ షేక్‌షా, బాలకృష్ణ, తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా బాలాపూర్‌కు చెందిన మహమ్మద్ నజీర్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు. దుకాణం షట్టర్‌ను కత్తిరించి లోనికి ప్రవేశించి 18 తులాల బంగారు నగలు, 8 కేజీల వెండిని దోచుకెళ్లారు. వీరు కునుకుంట్ల వద్ద జరిగే ఉరుసుకు వాహనంలో వచ్చారు. అనంతరం తెలంగాణకు వెళ్లే సమయంలో చోరీకి పాల్పడ్డారు. నిందితుల గుర్తింపులో బనగానపల్లి సీఐ ప్రవీణ్‌కుమార్, నంద్యాల సీసీఎస్ సీఐ సురేశ్‌కుమార్, ఎస్సైలు కల్పన, దుగ్గిరెడ్డి పాల్గొన్నారని తెలిపారు.

YEMMIGANUR MUNICIPALITY
E-Procurement Tender Notice No. 15/15th FCG& General Fund- 2025-2026/E1, dt. 11.02.2026
మునిసిపల్ సాధారణ నిధులు మరియు 15వ ఆర్థిక సంఘ నిధులతో 20 పనులు గాను రూ. 75.07 లక్షలతో అర్హులైన కాంట్రాక్టర్ల నుండి టెండర్లు స్వీకరించబడును, వివరములకు apeprocurement.gov.in నుండి పొందగలరు.
సం/- కమిషనరు, ఎమ్మిగనూరు పురపాలక సంఘం.

సంతృప్త స్థాయి అంతంత మాత్రమే

● ప్రభుత్వ శాఖల సేవలపై ప్రజల పెదవి విరుపు

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఆయా ప్రభుత్వ శాఖలు ప్రజలు సంతృప్తి చెందేలా సేవలు అందించాలని ప్రభుత్వం ఆదేశిస్తోంది. ఆయా శాఖల పనితీరుపై ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ సేకరిస్తోంది. దానిని పరిశీలిస్తే సంతృప్త స్థాయి కంటే అసంతృప్తే ఎక్కువగా కనిపిస్తోంది. విద్యుత్తు సేవల్లో కర్నూలు జిల్లా రాష్ట్రంలో చివరి నుంచి ఆరో స్థానంలో నిలవగా.. నంద్యాల జిల్లా పదో స్థానంలో నిలిచింది. పాఠశాల విద్యపై కూడా తల్లిదండ్రుల నుంచి పెద్దఎత్తున ఫిర్యాదులు అందాయి. ఉపాధ్యాయులు పాఠశాలలకు సకాలంలో హాజరయ్యేలా చూడాలని, పిల్లలకు అర్థమయ్యేలా విద్యా బోధన సాగాలని, మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం వడ్డించాలని, రుచి, నాణ్యత బాగుండేలా చూడాలని పలువురు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

☛ ఆయా ప్రభుత్వ శాఖల్లో అందుతున్న సేవలపై ప్రజల సంతృప్త స్థాయికి సంబంధించి రాష్ట్రస్థాయిలో కర్నూలు, నంద్యాల జిల్లాల ర్యాంకులు ఇలా ఉన్నాయి.

సంతృప్త స్థాయిపై వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ డా.సిరి

ప్రభుత్వ సేవలు	కర్నూలు	నంద్యాల
విద్యుత్తు సేవలు	23	10
పాఠశాల విద్యాశాఖ పనితీరు	24	18
మధ్యాహ్న భోజన పథకం అమలు	28	13
ఉచిత ఇసుక సరఫరా	09	11
గృహ నిర్మాణ బిల్లుల చెల్లింపు	03	19
ఇంటర్మీడియట్ కాలేజియేట్ సేవలు	19	10

ఉచిత ఇసుకపై అలక

గృహ నిర్మాణ శాఖ సేవల్లో కర్నూలుకు 3వ ర్యాంక్ రాగా.. ఉచిత ఇసుక విధానంలో 9వ ర్యాంక్ వచ్చింది. విద్యుత్తు, పాఠశాల స్థాయి, ఇంటర్మీడియట్ విద్య, మధ్యాహ్న భోజన పథకం అమలు తదితర నాలుగు అంశాల్లో కర్నూలు చివరి స్థానాల్లో నిలిచింది.

● నంద్యాల జిల్లా ఇంటర్మీడియట్ కాలేజియేట్, విద్యుత్తు సేవల్లో పదో స్థానంలో నిలిచింది. మిగిలిన సేవల్లో వెనుకబడింది.

ర్యాంకులు మెరుగుపడాలి

పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ అంశంపై కలెక్టర్ డా.ఎ.సిరి బుధవారం కర్నూలు కలెక్టరేట్‌లో ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. రేషన్ సరకులు అందరికీ అందేలా చూడాలని, వాటి నాణ్యత బాగుండేలా చూడాలని డీఎస్‌వోను ఆదేశించారు. దీపం పథకం లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్లు డెలివరీ చేసే బాయ్స్ ప్రవర్తన మర్యాదగా ఉండాలని, బిల్లు మొత్తం కంటే ఎక్కువ డబ్బు వసూలు చేయకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్తు సరఫరాలో లోపాలు లేకుండా చూడాలని ఆ శాఖ ఎస్ఈని ఆదేశించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం వడ్డించాలని, వేరుసెనగ చిక్కీలు నాణ్యంగా ఉండేలా చూడాలని డీఈవోకు సూచించారు. జడ్పీ, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో జడ్పీ సీఈవో నాసరరెడ్డి, డీఎస్వో రాజా రఘువీర్, విద్యుత్తుశాఖ ఎస్ఈ ప్రదీప్‌కుమార్, డీఈవో సుధాకర్, సమగ్ర శిక్షా ఏపీసీ లోకరాజు, జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల సౌకర్యాలపై సమగ్ర పర్యవేక్షణ

● శ్రీశైలంలో ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

శ్రీశైలం ఆలయం, నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: శ్రీశైలం బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, ఎస్పీ సునీల్ షొరాణ్ బుధవారం సమగ్రంగా పరిశీలించారు. దేవస్థానం కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి క్యూలైన్లు, ట్రాఫిక్ నిర్వహణ, దర్శనాల ఏర్పాట్లు, అన్నదాన, భోజనాల వసతులు, పార్కింగ్ ప్రదేశాలు, నడకదారిలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక విశ్రాంతి కేంద్రాలు, తాగునీరు, వైద్య శిబిరాలు తదితర సదుపాయాలను సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా, ముఖ్యంగా తొక్కిసలాటకు అవకాశం లేకుండా ప్రశాంత వాతావరణంలో దర్శనాలు జరిగేలా పనిచేయాలని ఆదేశించారు. క్యూలైన్లలోని భక్తుల్లో అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే సమీప వైద్య కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్కులు, పబ్లిక్ అనౌన్స్‌మెంట్ వ్యవస్థలను వినియోగించుకోవాలని తెలిపారు.

కమాండ్ కంట్రోల్ రూంలో సీసీ కెమెరాల ద్వారా పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

అందరితో గౌరవంగా మాట్లాడాలి

బ్రహ్మోత్సవాలకు బందోబస్తు విధులకు వచ్చిన స్పెషల్ పార్టీ, సాయుధ రిజర్వు సిబ్బంది, ఏపీ స్పెషల్ పోలీసు సిబ్బంది, కర్నూలు, నంద్యాల, అన్నమయ్య తదితర జిల్లాల నుంచి వచ్చిన సుమారు 180 మంది సాయుధ బలగాల సిబ్బందికి ఎస్పీ సునీల్ షొరాణ్ దిశానిర్దేశం చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన శివ భక్తులు పట్ల గౌరవప్రదంగా మాట్లాడుతూ.. వారికి మార్గం చూపించాలని సూచించారు. సిబ్బంది ఎట్టి పరిస్థితుల్లోనూ సహనం కోల్పోవద్దని అన్నారు. కేటాయించిన ప్రదేశాల్లో నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలన్నారు. చంద్రావతి కల్యాణ మండపం, ఫ్రీ క్యూలైన్, లడ్డూ కౌంటర్, గంగాధర మండపం, నంది సర్కిల్, దాసరి సత్రం, ఆర్టీసీ బస్టాండ్, సిద్ధరామయ్య కాంప్లెక్స్, పాతాళగంగ స్నానఘట్టాలు, పార్కింగ్ ప్రదేశాల్లో సిబ్బందిని విధుల్లో నియమించారు. కార్యక్రమంలో ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్, శ్రీశైలం వన్‌టౌన్ సీఐ జీవన్ గంగానాథ్ బాబు, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు మంజునాథ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండును తనిఖీ చేసిన కలెక్టర్

శ్రీశైలానికి భారీగా తరలివస్తున్న భక్తుల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆర్టీసీ బస్టాండును ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్సుల ఫ్రీక్వెన్సీ, రాకపోకల సమయాలు, వివిధ ప్రాంతాలకు బయలుదేరే బస్సుల షెడ్యూల్ తదితర అంశాలపై ఆర్టీసీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. బస్సులు సమయపాలన పాటిస్తున్నాయా? ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయి? అని నేరుగా ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. సమగ్రమైన సమాచారం అందించేందుకు బస్టాండులో పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బస్టాండులో పారిశుద్ధ్య పరిస్థితిని పరిశీలించారు.

మహిళ ఆత్మహత్య

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని నందమూరినగర్‌కు చెందిన హసీనా(37) మంగళవారం అర్ధరాత్రి అందరూ నిద్రిస్తుండగా ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ ఈశ్వరయ్య తెలిపారు. భర్త మహబూబ్ బాషా మద్యానికి బానిసకావడంతో ఆమె తరచూ గొడవపడేదన్నారు. ఇంట్లో భర్త నిద్రిస్తున్న సమయంలో ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఆమెకు ఒక కూతురు ఉంది.

కంది చేనులో కాలిపోయిన రైతు

నందికొట్కూరు, న్యూస్‌టుడే: నందికొట్కూరు పట్టణం కోటా వీధికి చెందిన బంగారు చిన్న శేఖరరెడ్డి(51) తన పొలంలో కాలిపోయి శవంగా కనిపించడంపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. జూపాడుబంగ్లా మండలం పరిధిలోని తనకున్న రెండు ఎకరాల పొలంలో కంపచెట్లను తొలగించేందుకు వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తమ పొలం పక్కన ఖాజా అనే రైతు కంది పంట సాగులో ఉందన్నారు. కంది పంటకు నిప్పంటుకుందని, చిన్న శేఖరరెడ్డి కనిపించడం లేదని మృతుడి సెల్‌ఫోన్ నుంచి ఖాజా ఫోన్ చేశాడని తెలిపారు. హుటాహుటిన పొలం వద్దకు వెళ్లి వెతకగా కనిపించలేదన్నారు. పక్కనే ఉన్న ఖాజా పొలంలో గాలించగా కంది సాలు మధ్యలో పూర్తిగా కాలిపై శవంగా పడి ఉన్నాడని తెలిపారు. తమకు ఫోన్ చేసిన ఖాజా అక్కడి నుంచి వెళ్లిపోయాడన్నారు. ఏమి జరిగిందన్న విషయం ఖాజాకు తెలుసని, మృతిపై అనుమానం ఉందని కుమారులు చంద్రమౌళిరెడ్డి, లోకేశ్వరరెడ్డిలు అనుమానం వ్యక్తం చేశారు. నందికొట్కూరు సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



చిన్న శేఖరరెడ్డి (పాత చిత్రం)

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం|| ✆ 73821 14647.

JOBS
కర్నూలు కొరియర్ లాజిస్టిక్ లో పని చేయుటకు 1 సంవత్సరం అనుభవం ఉన్న కొరియర్ డెలివరీ బాయ్స్ కావలెను. సంప్ర: 85558 37909.
కర్నూలు - నంద్యాల జిల్లాలో వినాయక సోలార్ నందు పని చేయుటకు మార్కెటింగ్ Executives & Manager కావలెను. జీతం 15,000/- మరియు Spl ఇన్సెంటివ్ ఇవ్వబడును. సంప్ర: 95025 92654.

అన్నికాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నంద్యాల

•నంద్యాల •నందికొట్కూరు •శ్రీశైలం •పాణ్యం

శ్రీశైలంలో ప్రత్యేక అధికారి పర్యటన

కైలాసద్వారం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఏవో చంద్రశేఖర్ ఆజాద్

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో బుధవారం దేవాదాయశాఖ ఆర్జేసీ, ఉత్సవాల ప్రత్యేక అధికారి ఎస్.ఎస్.చంద్రశేఖర్ ఆజాద్ పర్యటించారు. కైలాస ద్వారం, హఠకేశ్వరం వద్ద పాదయాత్ర భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. చంద్రావతి కల్యాణమండపం వద్ద శివదీక్ష భక్తులకు దేవస్థానం కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు ఆయన శ్రీశైలంలో ఉండి ఏర్పాట్లను పర్యవేక్షించనున్నారు.

వైద్య శిబిరాలకు మందుల విరాళం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో జిల్లాలో వివిధ శైవ క్షేత్రాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలకు రూ.20 వేల విలువ చేసే మందులను జనసేన నాయకుడు సుధా మోహన్ రెడ్డి విరాళంగా అందజేశారు. బుధవారం ఆయన రెడ్‌క్రాస్ అధ్యక్షులు దస్తగిరి, కోశాధికారి నాగేశ్వర రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉస్మాన్‌బాషా, మల్లికార్జునలకు అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 90143 08024
నంద్యాల : 98853 28120

నంద్యాల పురపాలకం: ?: పట్టణంలోని శివనగర్‌లో, పప్పులబట్టీ బజార్‌లో కాలువలు శుభ్రం చేయడంలేదు. - సూర్య, శక్తి స్థానికులు ?: నంద్యాల పట్టణం లలితనగర్‌లో వీధికుక్కలతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. - నిఖిల్, స్థానికుడు ✔: సిబ్బందిని పంపి కాలువలు శుభ్రం చేయిస్తాం. త్వరలోనే కుక్కల సమస్యలను పరిష్కరిస్తాం. - లక్ష్మీనారాయణశర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: ?: మండల కేంద్రం పాణ్యంలో బనగానపల్లె రహదారిలోని ఎన్టీఆర్ కాలనీలో పెద్ద ఎత్తున కంపచెట్లు పెరిగాయి. - ఈశ్వరయ్య ✔: సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తాం. - వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి, పాణ్యం

పేదలకు అండగా సీఎం సహాయ నిధి

వెల్పనూరులో బాధితునికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా

వెల్పనూరు(వెలుగోడు), న్యూస్‌టుడే: ప్రతి పేద కుటుంబానికి అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి ఉంటుందని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. వెలుగోడు మండలంలోని వెల్పనూరు గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బుధవారం బాధితులకు పంపిణీ చేశారు. 41 మంది బాధితులకు రూ.23 లక్షల విలువ చేసే చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు శ్రీనివాసులు, ఒబ్బు మధుసూదన్‌రెడ్డి, మదన, పాపయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పీపీపీ విధానాన్ని రద్దు చేయాలి: సీపీఐ

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: ప్రభుత్వం తీసుకొచ్చిన పీపీపీ విధానాన్ని రద్దు చేసి వైద్య కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి, సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ డిమాండు చేశారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం రాష్ట్ర వ్యాప్త ఆందోళనలకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. ఆరోగ్యశ్రీ నుంచి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల వరకు అన్నీ పేదవాళ్లను దోపిడీ చేస్తున్నాయని ఆరోపించారు. ఈ నెల 14వ తేదీన జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాల్లో ఆందోళనలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సోమన్న, బి.శ్రీనివాసులు, లక్ష్మీదేవి, డి.శ్రీనివాసులు, హరినాథ్, శశిధర్ పాల్గొన్నారు.

సీట్లు లేక పాట్లు

★ బస్టాండులో బస్సుల కోసం ప్రయాణికుల పడిగాపులు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బస్టాండ్లలో రద్దీ అధికంగా ఉంది. నంద్యాల జిల్లా నుంచి శ్రీశైలానికి వెళ్లాలంటే నంద్యాల, ఆత్మకూరు మీదుగా వెళ్లాలి. శ్రీశైలానికి వెళ్లే భక్తులు చాలా మంది వెంకటాపురం నుంచి కాలినడకన వెళ్లి దర్శనం చేసుకుంటారు. దర్శనం అనంతరం సొంత ఊర్లకు తిరుగు ప్రయాణమవుతారు. శ్రీశైలం వెళ్లడానికి, దర్శనం అనంతరం సొంత ఊర్లకు చేరుకోవడానికి వస్తున్న భక్తులతో నంద్యాల ఆర్టీసీ బస్టాండు కిటకిటలాడుతోంది. ఈనెల 9వ తేదీ నుంచి శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని అధికారులు చెబుతున్నా అవి ఏమాత్రం సరిపోవడం లేదు. దీంతో గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది.

బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్న జనం

రోజూ 18 బస్సులు

నంద్యాల ఆర్టీసీ డిపో పరిధిలో 108 బస్సులు ఉన్నాయి. నంద్యాల డిపో నుంచి మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 13 నుంచి 18 బస్సులు, ఇతర డిపోల నుంచి 58 బస్సులను శ్రీశైలానికి నడపనున్నారు. కానీ 9వ తేదీ నుంచే రద్దీ అధికం కావడంతో నంద్యాల డిపో నుంచి 9వ తేదీ 6 బస్సులు, 10వ తేదీన 10 బస్సులు, 11న 14 బస్సులు నడుపుతున్నారు. 12వ తేదీ నుంచి 3 రెగ్యులర్ సర్వీసులతో పాటు అదనంగా 15 బస్సులను నడపనున్నారు. భక్తుల కోసం శివరాత్రి రోజున ఆదివారం మహానంది, ఓంకారం, భోగేశ్వరం శైవక్షేత్రాలకు నంద్యాల నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు.

గంటల కొద్దీ నిరీక్షణ

కర్నూలు, బనగానపల్లె, మార్కాపురం, కడప, ఆళ్లగడ్డ తదితర మార్గాల్లో బస్సులను తగ్గించి శ్రీశైలంకు తిప్పుతున్నారు. కానీ ఈ మార్గాల్లో వెళ్లేందుకు బస్టాండుకు వస్తున్న ప్రయాణికులకు బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గంటల కొద్దీ బస్టాండులో వేచి చూస్తున్నా బస్సులు రావడంలేదని వాపోతున్నారు. అర గంటకోసారి వచ్చే బస్సుల్లో సీట్లు దొరక్క ఉసూరుమంటూ మరో బస్సు కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. బయట ప్రైవేటు వాహనాల్లో వెళ్తే రెండింతల ఛార్జీలు వసూలు చేస్తున్నారు.

ఎదురు చూస్తున్నా రావడం లేదు

- చంద్రశేఖర్, ప్రయాణికుడు

శ్రీశైలం దర్శనం చేసుకొని తాడిపత్రికి వెళ్తున్నా. నంద్యాల బస్టాండు వచ్చి గంటపైనే అయ్యింది. బస్సు కోసం ఎదురు చూస్తున్నా రావడంలేదు. మధ్యాహ్నం భిక్షకు వెళ్తే బస్సు వెళ్లిపోతుందేమోనని భిక్షకు వెళ్లకుండా ఎదురు చూస్తున్నా. రద్దీకి అనుగుణంగా బస్సులు నడపాలి.

ఇబ్బందులు లేకుండా చర్యలు

- మాధవీలత, ఆర్టీసీ డీఎం, నంద్యాల

శివరాత్రి సందర్భంగా బస్టాండులో ప్రయాణికుల రద్దీ పెరిగింది. శ్రీశైలం వెళ్లే భక్తుల కోసం 9వ తేదీ నుంచి అదనంగా బస్సులు నడుపుతున్నాం. నేటి నుంచి రోజూ 18 బస్సులను నడుపుతాం. రద్దీ అధికంగా ఉంటే అదనంగా బస్సులు నడిపి ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం.

గాజులపల్లెలో అలంకరణలో దస్తగిరిస్వామి దర్గా

దస్తగిరిస్వామి గంధోత్సవం

గాజులపల్లె, (మహానంది), న్యూస్‌టుడే: మహానంది మండలం గాజులపల్లె గ్రామ కొలిమిపేటలో వెలసిన హజరత్ దస్తగిరిస్వామి దర్గా ఉరుసు గంధోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. 12, 13వ తేదీల్లో ఉరుసు, ఖవ్వాలి, జియారత్ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.

అక్రమ నిర్మాణాలకు నోటీసులు

స్పందనకు వందనం

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కానాల గ్రామంలోని జగనన్న కాలనీలో రెండు, మూడు ప్లాట్లను ఒకే భవనంగా నిర్మిస్తున్నారని 'పేదల కాలనీ పెద్దల భవంతి' పేరుతో గత ఏడాది జులై 10వ తేదీన 'ఈనాడు'లో కథనం ప్రచురించారు. దీనికి స్పందించిన కలెక్టరు రాజకుమారి విచారణ నిర్వహించాలని ఆర్డీవో విశ్వనాథ్‌ను ఆదేశించారు. ఈమేరకు గ్రామీణ తహసీల్దారు, గ్రామ రెవెన్యూ అధికారులు విచారణ నిర్వహించారు. గ్రామానికి చెందిన శిద్దయ్య 3 ప్లాట్లను కలిపి ఒకే భవంతిగా, రంగారావు రెండు ప్లాట్లను కలిపి ఒకే భవంతిగా నిర్మించారని, ఫరూక్ రెండు ప్లాట్లను, అల్లూరయ్య రెండు ప్లాట్లను కొనుగోలు చేసి నిర్మాణం చేపట్టారని నివేదికను అందజేశారు. దీంతో కలెక్టరు అక్రమ నిర్మాణదారులకు నోటీసులు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. గ్రామ రెవెన్యూ అధికారి అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారికి 15 రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని నోటీసులు 10 రోజుల కిందట జారీ చేశారు.

నీటి వృథాను అరికట్టండి

వేసవి వస్తున్నందున భూగర్భజలాలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. మండల కేంద్రం మిడుతూరు కూడలిలో ఉన్న మినిట్యాంకు నిండి నీరు వృథాగా పారుతోంది. ముమ్ముందు వేసవి దృష్ట్యా నీరు వృథా కాకుండా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, మిడుతూరు

ఇరుకు దారి... ఇబ్బందులే మరి

నంద్యాల పట్టణంలోని శ్యామ్‌నగర్‌లో ప్రధాన రహదారిలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గోడ పక్కనే దారివెంట కార్లను ఉంచారు. మరోవైపు నెట్ కేబుల్‌కు సంబంధించిన స్తంభం రోడ్డులో ప్రమాదకరంగా ఉంది. దీంతో దారి ఇరుకుగా మారింది. రాత్రి సమయంలో ద్విచక్రవాహనదారులకు దూరం నుంచి కనపడక తరచూ ఇక్కడ ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

వీధుల్లో శునకాలు.. వణుకుతున్న జనాలు

నంద్యాల పట్టణంలో వీధి శునకాల దెబ్బకు జనం వణుకుతున్నారు. ఏ వీధిలో చూసినా గుంపులుగా సంచరిస్తూ పాదచారులు ముఖ్యంగా మహిళలు, చిన్నారులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. దీంతో ఇంటి నుంచి బయటికి రావడానికి ప్రజలు భయపడుతున్నారు. వీధి కుక్కల బెడద నుంచి కాపాడాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

మలుపు ప్రమాదకరం

మండలంలోని కొత్తపల్లె మెట్ట నుంచి భీమవరం వెళ్లే రహదారిలో ఉన్న మలుపు వద్ద డ్రైవరు అప్రమత్తంగా లేకపోతే పెద్దప్రమాదం జరుగుతోంది. మలుపు వద్ద పెద్ద చెట్టు ఉంది. దీంతో ఎదురుగా వస్తున్న వాహనం కనపడదు. మలుపును సూచించే బోర్డులు సంబంధిత అధికారులు ఏర్పాటు చేయాలని గ్రామాల రైతులు, ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నంద్యాల గ్రామీణం

జీవితంలో ఉన్నతికి సమాజమే కారణం

గడివేముల, న్యూస్‌టుడే: జీవితంలో ఉన్నత స్థానంలో ఉన్నామంటే సమాజమే కారణమని డీఈవో జనార్దన్‌రెడ్డి అన్నారు. గడివేములలోని శ్రీరాజరాజేశ్వరి పాఠశాలలో బుధవారం నిర్వహించిన సొసైటీ డేలో ముఖ్య అతిథిగా డీఈవో పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన వృత్తినైపుణ్యాలను తిలకించారు. ఉర్దూ విద్యా డివిజనల్ ఇన్‌స్పెక్టర్ అస్మద్దీన్ మాట్లాడుతూ.. విద్యతోనే జ్ఞానం, నైపుణ్యం, ఆత్మవిశ్వాసం కలిగి జీవన ప్రమాణాలు పెరుగుతాయన్నారు. ఎస్సై నాగార్జునరెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ రామేశ్వరరావు, ఏవో రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు. గడివేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రత్యేక తరగతులను డీఈవో జనార్దన్‌రెడ్డి తనిఖీ చేశారు. సీ, డీ గ్రేడ్ విద్యార్థులు

గడివేములలో సైనిక దుస్తులు ధరించిన విద్యార్థులతో డీఈవో జనార్దన్‌రెడ్డి

వసతిగృహాల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

మిడుతూరు, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు విద్యార్థులను దత్తత తీసుకోవడం వల్ల మంచి ఫలితాలు సాధించవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రెడ్డి సూచించారు. తలముడిపి, అలగనూరు, చెరుకుచెర్ల ఉన్నత పాఠశాలల్లో పరిశీలించారు. మండల విద్యాధికారులు ఫైజున్నిసా, మల్లికార్జున నాయక్‌లు పాల్గొన్నారు.

లేగదూడల సంరక్షణతోనే సంపద వృద్ధి

బోయరేవుల (వెలుగోడు), న్యూస్‌టుడే: లేగదూడల పెంపకంపై శ్రద్ధ వహించి సంరక్షించినప్పుడే పశు సంపద వృద్ధి చెందుతుందని పశు గణాభివృద్ధి సంస్థ అధికారి రాజశేఖర్ అన్నారు. వెలుగోడు మండలంలోని బోయరేవల గ్రామంలో బుధవారం రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా లేగదూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. పాడిరైతులు 63 లేగదూడలను ఈ కార్యక్రమంలో ప్రదర్శించారన్నారు. పాడిరైతులకు లేగదూడల కిట్స్ అందజేశామన్నారు. ప్రదర్శనలో పాల్గొన్న లేగదూడల పాడిరైతులకు బహుమతులను అందజేసినట్లు వివరించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

పతకాలు సాధించిన క్రీడాకారులతో ప్రముఖులు

బాక్సింగ్ పోటీల్లో జాతీయస్థాయిలో పతకాలు

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణానికి చెందిన 15 మంది క్రీడాకారులు జాతీయస్థాయి ఓపెన్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పతకాలు సాధించినట్లు జిల్లా ఒలింపిక్స్ మాజీ అధ్యక్షుడు డా.రవికృష్ణ తెలిపారు. స్థానిక క్రీడా సమాఖ్య కార్యాలయంలో క్రీడాకారులను బుధవారం ఆయన అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. బాక్సింగ్ క్రీడాభివృద్ధికి సహకరిస్తామని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించిన జిల్లా క్రీడాకారులను ప్రోత్సహించి సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డా.మధుసూదన్‌రావు, బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఫయాజ్, సభ్యులు చంద్ర, ప్రసాద్, మురళీమోహన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మహానందిలో చాగంటి ప్రవచనం

మహానంది, న్యూస్‌టుడే: మహానంది పుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు ప్రవచనం ఉందని దేవస్థానం ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, వేదపండితులు రవిశంకర అవధాని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ప్రతి ఒక్కరూ చదువుకోవాలి

నంద్యాల పురపాలకం, న్యూస్‌టుడే: విద్యా ఆవశ్యకత గురించి ప్రతి ఒక్కరికీ వివరించాలని పురపాలక కమిషనర్ బండి శేషన్న, మెప్మా పీడీ వెంకటదాస్ అన్నారు. 'ఉల్లాస్ అక్షర ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని టౌన్‌హాల్‌లో మహిళలకు పాఠాలు బోధించారు. ప్రతి ఒక్కరూ చదువుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. సీఎంఎం భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. నంద్యాల పట్టణంలో అన్న క్యాంటీన్ల ద్వారా రూ.5లకే నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నారని పురపాలక కమిషనర్ బండి శేషన్న తెలిపారు. అన్న క్యాంటీన్‌ను బుధవారం పరిశీలించారు. భోజనం వివరాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: ఎన్నికల సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని జిల్లా ఎస్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్, అజాం బేగ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎస్టీయూ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ... ఈనెల 13వ తేదీన కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాలన్నారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అమీర్, సుబ్బరాయుడు, గోపాలకృష్ణ, మౌలాలి, నాగేంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎస్టీయూ నాయకులు

పొదుపుపై విద్యార్థుల్లో అవగాహన

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక రామకృష్ణ పీజీ కళాశాలలో బుధవారం ఆర్‌బీఐ ఆధ్వర్యంలో ఆర్థిక సాక్షరత వారోత్సవాల సందర్భంగా క్విజ్ పోటీలు నిర్వహించి, బహుమతులను ప్రదానం చేశారు. లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ రవీంద్రకుమార్ మాట్లాడుతూ... విద్యార్థుల్లో పొదుపు, బ్యాంకింగ్ సేవలు, డిజిటల్ లావాదేవీలు, ఆర్థిక ప్రణాళికలపై అవగాహన పెంచడమే కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో రామకృష్ణ విద్యా సంస్థల ఛైర్మన్ డా.జి.రామకృష్ణారెడ్డి, వివిధ బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: పొద్దుతిరుగుడు సాగు చేస్తున్న రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని తెగుళ్ల విభాగం ప్రధాన శాస్త్రవేత్త వెంకటరమణ, శాస్త్రవేత్తలు నసీరుద్దీన్, రమాదేవి అన్నారు. కొత్తరామాపురం, ఆత్మకూరులో పొద్దుతిరుగుడు, నూనెగింజలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. 24 మంది రైతులకు స్ప్రేయర్లు పంపిణీ చేశారు.

రైతులకు పంపిణీ చేసిన స్ప్రేయర్‌లతో అధికారులు, శాస్త్రవేత్తలు

ఆన్‌లైన్ ద్వారా డ్రోన్ సేవలు

జిల్లెల్ల(గోస్పాడు), న్యూస్‌టుడే: మండలంలోని జిల్లెల్లలో యాప్ ద్వారా కిసాన్ డ్రోన్ల వినియోగాన్ని ఏవో స్వప్నిక ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. రైతులు చరవాణిలోని ప్లేస్టోర్‌లో డ్రోన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. దీని ద్వారా డ్రోన్ బుకింగ్ చేసుకోవచ్చన్నారు. వివరాలను గోడపత్రాలతో ప్రదర్శించారు. కార్యక్రమంలో ఏఈవో రామకృష్ణ, వీఏఏలు దివాకర్, ఉషా, ఖాజావలి, పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి అభినందన

నందికొట్కూరు, న్యూస్‌టుడే: నందికొట్కూరు పట్టణంలోని శ్రీవాణి ఇంగ్లీష్ పాఠశాలకు చెందిన విద్యార్థి తేజస్విని జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీలో ప్రతిభ చూపినట్లు పాఠశాల డైరెక్టర్ హనుమంతరావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని, డ్రాయింగ్ మాస్టర్ హారికను పాఠశాల డైరెక్టర్ అభినందించారు. చోడవరం చిత్రకళా నిలయంలో నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీలో 8వ తరగతి చదువుతున్న తేజస్విని జాతీయ స్థాయిలో బంగారు పతకాన్ని సాధించిందన్నారు.

అత్తపై దాడి చేసిన అల్లుడు

మిడుతూరు, న్యూస్‌టుడే: భార్యను కాపురానికి పంపడం లేదని దేవనూరు గ్రామానికి చెందిన అక్తర్ బేగం అనే మహిళపై ఆమె అల్లుడు షాకిర్ అలీ మంగళవారం రాత్రి దాడి చేశాడని పోలీసులు తెలిపారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అల్లుడిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై సుబ్బయ్య తెలిపారు.

వేలం వాయిదా ప్రకటన

మహారాజశ్రీ నంద్యాల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P.No.171/2023 in O.S.No.402/2021

K.వేంకటవీరరాఘవరెడ్డి -D.hr

V/s

U.నాగసుబ్బరాయుడు (Died) పోతివారసులు 1) U.అరుణకుమారి, 2) U.రాము. ఇద్దరూ పొన్నాపురం గ్రామం, నంద్యాల మండలం, నంద్యాల జిల్లా. - J.drs

పై నెంబరు అపలు అర్జీలోని D.hr. అపలు అర్జీ మొత్తము రూ. 4,36,614/-లు రాగోరి J.Drs తాల్కూ హక్కు అనుభవంలోగల షెడ్యూలు స్థిరాస్తిని వేలం కోరగా కోర్టువారు 3-3-2026వ తేదీకి వేలమునకు గాను వాయిదా వేసినారు. కావున కావలసిన సవాలుదారులు ఎవరైనా ఉంటే పైతేదీన ఉదయం 10.30 గంటలకు పైకోర్టులో హాజరై వేలంలో పాల్గొనవచ్చును.

షెడ్యూలు

నంద్యాల జిల్లా, నంద్యాల రిజిస్ట్రేషన్ జిల్లాలో చేరిన నంద్యాల మండలం, అయ్యలూరు గ్రామంలోని J.drs యొక్క హక్కు అనుభవంలో గల స్థిరాస్తి వివరం.

సర్వే నెంబరు : 947/1A, విస్తీర్ణము : ఎ 0.47 1/2 సెంట్లు ఫుల్

NB : E.C. లో ఏమిన్నీ తగాదాలు లేవు.

DHr విలువ : రూ. 5,00,000/-
అమీనా విలువ : రూ. 6,50,000/-
S.R.O వారి విలువ : రూ. 3,32,500/-
వేలం వాయిదా తేది:- 3-3-2026

చేపూరి మద్దులేటి, B.A., B.L.,
D.Hr. అడ్వకేట్, నంద్యాల - 518 501.
Cell : 93962 25935

సంక్షిప్త సమాచారం

నందికొట్కూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన జూపాడుబంగ్లాలోని క్వాటర్స్‌కు నీటి సరఫరా చేయాలని సీపీఐ నాయకుడు రమేష్‌బాబు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కేజీ రహదారిపై కాలనీ మహిళలతో కలిసి ఖాళీ బిందెలతో రోడ్డుపై బైటాయించి రాస్తారోకో చేశారు. గత మూడు రోజులుగా కాలనీకి నీటి సరఫరా లేదన్నారు. కార్యక్రమంలో కాలనీ మహిళలు నాగమణి, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు నందికొట్కూరు ఎన్జీవో సంఘం మద్దతు ఇస్తున్నట్లు అధ్యక్షుడు రాముడు తెలిపారు.

గడివేముల, న్యూస్‌టుడే: రైతులు ఆన్‌లైన్ ద్వారా డ్రోన్ సేవలు పొందవచ్చని వ్యవసాయాధికారి పవన్‌కుమార్ తెలిపారు. బిలకలగూడూరు గ్రామంలో బుధవారం డ్రోన్ సేవలపై అవగాహన కల్పించారు.

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: పాణికేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో సువర్ణ తెలిపారు.

ఆత్మకూరు, న్యూస్‌టుడే: శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్లే భక్తులకు అన్నదానం చేయడం గొప్ప కార్యమని నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి అన్నారు. కృష్ణాపురం గ్రామం వద్ద బ్రాహ్మణపల్లె గ్రామస్థులు ఏర్పాటు చేసిన అన్నదాన శిబిరాన్ని ప్రారంభించారు.

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: పవిత్ర రంజాన్ మాసాన్ని దృష్టిలో ఉంచుకొని ముస్లిం ఉద్యోగులు ఒక గంట ముందుగానే ప్రభుత్వ కార్యాలయాల నుంచి వెళ్లేందుకు అనుమతి ఇవ్వడం అభినందనీయమని ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్(ఆల్‌మేవా) నాయకులు ధన్యవాదాలు తెలిపారు.

ఆత్మకూరు, న్యూస్‌టుడే: సార్వత్రిక సమ్మెకు ఏపీ ఎన్జీవోల సంఘం మద్దతు ప్రకటించినట్లు ఆత్మకూరు తాలూకా యూనిట్ అధ్యక్షులు మోహన్‌రెడ్డి తెలిపారు.

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: శివరాత్రి సందర్భంగా ఓంకార పుణ్యక్షేత్రంలో జరిగే కబడ్డీ పోటీలకు సిద్ధమైన క్రీడాకారులకు బుధవారం దాతల సహకారంతో మూడు జతల క్రీడా దుస్తులను పంపిణీ చేశారు.

మహానంది, న్యూస్‌టుడే: పంటలను ఆశించిన పురుగులు, తెగుళ్ల నివారణకుగాను డ్రోన్‌తో మందులను పిచికారి చేయడంవల్ల ఎంతో ప్రయోజనం చేకూరుతుందని మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు.

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: మండలంలోని క్రిష్ణనంది ఆలయంలో ఈవో రామాంజనేయశర్మ, పల్లె తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ప్రజలు, ముఖ్యంగా మహిళలు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని యూనియన్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసులు అన్నారు. కురుకుంద గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహించారు.

కంది రైతుకు కన్నీరు

★ ఎకరాకు రెండు క్వింటాళ్లలోపే దిగుబడులు

10 బొల్లవరం గ్రామంలో ఆరబెట్టిన కంది

నందికొట్కూరు గ్రామీణం, నంద్యాల వ్యవసాయం న్యూస్‌టుడే: ఆరుగాలం కష్టపడి.. రూ.వేల పెట్టుబడి పెట్టి కంది సాగు చేసిన రైతులకు కన్నీరే మిగిలింది. తెగుళ్లు, వర్షాభావ పరిస్థితులు ఓ వైపు, మరోవైపు ధర లేకపోవడంతో రైతులు కుదేలవుతున్నారు. ఎకరాకు రూ.25 వేల పెట్టుబడి పెట్టి సాగు చేశామని, కనీసం పెట్టుబడులు కూడా చేతికిరావడం లేదని తీవ్రంగా నష్టపోతున్నామని కంది రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల పంట కోస్తే కూలీ ఖర్చులు కూడా భారమవుతాయని, అందువల్ల పంటను పశువులకు మేతగా వదిలేస్తున్నారు. అధిక విస్తీర్ణంలో కంది సాగు చేసిన రైతులు అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు విన్నవిస్తున్నారు.

నంద్యాల జిల్లాలో ఖరీఫ్‌లో 47035, రబీలో 3945 హెక్టార్లలో కంది సాగు చేసినట్లు అధికారులు పంట నమోదు చేశారు. అత్యధికంగా డోన్ 16372, ప్యాపిలిలో 11437, బేతంచెర్లలో 9808, బనగానపల్లిలో 2836 హెక్టార్లలో సాగు చేశారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు ప్రస్తుతం కోతలు జరుగుతున్నాయి. రబీలో సాగు చేసిన పంట పూత, కాపు దశలో ఉంది. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో తెగుళ్లు చుట్టుముట్టాయి. దాంతో నల్లి, పచ్చపురుగు తీవ్రత పెరగడంతో వాటి నుంచి పంటను కాపాడుకోవడానికి పిచికారీ మందుల ఖర్చు పెరిగిపోయింది. అయినా ఫలితం లేకుండా పోయిందని రైతులు చెబుతున్నారు. తుపాను వర్షాభావానికి పూత మొత్తం రాలి, పంట దెబ్బతినడంతో తీవ్రంగా దిగుబడులు తగ్గిపోయాయని రైతులు విలవిలలాడుతున్నారు. గతంలో ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడులు వచ్చేవి. కానీ ప్రస్తుతం ఎకరాకు రెండు క్వింటాలు రావడమే గగనంగా మారింది. వచ్చిన పంటను దళారులు క్వింటాలు ధర రూ.7700లకు అడుగుతున్నారని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం రూ.8400లకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది కానీ కొనుగోలు సక్రమంగా జరగడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెట్టుబడి కూడా చేతికి రాదు

- మనోహర్‌రెడ్డి, 10బొల్లవరం గ్రామం



ఖరీఫ్‌లో 10 ఎకరాల్లో కంది పంట సాగు చేశాను. ఎకరాకు రూ.25 వేల పెట్టుబడి పెట్టాను. ఈ ఏడాది వర్షాల తీవ్రతకు తెగుళ్లు, పురుగుల బెడద బాగా పెరిగింది. దాంతో పంటను కాపాడుకునేందుకు పిచికారీ మందులు అధికంగా చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. ఎకరాకు 1.5 క్వింటాలు మాత్రమే దిగుబడులు వచ్చాయి. చేసిన కష్టానికి ఫలితం లేక నష్టం మిగిలింది. ప్రభుత్వం కంది రైతులను ఆదుకోవాలి.



(c) eenadu

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

సర్వేలు వేగవంతం చేయండి

సమావేశంలో మాట్లాడుతున్న శివారెడ్డి

చాగలమర్రి, ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో చేపడుతున్న సర్వేలను వేగవంతంగా పూర్తి చేయాలని డీఎల్‌డీవో శివారెడ్డి తెలియజేశారు. చాగలమర్రి, ఆళ్లగడ్డ పట్టణాల్లోని మండల పరిషత్ కార్యాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్, జీఎంఎస్‌కేలతో సమీక్ష సమావేశాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చేస్తున్న యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే, ఆధార్ అథెంటికేషన్ తదితర సర్వేలను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో పన్నుల వసూలు ఈనెలాఖరు నాటికి 90 శాతం పూర్తి అయ్యేలా చూడాలని తెలియజేశారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, పన్నుల వసూళ్లపై సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు తాహిరహుసేన్, నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన

చాగలమర్రి, న్యూస్‌టుడే: చాగలమర్రి పట్టణంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు సీడీపీవో తేజేశ్వరి తెలియజేశారు. పట్టణంలోని 1, 2, 4వ అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... 1, 2 అంగన్‌వాడీలు పనులు సక్రమ న్యాయంగా ప్రమాణాలు పాటించడం లేదన్నారు. మెనూ కూడా సరిగా పాటించడం లేదని వివరించారు.

ఔషధ దుకాణాల తనిఖీ

చాగలమర్రి, న్యూస్‌టుడే: చాగలమర్రి పట్టణంలోని మెడికల్ దుకాణాలను డ్రగ్ ఇన్‌స్పెక్టర్ హనుమన్న బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లో నిబంధనల ప్రకారం మందులు ఉన్నాయా లేవా అని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల డివిజన్ పరిధిలో 700 మెడికల్ దుకాణాలు ఉన్నాయన్నారు. అన్ని దుకాణాలను తనిఖీ చేసామన్నారు. ప్రతి దుకాణంలో నిబంధనల ప్రకారం మందులను విక్రయించాలన్నారు. మెడికల్ దుకాణాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మెడికల్ దుకాణాల్లో నిబంధనలు ఉల్లంఘించినా, పరిశుభ్రత లేకున్నా చర్యలు తప్పవని హెచ్చరించారు.

దుకాణం తనిఖీ చేస్తున్న డీఐ హనుమన్న

కార్మికుల వేతనాలు చెల్లించాలి

డోన్, న్యూస్‌టుడే: చిన్నమల్క్యాపురం మేజర్ గ్రామ పంచాయతీలో పనిచేసే కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకులు శివరాం అన్నారు. బుధవారం గ్రామంలో కార్మికులతో సార్వత్రిక సమ్మెలో పాల్గొనాలని కోరారు. ప్రతి నెల ఐదోతేదీలోపు వేతనాలు ఇచ్చేలా చూడాలన్నారు. రామాంజనేయులు, నాగమద్దయ్య పాల్గొన్నారు. సమ్మెను విజయవంతం చేసేందుకు కార్మికులంతా ఏకం కావాలని ఏఐటీయూసీ నియోజకవర్గ నాయకులు అబ్బాస్ పిలుపునిచ్చారు.

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సంజామల, న్యూస్‌టుడే: ప్రైవేట్ విద్యా సంస్థల్లో 2026-2027 విద్యా సంవత్సరానికి గాను ఆర్టీఈ చట్టం కింద 25 శాతం సీట్ల భర్తీకి సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో ఈశ్వరయ్య చెప్పారు. ఒకటో తరగతి విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ నెల 16వరకు ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఆళ్లగడ్డ: 8008 574916 డోన్ పట్టణం: 94408 57790 బనగానపల్లె: 80085 73763

కోవెలకుంట్ల గ్రామీణం, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని సాయినగర్లో కాల్వ మధ్యలో విద్యుత్తు స్తంభం ఉన్న కారణంగా మురుగు ప్రవహించడం లేదు. - మహేష్, స్థానికుడు. ✔: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - ప్రకాష్‌నాయుడు, ఇన్‌ఛార్జి ఈవో.

ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: ?: ఆళ్లగడ్డ మండలంలోని గూబగుండం గ్రామ రహదారిలో స్థానికులు పేడ దిబ్బలు వేస్తున్నారు. - రాము, రైతు. ✔: పేడ దిబ్బలు తొలగిస్తాం. - నూర్జహాన్, ఎంపీడీవో.

శిరివెళ్ల, న్యూస్‌టుడే: ?: యర్రగుంట్ల ప్రధాన రహదారిలోని డ్రైనేజీ కాల్వను శుభ్రం చేయాలి. - రాజేష్‌కుమార్, విద్యార్థి. ✔: సిబ్బందితో పరిశుభ్రం చేయిస్తాం. - శ్రీనివాసశర్మ, డిప్యూటీ ఎంపీడీవో, శిరివెళ్ల.

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ?: క్రిష్ణగిరి మెట్ట సమీపంలో వంతెన శిథిలావస్థకు చేరుకుంది. మరమ్మతులు చేపట్టాలి. - రవీంద్రనాయక్, ప్రయాణికుడు. ✔: త్వరలో పనులు చేపడతాం. - పీఆర్ ఏఈ.

డోన్ గ్రామీణం, న్యూస్‌టుడే: ?: బోరపల్లె గ్రామంలో ప్రధాన రహదారి పక్కన కాల్వలో పేరుకుపోయిన వ్యర్థాలను శుభ్రం చేయాలి. - రాజు, గ్రామస్థుడు. ✔:త్వరలో వ్యర్థాలను తొలగిస్తాం. - రామకృష్ణ, పంచాయతీ సెక్రటరీ. ?: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో కొన్ని కాలనీల్లో వీధి దీపాలు వెలగడం లేదు. - హుసేన్, గ్రామస్థుడు. ✔: వీధి దీపాలు వెలగని ప్రాంతాలను గుర్తించి మరమ్మతులు చేయిస్తాం. - బాల తిమ్మయ్య, పంచాయతీ సెక్రటరీ.

ప్రహరీలు లేవాయె.. రక్షణ కరవాయె

కోవెలకుంట్ల పట్టణం, న్యూస్‌టుడే: పలు ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారుల పక్కన పాఠశాలల్లోని చిన్నారులకు ప్రమాదం పొంచి ఉంది. బడి ప్రాంగణంలో కుక్కలు, పశువులు సంచరిస్తున్నాయి. పిచ్చిమొక్కలు, ముళ్లకంపలు పెరిగి విషపురుగుల బెడద ఎక్కువైంది. రాత్రి వేళల్లో బయటి వ్యక్తులు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

చెర్లకొత్తూరులో ప్రహరీ లేని ప్రాథమిక పాఠశాల

కూటమి ప్రభుత్వంపై ఆశలు

● బనగానపల్లి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 272 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటిలో దాదాపుగా 67 పాఠశాలలకు ప్రహరీలు లేవు. ఐదేళ్ల కూటమి ప్రభుత్వం పాఠశాలల్లో మెరుగైన వసతుల కల్పనకు కృషి చేస్తోంది. మధ్యాహ్న భోజనం మెనూ మార్పుతో పాటు ఏకరూప దుస్తులు, పుస్తకాలు, నాణ్యమైన విద్యను అందించడం వంటి చర్యలు చేపట్టింది. అయితే పాఠశాల ప్రహరీలపై దృష్టి సారించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● పాఠశాలలకు ప్రహరీలు లేకపోవడంతో బయటి వ్యక్తులు పాఠశాలలోని మరుగుదొడ్లను అపరిశుభ్రం చేస్తున్నారు. అలాగే ఆవరణలో పశువులను కట్టేయడం, రాత్రి వేళల్లో ఆకతాయిలు తలుపులు, కిటికీలు ధ్వంసం చేస్తున్నారు. మందుబాబులు అక్కడే తాగి సీసాలు వేస్తున్నారు.

సమస్యలు ఉన్న పాఠశాలలివే..

● బనగానపల్లి మండలంలోని వెల్లెకొత్తూరు గ్రామంలోని ఎంపీపీ ప్రాథమిక పాఠశాల, రామతీర్థం, టంగుటూరు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ప్రహరీలు లేకపోవడంతో ప్రాంగణాల్లో పశువులు సంచరిస్తున్నాయి. విషపురుగుల బెడద ఉంది. దాదాపుగా 25 పాఠశాలల్లో ఇటువంటి సమస్య ఉంది.

● కొలిమిగుండ్ల మండలంలోని గొర్విమానుపల్లె, ఎర్రగుడిలోని బీసీ కాలనీ పాఠశాల, నందిపాడు ఎస్సీ కాలనీలోని పాఠశాలల్లోనూ ఇటువంటి సమస్య నెలకొంది.

● అవుకు మండలంలోని దాదాపు పది పాఠశాలల్లో ప్రహరీలు లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

● కోవెలకుంట్ల మండలంలోని అమడాల, సౌదరదిన్నె ఎస్సీ పాఠశాల్లోనూ ప్రహరీ సమస్యలు వేధిస్తున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బనగానపల్లి నియోజకవర్గంలో పాఠశాలల వివరాలు

మండలం	మొత్తం పాఠశాలలు	ప్రహరీ లేనివి
బనగానపల్లి	78	25
కొలిమిగుండ	59	20
అవుకు	58	10
సంజామల	41	02
కోవెలకుంట్ల	36	10

పండగ పూట.. వలస బాట

పండగ పూట పల్లెల నుంచి జనం వలసబాట వీడటం లేదు. మహాశివరాత్రి పండగ సమీపిస్తున్నా జీవనోపాధి కోసం పల్లె ప్రజలు గుంటూరుకు వలస వెళ్తున్నారు. డోన్ రైల్వేస్టేషన్ నుంచి కంబాలపాడు గ్రామానికి చెందిన పలువురు వ్యవసాయ కూలీలు బుధవారం రాత్రి రైలులో వెళ్లేందుకు వేచి ఉన్నారు. రైలు రాకపోవటంతో సేదతీరుతూ రైలు కోసం ఎదురుచూశారు. – న్యూస్‌టుడే, డోన్

కుక్కలు బాబోయ్ తిప్పలు

చాగలమర్రి పట్టణంలో కుక్కల బెడద తీవ్రమైంది. పట్టణంలోని కాలనీల్లో గుంపులు గుంపులుగా చేరి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. పట్టణంలోని వార్డుల్లో రోజూ ఏదో ఒక చోట కుక్కలు వృద్ధులు, చిన్నారులపై దాడులు చేస్తున్నాయి. రాత్రి సమయాల్లో కాలనీల్లో తిరగలేకపోతున్నామని కాలనీల్లో ప్రజలు వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, చాగలమర్రి

చెట్టు నీడే.. బస్సు షెల్టర్

ఆళ్లగడ్డ మండలంలోని గూబగుండం మెట్ట వద్ద 40వ జాతీయ రహదారిపై బస్సు షెల్టర్ లేక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సుల కోసం వేచి చూసేందుకు నిలువ నీడ లేకపోవడంతో చెట్టు నీడనే తల దాచుకుంటున్నారు. విద్యార్థులు, ప్రయాణికులు మధ్యాహ్నం సమయంలో బస్సుల కోసం ఎండలో నిలబడలేక అవస్థల పడుతున్నారు. హైవే నిర్వాహకులు షెల్టర్ నిర్మిస్తే సౌకర్యంగా ఉంటుందని ప్రయాణికులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, గూబగుండం(ఆళ్లగడ్డ గ్రామీణం)

రోడ్లపై పశు సంచారం.. ప్రాణ సంకటం

ఆళ్లగడ్డ పట్టణంలో రహదారులపై పశువుల సంచారం తీవ్రమైంది. విచ్చలవిడిగా పశువులను వాటి యజమానులు రహదారులపై వదిలేస్తున్నారు. పాత బస్టాండు, నాలుగు రహదారుల కూడలి, మెయిన్ బజారు ఇలా పలు కీలక ప్రాంతాల్లో రోడ్లపై అడ్డంగా కూర్చొని రాకపోకలకు ఆటంకం కల్గిస్తున్నాయి. వీటిపైన ఫిర్యాదు వచ్చినప్పుడు తూతూమంత్రంగా చర్యలు తీసుకుని మళ్లీ వదిలేస్తున్నారు. ఎమ్మెల్యే అఖిలప్రియ వీటిని నియంత్రించాలని ఆదేశాలు ఇచ్చినా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. – న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ

దెబ్బతిన్న చెరువు అలుగు

ఉయ్యాలవాడ మండలంలోని పుచ్చకాయలపల్లె చెరువు పరిస్థితి అధ్వానంగా మారింది. చెరువు అలుగు కట్టడాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. చెరువు కట్టకు సమీపంలో మట్టిని తవ్వటంతో లోపలి భాగంలో అమర్చిన రాతి పరుపు కుంగిపోయింది. చెరువుకు పంట కాల్వలు లేక పోవటంతో ఆయకట్టు పొలాలకు సక్రమంగా నీరు అందటం లేదు. కూటమి ప్రభుత్వంలోనైనా చెరువు మరమ్మతులకు ప్రత్యేక నిధులు కేటాయించాలని అన్నదాతలు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, పుచ్చకాయలపల్లె(ఉయ్యాలవాడ)

ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం

పార్టీలో చేరిన కార్యకర్తలతో బీసీ ఇందిరమ్మ

బనగానపల్లి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు ఆకర్షితులై తెదేపాలోని చేరుతున్నారని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి ఇందిరమ్మ పేర్కొన్నారు. బుధవారం సంజామల మండలం ఆకుమళ్ల గ్రామానికి చెందిన సుమారు 20 కుటుంబాల వారు వైకాపాను వీడి తెదేపాలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దశల వారీగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని కొనియాడారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో ప్రవేశపెట్టి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు నడిపిస్తున్నారని అన్నారు. పార్టీలో చేరిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పరంగా అన్ని రకాలుగా సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు మహేశ్వరరెడ్డి, వెంకటరమణారెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలి

సమావేశంలో మాట్లాడుతున్న జేఎండీ ఇక్బాల్

డోన్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి జేఎండీ ఇక్బాల్ అన్నారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఎస్టీయూ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13వ తేదీన ఎస్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జీవీ రమణ, దేవేంద్రప్ప, రామ్మోహన్, విశ్వనాథ్, రామదాసు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

డోన్, న్యూస్‌టుడే: విద్యా రంగ సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా కృషి చేయాలని యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు సుబ్బరాయుడు, డోన్ అధ్యక్షులు సుదర్శన్‌లు అన్నారు. బుధవారం ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో తపాలా ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రాలు పంపించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పాతపెన్షన్ విధానం పునరుద్ధరించాలని, 11వ పేస్కేల్‌ను తక్షణమే అమలు చేయాలని కోరారు. పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరమనోహర్‌రెడ్డి, మద్దిలేటి, రామాంజనేయులు, ప్రసాద్, కృష్ణనాయక్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా ఆరాధన ఉత్సవాలు

డోన్, న్యూస్‌టుడే: ఓబులాపురం మిట్ట వద్ద ఉన్న కాశిరెడ్డినాయన ఆశ్రమంలో ఆరాధన ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి వృషభాల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అనంతపురం జిల్లాకు చెందిన మహమ్మద్ ఫరీద్ వృషభాలు మొదటిస్థానంలో, కొత్తకోట గురునాథ్ వృషభాలు రెండో స్థానంలో, కొత్తపల్లెకు చెందిన దుబ్బన్న వృషభాలు మూడోస్థానంలో నిలిచాయి. కోలాటం ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది.

అలంకరణలో కాశిరెడ్డి నాయనస్వామి

అవుకు న్యూస్‌టుడే: అవుకులో కాశీవిశ్వనాథ స్వామి ఆలయంలో బుధవారం భక్తుల సందడి కొనసాగింది. మహాశివరాత్రి సందర్భంగా శ్రీగిరికి వెళ్లే భక్తులు అభిషేకం, పూజలు నిర్వహించారు.

పెద్దపూదెళ్లలో కబడ్డీ పోటీలు

ప్యాపిలి, న్యూస్‌టుడే: మహాశివరాత్రి పండగ సందర్భంగా పెద్దపూదెళ్ల గ్రామంలో ఈ నెల 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు వృషభాల బండలాగుడు పోటీలు, యువతకు కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు పేర్లను ముందుగా నమోదు చేసుకోవాలన్నారు.

బేతంచెర్ల, న్యూస్‌టుడే: శివరాత్రి పండగను పురస్కరించుకొని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక కమిటీ ఆధ్వర్యంలో హుస్సేనాపురం గ్రామంలో భగవద్గీత, అనుబంధ గ్రంథాల సారాంశంపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భగవద్గీత పుస్తకాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో నాగార్జున, నాగేంద్ర, వెంకటేశ్వర్లు, మద్దిలేటి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

ఆధ్యాత్మికం

బనగానపల్లి, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవర్చుకోవాలని పట్టణ మాజీ సర్పంచి బీసీ రాజారెడ్డి పేర్కొన్నారు. బుధవారం రవ్వలకొండలో హట్టిమునిస్వామి ఆశ్రమంలో ఆధ్యాత్మికత వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మానవ జీవితం గొప్పదన్నారు. ఆధ్యాత్మికతలో పాల్గొనడం ద్వారా మంచి నడవడిక, సమాజ సేవ గుణం అలవడుతుందన్నారు. అనంతరం రామశేషయ్య భగవద్గీత ప్రవచనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు వెంకటేశ్వర్లు, రామసుబ్బారెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బీసీ రాజారెడ్డి

సమాజ సేవలో భాగం కావాలి

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు సమాజ సేవలో భాగం కావాలని ఆళ్లగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డా.గంగన్న అన్నారు. దిగువ అహోబిలంలో కోనేరు శుభ్రత పనులకు ఆయన హాజరయ్యారు. ప్రజ్ఞ, అనంత డిగ్రీ కళాశాల విద్యార్థులు, ఆలయ సిబ్బంది పుష్కరిణిలో పెద్ద ఎత్తున పేరుకుపోయిన పూడికను తొలగించేందుకు శ్రమించారు.

శుభ్రత పనులు చేస్తున్న విద్యార్థులు

కార్యక్రమంలో అనంత కళాశాల యాజమాన్యం రామసుబ్బారెడ్డి, ఆలయ సీఏవో రామానుజన్, ఆలయ సిబ్బంది శివ, సునీల్, నాగేంద్ర, సురేష్ పాల్గొన్నారు.

భళా బాలిక.. పతకాల మాలిక

ప్యాపిలి, న్యూస్‌టుడే: పేద, మధ్య తరగతి కుటుంబానికి చెందిన విద్యార్థినులు అటు చదువులోనూ ఇటు ఆటల్లోనూ సత్తా చాటుతున్నారు. బాక్సింగ్ క్రీడపై ఆసక్తితో పాఠశాల స్థాయి నుంచే పీడీ విజయలక్ష్మి వద్ద ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు. బాక్సింగ్ అంటే మాటలు కాదు. కండ బలంతో పాటు బుద్ధి బలం ఉండాలి. ప్రత్యర్థి కొట్టే దెబ్బలను తప్పించుకుంటూ తిరిగి పంచ్ కొట్టినప్పుడే విజయం వరిస్తుంది. వివిధ స్థాయుల్లో బాక్సింగ్ పోటీల్లో పాల్గొని పతకాలు, ప్రశంసాపత్రాలు అందుకుంటున్నారు.

పోలీసు కొలువే లక్ష్యం - ఎం.అర్చన

ప్యాపిలి పట్టణానికి చెందిన రామాంజినేయులు, సుజాత దంపతుల కుమార్తె ఎం. అర్చన స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. కుమార్తె క్రీడా ఆసక్తిని గమనించి తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారు. ఆరో తరగతి నుంచే బాక్సింగ్‌పై ఆసక్తి పెంచుకొని సాధన చేస్తోంది. జిల్లా స్థాయిలో 2025 సెప్టెంబరులో జరిగిన పోటీల్లో పాల్గొని సత్తాచాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. 2025 అక్టోబరులో రాజమహేంద్రవరంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో స్వర్ణ పతకం సాధించింది. బెంగళూరులో 2026లో ఫిబ్రవరిలో జరిగిన అండర్-19 విభాగంలో 69వ జాతీయ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో ప్రశంసా పత్రం అందుకుంది. భవిష్యత్తులో పోలీసు కొలువే లక్ష్యమని చెబుతోంది అర్చన.

జాతీయస్థాయిలో రాణిస్తా - ఎస్.కబిహ

పట్టణానికి చెందిన చిన్న ఖాజాహుస్సేన్, ఫాతిమా దంపతుల కుమార్తె కబిహ. స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. అటు చదువుతో పాటు ఇటు క్రీడల్లో రాణిస్తోంది. జిల్లా స్థాయిలో 2025 సెప్టెంబరులో జరిగిన బాక్సింగ్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. 2025 అక్టోబరులో రాజమహేంద్రవరంలో జరిగిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచింది. 2026లో ఫిబ్రవరిలో బెంగళూరులో జరిగిన అండర్-19 బాలికల విభాగం 69వ జాతీయ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో పోటీల్లో ప్రశంసా పత్రాలను అందుకుంది. జాతీయ స్థాయి పతకమే లక్ష్యంగా సాధన చేస్తానంటోంది బాలిక.

సంక్షిప్త సమాచారం

శిరివెళ్ల, న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి ఎవరైనా భంగం కలిగించాలని ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ రాము బుధవారం హెచ్చరించారు. సమస్యాత్మక గ్రామాల్లో రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచామన్నారు.

శిరివెళ్ల, న్యూస్‌టుడే: గ్రామాల్లో ఓటరు జాబితాలో పేర్లు, చిరునామాలు తప్పులుంటే సవరించుకోవాలని తహసీల్దార్ విజయశ్రీ బుధవారం పేర్కొన్నారు. ఆయా గ్రామ సచివాలయాల పరిధిలోని ఓటర్ల జాబితాను ఇప్పటికే బీఎల్‌వోలకు అందించామన్నారు.

బేతంచెర్ల,న్యూస్‌టుడే: పట్టణంలోని సుందరయ్య కాలనీలో వేసవిలో నీటి కోసం ప్రజలు ఇబ్బంది పడుతుంటారు. తాగునీటి కష్టాలు రాకూడదనే ఉద్దేశంతో ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి చొరవతో కాలనీలో బుధవారం బోరు వేయించారు.

ప్యాపిలి, న్యూస్‌టుడే: కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 12న జరిగే సమ్మెలో అందరూ భాగస్వాములు కావాలని సీపీఐ మండల కార్యదర్శి మహేష్ పేర్కొన్నారు.

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: అల్లూరులో బుధవారం నక్కా చిన్నగురప్పకు చెందిన 20 గొర్రెలు కుక్కల దాడిలో మృతి చెందాయి. రూ.2 లక్షలు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయారు.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన మురళి బుధవారం ఇంటికి ద్విచక్రవాహనంపై వెళ్తూ చరవాణి పోగొట్టుకున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా ఓ మహిళ వద్ద గుర్తించి స్వాధీనం చేసుకొని బాధితుడికి అప్పగించారు.

ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: మర్రిపల్లె గ్రామానికి చెందిన అబ్దుల్ గఫార్ ఆటో యాత్ర చేపట్టారు. మర్రిపల్లె, యాదవాడ, ఓబులంపల్లె గ్రామాల్లో బుధవారం అబ్దుల్ గఫార్ ఆటో యాత్ర చేపట్టారు. హింసను వీడి శాంతితో మెలగాలని ఆటో యాత్ర చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

చాగలమర్రి, న్యూస్‌టుడే: పట్టణంలో అనారోగ్యంతో బాధపడుతున్న పోరుమామిళ్ల సురేష్‌కు బలిజ సంఘం సభ్యులు ఆవుల ప్రతాప్, జెట్టి నాగరాజు, మురళి నెల రోజులకు సరిపడే ఔషధాలు, నగదును అందజేశారు.

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: గ్రామ శివారులోని సర్వే నంబరులో 50 సెంట్ల స్థలం ఆక్రమణకు గురికాకుండా కంచె ఏర్పాటు చేస్తున్నామని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి సందర్భంగా బుధవారం ఉయ్యాలవాడలో భాజపా నాయకులు నివాళి అర్పించారు. భాజపా మండల అధ్యక్షుడు కొత్తమిద్దె శ్రీరామ్‌కుమార్, రాజగోపాల్‌రెడ్డి, శ్రీరాములు, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

దొర్నిపాడు, న్యూస్‌టుడే: ప్రభుత్వం నిర్ణయించిన తేదీలోగా తప్పనిసరిగా సర్వేలన్నీ పూర్తి చేయాలని ఎంపీడీవో సావిత్రి పేర్కొన్నారు. బుధవారం గ్రామాల్లోని పలు సచివాలయాలను తనిఖీ చేశారు. ప్రతి ఉద్యోగి సమయపాలన పాటించాలన్నారు.

కామినేనిపల్లె (శిరివెళ్ల), న్యూస్‌టుడే: గ్రామంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు గ్రామ సర్పంచి మేరువ నరసింహారెడ్డి పేర్కొన్నారు. గ్రామంలో కొనసాగుతున్న డ్రైనేజీ కాల్వల్లో వ్యర్థాల తొలగింపు పనులను సర్పంచి బుధవారం పరిశీలించారు.

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో పదో తరగతి విద్యార్థినులకు కెనరా బ్యాంక్ ఉద్యోగి నరేష్ విద్యా సామగ్రిని బుధవారం పంపిణీ చేశారు.

బాలికకు తప్పిన ప్రమాదం

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన చిన్నారి దివ్యమంజులబాయికి త్రుటిలో ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళ్తే రాళ్లకొత్తూరుతండాకు చెందిన బాలిక మంగళవారం అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లింది. మధ్యాహ్న సమయంలో మరొక బాలికతో ఆడుకుంటూ ఎస్సార్బీసీ పంట కాల్వలో అకస్మాత్తుగా పడిపోయింది. గమనించిన బాలిక తల్లిదండ్రులు, బంధువులు కాల్వలో కొట్టుకుపోతుండటంతో గుర్తించి వైద్యశాలకు తరలించారు. ప్రాణ ప్రాయం తప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఐసీడీఎస్ అధికారులు ఘటనపై విచారణ చేపట్టారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన ఓ యువతి బుధవారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతికారు. ఎక్కడా సమాచారం లేకపోవడంతో బేతంచెర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. యువతి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు.

ప్రైవేట్ బస్సుల్లో తనిఖీలు

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: రహదారి పన్నులు చెల్లించకుండా వెళుతున్న ఓ ప్రైవేట్ బస్సు యజమానికి జరిమానా విధించినట్లు డోన్ ఎంవీఐ క్రాంతికుమార్ తెలిపారు. బుధవారం డోన్ ఆర్టీవో కార్యాలయం వద్ద నిర్వహించిన వాహనాల తనిఖీల్లో భాగంగా బెంగళూరు నుంచి గోరఖ్‌పుర్‌కు వెళుతున్న అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బస్సును ఆపి ధ్రువపత్రాలను పరిశీలించారు. పన్ను చెల్లించట్లేదని గుర్తించి మోటారు వాహన చట్టం ప్రకారం రూ.3,46,500 జరిమానా విధించినట్లు ఆయన పేర్కొన్నారు.

నిధుల్లేక నిలిచిన నిర్మాణం

శిరివెళ్ల మండల కేంద్రంలోని ఒకటో గ్రామ సచివాలయ నిర్మాణ పనులు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైకాపా హయాంలో 2021లో శిరివెళ్ల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణలో సచివాలయ నిర్మాణానికి రూ.43.60 లక్షలు మంజూరయ్యాయి. రూ.22.70 లక్షల నిధులతో గుత్తేదారుడు 60 శాతం పనులను పూర్తి చేసినప్పటికీ మిగిలిన సొమ్ము జమ కాకపోవడంతో పనులను ఆపేశారు. – న్యూస్‌టుడే, శిరివెళ్ల

యునానీ చికిత్సతో వ్యాధులు దూరం

బేతంచెర్ల: రోగులకు మందులను అందిస్తున్న వైద్యులు

బేతంచెర్ల, ఆళ్లగడ్డ, శిరివెళ్ల, డోన్, కోవెలకుంట్ల, బనగానపల్లి, అవుకు, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందజేసే యునానీ ఆయుర్వేద మందులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని యునానీ వైద్యులు తెలిపారు. ప్రపంచ యునానీ దినోత్సవం సందర్భంగా యునానీ మందుల వినియోగం, వాడకం వాటి వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కడుపునొప్పి, గ్యాస్, చర్మవ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధులు, ఉబ్బసం, తదితర వ్యాధులకు అవసరమైన మందులను రోగులకు ఉచితంగా పంపిణీ చేశారు. యునానీ మందులను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్లు సూచించారు.

మహనీయుడు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ

డోన్, న్యూస్‌టుడే: సమాజంలో అర్హులైన అందరికీ సంక్షేమ ఫలాలు అందాలని, సుపరిపాలనకు దిశానిర్దేశం చేసిన మహనీయుడు పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అని భాజపా నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు వెంకటరమణ అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశభవిష్యత్తు కోసం పాటు పడ్డారన్నారు. సమాజంలో అందరికీ సమానంగా సంక్షేమం అందాలని కృషిచేశారన్నారు. కార్యక్రమంలో భాజపా నాయకులు కిరణ్, రవికుమార్, నటరాజ్, సురేష్, వీరేష్, శివప్రకాష్, పాల్గొన్నారు.

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు

(c) eenadu

అడిగేవరకు ఆగొద్దు... పనులు ఆపొద్దు

సమావేశంలో సీఎం మోహన్, మంత్రి నాయక్, ఇతర అధికారులు

మంచినీటి ప్రాజెక్టులపై సీఎం సమీక్ష

భువనేశ్వర్, న్యూస్‌టుడే: వేసవి ఎండలు పెరగక ముందే దాహం కేకలు వినిపిస్తున్నాయని, మంచినీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి భువనేశ్వర్‌లోని లోక్‌సేవాభవన్‌లో మంచినీటి సరఫరాకు సంబంధించి సీఎం అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. అధికారులు తెలిపిన వివరాల మేరకు... రాష్ట్రంలోని 46,531 గ్రామాలకుగాను 21,721 పల్లెల్లో కుళాయి నీరు సరఫరా అవుతోంది. 2027 మార్చిలోగా అన్ని గ్రామాలకు మంచినీరు అందించాలన్నది ప్రభుత్వ ధ్యేయం. ఈ నేపథ్యంలో ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయి. రూ.54 వేల కోట్ల వ్యయంతో వీటిని చేపట్టారు. ఇందులో జల్‌జీవన్ మిషన్ కార్యక్రమం కింద కేంద్రం రూ.32,128 కోట్లు కేటాయించింది. మిగతా వ్యయం ప్రభుత్వం భరిస్తోంది. గడిచిన 20 నెలల్లో 2,951 మంచినీటి సరఫరా ప్రాజెక్టుల పనులు పూర్తయ్యాయి. ఈ వివరాలు పంచాయతీరాజ్, మంచినీటి సరఫరా శాఖల ప్రిన్సిపల్ కార్యదర్శి గిరీష్ ఎస్.ఎన్. తెలిపారు. ఈ నేపథ్యంలో సీఎం మాట్లాడుతూ నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న గ్రామాల్లో వేసవిలో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని, ఎక్కడా ఆందోళనలకు తావీయరాదన్నారు. యుద్ధప్రాతిపదికన నీటి ప్రాజెక్టుల పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మంచినీటి సరఫరా శాఖల మంత్రి రబినారాయణ నాయక్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనూగార్గ్, అభివృద్ధి కమిషనర్ డి.కె.సింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎంఓయూ పత్రాలు చూపుతున్న ఉషాపాఢి, అమర్‌నాథ్

‘ఐరావత్’తో ఒప్పందం కుదుర్చుకున్న పట్టణాభివృద్ధి శాఖ

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఐఐటీ కాన్పూర్‌కు చెందిన ఐరావత్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఏఆర్‌ఎఫ్)తో బుధవారం కీలక ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. భువనేశ్వర్‌లోని లోక్‌సేవా భవన్‌లో జరిగిన కార్యక్రమంలో పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఉషాపాఢి, ఏఆర్‌ఎఫ్ సీఈఓ అమర్‌నాథ్ సమక్షంలో ఎంఓయూ కుదిరింది. దీని ప్రకారం రాష్ట్రంలోని నగరాలు, పట్టణాల్లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) సేవలు అందుబాటులోకి వస్తాయి. ఈ సందర్భంగా ఉషాపాఢి విలేకర్లతో మాట్లాడుతూ పట్టణాల్లో స్మార్ట్‌సేవలు ధ్యేయంగా ఏఐ ద్వారా కార్యక్రమాలు చేపడతామన్నారు. అమర్‌నాథ్ మాట్లాడుతూ ఒడిశాలోని పట్టణ ప్రాంతాల అభివృద్ధి ధ్యేయంగా ఏఆర్‌ఎఫ్ దీర్ఘకాలిక నివేదిక (లాంగ్ టెర్మ్ ప్రాజెక్టు) సిద్ధం చేసి ఏఐ సేవలు అమలుపరుస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఈజీఓవీ ఫౌండేషన్ కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు.

పోగొట్టుకుంటే... రాబట్టుకోలేరు

● రాష్ట్రంలో సైబర్ నేరాల ఆర్థిక రికవరీ 1.6 శాతం మాత్రమే

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి బాధితులు వందలాది కోట్ల రూపాయలు పోగొట్టుకుంటే రికవరీ మాత్రం 2 శాతమైనా లేదు. రాజ్యసభ సమావేశాల్లో బిజద ఎంపీ మానస్‌రంజన్ మంగరాజ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక సహాయమంత్రి పంకజ్ చౌదరి లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. గడిచిన మూడేళ్లలో రాష్ట్రంలో సైబర్ నేరాల ద్వారా రూ.144.5 కోట్ల సొమ్ము కోల్పోగా కేవలం రూ.23.59 కోట్లు(1.6 శాతం) మాత్రమే రికవరీ అయింది. ఈ సమయంలో మొత్తం 4,876 బ్యాంకు సంబంధిత మోసాల కేసులు నమోదయ్యాయి. బ్యాంకు సంబంధిత మోసాల కేసుల నియంత్రణకు ప్రభుత్వంతో పాటు ఆర్బీఐ చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి చౌదరి వెల్లడించారు.

గడిచిన మూడేళ్లలో నమోదైన కేసులు, పోగొట్టుకున్న నగదు, రికవరీ ఇలా...

సంవత్సరం	కేసులు	నగదు (రూ.కోట్లలో)	రికవరీ
2022–23	1594	255.35	10.16
2023–24	2363	1,155.68	4.57
2024–25	919	31.47	8.86

పంకజ్ చౌదరి

అధికారులు, మిల్లర్లతో సీఎస్ అనూగార్గ్ చర్చలు

మండీల్లో రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడండి

సీఎస్ అనూగార్గ్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ధాన్యం సేకరణలో జాప్యం తగదని, మిల్లర్లు ఈ బాధ్యత సక్రమంగా నెరవేర్చాలని, మండీల వద్ద రైతులు ఇబ్బంది పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత మిల్లర్లదేనని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) అనూగార్గ్ చెప్పారు. మంగళవారం రాత్రి భువనేశ్వర్‌లోని లోక్‌సేవాభవన్‌లో ధాన్యం కొనుగోళ్లు, మండీల్లో సమస్యలపై ఆమె మిల్లర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అనూగార్గ్ మాట్లాడుతూ మార్చి నెలాఖరు వరకు ధాన్యం సేకరణ జరుగుతుందని, ప్రతి గింజా కొనుగోలు చేయాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఇందుకు మిల్లర్లు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా మండీల్లో పరిస్థితి, టోకెన్ల కేటాయింపు, సకాలంలో కొనుగోలు, రైతుల బ్యాంకు ఖాతాల్లోకి సొమ్ము జమ అంశాలపై చర్చించారు. మిల్లర్లు తమ ఇబ్బందులు ప్రస్తావించి పరిష్కరించాలని కోరారు. సమావేశంలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ప్రత్యేక కార్యదర్శి శాశ్వతమిశ్ర, ఆహార, పౌరసరఫరాల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సంజయ్‌కుమార్ సింగ్, పౌరసరఫరాల కార్పొరేషన్ సంచాలకుడు కె.సుదర్శన్ చక్రవర్తి, మిల్లర్ల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

పేలిన ఎలక్ట్రిక్ స్కూటీ

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: ఎలక్ట్రిక్ స్కూటీ పేలి ఇంట్లో సామగ్రి పాడైన ఘటన రాయగడ సమితి పితామహుల్‌లో చోటుచేసుకుంది. బాధితుడు వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన సుభాష్ చంద్ర మంగళవారం రాత్రి స్కూటీకి ఛార్జింగ్ పెట్టి పడుకున్నారు. అర్ధరాత్రి సమయంలో పేలుడు శబ్దం వినిపించింది. దీంతో బయటకొచ్చి చూసేసరికి స్కూటీ కాలిపోతూ కనిపించింది. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. 15 రోజుల కిందట హీరో కంపెనీకి సంబంధించి విద్యుత్తు స్కూటీ కొనుగోలు చేశానని, ఇలా జరగడం వల్ల ఇంట్లో సోఫా, సెట్, ఫ్యాన్, వాషింగ్ మెషిన్, ల్యాప్‌టాప్, గీజర్ తదితరాలు పాడయ్యాయని బాధితుడు వాపోయాడు.

కాలిపోయిన స్కూటీ

గవర్నర్ హరిబాబుకు వినతిపత్రం అందిస్తున్న యువ బిజద నేతలు

ప్రమాణాలు పడిపోతున్నాయ్‌...పట్టించుకోండి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో వీసీలు, ప్రిన్సిపాళ్లు, ఆచార్యులు, అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉండటంతో విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయని, పట్టించుకోవాలని యువ బిజద నాయకులు గవర్నర్ కంభంపాటి హరిబాబుకు విన్నవించారు. మంగళవారం పార్టీ యువ నాయకులు భువనేశ్వర్‌లోని లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిశారు. పోస్టులు భర్తీ కాకపోవడంతో తరగతుల నిర్వహణ సాధ్యం కావడం లేదని, విద్యార్థుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోందని చెప్పారు. సగానికిపైగా వర్సిటీల్లో వీసీలు లేనందున ఆయాచోట్ల పాలనా వ్యవహారాలు సరిగా సాగడం లేదని వివరించిన వారంతా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ గవర్నర్‌కు వినతిపత్రం సమర్పించారు.

జాజ్‌పూర్‌లో బిజద ఆందోళన

భువనేశ్వర్, న్యూస్‌టుడే: మండీల్లో అవినీతి, అత్యాచారాలు, విద్యుత్తు ఛార్జీల పెంపు, పోస్టుల ఖాళీలు, నిరుద్యోగుల ఆక్రందనలు, క్షీణించిన శాంతిభద్రతలు తదితర అంశాలపై నిరసనగా బిజద నాయకులు బుధవారం జిల్లా కేంద్రంలో ఆందోళన చేపట్టారు. మాజీ మంత్రి ప్రీతిరంజన్ ఘడై నాయకత్వంలో వందలాది మంది యువ నేతలు, కార్యకర్తలు బ్యానర్లు చేపట్టి ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. మార్కెట్ కూడలి వద్ద జరిగిన బహిరంగ సభలో 20 నెలల మోహన్ చరణ్‌మాఝి సర్కారు పాలనా వైఫల్యాలు ప్రస్తావించారు. అనంతరం పాలనాధికారి పి.అన్వేషారెడ్డికి వినతిపత్రం అందజేశారు.

పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు

ఉగాది ఉత్సవాల నిర్వహణ సన్నాహక సమావేశం

సమావేశంలో పాల్గొన్న తెలుగు ప్రముఖులు, సమన్వయకర్తలు, వివిధ సంస్థల ప్రతినిధులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: స్థానిక ఆంధ్ర భాషాభివర్ధనీ సమాజం, జటాధరేశ్వర స్వామి దేవస్థానం, నగరంలోని తెలుగు సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో వచ్చే మార్చి 19న ‘ఉగాది ఉత్సవాలు-2026’ ఘనంగా నిర్వహిద్దామని ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు పూడిపెద్ది సత్యనారాయణ (బాబు) పిలుపునిచ్చారు. స్థానిక గిరి మార్కెట్ రోడ్డులోని ఆంధ్ర భాషాభివర్ధనీ సమాజం ఆవరణలో మంగళవారం రాత్రి తొలి సన్నాహక సమావేశం జరిగింది. దీనికి అధ్యక్షత వహించిన బాబు మాట్లాడుతూ స్థానిక ఖస్పావీధిలోని శ్రీ జటాధరేశ్వర స్వామి కల్యాణ మండపంలో ఉత్సవాలు జరుగుతాయన్నారు. అంతకుముందు మార్చి 15న ప్రకాశం హాల్లో బాల, బాలికలు, యువతీ, యువకులకు ఉగాది సంప్రదాయ వస్త్రధారణ పోటీలు నిర్వహిద్దామని బాబు చెప్పారు. ఉత్సవాల్లో కవి సమ్మేళనం, సాంస్కృతిక కార్యక్రమాలు ఇతరత్రా అంశాలపై చర్చించారు. సమావేశంలో ఉత్సవాల కమిటీ ముఖ్య కన్వీనరు ఆర్.శ్రీనివాస్, కన్వీనరు టి.వాసుదేవరావు, కో-కన్వీనరు వి.రవికుమార్ గుప్త, సాంస్కృతిక సమన్వయకర్త మోణింగి కామేశ్వరి పాల్గొని మాట్లాడారు. పలువురు సమన్వయకర్తలు, వివిధ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు.

రాష్ట్రంలో 803 జన ఔషధి కేంద్రాలు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: ఒడిశాలో 803 జన ఔషధి కేంద్రాలు ఉన్నట్లు కేంద్ర, రసాయన, ఎరువుల శాఖల సహాయ మంత్రి అనుప్రియ పటేల్ పేర్కొన్నారు. రాజ్యసభలో బిజద ఎంపీ సులతదేవ్ అడిగిన ప్రశ్నకు ఆమె బదులిస్తూ ఈ వివరాలను వెల్లడించారు. 2025, డిసెంబరు 12 నాటికి ఒడిశాలో 803 కేంద్రాలు పనిచేస్తున్నాయి. వీటిలో ప్రభుత్వ ప్రాంగణాలతో 21 అందుబాటులో ఉన్నాయి. సంచార జన ఔషధి వ్యాన్లు ఏర్పాటుకు రాష్ట్ర సర్కారు నుంచి ఎలాంటి ప్రతిపాదనలు అందలేదని అనుప్రియ స్పష్టం చేశారు. డ్రగ్స్, కాస్మోటిక్స్ చట్టం, 1940 నియమావళి 64, 1945 నియమావళి ప్రకారం మందుల విక్రయానికి రిటైల్ లైసెన్సులు జారీ చేస్తున్నట్లు పటేల్ పేర్కొన్నారు. ప్రత్యేక వసతులు, నిల్వ సామర్థ్యం, శీతల నిల్వ(కోల్డ్ స్టోరేజీ) తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని లైసెన్సులు మంజూరు చేస్తున్నట్లు ఆమె స్పష్టం చేశారు.

సమావేశంలో పాల్గొన్న బిడిక, సభ్యులు

లక్ష మంది భక్తులకు సౌకర్యాలు

● వచ్చే నెల 29 నుంచి అమ్మవారి చైత్రోత్సవాలు

రాయగడ, న్యూస్‌టుడే: ఉత్కళాంధ్రా భక్తుల కొంగుబంగారం మజ్జిగౌరి అమ్మవారి ఆలయ చైత్రోత్సవాల నిర్వహణ తేదీలు ఖరారు చేశారు. బుధవారం ఆలయ కార్యాలయం భవనంలో ట్రస్ట్ అధ్యక్షుడు రాయిసింగి బిడిక అద్వర్యంలో సన్నాహక సమావేశం జరిగింది. మార్చి 29 నుంచి ఏప్రిల్ 2 వరకూ 5 రోజులపాటు ఉత్సవాలు నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ రోజుల్లో సుమారు లక్ష మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని, అందుకు తగ్గ ఏర్పాట్లు చేయనున్నట్లు ప్రకటించారు.

విజిలెన్స్‌కు చిక్కిన జూనియర్ అసిస్టెంట్

సుబ్రాత్ కుమార్ బెహరా

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: రూ.2 కోట్లకు పైగా ప్రభుత్వ నిధులు దుర్వినియోగం ఆరోపణలపై జూనియర్ అసిస్టెంట్‌పై విజిలెన్స్ అధికారులు కేసు నమోదు చేశారు. విజిలెన్స్ వర్గాల సమాచారం మేరకు.. అనుగుల్ జిల్లా కేంద్రాసుపత్రిలో సుబ్రాత్ కుమార్ బెహరా జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రూ.2.38 కోట్ల ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేశారన్న ఆరోపణలపై కేసు నమోదు చేసి బెహరాకు చెందిన ఐదు చోట్ల అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. అనుగుల్‌లోని హాకింపద, నాల్కో నగర్, భువనేశ్వర్‌లోని శ్రీవిహార్, ఢెంకనాల్, ఆయన కార్యాలయంలో సోదాలు కొనసాగుతున్నాయి. ఐదుగురు డీఎస్పీల నేతృత్వంలో ఎనిమిది మంది ఇన్‌స్పెక్టర్లు, 14 మంది ఏఎస్సైలు, సిబ్బంది సోదాల్లో పాల్గొన్నారు.

శాసనసభ గౌరవం పెరగాలి

● స్పీకర్ సురమాపాఢి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: శాసనసభ గౌరవం, ఔన్నత్యం పెంచడానికి సరికొత్త నిబంధన అవసరమని, సభ్యులు (ఎమ్మెల్యేలు) చీటికిమాటికి పోడియం వద్దకొచ్చి నినాదాలు చేయడం, కార్యక్రమాలను అడ్డుకోవడం వంటివి మానుకోవాలని సభాపతి సురమాపాఢి చెప్పారు. మహారాష్ట్ర అసెంబ్లీ సభాపతి రాహుల్ నర్వాణె అధ్యక్షతన ముంబయిలోని సభా ప్రాంగణంలో సభా వ్యవహారాల సంఘం రెండు రోజుల సమావేశం ముగింపు కార్యక్రమం మంగళవారం రాత్రి జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న సురమాపాఢి మాట్లాడుతూ ఇటీవల కాలంలో సభల్లో జరుగుతున్న ఘటనలు ప్రస్తావించారు. పార్టీ ఫిరాయింపుల గురించి విపులంగా చర్చ జరిగింది. సభాపతుల సమావేశం ఈ ఏడాది (2026) ఏప్రిల్ 20, 21 తేదీల్లో భువనేశ్వర్ లేదా పూరీలో చేపట్టాలని నిర్ణయించారు. రానున్న 8 నెలల్లో తీసుకున్న నిర్ణయాలు, భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలకు సంబంధించి నివేదిక సిద్ధం చేసి లోక్‌సభ స్పీకర్‌కు సమర్పించాలని తీర్మానించారు.

సభాపతుల సమావేశంలో సురమాపాఢి

‘నులి పురుగుల’ మాత్రలు మింగిన 30 మందికి అస్వస్థత

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో నులిపురుగుల నివారణ మందు తిని 30 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఒడిశాలోని జాజ్‌పూర్ జిల్లా కొరెయి ప్రాథమిక పాఠశాలలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. పాఠశాలలో మధ్యాహ్నభోజనం తర్వాత విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. వాటిని తిన్నాక చాలామంది చిన్నారులకు వాంతులు అయ్యాయి. అనంతరం కళ్లు తిరిగి అస్వస్థతకు గురయ్యారు. దీంతో బాధిత చిన్నారులను కొరెయి సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)లో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతానికి చిన్నారులు కోలుకుంటున్నారని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు తెలిపారు. చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు వైద్యులు స్పష్టం చేశారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు

గజపతి జిల్లా నుంచి ముంబయికి గంజాయి అక్రమ రవాణా

● 92 కిలోలు స్వాధీనం: ఇద్దరి అరెస్టు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: ఒడిశాలోని గజపతి జిల్లా నుంచి మహారాష్ట్రలోని ముంబయికి కారులో అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఇద్దర్ని ఆబ్కారీ నిఘా విభాగం (బ్రహ్మపుర మండల) అధికారులు బుధవారం అరెస్టు చేసి న్యాయస్థానానికి తరలించారు. వారు గజపతి జిల్లా, హైదరాబాదు (తెలంగాణ)లకు చెందినవారని శాఖ ఉప సూపరింటెండెంటు శ్రుతికాంత్ రౌత్ సాయంత్రం విలేకరులకు చెప్పారు. గంజాం జిల్లా బ్రహ్మపుర శివారున అస్కా రోడ్డు మొదటి గేటు వద్ద ఉదయం వాహనాల తనిఖీలు చేస్తున్న సమయంలో అనుమానంతో ఓ కారును ఆపి సోదా చేయగా 92 కిలోల గంజాయి లభ్యమైందని ఆయన వివరించారు.

ఆఖరిచూపునకు అవకాశం కల్పించండి

● ఏపీ నుంచి మృతదేహం రప్పించాలంటూ వేడుకోలు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌కు వలస వెళ్లి మృతి చెందిన వలస కార్మికుని మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించాలంటూ కలహండికి చెందిన బాధిత కుటుంబీకులు అధికారులను వేడుకుంటున్నారు. బాధిత కుటుంబీకుల కథనం మేరకు జైపట్న పోలీసుస్టేషన్ పరిధి పాయిక్ కెందుముండి పంచాయతీ కట్పాడి గ్రామానికి చెందిన ధనుర్జాయ్ పటేల్(55) గుంటూరులోని ఓ పొగాకు పరిశ్రమలో ఉపాధికి వెళ్లారు. అక్కడ మృతిచెందిన పటేల్ మృతదేహాన్ని గ్రామానికి తీసుకురావాలంటూ ధనుర్జాయ్ భార్య కస్తూరీ పటేల్ జిల్లా యంత్రాంగానికి మొరపెట్టుకుంది. రెండేళ్ల నుంచి భర్త ఇంటికి రాలేదని, పరిశ్రమ యజమానికి వేడుకున్నప్పటికీ ఎలాంటి ఫలితం లేకపోయిందని ఆమె వాపోయారు. పటేల్ ఆఖరి చూపు కోసం తన కుమార్తె, అత్త ఎదురుచూస్తున్నారని, ఇందుకోసం అధికారులు చొరవ తీసుకోవాలని కస్తూరీ కంటతడి పెడుతున్నారు.

పుట్టెడు దుఃఖంలో బాధిత కుటుంబీకులు

డాక్టర్ లక్ష్మీబాయి జీవితం ఆదర్శప్రాయం

ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిఢ

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: ‘ప్రస్తుతం సంపద, పేరు, ప్రఖ్యాతులకు కేంద్రీకృతమైన సమాజంలో డాక్టర్ కె.లక్ష్మీబాయి జీవితం ఓ ఆదర్శ చరిత్ర’ అని ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిఢ అన్నారు. రోగుల సేవకు జీవితాన్ని అంకితం చేసిన బ్రహ్మపురకు చెందిన ప్రముఖ స్త్రీ రోగ, ప్రసూతి నిపుణురాలు డాక్టర్ లక్ష్మీ బాయి తన నూరో జన్మదినాన్ని పురస్కరించుకుని పొదుపు చేసిన రూ.3.40 కోట్లను క్యాన్సర్ బారిన పడిన మహిళలకు చికిత్సలు అందించేందుకు భువనేశ్వర్‌లోని ‘ఎయిమ్స్’ ఆసుపత్రికి విరాళంగా ఇచ్చిన సంగతి తెలిసిందే. మంగళవారం బ్రహ్మపుర వచ్చిన ఉప ముఖ్యమంత్రి పరిడా రాత్రి స్థానిక బాబానగర్‌లోని డాక్టర్ లక్ష్మీబాయి ఇంటికి వెళ్లి పరామర్శించి, సత్కరించి, కొంతసేపు ముచ్చటించి, ఆమె ఆశీర్వాదం తీసుకున్నారు. డాక్టర్ లక్ష్మీ బాయి లివింగ్ లెజెండ్ అని పేర్కొన్న ఉప ముఖ్యమంత్రి పరిడా ఆమె మానవత్వం, చాటుకున్న దాతృత్వం కేవలం ఒడిశాకు మాత్రమే పరిమితం కాకూడదని, దేశ, విదేశాలకు వ్యాపించాలన్నారు. ఆమె వెంట బ్రహ్మపుర ఎమ్మెల్యే కె.అనిల్ కుమార్, భాజపా గంజాం జిల్లా అధ్యక్షుడు సరోజ్ సాబత్, గంజాం పాలనాధికారి వి.కీర్తివాసన్, బీఈఎంసీ కమిషనర్ ప్రథమేష్ అరవింద రాజెషిర్కె తదితరులున్నారు.

డాక్టర్ లక్ష్మీబాయిని కలిసిన ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిఢ. చిత్రంలో బ్రహ్మపుర ఎమ్మెల్యే అనిల్ కుమార్ తదితరులు

స్వామికి ‘బొనొకొలగి’ గోప్యసేవలు

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీ శ్రీక్షేత్రంలో బుధవారం బహుళపక్షమి దశమి తిథి పురస్కరించుకుని జగన్నాథునికి ‘బొనొకొలగి’ గోప్యసేవలు జరిగాయి. సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు పూజాపండా, పుష్పాలక్, మేకప్ సేవాయత్‌లు పురుషోత్తమ, బలభద్ర, సుభద్రలకు ఆకు పసర్లు, మూలికలు, ఇతర సుగంధ ద్రవ్యాలతో తయారు చేసిన సహజ సిద్ధమైన రంగులు పూత పూసి దారు విగ్రహాలు తేజోవంతం చేశారు.

పోలీసులు క్రీడల్లోనూ సత్తా చాటాలి: డీజీపీ

భువనేశ్వర్, న్యూస్‌టుడే: పోలీసులు క్రీడల్లోనూ సత్తాచాటి ప్రతిష్ఠ పెంచాలని, నిత్యం వ్యాయామం చేసి ‘ఫిట్‌నెస్’ కలిగుండాలని డీజీపీ యోగేష్ బహదూర్ ఖురానియా చెప్పారు. కటక్ బక్షీ బజారు పరిధిలోని రిజర్వు పోలీసు మైదానంలో జరిగిన మూడు రోజుల క్రీడోత్సవాలు మంగళవారం రాత్రి ముగిశాయి. బహుమతుల ప్రదాన కార్యక్రమంలో పాల్గొన్న డీజీపీ మాట్లాడుతూ క్రీడలు శారీరక వికాసం, ఆత్మవిశ్వాసం, దృఢ సంకల్పాలను ప్రోది చేస్తాయన్నారు. పోటీల విజేతలకు ఖురానియా బహుమతులందజేశారు. కార్యక్రమంలో శాంతిభద్రతల ఏడీజీ సంజయ్‌కుమార్, కటక్ డీసీపీ రిషికేష్ ఖిలారి తదితర అధికారులు పాల్గొన్నారు.

విజేతలతో డీజీపీ ఖురానియా, ఇతర అధికారులు

తత్ప్రణమామి సదాశివలింగం

ధవళేశ్వరంలో మహాశివరాత్రికి విస్తృత ఏర్పాట్లు

గోపాలపూర్, న్యూస్‌టుడే: ప్రకృతి సోయగాల నడుమ ‘ఓం నమ శ్శివాయః’ అన్న పంచాక్షరి మంత్రం సదా మార్మోగే ధవళేశ్వర క్షేత్రం మహిమాన్వితమైనదిగా భక్తుల నమ్మకం. ఇక్కడి లింగం స్వయంభువుగా చెబుతారు. గోపాల్‌పూర్‌కు చేరువలో తీరం ఎదుట 25 ఎకరాల విస్తీర్ణంలో సరుగుడు, జీడిమామిడి తోటల నడుమ ఉన్న ఈ ముక్కంటి ఆలయానికి సంబంధించి వివిధ గాథలు ప్రాచుర్యంలో ఉన్నాయి. తనను ఆశ్రయించిన వారి ఆపదలను స్వామి తొలగించి శుభాలు చేకూరుస్తాడని భక్తులంటారు. ఇది వన భోజనాలకూ ప్రసిద్ధిగాంచినది కావడంతో గంజాం జిల్లా వ్యాప్తంగా ఇక్కడకి వచ్చి స్వామి దర్శనం, అభిషేకాలు చేపడతారు. వంటలు చేసుకుని, ముక్కంటికి అర్పణ చేసి ఆరగిస్తారు.

ధవళేశ్వర పీఠంలో మహారుద్రుని విగ్రహం

15న మహా వేడుక

పండగలు, పర్వదినాల్లో ఇక్కడ భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. బ్రహ్మపుర, ఇతర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సుల్లో సందర్శకులొస్తారు. ఆదివారం (15న) మహాశివరాత్రి కాగా, 14 (శనివారం) నుంచే ధవళేశ్వరంలో భక్తుల దీక్షలు ప్రారంభం కానున్నాయి. ఆలయ పాలకవర్గం శివరాత్రి దర్శనాలకు, తీర్థ ప్రసాదాలు, మహాదీప ప్రజ్వలన, జాగరణను దృష్టిలో పెట్టుకుని విస్తృత ఏర్పాట్లు చేసింది. పాలకవర్గం ఉపాధ్యక్షుడు కెప్టెన్ ఎ.పురుషోత్తం బుధవారం ‘న్యూస్‌టుడే’తో మాట్లాడుతూ మంచినీరు, పారిశుద్ధ్యం, స్వామి ప్రసాదాల వితరణ, భద్రతకు ప్రాధాన్యమిచ్చామన్నారు. 15 రాత్రి 11 గంటలకు శుభలగ్నంలో మహాదీప ప్రజ్వలన జరుగుతుందని, ఆ తర్వాత ముక్కంటికి పుష్పాల అర్చన ఆనవాయితీ ప్రకారం చేపడతామన్నారు. ఇక్కడ భక్తులు రాత్రంతా జాగరణ చేస్తారు. వారి కోసం ఆధ్యాత్మిక, వినోద కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 16న (సోమవారం) భక్తుల సౌకర్యార్థం ప్రసాదాల వితరణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

ఆలయ ముఖద్వారం

(c) eenadu

శక్తిపీఠాల్లో కాగడాకు పూజలు

బ్రహ్మపుర పెద్దమ్మవారి మందిరం వద్ద కాగడాతో నిర్వాహకులు, ఇతరులు

గంజాం జిల్లా స్వాస్థ్య మహోత్సవాలు ప్రారంభం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: దక్షిణ ఒడిశా పార్లమెంటరీ సంఘం (ఎస్‌ఓపీఎస్) ఆధ్వర్యంలో వివిధ సంస్థలు, ఇతర సంస్థల సహకారంతో 'సేవ గంజాం జిల్లా స్వాస్థ్య (ఆరోగ్య) మహోత్సవాలు-2026' బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ఖల్లికోట వర్సిటీ మైదానంలో ఈ నెల 15వ తేదీ వరకు ఇవి జరుగుతాయి. అంతకుముందు ఉదయం గంజాం జిల్లాలోని సుప్రసిద్ధ శక్తిపీఠాలు మా తారతారిణి, మా బంజేశ్వరి వద్ద కాగడా పెట్టి పూజలు చేశారు. అనంతరం బ్రహ్మపుర మా బుడి శంతాణీ ఠకురాణి (పెద్దమ్మవారు) మందిరానికి తీసుకువచ్చారు. ఇక్కడ విశేష పూజల అనంతరం కాగడాను ఆరోగ్య మహోత్సవాల ప్రాంగణానికి తీసుకొచ్చి అక్కడ ఉంచారు. అనంతరం ఉత్సవాలు మొదలయ్యాయి. ఆయా కార్యక్రమాల్లో ఎస్‌ఓపీఎస్ అధ్యక్షుడు విజయ కుమార్ స్వయిన్, ప్రధాన కార్యదర్శి బిప్లు ప్రసాద్ పండా, భాజపా గంజాం జిల్లా అధ్యక్షుడు సరోజ్ సాబత్, బీఈఎండీఏ ఉపమేయరు తదితరులు పాల్గొన్నారు.

'ఒడిశా మెడికల్ ఎక్స్‌పో-2026'కు సన్నాహాలు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఈ నెల 13 నుంచి 15 వరకు భువనేశ్వర్‌లోని బారముండా ప్రదర్శన మైదానంలో 'ఒడిశా మెడికల్ డివైసెస్ ఎక్స్‌పో-2026' ఏర్పాటు కానుంది. దీనికి సంబంధించి బుధవారం సాయంత్రం ఒడిశా మెడికల్ సర్వీస్ అసోసియేషన్ (ఓమ్స్) ఆధ్వర్యంలో డా. కిశోర్‌చంద్ర మిశ్ర, హైటెక్ వైద్యసంస్థ సంచాలకుడు అనిల్‌కుమార్ పాణిగ్రహి, ఓమ్స్ అధికార ప్రతినిధి శ్రీకాంత మార్ సామల్ భువనేశ్వర్‌లోని హైటెక్ ఆసుపత్రి అతిథి భవనంలో విలేకర్లతో మాట్లాడారు. వైద్య రంగంలో ఇటీవల కాలంలో అనేక మార్పులొచ్చాయని, ఆధునిక యంత్రాలు, ఉపకరణాలు అందుబాటులోకి వచ్చాయని, ఇవి ఎక్స్‌పోలో ప్రదర్శితమవుతాయని తెలిపారు.


ఎక్స్‌పో వివరాల ప్రతులు చూపుతున్న ప్రతినిధులు

ఎఫ్ఐహెచ్ ప్రోలీగ్ తొలి మ్యాచ్ విజేత బెల్జియం

మ్యాచు గెలుపొందిన బెల్జియం జట్టు క్రీడాకారులు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: రవుర్కెలాలోని బిర్సాముండా హాకీ మైదానంలో మంగళవారం రాత్రి ఎఫ్ఐహెచ్ ప్రోలీగ్ హాకీ మ్యాచులు జోరుగా ప్రారంభమయ్యాయి. ఇందులో తొలి మ్యాచ్‌లో బెల్జియం జట్టు 5-3 గోల్స్ తేడాతో అర్జెంటీనా జట్టుపై గెలుపొందింది. ప్రథమ క్వార్టర్‌లో 2-1 గోల్స్ తేడాతో అర్జెంటీనా ముందంజలో ఉండగా తర్వాత క్వార్టర్‌లలో బెల్జియం జట్టు గోల్స్ చేసి ఉత్తమ ఆటతో మ్యాచ్ విజేతగా నిలిచింది. ప్రారంభ వేడుకల్లో ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర క్రీడల మంత్రి సూర్యవంశీ సూరజ్ ఇరు జట్ల క్రీడాకారులతో కరచాలనం చేసి బాగా ఆడాలని సుభాభినందనలు తెలిపారు. జోనాయి ఎమ్మెల్యే లక్ష్మణ్ ముండా, రవుర్కెలా ఎమ్మెల్యే శారదాప్రసాద్ నాయక్, రాష్ట్ర క్రీడాశాఖ సంచాలకుడు విజయ్ ఎద్దుల, భారత హాకీ అధ్యక్షుడు దిలీప్ తిర్కి తదితరులు పాల్గొన్నారు.

ఎస్డీపీవో సదర్ కార్యాలయ కొత్త భవనం ప్రారంభం

నూతన భవనాన్ని ప్రారంభించిన మంత్రి బిభూతి జెనా. చిత్రంలో దక్షిణ మండల ఐజీ నితీ శేఖర్, ఎస్పీ శరవణ వివేక్ తదితరులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపుర పోలీసు జిల్లా ఆధ్వర్యంలో కొణిసిలో సబ్ డివిజనల్ పోలీసు ఆఫీసర్ (ఎస్డీపీవో) సదర్ కార్యాలయ నూతన భవనం ప్రారంభోత్సవం బుధవారం జరిగింది. రవాణా శాఖ మంత్రి బిభూతి భూషణ్ జెనా ముఖ్య అతిథిగా పాల్గొని దీన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో దక్షిణ మండల ఐజీ నితీ శేఖర్, బ్రహ్మపుర ఎస్పీ శరవణ వివేక్ ఎం. తదితరులు పాల్గొన్నారు.

భువనేశ్వర్‌లో మహిళా కమిషన్ ఆవిర్భావ వేడుక

వేదికపై సంచిక ఆవిష్కరిస్తున్న ఉపముఖ్యమంత్రి ప్రభాతి, మంత్రులు మహాలింగ, సంపద్, కమిషన్ అధ్యక్షురాలు శోభన

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని లోక్‌సేవా భవన్‌లో బుధవారం సాయంత్రం రాష్ట్ర మహిళా కమిషన్ 33వ ఆవిర్భావ వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో ఉపముఖ్య మంత్రి ప్రభాతిపరిడ, ఆరోగ్య, ఐటీ శాఖల మంత్రి ముఖేష్ మహాలింగ, పరిశ్రమల శాఖ మంత్రి సంపద్ స్వయిన్, మహిళా కమిషన్ అధ్యక్షురాలు శోభనా మహంతి పాల్గొని సంచిక ఆవిష్కరించారు. 2024-25 సంవత్సరంలో 1,879 కేసులు కమిషన్ పరిష్కరించినట్లు శోభనా తెలిపారు.

వీడిన సత్యబ్రత హత్య మిస్టరీ

సోనాల్‌సింగ్ పర్మార్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని శిశుహార్ ప్రాంతంలో ఆదివారం (8న) రాత్రి జరిగిన సత్యబ్రత ప్రధాన్ హత్య మిస్టరీ వీడిపోయిందని ఈ కేసు దర్యాప్తు చేస్తున్న జోన్-6 ఏసీపీ సోనాల్‌సింగ్ పర్మార్ బుధవారం భువనేశ్వర్‌లో విలేకర్లకు చెప్పారు. ప్రధాన నిందితుడు దినేష్ మంగళవారం రాత్రి జగత్సింగ్‌పూర్ పోలీసుల ఎదుట లొంగిపోయాడని, ఆయనను భువనేశ్వర్ తెచ్చి హత్య ఎలా జరిగిందన్న దానిపై సీన్ రీక్రియేషన్ చేయించామన్నారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం... లీజా అనే యువతికి పాత ప్రేమికుడు సత్యబ్రత. ఇటీవల వివాహితుడైన జగత్సింగ్‌పూర్‌కు చెందిన దినేష్ ఆమెకు దగ్గరయ్యాడు. 8వ తేదీ రాత్రి పాత ప్రియుడు సత్యబ్రత ఆమె వద్దకొచ్చాడు. తన ప్రియురాలి వద్దకు సత్యబ్రత వచ్చినట్లు తెలుసుకున్న దినేష్ [illegible] కత్తితో సత్యబ్రతను పొడిచి హతమార్చాడు. ఈ కేసులో మరో నిందితురాలు లీజాను, దినేష్‌ను ఎదురెదుగా ఉంచి విచారించామని, తర్వాత హత్యా ఉదంతం సీన్ రీక్రియేట్ చేయించి రికార్డ్ చేసినట్లు ఏసీపీ తెలిపారు. త్వరలో న్యాయస్థానంలో ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తామన్నారు.

హరిబాబును కలిసిన మహాలింగ

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఆరోగ్యశాఖ మంత్రి ముఖేష్ మహాలింగ బుధవారం భువనేశ్వర్‌లోని లోక్‌భవన్‌లో గవర్నర్ కంభంపాటి హరిబాబును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. రాష్ట్రంలో వైద్యసేవలు, ఆయుష్ వైద్యుల జీతాల పెరుగుదల తదితరాలపై వివరించారు.

సీఎస్‌తో ఎయిమ్స్ సీఈఓ భేటీ

అనూగార్గ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బిశ్వాస్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని ఎయిమ్స్ సీఈఓ డా. అశుతోష్ బిశ్వాస్ బుధవారం భువనేశ్వర్‌లోని లోక్‌సేవాభవన్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) అనూగార్గ్‌ను కలిశారు. ఎయిమ్స్‌లో వైద్యసేవల గురించి విపులంగా వివరించారు.

మీ ఆటకు... మా ప్రోత్సాహం

అంతర్జాతీయ హాకీ క్రీడాకారులకు మంత్రి సత్కారం

అమిత్ రోహిదాస్‌ను సత్కరిస్తున్న మంత్రి సూర్యవంశీ, చిత్రంలో విజయ్, దిలీప్ తిర్కి

సత్కారం అందుకుంటున్న నీలం సందీప్

సత్కారం అందుకుంటున్న రోషన్ కుజుర్

శీలానంద్ లక్రాకు సత్కారం

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: అంతర్జాతీయ హాకీ విజయాలు సాధిస్తున్న నలుగురు రాష్ట్ర హాకీ క్రీడాకారులను రాష్ట్ర క్రీడల మంత్రి సూర్యవంశీ సూరజ్ సత్కరించారు. ఈ మేరకు రవుర్కెలాలోని బిర్సాముండా హాకీ మైదానంలో మంగళవారం రాత్రి సత్కార కార్యక్రమం జరిగింది. ఇందులో మంత్రి సూర్యవంశీ ప్రముఖ హాకీ క్రీడాకారులు అమిత్ రోహిదాస్, నీలం సందీప్ ఎక్సెస్, శీలానంద్ లక్రా, రోషన్ కుజుర్‌లను ఘనంగా సత్కరించారు. వీరికి ఒక్కొక్కరికి రూ.7.50 లక్షల చొప్పున నగదు పురస్కారాలు అందజేసి అభినందించారు. రాష్ట్రం తరపున మరింత ప్రోత్సాహం ఉంటుందని ఆయన చెప్పారు. క్రీడాశాఖ సంచాలకుడు విజయ్ ఎద్దుల, భారత హాకీ అధ్యక్షుడు దిలీప్ తిర్కి తదితరులు వారిని అభినందించారు.

తప్పుల్లేని ఓటరు జాబితా రూపొందించాలి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్ నగరపాలక సంస్థ (బీఎంసీ) కార్యాలయం ఆవరణలో బుధవారం మధ్యాహ్నం భువనేశ్వర్ ఏకామ్ర, మధ్య, ఉత్తర, జట్నీ అసెంబ్లీ నియోజకవర్గాల బూత్‌స్థాయి అధికారుల (బీఎల్‌ఓ)తో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి(సీఈఓ) **ఆర్.ఎస్.గోపాలన్** సమావేశమయ్యారు. కొత్త ఓటర్ల నమోదు, జాబితాలో మృతుల పేర్ల తొలగింపు, ఇంటింటి సర్వే, తప్పిదాలకు తావులేని ఓటరు జాబితాలు సిద్ధం చేయడం అందరి కర్తవ్యం కావాలన్నారు.

భాజపా బలాన్ని పెంచడమే లక్ష్యం

భాజపాలో చేరుతున్న వారికి స్వాగతం పలుకుతున్న దృశ్యం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లాలో భాజపా బలాన్ని పెంచడమే లక్ష్యమని భాజపా జిల్లా అధ్యక్షుడు శివ ముదిలి అన్నారు. సునాబెడలోని సుభాష్ నగర్‌లో ఉన్న కల్యాణమండపంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొందరు కాంగ్రెస్, బిజద నేతలు, కార్యకర్తలు ఆయా పార్టీలను విడిచి భాజపాలో చేరారు. ★ కొరాపుట్ జిల్లా సునాబెడ పురపాలక సంస్థ అధ్యక్షుడు రాజేంద్ర కుమార్ పాత్ర్ భాజపా పార్టీలో చేరనున్నారు.

రైల్వేమంత్రిని కలిసిన ఎంపీ

మంత్రికి వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎంపీ బలభద్ర మాఝి

నవరంగపూర్, న్యూస్‌టుడే: కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను నవరంగపూర్ ఎంపీ బలభద్రమాఝి బుధవారం కలిశారు. రైల్వే లైను నిర్మాణం సమయంలో జాతీయ రహదారి శాఖతో చర్చించి, సమన్వయ నిర్ణయం తీసుకొని, ఎన్‌హెచ్-26 బైపాస్ రహదారి, రైల్వేలైను నిర్మాణం చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు.

మెడికల్ కళాశాల నిర్మాణానికి సన్నాహాలు

కళాశాల నిర్మించాల్సిన స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి, అధికారులు

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లాలో మెడికల్ కళాశాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. అందుకోసం స్థలం గుర్తింపు ప్రక్రియ పూర్తయింది. ఈనెల 13న ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం జరగనుందని, కళాశాల నిర్మాణానికి రూ.600 కోట్లు నిధులు మంజూరయ్యాయని, బుధవారం స్థలాన్ని విద్యా శాఖ మంత్రి నిత్యానంద గొండ్ పరిశీలించారు.

మధురంగా 'హరికథా గానం'

స్థానిక డైమండ్ ట్యాంకు రోడ్డులోని శ్రీ విరాట్ పోతులూరు వీర బ్రహ్మేంద్ర స్వామీజీ మందిరంలో జరుగుతున్న వార్షిక నవరాత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి 'అర్జున గర్వభంగం' హరికథా గానం జరిగింది. అందరినీ అలరించింది.

– న్యూస్‌టుడే, బ్రహ్మపుర నగరం

ఇతర ప్రాంతాల మావోయిస్టులు ఒడిశాలో లొంగిపోవచ్చు

కొంధమాల్ ప్రాంతాల్లో ముమ్మరంగా భద్రతా బలగాల గాలింపు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఇతర రాష్ట్రాలకు చెందిన మావోయిస్టులు ఒడిశాలో లొంగిపోవచ్చని, వారికి ఆరు నెలల్లోగా ఆర్థిక ప్యాకేజీ చెల్లిస్తామని ప్రభుత్వం బుధవారం స్పష్టం చేసింది. హోంశాఖ అధికారవర్గాలు దీనికి సంబంధించి ఉత్తర్వులు జారీ చేశాయి. డీజీపీ యోగేష్ బహదూర్ ఖురానియా తెలిపిన వివరాల మేరకు రాష్ట్రంలోని కొంధమాల్ జిల్లా, దీని సరిహద్దు ప్రాంతాల్లో కొద్దిమంది మావోయిస్టులు ఉన్నారు. నిర్ణీత వ్యవధికి ముందుగానే వారంతా లొంగిపోతారన్న ఆయన మావోయిస్టులంతా జనజీవన స్రవంతిలో చేరాలని పిలుపిచ్చారు.

ఘంటసాలకు ఘన నివాళి

పర్లాఖెముండి, రాయగడ, న్యూస్‌టుడే: చైతన్య ఆంధ్ర సాహితి సంస్కృతి సమితి ఆధ్వర్యంలో ఘంటసాల వెంకటేశ్వరరావు 52వ వర్ధంతి బుధవారం నిర్వహించారు. పట్టణంలోని మహేంద్రతనయ నది సమీపంలోని ఘంటసాల విగ్రహానికి సభ్యులు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ఘంటసాల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సభ్యులు

మొసళ్లతో పర్యావరణ సమతుల్యం

రాయగడ, న్యూస్‌టుడే: మొసళ్లు పర్యావరణ సమతుల్యానికి ఉపయోగపడతాయని గంజాం కళాశాల జంతు శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ మహేంద్ర శెట్టి అన్నారు. బుధవారం అటానమస్ కళాశాల గోల్డెన్ జూబ్లీ హాల్‌లో జంతు శాస్త్ర విభాగం వారు మొసలి సంరక్షణ స్వర్ణోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.

సెంచూరియన్‌లో కృషి మేళ

మహిళకు ప్రశంసాపత్రం అందిస్తున్న అతిథులు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గుసాని సమితి ఆర్.సీతాపురం వద్ద సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఎంఎస్ స్వామినాథన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ద్వారా రెండు రోజులపాటు నిర్వహించే కృషి మేళాను రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి గోకులానంద మల్లిక్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రహి, జడ్పీ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, వర్సిటీ ఉపాధ్యక్షుడు డీఎన్ రావు, వర్సిటీ ఉపకులపతి సుప్రియ పట్నాయక్ పాల్గొన్నారు.

సిబ్బంది సేవలు ప్రశంసనీయం

కొరాపుట్, న్యూస్‌టుడే: ఈస్ట్ కోస్ట్ రైల్వే కొత్తవలస కిరండూల్ రైలు మార్గంలో ఉన్నతాధికారులు రెండురోజులు పర్యటించారు. ఇందులో భాగంగా బుధవారం కొరాపుట్ నుంచి జగదల్‌పూర్ వరకు జరుగుతున్న రెండో రైలు మార్గం పనులను పరిశీలించారు. సిబ్బంది అందిస్తున్న సేవలను ప్రశంసించారు.

రైల్వే సిబ్బందితో మాట్లాడుతున్న డీఆర్ఎం లలిత్‌బోర

క్రికెట్ పోటీలకు 15 మంది ఎంపిక

ఎంపికైన క్రీడాకారులు, క్రికెట్ సంఘం ప్రతినిధులు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: కలహండి క్రికెట్ కప్ పోటీ కోసం 15 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. సునాబెడ హాల్ టౌన్‌షిప్‌లోని హాల్ స్టేడియంలో ఒడిశా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఎంపిక శిబిరంలో కొరాపుట్, జయపురం, బొరిగుమ్మ, సునాబెడ, సిమిలిగుడ, దమన్‌జోడి, నందపూర్ ప్రాంతాలకు చెందిన 15 మంది ఎంపికయ్యారు.

పథకాల అమలుపై ఎమ్మెల్యే ఆరా

జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా కొట్పాడ్ సమితి బటకుహడి, సుటిపొదర్, దమనహండి పంచాయతీల్లో బుధవారం ఎమ్మెల్యే రూపుబొత్ర పర్యటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పీఎం ఆవాస్, ఆయుష్మాన్ భారత్, ఉజ్వల, జల్‌జీవన్ మిషన్, ఇతర పథకాల అమలను పరిశీలించారు.

సుటిపొదరలో ప్రజలను ఆరా తీస్తున్న ఎమ్మెల్యే

'అగ్నిపరీక్ష' నవలావిష్కరణ

గాయత్రి కుమారికి అవార్డు అందిస్తున్న అతిథులు

రాయగడ, గుణుపురం, న్యూస్‌టుడే: గుణుపురంలో ఉపాధ్యాయుడిగా సేవలందించిన విజయ్‌కుమార్ పాఢి రచించిన అగ్నిపరీక్ష నవలను మంగళవారం ఆవిష్కరించారు. మంగళవారం రాత్రి గుణుపురం టౌన్‌హాల్‌లో ఒడిశా సాహిత్య అకాడమీ, సవిత కుమారి స్మారక ట్రస్ట్ వారు నిర్వహించిన సాహితీ సదస్సులో నవల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత్రి గాయత్రి కుమారి మిశ్రకు సవితకుమారి స్మారక అవార్డు అందజేశారు.

ఆకట్టుకుంటున్న సంప్రదాయ కల్యాణ వేదిక

సంప్రదాయ కల్యాణ వేదిక

కొరాపుట్, న్యూస్‌టుడే: వివాహంలో కల్యాణ మండపాలకు రూ. లక్షలు ఖర్చు పెట్టి అలంకరణలు చేస్తాం. కానీ కొరాపుట్‌లోని గిరిజన గ్రామాల్లో సంప్రదాయ మట్టితో చేసిన కల్యాణ వేదికలు అందరిని ఆకట్టుకుంటున్నాయి.

దివ్యాంగులకు ప్రశంసాపత్రాలు

జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా కుంద్రా సమితిలో బుధవారం బీమ్‌బోయ్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో దివ్యాంగులకు ప్రశంసాపత్రాలు, ట్రై సైకిళ్లు, చేతికర్రలు, కళ్లద్దాలు అందజేశారు. ముఖ్యఅతిథిగా కొట్పాడ్ ఎమ్మెల్యే రూపుబొత్ర హాజరయ్యారు.

సర్పంచి చర్యలను వ్యతిరేకిస్తూ బీడీవోకు వినతి

జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా కుంద్రా సమితి ఆస్న పంచాయతీ భవన నిర్మాణం, సర్పంచి ఏకపక్షంగా విధులు నిర్వర్తించడాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం వార్డు సభ్యులు బీడీవో పి.మనస్మితకు వినతిపత్రాన్ని అందజేశారు.

ఏఐతో అప్రమత్తంగా ఉండాలి

రాయగడ, న్యూస్‌టుడే: విప్లవవాత్మక మార్పులు తీసుకొచ్చే ఏఐ వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని జాతీయ సమాచార కేంద్రం జిల్లా అధికారి నేతేటి గుణశేఖర్ అన్నారు. మంగళవారం అంతర్జాలం దినోత్సవం సందర్భంగా అటానమస్ కళాశాల, ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రసంగించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

కళింగ స్పోర్ట్స్ కాంప్లెక్స్ సందర్శన

స్విమ్మింగ్ కేంద్రంలో బృంద ప్రతినిధులు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: లాల్‌బహదూర్ శాస్త్రి జాతీయ యంత్రాంగ అకాడమీ (ఎల్‌బీఎస్‌ఎన్‌ఏఏ)లో శిక్షణ పొందుతున్న సివిల్, నాన్‌సివిల్ బృందం ప్రతినిధులు కళింగ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను సందర్శించారు. మంగళవారం వీరంతా భువనేశ్వర్‌లోని కళింగ మైదానం, స్పోర్ట్స్ విజ్ఞాన కేంద్రం, ఇండోర్ అథ్లెటిక్ స్టేడియం, ఫుట్‌బాల్ మైదానం, జిమ్నాస్టిక్స్ ఇండోర్ హాలు, స్విమ్మింగ్ శిక్షణ కేంద్రం, బ్యాడ్మింటన్ ఇండోర్ హాలు, హాకీ మైదానం తదితర శిక్షణ కేంద్రాల్లోని సౌకర్యాలను పరిశీలించారు. క్రీడాశాఖ అధికారులు వారి వెంట ఉన్నారు.

అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్‌లో రంజిత్‌కు పతకం

కాంస్యంతో రంజిత్ చండా

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: దుబాయ్‌లో ఈ నెల 10 నుంచి 13 వరకు జరుగుతున్న ప్రపంచ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిక్స్ - 2026 పోటీల్లో రాష్ట్ర పారా అథ్లెట్ సత్తా చాటాడు. మంగళవారం పురుషుల ఎఫ్-46 కేటగిరీలో నిర్వహించిన జావెలిన్‌త్రో అంశంలో పోటీపడిన రంజిత్ చండా 57.75 మీటర్ల దూరం విసిరి తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం గెలుచుకున్నాడు.

బస్టాండు ప్రారంభం

బస్టాండును ప్రారంభిస్తున్న మంత్రి బిభూతి జెనా. చిత్రంలో బ్రహ్మపుర ఎమ్మెల్యే అనిల్ కుమార్ తదితరులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపుర శివారున అస్కా రోడ్డు మొదటి గేటు సమీపాన దుడుమా కాలనీ వద్ద కొత్తగా నిర్మాణమైన బస్టాండు బుధవారం ప్రారంభమైంది. రవాణా శాఖ మంత్రి బిభూతి భూషణ్ జెనా ముఖ్య అతిథిగా హాజరై దీన్ని ప్రారంభించి, బస్సులకు జెండా ఊపారు. బ్రహ్మపురలో ట్రాఫిక్ వ్యవస్థ నిర్వహణ, నగరవాసుల రాకపోకల సౌకర్యానికి ఈ బస్టాండు దోహదకారి అవుతుందని ఆయన పేర్కొన్నారు. బ్రహ్మపుర అభివృద్ధి సంస్థ (బీఈడీఏ) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బ్రహ్మపుర ఎమ్మెల్యే కె.అనిల్ కుమార్ అతిథిగా హాజరయ్యారు. ఇంకా ఇందులో భాజపా గంజాం జిల్లా అధ్యక్షుడు సరోజ్ సాబత్, గంజాం పాలనాధికారి వి.కీర్తివాసన్, బ్రహ్మపుర పురపాలక సంఘం కమిషనర్ ప్రథమేష్ అరవింద రాజేషిర్కె తదితరులు పాల్గొన్నారు. స్థానిక గేటుబజారు కూడలిలో పైవంతెన నిర్మాణం పనులు జరుగుతున్న నేపథ్యంలో దక్షిణ ఒడిశా జిల్లాల నుంచి బ్రహ్మపురవైపు వచ్చే బస్సులు ఈ బస్టాండులో ఆపుతారు.

జనగణనపై అధికారులకు అవగాహన

బరగఢ్, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి జనగణన అధికారుల సమీక్షతో పాటు శిక్షణ కార్యక్రమం బుధవారం కలెక్టర్ సభాగృహంలో జరిగింది. ఈ కార్యక్రమంలో జనగణన నిర్వహణ విధానాలపై అధికారులకు అవగాహన కల్పించారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

కొరాపుట్, న్యూస్‌టుడే: జవహర్ నవోదయ విద్యాలయ ప్రాంగణంలో ప్రేరణ పేరుతో పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు బుధవారం నిర్వహించారు. పోటీలలో జిల్లాలోని 14 సమితుల్లో గల ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జరిగిన కార్యక్రమంలో పోటీలలో 400 మంది విద్యార్థులు పాల్గొనడం విశేషం.

ఘనంగా పండిత దీనదయాళ్ వర్ధంతి

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: భాజపా సిద్ధాంత కర్త పండిత దీనదయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి సందర్భంగా బుధవారం ఆయనకు ఘన నివాళులర్పించారు. పర్లాఖెముండిలో ఖంజా వీధిలోని భాజపా కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

బరగఢ్ క్యాన్సర్ ఆసుపత్రిని ప్రారంభించాలి

బరగఢ్, న్యూస్‌టుడే: పశ్చిమ ఒడిశాలో పెరుగుతున్న క్యాన్సర్ కేసులపై లోక్‌సభలో బరగఢ్ ఎంపీ ప్రదీప్ పురోహిత్ ఆందోళన వ్యక్తం చేశారు. బరగఢ్ జిల్లాలో నిర్మించిన క్యాన్సర్ ఆసుపత్రిని వెంటనే పూర్తి ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, ఒడిశాలో క్యాన్సర్ రోగుల సంఖ్య పెరుగుతోంది. రూ.138 కోట్లతో నిర్మించిన బరగఢ్ క్యాన్సర్ ఆసుపత్రిలో అన్ని పోస్టులను భర్తీ చేసి, శినిగి-దిగి, రేడియోథెరపీ, ఐసీయూ సేవలను ఉచితంగా అందించాలని విజ్ఞప్తి చేశారు.

బంద్ విజయవంతం

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా ఉమ్మర్‌కోట్, రాయ్‌ఘర్, చందహండి, జోరిగావ్ సమితుల్లో బుధవారం 12 గంటల సమయం పాటు నిర్వహించిన బంద్ విజయవంతమైంది.

నేటి నుంచి హెచ్ఎస్ నాలుగో సెమిస్టర్

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: బోర్డ్ ఆఫ్ హైయ్యర్ సెకండరీ కౌన్సిల్(హెచ్ఎస్) 12వ తరగతి నాలుగో సెమిస్టర్ ఫిబ్రవరి 12వ తేదీ నుంచి 27వరకు నిర్వహిస్తుంది. 7,10,811 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారు. 6,837 పరీక్షా కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తారు.

క్రీడాకారులకు సన్మానం

క్రీడాకారులతో యంత్రాంగ అధికారులు

జయపురం, కొరాపుట్, న్యూస్‌టుడే: జాతీయ, రాష్ట్రస్థాయిలో జరుగుతున్న క్రీడా పోటీల్లో పాల్గొని విజయం సాధించిన కొరాపుట్ జిల్లాకు చెందిన క్రీడాకారులను యంత్రాంగం బుధవారం. కలెక్టర్ మనోజ్ సత్యవాన్, జిల్లా అభినందనలు తెలిపారు.

చోరీ ద్విచక్ర వాహనం స్వాధీనం

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఝూర్‌గ్రామ్ జిల్లా మాణిక్పాడా పోలీస్‌స్టేషన్ పరిధిలో గుప్తమణి అమ్మవారి ఆలయానికి వచ్చిన ఓ యువకుడి ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మండల్ అనే యువకుడు గుప్తమణి అమ్మవారి ఆలయ దర్శనానికి బుధవారం వచ్చాడు. గుడి నుంచి బయటకొచ్చే సరికి వాహనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే ట్రాఫిక్ కానిస్టేబుల్ సుదీప్ రంగంలోకి దిగి గంటలోనే వాహనాన్ని మండల్‌కు అప్పగించారు.

త్రుటిలో తప్పిన పెద్ద ప్రమాదం

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఝూర్‌గ్రామ్ జిల్లా రఘురా అనే ప్రాంతంలో మంగళవారం ఓ యాత్రికుల బస్సు నియంత్రణ కోల్పోయి దిగువ ప్రాంతానికి జారిపోయింది. బస్సు చోదకుడు చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పిందని పోలీసుల తెలిపారు.

రైల్వే పనుల పరిశీలన

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఖరగ్‌పూర్ డివిజన్‌లో ప్రముఖ రైల్వే స్టేషన్లు సంత్రాగాచి, షాలిమార్. ఈ స్టేషన్ల నుంచి సాగే ప్రధాన రైళ్ల సదుపాయాలు పరిశీలించి అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా డీఆర్ఎం లలిత్ మోహన్ ఆ పనులను పరిశీలించారు.

మహేంద్రగిరిపై మహాశివరాత్రి ఏర్పాట్లు

ధర్మరాజు మందిర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న బిభూతి భూషణ్ జెనా

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఈనెల 14, 15వ తేదీల్లో మహేంద్రగిరిపై భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి బిభూతి భూషణ్ జెనా అన్నారు. మంగళవారం పర్వతంపై ఉన్న కుంతి, అర్జున మందిరాలతో పాటు పరిసర ప్రాంతాలను పరిశీలించి సరైన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.

అంతర్ విశ్వవిద్యాలయం పోటీల్లో జయపురం విద్యార్థుల

జయపురం, న్యూస్‌టుడే: ఈనెల 25న కటక్ రెవెన్స్ విశ్వవిద్యాలయంలో అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో జయపురంలో ఉన్న విక్రమ్‌దేవ్ విశ్వవిద్యాలయానికి చెందిన 39 మంది విద్యార్థులు 22 అంశాల్లో పాల్గొంటారని రిజిస్ట్రార్ మహేశ్వర్‌చంద్ర నాయక్ తెలిపారు.

కార్మికుల ర్యాలీ

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: డీఆర్ఎం కార్యాలయం పరిసరాల్లో 12న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయమని కోరుతూ సీఐటీయూ, ఆర్‌యూసీఎల్ కార్మిక సంఘాలు మంగళవారం సాయంత్రం ఒక ర్యాలీ నిర్వహించాయి.

13న నవరంగపూర్‌కు ముఖ్యమంత్రి

నవరంగపూర్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి మోహన్‌చరణ్‌మాఝి ఈనెల 13న నవరంగపూర్ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా కొత్త మండేయి మైదానంలో జరిగే భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొంటారని, జగన్నాథ్ దర్శన్ యోజనను ప్రారంభిస్తారని జిల్లా యంత్రాంగం తెలిపింది.

మండీల నిర్వహణపై ప్రశంస

సిమిలిగుడ, న్యూస్‌టుడే: వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటైన మండీల నిర్వహణ పరిశీలించేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ బృందం జిల్లాలో పర్యటించింది. గత రెండు రోజులుగా ఈ బృందం వివిధ ప్రాంతాలను సందర్శించి మండీ నిర్వహణ తీరు పరిశీలిస్తోంది.

గ్లోబల్ రీసెర్చ్ ఇంటర్న్‌షిప్

సుమన్ చక్రవర్తి అతిథులతో

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఐఐటీ ఖరగ్‌పూర్‌లో గ్లోబల్ రీసెర్చ్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం(ఎస్‌జీఆర్ఐపీ) జరిగింది. ఇందులో భాగంగా యూకేలోని కేంబ్రిడ్జ్ వర్సిటీ యూసుఫ్ హమీద్, థియరీ గ్రూప్ ఛైర్ ప్రొఫెసర్ డేవిడ్ జేవేల్స్‌లు అతిథులుగా హాజరయ్యారు.

(c) eenadu

సోంపేటపై విశాఖ విజయం

ఇచ్ఛాపురంలో జరుగుతున్న అంతర్రాష్ట్ర టీ20 టోర్నమెంట్ ఉత్సాహభరితంగా సాగుతోంది. వెచ్చా జయంతి స్మారకార్థం ఇచ్ఛాపురం రాజావారి మైదానంలో మంగళవారం జరిగిన పోటీల్లో విశాఖపట్నం, సోంపేట జట్లు తలపడగా... సోంపేట నిర్ణీత 20 ఓవర్లలో 126 పరుగులకే కుప్పకూలింది. విశాఖ జట్టు 16.2 ఓవర్లలోనే నాలుగు వికెట్ల నష్టానికి 127 పరుగులు చేసి గెలిచింది. ఈ జట్టులో ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన అఖిల్‌కు నిర్వాహకులు ఉత్తమ ఆటగాడి జ్ఞాపిక అందించారు. కేశవరావు, దిలీప్, కృష్ణయ్య, షేక్‌మున్నా తదితరులు పాల్గొన్నారు. అంపైర్లుగా ప్రేమ్, మన్మథ, వ్యాఖ్యాతగా కృష్ణయ్య వ్యవహరించారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ఉప్పు చేప.. ఉపాధినిస్తోంది..!

● ఇచ్ఛాపురం కేంద్రంగా వ్యాపారం

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

సావళ్లు, గుళ్లరాళ్లు, నెత్తళ్లు, పూసపరిగలు, వంజరాలు, కట్టపరిగలు, రొయ్యపొట్టు, కవ్వాలు, మొరవలు, గులివిందలు, టెంకుసారలు, చెంపసారలు, కానాగ్రిలు, పాత్రాలు, గొరసలు.. ఈ పేర్లన్నీ ఏంటో అనుకుంటున్నారా..? ఇవన్నీ ఎండు చేపల్లోని రకాలు.. జిహ్వకు రుచితో పాటు జిల్లాలో ఎంతో మంది మత్స్యకారులకు వీటి ద్వారా ఉపాధి లభిస్తోంది. ఇచ్ఛాపురం కేంద్రంగా ఎండు చేపల వ్యాపారం ఆశాజనకంగా సాగుతోంది.

ఇచ్ఛాపురంలో ఎండు చేపలను సర్దుతున్న కార్మికురాలు

ఇచ్ఛాపురం మండలం డొంకూరు, సొన్నాపురం, కపాసుకుద్ది, మేకవరం, కళింగపట్నం తదితర తీర ప్రాంతాల్లో మత్స్యకారులు ఎక్కువగా ఈ రకం చేపల్ని సేకరిస్తారు. కొనుగోలు చేసిన వ్యాపారి.. రకానికి అనుగుణంగా వేర్వేరుగా ఉప్పులో ఊరబెడతారు. మూడు రోజుల తర్వాత ఎగుమతికి ముందు రెండు రోజులు బాగా ఎండబెడతారు. బాగా ఎండిన తరువాత మళ్లీ తూకం వేసి, వెదురు బుట్టల్లో నిల్వ చేస్తారు.

★ ఉప్పు చేపల్లో రకాల వారీగా ప్రత్యేక గుణాలుంటాయి. వాటిని వివిధ ఆహార పదార్థాలు, ఎరువులు, మందుల తయారీలో వినియోగిస్తుంటారు.

★ ఇచ్ఛాపురం రవాణా రంగ కేంద్రం నుంచి ఒడిశా, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, నేపాల్ ప్రాంతాలకు ఎక్కువగా పంపిస్తారు.

★ వర్షాకాలంలో ఈ వ్యాపారం అంతగా సాగదు. జనవరి నుంచి జూన్ వరకు నెలకు రూ.కోటి విలువైన ఎగుమతులు జరుగుతాయి.

★ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న ఇచ్ఛాపురం రవాణారంగ కేంద్రంతో పాటు స్థానిక మత్స్యకారులకు ఈ వ్యాపారం ఆర్థిక తోడ్పాటునందిస్తోంది.

ఇదే మా జీవనాధారం..

ఎండు చేపల పని బరువుగా కనిపించదు కానీ.. ఎక్కువ శ్రమ పడాలి. మూడు దఫాలు ఎండలో వేయాలి. ఆ చేపలను సాయంత్రం మళ్లీ సేకరించి. బస్తాల్లో నింపుతుంటాం. ఇలా చేసినందుకు బస్తాకు రూ.40 ఇస్తారు. వ్యాపారులు ఇచ్చే సొమ్ముతో జీవనం సాగిస్తున్నాం. – వి.సుభాష్, కార్మికుడు

అధరహో ఆయిల్‌పామ్

న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

రైతులు ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. మార్కెట్లో ధర బాగుండటంతో క్రమంగా సాగు విస్తీర్ణం పెరుగుతోంది. దీనికి ప్రభుత్వ ప్రోత్సాహం కూడా కలిసి రావడంతో ఎక్కువ మంది అటువైపు మొగ్గు చూపుతున్నారు. వ్యవసాయ క్షేత్రాల్లో పంట మార్పిడి అవసరమంటున్న వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారుల సూచనలకు అనుగుణంగా ముందుకు సాగుతున్నారు. మెట్ట భూముల్లోనే కాకుండా మాగాణిలోనూ మంచి లాభాలు ఆర్జించే ఈ సాగు మరింత పెంచేందుకు ఉద్యాన శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

ఆయిల్‌పామ్ సాగు

ప్రస్తుతం ఆయిల్‌పామ్ టన్ను ధర రూ.20,680 పలుకుతోంది. ఈ లెక్కన ఎనిమిది టన్నుల దిగుబడి వస్తే రూ.1,65,440, తొమ్మిది టన్నులైతే రూ.1,86,120 వరకు ఆదాయం వస్తుంది. ఎకరాకు రూ.50వేలు మదుపులు అవుతున్నాయి. ఖర్చులు పోనూ రూ.1.15లక్షల నుంచి రూ.1.36 లక్షలు లాభం ఉంటుంది. కొవిడ్ సమయంలో టన్ను రూ.15 వేల లోపు పడిపోయింది. మార్కెట్ లేకపోవడం, ఎండ, వానల్లో శ్రమిస్తే మిగిలేది ఏమీలేక చాలా మంది ముఖం చేటేశారు. దీంతో గత రెండేళ్లు సాగు తగ్గింది. కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తుండటం, మద్దతు ధర కల్పించడంతో ఎక్కువ మంది రైతులు దృష్టిసారిస్తున్నారు.

ప్రోత్సాహం ఇలా..

రైతులకు ప్రభుత్వమే మొక్కలు ఉచితంగా సరఫరా చేస్తోంది. ఎరువుల కోసం హెక్టారుకు రూ.5,250, అంతర పంటలు సాగుచేస్తే హెక్టారుకు మరో రూ.5,250 వార్షికంగా అందిస్తోంది. నేరుగా రైతుల ఖాతాకే నిధులు జమ చేస్తున్నారు. పంట కొనుగోలును సైతం ప్రభుత్వమే చేస్తోంది. ఒకసారి వేస్తే 25ఏళ్ల వరకు ఏటా రూ.లక్ష నుంచి రూ.1.30వేల వరకు నికర లాభం ఉంటుందని ఉద్యాన శాఖ అధికారులు తెలిపారు.

20 వేల ఎకరాల్లో..

జిల్లాలోని 15 మండలాల పరిధిలో 20 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగవుతోంది. పార్వతీపురం, సాలూరు, కొమరాడ, పాచిపెంట, మక్కువ, జియ్యమ్మవలస, సీతానగరం మండలాల్లో సాగు చేస్తున్నారు. గతంలో 13-14వేల ఎకరాల్లో ఉండేది. గతేడాది మూడు వేల ఎకరాలు, ఈ ఏడాది మరో మూడు వేల ఎకరాలకు పెరిగింది. తోటలకు పుష్కలంగా నీరు అందించేలా బోరు వేయించడం, ట్రాక్టర్, కట్టర్, నీటి కుంట, డ్రిప్ ఇరిగేషన్‌కు రాయితీలు కల్పిస్తోంది. ఎకరాకు 8-10 టన్నుల వరకు దిగుబడి వస్తుంది.

ముందుకొస్తున్నారు.. జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుకు ముందుకొస్తున్నారు. ప్రభుత్వం రాయితీలు కల్పించడం, పంట కొనుగోలు, గిట్టుబాటు ధర ఇవ్వడంతో రైతుల్లో మార్పు వచ్చింది. కొవిడ్ ముందు టన్ను రూ.23వేల వరకు ఉండేది. ఇప్పుడు పెరిగింది. – సత్యన్నారాయణ రెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి

స్పందించండి.. తొలగించండి

కొత్తూరు మండలంలోని మెట్టూరు బిట్-1 పంచాయతీ పరిధిలోని రక్షిత తాగునీటి పథకం చుట్టూ తుప్పలు, పనికిరాని మొక్కలు పెరగడంతో అపరిశుభ్రత నెలకొంది. దీంతో పాముల బెడద పెరిగిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు స్పందించి, చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాగర్ మాట్లాడుతూ పరిశీలించి, మొక్కలు తొలగిస్తామన్నారు. – న్యూస్‌టుడే, కొత్తూరు

మూసేసి.. మురుగును ఆపేసి

ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయంలోకి వెళ్లేందుకు దారి కోసం మురుగు కాలువ మూసుకుపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. సోమపోలమాంబ ఆలయం నుంచి సోమేశ్వరాలయం సమీపం వరకు ఉన్న కచ్చా కాలువను పలు చోట్ల కప్పేయడంతో మురుగు ముందుకు కదలడం లేదు. కాలువ నిర్మాణానికి ప్రతిపాదనలున్నాయని, అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామని పంచాయతీ అభివృద్ధి అధికారి ఎం.శాంతికుమారి తెలిపారు. – న్యూస్‌టుడే, సోంపేట

రక్షణ గోడ నిర్మించరూ...

నారాయణబట్టి ప్రాథమిక పాఠశాలకు రక్షణ గోడ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. రహదారికి ఆనుకుని ఉండటంతో విశ్రాంతి సమయాల్లో విద్యార్థులు రోడ్డుపైకి వెళ్లకుండా ఉండేందుకు ప్రహరీ నిర్మించాలని కోరుతున్నారు. ఈ విషయం మండల విద్యాధికారి కె.చిట్టిబాబు వద్ద ప్రస్తావించగా సమస్యను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. – న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

అంతిమయాత్రకూ ఇబ్బందులే..

ఎల్‌ఎన్‌పేట మండలం పెద్దకోటలోని గల శ్మశానానికి సరైన మార్గం లేకపోవడంతో పొలం గట్టుపైనే శవాన్ని మోసుకెళ్తున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం ఆ గ్రామానికి చెందిన ముంగి అప్పలసూరి మృతి చెందడంతో మృతదేహాన్ని శ్మశానవాటికకు తీసుకెళ్లడానికి ఇబ్బందులు పడ్డామని, సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. ప్రతిపాదనలు పంపించినట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. – న్యూస్‌టుడే, ఎల్‌ఎన్‌పేట

మలుపు.. ప్రమాదానికి పిలుపు

కవిటి మండలం జల్లుపుట్టుగ నుంచి రాజపురం వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డులో పలు చోట్ల భారీ మలుపులున్నాయి. ఆయా చోట్ల సూచిక బోర్డులు, వేగ నియంత్రికలు లేకపోవడంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఏఈ విక్రమ్‌ను వివరణ కోరగా వేగ నియంత్రికలున్నాయని, సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

కొడిశలు గుర్తించు.. ప్రమాదాన్ని తప్పించు

రేగిడి, న్యూస్‌టుడే: ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా పశువైద్య శిబిరాలు నిర్వహించారు. ప్రధానంగా పశువుల్లో కొడిశలు ఎక్కువగా ఉన్నట్లు గుర్తిస్తున్నారు. ఇవి ఒక రకమైన కీటకాలు. పశువులు వీటి బారిన పడితే పాడిఉత్పత్తి, ఇతర ఇన్‌ఫెక్షన్, శరీర ఉష్ణోగ్రత పెరగడం వంటి లక్షణాలతో పాటు పశువులపైనా తీవ్ర ప్రభావం చూపుతాయి. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా వాటి ప్రాణాలకే ముప్పు. లక్షణాలు, నివారణ చర్యలను పశువైద్యాధికారి దుర్గాప్రసాద్ వివరించారు.

పిడుదులు పట్టి నీరసించిన పశువు

నివారణ చర్యలు

★ కొడిశలు ఎక్కువగా పెంటకుప్పలు, చీకటి ప్రదేశాల్లో గుడ్లు పెడతాయి. పశువుల పాకల సమీపంలో అవి లేకుండా చూసుకోవాలి. పాకల్లో వెలుతురు ఉండాలి. ★ వీటి నివారణకు లీటరు నీటిలో బ్యూటాక్స్ సైపర్‌మెత్రిన్ ఒక మి.లీ. ద్రావణాన్ని కలిపి పశువు శరీరంపై పూయాలి. తీవ్రత ఎక్కువుంటే ఐవర్‌మెక్టిన్ సూదిమందును 50 కిలోల బరువుకు ఒక మి.లీ చొప్పున వర్తింపచేయాలి.★ మందు వేసే ముందు శాలను శుభ్రం చేసుకోవాలి.

ఇవీ నష్టాలు..

★ కొడిశలు పశువు నుంచి రోజుకు 0.5 నుంచి 2 మి.లీ. రక్తాన్ని పీల్చేస్తాయి. ★ ఎక్కువగా వాటి చెవుల్లో జీవిస్తూ ఉండడం వల్ల తలను విదిలిస్తుంటాయి. ★ వీటితో చర్మం దురదగా మారడంతో శరీరాన్ని పాకల్లోని కొయ్యలకు, గోడలకు రుద్దుతుంటాయి. ★ చర్మంపై వెంట్రుకలు రాలిపోతాయి. ★ బలహీనపడి చురుకుదనం తగ్గిపోతుంది.

రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

● పిచికారీ చేసే సమయంలో రైతులు పశువులను తాకకుండా చేతులకు తొడుగులు, ముఖానికి మాస్క్ ధరించాలి. ● మందులు నిర్దేశిత మోతాదులో మాత్రమే వినియోగించాలి. ● మందు డబ్బాలను పిల్లలు, పశువులకు దూరంగా ఉంచాలి.

మిరపలో తామర పురుగు సోకితే..

మిరప పంట వేసిన 30 రోజుల్లో తామర పురుగు ఆశించి తీవ్ర నష్టం చేస్తోందని కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త డా.ఎస్.శ్రీనివాసరాజు తెలిపారు.

పురుగు బారిన పడిన పంట

నివారణకు వెంటనే చర్యలు తీసుకోకపోతే పూతలో తామర పురుగు చేరి నాశనం చేస్తుందన్నారు. నివారణకు వెంటనే పొలంలో ఎకరానికి 100 జిగురు అట్టలు ఏర్పాటు చేయాలి. ఇందులో 40 పసుపు, 30 నీలం, 30 తెలుపు రంగు అట్టలు అతికిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయి. లేదా ట్రైస్టార్ నీల్‌ఫోల్ మందును 1.2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా బ్రైవిన్ ఫ్లయరాన్ 1.5 గ్రాముల పొడి మందును లీటరు నీటికి వారం, మరో వారం మందులు మార్చి పిచికారీ చేయాలి. వేపనూనె 5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవచ్చు.

– న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

రైతేరాజు

సంరక్షణ, యాజమాన్య చర్యలతో లాభం

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: పంటల సాగులో పురుగులు, తెగుళ్ల నివారణకు సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టడం వల్ల ఆశించిన దిగుబడులు సాధించవచ్చని విజయనగరం జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త తేజేశ్వరరావు తెలిపారు. రైతుల ప్రశ్నలకు సమాధానమిచ్చారు.

?: ప్రశ్న: రెండు ఎకరాల్లో మిరప సాగు చేశాం. ఆకులు, కొమ్మలపై మచ్చలు ఏర్పడి క్రమంగా చెట్లు ఎండిపోతున్నాయి. ఈ తెగులు నివారణ ఎలా? - వెంకటరమణ, కళ్లికోట

☛: సమాధానం: మీరు చెప్పిన ఆనవాళ్లను బట్టి పంటకు కొమ్మకుళ్లు తెగులు ఆశించింది. దీని నివారణకు రైతులు కాపర్‌ఆక్సీక్లోరైడ్ 30 గ్రాములు, స్ట్రెప్టోసైక్లిన్ ఒక గ్రాము చొప్పున 10 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేస్తే తెగులు ఉద్ధృతి తగ్గుతుంది.

?: వేరుశనగలో లద్దె పురుగు నివారణకు సస్యరక్షణ చెప్పండి? - అప్పారావు, వేపాడ

☛: లద్దెపురుగు నివారణకు ఎకరాకు 200 లీటర్ల నీటికి 200 గ్రా. థయోడికార్బ్ లేదా 60 మి.లీ. క్లోరాంత్రానిలిప్రోల్‌ను కలిపి సాయంత్రం సమయంలో పంటకు వేయాలి.

?: కొబ్బరిలో పిందెలు రాలిపోతున్నాయి. ఎలా నియంత్రించాలి? - గణపతి, విక్రంపురం

☛: కొబ్బరిలో చాలా కారణాలతో పిందెలు రాలవచ్చు. పొటాష్ లోపం వల్ల, నీరు ఎక్కువైనా లేదా తక్కువైనా, శిలీంధ్రం ఆశించడం లేదా హార్మోన్ల లోపం వల్ల ఈ ప్రమాదం ఉంది. వీటి నివారణకు సిఫారసు చేసిన ఎరువుల మోతాదులో రెండున్నర కిలోలు మ్యూరేట్ ఆఫ్ పొటాష్ కూడా వేయాలి. 100 లీటర్ల నీటికి 4.5 గ్రా., 2, 4-డిని కలిపి వారం రోజుల వ్యవధిలో నాలుగు సార్లు పత్రాలపై పిచికారీ చేయాలి.

అరటిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలివీ..

సాగుచేస్తున్న అరటి పంట

అరటి పంటలో సూక్ష్మధాతు పోషక లోపాలను ఎరువులను సమపాళ్లలో వేసుకుంటే అధిగమించవచ్చు. పొటాషియం నైట్రేట్ లేదా సల్ఫేట్ ఆఫ్ పొటాష్ 5 గ్రాములు లీటరు నీటికి 0.5 మి.లీ. జిగురుతో కలిపి ఆకుల మీద 4 నుంచి 5 సార్లు పిచికారీ చేయాలి. గెలలు వేసిన తోటల్లో ఆఖరి హస్తం విచ్చుకున్న తర్వాత ఒకసారి, అదే విధంగా 10 రోజుల తర్వాత మరో దఫా లీటరు నీటికి సల్ఫేట్ ఆఫ్ పొటాష్ 5 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి. అదే విధంగా అరటిలో బోరన్ ధాతువు లోపం వస్తుంది. నివారణకు జింకు సల్ఫేట్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. శీతాకాలంలో గెలలు సరిగ్గా వృద్ధి చెందకపోతే గెలలోని కాయలు పండుబారుతాయి. నివారణకు పొటాషియం ఆర్థోపాస్ఫేట్ 5 గ్రాములు లీటరు నీటికి కలిపి గెల మీద వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. ఈ యాజమాన్య పద్ధతులను సమర్థంగా పాటిస్తే మంచి దిగుబడి పొందవచ్చని రస్తాకుంటుబాయి కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త డా.ఎస్.శ్రీనివాసరాజు సూచించారు.

– న్యూస్‌టుడే, కురుపాం

అవగాహనతో నేరాల కట్టడి

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: అవగాహన ఉంటేనే నేరాల కట్టడి సాధ్యమవుతుందని ఎస్పీ మాధవరెడ్డి అన్నారు. మంగళవారం కాన్ఫరెన్స్‌లో అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఎక్కడా అల్లర్లు, గొడవలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇతరులను అసౌకర్యానికి గురిచేసే వ్యక్తులను గుర్తించి బైండోవర్ చేయాలన్నారు. మహాశివరాత్రి సందర్భంగా ఆలయాల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. భక్తులు భారీగా హాజరయ్యే ఆలయాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పోలీసూ శిరస్త్రాణం ధరించి వాహనం నడపాలన్నారు. అదనపు ఎస్పీ వెంకటేశ్వరరావు, ఎస్‌బీ సీఐ రమణమూర్తి, సోషల్ మీడియా సీఐ శ్రీనివాసరావు, ఆర్ఐ నాయుడు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ప్రయాణికుడిగా పరిచయమై.. ఐపీఎస్‌గా నమ్మబలికి

● ఉద్యోగం ఇప్పిస్తానని రూ.1.50 లక్షల కాజేత

● బాధితుడి ఫిర్యాదుతో నిందితుడి అరెస్టు

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: దిల్లీ ఎన్ఐఏలో ఐపీఎస్ అధికారిగా పని చేస్తున్నా.. ఆదాయపు పన్ను శాఖలో డివిజనల్ అడ్వైజర్ ఉద్యోగాన్ని రీప్లేస్‌మెంట్ కోటాలో ఇప్పిస్తానని ఓ యువకుడిని నమ్మించి రూ.1.50 లక్షలు కాజేసిన నకిలీ ఐపీఎస్ అధికారి ఉదంతమిది. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లా అలిపిరి పోలీసులకు ఇదే తరహాలో మరో రెండు చోట్ల మోసాలకు పాల్పడినట్లు తెలిసింది. తెలంగాణ రాష్ట్రం సిద్దిపేటలో ఒకరి నుంచి రూ.2.50 లక్షలు, మాదాపూర్‌లో మరో యువకుడి నుంచి రూ.7 లక్షలు కాజేసినట్లు గుర్తించారు. నిందితుడిని అరెస్టు చేసి కేసు వివరాలను సీఐ రామ్‌కిషోర్ ఎస్ఐ నరసింహారావుతో కలసి బుధవారం వెల్లడించారు. 'ఏలూరుకు చెందిన వెంకటేశ్వరరావు ఐదేళ్ల కిందట గరుడ వారధి నిర్మాణ పనుల నిమిత్తం తిరుపతికి వచ్చారు. స్థానిక ఆటోనగర్‌లో ఉంటూ ప్రస్తుతం స్విమ్స్‌లో ఫార్మసిస్టుగా పని చేస్తున్నారు. సెలవు రోజుల్లో రాపిడో డ్రైవర్‌గా పనిచేస్తారు. రెండు నెలల కిందట రాపిడో రైడ్‌లో కె.సురేష్‌కుమార్ అలియాస్ సూర్య పరిచయమయ్యారు. దిల్లీ ఎన్ఐఏలో ఐపీఎస్ అధికారిగా తనను తాను పరిచయం చేసుకున్నారు. ఇటీవల పదోన్నతిపై హైదరాబాద్‌కు బదిలీ అయినట్లు చెప్పారు. ప్రస్తుతం సెలవులో శెట్టిపల్లిలోని పిన్నమ్మ ఇంటికి వచ్చానని తెలిపారు. హైదరాబాద్ ఆదాయపన్ను శాఖలోని ఉన్నతాధికారులు తనకు పరిచయం ఉన్నారని.. రీప్లేస్‌మెంట్ కోటాలో ఉద్యోగం ఇప్పిస్తానని రాపిడో డ్రైవర్‌ను నమ్మించారు. అతని నుంచి విడతల వారీగా పేటీఎం ద్వారా రూ.1.50 లక్షల నగదు బదిలీ చేయించుకున్నారు. అతని అనుమానాస్పద ప్రవర్తనను గుర్తించిన బాధితుడు నగదు తిరిగి ఇమ్మని కోరగా.. నువ్వు చేయగలిగింది చేసుకోమని బెదిరించడంతో అలిపిరి పోలీసులను ఆశ్రయించారు. దర్యాప్తులో ఒడిశాకు చెందిన సురేష్‌కుమార్ ఇదే తరహా మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్స్‌కు అలవాటు పడి అవసరమైన డబ్బు కోసం మోసాలకు పాల్పడుతున్నట్లు తెలుసుకున్నారు. బుధవారం అరెస్టు చేసి అతని నుంచి రూ.1.25 లక్షల విలువైన వాషింగ్ మిషన్, టీవీ, మ్యూజిక్ పరికరాలు స్వాధీనం చేసుకున్న'ట్లు సీఐ వివరించారు.

నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సీఐ రామ్‌కిషోర్

కాలువ గండి పూడ్చండి

శారదాపురం సమీపంలో వంశధార దేశబట్టి కాలువకు గత వరదల్లో గండి పడింది. దీంతో సిమెంటు రక్షణ గోడతో ఉన్న గట్టు సైతం కొట్టుకుపోయింది. ఇప్పటి వరకు గండి పూడ్చలేదు. గట్టు పటిష్ఠం చేయలేదు. దీంతో రక్షణ గోడ కూలిపోయే పరిస్థితి నెలకొంది. గండి పూడ్చడంతోపాటు గట్టు బాగు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వంశధార శాఖ జేఈ రాజశేఖర్ తెలిపారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

ఇటు నియంత్రిక.. అటు వాహనాల నిలుపుదల

పంజావీధిలో ఒకే చోట బ్యాంకు, రెండు సచివాలయాలు, ప్రాథమిక ఆదర్శపాఠశాల, వాణిజ్య సంస్థలున్నాయి. రోడ్డు అంచునే విద్యుత్తు నియంత్రిక ఉంది. ఆయా చోట్లకు వచ్చే వాహనదారులు రోడ్డుపైనే వాహనాలు నిలుపుతున్నారు. దీంతో మిగతా వాహనదారులు, బాటసారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. సమస్య పరిష్కారానికి పోలీసుల సహకారంతో చర్యలు తీసుకుంటామని కమిషనర్ రమేష్ తెలిపారు.

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ఒడిశా అదనంగా నీటి వాడకం

సీలేరు, న్యూస్‌టుడే: బలిమెల జలాశయం నిర్వహణ, నీటి వాడకంపై ఆంధ్రా, ఒడిశా అధికారులు బుధవారం సీలేరు జెన్‌కో అతిథిగృహంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం జలాశయంలో 65.65 టీఎంసీల నీరుండగా.. జోలాపుట్ జలాశయంలో 20.19 టీఎంసీలు ఉందని, మొత్తం 85.84 టీఎంసీలు నీరుందని పేర్కొన్నారు. రాబోయే నెలలో సుమారు 1 టీఎంసీ నీరు రెండు జలాశయాల్లోకి చేరే అవకాశముందని లెక్కగట్టారు. మొత్తం సుమారు 86.84 టీఎంసీల్లో ఒడిశా 28.48, ఏపీ జెన్‌కో 58.36 టీఎంసీలు వాడుకోవడానికి నిర్ణయించారు. జనవరి నెలలో ఏపీ 5.31 టీఎంసీలు, ఒడిశా 6.18 టీఎంసీలు వాడుకున్నట్లు లెక్కలు తేల్చారు. దీనిప్రకారం ఒడిశా అదనంగా 0.87 టీఎంసీలు నీటిని వాడుకున్నట్లు పేర్కొన్నారు. ఈ నీటి సంవత్సరంలో ఇప్పటివరకూ ఏపీ 28.39 టీఎంసీలు నీటిని వినియోగించుకోగా, ఒడిశా 58.28 టీఎంసీలు వినియోగించుకున్నట్లు తేల్చారు. ఒడిశా అదనంగా 29.88 టీఎంసీలను వాడుకుందని తెలిపారు. ప్రస్తుతానికి గ్రిడ్ డిమాండ్, విద్యుత్తు అవసరాల నిమిత్తం ఒడిశా 3,000, ఏపీ 6,500 క్యూసెక్కుల నీటిని బలిమెల జలాశయం నుంచి వాడుకోవడానికి నిర్ణయించారు. ఒడిశా జలవనరులశాఖ నుంచి ముఖ్యనిర్మాణ ఇంజినీరు తృపాకుమార్ పాత్రో, పర్యవేక్షక ఇంజినీర్లు సనోజ్ సాహూ, ఏఈఈ దిలీప్ కుమార్ దలాబెహరా, ఏఈ గదాధర్ ప్రధాన్, కృషణ్ చంద్రపాణి, ఒడిశా హైడ్రో పవర్ కార్పొరేషన్ తరపున డిప్యూటీ జనరల్ మేనేజర్ ఓం ప్రకాష్ నాయక్, డిప్యూటీ మేనేజర్ బెహరా, అసిస్టెంట్ మేనేజర్ సుబదీప్ పండా పాల్గొన్నారు. ఏపీ జెన్‌కో తరపున ఎస్ఈలు జాకీర్‌హుస్సేన్, సీహెచ్ హనుమా, డీఈఈ జయపాల్, ఏఈఈ చింతాటి సురేష్ తదితరులు హాజరయ్యారు.

భర్త మృతదేహానికి అంత్యక్రియలు

డోకులపాడుకు చెందిన పుక్కళ్ల రాఘవేంద్ర (39) కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధ పడుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. ఈయనకు ఓ కుమారుడు, ఓ కుమార్తె ఉన్నా ఇద్దరూ చిన్న పిల్లలు కావడంతో భార్య కుమారి అంత్యక్రియలు నిర్వహించారు. స్థానిక శ్మశానవాటికలో భర్త మృతదేహానికి మంగళవారం కుమారి చితిపెట్టారు.

– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

శ్రీముఖలింగం ఉత్సవాల పర్యవేక్షణకు కంట్రోల్ రూం

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: శ్రీముఖలింగంలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాల పర్యవేక్షణకు ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం శ్రీముఖలింగంలో ఉత్సవాల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల సమయంలో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించేలా కంట్రోల్ రూం కేంద్రంగా పని చేయాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు వారికి కేటాయించిన విభాగాల్లో నిరంతరం పర్యవేక్షిస్తుండాలని.. అత్యవసర పరిస్థితి తలెత్తినా, భక్తుల నుంచి ఫిర్యాదులు వచ్చినా వెంటనే స్పందించాలని స్పష్టం చేశారు.



(c) eenadu

ఈనాడు పల్నాడు
గురువారం ఫిబ్రవరి 12, 2026

ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో..

జిల్లా స్థాయి ప్రతిభాపాటవ పోటీలు రేపు

గుంటూరు: 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి పాఠశాల-కళాశాలల ప్రతిభా పాటవ పోటీలు శుక్రవారం జరగనున్నాయి. గుంటూరు జడ్పీ ఆవరణలోని శ్రీసత్యసాయి విద్యా విహార్‌లో ఉ.9 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని వివిధ కేంద్రాల్లో నాలుగు నెలలుగా 120 పాఠశాలలు, 23 కళాశాలల్లో వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాసం, క్విజ్ విభాగాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో పోటీలు జరిగాయి. ప్రాంతీయ స్థాయిలో 1,003 మంది విద్యార్థులు హాజరు కాగా.. 120 మంది బహుమతులు అందుకుని జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గుంటూరు నగరంలోని పలు కేంద్రాలతో పాటు తెనాలి, బాపట్ల, చీరాల, మాచర్ల, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, నరసరావుపేట, చిలకలూరిపేట తదితర ప్రాంతాల్లో పాఠశాల స్థాయిలో 120 మంది, 23 కళాశాలల నుంచి నాలుగు విభాగాల్లో ముగ్గురు వంతున 276 మంది విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఎంపికైన విద్యార్థులందరూ శుక్రవారం ఉదయం 9 గంటలకు శ్రీసత్యసాయి విద్యా విహార్‌కు చేరుకోవాలని నిర్వాహకులు సూచించారు.

కోటప్పకొండకు 115 ప్రత్యేక బస్సులు

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : త్రికోటేశ్వరస్వామి తిరునాళ్లకు వెళ్లే భక్తుల కోసం చిలకలూరిపేట డిపో నుంచి బస్సులను సిద్ధం చేస్తున్నట్లు డిపో మేనేజర్ వై. వేణు బుధవారం తెలిపారు. బస్సుల పరిస్థితిని పరిశీలించి మాట్లాడారు. డిపోలో ఉన్న 40 బస్సులతో పాటు ఇతర డిపోల నుంచి 75బస్సులు తెప్పించి మొత్తం 115 భక్తుల కోసం ఏర్పాటు చేస్తున్నామన్నారు. తిరునాళ్ల కోసం 650 మంది సిబ్బంది పని చేయనున్నారని, చిలకలూరిపేట నుంచి పురుషోత్తమపట్నం, మద్దిరాల, యడవల్లి, యూటీ మీదుగా కోటప్పకొండకు వెళ్లేలా రూట్‌మ్యాప్ సిద్ధం చేశామన్నారు. తిరుగు ప్రయాణంలో కోటప్పకొండ, యూటీ మీదుగా కట్టుబడివారిపాలెం, కమ్మవారిపాలెం జంక్షన్, జాతీయ రహదారి మీదుగా ఎన్నార్టీ సెంటర్‌కు చేరుకుంటాయన్నారు. బస్సు టిక్కెట్ పెద్దలు రూ.30, చిన్నారులకు రూ.15, మహిళలు స్త్రీశక్తి పథకం ద్వారా ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపారు. ఈనెల 13 నుంచి 15 వరకు ప్రత్యేక బస్సులు తిరుగుతాయని తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా గతేడాది ఆర్టీసీకి రూ.17.24లక్షల ఆదాయం వచ్చిందని, ఈ ఏడాది పెరిగే అవకాశం ఉందన్నారు.

ప్రశాంతంగా కోటయ్యను దర్శించుకునేలా..

❖ పకడ్బందీగా మహాశివరాత్రి ఏర్పాట్లు ❖ కోటప్పకొండ ఆలయ ఈవో దాసరి చంద్రశేఖర్‌రావు

ఈనాడు, నరసరావుపేట

శివరాత్రికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా, త్వరగా దర్శనాలు అయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి ఆలయ ఈవో దాసరి చంద్రశేఖర్‌రావు తెలిపారు. తిరునాళ్లు సమీపిస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లపై ఆయన 'ఈనాడు' ముఖాముఖిలో మాట్లాడారు. ఆ వివరాలు..

దర్శనాలు సులువుగా అయ్యేలా.. శివాలయాల్లో రద్దీ వల్ల తోపులాటలు చోటుచేసుకోకుండా ఈసారి ముందస్తుగానే దర్శనాలు ప్రారంభిస్తున్నాం. శివరాత్రి పురస్కరించుకుని ముందురోజు రాత్రి ఒంటిగంట నుంచే త్రికోటేశ్వర స్వామి దర్శనాలు మొదలవుతాయి. భక్తులు వచ్చిన వారిని వచ్చినట్లు పంపుతాం. ఎక్కడా రద్దీ లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. అదనంగా క్యూలైన్లు కూడా ఏర్పాటు చేశాం. వీఐపీ దర్శన టికెట్లు టైమ్ స్లాట్‌ల ప్రకారం ఇస్తున్నాం. ఆ సమయంలోనే వారు రావాలి. ముందుగా వస్తే దర్శనం ఉండదు. ప్రోటోకాల్ దర్శనాలు ఉదయం 8:30 గంటల నుంచి 10 వరకు మళ్లీ మధ్యాహ్నం 2:30 గంటల నుంచి 4 వరకు ఉంటాయి.

భక్తులకు సేవల్లో లోపం లేకుండా..

2 లక్షల తాగునీటి సీసాలు పంపిణీకి సిద్ధం చేశాం. గతంలో ప్యాకెట్లు ఇచ్చేవారు. ఈసారి అరలీటరు సీసాలు పంపిణీ చేయనున్నాం. 75 వేల మజ్జిగ ప్యాకెట్లు, 75 వేల బిస్కట్ ప్యాకెట్లు, చిన్నపిల్లలకు వేడిపాలు సరఫరా చేస్తాం. 600 మంది వాలంటీర్లు సేవలు అందించడానికి ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకున్నారు. వీరితో పాటు ఎన్‌సీసీ, స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులు కూడా భక్తులకు ఉచితంగా సేవలందిస్తారు. కొండపైన 64 సీసీ కెమెరాలున్నాయి. ఇవి కాకుండా, అదనంగా 100 సీసీ కెమెరాలతో పర్యవేక్షణ చేపడుతున్నాం.

క్యూల రద్దీ నియంత్రణకు..

ఇదివరకు ఎప్పుడూ రాత్రి పూట పట్టువస్త్రాల సమర్పణ ఉండేది. ఈసారి సాయంత్రం 3 నుంచి 4 గంటల మధ్యలోనే స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించేలా ఏర్పాట్లు ఉంటాయి. భక్తులకు అసౌకర్యం లేకుండా క్యూలు ఆగకుండా త్వరగా స్వామి దర్శనం పూర్తయ్యేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. క్యూల వద్ద రద్దీ లేకుండా ఎక్కడికక్కడ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నాం. ఘాట్ రోడ్డులోనూ ట్రాఫిక్ ఆగకుండా ఆయా విభాగాలను అప్రమత్తం చేస్తున్నాం.

సరిపడా ప్రసాదాలు

దర్శనం చేసుకునే ప్రతి భక్తుడికి ఉచిత ప్రసాదం 20 గ్రాముల లడ్డూ అందజేస్తాం. ఇవి లక్షన్నర సిద్ధం చేస్తున్నాం. స్వామివారి ప్రసాదమైన నేతి అరిసెలు లక్ష, లడ్డూలు సుమారు రెండు లక్షలు అందుబాటులో ఉంచుతున్నాం. వీటికోసం పది కౌంటర్లు ఏర్పాటు చేశాం. నిరుడు 1.25 లక్షల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఈ సారి 1.50 లక్షల మంది వచ్చే అవకాశం ఉంది. అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నాం.

పార్కింగ్‌లో నిలిపేలా..

కార్లు, ద్విచక్ర వాహనాలకు కొండపైకి అనుమతి లేదు. కొండ కింది బాగాన వాహనాలు నిలుపుకోవడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. ఆ ప్రాంతంలోనే వాహనాలు నిలిపి ఉంచాలి. కొండపైకి భక్తులు బస్సుల్లోనే రావాలి. సొంత వాహనాలను అనుమతించం. పారిశుద్ధ్యం వంటి సమస్య తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. 80 వరకు బయో టాయిలెట్స్ సిద్ధం చేశాం. కేవలం కొండపైనే శానిటేషన్‌కు 200 మందిని నియమించాం. మున్సిపాల్టీల నుంచి కూడా కొందరు షిఫ్టుల వారీగా విధులు నిర్వహిస్తారు.

కొత్తవి రావు.. ఉన్నవి చాలవు

మహిళలకు ఉచిత ప్రయాణ పథకం 'స్త్రీశక్తి' ఉద్దేశాన్ని కొందరు ఆర్టీసీ సిబ్బంది దెబ్బతీస్తున్నారు. స్టాపుల్లో బస్సులు ఆపకుండా వెళుతున్నారు. దీనివల్ల అత్యవసర పరిస్థితుల్లో బస్సుల కోసం ఎదురు చూసే వారికి నిరాశే ఎదురవుతోంది. రద్దీ దృష్ట్యా బస్సు మొదలైన నుంచి కొన్ని స్టాపుల్లోనే ప్రయాణికులు ఎక్కే పరిస్థితి. మధ్యలో కొన్ని గ్రామాల్లో ఆగడం కష్టంగా ఉంటోంది. తమకోసం తీసుకొచ్చిన పథకాన్ని సద్వినియోగం చేసుకోలేకపోతున్నామని మహిళలు వాపోతున్నారు.

కొన్ని స్టాపుల్లో ఆపకుండా వెళుతున్న డ్రైవర్లు

ఈనాడు, నరసరావుపేట

నరసరావుపేట బస్టాండ్‌లో..

నరసరావుపేట-మాచర్ల మార్గంలో ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సులన్నీ ప్రయాణికులతో కిటకిటలాడుతూ నడుస్తుంటాయి. స్కూళ్లు, కాలేజీ విద్యార్థులకు తోడు మహిళలు పెరగడంతో బస్సులు కిక్కిరిసి నడుస్తున్నాయి. నరసరావుపేటలో మొదలైతే కారంపూడి వరకు రద్దీ ఉంటోంది. మధ్యలో సరిగా ఆపడం లేదు. మళ్లీ కారంపూడి నుంచి మాచర్ల మార్గంలో ఎక్కేవారే ఉంటున్నారు కానీ దిగేవారు ఉండటం లేదు. దుర్గి, అడిగొప్పుల గ్రామాల్లో బస్సులు ఆగడం లేదు. ✦ గుంటూరు-మాచర్ల మార్గంలో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో కూడా ఖాళీ ఉండటం లేదు. మాచర్ల, గురజాల, రెంటచింతల్లో చాలామంది ఉపాధ్యాయులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు గుంటూరు నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. వీరంతా బస్సులు ఎక్కలేకపోతున్నారు.

జిల్లాలో మొత్తం బస్సులు: 432
అదనంగా కావాల్సినవి: 60
రద్దీ మార్గాలు: నరసరావుపేట-మాచర్ల, నరసరావుపేట-చీరాల, వినుకొండ-గుంటూరు

✦ వినుకొండ నుంచి గుంటూరు వెళ్లే ప్రతి బస్సు వినుకొండలోనే నిండుతోంది. ఎక్స్‌ప్రెస్ బస్సులకు శావల్యాపురం, సంతమాగులూరు అడ్డరోడ్డు, నరసరావుపేట, ఫిరంగిపురం, పేరేచర్లలో స్టాప్‌లున్నాయి. కానీ బస్సులు మధ్యలో ఎక్కడా ఆగలేని పరిస్థితి. చిలకలూరిపేట మార్గంలో కేశానుపల్లిలో రెండు కళాశాలలున్నాయి. వీటికి వెళ్లే విద్యార్థులకు తోడు మహిళలతో నిండిపోతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో వేలాడుతూ వెళుతున్నారు.

✦ చాలా గ్రామాల్లో బస్సులు ఆపకపోవడంతో ప్రయాణికులు నిట్టూర్చుతున్నారు. రావిపాడు చెక్‌పోస్టు వద్ద బస్సులు ఆపకపోవడంతో డిగ్రీ, ఇంటర్ కాలేజీ విద్యార్థులు వేగనియంత్రికల వద్ద బస్సులు స్లో అవుతున్న సమయంలో రన్నింగ్‌లో ప్రమాదకరంగా పరుగులు పెడుతూ ఎక్కుతున్నారు. ఇక్కడ గంటల కొద్దీ బస్సుల కోసం పడిగాపులు తప్పడం లేదు. మాచర్ల, పిడుగురాళ్ల నుంచి వచ్చే ప్రతి బస్సు రద్దీగా ఉంటోంది. బస్సులు ఆగకపోవడంపై డీపీటీవో అజితకుమారి మాట్లాడుతూ జిల్లాలో ఇదివరకే అన్ని మార్గాల్లో 80 శాతం ఆక్యుపెన్సీతో బస్సులు నడిచాయి. ఇప్పుడు వంద నుంచి 120కు చేరింది. అన్నిచోట్లా ఆపాలని డ్రైవర్లకు సూచించాం. ఆపకపోతే ప్రయాణికులు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

పేద విద్యార్థులకు ఉచిత విద్య

న్యూస్‌టుడే, సత్తెనపల్లి

ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు

ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో పైసా ఖర్చు లేకుండా ఉచిత విద్య అభ్యసించే అవకాశాన్ని నిరుపేద విద్యార్థులకు కూటమి ప్రభుత్వం కల్పిస్తోంది. విద్యా హక్కు చట్టం-2009 అనుసరించి ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు పేదలకు కేటాయిస్తున్నారు. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాల నోటిఫికేషన్ విడుదలైంది.

❖ లాటరీ ద్వారా విద్యార్థుల్ని ఎంపిక చేయనున్నారు. అనాథలు, హెచ్ఐవీ బాధిత చిన్నారులకు 5, ఎస్సీలకు 10, ఎస్టీలకు 4, బీసీ, మైనార్టీ, ఇతరులకు 6 శాతం సీట్లు కేటాయిస్తారు.

❖ ఐబీ, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ పాఠశాలల్లో ప్రవేశాలకు 2020 ఏప్రిల్ 2 నుంచి 2021 మార్చి 31వ తేదీలోపు జన్మించి ఉండాలి. స్టేట్ సిలబస్ పాఠశాలల్లో ప్రవేశాలకు 2020 జూన్ 2 నుంచి 2021 మే 31వ తేదీ మధ్య జన్మించిన వారు అర్హులు.

❖ చిరునామా ధ్రువీకరణకు ఆధార్, ఓటరు ఐడీ, రేషన్ కార్డు, ఉపాధి హామీ జాబ్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్సుల్లో ఏదో ఒకటి సమర్పించవచ్చు. వయస్సు ధ్రువీకరణకు జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. గ్రామ, వార్డు సచివాలయాలు, విద్యా వనరుల కేంద్రాలు, పాఠశాలల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయవచ్చు.

❖ పోర్టల్‌లో ప్రైవేట్ పాఠశాలల నమోదు ప్రక్రియను ఈ నెల 16వ తేదీలోపు పూర్తి చేయనున్నారు. ఈ నెల 20 నుంచి మార్చి 10వ తేదీ వరకు విద్యార్థుల నమోదు ప్రక్రియ చేపడతారు. అర్హత నిర్ధారణ మార్చి 17న జరుగుతుంది. మొదటి విడత లాటరీ మార్చి 25, రెండో విడత లాటరీ ఏప్రిల్ 12న నిర్వహిస్తారు.

❖ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశానికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో రామారావు సూచించారు.

జిల్లాలో 25 శాతం సీట్లకు అందుబాటులోని ప్రైవేట్ పాఠశాలలు: 369

విద్యా సంవత్సరం	ప్రవేశం పొందిన విద్యార్థులు
2022–23	83
2023–24	344
2024–25	573
2025–26	506

పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రి గొట్టిపాటి

ఈనాడు, నరసరావుపేట: మహా శివరాత్రి పురస్కరించుకుని కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామికి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. ఈనెల 12 నుంచి 15 వరకు కోటప్పకొండపై శివరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. తిరునాళ్ల రోజు ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా ఉంది.

స్వచ్ఛ భారత్ మిషన్‌పై శిక్షణ

గుంటూరు: ఉమ్మడి గుంటూరు జిల్లాలో స్వచ్ఛ భారత్ మిషన్‌లో ప్రభుత్వం నిర్ణయించిన స్వచ్ఛత కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించేలా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగులకు శిక్షణ తరగతులు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించారు. గుంటూరులోని జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో గురువారం నుంచి రెండు రోజుల శిక్షణ తరగతులు ప్రారంభించనున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన 57 మండలాల ఎంపీడీవోలు, డీఎల్‌పీవోలు, డీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు హాజరు కావాలని జడ్పీ సీఈవో జ్యోతిబసు ఉత్తర్వులు జారీ చేశారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో నిర్మించిన వ్యక్తిగత కుటుంబ మరుగుదొడ్ల (ఐహెచ్‌హెచ్‌ఎల్)ను వినియోగించడం ద్వారా 100 శాతం బహిరంగ మల విసర్జన రహితంగా చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లా స్థాయిలో డీపీఆర్సీ ద్వారా శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు.

సాఫ్ట్‌గా ఆడేస్తూ.. పతకాలు సాధిస్తూ..

జాతీయ స్థాయిలో మాచర్ల విద్యార్థి ప్రతిభ

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: సాఫ్ట్‌బాల్ పోటీల్లో మాచర్లకు చెందిన విద్యార్థి మత్తే భోపేంద్ర కుమార్ సత్తా చాటుతున్నాడు. ఇప్పటికే మూడుసార్లు జాతీయ స్థాయిలో పాల్గొని ఔరా అనిపించాడు. నిత్య సాధన, అకుంఠిత దీక్ష, క్రీడపై ఆసక్తితోనే తానీ ఘనత సాధించినట్లు తెలిపాడు. సెయింట్ ఆన్స్ బాలుర పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఇతడి తండ్రి సంతోష్‌కుమార్ అదే పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు. తండ్రి ఆశయం మేరకు సాఫ్ట్‌బాల్ క్రీడపై మక్కువ పెంచుకుని నిత్యం సాధన చేస్తున్నాడు. సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ద్వారా ఏటా నిర్వహించే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. 2023-24లో ఛత్తీస్‌గఢ్‌లోని కబీర్ ధ్యాంలో నిర్వహించిన జాతీయ పోటీల్లో తొలిసారి పాల్గొన్నాడు. ఆ తర్వాత 2024-25లో మహారాష్ట్ర, తాజాగా ఈనెల 4 నుంచి 8 వరకు ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన జాతీయ పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున ఆడి, పతకాలు సాధించాడు. ఐపీఎస్ కావాలన్నదే తన లక్ష్యమని భోపేంద్ర కుమార్ చెబుతున్నాడు.

రైతేరాజు

లైన్ ఆకు సాగు.. లాభాలు బాగు

మిరప కోతల్లో జాగ్రత్తలు పాటిద్దాం

6లో

ప్రధాన ప్రాంతాల్లో డ్రోన్లతో పర్యవేక్షణ

మల్లమ్మసెంటర్ (నరసరావుపేట): ప్రశాంతమైన వాతావరణంలో భక్తులు త్రికోటేశ్వరస్వామిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేయాలని, ప్రధాన ప్రాంతాల్లో డ్రోన్లతో పర్యవేక్షణ ఉండాలని ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి పోలీసులకు సూచించారు. బుధవారం గుంటూరులో కోటప్పకొండ తిరునాళ్లపై ఐజీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తులకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని, ఎక్కడంటే అక్కడ వాహనాలు నిలపకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాహనాల పార్కింగ్, దేవుని దర్శనం వద్ద జనసందోహం స్తంభించకుండా చర్యలు తీసుకోవాలని, సమన్వయంతో తిరునాళ్లను విజయవంతం చేయాలని చెప్పారు. ప్రతి ఒక్కరికి కమ్యూనికేషన్ సెట్లు అందజేస్తామని, ఎక్కడ ఏ సమస్య తలెత్తినా వెంటనే సెక్టార్ ఇన్‌ఛార్జులకు తెలియజేసి వెంటనే పరిష్కారమయ్యేలా చూడాలని తెలిపారు. అనంతరం తిరునాళ్ల రూట్ మ్యాప్‌ను ఐజీకి ఎస్పీ కృష్ణారావు వివరించారు.

ఐజీకి తిరునాళ్ల రూట్‌మ్యాప్‌ను వివరిస్తున్న ఎస్పీ కృష్ణారావు

52.11 టీఎంసీలు లెక్కల్లోంచి మినహాయించండి

ఈనాడు, అమరావతి

కృష్ణా బోర్డుకు జలవనరులశాఖ లేఖ

కృష్ణా నదికి వరదలు వచ్చినప్పుడు కాలువలకు విడుదల చేసే నీటి పరిమాణంపై మినహాయింపు ఇవ్వాలని జలవనరులశాఖ... కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)కు లేఖ రాసింది. గతేడాది జూరాల నుంచి దిగువన ప్రకాశం బ్యారేజి వరకు ప్రాజెక్టులన్నీ నిండిపోయి గేట్లు ఎత్తి నీటిని వదిలినప్పుడు సముద్రంలోకి వదిలేశారు. ఆ సమయంలో పంటలకు అవసరం లేకపోయినా కాలువల ద్వారా మళ్లించి చెరువులు, పంటకుంటలు, వాగుల్లోకి మళ్లించారు. ఇలా చేయకపోయి ఉంటే విలువైన జలం వృథాగా సముద్రంలో కలిసిపోయేది. దీనిని దృష్టిలో ఉంచుకుని వరదల సమయంలో కాలువలకు విడుదల చేసిన నీటి పరిమాణాన్ని లెక్కల నుంచి మినహాయించాలని జలవనరులశాఖ కోరుతోంది. ఇప్పటివరకు నాగార్జునసాగర్ నుంచి కుడి, ఎడమ కాలువల కింద ఏపీ వాడుకున్న నీటి పరిమాణంలో తగ్గించి చూపాలని విన్నవిస్తోంది.

అన్ని ప్రాజెక్టుల్లో వరద కొనసాగుతుంటేనే... కృష్ణా నదిపై రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ప్రాజెక్టులు, జలాశయాలు, బ్యారేజీలు అన్నీ నిండి నీరు వృథాగా సముద్రంలోకి వెళ్తున్న సమయంలో కాలువలకు తీసుకున్న నీటిని లెక్కలోకి తీసుకుంటారు. గతేడాది భారీగా వరద నీరు రావడంతో జులైలోనే ప్రాజెక్టులన్నీ నిండిపోయాయి. జులై నుంచి అక్టోబరు వరకు ఆరు విడతల్లో అన్ని ప్రాజెక్టుల గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ఈ సమయంలో నాగార్జునసాగర్ కుడికాలువ కింద 42.701 టీఎంసీలు, సాగర్ ఎడమ కాలువ కింద ఏపీ పరిధిలో 9.41 టీఎంసీలు వాడుకున్నట్లు జలవనరులశాఖ లెక్క తేల్చింది. ఇలా వాడుకున్న 52.111 టీఎంసీలను మినహాయించాలని కోరింది.

175.48 టీఎంసీల వినియోగం

ఫిబ్రవరి 10 వరకు నాగార్జునసాగర్ కుడి, ఎడమ కాలువల పరిధిలో ఏపీ 175.486 టీఎంసీల నీటిని వాడుకుంది. ఇందులో కుడి కాలువ ద్వారా 148.739 టీఎంసీలు, ఎడమ కాలువ ద్వారా ఏపీ పరిధిలో 26.747 టీఎంసీలు ఉన్నాయి. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో నీటి లభ్యత ఉండడంతో రబీ సీజన్‌లోనూ మెట్ట పంటలకు సాగు నీరందిస్తున్నారు. గతేడాది కృష్ణా పరివాహక ప్రాంతంలో భారీ వర్షాలు కురవడంతో సకాలంలో ప్రాజెక్టుల్లోకి నీరొచ్చింది. ఫలితంగా గతేడాది జులైలోనే కాలువలకు సాగునీటిని విడుదల చేశారు. కుడికాలువ కింద తొలిపంట వరి సాగు చేసిన రైతుల్లో కొందరు రబీలో రెండో పంట కూడా వేశారు. ఖరీఫ్‌లో వరి సాగు చేయని రైతులు రబీలో మొక్కజొన్న వేశారు. ఫలితంగా సాగు విస్తీర్ణం అనూహ్యంగా పెరిగింది. మరోవైపు ఎడమకాలువ కింద తెలంగాణ నుంచి ఏపీలోకి సాగు నీరు రావాల్సి ఉండడంతో ఆయకట్టు చివరి భూములకు నీరందని పరిస్థితి నెలకొంది.

ఏపీఆర్‌జేసీలో గొడవపై ఆరా

విజయపురిసౌత్: నాగార్జునసాగర్‌లోని ఏపీ ఆర్‌జే కళాశాలలో సోమవారం రాత్రి విద్యార్థుల గొడవపై కలెక్టర్ కృతికా శుక్లా ఆరా తీశారు. కలెక్టర్ ఆదేశాలతో బుధవారం గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, మాచర్ల తహసీల్దారు కిరణ్‌కుమార్ తదితరులు కళాశాలను సందర్శించారు. విద్యార్థులు, అధ్యాపకుల నుంచి వివరాలు సేకరించారు. అలాగే ఏపీఆర్ఈఐఎస్ సొసైటీ ఆర్టీఎస్ రఘునాథ్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించి విచారణ చేపట్టారు. ప్రిన్సిపల్ సరోజిని, అధ్యాపకులు, సిబ్బందితో పలు విషయాలపై చర్చించారు. విద్యార్థుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హెచ్చరించారు. అనంతరం గాయాలపాలైన విద్యార్థులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ వీడ్కోలు వేడుకలో జరిగిన చిన్న వివాదం విద్యార్థుల మధ్య ఘర్షణకు దారితీసిందన్నారు. ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమన్నారు. భవిష్యత్తులో పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

రుణం.. ఎగనామం

✦ నిద్ర మత్తులో డీసీసీబీ
✦ రూ.20 కోట్లకుపైగా పేరుకున్న బకాయిలు

ఈనాడు, అమరావతి, పిడుగురాళ్ల

శీతల గోదాముల్లో మిర్చి నిల్వ చేసి.. కేంద్ర సహకార బ్యాంకు పరిధిలోని గురజాల, నల్లపాడు శాఖల్లో తీసుకున్న రుణ బకాయిల వసూళ్లలో ముందడుగు కానరావడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా రుణాలిచ్చిన బ్యాంకు అధికారులపై చర్యలు తీసుకున్న యంత్రాంగం బాధ్యులైన రుణగ్రహీతలపై చర్యలకు వెనకడుగు వేస్తోంది. దాదాపు రూ.20 కోట్లకుపైగా బకాయి పేరుకుపోయింది.

గురజాల శాఖలో... ఇక్కడి శీతల గోదాము యజమాని రైతులు మిర్చి నిల్వ చేసినట్టు చూపించి వారి పేరుతో రుణం తీసుకున్నారు. వైకాపా హయాంలో బ్యాంకు పాలకవర్గంలో కీలకంగా వ్యవహరించిన నేత అప్పటి ఉద్యోగులపై ఒత్తిడి తెచ్చి ఈ రుణం మంజూరు చేయించారు. ఏడాదిలోగా రికవరీ కాకపోవడంతో బ్యాంకు అధికారులు తనిఖీ చేసినప్పుడు అసలు గుట్టు బయటపడింది. గోదాము యజమాని మిర్చిని సైతం అమ్మేసుకున్నట్టు తేలింది. రైతులను విచారించగా.. రుణం తీసుకున్న విషయమే తెలియదని స్టేట్‌మెంట్లు ఇచ్చారు. బ్యాంకు అధికారులు ఇప్పటికీ ఒక్క రూపాయి కూడా వసూలు చేయలేకపోయారు.

✤ ఇప్పటికే క్రిమినల్ కేసులు నమోదైనందున పోలీసులు విచారణ చేస్తే బాధ్యులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

నల్లపాడు శాఖలో.... శీతల గోదాముల్లో మిర్చి నిల్వ చేసినవారి పేరిట వైకాపా నేతల ఒత్తిడితో నిబంధనలకు విరుద్ధంగా రూ.70 కోట్లకుపైగా ప్లెడ్జ్ రుణాలిచ్చారు. ప్రారంభంలో రికవరీ బాగానే ఉన్నా.. కొన్నాళ్లకు చెల్లింపులు ఆగిపోయాయి. శీతల గోదాముల్లో మిర్చిని పరిశీలించకుండానే పరిమితికి మించి రుణాలిచ్చినట్టు తరువాత వెలుగులోకొచ్చింది.

అయినా.. బ్యాంకు అధికారులు నిర్మాణాత్మక చర్యలు తీసుకోలేదు. 51విచారణలో.. రాఘవేంద్ర, విశ్వసాయి గోదాముల్లో మిర్చి తనఖా పెట్టి తీసుకున్న రూ.13.15 కోట్ల బాకాయి తీర్చలేదని గుర్తించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో అడుగు ముందుకు పడడం లేదు. రైతుల పేరుతో రుణాలు కొల్లగొట్టిన వారు మాత్రం బయట దర్జాగా తిరుగుతున్నారు. సాంకేతికంగా రైతుల పేరుతో రుణం మంజూరైనందున ఇటీవల ఒక శీతల గోదాము యజమాని కొంత సొమ్ము చెల్లించారు. ఇంకా రూ.9 కోట్లకుపైగానే వసూలు కావాల్సి ఉంది.

అన్నదాతకు గుర్తింపు.. పథకాలన్నీ వర్తింపు

రొంపిచర్ల, నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య జారీకి చర్యలు ముమ్మరమయ్యాయి. ఈ యూనిక్ ఐడీ ఆధారంగానే ప్రభుత్వ పథకాలన్నీ వర్తించనున్నాయి. గత ఏడాది నుంచి ఫార్మర్ రిజిస్ట్రీ ప్రారంభించినా తాజాగా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశాలొచ్చాయి. రైతులకు ఏఏ ప్రాంతాల్లో ఎన్ని సర్వే నంబర్లలో భూములు ఉన్నా.. వాటన్నింటికీ ఒకే విశిష్ట సంఖ్య జారీ చేయనున్నారు. వ్యవసాయశాఖ, రైతు సేవా కేంద్రాల సిబ్బంది అంతా ఇప్పుడీ పనుల్లో నిమగ్నమయ్యారు.

జిల్లాలో 2,91130 మంది రైతులకు ఈ రిజిస్ట్రేషన్లు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకూ 2,28,975 మందికి పూర్తి చేశారు. బ్యాంకు రుణాలు పొందేందుకు తప్పనిసరి చేయనున్నారు. పంట ఉత్పత్తుల క్రయ విక్రయాలు, రాయితీలు, బీమా వర్తింపునకు ఈ సంఖ్యనే ప్రమాణికంగా తీసుకుంటారు. అన్ని ఆర్ఎస్‌కేల్లో వ్యవసాయ సహాయకులు రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. పాసుపుస్తకం లేదా భూమి హక్కుపత్రం, ఆధార్ కార్డు నంబరు, ఆధార్‌తో అనుసంధానమైన చరవాణి తీసుకెళ్తే సరిపోతుంది. నమోదైన వెంటనే చరవాణికి 11 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య వస్తుంది. ఈ సంఖ్యతో మీ-సేవా కేంద్రాల్లో స్మార్ట్ కార్డు డౌన్‌లోడు చేయించుకోవచ్చు. జిల్లాలో ఇంకా 62,155 వేల మంది రైతుల నమోదు చేయనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి జగ్గారావు చెప్పారు. సాగు భూమి ఉన్న ప్రతి రైతు వివరాలు నమోదు చేసి 11 అంకెల విశిష్ట సంఖ్యను పొందాలన్నారు. పీఎం కిసాన్ తోపాటు భవిష్యత్తులో పథకాలన్నీ ఈ నంబరు ఆధారంగానే అందనున్నాయని తెలిపారు. రైతులకు అవగాహన కల్పించి నూరుశాతం నమోదు జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

వివరాలు నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

మండలాలవారీగా నమోదు ఇలా..

నరసరావుపేట రెవెన్యూ డివిజన్ పరిధిలో నరసరావుపేట మండలంలో 14,110 మందికి 9,749, రొంపిచర్ల 12,719 మందికి 10,081, వినుకొండ 11,484 మందికి 8,654, శావల్యాపురం 9,123 మందికి 7,253, ఈపూరు11015 మందికి 8,642, బొల్లాపల్లి 11,001 మందికి 9,872, నూజండ్ల 11,470 మందికి 9,803, చిలకలూరిపేట 9,584 మందికి 7,734, నాదెండ్ల 10015 మందికి 7,735, యడ్లపాడు 7,268 మందికి 5,967 నమోదు చేశారు.

పసుపు మిర్చి... లాభాలు తెచ్చి..

సాగుకు రైతుల ఆసక్తి

న్యూస్‌టుడే, గుంటూరు

ఉమ్మడి జిల్లాలో సాధారణంగా ఎర్ర మిరప సాగు ఎక్కువ. గత కొన్నేళ్లుగా నల్లతామర, బొబ్బర తెగులు, చీడపీడల సమస్యల కారణంగా పంటలు దెబ్బతింటున్నాయి. ఫలితంగా ఏటా నష్టపోవాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రయోగాత్మకంగా ఈ ఏడాది మేడికొండూరు, పెదకాకాని, పల్నాడు జిల్లా గురజాల, మాచవరం మండలాల్లో పసుపు రంగు మిర్చి సాగు చేస్తున్నారు. ఒక్క మేడికొండూరు మండల పరిధిలోనే సుమారు 400 ఎకరాల్లో ఈ రకం మిరప సాగవుతోంది.

కారణాలివీ.. ❖ ఈ రకం మిర్చి తామర పురుగుతో పాటు, బొబ్బర తెగులు వివిధ రకాల వైరస్‌లు తట్టుకునే గుణం ఎక్కువగా కలిగి ఉంటుంది.

❖ మందపాడులో కొంతమంది రైతులు మూడేళ్ల కిందట ప్రయోగాత్మకంగా సాగు చేశారు. దిగుబడి ఆశాజనకంగా ఉండటం, అప్పట్లో ఒక్కో క్వింటా ధర రూ.50 వేల నుంచి రూ.60 వేలదాకా పలకడంతో లాభదాయకంగా మారింది.



❖ ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా. ప్రస్తుతం క్వింటా రూ.35 వేల నుంచి రూ.40 వేల దాకా ధర పలుకుతోంది.

❖ గత రెండేళ్లుగా ఎర్ర మిర్చి సాగు చేసిన రైతులు వివిధ కారణాలతో నష్టపోయారు. దీంతో మరోసారి పసుపు రంగు మిర్చి సాగుకు మొగ్గు చూపారు.

❖ ఒక్క మందపాడులో గ్రామంలోనే 200 ఎకరాల్లో సాగులో ఉంది.

బొబ్బర తెగులు రాలేదు..

మూడెకరాల్లో పసుపు రంగు మిర్చి సాగు చేశాం. ఇప్పటి వరకు బొబ్బర తెగులు రాలేదు. ఒక్కో ఎకరాకు సుమారు రూ.2 లక్షలు ఖర్చయింది. వాతావరణం అనుకూలిస్తే సుమారు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల దాకా లాభం వచ్చే అవకాశం ఉంది.

- వెంకటేశ్వరావు, మందపాడు

ఔషధ గుణాలు పుష్కలం

పసుపు రంగు మిర్చిలో ఔషధ గుణాలు ఎక్కువ.. తెగుళ్ల బెడద తక్కువ. అంతర్జాతీయ మార్కెట్లోనూ మంచి డిమాండ్ ఉంది. అన్ని జాగ్రత్తలు పాటిస్తే ఎకరాకు సగటున 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

- లక్ష్మీ, ఏవో, మేడికొండూరు

(c) eenadu

కాలువలో పంపు.. నీరెలా పట్టుకోవాలో చెప్పు!

వేసవి సమీపిస్తోంది. ఏటా పట్టణంలో వేసవిలో పలు ప్రాంతాల్లో నీటి ఎద్దడి తలెత్తి ప్రజలు అల్లాడుతుంటారు. ఆ సమయంలో ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చేతి పంపులే వారికి ఆధారం. అధికారుల అలసత్వంతో పలు చేతిపంపులు నిరుపయోగంగా మారాయి. జిల్లా కేంద్రం నరసరావుపేటలో శిశు మందిరం ఎదుట రెండో వీధిలో ఓ చేతిపంపు సుమారు అయిదేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. తర్వాత మురుగు కాలువల నిర్మాణ సమయంలో చేతిపంపును మార్చే విషయం పట్టించుకోకుండా గుత్తేదారు పని పూర్తి చేశారు. అప్పటి నుండి పంపు దగ్గర బిందె పెట్టి నీరెలా పట్టుకోవాలో తెలియక స్థానికులు తలలుపట్టుకుంటున్నారు. ఇదే ప్రాంతంలో మరో చోట బోరు వేస్తే వేసవిలో ఉపయుక్తంగా ఉంటుందని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ ఏఈ జ్యోతి దృష్టికి తీసుకెళ్లగా ఆ ప్రాంతాన్ని పరిశీలించి సమస్య పరిష్కరిస్తామన్నారు.

- న్యూస్‌టుడే, మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట)

అధికారుల నిర్లక్ష్యంతో తాగునీటి కష్టాలు

మరమ్మతులకు గురైన మోటార్లు

అమరావతి, న్యూస్‌టుడే: వైకుంఠపురం పైలట్ ప్రాజెక్టులోని మోటార్లు మరమ్మతులకు గురయ్యాయి. కొన్ని రోజులుగా అమరావతి, లింగాపురం, ధరణికోట, నరకుళ్లపాడు గ్రామాలకు నీటి సరఫరా ఆగింది. పంప్‌హౌస్‌లో రెండు మోటార్లు ఉన్నాయి. ఒకటి పనిచేయకపోతే రెండో దాని ద్వారా నీటి సరఫరా చేస్తారు. ప్రత్యామ్నాయంగా ఉన్న మోటారు రెండేళ్ల కిందటే మరమ్మతులకు గురైనా అధికారులు పట్టించుకోలేదు. ప్రస్తుతం మరో మోటారు పనిచేయడం లేదు. వాటి మరమ్మతుకు అవసరమైన సామగ్రి అందుబాటులో లేదని తెలుస్తోంది. అమరావతికి మాత్రం ప్రత్యామ్నాయ మార్గంలో బుధవారం నీటిని సరఫరా చేశారు. మిగిలిన మూడు గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే మోటార్లకు మరమ్మతులు చేయించి, నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రత్నబాబు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో బహుళ ప్రయోజనాలు

వ్యవసాయక్షేత్రాన్ని పరిశీలిస్తున్న ఉన్నతాధికారులు

యడ్లపాడు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రతి మహిళ ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని ప్రకృతి వ్యవసాయం జెండర్ స్టేట్ కన్సల్టెంట్ అరుణ అన్నారు. యడ్లపాడు మండలం ఉన్నవలోని దివ్యాంగ మహిళా రైతు ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో బుధవారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలు వ్యవసాయంలో ముందుండి పని చేస్తే పెట్టుబడి ఖర్చులు తగ్గటంతో పాటు కుటుంబ ఆదాయం పెరుగుతుందన్నారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం చేపట్టడం ద్వారా వనరులను సామూహికంగా సమకూర్చుకోవచ్చని, సమయం, శ్రమ ఆదా అవుతుందని వివరించారు. జెండర్ స్టేట్ కో-ఆర్డినేటర్ ప్రశాంతి మాట్లాడుతూ రసాయన రహిత విధానంలో పండించిన ఉత్పత్తులతో ఆరోగ్యం మెరుగుపడుతుందని, వైద్య ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం డీపీఎం అమలకుమారి మాట్లాడుతూ ప్రతి మహిళా పెరటి తోటలు ఏర్పాటు చేసి ప్రకృతి వ్యవసాయం చేపడితే 'ఆరోగ్య ఆంధ్రప్రదేశ్' సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో స్టేట్ రిసోర్స్‌పర్సన్‌లు మన్విత, హేమ, జిల్లా అదనపు ప్రాజెక్టు మేనేజర్ ప్రేమరాజు, మహిళా సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఠీవీగా నిలిచిన ప్రభలు

యడవల్లిలో క్రేన్ సహాయంతో నిలబెడుతున్న ప్రభ

గంగన్నపాలెంలో..

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : మహాశివరాత్రికి మూడు రోజులు మాత్రమే ఉండటంతో గ్రామల్లో ప్రభలను క్రేన్ సహాయంతో లేపి నిలబెడుతున్నారు. కోటయ్య నినాదాలతో గ్రామస్థులు ప్రభలను నిలబెట్టడంతో ఠీవీగా దర్శనమిస్తున్నాయి. బొప్పూడి, యడవల్లి, కోమటినేనివారిపాలెం, గంగన్నపాలెం, పురుషోత్తమపట్నం ప్రభలను నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రభలను పంబతాళ్లతో లాగి కట్టి ఉంచారు. మిగిలిన ప్రభలు గురు, శుక్రవారాల్లో నిలబడనున్నాయి. ఈ నెల 13న అన్ని గ్రామాల్లో ప్రభల పండుగను నిర్వహించి 14న కోటప్పకొండకు తరలించనున్నారు.

కారులో నగదు సంచి.. గంటల్లో పట్టుకున్న పోలీసులు

లక్ష్మీనారాయణకు రూ. 2 లక్షలు అందజేస్తున్న ఎస్సై హనుమంతరావు, సిబ్బంది

గుంటూరు, న్యూస్‌టుడే: తండ్రి చికిత్స కోసం ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు తెచ్చిన నగదును కారులో మరచిపోవడంతో కొత్తపేట పోలీసులు గంటల వ్యవధిలో గుర్తించారు. పల్నాడు జిల్లా కారంపూడి మండలం సన్నిగండ్లకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పొట్ల లక్ష్మీనారాయణ తండ్రికి అనారోగ్యంగా ఉండడంతో ఈ నెల 10న నరసరావుపేట నుంచి కారులో గుంటూరులోని గుంటూరువారితోటలో ఓ ఆసుపత్రికి తీసుకొచ్చారు. చికిత్స కోసం తీసుకొచ్చిన రూ.2 లక్షల నగదు ఉన్న బ్యాగ్‌ను కారులో మరచిపోయారు. ఆసుపత్రిలోకి వెళ్లాక గుర్తుకు రావడంతో బయటకొచ్చి చూశారు. అప్పటికే కారు వెళ్లిపోవడంతో వెంటనే కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కారు నంబరు, డ్రైవర్ వివరాలు తెలియదని చెప్పడంతో సీఐ వీరయ్యచౌదరి సిబ్బందితో కలిసి సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. కారును గుర్తించి అందులోని రూ.2 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై హనుమంతరావు చేతులమీదుగా లక్ష్మీనారాయణకు ఆ నగదు అందజేశారు.

లైన్ ఆకు సాగు.. లాభాలు బాగు

బాపట్లలో లైన్ ఆకు సాగు

బాపట్లటౌన్, న్యూస్‌టుడే: లైన్ ఆకు సాగుతో రైతులు లాభాలు అందుకుంటున్నారు. ఏడాది పొడవునా ఈ పంట సాగుకు అనుకూలమే. బాపట్ల మండలం దరివాదకొత్తపాలెం, పోతురాజుకొత్తపాలెం, ఆసోదివారిపాలెం, కుక్కలవారిపాలెం, బేతపూడి, వెదుళ్లపల్లి, హనుమాన్‌నగర్, బసివిరెడ్డిపాలెం గ్రామాల్లో 100 ఎకరాలకు పైగా సాగు చేశారు. ఎక్కువమంది 10, 20 సెంట్లు చొప్పున చిన్న కమతాల్లో సాగు చేస్తున్నారు. ఈ ఆకును వివాహాల మండపాల్లో అలంకరణ, దండలు, గజమాలలకు ఉపయోగిస్తారు. ధర లేనిసమయంలో పశువులకు మేతగానూ ఉపయోగపడుతుంది. ప్రస్తుతం ధర కిలో రూ.15 పలుకుతోంది.

ఖర్చు ఇలా..

ఎకరాకు 50 నుంచి 60 బస్తాలు (70 కిలో బస్తా) చొప్పున ఈ ఆకును పొలంలో రైతు నాటుతున్నారు. బస్తా రూ. 1000 నుంచి రూ.1200 వరకు ఖర్చు అవుతుంది. లైన్‌ఆకు కొనుగోలు, కూలీ ఖర్చులు తదితరాలకు కలిసి ఎకరాకు రూ.90 వేల నుంచి రూ.లక్ష ఖర్చు వుతోంది. ఒక్కసారి పొలంలో నాటితే 4 నుంచి 5 ఏళ్లు దిగుబడి వస్తుంది. నాటిన నెల రోజులకు కోతకు వస్తుంది. నెలకు ఒకసారి ఆకును కోస్తారు. తొలి పంట 80 బస్తాలుపైగా వస్తుంది. బస్తాకు రూ.1000 నుంచి రూ.1100 వరకు రాబడి ఉంటుంది. సాగు ఖర్చు మొదటి కోతలోనే వస్తుంది.

హైదరాబాద్, చెన్నైలకు ఎగుమతి

బాపట్ల చుట్టుపక్కల ప్రాంతాల్లో పండిన లైన్ ఆకు హైదరాబాద్, చెన్నై, విజయవాడ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. నిత్యం పదుల సంఖ్యలో బస్తాలు లారీల్లో తరలిస్తున్నారు.

ప్రస్తుతం ధర బాగుంది

లైన్ ఆకుకు ప్రస్తుతం మంచి ధర ఉంది. నాకున్న అర ఎకరంలో దిగుబడి బాగానే ఉంది. ఏడాదికి రూ.లక్ష నుంచి లక్షన్నర మిగులుతోంది. **– అనిల్‌కుమార్, బేతపూడి**

మిరప కోతల్లో జాగ్రత్తలు పాటిద్దాం

గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే: గురజాల డివిజన్ పరిధిలో మిరప కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ క్రమంలో రైతులు తగు జాగ్రత్తలు, నాణ్యత ప్రమాణాలు పాటిస్తే విపణిలో మంచి ధర లభించే అవకాశం ఉందని పిడుగురాళ్ల ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు సూచించారు. కోతకు వచ్చే 20 రోజుల ముందు ఎలాంటి మందులు పిచికారీ చేయవద్దు. కోతకు ముందు పంటకు నీటితడులు ఆపేయాలి. కాయలు ఎర్రగా పండిన తరువాత కోత ప్రారంభించాలి. ఎక్కువగా పండితే నాణ్యత తగ్గుతుంది. పాలిథిన్ పట్టలపై సిమెంటు గచ్చుమీద ఎండబెట్టాలి. రాత్రి వేళల్లో మంచు పడకుండా పట్టలు కప్పి ఉంచాలి. పది శాతానికి మించి తేమ లేకుండా చూడాలి. మిరపకాయలు ఎండబెట్టడానికి ముందు అందులో దుమ్ము, ధూళి చేరకుండా జాగ్రత్త పడాలి. వర్షాలు వస్తే కోతలు ఆపేయాలి. లేదంటే నాణ్యత తగ్గిపోతుంది. తాలు, మచ్చకాయలను గ్రేడింగ్ చేసి వేరుచేయాలి. శుభ్రమైన గోనె సంచుల్లో కాయలు నింపాలి. శీతల గిడ్డంగుల్లో నిల్వ చేస్తే రంగు మారదు. కాయలు నిగనిగలాడేలా కనిపించాలని రసాయనాలు ఉపయోగించవద్దు.

ప్రశ్న: వేసవిలో మినుము, పెసర పంటల సాగుకు అనువైన నేలలు, సేద్య విధానాల ఏమిటి? - రాంబాబు, పెదరావూరు, తెనాలి మండలం.

సమాధానం: వేసవిలో ఫిబ్రవరి నుంచి మార్చి 18 వరకు మినుము, పెసర విత్తనాలు విత్తుకోవచ్చు. వరి మాగాణుల్లో అయితే (రబీ వరి తరువాత) మార్చి ఆఖరు వరకు విత్తుకోవచ్చు. మినుము, పెసర రకాలు తక్కువ కాలంలో కాపునకు వచ్చి బెట్టను, వేడిని తట్టుకునేవిగా ఉండాలి. మినుములో జీబీజీ-1, టీబీజీ-104, ఎల్‌బీజీ-752, పీయూ 31 రకాలు అనుకూలం. ❖ పెసరలో ఐపీఎం 2-14, ఎల్‌జీజీ-460, ఎల్‌జీజీ-407, డబ్ల్యూజీజీ-42 రకాలు అనుకూలం. వేసవిలో మినుము, పెసర రెండు రకాల పంటలు అన్ని రకాల నేలల్లో పండించవచ్చు. చౌడు, ముంపు నీరు నిలిచే నేలలు పనికి రావు. ❖ విత్తన మోతాదు: వేసవిలో అధిక పంటగా మినుముకు 8-10 కిలోలు ఎకరానికి, పెసరకు 6-7 కిలోలు. వరి మాగాణుల్లో తొలకరిగా 10-12 కిలోలు(మినుము), 12 కిలోలు (పెసరకు) విత్తుకోవాలి. ❖ ఎరువులు: ఎకరాకు 8 కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరం ఇచ్చే ఎరువు వేయాలి. - గుంటూరు, న్యూస్‌టుడే

❖ **నీటి యాజమాన్యం:** వేసవిలో పండించే పంటకు 25-30 రోజుల దశలో ఒకసారి, 45- 50 రోజుల దశలో మరోసారి తేలికపాటి తడులు ఇచ్చినట్లయితే అధిక దిగుబడులు పొందవచ్చు. **-డాక్టర్ ఎం.నగేష్, ఆంగ్రూ ఏరువాక కేంద్రం సమన్వయకర్త**

తక్కువ పెట్టుబడి.. ఎక్కువ రాబడి

దాచేపల్లి, న్యూస్‌టుడే: స్వల్ప ప్రణాళిక.. పంటల మార్పిడి చేస్తే తక్కువ విస్తీర్ణంలోనే ఎక్కువ రాబడి సాధించవచ్చని దాచేపల్లి పట్టణానికి చెందిన రైతు షేక్ సైదావలి నిరూపిస్తున్నారు. కూరగాయల సాగుతో ఆదాయం పొందుతున్నారు. ప్రస్తుతం తనకున్న అర ఎకరా పొలంలో సొరకాయ పంట సాగు చేసి లాభాలు గడిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

రూ.15 వేలలోపే ఖర్చు.. విత్తనాలు, ఎరువులు, ఇతర ఖర్చులు కలిపి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ఖర్చు అయింది. సొరకాయ సాగు చేసిన రెండు నెలల తర్వాత దిగుబడి మొదలైంది. ఎప్పటికప్పుడు సస్యరక్షణ చర్యలు చేపట్టడంతో కాయలు నాణ్యంగా వచ్చాయి. దిగుబడి బాగుంది. తెగుళ్ల బాధ తక్కువే. కోతలు వరుసగా వస్తుండటంతో నిరంతర ఆదాయం లభిస్తోంది. మధ్యవర్తులతో పనిలేకుండా సొరకాయలను నేరుగా స్థానిక మార్కెట్లకు తీసుకెళ్లి విక్రయిస్తుండటంతో మంచి ధర దక్కుతోంది. కిలో రూ.10 నుంచి రూ.18 వరకు పలుకుతోంది. మొత్తం దిగుబడి 80 క్వింటాళ్ల వరకు వస్తుందని, అన్ని ఖర్చులు పోను సుమారు రూ.80 వేల వరకు మిగులుతుందని వివరించారు. కూరగాయల సాగుతో తక్కువ విస్తీర్ణంలో, తక్కువ వ్యవధిలో ఆదాయం లభిస్తుందని ఆయన తెలిపారు.

సొరకాయలు కోస్తున్న సైదావలి

పంట మార్పిడి చేస్తూ..

ఏడాది పొడవునా ఒకే పంట వేస్తే ఫలితం ఉండదు. అందుకే పంట మార్పిడి విధానం పాటిస్తున్నా. సేంద్రియ ఎరువులు వాడితే భూమి సారవంతం అవుతుంది. ఆదాయం కూడా బాగా వస్తుందని సైదావలి చెబుతున్నారు.

జీవాల పిల్లల సంరక్షణ కీలకం

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: శీతాకాలంలో జీవాల(గొర్రెలు, మేకలు) పిల్లల సంరక్షణతో మంచి వృద్ధి, పోషణ లాభదాయకంగా ఉంటుందని ప్రత్తిపాడు ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకుడు డా.కె.సుగుణారావు చెప్పారు. పిల్లల సంరక్షణ గురించి ఆయన వివరించారు. ఫిబ్రవరి నెలలో ఈత శాతం అధికంగా ఉంటుంది. పుట్టగానే ముక్కు, రంధ్రాల్లో పొడిగుడ్డతో తుడిచి శ్వాస సరిగ్గా ఆడేలా చూడాలి. బొడ్డు కత్తిరించడానికి కొత్త బ్లేడు మాత్రమే వాడాలి. రెండు, మూడు రోజుల పాటు గాయానికి అయోడిన్ అద్దాలి. పుట్టిన 15 నిమిషాల్లోనే పాలు తాగించాలి. పిల్లల్ని తల్లి నాకేందుకు అందుబాటులో ఉంచాలి. దగ్గుర్లాంటి నివారణకు టీకా వేయించాలి.

త్రికోటేశ్వరస్వామి ఆదాయం రూ.59,97,462

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: కోటప్పకొండలోని త్రికోటేశ్వరస్వామి ఆలయం హుండీ లెక్కింపు బుధవారం చేపట్టారు. 82 రోజులకు నగదు 58,77,452, అన్నదానానికి రూ. 1,20,010 చొప్పున మొత్తం రూ.59,97,462 ఆదాయం వచ్చింది. అలాగే వెండి 106గ్రాములు, బంగారం 2గ్రాములు 900 మిల్లీగ్రాములు, విదేశీ కరెన్సీ 40 అమెరికా డాలర్లు, 100 కెనడా డాలర్లు, 5 యూరోలు, 20 నేపాల్ కరెన్సీ నోట్లు ఉన్నట్లు ఈవో చంద్రశేఖరరావు తెలిపారు.

ఆరబోసిన 11 క్వింటాళ్ల మిర్చి ఎత్తుకెళ్లారు

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతులకు దొంగల భయంతో కునుకులేకుండా పోతోంది. మండలంలోని మద్దిరాలకు చెందిన మాజీ సర్పంచి కేతినేని సుందరరామయ్య 8 ఎకరాల్లో మిర్చి పంట వేశారు. 11 క్వింటాళ్ల మిర్చి ఆరబోసి పక్కనే బస్తాలు ఉంచారు. మంగళవారం రాత్రి దొంగలు మిర్చి మొత్తం ఎత్తుకొని పోయారు. ఉదయం రైతు సుందరరామయ్య చూసి లబోదిబోమన్నారు. తెలిసినవారే దొంగతనం చేసి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. పోలీసులు నిఘా పెట్టి ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కొండవీటి రెడ్డిరాజుల శాసనాల పరిశీలన



శాసనాలను పరిశీలిస్తున్న కొండవీడు కోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కల్లి శివారెడ్డి

యడ్లపాడు, న్యూస్‌టుడే: కొండవీడు కోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కల్లి శివారెడ్డి బుధవారం సింహాచలంలోని నరసింహస్వామి ఆలయాన్ని సందర్శించి కొండవీటి రెడ్డి రాజుల శాసనాలను పరిశీలించారు. కొండవీటి రెడ్డిరాజులలో సుప్రసిద్ధుడు అనవేమారెడ్డితో పాటు కాటయ వేమారెడ్డి, కుమార గిరి రెడ్డి, వీరభద్రారెడ్డి, పెద కోమటి వేమారెడ్డి తూర్పుదేశ దండయాత్రలో భాగంగా ఆంధ్రప్రదేశ్ నుంచి ఒడిశా వరకు పలు రాజ్యాలు, దుర్గాలు జయించారన్నారు. ఇందులో భాగంగా సింహాచలంలోని నరసింహస్వామి దేవాలయంలో 'అనవేమనగర' అనే మండపాన్ని నిర్మించి స్వామివారి ధూపదీప నైవేద్యాలకు, కల్యాణానికి దానాలు చేశారన్నారు. అయా శాసనాలు కొండవీడు రెడ్డిరాజుల చారిత్రక వైభవానికి, సాహిత్యం, కళా పోషణకు అద్దం పడుతున్నాయని శివారెడ్డి వెల్లడించారు.

EENADU Classifieds

AUTO

VEHICLES FOR SALE

AP-39-TH-0626 Maruti Swift Dzire Car Model 2019 is for Sale in as is Where is Condition. Sundaram Finance Ltd. Guntur. ✆ 0863-2241386, 94409 09736.

BUSINESS SERVICES

REAL ESTATE

FLAT FOR SALE

GENERAL

PLOT FOR SALE

GENERAL

JOBS

TECHNICAL Skills Nerchukoni Job to set avvali anukone vallaku sada avakasam. Training period 1 month. if you are ready to join Job after Course. No interview. More detailes Contact: 8712625322 in between 8 am to 9 am. Limited Seats only.

✆ 94907 97533, 89482 30222

✆ 93944 47117, 92477 45046.

✆ 79970 18666.

✆ 97013 63586, 93812 32809.

✆ 88855 90905.

✆ 94402 14612.

✆ 85008 08778.

✆ 74166 89935.

✆ 72880 04466.

✆ 78010 32689.

89190 80894, 83091 32382.

✆ 94414 11874.

✆ 81422 92071.

✆ 87908 94569

SECURITY GUARDS

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/-

5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/-

ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వడం

పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

ఉద్యోగం మానేసి.. చోరీలు మొదలెట్టి

వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై రాజశేఖర్

అమరావతి, న్యూస్‌టుడే: పోస్టల్ శాఖలో ఉద్యోగం చేస్తున్న అతడు వ్యసనాలకు అలవాటు పడ్డాడు. బెట్టింగ్‌లకు పాల్పడి అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చేదారిలేక ఉద్యోగం మానేసి చోరీల బాట పట్టి చివరికి కటకటాల పాలయ్యాడు. పోలీసుల వివరాల ప్రకారం.. గుంటూరు గ్రామీణ మండలం జొన్నలగడ్డకు చెందిన నాగార్జున ఈ నెల 7న 14వ మైలు సెంటర్‌లో ఓ ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసి, దానిపై వైకుంఠపురం చేరుకున్నాడు. అక్కడ వేద వ్యాస ధర్మక్షేత్రం సమీపంలో వెంకాయమ్మ అనే మహిళ మెడలోని బంగారు గొలుసు లాక్కొని పారిపోయాడు. మహిళ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన ఎస్సై శ్రీనివాసరావు దర్యాప్తు చేస్తుండగా బుధవారం ముత్తాయపాలెం వద్ద నాగార్జునను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా గత జనవరిలో పెదకూరపాడు మండలం పరస వద్ద ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును అపహరించినట్లు చెప్పాడు. ఈ రెండు ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు.

శస్త్రచికిత్స వికటించి బాలుడి మృతి

నరసరావుపేటసెంట్రల్, న్యూస్‌టుడే: ఆపరేషన్ వికటించి బాలుడు మృతి చెందిన సంఘటన పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో బుధవారం జరిగింది. అచ్చంపేట మండలం ఓర్వకల్లు గ్రామానికి చెందిన సంతోష్(12) టాన్సిల్స్ నొప్పితో బాధపడుతుండటంతో కుటుంబ సభ్యులు నరసరావుపేటలోని ప్రైవేటు వైద్యశాలకు తీసుకొచ్చారు. వైద్యులు శస్త్రచికిత్స చేయగా వికటించి బాలుడు మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు వైద్యశాల వద్ద ఆందోళనకు దిగారు. ఈ విషయంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

91.9FM Vijayawada ఈ FM 91.9 Mee FM

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 80080 03297

భూ సమీకరణపై సందేహాలు వద్దు

రాజధానికి 2.5 ఎకరాల భూమి ఇచ్చిన లేమల్లె రైతు జాన్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అమరావతి, న్యూస్‌టుడే: రాజధాని అమరావతి విస్తరణకు భూ సమీకరణ త్వరగా పూర్తి చేస్తే.. అంతర్జాతీయ క్రీడానగరం నిర్మాణానికి శ్రీకారం జరుగుతుందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. బుధవారం లేమల్లె గ్రామంలో రైతులతో భూ సమీకరణపై మాట్లాడారు. భూ సమీకరణ తర్వాత 2500 ఎకరాల్లో అంతర్జాతీయ క్రీడానగరం ఏర్పాటు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం చంద్రబాబు మంత్రి నారాయణకు సూచించారన్నారు. క్రీడానగరం ఏర్పాటైతే అమరావతి ప్రాంతానికి అనేక సంస్థలు వచ్చి అభివృద్ధి చెందుతుందన్నారు. రైతులు త్వరగా భూములు అప్పగించాలని కోరారు. భూ సమీకరణపై ఎటువంటి సందేహాలు వద్దన్నారు. అనంతరం పలువురు రైతులు భూ సమీకరణకు అంగీకార పత్రాలు అందజేశారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు జానీసైదా, మండల తెదేపా అధ్యక్షుడు రాజా పాల్గొన్నారు.

82 బస్తాల చౌకబియ్యం జప్తు

అచ్చంపేట, న్యూస్‌టుడే: చౌకబియ్యం అక్రమంగా నిల్వ చేశారన్న సమాచారంతో విజిలెన్స్ ఎస్పీ సూర్య శ్రావణ్‌కుమార్ ఆదేశాలతో బుధవారం గుంటూరు విజిలెన్స్ అధికారుల బృందం అచ్చంపేట మండలంలో తనిఖీలు చేసింది. సీతారాంపురం వాగు వద్ద అప్పిరెడ్డి ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 82 బస్తాల్లోని 3,725 కిలోల చౌక బియ్యం జప్తు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. అక్రమ రవాణా వ్యాపారం చేస్తున్న ముండ్రు వీరభద్రరావుపై 6ఏ కేసుతోపాటు క్రిమినల్ కేసు నమోదుకు ఆదేశించామన్నారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు అనిల్‌బాబు, ఎస్సై అమీర్, డీఎస్ డీటీ సునీత పాల్గొన్నారు.

జాతీయ కవితా పోటీల విజేతలు వీరే..

విశాఖపట్నం(సీతంపేట), న్యూస్‌టుడే: విశాఖలోని సహృదయ సాహితి సంస్థ 46వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన జాతీయ స్థాయి కవితల పోటీల ఫలితాలను సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ బుధవారం విడుదల చేశారు. దేశవ్యాప్తంగా మొత్తం 145 కవితలు రాగా అందులో నిజామాబాద్‌కు చెందిన బి.కళాగోపాల్ రాసిన శీతలపెట్టెలు(ప్రథమ), విశాఖ నగరానికి చెందిన చొక్కర తాతారావు రాసిన ఈ రాత్రిని అప్పుడే తెల్లారనివ్వకండి(ద్వితీయ), పిడుగురాళ్లకు చెందిన వై. సీహెచ్.కె.మోహనరావు రాసిన పాదముద్రిక(తృతీయ) కవితలు ఎంపికయ్యాయి. ప్రోత్సాహక బహుమతి కింద యానాంకు చెందిన పి.అశోక్ కుమార్ రాసిన అక్షరగమనం, విశాఖ జిల్లా పెందుర్తికి చెందిన అరుణం శ్రీనివాస్ రాసిన యుద్ధభాష, శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలసకు చెందిన కుప్పిలి వెంకటరాజారావు రాసిన ఎండుటాకు కవితలు ఎంపికయ్యాయి. ఈనెల 20న విశాఖలోని పౌర గ్రంథాలయంలో నిర్వహించనున్న కార్యక్రమంలో విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నారు.

బ్రాయిలర్ ధరలు
(కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 120, రిటైల్ ధర - 147, చికెన్ విత్‌స్కిన్ - 213, చికెన్ స్కిన్‌లెస్ - 243.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213 చికెన్ స్కిన్‌లెస్ - 243.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 248 చికెన్ స్కిన్‌లెస్ - 258.

ద్విచక్ర వాహనదారుడి దుర్మరణం

పెదనెమలిపురి(రాజుపాలెం), న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరు మృతి చెందిన ఘటన అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారిపై పెదనెమలిపురి వద్ద బుధవారం జరిగింది. ప్రకాశం జిల్లా పొదిలి మండలం ఏలూరుకు చెందిన ధర్మవరపు శివకుమార్‌రెడ్డి(24) ద్విచక్ర వాహనంపై పిడుగురాళ్లకు బయలుదేరాడు. మార్గమధ్యలో పెదనెమలిపురి గ్రామంలోని తిరుపతమ్మ ఆలయ సమీపానికి చేరుకోగానే వాహనం అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ఘటనలో అతడి తల డివైడర్‌ను తగలడంతో బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై మణికృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి..

నకరికల్లు: నకరికల్లు మండలం చల్లగుండ్ల గ్రామ శివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. గుర్తుతెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనంపై వెళుతున్న గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. మృతుడి వయసు 45 సంవత్సరాలు ఉంటాయని, చేతిపై అమ్మ, నాన్న అని పచ్చబొట్టు ఉందని పోలీసులు తెలిపారు. ఎస్సై సతీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 80085 10541

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80085 14589

నరసరావుపేట
• నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

ఘంటసాల పాటలు అజరామరం

నివాళి అర్పిస్తున్న అభిమానులు

నరసరావుపేట టౌన్, న్యూస్‌టుడే: ప్రముఖ గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతిని నరసరావుపేట టౌన్ హాల్లో బుధవారం నిర్వహించారు. ఆయన పాటలు అజరామరమని కొనియాడారు. ఘంటసాల ది గ్రేట్ బయోపిక్ దర్శకుడు రామారావు, ప్రముఖ న్యాయవాది అయ్యప్పరాజు, అభిమానులు పాల్గొని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

ముగిసిన లూర్ధుమాత ఉత్సవాలు

అలంకరణలో లూర్ధుమాత ఆలయం

వినుకొండ, న్యూస్‌టుడే: లూర్ధుమాత మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న జీవాలయం ప్రాంగణాన్ని విద్యుత్తు బల్బులతో అలంకరించారు. ఈనెల 3న మొదలైన వేడుకలు ముగింపు సందర్భంగా బుధవారం వినుకొండ మిషన్ సుపీరియర్ ఫాదర్ మాడిమి అంథోని ప్రసాద్ ఆధ్వర్యంలో పాటిబండ్ల విచారణ గురువులు చిన్నాబత్తిని హృదయకుమార్ పండుగ, సమిష్టి దివ్యపూజాబలి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు విచారణ గురువులు, జేసుసభ సభ్యులు, సిస్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
నరసరావుపేట అర్బన్ : 80085 73156
యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? నరసరావుపేట పట్టణం రొంపిచర్ల రోడ్డు నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే సందులో మూలమలుపు మూత్ర విసర్జనతో దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం - **దుర్గ, ప్రయాణికురాలు**
✔ అక్కడ విసర్జన చేయకుండా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తాం. - **రమాదేవి, పారిశుద్ధ్య అధికారిణి**
– న్యూస్‌టుడే, మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట)

? చిలకలూరిపేట పట్టణంలోని 17వ వార్డు వడ్డెర కాలనీలోని శ్రీ నాగకరుమారెమ్మ, కనకదుర్గమ్మ, అంకమ్మతల్లి అమ్మవార్ల దేవస్థానం పక్కన ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. దోమలు వ్యాప్తితో ఇబ్బందిగా మారింది. - **రమేష్**
✔ పరిశీలించి ఖాళీ స్థలంలో పిచ్చిమొక్కలను తొలగించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తాం. - **సునీత, పారిశుద్ధ్య అధికారిణి** – న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం

కొండవీడు కోట.. అభివృద్ధికి బాట..!

యడ్లపాడు, న్యూస్‌టుడే

- ఉత్సవాలు విజయవంతంతో ప్రభుత్వం దృష్టి
- వారాంతాల్లో ఆర్టీసీ బస్సు సౌకర్యంతో ఆదాయం

ఈ నెల 7, 8 తేదీల్లో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన కొండవీడు ఉత్సవాలు విజయవంతమయ్యాయి. 2019లో తెదేపా ప్రభుత్వం, 2024లో వైకాపా ప్రభుత్వం కొండవీడు ఉత్సవాలు నిర్వహించాయి. కూటమి ప్రభుత్వం తాజాగా నిర్వహించిన ఉత్సవాలు అందరిదృష్టి ఆకర్షించాయి. చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, కలెక్టర్ కృతికా శుక్లా కార్యాచరణలో పక్కా ప్రణాళికతో ప్రభుత్వాన్ని ఒప్పించి ఉత్సవాల నిర్వహణకు రూ.75 లక్షలు ప్రత్యేక నిధులు మంజూరు చేయించారు. హెలీరైడ్, బోటింగ్, రాక్ క్లైంబింగ్, హార్స్ రైడ్ తదితర సదుపాయాలు పర్యాటకులను విశేషంగా ఆకర్షించాయి. మ్యూజికల్ నైట్, విద్యార్థుల సాంస్కృతిక పోటీలు రెండు రోజుల పాటు పర్యాటకులను అలరించాయి.

పర్యాటకానికి అనువైన ప్రాంతం

కొండవీడు ఉత్సవాలకు 15వేల మంది పర్యాటకులు వచ్చారు. ఉత్సాహంగా రెండు రోజులపాటు సందడి చేశారు. దీంతో ఉత్సవాల సమయంలోనే కాకుండా మిగిలిన రోజుల్లో కూడా పర్యాటకులు రావడానికి

ఉత్సవాల సందర్భంగా బోటులో విహరిస్తున్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే ప్రత్తిపాటి, కలెక్టర్ కృతికా శుక్లా

కొండవీడు ఎంతో అనుకూలమైన శీతల ప్రాంతం. పాఠశాలల విద్యార్థులకు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆస్వాదించేలా, కార్తిక వన సమారాధన కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి అనువుగా చెట్లు, విశాల ప్రదేశాలు ఉన్నాయి. గుంటూరు, విజయవాడ, చిలకలూరిపేట, నరసరావుపేట, మాచర్ల, తెనాలి, బాపట్ల తదితర ప్రాంతాల నుంచి వారాంతాలు, పండుగ రోజుల్లో కొండవీడుకు వేల సంఖ్యలో సందర్శకులు వస్తున్నారు. దారి మధ్యలో కత్తుల బావి, గోశాల, వెన్నముద్దల వేణుగోపాలస్వామి ఆలయాలను దర్శించుకుంటున్నారు. కొండవీడుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవటంతో సొంత వాహనాలున్నవారు మాత్రమే రాకపోకలు సాగిస్తున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సుల సౌకర్యం కల్పిస్తే పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వానికి పర్యాటకంతో అదనపు ఆదాయ వచ్చే అవకాశం ఉంది.

సీఎం పట్టుదలతో ఉన్నారు

కొండవీడు ఉత్సవాలు అంచనాల మించి విజయవంతం కావటంతో ఆనందాన్ని ఇచ్చింది. చారిత్రక కొండవీడును గొప్ప ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబు గట్టి పట్టుదలతో ఉన్నారు. జాతీయ రహదారి నుంచి చౌడవరం మీదుగా కొండవీడుకు టన్నెల్ రోడ్డు నిర్మించటానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. పర్యాటకుల డిమాండ్ ను బట్టి ఆయా ప్రాంతాల నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడపటానికి చర్యలు తీసుకుంటాం.
– ప్రత్తిపాటి పుల్లారావు, మాజీ మంత్రి, తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు

చిలకలూరిపేటలో ముస్లింల ఆత్మీయ సమావేశం

మాట్లాడుతున్న పురపాలక ఛైర్మన్ రఫాని

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: ముస్లిం మైనార్టీల సామాజిక అవసరాలను తీర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పురపాలక ఛైర్మన్ ఎస్‌కే రఫాని పేర్కొన్నారు. కౌన్సిల్ భవనంలో బుధవారం ముస్లిం మైనార్టీ నాయకులు, వార్డు ప్రజాప్రతినిధులు, ప్రముఖులతో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక మద్దినగర్, సుభానినగర్‌లోని కమ్యూనిటీ భవనాలను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చొరవతో అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. మదర్‌థెరిసా కాలనీ, టిడ్కో గృహ సముదాయం, ఎన్టీఆర్ కాలనీలలో ప్రత్యేకంగా శ్మశాన వాటికలకు స్థలాన్ని కేటాయించాలని, పురుషోత్తమపట్నంలో షాదీఖానా నిర్మించాలని పలువురు ఛైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి నిధులు కేటాయించి పనులు జరిగేలా చూస్తానని ఛైర్మన్ తెలిపారు. అంజుమన్ కమిటీ సభ్యులు, ముస్లిం కౌన్సిలర్లు, పార్టీ ప్రముఖులు పాల్గొన్నారు.

వినుకొండలో పరీక్ష కేంద్రం ఏర్పాటు

తరగతిగది పరిశీలిస్తున్న పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపల్ లాజరస్‌బాబు

వినుకొండ, న్యూస్‌టుడే: శ్రీమతి గంగినేని కల్యాణి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ ఏడాది నుంచి పాలిటెక్నికల్ ప్రవేశ పరీక్షా కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు అద్దంకి ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపల్ లాజరస్‌బాబు తెలిపారు. బుధవారం స్థానిక కళాశాల తరగతి గదులను పరిశీలించిన ఆయన ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసరావును కలిసి విషయం తెలిపారు. ఇప్పటి వరకు ఈ ప్రాంతం విద్యార్థులు ఇతర చోట్లకు వెళ్లి పరీక్ష రాసేవారని, ఇప్పుడు దూరం భారం కాకుండా ఇక్కడే కేంద్రం ఉండటం వల్ల మేలు చేకూరుతుందన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 25 నుంచి పాలీసెట్ పరీక్షలు ఇక్కడ నిర్వహిస్తారని చెప్పారు. కళాశాల జనరల్ శాఖాధిపతి డాక్టర్ రాజకుమార్ ఈ కేంద్రానికి సమన్వయకర్తగా వ్యవహరిస్తారన్నారు.

తిరుమల లడ్డూ కల్తీ జరగలేదని ప్రమాణం చేయండి

మాట్లాడుతున్న జనసేన నియోజకవర్గ బాధ్యుడు నాగ శ్రీనివాసరావు

వినుకొండ, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ కల్తీ జరగలేదని వైకాపా మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు దేవుడి గుడిలో ప్రమాణం చేయాలని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కె. నాగశ్రీనివాసరావు అన్నారు. ఆపార్టీ కార్యాలయంలో బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ నెయ్యి బదులు ప్రసాదంలో రసాయనాలు కలిశాయని సిట్ తేలిస్తే ఇంకా ఎందుకు బొంకుతున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో సూపర్‌సిక్స్ పథకాలు సూపర్‌హిట్ అయ్యాయని, వైకాపా తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మరని తెలిపారు. సమావేశంలో అనీల్‌కుమార్, హనుమానాయక్, చంద్రశివ తదితరులు పాల్గొన్నారు.

పంట వ్యర్థాలు కలియదున్నితే పోషకాలు

శనగ పంట పరిశీలిస్తున్న అధికారి నగేష్

యడ్లపాడు, చిలకలూరిపేట గ్రామీణ: పంట కాలం ముగిసిన తర్వాత పంట వ్యర్థాలను పొలంలోనే తగలబెట్టిన్లయితే భూమిలోని పోషకాలు, సూక్ష్మజీవులు తగ్గిపోతాయని నరసరావుపేట డాట్ సెంటర్ కో-ఆర్డినేటర్ నగేష్ అన్నారు. మండలంలోని దింతెనపాడులో బుధవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సస్యరక్షణ చర్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పంటకాలం ముగిసిన అనంతరం పత్తికట్టెను యంత్రంతో ముక్కలు చేసుకుని మందులతో నేలలో కలుపుకోవాలని, శనగ పంటను కూడా నూర్పిడి తర్వాత అదే మాదిరిగా రోటావేటర్‌తో భూమిలో కలియదున్నడంతో వ్యర్థాలు కుళ్లి భూమికి పోషకాలు అందుతాయన్నారు. డీకంపోజర్ ఎ. బి పొడులు అమరావతి పరిశోధన కేంద్రంలో అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏవో హరిప్రసాద్, ఏఈవోలు అనుపమ, బిలాల్, రైతులు పాల్గొన్నారు. ✦ చిలకలూరిపేట మండలం రాజాపేట, గోపాళంవారిపాలెం గ్రామాలలోనూ పొలాలను పరిశీలించి పంటకాలం తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఏవో ప్రవీణ్, వీఏఏ మల్లికార్జున్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మహేంద్రమాతమేదరి పెయింటింగ్ ఆవిష్కరణ

వినుకొండ, న్యూస్‌టుడే: జాతీయ చిత్రకారుడు వజ్రగిరి జస్టిస్ వేసిన మహేంద్రమాత మేదరి పెయింటింగ్‌ను బుధవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జొరిగె మస్తాన్‌రావు ఆవిష్కరించారు. ఏనుగుపాలెం రోడ్డులోని ఆ సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేదరి వృత్తి గొప్పతనాన్ని కళ్లకు కట్టినట్లు చిత్రంలో చూపించారని ప్రశంసించారు. చిత్రకళ గొప్పదని, ఎందరినో అది ప్రభావితం చేస్తుందన్నారు. అనంతరం చిత్రకారుడు జస్టిస్‌ను సన్మానించారు. కార్యక్రమంలో అంకాళమ్మతల్లి దేవస్థానం కమిటీ ఛైర్మన్ జొరిగె శంకరరావు, మేదరి సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు జొరిగె శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి తుమ్మల ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ ప్రిన్సిపల్‌ను సత్కరిస్తున్న కళాశాల ఛైర్మన్ ఎమ్మార్ శేషగిరిరావు

సరికొత్త నైపుణ్యాలతో ఉపాధి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు పొందాలంటే సరికొత్త నైపుణ్యాలు సాధించాలని జేఎన్‌టీయూ కాకినాడ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు అన్నారు. ఎంఏఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం టెక్ ఫెస్ట్ నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ విజ్ఞానాభివృద్ధి పరిశ్రమల అవసరాల గురించి అందుకు అనుగుణంగా పాఠ్య ప్రణాళిక అమలు చేస్తుందని తెలిపారు. సావ్వీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ఛైర్మన్ వెంకట్ మద్దినేని మాట్లాడుతూ పరిశ్రమల్లో ఏఐ విప్లవం గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. కళాశాల ఛైర్మన్ ఎమ్మార్ శేషగిరిరావు, డైరెక్టర్ దరువూరి శ్రావ్య, ప్రిన్సిపల్ సాదినేని రామారావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు

ప్రత్యామ్నాయ మార్గాన్ని ఏర్పాటు చేయిస్తున్న సీఐ, ఎస్సైలు

చిలకలూరిపేట గ్రామీణ, ఈపూరు, న్యూస్‌టుడే : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని చిలకలూరిపేట నుంచి కోటప్పకొండకు వెళ్లే, వచ్చేమార్గంలో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు చిలకలూరిపేట గ్రామీణ సీఐ బి.సుబ్బానాయుడు తెలిపారు. మండలంలోని కట్టుబడివారిపాలెం, యూటీ సెంటర్, ఎన్ఎస్‌పీ కెనాల్ తదితర ప్రాంతాల్లో బుధవారం ప్రత్యామ్నాయ మార్గాలను దగ్గరుండి ఏర్పాటు చేయించారు. గ్రామాలలోని ప్రజలు వచ్చే మార్గాలను వివరించారు. అన్ని ప్రభలు 14వ తేదీ సాయంత్రానికి కొండ వద్దకు చేరుకోవాలన్నారు. 15న రహదారులపై ప్రభలకు అనుమతి లేదన్నారు. ట్రాఫిక్‌కు ఎవరైనా అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐతోపాటు ఎస్సైలు అనిల్‌కుమార్, శివరామకృష్ణ, లీలాప్రసాద్ పాల్గొన్నారు. ✦ వినుకొండ గ్రామీణ సీఐ ప్రభాయ్య బుధవారం ఈపూరు మండలం భద్రుపాలెం వద్ద సంబంధిత కొండను సందర్శించారు. మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా కొండపైన తిరునాళ్ల జరుగనున్న నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించి సూచనలు చేశారు.

మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు

వినుకొండ, న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈనెల 15న వివిధ పుణ్యక్షేత్రాలకు దర్శనం కోసం వెళ్లే భక్తుల సౌకర్యార్థం డిపో నుంచి 70 బస్సులు నడుపుతున్నట్లు మేనేజర్ జె.నాగేశ్వరరావు తెలిపారు. కోటప్పకొండకు 50, శ్రీశైలం 10, త్రిపురాంతకం 6, మన్నేపల్లి తిరునాళ్లకు నాలుగు సర్వీసులు ఉన్నాయని, బస్టాండ్, అరుణాథియేటర్ సెంటర్, ముళ్లమూరు బస్టాండ్ నుంచి తిరుగుతాయని తెలిపారు.

మురుగు పారదు.. ముప్పు తొలగదు

ఎన్నెస్పీ కాలనీ స్థలంలో నిర్మించిన ప్రభుత్వ సంక్షేమ, గురుకుల పాఠశాలలు, వసతి గృహాల వద్ద మురుగు నీరు నిలబడి కుంటలుగా మారుతున్నాయి. భవనాలు నిర్మించి వాడుకున్న నీరు బయటకు వెళ్లేందుకు డ్రైనేజీ సౌకర్యం కల్పించకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ఎస్సీ బాలికల వసతి గృహం, రైల్వే స్టేషన్ రోడ్‌లో ఎస్సీ బాలికల గురుకులం, ఎన్నెస్పీ కాల్వ పక్కన కస్తూర్బాగాంధీ పాఠశాలల్లో సుమారు వెయ్యి మంది విద్యార్థులున్నారు. వాటి పక్కన ఉన్న ఖాళీ స్థలం నిండిన తర్వాత ట్యాంకర్లతో తోడిస్తున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్ మాట్లాడుతూ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సి ఉందని, ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. - **న్యూస్‌టుడేవినుకొండ**

గుంతల దారి.. ప్రమాదకరంగా మారి

చిలకలూరిపేట పట్టణం చీరాల రోడ్డులో డీఆర్ఎన్ఎస్ కళాశాల పక్క బజారు అధ్వానంగా మారింది. అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. ఈ మార్గంలో ప్రయాణం వాహనదారులకు నరక ప్రాయంగా మారింది. రహదారిపై పెద్దగా ఉన్న గుంతల్లో భవనాల వ్యర్థాలు పోసినా చదును చేయలేదు. దీంతో గుంతలు పూడ్చినా ఉపయోగం లేకుండా పోయింది. ప్రయాణించాలంటే వాహనాలు పాడైపోతున్నాయని చోదకులు వాపోతున్నారు. పురపాలకసంఘం ఏఈ మణికుమార్ మాట్లాడుతూ గుంతలను పూడ్చివేసి చదును చేస్తామని తెలిపారు.
- **న్యూస్‌టుడే, కళామందిర్ సెంటర్ (చిలకలూరిపేట పట్టణం)**

నూతన స్తంభం ఏర్పాటు

ఈనాడు వార్తకు స్పందన

నూజండ్ల, న్యూస్‌టుడే: కమ్మవారిపాలెం నుంచి యానాది కాలనీ వరకు విద్యుత్తు లైన్‌లో కొన్ని స్తంభాలు ఒరిగి పోవడంతో పాటు తీగలు కిందకు వేలాడుతున్నాయి. ఈ నెల 10న ఈనాడులో చిత్ర వార్త రావడంతో స్పందించిన విద్యుత్తు శాఖ ఏఈ సుధాకర్ ఒరిగిన స్తంభం స్థానంలో కొత్త స్తంభం ఏర్పాటు చేశారు. వేలాడుతున్న తీగలను సరిచేశారు. కాలనీ వాసులు ఈనాడుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నాళ్లో వేచిన ఉదయం.. రోడ్డుకు మోక్షం..!

అద్దంకి నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారిని నకరికల్లు మండలం దేచవరం మిద్దె సమీపంలో వాడరేవు రహదారిని కలుపుతూ రెండు దశాబ్దాల క్రితం నాబార్డు నిధులతో 12 కిలోమీటర్ల రోడ్డును నిర్మించారు. రొంపిచర్ల మండలం సుబ్బయ్యపాలెం క్రాస్ రోడ్డు నుంచి దేచవరం వరకు పలు గ్రామాలను అనుసంధానం చేస్తూ ఈ రహదారి విస్తరించారు. కాల క్రమేణా ఈ రహదారి గుంతలమయంగా మారడంతో ఆయా గ్రామాల ప్రజలు, విద్యార్థులు అవస్థలు ఎదుర్కొనే వారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాలకుల చొరవతో రోడ్డు నిర్మాణం ప్రారంభించారు. 12 కిలోమీటర్ల మేర తారు రోడ్డు నిర్మాణానికి రూ.3 కోట్లు ఖర్చు చేశారు. రోడ్డుకు మోక్షం కలిగిందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. - **న్యూస్‌టుడే, రొంపిచర్ల**

బడికి వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిందే

బొల్లాపల్లి మండలం రావులాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లోపలకు వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి. ముందు వైపు గేటుతో పాటు ప్రహరీ పొడవునా గ్రామస్థులు ఎరువు దిబ్బలు వేయడంతో అపరిశుభ్రంగా మారింది. శుభ్రం చేసి మొక్కలు నాటాలని ఉపాధ్యాయులు కోరినా పట్టించుకోలేదు. క్లస్టర్ లీడ్ పాఠశాల కావడంతో ప్రతి నెల మూడో శనివారం చుట్టు పక్కలున్న 16 పాఠశాలల నుంచి సుమారు 40 మందికి పైగా ఉపాధ్యాయులు ఇక్కడ నిర్వహించే సమావేశాలకు హాజరవుతారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆనందరావు మాట్లాడుతూ బడి ముందు ఎరువు దిబ్బలు తొలగించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శికి లేఖ రాశామని తెలిపారు. - **న్యూస్‌టుడే, బొల్లాపల్లి, వినుకొండ**

ఆందోళన చేస్తున్న కట్టుబడివారిపాలెం గ్రామస్థులు

స్థలం ఆక్రమించారంటూ ఆందోళన

నరసరావుపేటసెంట్రల్, న్యూస్‌టుడే: ఏళ్ల సంవత్సరాల నుంచి తమ స్థలాన్ని తిరునాళ్ల సమయంలో బొమ్మల షాపులకు అద్దెకు ఇచ్చుకుంటున్నామని, ఇప్పుడు వేరే వారు వచ్చి స్థలం తమదని బెదిరింపులకు దిగుతున్నారని చిలకలూరిపేట మండలం కట్టుబడివారిపాలెం గ్రామస్థులు జనసేన జెండాలతో బుధవారం కోటప్పకొండ వద్ద ఆందోళన చేశారు. తమ పూర్వీకుల నుంచి తమకు చెందిన భూమిని అద్దెకు ఇచ్చే హక్కులేదని నాగూర్ అనే వ్యక్తి బెదిరిస్తున్నారని వాపోయారు. ఈ విషయాన్ని డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లగా భూమికి సంబంధించిన పత్రాలు తీసుకురావాలని చెప్పారని, తీసుకెళ్లినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న గ్రామీణ పోలీసులు అక్కడికి చేరుకొని సర్దిచెప్పారు.

మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ

కె.శివరామప్రసాద్

వినుకొండ, న్యూస్‌టుడే: మున్సిపల్ కమిషనర్‌గా కె.శివరామప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు పురపాలిక సిబ్బంది కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన సుభాష్‌చంద్రబోస్ డీఎంఏ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

దీనదయాళ్ సిద్ధాంతాలు ప్రజల్లోకి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా భాజపా కార్యాలయంలో పండిత్ దీనదయాళ్ ఉపాధ్యాయ సమర్పణ దివస్ బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జూపూడి రంగరాజు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ దీనదయాళ్ ప్రతిపాదించిన ఏకాత్మ మానవతావాదం, ఇతర సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. జిల్లా అధ్యక్షుడు ఏలూరి శశికుమార్, కొక్కెర శ్రీనివాస్ యాదవ్, మాజీ అధ్యక్షుడు అలోకం సుధాకర్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న భాజపా నాయకులు

అవీ ఇవీ

నూరు శాతం అక్షరాస్యత సాధించాలి

నూజండ్ల, న్యూస్‌టుడే: నూరు శాతం అక్షరాస్యత సాధించిన మండలంగా నూజండ్లను మార్చాలని ఎంపీడీవో ఉమాదేవి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వాలంటీర్ల శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అక్షర కేంద్రాలను ప్రతిరోజు నిర్వహించాల్సిందేనని సూపర్ వైజర్ పర్యవేక్షణ తప్పనిసరి అన్నారు. వయోజనులకు చదవడం, రాయడం, కూడికలు, తీసివేతలు నేర్పించాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో మల్లికార్జునరావు, వయోజన విద్య సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, ఏపీఎం ఇందిర, వెలుగు సీసీలు, ఉపాధి పథకం క్షేత్రసహాయకులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

చింతలపాలెం ప్రభకు ప్రత్యేక పూజలు

నరసరావుపేటసెంట్రల్, న్యూస్‌టుడే: మండలంలోని చింతలపాలెం గ్రామంలో శివరాత్రి సందర్భంగా నిర్మించిన ప్రభను బుధవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించి నిలబెట్టారు. విద్యుత్తు దీపాలు, మందిరం అమర్చే పనులు ఉన్నాయని, గురు, శుక్రవారాల్లో ప్రభ నిర్మాణం పూర్తి చేసి 14 సాయంత్రం నుంచి కొండకు తరలించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సమ్మెకు మద్దతుగా కార్మికుల ర్యాలీ

వినుకొండ, న్యూస్‌టుడే: సార్వత్రిక సమ్మెకు మద్దతుగా బుధవారం పట్టణంలో తాపీ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. పట్టణ పురవీధుల్లో తిరిగి కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే ఉపసంహరించుకోవాలని నినాదాలు చేశారు. కార్మిక సంఘం నాయకులు యల్లమంద, పూర్ణ, చిన్నసుభాని, మీరావలి తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు.

ఎట్టకేలకు మంచినీటి సరఫరా

శావల్యాపురం, న్యూస్‌టుడే : వారం రోజులుగా మరమ్మతులు కారణంగా మండల కేంద్రమైన శావల్యాపురంలో నిలిచిన తాగునీటి సరఫరాను బుధవారం నుంచి పునరుద్ధరించినట్లు పంచాయతీ కార్యదర్శి కె. మహేంద్ర తెలిపారు. పథకానికి సంబంధించి పైపు లైన్లు దెబ్బతినడం వల్ల సరఫరా నిలిచిపోయిందని, మరమ్మతులకు గురైన వాటి స్థానంలో కొత్తవి అమర్చామన్నారు. అదే విధంగా పాత ఎస్టీ కాలనీలో చేతి బోరింగుకు కూడా మరమ్మతులు చేయించామని తెలిపారు.

నీటి ప్రవాహానికి అడ్డుకట్ట

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: చిలకలూరిపేట పట్టణం వడ్డెరకాలనీ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఎదురు కాల్వలో భవన నిర్మాణానికి ఉపయోగించే కంకర రాళ్లు పోశారు. కాల్వలో మురుగు నీరు ప్రవహించక రోజుల తరబడి నీరు నిలిచి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. సమస్యను పారిశుద్ధ్య అధికారి సునీత దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి కాల్వలో రాళ్లను తొలగించి, నీరు సక్రమంగా పారేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

14న నేత్ర వైద్య శిబిరం

నరసరావుపేట అర్బన్: డాక్టర్ కోడెల శివప్రసాదరావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి సహకారంతో 14న ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాజాగారి కోటలోని కోడెల శివప్రసాదరావు వైద్యశాల ప్రాంగణంలో ఉదయం 9 గంటలకు సేవలు ప్రారంభం అవుతాయని, కంటి సంబంధిత సమస్యలు ఉన్నవారు రావాలన్నారు.

ఓబీసీ మోర్చా పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జిగా శేషగిరిరావు

గుంటూరు నగరం: గుంటూరు జిల్లా భాజపాలో క్రియాశీలకంగా పనిచేసిన మోతే వెంకటశేషగిరిరావు ఓబీసీ మోర్చా పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జిగా నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ అధిష్ఠానం నుంచి ఉత్తర్వులు అందాయని బుధవారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. 13 సంవత్సరాలు పార్టీలో వివిధ కీలక బాధ్యతలు నిర్వహించానని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

సమస్య గుర్తించి.. సామరస్యంగా పరిష్కరించి

పైపు ద్వారా రాళ్లు తొలగిస్తున్న రైతులు

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: పెరుమాళ్లపల్లి మేజర్ పరిధిలోని వినుకొండ మైనర్ కాలువ తూములో గుర్తు తెలియని వ్యక్తులు పెద్ద రాళ్లు, పట్టలు పెట్టి నీరు రాకుండా చేయడంతో రైతులు ఇబ్బంది పడ్డారు. 300 ఎకరాల్లో సాగు చేసిన మిర్చి, పొగాకు, మొక్కజొన్న పంటలు దెబ్బతినే పరిస్థితి నెలకొంది. మరో రెండు రోజుల్లో నీరు నిలిపేస్తారని, తూము పగలకొడితే సమస్యలు వస్తాయని భావించిన రైతు వెనిగళ్ల బాలాజీ సమస్యను రైతు సంగం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము దృష్టికి తీసుకెళ్లాడు. ఎన్నెస్పీ ఈఈ శ్రీనివాసరావుకు విషయం తెలిపారు. జేఈ హేమంత్ రైతులతో కలిసి మూడు గంటలు శ్రమించి రాళ్లు తొలగించడంతో సమస్య పరిష్కారమైంది. రైతులు ఆనందం వ్యక్తం చేశారు. చిన్నదిబ్బయ్య, కొండయ్య, రాజేంద్ర నాయక్, చెంచురెడ్డి, శాంతయ్య, శ్రీకాంత్, యలమంద, గాలెయ్య తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

వినుకొండ రూరల్, మల్లమ్మసెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే: వినుకొండ మండలం విఠంరాజుపల్లి సమీపంలోని పప్పు మిల్లుల వద్ద మంగళవారం రాత్రి రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే ఎస్సై రాజమోహన్‌రావు తెలిపిన వివరాల ప్రకారం సుమారు 40 ఏళ్ల వయసు గల వ్యక్తి ప్రశాంతి రైలు వచ్చే సమయానికి పట్టాలపైకి రావడాన్ని పైలెట్ గమనించి హారన్ కొట్టినా వెళ్లలేదన్నారు. మృతుడు నీలం, నలుపు రంగు చెక్స్ చొక్కా, కాఫీ రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని, మృతుని ఆచూకీ తెలిసినవారు నరసరావుపేట రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

చేతివృత్తులతో ఆర్థికంగా వృద్ధి

మహిళలకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న డాక్టర్ జయమ్మ

చిలకలూరిపేట పట్టణం: చిలకలూరిపేట ఒయాసిస్ సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా కుట్టుశిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు బుధవారం ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పండరీపురం కేజే ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమంలో సంస్థ అధ్యక్షురాలు కందిమళ్ల జయమ్మ మాట్లాడారు. మహిళలకు చేతివృత్తులలో శిక్షణ ఇస్తే వారు ఆర్థికంగా వృద్ధి చెందుతారన్నారు. కుట్టుమిషన్ కూడా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు కరణం విజయలక్ష్మి, ఎండీ కరీమా, డాక్టర్ ప్రఫుల్లాదేవి, పి. రమాదేవి, కందిమళ్ల నారాయణమూర్తి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో ఆదాయం

రైతులకు సాగుపై సూచనలిస్తున్న ఉద్యానశాఖ అధికారులు

గణపవరం (చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే : ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు మంచి ఆదాయం లభిస్తుందని చిలకలూరిపేట ఉద్యాన శాఖ అధికారి ఆర్. శ్రీలక్ష్మి తెలిపారు. నాదెండ్ల మండలం గణపవరం, బుక్కాపురం రైతులకు సాగు, పంటలో నీటి యాజమాన్యం సస్యరక్షణ తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో బుధవారం అవగాహన కలిగించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యానశాఖ అధికారి శ్రీలక్ష్మి మాట్లాడుతూ సమయానికి నీటి సరఫరా చేసుకోవడం, నేలలో తేమ నిల్వ చేసే పద్ధతులు, తగిన ఎరువుల పరిమాణం తదితర అంశాలపై వివరించారు. గోద్రేజ్ కంపెనీ అధికారులు డాక్టర్ సుభాష్, క్షేత్ర సహాయకులు, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

తీగలు అల్లుకుని.. పొదరిల్లులా చేసుకుని

వినుకొండ మండలం నాగులవరంలో వినుకొండ-అద్దంకి రోడ్డు పక్కన విద్యుత్తు స్తంభానికి పిచ్చి మొక్కలు, గడ్డి జాతి తీగలు అల్లుకున్నాయి. స్తంభంతో పాటు రెండు వైపులా తీగలకు పాకుతూ పొదరిల్లులా మారింది. దీని కారణంగా అప్పుడప్పుడు విద్యుత్తు తీగల నుంచి నిప్పురవ్వలు వస్తున్నాయని గ్రామస్థులు అంటున్నారు. వెంటనే పిచ్చి మొక్కలను తొలగించాలని కోరుతున్నారు. దీనిపై రూరల్ ఏఈ శ్రీనివాసరావును సంప్రదించగా వెంటనే సిబ్బందిని పంపి తొలగిస్తామన్నారు. - **న్యూస్‌టుడే, వినుకొండ రూరల్**

(c) eenadu

సత్తెనపల్లి

• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

కేంద్రీయ విద్యాలయం ప్రారంభిస్తాం

స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మాచర్ల పట్టణం, న్యూస్‌టుడే: రానున్న విద్యాసంవత్సరం నుంచే కేంద్రీయ విద్యాలయం ప్రారంభిస్తామని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ప్రసాద్ తెలిపారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల కేంద్రీయ విద్యాలయాల డిప్యూటీ కమిషనర్ సంతోష్ ఆదేశాల మేరకు బుధవారం మాచర్లలో కేంద్రీయ విద్యాలయానికి కేటాయించిన స్థలాన్ని ఎంఈవో అల్లి సురేష్‌తో కలిసి ఆయన పరిశీలించారు. పీడబ్ల్యూడీ కాలనీలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో తాత్కాలికంగా తరగతులు ప్రారంభించేందుకు గదులు, మరుగుదొడ్లు, తాగునీటి సరఫరా తదితర అంశాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో సర్వేయర్ శ్రీనివాసరావు, వీఆర్వో నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కార్మికుల డిమాండ్లపై చర్చలు

కార్మికులతో ఎమ్మెల్యే యరపతినేని

దాచేపల్లి, న్యూస్‌టుడే: గామాలపాడు సమీపంలోని ఆంధ్రా సిమెంట్స్ (సాగర్ గ్రూప్) పరిశ్రమలో మూడు రోజులుగా కార్మికులు నిరసన తెలియజేస్తున్నారు. వేతనాలు పెంచాలని డిమాండు చేస్తున్నారు. బుధవారం కార్మికులు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావును గుంటూరులోని కార్యాలయంలో కలిసి సమస్యను విన్నవించారు. దీంతో ఆయన చరవాణి ద్వారా ఫ్యాక్టరీ యాజమాన్యంతో మాట్లాడారు. యాజమాన్యం సానుకూలంగా స్పందించి 4, 5 రోజుల్లో కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. దీంతో కార్మికులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
కారంపూడి: 80085 73185 గురజాల: 80085 7 3176

? అమరావతిలోని బండ చేను కాలనీలో రాత్రి సమయంలో వీధి దీపాలు వెలగక ఇబ్బంది పడుతున్నాం. - **కాలనీ వాసులు**
✔ మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరిస్తాం. - **నాగరాజు, పంచాయతీ కార్యదర్శి** - న్యూస్‌టుడే, అమరావతి

? అచ్చంపేట మండలం మిట్టపాలెంలోని ప్రధాన వీధిలో మురుగు తొలగించాలి. - **గ్రామస్థులు**
✔ మురుగు తొలగించి, పారిశుద్ధ్య పనులు వెంటనే చేపడతాం. - **షేక్ రసూల్, పంచాయతీ కార్యదర్శి** - న్యూస్‌టుడే, అచ్చంపేట

? బెల్లంకొండ పెద్ద మసీదు వద్ద మురుగు కాలువ అధ్వానంగా ఉంది. ముళ్లపొదలు పెరుగుతున్నాయి. - **ఎం.సూర్యనారాయణ**
✔ వెంటనే ముళ్ల పొదలు తొలగించి, పారిశుద్ధ్య పనులు చేపడతాం. - **గిరిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి** - న్యూస్‌టుడే, బెల్లంకొండ

? రెంటచింతలలో జనరిక్ మందుల దుకాణం ఏర్పాటు చేయాలి. - **కేశవరెడ్డి, శ్రీనివాసరావు**
✔ జనరిక్ మందుల దుకాణం ఏర్పాటు విషయంపై ఉన్నతాధికారులకు తెలియజేస్తాం. - **కృష్ణారెడ్డి, సీహెచ్‌సీ వైద్యుడు** - న్యూస్‌టుడే, రెంటచింతల

ఉపాధికి ఢోకాలేదిక!

పొదుపు మహిళలకు ప్రభుత్వం చేయూత

రఘురామ్‌నగర్(సత్తెనపల్లి), మాచర్ల, గురజాల, న్యూస్‌టుడే:

పట్టణ స్వయం సహాయక సంఘ సభ్యుల జీవనోపాధుల కల్పనకు కూటమి ప్రభుత్వం అనేక కార్యక్రమాల్ని అమలు చేస్తోంది. బ్యాంకు లింకేజీ రుణాలను అందజేస్తూనే విద్యావంతులైన అతివలకు వివిధ ఉపాధి మార్గాల్ని చూపిస్తోంది. నెలకు రూ.25 వేలు నుంచి రూ.35 వేలు వరకు ఆదాయ కల్పనకు అవకాశాలు సృష్టిస్తోంది. కుటుంబానికొక వ్యాపారవేత్తను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రోత్సహిస్తోంది. ఇంటి పట్టునే స్వయం ఉపాధిపై పొదుపు మహిళలు దృష్టి సారించాల్సిన తరుణమిదే.

సత్తెనపల్లిలో స్వయం సహాయక సంఘ సభ్యులు

డిజిలక్ష్మి సెంటర్లు.. కామన్ సర్వీస్ సెంటర్ తరహాలో డిజిలక్ష్మిలను ఏర్పాటు చేసేందుకు అవసరమైన సాంకేతిక శిక్షణ, పరికరాలను డిగ్రీ విద్యార్హత ఉన్నవారికి అందజేస్తున్నారు. సత్తెనపల్లి పట్టణంలో 32, పిడుగురాళ్ల 35, మాచర్ల 32, గురజాల 13, దాచేపల్లిలో 23 డిజిలక్ష్మి సెంటర్లను ఏర్పాటు చేయాలనే లక్ష్యం ఉంది.

ర్యాపిడో వాహనాలు.. డ్రైవింగ్‌పై పట్టు ఉన్న మహిళలకు ర్యాపిడో వాహనాలు అందజేసి వాహన చోదకంతో ఉపాధి కల్పించనుంది. దీనికి ర్యాపిడో సంస్థతో మెప్మా ఒప్పందం కుదుర్చుకుంది. సత్తెనపల్లిలో 40, పిడుగురాళ్ల 36, మాచర్ల 38, దాచేపల్లి 26, గురజాలలో 20 మంది చొప్పున పొదుపు మహిళలకు వాహనాలు అందించాలన్న ఆలోచన చేస్తున్నారు. ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

అమృత మిత్రలుగా.. పర్యావరణ పరిరక్షణ స్పృహ ఉన్న మహిళలకు మొక్కల సంరక్షణ బాధ్యత అప్పగించి ఉపాధి కల్పించనున్నారు. అమృత మిత్రలుగా వారిని ఎంపిక చేయనున్నారు. సత్తెనపల్లిలో 60, పిడుగురాళ్ల 800, మాచర్ల 100, దాచేపల్లి 490, గురజాలలో 1,850 మొక్కల సంరక్షణ బాధ్యతల్ని అక్కడి సంఘాల్లోని సభ్యులకు అప్పగించనున్నారు.

వ్యాపార వేత్తలుగా.. కుటుంబానికి ఒక మహిళా వ్యాపారవేత్తను తీర్చిదిద్దాలనే లక్ష్యంలో భాగంగా సత్తెనపల్లి పట్టణంలో 80, పిడుగురాళ్ల 72, మాచర్ల 76, దాచేపల్లి 52, గురజాలలో 40 నూతన వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు రుణ చేయూత అందించనున్నారు.

★ టీ దుకాణాలు, ఫాస్ట్‌ఫుడ్ దుకాణాలు ఉపాధి కల్పన కేంద్రాలుగా పట్టణాల్లో మారాయి. డ్వాక్రా మహిళలు ముందుకొస్తే ప్రభుత్వం వారితో చాయ్‌రస్తాలు, ఎగ్‌కార్టులను ఏర్పాటు చేయిస్తుంది. ఉత్సాహంతో ముందుకొస్తే చాలు ఉపాధికి ఢోకాలేని వాతావరణాన్ని కల్పిస్తుంది. రుణాలు ఇచ్చి, ప్రోత్సాహకం అందిస్తుంది. ఈ అవకాశాలను పట్టణ పొదుపు మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మెప్మా పీడీ మురళీకృష్ణ తెలిపారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

అచ్చంపేట, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు డీఆర్‌డీఏ కోర్సుల ప్రతినిధి అశోక్ పేర్కొన్నారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ కంప్యూటర్ ఆపరేటర్, సేల్స్ రిటైల్ అసోసియేట్ కోర్సుల్లో శిక్షణ ఇస్తామన్నారు. నరసరావుపేటలోని కేంద్రంలో శిక్షణ ఉంటుందని, వివరాలకు జాబ్స్ కోఆర్డినేటర్ అరుణ్ చరవాణి నంబరు 72072 18883లో సంప్రదించాలన్నారు.

విశిష్ట సంఖ్య పొందండి

బెల్లంకొండ, న్యూస్‌టుడే: మండలంలోని రైతులందరూ 11 అంకెల విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలని ఏవో అరుణకుమారి తెలిపారు. మండల వ్యాప్తంగా 70 శాతం మాత్రమే భూ హక్కుదారులు విశిష్ట సంఖ్య తీసుకున్నారని, మిగిలిన వారు నమోదు చేసుకోవాలన్నారు. సీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, వ్యవసాయ పరికరాలు, బీమా, నష్టపరిహారం తదితర పథకాలు పొందేందుకు విశిష్ట సంఖ్య తప్పనిసరి అన్నారు.

అక్రమ విద్యుత్తు వాడకంపై చర్యలు

రూ.3.39 లక్షల అపరాధ రుసుం

వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్తు అధికారులు

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: మాచర్ల మండలంలో విద్యుత్తు అధికారులు ఈఈలు సుందరబాబు, సింగయ్య ఆధ్వర్యంలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. అక్రమంగా విద్యుత్తు వినియోగిస్తున్న వారికి రూ.3.39 లక్షల అపరాధ రుసుం విధించారు. బుధవారం రాయవరం, కొత్తూరు, కొత్తపల్లి, హస్మాబాద్‌తండా, గన్నవరం, గోపాలపురం, [illegible] గ్రామాల్లో 4,543 సర్వీసులను తనిఖీ చేశారు. మీటరు లేకుండా విద్యుత్తు వాడుతున్న, మీటరు ఉండి అక్రమంగా వినియోగిస్తున్న, అనుమతించిన లోడు కంటే ఎక్కువగా వాడుతున్న, కేటగిరీలను మార్చి ఉపయోగిస్తున్న 89 మందిని గుర్తించి రూ.3.39 లక్షల అపరాధ రుసుం విధించినట్లు అధికారులు తెలిపారు. డీఈఈలు రామయ్య, మల్లికార్జునప్రసాద్, శ్రీనివాసరావు, రవికుమార్, ఏఈలు పాల్గొన్నారు.

ఎన్జీవో అసోసియేషన్ ఉపాధ్యక్షుడికి సత్కారం

గురజాల, న్యూస్‌టుడే: ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సూరేపల్లి రాజశేఖర్‌ను గురజాల ఆర్డీవో కార్యాలయంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఆర్డీవో మురళీకృష్ణ, తహసీల్దార్ దుర్గేష్, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి

చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్, కన్నా చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న తెదేపా నాయకులు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని మున్సిపల్ మాజీ ఛైర్మన్ యెల్లినేడి రామస్వామి అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల్ని ప్రభుత్వం విడుదల చేసిన సందర్భంగా పట్టణంలోని ప్రజావేదికలో బుధవారం టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుకు ఎలాంటి ఇబ్బందులులేకుండా మంత్రి నారా లోకేశ్ చర్యలు తీసుకుంటున్నారన్నారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి చౌటా శ్రీనివాసరావు, టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు గొల్లపల్లి వీరాంజనేయులు, షారోన్‌కుమార్, వెంకటేశ్వర్లు, మస్తాన్‌వలి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్రోసూరు(అచ్చంపేట): ప్రభుత్వం రూ.736 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయడం హర్షణీయమని నాయీబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల రంగారావు అన్నారు. క్రోసూరులో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

అమరేశ్వరాలయ ఈవో తీరుపై విమర్శలు

అమరావతి, న్యూస్‌టుడే: అమరావతికి జర్మనీ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్ బుధవారం వచ్చారు. అమరేశ్వరాలయానికి ఉదయం 11.20 గంటలకు చేరుకున్నారు. ఆ సమయంలో ఆయనకు స్వాగతం పలికేందుకు ఈవో రేఖ అందుబాటులో లేరు. సిబ్బంది, అర్చకులు స్వాగతం పలకడంపై అధికారుల్లో చర్చనీయాంశంగా మారింది. అనంతరం జర్మనీ కాన్సుల్ జనరల్ అమ్మ వారికి పూజలు నిర్వహిస్తున్న సమయంలో ఈవో వచ్చారు. దీనిపై ఈవోను అడగ్గా అప్పటికప్పుడు చెప్పడంతో కాన్సుల్ జనరల్ వచ్చే సమయానికి చేరుకోలేకపోయానని తెలిపారు.

ఒలింపియాడ్‌లో ప్రతిభ

విజయపురిసౌత్, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి గణిత ఒలింపియాడ్‌లో ఏపీఆర్‌జేసీ విద్యార్థులు 1, 2, 3, 5 ర్యాంకులు సాధించినట్లు ఏపీఆర్‌ఈఐఎస్ డిప్యూటీ సెక్రటరీ రఘునాథ్, ప్రిన్సిపల్ సరోజిని తెలిపారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి సోమేశ్వరకుమార్ మొదటి ర్యాంకు, రాహుల్ దేవీ ప్రసాద్ రెండో ర్యాంకు, నగేశ్ మూడో ర్యాంకు, వెంకట యశ్వంత్ అయిదో ర్యాంకు సాధించినట్లు వివరించారు. వారిని ప్రత్యేకంగా అభినందించారు.

సమస్యల పరిష్కారం బాధ్యత అధికారులదే

వృద్ధురాలి సమస్య వింటున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అమరావతి, న్యూస్‌టుడే: గ్రామాల్లో సమస్యలను గుర్తించి, వాటికి పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులదేనని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని లేమల్లెలో ప్రజల వద్దకే ప్రవీణ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. అర్జీలను స్వీకరించారు. రహదారులు, మురుగు కాలువల నిర్మాణం చేపట్టాలని పలువురు ఆయనను కోరారు. ఇంటి స్థలాలు, పింఛన్లు ఇప్పించాలని విన్నవించారు. అనంతరం గ్రామంలో పర్యటించారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు జానీ సైదా, తహసీల్దార్ దానియేలు, ఎంపీడీవో శివపార్వతి, మండల తెదేపా అధ్యక్షుడు రాజా, జానీ, మొగయ్య పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర సాధనకు బలమైన పునాది

పెదకూరపాడు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలో స్వర్ణాంధ్ర సాధనకు బలమైన పునాదులు వేసిందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ అనేక సవాళ్లను అధిగమిస్తూ రాష్ట్ర పునర్నిర్మాణమే లక్ష్యంగా చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనలో చారిత్రక విజయాలను సాధించామన్నారు.

శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

మాచర్ల పట్టణం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా మాచర్ల డిపో నుంచి శైవ క్షేత్రాలకు 42 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు మేనేజరు వీరాస్వామి తెలిపారు. పాలువాయి మీదుగా సత్రశాలకు 25 బస్సులు, గురజాల నుంచి గోలి మీదుగా సత్రశాలకు రెండు బస్సులు, గురజాల నుంచి దైదకు 3 బస్సులు, దుర్గి మీదుగా మన్నేపల్లికి ఒకటి, తేరాలకు ఒకటి, శ్రీశైలానికి 10 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆయన వివరించారు.

క్రీడాకారుడికి అభినందన

మాచర్ల పట్టణం, న్యూస్‌టుడే: ఇటీవల జరిగిన జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటిన మాచర్ల సెయింట్ ఆన్స్ విద్యార్థి బోయిడ్ల కుమార్‌ను బుధవారం ప్రిన్సిపల్ సుజాత అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని పాఠశాల, రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు సామంత్‌రెడ్డి, నరసింహారెడ్డి తదితరులు విద్యార్థిని సత్కరించారు.

ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక వాహనం

అమరావతి, న్యూస్‌టుడే: అమరేశ్వరాలయంలో జరిగే ఉత్సవాల సమయంలో ఉత్సవ విగ్రహాలను తీసుకెళ్లేందుకు అర్చకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ధరణికోటకు చెందిన నర్రా ఉదయభాస్కర్ ఆయన కుమారుడు వెంకటకృష్ణ జ్ఞాపకార్థం వాహనాన్ని తయారు చేయించి బహూకరించారు. బుధవారం వాహనాన్ని ఈవో రేఖకు అందజేశారు.

ప్రమాదానికి తలుపులు వేయండి

పట్టణంలోని వావిలాల పార్కులో మోటార్లు, విద్యుత్తు లైన్లకు సంబంధించి ఫ్యూజుల స్విచ్‌బోర్డు బాక్సులకు తలుపులు సరిగ్గా లేవు. రెండు స్విచ్‌బోర్డుల బాక్సులకు ఒకటే డోర్ ఉంది. అవి ఎప్పుడూ తెరచి ఉంటున్నాయి. పిల్లలు ఆడుకుంటూ అటువైపు వెళ్తే ప్రమాదాలు చోటుచేసుకునే పరిస్థితులు ఉన్నాయి. ప్రమాదాలు జరగకముందే తలుపులు మూసి, రక్షణ చర్యలు చేపట్టాలని తారకరామసాగర్ వాకర్స్ అధికారులను కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, సత్తెనపల్లి**

‘మట్టి’ కరిచిన నాణ్యత

రోడ్డు అంచుల వెంబడి వేసిన మట్టి

పెదకూరపాడు, న్యూస్‌టుడే: అత్తలూరు-పెదకూరపాడు రహదారిపై ప్రయాణ కష్టాలు తొలగేలా లేవు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో రహదారి నిర్మించినా.. తొమ్మిది నెలలకే ధ్వంసమైంది. నాణ్యతా లోపంతో కొన్నాళ్లకే దెబ్బతింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ రూ.2 కోట్ల నిధులు మంజూరు చేయించారు. 11 కిలోమీటర్ల మేర రహదారిని తవ్వి కంకర పరచి తారు పోశారు. నిర్మాణ పనులు దక్కించుకున్న గుత్తేదారు దారి అంచుల భద్రతను గాలికొదిలేశారు. అంచుల వెంబడి గ్రావెల్ మట్టి వేయాల్సి ఉండగా, పక్కన కందకాల్లోని మట్టి, పూడిక వేస్తున్నారు. ఇందులో పెద్దఎత్తున రాళ్లు ఉన్నాయి. ఆ బండరాళ్లతో ప్రమాదం పొంచి ఉంది. వర్షాకాలంలో అంచు దిగితే వాహనం కూరుకుపోయే అవకాశం ఉంది.

ఆర్కే బుల్స్.. అదుర్స్

మొదటి బహుమతి సాధించిన ఎడ్లు

మాచవరం: మాచవరంలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య స్వామి కల్యాణం సందర్భంగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఎడ్ల పందేలు రసవత్తరంగా సాగుతున్నాయి. బుధవారం రెండోరోజు జత పళ్ల, సేద్యం (న్యూ కేటగిరి) విభాగంలో బండలాగుడు పోటీలు నిర్వహించారు. జత పళ్ల విభాగంలో ఆర్కే బుల్స్ వారి అత్తోట శిరీషా, శివకృష్ణ చౌదరి (వేటపాలెం, చుండూరు, బాపట్ల జిల్లా) ఎడ్లు 3,165.11 అడుగుల దూరం బండలాగి మొదటి బహుమతి కైవసం చేసుకున్నాయి. చాగంటి శ్రీనివాసరావు(గుంటూరు), బెల్లం సుధీర్ (ఉప్పుగుండూరు, ప్రకాశం జిల్లా) సంయుక్త ఎడ్లు 3,074.7 అడుగుల దూరం లాగి రెండో, మైలా త్రివేణి నాయుడు (కావూరి లింగంగుంట్ల, చిలకలూరిపేట) ఎడ్లు 2,770 అడుగుల దూరం లాగి మూడో బహుమతిని దక్కించుకున్నాయి. ★ పాల పళ్ల విభాగంలో కడియం మణికంఠ (బయ్యారం, క్రోసూరు) ఎడ్లు 4,400.4 అడుగుల దూరం బండలాగి మొదటి స్థానంలో నిలిచాయి. చంద్రా వెంకటేశ్వర్లు (నందలూరు, కృష్ణా జిల్లా) ఎడ్లు 3,934.0 అడుగుల దూరం లాగి రెండో, పుచ్చకాయల శేషాద్రి చౌదరి (మద్దిరాల, ముప్పాళ్ల, ప్రకాశం జిల్లా) ఎడ్లు 3,752.7 అడుగుల దూరం లాగి మూడో స్థానాన్ని గెల్చుకున్నాయి. ఎడ్ల యాజమానులకు నగదు బహుమతులు అందజేశారు.

ఉంగుటూరులో పత్తి దొంగలు

అమరావతి, న్యూస్‌టుడే: పొలాల్లో పత్తిని దొంగలిస్తున్న వ్యక్తులను గ్రామస్థులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన ఘటన ఉంగుటూరులో చోటు చేసుకుంది. పెదకూరపాడుకు చెందిన కొందరు ముఠాగా ఏర్పడి నాలుగు రోజుల నుంచి ఉంగుటూరు పొలాల్లో పత్తి దొంగలించినట్లు గుర్తించారు. గ్రామస్థులు గమనించి వారిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

పంటల పరిశీలన

పెదకూరపాడు, న్యూస్‌టుడే: రబీలో సాగైన మొక్కజొన్న, కంది పంటలను ఏవో కృష్ణయ్య బుధవారం పరిశీలించారు. మొక్కజొన్న పంటలో ఎటువంటి చీడపీడలు లేవన్నారు. కంది పూత దశలో బెట్టకు రాకుండా నీటి తడి, పిందె దశలో మరో తడి అందించాలన్నారు. అనంతరం రైతుల సందేహాలను నివృత్తి చేశారు.

భక్తులకు ఇబ్బందుల్లేకుండా బందోబస్తు

క్యూలైన్లను పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటరమణ

అమరావతి, న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట బందోబస్తు నిర్వహిస్తామని డీఎస్పీ వెంకటరమణ అన్నారు. బుధవారం అమరేశ్వరాలయాన్ని ఆయన సందర్శించారు. క్యూలైన్లు, స్నానఘాట్లు పరిశీలించారు. అభిషేకం క్యూలైన్‌లో కొన్ని మార్పులు చేయాలని ఆలయ అధికారులకు సూచించారు. ప్రాంగణంలో ఎక్కడిక్కడ బారికేడ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఈవో రేఖ, సీఐ అచ్చయ్య, ధర్మకర్తల మండలి సభ్యులు వీరబాబు, వెంకట్రావు ఉన్నారు.

గురజాల గ్రామీణ: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని దైదకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని దేవాదాయ శాఖ ఉప కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. దైద అమరలింగేశ్వరస్వామి ఆలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. తొలుత స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం శివరాత్రి ఏర్పాట్లపై ఆరా తీశారు. క్యూలైన్లు, మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యంపై సూచనలు చేశారు. ఆలయ ఈవో పూర్ణచంద్రరావు, ఛైర్మన్ సాంబశివరావు పాల్గొన్నారు.

రెంటచింతల: మహాశివరాత్రికి సత్రశాలలో జరుగుతున్న ఏర్పాట్లు తక్షణమే పూర్తి చేయాలని దేవాదాయశాఖ డీసీ శ్రీనివాసరావు ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం ఆలయ పనులను తనిఖీ చేశారు. ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల దర్శనానికి ఏర్పాటు చేస్తున్న క్యూలైన్లను పరిశీలించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ గుండా శివయ్య పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌పై ప్రచారం చేయాలి

మాట్లాడుతున్న న్యాయమూర్తి విజయకుమార్‌రెడ్డి

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: వచ్చే నెల 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌పై విస్తృతస్థాయిలో ప్రచారం నిర్వహించి, ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చూడాలని మండల న్యాయసేవాధికార కమిటీ ఛైర్మన్, సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) వి.విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక కోర్టు హాలులో బుధవారం సత్తెనపల్లి న్యాయస్థానాల పరిధిలోని పోలీసు అధికారులు, ఎక్సైజ్ శాఖ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉభయుల అంగీకారంపై రాజీపడదగిన కేసుల్ని గుర్తించి, వాటిని పరిష్కరించడంపై దృష్టి సారించాలన్నారు. జడ్జిలు తౌషిద్ హుస్సేన్, సుజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టుకార్డుల ఉద్యమం

పోస్టు కార్డులు బాక్సులో వేస్తున్ననాయకులు

మాచర్ల పట్టణం, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ పీఆర్సీని వెంటనే ప్రకటించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నాసర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రికి పోస్టుకార్డులను పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ వేతన కమిషన్‌ను వెంటనే నియమించాలని, బకాయిలను చెల్లించాలని కోరారు. ఏళ్లుగా తమ డిమాండ్లు నెరవేరడం లేదన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి, పరిష్కరించాలన్నారు.

సరికొత్త నైపుణ్యాలతో ఉపాధి

నరసరావుపేట అర్బన్: విద్యార్థులు ఉద్యోగావకాశాలు పొందాలంటే సరికొత్త నైపుణ్యాలు సాధించాలని జేఎన్‌టీయూ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు అన్నారు. ఎంఏఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం టెక్‌ఫెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయం పరిశ్రమల అవసరాలు గుర్తించి అందుకు అనుగుణంగా పాఠ్యప్రణాళిక అమలు చేస్తుందని తెలిపారు.

రైతు పథకాలపై అవగాహన

యాప్‌లపై అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి జగ్గారావు

అచ్చంపేట (క్రోసూరు), న్యూస్‌టుడే: రైతులందరూ విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేయించుకోవాలని, తద్వారానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీలు, పథకాలు అందుతాయని జిల్లా వ్యవసాయాధికారి జగ్గారావు తెలిపారు. బుధవారం క్రోసూరు మండలంలో ఆయన పర్యటించారు. రైతు మక్కెన శ్రీనివాసరావు బొప్పాయి తోటను సందర్శించారు. ఈ-పంట నమోదును పర్యవేక్షించారు. అనంతరం క్రోసూరు-1 రైతు సేవా కేంద్రంలో రైతులతో ముఖాముఖి మాట్లాడారు. వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు మస్తానమ్మ, ఏవో వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ పోయినది

చుండు తిరుమలేష్ S/o బుచ్చయ్య ధరణికోట గ్రామము అమరావతి (మం), పల్నాడు జిల్లా. నా యొక్క డాక్యుమెంట్‌కు సంబంధించిన ఒరిజనల్ లింకు డాక్యుమెంట్ No: 18of/BK111/1996 D.No: 356-1D3లో య.1.00 ధరణికోట గ్రామము, అమరావతి (మం) పొలమునకు సంబంధించిన లింకు డాక్యుమెంటు తీసుకొని జిరాక్స్ కొరకు 9-2-2026వ తేదిన అమరావతి సెంటర్‌కు పోవుచుండగా దారిలో పోయినది. దొరికిన వారు

సంప్ర: 9912203067

మేలుజాతి లేగదూడల ప్రదర్శన

లేగదూడలను పరిశీలిస్తున్న పశువైద్యులు

ధూళిపాళ్ల(సత్తెనపల్లి గ్రామీణ): ధూళిపాళ్లలోని పశు వైద్యశాల ప్రాంగణంలో మేలుజాతి లేగదూడల ప్రదర్శన బుధవారం జరిగింది. దూడల పెంపకంలో చేపట్టాల్సిన అంశాలు, గడ్డి పెంపకం గురించి పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు అనిల్‌కుమార్ వివరించారు. గేదెలలో తిరిగి పొర్లుట గురించి, టీకాలు, ఏలిక పాముల నివారణ తదితరాలపై ఏడీలు జి.వీరయ్య, ఎం.శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. పశువైద్యులు శ్రీనివాసరావు, పుల్లారెడ్డి, శ్రీదేవి, బాలకృష్ణారెడ్డి, తెదేపా నాయకులు కేదార్‌నాథ్, శివప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

పల్లె ప్రగతికి పెద్దపీట

చిన అగ్రహారంలో రోడ్డు నిర్మాణం

కుమ్మరిపాలెం (పిడుగురాళ్ల), దాచేపల్లి, న్యూస్‌టుడే: పల్లెల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. అన్ని వీధుల్లో సిమెంటు రోడ్ల నిర్మాణానికి సిద్ధం చేశారు. పల్లె పండగ ద్వారా రహదారులతో పాటు మురుగు కాలువల నిర్మాణానికి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు నిధులు మంజూరు చేయించారు. గురజాల నియోజకవర్గంలోని పిడుగురాళ్ల, మాచవరం, దాచేపల్లి, గురజాల మండలాలకు రూ.4.97 కోట్లు ఉపాధి హామీ నిధులు కేటాయించారు. దాచేపల్లి మండలంలో 9, గురజాల 16, మాచవరం 11, పిడుగురాళ్ల మండలంలో 15 పనులు చేపట్టనున్నారు.

గ్రామాల వారీగా నిధులు

దాచేపల్లి మండలం పొందుగుల రూ.10 లక్షలు, శ్రీనివాసపురం రూ.10 లక్షలు, శ్రీనగర్ రూ.10 లక్షలు, గామాలపాడు రూ.25 లక్షలు, తక్కెళ్లపాడు రూ.15 లక్షలు, పెదగార్లపాడు రూ.20 లక్షలు, భట్రుపాలెం రూ.5 లక్షలు, కాట్రపాడు రూ.5 లక్షలు, ముత్యాలంపాడు రూ.20 లక్షలు, గురజాల మండలం దైద రూ.35 లక్షలు, పల్లెగుంత రూ.15 లక్షలు, గోగులపాడు రూ.15 లక్షలు, జనార్ధనపురం రూ.3 లక్షలు, మాడుగుల రూ.25 లక్షలు, అంజనాపురం రూ.29 లక్షలు, మాచవరం మండలం చెన్నాయిపాలెం రూ.15 లక్షలు, తురకపాలెం రూ.10 లక్షలు, శ్రీరుక్మిణీపురం రూ.15 లక్షలు, పిల్లుట్ల రూ.15 లక్షలు, నాగేశ్వరపురం తండా రూ.10 లక్షలు, ఎస్సీతండా రూ.10 లక్షలు, కొత్తగణేశునిపాడు రూ.15 లక్షలు, పిన్నెల్లి రూ.20 లక్షలు, గంగిరెడ్డిపాలెం రూ.10 లక్షలు, గాంధీనగర్ రూ.5 లక్షలు, పిడుగురాళ్ల మండలం కోనంకి రూ.15 లక్షలు, పాతగణేశునిపాడు రూ.10 లక్షలు, వీరాపురం రూ.10 లక్షలు, చెన్నాయిపాలెం రూ.10 లక్షలు, చినఅగ్రహారం రూ.15 లక్షలు, పెదఅగ్రహారం రూ.20 లక్షలు, కామేపల్లి రూ.15 లక్షలు, అయ్యప్పనగర్ రూ.5 లక్షలు, కరాలపాడు రూ.20 లక్షలు, పందిటివారిపాలెం గ్రామానికి రూ.10 లక్షలు చొప్పున మంజూరయ్యాయి.

సార్వత్రిక సమ్మెకు సంఘీభావం

సంఘీభావం తెలియజేస్తున్న ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ బాధ్యులు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు గురువారం తలపెట్టిన జాతీయ సార్వత్రిక సమ్మెకు సంఘీభావం తెలియజేస్తున్నట్లు ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ సత్తెనపల్లి శాఖ బాధ్యుడు పెండెం మణిరావు తెలిపారు. స్థానిక ఎన్జీవోస్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

పెదకూరపాడు: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను విరమించుకోవాలని, నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని నియోజకవర్గ ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసరావు కోరారు. 12న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం పెదకూరపాడులో బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

14న నేత్ర వైద్య శిబిరం

నరసరావుపేట అర్బన్: డాక్టర్ కోడెల శివప్రసాదరావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 14న ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాజాగారి కోటలోని కోడెల శివప్రసాదరావు వైద్యశాల ప్రాంగణంలో ఉదయం 9 గంటలకు సేవలు ప్రారంభం అవుతాయన్నారు.

వేలం ప్రకటన

మహారాజ శ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో సత్తెనపల్లి E P no 100 / 2025 in OS NO.1482/2023
బిట్వీన్
బాష్యం శంకర్ Represented by జి.పి.ఎ. హోల్డర్ - కొండవీటి నరసింహారావు --- డిక్రీ హోల్డర్
మరియు
యార్లగడ్డ నరసింహారావు --- జడ్జిమెంట్ /డెటార్
పై నెంబరు ఇ. పి ధాకాల డిక్రీ బాకీని రాబట్టుకొనుటకు గాను డిక్రీ హోల్డర్. జడ్జిమెంట్ డేటారు పై ఇ.పి ధాఖలు చేయగా శ్రీ కోర్టువారు విచారించి సదరు డిక్రీ బాకీని రాబట్టుటకు గాను జడ్జిమెంట్ డేటారు స్వాధీన హక్కు భుక్తములలో గల ఈ దిగువ తెలిపిన స్థిరాస్తిని శ్రీ కోర్టువారు ది.02.03.2026 తేదీన ఉదయం గం.10.30 ని॥లకు పై కోర్టులో బహిరంగ వేలం జరుపుటకు నిర్ణయించి యున్నారు, కావున యావన్మందికి తెలియజేయునది ఏమనగా కొనుగోలు చేయదలచిన వారు కోర్టు వారి షరతులకు లోబడి పై తేదీన శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై వేలం పాటలో పాల్గొని పాట పాడుకొనవచ్చునని తెలియపరచడమైనది.
షెడ్యూల్ :- గుంటూరు జిల్లా ప్రస్తుతం పల్నాడు జిల్లా - నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా- సత్తెనపల్లి సబ్ రిజిస్ట్రేషన్- ముప్పాళ్ల మండలం- రుద్రవరం గ్రామము తొండపి గ్రామ సర్వే .నెం.32/సి1 లో య. 3.3 సెంట్లు లేక 1.3476 హెక్టార్లు భూమికి హద్దులు: తూర్పు : సర్కారు డొంక హద్దు. దక్షిణం : ముత్తినేని మస్తాన్‌రావు భూమి హద్దు. పడమర : యార్లగడ్డ రామారావు భూమి హద్దు. ఉత్తరం : యార్లగడ్డ వెంకటేశ్వర్లు వగైరాల భూమి హద్దు. డిక్రీ హోల్డర్ విలువ: రూ 29,00,000/- అమీనా విలువ : 70,00,000/-
ఈసి దాఖలా అన్యాక్రాంతములు లేవు
వేలం తేది 02.03.2026,
తదుపరి విచారణ తేది. 09-03-2026
శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
బి.యల్.చిన్నయ్య, డిక్రీ హోల్డర్
సత్తెనపల్లి తరుపు న్యాయవాది సత్తెనపల్లి.

దగ్గరి దారని.. దూరం కావద్దు..!

మక్కువ, సీతానగరం మండలాల సరిహద్దు గ్రామాలైన వెంకటభైరిపురం, కొత్తవలస మధ్య ఆనకట్ట ఇది. దీని పైనుంచి రాకపోకలు చేయకూడదని అధికారులు హెచ్చరిస్తున్నా.. దగ్గరి దారి కావడంతో ఇటుగానే వెళ్తున్నారు. గతంలో చాలా మంది ఈ ప్రాంతంలో కాలు జారి ప్రాణాలు పోగొట్టుకున్న ఘటనలున్నాయి. అయినాసరే రాకపోకలు ఆగడం లేదు.
– న్యూస్‌టుడే, మక్కువ

పుస్తకాలే కాదు.. సీసాతో నీళ్లూ పట్టుకెళ్లాలి

పాఠశాలల్లో పనిచేయని శుద్ధి యంత్రాలు

వైకాపా ప్రభుత్వ హయాంలో 'నాడు-నేడు' పనుల తీరిది. పార్వతీపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఆర్వో ప్లాంటు ఇచ్చారు. ఇప్పటికి అయిదుసార్లు పాడైపోతే మరమ్మతులు చేశారు. మళ్లీ మొరాయించడంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు హెచ్‌ఎం వరప్రసాద్ తెలిపారు. ప్రస్తుతం 380 మంది విద్యార్థుల కోసం పురపాలక కుళాయి నీరు ట్యాంకులో నింపి, అందుబాటులో ఉంచారు. కొందరు బాలలు ఇంటి నుంచి నీళ్ల సీసాలు తెచ్చుకుంటున్నారు.

న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

పాఠశాల విద్యార్థులకు రక్షిత నీరు అందించాలన్న సంకల్పం పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చడం లేదు. గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపంతో విద్యా సంస్థల్లో బాలలకు రక్షిత నీటి అవస్థలు తప్పడం లేదు. నాడు-నేడులో పాఠశాలలకు మంజూరు చేసిన ప్లాంట్లు నిర్వహణ సక్రమంగా లేక 80 శాతానికిపైగా వినియోగానికి దూరంగా ఉన్నాయి. వీటి బాగుకు తక్షణ చర్యలు ఎక్కడా ఉండటం లేదు. వేసవి నేపథ్యంలో అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది. కూటమి ప్రభుత్వం దృష్టిసారించి పరిస్థితి చక్కదిద్దాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

సాలూరు: సాలూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలతోపాటు పలు ప్రాథమిక బడుల్లో ప్లాంట్లు లేక విద్యార్థులు ఇళ్ల నుంచి నీటిని సీసాలతో తెచ్చుకుంటున్నారు. విరామ, మధ్యాహ్న భోజన సమయంలో వాటినే తాగుతున్నారు. పాఠశాలలో బోరు నుంచి ట్యాంకులకు పట్టిన నీటిని తాగటానికి వినియోగించాల్సిన పరిస్థితి కూడా ఉంది. పట్టణంలో 24 పాఠశాలలుండగా.. 13 చోట్ల ప్లాంట్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

★ నాడు-నేడు తొలి విడతలో 486 పాఠశాలల్లో పనులు చేపట్టారు. దీనికి రూ.118.09 కోట్లు వెచ్చించారు. వీటిలో కొంత మొత్తంతో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్లు చాలా చోట్ల చిన్నచిన్న మరమ్మతులతో మూలకు చేరాయి.

★ రెండో విడతలో 535 పాఠశాలల్లో పనులు చేపట్టారు. రూ.144.51 కోట్లకుగాను గత వైకాపా ప్రభుత్వం రూ.55.45 కోట్లు మాత్రమే విడుదల చేసింది. దీంతో నిర్మాణ పనులు చాలా చోట్ల నిలిచిపోయాయి. మరోపక్క 70 శాతం ఆర్వో ప్లాంట్లు అమర్చలేదు. ఏర్పాటు చేసిన వాటిల్లోనూ చాలా వరకు పనిచేయడం లేదు.

చర్యలు తీసుకుంటాం

పాఠశాలల్లో ఎక్కడా తాగునీటికి ఇబ్బంది లేకుండా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. ఆర్వో ప్లాంట్ల పరిస్థితి పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.
– బ్రహ్మాజీరావు, డీఈవో

● జిల్లాలో మొత్తం పాఠశాలలు: **1,487** ● విద్యార్థులు: **66,280** మంది ● ప్రథమ, ద్వితీయ విడతల్లో అందించిన ఆర్వో ప్లాంట్లు: **1,021** ● తాగునీరు అందిస్తున్నవి: **20** శాతం మాత్రమే

కట్టింది పిల్లల కోసం.. కడుతోంది పశువులను!

చిన్నారుల భవితను తీర్చిదిద్దేందుకు నిర్మించిన అంగన్‌వాడీ భవనాల దుస్థితికి అద్దం పట్టే చిత్రమిది. మక్కువ మండలం శంబర గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం-3 నిర్మాణ పనులు ఏడేళ్ల కిందట ప్రారంభించారు. అప్పట్లో రూ.7 లక్షలు నిధులు మంజూరుకాగా స్లాబ్ వరకు నిర్మించి.. ద్వారాలు, కిటికీలు ఏర్పాటుచేసి వదిలేశారు. అసంపూర్తి నిర్మాణాన్ని స్థానికులు ఇలా పశువుల శాలగా వినియోగిస్తున్నారు. నంద గ్రామంలోని మూడేళ్ల కిందట రూ.14 లక్షలు మంజూరైన కేంద్రానిదీ అదే తీరు. – న్యూస్‌టుడే, మక్కువ

ఓటుతోనే భవిత.. తెలుసుకో యువత

– న్యూస్‌టుడే, పార్వతీపురం

ప్రతి ముగ్గురిలో ఒక్కరే నమోదు

యువశక్తి.. భారతదేశానికి ఆస్తి. అందుకే 18 ఏళ్లు దాటిన ప్రతి పౌరుడూ ఓటు పొందేలా రాజ్యాంగం హక్కును అందించింది. దేశ భవితను మార్చగలిగే ఈ వజ్రాయుధాన్ని పొందే అవకాశానికి యువత ఎందుకో దూరమవుతోంది. జిల్లా గణాంకాలు పరిశీలిస్తే.. ప్రతి ముగ్గురిలో ఒక్కరు మాత్రమే ఓటరుగా నమోదయ్యారు.

● జిల్లాలో 25,419 మంది 18-19 ఏళ్ల వయస్సులు ఉన్నట్లు అంచనా. ఇప్పటివరకు కేవలం 8,387 మంది మాత్రమే ఓటుహక్కు పొందారు.
● 17 వేల పైచిలుకు నమోదు కావాల్సి ఉంది.

ఓటర్లు ఎక్కువ.. యువతరం తక్కువ

● జిల్లాలో పురుష ఓటర్లతో పోల్చి చూస్తే మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. పురుషులు 3,85,189 మంది ఉండగా, స్త్రీలు 4,03,624 మంది ఉన్నారు.
● కొత్తగా ఓటరుగా చేర్చేందుకు 18-19 ఏళ్ల యువతులు 12,781 మంది ఉండగా.. నమోదైన వారు మాత్రం కేవలం 3,534 మందే.
● అదే యువకుల్లో 12,698 మంది ఉన్నట్లు అంచనా కాగా.. 4,150 మంది ఓటర్లుగా చేరారు.

చైతన్యానికి చర్యలు: ఓటరుగా ప్రతి వయోజన పౌరులు చేరేలా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. విద్యార్థుల స్థాయిలోనే ఓటుపై అవగాహన, ప్రజాస్వామ్యంలో ఓటు విలువ తెలియజేసేలా పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నాం. కొత్త ఓటర్లను చేర్చేందుకు అన్ని చర్యలు చేపడుతున్నాం. - కె.హేమలత, జిల్లా రెవెన్యూ అధికారి

జట్టు.. స్వచ్ఛ పార్వతీపురం సాధించేట్టు

స్వచ్ఛ పార్వతీపురమే సాధనగా.. పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా ముందుకెళ్తోంది జట్టు స్వచ్ఛంద సంస్థ. వ్యర్థానికి సరికొత్త అర్థం చెబుతూ.. పట్టణంతోపాటు చుట్టుపక్కల ఉన్న 15 మండలాలకు చెందిన ప్రజలను భాగస్వామ్యం చేసింది. స్వచ్ఛ ఆశయంతో అడుగులు వేస్తూ ఇంటింటా వ్యర్థాలను సేకరిస్తోంది. వాటిని శక్తి, ఆదాయ మార్గాలుగా మార్చుతూ పది మందికి ఉపాధి కల్పిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి ప్రశంసలు సైతం పొందింది.

– న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం, పురపాలక

జిల్లా కేంద్రం శివారులో రాయగడ రోడ్డులోని జట్టు ఆశ్రమం నిర్వాహకురాలు పద్మజ పర్యావరణానికి హానికలిగించే ప్లాస్టిక్ సేకరణకు 2017-18లో నడుం కట్టారు. కొవిడ్ సమయంలో ఆటంకం ఏర్పడింది. తర్వాత 2020లో మళ్లీ వీధుల్లో తిరుగుతూ ప్లాస్టిక్ వల్ల ఎదురయ్యే అనర్థాలు వివరించారు. ఇంటికి చేరిన ప్లాస్టిక్, పాలిథిన్ కవర్లను భద్రపరిచి.. తమకు అందించాలని సూచించారు. అలా ప్రారంభమైన సేకరణకు విశ్రాంత ఉద్యోగుల సంఘం, యువత, అపార్టుమెంటులోని మహిళల సహకారం తోడైంది.

కొబ్బరి చిప్పలను పీచుగా మార్చుతున్న యంత్రం

చెత్తే గురుదక్షిణ

ఆశ్రమంలో శాస్త్రీయ నృత్యం, కిక్ బాక్సింగ్ నేర్చుకునేందుకు వస్తున్న పిల్లలు చెత్తను కానుకగా ఇవ్వాలని ఆమె సూచించడంతో వారంతా వారం పాటు ఇంటి వద్ద సేకరించిన చెత్తను ఆదివారం సాధనకు వచ్చేటప్పుడు అప్పగిస్తున్నారు. ప్లాస్టిక్, పాత దుస్తులు, అట్టలు, గాజు, థర్మాకోల్ ఏదీ అనర్థం కాదంటూ సేకరించి భూమిపై పేరుకుపోకుండా తమవంతు కృషి చేస్తున్నారు. తొలినాళ్లలో చెత్తను పురపాలక శాఖకు అప్పగించారు. తర్వాత యంత్రాల సాయంతో చెత్తను బండిల్స్‌గా మార్చి పునర్వినియోగానికి వేరే ప్రాంతానికి తరలిస్తున్నారు. అందుకు కొంత మంది స్వచ్ఛందంగా, మరికొంత మంది రుసుము కోసం పనిచేస్తున్నారు.

గ్యాస్ తయారీ

ఇప్పటివరకు పొడి చెత్త సేకరించారు. ఇప్పుడు తడిచెత్తపై దృష్టి సారించారు. మార్కెట్‌లో పారబోసే ఆకులు, కూరగాయలు, పండ్లు, కొబ్బరి బొండాలు తదితర వాటిని యువత సేకరిస్తున్నారు. వీటిని గ్యాస్, విద్యుత్తు తయారీకి వినియోగిస్తున్నారు. ప్రస్తుతం గ్యాస్ తయారీ యూనిట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇందులో వచ్చిన వ్యర్థాలను పొలాలకు గెత్తంగా వాడొచ్చు.

రేపటితరం కోసం..: ప్రకృతిని ఆరాధించే వాళ్లం దాన్ని పాడుచేయకుండా ఉండాలన్న ఆలోచనతో చెత్త సేకరణకు నడుం కట్టాం. మాకు ఎంతోమంది సహకారం తోడైంది. తడి చెత్త కుళ్లి పరిసరాలు దుర్గంధంగా మారుతున్నాయి. ఆ పరిస్థితికి అడ్డుకట్ట వేయాలని గ్యాస్ తయారీకి అడుగులు వేశాం. అధికారులు సహకరిస్తే మంచి ఫలితాలు తీసుకురావచ్చు.
– పద్మజ, ఆశ్రమ నిర్వాహకురాలు

33 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఇంటర్మీడియట్ పరీక్షలు జరిగేలా ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని డీఐఈవో వై.నాగేశ్వరరావు సూచించారు. బుధవారం కార్యాలయంలో జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీతో సమావేశం నిర్వహించారు. 33 కేంద్రాల్లో జరగనున్న ఈ పరీక్షలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఇప్పటికే విద్యుత్తు, పురపాలక, పోలీసు, వైద్య ఆరోగ్య, తపాలా తదితర శాఖలతో చర్చించామని తెలిపారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బంది రాకుండా అంతా ముందస్తుగా ఏర్పాటు చేసుకోవాలని చెప్పినట్లు పేర్కొన్నారు. సిట్టింగ్, ఫ్లైయింగ్ స్క్వాడ్‌ల ఏర్పాటు, రూట్లు, పరీక్ష పేపర్ల భద్రతలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కమిటీ సభ్యులతో చర్చించారు. అన్ని చోట్ల సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందని, ఎక్కడా చూచిరాతలకు ఆస్కారం లేకుండా పక్కాగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రిన్సిపల్స్ ఎస్.రమణ, వి.హరగోపాల్, ఎ.రాజు పాల్గొన్నారు.

తలచుకున్నారు.. క్వాంటమ్‌లో గెలుచుకున్నారు

న్యూస్‌టుడే– రాజాం

విద్యార్థులకు సృజన కీలకం.. మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకుంటూ.. తమదైన నైపుణ్యాలను జోడిస్తేనే విజయాలు సొంతమవుతాయి. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి జాతీయస్థాయిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన అమరావతి 'క్వాంటమ్ హ్యాకథాన్' పోటీల్లో జీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఆర్.సాయివివేక్, వి.దినేష్, కె.శివశంకర్, ఎం.వెంకటకృష్ణ, అబ్దుల్‌యూనస్, పి.రాజేశ్వరి బృందం తీర్చిదిద్దిన 'క్వాంటమ్ స్టేట్ విజువలైజర్' ప్రాజెక్టు ప్రథమ స్థానం సాధించింది. విజేత బృందానికి రూ.50 వేలు, బంగారు పతకాలు, జ్ఞాపికలను అందించారు. అక్కడితో అయిపోలేదండోయ్.. ప్రతిష్ఠాత్మక ఐబీఎం సంస్థ స్టైఫండ్‌తో కూడిన ఇంటర్న్‌షిప్‌నకు వీరిని ఎంపిక చేశారు. ఉద్యోగాలూ ఇస్తామని ప్రకటించారు. విజయం బృంద సభ్యుల మాటల్లోనే...

జీరో నుంచి మొదలు పెట్టి..

అమరావతి క్వాంటమ్ హ్యాకథాన్ ప్రకటన వెలువడినప్పుడు మాకు కనీస అవగాహన లేదు. సీఎస్ఈ విభాగం ప్రొఫెసర్ల ప్రోత్సాహంతో సాధన మొదలు పెట్టాం. ఐబీఎం క్వాంటమ్ కంపోజర్, కిస్కిట్ లెర్నింగ్ మాడ్యూల్స్, మైక్రోసాఫ్ట్ క్వాంటమ్ లెక్చర్లు, అంతర్జాతీయ పరిశోధన పత్రాలను అధ్యయనం చేస్తూ.. నేర్చుకుని పట్టు సాధించాం. కళాశాలలో అంతర్గత హ్యాకథాన్ నిర్వహించగా అందులో 14 బృందాలతో పోటీపడి విజయం సాధించడంతో ఆత్మవిశ్వాసం మరింత పెరిగింది.

ప్రాజెక్టు విశిష్టతను న్యాయనిర్ణేతకు వివరిస్తున్న విద్యార్థులు

పది రోజుల్లోనే తొలి నమూనా..

క్వాంటమ్ గురించి అందరికీ అర్థమయ్యే విధంగా ప్రాజెక్టు ఉండాలని ప్రభుత్వం సూచించింది. దానికి తగ్గట్టుగా సర్క్యూట్ లోపల జరిగే ప్రక్రియలను కళ్లకు కనిపించేలా చూపించే సాధనం రూపొందించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. పది రోజుల్లోనే తొలి నమూనా సిద్ధం చేశాం. పీహెచ్‌డీ అధ్యాపకుల సూచనలతో మరింత మెరుగుపరిచాం. గణితం, కోడింగ్ వంటి అర్థంకాని భాషకు బదులుగా.. దృశ్య రూపంలో వివరించడంతో అందరూ సులువుగా తెలుసుకునేందుకు వీలుండేలా జాగ్రత్తలు తీసుకున్నాం. సెప్టెంబరు 9న విశాఖలోని గాయత్రి విద్యాపరిషత్తులో జరిగిన సెమీఫైనల్‌లో విజయం సాధించాం.

14 బృందాలతో తలపడ్డాం..

సెమీఫైనల్ పోటీలు ముగిశాక.. రాష్ట్ర ఉన్నత విద్యామండలి గతేడాది డిసెంబరులో నాలుగు వారాల పాటు 'క్వాంటమ్ సాంకేతికత'పై శిక్షణ ఇచ్చింది. దాన్ని అందిపుచ్చుకుని అయిదు నెలల్లో 'క్యూబిట్ ట్రేసర్' పేరుతో ఎడ్యుకేషనల్ ప్లాట్‌ఫాంగా ప్రాజెక్టును తీర్చిదిద్దాం. ఏఐ ఆధారిత క్వాంటమ్ అసిస్టెంట్, బ్లాక్ స్ఫియర్ విజువలైజేషన్, గేమిఫైడ్ లెర్నింగ్, రియల్ హార్డ్‌వేర్ ఇంటిగ్రేషన్ వంటి ఆధునిక ఫీచర్లు జోడించాం. ఈనెల 6న పది విభాగాల్లో నిర్వహించిన తుది పోటీల్లో 'క్వాంటమ్ స్టేట్ విజువలైజర్' విభాగంలో 14 బృందాలతో తలపడి ప్రథమ స్థానంలో నిలిచాం.

కార్యశాల.. గదుల్లో కాదు.. ప్రకృతి గుండెల్లో..

శిక్షణకు హాజరైన వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి

సాలూరు, న్యూస్‌టుడే: వ్యవసాయ, అనుబంధ శాఖల కార్యశాల.. జిల్లాస్థాయిలో సంబంధిత అధికారులు సిద్ధమైపోయారు. ఎప్పుడూ కలెక్టరేట్‌లోనో.. వీసీగానో జరిగే తంతుకు ఈసారి వేదిక మారింది. పచ్చని తోట నడుమ.. ప్రకృతి నీడన కలెక్టర్ అధ్యక్షతన సాగింది.

జిల్లా వ్యవసాయ గ్రామీణ పరివర్తన ప్రణాళికపై అధికారులకు పట్టణం సమీపంలో ఓ మామిడి తోటలో బుధవారం కార్యశాల నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పంటల మార్పిడి, అధిక దిగుబడులు వచ్చే వాటిపై రైతులకు ఆసక్తి కల్పించాలన్నారు. ఎక్కువ ధర వచ్చే, మార్కెట్‌లో గిరాకీ ఉండే పంటల సాగు విస్తీర్ణం పెంచాలన్నారు. టిష్యూ అరటి, పుట్టగొడుగు, పాల ఉత్పత్తులు, పాడి పరిశ్రమ అభివృద్ధిపై దృష్టిసారించాలన్నారు. పంటలకు సర్టిఫికేషన్ రావాలని, దానికి రైతులపై ఆర్థికభారం పడకుండా సాయం అందిద్దామన్నారు. సంప్రదాయ సాగులో దేశంలోనే నంబర్ వన్ స్థానంలో జిల్లాను నిలబెట్టాలన్నారు. జిల్లా వ్యవసాయ, పశుసంవర్ధక, మైక్రో ఇరిగేషన్, ఉద్యానశాఖల అధికారులు అన్నపూర్ణ, మన్మథరావు, రాధాకృష్ణ, సత్యనారాయణ రెడ్డి, కేవీకే శాస్త్రవేత్త దురవ, డ్వామా పీడీ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టెడన్నం.. పరమానందం

గూడు లేక రోడ్డుపై తిరిగేవారు కొందరు.. బిడ్డలు ఇంటి నుంచి బయటకు పంపేయడంతో దీనస్థితిలో గడుపుతున్న వృద్ధులు మరికొందరు. అలాంటి వాళ్లకు చేతనైనంత సాయం చేయాలని, ఒక పూటైనా కడుపు నింపాలని సంకల్పించారు పార్వతీపురం పట్టణానికి పలువురు. ఏళ్లుగా నిర్విరామంగా అన్నదానంతో వేలాది మంది ఆకలి తీరుస్తూ.. స్ఫూర్తిగా నిలుస్తున్నారు.
– న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం, పురపాలక

బ్రహ్మంగారి కూడలి వద్ద అన్నదానం

పట్టణంలోని ప్రధాన రహదారిలో ఉన్న నెయ్యిలవీధి సమీపంలో బ్రహ్మంగారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అక్కడ నిత్యం దీపారాధన, పూజలు చేస్తుంటారు. అక్కడే చుట్టుపక్కల పేదల ఆకలి బాధలపై పట్నాల మోహన్ స్పందించారు. 2018లో అన్నదానానికి నడుం కట్టారు. స్నేహితులు, తోటి వృత్తి పనివారు, దాతల సహకారంతో ముందడుగు వేశారు. దాతల సహకారం ఉన్నప్పుడు వారి పేరున రోజూ 50-60 మందికి భోజనం అందిస్తున్నారు. ఆ రోజుకు దాతలు దొరకని పక్షంలో స్వయంగా ఆయనే నిధులు సమకూర్చుకుంటున్నారు. పట్టెడన్నం దొరికితే చాలనుకునే ఆ పేదలకు దాతల సహకారం మేరకు పులిహోర, అన్నం, సాంబారు, పండు, మిఠాయి, బూరె తదితర వాటిని పెడుతున్నారు.

◆ జిల్లా ఆసుపత్రిలో జిల్లేలమూడి అమ్మ సేవా సంస్థ సభ్యులు నిరంతరాయంగా రోగుల సహాయకులకు మధ్యాహ్నం నాలుగేళ్లుగా అన్నదానం చేస్తున్నారు. పూర్వ విద్యార్థులంతా కలిసి తలో చేయి వేసుకోవడం, దాతల సహకారంతో రోజుకు 100-150 మందికి అన్నదానం చేస్తున్నారు. ఆసుపత్రిలో రోగుల సహాయకులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నాలుగేళ్లుగా ఆహారం అందిస్తున్నారు.

గిరిజనుల ఘోష వినిపిస్తాం

గిరిజనులకు ప్రాతినిధ్యం వహిస్తున్న తెదేపా శాసన సభ్యులు వీరంతా. మన్యంవాసుల గొంతు వినిపించడానికి బుధవారం ప్రారంభమైన శాసనసభ సమావేశాలకు ఇలా వెళ్లారు. చిత్రంలో రంపచోడవరం ఎమ్మెల్యే శిరీష, పోలవరం ఎమ్మెల్యే బాలరాజుతో పాటు జిల్లాకు చెందిన కురుపాం ఎమ్మెల్యే, విప్ జగదీశ్వరి, సాలూరు ఎమ్మెల్యే, గిరిజన సంక్షేమశాఖ మంత్రి జి.సంధ్యారాణి, పాలకొండ ఎమ్మెల్యే ఎన్.జయకృష్ణ ఉన్నారు.
– న్యూస్‌టుడే, పార్వతీపురం

ప్రతిభకు ప్రశంస

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: స్టేషన్ల పరిధిలో అపరిష్కృతంగా ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. బుధవారం తన కార్యాలయంలో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో నేరాల నియంత్రణకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లి, సమన్వయంతో పనిచేయాలన్నారు. మహిళలు, చిన్నారుల అదృశ్యం కేసుల్లో అలసత్వం చూపించకుండా తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసు స్టేషన్ల పరిధిలో పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని చెప్పారు. సాంకేతికతపై అంతా పట్టుసాధించి నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. స్టేషన్లవారీగా కేసులపై సమీక్షించారు. విధి నిర్వహణలో ప్రతిభ చూపిన అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. అదనపు ఎస్పీ వెంకటేశ్వరరావు, ఏఎస్పీ మనీషారెడ్డి, పాలకొండ డీఎస్పీ రాంబాబు, ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి, ఎస్బీ సీఐ రమణమూర్తి, డీసీ ఆర్బీ సీఐ ఆదాం, సీసీఎస్ సీఐ అప్పారావు, సీఐ నీలయ్య, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశంసా పత్రం అందిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

ఇంటి దగ్గరే పోషకాహారం

● పునరావాస కేంద్రాల అవసరం తగ్గింపు ● జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలు

న్యూస్‌టుడే, పార్వతీపురం

వయసుకు తగ్గ బరువు, ఎత్తు లేని పిల్లలను పోషక విలువలు ఉన్న ఆహారం అందని వారిగా గుర్తించి.. అదనపు ఆహారం, వైద్యం అందించేందుకు పౌష్టికాహార పునరావాస కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రస్తుతం జిల్లాలో పార్వతీపురం, సీతంపేట ఆసుపత్రులకు అనుబంధంగా ఈ పునరావాస కేంద్రాలు నడుస్తున్నాయి. ఇకపై అలాంటి వారిని పునరావాస కేంద్రాలకు పంపించాల్సిన అవసరం లేకుండా.. ఇంటి దగ్గరే అనుబంధ పోషకాహారాన్ని అందించనున్నారు.

కొత్త విధానంపై అవగాహన కల్పిస్తున్న నర్సింహమూర్తి

ఈ ఆలోచనను రాష్ట్రవ్యాప్తంగా రెండు మూడు జిల్లాల్లో అమలు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లాను ఎంపిక చేశారు. టాటా ట్రస్ట్ ఆర్థిక సహకారంతో 'విజయవాహిని' సంస్థ ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తుంది. దీనిపై జిల్లాలో ఐసీడీఎస్ పథక అధికారులు, పర్యవేక్షకులు, ఎంపిక చేసిన అంగన్‌వాడీ కార్యకర్తలకు పార్వతీపురం ఐటీడీఏ గిరిమిత్రలో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర సలహాదారులు నర్సింహమూర్తి, విజయవాహిని సమన్వయకర్త సుబ్రహ్మణ్యం, ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ పాల్గొన్నారు.

ఇదీ లక్ష్యం

◆ జిల్లాలో 40 వేల మందికి పైగా చిన్నారులు ఉన్నారు. వీరిలో 4.5 శాతం అంటే 1,800 నుంచి 2 వేల మంది వరకు పోషక విలువల లోపంతో ఉన్నారు. వీరికి పార్వతీపురం, సీతంపేట ఎన్‌ఆర్సీలకు పంపించి ఎత్తు, బరువు, వయసు నిష్పత్తి సంతృప్తికర స్థాయికి తీసుకువచ్చేందుకు వీలుగా 14 రోజులపాటు వైద్యం, పోషకాహారం అందిస్తున్నారు. ◆ కేర్‌టేకర్‌గా వచ్చిన వారికి భోజనం, వసతి కల్పించడంతోపాటుగా రోజుకు రూ.100 చొప్పున ఇస్తారు. ◆ ఈ రెండు కేంద్రాల్లో ఉన్నవి కేవలం 40 పడకలు మాత్రమే. ఉపయోగించుకుంటున్నవారూ తక్కువే. ◆ ఈ పరిస్థితిని అధిగమించేందుకు కొత్తగా "కమ్యూనిటీ బేస్డ్ మేనేజ్‌మెంట్ ఆఫ్ ఎక్యూట్ మాల్‌న్యూట్రిషన్" కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ◆ ఇందులో చిన్నారిని ఎన్‌ఆర్సీకి పంపించాలా? ఇంటి దగ్గరే సేవ అందించొచ్చా అనే అంశాన్ని మెడికల్ అసెస్‌మెంట్ చేస్తారు. ◆ అనారోగ్యం లేని వారిని ఇంటి దగ్గరే ఉంచి మంచి ఆహారాన్ని అందిస్తారు. ◆ వైద్యసేవలు అవసరమని భావిస్తేనే ఎన్‌ఆర్సీలకు పంపించేలా చర్యలు తీసుకుంటారు. ◆ ఈ పథకాన్ని జిల్లాలో త్వరలో ప్రారంభించనున్నారు. దీనికి స్త్రీశిశు సంక్షేమశాఖను సమాయత్తం చేసేందుకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పీడీ కనకదుర్గ చెప్పారు.



(c) eenadu

చెట్టెక్కిన మీటరు.. ప్రమాదాన్ని కనరు!

ఈ చిత్రంలో చూశారా.. ఇదేదో ఓ ఇంటికి సంబంధించో, వ్యవసాయ అవసరానికో వ్యక్తులు ఏర్పాటు చేసుకున్న మీటరు బోర్డు కాదు.. ఓ గ్రామానికి తాగునీటిని సరఫరా చేసేందుకు ఓపెన్ బోరు నుంచి ట్యాంకుకు నీరు ఎక్కించేందుకు విద్యుత్తు మోటారు కోసం ఏర్పాటు చేసిన మీటరు బోర్డు ఇది. పాచిపెంట మండలం దిగువ గొట్టూరు గ్రామం సచివాలయానికి కూత వేటు దూరంలో పథకం కోసం తెచ్చిన బోర్డు ప్యానెల్‌ను ఇలా ప్రమాదకరంగా చెట్టుకు కట్టేశారు. ఆ ప్రాంతంలోని రైతులు, కూలీలు అక్కడే సేదదీరుతారు. పంట కోస్తుంటారు. ఏం ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. దీనిపై విద్యుత్తుశాఖ జేఈ సింహాచలం వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా పరిశీలించి, వేరే చోట ఏర్పాటు చేస్తామన్నారు.

– న్యూస్‌టుడే, పాచిపెంట

పైపు లీకైంది.. నీరు ఏరైంది!

విజయనగరం పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరా చేస్తున్న ముషిడిపల్లి తాగునీటి పైపులైనుకు బుధవారం కొండతామరాపల్లి కూడలిలో రంధ్రాలు ఏర్పడి లీకవడంతో నీరు వృథాగా పోతోంది. దీంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. పైపుల్లో వ్యర్థాలు కలవడంతో నీరు కలుషితమై రోగాల బారిన పడే ప్రమాదముందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నానిబాబు వద్ద ప్రస్తావించగా లీకులు అరికట్టేలా చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

రూ.కోట్ల వ్యయం... ఏరీ జనం!

గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీకి రూ.కోట్ల ప్రజాధనం వ్యయం చేసినా ప్రజల సొంతింటి కలను నెరవేర్చలేకపోయింది. రూ.3 కోట్ల ఖర్చుతో విద్యుత్తు సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయింది. రూ.2 కోట్లకు పైగా వ్యయంతో రక్షిత పథకం నిర్మిస్తున్నారు. గ్రావెల్ రహదారులకు రూ.60 లక్షల మేర ఖర్చు చేసింది. ఇలా మొత్తం కాలనీలో రూ.6.40 కోట్ల నిధులు ఖర్చు చేసింది. ఈ కాలనీలో 1,200 మందికి పైగా లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చినా ప్రస్తుతం 200 మంది నిర్మాణాలు పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు. తాగునీరు, కాలువలు, రహదారులు లేకపోవడంతో లబ్ధిదారులు నిర్మాణాలవైపు ఆసక్తి చూపడం లేదు. మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని నగరపంచాయతీ కమిషనర్ రత్నరాజ్ తెలిపారు.

– న్యూస్‌టుడే, పాలకొండ

గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధచూపాలి

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధచూపాలని ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆడిటోరియంలో ఏటీడబ్ల్యూవోలు, హెచ్‌ఎంలు, సంరక్షకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి విద్యార్థి ఆరోగ్య సమాచారాన్ని సీహెచ్‌టీఎస్(ఆరోగ్య రక్షణ ట్రాకింగ్ సిస్టమ్) యాప్‌లో రోజూ ఉదయాన్నే నమోదు చేయాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి వివరాలను ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. ప్రతి మూడు నెలలకు రక్త పరీక్షలు చేసి హెచ్‌బీని గుర్తించాలన్నారు. రక్తహీనత ఉన్న వారికి పోషికాహారం అందించాలని ఆదేశించారు. సికిల్‌సెల్ ఎనీమియా బాధితులకు ప్రత్యేక వైద్య సదుపాయాలు, మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాబోయే 2027లో పదో తరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థుల కోసం ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకురాలు ఎ.విజయశాంతి, ఏటీడబ్ల్యూవోలు, హెచ్‌ఎంలు, వార్డెన్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

15 నిమిషాల్లో సమాచారం చేరాలి

★ ప్రతి రోజు ఉదయం 5.30 గంటలకు యోగా కార్యక్రమం, ప్రతి నెలా విద్యార్థికి బ్యాటరీ పరీక్ష నిర్వహించాలి. వసతి గృహాలు, పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు, మరుగుదొడ్లు అవసరం ఉంటే అత్యవసరంగా చేయించాలి. పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. విద్యార్థుల ఆరోగ్యానికి తగిన పోషకాహారం అందించాల్సిన బాధ్యత వహించాలి. ★ అనుమతి లేని వ్యక్తులను, బయటి ఆహార పదార్థాలను పాఠశాలల ప్రాంగణంలోకి అనుమతించకూడదు. ★ ఏదైనా అత్యవసర పరిస్థితి లేదా, అవాంఛనీయ ఘటనలు జరిగినప్పుడు 15 నిమిషాల్లోపు ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలి.

సేవల్లో ఉత్తమం.. అందుకున్నారు పురస్కారం

విధి నిర్వహణతో గుర్తింపు సాధించిన రక్షణ అధికారులు

న్యూస్‌టుడే– బొబ్బిలి, కొత్తవలస

వృత్తిలో నిబద్ధత, నేరగాళ్ల నియంత్రణ, శాఖ ఆస్తుల రక్షణ, మాదక ద్రవ్యాలు, మానవ అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపడంలో ఉత్తమ ప్రతిభ చూపి.. ప్రశంసలు పురస్కారాలు అందుకున్నారు జిల్లాకు చెందిన రైల్వే భద్రత అధికారులు. బొబ్బిలి ఆర్‌పీఎఫ్‌లో సీఐగా పనిచేస్తున్న పీవీ పండా.. ఎస్సై డీఎస్ కృష్ణ రాష్ట్రపతి అవార్డులకు ఎంపికయ్యారు. గత నెల విశాఖలో జరిగిన గణతంత్ర వేడుకల్లో రైల్వే డీఆర్‌ఎం లలిత్ బోహ్రా, ఉన్నతాధికారుల నుంచి సత్కారాలు అందుకున్నారు. కొత్తవలస రైల్వేకు చెందిన ఏఎస్సై కిల్లి ఉమామహేశ్వరరావు రైల్వే జీఎం పరమేశ్వర్ ఫంక్వాల్ నుంచి 'విశిష్ట రైల్ సేవ పురస్కారం-2025' అందుకున్నారు.

అంచెలంచెలుగా ఎదుగుతూ..

ప్రఫుల్ల చంద్ర పండా బొబ్బిలి సీఐగా విధులు నిర్వహిస్తున్నారు. 1989లో ఖుర్దా రోడ్డు డివిజన్‌లో కానిస్టేబుల్‌గా చేరారు. బొగ్గు, మానవ అక్రమ రవాణాతో పాటు అంతర్రాష్ట్ర చోరీల నిర్మూలనకు కృషి చేశారు. 2001లో బిలాస్‌పూర్‌లో ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు. గంజాయి ఎగుమతి చేస్తున్న 30 మందిని అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించారు. 2019లో ఉద్యోగోన్నతిపై ఖుర్దా రోడ్‌లో సీఐగా వెళ్లారు. బొగ్గు అక్రమ మార్గంలో రవాణా చేస్తున్న 20 వాహనాలు సీజ్ చేసి, 60 మందిని అరెస్టు చేశారు. 2025 మార్చిలో బొబ్బిలి సీఐగా విధుల్లో చేరారు. బొబ్బిలి రైల్వే వంతెన దిగువ లైన్లకు సంబంధించి తీగల చోరీలో అంతర్రాష్ట్ర నిందితులను పట్టుకున్నారు

నేర పరిశోధనలో ప్రత్యేకత..

డి.వెంకట మురళీకృష్ణ బొబ్బిలి ఆర్‌పీఎఫ్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్నారు. 1995లో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. 2006లో హెడ్‌గా పదోన్నతి పొంది విశాఖ డివిజన్‌లో చేరారు. గంజాయి, మానవ అక్రమ రవాణా నిందితులను అరెస్టు చేశారు. రైళ్లలో బంగారం, నగదు చోరీలను నియంత్రించారు. బొగ్గు, గంజాయి రవాణాను నియంత్రించారు. బంగారం చోరీకి పాల్పడ్డ పలువుర్ని అదుపులోకి తీసుకుని, సుమారు 20 కేసులు రికవరీ చేశారు. 2017లో ఏఎస్సైగా ఉద్యోగోన్నతి అందుకున్నారు. 2024లో బొబ్బిలి వచ్చారు.

కానిస్టేబుల్ నుంచి..

శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి మండలం కూన జమ్మన్నపేటకు చెందిన ఉమామహేశ్వరరావు 2006లో ఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరి, 2021లో ఏఎస్సైగా పదోన్నతి పొందారు. ప్రస్తుతం ఈస్ట్ కోస్ట్ రైల్వేలో సేవలందిస్తున్నారు. క్రీడల్లోనూ ప్రతిభ చాటుతూ ఎన్నో పతకాలు కైవసం చేసుకున్నారు. తల్లిదండ్రులు లక్ష్మీనారాయణ, వరహాలమ్మ. అన్నయ్య మన్మథరావు అనకాపల్లి జిల్లా రిజిస్ట్రారుగా ఉన్నారు. ★ వివిధ చోరీ కేసుల్లో 75 మంది నిందితుల, నాలుగు ముఠాలను పట్టుకుని రూ.93.48 లక్షల విలువైన ఆస్తిని స్వాధీనం చేసుకున్నారు. ★ 35 మంది గంజాయి స్మగ్లర్లను అరెస్టు చేసి 582 కిలోల మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. ★ నార్కోటిక్ కేసుల్లో రూ.1.16 కోట్ల రికవరీ సాధించారు. ★ ఆపరేషన్ రైల్ ప్రహరీ కింద ఇద్దరు హత్య నిందితుల్ని పట్టుకున్నారు. * 12 మంది మానవ అక్రమ రవాణా బాధితుల్ని రక్షించారు.

ఉమా మహేశ్వరరావు పతకాలు

పక్కాగా జాతర ఏర్పాట్లు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: మహాశివరాత్రి జాతర నేపథ్యంలో పుణ్యగిరి, సన్యాసయ్యపాలెంలో ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్ డి.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. దేవాదాయశాఖ ఈవో నాగేంద్ర, సాంఘికవర్గాలు ఏర్పాట్ల వివరించారు. పుణ్యగిరిలో కొండ దిగువ నుంచి పైవరకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. భక్తుల కోసం తాత్కాలిక మరుగుదొడ్లు, స్నాన ఘాట్ల వద్ద మహిళలు దుస్తులు మార్చుకొనే గదులు నిర్మించాలన్నారు. కుళాయిల వద్ద ట్యాప్‌లు బిగించాలన్నారు. సన్యాసయ్యపాలెంలో స్వామిని దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. భద్రతపై ఎస్సై చంద్రశేఖర్, బస్సులపై డీఎం సుదర్శనరావు వివరించారు.

జాతర ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	130	230	240

లక్ష్యం గురి తపొద్దు

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: జిల్లాలో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులకు వార్షిక ఫైరింగ్ శిక్షణ బుధవారం సారిపల్లి ఫైరింగ్ రేంజ్ కేంద్రంలో జిల్లా ఎస్పీ ఎఆర్.దామోదర్ ఆధ్వర్యంలో కొనసాగింది. శిక్షణను ఆయన పర్యవేక్షించి మాట్లాడారు. పోలీసులు లక్ష్యం గురి తప్పకూడదన్నారు. అధికారుల నైపుణ్యం మెరుగుపర్చేందుకు ఏటా సాధన చేయాలన్నారు. ఒత్తిడిలోనూ లక్ష్యాన్ని ఛేదించాలన్నారు. అనంతరం ఎస్పీ పిస్టల్, గ్లాక్ పిస్టల్, ఎకే-47, ఎస్ఎల్ఆర్, ఎంకే-5, అలాగే ఎల్ఎంజీ వంటి అధునాతన ఆయుధాలతో ఫైరింగ్ సాధన చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ పి.సౌమ్యలత, డీఎస్పీ ఆర్.గోవిందరావు, ఎస్బీసీఐ లీలారావు, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు పాల్గొన్నారు.

ఎకే-47తో గురిపెడుతున్న ఎస్పీ దామోదర్

'ఐటీ హబ్‌కు సాగు భూములు తీసుకోవద్దు'

భోగాపురం, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల పరిధిలో ఐటీ హబ్, జి-హబ్‌ల ఏర్పాటు కోసం సాగు భూములను ప్రభుత్వం తీసుకోకుండా చూడాలని రైతులు కోరారు. భోగాపురం, ముంజేరు, నందిగాం గ్రామాలకు చెందిన రైతులు బుధవారం అమరావతిలో మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు ఆధ్వర్యంలో హోంమంత్రి వంగలపూడి అనిత, ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావును కలిసి సమస్యలను వివరించారు. సాగు భూములు పరిశ్రమ అవసరాలకు తీసుకోవద్దని, వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాల జీవనోపాధి దెబ్బతింటుందని వేడుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రులు హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. నాయకులు సుభాషణరావు, శ్రీనివాసరావు, రాంబాబు, హరిబాబు ఉన్నారు.

హోంమంత్రి అనితకు వినతిపత్రం ఇస్తూ సమస్య వివరిస్తున్న బంగార్రాజు, రైతులు

విద్యార్థిని ఆచూకీ లభ్యం

అయ్యన్నపేట: విజయనగరంలోని ఓ బాలికల వసతిగృహంలో ఉంటూ ఈనెల 3న అదృశ్యమైన విద్యార్థిని ఆచూకీ ఎట్టకేలకు లభ్యమైంది. రేగిడి మండలంలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థిని(19) నగరంలోని కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్స్ మొదటి సంవత్సరం చదువుతోంది. చర్మ సంబంధిత చికిత్స కోసం వైద్యుల దగ్గరికి వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లిన ఆమె తిరిగిరాలేదు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. చరవాణి కాల్ డేటా ఆధారంగా విజయవాడలో ఓ అబ్బాయి(17)తో ఉన్నట్లు గుర్తించారు. అక్కడికి వెళ్లి తీసుకొచ్చామని, బుధవారం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు రెండో పట్టణ ఎస్సై ప్రమీలాదేవి తెలిపారు.

జిందాల్ బినామీలకు మరోసారి నోటీసులు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: మండలంలోని బొడ్డవర ప్రాంతంలో జిందాల్ పరిశ్రమ భూసేకరణ వ్యవహారంలో 12 బినామీ లబ్ధిదారులకు అక్రమంగా అందుకున్న రూ.36.10 లక్షల పరిహారం చెల్లించాలంటూ తహసీల్దార్ డి.శ్రీనివాసరావు రెవెన్యూ రికవరీ(ఆర్ఆర్) యాక్టు కింద రెండోసారి నోటీసులు జారీ చేశారు. మంగళవారం వీఆర్వోలు 12మంది బినామీలకు వీటిని అందించాలని ఆదేశించారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ గతేడాది నవంబరులో మొదటగా ఇచ్చిన ఆర్ఆర్ యాక్టు నోటీసుపై 12 మంది తిరిగి సమాధానం ఇస్తూ ఏ ఆధారాలు కింద నోటీసులు ఇచ్చారో ఆ కాపీల ప్రతులు అందించాలని కోరుతూ లేఖ ఇచ్చారన్నారు. దీంతో సంబంధిత పత్రాలు జత చేస్తూ నోటీసు ఇచ్చామన్నారు. నోటీసు అందిన వారం రోజుల్లో తీసుకున్న పరిహారం తిరిగి ప్రభుత్వానికి చెల్లించాలని లేకపోతే రెవెన్యూ రికవరీ యాక్టు కింద మీ ఆస్తులను ఆటాచ్ చేస్తామని అందులో పేర్కొన్నామన్నారు. బినామీలకు అక్రమంగా పరిహారం చెల్లించారంటూ అప్పట్లో 'ఈనాడు'లో వెలువడిన కథనంతో ఇది వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. 12 మందికి రూ.36.10 లక్షలు చెల్లించినట్లు నిర్ధారించారు.

సీవోఈలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట ఐటీడీఏ పరిధిలోని మల్లి ప్రతిభా కళాశాల(పీవీటీజీ- బాలురు)లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతున్నట్లు పీవో పవర్ స్వప్నిల్ జగన్నాథ్ బుధవారం తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖ, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, తూర్పుగోదావరి, కాకినాడ, పశ్చిమగోదావరి, డా.బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన ఆదిమ గిరిజన విద్యార్థులు(పీవీటీజీ) దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. ఈ విద్యా సంవత్సరంలో పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరై ఉండాలని, తల్లిదండ్రుల సంవత్సర ఆదాయం రూ.లక్ష మించి ఉండకూడదన్నారు. ప్రవేశ పరీక్ష మెరిట్ మార్కుల ఆధారంగా సీట్ల కేటాయింపు జరుగుతుందన్నారు. ఎంపీసీ, బైపీసీ ఇంగ్లిష్ మీడియంలో వరుసగా 40, 40 సీట్లను భర్తీ చేయడం జరుగుతుందన్నారు. దరఖాస్తుకు మార్చి 4 చివరి తేదీ కాగా హాల్ టిక్కెట్లు 6వ తేదీ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, ప్రవేశ పరీక్ష మార్చి 8న సీతంపేట బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్ చూడాలని లేదా దగ్గర్లోని గిరిజన గురుకుల కళాశాలలు, ఐటీడీఏలోని గురుకులం సెల్‌కు సంప్రదించాలన్నారు.

మహారాజా ఆసుపత్రిని వైద్య కళాశాలకు తరలించాలి

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: విజయనగరంలోని మహారాజా ఆసుపత్రిలో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు బీశెట్టి బాబ్జీ పేర్కొన్నారు. మౌలిక సదుపాయాలు లేక, పడకలు సరిపోక వేదన అనుభవిస్తున్నారని చెప్పారు. ఇక్కడున్న కొన్ని విభాగాలను వెంటనే వైద్య కళాశాలకు తరలించాలని డిమాండు చేశారు. ఈమేరకు బుధవారం ఆసుపత్రి వద్ద నిరసన తెలిపారు. అక్కడున్న మదర్ థెరెసా విగ్రహానికి పూలమాలలు వేశారు. క్యాన్సర్ విభాగాన్ని మంజూరు చేసి, సేవలు అందించాలన్నారు. ఇప్పటికే ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులకు వినతిపత్రాలు అందజేసినట్లు గుర్తు చేశారు. నాయకులు రామచంద్రరాజు, పిడకల ప్రభాకరరావు, రామ్మోహన్‌రావు, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రి వద్ద నిరసన తెలుపుతున్న జిల్లా పౌరవేదిక సభ్యులు

ప్రమాదవశాత్తు చెరువులో పడి వృద్ధుడి మృతి

బాడంగి, న్యూస్‌టుడే: స్నానానికి దిగిన వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందిన ఘటన బాడంగి మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాలు ప్రకారం.. రావివలస గ్రామానికి చెందిన రేజేటి అప్పలస్వామి (75) తోటకు వెళ్లి, అక్కడి నుంచి ఉత్తరావల్లిలోని బంధువుల పండగకు వెళ్తానని మంగళవారం ఉదయం 10 గంటలకు బయలుదేరారు. తిరిగి ఇంటికి చేరలేదు. బంధువులను చరవాణిలో సంప్రదించగా.. అక్కడికి రాలేదని తెలిపారు. కుమారుడు అప్పారావు బుధవారం ఉదయం తోటకు వెళ్లి వెతికినా కనిపించలేదు. సమీపంలోని చెరువులో అప్పలనాయుడు మృతదేహం గుర్తించారు. ఒడ్డుపై దుస్తులు ఉంచి, స్నానానికి దిగడంతో ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెచ్‌సీ ప్రసాద్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పైడితల్లి హుండీ ఆదాయం రూ.32.39 లక్షలు

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు విజయనగరం పైడితల్లి చదురుగుడి హుండీ ఆదాయాన్ని స్థానిక కల్యాణ మండపంలో బుధవారం లెక్కించారు. 90 రోజులకు గానూ రూ.32.39 లక్షల నగదు, 39.200 గ్రాముల బంగారం, 285 గ్రాముల వెండి సమకూరిందన్నారు. దేవస్థానం ఈవో కె.శిరీష, ధర్మకర్తలు పాల్గొన్నారు.

కానుకలు లెక్కిస్తున్న దేవస్థానం సిబ్బంది, శ్రీవారి సేవా సంఘం సభ్యులు

భక్తులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: రామతీర్థంలో మహా శివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఉత్సవ ప్రత్యేకాధికారిణి శోభారాణి సూచించారు. బుధవారం ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. భక్తులకు స్నానాలు చేసేందుకు రామకోనేరు వద్ద ఘాట్‌లను సిద్ధం చేయాలన్నారు. క్యూలైన్లలో నిల్చున్న భక్తులకు షామియానాలు వేయాలని చెప్పారు. ఈవో వై.శ్రీనివాసరావు, ఆలయ అధికారులు, పాల్గొన్నారు.

రామతీర్థంలో అధికారులతో చర్చిస్తున్న ఉత్సవ ప్రత్యేకాధికారిణి శోభారాణి

యువకుడి దుర్మరణం

మరొకరికి తీవ్ర గాయాలు

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన బుధవారం రాత్రి కురుపాం మండలంలో చోటుచేసుకుంది. నీలకంఠాపురం ఎస్సై నీలకంఠరావు వివరాల ప్రకారం.. కురుపాం మండలం గుజ్జువాయి పంచాయతీ శ్రీరాంపురం గ్రామానికి చెందిన బిడ్డిక సాయికుమార్(23) తన పెద్దమ్మ రాజమ్మతో కలిసి ద్విచక్ర వాహనంపై సీతంపేట మండలం మర్రిమానుగూడ వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా ధర్మలక్ష్మీపురం సమీపంలోని రహదారి మలుపు వద్ద వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో సాయికుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. రాజమ్మ తీవ్రంగా గాయపడింది. స్థానికులు నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

మార్టగేజ్ లోన్స్, బిజినెస్, హౌసింగ్‌లోన్స్ మరియు రైస్‌మిల్ వారికి లోన్స్ చేయబడును. Cont: 7207307421.

WANTED

Do You Need a Staff for Business Hire with ease www.mrvijay.in HR Solutions ✆ 8309661801.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

REAL ESTATE

PLOT FOR SALE

చెల్లూరు 4 రోడ్ల జంక్షన్‌కు సమీపంలో VMRDA అప్రూవ్డ్ లేఅవుట్‌లో Open ప్లాట్లు అమ్మకమునకు కలవు. పాత ధరలో ఇవ్వబడును. ✆ 8522811566.

JOBS

ప్రముఖ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో సిస్టం ఆపరేటర్స్, స్టోర్స్‌లో హెల్పర్స్ కావలెను. B.Tech / Dip., ITI, 10th- డిగ్రీ. ✆ 8019647888, 8341177761.

వైజాగ్ హాస్టల్‌లో పనిచేయుటకు క్లీనింగ్ స్టాఫ్ మగ పనివారు కావలెను. ఉచిత భోజనం, వసతి కల్పించబడును. ✆ 6300442703.

SECURITY GUARDS

వైజాగ్‌సిటీ, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో పనికొరకు సెక్యూరిటీగార్డ్స్, రూమ్, భోజనం, PF, ESI కలదు. జీతం: 20 వేలు, 36 వేలు. Ph.: 6300071128.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

శివరాత్రికి పూర్తిస్థాయిలో ఏర్పాట్లు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: శివరాత్రి పర్వదినాన భక్తుల తాకిడిని ముందుగానే అంచనా వేసి, తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి ఆదేశించారు. రామతీర్థం, పుణ్యగిరి, ధర్మవరం, పాల్తేరు, కోటిపల్లి తదితర శివాలయాలకు భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశముందన్నారు. ఈ నేపథ్యంలో జేసీ సేదు మాధవన్‌తో కలిసి బుధవారం రెవెన్యూ అధికారులు, ఎంపీడీవోలతో ఆన్‌లైన్‌లో మాట్లాడారు. ఉచిత బస్సులను ఎక్కువ మంది మహిళలు ఎక్కే అవకాశం ఉందని, తొక్కిసలాటలు జరగకుండా చూడాలన్నారు. ప్రైవేటు ఆలయాల్లో కమిటీలను అప్రమత్తం చేయాలని సూచించారు. కూడళ్లలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి, నిఘా పెట్టాలన్నారు. ★ విశాఖ ఎకనమిక్ రీజియన్ కార్యక్రమాలపై జిల్లాస్థాయి కమిటీని నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. జేసీ అధ్యక్షత వహిస్తారని, పరిశ్రమల శాఖ, కేన్ అధికారులు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సభ్యులుగా ఉంటారని, ముఖ్య ప్రణాళిక అధికారి మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

ఆధునికీకరణ సాగక.. అన్నదాత కన్నీరాగక!

గత ప్రభుత్వ తీరుతో కదలని కాలువల పనులు

న్యూస్‌టుడే, పాలకొండ

మూడు జిల్లాల రైతుల కల... దశాబ్దాలుగా సాగుతున్న పనులు.. గత తెదేపా ప్రభుత్వ హయాంలో ప్రారంభం.. తర్వాత వైకాపా పాలనలో అడుగులు పడని వైనం.. దీంతో ప్రస్తుత కూటమి ప్రభుత్వం రద్దు చేయాల్సి వచ్చింది. ఇదీ తోటపల్లి పాత ఆయకట్టు పరిధిలోని కుడి, ఎడమ కాలువల దుస్థితి. దీంతో భూములకు నీరందక రైతులు ఆవేదన చెందుతున్నారు.

నిలిచిన నిర్వహణ నిధులు

ప్రస్తుతం కాలువ పరిధిలో నిర్వహణకు నిధులు నిలిచిపోయాయి. 2010కి ముందు ఏటా కాలువల నిర్వహణకు నిధులు రావడంతో అధికారులు ఖరీఫ్ ముందు పనులు చేపట్టేవారు. ఆధునికీకరణ ప్రతిపాదనతో ఈ కాలువలు మేజర్ ఇరిగేషన్‌లోకి చేర్చారు. అప్పటి నుంచి నిధులు రావడంలేదు. అటు ఆధునికీకరణ జరగక, ఇటు నిర్వహణ పనుల్లేక శివారు రైతులకు కన్నీరే మిగులుతోంది.

● ఎడమ కాలువ పరిధిలో సాగు విస్తీర్ణం: 33,101.99
● కుడి కాలువ పరిధిలో సాగు విస్తీర్ణం: 7941 ఎకరాలు

ఆధునికీకరణ జరగాల్సిన కుడి ప్రధాన కాలువ

ఇదీ పరిస్థితి..

- పనులు: తోటపల్లి పాత ఆయకట్టు కాలువల ఆధునికీకరణ పనులు
- అంచనా : రూ.195 కోట్లు
- ప్రారంభం : 2018
- ఎడమ కాలువ పొడవు : 37 కి.మీ.
- జరిగిన లైనింగ్ : 17.5 కి.మీ.
- కుడికాలువ పొడవు : 17 కి.మీ.
- జరిగిన లైనింగ్ : 9.3 కి.మీ.

నెరవేరని రైతుల కల.. తోటపల్లి పాత ఆయకట్టు కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణ ప్రతిపాదన 20 ఏళ్లుగా ఉంది. 2010లో అప్పటి సీఎం రోశయ్య నవగాం వద్ద పనులకు శంకుస్థాపన చేశారు. జలయజ్ఞంలో ప్రాధాన్యతా క్రమం పనుల నుంచి ఆధునికీకరణ తొలగించడంతో ఆగిపోయాయి. తర్వాత తెదేపా హయాంలో 2018లో కాలువల పనులకు నిధులు విడుదలయ్యాయి. వైకాపా వచ్చాక అయిదేళ్లూ నాన్చారు. మొత్తం కాలువలు పూడికపోయాయి.

పెరిగిన అంచనా.. పనులు సకాలంలో జరగకపోవడంతో 2018లో రూ.195 కోట్ల అంచనాతో ఉన్న నిర్మాణ వ్యయం ప్రస్తుతం రూ.290 కోట్లకు చేరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. సీఎం చంద్రబాబుకు ప్రాధాన్యత వివరిస్తామని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తెలిపారు.

ఘనంగా పరదేశమ్మ జాతర

వేపాడ మండలంలోని చినగుడిపాలలో పరదేశమ్మ జాతర సందర్భంగా నిర్వహించిన ఎడ్ల పరుగు పోటీల్లో కేజేపురానికి చెందిన కొయిలాడ మోహన్ ఎడ్లు విజేతగా నిలిచి రూ.15 వేలు దక్కించుకున్నాయి. విజయనగరం, విశాఖ, అనకాపల్లి జిల్లాలకు చెందిన 18 ఎడ్లు పాల్గొన్నాయి. కేఎల్‌బీ పురం నుంచి వచ్చిన హేమతేజ ద్వితీయ(రూ.13 వేలు), లెక్కలవానిపాలెం నివాసి వెంకట కోమలి తృతీయ (రూ.12 వేలు) సాధించారు. మిగిలిన వారికి నగదు ప్రోత్సాహకాలు ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచి రామునాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, వేపాడ

పలకలు మాయం.. చూడకుంటే ప్రమాదం

సాలూరు పట్టణంలోని వేగావతి కాలనీ నుంచి బ్రాహ్మణరేవుకు వెళ్లేదారిలో కాలువపై పలకలు పూర్తిగా వేయలేదు. దీన్ని దాటే సమయంలో గుంతలో పడి ప్రజలు గాయాల పాలవుతున్నారు. రాత్రివేళ వృద్ధులు, చిన్నారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కల్వర్టు పలకలు వేసి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని పుర ఏఈ అలేక్ కుమార్ తెలిపారు. – న్యూస్‌టుడే, సాలూరు

సార్.. కాస్త పట్టించుకోండి

పాలకొండలోని రామాకళామందిర్ వీధి చివర పరిస్థితి ఇది. రోడ్డు పొడవునా చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. పారిశుద్ధ్య సిబ్బంది సక్రమంగా చెత్త సేకరించకపోవడంతో స్థానికులు ఇలా పడేస్తున్నారు. ఆపై నెలల తరబడి శుభ్రం చేయడం లేదు. మూగజీవాలు చేరి మిగిలిన ఆహార పదార్థాలతోపాటు ప్లాస్టిక్ వ్యర్థాలు కూడా తినేస్తున్నాయి. దీనిపై నగర పంచాయతీ కమిషనర్ రత్నరాజ్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. తగిన చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

ఇటు శిథిల గదులు.. అటు విధులు

పార్వతీపురంలో ఖజానా శాఖ కోసం నిర్మించిన భవనం ఇది. రెండు గదులు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఒకవైపు గదిలో ఆర్ఐ, సిబ్బంది భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు. పక్కనే ఉన్న మరో శిథిల గదిని రికార్డు రూమ్‌గా వాడుతున్నారు. అందులోకి వెళ్లి దస్త్రాలు తీయాలంటే భయపడుతున్నారు. అలాగే ఈ కార్యాలయ జనరేటరు పనిచేయక.. అలంకారప్రాయంగా మారింది. విద్యుత్తు సరఫరా నిలిచిపోతే చీకట్లో విధులు నిర్వహించాల్సిందే. కొత్త భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని అధికారులు అన్నారు. – న్యూస్‌టుడే, బెలగాం

ఆపదన్నా.. చర్యల్లేవంతే..!

తుంబలి-అల్లువాడ ప్రధాన రహదారి పక్కన ఓ టెలికమ్ సంస్థ కేబుల్ కోసం నాలుగు చోట్ల కొన్నేళ్ల క్రితం గోతులు తవ్వి వదిలేసింది. రాత్రి వేళల్లో అవి కనిపించక వాహన చోదకులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. గోతులు పూడ్చేందుకు చర్యలు తీసుకుంటామని ర.భ శాఖ జేఈ సుశీల 'న్యూస్‌టుడే'తో అన్నారు. – న్యూస్‌టుడే, జియ్యమ్మవలస

తెచ్చి.. పడేశారు

సీతానగరం మండలం పెదబోగిల పంచాయతీ పరిధిలోని బుడ్డిపేట గ్రామానికి ఇంటింటి కుళాయిల కోసం మూడేళ్ల కిందట రూ.24 లక్షలు మంజూరయ్యాయి. పనులు చేపట్టేందుకు ఏడాది కిందట ప్రధాన పైపులు తెచ్చారు. రెండు చోట్ల గుత్తేదారు నిల్వ చేశాడు. ఎండ, వానకు వదిలేయడంతో పైపుల మధ్య మొక్కలు పెరిగాయి తప్ప పనులు మాత్రం కాలేదు. రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తామని ఏఈ పవన్‌కుమార్ తెలిపారు. – న్యూస్‌టుడే, సీతానగరం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)	
పార్వతీపురం	8008566244
పాలకొండ	8008574299
సాలూరు	8008786820
కురుపాం	9849044696

?: వెలగవాడలో రహదారి పక్కన, సింగన్న వలసలో చెరువులో వ్యర్థాలను పడేస్తున్నారు. ఈ రెండు గ్రామాలకు చెత్త సేకరణ కేంద్రాల నిర్మాణాలకు స్థలాల కొరత ఉంది. ★ ఆరుబయట వ్యర్థాలు పారబోయకుండా తగిన చర్యలు తీసుకోవాలని కార్యదర్శులను ఆదేశిస్తాం. - **శ్రీనివాస్, ఇన్‌ఛార్జి డీఎల్‌పీవో**

?: పాలకొండ గాయత్రీ నగర్‌వీధిలో కల్వర్టు శిథిలమైంది. - **ప్రవీణ, గృహిణి** ★ కల్వర్టు నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. - **దేవీవరప్రసాద్, నగర పంచాయతీ ఏఈ** – న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

?: తిత్తిరి పంచాయతీలోని తులసి గ్రామం నుంచి గూడకు రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నాం. - **సాగర్** ★ రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. - **జె.ఉమామహేశ్వరి, ఎంపీడీవో** – న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

?: రామవరం రైల్వే గేటు నుంచి బొబ్బిలి మండలం రాజుపేట వరకు ఉన్న రోడ్డు అధ్వానంగా ఉంది. - **కార్తీక్** ★ అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. - **చంద్రమౌళి, ఏఈ** – న్యూస్‌టుడే, సీతానగరం

రూ.3 లక్షలతో మరుగుదొడ్లు

స్పందనకు వందనం

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: బందలుప్పి పంచాయతీ భవనం వద్ద మరుగుదొడ్లు నిర్మించారు. ఇక్కడ సిబ్బంది, ప్రజల ఇబ్బందిపై ఇటీవల 'ఈనాడు'లో 'మరుగులేక ఇక్కట్లు' శీర్షికతో వచ్చిన కథనానికి ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులు స్పందించారు. రూ.3 లక్షలతో పనులు చేసినట్లు ఏఈ బసవరాజు తెలిపారు.

ఎట్టకేలకు వెలుగులు

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ పట్టణంలోని వీధుల్లో వెలుగులు విరజిమ్ముతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ప్రభుత్వ ఆసుపత్రి రహదారి ఏళ్లుగా రాత్రయితే చీకటిగా ఉండేది. దీపాలు వెలగని వైనంపై పలుమార్లు 'ఈనాడు' కథనాలు ప్రచురించింది. ఎట్టకేలకు నగర పంచాయతీ అధికారులు స్పందించారు. పూర్తిస్థాయిలో దీపాలు వేయడంతో సమస్య పరిష్కారమైంది.

సుద్దపూస మాటలు.. శుద్ధజలం కనుమరుగు

గత వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ కంటే గొప్పగా మారుస్తామని, అన్ని సౌకర్యాలు కల్పిస్తామని నాయకులు గొప్పలు చెప్పారు. కానీ ఆచరణలో మాత్రం విఫలం అయ్యారు. జిల్లాలో 'నాడు-నేడు' లో బడుల అభివృద్ధి, భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకున్నా.. గుత్తేదారులకు బిల్లులు సకాలంలో ఇవ్వక చాలా చోట్ల పనులు ఆగాయి. మరోపక్క ఈ క్రమంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లలో 80 శాతానికిపైగా వృథాగా మారాయి. విద్యార్థులు వీధి కుళాయి నీరు తాగాల్సిన పరిస్థితి. కూటమి ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. – న్యూస్‌టుడే బృందం

వీరఘట్టం మండలం పీవీఆర్ పురం పాఠశాలలో బోరు నీరు పడుతున్న విద్యార్థులు

కుళాయి నీరే శరణ్యం

▶ బలిజిపేట ఉన్నత పాఠశాలలో 2019లో రూ.2 లక్షలతో ఏర్పాటు చేసిన 1,000 లీటర్ల సామర్థ్యం కలిగిన ఆర్వో ప్లాంటు మోటార్లు కాలిపోయి.. దిష్టిబొమ్మలా మారింది. విద్యార్థులు గొట్టపుబావి నీటినే వాడుతున్నారు. ఉన్నతాధికారులకు తెలిపినట్లు ప్రధానోపాధ్యాయుడు చెప్పారు.

▶ జియ్యమ్మవలస మండలం రావాడ రామభద్రాపురంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలోని ఆర్వో ప్లాంటు పాడైంది. 201 మంది కుళాయి నీటిని వినియోగిస్తున్నారు.

▶ కురుపాం మండలం శివ్వన్నపేట ఉన్నత పాఠశాలలోని 50 మంది విద్యార్థులు పంచాయతీ కుళాయి నీరే తాగుతున్నారు. ▶ కురుపాం ఎస్సీ వసతి గృహంలో ప్లాంటు పాడైంది. బీసీ వసతి గృహంలోనూ బోరు నీరే దిక్కు.

▶ సీతానగరం ప్రాథమిక పాఠశాలలోని ప్లాంటు మరమ్మతులకు గురైంది. 54 మంది విద్యార్థులు ఇంటి నుంచి నీటి సీసాలను తెచ్చుకుని దాహార్తిని తీర్చుకుంటున్నారు. గుత్తేదారుకు సమాచారం అందించినట్లు హెచ్ఎం సత్యం తెలిపారు.

▶ పాలకొండ మండలం అంపిలి ఎంపీయూపీ పాఠశాలకు ఇచ్చిన ప్లాంటు ఏదీ కూడా పనిచేయలేదు. 58 మంది విద్యార్థులు బడి ఆవరణలోని బోరు నీటినే తాగుతున్నారు. ఉన్నతాధికారులకు నివేదించామని ప్రధానోపాధ్యాయుడు గౌరీశంకర్ తెలిపారు.

▶ పాచిపెంట మండలంలోని 19 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు పరికరాలు ఇచ్చారు. 16 చోట్ల పాడయ్యాయి. ఏజెన్సీకి ఫోన్ చేసినా చర్యల్లేవని ఉపాధ్యాయులు చెప్పారు.

▶ గుమ్మలక్ష్మీపురం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో 391 మంది చదువుతున్నారు. ఇక్కడి ప్లాంట్ మరమ్మతులకు గురైంది. వినియోగంలోకి తెస్తామని ఏటీడబ్ల్యూవో రజని తెలిపారు.

▶ వీరఘట్టం మండలం నడుకూరు ప్రాథమికోన్నత పాఠశాలకు ఇచ్చిన రెండు ఆర్వో ప్లాంట్లు మూలకు చేరాయి. 70 మంది విద్యార్థులు ఉన్న పీఎంశ్రీ పాఠశాలలోని ప్లాంట్ పనిచేయడం లేదు. బోరు నీరు తాగుతున్నారు.

▶ సీతంపేట మండలం కె.గుమడ ప్రాథమిక పాఠశాలలో ప్లాంట్ లేక విద్యార్థులు కొంత మందిలో తాగునీరు పెట్టి అందిస్తున్నారు.

కురుపాం ఎస్సీ వసతి గృహంలో నిరుపయోగంగా శుద్ధజల యంత్రం

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడండి

పాచిపెంట, న్యూస్‌టుడే: మహాశివరాత్రిని పురస్కరించుకుని ఈనెల 15న పారమ్మ కొండ వద్ద నిర్వహించే జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. పెదవీధుపురంలోని సమీప పారముదేవతను కుటుంబ సమేతంగా బుధవారం దర్శించుకున్నారు. ఆలయ పూజారి, ఈవో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. వృద్ధులు అమ్మని దర్శించుకునేందుకు వీలుగా డోలీల ఏర్పాటు, తొక్కిసలాట జరగకుండా క్యూలైన్లు, కొండపైకి వెళ్లేందుకు వీలుగా రోప్‌ల ఏర్పాటు చేయాలని తెలిపారు. స్టాల్లో సరకుల నిర్దేశ ధరల విక్రయంలో జాతర ఆదాయం పెంచాలని సూచించారు. మూడు చోట్ల వైద్య శిబిరాలు నిర్వహించాలని చెప్పారు. ఏఎంసీ ఛైర్మన్ సూర్యనారాయణ, తహసీల్దార్ రవి, ఈవో రమేష్, సీఐ రామకృష్ణ, ఎస్సై అర్జున్ ఉన్నారు.

పూజల్లో కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు

పీజీఆర్ఎస్ వాయిదా

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో గురువారం మధ్యాహ్నం కలెక్టర్ వ్యక్తిగతంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం అనివార్య కారణాల వల్ల వాయిదా పడినట్లు ఎంపీడీవో కె.ధర్మారావు తెలిపారు. ఎప్పుడు నిర్వహించే తేదీని తెలియజేస్తామని పేర్కొన్నారు.

ఉపకార వేతనాల విడుదలకు డిమాండు

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: విద్యార్థుల ఉపకార వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సింహాచలం కోరారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. గత వైకాపా ప్రభుత్వంలో విద్యార్థులకు అన్యాయం జరిగిందన్నారు. కూటమి హయాంలో సమస్య పరిష్కారం అవుతుందనుకున్నా.. ఇంతవరకు చర్యలు తీసుకోలేదన్నారు. ఫీజులు చెల్లిస్తేనే హాల్ టికెట్లు ఇస్తామని విద్యాసంస్థల నుంచి తల్లిదండ్రులకు ఒత్తిడి పెరుగుతోందన్నారు. అఖిల్, ఇందు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నాయకుల నిరసన

తప్పుల్లేని భూ సర్వే చేపట్టాలి

భామిని, న్యూస్‌టుడే: ప్రస్తుతం జరుగుతున్న రీ సర్వేలో తప్పులు లేని భూ రికార్డుల తయారీ చేయాలని సబ్‌కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ అన్నారు. బుధవారం బాలేరులో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను ఆయన పరిశీలించారు. ప్రస్తుతం రీ సర్వేలో వస్తున్న సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో ముస్తాబుపై ప్రజలకు అవగాహన కల్పించారు. రోజూ గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేసి, ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని కోరారు. తహసీల్దార్ శివన్నారాయణ, ఆర్.మణిప్రభాకర్, రెవెన్యూ అధికారులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు తదితరులు ఉన్నారు.

సమస్యలు వింటున్న పవార్ స్వప్నిల్

పక్కాగా వివరాల నమోదు

పార్వతీపురం, న్యూస్‌టుడే: రీసర్వేలో తప్పులుంటే ముందుగానే గుర్తించాలని సంయుక్త కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో తహసీల్దార్లు, సర్వే యంత్రాంగంతో సమావేశమై మాట్లాడారు. భూమి, యజమానుల వివరాల్లో ఓ చిన్న పొరపాటు జరిగినా.. భవిష్యత్తులో ప్రజలకు ఇబ్బంది కలుగుతుందన్న విషయాన్ని గుర్తించాలన్నారు. పారదర్శకంగా, పక్కాగా వివరాలు నమోదు చేయాలన్నారు. క్షేత్రస్థాయి పరిశీలనలో నమోదు చేసిన సమాచారాన్ని సరిచూసుకోవాలని సూచించారు. పాలకొండ సబ్‌కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, డీఆర్వో హేమలత, తహసీల్దార్లు పాల్గొన్నారు.

గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన

పార్వతీపురం గ్రామీణం, బెలగాం, న్యూస్‌టుడే: విద్యార్థులు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని వన్‌స్టాప్ సెంటర్ అధికారిణి శాంతికుమారి సూచించారు. తాళ్లబురిడి ఉన్నత పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉన్న విద్యార్థులకు లైంగిక, వరకట్న వేధింపులు, బాల్య వివాహాలు, యాసిడ్ దాడులు, సైబర్ నేరాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయాల్లో 1098 నంబరుకు కాల్ చేయాలని చెప్పారు. వైద్యురాలు కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఆ ప్రాజెక్టులు రద్దు చేయాలి

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదివాసులకు అన్యాయం చేస్తూ కార్పొరేట్‌లకు భూములు కట్టబెట్టే ప్రయత్నాన్ని ప్రభుత్వం మానుకోవాలని దుగ్గేరు హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ ఆర్.సుందరరావు అన్నారు. బుధవారం కొదమ పంచాయతీ మోనంగిలో మాట్లాడారు. హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వల్ల గిరిజనులకు నష్టం కలుగుతుందని, దీన్ని రద్దు చేయాలన్నారు. దీనికి సంబంధించిన గోడపత్రికలు ఆవిష్కరించారు. రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి వర్మ, ముత్యాలు, చెంచు తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న నాయకులు

మన్యంలో డీఎఫ్‌వో పర్యటన

సీతంపేట: సీతంపేట మన్యంలో బుధవారం డీఎఫ్‌వో ప్రసూన పర్యటించారు. దోనుబాయి-జయపురం, బంగిగూడ-మెట్టుగూడ వద్ద ట్రెక్కింగ్ పాయింట్ల ఏర్పాటుకు గుర్తించిన ప్రాంతాలను పరిశీలించారు. ఆపై బెనరాయి జలపాతాన్ని సందర్శించారు. ట్రెక్కింగ్ పాయింట్ల ఏర్పాటుకు అటవీశాఖ ప్రతిపాదనలు చేయడంతో క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితి తెలుసుకున్నారు. అధికారులు రామారావు, దేవి తదితరులున్నారు.

స్థలాన్ని పరిశీలిస్తున్న ప్రసూన

ఉక్కిరిబిక్కిరి.. అఆలు ఎక్కేదెలా మరి

సాలూరు మండలం కొదమ పంచాయతీ శిఖరాగ్ర గ్రామమైన లొద్దలో పాఠశాల భవనం లేక ఇలా అద్దె ఇంట్లో ఇరుకు గదుల్లో బోధిస్తున్నారు. ఏకోపాధ్యాయుడు, 13 మంది విద్యార్థులున్న ఈ పాఠశాల గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తోంది. కేవలం ఈ ఒక్క గ్రామమే కాదు.. దాదాపు శిఖరాగ్రాన ఉన్న పాఠశాలల పరిస్థితి ఇలానే ఉంది. ఇళ్ల గడపల్లో, వరండాల్లో చదువులు చెప్పాల్సి వస్తోంది. దీనిపై డిప్యూటీ డీఈవో రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. నిధులు కోరుతూ ప్రతిపాదనలు చేశామని, ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉందని చెప్పారు. – న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

పరాధీనంలో.. ప్రభుత్వ స్థలం

రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలం పరాధీనంలో ఉన్నా పాలకులకు పట్టడం లేదు. స్థలాలు లేవంటూ అద్దె ఇంట్లో కార్యాలయాలు నిర్వహిస్తున్నారు. ఏటా రూ.లక్షలు ప్రభుత్వంపై అద్దెభారం పడడం తప్ప.. సర్కారు స్థలాలకు రక్షణ కల్పించి అవసరాలకు వినియోగించడం లేదు. పట్టణంలోని బంగారమ్మ కాలనీకి వెళ్లేదారిలో 15 ఏళ్లుగా ఆక్రమణకు గురైన సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహ స్థలమే ఇందుకు నిదర్శనం. భవనం శిథిలావస్థకు చేరిందని హాస్టల్ ఖాళీ చేసి, తర్వాత పట్టించుకోలేదు. దీంతో ఆక్రమణదారులు పశువుల శాలలు, గడ్డికుప్పలు వేసే స్థలంలా మారింది. వాటిని తొలగించి ప్రభుత్వ స్థలానికి రక్షణ కల్పిస్తామని తహసీల్దార్ నీలకంఠరావు తెలిపారు. – న్యూస్‌టుడే, సాలూరు

18 నుంచి పరీక్షలు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు టెక్నికల్ సర్టిఫికేట్ కోర్సు పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈవో బ్రహ్మాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు హాల్ టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

సీతానగరం, న్యూస్‌టుడే: పది ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత కోసం ప్రభుత్వం వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తోంది. సీతానగరం మండలం జోగింపేట కేంద్రంగా అంబేడ్కర్ గురుకులంలో 136 మంది బాలురు, కేజీబీవీలో 43 మంది బాలికలకు శిక్షణ చేపట్టారు. ఈనెల 9వ తేదీ నుంచి వచ్చే నెల 10 వరకు వసతి సౌకర్యం కల్పిస్తూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు.

ఉపాధి వేతనదారుల ఆందోళన

పాచిపెంట: కేసలి పంచాయతీ మడవలస ఉపాధి హామీ వేతనదారులు సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. కొందరు అధికార పార్టీ నాయకులు పనులు చేయకుండా ఈ వారం వారిని ఆపినట్లు ఆరోపించారు. వినతి పత్రాన్ని కార్యాలయంలో అందించారు. ఈశ్వరరావు, వేతనదారులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో అగ్నిప్రమాదాలు దూరం

పార్వతీపురం పట్టణం, సాలూరు, న్యూస్‌టుడే: ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే అగ్నిప్రమాదాలను దూరం చేయొచ్చని అగ్నిమాపక అధికారి ప్రభాకరరావు అన్నారు. బుధవారం జిల్లా ఆసుపత్రి వద్ద వైద్యులు, సిబ్బందికి ఆ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్యాస్ ప్రమాదాలు ఎదురైతే ఎలా నియంత్రించాలో ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. బహుళ అంతస్తులు, ఐసీయూ గదుల్లో విద్యుత్తు, ఇతర కారణాలతో ప్రమాదాల నియంత్రణపై అవగాహన కల్పించారు. సూపరింటెండెంటు నాగశివజ్యోతి, ఆర్ఎంవో శ్యామల, అగ్నిమాపక దళపతి రమేష్, సిబ్బంది పాల్గొన్నారు. ● సాలూరు పట్టణ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల మైదానంలో విద్యార్థులకు అగ్నిమాపక శాఖ అధికారులు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక విన్యాసాలు చేశారు. ఫైర్ ఆఫీసరు రాజారావు, ప్రిన్సిపల్ శ్రీను, ఎం.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

అభివృద్ధికి దూరంగా పాలన

బెలగాం, న్యూస్‌టుడే: అభివృద్ధి చేస్తుందని కూటమికి అధికారం ఇస్తే.. అన్యాయంగా వ్యవహరిస్తోందని మాజీ కేంద్ర మంత్రి కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంటు జేడీ శీలం ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని పింఛనుదారుల భవనంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు వి.దాలినాయుడు అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఉపాధి హామీ పథకానికి గాంధీ పేరు తీసేసి కేంద్ర ప్రభుత్వం అడ్డగోలు నిర్ణయాలు తీసుకుంట.. ఇక్కడ ప్రభుత్వం, ప్రతిపక్షం నిలదీయడం మానేసి, భాజపాకు భయపడుతున్నాయని ఎద్దేవా చేశారు. లడ్డూ అంశం ఒక్కటే సమస్య కాదని, అనేక సమస్యలు ఉన్నాయన్నారు. గిరిజన మరణాలను అరికట్టాలన్నారు. నాయకులు మహేష్, శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జేడీ శీలం

కాలమానిని ఆవిష్కరణ

భామిని: ప్రభుత్వ పాలనలో స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాలు పట్టుకొమ్మలుగా నిలవాలని ఎంపీడీవో వసంతకుమారి అన్నారు. బుధవారం తన కార్యాలయంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని సూచించారు. డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ జగన్నాథం ఉన్నారు.

ప్రణాళిక ప్రకారం చదవాలి

సీతంపేట, న్యూస్‌టుడే: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు దగ్గరపడుతున్న నేపథ్యంలో తగిన ప్రణాళిక ప్రకారం చదవాలని డిప్యూటీ డీఈవో పి.నారాయుడు అన్నారు. సీతంపేట బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను జీసీడీవో ఎ.రాములమ్మతో కలిసి బుధవారం ఆయన సందర్శించారు. పది విద్యార్థులకు సూచనలు చేశారు. అన్ని సబ్జెక్టుల్లో పట్టు సాధించాలని, ఏమైనా సందేహాలుంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. ఎంఈవో ఎం.ఆనందరావు, ప్రధానోపాధ్యాయుడు టి.చంద్రరావు, డిప్యూటీ వార్డెన్ గాసయ్య తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు సూచనలిస్తున్న డిప్యూటీ డీఈవో తదితరులు

పదిలో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

సీతానగరం, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు కార్యాచరణ అమలు చేయాలని డీఈవో బ్రహ్మాజీరావు కోరారు. మరిపివలస ఉన్నత పాఠశాలను బుధవారం సందర్శించారు. సీ, డీ గ్రేడ్ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. హెచ్ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీసీవో సందర్శన

సీతంపేట: సీతంపేటలోని జీసీసీ ప్రాంతీయ కార్యాలయాన్ని జిల్లా సహకార అధికారిణి(డీసీవో) వాణీ శైలజ బుధవారం సందర్శించారు. దస్త్రాల నిర్వహణ ఏ విధంగా ఉందో పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఆమెతోపాటు జీసీసీ డీఎం జి.సంధ్యారాణి, మేనేజర్లు దాసరి కృష్ణ, నర్సింహులు, అకౌంటెంట్ చిన్నబాబు తదితరులున్నారు.

మా స్వచ్ఛత ఇంతే..!

● పడకేసిన పల్లె పరిశుభ్రత

పల్లెలను సుందరంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రభుత్వం ఉంది. దీనికోసం ప్రతీనెల మూడో శనివారం గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెబుతున్నా.. ఫలితం కానరావడం లేదు. బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు పేరుకుపోవడంతో ఈగలు, దోమల బెడద ఎక్కువై ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతోంది. రోడ్ల పక్కన, చెరువులు, కాలువ గట్లపై ఇంటింటా సేకరించిన చెత్తాచెదారాలు పారబోస్తున్నారు. దీనివల్ల తాగునీరు కలుషితమవుతోంది. అధికారులు, సర్పంచులు పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపడంలేదు.

కంబరవలస చెరువులో పడేసిన వ్యర్థాలు

● **వీరఘట్టం** మండలం కంబరవలసలో సేకరించిన చెత్త చెరువులో పారబోస్తున్నారు. చెత్త సేకరణ కేంద్రం నిర్మాణం నాలుగేళ్ల క్రితం అర్ధాంతరంగా నిలిచిపోయింది.

● **భామిని** మండలంలోని సత్తివాడ చెత్త సేకరణ కేంద్రంలో వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. శివాలయానికి వెళ్లే మార్గంలో చెత్తను పారబోస్తుండడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దిమ్మిడిజోల, బత్తిలి గ్రామాల్లో చెత్త సేకరణ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. కానీ వీటిని వినియోగించడంలేదు. అధికారుల అశ్రద్ధ కారణంగా రహదారుల పక్కన వ్యర్థాలు పేరుకుపోతున్నాయి.

– న్యూస్‌టుడే, వీరఘట్టం, భామిని, పాలకొండ గ్రామీణం

పాలకొండ నియోజకవర్గంలో పంచాయతీల వివరాలు	
వీరఘట్టం	34
భామిని	26
పాలకొండ	32
సీతంపేట	53

భార్య మందలించిందని ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం పట్టణం, కొమరాడ, న్యూస్‌టుడే: భార్య మందలించడంతో భర్త గడ్డి మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కొమరాడ మండలంలో చోటుచేసుకున్నట్లు పోలీసులు బుధవారం తెలిపారు. సరవపాడుకు చెందిన కె.వినోద్ మద్యం తాగుతూ తిరుగుతున్నాడు. కుటుంబ పోషణ పట్టించుకోవడం లేదని భార్య మంగళవారం రాత్రి మందలించింది. మనస్తాపంతో గడ్డి మందుతాగాడు. కుటుంబీకులు గమనించి జిల్లా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

నిర్మాణ పనులకు శంకుస్థాపన

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ట్రైకార్ బోర్డు డైరెక్టర్ పి.లావణ్య అన్నారు. బుధవారం కురుపాం పంచాయతీలోని కస్పాగదబవలస నుంచి చెరువుకొమ్మువలస వరకు రూ.2 కోట్లతో బీటీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కలిశెట్టి కొండయ్య, ఎన్.వంశీ, డి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు. ● గరుగుబిల్లి: రావుపల్లి, గొట్టివలస గ్రామాల్లో 15వ ఆర్థిక సంఘం నిధులతో మంజూరైన గ్రామ వైద్యశాలల నిర్మాణానికి ఎంపీపీ ఉరిటి రామారావు శంకుస్థాపన చేశారు. ● బలిజిపేట: మండల కేంద్రంలో కళింగ వైశ్య భవనానికి వెళ్లేందుకు వీలుగా సిమెంటు రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరయ్యాయి. ఈ పనులకు తెదేపా నాయకులు రామారావు, శివ, కళింగ వైశ్య సంఘం అధ్యక్షుడు కె.రమేష్, సభ్యులు శంకుస్థాపన చేశారు. ● సీతానగరం: లక్ష్మీపురం సచివాయం పరిధిలోని ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణానికి తెదేపా మండలాధ్యక్ష, కార్యదర్శులు సత్యంనాయుడు, వేణుగోపాలనాయుడు, అధికారులు భూమిపూజ చేశారు.

కురుపాంలో భూమిపూజ చేస్తున్న లావణ్య

(c) eenadu

స్థల సేకరణే కీలకం..

పారిశ్రామిక అడుగులకు అడ్డంకులు

ఈనాడు, పోలవరం: శ్రామికవేత్తలను తయారు చేయాలన్న సంకల్పంతో కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నా క్షేత్ర స్థాయిలో భిన్నమైన పరిస్థితులు ఎదురవుతున్నాయి. ప్రతి నియోజకవర్గంలో పారిశ్రామిక క్లస్టర్ ఏర్పాటు చేయడం ద్వారా సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహమివ్వాలని భావించారు. అయితే ఉమ్మడి జిల్లాలో ఆశించిన మేర పురోగతి కనిపించడం లేదు. ప్రధానంగా భూముల గుర్తింపు, ఏపీఐఐసీకి బదలాయింపు ప్రక్రియలో జాప్యం నెలకొంటోంది.

ఇదీ పరిస్థితి: ✦ డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రెండు విడతల్లో రామచంద్రపురం, అమలాపురంలో శంకుస్థాపనలు చేశారు. మిగిలిన ప్రాంతాల్లో స్థల సేకరణ చేయాల్సి ఉంది. ఇప్పటికే ఒక నియోజకవర్గంలో మాత్రమే భూమిని గుర్తించారు. ✦ తూర్పుగోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం గ్రామీణం, గోపాలపురం, రాజానగరం నియోజకవర్గాల పరిధిలో గుర్తించిన భూముల్లో ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యేలు శంకుస్థాపనలు చేశారు. మరో మూడు చోట్ల స్థలాలు గుర్తించాల్సి ఉంది. ✦ కాకినాడ జిల్లాలో కాకినాడ గ్రామీణం, పెద్దాపురం, పిఠాపురం, తుని, జగ్గంపేట నియోజకవర్గాల పరిధిలో ఇప్పటికే స్థలాల గుర్తింపుతో పాటు రెండో విడతలోనే శంకుస్థాపనలు చేశారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. కాకినాడ నియోజకవర్గానికి సంబంధించి స్థలాన్ని గుర్తించే పనిలో యంత్రాంగం ఉంది.

✦ పోలవరం జిల్లాలో గంగవరం మండలంలో స్థలం గుర్తించడంతో అక్కడ మౌలిక వసతుల కల్పన పనులు చేయాల్సి ఉంది.

17న శాప్ లీగ్ పోటీలు

శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 31 క్రీడాంశాల్లో శాప్ లీగ్ పోటీలు నిర్వహించనున్నట్లు డీఎస్‌డీవో డి. శేషగిరి ఒక ప్రకటనలో తెలిపారు. 17న రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ, ఆర్ట్స్ కళాశాలలో అండర్-13, 15, 17, 19 విభాగాల్లో పురుషులు, మహిళలకు జిల్లాస్థాయి చదరంగం, సైక్లింగ్ పోటీలు ఉంటాయన్నారు. గెలుపొందిన క్రీడాకారులు 21, 22 తేదీల్లో విజయవాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. మరిన్ని వివరాలకు చరవాణి నంబరు 90329 34038 ను సంప్రదించవచ్చు.

జీడిమామిడి తోటలో పరిశీలిస్తున్న ఇస్రో శాస్త్రవేత్తలు

వీబీ జీ రామ్ జీ సాంకేతికతపై శాస్త్రవేత్తల పరిశీలన

వై.రామవరం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆదేశాల మేరకు వీబీ జీ రామ్ జీ విధి విధానాలు క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో సాంకేతిక అంశాలను ఇస్రో శాస్త్రవేత్తలు సోలోమాన్ రాజు, జోషీ సాయి ప్రకాశ్‌రావు పరిశీలించారు. మండలంలోని చవిటిదిబ్బలు గ్రామంలో వారు బుధవారం పర్యటించారు. గిరిజనులు వేసిన జీడి మామిడి తోటలను పరిశీలించారు. చవిటిదిబ్బలు పంచాయతీని యూనిట్‌గా తీసుకుని చేపట్టిన అభివృద్ధి పనులు, పురోగతిని పరిశీలించనున్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. వీబీ జీ రాంజీ సాఫ్ట్‌వేర్‌కు సంబంధించి వివిధాలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామన్నారు. మార్చి నెలాఖరుతో ఉపాధి హామీ పథకం స్థానే అమల్లోకి వచ్చే వీబీ జీ రామ్ జీ పథకంలో పనులు చేపడతారని తెలిపారు. మూడు రోజుల పాటు పంచాయతీలో పనులను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. గిరిజన సంప్రదాయాలు, ఆచారాలపై ఎంపీడీవో బాపన్నదొర వివరించారు. ఏపీవో సాయిబాబా, పంచాయతీ అభివృద్ధి అధికారి భార్గవి, వీబీ జీ రామ్ జీ సిబ్బంది పాల్గొన్నారు.

నవజాత శిశుకేంద్రం.. సేవలందక దైన్యం

పరికరాలున్నా.. వైద్యులు, సిబ్బంది కొరత

న్యూస్‌టుడే – రంపచోడవరం

తక్కువ బరువుతో పుట్టిన శిశువులు.. కామెర్లు, అంటువ్యాధులు సోకిన పిల్లలను ఉంచే కేంద్రమది. వెంటిలేటర్, ఇంక్యుబేటర్, ఫొటోథెరపీ యూనిట్, ఆక్సిజన్ తదితర ఆధునిక యంత్ర పరికరాలు ఉన్నా.. రెండేళ్లుగా చిన్నపిల్లల వైద్య నిపుణులు అందుబాటులో లేరు. పోలవరం జిల్లా కేంద్రం రంపచోడవరంలోని ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన నవజాత శిశు సంరక్షణ కేంద్రం (ఎస్‌ఎన్‌సీయూ)లో నవజాత శిశువులకు సకాలంలో చికిత్స అందక తల్లులు తల్లడిల్లుతున్నారు. ఆసుపత్రిలో కాన్పులతో పాటు ఓపీ సేవలతోపాటు వార్డుల్లో చికిత్స పొందుతున్న చిన్న పిల్లలను, ఎస్‌ఎన్‌సీయూ విభాగంలో శిశువులను చూడటం కష్టతరంగా మారింది.

ఒక్కరే స్టాఫ్‌నర్స్..

జిల్లాలో మాతాశిశు మరణాలను నివారించాలనే ఉద్దేశంతో రంపచోడవరంలోని ఏరియా ఆసుపత్రిలో ఈ విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఇద్దరు చిన్న పిల్లల వైద్యులు, నలుగురు స్టాఫ్ నర్సులు ఉండాలి. ఒక స్టాఫ్ నర్స్ మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. రెండేళ్లుగా చిన్న పిల్లల డాక్టరు (పీడియాట్రిక్) లేకపోవడంతో ఏరియా ఆసుపత్రిలోని చిన్నపిల్లల డాక్టరే ఈ విభాగంలోనూ వైద్యసేవలు అందిస్తున్నారు.

వార్మర్‌లో చికిత్స పొందుతున్న శిశువుతో తల్లి

ఎస్‌ఎన్‌సీయూలో అందించే సేవలు..

జనన లోపాలు, తక్కువ బరువు, కామెర్లు, బర్త్ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న, వెంటిలేటర్ అవసరమైన పిల్లలను ఎస్‌ఎన్‌సీయూ విభాగంలో చేర్చుకొని ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నారు. బరువు తక్కువ ఉండే పిల్లలను మూడు రోజులు, పచ్చకామెర్లు సోకిన వారికి వారం రోజులపాటు ప్రత్యేక చికిత్స అందించాల్సి ఉంటుంది. 20 మందికి ఒకేసారి సేవలందించేందుకు వార్డులో ఏర్పాట్లు ఉన్నాయి. సాధారణ వైద్యుడితోపాటు ఇద్దరు చిన్నపిల్లల వైద్యులు, నలుగురు స్టాఫ్ నర్సులు పనిచేయాల్సి ఉండగా.. ఒక్క స్టాఫ్‌నర్స్ మాత్రమే అందుబాటులో ఉన్నారు. ఆసుపత్రికి వచ్చిన, అక్కడే పుట్టిన పిల్లలకు వైద్యం అందించేందుకు వైద్య సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. రోజూ పది నుంచి 15 మంది తల్లులు ప్రసవిస్తుండగా.. ముగ్గురి నుంచి ఐదుగురు పిల్లలను ఎస్‌ఎన్‌సీయూలో ఉంచుతారు.

నివేదిక పంపించాం..

ఏరియా ఆసుపత్రిలోని ఎస్‌ఎన్‌సీయూ విభాగంలో ఇద్దరు చిన్న పిల్లల వైద్యులు, నలుగురు స్టాఫ్ నర్సులు ఉండాలి. వైద్యులు లేకపోవడంతో ఆసుపత్రిలో విధులు నిర్వర్తిస్తున్న చిన్నపిల్లల డాక్టరే చూస్తున్నారు. వైద్యులు, స్టాఫ్ నర్సులను నియమించాలని ప్రభుత్వానికి నివేదించాం.

– డాక్టర్ సూర్యప్రకాశరావు, సూపరింటెండెంట్, ఏరియా ఆసుపత్రి, రంపచోడవరం

అధికారులతో మాట్లాడుతున్న జేసీ, పీవో స్మరణ్‌రాజ్

మహాశివరాత్రికి పకడ్బందీ ఏర్పాట్లు

రంపచోడవరం ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్

రంపచోడవరం, గంగవరం: పోలవరం జిల్లాలో వివిధ శివాలయాల్లో ఈ నెల 15న నిర్వహించనున్న మహాశివరాత్రి వేడుకల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో బచ్చు స్మరణ్‌రాజ్ అధికారులను, కమిటీ సభ్యులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం రంప గ్రామంలోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో 19 వరకు నిర్వహించనున్న శివరాత్రి వేడుకల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. భక్తులకు భద్రతా ఏర్పాట్లు, ప్రత్యేక వైద్య శిబిరాలు, తాగునీరు, కొండపైకి వచ్చే భక్తులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఐదు రోజులపాటు కట్టుదిట్టంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. రంపచోడవరం తహసీల్దార్ బాలాజీ, సీఐ పి.వి.నాయుడు, సచివాలయ సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పరిశీలన: వెంటాడే సమస్యలు.. వేదనలో విద్యార్థులు

ఆశ్రమ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించాల్సిన ఆవశ్యకత

ఈనాడు, పోలవరం: అరకొర గదులు.. అధ్వానంగా పరిసరాలు.. దుర్భరంగా మరుగుదొడ్లు.. పనిచేయని బోర్లు.. ఇదీ పోలవరం జిల్లాలోని వివిధ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో కనిపించే పరిస్థితి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేమి, కింది స్థాయిలో నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులకు ఇబ్బందులు తప్పడంలేదు. తాజాగా మారేడుమిల్లి మండలం దేవరపల్లిలో కాలం చెల్లిన, సగం ఉడికిన ఆహార పదార్థాల కారణంగా దాదాపు 90 మంది బాలురు ఆసుపత్రి పాలయ్యారు. క్షేత్రస్థాయిలో వివిధ వసతిగృహాలను 'న్యూస్‌టుడే' బృందాలు పరిశీలించగా అసౌకర్యాలు కనిపించాయి.

జిల్లాలో ఇదీ లెక్క

విద్యాలయాలు	సంఖ్య	విద్యార్థులు
గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు	79	16,238
గిరిజన సంక్షేమ వసతిగృహాలు	15	1,281
గురుకుల విద్యాలయాలు	15	5,738
ఏకలవ్య ఆదర్శ విద్యాలయాలు	6	2,128
గిరిజన ప్రాథమిక పాఠశాలలు	289	6,744

22 చోట్ల పనిచేయక..

జిల్లాలోని అన్ని ప్రభుత్వ విద్యాలయాల్లో 70 ఆర్వో వాటర్‌ప్లాంట్లు ఉండగా 22 చోట్ల పని చేయడంలేదు. అనేక పాఠశాలల్లో మరుగుదొడ్లు మరమ్మతులకు గురవగా కొత్తగా 883 నిర్మించాలని ప్రతిపాదించారు.

ఎక్కడెక్కడ ఏ ఇబ్బందులంటే..

రంపచోడవరం: ముసురుమిల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో ఆరేళ్లుగా ఆర్వో ప్లాంటు మరమ్మతులకు గురై మూలకు చేరింది. ఐటీడీఏ ఆధ్వర్యంలో ఆర్‌డబ్ల్యూఎస్ నిర్మించిన 20 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకు మరమ్మతులకు గురై నీరు వృథాగా పోతోంది. విద్యార్థులకు చేతిపంపుల నీటిని కాచి చల్లార్చి అందిస్తున్నారు.

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి బాలుర ఆశ్రమ పాఠశాలలో 319 మంది విద్యార్థులుండగా ఒకటే చేతి పంపు ఉంది. ఓవర్‌హెడ్ ట్యాంకు లేదు. విద్యుత్తు నిలిచిపోతే చేతి పంపే ఆధారం. ఆర్వో ప్లాంట్లు పనిచేయక నీటిని వేడిచేసి అందిస్తున్నారు. కిచెన్ షెడ్‌ను ఉపాధ్యాయులే ఏర్పాటుచేశారు. డైనింగ్ హాల్ లేదు. డ్రైనేజీలు నిర్వహణ లేక దుర్భరంగా ఉన్నాయి.

రాజవొమ్మంగి బాలుర ఆశ్రమ పాఠశాలకు ఈ చేతి పంపే ఆధారం

ఎటపాక: నల్లకుంట, కొత్తూరు నారాయణపురం, ఎటపాకలో మూడు ఆశ్రమ పాఠశాలలున్నాయి. ఎటపాకలో శాశ్వత భవనం లేదు. గతంలో రెవెన్యూ కార్యాలయానికి వినియోగించిన భవనాన్ని వసతికి.. ఆర్డీఓ కార్యాలయానికి కేటాయించిన భవనంలో తరగతులు నిర్వహిస్తున్నారు. తాత్కాలికంగా రేకులతో షెడ్ వేసి వంటశాలగా వాడుతున్నారు. భోజనానికి ఎంపీడీవో కార్యాలయ సమావేశ హాలును ఆశ్రయిస్తున్నారు. అక్కడేదైనా సమావేశం జరిగితే విద్యార్థులంతా కంచాలతో తరగతి గదులకు వెళ్లాల్సిందే.

చింతూరు నర్సింహపురం బాలికల పాఠశాలలో మూలకుచేరిన ఆర్వో ప్లాంట్

మారేడుమిల్లి బాలుర ఆశ్రమ పాఠశాలలో మరుగుదొడ్ల దుస్థితి

మారేడుమిల్లి: మారేడుమిల్లిలోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలో సుమారు 300 మంది విద్యార్థులు ఉన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మరో 80 మందికీ ఇక్కడే వసతి.. భవనాలు, డైనింగు హాలు చాలవు. కళాశాల విద్యార్థులకు శిథిలమైన షెడ్‌లోనే వంటలు చేస్తున్నారు. బోర్లు పనిచేయవు. మరుగుదొడ్లు శిథిలమవడంతో విద్యార్థులు బహిరంగ ప్రదేశాల్లో కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు.

సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే శిరీషాదేవి, తదితరులు

మన్యంలో సమస్యలు పరిష్కరించాలి

సలహా మండలి సమావేశంలో ఎమ్మెల్యే శిరీషాదేవి

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: పోలవరం జిల్లా (రంపచోడవరం నియోజకవర్గం)లో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం అమరావతిలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర గిరిజన సలహా మండలి సమావేశంలో ఆమె మాట్లాడుతూ గిరిజనుల విద్య, వైద్యం, ఉపాధి, తదితర అంశాలను ప్రస్తావించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో వసతుల కొరత, గిరిజన నిరుద్యోగుల భవితవ్యం వంటి పలు అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు.

● ఏజెన్సీ ప్రాంతంలో ఉద్యోగావకాశాల కల్పనలో కీలకమైన జీవో నంబరు 3 రద్దు కావడంతో గిరిజన విద్యార్థులు అన్యాయానికి గురవుతున్నారని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయంగా తక్షణమే కొత్త జీవో తీసుకువచ్చి గిరిజనులకు ఉపాధి అవకాశాల్లో పెద్దపీట వేయాలని కోరారు. ● ఐటీడీఏ ఛైర్మన్‌గా ఇప్పటికీ కాకినాడ జిల్లా కలెక్టర్ కొనసాగుతుండటంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ పోలవరం జిల్లా కలెక్టర్‌ను ఛైర్మన్‌గా నియమించాలని కోరారు. జిల్లా ఏర్పడినా పూర్తిస్థాయి అధికారులు, శాశ్వత భవనాలు లేవని, ప్రభుత్వం చొరవ చూపాలన్నారు.

గృహాలకు బకాయిల బిల్లులు చెల్లించాలి..

● 2017-18లో మంజూరైన గృహాలకు బకాయిల బిల్లుల మంజూరుతో పాటు లబ్ధిదారులకు అదనంగా రూ. 50 వేలు అందించాలని, గిరిజన యువతకు ట్రైకార్ రుణాలను పునరుద్ధరించాలని కోరారు. ● ఏజెన్సీలోని పలు వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరాయని కొత్తవి నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంలను నియమించి విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. అధికారుల పర్యవేక్షణ లేక మెనూ సక్రమంగా అమలుకావడం లేదని, నాణ్యత లేని ఆహారంతో విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. ● గత ప్రభుత్వ హయాంలో జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా ఏజెన్సీ ప్రాంతానికి కేటాయించిన నిధులను అప్పటి నేతలు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. సమగ్ర విచారణ చేసి నిధులను రికవరీ చేయాలని కోరారు. ● నియోజకవర్గంలో పాలకవర్గ సమావేశాలు జరగకపోవడంతో సంక్షేమ ఫలాలు ప్రజలకు అందడం లేదని, తక్షణమే సమావేశం ఏర్పాటుచేసేలా చూడాలని కోరారు. సమస్యలపై మంత్రి సంధ్యారాణి సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే శిరీషాదేవి తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

పోటెత్తిన నదులు.. ముంపుతో అవస్థలు

దేవీపట్నం, వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: పోలవరం కాపర్‌డ్యాం గేట్లు మూసివేయడంతో రెండో రోజు బుధవారం గోదావరి, శబరి నదుల్లో నీటి మట్టం పెరిగింది. దేవీపట్నం మండలం గండిపోశమ్మ ఆలయ పరిసరాలు, ఒడ్డును ఆనుకుని ఉన్న దుకాణాల్లోకి నీరు చేరింది. దండంగి, డి.రావిలంక మధ్య వరద మరింత పెరగడంతో మన్యం నుంచి సీతానగరం, పురుషోత్తపట్నం వైపు రాకపోకలు నిలిచిపోయాయి. పోలవరం ముంపు గ్రామాల్లో దండంగి, చినరమణయ్యపేట, కె.వీరవరం, సీతారంలో మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది గోదావరి వరదల నేపథ్యంలో నాలుగు నెలలుగా అమ్మవారి దర్శనాలు నిలిచిపోయాయి. మరో మూడు రోజుల్లో అమ్మవారి దర్శనాలకు ఏర్పాట్లు చేస్తున్న నేపథ్యంలో గోదావరి పెరగడంతో ఆలయం వైపు భక్తులు రాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

గండిపోశమ్మ ఆలయ పరిసరాల్లో వరద నీరు

శబరి ఒడ్డున లంక పొగాకు తోటలో ముంపునీరు

పొగాకు తోటల్లో ముంపు..

వరరామచంద్రాపురం మండలంలో శబరి నది ఒడ్డు పక్కన పొలాల్లోకి ముంపు నీరు చేరింది. ఏటా వరదలు తగ్గిన తరువాత కొందరు పేద రైతులు ఒడ్డు పక్కన లంక భూముల్లో అపరాలు, పొగాకు తోటలు సాగు చేస్తుంటారు. చమురు యంత్రాలకు పెట్టుబడి పెట్టే ఆర్థిక పరిస్థితి లేకపోవడంతో కావిళ్లతో నది నుంచి నీరు తెచ్చుకుని మొక్కలను సంరక్షించుకుంటున్నారు. శబరి వంతెన సమీపంలో ఇలా కొందరు సాగు చేస్తున్నారు. బుధవారం నది నీటిమట్టం పెరిగి తోటలు ముంపునకు గురవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా చక్రస్నానం

కల్పవృక్ష వాహనంపై శ్రీనివాసుడు

ఆలమూరు: కోనసీమ జిల్లా చింతలూరులోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి పాంచాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆఖరి రోజైన బుధవారం శ్రద్ధోత్సవం, పూర్ణాహుతి కార్యక్రమాలు జరిగాయి. అనంతరం స్వామివారి చక్రస్నానం నిర్వహించారు. సాయంత్రం కల్యాణవేంకటేశ్వరునిగా కల్పవృక్ష వాహనంపై పురవీధుల్లో ఊరేగారు. భక్తులు పాల్గొన్నారు.

అటవీ భూముల్లో సాగుతో గిరిజనుల అభివృద్ధి

మాట్లాడుతున్న ఆదినారాయణ

రంపచోడవరం, న్యూస్‌టుడే: జిల్లాలో గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా సామాజిక భూముల్లో వివిధ ఉద్యాన పంటలు సాగు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయని రాష్ట్ర అటవీ హక్కుల చట్టం సమన్వయకర్త ఆదినారాయణ అన్నారు. బుధవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో ఎన్‌జీవోలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రంపచోడవరం, చింతూరు డివిజన్లలోని 230 గ్రామాల్లో 52 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేసి అటవీ ఉత్పత్తుల ద్వారా గిరిజనులు ఆర్థికంగా ఎదిగేందుకు విధివిధానాలు రూపొందించారన్నారు. ఒక్కో గ్రామంలో 100 హెక్టార్లలో సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.16 లక్షలు మంజూరు చేసేందుకు సుముఖంగా ఉన్నాయని తెలిపారు. అటవీ ఉత్పత్తులను మైదాన ప్రాంతాలకు తరలించి విక్రయించడం ద్వారా గిరిజనులు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు చర్యలు చేపట్టాయన్నారు. ముందుగా గ్రామసభలు నిర్వహించి తీర్మానాలు చేసిన తర్వాత గిరిజనులకు ఉపయోగపడేవిధంగా తగు చర్యలు చేపడతారన్నారు. దీనిపై ఎన్‌జీవో ప్రతినిధులు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. రాష్ట్ర పీఎంయూ అధికారి వెంకటకృష్ణన్, ఎన్‌జీవో ప్రతినిధులు సుబ్బరాజు, గాంధీబాబు, వెంకటేష్, మంగతాయారు, చంద్రకళ, సంధ్య, అప్పలరాజు, చిన్నారావు, నరేంద్ర, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ప్రసాదాల విశిష్టతపై అవగాహన

రాజమహేంద్రవరం సాంస్కృతికం: శ్రీవారి ప్రసాదాలకు ఎంతో విశిష్టత ఉందని తితిదే పూర్వపు ప్రధానార్చకులు ఎ.వి.రమణ దీక్షితులు అన్నారు. ఆయన రచించిన 'తిరుమల శ్రీవారి దివ్య ప్రసాదాలు' పుస్తకాన్ని రాజమహేంద్రవరం నగరానికి చెందిన 'నాగేంద్రాస్ న్యూ గొల్లపూడి వీరాస్వామి అండ్ సన్' పక్షాన గొల్లపూడి నాగేంద్ర ప్రచురించగా గత డిసెంబరులో తితిదే ఛైర్మన్ బి.ఆర్.నాయుడు ఆవిష్కరించారు. రమణ దీక్షితులు నగరానికి రావడంతో పుస్తక పరిచయ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. పారిశ్రామికవేత్త మధు ఫోమ్రా తొలి పుస్తకం అందుకున్నారు. రమణ దీక్షితులు మాట్లాడుతూ శ్రీవారి అన్నప్రసాదాలు చాలా రకాలు ఉంటాయని, నిత్యోత్సవాలు, పక్షోత్సవాలు, మాసోత్సవాలు, బ్రహ్మోత్సవాలు, పర్వదినాల్లో విశేష ప్రసాదాలతో నివేదన చేస్తారన్నారు. 9కిలోల బరువుతో పెద్దసైజు పుస్తకంగా గొల్లపూడి నాగేంద్ర రూపొందించి మోడల్‌గా ప్రదర్శించారు.

ప్రయాణికులకు శుద్ధి జలాలు

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం ఆర్టీసీ ప్రధాన బస్టాండ్‌లో ప్రయాణికులకు శుద్ధి చేసిన తాగునీటిని అందించేందుకు ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేస్తున్నారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రతి రోజూ 25 వేల మందికిపైగా ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. గతంలో చల్లటి తాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన ఫ్రీజ్ మరమ్మతుకు గురైంది. ఇప్పటికే పల్లెవెలుగు సర్వీసుల ప్రాంగణంలో 1,500 లీటర్ల సామర్థ్యం(కెపాసిటీ) ఉన్న ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశారు. ప్రధాన బస్టాండ్‌లో మంచినీటి సౌకర్యం పూర్తిస్థాయిలో లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో నాన్‌స్టాప్ టికెట్ బుకింగ్ కౌంటర్ వద్ద 1,500 లీటర్ల సామర్థ్యం ఉన్న ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నారు. అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సహకారంతో భవాని ట్రస్టు ద్వారా రూ.2.50 లక్షల వ్యయంతో దీనిని నిర్మిస్తున్నామని డిపో అధికారులు చెబుతున్నారు.

రైతులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య

● నమోదుతోనే పథకాల్లో లబ్ధి
● జిల్లాలో 52 శాతం పూర్తి

న్యూస్‌టుడే – రాజవొమ్మంగి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పెట్టుబడి సాయం, ఎరువుల రాయితీ, పంట బీమాతోపాటు ఉత్పత్తుల విక్రయాలు, బ్యాంకుల నుంచి రుణాలు పొందడానికి రైతులు తమ వివరాలను నమోదు చేయించుకోవాల్సి ఉంటుంది. జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ (ఏపీఎఫ్ఆర్) ప్రక్రియ చాలాకాలంగా కొనసాగుతున్నప్పటికీ 52.24 శాతం మాత్రమే పూర్తయింది. పట్టాదారు పాసుపుస్తకం పొందిన ప్రతి రైతూ వివరాలను నమోదు చేయించుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

ఎలా చేయించుకోవాలంటే..

రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రానికి ఆధార్‌కార్డుతోపాటు దీనికి లింక్ అయిన చరవాణిని తీసుకెళ్లాలి. గ్రామ వ్యవసాయ సహాయకులు వివరాలను నమోదు చేసి ఫోన్‌కు వచ్చే ఓటీపీ ఆధారంగా రిజిస్ట్రేషన్ చేస్తారు. ప్రతి రైతుకు ప్రత్యేకంగా 11 అంకెలతో కూడిన ప్రత్యేక విశిష్ట సంఖ్య వస్తుంది. ఈ సంఖ్యతో మీ సేవ కేంద్రాల్లో స్మార్ట్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

రైతు వివరాలు నమోదు చేస్తున్న ఏవో

సొంతంగా నమోదు చేసుకోవచ్చు..

వ్యవసాయ శాఖ ప్రారంభించిన రైతు మొబైల్ యాప్‌ను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని స్వయంగా అన్నదాతలే ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. లేదా సమీప రైతు సేవా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలి.

వివరాలు ఇలా..

జిల్లాలోని 12 మండలాల్లో 62,606 మంది రైతులు ఉండగా.. ఇప్పటికి 32,709 మందికి ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తయింది, 29,897 మంది రైతులు ఇంకా నమోదు చేయించుకోవాల్సి ఉంది. 52.24 శాతం రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయింది.

తప్పనిసరిగా చేయించుకోవాలి

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని ప్రభుత్వం నిర్దేశించింది. తద్వారా అన్ని సంక్షేమ ఫలాలు అందుకోవడానికి వీలుకలుగుతుంది. ప్రతి రైతూ స్పందించి త్వరగా నమోదు చేయించుకోవాలి.

– ఎస్‌బీఎస్ నంద్
జిల్లా వ్యవసాయాధికారి, రంపచోడవరం

మహా గణపతికి పంచలోహ కవచం

రాష్ట్రంలో ప్రసిద్ధిచెందిన మందపల్లి శనీశ్వరాలయంలోని మహాగణపతి విగ్రహానికి పంచలోహ కవచాన్ని అలంకరించనున్నారు. మండపేటకు చెందిన శిల్పి వాసా శ్రీనివాస్‌తో విజయవాడకు చెందిన భక్తులు పల్లపురాజు దంపతులు కవచాన్ని తయారు చేయించారు. మహాగణపతి విగ్రహానికి అలంకరించేలా 18 అంగుళాల ఎత్తు, 14 అంగుళాల వెడల్పున్న కవచం రెండు కిలోల బరువున్న పంచలోహాలతో తయారు చేసినట్లు శిల్పి తెలిపారు. శనీశ్వరాలయంలో స్వామివారి కల్యాణం నేపథ్యంలో గురువారం అందిస్తామని వివరించారు. - న్యూస్‌టుడే, మండపేట

సుద్దముక్కలతో సూక్ష్మ కళాఖండాలు

పెద్దాపురం పట్టణానికి చెందిన గృహిణి కోరుకొండ మహాలక్ష్మి సుద్దముక్కలతో సూక్ష్మ కళాఖండాలు తయారుచేసి అబ్బుర పరుస్తున్నారు. ఈమె తండ్రి బిక్కవోలు మండలం పందలపాక గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు అప్పల బత్తుల ప్రకాశరావు. తండ్రి తయారుచేసిన వస్తువులను చూసి ఈవిద్యను నేర్చుకున్నారు. సుద్దముక్కలతో సూక్ష్మ కళాఖండాలే కాదు చిత్రలేఖనం, బంగారపు వస్తువుల డిజైనింగ్, కాస్ట్యూమ్స్ డిజైనింగ్, ఇంటీరియల్ డిజైనింగ్‌లోనూ ప్రావీణ్యం సాధించారు. మదర్‌థెరిసా, ప్రధాని నరేంద్రమోదీ, బుద్ధుడు, స్వాతంత్య్ర సమరయోధులు మహాత్మాగాంధీ, అల్లూరి సీతారామరాజు, వినాయకుడు, వేంకటేశ్వరస్వామి, లక్ష్మీదేవి వంటి దేవుళ్ల చిత్రాలు గీశారు. - న్యూస్‌టుడే, పెద్దాపురం

ప్రధాని నరేంద్ర మోదీ చిత్రానికి రంగులు అద్దుతున్న కోరుకొండ మహాలక్ష్మి

కొంగల ఆకృతి

ఆలోచన అదిరింది..

రాజులపాలెం గ్రామానికి చెందిన రైతు కుసుమ సత్యనారాయణ పది సెంట్ల విస్తీర్ణంలో ఆకుకూరలు సాగు చేస్తున్నారు. పంటకు నీటితడులు ఇచ్చేందుకు ఆయన చేసిన ప్రయత్నం బాగుంది. చేతిపంపు నీటిని బకెట్‌లో పోసి తీసుకెళ్లే అవసరం లేకుండా అడుగున రంధ్రం చేసి దానికి ప్లాస్టిక్ పైపు అమర్చారు. బకెట్‌లోంచి నీరు నేరుగా పైపు ద్వారా పంటకు చేరుతోంది. దీనికి ఖర్చు, శ్రమ లేకుండా ఉందని ఆయన చెబుతున్నారు. - న్యూస్‌టుడే, పి.గన్నవరం

నేడు మహిళల హాకీ తుది పోరు

సెమీ ఫైనల్స్‌కు చేరిన పురుషుల జట్లు

పురుషుల జట్ల మధ్య జరుగుతున్న హాకీ మ్యాచ్

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ డీఎస్ఏలో జరుగుతున్న కోకనాడ గోల్డ్ కప్ హాకీ టోర్నమెంట్ తుది దశకు చేరింది. గురువారం మహిళల విభాగంలో హాకీ హరియాణా, ఎన్‌సీవోఈ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరగనుంది. పురుషుల క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు బుధవారం ఉత్సాహంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా మాజీ రైల్వే ఉద్యోగి రత్నాకర్, మాజీ ఇన్‌కంటాక్స్ అధికారి వెంకటేశ్వర్లు తదితరులు హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని, మ్యాచ్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డులు అందజేశారు. కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్ ఫౌండర్ కె.రవిచంద్రప్రసాద్, క్లబ్ అధ్యక్షుడు ఎ.బాబ్జి, రాష్ట్ర హాకీ సంఘ జాయింట్ సెక్రటరీ రవిరాజు, హాకీ కోచ్ నాగేంద్రకుమార్, పీడీలు సూరిబాబు, క్లబ్ సభ్యులు పర్యవేక్షించారు.

క్వార్టర్ ఫైనల్ విజేతలు వీరే..

సెంట్రల్ బోర్డు ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్‌పై 2-1తో పంజాబ్ నేషనల్ బ్యాంక్, సెంట్రల్ సెక్రటరియేట్ జట్టుపై 4-1తో ఒడిశా నేవల్ టాటా హాకీ జట్టు విజయం సాధించాయి. ఇండియన్ ఆర్మీపై 1-0తో సౌత్ సెంట్రల్ రైల్వేస్, ఇండియన్ నేవీపై 4-1తో ఐవోసీ జట్టు గెలుపొందాయి.

గొల్లవిల్లిలో వాలీబాల్ సంరంభం

న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

గ్రామంలో పోటీలకు ఏర్పాటుచేస్తున్న మైదానం

పట్టణాలే కాదు పల్లెలుకూడా జాతీయస్థాయి క్రీడాసంబరాలకు వేదికగా నిలుస్తున్నాయి. ఇందుకు నిదర్శనం ఉప్పలగుప్తం మండలంలోని గొల్లవిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వాలీబాల్ క్రీడా ప్రాంగణం. ఈ పాఠశాలలో చదివే విద్యార్థులు సైతం జాతీయ స్థాయి పోటీల్లో మెరుస్తూ గ్రామానికి కీర్తిప్రతిష్ఠలు తెస్తున్నారు. ఇక్కడ చదివే విద్యార్థులు అన్నిరంగాల్లో ప్రావీణ్యం సాధించడం గమనార్హం.

క్రీడా గ్రామంగా ప్రస్థానం ఇలా..

1989లో తూర్పుగోదావరి జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు పాఠశాల మైదానంలో ప్రారంభించడంతో స్థానిక క్రీడాకారులకు, గ్రామస్థులకు ఆసక్తిరేగింది. దీంతో తిరిగి 2000 సం॥లో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించి విజయపథంలో నడిపించడంతో ఇక్కడ ప్రాంగణానికి మంచిపేరు వచ్చింది. 2017లో జాతీయస్థాయి పోటీలకు గొల్లవిల్లి గ్రామం ఆతిథ్యమిచ్చింది. అప్పటి నుంచి ఈ గ్రామం వాలీబాల్ గ్రామంగా మారిపోయింది. 2018లో ఇదే ప్రాంగణంలో నిమ్మకాయల రంగయ్య మెమోరియల్ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించి జాతీయస్థాయి గుర్తింపు తెచ్చారు. 2025లో తిరిగి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అరిగెల శ్రీరంగయ్య (ఎఎస్ఆర్) వాలీబాల్ టోర్నమెంట్ పేరుతో గ్రామస్థులు జాతీయస్థాయి మహిళా, పురుష వాలీబాల్ పోటీలు నిర్వహించి గ్రామానికి పూర్వవైభవం తెచ్చారు. అదే పేరుతో ఈ నెల 15 నుంచి శివరాత్రిని పురస్కరించుకుని 5రోజుల పాటు ఏఎస్ఆర్ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. అందుకు తగ్గ ఏర్పాట్లు గొల్లవిల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో చురుగ్గా సాగుతున్నాయి. మహిళా, పురుష క్రీడాకారులకు వేరు వేరుచోట్ల విశ్రాంతి గదులు సిద్ధం చేశారు. ప్రాంగణం చుట్టూ ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేస్తున్నారు.

అన్ని సిద్ధం చేస్తున్నాం..

గత ఏడాది కంటే మెరుగ్గా క్రీడాకారులకు వసతి సౌకర్యం ఏర్పాటు చేశాం. సుమారు 6 వేల మంది మహిళలు, పురుషులకు వేర్వేరుగా మ్యాచ్‌లను వీక్షించేలా గ్యాలరీలు సిద్ధం అవుతున్నాయి. ప్రతీరోజు సాయంత్రం ఆరు నుంచి రాత్రి 12వరకూ మ్యాచ్‌లు జరిగే అవకాశం ఉంది.

- దేశంశెట్టి లక్ష్మీనారాయణ, ఏఎస్ఆర్ టోర్నమెంట్ అధ్యక్షుడు

శివయ్యా.. సౌకర్యాలేవయ్యా..

అంబాజీపేట, న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని అంబాజీపేట, అయినవిల్లి, అమలాపురం గ్రామీణ మండలాల్లో ఉన్న ఏకాదశ రుద్రుల ఆలయాల్లో భక్తులకు వివిధ సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. ఈ నెల 15న (ఆదివారం) మహాశివరాత్రి. దీనికి తగ్గట్టుగా ఆయా మండలాల్లోని పరమశివుడి ఆలయాలను భక్తుల కోసం సిద్ధం చేస్తున్నారు. తాగునీరు సౌకర్యం ఏర్పాటు చేయాలి. భక్తులకు క్యూలైన్‌లు సిద్ధం చేయాలి. ప్రధానంగా ఆలయాలకు వేకువజాము నుంచే భక్తులు వస్తారు కాబట్టి ముఖ్యకూడళ్లు, రహదారుల చెంతన విద్యుత్తు దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలి. ఆలయాలకు వచ్చే రహదారులు అధ్వానంగా ఉన్నాయి. అంబాజీపేట మండలంలోని కె.పెదపూడి, వ్యాఘ్రేశ్వరం, గంగలకుర్రుఅగ్రహారం గ్రామాల్లోని మంజునాథుడి ఆలయాలకు వెళ్లే రహదారులు గుంతలుపడి దారుణంగా ఉన్నాయి. వీటికి కనీస మరమ్మతులైనా చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

వ్యాఘ్రేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఇలా..

భారీ వాహనాలు వెళ్లకుండా పహారా..

రాత్రి సమయంలో పహారా కాస్తున్న లస్కర్లు

పి.గన్నవరం: పి.గన్నవరం డొక్కా సీతమ్మ అక్విడక్టు రోడ్డు వంతెనకు మంగళవారం నుంచి మరమ్మతు పనులు మొదలు పెట్టారు. దీనికి చేరువలో ఉన్న కాటన్ అక్విడక్టు రోడ్డు వంతెనపై ఆర్టీసీ బస్సులు, ఇతర భారీ వాహనాలు వెళ్లకుండా ట్రాఫిక్‌ను మళ్లించారు. ముందుజాగ్రత్త చర్యగా ఇక్కడ రేయింబవళ్లు కాపలా ఉండేవిధంగా జలవనరులశాఖ లస్కర్లను నియమించారు. 12 గంటల పాటు డ్యూటీ వేసేవిధంగా రోజుకు రెండు షిఫ్టులతో వీరిని నియమించారు. కాటన్ అక్విడక్టుకు అవతల, ఇవతల మొత్తం నలుగురిని ఉంచారు. 42 రోజుల పాటు లస్కర్లను నియమించనున్నట్లు జలవనరుల శాఖ డీఈఈ భూపతిరాజు రవిప్రసాద్‌రాజు వెల్లడించారు.

నూతన పెన్షన్ విధానంపై స్పష్టత ఇవ్వాలి

మాట్లాడుతున్న పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్

మలికిపురం, న్యూస్‌టుడే: గరిష్ఠ సర్వీసు తర్వాత ఉద్యోగ విరమణ చేయించే అసంబద్ధ నిబంధనలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంకటాల చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. స్థానిక మండల వనరుల కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు దీపాటి సురేశ్‌బాబు అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసే లోగా 12వ పీఆర్సీ ఛైర్మన్‌ను నియమించాలని, పాత పెన్షన్ విధానం అమలు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని, ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్య పరిష్కారానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని, ఎంటీఎస్ ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని, బకాయిల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు అప్పారి రామకృష్ణ, పంగం నీలారావు, రాష్ట్ర కార్యదర్శులు పంగం బ్రహ్మాజీరావు, యెరుబండి సత్యనారాయణ, పల్లంరాజు, యేపుగంటి పద్మనాభం, హేమసుందర్రావు, సుబ్రహ్మణ్యం, మట్టా శ్రీను, కోరుకొండ సువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిలో తొలగిన ఆక్రమణలు

కైకాలపేట వద్ద తొలగించిన ఇళ్లు

ఈనాడు కథనానికి స్పందన

మామిడికుదురు, న్యూస్‌టుడే: జాతీయ రహదారి 216లో బైపాస్ అనుసంధానమయ్యే చోట పాశర్లపూడి పరిధి కైకాలపేట వద్ద ఉన్న ఆక్రమణలను రెవెన్యూ, ఎన్.హెచ్. అధికారులు తొలగించారు. ఇక్కడ వై. జంక్షన్‌ను విస్తరించి విభాగినులను ఏర్పాటు చేయడం, సిమెంటు డ్రెయిన్ పనులు చేపట్టినా అప్పటికీ తొలగని ఆక్రమణల కారణంగా వాహనచోదకులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ పరిస్థితులపై ఈ నెల 8న 'అసంపూర్తి పనులు.. ప్రమాద ఘంటికలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. నాలుగు పూరిళ్లను తొలగించి వారికి పాశర్లపూడిలంకలో రెండేసి సెంట్ల చొప్పున స్థలాలు ఇచ్చేందుకు సమ్మతించారు. దీంతోపాటు కొంత ఆర్థిక సాయం చేసి ఇళ్లలోని సామగ్రి తరలించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ పి.సునీల్‌కుమార్ తెలిపారు.

భీమేశ్వరస్వామి రథానికి ప్రత్యేక పూజలు

రథం వద్ద పూజలు చేస్తున్న ఆలయ ఈవో నీలకంఠం, ఛైర్మన్ జగదీష్‌మోహన్

సామర్లకోట, న్యూస్‌టుడే: భీమేశ్వరాలయంలో ఈనెల 13 నుంచి 18వ తేదీ వరకు జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా రథయాత్రకు సంబంధించి బుధవారం రథం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో నీలకంఠం, ఛైర్మన్ జగదీష్‌మోహన్ ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈనెల 16న స్వామివారి రథోత్సవం సందర్భంగా రథం సెంటర్ వద్ద షెడ్డులో ఉన్న రథానికి పూజలు చేసి గాంధీ బొమ్మవద్దకు తీసుకువచ్చారు.

వేతన ఒప్పందంపై రెండోసారి చర్చలు విఫలం

దేవరపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని గౌరీపట్నంలో క్రషర్ కార్మికుల నూతన వేతన ఒప్పందంపై బుధవారం జరిగిన చర్చలు విఫలమయ్యాయి. గతంలో జరిగిన వేతన ఒప్పందం జనవరి 8న ముగియడంతో నూతన ఒప్పందం కోసం రెండుసార్లు క్రషర్, క్వారీ యజమానుల సంఘంతో చర్చలు జరిపారు. కార్మిక యూనియన్ నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం కార్మికులకు రోజుకు (24 గంటలకు) రూ.1300 వేతనం ఇస్తున్నారని, అదనంగా రూ.700 పెంచి రూ.2000 ఇవ్వాలన్నారు. సంక్రాంతి పండగ సందర్భంగా నెల రోజుల వేతనం బోనస్‌గా ఇవ్వాలని, ప్రతి కార్మికుడికి రూ. 10 లక్షలు ప్రమాద బీమా చేయించాలని, క్రషర్ ఆడే సమయంలో కార్మికులకు 150 గ్రాముల బెల్లం, రెండు అరటి పండ్లు, మాస్కు, మంచినీటి సదుపాయం, కార్మికులను పని నుంచి తొలగించిన తరువాత చేసిన కాలానికి సర్వీస్ (గ్రాడ్యుటీ) చెల్లించాలని డిమాండ్ చేశారు. యజమానుల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో వేతనాలు పెంచలేమని అందరితో సమీక్షించిన తర్వాత మంగళవారం చర్చలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ చర్చల్లో యజమానుల సంఘం అధ్యక్షుడు ఆండ్రు అనిల్, సూర్యనారాయణ రాజు, సత్యనారాయణ, దోనెల్లి మధుబాబు, కార్మిక సంఘం నాయకులు ఎస్‌కే మస్తాన్, కస్సే సత్యనారాయణ, కృష్ణ, రాము, రాజు, తదితరులు పాల్గొన్నారు.

తోడుగా వచ్చి.. ప్రాణాలు తీసి!

సహజీవనం చేస్తున్న వ్యక్తిని హతమార్చిన మహిళ

విశాఖపట్నం(ఆనందపురం): సహజీవనం సాగిస్తున్న ఇద్దరి మధ్య గొడవలు రావడంతో పురుషుడిని మహిళ దారుణంగా హత్య చేసిన ఘటన విశాఖపట్నం జిల్లా ఆనందపురం శివారు పందుల ఫారంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. మధురవాడ ప్రాంతానికి చెందిన పైడిరాజు ఆనందపురం శివారులో రెండేళ్ల నుంచి పందుల ఫారం నిర్వహిస్తున్నాడు. రాజమహేంద్రవరానికి చెందిన ఎస్.నాగశివ(38), షేక్ ముబీనా(శ్రావణి)(41) భార్యాభర్తలుగా పైడిరాజుకు పరిచయం చేసుకుని, ఫారం నిర్వహణ పనులు చూసుకుంటున్నారు. మంగళవారం అర్ధరాత్రి ఇద్దరూ మద్యం తాగి గొడవ పడ్డారు. నాగశివ అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు శ్రావణి బుధవారం ఉదయం పోలీసులకు సమాచారం ఇచ్చింది. మృతుడి శరీరంపై గట్టి దెబ్బలు ఉండడంతో శ్రావణిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించి, ఆమె హత్య చేసినట్లు నిర్ధారించారు.

చోరీ చేసిన వాహనాలపై గంజాయి రవాణా

పోలీసుల అదుపులో నిందితులు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: జల్సాలకు అలవాటు పడి ద్విచక్రవాహన చోరీలు, గంజాయి రవాణా వంటి నేరాలకు పాల్పడుతున్న ఇద్దరికి రాజమహేంద్రవరంలోని రెండో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా ఇరగవరం మండలం రేలంగి గ్రామానికి చెందిన తానేటి జయేంద్రవర్మ, అదే ప్రాంతానికి చెందిన మరో బాలుడు గంజాయి వ్యాపారం చేస్తే ఎక్కువ డబ్బు వస్తుందని భావించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో అయిదు ద్విచక్రవాహనాలను చోరీ చేశారు. విశాఖ, సీలేరు మన్యం ప్రాంతాల్లో వాహనాల ద్వారా 1.8 కిలోల గంజాయిని నగరానికి తరలించారు. ఆల్కాట్‌తోట రైతుబజార్ దగ్గర్లో రెండో పట్టణ పోలీసులు గంజాయితో ఉన్న వీరిని పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ప్రసాదం కౌంటర్ వద్ద వీరంగం..

యువకులపై చర్యలు

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం కొండ దిగువన తొలి పావంచాల వద్ద ప్రసాదం విక్రయ కౌంటర్ వద్ద వీరంగం సృష్టించిన యువకులపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. ఈనెల 8న మధ్యాహ్నం కొందరు యువకులు క్యూలైన్లో ఉన్న ఓ వ్యక్తిపై దాడికి దిగి అక్కడి వారిని భయభ్రాంతులకు గురి చేసిన విషయం విదితమే. ప్రసాదం టికెట్లు ఇచ్చే కౌంటర్ వద్ద క్యూలైన్లలో వెళ్లే సమయంలో యువకులు హడావుడి చేసి లైన్లో ఉన్న మరో వ్యక్తితో వాగ్వాదానికి దిగారు. రెచ్చిపోయిన యువకులు లైన్లో నుంచి బారికేడ్లపై నుంచి ప్రమాదకరంగా దూకి వెళ్లి దాడి చేశారు. దీంతో భక్తులు ఆందోళనకు గురయ్యారు. అక్కడివారు వీడియో తీయగా సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేసింది. ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. జిల్లా ఎస్పీ ఆదేశాలతో సీసీ కెమెరాల ద్వారా పోలీసులు పరిశీలించారు. వీరిది పెదపూడి మండలం గండ్రేడు గ్రామంగా గుర్తించారు. వీరంతా తలుపులమ్మ లోవ ఆలయానికి వెళ్లి వస్తూ వీరంగం సృష్టించారని తెలుసుకున్నారు. దాడికి పాల్పడిన 10 మంది యువకులను అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. వీరిని బైండోవర్ చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నామని ఎస్సై శ్రీహరిబాబు తెలిపారు.

రేపటి నుంచి గోలింగేశ్వరస్వామి కల్యాణ వేడుకలు

నిడదవోలు: నిడదవోలులోని రాజరాజేశ్వరి సహిత గోలింగేశ్వస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. పట్టణ నడిబొడ్డున ఉన్న చారిత్రాత్మకమైన గోలింగేశ్వరస్వామిని ఈ ప్రాంత ప్రజలు తమ ఇలవేల్పుగా భావిస్తారు. ఈనెల 13 నుంచి 17వ తేదీ వరకు ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ నామా సూర్యప్రకాశరావు తెలిపారు. 13న స్వామికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమపూజలు, రాత్రి స్వామివారి కల్యాణం జరుగుతుందన్నారు. 14న స్వామికి రుద్రాభిషేకాలు, 15న మహాశివరాత్రి సందర్భంగా తెల్లారుజామున మూడు గంటల నుంచి స్వామివారి మహాదర్శనం, రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహిస్తారు. మహాశివరాత్రి రోజున రుద్రాభిషేకాలు నిర్వహించుకునే భక్తులకు తెల్లారుజామున 3 నుంచి 5 గంటల వరకు, ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమయం కేటాయించారు. 16న స్వామికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమపూజలు, 17న స్వామి వారికి శ్రీపుష్పయాగోత్సవం నిర్వహించనున్నారు.

ఘనంగా లూర్దుమాత యాత్ర

ప్రత్తిపాడులో మరియగిరి మహోత్సవం

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ప్రత్తిపాడులో లూర్దుమాత యాత్రా మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. మరియగిరికి జిల్లా నలుమూలల నుంచి జనం పోటెత్తారు. మరియగిరిపై ఒమ్మి మోహన్ ప్రసాద్, ప్రభాకర్, రాజశేఖర్‌లు తొలి దివ్యపూజాబలి నిర్వహించారు. అనంతరం లూర్దుమాత, వ్యాకుల మాత, నిత్యసహాయ మాత విగ్రహాలను పూలతో అలంకరించిన తేరుపై ఊరేగింపుగా మరియగిరిపై ఉన్న మందిరానికి తీసుకెళ్లారు. క్రీస్తును, మేరీని కీర్తిస్తూ ప్రార్థనలు చేస్తూ కొండపై ఉన్న మేరీమాత మందిరానికి యాత్ర చేరుకుంది. మరియగిరిపై ఉన్న ప్రార్థనా మందిరంలో ఫాదర్ కె.చిన్నప్ప దివ్యసత్ప్రసాద ఆరాధన చేయగా, విశాఖ అతిమేత్రాసన వికార్ జనరల్ దుక్కిం పూడి బాలశౌరి, మేత్రాసన కోశాధికారి కె.జయరాజుల 50 మంది క్రైస్తవ గురువులతో కలిసి దివ్య పూజాబలి నిర్వహించారు. మేరీమాత వాత్సల్యం, క్రీస్తు త్యాగాలు స్ఫూర్తిగా తీసుకోవాలని ఉపదేశించారు. పునీత జోజప్ప మఠకన్యలు, చర్చికమిటీ సభ్యులు, ఆర్‌సీఎం యూత్ తదితరులు ఈ ఉత్సవంలో సేవలందించారు. ఖాదీ గ్రామీణ పరిశ్రమల బోర్డు వైస్‌ఛైర్మన్ కొమ్ముల కన్నబాబు తదితరులు ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఎస్సై లక్ష్మీకాంతం నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మరియగిరిపై దివ్య పూజాబలి నిర్వహిస్తున్న క్రైస్తవ గురువులు

వృద్ధురాలి మెడలో పుస్తెలతాడు చోరీ

- ఆమె ప్రతిఘటించడంతో ఈడ్చుకెళ్లిన దొంగ

చోరీ జరిగిన ప్రదేశంలో బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్సై సురేష్‌బాబు

రాయవరం, న్యూస్‌టుడే: ఒంటరిగా వెళ్లే మహిళల మెడలో గొలుసులు, పుస్తెలతాళ్లను చోరీ చేయడమే లక్ష్యంగా కొందరు రెచ్చిపోతున్నారు. రాత్రి సమయాల్లో దొంగలు బరితెగిస్తున్నారు. మంగళవారం రాత్రి రాయవరంలో జరిగిన ఘటనే దీనికి ఉదాహరణ. ఎస్సై డి.సురేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. రెడ్ల రామాలయం వద్ద కిరాణ సరకులు కొనుగోలుచేసిన వృద్ధ దంపతులు పులగం భామిరెడ్డి, లక్ష్మి ఇంటికి వెళుతుండగా చీకట్లో చరవాణి చూస్తూ ఓ యువకుడు ఆకస్మికంగా ఆమె మెడలోని 11 కాసుల బంగారు పుస్తెలతాడును లాక్కొనే ప్రయత్నం చేశాడు. బిత్తరపోయిన ఆమె తాడును చేతితో పట్టుకుని కేకలు వేస్తూ తీవ్రంగా ప్రతిఘటించింది. దీంతో ఆమెను ఈడ్చుకుంటూ చేతికి అందినంత తాడును పట్టుకుని ఆ యువకుడు పరారయ్యాడు. భార్య లక్ష్మి కేకలు విని ముందు నడుస్తున్న భామిరెడ్డి దొంగ వెళ్లిన వైపు కొంతదూరం వెళ్లినా చీకట్లో పట్టుకోలేక పోయారు. బాధితురాలి మెడ, మోచేయిపై స్వల్ప గాయాలయ్యాయి. సుమారు 25 గ్రాములపైనే బంగారుతాడు చోరీకి గురైందని ఆమె ఫిర్యాదుచేయగా కేసు నమోదుచేసినట్లు ఎస్సై చెప్పారు.

సీసీ కెమెరాలు లేని ప్రాంతంలో..

చోరీ ఘటనకు ముందు రావిచెట్టు సమీపంలో ఆ యువకుడు సిమెంట్‌బల్లపై కూర్చొని ఉన్నాడని బాధితులు చెబుతున్నారు. ఆ వీధిలో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ కెమెరా పరిధిలోకి రాని ప్రాంతంలో ఆమెపై దాడికి పాల్పడి.. పుస్తెలతాడును తెంచేందుకు ప్రయత్నించాడని పోలీసులు గుర్తించారు. ముందుగా ఆ ప్రాంతంలో కలియ తిరుగుతూ చోరీకి పాల్పడ్డాడని స్థానికులు చెబుతున్నారు. ఘటన జరిగిన ప్రాంతంతో పాటు పరిసరాలు, గ్రామంలోని ప్రధాన కూడళ్ల సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నామని ఎస్సై చెప్పారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	18,500
పాతకాయ: గండేరా	30,500
గటగట	29,000
కొత్తకాయ: గండేరా	30,000
గటగట	29,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	20,000-21,000
కొత్త (పచ్చి) కాయ	16,000-17,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	5,000
కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	120-00
రిటైల్ లైవ్	147-00
డ్రెస్డ్	213-00
స్కిన్‌లెస్	243-00

సార్వత్రిక సమ్మెకు ఏపీఎన్జీవోల మద్దతు

కాకినాడ కలెక్టరేట్: దేశ వ్యాప్తంగా కేంద్ర కార్మిక, ఉద్యోగ సంఘాలు గురువారం తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు మద్దతు ఇస్తున్నట్లు ఏపీఎన్జీవో అసోసియేషన్ కాకినాడ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుద్దటి రామ్మోహనరావు, పాలపర్తి మూర్తిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకు కాకినాడ కలెక్టరేట్ వద్ద తలపెట్టిన నిరసనకు జిల్లాలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్స్, కార్మికులు హాజరుకావాలని కోరారు.

చెట్టును ఢీకొని యువకుడి దుర్మరణం

మెట్టి దుర్గాప్రసాద్ (పాత చిత్రం)

రాజోలు, న్యూస్‌టుడే: రాజోలు మండలం కడలిలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామంలోని వాసంశెట్టివారిపాలేనికి చెందిన మెట్టి దుర్గాప్రసాద్(33) దుర్మరణం పాలయ్యాడు. ఇటీవల గల్ఫ్ నుంచి వచ్చిన బావను గెద్దాడలో కలుసుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వస్తుండగా కొబ్బరి చెట్టును బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెంది ఉంటాడని బావిస్తున్నారు. ఈ ఘటన జరిగిన విషయం బుధవారం ఉదయం వరకూ ఎవరికీ తెలియరాలేదు. రాజోలు ఎస్సై బి.రాజేష్‌కుమార్ చేరుకుని మృతదేహాన్ని రాజోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. దుర్గాప్రసాద్ తండ్రి గతంలోనే మరణించాడు. ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొడుకు మృతితో తల్లి రోదనలు మిన్నంటాయి. తనకు దిక్కెవరంటూ విలపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

92.7 FM Rajamahendravaram ఈ FM 92.7 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

14న చదరంగం పోటీలు

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్-7, 9, 11, 13, 15 బాల, బాలికల చదరంగం పోటీలు ఈనెల 14న రాజమహేంద్రవరంలోని కాల్ ఫ్యూషన్ చెస్ అకాడమీలో నిర్వహిస్తున్నట్లు అకాడమీ డైరక్టర్ కుమార్ విత్తనాల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు 95051 42888ను సంప్రదించవచ్చును.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్‌క్యాష్). ✆ 81422 92071.

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై ఆంధ్రప్రదేశ్ అంతటా మార్టిగేజ్ లోన్స్ మరియు స్థిరాస్తి ఎక్కడ ఉన్నా ఏసంస్థలో ఉన్నా Xerox పేపర్స్‌పై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. 50లక్షలులోపు, అయోద్య కోఆపరేటివ్ బ్యాంక్. ✆ 93969 99669.

MARRIAGE SERVICES

మంచి ప్రాపర్టీస్. టీసీ పద్మశాలి కన్వర్ట్ క్రిస్టియన్ బిజినెస్ అబ్బాయి 45 ఇయర్స్ సెకండ్‌కి OC or BCలో కన్వర్ట్‌గాని హిందూలో గాని లేట్ or సెకండ్‌లో అమ్మాయి మ్యారేజ్ కావాలి (ఎవరులేని అమ్మాయి అయినా పరవాలేదు). డైరెక్ట్: ✆ 9493835167.

PERSONAL CLASSIFIEDS

GREETINGS

REAL ESTATE

PLOT FOR SALE

KAKINADA CITY

308 Sq.yards West facing Commercial site for Sale/Lease at Karanamgari Junction, Kakinada. Cont: 94458 00581, 73933 40994.

JOBS

రాజమండ్రి ప్రముఖ ఎలక్ట్రానిక్స్ షోరూం నందు పనిచేయుటకు బాయ్స్ (హెల్పర్లు) కావలెను. ESI + PF సదుపాయం కలదు. Cell: 94947 11544, 97017 30347.

రాజమండ్రిలో మహాలక్ష్మి మార్కెట్ నందు పనిచేయుటకు అనుభవంగల ఎలక్ట్రీషియన్ కావలెను. మంచి జీతం, రెజ్యూమ్ వాట్సాప్: 99005 39944, 99124 01164

BR INFRACON నందు పనిచేయుటకు సైట్ ఇంజనీర్లు కావలెను. Q: డిప్లొమా, B.Tech/M.Tech అర్హత కలిగి బిల్డింగ్స్, ఇరిగేషన్ వర్క్స్ నందు 3to4 సంవత్సరములు అనుభవం కలిగి విజయవాడ, రాజమండ్రి, ఏలూరు జిల్లాల నందు పనిచేయుటకు కావలెను. పూర్తి బయోడేటాను info@brinfracon.comకి పంపగలరు ✆ 79955 57831.

కాకినాడ టూవీలర్ ఎలక్ట్రికల్ (ఏథర్)షోరూంలో చేయుటకు Service Advisors, Technicians, Sales Executives కావలెను. 8008884256

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 4-85 పై॥ అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

విద్యార్థులకు కళ్లజోళ్లు అందించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి సరిత

సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోండి

రంపచోడవరం: దృష్టి లోపం ఉన్న విద్యార్థులంతా సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకొని కళ్లజోళ్లు ధరించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టరు సరిత సూచించారు. జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కంటి పరీక్షల అనంతరం కళ్లజోళ్లు పంపిణీ చేశారు. దృష్టి లోపం ఉన్న వారు కళ్లజోడు వాడుతుంటోపాటు పోషకాహారం తీసుకోవాలన్నారు. సెల్‌ఫోన్లు చూడొద్దని సూచించారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు, పెదగెద్దాడ పీహెచ్‌సీ వైద్యులు వినోద్‌కుమార్, ముఖేష్, ఆప్తాల్మిక్ అధికారిణి జ్యోతిర్మయి, ఎంపీహెచ్‌ఈవో ప్రసాద్, వైద్య సిబ్బంది వైవీ సత్యనారాయణ, చిన్నారావు, సునీత పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణ అందరి బాధ్యత

ఎటపాక, న్యూస్‌టుడే: బాల్య వివాహాల నిర్మూలన ప్రతీ ఒక్కరి బాధ్యతని గౌరిదేవిపేట జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధ అన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు 100 రోజుల జాతీయ ప్రచార కార్యక్రమంలో భాగంగా మండలంలోని గన్నేరుకొయ్యపాడులో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. 'బాల్య వివాహాలు వద్దు- చదువే ముద్దు' అంటూ నినాదాలు చేస్తూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు అచ్చమాంబ, పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది

శుద్ధజల పరికరంతో ఉపాధ్యాయులు

పాఠశాలకు ఆర్వోప్లాంట్ వితరణ

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: వీఆర్‌పురం జడ్పీ పాఠశాలలో ఉన్న ఆర్వోప్లాంట్ పనిచేయక విద్యార్థులు చేతిపంపు నీటి తాగుతున్నారు. దీంతో ఆ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల తాగునీటి అవసరం తీర్చడానికి సుమారు రూ.60 వేలు విలువ చేసే శుద్ధజల యంత్ర పరికరాన్ని వితరణగా ఎంఈవో బాబూరావు చేతుల మీదుగా బుధవారం అందించారు. ఉపాధ్యాయులు అజయ్, వెంకటలక్ష్మి, రాజేశ్వరి, శ్యామల, అనురాధ, శ్రావణి, శిరోమణి, సుబ్బారావు, రమేశ్, కృష్ణ, చైతన్య, సత్తిబాబు, ప్రసాద్, రాజేశ్, చంద్రరావు, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే దీన్‌దయాళ్ సిద్ధాంతం

రంపచోడవరంలో నివాళులు అర్పిస్తున్న భాజపా నాయకులు

కూనవరం, న్యూస్‌టుడే: పేదరిక నిర్మూలనే ప్రధాన ధ్యేయంగా దీన్‌దయాళ్ తన సిద్ధాంతాలను రూపొందించారని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నోముల రామారావు అన్నారు. దీన్‌దయాళ్ వర్ధంతి సందర్భంగా భీమవరంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీ ఎదుగుదలలో ఆయన సిద్ధాంతాలు ముఖ్య భూమిక పోషించాయన్నారు. మండల అధ్యక్షుడు కరక పవన్‌కుమార్, కారం దారయ్య, శ్రీను తదతరులు పాల్గొన్నారు.

రంపచోడవరం: స్థానిక భాజపా కార్యాలయంలో బుధవారం సమర్పణ దివస్ సందర్భంగా పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు ఎం. వీరబాబు, వీకా బుల్లికొండలుదొర, కోండ్రు ప్రసాద్, అడపా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ: 10 - మ: 1 | రంపచోడవరం 9490877172 | అడ్డతీగల 9491575045 | దేవీపట్నం 7673936638 | గంగవరం 9493541083

సమస్య: మండలంలో కాకవాడ నుంచి లంకపాకల రహదారి రాళ్లు లేచిపోయి అధ్వానంగా తయారైంది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. సంబంధిత అధికారులు పక్కా రోడ్డును వేసేందుకు చర్యలు తీసుకోవాలి. **-అనసూయ, ఆనెంపల్లి గ్రామం**

సమాధానం: పక్కా రహదారి మంజూరైంది. త్వరలో పనులు మొదలుపెడతాం. **-వెంకటరమణ, డీఈ, పంచాయతీరాజ్, రంపచోడవరం**

– న్యూస్‌టుడే, రంపచోడవరం

సమస్య: పసరుగిన్నె గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం భవనాన్ని నిర్మించాలి. భవనం లేక ఇబ్బందులు పడుతున్నారు. **- విశ్వనాథం**

పరిష్కారం: అంగన్‌వాడీ భవనం నిర్మించేందుకు ఉన్నతాధికారులకు నివేదిస్తాం. నిధులు విడుదల చేసేందుకు ప్రతిపాదనలు పంపిస్తాం. **- బాపన్నదొర, ఎమ్‌పీడీవో**

– న్యూస్‌టుడే, వై.రామవరం

సమస్య: పాత గంగవరం వాల్మీకి వీధిలో వీధి దీపం వెలగడంలేదు. పంచాయతీ అధికారులు మరమ్మతులుచేసి వెలిగేలా చూడాలి. **- కోర్రాపు రాణి, పాతగంగవరం**

సమాధానం: మరమ్మతులుచేయించి వీధి దీపాలు వెలిగించేలా చర్యలు తీసుకుంటాం. **- శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి, గంగవరం**

– న్యూస్‌టుడే, గంగవరం

సమస్య: మారేడుమిల్లి నుంచి రంపచోడవరం వెళ్లే ప్రధాన రహదారిలోని గాలిగోపురం వద్ద ఉన్న బస్‌షెల్టరు పూర్తిగా శిథిలస్థితికి చేరింది. తాడేపల్లి పంచాయతీలోని గ్రామాల గిరిజనులు ఇక్కడి నుంచే వాహనాల కోసం ఎదురు చూస్తారు. ఇబ్బందులు పడుతున్నారు. **- అందాల లచ్చిరెడ్డి, తాడేపల్లి**

సమాధానం: గాలిగోపురం వద్ద ఉన్న బస్‌షెల్టరు మరమ్మతులకు చర్యలు చేపడతాం. **- రవికిశోర్, ఎంపీడీవో, మారేడుమిల్లి**

– న్యూస్‌టుడే, మారేడుమిల్లి

మన్యంలో ముమ్మరంగా దుంప గీతలు

గంగవరం, న్యూస్‌టుడే: మన్యంలోని మెట్టప్రాంతాల్లో సాగుచేస్తున్న సాగో దుంప తోటల తీతలను ప్రారంభించి ముమ్మరంగా దుంప గీతలు నిర్వహిస్తున్నారు. ఏటా రంపచోడవరం పరిధిలోని గంగవరం, రంపచోడవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి మండలాల్లో సుమారు మూడు వేల ఎకరాల్లో సాగో, కర్రపెండలం దుంప పంటలను సాగు చేస్తున్నారు. ఎకరాకు 40వేల నుంచి 70వేల వరకు రైతులు పెట్టుబడులు పెడుతున్నారు. ఒక్కో రైతు 2 నుంచి 15 ఎకరాల వరకు సాగుచేస్తూ పలువురికి ఉపాధి కల్పిస్తున్నారు. ఈ సాగోదుంపను సగ్గుబియ్యం, మైదా, బిస్కెట్లు తయారీలో వినియోగిస్తారు.

గిట్టుబాటు ధర రాక రైతుల ఆవేదన

నష్టాల బాటలో సాగు..

వర్షాలు అధికంగా పడటంతో తోటలు ఊట ఎక్కి దిగుబడి బాగా తగ్గి నష్టపోయామని రైతులు ఆందోళన చెందుతున్నారు. గోకవరం, జగ్గంపేట మండలాల్లోని మెట్టభూముల్లో కూడా ఈ పంటను పండిస్తారు. ఏజెన్సీలో ప్రాంతాలు ఇసుకనేల, వర్షాధార భూములు కావడంతో ఇక్కడ సాగో దుంపసాగుకు అనువుగా ఉండటం వల్ల ఏటా ఈ పంట విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది.

తోటల్లో తీసిన దుంపలను గీస్తున్న మహిళలు

పనులతో ఉపాధి

సాగో దుంప తోటలు తీతలతో ఏటా ఈ సీజన్‌లో స్థానికంగా కొంత ఉపాధి దొరుకుతుంది. గంప దుంపలకు రూ.170 నుంచి రూ.200ల చొప్పున రోజుకు రూ.650 నుంచి రూ.700 వరకు సంపాదిస్తున్నాం.

- చోడి, నర్సాయమ్మ, దుంపగీత కూలీ, గంగవరం

పంటకు బీమా సౌకర్యం కల్పించాలి

ప్రకృతి వైపరీత్యాల వల్ల దిగుబడులు రాక నష్టపోతున్నాం. ప్రభుత్వం నుంచి రాయితీ, ప్రోత్సాహకం సాగో రైతులకు ఉండటంలేదు. కనీసం పంటబీమా సైతం లేకపోవడంతో ఆర్థికంగా నష్టాల్లో కూరుకుపోతున్నాం. బీమా సౌకర్యం కల్పించాలి.

-పొట్టియ్య, సాగోదుంప రైతు, పిడతమామిడి

అంతరపంట విధానంతో...

సాగో రైతులకు ఎటువంటి ప్రోత్సాహకాలను ప్రభుత్వం ప్రకటించలేదు. అయితే అంతరపంట విధానంతో ఈ పంటను ఆయిల్ పామ్, జీడిమామిడి, చిన్న మొక్కతోటల్లో సాగుచేస్తే ఎకరాకు ఐదువేల వరకు ఆర్థిక సాయం పొందే అవకాశం ఉంది. రైతులు ఈ విధానంలో సాగుచేసి లబ్ధిపొందవచ్చు.

-ఏ.దేవదానం, పీహెచ్‌వో, రంపచోడవరం

తాటితోటలో పనులతో ఉపాధి

రంపచోడవరం, న్యూస్‌టుడే: మండలంలో పందిరిమామిడిలోని ఉద్యాన పరిశోధన స్థానంలో (హెచ్‌ఆర్‌ఎస్) తాటిచెట్ల ఆకులు తీసేందుకు, కల్లు గీసేందుకు, తోటలో పనిచేసే వారికి ఉపాధి అవకాశం కల్పించనున్నట్లు హెచ్‌ఆర్‌ఎస్ అధిపతి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టరు సి. వెంగయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాటి చెట్టు ఎక్కేవారు అర్హులన్నారు. వివరాలకు 08864 243577, 94931 28932, 73826 33663 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఆకట్టుకున్న కళాజాత

రంపచోడవరం: వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం-2007పై వైవీఆర్ రూరల్ పబ్లిసిటీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. వృద్ధులను నిరాదరణకు గురిచేస్తే విధించే శిక్ష, ఇంట్లో నుంచి వెళ్లగొట్టినా చట్టం తీసుకొనే చర్యలపై కళాకారులు గణేష్, రామలింగేశ్వరరావు, లక్ష్మి చేసిన ప్రదర్శన, ఆటపాటలు అందరినీ ఆకట్టుకున్నాయి.

సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలి

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లి మండలం లోతట్టు గ్రామాల్లో ప్రజల సమస్యలను సైతం పరిష్కరించడమే ధ్యేయంగా ప్రభుత్వ శాఖలు పనిచేయాలని ఎంపీపీ సార్ల లలితకుమారి కోరారు. బుధవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడుతూ రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. నీటి ఎద్దడి రాకుండా బోర్లు, పైపులైన్లకు మరమ్మతులు చేపట్టడానికి గ్రామ కార్యదర్శులు చొరవ చూపాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నారాయణ కోరారు. డీఎస్సీలో మండలానికి కొత్తగా తొమ్మిది మంది ఉపాధ్యాయులు నియమితులయ్యారని మండల విద్యాశాఖాధికారులు లక్ష్మీనారాయణ, వి.ముత్యాలరావు తెలిపారు. మండలంలో ఎనిమిది రైతు సేవా కేంద్రాల ద్వారా 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వ్యవసాయాధికారిణి సత్యవేణి తెలిపారు. రైతులంతా ఈ-క్రాప్ రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని కోరారు. గిరిజన గ్రామాల్లో డీ-వార్మింగ్ కార్యక్రమాన్ని రెండు విడతలు పూర్తిచేశామని, పశుబీమా కింద సాధారణ పశువులు చనిపోతే రూ.15 వేలు, మేలుజాతి ఆవులు, గేదెలు చనిపోతే రూ.30 వేలు నష్టపరిహారంగా అందజేస్తున్నట్లు పశువైద్యుడు వీరేంద్ర చెప్పారు. మండలంలో కొత్తగా అంగన్‌వాడీ భవనాలు నిర్మిస్తున్నామని, గుడిసెలో చాలాకాలంగా మూతపడి ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని అద్దె ఇంట్లో పునఃప్రారంభించినట్లు సీడీపీవో శాంతికుమారి తెలిపారు. సర్పంచుల పదవీకాలం త్వరలో ముగియనుండటంతో వీరిని మండల పాలకవర్గం, అధికారులు సత్కరించారు. మండలంలో దీర్ఘకాలంగా ఉన్న అనేక సమస్యలపై చర్చించి పరిష్కార దిశగా కార్యాచరణ చేయాల్సిన నేతలు సమావేశాన్ని మొక్కుబడి తంతుగా నిర్వహించారు. జడ్పీటీసీ సభ్యుడు గొర్లె బాలాజీబాబు, వైస్ ఎంపీపీలు రవికుమార్, తుంబుడు లత, ఎంపీటీసీ సభ్యులు సాదల బున్నమ్మ, కొరగాని సువర్ణరాజు, అనిల్‌కుమార్, ఎంపీడీవో రవికిశోర్, మండల ప్రత్యేకాధికారి చైతన్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సర్పంచులను సన్మానించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

ఇనుప రెయిలింగ్ ఏర్పాటు

స్పందనకు వందనం

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: బోర్నగూడెం శివారులో రహదారికి రెండు వైపులా 20 అడుగుల లోతులో వాగు ప్రవహిస్తోంది. ఈ ప్రదేశంలో దాదాపు 16 నెలల క్రితం ఆర్టీసీ బస్సు అదుపుతప్పి పడిపోయిన ఘటనలో రహదారికి రెండువైపులా ఉన్న ఇనుప రెయిలింగ్ విరిగిపోయింది. అధికారులు పట్టించుకోకపోవడంతో బోర్నగూడెం యువకులు కర్రలతో తాత్కాలిక రక్షణ ఏర్పాటు చేశారు. అక్కడి ప్రమాదకర పరిస్థితిపై గత ఏడాది జనవరి 31న 'ఆదమరిస్తే అంతే', మే 24న 'పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికలతో 'ఈనాడు'లో ప్రచురితమైన కథనాలకు ర.భ.శాఖ అధికారులు స్పందించారు. ఇనుప రెయిలింగ్, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. – న్యూస్‌టుడే, రాజవొమ్మంగి

ఏర్పాటుచేసిన రెయిలింగ్

పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించండి

చింతూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవలసిన భాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపై ఉందని యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు పండా కిష్టయ్య అన్నారు. బుధవారం చింతూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. నాలుగు మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు రామకృష్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు కిష్టయ్య

రాజవొమ్మంగి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించి ఊరి బడిని కాపాడుకోవాలని మండల యూటీఎఫ్ అధ్యక్షుడు జి.శ్రీను అన్నారు. స్థానిక ఎంఆర్‌సీ వద్ద బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కె.శ్రీను మాట్లాడుతూ గ్రామాల్లో ఏప్రిల్ 23 వరకు పాఠశాలల్లో ప్రవేశాలకు కార్యాచరణ ప్రారంభించాలన్నారు. సంఘం జిల్లా ఇన్‌ఛార్జి కార్యదర్శి టి.బొజ్జియ్య, జిల్లా కార్యదర్శి పి.రమణ, సంఘం నాయకులు రాంబాబు, మూర్తి, ప్రసన్న, శ్రీనుబాబు, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'క్వారీని వ్యతిరేకిస్తున్నందునే దాడులు'

రంపచోడవరం, న్యూస్‌టుడే: మండలంలోని నరసాపురంలో నల్లరాయి క్వారీని వ్యతిరేకిస్తున్న గ్రామస్థులపై మైనింగ్ నిర్వాహకులతోపాటు స్థానికులు కొంతమంది దాడులకు తెగబడటం దారుణమని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ అధ్యక్షుడు మోడిద నూకరాజు, ప్రధాన కార్యదర్శి చోడి ప్రదీప్‌కుమార్‌దొర డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని బుధవారం స్థానిక ఐటీడీఏ ఎదుట ఆందోళన చేశారు. అనంతరం పీవో స్మరణ్‌రాజ్‌ను కలిసి ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. నూకరాజు, ప్రదీప్‌కుమార్‌దొర మాట్లాడుతూ నరసాపురంలో మంగళవారం సాయంత్రం గ్రామసభ పేరుతో పిలిచి అరుణకుమారితోపాటు కొంతమందిపై విచక్షణా రహితంగా దాడి చేశారన్నారు. ఇంటికి పారిపోయి తలుపులు వేసుకొన్నప్పటికీ బయటకు లాగి దౌర్జన్యంగా ఘర్షణకు దిగారన్నారు. అరుణకుమారికి తీవ్ర గాయాలుకాగా రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో చేర్చారని తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అరుణకుమారిని భారత్ ఆదివాసీ పార్టీ నాయకులు మద్దేటి అంజిరెడ్డి, ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు పీఠ ప్రసాద్, చోడి ఏడుకొండలరావు, కంగల అబ్బాయిదొర, కలుములు ప్రసాద్, శివ పరామర్శించారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అరుణకుమారిని పరామర్శిస్తున్న ఆదివాసీ నాయకులు

అటవీ ప్రాంతంలో గంజాయి పట్టివేత

రంపచోడవరం, న్యూస్‌టుడే: మండలంలోని పెదకోరుమిల్లి గ్రామశివారులో కొండ దిగువన అటవీ ప్రాంతంలోని పొదల్లో 15 బస్తాల్లో దాచి ఉంచిన 370 కిలోల గంజాయిని పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకొన్నారు. దీనిపై సమాచారం అందడంతో డీఎస్పీ సాయిప్రశాంత్ ఆదేశాల మేరకు సీఐ సన్యాసినాయుడు, ఎస్సై భూషణం ఆధ్వర్యంలో పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకుని గంజాయిని స్టేషన్‌కు తరలించారు. సీఐ సన్యాసినాయుడు మాట్లాడుతూ పోలీసు శాఖ ఆధ్వర్యంలో పలుచోట్ల చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని, వీటిని దాటి వెళ్లేందుకు వీలుపడక అటవీప్రాంతంలో దాచి ఉంచారన్నారు. గంజాయి రవాణాకు పాల్పడిన వ్యక్తులను త్వరలో పట్టుకుంటామన్నారు. వీఆర్వోలు రవిచంద్ర, శివ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పెదకోరుమిల్లి శివారులో పోలీసులు స్వాధీనం చేసుకొన్న గంజాయి బస్తాలు

కీలక నిందితుడి అరెస్టు

గంగవరం, న్యూస్‌టుడే: గంగవరం పోలీస్ స్టేషన్ పరిధిలో 2024లో నమోదైన 187 కిలోల గంజాయి అక్రమ రవాణా కేసులో కీలక నిందితుడు ఒడిశాకు చెందిన లాకే సహదేవ్ అలియాస్ టైగర్ సాయిని బుధవారం అరెస్టు చేసినట్లు అడ్డతీగల సీఐ బి.నరసింహమూర్తి, గంగవరం ఎస్సై బి.వెంకటేష్ తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో రంపచోడవరం డీఎస్పీ సాయిప్రశాంత్ పర్యవేక్షణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి అంతర్ రాష్ట్ర పోలీసుల సమన్వయంతో నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. 80 కిలోలు, 193 కిలోల గంజాయి కేసుల్లోనూ నిందితుడిగా ఉన్నటు విచారణలో వెల్లడైందన్నారు. కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్లు వారు తెలిపారు. గంజాయి సాగు, అక్రమ రవాణా, డ్రగ్స్ రవాణాపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. కేసులను చాకచక్యంగా ఛేదించిన సీఐ, ఎస్సైలను జిల్లా పోలీస్ యంత్రాంగం అభినందించింది.

గంగవరం పోలీస్ స్టేషన్‌లో నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై, సిబ్బంది

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలపై హర్షం

ఎటపాక, న్యూస్‌టుడే: వివిధ కళాశాలల్లో చదువుతున్న పేద విద్యార్థుల కోసం రూ.1200 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేసినందుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు బుధవారం చందు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ ఫీజులు చెల్లించక అనేక మంది విద్యార్థులు వారి చదువును మధ్యలోనే నిలిపివేయాల్సిన పరిస్థితి వచ్చేదని అన్నారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి నెరవేర్చుతుందని హర్షం వ్యక్తం చేశారు.

ఏపీవోకు వినతిపత్రం అందిస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు

అటవీ ఉత్పత్తుల ధరలు పెంచాలని ధర్నా

చింతూరు, న్యూస్‌టుడే: మన్యంలో గిరిజనులు సేకరించే అటవీ ఉత్పత్తులకు ధరలు పెంచాలని డిమాండ్ చేస్తూ బుధవారం చింతూరులో ఐటీడీఏ ఎదుట అఖిలభారత రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. జిల్లా నాయకుడు కుంజా దూలయ్య మాట్లాడుతూ చింతపండు, కొండచీపుర్లు, జిగురు, ఉసిరి, కరక్కాయలు వంటి అటవీ ఉత్పత్తులకు మద్దతు ధరలు ప్రకటించి కొనుగోలు చేయాలన్నారు. రంపచోడవరంలో జీడిపిక్కల ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏపీవో రామతులసికి వినతిపత్రం అందజేశారు. నాయకులు కత్తుల బాలరెడ్డి, రమణ, విక్రమ్, పొద్దయ్య సిద్ధు, మూర్తి, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

'కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించకుండానే నియామకాలు'

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఏజెన్సీలో ఉపాధ్యాయ, ఉద్యోగ నియామకాలు, పదోన్నతులు ఇచ్చే ముందు ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయ సమావేశం నిర్వహించకుండా గిరిజన సంక్షేమశాఖ డీడీ ఇష్టంవచ్చినట్లు వ్యవహరిస్తున్నారని ఆదివాసీ ఉద్యోగుల సంక్షేమ అధ్యక్షుడు కత్తుల ఆదిరెడ్డి, ప్రధానకార్యదర్శి కుంజం అగ్గిదొర బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. స్కూల్ అసిస్టెంట్లుగా తెలుగు, హిందీ, పీఈటీ పోస్టుల కోసం అర్హత కలిగిన అభ్యర్థులతో ధ్రువీకరణ పత్రాలను డీడీ పరిశీలించడం నిబంధనలకు విరుద్ధమన్నారు. దీనిపై గిరిజన సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి, డైరెక్టర్‌కు, రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ✦ గిరిజన సంక్షేమశాఖ డీడీ ఉపాధ్యాయ సంఘాలను సంప్రదించకుండానే సొంత నిర్ణయాలతో 94 ఉపాధ్యాయ పోస్టులకు పదోన్నతులు కల్పించేందుకు ధ్రువపత్రాలను పరిశీలించే కార్యక్రమాన్ని నిర్వహించడం సమంజసం కాదని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు లండా వెంకటేశ్వరరావు, కార్యదర్శి కత్తుల ఆదిరెడ్డి, రాష్ట్ర సెక్రటరీ ఏలీషాబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమస్యను గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి, కమిషన్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మన్యంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల్లోని విద్యార్థుల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ పాటు ప్రత్యేక వైద్య శిబిరం కొనసాగుతోంది. ఆసుపత్రులకు వెళ్లిన విద్యార్థులంతా కోలుకుని తిరిగి పాఠశాలకు వచ్చిన తర్వాత కూడా వారికి అవసరమైన వైద్య పరీక్షలను బుధవారం నిర్వహించారు. సమయానికి టాబ్లెట్స్ వేస్తూ ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు.

సమ్మెను జయప్రదం చేయాలని వినతి

కూనవరం, న్యూస్‌టుడే: కార్మికులు, రైతు, కూలీల సమస్యలపై గురువారం తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మేకల నాగేశ్వరరావు కోరారు. పెదార్కూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి కూలీలకు రూ.600 వేతనం, పాత పద్ధతిలో హాజరు, రైతులకు గిట్టుబాటు ధరలు, కార్మిక వ్యతిరేక విధానాలపై ప్రభుత్వాలు తగ్గే వరకు పోరాటాలు కొనసాగుతాయన్నారు. కర్నాటి శ్రీనివాసరావు, నాగమణి, జయసుధ, రమ్య, నగేశ్ పాల్గొన్నారు.

నియామకపత్రం అందజేస్తున్న రాష్ట్ర నాయకులు

ఓబీసీ మోర్చా ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఈశ్వరరావు

చింతూరు, న్యూస్‌టుడే: ఉమ్మడి అల్లూరి, రంపచోడవరం జిల్లాల ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా మోతుగూడేనికి చెందిన కొమ్మోజు ఈశ్వరరావు నియమితులయ్యారు. రాష్ట్ర భాజపా నాయకులు మాధవ్, గోపీశ్రీనివాసు ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షురాలు శాంతకుమారి నియమించారు. బుధవారం ఈశ్వరరావుకు జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ప్రసాద్ నియామకపత్రాన్ని అందజేశారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

ఎటపాక, న్యూస్‌టుడే: మండలంలోని నల్లకుంట గ్రామానికి చెందిన నూపా శంకర్ బుధవారం కుటుంబ సభ్యులతో బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో మధ్యాహ్నం విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో ఇంటికి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. వెంటనే స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి పూర్తిగా మంటలను ఆర్పేశారు. దీంతో ఇంట్లో ఉన్న బంగారం, వస్తువులతో పాటు వారి కిరాణా షాపులోని విలువైన సామాన్లు సైతం కాలిపోయాయని తెలిపారు. రెవెన్యూ శాఖ నుంచి వీఆర్‌వో కన్నమ్మ ఘటనా స్థలానికి చేరుకుని ఆస్తినష్టం సుమారు రూ.6 లక్షలు ఉంటుందని అంచనా వేసి పంచనామ నిర్వహించారు. కట్టుబట్టలతో ఉన్న తమ కుటుంబాన్ని ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలని శంకర్ కోరారు.

రంపలో శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

రంపచోడవరం, న్యూస్‌టుడే: రంపచోడవరం మండలం రంపలో ప్రసిద్ధిగాంచిన పురాతన మల్లికార్జునస్వామి ఆలయం వద్ద మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం రంప శివాలయాన్ని డీఎస్పీ సాయిప్రశాంత్, తహసీల్దార్ బాలాజీ, ఎంపీడీవో ప్రసాద్ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. జాతర మహోత్సవాలను శాంతియుత వాతావరణలో జరిగేలా అధికారులకు డీఎస్పీ పలు సూచనలు చేశారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. స్నానాలు చేసిన తర్వాత భక్తులు దుస్తులు మార్చుకొనేందుకు గదులను ఏర్పాట్లు చేయాలన్నారు. వాహన పార్కింగ్, పారిశుద్ధ్యం తదితర చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. సీఐ సన్యాసినాయుడు, ఎస్సై వెంకటరావు, ఆర్ఐ నిర్మలకుమారి, ధర్మప్రచార భక్తమండలి సమన్వయకర్త నల్లమిల్లి వెంకటరామారెడ్డి పాల్గొన్నారు. * రంపచోడవరంలోని శివాలయంవీధిలో ఉన్న ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం అర్చకుడు లింగాల సీతారామాంజనేయ ప్రసన్నకుమార్‌శర్మ పందిరి రాట ప్రతిష్ఠ పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పింజర్ల నాగ వీరభద్రరావు, యర్రా ఆనందరావు, వైవీ రమణయ్య, గుడ్ల శ్రీనివాసరెడ్డి, నీలాపు గోవిందు, గుబ్బల సత్తిబాబు, తిరివీధి వెంకటేశ్వరరావు, నల్లమిల్లి వెంకటరామారెడ్డి పాల్గొన్నారు.

రంపచోడవరం ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో రాట ప్రతిష్ఠలో కమిటీ సభ్యులు

వై.రామవరం: మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై బుధవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీడీవో బాపన్నదొర మాట్లాడుతూ యార్లగడ్డ పంచాయతీ గొరబంద, చవిటిదిబ్బలు పంచాయతీ పూతిగుంట వద్ద జరిగే ఉత్సవాలలో శానిటేషన్, మంచినీటి సదుపాయాలను ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రొటోకాల్ ప్రకారం విధులు నిర్వహణ చేపట్టాలని తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీరాములు, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరాజు, సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రంప శివాలయం వద్ద పరిశీలిస్తున్న డీఎస్పీ సాయిప్రశాంత్

రాజవొమ్మంగి: జడ్డంగి స్వయంభూ భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయం వద్ద శివరాత్రి ఏర్పాట్లను బుధవారం అధికారులు పరిశీలించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలని తహసీల్దార్ సత్యనారాయణ ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. ఉత్సవాల నిర్వహణ, ట్రాఫిక్, పారిశుద్ధ్యం, తాగునీరు, భోజన ఏర్పాట్లు, సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ, తదితర అంశాలపై చర్చించారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ దుర్మరణం



మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మండలంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. వివరాలివి.. మారేడుమిల్లి గ్రామానికి చెందిన **రాచబోయిన చిన్నా(28)** ట్రాక్టరు డ్రైవరుగా పని చేస్తున్నారు. ట్రాక్టరులో చట్లవాడ పంచాయతీ పరిధిలోని పొట్లవాడకు వెళ్తుండగా అదుపుతప్పి రోడ్డు పక్కనున్న చెట్టును బలంగా ఢీకొట్టడంతో అతను తీవ్రంగా గాయపడ్డారు. పలువురు వెంటనే అతణ్ని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, అక్కడి నుంచి రంపచోడవరం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దీనిపై మారేడుమిల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అశ్వ వాహనంపై నారాయణుడు

ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో శివరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. బుధవారం... స్వామి వారి అశ్వవాహన సేవ కనుల పండువగా సాగింది. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. – న్యూస్‌టుడే, సి.ఎస్.పురం

మల్లన్న భక్తులకు ఇబ్బంది లేకుండా వసతులు

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైల మల్లన్న దర్శనానికి వెళ్లే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని జేసీ పి.శ్రీనివాసులు ఆదేశించారు. పెద్దదోర్నాల, పెద్దారవీడు మండలాల అధికారులతో దోర్నాల మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఘాట్ రోడ్లలో ట్రాఫిక్ ఇబ్బందులు, ప్రమాదాలకు తావులేకుండా చేపట్టిన చర్యలను సీఐ అజయ్ కుమార్ తెలియజేశారు. శివరాత్రి రోజున క్షేత్రంలో 1.40 లక్షల మంది కంటే ఎక్కువ మంది భక్తులుంటే... ఆపై వచ్చే వాహనాలను పెద్దదోర్నాలలో నిలిపివేస్తామన్నారు. ఆ మేరకు మల్లికార్జుననగర్ సమీపంలో పార్కింగ్ ఏర్పాట్లు చేశామన్నారు. వాహనదారులకు ఇబ్బంది లేకుండా ఆ ప్రాంతంలో విద్యుత్తు, తాగు నీరుతో పాటు అవసరమైన వసతులు కల్పిస్తున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో శివకోటేశ్వరరావు వివరించారు. పార్కింగ్ ప్రాంతాలు, పెద్ద దోర్నాల ఘాట్‌ను జేసీ పరిశీలించారు. ఆత్మకూరు మార్గంలో మట్టి చెదరకుండా నీరు చల్లాలని హైవే అధికారులను ఆదేశించారు. సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి, డీఎస్పీ నాగరాజు, డీడీవో బాలునాయక్, ఎంపీడీవో ప్రసూనాదేవి, తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డి, ఇరిగేషన్ ఏఈ భ్రమరాంబికా దేవి పాల్గొన్నారు.

పెద్దదోర్నాలలో వాహనాల పార్కింగ్ స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాసులు

ఉత్పాదకత పెంచుతాం..
జిల్లాను అగ్రగామిగా నిలుపుతాం

- జూన్ నాటికి లక్ష్యం చేరేలా ప్రణాళిక
- 'ఈనాడు'తో కలెక్టర్ రాజాబాబు

వ్యవసాయం, అనుబంధ, సేవా, పారిశ్రామిక రంగాలతో పాటు ఇతర అన్ని అంశాల్లోనూ మెరుగైన పనితీరు కనబరిచి వచ్చే జూన్ నాటికి జిల్లాను అగ్రపథాన నిలబెట్టేందుకు కృషి చేస్తున్నట్లు కలెక్టర్ రాజాబాబు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వ్యవసాయం, అనుబంధ రంగాల ప్రగతి ర్యాంకుల్లో జిల్లా వెనుకబాటుపై 'ఈనాడు' ఆయనను సంప్రదించగా పలు అంశాలు వెల్లడించారు. కొండపి నియోజకవర్గం ఖరీఫ్ వివరాలు నమోదుకాకపోవడం వెనుకబాటుకు ఓ కారణమన్నారు. సానుకూలతలను సద్వినియోగం చేసుకుంటూ రానున్న మూడు నెలల్లో 'ఏ ప్లస్' స్థానానికి చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. వివరాలు ఆయన మాటల్లోనే...

– ఈనాడు, ఒంగోలు

ముఖాముఖి

పరిశ్రమల రాకతో...

జిల్లాలోనే రామాయపట్నం పోర్టు, బీపీసీఎల్, ఇండోసోల్ ప్రాజెక్టులు ఏర్పాటవుతున్నాయి. భూసేకరణ పరంగా ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నాం. నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటవుతున్నాయి. దొనకొండకూ కంపెనీలు రానున్నాయి. పారిశ్రామికంగా వడివడిగా అడుగులు పడుతున్నందున... అనుబంధంగా రవాణా, ఇతర రంగాలు విస్తరించనున్నాయి. తద్వారా విస్తృత అవకాశాలతో పాటు ఉత్పాదకతా పెరుగుతుంది. పర్యాటకం అభివృద్ధికి బీచ్ ఫెస్ట్ నిర్వహిస్తున్నాం.

జల సురక్ష... రాష్ట్రమంతటా: జల సురక్ష పేరిట జిల్లాలో నెల రోజుల పాటు రక్షిత నీటి పథకాల మరమ్మతులు, ట్యాంకులు శుభ్రత వంటి పనులు చేపట్టి మంచి ఫలితాలు సాధించాం. దీన్ని గుర్తించిన ప్రభుత్వం రాష్ట్రమంతటా ఈ విధానం అమలుకు 'క్రాస్' పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం ఆనందంగా ఉంది.

ఉద్యానం మరింత పెరిగేలా...: ఇప్పటికే జిల్లాలో మూడు వేల హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. ఈ దిశగా రైతులను మరింత ప్రోత్సహిస్తాం. ఇటీవల వెలువరించిన జాబితాలో వ్యవసాయ ఉత్పత్తుల వివరాలు నమోదు కాలేదు. వచ్చే నివేదికలో ఇవి నమోదైతే ర్యాంకుల పరంగానూ మెరుగవుతాం.

'పది'లో పైచేయి కోసం...: పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ఉత్తమంగా నిలిచేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం. వసతి గృహానికి ఒక అధికారిని నియమించి పర్యవేక్షణ చేపట్టడంతో మార్పు కనిపిస్తోంది. పాఠశాలలను దత్తత ఇచ్చి మంచి మార్కులు సాధించేలా చూస్తున్నాం. ఈ ప్రయత్నాలన్నీ మంచి ఫలితాలనిస్తున్నాయి.

రారండోయ్... ప్రభుత్వ బడుల బాగుకు!

జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు లేక విద్యార్థులు ఆరు బయట విద్యాభ్యాసం చేయాల్సి వస్తోంది. తగినన్ని బల్లలు లేక కింద కూర్చోవాల్సి వస్తోంది. కొన్నిచోట్ల క్రీడా సామగ్రి లేక ఆటలకు దూరమవుతున్నారు. ఇతరత్రా సమస్యలూ వెన్నాడుతున్నాయి. ఈ నేపథ్యంలో దాతల సహకారంతో ఆయా సౌకర్యాలు కల్పించాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా విద్యాంజలి 2.0 కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి.

సైట్‌లో అవసరాల గుర్తింపు

ఇందులో భాగంగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యాలయానికి ఏమేం అవసరమన్నది ముందుగా గుర్తించాలి. ఆ వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన సైట్‌లో నమోదు చేయాలి. ఈ విషయమై జిల్లా విద్యాశాఖ అధికారులు ఇప్పటికే వారికి శిక్షణ ఇచ్చారు. విద్యాంజలి 2.0 ద్వారా

వివరాలు నమోదు చేసుకోవాలి...: వసతుల కల్పన, సేవలకు ముందుకు వచ్చే ఔత్సాహికులు, ఎన్‌జీవోలు, ఎన్నారైలు, సంస్థలు ముందుగా... విద్యాంజలి.ఎడ్యుకేషన్.జీవోవి.ఇన్ సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. ఆసక్తి ఉన్న రంగాన్ని ఎంచుకొని తోడ్పాటు అందించవచ్చు.

ఔత్సాహికుల కోసం విద్యాంజలి 2.0 అమలు

ఎవరైనా... రాష్ట్రంలోని ఏ ప్రాంతంలో ఉన్న పాఠశాలకైనా వసతులు కల్పించేందుకు ముందుకు రావచ్చు.

ఇలా సాయపడొచ్చు...

విద్యార్థులకు బోధన చేయవచ్చు. కళలు, యోగా, క్రీడలు, వృత్తి నైపుణ్యాలు, పోటీ పరీక్షలు వంటి అంశాల్లో శిక్షణ ఇవ్వవచ్చు. దివ్యాంగులకు అవసరమైన పరికరాలు, పిల్లలకు ఉపయోగపడే కథల పుస్తకాలు, పోషకాహారం అందించవచ్చు. విద్యావేత్తలు కౌన్సెలింగ్ తరగతులు... వైద్యులు శిబిరాలు నిర్వహించవచ్చు. బాలికలకు ఆత్మరక్షణ విద్య అందజేయవచ్చు.

– న్యూస్‌టుడే, గిద్దలూరు పట్టణం, నాగులుప్పలపాడు

☛ ఈ నెల 9న... కనిగిరి పట్టణంలోని బీసీ-2 బాలుర వసతి గృహాన్ని జేసీ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డుల్లో 75 మంది ఉన్నట్లు నమోదు చేసినా... అక్కడ వాస్తవంగా ఉన్నది 21 మందే. బోగస్ రోల్‌తో పాటు ఇతరత్రా అవకతవకలు వెలుగు చూడడంతో వార్డెన్‌ను విధుల నుంచి సస్పెండ్ చేశారు.

☛ ఈ నెల 10న... ఉలవపాడులోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తనిఖీ చేశారు. మెనూ పాటించకపోవడం, అల్పాహారం తక్కువగా ఉండడం, తాగునీరు లేక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

బోగస్ రోల్‌తో బొక్కుడు

- తనిఖీలు పట్టని అధికారులు
- సంక్షేమ వసతి గృహాల్లో పరిస్థితి ఇది

న్యూస్‌టుడే – కనిగిరి

ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో ఇటీవల కాలంలో వెలుగు చూస్తున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. బోగస్ రోల్‌తో పాటు కొన్ని చోట్ల కనీస స్థాయిలోనూ మెనూ పాటించడం లేదు. గత వైకాపా ప్రభుత్వ హయాంలోనే పర్యవేక్షణ లేక వసతి గృహాల నిర్వహణ గాడి తప్పింది. కూటమి ప్రభుత్వం వచ్చాక తరచూ చేపడుతున్న తనిఖీల్లో ఆ తప్పిదాలు వెలుగు చూస్తున్నాయి.

అంతా ఇష్టారాజ్యం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 74 ఎస్సీ, 64 బీసీ వసతి గృహాలున్నాయి. వీటిలో దాదాపు 12 వేల మంది విద్యార్థులున్నారు. ఇవి కాకుండా అన్ని రకాల గిరిజన వసతి గృహాలు 19 వరకు ఉన్నాయి. కళాశాల వసతి గృహాలు అదనం. ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యాలయాల్లో చదివే పిల్లలను మాత్రమే వీటిలో చేర్చుకోవాలి. విద్యార్థుల సంఖ్య తక్కువ ఉన్న చోట... సంక్షేమాధికారులు సమీప ప్రైవేటు పాఠశాలల పిల్లల పేర్లు నమోదు చేస్తున్నారు. ఈ బోగస్ రోల్ చూపి మెనూ ఛార్జీల కింద ప్రతి నెలా రూ.లక్షల్లో కాజేస్తున్నారు. ఈ మొత్తంలో కొంత పై అధికారులకూ వెళ్తుండడంతో చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

కనిగిరి వసతిగృహంలో మెనూ అమలుపై ఆరా తీస్తున్న జేసీ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యే ఉగ్ర

పరీక్షల సమయంలోనూ అదేతీరు...

త్వరలో పది, ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. ప్రభుత్వం సైతం ప్రభుత్వ విద్యాలయాల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తోంది. ఇటువంటి సమయంలోనూ వసతి గృహాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడం కలవరపరుస్తున్న అంశం. చాలా చోట్ల మెనూ అమలును పూర్తిగా విస్మరించారు. విద్యార్థులే ఈ విషయం చెబుతున్నారు. కొందరు సంక్షేమాధికారులు వేరే ప్రాంతాల్లో ఉంటూ వసతి గృహం ముఖమే చూడడం లేదన్న విమర్శలూ ఉన్నాయి. కొద్ది రోజుల క్రితం... కొనకనమిట్ల వసతి గృహంలో అటు సంక్షేమాధికారి, ఇటు సిబ్బంది రాక రోజంతా విద్యార్థులు ఆకలితో నకనకలాడాల్సి వచ్చింది. తరచూ వసతి గృహాలను తనిఖీ చేయాల్సిన ఏబీసీడబ్ల్యూవోలు, ఏఎస్‌డబ్ల్యూవోలు ఆ బాధ్యతలు విస్మరించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులైనా స్పందించి వసతిగృహాల నిర్వహణను గాడిన పెట్టాల్సిన అవసరం ఉంది.

అంతదూరంలో బస్టాండా...?

- మార్పు ప్రతిపాదనపై అంతటా చర్చ

ఈనాడు, ఒంగోలు

బస్సుల రద్దీ, ట్రాఫిక్ సమస్యల నేపథ్యంలో ఒంగోలు నడిబొడ్డున ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌ను మరో చోటకు తరలించాలన్న ప్రతిపాదనపై నగర వాసుల్లో ఇప్పుడు చర్చ నడుస్తోంది. అందరికీ అందుబాటులో ఉన్న దానిని ఊరి చివరకు తరలించడం సరికాదని కొందరు అభిప్రాయపడుతుంటే... ప్రత్యామ్నాయం ఆలోచించాలని మరి కొందరు సూచిస్తున్నారు.

ఆక్రమణలు.. ట్రాఫిక్ చిక్కులు

దశాబ్దాల క్రితం అప్పటి అవసరాలకు అనుగుణంగా 11 ఎకరాల విస్తీర్ణంలో బస్టాండ్, గ్యారేజీ ఏర్పాటు చేశారు. అప్పటితో పోలిస్తే ఇప్పుడు బస్సుల రాకపోకలు, ప్రయాణికుల రద్దీ అయిదారింతలు పెరిగింది. ప్రస్తుతం 28 ప్లాట్‌ఫాంలు ఉండగా... రోజుకు 1,500 బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. మరోవైపు చుట్టూ ఆక్రమణలు పెరిగాయి. బస్సులు లోపలకు వెళ్లి వచ్చే క్రమంలో కర్నూలు రోడ్డులో ట్రాఫిక్ నిలిచిపోతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో మరిన్ని చిక్కులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో బస్టాండ్‌ను మరోచోటకు తరలించాలని ఎమ్మెల్యే జనార్దన్ ఆర్టీసీ ఉన్నతాధికారులకు లేఖ రాశారు.

ప్రజాభీష్టం మేరకే నిర్ణయం...

నగర శివారులోని మార్కెట్ యార్డులో పదెకరాలకు పైగా ఖాళీ స్థలం ఉన్నందున బస్టాండ్‌ను అక్కడకు తరలించాలని ప్రతిపాదించారు. ఈ విషయాన్ని మంగళవారం నాటి నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే ప్రస్తావించారు. తద్వారా ఆ స్థలాన్ని వినియోగంలోకి తేవడంతో పాటు... పీపీపీ విధానంలో ఇక్కడ వాణిజ్య సముదాయాలు నిర్మిస్తే ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందన్నది తన ఆలోచనగా చెప్పారు. కాగా... అంతదూరమైతే కష్టమన్న అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది. బస్టాండ్‌పై ఒత్తిడి తగ్గించేలా నగరంలోనే మినీ బస్టాండ్ నిర్మిస్తే ప్రయోజనం ఉంటుందని పలువురు సూచిస్తున్నారు. ఏ నిర్ణయమైనా ప్రజల అభిప్రాయం మేరకే ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగ పరీక్ష వాయిదా

ఒంగోలు న్యాయవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో రెగ్యులర్ డెటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగ నియామకానికి ఈ నెల 15న నిర్వహించాల్సిన పరీక్షను వాయిదా వేసినట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్‌ఛార్జి ఛైర్ పర్సన్, ఒకటో అదనపు జిల్లా జడ్జి టి.రాజ్యలక్ష్మి తెలిపారు. మళ్లీ ఎప్పుడు నిర్ణయించేదీ తరువాత తెలియజేస్తామని చెప్పారు. రికార్డు అసిస్టెంట్, ఫ్రంట్ ఆఫీసు కో ఆర్డినేటర్ ఉద్యోగాలకు మాత్రం యథావిధిగా అదే రోజున... ఒంగోలు ఇందిరా ప్రియదర్శిని న్యాయ కళాశాలలో పరీక్ష జరుగుతుందని వివరించారు.

తప్పుల సవరణకు పది విద్యార్థులకు అవకాశం

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: త్వరలో పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులు... ఇప్పటివరకు సమర్పించిన వ్యక్తిగత వివరాల్లో ఏవైనా తప్పులుంటే సరిచేసుకునేందుకు విద్యాశాఖ ఉన్నతాధికారులు అవకాశం కల్పించారు. ఈ నెల 12 (గురువారం)తో ఆ గడువు ముగియనుంది. పాఠశాల దస్త్రాలు, యూడైస్‌లో నమోదైన వివరాలను పరిశీలించి తప్పులుంటే ప్రధానోపాధ్యాయుడి ద్వారా సరి చేయించుకోవాలని తెలిపారు. విద్యార్థి, తల్లిదండ్రుల పేర్లు, శరీరంపై గుర్తులు (పుట్టు మచ్చలు), కులం, ఉప కులం, విద్యార్థి చిత్రం, సంతకంలో మార్పులు చేసుకునే వెసులుబాటు కల్పించారు. మార్చిన వివరాలను ప్రధానోపాధ్యాయులు పాఠశాల దస్త్రాల్లో సరిదిద్ది ఉప విద్యాశాఖాధికారి దృష్టికి తీసుకెళ్లి అధికారికంగా నిర్ధారణ చేయిస్తారు.

నగరంలో డివిజన్ల పునర్విభజన!

- కొత్తగా మరో పది ఏర్పాటుకు ప్రతిపాదన

న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

ఒంగోలు నగరంలో డివిజన్ల పునర్విభజనతో పాటు కొత్తగా మరో పది ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనపై విస్తృతంగా చర్చ నడుస్తోంది. మార్చి 9లోగా డివిజన్ల వారీగా తుది ఓటరు జాబితాలు సిద్ధం చేయాలని ఎన్నికల కమిషన్ ఇటీవల ఆదేశాలిచ్చింది. అదే క్రమంలో మేయర్, ఛైర్మన్ తదితర పదవులకు రిజర్వేషన్లు ఖరారు చేయాలని సూచించింది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగేలోపే పునర్విభజన పూర్తి చేయాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్... రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పి.నారాయణకు లేఖ సమర్పించడం చర్చనీయాంశంగా మారింది.

హేతుబద్ధంగా లేదని...

2012లో ఒంగోలు నగర పాలక సంస్థ ఏర్పడింది. తొలి మేయర్‌గా గంగాడ సుజాత వ్యవహరిస్తున్నారు. ఎన్నికలకు ముందు డివిజన్ల సరిహద్దుల విషయంలో హేతుబద్ధత పాటించలేదని తెదేపా కార్పొరేటర్లు చాన్నాళ్లుగా ఆరోపిస్తున్నారు. 2011 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకోవడమూ సమస్యకు ఓ కారణం. అప్పట్లో 2.51 లక్షల జనాభా ఉండగా... ఇప్పుడు 3.20 లక్షలకు చేరింది. జనగణన చేపట్టనందున అప్పటి లెక్కల ప్రకారమే విభజించారు. ఉదాహరణకు అప్పట్లో 37వ డివిజన్‌లో 3,500 ఓటర్లు ఉండగా... ఇప్పుడు 8 వేల మంది ఉన్నారు. నగరంలో అతిపెద్ద డివిజన్ అదే. దీనిని మూడుగా విభజించాలని కోరుతున్నారు. ప్రతి చోటా మూడు వేలలోపు ఓటర్లు ఉండేలా పునర్విభజన చేయాలన్నది ప్రతిపాదన.

కార్పొరేటర్ల ఆరా... కొన్నిటి సరిహద్దులు మార్చాల్సిన అవసరాన్నీ ఎమ్మెల్యే తన లేఖలో పేర్కొన్నారు. 49వ డివిజన్‌లోని కొంత ప్రాంతాన్ని అసంబద్ధంగా ఇస్లాంపేట డివిజన్‌లో కలిపారు. గతంలో చోటుచేసుకున్న ఇలాంటి లోపాలను సవరిస్తూ కొత్తవి చేయాలని కోరారు. కాగా... జనగణన జరుగుతున్నందున ఈ విషయమై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది వేచి చూడాల్సిందే. మరోవైపు ఏ డివిజన్లను విభజిస్తారు, ఎక్కడెక్కడ కొత్తవి ఏర్పాటు చేస్తారన్న సమాచారం కోసం ఔత్సాహిక కార్పొరేటర్ అభ్యర్థులు అధికారుల వద్ద ఆరా తీస్తున్నారు.

శ్రీశైల క్షేత్రానికి ప్రత్యేక బస్సులు

మార్కాపురం, న్యూస్‌టుడే: మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో మార్కాపురం నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు మార్కాపురం డిపో మేనేజర్ లావణ్య తెలిపారు. 14, 15 తేదీల్లో 24/7 నడిచేలా మొత్తం 80 సర్వీసులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రద్దీని బట్టి అదనంగా తిప్పేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మరో పుణ్యక్షేత్రం త్రిపురాంతకానికి ప్రస్తుతం రోజుకు ఆరు సర్వీసులు తిరుగుతున్నాయని... రద్దీకి అనుగుణంగా వీటినీ పెంచుతామని వివరించారు.

సిబ్బంది కొరత... పశువైద్యానికి కలత!

- భవనాలూ బాగుకు నోచక అవస్థలు

న్యూస్‌టుడే – కంభం

ఉమ్మడి జిల్లాలో వ్యవసాయంతో సమానంగా పాడికి ప్రాధాన్యం ఉంది. పశుపోషణపైనే ఆధారపడి వేల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఇంతవరకు బాగానే ఉన్నా... తగినంత సిబ్బంది లేక ఆస్థాయిలో పశు వైద్య సేవలు అందడం లేదు.

లింగోజిపల్లిలో పూర్తిగా దెబ్బతిన్న గ్రామీణ పశు వైద్యశాల భవనం

ప్రకాశం, మార్కాపురం జిల్లాల పరిధిలో ఇప్పటికే 15 పశు వైద్య పోస్టులు ఖాళీగా ఉన్నాయి. త్వరలో మరికొందరు ఉద్యోగ విరమణ చేయనున్నారు. 2019కి ముందు పోస్టుల భర్తీ తప్ప... గత వైకాపా పాలనలో ఒక్కరినీ నియమించలేదు. ఒక్క గిద్దలూరు నియోజకవర్గంలోనే సోమవారపేట, పాపినేనిపల్లి, కొమరోలు, సంజీవరాయునిపేట, తర్లుపాడు తదితర ప్రాంతాల్లో వైద్యులు లేరు. ఆఫీసు సబార్డినేట్ పోస్టుల కొరతా ఎక్కువగానే ఉంది. సచివాలయాల్లో వెటర్నరీ సహాయకులను నియమించినా వారి సేవలు అంతంతమాత్రంగానే ఉన్నాయన్న విమర్శలున్నాయి.

జిల్లాలో పశు సంపద వివరాలు	ఆవులు:	గేదెలు, దున్నలు:	గొర్రెలు, మేకలు:
	56 వేలు	6.35 లక్షలు	19.75 లక్షలు

మార్కాపురం డివిజన్‌లో 21, ఒంగోలు పరిధిలో 16 పశు వైద్యశాల భవనాలు శిథిలావస్థకు చేరాయి. ఒక్కో దాని మరమ్మతులకు రూ.44 లక్షలు అవసరమని గత ఏడాది జనవరిలో ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాలేదు.

శిథిలావస్థలో పశువైద్యశాలలు

ఉమ్మడి జిల్లాలో మొత్తం 37 పశు వైద్యశాలలు శిథిలావస్థకు చేరాయి. చిన్నపాటి వర్షం పడినా కారుతూ మందులు, దస్త్రాలు తడిచిపోతున్నాయి. కొన్నిచోట్ల విధుల నిర్వహణకు అవకాశం లేక ఇతర శాఖల భవనాలను వినియోగిస్తున్నారు. తురిమెళ్ల వైద్యశాల భవనాన్ని పదిహేనేళ్ల క్రితమే నిర్మించినా... పనుల్లో నాణ్యత లేక గోడలు బీటలు వారాయి. రావిపాడు పశువైద్యశాలకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి అసెంబ్లీలోనూ ప్రస్తావించారు. లింగోజిపల్లి, యర్రబాలెం, లింగాపురంలోనూ భవనాలు దెబ్బతిన్నాయి. సమస్యలపై పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటేశ్వరరావు స్పందిస్తూ... వైద్యుల కొరత తీర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. దెబ్బతిన్న భవనాల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

(c) eenadu

మెట్ల మార్గం వద్ద అధికారులకు సూచనలిస్తున్న జేసీ శ్రీనివాసులు

త్రిపురాంతకం ఉత్సవాలను విజయవంతం చేయండి

త్రిపురాంతకం గ్రామీణం, త్రిపురాంతకం, న్యూస్‌టుడే: మార్కాపురం జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన త్రిపురాంతకం ఆలయాల్లో జరగనున్న మహా శివరాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేలా అధికారులు ప్రణాళికలతో పనిచేయాలి. భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించేందుకు ఆయన బుధవారం త్రిపురాంతకం వచ్చారు. ఈ సందర్భంగా సాగర్ కాలువ వద్ద స్నాన ఘట్టాలు, పార్కింగ్ స్థలం, క్యూలైన్లు, మెట్ల మార్గాల వద్ద భక్తుల కోసం జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు.

❖ అనంతరం స్థానిక బాలా త్రిపురసుందరీ దేవి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలపై మార్కాపురం ఇన్‌ఛార్జి సబ్-కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి ఆధ్వర్యంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాట్ల పురోగతిని సంబంధిత అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. సాగర్ కాలువలో ఏర్పాటు చేసిన స్నాన ఘట్టాల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా నిరంతరం గస్తీ ఏర్పాటు చేయాలన్నారు. వినుకొండ, మార్కాపురం, పొదిలి, గిద్దలూరు ప్రాంతాల నుంచి 20 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. సమావేశంలో స్థానిక తహసీల్దార్ విజయ్‌భాస్కర్, ఆలయాల ఈవో అనిల్ కుమార్, డీఎంహెచ్‌వో డా. వాణిశ్రీ, డీఎస్పీ నాగరాజు, ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీనివాసరెడ్డి, సాంబశివరావు, సునీల్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సాగర మిత్రలను కొనసాగించాలి

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: జిల్లాలో మత్స్య శాఖ ఆధ్వర్యంలో పని చేస్తున్న సాగర మిత్రలను కొనసాగించాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్ర మత్స్య శాఖ మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్‌కు విజ్ఞప్తి చేశారు. బుధవారం దిల్లీలోని ఆయన కార్యాలయంలో కలిసి రాష్ట్ర సాగర మిత్ర ఎంప్లాయిస్ యూనియన్ తరఫున వినతిపత్రం అందించారు. వీరి సేవలు మార్చి 31వ తేదీతో ముగియనున్నాయని, రెండు నెలల ముందే నోటీసు కూడా జారీ చేశారన్నారు. వారిని అకస్మాత్తుగా నిలిపివేయడంతో పీఎంఎంఎస్‌వైలో సాధించిన ప్రగతిపై ప్రతికూల ప్రభావం పడే వీలుందన్నారు. వారిని కొనసాగించేలా చూస్తామని మంత్రి తెలిపారు. కందుకూరులోని టీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో రద్దయిన ఎన్‌సీసీ యూనిట్‌ను పునరుద్ధరించాలని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కోరారు.

హాకీ.. వారి హాబీ!

❖ జాతీయ స్థాయి పోటీల్లో మద్దిపాడు బాలికల ప్రతిభ

న్యూస్‌టుడే, మద్దిపాడు

వారు పేదింటి బిడ్డలు. తమ గ్రామంలో ఉన్న ప్రభుత్వ బడిలోనే చదువుతున్నారు. అయినా నిత్యం కఠోర సాధనతో రాష్ట్ర హాకీ జట్టులో స్థానం సంపాదించి జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటుతున్నారు. జట్టు విజయంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. తమ ఊరికి, చదువుతున్న పాఠశాలకు మంచి పేరు తెస్తున్నారు. వారే మద్దిపాడులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ప్రత్యేక తర్ఫీదు పొందుతూ నైపుణ్యాలు పెంచుకుని అండర్ -14, అండర్-17 మహిళల విభాగాల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున ఝార్ఖండ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో జరిగిన జాతీయ స్థాయి హాకీ పోటీల్లో పాల్గొన్నారు. ఉత్తమ ఆటతీరుతో పలువురి ప్రశంసలు అందుకున్నారు. అంతర్జాతీయ స్థాయిలో దేశం తరఫున ఆడాలనేదే తమ లక్ష్యమని చెబుతున్నారు.

ఉత్తరప్రదేశ్ జట్టుతో పోటీ పడుతున్న ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణులు

తల్లిదండ్రుల కోరిక నెరవేరుస్తా..

నా పేరు **కావూరి సిరివల్లి.** మద్దిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నా. విద్యతోపాటు క్రీడలూ అవసరమని ఉపాధ్యాయులు చెప్పడంతో హాకీపై ఆసక్తిని పెంచుకున్నా. నాన్న జాన్‌సుందర్‌రావు, అమ్మ దయమ్మ రోజువారీ కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. మా వ్యాయామ ఉపాధ్యాయులు సౌజన్య, వనజలు చాలా రోజుల నుంచి రైట్ ఆఫ్ ప్లేయర్‌గా నన్ను తీర్చిదిద్దారు బాల్ గోల్ చేయడంలో మెలకువలు నేర్పించారు. ఇటీవల మధ్యప్రదేశ్‌లో జరిగిన అండర్ -14 జాతీయ స్థాయి హాకీ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున పాల్గొన్నా. రాష్ట్రం గెలుపు కోసం నా వంతు సహకారం అందించాను. దేశం తరఫున ఆడాలన్నదే మా తల్లిదండ్రుల కోరిక. దానిని తీర్చడమే నా లక్ష్యం.

జట్టు విజయంలో కీలకపాత్ర పోషించా..

నా పేరు **మందా అను.** 9వ తరగతి చదువుతున్నా. చిన్నప్పటి నుంచే క్రీడలంటే ఆసక్తి. మద్దిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 7వ తరగతిలో ఉన్నప్పుడే హాకీ బ్యాట్ చేతపట్టాను. కూలి పనులు చేసుకుని జీవనోపాధి పొందే మా తల్లిదండ్రులు సురేష్, కోటేశ్వరమ్మలు ఇచ్చిన ప్రోత్సాహంతో పాటు, పాఠశాల ఉపాధ్యాయుల సహకారం మరువలేను. మా వ్యాయామ ఉపాధ్యాయులు హాకీలో సెంటర్ ఫార్వార్డ్ క్రీడాకారిణిగా నన్ను తీర్చిదిద్దారు. జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో జరిగిన అండర్-17 విభాగంలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో త్రిపుర, బీహార్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలపై విజయం సాధించి తొలిసారి మన రాష్ట్ర జట్టు క్వార్టర్ ఫైనల్ వరకు వెళ్లడానికి నా వంతు ప్రతిభ చాటాను. అంతర్జాతీయ స్థాయిలో ఆడాలన్నదే నా ధ్యేయం.

సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

బీచ్ ఫెస్టివల్‌కు పటిష్ఠ బందోబస్తు

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పాకల బీచ్ ఫెస్టివల్‌కు పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ఆ మేరకు సింగరాయకొండ మండలం పాకల తీరం వద్ద చేస్తున్న ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. పర్యాటకులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించడంతో పాటు పూర్తి స్థాయి భద్రత కల్పించేలా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. నిర్దేశిత ప్రదేశాల్లో మాత్రమే సందర్శకులు స్నానాలు చేసేలా చూడాలన్నారు. ఆయా ప్రాంతాల్లో ఎలాంటి అపశ్రుతులకు తావులేకుండా 50 మంది గజ ఈతగాళ్లు, మెరైన్ పోలీసులను సిద్ధం చేయాలని ఆదేశించారు. వాహనాల రాకపోకల సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడటంతో పాటు రహదారి మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచామని, ఇబ్బందికర పరిస్థితులు ఎదురైతే ప్రజలు సమీపంలోని పోలీసులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు శివన్నారాయణ, హజరత్తయ్య, ఎస్సైలు మహేంద్ర, నాగమల్లేశ్వరరావు, బి.మహేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

శైవక్షేత్రాల వద్ద పోలీసు పహారా

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: మహా శివరాత్రి నేపథ్యంలో ఈ నెల 15వ తేదీన జిల్లాలోని అన్ని ప్రముఖ శైవక్షేత్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ట్రాఫిక్ మళ్లింపు, పార్కింగ్ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని క్షేత్రస్థాయి అధికారులకు సూచించారు. సాంకేతికతను పూర్తిగా వినియోగించుకుంటూ ఆయా ప్రాంతాల్లో నిఘా పెట్టాలని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా, ఏదైనా అనూహ్య సంఘటన జరిగితే తక్షణం స్పందించి చర్యలు చేపట్టేందుకు కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తుల కదలికలు ఉంటే స్థానిక పోలీసులతో పాటు డయల్-112/100 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ ఓ ప్రకటనలో కోరారు.

సార్వత్రిక సమ్మె

నేడు

ఒంగోలు గ్రామీణం: కేంద్ర కార్మిక, సంయుక్త కిసాన్ మోర్చా, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదానికి జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో ఆయా సంఘాల నాయకులు సమాయత్తమయ్యారు. ఒంగోలు నగరంలో ఉదయం ఆర్టీసీ బస్టాండ్ నుంచి అద్దంకి బస్టాండ్, పాత మార్కెట్ సెంటర్ మీదుగా కలెక్టరేట్ వరకు ప్రదర్శన కొనసాగనుంది. నాలుగు లేబర్ కోడ్‌లు, విద్యుత్తు సవరణ చట్టం రద్దుతోపాటు, ఉపాధిహామీ పథకం పాత చట్టాన్ని పునరుద్ధరించడం తదితర డిమాండ్లపై సమ్మె చేపట్టనున్నారు. సమ్మె విజయవంతానికి వామపక్షాలతోపాటు, కార్మిక సంఘాలు విస్తృత ప్రచారం నిర్వహించాయి. వారికి సంఘీభావంగా ఏపీఎన్జీవో జిల్లా సంఘం కూడా మద్దతు ప్రకటించింది.

సత్యసాయి దివ్యజ్యోతి యాత్ర రాక

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: భగవాన్ సత్యసాయిబాబా దివ్యజ్యోతి యాత్ర గురువారం నగరానికి వస్తుందని సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కోడెల శ్రీనివాసరావు పేర్కొన్నారు. దివ్యజ్యోతి యాత్ర భారతదేశమంతా పర్యటిస్తూ ఒంగోలు నగరంలోని మంగమూరు రోడ్డులోగల మందిరానికి వస్తుందన్నారు. అక్కడ నుంచి ఉదయం 10 గంటలకు ర్యాలీ జరుగుతుందన్నారు. ఉన్నతాధికారులు, విద్యార్థులు, సాయి భక్తులు పాల్గొంటారని తెలిపారు.

గ్రానైట్ గనుల్లో భద్రతా వారోత్సవాలు

❖ ఏప్రిల్‌లో నిర్వహించేందుకు నిర్ణయం

న్యూస్‌టుడే, చీమకుర్తి

ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల పరిధిలో ఉన్న గ్రానైట్ క్వారీల్లో ఏప్రిల్‌లో భద్రతా వారోత్సవాలు నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ఇటీవల బల్లికురవలో నిర్వహించిన సదస్సు సందర్భంగా అధికారులు, క్వారీ యజమానుల సంఘాల ప్రతినిధులు దీనిపై చర్చించి ఒక నిర్ణయానికి వచ్చారు. ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో ఉన్న వివిధ రకాల గ్రానైట్ క్వారీలను విభాగాలుగా విభజించి ప్రతి సంవత్సరం డిసెంబరు నెలలో భద్రతా వారోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గతేడాదికి సంబంధించి వారోత్సవాలు నిర్వహించని విషయమై 'భద్రత.. ఎవరికీ పట్టని బాధ్యత' అనే శీర్షికన గత నెల 26న 'ఈనాడు' కథనం ప్రచురితమైంది. దీనిపై అధికారులు ఆరా తీశారు. మైనింగ్ ఇంజినీర్ల అసోసియేషన్, గ్రానైట్ వృత్తి శిక్షణా కేంద్రం, బల్లికురవ, గురిజేపల్లి గ్రానైట్ యజమానుల సంఘాల ఆధ్వర్యంలో ఇటీవల బల్లికురవలో జరిగిన సదస్సుకు గనుల భద్రతా విభాగం సంచాలకుడు(డీఎంఎస్) వేణుగోపాల స్వామి హాజరయ్యారు. ఇప్పటికే ఆలస్యమైనందువల్ల ఏప్రిల్‌లో వారోత్సవాలు నిర్వహించాలని, త్వరలోనే తేదీలు కూడా ప్రకటించాలని భావిస్తున్నారు. ఇప్పటి వరకు 22 భద్రతా వారోత్సవాలు నిర్వహించగా.. అన్నింటికీ చీమకుర్తి ప్రాంతంలోని గెలాక్సీగ్రానైట్ క్వారీల యజమానులే హోస్టుగా వ్యవహరిస్తున్నారు. 23వ భద్రతా వారోత్సవాలకు తాము ఆతిథ్యం ఇస్తామని బల్లికురవ స్టీల్‌గ్రే గ్రానైట్ యజమానుల సంఘం ప్రతినిధులు ముందుకు వచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో రెండు జిల్లాల పరిధిలో ఉన్న సుమారు 105 క్వారీల్లో త్వరలోనే వారోత్సవాల నిర్వహణ దిశగా వివిధ భద్రతా అంశాలపై అవగాహన కల్పించనున్నారు.

చీమకుర్తి ప్రాంతంలోని గెలాక్సీ గ్రానైట్ క్వారీలు

కొనుగోలు కేంద్రాల ఏర్పాటు పట్టదా ?

❖ మొక్కజొన్న రైతు విలవిల

న్యూస్‌టుడే, తాళ్లూరు, దర్శి :

ఆపసోపాలు పడి వరి సాగు చేసినా.. నష్టాలే పలకరించడంతో పలువురు రైతులు ఈ దఫా మొక్కజొన్న వైపు దృష్టి సారించారు. దీంతో ప్రస్తుత రబీ సీజన్‌లో జిల్లావ్యాప్తంగా సాగు గణనీయంగా పెరిగింది. దిగుబడులు కూడా ఆశాజనకంగా ఉన్నా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు విలవిల్లాడుతున్నారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో అత్యధికంగా గిద్దలూరు, అర్ధవీడు, బేస్తవారపేట, కొమరోలు, పుల్లలచెరువు, రాచర్ల, తాళ్లూరు, త్రిపురాంతకం, అద్దంకి ప్రాంతాల్లో విస్తారంగా మొక్కజొన్న సాగైంది. సాధారణ విస్తీర్ణం 5,626 హెక్టార్లకుగాను 19,283 హెక్టార్లలో పంట వేయడం విశేషం. ఎకరా సొంత పొలం కలిగిన రైతులు రూ.35 వేలు, కౌలు రైతులు మరో రూ. పదివేలు అదనంగా ఖర్చు చేశారు. తెగుళ్ల ప్రభావం తక్కువగా ఉండడంతో రైతులకు ఇబ్బందులు కొంతమేర తగ్గాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈపాటికే కోతలు ప్రారంభించారు. దిగుబడులు ఆశాజనకంగా 30 నుంచి 40 క్వింటాళ్ల వరకూ వస్తున్నాయి. మార్కెట్‌లో ధరలు లేకపోవడం నిరాశకు గురిచేస్తోంది.

కొత్తపాలెంలో ట్రాక్టరుకు లోడ్ చేస్తున్న మొక్కజొన్న బస్తాలు

మధ్యవర్తులు ధరలు తగ్గించేసి..

ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.2400 ఉంది. అయితే మధ్యవర్తులు రూ.1900కే కొనుగోలు చేస్తున్నారు. దీంతో క్వింటాకు రూ.500 వరకూ నష్టపోతున్నారు. ఎకరాకు రూ.20 వేల కంటే తక్కువ రాబడులు వస్తున్నాయని ఇలా ఉంటే పెట్టుబడి డబ్బులు కూడా రావని వారంటున్నారు. ప్రభుత్వం తరపున తక్షణం కొనుగోలు కేంద్రాలు తెరిస్తే తాము గట్టెక్కుతామని వారంటున్నారు. ఈ విషయమై జిల్లా మార్కెటింగ్ విభాగం డీఎం హరికృష్ణను సంప్రదించగా జిల్లా రైతులు రబీ సీజనులో సాగు చేసి ఉత్పత్తి చేసిన మొక్కజొన్నను కొనుగోలు చేస్తామని, త్వరలోనే ఉన్నతాధికారుల నుంచి అనుమతులు తీసుకొని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేస్తామన్నారు.

అదనపు భూ సేకరణకు వినతి

కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ కార్యదర్శి ఉమాశంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ మాగుంట

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: అత్యవసర పరిస్థితుల్లో విమానాలు దిగేందుకు సింగరాయకొండ వద్ద జాతీయ రహదారిపై అదనపు భూ సేకరణ చేయాలని కోరుతూ కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ కార్యదర్శి ఉమాశంకర్‌కు దిల్లీలో బుధవారం ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన అత్యవసర లాండింగ్ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. త్రోవగుంట-చదలవాడ గ్రామాల మధ్యలో 7.5 కి.మీ మేర విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలని విన్నవించారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ ఓ ప్రకటనలో తెలిపారు.

తపాలా కార్యాలయాల్లో ఆధార్ శిబిరాలు

ఒంగోలు కర్నూలు రోడ్డు, న్యూస్‌టుడే: జిల్లా పోస్టల్ డివిజన్ పరిధిలోని చీమకుర్తి, మద్దిపాడు, వేటపాలెం, పర్చూరులోని తపాలా కార్యాలయాల్లో ఉన్న ఆధార్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసినట్లు సీనియర్ సూపరింటెండెంట్ ఎండీ జాఫర్ సాధిక్ బుధవారం తెలిపారు. గురువారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకు వీటిని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 5 నుంచి 15 ఏళ్ల వయసు గల బాల బాలికలకు తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్‌డేషన్‌కు సెప్టెంబర్ 30వ తేదీ వరకు పూర్తిగా ఉచితంగా అవకాశం కల్పించినట్లు చెప్పారు. ఆధార్ కేంద్రాలకు సమీపంలోని ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒంగోలు, కందుకూరు, చీరాల, సంతనూతలపాడు, టంగుటూరులోని తపాలా కార్యాలయాల్లో ఆధార్ సేవలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఆధార్ నమోదు ఉచితమని, పేరు, చిరునామా, పుట్టిన తేదీ మార్పులకు రూ.75, వేలిముద్రలకు రూ.125 రుసుము తీసుకుంటారని తెలిపారు. పిల్లల బయోమెట్రిక్ నవీకరణ ఉచితమని వెల్లడించారు.

చరిత్రలో నిలిచేలా పాకల బీచ్ ఫెస్ట్

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: పాకల బీచ్ ఫెస్టివల్‌ను చరిత్రలో నిలిచిపోయేంత ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ పి.రాజాబాబు పేర్కొన్నారు. ఈ నెల 14, 15 తేదీల్లో జరగనున్న ఉత్సవాల ఏర్పాట్లపై జిల్లా అధికారులతో బుధవారం చర్చించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా వేడుకలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఆయా శాఖలకు నిర్దిష్ట బాధ్యతలు అప్పగించిన నేపథ్యంలో సదరు అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. అనంతరం శాఖల వారీగా తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. డీఆర్వో ఓబులేసు, జడ్పీ సీఈవో చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ అనుమతుల్లో జాప్యం తగదు

జేసీ కల్పనాకుమారి

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఒడా పరిధిలో జరిగే భవన నిర్మాణాలకు సంబంధించి అనుమతుల జారీలో జాప్యం ఉండకూడదని జేసీ, ఒడా వైస్ ఛైర్మన్ కల్పనాకుమారి స్పష్టం చేశారు. స్థానిక ప్రకాశం భవన్‌లోని ఛాంబర్‌లో బుధవారం ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ప్రస్తుతం అమల్లో ఉన్న ఎల్ఆర్ఎస్, బీపీఎస్, ఏపీ డీపీఎంఎస్‌పై ఇంజినీరింగ్ విభాగం అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామ పంచాయతీల్లోని భవన నిర్మాణాలకు ఇచ్చే అనుమతుల్లో పురోగతిపై ఆరా తీశారు.

మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాల్సిందే

బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఫుడ్ కమిషన్ సభ్యుడు లక్ష్మీరెడ్డి

అద్దంకి, న్యూస్‌టుడే : ప్రభుత్వం నిర్దేశించిన విధంగా పాఠశాల విద్యార్థులకు తప్పనిసరిగా మెనూ ప్రకారం ఆహారం అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు ఎండేటి లక్ష్మీరెడ్డి అన్నారు. బుధవారం అద్దంకి బాలుర, బాలికల, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. సరఫరా అవుతున్న కోడిగుడ్లు, బియ్యం నిల్వలను సరి చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం వండే సమయంలో సంబంధిత ఉపాధ్యాయులు రుచి చూడాలన్నారు. నాణ్యమైన బియ్యం, సరకులు సరఫరా చేస్తున్న నేపథ్యంలో మంచి ఆహారం అందించాలన్నారు. బాలికల ఉన్నత పాఠశాలలో ఎక్కువ సైకిళ్లు ఉండటాన్ని గమనించి వివరాలు అడిగారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో ఏడువేల మంది విద్యార్థులకు సైకిళ్లు సరఫరా చేసినట్లు ఉపాధ్యాయులు వివరించారు. మరో మూడు వేల మందికి సైకిళ్లు ఇవ్వనున్నట్లు తెలుసుకుని అభినందించారు. ఆయన వెంట జిల్లా పౌర సరఫరా అధికారిణి పద్మశ్రీ, డిపో మేనేజరు వరలక్ష్మి, జీసీటీవో హేమలత, సాంఘిక సంక్షేమ గురుకుల సమన్వయకర్త డీ జయ, తూనికలు కొలతల అధికారి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కూలి పనికోసం వచ్చి..

❒ బంగారం, నగదు ఎత్తుకెళ్లాడు

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: దారిన వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తిని కూలి పనికోసం పిలిచిందామె. పనిచేస్తున్నట్లు నటించి అదును చూసి అదే ఇంటికి కన్నమేశాడు అతడు. రూ.లక్ష నగదు, అయిదు సవర్ల బంగారు ఆభరణాలు అపహరించుకుని వెళ్లిపోయాడు. ఒంగోలు రైలుపేట ఒకటో లైనులో బుధవారం జరిగింది ఈ సంఘటన. రెండో పట్టణ పోలీసులు కథనం మేరకు.. స్థానిక రైలుపేటలో విశ్రాంత తహసీల్దార్ కల్లూరి ఇందిరాదేవి నివసిస్తుంటారు. ఆమె ఇంటి నిర్మాణం చేపట్టారు. ఈ క్రమంలో అక్కడ కొన్ని కర్రల తొలగింపు కోసం ఆ దారిని వెళ్తున్న ఒక అపరిచిత వ్యక్తిని పిలిచి కూలిపని అప్పగించారు. ఆమె ఆదమరిచి ఉన్న సమయంలో వేరొక గదిలోకి వెళ్లిన ఆ వ్యక్తి బీరువా పగలకొట్టి అందులో ఉన్న బంగారం, నగదు అపహరించుకొని వెళ్లాడు. కర్రలు తీసేందుకు వెళ్లిన వ్యక్తి ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో అనుమానించిన ఇందిరాదేవి అక్కడికి వెళ్లి చూడగా సదరు వ్యక్తి కనిపించలేదు. బీరువా పగలగొట్టి ఉంది. అందులోని నగదు, నగలు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ మేడా శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు

ఒంగోలు గ్రామీణం: పాడి రైతులకు సేవల ద్వారా మంచి గుర్తింపు వస్తోందని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఎన్.వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక రంగారాయుడు చెరువు సమీపంలోని డీఎల్‌డీఏ కార్యాలయంలో బుధవారం ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన ఆరుగురు వీఏల్వోలకు సన్మానసభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ రీత్యా సర్వీసులో 30 నుంచి 40 సంవత్సరాల పాటు పశు వైద్యశాలలో మూగ జీవాల సంక్షేమానికి చేసిన సేవలు అభినందనీయమన్నారు. వైద్య సిబ్బంది అందరూ స్థానికంగా అందుబాటులో ఉంటూ సకాలంలో సత్వర సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎన్‌జీఎఫ్ జిల్లా అధ్యక్షుడు టీవీ.రమేష్, మార్కాపురం జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి రాఘవయ్య, డీడీలు జయచంద్ర, మురళీకృష్ణ, శ్రీధర్, జగత్ శ్రీనివాసరావు, లావణ్య, పారా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కుటుంబ వివాదాల నేపథ్యంలో వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఒంగోలులో గురువారం జరిగింది. రెండో పట్టణ పోలీసుల కథనం మేరకు.. నల్లగర్ల పద్మజ(38), ఎంఎస్సీ బీఈడీ చేశారు. పదేళ్ల ఏళ్ల క్రితం మొనపాటి చంద్రశేఖర్ అనే వ్యక్తితో వివాహమైంది. పద్మజ గృహిణిగా ఉండగా చంద్రశేఖర్ ఒక ప్రైవేటు హాస్పిటల్‌లో పనిచేస్తున్నాడు. అతను వ్యసనాలకు బానిస కావడంతో భార్యాభర్తల మధ్య తరచుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం తాము నివాసం ఉంటున్న ఇంటిలో పద్మజ చీరతో ఫ్యానుకు ఉరివేసుకుంది. ఆమె కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండో పట్టణ సీఐ మేడా శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనదారుడి మృతి

పెదనెమలిపురి(రాజుపాలెం), న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరు మృతి చెందిన ఘటన అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారిపై పెదనెమలిపురి వద్ద బుధవారం జరిగింది. ప్రకాశం జిల్లా పొదిలి మండలం ఏలూరుకు చెందిన ధర్మవరపు శివకుమార్‌రెడ్డి(24) ద్విచక్ర వాహనంపై పిడుగురాళ్లకు బయలుదేరాడు. మార్గమధ్యలో పెదనెమలిపురి గ్రామంలోని తిరుపతమ్మ ఆలయ సమీపానికి చేరుకోగానే వాహనం అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ఘటనలో అతడి తల డివైడర్‌ను తగడంతో బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై మణికృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జల్సాలకు అలవాటు పడి.. దొంగలుగా మారి..

❖ రూ.4 లక్షల విలువైన ద్విచక్ర వాహనాలు స్వాధీనం

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం, గుంటూరు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న ముఠాకు మార్కాపురం పోలీసులు అడ్డుకట్ట వేశారు. బుధవారం స్థానిక సీఐ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మార్కాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బారావు తెలిపిన వివరాల మేరకు మార్కాపురం పట్టణంలోని విజయ సినిమా థియేటర్ ప్రాంతానికి చెందిన సయ్యద్ మజీద్ అలియాస్ ఆషిక్, దూదేకుల మొహిద్దీన్‌షా, గుంటూరు నగరంలోని నల్లచెరువు వీధికి చెందిన పులి ఆంజిరెడ్డిలు పాత నిందితులు. వీరు గతంలో ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో ద్విచక్ర వాహనాలు చోరీ చేసి అమ్మగా వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తున్నారు.

జైల్లో పరిచయం స్నేహంగా మారింది..

ఒకే జైల్లో గడుపుతున్న సమయంలో ముగ్గురి మధ్య పరిచయం ఏర్పడింది. జైలు నుంచి బెయిల్‌పై వచ్చిన తర్వాత కూడా వాహనాలు చోరీ చేయసాగారు. బుధవారం ఉదయం మండలంలోని కోమటికుంట వై- జంక్షన్ వద్ద మార్కాపురం గ్రామీణ ఎస్సై వి.వేమన వాహనాలు తనిఖీలు చేస్తున్న సమయంలో ఉదయం 9:30 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై ఈ ముగ్గురు కుంటవైపు రాసాగారు. పోలీసులను చూసి పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. విచారించగా గుంటూరులో రెండు ద్విచక్ర వాహనాలు, పల్నాడు జిల్లా వినుకొండలో ఒక ద్విచక్ర వాహనం, మార్కాపురం మండలంలోని రాయవరం గ్రామంలో ఒక ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసినట్లు అంగీకరించినట్లు తెలిపారు. కోమటికుంట వద్ద ఉన్న ముళ్ల పొదల్లో వాహనాలను ఉంచి ఒక్కొక్కటిగా విక్రయిస్తున్నట్లు చెప్పారు. నిందితుల నుంచి మూడు బులెట్‌లు, మరొక పల్సర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసును ఛేదించినందుకు జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీ హర్షవర్ధన్ రాజు, డీఎస్పీ నాగరాజు, సీఐ, ఎస్సైలను ప్రత్యేకంగా అభినందించినట్లు చెప్పారు. అంతేకాకుండా కేసులో క్రియాశీలకంగా వ్యవహరించిన కానిస్టేబుళ్లు గిరి, వెంకటేశ్వర్లును అధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

మాట్లాడుతున్న సీఐ సుబ్బారావు

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 120, రిటైల్ లైవ్ - 142, చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234

EENADU Classifieds

AGRI BUSINESS
సాయి ప్రాపర్టీస్ & ప్రాజెక్ట్స్ ... 77999 60199, 77999 60279.

BUSINESS SERVICES
బంగారం బ్యాంకులో ... 81422 92071.

EDUCATION
DISTANCE EDUCATION
... M.Sc, M.A, MBA, MCA, M.Com, MLiSc ... 9849124970, 9030568558.
నెల్లూరు CBSE ... 97498, 91210 24992

SECURITY GUARDS
... ASO & సెక్యూరిటీ గార్డ్స్ ... 96189 71229, 9550214234

JOBS
MSK సెక్యూరిటీలో ... 83283 84242.
విజయశ్రీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ... GNM 2, ... GNM Boys-2 ... 98498 78129, 63057 88609.
గుంటూరులోని రియల్‌ఎస్టేట్ ... (50), ... (10) ... 78010 32689.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో పూర్తిగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ...

(c) eenadu

కందుకూరు

• కందుకూరు • కొండపి

యాప్ ద్వారా అద్దెకు వ్యవసాయ యంత్రాలు

పొన్నలూరు, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తపాలెం, జెడ్.మేకపాడు గ్రామాల్లో వ్యవసాయ అధికారి వి.రాము ఆధ్వర్యంలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. రబీ సీజన్‌లో సాగు చేసిన పంటల వివరాలను ఈ-పంటలో నమోదు చేసుకోవాలని సూచించారు. యాప్ ద్వారా ఎప్పుడైనా, ఎక్కడైనా వ్యవసాయ యంత్రాలను అద్దెకు పొందవచ్చని తెలిపారు. కంది పంట విక్రయించాలనుకునే వారు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి సుధీర్‌కుమార్, వ్యవసాయ సహాయకులు ఎం.కిశోర్ బాబు, కె.మధు, కె.స్వర్ణ, రైతులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదుతో బహుళ ప్రయోజనాలు

వలేటివారిపాలెం, న్యూస్‌టుడే: రైతులు ఈ-పంట నమోదు చేయించుకుంటే అనేక ప్రయోజనాలు ఉంటాయని ఏవో శేషారెడ్డి తెలిపారు. మండలంలోని అంకభూపాలపురంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరి పంటలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. మర్రిపూడి, న్యూస్‌టుడే: రైతులు తప్పనిసరిగా విశిష్ట గుర్తింపు సంఖ్య కలిగి ఉండాలని ఏవో వెంకటేష్ తెలిపారు. కాకర్లలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు.

ఆశ చూపుతారు.. దోచేస్తారు

టంగుటూరు (సింగరాయకొండ గ్రామీణం), న్యూస్‌టుడే: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, చరవాణులకు వచ్చే సమాచారాన్ని నమ్మితే నిలువునా మోసపోతారని సింగరాయకొండ సీఐ హజరత్తయ్య అన్నారు. టంగుటూరు జాతీయ రహదారిపై బుధవారం వివిధ పరిశ్రమలలో పనిచేస్తున్న మహిళలకు సైబర్ మోసాలు, నేరాలు జరిగే తీరుపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తులు.. బ్యాంకు సిబ్బంది పేరుతో తక్కువ వడ్డీకే వ్యక్తిగత రుణాలు ఇస్తామంటూ ఆధార్, బ్యాంకు ఖాతా నంబర్లు తీసుకుని, అనంతరం మోసం చేస్తారని చెప్పారు. అనుమానాస్పద వ్యక్తులు తారసపడినా, బెదిరింపులకు పాల్పడినా 100 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు. గంజాయి, మత్తు పదార్థాలు సరఫరా చేస్తున్న వారి వివరాలు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై నాగమల్లేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న సీఐ హజరత్తయ్య

ప్రభ నిర్మాణ పనుల ప్రారంభం

గుడ్లూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రం గుడ్లూరు శివాలయం వద్ద మహా శివరాత్రి సందర్భంగా ఈ నెల 15న ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం స్థల పూజ చేసి, ప్రభ నిర్మాణం ప్రారంభించారు. అర్చకులు లక్ష్మీనరసింహస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సభ్యులు రాములు, వెంకట్రామరాజు, రావూరి వేణు, పువ్వాడి వేణు, అమార మాల్యాద్రి, సి. శ్రీనివాసులు, కొత్తూరి రాజు, నాగరాజు పాల్గొన్నారు.

పూజలో పాల్గొన్న కమిటీ సభ్యులు, గ్రామస్థులు

పాఠశాలల్లో పచ్చదన కవచం!

❖ గ్రీన్ టెక్నాలజీ పేరుతో పార్కుల ఏర్పాటుకు చర్యలు

ఇది గుడ్లూరు మండలం బసిరెడ్డిపాలెం ఉన్నత పాఠశాలకు చెందిన విశాల మైదానం. ప్రస్తుతం ఇక్కడ 100కు పైగా ఉన్న వృక్షాలు చల్లని నీడనిస్తున్నాయి. ఈ ప్రాంగణంలో గ్రీన్ పార్కు ఏర్పాటు చేస్తే పచ్చదనం మరింత పెరుగుతుంది.

కందుకూరు, గుడ్లూరు, న్యూస్‌టుడే: గ్రీన్ కవర్ నిమిత్తం ఉగాది నుంచి రాష్ట్రంలోని పాఠశాలల్లో దేశీయ మొక్కల పెంపకం చేపట్టాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా అటవీ శాఖతో కలిసి గ్రీన్ టెక్నాలజీ పార్కులను ప్రారంభించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించారు.

ప్రయోజనాలు ఇలా..

విశాల మైదానాలు కలిగిన ఉన్నత పాఠశాలలు ఆయా పార్కుల ఏర్పాటుకు అనుకూలంగా ఉంటాయి. ఇందులో వివిధ రకాల నీడనిచ్చే మొక్కలతో పాటు పండ్ల, పూల, కూరగాయల తోటలను పెంచేందుకు వీలుంటుంది. తద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చు. పట్టణ ప్రాంతాలు, మండల కేంద్రాల్లో వృక్షాల సంఖ్య తగ్గుతోంది. గ్రీన్ పార్కుల ఏర్పాటుతో ఆ సమస్యను అధిగమించవచ్చు.

గుడ్లూరు ఉన్నత పాఠశాల మైదానం

నియోజకవర్గంలో వివరాలు

మండలం	పాఠశాలలు
కందుకూరు	6
గుడ్లూరు	8
ఉలవపాడు	7
లింగసముద్రం	6
వలేటివారిపాలెం	7

ఇక్కడ అనుకూలం

గుడ్లూరు, మొగళ్లూరు, ఉలవపాడు, రామాయపట్నం, భీమవరం, పలుకూరు, శాఖవరం, నలదలపూరు, పోకూరు, పెదపవని, లింగసముద్రం పాఠశాలల్లో గ్రీన్ పార్కుల ఏర్పాటుకు వీలుంది. ఆ దిశగా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

కందుకూరు: 70939 81624

కొండపి: 96424 56296

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే

?: పట్టణంలోని బృందావనం కాలనీలో వారం రోజులు నుంచి ఓ వీధిలోని దీపాలు వెలగడం లేదు. -ఎం.అనిల్, బృందావనం

✓: మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరిస్తాం. -కె.అనూష, మున్సిపల్ కమిషనర్

జరుగుమల్లి, న్యూస్‌టుడే

?: జరుగుమల్లిలో చాలా రోజులుగా పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో వీధుల్లో చెత్త పేరుకుపోయింది. -హరి, స్థానికుడు

✓: పారిశుద్ధ్య పనులు చేయించి సమస్య పరిష్కరిస్తాం. -విద్యులత, పంచాయతీ కార్యదర్శి

ఉలవపాడు, న్యూస్‌టుడే

?: మండలంలోని రామాయపట్నంలో రెండ్రోజులుగా తాగునీటి సరఫరా నిలిచి ఇబ్బందులు పడుతున్నాం. -శ్రీనివాసరావు

✓: గురువారం నుంచి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటాం. -మాలకొండయ్య, పంచాయతీ కార్యదర్శి

మర్రిపూడి, న్యూస్‌టుడే

?: మర్రిపూడి ప్రధాన రహదారిలో రేషన్ దుకాణానికి వెళ్లే వీధిలో దీపం వెలగకపోవడంతో రాత్రి పూట ఇబ్బందిగా ఉంటోంది. -శ్రీనివాసులు, స్థానికుడు

✓: సిబ్బందిని పంపి వెంటనే బాగు చేయిస్తాం. -బీవీ నాయుడు, పంచాయతీ కార్యదర్శి

గుడ్లూరు, న్యూస్‌టుడే

?: స్థానిక అంకమ్మ ఆలయానికి వెళ్లే మార్గంలోని మలుపులో రెండు వీధి దీపాలు వెలగడం లేదు. -ఎం.పవిత్ర

✓: పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం. -నరేశ్, పంచాయతీ కార్యదర్శి

మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష

పొన్నలూరు, న్యూస్‌టుడే: మహాశివరాత్రి నేపథ్యంలో మండలంలోని చెన్నిపాడు సంగమేశ్వరాలయం వద్ద చేయాల్సిన ఏర్పాట్లపై ఎంపీడీవో పి.సుజాత బుధవారం సమీక్షించారు. భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆలయ పరిసరాలను పరిశీలించారు. సమీపంలోని పాలేరు వాగులో లోతైన గుంతలు ఉన్న కారణంగా ఆ ప్రదేశాలకు ఎవరూ వెళ్లకుండా చర్యలు చేపట్టాలన్నారు. తాగునీరు, వైద్య సదుపాయం, అగ్నిమాపక చర్యలు, విద్యుత్తు వంటి అంశాలపై చర్చించారు. సమావేశంలో తహసీల్దార్ వి.పుల్లారావు, కొండపి సీఐ సోమశేఖర్, ఎస్సై పి.సత్యనారాయణ, ఆర్ఐ శివ, డిప్యూటీ ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, దేవస్థానం ఈవో వీరయ్యాచౌదరి, ఏఈ వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సంగమేశ్వరాలయ పరిసరాలను పరిశీలిస్తున్న సీఐ సోమశేఖర్, ఎంపీడీవో సుజాత

80 మంది సిబ్బందితో బందోబస్తు

లింగసముద్రం, న్యూస్‌టుడే: లింగసముద్రం, మొగిలిచర్లలో జరిగే తిరునాళ్లకు 80 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు కందుకూరు డీఎస్పీ బాల సుబ్రహ్మణ్యం తెలిపారు. బుధవారం దత్తాత్రేయస్వామి, కోటయ్యస్వామి మందిరాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తులకు అసౌకర్యం లేకుండా వాహనాల పార్కింగ్ స్థలంతో పాటు క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎస్సై రాంబాబు, అడపా రంగయ్య, కిలారి రమణయ్య తదితరులు ఉన్నారు. ❖ లింగసముద్రం మీదుగా మొగిలిచర్లకు 30, సంగమేశ్వరానికి 5 ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు కందుకూరు ఆర్టీసీ డిపో మేనేజరు శ్రీనివాసరావు తెలిపారు. ❖ మొగిలిచర్ల దత్తాత్రేయస్వామి మందిరం వద్ద ఈ నెల 15న జరిగే జాతర ఏర్పాట్లను ఒంగోలు దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ పానకాలరావు బుధవారం సమీక్షించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వసతులు కల్పించాలన్నారు. సమావేశంలో ఆలయ ధర్మకర్త పవని ప్రసాద్, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆగని వృథా.. తాగునీరందక వ్యథ..!

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే:

కాలనీ కష్టాలు

స్థానిక చాకలిపాలెం, గణేష్‌నగర్ ప్రాంతాల్లో ఏళ్ల తరబడి తాగునీటి సమస్య నెలకొంది. పట్టణంలో దాదాపు 70 శాతం కాలనీలకు ఉదయం పూట నీరు సరఫరా చేస్తున్నారు. చాకలిపాలెం, గణేష్‌నగర్, బలిజపాలెం, వడ్డెపాలెం ప్రాంతాలకు మాత్రం సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు ఇస్తున్నారు. అది కూడా అరకొరగా వస్తుండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు నాలుగు నెలల క్రితం చాకలిపాలెం చప్టా వద్ద పైపులైన్ పగిలి నీరంతా వృథాగా కాలువలోకి పోతోంది. దీంతో కట్టెల అడితి పడమర వీధి నుంచి చాకలిపాలెం అరుగు వీధి వరకు సక్రమంగా అందడం లేదని ప్రజలు వాపోతున్నారు. కొన్ని వీధుల్లో అసలు రాకపోవడంతో చేతిపంపులే దిక్కవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కరించాలని అనేకసార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేదని చెబుతున్నారు. అలాగే కాలనీ ప్రధాన వీధి వెంబడి మురుగు కాలువలు శిథిలావస్థకు చేరాయి. మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది పుణ్యమా అని ఏఎంసీ కార్యాలయంలో ఉన్న ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు నిండి నీరు భారీగా వృథా అవుతూ కాలువల ద్వారా చాకలికుంటకు చేరుతోంది. దీంతో ఆ ప్రాంతం నిండు కుండను తలపిస్తోంది. ఈ నేపథ్యంలో కాలువల్లో మురుగు పారుదల నిలుస్తోంది. కాలనీలో సుమారు 10 చోట్ల వీధి దీపాల సమస్య ఉంది. * గణేష్‌నగర్, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వెనుక వీధి ప్రాంతాల్లో అడుగడుగునా వేగ నిరోధకాలు ఉండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ద్విచక్ర వాహనదారులు వాపోతున్నారు. కొన్ని వీధుల్లో మట్టి రోడ్లు దర్శనమిస్తున్నాయి. వర్షాకాలంలో బురదమయంగా ఉంటోందని, కూటమి ప్రభుత్వం స్పందించి మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నారు. ▸ వడ్డెపాలెంలోనూ వేగ నిరోధకాల సమస్య నెలకొంది.

వార్డు: 27
ప్రాంతాలు: పడమటివడ్డెపాలెం, చాకలిపాలెం, గణేష్‌నగర్, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వెనుకవీధి
నివాసాలు: 550
జనాభా: 2400

చాకలిపాలెం ప్రధాన బజారులో అధ్వానంగా ఉన్న కాలువ

తహసీల్దార్‌గా బాధ్యతల స్వీకరణ

వలేటివారిపాలెం, న్యూస్‌టుడే: మండల తహసీల్దార్‌గా ఎస్ఎండీ హుస్సేన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సీఎస్ పురం తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఉప తహసీల్దారు, ఆర్ఐ, వీఆర్వోలు నూతన తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

హుస్సేన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్యాలయ సిబ్బంది

ప్రమాదాలకు మలుపులు..!

మండలంలోని తాతా హోటల్ నుంచి వీఆర్‌కోట వరకు ఆర్అండ్‌బీ రోడ్డుపై చాలా 8 కిలోమీటర్ల పరిధిలో పది చోట్ల మలుపులు ప్రమాదకరంగా మారాయి. వాటి వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేవు. మరోవైపు రోడ్డుకు ఇరువైపులా అక్కడక్కడ జామాయిల్ తోటలు ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కనిపించని పరిస్థితి. అధికారులు స్పందించి మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, లింగసముద్రం

సా..గుతున్న పనులు.. దుమ్ము, ధూళితో అవస్థలు

గుడ్లూరు మండలం చేవూరు వద్ద జాతీయ రహదారి నుంచి గ్రామంలోకి వెళ్లే ఓడరేవు మార్గాన్ని కిలోమీటరు మేర నాలుగు వరుసలుగా విస్తరిస్తున్నారు. ఇందులో భాగంగా తొలి విడతగా.. కంకర, సిమెంట్ మిశ్రమం పరిచారు. అయితే వాహనాల ధాటికి కంకర తొలగిపోవడంతో పాటు విపరీతంగా దుమ్ము లేస్తోంది. దీంతో అటుగా రాకపోకలు సాగించే సమయంలో ప్రజలు, వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితి నెలల తరబడి కొనసాగుతున్నా.. పట్టించుకునే వారు లేకుండా పోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. -న్యూస్‌టుడే, కందుకూరు

నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం!

కొండపి మండల కార్యాలయంలో చెత్తాచెదారంతో నిండిన వాహనం గత 12 రోజులుగా దర్శనమిస్తోంది. సేకరించిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాల్సిన అధికారులు సమస్యను పట్టించుకోకపోవడంతో చెత్త వాహనం కార్యాలయంలోనే నిలిచిపోయి, దుర్వాసన వస్తోంది. దీంతో అటుగా వెళ్లేవారు, కార్యాలయానికి వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో రామాంజనేయులు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శికి తెలియజేసి సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. -న్యూస్‌టుడే, కొండపి గ్రామీణం

సిద్ధమవుతోన్న అన్నక్యాంటీన్

సింగరాయకొండ ప్రజలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న అన్నక్యాంటీన్ ప్రారంభానికి ముస్తాబవుతోంది. రూ.5కే భోజనం అందించేందుకు గత తెదేపా ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణం చేపట్టగా.. అనంతరం ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాలవీరాంజనేయస్వామి చొరవతో నిధులు మంజూరు కావడంతో పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. అవి చివరి దశకు చేరారు. త్వరలో అన్నక్యాంటీన్‌ను అందుబాటులోకి తెస్తామని పంచాయతీ అధికారులు చెబుతున్నారు. -న్యూస్‌టుడే, సింగరాయకొండ గ్రామీణం

ఎన్‌సీసీ యూనిట్‌ని పునరుద్ధరించాలని వినతి

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ యూనిట్‌ను పునరుద్ధరించాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బుధవారం దిల్లీలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల కళాశాలలో మియావాకీ వనం ప్రారంభోత్సవానికి వచ్చిన ఎంపీకి.. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపల్ రవికుమార్, అధ్యాపకులు.. ఎన్‌సీసీ యూనిట్ తిరిగి మంజూరయ్యేలా చూడాలని కోరారు. ఆ మేరకు ఎంపీ దిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి విన్నవించగా.. సానుకూలంగా స్పందించినట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

హామీల అమలు కోరుతూ 13న ధర్నా

కందుకూరు పట్టణం, పొన్నలూరు, న్యూస్‌టుడే: పీఆర్సీ కమిటీ ఏర్పాటు, ఐఆర్ మంజూరు, బకాయిల చెల్లింపు, సీపీఎస్ రద్దు తదితర ప్రభుత్వ మేనిఫెస్టో హామీల అమలు కోరుతూ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 13న కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు కందుకూరు జోన్ కన్వీనర్ జి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిలర్ పిగిలి కొండయ్య, పొన్నలూరు మండల అధ్యక్షుడు ఆర్.కోటచారి, కార్యదర్శి కె.రాము బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ కార్యక్రమంలో ఎస్టీయూ ప్రతినిధులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ముప్పవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో ఎస్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి గవిని శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ముప్పవరం పాఠశాలలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎస్టీయూ ప్రతినిధులు

ముత్యాలకుంట రోడ్డుకు మోక్షం

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ముత్యాలకుంట, హిందూ శ్మశాన వాటిక మధ్యలో ఉన్న రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. దశాబ్దాల తరబడి గతుకులమయంగా ఉన్నా ఏ ఒక్కరూ పట్టించుకోలేదు. వైకాపా ప్రభుత్వంలో స్థానికులు అనేకసార్లు మొరపెట్టుకున్నా.. పెడచెవిన పెట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సుమారు రూ.9లక్షలు వెచ్చించి సీసీ రోడ్డు నిర్మించారు. బుధవారం రోడ్డును ప్రారంభించడంతో స్థానికుల నుంచి హర్షం వ్యక్తమవుతోంది.

ఎల్ఈడీ దీపాల ఏర్పాటు నిబంధనలకు విరుద్ధం

ఉలవపాడు, న్యూస్‌టుడే: వాహనాలకు ఎల్ఈడీ దీపాల ఏర్పాటు నిబంధనలకు విరుద్ధమని కందుకూరు ఆర్టీవో టీవీ నాగలక్ష్మి తెలిపారు. బుధవారం స్థానిక పోలీసుస్టేషన్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎల్ఈడీ దీపాలు ఇతరులకు ఇబ్బంది కలిగించడంతో పాటు తీవ్రమైన కాంతితో ప్రమాదాలు జరుగుతాయని చెప్పారు. తెల్లటి లేదా పసుపు రంగు కాంతినిచ్చే వాటిని అమర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉలవపాడు ఎస్సై సుబ్బారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఆర్టీవో నాగలక్ష్మి

ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా నియామకం

టంగుటూరు, న్యూస్‌టుడే: మండల ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా రామాంజనేయులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రస్తుతం కొండపి ఎంపీడీవో పనిచేస్తున్నారు. టంగుటూరులో గతంలో విధులు నిర్వహించిన దేవసేన దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో జిల్లా ఉన్నతాధికారులు రామాంజనేయులను ఇన్‌ఛార్జిగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని చెపారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న రామాంజనేయులు

విద్యుత్తు చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు

టంగుటూరు, న్యూస్‌టుడే: విద్యుత్తు చౌర్యానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఒంగోలు డీఈ హైమావతి ఆదేశించారు. టంగుటూరు మండలంలో విద్యుత్తు సిబ్బంది 75 మంది 35 బృందాలుగా ఏర్పడి, ఆమె ఆధ్వర్యంలో బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా అక్రమంగా వినియోగించడంతో పాటు విద్యుత్తు చౌర్యానికి పాల్పడుతున్న పలువురికి సుమారు రూ.9.74 లక్షలు అపరాధ రుసుం విధించారు. అనంతరం స్థానిక కార్యాలయం వద్ద సిబ్బందితో డీఈ సమావేశం నిర్వహించారు. అనుమతి లేకుండా అదనపు లోడు వినియోగించే వారిని గుర్తించడంతో పాటు నివాసాల పేరిట సర్వీసు తీసుకుని, వ్యాపార కార్యకలాపాలకు ఉపయోగించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని చెప్పారు. వేసవిలో సరఫరాలో అంతరాయాలు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీఈలు రంగారావు, శ్రీకాంత్, మోహనరావు, నారాయణ, ఏఈలు హరిబాబు, కోటయ్య, కోటేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సేవలన్నారు.. మూలకు చేర్చారు..!

కొండముడుసుపాలెం రైతు సేవా కేంద్రంలో కియోస్క్ ఇలా..

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే:

రైతులకు అది చేస్తాం.. ఇది చేస్తాం.. అంటూ.. గొప్పలకుపోయి ప్రజాధనాన్ని నీళ్ల ప్రాయంగా ఖర్చుచేసిన గత వైకాపా ప్రభుత్వం.. పంటల సాగులో రైతులకు అవసరమైన విత్తనాలు, పురుగుమందులు, ఎరువులను బుక్ చేసుకునేందుకు ఉపయోగపడే కియోస్క్ యంత్రాల విషయంలోనూ తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. అప్పట్లో ఒక్కోదాన్ని రూ.75వేల చొప్పున కొనుగోలు చేసి, రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేశారు. అంతేకాకుండా వ్యవసాయ ఉత్పత్తులు విక్రయం, పంటలకు గిట్టుబాటు ధర వివరాలను కూడా వాటి ద్వారా తెలుసుకోవచ్చని డాంబికాలు పలికారు. ఆ తరువాత వాటి వినియోగంపై రైతులు, సిబ్బందికి సరైన అవగాహన కల్పించలేదు. అయిదేళ్లూ మాటలతో మభ్యపెడుతూ వచ్చారు. చివరికి ఆయా యంత్రాలు దుమ్ము, ధూళితో మూలకుచేరాయి.

నియోజకవర్గంలో 75 చోట్ల

కందుకూరు నియోజకవర్గంలో 73 కేంద్రాల్లో సుమారు రూ.54.75 లక్షలు ఖర్చుచేసి ఏర్పాటు చేసిన కియోస్క్‌లు ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. అంతర్జాల సౌకర్యం అందుబాటులో లేకపోవడం, స్క్రీన్లు మరమ్మతులకు గురికావడంతో ఎక్కడా వినియోగించడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆర్బీకేలను ఆర్ఎస్కేలుగా మార్పు చేసింది. ప్రస్తుతం ఆయా కేంద్రాల సిబ్బంది చరవాణుల్లో యాప్ ఇన్‌స్టాల్ చేసుకుని రైతులకు సేవలు అందిస్తున్నారు.

ప్రభుత్వ నిర్ణయం మేరకు చర్యలు

నిరుపయోగంగా ఉన్న కియోస్క్‌లపై ప్రభుత్వం తీసుకునే నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం ఆయా యంత్రాలు పని చేయడం లేదు. సిబ్బంది ఫోన్ల ద్వారా రైతులకు సేవలు అందిస్తున్నారు.
-కేవీ శేషారెడ్డి, ఏడీఏ కందుకూరు

'శేషయ్య సాహితీ సేవలు మరువలేనివి'

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: కవి, సాహితీవేత్త, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఉమ్మడిశెట్టి వెంకటశేషయ్య మృతి సాహితీ లోకానికి తీరని లోటని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పి.శ్రీనివాసులు అన్నారు. కల్యాణ భారతి సాహితీ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం శేషయ్య సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో మంచి కవిగా శేషయ్య గుర్తింపు తెచ్చుకున్నారని ప్రశంసించారు. రచయితల సంఘానికి ఆయన అందించిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో జీవీ మాల్యాద్రి, శేషగిరిరావు, ఎం.కిశోర్, మాధవరావు, సీహెచ్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

శేషయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సాహితీ వేత్తలు

దీన్‌దయాళ్‌కు ఘన నివాళి

గుడ్లూరు: పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ వర్ధంతి సందర్భంగా స్థానిక భాజపా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో భాజపా మండల బాధ్యుడు ఇన్నమూరి సుధాకర్, ఇన్నమూరి ప్రమీల, జలగం వరుణ్, అశోక్, నాగరాజు, రవి, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

దీన్‌దయాళ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న భాజపా నాయకులు

(c) eenadu

ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి మార్కులు

విద్యార్థులకు సూచనలిస్తున్న డిప్యూటీ డీఈవో చంద్రమౌళేశ్వరరావు

ముండ్లమూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి మార్కులు సాధించవచ్చని డిప్యూటీ డీఈవో చంద్రమౌళేశ్వరరావు అన్నారు. స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని అసిస్టెంట్ డైరెక్టర్ వరప్రసాద్, జీసీడీవో హేమలతతో కలిసి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు వంద రోజుల ప్రణాళికను అమలు చేయాలన్నారు. పరీక్షల సమయంలో సమయాన్ని వృథా చేయరాదన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని చెప్పారు. పాఠశాలలో బియ్యం, నిత్యావసర సరకులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈవో-2 సుబ్బారావు, అధ్యాపకులు పద్మజ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దర్శి (తాళ్లూరు) : త్వరలో జరగబోయే పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణులయ్యేందుకు అందరూ కృషి చేయాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఎ.చంద్రమౌళేశ్వరరావు అన్నారు. దర్శి ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ బాలుర కోసం దర్శితోపాటు టంగుటూరు మండలం ఆలకూరపాడు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో రెసిడెన్షియల్ తరహాలో బోధన చేయిస్తున్నామన్నారు. కేంద్రం ఇన్‌ఛార్జి, దొనకొండ హెచ్‌ఎం రామాంజనేయులు, పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేలుడు పదార్థాల గోదాం పరిశీలన

వాహనాలను తనిఖీ డీఎస్పీ, సీఐ

బల్లికురవ, న్యూస్‌టుడే: భద్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని లేకుంటే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం బల్లికురవ మండలంలోని వేమవరం సమీపంలోని పేలుడు పదార్థాల గోదాంను డీఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాం పరిసరాలు, సరఫరా చేసిన వాహనాలను పరిశీలించారు. నిర్వాహకులు తీసుకుంటున్న భద్రత ప్రమాణాల గురించి ఆరా తీశారు. అనంతరం వేమవరం గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలోని పరిస్థితుల గురించి తెలుసుకుని శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని సీఐ, ఎస్సైలకు సూచించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో డీఎస్పీ మాట్లాడారు. కార్యక్రమంలో ఆయన వెంట సీఐ కె.వెంకట్రావు, ఎస్సై నాగరాజు, సంతమాగులూరు ఎస్సై పట్టాభిరామయ్య, సిబ్బంది ఉన్నారు.

శ్రీశైలానికి కాలినడకన శివస్వాములు

పాదయాత్రగా వెళుతున్న స్వాములు

కురిచేడు, న్యూస్‌టుడే: మండలంలోని 200మంది శివస్వాములు బుధవారం ఇరుముడి ధరించి కురిచేడు గ్రామంలోని శివాలయం నుంచి కాలినడకన శ్రీశైలానికి బయలుదేరారు. ఈ నెల 15న మహాశివరాత్రి రోజుకు అక్కడికి చేరుకోనున్నట్లు వారు తెలిపారు. స్థానిక శివాలయంలో బుధవారం శివస్వాములకు స్థానిక లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఇందూరి వెంకటనర్సిరెడ్డి తన సొంత నిధులతో అన్నదాన వితరణ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు రామారావు, రమణారావు, శ్రీను, ప్రసాదరావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు

మణికేశ్వరం (అద్దంకి), న్యూస్‌టుడే : మహాశివరాత్రి ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్ శ్రీచరణ్ అన్నారు. ఈ నెల 15న ఉత్సవాలను పురస్కరించుకుని సమన్వయ కమిటీ సమావేశం ఆలయ ప్రాంగణం వద్ద నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గుంటుపల్లి వాసు, సీఐ సుబ్బరాజు, పూజారి నడింపల్లి లక్ష్మీనారాయణ, గ్రామస్థులు అంజయ్య, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని గ్రామ పంచాయతీ కార్యదర్శికి సూచించారు. వేసవికాలం అయినందున క్యూలైన్‌లో భక్తులకు మంచినీరు, మజ్జిగ వంటి సదుపాయాలు కల్పించాలన్నారు.

గ్రామాల్లో మెరుగైన పారిశుద్ధ్యం

మేదరమెట్ల, న్యూస్‌టుడే: గ్రామాల్లో మెరుగైన పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీవో ఆర్.రాజ్యలక్ష్మి అన్నారు. కొరిశపాడు మండలంలోని తిమ్మనపాలెంలో ఆమె బుధవారం పర్యటించారు. స్థానిక మురుగు కాలువలను పరిశీలించారు. పూడికను ఎప్పటికప్పుడు తొలగించాలని తెలిపారు. ఐవీఆర్ఎస్‌కు సంబంధించిన కరపత్రాలను స్థానికులకు అందించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అద్దంకి

•అద్దంకి • దర్శి

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

జె.పంగులూరు: కేంద్ర ప్రభుత్వం కార్మికుల పట్ల వివక్షత నిరసనగా గురువారం దేశవ్యాప్తంగా తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్షులు కపల వీరయ్య కోరారు. సార్వత్రిక సమ్మెలో తాము పాల్గొంటున్నామని తెలుపుతూ పంగులూరు రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ అర్జున్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో భాగ్యలక్ష్మి, నరసింహారావు, సుబ్బారావు పాల్గొన్నారు.

మృత్యువుకు ఎదురేగుతారా..!

☛ రాంగ్‌రూట్‌లో వెళుతూ భారీమూల్యం

న్యూస్‌టుడే, మేదరమెట్ల

కొరిశపాడు వద్ద రోడ్డు ప్రమాద దృశ్యం

గమ్యానికి తొందరగా చేరుకోవాలి.. సమయం వృథా కాకూడదన్న ఆలోచనతో చోదకులు వ్యతిరేక దిశలో దూసుకుపోతున్నారు. నిబంధనలకు నీళ్లొదిలి తాము భారీ మూల్యం చెల్లించుకుంటున్నామన్న స్పృహ వారికి ఉండటం లేదు. దీంతో విలువైన ప్రాణాలు కోల్పోయి కన్నవారికి గుండెకోత మిగులుస్తున్నారు. చెన్నై- విజయవాడ రహదారి, అనుసంధాన రోడ్లలో ఈ పరిస్థితి కన్పిస్తోంది. వారికి పోలీసులు కూడా పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడం లేదు.

ఒంగోలు నుంచి వాహనాలు మేదరమెట్ల రావాలంటే మూడు కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి ఉంటుంది. దీంతో చాలామంది చోదకులు తిమ్మనపాలెం నుంచి జాతీయ రహదారిపై వ్యతిరేక దిశలో ప్రయాణిస్తున్నారు. ఒక ఉత్తర బైపాస్ మూసివేయడంతో మండలకేంద్రం కొరిశపాడు వెళ్లాలంటే అద్దంకి రోడ్డులో ఉన్న జాతీయ రహదారి వంతెన కింద నుంచి వెళ్లాలి. ఇలా వెళ్లాలంటే రెండున్నర కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాలి. దీంతో చోదకులు వ్యతిరేక దిశలో కొరిశపాడుకు పయనమవుతున్నారు. మండల కేంద్రం కావడంతో ఎక్కువమంది ఉద్యోగులు కూడా ఇలా మృత్యువుకు ఎదురేగుతున్నారు.

తిమ్మనపాలెం- మేదరమెట్ల మధ్య వ్యతిరేక దిశలో వెళుతున్న వాహనాలు

బైపాస్‌లను మూసేయడంతో..

ఒంగోలు నుంచి మేదరమెట్ల గ్రామంలోకి వచ్చే దక్షిణ బైపాస్, గుంటూరు వైపు నుంచి వచ్చే ఉత్తర బైపాస్‌లను మూసివేశారు. ఈ మార్గాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో చోదకులు త్వరగా గమ్యం చేరాలన్న లక్ష్యంతో ఇలా రాంగ్‌రూట్‌లో వెళుతున్నారు.

తరచూ దుర్ఘటనలు..

గతంలో మేదరమెట్ల నుంచి కొరిశపాడు వెళ్తున్న ద్విచక్ర వాహనానికి కారు ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందారు. గతేడాది తిమ్మనపాలెం నుంచి వ్యతిరేక దిశలో వస్తున్న లారీ..ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఇద్దరు మృతిచెందారు. ఆ ప్రదేశంలోనే ఆటో ద్విచక్ర వాహన చోదకుడిని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి.

వాహన చోదకుల్లో మార్పు రావాలి

వాహనాలు వ్యతిరేక దిశలో ప్రయాణించకుండా చర్యలు తీసుకుంటున్నాం. జరిమానాలు విధిస్తున్నాం. ఇక నుంచి కేసులు నమోదు చేస్తాం. ద్విచక్ర వాహనంపై వెళ్లే వారు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలి. మల్లికార్జునరావు, - అద్దంకి రూరల్ సీఐ

మంచినీటి సరఫరా తీరు పరిశీలన

దర్శి(తాళ్లూరు), న్యూస్‌టుడే: దర్శి పట్టణంలోని పలు ప్రాంతాల్లోని మంచినీటి పథకాలను బుధవారం జిల్లా పంచాయతీ అధికారి ఎం.వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఆయా పథకాల నుంచి గ్రామాలకు మంచినీటిని సరఫరా చేస్తున్న తీరును పరిశీలించారు. సిబ్బందికి సక్రమంగా వేతనాలు చెల్లించడం లేదని కొందరు ఐటీడీఏ జిల్లా కలెక్టర్ రాజాబాబుకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆ పథకాల నిర్వహణ, వేతనాల సమస్యను పరిశీలించేందుకు ఆయనతోపాటు మార్కాపురం పంచాయతీరాజ్‌శాఖ ఈఈ విజయకుమార్‌రెడ్డి, జిల్లా అటవీశాఖ సెటిల్‌మెంట్ విభాగం అధికారి, దర్శి ఈవోఆర్డీ జాన్సన్‌లు కలిసి ఆయా పథకాలను, దస్త్రాలను తనిఖీ చేశారు. సిబ్బందితో మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు. దర్యాప్తులో గుర్తించిన అంశాలను నివేదిక రూపంలో జిల్లా కలెక్టరుకు అందజేస్తామని డీపీవో తెలిపారు.

మంచినీటి పథకం పరిశీలిస్తున్న డీపీవో వెంకటేశ్వరరావు

విద్యార్థులకు నాణ్యమైన భోజనం

అద్దంకి, న్యూస్‌టుడే : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నామని పౌరసరఫరాల జిల్లా అధికారిణి పద్మశ్రీ అన్నారు. అద్దంకి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థంగా అమలుచేస్తోందన్నారు. ప్రస్తుతం ఎవ్వరూ ఇళ్ల నుంచి భోజనం తెచ్చుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఆడపిల్లలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యార్థినితో మాట్లాడుతున్న డీఎస్వో పద్మశ్రీ

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

అద్దంకి: 94409 15704,
దర్శి: 9848 671678
మేదరమెట్ల: 79933 00506

కురిచేడు, న్యూస్‌టుడే

?: కురిచేడు నుంచి గొల్లపాలెం, కాటంవారిపల్లె మీదుగా పేరంబొట్లపాలెం వెళ్లే మట్టిరోడ్డు నాలుగేళ్ల క్రితం తారురోడ్డు నిర్మాణంలో భాగంగా కంకర తోలి వదిలేశారు. అందులో ద్విచక్ర వాహనాలు కూరుకుపోయి ప్రయాణం కష్టసాధ్యంగా మారుతోంది. రహదారి నిర్మాణం చేపట్టి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాం. – సునీల్, కురిచేడు

✓: రహదారి నిర్మాణం టెండర్ ప్రక్రియలో ఉంది. ఆ ప్రక్రియ పూర్తికాగానే పనులు పూర్తిచేస్తాం. – శ్రీనివాసరెడ్డి, పంచాయతీరాజ్ శాఖ, కురిచేడు

ముండ్లమూరు, న్యూస్‌టుడే

?: ముండ్లమూరు నుంచి తమ్ములూరు వెళ్లే మార్గంలో చిలకలేరు వాగుపై ఉన్న చప్టా కొట్టుకుపోయింది. రాకపోకల సమయంలో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. చప్టాకు మరమ్మతులు చేపట్టాలి. – వెంకట్రావు, స్థానికుడు

✓: సమస్యను ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు మంజూరుకాగానే మరమ్మతులు చేయిస్తాం. – వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఏఈ, ముండ్లమూరు

అద్దంకి, న్యూస్‌టుడే:

?: నామ్ రహదారిపై సంజీవ్‌నగర్ నుంచి కాకానిపాలెం మలుపు వద్ద వేసిన తారు ప్యాచ్ లేచిపోయింది. దీంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. తక్షణం మరమ్మతులు చేయాలి. – రవి, అద్దంకి

✓: వెంటనే నామ్ రహదారి గుత్తేదారులతో మాట్లాడి మరమ్మతులు చేయిస్తాం. – జి లోకేశ్, ఏఈ, అద్దంకి పురపాలక సంఘం

తాళ్లూరు, న్యూస్‌టుడే :

?: మండలంలోని లక్కవరం సచివాలయం వద్ద మంచినీటి పథకం కుళాయి విరిగిపోయింది. దీంతో మంచినీరు సరఫరా జరుగుతున్న సమయంలో నీరంతా వృథాగా పోతోంది. సంబంధిత అధికారులు తక్షణం స్పందించి సమస్య పరిష్కరించాలి. – శ్రీను, స్థానికుడు

✓: వెంటనే కొత్త కుళాయిలు బిగించి సమస్య పరిష్కరిస్తాం. –వాలీ, ఏఈ, గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం, తాళ్లూరు

తాగునీరంతా రోడ్డు పాలు

కొరిశపాడు మండలం మేదరమెట్లలోని తమ్మవరం రోడ్డులో పైపు పగిలిపోవడంతో తాగునీరు వృథాగా పోతోంది. బుధవారం ఉదయం నుంచి నీరు వృథాగా పోతున్నా సంబంధిత అధికారులు ఎవరూ స్పందించలేదు. గ్రామంలో ప్రతి రోజు పైపులు పగిలి నీరు నేలపాలవుతోంది. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు శాశ్వత పరిష్కారం చూపించాలని గ్రామస్థులు కోరుతున్నారు. సమస్యపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కాలేషాని వివరణ కోరగా.. పైపు లీకులకు వెంటనే మరమ్మతులు చేయిస్తానని తెలిపారు. **మేదరమెట్ల, న్యూస్‌టుడే:**

కబ్జా చెర నుంచి భూమికి రక్షణ

ఈనాడు కథనానికి స్పందన

‘ఈనాడు’ కథనంతో ప్రభుత్వ భూమికి కబ్జా చెర నుంచి రక్షణ లభించింది. నామ్ రహదారి నుంచి కొంగపాడు వెళ్లే దారి మలుపు వద్ద స్థలాన్ని ఆక్రమించి సాగు చేపట్టారు. దీనిపై ‘ఈనాడు’లో ‘ప్రభుత్వ భూమిలో పంటల సాగు’ కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. ఈ స్థలాన్ని రెవెన్యూ పెట్రోలు బంకు కోసం కేటాయించినట్లు చెప్పారు. భవిష్యత్తులో ఎవరూ ఆక్రమించకుండా చుట్టూ ఇనుప తీగ ఏర్పాటుచేసి, ప్రభుత్వ భూమిగా బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు తహసీల్దార్ జీ శ్రీచరణ్ వెల్లడించారు. బుధవారం ఉదయం సదరు స్థలాన్ని వీఆర్‌వో సురేంద్ర పరిశీలించారు. **అద్దంకి, న్యూస్‌టుడే**

అధ్వానంగా తాళ్లూరు రహదారి

తాళ్లూరులోని స్థానిక రామాలయం వద్ద నుంచి శివాలయాల వరకూ ఉన్న ప్రధాన రహదారి అధ్వానంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తేలికపాటి వర్షం కురిస్తే రాకపోకలు సాగించడం కష్టసాధ్యమవుతోంది. తాళ్లూరు, మద్దిపాడు, చీమకుర్తి మండలాల్లోని పలు గ్రామాలవారు అద్దంకి, మేదరమెట్ల తదితర ప్రాంతాలకు ఈ మార్గంలో వెళుతుంటారు. ఉన్నతాధికారులు నిధులు మంజూరు చేసి సీసీ రహదారిగా మార్చాలని స్థానికులు కోరుతున్నారు. **తాళ్లూరు, న్యూస్‌టుడే**

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించం

మేదరమెట్ల, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు ఇండేల లక్ష్మీరెడ్డి హెచ్చరించారు. కొరిశపాడు మండలం మేదరమెట్ల, బొడ్డువానిపాలెం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మేదరమెట్లలోని బీసీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు పాలు, కోడిగుడ్లు సక్రమంగా అందకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ టీచర్‌ను ప్రశ్నించగా..ఆమె స్టాక్‌రాలేదు అనే సమాధానమివ్వడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బొడ్డువానిపాలెంలోని ఎంపీపీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఇందులో ఒక కేంద్రంలో 93 గుడ్లు అధికంగా ఉండగా, మరో కేంద్రంలో గత నెలకు సంబంధించిన గుడ్లు ఉండటంపై ఆరా తీశారు. ప్రభుత్వం పిల్లలు, బాలింతల సంక్షేమం కోసం భారీగా నిధులు వెచ్చిస్తుంటే..క్షేత్రస్థాయిలోని సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని హెచ్చరించారు. నిర్లక్ష్యానికి బాధ్యులైన అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అరుణాదేవి, టీచర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సీడీపీవో ఎలిజిబెత్ రాణిని ఆదేశించారు. మేదరమెట్లలోని రేషన్ దుకాణాన్ని తనిఖీ చేసి స్టాక్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో డీఎస్‌వో పద్మశ్రీ, పౌరసరఫరాల శాఖ అధికారి వరలక్ష్మి, సమగ్రశిక్ష జిల్లా బాలికా సంరక్షణ అధికారి హేమలత, ఫుడ్‌సేఫ్టీ అధికారి మహమ్మద్ షంషీర్‌ఖాన్ పాల్గొన్నారు.

మేదరమెట్ల అంగన్‌వాడీ కేంద్రంలో దస్త్రాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు లక్ష్మీరెడ్డి

అద్దంకిలో సాయి అఖండ దివ్యదర్శనం

అద్దంకి, న్యూస్‌టుడే : భగవాన్ సత్యసాయిబాబా అఖండజ్యోతి ప్రదర్శన అద్దంకి పట్టణంలో బుధవారం రాత్రి నిర్వహించారు. పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నుంచి భక్తులు నలు వీధుల్లో పాదయాత్రగా సాగారు. ప్రధాన రహదారి, గాంధీబొమ్మ కూడలి, తపాలా కార్యాలయం మీదుగా సత్య సాయిబాబా మందిరం వరకు ప్రదర్శన సాగింది. అడుగడుగునా భక్తులు వారులు పోసి పూజలు చేశారు. అద్దంకి సత్యసాయి సేవా కమిటీ కన్వీనర్ చిన్ని శ్రీహరిరావు నేతృత్వం వహించారు.

ఫిజియోబాల్‌తో చిన్నారులకు మేలు

బల్లికురవ, న్యూస్‌టుడే: ఫిజియోథెరపీ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని దివ్యాంగుల తల్లిదండ్రులను మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు కోరారు. బుధవారం స్థానిక భవిత కేంద్రంలో ఏర్పాటు చేసిన ఫిజియోథెరపీ క్యాంపునకు ఆయన హాజరై మాట్లాడారు. అద్దంకి మండలం బొమ్మనంపాడుకు చెందిన పాస్టర్ వినీల్‌కుమార్ ఏరోఫిట్ ఫిజియోథెరపీ బాల్‌ను భవిత కేంద్రానికి అందజేశారు. ఇలాంటి వాటితో చిన్నారులకు మేలు జరుగుతుందన్నారు. ఫిజియోథెరపీ డాక్టర్ ఇందిర, సిబ్బంది, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై పోస్టుకార్డు ఉద్యమం

అద్దంకి, న్యూస్‌టుడే : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. ఇందులో భాగంగా బుధవారం సాయంత్రం అద్దంకి ఉపతపాలా కార్యాలయం వద్ద కార్డులు పోస్టు చేశారు. పీఆర్‌సీ కమిషన్ ఛైర్మన్‌ను వెంటనే నియమించాలని, 29 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. అద్దంకి మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు బీవీ రత్నం, బీ పూర్ణచంద్రరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జగన్నాథం బాబూరావు తదితరులు మాట్లాడారు. 2004కు పూర్వం నియమితులైన ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్లులు చెల్లించాలన్నారు. సీఐటీయూ చేపట్టిన దేశవ్యాప్త సమ్మెకు సంఘీభావంగా అద్దంకి పట్టణంలో భవానీకూడలి నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించారు.

కార్డులు పోస్టు చేస్తున్న ఉపాధ్యాయులు

సక్రమంగా ఘన వ్యర్థాల నిర్వహణ

అద్దంకి, న్యూస్‌టుడే : అద్దంకి పురపాలకంలో ఘన వ్యర్థాల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని మేనేజరు బి.శ్రీదేవి అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా అద్దంకి మెప్మా రిసోర్సు పర్సన్లు, పారిశుద్ధ్య కార్యదర్శులతో ఒకరోజు శిక్షణ శిబిరం నిర్వహించారు. మెప్మా సీఎంఎం సత్యవతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ తరపున హాజరైన రిసోర్సు పర్సన్ హరీష్ మాట్లాడారు. మొత్తం 73 రకాల అంశాల గురించి సభ్యులకు వివరించారు. వ్యర్థాల నిర్వహణ సక్రమంగా ఉన్నపుడు మాత్రమే పట్టణంలో పరిస్థితి మెరుగుపడుతుందన్నారు. శిక్షణలో తెలుసుకున్న అంశాలను పొదుపు సంఘాల సమావేశంలో మిగిలిన సభ్యులకు వివరించాలని మెప్మా సీవో శ్రీలత తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాజీ హుస్సేన్, బలరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

20లోపు యూనిఫైడ్ సర్వే పూర్తి

దొనకొండ: దొనకొండ మండలంలో ఈ నెల 20వ తేదీలోపు యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే పూర్తి చేయాలని డిప్యూటీ ఎంపీడీవోలు రాధాకృష్ణమూర్తి, శ్రీనివాసరావు చెప్పారు. ఇండ్లచెరువు, మంగినపూడి, రుద్రసముద్రం గ్రామాల్లో సచివాలయం సిబ్బంది చేస్తున్న సర్వేను బుధవారం పరిశీలించారు.

తెదేపా నాయకుడి అంత్యక్రియలు

తాళ్లూరు: తాళ్లూరులో మృతి చెందిన మండల తెదేపా ప్రధాన నాయకుడు ఐ.శ్రీనివాసరెడ్డికి బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన మృతదేహాన్ని ట్రాక్టరుపై ఉంచి తాళ్లూరు వీధుల్లో ఊరేగించారు. దర్శి నియోజకవర్గ తెదేపా ప్రధాన నాయకులు కడియాల లలిత్‌సాగర్, ఎంపీపీ టి.శ్రీను, వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, మండల తెదేపా నాయకులు ఎం.వెంకటేశ్వరరెడ్డి, రమేష్, బడే, ఓబులరెడ్డితో పాటు స్థానికులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

లయన్స్ సభ్యుల చేయూత

కురిచేడు, న్యూస్‌టుడే: కురిచేడులోని బాలికోన్నత పాఠశాలకు స్థానిక లయన్స్ క్లబ్ సభ్యులు పెండేల ప్రసాదరావు, పోలేపల్లి లక్ష్మీనారాయణ రూ.10వేల విలువ చేసే భోజనం ప్లేట్లను బాలికలకు బుధవారం అందజేశారు. మధ్యాహ్న భోజనం చేయడానికి కంచాలు లేక వారు పడుతున్న ఇబ్బందులు గుర్తించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు దాతలు చెప్పారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ రీజినల్ ఛైర్మన్ రామారావు, అధ్యక్షులు ఇందూరి వెంకటనర్సిరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయం..

☛ శింగరకొండకు భారీగా ఆదాయం

శింగరకొండ(అద్దంకి), న్యూస్‌టుడే :

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామికి వేలంపాట ద్వారా భారీగా ఆదాయం సమకూరింది. మొత్తం పది రకాల హక్కులకు సంబంధించి బుధవారం ఆలయ పాలన భవనం వద్ద బహిరంగ వేలం నిర్వహించారు. ధరావత్తు చెల్లించిన పోటీదారులు వేలంలో పాల్గొన్నారు. తలనీలాల సేకరణ, బొమ్మల విక్రయం, పొంగలిశాల, క్యాంటీన్, ఫొటోలు తీసుకోవడం, పాదరక్షలు భద్రపరచడం, సోడా, ఐస్‌క్రీం విక్రయాలకు సంబంధించి వేలం నిర్వహించారు. అయితే కొబ్బరి కాయలు, పూజా ద్రవ్యాల విక్రయం, కొబ్బరిచిప్పల సేకరణకు సరైన ధర రాకపోవటంతో వాయిదా వేసినట్లు సహాయ కమిషనర్ ఎం.తిమ్మానాయుడు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు వేలం ప్రారంభించగా, రాత్రి ఎనిమిది గంటలకు కూడా పూర్తి కాలేదు. గతేడాది రూ.46,46,000 ఆదాయం సమకూరగా, ప్రస్తుతం రూ.68,43,500 వచ్చింది. గతంలో కంటే సుమారు రూ.21 లక్షలకు పైగా అదనపు ఆదాయం వచ్చినట్లు సహాయ కమిషనర్ తిమ్మానాయుడు తెలిపారు. పాలక మండలి ఛైర్మన్ చుండూరి మురళీసుధాకర్, ట్రస్టీలు పద్మజ, సుబ్బారావు, సురేష్ పాల్గొన్నారు.

భక్తులకు సిమెంటు బల్లల ఏర్పాటు

శింగరకొండకు వచ్చే భక్తుల సౌకర్యార్థం పది సిమెంటు బల్లలను పాలకమండలి ఛైర్మన్ చుండూరి మురళీ సుధాకర్ సమకూర్చారు. సుమారు రూ.35 వేల విలువైన బల్లలను భక్తులు కూర్చునేందుకు వీలైనచోట ఏర్పాటు చేశారు.

లింగ సమానత్వంపై అవగాహన

బల్లికురవ, న్యూస్‌టుడే: లింగ సమానత్వంపై అందరూ అవగాహన కలిగి ఉండాలని ఏపీఎం రాజారావు అన్నారు. బుధవారం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ‘సోషల్ జెండర్’ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ మహిళలు సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యల గురించి వివరించారు. తారతమ్యాలకు అతీతమైన సమాజాన్ని నిర్మించుకునేలా వారు ముందడుగు వేయాలని కోరారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రమాదేవి, సీసీలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల ఆకస్మిక తనిఖీ

అవీ.. ఇవీ.. అన్నీ..

తాళ్లూరు, న్యూస్‌టుడే : ప్రజలందరూ తప్పకుండా త్వరితగతిన ఇంటి పన్నులు చెల్లించాల్సిందేనని ఎంపీడీవో అజిత స్పష్టంచేశారు. మాధవరం, తూర్పుగంగవరం, రామభద్రాపురం సచివాలయాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పలువురు సిబ్బంది, ఆయా గ్రామాల నాయకులతో చర్చించారు. అక్షర-ఆంధ్ర కార్యక్రమం నిర్వహణ తీరు, యూఎఫ్ఎస్ సర్వే నిర్వహణ తీరుపై విచారించారు. తదుపరి స్థానికుల వద్దకు నేరుగా వెళ్లి ఇంటి పన్నులు వసూలు చేయించి రశీదును అందజేశారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

విశిష్ట సంఖ్యతో ప్రయోజనాలు

తాళ్లూరు: భూమి కలిగిన ప్రతి రైతూ తప్పకుండా విశిష్ట గుర్తింపు సంఖ్యను కలిగి ఉండాలని ఏవో బి.ప్రసాదరావు తెలిపారు. వారి పొలాలకు ఆధార్, చరవాణి వివరాలను నమోదు చేయించుకుంటే విశిష్ట సంఖ్య వస్తుందన్నారు. ఇంకా 1596 మంది రైతులు నమోదు చేయించలేదని, పెండింగులోనే ఉన్నాయన్నారు. బొద్దికూరపాడులో బుధవారం రైతులకు విశిష్ట సంఖ్యల నమోదుపై అవగాహనా సదస్సు నిర్వహించారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి పూజలు

తాళ్లూరు, న్యూస్‌టుడే : తూర్పుగంగవరంలో కొలువుదీరిన అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం వేకువజామున ఘనంగా అభిషేకాలు నిర్వహించారు. పూజారి బి.శ్రీను పంచామృతాలతో అభిషేకాలు చేసిన తదుపరి గోత్రనామాలతో అష్టోత్తర, సహస్ర నామార్చనలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు భజనలు చేశారు. తదుపరి భక్తులందరికీ తీర్థ, ప్రసాదాలు అందజేశారు. దీంతో ఆలయం వద్ద సందడి నెలకొంది.

(c) eenadu

ఒంగోలు

•ఒంగోలు •సంతనూతలపాడు

యాజమాన్య పద్ధతులతో నాణ్యమైన పొగాకు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: యాజమాన్య పద్ధతుల ద్వారా సుస్థిరమైన పొగాకు పంట దిగుబడులు సాధించాలని జీపీఐ సీనియర్ ఉపాధ్యక్షుడు డీఎస్. జితేంద్రకుమార్ సూచించారు. జీపీఐ ఆధ్వర్యంలో స్థానిక ఉత్తర బైపాస్‌లోని శ్రీ కన్వెన్షన్ హాలులో పొగాకు బోర్డు అధికారులు, ఉద్యోగులకు కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. . పంట సాగు సమయంలో పర్యావరణ, సామాజిక, పరిపాలన విధానాలు పాటించాలన్నారు.

సమ్మె జయప్రదానికి పిలుపు

ఒంగోలు కర్నూలురోడ్డు, న్యూస్‌టుడే: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని యూఎఫ్‌బీయూ కన్వీనర్ రాజీవ్ రతన్‌దేవ్ కోరారు. బుధవారం బ్యాంకుల ఆధ్వర్యంలో నగరంలోని నెల్లూరు బస్టాండ్ వద్ద గల యూబీఐ వద్ద ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన లేబర్ కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: మరమ్మతుల దృష్ట్యా ఒంగోలు నగర పరిధిలోని కోర్టు సెంటర్, శ్రీగిరి కొండ, ఆర్పీ రోడ్డు, జమ్మిచెట్టు బజారు, ట్రాఫిక్ పోలీసుస్టేషన్, గద్దలగుంట, లాయర్‌పేట, సాయిబాబా గుడి తదితర పరిసర ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ పాండురంగారావు తెలిపారు.

◗ కొత్తపట్నం: మండలంలోని మడనూరు, ఈతముక్కల, రాజుపాలెం, వజ్జిరెడ్డిపాలెం, గమళ్లపాలెం కొత్తపట్నం గ్రామాల్లో వ్యవసాయ విద్యుత్తు గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని, మడనూరు, తేటుపురం గ్రామ పరిధిలో ఆక్వా విద్యుత్తు సరఫరాకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అంతరాయం కలుగుతుందని ఏఈ చంద్రకాంత్ తెలిపారు.

పోతవరంలో రైతులతో మాట్లాడుతున్న జేసీ కల్పనా కుమారి

రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యతో పథకాల లబ్ధి

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: రైతులకు ప్రభుత్వం అందజేసే పథకాల లబ్ధి చేకూరాలంటే ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఐడీ తప్పనిసరిగా ఉండాలని జిల్లా సంయుక్త కలెక్టర్ కల్పనాకుమారి సూచించారు. మండలంలోని పోతవరంలో బుధవారం పొగాకు, మొక్కజొన్న పంటలను ఆమె పరిశీలించారు. రానున్న రోజుల్లో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, పంట నష్టపరిహారం, రాయితీపై వ్యవసాయ పరికరాలు, ఎరువుల పంపిణీ వంటివి అందాలంటే రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి అని వివరించారు. ప్రస్తుతం జరుగుతున్న ఈ-పంట నమోదు పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ప్రతి రైతు సాగు చేసిన పంటలను ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. పొగాకు సాగు ఖర్చులు, దిగుబడులు తదితర అంశాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, ఒంగోలు ఏడీఏ రమేష్ బాబు, ఏవో వెంకట్రావు, డీటీ శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

ఇంటి లెక్క.. ఇక పక్కా!

న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

నక్ష (నేషనల్ జియో స్పేషియల్ నాలెడ్జ్-బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హేబిటేషన్స్) కార్యక్రమం ద్వారా నగరంలో ఇంటింటికీ డోర్ నంబర్లు, పన్ను అసెస్‌మెంట్ నంబర్లు వేసే ప్రక్రియ చేపట్టారు. రాష్ట్రంలో ఏలూరు, కాకినాడ, మంగళగిరి, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు, తిరుపతి, అనంతపురం, కుప్పంలను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. కచ్చితమైన, తాజా పట్టణ భూ రికార్డులను నిర్ధారించుకోవడం, పౌరులను శక్తివంతం చేయడం, జీవన సౌలభ్యాన్ని మెరుగుపరచడం, పట్టణ ప్రణాళిక తయారీ దీని లక్ష్యం. ఇది డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ మోడరైజేషన్ (భూ రికార్డుల ఆధునికీకరణ) కోసం చేపట్టిన కార్యక్రమం. దీని ద్వారా ఒంగోలు నగరానికి రూ. 50 కోట్ల నిధులు (ఇన్సెంటివ్) కేటాయించారు. ఇంటింటా సర్వే పూర్తిచేసి లోకేషన్ల వారిగా మ్యాపులు రూపొందించే పనిలో సిబ్బంది ఉన్నారు. ముందుగా రూ. 30 కోట్లు, పూర్తి సమాచారం అప్‌లోడ్ అయ్యాక రూ. 20 కోట్లు విడుదల చేస్తారు.

నగరంలో ఇళ్లకు నంబర్లు వేస్తున్న సిబ్బంది

ఇవీ ప్రయోజనాలు..

నక్ష కార్యక్రమంలో ప్రతి ఇంటికీ డోర్ నంబర్లు వేయాలనేది ఒక అంశం. దీనికోసం రూ. 74 లక్షలు కార్పొరేషన్ నిధులు కేటాయించి గుత్తేదారుకు పని అప్పగించారు. ప్రతి ఇంటివద్ద డోర్ నంబర్, పన్ను అసెస్‌మెంట్ నంబరు పెయింట్‌తో రాస్తారు. ఒక్కో ఇంటికి రూ. 94 గుత్తేదారుకు చెల్లిస్తారు. ఇప్పటికీ 40 శాతం పూర్తయింది. నక్ష మార్గదర్శకాల ప్రకారం చేపట్టిన ఈ పనివల్ల ఇతర ప్రయోజనాలు కలగనున్నాయి. మొత్తం 66,397 గృహాలున్నాయి. 2014 ఎన్నికల సమయంలో కొత్త ఓటర్లను చేర్చేటప్పుడు డోర్ నంబర్లు సరిగా లేక సమీపంలో ఇతరుల డోర్ నంబర్లను అనుసరించి వేశారు. ఉదాహరణకు 22-3-16 అని ఉంటే 16(బి) అని వేసి కొత్త ఓట్లు నమోదు చేశారు. తరువాత జరిగిన ఎన్నికలలో ఓటర్ల జాబితా నవీకరణ సమస్యగా మారింది. ఒకే డోర్ నంబర్‌పై పదుల సంఖ్యలో ఓట్లు నమోదయ్యాయి. అంతేకాక పోస్టల్, గూగుల్ జీపీఎస్ ద్వారా చిరునామాలు తెలుసుకోవడం సమస్యగా మారింది. గతంలో కొత్త డోర్ నంబర్లు వేయాలని ప్రతిపాదించినా ఆచరణకు నోచుకోలేదు. ఇప్పుడు ఆ సమస్యలు తీరనున్నాయి. ప్రతి ఇంటికీ పది అంకెలతోకూడిన కొత్త నంబర్ వేస్తున్నారు. ఇంటి నంబరు, లొకాలిటీ, డివిజన్ నంబర్‌ను బట్టి తెలుసుకోవచ్చు. దీనివల్ల పన్నుల వసూలు, కొత్త పన్ను విధింపు, జనాభా సర్వే సులభతరం అవుతుందని అధికారులు చెబుతున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి

ఒంగోలు కర్నూలు రోడ్డు: ప్రస్తుత పరిస్థితిల్లో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని లీడ్ బ్యాంకు మేనేజర్ రమేష్ సూచించారు. ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా.. బుధవారం నగరంలో టీటీడీసీ సెంటర్‌లోని పలు కళాశాలల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి ఒక్క వ్యక్తి కూడా కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని, దగ్గరలో ఉన్న బ్యాంకుల్లో ఉచితంగా చేస్తారని చెప్పారు. రూడ్‌సెట్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యతతోనే అభ్యున్నతి

ఒంగోలు గ్రామీణం: మహిళల్లో అక్షరాస్యత శాతం పెంపు ద్వారా అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించవచ్చని డీఎల్‌డీవో సువార్త సూచించారు. ఒంగోలు మండలం యరజర్లలో నిర్వహిస్తున్న 'అక్షర ఆంధ్ర' కేంద్రాన్ని బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాల్లోని మహిళల్లో ఎక్కువ మంది నిరక్షరాస్యులుగా ఉండటం వల్ల పలు విధాలా ఆర్థిక మోసాలకు గురవుతున్నట్లు వివరించారు. కనీస చదువు ద్వారా ప్రతి ఒక్కరూ స్వయం ఉపాధి యూనిట్లు స్థాపించుకోవడంతో పాటు, ఆర్థికంగా ఎదిగేందుకు దోహదపడుతుందన్నారు.

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

సంతనూతలపాడు: పదో తరగతి విద్యార్థులు బాగా చదివి నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంపీడీవో సురేష్‌బాబు సూచించారు. బుధవారం మండలంలోని రుద్రవరం జడ్పీహెచ్‌ఎస్‌ను, సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సంపద కేంద్రాల్లో ఎరువులను తయారు చేయాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

నీటి వృథా.. ఆపకుంటే తప్పదు వ్యథ!

మద్దిపాడు మండలంలోని గుండ్లకమ్మ జలాశయం నుంచి గుండ్లపల్లి పంచాయతీ ప్రాంగణంలో ఉన్న ట్యాంకుల్లోకి పైపులైన్ ద్వారా నీరు వస్తుంది. బుధవారం ఉదయం పైపు లీకై నీరు సుమారు 30 అడుగుల ఎత్తుకు ఎగజిమ్మింది. సాయంత్రం వరకు నీటి లీకేజీని అధికారులు ఎవరూ పట్టించుకోక పోవడంతో గ్రామ పంచాయతీ కార్యాలయం మొత్తం బురదమయమైంది. త్వరగా పంచాయతీ అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాబును వివరణ కోరగా.. మూడో మోటారు ద్వారా నీటిని విడుదల చేశామని, దాని వల్ల ఒత్తిడితో పైపు లీకై ఉంటుందన్నారు. తక్షణమే నీటిని నిలుపుదల చేసి మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే,మద్దిపాడు

ఆసుపత్రి.. చెత్త కదలదేమిటి?

ఒంగోలు నగరంలోని ప్రభుత్వ మాత శిశు వైద్యశాల ముందు చెత్తను సకాలంలో తీసుకెళ్లడం లేదు. ఆసుపత్రిలో పోగైన చెత్త, శస్త్రచికిత్స వ్యర్థాలన్నింటినీ కవర్లలో కట్టి ఆసుపత్రి ముందున్న ఖాళీ స్థలంలోనే పడేస్తున్నారు. ఈ దారిలోనే నిత్యం పిల్లలు, బాలింతలు తిరుగుతుంటారు. దుర్వాసనతో అందరూ ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడకెళ్తే రోగాలు తగ్గాల్సింది పోయి.. తిరిగి వచ్చేలా ఉన్నాయని ఆందోళన చెందుతున్నారు. మరోవైపు విద్యుత్తు స్తంభం విరిగి తీగలు దారి పక్కనే పడిపోయినా మరమ్మతులు చేయడం లేదు. –ఈనాడు, ఒంగోలు

తుప్పు వదిలేనా.. రోడ్డెక్కేనా..!

ఈ చిత్రంలోని మద్దిపాడు మండల పరిషత్తు కార్యాలయం వద్దనున్న చెత్త సేకరణ వాహనాలు. గ్రామీణ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలనే ధ్యేయంతో 2018లో అప్పటి తెదేపా ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా చెత్త సేకరణకు ఈ-ఆటోలను సమకూర్చింది. అనంతరం 2019లో ప్రభుత్వం మారడంతో నిర్లక్ష్యానికి గురై ఇలా మూలకు చేరాయి. ఇన్నాళ్లకు మళ్లీ వాటిని బుధవారం ఎస్సీ కార్పొరేషన్ అధికారిణి కృష్ణవేణి తదితరులు పరిశీలించారు. వీటికి మరమ్మతులు చేసే వారితో ఫోన్‌లో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. ఉన్నతాధికారులతో చర్చించి త్వరలోనే వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో జ్యోతి తెలిపారు. ఇప్పటికైనా వీటిని రోడ్డెక్కించాలని ప్రజలు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, మద్దిపాడు

ఘంటసాలకు ఘన నివాళి

గాన గంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతిని అభయ కళారాధన సంస్థ ఆధ్వర్యంలో బుధవారం చీమకుర్తిలో నిర్వహించారు. స్థానిక పోలీసు ప్రాంగణం వద్ద ఉన్న ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. సంస్థ అధ్యక్షుడు మద్దాళి మాధవరావు, కె. శివయ్య, జి. కోటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులను సత్కరించారు. –న్యూస్‌టుడే, చీమకుర్తి

మహాశివరాత్రి ఏర్పాట్లపై సమన్వయ సమావేశం

చీమకుర్తి: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా దక్షిణ కాశీ రామతీర్థం క్షేత్రాన్ని సందర్శించే భక్తుల సౌకర్యార్థం తాగునీరు, వైద్య, పారిశుద్ధ్య సదుపాయాలు కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని తహసీల్దారు ఆర్.బ్రహ్మయ్య కోరారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుధవారం వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. సీఐ డి.ప్రసాద్, ఎంపీడీవో కె.రాఘవేంద్ర, దేవస్థానం ఈవో రజనీకుమారి, వైద్యులు అఫ్సర్, ఏఈ శాంతిప్రియ వివిధ సత్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో నాణ్యమైన ఆహారం అందించాలి

మోటుమాల కేజీబీవీలో ఆహారం పరిశీలిస్తున్న ఫుడ్ కమిషన్ సభ్యుడు లక్ష్మీరెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: బీసీ, సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు ఇండేల లక్ష్మీరెడ్డి సూచించారు. ఒంగోలు నగరంలోని బీసీ, సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాలను బుధవారం తనిఖీ చేశారు. ఆయన వెంట జిల్లా అధికారులు పాల్గొన్నారు.

❖ కొత్తపట్నం: సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో నాణ్యమైన ఆహారం అందించాలని ఫుడ్ కమిషన్ సభ్యుడు లక్ష్మీరెడ్డి సూచించారు. కొత్తపట్నంలోని బాలురు, బాలికల వసతి గృహాలు, మోటుమాల కేజీబీవీ హాస్టల్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు.

మరమ్మతులు మరిచారా..?

❖ కర్నూలు రోడ్డులో కుంగిన కల్వర్టులు
❖ ప్రమాదకరంగా వాహనాల రాకపోకలు

న్యూస్‌టుడే, సంతనూతలపాడు

ఒంగోలు-కర్నూలు రోడ్డు నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. చీమకుర్తి నుంచి పెద్ద ఎత్తున గ్రానైట్ లారీలతో పాటు, ఆర్టీసీ బస్సులు, ఆటోలు, టిప్పర్లు, లారీలు.. ఇలా వందలాది వాహనాల తిరుగుతుంటాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు సైతం రాకపోకలు సాగిస్తుంటారు. ఎంతో ప్రాముఖ్యత కలిగిన కర్నూల్ రోడ్డుపై ప్రమాదకరంగా మారిన కల్వర్టులను మాత్రం అలాగే వదిలేశారు. సంతనూతలపాడు మండల పరిధిలోని ఎండ్లూరుడొంక సమీపం, సంతనూతలపాడు గ్రామ దగ్గరిలో దెబ్బతిన్న రెండు కల్వర్టులను పట్టించుకున్న నాథులే లేరని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సంతనూతలపాడు సమీపంలో కల్వర్టుపై పడిన పెద్ద గుంత

❖ నెలలు గడుస్తున్నా అలాగే వదిలేశారు..

సంతనూతలపాడు సమీపంలో పెట్రోలు బంకు వద్ద కల్వర్టు ఉంది. ఆరు నెలల క్రితం దీని కింది భాగం కుంగి పెద్ద రంధ్రం ఏర్పడింది. ఏళ్ల క్రితం నిర్మించడంతో అది పూర్తిగా దెబ్బతింది. ప్రస్తుతం రంధ్రం పడిన ప్రదేశంలో ఇప్పటి వరకు అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అక్కడ ఒక వైపు మాత్రమే వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. అధికారులు కేవలం ప్రమాదాలు జరగకుండా సూచికగా బోర్డులు ఏర్పాటు చేసి మమా అనిపించారు. నెలలు గడుస్తున్నప్పటికీ కనీస మరమ్మతులు చేయలేదు. మరో వైపు కల్వర్టు మొత్తం పూర్తిగా మెతకిచ్చి ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అధికారులు మాత్రం అంచనాలు వేసి ప్రభుత్వానికి పంపించామని, నిధులు మంజూరు కాలేదని చెబుతున్నారు.

తూములు ఎన్నాళ్లుంటాయో..?

ఎండ్లూరుడొంక సమీపంలోని కల్వర్టు పూర్తిగా దెబ్బతింది. పక్కనున్న కళాశాల నుంచి మురుగునీరు రావడంతో వంతెనతో పాటు రోడ్డు సైతం పూర్తిగా దెబ్బతింది. ఆ సమయంలో తాత్కాలికంగా తూములు ఏర్పాటు చేసి పైన చీమకుర్తి నుంచి తెచ్చిన కంకర వేసి చేతులు దులుపుకొన్నారు. ఇక్కడ వంతెన నిర్మాణానికి రూ. 22 లక్షలతో ప్రతిపాదనలు పంపించామని అధికారులు తెలిపారు. తాత్కాలిక మరమ్మతులు చేపట్టి నెలలు గడుస్తున్నప్పటికీ పూర్తి స్థాయిలో పనులు చేపట్టలేదు. మరో వైపు తాత్కాలికంగా చేపట్టిన తూముల వద్ద కంకర పూర్తిగా పైకి లేస్తుంది. తూముల మధ్యలో రంధ్రాలు ఏర్పడుతున్నాయి. నిత్యం టన్నుల కొద్దీ బరువుతో భారీ లారీలు తిరిగే ఈ రోడ్డుపై తూములు ఎంత వరకు నిలుస్తాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. వీలైనంత త్వరగా శాశ్వత పరిష్కారం చూపాలని వాహన చోదకులు కోరుతున్నారు.

శ్మశాన వాటికకు స్థల పరిశీలన

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఒంగోలు నగర పరిధిలోని ముక్తినూతలపాడు గ్రామ రెవెన్యూ సర్వే నంబరు 15లో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని సంయుక్త కలెక్టర్ కల్పనా కుమారి బుధవారం పరిశీలించారు. ముస్లింల శ్మశాన వాటికకు కేటాయించే విషయమై ఆమె పరిశీలన చేశారు. అవసరమైన స్థల అన్వేషణ నిమిత్తం కలెక్టర్ ప్రత్యేక కమిటీని నియమించారు. ఈ క్రమంలో సదరు భూమిని కమిటీ సభ్యులు చూశారు. ఆర్డీవో లక్ష్మీప్రసన్న, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ పి. మధుసూదనరావు, మండల సర్వేయర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంటు పోయినది

చీదరబోయిన శ్రీను S/o వెంకటేశ్వర్లు, H.No: 4-55-1, దిన్నేపురం, గ్రామం చీమకుర్తి (మం) ప్రకాశం జిల్లాకు చెందిన డాక్యుమెంటు నెం: 2106/2018 చీమకుర్తి (మం), దిన్నేపురం గ్రామంలో మా ఇంటి దగ్గర నుంచి రుణం కోసం బ్యాంక్ దగ్గరికి మోటర్ సైకిల్ మీద వెళుతుండగా డాక్యుమెంట్ నెం: 2106/2018 పోయినది. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది ఫోన్ నంబరుకు తెలియజేయగలరు.

Cell: 90528 68595

బహిరంగ ప్రకటన

ఒంగోలు కాపురస్తులు షేక్ బుడేసాహెబ్ గారి కుమారుడు షేక్ ఖాదర్ భాషా, షేక్ దాదాసాహెబ్ గారి కుమారుడు షేక్ నజీర్ అహ్మద్ అనువారలు ఇచ్చిన సంజాయిషీ మేరకు ఈ బహిరంగ ప్రకటన ఇవ్వడమైనది.

పైన పేర్కొనబడిన మా క్లయింట్లు మరియు షేక్ గౌస్ భాషా, షేక్ కరీముల్లా, షేక్ రహంతుల్ల, షేక్ బదిరున్నీష, షేక్ ఫైజుల్లా అనువారలు కలసి ప్రకాశం జిల్లా, చీమకుర్తి (మం), మంచికలపాడు గ్రామంలో స.నెం. 277, 290, 291, 315, 320, 345 మరియు 347లో ఎ.76.29సెంట్లు భూమిని మూడు ప్రధాన సింగ్ కుటుంబముల వారి నుంచి పది (10) విక్రయ పత్రముల ద్వారా తేదీలు 20.01.89, 20.08.89, 24.01.89, 25.08.89, 21.06.93, 04.05.91, 31.01.89, 15.09.94(2)న కొనుగోలుచేసి స్వాధీనము పొందియున్నారు. పైన చెప్పిన కొనుగోలుదారులు అప్పటి నుండి షెడ్యూలు దాఖలా భూములకు పట్టాదారు పాసుపుస్తకములు పొంది స్వాధీనానుభవంలో ఉండియున్నారు.

ఇట్టి స్థితిలో అచ్చాల ఏసోబు, తండ్రి: చిన నాగయ్య మరియు కొంతమంది, మా క్లయింట్ల స్వాధీనానుభవమునకు అడ్డురాగా O.S 811/2005 నంబరున ఒంగోలు PJCJ కోర్టులో పర్మినెంట్ ఇంజక్షన్ కొరకు దావా చేసియున్నారు. ప్రస్తుతం సదరు భూములపై AS 86/2016న 1St ADJఒంగోలు వారి కోర్టు నందు అప్పీలు నిల్వలో ఉన్నది. షెడ్యూలు దాఖలా భూముల్లో మా క్లయింట్లకు తప్ప ఇతరులు ఎవరికీ ఎలాంటి హక్కులు లేవు. ఇట్టి స్థితిలో కొందరు వ్యక్తులు తప్పుడు పత్రములను, రెవిన్యూ రికార్డులను సృష్టించి షెడ్యూలు దాఖలా భూములను ఇతరులకు అమ్ముచూపుతున్నారని రూఢీగా తెలియవచ్చినది. ఆ విధంగా ఎవరైనా సదరు వ్యక్తుల ద్వారా విక్రయాలు పొందిన యెడల సదరు విక్రయాలు మా క్లయింట్ల హక్కులను బద్ధపరచజాలవని ఇందుమూలముగా ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

షెడ్యూలు: ప్రకాశం జిల్లా, చీమకుర్తి మండలం, చీమకుర్తి సబ్ రిజిస్ట్రేషన్ మంచికలపాడు గ్రామ సర్వే నెం.లు 315- ఎ.22.54 సెంట్లు. 320-ఎ.12.82సెంట్లు. 345-ఎ.5.09సెంట్లు. 347- ఎ.10.00సెంట్లు. 291/1 సి-ఎ.1.06సెంట్లు. 291/1 ఎ-ఎ.4.96సెంట్లు. 277/1-ఎ.6.29సెంట్లు 277/3-ఎ.4.66 సెంట్లు. 290/1-ఎ.4.61సెంట్లు. 290/3- ఎ.4.26సెంట్లు. మొత్తం: ఎ.76.29సెంట్లు విస్తీర్ణం.

స్థలం: ఒంగోలు తేదీ: 11-2-2026

ఇట్లు/- వై. రామకృష్ణ, సి.సుబ్బారావు
అడ్వకేట్స్, ఒంగోలు, ప్రకాశం జిల్లా.

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)

ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం : 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766
కొత్తపట్నం : 8464085451
ఎస్.ఎన్.పాడు: 8008552692

న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

?: ఒంగోలు నగరంలోని 9వ డివిజన్ వైఎస్ఆర్ కాలనీ ఎదుట రోడ్డులో డీఎం కన్వెన్షన్ ఎదురుగా వీధి దీపం వెలగడం లేదు. – సింగ్, స్థానికుడు

✓: విద్యుత్తు విభాగం సిబ్బందిని పంపించి లైటుకు మరమ్మతులు చేయిస్తాం. –ఏసయ్య, మున్సిపల్ ఇంజినీర్

?: 9వ డివిజన్ వైఎస్ఆర్ కాలనీ ఎదుట రోడ్డు చివర చెత్త పేరుకుపోయింది. కొన్ని రోజులుగా తీయడం లేదు. – స్థానికులు

✓: పారిశుద్ధ్య సిబ్బందిని పంపించించి వెంటనే అక్కడి చెత్తను తరలిస్తాం. – పిచ్చయ్య, శానిటరీ సూపర్‌వైజర్

స్థలం ఉంటే.. సొంతింటి కల నెరవేరినట్లే!

న్యూస్‌టుడే, ఒంగోలు కలెక్టరేట్

2029లోపు పేదల సొంతింటి కల నెరవేర్చాలన్న ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకెళ్తున్నాయి. అందులో భాగంగా ప్రధానమంత్రి గ్రామీణ్ ఆవాస్ యోజన కింద ఇళ్లు మంజూరు నిమిత్తం గృహ నిర్మాణశాఖ అధికారులు గతంలోనే సర్వే చేపట్టి లబ్ధిదారులను గుర్తించారు. అవగాహన లేక కొంత మంది వినియోగించుకోలేదు. దీన్ని గుర్తించిన అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లడంతో కేంద్రంతో మాట్లాడి మరో అవకాశం కల్పించారు. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన సర్వేలో ఒంగోలు, సంతనూతలపాడు నియోజకవర్గాల పరిధిలోని ఆరు మండలాల్లో నిర్వహించిన డిమాండ్ సర్వేలో 6,200 మంది అర్హులను గుర్తించారు.

ప్రత్యేక యాప్‌లో వివరాలు..

జిల్లా గృహనిర్మాణ శాఖ ఆధ్వర్యంలో 2024 నవంబర్ నుంచి 2025 జులై వరకు పీఎంఏవై-2.0 కింద ఇళ్లు మంజూరు నిమిత్తం క్షేత్రస్థాయిలో ఏఈ, డీఈ, సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులు సర్వే నిర్వహించి, వారి పూర్తి వివరాలను యాప్‌లో నమోదు చేశారు. అయినా సొంత నివాస స్థలం లేదా ఇంటి పట్టా కలిగి, ఇల్లు లేని పేదలు మిగిలి ఉండడంతో మరోసారి వారి పూర్తి వివరాలను సేకరించారు. పక్కాగృహానికి దరఖాస్తు చేసుకున్న మహిళలు ప్రస్తుతం ఉంటున్న నివాసం, కొత్తగా నిర్మించుకోనున్న స్థలం వద్ద ఉన్న ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేశారు. పీఎంఏవై అర్బన్-2.0 కింద పక్కాగృహం మంజూరైన లబ్ధిదారులకు రూ. 2.50 లక్షలు, పీఎంఏవై-2.0 గ్రామీణ ప్రాంతాల్లో రూ. 1.80 లక్షలు అందించనున్నారు. ఇటీవల నిర్వహించిన సర్వేలో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో ఉన్నవారికి సైతం యూనిట్ విలువ రూ. 2.50 లక్షలు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. దానికి అనుగుణంగా సర్వే యాప్‌లో నమోదు చేశారు. ఇప్పటికే అర్హులైన వారి నుంచి తెల్ల రేషన్ కార్డుతోపాటు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, భార్యాభర్తల ఆధార్ జిరాక్స్‌ను సేకరించారు. ఇక విడతల వారీగా లబ్ధిదారులకు పక్కాగృహాలు మంజూరు కానున్నాయి.

మండలాల వారీగా పక్కాగృహాల మంజూరు నిమిత్తం అర్హుల వివరాలు

మండలం	అర్హులు
ఒంగోలు	792
కొత్తపట్నం	1194
నాగులుప్పలపాడు	1029
చీమకుర్తి	898
మద్దిపాడు	880
సంతనూతలపాడు	1407

సందడిగా కళాశాల వార్షికోత్సవం

నాగులుప్పలపాడు: ఉప్పుగుండూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వారికోత్సవం ప్రిన్సిపల్ రంగనాయకులు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగింది. వక్తలు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల దాత అమరా కృష్ణమూర్తి కుమారుడు రాఘవేంద్రరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

శానిటేషన్ ప్యాడ్లు అందజేస్తున్న ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు

ఆరోగ్యంపై జాగ్రత్తలు తప్పనిసరి

సంతనూతలపాడు: విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని ఇన్నర్ వీల్ క్లబ్ ఛైర్‌పర్సన్ కె.స్వర్ణలత పేర్కొన్నారు. బుధవారం స్థానిక జడ్పీహెచ్ఎస్‌లో ఇన్నర్ వీల్ ఆఫ్ క్లబ్ ఒంగోలు ఆధ్వర్యంలో సేవా సంకల్ప ఛారిటబుల్ ట్రస్టు పర్యవేక్షణలో విద్యార్థులకు శానిటేషన్ ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థినులు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించుకోవాలని, తద్వారా క్యాన్సర్‌ను నివారించవచ్చని వివరించారు. అనంతరం పాఠశాలలో చదువుతున్న 162 మంది బాలికలకు ఏడు నెలలకు సరిపడా 11,340 శానిటేషన్ ప్యాడ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అసోసియేషన్ చార్టెడ్ ప్రెసిడెంట్ సునీత, కార్యదర్శి డాక్టర్ శరయు, బి.జయలక్ష్మి, నారాయణస్వామి చౌదరి, కంకణంపాటి వెంకటేశ్వర్లు, చంద్రావతి, కవిత, ధనలక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలు ప్రమోద తదితరులు పాల్గొన్నారు.

ONGOLE PUBLIC SCHOOL School Code AP032
(Affiliated to the Council for the Indian School Certificate Examinations, New Delhi)
Mangamoor Road, ONGOLE - 523 002, Phone: 08592-233284, 95814 11148
www.ongolepublicschool.com ★ Email: ops.ongole@gmail.com
GAUTHAMA EDUCATIONAL ACADEMY ONGOLE ESTD 1984

Admission Notification – 2026–27

Applications are invited for admission from Classes Nursery to Class X.

Renowned as one of the leading **ICSE** schools in India, our institution is committed to nurturing young minds through quality, value-based, and affordable education, delivered within a secure, inclusive, and child-centric learning environment.

Our Distinctive Features:

- A distinguished legacy of 42 years of academic excellence and educational leadership.
- An optimal student–teacher ratio.
- A team of highly qualified, experienced, and dedicated educators.
- International certification in Spoken English from Trinity College London.
- Laboratories and a well-resourced library to support academic enrichment.
- A rich and diverse range of co-curricular and extracurricular programmes.
- Air-conditioned classrooms from Nursery to Class II.
- Comprehensive student safety measures, with CCTV surveillance across the campus.

Admissions Open From 12 February 2026 LIMITED SEATS

TATA class edge Inspired Schooling · TRINITY COLLEGE LONDON

ops.ongole · ops.ongole · @opsongole · 95814 11148

School Office : 08592 233284, 95814 11148 between 9:00 a.m. and 4:30 p.m.

ఈనాడు
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం ఫిబ్రవరి 12, 2026

ధాన్యం సేకరణకు 161 కేంద్రాలు

సంగం, న్యూస్‌టుడే: జిల్లాలో రబీలో పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు 161 కేంద్రాలను అధికారులు ఖరారు చేశారు. జిల్లాలో 29 మండలాల పరిధిలో వరి సాగు జరుగుతుందని వ్యవసాయ శాఖ నివేదిక ఆధారంగా కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వెయ్యి టన్నుల లోపు ధాన్యం లక్ష్యత ఉండే రైతు సేవా కేంద్రాలను సి గ్రేడ్, వెయ్యి నుంచి రెండు వేల లోపు బి గ్రేడ్, రెండు వేల నుంచి పైబడి ఉండే కేంద్రాలను ఏ గ్రేడుగా నిర్ణయించారు.

సహకారశాఖకే అధికం..

161 కేంద్రాలను ఖరారు చేయగా వాటిలో 142 సహకారశాఖ పరిధిలో సహకార సంఘాల ద్వారా, ఏడు కేంద్రాలు మార్కెటింగ్ సొసైటీల పరిధిలో ఉంటాయి. తొలిసారిగా 12 రైతు ఉత్పత్తి సంఘాలకు ధాన్యం సేకరణ చేసే అవకాశం కల్పించారు. ఈ సంఘాలు జిల్లా పౌరసరఫరాల శాఖ పరిధిలో ఉంటాయి. ఈ మేరకు ఆయా కేంద్రాల పరిధిలో సిబ్బందికి జిల్లా స్థాయిలో శిక్షణ పూర్తయింది. మరోసారి మండల స్థాయిలో ఇవ్వనున్నట్లు సమాచారం.

నెలాఖరుకే.. ఈ నెలాఖరుకే కొన్ని ప్రాంతాల్లో వరి కోతలు జరిగే అవకాశం ఉండటంతో ఆయా ప్రాంతాల్లో కేంద్రాలు ప్రారంభించాలని, మార్చినెలకు జిల్లా వ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. ఈ విషయమై జిల్లా పౌరసరఫరాలశాఖాధికారి అర్జునరావు, జిల్లా సహకారశాఖాధికారి గుర్రప్పతో మాట్లాడగా రైతులకు ఇబ్బందులు లేకుండా కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

వేడుకగా ధ్వజారోహణం

నగరంలోని మూలాపేటలో కొలువైన శ్రీ భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ధ్వజారోహణం నిర్వహించారు. అనంతరం సింహ వాహనంపై ఆదిదంపతులు ఊరేగారు. నూతన కమిటీ సభ్యులతో ఈవో శ్రీనివాసులరెడ్డి, భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. స్థానికంగా ఉన్న శ్రీ అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వర స్వామి దేవస్థానంలో కూడా ధ్వజారోహణం జరిగింది. – న్యూస్‌టుడే, నెల్లూరు(సాంస్కృతికం)

పరిశ్రమిస్తే.. ఉపాధే

- జిల్లాలోని కొడవలూరు మండలం బొడ్డువారిపాలెం వద్ద ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేసి 8 ఏళ్లు గడిచింది. 217 ప్లాట్లలో ఇప్పటివరకు 162 ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కేటాయించారు. ఇక్కడ పట్టుమని పది పరిశ్రమలు కూడా ఏర్పాటు కాలేదు.
- ఇదే పరిస్థితి జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా, ఇండస్ట్రియల్ పార్కుల్లో నెలకొంది.

న్యూస్‌టుడే, నెల్లూరు(నవాబుపేట)

పారిశ్రామికంగా జిల్లాకు పేరుంది. సముద్రతీరం, రవాణా, నీటి వసతి ఉండటంతో 50వరకు మెగా, భారీ పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. నిరుద్యోగ సమస్యకు పరిష్కారంగా ఉపాధి అవకాశాలు పెంచుతూ నియోజకవర్గ పరిధిలో ఇండస్ట్రియల్ పార్కులను ఏర్పాటు చేయడం, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను తయారు చేయడం లక్ష్యంగా 2014-19 మధ్య అప్పటి తెదేపా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. భారీ పరిశ్రమల ఏర్పాటుకు ఏపీఐఐసీ ద్వారా భూసేకరణ చేస్తూనే నియోజకవర్గాల పరిధిలో ఎంఎస్ఎంఈ పార్కులను నెలకొల్పింది. జిల్లాలో 26 పార్కుల్లో 3,326.89 ఎకరాలు ఉన్నాయి. వీటిలో 1974 ప్లాట్లు ఉండగా.. 1562 కేటాయించారు.

బీవీపాలెం ఇండస్ట్రియల్ పార్కు

అరకొరగా పరిశ్రమలు

ఎంఎస్ఎంఈ, ఇండస్ట్రియల్ పార్కుల్లో ప్లాట్లు చాలా వరకు అమ్ముడుపోయాయి. ఆ స్థాయిలో పరిశ్రమలు ఏర్పాటు కాలేదు. ప్రభుత్వాల లక్ష్యం దానికి కొందరు ప్లాట్లు తీసుకుంటుండగా.. పరిశ్రమలు నెలకొల్పిన సమయానికి వాటిని ఏర్పాటు చేయలేకపోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు శిక్షణ ఇవ్వక, పరిశ్రమలు నెలకొల్పేందుకు బ్యాంకుల రుణాలు ఇవ్వక పోవడం వంటివి జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. పలుచోట్ల ఎంఎస్ఎంఈ పార్కుల్లో మౌలిక వసతుల కల్పన అంతంత మాత్రంగా ఉందని విమర్శలు వస్తున్నాయి. స్థలం తీసుకుని రెండేళ్లలో యూనిట్ నెలకొల్పకపోతే వాటిని తిరిగి ఏపీఐఐసీ స్వాధీనం చేసుకుంటుందని నిబంధనలు చెబుతున్నాయి.

ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం

ఇండస్ట్రియల్, ఎంఎస్ఎంఈ పార్కుల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్లాట్లు తీసుకుని యూనిట్ స్థాపించకుండా రెండేళ్లు గడిచిన వారికి నోటీసులు అందిస్తున్నాం. సరైన సమాధానం రాకపోతే ఆ స్థలాలను తిరిగి తీసుకుంటాం. ఇప్పటి వరకు 70 తిరిగి తీసుకున్నాం. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అందజేస్తాం. – శివకుమార్, జెడ్ఎం, ఏపీఐఐసీ

మారని తీరు.. పొడిగింపే పనితీరు

ఐదు సంవత్సరాల క్రితం వచ్చిన వరదలకు సోమశిల ప్రాజెక్టు దిగువ భాగంలో ఆప్రాన్ పూర్తిగా దెబ్బతినింది. మరమ్మతు పనులను గత ప్రభుత్వం పట్టించుకోలేదు. అనంతరం రూ.99 కోట్ల అంచనాలతో ఆమోదించి ప్రారంభించారు. రూ.22 కోట్లు ఖర్చు చేయగా.. బిల్లులు రాకపోవడంతో గుత్తేదారులు పనులను మధ్యలోనే వదిలేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పనులు ఆగస్టు వరకు పొడిగించినా పురోగతి లేదు. జలాశయం కింద పది లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. – ఈనాడు, నెల్లూరు, న్యూస్‌టుడే, అనంతసాగరం

మహా శివరాత్రికి భద్రతా ఏర్పాట్లు

నెల్లూరు (వేదాయపాలెం), న్యూస్‌టుడే: మహా శివరాత్రి సందర్భంగా జిల్లాలోని ప్రధాన ఆలయాలు, శైవక్షేత్రాల వద్ద పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేయాలని ఎస్పీ అజిత వేజెండ్ల పోలీసులను ఆదేశించారు. బుధవారం రాత్రి ఆమె జిల్లాలోని పోలీసు స్టేషన్ల సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆలయాల వద్ద కంట్రోల్ రూములు, క్యూఆర్టీ బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. సముద్ర, నదీ స్నానాల సందర్భంలో లైఫ్ జాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. కాన్ఫరెన్స్‌లో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, డీఎస్పీలు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

అక్రమ రవాణాకు కావలి

దాడులతో వెలుగులోకి.. మిల్లుల్లో నిల్వలు

ఈ చిత్రంలో కనిపించేవి కావలి పట్టణం మద్దూరుపాడు వద్ద ఇటీవల విజిలెన్స్ బృందం పట్టుకున్న రేషన్ బియ్యం. మిల్లులోని బంకర్లలో దాచి ఉండగా అధికారులు గుర్తించారు. అలాగే పట్టణంలోని పాతూరుతో పాటు జలదంకి మండలంలోని కొన్ని మిల్లుల్లో ఈ దందా సాగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

- ఇటీవల వెంకటాచలం వద్ద జాతీయ రహదారిపై విజిలెన్స్ అధికారులు రేషన్ బియ్యం పట్టుకోగా.. దీనికి బాధ్యులు ఎవరని డ్రైవర్‌ను అధికారులు అడిగితే.. కావలి నుంచి ఒకరు వస్తారని చెప్పడాన్ని బట్టి చూస్తే ఇవి అక్కడకు వెళుతున్నట్లు ఇట్టే తెలిసి పోతోంది.

న్యూస్‌టుడే, కావలి, నెల్లూరు(టౌన్)

కావలి రైస్‌మిల్లుల యజమానులు కొందరు బంకర్లు తయారు చేసుకున్నారు. రేషన్ బియ్యం మిల్లుకు తీసుకువచ్చి ఎవరికీ తెలియకుండా బంకర్లలో ఉంచుతున్నారు. యంత్ర పరికరాల ద్వారా వెలుపలకు తీసుకువచ్చి పాలిష్ చేసి తరలిస్తున్నారు.

మద్దూరుపాడు కేంద్రంగా..

మద్దూరుపాడు ప్రాంతంలో పలు రైస్‌మిల్లులున్నాయి. పౌరసరఫరాల స్టాక్‌పాయింట్ (ఎంఎల్ఎస్) ఇక్కడే ఉంది. అక్కడి నుంచి కొందరు రేషన్ డీలర్ల కోటాను స్టేజ్-2 రవాణా కాంట్రాక్టర్లతో నేరుగా ఇక్కడి కొన్ని మిల్లులకు తరలిస్తున్నట్లు విమర్శలు న్నాయి. రేషన్‌డీలర్లు ఎక్కువమంది బియ్యం లేకుండా నగదు అందజేయడానికి ఆసక్తి చూపుతున్నారు. పేదలు తమకు నగదు వద్దు, బియ్యమే కావాలని పట్టుబడుతున్నా వారు పట్టించుకోవడం లేదు. ఈ విషయమై గతంలో అడవి రాజుపాలెం, పాతూరు తదితర ప్రాంతాల్లో వివాదం తలెత్తింది.

అక్రమాలు సహించేది లేదు..

కొంతకాలంగా దాడులు ముమ్మరం చేస్తున్నాం. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గం. మిల్లుల్లో బంకర్లు చట్టబద్ధమా లేదా అనేది తెలియదు. అక్రమాలను సహించేది లేదు. – లీలారాణి, డీఎస్‌వో, నెల్లూరు

వారం రోజులుగా తనిఖీలు

రుద్రకోట, మద్దూరుపాడు ప్రాంతాల్లోని వివిధ రేషన్ దుకాణాల్లో ఇటీవల ఏఎస్‌వో ఐ. పుల్లయ్య, ఆత్మకూరు ప్రసాద్‌నాయుడు బృందం తనిఖీలు చేసింది. చాలాచోట్ల దుకాణాలు తనిఖీ చేస్తుండగానే రాజకీయ ఒత్తిళ్లు ఎదురవుతున్నట్లు సమాచారం. గతంలో తెదేపా ప్రభుత్వంలో రేషన్ స్మగ్లర్లపై పీడీ యాక్టు పెట్టేవారు. ప్రస్తుతం కూడా అలాగే చేయాలంటూ ప్రజలు కోరుతున్నారు.

జిల్లా పరిధిలో | రేషన్ దుకాణాలు-1513 | కార్డుల సంఖ్య- 7.62 లక్షలు | బియ్యం తీసుకుంటున్నవారు: 20,17,068 | ప్రతినెలా సరఫరా అవుతున్న బియ్యం: 11వేల మె.ట

పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్వో విజయకుమార్

ప్రశాంతంగా ఏపీపీఎస్సీ పరీక్షలు

నెల్లూరు (కలెక్టరేట్), న్యూస్‌టుడే: జిల్లాలో ఏపీపీఎస్సీ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. బుధవారం జిల్లా రెవెన్యూ అధికారి విజయకుమార్ పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు పరీక్షలు జరగ్గా.. పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

విమానాశ్రయ భూముల్లో డ్రోన్ సర్వే

దగదర్తి, న్యూస్‌టుడే: జిల్లాలోని దగదర్తి విమానాశ్రయ భూముల్లో ఎయిర్‌పోర్ట్ అథారిటీ బృందం బుధవారం ఓఎల్ఎస్ సర్వే నిర్వహించింది. డ్రోన్‌లతో భూముల్లోని వివిధ అంశాలను పరిశీలించారు. గత సంవత్సరం ఫిబ్రవరిలో ఎయిర్‌పోర్ట్ అథారిటీ బృందం విమానాశ్రయానికి కేటాయించిన భూములను పరిశీలించి.. అందులో మూడు ఇబ్బందికర అంశాలను గుర్తించింది. ఓఎల్ఎస్ (ఆబ్‌స్టికల్ లిమిటేషన్ సర్ఫేసెస్) సర్వే చేపట్టి పూర్తి నివేదికను అందిస్తామని పేర్కొన్నారు. వారి ఆదేశాలతో డ్రోన్ సర్వే చేపడుతున్నట్లు సమాచారం. విమానాశ్రయాలు, వాటి పరిసర ప్రాంతాలు విమాన కార్యకలాపాలకు సురక్షితమా! కాదా! అన్నది నిర్ధారించడానికి సర్వే కీలకం. వాటిలో గుర్తించిన అంశాలపై ఏం చర్యలు తీసుకోవాలో అధికారులు నిర్ణయిస్తారు. గతంలో వారు ప్రాథమికంగా మూడు అంశాలను గుర్తించారు. అందులో విమానాశ్రయానికి పడమర వైపున కొండ ప్రాంతం, ఉత్తరం వైపున ఉన్న చెరువు, భూముల్లోని డీఎం(దగదర్తి - ముంగమూరు) కాలువలు అడ్డంకిగా తేల్చారు. ప్రస్తుతం సర్వే చేస్తున్న బృందం ఆ అంశాలను గుర్తించి ఎయిర్ పోర్ట్ అథారిటీ అధికారులకు నివేదిక ఇస్తుంది. అనంతరం వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ రబియా, వీఆర్వో వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే చేస్తున్న సిబ్బంది

సేవా సైన్యం @ డిజిటల్ సోల్జర్స్

రెండులక్షల మంది విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షరీఫ్

న్యూస్‌టుడే, నెల్లూరు(వేదాయపాలెం)

ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉన్నతస్థానాల్లో ఉన్న కొందరు యువకులు పేద పిల్లలను ఆదుకునేందుకు ముందుకొచ్చారు. సాంకేతిక పరిజ్ఞానం ఉంటే భవిష్యత్తులో ఉన్నతస్థానాలు అధిరోహిస్తారన్న ఆలోచనతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం నేర్పిస్తున్నారు. పది సంవత్సరాలుగా సొంత నిధులతో కంప్యూటర్ గురించి వివరిస్తున్నారు. వీరి సేవలను గుర్తించిన విద్యాశాఖ అధికారులే ప్రతి పాఠశాలలో కంప్యూటర్ పరిజ్ఞానం నేర్పించాలని ఉత్తర్వులు కూడా జారీ చేశారు. ఒకరితో సేవలు ప్రారంభం కాగా.. నేడు 500 మంది సభ్యులుగా ఉన్నారు. 'డిజిటల్ సోల్జర్స్' పేరుతో వీరు సేవలు చేస్తున్నారు.

రెండు రాష్ట్రాల్లో..

నెల్లూరు నగరానికి చెందిన షేక్ ఖాజా మస్తాన్ షరీఫ్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. 2016లో ఆయన మదిలో వచ్చిన ఆలోచనే 'డిజిటల్ సోల్జర్స్'. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం తెలియకపోవడంతో షరీఫ్ ముందుకొచ్చారు. స్నేహితులతో ఆలోచనను పంచుకున్నారు. ఇలా రెండు రాష్ట్రాల్లో ఉన్న స్నేహితులంతా ఒక్కటయ్యారు. జీతంలో కొంత మేర సేవా కార్యక్రమాలకు ఖర్చు చేస్తూ ముందుకుసాగారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో డిజిటలైజేషన్‌పై ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటి వరకు వందకుపైగా పాఠశాలలు, 25 ఇంజినీరింగ్, 20 డిగ్రీ, ఎంబీఏ కళాశాలల్లో రెండు లక్షల మంది విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇచ్చారు.

కార్యక్రమాలు ఇలా..

కంప్యూటర్‌పైనే కాదు.. వ్యక్తిత్వ వికాసం, భావ వ్యక్తీకరణ నైపుణ్యం, అన్నదానం, రక్తదానం తదితర సేవా కార్యక్రమాలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. వీరి సేవలు గుర్తించి నాటి సీబీఐ జేడీ లక్ష్మీ నారాయణ పేద పిల్లల కోసం ప్రొజెక్టర్ బహూకరించారు.

ప్రతి విద్యార్థిని ప్రోత్సహించడమే మా అసోసియేషన్ లక్ష్యం

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం. మా అసోసియేషన్ ఆధ్వర్యంలో వీలైనంత వరకు అన్ని విద్యాసంస్థల్లో డిజిటలైజేషన్ చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాం. ప్రతి విద్యార్థిని ప్రోత్సహించాలన్నదే మా లక్ష్యం. –ఖాజా మస్తాన్ షరీఫ్, డిజిటల్ సోల్జర్స్ వ్యవస్థాపకుడు

స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాలపై పర్యవేక్షణ

41 మంది అధికారుల నియామకం

న్యూస్‌టుడే, నెల్లూరు(కలెక్టరేట్) : వైకాపా ప్రభుత్వంలో గ్రామ, వార్డు సచివాలయాలపై సరైన పర్యవేక్షణ లేని కారణంగా పలు సమస్యలు తలెత్తడంతో కూటమి ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. వాటిని స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాలుగా పేరు మార్చడంతో పాటు పర్యవేక్షణకు మూడంచెల వ్యవస్థను ప్రవేశపెట్టగా అమల్లోకి వచ్చింది. జిల్లా, మండల, పట్టణ స్థాయిలో ఈ కార్యాలయాల పర్యవేక్షణకు డిప్యుటేషన్లపై ఇతర ప్రభుత్వ శాఖల నుంచి 41 మంది అధికారులను నియమించింది. నెల్లూరు నగరపాలకసంస్థ, కావలి, ఆత్మకూరు, గూడూరు, బుచ్చిరెడ్డిపాలెం పట్టణాలతో పాటు 36 మండలాలకు అధికారులను నియమించి, వారికి సంబంధించిన విధులు, బాధ్యతలపై మార్గదర్శకాలు జారీ చేసింది.

జిల్లా స్థాయిలో విధులు

జిల్లాలోని స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాలను పర్యవేక్షిస్తూ.. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు బాధ్యత తీసుకోవాలి. ప్రజలకు నిర్దేశిత కాల వ్యవధిలో సేవలందేలా చూడాలి. కార్యాలయాలు తనిఖీ చేసి లోపాలు సరిదిద్దాల్సి ఉంది. హెచ్ఆర్ఎంఎస్ పోర్టల్‌లో ఉద్యోగుల బయోమెట్రిక్ నమోదు చేయాలి. ప్రజలకు అందించే సేవలపై వసూలు చేసే రుసుము అదే రోజు, తప్పనిసరి పరిస్థితుల్లో మరుసటి రోజు బ్యాంకు ఖాతాల్లో జమ చేయించాలి. ఉద్యోగులపై ఫిర్యాదులు, అక్రమాలపై విచారణ చేసి క్రమశిక్షణ చర్యలకు కలెక్టర్, రాష్ట్ర స్వర్ణ గ్రామ, వార్డు శాఖకు నివేదికలు పంపి, వారి నుంచి వచ్చే ఆదేశాలు అమలు చేయాలి.

మండల, పట్టణాల పరిధిలో..

మండల, పట్టణ స్థాయి పర్యవేక్షణ అధికారులు ఆయా కార్యాలయాల్లో మౌలిక వసతుల పరంగా ఉద్యోగులకు ఇబ్బంది లేకుండా చూడాలి. ఆధార్ కేంద్రాల పనితీరును పర్యవేక్షించాలి. ప్రతి ఆరు నెలలకు ఒక ఆధార్ కేంద్రాన్ని తనిఖీ చేయాలి. ప్రతి పౌరుడూ ఆధార్ నమోదు చేసుకునేలా చూడాలి. ఆధార్ ప్రత్యేక శిబిరాల నిర్వహణకు చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా అమలయ్యేలా చూడాల్సి ఉంది.

హజ్ యాత్రకు 163 మంది

నెల్లూరు (జీజీహెచ్), న్యూస్‌టుడే: హజ్ యాత్రికుల కోసం జిల్లా ప్రభుత్వాస్పత్రిలో బుధవారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. 41 మంది ప్రత్యేక కౌంటరులో వివిధ పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర హజ్ కమిటీ ఇన్‌స్పెక్టర్ ఇమ్రాన్ మాట్లాడుతూ జిల్లా నుంచి 163 మంది హజ్ యాత్రకు వెళ్లేందుకు పేర్లు నమోదు చేసుకుని పాస్‌పోర్టు పొందారన్నారు. రోజుకు 41 మంది చొప్పున పరీక్షించేందుకు నాలుగు రోజులపాటు వైద్యశిబిరం నిర్వహిస్తామని తెలిపారు.

వసతులున్నాయి.. రైళ్లు ఆగనంటున్నాయి

ప్రసన్నుడి బ్రహ్మోత్సవాలకు ఆపాలని వేడుకోలు

న్యూస్‌టుడే, బిట్రగుంట

కోట్ల రూపాయలు ఖర్చు చేసి శ్రీవెంకటేశ్వరపాళెం రైల్వేస్టేషన్‌కు భవనాలు నిర్మించారు. అంత వెచ్చించినా.. నాలుగేళ్లుగా రైళ్ల స్టాపింగ్ రద్దు చేయడంతో సామాన్య ప్రయాణికుల ఆశలపై నీళ్లు చల్లినట్లైంది. కనీసం మెము రైళ్లకు స్టాపింగ్ ఇస్తే సార్థకత ఉంటుంది. పది రోజుల్లో ప్రసన్నుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. అప్పటికైనా ఆగేలా చూడాలని భక్తులు కోరుతున్నారు. దీంతోపాటు అల్లూరు రోడ్డు, తలమంచి రైల్వేస్టేషన్లను కూడా అభివృద్ధి చేశారు. అక్కడా ఆగడం లేదు. మూడుచోట్ల కరోనా సమయం నుంచి రైళ్ల స్టాపింగ్ రద్దు చేశారు. ఆ తరువాత పునరుద్ధరించ లేదు.

శ్రీ వెంకటేశ్వరపాళెం రైల్వేస్టేషన్

నేతలు స్పందిస్తే..

కావలి, కోవూరు నియోజకవర్గ పరిధిలో శ్రీవెంకటేశ్వరపాళెం, అల్లూరు రోడ్డు, తలమంచి రైల్వేస్టేషన్లు ఉన్నాయి. ఈ ప్రాంతానికి చెందిన నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఉన్నారు. వీరు చొరవ చూపి స్టేషన్లలో రైళ్లు ఆగేలా చూడాలని సామాన్య ప్రయాణికులు, భక్తులు కోరుతున్నారు.

భక్తులకు కష్టాలు

ఎంతో ప్రసిద్ధిగాంచిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఉన్న కొండబిట్రగుంట పరిధిలో శ్రీవెంకటేశ్వరపాళెం రైల్వేస్టేషన్ ఉంది. ఇక్కడ ప్రతి శనివారం, బ్రహ్మోత్సవాల సమయాల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. రాష్ట్ర నలుమూలల నుంచి స్వామి దర్శనానికి వస్తుంటారు. వీరికి రైలు సౌకర్యం లేక వ్యయప్రయాసలకు గురవుతున్నారు. అల్లూరురోడ్డు, తలమంచి రైల్వేస్టేషన్ల పరిసరాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్నాయి. గ్రామాల్లో జనాభా శాతం పెరిగింది. సరిపడా బస్సులు లేక ప్రమాదకరంగా ఆటోల్లో ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక్కడ మెము రైళ్లకు స్టాపింగ్ ఏర్పాటు చేస్తే సామాన్య ప్రయాణికులకు ప్రయోజనం చేకూరుతుంది.

ఈ పంట నమోదులో తప్పులా? సరిచేసుకోండిలా..

ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఉత్పత్తులు విక్రయించాలన్నా.. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోతే పరిహారం పొందాలన్నా.. ప్రభుత్వ పథకాలు, రాయితీలు తీసుకోవాలన్నా.. ఈ-పంట నమోదు తప్పనిసరి. రబీ సీజన్‌కు సంబంధించి పంటల నమోదు ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది. ఈ నెల 10వ తేదీ నాటికి జిల్లాలో 90,139 మంది రైతులకు సంబంధించి 2.66 లక్షల ఎకరాల పంటల వివరాలు ఈ-పంటలో నమోదు చేశారు. ఈ నెల 20వ తేదీ నమోదుకు చివరి గడువు. పొరపాటుగా లేక వ్యవసాయశాఖ అధికారుల అలసత్వం వల్ల రైతుకు సంబంధించి సాగు వివరాలు ఈ క్రాప్ నమోదులో తప్పులు దొర్లితే.. అధికారులు సవరించే వరకు వేచి చూడకుండా.. రైతులే నేరుగా సరిదిద్దుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. ఈ పంట నమోదులో ఏమైనా తప్పులుంటే www.karshak.ap.gov.in, www.agriculture.ap.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి సరిచేసుకోవచ్చు. – న్యూస్‌టుడే, నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట)

ప్రతి పంచాయతీలో పది పనులు

ఉపాధి పథకంలో మార్పులు

న్యూస్‌టుడే, దుత్తలూరు

కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో ఉపాధి హామీ పథకంలో మార్పులు చోటుచేసుకున్నాయి గ్రామాల్లో చేపట్టిన పనులు పెండింగ్‌లో లేకుండా పూర్తయ్యేలా.. వేతనదారులకు ఎక్కువ పనిదినాలతో ఉపాధి లభించేలా రాష్ట్ర ప్రభుత్వం గత నెల 29న స్టాండర్డ్ ఆపరేషన్ గైడ్‌లైన్స్ జారీ చేసింది. దీని ప్రకారం ఒక్కో పంచాయతీకి తొలుత పది పనుల వంతున మంజూరు చేస్తారు. ఒకటి పూర్తయిన తరువాత మరొకటి చేపట్టాలి. 2014 నుంచి ఇప్పటివరకు మంజూరై, పెండింగ్‌లో ఉన్న పనులను ఈ ఏడాది మార్చి 31 నాటికి పూర్తి చేయాలని నిర్దేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపై చేపట్టిన పనుల్ని అదే ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా పూర్తి చేయాల్సి ఉంది. ప్రతి పంచాయతీలో గ్రామసభల ద్వారా 20 నుంచి 25 పనులకు అనుమతులు తీసుకోవడం... వాటిలో సగమే చేపట్టడం, నిధులు మురిగిపోవడం ఇప్పటివరకు పథకంలో జరుగుతోంది. అత్యవసరంగా ఎక్కడైనా కొత్త పనులు చేపట్టాలంటే జిల్లా ప్రోగ్రాం అధికారి(డీపీసీ)గా ఉండే కలెక్టర్ మంజూరు చేసేవారు. కొత్త జీవో ప్రకారం ఈ అధికారాన్ని వినియోగించకుండా లాగిన్‌ను నిలిపివేస్తున్నట్లు తెలుస్తోంది.

మార్చి 31లోగా పూర్తి

కాలనీల నిర్మాణానికి ఉపాధి హామీ పథకంలో నిధులు మంజూరైతే 90 రోజుల్లో ఖర్చు చేయాలి. పండ్ల తోటల పెంపకంలో మూడేళ్ల నిర్వహణకు అనుమతి ఉంది. రహదారులు, భవనాల నిర్మాణాలకు కాలపరిమితి ఉంటుంది. పథకంలో ఇప్పటివరకు ఉన్న నిబంధనల మేరకు ఒక ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులు తరువాత ఏడాదిలోనూ కొనసాగించే అవకాశం ఉండటంతో జిల్లాలో వందల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటన్నింటినీ ఈ ఏడాది మార్చి 31 లోగా పూర్తి చేయాలని నిర్దేశించారు.

పైన కొరత.. పట్టాలపై కలత

15 ఏళ్లుగా పైవంతెన పనులు

న్యూస్‌టుడే, గూడూరు పట్టణం

గూడూరు ఒకటి, రెండు పట్టణాలు కలుపుతూ ప్రజల రాకపోకలకు వీలుగా చేపట్టిన ఫ్లైఓవర్ నత్తతో పోటీ పడుతోంది. ఒకటో పట్టణం నుంచి రెండో పట్టణం.. అక్కడి నుంచి ఒకటో పట్టణానికి వెళ్లాలంటే రెండు మార్గాలు ఉన్నాయి. ఒకటి ప్రధాన రహదారిని చుట్టుకొని జీఎస్ రాయల్ సినిమాహాల్ ప్రాంతంలోని అండర్‌బ్రిడ్జి ద్వారా వెళ్లడం. మరొకటి రైలు పట్టాలు దాటుకొని పోవడం. పట్టాల మీదుగా వెళితే త్వరగా పట్టణంలోకి చేరవచ్చు. ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తి కాకపోవడంతో వాహనదారులు, పాదచారులు రైల్వేగేటు ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. నిత్యం తిరుపతి, చెన్నై వైపు రైళ్ల రాకపోకలు సాగిస్తుండడం. రైలు గేటును మూసివేయడంతో వాహనదారుల సమయమంతా వృథా అవుతోంది. ప్రమాదమని తెలిసినా పాదచారులు రైలు పట్టాల మీదుగా, ఆగివున్న గూడ్స్ రైళ్ల కింద దూరి అవతలకు వెళుతున్నారు.

పని పేరు:	గూడూరు ఫ్లైఓవర్
ప్రారంభం:	2011
అంచనా వ్యయం:	రూ.39కోట్లు
2018లో పెంచిన వ్యయం:	రూ.63.50 కోట్లు

అసంపూర్తిగా ఫ్లైఓవర్

బిల్లులు రాక..

గూడూరు ఫ్లైఓవరు నిర్మాణాన్ని 15 ఏళ్ల కిందట ప్రారంభించారు. అంచనా వ్యయం పెరగడంతో తెదేపా ప్రభుత్వం 2018లో ఆ మొత్తాన్ని పెంచుతూ నిధులు మంజూరు చేసింది. ఒకటో పట్టణంలోని ఎస్ఎంజీ పాఠశాల నుంచి ప్రారంభమై రెండో పట్టణంలోని సిరామిక్ కళాశాల వద్దకు ఒకటి, అడివయ్యకాలనీ ప్రాంతం వైపు మరో వంతెనను నిర్మించాల్సి ఉంది. అధికారులు, పాలకులు సమన్వయ లోపంతో ఆ పనులు పూర్తి కాలేదు. మొదట్లో స్థల, నిధుల సమస్య నెలకొనగా. ఆ తరువాత వాటిని పరిష్కరించారు. ప్రస్తుతం బిల్లులు రాక గుత్తేదారు పనులు ఆపినట్లు తెలిసింది. నిర్మాణం అసంపూర్తిగా వదిలేయడంతో పట్టణ ప్రజల చిరకాల కోరిక కలగానే మిగిలింది.

ప్రారంభించేలా చర్యలు

ఫ్లైఓవర్ నిర్మాణ పనులు రైల్వేశాఖ ద్వారా పూర్తి చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. త్వరలోనే ప్రారంభించి పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటాం. – రామాంజనేయులు, ఈఈ, ర.భ శాఖ, గూడూరు

(c) eenadu

అయిదేళ్లుగా పునాదులకే పరిమితం

పొదలకూరు మండలం మర్రిపల్లి ప్రాథమిక పాఠశాలకు నిర్మించిన అదనపు గది అయిదేళ్లుగా పునాదుల దశలోనే నిలిచిపోయింది. పిల్లర్ల కోసం ఏర్పాటు చేసిన కమ్ములు తుప్పుపట్టిపోతున్నాయి. సుమారు 25 మంది విద్యార్థులు ఇరుకు గదుల్లో అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి భవనాన్ని నిర్మించాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విన్నవిస్తున్నారు.
– న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్

సిబ్బంది లేక గంటల తరబడి నిరీక్షణ

కోవూరు పట్టణ పరిధిలోని పలు సచివాలయాల్లో సిబ్బంది లేక వివిధ పనుల నిమిత్తం వచ్చిన వారు గంటల సేపు నిరీక్షించి వెళ్లిపోతున్నారు. పెళ్లకూరు కాలనీ, శాంతినగర్, కోనేటి కయ్యలు, పడుగుపాడు ప్రాంతాల్లో గ్రామ సచివాలయాలు ఉన్నాయి. వివిధ పథకాలకు సంబంధించి దరఖాస్తులు, ధ్రువపత్రాల కోసం ఎక్కువ మంది కార్యాలయాలకు వస్తున్నారు. ఏకీకృత కుటుంబ సర్వేలో భాగంగా సిబ్బంది బయటకు వెళ్లారని అధికారులు చెబుతున్నారు. పర్యవేక్షణ అధికారులు స్పందించి సిబ్బంది ఉండేలా చూడాలని పలువురు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కోవూరు

రూ. కోట్ల స్థలం కాజేసేందుకు యత్నం

ఇందుకూరుపేట మండలం మైపాడు ప్రధాన రహదారిలో ఉన్న చేనేత భవనం ఆక్రమణలకు గురవుతోంది. రూ.కోట్లు విలువ చేసే స్థలంపై కన్నేసిన కబ్జాదారులు అక్కడే నివాసముంటున్నారు. మూడు దశాబ్దాల క్రితం గ్రామంలో వందలాది చేనేత కార్మికులు మగ్గాలు ఏర్పాటు చేసుకుని జీవనం పొందారు. కాలక్రమంలో అక్కడ ఎలాంటి కార్యకలాపాలు జరగడం లేదు. ప్రస్తుతం అక్కడ ఉన్న 414 అంకణాల స్థలం రూ.1.50 కోట్ల వరకు ఉంటుందని, సంబంధిత అధికారులు స్పందించి అక్రమార్కుల చెర నుంచి కాపాడాలని విన్నవిస్తున్నారు. – న్యూస్‌టుడే, ఇందుకూరుపేట

వందేమాతరం స్ఫూర్తి బెంగాల్ నుంచి బిట్రగుంటకి

జాతీయ గేయం వందేమాతరం.. 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పశ్చిమ బెంగాల్‌లో సీఐఎస్ఎఫ్ (సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్)బృందం చేపట్టిన 'సైక్లాథాన్ 2026 (సైకిల్ యాత్ర) బుధవారం బిట్రగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చేరుకుంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, స్థానిక విశ్రాంత సీఐఎస్ఎఫ్ ఉద్యోగులు, విద్యార్థులు వారికి ఘన స్వాగతం పలికారు. వందేమాతరం స్ఫూర్తితో భారతదేశ తీరప్రాంత రక్షణ, నిఘాపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కేరళలోని కొచ్చిన్ వరకు ఈ యాత్ర కొనసాగుతుందని బృందసభ్యులు తెలిపారు. – న్యూస్‌టుడే, బిట్రగుంట

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

చిత్తశుద్ధితో విధులు నిర్వహించండి

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: అధికారులు అప్పగించిన విధులను చిత్తశుద్ధితో నిర్వహించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి జేసీ వెంకటేశ్వర్లుతో కలిసి మండల స్థాయి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎస్సెస్సీ 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక, దీర్ఘకాలంగా గైర్హాజరైన వారికి రెసిడెన్షియల్ ఖాళీలు, పాఠశాలల్లో సివిల్ పనుల స్థితి, యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే, అక్షరాంధ్ర, ఒక నెల- ఒక గ్రామం - నాలుగు సందర్శనలు, ఇన్‌యాక్టివ్‌గా ఉన్న ప్రభుత్వ ఖాతాలను వాడుకలోకి తీసుకురావడం, ఈ-పంట నమోదు, ఉద్యమ్ పోర్టల్ నమోదు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలన్నారు. శివరాత్రి పండగను పురస్కరించుకుని దేవాలయాలకు వచ్చే భక్తులకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని ఈ-పంట నమోదు వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. కాన్ఫరెన్స్‌లో డీఆర్వో విజయకుమార్, జిల్లా అధికారులు, ఆర్డీవోలు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

అడ్డంగా దూసుకొస్తూ.. ప్రాణాలు వదులుతూ..!

కూడళ్ల వద్ద ప్రమాదాలు జరుగుతున్నా స్పందించని అధికారులు

జిల్లాలో జాతీయ రహదారులపై కూడళ్ల వద్ద ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి.. వేగంగా వస్తున్న వాహనాలకు అడ్డుగా వెళ్లడంతో నియంత్రించలేక ఢీకొడుతున్నారు.. చెన్నై-కోల్‌కత, నెల్లూరు-ముంబయి జాతీయ రహదారులపై వందలాది మంది ప్రాణాలు కోల్పోతుండగా... వేలాది మంది క్షతగాత్రులవుతున్నారు. చాలా చోట్ల సర్వీసు రోడ్లు లేక అడ్డంగా రావడంతో వాహనాలు ఢీకొంటున్నాయి. ఏదైనా జరిగితే హడావుడి చేస్తున్న అధికారులు తరువాత మిన్నకుండిపోతున్నారు. ఇప్పటికైనా పోలీసులు, ఎన్‌హెచ్ అధికారులు, రవాణా శాఖ సంయుక్తంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లాలో ప్రమాదకరంగా ఉన్న కూడళ్లపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

– న్యూస్‌టుడే, గూడూరు పట్టణం, పొదలకూరు చిల్లకూరు, కోట, కోవూరు, రాపూరు

పోటుపాలెం జంక్షన్‌లో ఇష్టారాజ్యంగా

గూడూరు సమీపంలోని పోటుపాలెం జంక్షన్ వద్ద ఇలా..

గూడూరు సమీపంలోని జాతీయ రహదారి పోటుపాలెం జంక్షన్ ప్రమాదాలు నిలయంగా మారింది. నెల్లూరు నుంచి తిరుపతి, చెన్నై వెళ్లే వాహనాలు, చెన్నై, తిరుపతి నుంచి నెల్లూరు వైపు వచ్చే వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటుంది. వాహనాల రాకపోకల సమయంలో పట్టణంలోకి వచ్చే వారు జాతీయ రహదారిపై వెళ్లే వాహనాలను గమనించడం లేదు. ఏడాది 20 నుంచి 30కి పైగా ప్రమాదాలు జరుగుతున్నాయి. చిల్లకూరు మండల పరిధిలో పోలీసుస్టేషన్, వరగలి అడ్డరోడ్డు, కోట అడ్డరోడ్డు కూడలి, పట్టుకుంట తదితర ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించారు. గతేడాది 11 ప్రమాదాలు జరిగాయి.

వేగంగా వస్తూ.. నియంత్రించలేక..

కోవూరు మండలం ఇనమడుగు కూడలి చెన్నై-కోల్‌కత జాతీయ రహదారి, సాలుచింతల వద్ద ముంబయి రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. జీవీఎల్ టిప్పర్లు, ద్విచక్ర వాహనాలను ఢీకొట్టడంతో ద్విచక్రవాహనదారులు పలువురు మృతిచెందారు. కొడవలూరు మండలం చంద్రశేఖరపురం నుంచి రామన్నపాళెం మధ్యలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి.

పడుగుపాడు వద్ద ఇనమడుగు కూడలి

క్రాసింగ్ మూసివేసి.. మళ్లీ తీయడంతో..

సర్వేపల్లి నియోజకవర్గం వెంకటాచలం కూడలి, చెముడుగుంట వద్ద సర్వీసురోడ్డు లేక వాహనాలు ఒకదానికొకటి ఢీకొని మృత్యువాత పడుతున్నారు. పొదలకూరు మండలం మరుపూరు మలుపు వద్ద ఎక్కువమంది ప్రాణాలు కోల్పోయారు. నెల్లూరు రూరల్ పరిధిలో బుజబుజనెల్లూరు పెట్రోలు బంకు ఎదురుగా కూడలి ప్రమాదకరంగా ఉంది. గతంలో బ్లాక్‌స్పాట్‌గా గుర్తించి.. రెండేళ్ల క్రితం తీసేయడంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ● వెంకటగిరి నియోజకవర్గంలోని రాపూరు ఎర్రచెరువు, గుండవోలు మలుపు, ఆకిలివలస, సిద్ధవరం, ఏపూరు, గోనుపల్లి వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. గుండవోలు మలుపు అత్యంత ప్రమాదకరంగా ఉంది. రాపూరు- సైదాపురం వరకు రోడ్డు అధ్వానంగా ఉండడంతో వాహనదారులు అదుపుతప్పి పడిపోతున్నారు.

స్థిరాస్తి క్షేత్రంలో రేషన్ బియ్యం పట్టుకున్న అధికారులు

కావలి, న్యూస్‌టుడే: ఆముదాలదిన్నెలో ఓ వైకాపా నాయకుడికి చెందిన లేఅవుట్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని బుధవారం పౌరసరఫరాలశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల మేరకు.. ఆముదాలదిన్నెకు చెందిన మణ్యం వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు 54.9 క్వింటాళ్ల బియ్యాన్ని 81 బస్తాల్లో ఓ వైకాపా నాయకుడికి చెందిన స్థిరాస్తి క్షేత్రంలో నిల్వ ఉంచారు. కాగా సమాచారం అందుకున్న అధికారులు దాడులు చేసి బియ్యాన్ని సీజ్ చేశారు. అనంతరం కావలి ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు. వీటి విలువ రూ.2.66లక్షలు ఉంటుందని తెలిపారు. నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. దాడుల్లో తహసీల్దార్ కృష్ణప్రసాద్, డీటీ విజయ, ఎస్సైలు పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడ్డ రేషన్ బియ్యంతో నిందితుడు

ఉపాధ్యాయులు మందలించారని విద్యార్థి ఆత్మహత్య

తోటపల్లిగూడూరు: పాఠశాలలో ఉపాధ్యాయులు మందలించారని మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తోటపల్లిగూడూరు మండలంలో బుధవారం జరిగింది. పేడూరుకు చెందిన పదహారేళ్ల విద్యార్థి ఇందుకూరుపేట మండలంలోని ఓ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. నగదు చోరీ విషయంలో ఉపాధ్యాయులు మందలించడంతో మనస్తాపానికి గురై ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వీరేంద్రబాబు తెలిపారు.

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాము ధర: (3 శాతం జీఎస్టీ కలిపిన ధర)	రూ.14,909
సవర ధర:	రూ.1,19,272
వెండి గ్రాము:	రూ.278.70

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	118
లేయర్	90
బ్రాయిలర్స్	214
బ్రాయిలర్ స్కిన్‌లెస్	238
లేయర్ మాంసం	153

న్యాయం చేయాలంటూ బాధితుల ఆందోళన

మనుబోలు, న్యూస్‌టుడే: నా భర్త మృతికి కారణమైన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, అక్కంపేట మాజీ సర్పంచి కిరణ్‌కుమార్‌రెడ్డిని అరెస్టు చేయాలని బాధితురాలు మల్లీశ్వరి డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని బండేపల్లి రోడ్డు వద్ద టెంట్ ఏర్పాటుచేసి పిల్లలు, బంధువులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఆమె మాట్లాడుతూ.. కోట గ్రామానికి చెందిన నా భర్త ఆవుల ముత్యాలయ్య(40) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. బండేపల్లిలోని బంధువుల ఇంటికి రాగా 2023 మే 29న రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారన్నారు. కిరణ్‌కుమార్‌రెడ్డి కారుతో ఢీకొనడంతోనే నా భర్త మృతిచెందారని, ఇందుకు కారణమైన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తామంతా అనాథలయ్యామని, తమకు న్యాయం చేయాలని కోరారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వారితో మాట్లాడి సర్దిచెప్పి పంపారు

సాగర మిత్రలను కొనసాగించండి: ఎంపీ

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: జిల్లాలో మత్స్య శాఖ ఆధ్వర్యంలో పని చేస్తున్న సాగర మిత్రలను కొనసాగించాలని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్ర మత్స్య శాఖ మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్‌కు విజ్ఞప్తి చేశారు. బుధవారం దిల్లీలోని ఆయన కార్యాలయంలో కలిసి రాష్ట్ర సాగర మిత్ర ఎంప్లాయిస్ యూనియన్ తరపున వినతి పత్రం అందించారు. వీరి సేవలు మార్చి 31వ తేదీతో ముగియనున్నాయని, రెండు నెలల ముందే నోటీసు కూడా జారీ చేశారన్నారు. వారిని అకస్మాత్తుగా నిలిపివేయడంతో పీఎంఎంఎస్‌వై కింద సాధించిన ప్రగతిపై ప్రతికూల ప్రభావం పడే వీలుందన్నారు. వారిని కొనసాగించేలా చూస్తామని మంత్రి తెలిపారు. కందుకూరులోని టీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో రద్దయిన ఎన్‌సీసీ యూనిట్‌ను పునరుద్ధరించాలని కేంద్రరక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కోరారు.

కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్‌తో మాట్లాడుతున్న ఎంపీ వేమిరెడ్డి

సందర్శన.. అవగాహన.. కార్యాచరణ

జిల్లాలో 42 పీఎంశ్రీ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు

న్యూస్‌టుడే, తోటపల్లిగూడూరు, ముత్తుకూరు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన బోధన, అభ్యసనతో పాటు వారి సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పీఎంశ్రీ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తోంది. సామాజిక పరిస్థితులకు అనుగుణంగా

చెన్నపల్లిపాలెం ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ శిక్షణలో విద్యార్థులు

వసతుల ఏర్పాటు..

పీఎంశ్రీ పాఠశాలలుగా ఎంపికైన ఉన్నత పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లలో వృత్తివిద్యా కోర్సులు నిర్వహించేందుకు ల్యాబ్‌ల ఏర్పాటుకు అవసరమైన నిధులు కేటాయించారు. క్రీడల్లో రాణించేందుకు ఆట స్థలాల అభివృద్ధికి రూ. 5 లక్షల చొప్పున ఖర్చు చేయనున్నారు. విజ్ఞాన విహారయాత్రలకు వెళ్లేందుకు నిధులు సమకూర్చారు. పాఠశాల వార్షికోత్సవాలు నిర్వహించుకునేందుకు ఒక్కో పాఠశాలకు రూ. 50 వేల చొప్పున అందజేయనున్నారు.

వృత్తి విద్యా కోర్సులను ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేశారు. విద్యార్థులకు తమకు ఆసక్తి ఉన్న అంశాల్లో తర్ఫీదు ఇస్తుండడంతో చక్కగా నేర్చుకుంటున్నారు.

జిల్లాలో 25 ఉన్నత, 7 గురుకుల, 10 ఆదర్శ పాఠశాలల్లో మొత్తం 42 పాఠశాలల్లో పీఎంశ్రీ కార్యక్రమం అమలు చేస్తున్నారు. అవసరమైన ఉపకరణాలతో ప్రత్యేక ల్యాబ్‌లు నెలకొల్పి వృత్తి విద్య నేర్పిస్తున్నారు. కంప్యూటర్, బ్యూటీ అండ్ వెల్‌నెస్, సైన్స్ ల్యాబ్‌లు అందుబాటులో ఉంచారు. గణితం, భౌతిక, జీవశాస్త్రాలకు సంబంధించి స్టెమ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయడంతో విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతోంది. ఒక్కో పాఠశాలకు రూ.5 లక్షలతో కంప్యూటర్ ల్యాబ్, రూ.2.24 లక్షలతో పలు ఉపకరణాలతో కూడిన బ్యూటీ అండ్ వెల్‌నెస్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. మరోవైపు పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు కుట్లు, చిత్రలేఖనం నేర్పుతున్నారు.

విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతోంది

ఎంఈవో వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. పీఎంశ్రీకి ఎన్నికైన పాఠశాలల్లో కంప్యూటర్ కోర్సులు, సైన్స్ ఇతర ల్యాబ్‌లు ఏర్పాటయ్యాయన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారని, వారిలో ఆసక్తి పెరుగుతోందన్నారు.

రేపు రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలు

నెల్లూరు(లీగల్), న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకు నగరంలోని జిల్లా కోర్టు ఆవరణలోని నెల్లూరు బార్ అసోసియేషన్ హాలులో పోలింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈపనులను నెల్లూరు రిటర్నింగ్ అధికారి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పులిమి అయ్యప్పరెడ్డి బుధవారం పర్యవేక్షించారు. ఎన్నికల బరిలో రాష్ట్ర వ్యాప్తంగా 143 మంది పోటీలో ఉన్నారు. నెల్లూరు నుంచి ప్రస్తుత రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సత్తు అంకయ్య, నెల్లూరు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు డి.ఫణిరత్నం, ఒ.వెంకట్‌రాజు, ఉమ్మిన ఈశ్వర మనోజ్ కుమార్ బరిలో ఉన్నారు. నెల్లూరు బార్ అసోసియేషన్‌కు సంబంధించి 1609 మంది ఓటర్లు ఉన్నారు. ఈనెల 13వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఓటింగ్ ప్రారంభమవుతుంది. అయిదుగురికి ప్రాధాన్యత ఓట్లు కచ్చితంగా వేయాల్సి ఉంటుందని, లేనిపక్షంలో చెల్లనివిగా మారే ప్రమాదం ఉందని రాష్ట్ర బార్ కౌన్సిల్ నెల్లూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులిమి అయ్యప్పరెడ్డి స్పష్టం చేశారు.

యువత.. సేవల్లో ఘనత

న్యూస్‌టుడే, కావలి

రక్తదానం చేస్తూ.. ఆపదలో ఆదుకుంటూ

ఆపదలో ఎంతోమంది రక్తం అందక ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రమాదాల్లో గాయపడిన వారు.. గర్భిణులు అత్యవసర పరిస్థితుల్లో ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. వీరిని గమనించిన పలువురు యువతులు వారిని కాపాడాలని నిర్ణయించుకున్నారు. సామాజిక బాధ్యతగా రక్తదానం చేస్తున్నారు. ఎవరికైనా అవసరమైతే వెళ్లి ఇస్తున్నారు పట్టణంలోని పలువురు యువతులు. ప్రాణదాతలుగా గుర్తింపు పొందారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా నగరాల్లో పనిచేస్తున్నారు. పట్టణానికి వచ్చినప్పుడల్లా వివిధ సేవా కార్యక్రమాలు చేస్తున్నారు.

ఆపన్నహస్తాలుగా..

ఆపదలో ఉన్న పేదలను ఆదుకుంటున్నారు. వ్యాధులకు గురైన వారికి ఆర్థిక సాయం చేస్తున్నారు. ఇప్పటివరకు రూ.7 లక్షల వరకు క్రౌడ్‌ఫండింగ్ ద్వారా అందించారు. వైద్య సలహాలను పేరొందిన ఆసుపత్రుల నుంచి వంద మందికి పైగా బాధితులకు అందించారు. కావలి రెడ్‌క్రాస్‌కు అనుబంధంగా సాగుతున్న టీమ్ సేవియర్స్ ద్వారా వీరంతా సేవా కార్యక్రమాలు చేస్తున్నారు.

మావ్య.. చైతన్య దీపిక

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మావ్య

బీటెక్ పూర్తి చేసిన కొత్తకోట మావ్య చదువుకునేటప్పటి నుంచే టీంసేవియర్స్‌లో సభ్యురాలిగా ఉన్నారు. నాలుగేళ్లుగా ఈ సంస్థ యువసేవా విభాగంలో సహాయ కార్యక్రమాలకు కోర్ సభ్యురాలిగా వ్యవహరిస్తున్నారు. కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థినులకు అవగాహన సదస్సుల్ని నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు 30కు పైగా ఏర్పాటుచేశారు. ప్రజలకు ఆరోగ్యపై అవగాహన కల్పిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను వివరిస్తూ.. వాటిలో లబ్ధి పొందేలా చూస్తున్నారు.

ఆదర్శప్రాయంగా.. సాయిస్వాతి

కావలికి చెందిన పెట్లూరు సాయిస్వాతి ఇటీవల రిపబ్లిక్‌డే సందర్భంగా రెడ్‌క్రాస్ మెగా రక్తదాన శిబిరం విజయవంతానికి కృషి చేశారు. ఆమె రక్తదానం చేయడంతోపాటు పలువుర్ని ప్రోత్సహిస్తున్నారు. మహిళలపై జరిగే అఘాయిత్యాలను నిలదీసి వారికి న్యాయం జరిగేలా చూస్తున్నారు. ఎక్కువగా పేదల నివాస ప్రాంతాలు, విద్యాసంస్థల్లో సదస్సులు నిర్వహిస్తున్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలను వివరిస్తున్నారు. అయిదేళ్లుగా సేవా కార్యక్రమాలు చేస్తున్నారు.

జీవితంపై విరక్తి చెంది బలవన్మరణం

నెల్లూరు (వేదాయపాలెం), న్యూస్‌టుడే: మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెందిన యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఉదంతమిది. పోలీసుల కథనం మేరకు.. నవాబుపేట పోలీసుస్టేషన్ పరిధిలోని కుసుమ దళితవాడకు చెందిన బి.రాజేష్ (32), శైలజ కొన్నాళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. రాజేష్ లారీ డ్రైవరుగా పనిచేస్తున్నారు. మద్యానికి బానిసయ్యారు. తాగొద్దని భార్య పలుమార్లు సూచించినా వినిపించుకోలేదు. ఈ నేపథ్యంలో బుధవారం ఇద్దరి మధ్య వివాదం జరిగింది. ఆతరువాత ఇంట్లోని సీలింగ్ హుక్కుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతని భార్య నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రైలు కింద పడి వ్యక్తి..

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న వైనమిది. వేదాయపాలెం - వెంకటాచలం రైల్వే స్టేషన్ల మధ్యలో పట్టాలపై బుధవారం గుర్తుతెలియని మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. మృతుడికి సుమారు 50 నుంచి 55 ఏళ్ల లోపు వయసు ఉంటుంది. తెలుపు రంగు కట్ బనియన్, పచ్చరంగు గళ్ల టవల్ నడుముకు చుట్టుకున్నాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఛాంపియన్ రైతులకు ప్రోత్సాహకాలందిస్తాం

పొదలకూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఎంపిక చేసిన ఛాంపియన్ రైతులు మిగతా సాగుదారులకు ఆదర్శంగా నిలవాలని ఆత్మ ప్రాజెక్టు పీడీ శారద అన్నారు. బుధవారం పొదలకూరు మండలంలోని మర్రిపల్లి, ముదిగేడు, డేగపూడి గ్రామాల్లో వరి, ఉద్యాన పంటలైన నిమ్మ, బంతిపూలు, కీరదోస పంటలను ఆమె పరిశీలించారు. ఆదర్శంగా నిలిచిన ఛాంపియన్ రైతులకు ఆత్మ తరపున ప్రోత్సాహకాలు అందిస్తామని పేర్కొన్నారు. పొదలకూరు ఏడీఏ శివనాయక్, డీఆర్‌సీ ఏడీఏ మారుతీదేవి, ఉద్యాన అధికారి ఆనంద్, ఏవోలు ప్రతాప్, గీతాకుమారి, ఛాంపియన్ రైతులు మాధవయ్య, చిరంజీవి తదితరులున్నారు.

అడగరులే తవ్వేయ్.. అందినకాడికి అమ్మేయ్!



కాకర్లపాడు సమీపంలో బీరాపేరు వాగులో ఇసుక తవ్విన ప్రాంతం

నిబంధనలకు విరుద్ధంగా ఇసుక, మట్టి తరలింపు

అనుమసముద్రంపేట, న్యూస్‌టుడే: ఏఎస్‌పేట మండలంలో ఇసుక, మట్టి మాఫియాకి అడ్డూఅదుపు లేకుండా పోతోంది. ప్రధానంగా బీరాపేరు, నక్కలవాగుల నుంచి ఇసుక తరలిస్తున్నారు. రాత్రి పది నుంచి తెల్లవారుజాము 4 గంటల వరకు తవ్వకాలు చేస్తూ ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమార్కులు వ్యవహరిస్తున్నా.. అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

ఎక్కడెక్కడంటే..

ఏఎస్‌పేట మండలంలోని గుడిపాడు, గుంపర్లపాడు, కాకర్లపాడు, పందిపాడు, చందలూరుపాడు గ్రామాల పరిధిలోని వాగులనుంచి ఇసుక తరలిపోతోంది. సీబీ వరం, జమ్మవరం, కాకర్లపాడు, పందిపాడు తదితర గ్రామాల్లో చెరువు లోతట్టు, మేత పోరంబోకు భూముల్లో మట్టిని తవ్వేస్తున్నారు. స్థానికంగా ట్రాక్టర్ ట్రక్కు మట్టి రూ.600, ఇతర ప్రాంతాలకు రూ.700-800 దూరాన్ని బట్టి అమ్మకాలు చేస్తున్నారు. అదే ఇసుకయితే స్థానికంగా రూ.1200 పలుకుతుండగా, ఆత్మకూరువంటి ప్రాంతాలకు రూ.1600 చొప్పున విక్రయిస్తున్నారు.

యంత్రాల సాయంతో..

బీరాపేరు, నక్కల వాగు నుంచి ఇసుకను వింజమూరు, ఆత్మకూరు, కలిగిరి మార్గాల ద్వారా వివిధ ప్రాంతాలతోపాటు, నెల్లూరు, ఆత్మకూరు మార్గంలో కొత్తగా వెలుస్తున్న పలు లేఅవుట్లకు తరలిస్తున్నారు. గతంలో గుంపర్లపాడు సమీపాన బీరాపేరు నుంచి తరలిస్తుండగా అధికారులు కేసులు నమోదు చేయగా.. పలువురు అక్రమార్కులు వాగ్వాదానికి దిగారు. దీంతో అప్పటినుంచి రూట్ మార్చి కాకర్లపాడు, పందిపాడు మధ్య ఉన్న బీరాపేరు వాగులో యంత్రాలతో తవ్వకాలు చేపడుతూ సొమ్ము చేసుకుంటున్నారు.

ప్రత్యేక నిఘా ఉంచుతాం

అనిల్‌కుమార్, తహసీల్దారు.. అక్రమంగా వాగులు, చెరువుల నుంచి ఇసుక, మట్టి తరలించే వాహనాలపై గట్టి నిఘా ఉంచుతాం. వీఆర్వోలకు ఆదేశాలిచ్చి ఇసుక తరలించే వాహనాలపై చర్యలు చేపడతాం.

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిష్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై- 600032, వెబ్‌సైట్: www.shriramfinance.in/auction.
కార్యాలయ చిరునామా: డి.నెం.26-2-7, 2వ అంతస్తు, పద్మావతి ప్లాజా, కెనరాబ్యాంక్ ప్రక్కన ఎ.కె.నగర్, నెల్లూరు (జిల్లా)- 524004 & శాఖ కార్యాలయం : నెల్లూరు-2

తుమ్మకూరి శేఖర్‌కు చెందిన స్థిరాస్తులు అమ్మకము కొరకు ఈ-వేలం ప్రకటన

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్)రూల్స్, 2002, 9(1) & 8(6)తో చదువబడే క్రింద స్థిరాస్తుల ఈ-వేలం అమ్మకం ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా రుణగ్రహీత(లు) మరియు గ్యారంటారు (లు)లకు తెలియజేయడమేమనగా దిగువ తెలిపిన రుణగ్రహీతలు / గ్యారంటార్లకు చెందిన ఆస్తులను సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా / ఛార్జిలో వుంచి పొందిన బకాయి మొత్తము **తేది: 26.08.2022** నాటికి **రూ.42,34,077/-** లను + **తేది:25.08.2022** నాటి నుండి వడ్డీ మరియు ఇతర ఖర్చులను రాబట్టుకునేందుకు సర్ఫేసి చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు **తేది: 26.08.2022**న జారీ చేసి శ్రీరామ్‌ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క సెక్యూర్డ్ క్రెడిటార్ వారిచే స్వాధీనం చేసుకున్న ఆస్తులను "ఎక్కడ ఎలా వున్నదో అక్కడ" "అక్కడ ఎలా ఉన్నదో" అలానే మరియు "అక్కడ ఏమి ఉన్నదో" అనే పద్ధతిపై **తేది: 23.03.2026 ఉదయం 11.గం॥లకు నుండి మ.1.00 గం॥ల** మధ్య విక్రయించుటకు నిర్ణయించినారు.

అగ్రిమెంటు నెం.: **NELL3TF2002290002,** రుణగ్రహీతలు/గ్యారంటార్ల యొక్క పేర్లు,చిరునామా :-1) **తుమ్మకూరి శేఖర్** తండ్రి టి.సుబ్బయ్య, డి.నెం.3/156, నాగేంద్ర నగర్, నవలాకుల తోట, 3వ మైలు దగ్గర,మైపాడురోడ్డు, నెల్లూరు జిల్లా -524002 (రుణగ్రహీత) 2) **తుమ్మకూరి సుగుణ,** భర్త టి.శేఖర్, డి.నెం.3/156, నాగేంద్ర నగర్, నవలాకుల తోట, 3వ మైలు దగ్గర,మైపాడురోడ్డు, నెల్లూరు జిల్లా -524002 (గ్యారంటారు), 3) **తుమ్మకూరి సుధీర్‌కుమార్** తండ్రి టి.శేఖర్, డి.నెం.3/156, నాగేంద్ర నగర్, నవలాకుల తోట, 3వ మైలు దగ్గర,మైపాడురోడ్డు, నెల్లూరు జిల్లా -524002 (గ్యారంటారు) 4) **సన్నిబోయిన సుశీలమ్మ** భర్త సుబ్బారావు, డి.నెం.3-155, నాగేంద్ర నగర్, నవలాకుల తోట, 3వ మైలు దగ్గర,మైపాడురోడ్డు, నెల్లూరు జిల్లా -524002 (రుణగ్రహీత)

స్థిరాస్తుల యొక్క వివరణ: (నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో రిజిష్టరుకాబడిన తుమ్మకూరి శేఖర్‌కి చెందిన పత్రంనెం. 1268/2020ప్రకారం ఆస్తి):- శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, నెల్లూరురిజిస్ట్రేషన్ జిల్లా, నెల్లూరు సబ్ జిల్లా, ప్రస్తుత స్టోన్‌హౌస్‌పేట సబ్‌జిల్లా, నెల్లూరు రూరల్ మండలం, అల్లిపురం హెచ్/ఒ, నవలాకులతోటటు, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని, పట్టా నెం.46, సర్వేనెం.231/1లోని భూమి యొక్క పూర్తి విస్తీర్ణం ఎ.3.09 సెంట్లు మరియు ఇందున ఎ.2.09 సెంట్లలో ఎ.1.59 సెంట్ల భూమిని మార్పుచేసి వేసిన ప్లాట్లలో ప్లాటు నెం.3 యొక్క విస్తీర్ణం 20 అంకణముల 36 చ.అ. లేదా 134.124 చ.మీ. స్థలం మరియు ఇందున నిర్మించిన డి.నెం.28/1-ఎ-3-156, అసెస్‌మెంట్‌నెం.1031105397 గల ఆర్‌సిసి బిల్డింగ్ హద్దులు: తూర్పు:కు 12అ. వెడల్పు గల కామన్ ప్యాసేజి, - 25.3అ. పడమరకు: కోట వెంకటయ్య భూమి, - 25.3అ. ఉత్తరమనకు: పోరెడ్డి క్రిష్ణారెడ్డి భూమి - 56అ. దక్షిణమునకు - సానిబోయిన సుబ్బారావు యొక్క ప్లాటు నెం.2 - 61అ. ఈ హద్దుల మధ్యస్థలం యొక్క విస్తీర్ణం 20 అంకణములు 36 చ.అ. లేదా 134.124 చ.మీ మరియు ఇందున నిర్మించిన ఆర్‌సిసి బిల్డింగ్ అన్ని ఫిక్చర్లు & అనుబంధ స్థలంతో సహా. అన్ని ఈజ్‌మెంటరీ హక్కులతో సహా. **తాకట్టు రుణభారాలు: లేవు.**

అగ్రిమెంటు నెంబరు	ఆస్తి యొక్క రిజర్వు ధర	ధరావత్తు	ధరావత్తు సమర్పణ విధానం	బిడ్ ఇంక్రిమెంటు మొత్తము	వేలం తేది	ధరావత్తు సమర్పణ తేది	ఆస్తుల తనిఖీ తేది
NELL3TF 2002290002	రూ.25,79,000/-(ఇరవై ఐదు లక్షల డెబ్బై తొమ్మిది వేల రూపాయలు మాత్రమే	రూ.2,57,900/-(రెండు లక్షల యాభై ఏడు వేల తొమ్మిది వందలరూపాయలు మాత్రమే)	శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారి పేరున డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా	రూ.30,000/-	23.03.2026	21.03.2026	20.03.2026

ఆసక్తి గల బిడ్డర్లు లాగిన్ ఐడి & పాస్‌వర్డ్ ఏర్పాటు చేయడంలో, బిడ్ సమర్పణలో, ఈ బిడ్డింగ్ ప్రక్రియలో సహాయం కొరకు **మెస్సర్స్ శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా లిమిటెడ్, శ్రీ గౌరవ్ నంబూద్రి సెల్: 9833922941,** ఈమెయిల్ **<gaurav.n@samil.in>** మరియు ఆస్తి సంబంధిత వివరాలకై **అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, శ్రీటి.విజయ్‌కుమార్ సెల్: +91 9949940787** సంప్రదించగలరు. అధీకృత అధికారి ఏ బిడ్డు అయినా లేక అన్ని బిడ్లను ఏ కారణము తెలుపకనే తిరస్కరించుటకు అధికారము కలిగి వున్నారు. ఆన్‌లైన్ వేలము టెండరు సమర్పణ/ బిడ్ ఫారం కొరకు/ టెండరు ఓపెన్ మరియు వేలము కొరకు వెబ్‌సైట్ **https://eauctions.Samil.in/home** ను చూడగలరు. పూర్తి నియమ నిబంధనల కొరకు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వెబ్‌సైట్‌లో తెలుపబడిన లింకు **https://www.shriramfinance.in/auction** ను చూడగలరు.**గమనిక:** ఇందుమూలముగా తెలియజేయడమేమనగా "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ " ఎన్‌సిఎల్‌టి చెన్నై వారి ఉత్తర్వు ప్రకారం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్"తో విలీనం కాబడింది. ఇటీవల "శ్రీరామ్ ఫైనాన్స్ ట్రాన్స్‌పోర్ట్ లిమిటెడ్" గా మార్పు చెందింది. ఇది తేది: 30.11.2022 నుంచి పేరు మార్పుకు సంబంధించిన సర్టిఫికెట్ ఇన్ కార్పొరేషన్ తేది: 30.11.2022 ద్వారా మార్పు చెందింది.

ప్రదేశము: నెల్లూరు,తేది:10.02.2026 **సం// అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**

EENADU Classifieds

REAL ESTATE

PLOT FOR SALE

హౌసింగ్ బోర్డు కాలనీకి దగ్గరలో నారాయణ కాలేజీకి ప్రక్కన 23 అంకణాల తూర్పు దిక్కు. ప్లాట్ అమ్మకానికి కలదు. Cell: 9642218382

JOBS

PRO's required for attending Admission work. Salary based on the Qualification & Experience. Contact : 9247007000

లేడి రిసెప్షనిస్ట్ కావలెను. నెల్లూరు టౌన్ ప్రముఖ రియల్ ఎస్టేట్ ఆఫీసు నందు పనిచేయుటకు సంప్రదించండి. Cont ✆ 83097 03972, 89850 97909

ప్రముఖ కంపెనీకి 6/10 Tons లారీకి అనుభవం, హెవీలైసెన్స్, బ్యాడ్జ్ కలిగిన డ్రైవర్లు కావలెను. నారాయణరెడ్డి పేట, నెల్లూరు. Cont: 88854 23099

బాతులను పెంచుటకు అనుభవం గల వర్కర్స్ & ఆంధ్ర టిఫిన్స్, Veg & Nonveg, స్నాక్స్ చేసే వంట మనిషి కావలెను. ✆ 9849311524, 8688262581

SBI **అనుబంధ** సంస్థలో పని చేయుటకు స్త్రీ/పు P.T/F.T కావలెను. వయస్సు: 25+, 10th, Sal: 12K+, గృహిణులకు, రిటైరైన వారికి ప్రత్యేకత. ✆7702320574

నిరుద్యోగులకు మంచి అవకాశం, డైలీ ఆదాయం వచ్చే మార్గం, రండి స్టాక్ మార్కెట్లో ట్రేడింగ్ చేయండి. Kotak Demat account ఓపెన్ చేసి ఫ్రీగా ట్రేనింగ్ చెప్పబడును. Call: 93980 87705

SECURITY GUARDS

నెల్లూరు జిల్లా గూడూరు పరిసర ప్రాంతాలలో పని చేయుటకు అనుభవం ఉన్న ASO & సెక్యూరిటి గార్డ్స్ కావలెను. 12 hrs డ్యూటీ, జీతం + PF, ESI. ఫ్రీ రూమ్ & సబ్సిడి ఫుడ్. ✆ 96189 71229

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు... వివరాలకు..
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
నెల్లూరు 80080 01790

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి.
B&W : రూ. 600
Colour : రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎటి డబ్బును వసూలు చేయ రాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

కావలి

• కావలి • ఉదయగిరి • ఆత్మకూరు

రేపు కావలిలో జాబ్‌మేళా

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కార్యాలయం, సీడాప్ ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీ కావలి లోని విస్డమ్ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి అబ్దుల్ ఖయ్యూం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో 14 కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలు కల్పిస్తారన్నారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమో, ఇంటర్, ఏదైనా డిగ్రీ చదివిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. **ఆత్మకూరులో 19న..: ఆత్మకూరు:** ఆత్మకూరులోని ఆంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 19న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో పావని పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని 30 కంపెనీలు ఇందులో పాల్గొంటున్నట్లు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

ఉదయగిరి, న్యూస్‌టుడే: ఉగాదికల్లా పక్కా గృహాల నిర్మాణాలను పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని గృహనిర్మాణ శాఖ ఈఈ మోహన్‌రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం గంగిరెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. మండలంలో 235 పక్కా గృహాల నిర్మాణం జరుగుతుందన్నారు. గుత్తేదారులు నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి మార్చి నాటికి పూర్తిచేస్తే బిల్లులు చెల్లిస్తామన్నారు. ఇన్‌ఛార్జి డీఈ పీరాన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)
కావలి : 80080 51666, 91548 46698
ఉదయగిరి : 80085 73944 ఆత్మకూరు: 8008573949

సమస్య: అనంతసాగరంలోని గుంత బజారు వీధిలో మురుగు కాలువలో పూడిక తీయకపోవడంతో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దుర్వాసన భరించలేకున్నాం. - **రజాక్, స్థానికుడు**

సమాధానం: సిబ్బందిని పంపి పూడిక తీయిస్తాం. - **అంజనేయులు, పంచాయతీ కార్యదర్శి**

? సంగంలో భారత్ కన్వెంట్ సమీపంలో ప్రారంభమైన సమాధుల తోట వద్దకు కొనసాగుతున్న మురుగు కాలువ పూడి ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. - **శ్రీహరి, సంగం**

✓ వెంటనే పూడిక తొలగించుకుని చర్యలు చేపడతాం- **ఆర్.నరసయ్య, పంచాయతీ కార్యదర్శి**

? మర్రిపాడు మండలం, సింగనపల్లికి వెళ్లే రోడ్డుకు గుంతలు ఏర్పడి అధ్వానంగా మారింది. - **వెంకటసుబ్బయ్య, స్థానికుడు**

✓ మరమ్మతులకు ప్రతిపాదనలు పంపుతాం. - **మహేశ్‌రెడ్డి, పీఆర్ ప్రాజెక్టు ఏఈ**

? ఆత్మకూరు పట్టణంలోని లక్ష్మణరావుపల్లిలో చెరువు అలుగు కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుని అధ్వానంగా మారడంతో దోమలు అధికమవుతున్నాయి. - **వెంకటరమణ, స్థానికుడు**

✓ పరిశీలించి వ్యర్థాలను తొలగిస్తాం. - **గంగాప్రసాద్, కమిషనర్, ఆత్మకూరు పురపాలక**

? దుత్తలూరు సంతపేట వద్ద మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు, మహిళలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. - **ప్రసాద్, స్థానికుడు**

✓ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. - **చెంచయ్య, ఎంపీడీవో - దుత్తలూరు, న్యూస్‌టుడే**

? కలిగిరి ప్రధాన సెంటర్లో కూరగాయల వ్యాపారులు మిగిలిన వ్యర్థాలను దుకాణాల ఎదుటే పోస్తున్నారు. - **రమణయ్య, స్థానికుడు**

✓ పరిశీలించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తాం. - **రవిచంద్ర, పంచాయతీ కార్యదర్శి**

? చేజర్ల కండ్రిక వెళ్లే మార్గంలో కంపచెట్లు పెరిగి రహదారికి అడ్డుగా ఉంది. దీనికి తోడు సిమెంటు రోడ్డు దెబ్బతింది. -**నారాయణరెడ్డి**

✓ ఉపాధి పథకంలో భాగంగా రహదారికి ఇరువైపులా చెట్లు తొలగించేందుకు తీసుకుంటాం. - **శ్రీనివాసులు పంచాయతీ కార్యదర్శి**

సమస్యల పరిష్కారానికి పోరాటం

సమావేశంలో మాట్లాడుతున్న ఖాజావలి

ఉదయగిరి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఈనెల 17న చేపట్టే చలో విజయవాడ(రణభేరి 2.0) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు షేక్ ఖాజావలి అన్నారు. స్థానిక పుల్లంపల్లి సుందరయ్య భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 29 శాతం ఐఆర్‌ను ప్రకటించి నూతన పీఆర్సీ కమిటీని నియమించాలన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి పోస్టుకార్డు క్యాంపెయిన్ చేపట్టడం జరిగిందన్నారు. అనంతరం గురువారం జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సంఘీభావంగా సీపీఎం కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతయ్య, దస్తగిరి అహ్మద్, నాయబ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. **కావలి :** రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పీఆర్సీని నియమించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు ఎం.సుదర్శనం డిమాండ్ చేశారు. బుధవారం కావలిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రూ. 38వేల కోట్ల బకాయిలను విడుదల చేయాలన్నారు. కేజీబీవీలతోపాటు విద్యాశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ వెంటనే రెగ్యులర్ చేయాలన్నారు. నాయకులు రాజకుమార్, ఏ.రాజు, మాల్యాద్రి, రవి, సురేశ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

గోడ ప్రతులు చూపుతున్న ఎస్టీయూ ప్రతినిధులు

పది నెలల కాలం.. వందకి 32 శాతం

కలిగిరి, న్యూస్‌టుడే: పంచాయతీ అధికారులు ఇంటి పన్ను వసూళ్లు చేయడంలో పూర్తిగా వెనుకబడ్డారు. 2025-26 ఆర్థిక సంవత్సరం.. మార్చి31 నాటికి ముగుస్తుండటంతో లక్ష్యం చేరుకునేందుకు కావలి డివిజన్ పరిధిలో సిబ్బంది పరుగులు పెడుతున్నారు.

ఈనెల 15వ తేదీలోపు..

ఈ నెల 15వ తేదీలోపు వంద శాతం వసూళ్లు చేయాలని ఉన్నతాధికారులు నిర్దేశించారు. లక్ష్యాలను అధిగమించకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు. దాంతో ఇతరత్రా పనులను ఆపేసి పంచాయతీ, సచివాలయ సిబ్బంది పన్ను వసూళ్ల ప్రక్రియలో నిమగ్నమయ్యారు. నిబంధనల మేరకు నవంబరులోనే డిమాండ్ నోటీసులు జారీ చేసి ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉండగా, ఆమేరకు సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించలేదు. ప్రస్తుతం ప్రజలకు డిమాండ్ నోటీసులు ఇవ్వడం, పన్ను చెల్లించమని కోరడం ఒకేసారి జరుగుతోంది. దీంతో ఒక్కసారిగా సొమ్ము చెల్లించమని ఒత్తిడి చేయడం ఏమిటని ప్రజలు పెదవి విరుస్తున్నారు.

కలిగిరి పంచాయతీ జలదానిపాలెంలో పన్ను వసూలు చేస్తున్న సిబ్బంది

కావలి డివిజన్‌లోని మండలాలు	: 12
పంచాయతీలు	: 214
అసెస్‌మెంట్లు(ఇళ్లు)	: 1,19,730
పన్ను లక్ష్యం	: రూ.9.91కోట్లు
వసూలైన పన్ను	: రూ.3.21కోట్లు
పన్ను శాతం పూర్తయిన పంచాయతీలు	: 14
మొత్తంగా పన్ను వసూలు శాతం	: 32.41

అభివృద్ధి పనులపై ప్రభావం

గ్రామ పంచాయతీలో తాగునీరు, రహదారులు, డ్రైనేజీ కాలువలు, వీధిదీపాలు, పారిశుద్ధ్యం నిర్వహణ తదితర పనులు చేపట్టాలంటే ప్రజలు చెల్లించే పన్నులే ప్రధాన ఆదాయ వనరుగా ఉంది. అధికారుల ఒత్తిడితో ప్రస్తుతం సిబ్బంది ఇంటింటికీ తిరుగుతున్నారు. కానీ ప్రజలు పన్ను చెల్లింపునకు ఆసక్తి చూపడం లేదు. దీంతో సిబ్బంది లక్ష్యాలు అధిగమించలేకున్నారు. డివిజన్‌లో 12 మండలాలుండగా..ఇంటి పన్నుల వసూళ్లలో కొడవలూరు, వింజమూరు, కలిగిరి మండలాలు బాగా వెనుకబడ్డాయి. వరికుంటపాడు, దుత్తలూరు మండలాలు 50 శాతం లక్ష్యాన్ని అధిగమించాయి.

ఆన్‌లైన్‌లోనూ చెల్లించే వెసులుబాటు

స్థానికంగా ఇళ్ల దగ్గర లేని యజమానులు ఆన్‌లైన్‌లోనూ పన్ను చెల్లించే వెసులుబాటు ఉంది. ఇకపై వచ్చిన సిబ్బందికి ప్రజలు సహకరించాలి. పన్ను చెల్లిస్తేనే గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయడానికి అవకాశం ఉంటుంది. **విజయకుమార్, డీడీవో, కావలి డివిజన్**

ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలు

విద్యార్థినులతో ఆర్డీవో పావని

సంగం, న్యూస్‌టుడే: ప్రణాళికాబద్ధంగా చదువుకుంటే పరీక్షల్లో మంచి ఫలితాలు వస్తాయని ఆత్మకూరు ఆర్డీవో బి.పావని అన్నారు. సంగంలోని డా.బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో వందరోజుల ప్రణాళికను తనిఖీ చేశారు. అనంతరం పీ-4 పథకంలో భాగంగా చేజర్ల మండలం పులనీల పల్లికి చెందిన నరసింహారావు ద్వారా సేకరించిన ఇన్వర్టర్‌ని పాఠశాలకు అందజేశారు. ప్రధానాచార్యులు సుమతమ్మ, ఆత్మకూరు డివిజన్ విద్యాశాఖాధికారి జానకీరాం, ఎంఈవో బి.మల్లయ్య హాజరయ్యారు.

బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే చర్యలు

వింజమూరు, న్యూస్‌టుడే: 14 ఏళ్ల లోపు పిల్లలను పనుల్లో పెట్టుకుంటే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సహాయ కార్మిక అధికారి బి. శ్రీకాంత్ హెచ్చరించారు. వింజమూరులో బుధవారం పలు కిరాణా, మెకానిక్, వెల్డింగ్ దుకాణాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ దుకాణంలో కార్మికుని పేరు, పుట్టిన తేదీ, పని గంటల వివరాలతో కూడిన దస్త్రాలు నిర్వహించాలన్నారు. రాత్రి 7 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు పనులు చేయించడం చట్ట విరుద్ధమన్నారు. కార్మిక, ఐసీడీఎస్ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీలో సరస్వతి పూజ

అనుమసముద్రంపేట, న్యూస్‌టుడే: ఏఎస్‌పేటలోని కేజీబీవీలో బుధవారం ఘనంగా సరస్వతి పూజాకార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి, ఇంటర్ విద్యార్థినులు సరస్వతిదేవి చిత్రపటానికి పూజలు చేశారు. అనంతరం పాఠశాలలో ఇంటర్, పదోతరగతి పరీక్షలకు హాజరుకానున్న 110 మంది విద్యార్థినులకు వైద్యురాలు డా. షకీలా అందించిన విద్యా సామగ్రిని విశ్రాంత ఉపాధ్యాయులు పంపిణీ చేశారు.

సూచిస్తారు.. కానీ పాటించరు!

గ్రామాలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించే అధికారులు వారి కార్యాలయాల్లో పారిశుద్ధ్య నిర్వహణను గాలికొదిలేస్తున్నారు. స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో నిల్వ ఉన్న చెత్తే దీనికి నిదర్శనం. నాలుగేళ్లుగా పాత దస్త్రాలు, సామగ్రి కార్యాలయంలోని మూలనపడి ఉన్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదు. - **న్యూస్‌టుడే, దుత్తలూరు**

వినియోగంలోకి తీసుకురారూ!

మండలంలోని ఇర్లపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో నాడు-నేడులో భాగంగా 1.5 లక్షలతో ఏర్పాటు చేసిన శుద్ధజల కేంద్రం నిరుపయోగంగా మారింది. ఏడు నెలల క్రితం మరమ్మతులకు గురికావడంతో దగ్గరలోని ప్లాంట్ నుంచి నీటిని తెప్పిస్తున్నారు. పాఠశాలలో 60 మంది విద్యార్థులు చదువుతున్నారు. యాప్‌లో ఫిర్యాదు చేసినా స్పందన కర్వైందని ఉపాధ్యాయులు చెప్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వినియోగంలోకి తీసుకురావాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.
- **న్యూస్‌టుడే, మర్రిపాడు (ఆత్మకూరు గ్రామీణం)**

భౌభౌలతో బెంబేలు

అనంతసాగరంలోని పలు వీధుల్లో కుక్కలు ప్రజలను తీవ్ర భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఇటీవల బీసీ కాలనీకి చెందిన సయ్యద్ ఖజా మొహిద్దీన్, గుండం వీధికి చెందిన ఏడేళ్ల చిన్నారిపై కుక్కలు దాడి చేశాయి. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాలపై వెళుతుంటే వెంటపడుతున్నాయి. వీధి కుక్కలను నియంత్రించడానికి పంచాయతీలు, సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. - **న్యూస్‌టుడే,అనంతసాగరం**

ఈ దారిలో వెళ్లాలంటే అవస్థలే

వెలిగండ్లలో విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలంటే నానా ఇబ్బందులు పడుతున్నారు. నివాసాలకు పాఠశాలకు వెళ్లే మార్గంలో రోడ్డుపై ఉన్న కల్వర్టు కూలిపోయింది. ఆ ప్రదేశంలో చిన్న గట్టుమీదుగా విద్యార్థులకు భయంభయంగా రాకపోకలు చేయాల్సి వస్తుంది. ఈవిషయమై పంచాయతీ కార్యదర్శి ధనుంజయను వివరణ కోరగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. - **న్యూస్‌టుడే, కొండాపురం**

నిర్లక్ష్యం.. నిరుపయోగం!

స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉన్న జనరేటర్ ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉంది. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు ప్రజల సేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా రూ.లక్షలు వెచ్చించి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కొంత కాలం జనరేటర్ సజావుగా నడిచినా నిర్వహణకు నిధులు మంజూరు కాక ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ తుప్పు పట్టి పోయింది. ఇకనైనా అధికారులు స్పందించి జనరేటర్‌ను వినియోగంలోకి తీసుకు రావాలని సర్వత్రా కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, అనంతసాగరం**

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

వరికుంటపాడు, న్యూస్‌టుడే: మండలంలోని తిమ్మారెడ్డిపల్లె, తూర్పురొంపిదొడ్ల విద్యుత్తు ఉప కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో గురువారం ఉదయం 11నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్తు సరఫరాను నిలిపివేస్తున్నట్లు డిస్కం ఏఈ ఖుద్దూస్‌బాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉప కేంద్రాల్లో మరమ్మతుల కారణంగా సరఫరాను నిలిపి వేస్తున్నామని రైతులు, ప్రజలు సహకరించాలన్నారు.

భారీ గుంతను పూడ్చిన అటవీశాఖ

సంగం : సంగం కొండపై ప్రమాదకరంగా ఉన్న భారీ గుంతను అటవీశాఖ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి యంత్రసాయంతో పూడ్చివేశారు. గుప్త నిధుల కోసం కొన్ని నెలల పాటు గుర్తు తెలియని వ్యక్తులు 100 అడుగుల లోతైన గుంతను తవ్వగా గతనెలాఖరులో కొరిమెర్ల వాసులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంబంధిత వ్యక్తులు పరారయ్యారు. ప్రస్తుతం గుంతను పూడ్చివేశారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జేవీవీ నాయకులు

ఉదయగిరి: స్థానిక ఏఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వక్త- 2026 కార్యక్రమంలో భాగంగా బుధవారం విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా జేవీవీ జిల్లా నాయకుడు దస్తగిరి అహ్మద్ మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసి కమ్యూనికేషన్ నైపుణ్యాన్ని పెంపొందించేందుకే పోటీలను నిర్వహిచామన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. బహుమతులు వితరణ చేసిన రాజగోపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు జిలానీ, అధ్యాపకుడు సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులతో గౌరవంగా మెలగాలి

వరికుంటపాడు, న్యూస్‌టుడే: చౌకదుకాణాలకు వచ్చే లబ్ధిదారులతో గౌరవంగా మెలగాలని రేషన్ డీలర్లకు డిప్యూటీ తహసీల్దారు నిమ్మల చెంచయ్య సూచించారు. మండలంలోని తోటలచెరువుపల్లె, మహమ్మదాపురం, యర్రంరెడ్డిపల్లెలోని చౌకదుకాణాలను బుధవారం ఆయన పరిశీలించారు. బియ్యం నిల్వలను, దస్త్రాలను తనిఖీ చేశారు. దుకాణాల వద్ద బోర్డులు ఏర్పాటు చేయడంతోపాటు వృద్ధులకు వారి ఇళ్లవద్దకు వెళ్లి తీసుకెళ్లి సరకులను అందచేయాలన్నారు.

పింఛన్ల తొలగింపు తగదు

కావలి, న్యూస్‌టుడే: సదరం రీవెరిఫికేషన్ పేరిట పింఛన్ల తొలగింపు దారుణమని దివ్యాంగ సంఘ రాష్ట్ర అధ్యక్షులు పులిపాటి దుర్గారెడ్డి, పోసిన వెంకట్రావుగౌడ్, సుబ్బారావు, నాగేంద్ర, చంద్రశేఖర్ అన్నారు. బుధవారం కావలిలో విలేకరులతో మాట్లాడుతూ ఆత్మగౌరవం, సంకల్పంతో దివ్యాంగులంతా జీవించాలని కోరారు. అర్హతగల వారంతా ప్రభుత్వ సంక్షేమాల్లో లబ్ధి పొందాలన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమనే హామీ ఇచ్చినా నెరవేరడం లేదన్నారు.

పరీక్షల సమయం.. ఆరోగ్యం భద్రం

ఏఎస్‌పేట జడ్పీ ఉన్నత పాఠశాలలో పది పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

అనుమసముద్రంపేట, న్యూస్‌టుడే: విద్యార్థి దశలో పదో తరగతి, ఇంటర్మీడియట్ చాలా కీలకం. ఉజ్వల భవితకు బాటలు వేసేందుకు ఇక్కడి నుంచే తొలి అడుగులు పడతాయి. ఈ నెల23 నుంచి ఇంటర్, మార్చి 16వ తేదీ నుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు పుస్తకాలతో నిత్యం కుస్తీపడుతున్నారు. ఇలాంటి కీలక సమయంలో ఎలాంటి ఒత్తిడి, ఆందోళనకు గరికాకుండా సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. పోషకారాన్ని తీసుకుంటూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

నిద్ర, భోజనం తప్పనిసరి

పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురవుతుండడం సహజం. తలనొప్పి, ఆకలి మందగించడం వంటి లక్షణాలతో చికాకుకు లోనవుతుంటారు. చదువు ధ్యాసలో పడిపోయి సక్రమంగా సమయానికి భోజనం చేయరు. ఈ విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధవహించాలి. తమ పిల్లలు బాగా చదువుతున్నారా అని అడిగేకంటే సమయానికి భోజనం, నిద్ర తగినంత ఉండేలా చూసుకోవాలి. రోజూ 10 నుంచి 15 గ్లాసులు మంచి నీరు తీసుకునేలా చూడాలి. పరీక్షల సమయంలో మాంసాహారం తీసుకోకపోవడమే ఉత్తమం. ఇతర పౌష్టికాహారం అందించాలి. రాత్రి సమయంలో అల్పాహారం, పండ్లు తీసుకుంటే మంచిది. దాని వల్ల విద్యార్థులు హుషారుగా ఉంటారు. ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరిగేలా వారితో మాట్లాడాలి. పరీక్ష బాగారాయగలమన్న ధీమాను వారిలో కలిగించాలి.–**వినూత, వైద్యురాలు, చిరమన పీహెచ్‌సీ**

అర్థం చేసుకుని చదవాలి: రుక్మిణి

ప్రధానోపాధ్యాయురాలు, ఏఎస్‌పేట ఉన్నత పాఠశాల

విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పట్టడం కంటే ఒక ప్రణాళిక ప్రకారం ఆయా సబ్జెక్టులు చదవాలి. అర్థం చేసుకుని ముందుకెళ్తే ప్రశ్నలు ఏ రకంగా వచ్చినా రాయవచ్చు. సందేహాలను ఎప్పటికప్పుడు నివృతి చేసుకోవాలి. తద్వారా ఆందోళన, ఒత్తిడి తగ్గుతుంది.

విరామం అవసరమే:

జ్యోతి, మండల విద్యాశాఖాధికారిణి

విద్యార్థులు ఏకధాటిగా చదవకుండా మధ్య, మధ్యలో విరామం ఇచ్చి చదువుకోవాలి. దీని వల్ల చదివినది మరింత బాగా అర్థం అవుతుంది. సమయాన్ని సద్వినియోగం చేసుకుని సబ్జెక్టుల వారీగా పాఠాలను పునశ్చరణ చేయాలి. ముఖ్యమైన పాయింట్లను నోట్స్‌గా రాసుకోవాలి. తోటి విద్యార్థులతో కలిసి చదవడం, బృందంగా కూర్చుని చర్చించుకోవడం వల్ల సందేహాలు నివృతి అవుతాయి. చేతిరాత పైన దృష్టి నిలిపితే అధికమార్కులు సాధించవచ్చు.

సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలి

సీతారామపురం, న్యూస్‌టుడే : దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని మండల సీఐటీయూ కన్వీనర్ కోడె రమణయ్య కోరారు. సీతారామపురంలో బుధవారం విలేకర్లతో మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్నభోజన నిర్వాహకులు, పాఠశాలలో పనిచేసే స్వీపర్లు, రైతులు, ఉపాధికూలీలు, హమాలీలు, వీవోఏలు, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులు అందరూ పాల్గొనాలన్నారు. **ఉదయగిరి:** లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం చేపట్టే సార్వత్రిక సమ్మెలో పాల్గొంటున్నట్లు స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఇన్‌ఛార్జి తహసీల్దారు షాజియాకు వీఆర్‌ఏలు నోటీసు అందజేశారు. అలాగే సీఐటీయూ నాయకులు, బ్యాంకు ఉద్యోగులు ఆశాఖల ఉన్నతాధికారులకు సమ్మె నోటీసులు అందించారు.

నిలిచిపోయిన క్వారీల పరిశీలన

వరికుంటపాడు : నిలిచిపోయిన క్వారీల పనులను తిరిగి ప్రారంభించుకోవాలని మైనింగు ఏడీఈ కె.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని వేంపాడు,జడదేవి, అలివేలిమంగాపురం గ్రామాల్లో ఉన్న క్వారీలను బుధవారం ఆయన పరిశీలించారు. పనుల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తగా చేసుకోవాలని సూచించారు. పర్యవేక్షకులు సుధాకర్, టీపీ వెంకటేశ్వరరావు, వీఆర్వో ఆంథోని పాల్గొన్నారు.

సస్పెన్షన్‌ను ఎత్తివేయాలంటూ నిరసన

డిపో ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఉదయగిరి, న్యూస్‌టుడే: ఉదయగిరి ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న జగదీష్‌బాబు అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని రెండోరోజైన బుధవారం స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎంయూఏ వర్కింగ్ ప్రెసిడెంట్ కాశీవిశ్వనాథ్, డిపో మాజీ కార్యదర్శి మౌలాలి మాట్లాడుతూ తనిఖీ అధికారులు నమోదు చేసిన కేసు ఆధారంగా డిపో మేనేజరు వాస్తవాలు తెలుసుకోకుండా, విచారణ చేయకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకొని సస్పెన్షన్ చేయటం దారుణమన్నారు. నాయకులు శంకర్, నాగరాజు, వెంకటేశ్వర్లు, ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

శేషవాహనంపై ఆదిదంపతులు

చెర్లోవంగల్లు (సంగం), న్యూస్‌టుడే: చెర్లోవంగల్లు గ్రామంలోని కామాక్షిదేవి సమేత భీమేశ్వరస్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం వేకువజాము వరకు శేషవాహనంపై స్వామిఅమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు.

జలాశయానికి 2,982 క్యూసెక్కుల వరద

అనంతసాగరం, న్యూస్‌టుడే: సోమశిల జలాశయంలో బుధవారానికి ఎగువ ప్రాంతాల నుంచి 2,982 క్యూసెక్కులు వరద నీరు వస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. జలాశయంలో 77.988కి 69.686 టీఎంసీల నీరు నిల్వ ఉండగా 326.253 అడుగుల మేర నీటిమట్టం నమోదైంది. -17, -18 రివర్స్ స్లూయిస్ ద్వారా 50, పవర్ టన్నల్ ద్వారా 1,800, 12వ క్రస్ట్‌గేట్ ద్వారా 1,600 క్యూసెక్కులు డెల్టాకు విడుదల చేస్తున్నారు. నాన్‌డెల్టాలైన కండలేరు వరద కాలువకు 400, దక్షిణ కాలువకు 200, ఉత్తర కాలువకు 300 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. రోజుకు సగటున 264 క్యూసెక్కులు ఆవిరవుతున్నట్లు ప్రాజెక్టు అధికారులు వివరించారు.

ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రతిజ్ఞ చేస్తున్న ఛైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి, సభ్యులు

బిట్రగుంట, కావలి, న్యూస్‌టుడే: బిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వర ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఆలయ ప్రాంగణంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి, కమిటీ సభ్యులతో ఈవో రాధాకృష్ణ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ కీర్తిని పెంచేలా కృషి చేస్తామన్నారు. ఆర్యవైశ్యులకు ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి ప్రాధాన్యమిస్తున్నారని తెదేపా జిల్లా అధికార ప్రతినిధి తటవర్తి రమేష్ అన్నారు. కావలిలో విలేకరులతో మాట్లాడుతూ బిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వర ఆలయ ఛైర్మన్‌గా మరోసారి శ్రీరాం మాల్యాద్రి ఎంపిక కావడం హర్షణీయమన్నారు.

దీన్ దయాళ్ కృషి ఎనలేనిది

జలదంకిలో నివాళులర్పిస్తున్న భాజపా నాయకులు

ఉదయగిరి, వింజమూరు జలదంకి, న్యూస్‌టుడే: సమాజంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఫలాలు అందాలనే అంత్యోదయ లక్ష్యం కోసం పండిట్ దీన్ దయాళ్ చేసిన కృషి ఎనలేనిదని భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.బ్రహ్మారెడ్డి అన్నారు. బుధవారం జలదంకిలో దీన్ దయాళ్ బలిదాన్ దివస్ సందర్భంగా పార్టీ శ్రేణులు ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. భాజపా మండల అధ్యక్షుడు ఎం.కిషోర్‌రెడ్డి, జలదంకి ఎంపీటీసీ సభ్యుడు కె.మాధవరావు పాల్గొన్నారు. ఉదయగిరిలో భాజపా కార్యాలయంలో దీన్‌దయాల్ సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు మాధవరెడ్డి, శ్రీహరి, శ్రీరాములు, సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. వింజమూరు భాజపా కార్యాలయంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు అంబటి ఈశ్వరరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

అంగన్‌వాడీ.. రక్షణ కొరవడి

సంగం, న్యూస్‌టుడే: సంగం మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా ఒక్కచోట కూడా ప్రహరీ లేకపోవడంతో చిన్నారులకు రక్షణ కరవైంది. మొత్తంగా 52 కేంద్రాలు ఉండగా.. 39 చోట్ల సొంత భవనాలున్నాయి, ఆరుచోట్ల అద్దె లేకుండా ఉచితంగానే ప్రైవేట్ భవనాల్లో నిర్వహిస్తుండగా.., మరో ఏడుచోట్ల అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

సిద్దీపురంలో ప్రహరీ లేని అంగన్‌వాడీ

మండలంలో కేంద్రాలు	: 52
బాలలు	: 1,923
గర్భిణులు	: 179
బాలింతలు	: 186

వాహనాలు, విషసర్పాలతో భయం

మండలంలో అత్యధికంగా అంగన్‌వాడీ కేంద్రాలు రహదారుల పక్కనే ఉన్నాయి. నిరంతరం వాహన సంచారంతో బాలలు జాగ్రత్తగా రహదారిని దాటుకుని వెళుతున్నారు. సంగంలో మిక్స్‌డ్ కాలనీలోని కేంద్రం రోడ్డు పక్కనే ఉండటంతో వాహనాల రద్దీకితోడు స్థానికులు వాహనాలను అడ్డగోలుగా నిలుపుతున్నారు. చిన్నారుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తిరమనతిప్ప కేంద్రం కొండ మీద ఎత్తుగా ఉంటుంది. అక్కడా సరైన సదుపాయాలు లేవు.

◗ జండాదిబ్బలో అంగన్‌వాడీ కేంద్రం కోవూరు కాలువ పక్కనే ఉంది. నిరంతరం సాగునీటి ప్రవాహం ఉంటోంది. ఏమాత్రం ఏమరపాటుగా ఉంటే చిన్నారులకు ప్రమాదం జరిగే అవకాశం ఉంది. సంగంలో ముత్తరాశిపాళెంలో కనిగిరి జలాశయం ప్రధానకాలువ గట్టున రక్షణ గోడ లేని ప్రదేశంలో కేంద్రం ఉంది. అధికారులు స్పందించి ఇప్పటికైనా ప్రహరీలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

◗ సిద్దీపురంలో అంగన్‌వాడీ కేంద్రం ప్రాథమిక పాఠశాల సమీపంలో పొలాల గట్టున ఉంది. దాంతో ఆ ప్రాంతంలో విషసర్పాలు, తేళ్ల సంచారంఉండటంతో చిన్నారుల తల్లిదండ్రులుఆందోళనకు గురవుతుంటారు. పలు స్వచ్ఛంద సంస్థలకు చెందిన సేవకులు తరచుగా అక్కడ పిచ్చిమొక్కలు, ముళ్ల చెట్లను తొలగిస్తున్నా కొంత కాలానికి సమస్య పునరావృతమవుతుంది.

◗ ఈ విషయమై ఆత్మకూరు ప్రాజెక్ట్ అధికారి సునీలతో మాట్లాడగా.. పీ-4 కార్యక్రమం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రహరీల నిర్మాణం చేపట్టాలని కోరుతూ ఆత్మకూరు ఆర్డీవోకు నివేదించామన్నారు.

రుణ లక్ష్యాలను పూర్తి చేయాలి

ఉదయగిరి, న్యూస్‌టుడే: ఆర్థిక సంవత్సరం త్వరలో ముగుస్తున్నందున ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను బ్యాంకర్లు పూర్తి చేయాలని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ మణిశేఖర్ సూచించారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉదయగిరి, సీతారామపురం, దుత్తలూరు, వరికుంటపాడు, మర్రిపాడు మండలాలకు చెందిన బ్యాంకర్లు, వెలుగు, పశు సంవర్ధక శాఖ అధికారులతో బుధవారం జేఎంఎల్‌బీసీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణ లక్ష్యాలను పూర్తి చేయటంతోపాటు రుణాలను రికవరీ చేయాలన్నారు.

‘ఉపాధి హామీ పథకాన్ని నీరుగారుస్తున్నారు’


గోడ ప్రతులు ఆవిష్కరిస్తున్న నాయకులు

కావలి, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నీరుగారుస్తుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. బుధవారం కావలిలో విలేకరులతో మాట్లాడారు. వీబీ జీ రాంజీ చట్టం తీసుకొచ్చి రాష్ట్రాలకు కేటాయిస్తున్న వాటా నిధులను 90శాతం నుంచి 60శాతానికి తగ్గించడం శోచనీయమన్నారు. ఉపాధి హామీ పరిరక్షణ యాత్రలో భాగంగా గురువారం రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆముదాలదిన్నెకు వస్తున్నారన్నారు. ఈ కార్యక్రమానికి కావలి, ఉదయగిరి నియోజకవర్గాల నుంచి నాయకులు, ప్రజలు తరలిరావాలని కోరారు. అనంతరం గోడ ప్రతులు ఆవిష్కరించారు. కాంగ్రెస్‌పార్టీ కావలి, ఉదయగిరి బాధ్యులు పొదలకూరు కల్యాణ్, అనిల్‌కుమార్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

(c) eenadu

గూడూరు

• గూడూరు • కోవూరు • సర్వేపల్లి

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) సమాచారం: 85002 02046
కోవూరు: 79950 67034, సర్వేపల్లి: 80085 73980

సమస్య: విడవలూరు మండల పరిధిలోని పార్లపల్లి పంచాయతీ పరిధిలో వీధి దీపాలు పగలు కూడా వెలుగుతున్నాయి. దీంతో విద్యుత్తు వృథా అవుతోంది. దీపాలు త్వరగా కాలిపోతున్నాయి. - స్థానికులు

సమాధానం: సిబ్బందికి చెప్పి దీపాలు పగలు వెలగకుండా చర్యలు తీసుకుంటాం. - తిరుపతయ్య, పంచాయతీ కార్యదర్శి

? కోవూరులోని బ్రాహ్మణ వీధిలో డ్రైనేజీ కాలువ పూడికతో నిండిపోయింది. దోమలతోపాటు దుర్వాసన అధికంగా ఉంది. - అవినాష్‌కుమార్

✓ పంచాయతీ కార్యదర్శికి చెప్పి కాలువల్లో పూడిక తీయిస్తాం. - శ్రీనివాసులు, ఎంపీడీవో

? కోట మండల పరిధిలోని శ్యామసుందరపురంలో మురుగుకాలువలు అధ్వానంగా ఉన్నాయి. దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సత్వరం పారిశుద్ధ్య పనులు చేపట్టాలని అవసరముంది. - జయప్రకాష్, స్థానికుడు

✓ ప్రజలకు ఇబ్బంది లేకుండా సమస్య పరిష్కరిస్తాం. - వేణు, డిప్యూటీ ఎంపీడీవో

? పొదలకూరు రూరల్ పరిధిలోని మారుతీ నగర్ మొదటి వీధిలో సైడు కాలువ ధ్వంసమై కొన్ని రోజులుగా నీరు పేరుకుపోయింది. -ప్రసన్నకుమార్, స్థానికుడు

✓ సిబ్బందికి చెప్పి శుభ్రం చేయిస్తాం. - యశ్వంత్ సింగ్, పంచాయతీ కార్యదర్శి

? కండలేరు జలాశయం నుంచి పొదలకూరుకు వచ్చే మంచినీరు రెండో పైపులైను నిర్మాణం పూర్తయినా సక్రమంగా విడుదల చేయడం లేదు. దీంతో కాలనీలు, ఆవాస ప్రాంతాలకు తాగునీరు ఇబ్బందిగా ఉంది. - వెంకటేశ్వర్లు, స్థానికుడు

✓ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి నీరు వచ్చేలా చర్యలు తీసుకుంటాం. - యశ్వంత్ సింగ్, పంచాయతీ కార్యదర్శి

? గూడూరు పురపాలక పరిధిలోని చెన్నూరు ప్రాంతంలో మురుగు కాలువ సక్రమంగా లేక పోవడంతో నీరు సాఫీగా వెళ్లడం లేదు. స్థానికంగా ఉండే ప్రజలు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. - విజయ్, చెన్నూరు.

✓ కాలువను శుభ్రం చేస్తాం. - వెంకటేశ్వర్లు, పురపాలక కమిషనర్

? తోటపల్లిగూడూరు మండలం అనంతపురం సమీపంలో పారుదల కాలువలో వ్యర్థాలు, గుర్రపుడెక్క, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. దీంతో నీటి పారుదలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. - రమణయ్య

✓ కాలువ మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. - అలీ, నీటిపారుదల శాఖ ఏఈ

? తోటపల్లిగూడూరు మండల పరిధిలోని వర కవిపూడి నుంచి అనంతపురం గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా ఉంది. వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. - శివశంకర్

✓ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వానికి నివేదించాం. - రమేశ్, పంచాయతీరాజ్ ఏఈ

మహాశివరాత్రి వేడుకలపై సమీక్ష

కోట, న్యూస్‌టుడే: గూడలిలోని కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 15న జరిగే మహాశివరాత్రి వేడుకలపై బుధవారం అధికారులు సమావేశం నిర్వహించారు. తహసీల్దారు జయజయరావు, ఎస్సై పవన్‌కుమార్, దేవాదాయశాఖ ఈవో పెంచలవర ప్రసాద్ ఏర్పాట్లపై ఆలయాన్ని పరిశీలించారు. అనంతరం సమీక్ష జరిపారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. తెదేపా నాయకులు వెంకటకృష్ణారెడ్డి, ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

గూడూరు డివిజన్‌లో సైదాపురం, మనుబోలు కలపాలి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరును కేవలం మూడు మండలాలకే పరిమితం చేయడం అన్యాయమని, గూడూరు డివిజన్‌లో సైదాపురం, మనుబోలు మండలాలను కలపాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి తెలిపారు. గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసిన అనంతరం ఏవో శిరీషకు వినతిపత్రం అందజేశారు. నాయకులు రామకృష్ణయ్య, పూల చంద్రశేఖర్, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పెరుమాళ్లపాడులో గ్రామసభ

సైదాపురం, న్యూస్‌టుడే: మండలంలోని పెరుమాళ్లపాడులో బుధవారం గ్రామసభ ఏర్పాటు చేశారు. వివిధ సమస్యలపై 12 వినతులు వచ్చినట్లు తహసీల్దారు సుభద్ర తెలిపారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

పురపాలక సంఘం	గూడూరు	అనధికార భవనాలు	506	వచ్చిన దరఖాస్తులు	188	ఆదాయం	రూ.35.47 లక్షలు

అనధికారమే అధికం.. దరఖాస్తులు తగ్గుముఖం

బీపీఎస్ సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్న పురపాలక అధికారులు

న్యూస్‌టుడే, గూడూరు పట్టణం

గూడూరు పురపాలక పరిధిలో బీపీఎస్ నత్తనడకన కొనసాగుతోంది. గత వైకాపా పాలనలో భవన నిర్మాణాలకు ఇష్టానుసారంగా అనుమతులిచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా భారీ భవంతులు నిర్మించారు. రెండు, మూడు అంతస్తులకు అనుమతులు పొంది, వాటిపైన మరొకటి వేశారు. అక్రమ భవనాలు క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం అవకాశమిచ్చినా చాలామంది ముందుకు రావడం లేదు. పురపాలక పరిధిలో వందల సంఖ్యలో ఉన్నా అవగాహన లేక కొందరు.. ఆసక్తి చూపక మరికొందరు, పలుకుబడితో ఇంకొందరు క్రమబద్ధీకరించుకోవడంలో అలసత్వం చూపుతున్నారు. మున్సిపల్ లైసెన్స్‌డ్ టౌన్ ప్లానర్(ఎల్‌టీపీ)లు ప్రభుత్వ ధరల కంటే అధికంగా చెప్పడంతో దరఖాస్తులు తక్కువగా వస్తున్నాయి. అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోకపోవడంతో అక్రమ నిర్మాణదారులు మిన్నకుండిపోతున్నారు.

గూడూరు పట్టణంలో భవనాలు

లక్ష్యానికి దూరంగా...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అక్రమ నిర్మాణాలు బీపీఎస్(బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం)ను అందుబాటులోకి తీసుకొచ్చింది. గూడూరు పురపాలక పరిధిలో 506 అక్రమ భవనాలున్నట్లు గుర్తించిన అధికారులు 188 దరఖాస్తులు రాగా, వాటిలో 24 అప్రూవల్ అయ్యాయి. 142 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇతర కారణాలతో 22 దరఖాస్తులు పరిశీలిస్తున్నారు. పట్టణంలోని 21 సచివాలయాల పరిధిలో యజమానులకు నోటీసులిచ్చినా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయాల్సిన బాధ్యత ప్లానింగ్ కార్యదర్శులదేనని అధికారులు చెబుతున్నారు. దీనిపై పట్టణ ప్రణాళిక అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో లక్ష్యానికి దూరంగా ఉన్నారు. బీపీఎస్ ద్వారా భవనాలన్నింటిని క్రమబద్ధీకరిస్తే సుమారు రూ.3 కోట్ల వరకు పురపాలక ఆదాయం రావచ్చని అధికారులు అంచనా. గడువు మరో నెల రోజులే మిగిలి ఉండడంతో క్రమబద్ధీకరణ సక్రమంగా పూర్తి చేస్తారా లేక సరిపెడతారా అన్నది ఆసక్తిగా మారింది.

గూడూరు అభివృద్ధికి సహకారమందించాలి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరు నియోజకవర్గ అభివృద్ధికి సహకారమందించాలని రాష్ట్ర విద్య, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ కోరారు. అమరావతిలో మంత్రిని బుధవారం ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పరిస్థితులు, ఇతర అంశాలపై చర్చించారు.

మంత్రి లోకేశ్‌తో ఎమ్మెల్యే సునీల్

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కోవూరు, న్యూస్‌టుడే: ఏపీ శాసన సభ బడ్జెట్ సమావేశాలు బుధవారం ప్రారంభమవగా కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి హాజరయ్యారు. ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగంలో పాల్గొని ప్రభుత్వం ప్రకటించిన అభివృద్ధి, సంక్షేమ ప్రణాళికలను ఆమె స్వాగతించారు. బడ్జెట్‌లో అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా ముఖ్యంగా మహిళా సంక్షేమం, గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేయాలని కోరారు. రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్ ప్రజల ఆశలకు అనుగుణంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

చదువుతో పాటు క్రీడల్లో సత్తాచాటాలి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: క్రీడారంగంలో రాణిస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ క్రీడా విభాగం హెచ్‌వోడీ షంషాద్‌బేగం తెలిపారు. గూడూరులోని డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో వార్షికోత్సవం సందర్భంగా స్పోర్ట్స్ మీట్‌ను బుధవారం నిర్వహించారు. విద్యార్థినులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కరస్పాండెంట్ మెహర్‌జ్యోతి, ప్రిన్సిపల్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు అందుకున్న వారితో అతిథులు

భూపరిహారం చెల్లించాలని డిమాండ్

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: చిల్లకూరు, కోట మండలాల్లోని తమ్మినపట్నం, కొత్తపట్నం పంచాయతీల్లో క్రిస్‌సిటీ కోసం భూములు అందించిన రైతులకు నష్టపరిహారం అందించాలని రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి సతీష్‌యాదవ్ తెలిపారు. గూడూరులోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద బుధవారం రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేసి, ఏవో శిరీషకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ చొరవతో రూ.1.20 లక్షలు ఉన్న పరిహారం, రూ.8 లక్షలకు సీఎం చంద్రబాబు పెంచారని చెప్పారు. కానీ అధికారులు ఇప్పటి వరకు కేవలం 40శాతం మందికి మాత్రమే పరిహారం అందించారని, 60శాతం మందికి అందలేదని తెలిపారు. నాయకులు, రైతులు శంకరయ్య, రామయ్య, చెంగల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, రైతులు

గుత్తేదారులకిచ్చారు.. అసంపూర్తిగా వదిలేశారు

న్యూస్‌టుడే, కలువాయి

వెంకటగిరి నియోజకవర్గ పరిధిలో గత వైకాపా పాలనలో కలువాయి మండలంలో మొత్తం 30 లేఅవుట్లు వేసి గృహాలు నిర్మిస్తామని హడావుడి చేశారు. వాటిలో గుత్తేదారుల ఆప్షన్ కింద 16 లేఅవుట్లను అప్పగించారు. మండలంలో 16 లేఅవుట్లలో 966 గృహాలు గుత్తేదారులు నిర్మించాల్సి ఉండగా వాటిలో 424 మాత్రమే ప్రారంభించి వివిధ దశల్లో అసంపూర్తిగా వదిలేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అసంపూర్తిగా ఉన్న గృహాలను పూర్తి చేసి పేదలకు అందించేందుకు చర్యలు చేపట్టింది. మండలంలో ప్రభుత్వ గృహాలకు ఎంత వరకు పని చేశారో గుత్తేదారులకు బిల్లులు చెల్లించారు. అసంపూర్తిగా వదిలేసిన పూర్తి చేయించేందుకు ముందుకు రావడం లేదు. ప్రభుత్వం వారితోనే పనులు పూర్తి చేయించాలని ఆదేశించింది. త్వరగా పూర్తిచేసి అందజేయాలని లబ్ధిదారులు విన్నవిస్తున్నారు.

కలువాయిలో అసంపూర్తిగా గృహాలు

కార్మికుల సమస్యలపై ఐక్యంగా పోరాడదాం

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా గురువారం జరుగుతున్న కార్మికుల సమ్మెలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని వామపక్షాల నాయకులు పిలుపునిచ్చారు. గూడూరులోని గడియార స్తంభం కూడలి నుంచి పట్టణంలో ద్విచక్రవాహన ర్యాలీని బుధవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేసేంత వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. నాయకులు జోగి శివకుమార్, రమణయ్య, మణి తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న వామపక్షాల నాయకులు

మాజీ ఎమ్మెల్యే ప్రసన్న పరామర్శ

కోవూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఒక గ్రామంలో ఇటీవల మృతి చెందిన బాలిక కుటుంబ సభ్యులను వైకాపా మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. అండగా ఉంటామని పేర్కొన్నారు.

గోడపత్రికల ఆవిష్కరణ

వెంకటాచలం, న్యూస్‌టుడే: 'ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పిద్దాం... ఊరి బడిని కాపాడుకుందాం' నినాదంతో యూటీఎఫ్ చేపట్టిన కార్యక్రమ గోడపత్రికను వెంకటాచలం ఎంపీడీవో కల్పన, ఎంఈవో సుధీర్ ప్రేమ్ కుమార్‌లు బుధవారం ఆవిష్కరించారు. విద్యారంగం పరిరక్షణతో పాటు, సర్కారు పాఠశాలల్లో పిల్లల నమోదు పెంచేందుకు చేపడుతున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘం నాయకులు కోరారు.

నగదు చెల్లించలేదని ఫిర్యాదు

వెంకటాచలం, న్యూస్‌టుడే: బియ్యం కొనుగోలు చేసి నగదు ఇవ్వకుండా మోసం చేసి బెదిరిస్తున్న ఘటనపై వెంకటాచలం పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. నెల్లూరుకు చెందిన మొగిలి మౌనిక కృష్ణపట్నం పోర్టు రోడ్డులో భవిష్య శ్రీ ట్రేడర్స్ పేరుతో బియ్యం వ్యాపారం చేస్తున్నారు. వీరి వద్ద పుదుచ్చేరికి చెందిన ఏజే ఫుడ్స్ నిర్వాహకులు, మధ్యవర్తిగా ఉన్న రాము రూ.19.30 లక్షల విలువైన బియ్యం కొనుగోలు చేసి నగదు చెల్లించలేదు. అడుగుతుంటే బెదిరిస్తుండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అధ్వానం.. అంగన్‌వాడీ భవనం

పొదలకూరు మండలం నరసింహ కండ్రిగ ప్రధాన రహదారి వద్ద నిర్మించిన అంగన్‌వాడీ భవనం పగుళ్లు ఏర్పడి అధ్వానంగా ఉంది. గత వైకాపా పాలనలో వీటిని నాసిరకంగా నిర్మించగా కొన్ని నెలలకే గోడలు ధ్వంసమై బీటలు వారాయి. ముఖ ద్వారం వద్ద ఉన్న మెట్లు సైతం ధ్వంసమవడంతో చిన్నారులు కార్యాలయానికి వచ్చి వెళ్లే సమయంలో గాయపడతారేమోనని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా భవనానికి మరమ్మతులు చేపట్టాలని విన్నవిస్తున్నారు. - న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్

ఇక్కడ కాలువ ఎక్కడుందో..?

తోటపల్లిగూడూరు మండలం మల్లికార్జునపురంలో వ్యర్థ జలాలు వెళ్లేందుకు మార్గం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎస్సీ., ఎస్టీ కాలనీల పక్కన వ్యర్థ జలాలు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన పారుదల కాలువ పిచ్చి మొక్కలు, వ్యర్థాలతో నిండిపోయింది. దీంతో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువ మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తోటపల్లిగూడూరు

ఎట్టకేలకు నిర్మాణం

కోవూరు పట్టణ పరిధిలోని కోనేటి మిట్ట వీధిలో కొన్నేళ్లుగా మురుగు కాలువలు లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గత వైకాపా పాలనలో పలు మార్లు ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక కాలువ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఎట్టకేలకు ఆక్రమణలు తొలగించి కాలువ పనులు ప్రారంభించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, కోవూరు

ఆక్రమిస్తున్నా పట్టించుకోరేం..!

విద్యానగర్‌లోని బస్‌షెల్టర్ ఆక్రమణలకు గురవుతోంది. విద్యానగర్‌లో కళాశాల విద్యార్థులు, ప్రయాణికులు బస్సుల కోసం వేచి ఉండేందుకు మూడు దశాబ్దాల క్రితం బస్సుషెల్టరు నిర్మించారు. రెండేళ్లుగా షెల్టరులోనే వాహనాలు పార్కింగ్ చేస్తూ ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రయాణికులు ఎండలోనే నిలుస్తున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు విన్నవిస్తున్నారు.- న్యూస్‌టుడే, కోట

రోడ్డంతా గుంతలమయం

విడవలూరు - తుమ్మగుంట మార్గంలో రోడ్డు గుంతలు ఏర్పడి అధ్వానంగా ఉంది. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు బాగు చేయాలని పలువురు కోరుతున్నారు. ఆర్‌అండ్‌బీ ఏఈ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతిపాదనలు పంపామని, ప్రభుత్వం టెండర్లు పిలిచిన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు.- న్యూస్‌టుడే, విడవలూరు

ఫార్మర్ రిజిస్ట్రీ.. సాగుదారులకు భవిష్య నిధి

న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్

రైతులకు ప్రభుత్వ పథకాలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 'ఫార్మర్ రిజిస్ట్రీ' నమోదు ప్రక్రియ చేపట్టింది. అసైన్డ్ పొలాలు మినహా సాగు భూమి ఉన్న ప్రతి రైతుకు 11 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య జారీ చేస్తారు. ఈ క్రమంలో పీఎం కిసాన్‌తో భవిష్యత్తులో వివిధ పథకాల అమలుకు ఇది తప్పనిసరి కానుంది.

ఇదీ ప్రయోజనం..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పెట్టుబడి సాయం, ఎరువుల రాయితీలు, పంట బీమా, పంట దిగుబడుల విక్రయాలతో పాటు అవసరమైన పంట దిగుబడులు పొందడానికి ఈ సంఖ్య తప్పనిసరి కానుంది. ఈ నేపథ్యంలో అందరూ తప్పని సరిగా తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు కోరుతున్నారు.

డేగపూడి ఆర్‌ఎస్‌కేలో నమోదు చేయిస్తున్న ఏవో ప్రతాప్

కొనసాగుతున్న నమోదు..

రైతుకు 11 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు(యూనిక్ ఐడీ) సంఖ్య నమోదు (ఫార్మర్ రిజిస్ట్రీ) ప్రక్రియను గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఏడాది నుంచి వీఏఏలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని 36 మండలాల్లో 2,68,535 రైతులకుగాను 1,90,663 మంది చేసుకున్నారు. ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం వివరాలు, ఆధార్‌తో అనుసంధానమైన చరవాణి నంబరు వివరాలిస్తే సిబ్బంది నమోదు చేస్తారు. అనంతరం రైతు ఇచ్చిన చరవాణికి 11 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య వస్తుంది. గూడూరు, కోవూరు, సర్వేపల్లి, వెంకటగిరి నియోజకవర్గాల్లో ఈ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది.

● ఏవో ప్రతాప్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు వర్తించేందుకు 'ఫార్మర్ రిజిస్ట్రీ' తప్పనిసరి అన్నారు. భవిష్యత్తులో దీనినే ప్రమాణికంగా తీసుకునే అవకాశం ఉందని ఈ నేపథ్యంలో రైతులందరూ తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలోని అన్ని రైతుసేవా కేంద్రాల్లో గ్రామ సహాయకులు నమోదు చేస్తున్నారని సంబంధిత పత్రాలతో సంప్రదించాలని సూచించారు.

వైద్యాధికారుల విచారణ

రాపూరు, న్యూస్‌టుడే: రాపూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రకాశం, తిరుపతి జిల్లాల వైద్య ఆరోగ్య శాఖ అధికారులు బుధవారం విచారణ చేపట్టారు. 2017-19 మధ్య వైద్యాధికారిగా ఉన్న చంద్రశేఖర్‌పై వచ్చిన అభియోగాలపై పలు దస్త్రాలు పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని పేర్కొన్నారు.

ధర్మ పరిరక్షణకు తిరుమల పాదయాత్ర

ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: దేశం, రాష్ట్రంలో ధర్మ పరిరక్షణకు తిరుమల పాదయాత్ర చేసేందుకు నడుం బిగించారు. మండల పరిధిలోని డేవిస్‌పేట గ్రామస్థులు వంద మందికిపైగా ఆదివారం పాదయాత్రగా బయలుదేరారు. బుధవారం రాత్రి కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తాం

కొడవలూరు, న్యూస్‌టుడే: పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంపీడీవో వెంకటసుబ్బారావు పేర్కొన్నారు. కొడవలూరులో బుధవారం సమీక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి పాఠశాలకు ఒక అధికారిని నియమించామన్నారు. వారు సందర్శించి విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

యునానీ వైద్యం సద్వినియోగం చేసుకోవాలి

వెంకటాచలం, న్యూస్‌టుడే: యునాని వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారిణి పర్వీన్ బాబి సూచించారు. వెంకటాచలంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులకు మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద వైద్యశిబిరం నిర్వహించి రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. కసుమూరు, ఏఎస్‌పేట యునాని వైద్యులు రవిబాబు, జాకిరుద్దీన్ పాల్గొన్నారు.

కేకు కోస్తున్న వైద్యులు, విద్యార్థులు

పాఠశాలకు ఫర్నిచర్ వితరణ

వెంకటాచలం, న్యూస్‌టుడే: మండలంలోని పూడిపర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు గ్రామానికే చెందిన పోతిరెడ్డి సుధాకర్ రెడ్డి రూ.25వేల విలువ జేసే తరగతి గదిలోని టేబుళ్లు అందజేయగా.. మణెయ్య, నరేంద్ర రెడ్డిలు కుర్చీలు సరఫరా చేశారు. వీరిని పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం కృష్ణయ్య, స్థానికులు అభినందించారు.

ట్రాక్టర్ కింద పడి వృద్ధుడి దుర్మరణం

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: పెన్నానదిలో ఇసుక తరలిస్తూ ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి వృద్ధుడు మృతిచెందిన ఘటన జొన్నవాడలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పెనుబల్లికి చెందిన రసూల్(64) జొన్నవాడ వద్ద పెన్నానదిలో ఇసుకను తరలిస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ టైరు కింద పడి ప్రాణాలు కోల్పోయారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంతోష్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

చిల్లకూరు, న్యూస్‌టుడే: మండలంలోని బూదనం టోల్‌ప్లాజా సమీపాన జాతీయ రహదారిపై బుధవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలయ్యాయి. గూడూరు చవటపాలెం ప్రాంతానికి చెందిన డేగా పెద్దయ్య రోడ్డు దాటుతుండగా ప్రమాదం జరిగింది. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఎన్‌హెచ్‌ఏఐ అంబులెన్స్‌లో గూడూరులోని ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు.

విద్యుదాఘాతంతో దుకాణం దగ్ధం

మనుబోలు, న్యూస్‌టుడే : విద్యుదాఘాతంతో ఫ్యాన్సీ దుకాణం దగ్ధమైన ఘటన స్థానిక కోదండరామపురంలో మంగళవారం రాత్రి చోటుచేసుకొంది. వివరాలమేరకు గ్రామానికి చెందిన సురేష్ ఫ్యాన్సీ దుకాణం నిర్వహిస్తున్నారు. దుకాణాన్ని మూసి ఇంటికెళ్లిన కొద్దిసేపటికి మంటలు వ్యాపించడంతో అటుగా వెళుతున్న స్థానికులు గుర్తించి యజమానికి సమాచారమిచ్చారు. స్థానికులు, చుట్టుపక్కల వారి సాయంతో మంటలను అదుపులోకి తెచ్చారు. విద్యుదాఘాతం కారణంగా దుకాణంలో ఫ్యాన్సీ వస్తువులు కాలిపోయాయని, సుమారు రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయారు.

స్పందిస్తే... మీరే ప్రాణదాతలు

వెంకటాచలం వద్ద జరిగిన ప్రమాదంలో క్షతగాత్రులు

న్యూస్‌టుడే, వెంకటాచలం

సామాజిక మాధ్యమాల ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రస్తుత రోజుల్లో రోడ్డు ప్రమాదం జరిగితే ప్రజలు ఆదృశ్యాలను చరవాణిలో బంధించేందుకు చూపించే శ్రద్ధ క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించడంలో ఉండడం లేదు. చట్టపరమైన పరిణామాలకు భయపడి అనేక మంది సాయమందించేందుకు వెనకడుగు వేస్తున్నారు. దీనిని నివారించి ప్రమాద బాధితులను రక్షించేందుకు కేంద్రం 2021లో 'గుడ్ సమారిటన్' (కష్ట కాలంలో ఇతరులకు స్వచ్ఛందంగా సహాయం చేయగలిగే వ్యక్తి) పథకాన్ని ప్రవేశపెట్టింది. దీని ద్వారా ప్రమాద బాధితులను ఆసుపత్రికి తరలించి వారి ప్రాణాలు నిలిపిన వారికి నగదు ప్రోత్సాహకం అందిస్తోంది.

● జిల్లాలో 5 జాతీయ, 14 రాష్ట్ర రహదారులు ఉన్నాయి. వేగం కారణంగా 2024లో 843, 2025లో 928 ప్రమాదాలు జరిగాయి. 2025లో 514 మంది మృతిచెందగా 894 మంది క్షతగాత్రులయ్యారు. కావలి నుంచి కోట వరకు ఉన్న జాతీయ రహదారితో పాటు... ఇతర రహదారుల్లోనూ నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. గోల్డెన్ అవర్‌లో ప్రథమ చికిత్స అందక పలువురు మృత్యువాత పడుతున్నారు. ఈ క్రమంలో సాయానికి మన వంతుగా మానవత్వంతో ముందుకెళ్లాల్సిన అవసరముంది. ఏదైనా ప్రమాదం సంభవిస్తే గోల్డెన్ అవర్‌లో తీసుకొస్తే ప్రాణాలు కాపాడే అవకాశముందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అధిక శాతం ప్రమాదాల్లో గంటలోపు ఆసుపత్రికి తరలించడం సాధ్యపడడం లేదు. స్థానికులు సకాలంలో స్పందించకపోవడమే ప్రధాన కారణం. బాధితులకు సాయం చేసిన వ్యక్తికి రూ.25 వేలు నగదు ప్రోత్సాహం ఇవ్వడంతో పాటు ఉత్తమ పౌరుడిగా గుర్తించి పురస్కారం, ప్రశంసాపత్రం అందజేస్తున్నారు. దీనిపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరముంది.

ప్రోత్సాహకం ఎలా పొందాలంటే..

ప్రాణాపాయంలో ఉన్న వారిని ఆసుపత్రికి తీసుకెళ్లాక సంబంధిత స్టేషన్‌కు సమాచారమిస్తే పోలీసులు ఓ లేఖ ఇస్తారు. దీనికి ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా, ఆసుపత్రి ధ్రువీకరణ పత్రాలను జత చేసి తహసీల్దారుకు దరఖాస్తు చేయాలి. రవాణా, రెవెన్యూ, పోలీసు, జాతీయ రహదారుల సంస్థ, వైద్యశాఖలకు చెందిన అధికారుల కమిటీ గుర్తించి ప్రోత్సాహానికి ఎంపిక చేస్తుంది. గోల్డెన్ అవర్‌పై ప్రజలకు ప్రతి పోలీసుస్టేషన్ పరిధిలో అవగాహన కల్పిస్తున్నామని పోలీసులు చెబుతున్నారు.

● వెంకటాచలం సీఐ సుబ్బారావు మాట్లాడుతూ... ప్రమాదం జరిగిన వెంటనే గాయపడిన వారిని నేరుగా ఆసుపత్రికి తరలించి.. తక్షణం వైద్యసేవలందిస్తే క్షతగాత్రులు కోలుకుంటారన్నారు. మరణాలు తగ్గుతాయని, మానవత్వంతో స్పందించాలన్నారు. గుడ్ సమారిటన్ గురించి ప్రజలకు మరింత అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.

ఉత్తరక్రియలు

ఆదరణ, అనురాగాలతో అందరిని అలరించిన మమతానురాగాల అమృతమూర్తి, మా తాత గారైన **శ్రీ మద్దు వెంకట కృష్ణారెడ్డి గారు** తే 29-01-2026 గురువారం సా॥ 5.20 ని॥లకు మమ్ములను వీడి దైవసాన్నిధ్యం చేరారు. వారి ఆత్మకు శాంతి కలిగించాలని భగవంతుని అశ్రునయనాలతో ప్రార్థిస్తున్నాము.

కీ॥శే॥ మద్దు వెంకటకృష్ణారెడ్డి గారు
కోవూరు

పెద్దకర్మ
తేది: 12-02-2026 గురువారం ఉదయం 10.00 గంటలకు కోవూరు శాంతినగర్, 3వ వీధిలోని మా స్వగృహము నందు జరుగును. కావున తెలియజేయడమైనది.

G. యశ్వంత్ సాత్విక్ రెడ్డి, G. సాహితి మాధుర్య, M. కార్తిక యశశ్విని, M. ధృతినయన

గుడ్‌లక్ ఐస్ ఇండస్ట్రీస్, L.S. స్కిన్‌కేర్ హాస్పిటల్, MVR ఐస్ ఇండస్ట్రీస్,
సెల్ : 9989453627, 9490079106.

(c) eenadu

నెల్లూరు
•నెల్లూరు •నెల్లూరు గ్రామీణం

విధుల్లో అప్రమత్తత తప్పనిసరి

నెల్లూరు (నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నగరంలోని 54 డివిజన్లలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు ఉపకరణాలను తప్పనిసరిగా వినియోగించాలని నగర ఇన్‌ఛార్జి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ సూచించారు. బుధవారం కార్యాలయంలో ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంటు ప్రతినిధుల ఆధ్వర్యంలో కార్మికులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధుల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. కమిషనర్ నందన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంపై ప్రజలందరికీ అవగాహన కల్పించి భాగస్వాములయ్యేలా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు డాక్టర్ ఎల్.వెంకటేశ్వర్లు, దొరసాని, రేవతి తదితరులు పాల్గొన్నారు.

గూడూరును రెవెన్యూ డివిజన్‌గా కొనసాగించండి

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: గూడూరును రెవెన్యూ డివిజన్‌గా కొనసాగించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంట శ్రీనివాసులురెడ్డి కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో జేసీ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రిటీషు కాలం నుంచే రెవెన్యూ డివిజన్‌గా కొనసాగుతుందన్నారు. గత ప్రభుత్వం జిల్లాల విభజన పేరుతో ముక్కలుగా చేసిందని, అంతకుమించి తెలుగుదేశం ప్రభుత్వం అడ్డగోలుగా విడగొట్టిందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సంజయ్‌కుమార్, నాయకులు మల్లికార్జున్‌రెడ్డి, కిషోర్, సుధీర్, ఇర్ఫాన్, రాజా పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా! (10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: సుందరయ్య కాలనీలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. వీధుల్లో గుంపులుగా తిరుగుతుండడంతో విద్యార్థులు, వృద్ధులు భయాందోళన చెందుతున్నారు. – లక్ష్మమ్మ

సమాధానం: కుక్కలను పట్టించేందుకు చర్యలు చేపడతాం. – డాక్టర్ మదన్‌మోహన్, నగరపాలక సంస్థ వెటర్నరీ అధికారి

? ఫత్తేఖాన్‌పేటలో కాలువలు శుభ్రం చేయడం లేదు. మురుగునీరు నీరు నిలిచి దుర్వాసన వస్తోంది. దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. – నారాయణ, స్థానికుడు

✓ కాలువలను శుభ్రం చేయిస్తాం. – డాక్టర్ దినేష్‌కుమార్, ఆరోగ్యాధికారి

- న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)

ఆక్రమణలను స్వచ్ఛందంగా తీసేయాలి: కమిషనర్

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నగరంలోని ఆత్మకూరు బస్టాండు ప్రాంతంలో రోడ్డుపై ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని కమిషనర్ వైవో నందన్ ఆదేశించారు. బుధవారం శెట్టిగుంట రోడ్డు, ఆత్మకూరు బస్టాండు, వెంకటేశ్వరపురం, పుత్తా ఎస్టేట్, రామ్మూర్తినగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. వెంకటేశ్వరపురంలో షాదీమంజిల్ పనులను పరిశీలించి నాణ్యతాప్రమాణాలు పాటించాలని సూచించారు. రామ్మూర్తినగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు, పుత్తా ఎస్టేట్‌లోని ఉయ్యాల కాలువను పరిశీలించారు. కార్యక్రమంలో స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయాల అదనపు కమిషనర్ హిమబిందు, ఎస్ఈ రహంతుజానీ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంకే లక్ష్యం

'న్యూస్‌టుడే'తో ఆరోగ్యాధికారి డాక్టర్ దినేష్‌కుమార్

ముఖాముఖి

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నగరంలో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నాం.. నగరాన్ని పరిశుభ్రంగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం.. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంకు సాధించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం.. ఇవీ నగరపాలకసంస్థ ఆరోగ్యాధికారి డాక్టర్ దినేష్‌కుమార్ చెప్పిన మాటలు. 'న్యూస్‌టుడే'తో ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

190 వాహనాల్లో చెత్త తరలింపు

నగరంలో నిత్యం 320 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుంది. 190 వాహనాల ద్వారా దీన్ని తరలిస్తున్నాం. కాలువల్లో ప్రతిరోజూ పూడిక తీయడంతో పాటు రెండో రోజే ఆ మట్టిని తరలిస్తున్నాం. పూడికతీత, చెత్త సేకరణ సమయంలో స్థానికుల సంతకాలు తీసుకుంటున్నాం. మురికివాడలపై దృష్టి సారించాం. 1260 మంది కార్మికులు ప్రతిరోజూ పారిశుద్ధ్య పనుల్లో పాల్గొంటున్నారు. 26 స్వీపింగ్ యంత్రాలతో వీధులను శుభ్రం చేయిస్తున్నాం.

దోమలపై దండయాత్రకు బృందాలు

నగరంలోని 54 డివిజన్లలో 166 సచివాలయాల పరిధిలో దోమల నివారణకు బృందాలను ఏర్పాటు చేశాం. 50 ఫాగింగ్ యంత్రాలు, 160 స్ప్రేయర్లు, 6 స్ప్రేడ్‌స్ప్రేయర్లు, రెండు మోటారు వాహనాలతో ఫాగింగ్ చేయిస్తున్నాం. దోమల నివారణ మందు పిచికారీతో పాటు నీరు నిల్వ ఉన్న స్థలాల్లో ఆయిల్ బాల్స్ వేయిస్తున్నాం. కాలువల్లో గంబూషియా చేపలను వదలనున్నాం. అయిదుగురు సభ్యులతో 11 బృందాలు ప్రతిరోజూ 11 డివిజన్లలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాయి.

ఏడు రోజుల్లో జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ

నిర్దేశించిన ఏడు రోజుల్లోపు జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్నాం. ప్రస్తుతం 120 దరఖాస్తులు మాత్రమే ఉన్నాయి. రెండు రోజుల్లో వాటిని కూడా పూర్తి చేస్తాం. ఎవరూ దళారులను ఆశ్రయించవద్దు. మాంసం దుకాణాలపై నిఘా పెడతాం. నిల్వ ఉన్న మాంసం విక్రయిస్తున్నా.. రంగులు కలిపినా కఠిన చర్యలు తీసుకుంటాం.

ట్రేడ్‌లైసెన్సుల వసూలుపై దృష్టి

నగరంలో 8,500 దుకాణాలు ఉన్నాయి. రూ.18 కోట్ల లైసెన్సు ఫీజు బకాయికు గాను రూ.15.46 కోట్లు వసూలయ్యాయి. మిగిలిన రూ.2.54 కోట్లు నెల రోజుల్లోగా వసూలు చేస్తాం. ఇంకా అనేక దుకాణాలు, ఫంక్షన్ హాళ్లు, హోటళ్లకు సంబంధించి వసూలుకావాల్సి ఉంది. లైసెన్సులు లేని దుకాణాలపై దాడులు చేసి ఫీజు వసూలు చేస్తాం.

ప్లాస్టిక్ రహితనగరంగా..

ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నాం. అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. నిషేధిత ప్లాస్టిక్ విక్రయిస్తున్న దుకాణాలపై దాడులు చేసి రూ.500 నుంచి రూ.5 వేల వరకు జరిమానా విధిస్తున్నాం. ప్రజలు కూడా ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ వస్తువులు వాడాలి.

అభివృద్ధికి సహకరించండి

నెల్లూరు(నగరపాలకసంస్థ) : ఏపీఐఐసీ ఛైర్మన్ ఎం.రామరాజును తెలుగుదేశం పార్టీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి బుధవారం విజయవాడలో కలిసి శాలువాతో సత్కరించారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గం ఆమంచర్లలో 59.61 ఎకరాల్లో రూ.13.26 కోట్లతో అభివృద్ధి పనులు మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. రెండో విడత పనులకు సహకరించాలని కోరారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలో రూ.27 కోట్లతో చేస్తున్న 240 అభివృద్ధి పనులు నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని తెదేపా నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం 36వ డివిజన్ బట్వాడిపాలెం సెంటరులో పర్యటించారు.

విషపురుగులతో భయం.. భయం

నగరంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ఏపీ భవనం నుంచి మార్చురీకి వెళ్లే దారిలో దీపాలు వెలగక పోవడంతో విషపురుగులు తిరుగుతున్నాయి. ఈమార్గంలో రాకపోకలు సాగించేందుకు రోగులు, సిబ్బంది భయపడుతున్నారు. దీనిపై ఆప్కాస్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు బుధవారం సూపరింటెండెంట్ మాధవికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, రాజీవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
– నెల్లూరు (వేదాయపాలెం), న్యూస్‌టుడే

నిబంధనలు పట్టని ట్రాక్టర్లు

నగరంలో ట్రాక్టర్లకు నిబంధనలు పట్టడం లేదు. భవన శిథిలాలు, ఇసుక తరలిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ట్రక్కుల్లో బండరాళ్లు, భవన శిథిలాలతో వెనుక వైపు డోరు కూడా వేయకుండా తరలిస్తున్నారు. గతుకుల్లో ఏ మాత్రం అదుపు తప్పినా.. వెనుక వైపు వచ్చే పాదచారులు, ద్విచక్రవాహనాలపై బండరాళ్లు పడే అవకాశం ఉంది. – న్యూస్‌టుడే, నెల్లూరు (టౌన్)

కొమ్మలు కొట్టారు.. తొలగించడం మరిచారు

నగరంలోని వనంతోపులో పది రోజులుగా రోడ్డు అంచున ఉన్న చెట్ల కొమ్మలతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్తు తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను కొట్టి తొలగించలేదు. రాత్రిళ్లు వీటి కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి.
– న్యూస్‌టుడే, నెల్లూరు (విద్య)

డంపింగ్ యార్డ్ కాదు.. కాలువే..

నగరంలోని 11వ డివిజన్ రాయపుపాలెం హైవే వెంబడి కాలువ గోడల నిర్మాణ పనులు నిలిచిపోయి ఏళ్లు గడిచింది. ఎగువ నుంచి కాలువలో వచ్చే మురుగులో చెత్త, చెదారాలు, వ్యర్థాలు నిలిచిపోయి పేరుకుపోతున్నాయి. కాలువలో పూడిక తీసి చాలా కాలం అయింది. ఈ ప్రాంతం అంతా దుర్వాసన వెదజల్లుతూ, విషపురుగులకు ఆవాసంగా మారింది.
–న్యూస్‌టుడే, నెల్లూరు(నవాబుపేట)

మూడునెలలైనా.. పట్టించుకోరా?

నెల్లూరు నగరం ఆర్ అండ్ బీ కార్యాలయం ఎదురుగా జీఎన్‌టీ రోడ్డు అధ్వానంగా తయారైంది. సగం రోడ్డు వరకు పగిలి రాకపోకలకు ఆటంకంగా మారింది. వేగంగా వచ్చే వాహనాలు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. మూడు నెలలుగా రోడ్డు దారుణంగా ఉన్నా ఎవరూ పట్టించుకోవడంలేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(మార్కెట్ సెంటర్)

In The Court of the Principal Junior Civil Judge, Nellore
E.P.No. 150/2025
O.S.No. 541/2021
Chandra Prasad ... DHR
Vs
Chandaluri Sailaja ... JDR
Notice to JDR
Chandaluri Sailaja W/o Venkata Kota Siva Prasad @ Prasad, Residing at Old D.No. 16/3/1249, New D.No. 16-11-448, 2nd Street, Haranadha puram, Nellore City.
[illegible] 24-2-2026వ తేదీ ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గాని వకీలు ద్వార గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసింది లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
వి.నరసింహారావు, డిక్రీ హోల్డరు అడ్వకేట్, నెల్లూరు.

సైకిల్ యాత్రను ప్రారంభిస్తున్న పోలీసు అధికారులు

నెల్లూరుకు చేరుకున్న సీఐఎస్ఎఫ్ సైకిల్ ర్యాలీ

నెల్లూరు (వేదాయపాలెం), న్యూస్‌టుడే: కేంద్ర పారిశ్రామిక భద్రత దళం (సీఐఎస్ఎఫ్) చేపట్టిన వందేమాతరం కోస్టల్ సైక్లోథాన్ సభ్యులకు బుధవారం నగరంలో పోలీసు అధికారులు స్వాగతం పలికారు. సీనియర్ కమాండెంట్ సంజిత్‌కుమార్ మాట్లాడుతూ వందేమాతరం రచించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మాతృభూమి రక్షణ, దేశం కోసం త్యాగాలు చేయాల్సిన అవసరాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్దేశంతో ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జనవరి 28న కోల్‌కతాలో ప్రారంభమైన ఈ యాత్ర ఈ నెల 23న కేరళ రాష్ట్రంలోని కొచ్చిలో ముగుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ దీక్ష, ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, కోస్టల్ గార్డ్ కృష్ణపట్నం పోర్టు కమాండెంట్ కార్తీక్, మారుతి నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ షామిలి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

విక్రమ్‌నగర్.. సమస్యలతో బేజార్

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే

అసంపూర్తి రోడ్లు.. పూడికతో నిండిన కాలువలు.. పరిసరాల అపరిశుభ్రతతో విక్రమ్‌నగర్ వాసులు నిత్యం నానాఇబ్బందులు పడుతున్నారు. అయ్యప్పగుడి సమీపంలో ఉన్న ఈ కాలనీలో తొమ్మిది వీధులు ఉన్నాయి. సిమెంట్ రోడ్లు అసంపూర్తిగా నిర్మించారు. అడ్డ వీధి నుంచి ప్రధాన వీధిని కలిపేలా రహదారి నిర్మాణం చేపట్టలేదు. మధ్యలో కొంత భాగం వదిలేయడంతో మట్టి రోడ్డుతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మార్జిన్ వద్ద గుంతలమయంగా ఉండడంతో వాహనదారులు అసౌకర్యానికి గురవుతున్నారు. అసలు రోడ్డే వేయని వీధులు మరీ దారుణంగా ఉన్నాయి. పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. పూడిక సక్రమంగా తీయకపోవడంతో మురుగునీరు ముందుకు కదలడం లేదు. కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. మురుగులో వృద్ధి చెందుతున్న దోమలతో వ్యాధులు ప్రబలుతున్నాయి. చెత్త సేకరణ సక్రమంగా జరగకపోవడంతో పలువురు రహదారులపైనే వేస్తున్నారు. దీంతో అపరిశుభ్రంగా మారుతున్నాయి. జాతీయ రహదారి పక్కనే ఉండడంతో దుమ్ము సమస్య తీవ్రంగా ఉంటోంది. ప్రస్తుతం వంతెన నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఈ కారణంగా లేస్తున్న దుమ్ముతో ఇబ్బందులు పడుతున్నారు. వానొస్తే వీరు పడే కష్టాలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద జలాలతో ముంపునకు గురవుతుంది. ప్రధాన రహదారితోపాటు కాలనీల్లోని వీధులు నీట మునగడంతో ఇళ్లలో నుంచి బయటకు రాలేకపోతున్నారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

పూడికతో నిండిన కాలువ

సీఎంఏ ఫలితాల్లో రావూస్ విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న రావూస్ సంస్థ డైరెక్టర్ శివసంకేత్

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : సీఎంఏ ఇంటర్, ఫైనల్ ఫలితాల్లో తమ సంస్థ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారని రావూస్ విద్యా సంస్థల డైరెక్టర్ శివసంకేత్ పేర్కొన్నారు. వీరిని బుధవారం కళాశాలలో అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎంఏ ఇంటర్ ఫలితాల్లో బి.పాల్ జాతీయస్థాయిలో 19వ ర్యాంకు, ముబారక్, వెంకటేశులు, లావణ్య, తనీష్‌గుప్తా మంచి మార్కులు సాధించారని తెలిపారు. ఫైనల్ ఫలితాల్లో కింజల్‌జైన్, వై.హరీష్, బి.హర్షవర్ధన్, హరిహరన్, పెరుమాళ్‌స్వామి ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించారని వివరించారు. కార్యక్రమంలో సీఈవో శివారెడ్డి, డీన్ విక్రమ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

18 వరకు పరీక్ష ఫీజు చెల్లింపునకు గడువు

నెల్లూరు (విద్య): డీఈఎల్‌ఈడీ 2025-27 సంవత్సరం రెగ్యులర్ విద్యార్థులు, 2023-25, 2024-26 సంవత్సరాల ప్రైవేట్ అభ్యర్థులు ఈ నెల 18వ తేదీ లోపు పరీక్ష ఫీజు చెల్లించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.బాలాజీరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సుల పరీక్షలు ఈ నెల 18 నుంచి 21 తేదీ వరకు జరుగుతాయన్నారు. హాల్ టిక్కెట్లు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

CHANGE OF SURNAME
I, LOKIREDDY PAVANI (Old Name) after marriage has changed my name to KALUVAYI PAVANI (New Name) W/o. Kaluvayi Prabhakar Reddy, resident of D.No. 26-3-1488, 2nd street, Opp. Nippo, Chandramouli Nagar, Nellore-524004. SPSR Nellore District, Andhra Pradesh.

పేరు మార్పు ప్రకటన
నేను, యెల్లమరాజు ప్రమీలా, భర్త పేరు: యెల్లమరాజు వెంకటరాజు కృష్ణ (పాతపేర్లు), నివాసం: డోర్ నెం. 21-12-518, పోలీస్ కాలనీ, ఏసీ స్టేడియం సమీపంలో, నెల్లూరు-524003. ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్. Hereby ప్రకటించు చున్నదేమనగా, నాపేరు మరియు నా భర్త పేరు మార్పు చేయబడినవి. నా పేరు మరియు నాభర్త పేరు ప్రస్తుతం యల్లంరాజు ప్రమీల, భర్త పేరు: యల్లంరాజు వెంకటరాజు కృష్ణ (కొత్తపేర్లు)గా మార్చబడినవి.

చట్టాలను కాలరాసిన కేంద్రం

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : కార్మికుల చట్టాలను పునరుద్ధరించాలని కోరుతూ వామపక్షాలు, కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల నాగేంద్రసాయి కోరారు. బుధవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మిక చట్టాలను కేంద్రం కాలరాసి నాలుగు లేబర్ కోడ్లుగా చేయడం దారుణమన్నారు. ఉదయం 10 గంటలకు ఏబీఎం కాంపౌండ్ నుంచి జరిగే ర్యాలీలో అన్నిసంఘాల వారు పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య నగర కార్యదర్శి సోఫియా తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(కలెక్టరేట్) : సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బండారుపల్లి వెంకటేశ్వర్లు, గాదిరాజు రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. సమ్మెకు సంఘీభావంగా గురువారం కలెక్టరేట్ ముందు భోజన విరామ సమయంలో ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ హాజరవుతారని, ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ధ్యానం..దానం అలవాటుగా మారాలి

నెల్లూరు(సాంస్కృతికం),న్యూస్‌టుడే: ధ్యానం.. దానాన్ని అలవాటు చేసుకోవాలని ఆధ్యాత్మికవేత్త వద్దిపర్తి పద్మాకర్ పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని రంగనాథస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆధ్యాత్మికపరమైన వివిధ అంశాలను భక్తులకు వివరించారు.

చదువుతో స్వయం సమృద్ధి

అక్షర సాధకులతో టీసీఎస్ బృంద సభ్యులు, అధికారులు

నెల్లూరుగ్రామీణం, న్యూస్‌టుడే: నెల్లూరు రూరల్ మండలం కొండ్లపూడి, దేవరపాలెంలో అక్షరాంధ్ర కేంద్రాలను రాష్ట్ర టీసీఎస్ బృంద సభ్యులు సందీప్ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్షరాంధ్ర కార్యక్రమం ద్వారా చదువు కొంటే సొంతంగా బ్యాంకు లావాదేవీలు చేయవచ్చన్నారు. తద్వారా మహిళలు స్వయం సమృద్ధి సాధించగలరన్నారు. మోసాలకు గురికాకుండా ఉంటారన్నారు. పొదుపు మహిళలు, ఉపాధి హామీ కూలీలు, గ్రామంలోని నిరక్షరాస్యులు ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అక్షరాంధ్ర జిల్లా నోడల్ అధికారి మల్లు మస్తాన్‌రెడ్డి, సూపర్‌వైజర్లు ఎల్.రామ్‌కుమార్, ఎమ్.కృష్ణకిషోర్, పి.రాజశేఖర్, వెల్ఫేర్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

మత్తు మందిచ్చి.. తాళిబొట్టు కాజేసి..

తిరుపతి (నేరవిభాగం) : మత్తు మందు ఇచ్చి.. తాళిబొట్టు కాజేసిన వైనమిది. అలిపిరి సీఐ రామ్‌కిషోర్ వివరాల మేరకు.. నెల్లూరులో జయమ్మ ఇంటి ఎదురుగా సాయి పార్థసారథి ఉంటున్నారు. డాక్టర్‌నని చెప్పి అనారోగ్యంతో ఉన్న జయమ్మకు చికిత్స చేసేవారు. మెరుగైన చికిత్సకు తిరుపతికి వెళదామని చెప్పడంతో..వరుసకు కుమార్తె అయిన మౌనికను తీసుకెళ్లింది. సాయిపార్థసారథి స్నేహితుడు సులేమాన్‌తో కలిసి నలుగురు కారులో బయల్దేరారు. అలసట రాదని చెప్పి మౌనికతో ఓ మాత్ర తినిపించగా.. తల తిరిగినట్లు ఉందని చెప్పడంతో హోటల్‌కు వెళ్లి విశ్రాంతి తీసుకుందామని కపిల తీర్థం కూడలికి తీసుకెళ్లారు. అక్కడ హాస్పిటల్‌లో జయమ్మకు వైద్య పరీక్షలు చేయించారు. ఈసమయంలో తాళిబొట్టు కనిపించకపోగా.. వెంట వచ్చిన వారికి మౌనిక చెప్పింది. ఇంటి దగ్గర పెట్టారేమో పరిశీలించుకోమని చెప్పారు. ఇక్కడికొచ్చి చూడగా కనిపించలేదు. సాయి పార్థసారథిని ప్రశ్నించగా..సమాధానం లేకపోవడంతో అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాయిపార్థసారథి కాజేసినట్లు దర్యాప్తులో తేలినట్లు సీఐ తెలిపారు. జిల్లాలో ఇద్దరు మహిళలను మోసగించి నగలు కాజేసినట్లు పోలీసులు గుర్తించారు.

In the Court of the I Addl. Senior Civil Judge, Nellore.
E.P.No. 21 / 2019
O.S.No. 204 / 2015
Madamsetty Mahesh Kumar ..D.H.R
Vs
Pillella Sridhar @ Pillella Sridhar Kumar ..J.D.R

వేలం ప్రకటన
పై నెంబరున డిక్రీ హోల్డర్ డిక్రీ బాకీ రాబట్టు కొనుటకు జె.డి.ఆర్. తాలూకు ఈ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని తే: 24-02-2026దిన ఉదయం 10-30 గంటల నుండి సాయంత్రం 5 గంటల లోపల పై తెలిపిన కోర్టులో బహిరంగ వేలంపాట జరుపబడును. కావున పాటదారులు ఎవ్వరైనా వేలం పాటలో పాల్గొని పాట పాడుకొనవచ్చును.

SCHEDULE
Nellore District Registration - Nellore Sub-Registry- Nellore Bit-I, Sy. No. 86/1, Plot No. 61, Iragalamma Sangam, House No. 6-150, admeasuring an extent of 108 Sq.Yards of site in it 54 square yards of site, init an extent of 268.5 square feet of building therein bounded by:-
East: Remaining house site of this plot, South: Remaining house site of this plot, West: Layout Road, and North: Plot No. 60.
Within the above said boundaries an extent of 6 3/4 ankanams or 54 square yards of site i.e., undivided share of the J.Dr. with all easement rights.
D.H.R. Value Rs. 6,00,000/-
Amin Value Rs. 15,00,000/-
Market Value Rs. 4,42,800/-
షేక్ మహబూబ్ బాషా, B.Com., B.L., డిక్రీ హోల్డర్ తరపు అడ్వకేట్, నెల్లూరు.

In the Court of the I Addl. Senior Civil Judge, Nellore.
E.P.No. 30 / 2019
O.S.No. 206 / 2015
M.Thirupal Reddy ..D.H.R
Vs
Pillella Sridhar @ Pillella Sridhar Kumar ..J.D.R

వేలం ప్రకటన
పై నెంబరున డిక్రీ హోల్డర్ డిక్రీ బాకీ రాబట్టు కొనుటకు జె.డి.ఆర్. తాలూకు ఈ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని తే: 24-02-2026దిన ఉదయం 10-30 గంటల నుండి సాయంత్రం 5 గంటల లోపల పై తెలిపిన కోర్టులో బహిరంగ వేలంపాట జరుపబడును. కావున పాటదారులు ఎవ్వరైనా వేలం పాటలో పాల్గొని పాట పాడుకొనవచ్చును.

SCHEDULE
Nellore District Registration, Nellore Sub-Registry- Nellore Bit-II, Narayanarao pet, Ward No.12, House No. 12-423, admeasuring an extent of 96.88 Sq.Yards of Site, in it 2016 sq.ft of roofed building therein (Ground, 1st and 2nd floor) each 672 sq. ft. - in the above said total, an extent of 48.44 sq. yards of site, in it an extent of 1008 sq. ft. of roofed building there in, bounded by: East: Road, South: Kandakam Kaluva, West: Remaining extent of this house, and North: House of Padavala Krishna Murthy.
Within the above said boundaries an extent of 48.44 undivided share of the J.Dr as per orders of Hon'ble High Court of A.P., at Amaravathi in CRP. No. 2275/2024, dated 22.10.2024 with all easement rights.
D.Hr Value Rs. 10,00,000/-
Amin Value Rs. 16,50,000/-
Market Value Rs. 19,48,380/-
షేక్ మహబూబ్ బాషా, B.Com., B.L., డిక్రీ హోల్డర్ తరపు అడ్వకేట్, నెల్లూరు.

కుష్ఠుపై అవగాహన అవసరం

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: దర్గామిట్టలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ మహిళా కళాశాలలో విద్యార్థులకు బుధవారం కుష్ఠుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీని లక్షణాలు, చికిత్స విధానం, ప్రభుత్వం అందిస్తున్న సేవలను జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నివారణ అధికారి ఖాదర్‌వలి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ షాలిని, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ పాపమ్మ, డీపీఎంఒ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాలకు నివాళి

నెల్లూరు(సాంస్కృతికం), న్యూస్‌టుడే: నగరంలోని సుబేదారుపేటలో గిరిజన హాస్టల్ ప్రాంగణంలో ఘంటసాల వర్ధంతి బుధవారం నిర్వహించారు. కేతా అంకుల్ మెమోరియల్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేయగా.. పాటూరు శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పలు కళాసంస్థల ప్రతినిధులు అమర గాయకుడి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో తబలిస్ట్ ఆనంద్ సన్మానించారు.

చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కళాసంస్థల నిర్వాహకులు

బాలుడికి బోన్‌మారో చికిత్స

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : తలసేమియాతో బాధపడుతున్న ఆరేళ్ల బాలుడికి త్వరలో బోన్‌మారో మార్పిడి శస్త్రచికిత్స జరుగుతుందని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఛైర్మన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి తెలిపారు. నగరంలోని రెడ్‌క్రాస్ సొసైటీలో బుధవారం మాట్లాడుతూ.. ఈ శస్త్రచికిత్సకు సుమారు రూ.35 లక్షల వరకు ఖర్చవుతుందన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సిఫార్సుతో ఈనెల 16న బెంగళూరులో శస్త్రచికిత్స జరుగుతుందన్నారు.

దొడ్ల శేషారెడ్డికి సత్కారం

నెల్లూరు(మార్కెట్ సెంటర్) : బీసీ వసతి గృహ విద్యార్థులకు దాత దొడ్ల శేషారెడ్డి రూ.2 లక్షలతోపునాది ప్రాథమిక నైపుణ్య కార్యక్రమానికి 1500 పుస్తకాలు అందించారని జిల్లా బీసీ సంక్షేమ అధికారి వెంకటలక్ష్మమ్మ తెలిపారు. బుధవారం ఆయన్ను సన్మానించారు. సంక్షేమాధికారులు పాల్గొన్నారు.

పార్వీ సినిమాస్ (ఎం.I) తెరపై ఈనాడు
షెడ్యూల్ స్క్రీన్..1..ఆరెంజ్ (తెలుగు) స్క్రీన్ 2.. మన శంకర వరప్రసాద్ (తెలుగు) స్క్రీన్ 3. అనగనగా ఒక రాజు (తెలుగు), యుఫోరియా (తెలుగు) **పార్వీ సినిమాస్ (స్పైస్)** స్క్రీన్..1. అనగనగా ఒక రాజు (తెలుగు), యుఫోరియా (తెలుగు) స్క్రీన్ 2. విత్ లవ్ (తెలుగు), హనీ (తెలుగు), మర్దానీ 3 (హిందీ) స్క్రీన్ 3. ఎర్రచీర (తెలుగు), బార్డర్ 2, (హిందీ), శ్రీ చిదంబరం గారు (తెలుగు) స్క్రీన్.4.. బరాబర్ ప్రేమిస్తా (తెలుగు), స్కార్లెట్ (జపనీస్) స్క్రీన్.5.. మన శంకర వరప్రసాద్ (తెలుగు) **రైన్ సినిమా షెడ్యూల్** స్క్రీన్..1. అనగనగా ఒక రాజు (తెలుగు), విత్ లవ్ (తెలుగు) స్క్రీన్ 2. యుఫోరియా (తెలుగు), సుమతి శతకం (తెలుగు) స్క్రీన్ 3. మనశంకర వరప్రసాద్ (తెలుగు), స్క్రీన్.4.. శ్రీ చిదంబరం గారు (తెలుగు) ఆపరేషన్ పద్మ, ఆరెంజ్ (తెలుగు)

అవిశ్రాంత సేవలు

❖ పింఛన్‌తో కార్యక్రమాలు
❖ తండ్రికి కుమారుడి సహకారం

న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ)

సంపాదించిన డబ్బు కూడబెట్టుకుంటున్న ప్రస్తుత రోజుల్లో విశ్రాంత అధికారి తన పింఛన్‌లో కొంతమొత్తం సేవలకు వెచ్చిస్తున్నారు. డాక్టరైన కుమారుడు ఆయనకు సహకారం అందిస్తున్నారు. ఇద్దరూ సేవలతో స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

నెల్లూరు నగరంలోని కొండాయపాలెం కూడలి సమీపంలో 86 ఏళ్ల వయసున్న విశ్రాంత ఇంజినీర్ సుబ్బారావు నివాసం ఉంటున్నారు. ఆయన తల్లిదండ్రులది పేద కుటుంబం. ఇరువురూ అప్పటి మద్రాస్ రాష్ట్రంలో కూలీ పనులు చేసి చదివించారు. తల్లి ఇళ్లలో పాచిపని చేసేది. ఇంజినీరింగ్ పూర్తి చేసి రైల్వే ఇంజినీరుగా పశ్చిమబెంగాల్‌లో కొలువు సాధించారు. ఆయనకు కుమారుడు, ముగ్గురు కుమార్తెలు. తల్లిదండ్రులు పడిన కష్టం గుర్తించుకుని వారు కష్టపడి చదివి ప్రయోజకులయ్యారు.

పేదలకు ఆహారం అందిస్తున్న తండ్రీకుమారుడు

తండ్రి మార్గంలో..

సుబ్బారావు కుమారుడు బీవీ రమణమూర్తి ఎండీ పూర్తి చేసి నెల్లూరు మెడికల్ కళాశాలలో ప్రొఫెసర్‌గా రాణిస్తున్నారు. తండ్రికి వచ్చే రూ.30వేల పింఛన్‌లో దాదాపు రూ.20వేలు ప్రతినెలా సేవా కార్యక్రమాలకు కేటాయిస్తున్నారు. తండ్రితోడుగా కుమారుడు 20 ఏళ్లుగా ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారు.

ఓదార్చి.. కన్నీరు తుడుస్తూ..

ప్రతినెలా అనాథ ఆశ్రమాలకు, మూగ, చెవిటి వారికి అవసరమైన మిషన్లు, వస్తువులు అందిస్తారు. కళ్లు లేని వారికి పరికరాలు, నగదు ఇవ్వడంతోపాటు వస్త్రాల వితరణ చేస్తుంటారు. వికలాంగులకు ట్రై సైకిళ్లు కొనుగోలు చేసి ఇస్తారు. పేద విద్యార్థులుంటే వారికి పరీక్ష ఫీజులు చెల్లిస్తున్నారు. రోగులకు అవసరమైన వైద్యపరీక్షలు చేయించి ఔషధాలు కొనిస్తున్నారు. ఏటా తల్లి శేషమ్మ జ్ఞాపకార్థం ప్రగతి ఛారిటీస్, వినయహోం వంటి ఆశ్రమాలకు వెళ్లి అక్కడ పిల్లలకు ఉచిత వైద్య పరీక్షలు చేస్తున్నారు. వారికి ప్రత్యేకమైన ఆహారం అందిస్తుంటారు.

ఉత్తరక్రియలు
మా తండ్రిగారైన
శ్రీ చొప్పా రామచంద్రయ్య గారు
తేది: 02.02.2026 సోమవారం
స్వర్గస్తులైనారు.
తేది: 12.02.2026 గురువారం
ఉదయం 10.00 గంటలకు
నెల్లూరు రూరల్ మండలం,
కాకుపల్లి గ్రామం, విమల్ గార్డెన్స్‌లోని
మా స్వగృహమునందు పెద్దకర్మ జరుగును.
కావున తెలియజేయడమైనది.

కీ॥ శే॥ శ్రీ చొప్పా రామచంద్రయ్య గారు
కుమారులు
చొప్పా కళ్యాణ్‌బాబు, చొప్పా గోపీనాథ్

వసతిగృహాల్లో ప్రత్యేక తరగతులు

● వెనుకబడిన 'పది' విద్యార్థులకు అవకాశం

గోరంట్ల, న్యూస్‌టుడే: పదో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను రూపకల్పన చేసి అమలు చేస్తోంది. ఇందులో భాగంగా సి గ్రేడ్‌లో ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడానికి కార్యాచరణ రూపొందించింది. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా వసతిగృహాలను ఎంపిక చేశారు. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశాల మేరకు బుధవారం నుంచే ప్రత్యేక తరగతులకు శ్రీకారం చుట్టారు. కొత్తచెరువు మండలం బండ్లపల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని ఇంటికి మంగళవారం కలెక్టర్ వెళ్లారు. పాఠశాలకు సరిగా హాజరుకాకపోవడానికి కారణాలను ఆరా తీసి విద్యార్థినితోపాటు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేశారు. సమీపంలోని జగరాజుపల్లి కస్తూర్బా విద్యాలయంలో చేర్పించి పరీక్షలకు సిద్ధం కావాలని ఒప్పించారు. ఈక్రమంలో జిల్లా వ్యాప్తంగా వెనుకబడి ఉన్న విద్యార్థుల కోసం రెసిడెన్షియల్‌గా శిక్షణ తరగతుల ప్రారంభానికి చర్యలు తీసుకున్నట్లు ఉప విద్యాశాఖాధికారి జాన్‌రెడ్డెప్ప చెప్పారు.

జిల్లా:	శ్రీసత్యసాయి
మండలాలు:	32
ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు:	312
విద్యార్థులు:	15,323
డి (గ్రేడ్)లో ఉన్నవారు:	291

(పెనుకొండ డివిజన్-204, కదిరి-06, ధర్మవరం-24, పుట్టపర్తి-57)

ఎంపిక చేసిన వసతిగృహాలు: 09
(బీసీ బాలుర వసతిగృహాలు రత్నగిరి, ఎన్‌ఆర్‌పల్లి, మండలపల్లి, హిందూపురం, పెనుకొండ, కదిరి, ధర్మవరం, కొత్తచెరువు, ఓబులదేవరచెరువు)


బత్తలపల్లి మండలం ఈదులముష్టూరు వద్ద ఏర్పాటు చేసిన స్తంభాలు

నిరంతర విద్యుత్తు.. చురుగ్గా కసరత్తు

■ ఆర్‌డీఎస్‌ఎస్ పథకంతో బహుళ ప్రయోజనం

ఈనాడు, పుట్టపర్తి, న్యూస్‌టుడే, ముదిగుబ్బ: అంతరాయం.. హెచ్చుతగ్గులు లేని విద్యుత్తు సరఫరాకు ఆర్‌డీఎస్‌ఎస్ పథకం ద్వారా పనులు వేగవంతమవుతున్నాయి. ఆర్‌డీఎస్‌ఎస్ (రీవాంప్‌డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్) అనేది విద్యుత్తు పంపిణీ రంగంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అతిపెద్ద సంస్కరణల పథకం. 2021-22 నుంచి 2025-26 లోపు పథకాన్ని పూర్తి చేయాలని గడువు విధించింది. క్షేత్రస్థాయిలో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ప్రజలు సహకరిస్తే అందరికీ ప్రయోజనం ఉంటుందని విద్యుత్తుశాఖ కన్‌స్ట్రక్షన్, టెక్నికల్ ఈఈలు శ్రీధర్‌రెడ్డి, ఐ.శ్రీనివాసులు చెబుతున్నారు.

60 శాతం పూర్తి

శ్రీసత్యసాయి జిల్లాలో ఎనిమిది నెలల కిందట రూ.1,100 కోట్లతో పనులు ప్రారంభించారు. 11 కేవీ ఫీడర్లు 228కిగాను 105 పనులు పూర్తి చేశారు. మరో 45 ఫీడర్ల పనులు చేపట్టాల్సి ఉంది. 33 కేవీ ఫీడర్లు 33 ఉండగా.. 22 చోట్ల పనులు పూర్తి కావొచ్చాయి. మొత్తంగా జిల్లాలో 60 శాతం పనులు పూర్తి చేశారు.

ఉపయోగాలు ఇలా..!

ప్రతి ఇంటికి త్రీఫేజ్ కరెంటు సరఫరా అవుతుంది. వ్యవసాయ మోటార్లు, నివాసాలకు వేర్వేరుగా స్తంభాలు ఏర్పాటు చేసి పంపిణీ చేస్తారు. అలాగే ఫీడర్లపై లోడు తగ్గుతుంది. దీంతో అల్ప విద్యుత్తు సరఫరాలో అంతరాయం, మోటార్లు కాలిపోవడం జరగదు. పంటలు ఎండిపోయే పరిస్థితి ఉండదు. 24 గంటలూ సరఫరా ఉంటుంది. పరిశ్రమలకూ త్రీఫేజ్ సరఫరా అందే పల్లెల్లోనూ పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవచ్చు. యువత స్వగ్రామంలోనే ఉపాధి పొందే అవకాశం ఉంటుంది.

అద్భుత పథకమిది.. అడ్డు చెప్పొద్దు

- మోజెస్, విద్యుత్తుశాఖ ఎస్‌ఈ

పెరుగుతున్న విద్యుత్తు అవసరాలు తీర్చేందుకు ఆర్‌డీఎస్‌ఎస్ ఎంతో దోహదం చేస్తుంది. కొన్నిచోట్ల వివాదాస్పద భూముల ఇతరత్రా వాటిలో స్తంభాలు ఏర్పాటు చేస్తుంటే స్థానికులు కొందరు అడ్డంకులు సృష్టిస్తున్నారు. సహకరిస్తే రెండు మూడు నెలల్లో అన్ని పనులు పూర్తి చేస్తాం.

ఇసుక అక్రమ రవాణా సహించం: ఎస్పీ

కొడిగెనహళ్లి (పరిగి), న్యూస్‌టుడే: పరిగి, రొద్దం మండలాల్లోని పెన్నా, జయమంగళి నదుల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ సతీష్‌కుమార్ హెచ్చరించారు. ఆయన బుధవారం మండలాల్లోని కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో పర్యటించారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. పెనుకొండ సీఐ రాఘవన్, ఎస్సై రంగడు యాదవ్‌తో కలిసి ఇసుక అక్రమ రవాణా కట్టడికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. తదుపరి ఎస్పీ విలేకరులతో మాట్లాడారు. పైడేటి, శ్రీరంగరాజులపల్లి గ్రామాల పరిధిలోని పెన్నా, జయమంగళి నదుల నుంచి అక్రమంగా ఇసుక తరలిపోతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల సమన్వయంతో అక్రమ రవాణా అరికడతామన్నారు.

అదరహో.. అద్దాల అంగళ్లు

హైదరాబాద్‌లో చౌటుప్పల్ వద్ద ఓ సంస్థ కంటెయినర్లతో నిర్మించే అందమైన కార్యాలయాలకు భలే గిరాకీ ఉంది. కొన్ని కార్పొరేటు కంపెనీలు తాత్కాలికంగా ఇటువంటి కంటెయినర్ల కార్యాలయాలను కావాలని ఆర్డర్లు పెడుతున్నాయి. రెండు వైపులా రూంలు లేదా దుకాణాలు నిర్వహించుకునే వీలుండటం, మధ్యలో అద్దాలతో తలుపులు.. ఇవన్నీ కార్పొరేటు శైలిని తలపిస్తున్నాయి. ఇలాంటి కార్యాలయాలు కావాలని మైసూర్‌కు చెందిన ఓ కంపెనీ ఆర్డర్ ఇవ్వడంతో హైదరాబాద్ నుంచి వీటిని ఏడు లారీల్లో తరలిస్తున్నారు. బుధవారం ఇవి అనంతపురం చేరుకున్నాయి.

- ఈనాడు, అనంతపురం

సేవలోనూ బాలయ్య మార్క్

■ గ్రామాలకు శుద్ధజలం

■ సొంత డబ్బు రూ.84 లక్షలు వెచ్చింపు

హిందూపురం, లేపాక్షి, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే బాలకృష్ణ సేవలోనూ తనదైన ముద్ర చూపుతున్నారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నా లేకపోయినా నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తన సొంత డబ్బు, అధికారం వచ్చినప్పుడు శాసనసభ్యుడి కోటా నిధులకు కొంత మొత్తం జతచేసి నీటి ఎద్దడి గ్రామాలకు శుద్ధ జలమందజేసి భళా బాలయ్య అనిపించుకుంటున్నారు.

లేపాక్షి మండలం శిరివరంలో ఏర్పాటు చేసిన శుద్ధజల ప్లాంటు

ఒక్కోదానికి రూ.4లక్షలు వంతున..

2024 ఎన్నికల తర్వాత కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టింది. తెదేపా తరఫున నియోజకవర్గం నుంచి తిరిగి ఎమ్మెల్యేగా గెలిచిన బాలయ్య తాగునీటి సమస్య ఎదుర్కొంటున్న గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. మదురేపల్లి, వ్యవసాయ మార్కెట్‌యార్డు, ముద్దిరెడ్డిపల్లి, మోతుకపల్లి, అప్పలకుంట, చౌడేశ్వరి కాలనీల్లో శుద్ధజల ప్లాంట్లు ఏర్పాటు చేశారు. ఒక్కోదానికి రూ.10 లక్షల చొప్పున నిధులు వ్యయమవగా, శాసనసభ్యుడి కోటా కింద రూ.6లక్షలు, మిగిలిన రూ.4లక్షలు తన సొంత డబ్బు వెచ్చించారు. మినరల్ వాటర్ ప్లాంట్లు అందుబాటులోకి రావటంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు..

2019 నుంచి 2024 వరకు ప్రతిపక్ష శాసనసభ్యుడిగా బాలకృష్ణ సేవకు వెనుకాడలేదు. అప్పట్లో నియోజకవర్గంలోని మొరంపల్లి, పట్టణంలోని 36వ వార్డు, పోచనపల్లి, చిలమత్తూరు, బ్రహ్మేశ్వరంపల్లి, టేకులోడు, బొమ్మయ్యగారిపల్లిలో మొత్తం తన సొంత డబ్బు రూ.10లక్షలు చొప్పున వెచ్చించి శుద్ధ జల ప్లాంట్లు ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఆయా గ్రామాల ప్రజలకు 25 లీటర్ల మినరల్ వాటర్ రూ.5లకే అందుతోంది. ఇవి లేనప్పుడు ఆయా గ్రామాల ప్రజలు వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకొని గొంతు తడుపుకొన్న విషయం తెలిసిందే.

స్వామివారి భూమి.. ఆదాయం అందదేమీ?

గుత్తి, గుంతకల్లు, తాడిపత్రి, ఉరవకొండ, న్యూస్‌టుడే: ఆలయాలకు రూ.కోట్లలో భూములున్నా తగినంత ఆదాయం రావడం లేదు. బహిరంగ వేలాలు నిర్వహించకుండా సాగుదారులకే వంత పాడుతూ అప్పగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వేల ఎకరాల భూములున్న చోట కూడా అరకొర భూములకు గుట్టుగా వేలాలు వేస్తున్నారు. బహిరంగ వేలాలు వేస్తే దేవాదాయశాఖకు రూ.కోట్లలో ఆదాయం సమకూరుతుంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా గుంతకల్లు, ఉరవకొండ, తాడిపత్రి నియోజవర్గాల్లో ఆలయ భూములకు నామమాత్రంగా వేలాలు జరుపుతున్నారు.

ఇదీ పరిస్థితి...

● గుంతకల్లు నియోజకవర్గం బేతాపల్లిలో శివాలయానికి చెందిన 18 ఎకరాల్లో కొందరు 50 ఏళ్ల నుంచి ఆధీనంలో ఉంచుకొని సాగు చేసుకుంటున్నారు. దేవాదాయశాఖకు ఏ మాత్రం గుత్తలు రావడంలేదు. చెట్నేపల్లిలోని శివాలయానికి చెందిన 20 ఎకరాల భూమిలో కొందరు సాగు చేసుకుంటున్నా.. వారు ఓ సామాజిక వర్గం వారికే గుత్త చెల్లిస్తున్నారు.

● జక్కలచెరువు పంచాయతీ పరిధి గొందిపల్లిలో బొలికొండ రంగనాథస్వామి ఆలయానికున్న 42 ఎకరాల భూమి పూర్తిగా ఆక్రమణలకు గురైంది.

● రజాపురంలో బురుడాల విఘ్నేశ్వర ఆలయానికున్న భూమి ఆక్రమణకు గురైంది. అదే గ్రామంలో మఠం ఆస్తులు 20 ఎకరాలు అన్యాక్రాంతమైంది.

● తాడిపత్రి నియోజకవర్గం యాడికిలో చెన్నకేశవస్వామికి చెందిన 200 ఎకరాలను కొందరు ఆక్రమించుకున్నారు.

● తాడిపత్రి పట్టణంలో రూ.కోట్ల విలువైన మఠం భూమిలో 150 మంది పాగావేశారు. ఆక్రమణదారులకే రెవెన్యూ అధికారులు కొన్నేళ్ల కిందట పొజిషన్ పత్రాలు ఇచ్చారు. ఆలూరు కోన, బుగ్గలోని ఆలయభూమి, కనకాద్రిపల్లిలలోని భూముల నుంచి అరకొర ఆదాయమే సమకూరుతోంది.

● ఉరవకొండలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి 2,134 ఎకరాల భూమి ఉండగా 1,556 ఎకరాలకు మాత్రమే వేలం నిర్వహిస్తున్నారు. దేవుడికి ఏటా రూ.కోటి దాకా ఆదాయం రావాల్సి ఉంది. రూ.16 లక్షలు మాత్రమే వస్తోంది.

చెట్నేపల్లిలోని శివాలయం దుస్థితి

మూడేళ్లకోసారి వేలం వేస్తున్నాం..

- నాగేంద్రుడు, ఈవో, గ్రూపు టెంపుల్, గుత్తి

గుత్తి, గుంతకల్లు, పెద్దవడుగూరు మండలాల్లోని ఆలయ భూములకు ప్రతి మూడేళ్లకోసారి బహిరంగ వేలాలు వేస్తున్నాం. అనేక చోట్ల ఆలయ భూములను పూజార్లు, పెద్దలు వేలాలు వేస్తున్నారు. కొన్ని చోట్ల మాత్రమే ఆలయాల దీప, ధూప నైవేద్యానికి సొమ్మును వెచ్చిస్తున్నారు. సాగులో ఉంటున్న భూములకు పక్కాగా వేలాలు వేస్తున్నాం.

ప్రత్యేక అవసరాల పిల్లల డేటా నమోదుపై అవగాహన

కొత్తచెరువు: ప్రత్యేక అవసరాల పిల్లలకు విద్య మరింత సులభతరం చేసేందుకు రూపొందించిన దృష్టి ప్రాజెక్టుపై అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా సహిత విద్య సమన్వయకర్త డాక్టర్ పుల్లన్న తెలిపారు. కొత్తచెరువు బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రారంభించిన ఈ కార్యక్రమం మూడు రోజులపాటు జరుగుతుందన్నారు. రాష్ట్ర పరిశీలకుల బృందం సభ్యులు జతిన్, చౌహాన్ డేటా నమోదును పరిశీలించారు. పుల్లన్న మాట్లాడుతూ జిల్లాలోని 3 వేల మంది ప్రత్యేక అవసరాల పిల్లలకు 28 మంది పాఠశాల సహాయకులు, 64 మంది ఐఈఆర్‌టీలు, 8మంది ఫిజియోథెరపిస్టులు, 32 మంది ఆయాలు సేవలందిస్తున్నారన్నారు. యాప్‌లో పిల్లల వివరాలను నమోదు చేయించారు.

ధర్మవరం పట్టుచీరలకు అంతర్జాతీయ మార్కెటింగ్

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరంలో చేనేత మగ్గాలపై తయారైన పట్టుచీరలకు అంతర్జాతీయ మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని హ్యాండ్లూమ్ ఎక్స్‌పోర్ట్ అండ్ ప్రమోషన్ కౌన్సిల్ జాయింట్ డైరెక్టర్ డా.సుందర్ మురుగేషన్ అన్నారు. బుధవారం ఆయన ధర్మవరంలో చేనేత జౌళిశాఖ అధికారులతో కలసి మగ్గాలను పరిశీలించారు. నేత కార్మికులు తయారు చేస్తున్న పట్టు చీరలను పరిశీలించారు. సెంట్రల్ సిల్క్ బోర్డు కార్యాలయంలో సైంటిస్ట్ సంజీవ్ గుప్తాతో సమావేశమై పట్టు చీరల నాణ్యత, రకాల గురించి డా.సుందర్‌మురుగేషన్ అడిగి తెలుసుకున్నారు. ధర్మవరంలో హ్యాండ్లూమ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ద్వారా వ్యాపారులు వారి సంస్థలను నమోదు చేయించుకొని విదేశాలకు పట్టుచీరలు ఎగుమతులు చేసేందుకు త్వరలో సమావేశం నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. చేనేత జౌళిశాఖ ఏడీ రామకృష్ణ, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఐజయ్య, డీవో రమణారెడ్డి, ఏడీవోలు సుబ్బానాయుడు, శీనానాయక్, చేనేత జాతీయ అవార్డు గ్రహీత నాగరాజు, మాస్టర్ ట్రైనర్ మార్కండేయ, వ్యాపారులు పాల్గొన్నారు.

మగ్గాన్ని పరిశీలిస్తున్న హెచ్‌ఈపీసీ జాయింట్ డైరెక్టర్ డా.సుందర్ మురుగేషన్

కాటికోటేశ్వరుడి బ్రహ్మోత్సవాలకు వేళాయె

తాడిమర్రి, ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: తాడిమర్రి మండలంలోని ప్రసిద్ధ కాటికోటేశ్వర క్షేత్రంలో శివరాత్రిని పురస్కరించుకుని రెండు రోజులపాటు జరిగే బ్రహ్మోత్సవాలకు దేవాదాయ శాఖాధికారులు, నిర్వాహకులు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. ఈ నెల 15, 16 తేదీల్లో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఆదివారం స్వామివారు చిల్లవారిపల్లి గ్రామం నుంచి ఊరేగింపుగా క్షేత్రానికి తరలివస్తారు. ఆరోజు స్వామికి విశేష పూజలు జరుగుతాయి. రెండోరోజు సోమవారం పూజల తర్వాత గదేగుండం నుంచి డప్పు వాయిద్యాల నడుమ స్వామివారు అగ్నిగుండ ప్రవేశం చేయడంతో ఉత్సవాలు ముగుస్తాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతోపాటు 200 మంది పోలీసులు, ప్రత్యేక బలగాలతో ఉత్సవాల పర్యవేక్షణ ఉంటుందన్నారు.

కొలువుదీరిన మూలవిరాట్

ఖరీఫ్ ప్రణాళికలు సిద్ధం చేయండి

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజన పథకం ద్వారా రైతులకు సేవలు, రాయితీ పథకాలు సకాలంలో చేరేలా ప్రతి శాఖ సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఈ పథకంపై వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రెండు నెలల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, సూక్ష్మపోషకాలు ముందుగానే అందుబాటులో ఉంచేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రతి రైతు సూక్ష్మ పోషకాలను వినియోగించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, నాణ్యమైన, అధిక దిగుబడి సాధించేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సమావేశంలో వ్యవసాయాధికారి క్రిష్ణయ్య, ఉద్యానఅధికారి చంద్రశేఖర్, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, పట్టు పరిశ్రమల అధికారిణి శోభారాణి, పశుసంవర్ధకశాఖ అధికారి శుభదాస్, ఏడీసీసీ బ్యాంకు మేనేజర్ కృష్ణానాయక్ పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

త్వరలో రైళ్లలో అరటి ఎగుమతి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: రైలు మార్గం ద్వారా అరటి ఎగుమతి చేసే ప్రక్రియ అతి త్వరలో ప్రారంభిస్తామని అనంతపురం కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. ఎగుమతిదారులకు ప్రోత్సాహకం కింద ప్రభుత్వం రూ.కోటి నిధులు ఇవ్వడానికి ఆమోదం తెలిపిందని ఆయన అన్నారు. బుధవారం తన కార్యాలయంలో అరటి ఎగుమతిదారులు, అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు.

సీఎం ఆదేశం

తాడిపత్రి రైల్వేస్టేషన్ నుంచి ప్రత్యేక రైలు ద్వారా అరటి ఎగుమతి చేసేందుకు నిర్దేశిత వ్యాపారులు త్వరగా చర్యలు తీసుకోవాలి. రీఫర్ కంటెయినర్‌కు రూ.10 వేలు ప్రోత్సాహకాన్ని అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. తాడిపత్రి నుంచి జేఎన్‌పీటీ పోర్టు దాకా అరటి ఎగుమతి చేసే ప్రక్రియను సత్వరం మొదలు పెట్టాలని స్వయంగా సీఎం చంద్రబాబు మొన్నటి సమీక్షలో ఆదేశించారు. ప్రోత్సాహక నిధులపై ఉద్యాన శాఖ ఉన్నతాధికారులతోనూ మాట్లాడాం. అరటి నాణ్యత పెంచడానికి యంత్రాంగం సాయంతో తగిన చర్యలు తీసుకుంటాం **- కలెక్టర్**

★ ఉమ్మడి జిల్లాలో అరటి సాగు రమారమి : **50** వేల హెక్టార్లు
★ అరటిపై ఆధారపడిన రైతులు : **30** వేల మంది
★ ఎకరాకు దిగుబడి : గరిష్ఠంగా **15** టన్నులు
★ టన్ను సరాసరి ధర : నాణ్యత బాగుంటే **రూ.. 20** వేలు
★ ఎగుమతికి అనుకూలమైన రకాలు : **8**

హమ్మయ్య.. కరుణ చూపారు

అనంతపురం (అశోక్‌నగర్), న్యూస్‌టుడే: నగర, పురపాలికల్లోని ఇంజినీరింగ్, పారిశుద్ధ్య కార్మికులు గత సంవత్సరం జులై 13, 16 నుంచి 22 వరకు సమ్మెలోకి వెళ్లారు. కార్మికులు ఆయా ప్రాంతాల్లోని కమిషనర్లకు రాతపూర్వకంగా తాము సమ్మెలోకి వెళుతున్నామని అందజేశారు. ఎన్ని రోజులు సమ్మెలో ఉంటే అన్ని రోజులు వేతనం రాదు. అప్పట్లో సమ్మె కాలానికి వేతనాల్లో కోత విధించి వేతనాలు ఇచ్చారు. అసలే చాలీ చాలని వేతనం తీసుకొనే చిరుద్యోగులు ఉన్న కొంత సొమ్ములోనే కోత విధించడంతో ఇబ్బంది పడ్డారు. అప్పటి సమ్మె కాలానికి ఒక్కొక్కరి నుంచి రూ.5 వేల వరకు వేతనం కట్ చేశారు. సమ్మె కాలానికి వేతనం ఇవ్వనున్నామని ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడంతో కరుణ చూపారని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అనంతలో అత్యధికం

ఉమ్మడి జిల్లాలో అనంతపురంలోనే అత్యధికంగా 680 మంది కార్మికులకు ప్రయోజనం ఒనకూరనుంది. అనంతపురం జిల్లాలోని అనంతపురం, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, కళ్యాణదుర్గం, రాయదుర్గం పురపాలికల్లో సుమారుగా 1182 మంది సమ్మెలోకి వెళ్లారు. శ్రీసత్యసాయి జిల్లాలోని ధర్మవరం, హిందూపురం, కదిరి, పెనుకొండ, పుట్టపర్తి, మడకశిర పురపాలికల్లో 529 మంది సమ్మెలోకి వెళ్లారు. రెండు జిల్లాల్లో రూ.85 లక్షల వరకు కార్మికులకు సప్లిమెంటరీ బిల్లులో వేతనాలు ఇవ్వనుండటంతో వారిలో ఆనందం వ్యక్తం అవుతోంది.

సాకే తిరుమలేశ్ - సీఐటీయూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి

డిమాండ్ల పరిష్కారం కోసం ఉద్యమ బాట పట్టాం. చిరుద్యోగుల వేతనాల్లో కోత విధించడం భావ్యం కాదని అనేక సార్లు విన్నవించుకున్నాం. ఆలస్యంగా అయినా కూటమి ప్రభుత్వం వేతనం ఇవ్వడం అభినందనీయం.. ధన్యవాదాలు.

నత్తనడకన పన్ను వసూళ్లు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: పల్లె ప్రగతికి దన్నుగా నిలిచే ఇంటి పన్ను వసూళ్లు నత్తనడకన సాగుతున్నాయి. వంద శాతం వసూళ్లతో పౌరసేవల మెరుగుకు అవకాశమున్నా, శ్రద్ధ పూర్తిగా లోపించింది. పంచాయతీల్లో రక్షిత తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ, మురుగు కాలువలు, రహదారులు తదితర మౌలిక వసతుల కల్పనకు ఇంటి, నీటి పన్ను రూపంలో వచ్చే ఆదాయం ఆధారం. ఈ విషయంపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో ఉద్యోగులు విఫలమయ్యారు. మరో 56 రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుంది. సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు ఇంటింటికి వెళ్లి వసూలు చేస్తేనే అభివృద్ధి దిశగా అడుగులు పడనున్నాయి.

● శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా 467 పంచాయతీల పరిధిలో ఇంటి, నీటి పన్ను బకాయిలు రూ.20.87 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఇప్పటివరకు కేవలం రూ.7.70 కోట్లు వసూలు చేశారు. గతంలో ఇంటి పన్ను చెల్లించాలంటే సచివాలయం వరకు వెళ్లాల్సి ఉండేది. స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఎక్కడి నుంచైనా చెల్లించే అవకాశాన్ని కూటమి ప్రభుత్వం కల్పించింది. ఇప్పటి వరకు కేవలం 11 పంచాయతీ మాత్రమే వంద శాతం పన్ను బకాయిలు వసూలు చేశారు. గ్రామ పంచాయతీలో ఇంటి పన్ను వంద శాతం వసూలు చేసి, ప్రగతి సాధిస్తామని డీపీవో సమత తెలిపారు.

చెరువులను ఆక్రమిస్తే చర్యలు తప్పవు

గాండ్లపెంట, న్యూస్‌టుడే : గ్రామాల సమీపంలో ఉన్న చెరువులు, కుంటలను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఇరిగేషన్ డీఈ వేణుగోపాల్, జేఈ అరుణకుమారి హెచ్చరించారు. వేపరాల కుంటలో రహదారి సమస్యపై గ్రామస్థుల ఫిర్యాదు మేరకు రెవెన్యూ సర్వేయర్లతో సర్వే చేయించారు. వేపరాల కుంట 9.42 ఎకరాలు ఉన్నట్లు తెలిపారు. సర్వేలో మండల సర్వేయర్ చందన, సిబ్బంది పాల్గొన్నారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
పూర్తి వివరములకు: 8008709784

అనురాగస్మృతులతో...



జననం: 01-07-1950
మరణం: 31-01-2026
కీ॥శే॥ శ్రీ మాదాల పుల్లమనాయుడు గారు
రిటైర్డ్ మేనేజర్, ఆంధ్రాబ్యాంక్, అనంతపురము
భార్య: శ్రీమతి మాదాల ఉమాదేవి సెల్: 7892621421, 9008123474
కుమారులు: మాదాల పవన్‌కుమార్, మాదాల వెంకట కిషోర్ కుమార్
కోడళ్లు: మాదాల కోమలి, మాదాల ఈశ్వరి
మనవళ్లు: మాదాల మురారి, మాదాల లిఖిత్, మనవరాలు: మాదాల నందిక
వైకుంఠ సమారాధన: 12-02-2026వ తేదీ గురువారం ఉదయం 10 గంటల నుండి అనంతపురము, మారుతి నగర్, 2వ క్రాస్, డి.నెం. 6/4/36/12, మా స్వగృహము నందు జరుగును.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

© 7382114467

COMPUTER EDUCATION

Lasyakrish ... ATP ... 9642273066, 7674937927.

REAL ESTATE

FLAT FOR SALE

East Facing 2BHK Flat, 1300 SFT, with Good Interiors, Geyser, Fans, Chimney Free, 9 years old, Suvidda Sadan Apartment, 3rd Cross, Maruthi Nagar. Contact: 8328453431

LEASE/ RENT

... 9133399861.

LAND REQUIRED

... Land Partners ... © 9133399861.

JOBS

... (Sheep farm) ... 9989304684

Rajahamsa Grand ... Hotel ... © 9948266888.

... MBA/B.Com /B.Sc ... 30-45 ... © 8885423099

ATP ... ATP. Cell: 7780544424

... 10 ... 12000/- ... 72880 04466

గమనిక

5 లైన్ల ప్రకటన రూ.395/-

వివరాలకు: 8008709784

సర్కారుపై ఆశ.. భూగర్భ జలాలపైనే ధ్యాస!

- కలగా రాగులపాడు తూము ఏర్పాటు
- రైతులకు తప్పని ఎదురుచూపులు

గుంతకల్లు, ఉరవకొండ, న్యూస్‌టుడే : గుంతకల్లు సమీపంలో నుంచి వెళ్లే హంద్రీనీవా కాలువకు ఉరవకొండ నియోజకవర్గం వజ్రకరూరు మండలంలోని రాగులపాడు వద్ద తూము ఏర్పాటు విషయంలో అంతులేని జాప్యం జరుగుతోంది. ఆ పనులు జరిగితే గుంతకల్లు మండలంలోని చెరువులు, కుంటలకు, పలు చెక్‌డ్యాంలకు నీటిని అందించడానికి ఉపయుక్తంగా ఉంటుంది. దీంతో పాటు ఉరవకొండ నియోజకవర్గంలోనూ కొన్ని కుంటలు, చెక్‌డ్యాంలకు నీరు అందివ్వడానికి వీలుంటుంది.

2018లోనే అనుమతులు

గత తెదేపా ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ కాలువ ఏర్పాటు కోసం ప్రభుత్వం నుంచి 2018లో ఉత్తర్వులు తీసుకొచ్చారు. అప్పటి ప్రభుత్వం రూ.40 కోట్లు మంజూరు చేసింది. తరువాత వైకాపా ప్రభుత్వం 2021లో టెండర్లు నిర్వహించారు. అప్పటి ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి భూమి పూజ చేసి పట్టించుకోలేదు. భూసేకరణ ప్రక్రియ ముందుకు సాగలేదు. ఇప్పుడా కాలువ అంచనా వ్యయం రూ.55 కోట్లకు చేరింది. ● కాలువ ఏర్పాటు చేస్తామని గతంలోనే ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా గత మేలో ఉరవకొండ నియోజకవర్గానికి వచ్చిన సమయంలోనూ రైతులకు అభయమిచ్చారు.

ప్రయోజనం బోలెడు

కాలువ ఏర్పాటైతే వజ్రకరూరు మండలంలోనే కాకుండా గుంతకల్లు మండలంలోని దాదాపు 4 వేల సేద్యపు బోర్లలో నీటి మట్టం పెరిగి పంటలు పండించుకోవడానికి వీలుంటుంది. కుంటల్లో, చెరువులు, చెక్‌డ్యాంలో నీరు నిల్వఉంటే భూగర్భజలమట్టం పెరుగుతుంది. తాగునీటి సమస్యకు పరిష్కారం లభించే అవకాశముంది. దీనిపై హంద్రీనీవా కాలువ గుంతకల్లు డివిజన్ ఈఈ శ్రీనివాస్‌నాయక్ స్పందిస్తూ ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందగానే సమగ్రమైన నివేదికను అందించి పనులను ప్రారంభిస్తామన్నారు.

నీరు లేక ఒట్టిపోయిన పులగుట్టపల్లి చెరువు

పొడవు	20 కి.మీ.లు	తూము నిర్మాణ వ్యయం (అంచనాల్లో)	రూ.55 కోట్లు
లబ్ధిపొందే మండలాలు	గుంతకల్లు, వజ్రకరూరు, ఉరవకొండ	భూసేకరణ	230 ఎకరాలు
హంద్రీనీవా నీటితో నింపే చెరువులు, కుంటలు	14	కాలువ సామర్థ్యం	100 క్యూసెక్కులు

ఈఏడాదిలో పూర్తి చేయిస్తాం

హంద్రీనీవా కాలువకు రాగులపాడు వద్ద తూమును ఏర్పాటు చేయిస్తాం. ఈ ఏడాది చివరికంతా పనులు పూర్తయ్యేలా ప్రణాళికతో ముందుకెళ్తాం. నిధులను మంజూరు చేయించుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. - జయరాం, ఎమ్మెల్యే, గుంతకల్లు

మహాత్మ జ్యోతిబా ఫులె గురుకులాల్లో ప్రవేశాలు

అనంతపురం (అశోక్‌నగర్), న్యూస్‌టుడే: మహాత్మా జ్యోతిబా ఫులె ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు ప్రకటన విడుదల అయింది. 2026-2027 విద్యాసంవత్సరంలో ప్రవేశాలు కల్పిస్తారు.

ఎక్కడెక్కడ..ఎన్ని సీట్లు

బాలుర గురుకులంలో ఐదో తరగతిలో ప్రవేశాలకు ఉరవకొండ మండలం పెన్నహోబిళం 80సీట్లు, కళ్యాణదుర్గం మండలం కుందుర్పిలో 40సీట్లు, బాలికల విభాగంలో డి.హిరేహాళ్‌లో 40, గోనబావిలో 40, నార్పలలో 80సీట్లు ఉన్నాయి. అనంతపురం జిల్లాలో ఇంటర్ కళాశాలలు లేవు. శ్రీసత్యసాయిలో మొత్తం 13 ఉండగా ఇందులో ఇంటర్ కళాశాలలు ఉన్నాయి. ● 6, 7, 8వ తరగతుల్లో ఆయా గురుకులాల్లో ఖాళీలను బట్టి ప్రవేశాలు ఉంటాయి. ఇంటర్‌లో ఆంగ్లమాధ్యమంలో చదివేందుకు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుకు చివరి తేది: **4-3-2026**, 5వ తరగతిలో ప్రవేశాలకు ప్రవేశ పరీక్ష: **12-4-2026**, 6,7,8 తరగతుల్లో మిగిలిన సీట్లకు: **19-4-2026** మధ్యాహ్నం, ఇంటర్‌లో ప్రవేశాలకు: అదేరోజు ఉదయం. దరఖాస్తుకు వెబ్‌సైట్: https:///mipaphcwreis.apcfss.in సంప్రదించాల్సిన నంబరు: 8125840147

ఉద్యోగుల క్రెడిట్ సొసైటీ అవకతవకలపై విచారణ

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఉద్యోగుల క్రెడిట్ సొసైటీలో చోటుచేసుకున్న అవకతవకలపై విచారణకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా సహకార శాఖ అధికారిణి అరుణకుమారి ఆదేశాల మేరకు విచారణ చేయడానికి రంగం సిద్ధమైంది. గత ఆర్థిక సంవత్సరంలో సొసైటీలో నిబంధనలకు విరుద్ధంగా నిధులు ఖర్చు చేశారని ఆడిటర్లు అభ్యంతరాలు లేవనెత్తారు. ఈ విషయాన్ని డివిజనల్ సహకార శాఖ అధికారి వెంకటరామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన డీసీఓకు విషయాన్ని చేరవేశారు. సహకార చట్టం సెక్షన్ 52 కింద విచారణ చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. విచారణ అధికారిగా మల్లరాయుడిని నియమించారు. బుధవారం ఆయన క్రెడిట్ సొసైటీ పాలకవర్గ సభ్యులకు తాఖీదులు జారీ చేశారు. తక్షణమే రికార్డులన్నీ అప్పగించాలని సూచించారు. రికార్డులు అప్పగించిన తర్వాత విచారణ ప్రారంభిస్తానని అధికారి మల్లరాయుడు తెలిపారు.

సేవాఘడ్‌కు నిరంతర విద్యుత్తు

గుంతకల్లు పట్టణం: పాతకొత్త చెరువు గ్రామంలో 33కేవీ విద్యుత్తు ఉపకేంద్రంలో బుధవారం సేవాఘడ్‌కు 24గంటల పాటు విద్యుత్తు సరఫరా చేసేందుకు కన్‌స్ట్రక్షన్ ఏడీ రంగస్వామి కొత్త బ్రేకరును ప్రారంభించారు. సేవాఘడ్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్తు సరఫరా చేసేందుకు బ్రేకరును ప్రారంభించామన్నారు. ఈకార్యక్రమంలో ఏఈ మన్నన్, సిబ్బంది పాల్గొన్నారు.

కాలమానిని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్, గెజిటెడ్ అధికారులు

స్టడీ సర్కిల్ పునః ప్రారంభానికి రూ.22 లక్షలతో ప్రతిపాదనలు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువత బాగు కోసం స్టడీ సర్కిల్ భవన మరమ్మతుకు రూ.22 లక్షలతో ప్రభుత్వానికి పంపడం సంతోషకరమని అఖిల భారత ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంఘం హర్షం వ్యక్తం చేసింది. బుధవారం కలెక్టర్ ఆనంద్‌ను కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆ సంఘం డైరీని ఆవిష్కరించారు. జిల్లాలోని ప్రభుత్వ శాఖల్లో ఫోకల్ పాయింట్ల వద్ద దళిత, గిరిజన ఉద్యోగ, అధికారులను నియమించేలా చొరవ తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ప్రధాన కార్యదర్శి రవిశంకర్, కేంద్ర కమిటీ సభ్యుడు సోమశేఖర్, విశ్రాంత డీసీటీఓ సుబ్బన్న, కలెక్టర్ కార్యాలయ సమన్వయాధికారి యుగేశ్వరిదేవి, డిగ్రీ అధ్యాపకుడు సుగప్ప, జేఎన్‌టీయూ ఇంజినీరు శ్యామ్‌బాబు, ఏబీసీడబ్ల్యూఓ సుభాషిణి, డీఈఈ లలిత, ఏఈఈ జైప్రకాశ్ పాల్గొన్నారు.

యాడికి.. అవుట్‌పోస్టుకు దిక్కేది?

యాడికి, న్యూస్‌టుడే : యాడికి మండలంలో అవుట్‌పోస్టుల నిర్వహణను పోలీసులు గాలికి వదిలేశారు. తాడిపత్రి సబ్‌డివిజన్ పరిధిలోని యాడికి మండలంలో నేరాల సంఖ్య అధికంగానే ఉంటుంది. దీంతో ఉన్నతాధికారులు యాడికిలో అవుట్‌పోస్టు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అవుట్‌పోస్టు చిరు వ్యాపారులకు నిలయంగా మారింది. ఇక్కడి పాత పోలీస్‌స్టేషన్ భవనం అవసరాలకు సరిపోకపోవడం, గదులు శిథిలమవడం, వర్షాలు వస్తే కారడం జరుగుతుండేది. దీంతో గత తెదేపా ప్రభుత్వ హయాంలో గ్రామానికి వెలుపల నూతన భవనాలు నిర్మించి పోలీస్‌స్టేషన్‌ను అక్కడికి మార్చారు.

తక్షణ సేవల నిమిత్తం కేంద్రం

వివిధ సమస్యలు, ఫిర్యాదులను ఇవ్వడానికి బాధితులు, ప్రజలు రావాలంటే ఇబ్బందులు తలెత్తేవి. సమస్యను గుర్తించి తక్షణ చర్యల నిమిత్తం పాత భవనంలో అవుట్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఒక ఏఎస్సైతో పాటు ఇద్దరు సిబ్బందిని నియమించి ప్రారంభించారు. కొంతకాలం తర్వాత పట్టించుకోలేదు. అప్పటి నుంచి భవనం చుట్టూ చిరువ్యాపారులు ఆక్రమించారు.

● రాయలచెరువులో రైల్వేస్టేషన్, జాతీయ రహదారి, జనాభా దృష్ట్యా ఇక్కడా అవుట్‌పోస్టును ఏర్పాటు చేయాలనుకున్నారు. రైల్వేగేటు సమీపంలో వ్యవసాయ చెక్‌పోస్టు పక్కనే గది నిర్మాణం చేపట్టారు. ఎందుకనో అదికాస్త సగంలోనే ఆగిపోయింది. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని సీఐ ఆర్.శ్రీనివాసులు తెలిపారు.

చిరు వ్యాపారులకు నిలయంగా అవుట్ పోస్టు

ముగిసిన పోలీసు క్రీడలు

ఓవరాల్ ఛాంపియన్ కప్‌ను అందజేస్తున్న ఐజీ షిమోషీ, ఎస్పీ జగదీశ్

ఆజాద్‌నగర్ (అనంతపురం),న్యూస్‌టుడే: జిల్లా పోలీసు స్పోర్ట్స్ అండ్ గేమ్స్-2025 బహుమతుల ప్రదానం పండగ వాతావరణంలో బుధవారం నగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో సాగింది. ముఖ్య అతిథులుగా ఐజీ షిమోషీ, ఎస్పీ జగదీశ్‌లు పాల్గొని పోలీసు అధికారులు, సిబ్బందిని ఉత్సాహ పరిచారు. క్రీడల్లో గెలుపొందిన జట్లు, వ్యక్తిగత విజేతలకు కప్‌లు, పతకాలు అందజేశారు. అనంతరం పోలీసు కుటుంబాలతో కలిసి 'బడా ఖానా' కార్యక్రమంలో ఐజీ, ఎస్పీలు పాల్గొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో చేరిన తొలినాళ్లలో నేర్చుకున్న శిక్షణ మరచిపోకుండా ఉండేలా ఈ కార్యక్రమాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. ముగింపు కార్యక్రమంలో ఐజీ, ఎస్పీ జట్లుగా విడిపోయి టగ్ ఆఫ్ వార్ నిర్వహించారు. పోటీలో ఎస్పీ జట్టు గెలుపొందింది. తాడిపత్రి ఏఎస్పీ రోహిత్‌కుమార్, శిక్షణ ఐపీఎస్ అశ్విని మణిదీప్, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఓవరాల్ ఛాంపియన్‌గా ఏఆర్ జట్టు

మూడు రోజులుగా జరిగిన పోలీసు క్రీడల్లో అన్ని విభాగాల్లో ప్రతిభ చూపిన జిల్లా ఏఆర్ విభాగం ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. క్రికెట్, పరుగు పందెం, రిలే, వాలీబాల్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రోలో గ్రూపు, వ్యక్తిగత విజయాలను నమోదు చేసింది. అలాగే అనంతపురం, తాడిపత్రి, కళ్యాణదుర్గం, గుంతకల్లు సబ్ డివిజన్ల జట్లకు మెమెంటోలను ఐజీ, ఎస్పీలు అందజేశారు.

జడ్పీ పాఠశాలలో తాగునీటి సమస్య పరిష్కారం

బ్రహ్మసముద్రం: మండలంలోని నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నెలకొన్న తాగునీటి సమస్యపై మంగళవారం విద్యార్థులు ఆ గ్రామ సర్పంచి సందీప్ ఇంటి వద్దకు వెళ్లి ఖాళీ ప్లేట్లు, గ్లాసులతో ధర్నా చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం సర్పంచితోపాటు పాఠశాల కమిటీ ఛైర్మన్ మల్లికార్జున స్పందించి.. పైపులైన్‌కు మరమ్మతులు చేయించారు. సంపులోకి నీరు సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టారు. ఎంఈవోలు ఓబుళపతి, కృష్ణానాయక్ పైపులైన్ మరమ్మతు పనులను పర్యవేక్షించారు.

తెదేపా గూటికి వైకాపా మైనార్టీ నాయకుడు

తెదేపా కండువాతో పార్టీలోకి ఆహ్వానిస్తున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రి, న్యూస్‌టుడే: వైకాపా సీనియర్ నాయకుడు, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు గయాజ్‌బాషా జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో తెదేపాలోకి చేరారు. ఈ సందర్భంగా ఆయన్ను తెదేపా కండువాతో పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా సమాజసేవ చేస్తున్న వ్యక్తి గయాజ్‌బాషా అన్నారు. తాడిపత్రిని అభివృద్ధి చేసేందుకు తోడ్పాటు అందించాలని, ఇదివరకే గయాజ్‌బాషాను అడిగామని, అప్పట్లో కొంత సమయం కావాలని చెప్పారని తెలిపారు. ప్రస్తుతం ఆయన పార్టీలోకి రావడం సమాజాభివృద్ధి చేసేందుకు తనకు మరింత బలం చేకూరిందన్నారు.

ఆధ్యాత్మిక సమాచారం

కదిరి, న్యూస్‌టుడే: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి దర్శనం నేటి (గురువారం) ఉదయం 6 గంటల నుంచి 6.45 వరకు ఉంటుంది. 7నుంచి 9గంటల మధ్య అభిషేక, స్వర్ణ కవచ సేవలు. అనంతరం 9 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు తిరిగి సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు భక్తులకు స్వామివారి సర్వదర్శనం ఉంటుంది.

నెట్టికంటయ్య ఆలయంలో వేలం

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే : కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో 2026-27 సంవత్సరానికి బహిరంగ వేలం, సీల్డ్ టెండర్, ఆన్‌లైన్ టెండర్ వేలం పాటలు ఈవో విజయరాజు ఆధ్వర్యంలో జరిగాయి. గతంలో కంటే ఈసారి వేలం పాటలతో కసాపురం దేవస్థానానికి ఆదాయం పెరిగింది. తలనీలాలు పోగుచేసుకొనే హక్కును అనంతపురానికి చెందిన నవీన్ రూ.1,36,50,000లకు పాట పాడి దక్కించుకున్నారు. టోల్‌గేట్/పార్కింగ్ రుసుం వసూలుకు ఈసారి రూ.19,07,069 ఆన్‌లైన్‌లో ఒకరు దక్కించుకున్నారు. మొబైల్ ఫోన్ల భద్రతకు రూ.8,15,000లతో దక్కించుకున్నారు. ఇంకా పలు వేలం పాటలను పలువురు దక్కించుకున్నారు. జిల్లా సహాయ కమిషనర్ మల్లికార్జున, ఏఈవో వెంకటేశ్వరుడు, ఆలయాధికారులు రామ్మోహన్, వేమన్న, పోలీస్ సిబ్బంది టెండర్ పాటదారులు పాల్గొన్నారు.

అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వీరాంజనేయులు

అనంతపురం(లీగల్), న్యూస్‌టుడే: నాలుగో అదనపు జిల్లా కోర్టు(మహిళా కోర్టు) పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఆర్.వీరాంజనేయులును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కళ్యాణదుర్గం మండలం ఈస్టు కోడిపల్లికి చెందిన వీరాంజనేయులు 2007లో న్యాయశాస్త్రంలో పట్టభద్రులయ్యారు. అప్పటి నుంచి జిల్లా కోర్టులో న్యాయవాదిగా సేవలు అందిస్తున్నారు. అదనపు పీపీగా ఆయన మూడేళ్ల పాటు కొనసాగనున్నారు.

అత్యాధునిక వసతులతో గ్రంథాలయం ఏర్పాటు చేస్తాం

రత్నాకర్‌ను సన్మానిస్తున్న గ్రంథాలయ ఛైర్మన్ వెంకట్

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో విద్యార్థులు, నిరుద్యోగుల సౌకర్యార్థం అత్యాధునిక వసతులతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసేందుకు తగు చర్యలు చేపడుతున్నామని ఉమ్మడి జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ వడ్డె వెంకట్ తెలిపారు. బుధవారం పుట్టపర్తిలో ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, జేసీ మౌర్యభరద్వాజ్‌లను ఆయన వేర్వేరుగా కలిసి సన్మానించారు. పుట్టపర్తిలో గ్రంథాలయం ఏర్పాటుకు స్థలం కేటాయించి, పక్కా భవనాన్ని ట్రస్టు తరపున నిర్మించాలని కోరారు.

పెన్నా.. జలపరవళ్లు!

పెద్దపప్పూరు, న్యూస్‌టుడే :పెద్దపప్పూరు మండలంలో సాగు, తాగునీటి వర ప్రదాయనిగా మారిన పెన్నానది ప్రస్తుతం జల ప్రవాహంతో పరవళ్లు తొక్కుతోంది. పదిహేనుళ్లగా ఈ సమయంలో మొదటి సారి నదిలో నీరు ప్రవహిస్తోంది. కూటమి ప్రభుత్వం చేపట్టిన చర్యలతోనే జలకళ సంతరించుకుంది. దీంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తాగు, సాగు నీటి కష్టాలు లేకుండా జీవిస్తున్నామని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదం జరిగితే ఎలా?

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండ ప్రాంతంలో వ్యవసాయ కూలీలు దూర గ్రామాలకు వెళ్తున్నారు. వారు ఉపాధి నిమిత్తం నిత్యం ఆటోలు, బొలెరోలో రాకపోకలు సాగిస్తుంటారు. ఈ వాహనాల్లో తరచుగా స్థాయికి మించి ప్రయాణికులను తీసుకెళ్తుంటారు. వాహనాలు కుదుపునకు గురైతే వారు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. మంగళవారం పట్టణంలోని ప్రధాన రహదారిపై ఓ బొలెరోలో ప్రయాణికులు ప్రమాదం అంచున ప్రయాణిస్తూ కనిపించారు. గతంలో కూలీలను తరలించే వాహనాలు ప్రమాదానికి గురైన సందర్భాలు ఉన్నాయి.

రంగనాథస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.14.97 లక్షలు

గుత్తి గ్రామీణం, న్యూస్‌టుడే: గుత్తి మండలంలోని తొండపాడు గ్రామంలో వెలసిన ప్రసిద్ధ బొలికొండ రంగనాథ స్వామి ఆలయ లెక్కింపును బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రాణి, ఆలయ కార్యనిర్వహణాధికారి శోభ ఆధ్వర్యంలో ఆలయ హుండీ లెక్కింపు చేశారు. గతేడాది అక్టోబర్ 10 నుంచి ఇప్పటి వరకు భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. రూ.14.97,832 లక్షల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ రంగస్వామిరెడ్డి యాదవ్, సిబ్బంది రామకృష్ణ, బాలు మోహన్ పాల్గొన్నారు.

కానుకలు లెక్కిస్తున్న ఆలయ అధికారులు, నిర్వాహకులు

గుత్తి.. నిత్యం ట్రాఫిక్ కష్టాలతో హడలెత్తి

గుత్తి గ్రామీణం, న్యూస్‌టుడే : గుత్తిలో ట్రాఫిక్ కష్టాలు అన్నీ ఇన్నీ కావు. నిత్యం గుత్తి మీదుగా వేల వాహనాల రాకపోకలు ఉండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. గుంతకల్లు, మంత్రాలయం వెళ్లే వాహనాలకు బైపాస్ రోడ్డు లేకపోవడంతో పట్టణంలోనే వెళ్లాల్సి వస్తోంది. దీంతో గాంధీచౌక్, ఆర్టీసీ ప్రాంగణం వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు రద్దీ ఎక్కువగా ఉంటోంది. అలాగే గుంతకల్లు రోడ్డును నూతనంగా నిర్మించడంతో ఒకవైపే వాహనాలు వెళ్లాల్సిన పరిస్థితి కొనసాగుతోంది. పట్టణంలో రోడ్డుకు ఇరువైపులా తోపుడు బండ్లు, వాహనాలు నిలపకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని వాహనాదారులు కోరుతున్నారు.

అనారోగ్య సమస్యలపై ప్రశ్నించిన భార్యకు వేధింపులు

అనంత నేరవార్తలు: అనారోగ్య సమస్యలపై ప్రశ్నించిన భార్యను వేధింపులకు గురిచేసిన ఘటన నగరంలో వెలుగుచూసింది. వివరాల మేరకు కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన ఓ యువకుడికి గతేడాది డిసెంబరులో నగరానికి చెందిన ఓ యువతితో వివాహమైంది. వివాహం అనంతరం భర్తకు అనారోగ్య సమస్యలు చుట్టుముట్టాయి. యువతి ఆమె తల్లిదండ్రుల సలహా మేరకు భర్తను నగరంలోని ఓ వైద్యుడి వద్దకు తీసుకెళ్లి పరీక్షలు చేయించింది. పరీక్షల్లో భర్తకు అధిక స్థాయిలో చక్కెర, కొలెస్ట్రాల్, రక్తంలో గ్లైకోట్స్ ఉన్నట్లు తేలింది. అనారోగ్య సమస్యలు దాచిపెట్టి తనను పెళ్లెందుకు చేసుకున్నావని ఆమె భర్తను ప్రశ్నించింది. అప్పటి నుంచి ఆమెపై వేధింపులకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు మద్దతు తెలపడంతో మరింత రెచ్చిపోయాడు. అదనంగా కట్నం తీసుకురావాలని వేధించేవాడు. బాధితురాలు రెండు రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

కదిరి పురపాలక సంఘం
"ఇ" ప్రొక్యూర్‌మెంట్

Tender Notice No. 1533 to 1538/KDR/General Funds/E1, Dt. 11-02-2026

పనిపేరు	పనుల సంఖ్య	అంచనా మొత్తం
General Funds	06	16 లక్షలు

ఆన్‌లైన్‌లో షెడ్యూలు డౌన్ లోడింగ్ ప్రారంభ తేది:	12-02-2026 ఉ॥ 11-00 గం॥లకు
ఆన్‌లైన్‌లో షెడ్యూలు డౌన్ లోడింగ్ చివరి తేది :	16-02-2026 సా॥ 05-00 గం॥లకు
బిడ్ తెరిచే తేది :	16-02-2026 సా॥ 05-30 గం॥లకు

తదుపరి వివరములకు https://tender.apeprocurement.gov.in "ఇ" ప్రొక్యూర్‌మెంట్ ప్లేస్‌లో పొందవచ్చును.

ఆఫీసు చిరునామా: కమిషనర్, కదిరి పురపాలక సంఘం. ఫోన్ నెం: 94948 17131.

Note: Any addendum/Corrigendum/Bid Clarifications/Time extension shall be issued on the website only. No separate press notification shall be issued.

సం/- కమిషనర్, కదిరి పురపాలక సంఘం

వ్యాపారంలో నష్టం..చోరీలకు బీజం

- అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు
- 270 గ్రాముల బంగారం స్వాధీనం

పెనుకొండ, న్యూస్‌టుడే: వ్యాపారంలో నష్టాలు రావడంతో చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా కుటుంబాన్ని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ముఠా పెనుకొండ సబ్-డివిజన్‌లోని పది పోలీస్‌స్టేషన్ల పరిధిలో గత నాలుగేళ్లలో 25 చోరీలకు పాల్పడింది. జిల్లా ఎస్పీ సతీశ్ కుమార్ బుధవారం పెనుకొండలోని డీఎస్పీ కార్యాలయంలో విలేకరులకు వివరించారు. కర్ణాటక రాష్ట్రం తుమకూరు జిల్లా పావగడ తాలుకా జాజురాయునిహళ్లికి చెందిన బొమ్మలాట అరుణ్‌కుమార్, అతడి కుటుంబ సభ్యులు, బంధువులు నరేశ్, ఆంజనేయులు, లక్ష్మీ, గంగమ్మ, యశోదమ్మ, వెంకటరమణ, నిర్మలమ్మ, లక్ష్మీదేవమ్మ పందుల వ్యాపారం చేస్తూ నష్టాల పాలయ్యారు. ఆర్థిక ఇబ్బందులతో సులభంగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకొని దొంగతనాలను ఎంచుకున్నారు. 2022 నుంచి వీరందరూ కలిసి తాళం వేసిన ఇళ్లలో చోరీలకు పాల్పడ్డారు. అమరాపురం, రొళ్ల, అగళి, మడకశిర, గుడిబండ, పెనుకొండ, రొద్దం, సోమందేపల్లి, కియా పోలీస్‌స్టేషన్ల పరిధిలోని దాదాపు 27 ఇళ్లలో బంగారు నగలు దొంగలించారు. చోరీ సమయంలో చరవాణిలు వాడితే పోలీసులకు పట్టుబడతామని ముందుగానే వాటిని తమ ఇళ్లలో ఉంచేవారు. దొంగలించిన ఆభరణాలను భాగాలుగా పంచుకొని అందులో కొన్ని అమ్మి వచ్చిన నగదు పంచుకునేవారు. మిగిలిన నగలను ప్రధాన నిందితులు అరుణ్ కుమార్, నరేశ్ తమ బంధువులు వెంకటరమణ, నిర్మలమ్మ పేరుపైన తాకట్టుపెట్టి తప్పించుకు తిరిగేవారు. ఈ నేపథ్యంలో 2026 జనవరి 22న గుడిబండ మండలం తాళ్లకెరెకు చెందిన గొల్ల పాండురంగప్ప ఇంటిలో చోరీకి పాల్పడి 60గ్రాముల బంగారం, రూ.10వేలు నగదు దొంగలించారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. వరుస చోరీలను అరికట్టేందుకు ఎస్పీ సతీశ్ కుమార్, పెనుకొండ డీఎస్పీ నరసింగప్ప ప్రత్యేక బృందాలను రంగంలో దింపారు. ఈక్రమంలో బుధవారం జంబులబండ గ్రామం కోటకొత్తూరు క్రాస్ వద్ద పోలీసులు అరుణ్‌కుమార్, నరేశ్‌ను అరెస్టు చేశారు. వారి నుంచి ద్విచక్రవాహనం, ఇనుపరాడ్లు స్వాధీనం చేసుకుని విచారించారు. వారిచ్చిన వివరాలతో కర్ణాటకలోని జాజురాయునిహళ్లిలో ఉంటున్న లక్ష్మీ, లక్ష్మీదేవమ్మ, గంగమ్మ, యశోదమ్మ, పావగడలోని ముత్తూట్ ఫైనాన్స్ కార్యాలయ సమీపంలో ఉంటున్న వెంకటరమణ, పావగడ తాలూకా కోటగుడ్డంలో నివసిస్తున్న నిర్మలమ్మను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.32.40లక్షల విలువచేసే 270 గ్రాముల నగలను స్వాధీనం చేసుకున్నారు. ఆంజనేయులు అనే నిందితుడు పరారీలో ఉన్నట్లు ఎస్పీ వివరించారు.

నిందితులు, నగలను చూపుతున్న ఎస్పీ సతీశ్‌కుమార్, సిబ్బంది

గోరంట్లలో చోరీ కేసుల్లో నిందితుడి..

గోరంట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో 2024 నుంచి 2026 మధ్య ఇళ్లలో జరిగిన వరుస చోరీల్లో హిందూపురం పట్టణానికి చెందిన నిందితుడు నూర్‌ముజామిల్‌ను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.18లక్షలు విలువజేసే 130 గ్రాముల బంగారు నగలు, ఒక ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. గోరంట్ల మండలం పాలసముద్రం వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా, నిందితుడు వారిని చూసి పారిపోవడానికి యత్నించగా అదుపులో తీసుకొని విచారించగా నిజాలు బయటపడ్డాయి. రెండు కేసుల్లో నిందితులను కోర్టులో హాజరుపరుస్తామని ఎస్పీ వివరించారు. సమావేశంలో పెనుకొండ, గోరంట్ల, మడకశిర సీఐలు రాఘవన్, శేఖర్, రాజ్‌కుమార్, పలువురు ఎస్సైలు పాల్గొన్నారు.

హిందూపురం

• హిందూపురం • పెనుకొండ • మడకశిర

హామీల అమలులో నిర్లక్ష్యంపై 13న ధర్నా

గోరంట్ల, న్యూస్‌టుడే: ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఉద్యోగి, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఇచ్చిన హామీల అమలులో నిర్లక్ష్యంపై 13న కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజులుయాదవ్ కోరారు. పాలసముద్రంలోని ఉన్నత పాఠశాల భవనంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 20 నెలలవుతున్నా హామీలు నెరవేరలేదన్నారు. మెరుగైన పీఆర్సీ ఇవ్వక పోవడంతో ఉద్యోగులు నష్టపోతున్నారని, పీఆర్సీ కమిటీ నియమించాలని, 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. వీటిపై రాష్ట్రవ్యాప్తంగా ధర్నా చేస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ఉపాధ్యాయులు రాధారమణ, గోపికృష్ణ, సుధాకర రెడ్డి, సలీం, ఈశ్వరప్ప, మనోహరాచారి, వేణుగోపాల్, గంగరాజు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

హిందూపురం : 91548 46650
పెనుకొండ : 91000 20922
మడకశిర : 76759 19016

సమస్య: బంగారుపాళ్యంలో వీధి దీపాలు వెలగడం లేదు. - యంజారప్ప, స్థానికుడు
సమాధానం: అక్కడక్కడ కొన్ని దీపాలు వెలగడం లేదు. కొత్తవి అమర్చుతాం. -యోగానంద, పంచాయతీ కార్యదర్శి, అమరాపురం
సమస్య: గౌడనకుంట ఇందిరమ్మ కాలనీలో మురుగు రోడ్డుపైకి ప్రవహిస్తోంది. -నాగరాజు, స్థానికుడు
సమాధానం: మురుగు కాలువ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే పనులు చేపడతాం. -గిరిజమ్మ, సర్పంచి, తమ్మడేపల్లి -న్యూస్‌టుడే, అమరాపురం
సమస్య: కేంచేపల్లి ఇందిరమ్మ కాలనీలో అంధకారం నెలకొంది. -భాగ్యమ్మ, స్థానికురాలు
సమాధానం: రెండు రోజుల్లో వీధిదీపాలు వెలిగేలా చేస్తాం. -లక్ష్మీదేవమ్మ, సర్పంచి, కేంచేపల్లి
సమస్య: కూర్మిపాళ్యంలో తాగునీటి సమస్యతో బాధపడుతున్నాం. -వెంకటస్వామి, స్థానికుడు
సమాధానం: బోరు తవ్విస్తాం. మోటారు అమర్చి నీరు సరఫరా చేస్తాం. -హరి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ -న్యూస్‌టుడే, గుడిబండ
సమస్య: పట్టణంలోని కిందరాని కాంప్లెక్స్ రోడ్డు నుంచి ఎన్టీఆర్ కూడలి వరకు కాలువలో చెత్త పేరుకుపోయి దోమల బెడద తీవ్రంగా ఉంది. -రవికుమార్, స్థానికుడు
సమాధానం: వెంటనే పారిశుద్ధ్య కార్మికులను పంపించి శుభ్రం చేయిస్తాం. -శంకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, హిందూపురం -న్యూస్‌టుడే, హిందూపురం సాంస్కృతికం

బడుగు వ్యాపారుల బతుకుబండి

120 కుటుంబాల్లో వెలుగులు

గోరంట్ల, న్యూస్‌టుడే: చిరు వ్యాపారాలతో జీవితాలు నెట్టుకొస్తున్న బడుగు జీవులకు రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి మంత్రి సవిత చేపట్టిన తోపుడు బండ్ల పంపిణీ ఆసరాగా నిలుస్తోంది. గతంలో సొంత బండ్లు కొనుగోలు చేసుకునే ఆర్థిక స్తోమత లేక అద్దెకు తీసుకుని వ్యాపారాలు చేసేవారు. ఇప్పటికీ కొంతమంది నేలపై వివిధ రకాల సామగ్రి అమ్ముకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. అలాంటి వారికి వెన్నుదన్నుగా ఈ తోపుడుబండ్లు నిలుస్తున్నాయి. పెనుకొండ నియోజకవర్గంలోని అయిదు మండలాల్లో ఈ పథకం కింద చేతన్ ఫౌండేషన్ సహకారంతో రెండు విడతలుగా 120 తోపుడు బండ్లు అందజేశారు. ఆయా కుటుంబాలకు నేరుగా ఉపాధి లభించిందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. పిల్లలను బాగా చదివించుకుంటున్నామని తమ ఆనందాన్ని పంచుకున్నారు. అది వారి మాటల్లోనే..

రెండు విడతల్లో మండలాలవారీగా పొందిన లబ్ధి వివరాలు

మండలం	అందిన తోపుడు బండ్లు		మొత్తం
	మొదటి	రెండో	లబ్ధిదారులు
గోరంట్ల	12	07	19
పెనుకొండ	18	10	28
సోమందేపల్లి	15	12	27
రొద్దం	15	11	26
పరిగి	12	08	20

ఆరేళ్లుగా పండ్ల వ్యాపారం చేస్తున్నా

నా పేరు కృష్ణవేణి. భర్త భవన నిర్మాణ కార్మికుడు. ఆయన సంపాదనకు తోడుగా ఆరేళ్లుగా పండ్ల వ్యాపారం చేస్తున్నా. ఇదివరలో సొంత తోపుడుబండి లేక చాలా అవస్థలు పడ్డా. ఇటీవల మంత్రి సవితమ్మ ఆదేశాలతో మాకు తోపుడుబండి వచ్చింది. దాని అద్దె నెలకు రూ.2వేలు పైగా మిగిలినట్లే. పిల్లల చదువుకు ఎంతో ఉపయోగపడుతుంది. మాకు ఇద్దరు కుమారులు డిగ్రీ, పదో తరగతి చదువుతున్నారు. -కృష్ణవేణి, గోరంట్ల

రోజుకు రూ.100 అద్దె చెల్లించా

నా పేరు నారాయణస్వామి. చిరు వ్యాపారిని. అద్దె తోపుడు బండికి రోజుకు రూ.100 అద్దె చెల్లించేవాడిని. ఆ మేరకు వ్యాపారం జరిగినా, జరగకపోయినా డబ్బు చెల్లించాల్సిందే. స్థానిక నాయకుల సహకారంతో మంత్రి ఆధ్వర్యంలో నాకు లభించిన సొంత తోపుడు బండి ఎంతో ఆదరవుగా ఉంది. అద్దె మొత్తం మిగులుతోంది. కుమారుడు, కుమార్తెను ఇంటర్మీడియట్ చదివిస్తున్నా. మాలాంటి చిరుజీవులకు సంక్షేమ పథకాలు ఉపయోగపడటం ఆనందంగా ఉంది. -నారాయణస్వామి, కదిరి రోడ్

నాలుగు ఇసుక ట్రాక్టర్ల సీజ్

పరిగి న్యూస్‌టుడే: పరిగి మండలంలోని శ్రీరంగరాజుపల్లి సమీపంలో జయమంగళి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై రంగడుయాదవ్ తెలిపారు. తమకందిన సమాచారంతో పోలీసు సిబ్బందితో వెళ్లి ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించామన్నారు. వాటిపై జరిమానా విధించేందుకు రెవెన్యూ అధికారులకు సిఫార్సు చేశామన్నారు.

మార్కెటింగ్ నైపుణ్యాలు తప్పనిసరి

హిందూపురం: ఎంబీఏ విద్యార్థులు కళాశాల స్థాయిలోనే మార్కెటింగ్ నైపుణ్యాలు పెంచుకోవాలని స్థానిక సప్తగిరి కళాశాల ప్రిన్సిపల్ నారాయణ రెడ్డి అన్నారు. బుధవారం కళాశాలలో విద్యార్థులు ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్ట్‌ను ఆయన ఏవో గంగిరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టాల్స్‌ను పరిశీలించి విద్యార్థుల అనుభవాలు తెలుసుకున్నారు.

ఆరోగ్య కేంద్రాలకు మహర్దశ

రొద్దంలో పూర్తయిన పబ్లిక్ హెల్త్ యూనిట్

రొద్దం, న్యూస్‌టుడే: దశాబ్దాలుగా శిథిలావస్థకు చేరుకున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాలకు మహర్దశ పట్టింది. రొద్దం మండల కేంద్రంలో దుస్థితికి చేరిన పీహెచ్‌సీ భవనం ఆవరణలో పనులు చేపట్టిన గుత్తేదారు సకాలంలో పబ్లిక్ హెల్త్ యూనిట్ నిర్మాణం పూర్తిచేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాలు కూలిపోయే స్థితికి చేరాయి. పాత భవనాలు ప్రమాదకరంగా ఉన్నా వాటిలోనే ఆరోగ్య సిబ్బంది సేవలందిస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వంలో నిధుల సమస్యతో పలు ఆసుపత్రి భవన నిర్మాణాలు పునాది దశలోనే నిలిచిన విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి సవిత దృష్టికి ప్రజలు ఆరోగ్య భవనాల దుస్థితి తెలిపారు. స్పందించిన ఆమె రూ.50లక్షల నిధులు మంజూరు చేశారు. పబ్లిక్ హెల్త్ యూనిట్ నిర్మాణానికి జీవీల శంకుస్థాపన చేశారు. ఆరు నెలల్లోనే భవన సముదాయం పనులు పూర్తయి ప్రారంభానికి సిద్ధమవడంతో స్థానికులు, ఆరోగ్య సిబ్బంది పొంగిపోతున్నారు.

డ్రోన్ యాప్‌పై రైతులకు అవగాహన

అగళి, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఆర్గనైజేషన్ ఆఫ్ కిసాన్ డ్రోన్' యాప్‌పై మండల వ్యవసాయాధికారి నాగరాజు బుధవారం మండలంలోని మధూడి, కొడిపల్లి గ్రామ రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓలా, ఉబర్, రాపిడో తరహాలో వ్యవసాయ పనులకు కిసాన్ డ్రోన్, ట్రాక్టర్లు ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకుని అద్దెకు తెప్పించుకోవచ్చన్నారు. యాప్‌లో అన్నదాతలు తమ వివరాలు నమోదు చేసుకొని ముందస్తుగా బుక్ చేసుకోవచ్చని సూచించారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తెదేపా కన్వీనర్ తిప్పేస్వామి, కిసాన్ డ్రోన్ రైతుమిత్ర గ్రూప్ కన్వీనర్ కె.యాదవ్, రైతుసేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కర్షకులతో కలిసి కరపత్రాలు విడుదల చేస్తున్న ఏవో నాగరాజు

అనుమతుల్లేని లేఅవుట్లపై కఠినచర్యలు తప్పవు

పట్టణంలో మున్సిపల్, తుడా అనుమతి లేకుండా లేఅవుట్లు వేసి ప్లాట్లు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని పురపాలక కమిషనర్ మల్లికార్జున హెచ్చరించారు. నింకంపల్లిలో అనుమతి లేకుండా వేసిన మూడు లేఅవుట్లను బుధవారం తొలగించినట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే వేసిన వాటిల్లో ప్లాట్లు అమ్మి ఉంటే క్రమబద్ధీకరణ చేసుకోవాలని స్పష్టం చేశారు. లేఅవుట్లలో తప్పనిసరిగా 40 అడుగుల వెడల్పు రోడ్లుండాలని, 10 శాతం స్థలాన్ని ప్రజావసరాలకు వదలాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, హిందూపురం పట్టణం

నిరుపయోగంగా వ్యవసాయ భవనం

పట్టణంలోని రైతుబజార్‌లో పూర్వ వ్యవసాయ భవనం నిరుపయోగంగా ఉంది. పశుసంవర్ధక శాఖకు చెందిన ఈ భవనాన్ని వ్యవసాయ శాఖకు ఇవ్వడంతో కొన్నేళ్లు మండల వ్యవసాయ కార్యాలయంగా వాడారు. ప్రస్తుతం పూలకుంటలోని రైతు సేవా కేంద్రంలోకి వ్యవసాయ కార్యాలయం తరలింది. అప్పటి నుంచి ఈ భవనం నిరుపయోగంగా మారింది. దీనిపై పశుసంవర్ధక డీడీ పెంచలయ్య మాట్లాడుతూ పరిశీలించి వినియోగంలోకి తెస్తామన్నారు. -న్యూస్‌టుడే, హిందూపురం

తొట్టె సరే.. నీరేదీ?

రేకులకుంట వెళ్లే రోడ్డు పక్కన పశువుల దాహార్తి తీర్చేందుకు నిర్మించిన తొట్టెల్లో నీరు నింపక పోవడంతో నిరుపయోగంగా మారింది. ఏడాది కావస్తున్నా నేటికీ పైపులైన్ సౌకర్యం కల్పించలేదు. పాడి రైతులు పశువుల దాహార్తి తీర్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఏపీఓ భార్గవి మాట్లాడుతూ త్వరలోనే తొట్టెల్లో నింపేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. -న్యూస్‌టుడే, మడకశిర గ్రామీణం

శిథిల భవనం..ఆకతాయిలకు నిలయం

మండలంలోని మలుగూరులో 25ఏళ్ల క్రితం నిర్మించిన సముదాయ భవనం నిరుపయోగంగా ఉంది. గోడలు, పైకప్పు దెబ్బతినడంతో వర్షాకాలంలో నీరు చేరుతోంది. ఆకతాయిల అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. దీనిపై ఎంపీడీవో దామోదరమ్మ దృష్టికి తేగా, పాతవి తొలగించి కొత్తవి నిర్మించేందుకు నిధుల కోసం ప్రతిపాదనలు పంపుతామన్నారు. -న్యూస్‌టుడే, హిందూపురం గ్రామీణం

చెక్‌డ్యామ్‌ను పునర్నిర్మించరూ..

మండలంలోని మోపురుగుండు పెద్ద వంకపై నిర్మించిన చెక్‌డ్యాం శిథిలమైంది. ఇందులో నీరు నిల్వ ఉంటే పరిసర బోర్లలో భూగర్భజల మట్టం పెరుగుతుంది. ప్రస్తుతం దుస్థితికి చేరడంతో లోతట్టు ప్రాంతాలకు నీరు తరలిపోతోంది. అధికారులు స్పందించి పునర్నిర్మించాలని రైతులు సత్యనారాయణ, బొజ్జప్ప తదితరులు కోరుతున్నారు. దీనిపై ఏపీఓ జగదీశ్ మాట్లాడుతూ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తామని, నిధులు వచ్చిన తర్వాత పనులు చేపడతామన్నారు. -న్యూస్‌టుడే, గుడిబండ

గుంతల రోడ్డుతో అవస్థలు

మండలంలోని కంచిసముద్రంలో ప్రధాన రోడ్డు గుంతమయంగా మారడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ మార్గంలో కర్ణాటక రాష్ట్ర నగరిగెర మీదుగా గౌరిబిదనూరు వెళుతుంటారు. సంబంధిత అధికారులు స్పందించి గుంతలకు మరమ్మతులు చేయడమో లేదా కొత్త రోడ్డు వేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్ దృష్టికి తేగా కొత్త రోడ్డు నిర్మాణంపై సంబంధిత శాఖాధికారులకు నివేదిస్తామన్నారు. -న్యూస్‌టుడే, లేపాక్షి

విద్యార్థులను అభినందిస్తున్న ఆర్డీవో ఆనంద్‌కుమార్ తదితరులు

జాతీయస్థాయి ఒలింపియాడ్‌లో ప్రతిభ

పెనుకొండ, న్యూస్‌టుడే: ఎన్‌టీసీ (నేషనల్ టీచర్స్ కౌన్సిల్) ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన జాతీయస్థాయి ఒలింపియాడ్ పరీక్షల్లో ప్రతిభచూపిన విద్యార్థులను బుధవారం ఆర్డీవో ఆనంద్‌కుమార్ అభినందించారు. ఈ సందర్భంగా స్థానిక గ్లోబల్ జెన్ పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్‌టీసీ 2025 నవంబర్‌లో ప్రతిభా పరీక్షలు నిర్వహించిందన్నారు. అందులో తమ ఐదో తరగతి విద్యార్థి టి.ఎస్.స్కందన్ సైన్స్ విభాగంలో జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానం, తొమ్మిదో తరగతి విద్యార్థులు ముగ్గురు బంగారు పతకాలు, సాంఘిక శాస్త్రం విభాగంలో ఐదుగురు రజత పతకాలు సాధించినట్లు తెలియజేశారు.

కొత్త రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

హిందూపురం సాంస్కృతికం, న్యూస్‌టుడే: పట్టణంలోని 32వ వార్డు అహమ్మద్ నగర్‌లో రూ.25లక్షలతో చేపట్టనున్న కొత్త రోడ్డు నిర్మాణానికి బుధవారం మున్సిపల్ ఛైర్మన్ డీఈ రమేశ్‌కుమార్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి బాలాజీ భూమిపూజ చేసి మాట్లాడారు. చాలా ఏళ్లుగా రోడ్డు గుంతలు పడటంతో పాదచారులు, వాహన చోదకులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారన్నారు. అన్నిచోట్లా త్వరలోనే కొత్త రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ లోకేష్, ఏఈ శంకర్, కౌన్సిలర్లు షేక్‌రేష్మబాను, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి: మండలంలోని కొండూరు బీసీ, ఎస్సీ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు సర్పంచి సిద్ధార్థ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు బాలాజీ, మండల కన్వీనర్ అభిలాష్ భూమిపూజ చేశారు. రూ.45లక్షలతో గ్రామాభివృద్ధి చేయనున్నామని, ఎమ్మెల్యే బాలకృష్ణ గ్రామీణ ప్రాంతాల్లో మౌలికవసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు బాలాజీ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక కార్పొరేషన్ డైరెక్టర్ జయప్ప, మాజీ సర్పంచి శివప్ప, నాయకులు నాగరాజు, సిద్దలింగప్ప, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం: రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న రమేశ్‌కుమార్, బాలాజీ తదితరులు

సోమందేపల్లి: మండలంలోని చాకర్లపల్లి గంగాదేవి వంక సమీపంలో హిందూపురం-సోమందేపల్లి ప్రధాన మార్గం నుంచి రేణుకానగర్‌కు బీటీ రోడ్డు నిర్మాణానికి సర్పంచి రామక్క, సగర, వాల్మీకి కార్పొరేషన్ ఛైర్మన్ వెంకట రమణ, డైరెక్టర్ ఆంజనేయులు, తెదేపా నాయకులు భూమిపూజ నిర్వహించారు. ఈ పనులకు మంత్రి సవిత రూ.45లక్షలు మంజూరు చేయించినట్లు చెప్పారు. గత వైకాపా ప్రభుత్వంలో వర్షాలకు మట్టిదారి బురదమయంగా మారడంతో గ్రామస్థులు అప్పటి మంత్రి శంకరనారాయణ తీరుపై ధర్నా చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో కన్వీనర్ వెంకటేశ్, నాయకులు భానుకీర్తి, రామకృష్ణ, చంద్రశేఖర్, సంజీవరెడ్డి, అనసూయమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు పాటుపడదాం

బాల్య వివాహాలు నిర్వహిస్తే చట్టపరంగా కఠినచర్యలు చేపడతామని ఐసీడీఎస్ మండల పర్యవేక్షకురాలు ఎ.విజయలక్ష్మి తెలిపారు. ఆమె బుధవారం మండలంలోని గుట్టూరులో జిల్లా బాలల సంక్షణ కేంద్రం సిబ్బందితో గ్రామస్థులు, మహిళలకు బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం వాటికి అడ్డుకట్ట వేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బాలల సంరక్షణ అధికారిణి మేఘన, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, పెనుకొండ

దూషించాడని స్నేహితుడి హత్య
కేసు ఛేదించిన పోలీసులు

హిందూపురం, న్యూస్‌టుడే: తనను తిట్టాడని స్నేహితుడి గొంతుకోసి చంపి, మృతదేహాన్ని పెట్రోలు పోసి తగులబెట్టిన కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ అబ్దుల్‌కరీం తెలిపారు. ఆయన బుధవారం విలేకరులకు వివరాలు తెలిపారు. పట్టణంలోని హస్నాబాద్‌కు చెందిన సుహేబ్, మహమ్మద్ ముల్లాఖాన్ స్నేహితులు. తరచు మద్యం తాగి గొడవపడేవారు. ఈ నెల 7న రాత్రి మద్యం మత్తులో గొడవపడ్డారు. తిరిగి మద్యం తాగేందుకు నింకంపల్లి వద్దనున్న పాడుపడిన చేదుబావి వద్దకు చేరుకున్నారు. సుహేబ్ తనను ఎప్పుడు తిడుతుంటాడని కక్ష పెంచుకున్న ముల్లాఖాన్ హత్య చేయాలని ముందుగానే నిర్ణయించుకొని తన వెంట కత్తి తీసుకొని వెళ్లాడు. సుహేబ్ గొంతుకోసి మృతదేహాన్ని చేదు బావిలోకి తోశాడు. మరో స్నేహితుడైన బాలుడికి ఫోన్‌చేసి పెట్రోల్ తెప్పించి సుహేబ్ మృతదేహంపై పోసి నిప్పంటించాడు. కేసు నమోదు చేసిన టుటౌన్ పోలీసులు నాలుగురోజుల్లో దర్యాప్తు ముగించి నిందితుడు మహమ్మద్ ముల్లాఖాన్‌ను అరెస్టు చేశారు. అతడి నుంచి హత్యకు ఉపయోగించిన కత్తి, ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడికి సహకరించిన బాలుడిని అదుపులో తీసుకొని అనంతపురానికి పంపినట్లు వెల్లడించారు. సమావేశంలో సీఐలు రాజగోపాలనాయుడు, జనార్దన్, టుటౌన్ ఎస్ఐ లింగన్న పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

సోమందేపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని వెలిదడకలలో ఉపాధి హామీ పథకం పనులపై బుధవారం డీఆర్‌పీ సామాజిక తనిఖీ చేశారు. మండలంలో ఈ పథకం నిధులతో పంచాయతీరాజ్ శాఖలో బీటీ, సీసీ రోడ్లు, మురుగు కాలువ పనులకు 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు మొత్తం రూ.4 కోట్లు వెచ్చించారు. ఈ నేపథ్యంలో పనులపై మూడు రోజులుగా సామాజిక తనిఖీలను డీఆర్‌పీ ఒక్కరే చేపడుతున్నారు. ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు ముగ్గురు డీఆర్‌పీలతో సామాజిక తనిఖీలు చేయాల్సి ఉంది. కాగా ఈదులబళాపురం, ప్రస్తుతం వెలిదడకలలో చెక్‌డ్యామ్‌లో పూడికతీత, గోకులం షెడ్డు నిర్మాణ పనులను ఒక్క డీఆర్‌పీనే పరిశీలించారు. ఆయన ఇంటింటికీ వెళ్లి చేసిన పనికి కూలి సక్రమంగా అందిందా లేదా అని విచారించారు. గురువారం మధ్యాహ్నం వెలిదడకలలో సామాజిక తనిఖీ గ్రామసభ ఉంటుందని డీఆర్‌పీ తెలిపారు.

వెలిదడకలలో ఉపాధి కూలీతో సంతకం తీసుకుంటున్న డీఆర్‌పీ సురేంద్రరెడ్డి

కేసుల పరిష్కారానికి లోక్‌అదాలత్ దోహదం

మాట్లాడుతున్న జిల్లా అదనపు న్యాయమూర్తి కంపల్లె శైలజ

హిందూపురం, న్యూస్‌టుడే: పోలీసులు, న్యాయవాదులు, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి మార్చి 14న జరిగే జాతీయ మెగాలోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా అదనపు న్యాయమూర్తి కంపల్లె శైలజ కోరారు. స్థానిక ఏడీజే కోర్టులో బుధవారం జిల్లా అదనపు న్యాయమూర్తి, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లునాయక్, ప్రత్యేక న్యాయమూర్తి రమణయ్య, పోలీసులు ఇతర శాఖల అధికారులతో ఆమె సమావేశమై మాట్లాడారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ మెగా లోక్‌అదాలత్ దోహదపడుతుందన్నారు. ప్రస్తుతం పోలీస్ స్టేషన్‌లో వివిధ రోడ్డు ప్రమాదాలు, క్రిమినల్, బ్యాంకులు, మున్సిపాల్టీ, బీఎస్ఎన్ఎల్ శాఖల్లో ఎన్ని కేసులు రాజీ చేయవచ్చని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైనంత వరకు ప్రతి శాఖ అత్యధిక కేసులు లోక్‌అదాలత్‌లో పరిష్కారమయ్యేలా చూడాలని ఆమె సూచించారు. సమావేశంలో ఏపీపీలు గోపాలకృష్ణ, నగేశ్, సీఐలు రాజగోపాలనాయుడు, జనార్దన్, అబ్దుల్ కరీం, న్యాయవాదులు పాల్గొన్నారు.

తపాలా బీమా ప్రయోజనకరం

సోమందేపల్లి, న్యూస్‌టుడే: తపాలా శాఖ తక్కువ ప్రీమియంతో కల్పిస్తున్న బీమా సదుపాయం గ్రామీణులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని హిందూపురం పోస్టల్ సూపరింటెండెంట్ రెడ్డిబాషా తెలిపారు. బుధవారం స్థానిక తపాలా కార్యాలయంలో ఆయన బీపీఎంలు, సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. 18 నుంచి 20 వరకు ప్రత్యేకంగా చేపట్టనున్న బీమా సంకల్ప కార్యక్రమం కింద ప్రతి గ్రామాల్లో కూలీలు, రైతులు, యువతకు పాలసీపై అవగాహన కల్పించి విరివిగా చేయించాలని పిలుపునిచ్చారు. అనంతరం విధుల నిర్వహణలో ప్రతిభచూపిన బీపీఎంలు నరసింహమూర్తి, శేఖర్‌కు బహుమతులు అందజేశారు.

మాట్లాడుతున్న తపాలా సూపరింటెండెంట్ రెడ్డిబాషా, పక్కన మల్లికార్జున, అనిల్‌రెడ్డి తదితరులు

సమావేశంలో ఏఎస్పీ మల్లికార్జున, ఇన్‌స్పెక్టర్ అనిల్‌రెడ్డి, స్థానిక సబ్ పోస్ట్‌మాస్టర్ జనార్దన్, బీపీఎంలు, సిబ్బంది శ్రీనివాసులు, శ్రీరాములు, నందకిషోర్, జయశ్రీ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

జలకళ వైపు అడుగులు

చెరువుల పటిష్ఠతకు పనులు

అప్పలకుంట సమీపంలో కాలువలో జేసీబీతో అడ్డుగా వేసిన మట్టి తొలగింపు

పరిగి, న్యూస్‌టుడే: పరిగి మండలంలోని పరిగి, కొడిగెనహళ్లి గొరవనహళ్లి చెరువులను హంద్రీనీవా జలాలతో నింపేందుకు రాష్ట్ర మంత్రి సవిత ఆదేశాలతో అధికారులు తగు ఏర్పాట్లు చేస్తున్నారు. హిందూపురం రూరల్ మండలంలోని కొటిపి, బేవనహళ్లి, మానేంపల్లి, అప్పలకుంట తదితర గ్రామాల్లో కాలువ గట్ల పటిష్ఠతకు మంత్రి తన సొంత నిధులు వెచ్చించి 8 పొక్లెయిన్‌లు, 13 ట్రాక్టర్లు సమకూర్చారు. కాలువ గట్లు బలహీనంగా ఉన్న, కోతకు గురైన ప్రాంతాల్లో మట్టివేసి పటిష్ఠం చేశారు. జిల్లాలోనే పెద్ద చెరువుల్లో ఒకటిగా గుర్తింపు పొందిన పరిగి చెరువును హంద్రీనీవా జలాలతో నింపనున్నట్లు మండల కన్వీనర్ ఎస్ఎన్ గోవిందరెడ్డి తెలిపారు. రెండు రోజుల వ్యవధిలో చెరువులకు నీటిని విడుదల చేస్తారన్నారు. ఆయా గ్రామాల్లోని చెరువుల వద్ద పనులు వేగవంతంగా జరిగేలా తెదేపా నాయకులు కృషి చేస్తున్నారు. హంద్రీనీవా జలాలను చెరువుల్లో నింపితే వందలాది ఎకరాలు సాగులోకి వస్తాయని మండల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పనులను హిందూపురం తెదేపా పార్లమెంటరీ కార్యదర్శి వి.హనుమప్ప, తెలుగు యువత జిల్లా కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, నాయకులు తిలక్, మారుతీ తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక గ్రీవెన్స్‌డే

హిందూపురం పట్టణం: కార్మికుల సంక్షేమానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకొంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. వారి సమస్యలపై ఫిర్యాదులు చేయడానికి ప్రతి గురువారం ప్రత్యేక గ్రీవెన్స్‌డే నిర్వహిస్తామన్నారు. పొరుగు సేవల విధానంలో పనిచేస్తూ మరణించిన కార్మికుల బకాయిలు ఆయా కుటుంబాలకు అందేలా కమిషనర్ చర్యలు తీసుకోవడంతో కార్మిక సంఘాల నాయకులు బుధవారం ఆయనను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి అదే ఉద్యోగం ఇవ్వడంతో పాటు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.30 వేలు, ఈఎస్ఐ నుంచి రూ.5లక్షలు, మున్సిపల్ ఎక్స్‌గ్రేసియా రూ.2లక్షలు, పీఎఫ్ ఖాతాలోని సొమ్ము అందినట్లు వివరించారు. కార్యక్రమంలో లబ్ధిదారులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న కార్మికులు, నాయకులు

అందరికీ అక్షరాస్యత అవసరం

మహిళలకు సూచనలు చేస్తున్న ఎంపీడీవో రామారావు

అమరాపురం, న్యూస్‌టుడే: స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న నిరక్షరాస్య మహిళలకు ప్రభుత్వం అక్షర ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా చదువు, రాత నేర్పించడానికి ఏర్పాట్లు చేసిందని ఎంపీడీవో రామారావు, ఏపీఎం ముత్యాలప్ప తెలిపారు. ఆయన బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్ వెనుక వైపు వీధిలో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాన్ని సందర్శించి అతివలకు పలు సూచనలు చేశారు. చిన్న చిన్న పదాలు, కూడికలు, తీసివేతలు నేర్పడంతో పాటు సంఘంలో జరిగే లావాదేవీలు తెలుసుకోవడానికి వీలుంటుంది. మండలంలో మొత్తం 1910 మంది నిరక్షర్యాస్యులకు అక్షర జ్ఞానం కల్పిస్తామన్నారు. మార్చి 29 వరకు రోజూ సాయంత్రం వేళల్లో తరగతులు ఉంటాయని వెల్లడించారు.

పుట్టపర్తి

•పుట్టపర్తి •ధర్మవరం •కదిరి •రాప్తాడు

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

ధర్మవరం: ధర్మవరం సబ్‌జైలును బుధవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.రాజశేఖర్ తనిఖీ చేశారు. ఖైదీలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేనివారు సంప్రదిస్తే ఉచితంగా న్యాయవాదులను ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. రిమాండ్ ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. సబ్‌జైలు ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ శివరామకృష్ణయ్య, న్యాయవాదులు ప్రసాద్, పెద్దన్న పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

గాండ్లపెంట, న్యూస్‌టుడే: కదిరి - రాయచోటి ప్రధాన రహదారిలో గాండ్లపెంట సమీపంలో రూ.2.70 కోట్లతో సీసీ రహదారి పనులు బుధవారం ప్రారంభించారు. ఈ పనులను జేఈ గౌతమి పరిశీలించారు. నిబంధనల ప్రకారం పనులు చేయించాలని గుత్తేదారుడు కృష్ణమోహన్‌కు సూచించారు.

ఉపాధి పనుల వివరాల నమోదులో జాప్యం

కనగానపల్లి, న్యూస్‌టుడే : ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనుల వివరాలను దస్త్రాలలో నమోదు చేయడంలో అధికారులు జాప్యం వహించారని డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ప్రజా వేదికలో 18 పంచాయతీలల్లో 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు చేపట్టిన వివిధ పనులపై సేకరించిన వివరాలను వెల్లడించారు. రూ.20 కోట్ల నిధులకు సంబంధించిన వాటిపై సామాజిక తనిఖీ నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన పనులకు రూ.74,766 రికవరీ చెల్లించాలని ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించినట్లు పీడీ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీడీ వెంకటచలపతి, ఎంపీడీఓ అనిల్‌కుమార్, ఏపీఓ వెంకటేశ్ నాయక్, ఎంపీపీ భాగ్యమ్మ, మార్కెట్ యార్డు ఛైర్మెన్ సుధాకర్ నాయుడు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

పుట్టపర్తి: 80085 73039
కదిరి : 80085 73033
ధర్మవరం: 99596 98222

సమస్య: మేజర్ పంచాయతీ గ్రామంలో ప్లాస్టిక్ కవర్లు ఎక్కడ చూసినా కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. ప్లాస్టిక్ కవర్ల వాడకం తగ్గించేందుకు చర్యలు తీసుకోగలరు. **- రమేష్**

సమాధానం: గ్రామంలో పర్యటించి కవర్లున్న ప్రదేశాలను పరిశీలిస్తాం. వాటిని అందిస్తున్న దుకాణాదారులతో పాటు వినియోగిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం. **- అశోక్‌నాయక్, ఈఓఆర్డీ**
– న్యూస్‌టుడే చెన్నేకొత్తపల్లి

హామీలు ఇచ్చారు.. వసతులు మరిచారు

ఉపాధి కల్పన, శుద్ధజలం, పచ్చదనం ఏదీ?

తలుపుల, న్యూస్‌టుడే: తలుపుల మండలంలోని వేపమానిపేట పంచాయతీ కొత్తపూలవాండ్లపల్లి-గంజివారిపల్లి గ్రామాల నడుమ ఊరగుట్టలో తెల్లరాయి తవ్వకాల కోసం మూడేళ్ల కిందట కొందరు అనుమతి తీసుకున్నారు. అప్పట్లో స్థానికుల నుంచి ఎలాంటి అభ్యంతరం లేదని, నోఅబ్జక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌వోసీ)ని అధికారుల నుంచి తీసుకోవడానికి గ్రామసభ నిర్వహించారు. మైనింగ్ అధికారులు, గుత్తేదారులు, స్థానికులకు ఉపాధి కల్పిస్తామని, వాతావరణం దెబ్బతినకుండా చెట్ల పెంపకాన్ని చేపడతామన్నారు. వీటితో పాటు స్థానికులకు శుద్ధజల ప్లాంటు ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. సగం కొండ కరిగిపోయినా సంబంధిత గుత్తేదారు, అధికారులు వసతులు కల్పించడంలో మొహం చాటేశారనే విమర్శలు ఉన్నాయి. తాము పుట్టిపెరిగిన ఊర్లోని ప్రకృతి సంపదను దోచుకుంటున్నా, తమకు ఎలాంటి ఉపాధి అవకాశాలు కల్పించకపోవడం దారుణమని స్థానిక గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మౌలిక వసతులు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

తరిగిపోతున్న కొండ

కొండపైన రెండు పెద్ద పెద్ద యంత్రాలు పెట్టి తెల్లరాయిని పగులగొట్టి నిల్వ చేస్తున్నారు. రాత్రిళ్లు ఆ రాయిని తరలిస్తున్నారు. ఇప్పటి వరకు దాదాపు 60 లోడ్ల రాయిని ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు తరలించినట్లు స్థానికులు చెబుతున్నారు. క్వారీ దగ్గర తప్పనిసరిగా వేయింగ్ మిషన్ ఉండాలి, ఎన్ని టన్నుల రాయిని తీసుకెళుతున్నారో అందుకు తగ్గ రాయల్టీని గుత్తేదారు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. వేయింగ్ మిషన్ లేనప్పుడు రాయల్టీ ఎలా చెల్లిస్తున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. జిలెటిన్‌స్టిక్ పెట్టి కొండను పేలుస్తుండటంతో భారీ శబ్దాలు, తెల్లటి దూళికి తట్టుకోలేకపోతున్నామని కొత్తపూలవాండ్లపల్లి, గంజివారిపల్లి గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

కరిగిపోతున్న ఊరగుట్ట కొండ

దెబ్బతింటున్న రోడ్లు

భారీ వాహనాలతో తెల్లరాయిని నిత్యం తరలించడం కారణంగా గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. కొత్తపూలవాండ్లపల్లి వద్ద రోడ్డు పలుచోట్ల దెబ్బతింది. పది కాలాల పాటు మన్నికగా ఉండాల్సిన తారురోడ్డు, కంకర తేలి గుంతలు పడింది. సంబంధిత అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో విద్యార్థుల సత్తా

బత్తలపల్లి, కొత్తచెరువు, న్యూస్‌టుడే: కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొన్న బత్తలపల్లి విజ్ఞానభారతి విద్యార్థులు విజేతలుగా నిలిచి పతకాలు సాధించారు. హైదరాబాద్‌లోని ఇండోర్ స్టేడియంలో ఈనెల 8న న్యూ డ్రాగన్ ఫైటర్స్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో విజ్ఞానభారతి హై స్కూల్ విద్యార్థులు 26 మంది పాల్గొన్నారు. బుక్కపట్నం మండలంలోని మహాత్మా జ్యోతిబా పాఠశాలకు చెందిన 5మంది విద్యార్థినిలు అంతర్జాతీయ కరాటే ఛాంపియన్ పోటీల్లో ఇందు, పల్లవి, సుజితలు బంగారు పతకాలు, వమీషా, తనుశ్రీ సిల్వర్ పతకాలు సాధించినట్లు ప్రిన్సిపల్ రమాదేవి, కరాటే శిక్షకురాలు జ్యోతి తెలిపారు. పలు విభాగాల్లో పతకాలు కైవసం చేసుకున్నవారిని ఉపాధ్యాయులు అభినందించారు.

బత్తలపల్లి: పతాకాలు సాధించిన విద్యార్థులు

తిమ్మమాంబ ఉత్సవాలు జయప్రదం చేయండి

నంబులపూలకుంట, న్యూస్‌టుడే : ప్రపంచ ప్రసిద్ధిగాంచిన పర్యాటక కేంద్రం తిమ్మమ్మమర్రిమాను వద్ద మూడు రోజుల పాటు జరగనున్న తిమ్మమాంబ మహాశివరాత్రి జాగరణ మహోత్సవాలు జయప్రదం చేయాలని మండల కన్వీనర్ శ్రీరాములునాయుడు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో తెదేపా కన్వీనర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాల్లో ఈషా ఫౌండేషన్ సద్గురు వారి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు మూడ్రోజులపాటు ఉంటాయని వివరించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

పథకాలు సమర్థంగా అమలు చేయాలి

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలను గ్రామస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలో అమలవుతున్న కీలక ప్రభుత్వ పథకాలు, పరిపాలనా అంశాల పురోగతిని సమీక్షించారు. అధికారులు తమ పరిధిలో పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ సమస్యలను తక్షణమే పరిష్కరించి, నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.

నేడు యూరియా పంపిణీ

పుట్టపర్తి: పుట్టపర్తి సహకార సంఘంలో గురువారం రైతులకు యూరియా పంపిణీ చేయనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు వెంకట్రాముడు తెలిపారు. రైతులు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్సులు తప్పనిసరిగా తీసుకురావాలని కోరారు.

వెంకటేశ్వర స్వామికి విదేశీ దంపతుల విరాళం

ధర్మవరం న్యూస్‌టుడే: ధర్మవరం పట్టణంలోని కొత్తపేట వేంకటేశ్వరస్వామి ఆలయానికి బుధవారం ట్రినిడాడ్‌కు చెందిన రుషిబాలు, రవితా సింగ్ దంపతులు 100డాలర్ల (రూ. 9వేల) విరాళం ఇచ్చారు. ఆలయ కమిటీ సభ్యుడు దత్త శివకు నగదును అందజేశారు.

ఉపాధ్యాయుల జట్టుకు ఘన స్వాగతం

విజేతలను సన్మానించిన మంత్రి కార్యాలయం ఇంఛార్జి హరీష్‌బాబు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయిలో ప్రభుత్వం నిర్వహించిన లీప్ టీచర్ల క్రికెట్ టోర్నమెంట్ విజేతగా శ్రీసత్యసాయి జిల్లా నిలిచిందని ఎంఈవో, జట్టు కెప్టెన్ గోపాల్‌నాయక్ తెలిపారు. బుధవారం ఎంఈవో మాట్లాడుతూ ఈ క్రికెట్ టోర్నమెంట్‌కు రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల ప్రభుత్వ ఉపాధ్యాయుల జట్లు పాల్గొన్నాయన్నారు. మంగళవారం గుంటూరులోని డాక్టర్స్ మైదానంలో అనకాపల్లి జట్టు 136 పరుగుల తేడాతో శ్రీసత్యసాయి విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుందన్నారు. విజేతలను డప్పు వాయిద్యాలతో స్వాగతం పలికారు. ఎంఈవో రాజేశ్వరీదేవి తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత అంతర్జాలాన్ని ఉపయోగిద్దాం

మాట్లాడుతున్న జడ్జి రాజశేఖర్

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: అంతర్జాలాన్ని వినియోగించేటప్పుడు యువత జాగ్రత్తగా ఉండాలని ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, జిల్లా జడ్జి రాజశేఖర్ పేర్కొన్నారు. బుధవారం జగరాజుపల్లిలోని శ్రీవిజ్ఞాన్ నర్సింగ్ కళాశాలలో చిల్డ్రన్ ఆఫ్ ఫౌండేషన్, జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ మిషన్ వాత్సల్య సంయుక్త ఆధ్వర్యంలో డిజిటల్ లిటరసీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ మనోరంజని అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి జడ్జి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ప్రస్తుతం యువత అంతర్జాలంలో ఎక్కువ సమయం గడుపుతున్నారని, ఇంటర్నెట్‌లో ఎన్ని ఉపయోగాలు ఉన్నాయో అన్ని నష్టాలు కూడా ఉన్నాయన్నారు. ఆన్‌లైన్ మోసాలకు గురైన వారు 1930 నంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలను విద్యార్థినులకు వివరించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చిల్డ్రన్ ఆఫ్ ఫౌండేషన్ జిల్లా సమన్వయకర్త కొండప్ప, జిల్లా బాలల పరిరక్షణ అధికారి మహేశ్, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల అభ్యున్నతికి టింబక్టు కలెక్టివ్ కృషి

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే : దివ్యాంగుల అభ్యున్నతి కోసం టింబక్టు కలెక్టివ్ సంస్థ కృషి చేస్తోందని, ఆ సంస్థ ప్రతిభా దివ్యాంగుల సొసైటీ సీఈఓ నరసింహులు, మిళిత ప్రోగ్రామ్ మేనేజర్ జయశ్రీ పేర్కొన్నారు. చెన్నేకొత్తపల్లి సొసైటీ కార్యాలయంలో బుధవారం ఎలక్ట్రికల్ వీల్‌చైర్ అసెస్మెంట్ క్యాంపు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి వచ్చినవారికి మోబిష్ ఇండియా ఫౌండేషన్ వారు వైకల్య ధ్రువీకరణ పరీక్షలు నిర్వహించారు. 30 మందికి వీల్ ఛైర్స్ అవసరమున్నట్లు గుర్తించారు. వారికి త్వరలోనే వాటిని ఫౌండేషన్ సహకారంతో అందిస్తామన్నారు. మోబిష్ సోషల్ ఇంపాక్ట్ ఎగ్జిక్యూటివ్ తరుణ్ వారి సిబ్బంది పాల్గొన్నారు.

ఔను.. ఇది విద్యాధికారి కార్యాలయమే!

పుట్టపర్తి మండలంలోని పాఠశాలల పని తీరుని నిత్యం పర్యవేక్షించే మండల విద్యాధికారి కార్యాలయం ఇది. దీని పక్కనే పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం ఉండటంతో ఉండటంతో అక్కడికి వచ్చేవారు ఇది మండల విద్యాధికారి కార్యాలయమేనా అని ప్రజలు అంటున్నారు. పరిసరాల్లో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి ఉండటంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలోని విద్యార్థులకు పరిసరాలు, పరిశుభ్రత గురించి నేర్పాల్సిన కార్యాలయమే ఇలా ఉంటే ఎలా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.
–న్యూస్‌టుడే, పుట్టపర్తి పట్టణం

కూలేదాకా పట్టించుకోరా?

తలుపులలో ఉడమలకుర్తి ఎస్సీ కాలనీలోని తాగునీటి ట్యాంకుపై విద్యుత్తు స్తంభం వొరిగి ప్రమాదకరంగా మారింది. గత వైకాపా ప్రభుత్వంలోనూ ఆ స్తంభాన్ని తొలగించాలని అప్పటి వైకాపా ఎమ్మెల్యేకి స్థానికులు మొరపెట్టుకొన్నారు. అయినా విద్యుత్తుశాఖ అధికారులు, సిబ్బంది పట్టించుకోలేదు. అధికారులు స్పందించి విద్యుత్తు స్తంభాన్ని మార్చాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై ట్రాన్స్‌కో ఏఈ శివతేజను వివరణ కోరగా పరిశీలించి, పరిష్కరిస్తామన్నారు. **–న్యూస్‌టుడే, తలుపుల**

ప్రమాదకరంగా స్తంభాల తరలింపు

కదిరి-రాయచోటి ప్రధాన రహదారిలో ప్రమాదకరంగా ట్రాక్టర్‌లో విద్యుత్తు స్తంభాలు తరలిస్తున్నారు. ఇలా చేసే సమయంలో స్తంభాలకు వెనుక సంకేతాలు, సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో పలువురు విమర్శిస్తున్నారు. ఆదమరిచి బండి నడిపితే ప్రమాద బారిన పడతామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి స్తంభాలు తరలించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని చోదకులు కోరుతున్నారు.
–న్యూస్‌టుడే, గాండ్లపెంట

రహదారులకు మోక్షమెన్నడో?

నల్లమాడలోని బాసంవారిపల్లి క్వార్టర్స్‌లో ఇళ్లు నిర్మించి దశాబ్దం అయిన కాలనీకి ఇంకా సీసీ రోడ్లు మంజూరు కాలేదని కాలనీవాసులు వాపోతున్నారు. నల్లమాడ నుంచి పుట్టపర్తికి వెళ్లే రహదారి పక్కనే ఉన్న కాలనీలో మట్టిరోడ్లే దర్శనమిస్తున్నాయి. నాయకులు ,అధికారులు మారుతున్నా..ఎవరూ పట్టించుకోవడంలేదని అంటున్నారు. దారి పొడవునా పిచ్చి మొక్కలు పెరిగి విషసర్పాలకు ఆవాసంగా మారుతుందోనని భయాందోళన గురవుతున్నారు. అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.
–న్యూస్‌టుడే, నల్లమాడ

ముక్కు.. మూసుకొని వెళ్లాల్సిందే..

కాలువ శుభ్రం చేయకపోవడంతో మురుగు రోడ్డుపైకి చేరుతోందని కదిరి పట్టణం నిజాంవలి కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాయచోటి రోడ్డు వైపు నుంచి నిజాంవలి కాలనీకి వెళ్లే మార్గంలోని మురుగు కాలువ ప్లాస్టిక్ కవర్లు, ఇతర వ్యర్థాలతో నిండిపోయింది. అటుగా వెళ్లేవారు ముక్కుమూసుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వ్యర్థాలను శుభ్రం చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.
–న్యూస్‌టుడే, కదిరి పట్టణం

ఆక్రమణలు తొలగించండి

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: ముదిగుబ్బలో జాతీయ రహదారికి ఇరువైపులా డ్రైనేజీ కాలువను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేశారని ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం ముదిగుబ్బ మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీడీవో శకుంతల, ఎంపీపీ ఆదినారాయణ, జెడ్పీటీసీ తిరుమలబాయి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సర్పంచులు, ఎంపీటీసీలు, వైస్ ఎంపీపీలు ముదిగుబ్బతోపాటు పలు గ్రామాల్లో తాగునీటి, విద్యుత్తు సమస్యలు ఉన్నాయన్నారు. వేసవిలో నిర్లక్ష్యం వహించకుండా సమస్యను పరిష్కరించాలని కోరారు.

పండిట్ దీన్‌దయాళ్ సేవలు ఎనలేనివి

ధర్మవరం: నివాళులర్పిస్తున్న భాజపా నాయకులు

పుట్టపర్తిలో..

దేశవ్యాప్తంగా భాజపాను బలోపేతం చేయడానికి పండిట్ దీన్‌దయాళ్ చేసిన సేవలు వెలగట్టలేనివని పలువురు భాజపా నాయకులు పేర్కొన్నారు. బుధవారం కదిరి, పుట్టపర్తి, ధర్మవరం నియోజకవర్గాల్లో ఉన్న నాయకులు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని పురస్కరించుకొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన ఆశయాల అమలు చేయడానికి అందరూ కట్టుబడి ఉండాలని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు భాజపా నాయకులు తదితరులు పాల్గొన్నారు. చింతలపల్లికి చెందిన నారా కొండయ్య సత్యసాయి జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శిగా నియమితులవ్వడంతో ఆయనకు బుధవారం ఉత్తర్వులను హరీష్‌బాబు అందజేశారు. **- న్యూస్‌టుడే బృందం**

కదిరిలో..

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన పెయింటర్ పవన్‌కుమార్(26) పని ముగించుకొని ద్విచక్రవాహనంలో ఇంటికి వెళుతుండగా పార్థసారథినగర్ వద్ద ఐషర్ వాహనం ఢీకొంది. గాయపడిన అతడిని అనంతపురం నగరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం బెంగళూరు తరలిస్తుండగా పవన్‌కుమార్ మృతి చెందాడని ధర్మవరం వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

పైకప్పు పెచ్చులూడి విద్యార్థులకు గాయాలు

నల్లచెరువు, న్యూస్‌టుడే: నల్లచెరువు జడ్పీ ఉన్నత పాఠశాలలో తరగతి గది పైకప్పు పెచ్చులూడి పడటంతో ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయి. మండల పరిధిలోని ఓరువాయి పంచాయతీ బోయవాండ్లపల్లికి చెందిన రోహిత్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాయి. బుధవారం తరగతి గదిలో కూర్చొని పరీక్షలు రాస్తుడంగా ఒక్కసారిగా పైకప్పు ఊడి రోహిత్ తలపై పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. పక్కనే ఉన్న మానీస్ అనే విద్యార్థి కాలివేళ్లపై పెచ్చులు పడటంతో స్వల్ప గాయాలయ్యాయి. రోహిత్‌ను 108 వాహనంలో ఎంఈవో తిరుపాల్‌నాయక్, ఉపాధ్యాయులు కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. ప్రమాదమేమీ లేదని వైద్యులు చెప్పడంతో ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు.

క్రైమ్.. కార్నర్

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప తాలూకా పోలీసులు అంతర్ జిల్లాల దొంగను అరెస్టు చేసి అతని నుంచి పది ద్విచక్ర వాహనాలు స్వాధీనపరుచుకున్నారు. దొంగను బుధవారం కడప తాలూకా పోలీసు స్టేషన్‌లో మీడియాకు చూపారు. ఎస్ఐ మోహన్‌కుమార్‌గౌడ్ తెలిపిన వివరాల మేరకు.. నంబులపూలకుంట మండలం గౌకనపల్లికి చెందిన షేక్ దర్బార్‌వల్లీ (42) గతంలో చరవాణులు దొంగతనం చేసి జైలుకు వెళ్లొచ్చాడు. ఆ తరువాత ద్విచక్ర వాహనాలు అపహరించడం మొదలుపెట్టాడు. కడప నగరంలో తాలూకా, ఒకటో, రెండో, చిన్నచౌకు, రిమ్స్ పోలీస్ స్టేషన్ల పరిధిలో పది ద్విచక్ర వాహనాలు దొంగిలించాడు. చౌటపల్లె రైల్వేగేటు సమీపాన పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పద స్థితిలో తిరుగుతున్న దర్బార్‌వల్లీని అదుపులోకి తీసుకున్నారు. విచారణ చేయగా ద్విచక్ర వాహనాలు చోరీ చేసినట్లు ఒప్పుకొన్నాడు. ఈ మేరకు అతన్ని అరెస్టు చేసి, పది ద్విచక్రవాహనాలు స్వాధీనపరుచుకున్నట్లు ఎస్ఐ మోహన్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ద్విచక్ర వాహనాల విలువ రూ.2 లక్షలు ఉంటుందన్నారు.

నీరు అడిగి.. బంగారు గొలుసు ఎత్తుకెళ్లారు!

కనగానపల్లి, న్యూస్‌టుడే : మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు మూడు తులాల బంగారు గొలుసు ఎత్తుకెళ్లిన ఘటన బద్దలాపురంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... గ్రామానికి చెందిన రెడ్డి నారాయణమ్మ ఉదయం పొలానికి వెళ్లింది. పనులు ముగించుకొని ఇంటికి వస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి మాస్కు ధరించి ఆమె వద్దకు వెళ్లి తాగడానికి నీరు అడిగాడు. నీళ్లు లేవని చెబుతుండగానే మరో వ్యక్తి బైక్‌పై ఆమె వద్దకు వచ్చి మెడలోని బంగారు చైన్ లాక్కొని ఇద్దరు కలిసి పారిపోయారు. మూడు తులాల బంగారు గొలుసు ఎత్తుకెళ్లినట్లు బాధితురాలు వాపోయారు. దీనిపై పోలీసులకు సమాచారం ఇవ్వగా రామగిరి సర్కిల్ సీఐ శ్రీధర్, ఎస్సై మహమ్మద్ రిజ్వాన్ అక్కడికి చేరుకొని వివరాలు సేకరించి దర్యాప్తు చేపట్టారు.

మెనూ పక్కాగా అమలు చేయాలి

అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో ముచ్చటిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పుట్టపర్తి, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ప్రీ-స్కూల్ మెనూ పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. బుధవారం పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని బ్రహ్మణపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. పిల్లలకు అందిస్తున్న మెనూ, ఉడికించిన గుడ్డు నాణ్యత, రంగు, పరిమాణాన్ని పరిశీలించారు. పోషణ యాప్‌లో పిల్లల ఎదుగుదల చార్ట్‌ను పక్కాగా నమోదు చేయాలని సూచించారు.



ఆటలు ఆడుతాం.. చదువులో రాణిస్తాం

సత్తా చాటుతున్న కుంటిమద్ది బాలికలు

రామగిరి, న్యూస్‌టుడే: చదువుతో పాటు క్రీడల్లో రాణించేవారు కొందరే ఉంటారు. ఆ కోవకు చెందిన వారే రామగిరి మండల కుంటిమద్ది ఉన్నత పాఠశాల విద్యార్థినులు. వీరు చదువుతో పాటు సాఫ్ట్‌బాల్, హాకీ క్రీడల్లో జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటారు. వ్యాయామ ఉపాధ్యాయుడు ఓబులేసు వద్ద శిక్షణ పొందుతూ రాణిస్తున్నారు. సాధించిన విజయాలు, లక్ష్యాలను వారు న్యూస్‌టుడేతో పంచుకున్నారు.

ఎస్సై అవుతా...



ఈ సంవత్సరం గుంటూరులో నిర్వహించిన అండర్-19 సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపా. సాఫ్ట్‌బాల్‌తో పాటు బేస్‌బాల్ క్రీడల్లోనూ శిక్షణ పొందుతున్నా. పీడీ సహకారంతో జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. జాతీయస్థాయిలో ప్రతిభ కనబరచి, క్రీడా కోటాలో ఎస్సై ఉద్యోగం సాధిస్తా. **- తులసి, తొమ్మిదో తరగతి**

ఇష్టమే తోడ్పాటునిస్తోంది..

క్రీడలంటే ఇష్టమే బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ క్రీడల్లో రాణించడానికి తోడ్పాటు అందిస్తోంది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించడంతో రాణిస్తున్నా. ఈ ఏడాది చంద్రగిరిలో నిర్వహించిన అండర్-19 బేస్‌బాల్ పోటీల్లో పాల్గొన్నా. విజయనగరంలో నిర్వహించిన జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపా. క్రీడా కోటాలో డీఎస్పీ కావాలని లక్ష్యంగా పెట్టుకున్నా. **- మోక్షిత, తొమ్మిదో తరగతి**

వ్యాయామ ఉపాధ్యాయురాలిగా స్థిరపడతా..

నాన్న నేత కార్మికుడు, అమ్మ వ్యవసాయ కూలీ. ఈ ఏడాది అనకాపల్లిలో నిర్వహించిన అండర్-19 రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ హాకీ పోటీల్లో పాల్గొని మూడో స్థానంలో నిలిచా. బేస్‌బాల్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యా. విజయనగరంలో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్నా. వ్యాయామ ఉపాధ్యాయురాలిగా స్థిరపడాలన్నదే లక్ష్యం. **- లక్ష్మి, పదో తరగతి**

ఉద్యోగాలకు విద్యార్థుల ఎంపిక

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల్లో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో 75 మంది అభ్యర్థులకు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు లభించినట్లు మంత్రి కార్యాలయం ఇంఛార్జి హరీష్‌బాబు తెలిపారు. బుధవారం కళాశాల్లో నిర్వహించే మేళాకు 12 కంపెనీలు హాజరుకాగా 149మంది పరీక్షలు రాశారు. ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశారు. కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి జోషి, నైపుణ్యాభివృద్ధి అధికారి తేజ్‌కుమార్, సీడాప్ అధికారి నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

మార్చి 1న క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఉషోదయ పాఠశాలలో మార్చి 1న ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహిస్తున్నామని యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలా నాగేంద్ర, క్యాంపు ఛైర్మన్ పోలా ప్రభాకర్, డా.సుబ్బారావు, చాంద్‌బాషా, కార్యదర్శి జయరామ్, కోశాధికారి వెంకటనాగార్జున తెలిపారు. ఈ సందర్భంగా కార్యాలయంలో బుధవారం ప్రచార పత్రాలు విడుదల చేశారు. యువర్స్ ఫౌండేషన్, బెంగళూరు శంకర క్యాన్సర్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ శిబిరంలో క్యాన్సర్ శస్త్ర చికిత్స నిపుణులు డా.బీఎస్.శ్రీనాథ్, డా.వినాయక్, డా.రేఖ, డా.ప్రదీప్‌రెడ్డి, డా.ఆనంద్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

13న విగ్రహ ప్రతిష్ఠాపన

రామగిరి, న్యూస్‌టుడే : ఎగువపల్లి కొత్తగేరి గ్రామంలో మారెమ్మదేవత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు గణపతి పూజతో బుధవారం ప్రారంభించారు. ఈనెల 13న జరగనున్న విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే పరిటాల సునీత, ఎంపీ పార్థసారథి, పావగడ ఎమ్మెల్యే వెంకటేష్ హాజరవుతారని తెదేపా నాయకుడు శ్రీధర్‌నాయుడు తెలిపారు.

ఈనాడు శ్రీకాకుళం

గురువారం ఫిబ్రవరి 12, 2026

5

అధికారులు అడగరు.. అక్రమార్కులు ఆగరు..!

ప్రభుత్వం డీసిల్టేషన్ పాయింట్ల ద్వారా అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానం కొందరు గుత్తేదారులకు కాసులు కురిపిస్తోంది. గార మండలం బూరవల్లి వద్ద వంశధార నదిలో నిర్వహిస్తున్న ర్యాంపే ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం. ఇక్కడ డీసిల్టేషన్ పద్ధతిలో ఇసుక తవ్వకాలు చేపట్టేందుకు ర్యాంపు మంజూరు చేశారు. నిబంధనల ప్రకారం నదీ గర్భంలో యంత్రాలతో తవ్వి.. తరలించకూడదు. అందుకు విరుద్ధంగా పగలు, రాత్రి తేడా లేకుండా అక్రమంగా రవాణా చేస్తున్నారు. పైగా పొక్లెయిన్లు లోపలికి వెళ్లేందుకు వీలుగా ఇలా మార్గాన్ని ఏర్పాటు చేసుకున్నా.. అధికారులెవరూ కన్నెత్తి చూడకపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై జలవనరులశాఖ ఎస్ఈ పి.సుధాకర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పరిశీలించి.. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

– న్యూస్‌టుడే, గార(బూరవల్లి)

మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు

బలగ(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ శ్రీకాకుళం రీజియన్ పరిధిలో ప్రముఖ శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు జిల్లా ప్రజారవాణాధికారి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పలాస డిపో నుంచి సాబకోటకు 10, టెక్కలి డిపో నుంచి రావివలసకు 5, శ్రీకాకుళం డిపో నుంచి రామతీర్థాలకు 15 బస్సులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. శ్రీముఖలింగం చక్రతీర్థస్నానాలకు ఫిబ్రవరి 18న శ్రీకాకుళం డిపో నుంచి 10, టెక్కలి నుంచి 5 ప్రత్యేక సర్వీసులు తిప్పుతామని వివరించారు. భక్తులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఆఫ్‌షోర్ పనులు పూర్తి చేయండి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు పనుల గురించి వివరిస్తున్న ఈఈ శేఖర్

పలాస గ్రామీణం, మెళియాపుట్టి, న్యూస్‌టుడే: మహేంద్రతనయ ఆఫ్‌షోర్ జలాశయం ద్వారా వచ్చే ఏడాది ఖరీఫ్ నాటికి సాగునీరు అందించాలని, ఆయకట్టు అనుసంధాన పనులు పూర్తి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. 43.5 మీటర్ల స్థాయి వరకు నీరు నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పలాస మండలం రేగులపాడు వద్ద ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. స్పిల్‌వే, ఎర్త్ బండ్ పనులు చూసి.. ఏప్రిల్ నెలాఖరులోగా రేగులపాడు-పెద్దమడి డైవర్షన్ రోడ్డు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈఈ శేఖర్, డీఈఈ సుధాకర్, ఏఈఈలు రాజశేఖర్, మీనాక్షి, తహసీల్దార్ బి.పాపారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు కార్మిక సంఘాల ర్యాలీ

కలెక్టరేట్(శ్రీకాకుళం), పాతశ్రీకాకుళం, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా గురువారం నిర్వహించనున్న సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, కె.అప్పన్నదొర, ఎం.గోవర్ధనరావు, ఎ.వి.బలరాం కోరారు. శ్రీకాకుళం నగరంలో బుధవారం పూలపేట, సీలం జూట్ మిల్లు, హమాలీ, బ్యాంకు, ఎల్ఐసీ, తపాలా తదితర సంస్థల్లో కార్మికులను కలిసి ప్రచారం చేశారు. గురువారం ఉదయం భారీ ర్యాలీ నిర్వహించనున్నారు.

● సమ్మెకు ఎన్జీవో సంఘానికి అనుబంధంగా ఉన్న ఉద్యోగ సంఘాలన్నీ సంఘీభావం తెలిపాయి. అన్ని బ్యాంకుల ఉద్యోగులు ఆందోళనల్లో భాగస్వాములు కావాలని జిల్లా బ్యాంకు ఉద్యోగుల సంఘ సమన్వయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గిరిధర్ నాయక్, బి.శ్రీనివాసులు కోరారు.

నీరిస్తారా.. ఊరిస్తారా..?

వేసవి వచ్చేస్తున్నా కొలిక్కిరాని జల్‌జీవన్ మిషన్ పనులు

న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

పల్లెల్లో ఇంటింటికీ కుళాయిల ద్వారా సురక్షిత తాగునీరందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్(జేజేఎం) పథకానికి శ్రీకారం చుట్టింది. దీని ద్వారా రాష్ట్రానికి మంజూరు చేసిన నిధుల్ని ఖర్చు చేయడంలో గత ప్రభుత్వం పూర్తి విఫలమైంది. గుత్తేదారులకు బిల్లులు చెల్లింపుల్లో జాప్యం జరగడంతో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. జిల్లాలోనూ అదే పరిస్థితి నెలకొంది. వేసవి ప్రారంభం కానున్న సమయంలో కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని పనులపై దృష్టి సారించింది. తాగునీటి ఇక్కట్లు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో పనులు చేపడుతున్నారు. అధికారుల అనాలోచిత నిర్ణయాల కారణంగా పథకం లక్ష్యాలకు దూరమైంది. ఇంకా 482 పనులకు సంబంధించిన టెండర్లు పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. చాలా చోట్ల గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పాత పథకాలకే వీటిని అనుసంధానం చేశారు.



సరుబుజ్జిలి మండల కేంద్రంలో అసంపూర్తిగా రిజర్వాయరు పనులు

నత్తనడకన రెండో దశ..

జేజేఎంలో భాగంగా రూ.700 కోట్లతో తొలి దశలో ఉద్దానం ప్రాంతంలోని 807 గ్రామాలకు పైపులైన్ల ద్వారా తాగునీటి సరఫరా చేపట్టాలని సంకల్పించారు. ప్రస్తుతానికి అక్కడ ఉన్న టి.శాసనం తాగునీటి ప్రాజెక్టు కొత్తగా చేపట్టిన పనులను అనుసంధానించి కొంత మేర నీరందిస్తున్నారు. మరో రూ.265 కోట్లతో చేపడుతున్న రెండో దశ పనులు నత్తనడకన సాగుతున్నాయి.

అంతటా ఇదే తీరు..

● గ్రామాల్లో నీటి సరఫరా చేసే రిజర్వాయర్లు, పంపుహౌస్‌లు లేకుండా వీధుల్లో పైపులైన్లు వేసి కుళాయిలు ఏర్పాటు చేయడంతో అవన్నీ అలంకారప్రాయంగా మారాయి.

● మరికొన్ని చోట్ల వేసిన కుళాయిలు జాడ లేకుండా పోయాయి.

● కొత్తగా నిర్మించిన మంచినీటి రిజర్వాయర్ల(ట్యాంకులు)కు బోర్లు, మోటార్లు ఏర్పాటు చేయకపోవడంతో అవి దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి.

త్వరగా పూర్తికి చర్యలు..

జిల్లాలో జేజేఎం పనుల పూర్తికి చర్యలు చేపడుతున్నాం. పెండింగ్ బిల్లులు చెల్లింపులు జరిగిన వెంటనే వివిధ దశల్లో ఉన్న వాటిపై దృష్టి సారిస్తాం. టెండర్లు పూర్తయిన వాటిని కూడా వీలైనంత త్వరలో ప్రారంభిస్తాం. – పి.శంకర్‌బాబు, ఆర్‌డబ్ల్యూఎస్, ఎస్ఈ

జిల్లాలో వివరాలిలా..	మంజూరైన జేజేఎం పనులు	విలువ	ఇప్పటి వరకు పూర్తయిన పనులు	చేసిన ఖర్చు	గుత్తేదారులకు చెల్లించాల్సిన బకాయిలు	వివిధ దశల్లో ఉన్నవి	ఇంకా చేపట్టాల్సినవి
	4,286	రూ.2,076 కోట్లు	1,198	రూ.889 కోట్లు	రూ.63 కోట్లు	2095	993

కల్యాణం.. వైభోగం

శ్రీకాకుళం నగరంలో తితిదే ఆధ్వర్యంలో శ్రీవారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

నారాయణుడి కల్యాణ మహోత్సవం కనుల పండువగా సాగింది. శ్రీకాకుళం నగరపాలకోన్నత పాఠశాల మైదానంలో బుధవారం తితిదే ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణాన్ని చూసి భక్తులు పులకించిపోయారు. మందసలో వాసుదేవుడి కల్యాణ వేడుక త్రిదండి శ్రీమన్నారాయణ దేవనాథ రామానుజ స్వాముల పర్యవేక్షణలో రమణీయంగా సాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక, కోలాట ప్రదర్శనలు, గీతాలాపనలు ఆకట్టుకున్నాయి.

– న్యూస్‌టుడే, పాత బస్టాండ్, మందస

మందసలో దేవేరులపై తలంబ్రాలు వేస్తూ..

వాసుదేవ పెరుమాళ్ ఆలయంలో వేడుకను వీక్షిస్తున్న భక్తజనం

అడుగులు ముందుకు.. వయసు వెనక్కి..!

● రేస్ వాక్ పోటీల్లో సత్తా చాటుతున్న సుధాకర్

న్యూస్‌టుడే, పాతబస్టాండ్

రోజూ కాసేపు నడిస్తే ఆరోగ్యానికి ఎంతో మంచిదని వైద్యులు చెబుతుంటారు. ఆ మాటలు ముమ్మాటికీ నిజమేనని నిరూపిస్తున్నారు శ్రీకాకుళం నగరంలోని హోమియో కాలనీకి చెందిన నళిని సుధాకర్. ప్రస్తుతం ఈయన వయసు 61 సంవత్సరాలు. లావేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఓ వైపు విద్యార్థులకు పాఠాలు చెబుతూ.. మరోవైపు క్రమం తప్పకుండా వ్యాయామ సాధనతో ముందుకు సాగుతున్నారు. రేస్ వాక్ పోటీల్లోనూ సత్తా చాటుతూ.. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు. 30 ఏళ్ల కిందట మొదలైన ఈయన నడక ప్రస్థానాన్ని దిగ్విజయంగా కొనసాగిస్తూ.. ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఉపయోగం ఏంటంటే..

రేస్ వాక్ పోటీలో క్రీడాకారులు చేతులు వెనక్కి.. ముందుకు ఊపుతూ వేగంగా నడవాలి. నియమాలను ఉల్లంఘిస్తే రిఫరీ ముందు పసుపు కార్డు, సరి చేసుకోకుంటే ఎరుపు కార్డు చూపించి.. పోటీ నుంచి తప్పిస్తారు. ఒలింపిక్స్ క్రీడల్లో భాగంగా ఈ రేస్ వాక్ పోటీలు జరుగుతుంటాయి. కఠిన నియమాలతో క్లిష్టంగా సాగే క్రీడ గుండె ఆరోగ్యం, బరువు నియంత్రణ, ఎముకల కండరాల బలం, రక్తప్రసరణ సమతుల్యత, జీర్ణక్రియ మెరుగుదలకు దోహదపడుతుంది.

సాధించిన విజయాలిలా..

● మలేషియా వేదికగా 2011లో అంతర్జాతీయ స్థాయి జరిగిన పోటీల్లో ఆరో స్థానం సాధించారు. శ్రీలంక(2023)లో రజతం, నేపాల్(2024)లో స్వర్ణం, గతేడాది మంగుళూరులో 5 కి.మీ. విభాగంలో రజతం, భూటాన్‌లో రెండు బంగారు, రజత పతకాలు అందుకున్నారు. థాయ్‌లాండ్, చెన్నైలలో జరిగిన పోటీల్లోనూ ప్రతిభ చూపారు.

● 2021లో మహారాష్ట్ర, తెలంగాణ, 2022, 2023లో తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించారు.

గత మూడేళ్లలో వివిధ రాష్ట్రాల్లో నాలుగు పోటీల్లో పాల్గొని బంగారు పతకాలు అందుకున్నారు. రాష్ట్రస్థాయిలోనూ 2012 నుంచి సత్తా చూపుతున్నారు. జిల్లాలో ఈ క్రీడపై తర్ఫీదు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని, మరిన్ని పతకాలు సాధిస్తానని చెబుతున్నారు సుధాకర్.

నగరపాలక సంస్థ కమిషనర్ బాధ్యతల స్వీకరణ

కూర్మారావు

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్‌గా హనుమంతు కూర్మారావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. వ్యవసాయ శాఖకు చెందిన ఆయన్ను ప్రభుత్వం ఏడాది పాటు డిప్యుటేషన్‌పై నియమించింది. ఇన్‌ఛార్జి కమిషనర్ కమలాకర్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ప్రతి విభాగాన్ని పరిశీలించారు. అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సమష్టిగా పని చేసి నగరాభివృద్ధికి తోడ్పాలని కోరారు. కమిషనర్‌ను నగరపాలక సంస్థ గుత్తేదారులు, కార్మిక సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తొలుత ఆయన అరసవల్లిలో సూర్యనారాయణస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

శ్రీకాకుళం డీఎస్పీ బదిలీ

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్.వివేకానందకు స్థానచలనం కల్పిస్తూ డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖ నగరంలోని హార్బర్ సబ్ డివిజన్‌లో సహాయ పోలీసు కమిషనర్‌గా నియమించారు. 2024 ఆగస్టు 27 నుంచి శ్రీకాకుళం డీఎస్పీగా బాధ్యతలు నిర్వర్తించారు. జిల్లాలో అభ్యుదయం సైకిల్ యాత్ర, శ్రీముఖలింగం, అరసవల్లి, శాలిహుండం ఉత్సవాలు విజయవంతం కావడంలో కీలకంగా వ్యవహరించారు. ఆయన స్థానంలో ఇంకా ఎవర్నీ నియమించలేదు.

అదో అవినీతి ఖజానా..!

● కొందరు ఉద్యోగులపై ఆరోపణల వెల్లువ

ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం

జిల్లాలోని ఖజానా శాఖ అవినీతికి చిరునామాగా మారింది. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు సంబంధించిన ఆర్థికపరమైన వ్యవహారాల విషయంలో ఎలాంటి పనిచేయాలన్నా ఇక్కడ అడుగడుగునా దోపిడీకి పాల్పడుతున్నారు. అడిగినంత ఇవ్వకపోతే కొర్రీలు వేసి కార్యాలయాల చుట్టూ తిప్పడం పరిపాటిగా సాగుతోంది. కాసులిస్తేనే పనులు జరిగేది అన్నట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత నెల 27న శ్రీకాకుళం ఉపఖజానా కార్యాలయంలో సచివాలయ ఉద్యోగిని వేతన బకాయిలు దస్త్రం విషయంలో రూ.15 వేలు తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు ఇద్దరు అధికారులు పట్టుబడ్డ విషయం తెలిసిందే. జిల్లాలోని వివిధ ఖజానా కార్యాలయాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

● జిల్లా కేంద్రంలో ఖజానా శాఖ ప్రధాన కార్యాలయం ఉంది. శ్రీకాకుళం, రణస్థలం, పొందూరు, ఆమదాలవలస, నరసన్నపేట, పాతపట్నం, కొత్తూరు, కోటబొమ్మాళి, టెక్కలి, పలాస, సోంపేట, ఇచ్ఛాపురం మొత్తం 12 ఉప కార్యాలయాలున్నాయి. ఒక్కో కార్యాలయ పరిధిలో రెండు నుంచి నాలుగు మండలాలు వస్తాయి. జిల్లాలో దాదాపు 12 వేల మంది విశ్రాంత ఉద్యోగులు, ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు 14 వేలకు పైనే ఉన్నారు.

● ఎచ్చెర్ల నియోజకవర్గ పరిధిలోని ఓ ఉద్యోగికి రావాల్సిన రూ.లక్ష బకాయిలకు సంబంధించి ఖజానా కార్యాలయ ఉద్యోగి, అధికారి రూ.20 వేలు డిమాండ్ చేశారు. ఇవ్వకపోతే దస్త్రాలు ముందుకెళ్లవని తేల్చి చెప్పారు. కావాలంటే గతంలో చేసిన వారిని అడగండంటూ అక్రమాల ఉదాహరణ చెప్పి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారు.

● ఇటీవల డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు తొలి జీతానికి సంబంధించి దస్త్రాలు సిద్ధం చేయడానికి కొందరు డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అన్నింట్లో దోపిడీనే..

● విశ్రాంత ఉద్యోగులు, ఉద్యోగులకు సంబంధించిన ఇంక్రిమెంట్లు, ఉద్యోగోన్నతులు, ఓడీ, ఓటీ, పింఛన్లు, ఈఎల్, గ్రాట్యుటీ, జీపీఎఫ్, జీతభత్యాలు, బకాయిలకు సంబంధించి ఖజానా శాఖ కార్యాలయాల్లోనే ఎక్కువగా పని ఉంటుంది. వీటి విషయంలో కొందరు అధికారులు, కార్యాలయ సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారని పెద్ద ఎత్తున విమర్శలు ఉన్నాయి.

● గుత్తేదారులు ప్రభుత్వం తరఫున చేపట్టిన పనులకు సీఎంఎఫ్ఎస్ ద్వారా పెట్టే బిల్లుల్లో సైతం కమీషన్లు తీసుకుంటున్నట్లుగా ఆరోపణలు ఉన్నాయి. వసతి గృహాలు, పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ వంటి శాఖల పరిధిలో చేసే పనులు, పెట్టే బిల్లుల్లోనూ చేతివాటం చూపించాల్సిందేనంటూ కొందరు బాధితులు బహిరంగంగానే వాపోతున్నారు.

పైకి చూడండి.. నచ్చినట్లు వెళ్లండి..

జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్ లైట్ల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. అవి ఎప్పుడు పనిచేస్తాయో.. ఎప్పుడు ఊరుకుంటాయో ట్రాఫిక్ పోలీసులకు సైతం తెలియని పరిస్థితి నెలకొంది. అరసవల్లి మిల్లు జంక్షన్, పొట్టి శ్రీరాములు, రామలక్ష్మణ కూడళ్ల వద్ద ఉన్న సిగ్నలింగ్ వ్యవస్థలో లోపాల కారణంగా వాహనాల క్రమబద్ధీకరణ వీలుపడట్లేదు. వాహనదారులు ఇష్టానుసారం వెళ్లిపోతున్నారు. పొట్టి శ్రీరాముల కూడలిలో పని చేయని లైట్లను చిత్రంలో చూడొచ్చు. – న్యూస్‌టుడే, పాతశ్రీకాకుళం

నిర్వహణ లోపం.. తెరుచుకోని తాళం..!

కొవిడ్ సమయంలో జిల్లావ్యాప్తంగా 8 ఆక్సిజన్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. ప్రతి నియోజకవర్గ పరిధిలోని ఆసుపత్రుల ఆవరణలో నెలకొల్పిన వీటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో మూలకు చేరాయి. అప్పటి నుంచి ఎక్కడికక్కడ తాళాలు వేసి ఉంచేయడంతో అవి నిరుపయోగంగా మారాయి. నరసన్నపేట ఆసుపత్రిలోని ఈ ప్లాంటే అందుకు నిదర్శనం. ఈ విషయమై జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి కల్యాణబాబు మాట్లాడుతూ పునరుద్ధరణకు ప్రతిపాదనలు పంపించామన్నారు. – న్యూస్‌టుడే, నరసన్నపేట

3 విడతలు.. రూ.92.10 కోట్లు

● 'దీపం-2' ద్వారా 11.36 లక్షల సిలిండర్ల సరఫరా

న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

సామాన్య కుటుంబాల్లో వంటింటి ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు కూటమి ప్రభుత్వం దీపం-2 పథకాన్ని అమలు చేస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 2024లో దీపావళి నుంచి నాలుగు నెలలకో సిలిండర్ చొప్పున ఏడాదికి మూడు ఉచితంగా అందిస్తోంది. ఈ పథకాన్ని ఇచ్ఛాపురంలోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రారంభించారు. జిల్లాలో దీని ద్వారా ఇప్పటి వరకు మూడు విడతల్లో రూ.92.10 కోట్ల మేర వినియోగదారులు లబ్ధి పొందారు.

● ఏటా డిసెంబరు నుంచి మార్చిలోగా మొదటి, ఏప్రిల్ నుంచి జులైలోగా రెండో, ఆగస్టు నుంచి నవంబరులోగా మూడో విడత గ్యాస్ సిలిండరు పొందొచ్చు. నిర్దేశిత గడువు ప్రకారం లబ్ధిదారులు బ్యాంకు ఖాతాల్లో రాయితీ నగదు జమ చేస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 11.36 లక్షల సిలెండర్లను ఉచితంగా సరఫరా చేశారు.

జిల్లాలో పథకం వివరాలిలా..

విడత	లబ్ధిదారులు	రాయితీ నగదు (రూ.కోట్లలో..)
తొలి	4,24,475	33.52
రెండు	4,15,129	33.98
మూడు	2,97,436	24.60

నగదు జమకాకుంటే..?

సిలిండరు తీసుకున్న తర్వాత రాయితీ మొత్తం జమ కాకుంటే 1967 టోల్‌ఫ్రీ నంబరును సంప్రదించాలి. అంతకంటే ముందు గ్యాస్ ఏజెన్సీకి వెళ్లి.. అక్కడ ఈ-కేవైసీ చేయించుకోవాలి. ఆ తర్వాత బ్యాంకుకు వెళ్తే ఎన్‌పీసీఐ మ్యాపింగ్ ప్రక్రియ చేస్తారు. వెంటనే అర్హులకు రాయితీ నగదు వారి ఖాతాల్లో జమ అవుతుందని జిల్లా పౌరసరఫరాల అధికారి సూర్యప్రకాశరావు తెలిపారు.

రూ.21.03 కోట్లిస్తే.. విస్తరణ దారికొస్తుంది..!

● అసంపూర్తిగా శ్రీకాకుళం - ఆమదాలవలస రహదారి పనులు

న్యూస్‌టుడే, శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం - ఆమదాలవలస రహదారి విస్తరణ పనులు ఏళ్ల తరబడి కొనసాగుతున్నాయి. ఇటీవల జిల్లా కేంద్రంలో చేపట్టాల్సిన పనుల్లో కదలిక వచ్చింది. కాలం కరుగుతున్న కొద్దీ వ్యయం పెరిగిపోతుండటంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. విస్తరణ కొలిక్కి రావాలంటే రూ.21.03 కోట్లు అవసరమని తేల్చారు.

శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద చేపడుతున్న రక్షణ గోడ తొలగింపు పనులు

● రహదారులు, భవనాలశాఖ పరిధిలోని రోడ్డు విస్తరణ పనులకు 2018లో అప్పటి తెదేపా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. భూసేకరణ విషయంలో ఆదిలోనే అడ్డంకులు ఎదురవ్వడంతో ప్రారంభంలో చేపట్టాల్సిన పనులు శ్రీకాకుళం నుంచి కాకుండా ఆమదాలవలస నుంచి మొదలు పెట్టారు. ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిపేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా సర్కారు ఐదేళ్ల పాటు పనులపై శ్రద్ధ చూపలేదు. గుత్తేదారులకు బిల్లుల చెల్లింపులో జాప్యం చేయడంతో మధ్యలోనే పనులు ఆపేశారు.

పని: రహదారి విస్తరణ

ప్రాంతం: శ్రీకాకుళం నగరంలోని డే అండ్ నైట్ కూడలి నుంచి ఆమదాలవలస రైల్వే గేటు వరకు

రోడ్డు పొడవు: 10.4 కి.మీ.

ఇప్పటి వరకు పూర్తయింది: 7.7 కి.మీ.

● కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పనుల్లో వేగం పెరిగింది. గుత్తేదారుతో మాట్లాడి ఆమదాలవలస నుంచి కొత్తరోడ్డు వద్ద రోడ్డు, విభాగిని పనులు పూర్తి చేశారు. రూ.28 కోట్ల మేర బిల్లులు చెల్లించారు. మిగిలిన రూ.12 కోట్లతో 2.7 కిలోమీటర్ల రోడ్డు, కాలువల పనులు చేపట్టనున్నారు. ఆర్థిక ఇబ్బందులను అధిగమించి, వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు.

ఎంతెంత.. ఎందుకంటే..

● పనులు పూర్తి కావాలంటే భవనాలు, ఇతర కట్టడాల తొలగింపు పరిహారం కింద 572 మందికి రూ.9.72 కోట్లు చెల్లించాలి.

● శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో రక్షణ గోడల నిర్మాణాలకు రూ.1.17 కోట్లు అవసరం.

● రహదారిలో విద్యుత్తు స్తంభాలు, నియంత్రికలు మార్చేందుకు రూ.7.35 కోట్లు కావాలి.

● తాగునీటి పైపులైన్లను మార్చేందుకు రూ.2.80 కోట్లు అవసరం.

● స్థలాలు కోల్పోతున్నవారికి టీడీఆర్ బాండ్లు ఇవ్వాలి.

● కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారుల మౌలిక వసతుల నిధి(సీఆర్ఐఎఫ్) నుంచి రోడ్డు విస్తరణకు రూ.40 కోట్లు మంజూరు చేసింది. ఆ నిధులతో కేవలం రోడ్డు, కల్వర్టుల నిర్మాణం, సెంటర్ డివైడర్, విద్యుద్దీకరణ పనులు చేపట్టేందుకే అనుమతించింది. కట్టడాల తొలగింపు, భూసేకరణ, విద్యుత్తు స్తంభాలు, నియంత్రికలు, తాగునీటి పైపులైన్ల మార్పు పనులు రాష్ట్ర ప్రభుత్వమే చేయించాలని స్పష్టం చేసింది.

(c) eenadu

అధునాతన సాంకేతిక నైపుణ్యాలతో ఉపాధి అవకాశాలు

విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న జేఎన్‌టీయూ-జీవీ వీసీ ఆచార్య సుబ్బారావు, ప్రతినిధులు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్ విద్యార్థులు అకడమిక్ సబ్జెక్టులపై పట్టుతో పాటు ప్రస్తుత ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న అధునాతన సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకుంటేనే మెరుగైన ఉద్యోగావకాశాలు లభిస్తాయని జేఎన్‌టీయూ-జీవీ వీసీ ఆచార్య డా. వి.వి.సుబ్బారావు అన్నారు. చిలకపాలెం సమీపంలోని శ్రీ శివాని ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం 20వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న వీసీ మాట్లాడారు. ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ డా. కె.వి.జి.డి.బాలాజీ, ప్రధానాచార్యులు వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పెద్ద మనసు చాటుకున్న పూర్వ విద్యార్థి

• పాఠశాల అభివృద్ధికి రూ.కోటి విరాళం ప్రకటన

పూర్వ విద్యార్థుల సమావేశంలో మాట్లాడుతున్న డా.లమ్మత విశ్వనాథం

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 1966లో పదో తరగతి చదివిన డా.లమ్మత విశ్వనాథం పెద్ద మనసు చాటుకున్నారు. అమెరికాలో స్థిరపడిన ఆయన బుధవారం పాఠశాలలో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమావేశానికి హాజరయ్యారు. తన జీవిత చరిత్రపై మిత్రుడు చింతాడ కృష్ణారావు రాసిన 'నా జీవనయానం కోట్నీరులో మొదలై' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం విశ్వనాథం మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి రూ.కోటి విరాళాన్ని ప్రకటించారు. ఆ మొత్తంతో విద్యాలయంలో ఆడిటోరియం, డిజిటల్ గ్రంథాలయం ఏర్పాటు చేస్తామని తెలిపారు. త్వరలో అధికారులు, గ్రామపెద్దల సమక్షంలో నగదు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పెట్ట గంగన్న, గ్రామ పెద్దలు ఎల్.ఎల్.నాయుడు, కోత మధుసూదనరావు పాల్గొన్నారు.

రైల్వే రిజర్వేషన్ కౌంటర్ తరలింపు తగదు

నిరసన తెలుపుతున్న వివిధ సంఘాల ప్రతినిధులు

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను వేరే ప్రాంతానికి తరలించే యత్నం మానుకోవాలని వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. శ్రీకాకుళం నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్, లయన్స్ క్లబ్ హార్మొనీ, సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు కృషితో ఏర్పాటు చేసిన రైల్వే రిజర్వేషన్ కౌంటర్ రోజూ రద్దీగా ఉంటుందని పేర్కొన్నారు. కౌంటర్ పని వేళలు, సిబ్బందిని తగ్గించడం వంటి చర్యలతో దశల వారీగా రైల్వే రిజర్వేషన్ కౌంటర్ ఎత్తివేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోందని తెలిపారు. స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల ఇందిరాప్రసాద్, వావిలపల్లి జగన్నాథం నాయుడు, జోగినాయుడు, ప్రసాదరావు, చిన్నం జయ, కృష్ణారావు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

లక్ష్యంతో చదివి ఫలితాలు సాధించాలి



ఇచ్ఛాపురం బీసీ వసతిగృహంలో విద్యార్థి సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీఈఓ రవిబాబు

ఇచ్ఛాపురం(గ్రామీణం), కంచిలి (గ్రామీణం), న్యూస్‌టుడే: పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణత, అత్యుత్తమ మార్కుల సాధన కోసం సమష్టిగా పనిచేద్దామని జిల్లా విద్యాశాఖాధికారి కె.రవిబాబు అన్నారు. పదోతరగతి విద్యార్థులతో నిర్వహిస్తున్న స్టడీ అవర్లను పరిశీలించేందుకు బుధవారం ఇచ్ఛాపురం వచ్చిన ఆయన ప్రభుత్వ పుర బాలికోన్నత పాఠశాలలో వందరోజుల ప్రణాళిక అమలుపై సమీక్షించారు. వెనకబడిన విద్యార్థులకు అవసరమైన ప్రోత్సాహం అందించి, పరీక్షల్లో చురుగ్గా రాసేలా మార్గనిర్దేశం చేశారు. వసతి గృహాల్లో చదువుతున్న వారితో మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. వారికి అందిస్తున్న భోజనం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈఓలు ... బాలిక, కొళిగాం జడ్పీ ఉన్నత, హరిపురం, బిర్లంగి ఏపీఎంపీఎస్ పాఠశాలలతోపాటు ఇచ్ఛాపురంలోని బీసీ, కంచిలి మండలం ఎంఎస్‌పల్లి బాలుర వసతి గృహాలను సందర్శించారు. ప్రత్యేక తర్ఫీదు పొందుతున్న విద్యార్థులతో మాట్లాడారు. అప్పారావు, ఎస్.విశ్వనాథం, ప్రధానోపాధ్యాయులు కె.సూర్యారావు, బి.శ్రీనివాసరావు, విద్యాశాఖ సిబ్బంది రాయపూడి దేవరాజు, ఆర్.రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాగర సంగ్రామ దీక్ష విజయవంతానికి పిలుపు

గోడప్రతులను ఆవిష్కరిస్తున్న ఎన్జీవో సంఘ నాయకులు

పాతశ్రీకాకుళం, న్యూస్‌టుడే: కాంట్రిబ్యూటరీ పింఛను విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 22న విశాఖపట్నంలో సాగర సంగ్రామ దీక్ష పేరిట నిర్వహించనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎన్జీవో సంఘ జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం కోరారు. శ్రీకాకుళం నగరంలోని ఎన్జీవో హోంలో బుధవారం దీక్షకు సంబంధించి రూపొందించిన గోడప్రతులను ఆవిష్కరించి మాట్లాడారు. సీపీఎస్ అంతానికి జరిగే పోరాటంలో ప్రతి ఉద్యోగి భాగస్వాములై పాల్గొనాలని కోరారు. ఎన్జీవో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.వేణుగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా శ్రీనివాసరావు, ఏపీటీఎఫ్ నాయకులు కె.భానుమూర్తి, సీహెచ్ శ్రీనివాసరావు, పి.తిరుమలరావు, సీపీఎస్ ఉద్యోగుల సంఘ నాయకులు ఆర్.సూరిబాబు, వీవై రాజు, బి.పూర్ణచంద్రరావు, వెంకటేశ్వర్లు, బి.రవి తదితరులు పాల్గొన్నారు.

పాలిథిన్ ముచ్చు.. ఆరోగ్యానికి ముప్పు!

న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

సులువుగా పని అయిపోవాలనే ఉద్దేశంతో కార్యక్రమాల నిర్వాహకులు పాలిథిన్‌తో తయారు చేసిన ఉత్పత్తులను వేడుకల్లో వినియోగిస్తున్నారు. ఎక్కడికి వెళ్లినా టీ కప్పు నుంచి భోజన పళ్లెం వరకు ఇవే కనిపిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా నెలకు రూ. 20 లక్షల మేర వ్యాపారం సాగుతోంది. నిషేధం ఉన్నా తయారీదారులు వెనకడుగు వేయడం లేదు. అవి పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి తీవ్ర ముప్పు తెస్తున్నా పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

పాలిథిన్ రేపర్ అతికించిన ప్లేట్లు

చైతన్యం అవసరం

జిల్లా వ్యాప్తంగా 200కు పైగా ప్లాస్టిక్ వస్తువులు, సంచులు తయారు చేసే సంస్థలు ఉన్నాయని సమాచారం. పర్యావరణానికి హాని కలిగించే ఉత్పత్తుల స్థానంలో స్టీలు ప్లేట్లు అద్దెకు ఇచ్చే వ్యాపారం, విస్తరాకుల తయారీ యూనిట్లు ఏర్పాటు చేయించాలి. కొన్ని ఐస్‌క్రీమ్‌లను బిస్కెట్ గొట్టాల్లో వేసి ఇస్తారు. క్రీమ్‌తో పాటు గొట్టాన్ని తినొచ్చు. బిస్కెట్ గ్లాసుల తయారీని ప్రోత్సహించాలి. కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తే ఎక్కువ మందికి విషయం చేరుతుందని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు.

ఇష్టానుసారం వినియోగం

• ప్రస్తుతం మార్కెట్లో లభిస్తున్న చాలా రకాల ప్లేట్లు పాలిథిన్ రేపర్ అతికించి ఉంటున్నాయి. వాటిపై వేడి పదార్థాలు వడ్డించగానే హానికరంగా మారతాయని వైద్యులు సూచిస్తున్నారు. తక్కువ ధరకు అవి అందుబాటులో ఉండటంతో ఎక్కువ మంది వాటి కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు. ఒక స్టీలు వస్తువును వందసార్లు వాడుకోవచ్చనే విషయాన్ని విస్మరించి ఇష్టానుసారం ప్లాస్టిక్ ఉత్పత్తులను పెద్దఎత్తున వినియోగిస్తున్నారని ఓ పురపాలక సంఘ అధికారి ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో వివాహాలు, ఇతర వేడుకలు మొదలుకానున్న నేపథ్యంలో పర్యావరణ హితంగా నిర్వహించుకోవాలని సూచించారు.

• ఒకప్పుడు విస్తరాకులు, అడ్డాకులు సేకరించి చీపురు పుల్లలతో విస్తర్లు కుట్టి విక్రయించేవారు. అవి పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి ఎంతో మేలు చేసేవి. ప్రస్తుతం అవి అందుబాటులో ఉన్నప్పటికీ కొంచెం ధర ఎక్కువగా ఉండటంతో వీటిని కార్యక్రమాల్లో వినియోగిస్తే ఖర్చు ఎక్కువ అవుతుందని ఆసక్తి చూపడం లేదు.

• పాలిథిన్ రేపర్, ప్లాస్టిక్ ఉత్పత్తులతో తయారు చేసిన ప్లేట్లను వినియోగించి పడేసిన చోట మూగజీవాలు ఆహారం కోసం అన్వేషిస్తూ వాటిని తినేస్తున్నాయి. ఈ కారణంగా చాలా నష్టం జరుగుతోందని పశు వైద్య నిపుణుడు అప్పలస్వామి తెలిపారు.

పురపాలక సంఘం	రోజూ ఉత్పత్తి అవుతున్న చెత్త (టన్నుల్లో)	అందులో ప్లాస్టిక్ వ్యర్థాలు
పలాస-కాశీబుగ్గ	28	2
ఇచ్ఛాపురం	18	2
ఆమదాలవలస	26	2
శ్రీకాకుళం నగరపాలక సంస్థ	70	6

అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం..

ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి అన్ని పురపాలక సంఘాలకు ప్రచార సామగ్రి చేరవేశాం. ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు చేతి సంచి, గ్లాసు, స్టీలు సీసా వెంట తీసుకెళ్లే అలవాటు పెరిగితే పర్యావరణాన్ని, ఆరోగ్యాన్ని కాపాడుకున్నవారవుతారు. ఈ విషయమై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం.

– రవీంద్ర, పురపాలక సంఘాల ప్రాంతీయ అధికారి, విశాఖపట్నం

సంస్థలు కనీస వేతనాలు అమలు చేయాల్సిందే

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: దుకాణాలు, వ్యాపార సంస్థలు కనీస వేతనాలు అమలు చేయాలని సహాయ కార్మిక అధికారి-2 నీలబాబులు బుధవారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. కనీస వేతనాలు చెల్లించని యజమానిపై కేసు నమోదు చేసి వసూలు చేసిన రూ. 87,400 డిమాండ్ డ్రాఫ్ట్‌ను ఆ సంస్థకు చెందిన నలుగురు కార్మికులకు అందజేశామని పేర్కొన్నారు. పలువురికి నియామక ఉత్తర్వులు అందజేశామని తెలిపారు. తనిఖీ రికార్డుల్లో చూపించని వారిపై శ్రీకాకుళం స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో కేసు వేయగా ఇద్దరు యజమానులకు రూ.3 వేలు చొప్పున జరిమానా విధించారని వెల్లడించారు.

17న చదరంగం పోటీలు

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 17న జిల్లా స్థాయి చదరంగం పోటీలు నిర్వహించనున్నట్లు డీఎస్‌డీఓ ఎ.మహేశ్‌బాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం నగర పరిధి శాంతినగర్ కాలనీలోని ఇండోర్ స్టేడియంలో జరగనున్న పోటీల్లో అండర్-13, 15, 17, 19 విభాగాల్లోని బాలబాలికలు పాల్గొనొచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు వారి వివరాలను sports.ap.gov.in లో నమోదు చేసుకోవాలని సూచించారు. పోటీల్లో ప్రతిభ ఆధారంగా తిరుపతిలో ఈ నెల 21న నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 76800 75375, 93903 52942ను ఫోన్ చేయాలని సూచించారు.

అపరిష్కృత ప్రాజెక్టులకు నిధులు కేటాయించండి

మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: జిల్లాలో అపరిష్కృత ప్రాజెక్టులకు నిధులు కేటాయించకుంటే అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యుడు కె.మోహనరావు ప్రశ్నించారు. శ్రీకాకుళం నగరంలోని సీపీఎం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పాలకుల నిర్లక్ష్యమే వెనకబాటుకు కారణమన్నారు. మంత్రిమండలి, కలెక్టర్ల సమావేశంలో సీఎం రాష్ట్ర పరిస్థితి సమీక్షిస్తూ జిల్లా 26వ స్థానంలో ఉందని పేర్కొన్నారంటే అత్యంత వెనకబడిన జిల్లాగా పాలకులే నెట్టేశారని విమర్శించారు. వంశధార, నాగావళి జలాల్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోవడంతో పంటలు పండక వలసల జిల్లాగా మారిందన్నారు. అపరిష్కృత ప్రాజెక్టుల పూర్తికి బడ్జెట్‌లో ఎందుకు నిధులు కేటాయించలేదో మంత్రి అచ్చెన్నాయుడు సమాధానం చెప్పాలని డిమాండు చేశారు. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు నేరడి బ్యారేజీకి ఎందుకు నోటిఫికేషన్ వేయించడం లేదని ప్రశ్నించారు.

పాఠాలే కాదు... కంట్లో వెలుగు నింపారు

• పేదవిద్యార్థిని కంటిచూపునకు ఉపాధ్యాయురాలి తోడ్పాటు

న్యూస్‌టుడే, పలాస, కాశీబుగ్గ

సంధ్యారాణిని సత్కరిస్తున్న స్కూల్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

విద్యార్థులకు తరగతి గదిలో పాఠాలు చెప్పడమే తన వృత్తిగా భావించలేదా ఉపాధ్యాయురాలు.. విద్యార్థుల ఆరోగ్యంపైనా దృష్టి పెట్టారు. అలా ఓ చిన్నారికి కంటిచూపు వచ్చేలా కృషి చేస్తున్నారు. ఇటీవల విశాఖపట్నంలో కుడి కంటికి శస్త్రచికిత్స చేయించారు. ఈ నేపథ్యంలో ఆమెను స్కూల్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సత్కరించారు. విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుని అభినందించారు. అసోసియేషన్ ప్రతినిధులు టి.చందనరావు, ఎన్.విష్ణుమూర్తి, ప్రధానోపాధ్యాయుడు ఎల్.ఢిల్లీశ్వరరావు, రేణుక, పద్మకుమారి, హేమలత, ఆశారాణి పాల్గొన్నారు.

ఏం జరిగింది?

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం సూదికొండ మోడల్ ప్రైమరీ పాఠశాలలో తమ్మినాన సంధ్యారాణి సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయినిగా పని చేస్తున్నారు. వృత్తిలో భాగంగా 5వ తరగతికి క్లాస్ టీచర్‌గా ఉన్నారు. ఈ క్రమంలో కోనేరు సమీరా అనే విద్యార్థిని పాఠాలు బోధించే సమయంలో చెప్పేవి రాయకుండా ముభావంగా కూర్చొనేది. ఎందుకిలా ఉంటున్నావని, ఎందుకు రాయడం, చదవడం లేదని ప్రశ్నించారు. దీనికి నా కళ్లు కనిపించవు కదా... అందుకే అలా ఉంటున్నానని చిన్నారి సమాధానమిచ్చింది.

● చిన్నారి కుటుంబీకులకు ఆరోగ్య కార్డులు లేకపోవడంతో వారి, విద్యా శాఖ అధికారులు, తోటి ఉపాధ్యాయుల అనుమతి తీసుకుని విద్యార్థిని విశాఖకు తీసుకుని వెళ్లి పరీక్షలు, చికిత్సకయ్యే ఖర్చు తానే భరించేలా అక్కడి వైద్యులతో మాట్లాడి ఈ నెల 9న కుడి కంటికి శస్త్రచికిత్స చేయించారు.

● విద్యార్థినికి కంటి వెలుగు ఇవ్వాలనే తపనతో సంధ్యారాణి పలాస మండలం టెక్కలిపట్నంలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న తన భర్త కె.వి.వి.ఎస్.ప్రసాదరావుతో సంప్రదించి ప్రయత్నం ప్రారంభించారు. టెక్కలికి చెందిన నేత్ర వైద్యాధికారి కణితి కేశవరావు, శ్రీరాములు వద్ద ప్రాథమిక పరీశీలన చేయటంతో హైదరాబాద్‌లో శస్త్రచికిత్స చేయిస్తే కంటి చూపు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. విద్యార్థిని అంతదూరం వెళ్లలేక పడే ఇబ్బందులను మరోమారు వైద్యుల దృష్టికి తీసుకుని వెళ్లి విశాఖలో శస్త్రచికిత్స జరిగేలా చేసిన ప్రయత్నం ఫలించింది.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

జానకమ్మ (పాత చిత్రం)

నరసన్నపేట, న్యూస్‌టుడే: జమ్ము సమీపంలో బుధవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. పాతపట్నం మండలం తిడ్డిమి గ్రామానికి చెందిన దువ్వారి జానకమ్మ (60) బంధువు దశదిన కర్మకు కుటుంబ సభ్యులతో కలసి ఆటోలో శ్రీకూర్మం వెళ్తుండగా.. మధ్యలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు జమ్ము సమీపంలో ఆటో నిలిపారు. సదరు మహిళ రోడ్డు దాటుతుండగా బుడితి నుంచి నరసన్నపేట వస్తున్న కారు ఢీకొని అక్కడికక్కడే కన్ను మూశారు. జానకమ్మకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నరసన్నపేట ఎస్సై గణేష్ చెప్పారు.

గంజాయితో నలుగురి అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు

నరసన్నపేట, న్యూస్‌టుడే: మడపాం టోల్ ప్లాజా వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా 24 కిలోల గంజాయితో నలుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. ఈ మేరకు స్థానిక సర్కిల్ కార్యాలయంలో సీఐ ఎం.శ్రీనివాసరావు బుధవారం వివరాలను వెల్లడించారు. రెండు వేరు వేరు కేసుల్లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆసిఫ్‌ఖాన్, అస్లిల్‌ఖాన్, ఒడిశా వాసులైన ఈసాకో రైతా, సాగర్ పహాన్‌లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి సరకుతో పాటు నాలుగు చరవాణులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎస్సై గణేష్ ఉన్నారు.

ఉద్యోగాల పేరిట మోసం కేసులో ఒకరికి రిమాండ్

హిరమండలం: ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసిన ఘటనలో ఓ వ్యక్తికి కోర్టు బుధవారం రిమాండ్ విధించింది. ఎస్సై వి.హేమంత్‌కల్యాణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హిరమండలం మేజర్ పంచాయతీ చిన్నకోరాడ వీధికి చెందిన బి.జనార్దనరావు హిరమండలం పరిధిలోని ఐదుగురు వ్యక్తులకు ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి నకిలీ జాయినింగ్ పత్రాలు అందించారు. బాధితుల వద్ద రూ.13.50 లక్షలు తీసుకున్నారు. 2025లో బాధితుల్లో ఒకరైన టి.సంతోష్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం నిందితుడిని కొత్తూరు కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి కె.రాణి 14 రోజుల పాటు రిమాండ్ విధించారు. జనార్దనరావును అంపోలు జైలుకు తరలించామని ఎస్సై చెప్పారు.

పండిట్ దీన్‌దయాళ్‌కు నివాళి

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: అన్ని వర్గాల అభ్యున్నతిని కాంక్షించే వ్యక్తిత్వం పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ సొంతమని వక్తలు కొనియాడారు. ఆయన వర్ధంతి కార్యక్రమాన్ని భాజపా జిల్లా కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన భాజపా రాష్ట్ర కార్యదర్శి సుర్రెడ్డి మోహన్, పలువురు నాయకులు దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనసంఘ్ పతాకస్థాయికి చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు బైరి అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాలం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అట్టాడ రవిబాబ్జీ, జిల్లా ప్రధాన కార్యదర్శులు చింత పాపారావు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పైడి సింధూర, పలువురు నాయకులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	150	255	275

బార్ కౌన్సిల్ సభ్యుల ఎన్నికలకు ఏర్పాట్లు

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: ఈ నెల 13న నిర్వహించనున్న రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుల ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పిట్టా దామోదరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సామగ్రి రాష్ట్ర బార్ కౌన్సిల్ నుంచి జిల్లాకు చేరిందని..సీసీ కెమెరాల పర్యవేక్షణలో హైపవర్ కమిటీ నిర్వహించనుందని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జరగనున్న ఈ ప్రక్రియను జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తంగి శివప్రసాదరావు పర్యవేక్షిస్తారని తెలిపారు. జిల్లా పరిధిలో ఓటు హక్కు కలిగి ఉన్న న్యాయవాదులు 772 మంది ఉండగా. ఉమ్మడి జిల్లాతో కలిపితే 1,316 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారని పేర్కొన్నారు.

17న చలో విజయవాడ

కలెక్టరేట్(శ్రీకాకుళం),న్యూస్‌టుడే: పీఆర్‌సీ సాధనకు ఈ నెల 17న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు వై.ఉమాశంకర్, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీలక్ష్మి తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని యూటీఎఫ్ భవన్‌లో బుధవారం ప్రాంతీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 12వ పీఆర్‌సీ 2023 జులై నుంచి అమలు కావాల్సి ఉండగా ఇప్పటికీ కమిషన్‌ను నియమించకపోవడం దారుణమన్నారు. పీఆర్‌సీ నియమించాలని.. 29 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని, సీపీఎస్ రద్దు చేయాలని, డీఏ బకాయిలు చెల్లించాలని, మెమో 57 అమలు చేయాలని డిమాండు చేశారు. సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి, గౌరవాధ్యక్షుడు కె.వైకుంఠరావు, సహాధ్యక్షురాలు ధనలక్ష్మి, సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

13 నుంచి పక్షుల గణన

న్యూస్‌టుడే, గార

వాతావరణంలో మార్పుల కారణంగా కొన్ని రకాల పక్షులు అంతరించిపోతున్నాయి. జిల్లాలో నెలకొన్న పరిస్థితిని తెలుసుకోవడానికి ఈ నెల 13 నుంచి 16 వరకు గ్రేట్ బ్యాక్‌యార్డ్ బర్డ్ కౌంట్ (జీబీబీసీ) నిర్వహించనున్నారు. ఫౌండేషన్ ఫర్ ఎకోలాజికల్ సెక్యూరిటీ, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా భాగస్వామ్యంతో చేపట్టనున్నారు. దేశంలో 70కి పైగా ప్రకృతి పరిరక్షణ, పక్షి పరిశీలన సంస్థలను బర్డ్ కౌంట్ ఇండియా సమన్వయం చేస్తోంది. పక్షులు, వాటి స్థితిగతులను తెలుసుకునే వీలవుతుంది.

వంశధార సాగర సంగమ ప్రదేశంలో కనువిందు చేస్తున్న ఫాల్కేటెడ్ డక్

యాప్‌లో వివరాల నమోదు.. ● పక్షుల గణన వివరాలు ఈ-బర్డ్ యాప్‌లో నమోదు చేస్తారు. 15 నిమిషాల పాటు అవి చేసే శబ్దాలు వింటారు. ప్రత్యక్షంగా కనిపించిన వాటిని అందులో నిక్షిప్తం చేస్తారు. గతేడాది 75 రకాల పక్షులు గుర్తించినట్లు సమాచారం. కేంద్రపాలిత ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి పక్షి పరిశీలకులు సుమారు 10 వేల మందికి పైగా పాల్గొన్నారు. ● దేశంలో సుమారు 1,300 రకాల పక్షి జాతులున్నట్లు గణన నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. గతేడాది దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 14న 875 రకాల పక్షుల్ని గుర్తించారు. రాష్ట్రంలో 151 రకాలను నిర్దేశిత యాప్‌లో నమోదు చేశారు.

జీవవైవిధ్యానికి నెలవు

● తెలియని పక్షి చిత్రం, రికార్డు చేసిన వాటి శబ్దాన్ని మెర్లిన్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తే ఆ జీవి వివరాలు కనిపిస్తాయి. ఏసియన్ వాటర్ బర్డ్ సెన్సెస్ ఆధారంగా 97 రకాలు గుర్తించినట్లు పక్షి పరిశీలకుడు బలగ నవీన్ తెలిపారు.

● వంశధార, నాగావళి నదీ తీరాలు, సంగమ ప్రదేశాల వద్ద అరుదైన ఫాల్కేటెడ్ డక్ కనిపించినట్లు నమోదైంది. ఇది సైబీరియాకు చెందిన అరుదైన వలస పక్షి. పైడ్ అవోసెట్, బ్లాక్-బెల్లీడ్ టెర్న్, పైడ్ హారియర్, రాప్టర్ వంటి పక్షులు కనిపిస్తుండటం ఈ ప్రాంత జీవ వైవిధ్యాన్ని మరింత స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. గ్రామ స్థాయిలో అరుదైన పక్షులు కనిపిస్తే 77998 06656ను సంప్రదించాలని కోరారు.

● జిల్లాలో 150 రకాల పక్షులున్నాయని ప్రాథమిక సమాచారం. నదీ పరివాహక ప్రాంతాలు, పెద్ద చెరువులు, సాగరాలు కీలక పక్షి కారిడార్‌గా అవతరిస్తుందని పేర్కొన్నారు.

దోమల నివారణపై దృష్టి

స్పందనకు వందనం

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరపాలక సంస్థలో పారిశుద్ధ్య పనులు అస్తవ్యస్తంగా ఉండటంతో దోమలు విజృంభిస్తున్నాయని.. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని 'ఈనాడు'లో ఈ నెల 11న 'పట్టించుకోరా.. కుట్టించుకోవల్సిందేనా..?' శీర్షికతో ప్రచురితమైన కథనంపై నగరపాలక సంస్థ ప్రజారోగ్యాధికారి పి.సుధీర్‌కుమార్ స్పందించారు. మురుగు నీరు నిలిచి ఉన్న ప్రాంతాలను బుధవారం పరిశీలించారు. నీరు మళ్లించేలా చర్యలు తీసుకున్నారు. భైరివానిపేటలో నీటి మళ్లింపు పనులను ఆయన పరిశీలించారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్ట్రెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, పరిపాలన కార్యాలయ ప్రాంగణం, బాలాజీ నగర్, సిరిపురం, విశాఖపట్నం

అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ వై. కిరణ్ చంద్ (చీఫ్ మేనేజర్) మొబైల్ నెం.91609 49910,
ఇ-మెయిల్ ఐడి: sbi.10077@sbi.co.in, మెషినరీ తనిఖీ కొరకు : 92466 11933 & 98482 49289.

హైపోథికేషన్ చేసిన చరాస్తుల అమ్మకం కొరకు ప్రకటన

దిగువ తెలిపిన ఋణగ్రహీత బకాయి చెల్లింపులో విఫలమైనందున, బ్యాంక్ వారు స్వాధీనం చేసుకున్న / సీజ్ చేసిన దిగువ తెలిపిన హైపోథికేషన్ చేసిన దిగువ తెలిపిన చరాస్తులను పార్టీల మధ్య గల హైపోథికేషన్ అగ్రిమెంట్ ప్రకారం లభించిన అధికారాలను ఉపయోగించి సదరు చరాస్తులను "ఎక్కడ ఎలా ఉన్నది", "అక్కడ అలానే" మరియు "ఏది ఉంటే అది" పద్ధతి పై మరియు దిగువ తెలిపిన వేలం నోటీసులో పేర్కొన్న నియమ-నిబంధనల ప్రకారం వేలం వేయబడును.

ఋణగ్రహీత(లు) : మెస్సర్స్ శ్రీ విఘ్నేశ్వర దాల్ మిల్, ప్రొప్రయిటర్ : శ్రీ తర్ర జయరామ్, సర్వే నెం. 117/27, శ్రీ ముఖలింగం రోడ్డు, బుడితి, శ్రీకాకుళం జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 532247. శ్రీ తర్ర జయరామ్, తండ్రి : సత్యనారాయణ, డి.నెం. 1-144, బిసి కాలనీ, కొండపోలవలస, జాలుమూరు, శ్రీకాకుళం జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 532427.

ప్రస్తుత బకాయి మొత్తం: తేది.22-12-2025 నాటికి రూ.1,51,15,645/- + తేది.23.12.2025 నుండి భవిష్య వడ్డీ మరియు ఇతర ఖర్చులు మొదలగునవి (మునుపటి జమలు మినహాయించిన తరువాత).

మెషినరీ వివరములు:

1. 25 ft height Elevator with 2 HP motor – 12 No's, **2.** Storage bin with 15 ton capacity each (MS make) – 2 No's, **3.** Boiler + heater + blower with 15 HP motor – 1 Set, **4.** Destoner with 5 HP motor – 1 No, **5.** Oil Trup with 1.5 HP motor – 1 No, **6.** Rollers with 15 HP motor – 2 No's, **7.** Sieve with 2 HP motor – 1 No, **8.** Dust Cleaner + Blower with 1 HP motor – 1 No, **9.** Rollers with 15 HP motor – 2 No's, **10.** Storage bin with 15 ton capacity each (MS make) – 2 No's, **11.** Grader with 2 Hp motor – 3 No's, **12.** Sieve with 2 HP motor-1 No, **13.** Panel Board – 1 No, **14.** Boiler+ heater + blower with 15 HP motor – 1 Set, **15.** Storage bin with 15 ton capacity each (MS make) – 1 No, **16.** Dust Cleaner + Blower with 1 HP motor – 1 No, **17.** Sieve with 2 HP motor – 1 No, **18.** Rollers with 15 HP motor – 2 No's, **19.** Oil Trup with 1.5 HP motor – 1 No, **20.** Sieve with 2 HP motor – 1 No, **21.** 15 HP motor with Belts – 1 Set, **22.** 25 ft height Elevator with 2 HP motor – 6 No's, **23.** Panel Boards – 2 No's, **24.** Oil Trup with 1.5 HP motor – 1 No, **25.** Color Sortex 2 Chute – 1 No, **26.** Storage bin with 15 ton capacity each (MS make) – 1 No, **27.** Oil Trup with 1.5 HP motor – 3 No's, **28.** Blower with 1 HP motor – 1 No, **29.** Weighing Machine – 3 No's, **30.** Stiching Machine – 2 No's, **31.** 25 ft height Elevator with 2 HP motor – 3 No's, **32.** Panel Boards – 1 No, **33.** Air Comperssor – 1 Set.

రిజర్వు ధర : రూ.52,00,000/- ధరావత్తు : రూ.5,20,000/- బిడ్ పెంపుదల : రూ.10,000/-

ఇ-వేలం తేదీ : 04-03-2026 సమయం : ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

మెషినరీ తనిఖీ తేది మరియు సమయం: తేది: 12-02-2026 నుండి 03-03-2026 వరకు ఉ॥10.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు

1) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క వెబ్ సైట్ : www.sbi.co.in/web/sbi-in-the-news/auction-noticesలో ఏర్పాటుచేసిన లింకును రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, ఐయండి, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడర్ M/s. PSB Alliance & M/s. Baanknet యొక్క ఇ-వేలం పోర్టల్ : https://baanknet.com/eauction-psb/x-login & https://baanknet.com & టోల్ ఫ్రీ ఫోన్ నెం.: 91 - 8291220220, Mail ID : support.baanknet@psballiance.comను సంప్రదించండి.
2) ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంపు డ్యూటీలు బదిలీ ఛార్జీలు, ఫీజు వగైరా మరియు చట్టపరమైన/నాన్ స్టేటటరీ బకాయిలు, పన్నులు, రేట్లు, ఎస్సెస్‌మెంట్ ఛార్జీలు, ఫీజులు వగైరా కొనుగోలు దారే భరించవలెను.

గమనిక-1: ఆసక్తి గల బిడ్డర్లు ఇ-వేలం తేదీలోపు PSB Alliance యొక్క వెబ్‌సైట్ https://baanknet.com నందు ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి (Pre-Bid EMD) జమ చేయవలెను.
గమనిక -2: అమ్మకం మొత్తానికి జీఎస్‌టి వర్తిస్తుంది.

తేది:17-01-2026, ప్రదేశం: విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి

Cell: 80085 97609

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80081 11237

EENADU Classifieds

JOBS

ప్రముఖ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో సిస్టం ఆపరేటర్స్, స్టోర్స్‌లో హెల్పర్స్ కావలెను. B.Tech / Dip., ITI, 10th- డిగ్రీ. ✆ 8019647888, 8341177761.

వైజాగ్ హాస్టల్‌లో పనిచేయుటకు క్లీనింగ్ స్టాఫ్ మగ పనివారు కావలెను. ఉచిత భోజనం, వసతి కల్పించబడును. ✆ 6300442703.

SECURITY GUARDS

వైజాగ్‌సిటీ, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో పనికొరకు సెక్యూరిటిగార్డ్సు, రూమ్, భోజనం, PF, ESI కలదు. జీతం॥ 20 వేలు, 36 వేలు. Ph.: 6300071128.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే
సంప్రదించండి: 8008597609

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

పరదాలతో బాలికల భద్రతెంత..?

కిల్లోయిలోని గిరిజన ఆశ్రమ పాఠశాల చుట్టూ సుమారు 200 మీటర్ల ప్రహరీ లేదు. అటవీ ప్రాంతం కావడంతో క్రూర మృగాలు మైదానంలో సంచరిస్తుంటాయి. బాలుర పాఠశాలగా ఉండే దీన్ని ఈ విద్యా సంవత్సరం నుంచి బాలికోన్నత పాఠశాలగా మార్పు చేశారు. దీంతో బాలికల రక్షణ కోసం ఉపాధ్యాయులు పరదాలు పట్టు పడుతున్నారు. సొంత డబ్బులు ఖర్చు చేసి ప్రహరీ లేని భాగంలో కర్రలు పాతి పరదాలు కట్టించారు. బాలికల రక్షణ కోసం ప్రహరీ నిర్మిస్తామని సీతంపేట ఐటీడీఏ పీడీ అన్నాదొర తెలిపారు. – న్యూస్‌టుడే, మందస

పలాస

• పలాస • ఇచ్ఛాపురం

తెరపై ఈనాడు

పలాసలో.. ఎస్వీ మాక్స్: మన శంకర వరప్రసాద్‌గారు హరికంకర్: హనీ (మార్నింగ్, ఫస్ట్ షో), యుఫోరియా (మ్యాట్నీ, సెకండ్ షో) **ఇచ్ఛాపురంలో..** పూర్ణ: మన శంకర వరప్రసాద్‌గారు **సోంపేటలో..** ఎస్ఎస్‌మ్యాక్స్: మన శంకర వరప్రసాద్‌గారు, శివ: నారీ నారీ నడుమ మురారి **మందసలో..** మహేంద్ర: పాంచాలి – న్యూస్‌టుడే, పలాస, ఇచ్ఛాపురం, సోంపేట, మందస

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 8008574279 9063144707

? చిన్న మేదరవీధి నుంచి మంగళవారం పేట వెళ్లే మార్గం అధ్వానంగా ఉంది. **- పి.ఈశ్వర్, ఇచ్ఛాపురం**

★ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. **- ఎన్.రమేష్, పుర కమిషనర్ ఇచ్ఛాపురం** – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

13 నుంచి శివరాత్రి ఉత్సవాలు

ఇచ్ఛాపురం, సోంపేట, పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం చిదంబరేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజులపాటు మహా శివరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయంలో భాగంగా కొలనులో కొలువైన ధ్యాన శివయ్య చుట్టూ విద్యుత్తు దీపాలను అలంకరించారు. 13న కుంభ సంక్రమణ సందర్భంగా గంగా హారతి, 108 మంది మహిళలతో కుంకుమ పూజలకు ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం యజ్ఞవాటిక నుంచి భస్మాన్ని సిద్ధం చేసే పవిత్ర కార్యక్రమం, ఆదివారం రుద్రాభిషేకాలు, పార్వతీపరిణయం 108 మంది దంపతులతో అర్చన, అభిషేకం చేస్తారు. బారువ కోటిలింగేశ్వర ఆలయంతోపాటు సముద్రతీరంలో పరిస్థితులను సోంపేట సీఐ మంగరాజు, తహసీల్దార్ బి.అప్పలస్వామి, ఎస్సై హరిబాబునాయుడు, దేవాదాయ ఈవో రామారావు బుధవారం పరిశీలించారు. ★ పలాస మండలం మహాదేవీపురం సమీపంలోని స్వయంభూ లింగేశ్వరస్వామి ఆలయాన్ని తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి, సీఐ రామకృష్ణ, ఎంపీడీవో వసంతకుమార్, డిప్యూటీ ఎంపీడీవో వైకుంఠరావు పరిశీలించారు. బారికేడ్లు, తాగునీటి వసతులు కల్పించాలని సూచించారు.

చిదంబరేశ్వరాలయం వద్ద కొలనులో మహాశివుడి విగ్రహం

పనులు కావు.. పాట్లు పోవు

– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం, మందస, సోంపేట, ఇచ్ఛాపురం గ్రామీణం

ప్రతి పల్లెకు స్వచ్ఛమైన తాగునీరు అందించే లక్ష్యంతో జల్‌జీవన్ మిషన్ పథకం ప్రారంభించారు. పథకం వచ్చి ఇన్నేళ్లు అవుతున్నా నేటికీ చాలా గ్రామాలకు నీరందని పరిస్థితి నెలకొంది. పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లోని పలు గ్రామాలను తాగునీటి సమస్య వెంటాడుతోంది. కొన్ని గ్రామాల్లో అసలు పనులే ప్రారంభించలేదు. చాలా గ్రామాల్లో కుళాయిలు నిర్మించి వాటికి ట్యాపులు అమర్చలేదు. మరి కొన్ని గ్రామాల్లో ట్యాపులు వేసినా చాలా వరకు పాడవడంతో నీరు వృథాగా పోతోంది. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో అధికారులు నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి

★ వజ్రపుకొత్తూరు మండలం పెద్దమురహరిపురం, పల్లివూరు, రెయ్యపాడు పంచాయతీలోని గ్రామాల్లో కుళాయిలు అమర్చి నెలలు కావస్తున్నా నీరు రావడంలేదు. తేరపల్లి, బచ్చలవానిపేట, గర్గవానిపేట, పల్లెవూరు, దున్నవానిపేట, సైనివానిపేట, గొల్లజగన్నాథపురం, చిన్నమురహరిపురం, పాతటెక్కలి తదితర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

★ మందస మండలం హంసరాలి పంచాయతీ పెట్టవూరు గిరిజన గ్రామం వద్ద జల్‌జీవన్ పథకం నిర్మాణం సగంలో నిలిచిపోయింది. ప్రస్తుతం స్థానికులు సమీప వాగు నుంచి నీరు తెచ్చుకుంటున్నారు.

అన్ని గ్రామాలకు నీరందిస్తాం..

జల్‌జీవన్ మిషన్ కింద మండలంలోని అన్ని గ్రామాలకు నీరందించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. చిన్న చిన్న సమస్యలను ఎప్పటికప్పుడు అధిగమిస్తున్నాం. అసంపూర్తిగా ఉన్న పనులు ప్రారంభించి అన్ని గ్రామాలకు తాగునీరందిస్తాం. – **సతీష్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ పథకం, పలాస**

మందస మండలం పెట్టవూరు వద్ద నిలిచిన ట్యాంకు నిర్మాణం

★ ఇచ్ఛాపురం మండలం సన్యాసిపుట్టుగలో ట్యాంకు నిర్మాణం మధ్యలో నిలిచింది. డొంకూరు, కేదారిపురం గ్రామాల్లో పైపులైన్లు వేసినా ఎత్తు ప్రాంతాలు కావడంతో నీరందడం లేదు. సోంపేట మండలంలో 24 గ్రామాల్లో పైపులైన్ పనులు చేయాల్సి ఉంది.

అభివృద్ధికి సహకారం అందించండి

పలాస, న్యూస్‌టుడే: పలాస నియోజకవర్గంలో వైద్య సేవల అభివృద్ధికి సహకారం అందించాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. ఈ మేరకు అసెంబ్లీ సమావేశాల సందర్భంగా విజయవాడలో వైద్యఆరోగ్యశాఖ జాయింట్ సెక్రటరీ రోణంకి గోపాలకృష్ణను మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు.

రేపు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

హరిపురం (మందస), న్యూస్‌టుడే: హరిపురం విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో ఉద్దానం ఫీడరుకు సంబంధించి మరమ్మతు పనుల నిమిత్తం ఈ నెల 13న విద్యుత్తు సరఫరా ఉండదని డీఈ యజ్ఞేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు హరిపురం, బాలిగాం, అంబుగాం, లొహరిబంద, వీరభద్ర, వీరగున్నమ్మపురం, కుంటికోట, పిడిమందస, సువర్ణాపురానికి ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యతోనే అభివృద్ధి..

కవిటి గ్రామీణం : నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో ఎల్.త్రినాథ్ సూచించారు. ఈ మేరకు బుధవారం గొండ్యాల పుట్టుగ, కొత్తూరు గ్రామాల్లో అక్షర కేంద్రాలను ఏవో శ్రీనివాసరెడ్డితో కలిసి పరిశీలించారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు.

ఆనవాలు కోల్పోయి.. అడవిలా తయారై..

పెద్దబొడ్డపాడు పంచాయతీ రామసాగరం (పెద్ద చెరువు) కొంత కాలంగా పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులు నోచుకోవడం లేదు. దట్టంగా పెరిగిన గడ్డి మొక్కలతో అధ్వానంగా మారింది. ఆనవాలు కోల్పోయి అడవిని తలపిస్తోంది. దీని కింద సుమారు వంద ఎకరాలకు పైగా ఆయకట్టు భూములున్నాయి. వాటికి సాగునీటి కష్టాలు తప్పడం లేదు. పరిశీలించి ఉపాధి హామీ పథకం కింద అభివృద్ధి పనులు చేపడతామని ఏపీవో అరుణ్ కుమార్ తెలిపారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

రహదారి.. ఇబ్బందికరంగా మారి

ఇచ్ఛాపురం పురపాలక సంఘం జీఐసీ కాలనీ ప్రధాన రహదారి దుస్థితి ఇది. పాతరోడ్డు శిథిలాలు ఇబ్బందికరంగా మారాయని, వర్షం పడితే పరిస్థితి దారుణంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. ఈ మార్గంలో 8 వీధుల ప్రజలు రాకపోకలు సాగిస్తారు. ఇలాంటి రహదారికి కనీసం మరమ్మతులు చేయకపోవడంతో ఇబ్బందికరంగా మారింది. దీనిపై పుర కమిషనర్ నల్లి రమేష్ స్పందిస్తూ రోడ్లను ప్రణాళికగా అభివృద్ధి చేస్తామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

కట్టారు.. వదిలేశారు..

కపాసుకుద్దిలో నిర్మించిన రైతు సేవా కేంద్రం పూర్తయినా ఇప్పటివరకు ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో సిబ్బంది శిథిలావస్థకు చేరిన తుపాను షెల్టర్‌లో సేవలు నిర్వహిస్తున్నారు. భవనాన్ని త్వరగా ప్రారంభించి ఇక్కడే సేవలు అందజేయాలని రైతులు కోరుతున్నారు. దీనిపై వ్యవసాయశాఖ ఏడీఏ భవానీ శంకర్‌ను వివరణ కోరగా గుత్తేదారుకు బిల్లులు బకాయిలు ఉన్నాయని, బకాయిలు వచ్చిన వెంటనే చెల్లించి వినియోగంలోకి తెస్తామన్నారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

చెత్తకుండీ కాదండి.. మంచినీటి బావి

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో తాగునీరందించే బావులు చెత్తకుండీలుగా మారుతున్నాయి. వీధుల్లో బోర్ల తవ్వకాలతో బావుల్లో నీటిలభ్యత లేకపోవడంతో స్థానికులంతా వాటిలో చెత్త వేస్తున్నారు. సమీపంలో ఉండే నివాసితులకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించి బావుల్లో చెత్త వేయకుండా పూడికలు తొలగించి నీటిని అందించాలని స్థానికులు కోరుతున్నారు. చెత్త వేయకుండా స్థానికులకు అవగాహన కల్పిస్తామని పారిశుద్ధ్య విభాగ ఇన్‌ఛార్జి వెంకటేశ్ తెలిపారు. – న్యూస్‌టుడే, పలాస

రోడ్డు నిర్మించారు..

స్పందనకు వందనం

ఇచ్ఛాపురం మండలం ముచ్చింద్ర నుంచి ప్రాథమిక పాఠశాలకు వెళ్లే రహదారి మురుగుతో దర్శనమిస్తోంది. దీనిపై గత నెల 9న 'ఇలాగైతే రోగాలు రావా' శీర్షికన ఈనాడులో ప్రచురితమైన చిత్ర కథనానికి అధికారులు స్పందించారు. రోడ్డు నిర్మాణం చేపట్టి సమస్యకు పరిష్కారం చూపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

దీపాలు వెలిగాయి..

ఇచ్ఛాపురం పురపాలక సంఘం పరిధి బ్రాహ్మణ, పంజా వీధుల్లో వీధిదీపాలు వెలగకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. ఈ సమస్యను 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా పురాధికారులకు స్థానికులు నివేదించారు. దీనికి కమిషనర్ నల్లి రమేష్ స్పందించి, పుర ఏఈ కిశోర్ ఆధ్వర్యంలో దీపాలు వేయించి సమస్యను పరిష్కరించారు.

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ఆటోను ఢీకొన్న కారు

కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: మకరాంపురం కూడలి వద్ద ప్రయాణికులతో జాడుపూడి నుంచి సోంపేట వెళ్తుండగా వెనక నుంచి కారు ఢీ కొట్టడంతో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయట పడగా డ్రైవర్ నల్లాన సుందరరావు కుడి చేతికి బలమైన గాయమైంది. స్థానికులు అతన్ని సోంపేట సామాజిక ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు

సోంపేట, న్యూస్‌టుడే: సోంపేట బిరుసువాడ కాలనీ పరిధిలో రైలు నుంచి జారిపడటంతో ఓ వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యారు. బాధితుడు ఒడిశా ఛత్రపూర్‌కు చెందిన వ్యక్తిగా భావిస్తున్నారు. స్థానికులు సోంపేట సామాజిక ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడే చికిత్స పొందుతున్నారు.

మెలకువలు పాటిస్తేనే అధిక దిగుబడి

రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానశాఖ అధికారులు

హరిపురం (మందస), పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: జీడిమామిడి తోటల యాజమాన్యంలో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యమని హెచ్‌వో శంకర్ దాస్ పేర్కొన్నారు. మందస మండలం కొండలోగాం, పలాస మండలం బొడ్డపాడు గ్రామాల్లో జీడిమామిడిపై బుధవారం పొలంబడి నిర్వహించారు. పూత, పిందె దశలో పిచికారీ చేయాల్సిన మందుల గురించి చెప్పారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఏవో పోలారావు, ఉద్యాన శాఖాధికారి శంకర్ దాస్, ఢిల్లీరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే చేరండి

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు పదో తరగతి తర్వాత ఇంటర్ ప్రభుత్వ కళాశాలల్లోనే చేరాలని ప్రిన్సిపల్ కె.సింహాచలం నాయుడు కోరారు. బుధవారం ఇద్దివానిపాలెం, బొరివంక ఉన్నత పాఠశాలల్లో కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాల సిబ్బంది ప్రత్యేక అడ్మిషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య కోసం ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు పెడుతుందని, దాన్ని గ్రామీణ విద్యార్థులు ఉపయోగించుకోవాలని సూచించారు. కళాశాలలో సైన్స్ ల్యాబ్‌లు, గ్రంథాలయం, నిష్ణాతులైన అధ్యాపకులు, ఆధునిక తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీరు ఉన్నాయని, విద్యార్థులకు ఉచిత పాఠ్య, నోటు పుస్తకాలు, పోటీ పరీక్షలకు స్టడీమెటీరియల్ అందిస్తామన్నారు. అధ్యాపకులు జి.విష్ణుమూర్తి, పి.హరి, బి.శ్రీనుబాబు, జె.పాపారావు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి దృష్టికి రైల్వే సమస్యలు

కంచిలి, న్యూస్‌టుడే: కంచిలి పరిధి సోంపేట రైలు నిలయం అభివృద్ధి, కంచమ్మ తల్లి ఆలయానికి వెళ్లే దారికి అండర్ పాస్ లేదా పై వంతెన నిర్మాణాల కోసం కంచిలికి చెందిన కూటమి నాయకులు, రైలు యూజర్ కమిటీ ప్రతినిధులు బుధవారం కేంద్ర విమానాయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్థానికంగా సీసీ రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో కూటమి నాయకులు జగదీష్ పట్నాయక్, బంగారు కురయ్య, ఇప్పిలి కృష్ణారావు, మురళీ పట్నాయిక్, కొత్తకోట శేఖర్, రామారావు, కొల్లి ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

రామ్మోహన్‌నాయుడిని కలిసిన నాయకులు

శివస్వాముల ప్రత్యేక పూజలు

ముత్యాలపేటలో అమృత వర్షిని సమేత మహా మృత్యుంజయేశ్వరస్వామి ఆలయం వద్ద శివ మాలాధారణ భక్తులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, రుద్రాభిషేకం, శివపార్వతుల కల్యాణం, మహిళలతో కుంకుమ పూజలు చేశారు. మృత్యుంజయేశ్వర యజ్ఞం వైభవంగా చేపట్టారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

మాజీ మంత్రి సీదిరి పరామర్శ

పలాస గ్రామీణం, సోంపేట, న్యూస్‌టుడే: పలాస మండలం బ్రాహ్మణతర్లాకు చెందిన బమ్మిడి హేమలత అనారోగ్యం కారణంగా ఇటీవల మరణించారు. ఆమె కుటుంబ సభ్యులను మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు పరామర్శించి ధైర్యం చెప్పారు. పైల చిట్టి పాల్గొన్నారు. ★ సోంపేట మండలం బెంకిలిలో ఇటీవల మరణించిన ఎర్ర తుంబేషు, పిరియా ధర్మారావు కుటుంబాలను ఎంపీపీ ఎన్.దాసు పరామర్శించారు. సర్పంచి ప్రతినిధులు పి.ధర్మేంద్ర, టి.చంద్రశేఖర్ ఉప సర్పంచులు టి.షణ్ముఖరావు, ఎస్.జానీ కోట రాజు తదితరులతో కలిసి అనారోగ్యంతో బాధపడుతున్న లోకనాథం, కృష్ణారావుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు.

అటవీ సంపదను సంరక్షించుకుందాం

కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: అడవుల్లో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అటవీ శాఖ అధికారి టి.దేవరాజు సూచించారు. ఈ మేరకు కాశీబుగ్గ ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎ.మురళీకృష్ణ ఆదేశాలతో బుధవారం ఎంఎస్ పల్లిలో అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదాల నివారణపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, దాలయ్యరెడ్డి, అటవీ అధికారులు లక్ష్మణమూర్తి, వెంకటేశ్, రవి, భానుమూర్తి, సురేష్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: సన్యాసిపుట్టుగ మండల పరిషత్తు ప్రాథమికోన్నత పాఠశాలలో వైద్యుడు దల్లి సురేష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రక్త పరీక్షలు చేయడంతోపాటు అవసరమైన మందులు అందజేశారు. వ్యక్తిగత శుభ్రత పాటించాలని ప్రధానోపాధ్యాయుడు టి.అరుణ్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ-ఎయిడ్స్‌పై అవగాహన

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే : జాడుపూడి నిరంజన్ డాబా వద్ద వైసీబీ, ట్రక్కర్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో వాహనదారులు, సిబ్బందితో ఐఈసీ కాంపెయిన్ నిర్వహించారు. ఇందులో హెచ్‌ఐవీ, ఎయిడ్స్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ రవికుమార్, ఏఎన్ఎం జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రుణాలు పునరుద్ధరించుకోవాలి

హరిపురం (మందస), న్యూస్‌టుడే: బాలిగాం పీఏసీఎస్ నుంచి రుణాలు పొందిన సభ్యులు వడ్డీలు చెల్లించి రుణాలు పునరుద్ధరించుకోవాలని సహకార సంఘం అధ్యక్షుడు లబ్బ రుద్రయ్య కోరారు. వన్‌బీ, ఆధార్, బ్యాంకు ఖాతా పుస్తకాలతో వచ్చి సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

మందస, న్యూస్‌టుడే: జనసేన శ్రేణులు స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మజ్జి భాస్కరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం నిర్ణయాన్ని శిరోధార్యంగా భావించి గ్రామాల్లో సమన్వయంతో పార్టీల బలోపేతానికి పని కోరారు. కార్యక్రమంలో స్థానిక జనసేన నాయకులు పాల్గొన్నారు.

విలువైన స్థలం.. వినియోగిస్తే ఆదాయం

– న్యూస్‌టుడే, సోంపేట

సోంపేట పట్టణంలో పంచాయతీ, రెవెన్యూ, ఇతర శాఖలకు సంబంధించిన విలువైన స్థలాలు నిరుపయోగంగా పడి ఉన్నాయి. పట్టణ నడిబొడ్డున ఉన్న వీటిని వినియోగిస్తే మంచి ఆదాయం వచ్చే అవకాశం ఉంది. దుకాణ సముదాయాలు, వాణిజ్య భవనాలు నిర్మిస్తే నెలవారీ ఆదాయం సమకూరడంతోపాటు కొంత మందికి ఉపాధి అవకాశాలు కల్పించొచ్చు. వాటిని అలా వదిలేయడంతో ఆక్రమణలు చోటు చేసుకోవడంతోపాటు పరిసరాలు అధ్వానంగా తయారవుతున్నాయి.

✤ ఈ ప్రాంతంలో గ్రంథాలయానికి, మంచినీటి ట్యాంకుల ఏర్పాటుకు కొంతస్థలం కేటాయించాల్సి వచ్చింది. తర్వాత విశ్రాంత ఉద్యోగుల భవనం, సులభ్ కాంప్లెక్స్‌కు మరికొంత స్థలం ఇచ్చారు. మిగిలిన స్థలం నిరుపయోగంగా పడి ఉంది. ఇక్కడ నిర్మాణాలు తొలగించి పంచాయతీ కార్యాలయం, దుకాణ సముదాయం నిర్మించేందుకు చేసిన ప్రయత్నాలు ఆచరణలోకి రాలేదు.

✤ సోంపేట టౌన్ హాలుకు సంబంధించిన స్థలం దశాబ్ద కాలంగా నిరుపయోగంగా పడి ఉంది. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు వెళ్లే మార్గంలో ప్రధాన రోడ్డుకు దగ్గరలోని ఈ వీధిలో బ్యాంకులు, వాణిజ్య సముదాయాలు, ఇతర దుకాణాలు ఉండటంతో దీన్ని సద్వినియోగపర్చితే ఆదాయంతోపాటు ప్రజలకు కొన్ని సేవలు అందించే అవకాశం ఉంది. ఈ ప్రాంతం ఖాళీగా ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలకు వేదికలా మారింది.

✤ సోంపేటలో మూడు దశాబ్దాల కిందట పంచాయతీ పార్కు తొలగించి ఆర్టీసీ బస్టాండు నిర్మించారు. దానికి బదులుగా బాలికోన్నత పాఠశాల వద్ద డంపింగుయార్డును పార్కుగా మార్చారు. ఇక్కడున్న 1.30 ఎకరాల స్థలంలో ప్రహరీ, ఇతర నిర్మాణాల కోసం అంచెలంచెలుగా రూ.50 లక్షలకు పైగానే వ్యయం చేశారు. ఉత్తర భాగంలో కాలువ నిర్మించకపోవడంతో పట్టణంలో సగానికి పైగా వీధులకు సంబంధించిన మురుగు నిలుస్తోంది.

ప్రధాన రోడ్డు పక్కనే నిరుపయోగం

✤ స్థానిక రెవెన్యూ కార్యాలయ ప్రాంగణంలో శిథిల గదులు తొలగించకపోవడంతో పాములు స్వైరవిహారం చేస్తున్నాయి. వీటిని తొలగించి ప్రధానరోడ్డు, వన్‌వే మార్గంలో చుట్టూ దుకాణాలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది. ఇక్కడ షాపింగ్ కాంప్లెక్సు నిర్మించేందుకు పలుమార్లు పరిశీలించారే తప్ప కార్యాచరణ చేపట్టలేదు.

షాపింగ్ కాంప్లెక్స్‌కు కేటాయించిన పంచాయతీ పార్కు స్థలం

✤ రెవెన్యూ ప్రాంగణంలోని శిథిల భవనాలను తొలగించాలని అధికారులకు తెలియజేశామని తహసీల్దార్ బి.అప్పలస్వామి తెలిపారు. దక్షిణం వైపు షాపింగ్ కాంప్లెక్స్, ఇతర నిర్మాణాలు చేపట్టేందుకు ఉన్న అవకాశాలపై గతంలో ఉన్నతాధికారులు పరిశీలన చేశారని కలెక్టర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు.

✤ పంచాయతీ పార్కు స్థలంలో దుకాణ సముదాయాలకు పరిశీలనలో ఉందని, రహదారి పక్కనే ఉన్న స్థలాల్లో వీటిని ఏర్పాటు చేసి లోపల అంగన్‌వాడీ భవనం, ఇతర అవసరాలకు వినియోగించాలని భావిస్తున్నామని పంచాయతీ ఈవో ఎం.శాంతికుమారి తెలిపారు.

దీన్‌దయాళ్‌కు ఘన నివాళి

భారతీయ జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకులు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి సభ కాశీబుగ్గలో భాజపా నాయకులు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. దీన్‌దయాళ్ భారతదేశ అభ్యున్నతికి ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు పి.వైకుంఠరావు, నియోజకవర్గ కన్వీనర్ రామానంద స్వామి, మోహన్ రాజు, తారకేశ్వరరావు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, కాశీబుగ్గ

ఉత్తమ సేవలతోనే గుర్తింపు

ఉద్యోగులు అందించిన ఉత్తమ సేవలే వారికి గుర్తింపునిస్తాయని వక్తలు అన్నారు. కవిటి ప్రాథమిక పాఠశాలలో 9 ఏళ్లపాటు ఉపాధ్యాయినిగా పని చేసిన ధనలక్ష్మి ఇటీవల బదిలీపై వెళ్లిపోవడంతో బుధవారం ఆమెకు ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాలకు అందించిన సేవలను కొనియాడారు. – న్యూస్‌టుడే, కవిటి

విద్యుత్తు ప్రమాద బాధిత కుటుంబాలకు పరిహారం

కంచిలి, న్యూస్‌టుడే: తలతంపర పంచాయతీ చిల్లపుట్టుగలో గతేడాది మేలో ఉత్సవాల సమయంలో జరిగిన విద్యుత్తు ప్రమాదంలో మృతి చెందిన ఈశ్వరరావు, చిన్నారులు నొలియా కృష్ణ, బి.నందిని కుటుంబ సభ్యులకు పరిహారం మంజూరైంది. వారికి ప్రభుత్వం, విద్యుత్తు శాఖ నుంచి పరిహారం అందించేందుకు ప్రభుత్వ విప్ అశోక్ తీవ్రంగా కృషి చేశారు. ఈ మేరకు విద్యుత్తు శాఖ (ఏపీ ఈపీడీసీఎల్) నుంచి ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున పరిహారం మంజూరైంది. డబ్బులు కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెదేపా మండలాధ్యక్షుడు మాదిన రామారావు, స్థానిక నాయకులు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

చలో విజయవాడ విజయవంతానికి పిలుపు

సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 17న నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కిశోర్ కుమార్ పిలుపునిచ్చారు. రణభేరీ 2.0 కార్యక్రమంలో భాగంగా కాశీబుగ్గలో బుధవారం చలో విజయవాడ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ వేతన సవరణ కమిషన్‌ను నియమించాలని, మధ్యంతర భృతి 29 శాతం ప్రకటించాలని డిమాండ్ చేశారు. రమేష్, కోదండరావు, జయరాం, మురళి, ఎల్.వి.చలం, చిట్టిబాబు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, కాశీబుగ్గ

ఇచ్ఛాపురంపై మకరాంపురం విజయం

ఇచ్ఛాపురం ఐసీసీ జట్టుపై మకరాంపురం జట్టు విజయం సాధించింది. ఇచ్ఛాపురం రాజావారి మైదానంలో జరుగుతున్న వెచ్చాజయంతి స్మారక అంతర్రాష్ట్ర టీ20 క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా బుధవారం ఇచ్ఛాపురం జట్టు తొలుత బ్యాటింగ్ చేసి నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 153 పరుగులు చేసింది. అనంతరం మకరాంపురం జట్టు 16.2 ఓవర్లలోనే మూడు వికెట్ల నష్టానికి లక్ష్యాన్ని చేరుకుంది. మకరాంపురం ఆటగాడు సాత్విక్‌కు ఉత్తమ ఆటగాడి జ్ఞాపిక అందజేశారు. నిర్వాహకులు కేశవరావు, దిలీప్, కృష్ణయ్య, షేక్‌మున్నా పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ఎస్జీటీలకు ఓటు హక్కు కల్పించాలి

పలాస, న్యూస్‌టుడే: ఎమ్మెల్సీ ఎన్నికల్లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ఓటుహక్కు కల్పించేలా చర్యలు చేపట్టాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.చందనరావు కోరారు. పలాస పర్యటనలో భాగంగా కాశీబుగ్గ, పలాస పురపాలిక, పలాస మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్‌లో చట్టం సవరించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపించాలని, 12 ఏళ్ల సర్వీస్ పూర్తిచేసిన ఉపాధ్యాయుడికి స్కూల్ అసిస్టెంట్ క్యాడర్ ఇవ్వాలని, ఎస్జీటీలతో తెలుగు, హిందీ, పీడీ పోస్టులు భర్తీచేయాలని కోరారు. రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఎన్.విష్ణుమూర్తి, ప్రధానోపాధ్యాయులు దానేటి కామేశ్వరరావు, ఉపాధ్యాయులు వరప్రసాద్, రమణ, ఇంద్రతనయ, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డాక్‌సేవ.. జనసేవ

మందస వాసుదేవ పెరుమాళ్ ఉత్సవాల్లో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా మందస పోస్టుమాస్టరు డి.భాస్కరరావు సౌజన్యంతో బుధవారం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. డాక్ సేవ-జనసేవ కార్యక్రమం ద్వారా భక్తులకు మజ్జిగ, నిమ్మ రసం, పులిహోర, రొట్టెలు సమకూర్చారు. పోస్టల్ సూపరింటెండెంట్ వి.హరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, మందస

27వ వర్ధంతి



మా అందరి హృదయాలలో చిరస్మరణీయమైన స్థానం సంపాదించి దైవ సన్నిధికేగి 27 సం॥లు గడిచినను మీ మధురస్మృతులు మా మదిలో నిలిచివున్నాయి. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కీ॥శే॥ మల్లా రమేష్ గారు

మరణం: 11-2-1999, పలాస

నాన్న: మల్లా బాబూరావు
అమ్మ: శ్రీమతి సుదేష్ణ
అన్నయ్య: మల్లా కాంతారావు, పలాస
వదిన: శ్రీమతి కావ్య
పిల్లలు: కరీన, కన్నన్
చెల్లి: శ్రీమతి డి. జ్యోతి బావ: డి. మహేష్
పిల్లలు: మహిత, మనీష, పలాస

(c) eenadu

టెక్కలి

•టెక్కలి •నరసన్నపేట •పాతపట్నం

మహాశివరాత్రి ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

శ్రీముఖలింగంలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పక్కాగా ఉండాలని అదనపు కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, ఆర్డీవో కె.సాయిప్రత్యూష అన్నారు. అధికారులతో బుధవారం వారు సమీక్ష నిర్వహించారు. ఆలయ వెనక భాగంలో మూడు ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అనంతరం వంశధార నదిలో స్వామి చక్రతీర్థ స్నానం జరిగే ప్రాంతాన్ని పరిశీలించారు. ఈవో ఏడుకొండలు, తహసీల్దారు జె.రామారావు ఉన్నారు. – న్యూస్‌టుడే, జలుమూరు

వైభవంగా రథయాత్ర

చిన్నబమ్మిడి పంచాయతీ సుబ్బారావుపేటలో శ్రీదేవిభూదేవి సమేత విజయవేంకటేశ్వరస్వామి ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. స్వామివారి రథయాత్ర వైభవంగా జరిగింది. సుమారు 350 ఏళ్ల కిందట నిర్మించిన ఆలయం శిథిలావస్థకు చేరుకోగా 2002లో పునర్నిర్మించారు. నాటి నుంచి ఏటా మూడురోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తుండటం ఆనవాయితీగా మారింది. పురోహితులు అరవెల్లి శ్రీనుబాబు, రాజాబాబు నేతృత్వంలో విశేషపూజలు నిర్వహించారు. – న్యూస్‌టుడే, ఎత్తురాళ్లపాడు(కోటబొమ్మాళి)

మరింత సమర్థంగా పనిచేయండి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

టెక్కలి, న్యూస్‌టుడే: రెవెన్యూ సిబ్బంది మరింత బాధ్యతగా, సమర్థంగా పనిచేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. బుధవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో డివిజన్ స్థాయి రెవెన్యూ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అంశాలవారీగా మాట్లాడారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చిన వినతులను పరిష్కరించాలన్నారు. రీసర్వే సమస్యలు, ధ్రువపత్రాలు, మ్యుటేషన్ల ఫిర్యాదులపై అలసత్వం పనికిరాదన్నారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఉద్యోగ మేళాలో 64 మంది ఎంపిక

టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉద్యోగ మేళాలో 64 మంది ఉద్యోగావకాశాలు దక్కించుకున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ టి.గోవిందమ్మ తెలిపారు. 12 సంస్థలు నిర్వహించిన ఇంటర్వ్యూలకు 147 మంది హాజరయ్యారని చెప్పారు. జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ప్లేస్‌మెంట్ అధికారి ఎం.వంశీకృష్ణ మాట్లాడుతూ ఏ రంగంలో కొలువు వచ్చినా సద్వినియోగం చేసుకుని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ల్యాక్‌పాల్, అధ్యాపకులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

సీఎంఏలో ప్రతిభ

నందిగాం, న్యూస్‌టుడే: కాపుతెంబూరు గ్రామానికి చెందిన ఆసపాన భువనేశ్వరి సీఎంఏ(కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్)లో ప్రతిభ చూపారు. గుంటూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో ఈమె విద్యనభ్యసిస్తున్నారు. గతేడాది డిసెంబరులో జరిగిన పరీక్షలకు సంబంధించి బుధవారం విడుదల చేసిన ఫలితాల్లో ఆలిండియాలో 28వ ర్యాంకు సాధించారు.

పల్లెకు చేరని వెలుగులు..!

ఆర్టీసీ సర్వీసుల రద్దుతో ప్రజల ఇక్కట్లు

న్యూస్‌టుడే, కొత్తూరు

వైకాపా హయాంలో రహదారుల నిర్వహణ పట్టించుకోక పోవడంతో గోతులమయంగా మారాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్లను అభివృద్ధి చేసింది. అంతవరకూ బాగానే ఉన్నా.. పాతపట్నం నియోజకవర్గంలోని పలు గ్రామాలకు గతంలో తిరిగే ఆర్టీసీ బస్సులు నిలిపేయడంతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. విద్యార్థులు, మహిళలు ప్రైవేటు వాహనాల్లో కిక్కిరిసి ప్రయాణిస్తున్నారు. మరికొందరు వేరే దారి లేక లగేజీ వాహనాలపై రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో కొన్నిసార్లు ప్రమాదాల బారిన పడుతున్నారు.

కొత్తూరు మార్గంలో లగేజీ వాహనంపై ప్రమాదకరంగా ప్రయాణం

అద్దంలా రహదారులు

● కొత్తూరు మండలం: నివగాం నుంచి గులుమూరు గ్రామానికి బీటీ రోడ్డు నిర్మించారు. కొత్తూరు, హిరమండలం మండలాల మధ్య రాకపోకలు సాగించేందుకు పల్లెవెలుగు సర్వీసు వేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకునే వారే లేకుండా పోయారు. కొత్తూరు నుంచి కలిగాం, బమ్మిడి, ఆర్‌కేపురం మీదుగా అంగూరు, కొత్తూరు నుంచి గొట్టిపల్లి, కొత్తూరు నుంచి రాష్ట్ర సరిహద్దులోని కడుము, దిమిలి గ్రామాలకు పాలకొండ డిపో నుంచి తిరిగే ఆర్డినరీ బస్సులను ఆపేశారు.

● మెళియాపుట్టి: నేలబొంతు గ్రామానికి గతంలో టెక్కలి డిపో నుంచి తిరిగే ఆర్టీసీ ఆర్డినరీ సర్వీసును రద్దు చేశారు. పునరుద్ధరించాలని ఐదేళ్లుగా ప్రజలు విన్నవిస్తున్నా చర్యలు శూన్యం. మారేడుకోట, మానాపురం, భరణికోట గ్రామాలకు అద్దంలాంటి రహదారులున్నా పల్లె వెలుగులు నడపడం లేదు.

● పాతపట్నం: బైదరాపురం, బడ్డుమర్రి ప్రాంతాలకు ఆర్టీసీ సర్వీసులు తిప్పాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోవడం లేదు. దీంతో ప్రైవేటు వాహనాలే దిక్కుగా మారాయి.

● ఎల్ఎన్‌పేట: మండలకేంద్రం నుంచి దబ్బపాడు, వాడవలస, మిరియాప్పల్లికి తిరిగే సర్వీసులను నాలుగేళ్ల క్రితం నిలిపేశారు. ఎస్.కె.బాలేరు గ్రామానికి బస్సు నడిపితే పది గ్రామాల ప్రజల ఇబ్బందులు తీరుతాయని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

నియోజకవర్గంలోని చాలా గ్రామాలకు రహదారుల నిర్మాణాలు పూర్తి చేశాం. ప్రజలు పడుతున్న ఇబ్బందులపై ప్రత్యేక దృష్టి సారించి, బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకుంటాం.

– గోవిందరావు, ఎమ్మెల్యే, పాతపట్నం

● హిరమండలం: భగీరథపురం మీదుగా శ్రీముఖలింగానికి రహదారి బాగున్నా.. ఆర్టీసీ బస్సు సదుపాయం లేదు. గొట్టా బ్యారేజీ కూడలి నుంచి పిండ్రువాడ, అంబావల్లి, అక్కరాపల్లి పంచాయతీల మీదుగా బస్సు నడపాలని ఆయా ప్రాంతాల వారు కోరుతున్నారు. బ్యారేజీ కూడలి నుంచి సారవకోట మండలం బొంతు కూడలి వరకు సర్వీసులు తిప్పాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. హిరమండలం నుంచి నియోజకవర్గ కేంద్రమైన పాతపట్నంకు రెండు సార్లు మాత్రమే బస్సులు తిరుగుతున్నాయి. దీంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజాసమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సప్ ద్వారా పంపొచ్చు. లేదా ఫోన్లో వివరించొచ్చు. వాటిని బాధ్యులదృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: మహాశివరాత్రి ఉత్సవాలు సమీపిస్తున్నాయి. శ్రీముఖలింగం ఆర్టీసీ బస్టాండ్ వద్ద మరుగుదొడ్ల నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారాయి. వినియోగంలోకి తీసుకొచ్చి భక్తులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి.

- రాజశేఖర్, శ్రీముఖలింగం

★: ప్రయాణ ప్రాంగణం వద్ద మరుగుదొడ్లు బాగు చేయిస్తున్నాం. త్వరలోనే వినియోగంలోకి తీసుకొస్తాం. - బి.చిన్నమ్మడు, ఎంపీడీవో, జలుమూరు – న్యూస్‌టుడే, జలుమూరు

?: నందిగాం మండలం కోమటూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. పిల్లలు సెలవు రోజుల్లో అందులో ఆడుతున్నారు. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. - గిరి, స్థానికుడు

★: మండల ఇంజినీరింగ్ అధికారితో మాట్లాడి, శిథిల భవనాన్ని నేలమట్టం చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

- జి.నరసింహులు, ఎంఈవో, నందిగాం

– న్యూస్‌టుడే, నందిగాం

కదిలించిన కథనాలు

స్పందనకు వందనం

కోటబొమ్మాళి మండలం నారాయణపురం, బమ్మిడిపేట, ఉప్పరిపేట, పులిబంద గ్రామాల రైతులు చీపుర్లపాడు మార్కెట్‌కు వచ్చేందుకు మట్టిరోడ్డు పైనే దశాబ్దాలుగా ప్రయాణిస్తుండే వారు. వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడేవారు. సమస్యపై ఈనాడులో పలుమార్లు వార్తలు ప్రచురితమవడంతో అధికారులు, పాలకులు స్పందించారు. రూ.80 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేయిస్తామని పీఆర్ ఏఈఈ అంజిత్‌కుమార్ చెప్పారు. – న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

కాలువా.. కనిపించవా..!

జలుమూరు మండలం కూర్మనాథపురం సమీపంలోని 3 ఆర్ నడగాం కాలువకు అనుసంధానంగా ఉన్న 11 ఎల్ చిక్కాలవలస కాలువ అధ్వానంగా మారింది. దీని ద్వారా నరసన్నపేట మండలం చిక్కాలవలస, సుందరాపురం గ్రామాల పంట పొలాలకు సాగునీరందుతుంది. ప్రస్తుతం పనికిరాని మొక్కలతో దయనీయంగా తయారైంది. సమస్యను వంశధార శాఖ జేఈ హరీష్ వద్ద ప్రస్తావించగా ఉపాధిహామీ పథకం పనుల్లో భాగంగా కాలువను బాగు చేయిస్తామన్నారు. – న్యూస్‌టుడే, జలుమూరు

పేరుకే ఉన్నాయి.. పనికిరావు

వైకాపా హయాంలో గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఫైబర్ నెట్‌వర్క్ యంత్రాలు అలంకారప్రాయంగా మారాయి. పోలాకి మండలంలో ఏర్పాటు చేసిన వాటిలో 70 శాతానికి పైగా పని చేయడం లేదు. పోలాకి సచివాలయంలో పరిస్థితిని చిత్రంలో చూడొచ్చు. ప్రభుత్వం అంతర్జాల వినియోగం కోసం నిధులు చెల్లిస్తోందని డిప్యూటీ ఎంపీడీవో సంధ్యారాణి అన్నారు. ఫైబర్ నెట్‌వర్క్ యంత్రాల మరమ్మతులకు సంబంధించి ఉత్తర్వులు రావాల్సి ఉందని తెలిపారు.

– న్యూస్‌టుడే, పోలాకి

ఆశయం ఘనం.. ఆచరణ శూన్యం

పశువుల దాహార్తిని తీర్చేందుకు కూటమి ప్రభుత్వం రూ.కోట్ల నిధులు వెచ్చించి నీటి తొట్టెలు నిర్మించింది. వీటి పనులకు ఉపాధిహామీ పథకం నిధులు వినియోగించారు. ఎక్కడా వీటిని ఉపయోగిస్తున్న దాఖలాలు లేవు. దీంతో నిధులు బూడిదలో పోసిన పన్నీరులా మారాయని పలువురు పెదవి విరుస్తున్నారు. రుగడ- కొమనాపల్లి గ్రామాల మధ్య ప్రధాన రహదారి పక్కన తొట్టెను చిత్రంలో చూడొచ్చు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ఆర్.కాళీప్రసాదరావు పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, హిరమండలం

మొర వినండి.. మరమ్మతులు చేయండి

జలుమూరు మండలం లింగాలవలస కాలనీలో బోరు మరమ్మతులకు గురైంది. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం శ్రీముఖలింగం తాగునీటి ప్రాజెక్టు ద్వారా నీరందుతోందని, సరఫరా నిలిచిపోయిన సందర్భాల్లో చేతి పంపును వినియోగిస్తున్నామని చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నారు. సిబ్బందికి తెలియజేసి, తక్షణమే బోరు బాగు చేయిస్తామని గ్రామీణ తాగునీటి విభాగం జేఈ మధుసూదనరావు స్పష్టం చేశారు. – న్యూస్‌టుడే, జలుమూరు

రహదారి భద్రత.. అందరి బాధ్యత

మడపాం వద్ద శిరస్త్రాణాలు అందజేస్తున్న పోలీసులు, టోల్ ప్లాజా నిర్వాహకులు

నరసన్నపేట, పాతపట్నం, న్యూస్‌టుడే: ఎన్‌హెచ్ఐటీ సదరన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మడపాం టోల్ ప్లాజా వద్ద ద్విచక్ర వాహనదారులకు బుధవారం శిరస్త్రాణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరసన్నపేట సీఐ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరూ భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై గణేష్, టెక్కలి ఎంవీఐ సంజీవరావు, టోల్‌ప్లాజా ఇంజినీరు ధవళేశ్వరరావు, మేనేజర్లు సతీష్‌బాబు, పైడిరాజు, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. ● పాతపట్నం అంతర్రాష్ట్ర సరిహద్దు తనిఖీ కేంద్రం వద్ద ఎస్సై మధుసూదనరావు ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించారు. అక్రమ, నిషేధిత ఉత్పత్తుల రవాణాను అడ్డుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రేపు విద్యుత్తు సరఫరా నిలిపివేత

కొత్తూరు, పోలాకి, టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: కొత్తూరు మండలంలోని శ్రీకాకుళం రోడ్డు, పారాపురం, గూనభద్ర, కలిగాం, మెట్టూరు, ఇరపాడు గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపేస్తున్నట్లు ఏఈ నిరంజన్ తెలిపారు. ● పోలాకి మండలం మబగాం విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ నర్సింహరావు చెప్పారు. దీంతో ఈనెల 13న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ● రావివలస విద్యుత్తు ఉపకేంద్రంలో నిర్వహణ పనుల కారణంగా రేపు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ నరసింహకుమార్ తెలిపారు.

వెదురు సాగుతో ఆదాయం

సారవకోట, న్యూస్‌టుడే: బీడు భూముల్లో వెదురు సాగు చేపట్టి ఏడాదికి రూ.లక్షల్లో ఆదాయం సాధించొచ్చని ఉద్యాన శాఖాధికారిణి మంగమ్మ (పాతపట్నం) తెలిపారు. పాతూరు గిరిజన గ్రామంలో బుధవారం రైతు శిక్షణ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. హెక్టారు విస్తీర్ణంలో 400 మొక్కలు నాటొచ్చని, మొదటి ఏడాది మొక్కకు రూ.90, రెండో ఏడాది రూ.60 నిర్వహణ ఖర్చులు అందిస్తామన్నారు. సర్పంచి అనిరుద్ పాల్గొన్నారు.

గట్కా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

నరసన్నపేట, న్యూస్‌టుడే: సత్యవరం జి.ప.ఉన్నత పాఠశాల విద్యార్థులు గట్కా పోటీల్లో సత్తాచాటారు. ఇటీవల జరిగిన జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు పాఠశాలలో బుధవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో శాంతారావు, హెచ్ఎం వకుళా రత్నమాల పాల్గొన్నారు.

సర్వే వేగవంతం చేయాలి

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో నర్సింహ ప్రసాద్ పండా బుధవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. కుటుంబ సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. మెళియాపుట్టిలో చెత్త సంపద కేంద్రాన్ని ఎంపీడీవో పరిశీలించి, నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఈసీ ఆదినారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శి కిశోర్, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి మార్కింగ్

సారవకోట, న్యూస్‌టుడే: సారవకోటలో రెవెన్యూ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో నూతన భవన సముదాయ నిర్మాణానికి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ రూ.1.75 కోట్లు మంజూరుచేశారు. ఈమేరకు ర.భ.శాఖ డీఈఈ తిరుపతిరావు బుధవారం మార్కింగ్ ఇచ్చారు. ఏఈఈ సరోజ ఉన్నారు.

రెండు పూరిళ్లు దగ్ధం

కొత్తూరు, న్యూస్‌టుడే: కారిగూడ పంచాయతీ పరిధిలోని శ్రీరాములగూడ గ్రామంలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. సవర సూరయ్య, ముఖలింగంకు చెందిన ఇళ్లు కాలి బూడిదయ్యాయి. సమాచారం అందుకున్న కొత్తూరు అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సుమారు రూ.లక్ష వరకు ఆస్తి నష్టం జరిగిందని చెప్పారు.

రహదారి పనులు ప్రారంభం

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నం, మెళియాపుట్టి మండలాలను అనుసంధానం చేసే ఆల్ఆంధ్ర రహదారి నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. శిథిలమైన రహదారిపై ప్రయాణించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. సుమారు 7 కిలోమీటర్ల రహదారి పనులకు రూ.3.4 కోట్లు నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది.

పూర్వ విద్యార్థికి సన్మానం

పోలాకి, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థి పొట్నూరు వరప్రసాద్‌ను అధ్యాపకులు బుధవారం సత్కరించారు. కళాశాల ప్రధాన ద్వారం వద్ద గేట్లు ఏర్పాటు చేయడంతో పాటు నీటి సరఫరాకు మోటారు, శుద్ధజల యంత్రాన్ని ఆయన పాఠశాలకు అందజేశారు. నలుగురు విద్యార్థులకు ఫీజులు చెల్లించారు. సైకిల్ షెడ్ ఏర్పాటుకు ముందుకొచ్చారు. ప్రిన్సిపల్ హెచ్.పద్మావతి, గోవిందరావు, నర్సింహరావు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించండి

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: రావివలసలో ప్రభుత్వ భూముల్లో జరుగుతున్న ఆక్రమణలు గుర్తించి తొలగింపునకు చర్యలు చేపట్టాలని గ్రామానికి చెందిన న్యాయవాది బడే రెడ్డిబాబు కోరారు. జిల్లా సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు.

మందుబాబులకు జరిమానా

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరికి టెక్కలి జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ యు.మాధురి చెరో రూ.10 వేల చొప్పున జరిమానా విధించినట్లు టెక్కలి సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. చేరి వీధికి చెందిన పోతల ఈశ్వరరావు, రావివలసకు చెందిన దాసరి రాజేష్ మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడినట్లు చెప్పారు.

పరీక్షలంటే భయం వీడాలి

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు పరీక్షలంటే భయం వీడాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎ.రవిబాబు సూచించారు. పదోతరగతి విద్యార్థులకు ప్రీఫైనల్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ప్రధానోపాధ్యాయుడు డి.దాశరథి, ఉపాధ్యాయులు రోణంకి శ్రీనివాస్, అరుణకుమార్, రామిరెడ్డి ఉన్నారు.

మల్లన్న సేవలో సంయుక్త కలెక్టర్

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: రావివలసలోని ఎండల మల్లికార్జునస్వామి శివక్షేత్రాన్ని జిల్లా సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ బుధవారం సందర్శించారు. అనంతరం మహాశివరాత్రి ఏర్పాట్లపై టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తితో మాట్లాడారు. డీఎస్పీ లక్ష్మణరావు, ఎల్.ఎల్.నాయుడు, దేవాదాయశాఖ ఈవో జి.గురునాథరావు, పంచాయతీరాజ్ డీఈ సుధాకర్, బడే రెడ్డిబాబు ఉన్నారు.

చోరీలపై కేసుల నమోదు

ఎత్తురాళ్లపాడు(కోటబొమ్మాళి), న్యూస్‌టుడే: పెద్దబమ్మిడి పంచాయతీ నిమ్మాడ కూడలి, కస్తూరిపాడు పంచాయతీ కొబ్బరిచెట్లపేట గ్రామాల్లో ఇటీవల జరిగిన ద్విచక్రవాహనాల చోరీలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ బుధవారం తెలిపారు. ● కన్నేవలసలో తాగునీటి బోరు వద్ద కొట్లాటకు దారితీసిన ఘటనపై ఇద్దరి వివాహితలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

సామగ్రి వితరణ

పాతపట్నం, న్యూస్‌టుడే: స్థానిక నవజీవన్ ఆశ్రమంలో బుధవారం సాయంత్రం విశ్రాంత ఉపాధ్యాయులు నల్లి రాజారావు, సుజాత దంపతుల మనుమడు జైష్ణవరామ్ పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు.

ఉపాధి పనులు ప్రారంభించాలి

సారవకోట, న్యూస్‌టుడే: మండలంలో ఉపాధి పనులు ఈనెల 12 నుంచి ప్రారంభించాలని సంబంధితశాఖ ఏపీడీ పి.శైలజ (టెక్కలి) సూచించారు. సారవకోటలోని ఉపాధి కార్యాలయంలో క్షేత్ర, సాంకేతిక సహాయకులతో బుధవారం సమావేశమయ్యారు. ఏపీవో నారాయణరావు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ శాఖ సహాయం

హిరమండలం, న్యూస్‌టుడే: మండలంలోని చొర్లంగి పీహెచ్‌సీ అభివృద్ధికి హిరమండలం ఎస్‌బీఐ శాఖ, అవేర్ సంస్థ కృషి చేస్తున్నాయని వైద్యాధికారి సంతోష్ తెలిపారు. బుధవారం ఆ శాఖ మేనేజర్ కె.జగదీశ్వరరావు, అవేర్ సంస్థ కోఆర్డినేటర్ పి.కృష్ణ వైద్య సామగ్రి అందజేశారు

దీన్‌దయాళ్ ఆశయసాధనకు కృషి

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆశయసాధనకు శ్రేణులు కృషి చేయాలని భాజపా టెక్కలి మండలాధ్యక్షుడు జర్జాన రాంజీ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన వర్ధంతి సందర్భంగా స్థానిక భాజపా కార్యాలయంలో చిత్రపటానికి నివాళులర్పించారు. కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు, పరమేశ్వరరావు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలంటూ ఏపీ యూటీఎఫ్ ఆధ్వర్యంలో పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టారు. 12వ పీఆర్సీ కమిషన్ ఛైర్మన్ నియామకం, 29 శాతం ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం భరణికోట, చాపర, కరజాడ పాఠశాలల ప్రాంగణాల్లో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు.

పోస్ట్‌కార్డులతో నిరసన తెలియజేస్తున్న ఉపాధ్యాయులు

పేదరికంతోనే పోటీ.. పతకాల్లో మేటి

– న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

వారంతా నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థులు. టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతూనే క్రీడల్లో కఠోర సాధన చేస్తున్నారు. శిక్షకులు, సదుపాయాలు లేకపోయినా నిరంతరం లక్ష్య సాధనకోసం శ్రమిస్తున్నారు. అనుకున్నది సాధించేందుకు, జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్తున్నారు.

పీడీ కావడమే లక్ష్యం

సంతకవిటి మండలం సిరిపురం గ్రామానికి చెందిన **మంగరాజు బాలాంజలి** బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతోంది. తండ్రి కిరాణా వ్యాపారి. క్రీడలపై ఆసక్తితో టెక్కలిలో వసతిగృహంలో ఉంటూ సాధన చేస్తోంది. 100 మీటర్లు, 200 మీటర్ల పరుగుపందెంలో సత్తాచాటుతోంది. 2023లో మహారాష్ట్రలో జరిగిన స్కూల్‌గేమ్స్‌లో పాల్గొనగా, రాష్ట్రస్థాయిలో గుంటూరులో మూడుసార్లు, బాపట్ల, ఏలూరులో చెరోసారి పాల్గొంది. గుంటూరులో జరిగిన పోటీలో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం దక్కించుకుంది. పీడీ కావాలన్నదే తన లక్ష్యమని చెబుతోంది.

జాతీయస్థాయిలో రాణింపు

టెక్కలిలోని మండాపోలం కాలనీలో నివాసముంటున్న **మౌనిక మిశ్రో** బీఎస్సీ ప్రథమ సంవత్సరం చదువుతోంది. తండ్రి స్థానిక ఆలయంలో పూజారి. లాంగ్‌జంప్, హర్డిల్స్‌లో పతకాల పంట పండిస్తోంది. ఇప్పటివరకు ఆరుసార్లు జాతీయ స్థాయి, ఎనిమిదిసార్లు రాష్ట్రస్థాయి పోటీల్లో అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంది. గుంటూరులో తాజాగా జరిగిన సౌత్‌జోన్ నేషనల్స్‌లో ఆరోస్థానంలో నిలిచింది.

వెయిట్‌లిఫ్టింగ్‌లో సత్తా

పెద్దపాడుకు చెందిన **ఎస్.ఝాన్సీరాణి** బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. తల్లిదండ్రులు కూలి పనులు చేసుకుంటున్నారు. వెయిట్‌లిఫ్టింగ్‌పై ఆసక్తితో టెక్కలిలో ఉండి చదువుతోంది. గతేడాది హిమాచల్‌ప్రదేశ్ సెంట్రల్ యూనివర్సిటీలో జరిగిన జాతీయ పోటీల్లో పాల్గొంది. ఈ ఏడాది భోపాల్‌లో జరిగిన జాతీయ పోటీలకు హాజరైంది. ఏలూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ద్వితీయ స్థానం దక్కించుకుంది. తల్లి ప్రోత్సాహంతో సాధన చేస్తున్నానని, జాతీయ పోటీల్లో సత్తాచాటుతానని చెబుతోంది.

ప్రభుత్వ కొలువు సాధిస్తా



సంతకవిటి మండలం బలరామపేట గ్రామానికి చెందిన **బోర వెంకటలక్ష్మి** బీఎస్సీ చివరి సంవత్సరం చదువుతోంది. టెక్కలిలో వసతిగృహంలో ఉంటూనే అథ్లెటిక్స్‌లో సాధన చేస్తోంది. గతేడాది గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించిన జూనియర్ నేషనల్స్ 5 కిలోమీటర్ల పరుగుపందెంలో పాల్గొంది. 2023లో భోపాల్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ జాతీయ పోటీల్లోనూ పాల్గొంది. చీరాల, గుంటూరు, తిరుపతి, శ్రీకాకుళంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంది. గుంటూరులో జరిగిన 800 మీటర్ల పరుగులో ప్రథమస్థానం దక్కించుకోగా, చీరాలలో 3 కిలోమీటర్ల పరుగుపందెంలో ద్వితీయస్థానంలో నిలిచింది. గుంటూరులో జావెలిన్‌త్రోలో, శ్రీకాకుళంలో డిస్కస్‌త్రోలో ద్వితీయస్థానాలు దక్కించుకుంది. క్రీడా కోటాలో ప్రభుత్వ కొలువే లక్ష్యంగా ముందుకెళ్తోంది.

దారి దయనీయం.. రాకపోకలకు భయం

ఎల్ఎన్‌పేట మండలం ఏబీ రహదారి నుంచి చింతలబడవంజ మీదుగా ఎస్.కె.బాలేరు వరకు గల బీటీ రహదారి అధ్వానంగా మారింది. కవిటి గ్రామం వద్ద గోతులమయంగా మారడంతో గ్రామస్థులు గృహ నిర్మాణ వ్యర్థాలను గుంతల్లో వేశారు. వర్షాకాలం వస్తే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని అధికారులు స్పందించాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని ర.భ.శాఖ జేఈ గోపాల్ వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి, చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, ఎల్ఎన్‌పేట

(c) eenadu

శ్రీకాకుళం

•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

వైభవంగా మహాకుంభాభిషేకం

శ్రీకాకుళం నగరం పాలకొండ రోడ్డులోని కోదండ రామాలయంలో సుదర్శన, లక్ష్మీనారాయణస్వామి సహిత మహాకుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక హోమ పూజలు అనంతరం కలశాలతో ఆలయ శిఖరంపై కుంభాభిషేకం చేశారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.సర్వేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం

● ఎస్‌వీసీ(రామలక్ష్మణ): మన శంకరవరప్రసాద్ గారు ● మారుతి: సుమతీ శతకం, హనీ ● కిన్నెర: విత్ లవ్ ● కీర్తన: భర్త మహాశయులకు విజ్ఞప్తి ● కీర్తిక: నారీ నారీ నడుమ మురారి ● సూర్య: అనగనగా ఒక రాజు ● సన్‌మ్యాక్స్: యుఫోరియా, 3 ● సరస్వతి: ఆరెంజ్ (2010)
– న్యూస్‌టుడే, పాతబస్టాండ్

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

పొందూరు, జి.సిగడాం, సరుబుజ్జిలి: పొందూరు మండలం లోలుగు, పొందూరు ఉపకేంద్రం పరిధిలో విద్యుత్తు లైన్ మరమ్మతులు జరుగుతున్నాయి. ఈ మేరకు పలు ప్రాంతాలకు 13వ తేదీన ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, పాలఖండ్యాం ఫీడర్ పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, సరుబుజ్జిలి విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్తు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్తుశాఖ ఈఈ యోగేశ్వరరావు తెలిపారు.

నిధులు విడుదల చేయండి..

మంత్రి లోకేశ్‌కు సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి, ప్రధాన రహదారుల విస్తరణకు అవసరమైన నిధులు విడుదల చేయాలని ఎమ్మెల్యే గొండు శంకర్ మంత్రి లోకేశ్‌ను కోరారు. అమరావతిలో బుధవారం ఆయన్ను కలిసి వివిధ అంశాలపై చర్చించారు. గత ప్రభుత్వ హయాంలో కల్వర్టులు, విభాగినుల నిర్మాణం, నగర సుందరీకరణ ఇతర పనులకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రస్తావించారు. అరసవల్లిలో రథసప్తమి వేడుకల్ని రాష్ట్ర పండగగా గుర్తించినందుకు ధన్యవాదాలు తెలిపారు. పర్యాటక రంగానికి మరింత పెద్దపీట వేయాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

నిత్యావసర సరకుల అందజేత

శ్రీకాకుళం నగరంలోని రెడ్‌క్రాస్ జిల్లా కార్యాలయం వద్ద బుధవారం నరసన్నపేట పరిధిలోని కుష్టు వ్యాధి బాధిత కుటుంబీకులకు ఛైర్మన్ పి. జగన్మోహనరావు ఆధ్వర్యంలో బ్రైట్ ఫ్యూచర్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ సమకూర్చిన నిత్యావసర సరకులు, వస్త్రాలు అందజేశారు. ఆర్గనైజేషన్ ప్రతినిధులు వెంకటేశ్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు కె.సత్యనారాయణ, ఎ.నర్సింగరావు, జి.రమణ, బి.సతీశ్, కరుణ సమాజం అధ్యక్షుడు పాపారావు తదితరులు పాల్గొన్నారు.
– న్యూస్‌టుడే, బలగ(శ్రీకాకుళం)

అడుగడుగునా మలుపులు.. కనిపించని బోర్డులు

వేగనిరోధక, హెచ్చరిక సూచికలు లేక ప్రమాదాలు

– న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

ఆమదాలవలస నియోజకవర్గంలోని సరుబుజ్జిలి, ఆమదాలవలస, పొందూరు, బూర్జ మండలాల్లోని పలు రహదారుల్లో మలుపులు ప్రమాదానికి నిలయాలుగా దర్శనమిస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. దీనికి తోడు మలుపు ఉన్న ప్రదేశాల్లో పనికిరాని మొక్కలు రహదారికి ఇరువైపులా దట్టంగా పెరిగిపోవడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. ద్విచక్ర వాహనదారులు ఈ మలుపుల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల మాత్రమే ప్రమాదకర సూచికలు ఉన్నాయని, అవసరమైన ప్రతి చోట వేగనిరోధకాలు, ప్రమాదకర సూచికలుంటే కొంత వరకు ప్రమాదాలను అరికట్టొచ్చని వాహన చోదకులు అంటున్నారు.

సుభద్రాపురం దారిలో ప్రమాదకరంగా మలుపు

నియోజకవర్గంలో పరిస్థితి..

◆ **సరుబుజ్జిలి మండలం:** అలికాం-బత్తిలి రహదారిలో కొండవలస, సూర్యనారాయణపురం, షళంత్రి కూడలి వద్ద, కొమనాపల్లి రహదారిలో కూనజమ్మన్నపేట, బుడ్డివలస, సరుబుజ్జిలి, ఇస్కులపాలెం, సుబ్బపేట, పెద్దమాలపేట, మూలసవలాపురం, పెద్దసవలాపురం, పురుషోత్తపురం, పెద్దవెంకటాపురం, రావివలస, సుభద్రాపురం, డకరవలస, కొత్తకోట, సింధువాడ, చిగురువలస తదితర గ్రామాలకు వెళ్లే రహదారుల్లో ఉన్న మలుపులతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

◆ **ఆమదాలవలస:** బొబ్బిలిపేట, జొన్నవలస, తిమ్మాపురం, లక్ష్ముడుపేట, కొర్లకోట, చీమలవలస, అక్కులపేట, ఈసర్లపేట, మందాడి, కృష్ణాపురం, దన్నానపేట, మునగవలస, చింతాడ, చెవ్వాకులపేట, పార్వతీశంపేట, రామచంద్రాపురం, కనుగులవలస, తొగరాం, జి.కె.వలస, కొత్తవలస గ్రామాలకు వెళ్లే రహదారుల్లో ప్రమాదకర మలుపులు ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

◆ **పొందూరు:** రాపాక, కింతలి, కనిమెట్ట, బురిడికంచరాం, తోలాపి, వీఆర్‌గూడెం, బాణాం, లక్ష్మీపురం, సింగూరు, తాడివలస, పిల్లలవలస, దళ్లవలస, దల్లిపేట, గోకర్నపల్లి తదితర గ్రామాల రహదారుల్లో మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి.

◆ **బూర్జ:** మద్రిపాడు, తుడ్డలి, రామన్నపేట, పెద్దపేట, అప్పలపేట, రాజుపేట, సింగన్నపాలెం, ఉప్పినివలస, వైకుంఠపురం కూడళ్లతోపాటు అన్నంపేట, గుత్తావల్లి, అల్లెన, బూర్జ, మామిడివలస-లంకాం, ఓవీపేట తదితర గ్రామాల రహదారుల్లో రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు.

ఏర్పాటు చేస్తున్నాం: మలుపులు వద్ద హెచ్చరిక సూచిక బోర్డులు, వేగనిరోధకాలు ఏర్పాటు చేస్తున్నాం. రహదారుల పక్కన పెరుగుతున్న పనికిరాని మొక్కలను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నాం. పరిశీలించి అవసరమైన ప్రాంతాల్లో ప్రమాదకర హెచ్చరిక బోర్డులు, వేగనిరోధకాలు ఏర్పాటు చేస్తాం. **- గణపతిరావు, డీఈ, ఆర్అండ్‌బీ**

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) 9502198883 8008552704

? : గాంధీ జంక్షన్ వద్ద ప్రధాన రహదారిపై ఇష్టానుసారంగా ఆటోలు నిలపడంతో ఇబ్బందిగా ఉంది. **మురళి, ఆమదాలవలస**
● : ఆటోలు నిలపకుండా చర్యలు తీసుకుంటాం. **బాలరాజు, ఎస్సై, ఆమదాలవలస**
? : తిమ్మాపురం ఎన్టీఆర్ కాలనీలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరగడం లేదు. **రాము, స్థానికుడు**
● : పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి పనులు చేయిస్తాం. **జ్యోత్స్న, మున్సిపల్ ఏఈ, ఆమదాలవలస**
– న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

రైతుల నేస్తం.. డబుల్ వీల్ మార్కర్

రణస్థలం, న్యూస్‌టుడే: వరి మాగాణిల్లో నేరుగా మొక్కజొన్న సాగుచేసే రైతులకు డబుల్ వీల్ మార్కర్లు మంచి నేస్తాలని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు అన్నారు. బుధవారం పైడిభీమవరంలో మొక్కజొన్న నాటే 700 మార్కర్లను పరిసర గ్రామాల లీడ్‌ఫార్మర్లకు అందజేశారు. కార్యక్రమంలో ప్రాంతీయ మేనేజర్ తవిటినాయుడు, రైతులు పాల్గొన్నారు.

కాలువలు లేక.. మురుగు కదలక

పొందూరు మండలం రెడ్డిపేట గ్రామంలో కాలువలు, సరైన రహదారులు లేక గ్రామస్థులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. రోడ్డుపైనే మురుగు ప్రవహించడంతో రాకపోకలు చేసేదెలా అని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు. ఎంపీడీవో వాసుదేవరావు వద్ద ప్రస్తావించగా ప్రతిపాదనలు పంపామని, నిధులు రాగానే పనులు చేపడతామన్నారు.
– న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

ఇలాగైతే ఆయకట్టుకు నీరెలా..?

వంశధార కుడి ప్రధాన కాలువకు అనుసరించి షళంత్రి కోమటి చెరువు దిగువున ఉన్న పిల్లకాలువలో పూడిక తీయకపోవడంతో ఆయకట్టు రైతులకు నీరందడం లేదు. అరకొర నీటితో ఇబ్బందులు పడుతున్నామని వరి, మొక్కజొన్న పంటలను సాగు చేస్తున్న రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనికిరాని మొక్కలు తొలగించాలని కోరుతున్నారు. వంశధార ఏఈ జగదీశ్వరరావు వద్ద ప్రస్తావించగా చర్యలు తీసుకుంటామన్నారు.
– న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

పడిపోతున్నాం.. పట్టించుకోండి

ఆమదాలవలస పట్టణంలోని అలికాం బత్తిలి ప్రధాన రహదారి మెట్టక్కివలస, గేదెలవానిపేట కూడలి వద్ద వయోడెక్ట్ కింద రహదారి నాచు పట్టడంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయని చోదకులు వాపోతున్నారు. నడుచుకుని వెళ్లాలంటే నరకంగా ఉందని పాదచారులు అంటున్నారు. సమస్యను పుర కమిషనర్ టి.రవి వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటానని తెలిపారు.
– న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

బండి దారే దిక్కు

బూర్జ మండలం హనుమయ్యపేట నుంచి కాలపర్తి వెళ్లాలంటే నేటికీ బండి దారే దిక్కు. వర్షం పడినా, గాలి వీచినా ఈ మార్గంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రహదారి నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీరాజ్ శాఖ జేఈ మాట్లాడుతూ చర్యలు తీసుకుంటామని మణికుమార్ తెలిపారు. – న్యూస్‌టుడే, బూర్జ

పొంచి ఉన్న ప్రమాదం

మెట్టక్కివలస మండలవీధి శివారు చెరువుగట్టుపై ఉన్న విద్యుత్తు నియంత్రిక చుట్టూ పొదలు ఉండటంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గాలి వీచే సమయంలో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ అవుతుందని అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పొదలు తొలగించాలని కోరుతున్నారు. ఏఈ శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా పరిశీలిస్తామని పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

శ్రీకాకుళం గ్రామీణ మండలం గూడెం నారాయణ నర్సింగ్ కళాశాలలో బుధవారం స్వాగతోత్సవం వైభవంగా నిర్వహించారు. సీనియర్ విద్యార్థులు కొత్తగా చేరిన వారికి ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు అలరించాయి. కళాశాల ఛైర్మన్ రెడ్డి నారాయణరావు పాల్గొన్నారు.–న్యూస్‌టుడే, శ్రీకాకుళం గ్రామీణం

రహదారి పనులకు శ్రీకారం

గార మండలం అయ్యవారిపేట నుంచి రాళ్లపేట, దల్లాం చెరువు గట్టు మీదుగా శ్రీకూర్మానికి 3.70 కి.మీ. మేర బీటీ రహదారి నిర్మాణ పనులకు బుధవారం నీటి సంఘం అధ్యక్షుడు వీఎస్ గిరి, ఉపాధ్యక్షుడు మెండ మురళి, మైగాపు ప్రభాకరరావు, చీడి రాంబాబు, చింతు ముకుందరావు, యాళ్ల జానకిరామ్ శంకుస్థాపన చేశారు. రోడ్డు నిర్మాణానికి సుమారు రూ.3 కోట్లు మంజూరైనట్లు సమాచారం. శ్రీకూర్మం వెళ్లడానికి దూరం తగ్గుతుందని రాళ్లపేట, అయ్యవారిపేట గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, గార (శ్రీకూర్మం)

ఉపాధ్యాయుల చేయూత

పొందూరు, పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పొందూరు మండలం లోలుగు కేజీబీవీ విద్యార్థినికి ఉపాధ్యాయులు రూ.66 వేల ఆర్థికసాయం అందజేశారు. తొగరాపు హర్షిత అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ మేరకు వైద్యానికి రూ.2.50 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు ఆర్థిక సహాయం చేశారు. ఆమె తల్లి నిర్మల లోలుగు ప్రాథమిక పాఠశాలలో ఆయాగా పనిచేస్తున్నారు. ఎంఈవోలు వాగ్దేవి, రాజారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థిని తల్లికి నగదు అందిస్తున్న ఎంఈవోలు, ఉపాధ్యాయులు

కళ్లద్దాల పంపిణీ

పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పొందూరు మండలం లోలుగు కేజీబీవీ, హైస్కూల్, కొంచాడ పాఠశాలలో బుధవారం 34 మంది విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ చేశారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవీన్ కల్యాణ్, రామచంద్రరావు, అనూష కుమారి, ఆశా పాల్గొన్నారు.

ప్రత్యేక శ్రద్ధ వహించాలి

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: పదోతరగతి విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కొత్తకోట జి.ప.ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పేర్కొన్నారు. మద్రిపాడు, బురిడివలస, నక్కలపేట గ్రామాల్లో బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులతో వారు మాట్లాడారు. ఉపాధ్యాయులు వినాయకరావు, తేజేశ్వరరావు, ముకుందరావు, రమేశ్ పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన.. పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పొందూరు మండలం కృష్ణాపురం గ్రామంలో బుధవారం రాగోలు జెమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో 250 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి అంబళ్ల శ్రీనివాసరావు, జనసేన నాయకుడు గార బాబూరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త తరలించండి

చెత్త సంపద కేంద్రం వద్ద అధికారులకు సూచనలిస్తున్న డీపీవో భారతీసౌజన్య

రణస్థలం, న్యూస్‌టుడే: జేఆర్‌పురం చెత్త సంపద కేంద్రం వద్ద ఉన్న చెత్తను విశాఖకు తరలించాలని డిప్యూటీ ఎంపీడీవో ప్రసాదరావు, కార్యదర్శి చంద్రశేఖర్‌లకు ఆదేశించారు. బుధవారం చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. పంచాయతీల్లో శతశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలన్నారు.

సమ్మె విజయవంతానికి పిలుపు

రణస్థలం, ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.అమ్మన్నాయుడు అన్నారు. 12న దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ పైడిభీమవరంలోని పరిశ్రమల వద్ద ప్రచారం నిర్వహించారు. ★ దేశవ్యాప్తంగా చేపడుతున్న సమ్మెలో కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఎన్.వి.రమణ పిలుపునిచ్చారు.

కథా సాహిత్యం కళింగ సీమ నుంచే మొదలు

సంచిక ఆవిష్కరిస్తున్న బాలసుధాకర్ మౌళి

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: సామాన్యుడి కోసం కథా సాహిత్యం కళింగ సీమ నుంచే మొదలైందని ప్రముఖ రచయిత, సాహితీవేత్త అట్టాడ అప్పలనాయుడు అన్నారు. ఎచ్చెర్ల డా.బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని జర్నలిజం విభాగంలో బుధవారం రచయిత ఎస్.బాల సుధాకర్ మౌళి 'ఎరిక' పేరిట స్థాపించిన కళింగ సాహిత్య పాఠశాల ప్రథమ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం పేరిట పాలకులు ప్రవేశపెట్టిన పథకాల్లో అవినీతిని ప్రముఖంగా ప్రస్తావిస్తూ సామాజిక స్పృహ కలిగించే పలు కథలు ఇక్కడి నుంచి ప్రచురితమయ్యాయన్నారు. ఈ సందర్భంగా 'ఎరిక' సంచిక ఆవిష్కరించారు. సాహితీ స్రవంతి కార్యదర్శి కె.శ్రీనివాస్, అధ్యాపకులు జి.లీలాప్రసాదరావు, రెడ్డి తిరుపతిరావు, కె.ఉదయ్‌కిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘంటసాలకు స్వరాంజలి

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని పలు సంగీత, సాహితీ సంస్థల ఆధ్వర్యంలో బుధవారం ప్రసిద్ధ సినీ నేపథ్య గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి నిర్వహించారు. సంగీత కళాశాలలు, సంస్థల నిర్వాహకులు, పలువురు గాయకులు స్వరాంజలి సమర్పించారు. బాపూజీ కళామందిరంలో ఘంటసాల విగ్రహానికి సీనియర్ గాయకులు కేవీఎన్ మూర్తి, పోలయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ బంగ్లా వద్ద ఆరోహి సంగీత కళాశాలలో సంగీత విభావరి జరిగింది.

పేదల పెన్నిధి.. సీఎం సహాయ నిధి

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: ఆమదాలవలస మండలం కనుగులవలస గ్రామంలో బగాది రూపవతి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమెకు సీఎం సహాయ నిధి నుంచి రూ.29 వేలు మంజూరయ్యాయి. దానికి సంబంధించిన చెక్కును మాజీ ఎంపీపీ కూన ప్రమీలా రాణి బుధవారం బాధితురాలికి అందజేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండలాధ్యక్షుడు నూకరాజు, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాల పరిశీలన

లావేరు, న్యూస్‌టుడే: తోటపల్లి జలాశయం నుంచి సాగునీరు అందించేందుకు గాను 17ఎల్ తోటపల్లి ప్రధాన కాలువ గట్టులను గురుగుబిల్లి సమీపంలో అడ్డగోలుగా తవ్వేయడంతో ఈనెల 9న 'గుట్టుగా తవ్వకం.. గట్టుమాయం!' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి తోటపల్లి ప్రాజెక్టు డీఈఈ లావణ్య ప్రియదర్శిని స్పందించి బుధవారం గట్టును పరిశీలించారు. అక్రమంగా గట్టు తవ్వితే కేసులు పెడతామన్నారు.

రహదారి నిర్మాణం పూర్తి

రణస్థలం, న్యూస్‌టుడే: మండలంలోని కమ్మసిగడాం నుంచి దేవరాపల్లి వెళ్లే రహదారి అధ్వానంగా ఉండేది. 3.3 కిలోమీటర్ల పొడవుండే ఈ రహదారిలో పెద్ద గోతులు ఏర్పడి వర్షం పడితే చెరువులను తలపించేది. కూటమి ప్రభుత్వం రూ.1.8 కోట్లు మంజూరు చేసి 2.5 కిలోమీటర్లు బీటీ, 800 మీటర్ల సీసీ రహదారి నిర్మించారు.

12 నుంచి కైలాసేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు

సింగుపురం(శ్రీకాకుళం గ్రామీణం) న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా శ్రీకాకుళం గ్రామీణ మండలం కిష్టప్పపేటలో కొలువైన కైలాసేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు ఈ నెల 12 నుంచి 16 వరకు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ధర్మకర్త గొండు జగన్నాథరావు బుధవారం ప్రకటన విడుదల చేశారు.

దీన్‌దయాళ్‌కు నివాళి

జి.సిగడాం, న్యూస్‌టుడే: సమాజంలో చిట్టచివరి వ్యక్తికి కూడా స్వాతంత్ర్య ఫలాలు అందాలని, అందుకోసం నిరంతరం కృషి చేసిన పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆదర్శనీయుడని భాజపా మండలాధ్యక్షుడు పైల విష్ణుమూర్తి కొనియాడారు. ఆయన వర్ధంతి సందర్భంగా బుధవారం జి.సిగడాం మండల కేంద్రంలోని ఓ కల్యాణ మండపంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

ఆర్యవైశ్యులు రాజకీయంగా ముందుండాలి

రణస్థలం, న్యూస్‌టుడే: ఆర్యవైశ్యులు రాజకీయంగా ముందుండాలని కర్నూలు అభివృద్ధి అథారిటీ ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం పైడిభీమవరంలో జరిగిన ఆర్యవైశ్య ఆత్మీయ కలయికలో పాల్గొని మాట్లాడారు. జనసేన నాయకులు వడ్డాది శ్రీను పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు అమలు చేయాలి

గార, న్యూస్‌టుడే: సమగ్ర శిక్షా కింద ఒప్పంద విధానంలో పని చేస్తున్న బోధన సిబ్బంది పూర్తిస్థాయి ఉపాధ్యాయులేనని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వెంటనే అమలు చేయాలని యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కోశాధికారి పీవీ సత్యనారాయణ కోరారు. గారలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 13 ఏళ్లుగా క్రాఫ్ట్, ఆర్ట్, వ్యాయామోపాధ్యాయులుగా పని చేస్తున్న తమకు అనుకూలంగా తీర్పు వచ్చినప్పటికీ ప్రభుత్వం అమలు చేయకపోవడం బాధాకరమన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరం మొండేటి వీధిలోని లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం స్వామికి క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు పూజ చేసిన కలాలు, కంకణాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధి జి.వెంకటేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు. ★ కాకి వీధిలోని ముత్యాలమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి పూజలు చేశారు.

వృద్ధులకు ఉచితంగా న్యాయ సేవలు

వృద్ధులతో మాట్లాడుతున్న డీఎల్ఎస్‌ఏ కార్యదర్శి హరిబాబు

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: వృద్ధులకు అవసరమైన న్యాయ సేవలు ఉచితంగా అందించడానికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ పని చేస్తోందని డీఎల్ఎస్‌ఏ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని స్త్రీ సదన్, ఖ్యాతి వృద్ధాశ్రమాలను బుధవారం ఆయన సందర్శించారు. ఆహారం, వైద్య సదుపాయాలు, వసతి సౌకర్యాలను తనిఖీ చేసి వృద్ధులతో మాట్లాడారు. కుటుంబ సభ్యులతో చట్టపరమైన సమస్యల పరిష్కారం, సహకారం కోసం జిల్లా కార్యాలయంలో సంప్రదించొచ్చని సూచించారు. సీనియర్ న్యాయవాది గేదెల ఇందిరాప్రసాద్, ఎస్.ధనలక్ష్మి, ఆర్.శ్రావణి పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఐదుగురికి గాయాలు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: అల్లినగరం సమీపంలోని సర్వీసు రోడ్డులో బుధవారం జరిగిన ప్రమాదంలో ఆటో బోల్తాపడి ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లావేరు గ్రామానికి చెందిన నలుగురు పొందూరు మండలం బేరుపేట గ్రామంలోని ఓ శుభకార్యానికి ఆటోలో వచ్చి, తిరిగి వెళ్తుండగా అల్లినగరం సమీపంలో ఆటో సర్వీసు రోడ్డులోని డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ సవలాపురపు ఎర్రయ్య, ఆటోలో ఉన్న మామిడి తవుడు, రేగాని సూరిబాబు, మామిడి రాము, పిలక రమణమ్మ గాయాలపాలయ్యారు. వీరిని 108 వాహనంలో చికిత్సకు శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు.

రుణం అందుకో.. అభివృద్ధిలో సాగిపో..!

స్వయంగా వ్యాపారాల్లో రాణిస్తున్న మహిళలు

– న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం, సరుబుజ్జిలి, బూర్జ, పొందూరు

ఆమదాలవలస నియోజకవర్గంలో స్వయం శక్తి సంఘాలు ద్వారా మహిళలు బ్యాంకుల్లో రుణాలు పొంది తమ ఇంటి వద్దే సొంతంగా వ్యాపారాలు చేసుకుంటూ పది మందికి ఉపాధి కల్పిస్తూ పలువురి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ప్రభుత్వం స్వయం శక్తి సంఘాలు ద్వారా వివిధ బ్యాంకుల నుంచి మహిళలకు రుణాలు అందిస్తున్నారు. ఆమదాలవలస, సరుబుజ్జిలి, బూర్జ, పొందూరు మండలాల్లోని వారు చేస్తున్న వ్యాపారం స్థాయి ఆధారంగా మహిళా సంఘ సభ్యులు రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షలు వరకు రుణం తీసుకుని వివిధ వ్యాపారాలు చేసుకుంటున్నారు. మరికొందరికి ఉపాధి సైతం కల్పిస్తూ ముందుకు సాగుతున్నారు.

మండలం	పంచాయతీలు	సంఘాలు	సభ్యులు
ఆమదాలవలస	30	1,163	12,463
సరుబుజ్జిలి	21	780	8,441
బూర్జ	30	1,099	12,245
పొందూరు	29	1,719	18,058

కుటుంబానికి ఎంతో సహాయపడుతున్నా...

నేను స్వయం శక్తి సంఘం నుంచి రూ.లక్ష రుణం తీసుకున్నాను. టైలరింగ్ చేసుకుంటూ మరో ఐదుగురు అమ్మాయిలకు ఉచితంగా నేర్పుతున్నాను. మహిళలకు కావాల్సిన దుస్తులు కొనుగోలు చేసి కుట్టి అందిస్తున్నాను. బ్యాంకు రుణం చెల్లించి మిగిలిన ఆదాయంతో కుటుంబానికి సహాయపడుతున్నాను. - పి.రవణమ్మ, లక్కుపురం, బూర్జ మండలం

ఆరుగురికి పనికల్పిస్తున్నాను

నేను స్వయం శక్తి సంఘం నుంచి బ్యాంకులో లింకేజ్ రూ.5 లక్షలు తీసుకున్నాను. అవసరమైన సామగ్రి కొనుగోలు చేసి వ్యాపారం ప్రారంభించాను. చేగొడియాలు, చుప్పులు, మిక్చర్ తయారు చేస్తూ ఆరుగురు మహిళలకు పనికల్పిస్తున్నాను. వారికి జీతాలు ఇస్తూ రుణం చెల్లిస్తున్నాను. **- మూగి రేవతి, దుబ్బులపేట, సరుబుజ్జిలి మండలం**

అందరికీ రుణం అందిస్తున్నాం: నియోజకవర్గంలో స్వయం శక్తి సంఘాల్లో ఉన్న అందరి మహిళలకు రుణం అందిస్తున్నాం. రుణాలు పొందిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. రుణాలు తీసుకొని చెల్లించి, మళ్లీ పొందాలి. **- నారాయణరావు, గోవిందరాజు, బాబూరావు, రామ్మూర్తి, నాలుగు మండలాల వెలుగు ఏపీఎంలు**

రెడ్డిపేటలో ఎన్ఎస్ఎస్ శిబిరం

పొందూరు, న్యూస్‌టుడే: రెడ్డిపేట గ్రామంలో బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ మధుసూదనరావు ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ శిబిరం నిర్వహించారు. దీనిని యూనిట్ ప్రోగ్రాం అధికారి దామోదర్, సర్పంచి సూర్యారావు ప్రారంభించారు.

CHANGE OF NAME

I, **KUNA RAVANAMMA** W/o Late Kuna Apparao residing at Plot No: 35 B, Srinivasa Nagar Colony, Patha Srikakulam, Srikakulam Town and Srikakulam District, My husband Late K. Apparao, who retired from service at BSNL Srikakulam, In his BSNL service pension Book PPO No: 502015091241841 my name have been mentioned incorrectly as **K. RAMANAMMA.** My Correct name is **KUNA RAVANAMMA** Vide affidavit Dated 09-09-2025 and other personal Documents.

37వ వర్ధంతి
(12-2-2026 గురువారం)

నీ జీవితమంతా మాకు సేవలు చేసి,
నీ ఆత్మీయతానురాగాలు మాలో మిగిల్చి
నీవు స్వర్గానికేగి 37 సం॥లు గడిచినా
ప్రతీక్షణం నీ జ్ఞాపకాలే మమ్మల్ని
నడిపిస్తున్నాయి. నీ మధుర స్మృతులు
సదా తలుచుకుంటూ...నీ ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...
అశ్రునయనాలతో... ఇట్లు

కీ॥శే॥ లసం॥ ఉరిటీ అన్నపూర్ణమ్మ
బలగవీధి, శ్రీకాకుళం
జననం 28-12-1929 మరణం 2-3-1989

కుమారుడు :
ఉరిటీ వెంకటరమణ
మరియు కుటుంబ సభ్యులు

(c) eenadu

కార్మిక సంఘాల సమ్మెకు డీఎంకే సంఘీభావం

చెన్నై, న్యూస్‌టుడే: కార్మిక సంఘాల తలపెట్టిన గురువారం జరగనున్న సమ్మెకు డీఎంకే సంఘీభావం తెలిపింది. రైతులు, కార్మికులు, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని, ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆరోపిస్తూ పలు కార్మిక సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చాయి.

గజ వాహనంపై తేజ స్వరూపిణి

పల్లకీ సేవలో అమ్మవారు

టీనగర్, న్యూస్‌టుడే: చెన్నై టీనగర్ జీఎన్‌చెట్టి రోడ్‌లో తితిదే ఆధ్వర్యంలోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం బ్రహ్మోత్సవ శోభతో కళకళలాడింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ వేడుకల్లో బుధవారం ఐదోరోజు అమ్మవారు పల్లకీలో ఊరేగుతూ భక్తులను మురిపించారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణ నడుమ పల్లకీ ఉత్సవం వైభవంగా సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారికి మంగళ హారతులు సమర్పించారు. గజ వాహన సేవ రాత్రి ఏడు గంటలకు ప్రారంభమైంది. వాహన సేవలతో పాటు ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అమ్మవారికి స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. గురువారం ఉదయం సర్వ భూపాల వాహనం, రాత్రికి గరుడ వాహనసేవ జరుగనున్నాయని ఆలయ ఏఈవో ధనుంజయ, సూపరింటెండెంట్ పుష్పలత తెలిపారు.

గజవాహనంపై..

హరితం.. పర్యావరణహితం

✦ తొలిసారిగా అర్బన్ గ్రీనింగ్ పాలసీ ప్రవేశపెట్టిన రాష్ట్ర ప్రభుత్వం

ఈనాడు-చెన్నై

రాష్ట్రంలో పట్టణాలు, నగరాలను పర్యావరణహితంగా మార్చాలనే డిమాండ్ ఎప్పటినుంచో ఉంది. కచ్చిత ప్రణాళికలు లేకపోవడం, సరైన ప్రమాణాలు రూపొందించుకోకపోవడంతో అది నెరవేరడం లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తొలిసారిగా 'పట్టణాల్ని హరితంగా మార్చే విధానాన్ని(అర్బన్ గ్రీనింగ్ పాలసీ)'ని ప్రవేశపెట్టింది.

సాధ్యం చేయాలని..

రాష్ట్రంలో హరిత శాతం ప్రస్తుతం 23.7శాతంగా ఉంది. 33 శాతానికి పెంచాలని లక్ష్యంగా చేసుకున్నారు.

ఇదీ ప్రణాళిక..

2031 నాటికి రాష్ట్రంలో పట్టణ జనాభా వాటా 67 శాతానికి పెరుగుతుందని అంచనా. దీనికి తోడు ట్రాఫిక్ సమస్యలు, కాలుష్యం సవాళ్లుగా నిలుస్తున్నాయి. ఈ పరిస్థితుల్ని ఎదుర్కొనేందుకు రాష్ట్రంలోని అన్ని పురపాలికలు, వాటి శివారుల్లో విభిన్న మార్పులు తెచ్చేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకోసం గ్రీన్ తమిళనాడు మిషన్ ఆధ్వర్యంలో పార్కులు, రోడ్లు, పట్టణ అడవులు, చిత్తడి నేలలు, కాలువ గట్లు, పారిశ్రామికవాడలు, విద్యాసంస్థలు, గృహావాసాలు ఇలా అన్ని ప్రాంతాల్ని పర్యావరణహితంగా మార్చేలా, హరితాన్ని తీసుకొచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

చెన్నైలోని ఓ కాలనీలో పచ్చదనం

ఏమేం చేయనున్నారు..

■ పచ్చదనం పెంచడం. ■ అన్ని నగరాలు, పట్టణాలకు గ్రీనింగ్ మాస్టర్ ప్లాన్ తయారు చేయడం. ■ ఆయా కార్యక్రమాల్లో స్థానికుల్ని భాగస్వాముల్ని చేయడం. ■ ఈ విధానాన్ని పక్కాగా అమలుచేసేందుకు ప్రభుత్వ విభాగాల్ని ఉన్నతీకరించడం. ■ స్థానిక మొక్కలకు ప్రాధాన్యమిచ్చేలా జీవవైవిధ్య వాతావరణాన్ని తీసుకురావడం. ■ ఎప్పటికప్పుడు చెట్ల సంరక్షణను పర్యవేక్షించడం. ■ రాష్ట్రంలో మార్పు తీసుకొచ్చి ఈ క్రతువులో దేశానికి దన్నుగా మార్చడం.

నిధుల కొరత రాకుండా

ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఈ ప్రాజెక్టులకు నిధుల కొరత రాకుండా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర పరిధిలోని వివిధ పథకాల నుంచి పట్టణాలు, నగరాలకు నిధులు మళ్లించేలా చూస్తున్నారు. అమలులో ఎక్కడా లోపాలు రాకుండా రాష్ట్ర కమిటీతో పాటు నోడల్ ఏజెన్సీని.. పట్టణాలు, నగరాలవారీగా అటవీ విభాగాల్ని ఏర్పాటుచేయడం, జిల్లాస్థాయి సమన్వయ కమిటీల్ని నియమిస్తున్నారు.

సాంకేతికత అందిపుచ్చుకుంటూ..

● అన్ని పురపాలికల్లో తొలి లక్ష్యంగా కనీసం 15శాతం హరితాన్ని పునరుద్ధరించేలా ప్రణాళికలు చేస్తున్నారు. ● ప్రతి వృక్షాన్ని జియోట్యాగ్ చేసి కనీసం 80శాతం వృక్షాల్ని కాపాడుకునేలా ప్రాధాన్యాన్ని రచిస్తున్నారు. ● ప్రాజెక్టు మొత్తాన్ని పర్యవేక్షించేందుకు డిజిటల్ ప్లాట్‌ఫామ్ తెస్తున్నారు. ఈ వివరాలు ఎప్పటికప్పుడు జనాలకు తెలిసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ● చారిత్రక విశేషాలున్న చెట్లు, వారసత్వ ప్రాంతాల అభివృద్ధిని దీని పరిధిలోకి తెస్తున్నారు. ● ప్రతి 3నెలలకూ ప్రాజెక్టులపై ఆడిటింగ్ నిర్వహించేలా ప్రతిపాదించారు. ఇవి పురపాలిక, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో జరగనున్నాయి. ● అన్ని నగరాలను ప్రోత్సహించేందుకు 'సిటీ బయోడైవర్సిటీ ఇండెక్స్, స్కోర్‌బోర్డ్'లను ప్రవేశపెడుతున్నారు. ఇది సింగపూర్ తరహా మోడల్‌లో ఉండేలా చూస్తున్నారు.

చెన్నై చేరుకున్న కేంద్ర ఎన్నికల బృందం

మీడియా ప్రతినిధులతో మాట్లాడుతున్న మనీష్ గార్గ్

చెన్నై, న్యూస్‌టుడే: తమిళనాడు, పుదుచ్చేరి శాసనసభలకు త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సన్నాహాలను పరిశీలించడానికి కేంద్ర ఎన్నికల బృందం చెన్నై చేరుకుంది. డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్లు భాను ప్రకాశ్, మనీష్ గార్గ్, పవన్‌కుమార్ శర్మ, సంజయ్‌కుమార్, ఆశిష్ గోయల్‌లతో కూడిన ఏడుగురు సభ్యుల బృందం బుధవారం చెన్నై చేరుకుంది. ఈ సందర్భంగా సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ మనీష్ గార్గ్ విలేకర్లతో మాట్లాడుతూ... తమిళనాడు, పుదుచ్చేరిలోని శాసనసభ ఎన్నికల సన్నాహాలను పరిశీలించడానికి వచ్చామన్నారు. ఈ బృందం చెన్నైలో మకాం వేసి గురువారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అర్చనా పట్నాయక్, తర్వాత ఆదాయపన్ను, పోలీసు, రైల్వే, పారా మిలటరీ, తపాలా, పౌర విమానాయానం తదితర 20కుపైగా శాఖల అధికారులతో సమాలోచన నిర్వహించనుంది. శుక్రవారం అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో, తర్వాత జిల్లా ఎస్పీలతో సమాలోచన నిర్వహించనుంది.

ఎన్నికల సర్వేకు వెళ్తే కొట్టారు

మంత్రిపై టీవీకే నిర్వాహకుల ఆరోపణ

చెన్నై, న్యూస్‌టుడే: ఎన్నికల సర్వే కోసం వెళ్తే కొట్టారని టీవీకే నిర్వాహకులు ఆరోపించారు. టీవీకే నిర్వాహకుడు ఉదయకుమార్ అధ్యక్షతన మంగళవారం ఓ బృందం హార్బర్ నియోజకవర్గంలోని 60వ డివిజన్‌లో ఎన్నికల సర్వే చేపట్టింది. తమ ప్రాంతంలోకి వచ్చి వివరాలు సేకరిస్తారా అంటూ కొందరు దాడి చేయడంతో గర్భిణి భవానీ సహా ఆరుగురు గాయపడ్డారు. వారిని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా పార్టీ ద్వితీయశ్రేణి నేతలు ఆదవ్ అర్జున, నిర్మల్‌కుమార్ తదితరులు పరామర్శించారు. బాధితులతో కలిసి మీడియా ప్రతినిధులతో వారు మాట్లాడుతూ... రౌడీమూకతో తమపై మంత్రి పి.కె.శేఖర్‌బాబు ఈ దాడి చేయించారని ఆరోపించారు. క్షతగాత్రుల్లో ఇద్దరు ఐసీయూలో ఉండగా మిగతా నలుగురు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. ఎన్నికల్లో ఓటమి భయంతోనే ఈ దాడికి పాల్పడ్డారని ఆరోపించారు.

మీడియా ప్రతినిధులతో మాట్లాడుతున్న టీవీకే నిర్వాహకులు

దాడిని ఖండించిన విజయ్

దాడిలో గాయపడిన నిర్వాహకులు త్వరగా కోలుకోవాలని టీవీకే అధ్యక్షుడు విజయ్ తన 'ఎక్స్' పేజీలో ఆకాంక్షించారు. టీవీకేకు పెరిగిన ప్రజామద్దతును చూసి ఓర్వలేక ఇలాంటి హింసాత్మక చర్యలకు అధికార పార్టీ పాల్పడుతోందని ఆరోపించారు.

డీఎంకే కూటమిలో సీట్ల సర్దుబాటుకు శ్రీకారం

మిత్రపక్షాలతో 22న చర్చలు ప్రారంభం

చెన్నై, న్యూస్‌టుడే: రానున్న శాసనసభ ఎన్నికల్లో మిత్రపక్షాలకు సీట్ల సర్దుబాటు చేసేందుకు డీఎంకే కూటమి నాయకత్వం శ్రీకారం చుట్టింది. కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు మంగళవారం పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. 17న రాష్ట్ర ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను సమర్పించనున్న నేపథ్యంలో శాసనసభ కార్యక్రమాలు పూర్తయిన తర్వాత 22న మిత్రపక్షాలతో సీట్ల సర్దుబాటు చర్చలను కమిటీ ప్రారంభిస్తుందని వెల్లడించింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఏర్పడిన మెగా కూటమి ఇంకా కొనసాగుతుండటంతో అదే జట్టుతో బలంతో ఈ ఎన్నికల్లోకి అడుగుపెట్టాలని నిర్ణయించింది. ఇప్పటివరకు సీట్ల సర్దుబాటు చర్చలకు కమిటీని ఏర్పాటు చేయకపోవడంపై పలు విమర్శలు వినిపించాయి. కూటమిలోని పలు పార్టీలు అధికారంలో భాగస్వామ్యం, మరిన్ని సీట్ల డిమాండ్‌తో ఉండటంతో ఈ వ్యవహారం తనకు ప్రతికూలంగా మారొచ్చని డీఎంకే అధిష్ఠానం భావిస్తున్నట్లు అభిప్రాయాలు వినిపించాయి. ఈ నేపథ్యంలో తాజా ప్రకటన వెలువడింది.

సజావుగా జరుగుతాయి..

సెల్వ పెరుంతగై

చెన్నై: డీఎంకే కూటమిలో సీట్ల సర్దుబాటు చర్చలు సజావుగా పూర్తవుతాయని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుంతగై ఆశాభావం వ్యక్తం చేశారు. దిల్లీ నుంచి తిరిగొచ్చిన సందర్భంగా చెన్నై విమానాశ్రయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. తమ అభ్యర్థన మేరకు శాసనసభ సమావేశం తర్వాత 22న సీట్ల సర్దుబాటు చర్చలకు ఆహ్వానించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. వీలైనంత త్వరగా ప్రజల వద్దకు డీఎంకే నేతృత్వంలోని 'ఇండియా' కూటమి వెళ్లాలన్నారు. డీఎంకే కూటమిలో కాంగ్రెస్ కొనసాగుతుందని, తమ కూటమి పటిష్ఠంగా ఉందని పేర్కొన్నారు.

రైల్వే ప్రాజెక్ట్‌లకు భూసేకరణలో రాష్ట్ర ప్రభుత్వ జాప్యం అవాస్తవం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రైల్వే ప్రాజెక్ట్‌లకు భూసేకరణలో తమిళనాడు ప్రభుత్వం జాప్యం చేస్తోందని కేంద్ర రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్ తప్పుడు సమాచారం ఇచ్చారని రాష్ట్ర రవాణా శాఖమంత్రి శివశంకర్ తెలిపారు. బుధవారం ఆయన తిరుచ్చిలో విలేకరులతో మాట్లాడారు. గత ఐదేళ్లలో తమిళనాడు ప్రభుత్వం 148.65 హెక్టార్ల విస్తీర్ణంలో 7 రైల్వే ప్రాజెక్ట్‌లకు పరిపాలనా ఆమోదం మంజూరు చేసిందన్నారు. 128.41 హెక్టార్ల విస్తీర్ణంలో 2 ప్రధాన ప్రాజెక్టులకు భూసేకరణ పనులు పూర్తయ్యాయని చెప్పారు. తిరువనంతపురం-కన్నియాకుమరి మధ్య బ్రాడ్‌గేజ్ రైల్వే ప్రాజెక్ట్‌ను త్వరితగతిన పూర్తి చేయడానికి అవసరమైన రూ.298.78కోట్లను కేంద్ర రైల్వేశాఖ విడుదల చేయలేదన్నారు. తమిళనాడు రైల్వే ప్రాజెక్ట్‌లకు కేవలం రూ.739.31కోట్లు మాత్రమే అందించడంతో భూసేకరణలో ఇబ్బంది నెలకొందని తెలిపారు.

అన్నాడీఎంకేను అధికారంలోకి తీసుకొద్దాం

ఎంజీఆర్, జయలలిత చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న నాయకులు

సైదాపేట, న్యూస్‌టుడే: డీఎంకే ప్రభుత్వ అవకతవకలు ప్రజలకు తెలియజేద్దామని అన్నాడీఎంకే సాహిత్య విభాగ సమావేశంలో ఆమోదించారు. జయలలిత 78వ జయంతి ఘనంగా జరుపుకోవటం, రానున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి అన్నాడీఎంకే సాహిత్య విభాగ ఆలోచనా సమావేశం బుధవారం అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయంలో జరిగింది. మాజీ మంత్రి వైగై సెల్వన్ నేతృత్వం వహించారు. అన్నాడీఎంకేకు అధికారంలోకి తేవటం తదితర తీర్మానాలు ఆమోదించారు. మాజీ మంత్రులు పొన్నయ్యన్, జయకుమార్, వళర్మతి తదితర పలువురు నేతలు పాల్గొన్నారు.

ఎస్పీఏ ఆందోళన సమయంలో మార్పు

చెన్నై, న్యూస్‌టుడే: డీఎంకే నేతృత్వంలోని లౌకికవాద ప్రగతిశీల కూటమి తరపున గురువారం జరగనున్న భారీ ఆందోళన సమయాన్ని మార్చారు. కేంద్ర బడ్జెట్‌లో తమిళనాడుకు జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా, వంద రోజుల ఉపాధి హామీ నిర్వీర్యం చేసేలా చట్టం, అమెరికా వాణిజ్య ఒప్పందం వంటి వ్యతిరేక విధానాలను నిరసనగా రాష్ట్రంలోని అన్ని నగరాలు, పార్టీ యూనియన్, పట్టణ పంచాయతీ స్థాయిలో గురువారం ఉదయం 10.30కు ఆందోళనలు చేపట్టనున్నట్లు లౌకికవాద ప్రగతిశీల కూటమి ఇప్పటికే ప్రకటించింది. అదే సమయంలో కార్మిక సంఘాలు సమ్మె, ధర్నా చేపట్టనుండటంతో తమ ఆందోళనను సాయంత్రం 4 గంటలకు మార్చినట్లు వెల్లడించింది.

అన్నింటా రాష్ట్రానికి అన్యాయం: ముఖ్యమంత్రి స్టాలిన్

ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి

చెన్నై, న్యూస్‌టుడే: కేంద్రంలోని భాజపా ప్రభుత్వం అన్నింటిలోనూ తమిళనాడుకు అన్యాయం, ద్రోహం చేస్తోందని ముఖ్యమంత్రి స్టాలిన్ విమర్శించారు. 'ఇండియా టుడే' తరపున నిర్వహించిన 'తమిళనాడు రౌండ్ టేబుల్' కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. ఓ సర్వే ప్రకారం డీఎంకే కూటమి 45 శాతం మద్దతుతో ముందంజలో ఉండగా రెండో స్థానానికి ఉన్న తేడా 12 శాతమన్నారు. ఇది అఖండ విజయమని, అలాగని తాము నిర్లక్ష్యంగా ఉండబోమని తెలిపారు. గతేడాది ఆర్థికాభివృద్ధి రేటు 11.19 శాతం ఉందని, ఈ రెండంకెల సంఖ్య ప్రగతిని చివరగా 14ఏళ్ల కిందట అందుకున్నట్లు గుర్తు చేశారు. అదికూడా డీఎంకే ప్రభుత్వంలోనే అన్నారు. 65కుపైగా కేంద్ర ప్రభుత్వ పురస్కారాలు రాష్ట్రానికి దక్కాయన్నారు. తమ ప్రభుత్వ పథకాలను ఇతర రాష్ట్రాల్లో అమలు చేసేందుకు అధికారులు ఇక్కడికొస్తున్నారని పేర్కొన్నారు. ఇంతటి మేలు చేసే డీఎంకే ప్రభుత్వానికి కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ఇబ్బందులు కలిగించడాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. నిధుల పంపిణీ, పన్నుల వాటా, ప్రత్యేక ప్రాజెక్టులు, రైల్వే ప్రాజెక్టులు తదితర అన్నింటిలోనూ రాష్ట్రానికి అన్యాయం, ద్రోహం చేస్తోందని ఆరోపించారు. ప్రస్తుత కేంద్ర బడ్జెట్‌లోనూ రాష్ట్రానికి కేటాయింపులు 'జీరో'నే అన్నారు. ఎన్డీయే కూటమికి అదే జీరోను ప్రజలు తిరిగి ఇస్తారని తెలిపారు. గవర్నర్‌తో దుష్ప్రచారం చేసి రాజకీయంగా రెచ్చగొడుతోందని, విద్వేషాలతో సమస్యలను సృష్టించి చలి కాచుకోవాలని భావిస్తోందని ఆరోపించారు.

రాష్ట్రంలో మైనారిటీ ప్రజలు సురక్షితంగా ఉన్నారు

ప్యారిస్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మైనారిటీ ప్రజలు సురక్షితంగా ఉన్నారని ఎంపీ కనిమొళి తెలిపారు. డీఎంకే ఎన్నికల మేనిఫెస్టో తయారీ కమిటీ ఛైర్మన్, ఎంపీ కనిమొళి బుధవారం మదురై వచ్చారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ... ప్రజల అంచనాలు, ప్రాంత అవసరాలు మేనిఫెస్టోలో ఉంటాయన్నారు. డీఎంకే ఎన్నికల హామీలు నెరవేరుస్తుందనే నమ్మకం ప్రజల్లో ఉందని చెప్పారు. మదురై ఎయిమ్స్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడమే ఆలస్యానికి ముఖ్య కారణమన్నారు. భాజపా అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో మైనారిటీల పరిస్థితి ఎలా ఉందో అందరికీ తెలుసన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ కనిమొళి

నేడు పుదుచ్చేరి శాసనసభ సమావేశం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పుదుచ్చేరి శాసనసభ సమావేశం గురువారం ఉదయం 9.30కు స్పీకర్ ఏంబలం సెల్వం ప్రసంగంతో ప్రారంభం కానుంది. ముఖ్యమంత్రి రంగసామి మధ్యంతర బడ్జెట్ దాఖలు చేయనున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి అదనపు ఖర్చులకు సభ ఆమోదం కోరనున్నారు. అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేయనున్నారు. నకిలీ ఔషధాల వ్యవహారం, ప్రభుత్వ అవినీతి ఆరోపణలు లేవనెత్తాలని ప్రతిపక్షాలైన కాంగ్రెస్, డీఎంకే యోచిస్తున్నాయి. శాసనసభ ప్రాంగణాన్ని బుధవారం స్పీకర్ సెల్వం పరిశీలించారు.

అసెంబ్లీలో ట్యాబ్‌ను పరిశీలిస్తున్న స్పీకర్ సెల్వం

మార్చి 5లోపు పళనిని జిల్లాగా ప్రకటించాలి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పళనిని మార్చి 5లోపు జిల్లాగా ప్రకటించాలని భాజపా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అన్నామలై డిమాండ్ చేశారు. హామీ ఇచ్చి నెరవేర్చని డీఎంకే ప్రభుత్వ తీరుని ఖండిస్తు భాజపా తరపున పళనిలో మంగళవారం సాయంత్రం ఆందోళన జరిగింది. అన్నామలై మాట్లాడుతూ.. పళని ఆలయ నగరంగా కాక అపరిశుభ్రతతో నిండుకున్న నగరంగా మారిందన్నారు. 3లక్షల మంది జనాభా ఉన్న పళని శుభ్రమైన నగరాల జాబితాలో దేశంలో 585వ స్థానంలో ఉందన్నారు. దిండుగల్‌లో ఇద్దరు మంత్రులున్నా ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. శాసనసభ ఎన్నికల తేదీ ప్రకటనకు ముందే పళనిని జిల్లాగా ప్రకటించాలన్నారు.

ప్రసంగిస్తున్న అన్నామలై

మెరినాలో ముమ్మరంగా బ్లూఫ్లాగ్ గుర్తింపు పనులు

చెన్నై, న్యూస్‌టుడే: మెరినాలో బ్లూఫ్లాగ్ గుర్తింపు రెండోవిడత పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పర్యావరణానికి అనుగుణమైన, శుభ్రమైన బీచ్‌లకు అందించే బ్లూఫ్లాగ్ సర్టిఫికెట్ కోవళం బీచ్‌కు మాత్రమే లభించింది. చెన్నై మెరినాతో పాటు కడలూర్, రామనాథపురం, తూత్తుకుడిలోని బీచ్‌లకూ ఈ గుర్తింపు పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. తొలుత మెరినా బీచ్‌ను తీర్చిదిద్దడానికి చెన్నై మహానగర పాలకసంస్థ(జీసీసీ) చర్యలు చేపట్టింది. ఇక్కడ 4 విడతలుగా పనులు చేపట్టాలని నిర్ణయించి ఆ మేరకు ఇప్పటికే ఈత కొలను వద్ద రూ.7.31 కోట్లతో తొలి విడత

రెండో విడత పనుల్లో కల్పించిన వసతులు

ముగించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చింది. వివేకానంద హౌస్ ఎదురుగా ఉన్న బీచ్ ప్రాంతంలో రెండో విడత పనులను జనవరిలో ప్రారంభించింది. రూ.7కోట్లతో జరుగుతున్న పనుల్లో భాగంగా వెదురు బొంగులతో చేసిన కుర్చీలు, నీడనిచ్చే భారీ గొడుగులు, నిఘా గోపురాలు, 4చోట్ల పిల్లల ఆట స్థలాలు, 2 పఠన కేంద్రాలు, 2 చోట్ల సెల్ఫీ పాయింట్లను ఏర్పాటు చేసింది. పురుషులు, మహిళలు, ట్రాన్స్‌జెండర్లు, దివ్యాంగులకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు ఏర్పాటు చేసింది. ప్లాస్టిక్ చెత్త బుట్టలకు బదులు వెదురుతో చేసినవి ఏర్పాటు చేయనున్నారు. ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని నివారించేలా పసుపు వస్త్ర సంచుల యంత్రాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రాజెక్టు పనుల్లో 90శాతం పూర్తయిన నేపథ్యంలో మిగిలిన త్వరగా ముగించి నెలాఖరులోపు ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు జీసీసీ యంత్రాంగం ప్రయత్నిస్తోంది.

చెన్నై మహానగర పాలక సంస్థ బడ్జెట్ 18న సమర్పణ

చెన్నై, న్యూస్‌టుడే: చెన్నై మహానగర పాలక సంస్థ(జీసీసీ) 2026-27వ ఏడాది బడ్జెట్‌ను 18న కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో సమర్పించనున్నారు. బడ్జెట్‌పై 20న చర్చ జరగనుంది. అనంతరం బడ్జెట్‌ను ఆమోదించనున్నారు. శాసనసభ ఎన్నికలు సమీపించిన నేపథ్యంలో బడ్జెట్ సమర్పిస్తుండటంతో ఇందులో పలు ప్రకటనలు చోటుచేసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కొత్త వంతెనలు, వాననీటి పారుదల కాలువలు, మహిళలకు కొత్త పథకాలు, ఘనవ్యర్థ నిర్వహణ, ప్రత్యేక పథకాల ప్రకటనలు ఉంటాయని, విద్య, రోడ్డు వసతి, రవాణా తదితర పనులకు ప్రాధాన్యం ఇచ్చి అదనపు నిధులు కేటాయించనున్నట్లు సమాచారం.

అన్నాడీఎంకే అధికారంలోకి రాగానే టాస్మాక్ ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చుతాం

సైదాపేట, న్యూస్‌టుడే: తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే టాస్మాక్ ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చుతామని అన్నాడీఎంకే మాజీ మంత్రి తంగమణి తెలిపారు. టాస్మాక్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామన్న హామీని నెరవేర్చని డీఎంకే ప్రభుత్వ తీరును ఖండిస్తూ అన్నా కార్మిక సంఘ పేరవై తరపున ర్యాలీ నిర్వహించారు. అనంతరం తంగమణి మాట్లాడుతూ.. కల్తీ సారాను నిర్మూలించేందుకు జయలలిత హయాంలో టాస్మాక్ సంస్థను ప్రారంభించారని, తద్వారా 37 వేల మందికి జీవనోపాధి లభించిందన్నారు. ప్రస్తుత డీఎంకే పాలనలో టాస్మాక్ ద్వారా ఏడాదికి రూ.50 వేల కోట్ల ఆదాయం వస్తోందని తెలిపారు. అన్నాడీఎంకే పాలనలో నియమించారనే కారణంతో టాస్మాక్ సిబ్బందిని ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు.

ర్యాలీగా వెళ్తున్న టాస్మాక్ ఉద్యోగులు

తాత్కాలిక శుభ్రతా కార్మికులకు విధులు

ప్యారిస్, న్యూస్‌టుడే: తాత్కాలిక శుభ్రతా కార్మికులు 1400 మందికి 4, 8 జోన్‌లలో మళ్లీ పని కల్పించేందుకు చెన్నై మహానగర పాలక సంస్థ(జీసీసీ) ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో పారిశుద్ధ్య పనులను ప్రైవేటుకు అప్పగించడానికి వ్యతిరేకత తెలిపి కార్మికుల హక్కుల ఉద్యమం దాఖలు చేసిన పిటిషన్‌ను ముగించేస్తూ మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. జీసీసీలోని 5, 6 జోన్‌లలో పారిశుద్ధ్య పనులను ప్రైవేటుకు అప్పగిస్తూ తీర్మానం తీసుకొచ్చిందని శ్రామికుల హక్కుల ఉద్యమం తరపున మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఇది న్యాయమూర్తులు జస్టిస్ ఎస్ఎమ్ సుబ్రహ్మణ్యం, జస్టిస్ కుమరప్పా ధర్మాసనంలో మంగళవారం విచారణకు వచ్చింది. అప్పుడు శ్రామికుల హక్కుల ఉద్యమం తరపున నివేదిక దాఖలు చేశారు. 5, 6 జోన్‌లలోని తాత్కాలిక శుభ్రతా కార్మికులు 1,400 మందిని 4, 8 జోన్‌లలో మళ్లీ పని కల్పించేందుకు జీసీసీ ఆమోదం తెలిపిందన్నారు. ఆమోదించిన న్యాయమూర్తులు కార్మికుల హక్కుల ఉద్యమం దాఖలు చేసిన పిటిషన్‌ను ముగించేశారు.

విజయ్ పోటీ ఎక్కడి నుంచి?

వి అక్షరంతో ఉన్న స్థానాల పరిశీలన

చెన్నై, న్యూస్‌టుడే: రాబోయే శాసనసభ ఎన్నికల్లో రాజకీయ తమిళగ వెట్రి కళగం(టీవీకే) అధ్యక్షుడు విజయ్ పోటీ చేయనున్న నియోజకవర్గాన్ని గుర్తించేందుకు కసరత్తు జరుగుతోంది. ఆయన పేరులోని తొలి అక్షరం 'వి'తో ప్రారంభమవుతున్న నేపథ్యంలో అదే అక్షరంతో ఉన్న నియోజకవర్గాలను పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

సెంటిమెంట్ దృష్ట్యా..

'వి' అక్షరమున్న నియోజకవర్గం నుంచి పోటీ చేస్తే గెలుపు తథ్యమని ఓ జ్యోతిష్యుడు సూచించాడని మరో కథనం ప్రచారంలో ఉంది. అందుకే అలాంటి నియోజకవర్గాల్లో విజయావకాశాలను పార్టీ ద్వితీయశ్రేణి నేతలతో ఇప్పటికే ఆయన చర్చించారని వినికిడి. విరుగంబాక్కం, వేళచ్చేరి నుంచే పోటీకి మొగ్గు చూపొచ్చని, అక్కడి స్థానిక బలం రాజకీయంగానూ కలిసొస్తుందని పలువురు విశ్లేషిస్తున్నారు.

విజయ్

చివరి వరకు సస్పెన్స్?

తమపై ఆరోపణలతో విరుచుకుపడుతున్న విజయ్‌కు ఈ ఎన్నికల్లో గట్టి గుణపాఠం చెప్పాలని డీఎంకే భావిస్తోంది. ఆయన పోటీ చేసే నియోజకవర్గంలో తమ పార్టీ అభ్యర్థిని రంగంలోకి దించాలని, భారీ మెజారిటీతో విజయ్‌ను ఓడించాలని తహతహలాడుతోంది. ఈ విషయం గ్రహించడంతో తాను పోటీ చేసే నియోజకవర్గాన్ని చివరి వరకు రహస్యంగా ఉంచాలని విజయ్ నిర్ణయించారని సమాచారం. ప్రస్తుతం ఐదు శాసనసభ నియోజకవర్గాలను పరిశీలించినా తుది నిర్ణయాన్ని ఆలస్యంగా ప్రకటిస్తారని ప్రచారం జరుగుతోంది.

పార్టీ వర్గాల అన్వేషణ

టీవీకే ముఖ్యమంత్రి అభ్యర్థిగా విజయ్ పేరును ఇప్పటికే ఖరారు చేయడంతో ఎన్నికల్లో ఆయన పోటీ చేయనున్న నియోజకవర్గం గురించి తెలుసుకోవాలనే ఆసక్తి సర్వత్రా నెలకొంది. చెన్నైలోని వేళచ్చేరి, విరుగంబాక్కం, విళుప్పురం జిల్లాలోని విక్రవాండి, నాగపట్టినం జిల్లాలోని వేదారణ్యం, దిండుగల్ జిల్లాలోని వేడసందూర్ నియోజకవర్గాలను విజయ్ పరిశీలనలోకి తీసుకున్నారని వినికిడి. వాటిలో విరుగంబాక్కంలో తన తల్లిదండ్రులు నివసిస్తుండగా పనైయూర్ నివాసానికి, పార్టీ కార్యాలయానికి వేళచ్చేరి కొద్ది దూరంలో ఉన్నాయి. టీవీకే తొలి రాజకీయ మహానాడు జరిగిన ప్రాంతం విక్రవాండి కావడం గమనార్హం. ఇక్కడి నుంచే ఆయన తన రాజకీయ లక్ష్యాలను, విధానాలను ప్రకటించారు.

(c) eenadu

విద్యా సహాయం పంపిణీ

చెక్కు అందిస్తున్న కె.పిచ్చాండి, విశ్వనాథన్

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: తిరువణ్ణామలైలో వీఐటీ కులపతి జి.విశ్వనాథన్ 242 మంది కళాశాల విద్యార్థులకు రూ.28 లక్షల విలువైన విద్యా సహాయం పంపిణీ చేశారు. శాసనసభ ఉప సభాపతి కె.పిచ్చాండి ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. మాజీ మంత్రులు అగ్రి కృష్ణమూర్తి, సేవూర్ రామచంద్రన్, ఎమ్మెల్యే శరవణన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో కంటతడి పెట్టిన మంత్రి

ఆవేదనతో మాట్లాడుతున్న మంత్రి గాంధీ

అరక్కోణం న్యూస్‌టుడే: రాణిపేటలోని విశ్వాస్ బుద్ధిమాంద్యులు, వికలాంగుల ప్రత్యేక పాఠశాలలో మంత్రి గాంధీ కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ పాఠశాలలో ఉంటున్న జాఫర్‌కు పుట్టుకతోనే మెదడులో లోపం కారణంగా మానసిక ఎదుగుదల లేకపోయింది. తల్లిదండ్రులు చికిత్స చేయించలేని స్థితిలో ఉండటంతో 29 ఏళ్ల కిందట ఇక్కడ చేర్పించారు. ఆయన 30వ జన్మదినోత్సవంలో మంత్రి ఆర్.గాంధీ, ఆయన సతీమణి కమల గాంధీ, కుమారుడు వినోద్‌గాంధీ పాల్గొన్నారు. మంత్రి కేక్ కట్టిరించి జాఫర్‌కు తినిపించారు. జాఫర్ తల్లి నూర్జహాన్ తన కుమారుడి స్థితిని వివరించడంతో మంత్రి చలించిపోయి కన్నీటి పర్యంతమయ్యారు.

ఆసుపత్రిలో చేరిన మంత్రి దురైమురుగన్

చెన్నై: డీఎంకే ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దురైమురుగన్ ఆస్పత్రిలో చేరారు. నగరంలోని నివాసంలో మంగళవారం రాత్రి ప్రమాదవశాత్తు కిందపడి గాయపడ్డ ఆయనను కుటుంబ సభ్యులు గ్రీమ్స్ రోడ్డులోని అపోలో ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి స్టాలిన్ ఆస్పత్రికి వెళ్లి మంత్రిని పరామర్శించి వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. వయోభార ఆరోగ్య సమస్యల కారణంగా కొంతకాలంగా మంత్రి పలు పర్యాయాలు ఆస్పత్రిలో చికిత్స పొందడం గమనార్హం.

జాతీయ రహదారుల నిర్మాణంలో జాప్యం

వడపళని, న్యూస్‌టుడే: జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) ఆధ్వర్యంలో జరుగుతున్న పనులు గడువులోగా ముగియడంలేదు. చెన్నై-తిరుపతి మార్గంలోని 44 కి.మీ మినహా చెన్నైను కలిపే ఏ ప్రధాన ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్టులు ప్రారంభానికి సిద్ధంగా లేవని కేంద్ర మంత్రిత్వ శాఖ ఇటీవల పార్లమెంటులో తెలిపింది.

✦ చెన్నైను కలిపే అనేక ప్రధాన మార్గాలు ఎన్నికల తర్వాతే ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. వాటిలో కొత్తగా బెంగళూరు-చెన్నై ఎక్స్‌ప్రెస్ వే, అరక్కోణం, కాంచీపురం మధ్య 54 శాతం వరకు మాత్రమే పనులు జరిగాయి. ప్రస్తుత చెన్నై-బెంగళూరు హైవే(ఎన్‌హెచ్-48)లో శ్రీపెరుంబుదూరు, కవరైపేట్టై మధ్య ఆరు లేన్ల నిర్మాణం కూడా పెండింగులోనే ఉన్నాయి. ఈసీఆర్ రోడ్డులోని మామల్లపురం నుంచి మరక్కాణం మార్గంలో నిర్మాణం కూడా ముందుకు సాగడం లేదు. ఈ ప్రాజెక్టులకు గడువు ఈ డిసెంబరు నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు గడువుందని అధికారులు పేర్కొంటున్నారు.

చెన్నై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌వేలో అసంపూర్తిగా ఉన్న నిర్మాణం

✦ బెంగళూరు హైవే(ఎన్‌హెచ్-48) పదేళ్లకు పైగా నిర్మాణంలో ఉంది. సర్వీస్ రోడ్డు అసంపూర్ణంగా ఉన్నా సంకేతాలు, లైట్లు ఏర్పాటు చేశారని పూందమల్లి నివాసి సెంథిల్ కుమార్ చెప్పారు.

✦ నాలుగేళ్లలో తమిళనాడులో జాతీయ హైవే ప్రాజెక్టులకు రూ.48,862 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్ర రవాణా మంత్రి నితిన్ గడ్కరీ పార్లమెంట్‌లో ఓ ప్రశ్నకు ఇచ్చిన సమాధానంలో తెలిపారు. అందులో ఇప్పటివరకు రూ.27,706 కోట్లు మాత్రమే వెచ్చించిందని పేర్కొన్నారు.

✦ బెంగళూరు-చెన్నై ఎక్స్‌ప్రెస్ వేలో గత మే నెలలో పనులు ఆగిపోయాయి. గుత్తేదారుకు ఆర్థిక సమస్యలు తలెత్తాయి. అధికారులు ప్రత్యామ్నాయం కోసం మళ్లీ పనులు ప్రారంభించాల్సి వచ్చిందని ఎన్‌హెచ్‌ఏఐ చెన్నై విభాగ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. భూసేకరణ, పరిహారం చెల్లింపు, పెండింగులో ఉన్న అనుమతుల కారణంగా జాప్యమైంది. ఫలితంగా గడువును ఈ ఏడాది వరకు పొడిగించారు.

✦ ఎన్నికలకు ముందుగా ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్టులు కొన్ని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. చెన్నై-తిరుపతి హైవేతోపాటు పాటు 99శాతం పూర్తయిన ఎన్‌హెచ్-744లో 35 కి.మీ వరకున్న వడుగపట్టి-తెర్కువెంగనల్లూర్, మదురై రింగ్ రోడ్డులోని వాడిపట్టి సెక్షన్, 45 కి.మీ మేర మేలూర్- కారైక్కుడి హైవేలోని నాలుగు లేన్లను ప్రారంభించాల్సి ఉందని మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు.

13న తిరుచ్చికి అమిత్‌షా రాక

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తమిళనాడు, కారైక్కాల్‌లో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా శుక్రవారం(13న) తిరుచ్చికి విచ్చేయనున్నారు. ఆ రోజు రాత్రి స్థానికంగా బస చేయనున్నారు. మరుసటిరోజు తిరుచ్చి విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో కారైక్కాల్ వెళ్లనున్నారు. కారైక్కాల్ మున్సిపాలిటీ మైదానంలో భాజపా తరఫున ఏర్పాటు చేసిన బహిరంగసభలో ప్రసంగించనున్నారు. అనంతరం తిరుచ్చికి వచ్చి సేలం బయలుదేరి వెళ్లనున్నారు. అక్కడ భాజపా సెంట్రల్ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. తిరుచ్చి తిరువానైక్కావల్ శ్రీమత్ ఆండవన్ ఆర్ట్స్ కళాశాలలో వ్యాపారవేత్తల సదస్సుకు కూడా హాజరవనున్నారు. ఎన్నికలకు సంబంధించి పార్టీ నిర్వాహకులతో సమావేశం జరిపే అవకాశాలు ఉన్నాయని భాజపా వర్గాలు తెలిపాయి.

సంకీర్ణమా.. ఏక పార్టీ ప్రభుత్వమా?

● ప్రజలే నిర్ణయిస్తారు: మాణిక్కం ఠాకూర్

వేళచ్చేరి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో రానున్నది సంకీర్ణ ప్రభుత్వమా, లేక ఏకపార్టీ ప్రభుత్వమా అనేది ప్రజలే నిర్ణయిస్తారని కాంగ్రెస్ ఎంపీ మాణిక్కం ఠాకూర్ తన ఎక్స్ పేజీలో తెలిపారు. ఎన్నికలయ్యే వరకు వేచి చూడాలని పేర్కొన్నారు.

రాజకీయాల్లో డీఎంకే మాత్రమే శత్రువు

ఎంపీ సి.వి.షణ్ముగం

వేళచ్చేరి, న్యూస్‌టుడే: రాజకీయాల్లోకి ఎవరు వచ్చినా, నిష్క్రమించినా తమకు డీఎంకే మాత్రమే శత్రువని అన్నాడీఎంకే మాజీ మంత్రి, రాజ్యసభ ఎంపీ సి.వి.షణ్ముగం తెలిపారు. దిండివనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో పలువురు రాజకీయాల్లోకి వచ్చారని పలువురి పేర్లు గుర్తు చేశారు. ఇప్పుడు ఎవరో(విజయ్) ప్రవేశించారని, కావాలంటే సినిమా థియేటర్‌లో ఈలలు వేయొచ్చని, బస్సును ఆపాలన్నా విజిల్ వేయొచ్చన్నారు. అన్నాడీఎంకేకు ఓటు వేయకుండా ఎవరూ ఆపలేరని తెలిపారు. రాష్ట్రంలో పదేళ్లకు పైగా పార్టీ పెట్టు కొన్నందున, వాటి గురించి ఆలోచించాల్సిన అవసరం లేదన్నారు.

మేనిఫెస్టోల్లో పర్యావరణానికి ప్రాధాన్యం ఇవ్వాలి

● పూవులగిన్ నణ్బర్గల్

ప్యారిస్, న్యూస్‌టుడే: రానున్న శాసనసభ ఎన్నికలకు ఇప్పటికే పలు పార్టీలు మేనిఫెస్టోలు విడుదల చేస్తున్నారు. కొందరు నాయకులు సభల్లో హామీలు కూడా ఇస్తున్నారు. ఇందుకు భిన్నంగా పూవులగిన్ నణ్బర్గల్ అనే సంస్థ ప్రత్యేక ప్రకటన విడుదల చేసింది. పార్టీలు తమ మేనిఫెస్టోలో పర్యావరణహిత అంశాలు పొందుపర్చాలని కోరింది. ● అన్ని జిల్లాల్లో డివిజన్‌స్థాయిలో వాతావరణ సూచనలు అందించేందుకు రాష్ట్రంలో విభాగం ఏర్పాటు చేయాలి. ● వాతావరణ మార్పుల కారణంగా ఎక్కువ ప్రభావితమయ్యే అణగారిన వర్గాల ప్రజల జీవనోపాధి రక్షించేందుకు ప్రత్యేక విధానం తీసుకురావాలి. ● పశ్చిమ కనుమలు, దాని జీవ వైవిధ్యాన్ని రక్షించేందుకు దివంగత మాధవ్ గాడ్గిల్ ప్రకటించిన పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలి. ● తీవ్ర వేడి ప్రభావాన్ని నియంత్రించే చర్యలు చేపట్టేందుకు జిల్లాస్థాయిలో హీట్ ఆఫీసర్లను నియమించాలి. ● ఖనిజ వనరుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలి.

పార్టీ ఏజెంట్లు ఓటర్లందరినీ కలవాలి

ముఖ్యమంత్రి స్టాలిన్

మాట్లాడుతున్న సీఎం స్టాలిన్

మామల్లపురం, న్యూస్‌టుడే: రానున్న శాసనసభ ఎన్నికలు తమిళనాడు జట్టు గెలుస్తుందో లేక దిల్లీ జట్టు విజయం సాధిస్తుందో నిర్ణయిస్తాయని ముఖ్యమంత్రి స్టాలిన్ అన్నారు. చెంగల్పట్టు జిల్లా తిరువిడందైలో బుధవారం సాయంత్రం డీఎంకే పోలింగ్ ఏజెంట్ల సమావేశం నిర్వహించారు. చెన్నై, విల్లుపురం జోన్లలోని 49 నియోజక వర్గాలకు చెందిన సుమారు 1.70 లక్షల మంది పోలింగ్ ఏజెంట్లు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ డీఎంకే ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రతి ఇంటికీ వెళ్లి తెలియజేయాలని అన్నారు. ఏజెంట్లు ప్రజలతో స్నేహపూర్వకంగా మాట్లాడాలని సూచించారు. కేటాయించిన పోలింగ్ కేంద్రం పరిధిలో ఓటర్లను కనీసం 5 సార్లైనా కలవాలన్నారు.

ఎన్నికల నిర్వహణ కమిటీ ఏర్పాటు

సైదాపేట, న్యూస్‌టుడే: రానున్న అసెంబ్లీ ఎన్నికలకు భాజపా తరఫున నిర్వహణ కమిటీ ఏర్పాటు చేశారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ప్రకటన విడుదల చేశారు. కమిటీ అధ్యక్షుడిగా జాతీయ కార్యవర్గ సభ్యుడు పొన్.రాధాకృష్ణన్, ఉప అధ్యక్షులుగా ఎస్ఆర్ శేఖర్, ఆర్ఎస్ జయప్రకాష్, ఎం.వెంకటేశన్, మాలా స్వెల్వకుమార్, రామశ్రీనివాసన్ ఉన్నట్లు తెలిపారు.

పెరుగుతున్న చేపల ఉత్పత్తి

వడపళని, న్యూస్‌టుడే: దేశంలో ప్రస్తుతం దాదాపు 20 మిలియన్ టన్నుల చేపలు ఉత్పత్తి అవుతున్నాయని కేంద్ర మత్స్యకార సంయుక్త కార్యదర్శి సాగర్ మెహ్రా పేర్కొన్నారు. బుధవారం 'ప్రపంచ సీఫుడ్ కాంగ్రెస్' సందర్భంగా జరిగిన ప్రపంచ స్థాయి కార్యశాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కన్నప్పన్ తదితరులు పాల్గొన్నారు.

తుదిదశకు అశోక్‌నగర్ లైబ్రరీ నిర్మాణం

పనుల వివరాలు తెలుసుకుంటున్న మంత్రి శేఖర్‌బాబు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: చెన్నై అశోక్‌నగర్‌లో సీఎండీఏ తరఫున రూ.15 కోట్లతో చేపట్టిన సీఎం లైబ్రరీ భవన నిర్మాణ పనులను బుధవారం మంత్రి శేఖర్‌బాబు, చెన్నై మేయర్ ఆర్.ప్రియ పరిశీలించారు. 25న ముఖ్యమంత్రి స్టాలిన్ భవనాన్ని ప్రారంభించనున్నారని తెలిపారు. 17న ప్రవేశపెట్టనున్న ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రతిపక్షాలు విస్తుపోయేలా ఉంటుందన్నారు. పీఎంకేలో భాగంగా ఉన్న అన్బుమణి మాటలకు సమాధానమిచ్చే బాధ్యుడను కాదన్నారు. అన్నాడీఎంకే నుంచి గెంటేసిన సెంగోట్టయ్యన్, కేపీ కప్పన్ వద్ద ఎడప్పాడి పళనిసామి గురించి అడిగితే వాళ్లే చెబుతారన్నారు. మంగళవారం చెన్నై ప్యారిస్‌లో ప్రజలకు టీవీకేకు జరిగిన ఘర్షణతో డీఎంకేకు సంబంధం లేదని, గాయపడిన ప్రజలు రాజీవ్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు.

విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ

విద్యార్థులతో మంత్రి నాజర్ తదితరులు

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూర్ సమీపం తిరుపాచ్చూరులో ఉలగం ఉంగల్ కైయిల్ పథకం కింద 102 ప్రైవేటు కళాశాలల విద్యార్థులకు బుధవారం మంత్రి నాజర్ ఉచిత ల్యాప్‌టాప్‌లు అందించారు. ఎమ్మెల్యేలు రాజేంద్రన్, గోవిందరాజన్, కృష్ణస్వామి, చంద్రన్, జిల్లా కలెక్టర్ ప్రతాప్ పాల్గొన్నారు.

నేడు కొరుక్కుపేట్టై పైవంతెన ప్రారంభం

పైవంతెనను పరిశీలిస్తున్న మంత్రులు కె.ఎన్.నెహ్రూ, పి.కె.శేఖర్‌బాబు

చెన్నై, న్యూస్‌టుడే: కొరుక్కుపేట్టైలో పైవంతెనను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. నేపథ్యంలో ఏర్పాట్లను మంత్రులు కె.ఎన్.నెహ్రూ, పి.కె.శేఖర్‌బాబు బుధవారం పరిశీలించారు. చెన్నై మహానగర పాలక సంస్థ(జీసీసీ) తరఫున కొరుక్కుపేట్టైలోని రైల్వే 2బి జంక్షన్‌లో రూ.96.04 కోట్లతో పైవంతెనను నిర్మించగా కొరుక్కుపేట్టై నుంచి ఎన్నూర్ వెళ్లే రోడ్డులో ట్రాఫిక్ నియంత్రణ దృష్ట్యా రూ.75 కోట్లతో కొరుక్కుపేట్టై-ఎన్నూర్ 2ఏ జంక్షన్‌లో పైవంతెన నిర్మించనున్నారు. నిర్మితమైన పైవంతెనను గురువారం ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. కొత్త పైవంతెనకు శంకుస్థాపన చేయనున్నారు.

అన్నాడీఎంకేలో చేరిన కళాశాల విద్యార్థులు

విద్యార్థులతో ఈపీఎస్

సైదాపేట, న్యూస్‌టుడే: కళాశాల విద్యార్థులు అన్నాడీఎంకేలో చేరారు. సవిత, వేల్స్, హిందుస్తాన్ క్రిసెంట్, ఎస్ఆర్ఎం తదితర ప్రైవేటు కాలేజీలకు చెందిన 300 మందికి పైగా విద్యార్థులు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామిని కలిసి ఆ పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఎంజీఆర్ యువజన విభాగ ఉప కార్యదర్శి కేవీస్ కార్తికేయన్ పాల్గొన్నారు.

మోదీ పాలనలో తెలుగువారు క్షేమంగా ఉన్నారు

పొంగులేటి సుధాకర్‌రెడ్డిని సత్కరిస్తున్న దేవరకొండ రాజు తదితరులు

టీనగర్: ప్రధాని మోదీ నాయకత్వంలో తెలుగు ప్రజలు క్షేమంగా ఉన్నారని, వారికి పలు పథకాలు అందుతున్నాయని భాజపా నేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి కొనియాడారు. తమిళనాడు తెలుగు పీపుల్ ఫౌండేషన్ వార్షికోత్సవం మంగళవారం చెన్నైలో జరిగింది. సంస్థ అధ్యక్షుడు దేవరకొండ రాజు, నిర్వాహకులు లావణ్య నిడుమోరి, తమిళనాడు భాజపా ఉపాధ్యక్షుడు చక్రవర్తి, మాజీ ఎంపీ కేవీస్ రాధాకృష్ణన్, భాజపా తమిళనాడు విభాగ ప్రతినిధి ఏఎన్ఎస్ ప్రసాద్, అమర్‌ప్రసాద్‌రెడ్డి, రమేష్, జేఎం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

Before the V Addl.
Motor Accident Claims
Tribunal : Nellore, A.P.
M.V.O.P.No. 236/2025
Kathi Venkateswarlu
... Claimant
Vs
1.R.Raghunath and 2 others
... Respondents
Notice to IIIrd Respondent
Jayamani Harihara Sudhan
S/o Jayamani, Karnadhan Koyal, Kuthanalluru Taluk, Tiruvaarur Dist. Tamilnadu State.
Please Take Notice that above case is posted to 25-02-2026 for your notice and appearance at 10.30 A.M. before the above said court. You may appear either in person or through an advocate and file you objection ifany, Failling which the matter will be decided exparte.
P.Srinivasulu, M.A.,B.L.,
Advocate for the Claimant, Kavali

Before the V Addl.
Motor Accident Claims
Tribunal : Nellore, A.P.
M.V.O.P.No. 300/2025
Komaragiri Anil
... Claimant
Vs
1.R.Raghunath and 2 others
... Respondents
Notice to IIIrd Respondent
Jayamani Harihara Sudhan
S/o Jayamani, Karnadhan Koyal, Kuthanalluru Taluk, Tiruvaarur Dist. Tamilnadu State.
Please Take Notice that above case is posted to 25-02-2026 for your notice and appearance at 10.30 A.M. before the above said court. You may appear either in person or through an advocate and file you objection ifany, Failling which the matter will be decided exparte.
P.Srinivasulu, M.A.,B.L.,
Advocate for the Claimant, Kavali

రైళ్ల సమాచారం

వడపళని, న్యూస్‌టుడే: డాక్టర్ ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-ఏక్తానగర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు(20919) 13వ తేదీ నుంచి బయలుదేరే రైలు అర్ధ గంట ముందుగా ఏక్తానగర్‌కు చేరుకుంటుందని దక్షిణ రైల్వే ప్రకటనలో తెలిపింది. గతంలో 21.05 గంటలకు చేరుకునే రైలు ఇక నుంచి 20.30 గంటలకు చేరుకుంటుంది.

దారి మళ్లింపు

● తిరువనంతపురం డివిజన్‌లో జరుగుతున్న సాంకేతిక పనుల కారణంగా చెన్నై సెంట్రల్-తిరువనంతపురం సెంట్రల్ రైలు దారి మళ్లించారు.

● 22207 చెన్నై సెంట్రల్-తిరువనంతపురం సెంట్రల్ 13, 20, 27 తేదీల్లో 16.00కు బయలుదేరే రైలు కొట్టాయం మీదుగా వెళ్తుంది. ప్రయాణికుల సౌకర్యార్థం ఎర్నాకులం టౌన్, కొట్టాయం, చెంగన్నూర్‌లో ఆగుతుంది.

ఇకపై ఆ శబ్దం వినిపించకూడదు

● పారిశుద్ధ్య కార్మికుల విజిల్‌ను చెత్తలో పడేసిన కౌన్సిలర్

ప్యారిస్, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య కార్మికుల విజిల్‌ను డీఎంకే కౌన్సిలర్ చెత్తలో విసిరేసిన ఘటన కలకలం సృష్టించింది. రాష్ట్రవ్యాప్తంగా పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటికీ వెళ్లి విజిల్ వేసి చెత్త సేకరిస్తుంటారు. శివగంగై 21వ వార్డులో పారిశుద్ధ్య కార్మికులు విజిల్ వేసి చెత్త సేకరిస్తుండగా అక్కడికొచ్చిన స్థానిక డీఎంకే కౌన్సిలర్ అయూబ్‌ఖాన్ వారి వద్ద ఉన్న విజిల్‌ను చెత్తలో పడేశాడు. వారికి శబ్దం చేసే స్పీకర్ ఇచ్చారు. తన వార్డులో విజిల్ శబ్దం చేస్తూ చెత్త సేకరించకూడదన్నారు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. తమ పార్టీకి విజిల్ చిహ్నం కేటాయించడంతో ఆయన అలా చేశారని టీవీకే మద్దతుదారులు ఆరోపిస్తున్నారు.

అందరూ పొదుపు అలవరచుకోవాలి

రిబ్బన్ కత్తిరిస్తున్న రాజశేఖర్, మునిరత్నం

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరు పొదుపును అలవరచుకోవాలని ఐఓబీ వేలూర్ రీజనల్ సీనియర్ మేనేజర్ రాజశేఖర్ పేర్కొన్నారు. తిరువళ్లూర్ జిల్లా రెడ్‌హిల్స్ సమీప చోళవరంలో ఐఓబీ కొత్త శాఖ ప్రారంభోత్సవం బుధవారం జరిగింది. రాజశేఖర్, ఆర్ఎంకే విద్యా సంస్థల అధినేత ఆర్ఎస్ మునిరత్నం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తక్కువ వడ్డీతో అందిస్తున్న రుణాలను పొంది ఆర్థికంగా ఎదగాలని తెలిపారు. బ్రాంచ్ మేనేజర్ జటిన్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

తాంబరం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పెరిగిన నేరాలు

అమల్‌రాజ్

మామల్లపురం, న్యూస్‌టుడే: తాంబరం పోలీస్ కమిషనరేట్ పరిధిలో గతేడాది నేరాలు పెరిగినట్లు కమిషనర్ ఎస్.అమల్‌రాజ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గతేడాది 245 నేరాలు జరిగాయన్నారు. అందులో 143 చోరీలు, 71 దారి దోపిడీ, 40 బంగారు గొలుసుల నేరాలు, 33 సెల్‌ఫోన్ చోరీలు జరిగాయన్నారు. 290 ద్విచక్ర వాహనాల చోరీలు జరిగాయని పేర్కొన్నారు. పలు కేసులతో సంబంధం ఉన్న 283 మందిని గూండాచట్టం కింద అరెస్టు చేశామని, 41 సైబర్ క్రైం ఘటనలో చోటుచేసుకున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాల్లో 460 మంది మృతి చెందగా 1,605 మంది గాయపడ్డారని చెప్పారు. కమిషనరేట్ పరిధిలో 25 శాంతిభద్రతల పోలీస్ స్టేషన్లు, ఆరు మహిళా ఠాణాలు, మూడు ట్రాఫిక్, మూడు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీస్‌స్టేషన్లు ఉన్నాయన్నారు.

గ్రామాలు అభివృద్ధి చెందాలి

మాట్లాడుతున్న విశ్వనాథన్

వేలూర్, న్యూస్‌టుడే: గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం ప్రగతిపథాన పయనిస్తుందని వీఐటీ కులపతి కె.విశ్వనాథన్ తెలిపారు. వీఐటీ నేతృత్వంలో కనియంబాడి యూనియన్ జలమందం పంచాయతీలో బుధవారం ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ప్రారంభమైంది. 17 వరకు కొనసాగనుంది. 14 రాష్ట్రాలకు చెందిన 418 మంది విద్యార్థులు పాల్గొననున్నారు. 13 గ్రామాల్లో వైద్య శిబిరాలు, పాఠశాల, చెరువులను శుభ్రం చేయటం, ఓటు ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. విశ్వనాథన్ మాట్లాడుతూ.. విద్యార్థులు గ్రామాల్లోని సమస్యలను గుర్తించి పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరారు. విద్యావంతులు కూడా వ్యవసాయంలోకి రావాలని తెలిపారు. ఎమ్మెల్యే ఈశ్వరన్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వీపీఎల్ రాయ్

శ్రీచంద్రశేఖరేంద్ర వర్సిటీలో అంతర్జాతీయ సదస్సు

కాంచీపురం, న్యూస్‌టుడే: కాంచీపురం సమీప ఏణాత్తూర్ పరమచార్య శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతి మహా విశ్వవిద్యాలయంలో బుధవారం అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ మెటీరియల్ సైన్సెస్ అండ్ ఇంజినీరింగ్ పేరిట జరిగిన సదస్సును ఉప కులపతి డాక్టర్ జి.శ్రీనివాసులు ప్రారంభించారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న హాంగ్‌కాంగ్ మెట్రోపాలిటన్ యూనివర్సిటీ చైర్ ప్రొఫెసర్ వీపీఎల్ రాయ్ పలు అంశాలు వివరించారు. ఫిజిక్స్ విభాగాధిపతి, విశ్వవిద్యాలయ అకడమిక్ డీన్ కె.వెంట్రామన్, పలువురు ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐజేకే నుంచి వైదొలగిన లీమారోస్ మార్టిన్

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: శ్రమకు తగిన గుర్తింపు లేకపోవడంతో ఐజేకేను వీడుతున్నట్లు లీమారోస్ మార్టిన్ ప్రకటించారు. ఆమె అన్నాడీఎంకే లేదా టీవీకేలో చేరాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. కోయంబత్తూరు జిల్లాలోని లాటరీ టిక్కెట్ల విక్రయ సంస్థ అధినేత మార్టిన్ భార్య లీమారోస్ మార్టిన్. ఈమె ఐజేకే జాయింట్ జనరల్ సెక్రటరీగా కొనసాగుతున్నారు. కొద్ది నెలలుగా పార్టీ నాయకత్వంపై అసంతృప్తిగా ఉన్న లీమారోస్ మార్టిన్ వైదొలుగుతున్నట్లు మంగళవారం అధికారింగా ప్రకటించారు.

ముస్లిం ఖైదీలను విడుదల చేయాలి

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: రంజాన్ ఉపవాసాలు చేపట్టేందుకు వీలుగా ఏళ్ల తరబడి జైళ్లలో ఉంటున్న ముస్లిం ఖైదీలను 3 నెలల పాటు పెరోల్‌పై విడుదల చేయాలని ఎస్‌డీపీఐ రాష్ట్ర అధ్యక్షుడు నెల్లై ముబారక్ కోరారు. ఎస్‌డీపీఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశం చెన్నైలో మంగళవారం సాయంత్రం జరిగింది. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి, వివిధ శాఖల్లో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండు చేశారు. జాతీయ ఉపాధ్యక్షుడు తెహ్లాన్ బాగవి, కార్యదర్శి యాము హైదీన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా అగ్నివీర్ నియామక శిబిరం ప్రారంభం

వేలూరు, న్యూస్‌టుడే: వేలూరు సమీపంలోని కాట్పాడి తమిళనాడు స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ స్టేడియంలో అగ్నివీర్ మహిళా సైనికుల ఎంపిక 5న ప్రారంభమైంది. 6 వేలమంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. రోజూ 900 మందికి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఎంపిక ప్రక్రియ 14 వరకు కొనసాగనుంది.

రాష్ట్రాభివృద్ధికి డీఎంకే అడ్డు: భాజపా

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: తమిళనాడు అభివృద్ధికి డీఎంకే ప్రభుత్వం అడ్డంకిగా ఉందని భాజపా జాతీయ అధికార ప్రతినిధి సీఆర్ కేశవన్ ఆరోపించారు. ఆయన బుధవారం కోయంబత్తూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... వివిధ అభివృద్ధి కార్యక్రమాల కోసం కేంద్ర ప్రభుత్వం 11 ఏళ్లలో తమిళనాడుకు రూ.6.50 లక్షల కోట్లు అందించిందని వివరించారు. కేంద్రం ప్రజలకు తక్కువ ధరలకు ఔషధాలు అందిస్తోందన్నారు. ఇందుకు విరుద్ధంగా డీఎంకే ప్రభుత్వం ప్రజలకు చౌకగా మద్యం అందిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరవైందని చెప్పారు. టీఎన్‌పీఎస్సీ పరీక్షను కూడా సరిగా నిర్వహించలేని పరిస్థితిలో డీఎంకే ప్రభుత్వం ఉందని విమర్శించారు.

నిరసనకారులు, ఆటో డ్రైవర్ల మధ్య వాగ్వావాదం

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: ఆటో డ్రైవర్లు, నిరసనకారుల మధ్య వాగ్వావాదం జరిగింది. మహిళలకు భద్రత కల్పించడంతో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బుధవారం మయిలాడుతురై కిట్టప్పా మార్కెట్ ఎదుట ఎన్డీయే తరఫున నిరసన జరిగింది. భాజపా జిల్లా అధ్యక్షుడు నాంజిల్ బాలు నేతృత్వంలో జరిగిన నిరసనలో భాజపా, అన్నాడీఎంకే, పీఎంకే, భాజపా మహిళా విభాగ సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. భాజపా జిల్లా మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు నర్మద మాట్లాడుతూ డీఎంకే పాలనలో మహిళలు ఆటోలో సురక్షితంగా ప్రయాణించలేకపోతు న్నారన్నారు. ఇదే సమయంలో ఎదురుగా ఉన్న ఆటో స్టాండు నుంచి ముగ్గురు ఆటో డ్రైవర్లు అక్కడి చేరుకుని తమను ఎలా అవమానిస్తారని గ్వావాదానికి దిగారు. పోలీసులు వారికి సర్దిచెప్పి పంపేశారు.

స్టెరిలైట్ ఫ్యాక్టరీలో గ్రీన్‌కాపర్ ఉత్పత్తికి హైకోర్టులో 'వేదాంత' పిటిషన్

ప్యారిస్: స్టెరిలైట్ ఫ్యాక్టరీలో గ్రీన్ కాపర్ ఉత్పత్తికి అనుమతి కోరి వేదాంత సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై తమిళనాడు ప్రభుత్వం జవాబివ్వాలని మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. భూమి, నీరు, గాలి కలుషితమవుతున్నాయని తూత్తుకుడి స్టెరిలైట్ ఫ్యాక్టరీని మూసేయాలని రాష్ట్ర ప్రభుత్వం 2018లో ఉత్తర్వులు ఇచ్చింది. వాటికి వ్యతిరేకంగా స్టెరిలైట్ ఫ్యాక్టరీ నిర్వాహకులైన వేదాంత సంస్థ మద్రాసు హైకోర్టులో కేసు వేసింది. ఈ కేసును 2020లో హైకోర్టు కొట్టివేసింది. ఈ ఉత్తర్వులను సుప్రీంకోర్టు సమర్థించింది. ఈ నేపథ్యంలో పర్యావరణానికి హాని కలిగించని గ్రీన్ కాపర్ ఉత్పత్తి చేసేందుకు స్టెరిలైట్ ఫ్యాక్టరీని తెరిచేందుకు అనుమతివ్వాలని తమిళనాడు కాలుష్య నియంత్రణ బోర్డుకు వేదాంత తరఫున తెలిపారు. కాలుష్య నియంత్రణ బోర్డు నిరాకరించడంతో వేదాంత సంస్థ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. బుధవారం విచారణకు రాగా తూత్తుకుడిలో మూసేసిన స్టెరిలైట్ ఫ్యాక్టరీలో గ్రీన్ కాపర్ ఉత్పత్తికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున అభ్యంతరం తెలిపారు. నిపుణుల కమిటీని ఏర్పాటు చేసే విషయమై రాష్ట్ర ప్రభుత్వం జవాబివ్వాలని ఉత్తర్వులు ఇచ్చి విచారణ 26కి వాయిదా వేశారు.

చెన్నైలో చందన్‌కుమార్ సంతాప సభ

సంతాపసభలో టంగుటూరి రామకృష్ణ తదితరులు

టీనగర్, న్యూస్‌టుడే: కెనడాలో దుండగుల కాల్పుల్లో మరణించిన ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ కెనడా ఉపాధ్యక్షులు చందన్ కుమార్ మృతికి సంతాప సభ బుధవారం చెన్నైలో జరిగింది. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు టంగుటూరి రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.

చెన్నై పోలీసు కమిషనరేట్‌లో బుధవారం ప్రజల నుంచి కమిషనర్ అరుణ్ ఫిర్యాదులను స్వీకరించారు. వాటిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు.
-ట్రిప్లికేన్, న్యూస్‌టుడే

స్కూటర్‌లోకి దూరిన పాము

* చీటీ ద్వారా తెలిపిన గుర్తుతెలియని వ్యక్తి

పామును బయటికి తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తిరుచ్చి తెన్నూర్ ప్రాంతానికి చెందిన న్యాయవాది గణపతి మంగళవారం ఉదయం తన స్కూటర్‌లో కోర్టుకు వెళ్లారు. స్కూటర్‌ను జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు భవనం ముందు నిలిపి వెళ్లాడు. అనంతరం ఉదయం 11.30 సమయంలో జూనియర్ న్యాయవాది పరుగున వచ్చి స్కూటర్ సీటుపై ఒక చీటీ ఉందని, అందులో 'ఈ స్కూటర్‌లో పాము ఉంద'ని రాసి ఉందని తెలిపాడు. వెంటనే గణపతి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సిబ్బంది అక్కడికి చేరుకుని వెదకగా ఇండికేటర్ వెనుక చిన్నపాటి పామును గుర్తించి బయటికి తీసి సంచిలో వేసుకొని వెళ్లారు.

★సీతా పయనం★ మైలాంజి
★ కాదలర్ దినం★ ఉయిరుల్లవరై ఉష

ఈ చిత్రాలు.. ప్రేమికుల రోజు ప్రత్యేకం

చెన్నై, న్యూస్‌టుడే: ప్రేమికుల దినోత్సవం సందర్భంగా కొత్త చిత్రాలు తెరపైకి రానున్నాయి. విజయ్ ఆంటోని సోదరి కుమారుడు అజయ్ దీషన్ నటించిన 'పూక్కి', ఆండ్రియా ప్రధాన పాత్రధారిగా నటించిన అడ్వెంచర్ థ్రిల్లర్ చిత్రం 'కా', శశికుమార్ నటించిన 'మైలార్డ్', కొత్త తారలు నటించిన 'మైలాంజి' చిత్రాలూ 13న విడుదల కానున్నాయి. అర్జున్ తన కుమార్తె ఐశ్వర్యతో రూపొందించిన 'సీతా పయనం' 14న విడుదల కానుంది.

రీ రిలీజ్ సందడి..

ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ప్రేమ నేపథ్యంతో రూపొందించిన కొత్త సినిమాలు విడుదల కావడం, వాటికి ప్రేమికులు బ్రహ్మరథం పట్టడం ఆనవాయితీ. కొన్నేళ్లుగా బలమైన ప్రేమకథ చిత్రాలు లేకపోవడంతో ప్రేమికుల దినోత్సవానికి ఆ చిత్రాల లోటు కనిపిస్తోంది. దీంతో ప్రేక్షకాదరణ పొందిన అలనాటి చిత్రాలను రీరిలీజ్ చేసేందుకు నిర్మాణ సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయి. ఆ మేరకు ప్రస్తుత ప్రేమికుల దినోత్సవం సందర్భంగా మాధవన్, రీమాసేన్ నటించిన 'మిన్నలే' (2001), సూర్య, త్రిష, లైలా తదితరులు నటించిన 'మౌనం పేసియదే' (2002) చిత్రాలు 13న విడుదల కానున్నాయి. కునాల్, సోనాలి బెంద్రే జంటగా నటించిన 'కాదలర్ దినం'(1999) 14న విడుదల కానుంది. విజయ టి.రాజేందర్ దర్శకత్వంలో గంగా, నళిని జంటగా నటించిన 'ఉయిరుల్లవరై ఉష' (1983) చిత్రం కూడా 13న విడుదల కానుండటం గమనార్హం.

జైలర్-2లో ఎస్జే సూర్య

ఎస్జే సూర్య

చెన్నై, న్యూస్‌టుడే: నెల్సన్ దర్శకత్వంలో రజనీకాంత్ 'జైలర్-2' చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. 'జైలర్'లో నటించిన నటీనటులతో పాటు పలువురు ప్రముఖ నటులు నటిస్తున్నారు. తమిళ దర్శకనటుడు ఎస్జే సూర్య కూడా నటిస్తున్నట్లు ఓ ఇంటర్వ్యూ సందర్భంగా కన్నడ సూపర్‌స్టార్ శివ రాజ్‌కుమార్ వెల్లడించారు. సెట్‌లో బంధువుల తరహాలో మాట్లాడుకుంటామని తెలిపారు. తొలి భాగం కన్నా ప్రస్తుత చిత్రంలో తన కథాపాత్రకు నిడివి ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు.

'శైలప్పన్ సైకిల్ మార్ట్' ఫస్ట్‌లుక్ విడుదల

ఫస్ట్‌లుక్ విడుదల చేస్తున్న దృశ్యం

చెన్నై, న్యూస్‌టుడే: సుగా దర్శకత్వంలో గ్రామీణ నేపథ్యంతో రూపొందిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'శైలప్పన్ సైకిల్ మార్ట్'. లక్ష్మీ క్రియేషన్స్ తరపున ఇసక్కి కార్‌వణ్ణన్ నిర్మించిన ఈ చిత్రంలో ఇసక్కి కార్‌వణ్ణన్, ఎం.ఎస్.భాస్కర్, ఇళవరసు, మూణార్ రమేశ్, దర్శకుడు సుబ్రమణియ శివ తదితరులు ముఖ్య పాత్రధారులుగా నటించారు. ఇళయరాజా సంగీతం అందించారు. చిత్రీకరణ ముగిసి నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టరును దర్శకుడు వెట్రిమారన్ బుధవారం విడుదల చేశారు.

బరీడ్ చిత్రీకరణ పూర్తి

చెన్నై, న్యూస్‌టుడే: 'వెబ్' చిత్ర దర్శకుడు హారూన్ కథ రాసి దర్శకత్వం వహించిన చిత్రం 'బరీడ్'. డ్రీమ్ హౌస్, జైన్ క్రియేషన్స్ పతాకంపై హారూన్, మహేందర్‌కుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. '8 తోట్టక్కళ్' కథానాయకుడు వెట్రి ఇందులో ఎన్‌కౌంటర్ పోలీసు అధికారిగా నటిస్తుండగా నాయికలుగా తెలుగువారైన అక్షిత, చాందిని తమిళరసన్ నటించారు. బాలాజీ శక్తివేల్, సింగం పులి, శరవణ సుబ్బయ్య, కోడంగి వడివేలు తదితరులు ఇతర ముఖ్యపాత్రల్లో నటించారు. ఎన్‌కౌంటర్ పోలీసు అధికారి ఎదుర్కొనే సమస్యలు, అతని కుటుంబానికి వచ్చే ఇబ్బందులు, ఇతర పరిణామాలు వంటి కథాంశాలతో చిత్రం రూపొందింది. ఇందులోని ఓ పాటను దర్శకుడు అరుణ్ రాజా కామరాజ్ పాడారు. చెన్నై, కోయంబత్తూర్, ఏర్కాడు, కొడైకానల్ తదితర ప్రాంతాల్లో చిత్రీకరణ చేపట్టారు. ప్రస్తుతం చిత్రీకరణ పనులు ముగియడంతో చిత్రబృందం సంబరాలు చేసుకుంది.

సంబరాల్లో చిత్రబృందం

సీమాన్ అరెస్టు

ప్యారిస్, న్యూస్‌టుడే: నామ్ తమిళర్ కట్చి ప్రధాన సమన్వయకర్త సీమాన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పలు డిమాండ్ల సాధనకు తమిళనాడు రాష్ట్ర గ్రామీణ జీవనోపాధి ఉద్యమం ఆల్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున చెన్నై వళ్లువర్‌కోట్టం వద్ద బుధవారం ఆందోళన జరిగింది. ఆందోళనకారులను సీమాన్ మద్దతు తెలిపారు. ఆందోళనకారులను పోలీసులు అరెస్టు చేయగా వారితో పాటు తనను కూడా తీసుకెళ్లాలని సీమాన్ వ్యానులో ఎక్కారు. ఆయన్ను కూడా పోలీసులు అరెస్టు చేసి ఆ తర్వాత విడిచిపెట్టారు.

అల్పాహారంలో బొద్దింక

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: అల్పాహారంలో బొద్దింక కనిపించిన ఘటన తేని జిల్లాలో చోటుచేసుకుంది. పెరియకుళం మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డుల్లో శాశ్వత, కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులు 179 మంది పనిచేస్తున్నారు. మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు అల్పాహారం అందించే పథకాన్ని సోమవారం ప్రారంభించారు. బుధవారం పెరియకుళం నార్త్‌కోస్ట్ ఐదో వార్డులో పనిచేసే గుణం అనే కార్మికురాలికి వడ్డించిన అల్పాహారంలో బొద్దింక కనిపించింది. ఆమె ఆ ఆహారాన్ని చెత్తలో పడేసింది.

ఆలయ స్థలం కబ్జాపై ఫిర్యాదు

ఫిర్యాదు చూపుతున్న వీరలక్ష్మి

సైదాపేట, న్యూస్‌టుడే: విజయ్ మానవత్వం లేని రాజకీయ నాయకుడని తమిళర్ మున్నేర్రపడై అధ్యక్షురాలు వీరలక్ష్మి ఆరోపించారు. అన్నాడీఎంకే హయాంలో హిందూ దేవదాయశాఖ మంత్రిగా పని చేసిన పరంజ్యోతి తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయ స్థలాన్ని కబ్జా చేసినట్లు చెన్నై ఆదంబాక్కంలోని అనిశా కార్యాలయంలో వీరలక్ష్మి ఆధారాలతో ఫిర్యాదు చేశారు. వీరలక్ష్మి మాట్లాడుతూ... తన పార్టీని లేకుండా చేసేందుకు అన్నాడీఎంకే యత్నించిందని తెలిపారు. 41 మంది చనిపోయిన బాధ కూడా లేకుండా పార్టీ సమావేశంలో విజయ్ డ్యాన్స్ చేశారని పేర్కొన్నారు.

కోవై మేయర్ రాజీనామా చేయాలి

ప్లకార్డులు ప్రదర్శిస్తున్న అన్నాడీఎంకే సభ్యులు

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: కోయంబత్తూరులో అన్నాడీఎంకే సభ్యులు నిరసన తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ సాధారణ సమావేశం బుధవారం మేయర్ రంగనాయకి అధ్యక్షతన జరిగింది. అన్నాడీఎంకే కౌన్సిల్ సభ్యులు ప్రభాకరన్, షర్మిల, రమేశ్ తదితరులు నోటికి పార్టీ కండువా కట్టుకుని, చేతుల్లో బ్యానర్లు పట్టుకుని నిరసన చేపట్టారు. కార్పొరేషన్‌లో అవినీతిలో పెరిగిపోయిందని, వెళ్లలూరు చెత్తకుప్పల నుంచి దుర్వాసన వస్తోందని, మేయర్ రాజీనామా చేయాలని ప్లకార్డులు ప్రదర్శించారు.

ఘంటసాలకు నివాళులు

ఘంటసాల చిత్రపటం వద్ద అంజలి ఘటిస్తున్న అభిమానులు

టీనగర్, న్యూస్‌టుడే: తెలుగు సినీ అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి చెన్నై పెరంబూరులో జరిగింది. తమిళనాడు తెలుగు సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు తమ్మినేని బాబు, జనని ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య, ప్రముఖ గాయకుడు కిడాంబి లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొని ఘంటసాల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎం.కొండయ్య, వి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

డీఎంకేలో చేరనున్న అన్నాడీఎంకే మాజీ మంత్రి?

వేలూరు, న్యూస్‌టుడే: అన్నాడీఎంకే మాజీ మంత్రి పార్టీ మారనున్నట్లు తెలిసింది. తిరుపత్తూరు జిల్లా జోలార్‌పేట నియోజకవర్గం నుంచి 2016లో అన్నాడీఎంకే నుంచి గెలిచిన నీలోఫర్ కఫిల్ కార్మిక మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. మంత్రిగా ఉన్న సమయంలో అవినీతికి పాల్పడ్డారని ఆరోపణలు రావడంతో ఆమెను అన్నాడీఎంకే ప్రాథమిక సభ్యత్వం నుంచి అధిష్ఠానం తొలగించింది. కొంతకాలం మౌనంగా ఉన్న ఆమె తర్వాత తిరిగి అన్నాడీఎంకేలో చేరారు. ఆమెకు పార్టీలో ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వలేదు. ఈ కారణంగా అన్నాడీఎంకేను వీడి డీఎంకేలో చేరాలని యోచిస్తున్నట్లు సమాచారం. అందులో భాగంగా 14న జోలార్‌పేట సమీపంలో జరిగే సమావేశానికి హాజరుకానున్న ముఖ్యమంత్రి స్టాలిన్ సమక్షంలో డీఎంకేలో చేరనున్నట్లు తెలిసింది.

పుదువై సీఎం రంగసామి కారు ముట్టడికి యత్నం

ఒప్పంద ఉద్యోగులపై లాఠీఛార్జి

లాఠీఛార్జి చేస్తున్న పోలీసులు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ఉద్యోగం పర్మినెంట్ చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి రంగసామి కారుని ముట్టడించేందుకు యత్నించిన ప్రజాపనులశాఖ ఒప్పంద ఉద్యోగులపై పోలీసులు లాఠీఛార్జి చేశారు. 14మంది గాయపడ్డారు. ప్రజాపనులశాఖలో 10ఏళ్లకుపైగా పనిచేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని ముఖ్యమంత్రి ఇటీవల శాసనసభలో ప్రకటించారు. ఇంకా ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో ఆందోళనలు చేస్తున్నారు. సింగార వేలర్ వర్ధంతి సందర్భంగా కడలూర్- పుదుచ్చేరి రోడ్డులోని కోర్టు వద్ద విగ్రహానికి బుధవారం ముఖ్యమంత్రి రంగసామి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి బయలుదేరుతుండగా ఉద్యోగులు సీఎం కారుని ముట్టడించేయత్నం చేశారు. భద్రతా విధుల్లో ఉన్న పోలీసులు అడ్డుకున్నారు. ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో లాఠీఛార్జి చేశారు. యానంకు చెందిన సుబ్బురాజ్ అనేవ్యక్తి తలకు తీవ్ర గాయమైంది. గాయపడిన మరో 13మంది ఉద్యోగులు ప్రభుత్వ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. ఆందోళనలో పాల్గొన్న ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు శరవణన్‌ని అరెస్ట్ చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉద్యోగులను మాజీ సీఎం నారాయణసామి పరామర్శించారు. పోలీసులు లాఠీఛార్జి చేయడం దారుణమని విమర్శించారు.

మంత్రి కులం పేరుతో దూషించారు

గ్రామస్థుల ఆందోళన

ప్యారిస్, న్యూస్‌టుడే: మదురై విమానాశ్రయం విస్తరణ పనులకు భూసేకరణ జరుగుతోంది. ఇందుకు చిన్న ఉడైప్పు గ్రామస్థులు వ్యతిరేకత తెలుపుతున్న నేపథ్యంలో తమ సమస్యలను తెలిపేందుకు ఎంపీ కనిమొళిని కలిసేందుకు వెళ్లారు. అప్పుడు మంత్రి మూర్తి అడ్డుకుని తమను కుల పేరుతో దూషించారని బాధిత ప్రజలు ఆరోపించారు. మంత్రి దిష్టిబొమ్మను కాల్చేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.

రైలు నుంచి పడి దంపతుల మృతి

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: రైలు నుంచి పడి దంపతులు మృతి చెందారు. కల్లకురిచ్చి ప్రాంతానికి చెందిన దంపతులు శివగండన్(37), కలయరసి(30) ముంబైలో ఉంటున్నారు. స్వగ్రామం కళ్లకురిచ్చిలో బంధువు మృతి చెందగా దంపతులు రైలులో బయలుదేరారు. బుధవారం రైలు తిరువణ్ణామలై జిల్లా ఆరణి వడమాది మంగళం గ్రామంలో వెళ్తుండగా మెట్ల వద్ద నిల్చున్న శివగండన్ కాలుజారి కిందపడబోయాడు. అతన్ని పట్టుకోవడానికి భార్య కలైయరసి ప్రయత్నించింది. ఇద్దరూ కిందపడి అక్కడికక్కడే మృతి చెందారు. ఆరణి పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాలను శవపరీక్ష కోసం ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు..

ఆర్కేనగర్: నాగపట్టినం జిల్లా వేదారణ్యం నుంచి ఈస్ట్‌కోస్ట్ రోడ్డు మీదగా తిరుచ్చెందూర్ వెళ్లే ప్రభుత్వ బస్సును సెల్వకుమార్(40) నడిపాడు. బస్సు పుదుకోట్టై జిల్లా మనమేల్‌కుడి వద్ద బుధవారం వస్తుండగా ద్విచక్ర వాహనంలో వేగంగా వచ్చిన మురుగన్(45) ఢీకొని అక్కడ నిల్చున్న 60 ఏళ్ల వృద్ధురాలిని కూడా ఢీకొనడంతో ఇద్దరూ ఘటనాస్థలంలోనే మృతి చెందారు.

చెట్టు పైనుంచి పడి వ్యక్తి...

విల్లివాక్కం: నీలగిరి జిల్లా ఓవేలి పట్టణ పంచాయతీ బార్వుడ్ ప్రాంతంలోని ప్రైవేట్ ఎస్టేట్‌లో మంగళవారం కొందరు చెట్టుకొమ్మలను నరికే పనులు చేపట్టారు. న్యూహోప్ ప్రాంతానికి చెందిన తెన్నరసు(32) చెట్టు ఎక్కుతుండగా జారి కిందపడ్డాడు. తీవ్ర గాయాలపాలైన అతన్ని సహచర కార్మికులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.

భార్య పూజ చేస్తుండగా మంటలు రేగి భర్త...

ఆర్కేనగర్: పుదుచ్చేరి లాస్‌పేట్టై సాప్పిళ్లైపేట్టై ప్రాంతానికి చెందిన విశ్వేశ్వర సోమనాథన్(60) ద్విచక్రవాహన మెకానిక్. ఇతనికి భార్య ధనలక్ష్మి, ఇద్దరు పిల్లలున్నారు. మంగళవారం విశ్వేశ్వర సోమనాథన్ ఇంట్లో పెట్రోల్ ఉపయోగించి ద్విచక్ర వాహనాన్ని మరమ్మతు చేస్తున్నాడు. ఆ సమయంలో ధనలక్ష్మి దేవుడికి పూజ చేసి అగరబత్తీ వెలిగించింది. అగరబత్తీ నుంచి వచ్చిన నిప్పురవ్వ బైక్‌పై పడింది. వాహనం మంటల్లో చిక్కుకోగా అక్కడే ఉన్న విశ్వేశ్వర సోమనాథన్‌కు వ్యాపించి తీవ్రంగా గాయపడ్డాడు. పుదుచ్చేరి జిప్మర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో బాలుడు...

వేలూరు: తిరుపత్తూరు జిల్లా ఆలంగాయం సమీపంలోని రెడ్డియూరు ప్రాంతానికి చెందిన ఇళయరాజా, ప్రియ దంపతులకు ఇద్దరు సంతానం. బుధవారం ఇళయరాజా తన ఇద్దరు పిల్లల్ని తీసుకుని ద్విచక్రవాహనంలో నమ్మియంపట్టు ప్రాంతానికి బయలుదేరాడు. ముల్లై వద్ద వేగంగా ఇసుక లోడుతో వచ్చిన లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. సందీప్(5) అక్కడికక్కడే మృతి చెందగా ఇళయరాజా, కుమార్తె నాతికధిర తీవ్రంగా గాయపడ్డారు.

లంచం కేసులో ఏఆర్ఐ అరెస్ట్

విల్లివాక్కం, న్యూస్‌టుడే: నామక్కల్ సమీపంలోని చిన్న అయ్యాపాలయానికి చెందిన సౌందర్యన్ తన నాలుగు గృహాలను కుమారుడి పేరుకు మార్చాలని నిర్ణయించి రెండు నెలలకు ముందు నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ శంకర్‌ను సంప్రదించారు. ఇంటికి రూ.5 వేలు చొప్పున రూ.20 వేలు లంచం అడిగారు. అందుకు ఇష్టపడని సౌందర్యన్ నామక్కల్ అవినీతి నిరోధక శాఖ కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. అనిశా పోలీసుల సూచన మేరకు మంగళవారం రసాయనం పూసిన నగదును నగరపాలక సంస్థ కార్యాలయం సమీపంలోని టీ దుకాణం వద్ద సౌందర్యన్ శంకర్‌కు ఇవ్వగా అనిశా పోలీసులు శంకర్‌ను అరెస్ట్ చేసి దర్యాప్తు చేస్తున్నారు. తిరుప్పత్తూర్‌కు చెందిన శంకర్ ఏడు నెలలకు క్రితం ఇక్కడ విధుల్లో చేరడం గమనార్హం.

మద్యం అక్రమంగా విక్రయించిన నలుగురు...

జీవానందం ● దేవేంద్రన్● హరికృష్ణన్ ● షేక్ ముహమ్మద్

గిండి: మద్యం అక్రమంగా విక్రయిస్తున్న తంజావూరుకు చెందిన జీవానందం, దేవేంద్రన్, చెన్నైకు చెందిన హరికృష్ణన్, షేక్ ముహమ్మద్‌లను మంగళవారం అరెస్టు చేశారు. వారి నుంచి 980 మద్యం బాటిళ్లు, రూ.56,370 నగదు స్వాధీనం చేశారు. విచారణలో బార్ ఇన్‌ఛార్జి జీవానందంపై ఇది వరకే 2 కేసులు నమోదయ్యాయని పోలీసులు తెలిపారు. మిగిలిన ముగ్గురు అదే బార్‌లో పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. నిందితులను బుధవారం కోర్టులో హాజరు పరిచి రిమాండుకు తరలించారు.

మత్తుపదార్థాలు విక్రయించిన ఇద్దరు..

నాగవల్లి ●శేఖర్

గిండి: ఆంధ్ర నుంచి మత్తుపదార్థాలు తెచ్చి విక్రయించిన కేసులో మరో ఇద్దరు అరెస్టయ్యారు. చెన్నై సెక్రటేరియట్ కాలనీలో మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో నాగవల్లి, ఆమె భర్త శేఖర్‌ను 8న అరెస్టు చేసి 1150 గ్రాముల గంజాయిస్వాధీనం చేసుకున్నారు. వారిలో నాగవల్లిపై 22 కేసులు, శేఖర్‌పై 6 కేసులు ఉన్నాయి. వారిని మంగళవారం కోర్టులో హాజరు పరచి రిమాండుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

నకిలీ బీమా కార్డులు అమ్ముతున్న ఇద్దరు..

అరక్కోణం: రాణిపేట జిల్లా ఆర్కాడు తాలూకా కలవై సమీపంలోని నంబరై ప్రాంతానికి చెందిన వెంకటేశన్, అతని భార్య కవిత తాము ప్రభుత్వ అధికారులమని చెప్పుకొని పంచాయతీ కౌన్సిల్ నాయకులకు పరిచయం చేసుకుని కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకం కింద ఒక వ్యక్తికి రూ.5 లక్షలు వరకు వైద్య చికిత్స పొందేందుకు వీలుగా గుర్తింపు కార్డును అందిస్తామని నమ్మించి ఒక్కో కార్డుకు రూ.80 చొప్పున ప్రజల నుంచి డబ్బును వసూలు చేశారు. ఇది మోసమని విచారణలో తెలియడంతో నిందితులపై పంచాయతీ కౌన్సిల్ నాయకులకు, తిమిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇద్దర్ని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు.

హత్య కేసులో నిందితుడు...

నిందితుడు వేళ్‌మురుగన్

గిండి: ఎంజీఆర్ నగర్‌కు చెందిన శరణ్య(33) వేళమురుగన్ అనే వ్యక్తి చేతిలో 2024 మార్చిలో హత్యకు గురైంది. ఈ కేసులోని నిందితుడు బెయిలుపై బయటకు వచ్చి కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. గత జనవరి 22న కోర్టు అరెస్టు వారెంటు జారీ చేసింది. పోలీసులు నిందితుడు వేళ్‌మురుగన్‌ను అరెస్టు చేసి మంగళవారం కోర్టులో హాజరు పరచి రిమాండుకు తరలించారు.

పురాతన విగ్రహాల అక్రమ తరలింపు కేసులో..

ఆర్కేనగర్: తిరుచ్చి అదనపు ఎస్పీ బాలమురుగన్ నేతృత్వంలో ప్రత్యేక బృందం 6వ తేదీ రాత్రి చెన్నై-తంజావూర్ జాతీయ రహదారి వల్లైయాపేట్టై ప్రాంతంలో వాహన తనిఖీలు చేపట్టారు. రోడ్డు పక్కన ఆగి ఉన్న కారులో సోదాలు జరిపారు. అందులో రెండో గోనెసంచుల్లో రెండు పురాతన విగ్రహాలను గుర్తించి వాహనంలో ఉన్న తిరువారూర్‌కు చెందిన మణికంఠన్, రామచంద్రన్‌ను అరెస్టు చేశారు. వారిచ్చిన సమాచారంతో ముకిలన్, జాన్సన్‌ను అరెస్టుచేసి బుధవారం కుంభకోణం అదనపు క్రిమినల్ మేజిస్ట్రేట్ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. విగ్రహాలను విదేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు తెలిసింది. స్వాధీనం చేసుకున్న విగ్రహాలు 15 శతాబ్దానికి చెందిన విష్ణు, దేవి విగ్రహాలుగా భావిస్తున్నారు.

మత్తు మాత్రలు విక్రయించిన యువకుడు..

విల్లివాక్కం: ఈరోడ్ జిల్లా అందియూర్ సమీపంలోని పచ్చాంపాలయం, ఇరుళక్కరైయానూర్‌లో మత్తు మాత్రలు విక్రయిస్తున్నట్లు మంగళవారం పోలీసులకు సమాచారం అందింది. గస్తీ చేపట్టి అదే ప్రాంతానికి చెందిన సౌందరరాజన్ వద్ద మత్తు మాత్రలు, ఇంజక్షన్‌లు ఉన్నట్లు గుర్తించి అరెస్ట్ చేసి భవాని క్రిమినల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు.

పోక్సో చట్టం కింద ఆలయ అర్చకుడు...

విల్లివాక్కం: ధర్మపురి ఎస్వీ సాలైలోని ఓ ఆలయంలో అదే ప్రాంతానికి చెందిన రమేష్‌బాబు అర్చకుడుగా పని చేశారు. ఆలయానికి తరచూ వస్తున్న 9వ తరగతి విద్యార్థినితో సన్నిహితంగా వ్యవహరించాడు. విద్యార్థిని పేదరికాన్ని ఆసరాగా తీసుకొని రోజుకు రూ.200 వేతనానికి తన ఇంటి పనికి నియమించుకుని అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇటీవల విద్యార్థిని కడుపుకొప్పితో బాధపడటంతో తల్లిదండ్రులు ధర్మపురి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి రెండు నెలల గర్భవతిగా గుర్తించారు. ఫిర్యాదు మేరకు ధర్మపురి మహిళా పోలీసులు రమేష్‌బాబును పోక్సో చట్టం కింద మంగళవారం అరెస్ట్ చేశారు.

క్రైం కార్నర్

శ్రీనివాస్, సిద్ధార్థ్, సాయి కిరణ్

డిజిటల్ అరెస్ట్ పేరిట మోసం..

టీనగర్: డిజిటల్ అరెస్ట్ పేరుతో సామాన్యులు, వృద్ధుల నుంచి రూ.లక్షలు దోచుకుంటున్న ముఠాను తిరునెల్వేలి పోలీసులు అరెస్టు చేశారు. పెరుమాళ్‌పురానికి చెందిన 65 ఏళ్ల విశ్రాంత ప్రభుత్వ అధికారికి గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి డిజిటల్ అరెస్టు చేసినట్లు బెదిరించారు. కేసు నుంచి బయటపడాలంటే తాము చెప్పిన బ్యాంకు ఖాతాకు డబ్బు పంపాలని ఒత్తిడి చేశారు. రూ.15 లక్షలను బదిలీ చేశాడు. వెంటనే నిందితులు ఫోన్ స్విచ్ ఆఫ్ చేయడంతో మోసపోయానని గ్రహించి బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు నిందితులు తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాకు చెందిన శ్రీనివాస్, సిద్ధార్థ్‌గా గుర్తించి అరెస్టు చేశారు. వారికి సహకరించిన హైదరాబాద్ నివాసి సాయికిరణ్‌ను సైతం అరెస్టు చేశారు.

మారణాయుధాలు కలిగి ఉన్న ఇద్దరు..



దినేష్, జగదీశ్

ప్యారిస్: చెన్నై గిండి పోలీసులు మంగళవారం స్థానికంగా ఉన్న నాగిరెడ్డి తోట్టం, ఖాళీ మైదానం వద్ద గస్తీ చేపట్టారు. అనుమానంగా ఉన్న ఐదుగురిని విచారిస్తుండగా కత్తులతో దాడి చేసేందుకు యత్నించి పారిపోయారు. దాడికి పాల్పడిన జగదీశ్, దినేష్‌లను అరెస్టు చేసి రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నారు.

దోపిడీ కేసులో ముగ్గురు...

అరెస్టైన వీరమరుదు, ఆనందకుమార్, రవికుమార్

ట్రిప్లికేన్: చెన్నై కణ్ణగినగర్‌కు చెందిన ధనలక్ష్మి వేళచ్చేరి వంద అడుగుల రోడ్డులో స్పా సెంటర్ నడుపుతున్నారు. శనివారం అక్కడికొచ్చిన ఐదుగురు గుర్తు తెలియని వ్యక్తులు, ధనలక్ష్మి, షాలిని, ప్రియాంక ముగ్గురిని కత్తితో బెదిరించి ఐదున్నర సవర్ల బంగారు గొలుసులు, ఆరు సెల్‌ఫోన్లు, మానిటర్, డీవీఆర్ దోచుకుని వెళ్లారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితులు ఆనందకుమార్, వీరమరుదు, రవికుమార్‌ను మంగళవారం అరెస్టు చేశారు. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు.

యువతిని రాళ్లతో కొట్టి చంపిన వ్యక్తి కోసం గాలింపు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఈరోడ్ చెన్నిమలై సాలై రంగంపాళయం వంతెన సమీపంలోని పొదలో ముఖం ఛిద్రమైన స్థితిలో యువతి మృతదేహం పడి ఉన్నట్లు మంగళవారం పోలీసులకు సమాచారం అందింది. డీఎస్పీ ముత్తుకుమరన్ నేతృత్వంలో సిబ్బంది, ఫోరెన్సిక్ నిపుణులు ఘటనాస్థలికి చేరుకుని ఆధారాలు సేకరించారు. యువతిని రాళ్లతో కొట్టి చంపినట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఆమెకు సంబంధించిన వివరాలు సేకరిస్తున్నారు. హంతకుడిని పట్టుకోడానికి 5 ప్రత్యేక పోలీసు బృందాలు రంగంలోకి దిగాయి.

భర్తను హతమార్చిన భార్య సహా ముగ్గురికి జీవిత ఖైదు

టీనగర్, న్యూస్‌టుడే: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే కారణంతో భర్తను హత్యచేసిన భార్య సహా ముగ్గురికి తిరునెల్వేలి కోర్టు మంగళవారం జీవిత ఖైదు విధిస్తూ తీర్పునిచ్చింది. తిరునెల్వేలి జిల్లా వీరవనల్లూర్ సమీపంలోని వలత్తు నంబికుళం ప్రాంతానికి చెందిన మురుగన్(29) ద్విచక్ర వాహనాల మెకానిక్‌గా పని చేసేవాడు. మురుగన్ భార్య అఖిల.. అతని స్నేహితుడు ముత్తురాజ్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుంది. తమకు అడ్డుగా ఉన్న భర్తను హతమార్చాలని అఖిల పథకం రూపొందించి 2017 జనవరి 27న రాత్రి మురుగన్‌ను తన వెంట పొలం వద్దకు తీసుకెళ్లింది. అప్పటికే అక్కడ మాటు వేసిన ముత్తురాజ్ అతని స్నేహితుడు పంచ్‌రాజన్ మురుగన్‌పై దాడి చేసి హతమార్చారు. ఈ కేసు విచారణ తిరునెల్వేలి అదనపు సెషన్స్ కోర్టులో జరిగింది. వాదోపవాదాలు ముగిసిన నేపథ్యంలో కోర్టు మంగళవారం తీర్పు వెలువరించింది. నిందితులు ముగ్గురికి జీవిత ఖైదు విధించింది. అఖిలకు అదనంగా మరో పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పుచెప్పారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్యం

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూర్ సమీపం రాజాజీపురం ఎన్జీవో కాలనీకి చెందిన వీరకుమార్ ప్రైవేటు బ్యాంకులో మేనేజర్‌గా పని చేస్తున్నారు. ఈయనకు భార్య రాజలక్ష్మి(31) ఉన్నారు. కుటుంబ కలహాలతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. బుధవారం కూడా గొడవ జరగడంతో మనస్తాపం చెందిన రాజలక్ష్మి పడక గదిలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది.

గుమ్మిడిపూండి సమీపంలో మరో మహిళ..

గుమ్మిడిపూండి: తిరువళ్లూర్ జిల్లా గుమ్మిడిపూండి సమీపం పెదద్దచోళియంబాక్కానికి చెందిన సీత(25) ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తోంది. మంగళవారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. కారణాలు తెలియరాలేదు.

భార్య, ఇద్దరు పిల్లలకు విషమిచ్చి భర్త ఆత్మహత్య

కుమారుడి మృతి

ప్యారిస్, న్యూస్‌టుడే: క్యాన్సర్‌తో బాధపడుతున్న భార్యను చూడలేక ఆమె, ఇద్దరు పిల్లలకు విషమిచ్చి భర్త ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన తమిళనాడులో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. చెన్నై పెరంబూర్‌లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఆత్మహత్య చేసుకున్నట్లు గురువారం ఉదయం సెంబియం పోలీసులకి సమాచారం అందింది. వారు అక్కడికి చేరుకోగా ఓ వ్యక్తి ఉరివేసుకుని మృతిచెంది, మహిళ, ఇద్దరు పిల్లలు స్పృహకోల్పోయిన స్థితిలో కనిపించారు. ముగ్గురిని కీల్పాక్కం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ఓ బిడ్డ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతి చెందిన వ్యక్తి పెరంబూర్‌కు చెందిన ప్రైవేటు ఉద్యోగి సెబాస్టియన్(42)గా గుర్తించారు. ఆయనకు భార్య రేక్సీబ్యూలా(37), ఇవాంజలిన్(8), ఇమాన్ ఆంటో(4) అనే ఇద్దరు పిల్లలున్నారు. రేక్సీబ్యూలా కొద్దినెలలుగా క్యాన్సర్‌తో బాధపడుతుండగా పలు ఆసుపత్రుల్లో చూపించినా నయంకాలేదు. భార్యకు ఏమైనా జరిగితే పిల్లలను ఎవరు చూసుకుంటారని సెబాస్టియన్ మనోవేదనకు గురయ్యాడు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి భార్య, ఇద్దరు పిల్లలకు విషం కలిపిన కేక్ తినిపించి, సెబాస్టియన్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. కేక్ తిన్న ఇమాన్ ఆంటో మృతిచెందగా మిగిలిన ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

కలెక్టర్ కార్యాలయానికి బాంబు బెదిరింపు

వేలూరు, న్యూస్‌టుడే: వేలూరు జిల్లా, కార్యాలయానికి మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని దుండగులు బాంబు పెట్టినట్లు కలెక్టర్ అధికారిక ఇమెయిల్‌కు ఓ సందేశం పంపినట్లు బెదిరింపు కాల్ వచ్చింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని స్నిఫర్ డాగ్స్ సాయంతో తనిఖీలు చేపట్టారు. సోదాల్లో ఎటువంటి పేలుడు పదార్థాలు లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు ఈమెయిల్ పంపిన వ్యక్తిని గుర్తించడానికి సైబర్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు చర్యలు చేపట్టారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Ph: 044-28232390
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 97910 83205, 97910 74993

RS
(c) eenadu

ధ్వజారోహణం.. ఆనందించే భక్తగణం

ధ్వజారోహణం సందర్భంగా పూలవర్షం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలకు సమారంభంగా వాయులింగేశ్వరుని ధ్వజారోహణ ఘట్టం ఆద్యంతం వైభవంగా జరిగింది. తొలి పూజ కన్నప్పదైతే.. బ్రహ్మోత్సవ బాధ్యత నందీశ్వరునిది. అందుకే వృషభధ్వజ సంకేతం కల్గిన ధవళవస్త్రాన్ని అధిరోహించి వేదోక్తంగా ధ్వజారోహణ ఘట్టాన్ని పూర్తిచేశారు. ఉత్సవ మూర్తులకు శ్రీకృష్ణదేవరాయల కాలం నాటి దివ్యాభరణాలు అలంకరించారు. ప్రధాన అర్చకులు స్వామినాథన్ నేతృత్వంలో సంకల్ప పూజలు, అనంతరం ధ్రువమూర్తులకు కంకణధారణ చేపట్టి సకల దేవతలను ఆహ్వానించారు. ట్రస్టుబోర్డు ఛైర్మన్ కొట్టే సాయిప్రసాద్, ఈవో బాపిరెడ్డి, బొజ్జల బృందమ్మ, భాజపా నేత ఆనంద్ పాల్గొన్నారు.

నేడు భూతరాత్రి వైభవం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం భూతరాత్రి వైభవం జరగనుంది. సమస్త భూత గణాలకు అధిపతి అయిన సర్వాంతర్యామి ఉదయం సూర్య ప్రభ, చప్పరంపై దర్శనమిచ్చే సోమస్కందమూర్తి, జ్ఞానాంబికలు రాత్రి భూత, శుక వాహనాలపై ఊరేగుతూ భక్తకోటికి దర్శన భాగ్యం కల్పించనున్నారు.

ఉ.4.30: మంగళవాయిద్యాలు
5.00: గోమాతపూజ, సర్వదర్శనం
9.00: స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తుల ఊరేగింపు
రాత్రి 8.00 స్వామి, అమ్మవార్ల పురవీధుల ఉత్సవం
9.00: దర్శనం ముగింపు

సంకల్ప పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, ఉభయదారులు

కల్పవృక్షంపై రాజమన్నార్ రాజసం

చంద్రగిరి, న్యూస్‌టుడే: శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో నాలుగోరోజు బుధవారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారు శ్రీరాజమన్నార్ (శ్రీరాజగోపాలస్వామి) స్వరూపంతో కల్పవృక్ష వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వాహనసేవ అనంతరం కల్యాణ మండపంలో శ్రీవారి ఉత్సవమూర్తులకు తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం శ్రీవారి ఉత్సవ మూర్తులు ఊంజలసేవలో భక్తులను తన్మయపరిచారు. రాత్రి శ్రీహరి దేవేరులతో సర్వభూపాల వాహనంపై తిరువీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. నృత్యప్రదర్శనలు ప్రత్యేకత చాటుకున్నాయి.

నేడు గరుడోత్సవం.. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం పల్లకీసేవ, స్నపనతిరుమంజనం, సాయంత్రం ఊంజలసేవ అనంతరం స్వామివారు గరుడ వాహనం అధిరోహించి తిరువీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు.

పట్టుతప్పి.. 16వ స్థానానికి

▶ 36 మండలాలకు విధుల్లో నలుగురే

నాలుగు స్తంభాలాట

ఈనాడు డిజిటల్, తిరుపతి: జిల్లాలో పట్టు'గూడు' కకావికలమవుతోంది. రైతులకు రాయితీలు ఇస్తాం.. యంత్రాలు ఇస్తాం.. సాగు చేయండి అంటూ ప్రభుత్వం చెబుతున్న మాటలకు, క్షేత్రస్థాయిలోని పరిస్థితులకు పొంతన కుదరడం లేదు. రైతులు వెన్నుతట్టి ప్రోత్సహించాల్సిన పట్టు పరిశ్రమశాఖ.. ఇప్పుడు వెన్ను విరిగింది. కారణం.. తీవ్రమైన సిబ్బంది కొరత. ఒకరిద్దరు కాదు.. ఏకంగా శాఖ మొత్తం ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తోంది. 36 మండలాలు కలిగిన జిల్లాలో కేవలం నలుగురు అధికారులతో నెట్టుకొస్తున్న దయనీయం నెలకొంది.

36 మండలాల పరిధిలో ఓ అధికారి, మరో ముగ్గురు సిబ్బంది ఉన్నారు. 20 మంది వరకు ఉద్యోగులు కావాలి. టెక్నికల్ అసిస్టెంట్ 6, టెక్నికల్ ఆఫీసర్ 8, అసిస్టెంట్ సెరికల్చర్ ఆఫీసర్ 4 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏళ్లుగా నియామకాలు లేక ఉన్న వారు ఉద్యోగ విరమణ పొందడంతో శాఖ ఖాళీ అయిపోయింది.

క్షేత్రస్థాయి పర్యటనలకు తిలోదకాలు

గతేడాది జిల్లాలో 180 ఎకరాల్లో సాగు ఉండగా ఈ ఏడాది 150 ఎకరాలకు విస్తరణ 90 ఎకరాలు సాగైంది. పట్టున్నన్న మదనపల్లె, పలమనేరు ప్రాంతాలు సాగులో దూసుకెళ్తుంటే.. జిల్లా రాష్ట్రంలో 16వ స్థానానికి పడిపోయింది. తెగుళ్లు వస్తున్నాయని రైతులు ఫోన్ చేసినా వెళ్లి చూసేవారు లేరు. నలుగురు ఎక్కడికి వెళ్లగలరు? ఎవరికి న్యాయం చేయగలరు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. జిల్లా మొత్తం తిరగాలంటే సిబ్బంది సరిపోవట్లేదని, లక్ష్యాలు పూర్తి చేయడానికి సర్వం ఒడ్డుతున్నామని జిల్లా అధికారి కిశోర్ నాయక్ తెలిపారు.

పసివయసుకు ప్రసవ గండం

☛ ఉమ్మడి జిల్లాలో ప్రమాదకర స్థాయిలో కేసులు

☛ కుప్పం ప్రాంతంలో అత్యధికంగా 14.9 శాతం

ఈనాడు- చిత్తూరు, న్యూస్‌టుడే, తిరుపతి (వైద్యవిభాగం): బాలికలకు కనీస వివాహ వయసు 18 ఏళ్లుగా చట్టం చేసినా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. ఆలోపు వారు గర్భం దాలిస్తే శారీరక, మానసిక సమస్యలు ఎదుర్కొనే అవకాశమున్నా తల్లిదండ్రులు విస్మరిస్తున్నారు. అవగాహన కల్పించడంలో అధికారులూ విఫలమవుతున్నారు. దీంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో టీనేజర్ల ప్రసవాలు అధికంగా జరుగుతున్నాయి.

తిరుపతి జిల్లాలో 2025 ఏప్రిల్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు ముప్పైవేల వరకు ప్రసవాలు జరిగాయి. అందులో 13-19 ఏళ్లలోపు బాలికలు 3,364 మంది ఉన్నారు. చిత్తూరు జిల్లాలో మొత్తం ప్రసవాలు పోల్చితే ఆరువేల వరకు తక్కువగా ఉండగా గర్భం దాల్చిన టీనేజర్ల సంఖ్య 2,565 నమోదైంది. శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లో పరిశ్రమలు ఉండటం, ఉపాధి కోసం ఉత్తరాది రాష్ట్రాల నుంచి తల్లిదండ్రులు వలస వస్తుండగా వారితో వచ్చే బాలికలు త్వరగా గర్భం దాల్చుతున్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో [illegible] శివరాత్రి సమయంలో బాల్య వివాహాలు అధికం. చిత్తూరు జిల్లాలో కుప్పం, పలమనేరులో ఇలాంటి ప్రసవాలు జరుగుతున్నాయి. కుప్పం ప్రాంతంలో తల్లిదండ్రులు చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేస్తుండటంతో ఇక్కడ అత్యధికంగా 14.9 శాతం టీనేజర్ల ప్రసవాలు నమోదవుతున్నాయి.

తల్లీబిడ్డలకు ప్రతిబంధాలు ఇలా..

బాలికల్లో శరీరంగా ఎదుగుదల లేకపోవడంతో అనివార్య పరిస్థితుల్లో సిజేరియన్లు చేస్తున్నారు. 65 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారు. ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో వీరికి ప్రసవాలు చేయడం క్లిష్టతరమవుతుండటంతో జిల్లా, ప్రాంతీయ ఆసుపత్రులకు తరలిస్తున్నారు. ప్రసవం సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటే మాతాశిశు మరణాలు పెరుగుతున్నాయి. ఇలాంటి కేసుల్లో శిశువులూ బలహీనంగా ఉంటున్నారు.

కమిటీలు ఉండి లాభమేంటి?

బాల్య వివాహాలు నేరం. ఉల్లంఘిస్తే రెండేళ్ల జైలుశిక్ష రూ.లక్ష జరిమానా విధించే అవకాశముంది. ఇలాంటి వాటిని అడ్డుకోవడానికి గ్రామ, మండల స్థాయిలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, మహిళా పోలీసులు, ఏఎన్‌ఎంలతో కమిటీలు వేసినా ప్రయోజనం లేకుండాపోయింది. గ్రామపెద్దలు పంచాయితీలు చేయడం, పిల్లలకు రహస్యంగా పెళ్లిళ్లు చేయడంతో సమస్యలు ఎదురవుతున్నాయి.

ఇలా చేస్తే మేలు

పాఠశాలల్లో తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, పారిశ్రామిక ప్రాంతాల్లో తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పరిస్థితుల్లో మార్పువచ్చే అవకాశం ఉంటుంది. వివాహాలు అరికట్టడానికి పోలీసు, మహిళా సాయం తీసుకోవడం, టోల్‌ఫ్రీ నంబరు, అధికారుల ఫోన్ నెంబర్లు ప్రదర్శించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చే అవకాశం ఉంటుంది.

2015 ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు ప్రసవాలు: తిరుపతి జిల్లాలో మొత్తం 29,665 టీనేజర్లు 3,364 శాతం 11.34

జైకా.. కదలక

☛ కూటమి బడ్జెట్‌పైనే ఆశలు

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జపాన్ అంతర్జాతీయ సహకార సంస్థ (జైకా) సహకారంతో పనుల్లో స్తబ్ధత నెలకొంది. వైకాపా హయాంలో బిల్లులు రాకపోవడంతో గుత్తేదారులు పనులు ఆపేశారు. కూటమి ప్రభుత్వం కదలిక తెచ్చినా అంచనాలు పెరగడంతో గుత్తేదారులు ముందుకురావట్లేదు.

పనుల వివరాలు చెరువులు: 24, అంచనా విలువ : రూ.42.36 కోట్లు



కృష్ణాపురం జలాశయం

గతంలో తెదేపా పాలనలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 33 ప్యాకేజీల కింద 65 చెరువులు, ప్రాజెక్టుల మరమ్మతులు, అభివృద్ధి, ఆధునికీకరణ పనులు చేయాలని నిర్ణయించింది. కార్వేటినగరం మండలంలో కృష్ణాపురం ప్రాజెక్టుకు రూ.28 కోట్లు, పిచ్చాటూరులోని అరణియార్ ప్రాజెక్టుకు రూ.35 కోట్లతోపాటు చిత్తూరు జిల్లాలో 41, తిరుపతి జిల్లాలో 24 చెరువుల అభివృద్ధికి నిధులు కేటాయించింది. వైకాపా ప్రభుత్వం తొక్కిపెట్టడంతో పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి.

17 పనులు రద్దు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 17 పనులు, మరో ఐదు చెరువుల పనులు రద్దుచేసింది. మిగిలిన 48 పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించింది. 2019-20 నాటి అంచనాలు కావడంతో పనులు కదలడం లేదు. రూ.10-12 కోట్లు అవసరం.

నోటీసులిచ్చాం

పెరిగిన ధరల ప్రకారం ప్రభుత్వానికి నివేదించాం. అదనపు నిధులిస్తేనే పనులు చేపట్టగలం. - **వెంకటేశ్వరరాజు, ఎస్ఈ**

శివయ్యకు 100 టన్నుల కల్తీ నెయ్యి

☛ ఏడాదిపాటు వైష్ణవి బ్రాండ్‌తోనే సరఫరా

☛ ఫిర్యాదులు వచ్చినా పట్టని వైనం

అడుగున గడ్డకట్టిన వైష్ణవి బ్రాండ్ నెయ్యి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ఆలయ పవిత్రతతోపాటు భక్తుల మనోభావాలకు తిలోదకాలు ఇచ్చిన వైకాపా పాలకులు, అప్పటి అధికారులు కల్తీ నెయ్యి అక్రమాలను వీలైనంత వరకూ విస్తరించారు. శ్రీకాళహస్తి ఆలయానికి వైష్ణవి బ్రాండ్ నెయ్యి సరఫరా విషయంలో అదే జరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా కొందరు పాలకులు వైష్ణవి బ్రాండ్ నెయ్యి బాగుందంటూ గుత్తేదారులను వెనుకేసుకురావడం గమనార్హం.

ఫిర్యాదులు లెక్కచేయక

శ్రీకాళహస్తీశ్వరాలయం లడ్డూకు మంచిపేరున్నా నాణ్యతపై 2023లో తీవ్ర విమర్శలు, ఫిర్యాదులు వచ్చాయి. అయిన అప్పటి పాలకులు, అధికారులు నోరు మెదపలేదు. ఏడాదిపాటు కల్తీ నెయ్యి సరఫరా కొనసాగించారు. మార్కెట్‌లో నాణ్యతగల నెయ్యి ధరతో పాటే వైష్ణవి బ్రాండ్ కిలో రూ.497.49 చొప్పున సరఫరా చేసింది. ఆర్నెల్ల తరువాత రూ.569.50కు పెంచుకోగలిగింది. ఆలయ అవసరాలకు నెలకు 8 టన్నులకుపైగా అవసరం ఉండగా ఇలా ఏడాదిలో 100 టన్నుల వరకు సరఫరా చేసింది. వైష్ణవి బ్రాండ్ పేరుతో నెయ్యిని సరఫరా చేసిన సుమిత్ర ట్రేడర్స్, వినాయక ఏజెన్సీలు సొంత ల్యాబ్ రిపోర్టులు అందజేసిన విషయం సైతం బయటకు పొక్కనీయలేదు.

తుడా అవినీతి దస్త్రానికి కదలిక

☛ విజిలెన్స్ విచారణపై త్వరలో నిర్ణయం

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: వైకాపా పాలనలో జరిగిన అక్రమాలు, ఉల్లంఘనలపై కూటమి ప్రభుత్వం చేపట్టిన విజిలెన్స్ విచారణలో మలిదశ చర్యలకు సమయం ఆసన్నమైంది. తుడాలో నిధుల దుర్వినియోగంపై అనేక ఆరోపణలు వచ్చాయి. కూటమి ప్రభుత్వ ఆదేశాలతో 2024 డిసెంబరు 24 నుంచి 2025 జులై వరకు సుదీర్ఘ విచారణ జరిపిన విజిలెన్స్ విభాగం నాలుగువేల ప్రతుల్లో నివేదిక అందజేసింది. ఇన్నాళ్లూ స్తబ్దుగా ఉన్న విచారణలో కదలిక వచ్చినట్లు తెలుస్తోంది. వైకాపా పాలనలో తుడా ఛైర్మనుగా పనిచేసిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆయన తనయుడు మోహిత్‌రెడ్డి సహా ఉల్లంఘనలకు సహకరించిన అధికారుల తప్పిదాలపై చర్యలు తప్పవని తెలుస్తోంది. చెవిరెడ్డి స్వగ్రామం తుమ్మలగుంట చెరువుకు రూ.60 కోట్ల వరకు తుడా నిధులు వెచ్చించినట్లు అధికారుల విచారణలో తేలింది. తుమ్మలగుంటలో పార్కు నిర్వహణకు రూ.23 కోట్ల నిధులు ఫిక్స్‌డ్ డిపాజిట్లుగా మళ్లించడం, వాటిపై వచ్చే వడ్డీని నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. తుడాకు చెందిన అతిథిగృహం, స్పోర్ట్స్ కాంప్లెక్స్, దుకాణ సముదాయాలను తుమ్మలగుంట పంచాయతీకి అప్పగించేలా చేసిన తీర్మానాల్లో ఉల్లంఘనలు తేలడంతో అప్పట్లో పనిచేసిన అధికారులు, ఉద్యోగులపై చర్యలు తప్పవని తెలుస్తోంది.

ఎస్వీపురంలో.. 5 స్టార్ హోటల్

నిర్మాణసంస్థ ప్రతినిధి ప్రదీప్‌కుమార్‌కు పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి (కలెక్టరేట్) : వడమాలపేట మండలం ఎస్వీపురం పరిధిలో 5 స్టార్ హోటల్ నిర్మాణానికి అవసరమైన భూమిని బుధవారం అప్పగించారు. ఒడిశాకు చెందిన ఎంఎస్ బెంగాల్ అల్టిమేట్ రిసార్ట్స్ ఎల్‌ఎల్‌పీ సంస్థ ప్రతినిధులకు కలెక్టర్ డా. వెంకటేశ్వర్ వాటి పత్రాలు అందజేశారు. రూ.200 కోట్లతో హోటల్ నిర్మించనుండగా ప్రభుత్వం 12.70 ఎకరాలు కేటాయించిందన్నారు. 250 మందికి పైగా ఉపాధి దొరుకుతుందన్నారు. అధికారులు రమణప్రసాద్, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

అంత్యక్రియలు

మంచి మనసుకు ప్రతిరూపం...
మమతానురాగాల మణిదీపం...
మరువలేము నీ రూపం...
ఆత్మీయతను పంచిన అమృతమూర్తి...
మా ఉన్నతికి అహర్నిశలు శ్రమించిన మా ఇంటిదీపం
శ్రీమతి అవినేని వనజాక్షి గారు
10.02.2026 మంగళవారం స్వర్గస్తులైనారు.

దహనక్రియలు
12.02.2026వ తేది గురువారం
ఉ.11.00గం॥లకు మా స్వగృహం నెం.20
టెంపుల్ టౌన్ విల్లాస్, రామతులసి కళ్యాణ
మండపం రోడ్డు నుండి అంతిమయాత్రగా
బయలుదేరి గోవిందధామం నందు
జరుగునని తెలియజేయడమైనది.

శోకతప్త హృదయాలతో...
కుమారులు: అవినేని ప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్, చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్
అవినేని జయప్రకాష్ USA
కుమార్తె: డా॥ఎ.స్వర్ణలత మరియు కుటుంబసభ్యులు

కీ॥శే॥ అవినేని వనజాక్షి గారు
W/o.కీ॥శే॥ అవినేని జయరామా నాయుడు,
మరణం: 10.02.2026

రెవెన్యూలో 19 మందికి రివర్షన్

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రెవెన్యూ శాఖలో 19 మంది సీనియర్ అసిస్టెంట్లకు గ్రేడ్-1 వీఆర్‌వోలుగా రివర్షన్ ఇచ్చారు. 2022, 2023లో గ్రేడ్-1 వీఆర్‌వోలకు తాత్కాలిక ఉద్యోగోన్నతిపై సీనియర్ అసిస్టెంట్లుగా పోస్టింగులు ఇచ్చారు. తహసీల్దార్/ఆర్డీవో/కలెక్టరేట్‌లో రెండేళ్లపాటు పనిచేయాలని, డిపార్ట్‌మెంట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలని, ఏపీపీఎస్సీ పరీక్షల్లో ఉత్తీర్ణులు కావాలంటూ షరతులు విధించారు. 19 మంది సీనియర్ అసిస్టెంట్లు.. ఉత్తీర్ణత సాధించకపోవడంతో రివర్షన్ పొందారు. చిత్తూరు జిల్లాలో ఐదుగురు, తిరుపతి జిల్లాలో ఐదుగురు, అన్నమయ్య జిల్లాలో 9 మంది రివర్షన్ ఉత్తర్వులు అందుకున్నారు.

ఇక చాలనే వయసులో చిరుతలా..!

హర్డిల్స్ సాధనలో ధనంజయ

తిరుపతి (క్రీడలు), న్యూస్‌టుడే: ఏడుపదుల వయసు.. అయితేనేం అదే వేగం.. జింకలా చెంగు చెంగుమంటూ దూకేస్తున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సొంతం చేసుకుంటున్నారు. ఆయనే తిరుపతికి చెందిన కూరపాటి ధనంజయ (72). తిరుపతి గ్రామీణ మండలం ఓటేరు గ్రామానికి చెందిన ఆయన ఐదో తరగతి వరకు చదువుకున్నారు. తిరుపతి భేరివీధిలో 45 ఏళ్లుగా చౌకదుకాణం నిర్వహిస్తున్నారు. మానసికోల్లాసం కోసం రోజూ ఉదయం, సాయంత్రం మైదానానికి వెళ్లేవారు. ఈక్రమంలో పలువురు వ్యాయామం, అథ్లెటిక్స్‌లో సాధన చేయడం చూసి స్ఫూర్తి పొందారు. అందరూ ఇక విరమిద్దామనే వయసులో తాను మొదలుపెట్టారు. అలా 2014 నుంచి మాస్టర్ అథ్లెటిక్స్‌లో సాధన మొదలుపెట్టారు. సలహాలు, సూచనలు ఇవ్వడానికి ఎవరూ లేనప్పటికీ సొంతంగా రాటుదేలారు. ప్రస్తుతం 100 మీ. పరుగు, 80, 300మీ హర్డిల్స్, 10ⅹ4 రిలేలో రాణిస్తున్నారు. ఇప్పటివరకు 15కు పైగా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. ఇటీవల తిరువనంతపురం వేదికగా జరిగిన 46వ జాతీయస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం, రెండు రజతాలతో సత్తా చాటారు. కుమారుడు ఓ ప్రైవేటు బ్యాంకులో ఉద్యోగం చేస్తుండగా, కుమార్తెను చార్టెడ్ అకౌంటెంట్‌కి ఇచ్చి వివాహం చేశారు. ఆర్థిక ఇబ్బందులు సైతం తట్టుకుని ప్రతిపోటీలోనూ ప్రాతినిధ్యం వహిస్తూ వస్తున్నారు.

అరణియార్.. ఖాళీయార్

అరణియార్ నదిలో ఇసుక తవ్వకాలపై నిషేధాజ్ఞలను ఇసుకాసురులు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. మలిమేలుకండ్రిగలోని శ్మశానవాటికలోనూ రెండు రోజులుగా తవ్వకాలు సాగిస్తున్నారు. యాభైకి పైగా ట్రాక్టర్లను నదిలో దించి ఇసుకను తమిళనాడుకు తరలిస్తుండగా గ్రామస్థులు మూకుమ్మడిగా అడ్డుకున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, నాగలాపురం**

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి : 80085 13290

104FM Tirupati
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9154991499

27వ వర్ధంతి

మంచితనానికి మారుపేరుగా నిలిచి,
మా అందరి హృదయాలలో చెరగని ముద్రవేసి,
సుదూర తీరాలకు వెళ్లినా మీ జ్ఞాపకాలు
మా మదిలో ఎప్పటికీ పదిలం. మీ పవిత్ర ఆత్మకు
శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...
శోకతప్త హృదయాలతో అంజలి ఘటిస్తూ...
కుమారులు:
మబ్బు దేవనారాయణ రెడ్డి (పెద్దబ్బ)
లేట్ మబ్బు రామనారాయణ రెడ్డి (చెంగారెడ్డి)
లేట్ మబ్బు లక్ష్మినారాయణరెడ్డి
కోడళ్లు:
ఎం.పార్వతి, ఎం.మంజుల, ఎం.సునంద
అల్లుడు: భూమా విజయకుమార్ రెడ్డి
కుమార్తె: భూమా పుష్పారెడ్డి
మనుమలు: మబ్బు రాహుల్‌రెడ్డి, మబ్బు తరుణ్ రెడ్డి,
మబ్బు లవనీష్ రెడ్డి, మబ్బు మితేష్ రెడ్డి
మనుమరాండ్రు: బొడెద్దుల జ్యోష్న రెడ్డి,
బి.మౌనిక, బి.పూర్ణలేఖ
మునిమనవరాలు: మబ్బు గోధారెడ్డి

కీ॥శే॥ మబ్బురామిరెడ్డి గారు
మాజీ శాసనసభ్యులు, తిరుపతి

(c) eenadu

అగస్త్య పూజితం.. అరుదైన ఆలయం

నలభై అడుగుల్లో పాతాళ గణపతి వైభవం

స్వామిని దర్శించుకునేందుకు వెళ్తున్న భక్తులు

ప్రాశస్త్యం ఇలా..: స్థల పురాణం అంతర్గతంగా సప్త రుషుల్లో ఒక్కరైన అగస్త్య మహర్షి దక్షిణ కైలాసంగా ప్రసిద్ధి పొందిన శ్రీకాళహస్తి క్షేత్రానికి నది ఆవశ్యకత తెలుసుకుని తపోబలంతో సువర్ణముఖి పేరుతో నదిని ఆవిర్భవింపచేశారు. పాకాల సమీపంలోని అగస్త్య చలంలో పుట్టి శ్రీకాళహస్తీశ్వరాలయానికి సమీపంలో సాగుతూ బంగాళాఖాతంలో కలుస్తోంది. నది ఆవిర్భావం జరిగాక అందులో నీళ్లు లేపోవడంతో ఆలోచనలో పడతారు. తపస్సుకు ముందు విఘ్నాధిపతి అయిన వినాయకస్వామిని పూజించని కారణంగా ఇలా జరిగిందని గ్రహించి ఆయన్ను మన్నించమని వేడుకుంటారు. అగస్త్యముని సంకల్పానికి మెచ్చిన వినాయకస్వామి పాతాళ మార్గంలో 40 అడుగుల లోతులో అగస్త్యునికి దర్శనమిచ్చినట్లు స్థల పురాణంలో విశదమవుతోంది. అందుకే ఇప్పటికీ ఇక్కడి వినాయక దర్శనం చేసుకోవాలంటే భక్తులు నలభై అడుగుల కిందకు దిగి చూడాల్సిందే.

దక్షిణ కైలాసంగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తి క్షేత్రంలో పురాణ ప్రాభవం కలిగిన ఆలయాలు ఎన్నో ఉన్నాయి. క్షేత్ర మహత్యానికి, అందులో సువర్ణముఖి నదీ పుట్టుకతానికి సంబంధించి ఏర్పాటైన పాతాళ గణపతి ఆలయం అగస్త్య మహర్షి పూజితంగా, దాదాపు 40 అడుగుల పాతాళంలో పూజలందుకుంటున్నారు.

ఇక్కడి ఆలయం ఎంతో అరుదైనదిగా గుర్తింపు పొందడం విశేషం. ఈ గణనాథుడిని దర్శించుకునేందుకు సినీనటులు, రెండు రాష్ట్రాలు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి ఆధ్యాత్మికంగా భక్తులు తరలివస్తుండటం విశేషం.

వినాయక స్వామి

సాహసోపేతమైన దర్శనం..: పాతాళ వినాయక స్వామి దర్శనం ఓ రకంగా సాహసోపేతమైనదనే చెప్పాలి. ఎందుకంటే ఎవరైనా మోకాళ్ల మీద పాక్కుంటూ లోనికి వెళ్లాల్సిందే. ఇరుకైన, ఎత్తయిన మెట్లపై అత్యంత జాగ్రత్తగా లోనికి వెళ్లి వినాయక స్వామిని దర్శించుకోవాల్సి ఉంటుంది. స్థూలకాయులు, చంటిబిడ్డలు, వృద్ధులు, దివ్యాంగులు, హృద్రోగులకు ప్రవేశం లేదు. ఎందుకంటే లోనికి వెళ్లి రావడం కాస్తంత కష్టం. భక్తుల శ్రేయస్సు దృష్ట్యా ఆలయ అధికారులు ఈ తరహా నియమ, నిబంధనలు అనుసరిస్తూ భక్తులను ఆలయంలోనికి అనుమతిస్తుంటారు. ఒకసారి ఏడుగురు లేదా ఎనిమిది మందికి మాత్రమే లోపలికి వెళ్లే అవకాశం ఉంటుంది. వాళ్లు వెళ్లి వచ్చాక మరి కొంత మందిని అనుమతిస్తుంటారు. ఇలా పర్వదినాల్లో రోజంతా వినాయకుడి దర్శనాలు సాగుతాయి.

- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

సుప్రభాతం.. ఆధ్యాత్మిక ఆనందం..

పవళింపు సేవలోని దేవతామూర్తులకు ఉదయపూర్వం మేలుకొలుపు నిర్వహించే విశేష సేవ సుప్రభాతం. ఒక్కో ఆలయంలో ఒక్కో రీతిలో ఈ సేవ నిర్వహిస్తుంటారు. శ్రీకాళహస్తీశ్వరాలయ విషయానికి వస్తే జ్ఞానప్రసూనాంబిక అమ్మవారి ఆలయానికి ఎడమ వైపున ఉన్న శయన మందిరంలో ఈ విశేష సేవ నిర్వహిస్తుంటారు. ప్రతి రోజూ వేకువజామున ఇక్కడ ప్రభాతసేవ, రాత్రి ఏకాంతసేవ ఈ మండపంలోనే జరుపుతుంటారు.

❖ **రుసుం:** రూ.200 ❖ **అనుమతి:** ఒకరికి

❖ **ఎలా పొందాలి:** ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఆలయ కౌంటర్లలో పొందచ్చు

❖ **ప్రత్యేకతలు:** ప్రధానమైన గర్భాలయాల్లో కొలువుదీరిన శ్రీకాళహస్తీశ్వరునితో పాటు జ్ఞానాంబిక అమ్మవార్ల తొలి దర్శనాన్ని వీక్షించే అవకాశం.

❖ **ఫలితం:** మానసిక శాంతి, ఆరోగ్యసిద్ధి, సర్వపాపాలు హరిస్తాయి.

ముక్కంటి ఆలయంలోని శయనోత్సవ మండపం

జిల్లావ్యాప్తంగా తుడా అభివృద్ధి పనులు: కలెక్టర్

తిరుపతి (నగరపాలిక) న్యూస్‌టుడే: తుడా అభివృద్ధి పనులు జిల్లా అంతటా విస్తరించాల్సిన అవసరముందని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో బుధవారం తుడా ఛైర్మన్ దివాకర్ రెడ్డి, వీసీ గోవిందరావుతో కలిసి ఆయన సమీక్షించారు. చెరువుల సుందరీకరణ, తుడా టవర్స్ పురోగతి, శెట్టిపల్లి టౌన్‌షిప్ ప్రణాళికలు, మాస్టర్‌ప్లాన్ రోడ్ల నిర్మాణ ప్రగతి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం ఆదేశాల మేరకు అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలన్నారు. జలవనరులశాఖ ఎస్ఈ వెంకటేశ్వర ప్రసాద్, తుడా కార్యదర్శి శ్రీకాంత్ బాబు పాల్గొన్నారు.

17 నుంచి చదరంగం పోటీలు

తిరుపతి (క్రీడలు), న్యూస్‌టుడే: క్రీడా క్యాలెండర్- 2026లో భాగంగా తిరుపతిలో జిల్లా, రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు నిర్వహించనున్నట్లు శాప్ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శశిధర్ ఓ ప్రకటనలో బుధవారం తెలిపారు. ఈనెల 17న జిల్లా స్థాయి, ఈనెల 21న రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయని, పోటీలకు అండర్- 13, 15, 17, 19 బాలబాలికలు అర్హులని అందులో వివరించారు. ఆసక్తిగల క్రీడాకారులు క్రీడా యాప్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 90596 06346, 99668 82029, 91772 34298 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఇగ్నో ప్రవేశాలకు 28న ఆఖరు

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: శ్రీవెంకటేశ్వర ఆర్ట్స్ కళాశాలలోని ఇగ్నో అధ్యయన కేంద్రంలో పీజీ, డిగ్రీ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేంద్రం సమన్వయకర్త మల్లికార్జునరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఈనెల 28వ తేదీ వరకు గడువు ఉంది, దరఖాస్తుల కోసం వెబ్‌సైట్ www. ignou. ac. in ను సందర్శించాలని పేర్కొన్నారు

వేదిక్ వర్సిటీ తాత్కాలిక రిజిస్ట్రార్‌గా ఉమేష్ భట్

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: తితిదే వేదిక్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ పోకల భాస్కరుడు బుధవారం తన పదవీకాలం పూర్తి కావడంతో ఆ పదవి నుంచి వైదొలిగారు. ఆయన స్థానంలో అక్కడే మీమాంస విభాగ ఆచార్యులైన ఉమేష్ భట్‌ను ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా నియమించారు. వాస్తవానికి నూతన రిజిస్ట్రార్‌గా తారకరామకుమార శర్మను నియమిస్తున్నట్లు వీసీ ఆచార్య రాణీ సదాశివమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. అయితే తారక రామకుమార శర్మ సెలవులో ఉండడంతో ఉమేష్ భట్ తాత్కాలికంగా ఆ బాధ్యతలు స్వీకరించారు.

జాతీయస్థాయి పోటీలకు ఎస్వీఎంసీ ఉద్యోగి

తిరుపతి(వైద్యవిభాగం): ప్రభుత్వ ఉద్యోగుల జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎస్వీ వైద్య కళాశాల జూనియర్ అసిస్టెంట్ **శశిభూషణరావు** ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డా.రవిప్రభు ఓ ప్రకటనలో బుధవారం తెలిపారు. ఈనెల 15 నుంచి 21వ తేదీ వరకు గోవాలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైనట్లు వివరించారు.

గంగమ్మ ఆలయ నిర్మాణానికి తితిదే నిధులు

వడమాలపేట, న్యూస్‌టుడే: మండలంలోని తట్నేరి గ్రామం గంగమ్మ ఆలయ నిర్మాణం కోసం తితిదే శ్రీవాణి ట్రస్టు ద్వారా రూ.20 లక్షల నిధులు మంజూరయ్యాయి. గతంలో ఎన్నో ఏళ్లుగా గుడి నిర్మాణం కోసం పలువురు ప్రజాప్రతినిధులను కలిసి విజ్ఞప్తి చేసినా గ్రామస్థుల కోరిక నెరవేరలేదు. ఇటీవల గ్రామస్థులు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన స్పందించి తితిదే ద్వారా నిధులు మంజూరు చేయించారు.

శ్రీశైలం మల్లన్నకు పట్టువస్త్రాల సమర్పణ

కాణిపాకం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీశైలం భ్రమరాంబిక మల్లికార్జునస్వామికి.. కాణిపాకం స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయం నుంచి బుధవారం పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ ఛైర్మన్ మణినాయుడు, ఈవో పెంచల కిశోర్ దంపతులు పాల్గొన్నారు.

మకర వాహనంపై సోమస్కందమూర్తి రాజసం

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గో రోజు బుధవారం ఉదయం సోమస్కందమూర్తి కామాక్షి అమ్మవారి సమేతంగా మకర వాహనంపై, రాత్రి శ్రీ కపిలేశ్వర స్వామివారు శేష వాహనంపై భక్తులకు అభయమిచ్చారు. భజనమండళ్ల కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ వైభవంగా వాహనసేవ కోలాహలంగా జరిగింది. ఆలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, భక్తులు పాల్గొన్నారు.

మకర వాహనంపై శ్రీ సోమస్కందమూర్తి సమేత కామాక్షి అమ్మవారు

సర్వదర్శనానికి 10 గంటలు

శ్రీవారి ఆలయ మాడవీధుల్లో కూల్ పెయింట్ వేస్తున్న కార్మికుడు

తిరుమల, తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: నేరుగా వచ్చే భక్తులకు 8 గంటల్లో, రూ.300 టికెట్లు కలిగిన భక్తులకు మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. మంగళవారం శ్రీవారిని 73,983 మంది భక్తులు దర్శించుకోగా రూ.4.23 కోట్ల హుండీ కానుకలు లభించాయి. శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద బుధవారం భక్తులకు పదివేల సర్వదర్శన టోకెన్లు జారీ చేశారు. వీటికి గురువారం వేకువజాము నుంచి రాత్రి పది గంటల వరకు దర్శనం కానుంది. శ్రీవారి మెట్టు నడకదారి భక్తులకు మరో రెండు వేల టోకెన్లు జారీ చేశారు.

వేసవికి ఏర్పాట్లు : రానున్న వేసవి నేపథ్యంలో శ్రీవారి ఆలయ మాడవీధులు, భక్తులు నడిచే మార్గంలో కూల్ పెయింట్ వేస్తున్నారు. కొంతకాలంగా మధ్యాహ్నం సమయంలో ఎండవేడిమి పెరిగింది. ఈ నేపథ్యంలో ఆలయ మాడవీధుల్లో భక్తులు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపడుతున్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శ్యామ్‌సుందర్ బుధవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారి మూలమూర్తిని న్యాయమూర్తి కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీవారిని ప్రముఖ ఆధ్యాత్మిక నాయకురాలు పద్మభూషణ్ సాధ్వి రితంబర దర్శించుకున్నారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ.. దేశంలోని ప్రజలంతా ధర్మబద్ధంగా జీవించాలని, హిందూ సమాజం దేశ నిర్మాణంలో భాగస్వాములవ్వాలని ఆకాంక్షించారు.

కుటుంబసభ్యులతో ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి శ్యామ్‌సుందర్

ప్రయాణికుడిగా పరిచయమై.. ఐపీఎస్‌గా నమ్మబలికి

❖ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.1.50 లక్షల కాజేత

❖ బాధితుడి ఫిర్యాదుతో నిందితుడి అరెస్టు

నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సీఐ రామ్‌కిషోర్

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: దిల్లీ ఎన్ఐఏలో ఐపీఎస్ అధికారిగా పని చేస్తున్నా.. ఆదాయపు పన్ను శాఖలో డివిజనల్ అడ్వైజర్ ఉద్యోగాన్ని రీప్లేస్‌మెంట్ కోటాలో ఇప్పిస్తానని ఓ యువకుడిని నమ్మించి రూ.1.50 లక్షలు కాజేసిన నకిలీ ఐపీఎస్ అధికారి ఉదంతమిది. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన తిరుపతి జిల్లా అలిపిరి పోలీసులకు ఇదే తరహాలో మరో రెండు చోట్ల మోసాలకు పాల్పడినట్లు తెలిసింది. తెలంగాణ రాష్ట్రం సిద్దిపేటలో ఒకరి నుంచి రూ.2.50 లక్షలు, మాదాపూర్‌లో మరో యువకుడి నుంచి రూ.7 లక్షలు కాజేసినట్లు గుర్తించారు. నిందితుడిని అరెస్టు చేసి కేసు వివరాలను సీఐ రామ్‌కిషోర్ ఎస్ఐ నరసింహరావుతో కలసి బుధవారం వెల్లడించారు. 'ఏలూరుకు చెందిన వెంకటేశ్వరరావు ఐదేళ్ల కిందట గరుడ వారధి నిర్మాణ పనుల నిమిత్తం తిరుపతికి వచ్చారు. స్థానిక ఆటోనగర్‌లో ఉంటూ ప్రస్తుతం స్విమ్స్‌లో ఫార్మసిస్ట్‌గా పనిచేస్తున్నారు. సెలవు రోజుల్లో రాపిడో డ్రైవర్‌గా పనిచేస్తారు. రెండు నెలల కిందట రాపిడో రైడ్‌లో కె.సురేష్‌కుమార్ అలియాస్ సూర్య పరిచయమయ్యారు. దిల్లీ ఎన్ఐఏలో ఐపీఎస్ అధికారిగా తనను తాను పరిచయం చేసుకున్నారు. ఇటీవల పదోన్నతిపై హైదరాబాద్‌కు బదిలీ అయినట్లు చెప్పారు. ప్రస్తుతం సెలవులో శెట్టిపల్లిలోని పిన్నమ్మ ఇంటికి వచ్చానని తెలిపారు. హైదరాబాద్ ఆదాయపన్ను శాఖలోని ఉన్నతాధికారులు తనకు పరిచయం ఉన్నారని.. రీప్లేస్‌మెంట్ కోటాలో ఉద్యోగం ఇప్పిస్తానని రాపిడో డ్రైవర్‌ను నమ్మించారు. అతని నుంచి విడతల వారీగా పేటీఎం ద్వారా రూ.1.50 లక్షల నగదు బదిలీ చేయించుకున్నారు. అతని అనుమానాస్పద ప్రవర్తనను గుర్తించిన బాధితుడు నగదు తిరిగి ఇమ్మని కోరగా.. నువ్వు చేయగలిగింది చేసుకోమని బెదిరించడంతో అలిపిరి పోలీసులను ఆశ్రయించారు. దర్యాప్తులో ఒడిశాకు చెందిన సురేష్‌కుమార్ ఇదే తరహా మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్స్‌కు అలవాటు పడి అవసరమైన డబ్బు కోసం మోసాలకు పాల్పడుతున్నట్లు తెలుసుకున్నారు. బుధవారం అరెస్టు చేసి అతని నుంచి రూ.1.25 లక్షల విలువైన వాషింగ్ మిషన్, టీవీ, మ్యూజిక్ పరికరాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు.

మత్తు మందు ఇచ్చి.. తాళిబొట్టు కాజేసి

తిరుపతిలో మహిళల దగా

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: ఓ వివాహితకు మత్తుమందు ఇచ్చి.. తాళిబొట్టు కాజేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. అలిపిరి సీఐ రామ్‌కిషోర్ వివరాల మేరకు.. 'నెల్లూరు నగరంలో జయమ్మ నివాసం ఉంటుంది. ఆమె ఇంటి ఎదురుగా ఉంటున్న సాయి పార్థసారథి (35) డాక్టర్‌నంటూ అనారోగ్యంతో ఉన్న జయమ్మకు చికిత్స చేసేవారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని ప్రైవేట్ వైద్యశాలకు తన కారులో తీసుకెళ్తానని చెప్పడంతో.. జయమ్మ వరసకు కుమార్తె అయిన మౌనికను వెంట తీసుకుని బయలుదేరింది. పార్థసారథి తన స్నేహితుడు సులేమాన్‌తో బయల్దేరారు. విరేచనాలు, ప్రయాణ అలసట లేకుండా ఉండేందుకంటూ ఓ మాత్రను మౌనికతో తినిపించారు. తర్వాత ఆమె తల తిరిగినట్లు ఉందని చెప్పడంతో మొదట హోటల్‌కు వెళ్లి విశ్రాంతి తీసుకుందామని కపిలతీర్థం కూడలికి తీసుకొచ్చారు. తర్వాత హాస్పిటల్‌కు వెళ్లి జయమ్మకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆ సమయంలో మౌనిక మెడలోని బంగారు తాళిబొట్టు కనిపించకపోవడంతో వెంట వచ్చిన వారికి చెప్పింది. ఇంటి వద్ద మరిచిపోయి వచ్చి ఉంటారేమో పరిశీలించుకోమని చెప్పారు. తీరా ఇంటికొచ్చి చూసినా కనిపించకపోవడంతో పార్థసారథిని ప్రశ్నించారు. సరైన సమాధానం లేకపోవడంతో అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. డాక్టర్ కాని సాయి పార్థసారథి మత్తు మాత్రలు ఇచ్చి మౌనిక మెడలోని బంగారు గొలుసు కాజేసినట్లు దర్యాప్తులో తేలినట్లు సీఐ తెలిపారు. నెల్లూరు జిల్లాలోనూ ఇద్దరు మహిళలను మోసగించి బంగారు కాజేసినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడిని బుధవారం రాత్రి అదుపులోకి తీసుకుని నగ స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

ఎలుగుబంటి దాడిలో రైతుకు తీవ్ర గాయాలు

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే: ఎలుగుబంటి దాడిలో రైతు తీవ్రంగా గాయపడిన ఘటన మంగళవారం సాయంత్రం మండలంలోని వైకోటలో జరిగింది. గ్రామానికి చెందిన బీగాల కూమార్ అటవీ సమీపంలోని పొలంలో పని చేస్తుండగా వెనుక నుంచి వచ్చిన ఎలుగుబంటి హఠాత్తుగా దాడి చేసింది. అతడు అక్కడి నుంచి పరుగు తీశాడు. తీవ్రగాయాలవడంతో స్థానికులు రైల్వేకోడూరు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. ఈ విషయంపై వైకోట అటవీశాఖ అధికారి మహేష్‌ను వివరణ కోరగా. . అతడికి సాయం చేస్తామన్నారు.

ఎర్రచందనం స్వాధీనం..
నలుగురు స్మగ్లర్ల అరెస్టు

ఎర్రచందనం, స్మగ్లర్లను చూపుతున్న టాస్క్‌ఫోర్స్ చీఫ్ సుబ్బరాయుడు, ఎస్పీ శ్రీనివాస్

తిరుపతి (జీవకోన), న్యూస్‌టుడే: భారీగా ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని, నలుగురు స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం అన్నమయ్య జిల్లా పరిధిలో జరిగిన ఈ ఘటనపై టాస్క్‌ఫోర్స్ చీఫ్ సుబ్బరాయుడు, ఎస్పీ శ్రీనివాస్, అదనపు ఎస్పీ కులశేఖర్ కపిలతీర్థంలోని ఆ విభాగం కార్యాలయంలో విలేకర్లకు వెల్లడించారు. టి.సుండపల్లి పరిధి పించా ప్రాజెక్టు సమీపంలో కొందరు స్మగ్లర్లు ఎర్రచందనం దుంగలను ట్రాక్టర్‌కు అనుసంధానం చేసిన ట్యాంకర్‌లో లోడు చేస్తుండగా టాస్క్‌ఫోర్స్ బలగాలు చుట్టుముట్టాయి. అప్రమత్తమైన స్మగ్లర్లు పారిపోయే ప్రయత్నం చేయడంతో వెంబడించి తమిళనాడు, ఏపీలోని పలు ప్రాంతాలకు చెందిన నలుగురిని పట్టుకున్నారు. అలాగే ట్రాక్టర్, ట్యాంకర్‌లో దాచిన 72 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.1.65 కోట్లు ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా దాడుల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బందిని అభినందించి, రివార్డులు ప్రకటించారు.

EENADU e Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

శ్రీ విఘ్నేశ్వర్ స్వామి ఇంటీరియర్ డిజైనర్స్ కబోర్డ్స్, డబుల్‌కాట్ విండోస్ ద్వారాలు అల్యూమినియం వర్క్ మరియు అపార్ట్‌మెంట్ వర్క్ ప్లానింగ్ మిషన్‌తో పాటు వర్క్స్ చేయబడును. ✆ 95812 56014.

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై ఆంధ్రప్రదేశ్ అంతటా మార్టిగేజ్ లోన్స్ మరియు స్థిరాస్తి ఎక్కడ ఉన్నా ఏసంస్థలో ఉన్నా Xerox పేపర్స్‌పై 2nd మార్టిగేజ్ లోన్ ఇవ్వబడును. 50లక్షలులోపు, అయోధ్య కోఆపరేటివ్ బ్యాంక్. ✆ 93969 99669.

HEALTH & CARE

PAEDIATRIC

శ్రీవిష్ణు చిన్నపిల్లల హాస్పిటల్: డా॥ కె.కీర్తన (M.D., Pediatrics, SVMC & Ex. Senior Resident RUIA, Fellow in Neonatology) పురిటి బిడ్డలు & చిన్నపిల్లల వైద్యనిపుణులు, 24X7 ఎమర్జెన్సీ కేసులు చూడబడును. మనోహరి హాస్పిటల్ ప్రక్కన, రెడ్డి & రెడ్డి కాలనీ, తిరుపతి ✆ 63035 53359.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

నేషనల్ హైవేలకు ఆనుకొని తిరుపతిలో ఫైనల్ అప్రూవ్డ్ ప్లాట్స్ అన్ని సదుపాయాలతో తక్కువధరకే,డైరెక్ట్ ఓనర్,స్పాట్ రిజిస్ట్రేషన్ ఫోన్ : 9966262221/9502774175

1.తిరుపతి - సి.రామాపురం జైన్‌మందిరం వద్ద 2.రేణిగుంట యోగానంద కాలేజీకి ప్రక్కన 3.చంద్రగిరిటౌన్‌లో ఉగ్రప్రత్యంగిరా అమ్మవారి గుడి దగ్గర 100 feet రోడ్డు ఆనుకొనిఉన్న వెంచర్స్‌లో తుడా అప్రూవల్స్‌తో హౌస్/విల్లా కట్టుకునే ప్లాట్లు అమ్మబడును. 9505502346.

JOBS

WANTED MALE Process Associates Qual: Degree/ Diploma with Typing Skills of 25 NWPM, Sal: 14K to 18K. Mob: 80967 30137.

Universal Educational Services Wanted Female Telecallers. Qualification: Any Degree, Tirupati ✆ 9676968115, 8179915301.

తిరుపతిలోని ప్రముఖ కంపెనీకి బిజినెస్‌పర్సన్స్, రిటైర్డ్ పర్సన్స్, వివాహితులు కావలెను. Age:30to65, Qua: Inter- PG పాన్‌కార్డు తప్పనిసరి ✆ 7675095860.

లక్ష్మీస్ డిజైనర్ ఎంపోరియం తిరుపతిలో బొటిక్‌లో అనుభవం కల్గిన లేడీ మరియు సేల్స్‌గర్ల్స్-2 కావలెను. ఆకర్షణీయమైన జీతం ✆9966129199.

బాతులను పెంచుటకు అనుభవం గల వర్కర్స్ & ఆంధ్ర టిఫిన్స్, Veg & Nonveg, స్నాక్స్ చేసే వంట మనిషి కావలెను. ✆ 9849311524, 8688262581.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU THE e WAY CLASSIFIEDS

B/W 5 లైన్ల ప్రకటన రూ. 500/-

Colour 5 లైన్ల ప్రకటన రూ. 600/- మాత్రమే

తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు

వివరాలకు...

80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి

B/W: రూ. 600 Colour: రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

ఎవరైనా కొడితేనే 'కిక్'

నిందితుడు శ్రీవాత్సవ్(సన్నీ)ను చూపుతున్న పోలీసులు

చంద్రగిరి, న్యూస్‌టుడే: మండలంలోని ఎగువరెడ్డివారి పల్లికి చెందిన శ్రీవాత్సవ్ (సన్నీ)ని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. గంజాయి మత్తులో అడ్డొచ్చినవారిని కొడుతూ, ప్రశ్నించినవారి వాహనాలు దహనం చేస్తూ బీభత్సం సృష్టించిన ఘటన జనవరి 21న అర్ధరాత్రి జరిగింది. గ్రామంలోని మౌనిక అనే యువతి ఇంటిపైన దాడిచేసి కిటికీలు, అద్దాలు ధ్వంసం చేశాడు. ద్విచక్ర వాహనాలను పెట్రోల్ పోసి తగలబెట్టాడు. బాధితుల ఫిర్యాదుతో నిందితుడ్ని సీఐ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు అరెస్టు చేశారు. గంజాయికి బానిసైన శ్రీవాత్సవ్ (సన్నీ) మత్తులో ఉన్నప్పుడు ఎవరైనా కొడితేనే తనకు 'కిక్' వస్తుందని చెప్పడం అతడి వికృత చేష్టలకు అద్దం పడుతోందని సీఐ సురేష్ కుమార్ తెలిపారు. అతనిపై తిరుపతిలో రెండు, చంద్రగిరిలో మూడు కేసులు నమోదైనట్లు వివరించారు. ఓ హత్యకేసులో నిందితుడిగా ఉన్నారన్నారు. యువకుల్ని ప్రలోభపెట్టి గంజాయికి బానిసలుగా మారుస్తున్నట్లు విచారణలో వెల్లడైందన్నారు. ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి



తడ, న్యూస్‌టుడే: రామాపురం వద్ద జాతీయ రహదారి సర్వీసు రోడ్డుపై బుధవారం ద్విచక్ర వాహనాన్ని మినీ లారీ ఢీకొన్న ప్రమాదంలో ఎస్సీ కాలనీకి చెందిన **లాజర్**(16) అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు యువకులు కిషోర్, స్వామి గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు... పదో తరగతి ఫెయిల్ అయిన లాజర్ పరీక్ష రాసేందుకు ఆరంబాకంలో ట్యూషన్‌కు వెళ్లి అదే గ్రామానికి చెందిన యువకులు కిషోర్, స్వామితో ద్విచక్ర వాహనంలో సాయంత్రం ఇంటికి బయల్దేరాడు. మరో ఐదు నిమిషాల్లో ఇంటికి చేరుకునే క్రమంలో వెనుక వచ్చిన మినీ లారీ ఢీకొంది. దీంతో లాజర్ కింద పడి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ఇద్దరు గాయాలతో బయటపడ్డారు. దీంతో కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి. తడ ఎస్సై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమరరాజ ఎనర్జీ & మొబిలిటీ లిమిటెడ్

(గతంలో అమరరాజ బ్యాటరీస్ లిమిటెడ్‌గా పిలువబడేది)

CIN: L31402AP1985PLC005305

నమోదిత కార్యాలయం: రేణిగుంట – కడప రోడ్, కరకంబాడి, తిరుపతి– 517520, ఆంధ్రప్రదేశ్

ఫోన్: 91 (877) 2265000, ఫ్యాక్స్: 91 (877) 2285600.

ఇమెయిల్ ఐడి: investorservices@amararaja.com వెబ్‌సైట్: www.amararajaeandm.com

AMARA RAJA Gotta be a better way

31 డిసెంబర్ 2025తో ముగిసిన త్రైమాసిక మరియు తొమ్మిది నెలల కాలానికి స్వతంత్ర మరియు ఏకీకృత ఫలితాల సంగ్రహ నివేదిక రూ.కోట్లలో

వివరాలు	స్వతంత్ర ఫలితాలు						ఏకీకృత ఫలితాలు					
	ముగిసిన త్రైమాసిక కాలం			ముగిసిన తొమ్మిది నెలల కాలం		ముగిసిన వార్షిక కాలం	ముగిసిన త్రైమాసిక కాలం			ముగిసిన తొమ్మిది నెలల కాలం		ముగిసిన వార్షిక కాలం
	31.12.2025	30.09.2025	31.12.2024	31.12.2025	31.12.2024	31.03.2025	31.12.2025	30.09.2025	31.12.2024	31.12.2025	31.12.2024	31.03.2025
	ఆడిట్ కానివి	ఆడిట్ కానివి	ఆడిట్ కానివి	ఆడిట్ కానివి	ఆడిట్ కానివి	ఆడిట్ అయినవి	ఆడిట్ కానివి	ఆడిట్ కానివి	ఆడిట్ కానివి	ఆడిట్ కానివి	ఆడిట్ కానివి	ఆడిట్ అయినవి
కార్యకలాపాల ద్వారా వచ్చిన మొత్తం ఆదాయం	3,350.84	3,388.18	3,164.02	10,088.94	9,431.04	12,404.89	3,410.15	3,467.02	3,272.47	10,278.25	9,786.25	12,846.32
సదరు వ్యవధికి నికర లాభం (పన్ను ఆసాధారణ ఐటంలకు ముందు)	251.28	283.76	311.09	796.05	963.72	1,188.08	239.87	243.03	297.70	711.82	949.48	1,162.10
పన్నుకు ముందు వ్యవధికి నికర లాభం (అసాధారణ ఐటంల తర్వాత)	207.48	405.55	422.16	874.04	1,074.79	1,299.15	192.24	364.82	408.77	785.98	1,060.55	1,273.17
పన్ను మరియు అసాధారణ ఐటంల తర్వాత వ్యవధికి నికర లాభం	151.69	302.40	311.83	648.10	797.09	963.90	140.15	276.49	298.37	581.44	783.10	944.67
సదరు వ్యవధికి మొత్తము సమగ్ర ఆదాయం (పన్ను తర్వాత సమగ్ర లాభంతోపాటు మరియు పన్ను తర్వాత ఇతర సమగ్ర ఆదాయం)	151.48	305.14	180.00	649.99	741.37	799.97	139.95	279.10	166.64	583.21	727.08	780.75
చెల్లించిన ఈక్విటీ వాటామూలధనం (ముఖ విలువ రూ. 1/- ఒక్కింటికి)	18.30	18.30	18.30	18.30	18.30	18.30	18.30	18.30	18.30	18.30	18.30	18.30
గత సంవత్సరపు ఆడిట్ చేసిన ఆస్తి అప్పులపట్టీలో చూపిన విధంగా రిజర్వులు (రీవాల్యుయేషన్ రిజర్వు మినహా)	-	-	-	-	-	7,359.97	-	-	-	-	-	7,370.83
ప్రతి వాటాకు వచ్చిన ఆర్జనలు (రూ. 1/- ఒక్కింటికి) (సదరు కాలానికి - వార్షికరించబడలేదు) - బేసిక్ /డైల్యూటెడ్ (రూ.)	8.29	16.52	17.04	35.41	43.55	52.66	7.66	15.11	16.30	31.77	42.79	51.62

గమనిక:1) SEBI (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్ 2015 యొక్క రెగ్యులేషన్- 33 ప్రకారం స్టాక్ ఎక్స్ఛేంజిలకు దాఖలు చేసిన స్వతంత్ర మరియు ఏకీకృత ఆర్థిక ఫలితాల సంగ్రహమే పైనపేర్కొన బడినది. త్రైమాసిక/తొమ్మిది నెలల కాల వ్యవధి యొక్క ఆర్థిక ఫలితాల మరియు వాటి నోట్స్ యొక్క పూర్తి నమూనా స్టాక్ ఎక్స్ఛేంజి వెబ్‌సైట్స్ (www.nseindia.com మరియు www.bseindia.com) నందు మరియు కంపెనీ వెబ్‌సైట్ అనగా www.amararajaeandm.com నందు లభ్యమగును.

2) కంపెనీ వాటాదారులు, ఎవరైతే తమ యొక్క ఇ-మెయిల్ చిరునామాను ఇంతవరకు నమోదు చేసుకోని/నవీకరించనివారు తమ యొక్క ఇ-మెయిల్ చిరునామాను వారి యొక్క డిపాజిటరీ పార్టిసిపెంట్స్‌తో నమోదు చేసుకోవలసినదిగా/నవీకరించవలసిందిగా లేదా వారి సమ్మతిని నమోదు/నవీకరణ నిమిత్తం తమయొక్క ఫోలియో సంఖ్య/DPID CL ID మరియు చెల్లుబాటు అయ్యే ఈమెయిల్ చిరునామాతో పాటుగా investor@cameoindia.com లేదా investorservices@amararaja.com కు పంపవలసిందిగా కోరడమైనది.

హైదరాబాద్

తేది: 11, ఫిబ్రవరి, 2026

అమరరాజ ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ తరపున
(గతంలో అమరరాజ బ్యాటరీస్ లిమిటెడ్‌గా పిలువబడేది)

సం/– జయదేవ్ గల్లా

DIN: 00143610

ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ మరియు సిఇఓ

(c) eenadu

తిరుపతి

•తిరుపతి • చంద్రగిరి

ఫలితాలు విడుదల చేస్తున్న ఎస్వీయూ వీసీ, రిజిస్ట్రార్, కళాశాల డైరెక్టర్

డిగ్రీ ఫలితాల విడుదల

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: సీకాం డిగ్రీ కళాశాల స్వయం ప్రతిపత్తి హోదాలో మొదటిసారిగా జరిగిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలను బుధవారం ఎస్వీయూ వీసీ ఆచార్య నరసింగరావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు విడుదల చేసినట్లు ఆ కళాశాల అధినేత డాక్టర్ టి. సురేంద్ర నాథ్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ప్రణీత్ స్వరూప్, పరీక్షల విభాగం నియంత్రణ అధికారి మునిరాజ్ పాల్గొన్నారు.

లోకేశ్ చిత్రపటానికి క్షీరాభిషేకం

తిరుపతి (నగరం, ఎస్వీయూ): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయడంపై టీఎన్ఎస్ఎఫ్ నాయకులు బుధవారం సంబరాలు చేసుకున్నారు. టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు కొట్టే హేమంత్‌రాయల్, తెలుగు యువత అధికార ప్రతినిధి రంజిత్‌నాయుడు ఆధ్వర్యంలో మంత్రి నారా లోకేశ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎస్వీయూలోఆర్కే. నాయుడు, సుబ్రహ్మణ్యం, నాగేంద్ర పాల్గొన్నారు.

ట్రోఫీ అందుకుంటున్న సంస్కృత వర్సిటీ విద్యార్థులు

ఛాంపియన్లుగా తిరుపతి విద్యార్థులు

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో అఖిల భారత సంస్కృత విద్యార్థుల ప్రథమ సాంస్కృతిక యువ మహోత్సవ్- 2026 వేడుకలు బుధవారంతో ముగిసాయి. ఈ ఉత్సవాలలో తిరుపతి విద్యార్థులు ఓవరాల్ ఛాంపియన్ షిప్ సాధించారు. ముఖ్య అతిథిగా ఎస్వీయూ రెక్టర్ ఆచార్య సీహెచ్ అప్పారావు విచ్చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. స్టూడెంట్స్ విభాగం డీన్ ఆచార్య సింగరాజు దక్షిణా మూర్తి శర్మ, డీన్ రజనీకాంత్ శుక్ల పాల్గొన్నారు.

ఉపయోగపడే పరిశోధనలు అవసరం

తిరుపతి (మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: పరిశోధన ఫలాలు సమాజానికి ఉపయోగపడేలా ఉండాలనిశ్రీ పద్మావతి మహిళా వర్సిటీ వీసీ ఆచార్య ఉమ పేర్కొన్నారు. వర్సిటీలో నిర్వహించిన ఐఆర్ఐఎస్ఈ ఈసీఆర్ కెపాసిటీ బిల్డింగ్ కార్యశాల బుధవారం ముగిసింది. రిజిస్ట్రార్ ఉష, సమన్వయకర్తలు జాన్‌సుష్మ, శోభారాణి పాల్గొన్నారు.

ధ్రువపత్రం అందజేస్తున్న వీసీ ఉమ, రిజిస్ట్రార్ ఉష

కుటుంబ సర్వే వేగవంతం చేయండి

చిన్న గొట్టిగల్లు, న్యూస్‌టుడే: కుటుంబ సర్వేను వేగవంతం చేయాలని జిల్లా స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు అధికారి నారాయణ రెడ్డి తెలిపారు. బుధవారం భాకారపేటలో పర్యటించారు. ఫ్యామిలీ సర్వే, అక్షరాంధ్ర, ఈకేవైసీ, ఇంటి పన్ను వసూళ్లపై మండల అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఈట్ స్ట్రీట్ సిద్ధం

✦ రూ.1.38 కోట్లతో పనులు
✦ నెలరోజుల్లో ప్రారంభం

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: నగర వీధుల్లో తోపుడుబండ్లు, ఫుట్‌పాత్‌లపైన చిరువ్యాపారులు ఆహార పదార్థాల విక్రయాలు సాగిస్తున్నారు. నాణ్యత లోపాలతో పాటు దుమ్ము, ధూళి నుంచి రక్షణ ఉండవు. దీన్ని అధిగమించి నగరవాసులకు నాణ్యమైన, శుభ్రతతో ఆహారాన్ని అందించేందుకు ఈట్‌స్ట్రీట్ అందుబాటులోకి రానుంది. నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్‌ను సమీపంలోని మాస్టర్‌ప్లాన్ రోడ్డులో రూ. 1.38 కోట్లతో 14 దుకాణాల ఏర్పాటుకు నగరపాలిక సంకల్పించింది.

అక్కడే ఎందుకంటే..

ఈట్‌స్ట్రీట్‌ను ప్రారంభించాలని రెండేళ్ల క్రితం భావించారు. రేణిగుంట మార్గంలో కొత్తగా నిర్మించిన మాస్టర్‌ప్లాన్ రోడ్డు అసంపూర్తిగా ఉండడంతో అది నిరుపయోగమని భావించి అక్కడ ఏర్పాటు చేసేదుందుకు గత ప్రభుత్వం నిర్ణయించింది. భద్రతాపరమైన సమస్యలు వస్తాయని అనుమానించిన అధికారులు అలిపిరి రోడ్డు నుంచి చెన్నారెడ్డి కాలనీ రోడ్డును అనుసంధానం చేస్తూ నిర్మించిన మాస్టర్‌ప్లాన్ రోడ్డు అనుకూలమైందని తీర్మానించారు.

నెహ్రూ మున్సిపల్ మైదానం సమీపంలో నిర్మాణ దశలోని ఈట్‌స్ట్రీట్

శాశ్వత దుకాణాలతో..

ఈట్‌స్ట్రీట్‌లో కంటైనర్‌లతో ఏర్పాటు చేస్తున్నారు. 8 అడుగుల వెడల్పు, 16 అడుగుల పొడవు ఉంటుంది. అందులో నీటికుళాయి, వ్యర్థాలు వెళ్లేలా ఏర్పాటు, సింక్, విద్యుత్తు సౌకర్యం కల్పిస్తారు. మొత్తం 14 దుకాణాలకు నేషనల్ హెల్త్ మిషన్ నుంచి రూ. కోటి మంజూరైంది. మిగిలిన రూ. 38 లక్షలు నగరపాలిక సాధారణ నిధుల నుంచి వెచ్చిస్తున్నారు. నెలరోజుల్లో పనులు పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

విధివిధానాలు రూపొందిస్తున్నాం

దుకాణాల కేటాయింపు పారదర్శకంగా ఉంటుంది. బహిరంగ వేలంలో దక్కించుకోవచ్చు. నిబంధనలు గురించి స్పష్టత రాలేదు. నేషనల్ హెల్త్ మిషన్ నిబంధనలు పాటిస్తాం.

- ఎన్.మౌర్య, కమిషనర్, నగరపాలిక, తిరుపతి

తిరుమల వ్యాపారుల సమస్యలపై చర్చ

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: తిరుమలలోని వ్యాపారుల సమస్యలపై తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు చర్చించారు. స్థానిక శ్రీనివాసపురంలోని తెదేపా సీనియర్ నాయకుడు జేబీ శ్రీనివాస్ నివాసానికి బుధవారం విచ్చేసిన ఆయనకు తెదేపా నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలు సమస్యలను వారు ప్రస్తావించారు.

బీఆర్ నాయుడుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జేబీ శ్రీనివాస్



ఔషధ మొక్కల పెంపకంపై దృష్టి

చంద్రగిరి, న్యూస్‌టుడే: నరశింగాపురంలోని శ్రీశ్రీనివాస ఆయుర్వేద ఫార్మసీలో ఔషధ మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించామని తితిదే జేఈవో డాక్టర్ ఎ. శరత్ అన్నారు. ఫార్మసీని బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎస్వీ ఆయుర్వేద వైద్యశాలకు అవసరమైన మందుల తయారీకి కావాల్సిన అరుదైన మొక్కల పెంపకంపై తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికార, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

శ్రీనివాస ఆయుర్వేద ఫార్మసీలో మందుల తయారీ పరిశీలిస్తున్న జేఈవో డా.శరత్

కేంద్ర మంత్రికి సత్కారం

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్‌ను తిరుపతికి చెందిన కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ పి. సి. రాయులు బుధవారం దిల్లీలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. తనకు ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ సభ్యుడిగా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

గంగమ్మ పరకామణి లెక్కింపు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ దేవస్థానంలో భక్తులు అమ్మవారికి హుండీల్లో సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. సూళ్లూరుపేట శ్రీ చెంగాలమ్మ దేవస్థాన సహాయ కమిషనర్ ప్రసన్నకుమారి పర్యవేక్షించారు. 60 రోజులకు గాను నగదు రూ. 25,04,079, బంగారం 26.700 గ్రాములు వెండి 478.5 గ్రాములు వచ్చింది. ఈ పరకామణిలో పాలకమండలి ఛైర్మన్ నైనార్ మహేష్ యాదవ్, ఈవో జయకుమార్ పాల్గొన్నారు.

ఎంపీడీవోగా ఉద్యోగోన్నతి

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: మదనపల్లె మండల కార్యాలయం పరిపాలనాధికారి మస్తాన్‌వలికి పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ నుంచి బుధవారం ఉత్తర్వులు అందాయి. ఆయన్ను తిరుపతి గ్రామీణ ఎంపీడీవోగా బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

In the Court of the II nd Addl. Civil Judge (Junior Division): Tirupati
I.A.No.99/2025, O.S.No.486/2025
S.Lavanya ...Plaintiff/Petitioner
Vs
T.Vijaya Kumar & Others ...Defendants/Respondents

Notice to Respondent /Defendant No.1

R1/D1) Thunga Vijaya Kumar S/o T.Nadhamuni, D.No.19-8-12, Hathiramjee Colony, Tirupati Town, Tirupati Urban Mandal, Tirupati District.

పై తెలిపిన దావా నందు వాది/పిటీషనర్ మీపైన మరియు ఇతరులపై పర్మనెంట్ ఇంజంక్షన్ ఉత్తర్వుల కొరకు కేసును దాఖలు చేసియున్నారు. అందు నిమిత్తం పై కనిన కేసు నందు ఐ.ఎ. నెం.99/2025 వేసియున్నారు. సదరు ఐ.ఎ. మరియు సూట్ నందు కోర్టువారు తేదీ. **26.02.2026** తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు తేదీన ఉదయం 10.30 గంటలకు నేరులోగాని లేక వకీలు ద్వారా హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకొనవలసినది. లేని యెడల మీకు పరోక్షముగా తీర్మానించబడును.

K.VIJAYABHASKAR REDDY
Advocate, Tirupati

వ్యవసాయంలో కృత్రిమ మేధ, డ్రోన్ల సేవలు

తిరుపతి(వ్యవసాయం), న్యూస్‌టుడే: రాష్ట్రాన్ని వ్యవసాయ రంగంలో బలోపేతం చేయాలన్న కూటమి ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా కృత్రిమ మేధ (ఏఐ), డ్రోన్లతో ఆధునిక సేవలు విస్తృతంగా రైతుల్లోకి తీసుకెళ్లేందుకు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (అంగ్రూ) కృషి చేస్తుందని వర్సిటీ ఉపకులపతి శారదా జయలక్ష్మి దేవి తెలిపారు. తిరుపతిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వేదికగా గురువారం నిర్వహించనున్న కిసాన్‌మేళా ఆవశ్యకతను వివరించేలా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆమె స్పష్టం చేశారు. పరిశోధన స్థానం ఏడీఆర్ డా.వి.సుమతి, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా. రెడ్డిశేఖర్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డా.శారదా జయలక్ష్మీదేవి

పరిశోధక విద్యార్థినికి డాక్టరేట్

తిరుపతి(మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ ఫార్మసీ విభాగం పరిశోధక విద్యార్థిని పి. ఎన్. ఎస్. శ్యామలకు వర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆచార్య శ్రీదేవి మార్గదర్శకత్వంలో 'క్వా బీడీ బేస్డ్ స్టెబిలిటీ ఇండికేటింగ్ మెథడ్ డెవలప్‌మెంట్, వాలిడేషన్ అండ్ అప్లికేషన్ టు డీగ్రేడేషన్ కైనెటిక్స్ ఆఫ్ సెలెక్టెడ్ డ్రగ్స్' అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించినట్లు డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య అనురాధ తెలిపారు.

శ్యామల

హెల్త్‌కేర్ కౌన్సిల్ సభ్యుడిగా నియామకం

తిరుపతి (వైద్యవిభాగం): రాష్ట్ర అల్లైడ్ హెల్త్ కేర్ కౌన్సిల్ సభ్యులుగా తిరుపతికి చెందిన ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ మునిశేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి సౌరబ్ గౌర్ ఉత్తర్వులు జారీ చేశారు. రెండేళ్ల పాటు పదవిలో కొనసాగనున్నారు. పలువురు అభినందనలు తెలిపారు.

డాక్టర్ మునిశేఖర్

ముఖ్య బహిరంగ ప్రకటన

మా కక్షికర్త యగు కడప జిల్లా, బద్వేలు మండలం, అశోక్ నగర్ వీధిలో కాపురముండు బచ్చల రామయ్య మరియు సుబ్బమ్మ గార్ల జ్యేష్ఠ కుమారుడైన బచ్చల రమణయ్య (74 సం॥ల వయస్సు) తరఫున యావన్మందికీ బహిరంగ పరచడమేమనగా..

మా కక్షికర్త బి.రమణయ్య మరియు అతని ధర్మపత్ని వెంకట సుబ్బమ్మ గార్లు కలిసి పై తెలిపిన టౌన్ నందు కాపురమున్నారు. వారివురికి శ్రీధర్ అనే జ్యేష్ఠ కుమారుడున్నూ మరియు స్వర్ణలత (శ్రీ వై.వెంకట సుబ్బయ్య గారి భార్య-బద్వేలు టౌన్) అను ఏకైక పుత్రిక మరియు డాక్టర్ సునీల్ కుమార్ (ప్రస్తుతం మదనపల్లి టౌన్ వాస్తవ్యులు) అను ముగ్గురు సంతానము కలిగియున్నారు. మా కక్షికర్త మరియు అతని భార్య, వారికి గల ఆస్తుల గురించి మరియు పరిస్థితులననుసరించి వారి సంతతి వారిని పెంచి, పెద్ద చేసి వివాహాది శుభకార్యములు వగైరాలు జరిపి జీవితములో స్థిరపరచియున్నారు. పై ముగ్గురు సంతానము పైకి జ్యేష్ఠ కుమారుడైన శ్రీధర్‌ను శ్రీమతి నాగలక్ష్మి (నార్పాల-అనంతపురం జిల్లా) అను ఆమెతో 31-10-1999 లేక ఆ సుమారున వివాహాది శుభకార్యములు జరిపించియున్నారు. సదరు బి.శ్రీధర్ మరియు బి.నాగలక్ష్మి వీరికి కౌశిక్ (ఉద్యోగ రీత్యా హైదరాబాద్ నివాసి) అను జ్యేష్ఠ కుమారుడున్ను మరియు వెంకట పార్థివ్ (ప్రస్తుతం ఇంజనీరింగ్ విద్యార్థి) అను కనిష్ఠ కుమారుడున్ను కలిగియున్నారు. స్వర్ణలతకు 2003లో వివాహము జరిగినది. వీరివురికి సవ్యశ్రీ మరియు యశశ్రీ అను ఇరువురు కుమార్తెలు (ప్రస్తుతం మైనర్లు) కలిగియున్నారు. సదరు బచ్చల రమణయ్య మరియు వెంకట సుబ్బమ్మ గార్లకు డాక్టర్ సునీల్ కుమార్ (గుండె వైద్య నిపుణులు-(ప్రస్తుతం మదనపల్లి టౌన్ వాస్తవ్యులు) గారికి డాక్టర్ లహరి అను ఆమెతో వివాహము జరిగి వీరికి శ్యామ్‌శౌర్య (9 సం॥ల వయస్సు) మరియు కామాక్షి (ఒకటిన్నర సం॥ల వయస్సు)అను సంతానము కలిగియున్నారు.

మా కక్షికర్త బద్వేలు టౌన్ నందు స్థిరపడి యున్నందున జీవనోపాధి నిమిత్తము అన్నపూర్ణ కట్ పీస్ సెంటర్ అను జౌళి వ్యాపారము 1985 నుండి బద్వేలు టౌన్‌లో జరుపుకొనుచున్నారు. మా కక్షికర్త జ్యేష్ఠ కుమారుడు శ్రీధర్, మరియు కనిష్ఠ కుమారుడు డాక్టర్ సునీల్ కుమార్ కలిసి వారి జాయింట్ కుటుంబ నిమిత్తము వ్యాపారము వగైరాలు ఈరోజు సరికి జరుపుకొనుచున్నారు. అదృష్ట వాశాత్తు మా కక్షికర్త అతని భార్య ప్రారంభించిన వ్యాపారములు గాని మరియు కుటుంబమునకు కావలసిన ఏ కార్యమైనను ఫలించి, యే విధమైన లోటు లేకుండా వారి సంతతిని గౌరవ మర్యాదల, ఉన్నత స్థితిలో స్థిరపరచియున్నారు.

ఇట్లు ఉండగా మా కక్షికర్త జ్యేష్ఠ కుమారుడు శ్రీధర్ 20-12-2025వ తేదీన బద్వేలు టౌన్‌లో అకస్మాత్తుగా చనిపోయిఉన్నారు. సదరు శ్రీధర్ భార్య, పిల్లలు, ప్రస్తుతము నాగలక్ష్మి పుట్టినిల్లయిన అనంతపురం జిల్లా నార్పాల మండలం మరియు గ్రామంలో కాపురముంటూ ఉన్నారు. బి.శ్రీధర్ మరణానంతరము అతని భార్య పిల్లలలో లేని అసహనము, దురాశ వగైరాలు పెరిగి మా కక్షికర్త జాయింట్ కుటుంబములో ఊహించని మరియు ఇదివరకు జరగని పరిణామములు పై తెలిపిన నాగలక్ష్మి మరియు ఆమె ఇరువురి కుమారులు కలిసి మనశ్శాంతి లేక నడుచుకొనుచున్నారు. మా కక్షికర్త మరియు అతని భార్య చాలా ఓపిక ప్రదర్శించి, పరిస్థితులను చక్కబెట్టడం కోసం చేసిన చర్యలు ఎంతమాత్రము పెద్ద కోడలు అయిన నాగలక్ష్మి మరియు ఆమె సంతానమునకు బోధపడలేదు. ఈ రోజు సరికి వారి నడవడికలో ఏ విధమైన మార్పు సహా ఎంతమాత్రము కనబడుటలేదు.

మా కక్షికర్త మరియు పై తెలిపిన ఇరువురు కుమారులు వారి జాయింట్ కుటుంబమునకు గాను సంపాదించిన జాయింట్ ఆస్తులు, వ్యాపారములు వగైరాలు సామరస్య పూర్వకముగా పరిష్కరించుకొనుటకు గాను చేసిన గట్టి ప్రయత్నములు విఫలము అయినవి. బి.శ్రీధర్ జీవిత కాలములో తన తండ్రి రమణయ్యతో జాయింట్ కుటుంబమునకు గాను జరిపిన ఆస్తులు వగైరాలు అతి నమ్మకము మీద శ్రీధర్ పేరున సహా సంపాదించియున్నారు. కానీ జాయింట్ కుటుంబ సభ్యులు అయిన మా కక్షికర్త మరియు అతని ఇరువురు కుమారులు పేర కలిగియున్న ఆస్తులు, లావాదేవీలు వగైరాలులో ఎంతమాత్రము స్వార్జితముగా పరిగణించకుండా HUF ఆస్తులుగా సమ భాగములు కలిగియున్నారు. అట్టి ఆస్తులు సహా ఈ రోజు సరికి చట్టప్రకారము పంచుకొని యుండలేదు. ఈ విషయములన్నియూ యావన్మంది ప్రజానీకానికి బాగుగా తెలియును. మా కక్షికర్త మరియు అతని జాయింట్ కుటుంబమునకు బద్వేలు మండలం మరియు టౌన్ (కడప జిల్లా), తిరుపతి టౌన్‌లోని సబ్ రిజిస్ట్రారు కాలనీ మరియు అనంతపురం జిల్లా నార్పాల మండలం, నార్పాల క్రాస్ రోడ్స్, వగైరాలలోని ఆస్తులు HUF ఆస్తులుగానే పరిగణించబడుచున్నది. ఇందులో కుటుంబ సభ్యులు ప్రత్యేక హక్కు అని భాగము కోరి యుండలేదు. అట్లు కోరవలసిన ఆవశ్యకత సహా ఎన్నడూ లేదు. పై విషయములకు భిన్నముగా బి.నాగలక్ష్మమ్మ గారు మరియు ఆమె ఇరువురు కుమారులు (బి.శ్రీధర్ వారసులు) నడుచుకొనుచున్నారు. మా కక్షికర్త భార్య వెంకట సుబ్బమ్మ సహా చనిపోయిన జ్యేష్ఠ కుమారుడు శ్రీధర్ పేర యావదాస్తులలో చట్టప్రకారము సమ భాగము కలిగియున్నది. ఈ విషయములు సహా గుర్తెరిగి పై తెలిపిన నాగలక్ష్మి ఆమె కుమారులు భిన్నముగా నడుచుకొనుచున్నారు. ఇటీవల మా కక్షికర్త అతని కుటుంబీకులకు తెలియడములో బి.నాగలక్ష్మి ఆమె కుమారులు ఆస్తులు ధుమక్కీగా ఇతరాదుల పేర తప్పు సంగతులతో విక్రయించుటకు ప్రయత్నములు చేయుచున్నట్లు తెలియవచ్చినది. అట్లు ఎవ్వరేని పై బి.నాగలక్ష్మి మరియు ఆమె సంతతి (ఇరువురు కుమారులు) నుండి పొందుటకు ప్రయత్నించిన యెడల అట్టి చర్యలు సమ్మతము కావనిన్నీ మా కక్షికర్త అతని కుటుంబ సభ్యులను ఎంతమాత్రము బైండ్ చేయవనిన్నీ మరియు మా కక్షికర్తలు చట్టపరిధిలో తీసుకొనబోవు యావత్తు సివిల్, క్రిమినల్ వగైరా చర్యలకు మరియు ఖర్చులకు నష్టము వగైరాలకు సంపూర్ణ బాధ్యులు కాగలరని నిర్వొద్యముగా తెలియపరచడమైనది. ఉన్న విషయములు నిక్కచ్చిగా తెలియపరచడమైనది. కాన ఏ విధమైన పత్రములు వగైరాలు పై నాగలక్ష్మి మరియు ఆమె ఇరువురు కుమారుల నుండి పొందిన యెడల లేక ఇదివరకే పొందియుండిన యెడల (సదరు విషయములను ఒప్పుకొనక) అట్టి చర్యలు చట్ట సమ్మతము కావనిన్నీ మరియు మా కక్షికర్త అతని కుటుంబీకులను బైండ్ చేయవనిన్నీ నిస్సంకోచముగా తెలియపరచడమైనది. ప్రజ్ఞతతో నడుచుకొనవలయునని ఈ దినపత్రిక ప్రకటన ద్వారా కోరడమైనది.

మదనపల్లి టౌన్
తేది: 11/02/2026

సం/- శ్రీ సరస సుబ్రహ్మణ్యం,
శ్రీ బి.యస్.హర్షవర్ధన్, న్యాయవాదులు
సొసైటీ కాలనీ, మదనపల్లె.

రైళ్లలో వ్యర్థాల నిర్వహణపై ప్రశ్నించిన ఎంపీ

తిరుపతి(జీవకోన): దేశవ్యాప్త రైల్వే స్టేషన్లు, రైళ్లలో పోగవుతున్న ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు, నిర్వహణపై చేపట్టిన చర్యలు చెప్పాలని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి బుధవారం పార్లమెంటులో ప్రశ్నించారు. ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం అమల్లో ఉన్నప్పటికీ రైళ్లలో ఆ పరిస్థితి కనిపించడం లేదన్నారు. స్టేషన్లు, ట్రాక్ వెంట ఎక్కడ చూసినా పేరుకుపోయి కనిపిస్తున్నాయని వివరించారు. నిర్వహణకు తీసుకుంటున్న చర్యలు ఏమిటో చెప్పాలని కోరారు.

క్రీడలు ఉద్యోగుల ఐక్యతకు దోహదం

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: ఉద్యోగుల ఐక్యతకు క్రీడలు దోహదపడతాయని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. రెండు రోజులుగా ఎస్వీయూ మైదానంలో తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల ఎక్సైజ్ శాఖ స్పోర్ట్స్ మీట్ ఘనంగా నిర్వహించారు. కచ్చపి ఆడిటోరియంలో విజేతలకు బహుమతులు అందజేశారు. డీసీ విజయశేఖర్, ఏసీలు శ్రీనివాసచారి, బాలకృష్ణన్, ఈఎస్‌లు నాగమల్లేశ్వరరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు. **తిరుపతి (కలెక్టరేట్):** విభిన్న ప్రతిభావంతులు, హిజ్రా, వయోవృద్ధుల సంక్షేమశాఖ ద్వారా ఏడుగురు హిజ్రాలకు కలెక్టర్ వెంకటేశ్వర్ బుధవారం గుర్తింపు కార్డులు అందజేశారు.

విశ్రాంత ఇంజినీరింగ్ ఉద్యోగుల సర్వసభ్య సమావేశం

తిరుపతి(భవానీనగర్): ఆంధ్రప్రదేశ్ పిఆర్అండ్ఆర్‌డి ఉమ్మడి చిత్తూరు జిల్లా ఇంజనీరింగ్ విశ్రాంత ఉద్యోగుల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం తిరుపతి నగర పరిధిలోని స్థానిక చెన్నారెడ్డి కాలనీలోని పంచాయతీ రాజ్ కార్యాలయ ఆవరణలో నిర్వహించినట్లు వెల్ఫేర్ అసోసియేషన్ నూతన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు ఎం శంకర్ నారాయణ తెలిపారు. రాష్ట్ర కమిటీ నాయకులు శివరామకృష్ణ, రియాజ్ అహ్మద్ నేతృత్వంలో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

ఎంబీయూలో ప్రాంగణ ఎంపికలు

చంద్రగిరి గ్రామీణ: మోహన్ బాబు యూనివర్సిటీలో జరిగిన ప్రాంగణ ఎంపికలలో 415 మంది ఉద్యోగాలు సాధించినట్లు కళాశాల యజమాన్యం బుధవారం తెలిపింది. యూనివర్సిటీ విద్యార్థులకు అత్యంత భద్రతాయుతమైన ఉద్యోగ అవకాశాలు లభించాయని ప్రోఛాన్సలర్ మంచు విష్ణు అన్నారు. వారికి ఛాన్సలర్ మంచు మోహన్ బాబు శుభాకాంక్షలు తెలియజేశారు.

నిరంతరాయంగా బస్సులు నడపాలి

తిరుపతి(ఆర్టీసీ), న్యూస్‌టుడే: తలకోన క్షేత్రానికి వచ్చే భక్తులకు ప్రయాణికులకు ప్రణాళిక బద్ధంగా, నిరంతరాయంగా బస్సు సౌకర్యం కల్పించాలని తిరుపతి డిపో మేనేజర్ సురేంద్ర కుమార్ అన్నారు. స్థానిక డిపోలో బుధవారం అన్ని యూనియన్ ప్రతినిధులతో ప్రత్యేక కో-ఆర్డినేషన్ సమావేశం జరిగింది.

ఘంటసాల వర్ధంతి

న్యూస్‌టుడే బృందం: నగరంలో పలు చోట్ల ఘంటసాల వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఆయన పాడిన పాటలతో అలరించారు. అంతకుముందు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

సెమిస్టర్ ఫలితాల విడుదల

తిరుపతి(మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: శ్రీ పద్మావతి మహిళా వర్సిటీలో డిసెంబరులో నిర్వహించిన ఎంబీఏ మీడియా మేనేజ్‌మెంట్ తృతీయ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను బుధవారం విడుదల చేశారు. ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

ఆటో డ్రైవర్ నిజాయతీ

పాకాల, న్యూస్‌టుడే: పాకాలలోని ఎస్‌బీఐ ఏటీఎం వద్ద దొరికిన రూ.10 వేల నగదును ఆటో డ్రైవర్ కిరణ్ పోలీసులకు అందజేసి నిజాయతీని చాటుకున్నాడు. కిరణ్ చిత్తూరు క్రాస్ రోడ్డు కూడలిలో ఆటో డ్రైవర్. బుధవారం సాయంత్రం ఏటీఎం వద్దకు వెళ్లిన సమయంలో అక్కడ నగదు కనిపించింది. ఆ మొత్తాన్ని ఎస్సై తరుణ్‌కు అందజేశారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: రేణిగుంట - తిరుపతి ప్రధాన రహదారిలో బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానిక ఆటోనగర్ వద్ద గుర్తు తెలియని వాహనం వ్యక్తిని ఢీకొట్టి వెళ్లిపోయింది. తీవ్ర రక్తస్రావాన్ని గురైన ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. ఆధారాలు లభించక గుర్తు తెలియని మృతదేహంగా భావించి రుయాకు తరలించారు.

శుభస్వీకరణ



కీ॥శే॥ ఒడుగు వెంకటరెడ్డి @ OVR గారు

OVR Degree College, Tirupati, OVR ITI, Tirupati, SV ITI, Tirupati
Sapthagiri School Nursing, Aparna School of Nursing
OVR Travels (VOLVO BUS), Ex Bajaj Dealer, Tirupati
(OVR విద్యా సంస్థల అధినేత, తిరుపతి)

విద్యార్థుల సంక్షేమమే తన ధ్యేయంగా భావించి, తండ్రిలా బాధ్యత వహించి, ఎందరో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును ప్రసాదించి, మా శ్రేయస్సు కొరకు అహర్నిశలు శ్రమించిన మా తండ్రిగారు **శ్రీ ఒడుగు వెంకటరెడ్డి @ OVR గారు** తేది. 29.01.2026న గురువారం స్వర్గస్తులైనారు.

తదుపరి **కర్మక్రియలు** తేది. 12.02.2026 గురువారం ఉ॥ 10 గంటలకు **మా స్వగృహం బాలాజీ కాలనీ, డి.నెం.547, తిరుపతి** నందు జరుగును.

కావున తెలియజేయడమైనది.

శోకతప్త హృదయాలతో...

కుమారుడు: ఒడుగు శ్రీకాంత్ రెడ్డి
మరియు కుటుంబ సభ్యులు

(c) eenadu

శ్రీకాళహస్తి

• శ్రీకాళహస్తి • సత్యవేడు • రైల్వేకోడూరు

డిప్యూటీ సీఎంకు ఆహ్వానం

శ్రీకాళహస్తిలో జరిగే బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని కోరుతూ శాసనసభలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలిసి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి - న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

15న మహాశివరాత్రి ఉత్సవాలు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని కె.బుడుగుంటపల్లెలో ఉన్న శ్రీ అశ్వత్థలింగేశ్వరస్వామి దేవాలయంలో ఈనెల 15న మహాశివ రాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకుడు శివయ్య బుధవారం తెలిపారు.

తనిఖీలు నిర్వహిస్తున్న బాంబ్‌స్క్వాడ్ బృందాలు

ఆలయం వద్ద గుర్తుతెలియని కారు

శ్రీకాళహస్తి: బ్రహ్మోత్సవాల దృష్ట్యా పోలీసులు విస్తృత స్థాయి బందోబస్తును ఏర్పాటు చేశారు. ముక్కంటి ఆలయం సమీపంలోని వాహన మండపం వద్ద మూడు రోజులుగా కారు పార్కింగ్ చేసి ఉండటం, కర్ణాటక రిజిస్ట్రేషన్ నంబరుతో ఉండటంతో బుధవారం బాంబ్ స్క్వాడ్ బృందాలు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.

పెద్దశేషవాహనంపై శ్రీ పరశురామేశ్వరస్వామి

శ్రీ ఆనందవల్లీదేవి సమేత శ్రీ పరశురామేశ్వరస్వామి

ఏర్పేడు, న్యూస్‌టుడే: గుడిమల్లం శ్రీ పరశురామేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. వేదపండితుల మంత్రోచ్ఛారణలతో ధ్వజస్తంభానికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కొడిపట్టాన్ని ధ్వజస్తంభంపై అధిరోహింపజేసి బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలను ఆహ్వానం పలికారు. అనంతరం శ్రీ ఆనందవల్లీదేవి సమేత శ్రీ పరశురామేశ్వరస్వామిని శేషవాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం చేపట్టారు. ఆలయ ఛైర్మన్ గిరి నాయుడు, ఈవో రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

భూతవాహనంపై భూతనాథుని విహారం

నాగలాపురం, న్యూస్‌టుడే: మండలంలోని సురుటుపల్లె వార్షిక మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పరమేశ్వరుడు బుధవారం భూతవాహనంపై గ్రామవీధుల్లో విహరించారు. ఉదయం ఆలయంలో మూలవర్లకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం ధ్వజపట మండపంలో విశేష అలంకరణలు చేశారు. వాహనసేవ సందర్భంగా ఆలయ కళావేదికలో భరతనాట్య ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఆలయ ఛైర్మన్ సుబ్రహ్మణ్యరాజు, ఈవో లత, ఉభయదాత జగన్నాథం పాల్గొన్నారు.

భూతవాహనంపై వాల్మీకేశ్వరుడు, మరగధాంబికాదేవిల విహారం

బ్రహ్మోత్సవాలకు నవసంధి వినాయకుడును ఆహ్వానిస్తున్న అర్చక స్వాములు

ఆనందంగా ఆహ్వానోత్సవం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: చతుర్మాడ వీధుల్లో కొలువుదీరిన నవసంధి వినాయకులు, పరివార దేవతామూర్తులను మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ బుధవారం రాత్రి ప్రత్యేక ఉత్సవాన్ని నిర్వహించారు. వెండి అంబారీపై వెలుగు రేడైన సోమస్కందమూర్తి, జ్ఞానాంబికలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. పట్టణంలోని వినాయకస్వామి ఆలయాల వద్ద దేవతామూర్తులతో నవ సంధి వినాయకులను ప్రత్యేకంగా ఆహ్వానిస్తూ ఉత్సవాన్ని ఘనంగా జరిపారు.

ఆనందభరితం.. ఆదిదంపతుల ధ్వజారోహణం

వాయులింగేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాలకు సమస్త దేవతా సమూహం దివి నుంచి భువికి చేరాయి. వృషభ ధ్వజ సంకేతంతో ధ్వజారోహణ క్రతువు అమోఘంగా పూర్తయింది. దేవతాసమూహాన్ని ఆహ్వానిస్తూ వేదపండితుల మంత్రోచ్ఛారణలతో శ్రీకాళహస్తి క్షేత్రం మార్మోగిపోయింది. పురాతన కాలం నాటి తిరువాచక వాలతో ఆదిదంపతులు చతుర్మాడ వీధుల్లోని భక్తకోటికి దర్శన భాగ్యం కల్పించారు. - న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

ధ్వజస్తంభం మీదకు కోడి చీరలను అధిరోహిస్తున్న ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్, ఈవో, అధికారులు

కోడి చీరల అధిరోహించి..

ముక్కంటీశుని ధ్వజారోహణ పట్టాన్ని పురస్కరించుకుని ధ్వజస్తంభం మీదకు కోడి చీరలను అధిరోహించారు. ఈ విశేషోత్సవంలో బుధవారం ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ కొట్టె సాయిప్రసాద్, ఎమ్మెల్యే కుటుంబీకులు రిషితారెడ్డి, బృందమ్మ, ఆలయ ఈవో బాపిరెడ్డి, భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ పాల్గొన్నారు.

మార్పు.. మహిళల నిట్టూర్పు..

ఏళ్లుగా వస్తున్న విధానాలను కాదని ఆలయ అధికారులు ఇష్టానుసారం మార్పులు చేపట్టడంతో మహిళలు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ధ్వజారోహణ పట్టం సందర్భంగా కోడిచీరలు సమర్పించేందుకు మహిళల నుంచి ఆదరణ పెరుగుతోంది. ఏళ్లుగా ఈ చీరల స్వీకరణ, టోకెన్ పంపిణీ నిత్య కల్యాణోత్సవం వద్ద జరిగేది. బుధవారం దాన్ని రంగుల గోపురం వద్దకు మార్చారు. మహిళలు ఎక్కడ టోకెన్లు తీసుకోవాలో తెలియక నానా అవస్థలు పడ్డారు. కొందరు ఆవరణలో ప్రదక్షిణలు చేసుకుంటూ తీరా ధ్వజారోహణ పట్టం సమయానికి పరుగులు తీసి చీరలు సమర్పించారు.

చీరలు సమర్పించేందుకు అవస్థలు పడుతున్న మహిళలు

ఆకట్టుకున్న సంగీత విభావరి

బ్రహ్మోత్సవాల్లో సినీ గాయని గీతామాధురి సంగీత విభావరి ఆకట్టుకుంది. ఆధ్యాత్మిక కీర్తనలను ఆలపించి భక్తులందరినీ మైమరపింపజేశారు. కళాకారుల నృత్య ప్రదర్శన రమణీయంగా సాగింది. నృత్య బృందాలు తమదైన నాట్యంతో ఆహూతులను రంజింపచేశారు. కళాకారులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

టీషర్టులు, మందులను ఈవోకు అందజేస్తున్న సిమెంటు డీలర్లు రమేష్, సురేష్

మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా పలువురు వితరణలు ఇచ్చారు. బుధవారం శ్రీవారి సేవకులకు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా తరఫున టీషర్టులు, పంచలను 200 మందికి అందించారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి, ఈవో బాపిరెడ్డి, ఎస్‌బీఐ అధికారులు పాల్గొన్నారు. ● నాయుడుపేటకు చెందిన సాగర్ సిమెంట్ డీలర్లు రమేష్, సురేష్ రూ.5 లక్షలు విలువైన టీషర్టులు, మందులను వితరణగా అందించారు. సాగర్ సిమెంటు ఎండీ ఆనంద్ రెడ్డి, జేఎండీ శ్రీకాంత్‌రెడ్డి తరఫున వీటిని అందజేశారు. ● తెదేపా నాయకుడు పైనాల పొన్నారావు మట్టి గాజులను ఆలయానికి వితరణగా ఇచ్చారు.

గాజులు అందజేస్తున్న పొన్నారావు

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి : 80085 74555
నాగలాపురం : 98854 43308
ఓబులవారిపల్లె : 99664 67525
రైల్వేకోడూరు : 97035 72572

ఏర్పేడు, న్యూస్‌టుడే: సమస్య: మండలంలోని పాగాలి పంచాయతీలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. **- లోకేశ్, స్థానికుడు**

సమాధానం: సంబంధిత పంచాయతీ కార్యదర్శితో చర్చించి వెంటనే సమస్య పరిష్కరిస్తాం. **- రమణకుమార్, డిప్యూటీ ఎంపీడీవో**

పారిశుద్ధ్య కార్మికుల నిరసన

రైల్వేకోడూరు: పట్టణంలోని పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం పారిశుద్ధ్య కార్మికులు నిరసన చేపట్టారు. ఎనిమిది నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని, 43 మంది కార్మికులకు పీఎఫ్ సొమ్ము జమ చేయడంలేదని పేర్కొన్నారు. కార్మికుల సంఘం అధ్యక్షుడు చెన్నయ్య, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ జయచంద్ర పాల్గొన్నారు.

సమ్మెకు దూరం

రేణిగుంట: ఈ నెల 12న వివిధ కార్మిక సంఘాలు ప్రకటించిన దేశవ్యాప్త సమ్మెకు తాము దూరమని భారతీయ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) జిల్లా కార్యదర్శి వెంకటాద్రియాదవ్ బుధవారం తెలిపారు.

శ్మశాన స్థల ఆక్రమణపై ఫిర్యాదు

ఓబులవారిపల్లె, (చిట్వేలి), న్యూస్‌టుడే: మైలపల్లె పంచాయతీ రాజారెడ్డి ఎస్సీకాలనీలో శ్మశాన స్థలాన్ని కొందరు ఆక్రమించారని సీపీఐ నాయకులు, స్థానికులు బుధవారం తహసీల్దారు స్పందనకు ఫిర్యాదు చేశారు. సర్వేనెంబరు 1117లో 70 సెంట్ల స్థలాన్ని శ్మశానవాటిక కోసం కేటాయించారని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య తెలిపారు. కార్యక్రమంలో చిన్న, అంకమ్మ, సాంబయ్య, కోటయ్య, సింహాద్రి, నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

సత్యవేడు, న్యూస్‌టుడే: పొరుగుసేవల కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ నాయకుడు రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీఐటీయూ కార్యాలయ ఆవరణలో గురువారం ఉదయం జరిగే అఖిల భారత సమ్మెకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు.

ఇలా వేశారు.. అలా పోయింది

పుల్లంపేట మండల పరిధిలో జాతీయ రహదారిని ఇటీవలే వేశారు. నెల రోజులోనే ఉడుమువారిపల్లె వద్ద రహదారిపై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. అటు వెళ్లే వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పుల్లంపేట

బీడు ఆక్రమణ.. అడ్డుకున్న తహసీల్దారు

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూముల ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు సుధీర్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని అంబూరులో బీడు భూములు ఆక్రమించారని సమాచారం అందుకున్న బుధవారం వాటిని స్వాధీనం చేసుకుని, బోర్డులు ఏర్పాటు చేశారు.

కంచె ఏర్పాటుపై వివాదం

పుల్లంపేట, న్యూస్‌టుడే: కొమ్మనవారిపల్లె రెవెన్యూ పరిధిలోని దొంగిరెడ్డిపల్లె ప్రాంతంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని కంచె వేశారు. సర్వే నెంబరు 220, 204లో దాదాపు ఆరు ఎకరాలను ఆక్రమించుకుని కంచె వేశారు. కంచె తొలగించడం కష్టంగా ఉందంటూ జేసీబీ సహాయంతో తొలగిస్తామని ఆర్ఐ రాజశేఖర్ తెలిపారు.

సేవలు అభినందనీయం

కేవీబీపురం, న్యూస్‌టుడే: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మాజీ సర్పంచి మునస్వామి పాలు ఎంతో సేవ చేశారని యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్ అన్నారు. ఆయన మృతుడి ఇంటికి చేరుకుని ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునస్వామియాదవ్, మురళి, అజయ్ పాల్గొన్నారు.

విద్యా సామగ్రి తీసుకున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, సమితి సభ్యులు,

స్నేహితుడి జ్ఞాపకార్థం.. సేవలు

పుల్లంపేట, న్యూస్‌టుడే: ఓబులవారిపల్లె, పుల్లంపేట మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం పదో తరగతి విద్యార్థులకు సర్వేజనా సేవా సమితి సభ్యులు పరీక్షా సామగ్రి పంపిణీ చేశారు. 16 సంవత్సరాల క్రితం సోమా జనార్దన్‌యాదవ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో అతడి మిత్రులు ఈ సంస్థ స్థాపించారు. అతని కుటుంబాన్ని కుటుంబాన్ని ఆదుకోవడంతో పాటు ఏటా ఫిబ్రవరి 11న సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వీరి సేవలను ఎంఈవో చక్రధర్‌రాజు, కృష్ణ కొనియాడారు.

ప్రథమ స్థానంలో నిలపాలి

పుల్లంపేట, న్యూస్‌టుడే: పదో తరగతి వంద శాతం ఫలితాలు సాధించి జిల్లాలోనే పుల్లంపేట మండలాన్ని ప్రథమ స్థానంలో నిలపాలని ఎంపీపీ వెంకటసుబ్బారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని వత్తలూరు ఉన్నత పాఠశాలను ఎంఈవో చక్రధర్‌రాజుతో కలిసి తనిఖీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నరసింహమూర్తి, ఉపాధ్యాయులు ఉన్నారు.

సమ్మె విజయవంతానికి పిలుపు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న లేబర్ కోడ్స్ రద్దును కోరుతూ ఈనెల 12న నిర్వహించే సమ్మెను విజయవంతం చేయాలని జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి మాదరాజు గంగాధర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం ఆయన అధ్యక్షతన నాయకులు సమావేశమయ్యారు. పాండురంగయ్య, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా తరలింపు.. ఆపేవారెవరు..?

సత్యవేడు మండలం సదాశామ్మ గుడి నుంచి ఆర్టీసీ డిపో వరకు తెలుగు గంగ కాలువ గట్టుపై ఉన్న విలువైన చెట్లను పట్టపగలే నరుకుతున్నారు. ట్రాక్టర్ల ద్వారా యథేచ్ఛగా తరలిస్తున్నారు. సమీప ఇటుక బట్టీలకు, సామిల్లుకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గత వారం రోజులుగా ఇవి జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, సత్యవేడు

కలశాల ప్రాకారోత్సవంలో కలశాలతో అర్చకులు

వేడుకగా గోపుర కలశ పూజ

నాగలాపురం, న్యూస్‌టుడే: నాగలాపురం వేదనారాయణస్వామి ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠించడానికి సిద్ధం చేసిన బంగారు పూత వేసిన 19 గోపుర కలశాలకు బుధవారం వేడుకగా పూజలు నిర్వహించారు. తితిదే ఆగమ సలహాదారు వరదన్ ఆధ్వర్యంలో ప్రధానార్చకులు నాగరాజు భట్టాచార్య, ఆలయ సిబ్బంది కలశాల ప్రాకారోత్సవం చేశారు. అనంతరం మండప గోపురాలపై కలశాలు ప్రతిష్ఠించారు. తితిదే సూపరింటెండెంట్ దయ్యప్ప, ఆలయాధికారులు చెంగల్రాయులు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

తహసీల్దారు తనూజను సత్కరిస్తున్న నేతలు

సాగుభూమి సమస్యలు పరిష్కరించండి

కేవీబీపురం, న్యూస్‌టుడే: రైతులు ఎదుర్కొంటున్న సాగు భూమి సమస్యలను పరిష్కరించాలని తెదేపా బీసీసెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మునస్వామియాదవ్ కోరారు. బుధవారం తహసీల్దారు తనూజను కలిసి సమస్యలు తెలిపారు. పక్కాగృహ నిర్మాణాలకు పట్టాలు పంపిణీ చేయాలన్నారు. శ్రీకారం చుట్టాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు దొరబాబునాయుడు, ప్రకాష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పురుగు మందు తాగి వృద్ధుడి మృతి

బీఎన్ కండ్రిగ, న్యూస్‌టుడే: గడ్డి మందు తాగి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని నెలవాయి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నెలవాయి గ్రామానికి చెందిన దొడ్డగ రాదయ్య (65), మద్యానికి బానిసై తరచూ కుటుంబ సభ్యులతో గొడవ పడేవారు. మంగళవారం ఉదయం 4 గంటల సమయంలో గడ్డి మందు తాగినట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు. శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హరిప్రసాద్ తెలిపారు.

మద్యం తాగి

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న మద్యం దుకాణం సమీపంలో బుధవారం తెల్లవారుజామున వాసు దేవరెడ్డి(31) అనే వ్యక్తి మృతిచెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ విజయ్‌కుమార్ తెలిపారు.

కిటికీలు పగులగొట్టి చోరీ

సత్యవేడు, న్యూస్‌టుడే: మండలంలోని చమర్తికండ్రిగ గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ స్వాతి ఇంట్లో చోరీ జరిగింది. ఇంటి కిటికీలు పగులగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు 32సవర్ల బంగారం, రూ.2లక్షల నగదు దోచుకెళ్లినట్లు బాధితురాలు బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయినాథ్ చౌదరి తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో..

నాగలాపురం: మండలంలోని వెల్లూరు గ్రామంలోని చీరాలు, లక్ష్మి దంపతుల ఇంట్లో బుధవారం చోరీ జరిగింది. వ్యవసాయ పనుల నిమిత్తం వారు వెళ్లిన సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. సంఘటనలో ఇంటిలోని రూ.10 వేల నగదు వెండి గొలుసులు, రెండు బంగారు ఉంగరాలు చోరీకి గురయ్యాయని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రాచపల్లెలో..

పుల్లంపేట: రంగంపల్లె పంచాయతీ ఆర్.రాచపల్లె గ్రామంలో పార్వతీ తన ఇంట్లో 3.8లక్షల నగదు చోరీ జరిగినట్లు ఫిర్యాదు చేశారు. బాధితురాలు ఇచ్చిన వివరాల మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

హత్యాయత్నం కేసులో అరెస్ట్

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: ఈ నెల 4న ఓబనపల్లె వీఆర్‌ఏ కనుపర్తి మణెయ్యపై జరిగిన హత్యాయత్నం కేసులో ఈనరాతి ప్రసాద్ అనే వ్యక్తిని బుధవారం అరెస్ట్ చేసినట్లు సీఐ చంద్రశేఖర్, ఎస్సై లక్ష్మీప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఈనెల 8న ఈనరాతి శ్రీనివాసులు, కులశేఖర్ అనే ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఇప్పుడు మూడవ నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచామని పేర్కొన్నారు.

చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న భాజపా నేతలు

పండిట్ దీన్‌దయాళ్‌కు నివాళి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: సమర్పణ దివస్ కార్యక్రమంలో భాగంగా పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు ఘనంగా నివాళులు అర్పించారు. పట్టణంలోని బేరివారి మండపం వద్ద బుధవారం ఆయన వర్ధంతిని పురస్కరించుకుని భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ నాయకులు నేతలు రమేష్‌బాబు, శైలజ, హరీష్‌రెడ్డి తదితరులు ఆయన సేవలను కొనియాడారు.

చర్చలు విఫలం

రేణిగుంట: జీతాలు పెంచాలని రేణిగుంట పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరసన బుధవారం రెండోరోజుకు చేరుకుంది. పంచాయతీ కార్మిక సంఘం నాయకులతో ఈవో పీఆర్‌డీ ప్రభురావు, ఈవో రమేష్ బాబు చేపట్టిన చర్చలు విఫలమయ్యాయి.

CHANGE OF NAME

I Kommi Maheswari (Old Name) W/o. V.Nagaraju, R/o. D.No-1/137, Veluru Village & Post, Pichatur Mandal, Tirupati District, A.P- 517587, I Changed My Name to Vella Umamaheswari, Henceforth I will be Known as **Vella Umamaheswari** (New Name)

అందరి లక్ష్యం.. వందశాతం

పరీక్షలకు పది విద్యార్థుల సమాయత్తం

కేవీబీపురం, నారాయణవనం, న్యూస్‌టుడే: రానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు సమాయత్తం అవుతున్నారు. పాఠశాలలన్నీ వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. విద్యార్థులు ఉత్తమ మార్కుల సాధనకు ప్రణాళికతో చదువుతున్నారు. పదిలో మెరుగైన ఫలితాలు చూడటానికి విద్యాశాఖ వందరోజుల ప్రణాళికను అమలుచేస్తోంది. విద్యార్థులకు ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు నిర్వహించి ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహిస్తున్నారు. మంచి ఫలితాలు రాబడుతున్నారు.

కేవీబీపురంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పకడ్బందీగా అమలు

వందరోజుల ప్రణాళికను ప్రతి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు అమలు చేస్తున్నారు. పిల్లల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు నేరుగా కలిసి విద్యార్థుల సామర్థ్యంపై చర్చించి ఇంటి వద్ద కూడా పిల్లలపై శ్రద్ధ తీసుకునేలా చూస్తున్నారు. దీంతో ఎప్పుడూ చూడని ఫలితాలను త్వరలోనే చూడబోతున్నాం.

- లక్ష్మీపతి, ఎంఈవో, కేవీబీపురం

గణాంకాలు

మండలం	పాఠశాలలు	బాలురు	బాలికలు	మొత్తం
కేవీబీపురం	10	225	217	447
నారాయణవనం	06	161	164	325
నాగలాపురం	05	118	156	274
పిచ్చాటూరు	06	128	111	239
వరదయ్యపాళ్లెం	06	154	115	269
బీఎన్‌కండ్రిగ	05	134	98	232
సత్యవేడు	13	252	265	517

రాత నైపుణ్యాలు పెరుగుతున్నాయి..



వందరోజుల ప్రణాళిక ద్వారా రాత నైపుణ్యాలతో పాటు మ్యాపులు గుర్తించడం, బొమ్మలు గీయడం వంటివి నేర్చుకుంటున్నాం. ఈ ప్రక్రియ రోజూ కొన సాగడం వల్ల పఠనాసక్తి పెరుగుతోంది. దీంతో మార్కులు పెంచుకునేందుకు వీలు కలుగుతుంది.

- లుకేష్‌రెడ్డి, కేవీబీపురం

రోజూ సాధనతో ప్రయోజనం

రోజూ అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. సబ్జెక్టులకు సంబంధించి స్లిప్ టెస్టులు రాయడం వల్ల ఎక్కడ మార్కులు తగ్గుతున్నాయో తెలుసుకుంటున్నాం. ఇంటికి వెళ్లి ఆ సమస్యలను నివృత్తి చేసుకుంటున్నాం. దీంతో ప్రతి సబ్జెక్టులో పూర్తి జ్ఞానం తెచ్చుకుంటున్నాం. ఇలా చేయడం వల్ల ఎక్కువ సేపు చదువుకునేందుకు అవకాశం దొరుకుతోంది. ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చదివిస్తున్నారు.



- దీక్షిత, కేవీబీపురం

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై- 600032. వెబ్‌సైట్: www.shriramfinance.in/auction.
కార్యాలయ చిరునామా: డి.నెం.42/107-1, ఓబుల్‌రెడ్డి కాంప్లెక్స్, అప్సర సర్కిల్, జయనగర్‌కాలనీ, కడప - 5160032 & శాఖ కార్యాలయం : రైల్వే కోడూరు

పుల్లంపేట ఎస్.ఆర్.ఓ (ఆర్.ఓ)లో రిజిష్టర్డు కాబడిన పత్రం నెం. 3678/2021 లోని ఎస్.నరసింహ ప్రసాద్ గారికి చెందిన

స్థిరాస్తులు అమ్మకము కొరకు ఈ-వేలం ప్రకటన

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్)రూల్స్, 2002, 9(1) & 8(6)తో చదువబడే క్రింద స్థిరాస్తుల ఈ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్‌అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క రూల్ 9(1)తో చదువబడే సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2022 ప్రకారం **తేది: 21.10.2024**న **జారీ చేసిన ఉద్దేశిత అమ్మకం ప్రకటన** జారీ చేసిన గడువు ముగిసిన అనంతరం జారీ చేస్తున్న స్థిరాస్తుల అమ్మకం ఈవేలం నోటీసు. దిగువ తెలిపిన వారందరూ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 - చట్టంలోని 54/2002 క్రింద 8(6)తో చదువబడే సెక్షన్ 13(8) క్రింద ఉద్దేశించిన మీ యొక్క విమోచన హక్కును వినియోగించుకోవడంలో విఫలమైమనందున ఈ ఈ-వేలం అమ్మకం నోటీసు జారీ చేయబడినది. ఈ నోటీసు రుణగ్రహీతలకు/ గ్యారంటార్లకు / తనఖాదారులకు / సహ-రుణగ్రహీతలకు/ కో-అప్లికెంట్లకు తెలియజేయడమైనది.

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా రుణగ్రహీత(లు) మరియు గ్యారంటారు (లు)లకు తెలియజేయడమేమనగా దిగువ తెలిపిన రుణగ్రహీతలు / గ్యారంటార్లకు చెందిన ఆస్తులను సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా/ఛార్జిలో వుంచి పొందిన బకాయి మొత్తము **తేది:07.06.2023** నాటికి **రూ.72,58,520/- లను +** **తేది:08.06.2023** నాటి నుండి వడ్డీ మరియు ఇతర ఖర్చులను రాబట్టుకునేందుకు సర్ఫేసి చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు **తేది: 07.06.2023**న జారీ చేసి శ్రీరామ్‌ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క సెక్యూర్డ్ క్రెడిటార్ వారిచే స్వాధీనం చేసుకున్న ఆస్తులను **"ఎక్కడ ఎలా వున్నదో అక్కడ" "అక్కడ ఎలా ఉన్నదో" అలానే మరియు "అక్కడ ఏమి ఉన్నదో" అనే పద్ధతిపై తేది: 25.03.2026 ఉదయం 11.గం॥లకు నుండి మ.1.00 గం॥ల మధ్య** విక్రయించుటకు నిర్ణయించినారు.

అగ్రిమెంటు నెం.: *KODR2TF2112300002:* రుణగ్రహీతలు/గ్యారంటార్ల యొక్క పేర్లు,చిరునామా :-1) శాఖాపురం అనురాధ తండ్రి కొండయ్య, డి.నెం.16-12-428-11, గాయత్రినగర్, గోమతి స్కూల్ దగ్గర, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా - 524004, **2) పి.వెంకటేశ్వర రావు,** తండ్రి పి.వెంకట్రామయ్య బజారు వీధి, శివాలయం, దామరమాడుదు, నెల్లూరు జిల్లా. **3) వారధి సాయి నిహారిక,** తండ్రి ఎస్.నరసింహప్రసాద్, డి.నెం.1/21బి, గుండ్లపల్లి రైల్వేకోడూరు , అన్నమయ్య జిల్లా, **4) ఎస్.నరహరి క్రిష్ణప్రసాద్ నాయుడు** తండ్రి ఎస్.నరసింహ ప్రసాద్ డి.నెం.1/21బి, గుండ్లపల్లి రైల్వేకోడూరు, అన్నమయ్య జిల్లా **(1,3,4 వారలు చనిపోయిన ఎస్.నరసింహప్రసాద్ గారి వారసులు, మరియు మీలో నెం.1 వారలు గ్యారంటారుగా ఇదివరకే రికార్డు చేయబడినది. మరియు 3&4 వారలు వారసులు)**

స్థిరాస్తుల యొక్క వివరణ: (పుల్లంపేట ఎస్.ఆర్.ఓ(ఆర్.ఓ) నందు ఎస్.నరసింహ ప్రసాద్ పేరున రిజిష్టరు కాబడిన పత్రంనెం.3678/2021 ప్రకారం): -వైయస్.ఆర్.కడప జిల్లా, పుల్లంపేట సబ్‌జిల్లా, కోడూరు మండలం, రెడ్డివారిపల్లి గ్రామ పంచాయతీ, కోడూరు గ్రామలెక్కదాఖలా ప్రసాద్‌నగర్ రెసిడెన్షియల్ ఏరియా, సర్వేనెం.179/బి-1ఎ, 190ఎ-13ఎ, 205-1, 205-2, 205-3 మరియు 205/4 లోని ఖాళీ స్థలంలో వేసిన హౌసింగ్ లేఔట్. హద్దులు: తూర్పు: కుక్కట్ల రామక్రిష్ణయ్య భూమి, పడమర: దరఖాస్తుదారుడు ఎస్.నరసింహప్రసాద్ యొక్క ప్లాటు నెం.29& 30. ఉత్తరం: కుక్కట్ల నారాయణ యొక్క భూమి, దక్షిణం: 18అ. వెడల్పు గల పంచాయతీ సిమెంట్ రోడ్డు. ఈ హద్దుల మధ్య తూర్పు నుండి పడమర: ఉత్తరం వైపు 61అ. లేదా 18.59మీ. తూర్పు నుండి పడమర: దక్షిణం వైపు: 34 1/2 అ. లేదా 10.51మీ. మరియు ఉత్తరం నుండి దక్షిణం: 77అ. లేదా 23.47మీ. మరియు ఉత్తరం నుండి దక్షిణం: పడమర వైపు 71అ. లేదా 21.64మీ. వెరశి మొత్తం విస్తీర్ణం 392.61 చ.గ. ఖాళీ స్థలం మాత్రమే. **తాకట్టు రుణభారాలు లేవు.**

అగ్రిమెంటు నెంబరు	ఆస్తి యొక్క రిజర్వు ధర	ధరావత్తు	ధరావత్తు సమర్పణ విధానం	బిడ్ ఇంక్రిమెంటు మొత్తము	వేలం తేది	ధరావత్తు సమర్పణ తేది	ఆస్తుల తనిఖీ తేది:
KODR2TF 2112300002	రూ.38,90,000/-(ముప్పై ఎనిమిది లక్షల తొంభై వేల రూపాయలు మాత్రమే)	రూ.3,89,000/- (మూడు లక్షల ఎనభై తొమ్మిది వేల రూపాయలు మాత్రమే)	శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారిపేరున డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా	రూ.10000/-	25.03.2026	24.03.2026	23.03.2026

ఆసక్తి గల బిడ్డర్లు లాగిన్ ఐడి & పాస్ట్‌వర్డ్ ఏర్పాటు చేయడంలో, బిడ్ సమర్పణలో, ఈ బిడ్డింగ్ ప్రక్రియలో సహాయం కొరకు **మెస్సర్స్ శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా లిమిటెడ్, శ్రీ గౌరవ్ నంబూద్రి సెల్: 9833922941,** ఈమెయిల్ **<gaurav.n@samil.in>** మరియు ఆస్తి సంబంధిత వివరాలకై **అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, శ్రీఎం.గంగాధర, సెల్: +91 9959463246** సంప్రదించగలరు. అధీకృత అధికారి ఏ బిడ్డు అయినా లేక అన్ని బిడ్లను ఏ కారణము తెలుపకనే తిరస్కరించుటకు అధికారము కలిగి వున్నారు. ఆన్‌లైన్ వేలము టెండరు సమర్పణ/ బిడ్ ఫారం కొరకు/ టెండరు ఓపెన్ మరియు వేలము కొరకు వెబ్‌సైట్ **https://eauctions.Samil.in/home** ను చూడగలరు. పూర్తి నియమ నిబంధనల కొరకు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వెబ్‌సైట్‌లో తెలుపబడిన లింకు **https://www.shriramfinance.in/auction** ను చూడగలరు. **గమనిక:** ఇందుమూలముగా తెలియజేయడమేమనగా "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ " ఎన్‌సిఎల్‌టి చెన్నై వారి ఉత్తర్వు ప్రకారం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్"తో విలీనం కాబడింది. ఇటీవల "శ్రీరామ్ ఫైనాన్స్ ట్రాన్స్‌పోర్ట్ లిమిటెడ్" గా మార్పు చెందింది. ఇది తేది: 30.11.2022 నుంచి పేరు మార్పుకు సంబంధించిన సర్టిఫికెట్ ఇన్ కార్పొరేషన్ తేది: 30.11.2022 ద్వారా మార్పు చెందింది.

ప్రదేశము: కడప, తేది: 11.02.2026 సం// అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

(c) eenadu

సూళ్లూరుపేట

• సూళ్లూరుపేట • వెంకటగిరి

జీఎస్‌డబ్ల్యూఎస్‌వో కార్యాలయం ఏర్పాటు

నాయుడుపేట, న్యూస్‌టుడే: మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా మండల గ్రామ, వార్డు సచివాలయాల కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఇందుకోసం ప్రత్యేక గది ఇద్దరు సహాయకులు జీఎస్‌డబ్ల్యూఎస్‌వోను కేటాయించారు. ఇకపై గ్రామ, వార్డు సచివాలయాల పర్యవేక్షణ వీరి పరిధిలో ఉంటుంది. ఈనెల 15న తేదీ నుంచి గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ అందుబాటులోకి వస్తుందని జీఎస్‌డబ్ల్యూఎస్‌వో శ్రీనివాసులు తెలిపారు.

నాయుడుపేట మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గది

కలెక్టర్‌ను కలిసిన ఎస్సీ కమిషన్ సభ్యుడు

నాయుడుపేట, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు శ్రీపతిబాబు పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత బుధవారం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. జిల్లాలో ఎస్సీ సంక్షేమ పథకాలు అమలు తీరు, వసతి గృహాలు అభివృద్ధిపై చర్చించినట్లు తెలిపారు.

కలెక్టర్ వెంకటేశ్వర్‌ను సన్మానిస్తున్న కమిషన్ సభ్యుడు శ్రీపతిబాబు

విద్యాశాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యేలు

మంత్రి లోకేశ్‌తో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, సునీల్‌కుమార్

వెంకటగిరి, న్యూస్‌టుడే: విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం మొదలైన అసెంబ్లీ సమావేశాల అనంతరం కలిసి ఆ క్రమంలో నియోజకవర్గంలో నాడు-నేడు ద్వారా అసంపూర్తిగా నిలిచిన పాఠశాల భవన నిర్మాణాలు, అంగన్‌వాడీ కేంద్రాల వివరాలను తెలిపారు. ఈ పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ మంత్రిని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

మిగిలింది నాలుగు రోజులే

❖ మొత్తం రూ.4.21 కోట్లు
❖ వసూలు రూ.2.10 కోట్లు

వాకాడు: కొండూరులో ఇంటి యజమానులతో మాట్లాడుతున్న ఎంపీడీవో సాయిప్రసాద్

వాకాడు-చిట్టమూరు, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నులు, కుళాయి, వ్యాపార, సెల్ టవర్స్, ట్రేడ్ లైసెన్సులు వంటి పన్నుల వసూలుకు గడువు ఇక నాలుగు రోజులే మిగిలింది. దీంతో సూళ్లూరుపేట డివిజన్ పరిధిలోని పంచాయతీరాజ్ శాఖ యంత్రాంగం గ్రామాల్లో తిరుగుతోంది. డివిజన్‌లోని తడ, సూళ్లూరుపేట, చిట్టమూరు, పెళ్లకూరు, దొరవారిసత్రం, వాకాడు, నాయుడుపేట, ఓజిలి మండలాల్లో మొత్తం 66629 గృహాలకు రూ.421.78 లక్షలు పన్నులు వసూలు కావాల్సి ఉండగా బుధవారం నాటికి రూ.210.45 లక్షలు మేర వసూళ్లు చేసి 50 శాతం పూర్తి చేశారు. ఇక నాలుగు రోజులు ఉండడంతో గ్రామాల్లో మైకుల ద్వారా.. ఇంటింటికి తిరుగుతూ లక్ష్యాన్ని చేరుకునేందుకు అధికారులు, పీడీవోలు విశ్వప్రయత్నాలు సాగిస్తున్నారు.

డివిజన్‌లో ఇంటి పన్నులు వసూళ్లు (రూ.ల్లో) ఇలా..

మండలం	పంచాయతీలు	గృహాలు	చెల్లించాల్సింది	వసూలు
తడ	18	10747	156.12 లక్షలు	67.32 లక్షలు
సూళ్లూరుపేట	19	7592	46.94 లక్షలు	20.31 లక్షలు
చిట్టమూరు	23	8304	29.11 లక్షలు	13.86 లక్షలు
పెళ్లకూరు	24	7378	39.79 లక్షలు	19.02 లక్షలు
దొరవారిసత్రం	22	7741	27.03 లక్షలు	13.84 లక్షలు
వాకాడు	19	8617	29 లక్షలు	16.04 లక్షలు
నాయుడుపేట	19	7247	46.52 లక్షలు	27 లక్షలు
ఓజిలి	26	9003	47.27 లక్షలు	33.06 లక్షలు
మొత్తం	170	66629	421.78లక్షలు	210.45 లక్షలు

వసూళ్లు స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లోనే..

పన్ను వసూళ్లు మొత్తం స్వర్ణ పంచాయతీ పోర్టల్ ఆన్‌లైన్ ద్వారానే జరగాలి. అంతర్జాలం, సెల్‌ఫోన్‌లోని స్వర్ణ పంచాయతీ పోర్టల్ యాప్‌ను ఓపెన్ చేసి అందులో నుంచి చెల్లించి, రసీదు పొందాలి. పన్నుల వసూళ్లలో ఎలాంటి అవకతవకలు ఉండరాదన్న కూటమి ప్రభుత్వ ఉద్దేశ్యంతోనే స్వర్ణ పంచాయతీ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చారు.

వందశాతం పూర్తికి చర్యలు

పన్నులు వందశాతం వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గడువు నాలుగు రోజులే ఉండడంతో పీడీవోలు ఇంటింటికి తిరిగి వసూలు చేస్తున్నారు.
- బాలిరెడ్డి, డీఎల్‌పీవో

వేడుకగా గోపుర కలశ పూజ

నాగలాపురం: నాగలాపురం వేదనారాయణస్వామి ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠించడానికి సిద్ధం చేసిన బంగారు పూత వేసిన 19 గోపుర కలశాలకు బుధవారం వేడుకగా పూజలు నిర్వహించారు. తితిదే ఆగమ సలహాదారు వరదన్ ఆధ్వర్యంలో ప్రధానార్చకులు నాగరాజు భట్టాచార్య, ఆలయ సిబ్బంది కలశాలకు ప్రాకారోత్సవం చేశారు.

సేవలు అభినందనీయం

కేవీబీపురం: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆదవరం మాజీ సర్పంచి మునస్వామి తెదేపాకు ఎంతో సేవ చేశారని యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్ అన్నారు. బుధవారం మృతుడి ఇంటికి చేరుకుని ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 88979 08890
వెంకటగిరి: 80085 73966
సమయం 10 AM TO 1 PM

సమస్య: స్థానిక ఆర్టీసీ బస్టాండు మలుపులో ప్రధాన డ్రైనేజీ కాల్వలు సరిగా లేక మురుగు ముందుకు సాగడంలేదు.
జి.విజయభాస్కర్, స్థానికుడు

సమాధానం: డ్రైనేజీ కాల్వలో పూడిక తీయించి మురుగు సాఫీగా సాగేలా చేస్తాం. **ఎస్‌కే.ఫజులుల్లా, కమిషనర్**

సమస్య: స్థానిక రాజగోపాలపురం వీధి మలుపులో రోడ్డు రంధ్రాలు పడి ప్రమాదకరంగా ఉంది. రాత్రి వేళల్లో ఇబ్బంది పడుతున్నారు. **దయాకర్, స్థానికుడు**

సమాధానం: రోడ్లు, కాల్వల పనుల కోసం ప్రతిపాదనలు పంపించాం. నిధులు రాగానే పనులు చేస్తాం.
ఎస్‌కే.ఫజులుల్లా, కమిషనర్.

న్యూస్‌టుడే, నాయుడుపేట పట్టణం

సూళ్లూరుపేట గ్రామీణం, న్యూస్‌టుడే

సమస్య: సూళ్లూరుపేట పట్టణంలోని మన్నారుపోలూరులో పారిశుద్ధ్య కార్మికులు సక్రమంగా రావడం లేదని వీధులు పరిశుభ్రంగా ఉండడంలేదు..- **రమేష్, స్థానికుడు**

సమాధానం: పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం
- **కె.చిన్నయ్య, పురపాలక కమిషనర్.**

రోడ్డు భద్రతపై అవగాహన



మాట్లాడుతున్న కె.వీరేష్ బాబు

సూళ్లూరుపేట పట్టణం, న్యూస్‌టుడే: సూళ్లూరుపేట ఎస్‌వీఎస్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ డా.ఎస్‌ఎల్‌బి శంకర్ శర్మ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఇసుజు మోటార్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, శ్రీసిటీ ఎన్విరాన్మెంటల్ హెల్త్ అండ్ సేఫ్టీ ఆఫీసర్ కె.వీరేష్ బాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి వాహనాలు నడిపే విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా శిరస్త్రాణం ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు ప్రసాద్, ఏడుకొండలు, శరత్‌బాబు, మత్తయ్య, గిరిబాబు, రాజు, ఉషారాణి, సునీత పాల్గొన్నారు.

నేటి నుంచి నీలకంఠేశ్వరుని బ్రహ్మోత్సవాలు

❖ తితిదే ఆధ్వర్యంలో ఏర్పాట్లు

తుమ్మూరులో గంగా సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయం

నాయుడుపేట, న్యూస్‌టుడే: పట్టణంలో ప్రసిద్ధి చెందిన తుమ్మూరులోని శ్రీగంగా కామాక్షి సమేత శ్రీనీలకంఠేశ్వర స్వామి ఆలయంలో గురువారం నుంచి తితిదే ఆధ్వర్యంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఇందుకు సంబధించి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇటీవల తితిదే ఆలయాన్ని అధునీకరించి రాజగోపురం, ధ్వజస్తంభం, ముఖమండపం, వినాయక, సుబ్రహ్మణ్య స్వామి, నవగ్రహ మండపాలను అధునీకరించారు. గంగా భవాని అమ్మవారి నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రతిష్ఠించారు.

నేడు అంకురార్పణ

తితిదే పండితులు ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం గణపతి పూజ, పుణ్యాహవచనం, రుత్విక్కరణ పూజలతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేయనున్నారు. 13న ధ్వజారోహణం, చప్పర ఉత్సవం, శేషవాహన సేవ, 14న విశేష అభిషేకాలు, చప్పర ఉత్సవం రావణవాహన సేవ, 15న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మహాగణపతి అభిషేకం, మహాదేవుని అభిషేకం నిత్య బలిహరణం, నంది, హంస వాహన సేవలు, అర్ధరాత్రి లింగోద్భవం పుణ్యకాల మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం పూజలు నిర్వహించనున్నారు. 16న మోహిని అలంకారం, గజ, సింహవాహన సేవలు రాత్రికి శివ పార్వతులు కల్యాణోత్సవం, 17న వసంతోత్సవం, ధ్వజావరోహణం, 18న పుష్ప యాగం పూజలు నిర్వహించనున్నట్లు తితిదే అధికారులు తెలిపారు.

చిరు వ్యాపారులకు ఆర్థిక చేయూత

వీధి వ్యాపారులకు స్వనిధి రుణాలు అందిస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

సూళ్లూరుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: తోపుడు బండ్లు, సైకిళ్లపై కూరగాయలు, పండ్లు, పాలు, బొమ్మలు వంటివి విక్రయిస్తూ పట్టణ వీధుల్లో జీవనం పొందే వ్యాపారులు (స్ట్రీట్ వెండర్స్) తమ కార్యకలాపాలు మరింత విస్తరించి ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం ఆర్థిక చేయూత అందిస్తోంది. ప్రధానమంత్రి వీధి వ్యాపారులకు ఆత్మనిర్భర్ నిధి(పీఎం స్వనిధి.2.0) పథకం ద్వారా పూచీకత్తులేని రుణాలు మంజూరు చేస్తూ తోడ్పాటు అందిస్తుంది.

● **ఐదు నెలల వ్యవధిలో..** ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబరు నుంచి పీఎం స్వనిధి 2.0 కింద పట్టణంలో వ్యాపారులకు పూచీకత్తులేని రుణాలకు అందించాలనేది లక్ష్యం కాగా ఇప్పటి వరకు 325 మందికి 5.80 లక్షలు అందించినట్లు మెప్మా సీఈవో ప్రభాకర్ తెలిపారు. వీరిలో మొదటిసారి రూ.15 వేలు చొప్పున రుణాలు పొందిన వారు ఉన్నారు.

● **క్రెడిట్ కార్డు జారీ:** పట్టణ పరిధిలోని వ్యాపారులకు పీఎం స్వనిధి 2.0 ద్వారా రుణాలు చెక్కుతో పాటు కొత్తగా క్రెడిట్ కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభించారు. దీంతో చిరు వ్యాపారులకు డిజిటల్ లావాదేవీలపై అవగాహన పెరగడంతో పాటు వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్లాల్సిన పని లేకుండా పూచీకత్తు లేకుండా రుణాలు పొందే అవకాశం ఉంది. డిజిటల్ లావాదేవీల ద్వారా రుణం చెల్లించిన వారికి వడ్డీ రాయితీ కూడా ఉంటుందన్నారు. ఇప్పటికే పలువురు వీధి వ్యాపారులకు బ్యాంకుల ద్వారా క్రెడిట్ కార్డులు జారీ చేసినట్లు చెబుతున్నారు.

మొదటిసారి రూ.15 వేల చొప్పున: సూళ్లూరుపేట పట్టణ పరిధిలో మొత్తం 549 మంది వీధి వ్యాపారులు ఉన్నారు. వీరిలో చాలా మందికి గుర్తింపు కార్డులు జారీ చేశారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో పీఎం స్వనిధి 2.0 ద్వారా బ్యాంకుల నుంచి వీరికి రుణాలను ప్రభుత్వం అందిస్తుంది. ఈ పథకంలో మొదట పొందిన రుణాన్ని తిరిగి బ్యాంకులకు చెల్లిస్తే రెండో సారి రూ.25 వేలు, మూడోసారి రూ.50 వేలు చొప్పున రుణం అందిస్తున్నారు.

పట్టణంలో విస్తృత తనిఖీలు

ఆర్టీసీ బస్టాండ్‌లో తనిఖీలు చేస్తున్న సీఐ వెంకటరమణ

వెంకటగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, కొరియర్ సర్వీస్‌లో బుధవారం సీఐ వెంకటరమణ విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఇప్పటికే గంజాయి రవాణా, నంబర్లాటపై ప్రత్యేక తనిఖీలు చేపట్టామన్నారు.

చిరస్మరణీయుడు ఘంటసాల

వెంకటగిరి, న్యూస్‌టుడే: ప్రజల హృదయాల్లో ఘంటసాల వెంకటేశ్వరరావు చిరస్మరణీయుడిగా నిలిచి పోయారని పద్మశ్రీ ఘంటసాల సేవా సంఘం అధ్యక్షుడు బికెప్రసాద్ అన్నారు. బుధవారం ఘంటసాల వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఘంటసాల ఆలపించిన భగవద్గీత గీతాలు నేటికి మార్మోగుతున్నాయన్నారు. కార్యక్రమంలో వ్యవస్థాపకుడు ఆరవ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పక్కనే మురుగు నీరు

కొత్తపేటలో ప్రజలు నివాసం ఉండే ఇళ్ల పక్కనే మురుగు నీరు నిల్వచేరడంతో దుర్వాసన వెదజల్లుతోంది. గ్రామంలోని మురుగు నీరంతా ఇక్కడ చేరడంతో దోమల బెడద ఎక్కువగా ఉంటోంది. ఫలితంగా ప్రజలకు విషజ్వరాలు వ్యాపించే ప్రమాదం ఉందని వాపోతున్నారు. అధికారులు స్పందించి మురుగు నీరు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.
-న్యూస్‌టుడే, ఓజిలి

ఈ దారిలో ప్రయాణించేదెలా?

సూళ్లూరుపేట మండలంలోని కుదిరి గ్రామంలో రహదారి గుంతలమయమై రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో ఈ మార్గంలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు ముందుకు వెళ్లలేకపోతున్నాయని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, సూళ్లూరుపేట గ్రామీణం**

మురుగు కాల్వలు అధ్వానం

పట్టణంలో లక్ష్మీణ్‌నగర్, మంగపతినాయుడనగర్ ప్రాంతాల్లో మురికినీటి కాల్వలు, కల్వర్టులు దెబ్బతిని అపరిశుభ్రత తాండవిస్తోంది. 24వార్డు పరిధిలో ఉన్నా ఈరెండు ప్రాంతాలు అభివృద్ధిపై గత పదేళ్లగా పురపాలిక పాలకవర్గం నిర్లక్ష్యం చేయడం.. పుర అధికారులు పర్యవేక్షణ కొరవడంతో మురికినీటి కాల్వలు, రోడ్డును కొందరు ఆక్రమించి అడ్డంగా నిర్మాణాలు చేపడుతున్నారు. దీనిపై కమిషనర్, వార్డు ప్లానింగ్ అధికారులకు విన్నవించిన స్పందన లేదని స్థానికులు తెలిపారు.
- **న్యూస్‌టుడే, నాయుడుపేట**

ఉత్తమ ఫలితాలు సాధించాలి

సరస్వతి పూజ నిర్వహించిన కళాశాల అధ్యాపకులు

బాలాయపల్లి, న్యూస్‌టుడే: త్వరలో జరిగే పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కరుణకుమారి అన్నారు. బుధవారం వెంగమాంబాపురం గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వార్షికోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇప్పటికే విద్యార్థులకు అన్ని విభాగాల్లో తర్ఫీదు పూర్తి చేశామన్నారు. ఈ క్రమంలో సరస్వతి పూజ చేపట్టారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

13న సామాజిక తనిఖీ ప్రజావేదిక

ఓజిలి, న్యూస్‌టుడే: ఓజిలి మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 13వ తేది సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో నారాయణరెడ్డి తెలిపారు. ఉపాధి హామి పథకం ద్వారా 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు అన్ని గ్రామ పంచాయితీల్లో జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలన్నారు.

క్యాన్సర్ నివారణపై అవగాహన

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం మహిళలకు క్యాన్సర్‌పై వైద్యులు అవగాహన కల్పించారు. శ్రీవెంకటేశ్వర క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్, టాటా ట్రస్టు సంయుక్తంగా అవగాహన కల్పించి పరీక్షలు చేశారు. వైద్య నిపుణులు హేమంత్ కుమార్ మాట్లాడుతూ వ్యాధి నివారణకు మొదటి మెట్టు వ్యాధి నిర్ధారణ చేసుకోవడమే అన్నారు. కార్యక్రమంలో సీడీపీవో ఉమామహేశ్వరి, వైద్య సిబ్బంది రెడ్డికుమారి, అమరావతి, మెహతాజ్, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిని విస్మరించిన వైకాపా

వెంకటగిరి, న్యూస్‌టుడే: గత ఐదేళ్ల వైకాపా పాలనలో అభివృద్ధిని విస్మరించారని తెదేపా పట్టణాధ్యక్షుడు సత్యనారాయణ అన్నారు. బుధవారం తెదేపా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో చేసిన అభివృద్ధిని తాము చేశామని వైకాపా నేతలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో పుర ఉపాధ్యక్షుడు బీరం రాజేశ్వరరావు,, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, ఏఎంసీ ఛైర్మన్ విశ్వనాధం, మాజీ ఛైర్మన్ రాజేశ్వరరావు, నేతలు ఆనంద్, రామకృష్ణ, స్వప్న, వెంకటముని, చంగరావు తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ రైలులో పొగలు

నాయుడుపేట రైల్వేస్టేషన్‌లో ఆగిన రైలు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట రైల్వేస్టేషన్‌కు చేరుకుంటున్న జోధ్‌పూర్ నుంచి తాంబరం వెళ్లే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైల్లో బుధవారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో మూడో బ్రేక్ బైండింగుతో పొగలు రావడంతో నిలిపేశారు. పొగలు విస్తరించడంతో వెంటనే రైల్వే అధికారులు, సిబ్బంది బాగుచేశారు. ప్రయాణికులు కొంత భయాందోళనకు గురయ్యారు. రైల్వే స్టేషన్ మాస్టరు చిరంజీవి 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ సాధారణంగా బ్రేక్ బైండింగు జరుగుతుందని దీన్ని రిలీజ్ చేశాక వెళ్లడం జరిగిందన్నారు.

డివైడర్‌పై ట్రాక్టరు బోల్తా

డివైడరు ఎక్కిన ట్రాక్టర్ ఇంజిన్

తడ, న్యూస్‌టుడే: తడ పంచాయతీ బోడిలింగాలపాడు వద్ద జాతీయ రహదారిపై బుధవారం కర్రల లోడుతో వెళ్తున్న ట్రాక్టరు బోల్తా పడింది. ఆ సమయంలో వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. డ్రైవరు కూడా ఎలాంటి గాయాల్లేకుండా బయటపడ్డాడు. ప్రమాదం కారణంగా గంటపాటు రాకపోకలు ఆగిపోయాయి. పోలీసులు క్రేన్ ద్వారా ట్రాక్టర్‌ను తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

క్రైం కార్నర్

పాత కక్షలతో దాడి.. ఇద్దరికి తీవ్ర గాయాలు

వాకాడు, న్యూస్‌టుడే: వాకాడు మండలం రావిగుంటపాలెం మద్యం దుకాణం సమీపంలో మంగళవారం రాత్రి మద్యం మత్తులో ఘర్షణ జరిగింది. ఈ సంఘటనపై పోలీసులు బుధవారం సాయంత్రం విచారణ చేపట్టారు. వాకాడు ఎస్ఐ నిఖిల్‌బాబు కథనం మేరకు చిట్టమూరు మండలం పల్లం పర్తి గ్రామానికి చెందిన వినోద్‌కుమార్, వాకాడు మండలం వేణుగోపాలపురం గ్రామానికి చెందిన శ్రీనివాసులుపై పాత కక్షలతో వాకాడు మండలం తీపలపూడి గ్రామానికి చెందిన మల్లాపు సతీష్, ఆయన సోదరుడు దినేష్ మరో వ్యక్తి గోపాల్‌రెడ్డి పడి వినోద్‌కుమార్, శ్రీనివాసులును ఇనుపరాడ్లు, కర్రలతో దాడి చేశారు. ఘర్షణలో గాయపడిన క్షతగాత్రులను నాయుడుపేట ఆసుపత్రికి తరలించారు. మేరకు దాడికి పాల్పడిన వారిలో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పులికాట్‌లో మునిగి మత్స్యకారుడి మృతి

మారి (పాతచిత్రం)

తడ, న్యూస్‌టుడే: పులికాట్ సరస్సులో చేపలవేటకు వెళ్లి కారూరు పంచాయతీ కాసింగాడు కుప్పానికి చెందిన నడకర మారి (45) బుధవారం దుర్మరణం చెందాడు. మారి, అన్నపూర్ణ దంపతులు ఎప్పటిలాగే సరస్సులో చేపల వేటకు వెళ్లారు. మధ్యాహ్నం వలలు నాటుతుండగా మారి పట్టుతప్పి నీళ్లల్లో పడిపోయి బురదలో కూరుకుపోయాడు. ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో అన్నపూర్ణ గట్టిగా కేకలు వేసింది. సమీపంలో వేట సాగిస్తున్న అదే గ్రామానికి చెందిన మత్స్యకారులు గాలించగా అప్పటికే మారి మృతిచెందాడు. బెస్త కార్పొరేషన్ ఛైర్మన్ బొమ్మన శ్రీధర్, ఎఫ్‌డీవో హిమజ ఘటనాస్థలానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తడ ఎస్సై కొండపనాయుడు తెలిపారు.

కోడి పందేల స్థావరంపై దాడి: దక్కిలి, న్యూస్‌టుడే: మండలంలోని అముదూరు గ్రామం సమీపంలోని శివగిరి అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై శివశంకర్ తెలిపారు. బుధవారం నిర్వహించిన దాడిలో ముగ్గురిని అదుపులోకి తీసుకుని రెండు కోడి పుంజులు, రూ.3,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మహిళ మెడలో గొలుసు చోరీ: వెంకటగిరి, న్యూస్‌టుడే: బంగారుపేటలోని కోదండరామ స్వామి ఆలయం ఎదుట నివాసం ఉంటున్న మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ చేసినట్లు బాధితులు తెలిపారు. ఇంటిలో నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి మహిళ మెడలో ఉన్న మూడు సవర్లు బంగారు గొలుసు, చరవాణిని చోరీ చేశారని బాధితులు వాపోయారు. ఈ మేరకు బాధితులు పోలీసులకు సమాచారం అందించారు.

వ్యవసాయ శాఖపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

తిరుమూరులో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా అధికార ప్రతినిధి కుంచం దయాకర్

వాకాడు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం వ్యవసాయ శాఖపై ప్రత్యేక దృష్టి సారించిందని తెదేపా జిల్లా అధికార ప్రతినిధి కుంచం దయాకర్ అన్నారు. బుధవారం మండలంలోని తిరుమూరులో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధర ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో ఏడీ నాగార్జునసాగర్, ఏవో దీప, గ్రామ వ్యవసాయ సహాయకుడు సుబ్బయ్య, రైతులు పాల్గొన్నారు.

మార్కెట్ ఫీజు చెల్లించి సహకరించండి

తడ, న్యూస్‌టుడే: మార్కెట్ ఫీజు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని సూళ్లూరుపేట ఏఎంసీ ఛైర్మన్ ఆకుతోట రమేష్ రైసు మిల్లర్లను కోరారు. మండలంలోని ఏఎంసీ కార్యాలయంలో బుధవారం ఆయన తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల రైసు మిల్లర్లతో సమావేశం అయ్యారు. 2025-26లో రూ.2.60 కోట్లకుగాను రూ.90.97 లక్షలు వసూలైందన్నారు. మిగిలిన లక్ష్యాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఏఎంసీ కార్యదర్శి రామమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్రీడామైదానం కబ్జాకు యత్నం

వెంకటగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని జడ్పీ క్రీడామైదానం కబ్జా చేసేందుకు కొందరు యత్నిస్తున్నారని భాజపా మాజీ కన్వీనర్ మణి ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నంబర్ 161లో ఉన్న స్థలాన్ని ముగ్గురు వ్యక్తులు తప్పుడు పత్రాలు సృష్టించి అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారన్నారు. వీరిపై ఎమ్మెల్యే రామకృష్ణ దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

హిందువుల మనోభావాలు దెబ్బతీశారు

దక్కిలి (వెంకటగిరి), న్యూస్‌టుడే: తిరుమల లడ్డూను కల్తీ చేసి హిందువుల మనోభావాలను వైకాపా ప్రభుత్వం దెబ్బతీసిందని దక్కిలి తెదేపా మండలాధ్యక్షుడు కోటిరెడ్డి విమర్శించారు. బుధవారం మండలంలోని తెదేపా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామచంద్రనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు బీమా.. మూడేళ్ల ధీమా

సూళ్లూరుపేట పట్టణం, న్యూస్‌టుడే: గత ప్రభుత్వంలో వ్యవసాయం, అనుబంధ పాడి పరిశ్రమలకు చేసిన మేలు శూన్యం. కూటమి ప్రభుత్వం రాకతో పాడి పరిశ్రమ అభివృద్ధికి పలు కార్యక్రమాలు చేపట్టింది. ప్రధానమైనది బీమా పథకం. మూగజీవాలకు ఒకసారి బీమా చెల్లిస్తే మూడేళ్ల పాటు ప్రమాదవశాత్తు నష్టపోయిన పరిహారం అందుతుంది. గ్రామాల్లోని సచివాలయం, పశువైద్యశాలల్లో సంప్రదించి రైతులు బీమా చేయించుకోవచ్చు.

ఈ సందర్భాల్లో భరోసా..

● పశువులు మేతకు వెళ్లినప్పుడు పిడుగుపాటు, విద్యుదాఘాతం, ఊబిలో చిక్కుకుపోవడం, తదితర కారణాలతో మృత్యువాత పడితే రైతులను ఆదుకునేందుకు ఈ బీమా ఉపయోగపడుతుంది.

● ఒక కుటుంబానికి గరిష్ఠంగా పది మూగజీవాల వరకు ఈ పథకం వర్తిస్తుంది.

● పశువులకు చెవిపోగులు వేయించి బీమా చెల్లించాలి.

● ప్రభుత్వం రాయితీగా నాటు పశువులకు రూ.816, మేలు జాతి పశువులకు రూ.1632 చెల్లిస్తుంది. రూ.లక్ష బీమా చేయించాలంటే కట్టాల్సిన ప్రీమియం(ఒక్క సారి చెల్లిస్తే మూడేళ్లకు వర్తింపు). మొత్తం రూ.6,400. ఇందులో రైతు వాటాగా రూ.4937 చెల్లిస్తే చాలు. మిగిలినది ప్రభుత్వం చెల్లిస్తుంది.

● గొర్రె, మేకలకు, రైతు రూ.27 చెల్లిస్తే ప్రభుత్వం రూ.6 వేలు నష్టపరిహారంగా అందజేస్తుంది.

పశువులు వివరాలివీ..

మండలం	సూళ్లూరుపేట	తడ
ఆవులు	4024	4343
గేదెలు	14372	6623
మేకలు	8958	5897
గొర్రెలు	19849	10497

రైతులు వినియోగించుకోవాలి

● పశు బీమా విధానంతో రైతులకు మేలు జరుగుతుంది. ప్రకృతి వైపరీత్యాలతో ప్రమాదం సంభవిస్తే బీమా ద్వారా లబ్ధి చేకూరుతుంది. దీనిని రైతులు వినియోగించుకోవాలి.
- **ఎం.వరలక్ష్మి, ఏడీఏ, సూళ్లూరుపేట.**

In The Court of The Junior Civil Judge: Kota
IA No.20/26
OS.No.10/26
1. K.C.Venkata Ramanaiah - Petitioners / Plaintiffs
2. Sk. Gouse Mohiddin
Vs
The State of Andhra Pradesh Rep. by its District Collector, Tirupati and 8 Others - Respondents / Defendants
జనరల్ నోటీసు
ఇందుమూలముగా తిరుపతి జిల్లా, వాకాడు మండలం, తిరుమూరు గ్రామ జలవనరుల శాఖకు సంబంధించిన తిరుమూరు చెరువు కలుజు ఎత్తు యథావిధిగా కొనసాగించడానికి తిరుమూరు గ్రామ చెరువు ప్రెసిడెంట్ K.C. వెంకటరమణయ్య మరియు పంచాయతీ వార్డు మెంబరు Sk.Gouse Mohiddinలు ప్రతినిధులుగా పై దావా దాఖలు చేసిఉన్నారు. కావున తిరుమూరు గ్రామ సాగునీటి రైతులు ఎవరైనా అభ్యంతరాలు ఉంటే తేదీ: 27-2-2026న 10-30 నిమిషాలకు పై కోర్టుకు హాజరై అభ్యంతరాలు ఉంటే తెలియపరచగలరు. లేనియెడల పరోక్షంగా తీర్మానించబడును.
S.Venkateswarlu, Advocate, Gudur.

(c) eenadu

ఆశీలుమెట్టలో బుధవారం రాత్రి నిర్వహించిన ఫ్యాషన్‌షోలో సంప్రదాయ వస్త్రధారణలో యువతులు, మహిళలు అలరించారు. పాల్గొన్న మోడల్స్‌నూ చిత్రాల్లో చూడొచ్చు. –న్యూస్‌టుడే, కార్పొరేషన్

ఈనాడు విశాఖపట్నం

గురువారం 12 ఫిబ్రవరి 2026 సిటీ 5

'మెట్రో'.. మరింత ముందుకు

తొలిదశలోనే 'భోగాపురం' వరకూ!

రూ.2,618 కోట్ల సమీకరణకు కసరత్తు

ఈనాడు, విశాఖపట్నం : విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టును మొదటి దశలోనే భోగాపురం వరకు విస్తరించే అంశంపై కసరత్తు సాగుతోంది. తొలుత అనుకున్న కొమ్మాది నుంచి ఆనందపురం మీదుగా భోగాపురం విమానాశ్రయానికి అనుసంధానించేలా ప్రతిపాదన కేంద్ర ప్రభుత్వానికి పంపినట్లు తెలిసింది. దీనికి ఆమోదం దక్కితే... తొలి దశ ప్రాజెక్టు 46.4 కి.మీ. నుంచి 71.7 కిలోమీటర్లకు పెరగనుంది.

నిధుల సమీకరణకు: మెట్రో రైలు ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం వాటా భరించాల్సి ఉంది. 71.7 కి.మీ.లకు రూ.17,232 కోట్లు ఖర్చవుతుందని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది. భూ సమీకరణ, విక్రయం ద్వారా నిధుల సమీకరణ బాధ్యత వీఎంఆర్‌డీఏకు అప్పగించింది. ఇందుకోసం వీఎంఆర్‌డీఏ దాదాపు రెండు వేల ఎకరాలు సమీకరించనుంది. ఆ పనులు వేగంగా సాగుతున్నాయి. సుమారు వెయ్యి ఎకరాలకు పైగా ఇప్పటికే రెవెన్యూ యంత్రాంగం సమీకరించింది. ఆ భూములు అభివృద్ధి చేసి విక్రయించి, నిధులను మెట్రో కోసం వెచ్చించనున్నారు. అలాగే మరికొన్ని వాణిజ్య తరహా విధానాలు అవలంబించనున్నారు.

రుణాలకు: మెట్రో రైలు ప్రాజెక్టు కోసం వీఎంఆర్‌డీఏ దాదాపు రూ.2,618 కోట్లు సమీకరించనుంది. భూములను తాకట్టు పెట్టి రుణాలు తీసుకునే ప్రతిపాదనపై ఆలోచన చేస్తున్నారు. తక్కువ వడ్డీకి రుణాలు ఇచ్చే జాతీయ బ్యాంకులు, ఆర్థిక సంస్థలను అధికారులు సంప్రదిస్తున్నారు. ఏ బ్యాంకులు ఎంత కాలానికి ఎంత వడ్డీతో రుణాలు మంజూరు చేస్తాయన్న విషయాలను పరిశీలిస్తున్నారు.

ఆ గాలి వలన.. అంతా ఆందోళన!

★ నగరంలో పడిపోతున్న వాయు నాణ్యత

★ కాలుష్యం పెరుగుదలకు కారణాలెన్నో

ఈనాడు–విశాఖపట్నం: గత కొన్ని రోజులుగా విశాఖలో గాలి నాణ్యత ఆందోళన కలిగించే స్థాయిలో దారుణంగా ఉంటోంది. కాలుష్యంలో దిల్లీని మించి ఏక్యూఐ (గాలి నాణ్యత-ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్) గణాంకాలు నమోదవ్వడం కలవరపెడుతోంది. ఇందుకు కొన్ని కారణాలు అధికారులు గుర్తించారు.

1 విశాఖ పోర్టు అథార్టీ (వీపీఏ), గంగవరం పోర్టుల్లో కవర్డ్‌షెడ్లను ఉపయోగించకుండా బహిరంగంగా బొగ్గు, ఇతర నిల్వలు ఉంచారు. టార్పాలిన్ పట్టాలు కప్పడం, స్ప్రింక్లర్లతో నీటిని చల్లే చర్యలు పూర్తిస్థాయిలో లేవు. కన్వేయర్ బెల్టులపై ముడిఖనిజం వెళ్లేటప్పుడు దుమ్ము బయటకు రాకుండా ఏర్పాట్లు లేవు. విశాఖ పోర్టులో ఓ కంపెనీ కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అనుమతుల్లేకుండా క్రషింగ్ యూనిట్ ఏర్పాటు చేసింది. బహిరంగంగా మాంగనీస్ ఓర్, బొగ్గు గ్రేడింగ్ చేస్తుండటం ఇక్కడ కాలుష్యానికి కారణమవుతోంది. పోర్టులకు వచ్చి, వెళ్లే లారీల్లో అధిక లోడు ఉండటం, టార్పాలిన్ కప్పకపోవడం వంటి కారణాలతో రోడ్లపైకి దుమ్ము భారీగా చేరుతోంది.

2 ఇటీవల షీలానగర్-సబ్బవరం గ్రీన్‌ఫీల్డ్ రహదారి పనులు ఆరంభమయ్యాయి. రూ.964 కోట్లతో చేపట్టిన 12.66 కి.మీ. ఆరు వరుసల రహదారి పనుల్లో ఫ్లైయాష్ (బూడిద) కూడా వాడుతున్నారు. ఎన్టీపీసీ, హిందూజా నుంచి నిత్యం వందల సంఖ్యలో లారీలు బూడిద రవాణా చేస్తున్నాయి.

★ ఆ సమయంలో ఓవర్‌లోడుతో, టార్పాలిన్ పట్టాలు కప్పకుండా తీసుకురావడంతో రహదారులన్నీ బూడిద మయంగా మారుతున్నాయి. ఫలితంగా గాల్లోకి బూడిద రేణువులు లేచి కాలుష్యానికి కారణమవుతున్నాయి.

★ పారిశ్రామిక ప్రాంతంలో బహిరంగంగా జిప్సం నిల్వలు పేరుకుపోవడంతో ఆ రేణువులు గాలిలో కలిసి ప్రమాదకరంగా మారుతున్నాయి.

3 జీవీఎంసీ పరిధిలో శిథిలావస్థ భవనాలను నిబంధనలు పాటించకుండా కూల్చేస్తుండటంతో దుమ్ము విపరీతంగా గాల్లోకి కలుస్తోంది. వ్యర్థాలను ఎలాంటి పైకప్పు లేకుండా జీవీఎంసీ వాహనాల్లో తరలిస్తున్నారు. నగరంలోని రోడ్లపై చేరిన దుమ్ము వాహనాల వేగానికి గాల్లో కలుస్తోంది. బహిరంగంగా చెత్తను కాల్చడం కూడా కాలుష్యానికి ఓ కారణంగా గుర్తించారు.

రంగులద్దిన బొమ్మలు

ప్రతి దిక్కు.. చూస్తే చమక్కు..

యుద్ధ నౌకల పండుగ 'ఐఎఫ్ఆర్'కు విశాఖ తీరం ముస్తాబవుతోంది. ఇప్పటికే ప్రధాన వేదికను సిద్ధం చేశారు. తీర ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ప్రహరీలను ఆకట్టుకునే చిత్రాలతో కళాత్మకంగా మారుస్తున్నారు. పలు జంతువుల బొమ్మలకు కొత్తగా రంగులు వేసి ఆకట్టుకునేలా చేస్తున్నారు. – ఈనాడు, విశాఖపట్నం

ప్రహరీకి కొత్త కళ

మళ్లీ.. 'ఆపరేషన్ లంగ్స్'!

★ ఈసారి సెల్లార్లలో ఆక్రమణలపై

★ జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

ఈనాడు–విశాఖపట్నం, కార్పొరేషన్–న్యూస్‌టుడే: 'ఇప్పటి వరకు నగరంలో రూ... కోట్ల విలువైన ఆక్రమణల తొలగింపునకు 'ఆపరేషన్ లంగ్స్' చేపట్టాం. తర్వాత సెల్లార్లలో పార్కింగ్ కాకుండా వాణిజ్య సముదాయాలు నిర్వహిస్తున్న వారిపై 'ఆపరేషన్ లంగ్స్ 3.0' ప్రారంభిస్తున్నాం. జోన్ల వారీగా సర్వే చేసి ముందుగా నోటీసులు ఇచ్చాం. తర్వాత ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తొలగింపు చర్యలు చేపడతాం' అని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. జీవీఎంసీ ప్రాధాన్యత అంశాలను బుధవారం మీడియాకు వివరించారు.

తొలుత ఆ రెండు చోట్ల: ముంబయి, అహ్మదాబాద్, బెంగళూరులో అధ్యయనం చేశాక మురికివాడల్లో బహుళ అంతస్తుల భవనాలు పీపీపీ మోడ్‌లో నిర్మిస్తున్నాం. పైలెట్ ప్రాజెక్టుగా నగరంలో వెంకటేశ్వర కాలనీ, ఇందిరా గాంధీనగర్‌లోని మురికివాడలను ఎంపిక చేశాం. రూ.23.17 కోట్లతో వెంకటేశ్వరలో 59 సెంట్లలో జీ+11 తరహా భవనం నిర్మిస్తాం. పీపీపీ మోడ్‌లో నిర్మించడానికి ముందుకొచ్చిన గుత్తేదారుకు ఇదే స్థలంలో సుమారు 678 చదరపుగజాలు కేటాయిస్తాం. 18 నెలల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది. అప్పటి వరకు మురికివాడ ఖాళీ చేసిన వారికి అద్దె ఆప్షన్ ఇచ్చి జీవీఎంసీ చెల్లిస్తుంది. మిగిలిన మురికివాడలపైనా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నగరంలో 66 మురికివాడలు గుర్తించగా, అందులో 16 కేంద్ర ప్రభుత్వ స్థలాల్లో ఉన్నాయి.

రూ. 172 కోట్లతో వసతి గృహాలు: నగరంలో సుందరీకరణ, ఇతర శాశ్వత పనులు చేస్తున్నాం. సీఐఐ భాగస్వామ్య సదస్సుకు రూ.60 కోట్లు ఖర్చు చేశాం. ఐఎఫ్ఆర్, మిలాన్ నేపథ్యంలో 119 పనులు గుర్తించి రూ.18.85కోట్లతో చేపడుతున్నాం. తాత్కాలిక పనులు కేవలం 10శాతం మాత్రమే. 'సాస్కి' పథకంలో రూ.172కోట్లతో గాజువాక, మధురవాడ, ముడసర్లోవలో 'వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్స్' నిర్మిస్తున్నాం.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ముందుండేలా: గతేడాది స్వచ్ఛ సర్వేక్షణ్‌లో 9వ ర్యాంకు సాధించాం. ఈ ఏడాది మొదటి మూడు ర్యాంకుల్లో లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆహారవ్యర్థాలు, కూరగాయల వ్యర్థాలను ప్రాసెస్ చేసేలా కాపులుప్పాడలో బయో సీఎన్‌జీ ప్లాంట్ ఏర్పాటు చేశాం. స్కూళ్లు, గ్రూప్ హౌస్‌లు, ఆసుపత్రుల వద్ద సీఎన్‌జీ మినీ ప్లాంట్స్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. బీచ్ వెంట ఆరు ప్రాంతాల్లో మరుగుదొడ్లు నిర్మిస్తాం.

ఆ వసతి గృహం అక్కడ కట్టింది: ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ లేఅవుట్లలో మిగిలిన, ఖాళీగా ఉన్న స్థలాల్లో పీపీపీ మోడ్‌లో ఇళ్లను నిర్మిస్తాం. గాజువాకలో నిర్మిస్తున్న వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ పారిశ్రామికవాడలోని స్థలంలో కట్టిందే. కొత్తగా ఏర్పాటైన జోన్ల వారీగా అభివృద్ధి ప్రణాళికలను ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లతో చర్చించి తయారు చేస్తున్నాం. భోగాపురం విమానాశ్రయ అనుసంధాన రహదారుల్లో రెండు జీవీఎంసీ చేపడుతోంది.

అందరూ చూసేలా.. అమలు చేసేలా!

● కాంక్రీట్ నగరిలో పచ్చనికాలనీ..!

● ఇంటింటా ఇంకుడుగుంతలు

● ఆదర్శంగా నిలుస్తున్న దయాల్‌నగర్

పచ్చదనం నిండిన ప్రవేశ మార్గం

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ఇండోర్, డెహ్రాడూన్ నగరాల అధికారులు ఇటీవల విశాఖ పర్యటనకు వచ్చారు. విశాలాక్షినగర్‌లోని దయాల్‌నగర్ కాలనీని సందర్శించి ఇక్కడ పచ్చదనం, పారిశుద్ధ్యం, తడిపొడి చెత్త సేకరణ, సేంద్రియ ఎరువుల తయారీ, వృత్తివిద్యా కోర్సుల నిర్వహణ తదితర అంశాలను అధ్యయనం చేశారు. నగరంలో చాలా ప్రాంతాలు ఉండగా ఆ అధికారులు దయాల్‌నగర్‌ను సందర్శించడానికి ఆ కాలనీ ప్రత్యేకతే కారణం.

ప్రతి నీటి చుక్క భూమిలోకే..: ఈ కాలనీ 1981లో ఏర్పాటైంది. ఇక్కడ 250 నివాసాలు ఉన్నాయి. తొలినాళ్లలో నీటి కోసం ప్రతి ఇంటి ఆవరణలో నూతులను తవ్వించుకున్నారు. పదేళ్ల క్రితం భూగర్భజలాలు పడిపోవటంతో బోర్లు ఏర్పాటు చేసుకున్నారు. ఎండిపోయిన బావులను వదిలేయలేదు. డాబాలపై పడిన వర్షపు నీటిని, ఇళ్లల్లోని వాడుక నీటిని వాటిల్లోకి పంపించి మళ్లీ జలకళ తెచ్చారు. నూతనంగా నిర్మించిన ప్రతి భవనానికి ఇంకుడుగుంతను తప్పని సరిచేశారు. ఇటీవల భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ రావడంతో సెప్టిక్ ట్యాంకులను శుభ్రపరిచి అందులోకి కూడా వాడుకనీరు పంపిస్తున్నారు. దీంతో మండు వేసవిలో కూడా నీటి ఎద్దడి ఉండదిక్కడ.

కాలనీలో పంటల సాగు

ఎటుచూసినా పచ్చదనమే

హుద్‌హుద్ తుపాను భీకరగాలులకు కాలనీలోని చెట్లన్నీ నామరూపాల్లేకుండా పోయాయి. కాలనీ వాసులంతా ఐకమత్యంతో రహదారులకు ఇరువైపులా, సామాజిక ప్రదేశాలలో, ఇళ్ల ఆవరణల్లో యుద్ధ ప్రాతిపదికన మొక్కలు నాటి వాటి సంరక్షణను బాధ్యతగా స్వీకరించారు. దీంతో కాలనీలో ఎటుచూసినా పచ్చదనం కనిపిస్తుంటుంది. ఏప్రిల్, మే నెలలో కూడా ఇక్కడ చల్లటి వాతావరణం ఉంటుంది.

శ్రమైక జీవనం: కాలనీలో సామాజిక అవసరాల కోసం వదిలిన స్థలంలో నాలుగుచోట్ల వ్యవసాయ క్షేత్రాలను ఏర్పాటు చేసుకున్నారు. వాటిల్లో పండ్ల తోటలు, ఆకుకూరలు, కూరగాయలు పండిస్తున్నారు. పండిన పంటలను ప్రతి ఆదివారం కాలనీవాసులు తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. ఆ డబ్బును వ్యవసాయ క్షేత్రాల నిర్వహణకు వినియోగిస్తారు. ' కాలనీకి స్వచ్ఛ పురస్కారాలు వచ్చాయి. కాలనీవాసులు మద్యం, మాంసం, ధూమపానం లాంటి అలవాట్లకు దూరంగా ఉంటారు. దీపావళి నాడు బాణసంచా కాల్చకుండా మొక్కలు నాటి సహపంక్తి భోజనాలు చేస్తామ'ని కాలనీ సంఘం కార్యదర్శి ఎంబీఆర్ మూర్తి తెలిపారు.

మీ 'రాత' మారుస్తాం!!

చూపులేని వారికి దస్తూరిలో సాయం

పెందుర్తి పాలిటెక్నిక్ విద్యార్థుల ఔదార్యం

పెందుర్తి, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు సేవాభావాన్ని కూడా అలవరచుకోవాలని సీఎం చంద్రబాబునాయుడు మార్గదర్శనం చేస్తున్నారు. ఈ క్రమంలో సామాజిక సేవలో పాలుపంచుకున్న విద్యార్థులను గుర్తించి వారిని ప్రోత్సహించాలని విద్యాలయాల యాజమాన్యాలను ఆదేశించారు. ఈ క్రమంలో పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు చూపులేని వారికి పరీక్షల సమయంలో సాయం చేస్తూ ఎందరికో నిలుస్తున్నారు. ఇటీవల కళాశాల యాజమాన్యం ప్రశంసాపత్రాలతో అభినందించింది.

■ నేను పెందుర్తి పాలిటెక్నిక్‌లో ఎలక్ట్రికల్ డిప్లొమా చేస్తున్నా. డిగ్రీ విద్యార్థినికి పరీక్ష రాయడంలో సాయం చేశా. ఆమె పలువురిని కోరినా ఎవరూ స్పందించలేదు. నేను చేసిన సాయానికి ఆమె ఎంతో సంతోషించడం నాకు చాలా తృప్తినిచ్చింది. –కోసూరు ప్రేమ్‌చంద్, గోపాలపట్నం

స్క్రైబ్‌గా సేవలందించిన విద్యార్థులతో ప్రిన్సిపల్ చంద్రశేఖర్, అధ్యాపకులు

★ చూపులేని కొందరు పరీక్ష రాసేందుకు తమకు సాయం కావాలని పెందుర్తికి చెందిన సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్ట్‌ను కోరారు. ఈ విషయాన్ని ట్రస్ట్ అధ్యక్షుడు దాడి శ్రీను పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్‌కు తెలియజేశారు. కళాశాలలో చివరి సంవత్సరం డిప్లొమా చదువుతున్న వారు స్క్రైబ్‌గా వెళ్లి సాయం చేయవచ్చని ఆయన సూచించారు. ఆ మేరకు విద్యార్థులకు అవగాహన కల్పించగా పది మంది ముందుకొచ్చారు. వారు ప్రస్తుతం నగరంలో వివిధ పరీక్షలు రాస్తున్న అంధులకు సాయపడుతున్నారు.

■ నేను మెకానికల్ డిప్లొమా చేస్తున్నా. ఇద్దరు అంధ అభ్యర్థులకు పోటీ పరీక్షలు రాయడంలో సాయం చేశా. కంప్యూటర్ ద్వారా జరిగే పరీక్షలోనూ పాల్గొన్నా. ఇది ఎంతో ఓపికతో చేయాల్సిన పని. ప్రశ్నలు చదివి వినిపించి వారు చెప్పిన సమాధానాన్ని నమోదు చేయాలి. చూపులేని వారికి సాయం చేశాననే సంతృప్తితో పాటు పోటీ పరీక్షలపై అవగాహన కలిగింది.
–అల్లూరి యామిని, ఎన్ఏడీ కూడలి

■ చూపులేని వారికి రాతలో సాయం చేయడానికి కళాశాలలో పది మందితో స్క్రైబ్ బృందాన్ని ఏర్పాటు చేశాం. ఆంగ్లం, తెలుగు మాధ్యమాలకు వేర్వేరుగా వీరిని ఎంపిక చేశాం. ప్రభుత్వం కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను ప్రోత్సహిస్తోంది. డిగ్రీ, పీజీ, పోటీ పరీక్షార్థులకు మా విద్యార్థులు వెళ్తున్నారు. –డాక్టర్ ఎన్.చంద్రశేఖర్, ప్రిన్సిపల్

64 డ్రోన్లతో నిరంతర నిఘా!

★ నగర భద్రత మరింత పటిష్ఠంగా!!

★ ఐఎఫ్ఆర్, మిలాన్‌కు 7వేల మందితో బందోబస్తు

★ 'ఈనాడు-ఈటీవీ'తో పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ

ఈనాడు–విశాఖపట్నం: 'అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ(ఐఎఫ్ఆర్), నేవీ మిలాన్, సిటీ పరేడ్ దృష్టిలో పెట్టుకుని విశాఖ నగర భద్రతపై మరింతగా దృష్టి పెట్టాం. నౌకాదళ విన్యాసాలు తిలకించడానికి లక్షలాది మంది వస్తారు. రాష్ట్రపతి, గవర్నర్, సీఎం, కేంద్రం రక్షణ మంత్రితో పాటు 75 దేశాల నుంచి ప్రతినిధులు వస్తున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపడుతున్నాం. మొత్తంగా ఏడు వేల మంది పోలీసులను రంగంలోకి దించుతున్నాం' అని విశాఖ సిటీ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ పేర్కొన్నారు.

■ '64 డ్రోన్లు, సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఉంటుంది. అస్త్రం యాప్ ద్వారా ట్రాఫిక్‌పై నిఘా, ఈపాస్ యాప్ ద్వారా వీవీఐపీ, వీఐపీలు ట్రాఫిక్‌లో చిక్కుకోకుండా చూడటం, విదేశీ ప్రతినిధులు సకాలంలో ఈవెంట్‌కు, తిరిగి గమ్యస్థానంకు చేర్చేలా ఏర్పాట్లు చేస్తున్నాం.

■ ఎవరిమీద అనుమానం ఉన్నా వెంటనే 79950–95799కు ఫోన్ చేయండి. ప్రజలే మా చెవులు... కళ్లు. ఏ సమాచారం ఉన్నా తెలియజేయండి' అని విశాఖ సిటీ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ పేర్కొన్నారు. 'ఈనాడు–ఈటీవీ'తో బుధవారం ప్రత్యేకంగా మాట్లాడిన సీపీ పలు వివరాలు వెల్లడించారు.

క్షుణ్ణంగా తనిఖీ

జిల్లా సరిహద్దుల్లో ఆరు శాశ్వత చెక్ పోస్టులున్నాయి. ఇక్కడ నిరంతర తనిఖీలు సాగుతాయి. ఆర్టీసీ, జీఆర్పీ, ఆర్పీఎఫ్‌తో కలిసి ఎక్కడికక్కడ తనిఖీలు చేస్తాం. టాస్క్ ఫోర్స్ ద్వారా లాడ్జిల్లో పరిశీలిస్తాం. నాకాబందీ సాగుతుంది. చిన్న అవాంఛనీయ సంఘటన కూడా జరగకుండా పటిష్ఠ భద్రతా చర్యలు తీసుకుంటున్నాం.

పోలీసుల సూచనలు పాటించాలి..

పోలీసులు ఇచ్చే సూచనలు, సలహాలు, ట్రాఫిక్ మళ్లింపులను నగరవాసులు పాటించాలి. గ్యాలరీలు నిండితే బయటే ఉండాల్సినప్పుడు సహకరించాలి. ఇతర దేశాల నుంచి వచ్చే వారు తప్పనిసరిగా ఫారం-3 పూర్తి చేసి పోలీసులకు అందజేయాలి. అతిథి గృహాల్లో, స్టేహోమ్స్‌లో విదేశీయులుంటే స్థానిక పోలీసులకు తెలియజేయాలి. కొన్ని దేశాల నుంచి కాల్ గర్ల్స్ వచ్చే అవకాశం ఉంది. వారికి ఆశ్రయం ఇవ్వొద్దు. డ్రగ్స్, గంజాయిపై పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఈనెల 15 నుంచి 20 వరకు జరిగే ఐఎఫ్ఆర్, మిలాన్, పరేడ్‌తో నగరం సందడిగా మారుతుంది. 15న మహా శివరాత్రి. మరుసటి రోజు తీరంలో పుణ్యస్నానాలు ఆచరించే క్రమంలో తొక్కిసలాటలకు ఆస్కారం ఇవ్వద్దు. 17, 18 తేదీల్లో పవిత్ర రంజాన్ నెల ప్రారంభమవుతుంది.

● అన్ని సందర్భాల్లో ప్రజలు మతసామరస్యం పాటించి పోలీసులకు సహకరించాలి. పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఖాళీగా ఉన్న ద్విచక్రవాహనాలు, కార్లు తెప్పించి జీపీఎస్ పెట్టి నిరంతరం పెట్రోలింగ్ చేసేలా యాప్‌లో పర్యవేక్షణ చేస్తాం.

ఇగ్నో బీఈడీ, బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాలు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) బీఈడీ, బీఎస్సీ నర్సింగ్ కోర్సులలో ప్రవేశాలకు మార్చి నెలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు సీనియర్ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ జి.ధర్మారావు ఒక ప్రకటనలో తెలిపారు. మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామన్నారు. బీఈడీ ప్రవేశ పరీక్షకు ఈనెల 27వ తేదీలోపు, బీఎస్సీ నర్సింగ్ కోసం మార్చి 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 08912511200 ఫోన్ నెంబరులో సంప్రదించాలని కోరారు.

హార్బర్ జోన్ ఏసీపీగా వివేకానంద

సింధియా, న్యూస్‌టుడే: పారిశ్రామిక ప్రాంతం హార్బర్‌జోన్ ఏసీపీగా సీహెచ్.వివేకానందను నియమిస్తూ బుధవారం పోలీసు శాఖ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రస్తుతం ఈయన శ్రీకాకుళం డీఎస్పీగా పని చేస్తున్నారు. ఇక్కడ ఏసీపీగా కొనసాగిన కాళిదాసును రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయానికి ఇటీవల ఎటాచ్ చేయడంతో గాజువాక జోన్ ఏసీపీ వై.శ్రీనివాసరావు ఇన్‌ఛార్జిగా కొనసాగారు. ఈ నేపథ్యంలో తాజా నియామకంపై ఉత్తర్వులు వచ్చాయి. వివేకానంద గతంలో మల్కాపురం స్టేషన్‌కు సీఐగా, గాజువాక ఏసీపీగా సేవలందించారు.

● వివేకానంద శ్రీకాకుళం జిల్లాలో అభ్యుదయం సైకిల్ యాత్ర, శ్రీముఖలింగం, అరసవల్లి, శాలిహుండం ఉత్సవాలు విజయవంతమయ్యేలా కీలకంగా వ్యవహరించారు.

WANTED
A Reputed Corporate Company Requires
Sr. CIVIL ENGINEER
Qlf: B.Tech/M.Tech Civil
Minimum 10 years Experience In Roads, Drains and Earth works
SALARY NEGOTIABLE
LAKSHMIKANTH
B.S. Layout, VSP
93555 58899

20వ వర్ధంతి

కీ॥శే॥ తలశిల సీతారావమ్మ
అమ్మా
మాకు జీవితాలను ప్రసాదించి,
మా అందరి ఔన్నత్యానికి తోడ్పడిన నిన్ను,
నీ శ్రమైక జీవన సాభాగ్యం, విశాల దృక్పథం
త్యాగనిరతిని ఎన్నటికీ మరువలేము.
సదా నీ దివ్య స్మృతులతో...

తలశిల బలరామకృష్ణ	గడ్డిపాటి ఝాన్సీలక్ష్మి
కీ.శే. తలశిల రాజారావు	నాగళ్ళ శివకుమారి
తలశిల ప్రసాదరావు	యార్లగడ్డ పార్వతి
తలశిల గోపాలకృష్ణ	కొరివి భాగ్యలక్ష్మి

ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులకు కొలువులు

కంచరపాలెం, న్యూస్‌టుడే: కంచరపాలెంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఏడాదికి రూ.5 లక్షల వేతనంతో కొలువులు సాధించారు. ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ మారుతి సుజుకి ఇండియా లిమిటెడ్ బుధవారం రాష్ట్రంలోని వివిధ కళాశాలల్లో రాష్ట్ర స్థాయి సెంట్రల్ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించింది. ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా 50 మంది విద్యార్థులు ఎంపికవ్వగా అందులో 24 మంది కంచరపాలెంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ బ్రాంచ్‌ల విద్యార్థులు కావడం గమనార్హం. అధ్యాపకుల మార్గదర్శకత్వం, సంస్థ అందిస్తున్న శిక్షణ ఫలితమే ఉద్యోగాల సాధనకు కారణమని ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.రమణ తెలిపారు. కళాశాల స్టూడెంట్ అడ్వయిజర్ ఎస్.వి.రమణ, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ ఎం.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.రమణ, విభాగాధిపతులు, అధ్యాపకులు

బంగారం, డబ్బు కోసం మహిళ దారుణహత్య | 6లో

నాచు సాగు.. ఉపాధి బాగు

సీవీడ్‌తో అతివలకు ఆదాయం

తీరం నుంచి సీవీడ్‌ను బయటకు తెస్తున్న మహిళలు

గ్రామీణభీమిలి, తగరపువలస, న్యూస్‌టుడే: 'ప్రధానమంత్రి మత్స్య సమృద్ధి యోజన'లో భాగంగా భీమిలి మండలం పెదమంగమారిపేట తీరంలో ఇటీవల ప్రారంభించిన సీవీడ్ (సముద్ర నాచు పెంపకం) సాగు సత్ఫలితాలను ఇస్తోంది.

★ మంగమారిపేట గ్రామానికి చెందిన కొందరు మత్స్యకార మహిళలు సంఘంగా ఏర్పడి గత ఏడాది నవంబరు 21న అంతర్జాతీయ మత్స్యకార దినోత్సవం నాడు సముద్రపు నాచు పెంపకానికి శ్రీకారం చుట్టారు. మత్స్యకార మహిళలకు సుస్థిర జీవనోపాధిని అందించేందుకు ప్రభుత్వం తెచ్చిన ఈ ప్రాజెక్టుతో కొద్దిరోజుల వ్యవధిలోనే మంచి లాభాలు రావడంతో వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రెండు టన్నుల దిగుబడి..: మంగమారిపేట తీరంలో దాదాపు రెండు టన్నుల దిగుబడి తొలిసారి వచ్చింది. తడిచిన సీవీడ్‌ను కిలో రూ.40 చొప్పున, ఎండబెట్టిన నాచును రూ.120 చొప్పున అమ్మారు. తద్వారా చక్కటి ఆదాయాన్ని పొందారు. ఈ స్ఫూర్తితో రెండోసారి కూడా 30 రాఫ్టుల సీవీడ్‌ను వేశారు. ఏడాదికి అయిదు సార్లు సాగు చేయనున్నారు. వీరిని ప్రోత్సహిస్తూ చిప్పాడ దివీస్ ఫార్మా కంపెనీ రూ.6 లక్షలను సీఎస్సార్ కింద అందించింది. ఈ మొత్తంతో సీవీడ్, రాఫ్టులను సమకూర్చుకున్నారు. మత్స్యకార మహిళలను స్ఫూర్తిగా తీసుకుని ఓ స్వచ్ఛంద సంస్థ, ఓ విశ్వవిద్యాలయం ఈ తీరంలో పదేసి రాఫ్టులతో సీవీడ్‌ను సాగు చేస్తున్నాయి.

సీ వీడ్ అంటే..: సీవీడ్ సముద్రపు వాతావరణంలో పెరిగే ఓ రకమైన నాచు మొక్క. ప్రధానంగా ఎరుపు, ఆకుపచ్చ, గోధుమ రంగుల్లో ఉంటాయి.

మరింత మందికి అవకాశం: మంగమారిపేట తీరంలో మహిళలు సాగు చేస్తున్న సీవీడ్ మంచి ఫలితాన్ని ఇచ్చింది. ఈ స్ఫూర్తితో మరింత మందికి అవగాహన కల్పించి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకుంటాం. మార్కెటింగ్ సదుపాయాలను కల్పిస్తున్నాం. – డా.కృష్ణ, పీఎం మత్స్య సమృద్ధి యోజన విశాఖ జిల్లా అధికారి

సీవీడ్ హబ్‌గా తీరం..: సీవీడ్‌ను ఎరువులు, ఔషధాలు, తినుబండారాలు, సౌందర్య ఉత్పత్తుల్లోనూ ఉపయోగిస్తున్నారు. వీటికి జపాన్, తైవాన్, ఇండోనేషియాలో డిమాండు ఎక్కువ. మంగమారిపేట, పరిసర తీర ప్రాంతాలను సీవీడ్ హబ్‌గా తీర్చిదిద్దుతాం.
– డా.లక్ష్మణరావు, మత్స్యశాఖ విశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80087 09638

(c) eenadu

విశ్రాంత ఉద్యోగిని బెదిరించి.. సొమ్ము స్వాహా

ఎండాడ, న్యూస్‌టుడే: డిజిటల్ అరెస్టు పేరుతో ఓ విశ్రాంత ఉద్యోగిని భయపెట్టి రూ.66 లక్షలు కాజేసిన ఘటనపై విశాఖ సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని బుధవారం అరెస్టు చేశారు. నగరానికి చెందిన విశ్రాంత ఉద్యోగికి కొద్ది రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి డిపాజిట్ ప్రొటెక్షన్ బోర్డు ముంబయి అధ్యక్షుడిగా పరిచయం చేసుకున్నాడు. కొలాబా పోలీస్ స్టేషన్‌లో మనీ లాండరింగ్ కేసు నమోదైందని చెప్పి ఫోన్ కాల్‌ను మహారాష్ట్ర పోలీస్ డీఐజీ వికాస్ శర్మ అని చెప్పుకునే మరో వ్యక్తికి బదిలీ చేశాడు. కెనరా బ్యాంక్‌లో ఖాతా తెరిచి, ఆ ఖాతా ద్వారా కోట్లాది రూపాయలు మనీ లాండరింగ్ జరిగిందని, దీనిపై సుప్రీంకోర్టు అరెస్టు జారీ చేసిందని వికాస్ శర్మ బాధితుడిని బెదిరించాడు. దర్యాప్తులో భాగంగా ఎవరితో మాట్లాడొద్దని ఒంటరిగా ఉంటూ నిరంతరం వీడియో కాల్‌లో అందుబాటులో ఉండాలని భయపెట్టారు. ఐదు రోజుల పాటు మానసిక ఒత్తిడికి గురిచేసిన అనంతరం రూ.66 లక్షలు బదిలీ చేయించుకున్నారు. మోసపోయినట్లు తెలుసుకున్న విశ్రాంత ఉద్యోగి విశాఖ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేసిన పోలీసులు గుంటూరుకు చెందిన చాగంటి గౌతమ్ (40)ను నిందితునిగా గుర్తించి రిమాండ్‌కు తరలించారు.

బంగారం, డబ్బు కోసం మహిళ దారుణహత్య

లక్ష్మి (పాతచిత్రం)

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: బంగారం, డబ్బు కోసం పట్టపగలు ఓ దుండగుడు మహిళ గొంతు నులిమి హత్య చేసిన ఘటన నగరంలో సంచలనం సృష్టించింది. ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆరిలోవ పాతపోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా కనకదుర్గనగర్‌లో కాపు రమణ, లక్ష్మి (45) దంపతులు నివాసం ఉంటున్నారు. రమణ జీవీఎంసీ ఉద్యాన విభాగంలో పనిచేస్తున్నారు. బుధవారం ఉదయం 9గంటలకు విధులకు వెళ్లారు. లక్ష్మి ఒక్కరే ఇంట్లో ఉండగా ఉదయం 10.15 గంటలకు సుమారు 35ఏళ్ల వయసున్న దుండగుడు ఇంట్లోకి ప్రవేశించాడు. ఇంట్లో ఉన్న సీసీ కెమెరాలో ఈ దృశ్యం రికార్డయింది. పరిసరాలను పరిశీలించిన అతను తిరిగి వెళ్లిపోయాడు. తర్వాత మళ్లీ 11 గంటల సమయంలో నెత్తిపై టోపీ, ముఖానికి మాస్క్ ధరించి వచ్చాడు. ఇంట్లోకి ప్రవేశించి లక్ష్మిపై దాడిచేసి గొంతునులిమి చంపేశాడు. అనంతరం ఆమె ఒంటిపై ఉన్న 8తులాల బంగారు ఆభరణాలు, బీరువాలో ఉన్న రూ.5 లక్షల నగదును తీసుకుని వెళ్లిపోయాడు. సాయంత్రం 5గంటలకు ఇంటికొచ్చిన రమణ భార్యను పిలిచినా స్పందించలేదు. అచేతనంగా పడి ఉండటం.. ముక్కులో నుంచి రక్తం వచ్చి ఉండటం గమనించారు. బంగారం, నగదు లేకపోవడంతో కుమార్తె, కుమారుడు, అల్లుడికి తెలిపారు. సమాచారం అందుకున్న ఆరిలోవ పోలీసులు అంబులెన్స్‌ను పంపించారు. అంబులెన్స్ సిబ్బంది వచ్చి పరిశీలించగా అప్పటికే లక్ష్మి మరణించినట్లు ధ్రువీకరించారు. క్లూస్‌టీం ఘటనా స్థలిలో ఆధారాలను సేకరించింది. బాగా రెక్కీ నిర్వహించిన వ్యక్తే ఈ దారుణానికి పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు. భర్త రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. మృతురాలి కుమార్తె, కుమారుడు, బంధువులు అక్కడికి సమీపంలో నివాసం ఉంటున్నా సాయంత్రం వరకు ఆమె మృతిచెందిన విషయం గుర్తించలేకపోయారు.

తోడుగా వచ్చి.. ప్రాణాలు తీసే..!

సహజీవనం చేస్తున్న వ్యక్తిని హతమార్చిన మహిళ

మృతి చెందిన నాగశివ

ఆనందపురం, న్యూస్‌టుడే : కొన్నాళ్ల నుంచి సహజీవనం సాగిస్తున్న ఇద్దరి మధ్య గొడవలు రావడంతో, పురుషుడిని మహిళ దారుణంగా హత్య చేసిన ఘటన ఆనందపురం శివారు పందుల ఫారంలో చోటు చేసుకుంది. బుధవారం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలివి. మధురవాడ ప్రాంతానికి చెందిన పైడిరాజు ఆనందపురం శివారులో రెండేళ్ల నుంచి పందుల ఫారం నిర్వహిస్తున్నాడు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన ఎస్.నాగశివ(38), షేక్ ముబీనా(శ్రావణి)(41) భార్యాభర్తలుగా పరిచయం చేసుకుని, ఫారం నిర్వహణ పనులు చూసుకుంటున్నారు. మంగళవారం అర్ధరాత్రి ఇద్దరూ మద్యం తాగి, ఆ మత్తులో గొడవ పడ్డారు. అయితే బుధవారం ఉదయం నాగశివ మృతి చెందినట్లు శ్రావణి 112 నెంబర్‌కు సమాచారం ఇచ్చింది. ఆనందపురం పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతి చెందిన తీరు, పరిసరాలు అనుమానాస్పదంగా ఉండడంతో ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. మధురవాడ ఏసీపీ అప్పలరాజు ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీం సభ్యులు ఆధారాలు సేకరించారు. మృతుడి శరీరంపై గట్టి దెబ్బలు ఉండడంతో శ్రావణిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించి, ఆమె హత్య చేసినట్టు నిర్ధారించారు. నిందితురాలికి గతంలోనే వివాహం అయినట్టు పోలీసులు తెలిపారు. మద్యం మత్తులో గొడవ పడడంతో హత్య జరిగిందా..? పథకం ప్రకారమే జరిగిందా...? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, మృతుడి బంధువులకు సమాచారం ఇచ్చినట్లు సీఐ వాసునాయుడు తెలిపారు.

PUBLIC NOTICE

Under instructions from my client Smt. Cheenupati Aruna W/o Sri. Yeddula Venkata Ramana Reddy, residing at 7-5-1/55, Flat No. A-601, Magestic Towers, Nr. Kalimatha Temple, R.K..Beach, Panduranga Puram, Visakhapatnam 530003, I issue this public notice.

Whereas my client intends to purchase the below mentioned schedule property bearing (1) Plot Nos: 75 in an extent of 533 Sq Yards or 445.65 Sq Mts, and (2) Plot No: 76 in an extent of 533 Sq Yards or 445.65 Sq Mts, situated in Paradesipalem (V), Madhurawada (U), Visakhapatnam bearing LP.No.1/2024 issued by VMRDA Vide Rc.No. 1526/2015/L5 (e-54125) dt. 31-03-2025 from the legal heirs of Late Sri. Pappu Purushottam Rao, Viz. (1) Smt. P. Chaya Lakshmi (2) Sri Pappu Kartik Sambasiva, (3) Sri Pappu Vivekananda Appala Narasimha, (4) Sri Pappu Ravikanth Srinivasa and (5) Smt. Pappu Gayatri (Daughter).

Whereas the General Public are hereby informed and cautioned that if any person has any Objection / Claim / Right / Title and interest in the said property they may call upon the under signed along with necessary documents evidencing their Objection / Claim / Right / Title and interest in the schedule property within 10 days from the date of this notice failing which my client presumes that there are no Objection / Claims / Right / Title and interest upon the schedule mentioned property and shall go ahead with the transaction. All or any such Objection / Claim / Right / Title and Interest received after stipulated period shall be presumed an afterthought to the said Public Notice and shall not have any bearing on my client. Hence this Notice.

SCHEDULE OF PROPERTY

All piece and parcels of lands bearing Plot Nos 75 and 76, in an extent of 533 Sq Yards or 445.65 Sq Mts each forming a single bit 1066 Sq Yards or 891.311 Sq Mts, of Survey No. 108, bearing Patta No. 148, situated in the Paradesipalem (V), Madhurawada Urban Visakhapatnam covered by LP No. 1/2024 VMRDA Vide Rc.No. 1526/2015/L5 (e-54125) dt. 31-03-2025 and bounded as follows.

(1) Plot No. 75	(2) Plot No.76
East: Plot No.76, South: 30 Feet Road, West: Plot No 74, North: Plot No H	East: 20 Feet Road, South: 30 Feet Road, West: Plot No. 75, North: Plot No H

S.R. KOMARAVOLU, HIGH COURT ADVOCATE
53-17-55/6, Flat No. 502, A.R. Residency, Shivalayam Street, Maddilapalem, Visakhapatnam -530013. E-Mail: kavsp2015@gmail.com
Ph: +91 8977897765, 8019018010

19న అప్రెంటీస్‌షిప్ మేళా

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు–3)న్యూస్‌టుడే: దువ్వాడ విజ్ఞాన్ కళాశాలలో ఈ నెల 19న విశాఖ ఉక్కు అప్రెంటీస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. గ్రాడ్యుయేట్ అప్రెంటీస్‌షిప్‌నకు బీఈ, బీటెక్, బీఏ, బీఎస్సీ, బీకాం, బీబీఏ, బీసీఏ, బీబీఎం.., టెక్నీషియన్ అప్రెంటీస్‌షిప్‌నకు డిప్లమో అన్ని విభాగాలు చదివిన విద్యార్థులు అర్హులన్నారు. 2022-2026 సంవత్సరాలలో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. హాజరయ్యేవారు తప్పనిసరిగా నేషనల్ అప్రెంటీస్‌షిప్ ట్రైనింగ్ స్కీమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

ఐఎఫ్‌ఆర్‌లో ఫైర్, డ్రోన్ షో

క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

నౌకాదళం అధికారులతో కలిసి బీచ్‌రోడ్డులో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

వన్‌టౌన్, న్యూస్‌టుడే : అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్‌ఆర్) నిర్వహణకు అధికారులంతా సమన్వయంతో పని చేయాలని, వీక్షకులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఆదేశించారు. బుధవారం ఆయన వీఎంఆర్‌డీఏ కమిషనర్ తేజ్‌భరత్, నౌకాదళం, పోలీసు, జీవీఎంసీ, ఇతర శాఖల అధికారులతో కలిసి ఆర్కేబీచ్‌లో ఏర్పాట్లు పరిశీలించారు. ఐఎఫ్‌ఆర్‌లో భాగంగా నిర్వహించే ఫైర్, డ్రోన్ షోలకు ముందస్తు అనుమతులు తీసుకోవాలని సూచించారు. ప్రధాన వేదిక, వీఐపీల సీటింగ్, వాహనాల పార్కింగ్, సాధారణ ప్రజలకు అవసరమైన గ్యాలరీలు, క్యూలైన్లు, ఎల్‌ఈడీ తెరల ఏర్పాటు, కంట్రోల్ రూమ్ నిర్వహణ తదితరాల్లో స్పష్టమైన ప్రణాళిక ఉండాలన్నారు. జెట్టీ ప్రాంతంలో ఉన్న బోట్లను తరలించాలని, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, వైద్యశిబిరాలు, అంబులెన్స్ వాహనాలు సిద్ధం చేసుకోవాలన్నారు. ★ అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ(ఐఎఫ్‌ఆర్)లో భాగంగా 19న ఆర్కేబీచ్‌లో 'అంతర్జాతీయ సిటీ పరేడ్‌ను నిర్వహించనున్నట్టు కలెక్టర్ హరేంధిరప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో మాట్లాడారు. 'రాష్ట్రానికి చెందిన బృందాలతో పాటు, విదేశీ కళాకారుల ప్రదర్శనలు ఉంటాయి. రాష్ట్ర చరిత్ర, సంస్కృతి ప్రతిబింబించేలా రెండు ప్రభుత్వ శకటాలను ప్రదర్శిస్తాం. 19న నిర్వహించే అన్ని కార్యక్రమాలు 18న సన్నాహకంగా జరుగుతాయి. ఈ రెండు రోజులు ప్రజలు హాజరై విన్యాసాలు తిలకించొచ్చు. ఆనందపురం మండలం జగన్నాథపురంలో ఐటీ పార్కు ఏర్పాటు అంశం పరిశీలనలో ఉంది' అని పేర్కొన్నారు.

ఉద్యోగాలకు 26మంది ఎంపిక

ఉద్యోగ మేళాలో పాల్గొనేందుకు వచ్చిన నిరుద్యోగులు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వవిద్యాలయం ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ అండ్ గైడెన్స్ బ్యూరో ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉద్యోగ మేళాకు స్పందన లభించింది. మొత్తం 124మంది నిరుద్యోగులు హాజరయ్యారు. 9కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. క్వెస్ కార్ప్‌కు 15 మంది, డెక్కన్ ఫైన్ కెమికల్స్‌కు ముగ్గురు, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్‌కు నలుగురు, ఫాక్స్‌కాన్‌కు నలుగురు మొత్తం 26మంది ఎంపికయ్యారు. గురువారం కూడా ఉద్యోగా మేళా ఉంటుందని ఏయూ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ అండ్ గైడెన్స్ బ్యూరో డిప్యూటీ చీఫ్ కె.దొరబాబు తెలిపారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్ట్రెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, పరిపాలన కార్యాలయ ప్రాంగణం, బాలాజీ నగర్, సిరిపురం, విశాఖపట్నం

అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ వై. శ్రీకాంత్ (చీఫ్ మేనేజర్) మొబైల్ నెం. 80994 44378, ఇ-మెయిల్ ఐడి: sbi.10077@sbi.co.in, ఆస్తి తనిఖీ కొరకు : 9666909050

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 8(6)కు 9(1) నిబంధనలతో చదువబడు (సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద బ్యాంకునకు తనఖా చేసిన స్థిరాస్తుల అమ్మకము)

SARFAESI చట్టం 2002 ప్రకారం సెక్షన్ 13(4) క్రింద దిగువ తెలిపిన ఆస్తి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారిగా దిగువ సంతకందారు భౌతిక స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు బకాయిలు రాబట్టుకొనుటకు దిగువ తెలిపిన తనఖాపెట్టిన ఆస్తి/ఆస్తుల ఈ-వేలం (SARFAESI చట్టం 2002 క్రింద) "ఎక్కడ ఎలా వున్నది అక్కడ అలానే" మరియు "అక్కడ ఏమున్నదో అదే" పద్ధతి పై నిర్వహించబడుతుందని సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది మరియు నియమ నిబంధనలు దిగువ తెలుపబడినవి.

ఋణగ్రహీత : శ్రీమతి సిరిమిశెట్టి లక్ష్మీ దేవి, భర్త : శ్రీ సిరిమిశెట్టి పోతురాజు, డి. నెం. 30-82-1/29, ప్లాట్ నెం. 29 పార్ట్, టి.ఎస్.నెం. 60/2, రోడ్డు నెం.3, వార్డు నెం.53, జోన్ 5, తిరుమల నగర్, వడ్లపూడి, గాజువాక, విశాఖపట్నం - 530044. వేరొక చిరునామా: శ్రీమతి సిరిమిశెట్టి లక్ష్మీ దేవి, భర్త : శ్రీ సిరిమిశెట్టి పోతురాజు, డి.నెం.2-38/1, రామాలయం వీధి, చౌడువాడ, కె.కోటపాడు - 531034. వేరొక చిరునామా: శ్రీమతి సిరిమిశెట్టి లక్ష్మీ దేవి, భర్త : శ్రీ సిరిమిశెట్టి పోతురాజు, డి.నెం.30-83-20, కణితి రోడ్డు, ఆర్‌హెచ్ కాలనీ, వడ్లపూడి, విశాఖపట్నం - 530046. శ్రీ సిరిమిశెట్టి పోతురాజు, తండ్రి : అప్పన్న, డి. నెం.30-82-1/29, ప్లాట్ నెం.29 పార్ట్, టి.ఎస్.నెం.60/2, రోడ్డు నెం.3, వార్డు నెం.53, జోన్ 5, తిరుమల నగర్, వడ్లపూడి, గాజువాక, విశాఖపట్నం - 530044. వేరొక చిరునామా: శ్రీ సిరిమిశెట్టి పోతురాజు, తండ్రి :అప్పన్న, డి.నెం. 2-38/1, రామాలయం వీధి, చౌడువాడ, కె.కోటపాడు - 531034. వేరొక చిరునామా: శ్రీ సిరిమిశెట్టి పోతురాజు, తండ్రి: అప్పన్న, డి.నెం.30-83-20, కణితి రోడ్డు, ఆర్‌హెచ్ కాలనీ, వడ్లపూడి, విశాఖపట్నం - 530046. డిమాండ్ నోటీసు తేది: 05-04-2024

డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం : తేది.04.04.2024 నాటికి రూ.43,98,296/- + తేది.05.04.2024 నుండి వడ్డీ మరియు ఇతర ఖర్చులు మొదలగునవి.

ప్రస్తుత బకాయి మొత్తం: తేది.06-02-2026 నాటికి రూ.52,57,011.49 పై + తేది.07.02.2026 నుండి భవిష్య వడ్డీ మరియు ఇతర ఖర్చులు మొదలగునవి (ముందటి జమలు మినహాయించిన తరువాత).

షెడ్యూల్ ఆస్తుల వివరములు:

పెదగంట్యాడ ఎస్.ఆర్.ఓ వద్ద రిజిస్టరు కాబడిన తేది.21.11.2012 నాటి రిజిస్టర్డు సేల్ డీడ్ నెం.2618/2012 ప్రకారం శ్రీమతి సిరిమిశెట్టి లక్ష్మీదేవి, భర్త : సిరిమిశెట్టి పోతురాజు గారిచే తనఖా పెట్టబడిన స్థిరాస్తి: విశాఖపట్నం, పెద గంట్యాడ సబ్-రిజిస్ట్రార్ ఆఫీస్, జీవిఎంసి పరిధి, వడ్లపూడి గ్రామం, తిరుమల నగర్, రోడ్ నెం.3 వద్ద, సర్వే నెం.60/2 లోని ప్లాట్ నెం.29 పార్ట్ (అప్రూవ్డ్ వుడా లే అవుట్ బిఎల్‌పి నెం.36/92, ఎల్‌పి నెం.23/96)తో కూడిన మొత్తం 267 చ॥గు॥ల విస్తీర్ణంలో ఉత్తరం వైపు 133.33 చ॥గు॥లు లేదా 111.481 చ॥మీ॥ల విస్తీర్ణం గల స్థలం అందు డోర్ నెం.30-82-1/29తో గల ఆర్‌సిసి భవనం యావత్తు ఆస్తి. హద్దులు : తూర్పు : ఎమ్.వి. ప్రసాద్ గారి భవనం, దక్షిణం : ఇట్ల అనురాధ గారికి చెందిన ఆస్తి, పడమర : 33 అ॥ల వెడల్పు రోడ్డు, ఉత్తరం : 40 అ॥ల వెడల్పు రోడ్డు. స్థలం కొలతలు : తూర్పు వైపు: 30 అ॥లు లేదా 9.14 మీ॥లు, దక్షిణం వైపు : 40 అ॥లు లేదా 12.19 మీ॥లు, పడమర వైపు: 30 అ॥లు లేదా 9.14 మీ॥లు, ఉత్తరం వైపు : 40 అ॥లు లేదా 12.19 మీ॥లు.

రిజర్వు ధర : రూ.1,10,04,000/- ధరావత్తు : రూ.11,00,400/- బిడ్ పెంపుదల : రూ.25,000/-

గమనిక : ఋణగ్రహీత ఎస్.ఎ. నెం.251/2025 డిఆర్‌టి, విశాఖపట్నంలో దాఖలు చేసినారు. కానీ, స్టే లేదు.

ఇ-వేలం తేదీ : 16-03-2026 సమయం : ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఆస్తి తనిఖీ తేది మరియు సమయం: తేది:12-02-2026 నుండి 15-03-2026 వరకు ఉ॥10.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు

1) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క వెబ్ సైట్ : www.sbi.co.in/web/sbi-in-the-news/auction-noticesలో ఏర్పాటుచేసిన లింక్‌ను రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, ఐయండి, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడర్ M/s. PSB Alliance & M/s. Baanknet యొక్క ఇ-వేలం పోర్టల్ : https://baanknet.com/eauction-psb/x-login & https://baanknet.com & టోల్ ఫ్రీ ఫోన్ నెం.: 91 - 8291220220, Mail ID : support.baanknet@psballiance.comను సంప్రదించండి.
2) ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంపు డ్యూటీలు బదిలీ ఛార్జీలు, ఫీజు వగైరా మరియు చట్టపరమైన/నాన్ స్టేటటరీ బకాయిలు, పన్నులు, రేట్లు, ఎస్సెస్‌మెంట్ ఛార్జీలు, ఫీజులు వగైరా కొనుగోలు దారే భరించవలెను.

గమనిక : ఆసక్తి గల బిడ్డర్లు ఇ-వేలం ముగిసేలోపు PSB Alliance నందు ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి (Pre-Bid EMD) జమ చేయవలెను. ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి మొత్తం PSB Alliance బ్యాంక్ అకౌంట్‌లో జమ అయిన సమాచారం వెబ్‌సైట్‌లో పొందుపరిచిన తరువాత మాత్రమే బిడ్డరు యొక్క "వాలెట్"లో చూపించబడుతుంది. బ్యాంకింగ్ ప్రక్రియలో ఇది జరుగుటకు సమయం పట్టవచ్చు, కావున బిడ్డర్లు చివరి నిముషంలో ఇబ్బందులు ఎదుర్కొనకుండా తమ ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డిను సాధ్యమైనంత త్వరగా జమ చేసుకోవాలనీ సూచించటమైనది.

గమనిక -2 : ఆదాయపు పన్ను చట్టం 1961లోని సెక్షన్ 194-1A ప్రకారం అమ్మకంలో భాగంగా అమ్మకం విలువ రూ.50,00,000/- (యాభై లక్షల రూపాయలు) మరియు అంతకంటే ఎక్కువ ఉన్నచో సదరు మొత్తముపై TDS @ 1% వర్తిస్తుంది. కావున సఫలీకృత బిడ్డరు/కొనుగోలుదారు గవర్నమెంట్ గైడ్‌లైన్స్ ధర లేదా అమ్మకం ధరలో ఏది ఎక్కువైతే దానిలో 1% TDS ను తగ్గించుకొని సదరు మొత్తమును ఆదాయపు పన్ను డిపార్ట్‌మెంట్ యొక్క ఫారం నెం.16-బి నందు జమచేయవలెను మరియు సదరు ఒరిజినల్ TDS సర్టిఫికెట్‌ను బ్యాంకు వారికి సమర్పించవలెను.(వ్యవసాయ భూమి కాకుండా కేవలం స్థిరాస్తికి మాత్రమే వర్తించును).

తేది:07-02-2026, ప్రదేశం: విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

పూర్వ విద్యార్థుల సేవలు ప్రశంసనీయం

కేజీహెచ్‌కు ఆరు వెంటిలేటర్లు వితరణ

అంకానా ప్రతినిధి డాక్టర్ నాగుల సీతారామయ్యను సన్మానిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, చిత్రంలో వైద్యులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : ప్రభుత్వ వైద్య సంస్థలను బలోపేతం చేయడంలో పూర్వ విద్యార్థుల పాత్ర కీలకమని కలెక్టర్ హరేంధిరప్రసాద్ అన్నారు. ఆంధ్ర వైద్య కళాశాల 1966 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు, ఉత్తర అమెరికాలో స్థిరపడిన ఏఎంసీ పూర్వ విద్యార్థుల సంఘం (అంకానా) ఆధ్వర్యంలో రూ.48 లక్షల విలువ చేసే ఆరు అత్యాధునిక వెంటిలేటర్లను కేజీహెచ్ పిల్లల విభాగానికి వితరణగా అందించారు. బుధవారం సాయంత్రం సంబంధిత విభాగంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం పూర్వ విద్యార్థులు డాక్టర్ నాగుల సీతారామయ్య, డాక్టర్ జి.గురుప్రసాద్‌ను కలెక్టర్ సత్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ సంధ్యాదేవి, కేజీహెచ్ పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ ఐ.వాణి, ఎన్టీఆర్ వర్సిటీ విశ్రాంత ఉపకులపతి డాక్టర్ టి.రవిరాజు, అంకోసా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఎస్‌కేఈ.అప్పారావు, డాక్టర్ పీవీ.సుధాకర్, విశ్రాంత ప్రిన్సిపల్స్ డాక్టర్ టి.రాధ, డాక్టర్ ఈ.పెదవీర్రాజు, డాక్టర్ వీవీజీ.మోహన్, తదితరులు పాల్గొన్నారు.

నగర ప్రణాళికాధికారి సరెండర్

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మహా విశాఖ నగర పాలక సంస్థ ప్రణాళికాధికారి (సీపీ) మీనాకుమారిని బుధవారం సాయంత్రం ప్రభుత్వానికి సరెండర్ చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండడంతోనే సరెండర్ చేసినట్టు కమిషనర్ కేతన్‌గార్గ్ పేర్కొన్నారు. ఆమె స్థానంలో మరో అధికారిని నియమించాలని ప్రభుత్వాన్ని కోరామని కమిషనర్ తెలిపారు. ★ గాజువాకలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు చెందిన భవనాన్ని నాటి వైకాపా పాలనలో సగానికిపైగా కూల్చేసిన అంశంపై మీనాకుమారిని దర్యాప్తు అధికారిగా నియమించారు. నాటి వాస్తవాలను, కొందరు ఉన్నతాధికారుల పేర్లను ఆమె నివేదికలో పొందుపరిచారు. అలాగే ఓ మురికివాడకు టీడీఆర్ పత్రాలు జారీ చేయాలని వచ్చిన దస్త్రాన్ని తిప్పి పంపారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న రెండు భారీ టీడీఆర్ దస్త్రాలను సైతం ఆమె పక్కన పెట్టేశారు. ఈ నేపథ్యంలో జరిగిన ఈ పరిణామం చర్చనీయాంశమవుతోంది.

ఉద్యమ పథంలో కార్మికలోకం..

న్యూస్‌టుడే, సింధియా

కార్మికుల సమస్యలను ఏకరవు పెడుతున్నా ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నాయని కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి ఈ క్రమంలోనే 'భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) మినహా అన్ని ప్రధాన కార్మిక సంఘాలు ఈనెల 12న జాతీయ స్థాయిలో సమ్మెకు పిలుపునిచ్చాయి.

సమ్మెలో ప్రధాన డిమాండ్లు ఏమిటంటే..

★ పూర్వపు కార్మిక చట్టాలను కుదించి కేవలం నాలుగు లేబర్ కోడ్స్‌గా విభజించడాన్ని తప్పుపడుతూ వాటిని రద్దు చేయాలని

★ ప్రభుత్వ రంగ కంపెనీలను ప్రైవేట్‌పరం చేయడాన్ని నిలువరించాలని ★ విదేశీ ప్రత్యక్ష భాగస్వామ్యాన్ని తగ్గించాలని

★ పని గంటలు పెంచి శ్రమ దోపిడీని నిరోధించాలని ★ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని

★ కనీస వేతనాలు అమలు చేయాలని ★ రవాణా భత్యం, స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించాలని

★ అంగన్‌వాడీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్యకర్తలు, 104, 108 సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని తదితర వాటిపై సంబంధిత సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

★ ఈ సమ్మె కారణంగా నిత్యావసరాల సామగ్రి రవాణాకు ఎలాంటి ఆటంకం ఎదురవ్వకుండా ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లా పాలనా యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. వీటిలో ముఖ్యంగా విమానయాన, ఇంధన సరఫరా, పాలు, వంట గ్యాస్, వైద్య ఆరోగ్య సేవలకు చెందిన విభాగాలకు పోలీసు భద్రత కల్పిస్తున్నాయి.

★ విశాఖ ఉక్కు, పోర్టు అథారిటీ, బీహెచ్‌పీవీ, నేవల్ డాక్‌యార్డు, హిందుస్థాన్ షిప్‌యార్డులలో 18,860 మంది శాశ్వత ఉద్యోగులు పనిచేస్తుండగా, ఒప్పంద ఉద్యోగులు 28,430 మంది ఉన్నారు. అచ్యుతాపురం, పరవాడ, దువ్వాడ ఆర్థిక మండళ్లలో 80వేల మందికి పైగా విధులు నిర్వర్తిస్తున్నారు.

★ ఉత్పత్తి కారక పరిశ్రమల్లో ఉత్పాదకతకు విఘాతం కలగకుండా ముందు రోజు రాత్రి షిఫ్టుల్లో పనిచేసే విధంగా అధికారులు, ఉద్యోగులకు అదనపు డ్యూటీలు వేయడం లాంటి అంశాలకు యాజమాన్యాలు మొగ్గు చూపుతున్నాయి. వీటిలో ముఖ్యంగా విశాఖ స్టీల్‌ప్లాంటు, కోరమాండల్, చమురు శుద్ధి కర్మాగారంతోపాటు హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐవోసీ కంపెనీల టెర్మినళ్ల నుంచి ఇంధన రవాణా కోసం ప్రత్యేక ఏర్పాట్లు సాగిస్తున్నాయి.

ఆసక్తిగా క్రికెట్ పోటీలు

కె.విజయ్ కుమార్

విశాఖక్రీడలు, న్యూస్‌టుడే : జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శేఖర్‌రావు స్మారక క్రికెట్ పోటీలు బుధవారం ఆసక్తిగా సాగాయి. ★ రైల్వేస్టేడియంలో జరిగిన మొదటి మ్యాచ్‌లో అవెంజర్స్ సీసీ జట్టు 7 వికెట్ల తేడాతో పీఎంపాలెం సీసీ జట్టుపై విజయం సాధించింది. అవెంజర్స్ జట్టులో **కె.విజయ్‌కుమార్ 53 పరుగులు** చేశాడు. రెండో మ్యాచ్‌లో భీమిలి క్రికెట్ అసోసియేషన్ జట్టు 39 పరుగుల తేడాతో అమెచ్యూర్స్ సీసీ జట్టుపై గెలుపొందింది. ★ త్రిష్ణ మైదానంలో జరిగిన తొలి మ్యాచ్‌లో గౌరీ యూత్ సీసీ జట్టు 23 పరుగులతో వైజాగ్ వీకింగ్స్ జట్టుపై గెలుపొందింది. రెండో మ్యాచ్‌లో శివాజీ సీసీ జట్టు 3 పరుగుల తేడాతో స్టాలియన్స్ సీసీ జట్టుపై విజయం సాధించింది.

జాతీయ కవితా పోటీల విజేతల వివరాలు వెల్లడి

సీతంపేట, న్యూస్‌టుడే: విశాఖలోని సహృదయ సాహితి సంస్థ 46వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన జాతీయ స్థాయి కవితల పోటీల ఫలితాలను సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ బుధవారం విడుదల చేశారు. దేశవ్యాప్తంగా మొత్తం 145 కవితలు రాగా అందులో నిజామాబాద్‌కు చెందిన బి.కళాగోపాల్ రాసిన శీతలపెట్టెలు(ప్రథమ), విశాఖ నగరానికి చెందిన చొక్కర తాతారావు రాసిన ఈ రాత్రిని అప్పుడే తెల్లారని వ్వకండి(ద్వితీయ), పిడుగురాళ్లకు చెందిన వై.సీహెచ్.కె.మోహనరావు రాసిన పాదముద్రిక(తృతీయ) కవితలు ఎంపికయ్యాయి. ప్రోత్సాహక బహుమతి కింద యానాంకు చెందిన పి.అశోక్ కుమార్ రాసిన అక్షరగమనం, విశాఖ జిల్లా పెందుర్తికి చెందిన అరుణం శ్రీనివాస్ రాసిన యుద్ధభాష, శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసకు చెందిన కుప్పిలి వెంకటరాజారావు రాసిన ఎండుటాకు కవితలు ఎంపికయ్యాయి. ఈనెల 20న విశాఖలోని పౌర గ్రంథాలయంలో నిర్వహించనున్న కార్యక్రమంలో విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నారు.

AUTO

VEHICLES FOR SALE

Maruti Car for sale 2008 Model Alto LXI (4 in all) submit sealed quotation on or before 16-02-2026 in the name of head master DAV Public School. Cont: 08924 224132, 9494289271.

REAL ESTATE

LAND FOR SALE

GENERAL

[illegible]

JOBS

Wanted Part / Full Time Sales Promoters for well reputed Real Estate Co. MVP Vizag. Ph: 9493244471, 9396972239.

Job Opportunity. A fast growing org. shortly opening new branches in Vizag & reqd... (1) Sr. Manager (2) Field Officers (3) PRO. M/F. Age: 30+. Yrly Pkg: 5-15 Lakhs (Neg). For Inrw. ✆ 9347268843.

BUSINESS SERVICES

[illegible]

FINANCIAL SERVICES

[illegible]

EENADU Classifieds

ఉద్యోగ అవకాశం

[illegible] BRANCH MANAGERS (M/F): 2 No's, DEVELOPMENT OFFICERS (M/F): 3 No's [illegible] Package: Rs. 80 000 to 1.6 Lakhs PM. Interviews on: 12th & 13th Feb. 2026. Con: VADREVU SRINIVAS - DGM B.S. LAYOUT, VSP Ph: 7207744599 8555968393

DRIVERS

[illegible]

SECURITY GUARDS

[illegible]

WALK-IN - INTERVIEW

An A1 GRADE COMPANY in Vizag/ Telangana Required the Following Positions.
* Asst. GENERAL MANAGERS: 10 Posts M/F Qlf: Degree to P.G. VRS/Retd., in any Sectors. Age: 35 to 65 Good Package, Flexible Timing, Attractive Remuneration.
* MARKETING MANAGERS: 10 Posts Qlf: Degree & Above, Need min., 1 Year Exp. in any Marketing Field Like Real Estate/ LIC/ Chit fund Companies Good Package + Perks.
Note: Interviews on 12th & 13th Morning 10 to 7 PM, attend with Resume.
Conc: K.K.Rao - DGM Doctors Colony, VSP. Ph: 8121100599

కావలెను

Electrical D.C [illegible]

SD Oil TopUp [illegible]

శ్రీ లక్ష్మీ ప్రసన్న సర్వీసెస్ ఆరిలోవ, విశాఖపట్నం 80080 58734

గమనిక

[illegible]

మార్చి 1 నుంచి రాష్ట్రస్థాయి కరాటే పోటీలు

ట్రోఫీ ఆవిష్కరిస్తున్న సినీనటుడు సుమన్, తదితరులు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే : విశాఖ వేదికగా మార్చి ఒకటి నుంచి రాష్ట్రస్థాయి కరాటే పోటీలు నిర్వహించనున్నారు. బుధవారం హెచ్‌బీకాలనీలోని మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో జరిగిన కార్యక్రమంలో సినీనటుడు సుమన్, భాజపా నాయకులు పరశురామరాజు, కరణం రెడ్డి నర్సింగరావు పాల్గొని ట్రోఫీని ఆవిష్కరించారు. బొత్స స్క్వేర్ ఆవరణలో జరిగే పోటీలకు రాష్ట్రంలోని నలుమూలల నుంచి వందలాది మంది క్రీడాకారులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో 'ద' జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి సూర్యనారాయణ, భాజపా నాయకులు సురేష్, కరాటే సంఘం ప్రతినిధి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా...!

కార్పొరేషన్, న్యూస్‌టుడే : నగరంలోని ఆశీలుమెట్ట సమీప కేపీ.పాల్ ఫంక్షన్‌హాల్ ప్రాంగణంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన సైమా బ్యూటీ ఎక్స్‌పో ఆకట్టుకుంది. పలువురు యువతులు, మోడల్స్ ఉత్సాహంగా పాల్గొన్నారు. మోడల్ ఒస్మాజాస్మిన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఎక్స్‌పో నిర్వాహకులు మోక్ష మాట్లాడుతూ...బ్యూటీ అండ్ వెల్‌నెస్ విభాగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. మాజీ ఉప మేయర్ దాడి సత్యనారాయణ మాట్లాడుతూ... ఇలాంటి కార్యక్రమాలు విశాఖలో నిర్వహించడం అభినందనీయమన్నారు. మన్యంవీరుడు చిత్ర నిర్మాత, నటుడు ఆర్‌వీవీ.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వివాహ ఆహ్వానం అందజేత

సీఎం చంద్రబాబుకు ఆహ్వానపత్రిక అందిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు దంపతులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే : మహా విశాఖ నగర పాలక సంస్థ మేయర్ పీలా శ్రీనివాసరావు కుమారుడి వివాహానికి హాజరు కావాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఆహ్వానపత్రికలు అందజేశారు. మేయర్ దంపతులు బుధవారం అమరావతి వెళ్లి సీఎం, మంత్రి లోకేశ్‌తో పాటు తదితరులను కలిశారు. మేయర్ సోదరులు పీలా గోవింద సత్యనారాయణ, పీలా కృష్ణ అప్పారావు, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బోర్‌వెల్ రంగాన్ని ఆదుకోవాలని నిరసన

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: బోర్‌వెల్ రంగం సంక్షోభంలో చిక్కుకుందని, ప్రభుత్వాలు పెద్ద మనసుతో ఆదుకోవాలని ఉమ్మడి విశాఖ జిల్లా బోర్‌వెల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.ఎస్.ఆర్.ప్రభోజి కోరారు. 69వ వార్డు నాతయ్యపాలెంలో బుధవారం సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అనంతరం బోర్‌వెల్ వాహనాలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభోజి మాట్లాడుతూ డ్రిల్లింగ్ సామగ్రి, డీజిల్, ముడి సరకుల ధరలు పెరడగంతో నిర్వహణ వ్యయం పెరిగిందన్నారు. ఈ రంగాన్ని నమ్ముకొని వేలమంది జీవిస్తున్నారన్నారు. నిర్వహణ వ్యయం పెరగడంతో ధరలు పెంచాల్సి వస్తోందని, రైతులు, ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. చైనా నుంచి దిగుమతి చేసుకొనే బిట్ల ధరలు 195 శాతం పెరిగాయన్నారు. గతంలో రూ.22వేలు ఉండే బిట్టు ఇప్పుడు దాదాపు రూ.65వేలకు చేరిందని పేర్కొన్నారు. సంఘం ప్రతినిధులు జి.వరప్రసాద్, నవీన్‌రెడ్డి, రాజేంద్ర, మోహన్ కృష్ణ, నరేంద్ర, ప్రసాదరావు, నారాయణ, బాలరాజు పాల్గొన్నారు.

నిరసన తెలియజేస్తున్న సంఘం ప్రతినిధులు, సభ్యులు

ఘనంగా ఐఓబీ వ్యవస్థాపక దినోత్సవం

అనాథాశ్రమం విద్యార్థులతో ఓవర్సీస్ బ్యాంకు ప్రతినిధులు

సీతంపేట, న్యూస్‌టుడే: ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు(ఐఓబీ) 90వ వ్యవస్థాపక దినోత్సవాన్ని విశాఖపట్నం ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా నగరంలోని వుడా, మెయిన్, అక్కయ్యపాలెం, ఎన్ఏడీ కూడలి, పెదవాల్తేరు శాఖల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. అనంతరం ఐఓబీ ప్రాంతీయ మేనేజర్ రవికుమార్ గుప్తా సిబ్బందితో కలిసి జనరేషన్ యువ అనాథాశ్రమం విద్యార్థులకు నిత్యావసరాలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాలు బ్యాంకు సామాజిక బాధ్యత పట్ల ఉన్న నిబద్ధతను, ప్రజల ఆరోగ్యం, సంక్షేమం పట్ల చూపిస్తున్న కృషిని ప్రతిబింబిస్తున్నాయని గుప్తా పేర్కొన్నారు.

9 కిలోమీటర్లలో చేపల వేట నిషేధం

వన్‌టౌన్, న్యూస్‌టుడే : ఐఎఫ్‌ఆర్, మిలాన్ కార్యక్రమాల దృష్ట్యా సముద్ర జలాల్లో 9 కిలోమీటర్ల మేర చేపలవేట, బోట్లు సంచారాన్ని నిలిపివేస్తున్నట్లు మత్స్యశాఖ జేడీ పి.లక్ష్మణరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అటు సాగర్‌నగర్ నుంచి ఇటు ఫిషింగ్ హార్బర్ వరకు ఉన్న ప్రాంతంలో ఈనెల 17 నుంచి 25 వరకు నిషేధం అమలులో ఉంటుందన్నారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	115	110
లైవ్	142	130
డ్రెస్డ్	206	230
స్కిన్‌లెస్	234	240

పెందుర్తి

తెరపై ఈనాడు
లక్ష్మీకాంత్ స్క్రీన్-1: శ్రీ చిదంబరం గారు
స్క్రీన్-2: మన శంకర వరప్రసాద్ గారు

నూతన నియామకం

దేశపాత్రునిపాలెం(పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వవార్డు భాజపా ఇన్‌ఛార్జిగా దేశపాత్రునిపాలెం గ్రామానికి చెందిన పండూరి రమేశ్ నియమితులయ్యారు. ఈమేరకు అనకాపల్లి జిల్లా భాజపా అధ్యక్షుడు డి. పరమేశ్వరరావు నుంచి బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ భాజపా బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి ఈ పదవి అప్పగించిన పార్టీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

వేపగుంట, న్యూస్‌టుడే: ?: 98వవార్డు షిప్‌యార్డ్ లేఅవుట్ కాలనీలోని కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధం వెంటాడుతోంది. -నాగేశ్వరరావు, అప్పారావు, స్థానికులు ✓: వెంటనే పరిశీలించి శుభ్రత చర్యలు చేపడతాం. -వెంకటస్వామి, శానిటరీ ఇన్‌స్పెక్టర్

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ మండలం సమ్మెంగిపాలెం-జాలారిపేట రహదారిని ఆనుకుని ఉన్న కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నాం. -స్థానికులు ✓: మీప్రాంత కాలువలను శుభ్రం చేయించడానికి చర్యలు తీసుకుంటాం. -మల్లికార్జునరావు, డిప్యూటీ ఎంపీడీవో, పరవాడ

పెందుర్తి, న్యూస్‌టుడే: ?: పులగవానిపాలెం సమీప అయ్యప్పనగర్ రోడ్డులోని వీధిదీపాలు రాత్రి, పగలు వెలుగుతున్నాయి. -బోని అప్పలరాజు, అయ్యప్పనగర్ ✓: వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. -ప్రసాద్, వీధిదీపాల నిర్వహణ ఏఈ, 97వ వార్డు

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: సబ్బవరం గణేశ్ వీధిలో వ్యర్థాలు పేరుకుపోయాయి. -పి.సత్యనారాయణ, సబ్బవరం ✓: వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. -పి. ఆనందరావు, గ్రామ కార్యదర్శి

?: సాయినగర్ కాలనీ నుంచి వచ్చే వాడుక నీరు సబ్బవరం వ్యాపార దుకాణాల ముందు నిల్వ ఉంటోంది. -వి.శంకరరావు, సబ్బవరం ✓: వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. -డి.ప్రసాదరావు, సర్పంచి, సబ్బవరం

స్పందనకు వందనం

ఎట్టకేలకు వ్యర్థాల తరలింపు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం సాయినగర్ కాలనీలో వ్యర్థాలు పేరుకుపోయి కొద్ది రోజులుగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను స్థానికులు 'ఈనాడు-మేమున్నాం మీకు తోడుగా' దృష్టికి తీసుకురావడంతో పంచాయతీ అధికారులు స్పందించారు. బుధవారం సిబ్బందితో శుభ్రత చర్యలు చేపట్టారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 'సుస్తీ'..!

■ ఇంకా అద్దె భవనంలో లక్ష్మీనరసింహనగర్ యూపీహెచ్‌సీ ■ రోగులకు, సిబ్బందికి తప్పని ఇక్కట్లు

వేపగుంట, న్యూస్‌టుడే: 98వవార్డు శివారు ప్రాంతాల ప్రజలకు ప్రాథమిక వైద్యం అందించేందుకు గత ప్రభుత్వం కేటాయించిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) ఇంకా అద్దె భవనంలోనే కొనసాగుతోంది. అరకొర వసతుల కారణంగా రోగులు, సిబ్బంది నిత్యం అవస్థలు పడుతున్నారు. కొంత మంది అక్కడ వైద్య సేవలు పొందడానికి ఇష్టపడకపోవడంతో సంబంధిత ఆరోగ్య కేంద్రం ఉన్నా లేనట్లేనని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.

■ గత వైకాపా ప్రభుత్వంలో అప్పటి పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ పదవీకాలం పూర్తి కానున్న సమయంలో హడావుడిగా సింహపురికాలనీ రామాలయం సమీపంలో ఈ ఆరోగ్య కేంద్రానికి అప్పటి మంత్రి విడదల రజిని చేతులమీదుగా శంకుస్థాపన చేయించారు. తరువాత సంబంధిత ఆసుపత్రికి స్థలం కేటాయించకపోవడం, ఓ చోట గుర్తించిన స్థలం తమకు చెందినదని జీవీఎంసీ అభ్యంతరం చెప్పడంతో శాశ్వత భవన నిర్మాణం అంతటితో ఆగిపోయింది. తర్వాత అధికారులెవ్వరూ ఆ విషయంపై దృష్టి సారించలేదు.

■ **సుమారు 20 కాలనీల ప్రజలకు ప్రయోజనం.. :** ఈ ఆరోగ్య కేంద్రానికి అన్ని వసతులు సమకూర్చి అందుబాటులోకి తీసుకువస్తే సుమారు 20 కాలనీల ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. సింహపురి కాలనీ, షిప్‌యార్డ్‌కాలనీ, అప్పన్నపాలెం, శ్రీనివాసనగర్, ఈస్ట్‌పాయింట్‌కాలనీ, లక్ష్మీనరసింహనగర్, శ్రీసాయిమాధవనగర్, పరిసర ప్రాంతాల ప్రజలు అత్యవసర సమయంలో ఇదే కేంద్రంలో వైద్య సహాయం పొందుతున్నారు. రక్త పరీక్షలు చేసేందుకు తగిన వసతి లేకపోవడంతో సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు. కూటమి పాలకులు, సంబంధిత అధికారులు వెంటనే దృష్టి సారించి తగిన చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

> ■ ఈ ఆరోగ్యకేంద్రం విషయమై ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటాం. గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇలాంటివెన్నో నిదర్శనం. అభివృద్ధి పనుల పేరిట గత వైకాపా ప్రభుత్వం ఎంతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసింది. రాజకీయాలకు అతీతంగా ఈ ఆరోగ్య కేంద్రాన్ని పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తాం.
> -పంచకర్ల రమేశ్‌బాబు, ఎమ్మెల్యే

మహాశివరాత్రికి పటిష్ఠ ఏర్పాట్లు

దేవాదాయశాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

వన్‌టౌన్, న్యూస్‌టుడే : అప్పికొండ సోమేశ్వర స్వామి ఆలయంలో 15న మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఆదేశించారు. బుధవారం ఆయన ఉత్సవాల నిర్వహణపై దేవాదాయశాఖతో పాటు ఇతర శాఖలకు చెందిన అధికారులతో సమీక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున భద్రత, పారిశుద్ధ్యం, తాగునీటి వసతి, వైద్య సదుపాయాలపై దృష్టి సారించాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని పోలీసులకు సూచించారు. ఆర్డీఓ సుధాసాగర్, ఏసీ అన్నపూర్ణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు, ఆలయ ఈఓ పద్మావతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

15వ తేదీన ప్రత్యేక పూజలు

సోమలింగేశ్వరుడు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం బంగారమ్మపాలెం (లింగాల తిరుగుడు)లో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని అర్చకులు డి.శేఖర్, కమిటీ సభ్యులు తెలిపారు. ఈనెల 15వ తేదీన తెల్లవారుజాము నుంచి రుద్రాభిషేకాలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాలు జరుగుతాయన్నారు. రాత్రి 7గంటల నుంచి కోటి దీపార్చన, బాణసంచా కాల్పులు, నాటక ప్రదర్శనలు ఉంటాయన్నారు.

దుర్గమాంబ పండగకు ఏర్పాట్లు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం కలపాక పంచాయతీ పెద్ద స్వయంభూవరంలో గురువారం శ్రీదుర్గమాంబ అమ్మవారి పండగ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద, గ్రామపురవీధుల్లో ప్రత్యేక విద్యుత్తు దీపాలంకరణ చేస్తున్నారు. ఉదయం 5గంటల నుంచి అమ్మవారి దర్శనాలు, ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయని గ్రామపెద్దలు తెలిపారు. భక్తులకు ప్రసాద వితరణ, మజ్జిగ పంపిణీ ఉంటుందన్నారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించాక అనుపోత్సవం చేస్తామన్నారు. రాత్రి సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని, ప్రజలు విజయవంతం చేయాలని కోరారు.

నేడు పారిశుద్ధ్య కార్మికుల సమ్మె

కార్పొరేషన్, న్యూస్‌టుడే: అఖిల భారత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం జరిగే సమ్మెలో జీవీఎంసీ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొంటున్నారని కమిషనర్ కేతన్‌గార్గ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా ఒక్కరోజు చెత్త సేకరణకు క్లాప్ వాహనాలు రావని, నివాసితులంతా తమ ఇళ్లలోనే చెత్తను నిల్వ ఉంచుకోవాలని ఆయన సూచించారు. రహదారులపై, బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేయకూడదన్నారు. శుక్రవారం ఇంటింటికీ వచ్చే క్లాప్ వాహనాలకు చెత్తను అందించాలన్నారు. దాదాపు 5 వేల మంది కార్మికులు సమ్మెలో పాల్గొంటారని కమిషనర్ పేర్కొన్నారు.

యువతకు నైపుణ్యాభివృద్ధిపై ఉచిత శిక్షణ

నరవ(వేపగుంట), న్యూస్‌టుడే: నరవలోని విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగు కళాశాలలో నైపుణ్యాభివృద్ధిపై ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ప్రదీప్‌వర్మ తెలిపారు. ఈనెల 16వ తేదీ నుంచి 20 రోజులపాటు శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. సొంతంగా పరిశ్రమలు, వ్యాపారాలు ప్రారంభించాలని భావించేవారికి, ఉపాధి అవకాశాలపై నిపుణులు అవగాహన కల్పిస్తారన్నారు. విద్యార్థులు నేరుగా కళాశాలకు వచ్చి పేర్లు నమోదు చేసుకుని ఈ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ సూచించారు.

ఉత్తమ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు

వేపగుంట, న్యూస్‌టుడే: ప్రజలకు అందించిన ఉత్తమ సేవలతోనే ప్రభుత్వ ఉద్యోగులకు తగిన గుర్తింపు లభిస్తుందని ఏపీఈపీడీసీఎల్ ఎస్‌ఈ శ్యామ్‌బాబు అన్నారు. వేపగుంట సబ్‌స్టేషన్ పరిధిలో 34ఏళ్లు పనిచేసి రిటైర్ అయిన ఉద్యోగి సూర్యనారాయణకు బుధవారం నాయుడుతోటలోని ఓ కల్యాణమండపంలో ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమానికి శ్యామ్‌బాబుతోపాటు డీఈలు, ఏఈలు, ఇతర ఉద్యోగులు హాజరై సూర్యనారాయణ దంపతులను సత్కరించారు. ఆయన అందించిన సేవలను కొనియాడారు.

20న ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం మల్లునాయుడుపాలెంలో మర్లమాంబ అమ్మవారికి కొన్నేళ్లుగా పూజలు చేస్తున్నప్పటికీ గ్రామంలో ఆలయం లేదు. దీంతో అమ్మవారికి ఆలయం నిర్మించాలని గ్రామస్థులు ముందుకొచ్చారు. ఈనెల 20న ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు సంబంధిత గోడపత్రికను బుధవారం ఆవిష్కరించారు.

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

బీఈడీ కళాశాలపై విచారణకు వెనకడుగు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: విశాఖ నగర శివారులో స్పెషల్ బీఈడీ కోర్సు నిర్వహిస్తున్న ఓ కళాశాలపై గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఏయూ అధికారులను ఆదేశిస్తూ గత నెల 22న గవర్నర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. 20రోజులైనా ఏయూ అధికారులు విచారణ చేపట్టకపోవడం గమనార్హం. స్థానిక విద్యార్థులకు కాకుండా ఒడిశా, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు ఒక్కో సీటును రూ.1.20లక్షల నుంచి రూ.1.60లక్షలకు విక్రయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. తరగతులకు హాజరుకాకుండా ఆయా రాష్ట్రాల విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఏయూ సీడీసీ డీన్ ఆచార్య టి.వెంకటకృష్ణను సంప్రదించగా గవర్నర్ కార్యాలయం నుంచి ఆదేశాలు అందిన విషయం వాస్తవమేనని, త్వరలో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

హుండీ ఆదాయం రూ.30.10 లక్షలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : పాతనగరం బురుజుపేటలో కొలువైన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి హుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. నగదు రూ.30,10,993, బంగారం 40.240 గ్రాములు, వెండి 144.800 గ్రాములు, వివిధ దేశాల కరెన్సీ లభించిందని ఆలయ ఈఓ శోభారాణి తెలిపారు. దేవాదాయశాఖ తనిఖీ అధికారి ఎం.శ్రీధర్, ఆలయ సహాయ కార్యనిర్వాహణ అధికారులు కె.రాజేంద్రకుమార్, ఎన్.ఆనంద్‌కుమార్, హెచ్‌ఎస్‌ఏవీఆర్.మూర్తి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

లెక్కింపులో పాల్గొన్న ఆలయ ఉద్యోగులు

'అక్రమాలు బయటపడినా వైకాపా వైఖరి మారలేదు'

పెందుర్తి, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ తయారీలో వినియోగించే నెయ్యి కల్తీ చేయడం జగన్ ప్రభుత్వ రాక్షస పాలనకు నిదర్శనమని రాష్ట్ర గవర్నింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ వేగి పవనేశ్వరరావు అన్నారు. ఈ మేరకు విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆయన విమర్శించారు. 2022లోనే నెయ్యి కల్తీ జరిగిందని నివేదిక వచ్చినా జగన్ సర్కార్ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. అక్రమాలు బయటపడ్డా కూడా తప్పు ఒప్పుకోకుండా రాజకీయంగా ఎదురుదాడి చేయడం వైకాపా వైఖరికి నిదర్శనమని వ్యాఖ్యానించారు.

విద్యార్థులకు అవగాహన

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు నిత్యం కృషి చేయడం ద్వారా ఉన్నత స్థాయికి ఎదుగుతారని రవీంద్రభారతి పాఠశాల ప్రధానాచార్యులు స్వరూప చంద్రకళ, సాయిబిందు పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులకు బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాల సాధన, పదో తరగతి తర్వాత అందుబాటులో ఉన్న వివిధ కోర్సులపై అవగాహన కల్పించారు.

దేవీపురం-బల్జిపాలెం రహదారికి మోక్షమెప్పుడో..

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలంలోని దేవీపురం-బల్జిపాలెం రహదారి గత కొన్నేళ్లుగా నిర్లక్ష్యానికి గురైంది. సుమారు రెండు కి.మీ. పొడవు గల ఈ రోడ్డు సమస్య పరిష్కరిస్తామని గత ప్రభుత్వ హయాంలో నేతలు హామీలిచ్చినా కార్యరూపం దాల్చలేదు. ఈ రోడ్డు శిథిలావస్థకు చేరడం వల్ల అమ్మలపాలెం, బల్జిపాలెం, నారపాడు, నల్లరేగులపాలెం గ్రామాల ప్రజలు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. రైతులు పండించే వ్యవసాయోత్పత్తులను మార్కెట్‌కు తరలించడానికి అష్ట కష్టాలు పడుతున్నారు. కూటమి పాలకులు, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మావుళ్ల గెడ్డ వంతెనకు రక్షణేది..!

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం మల్లునాయుడుపాలెం మావుళ్లగెడ్డపై నిర్మించిన కల్వర్టుకు రక్షణ గోడ లేకుండా పోయింది. గతంలో 'ఈనాడు'లో వెలువడిన కథనాలకు స్పందించి గ్రిల్స్ ఏర్పాటు చేశారు. రెండేళ్లు గడవక ముందే అవి తుప్పు పట్టి ఓ పక్క విరిగిపోగా మరో వైపున కూడా దెబ్బతినే స్థితిలో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ఆ దారిన వెళ్లే వారంతా కల్వర్టు వద్దకు వచ్చినపుడు భయాందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రక్షణ గోడ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

దర్పణం

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కార్యక్రమంలో పాల్గొన్న 97వ వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత, కాలనీవాసులు

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ సమీప శ్రమశక్తినగర్ ఆరవ లేఅవుట్‌లో రూ.40లక్షలతో సీసీ రహదారుల నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన జరిగింది. వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత ముఖ్య అతిథిగా పాల్గొని పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు వసంత, శంకరరావు దంపతులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కాలనీవాసులు శంకర్ ప్రసాద్, చిన్నాజీ, రమణమూర్తి, సాంబమూర్తి, శంకర్రావు, తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విజయవంతం చేయాలంటూ ర్యాలీ

పరవాడ, న్యూస్‌టుడే: కార్మికుల సమస్యలపై ఈనెల 12వ తేదీన చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం పరవాడ ఫార్మాసిటీలో ద్విచక్ర వాహన ర్యాలీ చేపట్టారు. తొలుత ఈ ర్యాలీని సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ ప్రారంభించి మాట్లాడారు. కార్మికులకు తీవ్రనష్టం కలిగిస్తున్న నాలుగు లేబర్‌కోడ్‌లను కేంద్రం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం చేపట్టిన ర్యాలీ విజయశ్రీ ఫార్మా నుంచి తానాం చెక్‌పోస్టు వరకు సాగింది. ఈకార్యక్రమంలో ధారబాబు, చిన్నారావు, రాజా తదితరులు పాల్గొన్నారు.

దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు నివాళి

చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న భాజపా నాయకులు

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: భాజపా ఆధ్వర్యంలో బుధవారం భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి జరిగింది. చినముషిడివాడలోని 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు కార్యాలయంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో 95, 97 వార్డుల భాజపా అధ్యక్షుడు చిక్కాల సతీశ్, ఉపాధ్యక్షురాలు మాధవి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం వాడచీపురుపల్లి రామచంద్రమ్మ జాతర సందర్భంగా సింహాద్రి లోకల్ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు బుధవారం తెల్లవారుజామున ముగిశాయి. ఈ పోటీల్లో విశాఖ, ముత్యాలమ్మపాలెం, వాడచీపురుపల్లి-1, వాడచీపురుపల్లి జూనియర్స్ జట్లు వరుస స్థానాల్లో విజేతలుగా నిలిచాయి. వీరికి రూ.12వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలు నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలను మాజీ ఎంపీపీ, ఉత్సవకమిటీ ఛైర్మన్ మాసవరపు అప్పలనాయుడు చేతులమీదుగా అందజేశారు. ఈ పోటీల్లో 32 బృందాలు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రొంగలి రమణమూర్తి, కూండ్రపు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విజేతకు బహుమతులు అందజేస్తున్న మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ కిరణ్, తదితరులు

పినగాడి (పెందుర్తి), న్యూస్‌టుడే: ఇటీవల తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీలో పెందుర్తి మండలం పినగాడిలోని విస్టం పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపల్ కేవీ కిరణ్ తెలిపారు. ఈ పోటీలో విజేతలుగా నిలిచి బంగారు పతకం సాధించడంతో పాటు కేరళలో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు వివరించారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రతిభ చాటిన విద్యార్థులు నాగు, దుర్గాప్రసాద్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏవో సాయిరాం, పీడీ బి.రమణారావు, శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి అబాకస్‌లో..

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: ఇటీవల ఉక్కు నగరంలో జరిగిన జిల్లాస్థాయి అబాకస్ పోటీల్లో చినముషిడివాడ ఎన్ఆర్ఐ ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాల విద్యార్థి ఎం.చరణ్ ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు చైతన్య తెలిపారు. ఈ సందర్భంగా సంబంధిత విద్యార్థిని ఆమె అభినందించారు.

జోనల్ స్థాయిలో..

పెందుర్తి, న్యూస్‌టుడే: భీమిలి నియోజకవర్గ పరిధిలోని కొమ్మాదిలో జరిగిన డాక్టర్ బీఎస్ రావు మెమోరియల్ జోనల్ క్రీడా పోటీల్లో పెందుర్తి శ్రీచైతన్య విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన చేపట్టినట్లు ప్రిన్సిపల్ తారకేశ్వరరావు తెలిపారు. వాలీబాల్ పోటీల్లో పాఠశాల బాలురు విజేతలుగా నిలిచారన్నారు. ఖోఖో, పరుగు పందెంలో పతకాలు సాధించినట్లు వివరించారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సంబంధిత విద్యార్థులను అభినందించారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులతో ప్రిన్సిపల్ తారకేశ్వరరావు, ఉపాధ్యాయులు

వార్షిక క్రీడా సంబరాలు

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: సుజాతనగర్ 80అడుగుల రహదారిలోని భాష్యం పాఠశాలలో బుధవారం వార్షిక క్రీడా సంబరాలు ఘనంగా జరిగాయి. ప్రిన్సిపల్ మహాలక్ష్మీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు అంతర్జాతీయ టెన్నికాయిట్ క్రీడాకారిణి, పద్మనాభం జెడ్పీ ఉన్నత పాఠశాల వ్యాయామోపాధ్యాయిని కె.నారాయణమ్మ ముఖ్య అతిథిగా విచ్చేసి వేడుకలను ప్రారంభించారు. విద్యార్థులు వివిధ క్రీడాపోటీల్లో పాల్గొని ప్రతిభ చాటారు. సాంస్కృతిక కార్యక్రమాలు, విన్యాసాలతో అలరించారు. విజేతలకు పాఠశాల జోనల్ అధికారి ఆంజనేయులు బహుమతులు అందజేశారు.

ఆకట్టుకున్న బాలల విన్యాసాలు

సాంస్కృతిక ప్రదర్శన

సైన్స్ ల్యాబ్ ప్రారంభం

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం తానాం బీసీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలోని రాంకీ ఫౌండేషన్, ఫౌండేషన్ ఫర్ రీజెలయన్స్ సీఎస్ఆర్ నిధులు రూ.19.50 లక్షలు వెచ్చించి ఫిజిక్స్ ల్యాబ్‌ను ఆధునికీరించడంతో పాటు కొత్తగా బయాలజీ ల్యాబ్ నిర్మించారు. విశాఖ ఫార్మాసిటీ సంస్థ ఎండీ డాక్టర్ లాల్‌కృష్ణ, ఫౌండేషన్ ఫర్ రీజెలయన్స్ డైరెక్టర్ సామ్రాట్‌కుమార్ బసక్ వీటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికలంతా సైన్స్‌ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో మంచి శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. సైన్స్‌ల్యాబ్ నిర్మించిన రాంకీ ఫౌండేషన్, ఎఫ్ఎఫ్ఆర్ సంస్థల యాజమాన్యాలకు ప్రిన్సిపల్ రమామోహిని కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో స్థానిక నాయకులు పైలా జగన్నాథరావు, రొంగలి నగేశ్, రాంకీ ఫౌండేషన్ అధికారులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న విశాఖ ఫార్మాసిటీ ఎండీ లాల్‌కృష్ణ

గొలుసు దొంగకు దేహశుద్ధి

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే: మహిళ మెడలోని బంగారు గొలుసును తెంచుకుని పారిపోతున్న దొంగను స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఉక్కు నిర్వాసితకాలనీ లక్ష్మీపురం ప్రాంతానికి చెందిన అద్దాల లక్ష్మి బుధవారం రాత్రి కూర్మన్నపాలెం ప్రధాన రహదారిలోని ఏప్లస్ ఆసుపత్రి సమీపంలో నడుచుకుంటూ వెళ్తున్నారు. ఇంతలో వెనుక నుంచి వచ్చిన దుండగుడు మహిళ మెడలోని మూడు తులాల పుస్తెల తాడును తెంచుకుని పారిపోయేందుకు ప్రయత్నించాడు. లక్ష్మి బిగ్గరగా కేకలు వేయడంతో స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. నిందితుడు మాటూరి శ్యామ్‌సుందర్‌ను ఉక్కునగరం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గతంలో ఎక్కడైనా దొంగతనాలకు పాల్పడ్డాడా అన్న కోణంలో విచారిస్తున్నారు.

ఉక్కు ఎస్ఎంఎస్‌లో కాపర్ ట్యూబ్‌ల చోరీ

ఉక్కునగరం (స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు కర్మాగారం స్టీల్ మెల్టింగ్ షాపు(ఎస్ఎంఎస్)లో చోరీ జరిగి వారం రోజులైనా ఫిర్యాదు చేసే నాథుడు కరవయ్యాడు. ఎస్ఎంఎస్-2లోని సీసీడీ మౌల్డ్ ప్రిపరేషన్ ప్రాంతంలోని 20 కాపర్ ట్యూబ్‌లు ఈ నెల 5వ తేదీ రాత్రి నుంచి కనిపించలేదు. ఒక్కో ట్యూబ్ సుమారు 91కేజీల బరువు ఉంటుంది. వాటిని ఎవరు దొంగిలించారో అధికారులకు అంతు చిక్కడంలేదు. ఏ అధికారి కూడా దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావడం లేదని సమాచారం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

మోహనరావు సేవలు మరువలేనివి

వన్‌టౌన్, న్యూస్‌టుడే : తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమ్మినేని మోహనరావు పార్టీకి అందించిన సేవలు మరువలేనివని నాయకులు కొనియాడారు. బుధవారం నగర పార్టీ కార్యాలయంలో మోహనరావు సంతాప సభ నిర్వహించి, ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం పార్టీ విశాఖ లోక్‌సభ నియోజకవర్గ అధ్యక్షులు చోడె వెంకటపట్టాభిరామ్ మాట్లాడుతూ... మోహన్‌రావు మృతి పార్టీకి తీరనిలోటు అన్నారు. ప్రయాణ సమయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని, విధిగా శిరస్త్రాణం ధరించడంతో పాటు, బీమా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, నాయకులు లొడగల కృష్ణ, బైరెడ్డి పోతనరెడ్డి, తాతాజీ, కోటనరేష్, సుజాత, చక్రవర్తి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

తమ్మినేని చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న జిల్లా తెదేపా నాయకులు

(c) eenadu

భీమిలి

సినిమాలు

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే

గణేష్ - మన శంకర వరప్రసాద్ గారు
రాములమ్మ - భర్త మహాశయులకు విజ్ఞప్తి
తాతా - శ్రీ చిదంబరం గారు
సప్తగిరి - విత్‌లవ్

హుండీ ఆదాయం రూ.30.10 లక్షలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : పాతనగరం బురుజుపేటలో కొలువైన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి హుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. నగదు రూ.30,10,993, బంగారం 40.240 గ్రాములు, వెండి 144.800 గ్రాములు, వివిధ దేశాల కరెన్సీ లభించిందని ఆలయ ఈఓ శోభారాణి తెలిపారు. దేవాదాయశాఖ తనిఖీ అధికారి ఎం.శ్రీధర్, ఆలయ సహాయ కార్య నిర్వహణ అధికారులు కె.రాజేంద్రకుమార్, ఎస్.ఆనంద్‌కుమార్, హెచ్‌ఎస్ఎన్‌వీఆర్.మూర్తి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన వైద్యశిబిరం

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి ప్రభుత్వ యునానీ డిస్పెన్సరీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎగువపేటలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా ముగిసిందని నిర్వాహకులు తెలిపారు. వైద్యురాలు బి.ప్రతిభ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరం కొనసాగింది. అంతకు ముందు డిస్పెన్సరీ నుంచి ఎగువపేట వరకు ఏఎన్ఎం, ఆశావర్కర్లతో ర్యాలీ నిర్వహించారు. ఆయుష్ విశాఖ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ కె.శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ) వైద్యులు కల్యాణి, రేఖ, సీహెచ్‌సీ సలహా మండలి సభ్యుడు జోగారావు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

99122 22247 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

ఎండాడ, న్యూస్‌టుడే: ?: బృందావనగర్(పీఎంపాలెం) క్రికెట్ మైదానం ఎదురుగా చాణిక్యపురి లేఅవుట్‌లో ఉదయం, సాయంత్రం వేళల్లో కొందరు ఆకతాయిలు వాహనాలు రోడ్డుకు అడ్డంగా పెట్టడంతో పలు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – పీఎంపాలెం, గస్తీ పోలీసులు. ?: బృందావనగర్(మధురవాడ)లో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. – చరణ్, కాలనీ వాసి. ✓: వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకుంటాం. – రాజా రవికుమార్, ఆరోగ్య అధికారి. ?: గాయత్రీనగర్(పీఎంపాలెం)లో రోడ్డు నంబరు 9లో పందుల బెడద తీవ్రంగా ఉంది. – శ్యామ్ ✓:పందుల నివారణకు చర్యలు తీసుకుంటాం.–రాజా రవికుమార్, ఆరోగ్య అధికారి. ?: విజయనగర్ టీచర్ లేఅవుట్(మధురవాడ)లో కాలువలు అధ్వానంగా ఉన్నాయి. – లక్ష్మణ్, లేఅవుట్ వాసి. ✓: కాలువల్లో పూడికలు తొలగిస్తాం. – సాయికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్. ?: రామాలయం వీధి (పీఎంపాలెం)లో ఎంఐజీ గృహ సముదాయాల్లో రోడ్లు గతుకులు పడి అధ్వానంగా ఉన్నాయి. – పీఎంపాలెం వాసులు. ✓: త్వరలో రోడ్డు మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. – అయ్యప్పనాయుడు, జెడ్సీ. ?: ఎండాడ పెట్రోల్ బంక్ సమీపంలో భారీ వాహనాలు పార్కింగ్ చేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. – చంద్రమోహన్, ప్రయాణికుడు. ✓:పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – ప్రభాకర్, ఆరిలోవ ట్రాఫిక్ సీఐ.

జీవం కోల్పోతున్న.. జీవ వైవిధ్య కేంద్రం

పీఎంపాలెం, న్యూస్‌టుడే: నగర ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు అటవీశాఖ తీర్చిదిద్దిన జీవ వైవిధ్య కేంద్రం నిర్వహణ కరవై వెలవెలబోతోంది. రెండేళ్ల క్రితం ఎంతో అట్టహాసంగా ప్రారంభమైన ఈ కేంద్రం అధికారుల పర్యవేక్షణ లేక కళావిహీనంగా మారుతోంది. దీంతో పార్కును సందర్శించేందుకు వచ్చే పర్యాటకుల సంఖ్య రోజురోజుకి తగ్గుముఖం పడుతోంది. ఎప్పటికప్పుడు మార్పులు చేసి అభివృద్ధి చేయాల్సిన యంత్రాంగం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పీఎంపాలెం క్రికెట్ స్టేడియం సమీపంలో కంబాలకొండ అభయారణ్య ప్రాంతంలో అటవీశాఖ తూర్పు కనుమల జీవ వైవిధ్య కేంద్రం(ఈస్టర్న్ ఘాట్స్ బయోడైవర్సిటీ సెంటర్)ను అభివృద్ధి చేసింది. దివీస్ లేబొరేటరీ, ఐఒఎల్ తదితర సంస్థలు కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) నిధులు సుమారు రూ.1.5 కోట్లు వెచ్చించి దీన్ని నిర్మించారు.

మొక్కలు లేక ఖాళీగా..

✦ **ఇవీ ప్రధాన సమస్యలు:** ఈ కేంద్రంలోని నక్షత్ర, ఔషధ మొక్కలు నీరు లేక చాలా వరకు ఎండిపోయాయి. అరుదైన పుష్పాలకు నిలయంగా ఉండాల్సిన ఆర్కిడేరియంలోని మొక్కలు జీవం కోల్పోతున్నాయి. సందర్శకులు కూర్చునేందుకు ఏర్పాటు చేసిన చెక్క కళాఖండాలు విరిగిపోయి మూలకు చేరాయి. ఆహ్లాదకరంగా తీర్చిదిద్దిన చెరువు లోపల పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా తయారైంది. సందర్శకులకు వన్యప్రాణుల మనుగడ, వాటి జీవన శైలి తదితరాలపై అవగాహన కోసం నిర్మించిన విజ్ఞాన కేంద్రం పర్యవేక్షణ లేక వెలవెలబోతోంది. ఆర్కిడేరియం ముందు చిన్న చెక్క వంతెనల మధ్య నీటి కొలనుల్లో నిల్వ నీరు దర్శనమిస్తోంది. కేంద్రంలో అటవీశాఖ ఏర్పాటు చేసిన కొంత మంది ఉద్యోగులు తాత్కాలిక శుభ్రత చర్యలు చేస్తూ కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్నారు.

క్షేత్రస్థాయి పరిశీలన చేస్తాం..: పీఎంపాలెంలోని అటవీశాఖ జీవ వైవిధ్య కేంద్రాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తాం. అక్కడి సమస్యలను డీఎఫ్ఓ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపడతాం.
– జగదీశ్వరరావు, డిప్యూటీ రేంజ్ అధికారి, అటవీశాఖ

రోడ్డుపై మురుగు.. రాకపోకలకు ఇక్కట్లు

ఆనందపురం, న్యూస్‌టుడే : ఆనందపురం- తగరపువలస జాతీయ రహదారి పక్కన సేవామార్గంలో వెల్లంకి, పెద్దిపాలెం గ్రామాల పరిధిలో మురుగునీరంతా రోడ్డుపైనే ప్రవహించడంతో రాకపోకలు సాగించే వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. గత కొద్ది నెలల నుంచి ఇక్కడ ఇదే పరిస్థితి ఉందని, అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇటీవల సమస్య తీవ్రత ఎక్కువైందని, అధికారులు స్పందించాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

కొత్తమ్మతల్లి పండక్కి ఏర్పాట్లు

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే : చిట్టివలస సంతపేటలో కొలువైన శ్రీ కొత్తమ్మతల్లి పండగను మే నెలలో నిర్వహించాలని కొత్తపేట, కొండపేట, విల్సన్‌పేట, సంతపేట గ్రామస్తులతో కూడిన ఉత్సవ కమిటీ నిర్ణయించింది. బుధవారం నిర్వహించిన సమావేశంలో కమిటీ సభ్యులు మాట్లాడారు. మే 7న చాటింపు, 14న దుర్గాలమ్మ దేవర, 15న దుర్గాలమ్మ అనుపోత్సవం, 19న కొత్తమ్మ తల్లి దేవర, జూన్ 1న తొలేళ్ల సంబరం, 2న పాలధార, రథాల ఊరేగింపు, అనుపోత్సవం ఉంటుందని తెలిపారు. కమిటీ ఛైర్మన్ ఆర్.సీతారామదొర, ప్రతినిధులు వెంకట్రావు, దేవుళ్లు, నర్సింగరావు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

కంకర దారి.. ప్రమాదకరంగా మారి..

ఎండాడ, న్యూస్‌టుడే: 8వ వార్డు ఎండాడ ప్రధాన రహదారి కంకర తేలి ప్రమాదకరంగా మారింది. 2 కిలోమీటర్ల దూరానికి సుమారు 20 నిమిషాలకు పైగా సమయం పడుతోందని వాహనచోదకులు వాపోతున్నారు. ఎండాడ ప్రధాన మార్గం నుంచి వైఎల్పీ లేఅవుట్, సాగర్‌నగర్‌ను కలుపుతూ ఉన్న ఈ లింక్ రోడ్డు చుట్టు పక్కల కాలనీలు, గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఏడాది నుంచి పనులు జరగకపోవడంతో ధూళి రేగి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తారు రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వలలో ప్లాస్టిక్ వ్యర్థాలు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: నగర పరిధిలోని మురుగు కాలువల ద్వారా పర్యావరణానికి, సముద్ర జీవరాశులకు హాని కలిగించేలా ఊహించని స్థాయిలో ప్లాస్టిక్ వ్యర్థాలు కలుస్తున్నాయనడానికి ఈ చిత్రమే నిదర్శనం. జూపార్క్, సాగరతీరం గుడ్లవానిపాలెం ఆలయాల పరిసర తీరాల్లో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులకు వల నిండా ప్లాస్టిక్ వ్యర్థాలే లభ్యమవుతున్నాయి. ప్రభుత్వ యంత్రాంగం స్పందించి ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా బీచ్ రోడ్డులోని గెడ్డల వంతెనల వద్ద వ్యర్థాలు నిలిచి నీరు మాత్రమే తీరంలో కలిసేలా చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.

కానరాని సూచిక బోర్డులు..

ఎండాడ, న్యూస్‌టుడే: జాతీయ రహదారి కూడలి(ఎండాడ)లో ట్రాఫిక్ అధికారులు పలుచోట్ల నిబంధనలకు సంబంధించి ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు కూలిపోయి ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. ఎండాడ కూడలి వద్ద వివిధ ప్రాంతాలకు వెళ్లే కూడలి ఏర్పాటు చేసిన రక్షణ గ్రిల్స్, లైట్లు, సూచికలు సక్రమంగా లేకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కొత్తవాటిని ఏర్పాటు చేయకపోవడం, బోర్డులు సరిచేయడంపై అధికారులు దృష్టి సారించడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. వీటిని పునరుద్ధరించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆదాయపు పన్నుశాఖ ఏడీపైనా కేసు

ఈనాడు డిజిటల్, అనకాపల్లి: ఆర్థిక నేరం కన్నుగప్పే యత్నంలో నర్సీపట్నంలో ఓ విద్యాసంస్థల నిర్వాహకుడు, ఛార్టర్డ్ అకౌంటెంట్‌తోపాటు విశాఖపట్నంలోని ఆదాయపన్ను ఉన్నతాధికారి సీబీఐ అధికారులకు చిక్కారు. ఈ మేరకు విశాఖపట్నం సీబీఐ అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు. అందులోని వివరాల ప్రకారం.. నర్సీపట్నంలోని ప్రముఖ విద్యాసంస్థలకు చెందిన నేరెళ్ల వెంకటరాజేష్ కొన్ని రోజుల క్రితం విద్యాసంస్థలకు చెందిన ట్రస్ట్ నుంచి రూ. 2 కోట్లు వ్యక్తిగత బ్యాంక్ ఖాతాకు మళ్లించుకున్నారు. ఐటీ రిటర్నులు సమర్పించినపుడు ఈ లావాదేవీలకు సంబంధించిన లోపాలు గుర్తించిన ఆదాయ పన్ను ఉన్నతాధికారులు ఆయన ఛార్టర్డ్ అకౌంటెంట్ గ్రంధి శరత్‌కుమార్‌కు తమ అభ్యంతరాలను తెలిపారు. దీని నుంచి బయటపడేందుకు విశాఖలోని ఆదాయపన్ను శాఖ యూనిట్-3 అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న అమృత్‌కుమార్‌కు రూ. 14 లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ వ్యవహారాలపై కాల్ రికార్డ్ ద్వారా నిఘా వేసిన సీబీఐ అధికారులు ఈనెల ఐదున ఆకస్మికంగా దాడి చేసి పట్టుకున్నారు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

వర్సిటీ చదరంగం పోటీలకు ఎంపిక

కొమ్మాది, న్యూస్‌టుడే: అంతర్ వర్సిటీ చదరంగం పోటీలకు చైతన్య ఇంజినీరింగ్ కళాశాల(కొమ్మాది) విద్యార్థి చొక్కాకుల శ్రవంత్ ఎంపికయ్యాడు. ఈనెల 9న నగరంలోని ఓ కళాశాల వేదికగా జరిగిన జేఎన్‌టీయూ-జీవీ అంతర్ కళాశాలల చదరంగం టోర్నమెంట్‌లో ప్రతిభ చాటాడు. మొత్తం 41 మంది పాల్గొన్న ఈ పోటీల్లో శ్రవంత్ ద్వితీయ స్థానంలో నిలిచి వర్సిటీ పోటీలకు ఎంపికయ్యాడు. వచ్చే నెల 3న చెన్నైలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో జరగనున్న సౌత్‌జోన్ అంతర్ వర్సిటీ పోటీలకు అర్హత సాధించాడు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సురేష్, ఫైనాన్స్ డైరెక్టర్ పి.మాధవి, వ్యాయామ అధ్యాపకులు పి.వేణుగోపాలరావు, బి.ప్రసన్నకుమార్ తదితరులు బుధవారం కళాశాలలో శ్రవంత్‌ను అభినందించారు.

శ్రవంత్‌ను అభినందిస్తున్న చైతన్య కళాశాల ప్రిన్సిపల్ సురేష్ తదితరులు

ఉత్సాహంగా క్రీడా పోటీలు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం మైభారత్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగాయి. వ్యాయామ అధ్యాపకులు పి.గౌరీశంకర్ పర్యవేక్షణలో జరిగిన వివిధ క్రీడాంశాల్లో 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగా పోటీలను కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ పి.సురేఖ ప్రారంభించారు. పోటీల విజేతలకు పతకాలు ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వై.వెంకట్రావు, ఎన్.శ్రీను, బి.సహదేవుడు, వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పతకాలు సాధించిన బాల,బాలికలు

కరాటేలో చిన్నారుల ప్రతిభ

భీమునిపట్నం, న్యూస్‌టుడే: జాతీయస్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో భీమిలికి చెందిన షోటోకాన్ కరాటే అసోసియేషన్ బాలబాలికలు సత్తా చాటి, పతకాలు సాధించారని నిర్వాహకులు పేర్కొన్నారు. పోటీలు ఈనెల 7, 8 తేదీల్లో విశాఖ స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో జరిగాయి. ప్రతిభ చూపిన ఎం.నిక్షిత్, సీహెచ్.శివరామ్, ఏ.ఇషాన్, వై.దేవాంశ్, ఏ.దిశ, ఆర్.ధాత్రిశ్రీ, ఆర్.నిహాల్‌ను బుధవారం చీఫ్ కోచ్ వెంకటరమణ అభినందించారు. విజేతలు మార్చిలో హైదరాబాద్‌లో జరిగే అంతర్జాతీయ పోటీలకు హాజరవుతారని వెంకటరమణ తెలిపారు.

గెలుపొందిన విద్యార్థులతో ప్రధానాచార్యులు సురేఖ, తదితరులు

కమనీయం.. అప్పన్న నిత్యకల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామి నిత్య కల్యాణోత్సవం బుధవారం సింహగిరిపై కమనీయంగా జరిపారు. అర్చకులు స్వామివారి ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని దేవేరుల సమేతంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆసీనుల చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల పరిణయ వేడుకను జరిపించారు.

అప్పన్న సన్నిధిలో ప్రముఖులు

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రి అప్పన్న స్వామిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ప్రముఖ సినీనటుడు సుమన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆలయానికి విచ్చేశారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడా మండపం చుట్టూ ప్రదక్షిణం చేశారు. పండితులు వేదమంత్రాలతో వీరిని ఆశీర్వదించారు. ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

కప్పస్తంభం వద్ద మొక్కుతున్న సినీనటుడు సుమన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు దంపతులు

గరుడ వాహనంపై గోవిందుడి వైభోగం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి దేవాలయంలో ఆర్జిత సేవల్లో భాగంగా బుధవారం గరుడ వాహన సేవ ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా నిర్వహించారు. అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని శోభాయమానంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడ వాహనంపై కొలువుదీర్చారు. తులసీదళాలతో అష్టోత్తర శతనామార్చన చేశారు. సినీ నటుడు రాజీవ్ కనకాల పూజలో పాల్గొని స్వామిని ఆరాధించారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

గరుడ వాహన సేవలో పాల్గొన్న సినీ నటుడు రాజీవ్ కనకాల, భక్తులు

అటవీ భూముల పరిరక్షణకు చర్యలు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: రుషికొండ బీచ్ పరిసరాల్లోని అటవీ భూముల పరిరక్షణకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు. ఇక్కడ సముద్ర తీరానికి అతి చేరువలో దాదాపు నాలుగు ఎకరాలకు పైగా అటవీ శాఖకు చెందిన భూములున్నాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో వీటిని పట్టించుకోకపోవడంతో రక్షణ కొరవడింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వీటి సంరక్షణకు చర్యలు తీసుకుంది. ఆయా భూముల హద్దుల వద్ద చుట్టూ ఇనుప కంచె ఏర్పాటు చేశారు. ఈ స్థలంలో కొంత భాగాన్ని అటవీ సామాజిక వన విభాగం నర్సరీగా అభివృద్ధి చేసి తొలి విడతగా గుడ్లవానిపాలెం వన సంరక్షణ సమితి(వీఎస్ఎస్) సభ్యుల పర్యవేక్షణలో వేప, కాము జాతులకు చెందిన సుమారు 5 వేల మొక్కలను సంరక్షిస్తున్నారు. ఈ మొక్కలను రాబోయే వర్షాకాలంలో ప్రజలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కార్యాలయాలకు ఉచితంగా అందజేయనున్నట్లు అటవీ అధికారులు పేర్కొన్నారు.

నిర్మించిన ఇనుప కంచె

నూతన కార్యాలయం ప్రారంభం

భీమునిపట్నం, న్యూస్‌టుడే : భీమిలి గ్రామదేవత శ్రీ నూకాలమ్మ ఉత్సవ కమిటీ (2026) కార్యాలయాన్ని బుధవారం మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంగణంలో ప్రారంభించారు. ఉత్సవాలు మార్చి 17 నుంచి 20 వరకు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవ నిర్వహణకు సంబంధించిన కార్యకలాపాల కోసం నూతన కార్యాలయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. సభ్యులు ఎం.సత్యప్రసాద్, జి.నూకరాజు, ఎస్.కరుణాకర్‌రెడ్డి, వి.బంగారు రాజు, జి.యశ్వంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న కమిటీ ప్రతినిధులు

విద్యార్థి కుటుంబానికి నగదు అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఆర్థికసాయం అందజేత

ఆనందపురం, న్యూస్‌టుడే : ఆనందపురం ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలుడు చరణ్ ఎముకల క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. పేద కుటుంబానికి చెందిన బాలుడి వైద్య ఖర్చులకు సాయం చేసేందుకు ఉపాధ్యాయులు ముందుకొచ్చారు. మూడు రోజుల నుంచి విరాళాలు సేకరించి.. బుధవారం రూ.1.85 లక్షలను బాలుడి కుటుంబానికి అందించారు. హెచ్‌ఎం కె.కామేశ్వరరావు, ఉపాధ్యాయులు శ్రీవిద్య, భాస్కర్‌రావు, సామాజిక కార్యకర్త సత్యమూర్తి, ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు వితరణ

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే : శ్రీ సాయి సంహిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపకులు రెడ్డిపల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో తాటితూరు మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 60 స్టీల్ కంచాలు, చిట్టివలస సంతపేట అంబేడ్కర్ జీవీఎంసీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పెన్నులు అందించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వై.జగన్నాథస్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్టీల్‌కంచాలతో బాలలు, చిత్రంలో ఉపాధ్యాయులు

షెల్టర్ లేదు.. ఫుట్‌పాతే దిక్కు..

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: బీచ్ రోడ్డులోని రుషికొండ ప్రాంత గీతం, గాయత్రీ కళాశాలల వద్ద బస్ షెల్టర్లు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో పర్యాటక ప్రాజెక్టు నెపంతో పరిసర రుషికొండపై నిర్మించిన కట్టడాల్లో భాగంగా టూరిజం అధికారులు ఈ షెల్టర్లను కూల్చివేశారు. దీంతో ఎండలు, వర్షాల సమయాల్లో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులతో పాటు శ్రీవారి ఆలయానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటిని తిరిగి నిర్మించేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు కోరుతున్నారు.

షెల్టర్ లేక ఫుట్‌పాత్‌పై కూర్చున్న ప్రయాణికులు

నేడు పారిశుద్ధ్య కార్మికుల సమ్మె

కార్పొరేషన్, న్యూస్‌టుడే : అఖిల భారత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం జరిగే సమ్మెలో జీవీఎంసీ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొంటున్నారని కమిషనర్ కేతన్‌గార్గ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒక్కరోజు చెత్త సేకరణకు క్లాప్ వాహనాలు రావని, నివాసితులంతా తమ ఇళ్లలోనే చెత్తను నిల్వ ఉంచుకోవాలని ఆయన సూచించారు. రహదారులపై, బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు పారబోయకూడదన్నారు. శుక్రవారం ఇంటింటికీ వచ్చే క్లాప్ వాహనాలకు చెత్తను అందించాలన్నారు. దాదాపు 5 వేల మంది కార్మికులు సమ్మెలో పాల్గొంటారని కమిషనర్ పేర్కొన్నారు.

పాత్రికేయులకు వైద్య పరీక్షలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఆదేశాలతో అక్రెడిటేషన్ ఉన్న పాత్రికేయులకు కేజీహెచ్ సమీప డాల్ఫిన్ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో బుధవారం నుంచి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. రోజుకు 25 మందికి అవకాశం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

క్షయ రహిత సమాజ స్థాపనే లక్ష్యం

మధురవాడ, న్యూస్‌టుడే: క్షయ రహిత సమాజ స్థాపనే లక్ష్యంగా వైద్య సిబ్బంది అంకితభావంతో పని చేయాలని జిల్లా క్షయ, కుష్ఠు వ్యాధి నివారణాధికారి డాక్టర్ రమేష్ సూచించారు. మధురవాడ పీహెచ్‌సీ, రుషికొండ యూపీహెచ్‌సీలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా ప్రాంతాల్లో నమోదవుతున్న టీబీ, కుష్ఠు కేసుల వివరాలు వైద్యులను అడిగి తెలుసుకున్నారు. 'టీబీ ముక్త్‌భారత్ అభియాన్'లో భాగంగా నిర్వహించాల్సిన స్క్రీనింగ్ ప్రక్రియపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. అత్యాధునిక ఎక్స్‌రే యంత్రాల వినియోగం, వాటి ద్వారా వ్యాధిని ముందస్తుగా గుర్తించే విధానాలను వివరించారు. ఆసుపత్రుల్లో రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట వైద్యులు దీపికాదేవి, హరిత, పర్యవేక్షణాధికారి పరమేశ్వరరావు, సీనియర్ టీబీ ల్యాబ్ సూపర్‌వైజర్ వి.వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు, సిబ్బందికి సూచనలు ఇస్తున్న జిల్లా క్షయ, కుష్ఠు నివారణాధికారి డాక్టర్ రమేష్

నైపుణ్యాల పెంపుతోనే అభివృద్ధి సాధ్యం

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: గీతం డీమ్డ్ వర్సిటీ స్కూల్ ఆఫ్ బిజినెస్‌ను జేఎన్‌టీయూ(దిల్లీ) ప్రొఫెసర్ సౌమెన్ చటోపాధ్యాయ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ వనరుల నైపుణ్యాల పెంపు ద్వారానే అభివృద్ధికి వీలుపడుతుందన్నారు. బడ్జెట్ (2026-27)ను సమీక్షిస్తూ మానవ వనరుల్లో నైపుణ్యాలను పెంచడం ద్వారా ఉత్పాదకత పెరుగుదల, సాంకేతిక ఆవిష్కరణలు, బాధ్యతాయుత పౌరుల నిర్మాణం సాధ్యపడుతుందన్నారు. ప్రస్తుత సాంకేతిక నైపుణ్యాల శిక్షణ, నాణ్యత పరంగా పరిశ్రమలకు అనుగుణంగా కృత్రిమ మేధస్సు ప్రభావానికి స్పందించగల సామర్థ్యం అత్యంత ముఖ్యమన్నారు. ఈ క్రమంలో ఏఐ ప్రభావానికి అనుగుణంగా స్పందించే అంశాలపై దృష్టి సారించాలన్నారు. విభాగ డైరెక్టర్ లుబ్జానిహర్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాధా రఘురామ పాత్రుని తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రొఫెసర్ చటోపాధ్యాయ

సేవలు మరువలేనివి

పాండ్రంగిలో నివాళి అర్పిస్తున్న నాయకులు

ఆనందపురం, న్యూస్‌టుడే : పెద్దిపాలెం గ్రామంలో బుధవారం భాజపా నాయకుల ఆధ్వర్యంలో పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ వర్ధంతి నిర్వహించారు. భాజపా రాష్ట్ర మెడికల్ సెల్ కన్వీనర్ ఆర్.రవికుమార్ తదితరులు హాజరై దీన్‌దయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి నివాళి అర్పించారు. భాజపా నాయకులు అప్పారావు, శ్రీనివాస్, రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం, న్యూస్‌టుడే : పాండ్రంగి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల భాజపా నాయకులు రవికుమార్, అప్పారావు, సోమేష్, సూర్యకాంతం తదితరులు పాల్గొన్నారు.

పెద్దిపాలెం గ్రామంలో...

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ఆనందపురం, న్యూస్‌టుడే : ఆనందపురం-అనకాపల్లి జాతీయ రహదారిలో శొంఠ్యాం సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం... విజయనగరం జిల్లా భోగాపురానికి చెందిన ఎన్.పైడిరాజు(59) ఓ గుత్తేదారుడి వద్ద ట్యాంకర్ లారీ క్లీనర్‌గా పని చేస్తున్నాడు. ఉదయం శొంఠ్యాం సమీప జాతీయ రహదారి మధ్యలో మొక్కలకు ట్యాంకర్ ద్వారా నీళ్లు పోస్తున్నాడు. ఇంతలో తమిళనాడుకు చెందిన లారీ పెందుర్తి వైపు నుంచి వేగంగా వచ్చి ట్యాంకర్ లారీని ఢీకొట్టి, పైడిరాజు కాలు మీద నుంచి దూసుకుపోయింది. దీంతో అతడి కాలు పూర్తిగా నుజ్జునుజ్జయింది. అలాగే ట్యాంకర్ లారీలో ఉన్న డ్రైవర్ క్యాబిన్ ఇరుక్కుపోవడంతో పాటు, కాలికి తీవ్ర గాయమైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. బాధితుల్ని వెంటనే కేజీహెచ్‌కు తరలించారు. దెబ్బతిన్న వాహనాలను పక్కకు తీసి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీలో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను బయటకు లాగుతున్న స్థానికులు

చికిత్స పొందుతూ వివాహిత మృతి

ఆనందపురం, న్యూస్‌టుడే : వివాహిత బలవన్మరణానికి పాల్పడిన ఘటనపై ఆనందపురం ఎస్ఐ శివ బుధవారం తెలిపిన వివరాలివి. లొడగలవానిపాలెం పంచాయతీ పరిధి నేలేర్తు గ్రామానికి చెందిన పి.శ్రీనివాసరావు వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆయనకు భార్య లీలా(45), ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారులిద్దరూ ఉద్యోగ రీత్యా చెన్నైలో ఉంటున్నారు. లీలా కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. అయితే ఇంట్లో నగదు లావాదేవీల విషయంలో భార్యాభర్తల మధ్య వివాదం చోటు చేసుకుంది. మనస్తాపం చెందిన లీలా మంగళవారం గడ్డి మందు తాగింది. గమనించిన భర్త వెంటనే విశాఖలో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. భర్త ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

(c) eenadu

విశాఖ తూర్పు

శిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

చినగదిలి(ఆరిలోవ), న్యూస్‌టుడే: చినగదిలిలోని నార్త్ శిర్డీ సాయిబాబా ఆలయ 13వ వార్షికోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాల్లో మొదటి రోజు ఉదయం సుప్రభాతసేవ, కాగడ హారతి, సామూహిక సాయి వ్రతాలు జరిగాయి. గురువారం నిత్య పూజలు, శుక్రవారం మధ్యాహ్నం అన్నాభిషేకం, అనంతరం అన్నదాన కార్యక్రమం జరుగుతుందని ఆలయ అధ్యక్షులు వానపల్లి అప్పారావు తెలిపారు.

అతిథి అధ్యాపకులతో సమావేశం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఏయూ అతిథి అధ్యాపకులతో ఆర్ట్స్ అండ్ కామర్స్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జె.రవి బుధవారం తన కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా యూజీసీ నిబంధనల ప్రకారం వేతనాలు చెల్లించాలని, తదితర సమస్యలపై చర్చించినట్లు అతిథి అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు సురేష్ మేనన్ తెలిపారు. సమావేశం వివరాలను వీసీ దృష్టికి తీసుకెళతానని ప్రిన్సిపల్ తెలిపారన్నారు. వీసీ తమ డిమాండ్లు పరిష్కరించకుంటే ఈ నెల 13నుంచి పోరుబాట పడతామని చెప్పారు. శేషు, ప్రసాద్, పన్నీ, ద్రాక్షాయని, కల్యాణి, లక్ష్మి, శిరీష్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య	పెదవాల్తేరు, ఎంవీపీ కాలనీ: 8008574769	మద్దిలపాలెం: 9912120229

ఆరిలోవ, న్యూస్‌టుడే: ?: 12వ వార్డు పెద గదిలి కొండ ప్రాంతం శివారులో రెండు వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రుళ్లు చీకట్లో ఇబ్బంది పడుతున్నాం. - దుర్గారావు, పెదగదిలి ✓: వెంటనే వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. - ఎం.రామకృష్ణ, వీధి దీపాల పర్యవేక్షకులు

ఎం.ఎం.టి.సి.కాలనీ (మద్దిలపాలెం), న్యూస్‌టుడే: ?: 15వ వార్డు పరిధి ఎం.ఎం.టి.సి.కాలనీ కాలువల్లో చెత్త పేరుకుపోయింది. మురుగు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. - రాజేష్, ఎం.ఎం.టి.సి.కాలనీ. ✓: తక్షణమే సిబ్బందిని పంపించి సమస్యను పరిష్కరిస్తాం. - కిషోర్, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్.

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : ?: విశాలాక్షినగర్ రెవెన్యూకాలనీలో ఐదేళ్లుగా వీధి కుళాయిలు అధికమయ్యాయి. స్థానికులను కరిచేయటంతో పాటు పరిసరాలను పాడు చేస్తున్నాయి. - రామకృష్ణ, విశ్రాంత ఉద్యోగి. ✓: వాహనాన్ని పంపించి వీధి కుక్కలను పట్టుకుని తరలిస్తాం. - డాక్టర్ రాజారమేష్‌కుమార్, పశుసంవర్థక అధికారి

హనుమంతువాక(విశాలాక్షినగర్), న్యూస్‌టుడే: ?: హనుమంతువాక రామాలయం వీధిలో వారం రోజులుగా రోజువిడిచి రోజు కుళాయిలు వస్తున్నాయి. నీరు సరిపోవడం లేదు. - సీత, హనుమంతువాక ✓: మీ ప్రాంతంలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. - శ్రీనివాస్, ఏఈ.

స్పందనకు వందనం

ఎంవీపీకాలనీ(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: 17వ వార్డు ఎంవీపీకాలనీ సెక్టార్-4 ప్రశాంతి పార్కు మార్గంలో రహదారిపై చెత్తను తొలగించడంలేదని బుధవారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ స్పందించారు. సిబ్బంది చేత వెంటనే చెత్తను తరలించి పరిసరాలను శుభ్రం చేయించారు.

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : పదో వార్డు పాతడెయిరీఫారం కూడలి నుంచి ఇందిరానగర్ లక్ష్మీనారాయణ దేవాలయం వరకు వీధి దీపాలు వెలగటం లేదని బుధవారం 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. దీనికి వీధి దీపాల విభాగ పర్యవేక్షకుడు రామకృష్ణ స్పందించారు. సిబ్బందితో దీపాలకు మరమ్మతులు చేయించారు.

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : కైలాసగిరి ఘాట్‌రోడ్డులో పలుచోట్ల తారురోడ్డు లేచిపోయి ప్రమాదకరంగా తయారైందని ఈనెల 10న 'ఇక్కడ... జాగ్రత్తగా వెళ్లండి' శీర్షికతో 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. దీనికి వీఎంఆర్‌డీఏ అధికారులు స్పందించారు. వెంటనే గుంతలు పడిన ప్రదేశాలలో తారువేసి బాగు చేశారు.

కైలాసగిరి ఘాట్‌రోడ్డుకు మరమ్మతులు

‘ఆవాస్’ కాలనీకి తీరనున్న తాగునీటి సమస్య

రూ.50లక్షలతో ఇంటింటికి కుళాయిలు

టీపీసీ పాయింట్ (ఆరిలోవ), న్యూస్‌టుడే

రాష్ట్రంలో తొలి రాజీవ్ ఆవాస్ యోజన కాలనీ సూర్యతేజనగర్‌లో 11ఏళ్ల తర్వాత మంచినీటి సమస్య పరిష్కారం కానుంది. రూ.50 లక్షల వ్యయంతో కాలనీలోని ఇంటింటికి కొళాయి కనెక్షన్లు ఇస్తున్నామని జీవీఎంసీ వాటర్‌వర్క్స్ ఏఈ కె.శ్రీనివాసరావు తెలిపారు. ముడసర్లోవ రిజర్వాయరు నుంచి ఆరిలోవ ప్రాంతానికి సరఫరా అవుతున్న పైపులైను నుంచి సబ్‌లైన్‌గా కనెక్షన్ ఇచ్చి కాలనీకి నీటిని అందజేస్తామన్నారు.

సూర్యతేజనగర్‌లో నివాసాలపై ఉన్న ట్యాంకులు

■ 204 ఇళ్ల నిర్మాణం: మురికివాడల అభివృద్ధిలో భాగంగా రాజీవ్ ఆవాస్ యోజన పథకం కింద కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.11 కోట్ల వ్యయంతో సూర్యతేజనగర్‌లో 204 ఇళ్లను నిర్మించారు. ఉమ్మడి రాష్ట్రంలో విశాఖలోని ఈ కాలనీని కేంద్ర ప్రభుత్వం ఈ పథకానికి ఎంపిక చేసింది. ఆరిలోవ గెడ్డ పక్కనున్న పూరి గుడిసెల స్థానంలో పక్కా ఇళ్లు నిర్మించారు. 2014లో అప్పటి వార్డు కార్పొరేటర్ ఒమ్మి సన్యాసిరావు కాలనీ నిర్మాణానికి స్థలం ఎంపిక చేశారు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్చువల్ పద్ధతిలో శంకుస్థాపన చేశారు. 2019నాటికి కాలనీ నిర్మాణం పూర్తయింది.

■ కూటమి ప్రభుత్వం వచ్చిన ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కాలనీ సమస్యపై దృష్టి పెట్టారు. ఇటీవల రూ.50లక్షల జీవీఎంసీ నిధులతో మంచినీటి కొళాయిల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. తొందరగా పనులు పూర్తి చేసి తాగునీటిని సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

■ కలుషిత నీటితో ఇబ్బందులు: కాలనీలో సిమెంటు రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మంచినీటి సరఫరా తదితర మౌలిక వసతులు సమకూరుస్తామని నాడు అధికారులు తెలిపారు. అన్ని వసతులు సమకూర్చినప్పటికీ మంచి నీటి కొళాయిలు ఏర్పాటు చేయలేదు. తరువాత వచ్చిన వైకాపా ప్రభుత్వం ఈ సమస్యను పట్టించుకోలేదు. దీంతో స్థానికులు ఎవరికి వారు బోర్లు తవ్వించుకున్నారు. ఇళ్లపై ట్యాంకులు ఏర్పాటు చేసుకుని అందులోకి నీరు పట్టుకునేవారు. అయితే పక్కనే గెడ్డ ఉండటంతో బోర్లలో కలుషిత నీరు వస్తోంది. ఆ నీటిని తాగిన స్థానికులు వ్యాధులు బారిన పడుతున్నారు. దీంతో తాగునీటిని కొనుగోలు చేసుకుని తాగాల్సి వస్తోంది.

ఆనందమార్గ్ ఆశ్రమం సందర్శన

ఇందిరానగర్ (విశాలాక్షినగర్), న్యూస్‌టుడే: పదో వార్డు పరిధి ఆనందమార్గ్ ఆశ్రమాన్ని మహారాష్ట్రలోని గోండ్వాన విశ్వవిద్యాలయం విద్యార్థులు బుధవారం సందర్శించారు. అధ్యయన యాత్రలో భాగంగా వీరు ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆశ్రమం నిర్వహిస్తున్న విద్యాలయం, అందిస్తున్న సేవలు, విద్యార్థుల సంరక్షణ, సామాజిక సేవ తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమం నిర్వాహకులు స్వామి సొమ్యానంద అవధూత, ట్రస్టు సభ్యులు అంజనేయపాత్రో, అధ్యాపకులు సురేష్, కాంతి, యాదవ్‌సాప్, గనానే తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమంలో గోండ్వాన వర్సిటీ విద్యార్థులు

అబాకస్ పోటీల్లో ప్రతిభ

విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: జీవీఎం ఉక్కునగరంలో జరిగిన జిల్లా స్థాయి అబాకస్ పోటీల్లో ఎంవీపీకాలనీలోని ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.పద్మజ తెలిపారు. వీరు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాల ప్రాంగణంలో ప్రతిభ చూపిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

ఇంట్లో చెత్త గెడ్డలోకి..

దర్పణం

ఎంవీపీ దోబీకాలనీకి చెత్తసేకరణ వాహనం రాకపోతుండటంతో కాలనీ వాసులు ఇళ్లల్లోని వ్యర్థాలు ఆసుపత్రి వెనుక భాగంలోని గెడ్డలో పోసేస్తున్నారు. గెడ్డను ప్రతి రోజు శుభ్రపరచకపోవటంతో మురుగు నిలిచిపోయి దోమలు వృద్ధి చెందుతున్నాయి. మరో పక్క హనుమంతువాక పాత మేకలబేలా నుంచి మాంసం వ్యర్థాలు కొట్టుకొస్తున్నాయి. పందులు, కుక్కలు గెడ్డలో తిష్ట వేయడంతో పారిశుద్ధ్యం దిగజారుతోంది. అధికారులు స్పందించి గెడ్డను శుభ్రపరచాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఎఫ్ఎంకాలనీ(విశాలాక్షినగర్)

గోతులు వదిలేసి.. అవస్థలు పెంచేసి..!

జీవీఎంసీ 15వ వార్డు హెచ్‌బీకాలనీ, పాతవెంకోజీపాలెం, జేఆర్‌నగర్ ప్రాంతాల్లో యూజీడీ పనులు నత్తనడకన సాగుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యూజీడీ కోసం తీసిన గోతులను రోజుల తరబడి పూడ్చకుండా వదిలేశారు. దీంతో వాహనచోదకులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, హెచ్‌బీకాలనీ (మద్దిలపాలెం)

ఖాళీ స్థలం.. వ్యర్థాల మయం!

పైనాపిల్ కాలనీలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం గృహ సముదాయం పక్కన ఉన్న ప్రభుత్వ స్థలం వ్యర్థాలకు నిలయంగా మారింది. ఈ స్థలానికి రక్షణ గోడ లేకపోవడంతో చెత్త, వ్యర్థాలు వేస్తున్నారని కాలనీ వాసులు తెలిపారు. దుర్వాసన, దోమలతో ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. ఖాళీ స్థలం ఆక్రమణలకు గురికాకుండా రక్షణ గోడ నిర్మించి ఆటస్థలంగా మార్చు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, ధారపాలెం (ఆరిలోవ)

ఆదాయపు పన్నుశాఖ ఏడీపైనా కేసు

ఈనాడు డిజిటల్, అనకాపల్లి: ఆర్థిక నేరం కప్పిపుచ్చే యత్నంలో నర్సీపట్నంలో ఓ విద్యాసంస్థల నిర్వాహకుడు, ఛార్టర్డ్ అకౌంటెంట్‌తోపాటు విశాఖపట్నంలోని ఆదాయపన్ను ఉన్నతాధికారి సీబీఐ అధికారులకు చిక్కారు. ఈ మేరకు విశాఖపట్నం సీబీఐ అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు. అందులోని వివరాల ప్రకారం.. నర్సీపట్నంలోని ప్రముఖ విద్యాసంస్థలకు చెందిన నేరెళ్ల వెంకటరాజేష్ కొన్ని రోజుల క్రితం విద్యాసంస్థలకు చెందిన ట్రస్టు నుంచి రూ. 2 కోట్లు వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు మళ్లించుకున్నారు. ఐటీ రిటర్నులు సమర్పించినప్పుడు ఈ లావాదేవీలకు సంబంధించిన లోపాలు గుర్తించిన ఆదాయ పన్ను ఉన్నతాధికారులు ఆయన ఛార్టర్డ్ అకౌంటెంట్ గ్రంధి శరత్‌కుమార్‌కు తమ అభ్యంతరాలను తెలిపారు. దీని నుంచి బయటపడేందుకు విశాఖలోని ఆదాయపన్ను శాఖ యూనిట్-3 అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న అమృతేష్‌కుమార్‌కు రూ. 14 లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ వ్యవహారంపై కాల్ రికార్డ్ ద్వారా నిమా వేసిన సీబీఐ అధికారులు ఈనెల ఐదున ఆకస్మికంగా దాడి చేసి పట్టుకున్నారు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

ఏపీఎన్జీవో ఉపాధ్యక్షుడిగా రవిశంకర్

సీతంపేట, న్యూస్‌టుడే: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో ఎంపీహెచ్ఈవోగా విధులు నిర్వర్తిస్తున్న ఆర్.రవిశంకర్ రాష్ట్ర ఎన్జీవోస్ సంఘం ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆయన్ను శాలువాతో సన్మానించారు.

పోషకాహారంతో ఆరోగ్యం

ఎంవీపీకాలనీ(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: విద్యార్థులు పోషకాహారం తీసుకుని ఆరోగ్యవంతులుగా మారాలని సదరన్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.విజయలక్ష్మి సూచించారు. ఎంవీపీకాలనీ సమతా కళాశాలలో ఏర్పాటు చేసిన పోషణ కౌన్సెలింగ్ కేంద్రాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. పోషకాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో సమతా కళాశాల డీన్, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.విజయరవీంద్ర, ప్రిన్సిపల్ ఎస్.సారాబందీ, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార కౌన్సెలింగ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ జి.విజయలక్ష్మి

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

కేఆర్ఎంకాలనీ(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: చైతన్యనగర్ విద్యుత్తు ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్-1 ఇ.ఇ. పి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు చైతన్యనగర్, కనకమ్మవీధి, దేవీ హోమ్స్, గాయత్రిస్కూల్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పండిట్ దీన్‌దయాళ్ స్ఫూర్తి ప్రదాత

పండిట్ దీన్‌దయాళ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పి.వి.ఎన్.మాధవ్ తదితరులు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: భారతీయ జనసంఘ్ పూర్వ అధ్యక్షులు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని బుధవారం లాసన్స్‌బేకాలనీ భాజపా కార్యాలయంలో నిర్వహించారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ దీన్‌దయాళ్ తన జీవితాన్ని దేశ సేవకు అంకితం చేశారని కొనియాడారు. డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ మరణం తరువాత జనసంఘ్ పగ్గాలు చేపట్టి పటిష్ఠం చేశారన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పరశురామ రాజు, రాష్ట్ర కోశాధికారి ఎం.నాగేంద్ర, మన్యం పార్వతీపురం జిల్లా ఇన్‌ఛార్జి ప్రకాశ్‌రెడ్డి, భాజపా వైద్య విభాగ కన్వీనర్ రూపాకుల రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆలోచించండి.. శుభ్రంగా ఉంచండి..!

రామ్‌నగర్ రజకుల గెడ్డ పరిసరాల్లో ప్రతిరోజు చెత్త పేరుకుపోతోంది. ఈ ప్రాంతం డంపింగ్ యార్డులా మారిపోయింది. ఈ పరిస్థితిలో మార్పు తేవడానికి 28వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ యాగటి సురేష్ నడుంబిగించారు. ఆ ప్రాంతంలో చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. రంగుల ముగ్గులు వేసి మొక్కల కుండీ ఏర్పాటు చేశారు.

- - న్యూస్‌టుడే, రామ్‌నగర్(పెదవాల్తేరు)

తీరానికి ‘పచ్చని’ కళ

ఐఎఫ్ఆర్ నేపథ్యంలో బీచ్‌రోడ్డును సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఎక్కడికక్కడ పచ్చదనం ఉండేలా మొక్కలు పెంచారు. ఆర్.కె.బీచ్, పార్కుహోటల్ కూడలిలో మూడు చోట్ల, గాదిరాజు ప్యాలెస్ ప్రాంతాలు పచ్చటి మొక్కలతో కళకళలాడుతున్నాయి. వివిధ రకాల మొక్కలతో గార్డెన్‌లా తీర్చిదిద్దారు. గతేడాది భాగస్వామ్య సదస్సుకు కేటాయించిన నిధుల్లో మిగిలిన మొత్తంతో పచ్చదనం ఏర్పాటు చేస్తున్నామని జీవీఎంసీ అధికారులు తెలిపారు.

- న్యూస్‌టుడే, బీచ్‌రోడ్డు(పెదవాల్తేరు)

కూడళ్లు రంగులమయం

ఐఎఫ్ఆర్ కోసం అధికారులు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నారు. రుషికొండ, తెన్నేటిపార్కు, ఆర్కేబీచ్ ప్రాంతాల్లోని కూడళ్లు, డివైడర్లు, పుట్‌పాత్‌లకు రంగులు అద్ది ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. గోతులు పడిన రోడ్లకు మరమ్మతులు చేసి అద్దంలా చేస్తున్నారు. బీచ్‌రోడ్డులో పలు చోట్ల తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్నారు. జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ అధికారుల సమన్వయంతో ఆయా పనులు జరుగుతున్నాయి. - న్యూస్‌టుడే, విశాలాక్షినగర్

సీఎం సహాయనిధి మంజూరు పత్రాల పంపిణీ

మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, తదితరులు

ఎంవీపీకాలనీ(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: నియోజకవర్గానికి చెందిన ఉమ్మడి గణేష్ (అప్పుఘర్)కు రూ.1,48,327, కె.మణి(అప్పుఘర్)కి రూ.50వేలు, పి.అప్పారావు (అంజయ్యనగర్ సెక్టార్-6 ఎంవీపీకాలనీ)కి రూ.62,266 చొప్పున ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరైంది. బుధవారం ఎంవీపీకాలనీలోని కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెలగపూడి ప్రతాప్‌రుద్ర, కార్పొరేటర్ మంగవేణి, కె.మురళీ, బి.నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

తమ్మినేని సేవలు మరువలేనివి

వన్‌టౌన్, న్యూస్‌టుడే : తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమ్మినేని మోహనరావు పార్టీకి అందించిన సేవలు మరువలేనివని నాయకులు కొనియాడారు. బుధవారం నగర పార్టీ కార్యాలయంలో మోహనరావు సంతాప సభ నిర్వహించి, ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం పార్టీ విశాఖ లోక్‌సభ నియోజకవర్గ అధ్యక్షులు చోడె వెంకటపట్టాభిరామ్ మాట్లాడుతూ... మోహనరావు మృతి పార్టీకి తీరనిలోటు అన్నారు. ప్రయాణ సమయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని, విధిగా శిరస్త్రాణం ధరించడంతో పాటు, బీమా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, నాయకులు లొడగల కృష్ణ, బైరెడ్డి పోతనరెడ్డి, తాతాజీ, కోటనరేష్, సుజాత, చక్రవర్తి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మోహనరావు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న జిల్లా తెదేపా నాయకులు

పాత్రికేయులకు వైద్య పరీక్షలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఆదేశాలతో అక్రెడిటేషన్ ఉన్న పాత్రికేయులకు కేజీహెచ్ సమీప డాల్ఫిన్ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో బుధవారం నుంచి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. రోజుకు 25 మందికి అవకాశం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. వైద్య పరీక్షల నివేదికలను రోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు కేజీహెచ్ ఓపీ విభాగంలోని 10వ నెంబరు గదిలో వైద్యులు పరిశీలించి, తగిన సూచనలు చేయనున్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన పాత్రికేయులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఓ ప్రకటనలో సూచించారు.

నేడు పారిశుద్ధ్య కార్మికుల సమ్మె

కార్పొరేషన్, న్యూస్‌టుడే : అఖిల భారత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం జరిగే సమ్మెలో జీవీఎంసీ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొంటున్నారని కమిషనర్ కేతన్‌గార్గ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒక్కరోజు చెత్త సేకరణకు క్లాప్ వాహనాలు రావని, నివాసితులంతా తమ ఇళ్లలోనే చెత్తను నిల్వ ఉంచుకోవాలని ఆయన సూచించారు. రహదారులపై, బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు పారబోయకూడదన్నారు. శుక్రవారం ఇంటింటికీ వచ్చే క్లాప్ వాహనాలకు చెత్తను అందించాలన్నారు. దాదాపు 5 వేల మంది కార్మికులు సమ్మెలో పాల్గొంటారని కమిషనర్ పేర్కొన్నారు.

రక్షించేవే... శిక్షించేలా..!

నగరంలో ఎక్కడ చూసినా హెచ్చరికలు బోర్డులు ప్రమాదకరంగా మారాయి. తూర్పు నియోజకవర్గంలో పెదవాల్తేరు, శంకరమఠం రోడ్డు తదితర ప్రాంతాల్లో డివైడర్ల వద్ద ఏర్పాటు చేసిన సూచికలు వాహనాలు ఢీకొని ధ్వంసమయ్యాయి. కొన్ని వంగిపోయి రోడ్డును ఆనుకుని ఉన్నాయి. వాహనచోదకులు చూసుకోకుండా వెళితే గాయపడే అవకాశం ఉంది. ప్రమాదాల్ని అరికట్టే సూచికలే ప్రమాదాలకు కారణమవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఎటువంటి సూచికలు కనిపించడం లేదు. - ఈనాడు, విశాఖపట్నం

పెదవాల్తేరులో..

శంకర మఠం రోడ్డులో...

ఫోకస్

హుండీ ఆదాయం రూ.30.10 లక్షలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : పాతనగరం బురుజుపేటలో కొలువైన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి హుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. నగదు రూ.30,10,993, బంగారం 40.240 గ్రాములు, వెండి 144.800 గ్రాములు, వివిధ దేశాల కరెన్సీ లభించిందని ఆలయ ఈఓ శోభారాణి తెలిపారు. దేవాదాయశాఖ తనిఖీ అధికారి ఎం.శ్రీధర్, ఆలయ సహాయ కార్యనిర్వహణ అధికారులు కె.రాజేంద్రకుమార్, ఎన్.ఆనంద్‌కుమార్, హెచ్ఎస్ఎన్‌వీఆర్.మూర్తి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బీఈడీ కళాశాలపై విచారణకు మీనమేషాలు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: నగర శివారులో స్పెషల్ బీఎడ్ కోర్సు నిర్వహిస్తున్న ఓ కళాశాలపై గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు ఫిర్యాదు వెళ్లింది. ఈ మేరకు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఏయూ అధికారులను ఆదేశిస్తూ గత నెల 22న గవర్నర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. 20రోజులైనా ఏయూ అధికారులు విచారణ చేపట్టకపోవడం గమనార్హం. స్థానిక విద్యార్థులకు కాకుండా ఒడిశా, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు ఒక్కో సీటును రూ.1.20లక్షల నుంచి రూ.1.60లక్షలకు విక్రయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. తరగతులకు హాజరుకాకుండా ఆయా రాష్ట్రాల విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఏయూ సీడీసీ డీన్ ఆచార్య టి.వెంకటకృష్ణను సంప్రదించగా గవర్నర్ కార్యాలయం నుంచి ఆదేశాలు అందిన విషయం వాస్తవమేనని, త్వరలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఏయూ సమాచారం

రక్తదానం చేస్తున్న విద్యార్థులు

రక్తదాన శిబిరానికి స్పందన

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో బుధవారం ఏయూ ఆరోగ్య కేంద్రంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. వీసీ ఆచార్య రాజశేఖర్ జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. హెల్పింగ్ హార్ట్స్, విశాఖపట్నం బ్లడ్ డోనర్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరం జరిగింది. క్లబ్ వ్యవస్థాపకులు రాజ్‌కుమారి, ఏయూ హెల్త్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ జి.వి.ఎస్.శర్మ, పిల్లా రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ కళాశాల వసతిగృహం చీఫ్ వార్డెన్‌గా ఆచార్య సిద్ధయ్య

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల వసతిగృహం, పరిశోధక విద్యార్థుల వసతి గృహం చీఫ్ వార్డెన్‌గా కెమిస్ట్రీ విభాగ ఆచార్యులు వి.సిద్ధయ్య నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఉపకులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ చేతుల మీదుగా ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆచార్యులు, ఆచార్య సిద్ధయ్యను అభినందించారు.

వీసీ నుంచి ఉత్తర్వులు అందుకుంటున్న ఆచార్య సిద్ధయ్య

సెమీఫైనల్స్‌కు శతాబ్ది ఉత్సవాల క్రికెట్ పోటీలు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఏయూ శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో వర్సిటీ క్రీడా మైదానంలో జరుగుతున్న క్రికెట్ పోటీలు సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. పూల్ బిలో బుధవారం డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల, ఏవీఎన్ కళాశాల జట్ల మధ్య జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల గెలుపొందింది. పూల్ ఏలో ఎం.వి.ఆర్ డిగ్రీ కళాశాల, పూల్ సీలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల గుమ్మలక్ష్మీపురం, పూల్ డీలో అనకాపల్లి ఎ.ఎం.ఎ.ఎల్. కళాశాల జట్లు విజయం సాధించాయని ఏయూ వ్యాయామ విద్య సంచాలకులు ఆచార్య ఎన్.విజయమోహన్ తెలిపారు. ఈ నాలుగు జట్లు సెమీ ఫైనల్‌లో తలపడతాయన్నారు. ఈ సందర్భంగా గెలుపొందిన జట్లను వ్యాయామ విద్య విభాగాధిపతి ఆచార్య ఎ.పల్లవి, కళాశాలల వ్యాయామ విద్య విభాగాధిపతులు అభినందించారు.

క్రీడాకారులతో ఆచార్య ఎన్.విజయమోహన్ తదితరులు

ఏయూ మహిళల నెట్‌బాల్ జట్టు ఎంపిక

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వవిద్యాలయం మహిళల నెట్‌బాల్ జట్టు ఎంపిక బుధవారం జరిగింది. ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు కృష్ణా వర్సిటీలో జరిగే ఆలిండియా వర్సిటీల నెట్‌బాల్ పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందని ఏయూ వ్యాయామ విద్య సంచాలకులు ఆచార్య ఎన్.విజయమోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులను ఆయనతో పాటు విభాగాధిపతి ఆచార్య ఎ.పల్లవి, జట్టు మేనేజర్ గోపీకృష్ణ తదితరులు అభినందించారు.

27, 28 తేదీల్లో సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో కార్యశాల

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 27,28 తేదీలలో ‘కోడ్ ఆఫ్ ప్రాక్టీస్ ఆన్ జియో సింథటిక్ రైన్‌ఫోర్స్ సాయిల్ స్ట్రక్చర్స్’ అంశంపై కార్యశాల నిర్వహించనున్నారు. కార్యశాలకు సంబంధించిన గోడపత్రికను వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఆచార్య సి.ఎన్.వి.సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

(c) eenadu

విశాఖ ఉత్తరం

•విశాఖ ఉత్తరం •విశాఖ దక్షిణం

ఏపీఎన్‌జీవో ఉపాధ్యక్షుడిగా రవిశంకర్

సీతంపేట, న్యూస్‌టుడే: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో ఎంపీహెచ్‌ఈవోగా విధులు నిర్వర్తిస్తున్న ఆర్.రవిశంకర్ రాష్ట్ర ఎన్జీవోస్ సంఘం ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆయన్ని శాలువతో సన్మానించారు. పలువురు ఉద్యోగులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

రవిశంకర్‌ను సత్కరిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, వైద్యులు

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

విశాఖ ఉత్తరం: 8008574796

విశాఖ దక్షిణం: 8008574977

జగదాంబకూడలి, న్యూస్‌టుడే ?: జీవీఎంసీ 38వ వార్డు టౌన్‌హాల్ ముఖద్వారం వద్ద వేగ నియంత్రికలు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. -కె.సి.సుధాకర్, స్థానికుడు ✓: పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. -వరప్రసాద్, ఒకటోపట్టణ సీఐ

జ్ఞానాపురం, న్యూస్‌టుడే ?: జీవీఎంసీ 41వ వార్డులో నీటి సరఫరా సమయపాలన ఉండటం లేదు. -రాంబాబు, జ్ఞానాపురం. ✓: సమయపాలన పాటించేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తాం. -శివకుమార్, మంచి నీటి సరఫరా విభాగం ఏఈ.

మాధవధార, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 51వ వార్డు కళింగనగర్‌లోని చెత్త కుండీలు వ్యర్థాలతో నిండిపోయాయి. తీవ్ర దుర్వాసన వస్తోంది. - కె.ఎమ్.రాజు ✓: సిబ్బందిని పంపించి కుండీలను శుభ్రం చేయిస్తాం. - వెంకటరమణ,శానిటరీ ఇన్‌స్పెక్టర్

● రక్షణ రంగ ఉద్యోగులకు గృహాలు

మురళీనగర్, న్యూస్‌టుడే: రక్షణ రంగ అధికారులు, ఉద్యోగుల కోసం జీవీఎంసీ 49వ వార్డు పట్టాభిరెడ్డితోట కొత్త బీసస్ యార్డ్ సమీపంలో గృహాలు నిర్మించనున్నారు. ఇందుకోసం శుక్రవారం ఉదయం 9.30 గంటలకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిఫెన్స్ ఎస్టేట్ ఆఫీస్ విశాఖ సర్కిల్ అధికారులు తెలిపారు. డిఫెన్స్ ఎస్టేట్ డైరెక్టర్ జనరల్ శోభా గుప్తా చేతులమీదుగా పూజా కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

● నేడు పారిశుద్ధ్య కార్మికుల సమ్మె

కార్పొరేషన్, న్యూస్‌టుడే : అఖిల భారత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం జరిగే సమ్మెలో జీవీఎంసీ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొంటున్నారని కమిషనర్ కేతన్‌గర్గ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒక్కరోజు చెత్త సేకరణకు క్లాప్ వాహనాలు రావని, నివాసితులంతా తమ ఇళ్లలోనే చెత్తను నిల్వ ఉంచుకోవాలని ఆయన సూచించారు. రహదారులపై, బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు పారవేయకూడదన్నారు. శుక్రవారం ఇంటింటికి వచ్చే క్లాప్ వాహనాలకు చెత్తను అందించాలన్నారు. దాదాపు 5 వేల మంది కార్మికులు సమ్మెలో పాల్గొంటారని కమిషనర్ పేర్కొన్నారు.

● దుర్గాంబమ్మకు అలంకరణ

పూర్ణామార్కెట్(అల్లిపురం), న్యూస్‌టుడే: నగరంలోని వెలంపేట సమీప దుర్గాంబ ఆలయంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. పలువురు భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

● పాత్రికేయులకు వైద్య పరీక్షలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఆదేశాలతో అక్రెడిటేషన్ ఉన్న పాత్రికేయులకు కేజీహెచ్ సమీప డయాగ్నస్టిక్ సెంటర్‌లో బుధవారం నుంచి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. రోజుకు 25 మందికి అవకాశం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. వైద్య పరీక్షల నివేదికలను రోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు కేజీహెచ్ ఓపీ విభాగంలోని 10వ నెంబరు గదిలో వైద్యులు పరిశీలించి, తగిన సూచనలు చేయనున్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన పాత్రికేయులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఓ ప్రకటనలో సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరోగ్య భరోసా

మాధవధార, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ఇప్పటికే పౌష్టికాహారం గర్భిణులు, బాలింతలకు సరఫరా చేసేలా చర్యలు తీసుకున్నారు. అదే క్రమంలో చిన్నారులు, అనారోగ్యానికి గురైనా ఆటలు ఆడుతూ గాయాలపాలైనా వెంటనే ప్రథమ చికిత్స చేసేలా మందులను(మెడికల్ కిట్లు) సరఫరా చేస్తోంది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణను గాలికొదిలేయడంతో చాలామంది చిన్నారులు, గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పోషకాహారం, ఆటపాటలతో కూడిన విద్యతో పాటు, ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యం ఇస్తున్నారు.

11 రకాల ఔషధాలు సరఫరా..

కేంద్రాలకు వచ్చే చిన్నారులు ఆటలు ఆడుతూ పడిపోయి గాయాలబారిన పడతారు. వాటికి రాయడానికి ఆయింట్‌మెంట్, బ్యాండేజ్, విరోచనాలు, కడుపు నొప్పి, జ్వరం, దగ్గు, దురదలు తగ్గడానికి సిరప్‌లు, కళ్ల ఎర్రబడినపుడు, చెవిపోటుకు ద్రావణం తదితర 11 రకాల ఔషధాలతో కూడిన కిట్ సరఫరా చేశారు. చేతులు శుభ్రం చేసేందుకు క్రిమి సంహారక ద్రావణం కూడా అందజేస్తున్నారు. వీటిని చిన్నారులతో పాటు, గర్భిణులు, బాలింతలు కూడా ఉపయోగించుకోవచ్చు. విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు వీటిని సరఫరా చేయనున్నారు.

ఉత్తర నియోజకవర్గంలో..	
వార్డులు	17
అంగన్‌వాడీ కేంద్రాలు	54
చిన్నారులు	1234
గర్భిణులు	432
బాలింతలు	218

అంగన్‌వాడీ కేంద్రాలకు అందజేసిన మందులు

14న చిత్రకళా ప్రదర్శన

సీతంపేట, న్యూస్‌టుడే: కల్పన కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 14న రామాటాకీస్ రోడ్డులోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ భవన్‌లో 'భలే మంచి రోజు'పేరుతో సంగీత, నృత్య, చిత్రకళా ప్రదర్శన నిర్వహించనున్నట్లు సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ తెన్నేటి జయరాజు తెలిపారు. అంబేడ్కర్ భవన్‌లో బుధవారం మీడియా సమావేశం నిర్వహించి ఆయన వివరాలు వెల్లడించారు. సొసైటీ 35వ వార్షికోత్సవం సందర్భంగా ఆ రోజు ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం, గౌరవ అతిథులుగా పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర హాజరవుతారన్నారు. కార్యక్రమాల సంబంధించిన గోడపత్రికను డీహెచ్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు జె.వి.ప్రభాకర్, బి.గౌతమ్ బాబు, తెన్నేటి సందేశ్ తదితరులు ఆవిష్కరించారు.

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న కల్పన కల్చరల్ సొసైటీ సభ్యులు

విరాళ దాత వేములపల్లి కన్నుమూత

మురళీనగర్, న్యూస్‌టుడే: జీవీఎంసీ 49వ వార్డు ఎన్జీజీఓస్ కాలనీలో నివాసముంటున్న సీనియర్ వాకర్ వేములపల్లి పూర్ణచంద్రరావు(84) మంగళవారం రాత్రి కన్నుమూశారు. మిలటరీ ఇంజినీరింగ్ సర్వీసెస్(ఎంఈఎస్)లో అధికారిగా ఉద్యోగ విరమణ చేసిన ఈయన కాలనీవాసులకు గత మూడు దశాబ్దాలుగా సుపరిచితులు. అంతేకాక కాలనీలో ఉన్న పలు ఉద్యానవనాలకు భారీ విరాళాలు అందజేసి వాటి అభివృద్ధికి చేయూత నందించారు. సెక్టార్-8 వైశాఖి స్పోర్ట్స్ పార్కులో ఆయన పేరున నిర్మించిన వేములపల్లి కళాక్షేత్రం సాంస్కృతిక కార్యక్రమాలకు వేదికగా నిలిచింది. సెక్టార్-4 సువర్ణ పార్కులో ధ్యాన మందిరాన్ని ఏర్పాటు చేసి మార్గదర్శకుడిగా నిలిచారు. ఈయన మృతిపట్ల కాలనీవాసులు, వాకర్స్ సభ్యులు, ఉద్యానవనాల ప్రతినిధులు సంతాపం తెలిపారు. ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం కృషి చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీలు

సీతంపేట, న్యూస్‌టుడే: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తన బృందంతో కలిసి బుధవారం అక్కయ్యపాలెం జాతీయ రహదారి పక్కనున్న ఆక్సి ఆసుపత్రిలో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. వైద్యులు, సిబ్బంది తగిన అర్హతలు కలిగి ఉన్నారా? ఆసుపత్రి రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలించారు. యాజమాన్యానికి తగు సూచనలు చేశారు. పేదవారిని దృష్టిలో పెట్టుకొని వైద్య సేవలు అందించాలని, రుసుములకు సంబంధించిన ధరల పట్టిక, రిజిస్ట్రేషన్ ఆసుపత్రి రిసెప్షన్ వద్ద ప్రచురించాలని ఆదేశించారు. ఆయన వెంట డాక్టర్ బి.ఉమావతి, డాక్టర్ ఎం.బి.నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు

అలరించిన ఘంటసాల గీతాలాపన

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: రైల్వేన్యూకాలనీ ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న శ్రీ సాయిబాబా ధ్యాన మందిరంలో బుధవారం సంగీత విద్వాంసుడు ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి నిర్వహించారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత, ఏయూ ఆచార్యులు సత్యవాడ సత్యనారాయణమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మందిరం భజన మండలి సభ్యులు, ఘంటసాల అభిమానులు, శిష్య బృందంతో ఘంటసాల భక్తి గీతాలాపన నిర్వహించారు. మధ్యాహ్నం మహా అన్నప్రసాద వితరణ చేశారు. మందిరం వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు(శేషు), బి.రాంబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘంటసాల చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సత్యనారాయణమూర్తి, మందిరం కమిటీ సభ్యులు

అభివృద్ధికి ఆమడదూరం

మాధవధార, న్యూస్‌టుడే: జీవీఎంసీ 51వ వార్డు సీతన్నగార్డెన్స్ నుంచి కళింగనగర్, జాతీయ రహదారి పంజాబు హోటల్ వెళ్లే ప్రధాన రహదారిలో గత కొన్నేళ్లుగా అభివృద్ధికి నోచుకోవడం లేదు. దీంతో రాళ్లు తేలిన రోడ్డుపై కాలనీవాసులు రాకపోకలు సాగిస్తూ తీవ్ర అవస్థలు పడుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఉద్యోగులు, వ్యాపారులు ఇక్కడ స్థలాలు కొనుక్కొని ఇళ్లు నిర్మించుకున్నారు. జీవీఎంసీ అధికారులు రోడ్లు ఉన్నాయని చెప్పి లక్షల్లో చలానాలు కట్టించుకొని ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారు. పలుమార్లు జీవీఎంసీ అధికారులకు విన్నవించినప్పటికీ, ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రహదారులు నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సీతన్నగార్డెన్స్-కళింగనగర్ రోడ్డు దుస్థితి

వృద్ధాశ్రమంలో ఉచిత వైద్య శిబిరం

మురళీనగర్, న్యూస్‌టుడే: జీవీఎంసీ 49వ వార్డు పట్టాభిరెడ్డితోట వానప్రస్థ వృద్ధాశ్రమంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నిరాశ్రయులైన వృద్ధులకు ఏజేకేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అల్లే పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు కూడా హాజరై వైద్యసేవలు పొందారు. ఆశ్రమ వ్యవస్థాపకులు రొట్టి శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వృద్ధులను పరీక్షిస్తున్న వైద్యుడు

ఏపీఎంసీ సభ్యురాలిగా ఎన్నిక

వన్‌టౌన్, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ వైద్య మండలి (ఏపీఎంసీ) సభ్యురాలిగా కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి ఎన్నికయ్యారు. ఇటీవల ఏపీఎంసీ సభ్యత్వ పదవుల కోసం ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో ఎన్నికలు జరిగాయి. ఎన్నికల్లో పోటీ చేసిన డాక్టర్ వాణి 8819 ఓట్లతో ఆరో స్థానంలో నిలిచి, సభ్యురాలిగా ఎంపికయ్యారు. వైద్యుల రిజిస్ట్రేషన్, పునరుద్ధరణ, నైతిక విలువల పాటించడం తదితర అంశాలను ఏపీఎంసీ పర్యవేక్షిస్తుంది. బుధవారం డాక్టర్ వాణిని ఆసుపత్రి నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం సభ్యులు నీలాపు శ్రీనివాసరావు, తదితరులు సత్కరించారు.

డాక్టర్ వాణిని అభినందిస్తున్న ఉద్యోగులు

సేవలు నిరుపమానం

నివాళి అర్పిస్తున్న భాజపా నాయకులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ సేవలు నిరుపమానమని భాజపా నాయకులు కొనియాడారు. మహారాణిపేట మండల భాజపా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం బీచ్‌రోడ్డులోని ప్రకృతి చికిత్సాలయం ఆవరణలో దీన్‌దయాల్ ఉపాధ్యాయ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.లక్ష్మీనారాయణ, భాజపా నాయకులు ఆర్.రవికుమార్, రాంబాబు, చంద్రశేఖరరావు, గిరిజ, సుశీల పాల్గొన్నారు.

ముక్కంటి దర్శనానికి ముస్తాబు

మాధవధార, న్యూస్‌టుడే: మహా శివరాత్రి సందర్భంగా ఉత్తరం నియోజకవర్గంలోని శివాలయాలు ముస్తాబవుతున్నాయి. ఆరోజు తెల్లవారుజాము నుంచి పూర్వక రుద్రాభిషేకాలు, ఏకవార అభిషేకాలు, సాయంత్రం జ్యోతిర్లింగార్చన, రుద్రాభిషేకం, అనంతరం లింగోద్భవ పూజలు నిర్వహించేందుకు ఆలయ కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాయి. దేవాలయాలకు రంగులు వేసి విద్యుత్తు దీపాలతో అలంకరించారు. స్వామిని దర్శించుకునేందుకు తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం దేవస్థానం, ఆలయాల నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

★ 17వ శతాబ్ది నాటి చారిత్రక శివలింగం: మాధవధారలోని మల్లికార్జునస్వామి ఆలయంలో వెలసిన శివలింగానికి చారిత్రక ప్రాశస్త్యం ఉంది. చుట్టూ కొండలు, మధ్యలో వెలసిన ఈ శివలింగం 17వ శతాబ్దంలో కార్తిక బహుళ సప్తమి రోజున ఒక రావి చెట్టు కింద వెలిసింది. కొన్ని రోజులు తర్వాత నందీశ్వరుడు వెలిశాడు. శివుడు శిరస్సు నుంచి జాలువారే జలపాతం ఇక్కడ నిత్యం ప్రవహించే జలధార. శ్రీకృష్ణదేవరాయులు ఈ శివలింగానికి పూజలు చేసినట్లు చరిత్ర చెబుతోంది. 19వ శతాబ్దంలో ఇక్కడ గుడిని నిర్మించారు. ఇటువంటి ఆకారం గల శివలింగం జిల్లాలో మరెక్కడా లేదు. ఇక్కడి జలధారలో స్నానమాచరించి స్వామివారిని దర్శించుకుంటే కోరికలు నెరవేరుతాయని భక్తుల గట్టి నమ్మకం. శివరాత్రి నాడు సుదూర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు.

మాధవధార ఆలయంలో వెలసిన శివలింగం

» **మర్రిపాలెంలో:** జాతీయ రహదారి పంజాబు హోటల్ సాయినగర్ వద్ద వెలసిన కాశీవిశ్వేశ్వరస్వామి సన్నిధిలో శివరాత్రికి ప్రత్యేక పూజలు చేయనున్నారు. 1991లో కాశీ నుంచి శివలింగాన్ని తీసుకొచ్చి ఇక్కడ ప్రతిష్ఠించారు. 2002 సంవత్సరం వరకు స్థానిక కాలనీవాసులే విరాళాలు వేసుకొని స్వామివారికి పూజలు చేసేవారు. అనంతరం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో పూజలు నిర్వహిస్తున్నారు. ప్రతి సోమవారం పెద్దఎత్తున భక్తులు తరలివస్తుంటారు.

తమ్మినేని కృషి మరువలేనిది

మాధవధార, న్యూస్‌టుడే: పేదల సమస్యలను పరిష్కరించడంలో తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమ్మినేని మోహనరావు చేసిన కృషి మరువలేనిదని పలువురు తెదేపా నేతలు కొనియాడారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన మృతి చెందిన విషయం విదితమే. మాధవధారలో 50వ వార్డు కూటమి నాయకులు, ప్రజలు బుధవారం ఆయన మృతికి నివాళి అర్పించారు. పేదలకు, పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు.

తమ్మినేని మోహనరావు చిత్రపటం వద్ద అంజలి ఘటిస్తున్న 50వ వార్డు కూటమి నాయకులు

శిరస్త్రాణంతో భద్రత

వన్‌టౌన్, న్యూస్‌టుడే : తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమ్మినేని మోహనరావు పార్టీకి అందించిన సేవలు మరువలేనివని నాయకులు కొనియాడారు. బుధవారం నగర పార్టీ కార్యాలయంలో మోహన్‌రావు సంతాప సభ నిర్వహించి, ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం పార్టీ విశాఖ లోక్‌సభ నియోజకవర్గ అధ్యక్షులు చోడె వెంకటపట్టాభిరామ్ మాట్లాడుతూ... మోహనరావు మృతి పార్టీకి తీరనిలోటు అన్నారు. ప్రయాణ సమయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని, విధిగా శిరస్త్రాణం ధరించడంతో పాటు, బీమా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, నాయకులు లొడగల కృష్ణ, బైరెడ్డి పోతనరెడ్డి, తాతాజీ, కోటనరేష్, సుజాత, చక్రవర్తి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మోహనరావు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న జిల్లా తెదేపా నేతలు

హుండీ ఆదాయం రూ.30.10 లక్షలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : పాతనగరం బురుజుపేటలో కొలవైన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి హుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. నగదు రూ.30,10,993, బంగారం 40.240 గ్రాములు, వెండి 144.800 గ్రాములు, వివిధ దేశాల కరెన్సీ లభించిందని ఆలయ ఈఓ శోభారాణి తెలిపారు. దేవాదాయశాఖ తనిఖీ అధికారి ఎం.శ్రీధర్, ఆలయ సహాయ కార్యనిర్వహణ అధికారులు కె.రాజేంద్రకుమార్, ఎన్.ఆనంద్‌కుమార్, హెచ్ఎస్ఎన్‌వీఆర్.మూర్తి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

లెక్కింపులో పాల్గొన్న ఆలయ ఉద్యోగులు

బాధితులకు ఆర్థిక భరోసా

బాధితులకు సాయం అందజేస్తున్న సీపీ శంఖబ్రతబాగ్చీ

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సీపీ శంఖబ్రతబాగ్చీ తెలిపారు. 2019లో జరిగిన రోడ్డు ప్రమాదంలో జి.వెంకట నాగసాయి రామదిలీప్‌కుమార్ (27) మృతి చెందారు. సాంకేతిక కారణాలతో బాధిత కుటుంబానికి పరిహారం అందలేదు. దీంతో సీపీ చొరవ చూపి, ఆయా సంస్థల నుంచి సేకరించిన రూ.1.50 లక్షలను బుధవారం బాధిత కుటుంబానికి అందించారు.

నేటి నుంచి మహా శివరాత్రి వేడుకలు

దేవాదాయశాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

మురళీనగర్, న్యూస్‌టుడే: సెక్టార్-7 ప్రజాపిత ఈశ్వరీయ బ్రహ్మకుమారీస్ విశ్వవిద్యాలయం శాంతిధామంలో గురువారం ఉదయం 8 గంటల నుంచి మహాశివరాత్రి వేడుకలు ప్రారంభించనున్నారు. ప్రతిరోజు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ ఇన్‌ఛార్జి బి.కె.అపరంజి పేర్కొన్నారు. ప్రత్యేక అలంకరణగా అరుణాచల శివుడిని ప్రతిష్ఠిస్తున్నట్లు తెలిపారు.

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: దొండపర్తిలోని ఎరుకుమాంబ అమ్మవారి సన్నిధిలో మహా శివరాత్రి వేడుకలు వైభవంగా జరపనున్నట్లు ఆలయ ఈవో డి.వి.ఎస్.సురేష్‌బాబా పేర్కొన్నారు. ఆరోజు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కుంకుమ పూజలు, అమ్మవారి దర్శనాలు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పురవీధుల్లో సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు, సంగీత విభావరి ఉంటాయన్నారు. ఇందుకోసం ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అలంకరణలో ఎరుకుమాంబ అమ్మవారు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయంలో 15న మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఆదేశించారు. బుధవారం ఆయన ఉత్సవాల నిర్వహణపై దేవాదాయశాఖతో పాటు ఇతర శాఖలకు చెందిన అధికారులతో సమీక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున భద్రత, పారిశుద్ధ్యం, తాగునీటి వసతి, వైద్య సదుపాయాలపై దృష్టి సారించాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని పోలీసులకు సూచించారు. ఆర్డీఓ సుధాసాగర్, ఏసీ అన్నపూర్ణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు, ఆలయ ఈఓ పద్మావతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

• తీరంలో భద్రతపై అవగాహన

నూచిక బోర్డు వద్ద సీఐ దివాకర్, మౌనిక తదితరులు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : సముద్ర తీరంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ, భద్రత చర్యలు పాటించాలని మహారాణిపేట సీఐ దివాకర్ అన్నారు. జేసీఐ వైజాగ్ స్మార్ట్ అధ్యక్షురాలు మౌనిక ఆధ్వర్యంలో మహారాణిపేట పరిధి సాగర తీరంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగరాదని, అత్యవసర సమయంలో సీపీ ఫోన్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని, సాగరతీరంలో అనుకోని ప్రమాదం జరిగితే సంబంధిత గార్డ్స్‌కు ఫోన్ చేయాలనే... సూచనలతో ఏర్పాటు చేసిన బోర్డులు అందరికీ ఉపయుక్తంగా ఉంటాయన్నారు. మౌనిక మాట్లాడుతూ... సంస్థ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. జేసీఐ సభ్యులు శ్రీనివాస్, కె.వి.రావు, దిలీప్‌కుమార్, ఉమేష్ భరద్వాజ్, కృష్ణ, వెంకటరమణ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక రైళ్ల గడువు పొడిగింపు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఏర్పాటు చేసిన తిరువునంతపురం నార్త్- సంత్రాగచ్చి (06081-06082)తో పాటు పలు ప్రత్యేక రైళ్ల గడువు పొడిగిస్తున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. ★ కామాఖ్య-ఎస్ఎంవీటి బెంగళూర్ (12552/51) ఏసీ రైళ్లకు ఫలకట స్టేషన్‌లో అదనపు హాల్ట్‌లు కల్పించనున్నట్లు తెలిపారు.

పింఛను పెంచాలని డిమాండ్

ఆందోళనలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పింఛను మొత్తాన్ని పెంచాలని సీఐటీయూ నాయకుడు అప్పలరాజు డిమాండ్ చేశారు. గురువారం నిర్వహించే అఖిల భారత సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఐక్య పోరాటాలతో కార్మికుల హక్కులు సాధ్యమవుతాయన్నారు. పింఛనుదారుల సంఘం నాయకులు నారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు బస్‌షెల్టర్ నిర్మాణం

ఈనాడు కథనాలకు స్పందన

జ్ఞానాపురం, న్యూస్‌టుడే : జీవీఎంసీ కాన్వెంట్ కూడలిలో బస్‌షెల్టర్ లేక ఆర్టీసీ ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై పలుమార్లు 'ఈనాడు'లో వార్తలు ప్రచురితమయ్యాయి. తాజాగా జనవరి 31న 'నీలువ నీడ లేక ఇక్కట్లు' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతో జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు స్పందించారు. వెంటనే నిధులు మంజూరు చేసి షెల్టర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం పనులు చకచకా సాగుతున్నాయి. వీలైనంత త్వరలోనే షెల్టర్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని అధికారులు తెలిపారు.

కాన్వెంట్‌కూడలిలో కొత్తగా నిర్మిస్తున్న షెల్టర్

హోటళ్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : విశాఖ నగరంలో నిర్వహించే ఐఎఫ్ఆర్, మిలాన్.. తదితర కార్యక్రమాల దృష్ట్యా హోటల్స్ నిర్వాహకులు మెరుగైన సేవలు అందించాలని సీపీ శంఖబ్రతబాగ్చీ సూచించారు. బుధవారం ఆయన కమిషనరేట్ కార్యాలయంలో హోటల్స్ యాజమాన్య ప్రతినిధులతో సమావేశమై...పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. హోటల్స్‌లో భద్రత, శుభ్రత, రుచికరమైన ఆహారం, అతిథుల వ్యక్తిగత స్వేచ్ఛ, సీసీ కెమెరాల ఏర్పాటు, విద్యుత్తు సరఫరా... తదితరాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అనుమానితులు ఎవరైనా హోటల్స్‌కు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. నిర్వాహకులు పోలీస్ వెరిఫికేషన్ ధ్రువపత్రం కలిగి ఉండాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బహిరంగ ప్రకటన

సర్వజనులకు తెలియజేయునది ఏమనగా, శ్రీ గౌరీ సంక్షేమ సమితి, విశాఖపట్నం-8, కంచరపాలెంలో కార్యాలయం కలిగియున్న రిజిస్టర్డ్ నెం. 337/1990 గల, దాని కార్యదర్శి గారి ద్వారా ప్రాతినిధ్యం వహిస్తూ, నా కక్షిదారుగా ఉన్నారు. నా కక్షిదారు ఈ దిగువ షెడ్యూల్‌లో వివరించిన ఆస్తిని (1) శ్రీ వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి, తండ్రి కృష్ణ మూర్తి, (2) శ్రీ వేదుల రామకృష్ణ సూర్య శివప్రసాద్, తండ్రి కృష్ణమూర్తి గార్ల నుండి కొనుగోలు చేయుటకు ఉద్దేశించినారు. సదరు ఆస్తిపైన పేర్కొన్న వారికి, వారి తండ్రి గారు తేది 18-07-1990న విశాఖపట్నం రిజిస్ట్రార్ కార్యాలయంలో వ్రాసిఇచ్చిన రిజిస్టర్డ్ వీలునామా ద్వారా సంక్రమించినది.

కావున, ఈ దిగువ షెడ్యూల్‌లో చూపిన ఆస్తిపై ఎవరికైనా ఎటువంటి చట్టపరమైన హక్కుగానీ, అనుభవం (Possession)గానీ, లేదా ఇతర ఋణ బాధ్యతలు (Charge) గానీ ఉన్నయెడల, వారు తమ అభ్యంతరాలను తగిన దస్తావేజు సాక్ష్యాధారాలతోసహా ఈ ప్రకటన వెలువడిన 10 రోజులలోగా ఈ దిగువ పేర్కొన్న చిరునామా దారునికి తెలియజేయవలెను. లేనియెడల, పైన పేర్కొన్న అమ్మకందారులకు తప్ప ఈ ఆస్తిపై మరెవ్వరికీ ఎటువంటి హక్కులు, క్లెయిములు లేదా ఋణములు లేవని భావించి, నా కక్షిదారులు ఈ కొనుగోలు వ్యవహారాన్ని పూర్తిచేస్తారని తెలియజేయడమైనది.

షెడ్యూల్: మండవారి పేట, దొండపర్తి గ్రామం, అల్లిపురం వార్డు, డోర్ నెం.46-15-35 & 46-15-35ఎ సర్వే నెంబర్లు 648, 651 & 658లలో ఉన్న ప్లాట్ నెం. 6లో గల మొత్తం 541.66 చదరపు గజముల స్థలము మరియు అందులో ఉన్న రెండు ఆర్.సి.సి. భవనములు ఈ క్రింది సరిహద్దుల మధ్య గలవు. **తూర్పు:** ప్లాట్ నెం. 7లో ఇతరుల ఇల్లు, **ఉత్తరం:** 100 అడుగుల వెడల్పు రోడ్డు, **పడమర:** ప్లాట్ నెం.5లో ఇతరుల ఇల్లు, **దక్షిణం:** ప్లాట్ నెం. 13లో ఇతరుల ఇల్లు.

Sri G. Rama Chandra Raju,
M. Yeshwanth Varma & B. Rajeswari, Advocates
D.No. 13-2-11, Maharanipeta,
Visakhapatnam-2. **Ph. No. 9440334813.**

(c) eenadu

గాజువాక

•గాజువాక •విశాఖ పశ్చిమం

అభివృద్ధి పనులకు భూమిపూజ

ఎన్ఏడీకూడలి(కాకానినగర్), న్యూస్‌టుడే: జీవీఎంసీ 90వ వార్డు కాకానినగర్‌లో రూ.49.40లక్షల జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు కార్పొరేటర్ బొమ్మిడి రమణ బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు సారథ్యంలో వార్డు అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. డీఈ వెంకట లక్ష్మి, వార్డు తెదేపా అధ్యక్షుడు శరగడం అరుణ్ కుమార్, ఇన్‌ఛార్జి బాబి తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ రమణ

ఆసక్తిగా పారా వాలీబాల్ పోటీలు

గోపాలపట్నం, న్యూస్‌టుడే: గోపాలపట్నం ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రాష్ట్ర పారా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర దివ్యాంగ మహిళలు, పురుషుల విభాగాల్లో సిట్టింగ్ వాలీబాల్ పోటీలు చేపట్టారు. ఈ పోటీలు మూడు రోజులపాటు జరుగుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

పోటీలో తలపడుతున్న దివ్యాంగ మహిళలు

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య
గాజువాక: 98494 65088
పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

గోపాలపట్నం, న్యూస్‌టుడే: సమస్య: జీవీఎంసీ 89వ వార్డు బాజీజంక్షన్ రోడ్డులో శిథిల కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలి. –అప్పారావు, భారతీనగర్. సమాధానం: మరమ్మతులు చేపడతాం. –గాయత్రి, పనుల విభాగం ఏఈ, ?: 52వ వార్డు మద్దిలపాలెం పూల లేఅవుట్‌లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టడం లేదు. –దొరబాబు, మద్దిలపాలెం, ✓: వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. –మూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్

న్యూస్‌టుడే, గాజువాక, పెదగంట్యాడ

?: గాజువాక 66వ వార్డు శివానీనగర్‌లో పందుల సంచారం ఎక్కువగా ఉంది. దారిలో వెళ్లాలంటే ఇవి దాడి చేస్తున్నాయి. –వి. అచ్చారావు, శివాజీనగర్, పురుషోత్తం, సింహాద్రి, రిటైర్డ్, ✓: సిబ్బందిని పంపించి పందుల నిర్మూలనకు చర్యలు చేపడతాం. –కిరణ్ కుమార్, ఏఎంఓహెచ్

ఆఖరి మజిలీకి మంచి రోజులు

స్పందనకు వందనం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: బీసీ రోడ్డు బాపూజీనగర్ శ్మశానవాటికలో ఎక్కడ లేని సమస్యలు నెలకొన్నాయి. దీని దుస్థితిపై జనవరి 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి జీవీఎంసీ జోన్ ఏఎంఓహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్, ప్రజారోగ్య సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఎగువ నుంచి వచ్చే మురుగునీరు దారి మళ్లించేలా చేశారు. పేరుకుపోయిన చెత్తకుప్పలు తొలగించడంతో నివాసితులు హర్షం వ్యక్తం చేశారు.

• సమ్మెలో పాల్గొన వద్దని ఉక్కు సీఎండీ విజ్ఞప్తి

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు–3)న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు కర్మాగారం పలు ఇబ్బందులు అధిగమించి ఉత్పత్తిని పెంచి లాభాల బాటలో పయనిస్తోందని, ఈ తరుణంలో కార్మికులు, ఉద్యోగులు సమ్మె చేపట్టడం కర్మాగారం ఆర్థిక స్థితిని దిగజారుస్తుందని ఉక్కు సీఎండీ మనీష్ రాజ్ గుప్తా తెలిపారు. ఉక్కులోని మెజారిటీ కార్మిక సంఘాల ప్రతినిధులను ఒక రోజు సమ్మె చేపట్టడంతో ఉత్పత్తితోపాటు లక్ష్యాలు, దిగుమతి తదితరాలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. కర్మాగారం ప్రయోజనాల దృష్ట్యా ఉంచుకొని సమ్మెలో ఉక్కు ఉద్యోగులు పాల్గొనకుండా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

• రేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

సింధియా, న్యూస్‌టుడే: జీవీఎంసీ 58వ వార్డులోని విద్యుత్తు తీగల మరమ్మతులు కారణంగా ఈనెల 13వ తేదీన విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఆపరేషన్ జోన్–2 ఈఈ బీవీ నాయుడు తెలిపారు. ఆ రోజు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పిలకవానిపాలెం, శ్రీరామనగర్, ఏపీ టిడ్కో, సముద్రయం, కంచమ్మకాలనీ, గొందేశివానిపాలెం, ట్రాన్స్ షిప్పింగ్ పరిశ్రమల ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

• కార్గో నిర్వహణలో సరికొత్త రికార్డు

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: అదానీ గంగవరం పోర్టు 2025-26 ఆర్థిక సంవత్సరంలో 554 కార్గో వెసెల్స్ నిర్వహణ ద్వారా కొత్త రికార్డు సృష్టించిందని పోర్టు వర్గాలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపాయి. 2023-24లో 552 కార్గో నౌకలను నిర్వహించగా ఇప్పుడు 554 కార్గో వెసెల్స్ నిర్వహణ ద్వారా కొత్త బెంచ్ మార్కును స్థాపించినట్లు పేర్కొన్నారు. పోర్టు సిబ్బంది, అధికారుల బృందం అంకితభావం, కృషికి ఇది నిదర్శనమన్నారు.

• నేడు పారిశుద్ధ్య కార్మికుల సమ్మె

కార్పొరేషన్, న్యూస్‌టుడే : కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం జరిగే సమ్మెలో జీవీఎంసీ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొంటున్నారని కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు. ఒక్కరోజు చెత్త సేకరణకు క్లాప్ వాహనాలు రావని, నివాసితులు బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు పారబోయకూడదన్నారు.

స్థలాలు సరే.. హక్కులు ఏవీ!

★ ఫార్మా పునరావాస కాలనీలో నిలిచిన రిజిస్ట్రేషన్లు
★ నిర్వాసితులకు తప్పని అవస్థలు

అగనంపూడి, న్యూస్‌టుడే: ఇళ్ల స్థలాలు ఇచ్చినందుకు సంతోష పడాలో... హక్కులు కల్పించనందుకు బాధపడాలో తెలియని అయోమయ పరిస్థితి వారిది. ఒకటి ... రెండు కాదు ఏకంగా ఇరవై ఏళ్లుగా ఆ కాలనీలో స్థలాల రిజిస్ట్రేషన్లు జరగడం లేదు. పునరావాస కల్పన సమయంలో అధికారులు పట్టాలు ఇచ్చేసి చేతులు దులుపుకున్నారు. దీంతో అధికారికంగా స్థలాల క్రయ, విక్రయాలు నోచుకోక ఏళ్ల తరబడి ఫార్మాసిటీ నిర్వాసితులు అవస్థలు పడుతున్నారు.

2వేల ఇళ్ల స్థలాల అభివృద్ధి: పరవాడ మండలంలో ఫార్మాసిటీ ఏర్పాటుతో ఇళ్లు, భూములు కోల్పోయిన లేపర్తి, ఈదుపాక, కొత్తపాలెం, పొన్నూరు అగ్రహారం, పానకాలయ్యపేట, ఏదురవానిపాలెం, దొప్పవానిపాలెం గ్రామాల ప్రజలకు అగనంపూడి రెవెన్యూ పరిధిలో పునరావాసం కల్పించారు. సర్వే సంఖ్య 219లో ఏపీఐఐసీ కేటాయించి లేవుట్‌లను విభజించి దాదాపు 2వేల ఇళ్ల స్థలాలను అభివృద్ధి చేశారు. దపదపాలుగా నిర్వాసితులకు పట్టాలు పంపిణీ చేయడంతో గృహాలు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. అప్పట్లో కొంత మంది అనర్హులు, స్థానికేతరులు పట్టాలు దక్కించుకున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తడంతో జిల్లా కలెక్టరు అంక్షలు విధించారు. ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు నిలుపు చేయాలని ఆదేశిస్తూ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఉత్తర్వులు పంపించారు. నాటి నుంచి ఇక్కడి స్థలాల క్రయవిక్రయాలు నిలిచి పోయాయి.


ఫార్మాసిటీ పునరావాస కాలనీలోని నివాసాలు

ఇవీ ఇబ్బందులు: ఏదైనా అత్యవసరం వచ్చి స్థలం అమ్మాలన్నా...కొనాలన్నా వీలుకాక నిర్వాసితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొంతమంది అనధికారికంగా ఒప్పంద పత్రాలు రాయించుకుని విక్రయాలు చేస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి ఆదాయం రాక పోగా విలువైన స్థలాలు దళారులు కారుచౌకగా కొట్టేస్తున్నారు. నిర్వాసితులు తమ వారసులకు గృహాలను బదలాయించుకునేందుకు అవకాశం లేక పోవడంతో ఆవేదన చెందుతున్నారు. రిజిస్ట్రేషన్లు జరగక పోవడంతో బ్యాంకులు స్థలాలపై రుణాలు ఇవ్వడం లేదు. దీంతో నూతనంగా ఇళ్లు నిర్మించుకునేందుకు, పాత కట్టడాలను విస్తరించుకునేందుకు అవకాశం ఉండడం లేదు.

అంక్షలు తొలగిస్తేనే..: ఫార్మాసిటీ పునరావాస కాలనీలో ఇళ్ల స్థలాలపై అంక్షలు తొలగిస్తేనే రిజిస్ట్రేషన్లు చేయడానికి వీలవుతుంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే వెంటనే రిజిస్ట్రేషన్లు చేయడానికి మాకు అభ్యంతరం లేదు. దస్తావేజుల సంఖ్య పెరిగితే ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. – ఎం. అప్పారావు, సబ్ రిజిస్ట్రార్, లంకెలపాలెం

కర్మాగారం పూర్వ వైభవానికి సహకరిస్తాం: ఇంటక్

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు–3)న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు కర్మాగారానికి పూర్వ వైభవం తెచ్చేందుకు అన్ని విధాలుగా సహకారం అందిస్తామని ఇంటక్ నాయకులు తెలిపారు. ఉక్కు పర్సనల్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ రాకేష్ నందన్ సహాయ్‌ను బుధవారం ఇంటక్ నాయకులు కలిసి ఈ మేరకు హామీ ఇచ్చారు. కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చి పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎం.రాజశేఖర్, పి.వి.రమణమూర్తి, మద్ది అప్పలరాజు, మధు, సింహాచలం, ఈశ్వరరావు, కె.వెంకటరావు, శివ, రాజు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రాకేష్ నందన్ సహాయ్‌ను అభినందిస్తున్న ఇంటక్ నాయకులు

ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయొద్దు: జేసీ

గాజువాక, న్యూస్‌టుడే: ప్రజా ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, వాటిపై క్షేత్రస్థాయిలో విచారణ జరపాలని జేసీ విద్యాధరి సూచించారు. బుధవారం గాజువాక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆమె తహసీల్దార్ బి.శ్రీనివాస్‌తో సమావేశమయ్యారు. మండలంలో ప్రభుత్వ భూముల పరిరక్షణ తదితర అంశాలపై చర్చించారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును సత్వరం పరిష్కరించాలన్నారు.

జేసీ విద్యాధరితో చర్చిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

మహాశివరాత్రికి పటిష్ఠ ఏర్పాట్లు

పరవాడ, న్యూస్‌టుడే: అప్పికొండ సోమేశ్వర స్వామి ఆలయంలో 15న మహాశివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఆదేశించారు. బుధవారం ఆయన ఉత్సవాల నిర్వహణపై దేవాదాయశాఖతో పాటు ఇతర శాఖలకు చెందిన అధికారులతో సమీక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున భద్రత, పారిశుద్ధ్యం, తాగునీటి వసతి, వైద్య సదుపాయాలపై దృష్టి సారించాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని పోలీసులకు సూచించారు. ఆర్డీఓ సుధాసాగర్, ఏసీ అన్నపూర్ణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు, ఆలయ ఈఓ పద్మావతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

శివార్లలో చురుగ్గా సీసీరోడ్ల పనులు

గాజువాక, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ హయాంలో గాజువాక 75వవార్డు పరిధి శివారుకాలనీల్లో నిర్లక్ష్యానికి గురైన వీధి రహదారులకు మంచిరోజులు వచ్చాయి. జీవీఎంసీ సాధారణ నిధుల నుంచి సుమారు రూ.24లక్షలతో సీసీరోడ్లు, డ్రైన్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. కండేపల్లి వీధి, నెల్లిముక్కు, సీతానగరం, పెదగంట్యాడలో అనుబంధ రహదారుల నిర్మాణంతో ఏళ్లనాటి ఇబ్బందులు తీరుతున్నాయని నివాసితులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆయాచోట్ల వీధి దీపాలను వెలగించాలని కోరుతున్నారు.

నూతన సిమెంటు రహదారి

మురుగు ముంచెత్తే..!

బీసీరోడ్డు(గాజువాక), న్యూస్‌టుడే: డ్రైనేజీ వ్యవస్థ స్తంభించి మురుగునీరు రహదారిని ముంచెత్తింది. ఈ పరిస్థితి గాజువాక పైడిమాంబ కాలనీ నూకాంబికా పాఠశాల దారిలో కనిపిస్తోంది. ఇక్కడ డ్రైనేజీ అవుట్‌లెట్ లేక ఎగువ నుంచి వచ్చే వాడుక నీరు నేరుగా రోడ్డుపైకి చేరుతోంది. ఇటీవల దుర్వాసన, మరోవైపు చెత్తాచారంతో దారి చిత్తడిగా మారింది. పైడిమాంబకాలనీ, సింహగిరికాలనీ, శివాజీనగర్‌వాసుల ఇబ్బందులను గుర్తించి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని పలువురు కోరుతున్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

ఉక్కునగరం (స్టీల్ సెక్టారు–3): దేశవ్యాప్తంగా గురువారం తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఉక్కు ప్రధాన పరిపాలన భవనం కూడలిలో బుధవారం నిర్వహించిన బహిరంగ సమావేశంలో కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొని కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసే విధానాలు, కార్మికులను పారిశ్రామిక వేత్తలకు తాకట్టు పెట్టే చట్టాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఈ సమ్మెలో పెద్దఎత్తున కార్మికులు పాల్గొనాలన్నారు. విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని, ఉక్కు ఉద్యోగులు, నిర్వాసితుల సమస్యలు పరిష్కరించేలా గర్జించాలని పిలుపునిచ్చారు. ఉదయం 9.30గంటలకు కొత్త గాజువాక పెట్రోలు బంకు వద్ద నుంచి ప్రారంభమయ్యే ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కె.ఎస్.ఎన్.రావు, డి.ఆదినారాయణ, పి.వి. రమణమూర్తి, యు.రామస్వామి, జె.అయోధ్యరామ్ పాల్గొన్నారు.

సింధియా: నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణం రద్దు చేయాలని సిటూ నాయకులు ప్రసాద్ తదితరులు డిమాండు చేశారు. షిప్‌యార్డు గేటు వద్ద బుధవారం నిర్వహించిన కార్మిక ధర్నాలో ఆయన మాట్లాడారు. సంస్థలో నిలిచిపోయిన పదోన్నతుల విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఈనెల 12న జరగనున్న సమ్మెలో కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సిటూ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

మల్కాపురం, న్యూస్‌టుడే: శ్రీనూకాంబిక అమ్మవారి ఆలయ వార్షికోత్సవం బుధవారం వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

వీఆర్ఎస్ ఉద్యోగుల సమస్యలపై కేంద్ర మంత్రికి లేఖ

ఉక్కునగరం: ఉక్కులో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ(వీఆర్ఎస్) చేసిన ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కేంద్ర ఉక్కుశాఖ మంత్రికి లేఖ రాసినట్టు మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు తెలిపారు. '2025లో వీఆర్ఎస్ తీసుకున్న 1140మందికి, రెండో విడత వీఆర్ఎస్ తీసుకున్న 480మందికి ఫైనల్ సెటిల్‌మెంటు ఇవ్వలేదు. 50శాతం ప్యాకేజీ బకాయిలతోపాటు లీవ్ ఎన్‌క్యాష్‌మెంటు, పెండింగ్ వేతనాలు చెల్లించకుండా మూడో విడత వీఆర్ఎస్ ప్రకటించడం నిబంధనలకు విరుద్ధం' అని నేషనల్ కాన్ఫడరేషన్ ఆఫ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు కె.ఎస్.ఎస్.చంద్రరావు జీవీఎల్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ మేరకు స్పందించి కేంద్రమంత్రికి లేఖ రాసినట్లు జీవీఎల్ పేర్కొన్నారు.

పండిట్ దీన్‌దయాళ్ సేవలు ఎనలేనివి

గాజువాక, సింధియా, న్యూస్‌టుడే: పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జీవితం ఆదర్శనీయమని భాజపా గాజువాక కన్వీనర్ కరణం రెడ్డి నర్సింగరావు అన్నారు. గాజువాక భాజపా కార్యాలయంలో బుధవారం జనసంఘ్ సిద్ధాంతకర్త పండిట్ దీన్‌దయాళ్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అట్టడుగు పేదల సంక్షేమమే ధ్యేయంగా ఆయన జీవితాన్ని అంకితం చేశారన్నారు. జిల్లా సభ్యులు కృష్ణంరాజు, సూరిబాబు, సోంబాబు, రోహిణి, పాపని, లలిత తదితరులు పాల్గొన్నారు. ★ మల్కాపురం: మల్కాపురం హౌసింగ్ కాలనీలోనూ ఈ కార్యక్రమం నిర్వహించారు. 58వ వార్డు భాజపా ప్రతినిధి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దీన్‌దయాళ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నర్సింగరావు, తదితరులు

బార్ కౌన్సిల్ ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమే

గాజువాక, న్యూస్‌టుడే: ఈనెల 13న జరిగే బార్‌కౌన్సిల్ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకోవడంలో న్యాయవాదులు అప్రమత్తంగా ఉండాలని, ప్రతిఓటు కీలకమైందని అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ అండ్ అవేర్‌నెస్ (ఆస్రా) వ్యవస్థాపకులు, సీనియర్ న్యాయవాది, సభ్యుడిగా బరిలో దిగిన హబీబ్ సుల్తాన్ అలీ సూచించారు. గాజువాకలో బుధవారం న్యాయవాదుల శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో 40శాతం చెల్లని ఓట్లు పడ్డాయని, సరైన అవగాహనలేక పొరపాట్లు చోటుచేసుకున్నాయన్నారు. ఆస్రా జిల్లా కౌన్సిల్ మెంబర్ తోట శత్రుఘ్నుడు, కిషోర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రహదారిలో దుకాణాల తొలగింపు

గాజువాక, న్యూస్‌టుడే: తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్న గాజువాక ప్రధాన రహదారిలో అనధికార దుకాణాల తొలగింపునకు ట్రాఫిక్ పోలీసులు బుధవారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. సీఐ షేక్ హుస్సేన్ నేతృత్వంలో పలువురు ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెచ్‌సీలు, పీసీలు రంగంలోకి దిగి పాతగాజువాక నుంచి కొత్తగాజువాక వరకూ దుకాణాలను తీయించి ఫుట్‌పాత్‌లపై పెట్టుకునేలా చర్యలు తీసుకున్నారు.

వార్డుల్లో పారిశుద్ధ్య పనుల పరిశీలన

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా సచివాలయ సిబ్బంది బాధ్యతగా పని చేయాలని జోనల్ కమిషనర్ బీఆర్ఎస్ శేషాద్రి సూచించారు. బుధవారం 75,76 వార్డుల్లో ఆయన శుభ్రత పనులను పరిశీలించారు. మస్తర్ కార్యాలయంలో సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి, ఉదయం 5.30గంటలకే సిబ్బంది మస్తర్ పాయింట్లకు హాజరు కావాలన్నారు. ఏఎంఓహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్, ఎస్ఎస్ కోటేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నగేశ్, తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందికి సూచనలిస్తున్న జెడ్సీ శేషాద్రి, తదితరులు

9వ వర్ధంతి

నెట్టిమి సీతారత్నం
దిబ్బపాలెం, RH కాలనీ, శ్రీనగర్
జననం : 02-06-1971, మరణం : 12-02-2017
మేనల్లుళ్లు, మేనకోడళ్ళు మరియు కుటుంబ సభ్యులు

నీవు మా నుండి దూరమై నేటికి 9 సంవత్సరాలు గడిచినా.. నీ చల్లని దీవెనలే మమ్మల్ని నడిపిస్తున్నాయి. నీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

భర్త : నెట్టిమి నారాయణరావు & బ్రదర్స్

కుమార్తెలు	అల్లుళ్లు
బొండా అలేఖ్య B.Tech	జగన్నాథరావు M.B.A.
గట్టి సూర్యదీప్తి, B.Tech	మహేష్, M.Tech
మామిడి తులసి B.Tech	రాజ్‌కుమార్, స్టీల్‌ప్లాంట్, VSP

కుమారుడు : నెట్టిమి మురళీధర్ B.Tech
మనుమలు : B. ధ్రుతిక్, G. జయన్ కార్తికేయ, హయన్ సిద్విక్, M. జతిన్ కార్తికేయ, వేదాన్ష్ కార్తీన్
ముద్దుల మనుమరాలు : B. చైత్రిక

వియ్యంకులు	వియ్యపురాళ్ళు
బొండా అప్పారావు	లక్ష్మి
గట్టి ఆదిశంకరరావు	సీతారామలక్ష్మి
మామిడి అప్పలరాజు	రమణమ్మ

మంచితనానికి మానవత్వానికి మారుపేరుగా నిలిచి, అనురాగం ఆప్యాయతలను మాకు పంచి, ఎంతో మంది విద్యార్థులను ఉన్నత పొరులుగా తీర్చిదిద్దిన మీరు మా నుండి దూరమై నేటికి 2సం॥ అయినను మీ జ్ఞాపకాలు మా మదిలో పదిలంగా ఉన్నాయి. మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

నాన్న-అమ్మ : కంకిపాటి ఆనందరాజు - సంతోషమ్మ
అన్నయ్య-వదిన : అనిల్ - స్రవంతి
చెల్లి - బావ : సుధ (బిక్కి) - మోహన్
తమ్ముళ్ళు - మరదళ్ళు : సునీల్, సుధీర్ - ప్రమీళ, జయ
మరియు కుటుంబ సభ్యులు బంధుమిత్రులు

ప్రారంభించి.. తలుపునకు తాళం వేసి!

దర్పణం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: నేషనల్ హెల్త్ మిషన్ నిధుల నుంచి సుమారు రూ. 50లక్షలతో పెదగంట్యాడ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం వద్ద ఆధునిక హంగులతో నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనం దిక్కులు చూస్తోంది. దీన్ని ప్రారంభించి అయిదు నెలలైనా తలుపునకు తాళం తీసే నాథుడులేకుండా పోయారు. జిల్లా వైద్య అధికారుల సమక్షంలో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు రిబ్బను కత్తిరించి ఈ భవనాన్ని ప్రారంభించారు. పెదగంట్యాడ మండలంలో అవసరమైన లేబొరేటరీ పరీక్షలు, సాంకేతిక వైద్య పరీక్షలకు ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో దీన్ని నిర్మించారు. ప్రారంభించకపోవడంతో లేబొరేటరీ సేవలకు పెదగంట్యాడ వైద్యసిబ్బంది నగరానికి వెళ్లాల్సి వస్తోంది. ఇకనైనా వినియోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు.



తెరుచుకోని పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనం

స్తంభంతో పొంచి ఉన్న ప్రమాదం

అగనంపూడి, న్యూస్‌టుడే: ఫార్మాసిటీ పునరావాస కాలనీ బీ లేఅవుట్‌లో ఓ ప్రయివేటు అంతర్జాల సేవల నెట్‌వర్క్‌కు చెందిన స్తంభం ప్రమాదకరంగా మారింది. ఇటీవల గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో స్తంభం కూలిపోయింది. తీగలను తొలగించిన సిబ్బంది స్తంభాన్ని అలాగే వదిలేశారు. రాత్రి సమయాల్లో వాహనచోదకులు ఏమాత్రం ఆదమరుపుగా వెళ్లినా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

రహదారి పక్కన కూలిన స్తంభం

అంతా మాఇష్టం...

వుడాకాలనీ(గాజువాక), న్యూస్‌టుడే: గాజువాకలో ఫార్మా బస్సుల అనధికార పార్కింగ్ ఆగడం లేదు. అడిగేవారు లేక పట్టణ రహదారులను అడ్డాగా చేసుకున్న వాహనచోదకులు ఇప్పుడు పార్కులనూ వదలడంలేదు. బుధవారం వుడాకాలనీ సెంటర్ మీడియం పార్కులో ఇవి కనిపించాయి. రూ.కోట్లు వెచ్చించి వీఎంఆర్‌డీఏ అధికారులు పార్కులను అభివృద్ధి చేస్తుంటే పార్కింగ్ యార్డుగా మార్చేస్తున్నారని నివాసితులు ఆందోళన వ్యక్తం చేశారు.

వుడా సెంటర్ మీడియం పార్కులో బస్సులు

చెత్త యార్డును తరలించాల్సిందే

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: జనావాసాల మధ్య స్వతంత్రనగర్‌లో ఉన్న చెత్తబదిలీ కేంద్రాన్ని తరలించాలని డిమాండు చేస్తూ యార్డు పోరాట కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రిలే నిరాహార దీక్షలు, ధర్నా నిర్వహించారు. కమిటీ అడ్వయిజర్లు శంకరనారాయణ, గంధం శ్రీనివాస్, మురళీ, ఎం. రాంబాబు మాట్లాడుతూ 16 గ్రామాలకు సమస్యగా మారిన యార్డును తొలగించకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. గురువారం ఆందోళనలో భాగంగా వంటా వార్పు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నాయకులు నారాయణరావు, డి. రమణ, రమేష్, ఎంకే మూర్తి, సతీష్, జ్యోత్స్న, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు

ఉక్కు ఎస్ఎంఎస్‌లో కాపర్ ట్యూబ్‌ల చోరీ

ఉక్కునగరం (స్టీల్ సెక్టారు–3)న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు కర్మాగారం స్టీల్ మెల్టింగ్ షాపు(ఎస్ఎంఎస్)లో చోరీ జరిగి వారం రోజులైనా ఫిర్యాదు చేసే నాథుడు కరవయ్యాడు. ఎస్ఎంఎస్-2లోని సీసీడీ మౌల్డ్ ప్రిపరేషన్ ప్రాంతంలోని 20 కాపర్ ట్యూబ్‌లు ఈ నెల 5వ తేదీ రాత్రి నుంచి కనిపించ లేదు. ఒక్కో ట్యూబ్ సుమారు 91కేజీల బరువు ఉంటుంది. వాటిని ఎవరు దొంగలించారో అధికారులకు అంతు చిక్కడంలేదు. ఏ అధికారి కూడా దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావడం లేదన్నది ఉద్యోగుల సమాచారం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

గొలుసు దొంగకు దేహశుద్ధి

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే: మహిళ మెడలోని బంగారు గొలుసును తెంచుకుని పారిపోతున్న దొంగను స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఉక్కు నిర్వాసికాలనీ లక్ష్మీపురం ప్రాంతానికి చెందిన అద్దాల లక్ష్మి బుధవారం రాత్రి కూర్మన్నపాలెం ప్రధాన రహదారిలోని ఏప్లస్ ఆసుపత్రి సమీపంలో నడుచుకుంటూ వెళ్తున్నారు. ఇంతలో వెనుక నుంచి బైక్‌పై వచ్చిన దుండగుడు మహిళ మెడలోని మూడు తులాల పుస్తెల తాడును తెంచుకుని పారిపోయేందుకు ప్రయత్నించాడు. లక్ష్మి బిగ్గరగా కేకలు వేయడంతో స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. నిందితుడు మాటూరి శ్యామ్‌సుందర్‌ను దువ్వాడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గతంలో ఎక్కడైనా దొంగతనాలకు పాల్పడ్డాడా అన్న కోణంలో విచారిస్తున్నారు.

పరిశుభ్రత పనుల తీరుపై జెడ్సీ ఆరా

మల్కాపురం, న్యూస్‌టుడే: ఐఎఫ్ఆర్‌లో భాగంగా మల్కాపురం నేవీ కల్యాణి ఆసుపత్రి కూడలి నుంచి డాక్‌యార్డు మీదుగా కాన్వెంట్ కూడలి వరకు జోరుగా జరుగుతున్న.. రహదారి మరమ్మతులు, పూడిక తీత తదితర పనులను బుధవారం జోనల్ కమిషనర్ హేమావతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐఎఫ్ఆర్ ప్రారంభం నాటికి రహదారులన్నీ ఆకర్షణీయంగా కనిపించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. పలువురు అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఈ నోటీసు ద్వారా మేము క్రింద తెలిపిన షెడ్యూల్ ఆస్తికి సంబంధించి **1. శ్రీ కంచర్ల సత్య ఆనంద్ దత్ S/o. శ్రీ కె.ఎస్ దత్ (లేటు) 2. శ్రీ కంచర్ల శశాంక్ దత్ S/o. శ్రీ కంచర్ల సత్య ఆనంద్ దత్ 3.** M/s దట్సన్స్ బిల్డర్స్ అండ్ **ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్** యొక్క డైరెక్టర్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్న **శ్రీ కంచర్ల సత్య ఆనంద్ దత్ S/o. శ్రీ కె.ఎస్ దత్ (లేటు)** హక్కు, టైటిల్ మరియు ఆసక్తికి సంబంధించి పరిశోధిస్తున్నాము.

ఇందుకు సంబంధించి ఎవరైన మరియు అందరూ వ్యక్తులు/సంస్థలకు క్రింద తెలిపిన ఆస్తికి సంబంధించి / యాజమానులకు సంబంధించి/ఏదైన బ్యాంకు మరియు/లేదా ఆర్థిక సంస్థలు ఏవైన వాటా, హక్కు, టైటిల్, ప్రయోజనం, ఆసక్తి, క్లెయిమ్, అభ్యంతరములు మరియు/లేదా డిమాండ్ మొ॥గు॥ ఉన్నచో అమ్మకము, బదిలీ, ఎక్స్ఛేంజ్, లెట్, లీజు,సబ్ లీజు, లైసెన్సు, లీవ్ మరియు లైసెన్స్, కేర్‌టేకర్ ఆధారము, టెనెన్సీ, సబ్ టెనెన్సీ, అసైన్‌మెంట్, రిలీజు, త్యాగము, తనఖా, వారసత్వము, వదులుకొనుట, పూర్వీకులు, గిఫ్టు, లీన్, చార్జీ, నిర్వహణ, అనుభవపు, ట్రస్ట్, వృత్తి, స్వాధీనతా, కుటుంబ ఏర్పాటు/సెటిల్‌మెంట్, వివాదము లేదా ఏదైన ఇతర విధానములు ఏదైన కేటాయింపు, బుకింగ్, రిజర్వేషన్, ఒప్పందం, డీడ్, పత్రము, వ్రాతపూర్వక, కన్వేయన్స్, డివైజ్, డిక్రీ ఏదైన కోర్టు ద్వారా ఉత్తర్వు, కాంట్రాక్టులు, అగ్రిమెంట్, ప్రతిజ్ఞ, లీన్, షేర్ హోల్డర్ల అగ్రిమెంటు, వాటా కొనుగోలు అగ్రిమెంటు, డెవలప్‌మెంట్ హక్కులు, భాగస్వామ్యము, టిడిఆర్ యొక్క ఎఫ్ఎస్ఐ వినియోగము, ప్రాజెక్ట్ మేనేజర్, డెవలప్‌మెంట్ మేనేజర్ లేదా ఎన్‌కంబ్రెన్స్ లేదా ఇతర విధములైన స్వభావముతో తెలుసుకోదలచినవారు ఈ బహిరంగ ప్రకటన ప్రచురణ తేదీ నుండి **15 (పదిహేను) రోజులలోగా** ఈ క్రింది సంతకముదారును క్రింది తెలిపిన చిరునామాలో డాక్యుమెంటరీ నిరూపణలతో, వ్రాతపూర్వకముగా, దాఖలు చేయవలసిందిగా కోరుతున్నాము. విఫలమైనచో ఎటువంటి క్లెయిము లేదా క్లెయిములు లేదా అభ్యంతరములున్నచో అవి నిష్ప్రయోజనమైనవిగా భావించి కొట్టివేయబడును.

షెడ్యూలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం – 530015, విశాఖపట్నం, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ములగాడ గ్రామం సందు సర్వే నంబర్లు 36/4 భాగం మరియు 37/1లోని **3095.76** చదరపు గజాలుకు సమానమైన **27,861.84** చదరపు అడుగులు కలిగిన భూమికి సరిహద్దులు. **ఉత్తరం :** ఎల్.పి. నెం. 53/2004లోని రెసిడెన్షియల్ లే అవుట్ మరియు పార్క్ **దక్షిణం :** గాజువాక– విశాఖపట్నం 100 అడుగుల వెడల్పు గల రోడ్డు **తూర్పు :** శ్రీ కె.వి. కృష్ణా మరియు శ్రీమతి కె. రేవతి కుమార్‌కు చెందిన భూమి **పడమర :** సిరికాన్ ప్రాజెక్ట్స్ ఎల్.ఎల్.పి. మరియు దట్సన్స్ బిల్డర్స్ & ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ చెందిన భూమి.

అల్తాఫ్ ఫాతిమా, అడ్వకేట్
సరఫ్ & పార్టనర్స్ లా ఆఫీసస్
డో.నెం. 8-2-619/1, 3వ అంతస్తు సాహో కాంప్లెక్స్,
రోడ్ నెం.11, బంజారాహిల్స్, హైదరాబాద్-500 034.
మొబైల్ : +91 8106166662
ఇ-మెయిల్: altaf.fathima@sarafpartners.com

ప్రదేశం : హైదరాబాద్
తేది : 12-02-2026

(c) eenadu

గెడ్డను కప్పెట్టేశారు!

చీపురుపల్లి-శ్రీకాకుళం ప్రధాన రహదారిని ఆనుకుని పలు పరిశ్రమలు ఏర్పాటు కావడంతో అక్కడ భూముల విలువ బాగా పెరిగింది. పత్తికాయవలస, కర్లాం కూడళ్ల సమీపంలో రియల్ వెంచర్లు వెలిశాయి. కొందరు రియల్ ఎస్టేట్ వెంచరుదారులు ప్రధాన రహదారిలో గెడ్డలను ఇలా కప్పేస్తున్నారు. వెంచరుదారులు వారి స్థలం వరకు ప్రహరీ నిర్మించి.. పనిలో పనిగా పక్కన ఉన్న గెడ్డ(పత్తికాయలవలస వద్ద)ను ఇలా చదును చేశారు. రెవెన్యూ దస్త్రాల ప్రకారం సర్వే నంబరు 2లో ఉన్న దీని విస్తీర్ణం 1.26 ఎకరాలు. 285.5 మీటర్లు పొడవున్న ఈ గెడ్డలో నీరు తోటపల్లి ఉప కాలువలో కలుస్తుంది. ఇది మైదానంగా మారడంతో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ర.భ.శాఖ, నీటిపారుదల, రెవెన్యూశాఖల క్షేత్ర సిబ్బంది చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. విషయం తహసీల్దారు ధర్మరాజు వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, చీపురుపల్లి గ్రామీణం

దాహమేస్తే.. కన్నీళ్లే తాగాలి..

– న్యూస్‌టుడే, విజయనగరం మయూరికూడలి

పాఠశాలలు, వసతిగృహాల్లో నీటిశుద్ధి ప్లాంట్లు లేక దాహం కేకలు వినిపిస్తున్నాయి. కొన్నిచోట్ల ఉన్నా పని చేయడం లేదు. దీంతో కుళాయిలపైనే ఆధారపడుతున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో టిన్లతో తెచ్చుకుంటున్నారు. వసతిగృహాల్లో సమస్య తీవ్రత ఎక్కువగా ఉంది. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేవరకు విద్యార్థులు దాహంతోనే ఉంటున్నారు.

★ జిల్లాలో 30 ఎస్సీ వసతి గృహాలున్నాయి. రెండు చోట్ల పూర్తిస్థాయిలో ప్లాంట్లు లేనట్లు అధికారులు చెబుతున్నా.. మిగిలిన ప్రాంతాల్లో కొన్ని పనిచేయడం లేదు.

★ బీసీ కేంద్రాలు 47 ఉండగా.. ఏడు చోట్ల మాత్రమే స్వచ్ఛమైన తాగునీరు అందుతోంది. మిగిలిన చోట్ల దాహం కేకలు వినిపిస్తున్నాయి.

★ ఎస్టీ కేంద్రాల్లో 18కి గానూ 10 చోట్ల ఉన్నాయని, కొత్తగా రూ.2.85 లక్షలతో 8 ప్లాంట్లు మంజూరైనట్లు అధికారులు పేర్కొంటున్నారు. వీటిని ఏర్పాటు చేయాల్సి ఉంది.

★ మరమ్మతులకు గురైన వాటిని బాగు చేస్తున్నామని, ఎక్కడా ఇబ్బంది లేకుండా చూస్తామని ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి కేంద్రాల అధికారులు అన్నపూర్ణమ్మ, శ్రీనివాస్, జ్యోతిశ్రీ తెలిపారు.

కడిగేందుకు.. తాగేందుకు ఇదే నీరు!

తెర్లాం, న్యూస్‌టుడే: తెర్లాం జడ్పీ ఉన్నత పాఠశాలలో 294 మంది విద్యార్థులు చదువుతున్నారు. రెండు బోర్లు, మోటార్లు ఉన్నప్పటికీ శుద్ధజల యంత్రం పనిచేయడం లేదు. చేతిపంపు, పైపులైన్ దగ్గర కంచాలు కడుక్కుంటున్నారు. కొంతమంది ఇంటి వద్ద నుంచి నీరు తెచ్చుకుంటున్నా.. మిగతావారికి ఆ కుళాయిలు, బోర్లే దిక్కు. శుద్ధజల యంత్రం పాడై అయిదేళ్లు అవుతున్నా.. బాగు చేయడం లేదు.

నిండుగా నిధులున్నా.. ఖర్చుకూ నీరసమే!

ఈనాడు, విజయనగరం: కేంద్ర ప్రాయోజిత పథకాల నిధుల వినియోగంలో రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాల్లో విజయనగరం ఒకటి. సుమారు 76 పథకాల అమలులో ప్రగతి కొరవడుతోంది. 36 రంగాలకు అత్యధికంగా వినియోగిస్తున్నా.. పనులు మందకొడిగానే సాగుతున్నాయి. 2019-24 మధ్య కాలంలో ఉపాధి హామీ మెటీరియల్ కాంపొనెంట్ కింద వచ్చిన రూ.1,062 కోట్లు మురుగుపోవడం పరిస్థితికి అద్దం పడుతోంది.

అన్ని శాఖల్లోనూ అంతే!

★ కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు పర్యవేక్షిస్తున్న వివిధ శాఖల అధికారుల వద్ద సైతం నిధుల వినియోగంపై స్పష్టత కరవవుతోంది. ఉన్నతాధికారుల సమీక్ష సమావేశాల్లో అడిగిన ప్రశ్నలకు స్పష్టంగా బదులివ్వలేకపోతున్నారు.

గత అయిదేళ్లలో (రూ.కోట్లలో)

సంవత్సరం	విడుదల	వినియోగం
2019–20	375	63
2020–21	488	314
2021–22	353	140
2022–23	271	115
2023–24	335	128

★ ప్రాథమిక అంచనా ప్రకారం గ్రామీణ సడక్ యోజన కింద ఇంకా రూ.12 కోట్లు వెచ్చించాలి. ఈ పథకం అమలు, నిధుల వ్యయంపై రికార్డుల్లోనూ లోపాలు కనిపిస్తున్నాయి.

★ గృహ నిర్మాణ సంస్థ పరిధిలో రూ.6 కోట్లు, డ్వామా పరిధిలో రూ.6 కోట్లు, ఐసీడీఎస్, విద్య, వ్యవసాయం, వైద్యారోగ్య శాఖలతో పాటు మరికొన్ని విభాగాల పరిధిలో రూ.కోటి చొప్పున వెచ్చించాల్సి ఉందని తెలుస్తోంది.

● 2024- 25 ఆర్థిక సంవత్సరంలో వేజ్ కాంపొనెంట్ కింద రూ.407.22 కోట్లు రాగా.. రూ.407.18 కోట్లు వెచ్చించారు. మెటీరియల్ కాంపొనెంట్ కింద రూ.133.55 కోట్లకు రూ.126.48 కోట్లు ఖర్చు పెట్టామని, రూ.7 కోట్లు పెండింగ్ ఉందని అధికారులు పేర్కొన్నారు.

● ఈ ఆర్థిక సంవత్సరంలో వేజ్ కాంపొనెంట్ కింద రూ.261.20 కోట్లకు ఇప్పటి వరకు రూ.254 కోట్లు వెచ్చించారు.

● మెటీరియల్ కాంపొనెంట్ ద్వారా రూ.67.93 కోట్లకు గానూ రూ.9.73 కోట్లు మాత్రమే వెచ్చించారు. మార్చి నెలాఖరులోగా ఖర్చు పెట్టకపోతే మిగిలిన నిధులు మురిగిపోయే ప్రమాదం ఉంది.

★ ఉపాధి వేతనదారులకు చెల్లింపులు పూర్తి చేశామని గతంలో డ్వామా అధికారులు లెక్కలు చూపారు. అయితే అవకతవకలు జరిగినట్లు ఆడిట్లలో తేలింది. దీంతో ఆ సొమ్ము జేబుల్లోకి వెళ్లిందో తేలాల్సి ఉందని ఇలా జిల్లాకు వచ్చిన 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంక దినకర్ పేర్కొన్నారు.

ఉన్నది అవ్వే..

'మంజూరైన నిధుల్లో రూ.40 కోట్లున్నాయి. మార్చి నెలాఖరులోగా వినియోగానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించా. నేషనల్ రూరల్ లైవ్లీ హుడ్ మిషన్, పీఎం ఆవాస్ యోజన, పీఎం గ్రామ్ సడక్ యోజన, రాష్ట్రీయ కృషి వికాస్, మిషన్ వాత్సల్య వంటి పథకాలకు ఖర్చు చేయాలి' అని కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి తెలిపారు.

పాఠశాల బస్సు బోల్తా

28 మందికి గాయాలు

బొబ్బిలి, బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: సాయంత్రం 5.30 గంటల సమయం.. బడి విడిచి పెట్టాక 32 మంది విద్యార్థులు సందడిగా బస్సు ఎక్కారు.. బాలల ముచ్చట్లతో కోలాహలంగా ఉంది. వసతి గృహానికి చేరడానికి మరో 10 నిమిషాలే. ఇంతలోనే అనుకోని ప్రమాదం. రెప్పపాటులో బస్సు బోల్తాపడింది. అంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఒకరిపై ఒకరు పడి హాహాకారాలు చేశారు. ప్రమాదంలో చోదకుడితో కలిపి 28 మంది గాయపడ్డారు. ఈ ఘటన బుధవారం సాయంత్రం బొబ్బిలి మండలం అలజంగి వద్ద చోటుచేసుకుంది.

కొరాడ సన్‌రైజ్ హోంలో ఉంటున్న అనాథ, పేద విద్యార్థులు బొబ్బిలిలోని సెవెంత్‌డే పాఠశాలలో చదువుతున్నారు. పాఠశాల విడిచిపెట్టిన తర్వాత ఎప్పటి లాగే హోంకు చెందిన బస్సులో బయలుదేరారు. అలజంగి సమీపంలో ఎదురుగా అతివేగంతో వచ్చిన వ్యాన్‌ను తప్పించబోయి బస్సు అదుపుతప్పి పొలంలో బోల్తాపడింది. ఈ ఘటనలో విద్యార్థి పిట్టా నానికి పక్కటెముకలకు, నూకరాజు, బాలకరుణకు నుదుటిపై తీవ్రంగా గాయాలయ్యాయి. మరో 25 మంది స్వల్పగాయాలు కాగా, మిగతావారు క్షేమంగా బయటపడ్డారు. బాధితులను బొబ్బిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బోల్తాపడిన బస్సు

గాయాలతో బాధిత విద్యార్థులు

గాయపడినవారు..: విద్యార్థులు డి.సుధ, ఎ.పార్వతి, ఎస్.మహేశ్, వి.జయగోవింద, పి.రజిని, జి.నాగలక్ష్మి, జి.కిరణ్ కుమార్, టి.లింగయ్య, ఎలీషా, పి.విష్ణు, జయభీమ్, బి.అభిత్, పౌలు, తివిక్రమ్, మోసెస్, ఎస్.దుర్గ, డి.చరణ్, మహేశ్, టి.ప్రమీలాక్షి, ప్రదీప్, చోదకుడు శంకర్, మరో నలుగురు గాయపడ్డారు. వీరికి తల, ముఖం, కాళ్లకు దెబ్బలు తగిలాయి.

అప్రమత్తతతో తప్పిన ప్రాణాపాయం

బస్సు బోల్తాపడిన వెంటనే చోదకుడు అప్రమత్తమై ముందున్న గ్లాసును పగలగొట్టారు. దీని ద్వారా పిల్లలంతా సురక్షితంగా బయటపడ్డారు. లేకుంటే బస్సులో చిక్కుకుని తొక్కిసలాట జరిగేది. ఘటనలో అయిదుగురు మినహా మిగతావారు డిశ్చార్జి అయ్యారని ఎస్సీ దామోదర్ ఒక ప్రకటనలో తెలిపారు. సీఐ నారాయణరావు, సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు.

అందుకోండి ఆయుష్మాన్ కార్డులు

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: జిల్లాలో 70 ఏళ్లు, అంతకంటే వయసు పైబడిన వృద్ధులంతా ఆయుష్మాన్ భారత్(ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన, ప్రధానమంత్రి వయో వందన యోజన) కార్డులు పొందాలని డీఎంహెచ్‌వో ఎస్.జీవనరాణి కోరారు. గురువారం పలు ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. పీహెచ్‌సీల వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీల ఆధ్వర్యంలో నమోదు కార్యక్రమం ఉంటుందని, అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. లబ్ధిదారు కుటుంబం సంవత్సరానికి రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్సలు పొందే అవకాశం ఉంటుందని చెప్పారు.

నలుగురు విద్యార్థుల డిబార్

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: పట్టణంలోని ఏపీఎస్ కళాశాలలో జరుగుతున్న బీఈడీ పరీక్షల్లో చూచిరాతకు పాల్పడుతున్న నలుగురు విద్యార్థులను డిబార్ చేశామని ప్రిన్సిపల్ ఎస్.రవికిరణ్ ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. పరీక్షలు అత్యంత పారదర్శకంగా కట్టుదిట్టంగా నిర్వహిస్తున్నామన్నారు.

14 బృందాలతో తలపడ్డాం.. ప్రథమంలో నిలిచాం..

హ్యాకథాన్ పోటీల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ

న్యూస్‌టుడే- రాజాం

విద్యార్థులకు సృజన కీలకం.. మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకుంటూ.. తమదైన నైపుణ్యాలను జోడిస్తేనే విజయాలు సొంతమవుతాయి. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి జాతీయస్థాయిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన అమరావతి 'క్వాంటమ్ హ్యాకథాన్' పోటీల్లో జీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఆర్.సాయివివేక్, వి.దినేష్, కె.శివశంకర్, ఎం.వెంకటకృష్ణ, అబ్దుల్‌యూనస్, పి.రాజేశ్వరి బృందం తీర్చిదిద్దిన 'క్వాంటమ్ స్టేట్ విజువలైజర్' ప్రాజెక్టు ప్రథమ స్థానం సాధించింది. విజేత బృందానికి రూ.50 వేలు, బంగారు పతకాలు, జ్ఞాపికలను అందించారు. అక్కడితో అయిపోలేదండోయ్.. ప్రతిష్ఠాత్మక ఐబీఎం సంస్థ స్టైఫండ్‌తో కూడిన ఇంటర్న్‌షిప్‌నకు వీరిని ఎంపిక చేశారు. ఉద్యోగాలు వస్తాయని ప్రకటించారు. విజయం పొందిన బృంద సభ్యుల మాటల్లోనే..

జీరో నుంచి మొదలు పెట్టి..

అమరావతి క్వాంటమ్ హ్యాకథాన్ ప్రకటన వెలువడినప్పుడు మాకు కనీస అవగాహన లేదు. సీఎస్ఈ విభాగం ప్రొఫెసర్ ప్రోత్సాహంతో సాధన మొదలు పెట్టాం. ఐబీఎం క్వాంటమ్ కంపోజర్, కిస్కిట్ లెర్నింగ్ మాడ్యూల్స్, మైక్రోసాఫ్ట్ క్వాంటమ్ లెక్చర్లు, అంతర్జాతీయ పరిశోధన పత్రాలను అధ్యయనం చేస్తూ.. నేర్చుకుని పట్టు సాధించాం. కళాశాలలో అంతర్గత హ్యాకథాన్ నిర్వహించారు. అందులో 14 బృందాలతో పోటీపడి విజయం సాధించడంతో ఆత్మవిశ్వాసం మరింత పెరిగింది.

పది రోజుల్లో తొలి నమూనా..

క్వాంటమ్ గురించి అందరికీ అర్థమయ్యేలా చెప్పేలా ప్రాజెక్టు ఉండాలని ప్రభుత్వం సూచించింది. దానికి తగిన విధంగా సర్క్యూట్ లోపల జరిగే ప్రక్రియలను కళ్లకు కనిపించేలా చూపించే సాధనం రూపొందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. పది రోజుల్లోనే తొలి నమూనా సిద్ధం చేశాం. పీహెచ్‌డీ ఆధ్యాపకుల సూచనలతో మరింత మెరుగుపరిచాం. గణితం, కోడింగ్ వంటి అర్థంకాని భాషను బయటకు.. దృశ్య రూపంలో వివరించడంతో అందరూ సులువుగా తెలుసుకుంటారనే ఉద్దేశంతో జాగ్రత్తలు తీసుకున్నాం. సెప్టెంబరు 9న విశాఖలోని గాయత్రి విద్యాపరిషత్తులో జరిగిన సెమీఫైనల్‌లో విజయం సాధించాం.

నాలుగు వారాల శిక్షణ..

సెమీఫైనల్ పోటీలు ముగిశాక.. రాష్ట్ర ఉన్నత విద్యామండలి గతేడాది డిసెంబరులో నాలుగు వారాల పాటు 'క్వాంటమ్ సాంకేతికత'పై శిక్షణ ఇచ్చింది. దాన్ని అందిపుచ్చుకుని అయిదు నెలల్లో 'క్యూబిట్ ట్రేసర్' పేరుతో ఎడ్యుకేషనల్ ప్లాట్‌ఫాంగా ప్రాజెక్టును తీర్చిదిద్దాం. ఏఐ ఆధారిత క్వాంటమ్ అసిస్టెంట్, బ్లాక్ స్ఫియర్ విజువలైజేషన్, గేమిఫైడ్ లెర్నింగ్, రియల్ హార్డ్‌వేర్ ఇంటిగ్రేషన్ వంటి ఆధునిక ఫీచర్లు జోడించాం. ఈనెల 6న పది విభాగాల్లో నిర్వహించిన తుది పోటీల్లో 'క్వాంటమ్ స్టేట్ విజువలైజర్' విభాగంలో 14 బృందాలతో తలపడి ప్రథమ స్థానంలో నిలిచాం.

ప్రాజెక్టు విశిష్టతను న్యాయనిర్ణేతకు వివరిస్తున్న విద్యార్థులు

పకడ్బందీగా పది పరీక్షలు

అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి

ఈనాడు, విజయనగరం: పదో తరగతి పరీక్షల నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం తన ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. 23,523 మంది విద్యార్థులు రాయనున్నారని, ఈమేరకు కేంద్రాలను సిద్ధం చేసినట్లు చెప్పారు. ఆయా చోట్ల సెక్షన్ 144 అమలు చేయాలని చెప్పారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పురపాలక కమిషనర్లు తనిఖీ చేసి, ఈనెల 16 నాటికి నివేదిక అందజేయాలని ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద నిఘా పెట్టాలన్నారు. విద్యార్థులు సకాలంలో చేరేలా కేంద్రాల మీదుగా బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను సూచించారు. ప్రతి కేంద్రం వద్ద ప్రథమ చికిత్స శిబిరం, నిరంతర విద్యుత్తు సరఫరా తదితర అంశాలపై సూచనలిచ్చారు. డీఆర్వో మురళి, డీఈవో యు.మాణిక్యంనాయుడు, ఆర్ఐవో ఎస్.తవిటినాయుడు, డీఎంహెచ్‌వో ఎస్.జీవనరాణి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఇలా..

పరీక్షల నిర్వహణ	16/03– 01/04
విద్యార్థులు	23,523
పరీక్షా కేంద్రాలు	119
ఫ్లయింగ్ స్క్వాడ్లు	7
స్టోరేజీ పాయింట్లు	29
ఇన్విజిలేటర్లు	1,350

నేనెవరో తెలుసా.. ఎస్‌వోఎస్

న్యూస్‌టుడే, భోగాపురం, డెంకాడ

హాయ్.. వాహన చోదకులారా.. నేనెవరో తెలుసా..? నా పేరు ఎస్‌వోఎస్ (సేవ్ అవర్ సోల్) జాతీయ రహదారుల్లో ఆపదలో ఉంటే మీ ప్రాణాల్ని రక్షించేందుకు ఎన్‌హెచ్ సంస్థ మమ్మల్ని ఏర్పాటుచేసింది. ఎవరికి ఆపద వచ్చినా సాయం చేసేందుకు మేం సిద్ధంగా ఉన్నా.. ఎవరూ నన్ను వినియోగించుకోవడం లేదు. ప్రమాదాల్లో పిల్లలు, గాయపడినవారు సకాలంలో సాయం చేసేవారు లేక ఇబ్బంది పడుతుంటారు. మా దగ్గరకు రండి.. సాయం పొందండి. నా గురించి చెబుతా వినండి..

భోగాపురంలో నిరుపయోగంగా ఎస్‌వోఎస్ బాక్సు

ఇక్కడుంటా..

జిల్లాలోని భోగాపురం మండలం రాజాపులోవ కూడలి నుంచి పూసపాటిరేగ మండలం కందివలస 32 కి.మీ. జాతీయ రహదారికి ఇరువైపులా, ప్రతి రెండు కి.మీ. దూరంలో రోడ్డుపక్కన ఏర్పాటు చేశారు. ఈ రోడ్డుపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వాహన ప్రమాదాలు, అత్యవసర వైద్య సేవలు అవసరమైనా సాయం చేయడమే పని.

నా వల్ల ఉపయోగాలివీ..

★ ప్రమాదం జరిగినప్పుడు నా వద్ద ఉన్న ఎరుపు రంగు బటన్‌ను నొక్కితే సమీపంలోని టోల్ ప్లాజా కేంద్రానికి సమాచారం వెళ్తుంది. ★ అక్కడ నుంచి ప్రమాదం జరిగిన లొకేషన్ ఆధారంగా ఎన్‌హెచ్‌ఐ అధికారులు చేరుకుంటారు. ★ వారి సూచనలతో అంబులెన్స్, వైద్య సిబ్బందిని రప్పిస్తారు. ★ క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించి ఆసుపత్రికి తీసుకెళ్తారు. ★ అర్ధరాత్రి వేళ బండి మరమ్మతులకు గురైనా, వాహనంలో పెట్రోలు అయిపోయినా బటన్ నొక్కితే అవసరమైన సాయం చేస్తారు.

గుర్తుపట్టండిలా..

రోడ్డు పక్కన ఓ స్తంభానికి చిన్న ఇనుప పెట్టెల్లా(ఎస్‌వోఎస్ బాక్సులు) ఉంటా. ఎవరికైనా అత్యవసరమైతే.. నా(బాక్సులో)వద్ద ఉండే ఎరుపు రంగు బటన్‌ను నొక్కగానే ఎన్‌హెచ్‌ఐ కంట్రోల్ రూంకు సమాచారం పంపించి అంబులెన్స్, పెట్రోలింగ్ వాహనం వెంటనే వచ్చేలా చూస్తా.

అధికారులూ.. మా గురించి చెప్పండి

రహదారి భద్రత అంటే కేవలం వెడల్పు రోడ్లు, డివైడర్లు ఏర్పాటే కాదు. కల్పిస్తున్న భద్రత సదుపాయాలను ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలి. ఎస్‌వోఎస్ బాక్సులు ఎందుకు, ఎలా ఉపయోగించాలో సూచిక బోర్డుల ఏర్పాటు, అవగాహన కార్యక్రమాల ద్వారా వివరించండి.

బస్సులున్నాయ్.. బయలుదేరండి

శివరాత్రికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

న్యూస్‌టుడే, విజయనగరం అయ్యన్నపేట

శివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రత్యేక సర్వీసులను నడిపేందుకు ఆర్టీసీ సిద్ధమైంది. ఈనెల 15, 16 తేదీల్లో విజయనగరం నుంచి రామతీర్థం, ఎస్.కోట-పుణ్యగిరి, సన్యాసిపాలేనికి అదనపు బస్సులను కేటాయించింది. ఈ రూట్లలో 65 వాహనాలు తిప్పనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారిణి జి.వరలక్ష్మి వెల్లడించారు. మిగిలిన డిపోల నుంచి మరో 30 వరకు అందుబాటులో ఉంటాయన్నారు. రద్దీకి అనుగుణంగా మరిన్ని కేటాయిస్తామని చెప్పారు.

మార్గాలు ఇలా..

★ ఎస్.కోట డిపో నుంచి పుణ్యగిరికి 20, ధర్మవరం సన్యాసేశ్వరస్వామి ఆలయానికి అయిదు బస్సులు వెళ్తాయి.

★ విజయనగరం జిల్లా కేంద్రం నుంచి సుమారు 40 బస్సులు తిరుగుతాయి. శ్రీకాకుళం నుంచి రణస్థలం మీదుగా రామతీర్థానికి 20, పాలకొండ నుంచి రాజాం, చీపురుపల్లి మీదుగా మరో పది వెళ్తాయి.

శ్రీశైలానికి ప్రత్యేకం..: విజయనగరం నుంచి శ్రీశైలం ఆలయానికి ఈనెల 14న మధ్యాహ్నం 2.45 గంటలకు ఇక్కడి నుంచి సర్వీసు బయలు దేరుతుంది. దర్శనం అనంతరం మరుసటి రోజు విజయనగరం చేరుకుంటుంది. ఏపీఎస్ఆర్టీసీ వెబ్‌సైట్ లేదా కాంప్లెక్స్‌లోని టికెట్ కేంద్రం వద్ద బుకింగ్ చేసుకోవచ్చు. ఎక్కువ మంది ఉంటే మరొకటి ఏర్పాటు చేస్తారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా, సకాలంలో సర్వీసులు చేరేలా సిబ్బందిని నియమించామని వరలక్ష్మి వెల్లడించారు.

హెల్ప్ డెస్కులు..

పార్కింగ్ ప్రదేశాలు లేదా ఆలయ ప్రాంగణాల్లో హెల్ప్ డెస్కులను పెడుతున్నారు. మైక్ ద్వారా ప్రచారం చేస్తారు. ఎవరైనా తప్పిపోయినా.. ఏదైనా సమాచారం కావాలన్నా సులువుగా తెలుసుకోవచ్చు. జిల్లా అధికారులతో పాటు సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ సిబ్బంది, ట్రాఫిక్ కంట్రోలర్లు అందుబాటులో ఉండనున్నారు.

1000 మంది చుట్టేశారు

నగరంలో 140 చోట్ల తనిఖీలు

విజయనగరం జిల్లా కేంద్రం బుధవారం పోలీసుల గుప్పెట్లోకి వెళ్లిపోయింది. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 వరకు సుమారు 140 ప్రాంతాల్లో ఒకేసారి 1000 మంది సిబ్బంది ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వాహన పత్రాలు, రికార్డులు లేని, శబ్ద కాలుష్యానికి కారణమయ్యే వాహనాలను గుర్తించి, సీజ్ చేశారు. మైనర్ డ్రైవింగ్, శిరస్త్రాణం ధరించడంపై అవగాహన కల్పించారు. ఎస్పీ దామోదర్ కోట కూడలి, మూడులాంతర్లు, గంటస్తంభం తదితర ప్రాంతాల్లో పర్యవేక్షించారు. యువతతో మాట్లాడి, సూచనలు చేశారు. త్వరలో జిల్లాలో నో హెల్మెట్- నో పెట్రోల్ విధానాన్ని అమలు చేస్తామన్నారు. ఏఎస్పీ పి.సౌమ్యలత, డీఎస్పీలు ఆర్.గోవిందరావు, జి.భవ్యారెడ్డి, ఎస్.రాఘవులు, వీరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, విజయనగరం అయ్యన్నపేట

చికిత్స రోగులకేనా.. భవనానికి చేయరా?

బొబ్బిలి నియోజకవర్గం తెర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) భవనమిది. రూ.60 లక్షలతో నిర్మించిన దీన్ని 2000 సంవత్సరంలో ప్రారంభించారు. 18 పంచాయతీల పరిధి 32 గ్రామాలకు చెందిన ప్రజలు ఆరోగ్య సేవలు అందుకుంటున్నారు. రోజూ సగటున 70 మంది వస్తుంటారు. అలాంటిచోట భవనం దుస్థితి ఇది. ప్రస్తుతం ఓపీ గదిలో కిటికీలు, గోడలపై పెద్ద బీటలు వారడంతో సిబ్బంది, రోగులు ఆందోళన చెందుతున్నారు. వైద్యులుండే గది కూడా ఇలానే ఉండడంతో ఆసుపత్రి అభివృద్ధి నిధులతో బాగుచేస్తున్నారు. బయట గోడల పునాదుల వద్ద బీటలు భయం గొలుపుతున్నాయి. – న్యూస్‌టుడే, తెర్లాం

అగాధంగా మార్చేశారు.. అనుమతుల్లేవని వదిలేశారు!

చీపురుపల్లి పట్టణం మీదుగా వెళ్లే తోటపల్లి-గజపతినగరం పిల్ల కాలువ ఇది. కొన్నేళ్ల కిందట ఇలా తవ్వేసి వదిలేయడంతో ప్రమాదకరంగా మారింది. గజపతినగరం నియోజకవర్గానికి సాగునీటిని అందించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో నిధులు మంజూరు చేశారు. తరువాత వచ్చిన తెదేపా ప్రభుత్వం పనులు కొంతవరకు చేపట్టింది. వైకాపా ప్రభుత్వ హయాంలో అడుగు ముందుకు సాగలేదు. టెండర్లు సైతం రద్దు చేశారు. నాలుగేళ్ల కిందట జి.అగ్రహారం వద్ద కాలువలో పడి ఇద్దరు చిన్నారులు మృతిచెందారు. కాలువ పక్క నుంచి వెదుళ్లవలస రహదారిని కొత్తగా నిర్మించారు. ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఇరువైపులా తుప్పలు, డొంకలు పెరిగిపోయి అడవిలా మారింది. కనీసం ప్రమాద హెచ్చరిక బోర్డులు లేవు. విషయాన్ని గజపతినగరం బ్రాంచి కాలువ ఏఈ భరత్ దృష్టికి తీసుకెళ్లగా పనులు పూర్తికి ప్రతిపాదనలు పంపారని, అనుమతులు రావాల్సి ఉందన్నారు. – న్యూస్‌టుడే, చీపురుపల్లి

జ్ఞాపకాల మదిలో...

జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్యచ
తస్మాద పరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి

మీరు చూపిన ఆత్మీయత.. అనురాగం మా అభివృద్ధికి వేసిన పూబాట.. మీరు భౌతికంగా దూరమైనా మా చెంత ఉన్నట్లే ఉంది.. ఏమిచ్చి రుణం తీర్చుకోము మా యదలోతుల్లోని భావాలను అక్షరరూపంలో నివేదించడం తప్ప..

నిర్యాణం, వర్ధంతి, జయంతి

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి

ప్రకటనలపై జీఎస్‌టీ 5% శాతం అదనం

ఈనాడు ప్రకటనల విభాగం

9000866020, 8008597609

(c) eenadu

చెట్టెక్కిన మీటరు.. ప్రమాదాన్ని కనరు!



ఈ చిత్రంలో చూశారా... ఇదేదో ఓ ఇంటికి సంబంధించింది, వ్యవసాయ అవసరాలకో వ్యక్తులు ఏర్పాటు చేసుకున్న మీటరు బోర్డు కాదు.. ఓ గ్రామానికి తాగునీటిని సరఫరా చేసేందుకు ఓహెచ్ బోరు నుంచి ట్యాంకుకు నీరు ఎక్కించేందుకు విద్యుత్తు మోటారు కోసం ఏర్పాటు చేసిన మీటరు బోర్డు ఇది. పాచిపెంట మండలం దిగువ గొట్టూరు గ్రామం సమీపంలోని వాలయానికి కూత వేటు దూరంలో పదకొండు కోసం తెచ్చిన బోర్డు ప్యానెల్‌ను ఇలా ప్రమాదకరంగా చెట్టుకు కట్టేశారు. ఆ ప్రాంతంలోని రైతులు, కూలీలు అక్కడే సేదదీరుతారు. పంట కోస్తుంటారు. ఏం ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. దీనిపై విద్యుత్తుశాఖ జేఈ సింహాచలం వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా పరిశీలించి, వేరే చోట ఏర్పాటు చేస్తామన్నారు. – న్యూస్‌టుడే, పాచిపెంట

పైపు లీకైంది.. నీరు ఏరైంది!

విజయనగరం పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరా చేస్తున్న ముషిడిపల్లి తాగునీటి పైపులైనుకు బుధవారం కొండతామరాపల్లి కూడలిలో రంధ్రాలు ఏర్పడి లీక్ వడంతో నీరు వృథాగా పోతోంది. దీంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. పైపుల్లో వ్యర్థాలు కలవడంతో నీరు కలుషితమై రోగాల బారిన పడే ప్రమాదముందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగబాబు వద్ద ప్రస్తావించగా లీకులు అరికట్టేలా చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

తప్పని డోలీ మోత

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: గిరిశిఖర గ్రామాలకు రహదారుల నిర్మాణాలకు నిధులొచ్చినా... పనులు చేపట్టకపోవడంతో గిరిజనులకు డోలీ మోతలు తప్పడం లేదు. వృద్ధుడు కాలినొప్పితో బాధపడుతుండటంతో బంధువులు డోలీ కట్టి కాలినడకన ఆసుపత్రికి తీసుకెళ్లిన ఘటన ఎస్.కోట పట్టణ శివారు గిరిశిఖర రేగ పుణ్యగిరి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన 64 ఏళ్ల గెమ్మెల సొంబకు కొన్ని రోజుల కిందట కాలు ముడుకుకు గాయమైంది. చీము పట్టి వాచిపోయింది. దీంతో నడవలేని స్థితికి చేరారు. ఆసుపత్రికి వెళ్లాలంటే గ్రామానికి రోడ్డు లేక వాహనాలు వచ్చే పరిస్థితి లేదు. దీంతో చేసేది లేక కుమారుడు, బంధువులు డోలీ కట్టి ఆరు కి.మీ. దూరం కాలినడకన అతన్ని మోసుకుంటూ ఎస్.కోటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందించారు. దీనిపై జనసేన పార్టీ నేత జకవర్ల నాయుడు వచ్చిన సర్పంచినాయుడు మాట్లాడుతూ ఇప్పటికే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచనలతో ప్రభుత్వం ఈ గ్రామానికి రోడ్డు నిర్మాణానికి ఏడాది కిందట రూ.4కోట్లు మంజూరు చేసిందన్నారు. కాంట్రాక్టరు, అధికారుల నిర్లక్ష్యంతో పనులు నిలిచాయన్నారు. దీంతో సమస్య తప్పడం లేదన్నారు. అధికారులు వెంటనే పనులు చేయకపోతే ఉప ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తామన్నారు.

గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధచూపాలి

మాట్లాడుతున్న పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధచూపాలని ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆడిటోరియంలో ఏటీడబ్ల్యూవోలు, హెచ్‌ఎంలు, సంరక్షకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి విద్యార్థి ఆరోగ్య సమాచారాన్ని సీహెచ్‌టీఎస్(ఆరోగ్య రక్షణ ట్రాకింగ్ సిస్టమ్) యాప్‌లో రోజూ ఇదే యాప్‌లో నమోదు చేయాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి వివరాలను ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. ప్రతి మూడు నెలలకు రక్త పరీక్షలు చేసి హిమోగ్లోబిన్ గుర్తించాలన్నారు. రక్తహీనత ఉన్న వారికి పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. సికిల్‌సెల్ ఎనీమియా బాధితులకు ప్రత్యేక వైద్య సదుపాయాలు, మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాబోయే 2027లో పదో తరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థుల కోసం ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకురాలు ఎ.విజయశాంతి, ఏటీడబ్ల్యూవోలు, హెచ్‌ఎంలు, వార్డెన్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

15 నిమిషాల్లో సమాచారం చేరాలి

★ ప్రతి రోజు ఉదయం 5.30 గంటలకు యోగా కార్యక్రమం, ప్రతి నెల విద్యార్థికి బ్యాటరీ పరీక్ష నిర్వహించాలి. వసతి గృహాలు, పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు, మరుగుదొడ్ల అవసరం ఉంటే అత్యవసరంగా చేయించాలి. పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. విద్యార్థుల ఆరోగ్యానికి తగిన ఉపాధ్యాయులే బాధ్యత వహించాలి. ★ అనుమతి లేని వ్యక్తులను, బయటి ఆహార పదార్థాలను పాఠశాలల ప్రాంగణంలోకి అనుమతించకూడదు. ★ ఏదైనా అత్యవసర పరిస్థితి లేదా, అవాంఛనీయ ఘటనలు జరిగినపుడు 15 నిమిషాల్లోపు ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలి.

సేవల్లో ఉత్తమం.. అందుకున్నారు పురస్కారం

విధి నిర్వహణతో గుర్తింపు సాధించిన రక్షణ అధికారులు

న్యూస్‌టుడే– బొబ్బిలి, కొత్తవలస

వృత్తిలో నిబద్ధత, నేరాల్ల నియంత్రణ, శాఖ ఆస్తుల రక్షణ, మాదక ద్రవ్యాలు, మానవ అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపడంలో ఉత్తమ ప్రతిభ చూపి.. ప్రశంసలు పురస్కారాలు అందుకున్నారు జిల్లాకు చెందిన రైల్వే భద్రత అధికారులు. బొబ్బిలిలో ఆర్‌పీఎఫ్‌లో సీఐగా పనిచేస్తున్న బీసీ పండా.. ఎస్సై డీఎం కృష్ణ రాష్ట్రపతి అవార్డులకు ఎంపికయ్యారు. గత నెల విశాఖలో జరిగిన గణతంత్ర వేడుకల్లో రైల్వే డీఆర్ఎం లలిత్ బోహ్రా, ఉన్నతాధికారుల నుంచి సత్కారాలు అందుకున్నారు. కొత్తవలస రైల్వేకు చెందిన ఏఎస్సై కిల్లి ఉమామహేశ్వరరావు రైల్వే జీఎం పరమేశ్వర్ ఫంక్వాల్ నుంచి 'విశిష్ట రైల్ సేవ పురస్కారం–2025' అందుకున్నారు.

ఉమా మహేశ్వరరావు పతకాలు

అంచెలంచెలుగా ఎదుగుతూ..

ప్రఫుల్ల చంద్ర పండా బొబ్బిలి సీఐగా విధులు నిర్వహిస్తున్నారు. 1989లో ఖుర్దా రోడ్డు డివిజన్‌లో కానిస్టేబుల్‌గా చేరారు. బొగ్గు, మానవ అక్రమ రవాణాతో పాటు అంతర్రాష్ట్ర చోరీల నిర్మూలనకు కృషి చేశారు. 2001లో బిలాస్‌పూర్‌లో ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు. గంజాయిని ఎగుమతి చేస్తున్న 30 మందిని అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించారు. 2019లో ఉద్యోగోన్నతిపై ఖుర్దా రోడ్‌లో సీఐగా వెళ్లారు. బొగ్గు అక్రమ మార్గంలో రవాణా చేస్తున్న 20 వాహనాలు సీజ్ చేసి, 60 మందిని అరెస్టు చేశారు. 2025 మార్చిలో బొబ్బిలి సీఐగా విధుల్లో చేరారు. బొబ్బిలి రైల్వే వంతెన దిగువ లైన్లకు సంబంధించి తీగల చోరీలో అంతర్రాష్ట్ర నిందితులను పట్టుకున్నారు

నేర పరిశోధనలో ప్రత్యేకత..

డి.వెంకట మురళీకృష్ణ బొబ్బిలి ఆర్‌పీఎఫ్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్నారు. 1995లో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. 2006లో హెడ్‌గా పదోన్నతి పొంది విశాఖ డివిజన్‌లో చేరారు. గంజాయి, మానవ అక్రమ రవాణా నిందితులను అరెస్టు చేశారు. రైళ్లలో బంగారం, నగదు చోరీలను నియంత్రించారు. బొగ్గు, గంజాయి రవాణాను నియంత్రించారు. బంగారం చోరీకి పాల్పడ్డ పలువుర్ని అదుపులోకి తీసుకుని, సుమారు 20 కేసులు రికవరీ చేశారు. 2017లో ఏఎస్సైగా ఉద్యోగోన్నతి అందుకున్నారు. 2024లో బొబ్బిలి వచ్చారు.

కానిస్టేబుల్ నుంచి..

శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి మండలం కూన జమ్మున్నపేటకు చెందిన ఉమామహేశ్వరరావు 2006లో ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరి, 2021లో ఏఎస్సైగా పదోన్నతి పొందారు. ప్రస్తుతం ఈస్ట్ కోస్ట్ రైల్వేలో సేవలందిస్తున్నారు. క్రీడల్లోనూ ప్రతిభ చాటుతూ ఎన్నో పతకాలు కైవసం చేసుకున్నారు. తల్లిదండ్రులు లక్ష్మీనారాయణ, వరహాలమ్మ. అన్నయ్య మన్మధరావు అనకాపల్లి జిల్లా రెవెన్యూ శాఖలో ఉన్నారు. ★ వివిధ చోరీ కేసుల్లో 75 మంది నిందితులు, నాలుగు ముఠాలను పట్టుకుని రూ.93.48 లక్షల విలువైన ఆస్తిని స్వాధీనం చేసుకున్నారు. ★ 35 మంది గంజాయి స్మగ్లర్లను అరెస్టు చేసి 582 కిలోల మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. ★ నార్కోటిక్స్ కేసుల్లో రూ.1.16 కోట్ల రికవరీ సాధించారు. ★ ఆపరేషన్ రైల్ ప్రహరీ కింద ఇద్దరు హత్య నిందితుల్ని పట్టుకున్నారు. * 12 మంది మానవ అక్రమ రవాణా బాధితుల్ని రక్షించారు.

పక్కాగా జాతర ఏర్పాట్లు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: మహాశివరాత్రి జాతర నేపథ్యంలో పుణ్యగిరి, సన్యాసయ్యపాలెంలో ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్ డి.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. దేవాదాయశాఖ ఈవో నాగేంద్ర, సాంబశివరావులు ఏర్పాట్ల వివరించారు. పుణ్యగిరిలో కొండ దిగువ నుంచి పైవరకు విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేశామన్నారు. భక్తుల కోసం తాత్కాలిక మరుగుదొడ్లు, స్నాన ఘాట్‌ల వద్ద మహిళలు దుస్తులు మార్చుకొనే గదులు నిర్మించామన్నారు. కూడళ్ల వద్ద బారికేడ్లు వేస్తున్నామన్నారు. సన్యాసయ్యపాలెంలో స్వామిని దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేశామని ఈవో తెలిపారు. భద్రతపై ఎస్సై చంద్రశేఖర్, బస్సులపై డీఎం సుదర్శనరావు వివరించారు.

జాతర ఏర్పాట్లుపై అధికారులతో సమీక్షిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	130	230	240

లక్ష్యం గురి తపొద్దు


ఏకే-47తో గురిపెడుతున్న ఎస్పీ దామోదర్

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: జిల్లాలో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులకు వార్షిక ఫైరింగ్ శిక్షణ బుధవారం సారిపల్లి ఫైరింగ్ రేంజ్ కేంద్రంలో జిల్లా ఎస్పీ ఎఆర్.దామోదర్ ఆధ్వర్యంలో కొనసాగింది. శిక్షణను ఆయన పర్యవేక్షించి మాట్లాడారు. పోలీసులు లక్ష్యం గురి తప్పకూడదన్నారు. అధికారుల నైపుణ్యం మెరుగుపర్చేందుకు ఏటా సాధన చేయాలన్నారు. ఒత్తిడిలోనూ లక్ష్యాన్ని ఛేదించాలన్నారు. అనంతరం ఎస్పీ పిస్టల్, గ్లాక్ పిస్టల్, ఏకే-47, ఎస్ఎల్ఆర్, ఎంకే-5, అలాగే ఎల్ఎంజీ వంటి అధునాతన ఆయుధాలతో ఫైరింగ్ సాధన చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ పి.సౌమ్యలత, డీఎస్పీ ఆర్.గోవిందరావు, ఎస్బీసీఐ లీలారావు, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు పాల్గొన్నారు.

జిందాల్ బినామీలకు మరోసారి నోటీసులు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: మండలంలోని బొడ్డవర ప్రాంతంలో జిందాల్ పరిశ్రమ భూసేకరణ వ్యవహారంలో 12 బినామీ లబ్ధిదారులకు అక్రమంగా అందుకున్న రూ.36.10 లక్షల పరిహారం చెల్లించాలంటూ తహసీల్దార్ డి.శ్రీనివాసరావు రెవెన్యూ రికవరీ(ఆర్ఆర్) యాక్టు కింద రెండోసారి నోటీసులు జారీ చేశారు. మంగళవారం వీఆర్వోలు 12మంది బినామీలకు వీటిని అందించాలని ఆదేశించారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ గతేడాది నవంబరులో మొదటగా ఇచ్చిన ఆర్ఆర్ యాక్టు నోటీసుపై 12 మంది తిరిగి సమాధానం ఇస్తూ ఏ ఆధారాలు కింద నోటీసులు ఇచ్చారో ఆ కాపీల ప్రతులు అందించాలని కోరుతూ లేఖ ఇచ్చారన్నారు. దీంతో సంబంధిత పత్రాలు జత చేస్తూ నోటీసు ఇచ్చామన్నారు. నోటీసు అందిన వారం రోజుల్లో తీసుకున్న పరిహారం తిరిగి ప్రభుత్వానికి చెల్లించాలని లేకపోతే రెవెన్యూ రికవరీ యాక్టు కింద మీ ఆస్తులను ఆటాచ్ చేస్తామని అందులో పేర్కొన్నామన్నారు. బినామీలకు అక్రమంగా పరిహారం చెల్లించారంటూ అప్పట్లో 'ఈనాడు'లో వెలువడిన కథనంతో ఇది వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. 12 మందికి రూ.36.10 లక్షలు చెల్లించినట్లు నిర్ధారించారు.

సీవోఈలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట ఐటీడీఏ పరిధిలోని మల్లి ప్రతిభా కళాశాల(పీవీటీజీ- బాలురు)లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతున్నట్లు పీవో పవర్ స్వప్నిల్ జగన్నాథ్ బుధవారం తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖ, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, తూర్పుగోదావరి, కాకినాడ, పశ్చిమగోదావరి, డా.బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన ఆదిమ గిరిజన విద్యార్థులు(పీవీటీజీ) దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. ఈ విద్యా సంవత్సరంలో పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరై ఉండాలని, తల్లిదండ్రుల సంవత్సర ఆదాయం రూ.లక్ష మించి ఉండకూడదన్నారు. ప్రవేశ పరీక్ష మెరిట్ మార్కుల ఆధారంగా సీట్ల కేటాయింపు జరుగుతుందన్నారు. ఎంపీసీ, బైపీసీ ఇంగ్లిష్ మీడియంలో వరుసగా 40, 40 సీట్లను భర్తీ చేయడం జరుగుతుందన్నారు. దరఖాస్తుకు మార్చి 4 చివరి తేదీ కాగా హాల్ టిక్కెట్లు 6వ తేదీ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, ప్రవేశ పరీక్ష మార్చి 8న సీతంపేట బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్ చూడాలని లేదా దగ్గర్లోని గిరిజన గురుకుల కళాశాలలు, ఐటీడీఏలోని గురుకులం సెల్‌కు సంప్రదించాలన్నారు.

'ఐటీ హబ్‌కు సాగు భూములు తీసుకోవద్దు'

హోంమంత్రి అనితకు వినతిపత్రం ఇస్తూ సమస్య వివరిస్తున్న బంగార్రాజు, రైతులు

భోగాపురం, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల పరిధిలో ఐటీ హబ్, జి-హబ్‌ల ఏర్పాటు కోసం సాగు భూములను ప్రభుత్వం తీసుకోకుండా చూడాలని రైతులు కోరారు. భోగాపురం, ముంజేరు, నందిగాం గ్రామాలకు చెందిన రైతులు బుధవారం అమరావతిలో మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు ఆధ్వర్యంలో హోంమంత్రి వంగలపూడి అనిత, ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావును కలిసి సమస్యలను వివరించారు. సాగు భూములు పరిశ్రమ అవసరాలకు తీసుకోవద్దని, వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాల జీవనోపాధి దెబ్బతింటుందని వేడుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రులు హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. నాయకులు సుభాషణరావు, శ్రీనివాసరావు, రాంబాబు, హరిబాబు ఉన్నారు.

మహారాజా ఆసుపత్రిని వైద్య కళాశాలకు తరలించాలి

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: విజయనగరంలోని మహారాజా ఆసుపత్రిలో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ పేర్కొన్నారు. మౌలిక సదుపాయాలు లేక, పడకలు సరిపోక వేదన అనుభవిస్తున్నారని చెప్పారు. ఇక్కడున్న కొన్ని విభాగాలను వెంటనే వైద్య కళాశాలకు తరలించాలని డిమాండు చేశారు. ఈమేరకు బుధవారం ఆసుపత్రి వద్ద నిరసన తెలిపారు. అక్కడున్న మదర్ థెరెసా విగ్రహానికి పూలమాలలు వేశారు. క్యాన్సర్ విభాగాన్ని మంజూరు చేసి, సేవలు అందించాలన్నారు. ఇప్పటికే ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులకు వినతిపత్రాలు అందజేసినట్లు గుర్తు చేశారు. నాయకులు రామచంద్రరాజు, పిడకల ప్రభాకరరావు, రామ్మోహన్‌రావు, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రి వద్ద నిరసన తెలుపుతున్న జిల్లా పౌరవేదిక సభ్యులు

ప్రమాదవశాత్తు చెరువులో పడి వృద్ధుడి మృతి

బాడంగి, న్యూస్‌టుడే: స్నానానికి దిగిన వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందిన ఘటన బాడంగి మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాలు ప్రకారం.. రావివలస గ్రామానికి చెందిన రేజేటి అప్పలస్వామి (75) తోటకు వెళ్లి, అక్కడి నుంచి ఉత్తరావల్లిలోని బంధువుల పండగకు వెళ్తానని మంగళవారం ఉదయం 10 గంటలకు బయలుదేరారు. తిరిగి ఇంటికి చేరలేదు. బంధువులను చరవాణిలో సంప్రదించగా.. అక్కడికి రాలేదని తెలిపారు. కుమారుడు అప్పారావు బుధవారం ఉదయం తోటకు వెళ్లి వెతికినా కనిపించలేదు. సమీపంలోని చెరువులో అప్పలనాయుడు మృతదేహం గుర్తించారు. ఒడ్డుపై దుస్తులు ఉంచి, స్నానానికి దిగడంతో ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెచ్‌సీ ప్రసాద్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి దుర్మరణం

మరొకరికి తీవ్ర గాయాలు

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన బుధవారం రాత్రి కురుపాం మండలంలో చోటుచేసుకుంది. నీలకంఠాపురం ఎస్సై నీలకంఠరావు వివరాల ప్రకారం.. కురుపాం మండలం గుజ్జువాయి పంచాయతీ శ్రీరాంపురం గ్రామానికి చెందిన బిడ్డిక సాయికుమార్(23) తన పెద్దమ్మ రాజమ్మతో కలిసి ద్విచక్ర వాహనంపై సీతంపేట మండలం మర్రిమానుగూడ వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా ధర్మలక్ష్మీపురం సమీపంలోని రహదారి మలుపు వద్ద వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో సాయికుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. రాజమ్మ తీవ్రంగా గాయపడింది. స్థానికులు నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

పైడితల్లి హుండీ ఆదాయం రూ.32.39 లక్షలు

కానుకలు లెక్కిస్తున్న దేవస్థానం సిబ్బంది, శ్రీవారి సేవా సంఘం సభ్యులు

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు విజయనగరం పైడితల్లి చదురుగుడి హుండీ ఆదాయాన్ని స్థానిక కల్యాణ మండపంలో బుధవారం లెక్కించారు. 90 రోజులకు గానూ రూ.32.39 లక్షల నగదు, 39.200 గ్రాముల బంగారం, 285 గ్రాముల వెండి సమకూరిందన్నారు. దేవస్థానం ఈవో కె.శిరీష, ధర్మకర్తలు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి

రామతీర్థంలో అధికారులతో చర్చిస్తున్న ఉత్సవ ప్రత్యేకాధికారిణి శోభారాణి

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: రామతీర్థంలో మహా శివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఉత్సవ ప్రత్యేకాధికారిణి శోభారాణి సూచించారు. బుధవారం ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. భక్తులకు స్నానాలు చేసేందుకు రామకోనేరు వద్ద ఘాట్‌లను సిద్ధం చేయాలన్నారు. క్యూలైన్లలో నిల్చున్న భక్తులకు షామియానాలు వేయాలని చెప్పారు. ఈవో వై.శ్రీనివాసరావు, ఆలయ అధికారులు, పాల్గొన్నారు.

విద్యార్థిని ఆచూకీ లభ్యం

అయ్యన్నపేట: విజయనగరంలోని ఓ బాలికల వసతిగృహంలో ఉంటూ ఈనెల 3న అదృశ్యమైన విద్యార్థిని ఆచూకీ ఎట్టకేలకు లభ్యమైంది. రేగిడి మండలంలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థిని(19) నగరంలోని కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్స్ మొదటి సంవత్సరం చదువుతోంది. చర్మ సంబంధిత చికిత్స కోసం వైద్యుల దగ్గరికి వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లిన ఆమె తిరిగిరాలేదు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. చరవాణి కాల్ డేటా ఆధారంగా విజయవాడలో ఓ అబ్బాయి(17)తో ఉన్నట్లు గుర్తించారు. అక్కడికి వెళ్లి తీసుకొచ్చామని, బుధవారం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు రెండో పట్టణ ఎస్సై ప్రమీలాదేవి తెలిపారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

మార్ట్గేజ్ లోన్స్, బిజినెస్, హౌసింగ్‌లోన్స్ మరియు రైస్‌మిల్ వారికి లోన్స్ చేయబడును. Cont: 7207307421.

WANTED

Do You Need a Staff for Business Hire with ease www.mrvijay.in HR Solutions ✆ 8309661801.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన
కేవలం 315 /-
(GST 5% అదనం)
మాత్రమే
సంప్రదించండి:
8008597609

REAL ESTATE

PLOT FOR SALE

వెల్లూరు 4 రోడ్ల జంక్షన్‌కు సమీపంలో VMRDA అప్రూవుడ్ లేఅవుట్‌లో Open ప్లాట్లు అమ్మకమునకు కలవు. పాత ధరలో ఇవ్వబడును. ✆ 8522811566.

JOBS

ప్రముఖ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో సిస్టం ఆపరేటర్స్, స్టోర్స్‌లో హెల్పర్స్ కావలెను. B.Tech / Dip., ITI, 10th- డిగ్రీ. ✆ 8019647888, 8341177761.

వైజాగ్ హాస్టల్‌లో పనిచేయుటకు క్లీనింగ్ స్టాఫ్ మగ పనివారు కావలెను. ఉచిత భోజనం, వసతి కల్పించబడును. ✆ 6300442703.

SECURITY GUARDS

వైజాగ్‌సిటీ, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో పనికొరకు సెక్యూరిటీగార్డ్స్, రూమ్, భోజనం, PF, ESI కలదు. జీతం: 20 వేలు, 36 వేలు. Ph.: 6300071128.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు. ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

శివరాత్రికి పూర్తిస్థాయిలో ఏర్పాట్లు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: శివరాత్రి పర్వదినాన భక్తుల తాకిడిని ముందుగానే అంచనా వేసి, తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి ఆదేశించారు. రామతీర్థం, పుణ్యగిరి, ధర్మవరం, పాల్తేరు, కోటిపల్లి తదితర శివాలయాలకు భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశముందన్నారు. ఈ నేపథ్యంలో జేసీ సేధు మాధవన్‌తో కలిసి బుధవారం రెవెన్యూ అధికారులు, ఎంపీడీవోలతో ఆన్‌లైన్‌లో మాట్లాడారు. ఉచిత బస్సులను ఎక్కువ మంది మహిళలు ఎక్కే అవకాశం ఉందని, తొక్కిసలాటలు జరగకుండా చూడాలన్నారు. ప్రైవేటు ఆలయాల్లో కమిటీలను అప్రమత్తం చేయాలని సూచించారు. కూడళ్లలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి, నిఘా పెట్టాలన్నారు. ★ విశాఖ ఎకనమిక్ రీజియన్ కార్యక్రమాలపై జిల్లాస్థాయి కమిటీని నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. జేసీ అధ్యక్షత వహిస్తారని, పరిశ్రమల శాఖ, కేన్ అధికారులు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సభ్యులుగా ఉంటారని, ముఖ్య ప్రణాళిక అధికారి మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

ఆధునికీకరణ సాగక.. అన్నదాత కన్నీరాగక!

గత ప్రభుత్వ తీరుతో కదలని కాలువల పనులు

న్యూస్‌టుడే, పాలకొండ

మూడు జిల్లాల రైతుల కల... దశాబ్దాలుగా సాగుతున్న పనులు.. గత తెదేపా ప్రభుత్వ హయాంలో ప్రారంభం.. తర్వాత వైకాపా పాలనలో అడుగులు పడని వైనం.. దీంతో ప్రస్తుత కూటమి ప్రభుత్వం రద్దు చేయాల్సి వచ్చింది. ఇదీ తోటపల్లి పాత ఆయకట్టు పరిధిలోని కుడి, ఎడమ కాలువల దుస్థితి. దీంతో భూములకు నీరందక రైతులు ఆవేదన చెందుతున్నారు.

ఆధునికీకరణ జరగాల్సిన కుడి ప్రధాన కాలువ

నిలిచిన నిర్వహణ నిధులు

ప్రస్తుతం కాలువ పరిధిలో నిర్వహణకు నిధులు నిలిచిపోయాయి. 2010కి ముందు ఏటా కాలువల నిర్వహణకు నిధులు రావడంతో అధికారులు ఖరీఫ్ ముందు పనులు చేపట్టేవారు. ఆధునికీకరణ ప్రతిపాదనతో ఈ కాలువలు మేజర్ ఇరిగేషన్‌లోకి చేర్చారు. అప్పటి నుంచి నిధులు రావడంలేదు. అటు ఆధునికీకరణ జరగక, ఇటు నిర్వహణ పనుల్లేక శివారు రైతులకు కన్నీరే మిగులుతోంది.

- ఎడమ కాలువ పరిధిలో సాగు విస్తీర్ణం: 33,101.99
- కుడి కాలువ పరిధిలో సాగు విస్తీర్ణం: 7941 ఎకరాలు

ఇదీ పరిస్థితి..

- పనులు: తోటపల్లి పాత ఆయకట్టు కాలువల ఆధునికీకరణ పనులు
- అంచనా : రూ.195 కోట్లు
- ప్రారంభం : 2018
- ఎడమ కాలువ పొడవు : 37 కి.మీ.
- జరిగిన లైనింగ్ : 17.5 కి.మీ.
- కుడికాలువ పొడవు : 17 కి.మీ.
- జరిగిన లైనింగ్ : 9.3 కి.మీ.

నెరవేరని రైతుల కల.. తోటపల్లి పాత ఆయకట్టు కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణ ప్రతిపాదన 20 ఏళ్లుగా ఉంది. 2010లో అప్పటి సీఎం రోశయ్య నవగాం వద్ద పనులకు శంకుస్థాపన చేశారు. జలయజ్ఞంలో ప్రాధాన్యతా క్రమం పనుల నుంచి ఆధునికీకరణ తొలగించడంతో ఆగిపోయాయి. తర్వాత తెదేపా హయాంలో 2018లో కాలువల పనులకు నిధులు విడుదలయ్యాయి. వైకాపా వచ్చాక అయిదేళ్లూ నాన్చారు. మొత్తం కాలువలు పూడికపోయాయి.

పెరిగిన అంచనా.. పనులు సకాలంలో జరగకపోవడంతో 2018లో రూ.195 కోట్ల అంచనాతో ఉన్న నిర్మాణ వ్యయం ప్రస్తుతం రూ.290 కోట్లకు చేరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. సీఎం చంద్రబాబుకు ప్రాధాన్యత వివరిస్తామని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తెలిపారు.

ఘనంగా పరదేశమ్మ జాతర

వేపాడ మండలంలోని చినగుడిపాలలో పరదేశమ్మ జాతర సందర్భంగా నిర్వహించిన ఎడ్ల పరుగు పోటీల్లో కేజేపురానికి చెందిన కొయిలాడ మోహన్ ఎడ్లు విజేతగా నిలిచి రూ.15 వేలు దక్కించుకున్నాయి. విజయనగరం, విశాఖ, అనకాపల్లి జిల్లాలకు చెందిన 18 ఎడ్లు పాల్గొన్నాయి. కేఎల్‌బీ పురం నుంచి వచ్చిన హేమతేజ ద్వితీయ(రూ.13 వేలు), లెక్కలవానిపాలెం నివాసి వెంకట కోమలి తృతీయ (రూ.12 వేలు) సాధించారు. మిగిలిన వారికి నగదు ప్రోత్సాహకాలు ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచి రామునాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, వేపాడ

(c) eenadu

బొబ్బిలి
● బొబ్బిలి ● రాజాం ● గజపతినగరం ● చీపురుపల్లి

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)
బొబ్బిలి - 80085 74367
గజపతినగరం - 80085 74332
రాజాం - 80085 74308
గరివిడి - 80085 74348

?: దాసరిపేట సమీపంలోని కూనేటి గెడ్డ వద్ద కాజ్‌వే పైనుంచి వరద ప్రవహిస్తోంది. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. వంతెన నిర్మించాలి. - **గ్రామస్థులు** ★ ఉన్నతాధికారులకు తెలియజేస్తాం. - **అజయ్‌భార్గవ్, జేఈ ఆర్‌అండ్‌బీ** – న్యూస్‌టుడే, దత్తిరాజేరు

?: రాజాం పట్టణంలోని పోలీస్‌స్టేషను ఎదురుగా కాలువలో చెత్త పేరుకుపోయింది. - **స్థానికులు** ★ తొలగింపజేస్తాం. - **ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్** – రాజాం పట్టణం

?: గొల్లలపాలెం రహదారి రాళ్లుతేలి అధ్వానంగా తయారైంది. - **స్థానికులు** ★ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. - **కృష్ణమూర్తి, పీఆర్ ఏఈ** – గంట్యాడ గ్రామీణం

?: రామభద్రపురం కనిమెరక వీధిలో కాలువలు లేవు. రోడ్డుపైకి నీరు వస్తోంది. - **స్థానికులు** ★ ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూస్తాం. కాలువలకు ప్రతిపాదిస్తాం. - **సూరిబాబు, ఈవో** – న్యూస్‌టుడే, రామభద్రపురం

?: లోతుగెడ్డ పంచాయతీ శివారు తోటవలస నుంచి ఆంధ్ర బస్టాండ్ వరకు రహదారి గుంతలతో రాళ్లుతేలి ఉంది. - **సోమయ్య** ★ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. రహదారి బాగుకు చర్యలు తీసుకుంటాం. - **గౌతమ్, ఎంఈవో** – న్యూస్‌టుడే, మెంటాడ

?: సంతకవిటి- రాజాం ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిలో నీరు నిలిచి ఉంది. గరికిపాడు వద్ద మడ్డువలస ఉపకాలువలో వస్తున్న సాగునీటిని రహదారి పైనుంచి పంట పొలాలకు మళ్లిస్తున్నారు. - **చోదకులు** ★ పరిశీలించి, చర్యలు తీసుకుంటాం. - **సతీష్‌కుమార్, ర.భ.శాఖ ఏఈ** – న్యూస్‌టుడే, సంతకవిటి

కూరగాయల ధరలు

రాజాం రైతుబజారులో బుధవారం కూరగాయల ధరలు (కిలో రూ.లలో).. ✦ టమాటా: 16 ✦ వంకాయలు: 26 ✦ దొండ: 40 ✦ బీర: 50 ✦ బెండ: 50 ✦ కాకర: 46 ✦ చిక్కుడు: 25 ✦ ఆనపకాయ (ఒకటి): 26 ✦ అరటి కాయలు (జత): 20 ✦ మునగ: 85 ✦ ఉల్లి: 28 ✦ బంగాళదుంపలు: 20 ✦ అల్లం: 80 ✦ వెల్లుల్లి: 120 ✦ పచ్చిమిర్చి: 70 ✦ క్యాబేజీ: 15/20 ✦ క్యారెట్: 42 – న్యూస్‌టుడే, రాజాం

ధూళి రేగుతోంది.. కంట్లో పడుతోంది

రేగిడి మండలం ఉంగరాడ మెట్ట కూడలి వద్ద ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. రహదారి పాడై అధ్వానంగా ఉంది. నిత్యం వాహనాలు తిరుగుతుంటాయి. ధూళి రేగి, వెనుక వచ్చే వాహనదారుల కళ్లల్లో పడుతోంది. దుకాణాల్లో నిండిపోతోంది. ఆరోగ్యానికి ప్రమాదకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడాదిగా ఇలానే ఉన్నా.. పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. విషయం ఆర్‌అండ్‌బీ జేఈ నాగభూషణరావు వద్ద ప్రస్తావించగా.. పది రోజుల్లో పనులు చేయిస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, రేగిడి

కలపకు కాళ్లు.. అధికారుల కళ్లకు గంతలు

న్యూస్‌టుడే – రాజాం గ్రామీణం, వంగర

విలువైన కలపకు కాళ్లు వస్తున్నాయి. అక్రమార్కులు ఇష్టారీతిన చెట్లను నరికి తరలిస్తున్నారు. పోలీసుస్టేషన్ల ముందుగానే వెళ్తున్నా.. రెవెన్యూ అధికారులు చూస్తుండగానే తరలిస్తున్నా.. నిమ్మకునీరెత్తినట్లు ఉంటున్నారు. దీంతో అక్రమార్కులు ఆడిందే ఆటగా కొనసాగుతోంది. రాత్రివేళల్లో ఇష్టమొచ్చినట్లు అతివేగంతో.. భారీ లోడ్లతో ట్రాక్టర్లు వెళ్తుండడంతో ప్రజలు హడలిపోతున్నారు. అసలే ఇరుకైన గ్రామీణ రహదారులు కావడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అటవీశాఖ అధికారుల పరిధిలోకి వస్తుందని రెవెన్యూ వాళ్లు తప్పించుకుంటున్నారు. అటవీశాఖ అధికారులు బొబ్బిలి నుంచి రావాలి. అసలు వారు వచ్చే దాఖలాలు లేవు.

పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం, గుమ్మలక్ష్మీపురం, ఖడ్గవలస నుంచి వంగర మీదుగా రాజాంలోని పలు కర్రల డిపోలకు రాత్రి వేళల్లో కలప చేరవేస్తున్నారు. వంగర మండలంలోని పలు గ్రామాల్లో చెట్లు ఇష్టారీతిన నరుకుతున్నారు. రాజాం మండలంలోని గ్రామాల్లో చెట్లు నరికి పట్టణ పరిధిలోని కర్రల డిపోలకు చేరవేస్తున్నారు. పర్యావరణానికి తీరని నష్టం కలిగిస్తున్నారు. దీంతో రానున్న రోజుల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది.

✦ రాజాం, వంగర మండలాల్లో నాలుగేళ్లలో ఒక్క కలప అక్రమ రవాణా కేసూ నమోదు కాలేదని అధికారులు చెబుతున్నారు. దీన్నిబట్టి పర్యవేక్షణ ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు.

వంగర: మద్దివలసలో రాత్రి సమయంలో ట్రాక్టర్‌తో తరలిస్తున్న కలప.

రాజాం: గార్రాజు చీపురుపల్లి వద్ద అక్రమంగా నిల్వ

నిబంధనలు పట్టించుకోరు..

కర్రల డిపోల వద్ద అటవీశాఖ అధికారుల అనుమతితో కర్రలు నిల్వ చేయాల్సిఉంది. కానీ నిబంధనలు పాటించడంలేదు. తమ అనుమతి లేకుండా ఉంచుతున్నారని తెలిసినా అధికారులు కావాలనే పట్టించుకోవడంలేదనే విమర్శలు వస్తున్నాయి. అక్రమార్కులతో సంబంధాలు ఉన్నాయని పలువురు వాపోతున్నారు. దీంతో టేకుతో పాటు మామిడి, పనస, మద్ది, వేప, తాటి తదితర కలప అక్రమ రవాణా జిల్లాలో అధికంగా జరుగుతోంది.

వాల్టా చట్టానికి తూట్లు..

వాల్టా చట్టం ప్రకారం.. ఎవరైనా చెట్టును నరకాలంటే.. ముందుగా తహసీల్దార్ అనుమతి తీసుకోవాలి. నరికిన చెట్టు ప్రాంతంలో కొత్త మొక్కను నాటాలి. దానిని సంరక్షించాలి. క్షేత్రస్థాయిలో చట్టాన్ని పట్టించుకోవడంలేదు. పర్యావరణానికి హాని కలిగిస్తున్నారు. అడ్డుకోవాల్సిన అటవీశాఖ అధికారులు ఎక్కడో ఉంటారు.

చర్యలు తీసుకుంటాం.. కలప అక్రమ రవాణా చేపడితే చర్యలు తీసుకుంటున్నాం. వాల్టా చట్టంలోని నిబంధనలు పక్కాగా పాటించాల్సిందే. ఎప్పటికప్పుడు తనిఖీలు చేపడతాం. కర్రల డిపోలపై నిఘా పెంచాం.
– ఆర్.కొండలరావు, జిల్లా అటవీశాఖ అధికారి

భూగర్భ వంతెన నిర్మించాలని వినతి

రైతులతో మాట్లాడుతున్న అధికారులు

గరివిడి, న్యూస్‌టుడే: గరివిడి మండలం కొండశంభాం రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం వద్దని, అండర్ గ్రౌండ్ వంతెన నిర్మించాలని రైతులు కోరారు. ఇక్కడ ఆర్వోబీ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ.. రైతులంతా కలెక్టర్ పీజీఆర్ఎస్‌లో వినతి ఇచ్చిన నేపథ్యంలో బుధవారం గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ జరిపారు. తహసీల్దారు బంగార్రాజు, ఆర్ఐ అచ్యుతరావుతో పాటు రైల్వే శాఖ సీనియర్ ఇంజినీరు పాల్గొన్నారు. భూగర్భ వంతెన నిర్మిస్తే భూములకు నష్టం ఉండదని రైతులు కోరారు. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని అధికారులు వివరించారు. జనసేన నేతలు వి.శ్రీనివాసరావు, జి.చిన్నంనాయుడు రైతులకు మద్దతుగా పాల్గొన్నారు.

సిబ్బంది లేరు.. సేవలు అందవు

బొబ్బిలి, న్యూస్‌టుడే: సచివాలయాల్లో అన్ని రకాల పౌర సేవలు అందిస్తున్నామని అధికారులు చెబుతున్నా కొన్నిచోట్ల అందని పరిస్థితి. కంప్యూటర్లు, ప్రింటర్లు పనిచేయకపోవడం, సిబ్బంది లేకపోవడంతో ప్రజలు విసిగిపోతున్నారు. పనిమీద వెళ్లేవారికి 'ఇక్కడ యంత్రాలు పనిచేయడం లేదు మీసేవా కేంద్రాలకు వెళ్లిపోండి.' అని చెబుతున్నారు. బొబ్బిలి పట్టణంలోని ఇందిరమ్మకాలనీ సచివాలయంలో ప్రింటర్ 15 రోజులుగా పనిచేయడం లేదు. కంప్యూటర్లలో ఒకటి మొరాయించింది. సచివాలయ కార్యదర్శి, కంప్యూటర్ ఆపరేటర్, అడ్మిన్ లేరు. దీంతో ప్రజలు మీసేవా కేంద్రాలకు వెళ్తున్నారు. విషయం ఇంతవరకు దృష్టికి రాలేదని, చర్యలు తీసుకుంటామని కమిషనర్ రామలక్ష్మి తెలిపారు.

ప్రభుత్వం దృష్టికి గిరిజనుల సమస్యలు

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: బొబ్బిలి మండలం కృపావలస, రామన్నవలస, దివెనవలస, సియోనువలస, చిన అక్కేనవలస గ్రామాల సమస్యలు పరిష్కరించాలని గిరిజనులు జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఆయన బుధవారం కృపావలసలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఆయా గ్రామాలను పంచాయతీలో విలీనం చేయాలని, విద్యుత్తు, తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

గడువులోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ఉగాది నాటికి గృహ ప్రవేశాలు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది, అసంపూర్తిగా నిలిచిపోయిన ఇళ్లు పూర్తిచేయాలని గృహ నిర్మాణశాఖ ఏఈ సూర్యనారాయణ, ఎంపీడీవో రవికుమార్ కోరారు. బుధవారం ఎం.బాగువలసలో లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. సచివాలయ ఇంజినీరింగ్ సహాయకుడు వెంకటరమణ పాల్గొన్నారు. ✦ రామభద్రపురం: తహసీల్దార్ రవి జాన్, గృహనిర్మాణశాఖ ఏఈ మద్ది వెంకటేష్ కోటశిర్లాం, పాడివానివలస, ముచ్చర్లవలస, చింతలవలసలో ఇళ్ల నిర్మాణాలు పరిశీలించారు.

యువత మెరిశారు.. నృత్యంతో ఆకట్టుకున్నారు

బాడంగి, న్యూస్‌టుడే: బాడంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఘనంగా జరిగింది. కళాశాల ప్రిన్సిపల్ విజయకుమారి, అధ్యాపకులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మంచి మార్కులతో ఉత్తీర్ణులై, ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

లబ్ధిదారులకు అవగాహన కల్పించాలి

రాజాం, న్యూస్‌టుడే: ఇళ్ల లబ్ధిదారులకు అవగాహన కల్పించి, ముందడుగు వేసేలా చర్యలు తీసుకోవాలని రాజాం పురపాలిక కమిషనర్ ఆకురాతి రామచంద్రరావు సిబ్బందికి సూచించారు. పురపాలిక కార్యాలయంలో గృహనిర్మాణ సంస్థ ప్రగతిపై స్వర్ణవార్డు, గృహ నిర్మాణ సంస్థ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. పట్టణ పరిధిలో 228 ఇళ్ల ఉగాది నాటికి గృహప్రవేశాలు చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటివరకు కేవలం 18 మాత్రమే పూర్తి కావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గృహనిర్మాణ సంస్థ ఏఈ బి.దుర్గారావు పాల్గొన్నారు.

బాలుడిని గాయపర్చిన వ్యక్తికి జైలు

దత్తిరాజేరు, గజపతినగరం, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనంతో బాలుడిని ఢీకొని గాయపర్చిన దత్తిరాజేరు మండలం ఎం.లింగాలవలస గ్రామానికి చెందిన కె.శంకరరావుకు గజపతినగరం మెదటితరగతి న్యాయమూర్తి విజయ్‌రాజ్‌కుమార్ ఆరు నెలల జైలు, రూ.1000 జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు ఇచ్చారని పెదమానాపురం ఎస్సై జయంతి తెలిపారు. 2021 ఏప్రిల్ 27న సాయంత్రం గడసాం గ్రామానికి చెందిన పల్లికల ధనుంజయ, తన అన్న కుమారుడు ప్రత్యూషవర్ధన్ కన్నాం గ్రామ సమీపంలోని మామిడి తోటకు వెళ్లారు. తోట సమీపంలో రహదారి పక్కన వ్యక్తిగత అవసరాలు తీర్చుకుంటుండగా కొల్లా శంకరరావు ద్విచక్రవాహనంపై వచ్చి ప్రత్యూషవర్ధన్‌ను ఢీకొట్టాడు. కాలికి తీవ్ర గాయమైంది. దీనిపై అప్పట్లో కేసు నమోదైందని, న్యాయమూర్తి బుధవారం తీర్పు ఇచ్చారన్నారు.

దుర్వాసన చెంత.. విద్యార్థులకు చింత

రాజాం మండలం కోఠారీపురం ప్రాథమికోన్నత పాఠశాల వద్ద మురుగు పేరుకుపోయి అధ్వానంగా దర్శనమిస్తోంది. దుర్వాసన భరించలేకపోతున్నామని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బడిలో ఉండలేకపోతున్నామని, గదుల్లోకి దోమలు వస్తున్నాయని వాపోతున్నారు. విషయం ఇన్‌ఛార్జి ఎంపీడీవో శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా.. మురుగు తొలగించేందుకు చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, రాజాం గ్రామీణం

రోడ్డుకు బీటలు.. ప్రయాణానికి పాట్లు

రామభద్రపురం మండలంలోని పాడివానివలస నుంచి కొత్తరేగకు వెళ్లే ప్రధాన రహదారి గుంతలుగా మారి ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. రోడ్డు మధ్యలో గోతులు ఏర్పడడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. సమస్యను పంచాయతీరాజ్‌శాఖ ఏఈ రమేష్ వద్ద ప్రస్తావించగా.. ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. – న్యూస్‌టుడే, రామభద్రపురం

అలరించిన సినీ సంగీత విభావరి

కార్యక్రమానికి హాజరైన ప్రేక్షకులు

గరివిడి, న్యూస్‌టుడే: ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి సందర్భంగా సహాయ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి గరివిడిలో సినీ సంగీత విభావరి నిర్వహించారు. ఉత్తరాంధ్రకు చెందిన 30 మంది గాయనీ గాయకులు నాడు-నేడు పేరిట పాత, కొత్త మధుర గీతాలను ఆలపించారు. ✦ చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఘంటసాల సంగీత ప్రస్థానాన్ని కొనియాడారు. ఇండిగో ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమ గర్భాం యూనిట్ హెడ్ వి.గోపి, కొండపాలెం (గరివిడి) మేజరు పంచాయతీ ఉప సర్పంచి బి.కార్తీక్, సహాయ్ సంస్థ అధ్యక్షుడు యు.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కూలకముందే కూల్చేయండి

రాజాం మండలం సోపేరులో రక్షిత మంచినీటి పథకం శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. ప్రాథమిక పాఠశాల పక్కనే ఉండటంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సమస్యను ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జగన్‌మోహన్ వద్ద ప్రస్తావించగా.. తొలగించేందుకు చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, రాజాం గ్రామీణం

ఎన్‌జీఆర్ పురంలో అగ్నిప్రమాదం

గజపతినగరం: ఎన్‌జీఆర్‌పురం గ్రామంలో బుధవారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఇంటి సత్తారావుకు చెందిన నాలుగు క్వింటాళ్ల ధాన్యం, 6 ట్రాక్టర్ల గడ్డివాము దగ్ధమయ్యాయి. గజపతినగరం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఆస్తి నష్టం అంచనా వేసి, నివేదిక అధికారులకు అందిస్తామని వీఆర్వో హరిబాబు తెలిపారు. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదన్నారు.

గ్రామ కమిటీలతో పార్టీ బలోపేతం

చీపురుపల్లి గ్రామీణం: గ్రామ కమిటీలతో పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని వైకాపా నాయకురాలు బొత్స అనూష కోరారు. కరకాం పంచాయతీలో బుధవారం మన కార్యకర్త- మన కుటుంబం కార్యక్రమం నిర్వహించారు. కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. నాయకులు ఐ.అనంతం, వి.శ్రీనివాసనాయుడు, ఎం.వరహాలనాయుడు పాల్గొన్నారు.

ఘంటసాలకు నివాళి

బొబ్బిలి: ఘంటసాల వర్ధంతి సందర్భంగా బుధవారం రాత్రి బొబ్బిలి కళాభారతి ఆడిటోరియంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కళాభారతి నిర్వాహకుడు నంబియార్ వేణుగోపాలరావు, ఆనంద్‌బ్రహ్మ అకాడమీ అధ్యక్షుడు ఎం.విజయమోహనరావు, గాయకుడు అప్పారావు, యూటీఎఫ్ నాయకులు విజయగౌరి, పుల్లెల శ్రీనివాసరావు ఘంటసాల చిత్రపటానికి నివాళులర్పించారు. 15 మంది గాయకులు ఘంటసాల పాటలను పాడారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

మెంటాడ: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, వాటిని ప్రోత్సహించినవారు, తల్లిదండ్రులు శిక్షార్హులని ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు లక్ష్మి, రాధిక అన్నారు. బుధవారం మెంటాడలోని బాలికలకు అవగాహన కల్పించారు. ✦ గుర్ల: మహిళా శిశు సంక్షేమ శాఖ బాలల రక్షణ విభాగం, మిషన్ వాత్సల్య భాగస్వామ్యంతో జెజ్జిపురం యూత్ క్లబ్ బాల్యవివాహ ముక్త్ భారత్ ప్రచార రథం ద్వారా గుర్ల ఉన్నత పాఠశాల వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గరివిడి సీడీపీవో ఎస్.ఆరుద్ర పాల్గొన్నారు.

సోలార్ వాటర్ హీటర్ల మంజూరు

మెంటాడ: మెంటాడలో 240 మంది విద్యార్థినులున్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి ప్రభుత్వం నాలుగు సోలార్ హీటర్లు సరఫరా చేసిందని విద్యాలయ ప్రత్యేకాధికారిణి శారద తెలిపారు. అమర్చాల్సి ఉందన్నారు.

హెచ్చరిస్తేనే ప్రమాదాలు ఆగేది

బొబ్బిలి మండలం చింతాడ, కలవరాయి, కోమటిపల్లి గ్రామాల వద్ద ఏర్పాటు చేసిన ప్రమాద హెచ్చరిక బోర్డులు పాడైపోయాయి. వీటిని పెట్టి ఏళ్లు గడవడంతో ఇనుప రాడ్లు మాత్రమే మిగిలాయి. ప్రస్తుతం ప్రమాదాలు జరుగుతున్నాయని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను ఏఈ రాజు వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి కొత్తవి ఏర్పాటు చేస్తామన్నారు. – న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం

శ్మశానానికి దారి చూపండి

రాజాం పట్టణంలోని తిమ్మయ్యపేటలో శ్మశానవాటికకు దారి లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. పొలాల మధ్యలో ఉండడంతో వర్షం పడితే వెళ్లలేని పరిస్థితి. బురదతో తీవ్ర ఇబ్బందులు పడుతుంటామని వాపోతున్నారు. చర్యలు తీసుకుంటామని కమిషనర్ రామచంద్రరావు అన్నారు. – న్యూస్‌టుడే, రాజాం పట్టణం

శుద్ధజలం.. సుదూరం

న్యూస్‌టుడే– రామభద్రపురం, రేగిడి, చీపురుపల్లి, గ్రామీణం, బొబ్బిలి, సంతకవిటి

ప్రభుత్వ బడులు, వసతి గృహాల విద్యార్థులకు శుద్ధజలం కరవవుతోంది. యంత్రాలు ఉన్నా.. దిష్టిబొమ్మలా మారాయి. మరమ్మతులకు గురై ఏళ్లు గడుస్తున్నా.. పట్టించుకునే నాథుడే లేడు. కొన్నిచోట్ల బయట నుంచి తీసుకొచ్చిన డబ్బాలు పెట్టినా.. చాలావరకు బోర్లు, కుళాయిలపైనే ఆధారపడాల్సిన దుస్థితి. కొంతమంది ఇళ్ల నుంచి సీసాలు తీసుకొస్తున్నారు. చాలామంది శుద్ధిలేని బోర్ల నీరు తాగుతున్నారు.

తెర్లాం: యంత్రానికి తాళం

ఇదీ పరిస్థితి..

రామభద్రపురం కనిమెరక వీధిలోని ప్రాథమిక పాఠశాలలో 27 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఏడాదిగా నీటిశుద్ధి యంత్రం మూలన ఉంది. సీసాలతో ఇంటి నుంచి తెచ్చుకుంటున్నారు. ● రేగిడి మండలం ఖండ్యాం ఉన్నత పాఠశాలలో 120 మంది చదువుతున్నారు. యంత్రం వినియోగంలో లేదు. మోటారు బావిపై ఆధారపడుతున్నారు. ● చీపురుపల్లి పట్టణం వంగపల్లి పేట ప్రాథమిక పాఠశాలలో నాడు- నేడు కింద ఏర్పాటు చేసిన శుద్ధజల ప్లాంటు ఏడాది కాలంగా పనిచేయడంలేదు. పాఠశాలలో 95 మంది విద్యార్థులు ఉన్నారు. ఏజెన్సీ సిబ్బంది వచ్చి మరమ్మతు చేశాక రెండు రోజులు పనిచేసి, మళ్లీ మూలకు చేరుతోంది.

సంతకవిటి ప్రాథమిక పాఠశాలలో 48 మంది విద్యార్థులు చదువుతున్నారు. గ్రామానికి సరఫరా చేస్తున్న వీధి కుళాయి నుంచి ప్రత్యేకంగా పైపులైను వేసి ట్యాప్ అమర్చారు. ఈ నీరే తాగుతున్నారు. కొంతమంది ఇంటి నుంచి తెచ్చుకుంటున్నారు.

బొబ్బిలి పట్టణంలోని తారకమరామకాలనీ పురపాలక డీపీఈపీ పాఠశాలలో 45 మంది చదువుతున్నారు. ప్లాంటు గోడకు దిష్టిబొమ్మలా ఉంది. పురపాలిక కుళాయి నీటిని పిల్లలు వినియోగిస్తున్నారు. కాలనీలోకి ట్యాపు నుంచి వచ్చిన నీటిని డబ్బాల్లో ఉంచారు. వాటిని సీసాలతో పట్టుకుని తాగుతున్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

గరివిడి, న్యూస్‌టుడే: గ్రామ సచివాలయాల ఉద్యోగులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని చీపురుపల్లి డీడీవో హేమసుందర్ అన్నారు. బుధవారం కొండపాలెం(గరివిడి) ఒకటో సచివాలయాన్ని సందర్శించారు. ఇంటి పన్ను వసూళ్లు, కుటుంబ సర్వే తీరు, పిల్లలకు వైద్యసిబ్బంది ఇంజక్షన్లు వేసే కార్యక్రమం పరిశీలించారు. ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, ఈవోపీఆర్డీ పుష్పాంజలి, ఈవో వేణుగోపాల్ పాల్గొన్నారు.

మహిళా రైతు సంఘాల బలోపేతానికి కృషి

మాట్లాడుతున్న ఎంపీడీవో సురేష్

చీపురుపల్లి, న్యూస్‌టుడే: డ్వాక్రా సంఘాల తరహాలో మహిళా రైతు సంఘాలను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని చీపురుపల్లి ఎంపీడీవో ఐ.సురేష్ అన్నారు. బుధవారం మండల సమాఖ్య భవనంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. మహిళా రైతు సంఘాలకు వ్యవసాయం చేయడానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందిస్తున్నట్లు తెలిపారు. సమీకృత వ్యవసాయ విధానం ద్వారా అధిక ఆదాయం వచ్చే ఉద్యాన పంటల వైపు దృష్టి సారించాలని సూచించారు. వెలుగు ఏపీఎం ఎన్.అప్పలనాయుడు, గ్రామీణ ఉపాధిహామీ పథకం ఏపీవో ఆదిబాబు, సీసీలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలపై సమీక్ష.. చీపురుపల్లి: మండలంలోని గృహనిర్మాణాల ప్రగతిపై మండల ప్రత్యేకాధికారిణి, డిప్యూటీ కలెక్టరు రాజేశ్వరి బుధవారం సమీక్షించారు. ఇళ్లను త్వరితగతిన పూర్తిచేసేలా దృష్టి సారించాలన్నారు. డీడీవో హేమసుందర్, ఎంపీడీవో సురేష్, గృహనిర్మాణశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

బొబ్బిలి గ్రామీణం: ఉద్యోగుల సమస్యలపై యూటీఎఫ్ ఆధ్వర్యంలో పోస్టుకార్డు ఉద్యమం చేపడుతున్నారు. సమస్యలను తెలియజేస్తూ సీఎంకు పోస్టు కార్డులు రాశారు. వాటిని బుధవారం మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో ప్రదర్శించారు. యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు విజయగౌరి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధం కావాలి

బాడంగి: స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీ బలోపేతానికి గ్రామ కమిటీలు ఏర్పాటు చేయాలని మాజీ ఎమ్మెల్యే శంబంగి చిన్నఅప్పలనాయుడు అన్నారు. బాడంగిలో వైకాపా మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. జడ్పీటీసీ పెద్దింటి రామారావు, తెంటు మధు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా

గంట్యాడ గ్రామీణం: గంట్యాడ మండలంలోని కొటారుబిల్లిలో గురువారం నుంచి యూరియా విక్రయాలు చేపడుతున్నట్లు మండల వ్యవసాయాధికారి శ్యామ్‌కుమార్ తెలిపారు. గంట్యాడ వ్యవసాయ కార్యాలయంలో మాట్లాడారు. రైతులంతా తమ ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకాల నకలు తీసుకురావాలన్నారు. ఎవరైనా అధిక ధరలకు విక్రయిస్తే ఫిర్యాదు చేయాలని తెలిపారు.

కర్లాం భూవివాదంపై విచారణ

చీపురుపల్లి గ్రామీణం: చీపురుపల్లి మండలం కర్లాంలో నెలకొన్న భూ వివాదంపై ఇన్‌ఛార్జి ఆర్డీవో ప్రమీలాగాంధీ బుధవారం తన కార్యాలయంలో విచారణ చేపట్టారు. సర్వే నంబరు 76లో ఉన్న భూములు తమ పూర్వీకుల పేరుతో రిజిస్టర్ అయ్యాయంటూ కర్లాం గ్రామానికి చెందిన రైతులు శనపతి సూర్యనారాయణ, కొమ్మాన వీరభద్రుడు, మోదుగులపేట గ్రామానికి చెందిన బాలి రామినాయుడు తెలిపారు. ఆ భూములు తమపేరున వారసత్వపరంగా ఉన్నాయని శిరువూరి సూరీడమ్మ కుమార్తె గొట్టిముక్కల నాగమణి చెప్పారు. రెండు వర్గాలకు చెందిన సదరు భూపత్రాలను పరిశీలించి, వాదనలు నమోదు చేశారు. చీపురుపల్లి తహసీల్దారు సి.ధర్మరాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ వితరణ

రేగిడి: రేగిడి మండలం అంబకండి మోడల్ ప్రాథమిక పాఠశాలకు రూ.16 వేలు విలువైన ప్రింటర్‌ను గ్రామానికి చెందిన పలువురు ఉద్యోగులు బుధవారం వితరణగా అందజేశారు. ఎంఈవో చేతులమీదుగా ప్రారంభించారు. దాతలు ఎం.రామకృష్ణ, ఎన్.విష్ణుమూర్తి, ఎన్.పాపినాయుడు, మారుతీ, మురళీకృష్ణ, ఎ.శ్రీనివాసరావు, అశోక్‌కుమార్, అచ్యుతరావు పాల్గొన్నారు.

విద్యుత్తు ఇబ్బంది తీరుస్తాం

గంట్యాడ గ్రామీణం: మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్తు సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని ఏఈ శ్రీనివాసరావు అన్నారు. లక్కిడాంలో పర్యటించి, సమస్యలు గుర్తించారు.

కూటమి ప్రభుత్వంతో అభివృద్ధి

వంగర: కూటమి ప్రభుత్వంతో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని జనసేన రాష్ట్ర ప్రచారకమిటీ సంయుక్త కార్యదర్శి పొగిరి సురేష్‌బాబు అన్నారు. బుధవారం నీలయ్యవలస గ్రామాన్ని సందర్శించి, కార్యకర్తలతో మాట్లాడారు. సమస్యలు తెలుసుకున్నారు. నీలయ్యవలస, బాగెంపేట గ్రామాల నుంచి అరసాడ వరకు రహదారి గుంతలతో అధ్వానంగా ఉందని, బాగుచేయాలని స్థానికులు వినతిపత్రం అందించారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

వంగర: విద్యార్థులు పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని అంబేడ్కర్ గురుకులాల జిల్లా సమన్వయకర్త ఎం.మాణిక్యం అన్నారు. మద్దువలస అంబేడ్కర్ గురుకులాన్ని సందర్శించి, విద్యార్థుల విద్యా ప్రమాణాలు పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు.

(c) eenadu

విజయనగరం

• విజయనగరం • నెల్లిమర్ల • ఎస్.కోట

తెరపై ఈనాడు

✦ ఎస్వీఎస్: **ఆరెంజ్, యుఫోరియా** ✦ శ్రీకృష్ణ: **అనగనగా ఒక రాజు** ✦ ఆదిత్య: **నారీ నారీ నడుమ మురారి** ✦ లీలామహల్: **బరాబర్ ప్రేమిస్తా** ✦ రంజనీ స్క్రీన్-1: **మన శంకరవరప్రసాద్‌గారు** ✦ శివరంజనీ స్క్రీన్-2: **ఆపరేషన్ పద్మ, యుఫోరియా, బరాబర్ ప్రేమిస్తా** ✦ హిమగిరి: **మన శంకరవరప్రసాద్‌గారు** ✦ సప్తగిరి: **విత్ లవ్.** – న్యూస్‌టుడే, కంటోన్మెంట్

ఇంటింటికీ పథకాలు

విజయనగరం గ్రామీణం: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేరవేయాలని తెదేపా సీనియర్ నాయకుడు గంటా పోలినాయుడు, ఎంపీటీసీ సభ్యుడు వేచలపు శ్రీనివాసరావు కోరారు. బుధవారం విజయనగరం మండలం రాకోడులో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలన్నారు.

చికిత్సకు ముందే కష్టం

వీల్‌చైర్లు లేక రోగులకు అవస్థ

'నగరానికి చెందిన ఓ వృద్ధుడు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. వయోభారం కారణంగా నడవలేరు. తన కుమారుడి సాయంతో ఇటీవల ఆటోలో మహారాజా ఆసుపత్రికి వెళ్లారు. ఆయన్ను తీసుకెళ్లేందుకు వీల్‌చైర్ లేదు. సిబ్బందీ కానరాలేదు. దీంతో నడిపించే అన్ని విభాగాలకూ తిప్పారు'

వృద్ధురాలిని నడిపిస్తున్న మనవడు

- న్యూస్‌టుడే, విజయనగరం అయ్యన్నపేట

విజయనగరంలోని మహారాజా ఆసుపత్రిలో రోగులు అష్టకష్టాలు పడుతున్నారు. వీల్‌చైర్లు లేకపోవడంతో దివ్యాంగులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులకు అవస్థలు తప్పడం లేదు. అత్యవసర విభాగం, ఓపీ, శస్త్రచికిత్స విభాగం.. తదితర ప్రాంతాల్లో తప్పనిసరిగా ఉండాలి. ఈమేరకు సిబ్బందిని నియమించాలి. కానీ కానరావడం లేదు. స్ట్రెచర్లదీ అదే పరిస్థితి.

ఉన్నది 32 మాత్రమే..

రోజూ 1600 వరకు ఓపీ నమోదవుతుంటుంది. 700 మంది వరకు ఇన్‌పేషెంట్లు ఉంటారు. కీళ్ల నొప్పులు, కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్థులు ఎక్కువగా వస్తుంటారు. బాధితుల కోసం కేవలం 32 వీల్‌చైర్లు మాత్రమే ఉండడం గమనార్హం. అవైనా అత్యవసర విభాగం వద్దే ఎక్కువగా ఉన్నాయి. మిగిలిన విభాగాల్లో కనిపించడం లేదు. 635 పడకలుండగా.. 15 స్ట్రెచర్లు మాత్రమే అందుబాటులో ఉంచారు. ఇవి ఏ మూలకూ సరిపోని దుస్థితి.

మందులంటే శ్రమే..

ఓపీ కోసం గంటల పాటు నిల్చుంటున్నారు. అనంతరం వైద్యుల దగ్గర సుమారు మూడు గంటల వరకు సమయం పడుతోంది. హమ్మయ్య అనేసరికి.. మందుల విభాగం వద్ద వందల మంది కనిపిస్తున్నారు. ఇంతపెద్ద వైద్యాలయం(ఘోషాసుపత్రితో కలిపి)లో ఫార్మసీ అధికారితో కలిసి 13 మంది సిబ్బందే ఉన్నారు. మరో కౌంటర్ అవసరమైనా చర్యల్లేవు.

నిరుపయోగంగా వీల్‌చైర్లు, స్ట్రెచర్లు

అంతటా వసూళ్లు.. పలు విభాగాల వద్ద సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వీల్‌చైర్లు, స్ట్రెచర్లు, రోగులను తరలించే వారు డబ్బులు డిమాండు చేస్తున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. డిశ్చార్జి సమయంలోనూ నగదు అడుగుతున్నారని సహాయకులు పేర్కొంటున్నారు. ఇటీవల చింతలపేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి ఈ పరిస్థితి ఎదురైంది.

చర్యలు తీసుకుంటాం..

ఓపీ విపరీతంగా పెరిగిపోవడంతో సమస్య ఎదురవుతోంది. అవసరమైన ప్రాంతాల్లో వీల్‌చైర్లు, స్ట్రెచర్లు అందుబాటులో ఉంచాం. రోగులకు అండగా నిలవాలని సిబ్బందికి సూచించాం. ఎవరైనా వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవు. నేరుగా ఫిర్యాదు చేయొచ్చు' అని సూపరింటెండెంట్ పద్మజ తెలిపారు.

విద్యార్థులకు.. రోజూ నీటి పరీక్షే!!

విజయనగరం మయూరికూడలి, న్యూస్‌టుడే: వసతిగృహాల్లో తాగునీటి సదుపాయం లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. నగరంలోని కేంద్రాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తోంది. ● రింగురోడ్డులోని ఓ అద్దె భవనంలో కొనసాగుతున్న ఎస్టీ కళాశాల(బాలికలు) వసతి కేంద్రంలో 187 మంది ఉన్నారు. ప్లాంటు లేకపోవడంతో స్టీల్ డబ్బాల్లో నగరపాలిక కుళాయి నీటిని పట్టుకుంటున్నారు. బయట నుంచి నీళ్ల క్యాన్లను తెచ్చుకునే సదుపాయం లేదని విద్యార్థినులు వాపోతున్నారు. ఈ భవనానికి నెలకు అద్దె రూపంలో రూ.75 వేలు ఇస్తున్నారు. ● సుంకరవీధిలో ఎస్సీ బాలికల కళాశాల వసతి కేంద్రాలు రెండు ఉన్నాయి. ఒకచోట మాత్రమే శుద్ధి కేంద్రాన్ని వినియోగిస్తున్నారు. రెండోది మూలకు చేరింది. ● నగరపాలిక పరిధిలో 20 వరకు వసతిగృహాల్లో సగం చోట్ల ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

నటరాజ్‌కాలనీ కేంద్రంలో నీటిని ఇలా స్టీల్ డబ్బాల్లో పట్టుకుంటున్నారు..

శృంగవరపుకోట: ఎస్.కోట మండలంలోని 35 పాఠశాలల్లో నీటి శుద్ధి యంత్రాలుండగా 11 చోట్ల మూలన పడ్డాయి. మూలబొడ్డవర, అమ్మపాలెం, ఎస్.కోట ప్రాథమిక, వీరనారాయణం జడ్పీ పాఠశాలల్లో ఇంతవరకు ఏర్పాటు చేయలేదు. ● ఎస్.కోట జడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఆరు నెలల నుంచి పని చేయడం లేదు. ఇక్కడ 406 మంది విద్యార్థినులున్నారు. వీరంతా ఇంటి నుంచి సీసాలతో నీరు తెచ్చుకుంటున్నారు. ● నాలుగేళ్లుగా శ్రీనివాసాకాలనీ పాఠశాలలో నీటిశుద్ధి యంత్రం పనిచేయడం లేదు. సమస్య ఉంటే 'మన బడి-మన భవిష్యత్తు' యాప్‌లో నమోదు చేయాలని, పది యంత్రాలకు టెక్నీషియన్ వచ్చి మరమ్మతు చేస్తారని ఎంఈవో నర్సింగరావు తెలిపారు.

ఎస్.కోట మండల కేంద్రంలోని శ్రీనివాసాకాలనీ ప్రాథమిక పాఠశాలలో నాలుగేళ్లుగా నిరుపయోగంగా నీటిశుద్ధి యంత్రం

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని రామతీర్థం ఎస్సీ వసతి గృహంలోని ప్లాంటు మరమ్మతులకు గురవడంతో బాలలు బోరు నీటిపై ఆధారపడుతున్నారు. మొయిద, అలుగోలు, బొప్పడాం గ్రామాల్లోని బీసీ వసతి కేంద్రాలకు ప్లాంట్లు మంజూరు కాక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. సంక్షేమాధికారి చంద్రునాయుడు మాట్లాడుతూ మరమ్మతులు చేయాలని ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. ● నెల్లిమర్లలోని జ్యోతిబా పులే మత్స్యకార వసతిగృహంలో 289 మంది చదువుతుండగా, ఇప్పటికీ ప్లాంటు బిగించలేదు. దీనిపై ప్రిన్సిపల్ కవితను వివరణ కోరగా ఇటీవలే మంజూరైందని, త్వరలో అమరుస్తామన్నారు.

? పినవేమలి వెళ్లే మార్గంలో వీధి దీపాలు లేవు. - **స్థానికులు** ● పరిశీలించి కొత్తవి ఏర్పాటు చేస్తాం. - **జి.వెంకటరావు, ఎంపీడీవో**

– న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

విజయనగరం పట్టణం	80089 02900
విజయనగరం గ్రామీణం	80085 74317
ఎస్.కోట	80085 74326
భోగాపురం	70959 54646

నూతన ఆవిష్కరణలు అవసరం

మాట్లాడుతున్న యోగీశ్వరరావు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: విద్యార్థులు నూతన ఆవిష్కరణల దిశగా ముందుకెళ్లాలని, అవి సమాజానికి ఉపయోగపడాలని హైదరాబాద్‌లోని కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్యుడు డా.డి.యోగీశ్వరరావు పేర్కొన్నారు. నగరంలోని కేంద్రీయ విశ్వవిద్యాలయంలో 'బయోటెక్నాలజీలో అకడమిక్ పరిశ్రమల వేగం' అంశంపై బుధవారం నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. పరిశోధన, ఆవిష్కరణ, వ్యాపారోన్నతి తదితర అంశాలపై పట్టు సాధించాలన్నారు. స్టార్టప్‌ల ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఇన్నొవేషన్ సంస్థ సంచాలకుడు ఆచార్య రాజిరెడ్డి ఇంక్యుబేషన్ కేంద్రాల పాత్రను వివరించారు. ఏవీ కంపెనీ సీఈవో కొండ్రెడ్డి అనిల్, విద్యాలయ ఉపకులపతి టి.శ్రీనివాస్, బయోటెక్నాలజీ విభాగాధిపతి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో రాత పరీక్ష

విద్యావిభాగం, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ గురజాడ విద్యాలయంలో జరుగుతున్న ఏపీపీఎస్సీ రాత పరీక్షలను బుధవారం కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అటవీ బీట్, సహాయ బీట్, దేవాదాయశాఖ అధికారి(గ్రేడ్-3) పోస్టులకు ఈనెల 9 నుంచి పరీక్షలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా కేంద్రంలో ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు.

తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి

సమాజంలో మార్పులకు అనుగుణంగా పోలీసింగ్

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: ప్రస్తుతం మారుతున్న సమాజానికి అనుగుణంగా పోలీసులు విధులు నిర్వర్తించాలని ఎస్పీ ఏఆర్.దామోదర్ సూచించారు. బుధవారం నెల్లిమర్ల మండలం సారిపల్లి సమీపంలోని పోలీసు శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. శిక్షణ కానిస్టేబుళ్లతో మమేకమై, తర్ఫీదును తీరును పరిశీలించారు. కేంద్రంలో మౌలిక సదుపాయాలు, వసతి, భోజన సౌకర్యాంపై అభ్యర్థులను ఆరా తీశారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. అన్నీ శ్రద్ధగా నేర్చుకోవాలని సూచించారు. ఎస్పీ వెంట డీపీటీసీ డీఎస్పీ పి.నారాయణరావు తదితరులున్నారు.

పనులకు వెళ్లకుండానే మస్తర్లు.. కొలతల్లో తేడాలు

సిబ్బందిని ప్రశ్నిస్తున్న పీడీ శారదాదేవి

విజయనగరం గ్రామీణం, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పనుల్లో అవినీతికి పాల్పడిన ఉద్యోగులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ శారదాదేవి హెచ్చరించారు. బుధవారం విజయనగరం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజా వేదికలో మాట్లాడారు. క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని, నిబంధనల ప్రకారం ముందుకెళ్లాలని సూచించారు. ❖ ఆడిట్‌లో భాగంగా చెరువు పనుల కొలతల్లో తేడాలు ఉన్నట్లు గుర్తించారు. ❖ కొన్ని పంచాయతీల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించడం లేదని వెల్లడించారు ❖ ఆరు నెలల కిందట నాలుగు పంచాయతీల్లో కొందరు వేతనదారులు పనికి రాకపోయినా మస్తర్లు వేశారని పేర్కొన్నారు ❖ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా గోకులాలు నిర్మించకపోయినా బిల్లులు చెల్లించారని తేల్చారు ❖ అవకతవకలపై పంచాయతీరాజ్ కమిషనర్, కలెక్టరు, జడ్పీ సీఈవోకు ఫిర్యాదు చేసినా నేటికీ చర్యలు లేవని ఎంపీపీ అప్పలనాయుడు ఆరోపించారు. అంబుడ్స్‌మెన్ సభ్యుడు ఎం.ఎ.యాకుబ్ భాషా, సామాజిక తనిఖీ విభాగం ప్రతినిధి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదానికి రోడ్డేశారు

వేపాడ మండలంలోని బొద్దాం సచివాలయం పరిధిలో ఉన్న రామేశ్వరి వీధిలో విద్యుత్తు స్తంభం ప్రమాదకరంగా ఉంది. స్తంభం ఉంటుండగానే రోడ్డు వేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. చిన్నారులు, వృద్ధులు ప్రమాదాల గురవుతున్నారని, రాత్రి వేళల్లో అటుగా వెళ్లలేక పోతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. సమస్యను విద్యుత్తు శాఖ ఏఈ పిల్లయ్య వద్ద ప్రస్తావించగా పంచాయతీ అధికారులు నిధులు కేటాయిస్తే వేరే దగ్గరకు మారుస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, వేపాడ

గణనాథుని సేవలో సుమన్

విజయనగరం గ్రామీణం: ప్రముఖ సినీ నటుడు సుమన్ విజయనగరంలోని కొత్తపేట సంపత్‌వినాయక స్వామిని బుధవారం దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త పైడిరాజు ఆయన్ను సత్కరించారు.

నీటి సరఫరాను పెంచాలి

ఉడాకాలనీ, న్యూస్‌టుడే: నగర ప్రజలకు నీటి సరఫరాను పెంచేందుకు చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ పల్లవి తెలిపారు. బుధవారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. అమృత్ 2.0 పనులపై ప్రజారోగ్య సాంకేతిక శాఖ ఈఈ జ్యోతి ఆరా తీశారు.

విద్యా సామర్థ్యాల పరిశీలన

వేపాడ, జామి: నీలకంఠరాజపురం, వావిలపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలను డిప్యూటీ డీఈవో కె.వి.రమణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. ఎంఈవోలు భాస్కరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు. ● జామి జడ్పీ ఉన్నత పాఠశాలను ఎంపీడీవో, ప్రత్యేకాధికారి అప్పలనాయుడు పరిశీలించారు. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయుడు కుమార్ శేఖర్, ఉపాధ్యాయులను అభినందించారు.

సంక్షిప్త సమాచారం

బాధ్యతగా పనిచేయాలి

బాబామెట్ట: శానిటరీ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని, అప్పుడే ప్రజారోగ్యం మెరుగుపడుతుందని ఎంహెచ్‌వో కె.సాంబమూర్తి ఆదేశించారు. నగరపాలక సమావేశ మందిరంలో బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. పర్యావరణ ఇంజినీర్ బి.వెంకట్ పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించండి.. ఉడాకాలనీ, న్యూస్‌టుడే: ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో పన్ను బకాయిలు చెల్లించాలని సహాయ కమిషనర్ అప్పలరాజు కోరారు. నగరంలో బుధవారం అవగాహన కల్పించారు.

దీన్‌దయాళ్ గొప్ప వ్యక్తి

కంటోన్మెంట్: పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గొప్ప వ్యక్తి అని, ఆయన్ను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని భాజపా రాష్ట్ర కార్యదర్శి యు.సుజాత అన్నారు. జిల్లా అధ్యక్షుడు రాజేష్ వర్మ అధ్యక్షతన నగరంలో బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృత్యువాత

అయ్యన్నపేట, న్యూస్‌టుడే: విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. ఒకటో పట్టణ హెచ్‌సీ రవి వివరాల ప్రకారం.. దుప్పాడ గ్రామానికి చెందిన కర్రోతు నారాయణరావు(60) ఈనెల 8న శౌచాలయంలో కాలు జారి పడిపోయారు. కుటుంబ సభ్యులు వెంటనే మహారాజా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కేజీహెచ్‌కు తీసుకెళ్లగా.. బుధవారం మరణించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ వెల్లడించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

అయ్యన్నపేట: నగరంలోని మహారాజా ఆసుపత్రి వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. సదరు వ్యక్తి ఆర్టీసీ సముదాయం వద్ద స్పృహతప్పి పడిపోయాడు. కొందరు ప్రయాణికులు ఆసుపత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. అయితే సరైన చికిత్స అందలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సిబ్బంది వెంటనే స్పందించారని, కానీ ప్రాణాలు కాపాడలేకపోయామని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు

అయ్యన్నపేట: ఉమ్మడి జిల్లాకు చెందిన ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తూ విజయవాడ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు జిల్లా ప్రజారవాణాధికారిణి జి.వరలక్ష్మి తెలిపారు. 115 మందికి అవకాశం దక్కిందన్నారు. వారిలో పలువురు బుధవారం ఆమెను కలవగా.. అభినందించారు.

ఆదమరిస్తే.. పెద్ద చెరువులోకే..

విజయనగరం జిల్లా కేంద్రంలోని పెద్దచెరువు దుస్థితి ఇది. గత ప్రభుత్వ హయాంలో సుందరీకరణకు నిధులు కేటాయించారు. అప్పట్లో నామమాత్రంగానే పనులు జరగడంతో అభివృద్ధికి దూరమైంది. కూటమి వచ్చినా పరిస్థితి మారలేదు. కొందరు మత్స్యకారుల కోసం ఇటీవల దీంట్లో చేపలను సైతం వేశారు. అయినప్పటికీ నిర్వహణ పనులు లేక ఇలా పెద్దఎత్తున గుర్రపుడెక్క చేరింది. పొరపాటు ఎవరైనా దిగితే ముప్పు తప్పని పరిస్థితి. అధికారులు స్పందించాలని పట్టణవాసులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం

దారంతా పిక్కలు.. కాళ్లకు బొబ్బలు

జామి మండల కేంద్రం నుంచి గొడుకొమ్ము గ్రామానికి వెళ్లే రహదారి దుస్థితి ఇది. 4 కిలోమీటర్ల పొడవున్న ఈ మార్గం అభివృద్ధి కోసం ఉపాధిహామీ నిధులతో పనులు ప్రారంభించారు. మెటల్ వేసి మధ్యలోనే వదిలేశారు. దీంతో ఈ రహదారి మీదుగా ప్రయాణం నరకప్రాయంగా ఉంటోందని చోదకులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాలు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నామని చెబుతున్నారు. సమస్యను పంచాయతీ రాజ్ డీఈ స్వామినాయుడు వద్ద ప్రస్తావించగా త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. – న్యూస్‌టుడే, జామి

కాగిత రహితంగా స్త్రీనిధి రుణాల మంజూరు

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: స్త్రీనిధి రుణాలు ఇకపై కాగితరహిత విధానంలో అందుతాయని, ఆ మేరకు ప్రణాళిక చేస్తున్నట్లు ఆ విభాగం ఏజీఎం వై.చిట్టిబాబు తెలిపారు. బుధవారం ఎల్.కోటలోని వెలుగు కార్యాలయంలో మాట్లాడారు. త్వరలో ఏఐ ఆధారిత యాప్ ప్రారంభం అవుతుందని తెలిపారు. రుణానికి దరఖాస్తు చేసిన 48 గంటల్లో డబ్బులు ఖాతాలో జమ అవుతాయన్నారు. బయోమెట్రిక్ ద్వారా (కాగిత రహితంగా) రుణాలు, చెల్లింపులు ఉంటాయన్నారు. ఒక్కో సంఘానికి రూ.5 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు అందిస్తామని చెప్పారు. రికవరీ 97.28 శాతం ఉందన్నారు. ఈ ఆర్థిక ఏడాదిలో జిల్లాలో 28,298 మందికి రూ.282.87 కోట్లు ఇవ్వనున్నామని, ఇప్పటికే 26,196 మందికి నగదు అందించామని వెల్లడించారు.

అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

యునాని వైద్యంతో ప్రయోజనం

భోగాపురం, న్యూస్‌టుడే: శరీర సమతుల్యతకు జ్వరం, జీర్ణ సమస్యలు, చర్మ వ్యాధులు, సంధివాతం వంటి వ్యాధులకు యునాని వైద్యం ఎంతో ఉపయోగపడుతుంది వైద్యాధికారి కార్తీక్ తెలిపారు. బుధవారం ప్రపంచ యునాని డే సందర్భంగా భోగాపురం మండలంలోని సుందరపేట ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమం చేపట్టారు. గ్రామంలోని వీధుల్లో ర్యాలీ నిర్వహించి ప్రయోజనాలను రోగులకు వివరించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి వెంకటరమణ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘంటసాల నగరంలో చదవడం గర్వకారణం

గుమ్చీ దారిలోని విగ్రహానికి నివాళులర్పిస్తున్న కళాపీఠం ప్రతినిధులు

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: మధుర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం విజయనగరంలోని గుమ్చీ రహదారిలో నిర్వహించారు. అక్కడున్న విగ్రహానికి కళాపీఠం వ్యవస్థాపకుడు ఎం.భీష్మారావు, ఇతర సభ్యులు నివాళులర్పించారు. ఆయన విజయనగరంలో చదవడం గర్వకారణమని, తెలుగువారి గుండెల్లో నిలిచిపోయారని భీష్మారావు పేర్కొన్నారు. ● స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాల్‌లో సినీ సంగీత విభావరి అలరించింది.

బైండోవర్ కేసులు తగవు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు ఇందుకూరి సుబ్బలక్ష్మి వర్గీయులపై బైండోవర్ కేసులు ఎలా పెడతారంటూ ఆమె అనుచరులు, పలువురు నాయకులు ప్రశ్నించారు. బుధవారం వారంతా తహసీల్దారు శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. కావాలనే తమపై అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. జిందాల్ ఆవరణలో డీసీఎంఎస్ ఛైర్మన్ గొంప కృష్ణ రైతులను రెచ్చగొట్టేలా మాట్లాడినా వారిపై చర్యల్లేవన్నారు. ఎంపీపీ సోమేశ్వరరావు, అప్పారావు, పెదఖండేపల్లి సర్పంచి రమణ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం ఇవ్వకుంటే భూమిచ్చేది లేదు

భోగాపురం, న్యూస్‌టుడే: తాత తండ్రుల నుంచి తాము పంటలు సాగు చేసుకుంటున్న భూములకు నష్టపరిహారం చెల్లించకుంటే, వాటిని ఇచ్చేది లేదని భోగాపురం మండలంలోని బసవపాలెం గ్రామానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం జీఎంఆర్ సంస్థకు చెందిన ప్రతినిధులు జేసీబీతో బసవపాలెం శివారు కొండ ప్రాంతంలోని భూముల్లో మొక్కల తొలగింపు, చదును పనులు చేపట్టారు. గ్రామానికి చెందిన మహిళలు, రైతులు వారిని అడ్డుకున్నారు. పంచాయతీ నాయకులు కోరాడ రాము, రీసు రమణ మాట్లాడుతూ ఏళ్లుగా ఇక్కడి కొండ వద్ద సుమారు 25 ఎకరాల్లో 30 మందికి పైగా రైతులు జీడి, మామిడి, ఇతర పంటలు సాగుచేస్తున్నారన్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలోనూ ఇలాగే జరిగిందన్నారు. రైతులకు ఎలాంటి ఆధారం లేదని, భూములు లాక్కోవడం అన్యాయమన్నారు. నష్టపరిహారం చెల్లించాలని కోరారు. వారు జీఎంఆర్ ప్రతినిధులతో చర్చించడంతో తాత్కాలికంగా పనులు ఆగాయి.

జేసీబీని అడ్డుకొని ముందు నినాదాలు చేస్తున్న గ్రామస్థులు

సమ్మె జయప్రదానికి పిలుపు

శృంగవరపుకోట: జిల్లా వ్యాప్తంగా గురువారం జరిగే అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ శృంగవరపుకోట పట్టణంలో సీఐటీయూ నాయకులు నాలుగు ఆటో స్టాండ్ల వద్ద చోదకులను కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు చెలికాని ముత్యాలు మాట్లాడుతూ కేంద్రంలో భాజపా ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను తిప్పి కొట్టాలన్నారు. ఆటో స్టాండ్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

మయూరి కూడలి: వామపక్షాలు, ప్రజా, కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో నేడు దేశవ్యాప్త సమ్మెలో భాగంగా విజయనగరంలో ఆందోళనలు, ర్యాలీలు, మానవహారాలు నిర్వహించనున్నట్లు సిటూ నాయకుడు రెడ్డి శంకరరావు తెలిపారు.

యువతకు లక్ష్యాలు అవసరం

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: యువత కష్టపడే తత్వాన్ని అలవర్చుకుంటే జీవితంలో ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని డీసీసీబీ ఛైర్మన్, తెదేపా విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు కిమిడి నాగార్జున అన్నారు. గుర్ల మండలం కొండగండ్రేడు గ్రామానికి చెందిన బోడసింగి రమణ ఇటీవల గ్రూప్- 2లో ఉప తహసీల్దారు పోస్టుకు ఎంపిక కావడంతో బుధవారం నగరంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో సత్కరించారు. పేద కుటుంబానికి చెందిన విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని, విజయాలు సాధించడం అభినందనీయమన్నారు. ప్రతిఒక్కరూ ఆ దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం నిరుద్యోగులను అన్నివిధాలా ప్రోత్సహిస్తోందని చెప్పారు. తెదేపా నాయకులు ఆదినారాయణ, సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Under the instructions of my client **M/S SHRIRAM FINANCE LIMITED, Vizianagaram Branch-II, Vizianagaram,** I issue the following notice to general public. My client intends to grant loan to **Mr. RAMPILLI GOVINDA RAO** S/o Suryanarayana Patrudu by keeping the below mentioned schedule property of **SMT. RAMPILLI TIRUMALA** W/o R Govinda Rao as security by way of Registered Mortgage. As such if any one have any claims, charges, mortgages Sale Agreements, Court Attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in-writing within seven days from the date of this notices. Otherwise, later objections will not bind my client in this regard.

SCHEDULE OF THE PROPERTY

Vizianagaram District, Bhogapuram Sub-District, Bhogapuram Mandalam, Nandigam Gram panchayat and revenue village accounts covered by S. No.75-1 site an extent of 146.6 Sq. yards together with RCC building with plinth area of 999 SFT bearing D.no.3-212, assessment no.22 is measured and bounded by: Measurements: **East to West** :40 feet; **North to South** : 33 feet
Bounded by: **EAST:** Ratcha banda and water tank; **SOUTH:** Panchayat CC road; **WEST:** House of Rampilli Narasimhulu; **NORTH** : Vacant site of Rampilli Guru Murthy

KODURI SREENIVASA RAO
SMT. SIVA KUMARI JALADI
Advocates,
S-2, Bharat Apartments, Behind Rythu bazar, Seethammadhara, Visakhapatnam-13.
Visakhapatnam Dt.11.02.2026 **Mobile No.9885166648** Mail: sreenivaskoduri@gmail.com



బహిరంగ ప్రకటన

మా క్లయింటు అయిన శ్రీ తెలంగాణా రాష్ట్రం, రంగారెడ్డి, షంషాబాద్, నియర్ మామిడిపల్లి, లోటస్ బ్లాక్ GMR టౌన్‌షిప్, FLAT నెం. 203రు వాస్తవ్యులు శ్రీ గుమ్మ ఉమా గణపతి శాస్త్రి గారి భార్య శ్రీమతి గుమ్మ సంధ్యా శాస్త్రి గారు యిచ్చిన భోగట్టా ప్రకారం యిందుమూలముగా ప్రజలు యావన్మందికీ తెలియజేయునది ఏమనగా,

ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని విజయనగరం జిల్లా, భోగాపురం మండలం, గూడెపువలస, దల్లిపేట పంచాయతీ, గాలిపేట గ్రామ వాస్తవ్యులు శ్రీ కొయ్య రమణ గారి భార్య శ్రీమతి కొయ్య పైడిరాజు మరియు వగైరాలుకు వారసత్వ రీత్యా సంక్రమించినటువంటి సదరు షెడ్యూలు దాఖలా ఆస్తిని వారి వద్ద నుండి కొనుగోలు చేయదలచియున్నారు. కావున, సదరు షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎవ్వరికైననూ ఎట్టి తనఖాలు, జప్తులు, క్రయపూర్వక హక్కులు మరియు వగైరాలు ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన తేదీ లగాయితూ 7 దినములలోగా ఈ క్రింది అడ్రస్సుకు లిఖితపూర్వకముగా తగు సాక్ష్యాధారములతో తెలియపర్చవలెను. లేనియెడల, సదరు షెడ్యూలు దాఖలా ఆస్తిని నిర్వివాదపు ఆస్తిగా భావించి కొనుగోలు చేయుదురు. ఆ తదుపరి వచ్చు అభ్యంతరములు, ఆక్షేపణలు నా క్లయింటు హక్కులను ఏవిధంగానూ బంధింపజాలవు.

షెడ్యూలు ఆస్తి

1వ ప్రతి: విజయనగరం జిల్లా, భోగాపురం మండలం, భోగాపురం సబ్-రిజిస్ట్రారు యిలాకా, ముంజేరు గ్రామము, సర్వే నెం. 377/1A1Aలో గల విస్తీర్ణం య. 0-09 సెం.లు విస్తీర్ణం గల భూమికి **హద్దులు: తూర్పు:** మా తాలూకా భూమి, **పడమర:** రోడ్డు, **ఉత్తరం:** పి.సింహాచలం, కె.సూరి అప్పన్న గార్ల భూమి, **దక్షిణం:** గూడెపువలస గ్రామ హద్దు.
2వ ప్రతి: విజయనగరం జిల్లా, భోగాపురం మండలం, భోగాపురం సబ్-రిజిస్ట్రారు యిలాకా, ముంజేరు గ్రామము, సర్వే నెం. 377/1A2Bలో గల విస్తీర్ణం య. 0-18 సెం.లు విస్తీర్ణం గల భూమికి **హద్దులు: తూర్పు:** కొయ్య అప్పలనారాయణ గారి భూమి, **పడమర:** కె.సూరి అప్పన్న మరియు మా తాలూకా భూమి, **ఉత్తరం:** సర్వే నెం. 372లో గల Tank, **దక్షిణం:** గూడెపువలస గ్రామ హద్దు.
3వ ప్రతి: విజయనగరం జిల్లా, భోగాపురం మండలం, భోగాపురం సబ్-రిజిస్ట్రారు యిలాకా, ముంజేరు గ్రామము, సర్వే నెం. 377/1A3లో గల విస్తీర్ణం య. 0-30 సెం.లు విస్తీర్ణం గల భూమికి **హద్దులు: తూర్పు:** కొయ్య రాంబాబు గారి భూమి, **పడమర:** కొయ్య పైడిరాజు గారి భూమి, **ఉత్తరం:** సర్వే నెం. 372లో గల Tank, **దక్షిణం:** గూడెపువలస గ్రామ హద్దు.

శ్రీ పాలవలస రాంబాబు, K. గోవిందరాజు, అడ్వకేట్స్
No. 47-11-1/9, Flat No. 4, II Floor, ESWAR ARCADE, Opp. Shriram Chits, Dwarakanagar, Lane -1, Visakhapatnam-16. Mobile: +91-9080202060

(c) eenadu

ఈనాడు పశ్చిమగోదావరి

గురువారం ఫిబ్రవరి 12, 2026 5

పుర సేవల్లో లోపాలా?

రేపు మున్సిపల్ ఆర్డీతో ఫోన్‌ఇన్

నరసాపురం, న్యూస్‌టుడే: ఏలూరు నగరపాలక సంస్థ, ఉభయ జిల్లాల్లోని పురపాలక సంఘాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, మురుగు సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా? భవన నిర్మాణ అనుమతులు, పన్నులకు సంబంధించిన సేవల్లో జాప్యం జరుగుతోందా? ఇలాంటి సమస్యలను పురపాలక ఆర్డీ (రాజమహేంద్రవరం) సీహెచ్ నాగనరసింహారావు దృష్టికి తీసుకువెళ్లే అవకాశం 'ఈనాడు' కల్పిస్తోంది. మీరు చేయాల్సిందల్లా నిర్ణీత సమయంలో ఇక్కడ పేర్కొన్న చరవాణి నంబరుకు ఫోన్‌చేసి పేరు, మీ ప్రాంతం వివరాలతో పాటు సమస్యను క్లుప్తంగా తెలియజేయడమే.

తేదీ: 13.02.2026 (శుక్రవారం)	సమయం: ఉదయం 12.30 నుంచి 1.30 గంటల వరకు	ఫోన్ నంబరు 98499 05801

తరగతి.. ఇదేం దుర్గతి!

పాలకొల్లు పట్టణ పరిధి బద్దావానిపేట ప్రాథమిక పాఠశాల తరగతి గది ఇది. విద్యార్థుల బెంచీలకు వెనుక భాగంలో ఓ మూలన చేతులు, సామగ్రి శుభ్రం చేసుకునే సింకు అమర్చారు. అక్కడే బకెట్, చీపురు, శుభ్రతకు ఉపయోగించే ద్రావణాలు ఉంచారు. ఇదే గదిలో మరోపక్క నీటి ట్యాంకు ఉంది. మధ్యలో పెద్ద చెత్త బుట్ట ఉంచారు. ఇరుకు భవనాల్లో పాఠశాలలు కొనసాగుతున్న మరికొన్ని చోట్లా ఇలాంటి పరిస్థితులే నెలకొన్నాయి. – న్యూస్‌టుడే, పాలకొల్లు

ఎక్కడా లేదు కట్టడి..

అంతా కట్టుబడే

ముడుపులు, నేతల ప్రమేయం

● పాలకోడేరు మండలం గొల్లలకోడేరు పంచాయతీ పరిధిలో ఒక అనధికార లేఅవుట్‌లో ఎటువంటి అనుమతులు తీసుకోకుండా భవనం నిర్మిస్తున్నారు. పంచాయతీ అధికారులు నోటీసులు ఇచ్చినా ఎటువంటి సమాధానం చెప్పకుండా పనులు కొనసాగిస్తున్నారు. ఇదే గ్రామంలో పలు చోట్ల అనధికారిక నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి.

గొల్లలకోడేరు (పాలకోడేరు), భీమవరం టూటౌన్, న్యూస్‌టుడే: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అనధికార నిర్మాణాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ తీసుకొచ్చినా అక్రమ కట్టడాలు ఆగడం లేదు. గతంలో పంచాయతీకి 14 శాతం బెటర్‌మెంట్ ఛార్జీలు చెల్లించి అనుమతులు పొందేవారు. ఎల్‌ఆర్‌ఎస్ అమల్లోకి వచ్చిన తర్వాత ఈ స్కీము ముసుగులో చాలా పంచాయతీల్లో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. తీరా.. నోటీసులు జారీ చేసిన అనంతరం ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకుంటామని చెబుతున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది.

పాలకోడేరు, ఆకివీడు, కాళ్ల, వీరవాసరం, భీమవరం, ఆచంట, పెనుమంట్ర, పెనుగొండ, యలమంచిలి మండలాల్లో గత ప్రభుత్వంలో వందల సంఖ్యలో అనధికార లేఅవుట్లు వెలిశాయి. అప్పట్లో నేతల ప్రమేయంతో అధికారులు చూసీచూడనట్లు వదిలేయడంతో స్థలాల విక్రయాలు జోరుగా జరిగిపోయాయి. వాటి యజమానులు ఇప్పుడు నిర్మాణాలు చేపడుతున్నారు. పలుచోట్ల అధికారులు అడ్డుకట్ట వేస్తున్నా మరికొన్ని చోట్ల ముడుపులు తీసుకుని పట్టించుకోవడం లేదు. మరోవైపు స్థానిక నేతల సిఫార్సులు, ఒత్తిడితో పనులు జరిగిపోతున్నాయి.

పంచాయతీల్లో ఆగని అనధికార నిర్మాణాలు

ఎల్‌ఆర్‌ఎస్‌కు మొగ్గు చూపని యజమానులు

మూడుసార్లు గడువు పెంచినా..

అనధికార లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ఇప్పటికే మూడు సార్లు ఎల్‌ఆర్‌ఎస్‌కు సంబంధించి గడువు పెంచి అవకాశం కల్పించింది. అయినా.. జిల్లాలో స్పందన అంతంతమాత్రంగా ఉంది. పట్టణాల పరిధిలో 296, గ్రామీణ ప్రాంతాల్లో 370 అనధికార లేఅవుట్లు ఉన్నట్లు అధికారికంగా గుర్తించారు. ఒక్కో లేఅవుట్‌లో సుమారు 50 నుంచి 300 వరకు స్థలాలు ఉన్నాయి. కానీ.. పట్టణాల పరిధిలో 1476, గ్రామీణ పరిధిలో 1250 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. గత ఏడాది డిసెంబరు నెలాఖరుతో గడువు ముగిసిపోగా తాజాగా ఏప్రిల్ 23 వరకు మరోమారు పెంచారు. ఇప్పటికైనా ప్లాట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులు సూచిస్తున్నారు. పంచాయతీల్లో ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని డీపీవో రామ్‌నాథ్‌రెడ్డి తెలిపారు.

ఇవి పట్టణ ప్రజల వెక్కిళ్లు

జిల్లాలో వీడని తాగునీటి కష్టాలు

నరసాపురం, భీమవరం పట్టణం, ఆకివీడు, న్యూస్‌టుడే

చెంతనే విశాల గోదావరి తీరం.. ఎటు చూసినా సాగునీటి కాలువలు, చెరువులతో అలరారే పశ్చిమ వాసులను తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. కొన్ని పట్టణాల్లో శివారు కాలనీల నివాసితులు బిందెడు నీటి కోసం ట్యాంకర్ల వద్ద పడిగాపులు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పట్టణ ప్రజలకు శుద్ధిజలాలు అందించేందుకు ఏటా రూ.కోట్లు వెచ్చిస్తున్నా దాహార్తి తీరడం లేదు. వేసవికి ముందే పలు ప్రాంతాల్లో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. పట్టణాల వారీగా ప్రస్తుత పరిస్థితిపై 'న్యూస్‌టుడే' పరిశీలన కథనం.

▲ నరసాపురం ● వార్డులు- 31 ❒ జనాభా- 60 వేలు ✪ నిత్యం నీటి సరఫరా- 9 ఎంఎల్‌డీ

నరసాపురం పట్టణంలో 40 ఏళ్ల నాటి తాగునీటి శుద్ధికేంద్రం, పైపు లైన్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రస్తుత అవసరాలకు అవి సరిపోవడం లేదు. దీనికి తోడు లీకేజీలతో శివారు ప్రాంతాలకు తగినంత నీరు చేరడం లేదు. పట్టణ పరిధిలో ప్రతి వ్యక్తికి సగటున నిత్యం వంద లీటర్ల శుద్ధి జలాలు సరఫరా చేస్తున్నట్లు అధికారులు లెక్కలు చూపుతుండగా క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం దీనికి భిన్నంగా ఉంది.

నరసాపురం: ట్యాంకరు వద్ద నీళ్లు పట్టుకుంటున్న స్థానికులు

● చినమామిడిపల్లి, పీచుపాలెం, సింగోడియన్‌పేట, రాజీవ్‌నగర్, కోలపర్తివారిమెరక, పాలపర్తివారిపేట, ఆదర్శనగర్, గ్రేస్‌నగర్, ఏటిగట్టు, ఎన్టీఆర్ కాలనీ, రుస్తుంబాద గోగులమ్మ చెరువుగట్టు, శివారు పేదల కాలనీ, ప్రాంతాలకు రెండు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు.

సంపు వద్ద నీటిని పట్టుకుంటున్న ప్రజలు

▲ భీమవరం ● 39 ❒ 1.63 లక్షలు ✪ 18 ఎంఎల్‌డీ

జిల్లా కేంద్రమైన భీమవరం పట్టణం ఏటేటా విస్తరిస్తుండగా దానికి తగ్గట్టుగా నీటి సరఫరా పెరగడం లేదు. తాగునీటి పథకం, పైపులైన్ల సామర్థ్యం సరిపోకపోవడం, పైపులైన్ల మరమ్మతులతో కొన్ని ప్రాంతాలకు శుద్ధి జలాలు సక్రమంగా అందడం లేదు.

● నర్సయ్య అగ్రహారం, బొక్కావారిపాలెం, దుర్గాపురం, లంకపేట, బలుసుమూడి, ప్రకాశ్‌నగర్, గొల్లవానితిప్ప రోడ్డు, బ్యాంకు కాలనీ, ఉండి రోడ్డు తదితర ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉంది.

▲ ఆకివీడు ● 20 ❒ 40 వేలు ✪ -

ఆకివీడు నగర పంచాయతీ పరిధిలో చినపల్లి, పెదపల్లి వీధులు, సమతానగర్, ఎస్బీఐ గోదాముల రోడ్డు, గంగాలమ్మకోడు ప్రాంతాలకు కుళాయి నీరు చేరడం లేదు. ఆయా ప్రాంతాలకు ట్యాంకర్ల నీరే ఆధారం. పలు వార్డుల పరిధిలో కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయి

భీమవరం తాడేరు రోడ్డులో నీటి కోసం ఉంచిన డబ్బాలు

ఎద్దడి నివారణకు ప్రణాళిక

శివారు ప్రాంతాలకు నిత్యం ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రతి ఒక్కరికీ సగటున 50-60 లీటర్ల నీరు సరఫరా చేయాలని కమిషనర్లకు సూచించాం. – సీహెచ్ నాగనరసింహారావు, పురపాలక ఆర్డీ

శ్రీవిద్యాలక్ష్మీదేవిగా మావుళ్లమ్మ

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మ ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా శ్రీ విద్యాలక్ష్మి దేవి అలంకరణలో అమ్మవారు బుధవారం దర్శనమిచ్చారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

హాయిగా రావొచ్చు.. సంతోషంగా దాటొచ్చు

కైకలూరు, న్యూస్‌టుడే: కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతరకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. 13 రోజులు జరిగే ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు అమ్మవారి దర్శనానికి వస్తుంటారు. పందిరిపల్లెగూడెం సర్కారు కాలువపై నిర్మించిన పెద్దింట్లమ్మ వారధిపై ఎదురెదురుగా భక్తుల వాహనాలు వస్తే తప్పుకొనే వీల్లేదు. ఈ నేపథ్యంలో సీఐ రవికుమార్ గతేడాది దాతల సహకారంతో వంతెనపై ట్రాఫిక్ సిగ్నళ్లు ఏర్పాటు చేయించారు. ఇటీవల అవి మరమ్మతులకు గురయ్యాయి. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ సూచనలతో సాంకేతికతను జోడించి సిగ్నళ్లకు 150 సెకన్ల నిడివితో టైమర్‌ను అమర్చారు. దీంతో ఒక వైపు వాహనాలు వంతెన దాటిన అనంతరం రెండో వైపు వచ్చేలా ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రబీ వరికి ఉప్పుద్రవం

కాలువల్లో కలుస్తున్న ఆక్వా జలాలు

ఉండి, న్యూస్‌టుడే: రబీ వరిచేలు ఈ దఫా కొన్నిచోట్ల ఆశించిన స్థాయిలో పెరగలేదు. జిల్లాలో రైతుల నుంచి వస్తున్న సమాచారంతో కేవీకే శాస్త్రవేత్తలు కొన్నిచోట్ల పరిశీలన చేస్తున్నారు. స్థానిక పరిస్థితులు, రైతులిస్తున్న సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఆక్వా చెరువుల మధ్యలో వరి సాగైన ప్రాంతాల్లో ఉపకాలువలు, బోదెల్లో ఉప్పునీటి(ఆక్వా వృథా జలాలు) లవణాలు కలిసినచోట్లే ఈసమస్య ఎదురవుతోందని తెలుస్తోంది. డ్రెయినేజీ (మురుగు) నీటితో సాగైనచోట్ల నేల విద్యుత్ వాహకత(సాయిల్ ఎలక్ట్రికల్ కండక్టివిటీ- ఈసీ) 4 శాతానికి మించి ఉంటోందని మూడు చోట్ల చేసిన ఫలితాల్లో గుర్తించారు.

వెలివర్రులో చౌడు లక్షణాలతో దెబ్బతిన్న వరిచేను

డ్రెయినేజీ సరిగా లేనిచోట్ల!

జిల్లాల్లో అధిక మండలాల్లో ఆక్వా సాగవుతోంది. ప్రధానంగా ఉండి, ఆకివీడు, కాళ్ల, వీరవాసరం, నరసాపురం, భీమవరం తదితర మండలాల్లో పల్లపు చోట్ల వరి భూముల్లో మురుగునీరు అధిక రోజులు నిలిచిపోతోంది. దమ్ములో జింక్ సల్ఫేట్ వేయని చోట్ల జింక్ లోపం బాగా కన్పిస్తోంది. కాంప్లెక్స్ ఎరువులు అధికంగా చల్లినచోట్ల, మురుగు ముందుకెళ్లని ప్రాంతాల్లో సల్ఫైడ్ ఇంజూరీ లోపంతో వేరు వ్యవస్థ నల్లబడి మొక్కలు దెబ్బతింటున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఖరీఫ్‌లో అధిక వర్షాల్లో ముంపు బెడద ఎదురవుతోంది. రబీలో మురుగునీరు బయటకెళ్లని చోట్ల నేలపై చౌడు లవణాలు బయటకొచ్చి మొక్కల ఎదుగుదలను దెబ్బతీస్తున్నాయని తెలుస్తోంది. జిల్లాలో ఆక్వా జలాలు డ్రెయిన్లోకి నేరుగా వదిలేయడం మామూలే. ఈదశలో మురుగునీటి ఎత్తిపోతలతో సాగనేది రాబోయే రోజుల్లో ప్రశ్నార్థకమేనని తెలుస్తోంది. చౌడు 4 శాతానికి మించినచోట్ల పంట దిగుబడిపై గట్టి ప్రభావం చూపే ప్రమాదముందని చెబుతున్నారు.

విస్తీర్ణం ఎకరాలలో...

జిల్లాల్లో సాగు: 2,39,000	రబీలో నాట్లేసినవి: 2,23,742
చౌడు లక్షణాలున్న ప్రాంతాలు: సుమారు 6000	
సాగుకు అనుకూలత లేని భూములు: దాదాపు 5000	

తగ్గించేందుకు ఇలా చేయాలి

చేలల్లోని మురుగునీటిని బయటకు తోడించాలి. నేలను పూర్తిగా ఆరగట్టాలి. తరచూ నీటి మార్పిడి జరగాలి. కూలీలతో కలుపు తీయిస్తే భూమిలోని గ్యాస్ బయటకెళ్తుంది. తద్వారా వేరు వ్యవస్థ నుంచి మొక్కలకు ఆక్సీజన్ అందుతుంది. చౌడు, సల్ఫైడ్ ఇంజూరీ సమస్య కొంతవరకూ తగ్గుతుంది. సిఫార్సుకు మించి ఎరువులు చల్లొద్దు. జీలుగ, పిల్లిపెసర, జనుము వంటి పచ్చిరొట్ట ఎరువులు వేసవిలో చల్లుకోవాలి. డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుదలతో చౌడు శాతాన్ని తగ్గించుకునే చర్యలు చేపట్టాలి. **- ఎన్.మల్లికార్జునరావు, ప్రధాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, ఉండి**

రాతపరీక్ష వాయిదా

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుకు సీఆర్‌ఆర్ కళాశాల ఇంటర్మీడియట్ బ్లాకులో ఈ నెల 12న నిర్వహించాల్సిన రాత పరీక్ష అనివార్య కారణాలతో వాయిదా వేయడం జరిగిందని జిల్లా జడ్జి ఎస్.శ్రీదేవి పేర్కొన్నారు.

కుర్రకారు దూసుకెళ్తోంది

చినఅమిరం (భీమవరం పట్టణం), న్యూస్‌టుడే

ఆ కుర్రోళ్లు చదివేది ఇంజినీరింగ్. అభిరుచి రకరకాల మోడళ్ల కార్ల తయారీ.. నిత్యం ధ్యాసంతా వాటిపైనే. వీరి ఆసక్తి చూసి వాహన విడిభాగాలను కళాశాల యాజమాన్యం సమకూరుస్తోంది. ఇక అంతే.. రోజుల వ్యవధిలో వాటికి ప్రాణం పోస్తున్నారు. దాని పనితీరును తొలుత కళాశాల ప్రాంగణంలో.. తర్వాత ప్రధాన రహదారులపై చూస్తున్నారు. అంతటితో ఆగకుండా గుంతలు, రాళ్ల రహదారులపై ఎంత వేగంగా వెళ్తుందో చూసి జాతీయ పోటీలకు తీసుకెళ్లి బహుమతులు పట్టేస్తున్నారు.

వాహన తయారీలో విద్యార్థులు

భీమవరంలో విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మెకానికల్ ఇంజినీరింగ్ చదువుతున్న మొదటి నుంచి ఆఖరి ఏడాది విద్యార్థులు 30 మంది ఎమిగోస్ (స్పానిష్‌లో ఫ్రెండ్స్) పేరుతో బృందంగా ఏర్పడ్డారు. వాళ్ల ఆలోచనంతా కొత్త రకం వాహనాల సృష్టిపైనే. బాహా, గోకార్ట్, ఈ బైక్, బైస్కిల్ ఇలా వినూత్నంగా, తక్కువ ఖర్చుతో తయారీ వాళ్ల ప్రత్యేకత.

బురదలో పరీక్షలు

ఆల్ టెరైన్ వెహికల్.. ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల గోదావరి బృందం పలు పోటీల్లో ఛాంపియన్‌గా నిలిచింది. భోపాల్‌లో గతేడాది సెప్టెంబరులో జరిగిన ఫార్ములా ఆఫ్ రోడ్ బాజా ఇండియా పోటీల్లో 'ఆల్ టెరైన్ వెహికల్' ప్రథమ స్థానంలో నిలిచి రూ.1.50 లక్షలు అందుకున్నారు. హైదరాబాద్, కాకినాడలో ఇటీవల జరిగిన పోటీల్లో బహుమతులు గెలుచుకున్నారు.

బహుమతులు అనేకం.. జాతీయ స్థాయి హైడ్రోజన్ వాహన బాహా పోటీలు గతేడాది జనవరిలో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ పితంపూర్‌లో జరగ్గా ప్రథమస్థానంలో నిలిచి రూ.1.10 లక్షల నగదుతో పాటు ప్రముఖ కంపెనీల దృష్టిలో వాహన డిజైన్ పడింది. అలా ఏడాది పొడవునా చెన్నై, పుణె, హిమాచల్‌ప్రదేశ్ తదితర చోట్ల జరిగిన వివిధ వాహన తయారీ, పోటీల్లో 5 ప్రథమ బహుమతులు సొంతం చేసుకున్నారు. తాజాగా జనవరిలో 7 నుంచి 11 వరకు మధ్యప్రదేశ్‌లోని పితంపూర్‌లో జరిగిన హైడ్రోజన్ బాహా-2026లో ఓవరాల్ రన్నరప్‌గా నిలిచి రూ.1.20 లక్షలు బహుమతి గెలుచుకున్నారు. పలు విభాగాల్లో ప్రత్యేకతలు చాటారు.

డ్రాప్ ఎట్ హోంతో.. మహిళలకు అభయం

ఈనాడు-ఏలూరు: వివిధ కారణాలతో మహిళలు ఎవరైనా అర్ధరాత్రి వేళ ప్రయాణాల్లో ఒంటరిగా ఉండిపోతే ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వారు ఒక్క ఫోన్ చేస్తే క్షణాల్లో పోలీసులు వారి ముంగిట వాలిపోతారు. సురక్షితంగా వారిని గమ్యస్థానాలకు చేరుస్తారు. దీనికి ఏలూరు పోలీసులు 'డ్రాప్‌ఎట్ హోం' అని పేరు పెట్టారు. ఈ సేవలను బాధిత మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారు.

అర్ధరాత్రి ఎక్కడైనా ఉండిపోతే ఫోన్ చేయండి
నంబరు: 83329 59174

ఇలా చేయాలి.. ఒంటరిగా ఉన్న వారు పోలీసు కంట్రోల్ రూంకు ఫోన్ చేసి వారు ఎక్కడ ఉన్నారో చెప్పాలి. వెంటనే అక్కడ ఉండే డ్రాప్ ఎట్ హోం సర్వీసెస్‌కు చెందిన ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు మరో పురుష కానిస్టేబుల్‌తో కలిసి వాహనంలో ఆ మహిళ ఉన్న ప్రదేశానికి చేరుకుంటారు. ఆమె ఎక్కడికి వెళ్లాలో తెలుసుకుంటారు. ఏలూరు నగరంలో అయితే ఇంటికే తీసుకెళ్తారు. ఇతర ప్రాంతాల వారైతే బస్టాండ్, రైల్వేస్టేషన్‌కు తీసుకెళ్లి బస్సు, రైలు ఎక్కించి జాగ్రత్తలు చెప్పి పంపుతారు.

మచ్చుకు కొన్ని..

➤ రెండు రోజుల క్రితం ఆశ్రం బస్టాప్ వద్ద ఓ మహిళ అర్ధరాత్రి 1.30 గంటలకు బస్సులు రాక ఒంటరిగా ఉన్నారు. భయంతో పోలీసు కంట్రోల్ రూంకు ఫోన్ చేశారు. వెంటనే డ్రాప్ ఎట్ హోం సర్వీసెస్ విభాగానికి ఫోన్ చేయగా ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు మరో కానిస్టేబుల్ వెళ్లి ఆమెను పోలీసు జీపులో కొత్త బస్టాండ్‌కు తీసుకొచ్చి బస్సు ఎక్కించారు.

➤ మరో మహిళ తంగెళ్లమూడి జాతర తిలకించేందుకు పలువురు మహిళలతో కలిసొచ్చి చివరకు ఒంటరిగా మిగిలిపోయారు. అయితే ఆమె ఇంటికి వెళ్లడానికి ఆ అర్ధరాత్రి బస్సులు, ఆటోలు లేక ఇబ్బంది పడుతూ కంట్రోల్ రూమ్‌కు కాల్ చేయగా వెంటనే మహిళా పోలీసులు సురక్షితంగా ఇంటికి చేర్చారు.

తెల్లవారుజామున 4 గంటల వరకు..
వారానికి ఇద్దరు, ముగ్గురు మహిళలు పోలీసుల సహాయంతో గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. కొందరు చరవాణి పోగొట్టుకుని.. మరికొందరు చేతిలో డబ్బులు అయిపోయి ఫోన్ చేసి రక్షణ కోరుతున్నారు. వారిని కూడా మా సిబ్బంది ఇంట్లో దింపి వస్తున్నారు. డ్రాప్ ఎట్ హోం సేవలు రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు అందుబాటులో ఉంటాయి. తెలియని వ్యక్తులు తీసుకెళ్తామని చెబితే నమ్మవద్దు. పోలీసులతో సురక్షితంగా చేరుకోవాలి. **- కేపీఎస్ కిశోర్, ఎస్పీ**

ఎన్‌వోసీ లేకుండానే ఆక్వా అనుమతులు

నరసాపురం, గ్రామీణ, న్యూస్‌టుడే: ఆక్వా సాగు అనుమతికి దరఖాస్తు చేసేందుకు కాళీపట్నం భూములు మినహా మిగిలిన వాటికి వీఆర్వోల నిరభ్యంతర పత్రం(ఎన్‌వోసీ) అవసరం లేదని కలెక్టర్ సీహెచ్ నాగరాణి స్పష్టం చేశారు. నరసాపురం రెవెన్యూ డివిజనల్ కార్యాలయాన్ని ఆమె జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డితో కలిసి బుధవారం సందర్శించారు. కార్యాలయంలో దస్త్రాలను పరిశీలించారు. అనంతరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించి సిబ్బంది, ప్రజలు, దస్తావేజు లేఖరులతో మాట్లాడారు. అనంతరం ఎల్‌బీచర్ల మీదుగా పీఎంలంక వెళ్లి నిర్మాణంలో ఉన్న రక్షణగోడ పరిశీలించారు. అనంతరం రామకృష్ణ మిషన్ ఆర్థిక సహకారంతో మత్స్యకారులకు అందించేందుకు సిద్ధం చేస్తున్న పడవలను, నల్లీక్రీక్‌లో పూడిక తీత పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. రీ సర్వేలో డేటా గల్లంతైన చినమామిడిపల్లి, దర్భరేవు గ్రామాల్లో సుమారు 1800 ఎకరాలకు సంబంధించిన సమస్య పరిష్కారమైందని పేర్కొన్నారు. ఆర్డీవో దాసి రాజు, తహసీల్దారు ఐవీవీ సత్యనారాయణ, మత్స్య సహకార సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు మైలా వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

పీఎంలంకలో వలలు పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

శివరాత్రి ఉత్సవాలకు పక్కా ఏర్పాట్లు

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: శివరాత్రి ఉత్సవాలకు భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని శైవక్షేత్రాల వద్ద ఏర్పాట్లు పక్కాగా జరగాలని కలెక్టర్ నాగరాణి ఆదేశించారు. ఆమె క్యాంపు కార్యాలయం నుంచి ఎస్పీ అద్నాన్ నయిం అస్మితో కలిసి బుధవారం జిల్లాలోని అధికారులతో దూరదృశ్య సమావేశం నిర్వహించి మాట్లాడారు. బందోబస్తు ఏర్పాటు చేయాలని, దర్శనం చేసుకునే దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యం కల్పించాలన్నారు. పారిశుద్ధ్యంపై పూర్తి శ్రద్ధ పెట్టాలన్నారు. అన్ని చోట్లా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. భీమవరంలో సోమేశ్వరాలయం, పాలకొల్లులోని క్షీర రామలింగేశ్వర ఆలయాలకు లక్షల్లో వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. 108 వాహనాలను అందుబాటులో ఉంచాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ ఫిబ్రవరి 13 నుంచి 18 వరకు ఉత్సవాలు జరిగినా 14, 15 తేదీల్లో రద్దీ ఎక్కువగా ఉంటుందని, ఇందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న సీసీ కెమెరాలకు అదనంగా మరిన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో డీఆర్వో శివన్నారాయణరెడ్డి, అదనపు ఎస్పీ భీమారావు, ఆర్డీవోలు తదితరులు పాల్గొన్నారు.

ఆనందబడి

దాతల సేవలకు 'విద్యాంజలి 2.0'

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థులకు ఎంతో మంది దాతలు వివిధ రూపాల్లో సహాయం చేస్తున్నారు. అదనపు గదుల నిర్మాణం, ఫర్నిచర్, రాత పుస్తకాలు, పరీక్ష సామగ్రి వంటివి అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. మరి కొందరు సామాజిక అంశాలపై అవగాహన, వృత్తి నైపుణ్య శిక్షణ తదితర అంశాలపై సదస్సులు నిర్వహిస్తున్నారు. ఇకపై ఇలాంటి దాతలు, సంస్థలను ఒక వేదికపై తీసుకొచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'విద్యాంజలి 2.0' పేరుతో వినూత్న కార్యక్రమాన్ని తెచ్చింది. ఇందులో దాతలు నగదు కాకుండా వస్తువులు, సేవల రూపంలో పాఠశాలలు, విద్యార్థులకు సహకారం అందించవచ్చు. ఇందుకోసం దాతలు http://vidyanjali.education.gov.in వెబ్‌సైట్‌లో వాలంటీరుగా రిజిస్టరు చేసుకుని తమకు నచ్చిన పాఠశాలను ఎంపిక చేసుకోవచ్చు.

ఉమ్మడి జిల్లాలో 3094 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో సుమారు 1.30 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. చాలా బడుల్లో అసౌకర్యాలు పలకరిస్తున్నాయి. వైకాపా ప్రభుత్వం నాడు-నేడు పేరుతో ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తామంటూ గొప్పలు చెప్పింది. అప్పట్లో చేపట్టిన పాఠశాలల అదనపు తరగతి గదుల నిర్మాణం చాలాచోట్ల నేటికీ పూర్తికాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'విద్యాంజలి' కార్యక్రమాన్ని వైకాపా పాలకులు పక్కన పెట్టారు. కూటమి ప్రభుత్వం 'విద్యాంజలి 2.0' ద్వారా దాతలను ఆహ్వానిస్తోంది.

ఏమేం చేయొచ్చంటే.. దాతలు, ప్రవాస భారతీయులు, స్వచ్ఛంద సంస్థలు, గ్రామస్థులు, కార్పొరేట్ సంస్థలు, పూర్వవిద్యార్థులు 'విద్యాంజలి 2.0' ద్వారా పిల్లలకు ఉపయోగపడే ఏ సహకారం అయినా అందించవచ్చు. వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకుంటే అందులో కనిపించే వివిధ రకాల సేవల్లో ఏదో ఒకటి ఎంచుకోవచ్చు.

సేవలు ఇలా.. విద్యా సహాయం, క్రీడలు, కళలు, నైపుణ్యాలు, ఆరోగ్యం, యోగా, మార్గనిర్దేశం, కెరీర్ గైడెన్స్ కౌన్సెలింగ్, ఎంట్రన్స్ ఎగ్జామ్ ప్రిపరేషన్స్, ఫర్నిచర్, విద్యా సామగ్రి, వైద్య శిబిరాలు, స్టోరీ రైటింగ్ స్కిల్స్, వృత్తి విద్యాశిక్షణ, సామాజిక బాధ్యతను గుర్తు చేసే అవగాహన సదస్సులు.

దాతలు రిజిస్టరు చేసుకోవాలి.. విద్యాంజలి 2.0 వెబ్‌సైట్‌లో దాతలు రిజిస్టరు చేసుకుని పాఠశాలను ఎంపిక చేసుకోవాలి. అక్కడ ఏ సేవలను వారు సమకూర్చగలరో తెలియజేయాలి. ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలలకు కావాల్సిన సేవలను వెబ్‌సైట్‌లో పొందుపరచాలి. **- ఈ.నారాయణ, డీఈవో**

తీరంలో డాల్ఫిన్ కళేబరం

మొగల్తూరు, న్యూస్‌టుడే: పేరుపాలెంసౌత్‌లోని సముద్ర తీరానికి బుధవారం డాల్ఫిన్ కళేబరం కొట్టుకు వచ్చింది. గత రెండురోజులుగా నరసాపురం నియోజకవర్గ పరిధిలో సముద్రతీరానికి ఆలివ్‌రిడ్లే తాబేళ్ల కళేబరాలు కొట్టుకువస్తున్నాయి. అటవీశాఖ అధికారులు ఈ నెల 10న 29, 11న 20 తాబేళ్ల కళేబరాలను గుర్తించారు. ఈ సమాచారం అందుకున్న అటవీశాఖ జిల్లా అధికారి డీఏ కిరణ్ బీచ్‌కు వచ్చారు. పశుసంవర్ధకశాఖ ఏడీ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ శాఖ సిబ్బంది డాల్ఫిన్, తాబేళ్ల కళేబరాలకు పంచనామా చేసి ఖననం చేశారు. వాటి నుంచి సేకరించిన నమూనాలకు పరీక్షలకు పంపుతున్నట్లు అధికారులు తెలిపారు.

(c) eenadu

పతకాల పంట పండిస్తున్న అన్నాచెల్లెళ్లు

వివిధ పోటీల్లో 15 పతకాలు సొంతం

చరణ్‌దీప్, సహస్ర

పాలకోడేరు, న్యూస్‌టుడే: వీరు సాధించిన పతకాలు చూస్తే అబ్బో చిచ్చర పిడుగులే అనిపిస్తుంది. పాలకోడేరు మండలం శృంగవృక్షం గ్రామానికి చెందిన కందుల సంధ్య, ఫణికుమార్ దంపతుల పిల్లలు చరణ్‌దీప్, సహస్ర వివిధ రంగాల్లో ప్రతిభాపాటవాలను ప్రదర్శిస్తూ ఔరా అనిపిస్తున్నారు. ఇప్పటి వరకు అన్నా చెల్లెళ్లు ఇద్దరూ కలిసి 15 పతకాలను సొంతం చేసుకున్నారు. ఐదో తరగతి చదువుతున్న చరణ్‌దీప్ 2022-23లో రాష్ట్ర స్థాయి స్పెల్ బీ పోటీలో బంగారు పతకం, 2024-25లో ఫుట్‌బాల్, చిత్రలేఖనం పోటీల్లో మూడు బంగారు పతకాలు, రన్నింగ్, ఈత పోటీల్లో రెండు కాంస్య పతకాలను గెలుచుకున్నారు. అన్నకు దీటుగా చెల్లెలు సహస్ర కూడా ఆరు బంగారు, 3 రజత పతకాలను సొంతం చేసుకున్నారు. 2023-24లో భగద్గీత శ్లోకాల పఠనంలో, జాతీయ సైబర్ ఒలింపియాడ్ సైన్స్ పోటీల్లో, ఐఎంవో ఒలింపియాడ్‌లో, స్పెల్‌బీలో, ఇంటర్నేషనల్ ఒలింపియాడ్‌లో బంగారు పతకాలు గెలుచుకుంది.

లోపం అధిగమించి.. ప్రతిభతో రాణించి..

విభిన్న కళల్లో మెరుస్తున్న ప్రత్యేక అవసరాల బాలలు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: విధి తమను చిన్నచూపు చూసిందని ఏ మాత్రం భావించకుండా చిన్న వయసులోనే ఇతరులతో సమానంగా ప్రతిభ కనబరుస్తున్నారు. దివ్యాంగుల కోసం సమగ్ర శిక్షా జిల్లా ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఇటీవల ఏలూరులో నిర్వహించిన జిల్లా స్థాయి సాంస్కృతిక, కళా ఉత్సవాల్లో భాగంగా జరిగిన వివిధ రకాల పోటీల్లో వీరు పాల్గొని ప్రథమ స్థానాల్లో నిలిచారు.

నాట్యంలో దిట్ట

జి.లహరికి వినికిడి లోపం ఉంది. ఆమెకు శస్త్ర చికిత్స చేసినా లోపం తొలగలేదు. జంగారెడ్డిగూడెం ఇందిరానగర్ కాలనీ ఎంపీపీ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతోంది. అదే ప్రాంతంలోని భవిత కేంద్రంలో ఐఈఆర్‌పీ చైతన్య వద్ద జానపద నృత్యంలో శిక్షణ తీసుకొంది. ఏలూరులో నిర్వహించిన జానపద నృత్య పోటీలో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచింది. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లోనూ బహుమతులు సాధించాలనేది ఈ బాలిక ఆశయం.

చిత్రలేఖనంలో సత్తా..

బుట్టాయగూడెం మండలం దొరమామిడి జడ్పీ ఉన్నత పాఠశాలలో కె.భార్గవి పదో తరగతి చదువుతోంది. న్యూరాలజీ సమస్యతో చేతులు సరిగా పనిచేయని ఆమెకు చిన్నతనం నుంచి బొమ్మలు వేయడంపై ఆసక్తి. అది గమనించిన తల్లిదండ్రులు ఒక ప్రైవేటు డ్రాయింగ్ టీచరు వద్ద చిత్రలేఖనంలో ప్రత్యేకంగా తర్ఫీదు ఇప్పిస్తున్నారు. ఏలూరులో నిర్వహించిన జిల్లా స్థాయి చిత్రలేఖనం పోటీలో ప్రథమ స్థానంలో నిలిచింది. చదువులో ఉత్తమ ప్రతిభ కనబరుస్తోన్న ఆమె చిత్రకళాకారిణిగా ఎదగాలని లక్ష్యంగా నిర్ణయించుకుంది.

ఇంజినీర్ కావడమే లక్ష్యం..

ఎస్.యశ్వంత్ సాయి సెరిబ్రల్ పాల్సీతో బాధపడుతూ.. ఏలూరు శ్రీరామ్‌నగర్ ఎంపీపీ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. స్థానిక అశోకవర్ధన భవిత కేంద్రంలో చికిత్స చేయించుకుంటున్నాడు. ఇతనికున్న వ్యాధి వల్ల అవయవాలు సరిగా పనిచేయవు. అయితేనేం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అందిస్తున్న ప్రోత్సాహంతో ఏలూరులో నిర్వహించిన జిల్లా స్థాయి ఆధునిక వస్త్రధారణ పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచాడు. భవిష్యత్తులో ఇంజినీరు కావాలనేది ఈ బాలుడి ఆశయం.

అర్థం చేసుకుంటూ..

ఏలూరు కేపీడీటీ ఉన్నత పాఠశాలలో ఎం.షణ్ముఖ సాయి 7వ తరగతి చదువుతున్నాడు. స్థానిక అశోకవర్ధన భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ చికిత్స పొందుతున్నాడు. ఆ కేంద్రంలో ఐఈఆర్‌టీ చెప్పిన విషయాలను అర్థం చేసుకుంటూ తనలోనూ ప్రతిభ దాగుందని నిరూపిస్తున్నాడు. ఏలూరులో నిర్వహించిన జిల్లా స్థాయి స్కిట్ పోటీల్లో కాంతారా వేషధారణ వేసి ప్రథమ బహుమతి అందుకున్నాడు.

ముందస్తు ప్రణాళికతో ఉత్తమ ఫలితాలు

పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

నూజివీడు, న్యూస్‌టుడే: విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ విద్య కీలకం. ఇక్కడే చాలా మంది భవితవ్యం తేలిపోతుంది. ఫిబ్రవరి 23 నుంచి మార్చి 24 వరకు ఇంటర్ వార్షిక పరీక్షలు జరగనున్నాయి. ఇప్పటికే సిలబస్ పూర్తయి రివిజన్ నడుస్తోంది. ఇష్టంగా చదివితే ఉత్తీర్ణత సాధించడం సులువు అని నిపుణులు చెబుతున్నారు.

ఇలా చేయాలి.. ☛ ప్రతి నిమిషం విలువైంది. ప్రణాళిక ప్రకారం చదవాలి. ☛ క్లిష్ట, సులభ జవాబులు చదివేందుకు ఏ సబ్జెక్టుకు ఎంత సమయం కేటాయించాలో అవగాహన ఉండాలి. విజయంలో సగం పాత్ర దీనిదే. ☛ సిలబస్, పరీక్ష విధానం పూర్తిగా ఆకళింపు చేసుకోవాలి. అన్ని సబ్జెక్టులపై అవగాహన అవసరం. ప్రతి సబ్జెక్టుకు ఓ బ్లూ ప్రింట్ ఏర్పాటు చేసుకుని, ప్రధాన అంశాలపై శ్రద్ధ వహించాలి. ☛ పూర్వ, మాదిరి ప్రశ్న పత్రాలు పరిశీలించాలి. సమాధానాలు రాసి సరిచూసుకోవాలి. ☛ సమయం తక్కువున్నందున ముఖ్యమైన అంశాలపై దృష్టి పెట్టాలి. ☛ ఇప్పటికే చదివిన అంశాల్ని మళ్లీ చూసుకోవాలి. ముఖ్యాంశాలను అండర్‌లైన్ చేసుకుని, పేపర్‌పై రాసుకోవడం ఉత్తమం. ☛ ఇతరులతో చర్చిస్తే మరింత ఉపయోగం. విద్యార్థులు వారిలో వారే ప్రశ్నలు వేసుకోవాలి. ☛ పరీక్షా కేంద్రంలో ప్రశ్నపత్రం బాగా చదివి అర్థం చేసుకోవాలి.

జిల్లా సమాచారం...

ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు:	17,531
రెండో సంవత్సరం విద్యార్థులు:	16,975
కళాశాలలు:	135
పరీక్ష కేంద్రాలు:	56

సరైన వాతావరణం అవసరం.. చదివేందుకు ప్రశాంత వాతావరణం అవసరం. దీంతో ఏకాగ్రత పెరుగుతుంది. విద్యార్థులను ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు గమనిస్తుండాలి. వారి అవసరాలను గుర్తించి కావాల్సినవి సమకూర్చాలి. ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి. వారికి తోడుగా ఉండాలి. చరవాణి, టీవీలకూ దూరంగా ఉండేలా చూడాలి. ఇతరులతో పోల్చకూడదు. ఒత్తిడికి గురైనట్లు కనిపిస్తే ధైర్యం చెప్పాలి. అవసరమైతే అధ్యాపకుల సహకారం తీసుకోవాలి. **- కె.యోహాను, ఆర్ఐవో, ఏలూరు**

బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లి మండలం తోటపల్లిలో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంటు ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. నితిన్ సాయి కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారు 20 టీపీడీ కంప్రెస్‌డ్ బయోగ్యాస్ ప్లాంటు ఏర్పాటుకు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. దాంతో తాజాగా నిర్వహించిన రాష్ట్ర మంత్రి మండలి సమావేశంలో తోటపల్లిలో ఆర్.ఎస్.నెంబర్ 2-1లో 45.60 ఎకరాల ప్రభుత్వ భూమిని నూతన, పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ(ఎన్‌ఆర్‌ఈడీసీఏపీ) తరఫున కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ స్థాపన కోసం కేటాయించే ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. ఎకరా రూ.16.94 లక్షల చొప్పున కేటాయించనున్నారు. దాంతో ఈ ప్రాజెక్టు ద్వారా అనేక మందికి ఉపాధి లభించనుంది.

శివాలయంలో వెంకన్న ప్రసాదాలు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల భ్రమరాంబమల్లేశ్వరస్వామి ఆలయంలో వేంకటేశ్వరస్వామి ప్రసాదాలు విక్రయించే కౌంటర్‌ను బుధవారం ఏర్పాటు చేశారు. ఈ కౌంటర్ ద్వారా భక్తులకు ప్రసాదాల విక్రయాలను ప్రారంభించారు. చిన్న వెంకన్న దర్శనానికి వచ్చే భక్తులు శివాలయాన్ని సందర్శిస్తారు. ఇక్కడ భక్తుల సౌకర్యార్థం స్వామివారి ప్రసాదాలను అందుబాటులో ఉంచినట్లు ఆలయాధికారులు తెలిపారు.

తాతారావు మృతికి సంతాపం

తణుకు, న్యూస్‌టుడే: తణుకు జిల్లా ఆసుపత్రి ఆర్‌ఎంవో అండే వెంకట రామ సత్య తాతారావు ఆకస్మిక మృతి పట్ల ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ సంతాపం తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పేద, మధ్య తరగతి వర్గాలకు వైద్య సేవలు అందిస్తూ నిబద్ధతతో పనిచేస్తున్న ఆయన గుండెపోటుతో మృతి చెందడం తనను కలచివేసిందన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా.. తాతారావు మృతి చాలా బాధాకరమని, ఎందరో ప్రాణాలు కాపాడిన వైద్యుడు ఇలా మృతి చెందడం చాలా దురదృష్టకరమని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం ప్రకటన విడుదల చేశారు. పేదలకు అండగా సేవలు అందిస్తున్న తాతారావు అనేక మంది హృదయాల్లో చిరస్థాయిగా ఉంటారన్నారు.

పలువురు నివాళులు.. తణుకు ఆసుపత్రిలో తాతారావు భౌతికకాయానికి తాడేపల్లిగూడెం ఆర్డీవో ఖతీబ్ కౌసర్ బానో, తహసీల్దార్ అశోక్ వర్మ, ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.సాయికిరణ్‌తో పాటు వైద్యులు, సిబ్బంది నివాళులర్పించారు.

అమ్మబాబోయ్

- తొమ్మిది నెలలు.. 281 గర్భస్రావాలు
- మన్యం ఆసుపత్రుల్లో పరిస్థితి ఇదీ..

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: మన్యం ప్రాంతంలోని పీహెచ్‌సీల పరిధిలో తొమ్మిది నెలల్లో ఏకంగా 281 మందికి గర్భస్రావాలు జరిగాయి. స్వయంగా వైద్య శాఖ సిబ్బందే తమ నివేదికల్లో ఈ వివరాలను పేర్కొన్నారు. ఐటీడీఏ ద్వారా అమలవుతున్న గిరిజన సంక్షేమ కార్యక్రమాలపై ఏలూరులో ఇటీవల కలెక్టర్ వెట్రిసెల్వి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ అంశాన్ని గుర్తించారు. పరిస్థితిపై అధికారులను ప్రశ్నించి మందలించారు. గర్భస్రావాలు జరగకుండా అరికట్టేందుకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పొంతన లేని వివరాలు చెప్పడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసుల వారీగా వివరాలు అందజేయాలని ఆదేశించారు. దీంతో ఉన్నతాధికారులు తలలు పట్టుకుంటున్నారు. నివేదికలను పరిశీలించి క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.

రిజిస్ట్రేషన్ లక్ష్యాలే కారణం అంటూ.. ఇదిలా ఉండగా పీహెచ్‌సీల పరిధిలో గర్భిణుల వివరాలు రిజిస్ట్రేషన్ చేసేందుకు ఉన్నతాధికారులు లక్ష్యాలు ఇవ్వడమే పరిస్థితికి కారణంగా వైద్య సిబ్బంది వాదిస్తున్నారు. గర్భిణులు లేకుండానే ఉన్నట్లు చూపి, వారు ప్రసవించినట్లు చూపే అవకాశం లేనందున గర్భస్రావం అయినట్లు తప్పుడు సమాచారాన్ని నివేదికల్లో పేర్కొన్నట్లు చెబుతున్నారు.

★ సహజంగా గిరిజన గ్రామాల్లో పోషకాహార లోపాలు, రక్తహీనత సమస్యలతో బాధపడుతుంటారు. గర్భస్రావాలకు ఇవి కారణాలా, లేక ఇంకేమైనా ఉన్నాయా అన్న కోణంలో పరిశీలిస్తున్నారు.

పీహెచ్‌సీల వారీగా నివేదికలో చూపిన గర్భస్రావాలు

కొండ్రుకోట	15
దొరమామిడి	30
కేఆర్‌పురం	28
నందాపురం	30
ఎల్‌ఎన్‌డీపేట	29
జీలుగుమిల్లి	23
విజరం	33
వేలేరుపాడు	24
అంతర్వేదిగూడెం	14
కమయ్యపాలెం	15
అమరవరం	14
కుక్కునూరు	17
పులిరామన్నగూడెం	3
కొయిదా	4
రాచన్నగూడెం	2

మన్యంలో మండలాలు: బుట్టాయగూడెం, పోలవరం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు: 15

17న మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాక.. 281 గర్భస్రావాలు నమోదైన పరిస్థితిని రాష్ట్ర మహిళా కమిషన్ తీవ్రంగా పరిగణించింది. ఇందుకు సంబంధించిన వాస్తవ పరిస్థితులు, కారణాలను నిర్ధారించడానికి మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ ఈ నెల 17న జిల్లాకు రానున్నారు. ఈ మేరకు సమాచారం అందినట్లు ఐటీడీఏ అధికారులు తెలిపారు. క్షేత్రస్థాయిలో పర్యటించి, ఉన్నతాధికారులతో సమావేశమవుతారని చెబుతున్నారు.

జ్ఞాపకాలు పదిలం!

ఆర్యసమాజం స్థాపించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రూ.150 విలువైన స్మారకనాణెం, ఆర్యసమాజ వ్యవస్థాపకులు మహర్షి దయానంద సరస్వతి 200వ జయంతి సందర్భంగా విడుదలైన రూ.200 విలువైన స్మారక నాణేలను ఏలూరుకు చెందిన అలీఖాన్ మహమ్మద్ సేకరించి ప్రదర్శించారు. **- ఈనాడు, ఏలూరు**

ఆలయ ఛైర్మన్ రామకృష్ణకు చెక్కు అందజేస్తున్న పప్పుసింగ్

దానేశ్వరి అమ్మవారి ఆలయానికి రూ.25 లక్షల విరాళం

తణుకు, న్యూస్‌టుడే: దువ్వ దానేశ్వరి అమ్మవారి ఆలయ అభివృద్ధికి దాతలు రూ.25 లక్షల విరాళం అందజేసినట్లు ఆలయ ఛైర్మన్ ప్రత్తి రామకృష్ణ తెలిపారు. అమ్మవారి ఆలయ పునఃనిర్మాణంలో భాగంగా తణుకుకు చెందిన కుమార్ పప్పు సింగ్, రమాదేవి దంపతులు వారి కుమారుడు రక్షిత్ కుమార్, కుమార్తెలు దివ్య, రాజిత సింగ్‌ల పేరిట రూ.25లక్షల చెక్కును రామకృష్ణకు బుధవారం అందజేశారు.

మహాశివరాత్రి పర్వదినం.. అప్రమత్తతే ప్రధానం

'న్యూస్‌టుడే'తో దేవాదాయశాఖ సహాయ కమిషనర్ శ్రీనివాసరావు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాలు పట్టిసీమ, బలివే, భోగేశ్వర స్వామి ఆలయాలతో పాటు శివాలయాల్లో ఈనెల 15న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. దీనికోసం అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు సహకరించి దర్శనానికి కొంత సమయం ముందుగానే ప్రణాళిక చేసుకుని ప్రశాంతంగా శివార్చన చేసుకోవాలని దేవాదాయశాఖ సహాయ కమిషనర్ కూచిభొట్ల శ్రీనివాసరావు కోరారు. శివరాత్రి వేడుకల ఏర్పాట్లు, భక్తులు పాటించాల్సిన జాగ్రత్తలపై ఆయన 'న్యూస్‌టుడే'కు ఇలా వివరించారు.

విస్తృత ఏర్పాట్లు.. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా పూర్తి స్థాయి ఏర్పాట్లు చేస్తున్నామని ఏసీ శ్రీనివాసరావు తెలిపారు. మూడు ప్రధాన ఆలయాలకు ముగ్గురిని సీఎస్‌వో(చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్లు)గా నియమించినట్లు చెప్పారు. అంతేకాకుండా భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక అదనపు సిబ్బందిని కేటాయించామన్నారు. ఎండల వల్ల ఇబ్బంది కలగకుండా చలువ పందిళ్లు, మజ్జిగ, మంచినీరు, వ్యాపారులు, దాతల సహకారంతో మంచినీరు, మజ్జిగ పంపిణీ చేయనున్నట్లు ఆయన చెప్పారు. లింగోద్భవ కాలంలో అభిషేకాలకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. అలాగే జిల్లాలో ఎక్కడా లేనివిధంగా భోగేశ్వరంలో జరిగే స్వామి వారి తెప్పోత్సవంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామన్నారు. ఆలయం నుంచి లేదా దాతల సహకారంతో ప్రసాదాలు పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేశామని వివరించారు. వీఐపీ దర్శనాల వల్ల ఉచిత దర్శనాలకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశామన్నారు.

భక్తులు సహకరించాలి

ఎటువంటి తోపులాటలు, ఆత్రుతకు తావు లేకుండా భక్తులు సహకరించాలని శ్రీనివాసరావు కోరారు. క్యూ లైన్లలో మాత్రమే వెళ్లాలని, వృద్ధులు, పిల్లలు ఎవరైనా వస్తే ఎదుటివారికి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని, దర్శన సమయాలను పాటించాలని సూచించారు. వృద్ధులు, మహిళలు, పిల్లలు ముందుగా వెళ్లేందుకు మిగిలిన వారు సహకరించాలన్నారు. తోసుకోవడం, ముందు ఉన్నవారిని నెట్టడం ప్రమాదాలకు దారి తీస్తాయని హెచ్చరించారు. బారికేడ్లపై బరువు ఆని నిల్చోవద్దని, అధికారుల సూచనలు పాటించాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

జీలుగుమిల్లి (బుట్టాయగూడెం), న్యూస్‌టుడే: రాష్ట్రేతర ప్రాంతం నుంచి ఉపాధి నిమిత్తం వచ్చిన యువతి ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం పి.అంకంపాలెంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ఒడిశా రాష్ట్రం రాయగడ జిల్లా బీఎల్ వడి మండలానికి చెందిన పతిక రష్మిక(19) నాలుగు రోజుల కిందట గ్రామంలోని కోళ్ల ఫారంలో పని చేసేందుకు వచ్చారు. బుధవారం ఆమె అనుమానాస్పద స్థితిలో ఉరి వేసుకుని మృతి చెంది ఉండడాన్ని గుర్తించారు. అక్కడే పనిచేస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన వివాహితుడు ప్రశాంత్‌తో ఆమెకు పరిచయం ఉన్నట్లు చెబుతున్నారు. ప్రశాంత్, అతడి భార్య పని నిమిత్తం కోళ్ల ఫారానికి వెళ్లగా, ఇంటి వద్ద రష్మిక షెడ్డులో ఉరి వేసుకున్నట్లు పేర్కొన్నారు.

లారీ ఢీకొని ఉద్యానశాఖ ఒప్పంద ఉద్యోగి దుర్మరణం

నాగేశ్వరరావు (పాత చిత్రం)

జీలుగుమిల్లి (బుట్టాయగూడెం), అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: లారీ ఢీకొని ఉద్యాన శాఖ ఉద్యోగి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన జీలుగుమిల్లి మండలం తాటియాకులగూడెం సమీపాన జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. బాపట్ల జిల్లా నరాలశెట్టివారిగూడేనికి చెందిన నరాలశెట్టి నాగేశ్వరరావు(53) తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేటలో ఉద్యానశాఖ కార్యాలయంలో ఒప్పంద పద్ధతిన ఉద్యోగం చేస్తూ అక్కడే కుటుంబంతో కలిసి ఉంటున్నారు. బుధవారం వ్యక్తిగత పనిపై జీలుగుమిల్లి వచ్చి.. తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో తాటియాకులగూడెం సమీపంలో అశ్వారావుపేట వైపు వేగంగా వెళుతున్న లారీ వెనుక నుంచి ఆయన్ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగేశ్వరరావు తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందారు. మృతుని భార్య నాగమల్లేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై క్రాంతికుమార్ తెలిపారు.

ఉప్పుటేరులో దూకి యువకుడు ఆత్మహత్య

ఆకివీడు, న్యూస్‌టుడే: ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల సరిహద్దు ప్రాంతంలో ఉన్న ఉప్పుటేరులో దూకి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఇది. సుమారు 22 సంవత్సరాల వయస్సు కలిగిన యువకుడు వారం రోజుల క్రితం నుంచి కనిపించపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకుతున్నారు. అయితే యువకుడి మృత దేహం బుధవారం ఉప్పుటేరులో లభ్యమైనట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మార్చి 16 నుంచి దూరవిద్య పరీక్షలు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: ఏపీ సార్వత్రిక విద్యాపీఠం దూరవిద్య వార్షిక పరీక్షలను మార్చి 16 నుంచి 28 వరకు నిర్వహించనున్నట్లు డీఈవో వెంకటలక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 20న జరగాల్సిన గణిత, భారతీయ సంస్కృతి, వారసత్వం పరీక్షను 21వ తేదీకి వాయిదా వేసినట్లు చెప్పారు. పరీక్షల కాల నిర్ణయ పట్టికను www.apopen-school.ap.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలియజేశారు.

14న పీఏటీ.. ఈ నెల 14న 'ప్రొఫెషనల్ అడ్వాన్స్‌మెంట్ టెస్ట్' (పీఏటీ) పరీక్ష నిర్వహించనున్నట్లు డీఈవో వెంకటలక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు హాజరు కావాల్సిన అభ్యర్థులు హాల్ టికెట్లను www.bse.ap.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

18 నుంచి టీసీసీ.. ఈ నెల 18 నుంచి 21 వరకు టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. అభ్యర్థులు హాల్ టికెట్లను www.bse.ap.gov.in వెబ్‌సైట్ నుంచి పొందవచ్చని అన్నారు.

14, 15 తేదీల్లో హెచ్ఎం అకౌంట్.. ఈ నెల 14, 15 తేదీల్లో హెచ్ఎం అకౌంట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ఆయా తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్షలు జరుగుతాయని చెప్పారు.

దిగబడిపోతున్న రాష్ట్రీయ రహదారి

కోలమూరు(ఉండి), న్యూస్‌టుడే: ఉండి నుంచి చేబ్రోలు వెళ్లే రాష్ట్రీయ రహదారి కొన్నిచోట్ల దెబ్బతింటోంది. ప్రధానంగా కోలమూరు, ఆరేడు ప్రాంతాల్లో రహదారి రెండు, మూడుచోట్ల దిగబడిపోతోంది. కోలమూరు నుంచి పులుగుమ్మ మార్గం వరకూ పంట కాలువ ప్రక్షాళన పనులు ఇటీవల పూర్తిచేశారు. ఆ దశలో కోలమూరు చిన్న రైస్‌మిల్లుకు సమీపంలో రహదారి కొంతమేర కోతకు గురైంది. దాని పునరుద్ధరణ పనులు అప్పట్లో చేశారు. గట్టు బలహీనపడినచోట రహదారి ముక్కలైపోతోందని వాహనచోదకులు వాపోతున్నారు. ఈఅంశంపై ఆర్అండ్‌బీ ఏఈ కె.శ్రీహరిరాజు స్పందిస్తూ పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బోర్డు పెట్టరు.. తిప్పి పంపుతారు!

ఫోన్ పే, గూగుల్ పే ద్వారా డబ్బులు చెల్లించే కౌంటర్ వద్ద టికెట్లు ఇవ్వకపోవడంతో వెనుదిరిగి వెళ్తున్న భక్తులు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవారి కేశఖండనశాల టికెట్లు తీసుకునేందుకు భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దేవస్థానం భక్తుల సౌకర్యార్థం కేశఖండనశాల ప్రారంభంలో ఫోన్ పే, గూగుల్ పే ద్వారా డబ్బులు చెల్లించి టికెట్లు తీసుకునేందుకు ఒక కౌంటర్, డబ్బులు చెల్లించి టికెట్లు తీసుకునేలా మరో కౌంటర్ ఏర్పాటు చేశారు. ఆయా కౌంటర్ల వద్ద భక్తులు గుర్తించేలా ఎటువంటి బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో తెలియక తికమక పడుతున్నారు. ఫోన్ పే, గూగుల్ పే ద్వారా టికెట్లు తీసుకునే కౌంటర్ వద్దకు డబ్బులు తీసుకెళ్లి టికెట్లు ఇవ్వమంటే మరో చోటుకు పంపిస్తున్నారు. ఇలా భక్తులను ఒక దగ్గర నుంచి నుంచి మరో దగ్గరకు పంపించడంతో ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై దేవస్థానం ఈఈ భాస్కర్ మాట్లాడుతూ. భక్తులు గుర్తించేలా ఆయా కౌంటర్ల వద్ద బోర్డులు ఏర్పాటు చేయిస్తామని చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ దేవదాయ ధర్మదాయ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా కేశవరం గ్రామం, గణపవరం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా నందు గల శ్రీ మల్లేశ్వర స్వామి వారి దేవాలయమునకు అభివృద్ధి పనులు చేయుటకు రూ.12.00 లక్షలకు టెండరు పిలుచుట జరుగుచున్నది.
ఇతర వివరములకు వెబ్‌సైట్.
www.apeprocurement.gov.in నందు చూడగలరు. ఇట్లు : ఛైర్మన్

ప్రయాణికుడిగా పరిచయమై.. ఐపీఎస్‌గా నమ్మబలికి

ఉద్యోగం ఇప్పిస్తానని రూ.1.50 లక్షల కాజేత

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: దిల్లీ ఎన్ఐఏలో ఐపీఎస్ అధికారిగా పని చేస్తున్నా.. ఆదాయపు పన్ను శాఖలో డివిజనల్ అడ్వైజర్ ఉద్యోగాన్ని రీప్లేస్‌మెంట్ కోటాలో ఇప్పిస్తానని ఓ యువకుడిని నమ్మించి రూ.1.50 లక్షలు కాజేసిన నకిలీ ఐపీఎస్ అధికారి ఉదంతమిది. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన తిరుపతి జిల్లా అలిపిరి పోలీసులకు ఇదే తరహాలో మరో రెండు చోట్ల మోసాలకు పాల్పడినట్లు తెలిసింది. తెలంగాణ రాష్ట్రం సిద్దిపేటలో ఒకరి నుంచి రూ.2.50 లక్షలు, మాదాపూర్‌లో మరో యువకుడి నుంచి రూ.7 లక్షలు కాజేసినట్లు గుర్తించారు. నిందితుడిని అరెస్టు చేసి కేసు వివరాలను సీఐ రామ్‌కిశోర్ ఎస్ఐ నరసింహారావుతో కలసి బుధవారం వెల్లడించారు. 'ఏలూరుకు చెందిన వెంకటేశ్వరరావు ఐదేళ్ల కిందట గరుడ వారధి నిర్మాణ పనుల నిమిత్తం తిరుపతికి వచ్చారు. స్థానిక ఆటోనగర్‌లో ఉంటూ ప్రస్తుతం స్విమ్స్‌లో ఫార్మసిస్టుగా పనిచేస్తున్నారు. సెలవు రోజుల్లో ర్యాపిడో డ్రైవర్‌గా పనిచేస్తారు. రెండు నెలల కిందట ర్యాపిడో రైడ్‌లో కె.సురేష్‌కుమార్ అలియాస్ సూర్య పరిచయమయ్యారు. దిల్లీ ఎన్ఐఏలో ఐపీఎస్ అధికారిగా తనను తాను పరిచయం చేసుకున్నారు. ఇటీవల పదోన్నతిపై హైదరాబాద్‌కు బదిలీ అయినట్లు చెప్పారు. ప్రస్తుతం సెలవులో శెట్టిపల్లిలోని పిన్నమ్మ ఇంటికి వచ్చానని తెలిపారు. హైదరాబాద్ ఆదాయ పన్ను శాఖలోని ఉన్నతాధికారులు తనకు పరిచయం ఉన్నారని.. రీప్లేస్‌మెంట్ కోటాలో ఉద్యోగం ఇప్పిస్తానని ర్యాపిడో డ్రైవర్‌ను నమ్మించారు. అతని నుంచి విడతల వారీగా పేటీఎం ద్వారా రూ.1.50 లక్షల నగదు బదిలీ చేయించుకున్నారు. అతని అనుమానాస్పద ప్రవర్తనను గుర్తించిన బాధితుడు నగదు తిరిగి ఇమ్మని కోరగా.. నువ్వు చేయగలిగింది చేసుకోమని బెదిరించడంతో అలిపిరి పోలీసులను ఆశ్రయించారు. దర్యాప్తులో ఒడిశాకు చెందిన సురేష్‌కుమార్ ఇదే తరహా మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్స్‌కు అలవాటు పడి అవసరమైన డబ్బు కోసం మోసాలకు పాల్పడుతున్నట్లు తెలుసుకున్నారు. బుధవారం అరెస్టు చేసి అతని నుంచి రూ.1.25 లక్షల విలువైన వాషింగ్ మిషన్, టీవీ, మ్యూజిక్ పరికరాలు స్వాధీనం చేసుకున్న'ట్లు సీఐ వివరించారు.

నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సీఐ రామ్‌కిశోర్

మురుగు కాలువలో పసికందు మృతదేహం

పెదపాడు, న్యూస్‌టుడే : ఏ తల్లి కన్నదో... పుట్టిన వెంటనే కనీసం బొడ్డు పేగు కోయకుండానే ఓ పసికందు మురుగు కాలువలో తేలింది. పెదపాడులోని పెద్దమాల కాలనీలో మురుగుకాలువ నుంచి స్థానికులకు దుర్వాసన వస్తుండటంతోపాటు పసికందు మృతదేహం ఉబ్బి కనిపిస్తుండటంతో పోలీసులకు సమాచారం అందించారు. పెదపాడు ఎస్సై ఆర్.శ్రీను ఘటన స్థలానికి చేరుకొని మురుగు కాలువలో ఉన్న మగశిశువును బయటకు తీయించారు. చుట్టుపక్కల వారిని విచారించినా ఎటువంటి ఆచూకీ లభించలేదు. ఐసీడీఎస్, ఆరోగ్యశాఖ అధికారులతో మాట్లాడినా ఫలితం లేకపోయింది. మృతదేహం ఉబ్బి ఉండటంతో పాటు దుర్వాసన వస్తుండటంతో రెండు రోజుల కిందట తీసుకొచ్చి ఇక్కడ పడేసి ఉంటారని ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని ఏలూరు సర్వజన ఆసుపత్రి శవాగారానికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.ల్లో)
నెక్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213 చికెన్ స్కిన్‌లెస్ - 243.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 137, 146, 157 చికెన్ విత్ స్కిన్ - 260 చికెన్ స్కిన్‌లెస్ - 270.

శ్మశానవాటికల అభివృద్ధికి రూ.9.34 కోట్లు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: జిల్లాలో శ్మశానవాటికల అభివృద్ధికి ఉపాధిహామీ పథకం కింద పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.9.34 కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు కలెక్టర్, జిల్లా పథక కో-ఆర్డినేటర్ వెట్రిసెల్వి ఉత్తర్వులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ నిధులతో 20 మండలాల్లో 51 గ్రామాల్లో శ్మశాన వాటికల్లో అవసరమైన నిర్మాణాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

పీఎంశ్రీ పాఠశాలలకు గ్రంథాలయ సామగ్రి

నిడమర్రు, న్యూస్‌టుడే: పీఎంశ్రీ పాఠశాలలకు కొత్తగా గ్రంథాలయ సామగ్రి వచ్చింది. ఈ సామగ్రిలో ఒక టేబుల్, 2 అల్మారాలు, దిన పత్రికల పెట్టె, 10 కుర్చీలు ఉన్నాయి. కొత్తగా వచ్చిన సామగ్రితో గ్రంథాలయాలకు నూతన శోభ వచ్చింది. జిల్లాలోని 37 పీఎంశ్రీ పాఠశాలలకు సామగ్రి వచ్చింది. సమగ్ర శిక్షా ఏఎంవో రెడ్డి రామారావు మాట్లాడుతూ గ్రంథాలయాలకు ఈ సామగ్రి ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు.

13న ఉద్యోగ మేళా

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా ఉపాధి కార్యాలయం, నేషనల్ కెరీర్ సర్వీస్ ఆధ్వర్యంలో ఈ నెల 13న ఉదయం 10 గంటలకు ఏలూరులోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి రమేశ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ నుంచి డిగ్రీ వరకు చదువుకున్న అభ్యర్థులు హాజరు కావచ్చన్నారు.

13న అభ్యర్థుల ఎంపిక కౌన్సెలింగ్

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి పరిధిలో డిస్ట్రిక్ట్ కన్సల్టెంట్, క్లినికల్ సైకాలజిస్ట్, ఆడియోలజిస్ట్ పోస్టులు సింగిల్ సోలటరీ పోస్టు (ఒకే పోస్టు) కావడంతో వీటికి రోస్టర్ వర్తించదని ఏలూరు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి అమృతం తెలిపారు. తుది జాబితా www.eluru.ap.gov.in, www.westgodavari.ap.gov.in పొందుపరచడమైందని తెలిపారు. స్టాఫ్ నర్స్ పోస్టుకు రోస్టర్ ప్రకారం ఓసీ అభ్యర్థులు లేనందున ఈ పోస్టు నిలుపుదల చేయడం జరిగిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రుమటాలజిస్ట్ చెన్నై నుండి రాక
డా॥ కవిత M.D, DNB, D.M., SCE (Rheumatology)
కీళ్ళ వాతం, గౌట్, SLE, APLA మొ॥ వ్యాధుల చికిత్సా నిపుణులు
డాక్టరు గారు తేది: 14-2-2026 (శనివారం) విచ్చేయుచున్నారు
అపాయింట్‌మెంట్ కొరకు: 98854 22345, 96662 61803, 08816-223728
A+ అభిరామ్ హాస్పిటల్స్ వాటర్ ట్యాంక్ దగ్గర, జె.పి.రోడ్, భీమవరం

92.7 FM Rajamahendravaram 92.7 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

EENADU Classifieds

BUSINESS SERVICES
భీమవరంలో బేకరి స్వీట్ షాపులో జ్యూస్, ఫ్రైడ్ రైస్, చైనీస్ చేయుటకు మాస్టర్స్ కావలెను. సెల్: 89853 11167.
బంగారం బ్యాంకులో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నటువంటి బంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 81422 92071.
మీ ఇంటి వద్ద నుండి పార్ట్/ఫుల్ టైం జాబ్ చేయుట ద్వారా అందరూ అర్హులే. వీక్లీ: 5000 to10,000 సంపాదించుకునే అవకాశం. ✆ 99897 99736.

JOBS
Senior Marketing Executive for Bhimavaram. Attractive Salary Will be Paid. Help Hospitals, Vijayawada. ✆ 92462 76008
BR INFRACON నందు పనిచేయుటకు సైట్ ఇంజినీర్లు కావలెను. Q: డిప్లొమా, B.Tech/M.Tech అర్హత కలిగి బిల్డింగ్స్, ఇరిగేషన్ వర్క్స్ నందు 3to4 సంవత్సరములు అనుభవం కలిగి విజయవాడ, రాజమండ్రి, ఏలూరు జిల్లాల నందు పనిచేయుటకు కావలెను. పూర్తి బయోడేటాను info@brinfra-con.com కి పంపగలరు. ✆ 79955 57831.
జంగారెడ్డిగూడెం, అశ్వారావుపేట రోడ్‌లోగల ప్రముఖ ఎలక్ట్రానిక్స్ షోరూంనందు పనిచేయుటకు బాయ్స్ (హెల్పర్స్), సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. ESI+PF కలదు. ✆ 94947 11544, 99123 51117.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 4.85 పై
తణుకు ఆఫీసు: 08819-224254

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం

భీమవరం

• భీమవరం • ఉండి

భీమేశ్వరస్వామి కల్యాణానికి ఏర్పాట్లు

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడులోని మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలను ఈ నెల 25 నుంచి 27 వరకు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ధర్మకర్తల మండలి ఛైర్మన్ వేమూరి వెంకట సీతారామ శాస్త్రి, ఈవో అల్లూరి సత్యనారాయణరాజు తెలిపారు. దీనికి సంబంధించిన ఆహ్వాన పత్రికను బుధవారం ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. 26వ తేదీ సాయంత్రం 6.30 గంటల నుంచి స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జంగారెడ్డి మణికంఠ కొండారెడ్డి, పి.రాంబాబు, చుండూరి వెంకటేశ్వరరావు, అర్చకులు వెంకటరత్నం పాల్గొన్నారు.

వైద్యసేవలను సద్వినియోగం చేసుకోండి

ప్రదర్శనలో వైద్యుడు అశోక్, లయన్స్ క్లబ్ సభ్యులు, విద్యార్థులు

ఆకివీడు, న్యూస్‌టుడే: జాతీయ యునాని దినోత్సవం సందర్భంగా బుధవారం ఆకివీడులో ప్రదర్శన నిర్వహించారు. యూనాని వైద్య విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక షాదీఖానా భవనంలో ఉచిత యునాని వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 60 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిజిటల్ గ్రంథాలయంగా తీర్చిదిద్దుతా

రికార్డులు పరిశీలిస్తున్న నాగరాజు

పాలకోడేరు, న్యూస్‌టుడే: జిల్లాలోని గ్రంథాలయాలను అన్ని వర్గాల పాఠకులకు ఉపయోగపడే విధంగా డిజిటల్ లైబ్రరీలుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు జుత్తుగ నాగరాజు తెలిపారు. బుధవారం ఆయన పాలకోడేరు మండలంలోని పాలకోడేరు, గొల్లలకోడేరులోని శాఖా గ్రంథాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్న పుస్తకాల వివరాలను అడిగితెలుసుకున్నారు. పాఠకులు ఏ విధమైన పుస్తకాలు కోరుకుంటున్నారు, విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు ఉన్నాయా లేవా అని ఆరా తీశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారులు బాలరాజు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రమైనా మార్పు రాదే?

భీమవరంలో ఇరుకుగా కీలక మార్గాలు

చినఅమిరం(భీమవరం అర్బన్, ఉండి), న్యూస్‌టుడే: భీమవరంలో రద్దీకి తగ్గట్టుగా రహదారి వ్యవస్థ లేదు. జిల్లా కేంద్రమయ్యాకైనా మార్పొస్తుందని ఆశించినా ఆ మేరకు జరగలేదు. నాలుగేళ్లయినా పరిస్థితిలో పెద్దగా మార్పు రాలేదు. జిల్లా కేంద్రం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే కీలక మార్గాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు.

భీమవరం నుంచి కలిదిండి మీదుగా విజయవాడ వెళ్లే కీలక రహదారి. చినఅమిరం పరిధిలో ఉన్న రహదారి వాహనాల రద్దీకి తగినట్లుగా లేదు. ఇటుగా రోజుకి 26 వేల వాహనాలు తిరుగుతున్నాయి.

★ గణపవరం నుంచి ఉండి మీదుగా భీమవరం వరకు రహదారి దారుణంగా ఉంది. కోలమూరు, ఆరేడు, పాములపర్రు, ఉండి వద్ద అంతా గుంతలమయమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల రోడ్డును తవ్వి తిరగబెట్టారు. కొమరాడ రోడ్డు, చినఅమిరం నుంచి అనాకోడేరు వెళ్లే రోడ్డు, భీమవరం-మొగల్తూరు, భీమవరం-కాళీపట్నం రోడ్లు బాగా దెబ్బతిన్నాయి. చినఅమిరం మీదుగా విజయవాడ వైపు వెళ్లే రోడ్డుకి ప్రతిపాదనలు పంపించాం. వెంప, కాళీపట్నం, కొమరాడ మార్గాలకు తాజాగా నిధులొచ్చాయి. టెండర్లు పిలవాల్సి ఉంది. ఆ ప్రక్రియ పూర్తవగానే పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నామని ర.భ.శాఖ ఏఈ రాజశేఖర్ తెలిపారు.

దెయ్యాలతిప్ప నుంచి నాగిడిపాలెం వరకు ఉన్న రహదారి దుస్థితి ఇది. దీని దూరం 4.67 కి.మీ. ఐదేళ్లుగా అధ్వానంగా ఉంది. వైకాపా హయాంలో ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో పరిస్థితి మరింత దిగజారింది. ప్రస్తుతం ఎక్కడికక్కడ గుంతలమయమై దారుణంగా ఉంది.

మేమున్నాం.. మీకు తోడుగా..

భీమవరం పట్టణం:	80085 74471	గునుపూడి:	80085 74474
భీమవరం మండలం:	80085 74533	వీరవాసరం:	80085 74475
పాలకోడేరు:	80085 74467	ఉండి:	80085 74526
ఆకివీడు:	80085 74525	కాళ్ల:	94401 04042

ఆకివీడు, న్యూస్‌టుడే: ? ఆకివీడులోని సిద్దాపురం రోడ్డులో ఉన్న డంపింగ్ యార్డు స్థలంలో దిగుమతి చేస్తున్న చెత్త తరచూ తగులబడుతోంది. **- వెంకట్రావు, స్థానికుడు**

✔ చెత్త తగులబడకుండా, పొగ వ్యాప్తిచెందకుండా చర్యలు తీసుకుంటాం. **- సాకేత్‌బాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

కాళ్ల, న్యూస్‌టుడే: ? కాళ్ల కొత్తపేటలో పూడిక తీయడంలేదు. **- సునీల్‌కుమార్**

✔ గ్రామంలో పక్కా డ్రెయిన్లు లేకపోవడంతో మురుగు పారుదల కష్టంగా ఉంది. పూడిక తీయించి, బ్లీచింగ్ చల్లిస్తాం. **-సతీష్‌కుమార్, కార్యదర్శి**

ఉండి, న్యూస్‌టుడే: ? ప్రధాన వంతెన కూడలి నుంచి తోటలోకి వెళ్లే మార్గంలో కొన్ని చోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. **-వెంకటసుబ్బలక్ష్మి**

✔ పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటాం. **- గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి**

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: ? గొల్లవానితిప్పలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. **-నరేష్**

✔ చర్యలు చేపడతాం. -రామాంజనేయప్రసాద్, పంచాయతీ విస్తరణాధికారి

వీరవాసరం, న్యూస్‌టుడే: ? వీరవాసరం-వడ్డిగూడెం రహదారిపై హోటళ్ల వద్ద నిలిపి ఉంచే వాహనాలతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. **-సోమేశ్వరరావు**

✔ రహదారిపై ట్రాఫిక్ నిలపకుండా చర్యలు తీసుకుంటాం. **- రాజ్‌కుమార్, ఎస్సై**

పాలకోడేరు, న్యూస్‌టుడే: ? గొల్లలకోడేరు వంతెన మలుపులో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడంతో వేండ్ర వైపు నుంచి వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. **- పి.సత్యనారాయణ, వేండ్ర.**

✔ తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. **-నాగేంద్రకుమార్, కార్యదర్శి, గొల్లలకోడేరు.**

విద్యార్థినులకు పుస్తకాలను అందిస్తున్న సీతారామలక్ష్మి తదితరులు

పట్టుదలగా చదివి మంచి ఫలితాలు సాధించాలి: తోట

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: పట్టుదలతో శ్రద్ధగా చదివితే మంచి ఫలితాలు రాబట్టొచ్చని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. పట్టణంలోని పీఎస్‌ఎం బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 200 మంది విద్యార్థినులకు తెలుగు యువత పట్టణాధ్యక్షుడు గొలగాని రమేష్ సౌజన్యంతో అభ్యాస పుస్తకాలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ వయసులో కష్టపడి చదివితే భవిష్యత్తు బాగుంటుందన్నారు.

పెట్రోలు బంకుల్లో నిబంధనలు పాటించాలి: జేసీ

తనిఖీ చేస్తున్న రాహుల్‌కుమార్‌రెడ్డి

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: పెట్రోలు బంకుల్లో కచ్చితంగా నిబంధనలు పాటించాలని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. భీమవరం మండలం యనమదుర్రులోని ఐఓసీ పెట్రోలు బంకును ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బంకులో భద్రతా ప్రమాణాలు, కొలతల్లో నిబంధనలు పాటిస్తున్నారో లేదో పరిశీలించారు. వినియోగదారులకు నాణ్యమైన ఇంధనం, సేవలు అందించాలని సూచించారు. వినియోగదారులు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలన్నారు. పెట్రోల్ బంకు నుంచి వృథా నీరు రోడ్డుపైకి రావడం గమనించి ఆ నీరు భూగర్భంలోకి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ రావి రాంబాబు, వీఆర్వో నాగరాజు తదితరులున్నారు.

అవినీతి ఆరోపణలొస్తే కఠిన చర్యలు..

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: అప్పుడా రిజిస్ట్రేషన్‌లో రైతులను ఇబ్బంది పెట్టినా... అవినీతి ఆరోపణలొచ్చినా కఠిన చర్యలు తప్పవని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. ఆర్డీవోలు, మత్స్యశాఖాధికారులు, తహసీల్దార్లు, మండల సర్వేయర్లతో ఆయన బుధవారం గూగుల్‌మీట్ నిర్వహించి మాట్లాడారు. రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయాలకు వచ్చే వారిని అవసరం లేకుండా వీఆర్వోలను కలవాలని సూచించకూడదని స్పష్టం చేశారు. ఏదైనా సమస్య ఎదురైతే రైతులు నేరుగా తహసీల్దార్లను సంప్రదించాలని సూచించారు. మార్చిలో చేపట్టే పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీకి అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు.

'ప్రొటోకాల్ పాటించకుండా అగౌరవపరుస్తారా'

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడులో కోట్లాది రూపాయలతో చేస్తున్న అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలలో కూటమి నాయకులు ప్రొటోకాల్ పాటించకుండా..వైకాపా మహిళా ఛైర్‌పర్సన్ అయిన తననే అగౌరవపరుస్తున్నారని ఛైర్‌పర్సన్ జామి హైమావతి ఆరోపించారు. బుధవారం 13వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించేందుకు తాను అక్కడికి వచ్చి తమ పార్టీ నాయకుల గురించి వేచి ఉండగానే కూటమి నాయకులు కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించడంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కౌన్సిలర్లు గేదల అప్పారావు, పడాల శ్రీనివాసరెడ్డి, గుండా సుందర రామనాయుడు (చిన్ని), అంబటి రమేష్, కురెళ్ల పోలు తదితర నాయకులు పాల్గొన్నారు.

చెత్త సేకరణకు స్వచ్ఛ రిక్షాలు వచ్చేశాయ్

కాళ్ల, న్యూస్‌టుడే: స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమానికి సంబంధించి ప్రభుత్వం నిన్న మొన్నటి వరకూ బ్యాటరీతో నడిచే రిక్షాలు పంచాయతీలకు అందజేశాయి. ప్రస్తుతం వాటి స్థానే రిక్షాలు వచ్చాయి. జిల్లాలో ఎంపిక చేసిన పంచాయతీలకు ముందుగా వీటిని పంపించారు. భీమవరం డివిజన్ పరిధిలో కాళ్ల, ఆకివీడు, ఉండి, గణపవరం, పాలకోడేరు, భీమవరం ప్రాంతాలకు ఇవి చేరుకున్నాయి. పంచాయతీకి ఒక రిక్షాతోపాటు తడి, పొడి చెత్త వేరు చేయడానికి నాలుగు డబ్బాలు అందజేశారు. ఎంపీడీవో కార్యాలయానికి చేరిన రిక్షాలతోపాటు తడి, పొడి చెత్త డబ్బాలను ఎంపిక చేసిన పంచాయతీలకు అందజేశామని కాళ్ల ఇన్‌ఛార్జి ఎంపీడీవో నాగేశ్వరరావు తెలిపారు.

మండలం. పంచాయతీలవారీగా ఇలా

★ కాళ్ల మండలం ఆనందపురం, ఎస్సీ బోసు కాలనీ, ఎల్ఎన్ పురం, మాలవానితిప్ప 4. ★ ఆకివీడు మండలం కోళ్ళపర్రు, తరటావ, దుంపగడప, రాజులపేట 4. ★ గణపవరం మండలం కోమటిపాలెం 1. ★ పాలకోడేరు మండలం వేండ్రఅగ్రహారం, విస్సాకోడేరు, కోరుకొల్లు 3.★ ఉండి మండలం ఎన్ఆర్పీ అగ్రహారం, పాందువ, ఉప్పులూరు, ఉణుదుర్రు 4. ★ వీరవాసరం మండలం వీరవాసరం 1. ★ భీమవరం మండలం పెదగర్వు, తోకతిప్ప, నాగిడిపాలెం 3.

పోటీతత్వంతో ముందుకెళ్లండి

విద్యార్థులకు బహుమతులు ఇస్తున్న నాగేంద్రప్రసాద్

ఉండి, న్యూస్‌టుడే: విద్యార్థి దశలో పోటీతత్వంతో ముందుకెళ్లాలని లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ ఎ.నాగేంద్రప్రసాద్ తెలిపారు. ఉండి ప్రభుత్వ ఐటీఐలో రిజర్వ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించి ఆయన మాట్లాడారు. విద్యార్థి దశలోనే నిర్దేశిత లక్ష్యం ప్రతిఒక్కరికీ ఉండాలన్నారు. అప్పుడే ఆశించిన రంగంలో రాణించగలమని వివరించారు. ఆర్థిక పొదుపు చర్యలు అలవర్చుకోవడం ద్వారా జీవితంలో ఎదురయ్యే వివిధ సమస్యల నుంచి సులభంగా గట్టెక్కవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఐటీఐ శిక్షణ అధికారి కృష్ణంరాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలు జైకుమార్, సాయికిరణ్, గౌతమ్‌సాయి, దీక్షిత్, సన్నీ, పవన్‌తేజ తదితరులకు బహుమతులు అందజేశారు.

రవాణాధికారుల ప్రత్యేక తనిఖీలు

భీమవరంలో తనిఖీలు చేస్తోన్న అధికారులు

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా రవాణాధికారి కృష్ణారావు ఆధ్వర్యంలో ఆ శాఖ అధికారులు జిల్లాలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఆటోరిక్షాలు, తేలిక పాటి, భారీ సరకు రవాణా వాహనాలకు బిగించి ఉన్న దీపాలను తొలగించారు. అలాంటి 150 వాహనాలను తనిఖీ చేసి వాటి చోదకులకు నిబంధనలపై కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ తరహా దీపాలతో రాత్రి వేళ ఎదురుగా వచ్చే వాహనచోదకులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని, వాటి నుంచి వచ్చే తీవ్రమైన కాంతి వల్ల కంటి చూపు దెబ్బతింటుందని అవగాహన కల్పించారు. భీమవరం, తణుకు, పాలకొల్లుల్లో చేసిన తనిఖీల్లో రవాణాధికారులు ప్రసాద్, శ్రీనివాస్, అజమీరాబద్దు, రవికుమార్, సత్యనారాయణ, తేజ, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: చట్టాలపై విద్యార్థి దశలోనే అవగాహన పెంపొందించుకోవాలని భీమవరం రెండోపట్టణ ఎస్సై హెచ్.మల్లికార్జునరావు తెలిపారు. నారాయణ కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. మహిళలు, బాలికలను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. పోక్సో బాలికా సంరక్షణ చట్టాలను వివరించారు.

కుంగుతున్న వంతెన

మడుగుపోలవరం (వీరవాసరం), న్యూస్‌టుడే: కొణితివాడ - మడుగుపోలవరం ఆర్ అండ్‌బీ రహదారిలో మురుగుకోడుపై ఉన్న తూము వంతెన రక్షణ గోడలు దెబ్బతిని కుంగిపోతున్నారు. తూముల వంతెన కావడంతో వర్షాల సమయంలో గుర్రపుడెక్క ఇతర వ్యర్థాలు పేరుకుపోయి మురుగు పారుదల జరగక రైతులు నష్టపోతున్నారు. ఆర్‌అండ్‌బీ ఏఈ డీఎస్ఎన్. మూర్తి మాట్లాడుతూ రహదారి అభివృద్ధి పనుల్లో భాగంగా వంతెనకు మరమ్మతులు చేయిస్తానన్నారు.

అప్రమత్తతతో క్యాన్సర్‌కు అడ్డుకట్ట

కొణితివాడ(వీరవాసరం), న్యూస్‌టుడే: క్యాన్సర్ మహమ్మారిపై ప్రజలు అప్రమత్తంగా ఉంటూ విధిగా పరీక్షలు చేయించుకోవాలని వీరవాసరం మండల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పోలిశెట్టి సత్యనారాయణ అన్నారు. వీరవాసరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి సహకారంతో గురువారం కొణితివాడలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యులు రేణుక, ప్రత్యూష, సౌమ్య, ప్రభాకర్, అబ్దుల్లాలు మొత్తం 144 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. శిబిరానికి మండల లయన్స్ క్లబ్ ట్రెజరర్ గొలగాని సత్యనారాయణ, సభ్యుడు వెలక్కాయల రామకృష్ణలు సహకారం అందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజనల్ ఛైర్మన్ నందుల రమణి, జిల్లా ట్రెజరర్ రామలింగేశ్వరరావు, జిల్లా సభ్యులు కామేశ్వరరావు, సర్పంచి బీశెట్టి లక్ష్మి, మాజీ సర్పంచి యరకరాజు వెంకట సుబ్రహ్మణ్యంరాజు, యరకరాజు హరిహరరాజు, నాగరాజు శ్రీనివాసరాజు, దేవిరెడ్డి పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: రైతులు ప్రభుత్వ పథకాలు, రాయితీలు, రుణాలు పొందాలంటే తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేయించుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. ఎల్బీచర్ల పరిధి బైనపాలెంలో పొలాలను ఆమెతో పాటు జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి పంట వివరాలపై ఆరా తీశారు. పలువురి రైతులకు ఈ- పంట నమోదు చేశారు.

దాతల సహకారంతో మంచినీటి చెరువు ప్రక్షాళన

వాంద్రం(ఉండి), న్యూస్‌టుడే: వాంద్రం గ్రామంలో దాతల సహకారంతో మంచినీటి చెరువు ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. ఈపనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు సర్పంచి దాసరి వెంకటకృష్ణతో పాటు మరికొందరు దాతలు ముందుకొచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఏఈ హరనాథరాజు, సర్పంచి వెంకటకృష్ణ, పంచాయతీ అభివృద్ధి అధికారి ఎన్.రామమోహనరావు, వార్డు సభ్యులు బుధవారం చెరువుని పరిశీలించారు.

ఉద్భవ్-2కె26 హ్యాకథాన్

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో మార్చి 5, 6 తేదీల్లో ఉద్భవ్-2కె26 ఓపెన్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ ప్లాటినం పేరిట జాతీయస్థాయి హ్యాకథాన్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ బి.హెచ్.వి.ఎస్ రామకృష్ణంరాజు తెలిపారు. హ్యాకథాన్ వివరాలతో కూడిన గోడపత్రాన్ని కళాశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఎస్.వి రంగరాజు, డైరెక్టర్ ఎం.జగపతిరాజు ఆవిష్కరించారని ప్రకటనలో తెలిపారు.

ఆ వెలుగులే దిక్కు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం భీమవరంలో పలు కూడళ్లలో విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. అంధకారంలో ప్రయాణిస్తున్న వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. అరకొర మరమ్మతులు చేసినా కొన్నిరోజులకే అవి పాడైపోతున్నాయి.

పలు కూడళ్లలో.. నర్సయ్య అగ్రహారం నుంచి బైపాస్‌రోడ్డుకు వచ్చే కూడలి, ఉండిరోడ్డు నుంచి బైపాస్‌మీదుగా తాడేపల్లిగూడెం వెళ్లే కూడలి, డాక్టర్ బీవీరాజు మార్గ్‌లోని మూడు కూడళ్లు, మారుతీనగర్ నుంచి విస్సాకోడేరు వంతెనకు వెళ్లే కూడలి తదితర చోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. తాడేరురోడ్డు, గునుపూడి, బలుసుమూడి, శ్రీరాంపురంలో కూడా ఇదే పరిస్థితి.

వాహనాల నుంచి వచ్చే వెలుగులే దిక్కుగా మారిన భీమవరం- తాడేపల్లిగూడెం రోడ్డు

ప్రమాదాలకు నిలయాలు.. * కూడళ్లలో విద్యుత్తు వెలుగులు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. భీమవరం- తాడేపల్లిగూడెంరోడ్డులో నెలరోజుల వ్యవధిలో 3 ప్రమాదాలు జరగ్గా ఇరువురు క్షతగాత్రులయ్యారు. బైపాస్‌రోడ్డులో భవన నిర్మాణ కార్మికుడ్ని లారీ ఢీకొనడంతో దుర్మరణం చెందాడు. విస్సాకోడేరు వంతెన సమీపంలోని కూడలిలో వాహన చోదకుడు గాయపడ్డాడు.

అంధకారంగా భీమవరం బైపాస్

నాణ్యత ప్రశ్నార్థకం?.. పట్టణంలో 6131 వీధి దీపాలు ఉన్నాయి. వాటిలో 600కు పైగా వెలుగులు మరిచిపోయాయి. ఇలా వెలుగులు ఇవ్వని వీధి దీపాలు కూడా ఎక్కువగా మూడురోడ్లు, నాలుగురోడ్లు కలిసే కూడళ్లలో ఉన్నాయి. గతంలో హైమాస్ట్ దీపాలు ఉండేవి. కనీసం ట్యూబ్‌లైట్లు అయినా సక్రమంగా వెలుగుతాయా అంటే అదీ ఉండదని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. బాగుచేసి వెళ్లిన మరుసటి రోజు నుంచి వెలగవు అంటున్నారు. వీధి దీపాల నిర్వహణపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని పురపాలక డీఈ వై.శ్రీను అన్నారు. వార్డుల వారీగా అన్నిచోట్లా పరిశీలిస్తానన్నారు. కూడళ్లలో ఇబ్బందులు లేకుండా వెంటనే మరమ్మతులతో పాటు కొత్త బల్బులు అమర్చుతామన్నారు.

ప్రకృతి సేద్యంతో ఆరోగ్యకర ఉత్పత్తులు

మాట్లాడుతున్న అరుణకుమారి

యలమంచిలి, న్యూస్‌టుడే: ప్రకృతి సేద్యంతో ఆరోగ్యకర పంట ఉత్పత్తులు పొందవచ్చని ఆ విభాగం జిల్లా సమన్వయకర్త ఎం.అరుణకుమారి పేర్కొన్నారు. యలమంచిలిలోని రైతు సేవా కేంద్రం ఆవరణలో మండల స్థాయి రైతు సమాఖ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి సేద్యాన్ని విస్తరించేలా రైతులకు అవగాహన కల్పించమే ఈ సమావేశాల లక్ష్యమన్నారు. గ్రామ స్థాయిలో డ్వాక్రా యానిమేటర్లు, వ్యవసాయ సహాయకులు, ఐసీఆర్పీ సభ్యులు సమష్టిగా కృషి చేసి ప్రకృతి సేద్యంతో కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఎనిమిది మంది రైతులను సత్కరించారు.

దీన్‌దయాళ్ సిద్ధాంతమే దేశాభివృద్ధికి మూలం

చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆదిలక్ష్మి తదితరులు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: దీన్‌దయాళ్ ఉపాధ్యాయ రూపకల్పన చేసిన సిద్ధాంతాలు దేశ సమగ్ర అభివృద్ధికి మూలమని భాజపా రాష్ట్ర కార్యదర్శి బోగిరెడ్డి ఆదిలక్ష్మి అన్నారు. పట్టణంలోని రామారావుపేటలోని భాజపా కార్యాలయంలో బుధవారం దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని నాయకులతో కలిసి నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దువ్వా శ్రీను, మీడియా ఇన్‌ఛార్జి నరిశే సోమేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తణుకు బాలిక ప్రతిభ

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: బహుళ ప్రతిభా విభాగంలో తణుకు పట్టణానికి చెందిన కాండ్రు వైష్మిత స్వామి వివేకానంద ఇండియన్ ఐకాన్ అవార్డును సొంతం చేసుకుంది. విశ్వగురు వరల్డ్ రికార్డు సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 8న హైదరాబాద్‌లో నిర్వహించిన స్వామి వివేకానంద ఇండియన్ ఐకాన్ అవార్డ్సు 2026 లో టాలెంటు కేటగిరీలో (పియానో, విజువల్ ఆర్ట్, సింగింగ్, స్పీచ్) ప్రతిభ కనబర్చినందుకు ఈ పురస్కారం దక్కింది. ఈ మేరకు తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మాధవిదేవి నుంచి అవార్డు అందుకుంది. ప్రస్తుతం ఆమె బెంగళూరులో పదో తరగతి చదువుతోంది. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన పలువురు వైష్మితను అభినందించారు.

శివోహం.. మహోత్సవ వైభవం

ఆచంట క్షేత్రంలో విస్తృత ఏర్పాట్లు

ఆచంట, న్యూస్‌టుడే: పశ్చిమలో ప్రసిద్ధ శైవ క్షేత్రాల్లో ఒకటైన ఆచంట ఉమా రామలింగేశ్వరస్వామి దేవస్థానం మహా శివరాత్రి శోభ సంతరించుకొంది. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి కూడా భక్తులు ఈ ఉత్సవాలకు తరలివస్తారు. ఫిబ్రవరి 13 నుంచి 17 వరకు తీర్థం, కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

13న కల్యాణం బహుళ ఏకాదశి, శుక్రవారం తెల్లవారుజామున 4.30 గంటలకు రామేశ్వరస్వామి, పార్వతీమాత కల్యాణం నిర్వహిస్తారు. శనివారం గ్రామోత్సవం జరుగుతుంది. ఆదివారం మహాశివరాత్రి రోజున రథోత్సవం, లింగోద్భవకాలంలో మహాన్యాసపూర్వక ఏకాదశరుద్రాభిషేకం జరుగుతాయి. మంగళవారం త్రిశూలోత్సవం పుష్పోత్సవంతో వేడుకలు ముగుస్తాయి.

ఖరీదైన ప్రాంతం.. సమస్యలు పదిలం

పట్టించుకోని అధికారులు

22 వార్డు నివేదన — జనాభా: 3,900

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం పట్టణంలో ఖరీదైన స్థలాలున్న ప్రాంతాల్లో ఇదొకటి. ఇక్కడ అధునాతన భవనాలు ఉన్నాయి. భీమవరం ఏర్పడినప్పట్నుంచి అభివృద్ధిలో దూసుకెళ్తోన్న ప్రాంతంలో సమస్యలు శాశ్వతంగా ఉన్నాయి. వెంకయ్యానాయుడు వీధి, తటవర్తివీధి, చేపల మార్కెట్ ప్రాంతం, మోగంటివారి వీధి తదితర ప్రాంతాలతో విస్తరించిన వార్డులోని సమస్యలను పరిష్కరించాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు శాంతియుతంగా విన్నవించుకున్నా పట్టించుకోవడంలేదనే విమర్శలున్నాయి.

రెస్ట్ హౌస్ రోడ్డులో డ్రెయిన్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. మురుగు వెళ్లే పరిస్థితి లేదు. కల్వర్టులు శిథిలమయ్యాయి. రహదారి పొడవునా భరించలేని దుర్వాసన వస్తోందని పట్టణ ప్రజలు వాపోతున్నారు.



ప్రధాన సమస్యలు ఇవీ.. ● ట్రాఫిక్ ఇబ్బందులు అనేకం. దుకాణాలు, వ్యాపార సంస్థల ఎదుట రహదారిపై వాహనాలు నిలుపుతున్నారు. ● వెంకయ్యానాయుడి వీధిలో కుళాయి నీటి సరఫరా సరిగ్గా లేదు. మంచినీటి సర్వీసు రిజర్వాయర్‌కు ఈ ప్రాంతం దూరంగా ఉండటం కారణమంటూ అధికారులు మాట దాటవేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ● పలు చోట్ల వీధి దీపాలు వెలగడంలేదు. బాగు చేసినా రోజుల వ్యవధిలో మళ్లీ మరమ్మతులకు గురవుతున్నాయి. ● డ్రెయిన్లను కప్పేయడంతో మురుగు కదలడం లేదు.

అన్నీ పరిష్కరిస్తాం.. డ్రెయిన్ నిర్మాణంతో పాటు మంచినీటి సరఫరా ఇబ్బందులు లేకుండా పనులు చేపడతామని పురపాలక డీఈ తాతబ్బాయి తెలిపారు. ఆక్రమణలను తొలగించి రహదారులపై అడ్డంకులు లేకుండా చూస్తామన్నారు.

నగరేశ్వరాలయంలో అంకురార్పణ

వాసవీ పెనుగొండ, న్యూస్‌టుడే: స్థానిక నగరేశ్వర, మహిషాసురమర్దని, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. నగరేశ్వర స్వామి, మహిషాసురమర్దని అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అంకురార్పణ, ధ్వజారోహణ, హోమాలు నిర్వహించారు.

విద్యుత్తు స్మార్ట్ మీటర్లతో ప్రయోజనం

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: విద్యుత్తు స్మార్ట్ మీటరు ప్రయోజనాలపై స్మార్ట్ మీటర్లు పక్వాడా పేరుతో ఈనెల 23 వరకూ వినియోగదారులకు ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు విద్యుత్తు శాఖ ఎస్ఈ ఉషారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్మార్ట్ మీటరుతో ముందస్తు చెల్లింపులు, వినియోగ వివరాలు, పారదర్శకమైన బిల్లింగ్ వంటి సౌకర్యాలపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

డ్రెయినేజీ సౌకర్యం కల్పించండి

పాలకోడేరు, న్యూస్‌టుడే: పెన్నాడ అగ్రహారం నాగుల చెరువు సమీపంలో దేవస్థానం భూములకు ఎదురుగా ఉన్న కాలనీలో డ్రెయినేజీ సౌకర్యం లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సిమెంట్ రహదారి సౌకర్యం కల్పించినా పక్కా డ్రెయినేజీ నిర్మించపోవడంతో మురుగు నీరంతా రోడ్డు పక్కనే తిష్ఠ వేస్తోంది. దీంతో దోమల బాధలు, దుర్వాసనతో సతమతమవుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. డ్రెయినేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు చేస్తామని కార్యదర్శి వెంకట్రాజు తెలిపారు.

(c) eenadu

నరసాపురం
• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: రహదారి భద్రతా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని పాలకొల్లు పట్టణ సీఐ కె.రజనీకుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద ఆయన బుధవారం వాహన తనిఖీలు చేశారు. లైసెన్సులు, వాహన పత్రాలు, శిరస్త్రాణం లేనివారికి జరిమానా విధించి అవగాహన కల్పించారు.

డంపింగ్ యార్డుకు స్థల పరిశీలన

నరసాపురం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణ పరిధిలో డంపింగ్ యార్డు ఏర్పాటు, గురుకుల పాఠశాల నిర్మాణానికి సంయుక్త కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి, ఆర్డీవో దాసి రాజు బుధవారం స్థల పరిశీలన చేశారు. రుస్తుంబాదలో లేఅవుట్, మాధవాయిపాలెంలోని పురపాలక స్థలం, భూమి విక్రయించేందుకు ఆసక్తి ఉన్న రైతు పొలాలను సందర్శించారు.

13న ఉచిత క్యాన్సర్ పరీక్షల శిబిరం

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: పాలకొల్లు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ పరీక్షల శిబిరాన్ని పట్టణంలోని లయన్స్ సామాజిక భవనంలో ఈ నెల 13న నిర్వహించనున్నట్లు ఆ క్లబ్ అధ్యక్షుడు శిడగం సతీశ్ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన వైద్యులు, సిబ్బంది ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు చేసి వైద్య సలహాలు ఇస్తారని పేర్కొన్నారు.

రేపు ప్రాంగణ ఎంపికలు

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: పాలకొల్లు దాంబర్స్ కళాశాలలో ఈ నెల 13న ప్రాంగణ ఎంపికలు నిర్వహించనున్నట్లు ఛైర్మన్ కేవీకేఆర్ నరసింహారావు బుధవారం తెలిపారు. 14 ప్రైవేటు సంస్థల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగావకాశాలు కల్పిస్తారని వివరించారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

శివోహం.. మహోత్సవ వైభవం

ఆచంట క్షేత్రంలో విస్తృత ఏర్పాట్లు

ఆచంట, న్యూస్‌టుడే: పశ్చిమలో ప్రసిద్ధ శైవ క్షేత్రాల్లో ఒకటైన ఆచంట ఉమా రామలింగేశ్వరస్వామి దేవస్థానం మహా శివరాత్రి శోభ సంతరించుకొంది. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి కూడా భక్తులు ఈ ఉత్సవాలకు తరలివస్తారు. ఫిబ్రవరి 13 నుంచి 17 వరకు తీర్థం, కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

13న కల్యాణం: బహుళ ఏకాదశి, శుక్రవారం తెల్లవారుజామున 4.30 గంటలకు రామేశ్వరస్వామి, పార్వతీమాత కల్యాణం నిర్వహిస్తారు. శనివారం గ్రామోత్సవం జరుగుతుంది. ఆదివారం మహాశివరాత్రి రోజున రథోత్సవం, లింగోద్భవకాలంలో మహాన్యాసపూర్వక ఏకాదశరుద్రాభిషేకం జరుగుతాయి. మంగళవారం త్రిశూలోత్సవం పుష్పోత్సవంతో వేడుకలు ముగుస్తాయి.

నగరేశ్వరాలయంలో అంకురార్పణ

వాసవీ పెనుగొండ, న్యూస్‌టుడే: స్థానిక నగరేశ్వర, మహిషాసురమర్దిని, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. నగరేశ్వర స్వామి, మహిషాసురమర్దిని అమ్మ వార్లను వధూవరులుగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అంకురార్పణ, ధ్వజారోహణ, హోమాలు నిర్వహించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసాపురం : 80085 74504	ఆచంట: 90631 44737
పాలకొల్లు : 80085 74510	వాసవీ పెనుగొండ: 80085 74469
పోడూరు : 90631 44741	మొగల్తూరు: 91212 29087

మొగల్తూరు, న్యూస్‌టుడే: ? కొండాలమ్మపాలెం పరిధి సంతోష్‌నగర్‌లో వీధిదీపాలు వెలగడం లేదు. - **ప్రసాద్.**
✔ మరమ్మతులు చేసేలా పంచాయతీ సిబ్బందికి ఆదేశిస్తాం. - **ఎం.నవీన్‌కిరణ్, డిప్యూటీ ఎంపీడీవో**

వాసవీ పెనుగొండ, న్యూస్‌టుడే: ? కమ్మర వీధిలో డ్రెయిన్ మురుగు రహదారిపైకి చేరుతోంది. - **రవికుమార్**
✔ చర్యలు తీసుకుంటాం. - **కృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి**

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: ? బ్రాడీపేట బైపాస్‌లో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళ రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. - **రామకృష్ణ, స్థానికుడు**
✔ మరమ్మతులు చేయిస్తాం. - **శ్రీనివాస్, ఇన్‌ఛార్జి కార్యదర్శి**

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: ? జవదల పేటలో చెత్తను సక్రమంగా తొలగించడం లేదు. దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. - **కె. నాగేంద్ర, నరసాపురం**
✔ చర్యలు తీసుకుంటాం. - **పాత్రుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

డ్రెయిన్లో పూడిక తొలగింపు

ఈనాడు స్పందన

వాసవీ పెనుగొండ, న్యూస్‌టుడే: వాసవీ మాత ఆలయ వీధిలో డ్రెయిన్ సమస్యపై ఈ నెల 7న 'ఈనాడు- మేమున్నాం..మీకు తోడుగా'లో ప్రచురితమైన వార్తకు సర్పంచి నక్కా శ్యామలాసోని, పంచాయతీ కార్యదర్శి టి.కృష్ణారెడ్డి స్పందించారు. డ్రెయిన్‌లో పూడిక, వ్యర్థాల తొలగింపు పనులు చేయించారు.

సువర్ణ ధనుస్సుకు పూజలు

వాసవీ పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: అయోధ్యలో సరయు నది తీరాన నిర్మిస్తున్న ఆలయంలో కళ్యాణ రాముడికి అలంకరించే సువర్ణ ధనుస్సు, పాదుకలను భక్తుల సందర్శనార్థం బుధవారం సిద్ధాంతంలోని చౌదరీల రామాలయంలో ఉంచారు. తొలుత వేద పండితులు, అర్చకులు వాటికి ప్రత్యేక పూజలు చేశారు. భగవాన్ సత్యసాయి బాబా సేవా సంస్థ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రాజగోపాల స్వామికి తోమాల సేవ

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని రుక్మిణీ సత్యభామ సమేత రాజగోపాలస్వామి ఆలయంలో బుధవారం పంచామృతాభిషేకాలు, తోమాల సేవ వైభవంగా నిర్వహించారు. అష్ట బుధవారం దీక్ష చేపట్టిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామికి అటుకులు, బెల్లం, తులసిమాలలు సమర్పించారు.

మూలకు చేర్చి మూడేళ్లు!

మార్టేరు, పెనుగొండ గ్రామీణ, పాలకొల్లు గ్రామీణ, నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం ఆర్భాటంగా ప్రవేశపెట్టిన వ్యవసాయ కియోస్క్‌లు అన్ని చోట్లా నిరుపయోగంగా మారాయి. దీంతో రూ.కోట్ల ప్రజాధనం వృథా అయింది. అప్పట్లో రైతులకు సత్వర సేవలు అందించేందుకు ఆర్బీకేలు (ప్రస్తుతం రైతు సేవా కేంద్రాలు) ఏర్పాటు చేశారు. సాగుదారులకు రాయితీపై ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు విక్రయించేందుకు కియోస్క్‌లు ఏర్పాటు చేయగా సాంకేతిక కారణాలతో ఇవన్నీ మూలకు చేరాయి.

నిరుపయోగంగా వ్యవసాయ కియోస్క్‌లు

ఇదీ పరిస్థితి.. పాలకొల్లు మండలం లంకలకోడేరులోని రెండు రైతు సేవా కేంద్రాల్లో యంత్రాలను ఒకే చోట వదిలేశారు. వీటిని ఒక్కసారి కూడా వినియోగించిన దాఖలాలు లేవు. పెనుమంట్ర మండలంలోని పలు గ్రామాల్లో గతంలో సిబ్బంది కొరతతో ఈ యంత్రాల వైపు చూసిన వారే లేరు. పోడూరు మండలం గుమ్ములూరులో రెండు యంత్రాలు ఒకే చోట దర్శనమిస్తున్నాయి. మొగల్తూరు, నరసాపురం మండలాల్లోనూ వీటిని వినియోగించడం లేదు.

« వాసవీ పెనుగొండ మండలం ఇలపర్రు రైతు సేవా కేంద్రంలో కియోస్క్‌లకు ఫ్లెక్సీ కప్పి వదిలేశారు. నడిపూడి, వాసవీ పెనుగొండ, చెరుకువాడ గ్రామాల్లో యంత్రాలే ఇదే పరిస్థితి. దాదాపు మూడేళ్ల నుంచి వీటిని వినియోగించే పరిస్థితి లేకపోవడంతో అవి ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి.

ఎందుకిలా.. కియోస్క్‌లు పనిచేయాలంటే అంతర్జాల సౌకర్యం ఉండాలి. గత ప్రభుత్వం ఈ సదుపాయం కల్పించలేదు. దీంతో సిబ్బంది తమ చరవాణి ద్వారా అంతర్జాలాన్ని ఉపయోగించుకొని కొద్ది రోజులు నెట్టుకొచ్చారు. ప్రస్తుత రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులు, పురుగు మందుల విక్రయాలు తగ్గడంతో 2023 నుంచి ఈ యంత్రాలు పూర్తిగా అటకెక్కాయి. సిబ్బంది లేని గ్రామాల్లో తొలి నుంచీ ఈ యంత్రాలు అలంకారప్రాయంగా మారాయి. ఈ అంశాన్ని ప్రభుత్వానికి నివేదించినట్లు డీఏవో వెంకటేశ్వరరావు తెలిపారు.

నరసాపురం, పాలకొల్లు, ఆచంట నియోజకవర్గాల పరిధిలో 182 ఆర్‌ఎస్‌కేల్లో కియోస్క్‌లు, ఇతర సామగ్రి ఏర్పాటు చేశారు. అప్పట్లో ఒక్కో యంత్రానికి రూ.62 వేలు వెచ్చించారు.

మాట్లాడుతున్న రామరాజు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

నరసాపురం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు సూచించారు. నరసాపురం 6వ వార్డులో పార్టీ వార్డు అధ్యక్షుడు రెడ్డి సూర్యనారాయణ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశంలో రామరాజు మాట్లాడారు. కార్యకర్తలు ఐకమత్యంగా ఉంటూ పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని సూచించారు. ఏఎంసీ ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, మత్స్యకార కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

డిజిటల్ గ్రంథాలయంగా తీర్చిదిద్దుతా

పాలకోడేరు, న్యూస్‌టుడే: జిల్లాలోని గ్రంథాలయాలను అన్ని వర్గాల పాఠకులకు ఉపయోగపడే విధంగా డిజిటల్ లైబ్రరీలుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు జుత్తుగ నాగరాజు తెలిపారు. బుధవారం ఆయన పాలకోడేరు మండలంలోని పాలకోడేరు, గొల్లలకోడేరులోని శాఖా గ్రంథాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్న పుస్తకాల వివరాలను అడిగితెలుసుకున్నారు. పాఠకులు ఏ విధమైన పుస్తకాలు కోరుకుంటున్నారు, విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు ఉన్నాయా లేవా అని ఆరా తీశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారులు బాలరాజు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

ఎల్బీచర్ల: రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: రైతులు ప్రభుత్వ పథకాలు, రాయితీలు, రుణాలు పొందాలంటే తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేయించుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. ఎల్బీచర్ల పరిధి బైనపాలెంలో పొలాలను ఆమెతో పాటు జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి పంట వివరాలపై ఆరా తీశారు. పలువురి రైతులకు ఈ- పంట నమోదు చేశారు.

★ ఎల్బీచర్లలో దర్బరేవు వెస్ట్ డ్రెయిన్ పూడి పోవడంతో వందలాది ఎకరాల్లో వరి సాగు చేయలేని పరిస్థితి ఏర్పడిందని స్థానిక రైతులు కలెక్టర్ నాగరాణి దృష్టికి తీసుకువచ్చారు. 8.3 కిలోమీటర్ల మేర పూడికతీత పనులు చేపడితే తొమ్మిది పంచాయతీల్లో రైతులు రెండు పంటలు సాగు చేసుకొనే అవకాశం ఉంటుందని పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్-ఛైర్మన్ గుబ్బల మార్రాజు, పలువురు రైతులు తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్ నాగరాణి అధికారులతో ప్రతిపాదనలు తయారు చేయించి ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు.

స్ఫూర్తి ప్రదాత దీన్ దయాళ్ ఉపాధ్యాయ

పాలకొల్లు సాంస్కృతికం, న్యూస్‌టుడే: పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి కార్యక్రమాన్ని పాలకొల్లులోని భాజపా కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించారు. పలువురు నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏకాత్మ మానవ వాదం ద్వారా సమగ్ర భారత నిర్మాణానికి దిశానిర్దేశం చేసిన దీన్ దయాల్ ఉపాధ్యాయ అందరికీ స్ఫూర్తిప్రదాతగా నిలిచారన్నారు. నాయకులు ఉన్నమట్ల కబర్ధి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణంలో భాజపా పట్టణ అధ్యక్షుడు రావూరి ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్ని దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

వరదొస్తే నిలుస్తుందా..!

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: ఎల్బీచర్ల, దర్బరేవు, రాజుల్లంక, సారవ తదితర గ్రామాల పరిధిలో మూడు వేల ఎకరాల ఆయకట్టులో మురుగును వశిష్ఠ గోదావరిలోకి మళ్లించే దర్బరేవు అవుట్ ఫాల్ స్లూయిజ్ ఇది. ఇది శిథిలావస్థకు చేరడంతో వరదలు, భారీ వర్షాల సమయంలో ముప్పు తప్పదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. స్లూయిజ్‌కు మరమ్మతులు చేసేలా చర్యలు చేపడతామని ఏటిగట్ల పరిరక్షణ శాఖ ఏఈ పవన్ తెలిపారు.

మూడు నెలలుగా మూసివేత!

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పంచారామ క్షేత్రం పాలకొల్లు క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద ప్రదక్షిణ మండపం పడమర వైపు గోడ గతేడాది కార్తిక మాసంలో కూలిపోయింది. దీంతో ఆ మార్గాన్ని మూసివేసి కర్రలతో అడ్డుకట్ట ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ప్రదక్షిణ చేసే భక్తులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. నెలలు గడిచినా గోడ పనులు చేపట్టకపోవడంపై భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గోడ నిర్మాణానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని.. అనుమతులు రాగానే పనులు చేపడతామని ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు తెలిపారు.

ముప్పు ముంగిట!

వడలి (వాసవీ పెనుగొండ, న్యూస్‌టుడే), న్యూస్‌టుడే: వడలి- పిట్టలవేమవరం రహదారిలో గౌడ రామాలయం వెనుక ఇందిరమ్మ కాలనీలో విద్యుత్తు నియంత్రిక వద్ద రక్షణ కంచె లేదు. ఫ్యూజు బాక్సు తక్కువ ఎత్తులో ఉంది. ఈ మార్గంలో నిత్యం విద్యార్థులు వీటి వల్ల ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని విద్యుత్తు ఏఈ పి.రాంబాబు తెలిపారు.

పార్కు నిర్మాణానికి భూమి పూజ

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: దత్తత గ్రామం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని గాంధీ మెగా ఫౌండేషన్ అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు అన్నారు. పాలకొల్లు మండలం పూలపల్లిలో గాంధీ మెగా పార్కు నిర్మాణానికి ఆయన బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పార్కులో సౌకర్యాలు కల్పించడంతో పాటు రక్షణ కంచె ఏర్పాటుచేయిస్తామని చెప్పారు.

పరమపదోత్సవము

జననం 10-06-1975 | పరమపదం 30-01-2026

శ్రీమాన్. S.T.P. రఘు రామానుజాచార్యులు (రఘుబాబు)
ది. 30-01-2026 శుక్రవారం స్వర్గస్తులైనారని తెలియజేయుటకు చింతిస్తున్నాము.
ది. 12-02-2026 గురువారం
ఉదయం 11 గం॥ల నుండి తథియారాధన (శుభ భోజనాలు)
పాలకొల్లు సూర్యతేజస్ నగర్‌లోని పెద్దగురువు గారి స్వగృహమునందు జరుపబడును. కావున తెలియపరచుచున్నాము.
ఇట్లు కుటుంబ సభ్యులు మరియు
శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి సేవా సమితి
పాలకొల్లు

ప్రకృతి సేద్యంతో ఆరోగ్యకర ఉత్పత్తులు

మాట్లాడుతున్న అరుణకుమారి

యలమంచిలి, న్యూస్‌టుడే: ప్రకృతి సేద్యంతో ఆరోగ్యకర పంట ఉత్పత్తులు పొందవచ్చని ఆ విభాగం జిల్లా సమన్వయకర్త ఎం.అరుణకుమారి పేర్కొన్నారు. యలమంచిలిలోని రైతు సేవా కేంద్రం ఆవరణలో మండల స్థాయి రైతు సమాఖ్య సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి సేద్యాన్ని విస్తరించేలా రైతులకు అవగాహన కల్పించమే ఈ సమావేశాల లక్ష్యమన్నారు. గ్రామ స్థాయిలో డ్వాక్రా యానిమేటర్లు, వ్యవసాయ సహాయకులు, ఐసీఆర్పీ సభ్యులు సమష్టిగా కృషి చేసి ప్రకృతి సేద్యంతో కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఎనిమిది మంది రైతులను సత్కరించారు.

రవాణాధికారుల తనిఖీలు

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా రవాణాధికారి కృష్ణారావు ఆధ్వర్యంలో ఆ శాఖ అధికారులు జిల్లాలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఆటోరిక్షాలు, తేలికపాటి, భారీ సరకు రవాణా వాహనాలకు బిగించి ఉన్న దీపాలను తొలగించారు. పాలకొల్లులో చేసిన తనిఖీల్లో రవాణాధికారి అజ్మీర బద్దు తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ ఐకాస ప్రధాన కార్యదర్శిగా పోసిబాబు

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: నాయీ బ్రాహ్మణ ఐకాస జిల్లా ప్రధాన కార్యదర్శిగా పాలకొల్లుకు చెందిన కొండేటి పోసిబాబు ఎన్నికయ్యారు. భీమవరం పట్టణంలో జరిగిన నాయీ బ్రాహ్మణ ఐకాస సమావేశంలో తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పోసిబాబు బుధవారం తెలిపారు. సంఘ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

విద్యార్థులతో కళాశాల సిబ్బంది

క్రమశిక్షణే విజయానికి తొలిమెట్టు

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: క్రమశిక్షణే విజయానికి తొలిమెట్టు అని పట్టణంలోని బీజీబీఎస్ మహిళా జూనియర్ కళాశాల కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్ అన్నారు. ఆ కళాశాల ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు వేడుకను బుధవారం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి ఎదగవచ్చన్నారు.

సమ్మెకు ఏపీ ఎన్జీవో సంఘం మద్దతు

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: కేంద్ర కార్మిక, ఉద్యోగ సంఘాలు గురువారం సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయి. ఈ సమ్మెకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య మద్దతు ప్రకటించిందని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ పాలకొల్లు శాఖ అధ్యక్ష, కార్యదర్శులు గుడాల హరిబాబు, గుబ్బల ప్రసాద్ తెలిపారు.

మార్టేరు, న్యూస్‌టుడే: సార్వత్రిక సమ్మెలో భాగంగా మార్టేరులో గురువారం భారీ ప్రదర్శన, సభ నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ నాయకులు తెలిపారు.

నరసాపురం పట్టణం, గ్రామీణ న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా గురువారం చేపట్టిన సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు పిలుపునిచ్చారు. నరసాపురం పట్టణ పరిధిలోని ఆక్వా పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు.

రాకపోకలకు ఇక్కట్లే!

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట వేమవరం ప్రధాన రహదారిలో కల్వర్టు దెబ్బతిని గుంతలు ఏర్పడటంతో రాత్రివేళ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి ఎస్.ఎం.వలీ పేర్కొన్నారు.

ఇలా.. వదిలేస్తే శిథిలమే!

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: నరసాపురం, మొగల్తూరు మండలాల పరిధిలో సాగునీటి ఎద్దడి నివారణకు కొప్పర్రు వద్ద 2012లో నిర్మించిన ఎత్తిపోతల పథకం ఇది. కనీస నిర్వహణ లేకపోవడంతో ఈ ప్రాంగణం చుట్టూ పొదలు పెరిగిపోయాయి. సామగ్రి తుప్పు పట్టింది. దీనిని ఇలాగే వదిలేస్తే పూర్తిగా శిథిలమైపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బాలిక అదృశ్యం

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: నరసాపురం మండలానికి చెందిన 17 ఏళ్ల బాలిక అదృశ్యంపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై టీవీ సురేశ్ తెలిపారు. ఈ నెల 9 రాత్రి ఇంట్లో నిద్రించిన బాలిక మరుసటి రోజు తెల్లవారు జామున చూసేసరికి కనిపించలేదని కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

జూదరుల అరెస్టు

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: భీమవరం మండలం తుందుర్రు శివారులో నిర్వహిస్తున్న జూదస్థావరంపై బుధవారం దాడి చేసి తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై టీవీ సురేశ్ తెలిపారు. వారి నుంచి రూ. 42,300 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: నరసాపురం- పాలకొల్లు జాతీయ రహదారిలో మార్కెట్‌యార్డు సమీపాన ఈ నెల 8న జరిగిన రోడ్డు ప్రమాదంలో తూర్పుతాళ్లు గ్రామానికి చెందిన దొంగ ముత్యాలరావు, దుర్గా భవానీలకు గాయాలయ్యాయి. వీరిని స్థానికులు చికిత్స నిమిత్తం నరసాపురం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. దీనిపై ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇటుకల బట్టీ మూసివేతకు చర్యలు

నరసాపురం, న్యూస్‌టుడే: పట్టణంలో జనావాసాల మధ్య ఉన్న ఇటుకల బట్టీ మూసివేతకు హరిత ట్రైబ్యునల్ ఇటీవల ఆదేశాలు ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఆర్డీవో దాసి రాజు, తహసీల్దారు ఐవీవీ సత్యనారాయణ బుధవారం ఆ ప్రాంతాన్ని సందర్శించారు. హరిత ట్రైబ్యునల్ ఆదేశాలపై న్యాయస్థానం స్టే ఇచ్చినట్లు నిర్వాహకుడు వారికి తెలిపారు. ఆ ప్రతి చూపాలని అధికారులు కోరగా తనకు ఇంకా అందలేదని నిర్వాహకుడు బదులిచ్చారు.

రుణాల కోసం ఎదురు చూపులు!

సిద్ధాంతం వద్ద పునాది స్థాయిలో నిలిచిన నిర్మాణం

వాసవీ పెనుగొండ గ్రామీణ, పెనుమంట్ర న్యూస్‌టుడే: ప్రభుత్వం ద్వారా అందే గృహ నిర్మాణ రుణాల కోసం లబ్ధిదారులు ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. సొంత స్థలాలు ఉన్నా రుణం మంజూరు కాకపోవడంతో చాలా మంది పేదలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రుణాల కోసం దరఖాస్తు చేసుకుంటే పరిశీలన చేస్తామని, త్వరలో వస్తుందని చెబుతూ అధికారులు కాలయాపన చేస్తున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాసవీ పెనుగొండ మండల పరిధిలో సొంత స్థలాలు ఉండి రుణాల కోసం 150 మంది దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. ఈ అంశంపై హౌసింగ్ ఏఈ లక్ష్మణరావు స్పందిస్తూ దరఖాస్తు చేసుకున్న వారికి త్వరలోనే రుణాలు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు.

13న సహకార కమిషనర్ కార్యాలయ ముట్టడి

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: సహకార ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 13న చేపట్టిన సహకార శాఖ కమిషనర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. సీతారాంపురం నార్త్‌లో బుధవారం జరిగిన ఉద్యోగుల యూనియన్ సమావేశంలో నాయకులు మాట్లాడారు.

శ్రద్ధాంజలి



జననం: 01-06-1949 | మరణం: 31-01-2026

శ్రీ చెరుకూరి సత్యనారాయణ గారు
Retd: మున్సిపల్ మేనేజర్, నరసాపురం
మాకు మార్గ నిర్దేశం చేస్తూ.. మా అడుగులు తడబడకుండా మా వెంట ఉండి మమ్ములను ముందుకు నడుపుతూ మా అభివృద్ధికి అహరహము శ్రమిస్తూ దివికేగిన మీ ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తూ.. శోకతప్తహృదయాలతో.. భార్య: లక్ష్మి
కుమారుడు: చెరుకూరి సతీష్‌కుమార్ కోడలు: రమాదేవి
మనుమడు: చెరుకూరి విజయసాయి
మనుమరాలు: చెరుకూరి తేన్మయిసాయి
కుమార్తె: తిమ్మిశెట్టి పద్మశ్రీలత అల్లుడు: స్వామికుమార్ (బాబు)
మనుమలు: తిమ్మిశెట్టి గిరీష్ శ్రీహరనాథ్, తిమ్మిశెట్టి అఖిలేష్
సోదరుడు: చెరుకూరి సుబ్బారావు (లేటు) - భారతి
సోదరి: యాతం నాగలక్ష్మి - అప్పారావు
బావమరుదులు: గాడవర్తి నాగేశ్వరరావు - ప్రభావతి
గాడవర్తి రమేష్‌బాబు - పద్మావతి (లేటు)
పెద్దకార్యం: ది.12-02-2026 (గురువారం) నరసాపురం మాధవాయిపాలెం చెరుకూరి పద్దయ్య గారి వీధిలోని మా స్వగృహం నందు జరుగును

(c) eenadu

తాడేపల్లిగూడెం
• తాడేపల్లిగూడెం • తణుకు

13 నుంచి కల్యాణోత్సవాలు

ఇరగవరం, న్యూస్‌టుడే: రేలంగి తాటకేశ్వర- మల్లేశ్వర స్వామి ఆలయాల్లో ఈ నెల 13 నుంచి కల్యాణోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ ఈవో కె.సూర్యనారాయణ తెలిపారు. 13వ తేదీ రాత్రి స్వామికి కల్యాణం, 14న రుద్రాభిషేకాలు, కుంకుమ పూజలు, 15న మహాశివరాత్రి సందర్భంగా స్వామికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, గ్రామోత్సవం చేస్తారన్నారు. 16న కుంకుమ పూజలు, 17న త్రిశూల స్నానం నిర్వహిస్తారని వివరించారు.

లేగదూడల ప్రదర్శన నేడు

ఇరగవరం, న్యూస్‌టుడే: తూర్పువిప్పర్రులో ఈ నెల 12న లేగదూడల ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు మండల పశువైద్యాధికారి వి.శ్రీనివాసరావు బుధవారం చెప్పారు. ఉదయం 8 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి పశుపోషకులు హాజరుకావాలని కోరారు.

18 నుంచి 'బీమా సంకల్పం' కార్యక్రమాలు

మాట్లాడుతున్న హరికృష్ణప్రసాద్

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: తపాలా శాఖ ద్వారా బీమా పాలసీలు చేసేందుకు ఈ నెల 18, 19, 20 తేదీల్లో బీమా సంకల్పం 3.0 కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు భీమవరం డివిజన్ తపాలా కార్యాలయ సీనియర్ సూపరింటెండెంట్ కె.హరికృష్ణప్రసాద్ తెలిపారు. స్థానిక పెద్ద తపాలా కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తపాలా శాఖ ద్వారా దేశవ్యాప్తంగా 1.50 కోట్ల పాలసీలు లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (పీఎల్ఐ), గ్రామీణ పోస్టల్ లైఫ్ ఇన్సురెన్స్ (ఆర్‌పీఎల్ఐ) పాలసీల ద్వారా అధిక మొత్తం వడ్డీ పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో తపాలా శాఖ తణుకు కార్యాలయ పోస్ట్‌మాస్టర్ సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగువారి గుండెల్లో చెరగని ముద్ర

నివాళులర్పిస్తున్న సరళాదేవి తదితరులు

తణుకు, న్యూస్‌టుడే: తెలుగువారి గుండెల్లో చెరగని ముద్రవేసుకున్న మధుర గాయకుడు పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు అని తెదేపా రాష్ట్ర చేనేత కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ వావిలాల సరళాదేవి కొనియాడారు. ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక ఎన్టీఆర్ పార్కు వద్ద ఉన్న ఆయన విగ్రహానికి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఘంటసాల ఆలపించిన గీతాలను గాయకులు ఆకుమర్తి రాజు, కోట రామ ప్రసాద్, ఎస్.దొరబాబు, ఈ.సత్యనారాయణ, అర్జి భాస్కరరావు, ఎం.శ్రీనివాస్, ఎం.విజయ్‌కుమార్ ఆలపించి ఆహూతులను అలరించారు. కార్యక్రమంలో ఆంజనేయులు, శ్రీనివాసరావు, బెజవాడ సూరి, సుబ్రహ్మణ్యం, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావు సేవలు హర్షణీయం

కృష్ణాపురం(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఈదర వెంకటేశ్వరరావు సేవలు హర్షణీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కృష్ణాపురంలో వెంకటేశ్వరరావు దశ దిన కర్మలో వారు మాట్లాడారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ తోట గోపి, జిల్లా పరిషత్తు మాజీ ఛైర్మన్ ఇమ్మణ్ణి రాజేశ్వరి, పెదతాడేపల్లి సర్పంచి పోతుల అన్నవరం, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఉండాలా.. వెళ్లిపోవాలా?

మండపాక పేదల కాలనీవాసుల అవస్థలు

మండపాక (తణుకు గ్రామీణం), న్యూస్‌టుడే: తణుకు మండలం మండపాకలో గత వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్మించిన పేదల కాలనీలో కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో అక్కడ నివసిస్తున్న ప్రజలు నానా అగచాట్లు పడుతున్నారు. ఈ లేఅవుట్లలో అనేక మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టినా. కొందరు మాత్రమే అక్కడ నివాసం ఉంటున్నారు. కాలనీలో తాగునీటి పైపులైన్లు, అంతర్గత రహదారులు, డ్రైనేజీలు, వీధి దీపాలు వంటి కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో అక్కడ ఉండేదెలా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యల తాండవం గత ప్రభుత్వం పేదలకు లేఅవుట్లు కేటాయించడం, పట్టాలను అందించడం వంటి కార్యక్రమాలను అట్టహాసంగా నిర్వహించి ప్రచారానికే పరిమితమైంది. పేదలకు కేటాయించిన కాలనీలో కనీస సౌకర్యాల కల్పన గాలికొదిలేసింది. మండపాక లేఅవుట్లో 85 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు. మొదట్లో ఇళ్ల నిర్మాణాలను త్వరగా ప్రారంభించాలని అధికారులు ఒత్తిడి చేయడంతో అనేక మంది లబ్ధిదారులు తమ స్తోమతకు మించి అప్పు చేసి పనులు ప్రారంభించారు. 33 ఇళ్ల నిర్మాణం పూర్తికాగా.. వివిధ కారణాలతో 37 గృహాల పనులు ఆగిపోయాయి. మిగిలిన 15 మంది అసలు ఆసక్తి చూపలేదు. ప్రస్తుతం కాలనీలో ఖాళీ స్థలాలు చిట్టడివిని తలపిస్తున్నాయి. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి విష సర్పాలు ఇళ్లలోకి వస్తున్నాయని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీలు లేక మురుగు నీరు రోజుల తరబడి ఇళ్ల సమీపంలో నిలవడంతో దోమలు విజృంభించి తరచూ విష జ్వరాల బారిన పడుతున్నామని కాలనీవాసి సత్యనారాయణ వాపోతున్నారు. కాలనీలో అంతర్గత రోడ్లు నిర్మించకపోవడంతో కొద్దిపాటి వర్షం కురిసినా ఇళ్ల నుంచి బయటికి రాలేని పరిస్థితి నెలకొందని లబ్ధిదారుడు శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు గతంలో వేసిన విద్యుత్తు దీపాలు పాడైపోవడంతో రాత్రి వేళలో రాకపోకలు సాగించడానికి అవస్థలు పడుతున్నామని చెబుతున్నారు. అధికారులు స్పందించి కాలనీలో మౌలిక సదుపాయాలను కల్పించాలని పలువురు కాలనీ వాసులు కోరుతున్నారు. ఈ సమస్యపై డిప్యూటీ ఎంపీడీవో నరసింహమూర్తిని సంప్రదించగా పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

అంతర్గత రోడ్డు దుస్థితి

ఎక్కడెక్కడున్నా తొలగిస్తే మేలు

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: స్కిన్నెరపురం నుంచి యనమదుర్రు వెళ్లే డ్రెయిన్ గుర్రపు డెక్కతో పేరుకుపోయింది. పంట పొలాలకు నీరు వెళ్లకుండా అడ్డు వచ్చి ఇబ్బందులు పడుతున్నామని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేశారు. గుర్రపుడెక్కను తొలగించేలా చర్యలు చేపట్టాలని అన్నదాతలు కోరుతున్నారు.

స్కిన్నెరపురంలో పేరుకుపోయిన గుర్రపు డెక్క

మేమున్నాం.. మీకు తోడుగా..
10 AM to 1 PM
తాడేపల్లిగూడెం : 99488 53114
తణుకు : 85558 50851
తణుకు గ్రామీణం: 63005 79402
అత్తిలి : 91548 46774

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ? తాడేపల్లిగూడెం కడకట్ల పసుపులేటి వారి వీధిలోని ఖాళీ ప్రదేశంలో వ్యర్థాలతోపాటు జంతు కళేబరాలను వేస్తుండటంతో భరించలేని దుర్వాసన వస్తోంది. -వెంకట్రావు, స్థానికుడు
✔ వ్యర్థాలు తొలగిస్తాం. -సోమేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్
? తాడేపల్లిగూడెం ఇండేన్ గ్యాస్ రోడ్డు అధ్వానంగా ఉండటంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. -శ్రీనివాస్, స్థానికుడు
✔ రహదారి నిర్మించేలా చర్యలు చేపడతాం.
-ఎం.ఏసుబాబు, పురపాలక కమిషనర్

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదలపై హర్షం

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మెరుగైన విద్యా ప్రమాణాలు నెలకొల్పేందుకు మంత్రి నారా లోకేశ్ చేస్తున్న కృషి అభినందనీయమని పలువురు తెదేపా నాయకులు కొనియాడారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.1200 కోట్లు విడుదల చేయడంపై పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో బుధవారం విద్యార్థులతో కలిసి లోకేశ్ చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. పార్టీ నరసాపురం పార్లమెంట్ అధ్యక్షుడు పసుమర్తి రామ్ లక్ష్మణ్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసలకొండ, పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు ఎరుబండి సతీశ్, గ్రామీణ మండల అధ్యక్షుడు బుర్లరాము పాల్గొన్నారు.

లోకేశ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న తెదేపా నాయకులు, విద్యార్థులు

దీన్‌దయాళ్ సిద్ధాంతమే దేశాభివృద్ధికి మూలం

రామారావుపేట(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: దీన్‌దయాళ్ ఉపాధ్యాయ రూపకల్పన చేసిన సిద్ధాంతాలు దేశ సమగ్ర అభివృద్ధికి మూలమని భాజపా రాష్ట్ర కార్యదర్శి బోగిరెడ్డి ఆదిలక్ష్మి అన్నారు. పట్టణంలోని రామారావుపేటలోని భాజపా కార్యాలయంలో బుధవారం దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని నాయకులతో కలిసి నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దువ్వా శ్రీను, మీడియా ఇన్‌ఛార్జి నరిశే సోమేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆదిలక్ష్మి తదితరులు

బాలికకు స్వామి వివేకానంద ఇండియన్ ఐకాన్ అవార్డు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: బహుళ ప్రతిభా విభాగంలో తణుకు పట్టణానికి చెందిన కాండ్రు వైష్మిత స్వామి వివేకానంద ఇండియన్ ఐకాన్ అవార్డును సొంతం చేసుకుంది. విశ్వగురు వరల్డ్ రికార్డు సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 8న హైదరాబాద్‌లో నిర్వహించిన స్వామి వివేకానంద ఇండియన్ ఐకాన్ అవార్డ్సు 2026 లో టాలెంటు కేటగిరిలో (పియానో, విజువల్ ఆర్ట్, సింగింగ్, స్పీచ్) ప్రతిభ కనబర్చినందుకు ఈ పురస్కారం దక్కింది. ఈ మేరకు తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మాధవిదేవి నుంచి అవార్డు అందుకుంది. ప్రస్తుతం ఆమె బెంగళూరులో పదో తరగతి చదువుతోంది. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన పలువురు వైష్మితను అభినందించారు.

దివ్యాంగ పిల్లలను ప్రోత్సహించాలి

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: దివ్యాంగ పిల్లలను వారి తల్లిదండ్రులు అన్ని విషయాల్లో ప్రోత్సహిస్తే మిగిలిన పిల్లలతో సమానంగా అన్ని రంగాల్లో పోటీపడతారని తాడేపల్లిగూడెం మండల విద్యాశాఖాధికారి పి.ఎం.కె.జ్యోతి అన్నారు. బుధవారం ఆమె స్థానిక సుబ్బారావుపేటలో ఉన్న భవిత కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఇటీవల భీమవరంలో జరిగిన జిల్లాస్థాయి ఆర్ట్ అండ్ కల్చరల్ కార్యక్రమంలో విశేష ప్రతిభ కనబర్చి బహుమతులు అందుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్టు అల్లు శ్రీకృష్ణ మహేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.కోటయ్య, ఉపాధ్యాయులు రాంబాబు, ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్.కె.బాల ఈశ్వరయ్య, ఎం. చంద్రకుమారి ఉష, దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అభినందిస్తున్న ఎం.ఇ.ఒ. జ్యోతి

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

బిల్లగుంట(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: పెంటపాడు మండలంలోని అన్ని గ్రామాల్లో వేసవికి తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు చేపడతామని ఎంపీపీ కట్టుబోయిన వెంకటలక్ష్మి అన్నారు. దర్శిపర్రు శివారు బిల్లగుంటలో మండల పరిషత్తు నిధులు రూ.3.20 లక్షలతో చేపట్టిన ఫిల్టర్‌బెడ్ నిర్మాణ పనులకు గ్రామ సర్పంచి కోట శేషవేణితో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచి కోట మార్కండేయులు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కట్టుబోయిన కృష్ణ ప్రసాద్, సీపీఐ నాయకుడు కళింగ లక్ష్మణరావు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

శంకుస్థాపన కార్యక్రమంలో వెంకటలక్ష్మి తదితరులు

జగన్ కాపులకు ద్రోహం చేసినా ఎందుకు ప్రశ్నించలేదు?: బొలిశెట్టి

గణేష్‌నగర్, వెంకట్రావు పాలెం(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: గతంలో చంద్రబాబు ప్రభుత్వం కాపుల రిజర్వేషన్ కోసం తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపిందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. జగన్ ప్రభుత్వం ఆ తీర్మానాన్ని వ్యతిరేకించి కాపులకు రిజర్వేషన్ అవసరం లేదని తీర్మానం చేసిందన్నారు. ద్రోహం చేసిన జగన్‌ను వైకాపాలో ఉన్న కాపు నాయకులు ఎందుకు నిలదీయడంలేదని ప్రశ్నించారు. బుధవారం విడిది కార్యాలయంలో భారతీయ కాపు సేన నాయకులు వెంకటేశ్వరరావు(కన్నా) బృందం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కాపులకు రిజర్వేషన్ ఇవ్వాలని కూటమి ప్రభుత్వాన్ని కోరుతూ వినతి పత్రాన్ని అందించారు. ముందుగా మండలంలోని వెంకట్రావుపాలెం, త్యాజంపూడి గ్రామాల మధ్య నిర్మాణంలో ఉన్న రహదారి పనులను కూటమి నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం అసెంబ్లీ సమావేశాలకు వెళ్లి ముందుగా ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను పార్టీ కార్యాలయంలో కలిశారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గ సమస్యలపై వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో జనసేన తాలూకా మహిళా అధ్యక్షురాలు వన్నెంరెడ్డి భవాని, రాష్ట్ర కార్యదర్శి సుంకర గణేశ్‌కుమార్, రాష్ట్ర ప్రోటోకాల్ కన్వీనర్ గాది శ్రీనివాస్, శివుడు, గుంటుమళ్లు వీరభద్రరావు, జిల్లా మహిళా అధ్యక్షురాలు నార్ని వాణి పాల్గొన్నారు.

ఉపముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

ముందస్తు చర్యలతో ప్రమాదాల నివారణ

తణుకు, న్యూస్‌టుడే: ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందస్తు నివారణ చర్యలు తీసుకుంటే అగ్ని ప్రమాదాలను అరికట్టవచ్చని తణుకు అగ్నిమాపక ఎస్సై అజయ్ పేర్కొన్నారు. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అగ్నిప్రమాద నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కర్మాగారాలు, ఆసుపత్రులు తదితర వాటిలో పనిచేసే కార్మికులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రమాదం సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణకు చర్యలు, ప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకోవాల్సిన చర్యలు, ప్రాథమిక చికిత్స తదితర అంశాలపై అగ్ని మాపక సిబ్బంది శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో తణుకు అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇక అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఏకీకృత సర్వేతో మేలు

తాడేపల్లిగూడెం,పెంటపాడు(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: ప్రతి కుటుంబానికి మేలు జరిగే విధంగా రాష్ట్ర ప్రభుత్వం యూనిఫైడ్(ఏకీకృత)సర్వే ప్రారంభించింది. తాడేపల్లిగూడెం పట్టణం, గ్రామీణ మండలం, పెంటపాడు మండలాల్లో కమిషనర్, ఎంపీడీవోల పర్యవేక్షణలో గ్రామ, వార్డు సచివాలయ అధికారులు శరవేగంగా నిర్వహిస్తున్నారు. వారికి కేటాయించిన నివాసాలను ఇంటింటి సర్వే చేసి వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఇది స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా అమలవుతోంది.

పెంటపాడులో సర్వే పరిశీలిస్తున్న ఎంపీడీవో రాంప్రసాద్

నియోజకవర్గంలోని వివరాలు ఇలా..

మండలం	మొత్తం కుటుంబాలు	సర్వే చేసినవి	చేయాల్సినవి
తాడేపల్లిగూడెం	31,267	28,230	3,037
గ్రామీణ మండలం	31,263	11,045	20,218
పెంటపాడు	24,757	8,822	15,935

సమయం, వ్యయం ఆదా సంక్షేమ పథకాలు పేదలకు, అర్హులకు అందించాలంటే ఈ యోజన చేస్తే లబ్ధిదారుల సంఖ్యను సులభంగా గుర్తించవచ్చు. నిర్దిష్ట కాలంలో అర్హులకు అందించవచ్చున. తద్వారా కుటుంబ అభివృద్ధి సాధ్యం పడుతుంది. ప్రభుత్వానికి సమయం, డబ్బు ఆదా అవుతుంది.
-ఎం.ఏసుబాబు, తాడేపల్లిగూడెం పురపాలక కమిషనర్, రాంప్రసాద్, పెంటపాడు ఎంపీడీవో

ప్రయోజనాలు వాస్తవ సమాచారాన్ని వినియోగించి ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాలు రూపకల్పన చేస్తారు. ప్రభుత్వం నుంచి ప్రతి కుటుంబం విద్య, వైద్యం, ఆర్థిక సహాయం అందేలా త్వరితగతిన అందించుటకు వీలు కలుగుతుంది. ఈ సమాచారం ఆధారంగా కుటుంబ ప్రయోజన కార్డులను జారీ చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.

నిర్విరామ పోరాటాలకు సమాయత్తం కండి

తణుకు, తాడేపల్లిగూడెం వన్ టౌన్, న్యూస్‌టుడే: లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ ఈ నెల 12న తలపెట్టిన సమ్మె విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక అక్కమాంబ పరిశ్రమ తదితర ప్రదేశాల్లో సమావేశాలు నిర్వహించి మాట్లాడారు. సమ్మె తర్వాత కూడా కేంద్ర ప్రభుత్వం దిగిరాకపోతే నిర్విరామ పోరాటాలకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ● కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా గురువారం జరగబోయే సమ్మెను ఉద్యోగులు, కార్మికులు విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు బొద్దాని నాగరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం సమ్మె విజయవంతం కోరుతూ తణుకు పట్టణంలో విస్తృత ప్రచార కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ● దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్, జిల్లా ఉపాధ్యక్షులు దూలం ప్రసాద్, సిరపరపు రంగారావు, రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు చిర్ల పుల్లారెడ్డి కోరారు. పెంటపాడులోని ప్రజాసంఘ కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ మేరకు పెంటపాడు నుంచి తాడేపల్లిగూడెం ఎన్‌కే గ్రౌండ్స్‌లో నిర్వహించే బహిరంగ సభ, ర్యాలీ విజయవంతం చేయాలని కోరారు.

తణుకు: నినదిస్తున్న ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు

కుక్కలతో బాధ.. దోమలతో రొద

13 వార్డు నివేదన
జనాభా : 2474
ప్రాంతాలు: డోలా, అంబటి, తోట, పచ్చిపాల వారి వీధులు, ఎస్సీ హాస్టల్ వెనుక భాగం, సోషల్ వెల్ఫేర్ లే అవుట్.

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: తణుకు పురపాలక సంఘ పరిధిలోని 13వ వార్డులో సమస్యలు వెంటాడుతున్నాయి. మురుగు నీరు, అంతర్గత రహదారులు, దోమల సమస్య, కుక్కల స్వైరవిహారంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా డ్రెయిన్లలో పూడిక తీత సక్రమంగా జరగకపోవడంతో మురుగు ముందుకు సాగక దుర్వాసన వెదజల్లుతోంది. స్థానికులు, వ్యాపారులు వినియోగించిన వ్యర్థాలను రోడ్ల అంచుల్లో, పంటకాలువల్లో వేస్తుండటంతో పారిశుద్ధ్య నిర్వహణ కష్టమవుతోందని పారిశుద్ధ్య కార్మికులు వాపోతున్నారు. మురుగు నీరు రోజుల తరబడి నివాసాల మధ్య నిల్వ ఉండి దోమలు విజృంభిస్తున్నాయి. దోమల నివారణకు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. డ్రెయినేజీల్లో బ్లీచింగ్ చల్లిన దాఖలాలు కనిపించడం లేదు. ఫాగింగ్ కుడా అంతంత మాత్రంగా చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగక రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. ఆయా ప్రాంతాలను పరిశీలించి పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు చేపడతామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సాయి తెలిపారు.

పచ్చిపాలవారి వీధిలో గుంపుగా కుక్కలు

ప్రజలను సన్మార్గంలో నడిపించడమే ధార్మిక సభ లక్ష్యం

ప్రత్తిపాడు(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: ప్రజలు, యువతను సన్మార్గంలో నడిపించడమే ఇస్లాం ధార్మిక రాష్ట్ర మహాసభల ముఖ్య ఉద్దేశమని ఇస్లాం మత పెద్దలు అన్నారు. బుధవారం ప్రత్తిపాడులో నిర్వహించే ఇస్లాం ధార్మిక సభా ప్రాంగణాన్ని ఏపీ భవన నిర్మాణ, ఇతర కార్మికుల సంక్షేమబోర్డు ఛైర్మన్ వలవల బాబ్జీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ మతాలను ఆచరిస్తూ పరమతాలను గౌరవించాలన్నారు. అనంతరం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో తాడేపల్లిగూడెం ఆర్డీవో ఖతీఫ్ కౌసర్ బానో మాట్లాడారు. సభలో ఇతర రాష్ట్రాల నుంచి మత పెద్దలు వచ్చి పాల్గొంటున్న నేపథ్యంలో ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. 14, 15 తేదీల్లో నిర్వహించే సభలకు ఏర్పాట్లపై ఆరా తీశారు. కార్యక్రమంలో తాడేపల్లిగూడెం డీఎస్పీ విశ్వనాథ్, తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాల తహసీల్దార్లు రాజేశ్వరి, ఎం.సునీల్ కుమార్, పట్టణ, గ్రామీణ ఎస్సైలు నాగరాజు, జేవీఎన్ ప్రసాద్, పెంటపాడు ఎంపీడీవో రాంప్రసాద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బాబ్జి

రవాణాధికారుల ప్రత్యేక తనిఖీలు

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా రవాణాధికారి కృష్ణారావు ఆధ్వర్యంలో ఆ శాఖ అధికారులు జిల్లాలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఆటో రిక్షాలు, తెలికపాటి, భారీ సరకు రవాణా వాహనాలకు బిగించి ఉన్న దీపాలను తొలగించారు. అలాంటి 150 వాహనాలను తనిఖీ చేసి వాటి చోదకులకు నిబంధనలపై కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ తరహా దీపాలతో రాత్రి వేళ ఎదురుగా వచ్చే వాహనచోదకులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని, వాటి నుంచి వచ్చే తీవ్రమైన కాంతి వల్ల కంటి చూపు దెబ్బతింటుందని అవగాహన కల్పించారు. భీమవరం, తణుకు, పాలకొల్లులో చేసిన తనిఖీల్లో రవాణాధికారులు ప్రసాద్, శ్రీనివాస్, అజమీరాబద్దు, రవికుమార్, సత్యనారాయణ, తేజ, నరేంద్ర పాల్గొన్నారు.

ద్వారకా తిరుమలకు పాదయాత్ర

విశ్వదుర్గేశ్వరిపేట(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: జగన్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబుపై అక్రమ కేసులు తొలగిపోవాలని, ఎన్‌డీయే ప్రభుత్వం అధికారంలోకి రావాలని, బొలిశెట్టి శ్రీనివాస్ భారీ మెజారిటీతో గెలవాలని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గొర్రెల శ్రీధర్ ద్వారకా తిరుమల వేంకటేశ్వరస్వామికి మొక్కుకున్నారు. తన కోర్కెలు అన్ని తీరడంతో బుధవారం తెల్లవారు జామున విశ్వదుర్గేశ్వరి అమ్మవారి ఆలయం నుంచి సుమారు 100 మందితో కలిసి పాదయాత్రగా ద్వారకా తిరుమల బయలు దేరారు.

పెట్రోలు బంకులో జేసీ తనిఖీలు

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: పెట్రోలు బంకుల్లో కచ్చితంగా నిబంధనలు పాటించాలని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. భీమవరం మండలం యనమదుర్రులోని ఐఓసీ పెట్రోలు బంకును ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బంకులో భద్రతా ప్రమాణాలు, కొలతల్లో నిబంధనలు పాటిస్తున్నారో లేదో పరిశీలించారు. వినియోగదారులకు నాణ్యమైన ఇంధనం, సేవలు అందించాలని సూచించారు. వినియోగదారులు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలన్నారు.

గడ్డి సాగు.. ఆదాయం బాగు

పశుగ్రాసం పెంచేందుకు ప్రభుత్వ ప్రోత్సాహం

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే : అధికశాతం రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. పశువుల పెంపకానికి ప్రభుత్వం సాయమందిస్తోంది. గ్రాసం పెంచేందుకు రాయితీలు అందజేస్తూ పాడి పరిశ్రమను మరింత ప్రోత్సహిస్తోంది. వీబీజీ రామ్‌జీ పథకంలో పశుగ్రాసం పెంచే రైతులకు వంద శాతం రాయితీ లభిస్తోంది. భూమి దున్నడం, గ్రాసం విత్తనాలు, ఎరువులకు అవసరమైన నిధులు ఇవ్వడంతో తణుకు నియోజకవర్గంలోని మండలాల్లో పశుసంవర్ధక శాఖ రైతులకు అవగాహన కల్పిస్తూ గడ్డి సాగు వైపు దృష్టి సారించేలా చర్యలు చేపట్టింది.

ఇవి వివరాలు ఒక్కో రైతుకు గరిష్ఠంగా 50 సెంట్ల వరకు పశుగ్రాసం సాగుకు అనుమతి ఉంది. జాబ్ కార్డు కలిగిన రైతులకు మాత్రమే ఈ రాయితీ వర్తిస్తుంది. అయిదెకరాల్లోపు భూమి కలిగిన ఎస్సీ, ఎస్టీ, సన్నకారు రైతులు అర్హులు. రైతు సేవా కేంద్రం, మండలంలోని పశు వైద్యాధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలి. అధికారులు పరిశీలించి నీటి వసతి కలిగి, మామిడి తోటలు కాకుండా బీడుగా ఉండే భూమిలో సాగు చేసుకొనే రైతులను ఎంపిక చేస్తారు. అనుమతి లభించినవారు అధికారుల పర్యవేక్షణలో పశుగ్రాసం పెంచాల్సి ఉంటుంది.

అత్తిలి ప్రాంతీయ పశువైద్యశాల పరిధిలో పశు సంపద

మండలం	ఆవులు	గేదెలు
అత్తిలి	995	7274
ఇరగవరం	1885	7878
తణుకు	1138	8425

పాడి రైతులకు పూర్తి రాయితీ.. పాడి పశువులకు తగిన పౌష్టికాహారం సులభంగా అందడంతో పాటు పాల ఉత్పత్తి పెరుగుతుంది. పాల దిగుబడితో రైతుల ఆర్థిక స్థిరత్వానికి దోహదం చేస్తోంది. రైతులకు వ్యవసాయ, విత్తన, ఎరువుల ఖర్చులకు ప్రభుత్వం పూర్తిగా రాయితీ ఇస్తోంది. పాడి పోషకులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
-రామాంజనేయులు, పశుసంవర్ధక శాఖ సహాయసంచాలకుడు, అత్తిలి

అగ్నిప్రమాద బాధితులకు సాయం

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే : అత్తిలి గాంధీనగర్‌లో గ్యాస్ లీకేజీ కారణంగా జరిగిన అగ్నిప్రమాదంలో నిరాశ్రయులైన బాధితులకు బుధవారం అత్తిలి మానవత స్వచ్ఛంద సంస్థ నిత్యావసరాలు, గృహోపకరణాలను అందజేశారు. అత్తిలి మానవత అధ్యక్షుడు కొరిపల్లి విజయ్‌కుమార్, గౌరవ ఛైర్మన్ ఆనాల ఆదినారాయణ, కార్యదర్శి కొరిపల్లి హరి పాల్గొన్నారు. ✦ తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదేశాలు అనుసరించి బాధితులకు తెదేపా మండల అధ్యక్షుడు పోలిశెట్టి చందు ఆధ్వర్యంలో రూ.10 వేలు ఆర్థిక సహాయం, దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో డీసీ ఛైర్మన్ నల్లూరి సురేష్, తెదేపా గ్రామ అధ్యక్షుడు కొరిపల్లి ప్రసాద్, దాసరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేసిన మానవత సభ్యులు

ప్రకటన
మహారాజశ్రీ తణుకు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఈ.పి.నెం.25/2022 ఇన్ ఓ.ఎస్.నం.166/2018
బిట్వీన్ :
బొక్కా సత్యనారాయణ తండ్రి : చంద్రయ్య, పు, వయస్సు. 50 సం.లు, వెంకట్రాయపురం, తణుకు మండలం, ప.గో.జిల్లా, ...డీ.హెచ్.ఆర్ / వాదీ
మరియు
కర్రీ లక్ష్మి గణపతి, తండ్రి : సత్యనారాయణ, పు., వయస్సు. 54 సం.లు. వెంకట్రాయపురం, తణుకు మండలం, ప.గో. జిల్లా, ... జె.డి.ఆర్ / ప్రతివాది
పై నంబరు ఈ.పి.ని డి.హెచ్.ఆర్, జే.డి.ఆర్ తాలూకా షెడ్యూలు దాఖలా ఆస్తిని వేలం వేయుటకు దాఖలు చేసియున్నాడు. సదరు ది.26-02-2026 వ తేదీన శ్రీ పై కోర్టువారి ఎదుట ఉదయం 10-00 గం.ల నుండి వేలం వేయబడును. వేలంలో అందరూ యథేచ్ఛగా పాల్గొనవచ్చును. వేలం షరతుల నిమిత్తం నాజరు గారిని సంప్రదించవలెను.
షెడ్యూలు
ప.గో.జిల్లా, తణుకు సబ్ రిజిస్ట్రారు వారి పరిధిలోని తణుకు మండలం, వెంకట్రాయపురం టౌన్ షిప్, 48.4 చ.గ. స్థలము అందులో ఉండుకునియున్న డోరు నం.10-90, (అసెస్మెంట్ నెం.101) లోని ఆర్.సి.సి. బిల్డింగ్ నకు హద్దులు : తూర్పు: మద్దుల వీరవెంకట సత్యనారాయణ మరియు షెడ్యూలు ఆస్తికి చెందిన ఉమ్మడి గోడ, పడమర: కర్రి లక్ష్మి గణపతి ఆస్తి మరియు పిటీషను షెడ్యూలు ఆస్తి, ఉత్తరం : పేకేటి మరియమ్మ గారి తాలూకు ఆర్.సి.సి డాబా, దక్షిణం : రోడ్డు.
ఈ హద్దుల మధ్య చ.గ. 48.4 ల స్థలము, అందులోని పై డోరు నం. ఆర్.సి.సి. బిల్డింగ్, చేతి పంపు మరియు యావత్తు ఈజిమెంటు హక్కులతో సహా.
డీహెచ్ఆర్ విలువ : 20,00,000/-
ఇట్లు,
మానుకొండ టోని, B.A., B.L.
డీ.హెచ్.ఆర్. తరపు అడ్వకేటు, తణుకు, ప.గో.జిల్లా,
ఫోన్ నం. 98487 56813

నీతిమంతుని జ్ఞాపకము చేసుకొనుట ఆశీర్వాదకరమగును
సామెతలు 10:7
శ్రద్ధాంజలి

ఆప్యాయతానురాగాలు మాకు పంచి ఇచ్చి మా అందరి హృదయాలలో చెరగని ముద్ర వేసిన మా ఇంటి దీపం శ్రీమతి తాటిపాక కాంతమ్మ గారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ప్రభువుని ప్రార్థిస్తూ..
శ్రీమతి తాటిపాక కాంతమ్మ గారు
మాజీ సర్పంచ్, బొమ్మిడి
W/o కీ.శే. తాటిపాక రామచంద్రరావు గారు
కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు
పెద్దకార్యం : ది. 12.02.2026 గురువారం బొమ్మిడి గ్రామంలో మా స్వగృహము నందు జరుపబడును.

(c) eenadu

వ్యవస్థకు వైద్యం చేద్దామని ఐఏఎస్‌నయ్యా!

◆ భూ కబ్జాలను విభిన్నంగా క్రమించం
◆ 'ఈనాడు'తో జిల్లా సంయుక్త కలెక్టర్ నిధి మీనా

ఈనాడు, కడప: 'మాది రాజస్థాన్. దిల్లీ యూనివర్సిటీ నుంచి వైద్య శాస్త్రం పట్టా తీసుకున్నాను. వైద్యులిగా రోగులకు చికిత్స చేసే అవకాశమే ఉంటుంది. ప్రజాసేవ చేయాలనేది నా ఆకాంక్ష. వ్యవస్థలో మమేకమై సమస్యల పరిష్కారానికి కృషిచేయాలనుకున్నాను. సివిల్ సర్వీసెస్ మార్గమని భావించాను. సివిల్ సర్వెంట్‌గా వ్యవస్థకు వైద్యం చేయొచ్చని తలిచాను. ఐఏఎస్ కోసం ప్రయత్నించి సఫలమయ్యాను' అన్నారు జిల్లాకు ఇటీవల జేసీగా నియమితులైన నిధి మీనా. 'ఈనాడు'తో ఆమె బుధవారం మాట్లాడారు. ఇవీ ఆ విశేషాలు...

● **అక్రమాలను అడ్డుకుంటాం...** జిల్లాలో భూ సమస్యలున్నాయి. రైతులకు సొంతగ్రామ వేకాధ్రేలా పరిష్కారానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటాం. తప్పుల్లేని పట్టాదారు పాసు పుస్తకాలివ్వడానికి కృషిచేస్తున్నాం. ఎలాంటి పొరబాట్లు లేకుండానే అందిస్తున్నాం. లోపాలుంటే సరిదిద్ది మార్పులతో రైతులకు అందిస్తాం. భూకబ్జాలపై ఉపేక్షించే ప్రసక్తే లేదు. ఈ వ్యవహారంపై కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించుకున్నాం.

● **మొత్తం 67,890 పుస్తకాలు...** జిల్లాలోని ఐదు రెవెన్యూ డివిజన్ల పరిధిలో 40 మండలాలున్నాయి. వీటిల్లో 67,890 పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీకి చర్యలు చేపట్టాం. రీసర్వే పూర్తయిన భూములకు ఇవ్వడానికి చర్యలు చేపట్టగా.. కొన్ని పొరబాట్లు వెలుగు చూస్తున్నాయి. తప్పులున్న వాటిని నిలిపేసి సరిదిద్దిన తర్వాత అందజేస్తాం. ఈ ప్రక్రియను మార్చి నెలాఖరులోపు పూర్తి చేస్తాం.

నేరాలకు కారణమవుతున్న వివాదాలు

భూవివాదాలతో నేరాలు పెరుగుతున్నాయి. ప్రజల పైనా ఇవి ఆర్థికపరంగా ప్రభావం చూపుతున్నాయి. వివిధశాఖలతో భూ యజమానులకు కొత్త సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం.

● **అనవసరంగా వేధిస్తే చర్యలు**

ముటేషన్ల దరఖాస్తులు, పరిష్కరించడానికి ధృవీకరణ సారించాం. అనవసరంగా దరఖాస్తులను తిరస్కరిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటాం. ఈ విషయంలో సీసీఎల్ఏ నుంచి స్పష్టమైన ఆదేశాలున్నాయి.

● **పంట కొనుగోలుకు కేంద్రాలు**

రైతులు పంట దిగుబడులను విక్రయించుకునేలా కంది, మినుము, శనగ పంట కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉంటాయి. శనగ పంట సాగు విస్తీర్ణాన్ని దృష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రాలు అందుబాటులోకి తెస్తాం.

క్యాన్సర్ చికిత్స.. సామాజిక బాధ్యత

కడప రిమ్స్‌కు ఓఎన్‌జీసీ సీఎస్ఆర్ నిధులు

ఈనాడు, కడప: జిల్లాలోని క్యాన్సర్ రోగులకు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్, చెన్నై వంటి నగరాలకు వెళ్తుంటారు. ఇది ఆర్థిక భారమవుతోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఓఎన్‌జీసీ తీసుకున్న నిర్ణయం వారికి ఎంతో ఉపశమనం కానుంది. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ విన్నపం మేరకు ఓఎన్‌జీసీ అధికారులతో సంప్రదింపుల మేరకు కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) నిధుల కింద కడప సర్వజన ఆసుపత్రి(రిమ్స్)కి రూ. 30 కోట్ల వరకు కేటాయించేలా కీలక నిర్ణయం తీసుకుంది. గుంటూరు జీజీహెచ్, కడప రిమ్స్‌కు కలిపి రూ. 60 కోట్లు మంజూరు చేయనుందని.. ఇందులో కడపకు సగం వాటా దక్కనుంది. క్యాన్సర్ చికిత్సల్లో కీలకమైన లైనాక్(లీనియర్ యాక్సిలరేటర్) యంత్రాల కొనుగోలుకు ఈ నిధులు వెచ్చించనున్నారు. తద్వారా ఆధునాతన రేడియోథెరపీ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో ఆధునిక రేడియోథెరపీ సేవలు అందుబాటులోకి వస్తే పేద, మధ్య తరగతి రోగులకు పెద్ద ఊరట లభిస్తుంది. చికిత్స ఖర్చులు తగ్గడమే కాకుండా సకాలంలో వైద్యం పొందే వీలుంటుందని వైద్య వర్గాలు పేర్కొంటున్నాయి.

ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న బిషప్ పాలనాధికారి ప్రకాష్

ప్రార్థనలకు హాజరైన విశ్వాసులు

కోపం.. అహం వీడితేనే మరియ మాత దీవెన

నాగరాజుపేట(కడప), న్యూస్‌టుడే: 'కోపం, అహం వదిలి ప్రతి ఒక్కరూ ఎదుటి వారిని గౌరవించాలి. అనాథలు, అభాగ్యుల పట్ల ప్రేమతో మెలగాలి. అప్పుడే మరియ తల్లి కరుణ ఉంటుంది' అని అపోస్తలిక పాలనాధికారి బిషప్ రెవ పాల్ ప్రకాష్ అన్నారు. కడప నగరం మరియాపురంలో ఈ నెల రెండున నవ దిన పూజా ప్రార్థనలతో ప్రారంభమైన లూర్దు మాత తిరునాల మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజు విశ్వాసులనుద్దేశించి బిషప్ మాట్లాడారు. మరియ మాత పేరుతో ఏర్పాటైన మరియాపురంలో 1934 నుంచి తిరునాల మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తల్లి లూర్దు మాతను భక్తితో వేడుకుంటే ఆశీస్సులు అందిస్తుందన్నారు. తిరునాల ముగింపు సందర్భంగా యువతకు ఏర్పాటు చేసిన క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగాయి. సాంస్కృతిక, బండ లాగుడు ప్రదర్శనలు అలరించాయి. విచారణ గురువులు ఫాదర్ మరియన్న, సహాయ గురువులు సుధాకర్, తిరునాల కమిటీ సభ్యులు, ఫాదర్లు, సిస్టర్లు, విశ్వాసులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాగుతున్న బండ లాగుడు ప్రదర్శన

చక్రం తిప్పే చేతుల్లేవు

వేధిస్తున్న ఆర్టీసీ డ్రైవర్ల కొరత

జిల్లాలోని డిపోలు	07
అవసరమైన డ్రైవర్లు	1,188
ప్రస్తుతం ఉన్నవి	852
మొత్తం కండక్టర్లు	1,064
ప్రస్తుతం ఉన్నవి	1,002

కడప చిన్నచౌక్, న్యూస్‌టుడే: జిల్లాలో కడప, మైదుకూరు, బద్వేలు, ప్రొద్దుటూరు, పులివెందుల, రాజంపేట, జమ్మలమడుగు ఆర్టీసీ డిపోలున్నాయి. వీటిలో ప్రస్తుతం డ్రైవర్ల కొరత వేధిస్తోంది. పలితంగా ఉన్న వారిపై అదనపు భారం పడుతోంది. ఈ క్రమంలో డ్రైవర్లకు విశ్రాంతి కరవై.. పని ఒత్తిడి ఎక్కువై అనారోగ్యం బారిన పడుతున్నారు. డ్రైవర్లు లేరనే కారణంతో కడప డిపోలో చాలా సందర్భాల్లో బస్సులను రద్దు చేసిన దాఖలాలూ ఉన్నాయి.

● **336 మంది అవసరం:** జిల్లాలోని ఏడు డిపోల పరిధిలో 336 మంది డ్రైవర్ల అవసరం ఉంది. ఆర్టీసీలో ఏళ్ల తరబడి నియామకాలు చేపట్టక పోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ప్రస్తుతం స్త్రీశక్తి పథకం అమలుతో ప్రయాణికుల సంఖ్య పెరిగింది. అందుకు అనుగుణంగా సర్వీసులూ ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యంలో అధికారులు 87 మంది ఆన్‌కాల్ డ్రైవర్ల సేవలు వినియోగించుకుంటున్నారు. వీరిలో కొందరు బాధ్యతాయుతంగా వ్యవహరించడం లేదనే విమర్శలున్నాయి. డ్రైవర్ల కొరతపై ఆర్ఎం గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. సిబ్బంది కొరత రాష్ట్ర వ్యాప్తంగా ఉందన్నారు. ఖాళీల భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, సిబ్బందికి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

టిక్.. టిక్.. టిక్.. అమ్మో ఆ 3 గంటలు

భయపెడుతున్న రోడ్డు ప్రమాదాలు

ఈనాడు, కడప: జిల్లాలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల మధ్య చోటుచేసుకుంటున్నట్లు పోలీసు శాఖ అధ్యయనంలో వెల్లడైంది. 2024వ సంవత్సరం గణాంకాలతో పోల్చితే 2025లో కొన్ని సమయాల్లోనే ప్రమాదాలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య, వేకువ జామున 3 నుంచి ఉదయం 6 గంటల వరకు ప్రమాదాలు 2025లో ఎక్కువగా నమోదయ్యాయి. రద్దీ, అలసట, వేగం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ ఇందుకు కారణాలుగా పోలీసులు అంచనా వేశారు. సాయంత్రం పూట వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో పాటు తెల్లవారు జామున నిద్రమత్తు కారణంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని గుర్తించారు. ఈ మేరకు అడ్డుకట్ట వేసేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు.

ఇవీ తీసుకోవాల్సిన చర్యలు

● పోలీస్ స్టేషన్ల వారీగా ప్రమాద ప్రదేశాల గుర్తింపు. ● సాయంత్రం 3 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రత్యేక్ డ్రైవ్. ● మద్యం తాగి నడపకుండా, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించేలా తనిఖీలు. ● విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు. ● రాత్రి పూట పెట్రోలింగ్ పెంపు. ● ట్రాక్టర్లు, ఆటోలపై ఎక్కువ సామర్థ్యంతో సామగ్రి, ప్రయాణికుల తరలింపు. ● రాత్రి వేళ రిఫ్లెక్టర్లు లేకపోవడం.

ప్రమాదకర ప్రాంతాలు

● కడప ట్రాఫిక్ పోలీస్ స్టేషన్. ● ప్రొద్దుటూరు పట్టణ, ట్రాఫిక్ పరిధి. ● రాజంపేట పట్టణం, బద్వేలు పరిధి. ● జమ్మలమడుగు పోలీస్ స్టేషన్ సరిహద్దులు.

ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం

ప్రమాదాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్న పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రాంతాలను గుర్తించాం. ప్రతి స్టేషన్ పరిధిలో బ్లాక్ స్పాట్‌లను మ్యాప్ చేశాం. సాయంత్రం, రాత్రి వేళల్లో అదనపు సిబ్బందిని మోహరిస్తున్నాం. ఈ దిశగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాం.

- షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఎస్పీ

వేళల వారీగా ప్రమాదాల పరిస్థితి...

(ఉ: ఉదయం మ: మధ్యాహ్నం సా: సాయంత్రం రా: రాత్రి వే: వేకువజాము)

సమయం	2024	2025
ఉ॥ 6-9	69	73
ఉ॥ 9 - మ॥ 12	98	106
మ॥ 12 -3	92	91
మ॥ 3 - సా॥ 6	112	130
సా॥ 6 - రా॥ 9	169	156
రా॥ 9 - 12	68	64
రా॥ 12 - 3	22	19
వే॥ 3 - 6	34	57

చరవాణితో చేను తడపొచ్చు

రైతులకు రాయితీపై పరికరాలు

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: కూటమి సర్కారు మైక్రో ఇరిగేషన్(సూక్ష్మ నీటి పారుదల) ప్రాజెక్టుల్లో సెన్సార్లు, మొబైల్ యాప్‌ల ఆధారిత ఆటోమేషన్ వ్యవస్థను రైతులకు పరిచయం చేస్తోంది. తద్వారా రైతులు తమ పొలాలకు అవసరమైన నీటిని, ఎరువులను ఎక్కడి నుంచైనా నియంత్రించుకునే సౌలభ్యం కల్పిస్తోంది. ఇది నీటి ఆదాతో పాటు అధిక దిగుబడికి, తక్కువ కార్మిక ఖర్చుకు దోహదపడనుంది. ఇందుకుగాను చిన్న, సన్నకారు రైతులకు 55 శాతం, ఇతర కర్షకులకు 45 శాతం రాయితీని కూడా ఇవ్వనుంది.

● ఆటోమేషన్ వ్యవస్థ ఒక ఆధునిక సాంకేతిక పరిష్కారం. రైతు మొబైల్ యాప్ ద్వారా పొలానికి నీటి పారుదలను ఆన్, ఆఫ్ చేసుకునే వీలుంటుంది. ఇంట్లో నుంచే నిర్వహణకు కుదురుతుంది.

పొలంలోని ఆటోమేషన్ పరికరం

● స్మార్ట్ కంట్రోల్, సెన్సార్లు, వాల్వ్ కంట్రోల్ యూనిట్లు, మొబైల్ యాప్ ఇలా అన్నీ కలిసి ఆటోమేషన్ వ్యవస్థగా పని చేస్తాయి. రైతు తన మొబైల్ యాప్‌తో పొలంలో ఉండే మోటారు ఆన్, ఆఫ్ చేయవచ్చు. ఏ వాల్వ్ ఎప్పుడు తెరవాలి అనేదీ షెడ్యూల్ చేసుకోవచ్చు. ఎంత సేపు నీరివ్వాలనేదీ ఏర్పాటు చేసుకోవచ్చు.

● సాధారణంగా సాగునీటి పద్ధతుల్లో నీటి వృథా ఎక్కువ. ఆటోమేషన్ ద్వారా మొక్కకు అవసరమైన నీరే అందుతుంది. ఫలితంగా 60 శాతం నీటి వృథా తగ్గుతుంది. ఆటోమేషన్ పొందేందుకు డ్రిప్ కోసం చేసుకున్నట్లుగానే దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ఏడాదికి గాను జిల్లాలో 250 హెక్టార్లల్లో 120 రైతులకు లబ్ధి చేకూరేలా ప్రణాళిక రూపొందించినట్లు మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ జిల్లా అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి చెప్పారు. పూర్తి వివరాలకు ఏపీఎంఐపీ, ఎంఐఏవోలను సంప్రదించవని సూచించారు.

చిత్రంలో ఓళిగ తయారు చేస్తున్న మహిళ ఎస్. షబాన. భర్త జిలానీ బాషా అనారోగ్యంతో మృతి చెందారు. ఆ తర్వాత కుటుంబ భారం ఆమెపై పడింది. మొదట్లో ఆహార పదార్థాల తయారీ పనులకెళ్లేది. ఆ తర్వాత బ్యాంకు లింకేజీ, స్వనిధి కింద రుణాలు తీసుకుని ప్రొద్దుటూరు పట్టణం మైదుకూరు రోడ్డులో ఆహార పదార్థాల దుకాణం ఏర్పాటు చేసింది. మరో ముగ్గురికి ఉపాధి చూపుతోంది.

చిత్రంలోని మహిళ గడ్డం నాగేశ్వరమ్మ. భర్త నాగమయ్య. వీరిది ప్రొద్దుటూరు పట్టణం గాంధీ రోడ్డులోని సంజీవనగర్. వీరిద్దరూ బ్యాంకు లింకేజీ, స్వనిధి కింద రుణాలు తీసుకున్నారు. తోపుడు బండిపై ఆపిల్, దానిమ్మ, ద్రాక్ష, కమలాపండ్ల విక్రయ వ్యాపారం చేస్తున్నారు. కొడుకు, కుమార్తెలతో జీవనం సాగిస్తున్నారు.

రుణం.. వ్యాపారం.. ఆత్మగౌరవం

◆ మహిళల స్వయం ఉపాధి పెన్నిధిగా 'స్వనిధి'
◆ 20,614 మందికి రూ. 49.14 కోట్ల మంజూరు

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి వీధి వ్యాపారుల ఆత్మనిర్భర్ నిధి(పీఎం స్వనిధి)ని మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారు. మెప్మా ఆధ్వర్యంలో రుణాలను అందిపుచ్చుకుంటూ బతుకుదెరువు ఏర్పరచుకుంటున్నారు. ఆర్థికంగా తమ కాళ్లపై తాము నిలుస్తున్నారు. ఇంటి పెద్ద దిక్కుకు చేదోడు వాదోడై కుటుంబానికి ఆసరాగా మారుతున్నారు. విజయవంతంగా చిరు వ్యాపారాలు చేస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

● జిల్లాలోని తొమ్మిది పురపాలక, నగర పంచాయతీల్లో 20,614 మంది వీధి వ్యాపారులకు ప్రస్తుతం ఒక్కొక్కరికి రూ. 15 వేలు, రూ. 25 వేలు, రూ. 50 వేలు చొప్పున మూడు విడతలుగా రూ. 49.14 కోట్లు మంజూరు చేశారు. సక్రమంగా చెల్లిస్తే ప్రోత్సాహకంగా 7 శాతం రాయితీ తిరిగి ప్రభుత్వం చెల్లిస్తోందని, వీధి విక్రేతలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మెప్మా పీడీ కిరణ్ కుమార్ సూచించారు.

పురపాలకలు	లబ్ధిదారులు	రుణాలు(రూ.కోట్లలో)
బద్వేలు	2,125	4.84
జమ్మలమడుగు	1,088	2.31
కడప	8,661	21.68
కమలాపురం	116	0.17
మైదుకూరు	1,348	3.17
ప్రొద్దుటూరు	3,772	9.07
పులివెందుల	1,686	4.06
రాజంపేట	1,007	2.17
ఎర్రగుంట్ల	811	1.67
మొత్తం	20,614	49.14

పందేలు.. మూడు ఫోర్లు.. ఆరు సిక్సర్లు!

క్రికెట్ బుకీలకు అడ్డాగా మారిన ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: టీ 20 క్రికెట్ ప్రపంచ కప్ మ్యాచ్‌లు రసవత్తంగా సాగుతున్నాయి. క్షణం క్షణం ఉత్కంఠభరితంగా ఉండటంతో ప్రొద్దుటూరు కేంద్రంగా పందేలూ ఊపందుకున్నాయి. బంతి బంతికీ బెట్టింగులు జోరుగా నడుస్తున్నాయి. టాస్ మొదలుకుని జట్ల గెలుపోటములు, ఓవర్‌లో నమోదయ్యే స్కోర్.. సిక్సర్లు.. ఫోర్లు.. ఇలా ప్రతి విషయంపై పందేలకు తెర లేపుతూ కొందరు సొమ్ము చేసుకుంటున్నారు.

పదుల సంఖ్యలో బుకీలు

ప్రొద్దుటూరు కేంద్రంగా పదుల సంఖ్యలో ప్రధాన బుకీలు పాగా వేశారు. వీరంతా ప్రధానంగా ఖాదర్‌బాద్, మట్టిమసీదువీధి, దొరసానిపల్లె, కోటవీధి, వినాయకనగర్, గాంధీరోడ్డు, మైదుకూరురోడ్డు, జిన్నారోడ్డు, ఆర్ట్స్ కాలేజీ రోడ్డు, శ్రీరాంనగర్, మున్సిపల్ ఆఫీస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో కార్యాలయాలు తెరిచి ప్రతి సీజన్‌కూ రూ.కోట్లలో పందేలు సాగిస్తున్నారు. కొందరు రాజకీయ నేతలు వీరికి అండగా నిలుస్తున్నారు. వీరిపై ఆయా స్టేషన్ల పరిధిలో సస్పెక్ట్ షీట్లు నమోదైనప్పటికీ.. బెట్టింగ్ నిర్వాహకులపై ఉక్కుపాదం మోపేందుకు పోలీసులు జంకుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అడపాదడపా స్టేషన్లకు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు చెబుతూ చేతులు దులుపుకొంటున్నారు.

యాప్‌లు.. అనుచరులతో దందాలు

బెట్టింగ్ కోసం ప్రత్యేకంగా యాప్‌లు తయారు చేసుకున్నారు. వీటి సాయంతో అనుచరుల ద్వారా దందా సాగిస్తున్నారు. రాయలసీమ జిల్లాలతో పాటు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లోనూ కొందరిని నియమించుకుని పందేలు నిర్వహిస్తున్నారు. మొత్తంగా టీ-20 ప్రపంచకప్, ఐపీఎల్ సీజన్లలో ప్రొద్దుటూరు కేంద్రంగా రూ. 100 కోట్ల మేర పందేలు సాగుతాయని అంచనా. యాప్‌ల ద్వారా బెట్టింగ్ నిర్వహిస్తున్నాం. తమను ఎవరూ ఏమీ చేయలేరనే ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఎవరినీ ఉపేక్షించేది లేదు

అసాంఘిక కార్యకలాపాలకు జోలికి ఎవరూ వెళ్లొద్దు. క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంపై గట్టి నిఘా ఉంచాం. కచ్చితమైన సమాచారం వస్తే తప్పకుండా దాడులు చేసి పట్టుకుంటాం. బెట్టింగ్ నిర్వహించే ఎవరినీ ఉపేక్షించేది లేదు. ఆ దిశగా ఆయా పోలీస్ స్టేషన్ల సీఐలకు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చాం.

- విభుకృష్ణ, ప్రొద్దుటూరు ఏఎస్పీ

దారి చూపు తోడు.. బతుకు పయనం ఆగదు

చిత్రంలో కనిపిస్తున్న దంపతులు బి.మఠం మండలం పలుగురాళ్లపల్లెకు చెందిన భీమయ్య స్వర్ణమ్మ. భీమయ్యకు పుట్టుకతోనే కాళ్లు లేవు. స్వర్ణమ్మ ఐదేళ్ల వయస్సులో అమ్మవారు పోసి కంటిచూపు కోల్పోయింది. ఈ దంపతులను తల్లిదండ్రులు శాస్తులయ్య, కామేశ్వరమ్మ సంరక్షించేవారు. వారి మృతితో ఉన్న ఊరిలో జీవనం భారంగా మారి నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ వెళ్లారు. అక్కడ ఓ ఆలయం ఆలయంలో అర్చకత్వం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఏదేని పని నిమిత్తం బయటికి వెళ్లాల్సి వస్తే భీమయ్య దారి చెబుతుంటే స్వర్ణమ్మ నడుస్తుంటారు. బద్వేలులోని బంధువుల ఇంటికి బుధవారం వస్తూ ఇలా కనిపించారు. ప్రభుత్వం ఇంటిని మంజూరు చేసి నిర్మించి ఇస్తే తమ బతుకు తాము బతుకుతామని విన్నవిస్తున్నారు. **- న్యూస్‌టుడే, బద్వేలు**

గ్రామీణ దారులకు లక్ష్మీ కటాక్షం

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లా పరిధిలోని గ్రామీణ రహదారులు కొత్త రూపు దాల్చనున్నాయి. ఏపీఆర్ఆర్ఎస్‌పీ ప్రాజెక్ట్ కింద మొత్తం 121.77 కి.మీ పరిధిలో 54 చోట్ల రోడ్లు ఏర్పాటు కానున్నాయి. ఈ మేరకు పాలనాపరంగా రూ. 55.85 కోట్ల నిధుల మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర ప్రాయోజిత పథకాల్లోని నాబార్డ్, సాస్కీ, పూర్వోదయ పథకం, రాయలసీమ ప్యాకేజీ నిధుల లభ్యత ఆధారంగా ఈ పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ విషయంపై జమ్మలమడుగు పీఆర్ ఈఈ రాఘవరెడ్డి మాట్లాడుతూ.. టెండర్ల ప్రక్రియ పూర్తవగానే పనులను చేపట్టనున్నట్లు తెలిపారు.

జిల్లాలో నిధుల కేటాయింపు ఇలా...

నియోజకవర్గం	పనుల సంఖ్య	రహదారులు (కి.మీ)	నిధులు (రూ.కోట్లలో)
ప్రొద్దుటూరు	04	14.35	08.65
బద్వేలు	12	33.39	12.26
జమ్మలమడుగు	07	17.03	07.22
కమలాపురం	11	15.87	09.76
పులివెందుల	10	21.37	08.75
మైదుకూరు	10	19.76	09.21

ఇంటి దీపం నువ్వు.. కూలితే ఎవరమ్మా దిక్కు!

ఓ వైపు నిత్యం చోటుచేసుకుంటున్న ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. పలు కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోతున్నాయి. మరికొన్నింటికి తీరని శోకం మిగులుతోంది. అయినా కొందరు ప్రమాదకరంగా ప్రయాణించడాన్ని మానడం లేదు. ఆటోపై ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న మహిళా కూలీల చిత్రమే ఇందుకు నిదర్శనం. పెండ్లిమర్రి సమీపంలో బుధవారం ఈ దృశ్యం కనిపించింది. ఏదేని ప్రమాదం చోటుచేసుకుంటే ఆ కుటుంబాలు ఇంటి వెలుగులను కోల్పోతాయనే విషయాన్ని విస్మరించి పలువురు మహిళలు కూలి పనులకు వేరే ఊరు ఇలా వెళ్తున్నారు. **- ఈనాడు, కడప**

జిల్లాకు వెయ్యి టన్నుల యూరియా

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే: పంటల సాగులో అవసరమైన యూరియా మరోమారు జిల్లాకు వచ్చింది. కడప రైల్వే స్టేషన్‌కు ర్యాక్‌లో వచ్చిన ఎరువును జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు బుధవారం పరిశీలించారు. జిల్లాకు వెయ్యి టన్నుల ఎరువులు రావడంతో. . 400 ప్రైవేట్ డీలర్లకు, 600 టన్నులు మార్క్‌ఫెడ్‌కు కేటాయించినట్లు వ్యవసాయ శాఖ జిల్లా అధికారి చంద్రానాయక్ తెలిపారు.

విరూపాక్షునికి ఆదిత్యుని కిరణాభిషేకం

సుండుపల్లి, న్యూస్‌టుడే: సుండుపల్లి మండల కేంద్రంలోని విరూపాక్ష స్వామిని బుధవారం ఉషోదయ వేళ ఆదిత్యుని కిరణాలు అభిషేకించాయి. ఈ దృశ్యాన్ని చూసేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఏటా మాఘమాసంలో మూడు రోజుల పాటు ఇక్కడికి ఆలయంలోని విరూపాక్ష స్వామిని సూర్యకిరణాలు తాకుతుంటాయి. వందల ఏళ్ల క్రితం అందుకు అనుగుణంగా ఆలయాన్ని నిర్మించడం అబ్బురమని పలువురు వ్యాఖ్యానించారు.

నేల తల్లి సారమెంత!

మట్టి నమూనాల పరీక్షకు ఆదేశాలు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: పంట సాగులో రైతులు బస్తాల కొద్దీ రసాయన ఎరువులను గుమ్మరిస్తున్నారు. అయినా దిగుబడులు ఆశించిన స్థాయిలో రావడం లేదు. అదే సమయంలో పెట్టుబడి తడిసి మోపెడవుతోంది. మరోవైపు నేలలూ నిర్జీవం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో అసలు నేలతల్లి సారమెంతో రైతులకు తెలపాలని అధికారులను కూటమి ప్రభుత్వం ఆదేశించింది. ఇందులకుగాను జిల్లాలో 15,038 మట్టి నమూనాలు సేకరించాలని లక్ష్యాన్ని నిర్దేశించించింది. ప్రకృతి వ్యవసాయం అధికారులు, సిబ్బందికి ఈ బాధ్యతలను అప్పగించింది.

మట్టి నమూనాను సేకరిస్తున్న సిబ్బంది

● నిర్దేశిత లక్ష్యాన్ని మార్చి 20లోపు పూర్తి చేయాలనే ఉత్తర్వుల మేరకు జిల్లా అధికారులు కదిలారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో 5,292 మట్టి నమూనాలు సేకరించారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటలు సాగు చేయక ముందే విశ్లేషణ ఫలితాల సమాచారాన్ని అందజేయనున్నారు.

● పొలాల్లో ఉదజని సూచిక, లవణ సాంద్రత, సేంద్రియ కర్బనం, లభ్య నత్రజని, భాస్వరం, పొటాష్ ఏమేరకు ఉందో పరిశీలిస్తారు. సూక్ష్మపోషకాలు సల్ఫర్, జింక్, బోరాన్, ఇనుము, మెగ్నీషియం, రాగి లభ్యతపై పరీక్షలు చేస్తారు. రానున్న సీజన్‌లో ఏ పంటను సాగు చేస్తారో అందుకు అనుగుణంగా పోషకాలను సిఫార్సు చేస్తారు.

● జిల్లాలో వ్యవసాయ భూముల నుంచి మట్టి నమూనాలను సేకరించి ఊటుకూరు భూసార పరీక్షా కేంద్రానికి పంపిస్తున్నామని, పరీక్షల విశ్లేషణ తర్వాత ఫలితాల సమాచారాన్ని రైతులకు తెలియజేస్తామని ప్రకృతి వ్యవసాయం డీపీఎం ప్రవీణ్ చెప్పారు.

● భూసార పరీక్ష కేంద్రానికి వస్తున్న మట్టి నమూనాలను శరవేగంగా విశ్లేషిస్తున్నామని, భూమిలో పోషకాల లభ్యత, రైతులు సాగు చేయనున్న పంటను అనుసరించి ఎరువులను సిఫార్సు చేస్తామని ఊటుకూరు భూసార పరీక్షా కేంద్రం సహాయ సంచాలకురాలు రాధాదేవి తెలిపారు.

జ్ఞాపకాల మదిలో...
జాతస్య హిధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృత్యస్యచ
తస్మాద పరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి
మీరు చూపిన ఆత్మీయత ..
అనురాగం మా అభివృద్ధికి వేసిన పూబాట
మీరు భౌతికంగా దూరమైనా మా చెంత ఉన్నట్లే ఉంది.
ఏమిచ్చి రుణం తీర్చుకోము మా యదలోతుల్లోని
భావాలను అక్షర రూపంలో
నివేదించడం తప్ప
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం
స్మృతి, వర్ధంతి, జయంతి
ప్రకటనల వివరాలకు
ఈనాడు కార్యాలయము, ఆలంఖాన్‌పల్లి, కడప.
కడప : 99899 97626

(c) eenadu

అక్రమ వసూళ్లు.. ఆగిన జీతాలు

గండికోటకు రెండు కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేసిన టోల్‌గేట్

-న్యూస్‌టుడే, జమ్మలమడుగు గ్రామీణ

- గండికోట టోల్‌గేట్ సిబ్బందికి నోటీసులు జారీ
- 'ఈనాడు' వరుస కథనాలతో అధికారుల చర్యలు

రాష్ట్రంలో ప్రపంచ పర్యాటక ప్రాంతాల్లో గండికోటకు ప్రత్యేక స్థానం ఉంది. కోటకు సుమారు 2 కిలోమీటర్ల దూరంలో పర్యాటక అభివృద్ధి పేరుతో టోల్ గేట్‌లో అక్రమాలు వెలుగు చూడడంపై కలెక్టర్ శ్రీధర్ సైతం సిబ్బందిపై, అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడి సిబ్బంది వసూలు చేసిన సొమ్మును ప్రభుత్వ ఖాతాలో జమ చేయని తీరుపై 'ఈనాడు'లో వరుస కథనాలు ప్రచురించడంతో జిల్లా అధికారులు స్పందించారు. పర్యాటకశాఖ సిబ్బంది వ్యక్తిగత ఖాతాల లావాదేవీలను పరిశీలించారు. చాలా వరకు టోల్‌గేట్ డబ్బులను దుర్వినియోగానికి పాల్పడినట్లు నిర్ధారణకు వచ్చారు. ఈ క్రమంలో జిల్లా పర్యాటకశాఖ అధికారి టోల్‌గేట్‌లోని ఎనిమిది మంది సిబ్బందికి నోటీసులు జారీ చేశారు. జీతాలను కూడా నిలుపుదల చేస్తూ.. రెండు రోజుల్లో తమకు సంజాయిషి ఇవ్వాలని పేర్కొన్నారు. సంతృప్తికరమైన వివరణను సమర్పించకుంటే జీతం శాశ్వతంగా జప్తు చేస్తామని, ఎటువంటి నోటీసు లేకుండా ఉద్యోగం తొలగించడమే కాకుండా తగిన చర్యలు కూడా తీసుకుంటామని నోటీసులో హెచ్చరించారు. ప్రస్తుతం ఈ అంశం చర్చనీయాంశంగా మారింది.

దోచుకున్న సొమ్ము బయటపడేనా?

గత 2024 సంవత్సరంలో గండికోట పర్యాటక అభివృద్ధి పేరుతో ఏర్పాటు చేసిన టోల్‌గేట్ నుంచి సోమవారం నుంచి శుక్రవారం ప్రతి మనిషికి రూ.20, శని, ఆదివారం రోజుల్లో రూ.30 ఇలా ప్రతి రోజూ పర్యాటకుల నుంచి డబ్బులు వసూలు చేశారు. అయితే గండికోట అభివృద్ధికి మాత్రం గడిచిన ఏడాది కాలం నుంచి ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. కానీ టోల్‌గేట్ డబ్బులు మాత్రం అక్కడ పనిచేసే సిబ్బందికి, అధికారులకు ప్రతి నెల జీతాలు మాత్రం చెల్లింపులు జరిగాయి. ప్రస్తుతం బయట పడిన అవినీతి చూస్తుంటే పర్యాటకుల సొమ్ము భారీ మొత్తంలో పక్కదారి పట్టినట్లు స్పష్టమవుతోంది. ప్రత్యేకాధికారితో టోల్‌గేట్‌లో జరుగుతున్న అవినీతి వ్యవహారంపై లోతైన విచారణ చేయిస్తే అక్కడ పనిచేసే సిబ్బంది అవినీతితో పాటు, మరికొందరి పాత్ర బయటపడుతుందని స్థానికులు అంటున్నారు.

ఆలయ పరిసరాలు పరిశీలిస్తున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

శివరాత్రి వేళ భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు

సిద్దవటం, న్యూస్‌టుడే: శివరాత్రి వేడుకల్లో భాగంగా నిత్యపూజస్వామికోనలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. మండలంలోని నిత్యపూజస్వామికోనను ఎస్పీ, రాజంపేట ఏఎస్పీ రామనాథ్ మనోజ్ హెగ్డే బుధవారం సందర్శించారు. పలు సమస్యాత్మక ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. భక్తులకు ఇబ్బంది లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్యూలైన్ల వద్ద తోపులాటలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాజంపేట సబ్ కలెక్టరు భావన, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, కడప స్పెషల్ బ్రాంచి డీఎస్పీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రామయ్య భక్తులకు నిత్యాన్నదానం

- తిరుమల తరహాలో ఒంటిమిట్టలో ప్రారంభం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట కోదండ రామాలయాన్ని దర్శించే భక్తులకు తిరుమల శ్రీవారి క్షేత్రంలో అమలు చేస్తున్న తరహాలోనే నిత్యాన్నదానం సేవలు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ సందర్భంగా తితిదే అధికారులు బుధవారం ఒంటిమిట్టకు వచ్చారు. తితిదే అన్నదాన విభాగం ప్రత్యేకాధికారి గరికపాటి లక్ష్మీనరసింహశాస్త్రి, ఎస్ఈ ఎ.నరసింహమూర్తి, ఈఈలు రవిశంకర్‌రెడ్డి, సి.సుమతి, డిప్యూటీ ఈవోలు ఎ.ప్రశాంతి, ఆర్.సెల్వం ఆధ్వర్యంలో ప్రస్తుతం నిర్వహిస్తున్న అన్నప్రసాద కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం నిత్యాన్నదానం చేపడుతున్న తాత్కాలిక పనులను పరిశీలించారు. వారితో పాటు డీసీవో ఎం.విజయభాస్కర్, డీఈ ఎం.నాగరాజు, ఏఈ అమరనాథ్‌రెడ్డి, తనిఖీ అధికారి నవీన్‌కుమార్ ఉన్నారు.

ఏర్పాట్లకు ప్రణాళికలు

అన్నదాన కేంద్రంలో ఒకేసారి 150-200 మంది భక్తులు కూర్చొని భోజనం చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వీటికి అవసరమైన బల్లలు, కుర్చీలు తెప్పించాలని నిర్ణయించారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం తయారు చేయడానికి కావాల్సిన సామగ్రి ఇక్కడ ఏర్పాటు చేయనున్నారు. తాగునీటి కోసం ఆర్వో కేంద్రాన్ని అమర్చుతారు.

చకచకా పనులు..

పనులను శరవేగంగా చేపట్టాలని ఆయా విభాగాల అధికారులకు తెలియజేశాం. తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, జేఈవో వల్లూరు వీరబ్రహ్మంతో చర్చించి పనులు త్వరలో ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటాం. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లను పూర్తి చేస్తాం. - గరికపాటి లక్ష్మీనరసింహశాస్త్రి, తితిదే అన్నదాన విభాగం ప్రత్యేకాధికారి

తాత్కాలిక పనులను పరిశీలిస్తున్న తితిదే అధికారులు

విజ్ఞానంతో పాటు వ్యాయామ విద్య అవసరం

కడప క్రీడలు, న్యూస్‌టుడే : విద్యార్థులకు విజ్ఞానంతోపాటు వ్యాయామ విద్య కూడా ఎంతో అవసరమని జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్ అన్నారు. బుధవారం స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో ఏపీ పీఈటీస్-ఎస్ఏ పీఈ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వ్యాయామ ఉపాధ్యాయుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా విద్యాశాధికారి షంషుద్దీన్ హాజరై ప్రసంగించారు. క్రీడలు, ఆటల్లో విద్యార్థులు రోజూ భాగస్వాములు అయ్యేలా చూడాల్సిన బాధ్యత వ్యాయామ ఉపాధ్యాయులదే అని అన్నారు. డిప్యూటీ డీఈవో రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ వ్యాయామ ఉపాధ్యాయులు మరింత బాధ్యతతో పనిచేసి విద్యార్థులను రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దాలన్నారు. ఏపీ పీఈటీస్-ఎస్ఏ పీఈ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్‌కిరణ్, జిల్లా అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి మాట్లాడారు. జిల్లాలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన వ్యాయామ ఉపాధ్యాయులకు ఉత్తమ వ్యాయామ శిక్షణ సేవా అవార్డును ఏటా అసోసియేషన్ తరపున అందిస్తామన్నారు. ఏపీలోని ప్రతి పాఠశాలకు క్రీడాపరికరాలను ఈ ఏడాది అందించడం చాలా సంతోషదాయకమైన విషయమన్నారు. అనంతరం 30 మంది వ్యాయామ ఉపాధ్యాయులకు ఉత్తమ వ్యాయామ శిక్షణ సేవా అవార్డును అందించారు. అంతకు ముందు 2025లో పదవి విరమణ చేసిన ఏడుగురు వ్యాయామ ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో పీఈటీస్-ఎస్ఏ పీఈ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాజిద్, జిల్లా కార్యదర్శి విక్టర్ ఇమ్మానియేల్, కోశాధికారి శివకృష్ణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి అగ్గిరప్ప, ఎస్‌జీఎఫ్ సెక్రటరీలు శ్రీకాంత్‌రెడ్డి, చంద్రావతి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్


చిన్నారితో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పిడియాట్రిక్ సర్జరీ డాక్టర్ సునీల్‌కుమార్‌రెడ్డి, చికిత్స బృందం

రిమ్స్ సూపర్ స్పెషాలిటీలో అరుదైన శస్త్ర చికిత్స

సర్వజన ఆసుపత్రి, న్యూస్‌టుడే : రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో మొదటిసారిగా ఓ చిన్నారికి అధునాతన విధానంతో అరుదైన శస్త్ర చికిత్స విజయవంతంగా చేశామని ఆ ఆసుపత్రి సూపరింటెండెంట్, పిడియాట్రిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఇది రిమ్స్‌కే గర్వకారణమని పేర్కొన్నారు. శస్త్రచికిత్స విజయవంతం చేసి ఇంటికి వెళుతున్న చిన్నారిని పిడియాట్రిక్ సర్జరీ బృందంతో కలిసి ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. రెండు మూత్ర నాళాల సమస్యతో బాధపడుతున్న 9 ఏళ్ల చిన్నారికి జిల్లాతోపాటు ఇతర జిల్లాల్లోని అనేక ఆసుపత్రుల్లో వైద్యం చేయించినా బాగవకపోవడంతో తల్లిదండ్రులు ప్రధాన నగరాల్లోని కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లి చూపించారన్నారు. శస్త్రచికిత్స చేస్తామని రూ.10 లక్షలు ఖర్చవుతుందని చెప్పడంతో అంత మొత్తం భరించలేక వారు రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి వచ్చారని వివరించారు. చిన్నారిలో ఒక కిడ్నీ పని తీరు మందగించిందని, శస్త్రచికిత్స చేయకపోతే రెండోది కూడా పాడయ్యే ప్రమాదం ఉందని తల్లితండ్రులకు వివరించి.. డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా పథకం కింద శస్త్రచికిత్స ఆరు గంటలపాటు చేసి విజయవంతం చేశామన్నారు. ఈ శస్త్రచికిత్స జిల్లాలో మొదటిదన్నారు. ప్రస్తుతం చిన్నారి ఆరోగ్యంగా ఉందని ఇకపై ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో పురిటి, చిన్న పిల్లలకు అన్ని రకాల అధునాతన శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నాయని జిల్లా ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో చిన్నారి తల్లిదండ్రులతో పాటు శస్త్ర చికిత్స చేసిన పిడియాట్రిక్ సర్జరీ వైద్యుల బృందం డాక్టర్ పీవీ రమణ, డాక్టర్ సుకుమార్, డాక్టర్ ప్రీతి, డాక్టర్ సులక్షణ, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యపూజస్వామి కోనకు ప్రత్యేక బస్సులు

సిద్దవటం, బద్వేలు న్యూస్‌టుడే: సిద్దవటం మండలం వంతాటిపల్లె శివారులోని నిత్యపూజస్వామి కోనకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం 40 ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసినట్లు కడప ఆర్టీసీ డిపో మేనేజరు కన్యాకుమారి బుధవారం తెలిపారు. కడప ఆర్టీసీ బస్టాండు నుంచి బయలు దేరి భాకరాపేట, సిద్దవటం మీదుగా పంచలింగాల గుడి వరకు బస్సులు వెళ్తాయన్నారు. మహిళా భక్తులకు 'స్త్రీ శక్తి పథకం' కింద ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

★ శివరాత్రి వేళ బద్వేలు నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు కడప ఆర్టీసీ డీఎం చైతన్య నిరంజన్ తెలిపారు. లంకమల శైవక్షేత్రానికి 23, మల్లెం కొండకు 7, బ్రహ్మంగారిమఠానికి 4, పోరుమామిళ్ల నుంచి నారాయణ స్వామి మఠానికి 3, నెల్లూరు నుంచి 5, మైదుకూరు నుంచి 12 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని చెప్పారు.

14 నుంచి హెడ్ మాస్టర్ అకౌంట్ పరీక్షలు

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే : హెడ్‌మాస్టర్ అకౌంట్ పరీక్షలు ఈ నెల 14వ తేదీ నుంచి రెండు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని సెయింట్ ఆంటోని బాలికల ఉన్నత పాఠశాలలో జరిగే పరీక్షలు ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతాయన్నారు. వీటితో పాటు ప్రొఫెషనల్ అడ్వాన్స్‌మెంట్ పరీక్ష 14వ తేదీన రెండు పూటలా జరుగుతాయన్నారు. హాల్‌టికెట్లు ఆన్‌లైన్ ఉంచినట్లు తెలిపారు.

19 నుంచి హ్యాండ్‌లూమ్ వీవింగ్ ప్రాక్టికల్స్

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే : హ్యాండ్‌లూమ్ వీవింగ్ ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 19 నుంచి 28వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు డీఈవో షంషుద్దీన్ తెలిపారు. డ్రాయింగ్, టైలరింగ్, హ్యాండ్‌లూమ్ లోయర్, హైయర్, టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు 18వ తేదీ నుంచి రెండు పూటలా నిర్వహిస్తున్నామన్నారు. హాల్‌టికెట్లు వెబ్‌సైట్‌లో ఉన్నాయన్నారు. హాల్‌టికెట్‌తోపాటు ఏదేని ఒక గుర్తింపు కార్డు తీసుకురావాలని సూచించారు.

సింహ వాహనంపై వీరభద్రస్వామి ఊరేగింపు

చాపాడు, న్యూస్‌టుడే: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు భద్రకాళిమాత సమేత వీరభద్ర స్వామి సింహ వాహనంపై దర్శనమిచ్చారు. బుధవారం సాయంత్రం నిత్యోపాసన, బలిహరణ, వాహనసేవ నిర్వహించారు. గణపతి, వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, చండీశ్వరస్వామి, త్రిశూలేశ్వరస్వామి, పంచమూర్తి ఉత్సవం జరిగాయి. కోలాట నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

సింహ వాహనంలో దర్శనమిస్తున్న స్వామివారు

ఉపాధి పనుల దస్త్రాలు పక్కాగా నిర్వహించాలి

కొండాపురం, న్యూస్‌టుడే: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులకు సంబంధించి దస్త్రాలను పక్కాగా ఉంచాలని డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మండలంలోని 28 గ్రామాల్లో 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు జరిగిన ఉపాధి పనులపై 20వ సామాజిక తనిఖీ బృందం గుర్తించిన అంశాలపై ప్రజావేదిక ఓపెన్ ఫోరం నిర్వహించారు. జాతీయ ఉపాధిహామీ పథకం, పంచాయతీరాజ్‌లో భాగంగా మండలంలో 250 పనులకు రూ.5.23 కోట్ల ఖర్చు చేశారు. పనుల్లో జరిగిన పొరపాట్లకు సంబంధించి సామాజిక బృందం గుర్తించిన రూ.85,260 రికవరీ చేశారు. సామాజిక తనిఖీతో జవాబుదారీతనం పెరుగుతుందని, ఎలాంటి తప్పులు జరగడానికి అస్కారం ఉండదన్నారు. నిధులు దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ రామలింగేశ్వరరెడ్డి, జిల్లా విజిలెన్స్ అధికారి జుబేదా, క్వాలిటీ కంట్రోల్ మధుసూదన్, ఏపీవో వెంకటసుబ్బమ్మ, పద్మారాణి, ఎంపీడీవో కార్యాలయ ఏవో వెంకటసుబ్బయ్య, ఉపాధి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దస్త్రాలను తనిఖీ చేస్తున్న డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి

కడప ఉక్కు.. రాయలసీమ హక్కు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: కడప ఉక్కు పరిశ్రమ రాయలసీమ ప్రజల హక్కు అని సకాలంలో పూర్తి చేసి నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి, రెవల్యూషనరీ స్టూడెంట్స్ ఫోరం (ఆర్‌ఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసు డిమాండ్ చేశారు. 18 ఏళ్లుగా నిర్మాణ దశలోనే ఉన్న కడప - బెంగళూరు రైల్వే లైను పూర్తి చేయాలని శాంతియుతంగా తలపెట్టిన బైక్ జాతాకు పోలీసులు అనుమతులు ఇవ్వలేదని మండిపడ్డారు. బుధవారం స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశ్రామికంగా, వ్యవసాయపరంగా దారుణంగా వెనుకబడిన సీమ ప్రాంతాన్ని కడప ఉక్కు పరిశ్రమ వల్ల అభివృద్ధి జరుగుతుందన్నారు. వైకాపా హయాంలో రెండుసార్లు ఉక్కు పరిశ్రమ కోసం భూమి పూజలో పాల్గొని ప్రగల్భాలు పలికిన అప్పటి సీఎం జగన్ ప్రజలను మభ్యపెట్టారని దుయ్యబట్టారు. కడప - బెంగళూరు రైల్వే లైన్ నిర్మాణం పూరైతే రవాణా సులభతరమవుతుందని చెప్పారు. విద్య, వ్యాపారాలు, వైద్యం కోసం ఎంతో ఉపయోగకరమన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. కడప ఉక్కు కోసం బైక్ జాతాను తాత్కాలికంగా వాయిదా వేశామని త్వరలోనే కార్యక్రమాన్ని మొదలుపెడతామని చెప్పారు. నాయకులు వంశీ, శివ, నాగార్జున, ప్రసాద్, విజయ్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న ఆర్ఎస్ఎఫ్ నాయకులు

డీఎల్ఈడీ ఫీజు 18 ఆఖరు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే : డీఎల్ఈడీ మొదటి సెమిస్టర్‌కు సంబంధించి ఈ నెల 18వ తేదీలోగా ఫీజు చెల్లించాలని డీఈవో షంషుద్దీన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.50 అపరాధ రుసుంతో ఈ నెల 25లోగా చెల్లించవచ్చన్నారు. ఈ మేరకు సంబంధిత కళాశాలల వెబ్‌సైట్ పేమెంట్ గేట్వేలో చెల్లించాలని సూచించారు.

అగ్నిమాపక శాఖ జిల్లా అధికారిగా బాధ్యతల స్వీకరణ

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే : కడప జిల్లా అగ్నిమాపక శాఖాధికారిగా యు.శరత్‌బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ధర్మారావును శిక్షణ కళాశాలకు బదిలీ చేయగా, అమరావతిలో సీఆర్‌డీఏలో పని చేస్తున్న శరత్‌బాబును కడపకు బదిలీ చేశారు. ఆయన 1993లో అగ్నిమాపక కేంద్రం అధికారిగా విధుల్లో చేరారు. పలు ప్రాంతాల్లో పని చేసి 2014లో జిల్లా అగ్నిమాపక శాఖాధికారిగా ఉద్యోగోన్నతి పొందారు. ఆయన్ను జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి యోగేశ్వర్‌రెడ్డి, ప్రొద్దుటూరు అగ్నిమాపక అధికారి బసివిరెడ్డిలు కలిసి పుష్పగుచ్ఛాలిచ్చి అభినందనలు తెలిపారు.

శరత్‌బాబు

ఎర్రచందనం స్వాధీనం.. పోలీసుల అదుపులో స్మగ్లర్లు

తిరుపతి (జీవకోన), న్యూస్‌టుడే: ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని, నలుగురు స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం అన్నమయ్య జిల్లా పరిధిలో జరిగిన ఈ ఘటనపై టాస్క్‌ఫోర్స్ చీఫ్ సుబ్బరాయుడు, ఎస్పీ శ్రీనివాస్, అదనపు ఎస్పీ కులశేఖర్ కపిలతీర్థంలోని ఆ విభాగం కార్యాలయంలో విలేకర్లకు వెల్లడించారు. టి.సుండపల్లి పరిధి పింఛా ప్రాజెక్టు సమీపంలో కొందరు స్మగ్లర్లు ఎర్రచందనం దుంగలను ట్రాక్టర్‌కు అనుసంధానం చేసిన ట్యాంకర్‌లో లోడు చేస్తుండగా టాస్క్‌ఫోర్స్ బలగాలు చుట్టుముట్టాయి. అప్రమత్తమైన స్మగ్లర్లు పారిపోయే ప్రయత్నం చేయడంతో వెంబడించి తమిళనాడు, ఏపీలోని పలు ప్రాంతాలకు చెందిన నలుగురిని పట్టుకున్నారు. అలాగే ట్రాక్టర్, ట్యాంకర్‌లో దాచిన 72 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.1.65 కోట్లు ఉంటుందని తెలిపారు.

ఎర్రచందనం, స్మగ్లర్లను చూపుతున్న టాస్క్‌ఫోర్స్ చీఫ్ సుబ్బరాయుడు, ఎస్పీ శ్రీనివాస్

మహారాజ రాజశ్రీ నాల్గవ అదనపు జిల్లా కోర్టు, కడప
M.V.O.P. No.283/2024
పనిపెంట క్రిష్ణయ్య, తండ్రి లేట్ వి.వెంకటసుబ్బయ్య, వయస్సు సుమారు 52 సంవత్సరములు, హిందూ, కూలి, డోర్ నెంబరు 4-57-1, నరసన్నగారిపల్లె, ఒంటిమిట్ట మండలం, వై.యస్.ఆర్. కడప జిల్లా. ...పిటీషనర్ / క్లెయిమెంట్
- వర్సెస్ -
పి.శ్రీనివాస పవన్, ఓనర్, మారుతి ఎర్టిగా కారు నెంబరు AP-27AW-7300, డోర్ నెంబరు 37/118, కొండాయపల్లె, వై.యస్.ఆర్. కడప జిల్లా. ...రెస్పాండెంట్ నెం.3
3వ రెస్పాండెంట్‌కు నోటీసు
పై తెలిపిన పిటీషనరుకు పై తెలిపిన కారు ద్వారా యాక్సిడెంట్ చేసినందున పై రెస్పాండెంట్లపైన పై M.V.O.P.ని దాఖలు చేసి ఉన్నారు. సదరు M.V.O.P. నందు 3వ రెస్పాండెంట్ అప్పియరెన్స్‌కు గాను 23.02.2026వ తేదీన ఉన్నది. కావున పై తెలిపిన 3వ రెస్పాండెంట్ నేరులో గానీ, వకీలు ద్వారా గానీ తన వాదనను 23.02.2026వ తేదీన పై తెలిపిన కోర్టులో ఉదయం 10.30 గం॥లకు హాజరై తెలుపుకొనవలెను. లేనంతట పై M.V.O.P. మీ పరోక్షంలో తీర్మానించెదరు.
ఇట్లు: జి.క్రిష్ణకుమార్, బి.కాం., బి.యల్., పిటీషనర్ న్యాయవాది, సెల్ నెంబరు: 9866482412.

గువ్వలచెరువు ఘాట్‌లో లారీ బోల్తా

- ఒకరు దుర్మరణం.. మరొకరికి తీవ్ర గాయాలు

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే: మండల పరిధి గువ్వల చెరువు ఘాట్ రోడ్డులో బుధవారం లారీ అదుపు తప్పి లోయలో పడింది. ఈ ప్రమాదంలో లారీ క్లీనర్ మృతి చెందగా.. డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు తమిళనాడులోని సేలం నుంచి పుణెకు కర్జూరా మొక్కలు తరలిస్తున్న లారీ.. తెల్లవారుజామున గువ్వల చెరువు ఘాట్‌రోడ్డు నాల్గో మలుపులో అదుపు తప్పింది. సుమారు 20 అడుగుల లోయలో పడింది. సమాచారం మేరకు హైవే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించి.. క్యాబిన్‌లోని డ్రైవర్ గోపిని రిమ్స్‌కు తరలించారు. క్లీనర్ శరవన్ కుట్టి అప్పన్(37) కర్జూరా మొక్కలు మీద పడడంతో అక్కడికక్కడే మృతి చెందారు. క్రైన్ సాయంతో మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీకేదిన్నె సీఐ బాలమద్దిలేటి, ఎస్సై శ్రీనివాసులరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గువ్వల చెరువు ఘాట్ లోయలో పడ్డ లారీ

చికిత్స పొందుతూ రైతు మృతి

చక్రాయపేట,(వేంపల్లె), న్యూస్‌టుడే: అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడిన రైతు.. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. వేంపల్లె మండలం తాళ్లపల్లెకు చెందిన రైతు సి.మణికంఠరెడ్డి(25) అప్పు చేసి అయిదు ఎకరాల్లో అరటి పంట సాగు చేశారు. నష్టం రావడంతో జనవరి 17న ఆత్మహత్యకు పాల్పడ్డారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయన్ను బంధువులు కడప, కర్నూలు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి పులివెందుల ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ నరసింహులు వెల్లడించారు.

మణికంఠరెడ్డి (పాత చిత్రం)

తల్లి మృతికి కారణమైన తనయుడి అరెస్ట్

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: అప్పును తీర్చమని చెప్పిన కన్నతల్లి చాప సుందరమ్మ (90)పై పెట్రోల్ పోసి కాల్చి ఆమె మృతికి కారణమైన తనయుడు జాకోబ్‌ను అరెస్టు చేసినట్లు ఎర్రగుంట్ల సీఐ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్లో ఎస్సై నాగమురళీతో కలిసి సీఐ మీడియాతో మాట్లాడారు. పోట్లదుర్తి గ్రామానికి చెందిన చాప సుందరమ్మ కుమారుడు జాకోబ్ తన కుమార్తె లత వద్ద రూ. 18 లక్షల నగదు అప్పుగా తీసుకున్నాడు. తన మనమరాలికి ఇవ్వాల్సిన అప్పు చెల్లించమని సుందరమ్మ పదేపదే చెబుతుండగా ఆగ్రహం వ్యక్తం చేసిన జాకోబ్ తల్లిపై పెట్రోల్ పోసి నిప్పంటించడంతో కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందారు. ఈ ఘటనపై సాయంత్రం ఎస్వీ కల్యాణ మండపం సమీపంలో జాకోబ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు.

విధుల నుంచి స్టాఫ్ నర్స్ తొలగింపు

బ్రహ్మంగారిమఠం, న్యూస్‌టుడే: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గత ఆదివారం సకాలంలో వైద్యమందక ప్రాణాలొదిలిన భక్తుడి ఘటనలో విధి నిర్వహణలో అలసత్వం వహించిన స్టాఫ్ నర్స్ రామలక్షుమ్మను విధుల నుంచి తొలగించినట్లు వైద్యుడు సంపత్‌కుమార్ తెలిపారు. జిల్లా వైద్యాధికారి నాగరాజు నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించడంతో వైద్యారోగ్యశాఖ రీజినల్ డైరెక్టర్ రామగిడ్డయ్య ఆదేశాలు జారీ చేశారు.

EENADU e Classifieds
BUSINESS SERVICES
JOBS
BUSINESS OFFER
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం॥ ✆ 7382114647.
బాతులను పెంచుటకు అనుభవం గల వర్కర్స్ & ఆంధ్ర టిఫిన్స్, Veg & Nonveg, స్నాక్స్ చేసే వంట మనిషి కావలెను. ✆ 9849311524, 8688262581
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన
రూ॥ 350/- మాత్రమే
Contact:
KDP: 9989997626
8008514248
PDTR: 8008597620
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి పెట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తలను బ్లాక్‌లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

కలెక్టరేట్ క్యాంటీన్‌లో అగ్నిప్రమాదం

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే : కడప కలెక్టరేట్‌లోని క్యాంటీన్‌లో బుధవారం గ్యాస్ లీకు కావడంతో అగ్నిప్రమాదం సంభవించింది. వెంటనే అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదంలో వంట సామగ్రి కాలిపోయింది. విద్యుత్తు తీగలు కాలిపోవడంతో వెంటనే విద్యుత్తు సరఫరా నిలిపేశారు. విషయం తెలుసుకున్న ఒకటో పట్టణ సీఐ చిన్నపెద్దయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదంపై ఆరా తీశారు. కలెక్టరేట్‌లో క్యాంటీన్‌ను మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం క్యాంటీన్‌లో సిబ్బంది అల్పాహారం తయారు చేస్తుండగా ఒక్కసారిగా రెగ్యులేటర్ నుంచి మంటలు రావడంతో అక్కడున్న మహిళలు, సిబ్బంది బయటికి పరుగులు తీశారు. వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలను అదుపు చేశారు. సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం వాటిల్లింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు

కమలాపురం, న్యూస్‌టుడే: వివాహేతర సంబంధం, కుటుంబ కలహాలతో వ్యక్తిపై దాడి చేసి హత్య చేసిన కేసులో.. ముగ్గురికి జీవితఖైదుతో పాటు జరిమానా విధిస్తూ జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి దీనబాబు బుధవారం తీర్పు వెల్లడించారు. ఎస్సై విద్యాసాగర్ వివరాల మేరకు కమలాపురం పంచాయతీలోని కె.అప్పాయపల్లెకు చెందిన మార్పూరి సుధీకర్(38)ను.. 2017లో పెద్దచెప్పలికి చెందిన ఈశ్వరమ్మ, షిండే చంద్ర, కె.అప్పాయపల్లెకు చెందిన సయ్యద్ ముబారక్‌లు పథకం ప్రకారం దాడి చేసి దారుణంగా హత్య చేశారు. ఈ మేరకు నేరం రుజువు కావడంతో ఈశ్వరమ్మ, సయ్యద్ ముబారక్‌లకు జీవితకాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5000 జరిమానా, షిండేచంద్రకు జీవితఖైదు విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. కేసు వాదించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలాజీ, సాక్షులను సకాలంలో హాజరుపరిచిన ఎస్సై విద్యాసాగర్, హెడ్‌కానిస్టేబుల్‌లు సుబ్బరాయుడు, వెంకటేశ్వర్‌రెడ్డి, కానిస్టేబుల్ సింహరాయుడును ఎస్పీ విశ్వనాథ్ అభినందించారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

- పది ద్విచక్ర వాహనాల స్వాధీనం

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే : కడప తాలూకా పోలీసులు అంతర్ జిల్లాల దొంగను అరెస్టు చేసి అతని నుంచి పది ద్విచక్ర వాహనాలు స్వాధీనపరుచుకున్నారు. దొంగను బుధవారం కడప తాలూకా పోలీసు స్టేషన్‌లో మీడియాకు చూపారు. ఎస్ఐ మోహన్‌కుమార్‌గౌడ్ తెలిపిన వివరాల మేరకు.. శ్రీసత్యసాయి జిల్లా నంబులపూలకుంట మండలం గౌకనపల్లికి చెందిన షేక్ దర్బార్‌వల్లీ (42) గతంలో చరవాణులు దొంగతనం చేసి జైలుకు వెళ్లొచ్చాడు. ఆ తరువాత ద్విచక్ర వాహనాలు అపహరించడం మొదలుపెట్టాడు. కడప నగరంలో తాలూకా, ఒకటో, రెండో, చిన్నచౌకు, రిమ్స్ పోలీస్ స్టేషన్ల పరిధిలో పది ద్విచక్ర వాహనాలు దొంగిలించాడు. చౌటపల్లె రైల్వే గేటు సమీపాన పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పద స్థితిలో తిరుగుతున్న దర్బార్‌వల్లీని అదుపులోకి తీసుకున్నారు. విచారణ చేయగా ద్విచక్ర వాహనాలు చోరీ చేసినట్లు ఒప్పుకొన్నాడు. ఈ మేరకు అతన్ని అరెస్టు చేసి, పది ద్విచక్రవాహనాలు స్వాధీనపరుచుకున్నట్లు ఎస్ఐ మోహన్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ద్విచక్ర వాహనాల విలువ రూ.2 లక్షలు ఉంటుందన్నారు.

అంతర్ జిల్లా దొంగను అరెస్టు చేసి అతని నుంచి 10 ద్విచక్రవాహనాలను జప్తు చేసిన పోలీసులు

(c) eenadu

రాజంపేట

•రాజంపేట • బద్వేలు

ప్రజా ధనానికి తుప్పు

నిరుపయోగంగా ఉన్న చెక్క ర్యాంపు

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో కండరాల బలహీనత, కీళ్ల నొప్పులు వంటి వాటితో బాధపడుతున్న వారికి ఫిజియోథెరపీ చేయడానికి మండలంలోని టేకూరుపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి కొన్నేళ్ల కిందట పరికరాలను మంజూరు చేశారు. అయితే ఇక్కడ ఫిజియోథెరపిస్టులు లేకపోవడంతో ఈ పరికరాలు తుప్పు పట్టి నిరుపయోగంగా మారాయి. దీంతో ప్రజాధనం వృథా అవుతోందని.. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీటిని వినియోగించేలా చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు. ఈ విషయంపై టేకూరుపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యుడు జయరామ్‌ను వివరణ కోరగా.. ఈ ఆసుపత్రికి ఫిజియోథెరపిస్టును జిల్లా అధికారులు నియమించలేదు. సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

కుంగిన కట్టతో కలవరం

బద్వేలు పెద్దచెరువు చిన్నతూము వద్ద కుంగిన కట్ట

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని బద్వేలు పెద్దచెరువు చిన్న తూము వద్ద కట్ట కొంత మేరకు కుంగి ప్రమాదకరంగా మారింది. ఈ చెరువు నిండుకుండలా ఉండటంతో నిత్యం పర్యాటకులు ఇక్కడికి వస్తున్నారు. చిన్నతూము గది పైకి ఎక్కి సెల్ఫీలు తీసుకోవడానికి యత్నిస్తున్నారు. ఇక్కడ కొంత మేర కట్ట కుంగి పోవడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు తెలిపారు. ఎలాంటి ప్రమాదం జరగక ముందే మరమ్మతులు చేయించాలని పర్యాటకులు కోరుతున్నారు. ఈ విషయంపై జలవనరుల శాఖ డీఈ వేణుగోపాల్‌ను వివరణ కోరగా.. వెంటనే అక్కడ నిర్మాణ పనులు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చూస్తామన్నారు.

భక్తుల మనోభావాలు దెబ్బతీస్తే ఊరుకోరు

మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ ఛైర్మన్ సుబ్బనరసయ్య నాయుడు

రాజంపేట, న్యూస్‌టుడే: భక్తుల మనోభావాలను దెబ్బతీస్తే వారు ఊరుకోరని స్థానిక మార్కెట్ కమిటీ ఛైర్మన్ సుబ్బనరసయ్య నాయుడు అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. తిరుమల లడ్డూ తయారీలో రసాయనాలు వాడారని సిట్ చెబుతుంటే దాన్ని కప్పిపుచ్చుకునేందుకు వైకాపా నాయకులు నానా తంటాలు పడుతున్నారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ఆకేపాడులో శ్రీనివాసుని ఆలయానికి భూమిని వీరిని తిరిగి ఆయన భార్య రాసిస్తే దేవుడునే మోసం చేశారని విమర్శించారు. జిక్కి ముసుగులో జగనం తునికే మోసం చేసిన మీరు తిరుమల లడ్డూ విషయంలో మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రానికి 220 బస్తాల యూరియా

కలసపాడు, న్యూస్‌టుడే: మండలంలోని లింగారెడ్డిపల్లె రైతు సేవా కేంద్రానికి బుధవారం 220 బస్తాల యూరియా వచ్చిందని మండల ఏవో విజయ కుమార్ తెలిపారు. గతంలో యూరియా తీసుకొన్న రైతులు కాకుండా మిగిలిన అర్హులైన రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకాలతో యూరియా తీసుకెళ్లాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు.

నాడు- నేడు పూర్తయ్యేదెన్నడు!

● శిథిల భవనాల్లోనే పిల్లల చదువులు

బద్వేలు, న్యూస్‌టుడే: 'నాడు- నేడు' పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలనే మార్చేస్తామని గత వైకాపా ప్రభుత్వం గొప్పలు చెప్పింది. ఆచరణలో మాత్రం పూర్తిగా విఫలమైంది. శిథిల భవనాలను కూల్చి వాటి స్థానంలో నూతన పాఠశాల భవనాలను నిర్మిస్తామని ఊదరించింది. ఆచరణ నిధులివ్వక పనులు పూర్తి చేయకుండానే అర్ధాంతరంగా నిలిపేసింది. దీంతో శిథిలావస్థలో ఉన్న పాఠశాలల్లోనే విద్యార్థులు చదువులు సాగించాల్సిన దుస్థితి నెలకొంది.

● ఇదీ పరిస్థితి: బద్వేలు మండలంలో ఐదు బాలుర ఉన్నత పాఠశాలలు, 59 ప్రాథమిక పాఠశాలలున్నాయి. వీటిలో సుమారు 3,671 మంది వరకు విద్యార్థులు చదువుతున్నారు. 2023లో బంకపాళెం దళితవాడ పాఠశాల వద్ద వంటగది, శౌచాలయాలు, అదనపు తరగతి గదులు నిర్మించాలనుకున్నారు. ఉన్న భవనాన్ని కూల్చి రూ. 11 లక్షలు వెచ్చించి పనులు కూడా మొదలు పెట్టారు. అనంతరం నిధులు రాకపోవడంతో పనులు ఆగిపోయాయి. ఈ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. 26 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అయితే శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్న భవనంలోనే విదిలేక ఉపాధ్యాయులు పిల్లలకు పాఠాలు బోధిస్తున్నారు. శౌచాలయాలు, కిచెన్ గది వినియోగంలోకి రాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

★ చెన్నంపల్లె ఎస్‌హెచ్‌ఏ రోడ్డులో పాఠశాల భవనం కలిసిపోయింది. అక్కడ నూతన భవనం నిర్మించాలని 2023లో నిధులు కేటాయించారు గాని పనులు మాత్రం చేపట్టలేదు. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం భవన నిర్మాణానికి స్థలం సేకరించి పనులు ఆపేసింది. దీంతో నూతన భవన నిర్మాణం కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం కూలేందుకు సిద్ధంగా ఉన్న ఓ అద్దె ఇంట్లో అధికారులు పాఠశాలను నడుపుతున్నారు. చెముడూరులో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. దీనిపై ఎంఈవో ప్రమీల దృష్టికి తీసుకెళ్లగా.. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, అనుమతులు రాగానే పనులు మొదలు పెడతామని వివరించారు.

అర్ధాంతరంగా నిలిచిపోయిన పాఠశాల భవన నిర్మాణం

ఎగువ బంకపాళెంలో కూలేందుకు సిద్ధంగా ఉన్న భవనంలో పిల్లలు

నీటి ట్యాంకు వితరణ

సుండుపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని పెద్దదళిత వాడ ప్రాథమిక పాఠశాలకు మానవతా సంస్థ తరపున నీటి ట్యాంకును వితరణ చేశారు. ఈ మేరకు నీటి ట్యాంకును బుధవారం వారు ఉపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వై. రామకృష్ణారెడ్డి, ఎన్. రవీంద్రనాథరెడ్డి, జె. హరికుమార్, గణపతినాయక్ పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, KICHAGARI VENKTBBAMMAASU (OLD NAME), R/o D.No.4/67-L-4-5, USMAN NAGAR, RAJAMPET, Y.S.R. KADAPA DISTRICT, A.P., HAVE CHANGED MY NAME AS KICHAGARI VENKATA SUBBAMMA (NEW NAME), W/o KICHAGARI ESWARAIAH.

సీఎం సహాయ నిధి పేదలకు వరం

చెక్కు అందజేస్తున్న తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, న్యూస్‌టుడే: సీఎం సహాయ పేదలకు పెన్నిదని తెదేపా నియోజక వర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. స్థానిక తెదేపా కార్యాలయంలో మంజూరైన సీఎం నిధి చెక్కులను లబ్ధిదారులకు బుధవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో వివిధ ప్రాంతాలకు చెందిన 9 మంది బాధిత లబ్ధిదారులకు రూ.7.20 లక్షల విలువ చేసే చెక్కులను అందజేశామన్నారు. నిరుపేదల ఆరోగ్య విషయంలో ఎలాంటి రాజీలేకుండా సీఎం సహాయనిధి కింద ఆర్థిక సహకారాన్ని కూటమి ప్రభుత్వం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలని విజ్ఞప్తి

మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి సుబ్రహ్మణ్యం

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: ఎన్నికల వేళ కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి సుబ్రహ్మణ్యం కోరారు. రీజియన్ కన్వీనర్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మండలంలో బుధవారం ఎస్టీయూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలెక్టరేట్ వద్ద శుక్రవారం తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలన్నారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించి 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రమణారెడ్డి, చంద్రశేఖర్, బాలరాజు, శ్రీనివాసులు, నారాయణ, ప్రదీప్, జయరామిరెడ్డి పాల్గొన్నారు.

ముఖ్య బహిరంగ ప్రకటన

మా కక్షికర్త యగు కడప జిల్లా, బద్వేలు మండలం, అశోక్ నగర్ వీధిలో కాపురముండు బచ్చల రామయ్యా మరియు సుబ్బమ్మ గార్ల జ్యేష్ఠ కుమారుడైన బచ్చల రమణయ్యా (74 సం॥ల వయస్సు) తరపున యావన్మందికీ బహిరంగ పరచడమేమనగా..

మా కక్షికర్త బి.రమణయ్యా మరియు అతని ధర్మపత్ని వెంకట సుబ్బమ్మ గార్లు కలిసి పై తెలిపిన టౌన్ నందు కాపురమున్నారు. వారివురికి శ్రీధర్ అనే జ్యేష్ఠ కుమారుడున్ను మరియు స్వర్ణలత (శ్రీ వై.వెంకట సుబ్బయ్యా గారి భార్య-బద్వేలు టౌన్) అను ఏకైక పుత్రిక మరియు డాక్టర్ సునీల్ కుమార్ (ప్రస్తుతం మదనపల్లి టౌన్ వాస్తవ్యులు) అను ముగ్గురు సంతానము కలిగియున్నారు. మా కక్షికర్త మరియు అతని భార్య, వారికి గల ఆస్తుల గురించి మరియు పరిస్థితులననుసరించి వారి సంతతి వారిని పెంచి, పెద్ద చేసి వివాహాది శుభకార్యములు వగైరాలు జరిపి జీవితములో స్థిరపరచియున్నారు. పై ముగ్గురు సంతానము పైకి జ్యేష్ఠ కుమారుడైన శ్రీధర్‌ను శ్రీమతి నాగలక్ష్మి (నార్పాల-అనంతపురం జిల్లా) అను ఆమెతో 31-10-1999 లేక ఆ సుమారున వివాహాది శుభకార్యములు జరిపించియున్నారు. సదరు బి.శ్రీధర్ మరియు బి.నాగలక్ష్మి వీరికి కౌశిక్ (ఉద్యోగ రీత్యా హైదరాబాద్ నివాసి) అను జ్యేష్ఠ కుమారుడున్ను మరియు వెంకట పార్థివ్ (ప్రస్తుతం ఇంజనీరింగ్ విద్యార్థి) అను కనిష్ఠ కుమారుడున్ను కలిగియున్నారు. స్వర్ణలతకు 2003లో వివాహము జరిగినది. వీరివురికి నవ్యశ్రీ మరియు యశశ్రీ అను ఇరువురు కుమార్తెలు (ప్రస్తుతం మైనర్లు) కలిగియున్నారు. సదరు బచ్చల రమణయ్యా మరియు వెంకట సుబ్బమ్మ గార్లకు డాక్టర్ సునీల్ కుమార్ (గుండె వైద్య నిపుణులు-(ప్రస్తుతం మదనపల్లి టౌన్ వాస్తవ్యులు) గారికి డాక్టర్ లహరి అను ఆమెతో వివాహము జరిగి వీరికి శ్యామ్‌శౌర్య (9 సం॥ల వయస్సు) మరియు కామాక్షి (ఒకటిన్నర సం॥ల వయస్సు)అను సంతానము కలిగియున్నారు.

మా కక్షికర్త బద్వేలు టౌన్ నందు స్థిరపడి యున్నందున జీవనోపాధి నిమిత్తము అన్నపూర్ణ కట్ పీస్ సెంటర్ అను జౌళి వ్యాపారము 1985 నుండి బద్వేలు టౌన్‌లో జరుపుకొనుచున్నారు. మా కక్షికర్త జ్యేష్ఠ కుమారుడు శ్రీధర్, మరియు కనిష్ఠ కుమారుడు డాక్టర్ సునీల్ కుమార్ కలిసి వారి జాయింట్ కుటుంబ నిమిత్తము వ్యాపారము వగైరాలు ఈరోజు సరికి జరపుకొనుచున్నారు. అదృష్ట వాశాత్తు మా కక్షికర్త అతని భార్య ప్రారంభించిన వ్యాపారములు గాని మరియు కుటుంబమునకు కావలసిన ఏ కార్యమైనను ఫలించి, యే విధమైన లోటు లేకుండా వారి సంతతిని గౌరవ మర్యాదల, ఉన్నత స్థితిలో స్థిరపరచియున్నారు.

ఇట్లు ఉండగా మా కక్షికర్త జ్యేష్ఠ కుమారుడు శ్రీధర్ 20-12-2025వ తేదీన బద్వేలు టౌన్‌లో అకస్మాత్తుగా చనిపోయిఉన్నారు. సదరు శ్రీధర్ భార్య, పిల్లలు, ప్రస్తుతము నాగలక్ష్మి పుట్టినిల్లయిన అనంతపురం జిల్లా నార్పాల మండలం మరియు గ్రామంలో కాపురముంటూ ఉన్నారు. బి.శ్రీధర్ మరణానంతరము అతని భార్య పిల్లలలో లేని ఆసహనము, దురాశ వగైరాలు పెరిగి మా కక్షికర్త జాయింట్ కుటుంబములో ఊహించని మరియు ఇదివరకు జరగని పరిణామములు పై తెలిపిన నాగలక్ష్మి మరియు ఆమె ఇరువురి కుమారులు కలిసి మనశ్శాంతి లేక నడుచుకొనుచున్నారు. మా కక్షికర్త మరియు అతని భార్య చాలా ఓపిక ప్రదర్శించి, పరిస్థితులను చక్కబెట్టడం కోసం చేసిన చర్యలు ఎంతమాత్రము పెద్ద కోడలు అయిన నాగలక్ష్మి మరియు ఆమె సంతానమునకు బోధపడలేదు. ఈ రోజు సరికి వారి నడవడికలో ఏ విధమైన మార్పు సహా ఎంతమాత్రము కనబడుటలేదు.

మా కక్షికర్త మరియు పై తెలిపిన ఇరువురు కుమారులు వారి జాయింట్ కుటుంబమునకు గాను సంపాదించిన జాయింట్ ఆస్తులు, వ్యాపారములు వగైరాలు సామరస్య పూర్వకముగా పరిష్కరించుకొనుటకు గాను చేసిన గట్టి ప్రయత్నములు విఫలము అయినవి. బి.శ్రీధర్ జీవిత కాలములో తన తండ్రి రమణయ్యాతో జాయింట్ కుటుంబమునకు గాను జరిపిన ఆస్తులు వగైరాలు అతి నమ్మకము మీద శ్రీధర్ పేరున సహా సంపాదించియున్నారు. కానీ జాయింట్ కుటుంబ సభ్యులు అయిన మా కక్షికర్త మరియు అతని ఇరువురు కుమారులు పేర కలిగియున్న ఆస్తులు, లావాదేవీలు వగైరాలులో ఎంతమాత్రము స్వయార్జితముగా పరిగణించకుండా HUF ఆస్తులుగా సమ భాగములు కలిగియున్నారు. అట్టి ఆస్తులు సహా ఈ రోజు సరికి చట్టప్రకారము పంచుకొని యుండలేదు. ఈ విషయములన్నియూ యావన్మంది ప్రజానీకానికి బాగుగా తెలియును. మా కక్షికర్త మరియు అతని జాయింట్ కుటుంబమునకు బద్వేలు మండలం మరియు టౌన్ (కడప జిల్లా), తిరుపతి టౌన్‌లోని సబ్ రిజిస్ట్రారు కాలనీ మరియు అనంతపురం జిల్లా నార్పాల మండలం, నార్పాల క్రాస్ రోడ్స్, వగైరాలలోని ఆస్తులు HUF ఆస్తులుగానే పరిగణించబడుచున్నది. ఇందులో కుటుంబ సభ్యులు ప్రత్యేక హక్కు అని భాగము కోరియుండలేదు. అట్లు కోరవలసిన ఆవశ్యకత సహా ఎన్నడూ లేదు. పై విషయములకు భిన్నముగా బి.నాగలక్ష్మమ్మ గారు మరియు ఆమె ఇరువురు కుమారులు (బి.శ్రీధర్ వారసులు) నడుచుకొనుచున్నారు. మా కక్షికర్త భార్య వెంకట సుబ్బమ్మ సహా చనిపోయిన జ్యేష్ఠ కుమారుడు శ్రీధర్ పేర యావదాస్తులలో చట్టప్రకారము సమ భాగము కలిగియున్నది. ఈ విషయములు సహా గుర్తెరిగి పై తెలిపిన నాగలక్ష్మి ఆమె కుమారులు భిన్నముగా నడుచుకొనుచున్నారు. ఇటీవల మా కక్షికర్త అతని కుటుంబీకులకు తెలియడములో బి.నాగలక్ష్మి ఆమె కుమారులు ఆస్తులు ధుమక్కీగా ఇతరాదుల పేర తప్పు సంగతులతో విక్రయించుటకు ప్రయత్నములు చేయుచున్నట్లు తెలియవచ్చినది. అట్లు ఎవ్వరేని పై బి.నాగలక్ష్మి మరియు ఆమె సంతతి (ఇరువురు కుమారులు) నుండి పొందుటకు ప్రయత్నించిన యెడల అట్టి చర్యలు సమ్మతము కావనిన్నీ మా కక్షికర్త అతని కుటుంబ సభ్యులను ఎంతమాత్రము బైండ్ చేయవనిన్నీ మరియు మా కక్షికర్తలు చట్టపరిధిలో తీసుకొనబోవు యాపత్తు సివిల్, క్రిమినల్ వగైరా చర్యలకు మరియు ఖర్చులకు నష్టము వగైరాలకు సంపూర్ణ బాధ్యులు కాగలరని నిర్ద్వంద్వముగా తెలియపరచడమైనది. ఉన్న విషయములు నిక్కచ్చిగా తెలియపరచడమైనది. కాన ఏ విధమైన పత్రములు వగైరాలు పై నాగలక్ష్మి మరియు ఆమె ఇరువురు కుమారుల నుండి పొందిన యెడల లేక ఇదివరకే పొందియుండిన యెడల (సదరు విషయములను వొప్పుకొనక) అట్టి చర్యలు చట్ట సమ్మతము కావనిన్నీ మరియు మా కక్షికర్త అతని కుటుంబీకులను బైండ్ చేయవనిన్నీ నిస్సంకోచముగా తెలియపరచడమైనది. ప్రజ్ఞతతో నడుచుకొనవలయునని ఈ దినపత్రిక ప్రకటన ద్వారా కోరడమైనది.

మదనపల్లి టౌన్
తేది: 11/02/2026

సం/- శ్రీ సరస సుబ్రహ్మణ్యాం,
శ్రీ బి.యస్.హర్షవర్ధన్, న్యాయవాదులు
సొసైటీ కాలనీ, మదనపల్లె.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ క్లినిక్

మాట్లాడుతున్న తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి రితేష్‌రెడ్డి, పక్కన ఆర్డీవో చంద్రమోహన్, అధికారులు

బి.కోడూరు, న్యూస్‌టుడే: తహసీల్దారు దస్తగిరయ్య ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయం వద్ద బుధవారం రెవెన్యూ క్లినిక్ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్డీవో చంద్రమోహన్, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి రితేష్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. రైతుల భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ క్లినిక్ సదస్సులను కూటమి ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. గత వైకాపా ప్రభుత్వం చేసిన తప్పిదాలతో భూ సమస్యలు అధికంగా పెరిగాయన్నారు. ఈ సదస్సుల ద్వారా పారదర్శకంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి సమస్యలు అక్కడికక్కడే పరిష్కరిస్తున్నారన్నారు. ఒరెవెన్యూ క్లినిక్‌లో మొత్తం 314 అర్జీలు వచ్చాయని తహసీల్దారు చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె విజయవంతానికి వినతి



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

కలసపాడు, న్యూస్‌టుడే: ఉపాధిహామీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని వ్యవసాయ సంఘం, ఆవాజ్ కమిటీ మండల కార్యదర్శులు సగిలి గురయ్య, షేక్ నాగూర్‌వలి, లాజరస్ కోరారు. మండల కేంద్రంలో బుధవారం వారు మాట్లాడారు. మండల కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 12న చేపట్టే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలన్నారు. ఈ మేరకు సమ్మెకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. సమ్మెలో ఉపాధిహామి కార్మికులందరూ పాల్గొనాలన్నారు.

● కాశినాయన: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ఈ నెల 12న దేశ వ్యాప్తంగా చేపడుతున్న సమ్మెను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్ అన్నారు. సీపీఎమ్ మండల అధ్యక్షుడు పోలయ్య మాట్లాడుతూ.. భాజపా ప్రభుత్వ విధానాలు రైతులకు వ్యతిరేకంగా ఉన్నాయన్నారు.

● రాజంపేట: కార్మికులంతా గురువారం నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఏపీ ఎన్జీవో సంఘ తాలూకా అధ్యక్షుడు వరదయ్య, ప్రధానకార్యదర్శి టి.కుమారస్వామి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సి. రవికుమార్ కోరారు. స్థానిక ఎన్జీవో కార్యాలయంలో వారు మాట్లాడారు. కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా లేబర్ చట్టాల్లో మార్పు చేయడం సరికాదన్నారు.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయండి

వీరబల్లి, న్యూస్‌టుడే: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెదేపా అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని మండల అధ్యక్షుడు ఎం. భానుగోపాల్‌రాజు కోరారు. గురప్పగారిపల్లిలో గ్రామ కమిటీ అధ్యక్షుడు వీరామృతనాయుడు అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం గ్రామాల వారీగా కార్యకర్తల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు వై. రెడ్డెప్పరెడ్డి, సుబ్బరామరాజు, వాసుదేవ రాజు, రామకృష్ణంరాజు, నాగప్పనాయుడు పాల్గొన్నారు.

'మాతోట' పనుల పరిశీలన

మామిడి తోటను పరిశీలిస్తున్న నాబార్డు అసిస్టెంట్ మేనేజరు రేఖాగోనెల్

సుండుపల్లి, న్యూస్‌టుడే: గిరిజనులు మాతోట పథకం కింద అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాబార్డు అసిస్టెంట్ మేనేజరు రేఖా గోనెల్ కోరారు. బుధవారం మండలంలోని కొలిమిమిట్ట, ఎగువసుగాలి బిడికి తదితర ప్రాంతాలలో నాబార్డు పథకంలో భాగంగా మంజూరైన మాతోట పథకం పనులను ఆమె పరిశీలించారు. అనంతరం మామిడితోట రైతులకు వేపనూనె పంపిణీ చేశారు. వీరి వెంట ఎన్జీవో సంస్థ ప్రతినిధులు ఉన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

గోపవరం న్యూస్‌టుడే: గోపవరం నూతన తాహసీల్దార్‌గా బుధవారం **జీవన్ చంద్రశేఖర్** బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు ఇక్కడ పనిచేసిన తాహసీల్దార్ త్రిభువన్‌రెడ్డి కడప కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. మండలంలో భూ సమస్యలు అధికంగా ఉన్నాయని వాటిని త్వరిగతిన పూర్తి చేస్తామని జీవన్ చంద్రశేఖర్ తెలిపారు.

ఘంటసాల గానం అజరామరం

రాజంపేట, న్యూస్‌టుడే: ఆలాపన ఆర్కెస్ట్రా, కళాంజలి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో అమరగాయకుడు ఘంటసాల వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి కళాకారులు నివాళులర్పించారు. రాజంపేటలో ఘంటసాల విగ్రహం ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పెంచలయ్య, అప్పారావు, మురళీ, అభిరామ్, నాగేంద్ర, నరసింహారెడ్డి, అనురాధ, వెంకటరమణ, సునీల్, భాస్కర్ పాల్గొన్నారు.

ఘంటసాల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కళాకారులు

విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ

అద్దాలు అందుకున్న విద్యార్థులతో వైద్యాధికారి హుస్సేనయ్య

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: పోషక విలువలున్న ఆహారం తీసుకుంటే కంటి చూపు మెరుగవుతుందని కంటి వైద్యాధికారి హుస్సేనయ్య పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ వారి ఆధ్వర్యంలో కంటి అద్దాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు అద్దాలను అందజేశారు.

● సైకిళ్ల అందజేత..

పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న దూర ప్రాంత విద్యార్థినులకు స్టేట్‌బ్యాంక్ ఆధ్వర్యంలో సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ మేరకు స్టేట్ బ్యాంక్ రాజంపేట రీజనల్ మేనేజరు చల్లా కోటిరెడ్డి, బద్వేలు చీఫ్ మేనేజరు రామమూర్తి విద్యార్థినులకు అందజేశారు.

విద్యార్థుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

మాట్లాడుతున్న నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో విద్యార్థుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్ అన్నారు. బుధవారం స్థానిక తెదేపా కార్యాలయంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు కూటమి ప్రభుత్వం విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు వెంకటసుబ్బయ్య, శేఖర్, గురుస్వామి, బాబు పాల్గొన్నారు.

● రాజంపేట: ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.1200 కోట్లను విడుదల చేసి ఎంతోమంది విద్యార్థులకు తీపి కబురు అందించిందని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రేవూరు వేణుగోపాల్ అన్నారు. నిధుల విడుదలపై బుధవారం టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి నారా లోకేశ్ విద్యా ప్రమాణాలను మెరుగుపరుస్తూ విద్యారంగాన్ని ముందంజలో ఉంచారని చెప్పారు. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో ఎంతోమంది విద్యార్థుల కుటుంబాలు అప్పులపాలయ్యాయన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని లేఖలు

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఎం చంద్రబాబుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉత్తరాలు రాస్తూ పోస్టుకార్డు ఉద్యమాన్ని చేపట్టినట్లు ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి దేవదత్తం అన్నారు. ఈ మేరకు బుధవారం పలువురు ఉపాధ్యాయులు ఉత్తరాలను రాసి సీఎంకు పోస్టు చేశారు. 2023 నుంచి అమలు కావాల్సిన పీఆర్సీ కమిషన్ ఇంతవరకు నియమించ లేదన్నారు.

పండిట్ దీన దయాళ్ ఆదర్శ ప్రాయుడు

సుండుపల్లి, న్యూస్‌టుడే: పండిట్ దీన దయాళ్ ఆదర్శప్రాయుడని భాజపా రాజంపేట అసెంబ్లీ బాధ్యుడు టి.రామజగదీష్ స్వామి, మండల అధ్యక్షుడు ఎస్.వి.రమణ అన్నారు. పండిట్ దీన దయాళ్ వర్ధంతి సందర్భంగా సుండుపల్లి కూడలిలో బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

● బి.కోడూరు: మండల పరిధి పాయలకుంట్లలో పండిట్ దీన దయాళ్ వర్ధంతి సందర్భంగా భాజపా నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన సమాజానికి చేసిన మార్గదర్శకాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో భాజపా మండల అధ్యక్షుడు పోలుబోయిన రవి, ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి చిన్న గురవయ్య పాల్గొన్నారు.

సుండుపల్లి: పండిట్ దీనదయాళ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న భాజపా అసెంబ్లీ బాధ్యుడు టి.రామజగదీశ్‌స్వామి, నాయకులు

బి.కోడూరు: పండిట్ దీన దయాళ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న భాజపా మండల అధ్యక్షుడు రవి, నాయకులు

ప్రొద్దుటూరు

• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • మైదుకూరు

పోలీసు బందోబస్తుతో తిరునాల ఏర్పాట్లు

స్వామివారి తీర్థప్రసాదాన్ని అందుకుంటున్న ఆర్డీవో సాయిశ్రీ

చాపాడు, న్యూస్‌టుడే: ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తుతో తిరునాల ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్డీవో సాయిశ్రీ తెలిపారు. బుధవారం ఆర్డీవో అల్లాడుపల్లె వీరభద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్ని శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటుచేసి పలు సూచనలిచ్చారు. ఆలయ ఛైర్మన్ పెండ్లి వీరనారాయణయాదవ్, గ్రామీణ సీఐ శివశంకర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో మల్లేష్, మైదుకూరు ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీలత, తహసీల్దారు రమాకుమారి, డిప్యూటీ ఎంపీడీవో హరినాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫారెస్ట్ డివిజన్ కొనసాగించాలని వినతి

మైదుకూరు, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరులోని ఫారెస్ట్ డివిజన్ కార్యాలయాన్ని కడప డివిజన్‌లో విలీనం చేయకుండా యథావిధిగా కొనసాగించాలని కోరుతూ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ బుధవారం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు వినతిపత్రం అందజేశారు. అసెంబ్లీ ఆవరణలో డిప్యూటీ సీఎంను కలిసిన ఎమ్మెల్యే ప్రొద్దుటూరులో డివిజన్ కార్యాలయం యథాతథంగా కొనసాగించాల్సిన ఆవశ్యకతను వివరించారు. భౌగోళిక విస్తీర్ణం, వన్యప్రాణుల సంరక్షణ, మొక్కల పెంపకం, ప్రజాపాలనా సౌలభ్యం దృష్ట్యా ప్రొద్దుటూరులోనే డివిజన్ కార్యాలయం కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరడంతో అందుకు అంగీకరించి అధికారులను ఆదేశిస్తానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

ధర్నా విజయవంతం చేయాలి

మైదుకూరు, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కారానికి చేస్తున్న పోరాటాలకు కలిసిరావాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కూశెట్టి పాలకొండయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం కడప కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. బుధవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఏర్పాటై 20 నెలలు దాటినా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల రావాల్సిన ఆర్థిక బకాయిలు చెల్లించకపోవడం దారుణమని పేర్కొన్నారు. నాయకులు రామ్మోహన్, సుబ్బరాయుడు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు వివరిస్తున్న ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కూశెట్టి పాలకొండయ్య, ఎస్టీయూ ప్రతినిధి రామమోహన్

అసంపూర్తి నిర్మాణాలు.. సమకూరని వసతులు

• జమ్మలమడుగు ఎన్టీఆర్ నగర్‌లో వేధిస్తున్న సమస్యలు

-న్యూస్‌టుడే, జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం

జమ్మలమడుగులోని ఎన్టీఆర్ నగర్‌లో వసతులు పూర్తి స్థాయిలో లేక పోవడంతో నిర్మాణాలు ముందుకు సాగడంలేదు. లే అవుట్-1లో నీటి సమస్య వేధిస్తుంటే, అంబవరం లేఅవుట్‌లో అంతర్గత రహదారుల పనులు జరగక పోవడం, దొంగల భయం వంటి కారణాలతో నిర్మాణాలు మందకొడిగా సాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత బీసీ, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు అదనపు సాయం ఇస్తున్న వివిధ రకాల కారణాలవల్ల లబ్ధిదారులు ముందుకు రావడంలేదు.

వేధిస్తున్న నీటి సమస్య

జమ్మలమడుగు హౌసింగ్ సబ్ డివిజన్ పరిధిలో 4,799 ఇళ్లకు 1,926 పూర్తికాగా 2,873 వివిధ దశల్లో ఉన్నాయి. వీటి కోసం రూ.59.95 కోట్లు వెచ్చించారు. అంబవరం లే అవుట్‌లో గృహ నిర్మాణాలు జరగక పోవడంతో కొన్ని చోట్ల కంపచెట్లు పెరిగి చిట్టడవిలా మారింది. జన సంచారం లేక పోవడంతో దొంగలు చేతి వాటం ప్రదర్శిస్తున్నారు. సిమెంటు బస్తాలు, ఇనుప కడ్డీలు, తలుపులు, కిటికీలు, నీటి మోటార్లు రాత్రి వేళల్లో ఎత్తుకెళ్తున్నారు. అంబవరం లే అవుట్-1లో నీటి సౌకర్యం లేక పోవడంతో లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. జమ్మలమడుగు మండలం పొన్నతోట, పెద్దముడియం, మైలవరం, ఎర్రగుంట్ల, ముద్దనూరు లే అవుట్లలో మౌలిక సదుపాయాలు లేక నిర్మాణాలు ఊపందుకోలేదు. పొన్నతోట లే అవుట్‌లోని కొన్ని ఇళ్లు మద్యం ప్రియులకు అడ్డాగా మారింది. వాటర్ ట్యాంకులు సైతం పగిలిపోయి చెల్లాచెదురుగా పడి పోయాయి. ఉగాది నాటికి కొన్ని ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇచ్చే ఆలోచన ఉందని జమ్మలమడుగు గృహనిర్మాణశాఖ సబ్ డివిజన్ డీఈ రాజశేఖర్ తెలిపారు. ఉన్నతాధికారుల నుంచి ఇంకా ఆదేశాలు అందలేదన్నారు.

మందుబాబులకు అడ్డాగా మారిన అసంపూర్తి ఇల్లు

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

కొండాపురం, న్యూస్‌టుడే: గండికోట ప్రాజెక్టు నిర్మాణం కోసం ఇళ్లు, భూములు త్యాగం చేసిన నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్ చేశారు. బుధవారం కొండాపురంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద గండికోట నిర్వాసితులకు అందాల్సిన పరిహారాన్ని బడ్జెట్ సమావేశాల్లో కేటాయించాలని సీపీఐ పార్టీ నాయకులు సుబ్బారెడ్డి, మనోహర్‌బాబు, లక్ష్మీనారాయణ, ప్రసాద్ 48 గంటల దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు సంఘీభావం తెలిపిన ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణం కోసం 22 గ్రామాల నిర్వాసితులు సర్వం త్యాగం చేశారని, ఆయా గ్రామాల్లోని పెండింగ్‌లో ఉన్న అర్బన్ హౌసింగ్ ప్యాకేజీ నిధులను తక్షణం కేటాయించాలని డిమాండ్ చేశారు. దీక్ష చేపట్టిన వారికి పలు గ్రామాల ముంపు వాసులు, ప్రజా సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు.

శిబిరంలో కూర్చున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

తీరనున్న దాహార్తి

• నిండుకుండలా ఉప జలాశయాలు

-న్యూస్‌టుడే, మైదుకూరు

తెలుగుగంగ ఒకటో ఉపజలాశయం

తెల్లవారుజామున చలి ప్రభావం కొనసాగుతున్నా పగటి ఉష్ణోగ్రతలు క్రమేపీ పెరుగుతున్నాయి. రెండేళ్ల కిందట మైదుకూరు పురపాలక పరిధిలో తాగునీటికి కటకట పరిస్థితులు ఉండేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలుగుగంగ ద్వారా చెరువులకు నీరు చేరడంతో భూగర్భ జలాలు పెరిగాయి. తాగునీటి సమస్య ఉత్పన్నం కాలేదు. ఈ ఏడాది చెరువులు కళకళలాడుతున్నాయి. ఈ సంవత్సరం తాగునీటికి ఇబ్బందులు లేకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజా ప్రతినిధులు అధికారులను ఆదేశించారు. తెలుగుగంగ బ్రహ్మంసాగర్ జలాశయంతోపాటు మైదుకూరు, దువ్వూరు పరిధిలో ఉప జలాశయాలు నీటితో నిండుకుండను తలపిస్తున్నాయి. చెరువుల్లో నీరు భూగర్భ జలాల సమస్య తలెత్తితే తెలుగుగంగ నీటిని మళ్లించే అవకాశాలు ఉన్నాయి. నియోజకవర్గంలో భూగర్భ జలాల లభ్యత 3 మీటర్ల నుంచి 9 మీటర్ల పరిధిలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం తెలుగుగంగ ఒకటో ఉప జలాశయంలో 2.133 టీఎంసీలకు 1.29 టీఎంసీలు, రెండో ఉప జలాశయంలో 2.45 టీఎంసీలకు 1.5 టీఎంసీలు, బ్రహ్మంసాగర్‌లో 17.74 టీఎంసీలకు 13.3 టీఎంసీలు నిల్వ ఉన్నాయి.

ఘనంగా దీన దయాళ్ వర్ధంతి

భాజపా కార్యాలయంలో భాజపా సిద్ధాంతకర్త దివంగత పండిత్ దీన దయాళ్ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. దీన దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. జమ్మలమడుగులో భాజపా నాయకులు సయ్యద్ నబీ, పాములేటి, నగళ్లపాటి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, కుమార్, రాజారెడ్డి, రంగనాయకులు, రామచంద్రయ్య, గురుశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రొద్దుటూరులో భాజపా పట్టణాధ్యక్షుడు-2 పాళెం కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో దీన దయాళ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు వెంకటనాయుడు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గురుప్రసాద్, నాయకులు రవి, పాళెం గురురాజేష్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు. బ్రహ్మంగారిమఠంలో భాజపా మండల అధ్యక్షుడు చంద్రఓబుల్‌రెడ్డి, ఈశ్వరయ్య, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.
-న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు విద్య, జమ్మలమడుగు, బ్రహ్మంగారిమఠం

నివాళి అర్పిస్తున్న భాజపా పట్టణ అధ్యక్షుడు పాళెం కిరణ్‌కుమార్, నాయకులు

నిరసనలో పాల్గొన్న ఉద్యోగులతో నాయకులు

ఉద్యోగుల మరణాలపై విచారణకు డిమాండ్

మైదుకూరు, న్యూస్‌టుడే: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల మరణాలపై హైకోర్టు పదవీవిరమణ న్యాయమూర్తితో విచారణ కమిషన్ ఏర్పాటు చేయాలని జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా కన్వీనర్ మస్తాన్, కో కన్వీనర్ ప్రతాప్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజశేఖర్‌రెడ్డి డిమాండు చేశారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల మరణాలకు నిరసనగా బుధవారం నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో కడపరోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం నుంచి రాయలు కూడలి వరకు కొవ్వొత్తులతో శాంతి ప్రదర్శన చేశారు. కమిటీ ప్రతినిధులు వినీత్, మైథిలి, యమున, సిద్దయ్య, వీరప్రతాప్, నరసింహారావు, ఎస్టీయూ సంఘ మైదుకూరు అధ్యక్షుడు రాఘవయ్య, వెంకటేశ్వర్లు, ఎస్టీయూ మండల అధ్యక్షుడు వై.రవికుమార్ పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం

కొండాపురం, న్యూస్‌టుడే: ఆర్థిక అక్షరాస్యత లేకపోతే ఆర్థికంగా ఎదగడం కష్టమని లీడ్‌బ్యాంకు మేనేజర్ జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం తాళ్లప్రొద్దుటూరులో కెనరా బ్యాంకు సీనియర్ మేనేజర్ సీహెచ్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మేనేజర్ వెంకటసుబ్బారెడ్డి, సీఎఎఫ్ఎల్ సభ్యులు బాలరాజు, డ్వాక్రా సంఘం సభ్యులు, బ్యాంకు ఖాతాదారులు, ప్రజలు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాల ఆహ్వానపత్రిక ఆవిష్కరణ

మైదుకూరు, న్యూస్‌టుడే : మైదుకూరు మాధవరాయస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవం ఏర్పాటుచేశామని నిర్వాహకులు తెలిపారు. ఆలయ ఆవరణంలోని భీమేశ్వరస్వామికి ఈనెల 15వ తేదీ తెల్లవారుజాము నుంచి 16వ తేదీ ఉదయం వరకు చేపట్టే ఉత్సవ ఆహ్వాన పత్రికను బుధవారం ఆలయ ఆవరణంలో ఆవిష్కరించారు.

సచివాలయ సిబ్బందికి తాఖీదులు

చాపాడు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుటుంబ సర్వే కార్యక్రమంలో నిర్లక్ష్యం వహించిన సచివాలయ సిబ్బందికి ఎంపీడీవో వీరకిషోర్ అత్యవసర తాఖీదులు జారీ చేశారు. జిల్లాలో చాపాడు మండలం వెనకబడి ఉందని, పలు సచివాలయాల్లో సిబ్బంది సరిగా స్పందించలేదని, వారిపై క్రమశిక్షణా చర్యలు ఎందుకు తీసుకోకూడదని నోటీసులో పేర్కొన్నారు. అన్నవరం ఏఎన్ఎం, ఖాదర్‌పల్లె, ఎన్.ఓబాయపల్లె, పల్లవోలు ఎనర్జీ అసిసెంట్లు, లక్ష్మీపేట పంచాయతీ కార్యదర్శి, వెదురూరు వీఆర్వోకు తాఖీదులు అందాయి. ఒక రోజులో సంజాయిషీ ఇవ్వాలని సూచించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని విద్యార్థినికి తీవ్ర గాయాలు

ఖాజీపేట, న్యూస్‌టుడే: స్కూల్ బస్సు నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా బీరం శ్రీధర్‌రెడ్డి స్కూల్ రెండో తరగతి విద్యార్థిని జి.వాగ్దేవిని తహసీల్దారు కార్యాలయం వద్ద కడప-జమ్మలమడుగు ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. బుధవారం సాయంత్రం స్కూల్ ముగించుకుని బస్సు దిగి ముందు భాగం నుంచి రోడ్డు దాటే క్రమంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. వెంటనే అంబులెన్స్‌లో కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బస్సులో సహాయకులు లేకున్నా ప్రయాణం చేసున్న ఉపాధ్యాయులూ పట్టించుకోలేదని స్థానికులు వాపోయారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

స్తంభాలు కూలి.. ఇద్దరికి..

మైదుకూరు, న్యూస్‌టుడే : స్తంభాలు ఒరిగి పోవడంతో బుధవారం మైదుకూరు సమీప శివపురంరోడ్డు వద్ద ఆర్డీఎస్ఎస్ పనులు చేస్తున్న ఇద్దరు కూలీలు గాయపడినట్లు తెలుస్తోంది. విద్యుత్తు తీగలు అమర్చుతున్న సమయంలో స్తంభం కూలినట్లు సమాచారం. లోతు తక్కువతో స్తంభాలు నాటడం వల్లే ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆటోలో తరలించినట్లు స్థానికులు తెలిపారు.

తెదేపా ఫ్లెక్సీల చించివేత

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరులో తెదేపా ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు చించివేశారు. పార్టీ జిల్లా కమిటీ ప్రమాణ స్వీకారం సందర్భంగా ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి, జిల్లా అధ్యక్షుడు భూపేష్‌రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొండారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జబీవుల్లా చిత్రాలతో తెదేపా నాయకుడు భూమిరెడ్డి సూర్యప్రతాప్‌రెడ్డి పట్టణంలో పలు ప్రాంతాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఫ్లెక్సీల్లో సూర్యప్రతాప్‌రెడ్డి చిత్రం వద్ద చించివేశారు. దీంతో ఇది పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

అధికారుల నిర్లక్ష్యంపై సీపీఐ నిరసన

బ్రహ్మంగారిమఠం, న్యూస్‌టుడే: ఈ నెల 5వ తేదీన ఇద్దరు దళిత యువకుల మృతిపై పోలీసులు నిర్లక్ష్యం వహించారని సీపీఐ నాయకులు బుధవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బాలు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బండి జకరయ్య మాట్లాడుతూ దళిత యువకులు మృతి చెందితే ఆ కుటుంబాన్ని ప్రతిపక్ష పార్టీ, స్థానిక ఎమ్మెల్యే కానీ ఎవ్వరు పట్టించుకోలేదని, యువకులు మృతి చెంది ఐదురోజులు కావస్తున్నా రాజకీయ నాయకులు కనీసం మృతుల కుటుంబాలను పరామర్శించకలోని ఆంతర్యమేమిటని ప్రశ్నించారు.

బారికేడ్.. ప్రమాదాలకు చెక్

హుబ్లీ-కృష్ణపట్నం జాతీయ రహదారికి సంబంధించి మైదుకూరు పట్టణం గోపిరెడ్డిపల్లె - గడ్డంవారిపల్లె పారిశ్రామికవాడ మధ్య ఉన్న పుల్లయ్యస్వామి సత్రం వద్ద రాకపోకలు చేపట్టిన కొన్నిరోజులకే రహదారి దెబ్బతినింది. ఇది గుర్తించి బాగుచేశారు. ఈ మార్గంలో హైవోల్టేజీ తీగలు తక్కువ ఎత్తులో ఉండటంతో ప్రమాదాలు జరిగే పరిస్థితిని అధికారులు గుర్తించారు. రహదారిపై యథావిధిగా చోదకులు రాకపోకలు చేస్తారేమోనని వెంటనే బారికేడ్ ఏర్పాటు చేసి కట్టడి చేశారు. -న్యూస్‌టుడే, మైదుకూరు

కోనేరు.. పట్టించుకోరు

సుమారు వందేళ్ల కిందట నిర్మించిన కోనేరు శిథిలావస్థకు చేరుకుంది. మండల పరిధిలోని సలివెందుల గ్రామంలో సుంకులాంబ ఆలయం ఎదుట ఈ కోనేరు ఉంది. పూర్వం తాగునీటి అవసరాలు, వ్యవసాయం కోసం ఉపయోగపడిన ఈ నీటి వనరు అధ్వానంగా మారింది. పడమర వైపు రాతి గోడ కూలిపోయింది. పూడికతోపాటు జమ్ము పెరిగిపోయి రూపురేఖలు కోల్పోయింది. పూర్తిగా రాతితో నిర్మించిన ఈ కట్టడాన్ని జలవనరుల శాఖ అధికారులు స్పందించి సంరక్షించాలని స్థానికులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, జమ్మలమడుగు

అధికారుల కినుక.. ప్రజల కళ్లల్లో ఇసుక

ఉచిత ఇసుక విధానం ప్రజలకు మేలు జరుగుతోంది. కానీ.. జమ్మలమడుగు-ప్రొద్దుటూరు రహదారిలో ఇసుకను వాహనాల్లో తరలించేప్పుడు పట్టలు కప్పక పోవడంతో ఆ మార్గంలో వస్తున్న ప్రజల కళ్లల్లోకి చేరి తీవ్ర అసౌకర్యానికి గురిచేస్తోంది. ఈ సమయంలో అధికారుల పరిశీలన లేకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. దీని వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఆ ట్రాక్టర్లు పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయాల మీదుగా వెళ్తున్నా పట్టించుకున్న పాపాన పోవడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
-న్యూస్‌టుడే, జమ్మలమడుగు గ్రామీణ

ఆశలు.. టమాటా

టమాటా పంటపై రైతుల ఆశలు నీరుకారాయి. ధర పెరగక పంటను వదులుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కొందరు రైతులు జీవాలకు వదిలేశారు. ఇతర పంటల సాగు ఆలోచనతో ఉన్నారు. గత మూడు వారాలుగా 27కిలోల ప్లాస్టిక్ బుట్ట రూ.80 నుంచి రూ.110 మధ్యనే పలుకుతోంది. మార్కెట్‌కు వచ్చే దిగుబడి తగ్గితే ధర పెరిగే అవకాశం ఉంటుందనే ఆలోచనతో కొందరు రైతులు వేచిచూసే ధోరణితో ఉన్నారు. చీడపీడల నుంచి పంటను కాపాడుకునే ప్రయత్నంలో ఉన్నారు. -న్యూస్‌టుడే, మైదుకూరు

విద్యార్థులకు పురస్కారాలు

కొండాపురం, న్యూస్‌టుడే: విశిష్ట హిందీ రత్న పురస్కారాల్లో భాగంగా ప్రతిభ చూపిన విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో పతకాలు, ప్రశంసాపత్రాలు సాధించారు. గత నెల 25వ తేదీ ప్రొద్దుటూరులో హిందీ భాషలో పలు అంశాలపై నిర్వహించినా ప్రతిభా పోటీల్లో స్థానిక పాఠశాల ఆరో తరగతి విద్యార్థి లహరి, ఏడో తరగతి నవ్యశ్రీ, 8వ తరగతి చిద్విజారెడ్డి, 9వ తరగతి యశశ్రీ, పదో తరగతి విద్యార్థి శ్రీలత బంగారు, శ్రీలక్ష్మీ (7వ తరగతి), ప్రభురాజ్‌కుమార్ (8వ తరగతి), కీర్తన (10వ తరగతి), రజిత పతకాలు, నిత్యశ్రీ (7వ తరగతి), షబాన (8వ తరగతి), హర్షిత (10వ తరగతి) కాంస్య పతకాలు సాధించారు.

హిందీ భాషలో రాష్ట్ర స్థాయి ప్రశంసాపత్రాలు పొందిన విద్యార్థులు

నిరసన వ్యక్తం చేస్తున్న శ్రీరాములపేట వాసులు

ఆక్రమణల తొలగింపులో వివక్ష తగదు

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక శ్రీరాములపేటవీధి వాసులు బుధవారం ఆక్రమణల తొలగింపు ప్రాంతంలో పురపాలక అధికారులు వివక్ష పాటిస్తున్నారని నిరసన చేపట్టారు. 2011లో అప్పటి కమిషనర్ రామిరెడ్డి ప్రొద్దుటూరు ఒకటో వరదకాలువపై ఉన్న ఇళ్లపై సర్వే చేపట్టి రెండువైపుల గుర్తులు వేశారన్నారు. ప్రజాఫిర్యాదుల వేదికకు ఈ అంశంపై ఫిర్యాదు చేస్తే 14వ సచివాలయ వార్డు ప్లానింగ్ కార్యదర్శి సమస్యను పరిష్కరించకపోగా సంతకాలు పెట్టాలని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. కమిషనర్ రవిచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఎడమవైపు పట్టాలు ఉన్నాయని ప్రభుత్వ స్థలం ఒకటి నుంచి మూడు అడుగులు మాత్రమే ఉండడంతో వాటిని తొలగించలేదన్నారు.

మహాశివరాత్రికి పటిష్ఠ ఏర్పాట్లు

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కన్యతీర్థంలో ఈ నెల 15వ తేదీన నిర్వహించే మహాశివరాత్రి వేడుకలకు పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులరెడ్డి, సీఐ నరేష్‌బాబు తెలిపారు. బుధవారం కన్యతీర్థంలో రెవెన్యూ, పోలీసు అధికారులు ఆలయాలను సందర్శించి వసతుల ఏర్పాట్లపై ఆలయ కమిటీ నిర్వాహకులతో ఆరా తీశారు. ఆర్ఐ న్యాయం సతీష్, ఎస్సై రామకృష్ణ, ఆలయ నిర్వాహకులు తదితరులు ఉన్నారు.

బ్రహ్మయ్యయాదవ్‌కు సన్మానం చేస్తున్న యాదవులు

జిల్లా యాదవ సంఘ అధ్యక్షుడికి సన్మానం

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన రామనబోయిన బ్రహ్మయ్యయాదవ్‌కు స్థానిక కృష్ణాలయంలో యాదవ సేవా సంఘం నాయకులు బుధవారం సాయంత్రం ఘనంగా శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు దాసరి బాలసుబ్బరాయుడు, కార్యదర్శి వెంకటరమణ, కోశాధికారి వెంకటయ్య, ఉపాధ్యక్షుడు బాలపుల్లయ్య, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ పోయినది

నా క్లయింట్ ఏటూరు వెంకటరామిరెడ్డి, తండ్రి ఏటూరు పెద్దవెంకటరెడ్డి, డోర్ నెం: 1/1224-1, ఎర్రముక్కపల్లి, కడప సిటీ వారు కారిపల్లి సురేష్ వగైరాలతో కొనుగోలు చేసి విక్రయ దస్తావేజు పొందివున్నారు. సదరు షెడ్యూలుకు సంబంధించిన లింకు డాక్యుమెంట్ ప్రొద్దుటూరు భగత్‌సింగ్ కాలనీలోని 4 రోడ్ల వద్ద జిరాక్స్ కోసం వెళుతుండగా పోయినది. సదరు **డాక్యుమెంట్ నెం. 4545/2013,** తేదీ: 5-7-2013. దొరికిన వారు క్రింది చిరునామాకు గానీ, పైన తెలిపిన నా క్లయింట్‌కు గానీ అందజేయగలరు.

షెడ్యూలు

YSR డి॥, ప్రొద్దుటూరు రి॥డి॥, ప్రొద్దుటూరు సబ్ డి॥, ప్రొద్దుటూరు మండలం, కొత్తపల్లె పంచాయతీ వార్డు నెం: 11 గల మత్స్యకాలనీ ఏరియా, మోడమీదిపల్లె గ్రామం పొలంలోని కల్లూరు వెంకటరెడ్డి కాలనీలోని ప్లాటు నెం: 49 గల జాగాకు సర్వే నెంబర్ వారీ వివరం: S.No.175 పైకి య 0.02 సెంట్లు మరియు 980 చ॥ లింకులు లేక 0.012 హెక్టార్లు గల జాగా. **ఇందుకు దిశలు : తూర్పు:** 24 అడుగుల వెడల్పు గల రోడ్డు, **పడమర:** ప్లాటు నెం: 28 గల జాగా, **ఉత్తరం:** ప్లాటు నెం: 50 గల జాగా, **దక్షిణం:** ప్లాటు నెం: 48 గల జాగా.

A.S.విజయకుమార్, అడ్వకేట్, ప్రొద్దుటూరు, సెల్ : 9985503399.

జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా ఆనంద్‌బాబు

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఆనంద్‌బాబు రెండోసారి నియమితులయ్యారు. ఇప్పటివరకు సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సుజాత సెకండరీ హెల్త్ డిప్యూటీ కమిషనర్‌గా ఉద్యోగోన్నతి పొందారు. దీంతో ఆనంద్‌బాబును సూపరింటెండెంట్‌గా నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన ఈ ఆసుపత్రిలోనే సివిల్ సర్జన్ స్పెషలిస్ట్‌గా ఉన్నారు. 2022 నుంచి 2025 వరకు సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించారు. తిరిగి బుధవారం ఆ బాధ్యతలు స్వీకరించారు.

జీఎన్ఎస్ఎస్ కాలువకు నీరు విడుదల

కొండాపురం, న్యూస్‌టుడే: గాలేరు-నగరి సుజల స్రవంతి (జీఎన్ఎస్ఎస్) ప్రధాన కాలువకు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు జలవనరులశాఖ ఈఈ ఉమామహేశ్వర్లు బుధవారం తెలిపారు. శెట్టివారిపల్లె హెడ్‌రెగ్యులేటర్ నుంచి జీఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువకు తాగు, సాగు అవసరాల దృష్ట్యా నీరు విడుదల చేసినట్లు తెలిపారు. గండికోట జలాశయం పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 25.506 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు ఈఈ పేర్కొన్నారు.

శుభ్రతనిస్తూ.. యాతన పడుతూ

◆ జీతాలందక పారిశుద్ధ్య కార్మికుల అవస్థలు

-న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు వైద్యం

ఆసుపత్రిలో వేతనాల కోసం నిరసన తెలుపుతున్న పారిశుద్ధ్య కార్మికులు, యూనియన్ నాయకులు

ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచుతున్న పారిశుద్ధ్య కార్మికులకు సకాలంలో జీతాలందక అవస్థలు పడుతున్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రొద్దుటూరులోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి రోజూ సుమారు 1500 మంది రోగులు, వారి సహాయకులు రాకపోకలు చేస్తున్నారు. ఈ తాకిడితో ఏర్పడిన అపరిశుభ్ర పరిసరాలను ఎప్పటికప్పుడు మెరుగుపరిచేందుకు షిఫ్ట్‌లవారీగా 68 మంది విధులు నిర్వహిస్తున్నారు. చూడటానికే ఇబ్బంది పడే మరుగుదొడ్లను వారు పరిశుభ్రం చేస్తారు. అలాంటి వారికి వేతనాలు అందకపోవడం దారుణం. జీతాల సాధనకు పోరాటాలు చేయాల్సి రావడం విచారకరమని పలువురు విమర్శిస్తున్నారు. మూడు నెలల నుంచి తమకు జీతాలివ్వలేదని దీంతో కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోతున్నారు. నెల నెలా అప్పులు పెరిగి అధిక వడ్డీల భారం పెరిగిపోతోందన్నారు. ప్రతి నెలా నిరసనలు చేపట్టినా.. అధికారులకు వినతులు అందించినా ఫలితం లేకుండా పోతోందంటున్నారు. గుత్తేదారు తమపై నిర్లక్ష్యం వహిస్తున్నారని, సక్రమంగా వేతనాలు అందించకుండా వేధిస్తున్నారని ఆరోపిస్తున్నారు. రూ.16,400 రావాల్సి ఉండగా 12,400 మాత్రమే చెల్లిస్తున్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా చెల్లించడంలేదని, సంవత్సరానికి రెండు జతలు యూనిఫాం ఇవ్వడంలేదు. దీంతో పాతవాటితోనే నెట్టుకొస్తున్నామంటున్నారు. తమకు బకాయి ఉన్న వేతనాలు వెంటనే చెల్లించి ప్రతి నెలా సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ సుజాత మాట్లాడుతూ పాత గుత్తేదారు మారి కొత్త వారు వచ్చారన్నారు. ముందున్న వారు ఈ మూడు నెలల జీతం చెల్లించామని చెబుతున్నారని, ఈ అంశం కోర్టులో నడుస్తోందన్నారు. త్వరలోనే వారికి వేతనాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

రైతులకు అందుబాటులో ఉండండి

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే : వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది అన్నదాతలకు అందుబాటులో ఉండాలని జిల్లా అధికారి చంద్రానాయక్ పేర్కొన్నారు. బుధవారం కడప డివిజన్ ఏడీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేసే పథకాలు, కార్యక్రమాలు రైతులకు చేరేట్లు చూడాలన్నారు. కార్యక్రమంలో ఏడీ లక్ష్మీమాధవి, వ్యవసాయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

అరవిందనగర్ (కడప) : మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటే వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ రమేష్ స్పష్టం చేశారు. బుధవారం కడప ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో పోలీసు కళా జాగృతి బృందం మాదక ద్రవ్యాలపై 'ఓ యువతా మేలుకో' నాటక ప్రదర్శన నిర్వహించారు. గోడపత్రాలను ఆవిష్కరించి వైస్ ప్రిన్సిపల్ మాట్లాడారు. కళాశాల ఈగల్ కో ఆర్డినేటరు నీలయ్య, సావిత్రి పలు సూచనలు చేశారు.

ఆర్థిక నేరాలపై అవగాహన అవసరం

మాట్లాడుతున్న లీడ్ జిల్లా మేనేజరు జనార్దన్

పులివెందుల, న్యూస్‌టుడే: ఆర్థిక నేరాలపై అవగాహన కలిగి ఉండాలని లీడ్ జిల్లా మేనేజరు జనార్దన్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై పలు విషయాలు తెలిపారు. కేవైసీలు సంబంధిత బ్యాంకుల వద్దే చేయించుకోవాలని సూచించారు. చరవాణికి వచ్చే అపరిచిత సందేశాలు, కాల్స్‌కు జవాబు ఇవ్వద్దని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపల్ బాల నారాయణ, ఏఎస్ఐ వర్మ, తదితరులు మాట్లాడారు. అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

వేతన సవరణ కమిటీ ఏర్పాటుకు డిమాండ్

కడప (గ్రామీణ), న్యూస్‌టుడే : విద్యుత్తు ఉద్యోగ, కార్మికులకు వేతన సవరణ కమిటీని ఏర్పాటు చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ డిస్కం ప్రెసిడెంట్ శివశంకర్ ఒక ప్రకటనలో డిమాండు చేశారు. ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు, జేఎల్ఎం-2, సమస్యల పరిష్కారం కోసం 2026 వేతన సవరణ కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్తు రంగాన్ని ప్రైవేటు పరం చేయడాన్ని విరమించుకోవాలన్నారు.

సీఎం అడ్డుకోకపోతే ఏపీకి నష్టమే

మారుతీనగర్, న్యూస్‌టుడే : బచావత్ ట్రిబ్యునల్ తీర్పునకు భిన్నంగా కర్ణాటక ప్రభుత్వం ఆలమట్టి డ్యాం ఎత్తును పెంచి నీటిని నిల్వ చేసి దిగువ రాష్ట్రాల నీటి వాటాకు గండి కొట్టడాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అడ్డుకోకపోతే తెలుగు రాష్ట్రాలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదముందని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు నాగసుబ్బారెడ్డి, బాదుల్లా, మద్దిలేటి, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

13న కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయుల ధర్నా

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే : ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 13న కడప కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్నట్లు ఎస్టీయూ నగర అధ్యక్షుడు సాదక్‌వలి తెలిపారు. బుధవారం కడపలోని ఎస్టీయూ భవన్‌లో ముఖ్యనాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు బాలగంగిరెడ్డి, రవిశంకర్‌రెడ్డి, మహబూబ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

పొలతల ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన

పెండ్లిమర్రి, న్యూస్‌టుడే: పొలతల క్షేత్రంలో ఈ నెల 14 నుంచి జరిగే మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను బుధవారం పెండ్లిమర్రి గ్రామీణ సీఐ చల్లని దొర పరిశీలించారు. ఈ సందర్భంగా పెద్ద వాహనాలు, చిన్నవాహనాల పార్కింగ్ స్థలాలను, పోలీసు కంట్రోల్‌రూమ్, క్యూలైన్ల బారికేడ్లు తనిఖీ చేశారు. ఆలయ ఈవో ఎం.కృష్ణా నాయక్, ఛైర్మన్ రాజారెడ్డిలతో చేపట్టాల్సిన పనులపై చర్చించారు.

గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశం

మారుతీనగర్, న్యూస్‌టుడే : జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ దాసరి భానుప్రకాష్ అధ్యక్షతన బుధవారం స్థానిక జిల్లా గ్రంథాలయ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వేతనాలు, పింఛన్లు, గ్రంథాలయ నిర్వహణ ఖర్చుల తీర్మానాన్ని ఆమోదించినట్లు ఛైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో డీఈఓ షంషుద్దీన్, వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ సుబ్బారెడ్డి, డీఎల్‌పీవో మస్తాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్, సీనియర్ అసిస్టెంట్ రాజకుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పన్ను చెల్లించని స్పిన్నింగ్ మిల్లుకు నోటీసులు

పులివెందుల, న్యూస్‌టుడే: పన్ను వసూళ్లు చెల్లించకపోవడంతో స్థానిక గోవిందరాజు టెక్స్‌టైల్స్ మిల్లుకు నోటీసులు జారీ చేసినట్లు పురపాలక కమిషనర్ మునికుమార్ తెలిపారు. సుమారు రూ.73 లక్షలు బకాయిలు ఉన్నాయని, నోటీసు అందించి త్వరగా చెల్లించాలని, లేని పక్షంలో చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు చెప్పారు. పురపాలక పరిధిలోని గృహ, పరిశ్రమలు ఇతరులు పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కోరారు.

నగరంలో నరకయాతన

ఎత్తు పల్లాలుగా అప్రోచ్ రోడ్లు ● అడుగడుగునా స్పీడ్ బ్రేకర్లు

ఎత్తుగా కల్వర్టు.. పక్కనే స్పీడ్ బ్రేకర్ ఉండటంతో ఇబ్బంది పడుతున్న చోదకులు

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే : కడప నగరంలోని మాసాపేట దొరల సమాధుల పక్కనున్న గంజికుంటకాలనీలో నెలకొన్న సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దేవుని కడప కూడలి నుంచి పాత డంపింగ్ యార్డు వరకు డబల్ రోడ్డు వేయడంతో కాలనీలు విస్తరించాయి. కానీ సరైన మౌలిక వసతులు లేకపోవడంతో ఆ ప్రాంత వాసులు అవస్థలు పడుతున్నారు. గంజికుంటకాలనీకి వెళ్లే దారి మొదలుకుని చివరకు అడుగడుగునా స్పీడ్ బ్రేకర్లు ఉన్నాయి. అయిదు వీధుల్లో చాలా ఎత్తులో అప్రోచ్ రోడ్డు వేయడంతో వాహనదారులు రాకపోకల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలువ ఎత్తు.. రోడ్డు తగ్గులో ఉంది. దీంతో వర్షాకాలం వస్తే వర్షం నీరు మొత్తం రోడ్డుపై నిలుస్తుండటంతో రాకపోకలకు అవస్థలు పడాల్సిందే. కొన్ని నెలల కిందట గంజికుంట కాలనీ ప్రధాన రోడ్డుకు నిధులు మంజూరయ్యాయి. కానీ ఇప్పటి వరకు పనులు వేయలేదని స్థానికులు ఆరోపించారు. రాత్రి వేళల్లో వచ్చిన కొత్త వారు ప్రమాదం బారిన పడుతున్నారు. సమస్యను మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ రాకేష్ దృష్టికి తీసుకెళ్లగా త్వరలోనే నగరంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు రానున్నాయి.. ఆ నిధులతో గంజికుంట కాలనీల్లో రోడ్లు, కాలువ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

వర్షాకాలం వస్తే అవస్థే

గంజికుంట కాలనీలో అప్రోచ్‌రోడ్లులు చాలా ఎత్తులో ఉన్నాయి. పైగా అడుగడుగునా స్పీడ్ బ్రేకర్లు ఉన్నాయి. వాటి వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ ప్రయోజనం లేదు. సిమెంటు రోడ్డు వేస్తే సమస్య తీరుతుంది. **- పద్మ, గంజికుంట కాలనీ, కడప.**

ఉల్లాసంగా.. ఉత్సాహంగా పోటీలు

లూర్దుమాత తిరునాల్లో బండలాగుడు ప్రదర్శన

వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న మేయర్ సురేష్, బిషప్ పాల్ ప్రకాష్

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే : కడప మరియాపురంలోని లూర్దుమాత తిరునాల మహోత్సవాలను పురస్కరించుకుని బుధవారం బండలాగుడు ఎద్దుల ప్రదర్శన, వాలీబాల్ క్రీడా పోటీలు ఉల్లాసంగా నిర్వహించారు. తెదేపా నాయకులు కర్నాటి చంద్రఓబులరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన బండలాగుడు ప్రదర్శనలో చౌటపల్లికి చెందిన మార్థల చంద్ర ఓబులరెడ్డి ఎద్దులు ప్రథమస్థానంలో నిలిచాయి. ద్వితీయ స్థానంలో కడప రూకవారిపల్లెకు చెందిన విద్యఓబులరెడ్డి, తృతీయ స్థానంలో ప్రొద్దుటూరుకు చెందిన గురివిరెడ్డి, తేజాశ్వర్‌రెడ్డి, నాల్గో స్థానంలో కమలాపురానికి చెందిన ఆదిల్ ఎద్దులు నిలిచి బహుమతులు గెలుపొందాయి. ఎద్దులు బండలాగుతుంటే యువత కేరింతలు కొట్టారు. వాలీబాల్ క్రీడాపోటీలను నగర మేయర్ సురేష్, బిషప్ పాల్ ప్రకాష్ ప్రారంభించారు. పోటీలు హోరాహోరీగా సాగాయి.

సాగునీటి ప్రాజెక్టులపై తెదేపాకు చిత్తశుద్ధి

అరవిందనగర్ (కడప) : రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులపై తెలుగుదేశంపార్టీకి చిత్తశుద్ధి ఉందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. అందులో భాగంగానే రాయలసీమలోని అన్నిజిల్లాలో నీరు పుష్కలంగా ఉన్నాయన్నారు. బుధవారం కడపలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం పేరుతో జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలోని అప్పటి ప్రభుత్వం కోట్లాది రూపాయలకు కక్కుర్తిపడి లిఫ్టు ఇరిగేషన్ పథకానికి ఐదేళ్ల కాలంలో ఒక్క పనికూడా చేయలేదన్నారు. జిల్లా అధికార ప్రతినిధి మన్నూరు అక్బర్, నాయకులు జయరాం, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ షేర్ల విక్రయం దుర్మార్గం

నిరసన ప్రదర్శన చేస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు

అరవిందనగర్ (కడప) : ఎల్ఐసీలో తన వాటా షేర్లను మరోసారి అమ్మేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధపడుతోందని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం నాయకులు రఘునాథరెడ్డి, వీరభద్రుడు ఆందోళన వ్యక్తం చేశారు. దీన్ని అందరూ అడ్డుకోవాలని కోరారు. బుధవారం కడపలోని ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు, ఎల్ఐసీ ఏజెంట్లు నిరసన ప్రదర్శన చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్ఐసీ, జీఎల్ఐసీ సంస్థలను బలోపేతం చేయడానికి బదులు కేంద్ర ప్రభుత్వం బయటి వాళ్లను ఎల్ఐసీ ఎండీగా నియమించడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు అక్బర్, రమణారెడ్డి, రాజేంద్ర, రవణకుమారి, శశికళ, గౌస్ శ్రీనివాసులు, రాజు పాల్గొన్నారు.

దీన దయాళ్ సేవలు మరువలేనివి

దీనదయాళ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సుష్మ, భాజపా నాయకులు

పులివెందుల, చక్రాయపేట(వేంపల్లె), లింగాల, న్యూస్‌టుడే: పండిట్ దీన దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి పురస్కరించుకుని బుధవారం పులివెందుల, చక్రాయపేట, లింగాల మండలాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలు మరువలేనివని కొనియాడారు. పులివెందులలో భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి శశిభూషణ్‌రెడ్డి, వేంపల్లె, చక్రాయపేటలో బీజేఎంఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుష్మ, భాజపా జిల్లా అధికార ప్రతినిధి హరిప్రసాద్ లింగాలలో పులివెందుల భాజపా అసెంబ్లీ కన్వీనరు మహేశ్వరరెడ్డి కార్యక్రమంలో అంజలి ఘటించారు.

కడప-బెంగళూరు రైల్వే లైన్‌పై నిర్లక్ష్యం తగదు

చక్రాయపేట,(వేంపల్లె), న్యూస్‌టుడే: రాయలసీమ సమగ్రాభివృద్ధికి ఉపయోగపడే కడప, రాయచోటి, మదనపల్లి, బెంగళూరు నూతన బ్రాడ్ గేజ్ రైల్వే నిర్మాణంపై ముఖ్యమంత్రికి నిర్లక్ష్యం తగదని మాజీ ఎంపీ, రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. వేంపల్లెలో బుధవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మంగళవారం ముఖ్యమంత్రి దిల్లీ పర్యటనలో కేంద్రమంత్రితో రైల్వే లైన్ నిర్మాణంపై చర్చించకపోవడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించాలని కోరారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదలకు వినతి

పులివెందుల, న్యూస్‌టుడే: కడప జిల్లాలోని పలు రైల్వే స్టేషన్లలో ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలుపుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్‌ను కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కోరారు. బుధవారం ఆయన దిల్లీలోని మంత్రి కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు.

కూలిపోతున్న ప్రజాస్వామ్యంపై సదస్సు 21న

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే : కూలిపోతున్న ప్రజాస్వామ్యం, చెదిరిపోతున్న స్వప్నంపై కడపలో ప్రత్యేక సదస్సు నిర్వహిస్తున్నట్లు సిటీ సిటిజన్ ఫోరం నాయకులు స్పష్టం చేశారు. బుధవారం కడప నగరంలోని రాజావెంగల్‌రెడ్డి ఆసుపత్రి ఆవరణంలో ఈనెల 21వ తేదీన జరిగే సదస్సుకు సంబంధించిన కరపత్రాలను వారు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యులు వెంగళ్‌రెడ్డి, ఓబులరెడ్డి, లక్ష్మీరాజా, లక్ష్మీదేవి, శివశంకర్, శ్రీనివాసులరెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం లోపిస్తే అనారోగ్యం

వీరపునాయునిపల్లె: గ్రామంలో పారిశుద్ధ్యం లోపిస్తే ప్రజలు అనారోగ్యం బారిన పడతారని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని అనిమెల గ్రామాన్ని బుధవారం పరిశీలించారు. వీధుల్లోని స్వచ్ఛతపై సర్పంచి, డిప్యూటీ ఎంపీడీవోలకు సూచనలు ఇచ్చారు. అనంతరం సంగమేశ్వర ఆలయం వద్ద కొత్తబోరుకు భూమి పూజ చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈవో జగన్‌మోహన్‌రెడ్డి ఛైర్మెన్ మురళీమోహన్‌రెడ్డిలను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు చరణ్, లలిత పాల్గొన్నారు.

జాగ్రత్తలతోనే ప్రాణాలకు రక్ష

ర్యాలీ చేస్తున్న విద్యార్థులతో సీఐ దస్తగిరి

కమలాపురం, న్యూస్‌టుడే: వాహనాలు నడిపే సమయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తేనే ప్రాణాలకు రక్షణ అని సీఐ దస్తగిరి అన్నారు. స్థానిక ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో బుధవారం రోడ్డు భద్రతపై పోలీస్‌స్టేషన్ నుంచి హెచ్‌పీ పెట్రోలు బంకు వరకు అవగాహన ర్యాలీ, అనంతరం విద్యార్థులు, వాహనదారులతో మానవహారం నిర్వహించారు. అనంతరం సైబర్ నేరాలు, పోక్సోపై ప్రజలకు సీఐ అవగాహన కల్పించారు. కళాశాల ప్రధానాచార్యులు రాజగోపాల్‌రెడ్డి, ప్రదీప్‌కుమార్‌రెడ్డి, ఎస్సై విద్యాసాగర్ పాల్గొన్నారు.

రైల్వే వంతెన పనులు పూర్తి చేయండి

కడప నగరపాలక, న్యూస్‌టుడే : యర్రముక్కపల్లి - విశ్వనాథపురం మధ్య ప్రారంభించిన రైల్వే అండర్ బ్రిడ్జి పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి కోరారు. బుధవారం ఆ వంతెన వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. నష్టపరిహారం చెల్లించడానికి నగర పాలక సంస్థ నుంచి రూ.3.58 కోట్లు ఇవ్వాలని తీర్మానించిన నేపథ్యంలో అధికారులు వెంటనే నిధులు విడుదల చేయాలన్నారు.

మారుతీనగర్ : నగరంలో ప్రజాస్వామ్యం నడుస్తుందా? హిట్లర్ పాలన కొనసాగుతుందా? అని వైకాపా అన్నమయ్య జిల్లా పరిశీలకులు, మాజీ మేయర్ సురేష్‌బాబు అన్నారు. అక్రమంగా కూల్చిన యర్రముక్కపల్లెలో మాజీ సైనికుడి ఇంటిని బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. నాయకులు కిశోర్, వెంకటేశ్వర్లు, వెంకటశివ, కార్పొరేటర్లు త్యాగరాజు, బాబు, సుబ్బరాయుడు, నాగేంద్ర, పాల్గొన్నారు.

వెలగని దీపాలు.. అంధకారంలో వీధులు

పులివెందుల పురపాలక పరిధిలో వెలగని వీధి దీపాలు

పులివెందుల, న్యూస్‌టుడే: పులివెందుల పురపాలక పరిధిని వీధి దీపాల సమస్య వేధిస్తోంది. కదిరి రోడ్డు, పట్టణం రింగ్ రోడ్డు, కె.వెలమవారిపల్లె, బాకరాపురం, యర్రగుడిపల్లె, నగరిగుట్ట, తదితర ప్రాంతాల్లో దీపాలు వెలగడం లేదు. రాత్రివేళల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విషపురుగుల సంచారంతో భయందోళనకు గురవుతున్నారు. ఈ విషయమై పురపాలక కమిషనర్ మునికుమార్‌ను వివరణ కోరగా ప్రతిపాదనలు పంపామని, రెండు రోజుల్లో ఏర్పాటు చేయిస్తామన్నారు.

పీపీపీ విధానాన్ని వ్యతిరేకిద్దాం

మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు సత్తార్

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం, నగర పాలక సంస్థ తీసుకొచ్చిన పీపీపీ విధానాన్ని వ్యతిరేకించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సత్తార్ అన్ని రాజకీయ పార్టీలకు, ప్రజలకు కోరారు. పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం కడప ప్రెస్‌క్లబ్‌లో అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలోని ప్రభుత్వానికి సంబంధించిన నేక్‌నామ్ కళాక్షేత్రం, వైఎస్ఆర్ ఆడిటోరియం, అంబేడ్కర్ భవన్, పాత మున్సిపాలిటీ స్థలాలను ప్రైవేట్ వారికి ఇవ్వడమనేది దుర్మార్గమన్నారు. ఒకసారి ప్రైవేటు వారి చేతుల్లోకి వెళ్తే తిరిగి వాటిని స్వాధీనపరుచుకోవడం కష్టమవుతుందన్నారు. కావున పీపీపీ విధానాన్ని రద్దు చేయాలని డిమాండు చేశారు.

యూరియా కోసం రైతుల పడిగాపులు

సచివాలయం వద్ద నిరీక్షిస్తున్న రైతన్నలు

చెన్నూరు : రబీ సీజన్‌లో మండల వ్యాప్తంగా జోరుగా వరి సాగైంది. రైతులకు అవసరమైన మేరకు యూరియా ప్రభుత్వం సరఫరా చేస్తోంది. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం ఎరువుల కొరత రైతులను వేధిస్తునే ఉంది. రెండు రోజులుగా చెన్నూరు, ఉప్పరపల్లె, రామనపల్లె గ్రామాల్లోని సచివాలయాల్లో యూరియా పంపిణీ జరుగుతోంది. ఒకటి రెండు బస్తాలతో మమ అనిపిస్తున్నారని తగినంత ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. గుట్టుగా తెలిసిన వారికి తరలిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఏవో శ్రీదేవిని వివరణ కోరగా యూరియా మంజూరైందని, అయినా చాలడం లేదన్నారు.

గడియారం అద్భుత సృష్టి శివభారత కావ్యం

గడియారం వెంకటశేష శాస్త్రి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హనుమంతరావు, పెన్షనర్స్ సంఘం ప్రతినిధులు

మారుతీనగర్ : గడియారం వెంకటశేష శాస్త్రి అద్భుత సృష్టి శివభారత కావ్యమని భారత రాష్ట్రపతి అవార్డు గ్రహీత విద్వాన్ గానుగపెంట హనుమంతరావు అన్నారు. గడియారం శాస్త్రి జయంతిని పురస్కరించుకుని బుధవారం స్థానిక జిల్లా పెన్షనర్స్ సంఘం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో చెన్నారెడ్డి, రామ్మూర్తినాయుడు, నగేష్, చెంచురెడ్డి, నారాయణ, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

ఆసుపత్రిలో కేకు కోస్తున్న డాక్టరు ఎస్.హిదాయతుల్లా, చిత్రంలో పలువురు

కడప చిన్నచౌకు: ఆరోగ్యమే మహా భాగ్యమని ఎం.ఆర్. ఆసుపత్రి నిర్వాహకులు డాక్టరు ఎస్. హిదాయతుల్లా పేర్కొన్నారు. నగరంలోని ఐటీఐ పెట్రోలు బంకు వద్ద ఉన్న ఎంఆర్ ఆసుపత్రి ఎనిమిదో వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ఆ ఆసుపత్రి ఆవరణలో కేకు కోసి సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎనిమిదేళ్ల నుంచి ఆసుపత్రి అభివృద్ధికి తోడ్పడుతున్న నగర ప్రజలకు రుణపడి ఉన్నామన్నారు. తమ ఆసుపత్రిలో అందుతున్న సేవల గురించి వివరించారు.

అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే : కడప తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఆత్మహత్య తాళలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ మోహన్‌కుమార్‌గౌడ్ తెలిపారు. కడప చెమ్ముమియాపేటకు చెందిన శ్రీనివాసులు (45) కలెక్టరేట్ ఎదుట అర్జీలు రాస్తుండేవాడు. అతనికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. ఇటీవల కాలంలో అప్పులు చేశారు. ఈ నేపథ్యంలో అప్పుల బాధ తాళలేక మంగళవారం ఇంట్లో అధికంగా వివిధ రకాల మాత్రలు వేసుకున్నాడు. వెంటనే ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

పెండ్లిమర్రి, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం కడప - పులివెందుల ప్రధాన రహదారిపై పాతసంగటిపల్లె బస్ స్టాప్ వద్ద మంగళవారం ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొంది. ఘటనలో గ్రామానికి చెందిన ఇద్దరు గాయపడ్డారు. అందులో ఒకరైన నాగయ్య (60) కడపలోని రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

మాట్లాడుతున్న జిల్లా ఎన్జీవో సంఘ అధ్యక్షుడు శ్రీనివాసులు

కడప గ్రామీణ, న్యూస్‌టుడే : ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండు చేశారు. బుధవారం నగరంలోని జిల్లా ఎన్జీవో కార్యాలయంలో సంఘం నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేతన సవరణ, పీఎఫ్ఆర్డీఏ చట్టం రద్దు, పెండింగ్ బకాయిలు చెల్లింపు, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు, పెన్షనర్లకు అదనపు క్వాంటం అమలు, తదితర సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ నెల 12న చేపట్టే జాతీయ సార్వత్రిక సమ్మెకు తమ సంఘం సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు తిమ్మారెడ్డి, శ్రీనివాసులు, నరసింహారెడ్డి, బాలపుల్లయ్య, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మద్దిలేటి

మల్లికార్జున

మారుతీనగర్: ఏఐటీయూసీ నగర 10వ మహాసభలు స్థానిక జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగాయి. ఈ సభల్లో ఏఐటీయూసీ నగర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, అధ్యక్షుడు వేణుగోపాల్, ఉప కార్యదర్శి బాదుల్లా తెలిపారు. నగర అధ్యక్షుడిగా పగడపూల మల్లికార్జున, నగర ప్రధాన కార్యదర్శిగా మద్దిలేటి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా సుబ్బరాయుడు, సహాయ కార్యదర్శులుగా నరసింహులు, నారాయణ, ఈశ్వరయ్య, రెడ్డెయ్య, రామచంద్రుడు, నాగిరెడ్డి, క్రాంతి, హనుమంతుతో పాటు 43 మందిని కౌన్సిల్ సభ్యులు, 21 మంది ఆఫీస్ బేరర్స్‌ను ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.





(c) eenadu